బకెట్లతో నీరు.. బాలికల కన్నీరు

బకెట్లతో నీటిని మోసుకెళ్తున్న విద్యార్థినులు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థినులు అరకొర సౌకర్యాలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. అరకులోయ మండలం గన్నెల గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో 260 మంది విద్యార్థినులున్నారు. మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ సౌకర్యం లేకపోవడంతో బకెట్లలో నీటిని మోసుకొని కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి. గతంలో నాడు-నేడు కింద సుమారు రూ. 26 లక్షలు ఈ పాఠశాలకు మంజూరైనా సక్రమంగా వినియోగించని కారణంగా ఈ దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ఇక్కట్లు తీర్చాలని విద్యార్థినులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అరకులోయ

రంగు మారిన డుడుమ

నిత్యం పాలనురగలా 556 అడుగుల ఎత్తు నుంచి జాలువారే డుడుమ జలపాతం రంగు మారింది. వరద నీటి ఉద్ధృతి కారణంగా డుడుమ జలాశయం నుంచి ఒక గేటు ఎత్తి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో జలపాతం వద్ద నీరు ఎరుపెక్కింది. - ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే

గో'దారి'కి మోక్షం
అటవీశాఖ అనుమతుల మంజూరు

కూనవరం, న్యూస్‌టుడే

గోదావరి వరదల సమయంలో విలీన మండలాలైన కూనవరం, వరరామచంద్రాపురం, చింతూరు, ఎటపాకలకు రాకపోకలు నిలిచిపోతాయి. నాలుగు మండలాల్లోనూ వరద నీరు ప్రధాన రహదారులపైకి చేరడంతో అత్యవసరమైనా బయటకు వెళ్లడానికి దారి లేకుండా పోతోంది. కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల వారికి వరదల సమయంలో అత్యవసర మార్గంగా పాలగూడెం, ఏడుగురాళ్లపల్లి అటవీ మార్గమే శరణ్యం. సాధారణ సమయాల్లో ఈ మార్గాన్ని కేవలం ఆ శాఖ అధికారులు, సిబ్బంది మాత్రమే వినియోగిస్తారు. వరదల సమయంలో మూడు మండలాల వారు నిత్యావసరాలకు, అత్యవసర ప్రయాణాలకు, మెరుగైన వైద్యం కోసం వినియోగిస్తారు. వర్షాకాలంలో ఈ మార్గం బురదమయంగా మారుతోంది. అడుగు మేర బురద పేరుకుపోతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. విధిలేక నాలుగైదు గంటలు కష్టపడి ఏడుగురాళ్లపల్లికి చేరుకుంటున్నారు.

గత వరదలకు ఇబ్బందులు: 2022లో వచ్చిన వరదలకు ఈ దారి చాలా మందికి ఉపయోగపడింది. వీఆర్‌పురం మండలంలో వారైతే స్థానిక అధికారుల సాయంతో పడవపై కూనవరం మండలం కోతులగుట్ట చేరుకుని అక్కడి నుంచి ఈ దారిలో వెళ్లాల్సిన పరిస్థితి. విద్యార్థులు పోటీ పరీక్షలకు, యువత ఉపాధి ముఖాముఖిలకు, రోగులు మెరుగైన వైద్యం కోసం ఈ మార్గాన్నే వినియోగించేది. ఈ మార్గం ద్వారా గమ్యం చేరడానికి రూ.వేలు ఖర్చుచేసి పెద్ద వాహనాలను కిరాయికి మాట్లాడుకుని వెళ్లాలి. దారి సక్రమంగా ఉంటే ద్విచక్ర వాహనంపై వెళ్లవచ్చు. వర్షాకాలంలో ఈ దారిలో వెళ్లడం అగ్నిపరీక్షలాంటిది. బురదలో వాహనాలు కూరుకుపోయి కదలకపోవడంతో చాలా ఇబ్బందులు పడేవారు.

ఎన్నో వినతులు ఇచ్చాక..: గోదావరికి భారీ వరదలు వచ్చిన ప్రతిసారి ఈ మార్గమే దిక్కుగా మారుతోంది. ఉన్నతాధికారులు సైతం ఈ మూడు మండలాలకు రావాలంటే ఈ దారినే వినియోగిస్తారు. ఈ మార్గానికి మరమ్మతులు చేయించాలని మూడేళ్లుగా మూడు మండలాల ప్రజలు ఉన్నతాధికారులకు ఎన్నో వినతులు ఇచ్చారు. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాల్లోనూ తీర్మానాలు చేశారు. అయినా అటవీశాఖ అభ్యంతరాలతో చర్యలు దస్త్రాలకే పరిమితమయ్యేవి. గతేడాది వరదలకు వచ్చిన కలెక్టర్ దినేశ్‌కుమార్ ఈ మార్గం ఆవశ్యకతను గుర్తించి పాలకులకు, అటవీశాఖ ఉన్నతాధికారులకు నివేదించారు. దీనిపై స్పందించిన ఆ శాఖ అధికారులు బోదునూరు నుంచి ఏడుగురాళ్లపల్లి వరకు దారి ఏర్పాటుకు సర్వేలు చేసి అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు అటవీశాఖ అనుమతులు రాలేదంటూ వెనకడుగు వేసిన ఐటీడీఏ అధికారులు ఈ దారి కార్యాచరణకు సిద్ధం అవ్వాల్సిన సమయం వచ్చింది. వరదలు రాకముందే దారి పనులు చేస్తే అత్యవసర సమయంలో ముంపు గ్రామాలకు మెరుగైన సేవలు అందించవచ్చు.

పాలగూడెం, ఏడుగురాళ్లపల్లి దారి

అభ్యంతరాలను పరిశీలించాక..: ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పాలగూడెం నుంచి ఏడుగురాళ్లపల్లి వరకు దారి కోసం వినతులు వచ్చాయి. అభ్యంతరాలకు తావులేకుండా కావాల్సిన వరకు దారి ఏర్పాటుకు అనుమతులు అటవీశాఖ నుంచి వచ్చాయి. పూర్తిగా పరిశీలన చేసిన తర్వాతే అనుమతులు ఇచ్చాం. - బబిత, డీఎఫ్‌వో, చింతూరు

బాలల ఆరోగ్యానికి భరోసా!
ఆశ్రమాల్లో విస్తృతంగా వైద్య పరీక్షలు

పాడేరు, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ఆహారపు అలవాట్లు, స్మార్ట్ పరికరాలతో సహవాసం, మార్కులు, ర్యాంకులపైనే ధ్యాస తదితరాలతో పిల్లలు మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలతో తరచూ ఇబ్బంది పడుతున్నారు. ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తోంది. ఈ నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమానికి (ఆర్‌బీఎస్‌కే) శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగా ఈనెల ఒకటి నుంచి పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో అనారోగ్య సమస్యలు గుర్తించి సత్వర చికిత్స అందిస్తారు.

★ జిల్లాలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందికి చిన్నారులకు చేయాల్సిన పరీక్షలపై శిక్షణ ఇచ్చారు. వీరు తమ పరిధిలోని విద్యాలయాల్లో ప్రతి విద్యార్థిని పరీక్షించి ఆరోగ్య సమస్యలు గుర్తిస్తారు. అవసరం మేరకు పీహెచ్‌సీ, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులకు వారిని తరలిస్తారు. అక్కడ సమస్య నమోదు చేసి అవసరాన్ని బట్టి పెద్దాసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యచికిత్స చేయిస్తారు.

ముందుగానే గుర్తిస్తే..: వ్యాధులను గుర్తించి తొలి దశలోనే సరైన వైద్యం అందించాలన్నది ప్రభుత్వం ఆలోచన. ప్రస్తుతం చాలామంది కంటి చూపు లోపం, తలనొప్పి, రక్తహీనత, ఆయాసం, చర్మసంబంధ రుగ్మతలతో ఇబ్బంది పడుతున్నారు. వీటి తీవ్రత పెరిగేవరకూ తెలియకపోవడంతో ఒక్కోసారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆ పరిస్థితి రాకూడదని ఈ కార్యక్రమం చేపడుతున్నారు.

★ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 3023 ఉండగా.. మొత్తం 1,93,582 మంది విద్యార్థులున్నారు. కస్తూర్బా విద్యాలయాలు 19, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు 204, గురుకులాలు 34లో సుమారు 97 వేల మంది చదువుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు 3314కు గాను 33,486 మంది బాలలు ఉన్నారు.

పాఠశాలలో బాలికలను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

నెలకు రెండు వైద్యశిబిరాలు : జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఈనెల ఒకటి నుంచి వైద్య సిబ్బందితో పరీక్షలు చేయిస్తున్నాం. ఆ మేరకు వైద్యం అందిస్తాం.. కలెక్టర్ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నెలకు రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తాం. - డాక్టర్ విశ్వేశ్వరరావునాయుడు, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌ఓశ్రీ

1200 కి.మీ. వచ్చి.. 15 కి.మీ. వెళ్లలేక..!
జల విద్యుత్తుకేంద్రం యంత్రసామగ్రి పరిస్థితి

సీతానగరం, న్యూస్‌టుడే: గోదావరి నదికి వరద ఉద్ధృతి పెరుగుతుండడంతో పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడానికి భారీ యంత్ర సామగ్రిని అత్యవసరంగా చేరుస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం అంగులూరు వద్ద నిర్మిస్తున్న 960 మెగావాట్ల జలవిద్యుత్తు కేంద్రానికి తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం గోదావరి ఏటిగట్టు నుంచే సామగ్రి చేర్చాలి. జలవిద్యుత్తు కేంద్రం వద్ద డ్రాఫ్ట్ ట్యూబ్‌లైనర్స్ ఏర్పాటుకు 12 యూనిట్లలో ఇప్పటికే 11 లైనర్స్ చేరాయి. టర్బైన్ నుంచి వేగంగా వెలువడే నీటిని డ్రాఫ్ట్ ట్యూబ్ మీద ఒత్తిడి లేకుండా చేయడానికి ఉక్కుతో తయారుచేసిన లైనర్ ఉపయోగిస్తారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ బీహెచ్ఈఎల్ నుంచి ఈనెల 2వ తేదీన చివరి 12వ లైనర్స్ సామగ్రి 8 ట్రాలీల్లో బయలుదేరాయి. సుమారు 1200 కిలోమీటర్లు అయిదు రోజుల్లో ప్రయాణించి సోమవారం తెల్లవారుజామున సీతానగరం మండలంలోని రఘుదేవపురం వద్ద నిలిపివేశారు. రఘుదేవపురం నుంచి పురుషోత్తపట్నం ఏటిగట్టుకు వెళ్లే 15 కిలోమీటర్ల రోడ్డు భారీ గుంతలతో ఉంది. టన్నుల కొద్దీ బరువు కలిగిన సామగ్రితో ట్రాలీలు ఇక్కడ నిలిచిపోయాయి.

రఘుదేవపురం వద్ద నిలిపివేసిన పోలవరం జలవిద్యుత్తు కేంద్రం సామగ్రి ట్రాలీలలో..

ఆర్భాటానికి రూపాలు.. ఆధునిక దిష్టిబొమ్మలు

అనంతగిరి, న్యూస్‌టుడే

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందిస్తాం.. వారి వికాసానికి అవసరమైన సేవలందిస్తామంటూ గత వైకాపా పాలకులు హంగామా చేసి అప్పటి రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. భారీగా ఖర్చుపెట్టి వీటిని కొనుగోలు చేశారు తప్ప వీటిని ఎలా వినియోగించాలనే దానిపై ఎవరికీ ఎలాంటి అవగాహనా కల్పించలేదు. దీంతో ఇవన్నీ ఆధునిక దిష్టిబొమ్మల్లా మిగిలిపోయాయి.

జిల్లా వ్యాప్తంగా సుమారు 72 వరకు కియోస్క్ యంత్రాలను పంపిణీ చేశారు. వీటితో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వైకాపా ప్రభుత్వం ప్రకటనలు గుప్పించింది. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందించే ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను వీటి ద్వారా బుకింగ్ చేస్తామని చెప్పారు. పశు సంవర్ధకశాఖ ద్వారా దాణా, మినరల్ మిక్చర్, మందులు కూడా వీటితోనే బుకింగ్ చేయవచ్చని ప్రకటించారు. ఉద్యాన శాఖ ద్వారా విత్తనాలు తీసుకోవటం, మత్స్యశాఖ ద్వారా మేత, మందుల బుకింగ్‌కు ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పైన తెలిపిన ఏ ఒక్క అవసరానికి ఇవి ఉపయోగపడిన దాఖలాలు లేవు. వచ్చిన యంత్రాలు వచ్చినట్టే చాలాచోట్ల వృథాగా పడి ఉన్నాయి. కొన్నిచోట్ల యంత్రాలకు ఉన్న మాజీ సీఎం జగన్ స్టిక్కర్లను సైతం తొలగించిన పాపానపోలేదు. ఇవి అక్కరకు రాని కారణంగా సెల్‌ఫోన్లతోనే ఆయా శాఖల సిబ్బంది వారి పనులు చేసుకుంటున్నారు.

వినియోగించకుండా వదిలేసిన కియోస్క్

ఇబ్బందులు ఇవీ... ఈ కియోస్క్‌లు పనిచేయాలంటే నెట్ తప్పనిసరి. కానీ మన్యంలో సెల్ సంకేతాల సమస్య విపరీతంగా ఉంటుంది. చాలా ప్రాంతాలకు అంతర్జాలం వచ్చే అవకాశం లేదు. స్థానిక పరిస్థితులు పరిగణనలోకి తీసుకోకుండా యంత్రాలు పంపించేసి చేతులు దులిపేసుకున్నారు. దీనికి తోడు ఈ యంత్రాలు వాడదామని ప్రయత్నించినవారికి పలు రకాల ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రారంభం నుంచే ఈ కియోస్క్‌లు సక్రమంగా పనిచేయడం లేదు. కొన్నింటికి తాకే తెరల్లో (టచ్‌స్క్రీన్) సమస్యలు ఉన్నాయి. ఆండ్రాయిడ్ బాక్సులు సైతం పలుచోట్ల మొరాయించిన సందర్భాలున్నాయి. దీంతో వాటన్నింటిని పక్కన పెట్టేశారు.

సమస్యలున్నాయి.. కియోస్క్‌ల వినియోగంలో కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు ఉండటంతో వినియోగించలేని పరిస్థితి ఎదురైంది. అదేవిధంగా మరికొన్నిచోట్ల సంకేతాలు లేకపోవటం వంటి వాటి కారణాలతో వినియోగించలేదు. మన్యంలో వీటిద్వారా అందించగలిగే సేవలూ తక్కువే. వీలైనంతవరకు వీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చేందుకు చర్యలు చేపడతాం. - నంద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

ఎమ్మెల్యేగా మీ రుణం తీర్చుకుంటా

ఎటపాక, న్యూస్‌టుడే: 'ముంపు మండలాల ప్రజలు తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించారు. మీ అందరి రుణం తీర్చుకుంటా. స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'నని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి హామీ ఇచ్చారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎటపాక మండలంలో పర్యటించారు. ముందుగా భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. ఎటపాక, సీతంపేట గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు. నెల్లిపాకలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. సీతాపురం, తోటపల్లి గ్రామాల్లో సచివాలయాన్ని ప్రారంభించి, ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్థల, విగ్రహ దాతలను సన్మానించారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు విజయభాస్కర్, నాయకులు వెంకటేశ్వర్లు, జమాల్‌ఖాన్, శ్రీకాంత్, చందు, మంగేశ్వరరావు, రమేష్, వెంకన్న, మధు పాల్గొన్నారు.

నెల్లిపాకలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే శిరీషాదేవి

వర్షాలతో హైవే పనులకు ఆటంకం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జాతీయ నిర్మాణ పనులపై పడింది. గత ఐదు రోజుల నుంచి పడుతున్న వర్షాలకు 516-ఈ జాతీయ రహదారి పనులు నిలిచిపోయాయి. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకూ సుమారు 435 కిలోమీటర్లు మేర ఈ పనులు జరుగుతున్నాయి. రూ.1550 కోట్లతో ఈ నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం పాడేరు నుంచి జి.మాడుగుల వరకూ 25 కిలోమీటర్ల మేర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణంతో భాగంగా ఎక్కడికక్కడ మట్టి పెళ్లలు పేరుకుపోయాయి. వర్షాలతో ఆ ప్రాంతమంతా బురదగా మారి వాహనాలు మట్టిలో కూరుకుపోతున్నాయి. ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర పనులపై వెళ్లాల్సిన వారు ప్రయాసపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

బురదమయంగా తయారైన రహదారి

బాలల సదనంలో ఉచిత వసతి

విశాఖపట్నం: పాతడెయిరీఫారం కూడలి ఆనందమార్గ ఆశ్రమంలోని బాలల సదనంలో ఉచిత వసతికి అనాథ, నిరుపేద బాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆశ్రమ నిర్వాహకులు స్వామి సౌమ్యానంద అవదూత తెలిపారు. ఆరు నుంచి పదేళ్ల బాలలు అర్హులన్నారు. వివరాలకు 80742 67791, 95507 75518 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

'ఆధార'ం లేక ఆవేదన

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఆధార్‌కార్డులు లేక ముగ్గురు చిన్నారులు చదువు, ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. కించుమండ పంచాయతీ శుక్రపుట్టు గ్రామానికి చెందిన పాంగి లక్ష్మి తండ్రి చిన్న వయసులోనే అనారోగ్యంతో మృతి చెందారు. ఈమెకు ముగ్గురు తమ్ముళ్లు ఉన్నారు. తండ్రి మృతితో.. వీరంతా వృద్ధురాలైన నాన్నమ్మ సంరక్షణలో ఉంటున్నారు. వీరికి ఎటువంటి చేదోడు లేదు. వీరిలో ముగ్గురు ఆధార్‌కార్డుకు నోచుకోక చదువుకు దూరమయ్యారు. ప్రభుత్వ పథకాలు అందడం లేదు. గ్రామంలో కూలి పనులు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. ఆధార్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా వారి జనన వివరాలు లేకపోవడంతో సంబంధిత అధికారులు మంజూరు చేయడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ఆధార్‌కార్డులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

ఆధార్ కార్డుకు నోచుకోని చిన్నారులు

జలాశయాల్లో నిల్వలు ఆశాజనకం

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: మాచ్‌ఖండ్ జలవిద్యుత్తు కేంద్రంలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని సీలేరు కాంప్లెక్స్ సీఈ కె.వి. రాజారావు పేర్కొన్నారు. పదవీ బాధ్యతలు చేపట్టాక తొలిసారి జలవిద్యుత్తు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. టీపీ డ్యాం, డుడుమ జలాశయం, ప్రాజెక్టు ఎస్ఈ కార్యాలయం, జోలాపుట్ జలాశయం తదితర ప్రాంతాలను చూశారు. నాలుగో నెంబరు జనరేటరు మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జోలాపుట్, డుడుమ జలాశయాల్లో ఆశించినస్థాయిలో నీటిమట్టాలు చేరుకున్నాయని తెలిపారు. ప్రస్తుతం అయిదు జనరేటర్ల సహాయంతో 97 మెగావాట్ల ఉత్పత్తి జరుపుతున్నామని చెప్పారు. నాలుగో నంబరు జనరేటరు మరో పదిరోజుల్లో వినియోగంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కొన్నిశాఖల్లో ఖాళీగా ఉన్న ఇంజినీర్ల పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని వివరించారు. పర్యవేక్షక ఇంజినీర్ (సివిల్) చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ (జనరేషన్) బి.గోవిందరాజులు, ఏడీఈ (సాంకేతిక) బి.జనార్దన్, మాచ్‌ఖండ్ ఏడీఈలు ఓబుల్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనరేటరు మరమ్మతు పనులు సమీక్షిస్తున్న సీఈ

వినతులు పరిశీలించి సత్వర పరిష్కారం

రంపచోడవరం, న్యూస్‌టుడే: మన్యంలో మారుమూల గ్రామాల నుంచి వినతుల రూపంలో వచ్చిన సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం చెప్పారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆయా శాఖల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై 83 వినతులు వచ్చాయని పీఓ చెప్పారు. రంపచోడవరం మండలం పెద్దగెడ్డాడ సమీపంలోని నిమ్మల కాలువ కింద 400 ఎకరాల ఆయకట్టు ఉందని, కాలువలో పూడిక తీస్తే చివరి భూములకూ నీరందుతుందని రైతులు ఈశ్వరరావు, గంగిరెడ్డి, రవిబాబు, గంగరాజు విన్నవించారు. నల్లగొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రహరీ శిథిలావస్థకు చేరి కూలేలా ఉందని బి.వెలమలకోట సర్పంచి అచ్చియమ్మ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మారేడుమిల్లి మండలం పుల్లంగి నుంచి అద్దరివలస వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని పుల్లంగి సర్పంచి జార్జిబాబు కోరారు. వై.రామవరం మండలం దబ్బమామిడిలో 25 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని చిన్నబాబు, ఎర్రయ్య, అప్పారావు వినతిపత్రం అందజేశారు.

బొర్నగూడెం విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ

పాఠశాల భవన నిర్మాణానికి హామీ

స్పందనకు వందనం

రంపచోడవరం, న్యూస్‌టుడే: బొర్నగూడెంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి వెంటనే చర్యలు చేపడతామని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం చెప్పారు. పాఠశాలకు భవనం లేక పూరిపాకలో తరగతులు నిర్వహిస్తున్నారని 'గోడలేని బడి.. వినపడదా గోడు' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో చిత్ర వార్త ప్రచురితమైంది. స్పందించిన పీఓ బొర్నగూడెం చేరుకుని పాఠశాల నడుస్తున్న పూరిపాకను పరిశీలించారు. ఉపాధ్యాయుడు, విద్యార్థులతో మాట్లాడి పక్కా భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

కన్నేరుకు వరదొస్తే.. కన్నీరే!
నేటికీ తీరని రవాణా కష్టాలు

ఏజెన్సీలో కొండ వాగులకు అవల నివసిస్తున్న గిరిజనులు మండల కేంద్రాలకు చేరుకోవాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితికి తెరపడటం లేదు. అడ్డతీగల మండలం వేటమామిడి పంచాయతీ పనుకురాతిపాలెం గ్రామంలో 80 గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వేటమామిడి, పనుకురాతిపాలెం గ్రామాలకు మధ్యలో కన్నేరు వాగు ఉంది. వర్షాకాలంలో వాగు పొంగితే రాకపోకలు నిలిచిపోతాయి. ఆ సమయంలో స్థానికులు ట్యూబ్‌ల సాయంతో వాగు దాటి అడ్డతీగల చేరుకోవాల్సి వస్తోంది. గతంలో వాగు దాటుతూ పలువురు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలున్నాయి. వంతెన నిర్మిస్తామన్న పాలకుల హామీలు నీటిమీత రాతలే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. - న్యూస్‌టుడే, అడ్డతీగల

ట్యూబ్‌పై కన్నేరు వాగు దాటుతున్న గిరిజనులు (పాత చిత్రం)

పెట్రోల్ పోసుకుని తల్లీబిడ్డ ఆత్మహత్య

బాల మౌనిక, లాసశ్రీ (పాత చిత్రం)

కొయ్యూరు, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో తల్లీబిడ్డ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రావణాపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, కొయ్యూరు ఎస్సై కిశోర్‌వర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రావణాపల్లి గ్రామానికి చెందిన లువ్వా సతీష్, రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన బాల మౌనిక (29)ను ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. సతీష్ ఆటో నడుపుతుండగా.. బాల మౌనిక టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఐదేళ్ల పాప లాస్యశ్రీ ఉంది. ఆదివారం ఓ శుభకార్యానికి భార్యాభర్తలు వెళ్లి తిరిగి వచ్చాక ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకొంది. మనస్తాపానికి గురైన బాల మౌనిక అమ్మేందుకు తెచ్చిన పెట్రోల్ సీసాను పట్టుకుని ఊరి శివార్లోని జీడిమామిడి తోటకు వెళ్లింది. తనతోపాటు కుమార్తెపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలతో కేకలేస్తున్న వీరిని స్థానికులు గుర్తించి మంటలార్పి నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. బాలిక చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందగా.. బాలమౌనికను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత మృతిచెందింది. మౌనిక తండ్రి డి.రాజుబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు ప్రాధాన్యం

పాడేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి ప్రాధాన్యమిస్తోందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి గిరిజన సంక్షేమాధికారులు, ఎంఈఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, అటవీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 10న మెగా తల్లిదండ్రుల సమావేశాన్ని అన్ని యాజమాన్యాల విద్యా సంస్థల్లో విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తల్లి పేరున మొక్కలు నాటాలన్నారు. మంగళవారం నుంచి పాఠశాలలకు మొక్కలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఐటీడీఏల పీఓలు అభిషేక్ గౌడ, సింహాచలం, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు, ఏపీసీ స్వామినాయుడు, జిల్లా సమన్వయకర్త స్వామినాయుడు, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌ఓ విశ్వేశ్వరరావునాయుడు, ఉపసంచాలకులు రజని పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తం: గోదావరి, శబరి నదుల వరద ప్రభావిత ప్రాంతాల్లో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎటపాక, కూనవరం, చింతూరు, వరరామచంద్రాపురం ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వరదలకు ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో డీఈఓ బ్రహ్మాజీరావు, స్వామినాయుడు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

80087 09638

(c) eenadu

సార్వత్రిక ప్రవేశాలు పెంచేందుకు కృషి

పాడేరు, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్యా విధానంలో పది, ఇంటర్ ప్రవేశాల లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గుర్తింపు పొందిన సమన్వయకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ.. సార్వత్రిక విద్యావిధానం విశిష్టతను వివరించారు. ప్రవేశాల పెంపులక్ష్యం ఆవశ్యకతను తెలియజేశారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం గోడపత్రులు ఆవిష్కరించారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శశికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ బ్రహ్మాజీరావు

ముత్తంగి రూపంలో రామయ్య దర్శనం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారు సోమవారం ముత్తంగి రూపంలో దర్శనమిచ్చారు. ముత్యాలతో పొదిగిన వస్త్రాలంకృతుడైన రామయ్య తండ్రి చూడముచ్చటగా కనిపించారు. అర్చకుల భక్తిశ్రద్ధలతో సుప్రభాత పలికి ఆరాధించి నామార్చన చేశారు. నిత్య కల్యాణంలో భాగంగా మాంగళ్యధారణ తలంబ్రాల వేడుక నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి రామయ్యవారిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రధాన ఆలయంలోని ప్రసన్నాలయంతో పాటు అనుబంధంగా ఉన్న ఆంజనేయస్వామి లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించి ఆశీర్వచనం పొందారు.

ఉద్యాన రైతులకు దండిగా ప్రోత్సాహకాలు

ఆయిల్‌పామ్, పూల సాగు లాభదాయకం

ఈనాడు-మీతోడు ఫోన్ ఇన్‌లో ఉద్యానాధికారి రహీమ్

రైతులకు అందించేందుకు కొబ్బరి, జీడిమామిడి, మామిడి మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. పూలు, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎంఏ రహీమ్ తెలిపారు. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యాన పంటల సాగులో మెళకువలు, రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు 'ఈనాడు-మీతోడు' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి 34 మంది రైతులు ఫోన్ చేసి ఆయనతో మాట్లాడారు. - న్యూస్‌టుడే, అనకాపల్లి

? ఆయిల్‌పామ్ వేయాలనుకుంటున్నాం. రాయితీలు వర్తిస్తాయా. – మారిశెట్టి పరదేశినాయుడు, హరిపాలెం, ఎం.ఎం.నాయుడు, బయ్యవరం

✔: ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. మొక్క ధర రూ.135 కాగా.. 90 శాతం రాయితీగా ఇస్తాం. నాలుగేళ్ల వరకు ఎరువులు, కలుపుతీత పనులకు ఏటా రూ.5,250 అందిస్తాం. వర్మీ కంపోస్టు యూనిట్ ఏర్పాటు చేసుకుంటే రూ.30 వేలు రాయితీ వస్తుంది. గెలలు కోసేందుకు యంత్రపరికరాలు, విద్యుత్తు పంపుసెట్, డీజిల్ ఇంజిన్ కొనుగోలుకూ రాయితీలు పొందవచ్చు.

రైతేరాజు

? బంతి, చామంతి సాగు చేయాలనుకుంటున్నాం. ఎప్పుడు నాటాలి. – దాడి వెంకటరమణ, వెంపాలెం, వద్ది కూర అప్పన్న, మెట్టపాలెం

✔: బంతి, చామంతి, మల్లి, గులాబీ సాగుకు హెక్టారుకు రూ.20 వేలు రాయితీ ఇస్తాం. సాగుకు ఇదే అనువైన సమయం.

? జీడిమామిడి సాగుకు ఏ రకాలు బాగుంటాయి. నీటి వసతి ఉంది. – అరిసెంటెల అప్పన్న, కుమారపురం, ఎం.రాం జోగినాయుడు, వాడ్రాపల్లి

✔: వి-3, 4 రకాలు అనుకూలం. అంటు మొక్క ధర రూ.40. సుమారు ఆరు వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. మొక్క నాటిన రెండేళ్ల వరకు నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. పందిరి, కాయ దశలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

ఈనాడు మీతోడు

? కొబ్బరి తోట వేయాలనుకుంటున్నాం. ఏ రకం మొక్కలు వేయాలి. హైబ్రిడ్ మొక్కలున్నాయా. – బీశెట్టి నాయుడు, మునగపాక, వి.రమేష్, రాంబిల్లి

✔: ఈస్టుకోస్టు పొడవు రకం మొక్కలున్నాయి. బుచ్చిరాజుపేట మొక్కలు పెంచి అందిస్తున్నాం. ఒక్కో మొక్క ధర రూ.90. సుమారు 40 వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. హైబ్రిడ్ రకాల్లేవు.

? మామిడి మొక్కలు ఎప్పుడు నాటుకోవాలి. అంతర పంటలుగా ఏమేం సాగు చేయవచ్చు. – శిరీ నాయుడు, బుచ్చయ్యపేట, దాడి శివ, సీతానగరం

✔: ప్రస్తుత వాతావరణం మొక్కలు నాటుకునేందుకు అనుకూలంగా ఉంది. డిసెంబరు వరకు నాటుకోవచ్చు. ఏడాది నుంచి ఏడాదిన్నర వయసున్న మొక్కలను ఎంచుకోవాలి. అంతర పంటలుగా కూరగాయలు, పెసలు, మినుము, అలసంద వంటివి సాగు చేయవచ్చు. మిశ్రమ పంటగా బొప్పాయి వేసుకోవచ్చు.

? హెక్టారు విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ వేయాలనుకున్నాం. ఎన్ని మొక్కలు అవసరం అవుతాయి. అంతర పంటలుగా వేటిని సాగు చేయవచ్చు. – కె.సత్యనారాయణ, అంగరపురం, ఎం.జగన్నాథరావు, మాకవరపాలెం

✔: నీటి వసతి ఉంటేనే ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలి. హెక్టారుకు వంద మొక్కలు సరిపోతాయి. కొంతమంది రైతులు 143 మొక్కల వరకు వేస్తున్నారు. అంతర పంటలుగా కోకో, అరటి సాగు చేయవచ్చు.

? రాయితీపై బిందు సేద్యం పరికరాలు మంజూరు చేస్తారా. – ఎస్.వి.ఆర్.నాయుడు, అరబుపాలెం, ఎన్.వి.కె.పరవరం, వడ్డాది

✔: ఐదు ఎకరాల్లోపు ఉన్న ఎస్సీ ఎస్టీలకు వంద శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలిస్తాం. మిగతా రైతులకు 90 శాతం రాయితీ వర్తిస్తుంది. ఐదు నుంచి పది ఎకరాలుంటే ఎవరికైనా 70 శాతం, అంతకంటే ఎక్కువ ఉంటే 50 శాతం రాయితీ వస్తుంది. తుంపర సేద్యం అయితే అన్ని కేటగిరీలకు 50 శాతం రాయితీ ఇస్తాం.

? ఇసుక నేలల్లో జామ సాగు చేయవచ్చా. ఏ రకాలు అనుకూలం.



– పీడీఏ రామారావు, అప్పన్నపాలెం, డి.వెంకన్నపాత్రుడు, జగన్నాథపురం

✔: నీరు నిల్వ ఉండని లోతైన మురుగునీటి సదుపాయం ఉన్న నేలలు అనుకూలం. తేలికపాటి ఇసుక నేలలు అంతగా పనికిరావు. కోహీర్ సఫేదా, లక్నో-49, అర్క్‌మూల్య, లలిత రకాలు అనుకూలం. నవంబరు వరకు నాటుకోవచ్చు.

సాగులో సందేహాలా.. ఫోన్ చేయండి

రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పీవీకే జగన్నాథరావు సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10 గంటల నుంచి సా. 4 గంటలకు వరకు 94419 44640 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సలహా

రామాలయం భూమిలో రగడ

పురుషోత్తపట్నంలో నిర్మాణ పనిని అడ్డుకోవడంతో ఘర్షణ

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామికి పురుషోత్తపట్నంలో భూములున్న విషయం విదితమే. ఆ భూమిలో అనుమతి లేకుండా భవన నిర్మాణ పనులు చేస్తుండటంతో సిబ్బంది దాన్ని అడ్డుకునే క్రమంలో ఆ గ్రామస్థులతో సోమవారం గొడవ జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భద్రాద్రి రాముడికి సుమారు 1300 ఎకరాల భూమి ఉండగా అందులో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోనే గరిష్ఠంగా 889.5 ఎకరాలున్నాయి. పురుషోత్తపట్నంలోని భూమి ఎక్కువ భాగం ఆక్రమణకు గురైంది. కోర్టు తీర్పు ప్రకారం ఈ భూమిపై దేవస్థానానికి హక్కులు లభించాయి. వీటిని దేవస్థానానికి అప్పగించి వాసులు పరిగణనలోకి తీసుకోవడం లేదు.

రామయ్య భూమిలో చేపట్టిన నిర్మాణ పనులు

న్యాయం చేయాలంటున్న భక్తులు

పురుషోత్తపట్నంలోకి ప్రవేశించే మార్గంలో పిల్లర్లతో నిర్మాణ పనులు చేస్తున్నారనే సమాచారం అందుకున్న ఆలయ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేయవద్దని ఇది పూర్తిగా రాముడి భూమి అని వివరించారు. కోర్టు తీర్పులతో దేవుడి పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నాయని వెల్లడించారు. కొన్ని కేసులు పెండింగ్‌లో ఉండగా నిబంధనలు ఉల్లంఘించడం సరైంది కాదని సూచించారు. సుదీర్ఘ కాలం నుంచి ఇక్కడే ఉంటున్నామని ఈ భూమిపై అన్ని హక్కులు ఉన్నాయంటున్నారు. తమకు దేవస్థానం అనుమతి అవసరం లేదని పురుషోత్తపట్నం వాసులు చెప్పారు. దేవస్థానం భూమిలో నిర్మాణాలు చేస్తున్న ప్రతీసారి ఇదే తంతు కొనసాగుతోంది. నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు. ఇరు ప్రభుత్వాల అధికారులు స్పందించి న్యాయం చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఆలోచింపజేస్తున్న వీడియో సందేశం

రామాలయం తెలంగాణలో ఉండి భూములు ఆంధ్రప్రదేశ్‌లో ఉండటంతో ఇది సరిహద్దు అంశంగా మారిందని ఏఈఓ భవాని రామకృష్ణ తెలిపారు. మిగతా శాఖల అధికారుల సహకారం లేదని కొందరు వచ్చిన ఏమీ చేయలేకపోతున్నారని వాపోయారు. ఈఈ రవీంద్రనాథ్, సూపరింటెండెంట్ కత్తి శ్రీనివాసరావు, సిబ్బందితో కలిసి వీడియో సందేశం విడుదల చేశారు. ఆక్రమణదారులు దేవస్థానం సిబ్బంది విధులను అడ్డగించి ఏం చేసుకుంటారో చేసుకోండని తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రావద్దని హెచ్చరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఆక్రమణలు తొలగించం' అని చెబుతున్నారని వివరించారు. ఎలాంటి సహకారం లేకపోవడంతో దేవస్థానం భూమిని కాపాడుకోలేని స్థితిలో తాము ఉన్నామని దీన్ని గుర్తించి దేవాలయం భూములను కాపాడేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

నిలకడగా గోదావరి

దేవీపట్నం, న్యూస్‌టుడే: గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టలేదు. అమ్మవారి ఆలయంతో పాటు దుకాణాలు, ఇళ్లు ముంపులోనే ఉన్నాయి. దండంగి - డి.రావిలంక రహదారిలో పురుషోత్తపట్నం, సీతానగరం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. సీతపల్లి వాగులో వరద ప్రవాహం తగ్గకపోవడంతో సమీపంలోని గిరిజన గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. అమ్మవారి ఆలయం నుంచి పర్యాటక బోటులో సందర్శకులు పాపికొండల అందాలను వీక్షించేందుకు వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు.

గండిపోశమ్మ ఆలయం వద్ద గోదావరి

నేటి నుంచి తాగునీటి పథకం కార్మికుల సమ్మె

దేవీపట్నం, న్యూస్‌టుడే: సత్యసాయి రక్షిత తాగునీటి పథకం కార్మికులు 19 నెలలుగా వేతన బకాయిలు విడుదల కాకపోవడంతో మంగళవారం నుంచి సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించారు. ఇందుకూరుపేటలోని పంపు హౌస్ వద్ద సోమవారం వారంతా సమావేశమయ్యారు. గుత్తేదారు నెలలు తరబడి జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలతో పస్తులుండాల్సి వస్తోందన్నారు. సమ్మెలో భాగంగా మంగళవారం గోకవరంలోని రెవెన్యూ కార్యాలయం నుంచి రాజమహేంద్రవరం లాలాచెరువులోని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లనున్నట్లు కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు పాలాడి శ్రీనివాస్ చెప్పారు. కార్మికుల సమ్మె వల్ల ఏజెన్సీతోపాటు మైదానలో ప్రాంతంలోని నాలుగు మండలాల్లో 80 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోనుంది.

నినాదాలు చేస్తున్న కార్మికులు

యువతకు ఉచిత శిక్షణ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖపట్నం పోర్టు అథారిటీ సహకారంతో అల్లూరి సీతారామరాజు జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సోమవారం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్‌బిల్డింగ్ (సెమ్స్) సీవోవో కమాండర్ (రిటైర్డ్) గోపీకృష్ణ శివ్వం తెలిపారు. ఇరవై ఏడు ఏళ్ల వయసులోపు పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైన అభ్యర్థులంతా ఈ ఉచిత కోర్సు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. రెండు నెలలపాటు ఉచిత వసతితో శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తిగలవారు జులై 11 లోగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8688411100, 7794840934 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బెల్లం ధరల తగ్గుముఖం

అనకాపల్లి: అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా అన్ని రకాల బెల్లం ధరలు తగ్గుముఖం పట్టాయి. రంగులు వంద కేజీలకు రూ.280, మధ్య రకం రూ.150, నాసి రకాలు రూ.140 వరకు తగ్గాయి.

రకం	గత వారం	ఈ వారం
రంగులు	5,030	4,750
మధ్య	3,600	3,450
నాసి	2,940	2,800

తాండ్రతో.. మామిడి రైతుకు ఊరట

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మామిడి సీజన్ ఈ ఏడాది రైతులకు కలిసిరాలేదు. మార్కెట్‌లో ధర లేకపోవడంతో నష్టాలను మూటకట్టుకోవాల్సి వచ్చింది. డిమాండు అధికంగా ఉండే బంగినపల్లి, రసాలు, సువర్ణరేఖ, కలెక్టర్ తదితర రకాల కాయల ధరలూ నేలచూపులే చూశాయి. పెట్టుబడి, కోత, రవాణా ఖర్చులూ రాలేదు. వచ్చిందే చాలనుకుని చాలా మంది తక్కువ ధరకే విక్రయించాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో పాయకరావుపేట మండలం సీతారాంపురం రైతు పకుర్తి బాబూరావు వినూత్నంగా ఆలోచించారు. రూ.1.5 లక్షల పెట్టుబడితో మామిడి తాండ్ర తయారీ యూనిట్ ఏర్పాటు చేశారు.

★ సీతారాంపురం చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఏటా ఇక్కడి నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు కాయలు ఎగుమతి అయ్యేవి. ఈ ఏడాది ధర లేక ఎగుమతులు ఆగిపోయాయి. మార్కెట్ స్థితిగతులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి కాయలను కొనుగోలు చేశారు. కాయల నుంచి గుజ్జు తీసి తాండ్ర తయారీకి 20 మంది మహిళలకు ఉపాధి కల్పించారు.

నాణ్యమైన పండ్లతో..

తాండ్ర తయారీకి నాణ్యమైన పండ్లు సేకరిస్తున్నాం. కాయలను శుభ్రం చేసి తొక్క తీసి గుజ్జును వేరు చేస్తాం. పంచదార కలిపి యంత్రం ద్వారా తాండ్ర తయారు చేస్తున్నాం. ఒక్కో మహిళకు రోజుకు రూ.300 చొప్పున గిట్టుబాటు అవుతోంది. తయారైన తాండ్రను కేజీ, అరకేజీ చొప్పున ప్యాకింగ్ చేసి మార్కెట్‌కు పంపుతున్నాం. అనకాపల్లితోపాటు కాకినాడ, తుని, రాజమహేంద్రవరం సరఫరా చేస్తున్నాం. తయారీ మరింత పెరిగితే ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎగుమతి చేసే ఆలోచన ఉంది.

– బాబూరావు, రైతు

తల్లిదండ్రుల సమావేశం 10న

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ఈనెల 10న నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో బాబూరావు పిలుపునిచ్చారు. జి.మాడుగుల మండలంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం సమావేశమయ్యారు. పలు సూచనలు, సలహాలు చేశారు. తల్లిదండ్రులు తప్పక హాజరుకావాలన్నారు. తహసీల్దారు రాజ్‌కుమార్, ఎంపీడీవో డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షురాలిగా వరలక్ష్మి

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షురాలిగా గిడ్డి వరలక్ష్మిని ఎన్నుకున్నారు. విశాఖపట్నం గిరిజన్ భవన్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా శెట్టి లక్ష్మణ్‌రావు, జిల్లా ముఖ్య సలహాదారులుగా తమర్బ ప్రసాద్, మండి నాగేశ్వరరావు, కంబిడి సుమిత్ర, జిల్లా ఉపాధ్యక్షులుగా కంకిపాటి రామారావు, సహాయ కార్యదర్శులుగా మత్స్యరాజు, భాస్కర్, ప్రమాణ స్వీకారం చేశారు.

బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

అడ్డతీగల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ సేవలకు సోమవారం అంతరాయం ఏర్పడింది. రోజంతా సెల్ సిగ్నల్స్ అందక ఇంటర్నెట్ పనిచేయక పోవడంతో వినియోగదారులు, అధికారులు ఇబ్బందులకు గురయ్యారు.

సమ్మెకు మద్దతు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: కార్మిక సమ్మెకు గిరిజన కాఫీ రైతు సంఘం మద్దతు తెలుపుతున్నట్లు సంఘం జాతీయ నాయకులు చిన్నబాబు, పాలికి లక్కు తెలిపారు. అరకులోయ గిరిజనసంఘం కార్యాలయంలో సంఘ నాయకులతో కలసి మాట్లాడారు. కనీస వేతనం అమలు, ఔట్‌సోర్సింగ్ విధానం, నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు గురుమూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి, న్యూస్‌టుడే: కార్మికుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు సాగిన చిరంజీవి అన్నారు. కార్మికుల సమస్యలపై బుధవారం జరిగే దేశవ్యాప్త సమ్మెలో హెచ్ఎన్‌టీసీ, పరిశోధనాస్థానాల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొంటారన్నారు. సమ్మెకు సంబంధించిన కరపత్రాలను సోమవారం కార్మికులకు పంపిణీ చేశారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు

పతాకాలు గెలుచుకున్న విద్యార్థులు

చింతూరు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చింతూరు విద్యార్థులు ఏడు బంగారు, నాలుగు వెండి, ఒక కాంస్య పతకం సాధించారని కోచ్ గంగాధర్ సోమవారం చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ పోటీలు ఆదివారం జరిగాయన్నారు. అండర్-13 విభాగంలో ఉయికా సంతోష్, గోలి వీరజస్వంత్ బంగారు పతకాలు, జూనియర్ విభాగంలో గుత్తుల మధు చందన, రోహిత్ బంగారు పతకాలు గెలుచుకున్నారని పేర్కొన్నారు. 78 కేజీల కేటగిలో రాహుల్ బంగారు పతకం, 88 కేజీల కేటగిరీలో గొంపా సాయికిరణ్ బంగారు, 94 కేజీల కేటగిరిలో లక్ష్మి గణేశ్ బంగారు పతాకం అందుకున్నారన్నారు.

జలవనరుల ఏఈఈల సంఘం ఎన్నిక

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ (ఏఈఈ) అధికారుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సంబంధిత కార్యాలయంలో సోమవారం జరిగింది. జిల్లా శాఖ నూతన అధ్యక్షునిగా బాడాన విజయ్‌కుమార్ (విశాఖ), ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ (భీమిలి), ఉపాధ్యక్షులుగా ఆకుల ప్రకాశ్ (చోడవరం), మలయాల శ్రీరామ కపిల్ (ఎస్ఎంఐ) ఎన్నికయ్యారు. మూడు జిల్లాలు, పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారులంతా ఈ ఎన్నికలకు హాజరయ్యారు.

రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ధర్నా

రాజవొమ్మంగి న్యూస్‌టుడే: అసంపూర్తిగా ఉన్న రహదారుల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండు చేస్తూ గిరిజన సంఘ నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రామారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు జగన్నాథం, సూరిబాబు ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. మండల పరిషత్తు కార్యాలయం ఎదుట బైఠాయించి వంటావార్పు చేశారు. రామారావు మాట్లాడుతూ రాజవొమ్మంగి - మల్లవరం, కిమ్మిలిగెడ్డ - కొత్తవీధి, రాజవొమ్మంగి - బూరుగుపల్లి, లోదొడ్డి - పాకవెల్తి, జడ్డంగి - వణకరాయి, జమ్మిచావిడి - సింగంపల్లి, కింద్ర కాలనీ - ముంజవరప్పాడు రోడ్లను పూర్తి చేయకుండా వదిలేయడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఆందోళన విషయాన్ని ఎంపీడీవో యాదగిరీశ్వరావు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారులు స్పందించి స్పష్టమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని గిరిజన సంఘ నాయకులు రాత్రి 7 గంటల వరకు కదలకుండా అక్కడే కూర్చున్నారు. గిరిజన సంక్షేమ శాఖ డీఈ గౌతమి ఈఈతో ఫోన్లో మాట్లాడి వారం రోజుల్లో ఆయా గ్రామాల గిరిజనులతో చర్చించి సమస్య పరిష్కారమయ్యేలా కృషిచేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఎంపీపీ వెంకటలక్ష్మి, సర్పంచి చంద్రుడు, ఎంపీటీసీ సభ్యురాలు లోవలక్ష్మి, మాజీ సర్పంచి దుర్గాప్రసాద్ ఆందోళనకు మద్దతు తెలిపారు. గిరిజన సంఘ నాయకులు అచ్చారావు, ప్రవీణ్, గంగరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

అంకితభావంతో పనిచేయండి

అడ్డతీగల, న్యూస్‌టుడే: విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ) సిబ్బంది అంకితభావంతో పని చేయాలని ఆ శాఖ విశాఖపట్నం జోన్ ఆర్జేడీ విజయభాస్కర్ సూచించారు. అడ్డతీగల మండలంలో సోమవారం ఆకస్మికంగా పర్యటించారు. ఎంఆర్‌సీ, జడ్పీ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడాల్సిన అవసరముందన్నారు. ఎంఈవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మంగరాజు, ఆశీర్వాదం, సత్తిరెడ్డి, రమణ వెంట ఉన్నారు.

ఎంఆర్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లిలో సోమవారం సాయంత్రం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. జులై 28 నుంచి మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. పెద్దఎత్తున పోలీసు బలగాలు ఏవోబీని జల్లెడ పడుతూ గాలింపుల ముమ్మరం చేస్తున్నాయి. మన్యానికి వచ్చి వెళ్లే ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. వాహన ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ద్విచక్రవాహనదారులకు శిరస్త్రాణం వినియోగం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలు, మితిమీరిన వేగం వంటి వాటిపై ఏఎస్సై ధర్మ కౌన్సెలింగ్ ఇచ్చారు.

ద్విచక్రవాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్సై ధర్మ

సుపరిపాలనలో తొలి అడుగుపై అవగాహన

రాజవొమ్మంగి న్యూస్‌టుడే: సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా తెదేపా యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ ఇన్‌ఛార్జి, కోఇన్‌ఛార్జి, కేఎస్ఎస్‌లకు ఆ పార్టీ అరకు పార్లమెంట్ సమన్వయకర్త టి.సత్తిబాబు సోమవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏఎంసీ ఛైర్మన్ లక్ష్మణరావు, తెదేపా మండల అధ్యక్షుడు పెద్దిరాజు, కార్యదర్శి కేశవ్, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, నాయకులు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

గంగవరం, న్యూస్‌టుడే: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ఎస్‌బీఐ లక్ష్యమని గంగవరం బ్రాంచి మేనేజర్ రత్నరాజు అన్నారు. బదిలీపై వచ్చిన ఆయన స్థానిక ఖాతాదారుల సేవాకేంద్రాన్ని సోమవారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నగదు అధికారి శ్రీనివాస్, సిబ్బంది దేవరాజు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

చింతపల్లి, న్యూస్‌టుడే: తల్లికి వందనం కార్యక్రమం పేరిట ప్రతి విద్యార్థి తమ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని సిపా ట్రస్టు సీఈఓ డాక్టర్ శశిప్రభ అన్నారు. లంబసింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులతో కలసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పాలిథిన్ సంచులను పూర్తిగా నిషేధించాలని కోరారు. విద్యార్థులకు వస్త్ర సంచులను పంపిణీ చేశారు. గ్రీన్‌క్లైమేట్ టీఎన్జీఓ వ్యవస్థాపక కార్యదర్శి జీవీరత్నం, ప్రధానోపాధ్యాయుడు సతీష్, సంస్థ సిబ్బంది శ్రీనివాస్, దుర్గాప్రసాద్ భాస్కర్, లక్ష్మి, పడాల్ తదితరులు పాల్గొన్నారు.

లంబసింగి పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న సంస్థ ప్రతినిధులు

నిరుద్యోగ యువతకు దుకాణాలు కేటాయించాలి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: పంచాయతీ ఆస్తులు వ్యక్తుల పేరుతో తీర్మానాలు చేసి ఆమోదింపచేసేందుకు ప్రయత్నించడం సరికాదని పెసా కమిటీ ఉపాధ్యక్షులు కిల్లో జగన్నాథం అన్నారు. సోమవారం అరకులోయలో పెదలబుడు సర్పంచి దాసుబాబు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం సమీపంలో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన వాణిజ్య దుకాణాలను, బందులదొడ్డి స్థలంలో నిర్మించిన ఇంటిని సర్పంచి, వార్డు సభ్యుని పేరుపై ఆమోదానికి తీర్మానం ప్రవేశపెట్టడాన్ని జగన్నాథం, సీపీఎం నాయకులు మగ్గన్న వ్యతిరేకించారు. పదవుల్లో ఉన్న వ్యక్తులు మారుతారని.. పంచాయతీ శాశ్వతమని పేర్కొన్నారు. వ్యక్తుల పేరుపై తీర్మానాలు చేసి వ్యాపారాలు చేస్తామంటే ప్రజాపోరాటం తప్పదన్నారు. దుకాణాలకు టెండర్లు పిలిచి పంచాయతీలోని నిరుద్యోగ యువతకు అందించాలన్నారు. ఈఓ రాజ్‌కుమార్, వార్డు సభ్యులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో సర్పంచి దాసుబాబు, ఈఓ రాజ్‌కుమార్

రహదారిపై కూలిన చెట్టు.. విరిగిన స్తంభాలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి నుంచి బోదులూరు వెళ్లే రహదారిలో ఈదురుగాలుల తీవ్రతకు సోమవారం చెట్టు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు తీగలపై చెట్టు పడటంతో స్తంభాలు విరిగాయి. కుట్రవాడ సమీపంలోని కాకూరు కూడలి వద్ద చెట్టు పడిపోయింది. పక్కనే బొడ్లంక వెళ్లే విద్యుత్తు లైను ఉండటం, చెట్ల కొమ్మలు తీగలపై పడటంతో రెండు స్తంభాలు విరిగిపోయాయి. చావడికోట పంచాయతీ పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది చొరవతో చెట్టును నరికి పక్కకు తొలగించడంతో వాహనాల రాకపోకలకు మార్గం సుగమం అయింది.

విరిగిన విద్యుత్తు స్తంభం

రైలు ఢీకొని జి.మాడుగుల వాసి మృతి

తుని పట్టణం, న్యూస్‌టుడే: తుని రైల్వేస్టేషన్ వద్ద రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. మృతుడు అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం, కిముడుపల్లి గ్రామానికి చెందిన బి.నూకరాజు (50)గా గుర్తించామన్నారు. ఈయనకు భార్య, పిల్లలు ఉన్నారన్నారు. ఏలూరు వెళ్లేందుకు స్వగ్రామం నుంచి భార్యతో కలిసి వచ్చి రెండో నంబరు ప్లాట్‌ఫామ్ వైపు నుంచి, వచ్చి ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చే క్రమంలో రైలు ఢీకొట్టిందన్నారు. కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామన్నారు.

కారు, ఆటో ఢీ.. పలువురికి స్వల్పగాయాలు

అనంతగిరి, న్యూస్‌టుడే: అనంతగిరి ఘాట్‌రోడ్డులో ఆటో, కారు ఢీకొన్న ఘటనలో పలువురు స్వల్పగాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అరకులోయ నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న కారు, ఘాటీ ఎక్కుతున్న ఆటో మర్ధగుడ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న పలువురికి స్వల్పగాయాలు కాగా.. వారిని అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించారు.

JOBS

9247259202 (సెల్ నెం), శ్రీ వెంకటేశ్వర ఎలక్ట్రికల్, భద్రాచలం షాప్‌లో పనిచేయుటకు యువకులు కావలెను.

పశువైద్యాధికారిణిగా సౌజన్యదేవి

చింతపల్లి, న్యూస్‌టుడే: లోతుగెడ్డ పశువైద్యాధికారిణిగా డాక్టర్ సౌజన్యదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ వైద్యాధికారిణిగా పనిచేసిన దేశగిరి దమయంతి తాజా బదిలీల్లో అనకాపల్లి జిల్లాకు వెళ్లారు. ఆమె స్థానంలో ముంచంగిపుట్టు మండలం కిలగాడలో పనిచేస్తున్న సౌజన్యదేవిని ఇక్కడ నియమించారు.

సేవలు అభినందనీయం

హుకుంపేట, న్యూస్‌టుడే: తీగలవలస సచివాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సిబ్బందిని ఆ పంచాయతీ ప్రజలు, నాయకులు సత్కరించి వీడ్కోలు తెలిపారు. సోమవారం జరిగిన సభలో సర్పంచి బేసు, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల గిరిజనులకు సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమన్నారు. పెసా కమిటీ, వార్డు సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	86	78
లైవ్	108	98
డ్రెస్డ్	157	166
స్కిన్‌లెస్	178	176

(c) eenadu

రహదారి బాగు

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ మండలంలోని మాడగడ వద్ద రహదారి బురదమయంగా మారింది. దీనిపై ఈనాడులో గత నెల 26న 'పడరాని పాట్లు' శీర్షికన ప్రచురితమైన చిత్రవార్తకి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. సోమవారం అక్కడ కంకర పోసి వాహనదారుల అవస్థలు తీర్చారు.

స్పందనకు వందనం

మాడగడ-బస్కి రహదారిలో కంకరతో చదును పనులు

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాలకు సత్యసాయి రక్షిత పథకం నుంచి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడి తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కుట్రవాడ సమీపంలోని సత్యసాయి నీటి శుద్ధి ప్లాంటుకు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో పది రోజులుగా నీటి సరఫరా చేయడం లేదు. స్థానికంగా నెలకొన్న ఇబ్బందులపై 'తాగునీటి సరఫరాకు అంతరాయం' శీర్షికన ఈ నెల 6న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు, సిబ్బంది స్పందించి రక్షిత పథకానికి విద్యుత్తు సరఫరాలో అంతరాయం వాటిల్లకుండా చర్యలు చేపట్టి సోమవారం నుంచి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

అరకులోయ, న్యూస్‌టుడే: సబకలో తాగునీటి పథకానికి అధికారులు సోమవారం మరమ్మతులు చేయించారు. 'ఈనాడు'లో సోమవారం 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురితమైన వార్తకు గన్నెల పంచాయతీ కార్యదర్శి జ్యోతి స్పందించారు. ప్యానల్‌బోర్డును బాగు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించారు.

వానాకాలం... విద్యుత్తుపై అప్రమత్తం

పెదబయలు, న్యూస్‌టుడే

★ గతేడాది పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ గడుగుపల్లిలో ఒకే కుటుంబంలో ముగ్గురు విద్యుత్తు షాక్‌తో మృత్యువాతపడ్డారు.

★ జీకేవీధి మండలంలో విద్యుత్తు స్తంభానికి వేలాడి ఒకరు ప్రాణాలు కోల్పోయారు.

★ రెండేళ్ల క్రితం హుకుంపేట మండలం కామయ్యపేటలోని పాఠశాలలో విద్యుత్తు షాక్‌కి గురై విద్యార్థి మృతి చెందాడు.

మన్యంలో వర్షాకాలంలో వారాల తరబడిగా వానలు కురుస్తుంటాయి. ఈ సమయంలోనే గిరిజనులు వ్యవసాయ పనులు అధికంగా చేస్తుంటారు. ఇంటివద్ద పిల్లలను వదిలేసి పెద్దలు పనులకు వెళ్తుంటారు. ఈ క్రమంలో అవగాహన లేక విద్యుత్తు ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి.

మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు(పాత చిత్రం)

గతంలో పాఠశాలల్లోనూ ఈ ప్రమాదాలు జరగడం ఆందోళనకలిగించే విషయం. విద్యుత్తుపై ఎంతో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్తు, పోలీసు, రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు.

ఏం చేయాలంటే..

★ వర్షాలు ఎక్కువగా పడుతుండడంతో గోడలు తడిగా ఉంటాయి. గోడల మీదుగా విద్యుత్తు సరఫరా జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ తడిచేతులతో తాకరాదు.

★ స్విచ్‌లని తడిచేతులతో వేయరాదు.

★ ఇంటిపై విద్యుత్తు వైర్లు, ఇంటి ముందు స్తంభాలుంటే తడి కర్రలతో వాటిని తాకరాదు. ఇటువంటి చోట్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

★ పొలాల్లో విద్యుత్తు స్తంభాలు.. సాధారణమా, హైటెన్షన్ లైను స్తంభాలా అని రైతులు గమనించాలి. వాటిని ఎట్టి పరిస్థితుల్లో తాకరాదు. పొలాల్లో వైర్లు తెగిపడి ఉన్నాయో లేదో గమనించాలి.

★ ఇంట్లో పిల్లల నుంచి పెద్దల వరకు విద్యుత్తు ప్రమాదాలపై కనీసం అవగాహన కలిగి ఉండాలి. అధికారులు లైన్‌మెన్‌లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

★ విద్యుత్తు ప్రమాదాలు జరిగితే బాధితులకు నష్టపరిహారం, బీమా సౌకర్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

తీగలను ఇలాగే వదిలేస్తారా?

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: సున్నంపాడు - నూరుపూడి మార్గంలో అద్దరవీధి వద్ద ఇటీవల చింతచెట్టు కూలి విద్యుత్తు తీగలు తెగిపోయాయి. స్థానికులు చింత చెట్టు కొమ్మలు తొలగించి మానును ముక్కలుగా నరికి పక్కన పడేశారు. పది రోజులు అవుతున్నా విద్యుత్తు అధికారులు తీగలను సరిచేయకుండా అలాగే వదిలేశారు. ఏదైనా ప్రమాదం జరిగే వరకు స్పందించరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. లైన్‌మెన్‌ను పంపి తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

తెగిపడిన విద్యుత్తు తీగలు

ఒడ్డుకు చేరాలంటే సాహసం చేయాల్సిందే

ప్లాస్టిక్ క్యాన్‌లు కట్టుకుని ఉబ్బెంగుల వాగు దాటుతున్న గిరిజనుడు

వర్షాలకు వాగులు, గెడ్డలు ఉప్పొంగి గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలపై వంతెనలు నిర్మించక ఏటా అవస్థలు తప్పడం లేదు. ముంచంగిపుట్టు మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ ఉబ్బెంగుల గ్రామానికి వెళ్లే మార్గంలో గెడ్డ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గిరిజనులు ప్రాణాపాయమని తెలిసినా సాహసం చేసి ప్రవాహం దాటుకుని రాకపోకలు సాగిస్తున్నారు. నడుముకు ప్లాస్టిక్ క్యాన్‌లు, ఆనపకాయ డిప్పలు కట్టుకుని ఒడ్డుకు చేరుతున్నారు. నిత్యావసరాలు, ఇతర సామగ్రి కోసం సాహసం చేయాల్సి వస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. రహదారి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. - ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

చురుగ్గా ఈ-కేవైసీ నమోదు

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని లబ్ధిదారులకు ముఖ ఆధారిత నమోదు ప్రక్రియ చురుగ్గా చేపడుతున్నారు. సెల్ సిగ్నల్స్ లేని గ్రామాల లబ్ధిదారులను సోమవారం అరకులోయ తీసుకొచ్చి వారందరికీ ఈ- కేవైసీ చేశారు. ఐసీడీఎస్ పీవో శారద మాట్లాడుతూ.. బాలింతలు, చిన్నారులకు పోషకాహారం సక్రమంగా అందాలనే ఉద్దేశంతో ముఖ ఆధారిత హాజరును ప్రభుత్వం తప్పనిసరి చేసిందని పేర్కొన్నారు.

అరకులోయలో బాలింతలు, చిన్నారుల వివరాలు నమోదు చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

రక్షిత నీరు.. అందని తీరు!

స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలోని రక్షిత నీటిప్లాంటు మరమ్మతులకు గురై నాలుగేళ్లవుతున్నా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడంలేదు. తాగునీటికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. 2010లో ఎంపీ నిధులతో అప్పటి ఎంపీ తడపట్ల రత్నాబాయి ఈ ప్లాంటు ఏర్పాటు చేశారు. మొదట్లో 20 లీటర్ల తాగునీటిని రూ. అయిదుకే అందించేవారు. ఆ తర్వాత రూ.10కి పెంచారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఉండే ఈ వాటర్‌ప్లాంటును పంచాయతీ అధికారులకు అప్పగించారు. ప్లాంటులో నీటిని తోడే మోటారు కాలిపోయి మరమ్మతులకు గురవడంతో ఎవరూ పట్టించుకోవడంలేదు. స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇది తమ పరిధిలో లేదని ఆర్‌డబ్ల్యూఎస్.. పంచాయతీ అధికారులు తప్పించుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షిత తాగునీటిని అందించాలని వారంతా కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రంపచోడవరం

మరమ్మతుకు నోచుకోని నీటిప్లాంటు

సాగుకు సన్నద్ధం

విడవకుండా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలకు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. కుంటల్లో దుక్కులు చేస్తూ, గట్లు పటిష్ఠపరుస్తున్నారు. కొందరు వరదలు రాని మెరక ప్రాంతాల్లో నారుమడులు వేసి వరి నారు పెంచుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రాయితీ విత్తనాలను అందించడంతో వ్యవసాయ పనులు మరింత వేగం పుంజుకున్నాయి. జగ్గవరం, కోతులగుట్ట, పండ్రాజుపల్లి, చినార్కూరు, పెదార్కూరు, కొండ్రాజుపేట, కొండాయిగూడెం, పల్లూరు, గూడెంకొత్తవీధి మండలం పి.కొత్తూరు గ్రామాల్లో పనులు జోరుగా జరుగుతున్నాయి. - కూనవరం, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

జగ్గవరం వద్ద కుంటలు సిద్ధం చేస్తున్న రైతులు

హెచ్చరిక బోర్డుతో గిరిజనుడి నిరసన

పాడేరు, న్యూస్‌టుడే: గుత్తులపుట్టు సంతబయలులో రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో గతంలో రెవెన్యూ అధికారులు పాతిన హెచ్చరిక బోర్డును ఆక్రమణదారుడు తొలగించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దబ్బపుట్టు గ్రామానికి చెందిర రంది చన్నయ్య కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. తొలగించిన బోర్డును పట్టుకుని నినాదాలు చేశారు. ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించడంతో వాహనాలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

వైద్యుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కూనవరం, న్యూస్‌టుడే: కూనవరంలో ఇటీవల మృతి చెందిన వైద్యుడు దుద్దుకూరి వెంకయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే శిరీషాదేవి దంపతులు సోమవారం పరామర్శించారు. ఎటపాక మండల పర్యటన ముగించుకుని వస్తూ పోలిపాక, కాచవరం గ్రామాల్లో స్థానికులతో మాట్లాడారు. టేకులబోరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శబరి వంతెనపై వరద ఉద్ధృతిని తహసీల్దారు శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు.

అమలవ్వని పీవో హామీ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పోతంగి పంచాయతీ పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారి ద్వారా వస్తున్న ఆదాయాన్ని పంచాయతీకి కేటాయించాలని సర్పంచి వెంకటరావు, ఉప సర్పంచి జగ్గునాయుడు, వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. పోతంగిలో సోమవారం వారు సమావేశమయ్యారు. పంచాయతీకి 30 శాతం ఆదాయం కేటాయిస్తామని అప్పట్లో ఐటీడీఏ పీవో హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. స్థానికులకే ఉపాధిని కల్పిస్తామని చెప్పి.. ఇప్పుడు వేరే ప్రాంతాల యువకులకు ఉద్యోగాలివ్వడం బాధాకరమని పేర్కొన్నారు.

వంచులలో పారిశుద్ధ్య పనులు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గ్రామాల్లో రోగాలు ప్రబలకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు తప్పక చేపట్టాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. వంచుల పంచాయతీలో సోమవారం ఈ పనులను పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

స్నేహభావంతో మెలగాలి

కొయ్యూరు, న్యూస్‌టుడే: విద్యార్థినులంతా స్నేహభావంతో మెలగాలని మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వీకేటీ మహాలక్ష్మి అన్నారు. యాంటీ ర్యాగింగ్‌పై సోమవారం కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సీనియర్, జూనియర్ అన్న బేధం వీడాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పథకాలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని మాజీ మంత్రి, జీసీసీ ఛైర్మన్ శ్రావణ్‌కుమార్ అన్నారు. కించుమండ పంచాయతీ శుక్రపుట్టు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో సోమవారం నిర్వహించారు. ఇంటింటికెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, అరకు పార్లమెంటరీ కోశాధికారి నాగేశ్వరరావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, నాయకులు పొత్తి, నర్సయ్య, వెంకటరమణరాజు, పాండురంగస్వామి, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా చింతపల్లి పంచాయతీ కొత్తవీధి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ప్రగతిబాటలో పయనిస్తోందన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకుడు చల్లంగి లక్ష్మణరావు, చింతపల్లి గ్రామకమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, అబ్బాయినాయుడు, వలీ పాల్గొన్నారు.

శుక్రపుట్టులో పథకాలు వివరిస్తున్న జీసీసీ ఛైర్మన్ శ్రావణ్‌కుమార్, తెదేపా శ్రేణులు

కొత్తవీధి గిరిజనులకు కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

సమస్యల పరిష్కారంలో ముందంజ

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం కంటే కూటమి సర్కారు ముందంజలో ఉందని రంపచోడవరం మార్కెట్ కమిటీ సభ్యులు ఆచంట శ్రీను, ముత్యాల రామారావు పేర్కొన్నారు. రేఖపల్లిలోని తెదేపా కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మరమ్మతుకు గురైన రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు కొత్తగా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. పోలవరం నిర్వాసితుల తరలింపులో ప్రతిబంధకాలను తొలగించి త్వరగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. జడ్పీటీసీ సభ్యుడు రంగారెడ్డి, నాయకులు కన్నారావు, నరసింహారావు, ప్రకాశరావు, రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ సభ్యుడు శ్రీను

అసత్య ఆరోపణలు మానుకోకుంటే గుణపాఠం

రంపచోడవరం, మోతుగూడెం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే శిరీషాదేవిపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోకుంటే మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మికి గుణపాఠం చెబుతామని తెదేపా నాయకులు పేర్కొన్నారు. రంపచోడవరం తెదేపా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు అడబాల బాపిరాజు, అనంతమోహన్, బాపన్నదొర, సూర్యనారాయణరాజు, జనార్దన్ మాట్లాడుతూ.. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి వ్యాఖ్యలను వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ ఖండించారు. ఎవరి హయాంలో ప్రజలకు మేలు జరిగిందో చర్చకు సిద్ధమేనని పేర్కొన్నారు.

పాఠశాలలో ఎన్నికల సందడి

ఎటపాక, న్యూస్‌టుడే: నందిగామపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్‌పీఎల్) ఎన్నిక సోమవారం ఉత్కంఠ భరితంగా సాగింది. పోలింగ్ అధికారిగా భావన, ఏపీవోగా కేతనశ్రీ, రిటర్నింగ్ అధికారిగా ఉపాధ్యాయుడు మహేష్ వ్యవహరించారు. 49 మంది బాలికలు, 36 మంది బాలురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో రెండు చెల్లుబాటు కాలేదు. ఎస్‌పీఎల్‌గా తొమ్మిదో తరగతి విద్యార్థి గౌతమ్‌కృష్ణ, జీఎస్‌పీఎల్‌గా పదో తరగతి విద్యార్థిని చందనశ్రీ ఎన్నికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పోలైన ఓట్లను లెక్కిస్తున్న రిటర్నింగ్ అధికారి, పీఓ, ఏపీఓలు

రేషన్ వాహనాలను పునరుద్ధరించాలి

అరకులోయ, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రేషన్ వాహనాలను ప్రభుత్వం పునరుద్ధరించాలని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కోరారు. అరకులోయలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మన్యంలో డీఆర్‌డిపోలు సుదూర ప్రాంతంలో ఉన్నాయని.. అక్కడకు వెళ్లి లబ్ధిదారులు రేషన్ బియ్యం తీసుకోవడం వ్యయ, ప్రయాసలతో కూడిందన్నారు. అనంతగిరి, అరకులోయ మండలాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి, గుమ్మకోట సర్పంచి అప్పారావు, కో ఆప్షన్ సభ్యుడు మదీనా తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, చిత్రంలో అనంతగిరి ఎంపీపీ నీలవేణి తదితరులు

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

గూడెంకొత్తవీధి, చింతపల్లి, న్యూస్‌టుడే: జల్‌జీవన్ మిషన్ పనులకు టెండర్ల ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ పాడేరు ఏఈఈ బీవీవీ నాగేశ్వరరావు తెలిపారు. దేవరాపల్లిలో నిర్మించిన మంచినీటి పథకాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గిరి గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చింతపల్లి మండలంలో పథకాలను ఈఈ పరిశీలించారు. డీఈ కరుణ, ఏఈలు సాయికృష్ణ, కల్యాణ్‌రామ్ స్వర్ణలత పాల్గొన్నారు.

దేవరాపల్లిలో నీటి పథకం మోటారు గదిని పరిశీలిస్తున్న ఏఈఈ నాగేశ్వరరావు

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

సీలేరు, న్యూస్‌టుడే: గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దారకొండ వైద్యాధికారిణి డా. హిమబిందు అన్నారు. దారకొండ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి హిమబిందు

మత్తు పదార్థాలతో అనర్థాలు

మోతుగూడెం, న్యూస్‌టుడే: గంజాయి, నాటుసారా వంటి మత్తు పదార్థాలతో ఎన్నో అనర్థాలున్నాయని ఎస్సై సాధిక్ పేర్కొన్నారు. మోతుగూడెం పరిధిలోని కొత్తపల్లి, వేములరాయి గ్రామాల్లో సోమవారం స్థానికులతో సమావేశమయ్యారు. గంజాయి సాగు, రవాణా, నాటుసారా తయారీని వదిలేసి ఉపాధి మార్గాలపై దృష్టిసారించాలన్నారు. అనంతరం గ్రామస్థులకు దుస్తులు పంపిణీ చేశారు.

దుస్తులు అందజేస్తున్న ఎస్సై సాధిక్

హైడ్రోప్రాజెక్టులతో తీవ్ర నష్టం

అనంతగిరి, న్యూస్‌టుడే: గుజ్జెలి, చిట్టంవలస, పెదకోట ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతులు తక్షణమే రద్దు చేయాలని ఎంపీపీ నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు కోరారు. కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ ప్రాజెక్టులతో సుమారు 50 గ్రామాల్లో 10 వేల మంది గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, అరకులోయ జడ్పీటీసీ సభ్యురాలు రోషిణి, అనంతగిరి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పాగి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: చిట్టంపాడులో హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేయాలని ముంచంగిపుట్టు పెసా కమిటీల సభ్యులు డిమాండు చేశారు. ముంచంగిపుట్టులో నిరసన తెలిపారు. సుబ్బారావు, పద్మనాభం, నీలకంఠం, బలరాం, గణపతి, తిరుపతి, జయరాం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు విన్నవిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు తదితరులు

నిర్వాసితులకు న్యాయం చేసే వరకు పోరుబాట

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి, వారికి న్యాయం చేసే వరకు పోరుబాట కొనసాగిస్తామని ఎంపీపీ లక్ష్మి, సీపీఎం మండల కార్యదర్శి సంతోశ్‌కుమార్ పేర్కొన్నారు. రేఖపల్లిలో తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. గ్రామాలు ఖాళీ చేసే సమయానికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు. ముంపుతో సంబంధం లేకుండా పరిహారం పొందిన భూముల రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు అందజేయాలని, అన్నదాతా సుఖీభవ పథకం వర్తింపజేయాలని కోరారు. ప్రాధాన్యత గ్రామాల జాబితాలో మొద్దులగూడెం, నూతిగూడెం, అన్నవరం, ఉమ్మడివరం, సున్నంవారిగూడెం, గుర్రంపేట, రేఖపల్లి, చిన్నమట్టపల్లిని చేర్చాలని తహసీల్దారు సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు ప్రదీప్, శ్రీరామ్మూర్తి, రమేశ్, చిన్నబాబు, ప్రకాశ్, సుందరయ్య పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసనలో నాయకులు, ప్రజాప్రతినిధులు

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు : 89853 66570, అరకులోయ: 63034 86346
రంపచోడవరం: 94908 77172

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ?: మారేడుమిల్లిలో సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది. చుట్టూ తుప్పలు పెరిగాయి. - స్థానికులు, మారేడుమిల్లి

✔: సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువస్తాం. - శ్రీనివాసవిశ్వనాథ్, ఎంపీడీవో

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ?: శరభవరంలో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అడ్డుగా పశువులు సంచరిస్తున్నాయి. - త్రిమూర్తులు, రాజవొమ్మంగి

✔: పశువుల యజమానులకు నోటీసులు జారీ చేశాం. స్పందించకుంటే జరిమానా విధిస్తాం. - శివ, పంచాయతీ కార్యదర్శి, శరభవరం



అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ?: ఎన్ఆర్‌పురం, రొంపల్లి పంచాయతీల పరిధిలో రహదారి పనులు సగంలో నిలిచిపోయాయి. - కొటపర్తి సన్యాసిరావు, రాయిపాడు

✔: త్వరలో పనులు ప్రారంభిస్తాం. - గణేష్, గిరిజన సంక్షేమశాఖ ఏఈ

కొయ్యూరు, న్యూస్‌టుడే: ?: మంప పంచాయతీ గంగవరం సమీపంలోని చెక్‌డ్యాం, పంట కాలువలు మరమ్మతులకు గురయ్యాయి. సాగునీటికి ఇబ్బందులు తప్పడంలేదు. - స్థానికులు, గంగవరం

✔: మరమ్మతు పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేయిస్తాం. - రామకృష్ణ, ఎస్.ఎం.ఐ జేఈ

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పెదబయలు స్టేట్ బ్యాంకు సమీపంలో ప్రధాన రహదారి ఆనుకొని చెత్త పేరుకుపోయింది. దోమలు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - బాబూరావు, స్థానికుడు

✔: వర్షాలతో పనుల్లో జాప్యం జరిగింది. చెత్తను సిబ్బందితో తీయిస్తాం. - నర్సింగరావు, ఈవోపీఆర్డీవో

చింతపల్లి, న్యూస్‌టుడే: ?: చింతపల్లి రామాలయం వీధిలో కాలువల్లో ఉన్న వ్యర్థాలను తీసి రోడ్డుపైనే వదిలేశారు. వీటిని తొలగించాలి.- మహర్షి రామాలయం వీధి

✔: వర్షాల కారణంగా చెత్త తొలగింపులో జాప్యం జరిగింది. పారిశుద్ధ్య కార్మికులతో వీటిని తీయిస్తాం. - లక్ష్మీకుమార్, పంచాయతీ కార్యదర్శి, చింతపల్లి

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజవొమ్మంగిలో జిల్లా అధ్యక్షుడు ఎం.బుజ్జి జెండా ఆవిష్కరించారు. అనంతరం మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. తాతారావు, కామరాజు, నూకరాజు, అనిల్ పాల్గొన్నారు.

గంగవరంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలో మాదిగల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా దండోరా ఇన్‌ఛార్జి మంగరాజు అన్నారు. చింతపల్లిలో మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కుందూరు రాజు, వెంకటరావు, చిందాడ చిన్న, అంబేడ్కర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం, న్యూస్‌టుడే: రాజవరంలో ఎమ్మార్పీఎస్‌రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నిడమర్తి చిన్నబాబు దండోరా జెండా ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. తొలుత ర్యాలీ చేసి జెండా ఎగురవేశారు. బింగూ విష్ణు తదితరులు కేకు కోశారు. తెదేపా నాయకులు రామారావు, కన్నారావు, నరసింహారావు, ప్రకాశరావు, రాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు సరే.. వెళ్లే దారేదీ?

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా.. సక్రమంగా వినియోగించడంలో ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఆలోచన లేకుండా చేస్తున్న పనులతో నిధుల ఖర్చు మినహా ప్రయోజనం ఉండటం లేదు. మారేడుమిల్లిలో ఇటీవల సీసీ రోడ్డు ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. మండల పరిషత్తు కార్యాలయం పక్క నుంచి బోదులూరు రోడ్డును కలుపుతూ గతంలో మట్టి రోడ్డు ఉండేది. వర్షం పడితే చిత్తడిగా మారి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో రూ.7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. తారు రోడ్డు, సీసీ రోడ్డు కలిసే చోట తాగునీటి పథకం మినీట్యాంకు ఉండటంతో నీరు పోయేందుకు కాలువ నిర్మించారు. దీనిపై సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు వెళ్లేందుకు వీల్లేకుండా పోయింది. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

రహదారి కలిసే చోట నిర్మించి వదిలేసిన కాలువ

నిరుపయోగంగా సిమెంటు రోడ్డు

(c) eenadu

సర్వర్ పని చేయక.. ఓపిక లేక..

జీజీహెచ్‌లో సర్వర్ పని చేయక, తగిన సిబ్బంది లేక రోగులకు అవస్థలు తప్పడం లేదు. ప్రతి సోమవారం విపరీతమైన రద్దీ ఉంటుంది. సర్వర్ తరచూ రోజూనే సర్వర్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆన్‌లైన్ టోకెన్ నంబర్ల కోసం రోగులకు సహాయం చేసే సిబ్బంది అంతంతమాత్రంగానే ఉండటంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. రోగులు ముందుగా ఆన్‌లైన్ టోకెన్ నంబరు తీసుకుని ఓపీ క్యూలైన్‌లోకి వెళ్లాలి. ఆక్సిడెంటల్ సర్వర్లు మొరాయిస్తున్నాయి. గతంలో ఆన్‌లైన్ టోకెన్ల వద్ద సిబ్బంది అధికంగా ఉండటంతో రోగులు త్వరగానే క్యూలైన్లోకి వెళ్లేవారు. ప్రస్తుతం పరిమిత సిబ్బంది ఉండటం.. ఓపిక లేని వేళల్లో రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. - ఈనాడు, గుంటూరు

క్యూలైన్లలో కిక్కిరిసిన రోగులు

డీఆర్సీ సమావేశం నేడు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డీఆర్సీ) సమావేశం ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో మంగళవారం మధ్యాహ్నం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయం, ఉద్యాన శాఖలతో పాటు జలవనరుల శాఖపై సమీక్షించనున్నారు.

ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్- 2025 కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. విద్యార్థుల కోసం నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో అధికారులు హెల్ప్‌లైన్ కేంద్రాలు అందుబాటులో ఉంచారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలను ఈ నెల 17 వరకు ఈ కేంద్రాల్లో పరిశీలిస్తారు.

నేతగారి మేత

- మంగళగిరి ఆటోనగర్ అడ్డాగా అక్రమాలు
- వైకాపా హయాంలో అనర్హులకు ప్లాట్లు

ఈనాడు - అమరావతి

మంగళగిరి ఆటోనగర్ అక్రమాలకు అడ్డాగా మారింది. వైకాపా ప్రభుత్వ హయాంలో అసోసియేషన్ నేత ఒకరు అన్నీతానై చక్రం తిప్పారు. అప్పట్లో అధికార వైకాపా అండ ఉండటంతో అక్రమాలకు తెగబడ్డారు. ఏపీఐఐసీ కార్యాలయంలోని కొందరు సిబ్బంది సైతం సహకరించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరుల పేర్లతో పదుల సంఖ్యలో ప్లాట్లు కేటాయించుకున్నారు. ఎవరైనా యూనిట్ ఏర్పాటుకు వస్తే అడ్డంకులు సృష్టించి.. అధికారులతో నోటీసులిప్పించి అడ్డుకున్నారు. మంగళగిరి ఆటోనగర్‌లో ప్లాట్లు కేటాయించాలన్నా.. యూనిట్ పెట్టాలన్నా.. విక్రయించాలన్నా.. బదిలీ చేయాలన్నా.. సదరు నేత అంగీకారం తప్పనిసరి. ఆటోనగర్‌కు పవర్‌సెంటర్ మారారంటే అతిశయోక్తి కాదు. ఏపీఐఐసీ ఉన్నతాధికారులు తరచూ మారుతుండడం, పాలకవర్గ సభ్యులు కీలక పాత్ర పోషించడంతోపాటు వారంతా ఆ నేత బాటలో నడవడంతో చెలరేగిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బాధితులు ఫిర్యాదులు చేయడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అనేక అక్రమాలను గుర్తించిన నిఘా విభాగం త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం.

మంగళగిరి ఆటోనగర్

ఇదీ గతం.... మంగళగిరి ఆటోనగర్ ఏర్పాటుకు ముందు 1974-75లో అప్పటి ప్రభుత్వం ఏపీఐఐసీకి 151 ఎకరాలను కేటాయించింది. 2002లో ఏపీఐఐసీ 143 ఎకరాలను ఏపీఐఐసీ నుంచి బదిలీ చేశారు. ఇందులో ఆర్టీసీ, రాజీవ్‌గృహకల్ప, రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు కొంతపోగా 116 ఎకరాల భూమి మిగిలింది. మౌలిక వసతుల అభివృద్ధి చేసి సుమారు 440 ప్లాట్లను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయించింది. వీరు రెండేళ్లలో యూనిట్ కార్యకలాపాలు చేపట్టాల్సి ఉండగా... ఎవరూ ప్రారంభించలేదు. ఇలాంటివి రద్దు చేసి కొత్తవారికి కేటాయించాల్సి ఉన్నా... ఏపీఐఐసీ సకాలంలో చర్యలు తీసుకోలేదు. ప్లాటు పొందిన సదరు వ్యక్తి అసోసియేషన్ నేతగా ఎదిగి అక్రమాలకు తెర లేపారు. రాజధాని అమరావతి రాకతో ప్లాట్లకు మరింత డిమాండ్ పెరగడంతో ఆయన అక్రమాలకు పాల్పడ్డారు.

సదరు నేత దందా ఇలా.... యూనిట్లు ఏర్పాటు చేశాక ఏపీఐఐసీ సదరు యజమానికి సేల్‌డీడ్ చేయాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా ప్లాట్లు కేటాయించారు. 15 ఏళ్ల తరువాత కూడా యూనిట్లు ఏర్పాటు చేయకపోయినా.. వైకాపా హయాంలో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. ప్లాటు పొందిన వ్యక్తి మరొకరికి సబ్‌లీజుకిచ్చినా.. ఏపీఐఐసీ పట్టించుకోలేదు. కొంతమంది అగ్రిమెంట్ డాక్యుమెంట్ల ద్వారా ప్లాట్లను ఇతరులకు విక్రయించారు. కొన్ని ప్లాట్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకునేలా చక్రం తిప్పారు. ఇప్పటికీ కొన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నా... అవి రద్దు కాకుండా కొంతమంది కాపాడారు. ఏపీఐఐసీ సేల్‌డీడ్ చేసిన ప్లాట్లలోనూ నిబంధనలు పాటించలేదు. ప్రైవేటు ఒప్పందాలతో ప్లాట్లను ఇతరులకు బదిలీ చేయడం, విక్రయించడం జరిగాయి. కొంతమంది ప్లాట్లు కావాలని నేతకు ఇచ్చిన డబ్బును ప్రైవేటు బిల్డింగ్ల ఆ సొమ్మును ఏపీఐఐసీకి జమ చేయలేదు.

ఎల్పీఎస్ లేఔట్లలో సర్వే

పచ్చదనం పెంపునకు స్థలాల గుర్తింపు

ఈనాడు - అమరావతి: అమరావతి పునర్నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు కేటాయించిన ఎల్పీఎస్ లేఔట్లలో సర్వే ప్రారంభమైంది. వీటిలో మౌలిక వసతుల కల్పన బాధ్యతను ప్రభుత్వం ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్)కు అప్పగించింది. ఇటీవల వరకు ఈ బాధ్యతలను సీఆర్డీఏ పర్యవేక్షించింది. రాజధానిలోని 18 ఎల్పీఎస్ జోన్లలో సర్వేలో భాగంగా పచ్చదనం పెంచే ప్రాంతాలను గుర్తిస్తున్నారు. ఎల్పీఎస్ లేఔట్లలో మౌలిక వసతుల అభివృద్ధికి అధికారులు టెండర్లు పిలిచి, గుత్తేదారులతో ఒప్పందం చేసుకున్నారు. క్షేత్రంలో ఈ పనులు పురోగతిలో ఉన్నాయి. మౌలిక వసతుల కల్పనలో భాగంగా 1,281 కి.మీ నిడివితో రహదారులు, వాన నీటి మళ్లింపు డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, విద్యుత్తు, కమ్యూనికేషన్ల డక్టులు నిర్మించాలి.

సర్వే నిర్వహిస్తున్న సీఆర్డీఏ, ఏడీసీ సిబ్బంది

1,500 ఎకరాల్లో 489 పార్కులు...: అమరావతిని హరిత రాజధానిగా అభివృద్ధి చేసే చర్యల్లో భాగంగా లేఔట్లలో విస్తృతంగా ఉద్యానాలను పెంచనున్నారు. అన్ని లేఔట్లలో 1,500 ఎకరాలను ఇందుకు ఉద్దేశించారు. అనువైన ప్రాంతాల కోసం సీఆర్డీఏ, ఏడీసీఎల్, సర్వే శాఖ అధికారులు అన్వేషిస్తున్నారు. గుర్తించిన ప్రాంతాల్లో హద్దులను నోటిపై చేస్తున్నారు. తర్వాత వాటిల్లో పార్కులను అభివృద్ధి చేస్తారు. ఇందులో తొలి ప్రాధాన్యంగా జోన్-7లో చేపట్టగా... 22 పార్కులు రానున్నాయి. అన్ని జోన్లలో 489 ఉద్యానాలను అభివృద్ధి చేయనున్నారు. వీటి విస్తీర్ణం మేరకు కమ్యూనిటీ, నైబర్‌హుడ్, సిటీ, టౌన్ పార్కులు, తదితర పలు రకాలను ప్లాట్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకున్నారు.

గుట్ట మాటున దోపిడీ

కొల్లిపర రీచ్‌లో ఇసుక అక్రమ రవాణా

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - కొల్లిపర

కొల్లిపర ఇసుక రీచ్ అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. కృష్ణా నదిలో తవ్వకాలకు అనుమతుల్లేకపోయినా.. రాత్రివేళ యథేచ్ఛగా తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో యార్డులో డంపింగ్ చేసిన ఇసుక రవాణాకు అనుమతి తీసుకుని.. ఆ గుట్టను అడ్డుగా పెట్టుకుని నదిలో అక్రమంగా తవ్వేస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో లారీల్లో ఇసుక తరలిపోతున్నా.. డంపింగ్‌యార్డులో నిల్వలు తరగకపోవడం గమనార్హం.

కొల్లిపర రీచ్‌లో లారీల్లోకి ఇసుక ఎగుమతి

గతంలో ఈ వ్యాపారంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తి ఆధ్వర్యంలోనే అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. పగటివేళ డంపింగ్‌యార్డులో ఉంటున్న భారీ యంత్రాలను రాత్రివేళ నేరుగా నదిలోకి తీసుకెళ్లి లారీల్లోకి ఇసుకను ఎగుమతి చేస్తున్నారు.

అడ్డుకోలేరా? కొల్లిపర రీచ్‌లో నిల్వ ఉన్న ఇసుకను విక్రయించడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. రాత్రివేళల్లో కృష్ణా నదిలో తవ్విన ఇసుకలో కొంత డంపింగ్‌యార్డుకు.. మరికొన్ని లారీలు నేరుగా వినియోగదారుల వద్దకు వెళ్లేలా వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. తనిఖీలున్నాయని సమాచారం వస్తే తవ్వకాలు ఆపేస్తున్నారు. నెల రోజుల నుంచి ఈ తంతు నడుస్తున్నా.. అడ్డుకున్నవారు లేరు. మధ్యలో పదిరోజులపాటు అక్రమ రవాణా ఆగింది. వారం రోజుల నుంచి మళ్లీ మొదలైంది.

బిల్లులతో మాయాజాలం అక్రమంగా రవాణా చేస్తున్న లారీలకు బిల్లులు ఇవ్వకపోవడంతో అవి రికార్డుల్లోకి ఎక్కడం లేదు. డంపింగ్‌యార్డులోని ఇసుక లోడ్ చేస్తున్న ఎక్కువ లారీలకు రికార్డుల్లో నమోదు చేయని బిల్లులిస్తున్నారు. తద్వారా అక్కడ ఇసుక నిల్వలు రికార్డుపరంగా తగ్గకుండా చూస్తున్నారు. ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారం చేస్తూ పెద్దఎత్తున దోపిడీకి పాల్పడుతున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే డంపింగ్‌యార్డు నుంచి రవాణాకు అనుమతులున్నాయని సమాధానమిస్తున్నారు. పైగా 32 టన్నుల లారీకి రూ.7 వేలు తీసుకుని లోడింగ్ చేస్తుండటంతో విషయం బయటకు రావడం లేదు. మార్కెట్లో ఇసుకకు ఆశించిన స్థాయిలో డిమాండ్ లేకపోవడంతో నది నుంచి దూరాన్ని బట్టి టన్ను రూ.400 నుంచి రూ.450లకే వినియోగదారులకు లభ్యమవుతోంది. దీంతో వినియోగదారుల వైపు నుంచి ఫిర్యాదులు ఉండడం లేదు. జిల్లా మైనింగ్ అధికారి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా కొల్లిపర రీచ్‌లో అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు వస్తే ఇటీవలే తనిఖీ చేశామని, డంపింగ్‌యార్డు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. నదిలో ఇసుక తవ్వకాలపై రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. నదిలో యంత్రాలతో తవ్వకాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

గుంటూరు ఘాటు అదిరింది

- మిర్చికి జాతీయ అవార్డు
- ఒక పంట... ఒక ఉత్పత్తి విభాగంలో గుర్తింపు

న్యూస్‌టుడే - కలెక్టరేట్ (గుంటూరు)

గుంటూరు మిర్చికి మరో జాతీయ అవార్డు దక్కింది. ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) విభాగంలో ఈ గుర్తింపు లభించింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో మిరప సాగు, ప్రభుత్వ సహకారం, రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలపై జిల్లా పాలనాధికారి నాగలక్ష్మి కేంద్రానికి నివేదించారు. స్పందించిన కేంద్ర బృందం ఒక జిల్లా... ఒక ఉత్పత్తి విభాగం కేటగిరీలో ఈ ఏడాది జనవరిలో జిల్లాలో పర్యటించింది. ఈ మేరకు ఓడీఓపీ విభాగంలో అవార్డుకు గుంటూరు మిర్చిని ఎంపిక చేసినట్టు కేంద్రం ప్రకటించింది. ఈ నెల 14న దిల్లీలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్‌గోయల్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట మిరప. దీనికి ఘాటెక్కువ. ఇక్కడి భూములు, వాతావరణం, సాగు విధానాల వల్ల ఇతర ప్రాంతాల్లో పండే మిర్చితో పోలిస్తే దీనికి ప్రత్యేకత ఉంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా మన్నన పొందుతోంది. గుంటూరులో విత్తనం మొదలుకుని ఎగుమతుల వరకు అన్ని దశల్లోనూ ఇక్కడ ప్రత్యేకతలున్నాయి.

పొరుగు రాష్ట్రాల రైతులు కూడా ఇక్కడి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పురుగు మందులు, కొత్తగా మార్కెట్లోకి వచ్చే ఎరువులను

ఇక్కడే పరిచయం చేస్తున్నారు. సాగులో కొత్త పద్ధతులకూ జిల్లా నెలవుగా ఉంది. ఆసియాలో అతిపెద్దదైన మిర్చియార్డు కొలువైందీ ఇక్కడే. రైతులకు గిట్టుబాటు ధర దక్కేవరకు మిర్చిని నిల్వ చేసుకోవడానికి గుంటూరు పరిసరాల్లో 80కిపైగా శీతలగోదాములున్నాయి. విత్తన పరిశోధన స్థానం లాం, మిర్చిలో పురుగుమందుల అవశేషాల శాతాన్ని పరీక్షించే ప్రయోగశాల అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రత్యేకతలతో జిల్లా యంత్రాంగం 76 పేజీల నివేదికను ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి విభాగం కింద కేంద్రానికి పంపింది. రైతులు బృందంగా ఏర్పడి రసాయన రహిత మిర్చి ఉత్పత్తిలో భాగస్వాములు కావడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను అందులో వివరించారు. గత జనవరిలో పర్యటించిన కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో అన్ని అంశాలను పరిశీలించి అవార్డుకు ఎంపిక చేసింది.

మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులు బెదిరిస్తున్నారు

- బిహార్ గ్యాంగ్‌తో హత్య చేయిస్తామంటున్నారు
- రక్షణ కల్పించాలని ఎస్పీ కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులు తమను చంపేస్తామని బెదిరిస్తున్నారని గుంటూరు లాలాపేటకు చెందిన షేక్ ముజబుర్ రెహమాన్ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ రమణమూర్తి లాలాపేట పోలీసులను ఆదేశించారు. బాధితుడు రెహమాన్ విలేకరులకు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.. 'ఆటోమొబైల్ స్పేర్‌పార్ట్స్ వ్యాపారం చేస్తుంటా. నా స్నేహితుడు అఫ్జల్‌ఖాన్ గత ప్రభుత్వంలో అప్పటి ఎంపీ నందిగం సురేష్ వద్ద గన్‌మేన్‌గా పని చేశాడు. ఇతను రేపల్లెకు చెందిన ఆశిక్ సన్నీని పరిచయం చేశాడు. తనకు నందిగం సురేష్ ఇసుక క్వారీ ఇచ్చారని, వ్యాపారం చేయడానికి రూ. 25 లక్షల అప్పు ఇస్తే మూడు నెలల్లో తిరిగిచ్చేస్తానని 2020లో సన్నీ అడిగాడు. సురేష్‌ను తన తరపున హామీగా పెడతానంటూ మాయ మాటలు చెప్పాడు. అవి నమ్మి రూ. 25 లక్షలు సన్నీకిచ్చా. మూడు నెలల తరువాత డబ్బులడిగితే అతను సమాధానం చెప్పలేదు. ఎన్నిసార్లు అడిగినా రాజకీయ నాయకులు, రౌడీషీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లతో సంబంధాలున్నాయని బెదిరిస్తున్నాడు. నందిగం సురేష్ అండ ఉందని, డబ్బులు అడిగితే నరికేస్తామంటూ అతని అనుచరులు నన్ను, నా సోదరుడు నౌషాద్‌ను భయపెట్టారు. దీంతో తన చావుకు నందిగం సురేష్ అనుచరుడైన సన్నీయే కారణమని నౌషాద్ 2023 డిసెంబరులో సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడిని ఆసుపత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడుకున్నాం. మేం నందిగం సురేష్ వద్దకెళ్లి విషయం చెప్పాం. ఆయన తన అనుచరుడికి మద్దతుగా మాట్లాడారు. ఆ డబ్బులు తిరిగి రావని చెప్పారు. మరోసారి డబ్బుల కోసం వస్తే జైల్లో వేయిస్తామని బెదిరించారు. కేసు పెడితే.. నన్ను, నా సోదరుడిని నామరూపాల్లేకుండా చేస్తామని సన్నీ హెచ్చరించాడు. తమ చేతిలో బిహార్‌వాళ్లున్నారని, రూ. 10 వేలిస్తే చాలు గొంతు కోసేస్తారని, చిత్రహింసలు పెట్టి కుక్కలతో కరిపించి చంపేస్తారని బెదిరించారు. అప్పట్నుంచి సురేష్, సన్నీ అనుచరులు మా కదలికలు గమనిస్తున్నారు. వారిద్దరి నుంచి ప్రాణహాని ఉంది. మాకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఏఎస్పీని కోరా' అని తెలిపారు.

షేక్ ముజబుర్ రెహమాన్

ఎంపీటీఎం 2.0 నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ 2.0కు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లను ఆదేశించారు. ఎంటీపీఎం 2.0 నిర్వహణపై కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 10న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో సమావేశం నిర్వహించాలన్నారు. ఉదయం 9 నుంచి 9.30 వరకు విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్థానిక పెద్దలకు ఆహ్వానం, పాఠశాలలో ఏర్పాటు చేసి ఫొటో బూత్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రూప్ ఫొటో తీసుకోవడం, 9.30 నుంచి 10.30 వరకు తరగతి గదుల్లో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులతో సమావేశమై హోలిస్టింగ్ ప్రోగ్రెస్ కార్డులు అందించి ప్రగతి తెలియజేయాలన్నారు. ఉదయం 10.30 నుంచి 11 వరకు తల్లులకు మ్యూజికల్ ఛైర్, లెమన్ ఇన్ స్పూన్, రంగోలి పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఈవో రేణుక, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఎంత తవ్వారు.. ఎక్కడ పోశారు..!

ఏఎన్‌యూలో మట్టి అక్రమ తవ్వకాలపై విజి'లెన్స్'

ఈనాడు, అమరావతి: ఎంత మట్టి తవ్వారు? ఎక్కడెక్కడ వినియోగించారు? అసలు మట్టి తవ్వకాలకు అనుమతులెవరు ఇచ్చారని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అక్రమ మట్టి తవ్వకాలపై గత రెండు రోజులుగా విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఎంతమేర తవ్వారో కొలతలు తీశారు. ఏఎన్‌యూలోని ఇంజినీరింగ్ కళాశాల వెనుకవైపు, వర్క్‌షాప్‌నకు సమీపంలో గతేడాది భారీగా ఎర్రమట్టి తవ్వారు. ఎకరాలకొద్దీ భూముల్లో పొక్లెయిన్లు పెట్టి 60 నుంచి 70 అడుగుల లోతున తవ్వేశారు. నాణ్యమైన ఎర్రమట్టి చేబ్రోలు తరువాత ఏఎన్‌యూలోనే దొరుకుతుంది. దీంతో ఈ మట్టికి భారీగా డిమాండ్ ఉంది. సుమారు వందెకరాల విస్తీర్ణంలో ఉన్న వర్సిటీలో ఖాళీ భూములున్నచోట చెట్లు, దట్టమైన పొదల మాటున అక్రమంగా మట్టి తవ్వేశారు. దీనికి సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోలేదు. తవ్వినదాంట్లో కొంతవరకు స్థానికంగా చేపట్టిన పనులకు వినియోగించగా.. మరికొంత బయటకు తరలించేశారని వర్సిటీలో చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో విజిలెన్స్ అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి పెట్టారు.

అవకాశమివ్వండి.. రూ.కోట్లు గడిస్తా!

- నా అనుభవంతో ట్రేడింగ్‌లో మరింత సంపాదిస్తా
- పోలీసు విచారణలో నిందితుడు ఆదిత్య వేడుకోలు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - పటమట

నేను షేర్లలో పెట్టుబడి పెట్టడంలో దిట్ట. ఏ షేర్ ధర ఎప్పుడు పెరుగుతుందో పసిగట్టగలను. షేర్ మార్కెట్లో బడా వ్యక్తులతో నేరుగా మాట్లాడగలిగే పరిచయాలు ఉన్నాయి. ఒక్క ఛాన్స్ ఇవ్వండి ప్లీజ్.. ట్రేడింగ్‌లో నాకున్న అనుభవంతో భారీగా సంపాదిస్తానని' అద్విక ఎండీ ఆదిత్య పోలీసుల విచారణలో వేడుకున్నాడు.

అధిక వడ్డీల పేరుతో రూ.కోట్లు దోచేసిన అద్విక ట్రేడింగ్ కంపెనీ కేసులో పోలీసులు నిశిత దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ఆదిత్య జల్సాలకు రూ.కోట్లు వెచ్చించినట్లు తేల్చారు. దుబాయ్‌లో మూడు కార్యాలయాలు ప్రారంభించి, ట్రేడింగ్ ఖాతాలనూ తెరిచాడు.

మొత్తంగా 1,109 మంది రూ.350 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు తేలింది. ఏజెంట్లకు కమీషన్ల రూపంలో.. పెట్టుబడిదారులకు వడ్డీల రూపంలో రూ.250 కోట్లు చెల్లించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నిందితుడు అనారోగ్యంతో బాధపడుతున్నందున సోమవారం విచారణ సాగలేదు.

ఆ ఖాతాలపైనే గురి.. విజయవాడలో రెండేళ్లలో మూడుచోట్ల కార్యాలయాలు మార్చినట్లు గుర్తించారు. కొన్నినెలల కిందట దుబాయ్‌లో మూడుచోట్ల మూడు కార్యాలయాలు పెట్టాడు. ట్రేడింగ్ కోసం గోల్డెన్ లీప్, మల్టీ బ్యాంకు, ఖజానాలో మూడు ఖాతాలు తెరిచాడు. వీటిల్లో నగదు నిల్వలు, లావాదేవీల స్టేట్‌మెంట్లు ఇవ్వాలని పోలీసులు ఆయా బ్యాంకులకు రాసినా వారు పట్టించుకోలేదు. ఫెమా చట్టం కింద కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా లేఖలు పంపనున్నారు.

కరెంట్ ఖాతాల వివరాలు కొలిక్కి.. సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి బోర్డు తిప్పేసే వరకు సంస్థకు చెందిన ఏడు కరెంటు ఖాతాల వివరాలు సోమవారం పోలీసులకు అందాయి. ఆదిత్య వ్యక్తిగత ఖాతా వివరాలూ చేరాయి. ఖాతాల్లో జమైన, బదిలీ అయిన నగదు వివరాలు లెక్క తేలేందుకు 7-10 రోజులు పట్టే వీలుందని భావిస్తున్నారు.

విచ్చలవిడి ఖర్చులు... దుబాయ్ కార్యాలయాల్లో ఇంటీరియర్ డిజైనింగ్‌కు రూ.20-30 లక్షలు వెచ్చించినట్లు తెలిసింది. విజయవాడ కార్యాలయంలోనూ రూ.20 లక్షలు వెచ్చించాడు. డిపాజిటర్లను ఆకట్టుకునేందుకే ఈ ఎత్తుగడ. నగరంలో రూ.3 కోట్ల విలువైన ఫ్లాట్ కొన్నాడు. నిరుడు.. ఓ ఏజెంట్‌కు కారు కొనేందుకు అతనితోపాటు ఆదిత్య కూడా షోరూమ్‌కు వెళ్లాడు. కారు కొన్న తర్వాత సిబ్బందికి టిప్‌గా రూ.50 వేలు ఇచ్చాడు. ఏజెంట్లను ఉత్తేజపరిచేందుకు గోవాలో విలాసవంత పార్టీలు ఇచ్చేవాడు.

ఇప్పటికి 110 మంది ఫిర్యాదు... ఏజెంట్ల ఖాతాలు, వారి లాకర్లు కూడా ఫ్రీజ్ అయ్యాయి. ఇప్పటికే 44 మంది ఏజెంట్లు వివరాలు ఇవ్వగా.. ఐదుగురు పరారీలో ఉన్నారు. నిత్యం బాధితులు ఏసీపీ కార్యాలయానికి వస్తూనే ఉన్నారు. ఇప్పటికి 110 మంది ఫిర్యాదు చేశారు.

ఏఎన్ఎంల సీనియారిటీ జాబితాపై తీవ్ర అభ్యంతరాలు

- డీఎంహెచ్‌వో కారు అడ్డగించిన ఆరోగ్య కార్యకర్తలు
- బదిలీల కౌన్సెలింగ్ మళ్లీ వాయిదా

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏఎన్ఎం గ్రేడ్-3గా పని చేస్తున్న వారి బదిలీల కౌన్సెలింగ్ గందరగోళానికి దారితీసింది. సీనియారిటీ జాబితా బయటపెట్టాలని ఏఎన్ఎంలు ఆందోళనకు దిగారు. ఒక దశలో డీఎంహెచ్‌వో విజయలక్ష్మి వెళ్తున్న కారును అడ్డగించి నిరసన తెలిపారు. కార్యాలయంలో సిబ్బంది ఉన్నారని, వారు జాబితా ఇస్తారని సర్దిచెప్పి అతి కష్టంమీద కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. వారంతా కార్యాలయం ముందే వర్షం పడుతున్నా లెక్క చేయకుండా జాబితా ప్రకటించే వరకూ వెళ్లేది లేదని ధర్నాకు దిగారు. దీంతో రాత్రి 10 గంటల సమయంలో సీనియారిటీ జాబితాను ఏఎన్ఎంల గ్రూపులో పెట్టారు. అది కూడా తప్పులతడకగా ఉందని వారంతా ఆరోపించడం గమనార్హం. వాటిని సరిచేయాల్సిందేనని వారు పట్టుబట్టారు. బదిలీల కౌన్సెలింగ్ విషయంలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కార్యాలయం నుంచి కూడా ఆరా తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు డీఎంహెచ్‌వోను కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం కౌన్సెలింగ్ ఏర్పాటు చేస్తామని ముందుగానే ప్రకటించినప్పటికీ మధ్యాహ్నం వరకు వారికి సమాచారం ఇవ్వకపోవడంతో చాలామంది డీఎంహెచ్‌వో కార్యాలయానికి తరలివచ్చారు. ఒక దశలో 900 మందికి తిరిగి కౌన్సెలింగ్ ఉంటుందని, కొద్దిసేపటి తర్వాత 160 మందికి మాత్రమే అని అధికారులు ప్రకటించడంతో అంతా గందరగోళానికి దారి తీసింది. చివరికి మంగళవారానికి కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు డీఎంహెచ్‌వో విజయలక్ష్మి ప్రకటించారు.

డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఏఎన్ఎంల ధర్నా

జాబితా విడుదలపై తీవ్ర జాప్యం ఏఎన్ఎంల సీనియారిటీ జాబితా విడుదలపై మొదటి నుంచి తీవ్ర జాప్యం చేస్తున్నారు. గతవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించిన సమయంలో తయారుచేసిన జాబితాపై మొదటి నుంచి ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ పట్టించుకోకుండా కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఆ జాబితా సక్రమంగా ఉంటే సోమవారం రాత్రి వరకు ఎందుకు వెల్లడించలేదని ఏఎన్ఎంలు ప్రశ్నిస్తున్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగితేనే రాత్రికి అతికష్టం మీద బయటపెట్టారని, అందులోనూ తప్పులున్నాయని వారు ఫిర్యాదు చేశారు. సీనియారిటీ జాబితాను ముందుగా ప్రకటించిన తర్వాతే మంగళవారం కౌన్సెలింగ్ ప్రారంభించాలని వారు డిమాండ్ చేస్తుండడం గమనార్హం.

అధిక లాభాలని రూ.25 లక్షలు హాంఫట్

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మహిళకు టోకరా

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు రూ. 25 లక్షలు దోచేసిన వైనమిది. బాధిత మహిళ సోమవారం పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేయగా.. అధికారులు ప్రత్యేక దర్యాప్తునకు ఆదేశించారు. పొన్నూరుకు చెందిన ఒక ఉపాధ్యాయుడి భార్య కొంతకాలంగా ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తున్నారు. గత మే నెలలో ఆమెకు వాట్సాప్‌లో సంక్షిప్త సందేశం వచ్చింది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అధిక లాభాలొస్తాయంటూ అందులో పేర్కొన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆమె మొదట రూ. 20 వేలు పెట్టుబడి పెట్టగా.. గంటలోనే రూ. 2 వేల లాభం చూపించారు. తర్వాత విడతలవారీగా రూ. 5 లక్షల పెట్టుబడి పెట్టగా.. నాలుగు రోజులకే రూ. 5 లక్షల లాభం వచ్చినట్టు చూపించారు. అలా 20 రోజుల్లో విడతలవారీగా రూ. 18 లక్షల పెట్టుబడి పెట్టించారు. రూ. 60 లక్షల వరకు లాభం వచ్చిందని అవతలి వ్యక్తులు నమ్మించారు. ఆ డబ్బులు తీసుకోవడానికి ఆమె ప్రయత్నించగా.. కంపెనీకి ముందుగా పది శాతం ఇవ్వాలని చెప్పి రూ. 7.19 లక్షలు కట్టించుకున్నారు. అయినా డబ్బులు తీసుకోనివ్వలేదు. ఆదాయపుపన్ను రూ. 8.63 లక్షలు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇది మోసగాళ్ల పనిగా గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దూసుకొచ్చిన మృత్యువు

కారును ఢీకొన్న లారీ

కుటుంబ సభ్యుల కళ్లెదుటే తండ్రి, కొడుకుల దుర్మరణం

పెదనందిపాడు, తిప్పర్తి, న్యూస్‌టుడే: అనుక్షణం అప్రమత్తంగా ఉన్నా.. మరుక్షణం వచ్చే విపత్తును ఎవరూ ఊహించలేరు. ఎంతో ఆనందంగా కారులో స్వగ్రామానికి వస్తున్న ఆ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం అతలాకుతలం చేసింది. కుటుంబ సభ్యుల కళ్లెదుటే తండ్రి, కొడుకులను లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు కబళించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదనందిపాడు మండలం వరగానికి చెందిన ఉదయగిరి నాగేశ్వరరావు (45) ఆర్మీలో ఉద్యోగ విరమణ అనంతరం రెండేళ్లు ఒప్పంద పద్ధతిలో తిరిగి రాజస్థాన్ రాష్ట్రంలో సుబేదార్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల 'ఆపరేషన్ సింధూర్'లో కూడా సేవలందించారు. భార్య అనురాధ, కుమారుడు వెంకట అభిషేక్ (21), కూతురు కుసుమతో కలిసి రాజస్థాన్ నుంచి హైదరాబాద్ చేరుకున్న నాగేశ్వరరావు..అక్కడ ఓ కార్యక్రమంలో పాల్గొని ఆదివారం రాత్రి కారులో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున నల్గొండ జిల్లా తిప్పర్తి మండలంలోని రాయినిగూడ గ్రామ శివారు అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై కారు పక్కకు ఆపి మూత్రవిసర్జన కోసం తండ్రి, కుమారుడు కిందకు దిగారు. అనంతరం కారు ఎక్కుతుండగా అదే రహదారిలో తమిళనాడుకు చెందిన లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా..నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కారులో ఉన్న తల్లి, కుమార్తెకు గాయాలు కాలేదు. శవపరీక్ష అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య అనురాధ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వారి మృతితో స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎక్స్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రెడ్డివరప్రసాద్, మాణిక్యారావు, షేక్ కాలేషా, గుంటూరు ఎన్‌సీసీ విభాగ అధికారులు మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు.

నాగేశ్వరరావు, వెంకట అభిషేక్ (పాత చిత్రాలు)

(c) eenadu

ఆయకట్టుకు సాగునీటి భరోసా

కృష్ణమ్మ కళకళ

ఈనాడు, అమరావతి, విజయపురిసౌత్, న్యూస్‌టుడే: జలాశయాలకు జులైలోనే వరద పోటెత్తడంతో కృష్ణా నది జలకళ సంతరించుకుంది. శ్రీశైలం ఎగువన ఉన్న ప్రాజెక్టులు నీటితో నిండడంతో దిగువకు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటిమట్టానికి చేరువైంది. దీంతో గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయనున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 78 వేల క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయంలో 529.10 అడుగుల వద్ద 166.39 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కృష్ణా నదికి ప్రస్తుతం ఉన్న ప్రవాహం కొనసాగితే త్వరలోనే సాగర్ డ్యామ్ కూడా నిండుతుంది. పులిచింతల ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 19.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాగర్ జలాశయం నిండితే పులిచింతలకు వరద ప్రవాహం మొదలవుతుంది. ఈ నేపథ్యంలో సాగర్ కుడి, ఎడమ కాలువలతోపాటు కృష్ణా డెల్టా ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా లభించింది. సకాలంలో పంటల సాగుకు వెసులుబాటు కలిగిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పట్టిసీమ నుంచి గోదావరి జలాలు

ప్రకాశం బ్యారేజీకి పట్టిసీమ నుంచి గోదావరి జలాలు తరలిస్తున్నారు. కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలకు నీటిని విడుదల చేయడంతో రైతులు వరి నాట్లు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. పశ్చిమ డెల్టాలో వెద పద్ధతిలో వరి సాగు మొదలైంది. సాగర్ కాలువల కింద కూడా ఈసారి సాగునీరు ముందుగానే విడుదలవుతుందన్న అంచనాల నేపథ్యంలో రైతులు బోరుబావుల కింద నారుమళ్లు వేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగర్ కాలువల కింద 7 లక్షల ఎకరాలు, కృష్ణా పశ్చిమ డెల్టాలో 5 లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా లభించింది. సాగర్ కాలువలకు నీటిని విడుదల చేస్తే వాగుల్లో నీటి లభ్యత పెరిగి ఎత్తిపోతల పథకాల కింద ఉన్న 2 లక్షల ఎకరాల మెట్ట పంటలకు నీరందుతుంది. కాలువలు, వాగుల్లో నీటి ప్రవాహం పెరిగితే భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి.

గోడు వినండి.. పరిష్కారం చూపండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే

సమస్యలను క్షేత్ర స్థాయి అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోక జిల్లా అధికారులకు విన్నవించుకునేందుకు వచ్చామని అర్జీదారులు పేర్కొన్నారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పీజీఆర్ఎస్‌కు 259 అర్జీలను అధికారులకు అందించారు.

మ్యాపింగ్‌లో తప్పుతో అవస్థ

జగ్జీవన్ జ్యోతి యోజన కింద ఉచిత కరెంటు పొందుతున్నాను. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పుతో ప్రస్తుతం విద్యుత్తు బిల్లు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తి హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో మా రేషన్ కార్డులో చేరారు. అతన్ని తొలగించాలని అధికారులను కోరుతున్నా స్పందించడం లేదు. - **కర్రే గగారిన్, గుడివాడ, తెనాలి మండలం**

దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం

తాడికొండ పాత సినిమా హాల్ ఎదురు రోడ్లో 330 గజాల స్థలంలో ఇల్లు ఉంది. గతంలో ఇక్కడ సీసీ రోడ్డు నిర్మించారు. ఇటీవల మండల గ్రాంటుతో సిమెంట్ రోడ్డును మా స్థలంలో దౌర్జన్యంగా నిర్మించారు. పంచాయతీ అధికారులను అడిగితే సమాధానం చెప్పడం లేదు. సర్వే చేయించి న్యాయం చేయాలి. - **కనగాల పూర్ణచంద్రరావు, స్రవంతి, తాడికొండ**

పంచాయతీలో అక్రమాలు

పంచాయతీలో అక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొందరు పెద్దలు గ్రామంలో బహిరంగ మద్యపానాన్ని ప్రోత్సహిస్తున్నారు. నాలుగేళ్లుగా నీటి సరఫరాకు సంబంధించి ఓపెన్ టెండర్లు పిలవకుండా పాతవారికే కట్టబెడుతున్నారు. గత నెలలో ఓపెన్ టెండరు వేసి దక్కించుకున్నా పని చేయనివ్వడం లేదు. - **తిరుమలశెట్టి హేమలత, కొలకలూరు మాజీ వార్డు సభ్యురాలు**

తాకట్టు పెట్టిన పొలం రిజిస్ట్రేషన్

పూర్వీకుల నుంచి వచ్చిన 50 సెంట్ల పొలాన్ని 2018లో గ్రామానికి చెందిన ఎ.సత్యనారాయణ వద్ద తాకట్టు పెట్టి రూ.8 లక్షలు తీసుకున్నాం. మా కుటుంబ సభ్యులందరితో సంతకాలు చేయించుకున్నారు. డబ్బులు చెల్లించి పత్రాలు విడిపించుకుందామని వెళ్తే దురుసుగా వ్యవహరిస్తున్నారు. - **మురికిపూడి జమాయమ్మ, పెదపరిమి, తుళ్లూరు మండలం**

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సమీక్ష 9న

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకర్‌రావు ఈనెల 9న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారు. వర్సిటీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై అధికారులతో సమీక్షిస్తారు. కమిషన్ పర్యటన ఖరారవడంతో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో ఏఎన్‌యూ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రోస్టర్ పాయింట్ల ప్రకారం ఎస్టీలకు ఉద్యోగావకాశాలు కల్పించారా? లేదా? అనే దానిపై సమీక్షించనున్నట్లు సమాచారం.

జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపికలు 15న

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సింథటిక్ ట్రాక్‌లో జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఎంపికైన జట్టు ఆగస్టులో బాపట్లలో నిర్వహించే రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డు తీసుకుని ఈనెల 15వ తేదీ ఉదయం 9 గంటలకు ఏఎన్‌యూలోని సింథటిక్ ట్రాక్ వద్దకు రావాలని సూచించారు.

రూ.16.38 లక్షల బకాయిల విడుదల

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా గిరిజన సంక్షేమ శాఖకు రూ.16.38 లక్షల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసింది. ఫిబ్రవరి- మే నెలలకు సంబంధించి బిల్లులను వసతి గృహాల వారీగా డీటీడబ్ల్యూవో మురళీధర్ విడుదల చేశారు. దీంతో పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించినట్లయింది.

ప్రకటన

నా క్లయింటు, మెస్సర్స్ సమృద్ధి ఎవిన్యూస్ ఎల్ఎల్‌పి (ఏసిఏ-2948), హైదరాబాద్ వారి తరఫున, డిసిగ్నేటెడ్ పార్ట్‌నర్ శ్రీ నోముల విక్రమ్‌రెడ్డి, తండ్రి పెంచల్‌రెడ్డి గారి నుండి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియచేయునది ఏమనగా,

నా క్లయింటు, ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ఇళ్ళ ప్లాట్లుగా అభివృద్ధిపరుచు నిమిత్తము, సదరు స్థిరాస్తి యజమాని అయిన మెస్సర్స్ హెచ్.ఆర్.టి. బిల్డర్స్, భాగస్వామ్య సంస్థ, విజయవాడ వారితో డెవలప్‌మెంట్ ఒప్పందము చేసుకొనుటకు సంసిద్ధులైయున్నారు. స్థల యజమాని అయిన మెస్సర్స్ హెచ్.ఆర్.టి. బిల్డర్స్, విజయవాడ ది. 06.05.2025న క్రయ దస్తావేజు నెం. 2508/2025, సబ్ రిజిస్ట్రీ, తాడికొండగా మరియున్నూ నెం.2507/2025, తేది. 06.05.2025, సబ్ రిజిస్ట్రీ, తాడికొండగా శ్రీ (లేటు) కొండా రత్నారెడ్డి గారి కుమారులైన శ్రీ కొండా సాంబిరెడ్డి, శ్రీ కొండా అప్పిరెడ్డి గార్ల నుండి క్రయం పొంది నిర్వివాదముగా సర్వ స్వాధీన యాజమాన్య హక్కు భుక్తములతో అనుభవించుచున్న ఆస్తియన్నీ మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఒరిజనల్స్‌గా గల లింకు రిజిష్టర్డ్ దస్తావేజు నెం.1220/2000, తేది.30.06.2000, సబ్ రిజిస్ట్రీ, తాడికొండ మరియు నెం. 1751/2000, తేది. 11.09.2000, సబ్ రిజిస్ట్రీ, తాడికొండగా గల తన విక్రయదారుల వద్ద పోయినందువలన సదరు విషయమై విక్రయదారులు ది.03.03.2025న స్టేషన్ హౌస్ ఆఫీసర్, పాత గుంటూరు వారి నుండి నాన్ ట్రేస్డ్ సర్టిఫికెట్‌ను పొందియున్నారని నా క్లయింటుకు తెలియచెప్పుచూ షెడ్యూలు దాఖలా ఆస్తిని ప్లాట్లుగా మార్చిడి చేయుటకు నా క్లయింటుతో రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ ఒప్పందము చేసుకొనుటకు సంసిద్ధులైయున్నారు. సదరు విషయమై ఎవరికైననూ, ఏవిధమైన అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ, క్లెయిములు గానీ, మరి యే యితర మనోవర్తి దావాలు, హక్కులు గానీ ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి ఏడు రోజులలో లిఖితపూర్వకముగా తగిన ఆధారములతో ఈ దిగువ చిరునామాకు రిజిస్టర్ పోస్టు తిరుగు రశీదు ద్వారా తెలియచేయవలసినదిగా కోరడమైనది. సదరు గడువు తేదీ లోగా చట్టప్రకారము చెల్లదగు ఎటువంటి అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ, క్లెయిములు గానీ రానియెడల నా క్లయింటు, ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నిర్వివాద ఆస్తిగా భావించి స్థల యజమానులతో రిజిస్టర్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కమ్ జనరల్ పవర్ ఆఫ్ దస్తావేజు ఒప్పందము చేసికొనగలరు. తదుపరి వచ్చు క్లెయిములు నా క్లయింటును గానీ, సదరు ఆస్తిని గానీ ఏ విధంగానూ బైండు చేయజాలవు.

షెడ్యూలు: గుంటూరు డివిజన్, తాడికొండ సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, తాడికొండ మండలం, లాం గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన, లాం గ్రామ డి.నెం. 184బి రు లోని య.1.98 సెంట్లు లేక హె.0.79ర్లు శేరీ మెరక భూమికి **హద్దులు: తూర్పు:** కొండా వీరారెడ్డి గారి భూమి హద్దు, **దక్షిణం:** ఆరిగెల వెంకటేశ్వర్లు, పద్మూరి చంద్రశేఖర్‌రావు పగైరాల భూమి హద్దు, **పడమర:** వంగా రామిరెడ్డి గారి భూమి హద్దు, **ఉత్తరం :** తనుబుద్దు రఘునాథరెడ్డి గారి భూమి హద్దు.

ఈ నాలుగు హద్దుల మధ్య య.1.98 సెంట్లు లేక హె.0.79ర్లు శేరీ మెరక భూమి మరియు యావత్ యీజ్‌మెంట్ హక్కులతో సహాయున్నూ మరియు అందలి యావత్తుతో సహా.

Dr. ధారా సత్యనారాయణ, Advocate
డోరు నెం. 36-12-13/3, డా.కిలారు ఋచ్చిబాబు వీధి,
మొగల్‌రాజపురం, విజయవాడ-520 010.
Cell No. 94403 20435. Phone No. 0866-2573736

విజయవాడ
తేది: 06-07-2025

అప్పు తీర్చలేదని ఇంటికి తాళం

★ రోడ్లపై తిరుగుతున్నాం ★ జీఎంసీ ఉద్యోగిపై ఎస్పీకి బాధితుల ఫిర్యాదు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: అప్పు తీసుకున్న పాపానికి తమ ఇంటికి తాళం వేసి గెంటేయడంతో 40 రోజులుగా ఇబ్బంది పడుతున్నామని పాత గుంటూరుకు చెందిన గోపీ అనే వ్యక్తి సోమవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ప్రత్యేక దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులు తెలిపిన వివరాలు.. అంకమ్మ అనే మహిళ తోపుడుబండిపై ఉల్లిపాయలు విక్రయిస్తుంటారు. ఆమె కుమారుడు గోపీ ఆటో డ్రైవర్. 2022లో కుటుంబ అవసరాల కోసం జీఎంసీలో డ్రైవర్‌గా పని చేస్తున్న రాంబాబు వద్ద విడతలవారీగా రూ.7 లక్షల అప్పు తీసుకున్నారు. కొంతకాలంపాటు రూ.4 వడ్డీ చొప్పున చెల్లించారు. అంకమ్మకు ఆరోగ్యం సరిగా లేక వడ్డీ కట్టడం లేదు. గత మే నెలలో రాంబాబు ఆమె ఇంటిని దౌర్జన్యంగా ఆక్రమించుకుని తాళం వేసి గెంటేశాడు. బాధితులు పాతగుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఐ వెంటనే రాంబాబును పిలిచి మందలించారు. అంకమ్మ కుటుంబాన్ని ఇంట్లో ఉండమని చెప్పి పంపించారు. ఆ మర్నాడు రాంబాబు మళ్లీ వచ్చి ఇంటికి తాళం వేసి గెంటేశాడని బాధితులు వాపోయారు. అప్పుగా తీసుకున్న రూ. 7 లక్షలు కట్టేస్తామని చెప్పినా వినకుండా ఆ ఇల్లు తనదంటూ బెదిరిస్తున్నాడని వాపోయారు.

ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు అంకమ్మ కుమారుడు గోపి

భూసమీకరణకు వ్యతిరేకంగా మైకులో ప్రచారం

తుళ్లూరు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో రాజధాని రెండోదశ భూ సమీకరణకు వ్యతిరేకంగా ఆదివారం ఒక వ్యక్తి మైకుతో ప్రచారం చేయడంతో స్థానికులు అడ్డుకున్నారు. గ్రామంలోని భూములను రాజధాని నిర్మాణానికి తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని, ఇది రైతులకు నష్టదాయకమంటూ అతను ప్రచారం చేయడంతో స్థానికులు నిలదీసి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అతడిని అదుపులోకి తీసుకున్న తుళ్లూరు పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారించారు. పెదపరిమి గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు కోరడంతోనే తాను ప్రచారం చేశానని అతను చెప్పినట్టు తుళ్లూరు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం అతడిని డీఎస్పీ టి.మురళీకృష్ణ విచారిస్తున్నారు. బైక్‌ను, మైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పెదపరిమిలో మైకులో ప్రచారం చేస్తున్న వ్యక్తి

ANDHRA PRADESH INDUSTRIAL INFRASTRUCTURE CORPORATION LIMITED
(An undertaking of the Govt. of Andhra Pradesh)
O/o. Zonal Office, Auto Nagar, Guntur (Dist), A.P - 522001.

e-PROCUREMENT NOTICE

Tender Notice's No.09,10,11 & 12/ ZM /APIIC /GNT-Sanitation /Works /2024-25 Dt: 04-07-2025

1. **Tender Notice No. 09:** Regular Maintenance of cleaning of roads, road side margins, drains & Open spaces and cleaning away garbage/debris in **Autonagar Guntur Ph-I & II** Guntur Dist. for the year 2025-26 for a period of Twelve Months (One year) with IALA Funds for (2nd call) **ECV: Rs.30,73,320/-**
2. **Tender Notice No. 10:** Regular Maintenance of cleaning of roads, road side margins, drains & Open spaces and cleaning away garbage/debris in **Autonagar Guntur Ph-III,IV &IDA** Guntur Dist. for the year 2025-26 for a period of Twelve Months (One year) with IALA Funds for (2nd call) **ECV: Rs.30,73,320/-**
3. **Tender Notice No. 11:** Regular Maintenance of cleaning of roads, road side margins, drains & Open spaces and cleaning away garbage /debris in **Autonagar Mangalagiri** Guntur Dist. for the year 2025-26 for a period of Twelve Months (One year) with IALA Funds for (2nd call) **ECV: Rs.25,06,980/-**
4. **Tender Notice No. 12:** Regular Maintenance of cleaning of roads, road side margins drains & Open spaces and cleaning away garbage/debris in **Autonagar, Tenali** Guntur Dist. for the year 2025-26 for a period of Twelve Months (One year) with IALA Funds for (2nd call). **ECV: Rs.15,36,660/-**

Tender Notices No: 09, 10, 11 & 12 bid download starts from 05.07.2025 at 08.00 PM and last date for submission of bid is 14.07.2025 up to 3.00 PM.
The details of tender notices and bid documents can be downloaded from www.apeprocurement.gov.in (or) https://tender.apeprocurement.gov.in

ZONAL MANAGER, APIIC LTD., GUNTUR.

అర్జీల పరిష్కారంలో ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంచండి

నిర్లక్ష్యం వహించే సంక్షేమ, విద్య సహాయకులకు నోటీసులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో వచ్చిన అర్జీలే మళ్లీ వస్తున్నాయని, అవి తిరిగి తెరుచుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. అనంతరం అర్జీలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, పెండింగ్‌లోకి వెళ్లకుండా చూడాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారికి షోకాజు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. వింజనపాడు, లాలుపురం, కంతేరు గ్రామాల్లోని సచివాలయాల్లో అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, అక్కడి సంక్షేమ, విద్య సహాయకులకు షోకాజు నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని ఆదేశించారు. గడువు సమీపిస్తున్న వాటిని ముందుగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదును సక్రమంగా ఎండార్స్ చేయడం లేదని, సంబంధిత శాఖల్లో సరైన అధికారులకు పంపడం లేదన్నారు. అర్జీల పరిష్కారంలో ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచేలా అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఉప కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయిన ఫీజు బకాయిలు, ఉపకార వేతనాలను సత్వరం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం తెనాలిలో విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించారు. అనంతరం సబ్ కలెక్టర్ సంజనా సింహకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ ఫీజు బకాయిల వల్ల చదువు పూర్తి అయిన విద్యార్థుల ధ్రువపత్రాలు కళాశాలల్లోనే నిలుపుకోవడం వల్ల పై చదువులకు, ఉద్యోగాలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబరు 77 ను వెంటనే రద్దు చేయాలని కోరారు. జులై 11న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, శివ, కిరణ్‌బాబు, తేజ, ప్రదీప్, యశ్వంత్, పవన్, నవీన్, సాయి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ సంజనా సింహకు వినతిపత్రం అందిస్తూ..

సీఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులకు జాతీయ స్థాయి ర్యాంకులు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ అండ్ ఇండియా (ఐసీఏఐ) ఆదివారం ప్రకటించిన సీఏ ఫైనల్, సీఏ ఇంటర్, సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు జాతీయస్థాయిలో పది ర్యాంకులు సాధించి సత్తా చాటారని సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. సోమవారం బ్రాడీపేటలోని సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఏ ఫైనల్‌లో కె.సాయిరామరెడ్డి 23వ ర్యాంకు, కె.మోహన్ 26, ఎస్.నిఖిల్‌జైన్ 33, బి.నాగిరెడ్డి 41, పి.పూజితారెడ్డి 43వ ర్యాంకు సాధించారన్నారు. సీఏ ఇంటర్‌లో డి.నాగసాయిలక్ష్మణ్ 15వ ర్యాంకు, జె.శరత్‌చంద్ర 29వ ర్యాంకులు సాధించారని, సీఏ ఫౌండేషన్‌లో జి.పూజితకు 16, జి.సాయిపద్మకు 17, పి.సాయిరాఘవేంద్రరెడ్డికి 17వ ర్యాంకులు వచ్చాయని వివరించారు. విద్యార్థులు, సహకరించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్

నకిలీ బంగారం తాకట్టు కేసులో మరో నిందితుడి అరెస్టు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి కరూర్ వైశ్యా బ్యాంకులో నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు పొందిన కేసులో మరో నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పట్టణ సీఐ వీరాస్వామి తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ పరిధిలోని పటమటలో ఓ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న ప్రకాష్... ఆ బ్యాంకులో పనిచేసే అప్రైజర్ మదన్‌కుమార్, స్థానికంగా ఉండే తాపీమేస్త్రి రాజశేఖర్‌రెడ్డిలు కలిసి 145 ఖాతాల ద్వారా 19.17 కిలోల నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.9.12కోట్లు రుణం తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే మదన్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా తెనాలి పైవంతెన సమీపాన ప్రకాష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి సంబంధించి నిందితుడి పేరుపై ఉన్న ఆస్తులను అటాచ్ చేయడం జరుగుతుందన్నారు. ఆయా వివరాల కోసం సంబంధిత శాఖలకు లేఖలు పంపినట్లు చెప్పారు. రూ.లక్ష నగదు రికవరీ చేసినట్లు ప్రకటించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో డీఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షణలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

నిందితుడిని చూపుతున్న సీఐ వీరాస్వామి

సందేశాత్మకంగా సాగిన నాటికలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్టు తెనాలి శాఖల ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి ద్వితీయ ఆహ్వాన నాటికల పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా న్యాయ నిర్ణేతలు చెరుకుమల్లి సింగారావు, హైమావతి, గోపరాజు విజయ్ నాటికల పోటీల ఫలితాలు ప్రకటించారు. విజయవాడ న్యూస్టార్ మోడ్రన్ థియేటర్స్ వారి ఐ యేట్ ఇండియా నాటిక ఉత్తమ, కరీంనగర్ చైతన్య కళాభారతి వారి ఖరీదైన జైళ్లు నాటిక ద్వితీయ, విశాఖపట్నం తెలుగు కళాసమితి వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత ? నాటికకు తృతీయ ప్రదర్శన పురస్కారాలు దక్కాయి. నాటిక దర్శకుడు డాక్టర్.ఎం.ఎస్ చౌదరికి ఉత్తమ దర్శకత్వం, దినేష్‌కు ఆహార్యం, దివాకర ఫణీంద్రకు రంగాలంకరణ, పిల్లాడు పాత్రధారి లోహిత్‌కు జ్యూరీ-2 విభాగాల్లో అవార్డులు దక్కాయి. శోభారాణికి ఉత్తమ నటి, నాగరాణి క్యారెక్టర్ నటి అవార్డు కైవశం చేసుకున్నారు. పి.వరప్రసాద్‌కు ఉత్తమ నటుడు, డి.హేమకు ప్రతి నాయకురాలు, పి.టి.మాధవ్‌ను ఉత్తమ రచన పురస్కారం వరించాయి. అసత్యం నాటిక పాత్రధారి పి.రామారావుకు క్యారెక్టర్ నటుడు, పి.లీలామోహన్‌కు ఉత్తమ సంగీతం విభాగాల్లో అవార్డులు దక్కాయి. వీడేం మగాడండి బాబు నాటిక పాత్రధారి జి.ఎస్.చలపతికి హాస్యనటుడు, అనుకున్నదొకటి అయినదొక్కటి నాటికలోని పిల్ల బిచ్చగాడు పాత్రధారి రుత్విక్‌ను జ్యూరీ 1 పురస్కారం వరించింది. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ట్రస్టు నిర్వాహకులు ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షుడు నల్లూరు వెంకటేశ్వరరావు కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ప్రముఖ సినీ రచయిత డాక్టర్ బుర్రా సాయిమాధవ్ పాల్గొన్నారు.

ఐ యేట్ ఇండియా నాటిక సమాజం వారికి ఉత్తమ నాటిక ప్రదర్శన బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

పొగాకు నాణ్యతపై రైతులకు అవగాహన తప్పనిసరి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పొగాకు కొనుగోలులో నాణ్యత, ప్రమాణాలకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ సూచించారు. కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు సంబంధించి రైతు సేవా కేంద్రాల్లో పంట సాగు నమోదు చేసుకున్న రైతులకు షెడ్యూలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు నిర్దేశించిన లక్ష్యాల మేరకు మంజూరయ్యేలా రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో యువకుడికి జీవితఖైదు

గుంటూరు లీగల్ న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి జీవితఖైదు, రూ. 10 వేల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మి పర్వీన్ సుల్తానాబేగం సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పొన్నూరు మండలం వల్లభరావుపాలేనికి చెందిన మద్దసాని సురేంద్ర 2014, జులై 4న తన ఇంటి దగ్గర ఆడుకుంటున్న బాలికకు మాయమాటలు చెప్పి సమీపంలోని భవనంపైకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ మేరకు పొన్నూరు రూరల్ పోలీసులు సురేంద్రపై కేసు దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ అతని నేరాన్ని రుజువు చేసింది. నష్టపరిహారం కింద బాధితురాలికి ప్రభుత్వం రూ. 5 లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి పర్వీన్ సుల్తానాబేగం ఆదేశించారు.

నిరక్షరాస్యులకు వంద గంటల బోధన

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్- అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని మార్గదర్శకాల ప్రకారం అమలు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఉన్న అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా ఉల్లాస్-అక్షర ఆంధ్ర కార్యక్రమం అమలు చేస్తున్నాయన్నారు. జిల్లాలో 2025-26 సంవత్సరానికి 90,426 మంది నిరక్షరాస్యులను, 2029 నాటికి వంద శాతం లక్ష్యం రూపొందించారన్నారు. గ్రామాల్లో, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, వాచ్‌మెన్, కుక్‌లను సర్వే చేసి నిరక్షరాస్యులైన వారిని ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. నిరక్షరాస్యులకు రోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు వంద గంటలు బోధన చేయాలన్నారు. డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, వయోజన విద్య డీడీ అంజనేయులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	43,233
అమ్మకాలు:	40,524
నిల్వలు:	6,459

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ..ల్లో)

334	9,500-12,700
నంబర్ 5	10,000-13,200
273	10,000-12,500
341	10,000-13,400

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-13,600
బాడిగ	10,000-12,500
దేవనూరు డీలక్స్	10,000-12,400
ఆర్మూర్	9,600-11,000

ఏసీ కామన్ వెరైటీ

334	9,500-12,800
నంబర్ 5	10,000-13,200
273	9,800-12,400
341	10,000-13,300
4884	10,000-12,600

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-13,300
బాడిగ	10,000-12,500
తాలు	4,700-7,000

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక్కింటికి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 107, రిటైల్ ధర - 129, చికెన్ విత్‌స్కిన్ - 187, చికెన్ స్కిన్‌లెస్ - 213.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 106, 114, 125 చికెన్ విత్ స్కిన్ - 204 చికెన్ స్కిన్‌లెస్ - 214.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES

బిజినెస్ మరియు ఎంప్లాయీస్‌కి లోన్ ఎలిజిబిలిటి ఉండి ప్రాపర్టీ లేక ప్రాపర్టీ ఉండి ఎలిజిబిలిటి లేని వారికి 1 Cr. నుండి 10 Cr. వరకు లోన్ ఇప్పించబడును. ✆ 99597 71529.

PEOPLE CARE

అశ్విని హోమ్‌కేర్ సర్వీసెస్ చిన్నపిల్లలను చూసుకునుటకు అనుభవంగల కేర్ టేకర్స్, హౌస్ కీపర్స్, పేషంట్స్ కొరకు నర్సులు, ఆయాలు మీ ఇంటి వద్దకే పంపించబడును. గుంటూరు. 88533 83338.

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

REAL ESTATE

HOUSE FOR SALE
GENERAL

బాపట్ల పట్టణము మెయిన్‌రోడ్ మరియు నేషనల్ హైవే మధ్యగల రోడ్డు ప్రక్కన గల పటేల్ నగర్ 1వలైనులో బిజెపి ఆఫీస్ ప్రక్కన 5.5 సెంట్ల విస్తీర్ణములో గల 2 అంతస్తుల డాబా అమ్మకమునకు కలదు. ✆ 99498 43944, 94416 49539.

LAND FOR SALE
GENERAL

మెగా ★ అవకడో ★ఫామ్ ల్యాండ్‌లో 11 సెంట్లు ★5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్: 9133574455.

PLOT FOR SALE
GENERAL

అమరావతి రోడ్, మల్లికార్జునపేట, 30 అ॥ల రోడ్, వెస్ట్ ఫేసింగ్ 25X45=125 చ.గ.ల ఖాళీ స్థలం అమ్మకానికి కలదు. గజం 44వేలు. ఫోన్: 90308 07472.

JOBS

Amaravathi Roofings: Roofing Sheets Distributor looking for Sales executives for Palnadu District with 2 to 3 yrs. Experience, Any Degree/Diploma. ✆ 95505 33666.

SIMS Group of Institutiona Require Hostel Wardens and Supervisors Male and Female, Qulification any Degree, Interested Candidates Call- Ph:- 76759 63955, 9133858238.

Wanted Primary, High School Telugu, English and Physics Teachers Contact Immediately. Perecherla Ph : 97017 59405, 99123 77669.

Required Accountant with Tally Knowledge for a Company Salary: 20000 to 30000. Contact: 95023 82228.

Looking for Senior Shift Supervisor & Maintenance Manager & Training Officer for a Spinning Mill Company with Plant @ Medchal with minimum of 10 Years. Exp. ✆ 8187860597.

Wanted Marketing Executives to work in Reputed Organization. Salary 12K to 15K. For Details. Reena's, 10/2, Arundalpet, Guntur. Interview Timings. 8 AM to 12 PM. Call: 98499 89951.

గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా భోజనం మరియు వసతితో పాటు Tally + Ms-Office కోర్సు నందు శిక్షణతో 100% ఉపాధి కల్పించబడును. 88851 81110.

కంప్యూటర్ డిజైనర్, ఐటీ కోఆర్డినేటర్, నర్సింగ్ స్టాఫ్, హెల్పర్స్, ల్యాబ్ టెక్నీషియన్ (నైట్ డ్యూటీ) కావలెను. ✆: 77999 77855.

గుంటూరులోని ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేయుటకు సూపర్ వైజర్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత కలదు. ✆ 70753 38338.

ఆత్మ విశ్వాసముతో సృజనాత్మక ఆలోచనలతో కుటుంబ వృద్ధిలో భాగస్వామ్యం కావాలనుకునే వివాహిత మహిళలకు ఒక సదావకాశం. మార్కెటింగ్ మరియు ఆఫీసు. విద్యార్హత: ఇంటర్‌మీడియట్ ✆ 89198 68927.

WALK -IN - INTERVIEW విజన్ ఆటో మోటివ్స్ - అపె ఆటో షోరూమ్ గుంటూరు, తెనాలి, నరసరావుపేట, మంగళగిరి, పిడుగురాళ్ళ నందు పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్ - 4 ★ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ -15 ★ అకౌంటెంట్స్ - 2 ★ సర్వీసు మేనేజర్ - 1 ★ సర్వీసు సూపర్‌వైజర్స్ - 4 ★ మెకానిక్స్ - 6 కావలెను. విజన్‌ఆటో మోటివ్స్, D.No: 18-4-23, బ్రహ్మానందరెడ్డి స్టేడియం దగ్గర గుంటూరు. ఇంటర్వ్యూ తేది: 08-07-2025 నుండి 11-07-2025 వరకు. ఫోన్/వాట్సప్ : 77999 09045, 77999 09055,. ఇమెయిల్: visionauto.guntur@gmail.com

WANTED
A LEADING FINANCIAL SERVICES MARKETING COMPANY REQUIRES
AREA MANAGER
FOR SELLING MOTOR INSURANCE
CTC Rs.3.5-4.5 LACS/ANNUM
PREFERABLY FROM GENERAL INSURANCE COMPANIES OR INSURANCE BROKING COMPANIES WITH 3 TO 4 YEARS OF EXPERIENCE.
LOCATION GUNTUR
send your RESUME to
resume@skiretail.in
✆ 9840335849
Ski Retail Capital limited
No.1, Sambandam Street, T Nagar Chennai-600017.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

తెనాలి
•తెనాలి •పొన్నూరు

అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ సంజనా సింహా

భూ వివాదాలు పరిష్కరించాలని వినతి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు, పరిష్కారాల వేదికలో రేషన్ కార్డులు, పింఛన్లు, భూ వివాదాలు, ధాన్యం కొనుగోలు నగదు చెల్లించలేదని, విద్యుత్తు సమస్యలపై 15 అర్జీలు వచ్చాయి. సబ్ కలెక్టర్ సంజనా సింహా అర్జీదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని పరిష్కారాలకు హామీ ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో 8 అర్జీలు వచ్చాయి. గత ప్రభుత్వ పాలనలో ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినవారికి స్థలాలు చూపించాలని సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

స్థలాలు చూపి ఇళ్లు నిర్మించాలి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ పేదలకు ప్రభుత్వ లేఔట్లలో ఇళ్ల స్థలాలు చూపి ఇళ్లు నిర్మించాలని, కవిరాజా పార్కులో అడ్డుగా ఉన్న చెట్టు తొలగించాలని, కాలుష్య కారకమైన చిమ్నీని తొలగించాలని పలువురు కమిషనర్ వల్లూరు మహాలక్ష్మీపతిరావుకు అర్జీలు అందజేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలు స్వీకరించిన కమిషనర్ క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

అర్జీ పరిశీలిస్తున్న కమిషనర్ మహాలక్ష్మీపతిరావు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

స్పందనకు వందనం

❖ తెనాలి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఆటో స్టాండ్ డ్రైవర్లలో కొందరు, ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని ప్రజలు ఈ నెల 7న మేమున్నాం మీకు తోడుగా ద్వారా రైల్వే పోలీసులకు తెలియజేశారు. వారికి ఎస్సై వెంకటాద్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రయాణికులను ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు.

❖ పట్టణ కొత్తపేటలో నూతనంగా నిర్మాణంలో ఉన్న భవనాలకు సామగ్రి పొక్లెయిన్‌తో తరలిస్తుండటంతో రోడ్డు దెబ్బతింటోందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారులకు తెలియజేయగా, సిబ్బంది సంబంధిత నిర్మాణదారులకు రోడ్డుదెబ్బతినకుండా పలు సూచనలు ఇచ్చారు.

? తెనాలిలోని కొత్తపేట తాలూకా పాఠశాల మార్గంలో కొత్తగా ఆక్రమణలు వెలుస్తున్నాయి. ఇవి మరింత పెరిగే ప్రమాదం ఉంది. - భాస్కర్, తెనాలి ✔ పరిశీలించి తొలగిస్తాం.

? తెనాలి పట్టణ నాజరుపేట పశువుల వైద్యశాల వెనుక రోడ్డులో తాగు నీటి సరఫరా లేదు. మూడు రోజులుగా నీరు రావడం లేదు. - స్థానికులు, నాజరుపేట

✔ క్షేత్ర పరిశీలన చేసి సమస్యను సత్వరం పరిష్కరిస్తాం.

? తెనాలి పట్టణ కైలాస్‌భవన్ రోడ్డులో కొత్త వీధి దీపం ఏర్పాటు చేయాలని కోరుతూ ఉన్నాం. అదిగో ఇదిగో అంటున్నారు తప్ప ఏర్పాటు చేయ లేదు. చీకటి వల్ల ఇబ్బందిగా ఉంది. - మధుసూదన్‌రావు, చెంచుపేట ✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- పై ప్రశ్నలకు ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ లక్ష్మీపతిరావు సమాధానాలు ఇచ్చారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం

పొన్నూరు, న్యూస్‌టుడే: ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో విచారణ చేసి ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతామని తహసీల్దారు మహమ్మద్ జియావుల్ హక్ పేర్కొన్నారు. సోమవారం పొన్నూరు తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 8 అర్జీలు స్వీకరించారు. అందులో రెవెన్యూ- 4, సర్వే కోసం 4 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

పెదకాకాని, న్యూస్‌టుడే : పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన పీవీ మల్లికార్జునరావు రూ.1.16 లక్షలు విరాళంగా అందించారు. ప్రత్యేక పూజల అనంతరం దాతకు స్వామి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి ఆలయ ఉద్యోగి రమణకుమారి సత్కరించారు.

దాతలకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగి రమణకుమారి

బడిలో వసతులు.. విద్యార్థుల అడుగులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలలకు పెరిగిన చేరికలు

ప్రభుత్వ బడుల వైపు విద్యార్థుల అడుగులు వడివడిగా పడుతున్నాయి. తెనాలి పరిధిలోని పాఠశాలల్లో చేరికలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉచితంగా నాణ్యమైన విద్యాబోధన, పుస్తకాలు సమగ్ర సామగ్రితో కూడిన కిట్, మధ్యాహ్న భోజనం, విశాలమైన ఆవరణలు, క్రీడలు, ఇతర సదుపాయాలతో పాటు ప్రభుత్వం నుంచి పర్యవేక్షణ పెరిగిన క్రమంలో పాఠశాలలు ఆకట్టుకుంటున్నాయి. ఏ పాఠశాల పరిధిలోని విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు గుర్తించి, వారి నివాస ప్రాంతాలకు వెళ్లి, తల్లిదండ్రులకు తమ బడిలో ఉన్న వసతులు, సదుపాయాలు వివరించి వారిని పాఠశాలలకు రప్పించే కార్యక్రమాలు కొనసాగుతూ ఉన్నాయి.

మారీసుపేటలోని ఎన్‌సీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులు

ఇంటింటికీ తిరిగి చేరికకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులు

తెనాలి పట్టణ, మండల పరిధిలో ప్రభుత్వ విభాగంలో 17 ఉన్నత, 74 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్య సుమారు 9,200 ఉండగా ఈ ఏడాది ఇప్పటి వరకు 1,550 మంది విద్యార్థులు కొత్తగా చేరినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు వరకు చేరికలకు సమయం ఉన్నందున విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. పదో తరగతి ఫలితాల్లో ప్రైవేటుకు దీటుగా తెనాలి పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థిని, మండలంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థిని 600కు 591 మార్కులు సాధించడమే కాకుండా, పదుల సంఖ్యలోని విద్యార్థులు 550 మార్కులను దాటిన నేపథ్యం కూడా సానుకూల అంశంగా కనిపిస్తోంది.

క్రమంగా పెరుగుతున్నారు

- లక్ష్మీనారాయణ, జయంతిబాబు- మండల విద్యాశాఖాధికారులు

ప్రభుత్వ పాఠశాలల్లో రోజురోజుకూ విద్యార్థుల చేరికలు పెరుగుతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన, మెరుగైన వసతులు, విద్యా సామగ్రి అందజేత తదితర పరిణామాలతో పిల్లలను చేర్పడానికి తల్లిదండ్రులు కూడా మొగ్గుచూపుతున్నారు. ఈ నెలాఖరు వరకు చేరికల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

సార్వత్రిక సమ్మెకు సమాయత్తం

కొల్లిపర: సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు భవన్నారాయణ అన్నారు. కొల్లిపర గ్రామంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. లేబరు కోడ్ రద్దు, కార్మిక హక్కుల సంరక్షణ కోసం ఈనెల 9న చేపట్టిన సమ్మెలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. కనీసవేతనం పెంపు, విశాఖస్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాలను చర్చించారు. సమావేశంలో రైతుసంఘం నాయకులు ములకాశివసాంబిరెడ్డి, కోటాచంద్రశేఖర్, గోదాసుందరరావు, రమేష్, నిర్మలజ్యోతి, సీహెచ్‌సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సాగనంపడానికే సంస్కరణలు..

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలను సాగనంపడానికే ప్రభుత్వాలు విద్యుత్తు సంస్కరణలను దూకుడుగా అమలు చేస్తున్నాయని యూఈఈయూ (యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్) ఏపీసీపీడీసీఎల్ కమిటీ అధ్యక్షుడు దాసరి వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు బాబూ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సంఘం జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు.

సాంబశివరావుకు పాల్ హారిస్ పురస్కారం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఈనెల 5 నుంచి తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి ద్వితీయ ఆహ్వాన నాటికల పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా సాంబశివరావుకు పాల్ హారిస్ పురస్కారం ప్రదానం చేశారు. రెండో ఏడాది నాటికల పోటీలు నిర్వహించుకోవడం అభినందనీయమని ముఖ్యఅతిథి హైదరాబాదుకు చెందిన బీజీఆర్ మైన్స్ డైరెక్టర్ వీసీరెడ్డి బాలకోటిరెడ్డి పేర్కొన్నారు. పీడీజీ అన్నె రత్నప్రభాకర్, పాల్ హారీస్ పురస్కారాన్ని హైదరాబాదుకు చెందినపాటిబండ్ల సాంబశివరావుకు ప్రదానం చేశారు.

కూటమి పాలనలో సంతోషంగా ప్రజలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన తెనాలిలోని 18, 19 వార్డులు, పెదరావూరు గ్రామంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ అమలు, సంక్షేమం, అభివృద్ధి అంశాలను వివరించారు. 18వ వార్డులో బహిరంగ మద్యపానం, కొందరు యువకుల హడావుడి, ఇతర సమస్యలను స్థానికులు చెప్పారు. వాటి పరిష్కారాలకు ఆలపాటి హామీ ఇచ్చారు.

అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

పొన్నూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం... అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. దొప్పలపూడిలో సోమవారం నిర్వహించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

పనులు పట్టాలెక్కాయ్

పొన్నూరు, న్యూస్‌టుడే

మండలంలోని కసుకర్రు గ్రామంలో అభివృద్ధికి రూ.1.96 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు ప్రారంభించారు. 800 మీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ.90 లక్షలు, 600 మీటర్ల సిమెంట్ మురుగు కాల్వకు రూ.68 లక్షలు, రెండు కల్వర్టుల నిర్మాణానికి రూ.38 లక్షలు కేటాయించారు.

అభివృద్ధి చేయనున్న రహదారి

☛ గత వైకాపా ప్రభుత్వ పాలనలో పొన్నూరు - పాంద్రపాడు ప్రధాన రహదారిలోని కసుకర్రు గ్రామంలో రహదారి కొంత భాగం గోతులమయంగా మారింది. రహదారి, కాలువ, కల్వర్టు నిర్మాణానికి అప్పటి వైకాపా ప్రభుత్వం రూ.1.96 కోట్లు మంజూరు చేసింది. కానీ పనులు చేయించడంలో గత పాలకులు పూర్తిగా వైఫల్యం చెందారు. వాహనదారులు రాకపోకలు నిర్వహిస్తూ అనేక ప్రమాదాల బారినపడ్డారు.

☛ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు భవనాల శాఖ అధికారులతో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సమీక్ష నిర్వహించినప్పుడు రహదారి అంశం చర్చకు వచ్చింది. కసుకర్రు గ్రామంలో అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన అధికారులకు సూచించారు. ఇటీవల రహదారి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రహదారి ఇరుకుగా మారడంతో విస్తరించాలని నిర్ణయించారు. దీనిపై రోడ్డు భవనాల శాఖ సహాయ ఇంజినీరు గోగినేని శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కసుకర్రులో నూతన రహదారి నిర్మాణ పనులు ప్రారంభించామని చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులను నిర్వహిస్తామని వెల్లడించారు.

నూటా ఎన్నికల బహిష్కరణ

ఏ.ఎన్.యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అధ్యాపకుల సంఘం ఎన్నికను బహిష్కరిస్తున్నట్లు పోటీలో ఉన్న ఆచార్య సుమంత్‌కుమార్, ఆచార్య జగదీష్ నాయక్ ప్రకటించారు. సోమవారం ఎన్నికల అధికారి ఆచార్య మురళీమోహన్‌కు లేఖ అందజేశారు. ఎన్నిక వాయిదా వేయని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించే ఆలోచన ఉందని తెలిపారు. ఎన్నికలో పారదర్శకత లోపించడం, ప్రచారానికి తగిన సమయం లేకపోవడం, ఓటర్ల జాబితా ప్రకటించకపోవడం, తటస్థంగా వ్యవహరించకపోవడం, మంగళవారం నుంచి పరీక్షలు ప్రారంభం కావడం తదితర కారణాల వల్ల ఎన్నిక వాయిదా వేయాలని కోరినా... స్పందించకపోవడంతో తాము బహిష్కరణ నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్ష, కార్యదర్శి పదవులకు పోటీ చేస్తున్న సుమంత్‌కుమార్, జగదీష్‌నాయక్ వెల్లడించారు.

ఎన్నికల అధికారి మురళీమోహన్‌కు లేఖ ఇస్తున్న సుమంత్‌కుమార్, జగదీష్‌నాయక్

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ ప్యాడిసన్‌పేటలో సోమవారం జెండా ఎగురవేసి, కేకు కోశారు. కార్యక్రమంలో నాగవేణి, సంధ్యారాణి, వంశీ, ప్రతాప్, వెంకటేశ్వరరావు, కమలాకర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి ప్రాంతంలోని కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చదువుకునే ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామని తెనాలి శ్రీకన్యకాపరమేశ్వరి వైశ్య విద్యానిధి కమిటీ కార్యదర్శి పెండేల వెంకట్రావు సోమవారం తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కొనసాగుతుందని, 25 గదుల్లో 100 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. ముందు వచ్చిన వారికి ముందు అన్న ప్రాతిపదికన కేటాయింపు ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు తెనాలి బస్టాండ్ రోడ్డులోని సంఘ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జేఎంజేలో వన మహోత్సవం

తెనాలి టౌన్: తెనాలి జేఎంజే మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం వన మహోత్సవం నిర్వహించారు. కళాశాల వద్ద, మండలంలోని చావావారిపాలెం గ్రామంలో పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ ప్రదర్శనలు చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శాంత, వైస్ ప్రిన్సిపల్ రోజ్‌లీనా, ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మి, నిర్మలజ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు. పెదకాకాని: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సెయింట్ జోసెఫ్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిస్టర్ సంధ్యారాణి తెలిపారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన వన మహోత్సవంలో విద్యార్థులతో కలిసి ఆమె పాల్గొన్నారు. పిల్లలు ఇంటి నుంచి తెచ్చిన మొక్కలను పాఠశాల పరిసరాల్లో నాటారు. జాతీయ రహదారిపై వాహనదారులకు విద్యార్థులు మొక్కలు పంపిణీ చేశారు.

బయోమైనింగ్ వ్యర్థాల వివరాలు చూపాలి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టుయార్డు ప్రాంగణంలో ఇప్పటికే బయోమైనింగ్ చేసిన వ్యర్థాల వివరాలు పక్కాగా చూపాలని గుంటూరు ప్రజారోగ్యశాఖ ఎస్ఈ డి.శ్రీనివాసరావు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కంపోస్టుయార్డులో వ్యర్థాలను పరిశీలించారు. బయోమైనింగ్ చేసే క్రమంలో జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. 63వేల టన్నులు తరలించామని, మొత్తం పరిమాణంలో 15 శాతం చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తీసుకున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజారోగ్యశాఖ డీఈఈ శివరామకృష్ణ, మున్సిపల్ డీఈఈ ఎ.శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు పాల్గొన్నారు.

'కార్మికుల సంక్షేమాన్ని మరిచిన కేంద్రం'

పొన్నూరులో ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పొన్నూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఏఐటీయూసీ పొన్నూరు శాఖ అధ్యక్షుడు ఆరేటి రామారావు పేర్కొన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని జీబీసీ రహదారిలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి, భవన యజమానులకు అనుకూలంగా చట్టాలను మార్చడం అన్యాయమని ఆవేదన చెందారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో సంక్షేమ బోర్డు నుంచి కార్మికులకు ఎటువంటి సహకారం అందలేదని వాపోయారు. పైగా సంక్షేమ బోర్డులోని నిధులు పక్కదారి పట్టించారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు కావాల్సిన వసతులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆడిట్ క్రమం తప్పకుండా చేయించాలి

తెనాలి(కొత్తపేట): పొదుపు సంఘాల నిర్వహణలో ఆడిట్ ఒక భాగమని ఆడిటర్ పాండురంగారావు పేర్కొన్నారు. సోమవారం మెప్మా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఆడిట్ చేయించాలని సూచించారు. దీని కోసం సమర్పించాల్సిన దస్త్రాల వివరాలు వివరించారు. కార్యక్రమంలో సీఎంఎం విజయకుమారి, పొదుపు సంఘాల మహిళలు, ఆర్పీలు పాల్గొన్నారు.

బార్‌లో గొడవ

తెనాలి టౌన్: పట్టణంలోని ఓ బార్‌లో మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య వాగ్వాదం జరిగి ఒకరు రెండో వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేశారు. ఆదివారం రాత్రి జరిగిన ఘటనపై మూడో పట్టణ పోలీసులకు సోమవారం సమాచారం అందింది

పత్రికా ప్రకటన

నా క్లయింట్ అయిన గుంటూరు జిల్లా పెదకాకాని మండలం, నంబూరు గ్రామ కాపురస్తురాలైన చల్లాపల్లి రాజేంద్రప్రసాద్ గారి భార్య చల్లాపల్లి సంగీత సంజాయిషీ మేరకు నేను ఇచ్చు పత్రికా ప్రకటన.

ది.03/07/2025న మధ్యాహ్నం సుమారు 01.00 గం॥ సమయంలో పై తెల్పిన నా క్లయింట్ నంబూరు నుండి పెదకాకాని తహశీల్దార్ గారి ఆఫీస్‌కి వెళ్లు నిమిత్తం నంబూరు అడ్డరోడ్ దగ్గర విజయవాడ నుండి గుంటూరు వెళ్లే ఆర్.టి.సి.బస్ ఎక్కి ప్రయాణించుచుండగా ఆమె చేతిలోని పసుపు రంగు కవరు పోయినది. అందులో ఆమె తాత గారైన కర్రె మోషే గారి కుమారుడు కర్రె ఏసురత్నం గారికి విక్రయం ద్వారా సంక్రమించిన పొలమునకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ ద.నెం.1123/1958 (సర్వే నెం.685, డి.నెం.243రు) కలదు.

నా క్లయింట్ పెదకాకాని యం.ఆర్.ఓ. ఆఫీస్ వద్ద దిగి చూడగా ఆమె చేతిలోని కవరు కన్పించలేదు. ఆమె వెంటనే పెదకాకానిలో ఆటో ఎక్కి, గుంటూరు బస్టాండ్‌కి వచ్చి, ఆమె ప్రయాణించిన బస్ కండక్టర్ గారిని విచారించగా వారెప్పరూ ఆమె కవర్‌ను గమనించలేదని తెలిపినారు. కనక సదరు పై తెల్పిన డాక్యుమెంట్స్ గాని, కవరు గాని ఎవ్వరికైననూ దొరికిన యెడల నాకు గాని, నా క్లయింట్ (సెల్ నెం.7842519489)కు గాని, లేక సంబంధిత పెదకాకాని పోలీస్ స్టేషన్‌లో గాని అప్పగించవలసినదిగా తెలియజేయడమైనది.

అమర్తలూరి వెంకటేశ్వరరావు
గుంటూరు, అడ్వకేట్, శ్రీనగర్, గుంటూరు
ది.07-07-2025 Ph: 98495 01665

పురబడిలో కంటి వైద్య సేవలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి చెంచురామానాయుడు పురపాలక ఉన్నత పాఠశాలలో సోమవారం ఈదర రామారావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

నూరుశాతం ఉత్తీర్ణత

తెనాలి టౌన్: ఏఎన్‌యూ నిర్వహించిన ఫార్మా-డీ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణ సోమవారం తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఎన్‌సీసీ ఎంపికలు

తెనాలి టౌన్: పట్టణ మారీసుపేటలోని నల్లమోతు చెంచురామానాయుడు పురపాలక ఉన్నత పాఠశాల్లో ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ ఎంపికలు జరిగినట్లు ఎన్‌సీసీ అధికారి పులి భాస్కరరావు సోమవారం తెలిపారు. అధికారులు రోషన్‌ప్రభాత్, శ్రీనాథ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కరిముల్లా, వెంకట్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారని, 50 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారని వివరించారు.

వైకాపా నాయకుల సమావేశం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎం కన్వెన్షన్ హాలులో నిర్వహించిన వైకాపా నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు.

అవీ ఇవీ

మొహర్రం త్యాగాలకు ప్రతీక

కొల్లిపర: మొహర్రం పండగను మున్నంగి, పిడపర్రు, దావులూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. ముస్లింసోదరులు ఇమామ్ హుస్సేన్, అనుచరుల త్యాగాలను గుర్తచేసుకున్నారు. పిడపర్రు నుంచి పిడపర్తిపాలెం ఆఫర్‌ఖానా వరకు పీర్లను ఊరేగించారు. ముజావర్లు షేక్‌గౌస్, షేక్‌జాన్‌పీరా, షేక్‌రఫి, రహీమ్, చాంద్ బాష, సుభాని, జిలాని ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా సంస్థల ప్రతినిధులకు సత్కారం

తెనాలి(కొత్తపేట): హిందూ సమాజానికి వివిధ రూపాలలో సేవలందించిన పలు సంస్థల ప్రతినిధులను సత్కరించినట్లు ఇషా హైందవ సేనా సంస్థ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో వీర్లపాటి విజయలక్ష్మి, మురళీకృష్ణ దంపతులు, రెడ్డి రమణమ్మ, నిట్టాబాలు, శివశక్తి సుబ్బారావును సత్కరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పెదకాకాని, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.

ఆర్యవైశ్య నేత పరిమి మృతి

చేబ్రోలు, న్యూస్‌టుడే: దాత, తెదేపా నేత, ఆర్యవైశ్య నాయకుడు పరిమి సత్యనారాయణ(78) సోమవారం మృతి చెందారు. స్థానిక ప్రాథమిక వైద్యశాలకు, డిగ్రీ కళాశాలకు స్థలం దానంగా ఇవ్వడంతో పాటు ఆర్యవైశ్యుల అపరకర్మ శాల నిర్మాణానికి సహకరించారు. సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఆర్థికంగా సహాయం అందించారు.

శ్రద్ధాంజలి

జననం : 1947

మరణం : 07-07-2025

కీ॥శే॥ శ్రీ పరిమి సత్యనారాయణ గారు

చేబ్రోలు గ్రామం, పొన్నూరు నియోజకవర్గం

మీ శ్రమ, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించి, ఎన్నో దానములుచేసి, మమ్ములను ఉన్నతులుగా తీర్చిదిద్దిన మీరు భౌతికముగా మా నుండి దూరమైనా...
మీరు మాపై చూపిన అనురాగ స్మృతులను ఎన్నటికీ మరువలేము.
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... బాధాతప్త హృదయాలతో అంజలి ఘటిస్తున్నాము.

భార్య : పద్మవాసిని పరిమి

కుమారులు-కోడళ్ళు : పరిమి అజయ్ - సత్యవాణి, పరిమి సందీప్ - మాధవి

కుమార్తెలు- అల్లుళ్లు : టి.లావణ్య - గోపిచంద్, కె.పల్లవి - ఆంజనేయులు

మనుమరాండ్రు & మనుమలు : సత్వేష్, దీప్తి, కార్తికేయ, హన్విక, సాయిసుహాస్, సాయిశ్రియ, హాసిత, శ్రీకర్

అంతిమయాత్ర : ది.08-07-2025 మంగళవారం ఉ॥ 11 గం.లకు మా స్వగృహము చేబ్రోలు నుండి బయలుదేరును. కావున తెలియజేయడమైనది.

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

అమ్మవార్లకు ఆషాఢ సారె

దుగ్గిరాల: స్థానిక వినాయకుని గుడిలోని సిద్ధి, బుద్ధి అమ్మవార్లకు, శివాలయంలోని పార్వతీదేవికి మహిళలు సోమవారం రాత్రి చీరె, సారె తీసుకెళ్లారు. ఎక్కువ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

దుగ్గిరాల, న్యూస్‌టుడే: మోరంపూడిలో ప్రధాన రహదారి వెంట ఉన్న ఒక ఇంట్లో నుంచి వస్తున్న మురుగునీరు రోడ్డు పక్క నిల్వ ఉందని దోమలు విజృంభిస్తున్నాయని గ్రామస్థులు సోమవారం చెప్పడంతో ఆ విషయాన్ని న్యూస్‌టుడే కార్యదర్శి శ్రీకాంత్‌కు తెలియపరిచింది. ఆయన వెంటనే స్పందించారు. మురుగునీరు నిల్వ ఉన్నచోట తక్షణ చర్యగా బ్లీచింగ్ చల్లించారు. మురుగునీరు పోయే ఏర్పాట్లు చేస్తామన్నారు.

తాడికొండ, న్యూస్‌టుడే: ? తాడికొండ గ్రామంలోని స్వరాజ్ నగర్‌లో కల్వర్టు కూలి మురుగుకాలువలో పడింది. వ్యర్థాలు తిష్ఠ వేశాయి. -శ్రీధర్ రెడ్డి,
✔ ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించి మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటాం. -సమతావాణి, ఎంపీడీవో
? లాం గ్రామంలో ప్రధాన మలుపు వద్ద గుంతలు ఏర్పడ్డాయి. వేగంగా వస్తున్న వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. -యాసిన్
✔ రహదారిలో గుంతలకు వెంటనే మరమ్మతులు చేయిస్తాం. -రాజశేఖర్, ఏఈ ఆర్‌అండ్‌బీ

వసతి గృహాల్లో పెరిగిన ప్రవేశాలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాల ఎస్సీ బాలుర వసతి గృహం కళకళలాడుతోంది. గత ఏడాది కంటే ప్రవేశాలు పెరిగాయి. వార్డెన్ నాగేశ్వరరావు, సిబ్బంది కృషి కారణంగా 30 మందికి పైగా పెరిగారు. గతేడాది 50 మంది బాలురు ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య 87కు చేరింది. ఒక్క దుగ్గిరాల నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి సైతం పిల్లలు ఇక్కడకు వస్తున్నారు. సిబ్బందిలో కొందరు ఆయా గ్రామాలకు వెళ్లి తల్లిదండ్రులకు చెప్పి నూతన విద్యార్థుల్ని చేర్పించారు. దీనికి తోడు గతంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లను కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు బాగా మెరుగుపరిచారు. మరమ్మతులు చేశారు. బాలికల వసతిగృహంలో ప్రస్తుతం 30 మంది ఉన్నారు. వీరి సంఖ్య కూడా మరింత పెరుగుతుందని వార్డెన్ నిర్మలాకుమారి చెప్పారు.

బాలుర హాస్టల్‌లో పిల్లల పుస్తకాలు తనిఖీ చేస్తున్న వార్డెన్

రేబిస్ టీకాల పంపిణీ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో సహాయ సంచాలకులు డా.సుగన్యరావు ఆధ్వర్యంలో ఆదివారం రేబీస్ వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా కుక్కలకు వేశారు. సంక్రమిత వ్యాధులపై అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జంతు ప్రేమికులకు ఆయన సూచించారు.

పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ నేడు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ అభివృద్ధి సూచికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.శివపార్వతి చెప్పారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు తప్పక హాజరు కావాలని కోరారు.

రాజధానిలో సీపీఎం నాయకుల పర్యటన

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి నిర్మాణానికి రెండో దశ భూ సమీకరణ చేపట్టే పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాల్లో సోమవారం సీపీఎం నాయకుల బృందం పర్యటించింది. స్థానిక రైతుల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం తుళ్లూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ మొదటి దశలో భూములిచ్చిన రైతులకు ప్లాట్లను ఇప్పటి వరకు అభివృద్ధి చేసి ఇవ్వలేదని, వాటిపై బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయన్నారు. 10 ఏళ్లు దాటినా రాజధాని ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. రెండవ దశ సమీకరణను విరమించుకొని రహదారులు, రైల్వే లైనులకు అవసరమైన భూములను తీసుకోవాలని, ఇక్కడి విద్యా సంస్థల్లో రాజధాని ప్రాంత విద్యార్థులకు ఉచిత విద్యకు అవకాశం కల్పించాలని స్థానిక రైతులు అభిప్రాయపడ్డారని ఆయన వివరించారు.

నృసింహుని సేవకు.. సౌకర్యాల తోవ

భక్తుల కోసం నూతన మార్పులు

మంగళగిరి, తాడేపల్లి, న్యూస్‌టుడే

మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీనృసింహుని ఆలయానికి వచ్చే భక్తులకు స్వామి వారి దర్శనం మరింత సౌకర్యవంతంగా జరిగేలా ఆలయ అధికారులు కొత్త మార్పులు తెచ్చారు. మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందుకు అవసరమైన డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. దీని అమలుకు దేవాదాయ కమిషనర్‌ను ప్రత్యేకంగా నియమించారు.

ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమాచార కేంద్రం

మరింత మందికి అన్నదానం..

నృసింహుని దర్శించుకున్న భక్తులందరికీ అన్నదానం అమలుకు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు రోజుకు 150 మందికి మాత్రమే అన్నదానం చేస్తున్నారు. పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా అదనంగా మరో 50 మందికి అన్నదానం చేస్తున్నారు. శని, ఆదివారాల్లో ఆ సంఖ్య 300లకు చేరుతుంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు అన్నప్రసాద పంపిణీ చేయాలని నిర్ణయించారు. కొండపై పానకాల స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు బస్సు సేవలు అందుబాటులో ఉంటాయి. నిత్య కైంకర్య సేవలు తెలుసుకునే విధంగా సమాచార కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. రద్దీ వేళల్లోనూ ఇబ్బందుల్లేకుండా క్యూలైన్ల సంఖ్య పెంచారు. వీటితోపాటు ప్రతి శుక్రవారం ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

దర్శనం వేళలు.. ఉదయం ఆరు గంటలకు ఆలయ ద్వారం తెరుస్తారు. ఆరు నుంచి 6.30 గంటల వరకు ప్రాతఃకాలార్చన. 7 గంటల నుంచి సాయంత్రం 3:30 వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

చిర్రావూరులో నీటి సరఫరా వేళలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో నీటి సరఫరా వేళలను ప్రకటించారు. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 గంటల నుంచి 9:30 గంటల వరకు గంగానమ్మ గుడి, రెండు దళిత వాడలు, 9 గంటల నుంచి 12 వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 7 వరకు కరణంగారి బజారు(గుండిమెడరోడ్డు), లైబ్రరీ సెంటర్ వరకు నీటి సరఫరా చేస్తారు. 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఉదయం 6 గంటల నుంచి 9 వరకు కరణంగారి బజారు (గుండిమెడ రోడ్డు), లైబ్రరీ సెంటర్ వరకు నీటిసరఫరా చేస్తారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7గంటల వరకు గంగానమ్మగుడి, రెండు దళిత వాడలకు నీటిసరఫరా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

తుళ్లూరు: ఉన్నత విద్యా కోర్సుల్లో విద్యార్థులు ఎంచుకొనే రంగాలను బట్టి వారి భవిష్యత్తుకు పునాదులు పడతాయని గ్రామానికి చెందిన ఎం.కె.ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పవరపు కృష్ణారావు తెలిపారు. సోమవారం ఆయన మందడంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో 60 మంది ఇంటర్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు.

మూడు చక్రాల సైకిల్ బహూకరణ

తుళ్లూరు: మండలంలోని శాఖమూరు గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచి పుసులూరు శ్రీహరికి సోమవారం మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. గ్రామంలో సోమవారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో జిల్లా ఐటీడీపీ అధ్యక్షుడు తలతోటి సురేంద్ర, అర్థల సదాశివరావు, కూటమి నాయకులతో కలిసి ఆమె పాల్గొన్నారు. సంక్షేమ పథకాల వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

మంగళగిరి: 14వ వార్డులో తెదేపా నాయకులు..

మంగళగిరిలో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ అనురాధ, జానకీదేవి తదితరులు

పాతమల్లాయపాలెంలో శివరామ ప్రసాద్, నాయకులు..

ప్రజలు మెచ్చేలా కూటమి పాలన

మంగళగిరి, న్యూస్‌టుడే: ప్రజలు మెచ్చేలా కూటమి పాలన సాగుతుందని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. మంగళగిరిలోని 5, 6 వార్డుల్లో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తెదేపా పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్‌తో కలిసి సోమవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటా తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. 'తల్లికి వందనం', ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దీపం పథకం, యువతకు ఉద్యోగాలు తదితర పథకాలను అమలు చేస్తూ ప్రజల మన్ననలను అందుకుందని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. స్థానిక 14వ వార్డు, రాజీవ్ గృహకల్ప, బాపనయ్యనగర్, 17వ వార్డు కొత్తపేట ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పద్మశాలీ సాధికార సమితి జిల్లా ప్రతినిధి జొన్నాదుల బాలకృష్ణ, కాండ్రు శ్రీనివాసరావు, రంగిశెట్టి నరేంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

పాతమల్లాయపాలెం(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తున్నదని తెదేపా మండల అధ్యక్షుడు శివరామ ప్రసాద్ చెప్పారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం పాతమల్లాయపాలెంలో సోమవారం జరిగింది. నాయకులు ఇంటింటికి వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. నాయకులు మద్ది సుబ్బారెడ్డి, దమ్ముకుల భాగ్యారావు, అంజిరెడ్డి, పమిడి శ్రీనివాసరావు, సరోజినీరావు, తదితరులు పాల్గొన్నారు.

బేస్ బాల్ జట్ల ఎంపిక పోటీలు నేడు

మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు మండలం కొర్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బేస్ బాల్ పోటీలు జరగనున్నాయి. ఆ సంఘం ఆధ్వర్యంలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం జిల్లా జట్లు ఎంపిక జరుగుతుంది. ఎంపికైన జట్లు ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు సత్యసాయి జిల్లా కదిరిలో జరగబోవు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి కడియం జయరావు తెలిపారు.

చిరు వ్యాపారులకు మంత్రి లోకేశ్ చేయూత

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి నియోజకవర్గంలో చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. మంత్రి సహకారంతో సోమవారం నవులూరు గ్రామానికి చెందిన పఠాన్ పాతిమా, పలగాని వెంకమ్మ, ఎర్రబాలెం గ్రామానికి చెందిన షేక్ ఆషా, మంగళగిరి 26వ వార్డుకు చెందిన షేక్ హాజీమున్నీసాలకు అల్పాహార బండ్లు, నవులూరుకు చెందిన మల్లెల భారతికి తోపుడు బండి, మంగళగిరి 5వ వార్డుకు చెందిన [illegible] నాయుడు సుబ్బారావు, 28వ వార్డుకు చెందిన పాతిమకు బడ్డీ కొట్టు అందజేయగా పట్టణంలోని 21వ వార్డుకు చెందిన షేక్ సుభాని, ప్రకాశం మహాంకాళికి ఫ్లోటింగ్ ర్యాకులను అందించారు. తమ కుటుంబ జీవనోపాధి అడగగానే చేయూతనిచ్చిన స్పందించిన లోకేశ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, శివ శేషగిరిరావు, పడవల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ అనురాధ, అబద్ధయ్య

కోతకు గురై.. రక్షణ కరవై..

మేడికొండూరు నుంచి 113 తాళ్లూరు గ్రామం వెళ్లేందుకు కొత్తగా తారు రోడ్డు వేశారు. దారిలో అక్కడక్కడ గుంతలు పడ్డాయి. రోడ్డు పక్కన పలు చోట్ల కోతకు గురై మట్టి కొట్టుకుపోయింది. దీంతో రోడ్డు దెబ్బతినే ప్రమాదం ఉంది. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, మేడికొండూరు

గండి.. పూడ్చరేంటండీ..!

మండలంలోని వింజనంపాడు, అనంతవరప్పాడు గ్రామాల మధ్య జల్లవాగు అండర్ టన్నెల్‌పై గుంటూరు వాహిని కట్టకు గండి ఏర్పడింది. ఈ కట్టపై రైతులు, ప్రయాణికుల వాహనాలు రాత్రి, పగలు అనేక గ్రామాలకు వెళుతుంటాయి. దీనికి తోడు కాలువ కట్టపై వీధిదీపాలు లేకపోవడంతో గుంతలు గమనించక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం కురిసిన సందర్భాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. -న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు

విద్యుత్ స్తంభం సరిచేయరూ

బడేపురం గ్రామం నుండి నిడుముక్కల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యన విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. ఓ విద్యుత్ స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి ఉంది. అది ఎప్పుడు కూలుతుందో తెలియక ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. -న్యూస్‌టుడే, తాడికొండ

కర్నూతలలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు క్షమారాణి తదితరులు

పెదనందిపాడులో..

మెగా పీటీఎం 2.0కు సిద్ధం

దుగ్గిరాల జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 10వ తేదీ నిర్వహించే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0ను పురస్కరించుకుని సోమవారం ప్రధానోపాధ్యాయిని శోభాదేవి ఆధ్వర్యంలో చిన్నారులు ఆ ఆకృతి వచ్చేలా కూర్చున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు తోడ్పాటు అందించారు. - దుగ్గిరాల, న్యూస్‌టుడే

పది మంది బైండోవర్

పుల్లడిగుంట(వట్టిచెరుకూరు): పుల్లడిగుంటలో రెండు వర్గాల యువకుల ఘర్షణ నేపథ్యంలో పది మందిపై సోమవారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తహసీల్దారు క్షమారాణి తెలిపారు. సీఐ రామానాయక్ సూచనల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదనందిపాడు: తూర్పుపాలెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర నాయకుడు డి.సాంబయ్య ఆధ్వర్యంలో జెండా ఏగురవేశారు. అదే విధంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేకు కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, తెదేపా నాయకులు విజయ్, సురేశ్, చిన్నం శ్రీకాంత్, నూతలపాటి తిలోక్, పమిడి శ్రీనివాసరావును శాలువాలతో ఘనంగా సత్కరించారు. * వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామంలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస కాటన్ మిల్లులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని తహసీల్దారు క్షమారాణి సోమవారం ప్రారంభించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. కుర్నూతల వీఆర్వో జెట్టి వెంకటేశ్వరరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. ❖ పెదనందిపాడు మండలం వరగాని, అన్నపర్రు, కొప్పర్రు, రావిపాడు, ఇతర గ్రామాలలో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించి .. కేకు కోశారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు కైసర్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంకయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటుస్సూ గుంటూరు జిల్లా, మంగళగిరి నవులూరు గ్రామము, డోర్ నెం.1-33/1కు కాపురస్తులు పోలవరపు (లేటు) హరిబాబు గారి భార్య పోలవరపు రమాదేవి గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు సుమారు 2 1/2 సంవత్సరముల క్రితం తనకు చెందిన యాక్సిస్ బ్యాంక్, మంగళగిరి బ్రాంచి అకౌంట్‌ను క్లోజ్ చేయు నిమిత్తం, సదరు బ్యాంకుకు చెందిన 20 చెక్కులు నెం. 004761 టు 004780 గల చెక్‌బుక్‌ను, ఇతర కాగితములు జిరాక్స్ కాపీలు మరియు కొంత నగదు బ్యాగ్‌లో పెట్టుకొని నవులూరులోని తన ఇంటి నుండి ఆటోలో బయలుదేరి మంగళగిరి బ్యాంకుకు వచ్చి చూసుకొనగా తనతో పాటు తీసుకొని వచ్చిన బ్యాగ్ మార్గమధ్యంలో ఎక్కడో పడిపోయినది. వెంటనే సదరు బ్యాగ్ గురించి చుట్టుప్రక్కల వెతికిననూ, విచారించిననూ దాని యొక్క ఆచూకీ తెలియలేదు. అంతట నా క్లయింటు సంబంధిత బ్యాంకు వారిని సంప్రదించి, పోయిన చెక్కులు తాలూకూ ఎవరైనా దుర్వినియోగం చేస్తారనే ఆలోచనతో ఆ చెక్కులను నిలుపుదల చేయించుటయే గాక, నా క్లయింటు బ్యాంక్ అకౌంట్‌ను కూడా క్లోజ్ చేసినారు. కావున పై తెలిపిన చెక్‌బుక్ ఎవరికైననూ దొరికిన యెడల, ఈ దిగువ తెలిపిన అడ్రస్సుకు స్వయముగా గాని, రిజిష్టరు పోస్టు ద్వారా గాని అందజేయగలరు. అట్లు గాక సదరు బ్యాగ్ దొరికిన వ్యక్తి ఎప్పుడైననూ, అందులోని చెక్కులను ఉపయోగించి ఎట్టి లావాదేవీలు జరిపిననూ అవి నా క్లయింటును బైండు చేయజాలవని మరియు అట్టి వారిపై నా క్లయింటు చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని యిందు మూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.

బొర్రా మధు
అడ్వకేట్, హౌస్ నెం.1-817, అజయ్‌నగర్, మంగళగిరి
సెల్: 93921 36051
మంగళగిరి,
తేది:08-07-2025

'స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదు'

పెదనందిపాడు, న్యూస్‌టుడే: విద్యుత్తు స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించడానికి వస్తే అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాశం రామారావు పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం స్మార్ట్ మీటర్లు బిగించవద్దు అంటూ సీపీఎం ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యుత్తు రంగం నిర్వహణ బాధ్యత క్రమంగా కార్పొరేట్ల చేతుల్లోకి వెళుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం 9 నెలల్లో రూ. 15 వేల కోట్లు పైగా సర్దుబాటు ఛార్జీల రూపంలో ప్రజలపై భారం వేసిందన్నారు. ఆ పార్టీ మండల కార్యదర్శి రమేష్ బాబు, సహాయ కార్యదర్శి వెంకటశివరావు, సభ్యులు వెంకటేశ్వర్లు, జె. రామారావు, రాజేంద్ర, రైతు సంఘ నాయకులు చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

బిక్కుబిక్కుమంటూ.. దేవుడే దిక్కంటూ..

ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో పశు వైద్యశాల

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే

శిథిలావస్థకు చేరిన భవనం

విరిగిపోయిన బోను

నుదురుపాడు పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో పలు గ్రామాల రైతులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 40 ఏళ్ల కిందట నిర్మించిన భవనం పూర్తిగా దెబ్బతింది. చిన్న పాటి వర్షం కురిసినా పైకప్పు, గోడల నుంచి నీరు కిందకు దిగుతుంది. మరో పక్క విషపూరిత జంతువులు తిరుగుతున్నాయి. ఎలుకలు తవ్వడంతో మట్టి లేచి అసౌకర్యంగా ఉంటుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఆసుపత్రి పరిధిలో నుదురుపాడుతో పాటు, కండ్రిక, మునగపాడు, యర్రగుంట్లపాడు, వేమవరం, బేతపూడి, గ్రామాలు ఉండగా.. గేదెలు, ఆవులు, ఎద్దులు మొత్తం సుమారు 10 వేలు ఉన్నాయి. మేకలు, గొర్రెలు సుమారు 7 వేలు ఉన్నాయి. గోడలతో పాటు, నేలంతా కూడా పగుళ్లు ఇచ్చింది. ఒక్కోసారి వానకు పుస్తకాలు, మందులు తడిచిపోతున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమావేశాలు జరిగితే మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని పశువైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు.

రైస్ మిల్లు, లారీ యజమానులపై కేసు

అనంతవరప్పాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: వట్టిచెరుకూరు మండలంలోని అనంతవరప్పాడు శ్రీవల్లి రైస్ మిల్‌లో మొత్తం 2268 క్వింటాళ్ల బియ్యాన్ని రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు సోమవారం గుర్తించగా.. వాటిలో సుమారు 160 క్వింటాళ్ల చౌక బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామని పౌరసరఫరాల డీటీ శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరుకు చెందిన మిల్లు యజమాని దివ్వెల హరీష్‌పై కేసు వట్టిచెరుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. బియ్యాన్ని తరలించేందుకు ఉపయోగిస్తున్న లారీ యజమాని గొంది అశోక్‌పైనా కేసు నమోదైంది. కేసును సీఐ రామానాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

మంగళగిరి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న వివిధ కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మంగళగిరిలోని సోమవారం సాయంత్రం పలు కార్మిక సంఘాల నాయకులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ న్యూ, వైఎస్ఆర్ టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన ర్యాలీలో కార్మిక సంఘాల ప్రతినిధులు

మేడికొండూరు: ఈనెల 9వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కౌలు దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పిలుపునిచ్చారు. మేడికొండూరులో సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు.



స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఆర్ఎసిపిసి - మంగళగిరి (64127) Iవ అంతస్తు, సౌమ్యభవన్, సిఎ-5, సిఫ్‌సి ఏరియా, ఆటోనగర్, మంగళగిరి-522 503.
ఫోన్ & ఫ్యాక్స్: 08645-232992. ఇమెయిల్: sbi.64127@sbi.co.in

నిబంధన-8(1) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తికొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్‌యాక్ట్, 2002 (నెం. 3/2002) క్రింద స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్ఎసిపిసి, మంగళగిరి, గుంటూరుజిల్లా దిగువ సంతకందారును అథరైజ్‌డ్ ఆఫీసర్‌గా నియమించడమైనది. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని 3వ నిబంధనతో చదివే 13(12) విభాగం క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో తెలిపినమొత్తం అనగా 17-04-2025 నాటికి రూ.11,66,237/- (పదకొండులక్షల అరవైఆరువేల రెండువందల ముప్పైఏడు రూపాయలు మాత్రమే) మరియు నోటీసులో తెలిపిన ప్రకారం 18-04-2025 నుండి వర్తించే విధంగా భవిష్యవడ్డీ, దానిపై ఉత్పన్నమైన ఖర్చులు తిరిగి చెల్లించవల్సిందిగా బకాయిదారు అయిన శ్రీ కల్లార్ బిస్వాస్ S/O శ్రీ గిరింద్రనాథ్ బిస్వాస్, ఫ్లాట్ నెం. 708, వాల్‌నట్ బ్లాక్, రెయిన్‌ట్రీ పార్క్ అపార్ట్‌మెంట్స్, ఎఎన్‌యు ఎదురుగా, నంబూరు 520 210, గుంటూరుజిల్లా మరియు రూమ్ నెం. 277, ఫారెస్ట్ అపార్ట్‌మెంట్, 1వ అంతస్తు, 4వ బ్లాక్, ఎపి సెక్రటేరియట్, వెలగపూడి, గుంటూరుజిల్లా వారిని కోరుతూ రిజిస్టర్డ్ పోస్టుద్వారా 17-04-2025న ఒక డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.

పైన తెలిపిన 17-04-2025 తేదినాటి సదరు నోటీసు మీకు అందజేయబడనందున/మీచే తీసుకోబడనందున, 30-04-2025న స్థానిక తెలుగు దినపత్రిక ఈనాడు మరియు ఆంగ్లదినపత్రిక ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లలో ప్రచురించడమైనది.

ఈమొత్తం తిరిగి చెల్లించడంలో బకాయిదారు/హామీదారులు విఫలమైనందున, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8వ నిబంధనతో చదివే సదరు చట్టంలోని 13వ విభాగపు 4వ ఉపవిభాగం క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ తెలిపిన ఆస్తిని 2025 జులై 02వ తేదిన దిగువ సంతకందారుచే స్వాధీనం చేసుకోవడమైందని బకాయిదారు/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరపరాదని, ఏవేని లావాదేవీలు జరిపినపక్షంలో అవి, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క ఛార్జికి అనగా 17-04-2025 నాటికి రావల్సిన రూ.11,66,237/- (పదకొండులక్షల అరవైఆరువేల రెండువందలముప్పైఏడు రూపాయలు మాత్రమే)లు మరియు దానిపై భవిష్యవడ్డీ, ఖర్చులు మొ॥వాటికి లోబడి వుంటాయని బకాయిదారు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

హామీ ఆస్తుల్ని విడిపించుకునేందుకు, లభ్యమయ్యే గడువుకు సంబంధించి, చట్టం యొక్క 13వ విభాగంలోని (8)వ ఉపవిభాగపు నిబంధనలు గమనించవల్సిందిగా బకాయిదారు/హామీదారుల్ని కోరడమైనది.

స్థిరాస్తి యొక్క వివరణ : గుంటూరుజిల్లా రిజిస్ట్రేషన్ - తుళ్లూరు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ - గుంటూరుజిల్లా (ఎపి), అమరావతి, కాపిటల్‌సిటీ, ఐనవోలు రెవిన్యూ సర్వే నెం. 52 వద్ద ప్లాట్ నెం. 20-155-656-5008-11-VI వద్దగల 500 చ.గజాల విస్తీర్ణపు ఖాళీస్థలం. ఇది 29-04-2019 తేదినాటి రిజిస్టర్డ్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నెం. 4576/2019 ద్వారా శ్రీ కల్లార్ బిస్వాస్‌కు చెందినది. హద్దులు : తూర్పు: 12.00 మీటర్ రోడ్డు, దక్షిణం: 25.00 మీటర్ రోడ్డు, పడమర : 20-155-656-5008-10-VA (ప్లాట్), ఉత్తరం: 20-155-656-5008-12-VI (ప్లాట్)

ప్రదేశం: మంగళగిరి
తేది: 02-07-2025
సం/- అథరైజ్‌డ్ ఆఫీసర్
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా.

(c) eenadu

గుంటూరు తూర్పు

రైస్ మిల్లు, లారీ యజమానులపై కేసు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: అనంతవరప్పాడు శ్రీవల్లి రైస్ మిల్లులో 2,268 క్వింటాళ్ల బియ్యాన్ని రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు సోమవారం గుర్తించారు. ఇందులో సుమారు 160 క్వింటాళ్ల చౌక బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు తేల్చినట్లు పౌరసరఫరాల డీటీ శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరుకు చెందిన మిల్లు యజమాని దివ్వెల హరీష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. లారీ యజమాని గొంది అశోక్‌పైనా కేసు నమోదైంది.

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 34, వంగ 24, బెండ 23, పచ్చిమిర్చి 34, కాకర 30, క్యారెట్ 41, క్యాబేజీ 21, బీర 20, దొండ 36, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 34, దోస 15, పొట్ల 18, చామదుంప 28, మునగ 10, గోంగూర 8, తోటకూర 15, చుక్కకూర 15, కొత్తిమీర 25, బీట్‌రూట్ 37, కీర 34, క్యాప్సికం 70, అల్లం 60, ఫ్రెంచి బీన్స్ 64, సొర 12, అరటి 7. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

? సుద్దపల్లిడొంకరోడ్డులో వీధికుక్కల బెడద అధికంగా ఉంది. నిత్యం వీధికుక్కలు రోడ్లపై సంచరిస్తూ అటుగా వచ్చే వారిపై దాడి చేస్తున్నాయి. **- మున్నీ, పాతగుంటూరు.** ✔ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. **- రత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? పాతగుంటూరులోని పార్కు సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు వెళ్లే దారిలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. **- కాంతారావు, మాచిరాజువారివీధి** ✔ ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ**

? గుంటూరు నుంచి విజయవాడకు వెళ్లే మార్గంలోని సర్వీసు రోడ్లపై ఆర్టీసీ బస్సుల్ని ఆపడం లేదు. **- మణికంఠ, పెదకాకాని** ✔ ఆర్టీసీ బస్సులు సర్వీసు రోడ్లపై వచ్చేలా చర్యలు తీసుకుంటాం. **- విమల, జిల్లా ప్రజా రవాణా అధికారి -న్యూస్‌టుడే, పట్నంబజారు**

స్పందనకు వందనం

☛ శారదాకాలనీ ప్రధానరోడ్డు సైడుకాలువల్లో పూడికలు తీయకపోవడంతో మురుగునీరు నిలిచిపోతోందని స్థానికుడు వెంకట్రావు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో పూడికలు తీయించారు. ☛ మల్లికార్జునపేట రెండోలైన్‌లో చెత్తకుప్పలు వదిలేయడం వల్ల వీధి అపరిశుభ్రంగా ఉందని స్థానికుడు శ్యాం 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య అధికారులకు తెలియజేయడంతో ట్రాక్టర్ పంపి చెత్తకుప్పలు తీయించారు. **- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ**

శ్రీపూజితకు బెస్ట్ స్కూల్ అవార్డు

బెస్ట్ స్కూల్ అవార్డు స్వీకరిస్తున్న కంచర్ల హరికృష్ణప్రసాద్

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: పట్టాభిపురం శ్రీపూజిత స్కూల్ బ్యాంకాక్‌లో నిర్వహించిన వరల్డ్ స్కూల్ సమ్మిట్ - 2025లో 'బెస్ట్ స్కూల్ విత్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్' అవార్డు సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ కంచర్ల పద్మ తెలిపారు. ఈ అవార్డును స్కూల్ యంగ్ డైరెక్టర్ కంచర్ల హరికృష్ణప్రసాద్ స్వీకరించారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ డైరెక్టర్ హరికృష్ణప్రసాద్ చిన్నవయసులోనే అసాధారణ నాయకత్వం, పాఠశాల విద్యలో కొత్త ఆవిష్కరణలు ప్రవేశపెట్టడం, అంకితభావం నిబద్ధత కలిగి ఉండటం వల్లనే అవార్డు దక్కిందని వివరించారు. హరికృష్ణ ప్రసాద్ అమెరికాలోని మేరీలాండ్ స్టేట్ యూనివర్సిటీ నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డాక్టరేట్ పట్టా సాధించారని తెలిపారు. స్వదేశం వచ్చిన హరికృష్ణప్రసాద్‌ను స్కూల్ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు మనసారా ఆహ్వానం పలికి అభినందించారు తెలిపారు.

వైభవంగా గురుపూర్ణిమ ఉత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: విద్యానగర్ మూడో లైనులోని శ్రీసాయినాథ సన్నిధానంలో గురుపూర్ణిమ ఉత్సవాలు సోమవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సాయినాథుడికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు.

పైపై పనులు... జనానికి అగచాట్లు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

రహదారి పొడవునా ప్యాచ్‌వర్కు చేయకుండా వదిలేసిన ప్రాంతం

కొత్తపేట నిశ్శంకరరావు వీధిలో రెండు నెలల కిందట తాగునీటి పైపులైను పనులు చేశారు. ఈ సమయంలో రహదారి పొడవునా యంత్రాలతో తవ్వేయడంతో మార్గం పనికిరాకుండాపోయింది. ఇష్టం వచ్చినట్లు తవ్వేసి ఇళ్ల ముందు మెట్లను పగలగొట్టారని స్థానికులు మండిపడుతున్నారు. సిమెంట్ రోడ్డు సైతం పగుళ్లిచ్చింది. పాత తాగునీటి పైపులు విరిగిపోయాయి. మ్యాన్‌హోల్ ఉన్నచోట రోడ్డు బీటలువారింది. గుంతలు తీసి పైపులు వేశాక సరిగా పూడ్చకుండా మట్టితో పైపైన కప్పేయడంతో రోజుల తరబడి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. కొన్నాళ్లకు మట్టికుప్పలు తీసేశారు. గుంతల్లో ప్యాచ్‌వర్క్ చేయకుండా వదిలేయడంతో జనానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇళ్ల ముందు మెట్లు పగలగొట్టినచోట గుంతలు పూడ్చకపోవడంతో వృద్ధులు, చిన్నపిల్లలు జారిపడి గాయాలపాలవుతున్నారు. ప్యాచ్‌వర్క్ చేస్తే మెట్లను బాగు చేయించుకుంటామని స్థానికులు చెబుతున్నా.. యంత్రాంగం చెవికెక్కడం లేదు. అసలే ఇరుకైన రహదారి. అందులో సగం తవ్వేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఎగుడుదిగుడు రోడ్డులో వాహనాలు అదుపు తప్పుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఆ మార్గంలో ఉన్న బండరాళ్లు తగిలి గాయాలయ్యాయని కొంతమంది చెప్పారు.

జీబ్రా లైన్ల ఏర్పాటులో నిర్లక్ష్యం

నగర ప్రధాన రహదారుల్లోని జీబ్రా లైన్లు పాడై నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. మార్కెట్ సెంటర్, హిందూ కాలేజీ సెంటర్, నాజ్‌సెంటర్, బస్టాండు రోడ్డు, పాతబస్టాండు సెంటర్లలోని జీబ్రా లైన్లు పాడై దాదాపు ఆరు నెలలు కావస్తోంది. వ్యాపార సముదాయాలు, కాలేజీలు, ఆసుపత్రులకు కేంద్రబిందువైన గుంటూరు నగరానికి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు వస్తుంటారు. బస్సులు దిగి రోడ్డు దాటేటప్పుడు జీబ్రా లైన్ల మీదుగా వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో అవి సగానికి పాడై పోయాయి. మరికొన్ని ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేయలేదు. చాలాచోట్ల పాదచారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల మధ్య సమన్వయలోపం కారణంగా ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

మార్కెట్ సెంటర్‌లో పాడైన జీబ్రా లైన్లు

నిర్దేశిత గడువులోగా అర్జీల పరిష్కారం

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీకి వివిధ మార్గాల ద్వారా వచ్చే ప్రజా ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో 30 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వాటిని ఆయా విభాగాల అధికారులకు పంపి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 39 అర్జీలు వచ్చాయి. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల పరిష్కారం గురించి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. స్పందించని అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అదనపు కమిషనర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డీసీ టి.శ్రీనివాసరావు, సీసీ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్తసేకరణ వందశాతం జరగాల్సిందే

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో ఇంటింటి చెత్త సేకరణ వందశాతం జరగాలని, కాలువలు, వీధుల్లో చెత్త వేసే వారిపై అపరాధ రుసుం విధించాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఆయన సంగడిగుంట, లాంచెస్టర్‌రోడ్డు, ఏటీఏ కాలనీ, గోలుసు కొండలరావునగర్ ప్రాంతాల్లో పర్యటించారు. కార్యదర్శులు విధిగా ఉదయం మస్టర్ సమయానికి హాజరై కార్మికుల పనిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఎక్కడా డంపింగ్ పాయింట్లు ఉండడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి శుభ్రం చేసుకునేలా నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. స్పందించని వారి స్థలాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. ☛ నల్లచెరువు ప్రధానరోడ్డులోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఆహారం సరఫరా చేసేందుకు నిర్ణీత వేళలను పాటించాలని సూచించారు.

అన్యాయమైపోతున్నాం

పోలీసులకు విన్నవించిన బాధితులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీలు రమణమూర్తి, సుప్రజ, హనుమంతు, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు.

ఊరు వదిలి వెళ్లిపొమ్మని బెదిరిస్తున్నారు

జొన్నలగడ్డ గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. ఉపసర్పంచి శ్రీనివాసరావు మా పొలంలోకి ట్రాక్టర్‌ను వెళ్లనీయకుండా ఇబ్బంది పెడుతున్నారు. అదేంటని అడిగితే.. ఊరు వదిలి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరాం. **- శ్రీను నాయక్, రాము నాయక్, బాలూ నాయక్**

ఎనిమిదేళ్లుగా ఇబ్బంది పెడుతున్నారు

బాధితుడు వీరాంజనేయులు వద్దకు వచ్చి ఫిర్యాదు స్వీకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

మూడేళ్ల కిందట పక్షవాతం రావడంతో నడవలేకపోతున్నా. మంగళదాస్‌నగర్‌లో ఓ వ్యక్తి వద్ద 60 గజాల్లో రేకుల ఇల్లు కొనుగోలు చేశా. నెలలో ఖాళీ చేస్తామని చెప్పి.. ఎనిమిదేళ్లుగా ఇబ్బంది పెడుతున్నాడు. అద్దె ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. అతని కుమారులు రౌడీషీటర్లని చెప్పి నన్ను బెదిరిస్తున్నాడు. నేను అద్దె ఇంట్లో ఉంటున్నా. **- వీరాంజనేయులు, మంగళదాస్‌నగర్**

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్: పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. 12వ డివిజన్‌కు చెందిన కురంగుంట్ల త్రిలోకేశ్వర్‌రెడ్డి కుమార్తె రెండేళ్ల చిన్నారి ధనలక్ష్మి అనారోగ్యానికి గురైంది. తల్లిదండ్రులు ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించారు. వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు కావడంతో వారు ఎమ్మెల్యే నసీర్‌ను సంప్రదించారు. ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2.08 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన చెక్కును ఆయన బాధిత తల్లిదండ్రులకు అందజేశారు. ఇప్పటివరకు గుంటూరు తూర్పులో రూ. 3 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశామని ఎమ్మెల్యే వివరించారు.

రైతులకు రుణ మాఫీ చేయండి

మాట్లాడుతున్న అజయ్‌కుమార్. పక్కన శివాజీ, రంగారెడ్డి, హరిప్రసాద్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రైతులు, కౌలు రైతులకు రుణ మాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం బ్రాడీపేటలోని కార్యాలయంలో రైతు సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని, కార్మిక హక్కులను కార్పొరేట్ శక్తుల చేతిలో వదిలేసే విధానాలను తిప్పికొట్టాలన్నారు. నాయకులు కొల్లి రంగారెడ్డి, మన్నవ హరిప్రసాద్ మాట్లాడుతూ 9న జరగనున్న సార్వత్రిక సమ్మెకు రైతు సంఘాలు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు జగన్నాథం, విఠల్‌రెడ్డి, ముసలయ్య, అప్పారావు, రామకృష్ణ, కోటయ్య, రవి పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు తప్పని ట్రాఫిక్ కష్టాలు

ఏ.సి. కాలేజీ ముందు భాగంలో రోడ్లపై చెట్ల కొమ్మలు

ఏసీ కళాశాల సెంటర్లో ఇటీవల అధికారులు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. రోజులు గడుస్తున్నా వీటిని తొలగించటం లేదు. ప్రస్తుతం శంకర్‌విలాస్ పైవంతెన నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. రోడ్లపై ఉన్న చెట్ల కొమ్మల కారణంగా నిత్యం ఈ ప్రాంతంలో వాహనాలు బారులు తీరుతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న చెట్ల కొమ్మల్ని తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

చీటీ డబ్బులు ఎగ్గొట్టారు

రహంతుల్లా, మారుతీనగర్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పిల్లలు పట్టించుకోవడం లేదని.. ప్రభుత్వం ఇస్తున్న పింఛనుతోనే బతుకుతున్నానని మారుతీనగర్‌కు చెందిన రహంతుల్లా వాపోయారు. నడవలేని స్థితిలో కర్ర సాయంతో పోలీసు కార్యాలయానికి వచ్చిన ఆయన కష్టపడి దాచుకున్న డబ్బులతో ఓ వ్యక్తి వద్ద చీటీ కడితే డబ్బులు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని ఏఎస్పీ రమణమూర్తికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన విచారించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కారుడ్రైవర్‌గా పని చేసిన రహంతుల్లా, నాసర్‌బీ దంపతులకు నలుగురు అబ్బాయిలు, ఒక కుమార్తె ఉన్నారు. అందరికీ వివాహాలు చేశారు. పదేళ్ల కిందట నాసర్‌బీ అనారోగ్యంతో మృతి చెందారు. లక్ష్మీనారాయణ అనే వ్యక్తి వద్ద రూ. లక్ష చీటీ వేశానని, నెలకు రూ. 5 వేల చొప్పున కట్టగా చీటీ పూర్తయిందని రహంతుల్లా చెప్పారు. నరాలు దెబ్బతిని నడవలేని స్థితిలో ఉన్న తను డబ్బులు అడుగుతుంటే ఇచ్చేశానని లక్ష్మీనారాయణ దబాయిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఏపీ న్యూరో సైంటిస్టుల సంఘ అధ్యక్షుడిగా సుందరాచారి

సుందరాచారితో అరుణకుమారి, బిందునర్మద తదితరులు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఏపీ న్యూరో సైంటిస్టుల సంఘ నూతన అధ్యక్షుడిగా గుంటూరు వైద్య కళాశాల ప్రధానాచార్యులు, సీనియర్ న్యూరాలజిస్ట్ ఆచార్య సుందరాచారి ఎంపికయ్యారు. నెల్లూరులో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు జరిగిన ఏపీ న్యూరోకాన్-2025 రాష్ట్ర వార్షిక సదస్సు ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి సుందరాచారి నూతన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో పరిశోధన పత్రం విభాగంలో సర్వజనాసుపత్రి న్యూరాలజీ విభాగం విద్యార్థి వైద్యులు సాయిలక్ష్మి, పోస్టర్‌లో వల్లీకృష్ణప్రియ విజేతలుగా నిలిచారు. గుంటూరు వైద్య కళాశాలలో సోమవారం సాయంత్రం జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో న్యూరాలజీ విభాగం వైద్యులు, పీజీలు నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సుందరాచారిని అభినందించారు. కార్యక్రమంలో ఆ విభాగం అధిపతి అరుణకుమారి, సహాయ ఆచార్యులు బిందునర్మద తదితరులు పాల్గొన్నారు.

NAME CLARIFICATION NOTICE

I, **Saleem Shaik**, resident of Door No: 54-216, Srinivasa Nagar 5th Line, Near Tarakarama Nagar, Bommarillu Appt, Kakani Road, Guntur - 522001, Guntur District, Andhra Pradesh, India, declare that the names **Shaik Saleem**, **Saleem Shaik**, **Shaik Abdul Saleem**, and **Abdul Saleem Shaik** refer to one and the same person — myself. In my son **Faheem Shaik**'s academic and ID records, my name appears as **Shaik Abdul Saleem**, while in my documents it appears as **Shaik Saleem** or **Saleem Shaik**. He will apply for a passport using **Abdul Saleem Shaik** as my name. This declaration is made to clarify the name variations for official and legal purposes.

తాగునీరు మురుగుకాలువపాలు

రహదారిపై ప్రవహిస్తున్న తాగునీరు

నగరంలోని అనేక ప్రాంతాలకు సరిపడాస్థాయిలో తాగునీరు అందడం లేదు. ఈ పరిస్థితుల్లో సోమవారం నెహ్రూనగర్ ప్రధాన రహదారిపై తాగునీరు వృథాగా పోవడంతో స్థానికులు నివ్వెరపోయారు. నెహ్రూనగర్ 7వ వీధిలోని రిజర్వాయర్ నుంచి తాగునీరు కాలువల ద్వారా ప్రవహించి రహదారుల పైకి చేరుకుంది. నెహ్రూనగర్ వీధులు చెరువులను తలపించాయి. శుద్ధి చేసిన తాగునీటిని రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తుండగా కరెంట్ సరఫరాలో అంతరాయం కలగడంతో అలా కాలువల్లోకి ప్రవహించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. **- న్యూస్‌టుడే, నెహ్రూనగర్**

నగరాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దుదాం

మాట్లాడుతున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, పక్కన కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరాన్ని సుందర, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హోల్డర్స్ అందరూ సహకరించాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో మిషన్ గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో మొక్కలు నాటే కార్యక్రమం విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. రహదారులు, మురుగుకాలువలను ఆక్రమించి, ట్రాఫిక్ పారిశుద్ధ్యానికి ఆటంకంగా ఉన్న వీధి వ్యాపారులకు త్వరలోనే వెండింగ్‌జోన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ సీజన్‌లో దశలవారీగా 5 లక్షల మొక్కలు నాటి సంరక్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే వార్డుల వారీగా మొక్కలు నాటే ప్రక్రియ నడుస్తోందన్నారు. రెండు ప్రాంతాల్లో వెండింగ్ జోన్లు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మిషన్‌గ్రీన్, వెండింగ్ జోన్లపై స్టేక్‌హోల్డర్స్ సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో సీపీ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, ఏడీహెచ్ జె.శాంతి, ఇన్‌ఛార్జి ఎంహెచ్‌వో రామారావు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించుకోవాల్సిందే

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నల్లచెరువు రోడ్డులో మంగళవారం సాయంత్రంలోగా ప్రధాన మురుగుకాలువలపై ఉన్న ఆక్రమణలను ఎవరికివారు తొలగించుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో ఆదేశించారు. పూడికతీత పనులు చేపట్టాల్సి ఉన్నందున ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేనిపక్షంలో జీఎంసీ పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగిస్తారని పేర్కొన్నారు.

ప్రపంచానికి భారతదేశం మార్గదర్శి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రపంచానికి భారతదేశం మార్గదర్శిగా ఉంటుందని శ్రీకాకుళం ఉపనిషన్మందిరం కార్యనిర్వాహక అధ్యక్షుడు నిష్ఠల నరసింహమూర్తి అన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై సోమవారం రాత్రి ఆయన గురువైభవం గురించి ప్రవచనం చేశారు.

పద్మవ్యూహాన్ని ఛేదించలేరా?

బస్టాండు సెంటర్లో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లే

పట్నంబజారు, న్యూస్‌టుడే

ఆర్టీసీ బస్టాండు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం కావడం లేదు. బస్టాండు ముందు భాగంలో ఆటలోను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. రోడ్లు ఆక్రమణలకు గురికావడంతో పాటు విజయవాడకు వెళ్లే బస్సులు బస్టాండు ముందుభాగంలో నిలుపుతుండడంతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటోంది. సోమవారం నాడు కాకానిలోని తోటకు వెళ్లేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో ఇక్కడికొచ్చి ఆటోల్లో వెళ్తుంటారు. దీనికి తోడు ఆసుపత్రులకు వెళ్లే వారితో ఈ ప్రాంతమంతా బిజీగా ఉంటుంది. పెరిగిన రద్దీని కట్టడి చేసేందుకు, వాహనాలు సాఫీగా ముందుకెళ్లేందుకు ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్న చర్యలు ఫలితం ఇవ్వడం లేదు. ఆటోలను రోడ్లపై నిలపొద్దని, ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేయొద్దని పోలీసులు మైకుల్లో హెచ్చరికలు చేస్తున్నా.. పరిస్థితిలో మార్పు ఉండడం లేదు. బస్టాండులో రెండు ఆటో స్టాండులున్నా.. కొందరు డ్రైవర్లు ఆటోలను రోడ్లపైనే నిలుపుతున్నారు. సాయంత్రంపూట కళాశాలలు, కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లేవారితో ఈ ప్రాంతమంతా రద్దీగా ఉంటుంది. రాత్రివేళల్లో ప్రైవేటు బస్సులు, ఆటోల కారణంగా రోడ్డుపై నడవలేని పరిస్థితి.

బస్టాండు ముందు భాగంలో నిలిపిన ఆటోలు

పికిల్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గ సభ్యులతో డీఎస్‌డీఓ నరసింహారెడ్డి

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే : జిల్లాలో పికిల్‌బాల్ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందజేస్తామని జిల్లా క్రీడాధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని వీవీవీ హెల్త్ హబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో గుంటూరు జిల్లా పికిల్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ ప్యాట్రన్‌గా టి.అరుణ్‌కుమార్, ఛైర్మన్‌గా చుక్కపల్లి రాకేష్, గౌరవ అధ్యక్షుడిగా హరికిషన్ సాయి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డాక్టర్ ఎం.శివకుమార్, ఉపాధ్యక్షులుగా రవీంద్రబాబు, కమలాకాంత్, రామకోటేశ్వరరావు, వరుణ్, హనుమంతరావు, భరత్‌కుమార్, కార్యదర్శిగా జీవీఎస్ ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.అరుణ్‌కుమార్, కోశాధికారిగా సుస్మితా చౌదరి, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ కల్యాణ చక్రవర్తి, డాక్టర రాజశేఖర్, డాక్టర్ ఫణీంద్ర మరో ఐదుగురు, సభ్యులుగా నలుగురు ఎన్నికయ్యారు. ఏపీ పికిల్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీధర్, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రతినిధులు వేణుగోపాలరావు, న్యాయవాది రవీంద్రబాబు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పికిల్‌బాల్ క్రీడాభివృద్ధికి కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. పాఠశాల, కళాశాలల్లో పికిల్‌బాల్ కోర్టుల్ని నిర్మించే విధంగా కృషి చేస్తామన్నారు.

గుంటూరు పశ్చిమ

చంద్రన్న పాలనలో పేదల సంక్షేమం రెట్టింపు

వృద్ధురాలికి కరపత్రం అందజేసి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో పేదల సంక్షేమం రెట్టింపైందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. 23వ డివిజన్‌లో 'సుపరిపాలన-తొలిఅడుగు' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. స్థానికుల సమస్యల్ని ఎమ్మెల్యే మాధవి అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో రోడ్లు గుంతలమయంగా ఉండడంతో ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం రోడ్లు అభివృద్ధి చెందడం వల్ల ప్రయాణం సాఫీగా సాగుతుందని ఆటోడ్రైవర్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ కూడా అమలు చేసి రైతుల్ని ఆదుకుంటామన్నారు. బీసీల సంక్షేమానికి చంద్రన్న పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు లాం వర్ధనరావు, సాధు రాజేష్, మల్లె ఈశ్వర్, యాకోబు, గంటా మౌలిక, నవమి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 33, వంగ 36, బెండ 25, పచ్చిమిర్చి 62, కాకర 44, బీర 39, క్యాబేజి 23, క్యారెట్ 45, దొండ 39, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 36, దోస 20, సొర 14, పొట్లకాయ 19, అరటికాయ 7, చామదుంప 26, బీట్‌రూట్ 32, కీరదోసకాయ 44, బీన్స్ 84, క్యాప్సికమ్ 69, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 30, అల్లం 58, వెల్లుల్లి 110. **- న్యూస్‌టుడే, పట్టాభిపురం**

రెండు దశాబ్దాల కల సాకారం

అన్నమయ్య తటాకంలో నీటి నిల్వకు మార్గం సుగమం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం వెనుక వైపున ఉన్న అన్నమయ్య తటాకం అభివృద్ధికి అడుగులు పడ్డాయి. ఇక్కడ తటాకంలో నీళ్లు నిల్వ ఉంచి శ్రీవారి తెప్పోత్సవం నిర్వహించాలని ఆలయ కమిటీ పాలకవర్గం దేవాలయం నిర్మించిన సమయంలోనే నిర్ణయించింది. తటాకంలో భారీ కొండ రాళ్లు ఉండడంతో నీరు పెట్టినా నిల్వ ఉండడం లేదు. రెండు దశాబ్దాలుగా ఇది కలగానే మిగిలిపోయింది. భారీ కొండ రాళ్లు తొలగించేందుకు పలుసార్లు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. తటాకం ఎండిపోవడం వల్ల వేసవిలో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. తటాకంలో ఉన్న భారీ కొండ రాళ్లను తొలగించేందుకు గ్రానైట్ వ్యాపారి ఒకరు ముందుకొచ్చారు. పొక్లెయిన్‌తో కొండ రాళ్లు తొలగించే పనులు ప్రారంభం కావడంతో రెండు దశాబ్దాల కల సాకారమైనట్లైంది. దీంతో అన్నమయ్య తటాకంలో నీటి నిల్వకు మార్గం సుగమమైంది. మరోవైపు అన్నమయ్య వాకింగ్ ట్రాక్ రిటైనింగ్ వాల్స్ దెబ్బతిన్నాయి. దీనిపై 'ఈనాడు'లో పలుసార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనికి స్పందించిన నగరపాలక సంస్థ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.49.90 లక్షలు మంజూరు చేసింది. ప్రస్తుతం రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు సాగుతున్నాయి.

రిటైనింగ్ వాల్ పనుల్ని పరిశీలిస్తున్న ఏఈ చైతన్య

కొండ రాళ్లు తొలగిస్తేనే..

అన్నమయ్య తటాకంలో నీటి నిల్వ కోసం గుజ్జనగుండ్ల చెరువు నుంచి పైపులైను ఏర్పాటు చేశారు. రెండు సార్లు నీరు పెట్టారు. అప్పట్లో చుట్టుపక్కల భూగర్భ జలాల మట్టం పెరిగింది. భారీ కొండ రాళ్లు ఉండడంతో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడం లేదు. వాటిని తొలగించేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు అన్నమయ్య తటాకంలోకి నీళ్లు వచ్చినా అవి నిల్వ ఉండలేదు. మరోవైపు వర్షాల తాకిడికి వాకింగ్ ట్రాక్ కోతకు గురై రిటైనింగ్ వాల్ కూలిపోయింది. వెంకటేశ్వర వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు విరాళాలు సేకరించి బస్తాలతో గోడలా నిర్మించి నడకదారి కోతకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గత ఏడాది జులై, ఆగస్టు నెలల్లో వరుసగా.. 'ఈ దారిలో నడిచేదెలా', 'వీడని ఉదాసీనత' శీర్షికలతో కథనాలు ఇచ్చాం. దీనికి అధికారులు స్పందించి రూ.49.90 లక్షలు మంజూరు చేయడంతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో తటాకంలో భారీ కొండ రాళ్ల తొలగింపు అంశం తెరపైకి వచ్చింది. వాకర్స్ సంఘ సభ్యుల ఆకాంక్ష మేరకు 'ఈనాడు' చొరవతో విద్యానగర్‌కు చెందిన గ్రానైట్ వ్యాపారి మాలెంపాటి సుబ్బారావు కొండరాళ్లను తొలగించేందుకు ముందుకొచ్చారు. దీనికి సుమారు రూ.10 లక్షలు ఖర్చవుతుందంటున్నారు. శ్రీవారి ఆలయ కమిటీ, వెంకటేశ్వర వాకర్స్ సంఘం సహకారంతో భారీ కొండరాళ్లను పొక్లెయిన్‌తో ధ్వంసం చేసి తొలగించే పనులు సాగుతున్నాయి. పనులు పూర్తి కాగానే అన్నమయ్య తటాకాన్ని నీటితో నింపాలని యోచిస్తున్నారు.

అన్నమయ్య తటాకంలో అడ్డుగా ఉన్న భారీ కొండ రాళ్లను పొక్లెయిన్‌తో తొలగింపు పనులు

ప్రజా భాగస్వామ్యంతోనే సంపూర్ణ అక్షరాస్యత

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: అక్షరాంధ్ర ఉద్యమాన్ని ప్రజా భాగస్వామ్యంతో నిర్వహిస్తేనే సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమవుతుందని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి అన్నారు. రామన్నపేటలోని జనచైతన్య వేదిక కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 1990లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలెక్టర్ల నేతృత్వంలో అధికార యంత్రాంగం, ఉపాధ్యాయులు, కళాకారులు, స్వచ్ఛంద సేవకులు, ప్రజా సంఘాల ఐక్య కృషితోనే అక్షరాస్యత ఉద్యమం బలోపేతమైందన్నారు. ప్రతి 10 మంది నిరాక్షరాస్యులకు.. విద్యావంతులైన స్వచ్ఛంద సేవకులు ఎలాంటి వేతనం తీసుకోకుండా, అక్షర కేంద్రాల్లో నిరాక్షరాస్యులకు విద్యను అందించారన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యతలో భారతదేశంలో అట్టడుగున ఉందని, ప్రతి ముగ్గురిలో ఒకరు మాతృభాషలో చదవడం, రాయలేని స్థితిలో ఉన్నారన్నారు. 15 నుంచి 60 సంవత్సరాల వయసులోపు వారు లక్షల మంది రాష్ట్రంలో నిరాక్షరాస్యులుగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే అక్షరాంధ్ర కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా అన్ని రాజకీయ పార్టీలు, యువజన, విద్యార్థి సంఘాలు, కళాకారులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలను వినియోగించి ప్రజా ఉద్యమంగా నిర్వహిస్తేనే సత్ఫలితాలు వస్తాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

స్పందనకు వందనం

పిచ్చి మొక్కలు తొలగింపు: ఏటీ అగ్రహారం 11వ లైనులో రహదారి వెంబడి దగ్గర పిచ్చి మొక్కలు తొలగించి అక్కడే వదిలేయడంతో కుప్పలుగా పేరుకుపోయాయి. దీంతో దోమలతో ఇబ్బంది పడుతున్నాం. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ అంగడి రాజేష్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో పిచ్చి మొక్కలు తొలగించారు.

చెత్త ఏరివేత: ఎన్జీవో కాలనీలో మున్నంగి స్కూల్ పక్కనున్న సైడ్ కాలువల వెంబడి చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ సూపర్‌వైజర్ అంగడి రాజేష్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి సైడ్ కాలువల వెంబడి ఉన్న చెత్తను తొలగించి ఆ ప్రాంతంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

నిర్దేశిత గడువులోగా అర్జీల పరిష్కారం

నగరపాలక సంస్థ: జీఎంసీకి వచ్చే ప్రజా ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో 30 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డీసీ బి.శ్రీనివాసరావు, సీపీ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

పైపు పెడితే ప్రమాదం కాదా..

గోరంట్ల శివారు ఇన్నర్‌రింగ్ రోడ్డు సమీపంలో రోడ్డుపై ఉన్న యూజీడీ మ్యాన్‌హోల్ గుంతపై మూత విరిగిపోయింది. ప్రమాదం జరగకుండా స్థానికులు యూజీడీ డ్రెయిన్‌లో ఉపయోగించే పైపును ఉంచారు. పైపు ఒక పక్కకి ఒరిగి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి యూజీడీ మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గోరంట్ల**

స్తంభం ఎక్కేదెలా.. మరమ్మతులు చేసేదెలా?

విద్యుత్తు స్తంభాల చుట్టూ కేబుల్ వైర్లు చుట్టేసి వెళ్లిపోతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చంద్రమౌళీనగర్‌లో అమరావతి ఫుడ్ కోర్టు పక్క రహదారిలో విద్యుత్తు స్తంభం కింది నుంచి పైకి వరకు కేబుల్ వైర్ల చుట్టలు, వైర్లు చుట్టేశారు. విద్యుత్తు మరమ్మతులు చేయాల్సి ఉన్నా కేబుల్ వైర్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది వాపోతున్నారు. స్తంభం పైకి సిబ్బంది ఎక్కే అవకాశం లేకుండా వైర్లు పెట్టారని, ఎన్నిసార్లు చెప్పినా పెడ చెవిన పెడుతున్నారని విద్యుత్తు శాఖ సిబ్బంది గగ్గోలు పెడుతున్నారు. **- న్యూస్‌టుడే, పట్టాభిపురం**

సుశీలమ్మను సత్కరిస్తున్న అధ్యాపకులు

అంధకారం తొలగించేవాడే గురువు

ఎస్వీఎన్‌కాలనీ, న్యూస్‌టుడే: గురువు అంటే కేవలం పాఠ్యాంశాలు బోధించే వారు కాదని, తనకున్న విజ్ఞానాన్ని అందించే నిస్వార్థపరుడని విశ్రాంత ప్రిన్సిపల్, పూర్వ తెలుగు ఆచార్య ఉపసంచాలకులు డాక్టర్ సి.హెచ్.సుశీలమ్మ అన్నారు. జేకేసీ కళాశాల ఆడిటోరియంలో 'గురుశిష్య సంబంధాలు-మానవీయ విలువలు' అనే అంశంపై భారతీయ భాషల విభాగం ఆధ్వర్యంలో ముఖ్యఅతిథి ఉపన్యాసం సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సుశీలమ్మ మాట్లాడుతూ అంధకారాన్ని తొలగించేవాడే గురువని ఉదాహరణ పూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.గోపీచంద్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.సాంబశివరావు, భారతీయ భాషల విభాగాధిపతి డాక్టర్ వై.ప్రశాంతి, ఆంగ్ల విభాగాధిపతి పి.నాగసుశీల, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ఇష్టపడి చదివితే ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకుంటారని దూరదర్శన్, ఆకాశవాణి పూర్వ వార్త విభాగాధిపతి డాక్టర్ కొండలరావు అన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో 'సుమేధ స్టూడెంట్ లీడర్‌షిప్' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన డాక్టర్ గుత్తికొండ కొండలరావు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. జీఎస్టీ సహాయ కమిషనర్ కె.కేదారేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు తన విజయ ప్రస్థానం వివరించి చైతన్యపర్చారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి, ప్రిన్సిపల్ రాంబాబు, మెడికల్ బోర్డు మెంబర్ ఆనంద్ సంపత్‌రెడ్డి, ధర్మవరం నిర్వాహకులు డాక్టర్ చంద్రశేఖర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ కొండలరావు, డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

వన మహోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్ పిలుపునిచ్చారు. పాఠశాల విద్యార్థులు నగరంలో సోమవారం వనమహోత్సవ ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీపురంలోని పాఠశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ మదర్ థెరిసా విగ్రహం మీదుగా వెళ్లి తిరిగి పాఠశాలకు చేరుకుంది. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ప్రదర్శనలో పాల్గొన్నారు. ర్యాలీని ప్రారంభించిన విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటి పెంచడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ కృష్ణవేణి, ప్రిన్సిపల్ దుర్గాశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు సహకరించండి

మాట్లాడుతున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, పక్కన కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరాన్ని సుందర, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, స్టేక్‌హోల్డర్స్ అందరూ సహకరించాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో మిషన్ గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో మొక్కలు నాటే కార్యక్రమం విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. డివిజన్ల వారీగా కార్పొరేటర్ల ద్వారా మొక్కలు పంపిణీ చేసినట్లు తెలిపారు. రహదారులు, మురుగుకాలువలను ఆక్రమించి, ట్రాఫిక్ పారిశుద్ధ్యానికి ఆటంకంగా ఉన్న వీధి వ్యాపారులకు త్వరలోనే వెండింగ్‌జోన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనధికార నిర్మాణాలు, పారిశుద్ధ్య సమస్యలపై కూడా ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ సీజన్‌లో దశలవారీగా 5 లక్షల మొక్కలు నాటి సంరక్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే వార్డుల వారీగా మొక్కలు నాటే ప్రక్రియ నడుస్తోందన్నారు. రెండు ప్రాంతాల్లో వెండింగ్ జోన్లు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మిషన్‌గ్రీన్, వెండింగ్ జోన్లపై స్టేక్‌హోల్డర్స్ సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో సీపీ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, ఏడీహెచ్ జె.శాంతి, ఇన్‌ఛార్జి ఎంహెచ్‌వో రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించుకోవాల్సిందే

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నల్లచెరువు రోడ్డులో మంగళవారం సాయంత్రంలోగా ప్రధాన మురుగుకాలువలపై ఉన్న ఆక్రమణలను ఎవరికివారు తొలగించుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో ఆదేశించారు. పూడిక తీత పనులు చేపట్టాల్సి ఉన్నందున ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేనిపక్షంలో జీఎంసీ పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగిస్తారని పేర్కొన్నారు.

సామూహిక సాయి సచ్చరిత్ర పారాయణ

వైభవంగా గురుపూర్ణిమ ఉత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: విద్యానగర్ మూడో లైనులోని శ్రీసాయినాథ సన్నిధానంలో గురుపూర్ణిమ ఉత్సవాలు సోమవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సాయినాథుడికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. మందిరంలో శ్రీసాయి సచ్చరిత్ర పారాయణం నిర్వహించారు. పలువురు సామూహిక ఏకదిన పారాయణంలో పాల్గొన్నారు. వందలాది భక్తులు సాయినాథుడిని దర్శించుకున్నారు. సాయినామ సప్తాహం నాలుగో రోజు కొనసాగింది. కార్యక్రమాలను ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య, ఆవుల అప్పారావు పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం పది గంటలకు నాగవల్లీ దళార్చన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గర్భిణులకు అవసరమైన పరీక్షలు తప్పనిసరి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గర్భిణులకు అవసరమైన పరీక్షలపై అందరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయలక్ష్మి సూచించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం వైద్యాధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో విజయలక్ష్మి మాట్లాడారు. గర్భం ధరించినప్పటి నుంచి కాన్పు పూర్తయ్యే వరకు ఎప్పుడైనా ఇబ్బందులు తలెత్తవచ్చన్నారు. పైకి అంతా బాగానే అనిపిస్తున్నా లోలోపల బిడ్డ శరీర నిర్మాణంలో లోపాలకు బీజం పడుతుండొచ్చన్నారు. వీటి విషయంలో అప్రమత్తత అవసరమన్నారు. అవసరమైన పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి అన్నారు. అనంతరం గర్భిణుల్లో వచ్చే ప్రమాదకర లక్షణాలపై తయారు చేసిన మాన్యువల్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీఐవో శ్రావణబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ న్యూరో సైంటిస్టుల సంఘం అధ్యక్షుడిగా సుందరాచారి

సుందరాచారితో అరుణకుమారి, బిందునర్మద తదితరులు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఏపీ న్యూరో సైంటిస్టుల సంఘం నూతన అధ్యక్షుడిగా గుంటూరు వైద్య కళాశాల ప్రధానాచార్యులు, సీనియర్ న్యూరాలజిస్ట్ ఆచార్య సుందరాచారి ఎంపికయ్యారు. నెల్లూరులో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు జరిగిన ఏపీ న్యూరో కాన్-2025 రాష్ట్ర వార్షిక సదస్సు ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి సుందరాచారి నూతన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో పరిశోధన పత్రం విభాగంలో సర్వజనాసుపత్రి న్యూరాలజీ విభాగం విద్యార్థి వైద్యులు సాయిలక్ష్మి, పోస్టర్‌లో వల్లీకృష్ణప్రియ విజేతలుగా నిలిచారు. గుంటూరు వైద్య కళాశాలలో సోమవారం సాయంత్రం జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో న్యూరాలజీ విభాగం వైద్యులు, పీజీలు నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సుందరాచారిని అభినందించారు. కార్యక్రమంలో ఆ విభాగం అధిపతి అరుణకుమారి, సహాయ ఆచార్యులు బిందునర్మద తదితరులు పాల్గొన్నారు.

శ్రీపూజితకు బెస్ట్ స్కూల్ అవార్డు

అవార్డు స్వీకరిస్తున్న కంచర్ల హరికృష్ణప్రసాద్

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: పట్టాభిపురం శ్రీపూజిత స్కూల్ బ్యాంకాక్‌లో నిర్వహించిన వరల్డ్ స్కూల్ సమ్మిట్ - 2025లో 'బెస్ట్ స్కూల్ విత్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్' అవార్డు సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ కంచర్ల పద్మావతి తెలిపారు. ఈ అవార్డును స్కూల్ యంగ్ డైరెక్టర్ కంచర్ల హరికృష్ణప్రసాద్ స్వీకరించారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ డైరెక్టర్ హరికృష్ణప్రసాద్ చిన్నవయసులోనే అసాధారణ నాయకత్వం, పాఠశాల విద్యలో కొత్త ఆవిష్కరణలను ప్రవేశపెట్టడం, అచంచలమైన నిబద్ధత కలిగి ఉండటం వల్లనే అవార్డు దక్కిందని వివరించారు. హరికృష్ణ ప్రసాద్ అమెరికాలోని మేరీలాండ్ స్టేట్ యూనివర్సిటీ నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డాక్టరేట్ పట్టా సాధించారని తెలిపారు. స్వదేశం వచ్చిన హరికృష్ణప్రసాద్‌కు స్కూల్ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు ఘనంగా ఆహ్వానం పలికి అభినందనలు తెలిపారు.

ఇంటింటి చెత్తసేకరణ వందశాతం జరగాల్సిందే

నగరపాలక సంస్థ: నగరంలో ఇంటింటి చెత్త సేకరణ వందశాతం జరగాలని, కాలువలు, వీధుల్లో చెత్త వేసే వారిపై అపరాధ రుసుం విధించాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఆయన సంగడిగుంట, లాంచెస్టర్ రోడ్డు, ఐపీడీ కాలనీ, గొలుసు కొండలరావునగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఎక్కడా డంపింగ్ పాయింట్‌లు ఉండడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.

మత్తు పదార్థాలతో జీవితం అంధకారం

విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న ఈగల్ ఎస్పీ నగేష్ బాబు, సంఘ సభ్యులు

ఏటీ అగ్రహారం: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు అంధకారం అవుతాయని ఈగల్ ఎస్పీ, పాఠశాల పూర్వ విద్యార్థి నగేశ్‌బాబు తెలిపారు. ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారని, వాటికి దూరంగా ఉండాలన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వినయ, విధేయతలు అలవర్చుకోవాలని, తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించాలన్నారు. పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధి శైలజ మాట్లాడుతూ పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకే ఏటా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 6 నుంచి 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.2 లక్షల నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థి చేబ్రోలు శ్రీనివాసరావు పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అడకా పద్మావతి, అడకా శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు ఖాజావలి, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కోపూరి కోటేశ్వరరావు, శీలం శ్రీనివాసరావు, ఆళ్ల వీరభద్రరావు, మధులాల్, హైమారావు, చెవుల శ్రీను, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి భారతదేశం మార్గదర్శి

మాట్లాడుతున్న నరసింహమూర్తి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రపంచానికి భారతదేశం మార్గదర్శిగా ఉంటుందని శ్రీకాకుళం ఉపనిషన్మందిరం కార్యనిర్వాహక అధ్యక్షుడు నిష్టల నరసింహమూర్తి అన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై సోమవారం రాత్రి ఆయన గురువైభవం గురించి ప్రవచనం చేశారు. తొలుత ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నరసింహమూర్తి మాట్లాడుతూ భారతదేశం విశ్వగురు పీఠం అన్నారు. గురువును శిష్యుడు ఎందుకు, ఏవిధంగా ఆశ్రయించాలి అనే విషయాలు మహాభారతం, భాగవతం, రామాయణం, గురుగీత, గురు చరిత్ర నుంచి ఉదహరించారు. రాబోయే గురు పూర్ణిమ, వ్యాస పూర్ణిమ సందర్భంగా వ్యాస భగవానుడి వైభవాన్ని వివిధ కోణాల్లో వివరించారు.

పికిల్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గ సభ్యులతో డీఎస్‌డీఓ నరసింహారెడ్డి

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లాలో పికిల్‌బాల్ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందజేస్తామని జిల్లా క్రీడాధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని వీవీవీ హెల్త్ హబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో గుంటూరు జిల్లా పికిల్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ ప్యాట్రన్‌గా టి.అరుణ్‌కుమార్, ఛైర్మన్‌గా చుక్కపల్లి రాకేష్, గౌరవ అధ్యక్షుడిగా హరికిషన్ సాయి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డాక్టర్ ఎం.శివకుమార్, ఉపాధ్యక్షులుగా రవీంద్రబాబు, కమలాకాంత్, రామకోటేశ్వరరావు, వరుణ్, హనుమంతరావు, భరత్‌కుమార్, కార్యదర్శిగా జీవీఎస్ ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.అరుణ్ కుమార్, కోశాధికారిగా సుస్మిత చౌదరి, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ కల్యాణ చక్రవర్తి, డాక్టర రాజశేఖర్, డాక్టర్ ఫణీంద్ర మరో ఐదుగురు, సభ్యులుగా నలుగురు ఎన్నికయ్యారు. ఏపీ పికిల్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీధర్, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రతినిధులు వేణుగోపాలరావు, న్యాయవాది రవీంద్రబాబు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పికిల్‌బాల్ క్రీడాభివృద్ధికి కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. పాఠశాల, కళాశాలల్లో పికిల్‌బాల్ కోర్టుల్ని నిర్మించే విధంగా కృషి చేస్తామన్నారు.

(c) eenadu

ఈనాడు

అమరావతి

కృష్ణా

మంగళవారం జులై 8, 2025

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - పటమట

అవకాశమివ్వండి.. రూ.కోట్లు గడిస్తా!

నా అనుభవంతో ట్రేడింగ్‌లో మరింత సంపాదిస్తా
పోలీసు విచారణలో నిందితుడు ఆదిత్య వేడుకోలు

'నేను షేర్లలో పెట్టుబడి పెట్టడంలో దిట్ట. ఏ షేర్ ధర ఎప్పుడు పెరుగుతుందో పసిగట్టగలను. షేర్ మార్కెట్లో బడా వ్యక్తులతో నేరుగా మాట్లాడగలిగే పరిచయాలు ఉన్నాయి. ఒక్క ఛాన్స్ ఇవ్వండి ప్లీజ్.. ట్రేడింగ్‌లో నాకున్న అనుభవంతో భారీగా సంపాదిస్తానని' అద్విక ఎండీ ఆదిత్య పోలీసుల విచారణలో వేడుకున్నాడు.

అధిక వడ్డీల పేరుతో రూ.కోట్లు దోచేసిన అద్విక ట్రేడింగ్ కంపెనీ కేసులో పోలీసులు నిశిత దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ఆదిత్య జల్సాలకు రూ.కోట్లు వెచ్చించినట్లు తేల్చారు. దుబాయ్‌లో మూడు కార్యాలయాలు ప్రారంభించి, ట్రేడింగ్ ఖాతాలనూ తెరిచాడు.

మొత్తంగా 1,109 మంది రూ.350 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు తేలింది. ఏజెంట్లకు కమీషన్ల రూపంలో.. పెట్టుబడిదారులకు వడ్డీల రూపంలో రూ.250 కోట్లు చెల్లించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నిందితుడు అనారోగ్యంతో బాధపడుతున్నందున సోమవారం విచారణ సాగలేదు.

ఆ ఖాతాలపైనే గురి..

విజయవాడలో రెండేళ్లలో మూడుచోట్ల కార్యాలయాలు మార్చినట్లు గుర్తించారు. కొన్నినెలల కిందట దుబాయ్‌లో మూడుచోట్ల మూడు కార్యాలయాలు పెట్టాడు. ట్రేడింగ్ కోసం గోల్డెన్ లీప్, మల్టీ బ్యాంకు, ఖబానాలో మూడు ఖాతాలు తెరిచాడు. ఈ ఖాతాల నగదు నిల్వలు, లావాదేవీల స్టేట్‌మెంట్లు ఇవ్వాలని నగర పోలీసులు ఆయా బ్యాంకులకు రాసినా వారు పట్టించుకోలేదు. ఫెమా చట్టం కింద కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా లేఖలు పంపనున్నారు. ఈవివరాలు వస్తే.. ఆ ఖాతాల్లో ఎంత నగదు ఉంది? అన్ని లావాదేవీలు తేలనున్నాయి.

కరెంట్ ఖాతాల వివరాలు కొలిక్కి..

సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి బోర్డు తిప్పేసే వరకు సంస్థకు చెందిన ఏడు కరెంటు ఖాతాలు ఉన్నాయి. వీటి వివరాలు అందించమని ఆయా బ్యాంకులకు దర్యాప్తు అధికారి లేఖలు రాయగా.. ఇవి సోమవారం పోలీసులకు అందాయి. ఇవేకాక.. ఆదిత్య వ్యక్తిగత ఖాతా వివరాలూ చేరాయి. ఖాతాల్లో జమైన, బదిలీ అయిన నగదు వివరాలు విశ్లేషిస్తున్నారు. లెక్క తేలేందుకు 7-10 రోజులు పట్టే వీలుందని భావిస్తున్నారు.

విచ్చలవిడి ఖర్చులు...

దుబాయ్ కార్యాలయాల్లో ఇంటీరియర్ డిజైనింగ్‌కు రూ.20-30 లక్షలు వెచ్చించినట్లు తెలిసింది. విజయవాడ కార్యాలయంలోనూ రూ.20 లక్షలు వెచ్చించాడు. డిపాజిటర్లను ఆకట్టుకునేందుకే ఈ ఎత్తుగడ. నగరంలో రూ.3 కోట్ల విలువైన ఫ్లాట్ కొన్నాడు. నిరుడు.. ఓ ఏజెంట్‌కు కారు కొనేందుకు అతనితోపాటు ఆదిత్య కూడా షోరూమ్‌కు వెళ్లాడు. కారు కొన్న తర్వాత సిబ్బందికి టిప్‌గా రూ.50 వేలు ఇచ్చాడు. ఏజెంట్లను ఉత్తేజపరిచేందుకు గోవాలో విలాసవంత పార్టీలు ఇచ్చేవాడు.

ఇప్పటికి 110 మంది ఫిర్యాదు...

ఏజెంట్ల ఖాతాలు, వారి లాకర్లు కూడా ఫ్రీజ్ అయ్యాయి. ఇప్పటికే 44 మంది ఏజెంట్లు వివరాలు ఇవ్వగా.. ఐదుగురు పరారీలో ఉన్నారు. నిత్యం బాధితులు ఏసీపీ కార్యాలయానికి వస్తూనే ఉన్నారు. ఇప్పటికి 110 మంది ఫిర్యాదు చేశారు. ఏజెంట్లకు ఎంత కమీషన్ ఇచ్చాడు? బాధితులకు వడ్డీ రూపంలో ఎంత తిరిగిచ్చాడు? మిగిలిన నగదు ఎక్కడుందో తెలుసుకునేందుకు పోలీసులు సమగ్రంగా విచారిస్తున్నారు.

అందిస్తే సాయం.. నడిపించదా స్థైర్యం

ఈ చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడి పేరు వక్కలగడ్డ శ్రీకాంత్(40). తల్లిదండ్రులు లేని అనాథ. అతనికి వచ్చే దివ్యాంగ పింఛనే జీవనాధారం. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు చెందిన ఇతను స్నేహితుల దగ్గర తలదాచుకుంటున్నాడు. ఎక్కడికైనా వెళ్లేందుకు బ్యాటరీ బండి కోసం నెల రోజుల కిందట కలెక్టరేట్‌కు రాగా కలెక్టర్ బాలాజీ అతనితో మాట్లాడి ఇస్తానని మాట ఇచ్చారు. సంబంధితశాఖ వారు ఇవ్వడం లేదు. మళ్లీ వినతిపత్రం ఇచ్చేందుకు సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్‌కు వచ్చాడు. అయితే కలెక్టర్ లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగాడు. - **ఈనాడు, కృష్ణా**

కాల్వలకు 7,586 క్యూసెక్కులు

ఎన్టీఆర్ కలెక్టరేట్: కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి సోమవారం 7,586 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 7,070, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 516 క్యూసెక్కులు, కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,707, ఏలూరు 1,110, బందరు 1,245, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,008 క్యూసెక్కుల నీరు ఇస్తున్నారు.

ప్రథమ వర్ధంతి

కీ||శే|| శ్రీ బొప్పన శరత్ గోపాల్ గారు
మీ మధుర స్మృతులు మా హృదయాలలో ఎల్లప్పుడూ కదలాడుతూనే ఉంటాయి
పెంజేంద్ర గ్రామ
బొప్పన మరియు బలుసు వారి కుటుంబ సభ్యులు

పెట్టుబడి ఘనం.. ఫలితం గగనం

అగ్రి ఆక్వా ల్యాబ్‌లు ప్రారంభించి నేటికి నాలుగేళ్లు

కంకిపాడు, న్యూస్‌టుడే

నియోజకవర్గానికి ఒకటి చొప్పున 2021లో ప్రారంభించిన అగ్రి, ఆక్వా ల్యాబ్‌ల్లో సేవలు నామమాత్రంగా ఉన్నాయి. విత్తనం స్వచ్ఛత, మొలక శాతం, ఎరువుల నాణ్యత పరీక్షలకే పరిమితమయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.78 నుంచి రూ.98 లక్షల వరకు ఖర్చు చేయగా పరికరాలకు రూ.3 కోట్లకు పైగా నిధులు వెచ్చించారు. అంటే ఒక్కో యూనిట్‌కు సుమారు రూ.4 కోట్లు పెట్టుబడి పెట్టినా క్షేత్ర స్థాయిలో రైతులకు ఉపయోగపడే భూసారం, పైర్లలో తెగుళ్ల నిర్ధరణ పరీక్షలు అందుబాటులో లేవు. కొన్ని ల్యాబ్‌ల్లో పరీక్షల సంఖ్యను వాస్తవం కంటే అధికంగా చూపుతున్నారనే విమర్శలున్నాయి.

విత్తన మొలక శాతాన్ని లెక్కిస్తున్న ఉద్యోగిని

కృష్ణా జిల్లాలో మొత్తం ల్యాబ్‌లు: 14
(వీటిలో అగ్రి–10, అగ్రి, ఆక్వా–4)

- భవన నిర్మాణానికి వెచ్చించిన నిధులు: 'నాబార్డ్' రూ.82 లక్షలు, ఆర్‌కేవీవై రూ.16లక్షలు
- ఒక్కో ల్యాబ్‌లో ఏడాదికి పరీక్షలు చేసిన నమూనాలు: ఎరువులు 212, విత్తనాలు 392 (దస్త్రాల్లో)
- ఆక్వా విభాగం చెరువుల్లో మట్టి, నీటి నమూనాలు - 576
- చేపలు, రొయ్యల డిటెక్షన్ పరీక్షలు - 148

నాణ్యత నిర్ధారణ ఇలా..

మండల స్థాయిలో ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తీసిన నమూనాలను తిరుపతి, విశాఖపట్నం, అమరావతి, తాడేపల్లిగూడెంలో ప్రధాన కేంద్రాలకు పంపుతారు. అక్కడ నుంచి 'డీకోడింగ్' విధానంలో జిల్లాలో ల్యాబ్‌లకు నమూనాలు పంపుతారు. ఇక్కడ పరీక్షల తరువాత 'స్టాండర్డ్'/సబ్-స్టాండర్డ్' రూపంలో నివేదికలను సంబంధిత కార్యాలయాలకు చేరవేస్తారు. కేంద్రానికి ఏవో ఇన్‌ఛార్జి కాగా ఇద్దరు సహాయకులు పనిచేస్తుంటారు. ఆక్వా విభాగంలో చెరువుల్లో నీరు, మట్టి పరీక్షలు ప్రధానమైనవి కాగా రోగాల బారినపడిన చేపలు, రొయ్యలను 'డిటెక్షన్' చేసి వ్యాధి నిర్ధారణ, కారణాలపై నివేదిక తయారు చేస్తారు. ఇది కొంతమేర ఆక్వా రైతులకు ప్రయోజనకరంగా ఉంది. ఇవి జిల్లా వ్యాప్తంగా అవనిగడ్డ, గుడివాడ, మచిలీపట్నం, కంకిపాడులో మాత్రమే ఉన్నాయి. మిగతా ల్యాబ్‌లు వ్యవసాయ రంగానికే(అగ్రి) పరిమితమయ్యాయి.

నాలుగు విభాగాల్లో నమూనాలు

ప్రధాన, రైతు సేవా కేంద్రాలు, రైతుల నుంచి వచ్చే నమూనాల పరీక్షలు ఉచితంగా చేస్తారు. ఇక వ్యాపారులు తీసుకువచ్చే వాటిలో విత్తన నాణ్యత పరీక్షకు రూ.300, ఎరువులకు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడకు వచ్చే నమూనాల్లో 80 శాతం మేర వ్యవసాయాధికారులు సేకరించినవే ఉంటున్నాయి.

ఇలా చేస్తే మేలు

- ల్యాబ్‌లపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడం.
- చీడపీడల బారిన పడిన పైరు నమూనాలను పరీక్షించి రోగ నిర్ధారణ చేయడం, రైతులకు సస్య రక్షణకు సూచనలు ఇవ్వడం.
- భూసార, సాగునీటి పరీక్షలు నిర్వహించడం.

శాకంబరికి కూరగాయల హారం

ఇంద్రకీలాద్రిపై మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న శాకంబరి ఉత్సవాలకు దాతలు ఇచ్చిన కూరగాయలతో దండలు సిద్ధం చేస్తున్నారు. ఆలయ ఈవో శీనానాయక్ హారతి ఇచ్చి అలంకరణకు శ్రీకారం చుట్టారు. సేవా మహిళలు కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో దండలు అల్లారు. - **ఈనాడు, అమరావతి**

పండ్ల మొక్కల పండగకు శ్రీకారం నేడే

ఈనాడు, అమరావతి: పల్లెపండగ స్ఫూర్తితో పండ్ల మొక్కల పండగకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. ఉభయ జిల్లాల్లో ఒకే రోజు భారీఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం చేపట్టనున్నారు. నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ సహకారంతో నిర్వహిస్తున్నారు.

ఒకేరోజు 503 ఎకరాల్లో ...

నిరుడు రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 4 వేల కిమీ మేర రహదారులు నిర్మించి కూటమి సర్కారు చరిత్ర సృష్టించింది. అదే తరహాలో ఉమ్మడి కృష్ణాలో ఒకే రోజు 503 ఎకరాల్లో మొక్కలు నాటి మరో నూతన ఆవిష్కరణకు రంగం సిద్ధం చేసింది. గంపలగూడెం మండలం గోసవీడులో 500 ఎకరాల్లో, గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో 3 ఎకరాల్లో మొక్కలు నాటుతారు. మామిడి, జామ, సీతాఫలం, సపోటా, నేరేడు, మునగ, బత్తాయి, అంజీరా, చింత, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, అంజీరా, యాపిల్‌బేర్, స్వీట్ ఆరెంజ్, దానిమ్మ, తదితర మొక్కలు నాటుతారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారు.

రూ.4.53 కోట్ల నిధులు: ఒక్క రోజులో నాటే మొక్కలకు రూ.4.53 కోట్లు కేటాయించారు. మొక్కలు, సామగ్రి కొనుగోలు, కూలీల వేతనాలు తదితర ఖర్చులు ఉంటాయి. పండ్ల తోటల ఏర్పాటు లక్ష్యం... ఎన్టీఆర్‌లో 4,000 ఎకరాలు, కృష్ణా జిల్లాలో 300 ఎకరాలుగా నిర్ణయించారు. మంగళవారం నుంచి పండ్ల తోటల ఏర్పాటు మొదలు కానుండగా.. జులై ఆఖరుకు లక్ష్యం పూర్తి చేసేలా అధికారులు కృషి చేస్తున్నారు.

ప్రథమ వర్ధంతి



కీ||శే|| శ్రీ బొప్పన శరత్ గోపాల్ గారు
అజరామరమైన కీర్తిప్రతిష్టలు అణువణువునా నింపుకున్న వ్యక్తిత్వం మీది.. మీరు గతించి ఏడాది అయినా.. మీ జ్ఞాపకాలు ఎల్లప్పుడూ పదిలంగానే ఉంటాయి
అంకినీడు వెలగ
మరియు కుటుంబ సభ్యులు

ప్రథమ వర్ధంతి

కీ||శే|| శ్రీ బొప్పన శరత్ గోపాల్ గారు
శ్రమైక జీవనంతో అత్యున్నత శిఖరాలకు ఎదిగి.. మాకు అందనంత దూరాలకేగిన ఆత్మబంధువుకు ప్రథమ వర్ధంతి నివాళి..
మేడసాని రవీంద్రరావు
మరియు కుటుంబ సభ్యులు

ప్రథమ వర్ధంతి

కీ||శే|| శ్రీ బొప్పన శరత్ గోపాల్ గారు
మీరు భౌతికంగా మానుండి దూరమై ఏడాది గడుస్తున్నా..
మీతో గడిపిన ఆ మధుర క్షణాలు మా అందరి జీవితాలలో నిత్యనూతనంగా ఎల్లప్పుడూ నిలిచే ఉంటాయి..
కోనేరు సుబ్బారావు
మరియు కుటుంబ సభ్యులు

దివికేగిన ధన్యజీవికి
ప్రథమ వర్ధంతి నివాళ్ళు
ఆజన్మాంతం మా అందరికి ప్రేమానురాగాలు పంచి..
ఒక ఆదర్శమైన భర్తగా, ఉన్నత విలువలతో నడిపించే తండ్రిగా,
ప్రేమను పంచే తాతయ్యగా...
ఆత్మీయులకు ఆత్మబంధువుగా జీవించి తరించిన
మా ఇంటి దైవం కీ||శే|| శ్రీ బొప్పన శరత్ గోపాల్ గారు
పరమపదించి నేటికి సంవత్సర కాలం గడుస్తున్నా
మీరు పంచిన ప్రేమామృత స్మృతులు నిరంతరం
మా హృదయాలలో కదలాడుతూనే ఉంటాయి...
మీరు భౌతికంగా మా మధ్య లేరనేది
మాకు ఎల్లప్పటికి మాటలకందని విషాదమే...
మీరు నడయాడిన ఈ నేల మాకు స్వర్గం.
మీ జీవితం మాకు నిరంతర స్ఫూర్తి మంత్రం.
బాధాతప్త హృదయాలతో..
మిమ్మల్ని ఎల్లప్పుడూ ప్రేమించే మీ కుటుంబం
భార్య:
శ్రీమతి బొప్పన ఝాన్సీ రాణి
కొడుకు - కోడలు
బొప్పన తారాచంద్ - బొప్పన కుసుమ
కూతురు - అల్లుడు
నాదెళ్ల కావ్య - నాదెళ్ల నందీప్
మనుమరాండ్రు, మనుమడు:
బొప్పన అద్వైత, బొప్పన రాణి ఐశ్వర్య,
నాదెళ్ల అనన్య, నాదెళ్ల యువన్
కీ||శే|| శ్రీ బొప్పన శరత్ గోపాల్ గారు
(1949 - 2024)
M/S. DYMES ENGINEERS PVT LTD. ◆ SARATH CITY CAPITAL MALL ◆ VIGNANA JYOTHI GROUP OF EDUCATIONAL SOCIETY

(c) eenadu

పేదరికం లేని సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

డివిజన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: పేదరికం లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం నగర పరిధిలోని 45, 46 డివిజన్లు, మండల పరిధిలోని పెదపట్నం గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారాలే లక్ష్యంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర జీడీపీని 15శాతం వృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. సమస్యల పరిష్కారంతో పాటు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు తగు ప్రాధన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఏడాది కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. డివిజన్ పరిధిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబాప్రసాద్, పీవీ ఫణికుమార్, హరిబాబు, నగర కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. ★ పెదపట్నంలో మంత్రి కొల్లు మాట్లాడుతూ కూటమికి అఖండ విజయం చేకూర్చిన ప్రజల రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఏడాది కాలంలో చేసిన మంచి, భవిష్యత్తులో చేయబోయే పనులు గ్రామస్థులకు వివరించారు. సంక్షేమం ముసుగులో వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని లూటీ చేసిందన్నారు. వైకాపా విధ్వంసంతో కుప్పకూలిన వ్యవస్థలను గాడిన పెడుతూ హామీ ఇచ్చిన విధంగా సూపర్‌సిక్స్ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పార్టీ నాయకులు గోపు సత్యనారాయణ, తలారి సోమశేఖర్, కుంచె నాని, స్థానిక నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అరాచక శక్తుల్ని అందలమెక్కించిన ఘనత జగన్‌ది

గుడివాడ, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో జగన్ మోహన్ రెడ్డి అరాచక శక్తులను అందలమెక్కించారని, మంత్రి పదవులు ఇచ్చారని.. నేడు ఆ అరాచక శక్తులతో రప్పా రప్పా అంటూంటే చూస్తూ ఊరుకోమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న కాలంలో ఇదే కొనసాగిస్తే ప్రజలు జగన్ పార్టీని 11 సీట్ల నుంచి 1కు పడేయడం ఖాయం అన్నారు. జగన్ అధికారంలో ఉండగా ప్రతిపక్షాలను కనీసం రోడ్డుపైకి కూడా రానీయకుండా జీవోలు తెచ్చారన్నారు. తమపై ఎన్ని కేసులు పెట్టారో అందరికీ తెలుసని, తాము కోర్టుకు వెళ్లి నిరూపించుకున్నామన్నారు. తెదేపాకు శత్రువులు ఎవరూ ఉండరని, చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన ఎవ్వరినీ వదలమన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని తన గోదాములలో 8 వేల బస్తాల బియ్యం దోచుకుని నేడు డబ్బులు కట్టేస్తే దొర అవుతాడా అని ఎద్దేవా చేశారు. నేడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న నేత చంద్రబాబు అన్నారు.

పోగొట్టుకున్నా.. తిరిగి పొందొచ్చు!

ఆర్టీసీలో 'లాస్ట్ ప్రాపర్టీ హ్యాండోవర్'తో సాధ్యం

✦ శివరామ్‌ప్రసాద్... రేపల్లె నుంచి విజయవాడ వచ్చారు. విజయవాడలో బస్సు దిగే హడావుడిలో పర్సు పడిపోయినా చూసుకోలేదు. అందులో డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, ఏటీఎం, పాన్ కార్డులు, రూ.5 వేలు ఉన్నాయి. దిగాక సరిచూసుకుంటే బస్సు వెళ్లిపోయింది. టిక్కెట్‌పై ఉన్న వివరాలతో కండక్టర్‌ను సంప్రదించగా విజయవాడ బస్టాండ్‌లోని యర్నింగ్ సెక్షన్‌లో ఉన్నట్లు తెలుసుకుని తిరిగి తీసుకున్నారు

✦ ఆరు నెలల కిందట అవనిగడ్డ నుంచి గుడివాడ వెళుతున్న బస్సులో మొగదారయ్య బ్యాగు మర్చిపోయి చల్లపల్లిలో దిగారు. తర్వాత చూసుకుంటే బస్సు గుడివాడ వెళ్లిపోయింది. తెలిసిన వారి సలహా మేరకు డిపో మేనేజర్ నంబరు తీసుకుని సంప్రదించగా బ్యాగు తిరిగి అప్పగించారు. ఇందులో పొలం పాస్ పుస్తకాలు, ఆధార్, రేషన్ కార్డులు ఉన్నాయి.

ఈనాడు - అమరావతి

ప్రయాణ హడావుడిలో బస్సులో మర్చిపోయిన వస్తువులపై పూర్తిగా ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదు. వాటిని తిరిగి పొందే అవకాశం ఉంది. ఆర్టీసీ దానికోసం లాస్ట్ ప్రాపర్టీ హ్యాండోవర్ విధానాన్ని అన్ని డిపోల పరిధిలో అమలు చేస్తోంది. ఈ ప్రక్రియ తెలియక చాలా మంది బస్సుల్లో వస్తువులు పోగొట్టుకుని నష్టపోతున్నారు.

తిరిగి పొందడమెలా: బస్సుల్లో సామగ్రి మర్చిపోతే హైరానా పడకుండా టిక్కెట్‌పై కండక్టర్ గురించి తెలిపే గుర్తింపు సంఖ్య ఉంటుంది. ఆ బస్సు ఏ డిపో పరిధిలోదో తెలుసుకుని మేనేజర్‌కు ఫోన్ చేయాలి. టిక్కెట్‌పై ఉన్న గుర్తింపు సంఖ్య చెబితే కండక్టర్, డ్రైవర్ ఫోన్ నంబర్, వివరాలు చెబుతారు. వారి ద్వారా సామగ్రి జాడ తెలుసుకోవచ్చు.

నిర్ధారించాకే అప్పగింత: డ్రైవర్, కండక్టర్లు ట్రిప్ పూర్తి కాగానే బస్సులో సామగ్రి ఎవరైనా మర్చిపోతే వాటిని డిపోలోని యర్నింగ్ సెక్షన్‌లో డీపీ క్లర్క్‌కు అప్పగించాలి. పోగొట్టుకున్న వారు నేరుగా ఆ క్లర్క్‌ను సంప్రదిస్తే.. పోగొట్టుకున్న వస్తువుల వివరాలు క్షుణ్ణంగా తెలుసుకుని... వారివే అని నిర్ధారించుకునే అప్పగిస్తారు.

మనకూ బాధ్యత ఉండాలి: ఉమ్మడి కృష్ణా జిల్లాలో 13 డిపోలు.. 1,186 బస్సులు ఉన్నాయి. రోజుకు సగటున 3.1 లక్షల మంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. సిబ్బంది బాధ్యత లేకుండా వ్యవహరించినా, తోటి ప్రయాణికులు ఆ వస్తువులను సిబ్బందికి అప్పగించకున్నా.. వస్తువులు దొరకడం సాధ్యం కాదు. ప్రయాణికులు బాధ్యతగా వ్యవహరించాలి. బస్సుల్లో దొరికిన వస్తువులను కండక్టర్‌కు అప్పగిస్తే పోగొట్టుకున్న వారికి సులభంగా చేర్చవచ్చు. నెలకు సగటున రెండు ఘటనలు జరుగుతాయనీ.. పోగొట్టుకున్న వారికి వస్తువులు అప్పగిస్తున్నామని ఆర్టీసీ ఆర్‌ఎం దానం తెలిపారు.

మెగా సమావేశాలను విజయవంతం చేయాలి

ప్రధానోపాధ్యాయులతో వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: పాఠశాలల్లో నిర్వహించనున్న మెగా సమావేశాలను ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి విజయవంతం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. జేసీ గీతాంజలిశర్మతో కలిసి సోమవారం కలెక్టరేట్ నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశంపై వీసీ ద్వారా సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ నెల 10న నిర్వహించిన మెగా సమావేశాల నిర్వహణ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం చేసిన కార్యక్రమాన్ని ఈ దఫా ప్రైవేటు పాఠశాలల్లోనూ నిర్వహించాలని స్పష్టం చేశారు. ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకూ సమావేశం నిర్వహించి సహపంక్తి భోజనంతో ముగించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ముఖ్యంగా తల్లికి వందనం లబ్ధిదారులు సమావేశాలకు హాజరయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ముందస్తుగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించాలన్నారు. సమావేశం రోజున తల్లిదండ్రులకు మ్యూజికల్ ఛైర్, టగ్‌ఆఫ్‌వార్, లెమన్ అండ్ స్పూన్ వంటి పోటీలు నిర్వహించాలని చెప్పారు. తల్లికి వందనం లబ్ధిదారులు తమ అభిప్రాయాలు తెలిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీసీకి జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, జిల్లాలోని మండల విద్యాధికారులు హాజరయ్యారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

బాధ్యత భుజాన.. మెరిసిన ఆలోచన

సోడా బండిని ద్విచక్ర వాహనానికి కట్టుకుని విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో వెళ్తున్న ఈ మహిళ పేరు కోమటి శేషమ్మ. కంకిపాడు మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ఆమె కుటుంబాన్ని పోషించుకోవడానికి రూ.1.3లక్షలు వెచ్చించి సోడా బండి కొనుక్కుంది. ఎక్కడికైనా తరలించే సదుపాయం కావాలంటే రూ.2.5లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో ఇంట్లో ఉన్న టీవీఎస్ ద్విచక్ర వాహనం నడపడం నేర్చుకుని దానికి సోడాబండిని కట్టుకుని ప్రొద్దుటూరులోని ఇంటి నుంచి జాతీయ రహదారిలో ఉన్న దావులూరు టోల్ ప్లాజా వరకు వచ్చి అక్కడ సోడాలు అమ్ముతోంది. దీనిపై వచ్చే ఆదాయంతో ఇద్దరు కొడుకులను చదివిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. -ఈనాడు, కృష్ణా

శాకంబరి ఉత్సవాలకు సర్వం సిద్ధం

మహామండపంలో కూరగాయలకు హారతి ఇస్తున్న ఈవో శీనానాయక్, వైదిక కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల 8నుంచి నిర్వహించే శాకంబరి ఉత్సవాలకు దాతలు ఇచ్చిన కూరగాయలు సోమవారం దేవస్థానానికి చేరాయి. దాతలు ఇచ్చిన కూరగాయలకు అర్చకులు పూజ చేశారు. ఈవో శీనానాయక్ హారతి ఇచ్చి దండల అలంకరణకు శ్రీకారం చుట్టారు. మల్లికార్జున మహామండపంలో మహిళలు దండలు తయారు చేస్తున్నారు. మంగళవారం ఉదయం 8గంటలకు విఘ్నేశ్వరపూజ, సాయంత్రం 4గంటలకు కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠాపన, మండపారాధన కార్యక్రమాలు రుత్వికులు నిర్వహిస్తారు. 9న మూలమంత్ర హవనాలు, మండప పూజలు, హారతి, 10న ఉదయం 8గంటలకు సప్తశతీ పారాయణ, మహావిద్యా పారాయణ, శాంతి పౌష్టిక హోమాలు, 9.30 గంటలకు మహాపూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఈవో పేర్కొన్నారు. గత ఏడాది మూడు రోజులకు 36 టన్నుల కూరగాయలు దాతలు అందజేయగా, ఈసారి మొదటి రోజు అలంకరణకు 16 టన్నులు ఇచ్చారు.

అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలు చూపాలి

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో చంద్రశేఖరరావు, అధికారులు

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఇచ్చే అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలు చూపాలని డీఆర్వో చంద్రశేఖరరావు అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేదికలో పరిష్కారం చూపిన అర్జీదారుల అభిప్రాయాలను సీఎంవో కార్యాలయం ద్వారా సమీక్షిస్తున్నారని పేర్కొన్నారు. పరిష్కార యోగ్యం కాని అర్జీల విషయంలో ఇందుకు గల కారణాలను అర్జీదారులకు సవివరంగా అర్థమయ్యేలా తెలిపి ప్రత్యామ్నాయ మార్గాలు సూచించాలని చెప్పారు. ఏఎస్పీ సత్యనారాయణ, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, ఆర్డీవో స్వాతి తదితర అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వెలుగు పథకంలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వీఓఏ సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ శాఖలో బదిలీలపై నిరసన వ్యక్తం చేసిన గ్రామ వ్యవసాయ సహాయకులు రీకౌన్సెలింగ్ నిర్వహించి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఏపీ జేఏసీ జిల్లా నాయకులు శ్యామ్‌నాథ్, తదితరులు వ్యవసాయ సహాయకుల నిరసనకు మద్దతు పలికారు.

శతాధిక వృద్ధురాలు తులసీరత్నం మృతి

చల్లపల్లి, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన నాదెళ్ల తులసీరత్నం(102) సోమవారం స్వగృహంలో కన్నుమూశారు. పురిటిగడ్డ పంచాయతీతోపాటు నడకుదురు, వెలివోలు, నిమ్మగడ్డ, యార్లగడ్డ గ్రామాలకు కేంద్ర బిందువైన పురిటిగడ్డలో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి లక్షలాది రూపాయలు విలువచేసే 80 సెంట్ల స్థలాన్ని వితరణగా అందించి తన దాతృత్వాన్ని చాటుకొన్నారు. పురిటిగడ్డలోని శ్రీకృష్ణసాయి ధ్యాన మందిరం వ్యవస్థాపక అధ్యక్షురాలిగా ప్రస్తుతం ఉన్నారు. పలువురు ప్రముఖులు తులసీరత్నం భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఆవును రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

గుడివాడ బేతవోలు వడ్డే వారి వీధిలోని బూరగడ్డ పద్మావతి ఇంటిలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజ్ సంప్‌లో సోమవారం ఓ ఆవు ప్రమాదవశాత్తు పడిపోయింది. దాన్ని అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా బయటకు తీసి రక్షించారు. అదే ఈ దృశ్యం. - గుడివాడ, న్యూస్‌టుడే

GOVERNMENT OF ANDHRA PRADESH
Municipal Administration Department
YSR TADIGADAPA MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE

Roc No. 1299 / E1 / 2023 Dt. 07-07-2025

Sl. No.	Name of Grant	No. of works	Estimate Amount (in Lakhs)	Bid downloading date and time	Bid closing date and time
1	APCRDA Funds	26	900.00	08-07-2025 3-30 PM	22-07-2025 4-00 PM

Note : All rights are reserved to the Commissioner to cancel or reject the tenders without any reasons (As per G.O. Ms No.94, Dt. 01-07-2003 I & CAD) Further details can be seen @ 'e' procurement market place @ https://tender.apeprocurement.gov.in
Contact No: 91546 90514, 91546 90506, 91546 90419

Sd/- Commissioner
YSR Tadigadapa Municipality.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

వినతిపత్రం అందించేందుకు వచ్చిన వీఓఏలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ వెలుగు వీఓఏ ఉద్యోగుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వీఓఏలు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్‌కు వినతిపత్రం అందించారు. కనీస వేతనం రూ.15వేలు ఇవ్వాలని, రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వేతనాలు నేరుగా తమ ఖాతాలకు జమ చేయాలని, అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. మూడేళ్ల కాలపరిమితిని పూర్తిగా రద్దు చేయాలని, తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

అన్ని బస్టాండ్లలో మౌలిక వసతులు

పెడన బస్టాండులో ప్రయాణికులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని బస్టాండ్లలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి పడమంచిలి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన పెడన, బంటుమిల్లి బస్టాండ్లను పరిశీలించారు. ఆయా బస్టాండ్లలో తాగునీరు, మరుగుదొడ్లతో పాటు ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు, ఫ్యాన్లు తదితరాలను పరిశీలించారు. బంటుమిల్లి కార్గో కేంద్రాన్ని పరిశీలించి అక్కడి నుంచి వెళ్తున్న పార్సిళ్లు, ఎంత మంది కొరియర్ సేవలు వినియోగించుకొంటున్నారు, తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బంటుమిల్లి బస్టాండ్ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బస్టాండులో ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

సృష్టిగర్భ గ్రంథావిష్కరణ

ఆవిష్కరణలో విద్యాశంకర భారతీ మహాస్వామి. చిత్రంలో విజయభాస్కర్, వోలేటి పార్వతీశం, బుద్ధప్రసాద్, ధర్మాన ప్రసాదరావు, డా.కె.వి.రమణాచారి, అందెశ్రీ, మద్దాళి రఘురామ్ తదితరులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: పలికితేనే ఫలాన్నిచ్చేవి ఉపనిషత్తులు అని పుష్పగిరి పీఠాధిపతి, జగద్గురువు అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో రచయిత, కేంద్ర సంగీత, నాటక అకాడమీ పురస్కార గ్రహీత డా.దీర్ఘాసి విజయభాస్కర్ రచించిన 'సృష్టిగర్భ' (ఉపనిషత్కాంతి) గ్రంథావిష్కరణ, అంకితోత్సవం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కర్మగతులు తెలుసుకోకుండా ఏదీ సిద్ధించదని నవతరం తెలుసుకోలేకపోతోందన్నారు. వేదాంతములు తెలియని యాగాలు ఏవైన ప్రయోజనం ఉండదని, అలాంటి వేదాంతాన్ని అభ్యాసం చేయడానికి తెలుగు మంత్రాత్మకమైన గ్రంథంగా 'సృష్టిగర్భ'ను విజయభాస్కర్ అందించారన్నారు. ఏపీ మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. 'సృష్టిగర్భ' ద్వారా ఉపనిషత్తులు, ఆధ్యాత్మికత సమాజానికి సులువైన మార్గంలో అందించిన పద్ధతి విజయభాస్కర్‌ను తర్వాత తరంలో చిరస్థాయిగా నిలబెడుతుందన్నారు. ఏపీ కృష్ణా జిల్లా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. ఆధునిక తెలుగు సాహిత్యం ఉత్తరాంధ్ర నుంచి వచ్చిందే.. ఆ ప్రాంతమే తెలుగు సాహిత్యానికి దిశానిర్దేశం చేస్తూ.. సుసంపన్నం చేసిందన్నారు. కార్యక్రమంలో కవి అందెశ్రీ, సాహితీవేత్త డా.వోలేటి పార్వతీశంలు శుభాకాంక్షలు తెలిపారు. కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ స్వాగతం పలికారు. ముందుగా గాయని సురేఖామూర్తి సమర్పించిన లలిత సంగీతం శ్రోతలను ఆకట్టుకుంది.

'స్త్రీ గొంతుక' పట్టించింది!

బంగారం చోరీ కేసు ఛేదన

విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వి.ధీరజ్ వినీల్

గుడివాడ, న్యూస్‌టుడే: చెడు నడత కలిగిన కొందరి మధ్య నెల్లూరు జైలులో ఏర్పడిన స్నేహం ఓ ముఠాగా ఏర్పాటై పలు చోరీలకు పాల్పడేలా చేసింది. గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా పామర్రు మండలం మలయప్పన్‌పేటకు చెందిన ఎస్.ప్రమీల రాణి ఇంట్లో ఫిబ్రవరి 22న రాత్రి 16 కాసుల బంగారం దొంగల పాలైంది. నేరం జరిగిన రోజున దొంగల వెంట పడిన సమయంలో స్థానికులు ఓ స్త్రీ గొంతుకను గుర్తించినట్లు సమాచారం తెలుసుకున్న సీసీఎస్ ఎస్.ఐ శీలం స్వామి దాసు దాని ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులలో ఒకరైన ఏలూరుకు చెందిన మున్నా(సిరి) అనే ట్రాన్స్‌జెండర్‌ను అదుపులోనికి తీసుకోగా అసలు విషయం బయట పడింది. ఈ కేసులో ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ షబ్బీర్, ట్రాన్స్‌జెండర్ షేక్ మున్నా (సిరి), కాకినాడకు చెందిన కొఠారి శ్రీనివాసరావులను ప్రధాన నిందితులుగా గుర్తించారు. వారిని బల్లిపర్రు వద్ద ఆదివారం అదుపులోనికి తీసుకుని వారి నుంచి 16 కాసుల బంగారం రికవరీ చేశారు. వారిపై రాష్ట్ర వ్యాప్తంగా 110కు పైగా కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. వీరందరికీ నెల్లూరు జైలులో గొడవర్తి కిరణ్ (లిక్కా) అనే ఒక గంజాయి స్మగ్లర్‌తో పరిచయం ఏర్పడిందన్నారు. ప్రధాన నిందితులు ముగ్గురితో పాటు గుడివాడ బేతవోలుకు చెందిన గూడపాటి రాజేష్, నైజాంపేటకు చెందిన తిరుమలశెట్టి ధనుష్(పండు)లను కూడా అరెస్టు చేశామన్నారు. దీంతో ఈ కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన సీసీఎస్ సీఐ ఇ.రమణమ్మ, సీసీఎస్ ఎస్.ఐ శీలం స్వామి దాసు, పామర్రు సీఐ పి.సుధాకర్, ఎస్.ఐ రాజేంద్ర ప్రసాద్, కానిస్టేబుళ్లు మస్తాన్, రాంబాబులకు డీఎస్పీ ధీరజ్ వినీల్ రివార్డులను అందించారు.

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

SHRIRAM శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. బ్రాంచి ఆఫీస్: డి.నెం.29-37-141, 2వ అంతస్తు, రామమందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002.

2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని రూల్ 8 (6) క్రింద 30 రోజుల అమ్మకపు నోటీసు ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన.

ఋణగ్రహీతలు / హామీదారుల వివరాలు: 1. శ్రీనివాస రెడ్డి బొమ్మారెడ్డి, తండ్రి: గోవింద రెడ్డి, డి.నెం: 9-29, లోయబాట రోడ్డు, నున్న, కృష్ణాజిల్లా-521212. **2. గొల్లా ఆంథోనీ,** తండ్రి: రాఘవులు, డి.నెం: 7-103, అంబేద్కర్ విగ్రహం, కేసరపల్లి, కృష్ణాజిల్లా-521102. **3. బొమ్మారెడ్డి రజని,** భర్త: శ్రీనివాస రెడ్డి, డి.నెం: 3-77, జి కొండూరు గ్రామం & మండలం, ఎన్.టి.ఆర్ జిల్లా-521230. **4. దొడ్డా పుష్ప రాణి,** భర్త: గొల్లా ఆంథోనీ, డి.నెం: 7-103, అంబేద్కర్ విగ్రహం, కేసరపల్లి గ్రామం, కృష్ణాజిల్లా-521102.

సర్/మేడమ్,

విషయం: 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయి పడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు: **శ్రీనివాస రెడ్డి బొమ్మారెడ్డి** గారికి చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక: రుణ ఒప్పందం నెంబర్లు: VIJA4TF1503250002 & VIJA4TF1608310002.

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్.సి.ఎల్.టి చెన్నై ఉత్తర్వుల ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"గా మార్పుచెందింది. ఇది ది. 30-11-2022 నుండి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ ది. 30-11-2022 ద్వారా "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా మార్పుచెందింది. దీని రిజిస్టర్డ్ కార్యాలయం: శ్రీ టవర్స్ ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు ఆఫీస్ చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నెం. 29-37-141, 2వ అంతస్తు, రామమందిర దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002 మరియు **బ్రాంచి ఆఫీస్: విజయవాడ-IV** (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద **తేది.27-01-2023**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది. 27-01-2023** నాటికి బకాయి **రూ.87,69,204/-** (అక్షరాలా ఎనభై ఏడు లక్షల అరవై తొమ్మిది వేల రెండు వందల నాలుగు రూపాయలు మాత్రమే) + **రూ.94,95,006/-** (అక్షరాలా తొంభై నాలుగు లక్షల తొంభై ఐదు వేల ఆరు రూపాయలు మాత్రమే) **మొత్తం రూ.1,82,64,210/-** (అక్షరాలా ఒక కోటి ఎనభై రెండు లక్షల అరవై నాలుగు వేల రెండు వందల పది రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ /ఖర్చుల మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని రూల్ 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది. 27.04.2023 & 12.08.2023** న లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద అడ్వకేట్ కమీషనర్ల సహకారంతో **తేది. 24.05.2024**న భౌతిక స్వాధీనం కూడా చేసుకొనిరి.

సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఈ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేదీ, ఈ నోటీసు చేరిన తేదీ నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఈ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఈ-వేలం జరిగే తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఈ-వేలం నిర్వహించనున్న సర్వీసు ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.

అందువల్ల మీరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడ్డ మొత్తంతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి అయిన ఖర్చులను మరియు ఇటీవల అయిన వడ్డీ, ఖర్చులు, ఛార్జీల మొత్తాన్ని అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా చెల్లించినచో, ఆస్తి అమ్మకంపై ఏలాంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.

శ్రీనివాస రెడ్డి బొమ్మారెడ్డి గారికి చెందిన షెడ్యూల్ ఆస్తుల వివరాలు
నున్న ఎస్.ఆర్.ఓ నందు వైడ్ డాక్యుమెంట్ నెం. 892/2015 &
విజయవాడ ఎస్.ఆర్.ఓ. నందు డాక్యుమెంట్ నెం. 2754/2016

ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, నున్న సబ్-జిల్లా, విజయవాడ రూరల్ మండలం, నున్న గ్రామ పంచాయితీ ఏరియా, నున్న గ్రామం, అసెస్‌మెంట్ నెం.151, ఆర్.ఎస్.నెం.429, డోర్ నెం.2-14 నందు 470 చదరపు గజాలు లేదా 392.96 చదరపు మీటర్ల విస్తీర్ణంలోని ఇంటి స్థలం మరియు దానిలో గల పెంకుటిల్లు ఈ క్రింది హద్దులలో హద్దులు: **తూర్పు:** పంచాయితీ రోడ్డు, **దక్షిణం:** పోలారెడ్డి సుబ్బమ్మ గారి ఆస్తి, **పడమర:** ప్రతిగడప రామానుజమ్మ గారి ఆస్తి, **ఉత్తరం:** బొమ్మారెడ్డి గోవింద రెడ్డి గారి ఆస్తి. పైన పేర్కొన్న హద్దుల లోపల 470 చదరపు గజాలు లేదా 392.96 చదరపు మీటర్ల విస్తీర్ణంలోని ఇంటి స్థలం మరియు దానిలో డోర్ నెం.2-14 మరియు అసెస్‌మెంట్ నెం.151 గల పెంకుటిల్లు మాత్రమే ఉంది. (ఈ ఆస్తి ఎస్.ఆర్.ఓ. విజయవాడ వారి డాక్యుమెంట్ నెం.3466/2003కి అనుగుణంగా ఉంది).

తేది: 07-07-2025 **అధీకృత అధికారి**
ప్రదేశం : విజయవాడ **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర: 81422 92071.

REAL ESTATE

LAND FOR SALE

మెగా ★అవకడో ★ ఫామ్‌ల్యాండ్‌లో 11 సెంట్లు ★ 5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరానికి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్: 9133574455

PLOT FOR SALE

CRDA **అప్రూవల్‌తో** లోబడ్జెట్‌లో Open Plots అమ్మకానికి కలవు. పరిటాల, కంకిపాడు, సూరంపల్లి ... ✆ 90309 56555.

FINANCIAL SERVICES

JOBS

Looking for Senior Shift Supervisor & Maintenance Manager & Training Officer for a Spinning Mill Company with Plant @ Medchal with minimum of 10 Years. Exp. 8187860597.

Wanted PRO's (Public Relationship Officer) to work in a reputed organization at Guntur. 81219 60902, 77290 15053.

Wanted Primary Teachers to Teach Mathematics, EVS, English N High School, Physics, Hindi, Social. SRKV ✆ 94907 42908.

PEOPLE CARE

OLD AGE HOME

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616

కిరాణా షాప్‌లో పనిచేయుటకు ఆటో డ్రైవర్ కావలెను. కాళేశ్వరరావు మార్కెట్. ✆ 99893 77333.

విజయవాడ, నిడమానూరులో ప్రముఖ గోడౌన్‌లో పనిచేయుటకు ప్యాకింగ్ బాయ్స్, పికర్స్ & హెల్పర్లు కావలెను. 19 to 35 Yrs, జీతం: 13 వేల నుండి 15 వేలు ✆ 99898 06121/ 86397 71502.

WALK -IN - INTERVIEW విజన్ ఆటో - ఆపె ఆటో షోరూమ్ విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం, నందిగామ నందు పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్ - 4 ★ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ - 15 ★ ...

గమనిక

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

సచివాలయం వరకు నిర్మించిన సీసీ రోడ్డు

★ బందరు మండలంలో సుల్తానగరంలో సచివాలయానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేక ఉద్యోగులతో పాటు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదే ప్రాంగణంలో హెల్త్‌క్లినిక్, రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వం పలుపు ప్రాంతాల్లో భవనాలు నిర్మించడంతో వర్షం వస్తే చాలు మట్టి నీరుచేరి చెరువుల మారిపోయేవి. ఈ సమస్యపై 'ఈనాడు' చిత్రకథనాలు ప్రచురించడంతో పాటు గ్రామస్థులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకొచ్చిన విషయాన్ని అధికారులకు వివరించడంతో ఎట్టకేలకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీనిపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ★ నగరంలోని బుట్టాయిపేట ఎల్‌ఐసీ శిక్షణ కేంద్రం ఎదుట రోడ్డు పక్కన వేసిన చెత్త తొలగించకపోవడంతో మేట వేసింది. స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఈ ప్రాంతవాసులు మేమున్నాం మీకుతోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావడంతో సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ★ నగరంలోని వలందపాలెం డ్రైనేజ్ కల్వర్టు కింద చెత్తమేట వేసుకుపోవడంతో మురుగు దిగువకు పారక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

ప్రధాన రహదారిపై లీకును సరిచేస్తున్న కమిషనర్

★ ప్రధాన రహదారిపై తాగునీటి పైపులైనుకు ఏర్పడిన లీకును కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి సరిచేయించారు. ఈ సమస్యను స్థానికులు ఈనాడు మేమున్నాం మీకు తోడుగా ద్వారా దృష్టికి తేవడంతో స్పందించిన మున్సిపల్ కమిషనర్ వాటర్ వర్క్స్ సిబ్బందిని అప్రమత్తం చేసి పైపులైనుకు వెంటనే మరమ్మతులు చేయించారు. - పెడన, న్యూస్‌టుడే

జేసీబీ, ట్రాక్టర్ల సీజ్

బంటుమిల్లి: మండలంలోని మల్లపర్రులో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, తోలకాలు జరుపుతున్న జేసీబీ, ట్రాక్టర్లను ఆదివారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఇన్‌ఛార్జి తహసీల్దార్ కాగిత పూర్ణచంద్రరావు వాటికి రూ. 8వేల జరిమానా విధించారు.

సనాతన ధర్మమే ఎప్పటికైనా శాశ్వతం

ప్రవచనం చేస్తున్న పవనకుమారశర్మ, పక్కన సూర్యనారాయణశర్మ ఘనపాఠి తదితరులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: వైదిక ధర్మం అంటే వేద ధర్మమని, ఇది సనాతన ధర్మంలో భాగం, శాశ్వతమైన ధర్మం అంటూ పలువురు వేదపండితులు పేర్కొన్నారు. నగరంలోని బుట్టాయిపేట చిట్టిపోలేశ్వరయ్య ఆలయంలో సోమవారం నిర్వహించిన వైదిక ప్రవర్తక సంఘ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన పండితులు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేశారు. బ్రహ్మశ్రీ పవన కుమారశర్మ వైదిక ధర్మం, విరాటపర్వంపై సుదీర్ఘ ప్రసంగం చేయగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విష్ణుభట్ల సూర్యనారాయణశర్మ ఘనపాఠితో పాటు సంఘ ప్రతినిధులు పండితులను ఘనంగా సత్కరించారు. తొలుత విశేష పూజలు జరిపించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ధర వరలు

రైతుబజారులో కూరగాయల ధరలు: టమాట 36, వంగ 28, బెండ 20, పచ్చిమిర్చి 60, కాకర 44, క్యాబేజీ 22, క్యారెట్ 42, దొండ 38, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 26, గోరుచిక్కుడు 36, దోస 18, సొర 10.8, అరటికాయ 8, 7, చిక్కుడు 48, బీర 28, చామదుంప 30, ములగ 10/08, కంద 60, బీట్‌రూట్ 32, కీరదోస 44, బీన్స్ 86, క్యాప్సికం 80, అలసందలు 40, బిలదదుంప 36, కొత్తిమీర 16/08, పుదీనా 15/5. మంగళవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. -మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

సింధూరాలు

రేవతి: జురాసిక్ వరల్డ్
మినీరేవతి: మార్గన్
సిరికృష్ణ: కుబేర
సిరివెంకటి: తమ్ముడు
-మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

పేదల బియ్యమే.. పెద్దలకు పరమాన్నం

ఆగని అక్రమ రవాణా

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

ఈ ఏడాది జనవరి 19న గూడూరు మండలం రాయవరంలోని ఓ రైస్ మిల్లు నుంచి రాత్రివేళ వాహనాల్లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్స్ పౌరసరఫరాలశాఖ అధికారులు అడ్డుకున్నారు. 1289 (ఒక్కొక్కటి 25కేజీలు) బస్తాలు స్వాధీనం చేసుకున్నారు.

● ఈ నెల 2న గూడూరు మండలం తరకటూరుపాలెంలోని రైస్‌మిల్లు నుంచి వాహనాల్లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్, పౌర సరఫరాలశాఖ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఒక్కొక్కటి 50 కేజీలుగల మొత్తం 276 బస్తాలు స్వాధీనం చేసుకుని వాహనాలు సీజ్ చేశారు.

మచిలీపట్నంలో స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

పేదల బియ్యం అక్రమార్కులకు పరమాన్నంగా మారుతోంది. బియ్యం నాణ్యతగా లేవని, ఇతర కారణాలతో కొందరు తినడానికి ఇష్టపడడం లేదు. వీరంతా తమకు వచ్చిన బియ్యాన్ని నిల్వ పెట్టుకోలేక ఎంతోకొంతకు విక్రయించడంతో అక్రమ తరలింపునకు కారణం అవుతోంది. వైకాపా ప్రభుత్వ హయాంతో పోల్చితే పీడీఎస్ బియ్యం అక్రమ విక్రయాలు కొంతమేర తగ్గినా తరలింపు మాత్రం పూర్తిగా ఆగలేదు. బందరు, పెడన నియోజకవర్గాల్లో రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై కూటమి ప్రభుత్వ ఆదేశాలతో దాడులు ముమ్మరం చేశారు. విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ, పోలీసులు నిత్యం తనిఖీలు చేస్తూనే ఉన్నారు. అయినా అక్రమార్కులు ఏదో రకంగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు.

రైసుమిల్లుల్లో సైతం..

పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారంలో కొందరు రైస్ మిల్లర్లు భాగస్వామ్యం కావడం ఆందోళన కలిగించే అంశం. నగరంలోని జగన్నాథపురంలోని ఓ రైస్‌మిల్లులో రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న సమాచారంతో అధికారులు అక్కడకు వెళ్లి తనిఖీలు చేశారు. మిల్లు నుంచి రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తెలంగాణకు తరలించేందుకు సిద్ధమైనట్లు గుర్తించి మొత్తం 723 బస్తాల్లో ఉన్న 210.33 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని మిల్లు యజమానిపై కేసు నమోదు చేశారు. గూడూరు మండలంలో నమోదైన కేసుల్లోనూ రైస్ మిల్లర్లు భాగస్వామ్యం ఉంది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం దీంతో బయటపడుతోంది.

● ఇటీవల పెడన పట్టణంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నట్టు గుర్తించి రెండుచోట్ల కలిపి 12 క్వింటాళ్లకు పైగా పీడీఎస్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖాధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పటిష్ఠం కావాలి.. ప్రక్షాళన చేయాలి

బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో కొందరు ఇంటింటికీ వెళ్లి బియ్యం కొనుగోలు చేసి ఏలూరు జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. కృత్తివెన్ను మండలం తీర ప్రాంతం కావడం, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు దగ్గరలో ఉండడంతో అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నారని కొంతమంది రేషన్ డీలర్లే చెప్పడం గమనార్హం. ★ పౌర సరఫరాల శాఖను ప్రక్షాళన చేసి నిఘాను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉంది.

పాఠశాల సిబ్బందికి వేతనాలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మరుగుదొడ్ల శుభ్రం చేసే స్కావెంజర్లకు ఈ ఏడాది మార్చి నుంచి మే వరకు వేతనాలు సోమవారం విడుదలైనట్లు ఎంఈవో-2 వై.వి. హరనాథ్ తెలిపారు. 63 పాఠశాలల్లో ఉన్న 58 మందికి వేతనాలు జమ అయినట్లు వివరించారు.

రైతులకు పంటల బీమా

పెడన, పెడన గ్రామీణ, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్న రైతులు ఎకరాకు రూ.830 వంతున పంటల బీమా చెల్లించాలని మండల వ్యవసాయాధికారి(ఏవో) సజ్జ జెస్సీ చెప్పారు. పంట రుణాలు తీసుకునే రైతుల నుంచి బ్యాంకర్లు ఈ మొత్తాన్ని మినహాయిస్తారని, రుణాలు తీసుకోని రైతులు మీసేవ కేంద్రాల్లో చెల్లించి రసీదు పొందాలని సూచించారు.

ఐటీఐ మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

గుడివాడ, న్యూస్‌టుడే: ఐటీఐ కళాశాలలో మొదటి విడతలో మిగిలిన సీట్ల భర్తీకి ఆన్‌లైన దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కేటీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఓ. మంజులాదేవి సోమవారం తెలిపారు. 8వ తరగతి, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్లో ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం వారి విద్యార్హతల పత్రాలతో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08764-295953, 8297574757 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

నోటీసు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన నాయకులు, కార్మికులు

మచిలీపట్నం (గొడుగుపేట),న్యూస్‌టుడే: ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దామంటూ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులతో పాటు పలువురు నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అమలు, లేబర్‌కోడ్‌ల రద్దు, తదితర డిమాండ్ల పరిష్కార సాధనలో భాగంగా జాతీయ కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని పేర్కొన్నారు. అన్ని కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొంటున్నాయన్నారు. వామపక్ష నాయకులు మోదుమూడి రామారావు, గొడుగు చైతన్యకుమార్, మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు యర్రంశెట్టి ఈశ్వరరావు, తాటిపర్తి రామకృష్ణ, గుర్రం దుర్గారావు, యర్రంశెట్టి శ్రీమన్నారాయణ, రత్నకుమారి, సామ్రాజ్యం, నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాట పటిమ ఆదర్శనీయం

మల్కాపట్నం: వేడుకల్లో కార్పొరేటర్ దేవరపల్లి అనిత, నాయకులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మందకృష్ణ మాదిగ పోరాట పటిమ ఆదర్శనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ పుట్టిన రోజు వేడుకలను సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. మల్కాపట్నం గుప్తాసెంటరులోని బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరపల్లి అనిత ముఖ్యఅతిథిగా పాల్గొని కేకు కత్తిరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాటిన చెట్టు మహావృక్షమై ఫలాలు అందిస్తుందని, వాటిని భావితరాల వారు అనుభవిస్తారన్నారు. ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జుజ్జవరపు అనిల్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు బీడెల్లి మరియకుమార్‌తో పాటు డి.శిరీష, గండ్రపు శీనయ్య, కొడాలి అజయ్‌కుమార్, బందారు వెంకటేశ్వరరావు, కొడమంచిలి చంద్రశేఖర్, విశ్రాంత ఎంపీడీవో వెంకటేశ్వరరావు, న్యాయవాది అద్దేపల్లి నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈడేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి జలదండి నరసింగరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించడంతో పాటు ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. నాయకులు కొమ్ముప్రసాద్, సీహెచ్ అర్జునరావు, ఎం.గోపాలకృష్ణ, బేతపూడి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు చౌర్యాన్ని అరికట్టాలి

సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న విద్యుత్తు శాఖాధికారులు

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: విద్యుత్తు చౌర్యాన్ని పూర్తిగా అరికట్టేలా అన్ని స్థాయిల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్తు శాఖ అధికారులు స్పష్టం చేశారు. నగరంలో సోమవారం విద్యుత్తు చౌర్యంపై అధికారులకు దిశా నిర్దేశం చేసిన అనంతరం విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వాసు, మచిలీపట్నం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.గోవిందరావు నేతృత్వంలో నగరంలో తనిఖీలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది 34 బృందాలుగా ఏర్పడి 2,559 గృహ సర్వీసులు, 455 వాణిజ్య సముదాయాల్లో సోదాలు నిర్వహించారు. వీటిల్లో 230 సర్వీసులు అదనపు లోడ్ వినియోగించడాన్ని గుర్తించి రూ.7.88 లక్షల జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యుత్తు చౌర్యానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా చౌర్యం జరుగుతున్నట్లు గుర్తిస్తే 94408 12091, 94408 12362, 94408 12363 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నం డీఈఈ శ్రీనివాసులతో పాటు డివిజన్ పరిధిలోని డీఈఈలు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీల్లో పాల్గొన్నారు.

కల్వర్టు కట్టేసి.. అప్రోచ్ వదిలేసి..

నగరంలోని శివగంగ ప్రాంతంలో డ్రైన్‌పైన పలు చోట్ల కల్వర్టులు నిర్మించినా అప్రోచ్‌లు ఏర్పాటు చేయలేదు. వాటిపై రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు.
- మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

పైపులు కోసేశారు.. పట్టించుకోండి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: బందరు మండలంలోని తాళ్లపాలెం కాలువపై వివిధ ప్రాంతాల్లో ఉన్న మోటార్ ఇంజిన్ల పైపులు గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో కోసి వెళ్లిపోయారని స్థానిక రైతులు వాపోతున్నారు. శివారు ప్రాంతం కావడంతో పొలాలకు నీరు అందించేందుకు కాలువగట్టుపై రైతులు ఎవరికి వారు ఇంజిన్ ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. ఎప్పటి నుంచో ఇంజిన్లు ఇక్కడే ఉంటున్నాయని, అవసరం వచ్చినప్పుడు వాటిని వినియోగించుకుంటామని తెలిపారు. తాళ్లపాలెం, పెడన మండలంలోని కోటవానిపాలెం గ్రామాలకు చెందిన రైతులు ఆ ప్రాంతంలో సాగు చేస్తుంటారని, ఇటీవల దాదాపు పది మోటారు ఇంజిన్‌లకు చెందిన పైపులను కోయడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఇలాంటి పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

అడుగేస్తే.. మడుగులోకే..

నగరంలోని చెమ్మనగిరిపేట ప్రాంతంలో నగరపాలక సంస్థ కార్యాలయ పక్క వీధిలో డ్రైన్ పనులు చేపట్టారు. దీంతో అదే రోడ్డులో మురుగు దిగువకు పారక రోడ్డుపై తిష్ఠ వేసింది. స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు రోడ్డుపైకి చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం.. ప్రగతికి ప్రతిరూపం

23వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

పెడన, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పట్టణంలోని 22,23 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గత వైకాపా ప్రభుత్వంలో అస్తవ్యస్తమైన వ్యవస్థలకు పునరుజ్జీవం కల్పిస్తూనే కూటమి ప్రభుత్వం సంక్షేమం, ప్రగతికి పెద్దపీట వేస్తుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఇప్పటికే అమలు చేస్తున్నామని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమల్లోకి వస్తోందని పేర్కొన్నారు. మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం అందుతుందని పేర్కొన్నారు. చేనేత, కలంకారీ పరిశ్రమలు విస్తరించిన పెడనలో ఈ రెండింటిని పూర్తి స్థాయిలో ప్రగతి దిశగా నడిపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ తెదేపా అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, ఆ పార్టీ నేతలు యర్రా రాజా, బొడ్డు దీక్షనందుడు, చందన నారాయణరావు, పరసా జితేంద్ర, బుద్దే మల్లేశ్వరరావు, యర్రా రవి, మేడక కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా చెరువుల తవ్వకం

కళ్లెదుటే జరుగుతున్నా అడ్డుకోవడంలో అధికారుల వైఫల్యం

న్యూస్‌టుడే, పెడన

పెడన మండలం జింజేరు గౌడపాలెం గ్రామంలో మడ అడవుల సరిహద్దున సర్వే నం.5/28 పట్టా భూముల్లో చెరువుల తవ్వకాలు జరుగుతున్నాయి. మండల కేంద్రానికి 15 కి.మీ దూరంలో లజ్జబండ డ్రెయిన్ పక్కగా గత కొద్దిరోజులుగా జరుగుతున్న ఈ తవ్వకాలను నియంత్రించడంలో రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు నిర్లిప్తంగా వ్యవహరించడంతో పంట భూములు చెరువులుగా మారిపోతున్నాయి. గౌడపాలెం గ్రామం సరిహద్దు నుంచి లజ్జబండ మేజర్ డ్రెయిన్ ప్రవహిస్తోంది. ఈ డ్రెయిన్ వెంబడి మడ అడవులు విస్తరించాయి. వీటి పక్కగా కొంత మంది గౌడపాలెం రైతులు పంట భూములను చెరువులుగా మార్చేస్తున్నారు. అనుమతులు లేకుండా గత కొద్దిరోజులుగా ఈ తవ్వకాలు జరుగుతున్నా గ్రామ వీఆర్వో నియంత్రించలేకపోయారు. సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కొంత మంది రైతులు చెరువుల తవ్వకాల్లో వస్తున్న ఇసుకను బయటకు తరలిస్తూ విక్రయిస్తున్నారు

జింజేరు గౌడపాలెంలో పురోగతిలో చెరువుల తవ్వకాలు

సమీపంలో ఉండే మడ అడవులు

అప్రమత్తమైన అధికారులు

తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు సోమవారం ఈ సమాచారం అందడంతో అప్రమత్తమయ్యారు. ఆర్ఐ ఈడే విజయలక్ష్మిని హుటాహుటిన ఆ గ్రామానికి తరలివెళ్లాలని ఆదేశించారు. ఘటనా స్థలంలో ఒక జేసీబీని సీజ్ చేసిన ఆర్ఐ తదుపరి తవ్వకాలను నిలిపివేయించాలని వీఆర్వో నిమ్మగడ్డ రాందాస్‌ను ఆదేశించారు. ఫలితంగా చెరువుల తవ్వకాలు తాత్కాలికంగా నిలిచాయి. మడ అడవుల పక్కగా చెరువుల తవ్వకాలను చేపట్టవచ్చా? లేదా? ఈ అడవులు అటవీశాఖ వద్ద నోటిఫై అయ్యాయా లేదా అన్న దానిపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

ఆ డొంక రోడ్డు.. బాగు పడేనా?

మండల పరిధిలోని కోకనారాయణపాలెం నుంచి అనంతాయిపేట వెళ్లే కాలువగట్టు వెంబడి రోడ్డు నిర్మించాలని ఏళ్ల తరబడి అడుగుతున్నా స్పందించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. వైకాపా హయాంలో ఈ రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను వివరించి అభివృద్ధి చేయాలని విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. రెండు గ్రామాల రాకపోకలకు ఇది దగ్గరగా ఉంటుందని, కూటమి ప్రభుత్వ హయాంలో అయినా అభివృద్ధి చేస్తారన్న ఆశతో ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. - గూడూరు, న్యూస్‌టుడే

రైతుల భూముల్లో పండ్ల తోటలు

నర్సరీ నుంచి మొక్కలు తరలిస్తున్న సిబ్బంది

పెడన, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రైతుల భూముల్లో పండ్ల తోటలు' కార్యక్రమం మంగళవారం లాంఛనంగా ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పెడన మండలం కాకర్లమూడి గ్రామ రైతు భూమిలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. కడియం నుంచి నందమూరులోని అటవీశాఖ నర్సరీకి చేరుకున్న 2వేల మొక్కలను నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు.. మండలానికి 500 వంతున అధికారులు సోమవారం పంపిణీ చేశారు. ఇందులో కొబ్బరి, మామిడి, నిమ్మ, సపోట తదితర పండ్ల మొక్కలున్నాయి.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

సామగ్రి అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

గూడూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పోలవరం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద బాధితురాలు మురాల లక్ష్మీకుమారికి సోమవారం రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో వితరణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి భవిరి శంకరనాథ్, జిల్లా సమన్వయకర్త హరికృష్ణ, కోశాధికారి కొండపల్లి రామ్‌బాలాజీ తదితరులు బాధితురాలికి వంట సామగ్రి, టార్పాలిన్ తదితర వస్తువులు అందజేశారు. మానవ హక్కుల సంస్థ ప్రతినిధి పడవల మోహన్‌త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. మరింత మంది దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సాయం అందించేందుకు ముందుకు రావాలన్నారు.

విద్యుత్తు లేక.. ప్రారంభానికి నోచుకోక..

మల్లపరాజుగూడెంలో సచివాలయ భవనం

విలేజ్ హెల్త్ క్లినిక్..

బంటుమిల్లి మండలం మల్లపరాజుగూడెం పంచాయతీ పరిధిలో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు సేవా కేంద్ర భవనాల నిర్మాణాలు పూర్తయి ఏడాది గడుస్తోంది. నేటికీ అవి ప్రారంభానికి నోచుకోలేదు. గ్రామ శివారు ప్రాంతంలో వీటిని నిర్మించడంతో అక్కడ విద్యుత్తు సదుపాయం లేదు. దీనితో అవి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుత సచివాలయ, ఆయా శాఖల సిబ్బంది పాత పంచాయతీ, అద్దె భవనాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీటికి విద్యుత్తు సదుపాయం కల్పించి వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి

ప్రజా వినతులకు అధికారుల డుమ్మా

షోకాజ్‌ను ఖాతరు చేయని వైనం

పెడన, న్యూస్‌టుడే: ప్రజా వినతుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు పెడన మండలంలో పలువురు అధికారులు వరుసగా గైర్హాజరవుతున్నారు. ఈ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించినప్పటి నుంచి పెడన మండలంలో ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, డ్రెయినేజీ, ఆర్‌డబ్ల్యూఎస్, మత్స్యశాఖ, మార్కెటింగ్, పశుసంవర్ధకం, విద్యుత్తు శాఖల అధికారులు హాజరు కావడం లేదు. దీనిపై కలెక్టర్ ఆదేశాలతో గత నెల 27న తహసీల్దార్ సంబంధిత అధికారులకు పీజీఆర్ఎస్ కన్వీనర్ హోదాలో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీటిని బేఖాతరు చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఆశాఖల అధికారులు తిరిగి హాజరు కాలేదు. ● **ఇసుక తవ్వకాలపై ఫిర్యాదు:** పెడన మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని పేర్కొంటూ నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ శొంఠి నాగరాజు తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. తవ్వకాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఇసుక టిప్పర్ ఢీకొని కూడూరులో ఒక వ్యక్తికి ఆదివారం రాత్రి తీవ్ర గాయాలయ్యాయని తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు.

ఇసుక టిప్పర్ ఢీకొని ఒకరికి గాయాలు

పెడన, న్యూస్‌టుడే: నడుపూరు-వాడవల్లి ప్రధాన రహదారిపై మండలంలోని కూడూరు వద్ద ఆదివారం రాత్రి ఇసుక టిప్పర్ ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ గ్రామానికి చెందిన కాగిత రామకోటయ్య తన బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. క్షతగాత్రుడు మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్సై గంట్ల సత్యనారాయణ తెలిపారు

కలంకారీ క్లస్టర్ ఏర్పాటు ప్రక్రియ వేగవంతం

ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవోతో ఎమ్మెల్యే భేటీ

సీఈవోను కలిసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, వేణుగోపాల్ తదితరులు

పెడన, న్యూస్‌టుడే: పెడన కలంకారీ క్లస్టర్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేస్తామని ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి(సీఈవో) ఎం.విశ్వ స్పష్టం చేశారు. క్లస్టర్‌పై చర్చించేందుకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సీఈవోను మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం కలిశారు. క్లస్టర్ ఏర్పాటులో ఇప్పటివరకు జిల్లా స్థాయిలో పురోగతి వివరించారు. క్లస్టర్‌తో కలంకారీ దిశ దశ మారతాయని, ఈ హస్తకళకు మరింత ప్రాచుర్యం ఏర్పడుతుందన్నారు. దాదాపు 5వేల మంది కళాకారులు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని క్లస్టర్‌తో మరింత మందికి ఉపాధి కలుగుతుందన్నారు. దీనిపై సీఈవో స్పందిస్తూ.. ప్రభుత్వం క్లస్టర్ ఏర్పాటుపై స్పష్టంగా ఉందని, సీఎంవో నుంచి ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారన్నారు. త్వరలో దీనికి సంబంధించి ఆస్తుల బదలాయింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. క్లస్టర్‌కు సంబంధించి డీపీఆర్ ప్రక్రియను త్వరలో పూర్తి చేసి తమకు అందజేయాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం వెంకట్రావుకు సూచించారు. అలాగే రామెటీరియల్ బ్యాంకుకు అవసరమైన రూ.కోటిన్నర నిధులు విడుదల చేయిస్తామన్నారు. రూ.10కోట్లతో క్లస్టర్‌ను ప్రారంభించి దశలవారీగా విస్తరించాలని, అధునాతన మిషనరీ సమకూర్చాలని సీఈవో సూచించారు. బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, క్లస్టర్ అసోసియేషన్ కార్యదర్శి జంపాన శ్రీనివాస్, లేపాక్షి అధికారులు, డిజైనర్లు సీఈవోను కలిసిన వారిలో ఉన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కాల్: 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

యనమలకుదురు శాంతినగర్‌లో కొన్ని రోజులుగా చెత్త తీయడంలేదని స్థానికులు వచ్చిన ఫిర్యాదు మేరకు కమిషనర్ షేక్ నజీర్ స్పందించి సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే, యనమలకుదురు(కానూరు) ✤ పెదపులిపాక ఎస్సీ కాలనీ, గణపతినగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదంటూ స్థానికులు మేమున్నాం మీకుతోడుగా ద్వారా గ్రామ కార్యదర్శి వెంకట రత్నానికి ఫిర్యాదు చేయగా స్పందించిన కార్యదర్శి ఆయా ప్రాంతాల్లో 8 దీపాలు మార్చారు. ✤ గంగూరు జాతీయ రహదారిలో దీపాలు వెలగడం లేదని వచ్చిన ఫిర్యాదుపై గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి మూడు దీపాలకు మరమ్మతులు నిర్వహించారు. – న్యూస్‌టుడే, పెనమలూరు

చిన్నారి శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

పోరంకి(కానూరు), న్యూస్‌టుడే: హృద్రోగంతో బాధపడుతున్న చిన్నారి అన్వితకు జేసీఐ సంస్థ జాతీయ అధ్యక్షుడు అంబర్ జుంజున్‌వాలా రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. సోమవారం పోరంకిలో జరిగిన కార్యక్రమంలో చిన్నారి తల్లిదండ్రులకు చెక్కు అందజేశారు. అన్విత గుండె మార్పిడి ఆపరేషన్‌కు రూ.55 లక్షలు ఖర్చు అవుతాయని వైద్యులు తెలపడంతో తమవంతు సాయంగా ఈ మొత్తం అందజేశామన్నారు. జేసీఐ ప్రతినిధులు రాజేష్, తేజ, విష్ణుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి

రామవరప్పాడు, సీఎం సహాయనిధి పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. నియోజకవర్గంలోని 33 మంది బాధితులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 23.92 లక్షల విలువైన ఎల్వోసీలు, చెక్కులను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి ఆయన పంపిణీ చేశారు. గొట్టిపాటి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం సహాయనిధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించినట్లు తెలిపారు. రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు సొంత నిధులతో మోటార్లు అందించిన యార్లగడ్డను ఆయన అభినందించారు. నాయకులు గూడపాటి తులసి మోహన్, రామారావు, కొలుసు రవీంద్ర, దయాల రాజేశ్వరరావు, కొల్లా ఆనంద్ పాల్గొన్నారు.

రాణాలకు వసతి కరవు

✤ కారిపోతున్న గన్నవరం పోలీస్ స్టేషన్
✤ కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే మేలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

శాంతి, భద్రతల పరిరక్షణలో కీలకపాత్ర పోషించే పోలీసులకు సరైన వసతి కరవైంది. అరకొర వసతులు, అద్దె భవనాలు, ఎప్పుడు కూలిపోతుందో తెలియని సముదాయాల్లో ఏళ్లుగా విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల మహిళా సిబ్బందికి కనీసం మరుగుదొడ్ల సదుపాయం కూడా లేని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాల పునర్విభజన తర్వాత గన్నవరం కేంద్రంగా ఏర్పాటైన సబ్ డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో వసతుల లేమిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

- సబ్ డివిజన్ కేంద్రం: గన్నవరం
- సర్కిల్ కార్యాలయాలు: రెండు (హనుమాన్‌జంక్షన్, కంకిపాడు)
- అర్బన్ స్టేషన్లు : మూడు (గన్నవరం, పెనమలూరు, ఉయ్యూరు)
- పోలీస్ స్టేషన్లు: అయిదు

✤ అద్దె భవనమే గత్యంతరం : గన్నవరం నియోజకవర్గంలో బాపులపాడు మండలం మినహా మిగతా పోలీస్ స్టేషన్లు గతంలో విజయవాడ కమిషనరేట్ పరిధిలో ఉండేవి. 2022లో కొత్త జిల్లాల ఏర్పాటుతో గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను ఒకే గూటికి తీసుకువచ్చి గన్నవరం కేంద్రంగా సబ్ డివిజన్ ఏర్పాటు చేశారు. మొదట్లో సరైన వసతి దొరక్కపోవడంతో పాత ఏసీపీ కార్యాలయం ఉన్న గూడవల్లి కేంద్రంగానే డీఎస్పీ విధులు నిర్వహించారు. కొన్ని నెలల తర్వాత గన్నవరంలోని ఓ అద్దె భవనంలోకి సబ్ డివిజన్ కార్యాలయం మార్చారు.

అందుబాటులోకి రాని ఆత్కూరు భవనం

✤ అంతటా అవస్థలే : సీఐ ఎస్‌హెచ్‌వోగా ఉన్న గన్నవరంలో ఇద్దరు ఎస్సైల ఆధ్వర్యంలో దాదాపు 90 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు ట్రాఫిక్ పర్యవేక్షణకు ఇద్దరు సీఐలు, ఎస్సైల ఆధ్వర్యంలో సిబ్బందిని కేటాయించారు. మొత్తం అందరూ ఒకే ప్రాంగణంలో ఉండాల్సి రావడంతో వసతుల పరంగా ఇబ్బందులు అనివార్యమయ్యాయి. మరోపక్క వర్షం వస్తే భవనమంతా కారిపోతుంది. మరోపక్క హనుమాన్‌జంక్షన్, వీరవల్లి భవనాలు ఎప్పుడోనే శిథిలావస్థకు చేరాయి. అరకొర మరమ్మతులతో కాలం గడుపుతున్నారు. ఆత్కూరులో ఏడేళ్ల కిందట రూ.1.24 కోట్ల వ్యయంతో చేపట్టిన శాశ్వత భవన నిర్మాణం ఇంకా అసంపూర్తిగానే ఉంది. కంకిపాడు, పెనమలూరు భవనాలు కూడా సరిపోవడంలేదు.

అద్దె భవనంలో డీఎస్పీ కార్యాలయం

✤ కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు: హనుమాన్‌జంక్షన్‌లో ప్రస్తుతం ఉన్న పోలీస్‌స్టేషన్ భవనాన్ని కూల్చివేసి రెండంతస్థుల నూతన భవనం నిర్మించాలని ఎప్పుడోనే ప్రతిపాదించారు. వీరవల్లిలో దెబ్బతిన్న నివాస సముదాయ భవనాలను పడగొట్టి, నూతన భవనాలు నిర్మించాలన్న ప్రతిపాదనలు కార్యరూపంలోకి రాలేదు. గన్నవరంలో ఆరెకరాల స్థలం అందుబాటులో ఉన్న నేపథ్యంలో సబ్ డివిజన్ కార్యాలయంతో పాటు, పోలీస్ స్టేషన్, సిబ్బంది నివాస సముదాయాల నిర్మాణానికి వీలుగా పోలీసు గృహ నిర్మాణ సంస్థ సత్వరమే స్పందించి ప్రతిపాదనలు రూపొందించి, నిధులు కేటాయిస్తేనే ఈ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

పేదరిక నిర్మూలనే లక్ష్యం కావాలి

మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

ఉయ్యూరు, న్యూస్‌టుడే: 'పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సామాజిక వర్గాలు అడుగులు వేయాలని, అవకాశం ఉన్న వారంతా పేదల అభ్యున్నతికి చేయూతనివ్వాలని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక శ్రీ విశ్వశాంతి విద్యా సంస్థల ప్రాంగణంలో పీ-4 కార్యక్రమంపై వివిధ వర్గాలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసేందుకు జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఛాప్టర్ అనే ఆన్‌లైన్ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. విద్యా సంస్థ అధినేత మండల సుబ్బ పూర్ణేశ్వరరావు, డైరెక్టర్లు సూర్యశేఖర్, సుష్మ, కె.ఆర్.ఆర్.సి. ఎస్డీసీ కలెక్టర్ శ్రీదేవి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి, మార్క్‌ఫెడ్ ఎండీ మురళీకిషోర్, మండల ప్రత్యేకాధికారి జ్యోతి, పాఠశాల ప్రిన్సిపల్ పద్మజారాణి, డీఎల్డీవో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి ఉత్సవాలకు కూరగాయలు

కూరగాయల లారీ వద్ద దాతలు, రైతులు

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే శాకంబరి ఉత్సవాలకు రైతు మరియు శివశంకర్ ఆధ్వర్యంలో రూ. 55 వేల విలువగల రెండున్నర టన్నుల కూరగాయలను సోమవారం పంపించారు. గండిగుంట శివారు వెంకటాపురం నుంచి బయలు దేరిన లారీని దాతలు సూరకం వెంకట సాంబశివరావు, దోనేపూడి శివాజీ, దోనేపూడి వెంకటేశ్వరరావు, వెలగపూడి వెంకట సత్యనాగభూషణరావు, పాలడుగు రమేష్‌బాబులు జెండా ఊపి పంపించారు. శివశంకర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఏటా దాతలు, రైతులు సహకారంతో ఉత్సవాలకు కూరగాయలను పంపిస్తున్నామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అవసరం

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అవసరమని ఎంపీపీ అధ్యక్షుడు అన్నే ధనయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పులూరులో [illegible] జడ్పీ పాఠశాలకు దాత కొల్లి గాంధీ అందించిన ఫ్యాన్లు వితరణ చేశారు. ధనయ్య మాట్లాడుతూ ఇటీవల గ్రామానికి జడ్పీ పాఠశాల నిర్మాణం కోసం స్థలం వితరణ చేశారని దాని నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రాథమికోన్నత పాఠశాలనే జడ్పీ స్కూల్‌గా వినియోగిస్తున్నట్లు చెప్పారు. కొల్లి కిషోర్, ఉపాధ్యాయులు టి.వరప్రసాదరావు, ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు వితరణ చేస్తున్న దాత గాంధీ, పక్కన ధనయ్య తదితరులు

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

గండిగుంట: ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ

ఎనికేపాడు: కరపత్రాలు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో సోమవారం ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎక్కువ మంది ఇళ్ల స్థలాలు కావాలని అడుగుతున్నారని.. ప్రభుత్వ నిర్ణయం మేరకు అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ.. విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాలను సీఎం చంద్రబాబుతో చర్చించి విజయవాడ మున్సిపాలిటీలో కలిపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉయ్యూరు: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పట్టుదలతో పని చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర తెదేపా ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, నగర పంచాయతీ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) అన్నారు. సోమవారం పట్టణంలోని నాలుగో వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని కరపత్రాలు పంపిణీ చేశారు.

గండిగుంట(ఉయ్యూరు గ్రామీణం): కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. గండిగుంటలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిర్వహించిన సభలో ప్రజల సమస్యను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, సర్పంచి అనుపమ, నగరపంచాయతీ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, దండమూడి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కానూరు, న్యూస్‌టుడే : తాడిగడప పురపాలికలో బందరు రోడ్డుపై తెదేపా మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర నేతృత్వంలో పరిశీలకుడు జువ్వాది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరు, చోడవరం గ్రామాల్లో తెదేపా నేతలు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

కంకిపాడు గ్రామీణం: కంకిపాడులో నిర్వహించిన కార్యక్రమంలో చిట్టూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కొండా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్: తెదేపా మండల, గ్రామ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, అట్లూరి శ్రీను బాపులపాడు ఎంజీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కానూరు, యనమలకుదురు, న్యూస్‌టుడే : కానూరులో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకర బాబు, నాయకులు వెంకటేశ్వరరావు, ఇమామ్, తదితరులు కరపత్రాలు పంపిణీ చేశారు. యనమలకుదురులో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ్‌ప్రసాద్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చోడవరంలో..

శ్రీరామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

కానూరు: యనమలకుదురు శ్రీరామలింగేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు జీఆర్‌వీ సాగర్ నేతృత్వంలో రుద్రాభిషేకం చేశారు. ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు, కార్యనిర్వహణాధికారి ఎన్.భవానీ పాల్గొన్నారు.

జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ప్రవేశం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: హనుమాన్‌జంక్షన్ ప్రాంతానికి చెందిన బాణావతు ఇందుశ్రీ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందింది. ఇటీవల నిర్వహించిన అఖిల భారత న్యాయవిద్య ప్రవేశపరీక్ష(క్లాట్‌లో 716 ర్యాంకు) అత్యుత్తమ ప్రతిభతో ఉత్తీర్ణురాలై, ప్రఖ్యాత దామోదర సంజీవయ్య విశ్వవిద్యాలయం విశాఖపట్నం ప్రాంగణం(క్యాంపస్)లో సీటు సాధించింది. ఈ సందర్భంగా హనుమాన్‌జంక్షన్ సిద్ధార్థ విద్యాలయలో సోమవారం ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు. సిద్ధార్థ విద్యా సంస్థల డైరెక్టర్ కోనేరు సురేష్ బాబు, ప్రిన్సిపల్ వీరమాచనేని ధనలక్ష్మి, విజయవాడ శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ ఎండీ తోట శరత్‌చంద్ర ఆధ్వర్యంలో ఇందుశ్రీని సత్కరించారు. హనుమాన్‌జంక్షన్ ప్రాంతం నుంచి ఈ ఘనత సాధించిన మొదటి విద్యార్థినిగా, తమ పాఠశాలలో చదివిన ఇందుశ్రీ నిలవడం అభినందనీయమన్నారు. ఇందుశ్రీ తండ్రి బీవీ నాయక్ మాట్లాడుతూ తన కుమార్తెను న్యాయమూర్తిగా చూడాలన్నదే తన లక్ష్యమన్నారు.

ఉప సర్వే ఇన్‌స్పెక్టర్‌కు గాయాలు

పెనమలూరు, న్యూస్‌టుడే: గంగూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉయ్యూరు వాసి చిప్పిడి శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇతను కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్‌గా పనిచేస్తుంటారు. గుణదలలో తన బంధువు చనిపోవడంతో ఈ నెల 6వ తేదీన ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. గంగూరు వద్దకు వచ్చేసరికి గోసాల వైపు నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావు కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు పెనమలూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడి కోసం గాలిస్తున్నారు.

వక్ఫ్‌బోర్డు భూములు గుర్తించాలని వినతి

కంకిపాడు గ్రామీణం: మండలంలోని చలివేంద్రపాలెం, నెప్పల్లి పరిధిలో వక్ఫ్‌బోర్డు భూములు గుర్తించి అప్పగించాలని వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్.చిన్నా కంకిపాడు తహసీల్దారు భావన్నారాయణకు సోమవారం వినతి పత్రం అందజేశారు. తహసీల్దారు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతి ప్రతం అందజేశారు. అనంతరం చిన్నా మాట్లాడుతూ చలివేంద్రపాలెం మసీదుకు 33 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని దాతలు ఇచ్చిన భూమిపై వచ్చే ఆదాయాన్ని పేద ముస్లింల కుటుంబాల్లో పెళ్లిళ్లు, భోజన వసతికి వినియోగించేందుకు ఇచ్చారన్నారు. కాలక్రమంలో ఆ భూములను స్వార్థపరులైన ముజావర్లు దళారులకు తాకట్టుపెట్టి వడ్డీ కట్టలేక ఆ భూములను వారికే అమ్మినట్లు ఆరోపించారు. ఆ భూములను ఎవరూ అమ్మడానికి, కొనుగోలు చేసేందుకు చట్టపరంగా చెల్లదని, వాటిని గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న చిన్నా

పశుగ్రాస క్షేత్రాలకు దరఖాస్తుల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం భాగస్వామ్యంతో పశుగ్రాస క్షేత్రాల పెంపకానికి దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు బాపులపాడు పశుసంవర్ధక శాఖ ఏడీ ఎం.ప్రమీలారాణి తెలిపారు. ఈ నెల 7 నుంచి 12 వరకు మండల వ్యాప్తంగా ఉన్న 27 గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఒక్కో కుటుంబానికి 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు సూపర్ నేపియర్ రకం పశుగ్రాసం పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. 10 సెంట్లకు రూ.6599 చొప్పున ప్రోత్సాహం మంజూరు చేస్తోందని.. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అడిగేదెవరు? అడ్డుకునేదెవరు?

ఏరులై పారుతున్న మద్యం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం నియోజకవర్గ పరిధిలో మద్యం ఏరులై పారుతోంది. స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ దుకాణాలను చూస్తే బార్, రెస్టారెంట్‌లను తలపించేలా దర్శనమిస్తున్నాయి. పగలు, రాత్రి అని తేడా లేకుండా అన్ని వేళల్లో రూ.50 నుంచి రూ.100 ఎక్కువకు మద్యాన్ని విక్రయాలు చేస్తున్నారు. మరో వైపు దుకాణాల వద్దనే ఎటువంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా సిట్టింగ్‌తో భారీగా విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 23 మద్యం దుకాణాలున్నాయి. అనధికారికంగా సిట్టింగ్‌తో ఉన్న దుకాణాలు 19 వరకు ఉన్నాయి.

సెయింట్ జాన్స్ పాఠశాలను ఆనుకొని ఉన్న దుకాణం వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

అన్నీతెలిసినా తాము ఏమీ చేయలేకపోతున్నామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని మద్యం దుకాణాల్లో 80 శాతం సిండికేట్‌ల అధీనంలో ఉండడంతో గ్రామాల్లో బెల్ట్ దుకాణాలను కూడా వారి బంధువులే నిర్వహిస్తూ అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో గన్నవరం నియోజకవర్గం అంటే మట్టి గుర్తొచ్చేది.. ఇప్పుడు మద్యం అంటున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల పాఠశాలలను ఆనుకొని ఉన్న మద్యం దుకాణాలను తొలగించాలన్నారు. ప్రధాన మార్గాల్లోని వైన్స్ పరిసరాల్లో రాత్రి వేళ మందుబాబుల ఆగడాలు చెప్పనక్కర్లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలతో పాటు మందుబాబుల ఆగడాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

నున్న, న్యూస్‌టుడే: పద్మశ్రీ మందాకృష్ణ మాదిగ పోరాట పటిమ, సమాజంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి అందిన సహకారంతోనే వర్గీకరణ సాధ్యమైందని నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జ్ మంద వేణు మాదిగ అన్నారు. నున్న గ్రామంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం, మందాకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. తెదేపా గ్రామ అధ్యక్షుడు కలకోట శ్రీనివాసరెడ్డి, యర్కారెడ్డి కోటిరెడ్డి, వార్డు సభ్యులు, జనసేన గ్రామ అధ్యక్షుడు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

సభలో నాయకులు, తదితరులు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: మూడు దశాబ్దాల కాలంలో ఎన్నో పోరాటాలు చేసి ఎమ్మార్పీఎస్ అధినాయకుడు మంద కృష్ణ మాదిగ చరిత్ర సృష్టించారని మాజీ ఎమ్మెల్సీ, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్సీవాడలో సోమవారం రాత్రి ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా వైవీబీ కేక్ కోశారు. కౌన్సిలరు సంతోషి సలోమి, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.కృష్ణ, జిల్లా అధ్యక్షుడు పి.దినేష్‌బాబు, స్థానిక నాయకుడు ప్రవీణ్‌కుమార్, వంగవీటి శ్రీనివాసప్రసాద్, కె.వాసు, గుర్నాథరావులు పాల్గొన్నారు.

యూఎఫ్‌ఆర్టీఐ కోస్తా జిల్లాల అధ్యక్షుడిగా జోగేశ్వరరావు

గండిగుంట(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే : గండిగుంట శివారు ఆనందపురానికి చెందిన బేతపూడి జోగేశ్వరరావును యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్(యూఎఫ్‌ఆర్టీఐ) కోస్తా జిల్లాల కన్వీనర్‌గా నియమించినట్లు రాష్ట్ర కన్వీనర్ జంపాన శ్రీనివాస్‌గౌడ్ సోమవారం తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. స.హ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తానని జోగేశ్వరరావు తెలిపారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు

బాపులపాడు మండలం మడిచర్లలో అంతర్గత రహదారుల పరిస్థితి దారుణంగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బీసీ, ఓసీ కాలనీల్లో కీలక రోడ్లు ఇప్పటికీ మట్టి దారులుగానే ఉండటం, పక్కా డ్రెయిన్లు లేకపోవడంతో మురుగు రోడ్లపైకి వచ్చి చేరుతోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మడిచర్ల(హనుమాన్‌జంక్షన్)

ధ్రువపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్ విశ్వనాథ్, పక్కన భువనేశ్వరిదేవి

వృత్తి నైపుణ్యంతోనే ఆర్థిక ప్రగతి

ఉయ్యూరు, న్యూస్‌టుడే: చదువుకున్న యువత వృత్తి నైపుణ్యం సాధించడం ద్వారా ఆర్థికంగా ప్రగతి సాధించవచ్చని ఏజీఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విశ్వనాథ్ అన్నారు. స్థానిక ఏజీఎస్‌జీఎస్ కళాశాలలో విద్యార్థినులకు కుట్టు శిక్షణ పూర్తయిన నేపథ్యంలో సోమవారం వారికి ఆయన ధ్రువపత్రాలు అందించారు. మహిళా స్ఫూర్తి సంస్థ అధ్యక్షురాలు భువనేశ్వరిదేవి మాట్లాడుతూ విద్యార్థునులకు 45 రోజులు కుట్టులో శిక్షణ ఇచ్చామని, తద్వారా ముద్ర రుణాలు పొంది ఆదాయాన్ని సాధించవచ్చన్నారు. శిక్షకురాలు పరమేశ్వరిదేవి, కళాశాల మహిళా సాధికారత విభాగం కన్వీనర్ ఎం.వి.శాంతి, కో- కన్వీనరు అపర్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదానికి పిలుపు

పెనమలూరు, న్యూస్‌టుడే: సీపీఎం ఆధ్వర్యాన ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యాన పెనమలూరు మండలం, ఆటోనగర్‌లలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు షేక్ ఖాసిం, వై.నరసింహారావు, గోపీమూర్తి, రెడ్డి, ఏడుకొండలు, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రదర్శనలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు

శాకంబరిగా అన్నపూర్ణాదేవి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పాతగన్నవరం కాశీవిశాలాక్షి అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవార్లకు తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఆషాఢ సారె సమర్పించారు. అమ్మవారిని శాకంబరిగా ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చెంచుల కాలనీలో కొలువైన లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. సంఘ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

✤ గన్నవరం పట్టణంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 10న గురుపౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారిని శాకంబరిగా అలంకరించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాతగన్నవరం విశ్వేశ్వర స్వామి ఆలయంలో..

ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు

పోరంకి(కానూరు), న్యూస్‌టుడే : తాడిగడప పురపాలికలోని అన్ని ప్రాంతాల్లో ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. సోమవారం సాయంత్రం పోరంకి విష్ణుపురం కాలనీలో రూ.86 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పురపాలికను అభివృద్ధిలో నంబరు వన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కూటమి నేతలు, కమిషనర్ షేక్ నజీర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు తదితరులు

పవర్‌గ్రిడ్‌ను సందర్శించిన ఈడీ

నున్న, న్యూస్‌టుడే: విజయవాడ రూరల్ మండలం నున్నలోని పవర్‌గ్రిడ్‌ను సదరన్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డోమన్ యాదవ్ సోమవారం సందర్శించారు. ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. చీఫ్ జనరల్ మేనేజర్ ఏసీ శంకరయ్య, సీజీఎం టీవీఎస్ ప్రవీణ్‌కుమార్, మేనేజర్ కె.నాగమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటి నీరు పోస్తున్న ఈడీ డోమన్ యాదవ్, తదితరులు

సీపీఐ జిల్లా మహాసభ నేడు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు పార్టీ కృష్ణాజిల్లా సమితి 26వ మహాసభను మంగళవారం గన్నవరంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, పి.దుర్గాభవానీ, దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు, ప్రజానాట్యమండలి నాయకులు, జిల్లా నలుమూలల నుంచి పార్టీ అభిమానులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పెద్దు వాసుదేవరావు, కాట్రగడ్డ రామచంద్రజోషి తదితరులు పాల్గొన్నారు.

తెదేపా కార్యాలయం ప్రారంభం

గంగూరు(పెనమలూరు), న్యూస్‌టుడే: గంగూరులో ఏర్పాటు చేసిన తెదేపా కార్యాలయాన్ని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో పార్టీ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సూచించారు. మాజీ సర్పంచి ప్యారీల తీఫ్, పార్టీ నేతలు కోయ ఆనంద్, అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, ఇర్ఫాన్ పాషా, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

WANTED FACULTY
SIDVI EL-FINS THE PRE-SCHOOL PIONEER
Centre Head: We are seeking a dedicated Pre-School Centre Head (Female) to lead our dynamic team and create a nurturing environment for both students and Parents.
Pre-School Teachers: Degree with 2 years experience.
Primay Teachers: English (Degree with B.Ed)
High School: Physics, Maths Degree / PG with 2 years experience with (B.Ed)
Candidates May Walk-in Between 9:00 AM & 5:00 PM on Any day before 13th July 2025
సిద్ధార్థ విద్యాలయ స్కూల్స్
ఏలూరు - హనుమాన్ జంక్షన్
సెంట్రల్ ఆఫీస్: విద్యాకోకిల భవనం, వట్లూరు, ఏలూరు
సెల్: 93942 24498, 88977 30230

(c) eenadu

విధులు సక్రమంగా నిర్వర్తిస్తే సుస్థిర స్థానం

వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న సీఐ సుభాకర్, ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్

పామర్రు: ఉద్యోగులు తమ విధిని సక్రమంగా నిర్వర్తిస్తే ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవచ్చని పామర్రు సీఐ సుభాకర్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేసిన వెంకటేశ్వరరావు గుడ్లవల్లేరుకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్, స్టేషన్ సిబ్బంది వెంకటేశ్వరరావును సన్మానించారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ఘంటసాల, న్యూస్‌టుడే: ఎన్నారై సంగుబట్ల వెంకట బాలశేఖర్-మాధురి దంపతులు జలధీశ్వరాలయంలో సోమవారం విశేష పూజలు చేసి రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధికి ఆ సొమ్మును వినియోగించాలని సూచించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ దాతను సత్కరించారు.

ఎన్నారై వెంకట బాలాశేఖర్‌ను స్వామివారి జ్ఞాపికతో సత్కరిస్తున్న దృశ్యం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? గుడివాడ మండలం దొండపాడు రోడ్డులోని శ్రీకాళహస్తీశ్వర కాలనీలో తాగునీటి కుళాయిలు లేక 20 ఏళ్లుగా స్థానికులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ వేలాది నిరుపేద కుటుంబాలు ఉన్నాయి. తాగునీటి సమస్యను పరిష్కరించాలి. **-వెంకటరమణ, శ్రీకాళహస్తీశ్వర కాలని**

✔ ఉన్నతాధికారులకు సమస్యను వివరించాము. త్వరలో నిధులు విడుదల చేస్తారు. గుడివాడ ఎమ్మెల్యే రాము కూడా అధికారులతో మాట్లాడారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కారం అవుతుంది. **-ఎంపీడీవో జి.వి.విష్ణు ప్రసాద్ – న్యూస్‌టుడే, గుడివాడ**

? వీరంకిలాకుల నుంచి అగినపర్రు, మామిళ్లపల్లి మీదుగా నారాయణపురం అడ్డరోడ్డు, కూచిపూడి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. వెంటనే మరమ్మతులు చేయించాలి. **- వెంకటేశ్వరరావు**

✔ వీరంకిలాకుల నుంచి అగినపర్రు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతులకు రూ.1.50 కోట్లు మంజూరు అయ్యాయి. వర్షం, ఆర్డర్లు రాగానే పని ప్రారంభిస్తాం. తరువాత అక్కడి నుంచి మిగిలిన రోడ్డుకు అంచనాలు పంపిస్తాం. **- మల్లికార్జునరావు, ఏఈ ఆర్‌అండ్‌బీ – న్యూస్‌టుడే, పమిడిముక్కల**

మారిన మెనూ.. ఇష్టంగా తింటూ..

పమిడిముక్కల, న్యూస్‌టుడే

ఇటీవల కూటమి ప్రభుత్వం విద్యారంగంలో తెచ్చిన మార్పులతో పాటు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. బడులు తెరచినప్పటి నుంచి దొడ్డు బియ్యం స్థానంలో మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన సన్నబియ్యంతో వండిన రుచికరమైన భోజనం అందుతుండటంతో పాఠశాలల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పామర్రు నియోజకవర్గంలో మొత్తం 245 పాఠశాలల్లో 11246 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. గతంలో రేషన్‌బియ్యం వంటతో కొన్నిచోట్ల సుద్ద అయిందని, ఆరోగ్యం తేడా చేసిందంటూ విద్యార్థులు బడిలో భోజనం పట్ల విముఖత చూపేవారు. అధికశాతం ఇంటి నుండే భోజనం తెచ్చుకొనేవారు. ప్రభుత్వం ఇటీవల విద్యార్థులకు పౌష్టికాహారం ఇవ్వాలనే ఉద్దేశంతో మార్చిన వంటల జాబితా(మెనూ) ప్రకారం వండిన పదార్థాలు సన్నబియ్యం అన్నంతో పెట్టడంతో వారు ఇష్టంగా తింటున్నారని పమిడిముక్కల, తోట్లవల్లూరు, కూచిపూడి తదితర మండలాల్లోని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. తమకు వంటకాలు తేలిగ్గా ఉందని వంట చేసేవారు చెబుతున్నారు.

ఐనపూరులో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
పామర్రు	58	2171
మొవ్వ	58	2730
తోట్లవల్లూరు	34	1928
పమిడిముక్కల	58	2978
పెదపారుపూడి	37	1439
మొత్తం	245	11246

సన్నబియ్యపు అన్నం పొడిపొడిగా రుచిగా ఉంటోంది. ప్రభుత్వ మెనూ ప్రకారం వండే కూరలు, రసం కమ్మగా ఉంటున్నాయి. గతంలో ఇంటినుంచి క్యారేజీ తెచ్చుకునేవాళ్లం. ఈసారి బడి తెరచినప్పటినుంచి బళ్లోనే భోంచేస్తున్నాం. **– రావూరు నాగ అఖిల్, పదో తరగతి, ఐనపూరు.**

రేషన్ బియ్యంతో అన్నం ముద్ద ముద్దగా ఉండేది. అన్నం తినాలనిపించేది కాదు. కడుపు నిండకుండానే చేయి కడుక్కొనే వాళ్లం. ఇప్పుడు సన్నబియ్యంతో అన్నం చాలా బావుంటోంది. మారిన మెనూతో పదార్థాలు రుచిగా ఉంటున్నాయి. **– ఓగిరాల హర్షిత, 8వ తరగతి, తోట్లవల్లూరు**

అమ్మవారికి ఆషాఢ మాసం సారె

కపిలేశ్వరపురం (పమిడిముక్కల), న్యూస్‌టుడే: కపిలేశ్వరపురంలోని శ్రీకృష్ణ మహిళా భక్తమండలి ఆధ్వర్యంలో సోమవారం పావనినాగేశ్వరస్వామి ఆలయంలోని బాలాత్రిపురసుందరి అమ్మవారికి ఒడి బియ్యం, ఆషాఢ సారె సమర్పించారు. అనంతరం స్థానిక గీతా మందిరంలోని రుక్మిణి గోదాదేవీలకు ఆషాఢ సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

సారె సమర్పిస్తున్న భక్తమండలి మహిళలు

అవనిగడ్డ గ్రామీణం: తుంగలవారిపాలెంలో ఏటి ఒడ్డు అమ్మవారికి సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆషాఢ మాస సారెను సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ చేశారు. ప్రతినిధులు జీవి నాగరాజు, సిర్విశెట్టి సుబ్బారావు, వెంకటేశ్వరరావు, సింధూజ పాల్గొన్నారు.

కూచిపూడి, న్యూస్‌టుడే: కూచిపూడిలోని బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారికి స్థానిక వాసవీ వనిత క్లబ్ మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. కూచిపూడి, పెదపూడి మహిళలు బాలాత్రిపురసుందరి అమ్మవారికి, కూచిపూడి గ్రామదేవత గంగానమ్మకు సారె సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వనిత క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లీలాకుమారి, వెంకటప్రసాద లక్ష్మి, కోశాధికారి కృష్ణకళ పలువురు మహిళలు పాల్గొన్నారు.

స్థానిక న్యాయస్థానం ప్రాంగణం సమీపంలోని కంచికామాక్షి అమ్మవారికి ఆషాఢ సారె తీసుకువస్తున్న మహిళా భక్తులు – న్యూస్‌టుడే, అవనిగడ్డ

కోనేరు పరిసరాల్లో పరిశుభ్రత చర్యలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయ కోనేరు పరిశుభ్రతకు ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు తక్షణ చర్యలు చేపట్టారు. సోమవారం ఈనాడులో ప్రచురితమైన 'విషసర్పాలకు ఆలవాలంగా కోనేరు' అన్న కథనానికి స్పందించారు. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల నివారణకు మందు పిచికారీ చేశారు. పార్కింగ్ స్థలంలో వాడి పారేసిన విస్తరాకులు, ప్లాస్టిక్‌గ్లాసులు ఇతరత్రా వ్యర్థాలను ఊడ్చి దహనం చేశారు.

పచ్చిక మీద కలుపు నివారణ మందు పిచికారి చేస్తున్న కూలీలు

ఈనాడు స్పందన

రాష్ట్ర అభివృద్ధే కూటమి ధ్యేయం

పామర్రు(గ్రామీణం), న్యూస్‌టుడే: ఐదేళ్ల వైకాపా పాలనలో పల్లెలు అభివృద్ధికి నోచుకోలేకపోయాయని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ధ్వజమెత్తారు. సోమవారం మండలంలోని కనుమూరు, జమీగొల్వేపల్లి, పోలవరం, ఉండ్రపూడి గ్రామాల్లో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిపై కరపత్రాలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జనసేన నియోజకవర్గ బాధ్యుడు తాడిశెట్టి నరేష్, తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుదురవల్లి ప్రవీణ్‌చంద్ర, ఈడే నాని, మండపాక శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, నాయకులు

తీర గ్రామాల అభివృద్ధికి కృషి

సొర్లగొంది(నాగాయలంక), న్యూస్‌టుడే: తీర గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని సొర్లగొంది గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏడాది పాలనలో తెదేపా నెరవేర్చిన హామీలు, భవిష్యత్తులో చేయబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. నేతలు, కార్యకర్తలు, కుటుంబ సాధికారిత సమితి సభ్యులతో కలిసి ఇంటింట ప్రచారం చేశారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షులు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, అవనిగడ్డ నియోజకవర్గం పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, జిల్లా మహిళ అధ్యక్షులు తలశిల స్వర్ణలత, మండల తెదేపా అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, బొబ్బా గోవర్ధన్, తుంగల కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్డు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలను చెప్పి నేతలకు గ్రామస్థులు అర్జీలను అందజేశారు.

సొర్లగొందిలో ఇంటింట ప్రచారంలో మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు, తెదేపా నాయకులు

బ్యాంకింగ్ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు

గుడివాడ, న్యూస్‌టుడే: యువతకు నేడు బ్యాంకింగ్ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని విజయవాడ ఎస్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.రవి పేర్కొన్నారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో 'బ్యాంకింగ్ రంగం.. వృత్తి అవకాశాలు' అనే అంశంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంకింగ్ రంగంలో ప్రొబేషనరీ అధికారి, జూనియర్ అసిస్టెంట్, స్పెషలిస్టు అఫీసర్ల పోస్టులకు తరచూ నియామకాలు జరుగుతాయన్నారు. డిగ్రీ దశ నుంచి విద్యార్థులు బ్యాంకింగ్ ఉద్యోగాలకు శిక్షణ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్, పాలకవర్గ అధ్యక్షుడు ఎల్.ఆర్.కె.ప్రసాద్, సెక్రటరీ, కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు, వైస్ ప్రిన్సిపల్ బీఎస్ఎస్.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రవిను సత్కరిస్తున్న దృశ్యం

తాగునీరు సరఫరా చేయండి

పెదపారుపూడి, న్యూస్‌టుడే: మండల పరిధి వెంట్రప్రగడ గ్రామంలో గత రెండు నెలల నుంచి తాగునీరు సరఫరా అవ్వక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వెంట్రప్రగడలోని ఎర్ర చెరువు వద్ద మంచినీటి కుళాయిల ద్వారా నీళ్ల రాక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు చెప్పినా తమ గోడు పట్టించుకోవడం లేదని వాపోయారు. అలాగే జగనన్న కాలనీలో గత వారం నుంచి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు లబ్ధి

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతోందని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు చెప్పారు. దింటిమెరక గ్రామంలో సోమవారం 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. నాయకులు కె.జాన్‌విల్సన్, అప్పికట్ల రవీంద్రబాబు, పూతబోయిన శ్రీనివాసరావు, వేములపల్లి రాజేష్, బొడ్డు వెంకటన్న, మహ్మద్ ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న బండే శ్రీనివాసరావు

యువకుడి ఆత్మహత్య


మృతుడు విజయ్‌కుమార్

గుడివాడ, న్యూస్‌టుడే: కామెర్లతో బాధపడుతున్న ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇది. గుడివాడ తాలూకా పోలీసుల కథనం ప్రకారం గుడివాడ మండలం తటివర్రు గ్రామానికి చెందిన మట్టా యేసమ్మ కుమారుడు విజయ్ కుమార్ (28) గత కొంత కాలంగా కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వ్యాధి నయం కాకపోవడంతో ఆదివారం అర్ధరాత్రి ఇంటి వరండాలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈమేరకు ఎస్.ఐ ఎన్.చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గండి పూడ్చరూ..

నారుమడులకు నీరందని దుస్థితి

న్యూస్‌టుడే, కోసూరుపాలెం (మోపిదేవి)

మండలంలోని కోసూరుపాలెం, ఉత్తరచిరువోల్లంక, అయోధ్య ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి తాజాగా నెలకొంది. దాదాపు 600 ఎకరాలకు నీటి తీవ్రత ఎదురైంది. కోసూరుపాలెం సమీపంలో కాలువ మీద గతంలో నీటి తొట్టి నిర్మించారు. దాని మీదుగా సాగునీరు సరఫరా జరుగుతోంది. అయితే కొన్ని రోజుల కితం అడుగుభాగంలో గండిపడి కోతకు గురైంది. అది పెద్దదైంది. ఆ గండిని పూడ్చి నీటిని తొట్టిమీదుగా మళ్లించాలి. కాలువ ప్రారంభం నుంచి వస్తున్న సాగునీరు గండిపడిన ప్రదేశంలోకి వస్తుండటంతో గండి రోజురోజుకీ పెద్దదవుతోంది. గండిని పూడ్చాలంటే కనీసం 30కి పైగా ట్రాక్టర్ల మట్టి అవసరం. సమస్యను ఆ ప్రాంత రైతులతో పాటు నీటి సంఘ అధ్యక్షులు జలవనరుల శాఖ అధికారికి తెలిపారు. అయినా, క్షేత్రస్థాయిలో సమస్య పరిశీలనకు అధికారులు రాలేదని వాపోతున్నారు. గండిపడిన ప్రదేశం నుంచి ఎగువకు నీరు రాకపోవటంతో నారుమడులు ఎండిపోతున్నాయని, చల్లిన విత్తనాలు మొలిచే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గండి పడిన ప్రదేశాన్ని పొక్లెయిన్‌తో పూడ్చించే చర్యలకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లానని జలవనరుల శాఖ ఏఈ రవితేజ పేర్కొన్నారు.

బీటలు వారిన నేల

తొట్టిపక్కనే గొయ్యి ఏర్పడి సాగునీరు వృథాగా పోతున్న దృశ్యం

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని స్థానిక డీఎస్పీ టి.విద్యాశ్రీ హెచ్చరించారు. సబ్ డివిజన్‌లో ఇసుక, బుసక, మట్టి లాంటివి అక్రమ రవాణా చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పీడీఎస్ బియ్యం, మద్యం అక్రమ రవాణా, జూదాలు, గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే 94407 96406 నెంబర్‌కు ఫోన్ చేయాలని చెప్పారు.

విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ విద్యాశ్రీ

'అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు హామీ నెరవేరుస్తాం..'

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణం నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇచ్చిన హామీని తప్పక నెరవేరుస్తారని గుడివాడ మండల పార్టీ అధ్యక్షుడు వాసే మురళీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చాట్రగడ్డ రవి కుమార్, దళిత నేతలు గడ్డం ప్రకాష్‌దాస్, మేరుగు మోజస్‌లు పేర్కొన్నారు. స్థానిక నెహ్రూ చౌక్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైకాపా అధికారంలో ఉండగా అంబేడ్కర్ విగ్రహం నిర్మిస్తామని మాయమాటలు చెప్పారన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు అందుగుల ఏసుపాదం, మెండు జోజిబాబు, నీరుడు సురేష్, రేమల్లి రజినీ కాంత్, డొక్కుమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న దళిత నేతలు

నిల్వ చేసిన రేషన్ బియ్యం స్వాధీనం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి నారాయణరావు నగర్‌లో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకొన్నారు. అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం, చల్లపల్లి ఎస్.ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. లుక్కా రాఘవులు అనే వ్యక్తి ఇంట్లో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి పట్టుకొన్నారు. 33 బస్తాల్లో 1160 కేజీల రేషన్ బియ్యాన్ని సీజ్‌చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

చల్లపల్లిలో పట్టుకున్న రేషన్‌బియ్యంతో పోలీసు

ఇళ్ల నిర్మాణాలకు ముందుకురావాలి

పెదపారుపూడి, న్యూస్‌టుడే: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావాలని ఎంపీడీవో విమాదేవి అన్నారు. మండల పరిధి వెంట్రప్రగడలోని జగనన్న కాలనీని సోమవారం ఆమె పరిశీలించారు. కాలనీలో అన్ని సౌకర్యాలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య, అంతర్గత రహదారులు, కాలనీకి వచ్చే రహదారిలో వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అన్ని సౌకర్యాలు వెంటనే కల్పించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇన్‌ఛార్జి ఏఈ ఫణికుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కోతకు గురై ప్రమాదకరంగా వంతెన..

మండలంలోని కళ్లంవారి పాలెం వద్ద కేఈబీ కాలువపై నిర్మించిన వంతెన వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే మరమ్మతులు చేపట్టి సరిచేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

ఐటీఐ మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ,: ఐటీఐ కళాశాలలో మొదటి విడతలో మిగిలిన సీట్ల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఓ.మంజులా దేవి సోమవారం తెలిపారు. 8వ తరగతి, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అనంతరం వారి విద్యార్హతల పత్రాలతో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08764-295953, 8297574757 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని దుకాణాల్లో పొగాకు ఉత్పత్తుల నిషేధంపై సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఉన్న పొగాకు ఉత్పత్తులు విక్రయించే దుకాణాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. పొగాకు నియంత్రణ చట్టం నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులకు జరిమానాలు విధిస్తామన్నారు. అన్ని విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మకూడదు అనే బోర్డులను వ్యాపారులు ఏర్పాటు చేయాలని సూచించారు.

పెదపారుపూడి, న్యూస్‌టుడే: మండలంలోని పాఠశాలలు, కళాశాలల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై ప్రవీణ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రమైన పెదపారుపూడిలోని బడ్డీ దుకాణాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాల నిషేధంపై సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

పాల ఉత్పత్తిలో పశుగ్రాసానికి ప్రాముఖ్యత

అవనిగడ్డ, న్యూస్‌టుడే: పాల ఉత్పత్తిలో పశుగ్రాసానికి ప్రాముఖ్యత ఉందని, నాణ్యమైన పశుగ్రాసాన్ని పశువులకు అందించాలని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ ఎస్.నాగభూషణం చెప్పారు. సోమవారం స్థానిక ఏరియా పశువైద్యశాల ప్రాంగణంలో ఆయన పశుగ్రాస వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. పశు సంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు అందిస్తున్న వివిధ పథకాలను వివరించి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. స్థానిక సహాయ సంచాలకుడు డాక్టర్ బి.సాంబశివరావు మాట్లాడారు. అవనిగడ్డ, సబ్‌డివిజన్‌లోని అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక పశువైద్యులు, సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా వీరబాబు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: దివి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజనాల వీరబాబును నియమిస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2014 నుంచి జనసేన పార్టీలో కొనసాగుతున్న వీరబాబు నియామకం పట్ల పలువురు కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనను జనసేన నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాయపూడి వేణుగోపాలరావు, లంకె యుగంధర్, మత్తి సుబ్రహ్మణ్యం, చన్నగిరి సత్యనారాయణ, బచ్చు శ్రీహరి, బోగిరెడ్డి నాగేశ్వరావు, ఆళ్లమల్ల చందు తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ ఉపాధి సాధించడం అభినందనీయం'

గుడివాడ, న్యూస్‌టుడే: ఆదిత్య డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు 96 మంది కార్పొరేట్ సంస్థలలో ఉపాధి సాధించడం ఆనందంగా ఉందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. స్థానిక తితిదే కల్యాణ మండపంలో ఆదిత్య డిగ్రీ కళాశాల అఛీవర్స్ డే వేడుకలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణ రెడ్డి, శ్రీవిద్యా విద్యా సంస్థల నిర్వాహకుడు ఎస్.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశం జయప్రదం చేయండి

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 10న జరిగే మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశాన్ని జయప్రదం చేయాలని 1-2 ఎంఈవోలు ఎన్ శివశంకర రావు, కె.శ్రీలక్ష్మి కోరారు. విద్యాశాఖ పర్యవేక్షణలో 'బడివైపు ఒక అడుగు - తల్లిదండ్రులతో ముచ్చట్లు' పేరుతో నిర్వహించే ఈ తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశంలో అందరూ పాల్గొని విద్యార్థుల, పాఠశాల అభివృద్ధికి తగు సూచనలు ఇవ్వాలన్నారు.

పమిడిముక్కల, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశ నిర్వహణకు ప్రభుత్వ ఆదేశాలతో ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులతో 17 కమిటీలు సిద్ధం చేస్తున్నట్టు ఎంఈవో 2 ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి పాఠశాలలోనూ విద్యార్థుల చేత వారి తల్లి పేరున మొక్క నాటిస్తామన్నారు. పులిగడ్డ తదితర ప్రాంతాల నుంచి 2630 మొక్కలు తెప్పిస్తున్నట్టు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పమిడిముక్కల న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ 61వ జన్మదినోత్సవం సందర్భంగా పెనుమెత్స, వీరంకిలాకుల్లో వేడుకలు నిర్వహించారు. సర్పంచి దండమూడి అచ్చమాంబ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

రాజేంద్ర నగర్ బ్రాంచి (11102), గుడివాడ, కృష్ణా జిల్లా-521 301

స్వాధీనత ప్రకటన

APPENDIX IV (రూలు-8(1) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం-2002 (నెం.54 ఆఫ్ 2002) ప్రకారం భారతీయ స్టేట్ బ్యాంక్, రాజేంద్ర నగర్ బ్రాంచి, కృష్ణా జిల్లా యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్షన్ 13(12) 3వ నిబంధన క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణము మొత్తము ది.06-05-2025 నాటికి **రూ.34,60,554/-** (అక్షరాల ముప్పైనాలుగులక్షల అరవైవేల ఐదువందల యాభైనాలుగు రూపాయలు మాత్రమే) మరియు ది:07-05-2025 నుండి వడ్డీ, ఖర్చులతో సహా చెల్లించమని కోరుతూ ఋణగ్రహీత: శ్రీ సాదె సుభాని కుమార్, తండ్రి: యస్ రామారావు, హెచ్.నెం.5-181, కుమ్మరి చెరువు వీధి, గుడివాడ, కృష్ణా జిల్లా-521 301. హెచ్/యల్ నెంబర్లు: 36613072779, 39003332037 వీరిని కోరుతూ ది:07-05-2025 వ తేదీన డిమాండు నోటీసును జారీచేయడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత విఫలమైనందున సదరు రూల్ "8"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్థిని సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 ప్రకారం ఈ దిగువ సంతకందారు ఈ రోజున స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు/తనఖాదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క ఛార్జీకి మొత్తం బకాయి ది.06-05-2025 నాటికి **రూ.34,60,554/-** మరియు తదుపరి వడ్డీ + ఖర్చులు మొదలగువాటికి లోబడి ఉంటాయని ఋణగ్రహీతకు/తనఖాదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియపరచటమైనది.

ఋణగ్రహీతలు సదరు చట్టంలో సబ్ సెక్షన్(8) ఆఫ్ సెక్షన్ 13 ప్రకారం తనఖా ఆస్థిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టి సారించవలసి ఉన్నది.

స్థిరాస్థి వివరము

కృష్ణా జిల్లా, గుడివాడ, ఆర్‌యస్ నెం.149 పార్టు, వార్డు నెం.13, డోర్ నెం.13/148 లోని **చందన రెసిడెన్సి**, ఫ్లాట్ నెం.503, 4వ అంతస్థు, ప్లింత్ ఏరియా 900 చ॥అడుగులు, కామన్ ఏరియా 180, పార్కింగ్ ఏరియా 90 తో పాటు మొత్తం విస్తీర్ణం 524.5 చ॥గ॥లలోని అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగము 30 చ॥గ॥లు కలిగిన ఆర్‌సిసి భవనము శ్రీ సాదె సుభాని కుమార్, తండ్రి: యస్ రామారావు గారికి చెందిన రిజిష్టర్డ్ సేల్‌డీడ్ నెం.1057/2017, తేది:08-03-2017, గుడివాడ జెయస్‌ఆర్‌ఒ, కృష్ణా జిల్లా. __అపార్ట్‌మెంట్ హద్దులు:__ తూర్పు: ఈ ఆస్థి యొక్క ప్రహరీ గోడ మరియు తరువాత బొప్పన రంగారావు, దక్షిణం: మునిసిపల్ బజారు, పడమర: పొట్లూరి స్వర్ణ కుమారి గారి ఆస్థి, ఉత్తరం: ఈ ఆస్థి యొక్క ప్రహరీ గోడ మరియు తరువాత రావులపల్లి కోటేశ్వరరావు. __ఫ్లాట్ హద్దులు:__ తూర్పు: వరండా, దక్షిణం: మెట్లు మరియు వరండా, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై.

తేది :07-07-2025

ప్రదేశం:గుడివాడ

అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్

(c) eenadu

ప్రేమ వ్యవహారంలో యువతి హత్య!

మృతదేహం పక్కనే కత్తి గాయాలతో ప్రియుడు

రమ్య

జిన్నారం(రామచంద్రాపురం), న్యూస్‌టుడే: ప్రేమ వ్యవహారంలో యువతి హత్య కలకలం రేపింది. ఆమె మృతదేహం పక్కనే ప్రియుడు కూడా గొంతుపై కత్తిగాట్లతో పడి ఉండడం అనుమానాలు రేకెత్తిస్తోంది. ప్రియుడే ఈ పని చేశాడా... ఇంకెవరి హస్తమైనా ఉందా...? అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. హైదరాబాద్ శివారులోని రామచంద్రాపురం ఠాణా పరిధిలోని బండ్లగూడలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా బాడంగి మండలం గజరాయునివలస గ్రామానికి చెందిన బొత్స శ్రీనివాస్, ఈశ్వరమ్మ దంపతులు 25 ఏళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. రామచంద్రాపురం పరిధిలోని బండ్లగూడ బాలాజీనగర్‌లో నివాసముంటున్నారు. వీరి కుమార్తె రమ్య (23)కు మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మాణెపల్లికి చెందిన ప్రవీణ్‌కుమార్ (25)తో మూడేళ్ల నుంచి పరిచయముంది. బీటెక్ పూర్తి చేసిన ప్రవీణ్ ప్రస్తుతం అల్విన్‌కాలనీలో ఉంటూ ట్యూషన్లు చెబుతున్నాడు. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. ఆరు నెలల క్రితం తమ ప్రేమ గురించి యువకుడు... రమ్య తల్లిదండ్రులకు చెప్పగా.. వారు అంగీకరించలేదు. ఆమెకు పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. సోమవారం మధ్యాహ్నం యువతి తల్లి ఈశ్వరమ్మ ఇంటికి వచ్చేసరికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. కిటికీలోంచి పరిశీలించగా... రమ్య గొంతుపై తీవ్ర గాయంతో రక్తపు మడుగులో ఉంది. ఆ పక్కనే మెడ మీద గాయంతో ప్రవీణ్ పడి ఉన్నాడు. ప్రవీణ్ కొన ఊపిరితో ఉండడంతో ఆసుపత్రికి తరలించారు.

అలాంటి వాటికే మీ సమయాన్ని వెచ్చించండి

అవసరం లేని విషయాల గురించి ఆలోచిస్తూ ఉంటే మీ సమయం వృథా కావడమే కాదు, దానివల్ల ముఖ్యమైన పనులపై మీరు దృష్టి పెట్టలేరు.
ఓ విషయం వల్ల మీకు
1. వ్యక్తిగత ప్రయోజనమైనా ఉండాలి.
2. మనశ్శాంతైనా లభించాలి.
3. మీ కుటుంబానికి, సమాజానికి పనికొచ్చే అర్థవంతమైన విషయమైనా అయ్యుండాలి.
అలాంటి వాటి కోసమే మీ సమయాన్ని, శక్తిని వెచ్చిస్తూ పూర్తి ఏకాగ్రతను నిలపండి.
– మోర్గాన్ రిచర్డ్ ఒలివియర్, రచయిత్రి

జగన్ కారులో వచ్చి వెళ్లా.. నాకేం తెలియదు

పోలీసుల విచారణలో మాజీ మంత్రి పేర్ని నాని

సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన పేర్ని నాని ★ సీఐ గది వద్ద గుమికూడిన వైకాపా నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 18న సత్తెనపల్లి పట్టణంలో ర్యాలీ చేయడంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తిన విషయం మీకు తెలుసా? రప్పా రప్పా అనే ప్లకార్డులు మీరు చూశారా? వాటిని ఎక్కడ ముద్రించారు? జనసమీకరణలో మీ పాత్ర ఉందా? పట్టణంలో ఎటువంటి అనుమతుల్లేకుండా ర్యాలీ చేయడమే కాకుండా డీజేతో నృత్యాలు చేయడం, వాహనాలు శబ్దం చేస్తూ నడపడం, బహిరంగంగా మద్యం తాగడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడం వంటి విషయాలు మీకు తెలియవా? అంటూ మాజీ మంత్రి పేర్ని నానిని సత్తెనపల్లి పోలీసులు ప్రశ్నించారు. జగన్ కారు ఎక్కమంటే ఎక్కాను.. తాడేపల్లి నుంచి కారులో వచ్చా.. కారులోనే తిరిగి వెళ్లా.. అనుమతుల గురించి నాకేం తెలియదని ఆయన సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడంపై పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో పేర్ని నానిని సోమవారం విచారించారు. పట్టణంలో జరిగిన ర్యాలీలో మీరు పాల్గొన్నారా అని పోలీసులు ప్రశ్నించగా కారులో ఉన్నానని చెప్పారు. జగన్ పర్యటనకు 3 వాహనాలు, 100 మందికి అనుమతి ఇచ్చారు కదా అని నాని పోలీసుల్ని అడిగారు. పట్టణంలో ర్యాలీకి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, రెంటపాళ్లకు పెద్దసంఖ్యలో వాహనాలు, జనం వస్తే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని ఉన్నతాధికారులు ముందుగానే చెప్పారని పోలీసులు సమాధానమిచ్చారు. విచారణకు మరోసారి పిలిస్తే రావాలని సీఐ నాగమల్లేశ్వరరావు మాజీ మంత్రికి చెప్పారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు పోలీస్‌స్టేషన్‌లోకి గుంపుగా వచ్చేసి.. విచారణ పూర్తయ్యే వరకు సీఐ గది ముందే హడావుడి చేశారు.

రెంటపాళ్ల ఎక్కడో తెలియదు

తనకు రెంటపాళ్లే కాదు సత్తెనపల్లి ఎక్కడో కూడా తెలియదని.. ఇక్కడికి రావడం ఇదే తొలిసారి అని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. పోలీసుల విచారణ తర్వాత వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుధీర్ భార్గవరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 11 సెక్షన్లతో తనపై కేసు పెట్టారని, మచిలీపట్నంలోని కార్యాలయంలో ఆదివారం పోలీసులు నోటీసు అంటించి వెళ్లడంతో విచారణకు వచ్చానని చెప్పారు. పోలీసుల ఆంక్షలు అతిక్రమించారని, ప్రజల్ని ఇబ్బందులకు గురి చేశారని, స్టంట్లు వేశారని రుజువు కావడంతో మిమ్మల్ని విచారణకు పిలుస్తున్నామంటూ నోటీసులో పేర్కొన్నారన్నారు. సత్తెనపల్లిలో వైకాపా ఇన్‌ఛార్జి, ఛైర్‌పర్సన్ ఎవరో కూడా ఇక్కడికి వచ్చేవరకు తనకు తెలియదని, తాను ఎవరితోనూ మాట్లాడలేదని అన్నారు. పాలకుల ఒత్తిడితో వారి కుర్చీలను కాపాడుకునేందుకు పోలీసు అధికారులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని, సత్తెనపల్లి పోలీసులు అమాయకులని వ్యాఖ్యానించారు. తనపై కేసులు పెట్టినా జగన్ జెండాను వదిలేది లేదన్నారు.

కరోనా కట్టుకథల కరోడ్‌'పతి'

- బెంగళూరు మహిళను వంచించి కోట్ల ఆస్తి కాజేసిన చిత్తూరువాసి

శివప్రసాద్

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: భార్యాపిల్లలు కరోనా సోకి మృతి చెందారని మాయమాటలతో ఓ మహిళను నమ్మించి పెళ్లి చేసుకుని వంచించి రూ.28 కోట్ల సొత్తు కాజేసి పరారయ్యాడొక మోసగాడు. బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజ్‌పేట్‌కు చెందిన నాగమణి (50)కి చాన్నాళ్ల క్రితం బెంగళూరుకు చెందిన వెంకటప్పరెడ్డితో పెళ్లయింది. కొద్దికాలం క్రితం వారి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ బెంగతో భర్త వెంకటప్పరెడ్డి అనారోగ్యంతో మరణించారు. కొన్నాళ్లకు ఆమె మరో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని మధ్యవర్తి మహిళను ఆశ్రయించారు. ఆ మహిళ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం శేషాపురానికి చెందిన శివప్రసాద్‌కు ఈ విషయాన్ని చెప్పింది. అప్పటికే అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. అయినా.. నాగమణి ఆస్తిపరురాలని తెలుసుకున్న శివప్రసాద్ పథకం పన్నాడు. తన భార్య, కుమార్తె కొవిడ్‌తో మరణించారంటూ నకిలీ మరణ ధ్రువపత్రాలు తయారు చేసి నాగమణికి చూపాడు. నాగమణి వాటిని నమ్మడంతో 2022లో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు.

డబ్బొస్తుందని ఆశజూపి...: ఆమె ఆస్తిపై కన్నేసిన శివప్రసాద్ ఆర్‌బీఐ నుంచి కోట్లలో సొమ్ము రానుందని చెబుతూ కొన్ని నకిలీ పత్రాలు సృష్టించి, ఆ నగదు దక్కాలంటే కొంతసొమ్ము ఆర్‌బీఐకి చెల్లించాలని నమ్మించాడు. భర్త కదా అని ఆమె నమ్మడంతో ఆమె తండ్రి, సోదరుడు, పదిలక్షల వాళ్లతోనే ఆమె నుంచి సొమ్ము బదలాయించుకున్నాడు. అప్పటికే నాగమణి సంతకాలు ఫోర్జరీ చేసిన శివప్రసాద్ బెంగళూరులో మొదటి భర్త నుంచి ఆమెకు సంక్రమించిన రూ.15 కోట్ల విలువైన భూమిని, రూ.10 కోట్ల విలువైన భవనాన్ని అమ్మేశాడు. ఆమె ఆభరణాలను కూడా బ్యాంకులో తనఖా పెట్టాడు. బంధువుల పెళ్లికి వెళ్లాల్సి ఉందని, ఆభరణాలు కావాలని నాగమణి కోరగా అప్పటి నుంచి అతడు పరారయ్యాడు. భర్తను వెతుక్కుంటూ ఆమె బంగారుపాళ్యానికి రాగా.. అప్పటికే అతనికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిసింది. దీంతో బాధితురాలు ఎస్పీ మణికంఠను ఆశ్రయించి న్యాయం చేయాలని విన్నవించారు.

త్వరలోనే ధాన్యం రైతుల బకాయిలు చెల్లింపు

ఏపీమార్క్‌ఫెడ్ ఎండీ ఢిల్లీరావు

ఈనాడు, అమరావతి: ధాన్యం రైతుల బకాయిలను (ఖరీఫ్ 2024-25 పంట కాలానికి) త్వరలో చెల్లించనున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ ఢిల్లీరావు తెలిపారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి రూ.1,000 కోట్ల రుణం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4న అనుమతించిదన్నారు. మూడు రోజుల్లో ఆ మొత్తం మార్క్‌ఫెడ్‌కు బదిలీ అవనుందన్నారు. రుణం బదిలీ అయిన వెంటనే రైతుల బకాయిలు చెల్లిస్తామని తెలిపారు.

మాలిలో కిడ్నాపర్ల చెర నుంచి మా బిడ్డను కాపాడండి

అమరలింగేశ్వరరావు తల్లిదండ్రుల వేడుకోలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: 'అమ్మా.. ఆఫ్రికాలో ఎలా ఉంది? మాలిలో ఆపరేషన్ చేశారు కదా.. ఇప్పుడు బాగానే నడవగలుగుతున్నావా' అని చివరిసారిగా తన కుమారుడు అమరలింగేశ్వరరావు అన్న మాటలను గుర్తు చేసుకుని ఆ తల్లి కుమిలిపోతున్నారు. ఉపాధి కోసం ఆఫ్రికాలోని మాలి దేశం వెళ్లిన పల్నాడు జిల్లా మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన అమరలింగేశ్వరరావు వారం రోజుల క్రితం ఉగ్రవాదుల చేతిలో కిడ్నాప్‌కు గురైన విషయం తెలిసిందే. రోజులు గడుస్తున్నా ఆచూకీ లేకపోవడంతో అతని తల్లిదండ్రులు వెంకటరమణ, రాజ్యలక్ష్మి, భార్య, ముగ్గురు పిల్లలు ఆందోళన చెందుతున్నారు. ఆయన తల్లిదండ్రులు పలకరించగా.. 'అమరలింగేశ్వరరావు గ్రామంలో పదో తరగతి చదివాక మాచర్లలో ఐటీఐ పూర్తి చేశాడు. తర్వాత పల్నాడులో సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగం వచ్చింది. పెళ్లై ముగ్గురు పిల్లలు పుట్టాక కుటుంబ పోషణ కష్టమైంది. మరోవైపు ఫ్యాక్టరీలో పనిచేసే స్నేహితుడి ద్వారా మాలిలో ఉద్యోగం ఉందంటే దరఖాస్తు చేసి వెళ్లాడు. అప్పటికి 11 ఏళ్లు అయ్యింది. ఏటా ఒకసారి వచ్చి వెళ్తాడు. ఈసారి రెండు నెలల్లో వస్తానని మాతో అన్నాడు' అని తల్లి రాజ్యలక్ష్మి తెలిపింది. చివరిసారి జులై 1న ఫోన్‌లో తాము మాట్లాడామని, తర్వాత కిడ్నాప్ విషయం తెలిసిందని తల్లిదండ్రులు చెప్పారు. ఉగ్రవాదుల చెర నుంచి తమ కుమారుడిని విడిపించి క్షేమంగా ఇక్కడికి వచ్చేలా చూడాలని వారు వేడుకుంటున్నారు.

గ్రూప్-1 కేసులో మధుసూదన్‌కు బెయిల్

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 (2018) ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు, నిధుల దుర్వినియోగం కేసులో రెండో నిందితుడు, క్యామ్‌సైన్ మీడియా సంస్థ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్‌కు హైకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. విజయవాడ కోర్టులో రూ.25 వేల విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. అభియోగపత్రం దాఖలు చేసే వరకు ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరుకావాలని మధుసూదన్‌కు స్పష్టంచేశారు. మూల్యాంకనంలో అక్రమాలపై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం మధుసూదన్ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇటీవల వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి.. సోమవారం నిర్ణయాన్ని ప్రకటించారు. ఏపీపీఎస్సీతో చేసుకున్న ఒప్పందంలోని నిబంధనలకు అనుగుణంగానే మధుసూదన్ పనులు నిర్వహించారన్నారు. వైద్య నివేదికలు, కేసులోని వివరాలను పరిగణనలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు
- హైకోర్టులో నేడు విచారణ

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి(ఏ39) ఉపసంహరించుకున్నారు. సోమవారం జరిగిన విచారణలో వ్యాజ్యం ఉపసంహరణకు మోహిత్‌రెడ్డి తరఫు న్యాయవాది అభ్యర్థించారు. అందుకు అనుమతిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులిచ్చారు. సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని, కేసులో తనను నిందితుడిగా పేర్కొంటూ 'సాక్షి'గా విచారణకు రావాలని దర్యాప్తు అధికారి నోటీసు ఇవ్వడం చెల్లదంటూ హైకోర్టులో మోహిత్‌రెడ్డి క్వాష్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇటీవల జరిగిన విచారణలో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని అతని తరఫు సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు అభ్యర్థించగా, ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి నిరాకరించారు. అరెస్ట్‌పై ఆందోళన ఉంటే ముందస్తు బెయిలు పిటిషన్ వేసుకోవాలన్నారు.

వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రానుంది. 'మద్యం ముడుపులను తరలించడానికి నేను తుడా ఛైర్మన్‌గా ఉన్న సమయంలో వాహనాలను వినియోగించినట్లు నాపై ఆరోపణ చేస్తున్నారు. వాస్తవానికి అప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తుడా వాహనాలను వినియోగించం. రూ.కోట్లు తరలించడం సాధ్యం కాదు. నేను నేరానికి పాల్పడలేదు. నా ప్రతిష్ఠను దిగజార్చేందుకు రాజకీయ నేతలు చెప్పిన మాటలు విని పోలీసులు నన్ను ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారు' అని వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఇప్పటికే బెయిలు కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను విజయవాడ కోర్టు కొట్టివేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరారు.

బూనేటి చాణక్య బెయిల్ పిటిషన్ కొట్టివేత

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన రాజ్ కెసిరెడ్డి ప్రధాన అనుచరుడు బూనేటి చాణక్య (ఏ-8) బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం కొట్టేసింది. అతనికి బెయిల్ నిరాకరిస్తూ ఏసీబీ న్యాయస్థానం న్యాయాధికారి భాస్కర్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

● ఇంటి నుంచి ఆహారం తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మద్యం కుంభకోణం కేసు నిందితుడు రాజ్ కెసిరెడ్డి (ఏ-1) దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా విజయవాడ ఏసీబీ న్యాయస్థానం కొట్టేసింది.

● మద్యం కుంభకోణం కేసులో నిందితులైన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్‌నాయుడు బెయిల్ పిటిషన్‌లపై తదుపరి విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. వీరిద్దరికీ బెయిల్ ఇవ్వొద్దంటూ సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు.

మిద్దె పంట.. మేలు ఇంట

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

మొక్కలకు ఎండ తగలకుండా షేడ్‌నెట్ ఏర్పాటు

రైతేరాజు

విజయవాడ టీచర్స్ కాలనీలో ఉంటున్న వైద్యులు మన్నె గోపీచంద్, నాగభాస్కరాంబ దంపతులు మిద్దె తోట సాగు చేస్తున్నారు. కొన్నేళ్ల పాటు ఆస్పత్రి నిర్వహించి ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్నారు. పదేళ్ల నుంచి సేంద్రియ విధానంలో మిద్దె పంటలు పండిస్తూ.. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇల్లు కట్టుకున్నప్పుడే సాగుకు అనుకూలంగా తీర్చిదిద్దుకున్నారు. కుండీలు పెట్టుకునేలా గోడలు నిర్మించారు. వాటిపై ఇనుప స్టాండ్లు ఏర్పాటు చేశారు. అందులో కుండీలు, డ్రమ్ములు పెట్టారు. వాటిలో పూలు, ఫలాలు, కూరగాయల మొక్కలు నాటారు. భవనం పాడైపోకుండా యాంటీ శ్లాబ్ లీకింగ్ చేయించారు. దానిపై టైల్స్ వేయించారు. బిందు సేద్యం, సాధారణ పద్ధతిలో నీరు పోసి సంరక్షిస్తున్నారు. ఒక్క చుక్క నీరు కూడా శ్లాబ్‌పై నిల్వ ఉండకుండా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఇంటి ముందు, ప్రహరీ, మెట్ల పక్కన, మిద్దెపైన ఖాళీ లేకుండా మొక్కలు పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

మెట్ల మార్గంలో పెంచుతున్న మొక్కలు

ఎరువులు తయారు చేస్తూ..

ఇంట్లో నుంచి వచ్చిన కూరగాయల వ్యర్థాలు, వ్యాపారుల వద్ద పాడైపోయి మిగిలిన కూరగాయలు, రాలిన ఆకులను ఎరువుగా తయారు చేసి వాడుతున్నారు. బెండ, వంకాయ, దోస, కాకర, బీర, పొట్లకాయ, బత్తాయి, నారింజ, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, సీతాఫలం, రామాఫలం వంటి ఫలాల మొక్కలతో పాటు ఆరు రకాల మందారాలు, పది రకాల చామంతులు, కనకాంబ్రాలు, పారిజాతం, సన్నజాజి, విరజాజి, చుక్కమల్లి, బిళ్ల గన్నేరు, ఆకుకూరలు పెంచుతున్నారు. మొక్కలకు ఎండ తగలకుండా షేడ్‌నెట్ వేశారు. ఇద్దరూ ఇక్కడ పండిన ఆకుకూరలు, కూరగాయలు తినడమే కాకుండా బంధువులు, ఇరుగుపొరుగు వారికి కూడా ఇస్తున్నారు.

★ ఈ సందర్భంగా వైద్య దంపతులు మాట్లాడుతూ.. 'సేంద్రియ పద్ధతిలో మిద్దె తోటలో కూరగాయలు, ఆకుకూరలు, ఫలాల మొక్కలు పెంచుతున్నాం. వాటిని తిని ఆరోగ్యంగా ఉంటున్నాం. ఉదయం, సాయంత్రం రెండు గంటలు తోట పనికి కేటాయిస్తాం. ఇల్లు చల్లగా ఉంటుంది. మంచి గాలి వస్తుంది. ఆహ్లాదంగా ఉంటుంది.' అని వివరించారు.

ప్రశ్న: కాలీఫ్లవర్ పంటకు నేలలు, నాటే కాలం, ఎరువుల యాజమాన్యం గురించి వివరించండి? – కె.రంగారావు, రైతు, రుద్రవరం

సమాధానం: కాలీఫ్లవర్ పంటకు చల్లని వాతావరణం అవసరం. స్వల్పకాలిక రకాలకు జులై, ఆగస్టు నెలలు అనువైనవి. బాగా నీరు ఇంకే గరప నేలలు పంట సాగుకు అనుకూలం. విత్తనాన్ని సన్నని ఇసుకతో కలిపి మడుల్లో నారుపోసి, 30-35 రోజుల తరువాత నాటు వేయాలి. ఎరువుల యాజమాన్యానికి... హెక్టారుకు సుమారు 40-50 కిలోల భాస్వరం, 50 కిలోల పొటాష్ ఎరువును ఆఖరి దుక్కిలో వేయాలి. తరువాత హెక్టారుకు 60-80 కిలోల నత్రజనిని మూడు సమాన భాగాలుగా చేసి, తొలిసారి నారు నాటిన 25-30 రోజులకు, రెండో సారి 50-60 రోజులకు, మూడో సారి 75-80 రోజులకు వేయాలి. ఫలితంగా హెక్టారుకు దాదాపు 20 టన్నుల దిగుబడి పొందవచ్చు. **- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం** - ఘంటసాల, న్యూస్‌టుడే

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

డ్రోన్ వినియోగిస్తే.. సమయం.. ఖర్చు ఆదా

80శాతం రాయితీపై మంజూరు

డ్రోన్ గురించి రైతులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త సుధారాణి, వ్యవసాయ అధికారులు

ఘంటసాల, చల్లపల్లి, న్యూస్‌టుడే

వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, ప్రయోజనాలు, రాయితీ గురించి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డి.సుధారాణి, సస్యరక్షణ శాస్త్రవేత్త కె.రేవతి వివరించారు. డ్రోన్ కావాలంటే ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలి. అందులో ఒకరు ఇంటర్మీడియట్ లేదా అగ్రికల్చర్ డిప్లమా లేదా అగ్రికల్చర్ ఇంజినీరింగ్ చదివి ఉండాలి. అతనికి డ్రోన్ వినియోగంపై 15 రోజుల పాటు గుంటూరు లాంలో శిక్షణ ఇస్తారు. జిల్లా వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దాని ఖరీదు రూ.9.80 లక్షలు. అందులో రైతులు రూ.4.90 లక్షలు (50 శాతం) తమ ఖాతాల్లో ఉన్నట్టు బ్యాంకుకు చూపించాలి. 2 నెలల్లో దాని ఖరీదులో రూ.7.80 లక్షలు (80 శాతం) రాయితీతో రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్‌ను రైతులకు అందిస్తుంది. ఇంకా అన్నదాతలు చెల్లించాల్సిన రూ.2 లక్షలు నెల నెల వాయిదాల పద్ధతిలో మూడేళ్లలో చెల్లించాలి. డ్రోన్ ఆపరేట్ చేసే వ్యక్తికి రైతులు ఎకరానికి రూ.300-350 చొప్పున చెల్లిస్తారు.

ప్రయోజనాలు కొన్ని..

90 శాతం నీరు, 95 శాతం సమయం ఆదా చేయవచ్చు. 10 లీటర్ల ట్యాంకు సామర్థ్యం గల వ్యవసాయ డ్రోన్‌తో ఎకరా పొలాన్ని 10-15 నిమిషాల్లో రసాయన మందు చల్లవచ్చు. విత్తనాలు, పురుగులు, తెగుళ్లు, కలుపు మందులు, నీళ్లలో కరిగే ఎరువులు పిచికారీ చేయవచ్చు. రైతులు రసాయనాలు పిచికారీ చేయడం వలన కలిగే శ్వాసకోశ వ్యాధులను దూరం చేస్తుంది. బురదలో నడుస్తూ మందులు వేయాల్సిన అవసరం ఉండదు. పని ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది. ఎత్తు ఎక్కువగా పెరిగే మొక్కజొన్న, జొన్న, చెరకు తదితర పంటలకు తేలికగా మందులు పిచికారీ చేయవచ్చు. డ్రోన్ వాడినప్పుడు అదనంగా 6-7 సెట్ల బ్యాటరీలు దగ్గర ఉంచుకుంటే మంచిది.

అరటిలో సస్యరక్షణ చర్యలు



లంకలో సాగు చేసిన అరటి పంట

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : కృష్ణానది పరీవాహక లంక గ్రామాల్లో అరటి పంటను రైతులు సాగు చేశారు. సస్యరక్షణ చర్యలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు. ఆ వివరాలను ఉద్యాన శాఖ అధికారి చందు జోసఫ్ తెలియజేశారు. అరటి పిలకలు నాటే సమయంలో శుద్ధి అవసరం. పిలకలను మైక్రోక్రోటాపాస్ ద్రావణంలో 30 నిమిషాల పాటు నిల్వ ఉంచి నాటితే తెగుళ్లను ఎదుర్కొంటుంది. ఎకరానికి 900 నుంచి వెయ్యి పిలకల వరకు నాటుకోవాలి. పిలక నాటడానికి తవ్విన గుంతలో 300 గ్రాముల పాస్ఫరస్, ఐదు కిలోల పశువుల ఎరువు వేయాలి. మొక్క ఎదిగిన తర్వాత నత్రజని, పొటాషియం ఎరువులను తగిన మోతాదులో వాడాలి. అరటికి ఆశించే తెగుళ్లలో సిగటోకా ఆకుమచ్చ తెగులు ప్రధానమైంది. దాని నివారణకు మాంకోజెబ్ మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పనామా తెగులు పిలకల ద్వారా వ్యాపిస్తుంది. దాని నివారణకు శుద్ధి చేసిన పిలకలు నాటుకుంటే మంచిది.

గవర్నర్ పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

10న ఉద్యాన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

సూచనలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, పక్కన జేసీ గీతాంజలిశర్మ, ఎస్పీ గంగాధరరావు తదితరులు

ఆత్కూరు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం ఆత్కూరులో 10న గవర్నర్ పర్యటనలో భద్రతా లోపం తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. స్థానిక స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో జరిగే వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి డీజీ డా.ఎమ్.ఎల్.జాట్‌తో కలిసి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను జేసీ గీతాంజలిశర్మ, ఎస్పీ గంగాధరరావులతో కలిసి కలెక్టర్.. సోమవారం సభా ప్రాంగణ పరిసరాలను సందర్శించారు. అతిథులకు ప్రత్యేక వసతులు, పరిసరాల్లో స్వచ్ఛత, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని విశ్వవిద్యాలయం డీన్ ప్రసన్నకుమార్‌కు కలెక్టర్ సూచించారు. ప్రోటోకాల్ ప్రకారం కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులతో చర్చించిన కలెక్టర్.. పలు సూచనలు చేశారు. అసోసియేట్ డీన్ దొరాజీరావు, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, మెప్మా పీడీ సాయిబాబు, జిల్లా సంక్షేమ సాధికారత అధికారి షాహిద్‌బాబు, డీపీవో అరుణ, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

9న లేజర్ రన్ జట్ల ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నిడమానూరు జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో ఈ నెల 9వ తేదీన ఉమ్మడి కృష్ణా జిల్లా రేజర్ రన్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా మోడరన్ పెంటాథ్లాన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెలగపూడి ఉజ్వల్, మరీదు సురేంద్రబాబు తెలిపారు. అండర్-9, 11, 13, 15, 17, 19, 30 కేటగిరీలతో పాటు మాస్టర్ 'ఎ' 31-40, మాస్టర్ 'బి' 41-50, మాస్టర్ 'సి' 51+ కేటగిరీల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు అదే రోజు ఉదయం 8 గంటలకు పాఠశాల మైదానంలో పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఆధార్ కార్డుతో హాజరవ్వాలని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12వ తేదీన నరసరావుపేటలోని కోడెల శివప్రసాదరావు డీఎస్ఏ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో తలపడతారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94418 12694 నంబరులో సంప్రదించాలని సూచించారు.

వల్లభనేని వంశీకి అస్వస్థత

విజయవాడ ఆసుపత్రిలో చేరిక

చికిత్స పొందుతున్న వంశీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వైకాపా నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అస్వస్థతకు గురయ్యారు. శ్వాస సంబంధిత సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్న ఈయన.. సోమవారం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. బాపులపాడు మండలం ఎ.సీతారాంపురంలో నివాసం ఉంటున్న వంశీ సోమవారం ఉదయం గన్నవరం కోర్టులో హాజరయ్యారు. అనంతరం అక్కడకు వచ్చిన కార్యకర్తలు, అభిమానుల్ని కొద్దిసేపు కలిసి మాట్లాడారు. అక్కడ్నుంచి నేరుగా విజయవాడలోని ఆసుపత్రికి వెళ్లారు. జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్నా పలుమార్లు అనారోగ్యానికి గురై విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది గత నెల మొదటి వారంలో న్యాయస్థానాన్ని అభ్యర్థించి ఓ ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా తరచూ జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతుండడంతో గత శుక్రవారం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడ కొన్ని వైద్య పరీక్షల అనంతరం, ఇతర పరీక్షలు, వైద్య చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించినట్లు సమాచారం. దీంతో సోమవారం హుటాహుటిన బందరు రోడ్డులోని ఓ ఆసుపత్రిలో చేరారు. ముక్కులో ఓ రంధ్రం పూడుకుపోవడంతో శ్వాస తీసుకోలేకపోతున్నారని, అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాలని వైద్యులు పేర్కొన్నారని, రెండ్రోజుల పరిశీలన తర్వాత శస్త్రచికిత్స చేసే అవకాశముందని వంశీ అనుచరులు తెలిపారు.

సొంత నిధులతో క్యాంటీన్ ఏర్పాటు అభినందనీయం

రిబ్బన్ కోస్తున్న ఎంటీ కృష్ణబాబు, పక్కనే లక్ష్మీశ, డిల్లీరావు తదితరులు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: వైద్యులు ఆహారం తినేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు తమ సొంత నిధులతో క్యాంటీన్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు అన్నారు. విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వైద్యులు ఏర్పాటు చేసుకుని క్యాంటీన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొత్తం రూ.1.50 కోట్ల వైద్యుల నిధులతో క్యాంటీన్‌ను నిర్మించుకున్నారని, అందులో రూ.48 లక్షలు కొవిడ్ సమయంలో వైద్యులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఉన్నాయని పేర్కొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు, అడిషనల్ డీఎంఈ వెంకటేష్, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.ఏడుకొండలు, ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా.ఏవీ రావు తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్ల పరిశీలన

పరిశీలిస్తున్న గోపీచంద్, వివిధ జిల్లాల ఉద్యోగులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా సోమవరంలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను సోమవారం 13 జిల్లాల ఉపాధి హామీ పథకం ఉద్యోగులు పరిశీలించారు. వీటి నిర్మాణంలో సాంకేతిక వివరాలను ఉపాధి హామీ పథకం రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి(సీక్యూసీవో) గోపీచంద్ వివరించారు. ఇందుకు వినియోగించే కంకర, రాళ్ల గురించి చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎలా నిర్మించుకోవాలో వివరించారు. తక్కువ ఖర్చుతో నిర్మించే ఈ డ్రెయిన్ల వల్ల నీరు భూమిలో ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. మ్యాజిక్ డ్రెయిన్ల ఫొటో ప్రదర్శనను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ఇంజినీర్లు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర స్థాయి సిబ్బంది బస్సులో గ్రామానికివచ్చి వీటిని పరిశీలించారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, తిరుపతి, బాపట్ల జిల్లాల్లో ఎంపిక చేసిన 13 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఈ డ్రెయిన్లు నిర్మిస్తారు. ఉపాధి హామీ పథకం సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి జె.సురేష్‌బాబు, ఏపీడీ ఎన్.శ్రీనివాసరావు, ఏపీవో శరత్‌బాబు, స్థానిక తెదేపా నాయకుడు ఉప్పుకొండూరు గురుప్రసాద్, యోగానందం తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కరెన్సీనగర్ : ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రత్యేక కేటగిరీ కింద చేరబోయే ఫార్మసీ, అగ్రికల్చర్, బీఎస్సీ



నేడు, రేపు ఏపీఈసెట్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్

గణితం డిప్లొమా కోర్సులు చేసిన విద్యార్థులు ఏపీఈసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా నేడు, రేపు (8, 9 తేదీల్లో) తమ ప్రత్యేక కేటగిరీ ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేయించుకోవాలని అధికారులు తెలిపారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 8న ఆర్మీ సంతతి ర్యాంకర్లు 1 - 20,000 వరకు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అభ్యర్థులు 1- 15 వేల ర్యాంక్ వరకు, ఆంగ్లో ఇండియన్ అభ్యర్థులు ఒకటి నుంచి ఆఖరి ర్యాంకు వరకు హాజరు కావాలి. 9న ఆర్మీ సంతతి 20,001 నుంచి చివరి ర్యాంకు వరకు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 15,001 నుంచి చివరి ర్యాంక్ వరకు, పీడబ్ల్యూడీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఒకటి నుంచి చివరి ర్యాంకు వరకు హాజరుకావాలి. జనరల్ కేటగిరీ కౌన్సెలింగ్‌కు ఐచ్ఛికాలు ఇవ్వడం సోమవారం నుంచి ప్రారంభమైంది. ఐచ్ఛికాలను 11న మార్చుకునే వీలు కల్పించారు. 13న సీట్లు కేటాయిస్తారు.

పాఠశాలల్లో సమస్యలున్నాయా?.. పథకాలు అందలేదా?

ఈనాడు మీతోడు

ఇటీవలే విద్యా సంవత్సరం మొదలైంది. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు దృష్టికి తీసుకువచ్చే అవకాశం 'ఈనాడు-మీతోడు' కల్పిస్తోంది. పాఠశాలల్లో వసతుల లేమి, తల్లికి వందనం, విద్యా మిత్ర కిట్లు రాకపోవడం, ప్రైవేటు పాఠశాలల గుర్తింపు, ఫీజులు, పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు, తరగతి గదులు, తాగునీటి ఇబ్బందులు తదితర సమస్యలపై ఫోన్ చేస్తే డీఈఓ సమాధానాలిస్తారు. మీరు చేయాల్సినదంతా దిగువ సెల్ నంబరుకు నిర్ణీత సమయంలో కాల్ చేయడమే. **- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే**

9న డీఈఓ సుబ్బారావుతో 'ఈనాడు' ఫోన్‌ఇన్

97041 69998 | తేదీ: బుధవారం (9.7.2025) | సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - పటమట

అవకాశమివ్వండి.. రూ.కోట్లు గడిస్తా!

నా అనుభవంతో ట్రేడింగ్‌లో మరింత సంపాదిస్తా
పోలీసు విచారణలో నిందితుడు ఆదిత్య వేడుకోలు

"'నేను షేర్లలో పెట్టుబడి పెట్టడంలో దిట్ట. ఏ షేర్ ధర ఎప్పుడు పెరుగుతుందో పసిగట్టగలను. షేర్ మార్కెట్లో బడా వ్యక్తులతో నేరుగా మాట్లాడగలిగే పరిచయాలు ఉన్నాయి. ఒక్క ఛాన్స్ ఇవ్వండి ప్లీజ్.. ట్రేడింగ్‌లో నాకున్న అనుభవంతో భారీగా సంపాదిస్తానని' అద్విక ఎండీ ఆదిత్య పోలీసుల విచారణలో వేడుకున్నాడు."

"అధిక వడ్డీల పేరుతో రూ.కోట్లు దోచేసిన అద్విక ట్రేడింగ్ కంపెనీ కేసులో పోలీసులు నిశిత దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ఆదిత్య జల్సాలకు రూ.కోట్లు వెచ్చించినట్లు తేల్చారు. దుబాయ్‌లో మూడు కార్యాలయాలు ప్రారంభించి, ట్రేడింగ్ ఖాతాలనూ తెరిచాడు."

"మొత్తంగా 1,109 మంది రూ.350 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు తేలింది. ఏజెంట్లకు కమీషన్ల రూపంలో.. పెట్టుబడిదారులకు వడ్డీల రూపంలో రూ.250 కోట్లు చెల్లించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నిందితుడు అనారోగ్యంతో బాధపడుతున్నందున సోమవారం విచారణ సాగలేదు."

ఆ ఖాతాలపైనే గురి..

విజయవాడలో రెండేళ్లలో మూడుచోట్ల కార్యాలయాలు మార్చినట్లు గుర్తించారు. కొన్నినెలల కిందట దుబాయ్‌లో మూడుచోట్ల మూడు కార్యాలయాలు పెట్టాడు. ట్రేడింగ్ కోసం గోల్డెన్ లీప్, మల్టీ బ్యాంకు, ఖబానాలో మూడు ఖాతాలు తెరిచాడు. ఈ ఖాతాల నగదు నిల్వలు, లావాదేవీల స్టేట్‌మెంట్లు ఇవ్వాలని నగర పోలీసులు ఆయా బ్యాంకులకు రాసినా వారు పట్టించుకోలేదు. ఫెమా చట్టం కింద కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా లేఖలు పంపనున్నారు. ఈవివరాలు వస్తే.. ఆ ఖాతాల్లో ఎంత నగదు ఉంది? అన్ని లావాదేవీలు తేలనున్నాయి.

కరెంట్ ఖాతాల వివరాలు కొలిక్కి..

సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి బోర్డు తిప్పేసే వరకు సంస్థకు చెందిన ఏడు కరెంటు ఖాతాలు ఉన్నాయి. వీటి వివరాలు అందించమని ఆయా బ్యాంకులకు దర్యాప్తు అధికారి లేఖలు రాయగా.. ఇవి సోమవారం పోలీసులకు అందాయి. ఇవేకాక.. ఆదిత్య వ్యక్తిగత ఖాతా వివరాలూ చేరాయి. ఖాతాల్లో జమైన, బదిలీ అయిన నగదు వివరాలు విశ్లేషిస్తున్నారు. లెక్క తేలేందుకు 7-10 రోజులు పట్టే వీలుందని భావిస్తున్నారు.

విచ్చలవిడి ఖర్చులు...

దుబాయ్ కార్యాలయాల్లో ఇంటీరియర్ డిజైనింగ్‌కు రూ.20-30 లక్షలు వెచ్చించినట్లు తెలిసింది. విజయవాడ కార్యాలయంలోనూ రూ.20 లక్షలు వెచ్చించాడు. డిపాజిటర్లను ఆకట్టుకునేందుకే ఈ ఎత్తుగడ. నగరంలో రూ.3 కోట్ల విలువైన ఫ్లాట్ కొన్నాడు. నిరుడు.. ఓ ఏజెంట్‌కు కారు కొనేందుకు అతనితోపాటు ఆదిత్య కూడా షోరూమ్‌కు వెళ్లాడు. కారు కొన్న తర్వాత సిబ్బందికి టిప్‌గా రూ.50 వేలు ఇచ్చాడు. ఏజెంట్లను ఉత్తేజపరిచేందుకు గోవాలో విలాసవంత పార్టీలు ఇచ్చేవాడు.

ఇప్పటికి 110 మంది ఫిర్యాదు...

ఏజెంట్ల ఖాతాలు, వారి లాకర్లు కూడా ఫ్రీజ్ అయ్యాయి. ఇప్పటికే 44 మంది ఏజెంట్లు వివరాలు ఇవ్వగా.. ఐదుగురు పరారీలో ఉన్నారు. నిత్యం బాధితులు ఏసీపీ కార్యాలయానికి వస్తూనే ఉన్నారు. ఇప్పటికి 110 మంది ఫిర్యాదు చేశారు. ఏజెంట్లకు ఎంత కమీషన్ ఇచ్చాడు? బాధితులకు వడ్డీ రూపంలో ఎంత తిరిగిచ్చాడు? మిగిలిన నగదు ఎక్కడుందో తెలుసుకునేందుకు పోలీసులు సమగ్రంగా విచారిస్తున్నారు.

పండ్ల మొక్కల పండగకు శ్రీకారం నేడే

ఈనాడు, అమరావతి: పల్లెపండగ స్ఫూర్తితో పండ్ల మొక్కల పండగకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. ఉభయ జిల్లాల్లో ఒకేరోజు భారీఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం చేపట్టనున్నారు. నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో ఉద్యానశాఖ సహకారంతో నిర్వహిస్తున్నారు.

ఒకేరోజు 503 ఎకరాల్లో ...

నిరుడు రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 4 వేల కిమీ మేర రహదారులు నిర్మించి కూటమి సర్కారు చరిత్ర సృష్టించింది. అదే తరహాలో ఉమ్మడి కృష్ణాలో ఒకే రోజు 503 ఎకరాల్లో మొక్కలు నాటి మరో నూతన ఆవిష్కరణకు రంగం సిద్ధం చేసింది. గంపలగూడెం మండలం గోసవీడులో 500 ఎకరాల్లో, గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో 3 ఎకరాల్లో మొక్కలు నాటుతారు. మామిడి, జామ, సీతాఫలం, సపోటా, నేరేడు, మునగ, బత్తాయి, అంజీరా, చింత, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, అంజీరా, యాపిల్‌బేర్, స్వీట్ ఆరెంజ్, దానిమ్మ, తదితర మొక్కలు నాటుతారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారు.

రూ.4.53 కోట్ల నిధులు: ఒక్క రోజులో నాటే మొక్కలకు రూ.4.53 కోట్లు కేటాయించారు. మొక్కలు, సామగ్రి కొనుగోలు, కూలీల వేతనాలు తదితర ఖర్చులు ఉంటాయి. పండ్ల తోటల ఏర్పాటు లక్ష్యం... ఎన్టీఆర్‌లో 4,000 ఎకరాలు, కృష్ణా జిల్లాలో 300 ఎకరాలుగా నిర్ణయించారు. మంగళవారం నుంచి పండ్ల తోటల ఏర్పాటు మొదలు కానుండగా.. జులై ఆఖరుకు లక్ష్యం పూర్తి చేసేలా అధికారులు కృషి చేస్తున్నారు.

శాకంబరికి కూరగాయల హారం

ఇంద్రకీలాద్రిపై మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న శాకంబరి ఉత్సవాలకు దాతలు ఇచ్చిన కూరగాయలతో దండలు సిద్ధం చేస్తున్నారు. ఆలయ ఈవో శీనానాయక్ హారతి ఇచ్చి అలంకరణకు శ్రీకారం చుట్టారు. సేవా మహిళలు కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో దండలు అల్లారు.

- ఈనాడు, అమరావతి

ఎల్పీఎస్ లేఔట్లలో సర్వే

పచ్చదనం పెంపునకు స్థలాల గుర్తింపు

ఈనాడు - అమరావతి: అమరావతి పునర్నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు కేటాయించిన ఎల్పీఎస్ లేఔట్లలో సర్వే ప్రారంభమైంది. వీటిలో మౌలిక వసతుల కల్పన బాధ్యతను ప్రభుత్వం ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్)కు అప్పగించింది. ఇటీవల వరకు ఈ బాధ్యతలను సీఆర్డీఏ పర్యవేక్షించింది. రాజధానిలోని 18 ఎల్పీఎస్ జోన్లలో సర్వేలో భాగంగా పచ్చదనం పెంచే ప్రాంతాలను గుర్తిస్తున్నారు. ఎల్పీఎస్ లేఔట్లలో మౌలిక వసతుల అభివృద్ధికి అధికారులు టెండర్లు పిలిచి, గుత్తేదారులతో ఒప్పందం చేసుకున్నారు. క్షేత్రంలో ఈ పనులు పురోగతిలో ఉన్నాయి. మౌలిక వసతుల కల్పనలో భాగంగా 1,281 కి.మీ నిడివితో రహదారులు, వాన నీటి మళ్లింపు డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, విద్యుత్తు, కమ్యునికేషన్ల డక్ట్‌లు నిర్మించాలి.

సర్వే నిర్వహిస్తున్న సీఆర్డీఏ, ఏడీసీ సిబ్బంది

1,500 ఎకరాల్లో 489 పార్కులు...: అమరావతిని హరిత రాజధానిగా అభివృద్ధి చేసే చర్యల్లో భాగంగా లేఔట్లలో విస్తృతంగా ఉద్యానాలను పెంచనున్నారు. అన్ని లేఔట్లలో 1,500 ఎకరాలను ఇందుకు ఉద్దేశించారు. అనువైన ప్రాంతాల కోసం సీఆర్డీఏ, ఏడీసీఎల్, సర్వే శాఖ అధికారులు అన్వేషిస్తున్నారు. గుర్తించిన ప్రాంతాల్లో హద్దులను నోటిపై చేస్తున్నారు. తర్వాత వాటిల్లో పార్కులను అభివృద్ధి చేస్తారు. ఇందులో తొలి ప్రాధాన్యంగా జోన్-7లో చేపట్టగా... 22 పార్కులు రానున్నాయి. అన్ని జోన్లలో 489 ఉద్యానాలను అభివృద్ధి చేయనున్నారు. వీటి విస్తీర్ణం మేరకు కమ్యూనిటీ, నైబర్‌హుడ్, సిటీ, టౌన్ పార్కులు, తదితర పలు రకాలను ప్లాట్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకున్నారు.

(c) eenadu

కష్టపడి పనిచేయడం కాదు..స్మార్ట్‌గా ఆలోచించి పని చేయండని సీఎం

ఆలోచిస్తే అధనంగా సంపాదించొచ్చు గురూ..!

చంద్రబాబు తరచూ చెబుతున్న మాటలు విజయవాడ మురళీనగర్ శ్రీరాంజీ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఇస్త్రీ చేసే బల్లంట్ల రాము తూచా తప్పకుండా పాటిస్తున్నాడు. కాలంతోపాటే వచ్చే మార్పులను..మెలకువలను గమనిస్తే చేసేపని తేలికవ్వడమే కాక అదే కష్టంతో రెండింతల డబ్బులు సంపాదించొచ్చు అని నిరూపిస్తున్నాడు. ఇస్త్రీ పెట్టెలో బొగ్గులు ఒక్కసారి రాజేస్తే మళ్లీ ఎప్పుడుకావాలంటే అప్పుడు ఆపి వెలిగించడానికి అవ్వదు. దానికితోడు బరువైన ఇత్తడి పెట్టెతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇస్త్రీ చేయడంతో రాత్రికి నొప్పులు..నిప్పుల సెగ వల్ల వేడి తప్పదు. బొగ్గుల నుంచి నిప్పురవ్వలు ఎగిరి బట్టలపై పడి కాలిపోవడం వంటి ప్రమాదాలు ఉంటాయి. ఈ కష్టాలన్నింటికీ గ్యాసుతో నడిచే ఇస్త్రీ పెట్టెతో చెక్‌పెట్టవచ్చని చెబుతున్నాడు. మొదట పెట్టెబరువు సగం తగ్గి..జబ్బల నొప్పి ఉండదు. సిల్క్ బట్టకి తగ్గించుకుని..కాటన్ బట్టకి వేడి పెంచుకుని చేసుకోవడమే కాదు..ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆపి వెళ్లిపోవచ్చు. బొగ్గులకు రోజుకు రూ.150 చొప్పున నెలకు రూ.4500 అయ్యేది..నేడు నెలకు గ్యాసుకు రూ.1000 మాత్రమే ఖర్చు అవుతుంది. మార్కెట్‌లో కూడా బొగ్గుల రేటు ఎక్కువవ్వడమే కాకుండా..అమ్మకందారులు బరువు ఎక్కువ తూగడానికి వాటిని తడిపి అమ్ముతున్నారు. తడి ఆరబెట్టడానికి సమయం వృథా..లేదంటే మంట అంటుకోక..పొగతో ఇబ్బంది. విజయవాడ వన్‌టౌన్‌లో రూ.7500 తో గ్యాస్ ఇస్త్రీ పెట్టె, రెగ్యులేటర్, పైప్ కి ఖర్చుపెట్టానని ఇప్పుడు ఆరోగ్యంగా.. సౌకర్యవంతంగా ఉందని చెబుతున్నాడు. పాతమూసధోరణిలో కాకుండా..మారుతున్న కాలంతో పాటు మనం మారాలని సందేశం ఇస్తున్నాడీ రాము. - ఈనాడు, అమరావతి.

పోగొట్టుకున్నా.. తిరిగి పొందొచ్చు!

ఆర్టీసీలో 'లాస్ట్ ప్రాపర్టీ హ్యాండోవర్'తో సాధ్యం

✦ శివరామ్‌ప్రసాద్... రేపల్లె నుంచి విజయవాడ వచ్చారు. విజయవాడలో బస్సు దిగే హడావుడిలో పర్సు పడిపోయినా చూసుకోలేదు. అందులో డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, ఏటీఎం, పాన్ కార్డులు, రూ.5 వేలు ఉన్నాయి. దిగాక సరిచూసుకుంటే బస్సు వెళ్లిపోయింది. టిక్కెట్‌పై ఉన్న వివరాలతో కండక్టర్‌ను సంప్రదించగా విజయవాడ బస్టాండ్‌లోని యర్నింగ్ సెక్షన్‌లో ఉన్నట్లు తెలుసుకుని తిరిగి తీసుకున్నారు

✦ ఆరు నెలల కిందట అవనిగడ్డ నుంచి గుడివాడ వెళుతున్న బస్సులో మొగదారయ్య బ్యాగు మర్చిపోయి చల్లపల్లిలో దిగారు. తర్వాత చూసుకుంటే బస్సు గుడివాడ వెళ్లిపోయింది. తెలిసిన వారి సలహా మేరకు డిపో మేనేజర్ నంబరు తీసుకుని సంప్రదించగా బ్యాగు తిరిగి అప్పగించారు. ఇందులో పొలం పాస్ పుస్తకాలు, ఆధార్, రేషన్ కార్డులు ఉన్నాయి.

ఈనాడు - అమరావతి

ప్రయాణ హడావుడిలో బస్సులో మర్చిపోయిన వస్తువులపై పూర్తిగా ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదు. వాటిని తిరిగి పొందే అవకాశం ఉంది. ఆర్టీసీ దానికోసం లాస్ట్ ప్రాపర్టీ హ్యాండోవర్ విధానాన్ని అన్ని డిపోల పరిధిలో అమలు చేస్తోంది. ఈ ప్రక్రియ తెలియక చాలా మంది బస్సులో వస్తువులు పోగొట్టుకుని నష్టపోతున్నారు.

తిరిగి పొందడమెలా: బస్సుల్లో సామగ్రి మర్చిపోతే హైరానా పడకుండా టిక్కెట్‌పై కండక్టర్ గురించి తెలిపే గుర్తింపు సంఖ్య ఉంటుంది. ఆ బస్సు ఏ డిపో పరిధిలోదో తెలుసుకుని మేనేజర్‌కు ఫోన్ చేయాలి. టిక్కెట్‌పై ఉన్న గుర్తింపు సంఖ్య చెబితే కండక్టర్, డ్రైవర్ ఫోన్ నంబర్, వివరాలు చెబుతారు. వారి ద్వారా సామగ్రి జాడ తెలుసుకోవచ్చు.

నిర్ధారించాకే అప్పగింత: డ్రైవర్, కండక్టర్లు ట్రిప్ పూర్తి కాగానే బస్సులో సామగ్రి ఎవరైనా మర్చిపోతే వాటిని డిపోలోని యర్నింగ్ సెక్షన్‌లో డీపీ క్లర్క్‌కు అప్పగించాలి. పోగొట్టుకున్న వారు నేరుగా

ఆ క్లర్క్‌ను సంప్రదిస్తే.. పోగొట్టుకున్న వస్తువుల వివరాలు క్షుణ్నంగా తెలుసుకుని... వారివే అని నిర్ధారించుకునే అప్పగిస్తారు.

మనకూ బాధ్యత ఉండాలి: ఉమ్మడి కృష్ణా జిల్లాలో 13 డిపోలు.. 1,186 బస్సులు ఉన్నాయి. రోజుకు సగటున 3.1 లక్షల మంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. సిబ్బంది బాధ్యత లేకుండా వ్యవహరించినా, తోటి ప్రయాణికులు ఆ వస్తువులను సిబ్బందికి అప్పగించకున్నా.. వస్తువులు దొరకడం సాధ్యం కాదు. ప్రయాణికులు బాధ్యతగా వ్యవహరించాలి. బస్సుల్లో దొరికిన వస్తువులను కండక్టర్‌కు అప్పగిస్తే పోగొట్టుకున్న వారికి సులభంగా చేర్చవచ్చు. నెలకు సగటున రెండు ఘటనలు జరుగుతాయనీ.. పోగొట్టుకున్న వారికి వస్తువులు అప్పగిస్తున్నామని ఆర్టీసీ ఆర్ఎం దానం తెలిపారు.

వేళకు రాకుంటే..!

గ్రీవెన్స్‌లో అధికారుల హాజరుపై కలెక్టర్ ఆగ్రహం

మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, హాజరైన అధికారులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్/ గ్రీవెన్స్) కార్యక్రమానికి జిల్లా అధికారులు ఠంచన్‌గా వేళకు రావాలని, ఆలస్యమైనా, గైర్హాజరయినా సస్పెన్షన్ వేటు తప్పదని కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. పీజీఆర్ఎస్ నిర్వహించే నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరానికి సోమవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టర్ చేరుకున్నారు. అధికారుల హాజరు సమయాలపై ఆరా తీశారు. కొందరు ఆలస్యంగా వస్తున్న విషయాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. తుది హెచ్చరికలు జారీ చేశారు. నిర్ణీత వేళకు రావాలని ముందుగానే డీఆర్వో ద్వారా పంపిన సమాచారాన్ని పలువురు బేఖాతరు చేయడాన్ని అలసత్వంగా భావిస్తామన్నారు. పీజీఆర్ఎస్ నిర్వహించే రోజు ఉదయం 9.30 గంటలకు సమావేశ మందిర తలుపులను మూసి వేయాలని సిబ్బందిని ఆదేశించారు. 10 గంటల కల్లా అధికారుల హాజరుపట్టికను తమ ముందు ఉంచాలన్నారు. సమయపాలన అధికారుల పనితీరుకు కొలమానమన్నారు. టీం ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రగతిలోనూ, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ జిల్లాను అగ్రగామిగా నిలపడం ప్రతి ఒక్కరి కర్తవ్యంగా భావించాలని సూచించారు. కాగా కొందరు హెచ్‌వోడీలు రాకుండా కింది స్థాయి అధికారులను పంపుతున్నారు. దీనిపైనా కలెక్టర్ దృష్టి సారించాల్సి ఉంది.

138 అర్జీల స్వీకరణ.. పీజీఆర్ఎస్‌లో మొత్తం 138 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు అధికంగా 53 వినతులు వచ్చాయి. పోలీస్ 23, మున్సిపల్ 17, పౌరసరఫరాలు, వైద్య, పంచాయతీ రాజ్ శాఖలకు ఆరు చొప్పున అర్జీలు అందాయి. మిగతావి డీఆర్డీఏ, వ్యవసాయ, డ్వామా, గనులు, రిజిస్ట్రేషన్, విభిన్న ప్రతిభావంతులు తదితర శాఖల సంబంధించినవి ఉన్నాయి. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

శాకంబరి ఉత్సవాలకు సర్వం సిద్ధం

మహామండపంలో కూరగాయలకు హారతి ఇస్తున్న ఈవో శీనానాయక్, వైదిక కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల 8నుంచి నిర్వహించే శాకంబరి ఉత్సవాలకు దాతలు ఇచ్చిన కూరగాయలు సోమవారం దేవస్థానానికి చేరాయి. దాతలు ఇచ్చిన కూరగాయలకు అర్చకులు పూజ చేశారు. ఈవో శీనానాయక్ హారతి ఇచ్చి దండల అలంకరణకు శ్రీకారం చుట్టారు. మల్లికార్జున మహామండపంలో మహిళలు దండలు తయారు చేస్తున్నారు. మంగళవారం ఉదయం 8గంటలకు విఘ్నేశ్వరపూజ, సాయంత్రం 4గంటలకు కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠాపన, మండపారాధన కార్యక్రమాలు రుత్వికులు నిర్వహిస్తారు. 9న మూలమంత్ర హవనాలు, మండప పూజలు, హారతి, 10న ఉదయం 8గంటలకు సప్తశతీ పారాయణ, మహావిద్యా పారాయణ, శాంతి పౌష్టిక హోమాలు, 9.30 గంటలకు మహాపూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఈవో పేర్కొన్నారు. గత ఏడాది మూడు రోజులకు 36 టన్నుల కూరగాయలు దాతలు అందజేయగా, ఈసారి మొదటి రోజు అలంకరణకు 16 టన్నులు ఇచ్చారు.

సాగు ఖర్చు తగ్గాలని.. గుంటక పరికరం తయారీ

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం మునగచర్లకు చెందిన సన్నకారు రైతు షేక్ మీరా హుస్సేన్ సాగు ఖర్చులు తగ్గించుకోవడానికి గుంటక పరికరం తయారుచేసి తానే అంతర కృషి చేస్తున్నారు. అతనికి రెండెకరాల పొలం ఉంది. ఎకరం పొలంలో పత్తి సాగు చేస్తున్నారు. పత్తిలో సాళ్ల మధ్య కలుపు మొక్కలను ఎడ్లతో దున్నించడానికి ఎకరానికి రూ.800 కిరాయి చెల్లించాలి. ఇలా నాలుగు సార్లు దున్నించాలంటే రూ.3,200 ఖర్చు అవుతుంది. ఈ వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం అతను ఫౌండ్రీలో రూ.2700 వెచ్చించి ఇనుప గుంటక పరికరం తయారు చేయించారు. దీనిపై బరువు కోసం మట్టి మూటకట్టి ఎడ్లకు బదులు తానే ఎకరం పత్తిలో రెండు రోజులు శ్రమించి దున్నుకున్నారు. దీనివల్ల ఖర్చు ఆదా అవుతుందని, ఇలా అంతరకృషి చేయడంవల్ల కలుపు సమస్య నివారించుకోవచ్చని చెప్పారు. ఖర్చులు తగ్గించుకోడానికి తానే ఈ పరికరంతో పలుమార్లు అంతర కృషి చేస్తున్నానని చెప్పారు. - నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

దయతలచండి.. దారిచూపండి

'జాతీయ రహదారుల అధికారులూ.. మొద్దు నిద్ర వీడండి' అంటూ విజయవాడలోని కృష్ణలంక రాణిగారితోట సర్వీసు రోడ్డులో.. ఎన్‌హెచ్ ప్రాంతీయ కార్యాలయం సమీపంలో కృష్ణలంక వాసులు పేరుతో స్థానికులు ఆసక్తికర బ్యానర్ సోమవారం ఏర్పాటు చేశారు. కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాల ప్రజలు జాతీయ రహదారి దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో 'బ్యానర్‌పై మేము కూడా మనుషులమని గుర్తించండి.. ఇంకా ఎంత మంది చనిపోవాలి.. ఎన్ని కుటుంబాలు రోడ్డున పడాలి' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో ఏడాది వ్యవధిలో సుమారు పది మంది ప్రాణాలు కోల్పోయారు. ఎంతో మంది క్షతగాత్రులయ్యారు. ఈ సమస్యకు పరిష్కారం చూపకపోతే ఈ నెల 10వ తేదీన జాతీయ రహదారుల భవనాన్ని ముట్టడిస్తామని బ్యానర్‌పై పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, కృష్ణలంక

రాజ్‌భవన్‌లో మాక్ డ్రిల్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : రాజ్‌భవన్‌లో సోమవారం రాత్రి ఆక్టోపస్ బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. తొలుత ఆక్టోపస్ డీఎస్పీ ఐ.తిరుపతయ్య నేతృత్వంలో భద్రతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్, అగ్నిమాపకశాఖ, విద్యుత్తు, ట్రాఫిక్, సిటీ సెక్యూరిటీ వింగ్, నగరపాలక సంస్థల ఆధ్వర్యంలో అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆక్టోపస్ బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే పోలీసు బలగాలు ఏ విధంగా స్పందిస్తాయో ప్రత్యక్షంగా చేసి చూపించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్టోపస్, పోలీస్, అగ్నిమాపక, సిటీ సెక్యూరిటీ వింగ్ ఇతర సంస్థల సిబ్బంది

డ్రెయిన్ పూడిపోకుండా పరికరం

పరికరం ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ తదితరులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఔట్‌ఫాల్ డ్రెయిన్ వద్ద చెత్త నిలిచి పూడిపోకుండా ఉండే పరికరాన్ని సోమవారం నగరంలో ఏర్పాటు చేశారు. రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పరికరం మోటార్ సాయంతో పనిచేస్తుంది. ఈ స్టీల్ పరికరం ద్వారా చెత్తను సైతం వాహనాల్లోకి సునాయాసంగా తరలిస్తుందని స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీ తెలిపారు. ప్రాజెక్టు డీఈ బూసిరెడ్డి, స్థానిక శానిటరీ అధికారి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ల ముందుకు పోలీసులు

పటమట, న్యూస్‌టుడే: రెండు ఫిర్యాదుల విషయమై ఈ నెల 10న దిల్లీలో తమ ఎదుట హాజరు కావాలని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబును జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్లు ఆదేశించాయి. గత ఏడాది పటమట, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లలో అందిన ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులను విచారణ చేశారు. ఆరోపణలు నిజం కావని కేసు నమోదు చేయకుండా పక్కనపెట్టారు. దాంతో ఇబ్రహీంపట్నం స్టేషన్‌లో ఫిర్యాదుదారు ఆదిలక్ష్మి జాతీయ ఎస్టీ కమిషన్‌కు, పటమట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారుడు శంకర్ జాతీయ ఎస్సీ కమిషన్‌కు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో యూనిట్ ఇన్‌ఛార్జి సీపీ రాజశేఖరబాబు, ఆదిలక్ష్మి కేసు విచారణ అధికారి, వెస్ట్ జోన్ ఏసీపీ దుర్గారావు, శంకర్ కేసు విచారణ అధికారి, సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని కమిషన్లు ఆదేశించాయి.

పీజీ విద్యార్థిని బలవన్మరణం

భవానీపురం, న్యూస్‌టుడే: మానసిక వ్యాధితో బాధపడుతున్న యువతి (24) బలవన్మరణానికి పాల్పడినట్లు భవానీపురం స్టేషన్ పోలీసులు తెలిపారు. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్ వద్ద పసుపులేటి యశస్విని కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటోంది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పీజీ చదువుతున్న ఆమె కొన్నాళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతోంది. ఇటీవల ఆమెను ఎయిమ్స్‌లో సైకాలజిస్టుకు చూపించగా నిద్రమాత్రలు ఇచ్చారు. అందులో ఎనిమిది మాత్రలను గతంలో మింగడంతో చికిత్స చేయించారు. ఈనెల 6న సాయంత్రం తల్లి సుజాత దుర్గగుడికి వెళ్లారు. తిరిగి రాత్రి 9గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా తలుపు గడియ పెట్టి ఉంది. తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా గదిలో ఫ్యాన్‌కు యశస్విని ఉరి వేసుకుంది. 108 సిబ్బంది వచ్చే సమయానికే చనిపోయింది. మానసిక వ్యాధి కారణంగానే కుమార్తె చనిపోయినట్లు తల్లి సుజాత ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'అక్రమాలపై విచారణ జరపండి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వంలో నాడు-నేడు కార్యక్రమాల్లో కడప జిల్లాకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి చేసిన అవినీతిపై ప్రభుత్వం విచారణ జరపాలని విజయవాడకు చెందిన గుత్తేదారు కంచి రాజేష్ కోరారు. సోమవారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 2020 సంవత్సరంలో నాడు-నేడు పనుల కోసం గ్రీన్ చాక్ బోర్డు మెటీరియల్ సరఫరా చేసేందుకు సుదర్శన్‌రెడ్డితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. దీని నిమిత్తం పలు దఫాలుగా రూ.1.50 కోట్లు చెల్లించానని తెలిపారు. కానీ మెటీరియల్ సరఫరా చేయలేదని, తాను ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వలేదని వాపోయారు. వైకాపాను వీడిన సుదర్శనరెడ్డి.. ప్రస్తుతం తెదేపాలో ఉన్నారని, డబ్బుల గురించి అడిగితే బెదిరిస్తున్నారని రాజేష్ ఆరోపించారు. దీనిపై ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఈ ఏడాది జనవరిలో ఫిర్యాదు చేశానని చెప్పారు. ఇది సివిల్ ఫిర్యాదు అని చెప్పి.. కేసు నమోదు చేయలేదన్నారు. తనకు న్యాయం చేయాలని రాజేష్ విజ్ఞప్తి చేశారు.

నకిలీ బంగారం తాకట్టు కేసులో మరో నిందితుడి అరెస్టు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి కరూర్ వైశ్యా బ్యాంకులో నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు పొందిన కేసులో మరో నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పట్టణ సీఐ వీరాస్వామి తెలిపిన వివరాల మేరకు. . విజయవాడ పరిధిలోని పటమటలో ఓ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న ప్రకాష్... ఆ బ్యాంకులో పనిచేసే అప్రైజర్ మదన్‌కుమార్, స్థానికంగా నివాసం ఉండే తాపీమేస్త్రి రాజశేఖర్‌రెడ్డి కలిసి 145 ఖాతాల ద్వారా 19.17 కిలోల నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.9.12కోట్లు రుణం తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే మదన్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా తెనాలి పైవంతెన సమీపాన ప్రకాష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి సంబంధించి నిందితుడి పేరుపై ఉన్న ఆస్తులను అటాచ్ చేయడం జరుగుతుందన్నారు. ఆయా వివరాల కోసం సంబంధిత శాఖలకు లేఖలు పంపినట్లు చెప్పారు. రూ.లక్ష నగదు రికవరీ చేసినట్లు ప్రకటించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో డీఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షణలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ వీరాస్వామి తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

ప్రకటన

నా క్లయింటు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లబ్బీపేట బ్రాంచి, లబ్బీపేట, విజయవాడ వారి తరపున చీఫ్ మేనేజరు గారి నుండి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియచేయునది ఏమనగా..

ఈ క్రింద ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని, సదరు స్థిరాస్తి యజమాని అయిన శ్రీ గోపు ప్రణీత్, తండ్రి (లేటు) శ్రీనివాసరావు, విజయవాడ వాస్తవ్యులు నా క్లయింటు బ్యాంకుకు హామీగా చూపుచూ ఋణ సదుపాయమును కోరియున్నారు.

తన తల్లిగారైన శ్రీమతి గోపు పద్మ గారికి ఆమె తోడికోడలు, శ్రీమతి గోపు పద్మజ గారి నుండి ది.16-07-2005న దఖలు దస్తావేజు నెం.2729/2005, సబ్ రిజిస్ట్రీ, గుణదల ... [illegible]

Dr. ధారా సత్యనారాయణ, Advocate ... Cell No. 94403 20435. Phone No. 0866-2573736

శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం ... Computer No.31696 / 2025 Dt.07.07.2025 ... www.apeprocurement.gov.in ... బహిరంగ వేలము తేది: 16-07-2025

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ... 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని రూల్ 8 (6) క్రింద 30 రోజులు ... తేది: 07-07-2025 ప్రదేశం: విజయవాడ అధీకృత అధికారి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

EENADU Classifieds

BUSINESS SERVICES · REAL ESTATE · LAND FOR SALE · PLOT FOR SALE · FINANCIAL SERVICES · JOBS · PEOPLE CARE · OLD AGE HOME

WALK -IN - INTERVIEW ... visionauto.jobs@gmail.com

Looking for Senior Shift Supervisor & Maintenance Manager & Training Officer for a Spinning Mill Company with Plant @ Medchal with minimum of 10 Years. Exp. 8187860597.

Wanted PRO's (Public Relationship Officer) to work in a reputed organization at Guntur. 81219 60902, 77290 15053.

Wanted Primary Teachers to Teach Mathematics, EVS, English N High School, Physics, Hindi, Social. SRKV 94907 42908.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616

గమనిక

91.9FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

(c) eenadu

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
ఇబ్రహీంపట్నం గ్రామీణం 9773300487 గొల్లపూడి 8008574638

? జి.కొండూరు శివారు కొత్తూరు గ్రామంలో కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు పారకపోవడంతో దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నాం. - పి.వెంకట్రావు గ్రామస్థుడు ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. తక్షణమే సిబ్బందిని పంపించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.
- బసవలింగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి

స్పందనకు వందనం

• కోడూరు గ్రామంలో నెలల తరబడి కాలువల్లో పూడిక తీయక అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 7వ తేదీన 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురించగా స్పందించిన కార్యదర్శి, సర్పంచి ప్రసాద్ సోమవారం గ్రామంలో సిబ్బందితో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

పూడిక తొలగింపును తనిఖీ చేస్తున్న కమిషనర్ మనోజ

• పట్టణంలోని 12వ వార్డులో డ్రెయినేజీ అంతా పూడికతో పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ మనోజ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. పురపాలిక కార్మికులతో శుభ్రం చేయించారు. • పట్టణంలోని 6 వార్డుల్లో కాలువల్లో పూడికలు తొలగించాలని స్థానికుల ఫిర్యాదును కమిషనర్ మనోజ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక కార్మికులతో పూడిక తొలగింపజేశారు. • పట్టణంలోని 8వ వార్డులో రహదారి పక్కన పిచ్చి చెట్లు పెరిగి అపరిశుభ్రంగా ఉందని ప్రజలు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కు తెలుపగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో రహదారి పక్కన శుభ్రం చేయించారు. • పట్టణంలోని ఇందిరా కాలనీలో రహదారి పక్కన చెత్త కుప్పలు అడ్డుగా ఉన్నాయని స్థానికులు చేస్తున్న ఫిర్యాదుపై పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. పురపాలిక కార్మికులతో రహదారి పక్కన చెత్త లేకుండా తొలగింపజేశారు. - న్యూస్‌టుడే, తిరువూరు

పట్టాదారు పాస్ పుస్తకాలకు వినతి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : పూర్వీకుల నుంచి సంక్రమించి, తమ సాగులో ఉన్న అసైన్డు భూములను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలని మైలవరం మండలం గణపవరానికి చెందిన కోట సురేష్, ఏసుపాదం, ప్రసాద్ తదితరులు నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై న్యాయవాది, సీపీఎం నాయకుడు రావూరి రమేష్‌బాబుతో కలిసి వారు కలెక్టర్ జి.లక్ష్మీశకు విజ్ఞప్తి చేశారు.

కొత్తూరు చెరువులో అక్రమ తవ్వకాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ మండలం కె.తాడేపల్లి శివారు కొత్తూరు గ్రామంలోని ఆర్.ఎస్.నంబరు 63 లోని చెరువులో గత 20 రోజుల నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి అక్రమంగా తవ్వుతున్నారని మెండెం జమలయ్య తదితరులు కలెక్టర్ జి.లక్ష్మీశకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో ఛాయాచిత్రాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కృష్ణా జలాలను నూజివీడు ట్రిపుల్‌ఐటీకి తాగునీటి అందించే పైపులైన్ కె.తాడేపల్లిలోని నివాస ప్రాంతాల్లో లీక్ కావడంతో స్థానికులకు ఇబ్బందిగా మారిందని పలువురు వినతి పత్రం సమర్పించారు.

కలెక్టర్‌కు వివరాలు వెల్లడిస్తున్న జమలయ్య

నేనున్నా.. నిఘా పెట్టేస్తున్నా
కేసుల ఛేదనకు సీసీ కెమెరాల సాయం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ఇటీవల కాచవరం ఇందిరమ్మ కాలనీకి వెళ్తున్న ఆటోడ్రైవర్‌ను ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టి చంపారు. దీనికి అది రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసును పక్కదారి పట్టించాలని ప్రయత్నం చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లోని దృశ్యాలను పరిశీలించి అది హత్యగా నిర్ధారించి నిందితులను జైలుకు పంపారు.

కేతనకొండ పొలాల్లో పనిచేసేందుకు ఇబ్రహీంపట్నం నుంచి వెళ్తున్న కూలీల ఆటోను మూలపాడు వద్ద ఓ కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఆ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. మూలపాడు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలోని దృశ్యాల సాయంతో కారును గుర్తించి డ్రైవరును అరెస్టు చేశారు.

కొండపల్లికి చెందిన బాలిక ఇంట్లో చెప్పకుండా ఇబ్రహీంపట్నం రింగు సెంటరు వద్ద ఆమె కోసం వేచి ఉన్న యువకుడితో కలిసి ఆటోలో విజయవాడ వైపు వెళ్లిపోయింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి 24 గంటలో వారిని గుర్తించి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

జూపూడి వద్ద జాతీయరహదారి బ్లాక్ స్పాట్ వద్ద స్తంభానికి ఏర్పాటు చేశారిలా..

గతంలో తలకు మించిన భారం

గ్రామాలతో పాటు జాతీయరహదారి వెంట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో ఇబ్రహీంపట్నం పోలీసులు పలు చోరీలు తదితర కేసులను ఛేదించి నిందితులను పట్టుకుంటున్నారు. గతంలో ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలోని జాతీయరహదారి వెంట జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పద మృతి కేసులు, ద్విచక్రవాహన చోరీలు, ఇంటి దొంగతనాలు తదితర నేరాల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేయడం పోలీసులకు తలకుమించిన భారంగా తయారైంది. ప్రస్తుతం పోలీసు స్టేషన్ పరిధిలో విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా నీడలో పర్యవేక్షణ చేస్తుండడంతో నేరాలకు అడ్డుకట్ట పడింది.

నిరంతర పర్యవేక్షణ

ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని కొండపల్లి పురపాలిక, గ్రామీణ మండలం పరిధిలో 316 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందులో 98 మ్యాట్రిక్స్ కెమెరాలు గతంలోనే ఉన్నాయి. 17 ప్రధాన కూడళ్లలో నాలుగు డైరెక్షన్లలో 68 కెమెరాలు ఉన్నాయి. బహుళ అంతస్థుల భవనాల వద్ద మూడు చొప్పున 150 కెమెరాలు బిగించారు. మరో వంద కెమెరాల ఏర్పాటుకు అధికారులు రూపొందించిన ప్రణాళికలు త్వరలో అమలు కానున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

నేరాల కట్టడికి సాయం

ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వల్ల పలు కేసులను ఛేదించి నిందితులను అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేస్తున్నాం. సాంకేతికతను వినియోగించుకుంటూ నేరాలను కట్టడి చేస్తున్నాం.
- చంద్రశేఖర్, సీఐ ఇబ్రహీంపట్నం

ఆలయంలో అన్ని వసతులు కల్పిస్తాం

కొండపల్లి, న్యూస్‌టుడే: భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ప్రాంగణంలో అన్ని వసతులు కల్పించేందుకు ఆలయ నూతన కమిటీ సభ్యులందరూ కృషి చేస్తారని శ్రీ గాయత్రీ ఆలయం గౌరవ అధ్యక్షుడు, వైస్ ఛైర్మన్ శ్రీను అన్నారు. కొండపల్లి చైతన్యనగర్‌లోని గాయత్రీ క్షేత్రం పాలక వర్గ ఎన్నిక, సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. శివస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో అధ్యక్షుడిగా వంగేటి వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా బసవ ఉమా, ప్రధాన కార్యదర్శిగా వాసులు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ కొన్నేళ్లుగా మరుగున పడిన ఆలయ అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో మాధురి, సురేష్, సోమయాజులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు అందిస్తున్న ఛైర్మన్ చిట్టిబాబు, తెదేపా నాయకులు

రాష్ట్రాభివృద్ధికి సాంకేతిక బాటలు

కొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధికి సాంకేతిక బాటలు వేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. కొండపల్లి మెప్మా రిసోర్స్ పర్సన్లకు ఛైర్మన్ చిట్టిబాబు ట్యాబ్‌లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో ఒకరిని పారిశ్రామికవేత్తగా రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ముఖ్యంగా పొదుపు సంఘ మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రణాళికలను రూపొందిస్తోందన్నారు. అందులో భాగంగానే రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు సీతారామయ్య, మేనేజర్ శ్రీధర్, సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ వెంకటేశ్వరమ్మ, వెంకయ్య, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తున్నారు..

పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీ పరిధిలో డ్రెయినేజీల్లో పూడిక, చెత్తతో మురుగు నీటి పారుదల సమస్యపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. సోమవారం రెడ్డిగూడెం పంచాయతీలోని 2 వార్డుల్లో సీసీ రహదారి పక్కన ఉన్న డ్రెయినేజీలను సిబ్బందితో శుభ్రం చేయించారు. ఎంపీడీవో టి.కె.వి.రమణ, ఈవోపీఆర్డీ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు పనులు పర్యవేక్షించారు.

ఈనాడు కథనానికి స్పందన

స్నేహపూర్వకంగా సాగుదాం

తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఎమ్మెల్యే శ్రీనివాసరావు కరచాలనం

గంపలగూడెం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు నియోజకవర్గాలైన తిరువూరు, మధిర నుంచి వారిరువురూ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. తిరువూరు నియోజకవర్గంలోని గంపలగూడెం మండల సరిహద్దునే భట్టి ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గం ఉంది. ఈ నేపథ్యంలో రెండు నియోజకవర్గాల ప్రజల మధ్య స్నేహపూర్వక సహాయ సహకారాలు అందించుకోవాలని మాట్లాడుకున్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయంలో ఏర్పడిన పరిచయం 3 దశాబ్దాలైనా మా మధ్య స్నేహం నడుస్తోందన్నారు. ఈ సందర్భంగా కొలికపూడి.. విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

సజావుగా నామినేషన్లు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తగూడెం పాలసంఘం సభ్యుల ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో నిర్వహించాల్సి ఉండగా, జాతీయ రహదారి పక్కన ఇబ్బంది నేపథ్యంలో చిలుకూరివారిగూడెంలోని కార్యాలయంలో ప్రక్రియను పూర్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఎన్నికలను తాము బహిష్కరిస్తున్నామంటూ తెదేపా ఆదివారమే ప్రకటించినా, గత పరిణామాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ఎస్సై కె.సుధాకర్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి ఎన్నికల అధికారి ఎం.వెంకటేశ్వరరావు నామినేషన్లను స్వీకరించారు. నాలుగు స్థానాలు ఖాళీగా ఉండగా, అందులో 2 జనరల్, మరో 2 మహిళలకు కేటాయించారు. వైకాపా మద్దతుతో మొత్తం ఐదుగురు నామినేషన్లను దాఖలు చేశారు. పోటీ లేని నేపథ్యంలో నాలుగు స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. తాను ఉన్నతాధికారుల సూచనల మేరకు, నిబంధనల ప్రకారం ఎన్నిక నిర్వహించడమే తన బాధ్యత అని, తనపై విమర్శలపై తానేమీ చెప్పదలచుకోలేదని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

నామినేషన్ పత్రాలు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు

ప్రభుత్వ రాయితీలు వినియోగించుకోండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా గుంటుపల్లి గ్రామీణ పశువైద్యశాల ఆవరణలో సోమవారం పశుగ్రాస పెంపకాలపై పశుపోషకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందుకు హాజరైన జేడీ హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసాలకు అందిస్తున్న రాయితీలను వివరించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఉచితంగా మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టరు మోసెస్ వెస్లీ, అసిస్టెంట్ డైరెక్టర్లు రాధాకృష్ణమూర్తి, శ్రీనివాసరావు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పూర్ణిమ, తెదేపా నాయకుడు తిరుమలరావు, కొండపల్లి, గుంటుపల్లి పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.


తిరువూరు: కాకర్లలో పశుగ్రాసం పరిశీలించిన పశుసంవర్ధకశాఖ అధికారులు

కాకర్ల(తిరువూరు), న్యూస్‌టుడే: జాతీయ పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కాకర్లలో సోమవారం పశుపోషకులకు గ్రాసం పెంపకంపై పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు సీవో-4 బహువార్షిక పశుగ్రాసం కాండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించి, నవధాన్యాలతో మాగాణిలో సాగు చేసిన పచ్చిరొట్టను పరిశీలించారు. పశుసంవర్ధకశాఖ విజయవాడ ఉపసంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, ఏడీ హెచ్‌లు కిషన్‌సింగ్, సునంద, పశువైద్యాధికారులు అభిలాష్, శ్వేత, వీఎల్వో ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు

చనమోలు సేవలు చిరస్మరణీయం

జి.కొండూరు: అరటికాయలు పంచుతున్న లక్ష్మీతిరుపతమ్మ, అరుణ తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మాజీ మంత్రి దివంగత చనమోలు వెంకట్రావు వర్ధంతిని వెలగలేరు, జి.కొండూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం జి.కొండూరులో వృద్ధులు, పేదలకు పలాలు పంచారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, సర్పంచి మండల అరుణ, నాయకులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: మైలవరంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక పాత ప్రభుత్వాస్పత్రి ఎదుట ఉన్న చనమోలు, రాజీవ్‌గాంధీ, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు, వారి సేవలను కొనియాడారు. నాయకులు గిరిధర్‌కుమార్, రామకృష్ణ, పిట్ల నాగేశ్వరరావు, దుర్గారావు, ఆంజనేయులు, సుధాకర్, వెంకటరెడ్డి, చంటి తదితరులు పాల్గొన్నారు.

నేడు గోసవీడుకు కలెక్టర్ లక్ష్మీశ

గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని గోసవీడులో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు పర్యటిస్తారని ఎంపీడీవో డి.బాబూరావు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటల సాగుపై రైతులను ప్రోత్సహించే కార్యక్రమంలో పాల్గొని మామిడి మొక్కలు నాటతారని చెప్పారు. అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులు, విగ్రహావిష్కరణలో ఎంపీ కేశినేని చిన్ని పాల్గొంటారని, ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆయనతో పాటు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఉండనున్నారు.

పంచాయతీని వీడిన జూనియర్ అసిస్టెంట్

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పెన్నేరు అజయ్‌కుమార్‌ను సోమవారం రిలీవ్ చేసినట్లు విజయవాడ గ్రామీణ మండలం ఎంపీడీవో విగ్గిన్స్ తెలిపారు. 'ఈనాడు'లో సోమవారం 'పంచాయతీలో పాతుకుపోయారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి రిలీవ్ చేసినట్లు పేర్కొన్నారు. అజయ్‌కుమార్‌ను చందర్లపాడుకు బదిలీ చేస్తూ గత నెలలోనే డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు.

గంపలగూడెం: కరపత్రాలు అందజేస్తున్న దేవదత్

మైలవరంలో..

విస్సన్నపేట: తాతకుంట్లలో


ఇబ్రహీంపట్నం: ఛైర్మన్ చిట్టిబాబు ఆధ్వర్యంలో..

ఇంటింటా సుపరిపాలన

మైలవరం, గొల్లపూడి, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు : 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో సోమవారం కూటమి నాయకులు ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ఏడాది పాలనలో అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు.

ఉమాపతికి విశేష పూజలు

కొత్తపల్లి గుడిలో అలంకరించిన శివలింగం

కొత్తపల్లి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లి సమీప కట్లేరులోని గోపాలస్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమాగౌరీశంకరుని ఆలయంలో సోమవారం అర్చకులు పి.కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించి పుష్పాలతో అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ

తిరువూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ చూపుతారని పట్టణానికి చెందిన డాక్టర్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. విద్యాభ్యాసం చేస్తున్న వారికి ఆరోగ్యం, వ్యాయామం, పౌష్టికాహారం కూడా ముఖ్యమేనన్నారు. పాత తిరువూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం లయన్స్‌క్లబ్, సమత, లెజెండ్స్ క్లబ్బుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళ, బుధవారాల్లో ఉచితంగా బ్లడ్ గ్రూపింగ్, దంత, నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు కూడా ఉచితంగా అందజేస్తామని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పీవీ.రావు, కొమ్మినేని రాజేశ్ ఖన్నా, డీజే నరసింహారావు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ జీవీ లక్ష్మి అధ్యక్షత వహించారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

మైలవరం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని, మందకృష్ణ మాదిగ పుట్టినరోజును సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక సిద్ధిపేట వద్ద ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించి కేకు కోశారు. కార్యక్రమంలో విశ్రాంత ఏబీసీడబ్ల్యూఓ వీరాస్వామి, సర్పంచి మంజుభార్గవి, నాయకులు నారాయణ, నాగరాజు, ఏసు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కీర్తిరాయునిగూడెంలో దొండపాటి విజయ్, వెల్వడంలో పత్తిపాటి ప్రభాకరరావు తదితరుల ఆధ్వర్యంలో జెండా ఎగరవేసి, వేడుకలు చేశారు.

అవీ ఇవీ

షర్బత్ పంపిణీ

గొల్లపూడి, న్యూస్‌టుడే: మొహర్రంను పురస్కరించుకుని గొల్లపూడిలోని పోసాని నరసింహారావుచౌదరి ఉన్నత పాఠశాల సమీపంలో షర్బత్‌ను తెదేపా మైనార్టీ నాయకుడు కరీముల్లా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మైనార్టీ పెద్దలను సన్మానించారు.

సమ్మె జయప్రదానికి పిలుపు

మైలవరం, న్యూస్‌టుడే: ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మిక, కర్షక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం మైలవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులపై ద్విచక్ర వాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి, లేబర్ కోడ్‌ల రద్దు కోసం సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు శ్రీనివాసరావు, సురేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, విస్సన్నపేట, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ తిరువూరులో సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో సోమవారం ద్విచక్రవాహనాలపై ప్రదర్శన చేశారు. సీఐటీయూ, భవన నిర్మాణ సంఘం జిల్లా, మండల నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, రవి, రమేష్, ఖాసిం పాల్గొన్నారు. విస్సన్నపేటలో సీపీఎం మండల కార్యదర్శి వి.నాగరాజు ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని చీమలపాడులో రెండు రోజుల కిందట యువకుడిపై జరిగిన హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై సీహెచ్.కృష్ణ తెలిపారు. శుక్రవారం రాత్రి తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన గుగులోతు హేమంత్‌నాయక్‌పై అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు మూకుమ్మడిగా కత్తులతో దాడి చేసిన సంగతి తెలిసిందే. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా నిందితులైన గుగులోతు తెండూల్కర్‌నాయక్, దోపతి రాజేశ్, బానోతు విజయ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. వారిని తిరువూరు న్యాయస్థానంలో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో నూజివీడు జైలుకి తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

మూలపాడులో జూదరులు..

ఇబ్రహీంపట్నం గ్రామీణం: మూలపాడులో జూదమాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు శిబిరంపై దాడిచేసి 9 మందిని అదుపులోకి ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.11,430 నగదు స్వాధీనం చేసుకున్నారు.

(c) eenadu

విజయవాడ తూర్పు

స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికకు 6 నామినేషన్లు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ స్థాయీ సంఘం నూతన సభ్యులుగా పోటీ చేసేందుకు వైకాపా నుంచి ఆరుగురు సభ్యులు ఇప్పటి వరకు నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి డి.చంద్రశేఖర్ ప్రకటించారు. నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసినందున దాఖలైన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ 8వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. శ్రీరంశెట్టి పూర్ణచంద్రరావు, షేక్ రహమతున్నీసా, మొహమ్మద్ రెహానా నాషిద్, పుప్పాల నరసకుమారి, ఉద్దంటి సునీత, అలంపూరు జయలక్ష్మి నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

డయల్ యువర్ డీఎం నేడు

ఆటోనగర్, న్యూస్‌టుడే: ఆటోనగర్ ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆటోనగర్ డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆటోనగర్ డిపో నుంచి చెన్నై, బెంగళూరు, తిరుపతి, కర్నూలు, విశాఖపట్నం, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు నడుపుతున్న సర్వీసులకు సంబంధించి సమస్యలు, సలహాల కోసం మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య 99592 25463 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందనకు వందనం

❖ గుణదల ఈఎస్ఐ ఆస్పత్రి ప్రాంతంలో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి రాజారావు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించారు. సిబ్బందిని పంపి డబ్బాలు, తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిని తీయించివేశారు. మందులు చల్లించారు.

❖ మూడో డివిజన్ గుణదల ఊర్మిళనగర్‌లో భూగర్భ డ్రెయినేజీ మ్యాన్‌హోల్ పొంగుతోందని స్థానిక నివాసి రాబర్ట్ ఏఈ దీక్షితులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పూడిక తీయించారు.

❖ 20వ డివిజన్ కృష్ణలంక హైస్కూల్ రోడ్డు మసీదు ఎదురుగా 20-102/347 విద్యుత్ స్తంభానికున్న దీపం కొంత కాలంగా వెలగడం లేదని స్థానిక నివాసి ప్రసాద్ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేశారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

అర్హులకే లబ్ధి.. అక్రమాలకు స్వస్తి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం, సరకులు పంపిణీ చేస్తున్నాయి. కొన్నిచోట్ల అవి అనర్హులకు చేరుతున్నాయని, లబ్ధిదారులకు ఇవ్వకపోయినా.. ఇచ్చినట్లు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంది. ముఖ ఆధారంగా పనిచేసే పోషణ్ ట్రాకర్ యాప్‌ని అందుబాటులోకి తెచ్చింది. సరకులు, పోషకాహారం లబ్ధిదారుల ముఖ గుర్తింపు తీసుకున్నాకే పంపిణీ చేస్తున్నారు. ఫలితంగా అక్రమాలను నియంత్రించి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుంది.

పారదర్శకంగా పంపిణీ

నియోజకవర్గంలో 93 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 993 మంది గర్భిణులు, 810 మంది బాలింతలు, 6 నెలల్లోపు చిన్నారులు 998 మంది, ఆరు

లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపు తీసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్త

నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 5270 మంది, మూడేళ్లు పైబడిన వారు 5354 మంది ఉన్నారు. 93 మంది కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నారు. వారంతా పోషకాహారం అందించడంతో పాటు చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన యాప్‌లు లోపాలమయంగా ఉండేవి. సరకులు బయటకు వెళ్లేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక పోషకాహారం లబ్ధిదారులకు పక్కాగా అందేలా చర్యలు చేపట్టింది. ఇటీవల బాల సంజీవని యాప్ 2.0 తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీ నుంచి ముఖ ఆధారిత గుర్తింపు అమల్లోకి తెచ్చింది. ఫలితంగా లబ్ధిదారులు కేంద్రానికి వచ్చి సరకులు తీసుకెళ్తున్నారు. అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా సరకుల పంపిణీ ప్రక్రియ సాగుతోంది. ఆ రెండు యాప్‌ల్లో వివరాల నమోదు వల్ల ఎప్పటికప్పుడు సమాచారం అధికారులకు చేరుతోంది. 'పౌష్టికాహారానికి ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. ప్రభుత్వాల లక్ష్యానికి అనుగుణంగా అర్హులకు లబ్ధి అందేలా పర్యవేక్షిస్తున్నాం. ముఖ ఆధారిత గుర్తింపు వల్ల అక్రమాలకు కళ్లెం పడింది' అని విజయవాడ గ్రామీణం సీడీపీవో పి.భానుమతి అన్నారు.

రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

అధికారులతో కలిసి పీఎన్‌బీఎస్ పరిసరాల్లో రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె

కృష్ణలంక, న్యూస్‌టుడే: కృష్ణలంక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. సోమవారం సత్యం హోటల్ సెంటర్, బందరు లాకుల సెంటర్, బస్‌స్టేషన్ పరిసరాలను ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కృష్ణలంక ప్రాంత ప్రజలు జాతీయ రహదారి దాటే విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్య పరిష్కరించేందుకు అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు చెప్పారు. సత్యం హోటల్ సెంటర్‌లో తక్షణం వేగ నిరోధకాలు ఏర్పాటు, బందరు లాకుల సెంటర్ వద్ద వెహికల్ అండర్ పాస్ నిర్మాణం, బస్‌స్టేషన్ నుంచి కృష్ణలంక పీఎస్ వరకు రహదారి మార్జిన్ల విస్తరణ చేయనున్నట్లు చెప్పారు. అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ సంజీవరాయుడు, డీఈ శ్రీనివాసరావు, ఏడీసీపీ ప్రసన్నకుమార్, సీఐలు నాగరాజు, బాలమురళీకృష్ణ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 22 అర్జీలు

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరవాసుల సమస్యలను గడువు లోపు పరిష్కరించాలని, ఆయా సమస్యలు మళ్లీ ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన 22 వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాధ్యులైన అధికారులు క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. భవానీపురం దర్గా ప్లాట్లలో నిర్మాణాలకు ప్లాన్లు మంజూరు, బస్సు షెల్టరు తొలగింపు, కొండరాళ్లు జారి పడడం, కొండ ప్రాంతాలకు తాగునీటి సరఫరా, ఆక్రమణల తొలగింపు, అక్రమ కట్టడాలు, టీడీఆర్ బాండ్ల జారీ తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. అధికారులు డి.చంద్రశేఖర్, సంజయ్ రత్నకుమార్, శ్రీనాథ్‌రెడ్డి, అర్జునరావు, పి.సృజన, పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, మాల్యాద్రి, లతా, బి.సోమశేఖర్ రెడ్డి, ఎ.శ్రీధర్ పాల్గొన్నారు.

కొండ ప్రాంత వాసులను తరలించండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కొండ ప్రాంతాల్లో ప్రమాదకరమైన ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. పాతబస్తీ, చిట్టినగర్, రామరాజ్యనగర్, విద్యాధరపురం లేబర్ కాలనీ, భవానీపురం, ఆర్టీసీ వర్క్‌షాపు, కుమ్మరిపాలెం ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. స్థానిక సమస్యలు తెలుసుకొని సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో కొండలపైన నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున, అటువంటి వారిని గుర్తించి కబేళా ప్రాంతంలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్లు వారికి కేటాయించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని అన్నారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు పరిశీలించారు. విద్యాధరపురం క్రీడా ప్రాంగణం ప్రహరీ పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించారు. ఇంజినీరింగ్ పనుల్లో పురోగతి సాధించాలని, పనులను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు.

తెదేపా కార్యకర్తలకు ఆర్థిక సాయం

కృష్ణలంక, న్యూస్‌టుడే: తెదేపా తిరిగి అధికారంలోకి వచ్చిందంటే దాని వెనుక కార్యకర్తల శ్రమ ఉందని, అటువంటి వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెదేపా యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. రాణిగారితోట 17వ డివిజన్ తెదేపా కార్యాలయంలో సోమవారం ముగ్గురు కార్యకర్తలకు తన సొంత నిధులు రూ.30 వేలు సహాయంగా అందించారు. క్రాంతి మాట్లాడుతూ.. నిస్వార్థంగా పార్టీ జెండా మోసే కార్యకర్తలు తెదేపాకు ఉన్నారని, వారి శ్రమ వల్లే పార్టీ తిరిగి అధికారంలోకి వస్తోందని అన్నారు. 17వ డివిజన్‌కు చెందిన షేక్ రమీజాకు వైద్యం కోసం రూ.15 వేలు, 5వ డివిజన్‌కు చెందిన దాసుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు, 19వ డివిజన్‌కు చెందిన షేక్ పాతిమాబేగంకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. రాయి రంగమ్మ, కొప్పోలు శ్రీనివాస్, పల్లా సాగర్, మొకర రమణ, షేక్ సునాబీ, అప్పలనాయుడు, హజరత్ తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎం విజయవంతానికి పిలుపు

మాట్లాడుతున్న కలెక్టర్ జి.లక్ష్మీశ, వేదికపై డీఈవో సుబ్బారావు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : విద్యార్థుల సమగ్రాభివృద్ధికి దోహదపడేలా ఈ నెల 10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ (పీటీఎం) నిర్వహిస్తున్నామని, అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. నగరంలోని బిషప్ అజరయ్యా బాలికోన్నత పాఠశాలలో ప్రైవేటు విద్యాసంస్థల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం నిర్వహించాలని కోరారు. గ్రామ, జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, షైనింగ్ స్టార్స్, పాఠశాలలో చదివి ఉన్నత స్థానాల్లో నిలిచిన ప్రముఖులను ఆహ్వానించి సత్కరించాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలని చెప్పారు. తల్లి పేరుతో ఒక మొక్క నాటాలని కోరారు. డీఈవో యు.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ సమాచారంతో ఓటరు జాబితాల సవరణ

ఎన్టీఆర్ కలక్టరేట్, న్యూస్‌టుడే : ఓటరు జాబితాలను సవరించే తరుణంలో వాస్తవ సమాచారం ఉండేలా చూడాలని విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య సూచించారు. ప్రవాసాంధ్రులు, పీడబ్ల్యూడీ, శాశ్వతంగా చిరునామా మారిన ఓటర్లతో పాటు, మరణించిన వారి వివరాలను తప్పకుండా సేకరించాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విచారణకు వెళ్లినప్పుడు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. నగరంలోని సబ్ కలెక్టరేట్ ఆడిటోరియంలో తూర్పు నియోజకవర్గ బీఎల్వోల శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ఆర్డీవో హాజరై పలు సూచనలు చేశారు. ఎన్నికల విభాగ ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్ గూడపాటి సుజాత, సీనియర్ అసిస్టెంట్ జి.వరప్రసాద్, బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) పాల్గొన్నారు.

లయోలా నూతన కరస్పాండెంట్‌గా రెక్స్ ఏంజిలో

కరెన్సీనగర్: నగరంలోని ఆంధ్రా లయోల కళాశాల నూతన కరస్పాండెంట్‌గా రెక్స్ ఏంజిలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు కరస్పాండెంట్‌గా పనిచేసిన సగాయరాజ్ గుంటూరు లయోల పబ్లిక్ స్కూల్‌కు బదిలీపై వెళ్లారు. రెక్స్ గతంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా, పరీక్షల నియంత్రణ అధికారిగా, వివిధ విభాగాల డైరెక్టర్‌గా పని చేశారు. ఆయన్ని పాదర్లు రెక్టార్ పీఆర్ జాన్, ప్రిన్సిపల్ మిల్కీయోర్, కళాశాల స్టాఫ్ అసోసియేషన్ ఛైర్మన్ జి.సహాయ భాస్కరన్, అధ్యాపకులు అభినందించారు.

రెక్స్‌ని అభినందిస్తున్న ఫాదర్లు

సీసీ చప్టాల ఏర్పాటు

స్పందనకు వందనం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మూడో డివిజన్ కరెన్సీనగర్ దొండపాటి నాంచారయ్య వీధి నుంచి హైవే సర్వీస్ రోడ్డుకు వెళ్లే రహదారి డ్రెయిన్‌పై చప్టాలు ప్రమాదభరితంగా మారాయని 'ప్రమాదకరంగా చప్టా... పట్టించుకోపోతే ఎట్లా' శీర్షికన ఈ నెల ఒకటో తేదీన ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. ధ్వంసమైన చప్టా ప్రాంతంలో కొత్తవి ఏర్పాటు చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు వెడల్పు తగ్గకుండా గడ్డర్లు వేయండి

ప్రమాదాలు చోటుచేసుకోకుండా పుల్లేటి కట్ట వెంట రక్షణ చర్యలు చేపడుతున్నారు. వెటర్నరీ కాలనీ, లయోల కళాశాల ప్రహరీ వెంబడి ఇప్పటికే ఇనుప గడ్డర్లు వేశారు. ప్రభుత్వ దంత కళాశాల నుంచి పనులు చేస్తున్నారు. కొన్నిచోట్ల డ్రెయిన్ వైపు స్థలం ఉన్నా.. రోడ్డువైపు గడ్డర్లు వేస్తున్నారు. రహదారి కుచించుకుపోతోందని, అధికారులు స్పందించాలని వాహనదారులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

దారిపైనే వాహనాలు.. రాకపోకలు ఎలా?

మాచవరం పోలీసు స్టేషన్ ఎదుట రోడ్డుపైన ప్రమాదానికి కారణమైన, వివిధ కేసుల్లో ఉన్న వాహనాలను నిలుపుతున్నారు. ఫలితంగా వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై వాహనాలను ఇష్టానుసారం నిలపడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాటిని తొలగించి వాహనాలు సజావుగా వెళ్లివచ్చేలా చూడాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గుణదల (పటమట)

చెట్ల కొమ్మలు తొలగించండి

కృష్ణలంక 22వ డివిజన్ ఆనంద భవన్ రోడ్డులో చెట్ల కొమ్మలు ప్రమాదకర స్థితిలో విద్యుత్తు తీగలకు తాకుతున్నాయి. అప్పుడప్పుడూ నిప్పులు చెలరేగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో సరఫరా నిలిచిపోతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆయా కొమ్మలను మాత్రమే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కృష్ణలంక

రహదారిపై ఇసుక నిల్వతో ఇక్కట్లు

పటమటలోని హైటెన్షన్ రోడ్డుకు ఇరువైపులా ప్రైవేట్ ట్రావెల్ బస్సులు, లారీలు పార్కింగ్ చేస్తున్నారు. కొంతమంది లారీ యజమానులు రోడ్డుని డంపింగ్ యార్డుగా వాడుకుంటారు. క్వారీల నుంచి ఇసుక తెచ్చి రోడ్డు సగ భాగం వరకు డంప్ చేస్తున్నారు. రాకపోకలు సాగించే స్థానిక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, పటమట

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

ప్రదర్శనలో వైకాపా విద్యార్థి సంఘం నాయకులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: గత ముఖ్యమంత్రి జగన్ 17 వైద్య కళాశాలలు కొత్తగా ఏర్పాటు చేస్తే.. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆరోపించారు. ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దంటూ గుణదల వైకాపా కార్యాలయం నుంచి విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వరకు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. విశ్వవిద్యాలయం ఎదుట బైఠాయించారు. లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించగా... పోలీసులు అడ్డుపడ్డారు. వర్సిటీ అధికారులు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. నాయకులు రవిచంద్ర, నీలి ఆనంద్ కుమార్, ఓబుల్ రెడ్డి, నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం!

కృష్ణలంక, న్యూస్‌టుడే

కృష్ణలంకకు ఆనుకొని వెళ్తున్న కోల్‌కతా - చెన్నై, విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారులపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. స్క్యూబ్రిడ్జి నుంచి బస్ స్టేషన్ వరకు సుమారు 2.5 కిలోమీటర్ల రహదారికి ఆనుకుని కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాలకు చెందిన ఆరు డివిజన్లు ఉన్నాయి. ప్రజలు నగరంలోకి రావాలంటే రహదారి దాటడం తప్పించి ప్రత్యామ్నాయం లేదు. కనకదుర్గమ్మ, బెంజి సర్కిల్ పైవంతెనల నిర్మాణం అనంతరం వాహనాల రద్దీ బాగా పెరిగింది. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కీలక పాయింట్లలో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టకుండా జాతీయ రహదారుల విభాగం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. ఫలితంగా ప్రజల జీవితాలు దినదినగండంగా మారిపోయాయి.

అమెరికన్ ఆసుపత్రి వంతెన వద్ద ప్రమాదకర స్థితిలో రోడ్డు దాటుతున్న ప్రజలు

కీలక ప్రాంతాలపై దృష్టి సారిస్తేనే..

☛ స్క్యూబ్రిడ్జి, గీతానగర్ మలుపు, నేతాజీ వంతెన, అమెరికన్ ఆసుపత్రి, సత్యం హోటల్, బందరు లాకులు ప్రజల రాకపోకలు సాగించే కీలక ప్రాంతాలు. ☛ రహదారిపై ప్రతి మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయడం లేదు. కృష్ణలంక ఎం హోటల్, సత్యం హోటల్ సెంటర్ల వద్ద ప్రజలు ప్రాణాలు అరచేత పట్టుకుని రోడ్డు దాటాల్సి వస్తోంది. ☛ అటు బెంజి సర్కిల్, ఇటు కనకదుర్గమ్మ పైవంతెనల నుంచి నిరంతరం వచ్చే వాహనాలతో పాటు అమెరికన్ ఆసుపత్రి వంతెన మీదుగా కృష్ణలంక సర్వీసు రోడ్డులోకి ప్రవేశించే వారు, సర్వీసు రోడ్డు నుంచి రహదారి మీదకు వెళ్లే వారికి కేవలం ఒకే మార్గం ఉండడంతో తరచూ వాహనాలు ఢీకొంటున్నాయి. ☛ కృష్ణలంక ప్రాంత ప్రజలు అధికంగా ఎంజీ రోడ్డు నుంచి కృష్ణలంకలోకి వచ్చేందుకు అమెరికన్ ఆసుపత్రి వంతెన వాడుతారు. కీలకమైన వారధి వద్ద రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రమాదపుటంచునే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఎన్‌హెచ్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఏడాదిలోనే అభివృద్ధి పరుగులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మూడో డివిజన్ గుణదల సాయి మెస్ ప్రాంతంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ముగ్గురు నిరుపేద పార్టీ కార్యకర్తలకు స్వయం ఉపాధి నిమిత్తం రూ. 40 వేల విలువైన బడ్డీ కొట్టు, తోపుడు బళ్లను ఉచితంగా అందజేశారు. గద్దె మాట్లాడుతూ.. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. ఏడాదిలోనే అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ మాట్లాడుతూ.. సూపర్-6లో చెప్పిన ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకుడు వెలగపూడి శంకర్‌బాబు, తాడి బాబూరావు, జనసేన నాయకులు గుత్తికొండ కృష్ణమోహన్, యలమంచిలి పండు, రాజేష్, జి.సదాశివరావు, రాగాని సాయి, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలతో ఉపాధి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 53 ఉద్యోగ మేళాలను నిర్వహించగా, 900 మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలను కల్పించామని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మరిన్ని నిర్వహించాలని సూచించారు. నగరంలోని ఇగ్నైట్ సెల్‌లో సోమవారం జిల్లా ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన పరిశీలించారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పూర్ణచంద్రరావు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ): ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీలందరూ ఐకమత్యంగా ఉండి పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ (ఏబీఎస్పీ) జాతీయ సమన్వయకర్త, విశ్రాంత డీజీపీ జె.పూర్ణచంద్రరావు అన్నారు. మొగల్రాజపురంలో ఏర్పాటు చేసిన ఏబీఎస్పీ రాష్ట్ర కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మెజార్టీ వర్గాల మధ్య విభేదాలు సృష్టించి కొన్నేళ్ల నుంచి తక్కువగా ఉన్న సామాజిక వర్గాలే అధికారాన్ని పొందుతున్నాయని విమర్శించారు. ఇంతవరకు ఎమ్మెల్యేలు కాని సామాజిక వర్గాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. నాయకులు పరంజ్యోతి, లకే రాజారావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు దొణప్ప సేవ ఎనలేనిది

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : మాతృభాష అభ్యున్నతికి, సాహిత్యానికి దొణప్ప చేసిన సేవలు ఎనలేనివని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేష్ కొనియాడారు. ప్రసిద్ధ సాహితీవేత్త తూమాటి దొణప్ప శతజయంతిని సోమవారం కళాశాలలో నిర్వహించారు. విశిష్ట తెలుగు దిగ్దర్శనం పేరుతో రూపొందించిన బుక్‌లెట్ ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ సి.జంపాల, సాహితీవేత్తలు గోళ్ల నారాయణరావు, గుమ్మా సాంబశివరావు, సత్రీ తదితరులు మాట్లాడారు.

బౌలర్ల మాయాజాలం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ సెంట్రల్ జోన్ సీనియర్ అంతర్ జిల్లాల మల్టీ డే క్రికెట్ టోర్నీలో సోమవారం బౌలర్లు రాణించారు. మూలపాడు డీవీఆర్ మైదానంలో కృష్ణా, గుంటూరు జట్ల మధ్య ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుంటూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్ బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 31.5 ఓవర్లలో 105 పరుగులకు ఆలౌటైంది. ప్రత్యర్థి బౌలర్లు పి.ఆదిత్యరెడ్డి (4/28), జి.ఆకాష్ (4/20) మెరిశారు. తొలి ఇన్నింగ్ బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు ఆట నిలిపే సమయానికి 35 ఓవర్లలో వికెట్ కోల్పోయి 127 పరుగులతో కొనసాగుతోంది. ఎం.వంశీ (68) రాణించాడు. సీపీ మైదానంలో పశ్చిమ గోదావరి, ప్రకాశం జట్ల మధ్య ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమ గోదావరి జట్టు 37 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. ప్రత్యర్థి బౌలర్లు జీఎస్‌వీ సుమిత్ (5/51), వి.వేణు (4/61) మెరిశారు. తొలి ఇన్నింగ్ బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు ఆట నిలిపే సమయానికి 30 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 162 పరుగులతో కొనసాగుతోంది.

ఏరోబిక్స్‌లో 'వీపీఎస్' క్రీడాకారుల ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక వీపీఎస్ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ క్రీడాకారులు ఏషియన్ ఏరోబిక్స్‌లో పతకాలు కైవసం చేసుకున్నారని ప్రిన్సిపల్ మేడా సీతారామయ్య తెలిపారు. ఈ నెల ఒకటి నుంచి 3వ తేదీ వరకు దుబాయ్‌లో జరిగిన పోటీల్లో కె.శ్రీసరయు వ్యక్తిగత విభాగంలో పసిడి, డబుల్స్ ఏరోబిక్స్, ఫిట్‌నెస్ ఏరోబిక్స్ డబుల్స్‌లో రజత పతకాలు సొంతం చేసుకోగా.. ఎం.హిమేష్ వ్యక్తిగత విభాగంలో పసిడి, ఏరోబిక్స్ డబుల్స్, ఫిట్‌నెస్ ఏరోబిక్స్ డబుల్స్‌లో రజత పతకాలు కైవసం చేసుకున్నాడు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రోజ్ మేరీ, జిమ్నాస్టిక్స్ కోచ్ వై.రామ్మోహన్, ఉపాధ్యాయులు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న సీతారామయ్య, రోజ్ మేరీ

ముగిసిన రాష్ట్ర స్థాయి గట్కా రిఫరీ, శిక్షకుల శిక్షణ

విజయవాడ క్రీడలు: కృష్ణలంకలోని డీఎస్ఏ కేవీకే క్రీడా ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి గట్కా రిఫరీ, శిక్షకుల శిక్షణ సోమవారం ముగిసిందని రాష్ట్ర గట్కా సంఘం ప్రధాన కార్యదర్శి జ్యోత్స్నాదేవి తెలిపారు. రాష్ట్ర గట్కా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో రాష్ట్రంలోని 12 జిల్లాల నుంచి 30 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రాలు బహూకరించామని వివరించారు. సౌత్ ఇండియా గట్కా సంఘం ఛైర్మన్ సురేంద్రరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవగా. . రాష్ట్ర గట్కా సంఘం టెక్నికల్ డైరెక్టర్ సత్య శ్రీకాంత్ ధ్రువపత్రాలు అందజేశారు.

తాగునీటి పైపునకు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మూడో డివిజన్ కరెన్సీనగర్ కృష్ణా ఎన్‌క్లేవ్ రోడ్డులో తాగునీటి పైపు లీకేజీతో నీరంతా వృథాగా పోతోందని 'వృథాగా జలాలు...దాహంతో శివారు' శీర్షికన 'ఈనాడు' ఈ నెల 6న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తాగునీటికి వాల్వ్ అమర్చారు. నీటి వృథా అరికట్టారు.

బార్‌లో ఘర్షణ... గాయాలతో వ్యక్తి మృతి?

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గవర్నర్‌పేట కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డులోని ఒక థియేటర్ వద్ద జరిగిన గొడవలో గాయపడిన వ్యక్తి చనిపోయిన ఘటనపై గవర్నర్‌పేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కృష్ణలంకకు చెందిన అప్పలరెడ్డి (41) కూలి పనులు చేస్తుంటారు. గత నెల 24వ తేదీ రాత్రి తనతో పాటు పనిచేసే బుర్రా వెంకటసాయితో కలిసి గవర్నర్‌పేటలో మద్యం తాగారు. వీరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. గాయాలు కాగా అతడిని ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. అప్పలరెడ్డి తాగి కింద పడిపోయి గాయపడ్డాడని వెంకటసాయి చెప్పడంతో అంతా ఊరుకున్నారు. చికిత్స అనంతరం ఇంటికి వెళ్లారు. తర్వాత రోజు తల నుంచి తీవ్రమైన రక్తస్రావం అవుతుండడంతో 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకు వెళుతుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ క్రమంలో గత నెల 28న పెద్ద కర్మ కార్డు ఇచ్చేందుకు అప్పలరెడ్డి కుమారుడు కొండారెడ్డి గవర్నర్‌పేటలోని తన స్నేహితుడు సాయి వద్దకు వెళ్లారు. 24వ తేదీ రాత్రి తన తండ్రితో బుర్రా వెంకటసాయి గొడవ పడిన విషయం బయటపడింది. తలను మెట్లకు గట్టిగా కొట్టాడని, దాని వల్లే చనిపోయినట్లు గుర్తించారు. ఈ విషయం తల్లికి చెప్పడంతో.. ఆమె సోమవారం గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

• విజయవాడ రోడ్డు నుంచి తహసీల్దారు కార్యాలయం వైపు వచ్చే రోడ్డు పక్కన నాలుగు ప్రాంతాల్లో పైపులైన్లు లీకులు ఏర్పడి తాగునీరు వృథాగా పోతోందని మున్సిపల్ కమిషనర్ లోవరాజు, ఏఈ ఫణిశ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి ఆయా ప్రాంతాల్లో మరమ్మతులు చేయించారు. • రామన్నపేట రోడ్డులో పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఇంజినీరింగ్ విభాగం సిబ్బందితో మరమ్మతులు చేయించారు. • రామలింగేశ్వర నగర్‌లో చందర్లపాడు రోడ్డు పక్కన పైపులైన్ మరమ్మతులకు గురయ్యిందని స్థానికులు ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కరించారు. • పదో వార్డులో రోడ్డు పక్కన డ్రెయిన్ పూర్తిగా ధ్వంసం కావడంతో మురుగు నీరు ప్రవాహానికి ఇబ్బంది అవుతోందని స్థానికులు ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి దృష్టికి తీసుకు రాగా స్పందించారు. 60 మీటర్లు పొడవునా డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. • నందిగామ వైజంక్షన్ వద్ద నుంచి రైతుపేట వరకు విజయవాడ రోడ్డు పక్కన చెత్త కుప్పలు వేశారని ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేశారు. • పెద్ద మసీదు వద్ద చెత్త కుప్పలు పేరుకుపోయాయని స్థానికులు కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించి కార్మికులతో శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, నందిగామ

పదో వార్డులో నిర్మాణంలో డ్రెయిన్

• రైతు బజారు వెనుక వీధిలో విజయ డెయిరీ వద్ద మురుగు కాలువలో వ్యర్థాలు నిల్వ ఉండి దుర్గంధం వస్తోందని స్థానికుడు వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదుకు పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం స్పందించి సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగించారు. - న్యూస్‌టుడే, కంచికచర్ల

రక్షణ కల్పించాలని వినతి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ వత్సవాయికి చెందిన పి.రామారావు నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం వినతి పత్రం సమర్పించారు. తన ఇంటికి, భూమికీ రక్షణ కల్పించాలని ఆయన విన్నవించారు.

సమస్యలపై నిర్లక్ష్యం వద్దు: ఆర్డీవో

నందిగామ: ప్రజల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలపై అర్జీలు స్వీకరించారు. మొత్తం 16 అర్జీలు రాగా రెవెన్యూ శాఖకు 5, సర్వే విభాగానికి 4, పోలీస్ శాఖకు 3, ఇతర శాఖలకు మరో 4 అర్జీలు వచ్చాయి. ఆర్డీవో సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఉద్యోగులకు సన్మానం

నందిగామ గ్రామీణం: పెద్దవరం గ్రామ సచివాలయంలో సోమవారం బదిలీ అయిన ఉద్యోగులను గ్రామ తెదేపా నాయకులు సన్మానించారు. ఉద్యాన సహాయకుడు సత్యనారాయణ, ఏఎన్ఎం ప్రమీల, డిజిటల్ సహాయకుడు ఆర్.వెంకటేశ్వరరావును ఆర్.రామకృష్ణ, ఎన్. శ్రీనివాసరావు, ఎస్.వెంకటసుబ్బారావు సన్మానించారు.

రిసోర్స్‌పర్సన్ల కాలపరిమితి పెంపుపై హర్షం

నందిగామ, న్యూస్‌టుడే: మెప్మా సంస్థలో పని చేస్తున్న రిసోర్స్‌పర్సన్ల కాలపరిమితిని ప్రభుత్వం పెంచడంతో స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో స్థానిక పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి, మున్సిపల్ కమిషనర్ లోవరాజు, రిసోర్స్‌పర్సన్లు.. సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏఈ ఫణి శ్రీనివాస్, ఏచూరి రాము, సత్యవతి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి తదితరులు

వంతెన నిర్మాణం ఎప్పుడో!

☛ రూ.30 కోట్లతో ప్రతిపాదనలు
☛ కార్యరూపం దాల్చితే ఉభయ రాష్ట్రాలకు మేలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే

రెండు రాష్ట్రాలకు కీలకమైన జగ్గయ్యపేట పట్టణ శివారులో పాలేరుపై ఉన్న కె.అగ్రహారం వంతెన పూర్తిగా శిథిలమైంది. దానిపై వాహనదారులు ప్రయాణించాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పట్టించుకోకపోవడంతో ఈ వంతెనపై ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన వంతెన, రెయిలింగ్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. • జగ్గయ్యపేట-ముక్త్యాల మార్గంలో అంతర రాష్ట్ర రహదారిగా ఉన్న ఈ వంతెన మీదుగా రోజూ వేలాది భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. కాకతీయ, కేసీపీ సిమెంట్, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ జగ్గయ్యపేట లైమ్ మైన్స్ మొదలుకొని తెలంగాణ రాష్ట్రంలో వివిధ కర్మాగారాలకు ఈ మార్గం గుండా రోజూ భారీ వాహనాలు తిరుగుతుంటాయి. • గత ఏడాదిలో వచ్చిన వరదలతో వంతెన పూర్తిగా ధ్వంసమైంది. పై నుంచి నీరు ప్రవహించింది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారి వంతెన కుంగిపోయింది. అప్పటి నుంచి కొత్త వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేస్తున్నా అవి కార్యరూపం దాల్చడం లేదు. తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులిపేసుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. • ముక్త్యాలలోని భవానీ ముక్తేశ్వరస్వామి, కోటి లింగాల హరిహర మహాక్షేత్రానికి వేలాది మంది భక్తులు ఇతర రాష్ట్రాల నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి, కృష్ణా నదిలో స్నానం ఆచరించడానికి ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. 2004, 2014 పుష్కరాల సమయంలో నూతన వంతెనకు ప్రతిపాదనలు కోరగా.. నిధుల కొరత వల్ల ఆ ప్రక్రియ ఆగిపోయింది. ప్రస్తుతం రెయిలింగ్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీనిపై ఆర్అండ్‌బీ డీఈఈ తిరుమాణి పరుశురాముడుని వివరణ కోరగా 200 మీటర్లతో నూతన వంతెన నిర్మాణానికి రూ.30 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు.

శిథిలమైన వారధి

మెస్ ఛార్జీలు పెంచాలి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వసతి గృహాల్లో పెరిగిన ధరల కనుగుణంగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపీనాయక్ కోరారు. ఆదివారం రాత్రి నందిగామ ఎస్సీ బాలుర వసతిగృహం-1 విద్యార్థులతో కలసి భోజన నాణ్యత పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో వసతులు పెంచాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, ప్రస్తుతమిస్తున్న మెస్ ఛార్జీలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని చెప్పారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, హస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

వత్సవాయి, న్యూస్‌టుడే: మండల పరిధి భీమవరం సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో రైతులు సాగు పనులు చేస్తుండగా సోమవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తాత, ముత్తాతల నుంచి తాము సాగు చేసుకుంటున్న భూమిని గత వైకాపా ప్రభుత్వం మత్స్యపెట్టె తమకు ... చేసిందని తెలిపారు. అప్పట్లో జరిగిన ఒప్పందం ప్రకారం తమకు ఒక్కొక్కరికి 5 సెంట్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసి మాపొరని ఆరోపించారు. ప్రభుత్వం మారినా తమ గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోయారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులతో న్యూస్‌టుడే మాట్లాడగా.. సదరు భూముల్లో హైకోర్టు యథాతథ స్థితి ఉత్తర్వులు ఇచ్చినందున.. ఎలాంటి ఎవరిని అనుమతించవద్దని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతులను అడ్డుకున్నట్లు తెలిపారు.

రామాయణంపై ప్రవచనం

నందిగామ గ్రామీణం: నందిగామ ముక్కోటి మండపంలో సోమవారం రాత్రి రామాయణంపై హైదరాబాద్‌కు చెందిన మల్లాది వెంకటరామనాథ శర్మ ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. రామాయణాన్ని పారాయణం, శ్రవణం చేయడంవల్ల పుణ్యం లభిస్తుందన్నారు. భక్తులు సీతారాముల ఉత్సవ మూర్తులను దర్శించుకున్నారు. నిర్వాహకులు వీవీ వెంకటరత్నమాచార్యులు, ధన్వంతరి, ఆలోక్షణాచార్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరామనాథశర్మ

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

సారెతో మహిళలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన మహిళలు సోమవారం తిరుపతమ్మ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. సుమారు 200 మంది మహిళలు పూలు, పండ్లు, పలు రకాల మిఠాయిలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. వారికి ఆలయ అధికారులు మంగళ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి సారె సమర్పించారు.

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మునగచర్లకు చెందిన మహిళలు సోమవారం విజయవాడ కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించారు. గ్రామానికి చెందిన చిరుమామిళ్ల సుజాత, సంద్ర లక్ష్మి, పంగులూరి లక్ష్మి, పి.సుజాత తదితరులు సారెతో గ్రామం నుంచి ప్రదర్శనగా విజయవాడకు తీసుకెళ్లారు.

అనిగండ్లపాడులో

కార్మికుల నిరసన

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయం వద్ద గత మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. సోమవారం కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఇంజినీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులందరికీ వర్తింపజేయాలని కోరారు. ఈ నెల 12వ తేదీలోపు సమస్యలు పరిష్కరించకపోతే ఆదివారం అర్ధరాత్రి నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సంఘ అధ్యక్షుడు పరిమి రవి, కార్యదర్శి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సీపీఎం నాయకులు వల్లూరి రవి శేఖర్, శ్రీనివాసులు కార్మికులకు మద్దతు తెలిపారు.

ప్రదర్శనలో ఇంజినీరింగ్ సంఘాల నాయకులు

గుంతల దారి.. ప్రమాదకరంగా మారి..

కంచికచర్ల నుంచి నక్కలంపేట వెళ్లే రహదారి అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారింది. 2016లో కృష్ణా పుష్కరాల సందర్భంగా నాటి తెదేపా ప్రభుత్వం కంచికచర్ల సమీపంలోని జాతీయ రహదారి నుంచి నక్కలంపేట మీదుగా గని ఆత్కూరు పుష్కర ఘాట్ల వరకు రూ.2.50 కోట్లతో రహదారి నిర్మించింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం రహదారుల కనీస నిర్వహణ పట్టించుకోకపోవడంతో రహదారి పూర్తిగా ధ్వంసమైంది. కంచికచర్ల నుంచి వచ్చే వాహనాలు ఈ రహదారిలోకి వచ్చే క్రమంలో రహదారిపై ఉన్న గుంతలు తప్పించే క్రమంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కంచికచర్ల

ఇళ్ల మధ్యే మురుగు

కంచికచర్లలో పలు కాలనీల్లో డ్రెయిన్లు లేకపోవడం.. ఉన్న వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. స్థానిక మోడల్ కాలనీ ఏర్పడి దశాబ్ద కాలం గడిచినా కాలనీలో డ్రెయిన్లు లేకపోవడంతో మురుగు నీరు పలు చోట్ల రహదారులు, ఖాళీ స్థలాల్లో చేరి స్థానికులకు తీవ్ర అసౌకర్యంగా మారుతుంది. మురుగు నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయని, కాలనీలో చిన్నారులు, వృద్ధులు తరచూ జ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కంచికచర్ల

సూపర్-6 పథకాల అమలుపై ప్రజల సంతృప్తి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పరిపాలనలో సూపర్-6 పథకాలు అమలుపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి తెలిపారు. సోమవారం రాత్రి పెద్దవరం శివారు కొత్తబెల్లంకొండవారిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం, పింఛన్ల పెంపు తదితర పథకాల అమలు బాగుందని చెప్పారు. తెదేపా నాయకులు జమల్లమూడి విష్ణు, పెమ్మసాని శ్రీనివాసరావు, గద్దె రమేష్‌బాబు, పొందూరి కోటి, సురేష్, కడియాల చంద్రశేఖర్, వెంకట్రావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా మండల అధ్యక్షుడు వీరాస్వామి

నేటి నుంచి పవిత్రోత్సవాలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వేదాద్రి పావన కృష్ణానది తీరంలో వెలసిన యోగానంద లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు మంగళవారం నుంచి ఈ నెల 11 వరకు నిర్వహిస్తునట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి సురేష్‌బాబు తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

చందర్లపాడు, న్యూస్‌టుడే: చందర్లపాడు సమీపంలో పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులను నిలిపి డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న చోదకులకు జరిమానా విధించారు. వాహనచోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

కుక్కకాటు బాధితులకు పరామర్శ

జగ్గయ్యపేటగ్రామీణం, న్యూస్‌టుడే: వీధి కుక్కల దాడిలో గాయపడి జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సోమవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తాతయ్య మాట్లాడుతూ.. వీధి కుక్కల సమస్యను సీరియస్‌గా తీసుకొని మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూడలన్నారు. మున్సిపల్ అధికారులు, స్థానిక వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణారావు, అధికారులు పాల్గొన్నారు.

మునేటి కాలువకు గండి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రామిరెడ్డిపల్లి వద్ద మునేటి కాలువకు సోమవారం గండిపడింది. ఇటీవలే పోలంపల్లి డ్యాం నుంచి కాలువ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. గత ఏడాది సెప్టెంబరులో వరదకు రామిరెడ్డిపల్లి వద్ద కాలువకు 16 మీటర్ల పొడవున గండి పడడంతో మట్టితో పూడ్చారు. ప్రస్తుతం అదే ప్రదేశంలో కాలువ అండర్ టన్నెల్(యూటీ) ప్రదేశంలో గండి పడింది. ఈ ప్రదేశాన్ని మునేరు పోలంపల్లి ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పి.బాలాజీ, ఇరిగేషన్ ఇన్‌ఛార్జి ఏఈ ప్రశాంతి పరిశీలించారు. ప్రస్తుతం ఏర్పడ్డ గండికి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతున్నామని ఏఈ తెలిపారు.

రామిరెడ్డిపల్లి వద్ద పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఇన్‌ఛార్జి ఏఈ ప్రశాంతి

సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

జగ్గయ్యపేట గ్రామీణం: ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని, ప్రతి నెలా కొన్ని ముఖ్యమైన సమస్యలు ఎంచుకొని వాటిని పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజల నుంచి వీధి దీపాలపై ఫిర్యాదులు అందాయన్నారు. దీనికోసం రూ.9 లక్షలతో 300 దీపాలు కొనుగోలు చేశామన్నారు. మంగళవారం నుంచి పట్టణంలోని వార్డుల్లో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరికైనా వారి వార్డుల్లో ఈ సమస్య ఉంటే కౌన్సిలర్లు, ఛైర్మన్‌ను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.

వీధి దీపాలు పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్లు

దోమల దండయాత్ర

మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు నీరు నిలిచి దోమలు వృద్ధి చెంది.. గ్రామాల్లో దండయాత్ర చేస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు కాలువల్లో పూడిక తీయిస్తున్నా నిర్వహణ ఖర్చులు భరించడం కష్టమని ఫాగింగ్ యంత్రాలను బయటకు తీయడం లేదు. దీంతో అన్ని ప్రాంతాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రస్తుత సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని అన్ని పంచాయతీల్లో ఫాగింగ్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ☛ నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 83 పంచాయతీలు ఉన్నాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా అన్ని పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలిచ్చారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం నుంచి దోమల సమస్య తీవ్రతరం అవుతుంది. పంచాయతీల్లో నెలకు ఒక్కసారైనా ఫాగింగ్ చేయించాలి. దీనికి పంచాయతీల్లో సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చుపెట్టాలి. ☛ పంచాయతీల్లో ఒక్కసారి ఫాగింగ్ చేయించడానికి డీజిల్, యంత్రాన్ని వీధుల్లో తిప్పడానికి ఆటో, కార్మికుల వేతనాలు కలిపి రూ.3500 నుంచి రూ.7 వేల వరకు ఖర్చవుతుంది. యంత్రాలున్నా పంచాయతీల్లో వీటిని ప్రస్తుతం వినియోగించడం లేదు. ఇటీవల కొన్ని గ్రామాల్లో కార్మికులతో డ్రెయిన్లలో పూడిక తీయించారు. అనంతరం దోమల నిర్మూలనకు మలాథియాన్ మందు పిచికారీ చేయించాలి. కాని అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. ☛ ఫాగింగ్ యంత్రంలో ఎబేట్ మందును కలిపి ఫాగింగ్ చేయించాలి. ఇలా వారానికి ఒక్కసారి చేస్తే దోమలను నిర్మూలించడం సాధ్యపడుతుంది. పాతకంచల రావిచెట్టు సెంటరులో పబ్లిక్ కుళాయి నీరు రహదారిపై ప్రవహిస్తున్నాయి. ఇక్కడ నీరు నిల్వ కాకుండా చూడాలి. వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ☛ పంచాయతీ, ఆరోగ్య శాఖల ఉమ్మడి పర్యవేక్షణతో గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఫాగింగ్ పనులు చేపట్టాలి. కాని పంచాయతీలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ఎబేట్, మలాథియాన్ మందు ఇవ్వడం లేదని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు పారిశుద్ధ్య పనులను తనిఖీ చేస్తే ఫలితం కనిపిస్తుంది.

పాతకంచలలో రహదారిపై నిలిచిన నీరు

పూడికతీతకు ఆదేశాలు

వర్షాకాలం దోమలు వృద్ధి చెందకుండా అన్ని పంచాయతీల్లో ఫాగింగ్ చేయించాలని, డ్రెయిన్లలో పూడిక తీయించాలని ఆదేశాలిచ్చాం. నిర్లక్ష్యంగా వ్యవహరించే పంచాయతీ కార్యదర్శులపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.
- కేవీ రాఘవన్, డీఎల్‌పీవో, విజయవాడ

భక్తిశ్రద్ధలతో మొహర్రం

చందర్లపాడు, న్యూస్‌టుడే: మండలంలో పలు గ్రామాల్లో మొహర్రంను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చందర్లపాడులో పీర్లను మేళతాళాలతో ఊరేగింపుగా బావి వద్దకు తీసుకెళ్లారు. తోటరావులపాడు, రామన్నపేట, చింతలపాడు తదితర గ్రామాల్లో పీర్ల ఊరేగింపు చేపట్టారు.

చందర్లపాడు: ఊరేగింపుగా తీసుకెళుతున్న పీర్లు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాగల్లులో సోమవారం రాత్రి చిన్నపీర్లచావడి, పెద్దపీర్లచావడి కమిటీల ఆధ్వర్యంలో పీర్లను ఊరేగించారు. కర్బలా మైదానంలో హస్సేన్, హుస్సేన్ సోదరుల త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ పీర్లను ఊరేగించారు. స్థానిక తెదేపా నాయకుడు మాచారపు రామకోటేశ్వరరావు దంపతులు పీర్లను దర్శించుకున్నారు. ఉత్సవాల నిర్వాహకులు షేక్ ఖాజా, మస్తాన్, అన్వర్, బుడేసాహెబ్, సైదా తదితరులు పాల్గొన్నారు.



మాగల్లులో దర్శించుకున్న తెదేపా నాయకులు

సీసీ కెమెరాలతో రక్షణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఎక్కడైతే సీసీ కెమెరా ఉంటుందో.. అక్కడ రక్షణ ఉంటోందని జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. డివైన్ సురక్షా కార్యక్రమంలో భాగంగా దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో తప్పకుండా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు సోమవారం పెనుగంచిప్రోలు జీఎస్ఆర్ గార్డెన్‌లో అన్ని మతాలకు చెందిన పెద్దలతో సమావేశం నిర్వహించి సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించారు. తప్పకుండా కెమెరాలు ఏర్పాటు చేస్తామని వారంతా తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు వాసిరెడ్డి బెనర్జీ, ఎస్సై అర్జున్, మత పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

వీరులపాడు, న్యూస్‌టుడే : ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. జుజ్జూరులో కేక్ కోసిన అనంతరం శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. అల్లూరు, వీరులపాడు, జయంతి, వి.అన్నవరం గ్రామాల్లో జెండా ఎగుర వేశారు. జమ్మవరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మంద పిచ్చయ్య కేక్ కోశారు.

కంచికచర్ల: గండేపల్లిలో నినదిస్తున్న నాయకులు



నందిగామ: మాదిగ జనమేళాకు తరలి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

కంచికచర్ల, న్యూస్‌టుడే: గండేపల్లిలో సర్పంచి బొక్కా రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు జెండా ఎగురవేశారు. కీసర, పేరకలపాడు, మోగులూరు, కంచికచర్ల, పరిటాలలో మంద కృష్ణమాదిగ పుట్టిన రోజు సందర్భంగా మిఠాయిలు పంచారు.

నందిగామ గ్రామీణం: తక్కెళ్లపాడులో ఎమ్మార్పీఎస్ జెండాను ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వేల్పుల ప్రభాకర్ ఆవిష్కరించారు.

నందిగామ, న్యూస్‌టుడే: ఒంగోలులో జరుగుతున్న మాదిగ మహా మేళాకు నందిగామ నియోజకవర్గం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సులో తరలి వెళ్లారు. నాయకులు కనకపూడి వెంకటరత్నం మాదిగ, నంద్రు మరియదాసు, కొండ, కొంద్రు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి

జగ్గయ్యపేటగ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 9వ వార్డు సీతారామపురంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం సూపర్-6 పథకాలు అమలు చేస్తోందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పీ4తో రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని తెలియజేశారు. మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకృష్ణ, ఎలమంచిలి రాఘవ, గింజుపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

వత్సవాయి, న్యూస్‌టుడే: కూటమి ఏడాది పాలనలో సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేశారని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ తెలిపారు. ఆయన స్వగ్రామం లింగాలలో సోమవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్ల ప్రజలు నానా కష్టాలు అనుభవించారని విమర్శించారు. వైకాపా అరాచకాలకు కూటమి ప్రభుత్వం చరమగీతం పాడటం పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. తెదేపా మండల అధ్యక్షుడు వడ్లమూడి రాంబాబు, జిల్లా కార్యదర్శి జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి, మాజీ సర్పంచి జగన్మోహనరావు, సర్పంచి చల్లా విజయలక్ష్మి, ఎంపీటీసీ వేముల శివ, తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో మహిళకు కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, పక్కన నాయకులు

చందర్లపాడు, న్యూస్‌టుడే: తోటరావులపాడు, తుర్లపాడుల్లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యదర్శి యలగాల నూకానమ్మ, దాసరి ఏసుప్రభు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు EVERGREENS R HEIGHTS, rep. by its Managing Partner, Mandali Baby Rama Krishna and others వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు ఆస్తులను బీదం ఎలిశమ్మ గారు క్రయం పొంది, ది. 05-10-1998న శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు నెం. 1872/1998 రు గానూ, అదే విధముగా ది. 23-01-1999న శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు నెం. 162/1999 రు గాను రిజిస్టరు చేయించుకొని అనుభవించుచున్నారు. వారికి చెందిన షెడ్యూలు దాఖలా ఆస్తులను నా క్లయింటు క్రయము పొందుటకు నిర్ణయించుకొనియున్నారు. కావున సదరాస్తిపై, ఎవరికి ఎటువంటి ఆక్షేపణలు గాని, వాజ్యములు గాని, వివాదములుగాని మరియే ఇతర అభ్యంతరములు యున్ననూ, యీ ప్రకటన తేదీ నుండి 10 రోజులలోగా వ్రాతపూర్వకముగా రిజిస్టరు పోస్టుద్వారా యీ క్రింద చిరునామాకు తెలియజేయవలెను. అపై వచ్చు క్లయిములు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూలు : 1వ ఐటమ్ : దస్తావేజు నెం. 1872/1998 రు దాఖలా ఆస్తి వివరం : కృష్ణా జిల్లా, శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా కీసర గ్రామ పంచాయితీ ఏరియాలోని కీసర గ్రామ డి.నెం. 158/1 రు దాఖలా య. 0.80 సెంట్లు స్థిరాస్తి శేరీ మెరక భూమికి హద్దులు : తూర్పు : ప్రత్తిపాటి మేరమ్మ గారి భూమి, దక్షిణం : కలతోటి శౌరమ్మ వగైరాల భూమి, పడమర : వేల్పుల సుబ్బమ్మ గారి భూమి, ఉత్తరం : సాహెబ్ ఖాన్ గారి భూమి., యీ హద్దుల మధ్య య. 0.80 సెంట్లు భూమిన్నీ మరియు అందలి యావత్తు యీజ్‌మెంట్ హక్కులతో సహా.

ఐటమ్ నెం. 2 : దస్తావేజు నెం. 162/1999 రు దాఖలా ఆస్తి వివరం : కృష్ణా జిల్లా, శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా కీసర గ్రామ పంచాయితీ ఏరియాలోని కీసర గ్రామ సర్వే నెం. 157 రు దాఖలా య. 0.18 సెంట్లు భూమికి హద్దులు : తూర్పు : కామా ఆరోగ్య మేరి గారి భూమి, దక్షిణం : దామాల ఏసుదాయమ్మ గారి భూమి, పడమర : షేక్ అబ్జుమియా వగైరాల భూమి, ఉత్తరం : చింతలపూడి రాజ్యలక్ష్మి గారి భూమి, యీ హద్దుల మధ్య య. 0.18 సెంట్లు భూమిన్నీ మరియు అందలి యావత్తు యీజ్‌మెంటు హక్కులతో సహా.

ఇట్లు,
వి.వి.పి. ధర్మారాయుడు, అడ్వకేటు
లోటస్ ల్యాండ్ మార్క్, సెక్టార్-1, రోడ్డు నెం. 6,
హౌస్ నెం. 38, అయోధ్యనగర్, విజయవాడ - 520003
సెల్ నెం. 9849964983

(c) eenadu

విజయవాడ పశ్చిమ

రెండో అధికార భాషగా ఉర్దూ ఉండాలి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాతబస్తీ గాంధీజీ మహిళా కళాశాలలో సెకండ్ లాంగ్వేజి ఉర్దూ ప్రవేశపెట్టాలని కోరుతూ తెదేపా మైనార్టీ సెల్ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి ఖాదర్ వినితపత్రాన్ని కళాశాల ప్రిన్సిపల్ రమణశ్రీకి సోమవారం అందజేశారు. ముస్లిం విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నందున అవకాశం కల్పించాలని కోరారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఎంపీ కేశినేని శివనాథ్‌లకు కూడా ఈసమస్యపై వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.

స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికకు 6 నామినేషన్లు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ స్థాయీ సంఘం నూతన సభ్యులుగా పోటీ చేసేందుకు వైకాపా నుంచి ఆరుగురు సభ్యులు ఇప్పటి వరకు నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి డి.చంద్రశేఖర్ ప్రకటించారు. నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసినందున దాఖలైన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ 8వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. శ్రీరంశెట్టి పూర్ణచంద్రరావు, షేక్ రహమతున్నీసా, మొహమ్మద్ రెహనా నాషిద్, పుప్పాల నరసకుమారి, ఉద్దంటి సునీత, అలంపూరు జయలక్ష్మి నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందించారు.. పరిష్కరించారు

స్పందనకు వందనం

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: నియంత్రిక... ప్రమాదవీచిక అనే శీర్షికన సోమవారం ఈనాడులో ప్రచురితమైన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లోని తీగలను సరిచేశారు. బాక్స్‌కు మరమ్మతులు నిర్వహించారు. ఊడిపోయిన పెన్సింగ్‌కు మరమ్మతులు నిర్వహించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రుధిర ధార.. చెరిపేద్దాం ఇలా..!

- ఎన్‌హెచ్65లో కలవరపెడుతున్న ప్రమాదాలు
- నివారణ చర్యలు చేపట్టిన పోలీసులు

న్యూస్‌టుడే, భవానీపురం

★ ఇటీవల గొల్లపూడి పోసాని నరసింహారావుచౌదరి ఉన్నత పాఠశాల సమీపంలో రోడ్డు దాటుతున్న ఇబ్రహీంపట్నానికి చెందిన గుత్తేదారును కారు ఢీకొంది. సంఘటనా స్థలంలోనే అతను చనిపోయారు.

★ కొన్ని రోజుల క్రితం డీమార్ట్ వద్ద షాపింగ్ ముగించుకుని రోడ్డు దాటుతున్న మహిళను అటుగా వెళ్తున్న వాహనం ఢీకొనడంతో చనిపోయారు.

ఇలా రెండేళ్లలో జాతీయ రహదారిపై 40కి పైగా ప్రమాదాలు జరగ్గా 8 మంది దుర్మరణం చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. అదుపుప్పి వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. గొల్లపూడి డీమార్ట్, ఆసుపత్రి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలుగా పోలీసులు గుర్తించారు. నివారణపై దృష్టిసారించారు.

35వేల వాహనాల రాకపోకలు..

ఎన్‌హెచ్-65 విజయవాడ-హైదరాబాద్ జాతీయరహదారిపై నిత్యం అన్ని రకాల వాహనాలు 35వేలకు పైగా రాకపోకలు సాగిస్తుంటాయి. గొల్లపూడి డీమార్ట్, ఆసుపత్రి వద్ద రోడ్డు దాటేందుకు ఎలాంటి అవకాశం లేదు. అక్కడ ఉన్న డివైడర్ ఎత్తు తక్కువగా ఉండడంతో ఎక్కువ మంది ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో వేగంగా దూసుకొస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నిసార్లు ప్రాణాలు పోతున్నాయి. ఆ సూపర్‌మార్కెట్‌కు నిత్యం వందలాది, వారాంతపు రోజుల్లో షాపింగ్ చేసేందుకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. అక్కడ ఉండే ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు వస్తుంటారు. వాహనాలు వేగంగా దూసుకురావడం, రాత్రి సమయంలో హదారిపై లైట్లు వెలగకపోవడం, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

పరిశీలిస్తున్న సీఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది

రూ.8లక్షలతో రెయిలింగ్ ఏర్పాటు..

సూపర్‌మార్కెట్, ఆసుపత్రి, ఉన్నత పాఠశాల ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు భవానీపురం పోలీసులు చర్యలు చేపట్టారు. అక్కడ 500 మీటర్ల మేర ఐరన్ రెయిలింగ్‌ను ఏర్పాటు చేయించారు. స్టేషన్‌లో నమోదవుతున్న ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా అక్కడ సూపర్‌మార్కెట్‌కు వస్తున్న వినియోగదారులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తించి యాజమాన్యం సహకారంతో సుమారు రూ.8లక్షల వ్యయంతో జాతీయరహదారిపై రోడ్డు దాటకుండా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. గొల్లపూడి మార్కెట్‌యార్డు వరకు వెళ్లి యూటర్న్ తీసుకునేలా ట్రాఫిక్ మార్పులుచేశారు.

జాతీయరహదారి మధ్యలో ఏర్పాటు చేసిన రెయిలింగ్

డివైడర్ దాటకుండా చర్యలు

జాతీయరహదారిపై రోడ్డు దాటుతుండగా అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోయారు. కారణాలు గుర్తించాం. జాతీయ రహదారిలో డివైడర్ దాటకుండా చర్యలు చేపట్టాం. మార్కెట్, ఆసుపత్రికి వెళ్లేవాళ్లు కొంత దూరం వెళ్లి యూటర్న్ తీసుకుని రావాల్సి ఉంది. ప్రతి ఒక్కరూ ప్రమాదాల నివారణ బాధ్యతగా తీసుకోవాలి.

-ఉమామహేశ్వరరావు, సీఐ, భవానీపురం

బొమ్మల కొట్లు తొలగింపు తగదు

కలెక్టరేట్‌లో వినతి పత్రంతో దుకాణదారులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని దుర్గ గుడి వద్ద వీఎంసీ స్థలంలో ఉన్న బొమ్మల కొట్లను ఆలయ అధికారులు తొలగించడం తగదని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చర్యలకు ఉపక్రమించారని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు దుర్గా మల్లేశ్వరి ఫ్యాన్సీ అండ్ జ్యూస్ కమిటీ నాయకులు నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం వినతి పత్రం సమర్పించారు. 300 మీటర్ల లోపలగా కొట్లు ఉన్నాయని, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేదని పేర్కొన్నారు. న్యాయం చేయాలని కోరారు. కమిటీ అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ నేతృత్వంలో దుకాణదారులు తరలివచ్చారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ప్రదర్శనగా వస్తున్న వైకాపా విద్యార్థి సంఘం నాయకులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: గత ముఖ్యమంత్రి జగన్ 17 వైద్య కళాశాలలు కొత్తగా ఏర్పాటు చేస్తే.. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆరోపించారు. ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దంటూ గుణదల వైకాపా కార్యాలయం నుంచి విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వరకు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. విశ్వవిద్యాలయం ఎదుట బైఠాయించారు. లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించగా... పోలీసులు అడ్డుకున్నారు. [illegible] అనంతరం వైద్య కళాశాలలకు మంజూరైన సీట్లను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం జాతీయ వైద్య కమిషన్‌కు లేఖ రాయడం విచారకరమని ధ్వజమెత్తారు. నాయకులు రవిచంద్ర, నీలి ఆనంద్ కుమార్, ఓబుల్ రెడ్డి, నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాయం అభినందనీయం

విద్యార్థికి ఉపకార వేతనం అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు సురేష్ బాబు, కార్పొరేటర్ రత్నకుమారి, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు పదవి విరమణ చేసిన ఉపాధ్యాయులు అండగా నిలవడం అభినందనీయమని 44వ డివిజన్ కార్పొరేటర్ రత్నకుమారి అన్నారు. లేబర్‌కాలనీలోని జీవన్ మున్సిపల్ హైస్కూల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పదవీవిరమణ చేసిన పీఈటీ గద్దె సురేష్‌బాబు కుమారుడు రవితేజ, కోడలు ప్రణవి పదో తరగతి ఫలితాల్లో 500 మార్కులు దాటిన విద్యార్థులకు రూ.1,01,000నగదు పురస్కారాలను అందజేశారు. ఈసందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు అధునాతన బోధనతో ముందంజలో ఉన్నాయన్నారు. ఎన్నారైలు, విశ్రాంత ఉపాధ్యాయులు మున్సిపల్ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించడం మంచి పరిణామమన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, స్థానిక తెదేపా నాయకులు మైలవరపు దుర్గారావు, నారిండి కిషోర్, ఉపాధ్యాయులు వెంకట్రావ్, శ్రీనివాసరావు, రంగారావు, జమీలా భాను పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం

ఏకలవ్యనగర్‌లో ప్రభుత్వ కార్యక్రమాలు వివరిస్తున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ రాకేష్, హరిబాబు, ఇతర నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం లోనే పేదలకు సంక్షేమం సాధ్యమని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ అన్నారు. సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా తెదేపా నాయకుడు డూండీ రాకేష్, మాజీ ఫ్లోర్ లీడర్ హరిబాబు ఏకలవ్యనగర్, కామకోటి నగర్‌లో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తిరిగి వివరించారు. వైకాపా పాలనలో అన్ని వర్గాలు ఆర్థికంగా దెబ్బతిన్న విషయాన్ని తెలియజేశారు. అమరావతి రాజధాని నిర్మాణంలో పురోగతి, శాంతి భద్రతలు, రోడ్ల, తల్లికి వందనం, పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ వంటివి కూటమి పాలనతీరుకు నిదర్శనం అన్నారు. ఈకార్యక్రమంలో తెదేపా నాయకులు పువుల కాంతారావు, ఏలూరు వెంకన్న, కె.శివకుమార్, జూలూరు నాగభూషణం పాల్గొన్నారు.

కలెక్టరేట్ పెరట్లో ప్రకృతి వ్యవసాయం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో ఏడు సెంట్ల విస్తీర్ణంలో 22 రకాల విత్తనాలతో ఏటీఎం మోడల్ కూరగాయల సాగును కలెక్టర్ జి.లక్ష్మీశ సోమవారం ప్రారంభించారు. వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) సంయుక్తంగా ప్రకృతి వ్యవసాయ క్షేత్రం ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా ఏటీఎం (ఎనీ టైమ్ మనీ) తరహాలో కూరగాయలు, ఆకు కూరలు పండించేలా రైతులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని సూచించారు. పొలాల్లోనే కాకుండా ప్రజలు పెరటి, మిద్దె తోటలు పండించేలా చూడాలన్నారు. జేసీ ఎస్.ఇలక్కియా, డీఏవో విజయకుమారి, డీపీఎం శంకర నాయక్, పథక ప్రాంతీయ సమన్వయకర్త అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

మహిళలకు సంఘీభావం తెలుపుతున్న సత్యబాబు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కుళాయిలకు నీటి సరఫరా లేకపోవడంపై ఖాళీ బిందెలతో మహిళలు రామరాజ్యనగర్‌లో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ నీటిసరఫరా విభాగపు సిబ్బంది సమస్యలను పరిష్కరించలేకపోవడం వల్ల తలెత్తిన సమస్యలను కార్పొరేషన్ అధికారులు పరిష్కరించాలన్నారు. ఏడు రోజులుగా బిందెడు నీటి కోసం నానా అగచాట్లు పడుతున్నరన్నారు. పాలకులకు ప్రజలకు రక్షిత నీటిని అందించాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రసాద్, మస్తాన్, దుర్గాకుమారి, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక మహిళ బలవన్మరణం

భవానీపురం, న్యూస్‌టుడే: వేధింపులు తాళలేక మహిళ బలవన్మరణానికి పాల్పడినట్లు భవానీపురం స్టేషన్ పోలీసులు తెలిపారు. హెచ్‌బీకాలనీలో పొట్ల నాగమణి(30) నివాసం ఉంటోంది. ఆమెకు పదేళ్ల క్రితం పల్నాడు జిల్లా గురజాలకు చెందిన వెంకటరామారావుతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. ఐదేళ్ల క్రితం భర్తను వదిలేసి నాగమణి భవానీపురంలోని పుట్టింటికి వచ్చేసింది. రెండేళ్లుగా భవానీపురం రైతుబజారులో కూరగాయలు విక్రయిస్తోంది. అక్కడ శ్రీనివాస్ అనే వ్యక్తి పరిచయం కావటంతో వారిద్దరూ కలిసి హెచ్‌బీకాలనీలో ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. నాగమణి రూ.15లక్షలు అప్పులు చేయటంతో ఆమె తల్లే తీర్చింది. ఈనెల 6వ తేదీ రాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని చనిపోయింది. ఆమె తల్లి సమాచారంతో పోలీసులు నాగమణి మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. శ్రీనివాస్ వేధించేవాడని, ఆ కారణంతోనే చనిపోయి ఉంటుందని తల్లి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుట్టుశిక్షణ మహిళల సారె సమర్పణ

ఆలయంలోకి వెళుతున్న కుట్టుశిక్షణ మహిళలు

చిట్టినగర్, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్, లయన్స్ స్మైల్స్ ఛారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్న కుట్టుశిక్షణ కేంద్రంలోని మహిళలు ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మ అమ్మవారికి సోమవారం ఆషాఢమాస సారె సమర్పించారు. కుట్టు శిక్షణ శిక్షకురాలు దుర్గ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ కార్యాలయంలో అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పట్టుచీర, పసుపు, కుంకుమ, గాజులు, మిఠాయిలు ఇతర వస్తువులను తీసుకుని డప్పు వాయిద్యాల నడుమ ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. అమ్మవారికి సమర్పించి, దర్శించుకుని తరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ తరపున వ్యవస్థాపక అధ్యక్షులు ఎ.వి.రావు, మాజీ ప్రధాన కార్యదర్శి శివకుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

పొరుగు సేవల కార్మికులకు పథకాలు ఇవ్వాలి

సర్కిల్1 వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు అందరికీ సంక్షేమ పథకాలు వర్తించే విధంగా చూడాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుదె రాజా డిమాండ్ చేశారు. చిట్టినగర్, కలరా ఆసుపత్రి సెంటర్‌లోని సర్కిల్-1 కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సంబంధించి బాకాయి ఉన్న ఆరు డీఏలు, విశ్రాంత ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులందరికీ రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, నాయకులు జేమ్స్, రమణమ్మ, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

కొండ ప్రాంత వాసులను తరలించండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కొండ ప్రాంతాల్లో ప్రమాదకరమైన ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. పాతబస్తీ, చిట్టినగర్, రామరాజ్యనగర్, విద్యాధరపురం లేబర్ కాలనీ, భవానీపురం, ఆర్టీసీ వర్క్‌షాపు, కుమ్మరిపాలెం ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. స్థానిక సమస్యలు తెలుసుకొని సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో కొండలపైన నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున, అటువంటి వారిని గుర్తించి కబేళా ప్రాంతంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు వారికి కేటాయించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని అన్నారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు పరిశీలించారు. విద్యాధరపురం క్రీడా ప్రాంగణం ప్రహరీ పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించారు. ఇంజినీరింగ్ పనుల్లో పురోగతి సాధించాలని, పనులను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు.

కూరగాయల ధరలు

వంకాయలు-28, టమాటా-35, బెండ-25, పచ్చిమిర్చి-60, కాకర-44, బీర-28/36, క్యాబేజి-22, క్యారెట్-32/42, దొండ-32, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-26, గోరుచిక్కుళ్లు-36, దోస-18, సొర-10, పొట్ల-20/25, అరటికాయ-8/7, చామదుంప-28, అల్లం-60, మునగ-10/12, ఆకు కూరలు (కట్ట)-3, కంద-58, బీట్‌రూట్-32, కీరదోస-44, బీన్స్-86, క్యాప్సికమ్-80, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/14, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చి మామిడి-12/10 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. – ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

కేబీఎన్ విద్యార్థికి ఎన్‌సీసీ క్యాడెట్ అవార్డు

చిట్టినగర్, న్యూస్‌టుడే: కేబీఎన్ కళాశాల విద్యార్థికి ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్ అవార్డు లభించిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. తమ కళాశాలలో బీకాం మూడో సంవత్సరం చదువుతున్న టీబీఎన్ శ్రీనివాస్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలలో అంకితభావంతో పని చేశారన్నారు. సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నదుల పరిరక్షణ, స్వచ్ఛభారత్, వరద హాయక సేవా కార్యక్రమాలు, అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాలకు గుర్తింపుగా అవార్డు దక్కిందన్నారు. ఇటీవల అవార్డు అందుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాస్, ఎన్‌సీసీ కమాండర్ విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 22 అర్జీలు

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర వాసుల సమస్యలను గడువులోపు పరిష్కరించాలని, ఆయా సమస్యలు మళ్లీ ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన 22 వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాధ్యులైన అధికారులు క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. భవానీపురం దర్గా ప్లాట్లలో నిర్మాణాలకు ప్లాన్లు మంజూరు, బస్సు షెల్టరు తొలగింపు, కొండరాళ్లు జారి పడడం, కొండ ప్రాంతాలకు తాగునీటి సరఫరా, ఆక్రమణల తొలగింపు, అక్రమ కట్టడాలు, టీడీఆర్ బాండ్ల జారీ తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. అధికారులు డి.చంద్రశేఖర్, సంజయ్ రత్నకుమార్, శ్రీనాథ్‌రెడ్డి, అర్జునరావు, పి.సృజన, పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, మాల్యాద్రి, లతా, బి.సోమశేఖర్ రెడ్డి, ఎ.శ్రీధర్ పాల్గొన్నారు.

తవ్వారు.. పూడ్చడం మరిచారు..!

కోళ్లఫారం రోడ్డులో గోతులు ఇలా..

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురం 40వ డివిజన్ తాగునీటి పైపులైన్ల కోసం తవ్విన గోతులు పూడ్చడం మర్చిపోయారు. కోళ్లఫారం రోడ్డు, చర్చిరోడ్డు, తదితర ప్రాంతాల్లో పైపులైన్ల ఏర్పాటు కోసం కొన్నాళ్లక్రితం తవ్వారు. అప్పటి నుంచి పూడ్చకుండా వదిలేశారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నివాసాల ముందు ఉన్న గోతుల్లో చిన్నారులు పడి గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగుతో అవస్థలు..!

రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: బ్రాహ్మణవీధి గాజుల దుకాణం ఆవరణలో రోడ్డుపై మురుగు పొంగిపొర్లుతోంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకల సమయంలో బురద పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి గట్కా రిఫరీ, శిక్షకుల శిక్షణ

ఉత్తీర్ణులైన అభ్యర్థులతో సురేంద్రరెడ్డి, సత్య శ్రీకాంత్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణలంకలోని డీఎస్ఏ కేవీకే క్రీడా ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి గట్కా రిఫరీ, శిక్షకుల శిక్షణ సోమవారం ముగిసిందని రాష్ట్ర గట్కా సంఘం ప్రధాన కార్యదర్శి డి.జ్యోత్స్నాదేవి తెలిపారు. రాష్ట్ర గట్కా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో రాష్ట్రంలోని 12 జిల్లాల నుంచి 30 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రాలు బహూకరించామని వివరించారు. సౌత్ ఇండియా గట్కా సంఘం ఛైర్మన్ సురేంద్రరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవగా.. రాష్ట్ర గట్కా సంఘం టెక్నికల్ డైరెక్టర్ కె.సత్య శ్రీకాంత్ ధ్రువపత్రాలు అందజేశారు.

రోడ్డెక్కిన మురుగు.. జనం పరుగు..!

- డ్రెయిన్ల నిర్మాణంలో జాప్యం
- నత్తనడకన పనులతో అవస్థలు

కుమ్మరిపాలెం సెంటర్‌లో రోడ్డుపై పారుతున్న నీరు

విద్యాధరపురం, న్యూస్‌టుడే

నిత్యం రద్దీగా ఉండే కుమ్మరిపాలెం రోడ్డులో డ్రెయిన్ నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతుండటంతో స్థానికులతో పాటు వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే వాననీటితో కలిసి మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఆ మురుగు రోజుల తరబడి తిష్టవేస్తోంది. బురద, చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈప్రాంతంలో ఆవాసాలతోపాటు పెద్ద సంఖ్యలో దుకాణాలు, దేవాలయం, మసీదు ఉండటంతో జనరద్దీకూడా ఎక్కువగా ఉంటోంది. ప్రతి శుక్రవారం మసీదులో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు నమాజు చేయడానికి వచ్చినపుడు, స్థానిక గంగానమ్మ ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్నప్పుడు ట్రాఫిక్ జామ్ అవుతోంది.

ఇల్లు గడవడం కష్టంగా ఉంది

ఒకవైపు వరదల కారణంగా మురుగు నీటి సమస్య వేధిస్తుంటే, మరోవైపు డ్రెయిన్ పనులు నత్తనడకన సాగుతుండటంతో దుకాణం తెరవలేక పోతున్నాం. చిన్నపాటి వర్షానికే రోడ్డు మీద నీరు నిలిచిపోతోంది. మురుగునీటి కారణంగా వ్యాపారం చేసుకోలేక పోతున్నా. ఇల్లు గడవడం కూడా కష్టమవుతోంది. మురుగు నీరు నిల్వ ఉండకుండా మోటర్లతో తోడించాలి. - సుధాకర్, స్థానికుడు

అనారోగ్యంతో ఇబ్బందులు



రోడ్డు మీద మురుగు నీరు కారణంగా నమాజుకు వెళ్లడం ఇబ్బందిగా మారింది. వర్షం కురిసినప్పుడు సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది. మసీదులోపలి నుంచి బైటకు రావాలంటే పీట్లు వేయాల్సి వస్తోంది. రోజులుగా మురుగు ఉండటంతో పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి. డ్రెయిన్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి. -కరీముల్లా, కుమ్మరిపాలెం

కార్మికులను పెంచి పనులు పూర్తి

కుమ్మరిపాలెం సెంటర్‌లో డ్రెయిన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే రోడ్డు మీద మురుగు నీరు నిల్వ ఉండకుండా తోడించే ఏర్పాట్లు చేశాం. అవసరమైతే అదనపు కార్మికులతో రాత్రి పూట కూడా పనులు చేయిస్తాం. నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా వాహన చోదకులు కూడా సహకరించాలి.

- రామకృష్ణ, ఏఈ, కార్పొరేషన్

పొట్టి శ్రీరాములు కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు

ఐఎస్‌వో గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న కళాశాల కార్యదర్శి అమర్‌సుధీర్

చిట్టినగర్, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలకు అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్‌వో) గుర్తింపు లభించినట్లు ఆ కళాశాల కార్యదర్శి అమర్‌సుధీర్ తెలిపారు. ఐఎస్‌వో సంస్థ ప్రతినిధి హరగోపాల్ చేతుల మీదుగా గుర్తింపు పత్రాన్ని సోమవారం అందుకున్నట్లు వివరించారు. అనంతరం హరగోపాల్ మాట్లాడుతూ ఆధునిక ప్రయోగశాలలు, సాంకేతిక విద్యా బోధన, ఉపాధి అవకాశాల కల్పన, పచ్చదనం, పరిశుభ్రత అంశాలను పరిశీలించి గుర్తింపు ఇచ్చినట్లుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శరవణకుమార్, వైస్ ప్రిన్సిపల్ పతంజలిశాస్త్రి, ఐక్యూఏసీ కన్వీనర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
63036 11232

సీతారాంపురం, న్యూస్‌టుడే : రామకృష్ణాపురం ఓల్డ్ పోస్టాఫీసు రోడ్డులోని ఆర్ఆర్‌డబ్ల్యూఏ 430 వద్ద గల విద్యుత్తు స్తంభానికి (నం:30-246-34)కు ఉన్న దీపం వెలగడం లేదని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు వీఎంసీ ఏఈ బాలసుబ్రహ్మణ్యం స్పందించారు. సిబ్బంది పంపించి దీపం ఏర్పాటు చేయించారు.

? సూర్యారావుపేట టొబాకో బారన్ వీధిలో విద్యుత్తు స్తంభం (నం: 29/30/15)కు ఉన్న దీపం గత కొద్ది రోజులుగా వెలగడం లేదు. దీపం ఏర్పాటు చేయగలరు.
- ఎం.నందకుమార్, స్థానికుడు

✔ ఏర్పాటు చేస్తాం. - ఎం.బాలసుబ్రహ్మణ్యం, ఏఈ, వీఎంసీ

కాల్వలకు 7,586 క్యూసెక్కులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి సోమవారం 7,586 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 7,070, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 516 క్యూసెక్కులు ఇచ్చారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,707, ఏలూరు 1,110, బందరు 1,245, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,008 క్యూసెక్కుల చొప్పున నీరు ఇస్తున్నారు.

కలెక్టరేట్ పెరట్లో ప్రకృతి వ్యవసాయం

మోడల్ కూరగాయల పెంపకాన్ని ప్రారంభించి, మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో ఏడు సెంట్ల విస్తీర్ణంలో 22 రకాల విత్తనాలతో ఏటీఎం మోడల్ కూరగాయల సాగును కలెక్టర్ జి.లక్ష్మీశ సోమవారం ప్రారంభించారు. వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయం (ఏపీ సీఎన్ఎఫ్) సంయుక్తంగా ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా ఎనీ టైమ్ మనీ (ఏటీఎం) తరహాలో కూరగాయలు, ఆకుకూరలు పండించేలా రైతులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని సూచించారు. పొలాల్లోనే కాకుండా ప్రజలు పెరటి, మిద్దె తోటలు పండించేలా చూడాలన్నారు. జేసీ ఎస్.ఇలక్కియా, డీఏవో విజయకుమారి, డీపీఎం శంకర నాయక్, పథక ప్రాంతీయ సమన్వయకర్త అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించరూ..

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : బుద్ధ యోగా ఫౌండేషన్ ద్వారా రాష్ట్రంలోని 907 పాఠశాలలోని 1,056 మంది యోగా శిక్షకులను ప్రత్యక్షంగా ప్రభుత్వ పరిధిలోకి తీసుకుని, వారికి సరైన ఆర్థిక, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంక గోవిందరాజులు, జాతీయ సమితి సభ్యురాలు గంటా మమత కోరారు. ఈ మేరకు వారు నగరంలోని కలెక్టరేట్‌లో జేసీ ఎస్.ఇలక్కియాకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో యోగా విద్యను అమలు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఐవైఎఫ్ నగర సహాయ కార్యదర్శి లంకే సాయి తదితరులు పాల్గొన్నారు.

యోగా కేంద్రాలు కావలె..!

సాధనకు వసతి లేక ఇబ్బందులు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే

యువతుల సాధన

ప్రపంచానికి భారతదేశం పరిచయం చేసిన అద్భుత ఆరోగ్య ప్రక్రియ యోగా. సంపూర్ణ ఆరోగ్యానికి ఇదొక సాధనం.

నేటి ఆధునిక జీవనశైలిలో ఎదురవుతున్న ఒత్తిడిని అధిగమించేందుకు.. చక్కని మార్గం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గత నెలలో 21 రోజుల పాటు రాష్ట్రంలో విస్తృతంగా యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. అన్ని వర్గాల ప్రజలకు అలవాటు చేసింది. జీవన విధానంలో దీనిని భాగం చేసుకునేలా కృషి చేసింది. దీంతో ప్రజల్లో యోగాపై మరింత మక్కువ పెరిగింది. అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ వారు ఉచితంగా యోగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇది మినహా.. మరెక్కడా ప్రజలు సాధన చేయడానికి సరైన వసతి లేదు.

ప్రత్యేక యోగా కేంద్రాలు అంటూ ఏమీ లేవు. ఎక్కువ మంది ప్రైవేటుగా ఫీజులు చెల్లించి నేర్చుకోవాల్సి వస్తోంది. ఇది ఆర్థికభారంగా ఉంది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి.. అన్ని వర్గాల వారికి అందుబాటులో సెంటర్లు ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నియోజకవర్గ ప్రజలు
సుమారు 2,80,000 మంది
యోగాంధ్ర భాగస్వాములు
సుమారు 1,00,000 మంది

ఆరోగ్యంపై మక్కువ

ప్రస్తుతం నా వయసు 72 సంవత్సరాలు. 16వ ఏట నుంచే శరీర దృఢత్వంపై మక్కువతో వ్యాయామాలు చేస్తుంటాను. ఇప్పటికీ కొనసాగిస్తున్నాను. సాధన వల్ల ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉంటుంది. వయసు ప్రభావంతో వ్యాయామ సమయం తగ్గించి.. యోగా చేయడం అలవాటు చేసుకున్నాను. కానీ కాలనీలో యోగా కేంద్రాలు లేవు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తే నా లాంటి వారికి ఎందరికో ఉపయుక్తంగా ఉంటుంది.
– తట్టవర్తి ఆనంద్, నందమూరినగర్

దినచర్యగా మారింది

గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నాను. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతిరోజూ సాధన చేస్తున్నాను. ఇదొక దినచర్యగా మారింది. ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉంటోంది. మాకినేని బసవ పున్నయ్య మున్సిపల్ స్టేడియంలోని కేంద్రంలో తరగతులకు హాజరవుతున్నాను. అయితే.. న్యూరాజరాజేశ్వరి పేట నుంచి అజిత్‌సింగ్‌నగర్‌కు వెళ్లి రావడానికి ఎక్కువ సమయం పడుతోంది. స్థానికంగా ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.
– చక్రవర్తి, న్యూరాజరాజేశ్వరి పేట

ఉద్యోగ మేళాలతో ఉపాధి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 53 ఉద్యోగ మేళాలను నిర్వహించగా, 900 మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలను కల్పించామని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మరిన్ని నిర్వహించాలని సూచించారు. నగరంలోని ఇగ్నైట్ సెల్‌లో సోమవారం జిల్లా ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన పరిశీలించారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుభూషణ్‌రావు, ఉపాధి కల్పన అధికారి (ఒకేషనల్ అండ్ గైడెన్స్) వై.ఎస్.బ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ సమాచారంతో ఓటరు జాబితాల సవరణలు

బీఎల్వోలతో ఆర్డీవో చైతన్య

ఎన్టీఆర్ కలక్టరేట్, న్యూస్‌టుడే : ఓటరు జాబితాలను సవరించే తరుణంలో వాస్తవ సమాచారం ఉండేలా చూడాలని విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య సూచించారు. ప్రవాసాంధ్రులు, పీడబ్ల్యూడీ, శాశ్వతంగా చిరునామా మారిన ఓటర్లతో పాటు, మరణించిన వారి వివరాలను తప్పకుండా సేకరించాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విచారణకు వెళ్లినప్పుడు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. నగరంలోని సబ్ కలెక్టరేట్ ఆడిటోరియంలో తూర్పు నియోజకవర్గ బీఎల్వోల శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ఆర్డీవో హాజరై పలు సూచనలు చేశారు. ఎన్నికల విభాగ ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్ గూడపాటి సుజాత, సీనియర్ అసిస్టెంట్ జి.వరప్రసాద్, బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ

సీతారాంపురం, న్యూస్‌టుడే: సీతారాంపురంలోని కాలువ గట్టు ప్రాంత మహిళలు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ తల్లికి సోమవారం ఆషాఢ సారె సమర్పించారు. సుభాషిణి, వెంకటేష్ దంపతులు, మహంతి వాసుదేవరావు, గౌతమి దంపతులు అమ్మవారి విగ్రహ ప్రతిమను తలపై పెట్టుకొని సీతారాంపురంలోని పలు వీధుల మీదుగా ఇంద్రకీలాద్రికి పాదయాత్రగా చేరుకున్నారు. వారితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. స్థానిక మహిళలు అమ్మవారికి పండ్లు, మిఠాయిలు, చీరలు, పసుపు, కుంకుమ, పూలు, గాజులు సమర్పించారు.

ఏడాదిలోనే పింఛను పెంచాం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : తెదేపా అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే పింఛను రూ.4000 పెంచామని, గత వైకాపా హయాంలో రూ.1000 పెంచడానికి ఐదేళ్ల పట్టిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం న్యూరాజరాజేశ్వరిపేటలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 21 డివిజన్లలో పర్యటించి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సమస్యలు అడిగి తెలుసుకుంటున్నామని చెప్పారు. గత ఏడాది వ్యవధిలో రూ.240 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, మాజీ కార్పొరేటర్ ఎరుబోతు రమణారావు, మాజీ కార్పొరేటర్ పిరియ జగదాంబ, 57వ డివిజన్ అధ్యక్షుడు కబీర్, ప్రధాన కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ సమస్య వింటున్న బొండా ఉమామహేశ్వరరావు

ప్రజలంతా సంతోషం

మధురానగర్ : కూటమి ప్రభుత్వ ఏడాది పాలన గురించి ప్రజలకు వివరిస్తున్నామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం 31వ డివిజన్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటి తిరిగి ప్రజలతో మాట్లాడారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, ఇళ్ల పట్టాలు వంటి సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని. వాటిని పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు దేవతోటి నాగరాజు, మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, నందేటి భానుసింగ్, కాకొల్లు మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై పార్కింగ్ చేస్తే జరిమానా

ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్క్ చేస్తే జరిమానాలు తప్పవని మూడో ట్రాఫిక్ సీఐ కొత్తూరు కిషోర్‌బాబు హెచ్చరించారు. నగర సీపీ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ అదనపు డీసీపీ ఏబీటీఎస్ ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం స్థానిక పండ్ల మార్కెట్ వద్ద ప్రజలను ఇబ్బంది కలిగిస్తూ పార్క్ చేసిన వాహనాలను గుర్తించి టోయింగ్ వెహికల్స్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఇదే పునరావృత్తం అయితే డ్రైవింగ్ లైసెన్సును సస్పెండ్ చేస్తామని సీఐ తెలిపారు. అధికారిక పార్కింగ్‌లలో మాత్రమే వాహనాలు నిలపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై జీవీఎస్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించరూ..

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విదేశీ వైద్య విద్యార్థులు తమ శాశ్వత రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆంధ్రరత్నభవన్‌లో ఉన్న ఆయన్ని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలను వివరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు జాతీయ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం (ఎన్ఎస్‌యూఐ) అండగా ఉంటుందని తెలిపారు. సమస్యను ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సయ్యద్ గుల్ మొహమ్మద్, నిఖిల్, పార్దీప్, దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9న నగరంలో కార్మికుల భారీ ప్రదర్శన

ఐక్యత చాటుతున్న కార్మిక సంఘాల జిల్లా నాయకులు

మధురానగర్, న్యూస్‌టుడే : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈ నెల 9న వన్ టౌన్ రథం సెంటరు నుంచి లెనిన్‌కూడలి వరకు కార్మికులు, రైతుల భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయి. సోమవారం బి.ఆర్.టి.ఎస్.రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అన్ని సంఘాలు కలిసి కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, చేతివృత్తిదారులు, ఉపాధి హామీ కూలీలతో ప్రదర్శన నిర్వహించాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్లు, నూతన వ్యవసాయ మార్కెట్ విధానానికి వ్యతిరేకంగా, కౌలు రైతు చట్టం, రుణ విమోచన చట్టం, అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కనీస వేతన చట్టం కోరుతూ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల జీవనోపాధి, ఉద్యోగ.. ఆరోగ్య భద్రతకు ప్రభుత్వాలు పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు మూలి సాంబశివరావు, ఆంజనేయులు, ఎ.వెంకటేశ్వరరావు, కె.దుర్గారావు, మునిశంకర్, మరీదు ప్రసాద్ బాబు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రేయింబవళ్లు అక్కడే..!

నగరంలోని బి.ఆర్.టి.ఎస్. రోడ్డులో రాత్రి 10 గంటల నుంచి ఫుడ్ కోర్టు నిర్వహిస్తున్నారు. రాత్రి 12 గంటల వరకు తినుబండారాలు విక్రయించి బళ్లను అక్కడి నుంచి తీసేయాలి. కానీ ఇది అమలుకు నోచుకోవడం లేదు. రోడ్డు మధ్య భాగంలో అలాగే ఉంచి వెళ్లిపోతున్నారు. అత్యవసర సమయంలో బి.ఆర్.టి.ఎస్. రోడ్డు మధ్య భాగాన్ని వినియోగించుకునే పరిస్థితి కనిపించడం లేదు. పర్యవేక్షించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడంతో.. ఈ ప్రాంతం ఆక్రమణదారుల చెరలోకి వెళ్లిపోతోంది. **- న్యూస్‌టుడే, మధురానగర్**

మురుగు పారక దుర్వాసన



అజిత్‌సింగ్‌నగర్ లూనా సెంటర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయ సమీప వీధిలో సైడుకాల్వలో పూడిక తీయడం లేదు. మురుగు పారక దుర్వాసన వెదజల్లుతోంది. దోమలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు క్రమం తప్పకుండా.. పూడిక తీయాలని, ఫాగింగ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్**

ఖాళీ స్థలాలతో అవస్థలు

పాయకాపురం ఎల్ఐజీ ఉడా కాలనీలోని అధిక సంఖ్యలో ఖాళీ స్థలాలున్నాయి. ఈడబ్ల్యూఎస్ ఆరో లైన్‌లో భారీగా పిచ్చి మొక్కలు పెరిగాయి. విష సర్పాలు వస్తున్నాయని.. మురుగు పేరుకుపోయిందని, తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి.. శుభ్రం చేయించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, పాయకాపురం**

ఎత్తైన కల్వర్టుతో ఇక్కట్లు

వాంబేకాలనీలోని 'ఎఫ్' బ్లాక్ నుంచి 'జి' బ్లాకులోకి వెళ్లే దారిలో కల్వర్టు ఎత్తు ఎక్కువగా ఉంది. వృద్ధులు ఎక్కి దిగడానికి అష్టకష్టాలు పడుతున్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మాణ దశలోనే స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినా వినిపించుకోలేదు. దానిని దాటలేక ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు సమాంతరంగా కల్వర్టు ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్**

విద్యారంగ సమస్యలపై వినతి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ.. పీడీఎస్‌యూ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశకు వినతి పత్రం సమర్పించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్ మాట్లాడుతూ.. విలీన ప్రక్రియ వల్ల వేలాది పాఠశాలలు మూతపడుతున్నాయని తెలిపారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు పెండింగులో ఉన్నాయని పేర్కొన్నారు. వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే జీవోలు 107, 108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నగర శాఖ నాయకులు రాజ్‌కుమార్, మహేష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడదాం..

చుట్టుగుంట, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీలందరూ ఏకమై పోరాడితే తప్ప మన సమస్యలు పరిష్కారం కావని, అందుకు అంతా ఏకమవ్వాలని ఏబీఎస్పీ జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. చుట్టుగుంట విశాలాంధ్ర రోడ్డు నిమ్మతోట కూడలి వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ఏబీఎస్పీ రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏబీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త బి.పరంజ్యోతి, మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

'భాజపా పాలనలో పెరిగిన అవినీతి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : భాజపా పాలనలో అవినీతి పెరిగిందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. సోమవారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎగవేతదారులకు రూ.లక్షల కోట్ల బ్యాంకు అప్పులు మాఫీ చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో రాజధాని కోసం భూసేకరణ చేసినప్పుడు రైతులకు వెయ్యి గజాల ఇంటి స్థలం, 400 గజాల కమర్షియల్ కాంప్లెక్స్ ఇస్తామని చెప్పి.. ఇప్పటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. విజయవాడలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండగా.. అమరావతిలో మరొకటి ఎందుకని ప్రశ్నించారు. 50 అంతస్తుల సచివాలయం అవసరమా? అని ఆయన అడిగారు.

బార్‌లో ఘర్షణ... గాయాలతో వ్యక్తి మృతి?

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గవర్నర్‌పేట కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డులోని ఒక థియేటర్ వద్ద జరిగిన గొడవలో గాయపడిన వ్యక్తి చనిపోయిన ఘటనపై గవర్నర్‌పేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కృష్ణలంకకు చెందిన అప్పలరెడ్డి (41) కూలి పనులు చేస్తుంటారు. గత నెల 24వ తేదీ రాత్రి తనతో పాటు పనిచేసే బుర్రా వెంకటసాయితో కలిసి గవర్నర్‌పేటలో మద్యం తాగారు. వీరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. గాయాలు కాగా అతడిని ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. అప్పలరెడ్డి తాగి కింద పడిపోయి గాయపడ్డాడని వెంకటసాయి చెప్పడంతో అంతా ఊరుకున్నారు. చికిత్స అనంతరం ఇంటికి వెళ్లారు. తర్వాత రోజు తల నుంచి తీవ్రమైన రక్తస్రావం అవుతుండడంతో 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకు వెళుతుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ క్రమంలో గత నెల 28న పెద్ద కర్మ కార్డు ఇచ్చేందుకు అప్పలరెడ్డి కుమారుడు కొండారెడ్డి గవర్నర్‌పేటలోని తన స్నేహితుడు సాయి వద్దకు వెళ్లారు. 24వ తేదీ రాత్రి తన తండ్రితో బుర్రా వెంకటసాయి గొడవ పడిన విషయం బయటపడింది. తలను మెట్లకు గట్టిగా కొట్టాడని, దానివల్లే చనిపోయినట్లు గుర్తించారు. ఈ విషయం తల్లికి చెప్పడంతో.. ఆమె సోమవారం గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు

పాయకాపురం, న్యూస్‌టుడే : బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది. 2019 సంవత్సరం, నవంబరులో వాంబే కాలనీకి చెందిన ఓ మహిళ.. రోజు మాదిరిగా తన కుమార్తె (6)ను ఇంటి వద్ద ఉంచి, పనికి వెళ్లారు. అదే ప్రాంతానికి చెందిన సింహాచలం(25) బాలికతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడాన్ని పక్కింటి మహిళ గుర్తించి గద్దించారు. ఈ ఘటనపై బాధితురాలి తల్లి నున్న పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో.. కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి వి.భవాని సోమవారం తీర్పు ఇచ్చారు. బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం వచ్చేలా చూడాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీని ఆదేశించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.కృష్ణవేణి, పోలీసుల పర్యవేక్షణలో తొమ్మిది మంది సాక్షులను విచారించారు.

అంత్యక్రియల్లో అపశ్రుతి

తారజువ్వ పడి ఇల్లు దగ్ధం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : అంత్యక్రియల్లో భాగంగా కాల్చిన టపాసుల నిప్పు రవ్వలు పడి తాటాకు ఇల్లు దగ్ధమైన ఘటన అజిత్‌సింగ్‌నగర్‌లో చోటుచేసుకుంది. కుటుంబం మొత్తం వీధిన పడింది. విలువైన పత్రాలు, బంగారం, నగదు కాలిపోయింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పోతనపల్లి నాంచారమ్మకు కుమారుడు, కోడలు, మనవరాలు ఉన్నారు. వీరందరూ కలిసి అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్, చింతా వారి వీధిలోని తాటాకు ఇంట్లో ఉంటున్నారు. నాంచారమ్మ ఇంటి వద్దే ఉంటోంది. కుమారుడు దుర్గారావు ఆరోగ్య పరిస్థితి సరిగా లేక ఇంట్లో ఉంటూ.. అప్పుడప్పుడూ కూలీ పనులకు వెళుతుంటారు. అతని భార్య సూర్యకుమారి ప్రైవేటు ఆసుపత్రిలో ఆయాగా పనిచేస్తున్నారు. సోమవారం స్థానికంగా వివిధ కారణాలతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా.. వాంబేకాలనీలోని శ్మశానవాటికలో దహన సంస్కారాలకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ క్రమంలో డాబా కొట్లు సెంటర్ మీదుగా వెళుతూ.. తారాజువ్వలు వెలిగించారు. అవి నాంచారమ్మ ఇంటిపై పడి మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి ఇంట్లో నిద్రిస్తున్న వారిని అప్రమత్తం చేశారు. దీంతో ప్రాణనష్టం తప్పింది. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో కుటుంబ సభ్యులు రోదించారు. బుడమేరు వరదలో దెబ్బతిన్న ఇంటిని రూ.లక్షలు అప్పు చేసి బాగుచేయించుకున్నామని విలపించారు. పింఛను డబ్బులు, కూడబెట్టుకున్న సొమ్ము సుమారు రూ.లక్ష నగదు, 16 గ్రాముల బంగారం, కోడలు జీతం రూ.15,000, ఇంటి కాగితాలు, విలువైన ఇంటి సామగ్రి కాలిపోయాయని నాంచారమ్మ తెలిపారు. కళ్ల ముందే ఇల్లు బుగ్గి అయ్యిందని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడంతోపాటు బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

మొండిగోడలతో మిగిలిన ఇల్లు

విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు

పాయకాపురం: రాధానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు హెచ్‌బీ, బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు సోమవారం నిర్వహించారు. టీబీ అధికారి డా.భానూనాయక్ హాజరై విద్యార్థులకు హెచ్‌బీ, బ్లడ్ గ్రూపింగ్ పరీక్షల ఆవశ్యకతను వివరించారు. ప్రిన్సిపల్ బాలరాజు, రాజీవ్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా.పద్మావతి, హెచ్‌వీ వసంత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కోకన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగ, ఉపకులాలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకుడు పరిశపోగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి రాస్తావా.. విడాకులు ఇస్తావా..?

మధురానగర్, న్యూస్‌టుడే : తన పేరున ఆస్తి రాసివ్వాలని లేని పక్షంలో విడాకులు ఇవ్వాలని భార్యను వేధిస్తున్న భర్తపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. నందమూరినగర్‌కు చెందిన లక్ష్మణ్, బాల గురవమ్మకు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. భర్త ఆటో డ్రైవర్‌గా, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. భార్య పేరున ఉన్న ఇల్లు, పొలం తన పేరున రాయాలంటూ లక్ష్మణ్ కొద్దిరోజులుగా ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. సోమవారం ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పీజీఆర్ఎస్‌లో చక్రాల కుర్చీలు

నగరంలోని కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో వినతి పత్రాలు ఇవ్వడానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులకు కలెక్టరేట్ సిబ్బంది ఆసరాగా నిలిచారు. ఎలాంటి సహాయకులు లేకుండా ఒంటరిగా వచ్చినా.. సిబ్బంది వారిని తోడ్కొని వేదిక వద్దకు చేర్చుతున్నారు.
- న్యూస్‌టుడే, ఎన్టీఆర్ కలెక్టరేట్

ధోని పుట్టిన రోజు వేడుకలు

వడ్డిస్తున్న రాజేష్

గాంధీనగర్, న్యూస్‌టుడే : భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని పుట్టిన రోజు వేడుకలు సోమవారం గాంధీనగర్‌లోని శైలజా థియేటర్ వద్ద ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి కేకు కోశారు. పేదలకు అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. క్రికెట్ చరిత్రలో తనకంటూ ప్రత్యేకత చాటుకున్న వ్యక్తి ధోని అని అన్నారు. జనసేన నాయకులు కె.సోమనాథం, రాధాకిరణ్, తాడి దుర్గారావు, పైలా ప్రకాష్, కోసూరి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి వివాదాల ఫిర్యాదులే అత్యధికం

యువకుడి సమస్య వింటున్న డీసీపీ ఉదయరాణి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : పోలీస్ కమిషనర్ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 62 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఉదయరాణి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో అత్యధికంగా భూ, ఆస్తి వివాదాలు 37, మోసాలు 5, సైబర్ నేరాలు 4, కుటుంబ కలహాలు 4, కొట్లాట 3, మహిళా సంబంధ నేరాలు 2, ఇతర వివాదాలు 7 చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపించి.. సత్వరం పరిష్కరించాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు.

చదరంగంలో ప్రతిభ

విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : స్థానిక ఎంకే బేగ్ పాఠశాల విద్యార్థి సోమేశ్వరరావు చదరంగం పోటీల్లో ప్రతిభ కనబరచడం అభినందనీయం అని మండల విద్యాశాఖాధికారి వెంకటరత్నం అన్నారు. విజయవాడ నలందా విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో సోమేశ్వరరావు పాల్గొన్నాడు. ఇందులో ద్వితీయ స్థానంలో గెలుపొందాడు. సోమవారం అతడిని ఉపాధ్యాయులు, ఎంఈవో అభినందించారు. ప్రధానోపాధ్యాయులు ఎం.హుస్సేన్, ఎన్‌సీసీ ఉపాధ్యాయులు ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

(c) eenadu

ప్రేమ వ్యవహారంలో యువతి హత్య!

మృతదేహం పక్కనే కత్తి గాయాలతో ప్రియుడు

రమ్య

జిన్నారం(రామచంద్రాపురం), న్యూస్‌టుడే: ప్రేమ వ్యవహారంలో యువతి హత్య కలకలం రేపింది. ఆమె మృతదేహం పక్కనే ప్రియుడు కూడా గొంతుపై కత్తిగాట్లతో పడి ఉండడం అనుమానాలు రేకెత్తిస్తోంది. ప్రియుడే ఈ పని చేశాడా... ఇంకెవరి హస్తమైనా ఉందా...? అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. హైదరాబాద్ శివారులోని రామచంద్రాపురం ఠాణా పరిధిలోని బండ్లగూడలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా బాడంగి మండలం గజరాయునివలస గ్రామానికి చెందిన బొత్స శ్రీనివాస్, ఈశ్వరమ్మ దంపతులు 25 ఏళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. రామచంద్రాపురం పరిధిలోని బండ్లగూడ బాలాజీనగర్‌లో నివాసముంటున్నారు. వీరి కుమార్తె రమ్య (23)కు మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మాణెపల్లికి చెందిన ప్రవీణ్‌కుమార్ (25)తో మూడేళ్ల నుంచి పరిచయముంది. బీటెక్ పూర్తి చేసిన ప్రవీణ్ ప్రస్తుతం ఆల్విన్‌కాలనీలో ఉంటూ ట్యూషన్లు చెబుతున్నాడు. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. ఆరు నెలల క్రితం తమ ప్రేమ గురించి యువకుడు... రమ్య తల్లిదండ్రులకు చెప్పగా.. వారు అంగీకరించలేదు. ఆమెకు పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. సోమవారం మధ్యాహ్నం యువతి తల్లి ఈశ్వరమ్మ ఇంటికి వచ్చేసరికి లోపల నుంచి గడియ పెట్టి ఉంది. కిటికీ లోంచి పరిశీలించగా... రమ్య గొంతుపై తీవ్ర గాయంతో రక్తపు మడుగులో ఉంది. ఆ పక్కనే మెడ మీద గాయంతో ప్రవీణ్ పడి ఉన్నాడు. ప్రవీణ్ కొన ఊపిరితో ఉండటంతో ఆసుపత్రికి తరలించారు.

అలాంటి వాటికే మీ సమయాన్ని వెచ్చించండి

అవసరం లేని విషయాల గురించి ఆలోచిస్తూ ఉంటే మీ సమయం వృథా కావడమే కాదు, దానివల్ల ముఖ్యమైన పనులపై మీరు దృష్టి పెట్టలేరు. ఓ విషయం వల్ల మీకు

1. వ్యక్తిగత ప్రయోజనమైనా ఉండాలి.
2. మానసిక శాంతైనా లభించాలి.
3. మీ కుటుంబానికి, సమాజానికి పనికొచ్చే అర్థవంతమైన విషయమైనా అయ్యుండాలి.

అలాంటి వాటి కోసమే మీ సమయాన్ని, శక్తిని వెచ్చిస్తూ పూర్తి ఏకాగ్రతను నిలపండి.
– మోర్గాన్ రిచర్డ్ ఒలివియర్, రచయిత్రి

జగన్ కారులో వచ్చి వెళ్లా.. నాకేం తెలియదు

పోలీసుల విచారణలో మాజీ మంత్రి పేర్ని నాని

సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన పేర్ని నాని ★ సీఐ గది వద్ద గుమికూడిన వైకాపా నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 18న సత్తెనపల్లి పట్టణంలో ర్యాలీ చేయడంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తిన విషయం మీకు తెలుసా? రప్పా రప్పా అనే ప్లకార్డులు మీరు చూశారా? వాటిని ఎక్కడ ముద్రించారు? జనసమీకరణలో మీ పాత్ర ఉందా? పట్టణంలో ఎటువంటి అనుమతుల్లేకుండా ర్యాలీ చేయడమే కాకుండా డీజేతో నృత్యాలు చేయడం, వాహనాలు శబ్దం చేస్తూ నడపడం, బహిరంగంగా మద్యం తాగడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడం వంటి విషయాలు మీకు తెలియవా? అంటూ మాజీ మంత్రి పేర్ని నానిని సత్తెనపల్లి పోలీసులు ప్రశ్నించారు. జగన్ కారు ఎక్కమంటే ఎక్కాను.. తాడేపల్లి నుంచి కారులో వచ్చా.. కారులోనే తిరిగి వెళ్లా.. అనుమతుల గురించి నాకేం తెలియదని ఆయన సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడంపై పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో పేర్ని నానిని సోమవారం విచారించారు. పట్టణంలో జరిగిన ర్యాలీలో మీరు పాల్గొన్నారా అని పోలీసులు ప్రశ్నించగా కారులో ఉన్నానని చెప్పారు. జగన్ పర్యటనకు 3 వాహనాలు, 100 మందికి అనుమతి ఇచ్చారు కదా అని నాని పోలీసుల్ని అడిగారు. పట్టణంలో ర్యాలీకి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, రెంటపాళ్లకు పెద్దసంఖ్యలో వాహనాలు, జనం వస్తే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని ఉన్నతాధికారులు ముందుగానే చెప్పారని పోలీసులు సమాధానమిచ్చారు. విచారణకు మరోసారి పిలిస్తే రావాలని సీఐ నాగమల్లేశ్వరరావు మాజీ మంత్రికి చెప్పారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు పోలీస్‌స్టేషన్‌లోకి గుంపుగా వచ్చేసి.. విచారణ పూర్తయ్యే వరకు సీఐ గది ముందే హడావుడి చేశారు.

రెంటపాళ్ల ఎక్కడో తెలియదు

తనకు రెంటపాళ్లే కాదు సత్తెనపల్లి ఎక్కడో కూడా తెలియదని.. ఇక్కడికి రావడం ఇదే తొలిసారి అని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. పోలీసుల విచారణ తర్వాత వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుధీర్ భార్గవరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 11 సెక్షన్లతో తనపై కేసు పెట్టారని, మచిలీపట్నంలోని కార్యాలయంలో ఆదివారం పోలీసులు నోటీసు అంటించి వెళ్లడంతో విచారణకు వచ్చానని చెప్పారు. పోలీసుల ఆంక్షలు అతిక్రమించారని, ప్రజల్ని ఇబ్బందులకు గురి చేశారని, స్టంట్లు వేశారని రుజువు కావడంతో మిమ్మల్ని విచారణకు పిలుస్తున్నామంటూ నోటీసులో పేర్కొన్నారన్నారు. సత్తెనపల్లిలో వైకాపా ఇన్‌ఛార్జి, ఛైర్‌పర్సన్ ఎవరో కూడా ఇక్కడికి వచ్చేవరకు తనకు తెలియదని, తాను ఎవరితోనూ మాట్లాడలేదని అన్నారు. పాలకుల ఒత్తిడితో వారి కుర్చీలను కాపాడుకునేందుకు పోలీసు అధికారులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని, సత్తెనపల్లి పోలీసులు అమాయకులని వ్యాఖ్యానించారు. తనపై కేసులు పెట్టినా జగన్ జెండాను వదిలేది లేదన్నారు.

గ్రూప్‌-1 కేసులో మధుసూదన్‌కు బెయిల్

ఈనాడు, అమరావతి: గ్రూప్‌-1 (2018) ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు, నిధుల దుర్వినియోగం కేసులో రెండో నిందితుడు, క్యామ్‌సైన్ మీడియా సంస్థ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్‌కు హైకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. విజయవాడ కోర్టులో రూ.25 వేల విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. అభియోగపత్రం దాఖలు చేసే వరకు ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరుకావాలని మధుసూదన్‌కు స్పష్టంచేశారు. మూల్యాంకనంలో అక్రమాలపై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం మధుసూదన్ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇటీవల వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి.. సోమవారం నిర్ణయాన్ని ప్రకటించారు. ఏపీపీఎస్సీతో చేసుకున్న ఒప్పందంలోని నిబంధనలకు అనుగుణంగానే మధుసూదన్ పనులు నిర్వహించారని, వైద్య నివేదికలు, కేసులోని వివరాలను పరిగణనలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు
- హైకోర్టులో నేడు విచారణ

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి(ఏ39) ఉపసంహరించుకున్నారు. సోమవారం జరిగిన విచారణలో వ్యాజ్యం ఉపసంహరణకు మోహిత్‌రెడ్డి తరఫు న్యాయవాది అభ్యర్థించారు. అందుకు అనుమతిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులిచ్చారు. సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని, కేసులో తనను నిందితుడిగా పేర్కొంటూ 'సాక్షి'గా విచారణకు రావాలని దర్యాప్తు అధికారి నోటీసు ఇవ్వడం చెల్లదంటూ హైకోర్టులో మోహిత్‌రెడ్డి క్వాష్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇటీవల జరిగిన విచారణలో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని అతని తరఫు సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు అభ్యర్థించగా, ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి నిరాకరించారు. అరెస్టుపై ఆందోళన ఉంటే ముందస్తు బెయిలు పిటిషన్ వేసుకోవాలన్నారు.

వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రానుంది. 'మద్యం ముడుపులను తరలించడానికి నేను తుడా ఛైర్మన్‌గా ఉన్న సమయంలో వాహనాలను వినియోగించినట్లు నాపై ఆరోపణ చేస్తున్నారు. వాస్తవానికి అప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తుడా వాహనాలను వినియోగించడం, రూ.కోట్లు తరలించడం సాధ్యం కాదు. నేను నేరానికి పాల్పడలేదు. నా ప్రతిష్ఠను దిగజార్చేందుకు రాజకీయ నేతలు చెప్పిన మాటలు విని పోలీసులు నన్ను ఈ కేసులో ఇరికించార'ని వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఇప్పటికే బెయిలు కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను విజయవాడ కోర్టు కొట్టివేసిందని వెల్లడించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరారు.

బూనేటి చాణక్య బెయిల్ పిటిషన్ కొట్టివేత

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన రాజ్ కెసిరెడ్డి ప్రధాన అనుచరుడు బూనేటి చాణక్య (ఏ-8) బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం కొట్టేసింది. అతనికి బెయిల్ నిరాకరిస్తూ ఏసీబీ న్యాయస్థానం న్యాయాధికారి భాస్కర్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- ఇంటి నుంచి ఆహారం తీసుకొచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మద్యం కుంభకోణం కేసు నిందితుడు రాజ్ కెసిరెడ్డి (ఏ-1) దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా విజయవాడ ఏసీబీ న్యాయస్థానం కొట్టేసింది.
- మద్యం కుంభకోణం కేసులో నిందితులైన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్‌నాయుడు బెయిల్ పిటిషన్‌లపై తదుపరి విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. వీరిద్దరికీ బెయిల్ ఇవ్వొద్దంటూ సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు.

కరోనా కట్టుకథల కరోడ్‘పతి’

- బెంగళూరు మహిళను వంచించి కోట్ల ఆస్తి కాజేసిన చిత్తూరువాసి

శివప్రసాద్

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: భార్యాపిల్లలు కరోనా సోకి మృతి చెందారని మాయమాటలతో ఓ మహిళను నమ్మించి పెళ్లి చేసుకుని వంచించి రూ.28 కోట్ల సొత్తు కాజేసి పరారయ్యాడో మోసగాడు. బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేటకు చెందిన నాగమణి(50)కి చాన్నాళ్ల క్రితం బెంగళూరుకు చెందిన వెంకటప్పతో పెళ్లయింది. కొన్నేళ్ల క్రితం వారి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ తర్వాత భర్త వెంకటప్పనూ అనారోగ్యంతో చనిపోయాడు. కొన్నాళ్లకు ఆమె మరో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని మధ్యవర్తి మహిళను ఆశ్రయించారు. ఆ మహిళ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం శేషాపురానికి చెందిన శివప్రసాద్‌కు ఈ విషయాన్ని చెప్పింది. అప్పటికే అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. అయినా.. నాగమణి ఆస్తిపరురాలని తెలుసుకున్న శివప్రసాద్ పథకం పన్నాడు. తన భార్య, కుమార్తె కొవిడ్‌తో మరణించారంటూ నకిలీ మరణ ధ్రువపత్రాలు తయారు చేసి నాగమణికి చూపాడు. నాగమణి వాటిని నమ్మడంతో 2022లో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు.

డబ్బొస్తుందని ఆశజూపి..: ఆమె ఆస్తిపై కన్నేసిన శివప్రసాద్ ఆర్‌బీఐ నుంచి కోట్లలో సొమ్ము రానుందని చెబుతూ కొన్ని నకిలీ పత్రాలు సృష్టించి, ఆ నగదు దక్కాలంటే కొంతసొమ్ము ఆర్‌బీఐకి చెల్లించాలని నమ్మించాడు. భర్తే కదా అని ఆమె నమ్మడంతో తన తండ్రి, సోదరుడు, వదినల ఖాతాల్లోకి ఆమె నుంచి సొమ్ము బదలాయించుకున్నాడు. అప్పటికే నాగమణి సంతకాలు ఫోర్జరీ చేసిన శివప్రసాద్ బెంగళూరులో మొదటి భర్త నుంచి ఆమెకు సంక్రమించిన రూ.15 కోట్ల విలువైన భూమిని, రూ.10 కోట్ల విలువైన భవనాన్ని అమ్మేశాడు. ఆమె ఆభరణాలను కూడా బ్యాంకుల్లో తనఖా పెట్టాడు. బంధువుల పెళ్లికి వెళ్లాల్సి ఉందని, ఆభరణాలు కావాలని నాగమణి కోరగా అప్పటి నుంచి అతడు పరారయ్యాడు. భర్తను వెతుక్కుంటూ ఆమె బంగారుపాళ్యానికి రాగా.. అప్పటికే అతనికి భార్య, కూతురు ఉన్న తెలిసింది. దీంతో బాధితురాలు ఎస్పీ మణికంఠను ఆశ్రయించి న్యాయం చేయాలని విన్నవించారు.

మాలిలో కిడ్నాపర్ల చెర నుంచి మా బిడ్డను కాపాడండి

అమరలింగేశ్వరరావు తల్లిదండ్రుల వేడుకోలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: 'అమ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది? మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ చేశారు కదా.. ఇప్పుడు బాగానే నడవగలుగుతున్నావా?' అని చివరిసారిగా తన కుమారుడు అమరలింగేశ్వరరావు అన్న మాటలను గుర్తు చేసుకుని ఆ తల్లి కుమిలిపోతున్నారు. ఉపాధి కోసం ఆఫ్రికాలోని మాలి దేశం వెళ్లిన పల్నాడు జిల్లా మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన అమరలింగేశ్వరరావును వారం రోజుల క్రితం ఉగ్రవాదులు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. రోజులు గడుస్తున్నా ఆచూకీ లేకపోవడంతో అతని తల్లిదండ్రులు వెంకటరమణ, రాజ్యలక్ష్మి, భార్య, ముగ్గురు పిల్లలు ఆందోళన చెందుతున్నారు. ఆయన తల్లిదండ్రులను పలకరించగా.. 'అమరలింగేశ్వరరావు గ్రామంలో పదో తరగతి చదివాక మాచర్లలో ఐటీఐ పూర్తి చేశాడు. తర్వాత నల్గొండలో సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగం వచ్చింది. పెళ్లై ముగ్గురు పిల్లలు పుట్టాక కుటుంబ పోషణ కష్టమైంది. మరోవైపు ఫ్యాక్టరీలో పనిచేసే స్నేహితుడి ద్వారా మాలిలో ఉద్యోగం ఉందంటే దరఖాస్తు చేసి వెళ్లాడు. ఇప్పటికి 11 ఏళ్లు అయ్యింది. ఏటా ఒకసారి వచ్చి వెళ్తాడు. ఈసారి రెండు నెలల్లో వస్తానని మాతో అన్నాడు' అని తల్లి రాజ్యలక్ష్మి తెలిపింది. చివరిసారి జులై 1న ఫోన్‌లో తాము మాట్లాడామని, తర్వాత కిడ్నాప్ విషయం తెలిసిందని తల్లిదండ్రులు చెప్పారు. ఉగ్రవాదుల చెర నుంచి తమ కుమారుడిని విడిపించి క్షేమంగా ఇక్కడికి వచ్చేలా చూడాలని వారు వేడుకుంటున్నారు.

త్వరలోనే ధాన్యం రైతుల బకాయిలు చెల్లింపు

ఏపీమార్క్‌ఫెడ్ ఎండీ ఢిల్లీరావు

ఈనాడు, అమరావతి: ధాన్యం రైతుల బకాయిలను (ఖరీఫ్ 2024-25 పంట కాలానికి) త్వరలో చెల్లించనున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ ఢిల్లీరావు తెలిపారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి రూ.1,000 కోట్ల రుణం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4న అనుమతించిదన్నారు. మూడు రోజుల్లో ఆ మొత్తం మార్క్‌ఫెడ్‌కు బదిలీ అవనుందన్నారు. రుణం బదిలీ అయిన వెంటనే రైతుల బకాయిలు చెల్లిస్తామని తెలిపారు.

మిద్దె పంట.. మేలు ఇంట

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

మొక్కలకు ఎండ తగలకుండా షేడ్‌నెట్ ఏర్పాటు

విజయవాడ టీచర్స్ కాలనీలో ఉంటున్న వైద్యులు మన్నె గోపీచంద్, నాగభాస్కరాంబ దంపతులు మిద్దె తోట సాగు చేస్తున్నారు. కొన్నేళ్ల పాటు ఆస్పత్రి నిర్వహించి ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్నారు. పదేళ్ల నుంచి సేంద్రియ విధానంలో మిద్దె పంటలు పండిస్తూ.. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇల్లు కట్టుకున్నప్పుడే సాగుకు అనుకూలంగా తీర్చిదిద్దుకున్నారు. కుండీలు పెట్టుకునేలా గోడలు నిర్మించారు. వాటిపై ఇనుప స్టాండ్లు ఏర్పాటు చేశారు. అందులో కుండీలు, డ్రమ్ములు పెట్టారు. వాటిలో పూలు, ఫలాలు, కూరగాయల మొక్కలు నాటారు. భవనం పాడైపోకుండా యాంటీ శ్లాబ్ లీకింగ్ చేయించారు. దానిపై టైల్స్ వేయించారు. బిందు సేద్యం, సాధారణ పద్ధతిలో నీరు పోసి సంరక్షిస్తున్నారు. ఒక్క చుక్క నీరు కూడా శ్లాబ్‌పై నిల్వ ఉండకుండా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఇంటి ముందు, ప్రహరీ, మెట్ల పక్కన, మిద్దెపైన ఖాళీ లేకుండా మొక్కలు పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రైతేరాజు

మెట్ల మార్గంలో పెంచుతున్న మొక్కలు

ఎరువులు తయారు చేస్తూ..

ఇంట్లో నుంచి వచ్చిన కూరగాయల వ్యర్థాలు, వ్యాపారుల వద్ద పాడైపోయి మిగిలిన కూరగాయలు, రాలిన ఆకులను ఎరువుగా తయారు చేసి వాడుతున్నారు. బెండ, వంకాయ, దోస, కాకర, బీర, పొట్లకాయ, బత్తాయి, నారింజ, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, సీతాఫలం, రామాఫలం వంటి ఫలాల మొక్కలతో పాటు ఆరు రకాల మందారాలు, పది రకాల చామంతులు, కనకాంబ్రాలు, పారిజాతం, సన్నజాజి, విరజాజి, చుక్కమల్లి, బిళ్ల గన్నేరు, ఆకుకూరలు పెంచుతున్నారు. మొక్కలకు ఎండ తగలకుండా షేడ్‌నెట్ వేశారు. ఇద్దరూ ఇక్కడ పండిన ఆకుకూరలు, కూరగాయలు తినడమే కాకుండా బంధువులు, ఇరుగుపొరుగు వారికి కూడా ఇస్తున్నారు.

★ ఈ సందర్భంగా వైద్య దంపతులు మాట్లాడుతూ.. 'సేంద్రియ పద్ధతిలో మిద్దె తోటలో కూరగాయలు, ఆకుకూరలు, ఫలాల మొక్కలు పెంచుతున్నాం. వాటిని తిని ఆరోగ్యంగా ఉంటున్నాం. ఉదయం, సాయంత్రం రెండు గంటలు తోట పనికి కేటాయిస్తాం. ఇల్లు చల్లగా ఉంటుంది. మంచి గాలి వస్తుంది. ఆహ్లాదంగా ఉంటుంది.' అని వివరించారు.

డ్రోన్ వినియోగిస్తే.. సమయం.. ఖర్చు ఆదా

డ్రోన్ గురించి రైతులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త సుధారాణి, వ్యవసాయ అధికారులు

ఘంటసాల, చల్లపల్లి, న్యూస్‌టుడే

వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, ప్రయోజనాలు, రాయితీ గురించి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డి.సుధారాణి, సస్యరక్షణ శాస్త్రవేత్త కె.రేవతి వివరించారు. డ్రోన్ కావాలంటే ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలి. అందులో ఒకరు ఇంటర్మీడియట్ లేదా అగ్రికల్చర్ డిప్లమా లేదా అగ్రికల్చర్ ఇంజినీరింగ్ చదివి ఉండాలి. అతనికి డ్రోన్ వినియోగంపై 15 రోజుల పాటు గుంటూరులాంలో శిక్షణ ఇస్తారు. జిల్లా వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దాని ఖరీదు రూ.9.80 లక్షలు. అందులో రైతులు రూ.4.90 లక్షలు (50 శాతం) తమ ఖాతాల్లో ఉన్నట్టు బ్యాంక్‌కు చూపించాలి. 2 నెలల్లో దాని ఖరీదులో రూ.7.80 లక్షలు (80 శాతం) రాయితీతో రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్‌ను రైతులకు అందిస్తుంది. ఇంకా అన్నదాతలు చెల్లించాల్సిన రూ.2 లక్షలు నెల నెల వాయిదాల పద్ధతిలో మూడేళ్లలో చెల్లించాలి. డ్రోన్ ఆపరేట్ చేసే వ్యక్తికి రైతులు ఎకరానికి రూ.300-350 చొప్పున చెల్లిస్తారు.

ప్రయోజనాలు కొన్ని..

90 శాతం నీరు, 95 శాతం సమయం ఆదా చేయవచ్చు. 10 లీటర్ల ట్యాంకు సామర్థ్యం గల వ్యవసాయ డ్రోన్‌తో ఎకరా పొలాన్ని 10-15 నిమిషాల్లో రసాయన మందు చల్లవచ్చు. విత్తనాలు, పురుగులు, తెగుళ్ల, కలుపు మందులు, నీళ్లలో కరిగే ఎరువులు పిచికారీ చేయవచ్చు. రైతులు రసాయనాలు పిచికారీ చేయడం వలన కలిగే శ్వాసకోశ వ్యాధులను దూరం చేస్తుంది. బురదలో నడుస్తూ మందులు వేయాల్సిన అవసరం ఉండదు. పని ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది. ఎత్తు ఎక్కువగా పెరిగే మొక్కజొన్న, జొన్న, చెరకు తదితర పంటలకు తేలికగా మందులు పిచికారీ చేయవచ్చు. డ్రోన్ వాడినప్పుడు అదనంగా 6-7 సెట్ల బ్యాటరీలు దగ్గర ఉంచుకుంటే మంచిది.

ప్రశ్న: కాలీఫ్లవర్ పంటకు నేలలు, నాటే కాలం, ఎరువుల యాజమాన్యం గురించి వివరించండి? – కె.రంగారావు, రైతు, రుద్రవరం

సమాధానం: కాలీఫ్లవర్ పంటకు చల్లని వాతావరణం అవసరం. స్వల్పకాలిక రకాలకు జులై, ఆగస్టు నెలలు అనువైనవి. బాగా నీరు ఇంకే గరప నేలలు పంట సాగుకు అనుకూలం. విత్తనాన్ని సన్నని ఇసుకతో కలిపి మడుల్లో నారుపోసి, 30-35 రోజుల తరువాత నాటు వేయాలి. ఎరువుల యాజమాన్యానికి... హెక్టారుకు సుమారు 40-50 కిలోల భాస్వరం, 50 కిలోల పొటాష్ ఎరువును ఆఖరి దుక్కిలో వేయాలి. తరువాత హెక్టారుకు 60-80 కిలోల నత్రజనిని మూడు సమాన భాగాలుగా చేసి, తొలిసారి నారు నాటిన 25-30 రోజులకు, రెండో సారి 50-60 రోజులకు, మూడో సారి 75-80 రోజులకు వేయాలి. ఫలితంగా హెక్టారుకు దాదాపు 20 టన్నుల దిగుబడి పొందవచ్చు. **- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం - ఘంటసాల, న్యూస్‌టుడే**

అరటిలో సస్యరక్షణ చర్యలు

లంకలో సాగు చేసిన అరటి పంట

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : కృష్ణానది పరీవాహక లంక గ్రామాల్లో అరటి పంటను రైతులు సాగు చేశారు. సస్యరక్షణ చర్యలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు. ఆ వివరాలను ఉద్యాన శాఖ అధికారి చందు జోసఫ్ తెలియజేశారు. అరటి పిలకలు నాటే సమయంలో శుద్ధి అవసరం. పిలకలను మైక్రోక్రోటాపాస్ ద్రావణంలో 30 నిమిషాల పాటు నిల్వ ఉంచి నాటితే తెగుళ్లను ఎదుర్కొంటుంది. ఎకరానికి 900 నుంచి వెయ్యి పిలకల వరకు నాటుకోవాలి. పిలక నాటడానికి తవ్విన గుంతలో 300 గ్రాముల పాస్ఫరస్, ఐదు కిలోల పశువుల ఎరువు వేయాలి. మొక్క ఎదిగిన తర్వాత నత్రజని, పొటాషియం ఎరువులను తగిన మోతాదులో వాడాలి. అరటికి ఆశించే తెగుళ్లలో సిగటోకా ఆకుమచ్చ తెగులు ప్రధానమైంది. దాని నివారణకు మాంకోజెట్ మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పనామా తెగులు పిలకల ద్వారా వ్యాపిస్తుంది. దాని నివారణకు శుద్ధి చేసిన పిలకలు నాటుకుంటే మంచిది.

గవర్నర్ పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

10న ఉద్యాన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

సూచనలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, పక్కన జేసీ గీతాంజలిశర్మ, ఎస్పీ గంగాధరరావు తదితరులు

ఆత్కూరు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం ఆత్కూరులో 10న గవర్నర్ పర్యటనలో భద్రతా లోపం తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. స్థానిక స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో జరిగే వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి డీజీ డా. ఎమ్.ఎల్.జాట్‌తో కలిసి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను జేసీ గీతాంజలిశర్మ, ఎస్పీ గంగాధరరావులతో కలిసి కలెక్టర్.. సోమవారం సభా ప్రాంగణ పరిసరాలను సందర్శించారు. అతిథులకు ప్రత్యేక వసతులు, పరిసరాల్లో స్వచ్ఛత, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని విశ్వవిద్యాలయం డీన్ ప్రసన్నకుమార్‌కు కలెక్టర్ సూచించారు. ప్రోటోకాల్ ప్రకారం కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులతో చర్చించిన కలెక్టర్.. పలు సూచనలు చేశారు. అసోసియేట్ డీన్ దొరాజీరావు, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, మెప్మా పీడీ సాయిబాబు, జిల్లా సంక్షేమ సాధికారత అధికారి షాహిద్‌బాబు, డీపీవో అరుణ, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

9న లేజర్ రన్ జట్ల ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నిడమానూరు జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో ఈ నెల 9వ తేదీన ఉమ్మడి కృష్ణా జిల్లా రేజర్ రన్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా మోడరన్ పెంటాథ్లాన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెలగపూడి ఉజ్వల్, మరీదు సురేంద్రబాబు తెలిపారు. అండర్-9, 11, 13, 15, 17, 19, 30 కేటగిరీలతో పాటు మాస్టర్ 'ఎ' 31-40, మాస్టర్ 'బి' 41-50, మాస్టర్ 'సి' 51+ కేటగిరీల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు అదే రోజు ఉదయం 8 గంటలకు పాఠశాల మైదానంలో పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఆధార్ కార్డుతో హాజరవ్వాలని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12వ తేదీన నరసరావుపేటలోని కోడెల శివప్రసాదరావు డీఎస్ఏ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో తలపడతారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94418 12694 నంబరులో సంప్రదించాలని సూచించారు.

వల్లభనేని వంశీకి అస్వస్థత

విజయవాడ ఆసుపత్రిలో చేరిక

చికిత్స పొందుతున్న వంశీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వైకాపా నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అస్వస్థతకు గురయ్యారు. శ్వాస సంబంధిత సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్న ఈయన.. సోమవారం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. బాపులపాడు మండలం ఎ.సీతారాంపురంలో నివాసం ఉంటున్న వంశీ సోమవారం ఉదయం గన్నవరం కోర్టులో హాజరయ్యారు. అనంతరం అక్కడకు వచ్చిన కార్యకర్తలు, అభిమానుల్ని కొద్దిసేపు కలిసి మాట్లాడారు. అక్కడ్నుంచి నేరుగా విజయవాడలోని ఆసుపత్రికి వెళ్లారు. జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్నా పలుమార్లు అనారోగ్యానికి గురై విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది గత నెల మొదటి వారంలో న్యాయస్థానాన్ని అభ్యర్థించి ఓ ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా తరచూ జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతుండడంతో గత శుక్రవారం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడ కొన్ని వైద్య పరీక్షల అనంతరం, ఇతర పరీక్షలు, వైద్య చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించినట్లు సమాచారం. దీంతో సోమవారం హుటాహుటిన బందరు రోడ్డులోని ఓ ఆసుపత్రిలో చేరారు. ముక్కులో ఓ రంధ్రం పూడుకుపోవడంతో శ్వాస తీసుకోలేకపోతున్నారని, అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాలని వైద్యులు పేర్కొన్నారని, రెండ్రోజుల పరిశీలన తర్వాత శస్త్రచికిత్స చేసే అవకాశముందని వంశీ అనుచరులు తెలిపారు.

సొంత నిధులతో క్యాంటీన్ ఏర్పాటు అభినందనీయం

రిబ్బన్ కోస్తున్న ఎంటీ కృష్ణబాబు, పక్కనే లక్ష్మీశ, ఢిల్లీరావు తదితరులు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: వైద్యులు ఆహారం తినేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు తమ సొంత నిధులతో క్యాంటీన్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు అన్నారు. విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వైద్యులు ఏర్పాటు చేసుకుని క్యాంటీన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొత్తం రూ.1.50 కోట్ల వైద్యుల నిధులతో క్యాంటీన్‌ను నిర్మించుకున్నారని, అందులో రూ.48 లక్షలు కొవిడ్ సమయంలో వైద్యులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఉన్నాయని పేర్కొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, అడిషనల్ డీఎంఈ వెంకటేష్, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. ఏడుకొండలు, ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా.ఏవీ రావు తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్ల పరిశీలన

పరిశీలిస్తున్న గోపీచంద్, వివిధ జిల్లాల ఉద్యోగులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా సోమవరంలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను సోమవారం 13 జిల్లాల ఉపాధి హామీ పథకం ఉద్యోగులు పరిశీలించారు. వీటి నిర్మాణంలో సాంకేతిక వివరాలను ఉపాధి హామీ పథకం రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి(సీక్యూసీవో) గోపీచంద్ వివరించారు. ఇందుకు వినియోగించే కంకర, రాళ్ల గురించి చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎలా నిర్మించుకోవాలో వివరించారు. తక్కువ ఖర్చుతో నిర్మించే ఈ డ్రెయిన్ల వల్ల నీరు భూమిలో ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. మ్యాజిక్ డ్రెయిన్ల ఫొటో ప్రదర్శనను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ఇంజినీర్లు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర స్థాయి సిబ్బంది బస్సులో గ్రామానికివచ్చి వీటిని పరిశీలించారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, తిరుపతి, బాపట్ల జిల్లాల్లో ఎంపిక చేసిన 13 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఈ డ్రెయిన్లు నిర్మిస్తారు. ఉపాధి హామీ పథకం సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి జె.సురేష్‌బాబు, ఏపీడీ ఎన్.శ్రీనివాసరావు, ఏపీవో శరత్‌బాబు, స్థానిక తెదేపా నాయకుడు ఉప్పుకొండూరు గురుప్రసాద్, యోగానందం తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

రహదారులు మెరుగుపరచండి

ముఖ్యమంత్రికి ఎంపీ రమేష్ వినతి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ సీఎం రమేష్

ఈనాడు, అమరావతి- అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లాలో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న కీలకమైన ప్రధాన రహదారులు, అనుసంధాన మార్గాలు, వంతెనల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కోరారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి జిల్లాలో ప్రధాన సమస్యలను దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో అనకాపల్లి- చోడవరం రహదారి త్వరగా పూర్తిచేయాలని కోరారు. వడ్డాదిలో పెద్దేరు నదిపై, నర్సీపట్నం- రేవుపోలవరం రోడ్డులో వరాహ నదిపైన నిర్మించాల్సిన హై లెవెల్ వంతెనల ప్రతిపాదనల నివేదిక సీఎంకు అందజేశారు. జిల్లాలో చేపట్టిన భీమునిపట్నం- నర్సీపట్నం, అనకాపల్లి- వెంకన్నపాలెం, నర్సీపట్నం- రేవుపాలెం, నర్సీపట్నం- చింతపల్లి, వడ్డాది- పాడేరు, భీమునిపట్నం- నర్సీపట్నం, నర్సీపట్నం- తుని రహదారుల నిర్మాణ తాజా పరిస్థితి, చేపట్టాల్సిన చర్యలను వివరించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగంగా పారిశ్రామిక కారిడార్లు, పర్యాటక కేంద్రాలు, పెట్టుబడి ప్రాంతాలు, పోర్టులు, విమానాశ్రయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించడంపై హర్షం వ్యక్తం చేశారు. రహదారి వ్యవస్థ మెరుగుపడితే మరింత సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

నడవలేం.. నడపలేం!

కె.కోటపాడు మండలం పాతవలస-సూదివలస రోడ్డు అడుగడుగునా గుంతలతో అధ్వానంగా దర్శనమిస్తోంది. వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనాలు నడపలేక.. కనీసం నడవడానికి వీలులేక నిత్యం ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వాహనాలు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. ఇంత దారుణంగా ఉన్న ఈ మార్గాన్ని గత వైకాపా ప్రభుత్వంలో పట్టించుకోలేదు. ఎన్నేళ్లయినా పురోగతి లేకపోవడంతో ఇరు గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

– కె.కోటపాడు, న్యూస్‌టుడే

గోతులమయంగా తయారైన రహదారి

పేట మార్కెట్ కమిటీ పాలకవర్గం ఇదే...

పాయకరావుపేట: పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పేర్లతో సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అధ్యక్షుడుగా దేవర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడుగా కె.వెంకటేశ్వరరావును నియమించారు. సభ్యులుగా పిర్ల కల్యాణి, బి.లక్ష్మి, జి.అచ్యుత వీర వెంకటశ్రీను, కాండ్రేగుల ధనలక్ష్మి, కె.బాబూరావు, ఎన్.సూర్యలక్ష్మి, పి.గణేష్, పి.పాప, టి.నూకరత్నం, వై.సత్యనారాయణ, డి.అప్పారావు, ఎస్.సూర్యారావు, టి.గంగాలక్ష్మిని నియమించారు.

పగలు భేటీ.. రాత్రి లూటీ!

✦ కూటమి పాలనలోనూ వైకాపా నేతల బరితెగింపు

✦ కొండవాలు ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు

వారంతా ఒక ముఠా! రెండు బృందాలుగా ఏర్పడతారు. పగలు ఓ బ్యాచ్ బేరాలు ఒప్పుకొని సొమ్ము వసూలు చేస్తుంటే.. రాత్రయితే మరో బ్యాచ్ పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో మూకుమ్మడిగా బయలుదేరి దగ్గరలోని కొండలను కొల్లగొడుతూ.. చెరువులను చెరిచేస్తున్నారు. .. ఇదీ సబ్బవరం మండలంలో సాగుతున్న గ్రావెల్ దందా!

ఈనాడు డిజిటల్, అనకాపల్లి, సబ్బవరం, న్యూస్‌టుడే

అనకపల్లి శివారు ఎర్రవానిపాలెం దగ్గర తవ్విన కొండవాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా.. సబ్బవరం మండలంలో వైకాపా మూకల ఆగడాలకు అడ్డుకట్ట పడలేదు. అడిగేవారు లేకపోవడంతో ఇప్పటికీ మండలంలోని పలు గ్రామాల్లో మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు నిరంతరాయంగా సాగిపోతున్నాయి. కొండలు, చెరువులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సబ్బవరం, పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంది. లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటితో పాటు ఇళ్ల నిర్మాణాలు సైతం జోరుగా సాగుతున్నాయి. దీంతో ఆయా పనులకు మట్టి, గ్రావెల్ డిమాండ్ బాగా ఎక్కువైంది. దీన్ని అవకాశంగా చేసుకుని. . వైకాపా నాయకులు ఓ ముఠాగా ఏర్పడి సమీపంలోని ఎలాంటి అనుమతులు లేకుండా కొండలను తవ్వేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిందిపోయి వైకాపా నాయకులతో కుమ్మక్కయి వారికి అండదండలు అందిస్తున్నారు. తనిఖీలు చేసి అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులేమో కార్యాలయాలకే పరిమితం అవుతుండటంతో అక్రమార్కుల దందా మూడు లారీలు.. ఆరు ట్రాక్టర్లుగా కొనసాగుతోంది.

ఒమ్మివానిపాలెం గ్రావెల్‌ను ఓ ప్రైవేట్ వెంచర్‌లో వేశారిలా..

కన్నుపడితే.. కరగదీయాల్సిందే!.. అనకపల్లి, గంగవరం, బాటజంగాలపాలెం, ఒమ్మివానిపాలెం, గాలిభీమవరం, అంతకాపల్లి, రాయపురఅగ్రహారం, గొల్లలపాలెం తదితర గ్రామాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాల రవాణా పెద్ద వ్యాపారంగా మారింది. ఆయా ప్రాంతాలకు సమీపంలోని ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలు, పేదల ఇళ్ల కాలనీలకు సమీపంలో రాత్రి వేళల్లో భారీ యంత్రాలతో తవ్వకాలు సాగిస్తున్నారు. దూరాన్ని బట్టి లారీకి రూ. 3,500 నుంచి రూ. 7 వేల వరకు వసూలు చేస్తున్నారు. తెల్లారేసరికి గ్రావెల్ కోరినచోట దింపేసి గప్‌చుప్ అన్నట్టుగా ఉండిపోతున్నారు.

● అసకాపల్లి సర్వే నం. 1 వజ్రాల కొండ చుట్టూ రోజూ తవ్వకాలు చేస్తున్నారు. న్యాయ విశ్వవిద్యాలయం దగ్గర పేదల ఇళ్లకు ఆనుకుని ఉన్న కొండవాలు మొత్తం అగాధంలా మార్చేశారు.

● ప్రస్తుతం ఒమ్మివానిపాలెం సమీపంలోని నల్లకొండపై అక్రమార్కుల కన్నుపడింది. దీంతో ఇక్కడ కొద్దిరోజులుగా తవ్వకాలు ఊపందుకున్నాయి. ఇక్కడ నుంచి గ్రావెల్‌ను సమీపంలోని ప్రైవేటు వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

అక్రమ తవ్వకాలు చేస్తే చర్యలు

.. ప్రభుత్వ స్థలాలు, కొండ వాలుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. ఫిర్యాదులు వస్తే.. రెవెన్యూ సిబ్బందిని పంపించి తనిఖీలు చేయిస్తున్నాం. రాత్రివేళల్లో కూడా నిఘా పెడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలు చేస్తే.. వాహనాలను సీజ్ చేస్తాం. అపరాధరుసుం విధిస్తాం. అప్పటికీ ఆపకపోతే.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, ఏడీ, మైనింగ్, అనకాపల్లి

బెన్నవోలులోనూ అక్రమాల బాగోతాలు

చోడవరం, న్యూస్‌టుడే చోడవరం మండలంలో సహజ వనరుల సంపద దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. బెన్నవోలులో తాగునీటి పథకాలకు సమీపంలో తవ్వకాలు చేపట్టారు. అధికారులు వస్తున్నారు.. తవ్వకాలు చేపడితే ఊరుకోబోమంటూ హెచ్చరించి వెళ్లిపోతున్నారు తప్ప చర్యలు చేపట్టలేదు. రాయపురాజుపేట, నర్సాపురం, వెంకన్నపాలెం, అంబేరుపురం, గోవాడ, బెన్నవోలు, ముద్దుర్తి, గంధవరం పంచాయతీలు కొండలకు సమీపంలో ఉన్నాయి. కొండ దిగువన భూములున్న రైతులతో మాట్లాడుకుని కంకరను పట్టుకెళ్లి అమ్ముకుంటున్నారు. బెన్నవోలులో వారం రోజులుగా రాత్రుళ్లు తవ్వకాలు చేసి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. గతంలో తవ్వకాలు వల్ల తాగునీటి సరఫరా గొట్టాలు దెబ్బతింటే పంచాయతీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఆగమేఘాలపై తవ్వకందారులు గొట్టాలను బాగు చేయించారు. ఇప్పుడు తాగునీటి పథకాన్ని ఆనుకుని కొండను తొలిచేసేస్తున్నారు. దీంతో నీటి పథకాల పునాదులు జారి కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది.

★ అక్రమ తవ్వకాలపై తాగునీటి సరఫరా విభాగం డీఈఈ సూర్యనారాయణ వద్ద ప్రస్తావించగా తహసీల్దారుకు లేఖ ద్వారా తెలిపామన్నారు. తాగునీటి పథకాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత పంచాయతీలదేనని స్పష్టం చేశారు. పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.

బెన్నవోలులో తాగునీటి పథకాల వద్ద తవ్వకాలు

అభ్యున్నతికి బాసట.. వికాసానికి వేదిక

బాలల ప్రగతికి దోహదపడేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు విద్యాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య మరింత బంధాన్ని పెంచడానికి సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న జిల్లావ్యాప్తంగా మెగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) కార్యక్రమం నిర్వహించనుంది. ఈ సారి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లో కూడా ఈ సమావేశాన్ని పెద్ద ఎత్తున చేపట్టడానికి విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో 1,396 ప్రభుత్వ పాఠశాలలు, 406 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 2.5 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈనెల 10న జరిగే సమావేశాలకు తల్లిదండ్రులు అందరూ తప్పనిసరిగా పాఠశాలలకు వచ్చేలా ఇప్పటికే విద్యాశాఖ ఆహ్వానాలను సిద్ధం చేసింది. అటు తల్లిదండ్రులు ఇటు విద్యార్థుల్లో నూతన చైతన్యం తీసుకువచ్చేలా ముందడుగు వేస్తున్నారు.

✦ తరగతి గదిలో చదువు, నైపుణ్యాల పెంపు, సమగ్ర వికాసం దిశగా ఉపాధ్యాయులు బోధిస్తారు. ఇలాగే ఇంటి వద్ద తల్లిదండ్రులు సైతం విద్యార్థుల వికాసంలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు మెగా పీటీఎంలను వేదికగా తీర్చిదిద్దాలని ఆలోచన చేసింది. ఇందులో తరగతి గదుల్లో విద్యార్థుల సమగ్ర పురోగతి నివేదిక, పాఠశాల ప్రగతి వివరాలతో పాటు పిల్లల ఆరోగ్య విషయాలను తల్లిదండ్రులకు వివరించనున్నారు. విద్యాహక్కు చట్టం, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపు అంశాలపై అవగాహన కల్పించనున్నారు. విద్యార్థుల మార్కులకు సంబంధించి ప్రోగ్రెస్ కార్డులు, తరగతి గదిలో పిల్లల ప్రవర్తను వివరించనున్నారు. తల్లికి వందనం, మనబడి మ్యాగజైన్, విద్యా సంబంధ అంశాలపై చర్చించనున్నారు. తల్లులకు రంగవల్లులు, కుర్చీలాట, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలను నిర్వహించనున్నారు. మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించనున్నారు. పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు బృంద చిత్రాలు తీసుకునేలా ఫొటో స్పాట్లు సైతం ఏర్పాటు చేయనున్నారు. డ్రీమ్ వాల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులతో వారి లక్ష్యాలను దానిపై రాయించి ఆ దిశగా వెన్నుతట్టి ప్రోత్సహించనున్నారు. అమ్మ పేరుతో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటనున్నారు. ఇలా అటు విద్యార్థులు ఇటు తల్లిదండ్రుల్లో ఈ వేడుక ఒక తియ్యని జ్ఞాపకంగా ఉండిపోయేలా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం... మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఈనెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు కళాశాలల్లోనూ నిర్వహించడానికి ఏర్పాట్లు చేపడుతున్నాం. తల్లిదండ్రులను గౌరవించడమే ప్రధాన ఉద్దేశం. తల్లికి వందనం మీద పోటీలు నిర్వహిస్తాం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెరుగుతుంది. అందరూ భాగస్వాములు కావాలి.– **జి.అప్పారావు నాయుడు, డీఈఓ**

వెలుగుల కొండ సింహాద్రి..

నేడు వ్యవస్థాపక దినోత్సవం

పరవాడ, న్యూస్‌టుడే: వివిధ రాష్ట్రాలకు వెలుగులు ప్రసాదిస్తున్న పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ నాణ్యమైన విద్యుదుత్పత్తి చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ ప్రగతి పథంలో పయనిస్తోంది. 1997 జులై 8వ తేదీన పరవాడ వద్ద ఆవిర్భవించిన ఈ సంస్థ ఏటా పురోగతి సాధిస్తోంది. 500 మందికిపైగా ఉద్యోగులతో పాటు 2500 మంది ఒప్పంద కార్మికులు ఇక్కడ సేవలందిస్తున్నారు.

★ తొలి, మలి దశలలో కలిపి మొత్తం రూ.8148 కోట్లతో 2వేల మెగావాట్ల (500 మెగావాట్ల సామర్థ్యం గల 4యూనిట్లు) సామర్థ్యంతో దీన్ని నిర్మించారు. ఇక్కడి నుంచి తెలుగు రాష్ట్రాలతో వివిధ ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా అవుతోంది.

★ ఇక్కడి రిజర్వాయర్‌పై 25 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుదుత్పత్తి కూడా జరుగుతోంది. దీన్ని రూ.110 కోట్లతో ఆగస్టు 2021లో ఏర్పాటు చేశారు. మరో 18 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

పరవాడ ఎన్టీపీసీ విద్యుత్తు కేంద్రం

★ సీఎస్ఆర్ పథకం కింద ఈ సంస్థ సమీప గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతోంది. వాటితో పాటు వేసవిలో బాలికా సాధికారత శిక్షణ, మండల స్థాయిలో క్రీడల నిర్వహణ కొనసాగిస్తోంది. నిర్వాసిత గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు విజయవాడలోని సీపీఈటీ సంస్థలో 'మెషిన్ ఆపరేటర్ ఇంజక్షన్ మౌల్డింగ్ అండ్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్'లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. మహిళలకు కుట్టు శిక్షణ, ప్రతిభ గల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి ప్రోత్సహిస్తోంది.

★ కాలుష్య నివారణకు రూ.871 కోట్లతో నిర్మిస్తున్న ఫ్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్(ఎఫ్‌జీడీ) ప్లాంట్ల పనులు దాదాపు పూర్తయ్యాయి. థర్మల్ విద్యుదుత్పత్తిలో భాగంగా బొగ్గు మండించే క్రమంలో విడుదలయ్యే సల్ఫర్ డయాక్సైడ్ తదితర కాలుష్య కారక వాయువుల తీవ్రత తగ్గించేందుకు ఇక్కడి 4యూనిట్లకు 4 ఎఫ్‌జీడీ ప్లాంట్లు నిర్మిస్తున్నారు. 1, 2, 4 యూనిట్లకు చెందిన పనులు పూర్తి కావడంతో వినియోగంలోకి తెచ్చారు. 3వ యూనిట్ ఎఫ్‌జీడీ పనులు చివరి దశలో ఉన్నాయి.

★ ఎన్టీపీసీలో 165 మీటర్ల ఎత్తున నిర్మించిన కూలింగ్ టవర్లు ఆసియాలోనే అతి ఎత్తైనవి. ★ ఒక రోజుకు అవసరమయ్యే 30వేల మెట్రిక్ టన్నుల బొగ్గును వేర్వేరు ప్రాంతాల నుంచి రైలు మార్గం ద్వారా దిగుమతి చేసుకుంటున్నారు.

★ విద్యుదుత్పత్తి సమయంలో ఒక రోజుకు వచ్చే సుమారు 3500 టన్నుల బూడిదను జాతీయ రహదారుల నిర్మాణానికి, సిమెంట్ కంపెనీలకు, బ్రిక్స్ తయారీ యూనిట్లకు తరలిస్తున్నారు.

★ ప్లాంటుకు సముద్ర నీటి అవసరాల నిమిత్తం తిక్కవానిపాలెం తీరంలో 700 మీటర్ల పొడవున జెట్టీ (పంపుహౌస్) నిర్మించారు.

మత్స్యకారులకు చిక్కిన టూనా

పూడిమడక తీరం... టూనా చేపల వర్షం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పూడిమడక సముద్ర తీరం టూనా చేపలతో నిండిపోయింది. భారీగా చిక్కిన చేపలతో మత్స్యకారుల మోము మురిసింది. జపనీస్ అత్యంత ఇష్టపడే టూనా చేపలు పూడిమడక మత్స్యకారులకు సోమవారం భారీగా చిక్కాయి. రెండు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ఆరు అడుగుల పొడవైన భారీ టూనా చేపలతో తిరిగి వచ్చారు. కేజీ ధర రూ.300 వరకు పలకడంతో మత్స్యకారులు ఆనందంవ్యక్తంచేశారు. పూడిమడక తీరం మార్కెట్‌ను తలపించింది. చిన్నాపెద్దా తేడాలేకుండా చేతిలో పెద్దపెద్ద చేపలతో కనిపించారు. ఇంత భారీగా చేపలను చాలా ఏళ్ల తరవాత చూశామని మత్స్యకారులు సంబరపడ్డారు.

మీ ఇల్లు బంగారంగాను..

✦ పీ-4కు 64,518 కుటుంబాల ఎంపిక

✦ దత్తతకు 2,104 మంది సిద్ధం

నర్సీపట్నం, న్యూస్‌టుడే

నిరుపేద రహిత సమాజ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్ (పీ-4) కార్యక్రమంలో పేద కుటుంబాలన్నీ బంగారంలా మెరవాలన్నదే ఆశయంగా ముందుకెళ్తోంది. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే మార్గదర్శకులుగా సంపన్నులు ముందుకు వచ్చేలా ప్రణాళిక రూపొందించింది. జిల్లాలో ఇప్పటికే 64,518 బంగారు కుటుంబాలను గుర్తించారు. జిల్లాలో 6.5 లక్షల కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నట్లు సర్వేలో తేలింది. వీరిలో అత్యంత నిరుపేదలను గుర్తించి కార్యాచరణను సిద్ధం చేశారు. పీ-4 ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయాలని నిర్ణయించారు.

సర్వే చేస్తున్న సిబ్బంది

సంపన్నల ఉదారతతో ఊతం.. సమాజంలోని ధనవంతుల ఉదారతే ఈ కార్యక్రమానికి ఊతంగా నిలుస్తుంది. వీరి సాయం పొందే దిశగా ఇప్పటికే చర్యలు ముమ్మరమయ్యాయి. ఆపన్నహస్తం అందించేందుకు సంపన్న వర్గాలు సంసిద్ధత వ్యక్తం చేస్తేనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుంది. ఇప్పటికే చాలా మంది స్పందించి ముందుకొస్తున్నారు. అధిక సంఖ్యలో ధనికులు, పెద్ద పెద్ద సంస్థల అంగీకరించేలా చైతన్యవంతం చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించారు. వీరి కోసం సర్వే చేస్తున్నారు. మండలాల వారీగా ఎంపికకు కసరత్తు జరుగుతోంది. వీరి స్థితిగతులపైనా ఆరా తీస్తున్నారు.

15,736 కుటుంబాలకు దాతల ఎంపిక పూర్తి... అతి నిరుపేదలకు ముందుగా సాయం అందించేందుకు వీలుగా జిల్లాలో గుర్తించిన 64,518 కుటుంబాలకు మార్గదర్శులను ఎంపిక చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 15,736 కుటుంబాలను 2,104 మంది దత్తత తీసుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆగస్టు 15 నాటికి 51 వేల కుటుంబాలకు మార్గదర్శులను ఎంపిక చేయడమే లక్ష్యం ముందుకు సాగుతున్నాం.

– రామారావు, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి

వైకాపా మాయాజాలం.. అందని పునరావాసం

రాంబిల్లి, న్యూస్‌టుడే

తలుపులు, కిటికీలు ఉండి నలుగురు నివసించే గూడును ఇల్లనే అంటారు. కానీ గత వైకాపా పాలకులకు ఇవి షెడ్లుగా కనిపించాయి. నివాసితులు ఉండే ఇళ్లను పశువుల షెడ్లుగా నమోదు చేసిన నాటి గ్రామ వాలంటీర్ల నిర్వాకం నేడు నిర్వాసితుల పాలిట శాపంగా మారింది. ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) నిర్వాసితులైన వి.ఆర్.అగ్రహారం గ్రామంలో అర్హులైన 35 కుటుంబాలకు పునరావాసం అందని ద్రాక్షగా మారింది. వైకాపా హయాంలో 2021లో గ్రామ వాలంటీర్లు చేపట్టిన కుటుంబాల సర్వే నివేదికలో చోటు చేసుకున్న తప్పిదాలతో ఈ దుస్థితి నెలకొంది. తమ ఇళ్లకు తలుపులు, కిటికీలు ఉన్నా పశువుల షెడ్లుగా ఎలా నమోదు చేస్తారని స్థానికులు లాలం నారాయణమూర్తి, లాలం చిట్టమ్మ ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని నిర్వాసితులు కోరుతున్నారు. సెజ్ కోసం సేకరించే భూముల్లో నివాసం ఉండే కుటుంబాలకు తప్పకుండా పునరావాసం కల్పిస్తామని తహసీల్దారు ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పునరావాసానికి గుర్తించిన జాబితాలను గ్రామంలో ప్రచురించాక అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ 180 అర్జీలు అందాయని, వీటిని పరిశీలించి మార్పుచేర్పులు చేశామన్నారు.

వీఆర్.అగ్రహారంలో పశువుల షెడ్‌గా నమోదు చేసిన నివాసం ఇది

పరిశ్రమల రాకతో లెక్కకుమించి ఉద్యోగాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి మండలంలో ఏర్పాటవుతున్న పరిశ్రమల ద్వారా లెక్కకుమించి ఉద్యోగాలు రానున్నట్లు మంత్రి వంగలపూడి అనిత అన్నారు. దేవవరంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. గ్రామానికి వచ్చిన ఆమెకు మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవర సత్యనారాయణ, తెదేపా నాయకులు సుధారాజు, వర్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి దారిపొడవునా ఆమెపై పూలు చల్లారు. అనంతరం మంత్రి అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించి, సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ముఖాముఖీలో మాట్లాడుతూ తాను ఎన్నికల్లో 20 వేల ఉద్యోగాలు కల్పిస్తానని మాటిచ్చానని.. ఈ క్రమంలోనే నక్కపల్లిలో ప్రస్తుతం రెండు భారీ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, వీటి ద్వారా నియోజకవర్గమే కాకుండా.. బయటి వారికి భారీ ఎత్తున ఉద్యోగాలు, ఉపాధి కల్పించగలమన్నారు. మెగా తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా చేయిస్తున్నామని, త్వరలోనే ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీలో భాగంగా చినరామభద్రపురానికి రూ. 1.2 కోట్లతో రోడ్డు వేయిస్తున్నామన్నారు. ప్రభుత్వం జవాబుదారీతనం ఉండటంతోనే ఏడాదిలో జరిగిన అభివృద్ధిని వివరించడానికి గ్రామాల్లోకి వచ్చినట్లు తెలిపారు. ప్రజలనుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. దేవర సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండలశాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, కొరిమి సూర్య గణేష్ సమావేశంలో మాట్లాడారు.

దేవవరంలో సామూహిక సీమంతాలు చేస్తున్న మంత్రి అనిత

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థ సారథి, బండారు సత్యనారాయణ, కోన తాతారావు, యేసుదాస్ తదితరులు

రాష్ట్ర ప్రగతికి కట్టుబడి పనిచేస్తున్నాం: కొలుసు

మాడుగుల, న్యూస్‌టుడే : ప్రపంచంలోనే ప్రత్యేకమైన రాజధానిగా అమరావతిని నిర్మించడమే లక్ష్యం కాగా, 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి నీటిని విడుదల చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. సోమవారం మాడుగుల వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రగతికి కట్టుబడి పని చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజల్లో చెడ్డ చేయడానికి జగన్ ఎత్తుగడలు వేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 6లక్షల ఇళ్లను నిర్మించాలన్నది లక్ష్యం కాగా, రూ. 3,300 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రహదారుల కష్టాలు లేకుండా కొత్తగా రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

సారూ.. అన్నదాతా సుఖీభవ వర్తింపజేయరూ!

నర్సీపట్నం, న్యూస్‌టుడే: అర్హులైన రైతులందరికీ అన్నదాతా సుఖీభవ పథకం వర్తింపజేయాలని డిమాండు చేస్తూ రావికమతం, రోలుగుంట మండలాలకు చెందిన గిరిజన రైతులు సబ్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. మోకాళ్లపై నిల్చుని చేతులు జోడించి న్యాయం చేయాలంటే వేడుకున్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావుతో కలిసి గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలను ప్రదర్శించారు. రెండు మండలాల్లో 86 మంది రైతులు జీడి మామిడి తోటల సాగు చేస్తున్న సీలింగ్ భూములకు 1976లో పట్టాలిచ్చారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు భూరికార్డులు తారుమారు చేయడంతో సంక్షేమ పథకాలు అందడం లేదని వాపోయారు. సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సూరిబాబు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చుని వేడుకుంటున్న రైతులు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు

ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

80087 09638

(c) eenadu

క్షేత్రస్థాయి పర్యటనలతో అర్జీల పరిష్కారం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వినతులు పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 370 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ, ప్రత్యేక ఉప కలెక్టరు సుబ్బలక్ష్మి వినతులు స్వీకరించారు.

రూ.5 లక్షల చెక్కు పంపిణీ : జగన్నాథపురానికి చెందిన మువ్వల ప్రసాద్ విశాఖ కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తూ 2020 ఆగస్టు 20న మృతి చెందగా, బాధిత కుటుంబానికి ఆకస్మిక సహాయ నిధి కింద రూ. 5 లక్షల చెక్కు కుటుంబ సభ్యులకు కలెక్టర్ అందజేశారు. ఆర్థిక సాయం కోరుతూ జాతీయ మానవ హక్కుల సంఘాన్ని కుటుంబం ఆశ్రయించడంతో ప్రభుత్వ ఆదేశాలతో అందజేశామన్నారు.

మువ్వల చిన్నాకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

★ డ్వాక్రా సంఘాలకు సంబంధించిన నగదు చెల్లించకుండా సొంతానికి వాడుకున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకుకు చెందిన బ్యాంకు మిత్రపై చర్యలు తీసుకోవాలని పాపయ్యపాలెంకు చెందిన డ్వాక్రా మహిళలు, సర్పంచి చెల్లెయ్యమ్మ కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో 22 గ్రూపులకు చెందిన రూ. 9 లక్షల మేర నగదును బ్యాంకుకు చెల్లించకుండా కాజేశారన్నారు. ఈ విషయం తెలుసుకున్న బ్యాంకు అధికారులు బ్యాంకు మిత్ర వద్ద నుంచి రూ. 4 లక్షలు రికవరీ చేశారన్నారు. మిగిలిన నగదు ఇవ్వమని అడిగితే ఆమె తప్పించుకు తిరుగుతున్నారని చెప్పారు.

కలెక్టరేట్ వద్ద పాపయ్యసంతపాలెం మహిళలు

★ మాకవరపాలెం మండలం జి.కోడూరు రెవెన్యూ సర్వే నంబరు 332లో రాయి క్వారీని రద్దు చేయాలని గ్రామస్థులు, ఎమ్మార్పీఎస్ దళిత సంఘాల నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అత్తుమూరి పెంటయ్య, చినదేముడు, లక్ష్మీ మాట్లాడుతూ క్వారీ సమీపంలో ఉన్న డీ-పట్టా భూముల్లో 23 మంది రైతులు జీడి, మామిడి, సర్వే తదితర పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. క్వారీ నుంచి వచ్చే దుమ్ము, ధూళితో పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. తక్షణమే అనుమతులు రద్దు చేసి క్వారీని మూసివేయాని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

★ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ఏడాది పెండింగ్‌లో ఉన్న వసతి, విద్యాదీవెన నిధులు తక్షణమే విడుదల చేయాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో సిబ్బంది లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఎలమంచిలి, పాయకరావుపేట, అనకాపల్లి బాలికల వసతి గృహాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడుస్తున్నాయన్నారు.

ప్రజలకు తక్షణ న్యాయం అందించాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పోలీస్‌స్టేషన్లలో ప్రజలకు తక్షణ న్యాయం అందించేలా సిబ్బంది చొరవ చూపాలని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 35 ఫిర్యాదులొచ్చాయి బాధితులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాల ఫిర్యాదులు వచ్చాయి. చట్ట పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌హెచ్‌ఓలను ఎస్పీ ఆదేశించారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

కలెక్టరు, ఆరుగురు అధికారులకు కోర్టు నోటీసులు

రహదారి దుస్థితిపై వివరణ కోరిన న్యాయస్థానం

చోడవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని ముఖ్యమైన భీమిలి-నర్సీపట్నం రహదారి అడుగడుగునా గోతులతో కనీసం రాకపోకలు సాగించలేని దుస్థితిలో ఉంది. రెండు దశాబ్దాలుగా దీనికి కనీస నిర్వహణ కరవైంది. ఛిద్రమైన రహదారి వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ సీనియర్ న్యాయవాది కాండ్రేగుల డేవిడ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు భూపతి రాజు, ఎ.భరత్ భూషణ్ న్యాయ సేవా సంస్థను ఆశ్రయించారు. ఏపీ న్యాయ సేవా అథారిటీ చట్టం ప్రకారం ప్రజలకు కల్పించాల్సిన ప్రాథమిక సదుపాయంపై సెక్షన్ 12, 13ను అనుసరించి చోడవరం కోర్టులో దావా వేశారు. న్యాయస్థానం దీనిని విచారణకు స్వీకరించింది. దీనిపై జిల్లా కలెక్టరు సహా ఏడుగురు అధికారులకు స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 26న కోర్టుకు సమగ్ర వివరాలతో హాజరు కావాలని అందులో పేర్కొన్నారు.

అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా చక్రవర్తి

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఎట్టకేలకు జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా కె.చక్రవర్తిని ప్రభుత్వం తిరిగి నియమించింది. విశాఖలోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం కమిషనర్‌కు జాయినింగ్ రిపోర్టు ఇచ్చినట్లు తెలిసింది. ఈయన విశాఖలోని వ్యవసాయశాఖ సహాయ సంచాలకునిగా పనిచేస్తున్నారు. డిప్యుటేషన్‌పై ఇక్కడికి వస్తున్నారు. వాస్తవానికి ఈయనను గత నెల 10న జోనల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా ఆయన విధుల్లో చేరలేదు. దీంతో ఉత్తర్వులు రద్దు అయ్యాయని, ఈయన స్థానంలో వేరే అధికారిని నియమిస్తారనే ప్రచారం సాగింది. అంతలోనే చక్రవర్తినే తిరిగి జోనల్ కమిషనర్‌గా నియమించారు. విశాఖలోని ప్రధాన కార్యాలయంలో కార్యదర్శి బీవీ రమణ ఇప్పటివరకు జోనల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చక్రవర్తి ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

సూచీ ఏర్పాటు

స్పందనకు వందనం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: 'అనకాపల్లికి దారేటు.. బ్రదర్?' శీర్షికన ఈ నెల 6న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ అధికారులు స్పందించారు. అనకాపల్లి జాతీయ రహదారి డైవర్షన్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు విరిగిపోయింది. దీని స్థానంలో సోమవారం కొత్తగా సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగా ఏర్పాటు చేసిన బోర్డు

నడిరోడ్డుపై కత్తులతో దాడి

ఫ్యాక్షన్‌ను తలపించేలా ఘటన
నలుగురికి తీవ్ర గాయాలు

ప్రధాన నిందితుడు చందక సురేంద్ర

విశాఖపట్నం, న్యూస్‌టుడే: చేతుల్లో కత్తులు పట్టుకొని రోడ్డుపై తిరుగుతూ.. అడ్డు వచ్చిన వారిపై దాడులు చేస్తూ ఫ్యాక్షన్ సినిమాకు ఏమాత్రం తీసిపోని విధంగా కొందరు రౌడీమూకలు చేసిన బీభత్సం నగరంలో శాంతి భద్రతలకు సవాలుగా మారింది. గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన స్థానికులను భీతావహులను చేసింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలేనికి చెందిన చందక సూర్యకుమార్‌కు.. అదే ప్రాంతానికి చెందిన సాయికి ఆదివారం చిన్నపాటి ఘర్షణ జరిగింది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న సాయి స్నేహితుడు సరిపల్లి రాజేశ్ జోక్యం చేసుకుని ఇద్దరినీ మందలించాడు. ఈ విషయం తెలుసుకున్న సూర్యకుమార్ సోదరుడు సురేంద్ర, తన స్నేహితులు శిలపరిశెట్టి అక్షయ్, బరిగట్ల సతీశ్, దాడి లిఖిత్, రేసు ఆనంద్‌లతో కలిసి వచ్చి నా సోదరుడిని మందలిస్తావా అంటూ రాజేశ్‌పై కత్తితో దాడిచేశాడు. ఆ సమయంలో సురేంద్ర గంజాయి మత్తులో ఉన్నాడు. గతంలో జరిగిన ఓ టెంట్‌హౌస్ తగాదాను కూడా మనసులో ఉంచుకొని ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడి సమయంలో అక్కడే ఉన్న సూరిశెట్టి మణికిరణ్, అంకా రమణ, అమరపిన్ని కనకరాజు ఇరువర్గాలను సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా.. వీళ్లపై కూడా సురేంద్ర, అతని స్నేహితులు కత్తితో దాడిచేసి గాయపరిచారు. ప్రధాన రహదారిపై అర్ధరాత్రి వేళ కత్తులతో రోడ్ల మీద పరుగులు తీయడం చూసి స్థానికులు భయాందోళనకు గురై ఇళ్లలోకి వెళ్లిపోయి తలుపులు వేసుకున్నారు. రాజేశ్‌కు ఆరుచోట్ల కత్తిపోట్లు కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. మిగతా వారికి కూడా గాయాలయ్యాయి. వీరు కూడా చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకునేలోపే నిందితులు పరారయ్యారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం సీఐ ఎన్.వి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎస్సైలు అప్పలనాయుడు, రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

గాయపడిన రాజేశ్

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

నాతవరం, న్యూస్‌టుడే: గంజాయి కేసులో ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ విశాఖ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ సోమవారం తీర్పు ఇచ్చారు. ఎస్సై భీమరాజు తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో నాటి ఎస్సై ఆశోక్‌కుమార్ వెదురుపల్లి కూడలిలో వాహన తనిఖీలు చేస్తుండగా 60 కేజీల గంజాయితో ఇద్దరు పట్టుబడ్డారు. నిందితులు షేక్ మస్తాన్‌వలీ, గులిమి మల్లేశ్వరరావుపై అప్పట్లో కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో వాద ప్రతివాదనలు పూర్తవడంతో పదేళ్ల జైలు, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించలేని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కిడ్నాప్ కేసులో ఇద్దరు అరెస్టు

కరీంనగర్, న్యూస్‌టుడే: ముగ్గురిని కిడ్నాప్ చేసి చంపుతామని బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసులో ఇద్దరిని కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నిరంజన్‌రెడ్డి కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన సాయికుమార్, అనకాపల్లికి చెందిన మాధవి కొన్నేళ్ల క్రితం సహజీవనం చేసి వ్యాపార లావాదేవీలు సాగించారు. కొన్ని రోజులకు మాధవి మరో వ్యక్తి శ్రీకాంత్‌తో సన్నిహితంగా ఉంటున్నట్లు తెలుసుకున్న సాయికుమార్ ఆమెను ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. వీటిని మనసులో పెట్టుకున్న మాధవి, శ్రీకాంత్, ఆమె తమ్ముడు గణేశ్ గత నెల 26న కొత్తపల్లి మండలం చింతకుంటలో ఉంటున్న సాయికుమార్, కృతిక్ (బంధువు), మరో వ్యక్తిని వాహనంలో బలవంతంగా ఎక్కించుకున్నారు. సాయికుమార్‌ను చంపుతామని బెదిరించి రూ.10వేలు, భూమికి సంబంధించిన పత్రాలు, రెండు ఫోన్లు, కృతిక్‌ను బెదిరించి రూ.60 వేలు తీసుకున్నారు. దారిలో సాయికుమార్ తప్పించుకుని శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి కొత్తపల్లి స్టేషన్‌కు బదిలీ చేశారు. శ్రీకాంత్, మాధవి సోమవారం లొంగిపోయారు. గణేశ్ పరారీలో ఉన్నాడు.

ఉద్యాన రైతులకు దండిగా ప్రోత్సాహకాలు

ఆయిల్‌పామ్, పూల సాగు లాభదాయకం

ఈనాడు-మీతోడు ఫోన్ ఇన్‌లో ఉద్యానాధికారి రహీమ్

రైతులకు అందించేందుకు కొబ్బరి, జీడిమామిడి, మామిడి మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. పూలు, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎంఏ రహీమ్ తెలిపారు. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యాన పంటల సాగులో మెలకువలు, రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు 'ఈనాడు-మీతోడు' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి 34 మంది రైతులు ఫోన్ చేసి ఆయనతో మాట్లాడారు. – న్యూస్‌టుడే, అనకాపల్లి



? ఆయిల్‌పామ్ వేయాలనుకుంటున్నాం. రాయితీలు వర్తిస్తాయా. – మారిశెట్టి పరదేశినాయుడు, హరిపాలెం, ఎంఎం నాయుడు, బయ్యవరం

✔: ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. మొక్క ధర రూ.135 కాగా.. 90 శాతం రాయితీగా ఇస్తాం. నాలుగేళ్ల వరకు ఎరువులు, కలుపుతీత పనులకు ఏటా రూ.5,250 అందిస్తాం. వర్మీ కంపోస్టు యూనిట్ ఏర్పాటు చేసుకుంటే రూ.30 వేల రాయితీ వర్తిసుంది. గెలలు కోసేందుకు యంత్రపరికరాలు, విద్యుత్తు పంపుసెట్, డీజిల్ ఇంజిన్ కొనుగోలుకూ రాయితీలు పొందవచ్చు.

? బంతి, చామంతి సాగు చేయాలనుకుంటున్నాం. ఎప్పుడు నాటాలి. – దాడి వెంకటరమణ, వెంకుపాలెం, పచ్చికూర అప్పన్న, మెట్టపాలెం

✔: బంతి, చామంతి, మల్లి, గులాబీ సాగుకు హెక్టారుకు రూ.20 వేలు రాయితీగా ఇస్తాం. సాగుకు ఇదే అనుకూల సమయం.

? కొబ్బరి తోట వేయాలనుకుంటున్నాం. ఏ రకం మొక్కలు వేయాలి. హైబ్రీడ్ మొక్కలున్నాయా. – భీశెట్టి నాయుడు, మునగపాక, పి.రమేష్, రాంబిల్లి

✔: ఈస్టుకోస్టు స్టాల్ రకం మొక్కలున్నాయి. బుట్టలో మొక్కలు పెంచి అందిస్తున్నాం. ఒక్కో మొక్క ధర రూ.90. సుమారు 40 వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. హైబ్రీడ్ రకాల్లేవు.

? హెక్టారు విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ వేయాలనుకున్నాం. ఎన్ని మొక్కలు అవసరమవుతాయి. అంతర పంటలుగా వేటిని సాగు చేయవచ్చు. – కె.సత్యనారాయణ, అంబేరుపురం, ఎం.జగ్గఅప్పారావు, మాకవరపాలెం

✔: నీటి వసతి ఉంటేనే ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలి. హెక్టారుకు వంద మొక్కలు సరిపోతాయి. కొంతమంది రైతులు 143 మొక్కల వరకు వేస్తున్నారు. అంతర పంటలుగా కోకో, అరటి సాగు చేయవచ్చు.

? జీడిమామిడి సాగుకు ఏ రకాలు బాగుంటాయి. నీటి వసతి ఉండాలా. – అరిశెంకుల అప్పన్న, కుమారపురం, ఎం.రామ జోగినాయుడు, వాడ్రాపల్లి

✔: వి-3, 4 రకాలను పరిశీలించవచ్చు. అంటు మొక్క ధర రూ.40. సుమారు ఆరు వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. మొక్క నాటిన రెండేళ్ల వరకు నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. పిందె, కాయ దశలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

? మామిడి మొక్కలు ఎప్పుడు నాటుకోవాలి. అంతర పంటలుగా ఏమేం సాగు చేయవచ్చు. –తిర్రి రమణ, బుచ్చెయ్యపేట, దాడి శివ, సీతానగరం

✔: ప్రస్తుత వాతావరణం మొక్కలు నాటుకునేందుకు అనుకూలంగా ఉంది. డిసెంబరు వరకు నాటుకోవచ్చు. ఏడాది నుంచి ఏడాదిన్నర వయసున్న మొక్కలను ఎంచుకోవాలి. అంతర పంటలుగా కూరగాయలు, పెసలు, మినుము, అలసంద వంటివి సాగు చేయవచ్చు. మిశ్రమ పంటగా బొప్పాయి వేసుకోవచ్చు.

? రాయితీపై బిందు సేద్యం పరికరాలు మంజూరు చేస్తారా. – ఎస్.వి.ఆర్.నాయుడు, అరబుపాలెం, ఎస్.వి.కె.పరశురాం, వడ్డాది

✔: ఐదు ఎకరాల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలిస్తాం. మిగతా రైతులకు 90 శాతం రాయితీ వర్తిస్తుంది. ఐదు నుంచి పది ఎకరాలుంటే ఎవరికైనా 70 శాతం, అంతకంటే ఎక్కువ ఉంటే 50 శాతం రాయితీ వస్తుంది. తుంపర సేద్యం అయితే అన్ని కేటగిరీలకు 50 శాతం రాయితీ ఇస్తాం.

? ఇసుక నేలల్లో జామ సాగు చేయవచ్చా. ఏ రకాలు అనుకూలం. – పీడీఏ రామారావు, అప్పన్నపాలెం, డి.వెంకన్నపాత్రుడు, జగన్నాథపురం

✔: నీరు నిల్వ ఉండని లోతైన మురుగునీటి సదుపాయం ఉన్న నేలలు అనుకూలం. తేలికపాటి ఇసుక నేలలు అంతగా పనికిరావు. కోహిర్ సఫేదా, లక్నో-49, అర్కమృదుల, లలిత రకాలు అనుకూలం. నవంబరు వరకు నాటుకోవచ్చు.

సాగులో సందేహాలా.. ఫోన్ చేయండి

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సలహా

రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పీవీకే జగన్నాథరావు సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10 గంటల నుంచి సా. 4 గంటలకు వరకు 94419 44640 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

తాండ్రతో.. మామిడి రైతుకు ఊరట

నాణ్యమైన పండ్లతో..

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మామిడి సీజన్ ఈ ఏడాది రైతులకు కలిసిరాలేదు. మార్కెట్‌లో ధర లేకపోవడంతో నష్టాలను మూటకట్టుకోవాల్సి వచ్చింది. డిమాండు అధికంగా ఉండే బంగినపల్లి, రసాలు, సువర్ణరేఖ, కలెక్టర్ తదితర రకాల కాయల ధరలూ నేలచూపులే చూశాయి. పెట్టుబడి, కోత, రవాణా ఖర్చులూ రాలేదు. వచ్చిందే చాలనుకుని చాలా మంది తక్కువ ధరకే విక్రయించాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో పాయకరావుపేట మండలం సీతారాంపురం రైతు పకుర్తి బాబూరావు వినూత్నంగా ఆలోచించారు. రూ.1.5 లక్షల పెట్టుబడితో మామిడి తాండ్ర తయారీ యూనిట్ ఏర్పాటు చేశారు.

★ సీతారాంపురం చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఏటా ఇక్కడి నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు కాయలు ఎగుమతి అయ్యేవి. ఈ ఏడాది ధర లేక ఎగుమతులు ఆగిపోయాయి. మార్కెట్ స్థితిగతులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి కాయలను కొనుగోలు చేశారు. కాయల నుంచి గుజ్జు తీసి తాండ్ర తయారీతో 20 మంది మహిళలకు ఉపాధి కల్పించారు.

తాండ్ర తయారీకి నాణ్యమైన పండ్లు సేకరిస్తున్నాం. కాయలను శుభ్రం చేసి తొక్క తీసి గుజ్జును వేరు చేస్తాం. పంచదార కలిపి యంత్రం ద్వారా తాండ్ర తయారు చేస్తున్నాం. ఒక్కో మహిళకు రోజుకు రూ. 300 చొప్పున గిట్టుబాటు అవుతోంది. తయారైన తాండ్రను కేజీ, అరకేజీ చొప్పున ప్యాకింగ్ చేసి మార్కెట్‌కు పంపుతున్నాం. అనకాపల్లితోపాటు కాకినాడ, తుని, రాజమహేంద్రవరం సరఫరా చేస్తున్నాం. తయారీ మరింత పెరిగితే ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎగుమతి చేసే ఆలోచన ఉంది. – బాబూరావు, రైతు

బెల్లం ధరల తగ్గుముఖం

అనకాపల్లి: అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా అన్ని రకాల బెల్లం ధరలు తగ్గుముఖం పట్టాయి. రంగులు వంద కేజీలకు రూ.280, మధ్య రకం రూ.150, నాసి రకాలు రూ.140 వరకు తగ్గాయి.

రకం	గత వారం	ఈ వారం
రంగులు	5,030	4,750
మధ్య	3,600	3,450
నాసి	2,940	2,800

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

కోటవురట్ల, న్యూస్‌టుడే: తరచూ మద్యం తాగి వస్తున్నాడని భార్య మందలించడంతో మనస్తాపం చెందిన భర్త సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్సై రమేశ్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోటవురట్ల మండలం రాజుపేట శివారు పి.రామన్నపాలెనికి చెందిన పీతల వరహాలబాబు (42) మద్యం తాగి వస్తున్నాడని భార్య గంగ మందలించింది. మనస్తాపం చెందిన వరహాలబాబు పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కొప్పాక జాతీయ రహదారి వద్ద సోమవారం సాయంత్రం కారు బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి కొవ్వూరు వైపు వెళ్తున్న కారు ముందు టైరు పేలిపోవడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురితోపాటు డివైడర్ మధ్యలో లైట్లు బిగిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి, ప్రమాద సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు. క్షతగాత్రులు స్వల్ప గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బోల్తా పడిన కారు

భవనం పైనుంచి కింద పడి యువకుడి దుర్మరణం

నాగమహాలక్ష్మినాయుడు (పాతచిత్రం)

పరవాడ, న్యూస్‌టుడే: ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో విద్యుత్తు అలంకరణ పనులు చేస్తూ భవనం పైనుంచి కింద పడి ఓ యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. మునగపాక మండలం టి.సిరసపల్లి గ్రామానికి చెందిన మద్దాల నాగమహాలక్ష్మినాయుడు (28) దీపాంజలినగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌కు విద్యుత్తు అలంకరణ సామగ్రి అమర్చేందుకు లైటింగ్ సంస్థకు చెందిన యజమాని భాస్కరరావుతో అక్కడికి వెళ్లాడు. ఈనెల 8వ తేదీన పరవాడ ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం జరగనున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఈ పనులు చేపట్టారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు భవనం మొదటి అంతస్తు నుంచి నాగమహాలక్ష్మినాయుడు కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని తొలుత ఎన్టీపీసీ ఆసుపత్రికి, తర్వాత కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. అవివాహితుడైన ఇతడికి తల్లిదండ్రులతోపాటు వివాహమైన ఇద్దరు అక్కలు ఉన్నారు. చేతికి అందొచ్చిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. కేజీహెచ్ మార్చురీలో సోమవారం పోస్టుమార్టం జరిగాక మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై త్రినాథరావు పేర్కొన్నారు.

AGRI BUSINESS

Tomato Trading. Earn 1000 daily profit on investment. Cntct: 6309090490. Svlpl.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్థిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్‌లోన్ చేయబడును. ✆ 96665 47338.

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

KOMMADI

North East Facing 2BHK 1200 Sft, Pooja, Dressing Room, Car Parking at Kommadi. Rent 7 to 8,000/- PM. Spot Reg. Bank Loan available. Ph: 8121100599.

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

North- East Corner Building for Sale. Ready to Move. 121 Sq.Yds. (Cellar- G+1) 60 Ft., Double Rd., Facing. Prime Location at Atchutapuram ✆ 9885824528.

LAND FOR SALE

BHOGAPURAM

Land for Sale: 1.5 Acres (NH-16) Highway Adjacent along Vizag- Srikakulam Rd. @ Nathavalasa Jn., Nr. Bhogapuram. Ph: 9959964304.

SECOND SALE

మిధున్ ఏజెన్సీ కొనబడును పాత A/Cలు, సెంట్రల్ A/Cలు, ఇన్వెర్టర్ బ్యాటరీలు, ఫ్రిజ్, వాషింగ్ మిషన్స్, ఫర్నిచర్, ఆన్‌లైన్ UPS లు కొనబడును. Cont : 6309745364.

JOBS

Receptionist and Waiters Required Age: below 35 yrs. with Computer & Hindi & English speaking skills Hotel Winsar Park, Opp. KGH, Vizag. 9849581868.

Wanted Marketing Managers to work in Ministry of Divinity, Vizag. Salary Rs. 27,500/-. ✆: 86393 67991.

డ్రైవర్స్- హెవీ వెహికల్/ బ్యాడ్జ్ కలవారు మారికవలసలో కోళ్ల ఫారం నుండి కోళ్ళు వ్యానులో (407) రాత్రి సమయంలో నడిపే డ్రైవర్స్ కావలెను. ✆ 9440611329, 9951853379.

ఉద్యోగ అవకాశం. వ్యాపార రంగంలో ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందిన మా సంస్థ నందు జూలై నెలలో ఈ క్రింది ఉద్యోగాల కొరకు అభ్యర్థులను ఎంపిక చేయబడును. 1. Administrative Officers: M/F, 2. Co-ordinators: M/F, 3. Client Supporting Managers: (F) ఆదాయం: నెలకు 50 వేలు నుండి లక్షా 15 వేలు వరకూ నిర్ణయించబడినది. గమనిక: 1. గత మీ అర్హతను బట్టి ఇంటర్వ్యూ సమయంలో పైన ఉదహరించిన స్థాయి మరియు మీయొక్క ప్యాకేజి నిర్ణయించబడును. 2. సెలెక్ట్ అయిన అభ్యర్థులకు వెంటనే నియామకం కల్పించబడును. ఇంటర్వ్యూ తేది: జూలై 8, 9. Cont: 9177296835, 9290060887.

USAలో 1 సం॥ బాబును చూసుకోవడానికి వీసా కల్గిన Nancy (కేర్ టేకర్) కావలెను. జీతం + భోజనం + ఉచిత వసతి. L.రామచంద్ర నాయుడు, తిరుపతి. ✆ 92469 99571, 92469 98571.

Oyo హోటల్ రూమ్స్ (Lodge) నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్ cum రూమ్ బాయ్స్ కావలెను (Age below 28). భోజనం & వసతి కలదు. MVP కాలనీ, వైజాగ్. ✆ 7036488899.

జనరేషన్‌యువ చిల్డ్రన్ హోమ్‌లో ఉండి పనిచేయుటకు M/F 1) వార్డెన్ -3, వయస్సు: 25-40 సం॥, 2) అకౌంటెంట్ -1, 3) డ్రైవర్ -1 వయస్సు: 40-50 సం॥ కావలెను. ✆ 7286846624.

ACCOUNTING

Hotel @ Gajuwaka, Autonagar needs Hotel Industry Exp. Sr. Accounts/ Asst. Accounts/ Clerks. Send resume WhatsApp: 9392900617

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రైలు ఢీకొని మన్యం వాసి మృతి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: తుని రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి పట్టాలు దాటుతున్న వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కిముడుపల్లికి చెందిన బోనంగి నూకరాజు (50) భార్యతో కలిసి తుని రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఇక్కడి నుంచి రైలులో ఏలూరు వెళ్లాల్సి ఉంది. రెండో నంబరు ప్లాట్‌ఫాం నుంచి పట్టాలు దాటి ఒకటో నంబరు ప్లాట్‌ఫాం గట్టు ఎక్కుతుండగా విశాఖ వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైలు రావడం చూసి నూకరాబు భార్య వెనక్కు వెళ్లడంతో ఆమె ప్రమాదం నుంచి బయటపడిందని తుని రైల్వే ఎస్సై శ్రీనివాసరావు చెప్పారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

డ్రోన్ సాంకేతికతతో సాగులో మార్పులు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి శాస్త్రవేత్తలు చొరవ చూపాలని వ్యవసాయ సాంకేతిక అనువర్తన పరిశోధన సంస్థ (అటారి) పదో జోన్ (హైదరాబాద్) డైరెక్టరు డాక్టరు షేక్ ఎన్ మీరా అన్నారు. ఉత్తర కోస్తా, గోదావరి జోన్, ఉన్నత పర్వతశ్రేణి జోన్లకు సంబంధించిన విస్తరణ శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞానకేంద్ర, డాట్ శాస్త్రవేత్తలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం రైతులకు ఎలా తీసుకురావాలో శాస్త్రవేత్తలకు మార్గనిర్దేశం చేశారు. డ్రోన్ టెక్నాలజీ, సోలార్ వినియోగంతో వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావచ్చని అభిప్రాయపడ్డారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు, ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం ఉప విస్తరణ సంచాలకులు బి.ముకుందరావు మాట్లాడారు. ఉత్తర కోస్తా, గోదావరి, పర్వతశ్రేణి ప్రాంత జోన్ల నుంచి 52 మంది శాస్త్రవేత్తలు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలనుద్దేశించి ప్రసంగిస్తున్న మీరా

పశుగ్రాస వారోత్సవాలను వినియోగించుకోవాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల 14 వరకూ జరిగే పశుగ్రాస వారోత్సవాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి వారోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు రాయితీపై పశుగ్రాస, జొన్న, మొక్కజొన్న, పిల్లిపెసర వంటి విత్తనాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారి రామమోహనరావును ఆదేశించారు. డీఆర్వో సత్యనారాయణ, ప్రత్యేక ఉపకలెక్టర్ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	విత్ స్కిన్	స్కిన్‌లెస్
ఫారం గేటు	86	78
లైవ్	108	98
డ్రెస్‌డ్	157	166
స్కిన్‌లెస్	178	176

(c) eenadu

జాబితాలో పేర్లు లేవని ఆందోళన

జాబితాలను ప్రదర్శిస్తున్న నిర్వాసితులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల పేర్లను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ జాబితాలో లేకుండా చేశారంటూ సబ్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అప్పలరాజు ఆధ్వర్యంలో నక్కపల్లి మండలం పాటిమీద గ్రామానికి చెందిన 12 మంది ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.

వెబ్‌ల్యాండ్ తప్పిదాలపై వినతులు

వెబ్‌ల్యాండ్‌లో చోటుచేసుకున్న తప్పిదాలతో రైతుల భూములు ప్రభుత్వానికి చెందినవిగా నమోదయ్యాయని పేర్కొంటూ బాధితులు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. సబ్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 22 వినతులు వచ్చాయి. కార్యాలయ ఏవో సుధాకర్ వీటిని పరిశీలించారు. వెబ్‌ల్యాండ్‌లో ప్రభుత్వ భూమిగా నమోదైన జిరాయితీ భూములను వేరు చేయాలని కోరుతూ గొలుగొండ మండలం చీడిగుమ్మలకు చెందిన జోగారావు, కోటవురట్లకు చెందిన అర్జున, రోలుగుంటకు చెందిన ఆదిలక్ష్మి తదితరులు విన్నవించారు. సమగ్ర విచారణ చేపట్టాలని ఏవో సుధాకర్ తహసీల్దార్లకు సూచించారు.

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **సోలోబోయ్**, రామచంద్ర: **మారన్**, శ్రీసత్య: **3బీహెచ్‌కే** సత్యనారాయణ స్క్రీన్-1: **కన్నప్ప**, స్క్రీన్-2: **జురాసిక్ వరల్డ్**, వెంకటేశ్వర: **చంద్రేశ్వర**, పర్తిసాయి: **కుబేర**, షిర్డిసాయి: **తమ్ముడు**, అచ్యుతాపురం: స్క్రీన్-1: **కుబేర, కన్నప్ప**, స్క్రీన్-2: **తమ్ముడు**

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

హుండీ ఆదాయం లెక్కింపు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని జగన్నాథస్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రథోత్సవాల్లో భాగంగా హుండీ ఆదాయం రూ.14,70,552 నగదు వచ్చినట్లు దేవస్థాన ఉత్సవ కమిటీ ఛైర్మన్ దాడి బుజ్జి, ఈవో మురళీ తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ. 1,45,619 నగదు అధికంగా వచ్చినట్లు చెప్పారు.

జోరుగా పంట కాలువల ఆధునికీకరణ

అనకాపల్లి, న్యూస్‌టుడే: అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని భూములు సిద్ధం చేశారు. వరి సాగుకు అవసరమైన విత్తనాలను సేకరించారు. నాట్లు వేసే సమయానికి పంట కాలువల ఆధునికీకరణ పనులు పూర్తి చెయ్యాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. శివారు ఆయకట్టుకూ నీరు చేరే విధంగా పనులు ముమ్మరం చేశారు. ఈ పనులను సాగునీటి సంఘాలకే అప్పగించారు. రెండు దశాబ్దాలుగా పూడికతీతకు నోచుకోని ఎల్లయ్య కాలువలో జోరుగా పనులు చేస్తున్నారని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనేక చోట్ల కాలువ ఆక్రమణలకు గురవడంతో వీటిని తొలగిస్తున్నారు. ఈ కాలువ ద్వారా 1,952 ఎకరాలకు సాగు నీరు చేరాలి. పులికాలువ, అచ్చన్నకాలువల ద్వారా 1,280 ఎకరాలకు నీరు అందుతోంది. ఏనాడూ పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరు అందలేదు. ఈసారి చివరి ఆయకట్టుకు నీరు చేరే విధంగా పనులు చేస్తున్నారు. ఎల్లయ్య కాలువకు రూ.29.63 లక్షలు, పులికాలువకు రూ.53 లక్షలు, నాగులాపల్లి కాలువకు రూ.20.62 లక్షలతో పనులు చేస్తున్నారు.

ఎల్లయ్య కాలువలో పొక్లెయిన్‌తో పూడిక తొలగింపు

పట్టణం మధ్య నుంచి నాగులాపల్లి, ఎల్లయ్యకాలువ ప్రవహిస్తుంటాయి. ఈరెండింటిలో పట్టణంలోని మురుగు చేరుతోంది. దీంతో పంటకాలువలే ప్రధాన మురుగు కాలువలుగా మారిపోయాయి. ఏటా వేసవిలో పూడికలను జీవీఎంసీ అధికారులు తొలగించాల్సి ఉంది. వైకాపా హయాంలో తూతూ మంత్రంగా పనులు చేసి డబ్బులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఈసారి జీవీఎంసీ, జలవనరులశాఖ అధికారులు, రైతులు సమన్వయంతో పనులు చేస్తున్నారు.

తవ్వకాల అనంతరం పులికాలువ

శారదానది పరవళ్లు తొక్కుతున్నా..

శారదానది పరవళ్లు తొక్కుతున్నా ఈ కాలువల్లో సక్రమంగా నీరు చేరడంలేదు. నదిలో నీటిని గ్రోయిన్ల ద్వారా ఈ కాలువలకు మళ్లించి పంట పొలాలకు అందే విధంగా పనులు చేస్తున్నారు.

రహదారులున్నా అందని ఆర్టీసీ సేవలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: రహదారులు ఉన్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల తరబడి ఆటోల్లోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. అనకాపల్లి మండలంలో 32 పంచాయతీల పరిధిలో 130 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 11 నుంచి 15 గ్రామాలకు మాత్రమే బస్సులు నడుస్తున్నాయి. అనకాపల్లి నుంచి చోడవరం, సబ్బవరం, గాజువాక, విశాఖ, తట్టబంద, కొత్తూరు తదితర ప్రాంతాలకు ఆనుకొని ఉన్న గ్రామాలకు మాత్రమే బస్సులు నడుస్తున్నాయి.

భట్లపూడి కొండుపాలెం, కోడూరు, రేబాక, కాపుశెట్టివానిపాలెం, గోపాలపురం, కొప్పాక గ్రామాల్లో రూ. లక్షలు వెచ్చించి పంచాయతీరాజ్ అధికారులు బీటీ రహదారులు నిర్మించారు. వెంకుపాలెం, సుందరయ్యపేట, సీతానగరం, పాపయ్యపాలెం తదితర గ్రామాలకు మెరుగైన రహదారి సౌకర్యం ఉన్నా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపడం లేదు. ఈ గ్రామాల్లో అధిక సంఖ్యలో వ్యవసాయమే జీవనాధారం. పండించిన పంటలు, కూరగాయాలను పట్టణానికి తీసుకువచ్చి అమ్మకాలు చేపట్టాలన్నా బస్సులు లేక ఆటోలకు అధిక ధరలు చెల్లించాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిమితికి మించి ఆటోల్లో కిక్కిరిసి రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి అందుబాటులో ఉన్న గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడపాలని స్థానికులు కోరుతున్నారు.

రాజుపాలెం రహదారి

మెనూ తప్పనిసరిగా పాటించాల్సిందే!

కశింకోట: వసతిగృహంలో మెనూను అమలు చేయాల్సిందేనని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు కె.శ్రీదేవి ఆదేశించారు. కశింకోట బీసీ సంక్షేమ బాలుర వసతిగృహాన్ని సోమవారం సందర్శించారు.

ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

అనకాపల్లి పట్టణం: పట్టణంలోని జంగాలమదుము వద్ద సోమవారం రాత్రి లారీ-ఆటో ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్ నీలాపు మోహన్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

కర్మాగారం తెరిపించాలని శాంతి ర్యాలీ

కశింకోట: తేగాడ క్రెబ్స్ కెమికల్ కర్మాగారం తెరిపించాలని కర్మాగారం ఉద్యోగులు సోమవారం విశాఖలో కాలుష్య నియంత్రణమండలి కార్యాలయం వద్ద శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జోనల్ అధికారి సుదర్శనరావుకు వినతిపత్రం అందించారు. ఏవీ అప్పారావు, కన్నబాబు, బాబూరావు పాల్గొన్నారు.

పాఠశాల దారి ఇలాగేనా?

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: మార్టూరు పంచాయతీ గుంకలోవ ప్రాథమిక పాఠశాలకు మార్గం సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. క్వారీలకు వెళ్లే మార్గంలోని రహదారి మరమ్మతులకు గురైంది. ఇదే రోడ్డులో పాఠశాల ఉంది. వర్షం వస్తే బురదగా మారుతోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య రాను రాను తగ్గుతోంది. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రింగురోడ్డు కాలువ..

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన రహదారి నుంచి రింగురోడ్డుకు వెళ్లే మార్గంలో కాలువ వద్ద రహదారి కుదించుకుపోతుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో నెలకొన్న ఈ సమస్యను పరిష్కరించాలని వెంటనే చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

తోపుడుబండే హెచ్చరిక బోర్డు

తాళ్లపాలెం శివారు సంతప్రాంతంలో ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలుగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరింది. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా స్థానికులు గుంతకు అడ్డంగా తోపుడుబండిని ఉంచారు. ఈ రహదారికి అధికారులు కనీస మరమ్మతులు చేపట్టడంలేదని విమర్శిస్తున్నారు.

– కశింకోట, న్యూస్‌టుడే

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్) జిల్లా విద్యాశాఖాధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ సర్వీస్ క్రమబద్ధీకరణలో జాప్యం నివారించి సంస్థాగత సెలవులను గతంలో మాదిరిగా అమలు చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సెలవుల సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని విన్నవించారు. ఉపాధ్యాయుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ధర్మారావు, కార్యదర్శి బి.వెంకటపతిరాజు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి సాయం అందజేత

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పూడిమడక తీరంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుని కుటుంబానికి పేటకు చెందిన పలువురు ఆర్థికసాయం అందజేశారు. సోమవారం పూడిమడకలో పర్యటించి బాధితుడి తల్లి చోడిపల్లి దేవుడమ్మకు సుమారు రూ.10 వేల నగదుతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. నాయకులు చోడిపల్లి శ్రీను, పి.నాగేశ్వరరావు, చేపల దేవుడు, మేరుగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జిగా ఆదిబాబు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మండల తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జిగా తిమ్మరాజుపేటకు చెందిన కర్రి ఆదిబాబును నియమించినట్లు తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

పేద విద్యార్థులకు చేయూత

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు చేయూత ఇవ్వడానికి ముందుకురావాలని ఎం.జగన్నాథపురం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం కె.రాజారత్నకుమార్ కోరారు. గ్రామానికి చెందిన సాయివంశీ, స్వప్న దంపతులు 219 మంది పేద విద్యార్థులకు సోమవారం పుస్తకాలు, డైరీలను అందించారు. సర్పంచి కరెడ్ల బుల్లమ్మ, ప్రకాశ్, వెంకటేష్, కాత్యాయిని తదితరులు పాల్గొన్నారు.

'పూర్తిస్థాయిలో పనిచేయని వైకాపా కార్యకర్తలు'

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: 2019 ఎన్నికల్లో కసితో పనిచేసిన కార్యకర్తలు, 2024 ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పనిచేయలేదని వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అడ్డురోడ్డులో పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు అధ్యక్షతన సోమవారం సాయంత్రం వైకాపా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి, జనాలను మోసం చేస్తోందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు 'బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యకర్తల అభీష్టాన్ని సంతృప్తిపరిచే విధంగా నియోజకవర్గ సమన్వయకర్త ఉండాలని సూచించారు. అంతకుముందు వైకాపా పార్లమెంటరీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పరిశీలకురాలు శోభా హైమావతి, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు మాట్లాడారు.

తరచూ మరమ్మతు.. తాగునీరు వృథా

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పేట ప్రధాన రహదారిపై నిత్యం ఏదోఒక చోట తాగునీరు వృథాగా పోతోంది. సీతారాంపురం, నక్కపల్లి మండలం దేవవరం, ఒడ్డిమెట్ట, చినరామభద్రపురం గ్రామాలకు పేట నుంచి నీటిని సరఫరా జరుగుతోంది. కంటోన్మెంట్ ఏరియా నుంచి జీవీఆర్ నగర్ మధ్యలో పైపులైను నుంచి తరచూ నీరు లీకవుతోంది. నీరంతా రోడ్డుపైకి చేరుతుండటంతో రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వర్మ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లగా.. లీకేజీలున్న చోట తక్షణమే మరమ్మతు చేయిస్తామన్నారు.

పైపులతో ఇబ్బంది..

కుళాయిల్లో బురదనీరు!

నక్కపల్లి, న్యూస్‌టుడే: కాగితలో పలు ఇళ్లకు వస్తున్న తాగునీరు కలుషితమవుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామానికి సంబంధించి దార్లపూడి పైలట్ ప్రాజెక్టుతోపాటు, స్థానికంగా ఏర్పాటు చేసిన మోటారు ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశారు. ఇంటింటికీ కుళాయి సదుపాయం అందుబాటులోకి రావడంతో పలు ఇళ్లకు బురదనీరే వస్తుంది. నీటిని సరఫరా చేస్తున్న సమయంలో కొన్ని పైపుల నుంచి బురద నీరే రావడంతో జనానికి కష్టాలు తప్పడంలేదు. దీంతో నీరు సరఫరా అవుతున్నా పట్టుకోలేకపోతున్నారు. కేవలం కొన్ని ఇళ్లకే బురదనీరు వస్తోందని, పైపులైను ఎక్కడికక్కడ తనిఖీ చేయిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి చిన్నంనాయుడు తెలిపారు. సమస్య ఎక్కడుందో గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కూటమి పాలనలో అన్ని వర్గాలకు మేలు

అనకాపల్లి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఒక పక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తునే మరో పక్క అనేక అభివృద్ధి పనులు చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు తెలిపారు. స్థానిక లక్ష్మీదేవిపేటలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటి ప్రచారం చేశారు. నాయకులు కర్రి గోపి, కాండ్రేగుల ముకుంద, మళ్ల శివనారాయణ, కొణతాల పెద్దవాసు పాల్గొన్నారు. చీమలాపల్లిలో తెదేపా మండల అధ్యక్షులు పీలా తులసీరామ్ ఇంటింటి ప్రచారంలో కరపత్రాలను ప్రజలకు అందించారు. ఏడాదిలో చేసిన పనులు, అమలు చేసిన పథకాలను వివరించారు. నాయకులు పతివాడ చిన్నయ్యనాయుడు, మామిడి శివఅప్పారావు, కాండ్రేగుల అప్పారావు, పెయ్యిల గిరి పాల్గొన్నారు.

చీమలాపల్లిలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న తెదేపా నాయకులు

గ్రీన్‌బెల్ట్‌లో చెట్ల తొలగింపు అన్యాయం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పరిశ్రమల నుంచి వెలవడే ప్రమాదకరమైన వాయువులను అడ్డుకోవడానికి దిబ్బపాలెం సెజ్ కాలనీ చుట్టూ ఉన్న గ్రీన్‌బెల్ట్‌లోని చెట్లను నరికివేయడం అన్యాయమని కాలనీవాసులు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కృష్ణంపాలెం నిర్వాసితులకు ఇంటిస్థలాలు కేటాయించేందుకు కాలనీ చుట్టూ ఉన్న 200 ఎకరాల్లో గ్రీన్ బెల్ట్‌ను నాశనం చేయడానికి సిద్ధమవుతున్నారన్నారు. కృష్ణంపాలెంవాసులకు మరోచోట స్థలాలు కేటాయించాలని, తమకు అన్యాయం చేయవద్దని కోరారు. నాయకులు వియ్యపు కృష్ణ, లాలం శ్రీనివాసరావు, నీరుకొండ అశోక్ కుమార్, ఉస్తాలు, గాడి గణేష్, పిల్లి రమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫిర్యాదు కాపీ చూపిస్తున్న ప్రతినిధులు

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), కొత్తూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి పంపిణీ చేపట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు విల్లూరి ఉమామహేశ్వరరావు రూపొందించిన స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరి, నూకాంబిక దేవస్థానం ఛైర్మన్ పీలా నాగశ్రీను, నాయకులు పాల్గొన్నారు. ఇటీవల లంకెలపాలెం వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో చనిపోయిన బాధిత కుటుంబ సభ్యులను, గవరపాలేనికి చెందిన పెతకం శెట్టి మధు చనిపోవడంతో కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్టీనగర్‌గా ప్రత్యేక పంచాయతీ చేయాలని స్థానికులు కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఎంపీ కార్యాలయ ప్రతినిధి విజయ్‌కు వినతిపత్రాలు అందజేశారు.

అంగన్‌వాడీ కార్యకర్త సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

సమ్మెను విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ

అచ్యుతాపురం, కొత్తూరు: ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు రొంగలి రాము, సోమునాయుడు, రాజాన సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లి సీపీఐ భవనంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు ప్రతినిధులతో సమావేశమయ్యారు.

ప్రజా సంఘాల నాయకుల ర్యాలీ

కాలువ పనులకు శ్రీకారం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సత్యవరం- మాసాహెబ్‌పేట గ్రామాలకు సాగునీటిని అందించే ఊట కాలువ అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కాలువ గత కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో మాసాహెబ్‌పేట, గోపాలపట్నం శివారు భూములకు నీరు అందని పరిస్థితి ఉండేది. ఈ సమస్యను మంత్రి అనిత దృష్టికి నాయకులు తీసుకెళ్లారు. పూడికతీత లైనింగ్, ఇతర పనులు చేపట్టేందుకు సుమారు రూ.10 లక్షలు మంజూరు చేశారు. కూటమి నాయకులు గెడ్డం బుజ్జి, చించెలపు పద్దు, పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ. . సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. నాయకులు యాళ్ల వరహాలబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, కీర్తి సీతారాం, చింతకాయల రాంబాబు, అప్పారావు, నానాజీ పాల్గొన్నారు.

సత్యవరం వద్ద ఊట కాలువ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

పూడికతీత పనులు ప్రారంభం

ఎలమంచిలి: పాత జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడికతీత పనులను సోమవారం ప్రారంభించారు. వీటిని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి పరిశీలించారు. వర్షా కాలంలో పట్టణం ముంపునకు గురికాకుండా పూడికలు తీయిస్తున్నామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ఇంజినీర్ గణపతిరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పేటలో ఎమ్మార్పీఎస్ నాయకుల ర్యాలీ

పాయకరావుపేట: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం దినోత్సవాన్ని పేటలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంపల చినరాజు ఆధ్వర్యంలో వై కూడలి నుంచి ప్రధాన రహదారిపై ర్యాలీ చేపట్టారు. అనంతరం జనసేన నాయకుడు తోట నగేష్, సీఐ అప్పన్నతో కలిసి కేకు కోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని, మాదిగల చరిత్రను తిరగరాశారని అభివర్ణించారు. జిల్లా అధికార ప్రతినిధి కె.చిన్న అప్పారావు, జిల్లా ఇన్‌ఛార్జి వి.వెంకట్రావు, కె.కనకేశ్వరరావు, అజయ్‌బాబు, సలికే గోవిందు, రమేష్, కొండబాబు, వెంకటరమణ పాల్గొన్నారు.

నక్కపల్లి, ఎలమంచిలి: నక్కపల్లిలో ఎస్సీ కాలనీ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. నాయకులు కాండ్రకోట సూర్య, కాండ్రకోట రాజారావు, కుందూరు లోవరాజు, కాండ్రకోట ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. ఎలమంచిలి అరుంధతినగర్‌లో జాంబవ కుల సంఘం ఆధ్వర్యంలోకేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు పంచారు. జిల్లా ఇన్‌ఛార్జి వివేకులరావు, పెదపూడి బండియ్య, రిగుమర్తి రాజబాబు, కనకేశ్వరరావు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

[illegible]

DHR విలువ: రూ 8,00,000/-
అమీనా విలువ : రూ 30,00,000/-
మార్కెట్ విలువ: రూ 30,70,580/-
పై స్థిరాస్తి నందు JDR కు హక్కు గల 1/2వ వంతు ఆస్తికి మార్కెట్ విలువ తే 20-04-2020 నాటికీ రూ 15,35,290/-
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ద్వారపురెడ్డి వెంకటరావు
DHR తరపు న్యాయవాది
యలమంచిలి, యలమంచిలి
తేది:07-07-2025. ఫోన్: 99512 19191

హెచ్‌ఎం ఉదారత

విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఆటోతో హెచ్‌ఎం

కశింకోట, న్యూస్‌టుడే: పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఎం ఆటో సౌకర్యం కల్పించి ఉదారతను చాటుకున్నారు. తాళ్లపాలెం సంత ప్రాంతం నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న బంగారయ్యపేట 1వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 1నుంచి 5వ తరగతి విద్యార్థులు 11 మందిని పాఠశాలకు తరలించారు. దూరంగా ఉన్న పాఠశాలకు విద్యార్థులు వెళ్లి వచ్చేందుకు వీలుగా హెచ్‌ఎం గాడి శ్రీనివాసరావు ఆటో సమకూర్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వహిందూ మహాసంఘం అధ్యక్షుడిగా వెంకటరావు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: హిందూ ధర్మాన్ని కాపాడడానికి అందరూ ఐక్యంకావాలని విశ్వహిందూ మహాభారత్ ధర్మ ప్రచారకులు గోవింద రామానుజాచార్యులు కోరారు. అచ్యుతాపురంలోని దుర్గమ్మ ఆలయాన్ని సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. విశ్వహిందూ మహాసంఘం కమిటీకి అనకాపల్లి అధ్యక్షుడిగా మండలానికి చెందిన యల్లపు వెంకటరావు, ఉపాధ్యక్షుడిగా కోడూరు వెంకటరావు, మండల అధ్యక్షుడిగా శరగడం జగ్గ అప్పారావు, ఉపాధ్యక్షుడిగా యానాపు శ్రీనులను నియమించినట్లు తెలిపారు.

గోవిందరామానుజాచార్యులతో ప్రతినిధులు

అనకాపల్లి, న్యూస్‌టుడే ?: అనకాపల్లి కర్రి వారివీధిలో చైతన్యనగర్‌లో మట్టి రోడ్డును సిమెంట్ రహదారి ఏర్పాటు చేయాలి. – కాండ్రేగుల చిన్న భాస్కరరావు, అనకాపల్లి, ✓: రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. – ఎస్.శేఖర్, ఈఈ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే ?: శారదానగర్ పదోవీధిలో రహదారి నిర్మాణం లేక ఇబ్బంది పడుతున్నాం. – సుమంత్, శారదానగర్, ✓: సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – సుభాష్, కొత్తూరు పంచాయతీ కార్యదర్శి

ఎలమంచిలి, న్యూస్‌టుడే ?: ఎలమంచిలి స్టేషన్‌రోడ్డులో రోడ్డు పక్కన చేపల వ్యర్థాలు పడేస్తున్నారు. – వీఆర్ నాగరాజు, ✓: మార్కెట్‌లో చేపలు అమ్ముకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం. – పల్లా శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే ?: పెదపాడులో తరచూ విద్యుత్తు కోతలు విధిస్తున్నారు. – సింహాచలం, పెదపాడు, ✓: విద్యుత్తు కోతలు లేకుండా చర్యలు తీసుకుంటాం. – భానుప్రకాశ్, ఏఈ

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

పాయకరావుపేట, న్యూస్‌టుడే ?: పాయకరావుపేటలోని శ్మశానం నుంచి రాజుగారిబీడు వెళ్లే రోడ్డులో తుప్పలు ఏపుగా పెరిగి రోడ్డు ఇరుకుగా మారింది. – రాంబాబు, స్థానికుడు, ✓: తుప్పల తొలగింపునకు సిబ్బందిని పంపుతాం. – ఎం.లవరాజు, ఈవో

పాయకరావుపేట, న్యూస్‌టుడే ?: ఇందిరా కాలనీలో తాగునీటి పైపులైన్లు శిథిలావస్థకు చేరాయి. కుళాయిల నుంచి బురద నీరు వస్తోంది. – రాజు, పాయకరావుపేట, ✓: జల్‌జీవన్ పనుల్లో భాగంగా కొత్తగా పైపులైన్లు వేస్తున్నాం. – వర్మ, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

గాయపడిన సీపీలకు ఆర్థికసాయం

సాయాన్ని అందిస్తున్న ఏకేవీ సిబ్బంది

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీపీలకు ఏకేవీ సిబ్బంది సోమవారం ఆర్థికసాయాన్ని అందించారు. ఆర్. శివరాపురం సీపీ దేవర చిలుకునాయుడు ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయన భార్య మృతిచెందారు. తైపురం సీపీ నక్కా కుమార్ బైక్‌పై నుంచి పడి కోమాలోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఏకేవీ సిబ్బంది రూ.1.2 లక్షలు సమీకరించి వారికి అందజేశారు. ఏపీఎం రాజుబాబు, నాయుడు, దేముడుబాబు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి తీవ్రగాయాలు

రోలుగుంట, న్యూస్‌టుడే: నర్సీపట్నం వైపు నుంచి అర్జాపురం వైపు వస్తున్న ద్విచక్రవాహనం కుసుమమ్మల కూడలివద్ద సోమవారం అదుపుతప్పింది. ఈ ఘటనలో రావికమతం మండలం టి.అర్జాపురానికి చెందిన ఆరి వెంకటేష్, రెండేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయినపుడు ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను కొత్తకోట ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నర్సీపట్నం తరలించినట్లు ఎస్సై రామకృష్ణారావు తెలిపారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం శ్రీకన్య ఆది: సోలో బాయ్, కన్నప్ప, ఆది2: మార్గన్, కుబేర, ఆది3: తమ్ముడు, ఆది4: జురాసిక్ వరల్డ్, ఎఫ్1 ది మూవీ, బంగారాజు: మార్గన్, రాజు: కన్నప్ప. చోడవరం శ్రీసాయిలక్ష్మి: తమ్ముడు, సాయిలక్ష్మి: కన్నప్ప, పూర్ణ: కుబేర

ఆరంభానికి ముందే ఆక్షేపణ

రోలుగుంట, న్యూస్‌టుడే: గిరిజనుల డోలీ మోతలకు స్వస్తి చెప్పేందుకు చేపట్టిన రహదారి పనుల్లో డొల్లతనం బయటపడుతోంది. పనుల ఆరంభంలోనే అధ్వానంగా తయారవడంతో వాహనదారులు పెదవి విరుస్తున్నారు. గిరిజనుల నిధులంటే అంత చులకనా అంటూ ఆక్షేపిస్తున్నారు. ★ రోలుగుంట మండలంలోని గిరిజన పంచాయతీ అర్ల నుంచి పిత్రిగెడ్డ, జాజులబంద గ్రామాల మీదుగా కొయ్యూరు మండలం మూలపేట వరకూ కొత్తరోడ్ల కిందట ఉపాధి హామీ పథకంలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ద్వారా రూ.4.10కోట్లను జిల్లా కలెక్టరు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు.

కొద్దిపాటి వర్షానికే కొట్టుకుపోయిన మెటల్

ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు నిర్మాణంలో వేసిన మెటల్, గ్రావెల్ బూడిద ఇతర సామగ్రి అంతా కొట్టుకుపోయింది. దీంతో వాహన ప్రయాణాలు సంగతి దేవుడెరుగు కాలినడకకే అవస్థలు పడాల్సి వస్తోంది. దీనికితోడు నేటివరకు గుత్తేదారు ఖర్చుచేసిన సుమారు రూ.60లక్షలకు పైగా నిధులను ప్రభుత్వం చెల్లించకపోవడంతోనే పనుల్లో జాప్యం జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ★ ఈ విషయమై ఏఈ శ్రీనివాస్ (ప్రాజెక్ట్స్) మాట్లాడుతూ వర్షాల కారణంగా రహదారి నిర్మాణంలో వేసిన మెటీరియల్ కొట్టుకుపోయిన మాట వాస్తవమని, మరో లేయర్ వేసి పనులను త్వరితగతిన పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గాంధీ గ్రామంలో లోఓల్టేజ్ సమస్య

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గాంధీ గ్రామం విద్యానగర్‌లోని వేంకటేశ్వర అపార్టుమెంటులో తరచూ లోఓల్టేజ్ సమస్యతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సుమారు 30 కుటుంబాలకు పైగా ఉంటున్నాయి. ఓల్టేజ్ హెచ్చు.. తగ్గుల కారణంగా గృహోపకరణాలు పాడవుతుండటంతో రూ.లక్షల్లో ఆస్తినష్టం వాటిల్లుతోంది. తరచూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిప్పురవ్వలు రాలుతున్నాయి. దీనిపై విద్యుత్తుశాఖ లైన్‌మెన్ వద్ద ప్రస్తావించగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్య ఉందని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.

కూడలిలో వసతుల కొరత

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణానికి కేంద్ర బిందువు కొత్తూరు జంక్షన్. ఇక్కడి వసతుల కొరత ప్రయాణికులు, వ్యాపారులను వేధిస్తోంది. తూర్పు వైపు విశాఖ-అనకాపల్లి, పడమర వైపు పాడేరు దక్షిణం వైపు పి.ఎస్.పేట, ఉత్తరం వైపు ఎ.కోడూరు వెళ్లేందుకు ఇది కూడలి. దీంతో అధికంగా రద్దీ ఉంటుంది. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలంటూ పట్టణవాసులు కోరుతున్నారు.

బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

పట్టణానికి నడిబొడ్డున ఉన్న ఈ కూడలిలో పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు నడుస్తున్నాయి. పూర్వం నుంచి ఇక్కడ వ్యాపారాలు అధికంగా జరుగుతుండటంతో వాహనాల రాకపోకలు, జనసంచారంతో రద్దీగా ఉంటోంది. ఇలాంటి ప్రాంతంలో వీధి వ్యాపారాలు జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం, సరకుల కోసం వచ్చే వారి వాహనాలు ఎక్కడ నిలపాలో కూడా తెలియని పరిస్థితి ఉంది.

నిత్యం ట్రాఫిక్ రద్దీ

బస్ షెల్టర్ నిర్మించాలి.. గతంలో దాతలు నిర్మించిన బస్ షెల్టర్లను ఆక్రమించుకుని పడగొట్టి వాటిలో దుకాణాలు ఏర్పాటు చేసుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. విద్యార్థులు, ప్రయాణికులు రోజూ దాదాపు రెండు వేల మందికి పైగా ఇక్కడి నుంచి బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. వీరంతా బస్సుషెల్టర్ లేకపోవడంతో ఎండ, వానలకు ఏ దుకాణం వద్దో తలదాచుకుంటున్నారు. దీనికి తోడు ఇక్కడ మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో సమీపంలోని ప్రభుత్వ కార్యాలయాలపై ఆధారపడుతున్నారు. ముఖ్యంగా మహిళల కష్టాలు వర్ణనాతీతం.

రహదారిని విస్తరించాలి: కూడలి వరకు 50 అడుగుల మేర విస్తరించారు. అక్కడి నుంచి గోవాడ వైపు షెల్టర్ బంక్ వరకు విస్తరణ చేపట్టలేదు. రెవెన్యూ కార్యాలయాలు వాహన పార్కింగ్ స్థలంగా వాడుకుంటున్నారు.

పట్టించుకోకపోతే ఎలా..?

వసతుల కొరతతో ఇక్కడి నుంచి చాలా మంది వలస వెళ్తున్నారు. ముఖ్యంగా కొత్తూరు జంక్షన్‌లో ఇబ్బందులున్నాయి. కనీసం మరుగుదొడ్లు అయినా నిర్మించాలి. సమస్యలపై పలుమార్లు వివిధ సంఘాల ద్వారా వినతి పత్రాలు అందజేసినా ప్రయోజనం లేదు. అధికారులు, పాలకులు దీనిపై దృష్టి సారించాలి. – ఏడిద వెంకట ప్రసాదు, చోడవరం

వాన నీరు నేలలో ఇంకేలా..

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలో ఇంకించేందుకు ప్రభుత్వం ఇంకుడు గుంతలు తవ్విస్తోంది. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. నర్సీపట్నం మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో కొద్ది రోజుల కిందట రూ.75 వేల వ్యయంతో ఇంకుడు గుంత నిర్మించారు. మేడపై పడిన వర్షపు నీరంతా ఈ గుంతలోకి చేరి భూమిలో ఇంకేలా ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, నర్సీపట్నం గ్రామీణం

వైభవంగా మారు రథయాత్ర

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి దేవాలయంలో జగన్నాథస్వామి దశావతారాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా సీఐ అప్పలరాజు, గౌరీశ్వరాలయం ఉత్సవ కమిటీ ఛైర్మన్ గూనూరు సురేష్, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, సభ్యులు తదితరులు పాల్గొని మారురథయాత్రను ఘనంగా ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు సుభద్ర, బలభద్ర సమేత ఉన్న జగన్నాథుడిని ప్రత్యేకంగా అలంకరించారు.

సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి

ముగిసిన పీర్ల పండగ

మాడుగుల : మాడుగుల జుమా మసీదు నుంచి సోమవారం రాత్రి పీర్లను పట్టణంలో ఊరేగింపు చేశారు. స్థానిక ముస్లిం సోదరులు అంతా కలసి పీర్లతో ఊరేగింపు నిర్వహించారు. పీర్ల పండగతో అందరిలో సోదర భావం కలుగుతుందని దీన్ని మతపెద్దలు తెలిపారు.

పీర్ల ఊరేగింపు

అ వీ ఇ వీ

ఈవోపీఆర్డీగా అర్జునరావు

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం మండల పరిషత్ కార్యాలయం ఈవోపీఆర్డీగా కె.అర్జునరావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన దుంబ్రిగుడ మండలం నుంచి ఇక్కడకు బదిలీ పై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఓ.మహేష్ జి.కె.వీధి మండలానికి బదిలీ పై వెళ్లారు.

తల్లిదండ్రుల సమ్మేళనంపై అవగాహన సదస్సు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు పీటీఎం సమావేశంపై అవగాహన కల్పించినట్లు ఎంఈఓ దేముడమ్మ తెలిపారు. సమావేశానికి వచ్చిన తల్లిదండ్రులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, వారికి పలు క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు.

బేస్‌బాల్ పోటీలకు ఎంపిక నేడు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక జడ్పీ పాఠశాలలో మంగళవారం క్రీడాకారుల ఎంపిక జరగనుందని బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అక్షజ్‌కృష్ణ, ఉపాధ్యక్షుడు శివాజీ, కార్యదర్శి అప్పారావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి యువతీ యువకుల విభాగాల్లో రెండు జట్లను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు అనంతపురంలో ఈనెల 12 నుంచి 14 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

వజ్రగడలో ప్రబలిన జ్వరాలు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: వజ్రగడ గ్రామంలో జ్వరాలు ప్రబలి స్థానికులు మంచం పట్టారు. సభాపతి అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో వైద్యాధికారులు సోమవారం ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్యంపై సర్వే నిర్వహించారు. నిల్వ నీటిని తొలగించడంతోపాటు పారిశుద్ధ్య కార్మికులతో రహదారులు, కాలువలు, తాగునీటి పథకాలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీపే దొరబాబు ఉద్యోగ విరమణ చేయగా.. సిటీ క్లబ్‌లో సత్కార కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, ఎంఈవో నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కృష్ణదేవిపేట, నాతవరం, న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ సూచించారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా జోగుంపేట ఆర్.ఎన్.ఆర్ కాలనీలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర పీడితులను పరీక్షించి మందులిచ్చారు. గొలుగొండ, చీడిగుమ్మల పీహెచ్‌సీల వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. నాతవరం మండలం ములగపూడిలో జ్వరాలు ప్రబలడంపై జనసేన నాయకులు అప్పన దొరబాబు, గణేష్ చొరవతో అధికారులు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు.

శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న శ్యామ్‌కుమార్, సిబ్బంది

జాబితాలో పేర్లు లేవని ఆందోళన

సబ్ కలెక్టరేట్‌లో జాబితాలను ప్రదర్శిస్తున్న నిర్వాసితులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల పేర్లను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ జాబితాలో లేకుండా చేశారంటూ సబ్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అప్పలరాజు ఆధ్వర్యంలో పాటిమీద గ్రామానికి చెందిన 12 మంది ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. నిర్వాసితుల్లో 18 ఏళ్లు దాటిన మహిళలు, పురుషులకు రూ.25 లక్షల చొప్పున ప్యాకేజీ అమలు చేయాలని కోరారు. ఈ మొత్తాన్ని రూ.8.98 లక్షలకే పరిమితం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు.

రాయితీ సద్వినియోగంతో ఆదాయం

మాడుగుల, న్యూస్‌టుడే: దేశంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేయడానికి ప్రధాని మోదీ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్ ఎనలేని కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మాడుగుల తితిదే కల్యాణ మండపంలో జరిగిన సభలో మంత్రి పాల్గొని మాట్లాడారు. డీసీసీబీ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గం వెనకబడింది వ్యవసాయ రుణాలు పెంచాలన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో మాడుగులలో రూ.2.58 కోట్లు వ్యవసాయ రుణాలను అందజేశారు.

మాడుగులలో చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే తదితరులు

మాడుగుల గ్రామీణం : సత్యవరం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

రోలుగుంట, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని మెరుగైన ఆదాయం పొందాలని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు పేర్కొన్నారు. మండలంలోని కొవ్వూరులో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో మిగతా రాష్ట్రాలతో పోల్చుకుంటే ఇక్కడ ఆయిల్‌పామ్ సాగుకు ఎంతో అనుకూలమన్నారు. పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ ఏజీఎం పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ ఎరువులకు హెక్టారుకు రూ.5250ల చొప్పున నాలుగేళ్లపాటు ఇస్తున్నామన్నారు.

ఆయిల్‌పామ్ రైతులు, ఉత్పత్తులతో ఎమ్మెల్యే రాజు

పునర్వైభవం వైపు పయనం

మార్కెట్ కమిటీ పాలకవర్గం తొలి సమావేశం నేడు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డు అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి. నర్సీపట్నం మార్కెట్ కమిటీ పాలకవర్గ తొలి సమావేశం మంగళవారం జరగనుంది. అభివృద్ధి పనులకు సంబంధించి పలు ప్రతిపాదనలను ప్రవేశపెట్టనున్నారు. పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో సభాపతి అయ్యన్న సూచించిన మేరకు రైతుబజారులో దుకాణాలు, వివాహాది శుభకార్యాలయాల నిర్వహణకు ఆడిటోరియం నిర్మించేందుకు ప్రతిపాదించనున్నారు. కొన్నేళ్లుగా మూతపడిన భూసార పరీక్ష కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురానున్నారు. ఇందుకు సంబంధించి ప్రయత్నాలు మొదలయ్యాయి. ఏవోను నియమించడం, విద్యుత్తు సదుపాయం కల్పించడం ఇప్పటికే పూర్తి చేశారు. ఈ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో పట్టాలెక్కించేందుకు రూ.3.15 లక్షలు అవసరమని అంచనా వేశారు.

మార్కెట్ కమిటీ కార్యాలయం

★ ఐదు మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న రైపనింగ్ ఛాంబర్ యార్డులో నిరుపయోగంగా ఉంది. దీన్ని వినియోగంలోకి తీసుకురావడానికి రూ.1.78 లక్షలు అవసరం. యార్డులోని గోదాములు, దుకాణాలు రంగులు వెలిసి కళావిహీనంగా మారాయి. యార్డు ఆవరణలోని వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయాధికారి కార్యాలయాలు మరమ్మతుకు గురయ్యాయి. యార్డు ప్రహరీ కొన్నిచోట్ల మరమ్మతుకు గురైంది. పలు దుకాణాలు, మూడు, నాలుగు నంబర్ల గోదాములు దెబ్బతిని వర్షపునీరు లోపలకు చేరుతోంది. వీటన్నింటినీ సరిచేయాల్సి ఉంది.

రైతు సంక్షేమం ధ్యేయం

మార్కెట్ యార్డు అన్ని విధాలా రైతులకు ఉపయుక్తంగా ఉండాలన్నదే ధ్యేయం. ఇందులో భాగంగా ఏం చేయాలన్నది సభాపతి అయ్యన్నపాత్రుడు పలు సూచనలు ఇచ్చారు. తదనుగుణంగా తొలి సమావేశం నుంచే ముందుకు వెళ్తాం. – గవిరెడ్డి వెంకటరమణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్

ప్రజా సమస్యలు పరిష్కరించండి

మాకవరపాలెం, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు ప్రస్తావిస్తున్న సమస్యలను మండల పరిషత్తు సమావేశాల్లో పరిష్కరించకుండా మొక్కుబడిగా నిర్వహించడం ఎందుకంటూ ప్రజాప్రతినిధులు అధికారులపై మండిపడ్డారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. బూరుగుపాలెం, చామంతిపురం, ముసిడిపాలెం గ్రామాల ప్రజలకు కొన్ని నెలలుగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు రుత్తల యర్రాపాత్రుడు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. చామంతిపురం పంచాయతీ ప్రజలు నిత్యావసర సరకులు తీసుకోవడానికి రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని, గ్రామంలో రేషన్‌డిపో ఏర్పాటు చేయాలని సర్పంచి గోవింద తహసీల్దారు వెంకటరమణను కోరారు. ప్రభుత్వ పాఠశాల స్థలం ఆక్రమణకు గురవుతోందని, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని రాచపల్లి ఎంపీటీసీ సభ్యుడు యర్రాపాత్రుడు కోరారు. నర్సీపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జడ్పీటీసీ సభ్యురాలు సత్యవేణి, వైస్ ఎంపీపీలు రాజారావు, లక్ష్మీ, ఎంపీడీవో ఛాయసుధా తదితరులు పాల్గొన్నారు.

9న పాండవుల మెట్ట గిరిప్రదక్షిణ

దేవరాపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని పాండవుల మెట్టపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి గిరి ప్రదక్షిణ ఈ నెల 9న జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 4 గంటలకు ఆలయం తొలి మెట్టు వద్ద కొబ్బరికాయ కొట్టిన తరువాత భక్తులు ప్రదక్షిణకు బయలుదేరతారని ఆలయ కమిటీ తరఫున అవుగడ్డ రామ్మూర్తినాయుడు పేర్కొన్నారు. 7కి.మీ. మేర సాగే ఈ ప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పాండవుల మెట్టపై నిర్మించిన స్వామి వారి ఆలయం

భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, భవన నిర్మాణ కార్మికులు సోమవారం ర్యాలీ చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండు చేశారు. ఉపాధి శ్రామికులకు 200 రోజుల పనిదినాలు కల్పించడంతోపాటు రోజువారీ రూ.500 చొప్పున కూలి చెల్లించాలన్నారు.

చీడికాడ, న్యూస్‌టుడే : ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల్ని కట్టుబానిసల్లా పాలకులు చూస్తున్నారని సీఐటీయూ నాయకులు విమర్శించారు. ఈ నెల 9న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ప్రచార జాత చేపట్టారు.

నిబంధనల ప్రకారం భూములను సేకరించాలి

కె.కోటపాడు, న్యూస్‌టుడే : సెజ్‌కు ఆర్లి ప్రాంతంలోని భూములను ప్రభుత్వం నిబంధనల ప్రకారం సేకరించాలని ప్రజాసంఘాల మండల కన్వీనర్ యర్రా దేముడు కోరారు. సంఘ నాయకులు ఈ మేరకు సోమవారం ఈ గ్రామ స్థలతోపాటు నిరసన వ్యక్తం చేశారు. నాయకులు బోళెం కాసుబాబు, రుత్తల యర్రాపాత్రుడు, రమణ, నూకరాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

అచ్చిరాజు కుటుంబానికి అండగా ఉంటాం: సభాపతి

నాతవరం, న్యూస్‌టుడే: నిబద్ధత, నిజాయతీ కలిగిన నాయకుడిని కోల్పోవడం తెదేపాకు తీరనలోటని సభాపతి అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. తెదేపా నేత లాలం అచ్చిరాజు అంత్యక్రియలు నాతవరం మండలం వెన్నలపాలెంలో సోమవారం జరిగాయి. సభాపతి అయ్యన్న దంపతులు, కుమారుడు విజయ్ హాజరై అచ్చిరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం అంతిమ యాత్రలో అయ్యన్న పాల్గొని పాడె మోశారు. నాయకులు అడగర్ల నానిబాబు, కరక సత్యనారాయణ, పి.కొండబాబు, కాశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతిమయాత్రలో పాడె మోస్తున్న అయ్యన్నపాత్రుడు

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట- జెడ్.కొత్తపట్నం ప్రత్యామ్నాయ రోడ్డు (కాలువ గట్టు) అభివృద్ధికి రూ.70 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చొరవ తీసుకొని ఈ రోడ్డు అభివృద్ధికి, తారు రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదలకు కృషి చేశారు. ఇప్పటికే టెండర్ కూడా పూర్తయింది. త్వరలోనే పనులు చేపడతామని పీఆర్ ప్రాజెక్టు డీఈఈ శ్రీహరి చెప్పారు. దీనిపై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పశుగ్రాస వారోత్సవాలు ప్రారంభం

పశుగ్రాసంపై అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారిణి గాయత్రీ దేవి

దేవరాపల్లి, న్యూస్‌టుడే : మండలంలో పశుగ్రాస వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. దేవరాపల్లి, మామిడిపల్లి, ఎం.అలమండలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో పశు వైద్యాధికారులు గాయత్రీ దేవి, మంజూష, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. పశు గ్రాసం సాగు, శాస్త్రీయ పద్ధతిలో దాన్ని నిల్వ చేసే విధానంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు పచ్చిగ్రాసం అందించడం ద్వారా ఆరోగ్యంగా ఉండటమే కాకుండా సకాలంలో ఎదకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సహాయకుడు సురేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పశుగ్రాస వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. దిబ్బిడి గ్రామంలో పశుగ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. బుచ్చెయ్యపేట పశువైద్యాధికారిణి పద్మజ మాట్లాడుతూ.. అధిక పోషక విలువలు ఉన్న సూపర్ నేపియర్, రెడ్‌నేపియర్ తదితర రకాల గ్రాసాల పెంపకంతో రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుంకర లక్ష్మి, పూడి రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743, చోడవరం - 80085 74732, మాడుగుల - 80085 74740 చీడికాడ - 80085 74742

నర్సీపట్నం, న్యూస్‌టుడే: శారదా నగర్‌లో సత్యసాయి ఆర్చి వద్ద ఖాళీ స్థలం వర్షాలకు చిత్తడిగా మారి దోమలకు ఆవాసంగా తయారైంది. – ఎం.రాజారత్నం, శారదానగర్, ✔: సిబ్బందిని పంపి ఆ ప్రాంతానికి శుభ్రం చేయిస్తాం. – చిట్టిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నర్సీపట్నం

నాతవరం, న్యూస్‌టుడే: నాతవరం ప్రధాన రహదారిలో తాండవ వంతెన ప్రమాదకరంగా ఉంది. – చింతకాయల శ్రీను, నాతవరం, ✔: రహదారులు భవనాల శాఖ అధికారులకు ప్రతిపాదిస్తాం. – పార్థసారథి, మండల పరిషత్తు కార్యాలయ ఏవో

కె.కోటపాడు, న్యూస్‌టుడే: గొట్లాంలో వీధి రోడ్డు అధ్వానంగా ఉంది. మరమ్మతులు చేయాలి. – రాజు, గొట్లాం, ✔: పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేసి మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపుతాం. – ప్రియాంక, కార్యదర్శి, గొట్లాం

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గొలుగొండ మండలం కశిమిలో తాగునీటి ట్యాంకు చుట్టూ తుప్పలు పెరిగాయి. – జి.ఎన్.రాజు, కశిమి, ✔: పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో విధులకు రావడం లేదు. ఉపాధి హామీ శ్రామికులతో రెండు రోజుల్లో తుప్పలను తొలగిస్తాం. – నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి

వెబ్‌ల్యాండ్ తప్పిదాలపై అధికంగా వినతులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: వెబ్‌ల్యాండ్‌లో చోటుచేసుకున్న తప్పిదాలతో రైతుల భూములు ప్రభుత్వానికి చెందినవిగా నమోదయ్యాయని పేర్కొంటూ బాధితులు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. సబ్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 22 వినతులు వచ్చాయి. కార్యాలయ ఏవో సుధాకర్ వీటిని పరిశీలించారు. వెబ్‌ల్యాండ్‌లో ప్రభుత్వ భూమిగా నమోదైన జిరాయితీ భూములను వేరు చేయాలని కోరుతూ గొలుగొండ మండలం చీడిగుమ్మలకు చెందిన జోగారావు, కోటవురట్లకు చెందిన అర్జున, రోలుగుంటకు చెందిన ఆదిలక్ష్మి తదితరులు విన్నవించారు. సమగ్ర విచారణ చేపట్టాలని ఏవో సుధాకర్ ఆయా మండలాల తహసీల్దార్లకు సూచించారు.

అర్జీ పరిశీలిస్తున్న సబ్ కలెక్టరేట్ ఏవో సుధాకర్, తహసీల్దారు రామారావు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

చీడికాడ, బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే : మండలంలోని తురువోలులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎలుసూరి ఘాటీలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెండాను ఆవిష్కరించిన అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ★ చిట్టియ్యపాలెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచిపెట్టారు.

మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గొలుగొండ మండలంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేసి మిఠాయిలు పంచారు. కృష్ణదేవిపేట, కొత్తమల్లంపేట, చీడిగుమ్మల గ్రామాల్లో ర్యాలీ చేశారు. ఎంపీపీ మణికుమారి, సత్యనారాయణ, రాజుబాబు, శివసత్యనారాయణ, రమేష్, అప్పారావు, సూరిఅప్పారావు పాల్గొన్నారు.

(c) eenadu

తెరపై ఈనాడు

పెందుర్తి, న్యూస్‌టుడే

లక్ష్మీకాంత్ స్క్రీన్-1- జూరాసిక్ వరల్డ్ (మార్నింగ్, ఫస్ట్ షో), కన్నప్ప (మ్యాట్నీ, సెకండ్ షో) స్క్రీన్-2 - తమ్ముడు

కృష్ణమయ్య సంకీర్తనల జయంతి

సింహాచలం, న్యూస్‌టుడే: తొలి తెలుగు వచన సంకీర్తనా పితామహుడు శ్రీకాంత కృష్ణమాచార్యులు సింహాద్రినాథుడిపై రాసిన వచన సంకీర్తనల జయంతి సోమవారం అప్పన్న ఆలయంలో ఘనంగా జరిగింది. ఆలయ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యుల నేతృత్వంలో అర్చకులు ఆలయ బేడామండపంలోని కృష్ణమయ్య విగ్రహం వద్ద విశేష పూజలు, ఆరాధనలు నిర్వహించారు. కృష్ణమయ్య వచన సంకీర్తనలను గానం చేశారు.

పెందుర్తి

పెందుర్తి ఎమ్మెల్యేతో 'ఈనాడు-ఫోన్‌ఇన్' రేపు

తేదీ: 09-07-2025 (బుధవారం)
సమయం: ఉదయం 9.00 నుంచి 10.00 గంటల వరకు
ఫోన్ నెంబర్: 93472 79909

పెందుర్తి నియోజకవర్గంలో వివిధ ప్రజా సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలు, అర్హులకు అందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు... తదితర అంశాలను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఇందుకు 'ఈనాడు' అవకాశం కల్పిస్తోంది. మీరు ఫోన్ చేసి వివరిస్తే ఎమ్మెల్యే తగు సమాధానం ఇస్తారు. -న్యూస్‌టుడే, వేపగుంట

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: శ్రీసాయిమాధవనగర్ సెక్టార్-1లో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. -త్రినాథరావు, శ్రీసాయిమాధవనగర్. ✓: వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. -హరిబాబుదార్, వీధిదీపాల నిర్వాహకాధికారి

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం పెదయాతపాలెం కొత్తరోడ్డు సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. -స్థానికులు, పెదయాతపాలెం. ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -చైతన్య, ఈవోపీఆర్డీ, సబ్బవరం.

?: సబ్బవరం జోడుగుళ్ల వినాయక మందిరం దగ్గరలో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద అధికంగా ఉంది. -కె.శ్రీత బాబు, సబ్బవరం. ✓: పరిశీలించి వ్యర్థాల తరలింపునకు చర్యలు తీసుకుంటాం. - వై. రామేశ్వరరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

వ్యవసాయ ల్యాబ్ సేవలు అందేదెప్పుడో..!

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరంలో నిర్మించిన జిల్లా వ్యవసాయ ల్యాబ్ సేవలు ఈ ఏడాదైనా రైతులకు అందుబాటులోకి వస్తాయా అని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఏడాది కిందట సుమారు రూ.కోట్లతో దీన్ని నిర్మించారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు అందుబాటులోకి వస్తుందని గతంలో వ్యవసాయాధికారులు ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదు.

★ ఇవి అందుబాటులోకి వస్తే రైతులు వినియోగించే ఎరువుల నాణ్యతను ఇక్కడ పరిశీలిస్తారు. దీనివల్ల నకిలీ ఎరువులు వినియోగించి రైతులు నష్టపోయే ప్రమాదం ఉండదు. ముందుగా విత్తన పరీక్ష చేయించడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుంది. మార్కెట్లోకి వచ్చే వివిధ రకాల విత్తనాల ప్రకటనలు చూసి మోసపోరు. క్రిమిసంహారక మందుల విషయంలోనూ రైతులకు మేలు జరుగుతుంది.

సబ్బవరంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవనం

★ సాధారణంగా ఏ జిల్లాకు చెందిన విత్తనాలను ఆ జిల్లా వ్యవసాయ ల్యాబ్‌లో పరీక్షలు చేయడం వల్ల కొన్ని విత్తన సంస్థలు స్థానిక అధికారులను ప్రలోభాలకు గురిచేసి అనుకూల ప్రచారం పొందే అవకాశం ఉంది. దీనివల్ల రైతులు వినియోగించే విత్తనాల వల్ల నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. ఇలాంటివి జరగకుండా ఉండేందుకు ఒక వ్యవసాయ కేంద్రం నుంచి వేరొక కేంద్రానికి నమూనాలు పంపి పరీక్షలు చేయిస్తుంటారు. ముందుగా ఒక సంస్థ విత్తనం రిలీజ్ చేసేటపుడు వాటిని సంబంధిత డిపోల నుంచి వ్యవసాయాధికారులు సేకరించి స్థానిక వ్యవసాయ ల్యాబ్‌కు పంపిస్తారు. అక్కడ ఒక్కో నమూనాకు ఒక్కో కోడ్ నంబరు ఇచ్చి ఇతర జిల్లాలకు వాటిని తరలిస్తారు. అక్కడ వాటికి డీ-కోడింగ్ చేసి నాణ్యత పరీక్షలు చేపడతారు. దీని వల్ల ఆ నమూనాలు ఏ కంపెనీవో తెలిసే అవకాశం లేనందున ఆ ప్రక్రియ పారదర్శకంగా జరిగి నాణ్యంగా లేని వాటిని తిరస్కరిస్తారు. దీనివల్ల రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా దీన్ని ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలి

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు తదితరులు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. సోమవారం పెందుర్తి సీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఛైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి, జీవీఎంసీ జోనల్ కమిషనర్, ఎంపీడీవోలతో కలిపి ఏడుగురు సభ్యులుగా ఉంటారు. ఇందులో భాగంగా పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ దొర.. సభ్యులుగా నియమితులైన రాపర్తి శంకర్ ఆనంద్, బండారు వరుదనిదేవితో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులంతా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. వైద్యులు అవంతి, అరుణ, హెడ్ నర్సు లిల్లీగ్రేస్, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యుక్త వయసు.. లక్ష్యాలకు పునాది

మాట్లాడుతున్న సీఐ సతీశ్‌కుమార్

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవితంలో యుక్త వయసు ఎంతో కీలకమైనదని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యుక్త వయసులో మంచి అలవాట్లు, క్రమశిక్షణతో జీవితంలో సాధించబోయే లక్ష్యాలకు పునాది వేసుకోవాలని సూచించారు. ఈవ్‌టీజింగ్ తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లలితకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● నేడు ఎమ్మెల్యే పర్యటన

సబ్బవరం, న్యూస్‌టుడే: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మంగళవారం ఉదయం 10 గంటలకు సబ్బవరం మండలంలోని ఆరిపాక శివారు వినయాతపాలెం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరవుతారని ఎంపీడీవో పి.పద్మజ, మండల జనసేన అధ్యక్షుడు కర్రి రవి కరాజు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ కార్యక్రమానికి అంతా హాజరు కావాలని కోరారు.

● మందుబాబులకు జరిమానా

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి న్యాయస్థానం జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరావు తెలిపారు. సోమవారం ఏడుగురిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అందరికీ కలిపి రూ.70 వేలు జరిమానా విధించినట్లు వివరించారు.

● భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించరూ..

సబ్బవరం, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఈ నెల 9వ తేదీన జరగనున్న అఖిల భారత కార్మిక సంఘాల సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులంతా పాల్గొంటారని తెలియజేస్తూ సబ్బవరం ఎంఈవో రవీంద్రబాబుకు సోమవారం పలువురు ఆ సంఘ నాయకులు విన్నవించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

ఓటరు జాబితాల నిర్వహణపై శిక్షణ

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవెల్ అధికారులకు ఓటరు జాబితాల నిర్వహణపై సోమవారం నుంచి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. నియోజకవర్గ పరిధిలోని 299 మంది బీఎల్వోలకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్నికల విభాగం డీటీ అర్జునరావు తెలిపారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన ఈ శిబిరంలో తొలిరోజు 50 మంది బీఎల్వోలకు యాప్ వినియోగం, మార్పులు, చేర్పులు, తొలగింపుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారు.

బీఎల్వోలకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్

● వినతుల స్వీకరణ

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సోమవారం జరిగింది. జడ్సీ హేమవతి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెందుర్తి వీఎంఆర్డీఏ లేఅవుట్‌లో భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, ఎన్టీఆర్ భరోసా పింఛను ఇప్పించాలని, సింహాచలం ప్రాంతంలో టీడీఆర్‌లు ఇవ్వాలని, లక్ష్మీపురం ప్రాంతంలో వీధిదీపాల సమస్య పరిష్కరించాలని, అడివివరం, దొగ్గవానిపాలెం ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

● దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

పరవాడ, న్యూస్‌టుడే: లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9వ తేదీన కార్మికులు చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం లంకెలపాలెం తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

● నకిలీ మద్యంపై విచారణ చేపట్టాలంటూ వినతి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ కేంద్రంగా కలకలం రేపిన నకిలీ మద్యం తయారీ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పరవాడకు చెందిన పలువురు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పరవాడలోని కొందరు ముఠాగా ఏర్పడి నకిలీ మద్యం తయారు చేసి బెల్టు షాపులకు సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసును సీఐడీ విభాగాధికారులతో పక్కాగా దర్యాప్తు చేయించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్రి చంద్రశేఖర్, రాజులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు మెరైన్ పోలీసులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సింహాచలం నృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే గిరి ప్రదక్షిణకు రుషికొండలోని మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన 20 మంది పోలీసులు, స్థానిక బీచ్ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న గజ ఈతగాళ్లు 17 మంది జీవీఎంసీ లైఫ్‌గార్డులతో జిల్లా ప్రభుత్వ యంత్రాంగం నియమించింది. సంబంధిత సముద్ర తీరంలో వీరు ఈ నెల 9, 10 తేదీల్లో గిరి ప్రదక్షిణ భక్తులకు సేవలందిస్తారు.

జీవీఎంసీ కమిషనర్‌కు వినతి

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం గుల్లలపాలెం ఎఫ్ఆర్‌యూను ప్రైవేట్ సంస్థకు ఇవ్వకుండా నిలిపివేసి తక్షణం జీవీఎంసీ అధీనంలోనే నడిపేలా చర్యలు తీసుకోవాలని సోమవారం గ్రీవెన్స్‌లో కమిషనర్ కేతన్‌గార్గ్‌కు 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ అధీనంలో వైద్య సేవలు సక్రమంగా ఉన్నాయని, ఉచితంగానే మందులు పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. రెండేళ్ల కిందట ప్రభుత్వం ఎఫ్ఆర్‌యూకి రూ.70 లక్షలతో అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు. ప్రైవేటుకు అప్పగిస్తే నిరాహార దీక్షకు కూర్చుంటానన్నారు.

ఘనంగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: నరవ ఎల్‌జీనగర్‌లో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. అంబేడ్కర్ విగ్రహానికి ఎంఆర్‌పీఎస్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎల్‌జీనగర్ నివాసుల సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ముప్పిడి వినయ్‌కుమార్, కార్యదర్శి శ్యామ్ సుందరమ్, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం సాయినగర్ కాలనీలోనూ మండల ఎమ్మార్పీఎస్ కన్వీనర్ బొర్రా జయరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు దండోరా జెండాను ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దండోరా ఉద్యమంలో విశేష సేవలు అందించిన నాయకులు సన్యాసి, అప్పారావు, శాంతమ్మలను ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ సభ్యులు, కూటమి నాయకులు

సింహాద్రి ఎన్టీపీసీ సీవాటర్ పైపులైన్‌కు లీకులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం తిక్కవానిపాలెం తీరం నుంచి సింహాద్రి ఎన్టీపీసీకి వేసిన సీవాటర్ పైపులైన్‌కు లీకులు ఏర్పడ్డాయి. ప్లాంటులోని విద్యుదుత్పత్తి తయారీలో భాగంగా కూలింగ్ టవర్లకు సముద్ర నీటి అవసరాల నిమిత్తం ప్లాంటు ప్రారంభ సమయంలో తిక్కవానిపాలెం తీరం నుంచి ఎన్టీపీసీ ప్లాంటు వరకు భారీ సీవాటర్ పైపులైన్ నిర్మించారు. దేవాడ ఉప్పుగల్లీల సమీపంలో ఈ పైపులైన్ దెబ్బతిని సముద్రపు నీరు పెద్దగా కొండచరియ ఉప్పుటేరులోకి ప్రవహిస్తుండగా మరికొంత రోడ్డుపైకి వస్తుండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి మరో 50 మీటర్ల దూరంలో పైపులైన్ వాల్వ్ నుంచి కూడా పెద్దఎత్తున లీకవుతోంది. సంబంధిత అధికారులు వెంటనే తగిన మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దేవాడ ఉప్పుగల్లీల సమీపంలో ఇలా..

గిరి ప్రదక్షిణ భక్తులకు సౌకర్యాలు కల్పించండి

బీఆర్‌టీఎస్ రహదారిని పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు

అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సింహగిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. వీరిద్దరూ సోమవారం రాత్రి వేర్వేరుగా గిరి ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తాగునీరు, మరుగుదొడ్లు ఎక్కువ ప్రాంతంలో అందుబాటులో ఉంచాలన్నారు. నడవడానికి అనుకూలంగా రహదారులను తీర్చిదిద్దాలన్నారు. బీచ్‌లో స్నానం చేసే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు అనుకూలంగా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. విద్యుత్తు దీపాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేసి, భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, పి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

రూ.3.53 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక 75వ వార్డులో రూ.3.53 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఉక్కు నిర్వాసిత కాలనీల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తామన్నారు. వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అధ్యక్షత వహించి వార్డులో సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, తెదేపా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు శ్రీముసిరి శ్రీను, సోమునాయుడు, అప్పారావు, పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎంవీపీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవాల్తేరు గాంధీ సెంటర్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున అనధికారికంగా మద్యం సీసాలను తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎంవీపీ ఎస్.ఐ. శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు, సిబ్బంది దాడులు చేశారు. ఓ వ్యక్తి వద్ద రెండు సంచుల్లో ఉన్న 33 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పెదవాల్తేరు చేపలబజారు ప్రాంతానికి చెందిన బోర సతీష్‌రెడ్డి (26)ని అరెస్టు చేశారు. మద్యం సీసాలను కొనుగోలు చేసి అనధికారికంగా అధిక ధరలకు విక్రయిస్తున్నాడని సీఐ తెలిపారు.

సీనియర్ జల నాణ్యత విశ్లేషకుడి బదిలీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలలోని సీనియర్ జల నాణ్యత విశ్లేషకులు వై.ఎస్.శివరామకృష్ణ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో విజయవాడకు బదిలీ అయ్యారు. గత ఐదు సంవత్సరాలుగా ఆయన ఇక్కడ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన్ను కార్యాలయ సిబ్బంది సత్కరించారు. మాధవరావు, గౌరీశ్వరరావు, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రభుత్వ హైస్కూలు విద్యార్థులకు సోమవారం రోడ్డు భద్రతపై సబ్బవరం సీఐ ఆర్.రామచంద్రరావు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే శిక్షార్హులవుతారన్నారు. సబ్బవరం జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

త్వరలో టీడీఆర్, పంచగ్రామాల సమస్యకు పరిష్కారం

అడివివరం, న్యూస్‌టుడే: ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం అధ్యక్షతన సోమవారం అడివివరంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. త్వరలోనే టీడీఆర్‌ల సమస్య, పంచగ్రామాల భూసమస్య పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. టీడీఆర్‌ల జారీపై ప్రభుత్వం వేసిన అయిదుగురు సభ్యుల కమిటీ నివేదిక రాగానే టీడీఆర్‌లు జారీ అవుతాయన్నారు. పంచగ్రామాల సమస్య పరిష్కారంలో భాగంగా తొలుత నిర్మాణాల క్రమబద్ధీకరణ జరుగుతుందన్నారు. దశల వారీగా ఖాళీ స్థలాలు, రైతుల భూములు, గ్రామ కంఠం స్థలాల సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. తొలుత ఆయన కాపుదిబ్బ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో 98వ వార్డు తెదేపా అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నాయకులు గుసిడి శంకర్రావు, లండ శ్రీను, రౌతు రాంబాబు, బున్ని, అవినాశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

కాపుదిబ్బలో ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

జంగాలపాలెంలో ఇంటింటికీ తెదేపా

జంగాలపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం పెందుర్తి మండలం జంగాలపాలెంలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం జరిగింది. సర్పంచి గొరపల్లి నరసింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో సాధించిన లక్ష్యాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు రెడ్డి నారాయణరావు, గొరపల్లి వెంకటరమణ, నగేశ్, అజయ్, అధిక సంఖ్యలో కార్యకర్తలు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న నాయకులు

కూటమితోనే సుపరిపాలన

పిట్టవానిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వవార్డు పరిధి పిట్టవానిపాలెంలో సోమవారం వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు ఈర్ల సోమునాయుడు, నూకరెడ్డి, పైడిరెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం పెదనాయుడుపాలెంలోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు. పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలన కరపత్రాలను అందించారు. అంతకు ముందు గ్రామంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో సాయినాథరావు, గండి దేముడు, రెడ్డి దేముడు, పోతల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబ్జీ విలేకరులతో మాట్లాడుతూ వైకాపా చేస్తున్న దుష్ప్రచారాన్ని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని, వాస్తవాలు ప్రజలకు వివరించాలని సూచించారు.

సింధియా, న్యూస్‌టుడే: నిరుద్యోగిత తగ్గించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళాలు నిర్వహించడానికి ప్రత్యేక కార్యాచరణకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. సోమవారం సాయంత్రం 59వ వార్డులో జరిగిన 'సుపరిపాలనలో-తొలిఅడుగు' పేరిట పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓపిక పడితే హామీలన్నీ సకాలంలో పూర్తి కాగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షులు నక్క లక్ష్మణరావు, వార్డు అధ్యక్షులు ఉరుకూటి హరి, ప్రధాన కార్యదర్శి మితిరెడ్డి శంకర్, క్లస్టర్ ప్రతినిధి డొంకాన రాంబాబు, కూటమి నాయకులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

పెదనాయుడుపాలెంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న గండి బాబ్జీ, నాయకులు, కార్యకర్తలు

యువతకు ఉచిత శిక్షణ

సింధియా, న్యూస్‌టుడే: విశాఖపట్నం పోర్టు అథారిటీ సహకారంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సోమవారం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్‌బిల్డింగ్ (సెమ్స్) సీవోవో కమాండర్ (రిటైర్డ్) గోపీకృష్ణ శివ్వం తెలిపారు. ఇరవై ఏడేళ్ల వయసులోపు పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైన అభ్యర్థులంతా ఈ ఉచిత కోర్సు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. రెండు నెలలపాటు ఉచిత వసతితో శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తిగల యువతీ యువకులు ఈనెల 11లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 86884 11100, 77948 40934, 0891-2704010 నంబర్లలో లేదా సింధియా సమీప సెమ్స్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అనధికార వసూళ్లపై ఫిర్యాదుల వెల్లువ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రేషను డిపోల డీలర్ల నుంచి పౌర సరఫరాల శాఖ సిబ్బంది అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారంటూ సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ సరకుల పంపిణీలో మార్పులు చేసింది. గతంలో ఉన్న ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి గత నెల నుంచి డిపోల వద్దే సరకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 610 రేషను డిపోల ద్వారా నిత్యావసరాలు అందజేస్తున్నారు. ప్రస్తుతం జులై నెలకు సంబంధించి పంపిణీ చురుగ్గా సాగుతోంది. ఈ నేపథ్యంలో పంపిణీని పర్యవేక్షించాల్సిన ఉద్యోగులు డీలర్ల నుంచి అనధికారికంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నారు. ఒక్కో రేషను కార్డుకు రూ.3ల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక్కో దుకాణం పరిధిలో సుమారు 800 నుంచి 1500 వరకు కార్డులుంటాయి. దీనిప్రకారం నెలకు రూ.2400 నుంచి రూ.4500 వరకు ఇవ్వాలని లేకుంటే తనిఖీల పేరుతో కేసులు రాస్తామని డీలర్లను హెచ్చరిస్తున్నట్లు సమాచారం. పాతనగరంలోని డిపోలతో పాటు కంచరపాలెం, గాజువాక, మధురవాడ, గోపాలపట్నం, రైల్వే న్యూకాలనీ తదితర ప్రాంతాల్లో ఈ బెదిరింపులు అధికంగా ఉన్నాయని చెబుతున్నారు. కారుణ్య నియామకాల కింద వచ్చిన కొంతమంది డీలర్ల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వయం సహాయక బృందాల పేరుతో పలు డిపోలను బినామీగా నడుపుతున్న ఒక ఉద్యోగి వసూళ్ల వెనుక చక్రం తిప్పుతున్నారని, అనధికారికంగా వసూలు చేసిన ఈ మొత్తాన్ని సహాయ సరఫరా అధికారులకు ఇస్తున్నారని చెబుతున్నారు. పూర్తిస్థాయిలో ఆయా అంశాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీలర్లు అధికారులను కోరుతున్నారు.

ఎఫ్ఆర్‌యూని ప్రభుత్వమే నడపాలి

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం 60వ వార్డు గుల్లలపాలెంలో ఎఫ్ఆర్‌యూ (ఫస్ట్ రిఫరల్ యూనిట్)ని ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు డిమాండు చేశారు. సోమవారం ఆసుపత్రి వద్ద సీపీఎం, సిటూలు చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏడు వార్డుల్లో కొండవాలు ప్రాంత రోగులందరికీ ఏకైక ప్రభుత్వ ఆసుపత్రిగా ఉందని స్పష్టం చేశారు. కోరమాండల్ లాంటి సంస్థకు ఇచ్చే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, సీపీఎం, సిటూ నాయకులు, ఐద్వా మహిళలు పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం, సిటూ నాయకులు, కార్యకర్తలు

జలవనరుల ఏఈఈల సంఘం ఎన్నిక

అధ్యక్షుడు విజయ్ కుమార్

ప్రధానకార్యదర్శి ఆర్.విజయ్ కుమార్

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ (ఏఈఈ) అధికారుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సంబంధిత కార్యాలయంలో సోమవారం జరిగింది. జిల్లా శాఖ నూతన అధ్యక్షునిగా బాడాన విజయ్‌కుమార్ (విశాఖ), ప్రధాన కార్యదర్శిగా రఘుపతుల విజయ్‌కుమార్ (భీమిలి), అసోసియేట్ అధ్యక్షునిగా కోరాడ పైడినాయుడు (క్యూసీ), ఉపాధ్యక్షులుగా ఆకుల ప్రకాశ్ (చోడవరం), మలయాల శ్రీరామ కపిల్ (ఎస్‌ఎంఐ), కోశాధికారిగా నివగాని రావు (విశాఖ), సహాయ కార్యదర్శులుగా ముడికి రాంజీ, ఎ.రాజేశ్, అక్తరి భాను అమీనా, వీవీకే సాయిలక్ష్మి ఎన్నికయ్యారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారులంతా ఈ ఎన్నికలకు హాజరయ్యారు. కార్యక్రమంలో జలవనరులశాఖ విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలు పోలవరం ప్రాజెక్టు అసిస్టెంట్ కార్యనిర్వాహక ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పరవాడ, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ ఉదయ నాగశ్రీ, ప్రిన్సిపల్ సీతాలక్ష్మి అన్నారు. పాఠశాలలో అధునాతన ప్రమాణాలతో తీర్చిదిద్దిన పికెల్‌బాల్ క్రీడకు చెందిన నాలుగు కోర్టులను సోమవారం వీరు ప్రారంభించారు. విద్యార్థులంతా పికెల్‌బాల్ కోర్టులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో నిశాంత్, కోచ్‌లు పాల్గొన్నారు.

పికెల్‌బాల్ కోర్టులను ప్రారంభిస్తున్న పాఠశాల డైరెక్టర్ ఉదయ నాగశ్రీ

పండగ వాతావరణంలో మెగా పీటీఎం

మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి సరోజిని

పరవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో ఈనెల 10వ తేదీన ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న మెగా పీటీఎం-2 (పేరెంట్స్ టీచర్స్ మీటింగ్)ని పండగ వాతావరణంలో నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారిణి సరోజిని పేర్కొన్నారు. పరవాడ మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో పీటీఎం-2పై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాలల్లో పక్కాగా నిర్వహించాలన్నారు. ఎంపీడీవో రమేశ్‌నాయుడు, ఎంఈవోలు దివాకర్‌రావు, సాయిశైలజ, ఈవోపీఆర్డీ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

బత్తలపల్లి కూడలిలో భక్తజన సందోహం నడుమ భేటీ అవుతున్న పీర్లు

బత్తలపల్లిలో పీర్లు భేటీ

బత్తలపల్లి, న్యూస్‌టుడే: బత్తలపల్లి కూడలిలో సోమవారం ఉదయం వేలాది మంది భక్తుల నడుమ వివిధ గ్రామాల నుంచి వచ్చిన పీర్లు ఖాశీం స్వామితో భేటీ అయ్యాయి. ఏటా మొహర్రం సందర్భంగా పీర్లు ఇక్కడ భేటీ కావడం ఆనవాయితీ. తెల్లవారుజామున ఖాశీంస్వామి పీరును ఊరేగింపుగా కూడలి వద్దకు తీసుకొచ్చారు. ఆతర్వాత గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి, మలకాపురం, రాఘంపల్లి, ముష్టూరు గ్రామాల పీర్లు కూడలికి చేరుకొని ఖాశీంస్వామితో భేటీ అయ్యాయి. పీర్లను చూసేందుకు తరలివచ్చిన భక్తులతో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం పీర్లను ఊరేగింపుగా చావిళ్లకు తరలించారు. అక్కడ ముజావర్లు ప్రార్థనలు చేసి చక్కెర, బెల్లం చదివింపులు చేశారు. సాయంత్రం పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించి, జలధికి తరలించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ధర్మవరం గ్రామీణ సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఖరీఫ్ సాగుపై సందేహాలా?

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై.. 35 రోజులు గడిచిపోయింది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి అనంత జిల్లాలో వర్షాధారం కింద సాగు లక్ష్యం 16,12,991 ఎకరాలు. ఇప్పటి వరకు 47 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు మాత్రమే సాగయ్యాయి. వర్షం వస్తే ఏయే పంటలు వేసుకోవచ్చు? ప్రధాన పంట వేరుసెనగ ఈనెల (జులై)లో కూడా సాగుకు అనుకూలమా? ఆ తర్వాత ఏ పంటలు వేసుకోవాలి? విత్తన మోతాదు, ఎరువుల వినియోగం.. తదితర అంశాలపై సందేహాల నివృత్తి కోసం 'ఈనాడు' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిచనుంది. జిల్లా వ్యవసాధికారిణితోపాటు శాస్త్రవేత్తలతో ఫోన్లో నేరుగా మాట్లాడే అవకాశం కల్పిస్తోంది. ఫోన్ చేయండి.. సూచనలు, సలహాలు పొందండి.

ఈనాడు మీ తోడు

సలహాలు, సూచనలు ఇచ్చేవారు: అనంత జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మతోపాటు రెడ్డిపల్లి, కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రాల సమన్వయకర్తలు డాక్టర్ సాధినేని మల్లీశ్వరి, డాక్టర్ ఇ.చంద్రాయుడు, రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి.

ఫోన్ చేయాల్సిన తేదీ : 09-07-2025 (బుధవారం)
సమయం : ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు
నంబర్లు : 99896 23825, 83310 57714

జేఎన్‌టీయూలో ఈఏపీసెట్ సహాయ కేంద్రం

జేఎన్‌టీయూ : ఇంజినీరింగ్, ఔషధ, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఆరంభమైంది. ఇందులో భాగంగా జేఎన్‌టీయూలో ఈఏపీసెట్ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య ఆదేశాల మేరకు అడ్మిషన్స్ డైరెక్టర్ సురేష్‌బాబు.. వర్సిటీలోని ఏపీజే అబ్దుల్ కలాం భవనంలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

కడుపు 'కోత'కే మొగ్గు!

కాన్పుల్లో కాసుల కోసం కక్కుర్తి

రూ.వేలల్లోనే వసూలు

సిజేరియన్ అయ్యాక కోలుకునేందుకు కొంతకాలం పడుతుంది. ఒకవేళ కుట్లు వేసిన చోట ఇన్‌ఫెక్షన్ సోకితే మరింత సమయం పడుతుంది. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒక సిజేరియన్‌కు రూ.36 వేల నుంచి రూ.75 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ప్రభుత్వం ఇచ్చే మొత్తానికి అదనంగా వసూలు చేస్తూ.. బాధిత కుటుంబాలపై ఆర్థికభారం మోపుతున్నారన్న ఆరోపణలున్నాయి.

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: అనంత నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఈఏడాది ఆరంభం నుంచి మే వరకు 385 ప్రసవాలు జరగ్గా అందులో 229 సిజేరియన్లు చేశారు. మరో వైద్యశాలలో నమోదైన కాన్పులు 116 కాగా సిజేరియన్లు 102 చేయడం గమనార్హం. ఇలా జిల్లాలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్లకే అధిక ప్రాధాన్యం ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గర్భిణులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలతో పాటు, పౌష్టికాహారాన్ని అందజేస్తోంది. ఏఎన్‌ఎంలు, గర్భిణుల ఇంటి వద్దనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రసవ సమయంలో ఇబ్బంది పడకూడదని మెరుగైన సౌకర్యాలను సర్కారు కల్పిస్తోంది. దీన్ని బట్టి సాధారణ ప్రసవాలు పెరగాలి. ఇందుకు భిన్నంగా సిజేరియన్లు అధికమవుతుండటం గమనార్హం. కొందరు వైద్యులు కాసుల కోసం కక్కుర్తి పడి సాధారణ కాన్పు అయ్యే పరిస్థితి ఉన్నా చోట సిజేరియన్ చేస్తున్నారు. లేదంటే తల్లీ బిడ్డకు ప్రమాదం అంటూ ఆందోళనకు గురి చేస్తూ ఒప్పిస్తున్నారు. 'ఎన్టీఆర్ వైద్య సేవ' కింద ఉన్న కొన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ ఈ తతంగం సాగుతోంది.

సమీక్షలకే పరిమితం

రాష్ట్రంలో సిజేరియన్లు అధికంగా జరుగుతున్న జిల్లాల్లో అనంతపురం మూడవ స్థానంలో ఉంది. ఇంత జరుగుతున్నా అధికారుల ప్రేక్షక పాత్ర వహిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నెలా సమీక్ష సమావేశాలతో సరిపెడుతున్నారు. క్షేత్రస్థాయిలో తరచూ తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

ఎలాంటప్పుడు చేయాలంటే..!

ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, నియంత్రించలేనంతగా బీపీ వచ్చినప్పుడు, కడుపులో బిడ్డ అడ్డం తిరిగినప్పుడు, బిడ్డకు గుండె సమస్య.. తల్లీబిడ్డల ప్రాణాపాయం కలుగుతుందను సందర్భాల్లో సిజేరియన్ చేయవచ్చని గైనకాలజీ విభాగం నిపుణులు చెబుతున్నారు.

అనంత జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాల తీరు (ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు)

ఆసుపత్రులు	మొత్తం ప్రసవాలు	సిజేరియన్లు
ప్రభుత్వ ప్రాంతీయ..	973	314
సామాజిక..	341	25
ప్రభుత్వ అనంత సర్వజన.	2,505	1,326
ప్రైవేటు..	6,821	3,015

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

- డాక్టర్ ఈ.బి.దేవి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి

కొన్ని ప్రతికూల ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు మాత్రమే సిజేరియన్ చేయాలి. అధిక సిజేరియన్లు చేసిన ఆసుపత్రుల యాజమాన్యాలకు నోటీసులు ఇస్తాం. ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో అదనంగా డబ్బులు డిమాండ్ చేశారని ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటాం.

అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీ, అధికారులు

గడువులోగా సమస్యల్ని పరిష్కరించండి

పామిడి, న్యూస్‌టుడే : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలకు అత్యంత ప్రాధాన్యమిచ్చి గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పామిడిలోని జగన్నాథ పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహాన్, డీఆర్వో మలోలా, తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ జిల్లా స్థాయి అధికారులు ప్రజల నుంచి 567 అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా ఇళ్ల స్థలాలు, రీసర్వేలో జరిగిన తప్పులు, భూసమస్యలు తదితర వాటిపై ప్రజలు అర్జీలు సమర్పించారు. పామిడిలోని కొత్తబస్టాండ్ అభివృద్ధి, రోడ్ల విస్తరణ చేపట్టాలని, అక్రమణలకు గురైన ప్రధాన కాలువలు, ప్రభుత్వ, రెవెన్యూ భూముల పరిరక్షణ, శాశ్వత ఆధార్ కేంద్రం తదితర అంశాలపై పలు ప్రజాసంఘాల, వామపక్ష పార్టీల నాయకులు అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పామిడి తహసీల్దార్ షర్మిల, ఎంపీడీవో తేజోత్స్న, గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు, వివిధ శాఖ అధికారులు, నియోజకవర్గ తహసీల్దారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

వడ్డీకిస్తారు..ఆనక నడ్డి విరుస్తారు!

శ్రుతి మించుతున్న వ్యాపారుల ఆగడాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు శ్రుతి మించుతున్నాయి. ఎంత కావాలంటే అంత డబ్బు ఇస్తారు. కాకపోతే వడ్డీ ఎక్కువ. అవసరం కదా అని తీసుకున్నారా చిక్కుల్లో పడినట్లే. నగరంలోని భవానీనగర్, రాణినగర్, టీవీటవర్, రామకృష్ణ కాలనీ, కళాకారుల కాలనీ, నాల్గో, ఐదో రోడ్డు... తదితర ప్రాంతాల్లో వ్యాపారుల దౌర్జన్యాలు అంతా ఇంతా కాదు. వసూళ్లకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతినెలా వడ్డీ ఇవ్వకపోతే గొడవలకు దిగుతారు. దాడులు చేయడానికి వెనుకాడరు. టవర్‌క్లాక్ వద్ద ఓ మహిళా వ్యాపారి రోజువారీ, వారం, నెల వడ్డీలకు అప్పు ఇస్తుంటుంది. వసూళ్లకు ఓ యువకుడ్ని నియమించుకుంది. వారి ఆగడాలపై ఎందరో బాధితులు ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదులు చేశారు.

వసూళ్లు ఇలా..

- వడ్డీ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి వారం, నెల వడ్డీ రూపంలో వసూలు చేస్తున్నారు. అవసరాన్ని బట్టి రూ.100కు రూ.5 నుంచి 10 వరకు వసూలు చేస్తున్నారు.
- రూ.10 వేలు అవసరమైతే రూ.వెయ్యి మినహాయించుకుని రూ.9 వేలు ఇస్తారు. వారం రోజుల్లో రూ.10 వేలు చెల్లించాలి. దీన్ని వారం వడ్డీ అంటారు. ఈ తరహా వ్యాపారం ధర్మవరం, అనంతపురం, గుంతకల్లులో అధికంగా సాగుతోంది.
- రూ.లక్ష అవసరమైన వారికి రూ.22 వేలు మినహాయించుకుని రూ.78 వేలు ఇస్తారు. రోజుకు వెయ్యి చొప్పున వంద రోజుల్లో లక్ష చెల్లించాలి.

ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకొని..

వ్యాపారులు ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకుంటారు. ఒకరి ప్రాంతంలోకి మరొకరు వెళ్లరు. అప్పట్లో కాల్‌మనీ కేసులు నమోదు కావడంతో వడ్డీ వ్యాపారులు కాస్త తగ్గారు. సమయానికి వడ్డీ చెల్లించలేదో నరకం చూపిస్తారు. కిరాయి మనుషులతో దాడులు చేయిస్తారు. బాధితులు కొందరు వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. చక్రవడ్డీల పేరుతో ఆస్తులు రాయించుకుంటున్న సందర్భాలూ ఉన్నాయి.

వడ్డీ చెల్లించలేదని దాడి

అనంత నగరంలో వడ్డీ చెల్లించలేదని ఓ వ్యక్తిపై దాడి జరిగింది. ఒకటో పట్టణ ఇన్‌ఛార్జి సీఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. పాతూరులోని ఉమానగర్‌కు చెందిన బాబ్‌జాన్ బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. ఐదేళ్ల కిందట భవానీనగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారి తిరుపాలు వద్ద రూ.10 వడ్డీతో రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. కొంతకాలం వడ్డీ చెల్లించిన బాధితుడు.. తర్వాత చెల్లించలేదు. సోమవారం దుకాణం వద్ద ఉన్న బాబ్‌జాన్‌తో వడ్డీవ్యాపారి కుమారుడు సూరి, అతని అనుచరులు సోము, అంజి, హసేన్‌వలి వాగ్వాదానికి దిగారు. వారిలో ఒకడు బాబ్‌జాన్‌పై చేయి చేసుకున్నాడు. అంతటితో ఆగకుండా రోడ్డుపైకి ఈడ్చుకెళ్లి.. కాళ్లు, చేతులతో దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

వీఆర్‌ఓలకు బదిలీ ఉత్తర్వులు

జిల్లా సచివాలయం : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 248 మంది గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులకు (వీఆర్‌ఓ) బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం ఉత్తర్వులను నిర్దేశిత ఉద్యోగులకు పంపించారు. గత నెల 29న అనంత రెవెన్యూ భవన్‌లో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. తీవ్ర తర్జనభర్జన తర్వాత ఉమ్మడి జాబితా ప్రకారం ఉత్తర్వులు వెలువరించారు. ఆ 248 మందిలో అనంత జిల్లా పరిధిలో 150 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 98 మంది ప్రకారం ఉన్నారు. రెండు జిల్లాల పరిధిలో అటుఇటు నలుగురు బదిలీ అయ్యారు. ప్రాధాన్యత కేటగిరీలతో నిమిత్తం లేకుండా అనంత నగరంలో పని చేస్తున్న కొందరు వీఆర్‌ఓలకు మళ్లీ ఇక్కడే పోస్టింగ్ రావడం విశేషం. ఇదే తరహాలో కీలక పట్టణాల్లోనూ చోటు చేసుకుంది.

పీటీఎం సాక్షులుగా సచివాలయ ఉద్యోగులు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఈనెల 10న ప్రతిష్ఠాత్మకంగా జరిగే మెగా పీటీఎం సమావేశాలకు సంబంధించి ప్రపంచ రికార్డు నమోదు కోసం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులే సాక్షులుగా ఉంటారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉండకూడదు. ప్రతి సమావేశంలో కనీసం 30 సెకన్ల వీడియో, రెండు ఫొటోలు నిర్దేశిత లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి' అని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన అన్ని శాఖల అధికారులతో దృశ్యసమీక్ష జరిపారు. జిల్లా వ్యాప్తంగా 2,420 పాఠశాలల్లో సాక్షులను నమోదు చేయాల్సి ఉండగా.. 1,616 చేశారు. హెచ్‌ఎం, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు చొరవ తీసుకోవాలన్నారు. మొక్కలు నాటే ప్రక్రియకు సంబంధించి 2,306 పాఠశాలల్లో 1,358 మాత్రమే రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు.

B.Tech., and Ag.B.Sc., SPOT ADMISSION
కేవలం 6,7,8,9,10 లక్షల ఖర్చుతో నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ / అగ్రికల్చర్ బీఎస్సీ (కాలేజ్ ఫీజు + హాస్టల్ ఫీజుతో కలిపి) ఎటువంటి షూరిటీ లేకుండా విద్యార్థికి 70 నుంచి 80% లోన్ సౌకర్యం కల్పించబడును. వివరాలకు సంప్రదించండి :
9602555500, 9160220527

ఆస్పత్రిలో తాగునీటికి కటకట

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: రాయదుర్గం ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ప్రతిరోజూ సుమారు 500 నుంచి 600 మంది వరకు రోగులు, వారితోపాటు బంధువులు ఆస్పత్రికి వస్తుంటారు. స్థానికంగా తాగునీటి వసతి లేకపోవడంతో లీటర్‌కు రూ.20 చెల్లించి బయట కొనుక్కోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఆస్పత్రిలో ఉన్న శుద్ధ జల యంత్రం మూడేళ్ల కిందట మరమ్మతుకు గురైనా పట్టించుకునే వారే కరవయ్యారు. ఏడాది కిందట మున్సిపల్ కుళాయి నీటిని సింటెక్ ట్యాంకులోకి పంపే ఏర్పాట్లు చేసినా.. ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రాంతంలోనే నిర్మిస్తున్న జనరిక్ మెడికల్ దుకాణానికి సింటెక్ ట్యాంకు అడ్డుగా ఉందని నెల రోజుల కిందట తొలగించి... మళ్లీ కనెక్షన్ ఇవ్వడం మరిచారు. దీంతో ఆస్పత్రిలో తాగునీటి ఇబ్బందులు ఎప్పటిలాగే ఉన్నాయి. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఆసుపత్రి పరిపాలనాధికారి మహబూబ్ బాషాను వివరణ కోరగా ... రెండు రోజుల్లోగా ట్యాంకుకు నీటి కనెక్షన్ ఇప్పిస్తామని, దాతల సాయంతో ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శుద్ధజల యంత్రానికి ముసుగు వేశారిలా..

శ్రావణమాసం.. స్వగృహ యోగం

అనంతలో 9,711 ఇళ్ల ప్రారంభానికి సన్నాహాలు

కుందుర్పిలో ఇంటిని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ శైలజ

అనంతపురం(అశోక్‌నగర్), న్యూస్‌టుడే: శ్రావణమాసం పేదలకు సొంతింటి ప్రవేశానికి ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. లక్ష్యాలను చేరుకొని పేదలకు స్వగృహ యోగం కల్పించడానికి జిల్లా గృహ నిర్మాణ సంస్థ కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం ఆషాఢమాసం నడుస్తోంది. ఈనెల 25వ తేదీ నుంచి శ్రావణ మాసం ఉండటంతో ఎక్కువ మంది ఇళ్లలో చేరేందుకు ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పైకప్పు పూర్తయిన, పైకప్పు దశకు చేరిన ఇళ్లపై అధికారులు దృష్టిసారించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి కావడానికి చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఇసుకను ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నిలిచిపోయినా, వివిధ దశల్లో ఉన్న ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు అదనపు సాయం అందించడం విశేషం.

చొరవ చూపితేనే.. లక్ష్యానికి చేరువ

గత వైకాపా ప్రభుత్వం అప్పట్లో ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు నిర్దాక్షిణ్యంగా బిల్లులు ఆపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొన్ని నియోజకవర్గాల్లో వైకాపా హయాంలో మంజూరైన ఇళ్లకు బిల్లులు ఇవ్వకూడదన్న అభిప్రాయం వ్యక్తం అవుతుండటంతో ప్రజాప్రతినిధులు కొంత చొరవ చూపడం లేదు. ఇప్పటిదాకా నిర్ణయించిన లక్ష్యాల్లో సగం మాత్రమే పూర్తి కాగా శ్రావణ మాసంలో కొంత మేరకు పూర్తయితే 75 నుంచి 85 శాతం లక్ష్యానికి చేరువయ్యే అవకాశం ఉంటుంది.

నియోజకవర్గం	ఇళ్ల లక్ష్యం	పూర్తి
అనంతపురం	864	602
తాడిపత్రి	1,189	1,181
కళ్యాణదుర్గం	1,468	1,166
రాయదుర్గం	888	508
శింగనమల	1,056	533
గుంతకల్లు	1,625	680
ఉరవకొండ	1,718	254
రాప్తాడు	903	155
మొత్తం :	9,711	5,079

ధర్మబద్ధ జీవనానికి రామాయణం దిక్సూచి

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ధర్మబద్ధ జీవనానికి రామాయణం దిక్సూచి అని కన్యాకుమారి వివేకానంద కేంద్రం అఖిల భారత ఉపాధ్యక్షురాలు శ్రీమతి నివేదితాబిడే పేర్కొన్నారు. శ్రీసత్యసాయి సేవా సంస్థలు, శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సార్వత్రిక మానవ విలువలు అనే అంశంపై ఈనెల 8వ తేదీ వరకూ ప్రశాంతి నిలయంలో నాలుగు రోజుల వేసవి శిబిరంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం రామాయణ, మహాభారతాల్లోని ధర్మబద్ధ జీవనం గురించి, మానవ విలువల గురించి నివేదితాబిడే ప్రసంగించారు. అనంతరం లవకుశ వేషధారణలో విద్యార్థులు ఆలపించిన రామకథా గానం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. మంగళహారతి అందుకున్న తరువాత భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ప్రశాంతి నిలయంలో రామకథ గానాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు

తుక్కు అక్రమ రవాణా

రూ.లక్షల్లో జీఎస్‌టీ ఎగవేత

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ఈ-వేబిల్లు లేకుండా కొందరు డీలర్లు సరకులను అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అనంతపురం జిల్లాలో కొందరు డీలర్లు ఈ-వేబిల్లు లేకుండా తుక్కును రాత్రిపూట లారీల్లో కర్నూలు మీదుగా హైదరాబాదుకు రవాణా చేస్తున్నారు. తాజాగా గుత్తి సమీపంలో ఈ-వేబిల్లు లేకుండా తరలిస్తున్న 7 వేల కిలోల తుక్కు సామగ్రిని అధికారులు సీజ్ చేశారు. సంబంధిత డీలరుకు సుమారు రూ.3 లక్షలు అపరాధ రుసుం విధించారు. తుక్కు అక్రమ రవాణాదారులు అధికారుల ఆకస్మిక తనిఖీలకు చిక్కకుండా తప్పించుకోవడానికి లారీకి కొంత దూరంలో వెనుకవైపు, ముందు తమ అనుచరులతో కార్లలో గస్తీ తిరుగుతూ.. రవాణా చేస్తున్నారు.

తనిఖీల్లో విస్తుపోయే నిజాలు..

హిందూపురం డివిజన్‌లో కొందరు డీలర్లు పారిశ్రామిక వాడలో తుప్పు పట్టిన యంత్రాలు, ఇనుప సామగ్రిని కొనుగోలు చేసి ఈ-వేబిల్లు లేకుండానే బెంగళూరుకు తరలిస్తున్నారు. అక్కడ తుక్కును కరిగించి కావాల్సిన మందంతో ఇనుప కడ్డీలు తయారు చేయించి, వాటిని మళ్లీ హిందూపురంలో అమ్ముతున్నారు. కర్ణాటక నుంచి కొబ్బెర, వక్క, ఉత్తరాది రాష్ట్రాలకు ఈ-వేబిల్లు లేకుండానే తరలిపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో జరిపిన ఆకస్మిక తనిఖీల్లో వాణిజ్య పంటలు, గ్రానైట్, రెడీమేడ్ దుస్తులు, చీరలు, కర్టెన్లు, పాన్‌మసాలా, తుక్కు తదితర సరకులను ఈ-వేబిల్లు లేకుండా రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత వ్యాపారులకు రూ.30 లక్షలు అపరాధ రుసుం విధించారు. ఈ లెక్కన ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజుకు లక్ష రూపాయలు, సంవత్సరానికి సుమారు రూ.40 కోట్లు జీఎస్‌టీ ఎగ్గొడుతున్నారని అంచనా.

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి
మీ ఉన్నతికి శ్రమించిన, మీ కుటుంబ సభ్యుల/ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రకటనలు ప్రచురణ కొరకు
పూర్తి వివరములకు:
8008709784

CHIRANJEEVI REDDY
INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY FOR WOMEN
(All Courses approved by AICTE New Delhi.)
WE'RE HIRING
We're seeking talented and passionate women to join our faculty and staff. Send your resume and cover letter to careercritatp@gmail.com. This opportunity is open to women candidates only, as part of our commitment to creating a women-centric academic environment.
POSITIONS: Principal, Vice Principal, CSE (Asst. Prof.), ECE (Asst. Prof.), MBA (Assoc. Prof.), Physics, Chemistry, English, Librarian
Qualification and Salary as per AICTE Norms
Rachanapalli, Bellary Road, Anantapur - 515004
CONTACT: 9666886027 & 9666886029

GITAMW గౌతమి మహిళా ఇంజనీరింగ్ కాలేజి
COLLEGE CODE GTMW
సాయి నగర్, పెద్దశెట్టిపల్లి గ్రామం, ప్రొద్దుటూరు, వై.యస్.ఆర్. కడప జిల్లా.
సెల్: 9848349885, 9642076632, 9849570557.
WE ARE AUTONOMOUS

B.TECH
CSE & CSE (AI & ML)
ECE & EEE
DIPLOMA
DEEE DECE DCME
2025 - 26 ADMISSION OPEN
• 100% Campus Placements for Eligible Students.
• Girl's Hostel Available in Campus with All facilities.
• Bus Facility available
Chagalamarri, Jammalamadugu, Yerraguntla, RTPP & Muddanur
B++ NAAC
UGC AUTONOMOUS

కుళ్లాయిస్వామి గోవిందా..

● స్వామి అగ్నిగుండ ప్రవేశం ● ముగిసిన బ్రహ్మోత్సవాలు

నార్పల, న్యూస్‌టుడే : గూగూడు కుళ్లాయి స్వామి మొహర్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జలధి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన ఘట్టమైన కుళ్లాయిస్వామి పీర్ల అగ్నిగుండ ప్రవేశ దృశ్యాలు తిలకించడానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. సోమవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి పీర్లను గ్రామంలో ప్రదర్శనగా తీసుకెళ్లారు. దేవదేవుడు ప్రజల దగ్గరికే రావడంతో కుళ్లాయి స్వామి గోవిందా.. గోవిందా అంటూ భక్తులు చక్కెర చల్లుతూ మొక్కులు చెల్లించారు. కొందరు పొర్లుదండాలు పెడుతూ కోర్కెలు తీరాలని స్వామిని వేడుకున్నారు. ఉదయం 6 గంటలకంతా కుళ్లాయిస్వామి పీరుతో సహా మరో 20 పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేసి చావిడిలో కొలువుదీరాయి. మళ్లీ మధ్యాహ్నం 3 గంటలకు మరో సారి అగ్నిగుండ ప్రవేశం చేసి గ్రామంలోకి వెళ్లాయి. సాయంత్రం 6 గంటల సమయంలో కొర్లగుట్ట మీదుగా జలధికి వెళ్లడంతో గూగూడు బ్రహ్మోత్సవాలు ముగిశాయి. పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు బుధవారం సాయంత్రం 6 గంటలకు పీర్ల మకానంలో స్వామి చివరి దర్శనం ఉంటుందని అర్చకులు తెలిపారు.

జలధికి వెళ్తున్న పీర్ల సమూహం

అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న ప్రధాన పీరు

పొట్టేళ్ల పెంపకం.. లాభదాయకం

“ కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : కళ్యాణదుర్గం మండలం కురాకులతోటకు చెందిన నాగరాజు పొట్టేళ్ల పెంపకంతో లాభాలు గడిస్తున్నారు. తనకున్న రెండెకరాల్లో పంటలు సాగు చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. చివరకు పలువురు రైతుల నుంచి పొట్టేళ్లను కొనుగోలు చేసి వాటిని సంరక్షించుకుంటూ విక్రయాలు చేస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు. ”

★ సొంత వ్యవసాయ క్షేత్రంలో 2022లో షెడ్డు, దాణా గోదాంను రూ.20 లక్షలు ఖర్చుతో నిర్మించాడు. రైతుల వద్ద నుంచి ఒక్కో పొట్టేలు పిల్లను రూ. 7 వేల- రూ.12 వేల మధ్య కొనుగో చేశాడు. వీటి కోసం సుమారుగా రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. నెల నుంచి రెండు నెలలలోపు వాటిని విక్రయించారు. 30-40 కిలోల వరకు ఉన్న ఒక్కో పొట్టేలను రూ.15 వేల నుంచి రూ.16,500 వరకు విక్రయాలు జరుపుతున్నారు. 50 పొట్టేళ్ల విక్రయిస్తే రూ.1.80 లక్షల వరకు ఆదాయం వస్తోంది. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి ధరలు ఉంటున్నాయి. ఎక్కువ శాతం ధరలు నిలకడగానే ఉంటున్నాయి. ఒక్కో విడతలో 50 -250 పొట్టేళ్ల పిల్లలను కొనుగోలు చేసి 30-46 రోజుల్లో విక్రయిస్తున్నారు. ప్రతి శనివారం అనంతపురం, పావగడ మార్కెట్లో విక్రయాలు జరుపుతున్నారు. ఇలా ఏడాదికి సుమారుగా రూ.25 లక్షల వరకు ఆదాయాన్ని గడిస్తున్నారు.

జీవాలకు ప్రత్యేక ఆహారం

టీఎంఆర్ దాణా టన్ను రూ.18 వేలతో 30 టన్నులు కొనుగోలు చేసి గోదాంలో నిల్వ చేశారు. వీటికి తోడు గానుగ చెక్క కిలో రూ.26తో కొనుగోలు చేశారు. ఒకటిన్నర ఎకరాలో సొంత వ్యవసాయ తోటలోనే మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పంటను యంత్రంతో కత్తిరించి పొట్టేళ్లకు మేతగా వేస్తున్నారు.

షెడ్డులో ఉన్న పొట్టేళ్లు

నాగరాజు రైతు

ఒక్కో పొట్టేలుకు 250 గ్రాములు - 500 గ్రాముల వరకు టీఎంఆర్, గానుగ చెక్క, మొక్కజొన్న కలిపి వేస్తున్నారు. 21 రోజులకోసారి డివార్మింగ్ చేయించి, 15 రోజులకోసారి వ్యాక్సిన్, వారానికి మూడు సార్లు లివర్, క్యాల్షియం టానిక్‌ను తాగిస్తున్నారు. దీని వల్ల జీవాలు వ్యాధుల బారిన పడకుండా ఉండటానికి ఎక్కువ శాతం అవకాశం ఉంటుంది. అలాగే బరువు కూడా పెరుగుతాయి.

యూట్యూబ్‌లో సలహాలు..

-నాగరాజు, కురాకులతోట

ఎంఏ, బీఈడీ, డీ-ఫార్మసీ పూర్తి చేశా. సివిల్స్ సాధించాలని ప్రయత్నించినా ఫలితం లేక పోయింది. కళ్యాణదుర్గంలో పశువుల ఔషధ దుకాణం ఏర్పాటు చేసుకున్నా. గ్రామాల్లో ఎక్కువగా తిరుగుతుండటంతో అక్కడి రైతుల గొర్రెలు, పొట్టేళ్ల పోషణ గురించి తెలుసుకున్నా. యూట్యూబ్‌లో చూసి షెడ్డు ఏర్పాటు చేశా. పొట్టేళ్ల పెంపకంతో లాభాలు బాగా ఉన్నాయి.

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114847.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I. R. Jabhid, S/o R.Mahaboob Basha, residing at H.No. 13/49a, marama gudi street, Madakasira, Sathya Sai district, Andhra Pradesh – 515301, have changed my name to R. Javeed, and shall hereafter be known as R. Javeed for all purposes.

TO LET

COMMERCIAL

ATP టౌన్, NH.44, సుధీర్ లారీ కాటా వెనుక, D Mart Lane/ రిలయన్స్ డిజిటల్/ ట్రెండ్స్ ప్రక్కన ఉన్న రెస్టారెంట్/ 70 సెంట్ల ఖాళీ స్థలం బాడుగకు ఇవ్వబడును. Cell: 6305772976.

JOBS

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

ఆలమూరు రోడ్డులో ప్లాటింగులో గార్డెన్ పనికి మగ మనిషి కావలెను (పార్ట్/ఫుల్ టైం). ఫోన్: 7093037333

MARKETING/ SALES

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ అనంతపురం నందు పనిచేయుటకు Sales Executives and Telecallers కావలెను. సెల్: 94923 85111.

HUMAN RESOURCES

Wanted HR Executive A IT start-up company is looking Strong knowledge in recruitment, payroll, and employee engagement is a must. Note: English is must. Location: Anantapur Email : atp.hr@cnnitech.com

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

: వివరాలకు :

8008709784

ప్రకటనలపై జి.ఎస్.టీ. 5% వర్తించబడును

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండలో మరో 25 ఏళ్లపాటు తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యమని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. రూ.16.35 కోట్లతో కూడేరు మండలం ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ వరకు నిర్మించిన తాగునీటి పథకం మోటార్లను సోమవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో చెప్పినట్లు ఆరు నెల్లలో ఈ పథకాన్ని పూర్తిచేసినట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పైపులైన్ వేయలేదని, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అసమర్థుడిగా నిలిచి పోయారన్నారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రేగటి నాగరాజు, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, తెదేపా మండల కన్వీనర్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

శిలాఫలకం వద్ద మంత్రి, తెదేపా నాయకులు

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి నేడు కౌన్సెలింగ్

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఖాళీగా ఉన్న ఐదో తరగతి సీట్లను భర్తీ చేయడానికి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీసీఓ కె.జయలక్ష్మి తెలిపారు. గతంలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా ఈ సీట్లను భర్తీ చేస్తామని ఆమె వివరించారు. బాలికలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, బాలురకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు కురుగుంట బాలికల గురుకుల విద్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కేవలం మెరిట్ ఆధారంగానే సీట్లను భర్తీ చేస్తామన్నారు.

సమస్య- సమాధానం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో పంటలు సాగుచేసే రైతులు పంటల సాగులో ఎలాంటి సందేహా లున్నా రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త **నారాయణస్వామి** నంబరు 62812 84235 ఫోన్ చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య : ప్రస్తుత ఖరీఫ్‌లో మునగ పంట సాగు చేయాలనుకుంటున్నాం. అధిక దిగుబడులు ఇచ్చే మునగ విత్తన రకాలను తెలపండి.

-వెంకటేశ్వరనాయుడు, వెంకటాంపల్లి

సమాధానం: మునగ సాగులో పీకేఎం-1 అధిక దిగుబడులు ఇస్తుంది. ధనుశ్, సువర్ణ, రకాలు కూడా అధిక దిగుబడులు ఇచ్చే రకాలు. రైతులు వాటిని సాగు చేసుకోవచ్చు.

సమస్య : పత్తి పంటను నాగులు ఎకరాల్లో సాగు చేస్తున్నాం. సాళ్ల మధ్య అంతర పంటలు సాగు చేయవచ్చా.

-నాగభూషణ, రేగడికొత్తూరు

సమాధానం: పత్తి పంటలో అంతర పంటలు సాగుచేయవచ్చు. పెసర, మినుము, కంది, చిక్కుడు, పంటలు సాగు చేసుకుంటే రెండు పంటల నుంచి రైతులకు ఆదాయం వస్తుంది.

రైతేరాజు

చిట్కా

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో వరిసాగుచేసే రైతులు నారుమడి పెంపకంలో తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. వరి మధ్యకాలిక రకాలు సాగుచేసే రైతులు జులై 15వ తేదీ లోపు నారుమడి సిద్ధం చేసుకోవాలన్నారు. స్వల్పకాలిక రకాలు సాగు చేసే రైతులు జులై 25వ తేది లోపు నారుమడి సిద్ధం చేసుకోవాలన్నారు. బీపీటీ రకం విత్తనాలు ఎకరాకు 20 కిలోలు, దొడ్డు రకాలు 25 కిలోలు చొప్పున 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమడి ఏర్పాటు చేసుకోవాలన్నారు. నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పోటాష్ వేసుకుంటే ఆరోగ్యంగా పెరుగుతుందని శాస్త్రవేత్త తెలిపారు.

వృద్ధాశ్రమం షెడ్డు కూల్చివేత

ఈనాడు, అనంతపురం: వృద్ధులు, అనాథలను చేరదీస్తున్న ఆశ్రమంపై అధికారులు జులుం ప్రదర్శించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారంటూ ఆశ్రమం పక్కన ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక షెడ్డును కూల్చేశారు. కూడేరు మండలం గొటుకూరు పరిధిలో శ్రీరాములు.. బెరాకా అనాథ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. 2010లో అప్పటి కలెక్టర్ ఆశ్రమం కోసం 1.96 ఎకరాల స్థలం కేటాయించినట్లు చెబుతున్నారు. దాతల సాయంతోనే ఆశ్రమాన్ని నడుపుతున్నారు. ఈ క్రమంలోనే వైకాపా ప్రభుత్వంలో స్థానిక వైకాపా నాయకులు ఆశ్రమం పక్కన ఖాళీ స్థలంలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని నిర్మించారు. దానిపై శ్రీరాములు అప్పట్లోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. చెత్త వేయబోమని.. బిల్లుల కోసమే షెడ్డు ఏర్పాటు చేసి వెళ్లిపోతామని చెప్పి ఒప్పించారు. ఇటీవల ఆశ్రమంలో ఉండే వారికి వంట చేయడానికి ఇబ్బందిగా ఉండటంతో పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో రేకులషెడ్డు ఏర్పాటు చేసుకున్నామని.. అధికారులు అభ్యంతరం చెబుతూ నోటీసులిచ్చారని నిర్వాహకుడు చెబుతున్నారు. తర్వాత జేసీబీలతో తాత్కాలిక షెడ్డును కూల్చేశారని వాపోయారు. రెండు రోజులుగా వృద్ధులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేశ్, కలెక్టర్ వినోద్‌కుమార్ ఫొటోలు ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ స్థలం పేరుతో తమను అక్కడి నుంచి ఖాళీ చేయించే కుట్ర జరుగుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ మహబూబ్‌బాషా వివరణ కోరగా ప్రభుత్వ స్థలంలో షెడ్డు నిర్మించారని.. అందుకే తొలగించామని తెలిపారు. వృద్ధాశ్రమానికి భూమి కేటాయించినట్లు ఎక్కడా రికార్డులు లేవన్నారు.

నేలమట్టమైన షెడ్డు

అరటి పంట.. అన్నదాత కులాసా

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : ఏడేళ్లుగా అరటిసాగుతో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు కదిరి మండలంలోని వీరేపల్లిపేటకు చెందిన రైతు లోక్‌నాథ్‌రెడ్డి. ఇతనికి 8.5 ఎకరాల భూమి ఉంది. గతేడాది 4.5 ఎకరాల్లో అరటి సాగు చేశారు. కోతకోసిన తర్వాత పిలకల ద్వారా కూడా లాభాలు సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

బెంగళూరు నుంచి పిలకలు

సాగుకు ముందు భూమిని ఒక మడకతో దున్నించారు. తర్వాత పేడ ఎరువులు చల్లించి ఐదు మడకలతో ఇరుసాల దున్నించారు. టిల్లరుతో సేద్యం చేసి అనంతరం డ్రిప్పు ద్వారా నీటి తడులు అందించారు. బెంగళూరు నుంచి క్యాడిల్లా రకానికి చెందిన అరటి మొక్కను రూ.18.25తో కొనుగోలు చేశారు. ఎకరాకు 1300 చొప్పున మొత్తం 6వేల మొక్క 5.5X5.5 దూరంతో నాటించారు. అరటిలో ప్రధానంగా సిగటోక తెగుళ్ల ఆశిస్తే ఆకులు పసుపు రంగులోకి మారి తర్వాత ఎండిపోతాయి. వీటి నివారణకు ప్రొఫికోనజోల్ ఒక మి.లీ నీటికి, రెండో పిచికారీలో కార్బెండజిమ్, మంకోజెబ్ మిశ్రమాన్ని ఒక గ్రాము లీటరు నీటికి, మూడో పిచికారీలో ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్, టెబుకొనజోల్ మిశ్రమాన్ని 1.5 గ్రాములు లీటరు నీటికి, నాలుగో పిచికారీలో డైఫెనకొనజోల్ ఒక మి.లీ నీటికి కలిపి పిచికారీ చేశారు. వీటితోపాటు ఎకరాకు ఐదుమూటల యూరియా, చెక్క, డీఏపీ వినియోగించారు. మొత్తం పెట్టుబడికే రూ.6 లక్షలు ఖర్చు చేశారు.

సాగులో అరటితోట, రైతు, లోక్‌నాథ్‌రెడ్డి

మొదటి కోతకు వంద టన్నులు

● ఎరువులు, మందులు బాగా పిచికారీ చేయడంతో కాయ పరిమాణం బాగా పెరిగింది. మొదటి కోతలో వంద టన్నులు దిగుబడి రాగా టన్ను రూ.12వేలతో, రెండో కోతలో 25 టన్నుల దిగుబడి రాగా టన్ను రూ.15వేలతో పులివెందులకు చెందిన వ్యాపారులకు విక్రయించారు. మొత్తం రూ.15లక్షల దిగుబడి రాగా పెట్టుబడిపోయి రూ.9 లక్షలు లాభం మిగిలింది. తర్వాత పిలకల ద్వారా మరో రూ.7లక్షల నుంచి 9 లక్షల వరకు లాభం వస్తుందని రైతు చెబుతున్నారు.

సర్పంచి మామపై హత్యాయత్నం

మైలాపురంలో ఉద్రిక్తత.. పోలీసుల పికెట్

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని కొలగానహళ్లి గ్రామ సర్పంచి కావలి శ్రుతి మామ అనంతరాజుపై మైలాపురంలో సోమవారం రాత్రి ప్రత్యర్థులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామస్థుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొలగానహళ్లిలో మొహర్రం వేడుకల అనంతరం అనంతరాజు మైలాపురం గ్రామానికి వెళ్లారు. అక్కడే ప్రత్యర్థి వర్గానికి చెందిన వ్యక్తులు కాపుకాచి వేటకొడవళ్లతో ఆయనపై దాడి చేశారు. దీంతో ఆయన తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ గలాటను విడిపించేందుకు వచ్చిన వారికి కూడా గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కొలగానహళ్లికి చెందిన పలువురు మైలాపురానికి చేరుకుని ప్రత్యర్థి వర్గానికి చెందిన ఇళ్లపై దాడులకు పాల్పడ్డారన్నారు. ఇంటివద్ద ఉన్న పశుగ్రాసానికి నిప్పుపెట్టి పలు ఇళ్ల తలుపులు పగులగొట్టినట్లు సమాచారం. అప్పటికే అనంతరాజుపై దాడి చేసిన వారు గ్రామం నుంచి పరారైనట్లు తెలిసింది. ఈ ఘటనలో గాయపడిన క్షతగాత్రులను వారి కుటుంబ సభ్యులు ఆటోలో బళ్లారిలోని విమ్స్ ఆసుపత్రికి తరలించారు. గ్రామస్థుల సమాచారంతో రాయదుర్గం గ్రామీణ సీఐ వెంకటరమణ, ఎస్సై నబీరసూల్ పోలీసులతో వచ్చి గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు. హత్యాయత్నానికి వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

అభిషేక్‌రెడ్డి అసాధారణ బ్యాటింగ్.. చిత్తూరు భారీస్కోరు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు దిగాడు ఆ బ్యాటరు.. ద్విశతకం చేసి అజేయంగా నిలిచాడు. జట్టు మొత్తం పెవిలియన్ చేరినా.. అతను మాత్రం నాటౌట్‌గానే నిలవడం గమనార్హం. సౌత్‌జోన్ అంతర్ జిల్లా మూడు రోజుల క్రికెట్ పోటీల్లో చిత్తూరు బ్యాటరు అభిషేక్‌రెడ్డి (227) అసాధారణ బ్యాటింగ్‌తో అందరిని ఆకట్టుకున్నాడు. సోమవారం అనంత క్రికెట్ మైదానంలో ఉదయం 316/3 ఓవర్‌నైట్ స్కోరుతో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన చిత్తూరు జట్టు 115.2 ఓవర్లలో 455 పరుగులకు ఆలౌటైంది. అనంతపురం బౌలర్లు బి.వినయ్‌కుమార్ (4/72), దీపక్, ప్రదీప్ రెడ్డి, రాజుకుళ్లాయప్ప చెరి రెండు వికెట్లు కూల్చారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 44 ఓవర్లలో 4 వికెట్లకు 199 పరుగులు చేసింది. బ్యాటరు ఎంకే దత్తారెడ్డి (100; 83 బంతుల్లో) అజేయ శతకంతో మెరిపించాడు. చిత్తూరు జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించాలంటే చివరిరోజు బ్యాటర్లు చెలరేగాల్సి ఉంటుంది.

● మరో పోటీలో నెల్లూరు జట్టు కడప జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 44 పరుగుల ఆధిక్యత సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 47/1తో మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన కడప జట్టు 244 పరుగులకే కుప్పకూలింది. ఆరీఫ్‌బాషా (62), టి.వంశీకృష్ణ (54) బ్యాటింగ్‌లో రాణించినా జట్టుకు ఆధిక్యత సాధించలేకపోయారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లకు 179 పరుగులు చేసింది. రేవంత్‌రెడ్డి(76) చక్కటి బ్యాటింగ్‌తో అలరించాడు. మూడో రౌండు మ్యాచ్‌లు రెండు డ్రా దిశగానే పయనిస్తున్నాయి.

అజేయ ద్విశతకంతో అభిషేక్‌రెడ్డి (227)

దత్తారెడ్డి మెరుపు శతకం

భూకబ్జాదారుపై కేసు నమోదు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని హనుమాన్ సర్కిల్‌లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న దేవేంద్రపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇతని కబ్జాతీరుపై ఈనెల 6న 'రూ.15కోట్ల సర్కారు స్థలం కబ్జా' అని 'ఈనాడు' కథనం ప్రచురితమైన సంగతి పాఠకులకు విదితమే. దీనిపై స్పందించిన తహసీల్దారు 12.75 సెంట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ మనోహర్ తెలిపారు. ఇది వరకు బళ్లారి రోడ్డు, ఆలూరు రోడ్డు కూడలిలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని గతేడాది నుంచి బాధితుడు మాజీ కౌన్సిలర్ రామచంద్ర పోరాటం సాగిస్తున్నారు. రెండు సర్వే నంబర్లలో రెవెన్యూ అధికారుల చేత స్థలాన్ని సర్వే చేయించాడు. 54 సెంట్ల స్థలం ఆక్రమణకు గురైందని మాజీ కౌన్సిలర్ జిల్లా కలెక్టర్ వరకు తీసుకెళ్లాడు. గత నెల 27తేదీన స్థలాన్ని కాపాడాలని ఆరోజు ఆయన దీక్ష చేపట్టాడు.

స్పందించు.. సంధించు!

ఈనాడు మీ తోడు

పాఠకులారా..! మీలో సామాజిక స్పృహ.. ఏదైనా మంచి చేయాలన్న తపన ఉందా? అన్యాయాలను నిగ్గదీసి ప్రశ్నిస్తారా? సమస్యలను మీ చేతుల మీదుగా పరిష్కారం చూపాలని ఆరాటపడుతున్నారా? ఏ వర్గానికైనా అత్యంత విలువైన సమాచారం చేరవేయాలని అనుకుంటున్నారా? మీ చుట్టుపక్కల ఆహ్లాదకర.. ఆసక్తిదాయక.. ఆదర్శప్రాయమైన అంశాలు నలుగురికి పంచాలని ఆశిస్తున్నారా? అయితే ఈ వేదిక మీ కోసమే.. మీ గొంతుకకు **ఈనాడు** తోడు అవుతుంది. ప్రజాశ్రేయస్సు పరమావధిగా మీరు రాసిన అక్షరాలు, తీసిన ఫొటోలకు పత్రికలో సముచిత స్థానం కల్పించేందుకు ముందుకొస్తున్నాం..

ఇంకెందుకు ఆలస్యం.. తీసుకోండి కలం.. పట్టండి కెమెరా.. సమస్యలపై మీదైన శైలిలో ఎక్కుపెట్టండి..!

మీరు చేయాల్సినవి..

- ఏదేని అంశాన్ని పది వాక్యాలకు మించకుండా సూటిగా, స్పష్టంగా రాయడం.
- నాణ్యమైన ఫొటోలు తీసి పంపడం.
- వ్యక్తిగతమైనవి వద్దు.. సమాజశ్రేయస్సుకే ఈనాడు వేదిక అనేది మదిలో మెదలాలి.

★ మీరు పంపిన అంశాలను పరిశీలించి.. అర్హత ఉన్నవి ప్రచురిస్తాం.

పోస్టు చేయాల్సిన నంబరు 93901 60428

1.7 కిలోల గంజాయి పట్టివేత

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో కొనుగోలు చేసిన గంజాయిని అమ్మేందుకు తీసుకెళ్తున్న ముఠా సభ్యులను కణేకల్లు రోడ్డులో పట్టుకున్నట్లు రాయదుర్గం యూపీఎస్ సీఐ జయనాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బళ్లారిలో రైల్వే స్టేషన్‌లో సాధువుల నుంచి గంజాయి కొనుగోలు చేసి రాయదుర్గం, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో ప్యాకెట్ రూ.800లకు అమ్ముతున్నట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. ఇన్నాళ్లు రైలు మార్గంలోనే గంజాయి తరలించే ముఠా సోమవారం కణేకల్లులో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డారన్నారు. నిందితులు కంబదూరు మండలం కర్తనపర్తికి చెందిన బోయ నరేశ్, కొత్తూరుకు చెందిన కొడపల్లి రామాంజనేయులు, చెన్నంపల్లికి చెందిన వై.మారెన్న, ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన సి.మారెప్ప, కంటగాని వెంకటరాముడు, అనంతపురం నగరం చంద్రబాబు కొట్టాలకు చెందిన దంపట్ల జీవన్‌కుమార్, రుద్రంపేటకు చెందిన బండి ఉదయ్‌కిరణ్, ఎన్‌టీ కాలనీకి చెందిన అమామ్‌సాబ్, రాణినగర్‌కు చెందిన అన్వర్ బాషా, గార్లదిన్నె పాతకల్లుకు చెందిన అంచెల రసూల్‌ఖాన్‌లను అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చడంతోపాటు 1.7 కిలోల గంజాయి, 7 చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

గుత్తిలో అధిక ధరకు ఈ-బాండ్ల అమ్మకం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో సాధారణ నాన్‌జ్యుడీషియల్ బాండ్ల కొరత ఉంది. రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు బాండ్లను నంద్యాల జిల్లా ప్యాపిలి, ఉరవకొండ, గుంతకల్లు, కర్నూలు జిల్లాలోని పత్తికొండలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. సాధారణ బాండ్లు స్థానికంగా లేకపోవడంతో ప్రజలు అత్యవసరంగా ఈ-బాండ్లను కొంటున్నారు. రూ.వంద బాండును వెండర్లు రూ.వెయ్యికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గుత్తిలో 15 మంది దాకా స్టాంపు వెండర్లు ఉండగా ఈ-బాండ్ల వెండర్లు ఇద్దరు ఉన్నారు. వీరు ప్రజలను దగా చేస్తున్నా రిజిస్ట్రేషన్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అప్పుల బాధతో

ఇద్దరు రైతుల ఆత్మహత్య

రాప్తాడు, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రాంతాల్లో అప్పుల బాధ తాళలేక ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కరుణాకర్ (32) తనకున్న వ్యవసాయ పొలంలో పంటలు సాగు చేస్తూ జీవనం సాగించేవారు. సుమారు నాలుగేళ్ల నుంచి పంటలు పండక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తనకు తెలిసిన వారి దగ్గర సుమారు రూ.15 లక్షల వరకు అప్పులు చేశారు. వాటిని తీర్చలేక మదనపడేవాడు. ఈ నెల 3వ తేదీన పొలంలో గడ్డికి కొట్టే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. వెంటనే బంధువులు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సలందించారు. ఆతర్వాత ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు భార్య వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె సంతానం. ఇంటికి పెద్ద దిక్కు మృతితో భార్య, కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

(కూడేరు)ఉరవకొండ, న్యూస్‌టుడే: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కూడేరులో చోటుచేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాలిలా.. స్థానికంగా ప్రధాన వీధిలో నివసించే గురుస్వామి(55)కి తనకున్న 11.5 ఎకరాల్లో కొన్నేళ్లుగా వేరుసెనగ, వరి సాగు చేస్తున్నాడు. రెండు మూడేళ్లుగా వ్యవసాయంలో వరుస నష్టాలు ఎదురవగా..రూ.6 లక్షలు అప్పులయ్యాయి. వాటిని తీర్చేమార్గం లేక మనస్తాపానికి గురై ఆదివారం ఇంటి నుంచి వెళ్లి పొలంలో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం ఉదయం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.


గురుస్వామి

మనస్తాపంతో యువకుడు...

కూడేరు, న్యూస్‌టుడే: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కూడేరు మండలంలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాలిలా.. వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి తండాకు చెందిన ఆదినారాయణ నాయక్(23) ఓ కేసులో నిందితుడిగా ఉన్నాడు. దీనిని అవమానంగా భావించిన ఆయన కొన్నాళ్లుగా సొంత ఊళ్లో ఉండకుండా తల్లితో కలిసి కూడేరు మండలం బ్రాహ్మణపల్లిలోని స్కందలో నివసిస్తున్నారు. తల్లి రెండు రోజుల కిందట స్వగ్రామానికి వెళ్లగా. . ఆదినారాయణ నాయక్ ఒక్కడే ఒంటరి ఉన్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిని సోమవారం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పురుగుమందు డబ్బాలతో నిరసన

బైఠాయించిన గిరిజన రైతులు

పామిడి, న్యూస్‌టుడే : గిరిజన రైతుల భూములకు కలెక్టర్ రస్తా చూపించాలని ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాకే గోవింద్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి రామగిరి ఎగువ తండా గ్రామ గిరిజన రైతులంతా కలిసి పురుగుమందు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ గిరిజన రైతులకు చెందిన 126 ఎకరాలకు రస్తా సమస్యను పరిష్కరిస్తే దాదాపు 43 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు లాలూనాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఐదు తులాల బంగారు గొలుసు చోరీ

నార్పల, న్యూస్‌టుడే : మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామంలో ఉదయం నడకకు వెళ్లిన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు తెంచుకుని పరారయ్యారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు నెట్టెం పుష్పవతి గ్రామ ప్రధాన రహదారిలో ఉదయం నడకకు వెళ్తుండగా ద్విచక్రవాహనంలో వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలోని 5 తులాల బంగారు గొలుసు తెంచుకుని పారిపోయారు. పెనుగులాట ఘటనలో మహిళ కిందపడటంతో ఆమె మెడకు, మోకాలికి గాయాలయ్యాయి. బాధితురాలు నార్పల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

(c) eenadu

రాయదుర్గం
•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ఇళ్లు నిర్మించుకోకుంటే రద్దే!

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని నాలుగు లేఅవుట్లలో గతంలో పేదలకు మంజూరైన ఇంటి స్థలాల్లో లబ్ధిదారులు నిర్మాణాలు చేసుకోకుంటే రద్దు చేస్తామని తహసీల్దార్ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ ఏఈ లోకనాథ్ చౌదరి హెచ్చరించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు లేఅవుట్లలో 2,379 మందికి ఇళ్ల స్థలాలు మంజూరవగా.. 1,173 మంది నిర్మాణాలు చేయలేదన్నారు. వీటిల్లో బేస్మెంట్ వరకు ఉన్నవి 45 రోజుల్లో, గోడల స్థాయిలో ఉన్న వాటికి 30 రోజులు, పైకప్పు మిగిలిన వాటికి 15 రోజుల్లో నిర్మాణాలు పూర్తిచేసుకోకుంటే రద్దవుతాయని వారు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

కణేకల్లు: జక్కలవడి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని పలువురు సోమవారం సచివాలయం ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. అధికారులు, పాలకవర్గ సభ్యుల దృష్టికి తెచ్చినా పెడచెవిన పెడుతున్నారని వాపోయారు. సర్పంచి శారద హనుమంతరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి గోడు విన్నవించారు. ఏఈ శివకృష్ణారెడ్డి మాట్లాడుతూ రూ.5 లక్షలు మంజూరయ్యాయని, సమస్య పరిష్కరిస్తామన్నారు.

ఖాళీ బిందెలతో ఆందోళన

రహదారుల ఆధునికీకరణతోనే అభివృద్ధి: పయ్యావుల

ఉరవకొండ: రహదారుల ఆధునికీకరణతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. రూ.2.90 కోట్లతో ఉరవకొండ నుంచి రాయంపల్లి వరకు, రూ.2.75 కోట్లతో జాతీయ రహదారి నుంచి పాల్తూరు వరకు, రూ.2.95 కోట్లతో ఉరవకొండ పట్టణంలోని కనేకల్ రహదారి నుంచి మార్కెట్టు యార్డు వరకు చేపట్టనున్న రహదారుల పనులకు సోమవారం భూమిపూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెదేపా నాయకులు రేగటి నాగరాజు, సీతారాముడు, సినిమా రామాంజనేయులు, స్వారం కేశవ, తిమ్మప్ప, సుంకన్న, వన్నూరుస్వామి, సుదర్శన్, భగవాన్, శివ పాల్గొన్నారు.

ప్రొక్లెయిన్‌తో పనులు ప్రారంభిస్తున్న మంత్రి కేశవ్

తీరనున్న నీటి ఇక్కట్లు

నీటితొట్టెని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

న్యూస్‌టుడే, రాయదుర్గం గ్రామీణం

రాష్ట్రంలో రైతుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని అన్నదాతలకు వ్యవసాయంతోపాటు పాడి పెంపకానికి తోడ్పాటును అందిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా 'పల్లె

ఉపాధి పథకంలో తొట్ల నిర్మాణం

పండుగ' పేరుతో జాతీయ ఉపాధి హామీ పథకంలో మూగ జీవాలైన పశు పక్ష్యాదుల దాహం తీర్చేందుకు నీటితొట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

లక్ష్యానికి మించి నిర్మాణాలు

డివిజన్‌లో 146 నీటితొట్ల నిర్మాణం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. కాగా ఇప్పటికే అధికారులు అంతకు మించి 251 తొట్ల నిర్మాణానికి అనుమతులిచ్చారు. వాటిల్లో ప్రస్తుతం 118 తొట్ల పనులు ప్రగతిలో ఉండగా.. 70 పూర్తవడంతో ఇటీవల ప్రారంభోత్సవాలు పూర్తిచేశారు. మరో 76 నిర్మించాల్సి ఉంది. మెచ్చిరి మాజీ సర్పంచి మల్లికార్జున మాట్లాడుతూ మూగజీవాల దాహం తీర్చడానికి నీటితొట్టు నిర్మించడం హర్షణీయమన్నారు.

2025లో ఉపాధి హామీ పథకంలో మంజూరైన నీటితొట్ల వివరాలు...

మండలం	టార్గెట్	అనుమతి పొందినవి	ప్రగతిలో ఉన్నవి	పూర్తయినవి	బ్యాలెన్సు
రాయదుర్గం	54	72	36	21	33
కణేకల్లు	20	22	13	8	12
బొమ్మనహాళ్	9	48	7	2	7
డి.హీరేహాళ్	36	32	21	8	28
గుమ్మఘట్ట	27	77	41	31	4

మరిన్ని మంజూరు చేస్తాం

ఉపాధి హామీ పథకంలో ఇప్పటికే డివిజన్‌లో టార్గెట్‌కు మించి నీటితొట్ల నిర్మాణాలకు అనుమతులిచ్చాం. అవన్నీ పురోగతిలో ఉన్నాయి. డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అవసరం అనుకుంటే మరిన్ని నిర్మాణానికి అనుమతులు ఇస్తాం. - **నాగేశ్వరరావు, డీఎల్‌పీఓ, ఇన్‌ఛార్జి డ్వామా ఏపీడీ, రాయదుర్గం**

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: కళ్యాణదుర్గం మండలంలోని ఎర్రంపల్లి గ్రామ ఓసీ కాలనీలో నల్లాలకు బిరడాలు లేక పోవడంతో నీరు వృథాగా పోవడంతో అపరిశుభ్రంగా మారుతోంది. **- సత్యప్ప, ఎర్రంపల్లి.**
సమాధానం: నల్లాలకు బిరడాలు బిగించేలా ఏర్పాట్లు చేసి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం. **- ధనుంజయ, కార్యదర్శి, గరుడాపురం.**
- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం.

సమస్య: కల్యం ఉన్నత పాఠశాల ఆవరణలోని చేతిపంపు వృథాగా మారింది. దీంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. **- కల్యం గ్రామస్థులు.**
సమాధానం: చేతిపంపు మరమ్మతునకు కృషి చేస్తాం. **-ధనుంజయ, ఎఈ డి.హీరేహాళ్.**

సమస్య: కల్యంలో రాయదుర్గం- బళ్లారి రహదారికి ఇరువైపులా చెత్తచెదారం వేస్తున్నారు. **- బొమ్మయ్య, కల్యం.**
సమాధానం: చెత్తను తొలగింపజేస్తాం. **-రాజు, కార్యదర్శి.**

సమస్య: పంచాయతీ కార్యలయం వెనుక ఉన్న కాలువలలో మురుగు పేరుకుపోయింది. **- సరోజమ్మ, డి.హీరేహాళ్.**
సమాధానం: మురుగు తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **-రమణ, కార్యదర్శి, డి.హీరేహాళ్. - న్యూస్‌టుడే, డి.హీరేహాళ్.**

కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాలవ, నాయకులు

చంద్రబాబు నేతృత్వంలో సుపరిపాలన

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎన్నికల హామీలను అమలు చేస్తున్నట్లు రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని చదం గొల్లలదొడ్డిలో సోమవారం సర్పంచి మల్లేశప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి సీఎం చంద్రబాబు నాయుడు తొలి ఏడాదిలోనే పలు పథకాలు అమలు చేశామన్నారు. త్వరలో రైతులకు అన్నదాతా సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితరాలు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కాలవ తనయుడు, యువ నాయకుడు భరత్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవ్వగా.. అభిమానులు డప్పుచప్పుళ్లు, బాణాసంచా కాల్చుతూ ఘనంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ ఎంఆర్ఎఫ్ హనుమంతు, నాయకులు కాటా వెంకటేశులు, మాజీ జడ్పీటీసీ విజయ్‌కుమార్, కదరంపల్లి సోమశేఖర్, ఆర్ఎంసీ డైరెక్టర్ హనుమంతు, వజ్రవన్నూరు సర్పంచి అశోక్ పాల్గొన్నారు.

విజయవాడ బస్సు రూట్లో మార్పులు

ఉరవకొండ: ఉరవకొండ నుంచి నిత్యం సాయంత్రం 6:30 గంటలకు విజయవాడ వెళ్లే బస్సు దారిలో మార్పు చేసినట్లు డీఎం హంపన్న సోమవారం పేర్కొన్నారు. ఇన్నాళ్లుగా అనంతపురం మీదుగా వెళ్తుండేదన్నారు. మంగళవారం నుంచి ఉరవకొండ, గుంతకల్లు, గుత్తి, కర్నూలు మీదుగా వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. విషయాన్ని ప్రయాణికులు గుర్తించాలని కోరారు.

నగరవనాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

80 హెక్టార్లలో మొక్కల పెంపకం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయదుర్గం పరిసర ప్రాంతాల్లోని అటవీ భూములతోపాటు నగరవనంలో 80 హెక్టార్లలో మొక్కల పెంపకం చేపట్టనున్నట్లు అడిషనల్ పీసీసీఎఫ్ చలపతి రావు, డీఎఫ్‌వో విఘ్నేష్ అప్పావ్ పేర్కొన్నారు. రాయదుర్గం మండలంలోని కొంతానపల్లి సమీపంలోని ధర్మపురి అటవీ ప్రాంతంలో రెండేళ్ల కిందట 40 హెక్టార్లలో నాటిన మొక్కలను సోమవారం పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం నగరవనంను పరిశీలించి కొనసాగుతున్న పనుల తీరును ఎఫ్ఆర్‌వో రామచంద్రుడును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాయదుర్గం డీఆర్‌వో దామోదర్‌రెడ్డి, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఇసుక దందా సాగుతున్నా తెలియదా: వైకాపా

అనంత నగరపాలక, న్యూస్‌టుడే : జిల్లాలోని శింగనమల, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో ఇసుక నిల్వలు చేసి కూటమి నాయకులు భారీగా విక్రయాలు జరుపుతున్నారని శింగనమల నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త శైలజానాథ్ ఆరోపించారు. ఇదంతా చంద్రబాబుకు తెలియకుండా సాగుతోందా? అని ఆయన ప్రశ్నించారు. సోమవారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణుల కోసం తెచ్చిన ఉపాధి హామీ పథకం తెదేపా నాయకులు దోచుకోవడానికి వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. శింగనమలలో నకిలీ మస్టర్లు వెలుగు చూస్తున్నాయని, బుక్కరాయసముద్రం మండలంలో ఉపాధి హామీ పథకం గ్రూపులో నాలుగు పేర్లు ఉంటే 10 మంది ఫొటోలు కనిపిస్తున్నాయన్నారు. పాత కుంటలకు కొత్తగా బిల్లులు చూపి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. చెన్నంపల్లిలో వాటాల కోసం కొట్టుకుంటున్నా ఎవరికీ పట్టడం లేదన్నారు. కళ్యాణదుర్గంలో స్టాంపుల కుంభకోణానికి పాల్పడి ఒకరినొకరు ఫిర్యాదు చేసుకుంటే, అనంతపురంలో వారి పార్టీ నాయకుడిని హత్య చేయడానికి ప్రయత్నించారని వారే ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. కలెక్టర్ చొరవ చూపి అధికార పార్టీ ఆగడాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉరవకొండ: ఆమిద్యాలలో పీర్ల ప్రదర్శన

గడే హోతూరులో..

కళ్యాణదుర్గంలో...

రాయదుర్గం పురవీధుల్లో...

జలధికి తరలిన పీర్లు

కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్లకు సోమవారం భక్తులు పెద్దఎత్తున హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బెల్లం, పంచదారతో చదివింపులు చేయించారు. కుల, మతాలకు అతీతంగా పానకాలు తీసుకొచ్చారు. అనంతరం పీర్లు అగ్ని గుండంలోకి ప్రవేశింపజేసి పురవీధుల్లో మేళాలు, తప్పెట్లతో ఊరేగించారు.

-న్యూస్‌టుడే బృందం

కంబదూరు: డప్పుచప్పుళ్లతో ఊరేగింపు

చెరువుల ఆక్రమణపై ఫిర్యాదు

శెట్టూరు, న్యూస్‌టుడే: చెరువులు ఆక్రమించి పంటలు సాగుచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శెట్టూరు మండలం ములకలేడు చెరువు సాగు నీటి సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఎంపీటీసీ సభ్యుడు జీఎల్ లింగప్ప, తెదేపా నాయకుడు మూర్తి తదితరులు సోమవారం ఉప తహసీల్దార్ అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

రాత పుస్తకాల పంపిణీ

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని పలువురు పేద విద్యార్థులకు జైభీమ్‌రావ్ భారత్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామప్ప నాయక్ సోమవారం రాత పుస్తకాలను పంపిణీ చేశారు. పేద వర్గాలకు చెందిన వారికి తోడ్పాటును అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి ముందుకొచ్చినట్లు ఆయన తెలిపారు.

జీవాలకు మందుల పంపిణీ

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు పశువైద్యశాలలో సోమవారం వైద్యులు నాగలింగేశ్వరరెడ్డి, ప్రసాద్, నాయకులు గొర్రెలకు టీకాలు, మందులు వేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వైద్యులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శెట్టూరు సర్పంచి కుమార్, తెదేపా నాయకులు ఉరుప్రసాద్, నగేష్, రషీద్ పాల్గొన్నారు.

ఘనంగా పాండురంగ స్వామి రథోత్సవం

ఊరేగింపులో పాల్గొన్న భక్తులు...

రాయదుర్గం, న్యూస్‌టుడే: తొలి ద్వాదశిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ పాండురంగ స్వామి రథోత్సవాన్ని సోమవారం కన్నులపండువగా నిర్వహించారు. బళ్లారి రోడ్డులోని ఆలయం నుంచి రుక్మిణీ, పాండురంగ స్వామి ఉత్సవ విగ్రహాలను రథంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు, తెదేపా యువ నాయకుడు కాలవ భరత్, స్వకుళ సాళి సమాజం సభ్యులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

వైకాపా పాపం.. విద్యార్థులకు శాపం!

అసంపూర్తి భవనాలు, చెట్లకిందే చదువులు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: 'ప్రభుత్వ పాఠశాలల రూపురేకలు మారుస్తాం.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తామని' గత ప్రభుత్వం గొప్పలు చెప్పినా.. ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదు. అప్పటి ప్రభుత్వం చేసిన తప్పిదం వల్ల ప్రస్తుతం విద్యార్థులకు శాపంగా మారింది. 2022లో 'నాడు- నేడు' కింద ప్రారంభించిన అదనపు తరగతి భవనాలు నేటికీ పూర్తవలేదు.

ఆదిలోనే ఆగిన పనులు

బొమ్మనహాళ్ మండలంలోని లింగదహాళ్, ఉంతకల్లు, దేవగిరి, నేమకల్లు, చంద్రగిరి, కల్‌హోళ గ్రామాల్లో ఉన్నతి పొందిన పాఠశాలల ప్రత్యేక గదుల పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. ఉంతకల్లులో అసంపూర్తి గదుల్లోనే 6 నుంచి 10 తరగతులు కొనసాగిస్తున్నారు. నేమకల్లు, దేవగిరి, చంద్రగిరి, కల్‌హోళ గ్రామాల్లోనూ అదనపు పనులు తుది దశలో ఆగిపోయాయి. నేమకల్లులో గ్రామానికి కిలోమీటరు దూరంలో రెండు గదులతో చేపట్టిన పనులు పునాదులకే పరిమితమయ్యాయి. దర్గాహొన్నూరులో అసంపూర్తి భవనాల వల్ల చెట్ల కింద బోధన చేస్తున్నారు. ఎల్‌బీనగర్, ఉంతకల్లు ఎస్సీ కాలనీ, శ్రీరంగాపురం, ఉద్దేహాళ్ పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి.

నేమకల్లులో ఆరుబయటే..

నిధులు రాగానే పనులు చేయిస్తాం

అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాల పనులు పూర్తిచేయడానికి కావాల్సిన నిధుల నిమిత్తం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపాం. అక్కడి నుంచి ఆదేశాలు రాగానే పనులు చేయిస్తాం. **ఈరన్న, మల్లికార్జున, ఎంఈవో-1 ఎంఈవో-2**

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

ఉరవకొండ, బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మాదిగల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ పనిచేస్తోందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవెల్ స్వామిదాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్ ఆత్మగౌరవ స్తూపం వద్ద నిర్వహించిన ఆవిర్భావోత్సవంలో వారు మాట్లాడారు. కూడేరులోనూ వేడుకలు జరిగాయి. ● దర్గాహొన్నూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్ వేడుకలు నిర్వహించారు. ఆ మండల శాఖ అధ్యక్షులు శ్రీధరఘట్ట చంద్ర, గౌరవాధ్యక్షులు వన్నూరుస్వామి, ప్రధాన కార్యదర్శి రమేష్, రాజు పాల్గొన్నారు.

చెట్లు నరకరాదని టాంటాం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పీర్లపండగ సందర్భంగా పచ్చని చెట్లు నరకరాదని పలు గ్రామాల్లో ముందస్తుగా టాంటాం వేయించినట్లు అటవీశాఖ రేంజర్ రామచంద్రుడు పేర్కొన్నారు. సోమవారం కళ్యాణదుర్గం మండలం విట్లంపల్లిలో ఆయన మాట్లాడారు.

కళ్లకు గంతలతో నిరసన

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు సోమవారం మూడోరోజు పంప్‌హౌస్ వద్ద కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేశారు. కార్యక్రమంలో కార్మికులు వన్నూరప్ప, ఎర్రిస్వామి, తిప్పేస్వామి, పరుశురాం, వీరాంజనేయులు, పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూమి పేదలకు పంచండి

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: దాసప్ప రోడ్డులోని వక్ఫ్ బోర్డు భూమి పేదలకు పంపిణీ చేయాలని విశ్వ హిందూ పరిషత్ తాలూకా అధ్యక్షులు రాజేశ్ స్థానిక తహసీల్దార్ నాగరాజుకు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి మల్లికార్జున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా జాతీయ రహదారిపై ఉన్న మలుపులో సోమవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎస్ఎల్ఎన్ కాలనీకి చెందిన గౌరి- కుమార్‌నాయక్ దంపతులతోపాటు అంబేడ్కర్ నగర్‌కు చెందిన అభిరామ్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

వాహనాలు ఎదురైతే.. అంతే!

నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పాత పోస్టాఫీసు కూడలిలో ట్రాఫిక్ అగచాట్లు పెరుగుతున్నాయి. రెండు బస్సులు ఎదురైతే గంటపాటు ఆగాల్సిందే.! ఇలా నిత్యం రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సై ప్రవీణ్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు ఆపకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, కంబదూరు.**

సీసీ దారులు నిర్మించరూ...

రాయదుర్గం పట్టణం వాల్మీకీనగర్ బీసీ బాలుర వసతి గృహం వెనుక దారి గుంతలు పడి అధ్వానంగా మారింది. కాలనీఏర్పడి ఇరవై ఏళ్లు గడుస్తున్నా. కనీస సౌకర్యాలు కల్పించలేదు. దీంతో ఆ ప్రాంతానికి ఆటోలు రావాలన్నా ఇబ్బందిగా మారింది. మురుగు రోడ్డుపై నిలిచి దుర్వాసన వస్తోంది. కమిషనర్ దివాకర్‌రెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ పలు కాలనీల్లో వసతుల కల్పనకు అనుమతులు రాగానే పనులు చేయిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం.**

ఏళ్లుగా నిరుపయోగం

కళ్యాణదుర్గం సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 108, 104 వాహనాలు ఏళ్లుగా వృథాగా మారాయి. వాహనాలకు సంబంధించిన పరికరాలు తుప్పు పడుతున్నాయి. ఏజెన్సీ నిర్వాహకులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఈ వాహనాలను తుక్కుగా మార్చాలని నివేదిక ప్రభుత్వానికి పంపామన్నారు.

-న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం.

కణేకల్లు పంచాయతీ ఈవోగా శిక్షణ కలెక్టర్

కణేకల్లు: స్థానిక పంచాయతీ ఈఓగా శిక్షణ కలెక్టర్ సచిన్ రహార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఐఏఎస్ శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో ఈఓ విధులు, బాధ్యతలు, ఎదుర్కొనే సమస్యలపై అవగాహన పెంపొందించుకొనేందుకు 14 రోజులపాటు ఈ బాధ్యతల్లో ఉండనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శిక్షణ కలెక్టరును సత్కరిస్తున్న అధికారులు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కణేకల్లు, న్యూస్‌టుడే: గోపులాపురం వద్ద రెండు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బెళుగుప్ప మండలం ఎర్రగుడికి చెందిన హెచ్.తిప్పేస్వామి(52) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఆయనకు భార్య శ్యామలతోపాటు, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తిప్పేస్వామి

నిధులున్నా.. ముందుకు సాగని పనులు!

కుంటుపడుతున్న పుర ప్రగతి

న్యూస్‌టుడే, రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘంలో నిధులున్నా.. అభివృద్ధి పనులు చేయడానికి గుత్తేదార్ల నిరాసక్తత వల్ల పట్టణ ప్రగతి నిలిచిపోయింది. గత వైకాపా పాలనలో అభివృద్ధి పనులు పట్టించుకోకపోవడం, చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో గుత్తేదార్లలో ఆందోళన మొదలైంది. ఒక్కో పనికి మూడు నుంచి అయిదు మార్లు టెండర్లు పిలిచినా ఒక్కటి కూడా దాఖలు కాకపోవడం గమనార్హం. ప్రస్తుతం పురపాలికలో సుమారు రూ.8 కోట్లకుపైగా నిధులున్నా.. అధికారులు పనులు చేయలేని పరిస్థితి

పట్టణంలో కూలిన డివైడర్

'నిధి పోర్టల్' ఉన్నా...

గతంలో సీఎఫ్ఎంఎస్ పద్ధతి చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు కూటమి ప్రభుత్వం 'నిధి పోర్టల్'ను అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానంలోనూ సాంకేతిక సమస్య రావడంతో నిధుల చెల్లింపులో జాప్యం కలిగింది.

బిల్లులు ఆగిపోవడానికి మరో కారణం... కౌన్సిల్ వైకాపా చేతిలో ఉండటంతో రాజకీయ విపక్ష నెలకొందనే ఆరోపణలున్నాయి. కణేకల్లు రోడ్డు నుంచి బళ్లారి రోడ్డు వరకు పైపులైన్ల పనులు, నీటి క్లోరినేషన్, పారిశుద్ధ్య పనులు, ట్రాక్టర్ల మరమ్మతులు తదితర పనులు నిలిచిపోయాయి.

టెండర్లు పిలిచాం

మున్సిపాల్టీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ఇప్పటికే రెండు మూడుసార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రాలేదు. దీంతో మళ్లీ టెండర్లు పిలిచాం. ఎవరైనా వస్తే పనులు అప్పగిస్తాం.
- వి.దివాకర్‌రెడ్డి, కమిషనర్, రాయదుర్గం

సమస్యల పరిష్కారానికి చర్యలు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని వచ్చిన 13 వినతులను ఆయా మండలాల అధికారులకు పంపినట్లు ఆర్డీవో వసంతబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో పలువురు విన్నపాలు చేసినట్లు తెలిపారు. దళిత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని లౌకిక రాజ్య పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మందల రమేష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహాలింగ, రవికుమార్, కళ్యాణ్, రామాంజి, వన్నూరస్వామి, మనోహర్, రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన సాగుతుందని, పిల్లలను సర్కారు బడులకు పంపాలని కోరుతూ సోమవారం కూడేరు మండలం ఇప్పేరులో ఉపాధ్యాయులు గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు వివరించారు. హెచ్ఎం ఓబుళపతి, ఉపాధ్యాయుడు ప్రతాప్ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

WANTED LECTURERS
Swamy Vivekananda Degree & PG College
Mudigallu Road, Kalyanadurgam
LECTURERS: 1) Computer Science 2) Botany
NON TEACHING STAFF: 1) Physical Director
Eligibility: P.G. Degree with 55% Marks in the above Mentioned Subjects
Please Send your Resumes to svndc.kld@gmail.com
Last Date for submission of resumes: 16-07-2025
Interview Date will be announced personally
- Principal
Contact Cell No:
9014219389, 9849038371
9440878029, 9963221275

(c) eenadu

నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు నరసయ్య, ఈశ్వరయ్య మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న కార్మికులకు, సిబ్బందికి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

గుంతకల్లు

• గుంతకల్లు • శింగనమల • తాడిపత్రి

త్వరలో యాడికి కాలువకు మరమ్మతులు

యాడికి: యాడికి కాలువకు మరమ్మతులను త్వరలోనే చేపట్టనున్నట్లు హెచ్ఎల్‌సీ ఎస్ఈ విశ్వనాథరెడ్డి తెలిపారు. పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లి నుంచి క్రిష్టిపాడు వరకు నార్త్ కెనాల్, రాయలచెరువు నుంచి యాడికి వరకు కాలువలో పెరిగిన ముళ్ల పొదలు, మట్టితో నిండిన వాటిని క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ తదితర పనులకు రూ.50లక్షలకు మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. క్రిష్టిపాడు కెనాల్‌కు రూ.30లక్షలు, యాడికి కాలువకు రూ.20 లక్షలు కేటాయించామని, ఈ నిధులు మంజూరైన వెంటనే పనులు చేయిస్తామన్నారు. తాగు,సాగు నీటికి ఉపయోగపడే కాలువకు మరమ్మతులు చేపట్టి నీటి విడుదలకు కృషి చేయాలని ఎస్ఈని మాజీ ఎంపీపీ రంగయ్య కోరారు. హెచ్ఎల్‌సీ ఈఈ వెంకటేశ్వర్లు, ఏఈలు శివశంకరప్ప, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లు ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో ముఖ ద్వారం వద్ద అపరిశుభ్రంగా ఉంది. **- రాజు**

సమాధానం: పారిశుద్ధ్య విభాగ సిబ్బందికి చెప్పి శుభ్రం చేయిస్తాం.
- సంపత్‌కుమార్, ఏవో, ఏరియా ఆసుపత్రి
– న్యూస్‌టుడే గుంతకల్లు పట్టణం

సమస్య : జూలకాల్వ గ్రామంలో మురుగు సమస్య ఉంది. **- రాముడు**

సమాధానం : గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తాం.
- భాస్కర్, ఎంపీడీవో, శింగనమల

సమస్య : ఆనందరావుపేట గ్రామంలో విద్యుత్తు తీగలు కిందకు వాలి ఉన్నాయి.
- ఆదినారాయణ, ఆనందరావుపేట

సమాధానం : త్వరలో సమస్యను పరిష్కరిస్తాం.-విజయ్‌కుమార్, విద్యుత్తు ఏఈ
– న్యూస్‌టుడే శింగనమల

ప్రాంతీయ ఆసుపత్రి.. సమస్యలు జాస్తి

రోగులకు తప్పని తిప్పలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలోని వార్డుల్లో వైద్యం పొందుతున్న రోగులు పలు సమస్యలతో అవస్థ పడుతున్నారు. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా వివిధ రుగ్మతలతో ఆసుపత్రిలో చేరుతున్నారు.

ఏ వార్డుకెళ్లినా.. అంతే..

ఆసుపత్రి మొదటి అంతస్తులోని వృద్ధుల వార్డులో కిటికీలు దెబ్బతిన్నాయి. చానాళ్లుగా మరమ్మతులకు నోచుకోవటం లేదు. ఫలితంగా సాయంత్రం, రాత్రిళ్లు దోమల పోటు ఎక్కువగా ఉంటోందని రోగం తగ్గాల్సింది పోయి ముదురుతోందని బాధితులు వాపోతున్నారు. నాలుగు ఫ్యాన్లలో ఒకటి తిరగడం లేదని చెబుతున్నారు.

● మరుగుదొడ్లల్లో కుళాయిలకు నీరు సరిగా రావడం లేదు. ఉన్నట్టుండి మధ్యలోనే సరఫరా ఆగిపోతోంది. మహిళలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఎటూ వెళ్లలేని వృద్ధుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని రోగి బంధువులు వాపోతున్నారు.

● ఆరో వార్డులో నాలుగు ఫ్యాన్లు ఉన్నాయి. అందులో ఒకటే చాలా రోజులుగా తిరగడం లేదు. ఇక్కడి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉంటుందో మంచాలపై దుప్పట్లు, పరుపులు లేవు. రోగులే ఎవరి అవసరం కొద్ది వారు తెచ్చుకోవాల్సి వస్తోంది. అసలే కష్టాల మధ్య జబ్బులతో బాధపడే రోగులకు ఇది అదనపు భారంగా మారుతోంది.

● తాగునీటి కుళాయిలు ఆసుపత్రి కింది ఆవరణలో ఏర్పాటు చేశారు. అక్కడ కుళాయిలు ఉన్నట్లు రోగులకు తెలియటం లేదు. రోగి సహాయకులు హోటళ్ల నుంచి నీటిని కొనాల్సి వస్తోంది. ఇక్కడంతా అరకొర వసతులతో ఇబ్బంది పడుతున్నామని రోగులు వాపోతున్నారు.

రోగుల వార్డులో దెబ్బతిన్న కిటికీలు

పెరుగుతున్న రోజువారి ఓపీ

ఆసుపత్రిలో రోజు 50 నుంచి 60 మంది దాకా ఇన్‌పేషెంట్లు చేరుతున్నారు. వీరిలో ప్రధానంగా తీవ్ర జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పులు, చర్మ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రోజు వారి ఓపీ 600 నుంచి 700 వరకు ఉంటోంది. ఆసుపత్రిలోని సమస్యలపై సూపరింటెండెంట్ డాక్టర్ అజేంద్రరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆసుపత్రిలోని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి పరిష్కారం చూపుతామన్నారు. ప్రత్యేకంగా కిటికీలకు మరమ్మతులు చేయించి, దోమల బెడద తప్పిస్తామన్నారు.

కొత్తబస్టాండ్ దుస్థితిపై జేసీ ఆరా

మాట్లాడుతున్న జేసీ శివనారాయణశర్మ

పామిడి, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల నాయకులు ఇచ్చిన అర్జీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ కొత్తబసాండ్‌ను వెంటనే తనిఖీ చేయాలని జేసీ శివనారాయణశర్మకు సూచించారు. ఆయన ఆర్టీసీ అధికారులతో కలిసి కొత్త బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొత్తబస్టాండ్‌కు మౌలిక వసతులు కల్పించాలన్నారు. బస్టాండ్ స్థలం ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తాచెదారం తొలగించి బస్టాండ్ ప్రాంగణానికి ప్రహరీ, ప్లాట్‌ఫాంలు, శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారుల గైర్హాజరు

హాజరైన అధికారులు

గుంతకల్లు గ్రామీణం: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అధికారులు కనిపించలేదు. 12 గంటల సమయంలో కేవలం తహసీల్దారు, వ్యవసాయశాఖ అధికారిణి మాత్రమే అందుబాటులో ఉన్నారు. మరో నలుగురు అధికారులు సంతకాలు చేసి కొద్దిసేపు ఉండి పోయారు. పీజీఆర్ఎస్‌లో పాల్గొనాలని అన్నిశాఖల అధికారులకు సందేశం పంపామని తహసీల్దారు రామాదేవి తెలిపారు.

పప్పుల పరిశ్రమలో అగ్నిప్రమాదం

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డులో ఉన్న పప్పుల పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక సీఐ మోహన్‌బాబు తెలిపిన వివరాల మేరకు పరిశ్రమ సమీపంలోని కట్టెలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగి పప్పుల పరిశ్రమలోకి వ్యాపించాయి. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పినట్లు సీఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు. సుమారు రూ.2 లక్షల నష్టం వచ్చిందని బాధితుడు కిషోర్ వాపోయారు.

9న దేశవ్యాప్త సమ్మె

గుంతకల్లు పట్టణం : 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సోమవారం సీఐటీయూ నాయకులు బైకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు నరసయ్య, నాగరాజు, జగదీశ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కేంద్రం విధానాలపై నిరసన తెలిపారు.

కదలని మురుగుతో తిప్పలు

తాడిపత్రి శ్రీనివాసపురంలోని వీధిలో రహదారిపై మురుగు నిలుస్తోంది. కాలువలు లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. చిన్నపాటి వర్షం కురిసినా ఇక్కడ నెలల తరబడి మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని జనం ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై మున్సిపల్ ఏఈ నాగేంద్రను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

-న్యూస్‌టుడే, తాడిపత్రి పట్టణం

అరటి మొక్కల ఉత్పత్తి కేంద్రంతో అభివృద్ధి

తాడిపత్రి, న్యూస్‌టుడే : అరటి టిష్యూ కల్చర్ మొక్కల ఉత్పత్తి, పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయడంతో ఉద్యాన రంగం పరంగా తాడిపత్రి అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తలారిచెరువు గ్రామానికి దిల్లీ నుంచి వచ్చిన బీబీఎస్ఎస్ఎల్ ప్రతినిధి పరేశ్ దేశాయ్, రిసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు జయప్రకాశ్, తివారీలతో కలిసి కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 18లో ఉన్న 50 ఎకరాల్లో పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు విద్యుత్తు సరఫరా, నేల సామర్థ్యం, నీటి సౌకర్యం, రహదారులు అనుకూలంగా ఉన్నాయని కేంద్ర బృందానికి ఆయన వివరించారు. తాడిపత్రిలో అరటి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే నాణ్యమైన అరటిమొక్క దొరుకుతుందని, తద్వారా ఉద్యాన పంటల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. అంతేకాకుండా అరటి ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు రైలు సౌకర్యంగా ఉంటుందన్నారు. భూమికి సంబంధించిన ప్రతిపాదనల అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఆర్డీవో కేశవనాయుడు, జిల్లా ఉద్యానశాఖాధికారి ఉమాదేవి,తహసీల్దార్ సోమశేఖర్, మండల సర్వేయర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ ప్రగతి ఇదేనా?

గుత్తి రైల్వే స్టేషన్‌ను అధికారులు అభివృద్ధి పేరుతో నాశనం చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దాదాపు ఏడాదిన్నర కిందట నూతన రైల్వే బుకింగ్ కార్యాలయం నిర్మాణానికి దాదాపు రూ.10 కోట్లు మంజూరయ్యాయి. దీంతో స్టేషన్ అధికారులు బుకింగ్ కార్యాలయం, సైకిల్ పార్కింగ్ స్థలం వద్ద పెద్ద గుంత తీసి వదిలేశారు. ప్రస్తుతం రైల్వే స్టేషన్ అలంకారప్రాయంగా కనిపిస్తోంది. పనులు మొదలు పెట్టిన వారంలోనే ఆగిపోయాయి. అభివృద్ధి పేరుతో బాగున్న స్టేషన్‌ను నాశనం చేశారని ప్రయాణికులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన బుకింగ్ కార్యాలయాన్ని తొందరగా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే గుత్తి గ్రామీణం

పులగుట్టపల్లి పెద్దతండాలో ఆటోకు నిప్పు

గుంతకల్లు గ్రామీణం : మండలంలోని పులగుట్టపల్లి పెద్దతండాలో తుకారం నాయక్ ఆటోకు గుర్తు తెలియని నిప్పు పెట్టారని రూరల్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. తుకారం నాయక్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం గుంతకల్లు వచ్చి ఆటో నడిపి సాయంత్రం ఇంటికి చేరుకునేవాడు. ఇంటి వద్దనే ఆటో పార్కింగ్ చేయగా, గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటల్లో కాలిపోయిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పసికందు మృతదేహం గుర్తింపు

గార్లదిన్నె: గార్లదిన్నెలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఆరుమాసాలున్న పసికందు మృతదేహం కనిపించడంతో స్థానికంగా కలకలం సృష్టించింది. కాలనీ సమీపంలో ఆరుబయట మృతదేహాన్ని పీక్కుతినడానికి కాకులు గుంపులు గుంపులుగా ఉండటంతో వాటిని గమనించిన స్థానికులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. వీఆర్వో రవిశంకర ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

డిగ్రీ కళాశాలకు న్యాక్ గ్రేడ్

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలకు రెండోసారి న్యాక్ గ్రేడ్ గుర్తింపు వచ్చిందని కరస్పాండెంట్ కేసీ హరికుమార్, ఛైర్మన్ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం కళాశాలలో వారు మాట్లాడుతూ కళాశాల పక్కగా విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఉందని, అందువల్లే ఇప్పుడున్న న్యాక్ గ్రేడ్‌ను మరో ఐదేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వ సంస్థ నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. రెండోసారి న్యాక్ గ్రేడ్ రావడంతో కళాశాల యజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. న్యాక్ గ్రేడ్ గుర్తింపు రావడానికి సహకారం అందించిన నటరాజ్‌ను సత్కరించారు. ఈకార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపల్ సురేశ్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హనుమాన్ వాహనంపై పాండురంగడు

పామిడి, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం మూడో రోజు బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాండురంగ స్వామి సోమవారం హనుమాన్ వాహనంపై సన్నాయి వాయిద్యాలు, మేళతాళాల నడుమ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రంగసుభే ఫిర్కా భగవాన్ దాసు భావసార క్షత్రియ సమాజ్ సభ్యుల ఆహ్వానం మేరకు విఠోబ దేవాలయంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కార్మిక సంక్షేమ శాఖ బోర్డు అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, పామిడి, గుత్తి మండలాల బాధ్యుడు గుమ్మనూరు ఈశ్వర్ పాండురంగ స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయాల ఈవో కృష్ణయ్య, భావసార క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు నాగభూషణం, ఉపాధ్యక్షుడు స్వామిరావు, మంజునాథ్ రావు, పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా విజయలక్ష్మి

విజిలెన్స్ కమిటీ సభ్యురాలి విజయలక్ష్మిని సత్కరిస్తున్న మహిళలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్- సివిల్ సప్లయ్ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా తనకు నామినేటెడ్ పదవి దక్కిందని విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి విజిలెన్స్ కమిటీ సభ్యులుగా నియామకం చేయడంతో ప్రధాని నరేంద్రమోదీ, జాతీయ అధ్యక్షుడు నడ్డా, సీఎం చంద్రబాబునాయుడు, పురందరేశ్వరికి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం ఎఫ్‌సీఐ గోదాం మహిళ హమాలీలు ఆమెను ఘనంగా సత్కరించారు.

ఇసుక దందా సాగుతున్నా తెలియదా: వైకాపా

అనంత నగరపాలక, న్యూస్‌టుడే : జిల్లాలోని శింగనమల, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో ఇసుక నిల్వ చేసి కూటమి నాయకులు భారీగా విక్రయాలు జరుపుతున్నారని శింగనమల నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త శైలజానాథ్ ఆరోపించారు. ఇదంతా చంద్రబాబుకు తెలియకుండా సాగుతోందా? అని ఆయన ప్రశ్నించారు. సోమవారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణుల కోసం తెచ్చిన ఉపాధి హామీ పథకం తెదేపా నాయకులు దోచుకోవడానికి వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. శింగనమలలో నకిలీ మస్టర్లు వెలుగు చూస్తున్నాయని, బుక్కరాయసముద్రం మండలంలో ఉపాధి హామీ పథకం గ్రూపులో నాలుగు పేర్లు ఉంటే 10 మంది ఫొటోలు కనిపిస్తున్నాయన్నారు. పాత కుంటలకు కొత్తగా బిల్లులు చూపి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. చెన్నంపల్లిలో వాటాల కోసం కొట్టుకుంటున్నా ఎవరికీ పట్టడం లేదన్నారు. కళ్యాణదుర్గంలో స్టాంపుల కుంభకోణానికి పాల్పడి ఒకరినొకరు ఫిర్యాదు చేసుకుంటే, అనంతపురంలో వారి పార్టీ నాయకుడిని హత్య చేయడానికి ప్రయత్నించారని వారే ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. కలెక్టర్ చొరవ చూపి అధికార పార్టీ ఆగడాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

'పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేస్తాం'

గుంతకల్లు పట్టణం : జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పార్టీని బలోపేతం చేయాలని కష్టపడుతుంటే కొందరు పార్టీని దెబ్బతీస్తున్నారని, విజయవాడకు వెళ్లి ఫిర్యాదు చేస్తామని వీర మహిళలు పేర్కొన్నారు. సోమవారం గుంతకల్లులో ఇల్లూరు భవనంలో జనసేన పార్టీ వీర మహిళలు వక్కల ఉమా ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వక్కల ఉమా, జ్యోతి మాట్లాడుతూ గుంతకల్లులో నియోజకవం సమస్వయకర్తగా చెప్పుకొంటున్న ఓ వ్యక్తి అందర్నీ కలుపుకొని పోవటం లేదన్నారు. ఆయనకు పదవి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. 2014 నుంచి పార్టీలో వీరమహిళలు క్రియాశీలక సభ్యులుగా పని చేస్తున్నారన్నారు.సభ్యురాళ్లు స్వర్ణలత, శారద, సునీత, తులసి, జ్యోతి పాల్గొన్నారు.

'ప్రజల్లో తిరిగి తెదేపాను బలోపేతం చేద్దాం'

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి, న్యూస్‌టుడే : గ్రామస్థాయిలో నిత్యం ప్రజలతో తిరుగుతూ వారి సమస్యలు పరిష్కరించినప్పుడే తెదేపా బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక జేసీ నివాసంలో తెదేపా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, గ్రామంలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన సూచించారు. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల దగ్గరపడ్డాయని, వాటిలో విజయం సాధించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. సాయంత్రం ఆయన పట్టణంలోని మెయిన్‌బజార్, ఓంశాంతినగర్ తదితర కాలనీల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో తెదేపా కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

'పెద్దారెడ్డి తాడిపత్రికొస్తే అడ్డుకుంటాం'

తాడిపత్రి, న్యూస్‌టుడే: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా తాడిపత్రికి పెద్దారెడ్డి వస్తే అడ్డుకుంటామని తెదేపా కౌన్సిలర్ మల్లికార్జున హెచ్చరించారు. సోమవారం ఆయన జేసీ నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి ఉందని, తాడిపత్రిలో ఉన్న నాయకులు నిరభ్యంతరంగా జరుపుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఆయన కుమారులు వస్తే వందలాదిమంది తెదేపా శ్రేణులతో అడ్డుకుంటామన్నారు. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఆయన చేసిన అరాచకాలకు ప్రజలే ఆయున్ను అడ్డుకుంటారన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు విజయ్‌కుమార్, రాగేజ్యోతి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి

కరపత్రాలు అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, వెంకటశివుడు యాదవ్, గుమ్మనూరు ఈశ్వర్

పామిడి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని కటికవీధిలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కార్మిక సంక్షేమ శాఖ బోర్డు అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, గుత్తి, పామిడి మండలాల బాధ్యుడు గుమ్మనూరు ఈశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తెదేపాతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజల సమస్యలను అడిగి తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, తల్లికి వందనం పథకంపై ఆరా తీశారు. అన్నదాత సుఖీభవ పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి మరెన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో పామిడి పట్టణ, మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పెద్దవడుగూరు: కేకు కోసి సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : ఎమ్మార్పీఎస్ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని నాయకులు కోరారు. ఎమ్మార్పీఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం, పార్టీ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా పెద్దవడుగూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేకు కోసి సంబరాలు చేశారు. మండల గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు రంగస్వామి, దేవరాజు, మారయ్య, పెద్దలయ్య, మధుసూదన్ పాల్గొన్నారు.

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని ఎమ్మార్పీఎస్, భాజపా నాయకులు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. భాజపా రాష్ట్రనాయకుడు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి పోరాడుతున్న గొప్ప నాయకుడు మందకృష్ణ అని అన్నారు. అనంతరం వైద్యవిధాన ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు, పండ్లు అందజేశారు.

ఊరేగింపులో ఏఎస్ఐ నృత్యం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో సోమవారం పీర్ల మకానం వద్ద ఏఎస్ఐ మాణిక్యం తన సిబ్బందితో కలిసి నృత్యం చేసి అందర్నీ ఉత్సాహపరిచారు. ఆయన బందోబస్తులో భాగంగా పీర్ల వద్దకు వెళ్లారు. ఏఎస్ఐ స్థానికుడు కావడంతో గ్రామస్థులతో కలిసి ఆనందంగా గడిపారు. అక్కడి మిత్రులు, గ్రామస్థులను చూసి వారిలో ఉత్సాహం నింపిందుకు చిందులు వేయడం అందర్నీ ఆకట్టుకుంది.

భక్తిశ్రద్ధలతో పెద్దసరిగెత్తు

కొలువుదీరిన పీర్లు

గార్లదిన్నె: గార్లదిన్నెలో సోమవారం పెద్దసరిగెత్తు సందర్భంగా మొహర్రం పీర్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. మొక్కుబడి ఉన్న భక్తులు పానకాలతో వెళ్లి భక్తిశ్రద్ధలతో చక్కెర చదివింపులు చేశారు.

గూగూడు వీధుల్లో పీర్లు

బుక్కరాయసముద్రంలో

గుత్తి ప్రధాన రోడ్డులో..

జలధికి తరలిన పీర్లు

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో మొహర్రాన్ని పురస్కరించుకొని కొలువుదీరిన పీర్లను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జలధికి తరలించారు. ఉదయాన్నే ఆయా చావిడిల వద్ద పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. ఆ దృశ్యాలను చూడటానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ప్రధానంగా నార్పల మండలం గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి అగ్నిగుండ ప్రవేశం చూడానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. అన్ని ప్రాంతాల్లో మతసామరస్యం వెల్లివిరిసింది. -న్యూస్‌టుడే బృందం

శింగనమలలో..

యాడికిలో

పెద్దవడుగూరులో

నందలపాడులో

ఫ్యాక్షన్ గ్రామంలో మొహర్రం

దిమ్మగుడిలో గుండం తవ్వకాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : మండలంలోని సమస్యాత్మక ఫ్యాక్షన్ గ్రామమైన దిమ్మగుడిలో ముప్పైఏళ్ల తర్వాత మొహర్రం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అనుమతులు రావడంతో సోమవారం అగ్నిగుండం తవ్వకాన్ని గ్రామస్థులు ప్రారంభించారు. పూర్తిస్థాయి కట్టుదిట్టమైన నిబంధనల మధ్య మొహర్రం నిర్వహించుకునేందుకు పోలీసు యంత్రాంగంతో పాటు ఉన్నతాధికారులు అనుమతులు ఇవ్వడంతో సీఐ రామసుబ్బయ్య, ఎస్సై ఆంజనేయులు ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. గ్రామంలో సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇప్పటికే గ్రామంలో ప్రత్యేక బలగాలను దింపడంతోపాటు పలువురిపై బైండోవర్ నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

(c) eenadu

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

ముగిసిన మొహర్రం

ఆత్మకూరులో జలధికి తరలుతున్న పీర్లు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఆత్మకూరు, పి.యాలేరు గ్రామాల్లో సోమవారం మొహర్రం ప్రశాంతంగా ముగిసింది. యువత పీర్లను ఎత్తుకొని అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఇతర గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలి రావడంతో ఆత్మకూరు వీధులు జనసంద్రంగా మారాయి. జలధి అనంతరం పీర్లను తిరిగి చావిడికి చేర్చి ప్రార్థనలు చేశారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై జరిమానా

దుకాణంలో తనిఖీ చేస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అనంత పరిరక్షక్ ద్వారా మొదటి రోజే ఆశావహ ఫలితాలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఇంజినీరు మునిప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలోని పాతూరు, గుత్తిరోడ్డు, కళ్యాణదుర్గం బైపాస్, రాజు రోడ్డు తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. దాడులు చేస్తున్నారని తెలియగానే యజమానులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. ఈసందర్భంగా రెండు పరిశ్రమలకు రూ.50 వేలు, మొదటి సారి తప్పు చేసినందుకు మరో దుకాణానికి రూ.20 వేలు జరిమానా విధించారు. వంద కిలోల ప్లాస్టిక్, ఇతర నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకొని నగరపాలక కార్యాలయానికి అప్పగించారు. జరిమానా సొమ్మును నగరపాలకకు చలానా రూపంలో చెల్లించారు.

తాగునీటి కష్టాలు ఇంకెన్నాళ్లూ?

- విద్యుత్తు నియంత్రిక ఏర్పాటుకు ఎదురుచూపులు
- భైరవనగర్ వాసులకు తప్పని ఇబ్బందులు

వినియోగంలోకి రాని ట్యాంకు

తపోవనం(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణ పంచాయతీ పరిధిలోని పలు కాలనీలకు తాగునీటిని సరఫరా చేయాలని నిర్మించిన ట్యాంకు ఇంకా వినియోగంలోకి రాలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి సరఫరాకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నా విద్యుత్తు కనెక్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో భైరవనగర్‌లో నీటి సమస్య పరిష్కారం కాలేదు. అనంతపురం గ్రామీణ మండలంలోని భైరవనగర్‌కు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల ఎదురుగా భూమి లోపల నీటి ట్యాంకు నిర్మించారు. 2.50 లక్షల సామర్థ్యంతో నిర్మించి ఈ ట్యాంకు నిర్మించి రెండేళ్లు పూర్తయింది. దీన్ని ఎవరూ పట్టించుకోనందున 'ఈనాడు-మీతోడు' దృష్టికి భైరవనగర్ వాసులు తెచ్చారు. నిరుపయోగంగా ఉన్న ట్యాంకుపై 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. నీటి సరఫరాకు అవసరమయ్యే పైప్‌లైన్ పనులు, మోటారు బిగించారు.

కనెక్షన్ ఇస్తే సమస్య పరిష్కారం

విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాలని ట్రాన్స్‌కో అధికారులను సంప్రదించాం. ట్యాంకు ద్వారా నీటి సరఫరాకు అవసరమైన అన్ని పనులు పూర్తి చేశారు. 25 కేవీ విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేసి సబ్‌మర్సిబుల్ మోటారుకు కనెక్షన్ ఇస్తే భైరవనగర్‌కు నీటి సమస్య తీరుతుంది. **- హరికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ**

రెండు నెలలుగా విన్నవిస్తున్నా పట్టదా?

కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల ఎదురుగా నిర్మించిన ఈ ట్యాంకుకు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సమ్మర్ స్టోరేజీ నుంచి నీరు సరఫరా చేయడానికి పైప్‌లైన్ ఉంది. సుశీలారెడ్డి కాలనీకి వెళ్లే పైప్‌లైన్‌కు ఈ ట్యాంకు పైప్‌లైన్ అనుసంధానం చేశారు. ట్యాంకు నుంచి కాలనీలకు నీటిని సరఫరా చేయాలంటే త్రీఫేజ్ కనెక్షన్ మోటారు కావాలి. ట్యాంకు లోపలే సబ్‌మర్సిబుల్ మోటారును అమర్చారు. దీనికి విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాలంటే ఒక నియంత్రిక ఏర్పాటు చేయాలి. అలా కాకుంటే తాత్కాలికంగా జేఎన్‌టీయూ నుంచి విద్యుత్తు సరఫరా చేయడానికి వెసులుబాటు ఉంది. పంచాయతీ అధికారులు రెండు నెలల నుంచి విద్యుత్తు అధికారులను కనెక్షన్ కోసం వెంటపడుతున్నారు. అయినా ఎవరూ స్పందించలేదు. అధికారుల బదిలీలు జరగడంతో ఆలస్యం అవుతుందని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు.

పోగొట్టుకున్న వస్తువుల అప్పగింత

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఓ యువతి బస్సులో పోగొట్టుకున్న వస్తువులను చెన్నేకొత్తపల్లి పోలీసులు సోమవారం అందజేశారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం నగరానికి చెందిన తేజస్విని బెంగళూరులోని ఓ కంపెనీలో టెకీగా విధులు నిర్వహిస్తోంది. అక్కడి నుంచి స్వగ్రామం అనంతపురానికి ఆదివారం ఉదయం 8 గంటలకు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. రాప్తాడు వద్ద ల్యాప్‌టాప్, ఇతర లాగేజీ బ్యాగుల కోసం చూడగా కనిపించలేదు. వెంటనే తన అన్నకు ఫోన్ చేసి విషయం తెలిపింది. ఇద్దరు చెన్నేకొత్తపల్లి ఠాణాకు వచ్చి ఫిర్యాదు చేశారు. ఎన్ఎస్‌గేట్‌లో 14 మంది బస్సు దిగారని, వారే తన వస్తువులు తీసుకెళ్లి ఉంటారని అనుమానం వ్యక్తం చేసింది. చెన్నేకొత్తపల్లి ఓబుళ లక్ష్మీనరసింహస్వామి పూజా కార్యక్రమాల కోసం పలువురు బెంగళూరు నుంచి వచ్చారు. బస్సు దిగి వచ్చిన వారెవరైనా ల్యాప్‌టాప్, ఇతర వస్తువులు పొరపాటున తీసుకెళ్లి ఉన్నారేమోనని మైక్ ద్వారా విషయాన్ని భక్తులకు తెలియజేశారు. 10 నిముషాలకే ఓ వ్యక్తి వచ్చి వస్తువులను పోలీసులకు అందజేసి వెళ్లిపోయాడు. ఆ వస్తువులను సోమవారం స్టేషన్‌లో యువతికి అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 8008573011
రాంనగర్: 8008573001
కమలానగర్: 7032975446

సమస్య: రహమత్ నగర్ 12వ క్రాస్‌లో వీధి దీపాలు వెలగక చీకటిగా ఉంది. **- కాలనీవాసులు**

సమాధానం: సిబ్బందిని పంపి వెంటనే వీధి దీపాలు వెలిగే విధంగా చర్యలు చేపడతాం.

సమస్య: తాపీకట్టి బస్టాండ్‌లో ఆవుల బెడద అధికంగా ఉంది. **- ప్రభాకర్**

సమాధానం: యజమానులకు తాఖీదులు ఇస్తాం. **పై ప్రశ్నలకు నగరపాలక డీఈ దస్తగిరి, ఎంహెచ్ఓ రంగస్వామి సమాధానాలు ఇచ్చారు. - న్యూస్‌టుడే, అశోక్‌నగర్**

సమస్య: ఆత్మకూరులోని ఓసీ కాలనీలో ఇళ్ల మధ్య మురుగు నిలిచిపోయి అపరిశుభ్రంగా మారింది. **- సావిత్రి**

సమాధానం: పంచాయతీ కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం. **- సాదిక్‌వలి, పంచాయతీ కార్యదర్శి, - న్యూస్‌టుడే, ఆత్మకూరు**

'దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి'

ద్విచక్ర వాహన ప్రదర్శన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ఈనెల 9న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సోమవారం అనంతపురం నగరంలో కార్మిక సంఘాలు ద్విచక్ర వాహన ప్రదర్శన చేశారు. నాయకులు రాజారెడ్డి, నాగేంద్రకుమార్, యేసురత్నం, ఓబిరెడ్డిలు మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను కాలరాసి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను భాజపా పాలిత రాష్ట్రాలు అమలు చేయలేకపోయాయి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తొందరపడి పని విధానాన్ని 8 నుంచి 10 గంటలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం కార్మికులకు ద్రోహం చేసినట్టేనన్నారు. ఈ విధానాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని, నిత్యావసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఇంటికొక వ్యాపారవేత్త లక్ష్యం

వీసీ సుదర్శన్‌రావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: ఇంటికో వ్యాపారవేత్త కావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ అన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగంగా అనంతపురం జేఎన్‌టీయూలో ఏర్పాటు కాబోతున్న స్పోక్ సెంటర్‌పై సోమవారం సాయంత్రం అనంతపురం రహదారుల, భవనాలశాఖ అతిథి గృహంలో వీసీ సుదర్శన్ రావుతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. స్పోక్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. స్పోక్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్లు విడుదల చేసిందని, ఎక్కువ మంది యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని వీసీని ఎమ్మెల్యే కోరారు.

రాంనగర్(అనంతపురం): పేదలందరికి సంక్షేమ పథకాలు దరిచేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం 19వ డివిజన్‌లోని సాయినగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు పంచారు. సూర్యనగర్ కాలనీలో మరువ వంకతో ఇబ్బందులు పడుతున్నామని, భారీ వర్షాలు వస్తే ఇళ్లలోకి నీరు చేరుతోందని ప్రజలు మొరపెట్టుకున్నారు. రక్షణ గోడల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జనతా వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా మేల్ హెల్త్ అసిస్టెంట్లకు నిర్వహించిన ఒకరోజు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీ సిబ్బందితో ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. చెత్తను తొలగించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి పరీక్షలు నిర్వహించి, వారిని చికిత్సల కోసం ఆసుపత్రులకు పంపాలని సూచించారు.

'ఉపాధి పనుల్లో కూటమి నేతల అవినీతి'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అనంత జిల్లాలో శింగనమల, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో ఇసుక డంపులుగా నిల్వ చేసి కూటమి నాయకులు అమ్ముకుంటున్నారని శింగనమల నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త శైలజానాథ్ ఆరోపించారు. వైకాపా జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'గ్రామీణుల కోసం తెచ్చిన ఉపాధి హామీ పథకం తెదేపా నాయకులు దోచుకోవడానికి వాడుకుంటున్నారు. శింగనమలలో నకిలీ మస్టర్లు వెలుగు చూస్తున్నాయి. బుక్కరాయసముద్రం మండలంలో ఉపాధి హామీ పథకం గ్రూపులో నాలుగు పేర్లు ఉంటే 10 మంది ఫొటోలు ఉన్నాయి. పాత కుంటలకు కొత్తగా బిల్లులు చూపి సొమ్ము చేసుకుంటున్నారు. చెన్నంపల్లిలో వాటాల కోసం కొట్టుకున్నారు. కళ్యాణదుర్గంలో స్టాంపుల కుంభకోణానికి పాల్పడి ఒకరినొకరు ఫిర్యాదు చేసుకుంటే, అనంతపురంలో వారి పార్టీ నాయకున్ని హత్య చేయడానికి ప్రయత్నించారని వారే ఫిర్యాదు చేశారు. కలెక్టర్ చొరవ చూపి అధికార పార్టీ శ్రామికులను దోచుకోకుండా చర్యలు చేపట్టాలి" అని కోరారు.

బదిలీ ఉత్తర్వులు ఇవ్వండి

నిరసన తెలుపుతున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీల విషయం ఎటు తేలడం లేదు. బదిలీల ప్రక్రియ పూర్తి అయినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు ఏఎన్ఎంలకు ఉత్తర్వులు జారీ చేయలేదు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి ఏఎన్ఎంల సమస్యను డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి.దేవి తీసుకెళ్లారు. ఈ విషయంపై తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై ఆదేశాలు అందకపోవటంతో నిరీక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా బదిలీ ఉత్తర్వులు అందజేయాలని కోరుతూ సంబంధిత ఏఎన్ఎంలు డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చారు.

ఏడు రోజులుగా తిరుగుతున్నా పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు త్వరితగతిన ఏదో ఒక విషయం తేల్చాలని డిమాండ్ చేస్తూ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

నగరవాసికి భారత్ గౌరవ్ సమ్మాన్ పురస్కారం

అనంత సాంస్కృతికం: ఉత్తర్‌ప్రదేశ్, ముంబయి ఇస్కాన్ ఇన్‌ఛార్జి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ప్రణవానంద దాస్ స్వామిజీ చేతుల మీదుగా నగరానికి చెందిన విజయ సాయి ట్రస్టు వ్యవస్థాపకుడు విజయసాయికుమార్ భారత్ గౌరవ్ సమ్మాన్ అవార్డు అందుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌కు చెందిన జన జాగృతి సేవా సమితి అందించే ఈ అవార్డును స్వామిజీ చేతుల మీదుగా అందించారు.

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE OF CHITTOOR.
D.O.P.NO. 339 OF 2023.
Between
K. Abhijeeth ...Petitioner.
And
R. Reshma ..Respondent.
NOTICE TO THE RESPONDENT.
R. Reshma W/o K. Abhijeeth D/o S. Sattar, r/at D.No.11/348, 1st Cross, Aravind Nagar, Ananthapur Town,Post and Dt, A.P.
The Petitioner has filed the above Petition against you seeking relief of dissolving his marriage dt.22-12-2017 performed with you by grant of decree of divorce. The above case stands posted to 30-07-2025 for your appearance and filing your objections if any. On that day please be present at 10.30 A.M., either in person or through an Advocate and file your objections if any before the above said Hon'ble Court and if you fail to do so the matter will be decided Ex-Parte in your absence.
Sd/- S.BALAIAH
Advocate for the Petitioner

అంధులకు దుప్పట్ల వితరణ

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: కురుగుంటలోని అంధుల ఆశ్రమంలో విశ్రాంత ఏడీఏ వెంకటరమణ సోమవారం అన్నదానం, దుప్పట్ల పంపిణీ చేపట్టారు. తన మనవడు, మనవరాలి జ్ఞాపకార్థం ఆయన 40 మంది అంధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పెద్దాసుపత్రి వద్ద రోగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు విజయ్, చంద్రమౌళి, గురుమూర్తి, మల్లికార్జున, కృష్ణమూర్తి, విశ్వనాథ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ, కార్మిక సంఘం నాయకులు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలను అధికారులు గాలికి వదిలేశారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్‌గౌడ్ విమర్శించారు. సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నగరపాలక కార్యాలయం వద్ద పరికరాలతో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. రాజేశ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు, వారి గోడు వినే ఓపిక లేకపోవడం దారుణం అన్నారు. 30 ఏళ్ల పాటు పని చేయించుకొని పదవీ విరమణ సమయంలో ఒట్టి చేతులతో ఇళ్లకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కోశాధికారి వేణుగోపాల్, నాయుడు, రామాంజనేయులు, కుళ్లాయిరెడ్డి పాల్గొన్నారు.

'కార్మికులను మోసం చేసిన వైకాపా'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి రాష్ట్రంలోని 13 వేల మంది కార్మికులను మోసగించిందని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు విమర్శించారు. సోమవారం నగరపాలక కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. నగరపాలక కార్యాలయం నుంచి గడియార స్తంభం వరకు ర్యాలీ కొనసాగింది. కూటమి ప్రభుత్వమైనా న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో ఈనెల 12 అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె చేపడతామన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, కోశాధికారి పోతులయ్య పాల్గొన్నారు.

'ఇంటర్ ఎస్సీ విద్యార్థులు ఖాతా తెరవాలి'

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు తల్లికి వందనం సొమ్ము ఖాతాలో జమ కావాలంటే ఎన్‌పీసీఐ లింకుతో కూడిన ఖాతా తెరవాలని సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి రామాంజనేయులు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన ప్రభుత్వం తల్లికి వందనం సొమ్ము జమ చేయనుండటంతో ఈనెల 9లోగా విద్యార్థి పేరు మీద పోస్టాఫీసులో లేదా బ్యాంకులో ఖాతా తెరవాలన్నారు.

మందకృష్ణ మాదిగ పోరాటాలు స్ఫూర్తిదాయకం

రుద్రంపేట, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా సోమవారం మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో నాలుగో రోడ్డులోని అంధుల ఆశ్రమంలో కేకు కోసి సంబరాలు చేశారు. మందకృష్ణ పోరాటాల ఫలితంగా పింఛన్ రూ.6000 వస్తుండటంపై అంధులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి చిన్న సుబ్బారావు, ఎంఈఎఫ్ జాతీయ నాయకులు బండారు శంకర్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కదిరప్ప, జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్, ఎంఈఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అమర్‌నాథ్, రాష్ట్ర నాయకులు గంగాధర్, హనుమంతరావు, మహిళ నాయకురాలు స్వతంత్ర కుమారి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన

కమలానగర్, న్యూస్‌టుడే: నగరంలోని అశోక్‌నగర్ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. నిర్వాహకుడు సంజయ్ జైన్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలో మహిళలకు, చిన్నారులకు కావాల్సిన అన్ని రకాల వస్త్రాలు, ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 వరకు ఈ ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు. అన్ని రకాల చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామన్నారు.

మహిళా కార్మికులకు చీరల పంపిణీ

కమలానగర్, న్యూస్‌టుడే: నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ నిర్మలమురళి, ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో సోమవారం 25 మంది మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యుడు నేనుభాయ్ త్రిలోక్‌చంద్ జ్ఞాపకార్థం వీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. సభ్యులు సాయిపల్లవి, నాగరాజు, రాము, సరస్వతి, సరోజమ్మ పాల్గొన్నారు.

ఆప్కో దుకాణాల్లో ఆషాఢమాస ఆఫర్లు

కమలానగర్, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆప్కో దుకాణాల్లో ఆషాఢమాసం సందర్భంగా చేనేత వస్త్రాలపై ఆఫర్లను విడుదల చేసినట్లు మండల వాణిజ్య అధికారి శివప్రసాద్ తెలిపారు. చేనేత వస్త్రాలపై 30 శాతం, ఎంపిక చేసిన వస్త్రాలపై 70 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

టిడ్కో సొమ్ము వెనక్కి ఇవ్వాలి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: గతంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాల కోసం తీసుకున్న సొమ్ము వెనక్కి ఇవ్వాలని పలువురు లబ్ధిదారులు కోరారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పలువురు లబ్ధిదారులు తాము డీడీల రూపంలో కట్టిన నగదు తిరిగివ్వాలని డిప్యూటీ కమిషనరు పావనికి విన్నవించారు. వేణుగోపాల్ నగర్‌లో రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ, కార్మికుల సమస్య తదితర 12 ఫిర్యాదులు అందాయి.

10న శ్రీనివాసుడి కల్యాణం

అనంత సాంస్కృతికం: గురుపౌర్ణమి పురస్కరించుకుని స్థానిక హెచ్చెల్సీ కాలనీ కొల్హాపూర్ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఈనెల 10న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణోత్సవం వైభవంగా జరుపుతున్నట్లు నిర్వాహకుడు విజయ్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం 4.30కు జరిగే ఈ ఉత్సవానికి కణంపల్లి ఉమారాణి, మనూరు నాగరాజురావు దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరిస్తారన్నారు.

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : గంగా : **మార్గన్**, గౌరి, త్రివేణి : **కన్నప్ప**, ఎస్వీ సినిమా, నీలిమ : **తమ్ముడు**, గౌతమి : **జురాసిక్ వరల్డ్**, గాయత్రి : **3బీహెచ్‌కే**, తరంగిణి : **సోలో బాయ్**, శాంతి : **కుబేర**, సుధా : **షో టైం**.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: నగరంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ రఘునాథ రెడ్డి తెలిపారు. పౌరశాస్త్రం, వృక్షశాస్త్రం సబ్జెక్టు అధ్యాపకులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. పీజీలో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులు. ఈ నెల 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 14వ తేదీన మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

తెదేపాతోనే సుపరిపాలన

రుద్రంపేట, న్యూస్‌టుడే: తెదేపాతోనే ప్రజలకు సుపరిపాలన అందుతోందని మాజీ ఎంపీటీసీ నారాయణస్వామి పేర్కొన్నారు. సోమవారం అనంతపురం గ్రామీణం (మండలం) కక్కలపల్లి పంచాయతీ పరిధి పురుషోత్తం కాలనీలో ఏడాది పాలనపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. స్థానిక నాయకులు నరసింహులు, అన్వర్‌బాషా, రాయల్ రాజు పాల్గొన్నారు.

శిథిల కల్వర్టులు.. ప్రమాద హేతువులు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: అనంతపురం నగరంలోని పలుప్రాంతాల్లో కల్వర్టులు దెబ్బతిని అధ్వానంగా మారాయి. దీంతో మురుగు నీరు అస్తవ్యస్తంగా పారుతోంది. కల్వర్టులపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో కల్వర్టుల మరమ్మతుల కారణంగా పాఠశాలలకు వెళ్లి వస్తున్న విద్యార్థులు కిందపడుతున్నారు. వాటికి మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

కోవూరునగర్ నాలుగో క్రాస్ వద్ద మూడు నెలల కిందట కల్వర్టు మరమ్మతుకు గురైంది. నిత్యం వందల సంఖ్యలో పాఠశాల విద్యార్థులు, వాహనదారులు ఈదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. ఐదో తరగతి చదువుతున్న హేమంత్‌కుమార్ అనే విద్యార్థి సైకిల్‌పై పాఠశాల నుంచి వస్తూ కిందపడటంతో కుడి కాలికి గాయమైంది. నిత్యం ఎవరో ఒకరు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

లక్ష్మీనగర్ నీలం సంజీవరెడ్డి బంగ్లా ఎదురుగా వీధిలో కల్వర్టు ఐదు నెలల కిందట దెబ్బతింది. ఈ కారణంగా కాలువలో చెత్తా చెదారం పడి మురుగునీరు పారడం లేదు. తీవ్ర దుర్వాసనతో ముక్కుమూసుకొని వెళ్లే పరిస్థితి. కల్వర్టు నుంచి ప్రధాన దారిలోకి వెళ్లటానికి దాదాపు 40 ఇళ్లు ఈ చుట్టుపక్కల ఉన్నాయి. వారంతా నిత్యం ఇదే దారిలో ప్రయాణం సాగిస్తుంటారు. పెద్ద వాహనాలు కాలనీల్లో రావాలంటే ఇబ్బందిగా ఉందని స్థానికులు చెబుతున్నారు. మరమ్మతులు చేసి రాకపోకలకు సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఈనెల 8న మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కనీసం 2 వేల ఎకరాల్లో మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే హాజరవుతారు. నిర్దేశిత లక్ష్యాన్ని నెలాఖరు నాటికి పూర్తి చేసేలా పక్కా కార్యాచరణ ఉండాలని కలెక్టర్ సూచించారు. ఏ ఎమ్మెల్యే ఎక్కడెక్కడ పాల్గొంటారో, ఆ వివరాలను డ్వామా పీడీ సలీమ్‌బాషా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో సోమవారం రాత్రి దిచక్ర వాహనం ఢీకొని ఈశ్వరయ్య (54) మృతిచెందాడు. సదరు వ్యక్తి స్థానిక రుద్ర వైన్స్ వద్ద రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. ట్రాఫిక్ సీఐ వెంకటేశ్‌నాయక్ ఘటనా స్థలిని చేరుకుని క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి జేబులో ఆధార్ కార్డు ఉండటంతో ధర్మవరానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

(c) eenadu

ఈనాడు
అన్నమయ్య
మంగళవారం జులై 8, 2025

దొంగనోట్ల కలకలం

- వాల్మీకిపురంలో జోరుగా మార్పిడి
- బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు
- గతంలో ప్రొద్దుటూరులో వైకాపా నేత చలామణి

– ఈనాడు, కడప

దొంగనోట్లు తరచూ కలకలం రేపుతున్నాయి. ఇటీవల లేకపోయినా తాజాగా వాల్మీకిపురంలో ప్రత్యక్షమయ్యాయి. ఈ దందాకు బెంగళూరు నగరం నిలయంగా మారింది. ఈ వ్యవహారం వైకాపా హయాంలోనూ సంచలనంగా మారింది. ప్రొద్దుటూరు కేంద్రంగా వైకాపా హయాంలో ఆ పార్టీ నేత, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ రసపుత్ర రజని దొంగనోట్లు చలామణి చేస్తూ పట్టుబడ్డారు. అప్పట్లో జిల్లా పోలీసులకు వ్యవహారం తెలిసినా వైకాపా పెద్ద తలల అండ ఉండటంతో పట్టించుకోలేదు. చివరకు బెంగళూరులోని సుబ్రహ్మణ్యపురం ఠాణా పోలీసులు దొంగనోట్ల కేసులో అరెస్టు చేశారు. ఈ కేసులో రజనితో పాటు చరణ్‌సింగ్, గోపీనాథ్, పుల్లలరేవు రాజాలను నిందితులుగా గుర్తించారు. ప్రొద్దుటూరు పురపాలక సంఘంలో పొరుగు సేవల కింద పని చేసే చరణ్‌సింగ్‌ను దొంగనోట్ల చలామణికి రజని వినియోగించుకున్నట్లు పోలీసులు అభియోగాలు నమోదు చేశారు. రజని నుంచి రూ.44.09 లక్షల నకిలీ నోట్లను గుర్తించారు. ఈ వ్యవహారం వైఎస్సార్ కడప జిల్లాలో కలకలం రేపింది. తీవ్ర అలజడి చెలరేగడంతో అప్పట్లో ఆమెను నామినేటెడ్ పదవి నుంచి వైకాపా ప్రభుత్వం తొలగించింది. ఈమె కారణంగానే జిల్లాలోకి భారీగా దొంగనోట్లు చలామణిలోకి వచ్చాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత వ్యవహారం చల్లబడి పోగా ఇప్పుడు వాల్మీకిపురంలో పట్టుబడిన నిందితులతో మరోసారి వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

రాయచోటిలో పోలీసులు ప్రదర్శించిన దొంగనోట్లు

బీజాపూర్‌లో పడిన బీజం

కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ నుంచి అన్నమయ్య జిల్లాలో దొంగనోట్ల చలామణికి బీజం పడింది. గతంలో పలుసార్లు ఈ నేరాలు వెలుగు చూసినా కర్ణాటకతో లింకు బయటపడింది. ఇప్పుడు సైతం బీజాపూర్‌లో రాథోడ్ కార్యకలాపాలు నడుపుతున్నట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. ఇప్పుడు రాథోడ్ పరారీలో ఉండగా... ఇది వరకు బీజాపూర్‌లో పలు కేసుల్లో ఇరుక్కున్నారు. ఇక బీజాపూర్ నుంచి వ్యవహారం సాగదని తెలుసుకున్న రాథోడ్ మదనపల్లె కేంద్రంగా దందా సాగించాలనే ప్రయత్నాల్లో ఉండగానే ఇక్కడా పోలీసులు గుట్టు రట్టు చేశారు. వాల్మీకిపురంలో పట్టుబడిన వారంతా రాథోడ్ ముఠాగా పోలీసులు భావిస్తున్నారు. వీరి దగ్గర నుంచి రూ.500 విలువైన 735 దొంగనోట్లు స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ నుంచి నోట్లు ఇక్కడికి తీసుకొచ్చినట్లు విచారణలో తేలింది. మదనపల్లెలో నోట్లు ముద్రణ ఏర్పాట్లను గుర్తించిన పోలీసులు స్థానికుల సహకారంపై ఆరా తీస్తున్నారు. వైకాపా హయాంలో సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు సైతం దొంగనోట్లు పంచి మోసానికి పాల్పడిన వ్యవహారాలు బయటపడ్డాయి. తాజా వ్యవహారంలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. వ్యవహారాన్ని సమూలంగా రట్టు చేసి నిందితులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

ఆర్టీసీ జోన్ డీసీటీఎంగా ప్రశాంతి

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : కడప ఆర్టీసీ జోన్ డిప్యూటీ సీటీఎం (ఆపరేషన్-కార్గో)గా ఎంఎస్ ప్రశాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీహరిని జోనల్ వర్కుషాపునకు బదిలీ చేశారు. పుత్తూరులో డీఎంగా పనిచేస్తున్న ప్రశాంతికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ కడప జోన్ డిప్యూటీ సీటీఎంగా బదిలీ చేశారు. కడప జోన్ పరిధిలోని 52 డిపోల్లోని కార్గో వ్యవహారాలను ఆమె పర్యవేక్షిస్తామన్నారు.

రాణిపేటకు రాజమార్గం

- కడప-చిత్తూరు రహదారి విస్తరణ
- నాలుగు వరుసలుగా ఎన్‌హెచ్-40

పీలేరు, న్యూస్‌టుడే: కడప-చిత్తూరు మార్గం ఇక నాలుగు వరుసల దారిగా అభివృద్ధి చెందనుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం దేశంలో 10 జాతీయ రహదారుల విస్తరణకు అంగీకరించింది. ఇందులో భాగంగా కర్నూలు నుంచి నంద్యాల, కడప, రాయచోటి, పీలేరు, చిత్తూరు మీదుగా తమిళనాడు రాష్ట్రంలోని రాణిపేట వరకు ప్రస్తుతం ఎన్‌హెచ్-40 రహదారి ఉంది. ఇందులో కడప నుంచి చిత్తూరు జిల్లాలోని పీలేరు, రంగంపేట క్రాస్ వరకు 148 కిలోమీటర్లు నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. తొలుత 1999లో చిత్తూరు ఎంపీగా జ్ఞానేంద్రరెడ్డి పనిచేసినప్పుడు చిత్తూరు-కడప మార్గం ఆర్అండ్‌బీ శాఖ నుంచి ఎన్‌హెచ్‌కు బదిలీ చేశారు. అయితే రెండు వరుసల దారి మాత్రం 15 ఏళ్ల కిందట అభివృద్ధి పరిచారు. కడప-చిత్తూరు మార్గం తమిళనాడు రాష్ట్రంలోని రాణిపేట మీదుగా చెన్నై, వేలూరు, కోయంబత్తూరు మీదుగా పాండిచ్చేరి వరకు ఉంది. చెన్నై, పాండిచ్చేరి, కోయంబత్తూరు పట్టణాలు వ్యాపారపరంగా అభివృద్ధి చెందినందున ప్రస్తుతం ఉన్న రెండు వరుసల దారిలో రాత్రింబవళ్లు వాహనాలు వెళ్తుంటాయి. పగలు ప్రయాణికుల బస్సులు, కార్లు, రాత్రి సమయాల్లో వివిధ రకాల సరకులతో లారీలు, భారీ కంటెయినర్లు వెళ్తుంటాయి. ఇంత ప్రాధాన్యం ఉన్నందున వాహనాల రద్దీతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కడప-చిత్తూరు మార్గాన్ని నాలుగు వరుసల దారిగా విస్తరించడానికి అంగీకరించింది. ప్రస్తుతం మదనపల్లె నుంచి తిరుపతి వరకు నాలుగు వరుసల దారి విస్తరణ పనులు ముగింపు దశకు వచ్చాయి.

పీలేరు పట్టణం మీదుగా వెళ్తున్న రాణిపేట రోడ్డు

సింహ వాహనం.. మలయప్ప అవతారం!

నందలూరు, న్యూస్‌టుడే: నందలూరులో సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సింహ వాహనంపై మలయప్ప అవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి వారు మాఢ వీధుల్లో విహరించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం పాల్గొన్నారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం పల్లకి సేవ, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి హనుమంత వాహనంపై స్వామి వారు విహరిస్తారని అధికారులు తెలిపారు.

దరఖాస్తు నకిలీ... డీఈఈ బదిలీ

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : స్వీయ అభ్యర్థనపై ఓ అధికారి బదిలీకి బదిలీ ఉత్తర్వులు రాగా అది నకిలీ దరఖాస్తు అని తేలడం కలకలం రేపింది. ఈ ఘటన మదనపల్లె హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కార్యాలయంలో ఆలస్యంగా వెలుగు చూసింది. మదనపల్లె హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్ కార్యాలయం పరిధిలోని కదిరి డివిజన్-9లో వీఎస్‌పీ లింగారెడ్డి డీఈఈగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో శ్రీశైలం డ్యామ్ నిర్వహణ విభాగానికి బదిలీ చేయాలని కోరినట్లు అభ్యర్థన వచ్చిన నేపథ్యంలో అక్కడికి ఆయనను బదిలీ చేశారు. విషయం తెలుసుకున్న లింగారెడ్డి కంగుతిన్నారు. తాను ఎలాంటి అభ్యర్థన చేయలేదని ఎవరో తన సంతకాన్ని ఫోర్జరీ చేసి బదిలీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో పంపినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎస్ఈ విఠల్‌ప్రసాద్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే బదిలీ ఉత్తర్వులను రద్దు చేయాలని ఉన్నతాధికారులకు లేఖ ద్వారా విన్నవించారు. దీంతో ఈఎన్‌సీ ప్రస్తుతం పనిచేస్తున్న కదిరి డివిజన్ కేంద్రంలోనే ఉండేలా ఉత్తర్వులిచ్చారు. తన సంతకాలను ఫోర్జరీ చేసిన వారిపై విచారణ చేయాలని డీఈఈ లింగారెడ్డి ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రాగా ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

వీరబల్లి పీర్లు.. భక్తులందరి జేజేలు

జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో మొహర్రం కార్యక్రమాలు నిర్వహిస్తుండగా అందులో వీరబల్లిది ప్రత్యేకత. కులమతాలకతీతంగా వేలాదిగా భక్తులు హాజరవడం ఇక్కడి సంప్రదాయం. పది రోజుల కిందట మొదలైన మొహర్రం కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. ప్రధాన ఘట్టమైన అగ్నిగుండం, జలధి కార్యక్రమం చివరి రోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీరబల్లి, ఈడిగపల్లి, వంగిమళ్ల గ్రామాల్లోని పీర్ల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ చిత్రమే ఇది. - న్యూస్‌టుడే, వీరబల్లి

ఎవరి కోసం జగన్ దండుయాత్ర

కుక్కతోక వంకరలా వైకాపా బుద్ధి ◆ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: వైకాపాను రాష్ట్ర ప్రజలు ఛీకొట్టినా ఆ పార్టీ బుద్ధి కుక్కతోక వంకరలా మారిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విమర్శించారు. రాయచోటిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. కారుతో కార్యకర్తను తొక్కించి అతని మరణానికి కారణమైన మాజీ సీఎం జగన్ మళ్లీ రైతుల పేరుతో రోడ్డెక్కడం దారుణమని విమర్శించారు. రైతుల పేరుతో జగన్ పరామర్శలకు వెళ్లిన చోటల్లా ఏం జరిగిందో ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. గుంటూరు మిర్చి యార్డులో పరామర్శకు వెళ్తే వైకాపా అల్లరిమూకలు మిరప కాయల బస్తాలు ఎత్తుకెళ్లారన్నారు. పొదిలిలో పొగాకు రైతుల పరామర్శకు వెళ్లి పొగాకు బేళ్లు తొక్కి నాశనం చేసి రైతులను నష్టపరిచారని, ఇప్పుడు మళ్లీ మామిడి రైతులను ఏం చేద్దామని పరామర్శకు వెళ్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో గతేడాది 2.5 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా ఈ ఏడాది 6.5 లక్షల టన్నులు వచ్చాయన్నారు. కిలోకి రూ.4 చొప్పున ప్రభుత్వం ఇస్తోందన్నారు. రూ.8కి తగ్గకుండా ఫ్యాక్టరీలు, ట్రేడర్లు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇప్పటికే చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో 3,08,261 మెట్రిక్ టన్నుల మేర మామిడిని ట్రేడర్లు, ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేశాయన్నారు. ర్యాంపులు, మండీల ద్వారా మరో రూ.81 వేల మెట్రిక్ టన్నులు మామిడి ఇతర రాష్ట్రాలకు ప్రభుత్వం విక్రయించిందన్నారు. జగన్ రాద్ధాంతం చేసేందుకే బలప్రదర్శన తరహాలో బంగారుపాళెం వెళ్తున్నారన్నారు. తోతాపురి మామిడితో సంబంధం లేని వైఎస్సార్ కడప జిల్లా నుంచి కార్యకర్తలను ఎందుకు తరలిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మూడు జిల్లాల నుంచి 25 వేల మంది కార్యకర్తలను తరలించేందుకు 90 బస్సులు, 1,810 కార్లు, వ్యాన్లు, 2,230 బైకులతో దండయాత్రగా వెళ్లడం పరామర్శ ఎలా అవుతుందని ఆయన విమర్శించారు.

సెలవుపై జడ్పీ సీఈవో, డీపీవో

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా పంచాయతీ అధికారిణి (డీపీవో) రాజ్యలక్ష్మి సెలవుపై వెళ్లారు. జడ్పీ సీఈవో ఓబులమ్మ వారం నుంచి సెలవులో ఉండగా.. మరో వారం రోజుల పాటు తన సెలవును కలెక్టరు అనుమతితో పొడిగించుకున్నారు. డీపీవో రాజ్యలక్ష్మీ ఈ నెల 7 నుంచి 28వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. జడ్పీ సీఈవో బాధ్యతలను, డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం తాత్కాలికంగా నిర్వహించనున్నారు.

రైతేరాజు 6లో

B.Tech., and Ag.B.Sc.,
SPOT ADMISSION
కేవలం 6,7,8,9,10 లక్షల ఖర్చుతో నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ / అగ్రికల్చర్ బీఎస్సీ (కాలేజ్ ఫీజు + హాస్టల్ ఫీజుతో కలిపి) ఎటువంటి షూరిటీ లేకుండా విద్యార్థికి 70 నుంచి 80% లోన్ సౌకర్యం కల్పించబడును. వివరాలకు సంప్రదించండి :
9502555500, 9160220527

సర్వేయర్లపై కలెక్టర్ ఆగ్రహం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: రీ సర్వే విషయమై పెద్దతిప్పసముద్రం మండల, గ్రామ సర్వేయర్లపై కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పెద్దతిప్పసముద్రం మండలం మడమూరు గ్రామానికి చెందిన వెంకటప్ప తనకు సంబంధించి 2.30 ఎకరాల వ్యవసాయ భూమిని రీసర్వేలో కేవలం 94 సెంట్లు మాత్రమే నమోదు చేశారని ఫిర్యాదు చేయగా దీనిపై మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉన్న మండల సర్వేయరు శ్రీవాణి, గ్రామ సర్వేయరు సురేశ్‌లతో దృశ్య మాధ్యమం ద్వారా సమస్యపై వివరాలు ఆరా తీశారు. వాస్తవానికి అతనికి ఉన్న 2.30 ఎకరాల భూమిలో రీ-సర్వే సమయంలో అనుభవంలో ఉన్న 94 సెంట్ల విస్తీర్ణాన్ని మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిగలిన భూమి 19 మంది జాయింట్ ఆస్తిలో నమోదైనట్లు సర్వేయర్లు సమాధానం చెప్పారు. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించాలని, లేదంటే బాధ్యులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేయాలని ఆదేశం : మదనపల్లె జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేయాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు దృశ్య మాధ్యమం ద్వారా కలెక్టర్ శ్రీధర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది తీరుపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, వైద్యులు అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఆసుపత్రిపై పర్యవేక్షణ ఉండాలని, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

తల్లి పేరుతో ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలి

ప్రసంగిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, పక్కన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఏఎస్పీ మనోజ్, అధికారులు

రాయచోటి, న్యూస్‌టుడే: తల్లి పేరుతో ప్రతి విద్యార్థి ఈ నెల 10న మొక్కలు నాటాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విజయవంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. జిల్లాలోని 2.50 లక్షల విద్యార్థులు వారి తల్లిదండ్రులు కలిసి 6.75 లక్షల మంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటేందుకు ప్రతి విద్యార్థికి గ్రీన్ పాస్‌పోర్ట్ ఇస్తారన్నారు. తల్లి పాదాలకు వందనం చేసి మొక్కను నాటడంతో పాటు దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. 30 సెకండ్ల వీడియో, చిత్రాలు తీసి డాక్యుమెంట్ చేసేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. జిల్లాలో అటవీశాఖ ఆధీనంలో 12 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో పోలీసుశాఖ పౌరులకు మెలకువలను తెలియజేసేలా కార్యక్రమాలు రూపొందించినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామన్నాథ్ హెగ్డే, డీఈవో సుబ్రహ్మణ్యం, డీఐఈవో రవి, ఎంపీడీవోలు, పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఆక్రమణలు... చర్యలకు వంకలు

నిద్రావస్థలో అధికార యంత్రాంగం

కబ్జాకు గురైన తట్టివారిచెరువు వంక

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : మదనపల్లె పట్టణ సరిహద్దు పంచాయతీ పరిధిలోని సాగు, తాగునీటి వనరులుగా ఉన్న చెరువులు, వంకలు ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రభుత్వ స్థలాల్లోనే కాకుండా ప్రైవేటు స్థలాల్లో ఉన్న వంకలు రెవెన్యూ లెక్కల ప్రకారం ప్లాన్‌మార్కులో ఉంటే పూడ్చకూడదని చట్టం చెబుతున్నా నిబంధనలకు తూట్లు పొడుస్తూ ఇష్టానుసారంగా అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు. పలు చెరువుల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా కనీసం సర్వే కూడా చేపట్టలేదనే ఆరోపణలున్నాయి.

- పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలో తట్టివారిచెరువు ఉంది. వెంకప్పకోట రెవెన్యూ గ్రామ పరిధిలోని ఈ చెరువు 120 ఎకరాలకు పైగా విస్తరించింది. దీనికి వంకల ద్వారా వర్షాధారంగా నీరు చేరుతుంది. ఎగువన చీకలగుట్ట మీదుగా వంక దాదాపు మూడు కిలో మీటర్లు ఇందులో అనుసంధానమై ఉంది. కొన్ని ప్రాంతాల్లో 15 అడుగులు కొన్ని ప్రాంతాల్లో 10 అడుగుల వెడల్పు ఉండే ఈ వంక బాలాజీనగర్ సమీపంలో పూర్తిగా కనుమరుగైంది. ఇప్పటికే ఈ వంకను పూడ్చేసి మెకానిక్ షెడ్లను ఏర్పాటు చేశారు. వంక కనీసం మూడు అడుగులు కూడా లేకుండా ఆక్రమించారు. ముజీబ్‌నగర్‌కు వెళ్లే మార్గంలోని ఈ వంకను పూడ్చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై ఆరు నెలలుగా స్థానికులు, ఆయకట్టు రైతులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. జలవనరులశాఖ పర్యవేక్షణ లేదని, రెవెన్యూ అధికారులు సర్వే చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. బీకేపల్లె గుట్టలపై నుంచి వచ్చే వంకలు పూర్తిగా కనిపించకుండా పోయాయి. బైపాస్‌రోడ్డు విస్తరణతో పాటు పలువురు ఆక్రమించుకోవడంతో వంకలు పూడిపోయాయి. దీంతో వర్షపు నీరు ఈ చెరువులో చేరే పరిస్థితి లేదు. రెవెన్యూ దస్త్రాలను పరిశీలించి సర్వే చేసి ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి కష్టాలు తప్పవు.

సంయుక్త తనిఖీలు నిర్వహిస్తాం

చెరువులు, వంకలు ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదులు వచ్చాయి. బీకేపల్లె, ఎర్రగానిమిట్ట నుంచి వచ్చే వంకతో పాటు, దేవతానగర్ చీకటిగుట్ట మీదుగా పారే వంకలను జలవనరులశాఖ, గ్రామ కార్యదర్శి, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులందరం సంయుక్తంగా తనిఖీ చేస్తాం. ఇందుకు పంచాయతీ కార్యదర్శికి సంయుక్త తనిఖీలకు అనుమతివ్వాలని లేఖ రాశాం. గ్రామ దస్త్రాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. త్వరితగతిన క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలకు గురైనట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. - రాజేంద్రప్రసాద్, ఏఈ జలవనరులశాఖ, మదనపల్లె

గౌతమి COLLEGE CODE GTMW
GITAMW SINCE 2009
మహిళా ఇంజనీరింగ్ కాలేజి
సాయి నగర్, పెద్దశెట్టిపల్లి గ్రామం, ప్రొద్దుటూరు, వై.యస్.ఆర్. కడప జిల్లా.
సెల్ : 9848349885, 9642076632, 9849570557.
WE ARE AUTONOMOUS

869+ ★Placements★
16 years Excellence
B.TECH
CSE & CSE (AI & ML)
ECE & EEE
DIPLOMA
DEEE DECE
DCME
2025 - 26 ADMISSION OPEN
+ 100% Campus Placements for Eligible Students.
+ Girl's Hostel Available in Campus with All facilities.
+ Bus Facility available
Chagalamarri, Jammalamadugu, Yerraguntla, RTPP & Muddanur
B++ NAAC
UGC AUTONOMOUS
AWARDED AAA+ RANKING BY CAREERS360

పర్యాటకం... నీరే ప్రతిబంధకం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన హార్సిలీహిల్స్‌లో ప్రైవేటు భాగస్వామ్యంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి తెదేపా కూటమి ప్రభుత్వం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. కొండపై రూ.200 కోట్ల పెట్టుబడితో ఒబెరాయ్ సంస్థ ఐదు నక్షత్రాల హోటల్ నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం 20 ఎకరాల భూమి కేటాయించింది. తాజాగా యోగా గురువు రాందావ్ బాబా అంతర్జాతీయ వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు సీఎం చంద్రబాబు సమక్షంలోనే ప్రకటించారు. ఇప్పటికే రెవెన్యూ అతిథి గృహంతో పాటు టెలికాం భవనాన్ని హోటల్ నిర్వహణకు ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చి నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో పర్యాటకుల రద్దీ భారీగా పెరుగుతుండగా.. నీటి సరఫరా మాటేమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

హార్సిలీహిల్స్‌కు తాగునీటిని తరలిస్తున్న పైపులైను ఇదే

- కురబలకోట మండలం గాలేటివారిపల్లె వద్ద ఉన్న బోర్ల నుంచి పైపులైను వేసి నీటిని తరలిస్తున్నారు. అటవీ ప్రాంతంలో నిర్మించిన ఏడు పంపింగ్ కేంద్రాల ద్వారా రోజూ 70 వేల లీటర్ల నీరు చేరుతున్నాయి. అవసరాలకు ఈ నీరు సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల కాలంలో టౌన్‌షిప్ కమిటీ కొన్ని ప్రైవేటు గృహాలకు నీటి సరఫరాను నిలిపివేసింది. దీంతో వీరంతా కొండ కింద నుంచి వస్తున్న ట్యాంకర్ల ద్వారా నీటిని కొంటున్నారు. ట్యాంకరు నీటిని రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు చెల్లించి కొనుగోలు చేయడం మోయలేని భారంగా మారింది. 1960 సంవత్సరంలో ప్రారంభించిన తాగునీటి పథకాన్ని ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా ఆధునికీకరిస్తే కొంత వరకు సమస్య తీరుతుంది. గాలేటివారిపల్లె నుంచి కొండ వరకు ఉన్న పాత వాటిని పూర్తిగా మార్పు చేయాలి.

ఇలా చేస్తే సమస్య పరిష్కారం

- హార్సిలీహిల్స్ తాగునీటి పథకాన్ని హంద్రీ-నీవా ప్రాజెక్టుతో అనుసంధానం చేయాలి. ఈ కాలువల ద్వారా వస్తున్న కృష్ణా జలాలను గాలేటివారిపల్లె వద్ద చెరువులో నిల్వ చేసి వేసవి కాలంలో పంపింగ్ చేయాలని నిర్ణయించారు. గతంలో రూ.3 కోట్లతో ప్రభుత్వానికి ఈ ప్రతిపాదన పంపగా నిధులు మంజూరు కాలేదు.
- బి.కొత్తకోట మండలం చలిమామిడి లేదా గట్లపై ప్రాంతంలో బోర్లు వేసి ప్రత్యేక పైపులైను ద్వారా నీటిని తరలించాలని గతంలో అటవీశాఖ ప్రణాళికను సిద్ధం చేసినా ఆచరణలో సాధ్యం కాలేదు. గండికోట జలాలను కొండకు తరలించేలా అధికారులు ఆలోచన చేసినా ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేయలేదు. రానున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారుల బృందం సమగ్రంగా అధ్యయనం చేసి హార్సిలీహిల్స్ నీటి కొరతను తీర్చేలా సత్వర చర్యలు చేపట్టడం అనివార్యంగా కన్పిస్తోంది.

భవిష్యత్ అవసరాల మేరకు చర్యలు : ప్రభుత్వ ఆదేశాల మేరకు రానున్న రోజుల్లో హార్సిలీహిల్స్‌లో తాగునీటి సరఫరాను మెరుగుపర్చడానికి చర్యలు చేపడతామని పర్యాటకశాఖ డీఈ (తిరుపతి) ఇ.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. 'న్యూస్‌టుడే'తో డీఈ మాట్లాడుతూ... ప్రైవేటు సంస్థలకు కొండపై స్థలాలను కేటాయించిన తర్వాత పర్యాటకశాఖ విధానం ప్రకారం మౌలిక సదుపాయాలను కల్పించడానికి నిధులు కేటాయిస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతానికి కొండపై నీటి సరఫరా ఇబ్బంది లేకుండా నడుస్తోందని, పర్యాటకుల అవసరాలకు తగినట్లు నీటిని ఇస్తున్నామని వివరించారు.

అంత్యక్రియలు
కుమారి పాళెం శేషమాంబ గారు
07.07.2025వ తేదీ స్వర్గస్తులైనారు.
వీరి అంత్యక్రియలు 08.07.2025వ తేదీ
మంగళవారం మధ్యాహ్నం 2.00 గం॥ల
నుండి కడప టౌన్, APHB కాలనీ,
Door No.1/2617, LIGH-33-Bలోని
మా స్వగృహం నుండి జరుగును.



కుమారి పాళెం శేషమాంబ
Rtd. ప్రిన్సిపాల్,
తండ్రి : లేట్ పాళెం నరసింహులు
జననం : 16.03.1940 మరణం : 07.07.2025
ఇట్లు :
పాళెం గౌతం చంద్రకాంత్
మరియు
కుటుంబసభ్యులు
సెల్ : 99495 38039

(c) eenadu

రైతేరాజు

పశువుల కొట్టంలో ప్రథమ చికిత్స పెట్టె

పాడి రైతులు డెయిరీ ఫామ్స్ లేదా పశువుల కొట్టంలో ప్రథమ చికిత్స పెట్టె (ఫస్ట్ ఎయిడ్ బాక్సు) ఏర్పాటు చేసుకోవాలి. అందులో కాటన్, బ్యాండేజ్ క్లాత్, కత్తెర, ప్లాస్టర్, టించర్ అయోడిన్, టించర్ బెజాయిన్, ఆయిల్ ఆఫ్ టర్పంటైన్, డిస్పోజబుల్ 5 ఎంఎల్, 10, 20 ఎంఎల్ సిరంజిలు, ఐవీ సెట్, మల్లెముల్లు(ఫోర్సెప్స్), డ్రెంచింగ్ కప్ లేదా బాటిల్ వంటి వస్తువులు ఉంచుకోవాలి. ఈ పరికరాలు అందుబాటులో ఉంటే అనారోగ్యంతో ఉన్న పశువులకు ఈ కిట్టు ద్వారా ప్రథమ చికిత్స చేసి ఉపశమనం కలిగించవచ్చు. తదుపరి దశలలో మెరుగైన చికిత్స కోసం సమీపంలోని పశువైద్యులను సంప్రదించవచ్చని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టరు గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. పశువైద్యులు అందుబాటులో లేని సమయం, పశువుల వలస వెళ్లినప్పుడు ఈ ప్రథమ చికిత్స ఎక్కువగా తోడ్పడుతుంది. పొరుగు రాష్ట్రాలలో మేలుజాతి పశువుల కొనుగోలు చేసి రవాణా చేసే సమయంలో ఈ కిట్లు అందుబాటులో ఉంచుకొంటే ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.

చిట్కా

- న్యూస్‌టుడే, రాయచోటి

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న: సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వంగను వెర్రి తెగులు, కొమ్మ, కాయతొలుచు పురుగులు ఆశించాయి. పురుగు ఉద్ధృతి అధికంగా ఉంది. నివారణ తెలపండి?

- నిత్యానందరెడ్డి, నిమ్మనపల్లె

సమాధానం: వంగలో వెర్రితెగులు ఆశించినప్పుడు ఆకులు చిన్నవిగా మారి పూత, కాయ రాదు. నివారణకు తెగులు సోకిన మొక్కలను పీకి దూరంగా వేసి కాల్చివేయాలి. వేప నూనె, బ్రహ్మాస్త్రం పిచికారీ చేయడం ద్వారా నివారణ చేయవచ్చు.

- పీరూసాహెబ్, సస్యరక్షణ శాస్త్రవేత్త, కలికిరి కేవీకే

పాడికి దన్నుగా.. గతం కంటే మిన్నగా

- న్యూస్‌టుడే, చిన్నమండెం

ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా కరవులో సైతం ఎక్కువ మంది పాడి పెంపకంతోనే జీవనం సాగిస్తున్నారు. ఏటికేడు ప్రధాన పంటలు సాగు చేసినా అతివృష్టి, అనావృష్టి, తెగుళ్లు, గిట్టుబాటు కాని ధరలతో రైతులు నష్టాలపాలవుతున్నారు. ఇలాంటి సమయంలో జీవనం భారమైన రైతులు పాడి పెంపకంపై దృష్టి సారిస్తున్నారు. పాల ఉత్పత్తితోనే తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పశుగ్రాసాభివృద్ధికి తమ వంతు ప్రోత్సహిస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ పరంగా అమలు చేసే పథకాలను అన్నమయ్య జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ గుణశేఖరపిళ్లై వివరించారు. వర్షాకాలంలో పశుగ్రా

పశుగ్రాసాభివృద్ధికి పంచ సూత్రాలు

సాన్ని అధికంగా సాగు చేసుకుని వేసవికి కూడా ఉపయోగించుకోవచ్చని సూచిస్తున్నారు. ప్రభుత్వం ద్వారా అందే రాయితీలను ఆయన వివరించారు.

పడమటికోన సాగులో ఉన్న గడ్డి

రాయితీపై విత్తనాల పంపిణీ

ప్రభుత్వం 75 శాతం రాయితీతో నీటి ఎద్దడిని తట్టుకుని దిగుబడినిచ్చే గడ్డి విత్తనాల పశు వైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నారు. సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు కూడా ఉన్న పొలంలో తమ కున్న పశువులను బట్టి గ్రాసాన్ని పెంచుకోవాలని సూచిస్తున్నారు.

బహువార్షిక పశుగ్రాస పెంపకం

ఈ సాగులోని ప్రధాన రకాలు కో 1,2,3,4, ఏపీ బీఎన్ నేపియర్, సూపర్ నేపియర్, హైబ్రీడ్ నేపియర్‌లు. ఒకసారి సాగు చేసుకుంటే అయిదేళ్ల వరకు దిగుబడులు వస్తాయి. ఎకరాకు రెండు కనుపులున్న పుల్లలను 10 వేలు నాటుకోవాలి. ఒక కోతకు 25 టన్నుల వరకు గడ్డి దిగుబడి రావడంతో పాటు ఏటా ఐదు నుంచి ఆరు కోతలు వస్తాయని జేడీ తెలిపారు.

గడ్డి సాగుకు

ఉపాధి ప్రోత్సాహం : గడ్డి పెంపకానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోంది. పది సెంట్ల నుంచి అర ఎకరా వరకు గడ్డి పెంచుకునే రైతులకు ఆర్థికంగా చేయూతనిస్తోంది.

కరవులో పశుగ్రాసానికి ఉపయోగపడే చెట్ల పెంపకం : వ్యవసాయానికి అనువుగా లేని భూముల్లో అవిసె, సుబాబుల్, గ్లిరిసిడియా చెట్లను పెంచుకోవచ్చు. ఇందులో సుబాబుల్ విత్తనాలను చల్లుకుంటే వర్షాలకు మొలకెత్తుతాయి. వీటి ఆకులను పశుగ్రాసంగా ఉపయోగించుకోవచ్చు.

వ్యవసాయ ఉప ఉత్పత్తులు

ఖరీఫ్, రబీ సీజన్లలో పండిన వరి, వేరుసెనగ, జొన్న, సజ్జ, రాగి పంటలు అయిపోయిన తర్వాత వాటి శాఖీయ భాగాలను పశుగ్రాసంగా ఉపయోగించుకోవచ్చు. వీటిని ఎండబెట్టుకొని వేసవిలో గ్రాసంగా కూడా వాడుకోవచ్చు. పచ్చిమేతతో పాటు వరిగడ్డి, వేరుసెనగ కట్టె పశువులకు మేతగా వేయడంతో పాలలో వెన్న శాతం పెరుగుతుంది. తద్వారా పాలకు గిట్టుబాటు ధర పలికి రైతులకు ఆర్థికంగా ఎదిగేందుకు దోహద పడుతుందని వివరించారు.

- న్యూస్‌టుడే, కలికిరి గ్రామీణ

బీన్సు సాగు... లాభాలు బాగు

రామసముద్రం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం ముళబాగల్ తాలుకా అరిపినేపల్లెకు చెందిన శ్రీనివాసులు 1.5 ఎకరాల విస్తీర్ణంలో బీన్సు సాగు చేపట్టారు. టమాట దిగుబడి పూర్తయిన వెంటనే ఆ మొక్కలకు ఊతంగా ఏర్పాటు చేసిన కర్రల వద్దే తీగ బీన్సు విత్తనాలను విత్తారు. మొలకెత్తిన 15 రోజుల వ్యవధిలోనే తీగలు బాగా పాకాయి. ఊతాలుగా ఉన్న కర్రలకు పాకించి వారానికోసారి బిందు సేద్యంతో మొక్కలకు పోషక ఎరువులను అందించారు.

షేడ్‌నెట్లలో సాగవుతోన్న బీన్సు పంట

క్రిమి కీటకాలు ఆశించకుండా 15 రోజుల కాల వ్యవధిలో పంటసాగుకు మందులు పిచికారీ చేశారు. సూర్యరశ్మి మొక్కలపై నేరుగా పడకుండా షేడ్‌నెట్లను అమర్చారు. రెండున్నర నెలలకే దిగుబడి ప్రారంభం కాగా 1.5 ఎకరాల విస్తీర్ణంలో 60 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. షేడ్‌నెట్ ఏర్పాటుతో దిగుబడి రెట్టింపు అయింది. మూడు నెలల వ్యవధిలోనే పంట కాలం పూర్తి కావాల్సి ఉంటే మరో నెల రోజుల పాటూ అదనంగా దిగుబడి వచ్చింది. రైతుకు సాగు వ్యయం రూ.70 వేల వరకు ఖర్చు కాగా రాబడి రూ.3 లక్షలకు పైగానే వచ్చింది. ఖర్చులు పోనూ రైతుకు రూ.2.30 లక్షల వరకు లాభం సమకూరినట్లు తెలిపారు.

9, 11 తేదీల్లో క్రీడా పాఠశాల జిల్లా స్థాయి ఎంపికలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల ప్రవేశానికి సంబంధించి జిల్లా స్థాయి ఎంపికలను ఈ నెల 9, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ నెల 9న 4వ తరగతి ప్రవేశానికి, 10న 5వ తరగతి ప్రవేశానికి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నామన్నారు. ఎంపికలకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్, 2 పాస్‌పోర్టు ఫొటోలతో హాజరు కావాలన్నారు. ప్రాథమిక వైద్య పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే జిల్లాస్థాయి ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు.

నేటి నుంచి మల్టీడే క్రికెట్ పోటీలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : ఏసీఏ సౌత్‌జోన్ అండర్-19 పురుషుల మల్టీ డే క్రికెట్ పోటీల్లో భాగంగా వైఎస్సార్-ఏసీఏ స్టేడియంలో కడప-అనంతపురం క్రికెట్ జట్లు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు పోటీపడనున్నాయి. ఇప్పటికే అనంతపురం జట్టు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలుపొంది 20 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. కడప జట్టు ఆడిన మూడు మ్యాచ్‌లో ఒక విజయం, రెండు డ్రాలతో 12 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. నెల్లూరు 7, కర్నూలు 2, చిత్తూరు ఒక పాయింట్ మాత్రమే సాధించాయి. చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు కేఎస్ఆర్ఎం మైదానంలో ఏసీఏ అండర్-19 పురుషుల మల్టీ డే క్రికెట్ పోటీ జరగనుంది.

ఎన్‌సీడీ సర్వే తనిఖీ

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని తువ్వపల్లెలో సోమవారం గ్యారంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఎన్‌సీడీ సర్వే నిర్వహించారు. ఈ సర్వేని కడప రిమ్స్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ పవన్‌కుమార్, వైద్య కళాశాల విద్యార్థులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు వైద్య సిబ్బంది ఎన్‌సీడీ సర్వే ఏ విధంగా చేస్తున్నారని, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల గురించి విచారించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

JOBS

BUSINESS OFFER

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Shaik Jatarvali (Old Name), S/o. S.Babasab, R/o D.No: 4-6-235, New Colony, Yerragunta-516309, Kadapa, Andhra Pradesh. I Changed my name to Shaik Jafarvali. Henceforth, I will be known as Shaik Jafarvali.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే

Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

దొంగ నోట్ల ముఠా గుట్టు రట్టు

● పది మంది నిందితుల అరెస్టు ● నోట్ల కట్టలు, ప్రింటింగ్ మిషన్ల స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, పక్కన పోలీసు అధికారులు

రాయచోటి, న్యూస్‌టుడే: దొంగ నోట్లు ముద్రిస్తూ గుట్టుచప్పుడు కాకుండా చలామణి చేస్తున్న ముఠాను అరెస్టు చేశామని ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జూన్ నెల 26వ తేదీన ఎస్.కాలేషా అనే ఓ వ్యక్తి నకిలీ రూ.500 నోటుతో మద్యం కొనుగోలు చేసేందుకు వాయల్పాడులోని ఓ దుకాణానికి వెళ్లాడు. దుకాణ మేనేజర్ నవీన్‌కుమార్ గుర్తించి నోటు ఎక్కడిదని ప్రశ్నించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఆయన ఫిర్యాదుతో కాలేషా కోసం పోలీసులు గాలించారు. మదనపల్లె-బెంగళూరు ప్రధాన రహదారిలో వాయల్పాడు క్రాస్ వద్ద ఉన్న ఓ పెట్రోలు బంకులో ఉండగా అదుపులోకి తీసుకుని విచారించడంతో నకిలీ నోట్ల చలామణి చేసే దొంగల ముఠా గుట్టు తెలిసిందని ఎస్పీ చెప్పారు. కర్ణాటకకు చెందిన రాథోడ్, కుమార్, బాబులు మదనపల్లెలో దొంగ నోట్లు ముద్రిస్తున్నట్లు గుర్తించామన్నారు. వారి నుంచి రూ.500 ముద్రణతో ఉన్న 735 నకిలీ నోట్లు, వాటిని ముద్రించడానికి ఉపయోగించిన ప్రింటింగ్ మిషన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, 12 చరవాణులు, ఆర్‌బీఐ అక్షరాలతో ఉన్న ఆకుపచ్చ రిబ్బన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగనోట్లను కర్ణాటక రాష్ట్రంతో పాటు అన్నమయ్య జిల్లాలో చలామణి చేస్తున్న షేక్ కాలేషా, వి.ఎం.ముస్తాక్ అహ్మద్, ఎస్ఎండీ హఫీజ్, భీమసింగ్ పండిత్ రాథోడ్, కుమారస్వామి, షేక్ షఫిక్ అహ్మద్, నందిమంగళం యోజాజ్‌పాషా, వి.ఎం.ఫుర్హాన్, షేక్ ఆసీఫ్, షేక్ సుహేల్ అనే వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్పీ వివరించారు. నకిలీ నోట్ల ముఠా వ్యవహారాన్ని ఛేదించిన డీఎస్పీ కృష్ణమోహన్, వాయల్పాడు సీఐ ప్రసాద్‌బాబు, ఎస్సైలను అభినందించారు.

తల్లికి వందనం డబ్బులివ్వలేదని భర్తను కడతేర్చిన భార్య

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : బిడ్డల చదువు కోసం వచ్చిన డబ్బును భర్త మద్యం తాగేందుకు తీసుకున్నాడన్న కోపంతో అతడిని చంపిన భార్యను పోలీసులు సోమవారం అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. డీఎస్పీ కథనం మేరకు.. మదనపల్లె మండలం రెడ్డివారిపల్లెకు చెందిన వెంకోజీ చంద్రశేఖర్ (46) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తాడు. 20 ఏళ్ల కిందట రమాదేవితో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. చంద్రశేఖర్ నిత్యం మద్యం తాగి కుటుంబాన్ని పట్టించుకోలేదు. దీంతో రమాదేవి పాలెంకొండకు చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో పిల్లల చదువు కోసం తల్లికి వందనం పథకం ద్వారా వచ్చిన డబ్బు ఆమె ఏపీఎం ద్వారా చంద్రశేఖర్ తీసుకున్నాడు. ఆ డబ్బు ఇవ్వాలని భార్య భర్తతో గొడవపెట్టుకుంది. ఈ నెల 2వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో చంద్రశేఖర్ మద్యాన్ని గ్లాసులో పోసి ఇవ్వమని భార్యకు చెప్పాడు. దీంతో రమాదేవి మద్యంలో విషం కలిపి ఇచ్చింది. దాన్ని తాగిన అతను మళ్లీ భార్యతో గొడవపడ్డాడు. ఈ గొడవలో ఆమె భర్త గొంతును నులిమి, కర్రతో కొట్టింది. దీంతో చంద్రశేఖర్ నడవలేక పడిపోయి వేదనపడుతూ ఇంట్లోనే చనిపోయాడు.

నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు

రక్తం మొత్తం శుభ్రం చేసిన రమాదేవి కూలిపనులకు వెళ్లిపోయింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన ఆమె మద్యం తాగి భర్త చనిపోయినట్టు చుట్టుపక్కల వారికి తెలిపింది. విషయం తెలుసుకున్న మృతుడి సోదరుడు మహేశ్ గ్రామానికి చేరుకుని సోదరుడి శరీరంపై గాయాలుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అప్పట్లో అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా మద్యంలో విషం కలపడం, గొంతు నులమడం ద్వారా మృతి చెందినట్లు నిర్ధారణ అయింది. దీంతో రూరల్ సీఐ కళా వెంకటరమణ తమ సిబ్బందితో రమాదేవిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకుంది. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేంద్ర, సీఐ కళా వెంకటరమణ

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

● గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతుల వెల్లువ

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై చర్చించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మచ్చుకు కొన్ని వినతులు...

★ వీరబల్లి మండలం మట్లితొగటపల్లికి చెందిన వృద్ధురాలు అనంతమ్మ తనకు వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని కోరారు. ★ రాయచోటి మండలం ఎగువ అబ్బవరం వార్డు నెంబరు 15, రాయుడు కాలనీలోని హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఇతరుల పేర్లు నమోదయ్యాయని వాటిని తొలగించాలని మహేష్ అనే వ్యక్తి అర్జీ సమర్పించారు. ★ రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ సూర్యనారాయణపురానికి చెందిన ఆర్ల సుబ్బయ్య గత ప్రభుత్వంలో రైతు సేవా కేంద్రం పనులు చేపట్టారు. వాటికి సంబంధించిన బిల్లులు అందలేదని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. ★ పెనగలూరు మండలం బెత్తపల్లికి చెందిన నారాయణరెడ్డి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిమ్మచెట్లు మంజూరు చేయాలని కోరారు. ★ మదనపల్లె మండలం అంకిరెడ్డిపల్లి సమీపంలోని కొండపై ఉన్న బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ, బీఎస్పీ నాయకులు కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. ★ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే సన్న బియ్యం దుర్వినియోగం అవుతున్నాయని విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ మాజీ సభ్యుడు సాయికుమార్ విన్నవించారు.

సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం సబ్‌జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. ఇందులో 25 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశామని వీరంతా కర్నూలులో జరిగే శిక్షణా శిబిరానికి వెళ్తారన్నారు. అక్కడ ప్రతిభ చూపిన వారు ఈ నెల 12, 13 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తారని పేర్కొన్నారు. ఈ ఎంపిక శిబిరంలో వ్యాయామ ఉపాధ్యాయులు కమలేష్, మహేంద్రనాయక్, విష్ణు, అంజనప్ప, మోహన్‌రెడ్డి, బాలజీ, మహేంద్ర, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

బుద్ధుడి విగ్రహం ధ్వంసంపై
దర్యాప్తునకు డిమాండ్

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : గ్రామీణ మండలం అంకిశెట్టిపల్లె సమీపంలోని బుద్ధనికొండలో బుద్ధవిగ్రహం ధ్వంసం ఘటనపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్టీయూ భవన్‌లో సోమవారం బహుజనసేన ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. బుద్ధనికొండలో విగ్రహం ధ్వంసం కేసును పోలీసులు తప్పుదోవ పట్టించి నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అనుమానితుల పేర్లు వెల్లడించినా సీఐ పట్టించుకోలేదన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవడం పక్కనపెట్టి, న్యాయం చేయాలని కోరుతూ ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్న వారిని అరెస్టు చేయడాన్ని ఖండించారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు యమలాసుదర్శన్, పి.ఎల్.నరసింహులు, ప్రభాకర్‌రెడ్డి, బాలాజీ, కె.వి.రమణ, శ్రీచందు, రాజశేఖర్, కోనేటి దివాకర్, సుదర్శనం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చాటుతున్న ప్రజా సంఘాల నాయకులు

14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ముగ్గురు నిందితుల అరెస్టు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం శివారు కమ్మపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఆదివారం వేకువ సిద్దవటం అటవీ అధికారులు దాడులు చేసి ముగ్గురు నిందితులతో పాటు ఎర్రచందనం దుంగలు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిద్దవటంలోని అటవీక్షేత్రాధికారి కార్యాలయంలో సోమవారం అటవీ అధికారిణి కళావతి మాట్లాడుతూ.. పక్కా సమాచారం మేరకు కమ్మపాలెం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ముగ్గురు వ్యక్తులు, ఒక కారు అనుమానాస్పదంగా కన్పించడంతో అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. ఆలయం సమీపంలోని 14 ఎర్రచందనం దుంగలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన దుంగలు 193 కిలోలు ఉండగా వాటి విలువ రూ.56 వేలు ఉంటుందని వివరించారు. నిందితులను కడపలోని రామాంజనేయపురానికి చెందిన సన్నపూరి వెంకటరమణ, కొప్పర్తికి చెందిన సుబ్బారెడ్డి, సిద్దవటం మండలం కమ్మపాలెం గ్రామానికి చెందిన శిఖామణిగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి తిరుపతిలోని న్యాయస్థానానికి తరలిచంఅరు. మరో నిందితుడు పరారవ్వగా అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఉప అటవీ అధికారి ఓబులేసు, బీటు, సహాయ బీటు అధికారులు పెంచలరెడ్డి, మధు, హైమావతి, స్ట్రైకింగ్ ఫోర్స్, సాహెబ్‌బావి బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన దుంగలు, నిందితులతో అటవీ అధికారులు

చట్టం పరిధిలో కేసులకు తక్షణ పరిష్కారం

రాయచోటి, న్యూస్‌టుడే: చట్టపరిధిలో ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను ముఖాముఖిగా తెలుసుకుని పరిష్కారం కాకపోవడానికి గల కారణాలను సంబంధిత పోలీసు అధికారులతో టెలీ కాన్ఫరెన్సు ద్వారా అడిగి తెలుసుకున్నారు. అర్జీదారులను పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యలను తెలుసుకుని నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఓబులవారిపల్లి చిన్నఓరంపాడుకు చెందిన వెంకటరమణ, బి.కొత్తకోట నుంచి వచ్చిన పి.మల్లేశ్వరమ్మ, కలకడ నుంచి వచ్చిన వై.వెంకటయ్య, ఏకిలవంకపల్లికు చెందిన నూర్జహాన్‌లు నడవ లేని స్థితిలో ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ వారి వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు.

రామయ్య సేవలో విజిలెన్స్ ఏఎస్పీ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని కడప విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ జి.శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు. రాములోరి సన్నిధికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణమూర్తులను దర్శించారు. అనంతరం ఆలయ చారిత్రక వైభవం, ప్రాశస్త్యాన్ని అర్చకులు వారికి తెలియజేశారు. శాలువా కప్పి సత్కరించి వేదాశీర్వాదం చేశారు. రంగ మండపం, తూర్పు గోపురంలో శిల్పసంపద అద్భుతంగా ఉందని ఆయన కొనియాడారు.

కుటుంబ సభ్యులతో ఆలయంలో విజిలెన్స్ ఏఎస్పీ శ్రీనివాసరావు

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి



శివశంకర్ (పాత చిత్రం)

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన కురబలకోట మండలంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన శివశంకర్ (45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తాడు. ఇతను ఆదివారం రాత్రి అంగళ్లు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వారు గుర్తించి కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు వచ్చి ఆయన్ను ఇంటికి తీసుకెళ్లారు. మద్యం మత్తులో ఉన్న ఆయన తరచూ ఇలాగే పడి పోతుండటంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. సోమవారం ఉదయం ఆయన ఇంట్లోనే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ముదివేడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు...

ఖాజాపీర్ (పాత చిత్రం)

మదనపల్లె నేరవార్తలు : బ్యానర్‌కు లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మదనపల్లె పట్టణంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానిక గొల్లపల్లెకు చెందిన ఖాజాపీర్ (29) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తాడు. ఇతను సీటీఎం రోడ్డులోని ఎస్టేట్ సమీపంలో ఓ సంస్థకు చెందిన బ్యానర్‌కు లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ప్రమాదంలో ఖాజాపీర్ అక్కడే దుర్మరణం చెందగా సహాయకుడిగా వచ్చిన వ్యక్తికి గాయాలయ్యాయి. అతను ప్రమాదం జరిగిన వెంటనే పరారయ్యాడు. విషయం తెలుసుకున్న మదనపల్లె రెండోపట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం ఆసుపత్రి శవాగారానికి తరలించారు. మృతుడికి భార్య రేష్మ, కుమారుడు ఉన్నారు.

నీటి గుంటలో పడి ఒకరు...

సంబేపల్లె (రాయచోటి) : సంబేపల్లె మండలం శెట్టిపల్లి సమీపంలోని నీటి గుంటలో పడి ఓ యువకుడు మృతి చెందారు. కర్నూలులోని కొత్తపేటకు చెందిన అస్లాం మూడేళ్లుగా రాయచోటిలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన కుమారుడు ఎస్.మహమ్మద్ ఉస్మాన్ (26) తన స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు శెట్టిపల్లి సమీపంలోని ఝరికోన వద్ద నున్న నీటి కుంట వద్దకు ఆదివారం సాయంత్రం వెళ్లారు. స్నేహితులతో కలిసి నీటి గుంటలో దిగి కొద్దిసేపటికి మునిగిపోయారు. సమాచారం అందుకున్న స్థానికులు వెలికితీసేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. విషయం తెలుసుకున్న ఎస్సై భక్తవత్సలం అగ్నిమాపక సిబ్బందితో కలిసి సోమవారం వెలికి తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ మరొకరు...

చిన్నమండెం : మండల పరిధిలోని రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గుర్రంకొండ మండలం చిల్లువారిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం (61) చిన్నమండెంలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం తన స్వగ్రామం నుంచి చిన్నమండేనికి తొట్లివారిపల్లెకు చెందిన సాయితో కలిసి ద్విచక్ర వాహనంలో బయల్దేరారు. మార్గ మధ్యలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సుబ్రహ్మణ్యంను మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

విష ద్రావణం తాగి ఆత్మహత్య

నందలూరు, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటాద్రిపురం ఎస్టీ కాలనీకి చెందిన బొమ్మల నారాయణ (25) అనే యువకుడు కుటుంబ కలహాలతో ఆదివారం విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రెండేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన మునెమ్మతో వివాహమైంది. రెండేళ్లుగా కడప నగర సమీపంలోని ఇటుకల బట్టీలో కూలి పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మద్యం తాగి ఇంటికి వెళ్లడంతో భార్య గొడవ పడింది. దీంతో మనస్తాపానికి గురై విష ద్రావణం తాగాడు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మదనపల్లె
•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

వెలుగు సంస్థ వార్షికోత్సవం

వెలుగు సంస్థ ఆవరణలో సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు, సిబ్బంది

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : అమ్మచెరువు మిట్టలో ఉన్న వెలుగు సంస్థ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆవరణలో ఏర్పాటు చేసిన సంస్థ వ్యవస్థాపకురాలు పద్మజ విగ్రహానికి పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, వెలుగు సంస్థ కన్వీనర్ భాగ్యలక్ష్మి, సుజాత, ప్రిన్సిపల్ లీనా కుమారి, వార్డెన్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీకి విద్యార్థుల ఎంపిక

ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు అంజాద్ అలీఖాన్

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: ఎన్‌సీసీలో చేరడంతో విద్యార్థులకు క్రమశిక్షణ వస్తుందని నిమ్మనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజాద్ అలీఖాన్ పేర్కొన్నారు. పాఠశాలలో 50 మంది విద్యార్థులు ఎన్‌సీసీకి ఎంపిక కావడంతో సోమవారం వారిని అభినందించారు. ఎన్‌సీసీ ద్వారా శిక్షణ పొందడంతో మానసికోల్లాసం లభించి చదువులో రాణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీటీవో వెంకటగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తిరునాల

పూజలందుకుంటున్న వీరాంజనేయస్వామి

రామసముద్రం, న్యూస్‌టుడే: కనగాని గ్రామంలో సోమవారం ఆంజనేయస్వామి తిరునాల వైభవంగా జరిగింది. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

భూ సమస్యలు పరిష్కరించండి..!

❖ మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు బాధితుల మొర

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: భూ సమస్యలు పరిష్కరించాలని బాధితులు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి 92 మంది అర్జీదారులు వినతిపత్రాలు అందజేశారు. భూ వివాదాలు, సామాజిక భద్రతా పింఛన్లు, గ్యాస్ రాయితీ సమస్యలపై పలువురు అర్జీలు సమర్పించారు. వీటిపై సమగ్ర నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు.

అర్జీదారులను విచారిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్

ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తున్నారు

అంగళ్లు గ్రామంలో ప్రైవేటు కళాశాల సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవడంతో గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం. దీన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరిగి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలి.

- రమణయ్య, తుంగవారిపల్లె

విస్తీర్ణం తక్కువగా నమోదు

వాల్మీకిపురం మండలంలో నా భర్త వెంకటరమణారెడ్డి పేరుతో 7.79 ఎకరాల భూమి ఉంది. కొన్నేళ్ల కిందట ఆయన మృతి చెందాడు. రీసర్వేలో 5.42 ఎకరాలు మాత్రమే చూపిస్తున్నారు. భూ విస్తీర్ణం తక్కువగా నమోదు చేశారు. దీనిపై అధికారులకు విన్నవించాను. విచారించి న్యాయం చేయండి.

- నిర్మలాదేవి, మర్రిపాడు, గుర్రంకొండ

పరిహారం కోసం తిరుగుతున్నా

వి.కోట మండలంలో హంద్రీనీవా కాలువ నిర్మాణానికి 75 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం తీసుకుంది. పదేళ్ల కిందట భూమిని స్వాధీనం చేసుకున్నా ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటి వరకు పరిహారం మంజూరు చేయలేదు. స్పందించి అధికారులు న్యాయం చేయండి.

- శ్రీరాములు, ఆదన్నపల్లె

విచారించి న్యాయం చేయండి

ములకలచెరువు మండలంలో మా పూర్వీకులు కొనుగోలు చేసిన సొంత భూములున్నాయి. వారసత్వ భూములను ఇతరుల పేరుతో నమోదు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు అర్జీలు సమర్పించాం. మా వద్ద ఉన్న దస్త్రాలను పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నాం.

- జయరామిరెడ్డి, తనకల్లు

పొలానికి దారి చూపండి



పూర్వీకుల నుంచి పొలాలకు వెళ్లేందుకు దారి ఉంది. దీన్ని కొంత మంది ఆక్రమించుకునేందుకు మా పొలానికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. రెవెన్యూ దస్త్రాల ప్రకారం దారి ఉంది. వ్యవసాయ భూములకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. విచారించి న్యాయం చేయండి.

- గంగిరెడ్డి, మల్లెల, పెద్దతిప్పసముద్రం

నీట్‌లో విద్యార్థిని సత్తా

పీలేరు, న్యూస్‌టుడే: వైద్యశాఖలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పురుషోత్తం కుమార్తె అరిపల్లె జ్ఞాపిక నీట్ పరీక్షలో జాతీయ స్థాయిలో 9,319 ర్యాంకు సాధించింది. సోమవారం ప్రకటించిన రాష్ట్ర ర్యాంకుల్లో 367వ స్థానం దక్కించుకుంది. దీంతో తల్లిదండ్రులు పురుషోత్తం, కవిత ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తల్లిదండ్రులతో విద్యార్థిని జ్ఞాపిక

గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: గ్రామకమిటీ ఎన్నికల్లో ఏకాభిప్రాయం కుదరని పక్షంలో ఆ వివరాలు పార్టీ అధిష్ఠానానికి పంపుతామని నిమ్మనపల్లె మండల పరిశీలకుడు కుదుం శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నిమ్మనపల్లె మండలంలోని పది పంచాయతీల్లో ఎన్నికలు జరిగాయి. నిమ్మనపల్లె, తవళం, రెడ్డివారిపల్లె, కొండయ్యగారిపల్లె, ముష్టూరు గ్రామాల్లో బూత్ కమిటీ సభ్యుల నియామకం సజావుగా సాగినా గ్రామకమిటీ అధ్యక్ష ఎన్నికకు ఏకాభిప్రాయం కుదరక పోవడంతో పార్టీ అధిష్ఠానానికి నివేదిక సమర్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా రాచవేటివారిపల్లెకు మల్లికార్జున, అగ్రహారానికి దేవళం శ్రీనివాసులు, సామకోటవారిపల్లెకు రావల యర్రమ్మ, వెంగంవారిపల్లెకు నారాయణ, బండ్లపాయికు వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు . రాజన్న, ఆర్‌జే వెంకటేష్, మునిరత్నం, కనగంటి ప్రసాద్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరిశీలకుడు కుదుం శ్రీనివాసులు

తాగునీటి సమస్యకు పరిష్కారం

పీలేరు గ్రామీణ: పీలేరు మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగాలపల్లెలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవ మేరకు ప్రభుత్వ నిధులతో బోరుబావిని తవ్వించి, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వారణాసి శ్రీరామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి, వసంత రాజా, తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే ప్రజా సంక్షేమం

కదిరినాథునికోటలో పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న జయచంద్రారెడ్డి, నాయకులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట నగర పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులకు అమృత్ 2.0 పథకం కింద రూ.10.50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెదేపా తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని పాశంవీధిలో ఆయన పర్యటించారు. స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజరు రమాదేవి, నాయకులు బంగారు వెంకటరమణ, గంజి మోహన్, మస్తాన్, నాసీర్, కిట్టన్న, ప్రభాకర్, ఇమామ్‌సాబ్, తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు: ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా తంబళ్లపల్లె ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని కదిరినాథునికోట గ్రామంలో చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మూగి రవిచంద్ర, పాస్టర్ శీనా, నాగిరెడ్డి, శ్రీనివాసులు, రెడ్డెప్ప పాల్గొన్నారు.

చింతపర్తి (వాల్మీకిపురం): అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెదేపా సీనియర్ నాయకుడు కంభం నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతపర్తిలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం చింతపర్తి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమ సమావేశంలో మాట్లాడారు. కూటమి పార్టీ నాయకులు సమన్వయంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి మహిత, నాయకులు ద్వారకనాథరెడ్డి, శేషురెడ్డి, కేదిరెడ్డి, కాంతారావులు, వెంకటేష్ శెట్టి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని మండల కేంద్రంలో తెదేపా శ్రేణులు నిర్వహించాయి. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌రావు, మహేష్, రఘురామిరెడ్డి, సుమన్, మల్లికార్జున, లైటింగ్ చంద్రారెడ్డి, గల్లా నారాయణ, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనుల వేగవంతానికి వినతి

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరులోని మదనపల్లె, చిత్తూరు మార్గాల్లో జరుగుతున్న రైల్వే వంతెన పనులు సత్వరం పూర్తి చేయాలని, అంత వరకు ఆ మార్గాల్లో వాహనాలు, పాదచారులకు ఇబ్బంది లేకుండా సర్వీసు రోడ్డు గుంతలు లేకుండా వేయాలని ప్రజలు కోరారు. ఈ మేరకు సోమవారం దళిత నాయకుడు రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మీకర్, రవీంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో పీలేరు ప్రజలు స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది భానుప్రసాద్, ఎస్‌ఆర్ మురళీ, ఉదయ్‌కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

తహసీల్దారు శివకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ప్రజలు

బాధిత కుటుంబాలకు పరామర్శ

కలకడ, న్యూస్‌టుడే : మండలంలోని కోనయతీ బాకీవారిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్‌రెడ్డి(బోర్‌వెల్ శేఖర్‌రెడ్డి) మృతదేహానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఆదివారం సాయంత్రం చిన్నమండెం మండలం వండాడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. సోమవారం మృతదేహాన్ని బాకీవారిపల్లెకు తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు.

పెద్దతిప్పసముద్రం: సంపతికోట పంచాయతీ, ఎంపీటీసీ సభ్యుడు ముత్తన కిట్టన్న(64) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. గతంలో సంపతికోట సర్పంచిగా పనిచేశారు. ప్రస్తుతం ఎంపీటీసీ సభ్యుడిగా ఉంటూ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి ఎంపీటీసీ సభ్యుడి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ పోరాటం

గర్నిమిట్టలో కేకుకోస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పీలేరు గ్రామీణ, బి.కొత్తకోట, కంభంవారిపల్లి, కలకడ, ములకలచెరువు, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జెండా ఎగురవేశారు. అలాగే మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. కేకును కోసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలకడలో కేకుకోస్తున్న నాయకులు

బి.కొత్తకోట బస్టాండులో..

కళాశాలపై చర్యలకు డిమాండ్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: ఫీజుల పేరుతో వేధింపులకు గురిచేస్తున్న కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు రక్షణ కల్పించాలని, విద్యార్థులకు ఫీజుల పేరుతో వేధించకూడదని రాష్ట్ర ప్రభుత్వం సూచిస్తున్నా నిబంధనలు పాటించలేదని ఆరోపించారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్‌కు అర్జీ సమర్పించారు. వీరికి సీపీఐ నాయకులు పీఎల్ నరసింహులు, కృష్ణప్ప, మురళీలు మద్దతు తెలిపారు.

మదనపల్లె నేరవార్తలు : మదనపల్లెలో ఫీజుల పేరుతో వేధింపులకు గురి చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ అన్నారు. సోమవారం ఆయన రాయచోటిలోని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇటీవల ఓ కళాశాలలో ఫీజుల కోసం వేధింపులకు గురి చేయడంతో విద్యార్థిని ఆత్మహత్య లేఖ రాసి వెళ్లి పోవడం జరిగిందన్నారు.

సబ్‌కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పశుగ్రాస వారోత్సవాలు

కలికిరి, న్యూస్‌టుడే: పాడి రైతులు పచ్చిమేత, ఎండు గడ్డితో లాభాల బాట పట్టవచ్చని ఏడీ వెంకటముని నాయుడు రైతులకు సూచించారు. సోమవారం కలికిరి మండలం గుండ్లూరు రైతు సేవా కేంద్రంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఏటా జులై 7 నుంచి 14 వరకు అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మహల్, మేడికుర్తి, పాలెం పశువైద్యాధికారులు గిరినాథ్‌రెడ్డి, కీర్తి, జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు, వంశీ పాల్గొన్నారు.

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE: MADANAPALLE
IA No: 78/2023 AS.No: /2023
PETITIONERS/ APPELLANTS:
J.P. Sahadeva Reddy (Died) and others.
RESPONDENTS :
Y. Chinna Mal Reddy
NOTICE
To:
R-4 :
J. Raj Kiran Reddy, S/o. Late J.P.Sahadeva Reddy, aged about 21 years, Hindu, presently residing at D.No:7/65, Jangavaripalle, Kurabalakota Mandal, Chittoor district.
Please take notice that the above matter stands posted to 24/7/2025 for your appearance and you are hereby required to attend the said Hon'ble court at 10.30 am on said date, failling which, the matter will be decided exparte basing on the material available on record. This is for your information.
Sd/- **B.Chandra Sekhar Rao,**
BA, LLB, Advocate,
Madanapalle.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని దండువారిపల్లె గ్రామంలో ఎస్సీ కుటుంబాలకు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని మాల మహానాడు ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కిశోర్‌కుమార్‌కు మాలమహానాడు నాయకులు, గ్రామస్థులు అర్జీ సమర్పించారు. కొన్నేళ్లుగా శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నారని, స్థలం లేక దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారించి స్థలం కేటాయించాలని తహసీల్దారును కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాయలసీమ కన్వీనర్ చంద్రయ్య, రామచంద్ర, మోహన, గంగరాజు, రెడ్డప్ప, బాబు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కిశోర్‌కుమార్‌కు అర్జీ సమర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం పోలీసుస్టేషన్ ముందు సోమవారం నరసాపురం గ్రామస్థులు ఆందోళనకు దిగారు. దారి తగాదా విషయమై ఆదివారం ఏత్తూరుపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు నరసాపురం గ్రామస్థులపై దాడి చేసి గాయపరిస్తే కేసు నమోదు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. నిందితులపై కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై రమేష్‌బాబు సంఘటన స్థలానికి చేరుకుని నిరసనకారులతో మాట్లాడారు. కొంతమందిపై ఆదివారం రాత్రే కేసు నమోదు చేసినట్లు వివరించారు. సంఘటన స్థలాన్ని కూడా పరిశీలించి సమాచారం సేకరించినట్లు తెలిపారు. విషయం తెలుసుకోకుండా పోలీసుస్టేషన్ ముందు ఆందోళనకు దిగడం మంచి పద్ధతి కాదన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నిరసనకారులతో మాట్లాడుతున్న ఎస్సై రమేష్‌బాబు

మురుగు... రహదారిపై పరుగు

రామసముద్రం మండలం ఎలకపల్లె గ్రామ పంచాయతీ జక్కులవారిపల్లెలో కాలువలు లేక మురుగునీరు వీధిపైనే ప్రవహిస్తోంది. మురుగుపైనే గ్రామస్థులు నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామంలో మురుగు కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో గఫూర్‌ను వివరణ కోరగా మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, రామసముద్రం**

కృత్రిమ మేధతో విప్లవాత్మక మార్పులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : కృత్రిమ మేధస్సుతో పరిశ్రమల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ మహేంద్రన్ అన్నారు. సోమవారం శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్, రిసోర్స్ పర్సన్ డాక్టర్ హుమేరాఖానమ్, ప్రిన్సిపల్ రమాదేవి, సమన్వయకర్త కవిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజ రాజశ్రీ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మదనపల్లి
O.S.No. 26 of 2022
వాది: కే.లక్ష్మీనారాయణ
ప్రతివాది: ఎస్.శ్రీహర్ష
ప్రతివాది:-
ఎస్.శ్రీహర్ష, తండ్రి ఎస్.వెంకట్రామయ్య, డోర్ నెంబర్ 14-484-ఎ, గాంధీ రోడ్, మదనపల్లి టౌన్ అండ్ పోస్ట్, అన్నమయ్య జిల్లా.
పై దావాను వాది ఆయిన కే.లక్ష్మీనారాయణ మీ నుండి దావా బాకీని రాబట్టుకొనుటకు గాను మీ పైన దావా పై కోర్టులో దాఖలు చేసియున్నారు. మీకివ్వబడిన [illegible] 14.07.2025 తేదీన [illegible] 10.30 గంటలకు మీరు కోర్టులో హాజరు కాగలరు.
ఇట్లు కోర్టు వారి ఆదేశానుసారం
టి.వెంకట రమణారెడ్డి, బి.ఏ., బి.ఎల్.,
వాది తరఫు న్యాయవాది
సెల్ నెం: 89782 18657

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మదనపల్లె పట్టణంలోని వారపు సంతలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని సోమవారం స్థానికులు గుర్తించి రెండోపట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి ఆచూకీ తెలియకపోవడంతో మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రి శవాగారానికి తరలించారు. మృతుడు 40 నుంచి 45 ఏళ్లు కలిగి ఉంటాడని అతని బంధువులు ఎవరైనా ఉంటే ఆసుపత్రికి వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లాలని పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, రామసముద్రం, న్యూస్‌టుడే : వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లెలోని లక్ష్మీనగర్‌కు చెందిన హుస్సేన్ వాటర్ ట్యాంకు డ్రైవర్‌గా పనిచేస్తాడు. ఇతను సోమవారం ఉదయం కురవంకలో నీరు తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. గాయపడిన ఆయన్ను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిరుపతికి రెఫర్ చేశారు. ✦ మదనపల్లెలోని మోతీనగర్‌కు చెందిన హరి ఆదివారం రాత్రి సొంత పనిపై సీటీఎం వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎర్రాగానిమిట్ట వద్ద అదుపుతప్పి పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ✦ రామసముద్రం-చెంబకూరు రోడ్డు మార్గంలోని హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం వద్ద ఆదివారం అర్ధరాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఆర్.నడింపల్లె గ్రామపంచాయతీ దిగువబొంపల్లెకు చెందిన నారాయణస్వామి చెంబకూరు నుంచి రామసముద్రానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా తిరుమలరెడ్డిపల్లెకు చెందిన గంగాధర్, సైదాన్‌బీ రామసముద్రం నుంచి సొంత గ్రామానికి బైకులో వస్తుండగా ఢీకొన్నారు. బాధితులను చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పీలేరులో నత్తనడకన ఆర్వోబీ పనులు

విసుగెత్తిపోతున్న వాహనదారులు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పీలేరు పేరు వినగానే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. మూడేళ్లుగా కొనసాగుతున్న ఆర్వోబీ పనులతో పట్టణ ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. పీలేరు పట్టణంలోని మదనపల్లె, చిత్తూరు మార్గాల్లో ఉన్న రైలు గేట్ల వద్ద రైళ్ల రాకపోకల సమయాల్లో వాహనదారులకు తీవ్రం అంతరాయం ఏర్పడుతోంది. రైల్వే గేటు తీసే వరకు గంటల తరబడి నీరీక్షించాల్సి ఉంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గంగా మదనపల్లె, చిత్తూరు మార్గాల్లో రైల్వే వంతెనల నిర్మాణ పనులను ప్రారంభించారు.

పంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డు తవ్వేయడంతో వాహనదారుల అవస్థలు

నిర్మాణాల్లో జాప్యం

ఆర్వోబీ పనుల్లో భాగంగా రెవెన్యూ అధికారులు తొలుత భూసేకరణ చేపట్టి పరిహారం చెల్లించినా సంతృప్తి చెందని బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. అయితే ప్రస్తుతం కోర్టు కేసులు కూడా ఏమీ లేవు. అయినా సకాలంలో ఆర్వోబీ పనులు పూర్తి చేయడంలో సంబంధిత గుత్తేదారు సంస్థ నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో ప్రజలు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి ధర్నాలు చేపట్టారు.

దుమ్ముతో ఇక్కట్లు

పీలేరులోని మదనపల్లె మార్గం అజంతా మిట్ట నుంచి పద్మావతినగర్ వరకు, చిత్తూరు మార్గంలోని మోడల్ కాలనీ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ఈ పనులు జరుగుతున్నాయి. పిల్లర్ల దశలోనే నిర్మాణాలున్నాయి. ఈ క్రమంలో వాహన రాకపోకల సమయంలో వచ్చే దుమ్ముతో రోడ్డు పక్కన ఉన్న వ్యాపారులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. విద్యార్థులు, వృద్ధులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు.

✦ మదనపల్లె మార్గంలో ఆర్వోబీ నిర్మాణానికి రూ.66.65 కోట్లు మంజూరు కాగా 2026 జులైలోపు పూర్తి చేయాల్సి ఉంది. చిత్తూరు మార్గంలో రూ.68.25 కోట్లతో 2026 జూన్ వరకు గడువు ఉంది.

సకాలంలో పూర్తయ్యేలా చర్యలు

ఆర్వోబీ పనులు సజావుగా సాగేందుకు అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగించాం. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను గడువు లోపల పూర్తి చేయడానికి సంబంధిత గుత్తేదారు సంస్థపై ఒత్తిడి తెస్తున్నాం.

- శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ ఈఈ

బాలిక అదృశ్యం

పీలేరు గ్రామీణ: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పీలేరు ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. పీలేరుకు చెందిన బాలిక (13) ఆదివారం తన పుట్టిన రోజు కావడంతో ఓ పాఠశాల నుంచి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో సాయంత్రం అదృశ్యమైంది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

సబ్ కలెక్టర్‌కు వినతులు

సబ్ కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న బాధితుడు

రాజంపేట, న్యూస్‌టుడే: బాధితుల సమస్యలపై క్షేత్ర స్థాయికి వెళ్లే వాస్తవాలు తెలుసుకోవాలని.. దానికి అనుగుణంగా బాధితులకు న్యాయం చేయడానికి అవకాశముంటుందని సబ్ కలెక్టర్ నైదియాదేవి తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశమందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారిని ఆక్రమించారని.. తమబిడ్డను గురుకుల పాఠశాలలో చేర్పించాలని.. తమ భూములను ఆక్రమించారని, ప్రభుత్వ భూములను కబ్జా చేశారని పలు రకాల సమస్యలను డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి వచ్చిన 27 మంది బాధితులు ఆమెకు ఫిర్యాదు చేశారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

పీఎం సూర్యఘర్‌పై అవగాహన సదస్సు నేడు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలుపై ఉప్పరపల్లె శివారులోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం లబ్ధిదారులు, వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ ఒంటిమిట్ట ఉప డివిజన్ ఏఈ సుబ్రహ్మణ్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలకు చెందిన వారు హాజరుకావాలని కోరారు.

మూడు పంచాయతీల్లో పోటాపోటీ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: తెదేపా సంస్థాగత ఎన్నికల్లో భాగంగా మూడు పంచాయతీల్లో నూతన కార్యవర్గంలో తమకే చోటు కల్పించాలని రెండు వర్గాలు పోటాపోటీగా మండల పరిశీలకుడు ఈశ్వరప్పకు ప్రదానం పత్రాలను అందజేశారు. కొత్తమాధవరం, రాచగుడిపల్లె, సాలాబాదు పంచాయతీల్లో తమ వారిని ప్రాధాన్యం ఇవ్వాలని వేర్వేరుగా జాబితాను ఇచ్చారు. వర్గాలకు సమ న్యాయం చేయాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట: 9441872651
రాయచోటి: 9703622242
రైల్వేకోడూరు: 9703572572

స్పందనకు వందనం

సుండుపల్లి, న్యూస్‌టుడే: కేవీ వీధిలోని మురుగు నీటి కాలువ పూడికతో నిండి మురుగంతా రోడ్డు మీదకు ప్రవహిస్తుండటంతో 'మేమున్నాం మీకు తోడుగా'లో శనివారం వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తొలగించారు.

ఓబులవారిపల్లె: మండల పరిధి వైకోటలోని పలు వీధుల్లో దీపాలు వెలగడం లేదు. ఈ సమస్యపై 'మేమున్నాం మీకు తోడుగా'లో గురువారం వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి తేజ, సర్పంచి ఈశ్వరయ్య వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

?: మండల కేంద్రంలోని శివకరాపురం, ఓబులవారిపల్లె, కెజి కంపాలపల్లె గ్రామాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలి.
- సురేంద్ర, ఓబులవారిపల్లె

✓: సమస్య మా దృష్టికి వచ్చింది. వెంటనే వీధి దీపాలకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తాం. **- భారతి, పంచాయతీ కార్యదర్శి, ఓబులవారిపల్లె - న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె**

?: ఓబులవారిపల్లె పంచాయతీలో రోడ్లకు ఇరువైపులా చెత్తను పడేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
- సుబ్బరాయుడు, ఓబులవారిపల్లె

✓: వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను తొలగించి, సమస్యను పరిష్కరిస్తాం. **- భారతి, పంచాయతీ కార్యదర్శి, ఓబులవారిపల్లె - న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె**

?: కొంత కాలంగా వీధుల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలి.
- పెంచలయ్య, కోనయ్యగారిపల్లి

✓: వీలైనంత త్వరగా చెత్తను తొలగించి సమస్యను పరిష్కరిస్తాం.
- లక్ష్మీకర, కార్యదర్శి, కోనయ్యగారిపల్లి - న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె

?: శివాజీనగర్‌లోని వీధుల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. వెంటనే మరమ్మతులు చేసి వెలిగేలా చర్యలు తీసుకోవాలి.
- నాగరాజనాయక్, శివాజీనగర్, సుండుపల్లి

✓: వెంటనే వీధి దీపాల మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. **- సురేష్‌బాబు, పంచాయతీ ప్రత్యేక అధికారి, సుండుపల్లి - న్యూస్‌టుడే, సుండుపల్లి**

నాడు-నేడు... బడుల్లో అవస్థలు చూడు!

విద్యార్థులకు తప్పని తిప్పలు

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

– న్యూస్‌టుడే, సుండుపల్లి

గత వైకాపా పాపాలు ఇంకా వెంటాడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల బాగు కోసం అప్పటి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నాడు-నేడు' పథకం వెలవెలబోయింది. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, వసతి గృహాలకు మరమ్మతులు చేయించి విద్యార్థులకు అందిస్తామన్న మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయి. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పలు పాఠశాలల్లో విద్యార్థులు అసౌకర్యాల నడుమ విద్యనభ్యసిస్తున్నారు.

● సుండుపల్లి మండలంలోని పలు ఉన్నత పాఠశాలలు గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద ఎంపికయ్యాయి. వాటికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో గుత్తేదారులు చేపట్టిన పనులను మధ్యలోనే విడిచిపెట్టారు. ఎన్నికల అనంతరం ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో చక్కదిద్దే పనులు చేపట్టినా పూర్తి స్థాయిలో సమస్యలు తీరలేదని విద్యార్థులు వాపోతున్నారు. మౌలిక వసతులు కల్పించాలని వేడుకుంటున్నారు.

● తిమ్మసముద్రం ఉర్దూ ఉన్నత పాఠశాలలో అయిదు అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. మూడు గదులు స్లాబ్ వరకు నిర్మించారు. మోల్డింగ్ దశలో పైవరుసలో రెండు గదులు నిర్మించాల్సి ఉంది. అదే గ్రామంలోని సోమసేనిగడ్డ హరిజనవాడ ప్రాథమిక పాఠశాల, మడితాడు జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాల, రాయవరం వైవైఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనులను నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. ఈ భవనాలపై సంబంధిత అధికారులు స్పందించి పనులు వెంటనే పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తిమ్మసముద్రంలో నిర్మాణ దశలో ఆగిన ఉర్దూ పాఠశాల భవనం

● ఈ విషయమై ఎంఈవో వెంకటేశ్‌నాయక్‌ను వివరణ కోరగా.. అసంపూర్తి భవన నిర్మాణాల పూర్తికి ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఉన్నతాధికారులకు రూ.10.62 కోట్లు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపించగా ఇప్పటి వరకు రూ.3.18 కోట్లు విడుదలైందని చెప్పారు. మిగిలిన నిధులు మంజూరైతే ఆగిన నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

తాళ్లపాకను అభివృద్ధి చేయాలని వినతి

తితిదే ఈవో శ్యామలరావుకు వినతిపత్రం అందజేస్తున్న భానుప్రకాశ్‌రెడ్డి, పోతుకుంట రమేష్‌నాయుడు, నాయకులు

రాజంపేట గ్రామీణ, రాజంపేట న్యూస్‌టుడే: అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరుతూ సోమవారం తితిదే ఈవో శ్యామలరావుకు తితిదే పాలక మండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుకుంట రమేష్ నాయుడు వినతిపత్రం సమర్పించారు. తాళ్లపాక ముఖద్వారం నుంచి తాళ్లపాక వరకు రోడ్డును వెడల్పు చేసి [illegible] సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సంగీత నృత్య కళాశాల, శ్రీవారి ఆలయ నిర్మాణంతోపాటు అన్నమయ్య నివసించిన ఇంటి స్థలాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. సిద్ధేశ్వర చెన్నకేశవ స్వామి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో కల్యాణ టికెట్లను పెంచాలని విన్నవించారు. ఈవో సానుకూలంగా స్పందించి బోర్డు సమావేశంలో పొందుపరిచి అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్దండం సుబ్రహ్మణ్యం, రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, న్యాయవాది వై.సురేష్ రాజు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

మొక్కకు నీరు పోస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: ఉపాధి పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహమిస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నమండెం మండలం వండాడి, రాయచోటి మండలం గొర్లముడివీడు గ్రామాల్లో సోమవారం రైతుల పొలాల్లో మామిడి మొక్కలు నాటారు. మంత్రి మాట్లాడుతూ అయిదు ఎకరాలలోపున్న రైతులకు ఈ పథకం ద్వారా తోట పెంపకానికి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు. రైతులు పండ్ల, పూల తోటలకు ఉపాధి పథకం ద్వారా లబ్ధి పొందాలన్నారు. పాడి పశువుల క్షేమం కోసం మినీ గోకులాలు మంజూరు చేయగా రైతులు నిర్మించుకోవడం హర్షణీయమన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచి వెంకటరామిరెడ్డి, ఏపీడీ మధుబాబు, ఏపీవో మురళీమోహన్ పాల్గొన్నారు.

ఘనంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

హంస వాహనంపై చెన్నకేశవస్వామి

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: తాళ్లపాకలోని సిద్ధేశ్వర, చెన్నకేశవస్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తితిదే అధికారులు, అన్నమయ్య ప్రాజెక్టు కళాకారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉదయం సిద్ధేశ్వరస్వామికి పల్లకీ సేవ, శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామి వారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

ఆది దంపతులకు ప్రత్యేక పూజలు

అలంకరణలో పరమేశ్వరుడు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ భుజంగేశ్వరస్వామి దేవాలయంలో ఆషాఢమాసం శుద్ధ ద్వాదశి సందర్భంగా సోమవారం ఆది దంపతులకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేపట్టారు. అర్చకులు పవన్‌కుమార్‌శర్మ, యోగీశ్వరశర్మ ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరులకు అభిషేకాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గంధం పీరు ఊరేగింపు

గంధం పీరు ఊరేగింపులో భక్తులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: మొహర్రం కార్యక్రమాల్లో భాగంగా చిన్నమండెంలో ఆదివారం రాత్రి గంధం పీరు ఊరేగింపు సంప్రదాయబద్ధంగా సాగింది. పట్టణంలోని మూడు మకాన్లలోని పీర్లన్నీ జలధికి వెళ్లి తిరిగి మకాన్లకు చేరాయి. ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు గంధం పీరు దర్శనానికి భక్తులు తరలి వచ్చారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పీర్ల ఊరేగింపు సంప్రదాయబద్ధంగా మొదలు పెట్టారు. సోమవారంతో చిన్నమండెంలో మొహర్రం ముగిసింది. రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పాడి పశువులకు ఉచితంగా టీకాలు

పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీ మాలకొండయ్య

చిన్నమండెం, న్యూస్‌టుడే: పాడి పశువులకు ప్రభుత్వం ద్వారా ఉచితంగానే బ్రూసెల్లోసిస్ టీకాలు వేస్తున్నట్లు రాయచోటి పశుసంవర్ధకశాఖ డీడీ మాలకొండయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని వండాడిలో సోమవారం పాడి పశువులకు ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 70 పశువులకు టీకాలు వేశారు. అనంతరం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డీడీ మాట్లాడుతూ టీకా ఆవశ్యకత గురించి వివరించారు. ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి రైతులకు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యుడు టి.భాస్కర్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఆందోళన

ద్విచక్ర వాహనాల ర్యాలీ చేస్తున్న సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: కార్పొరేట్లకు మేలు చేసేందుకే కేంద్రంలోని భాజపా ప్రభుత్వం లేబర్‌కోడ్‌లను తెస్తోందని.. వెంటనే రద్దు చేయాలంటూ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక పురపాలక కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు రామాంజులు, రమణ, శంకరయ్య, రమేష్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ నాయకులు పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. నాయకులు కిరణ్‌కుమార్, యానాదయ్య, జాన్‌ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రమేష్, హేమంత్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: అర్హులైన పేదవారికి ఇళ్ల స్థలాలు కేటయించి.. ఇంటిని నిర్మించి ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉదయ్ కిరణ్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం లిబరేషన్ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత పేదలకు 3 సెంట్లు, పట్టణాల్లోని పేదలకు 2 సెంట్ల స్థలం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దారు నరసింహకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ నాయకులు విశ్వనాథ్, రమణ, రఘునాథనాయుడు, సుజాత, లవకుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న లిబరేషన్ పార్టీ నాయకులు

జీవనోపాధికి వన్-ధన్ వికాస కేంద్రాలు

చిట్వేలి(పుల్లంపేట), న్యూస్‌టుడే: వన్ ధన్ వికాస కేంద్రాలను గిరిజనులు ఉపయోగించుకోవాలని రైల్వేకోడూరు నియోజకవర్గ వైసీపీ రామచంద్రయ్య పేర్కొన్నారు. రాచకుంట, చెర్లోపల్లి పంచాయతీల పరిధిలోని యానాదికాలనీలను సోమవారం ఆయన పర్యటించారు. జీవనోపాధి మెరుగుకు వన్ ధన్ వికాసకేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. మహిళలు పొదుపు సంఘాలుగా ఏర్పడి పొదుపు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రమణ, వైద్యసంక్షేమ సహాయకులు మణికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశానికి ఆహ్వానం

పుల్లంపేట, న్యూస్‌టుడే: ఈ నెల 10న నిర్వహిస్తున్న మెగా తల్లిదండ్రుల సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులను వినూత్న రీతిలో ఆహ్వానిస్తున్నామని దళవాయిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున తెలిపారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ఆహ్వాన పత్రాలను సోమవారం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుతో కలిసి పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు. ఆయన పార్టీ నాయకులతో కలిసి రీకాలింగ్ బాబు ప్రచార పత్రాలు విడుదల చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

చిన్నమండెం, పెద్దమండెం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన చిన్నమండెం-పెద్దమండెం ప్రధాన రహదారి వద్ద సోమవారం చోటుచేసుకుంది. చిన్నమండేనికి చెందిన వెంకటసుబ్బారెడ్డి తన భార్యతో కలిసి పెద్దమండెం మండలంలోని గుడిసెవారిపల్లెకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. కుంటకిందపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటసుబ్బారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన భార్య స్వల్పంగా గాయపడ్డారు. వారిని 108లో ఆసుపత్రికి తరలించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

ఓటరు జాబితా ప్రదర్శన

ఓటరు జాబితాను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు సంబంధించి నూతన ఓటరు జాబితాను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుజాతమ్మ సోమవారం ఆవిష్కరించారు. ఖాళీగా ఉన్న జడ్పీటీసీ స్థానాన్ని ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని ఇటీవల రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎస్ఈసీ నుంచి వచ్చిన ఓటర్ల సమాచారాన్ని పంచాయతీ వారీగా ముద్రించారు. పురుషులు 12,050 మంది, మహిళలు 12,556 మంది ఉన్నారు. సోమశిల ముంపు గ్రామాల్లో కుడమలూరు, బేస్తపల్లిలో 240 మంది ఓటర్లు ఉన్నారు. ఇటీవల జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రాచగుడిపల్లె పంచాయతీలో కలిపారు. ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో జాబితాను అందుబాటులో పెట్టామని ఎవరైనా వచ్చి పరిశీలన చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తులసిరెడ్డి, గంగపేరూరు కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.

ఏడీఏ శివశంకర్ బాధ్యతల స్వీకరణ

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట డివిజన్ వ్యవసాయాధికారిగా శివశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజంపేటలో పని చేస్తున్న రమేష్‌బాబు ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే.

నిరసన తెలియజేస్తున్న గ్రామస్థులు

దారి ఏర్పాటు చేయాలని నిరసన

రాయచోటి, న్యూస్‌టుడే: గాలివీడు మండలం అరవీడు గ్రామ పరిధిలోని నడింపల్లికు దారి సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్థులు సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపాశారు. అరవీడు కస్పా నుంచి నడింపల్లికి వెళ్లేందుకు దారి లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్ధిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గతంలో సర్వే నెంబరు 413లో 2.15 ఎకరాల భూమి ఉండేదని ఆ భూమిలో 100 మీటర్ల మేర దారి ఉండేదన్నారు. ఇప్పుడు యజమాని అంగీకరించకపోవడంతో గ్రామస్థులకు ఇబ్బందిగా మారిందన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి దారి చూపాలని కోరారు. అనంతరం జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతి పత్రం అందజేశారు.

అన్నదాత సుఖీభవ పథకంపై ఫిర్యాదుకు అవకాశం

చిన్నమండెం, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ పథకంపై రైతులు తమ ఫిర్యాదు చేసేందుకు ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి గీత ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పరిశీలనలో తిరస్కరించిన రికార్డులు, తహసీల్దారు లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న రికార్డులు గ్రీవెన్స్ మాడ్యుల్‌లో పొందుపరిచినట్లు వివరించారు. ఈ నెల 13వ తేదీ లోపల తమ అభ్యంతరాలు తెలుపుకోవచ్చన్నారు. జూన్ 30లోగా వెబ్‌ల్యాండ్‌లో నమోదైన రైతులు కూడా అర్హులేనన్నారు.

నిత్యపూజకోనలో పారిశుద్ధ్య పనులు

పాత పాదరక్షకలను తొలగిస్తున్న కూలీలు

సిద్దవటం, న్యూస్‌టుడే : మండల పరిధి వంతాటిపల్లె శివారు లంకమల అభయారణ్యంలోని నిత్యపూజస్వామి కోనలో సోమవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌ఛార్జి ఈవో శ్రీధర్ మాట్లాడుతూ.. పంచలింగాల ఆలయం నుంచి నిత్యపూజస్వామి కోవెలకు వెళ్లే మార్గంలో గతంలో భక్తులు వదిలేసిన పాత పాదరక్షలు, చెత్తాచెదారాన్ని కూలీలతో తొలగించే పనులు చేపట్టామన్నారు. పంచలింగాల ఆలయం వద్ద ఉన్న కోనేరులో చెత్త తొలగించి నీటి శుభ్రత పనులు నిర్వహించామని తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత

రాజంపేట గ్రామీణ, (పెనగలూరు), న్యూస్‌టుడే: రెవెన్యూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలా కాలంగా పని చేస్తున్న సిబ్బంది న్యాయమైన సమస్యలను పరిష్కారం కోసం ఈ నెల తొమ్మిదో తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మె కారణంగా తహసీల్దార్, ఎస్ఐలకు వినతి పత్రం, సమ్మె నోటీసులు సోమవారం అందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని విన్నవించారు.

క్రికెట్ విజేత చింతకాయలపల్లె జట్టు

నిర్వాహకుల నుంచి ట్రోఫీని అందుకుంటున్న విజేత జట్టు

నందలూరు, న్యూస్‌టుడే: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న అరవపల్లె క్రికెట్ లీగ్ సీజన్ వన్ విజేతగా చింతకాయల పల్లె జట్టు విజయం సాధించింది. సోమవారం ఉదయం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అరవపల్లికి చెందిన ఫాల్కన్ లెవెన్స్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 14 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేసింది. చింతకాయలపల్లె జట్టు 11.4 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసి విజయం సాధించింది. విజేత జట్టుకు ఎస్టీ ఖాన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.30 వేలు, గుణయాదవ్ ఆధ్వర్యంలో ట్రోఫీని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. రన్నర్స్‌కి ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ బృందం రూ.20 వేలు, యంబలూరు ప్రదీప్ ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో పల్లె మాధవి, వేపగుంట సామ్రాజ్, ఏసీఎల్ సభ్యులు హరి, అరణ్, రాము పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో పాల్గొన్న సంస్థ సభ్యులు

గ్రామీణ ప్రాంతాలకు మానవతా సేవలు

గాలివీడు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాలకు మానవతా సేవలు విస్తృత స్థాయిలో తీసుకెళ్తామని మండల శాఖ అధ్యక్షుడు చెంగల్‌రాజు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ.. గ్రామీణుల చెంత సేవలను విస్తరించడంతో పాటు ఆసక్తి ఉన్న వారికి సభ్యత్వ నమోదు చేస్తామన్నారు. ఛైర్మన్ సుబ్బారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శివా రెడ్డి, రామకృష్ణా రెడ్డి, దామోదర్ పాల్గొన్నారు.

తెదేపా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి

రాజంపేట గ్రామీణ, (పెనగలూరు) న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రైల్వేకోడూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి, కుడా ఛైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి అన్నారు. పెనగలూరు మండలం నారాయణ నెల్లూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వివిధ వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థికంగా చితికిపోయిన బాధితులకు సీఎం సహాయ నిధి ద్వారా సాయం అందిస్తున్నామన్నారు. అనంతరం రహదారి నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. తెదేపా మండల ప్రధాన కార్యదర్శి కళాచంద్ర, గ్రామస్థులు జయచంద్రరాజు, చెంగల్ రెడ్డి, లేబాక శ్రీనివాసులరెడ్డి, దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

పెనగలూరు : కరపత్రాలు పంచుతున్న ముక్కా రూపానందరెడ్డి, నేతలు

మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం సాధ్యమని తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. మండలంలోని సానిపాయిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ముందుగా ఆయనను కార్యకర్తలు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన, అందించే పథకాలను ప్రజలకు వివరించారు. తెదేపా మండల శాఖ అధ్యక్షుడు ఎం.భానుగోపాల్‌రాజు, నాయకులు వేణుగోపాల్‌రాజు, శివనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
బాపట్ల
మంగళవారం జులై 8, 2025

రైల్వే స్టేషన్లు.. సమస్యలు కోకొల్లలు

జిల్లాలో ప్రధాన రైల్వే స్టేషన్లలో అసౌకర్యాలు. వసతుల కొరతతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం సరిగా లేదు. ప్లాట్‌ఫారాలపై పనులు అసంపూర్తిగా చేసి వదిలేశారు. బాపట్ల స్టేషన్‌లో కాలినడక వంతెన నిర్మాణంలో ఎక్కడలేని జాప్యం చేస్తున్నారు. ఈ కారణంగా ప్రయాణికులు ప్రమాదకర పరిస్థితుల్లో పట్టాలు దాటుతున్నారు. అమృత్ స్టేషన్ పేరుతో రూ.కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి.

చీరాల రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై పనులు ఇలా..

న్యూస్‌టుడే, బాపట్ల, రేపల్లె అర్బన్, చీరాల అర్బన్

రేపల్లె రైల్వే స్టేషన్లో ప్లాట్‌ఫారాలపై చాలా చోట్ల కొళాయిలకు ట్యాబ్‌లు లేవు. పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగి విషపురుగులకు నిలయంగా మారింది. అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.25.6 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టినప్పటికీ రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం 10 వేల నుంచి 12 వేల మంది వరకు తెనాలి, గుంటూరు, సికింద్రాబాద్, విశాఖపట్నం, చెన్నై తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి వెళ్తుంటారు. ప్లాట్‌ఫాంపై తాగునీరు, మరుగుదొడ్లు లేక మహిళలు, పిల్లలు, వృద్ధులు నరక యాతన పడుతున్నారు. రేపల్లె, చెరుకుపల్లి, నిజాంపట్నం, నగరం తదితర మండలాల నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు, రాత్రి వేళ అధిక సంఖ్యలో రైలు కోసం వేచి ఉంటారు. ✦ బాపట్ల రైల్వేస్టేషన్‌లో రూ.80 కోట్లతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. నాలుగు, ఐదు ప్లాట్‌ఫారాల నిర్మాణ సమయంలో తూర్పు నుంచి రైలు పట్టాల మీద ప్రయాణికులు వెళ్లే కాలినడక వంతెన మూసేశారు. మొదటి ప్లాట్‌ఫాంలో ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. 90 శాతం రైళ్లు ఆగే రెండు, మూడు నంబరు ప్లాట్‌ఫారాల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేదు. ప్రస్తుతం స్టేషన్లో ఒక్క లిఫ్ట్ మాత్రమే ఉంది. రిజర్వేషన్ బోగీలు రైలు ఇంజిన్ మొదట్లో లేదా చివర్లో ఉంటున్నాయి. ప్రయాణికులు లగేజీ తీసుకుని రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. రెండో కాలినడక వంతెన నిర్మించి లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది.

కాలినడక వంతెన నిర్మాణంలో తీవ్ర జాప్యం

అసంపూర్తిగా వంతెన..

రేపల్లె స్టేషన్‌లో కొళాయి వద్ద అపరిశుభ్రత

✦ చీరాల రైల్వే స్టేషన్లో ఎస్కలేటర్ నిర్మాణ పనులు రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. ప్లాట్‌ఫాంపై గొయ్యి తవ్వడంతో ప్రమాదకరంగా ఉంది. మరుగుదొడ్లకు తాళాలు వేశారు. మహిళలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్‌ఫాం చివరల్లో దీపాలు వెలగడం లేదు. పడమర వైపు టికెట్ బుకింగ్ కౌంటర్ నుంచి రైల్వే గేటు వరకు చీకటిగా ఉంటోంది. రైల్వే పోలీసుల గస్తీ సక్రమంగా ఉండటం లేదు. వేటపాలెం రైల్వేస్టేషన్లో కొత్తగా వేసిన షెడ్లలో ప్రయాణికులు కూర్చోడానికి కుర్చీలు ఏర్పాటు చేయలేదు.

సహకారం కొరవడి.. సేవల్లో వెనకబడి

సహకార సంఘాలకు పాలకవర్గాల నియామకంలో జాప్యం నెలకొంటోంది. ప్రతి సంఘానికి ఛైర్మన్, ఇద్దరు డైరెక్టర్లతో కలిపి త్రిసభ్య కమిటీ నియమించడానికి ఆరు నెలల క్రితమే అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇంకా ఆమోదం రాలేదు. ఖరీఫ్‌లో పంటల సాగు ప్రారంభమైంది. సంఘాల ద్వారా రైతులకు ఎరువుల విక్రయించాల్సి ఉంది. ప్రస్తుతం సహకార శాఖ అధికారులే పర్సన్ ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తున్నారు. నూతన పాలకవర్గాలు వస్తే సంఘాల క్రియాశీలమై అన్నదాతలకు మెరుగైన సేవలు అందుతాయి.

పీఏసీఎస్‌ల పాలకవర్గాల నియామకంలో జాప్యం

న్యూస్‌టుడే, బాపట్ల

జిల్లాలో 112 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) ఉన్నాయి. జిల్లాలో నూరు శాతం ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయింది. గత ప్రభుత్వ పాలనలో సంఘాలు నిర్వీర్యమయ్యాయి. పర్సన్ ఇన్‌ఛార్జులుగా వ్యవహరించిన వైకాపా నేతలు రుణాల మంజూరులో గోల్‌మాల్‌కు పాల్పడ్డారు. బినామీ పేర్లతో రూ.కోట్ల రుణాలు దోచేశారు. నూతెళ్లపల్లి సొసైటీలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయి. రూ.4.60 కోట్లకు పైగా నిధులు స్వాహా చేసినట్లు విచారణలో తేలింది. రుణాల రికవరీకి చర్యలు చేపట్టారు. వేమూరు, భట్టిప్రోలులో ఎరువుల విక్రయాల్లోనూ అక్రమాలకు పాల్పడ్డారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.లక్షల్లో అక్రమాలకు పాల్పడ్డారు.

తూర్పు బాపట్ల సహకార సొసైటీ కార్యాలయం

సంఘాలను విడిపించింది. సహకార శాఖ నుంచి ఓ అధికారిని నాలుగు సంఘాలకు పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమించింది. త్రిసభ్య కమిటీల నియామకానికి గత జనవరిలోనే కసరత్తు చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన వారి పేర్లతో పాలకవర్గ నియామకానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపారు. మే లోనే ఆమోదం వస్తుందని అందరూ భావించారు. జాప్యం జరుగుతోంది.

✦ మార్క్‌ఫెడ్ నుంచి సహకార సంఘాలకు ఎరువులు కేటాయించి రైతులకు ఎంఆర్‌పీ ధరకు విక్రయిస్తున్నారు. పాలకవర్గాలు లేకపోవటం వల్ల సంఘాలు సమర్థవంతంగా పని చేయడం లేదు. కంకటపాలెం, ముదునూరు, దేవినేని గ్రామాల పరిధిలో 12 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కంకటపాలెం సహకార సొసైటీ ఉన్నా పాలకవర్గం లేకపోవటం వల్ల గత ఖరీఫ్‌లో ఎరువుల వ్యాపారం చేయలేదు. రైతులు ఎరువుల కోసం బాపట్లకు వచ్చి ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనాల్సి వస్తోంది. అదే సొసైటీకి పాలకవర్గం ఉంటే ఎరువులు తెప్పించి స్థానికంగా విక్రయించేవారు. ఎరువులు స్థానికంగా లభిస్తే వారిపై రవాణా, అధిక ధరల భారం ఉండదు. సత్వరమే నూతన పాలకవర్గాలను నియమించాలని అన్నదాతలు కోరుతున్నారు. దీనిపై జిల్లా సహకార శాఖాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని సహకార సొసైటీలకు పాలకవర్గాల నియామకానికి ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలో ప్రభుత్వం నుంచి అనుమతి వస్తుంది. సహకార సంఘాలు బాగా పని చేసి రైతులకు సేవ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

✦ సహకార సంఘాలకు నియమించిన పర్సన్ ఇన్‌ఛార్జులను కూటమి ప్రభుత్వం తొలగించింది. వైకాపా నేతల కబంధ హస్తాల నుంచి

పొగాకు కొనుగోలు కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత

పర్చూరు, ఇంకొల్లు, జె.పంగులూరు: పొగాకు కొనుగోలు కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.లవన్న తెలిపారు. సోమవారం పొగాకు కొనుగోలు చేసే పర్చూరు, ఇంకొల్లు, జె.పంగులూరు మండలాల్లోని కేంద్రాలను రెవెన్యూ, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. నూతనంగా పర్చూరు మండలంలోని అడుసుమల్లిలో, ఇంకొల్లులోని వంకాయలపాడులో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్న గోదాములను సందర్శించారు. కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు జరిగే తీరును, కొనుగోలు చేసే పొగాకు బేళ్లకు కల్పించే భద్రతను స్థానిక అధికారులతో కలిసి చర్చించారు. గోదాముల వద్ద రాత్రి సమయాల్లో పటిష్ఠ భద్రత ఉండేలా సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రమాదాలు సంభవించకుండా ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలను నమోదు చేసుకున్నారు. రవాణా మార్గాలను పరిశీలించారు. నివేదికలను తయారు చేసి కలెక్టర్‌కు అందించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, మార్క్‌ఫెడ్ ప్రాజెక్టు మేనేజర్ రమేష్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సుబ్రహ్మణ్యం, మార్కెటింగ్‌శాఖ ఏడీ రమేష్, తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, నల్లబర్లీ పొగాకు రైతుల ప్రతినిధి కొల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గోదాము పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లవన్న, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ

ఆదమరిస్తే పెనుప్రమాదమే

దూర ప్రాంతాల నుంచి పర్యాటకుల రాకపోకలతో బాపట్ల- సూర్యలంక మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. ఆదర్శనగర్ సమీపంలో పేరలి కాల్వ వంతెన అప్రోచ్ వద్ద సోమవారం పెద్ద గొయ్యి పడింది. సూర్యలంకలో రొయ్యల చెరువులు పూడ్చడానికి భారీ వాహనాలు ఇసుక లోడుతో వెళ్తున్నాయి. వీటి వల్లే వంతెన అప్రోచ్ దెబ్బతిని భారీ గొయ్యి పడింది. వేగంగా వచ్చే వాహనాలు గొయ్యిలో పడితే వాహనదారుల ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. గొయ్యి పూడ్చి మరమ్మతులు చేయకుంటే భారీ వర్షాలకు వంతెన అప్రోచ్ కోతకు గురై సూర్యలంకకు రాకపోకలు స్తంభించే ప్రమాదం ఉంది. సమస్యను డీఈ అరుణ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, బాపట్ల

గుంటూరు మిర్చికి జాతీయ అవార్డు

ఒక పంట... ఒక ఉత్పత్తి విభాగంలో గుర్తింపు

న్యూస్‌టుడే, గుంటూరు



గుంటూరు మిర్చికి మరో జాతీయ అవార్డు దక్కింది. ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) విభాగంలో ఈ గుర్తింపు లభించింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో మిరప సాగు, ప్రభుత్వ సహకారం, రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలపై జిల్లా పాలనాధికారి నాగలక్ష్మి కేంద్రానికి నివేదించారు. స్పందించిన కేంద్ర బృందం ఒక జిల్లా... ఒక ఉత్పత్తి విభాగం కేటగిరీలో ఈ ఏడాది జనవరిలో జిల్లాలో పర్యటించింది. ఈ మేరకు ఓడీఓపీ విభాగంలో అవార్డుకు గుంటూరు మిర్చిని ఎంపిక చేసినట్టు కేంద్రం ప్రకటించింది. ఈ నెల 14న దిల్లీలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్‌గోయల్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట మిరప. దీనికి ఘాటెక్కువ. ఇక్కడి భూములు, వాతావరణం, సాగు విధానాల వల్ల ఇతర ప్రాంతాల్లో పండే మిర్చితో పోలిస్తే దీనికి ప్రత్యేకత ఉంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా మన్నన పొందుతోంది. గుంటూరులో విత్తనం మొదలుకుని ఎగుమతుల వరకు అన్ని దశల్లోనూ ఇక్కడ ప్రత్యేకతలున్నాయి. పొరుగు రాష్ట్రాల రైతులు కూడా ఇక్కడి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పురుగుమందులు, కొత్తగా మార్కెట్లోకి వచ్చే ఎరువులను ఇక్కడే పరిచయం చేస్తున్నారు. సాగులో కొత్త పద్ధతులకూ జిల్లా నెలవుగా ఉంది. ఆసియాలో అతిపెద్దదైన మిర్చియార్డు కొలువైందీ ఇక్కడే. రైతులకు గిట్టుబాటు ధర దక్కేవరకు మిర్చిని నిల్వ చేసుకోవడానికి గుంటూరు పరిసరాల్లో 80కిపైగా శీతలగోదాములున్నాయి. విత్తన పరిశోధన స్థానం లాం, మిర్చిలో పురుగుమందుల అవశేషాల శాతాన్ని పరీక్షించే ప్రయోగశాల అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రత్యేకతలతో జిల్లా యంత్రాంగం 76 పేజీల నివేదికను ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి విభాగం కింద కేంద్రానికి పంపింది. రైతులు బృందంగా ఏర్పడి రసాయన రహిత మిర్చి ఉత్పత్తిలో భాగస్వాములు కావడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను అందులో వివరించారు. గత జనవరిలో పర్యటించిన కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో అన్ని అంశాలను పరిశీలించి అవార్డుకు ఎంపిక చేసింది.

నేడు డీఆర్సీ సమావేశం

గుంటూరు: జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డీఆర్సీ) సమావేశం ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని అధికారులు తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయం, ఉద్యాన శాఖలతో పాటు జలవనరుల శాఖలపై సమీక్షించనున్నారు. తల్లికి వందనం పథకం అమలు, స్వర్ణాంధ్ర విజన్-2047 అంశాలపై సమీక్షించనున్నారు.

రైతేరాజు 6లో
దొండ పంటతో ఆదాయం
వెద సాగు.. దిగుబడి బాగు

ఆయకట్టుకు సాగునీటి భరోసా

కృష్ణాలో పెరుగుతున్న ప్రవాహం

ఈనాడు, అమరావతి: జలాశయాలకు జులైలోనే వరద పోటెత్తడంతో కృష్ణా నది జలకళ సంతరించుకుంది. శ్రీశైలం ఎగువన ఉన్న ప్రాజెక్టులు నీటితో నిండడంతో దిగువకు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. శ్రీశైలం జలాశయ గరిష్ఠ నీటిమట్టానికి చేరువైంది. దీంతో గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయనున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 78 వేల క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయంలో 529.10 అడుగుల వద్ద 166.39 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కృష్ణా నదికి ప్రస్తుతం ఉన్న ప్రవాహం కొనసాగితే త్వరలోనే సాగర్ డ్యామ్ కూడా నిండుతుంది. పులిచింతల ప్రాజెక్టు గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 19.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాగర్ జలాశయం నిండితే పులిచింతలకు వరద ప్రవాహం మొదలవుతుంది. ఈ నేపథ్యంలో సాగర్ కుడి, ఎడమ కాలువలతోపాటు కృష్ణా డెల్టా ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా లభించింది. సకాలంలో పంటల సాగుకు వెసులుబాటు కలిగిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

❖ ప్రకాశం బ్యారేజీకి పట్టిసీమ నుంచి గోదావరి జలాలు తరలిస్తున్నారు. కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలకు నీటిని విడుదల చేయడంతో రైతులు వరి నాట్లు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. పశ్చిమ డెల్టాలో వెద పద్ధతిలో వరి సాగు మొదలైంది. సాగర్ కాలువల కింద కూడా ఈసారి సాగునీరు ముందుగానే విడుదలవుతుందన్న అంచనాల నేపథ్యంలో రైతులు బోరుబావుల కింద నారుమళ్లు వేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగర్ కాలువల కింద 7 లక్షల ఎకరాలు, కృష్ణా పశ్చిమ డెల్టాలో 5 లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా లభించింది. సాగర్ కాలువలకు నీటిని విడుదల చేస్తే వాగుల్లో నీటి లభ్యత పెరిగి ఎత్తిపోతల పథకాల కింద ఉన్న 2 లక్షల ఎకరాల మెట్ట పంటలకు నీరందుతుంది. కాలువలు, వాగుల్లో నీటి ప్రవాహం పెరిగితే భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి.

ఆమడ దూరం అడవులే..

ఫిష్ బోన్ టెక్నాలజీ విధానంలో అటవీశాఖ అభివృద్ధి

మడ అడవులకు అధికారులు ఊపిరి పోస్తున్నారు.. ఫిష్ బోన్ టెక్నాలజీ విధానంలో అటవీశాఖ యంత్రాంగం అభివృద్ధి చేస్తోంది. బాపట్ల జిల్లా నిజాంపట్నం- సూర్యలంక మధ్య సముద్రతీరం వెంబడి మడ అడవులు ఉన్నాయి. మొక్కలు నాటడం వల్ల ఫలితాలు రాకపోవడంతో సీడ్ డిబ్లింగ్ విధానంలో లక్ష్యాన్ని సాధించేందుకు శ్రమిస్తున్నారు. సముద్ర తీరం వెంబడి సహజ సిద్ధంగా ఏర్పాటైనవే మడ వనాలు. ఇవి విపత్తుల వేళ తుపాను గాలుల వేగాన్ని తగ్గిస్తాయి. ఆ ప్రాంతంలో సముద్రపు పోటు పాట్ల వల్ల తీరం కోతకు గురికాకుండా కాపాడతాయి.

ఈనాడు, బాపట్ల

అటవీశాఖకు సంబంధించి బాపట్ల జిల్లాలోని ముత్యాలంపాలెం, నిజాంపట్నం, అడవులదీవి సెక్షన్ల పరిధిలో ముత్యాలంపాలెం, నిజాంపట్నం, ఆముదాలపల్లి, దిండి, అడవులదీవి, కొత్తపాలెం బీట్లలో మొత్తం 5232.86 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. ఇందులో 1500 హెక్టార్లు మడ అడవి కాగా.. నాలుగు దశాబ్దాల్లో ఆ విస్తీర్ణం 40శాతానికి పైగా తగ్గింది. అక్రమార్కులు చెట్లు నరికి ఆ ప్రాంతాలను రొయ్యలచెరువులుగా మార్చడమే ఇందుకు కారణం.

ఫిష్ బోన్ టెక్నాలజీతో.. సముద్రపు నీరు పోటు పాటుకు గురైనప్పుడు వాగులు, కాలువల ద్వారా పరిసరాల్లోకి విస్తరిస్తుంది. అక్కడే మడ వనాలు వృద్ధి చెందుతాయి. అయితే, గత కొంతకాలంగా ఈ ప్రక్రియకు అవరోధాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అధికారులు ఫిష్ బోన్ టెక్నాలజీ ఉపయోగించి మడ అటవీ ప్రాంతం పరిసరాల్లో కాలువలు తవ్వారు. సముద్రపు నీరు వాటిలోకి చేరే ఏర్పాటు చేశారు.

సీడ్ డిబ్లింగ్‌తో సత్ఫలితాలు.. పదేళ్లుగా అటవీశాఖ ఇక్కడ మడ అడవుల వృద్ధి చేపట్టగా.. 2019 వరకు 436.35 హెక్టార్లలో మొక్కలు నాటారు. అందులో ఎక్కువగా చనిపోవడంతో ఆ పరిసరాల్లో దొరికే విత్తనాలనే సేకరించి సీడ్ డిబ్లింగ్ చేపట్టడంతో సత్ఫలితాలు వస్తున్నాయి. ప్రస్తుతం 200 హెక్టార్లలో ఈ ప్రక్రియ జరిగింది. డ్రోన్ వీక్షణంలో ఆ పచ్చదనం కనిపిస్తోంది. ఇక్కడ 893.65 హెక్టార్లలో ఇప్పటికే సహజ సిద్ధంగా ఉండగా.. మరో 150 హెక్టార్లలో మడ వనాల ఏర్పాటుకు అనుకూలంగా ఉంది. ఈ ఏడాది 20 హెక్టార్లలో విస్తరించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సూర్యలంక సముద్రతీరం వెంబడి మడ అడవి

❖ తీరం వెంట మడ అడవుల విస్తీర్ణం పెంచే ప్రాజెక్టుకు ఎంపిక చేసిన పర ప్రాంతంపై పర్యావరణవేత్తల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. చిత్తడి నేలల్లో వలసపక్షుల ఆవాసాలు దెబ్బతినేలా అధికారులు మడ వనాల పెంపకం చేపడుతున్నారని గతంలోనే ఆందోళన వ్యక్తం చేశారు. తీరంలో పర్యావరణం, జీవవైవిధ్య పరిరక్షణకు మడ అడవుల విస్తీర్ణాన్ని పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించడం.. ఈ క్రమంలోనే అడవులదీవి, సూర్యలంకలో 200 హెక్టార్లలో తొలుత రూ.1.68 కోట్లతో అభివృద్ధి చేపట్టగా ప్రస్తుతం ఆ ఫలితాలు స్పష్టమవుతున్నాయి. ఈ విషయమై కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కాశీవిశ్వనాథ రాజుతో 'ఈనాడు' మాట్లాడగా.. మడ అడవుల అభివృద్ధిలో ఫిష్ బోన్ టెక్నాలజీ విధానంలో సత్ఫలితాలు వస్తున్నాయని వివరించారు.

ఏఎన్ఎంల సీనియారిటీ జాబితాపై తీవ్ర అభ్యంతరాలు

గుంటూరు వైద్యం: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏఎన్ఎం గ్రేడ్-3గా పని చేస్తున్న వారి బదిలీల కౌన్సెలింగ్ గందరగోళానికి దారితీసింది. సీనియారిటీ జాబితా బయటపెట్టాలని ఏఎన్ఎంలు ఆందోళనకు దిగారు. ఒక దశలో డీఎంహెచ్‌వో విజయలక్ష్మి కారును అడ్డగించి నిరసన తెలిపారు. కార్యాలయంలో సిబ్బంది ఉన్నారని, వారు జాబితా ఇస్తారని సర్దిచెప్పి అతి కష్టంమీద కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. వారంతా కార్యాలయం ముందే వర్షం పడుతున్నా జాబితా ప్రకటించే వరకూ వెళ్లేది లేదని ధర్నాకు దిగారు. దీంతో రాత్రి 10 గంటల సమయంలో సీనియారిటీ జాబితాను ఏఎన్ఎంల గ్రూపులో పెట్టారు. అది కూడా తప్పులతడకగా ఉందని వారంతా ఆరోపించడం గమనార్హం. గుంటూరు జిల్లాలో బదిలీల కౌన్సెలింగ్ విషయంలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కార్యాలయం నుంచి కూడా ఆరా తీయాల్సిన దుస్థితి ఏర్పడింది. వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు డీఎంహెచ్‌వోను కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం కౌన్సెలింగ్ ఏర్పాటు చేస్తామని ముందుగానే ప్రకటించినప్పటికీ మధ్యాహ్నం వరకు వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో చాలామంది డీఎంహెచ్‌వో కార్యాలయానికి తరలివచ్చారు. ఒక దశలో 900 మందికి తిరిగి కౌన్సెలింగ్ ఉంటుందని, కొద్దిసేపటి తర్వాత 160 మందికి మాత్రమే అని అధికారులు ప్రకటించడంతో అంతా గందరగోళానికి దారి తీసింది. చివరికి మంగళవారానికి కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు డీఎంహెచ్‌వో విజయలక్ష్మి ప్రకటించారు.

డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఏఎన్ఎంల ధర్నా

ఫిర్యాదులు వస్తున్నా..

ఏఎన్ఎంల సీనియారిటీ జాబితా విడుదలపై మొదటి నుంచి తీవ్ర జాప్యం చేస్తున్నారు. గతవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించిన సమయంలో తయారుచేసిన జాబితాపై మొదటి నుంచి ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ పట్టించుకోకుండా కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఆ జాబితా సక్రమంగా ఉంటే సోమవారం రాత్రి వరకు ఎందుకు వెల్లడించలేదని ఏఎన్ఎంలు ప్రశ్నిస్తున్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగితేనే రాత్రికి అతికష్టం మీద బయటపెట్టారని, అందులోనూ తప్పులున్నాయని వారు ఫిర్యాదు చేశారు. సీనియారిటీ జాబితాను ముందుగా ప్రకటించిన తర్వాతే మంగళవారం కౌన్సెలింగ్ ప్రారంభించాలని వారు డిమాండ్ చేస్తుండడం గమనార్హం.

నిరక్షరాస్యులకు వంద గంటల బోధన

గుంటూరు, న్యూస్‌టుడే: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్- అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని మార్గదర్శకాల ప్రకారం అమలు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఉన్న అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా ఉల్లాస్-అక్షర ఆంధ్ర(సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాసనం, అవగాహన) కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. జిల్లాలో 2025-26 సంవత్సరానికి 90,426 మంది నిరక్షరాస్యులను, 2029 నాటికి వంద శాతం వయోజన (ప్రాథమిక) క్రియాత్మక సాక్షరతను సాధించే లక్ష్యం రూపొందించారన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎంపీడీవో అధ్యక్షతన మండల స్థాయిలో, మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన మున్సిపల్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, వాచ్‌మెన్, కుక్‌లను సర్వే చేసి నిరక్షరాస్యులైన వారిని నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. తరగతుల నిర్వహణకు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అనుకూలమైన గదులు గుర్తించాలన్నారు. నిరక్షరాస్యులకు రోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు వంద గంటలు బోధన చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, వయోజన విద్య డీడీ ఆంజనేయులు పాల్గొన్నారు.

శనగ కొనేవారేరి.. ధరేది?

శనగ ధర రోజురోజుకూ దిగజారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట ఇంటికి చేరి నెలలు గడుస్తున్నా కొనుగోలుదారులు కనిపించక దిగాలు చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట చేతికందే సమయంలో తగ్గిన దిగుబడులు, ఆశించిన ధర లేకపోవడంతో డీలాపడ్డారు.

న్యూస్‌టుడే, మార్టూరు, అద్దంకి, పర్చూరు

జిల్లాలో పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో 38,693 ఎకరాల్లో రైతులు రబీలో శనగ రకాలు సాగు చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో భారీగా పెట్టుబడి పెట్టి, తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకున్నారు. శనగలను ఇళ్లకు తరలించుకున్నారు. అయితే వ్యాపారులు, దళారులు వాటిని కొనేటప్పుడు ధరలో భారీగా కోత విధించడంతో పెట్టిన పెట్టుబడి దక్కని పరిస్థితి. ప్రస్తుతం జేజే-11 రకం క్వింటా రూ.5,200 నుంచి రూ.5,400 వరకు కొనుగోలు చేస్తున్నారు. గతంలో రూ.10,500 ధర పలికిన కాబూలీ (తెల్ల) రకం శనగ ప్రస్తుతం అడిగే నాథుడే కనిపించడం లేదు. అవసరమైన వ్యాపారి ఎప్పుడో గుర్తు వచ్చినప్పుడు క్వింటా రూ.6 వేల చొప్పున కొంటున్నాడు.

ఇబ్బడిముబ్బడిగా దిగుమతి.. టాంజానియా, ఆస్ట్రేలియా, కెనడా, సూడాన్, శ్రీలంక తదితర దేశాల నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు సున్నా శాతం సుంకంపై ఎర్ర శనగలు ఇబ్బడిముబ్బడిగా దిగుమతి చేసుకున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికీ ఓడరేవుల్లో నిల్వలు ఉన్నాయంటున్నారు. గతంలో మాదిరి విదేశీ సరకుకు 30 శాతం దిగుమతి సుంకం విధించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఇక తెల్ల రకాలను మార్కెట్లో అడిగే నాథుడు కనిపించకపోవడమే కాకుండా ప్రభుత్వం కొనుగోలుకు వెనకడుగు వేస్తోంది. దీంతో ఈ రకం సాగు చేసిన రైతులు చేసేది లేక శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకోక తప్పడం లేదు. ప్రస్తుతం ఇంకొల్లు, పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, అద్దంకి తదితర ప్రాంతాల్లోని 40కి పైగా కోల్డ్ స్టోరేజీల్లో శనగ నిల్వలు పేరుకుపోయాయి. మరికొందరు అప్పుల బాధ నుంచి విముక్తికి దక్కిన ధరకు అమ్ముకుంటున్నారు.

ఇళ్ల వద్ద బస్తాలకు ఎత్తుతున్న శనగలు

ప్రభుత్వం శనగ రైతులను ఆదుకోవాలని కారంచేడు మండలం తిమిడితపాడుకు చెందిన **బోడావుల లక్ష్మీనారాయణ** కోరారు. తెల్ల, ఎర్ర రకాలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలని, డీస్టోన్ నిబంధన తొలగించాలన్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే శనగకు 30 శాతం దిగుమతి సుంకం విధిస్తేనే మన పంటకు మార్కెట్లో డిమాండ్ ఉంటుందన్నారు. టాంజానియా నుంచి మార్చి 31కి ఎర్రరకం శనగలు ఎక్కువ మొత్తంలో ఓడరేవుకు దిగుమతి అయ్యాయని, ఆ ప్రభావం దేశీయంగా శనగ మార్కెట్‌పై ప్రభావం చూపుతోందని అంటున్నారు.

ఏఎన్‌యూలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సమీక్ష 9న

గుంటూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకర్‌రావు ఈనెల 9న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారు. వర్సిటీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై అధికారులతో సమీక్షిస్తారు. కమిషన్ పర్యటన ఖరారవడంతో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో ఏఎన్‌యూ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రోస్టర్ పాయింట్ల ప్రకారం ఎస్టీలకు ఉద్యోగావకాశాలు కల్పించారా? లేదా? అనే దానిపై సమీక్షించనున్నట్లు సమాచారం.

జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపికలు 15న

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సింథటిక్ ట్రాక్‌లో జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఎంపికైన జట్టు ఆగస్టులో బాపట్లలో నిర్వహించే రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డు తీసుకుని ఈనెల 15వ తేదీ ఉదయం 9 గంటలకు ఏఎన్‌యూలోని సింథటిక్ ట్రాక్ వద్దకు రావాలని సూచించారు.

(c) eenadu

కలెక్టర్ గారూ.. చదువుకుంటాం సాయం చేయరూ!

★ చిన్నారుల విన్నపం ★ ఆదుకోవాలని పాలనాధికారి ఆదేశం

కలెక్టర్ వెంకటమురళిని సాయం చేయాలని కోరుతున్న బాలికలు, నాయనమ్మ

బాపట్ల, న్యూస్‌టుడే: కలెక్టర్ గారూ.. బాగా చదువుకుంటాం.. సాయం చేయరూ అంటూ తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు నాయనమ్మతో కలిసి కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు వచ్చి విజ్ఞప్తి చేశారు. పాలనాధికారి వెంటనే స్పందించి మిషన్ వాత్సల్య కింద ఇద్దరు చిన్నారులకు ఆర్థిక సాయం చేయాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. కర్లపాలెం ఎంపీ రాజుపాలేనికి చెందిన బాలికల తండ్రి పిట్ల వెంకట తిరుపతిరెడ్డి మాజీ సైనికుడు. అనారోగ్యంతో మృతి చెందాడు. తొలుత పిల్లల తల్లి ధనలక్ష్మి ఆరోగ్య సమస్యలతో తనువు చాలించింది. తిరుపతిరెడ్డి మరో మహిళను వివాహం చేసుకున్నా అతడి మరణం తర్వాత ఆమె పిల్లలను వదలి వెళ్లిపోయింది. విశ్రాంత సైనికుడిగా తిరుపతిరెడ్డికి వచ్చే రూ.19 వేల పింఛనులో రూ.9500 సవతి తల్లి తీసుకుంటోంది. కుమార్తెలకు మిగిలిన రూ.9500 వస్తోంది. నాయనమ్మ పిట్టు కోటేశ్వరమ్మ వారి సంరక్షణ బాధ్యతలు చూస్తోంది. బాపట్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మాజీ సైనికుడి పెద్ద కుమార్తె లిఖితారెడ్డి ఎనిమిదో తరగతి, చిన్న కుమార్తె వైష్ణవి మూడో తరగతి చదువుతున్నారు. మనవరాళ్లతో కలిసి కోటేశ్వరమ్మ కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ వెంకటమురళిని కలిసి ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులు తెలియజేసింది. ఆయన స్పందించి ప్రైవేటు పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి బాలికల నుంచి తక్కువ ఫీజు తీసుకునేలా చూడాలని ఐసీడీఎస్ పీడీ రాధా మాధవిని ఆదేశించారు. మిషన్ వాత్సల్య కింద బాలికలను దత్తత తీసుకుని.. తక్షణమే ఒక్కొక్కరికి రూ.నాలుగు వేలు చొప్పున సాయం చేయాలని చెప్పారు. బాలికల చదువు నిమిత్తం ఏ అవసరం ఉన్నా తనను సంప్రదించాలని సూచించారు.

వర్గీకరణ ఉద్యమానికి పురిటిగడ్డ చీరాల

మాట్లాడుతున్న మాణిక్యారావు

చీరాల, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి చీరాల ప్రాంతం పురిటిగడ్డని, విజయనగర కాలనీలోనే ఎమ్మార్పీఎస్ పురుడుపోసుకుందని లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యారావు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలాలను వివిధ రాష్ట్రాల్లో తమ జాతి ప్రజలు అనుభవిస్తున్నారని తెలిపారు. సంఘం ఆవిర్భావం తరువాత మొదట కమిటీ విజయనగర కాలనీలో వేశామని గుర్తుచేశారు. ఆ తరువాత క్రమంలో అనేక ప్రాంతాల్లో విస్తరిస్తూ ఉద్యమం దేశవ్యాప్తమైందన్నారు. ఇందులో కాలనీ వాసుల పాత్ర మరువలేనిదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం మొదటి నుంచి వర్గీకరణకు అనుకూలంగా ఉందన్నారు. ఉద్యమం మొదలైన మూడేళ్లకే దీనిపై చంద్రబాబు ఆర్డినెన్స్ ఇచ్చారని తెలిపారు. అంతకుముందు ఉద్యమంలో అమరులైన వారికి నివాళులు అర్పించారు. ఉసురుపాటి సురేష్, యాకోబు, చిట్టిబాబు, బాబూరావు, ప్రసాద్, వంశీ, లక్ష్మయ్య, రమేష్, మోషే, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 200 అర్జీలు

పొగాకు వ్యతిరేక బ్యానర్‌పై సంతకం చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, న్యూస్‌టుడే : వేమూరు మండలం చావలిలో నిరుపేద ఎస్సీ ఎస్టీ మహిళలను బంగారు రుణాల పేరుతో మోసం చేసిన మణికంఠ క్రెడిట్ సొసైటీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ వెంకటమురళికి పీజీఆర్ఎస్‌లో ఏఐసీసీటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు దార్లా బాధితులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సొసైటీ పాలకులు తీసుకున్న బంగారు ఆభరణాలు రికవరీ చేయించాలని కోరారు. పాత బస్టాండ్‌లో మాజీ గవర్నర్ కోన ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వైకాపా నాయకులు దేవేష్, సుధీర్‌బాబు, రాజా, రామచిరెడ్డి వినతిపత్రం అందజేశారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 200 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం సూర్యఘర్ లక్ష్యం సాధించేలా మండల అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. రిజిస్ట్రేషన్లలో ముందంజలో ఉన్న జె.పంగులూరు, నగరం మండలాల అధికారులను ఆయన అభినందించారు. కొల్లూరు, బాపట్ల, వేమూరు ఎంపీడీవోలు సూర్యఘర్ రిజిస్ట్రేషన్లలో నిర్లక్ష్యంగా ఉన్నారని.. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

వేడుకగా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలి

పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని పండగ వాతావరణంలో వేడుకగా జరపాలని విద్యాశాఖాధికారులను కలెక్టర్ వెంకటమురళి ఆదేశించారు. పీటీఎం నిర్వహణపై విద్యాశాఖాధికారులతో కలిసి ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 1818 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1.59 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. మెగా పీటీఎంలో ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలన్నారు. మాదక ద్రవ్యాల అరికట్టడంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పొగాకు రహిత సమాజంపై వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన ప్రచారాన్ని కలెక్టర్ ప్రారంభించి.. ప్రచార బ్యానర్‌పై సంతకం చేశారు. డీఈఓ పురుషోత్తం, సమగ్ర శిక్ష ఏపీసీ నాగిరెడ్డి, డీఎంహెచ్ఓ విజయమ్మ, డీపీఓ ప్రభాకర్, అటవీ శాఖాధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అన్ని రకాల పొగాకు కొనుగోలు చేయాలి

రైతులతో మాట్లాడుతున్న కృష్ణయ్య

ఇంకొల్లు, న్యూస్‌టుడే: మంచి రంగు నాణ్యత కలిగిన పొగాకును ధరలు తగ్గించి కొనుగోలు చేస్తూ రైతులను దగా చేస్తున్నారని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య ఆరోపించారు. సోమవారం రైతు సంఘం ప్రతినిధులు ఇంకొల్లు మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతుల ద్వారా సమస్యలు తెలుసుకున్నారు. కృష్ణయ్య మాట్లాడుతూ ముందుగా సన్న చిన్నకారు రైతుల దగ్గర నిల్వలు కొనుగోలు చేయాలన్నారు. లేకుంటే రంగు మారి ధరలు తగ్గుతాయన్నారు. రైతులు కేంద్రానికి తెచ్చిన అన్నిరకాల పొగాకును తిరస్కరించకుండా కొనాలని డిమాండ్ చేశారు. రామారావు, హరిబాబు, వెంకట్రావు, ప్రసాద్, బంగారుబాబు, రాజేష్, రాజు, కొలల రైతులు పాల్గొన్నారు.

టీ-20 క్రికెట్ పోటీల విజేత నకరికల్లు

విజేత జట్టుకు కప్పు, నగదు అందిస్తున్న నిర్వాహకులు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని విప్పర్లపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నియోజకవర్గ టీ-20 క్రికెట్ పోటీల్లో నరసరావుపేట నియోజకవర్గం నకరికల్లు సీనియర్ జట్టు విజేతగా నిలిచింది. జూన్ 12వ తేదీ నుంచి విప్పర్లపల్లివారి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచిన జట్టుకు వడ్లమూడి కిషోర్, కాకర్ల సాంబశివరావు, పగడాల వెంకటేశ్వరరెడ్డి, శాఖమూరి మారుతి చేతులమీదగా రూ.1.30లక్షలు నగదు బహుమతి సోమవారం అందజేశారు. పర్చూరు నియోజకవర్గం దుద్దుకూరు యూత్ జట్టు రెండో బహుమతి దక్కించుకోగా వారికి డాక్టర్ శాఖమూరి బాజీబాబు, డాక్టర్ చెరుకూరి ఫణికుమార్, ఏనుగంటి వెంకటరత్నం సమకూర్చిన రూ.80వేలు నగదును నిర్వాహకులు అందించారు. మూడో బహుమతి చీరాల కోటి స్మైల్స్ టీమ్ గెలుచుకోగా నాగరాజు చేతుల మీదగా రూ.50వేలు, నరసరావుపేట జట్టు 4వ బహుమతి దక్కించుకోగా వారికి యాంపాటి అంజిరెడ్డి, గ్రామ సర్పంచి గాదె రామిరెడ్డి రూ.30 వేలు అందించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

దొండ పంటతో ఆదాయం

సాగులో శాశ్వత దొండ పందిరి తోట

న్యూస్‌టుడే, యడ్లపాడు

ఉద్యాన పంటల సాగుతో ఓ రైతు లాభాల బాటలో నడుస్తున్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొత్తపాలేనికి చెందిన రాట్నాల రామయ్య మూడేళ్ల క్రితం 40 సెంట్ల విస్తీర్ణంలో బెంగాలీ రకం దొండ తోట సాగు చేశారు. రాతి స్తంభాలు, ఇనుప తీగలతో శాశ్వత పందిరి నిర్మించుకున్నారు. ఒక్కో స్తంభం రూ.400 చొప్పున కొని, ప్రతి 12 అడుగులకు ఒక్కో రాతి స్తంభం వంతున 70 స్తంభాలు భూమిలో పాతించారు. వాటి పైభాగంలో ఇనుప మెస్ అల్లించారు. ఉద్యాన తోటల సాగులో శాశ్వత పందిళ్లు నిర్మించే రైతుకు ఎకరాకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అందజేసే పెట్టుబడి రాయితీలో భాగంగా రూ.40 వేలు పొందారు. 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకుని పొలంలోని బోరుబావికి బిందు సేద్య పరికరాలు అమర్చుకున్నారు. తొలిఏడాది పెట్టుబడికి రూ.2.20 లక్షలు ఖర్చు చేశారు. మూడు నెలల నుంచి కాపు మొదలైంది. కూలీలతో పాటు కుటుంబ సభ్యులు దొండకాయల కోత పనుల్లో పాల్గొంటున్నారు. వారానికి సగటున 4 క్వింటాళ్ల దొండ పంట దిగుబడి చేతికి అందుతోంది. మార్కెట్‌లో సగటున దొండ కాయలకు కిలో రూ.10 నుంచి రూ.30 వరకు ధర లభిస్తోంది. పంటను గుంటూరు కూరగాయల మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఏడాదికి సరాసరి రూ.1.50 లక్షల ఆదాయం వస్తోంది. ఏటా వేసవిలో పందిరిపై అల్లుకున్న దొండ తీగలను తొలగిస్తున్నారు. కొత్త దొండ పాదుల నుంచి కొత్తగా చిగురు వచ్చి దిగుబడి రావటానికి 2 నెలల సమయం పడుతోంది.

కష్టానికి దక్కుతున్న ప్రతిఫలం

పత్తి తదితర వాణిజ్య పంటల సాగులో నష్టపోయి ఉద్యాన తోటలు సాగు చేస్తున్నా. కుటుంబ సభ్యులతో కలిసి తోటలో పురుగు మందుల పిచికారీ, కాయలకోత, మార్కెట్ తరలింపు తదితర పనులు స్వయంగా చేసుకుంటున్నాం. పంట మీద వచ్చే నికర ఆదాయంతో కుటుంబాన్ని ముందుకు నడిపిస్తున్నా. ఉద్యాన తోటల సస్యరక్షణకు పెట్టుబడి వ్యయం క్రమంగా పెరుగుతోంది. **- రాట్నాల రామయ్య, ఉద్యాన రైతు, కొత్తపాలెం, యడ్లపాడు మండలం**

రైతు ప్రశ్న: పత్తి విత్తిన తర్వాత తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు ఏమిటి?
– మోహనరావు, బడేపురం, తాడికొండ మండలం.

శాస్త్రవేత్త సమాధానం: జిల్లాలోని నల్ల నేలల్లో జులై, ఆగస్టు నెలలు పత్తిని విత్తేందుకు అనుకూల సమయం. 70 మి.మీ. వర్షపాతం నమోదయ్యాక నానుడి పదునులో విత్తనం విత్తుకోవాలి. ఎంపిక చేసుకున్న విత్తనాన్ని శుద్ధి చేసి విత్తుకుంటే పంటను చీడపీడలు, తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు.

విత్తన శుద్ధి ఇలా: ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్. 9 మి.లీ/ కిలో విత్తనం, సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ 10 గ్రా/ కిలో విత్తనానికి వాడాలి. లేదా ట్రైకోడర్మ విరిడె 8 గ్రా. కిలో విత్తనం లేదా కార్బాక్సిన్ 2 గ్రా. కిలో విత్తనానికి పట్టించి శుద్ధి చేసుకోవాలి. **- డాక్టర్ ఎన్.వెంకటలక్ష్మి, గుంటూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త – న్యూస్‌టుడే, గుంటూరు**

డెల్టా మాగాణుల్లో పచ్చిరొట్ట ఎరువుల ఆవశ్యకత

కొల్లూరు, న్యూస్‌టుడే: కృష్ణాడెల్టాలోని మాగాణుల్లో పచ్చిరొట్ట ఎరువుల ఆవశ్యకతను కొల్లూరు మండల వ్యవసాయాధికారి వల్లభరెడ్డి నరేంద్రబాబు వివరిస్తున్నారు. రైతులు ఖరీఫ్‌లో వరి, రబీలో మినుము, పెసర పంటలు సంప్రదాయంగా సాగు చేస్తున్నారు. దీనివల్ల మినుము, పెసర మొక్కల వేళ్లలో అభివృద్ధి చెందే నత్రజని బుడిపెలు పొలంలో కలిసి నేలకు సహజంగా నత్రజనిని అందించాయి. ఈ ప్రక్రియ నేల సహజ స్వభావ పరిరక్షణ, నత్రజని, సేంద్రియ పదార్థాల స్థిరీకరణకు తోడ్పడింది. కొన్నేళ్లుగా వరి పంట తరువాత రబీలో మినుము, పెసరకు బదులుగా మొక్కజొన్న, జొన్న సాగవుతున్నాయి. ఈ పంటలు నేలనుంచి సారాన్ని గ్రహించడమే తప్ప మినుము, పెసర, పప్పుధాన్యాల మొక్కల మాదిరిగా నేల సారం పెంచవు. దీనికి తోడు మొక్కజొన్న, జొన్న పంటల వ్యర్థాలు రైతులు పొలంలో తగలబెట్టడంతో సహజసిద్ధమైన ఎరువులు పొలాలకు అందే అవకాశం లేకుండా పోయింది. దీంతో నేల సహజ స్వభావం దెబ్బతినడంతో రసాయన ఎరువుల వాడకం ప్రమాదకర స్థాయికి చేరుకుంటోంది. దీంతో పెట్టుబడులు ఇబ్బడిముబ్బడిగా పెరిగి దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. సమస్యను అధిగమించేందుకు పచ్చిరొట్ట పైరుల పెంపకం చేపట్టాలి.

వెద సాగు.. దిగుబడి బాగు

న్యూస్‌టుడే, అమృతలూరు

కూలీ రేట్లు పెరగడం, ప్రతికూల పరిస్థితులతో విసిగిన రైతులు కొంత కాలంగా వెద సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ విధానంలో మెలకువలు, కలుపు యాజమాన్యం తదితర అంశాలను మండల వ్యవసాయ అధికారి భరత్ కుమార్ వివరించారు. రైతులు తొలి నుంచి నీటి యాజమాన్యం (ఆరుతడి)పై అప్రమత్తంగా ఉంటే ఆశించిన దిగుబడి వస్తుందన్నారు.

వ్యయం తక్కువ: ఈ పద్ధతిలో ఎకరాకు కేవలం 15 నుంచి 18 కిలోల విత్తనం మాత్రమే అవసరం. నారు పెంపకం, పీకడం, నాట్లు వేయడం వంటి ఖర్చు ఎకరాకు రూ.2,500 వరకు తగ్గుతుంది. కూలీల కొరత అధిగమించవచ్చు.

ఆశించిన దిగుబడి: వెద సాగులో మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండడంతో సాధారణ నాట్ల కంటే 15 శాతం దిగుబడి పెరగడానికి అవకాశం ఉంది. పంట 7 నుంచి 10 రోజులు ముందుగా కోతకు వస్తుంది. దుబ్బుకు పిలకలు ఎక్కువగా రావడం, ఎత్తు ఎక్కువగా పెరగకపోవడంతో గాలులకు తట్టుకుని నిలబడుతోంది.

కలుపు నివారణ: ఈ పద్ధతిలో కలుపు ప్రధాన సమస్య. సకాలంలో దానిని నివారించి పైరును కాపాడుకోవాలి. వరి విత్తిన 3 నుంచి 5 రోజుల్లోపు ఎకరాకు 50 గ్రాముల ఆక్సా డయార్జిల్ 80 శాతం పొడి లేదా 80 గ్రాముల పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 5 శాతం మందు 20 కిలోల పొడి ఇసుకతో కలిపి చల్లాలి. లేదా 400మి.లీ., సైహలోఫాప్ బ్యుటైల్ 10 శాతం మందును 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 15 రోజులకు పిచికారీ చేయాలి. గడ్డి, వెడల్పాటి ఆకు నిర్మూలనకు 80 నుంచి 120మి.లీ. బిస్ పైరిబాక్ సోడియం, 10 శాతం ద్రావకం 200లీటర్ల నీటిలో కలిపి విత్తిన 15 నుంచి 20 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. 40 రోజులకు చేతితో కలుపు తీయించి నిర్మూలించవచ్చు.

వెద పద్ధతిలో డ్రమ్ సీడర్‌తో విత్తడాన్ని పర్యవేక్షిస్తున్న ఏవో భరత్‌కుమార్

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగం రాలేదని మనస్తాపం చెందిన ఒక యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చీరాల మండలం వాడరేవు - రామాపురం మధ్య చోటుచేసుకుంది. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మార్టూరు మండలం కోలలపూడికి చెందిన బొబ్బేపల్లి శ్రీనివాసరావు కుమారుడు అనిల్‌కుమార్(23) నరసరావుపేటలో బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నాడు. ఫలించకపోవడంతో.. మనస్తాపం చెంది ఈనెల 4న వాడరేవు వచ్చి ఒక రొయ్యల ఫ్యాక్టరీ సమీపంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు.. చీరాలలోనే ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ.. సోమవారం మరణించాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

స్కూటీ అదుపు తప్పి ఆదాయపన్ను శాఖ అధికారి మృతి

జె.పంగులూరు, న్యూస్‌టుడే: స్కూటీ అదుపుతప్పి కింద పడటంతో ఆదాయపన్ను శాఖ అధికారి మృతి చెందిన ఘటన జాతీయ రహదారిపై జాగర్లమూడివారిపాలెం వద్ద సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరులో ఆదాయ పన్ను శాఖ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న దాసరి కృష్ణచైతన్య (46) ఒంగోలు నుంచి గుంటూరు వెళుతుండగా స్కూటీ అదుపుతప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినోద్‌బాబు తెలిపారు.

అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం

అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, న్యూస్‌టుడే : సమస్యలపై పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇచ్చే అర్జీలు పునరావృతం కాకుండా పోలీసు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ తుషార్ డూడీ ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల సమస్యలను ఎస్పీ విన్నారు. మొత్తం 55 మంది సమస్యలపై అర్జీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో సత్వర విచారణ చేపట్టి న్యాయం చేస్తామన్నారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, ఆస్తి తగాదాలు, స్థల వివాదాలపై ఎక్కువ అర్జీలు వచ్చాయి. డీఎస్పీలు రామాంజనేయులు, మోయిన్, సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలీసు విధుల్లో డ్రైవర్ బాధ్యత కీలకం

బాపట్ల, న్యూస్‌టుడే : పోలీసు విధుల్లో డ్రైవర్ బాధ్యత కీలకమని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. స్థానిక పోలీసు కవాతు మైదానంలో పోలీసు వాహన డ్రైవర్లకు డ్రైవింగ్ నైపుణ్య శిక్షణ కోర్సును ఆయన సోమవారం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆధునాతన డ్రైవింగ్ నైపుణ్యాలు అభివృద్ధి, ప్రమాద నివారణ సాంకేతికలు, వాహనాల నిర్వహణ, వీవీఐపీ కాన్వాయ్, ప్రొటోకాల్స్ పాటించటం, అత్యవసర పరిస్థితుల్లో డ్రైవర్లు మరింత భద్రంగా, వృత్తిపరమైన పరిపక్వతతో విధులు నిర్వహించటానికి అవసరమైన నైపుణ్యాలు మెరుగుపరచటం వంటి అంశాలపై మూడు రోజులు శిక్షణ ఇస్తారని వివరించారు. మానవ తప్పిదాలు, వాహనాల నిర్వహణ లోపాల వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు చెప్పారు. పోలీసు వాహనంలో ప్రయాణిస్తున్న అధికారిని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చే బాధ్యత డ్రైవర్‌పై ఉందని, ప్రమాదరహితంగా నడపాలని సూచించారు. ఏఆర్ డీఎస్పీ విజయసారథి, ఎంవీఐ రంగారావు, ఎంఆర్టీఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదంలో ఖోఖో శిక్షకుడి దుర్మరణం

శ్రీనివాసరావు (పాతచిత్రం)

జి.ఎన్.పాలెం (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై వస్తూ కిందపడి ఖోఖో శిక్షకుడు మృతి చెందారు. గోకరాజు నల్లిబోయినవారిపాలెంలో సోమవారం ఇది జరిగింది. చందోలు ఎస్సై శివకుమార్ యాదవ్ వివరాల మేరకు... జి.ఎన్.పాలెం గ్రామానికి చెందిన నల్లిబోయిన శ్రీనివాసరావు (56) ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తూ గ్రామంలోని శ్రీరామాలయం కూడలిలో అదుపు తప్పి కింద పడ్డారు. తలకు బలమైన గాయం కావటంతో గుంటూరు వైద్యశాలకు తీసుకువెళ్లగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ★ శ్రీనివాసరావు తీరప్రాంతంలో ఎంతో మందికి ఖోఖో శ్రీనుగా పరిచయం. ఖో-ఖోలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించారు. తీర ప్రాంతం నుంచి ఎంతో మందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. పొన్నూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో పీఈటీగా పని చేసేవారు. ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే నరేంద్రవర్మ సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ట్రాక్టర్ కింద పడి చోదకుడు...



మల్లికార్జునరావు మృతదేహం

వెల్లలచెరువు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో చోదకుడు మృతిచెందిన ఘటన వెల్లలచెరువులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జె.పంగులూరు మండలం రామకూరుకు చెందిన నల్లపాటి మల్లికార్జునరావు (44) అత్తగారి ఊరు సంతమాగులూరు మండలం వెల్లలచెరువు. రామకూరులో తొలి ఏకాదశి పండగ ఆదివారం జరుపుకొని సోమవారం ట్రాక్టర్‌పై అత్తగారింటికి బయలుదేరారు. అమరావతి-అనంతపురం జాతీయ రహదారిలో వెల్లలచెరువు పెట్రోలు బంకు సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి అంచులోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ట్రాక్టర్ కింద పడి మరణించారు. స్థానికులు గమనించి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. మృతదేహాన్ని శవపంచానామా నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 107, రిటైల్ ధర - 129, చికెన్ విత్‌స్కిన్ - 187, చికెన్ స్కిన్‌లెస్ - 213.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 106, 114, 125 చికెన్ విత్ స్కిన్ - 204 చికెన్ స్కిన్‌లెస్ - 214.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

91.9FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES
బిజినెస్ మరియు ఎంప్లాయీస్‌కి లోన్ ఎలిజిబిలిటీ ఉండి ప్రాపర్టీ లేక ప్రాపర్టీ ఉండి ఎలిజిబిలిటీ లేని వారికి 1 Cr. నుండి 10 Cr. వరకు లోన్ ఇప్పించబడును. ✆ 99597 71529.

PEOPLE CARE
అశ్విని హోమ్‌కేర్ సర్వీసెస్ చిన్నపిల్లలను చూసుకుంటకు అనుభవంగల కేర్ టేకర్లు, హౌస్ కీపర్స్, పేషంట్స్ కొరకు నర్సులు, ఆయాలు మీ ఇంటి వద్దకే పంపించబడును. గుంటూరు. 88533 83338.

OLD AGE HOME
రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.
స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

REAL ESTATE
HOUSE FOR SALE
GENERAL
బాపట్ల పట్టణము మెయిన్‌రోడ్ మరియు నేషనల్ హైవే మధ్యగల రోడ్డు ప్రక్కన గల పటేల్ నగర్ 1వలైనులో బిజెపి ఆఫీస్ ప్రక్కన 5.5 సెంట్ల విస్తీర్ణములో గల 2 అంతస్తుల డాబా అమ్మకమునకు కలదు. ✆ 99498 43944, 94416 49539.

LAND FOR SALE
GENERAL
మెగా ★ అవకాడో ★ఫామ్ ల్యాండ్‌లో 11 సెంట్లు ★5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్: 9133574455.

PLOT FOR SALE
GENERAL
అమరావతి రోడ్, మల్లికార్జునపేట, 30 అ॥ల రోడ్, వెస్ట్ ఫేసింగ్ 25X45=125 చ.గ.ల ఖాళీ స్థలం అమ్మకానికి కలదు. గజం 44వేలు. ఫోన్: 90308 07472.

JOBS
Amaravathi Roofings: Roofing Sheats Distributor looking for Sales executives for Palnadu District with 2 to 3 yrs. Experience, Any Degree/Diploma. ✆ 95505 33666.
SIMS Group of Institutiona Require Hostel Wardens and Supervisors Male and Female, Qulification any Degree, Interested Candidates Call- Ph:- 76759 63955, 9133858238.
Wanted Primary, High School Telugu, English and Physics Teachers Contact Immediately. Perecherla Ph : 97017 59405, 99123 77669.
Required Accountant with Tally Knowledge for a Company Salary: 20000 to 30000. Contact: 95023 82228.
Looking for Senior Shift Supervisor & Maintenance Manager & Training Officer for a Spinning Mill Company with Plant @ Medchal with minimum of 10 Years. Exp. ✆ 8187860597.
Wanted Marketing Executives to work in Reputed Organization. Salary 12K to 15K. For Details. Reena's, 10/2, Arundalpet, Guntur. Interview Timings. 8 AM to 12 PM. Call: 98499 89951.
గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా భోజనం మరియు వసతితో పాటు Tally + Ms-Office కోర్సు నందు శిక్షణతో 100% ఉపాధి కల్పించబడును. 88851 81110.
కంప్యూటర్ డిజైనర్, ఐపీ కోఆర్డినేటర్, నర్సింగ్ స్టాఫ్, హెల్పర్స్, ల్యాబ్ టెక్నీషియన్ (నైట్ డ్యూటీ) కావలెను. ✆: 77999 77855.
గుంటూరులోని ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనిలో పనిచేయుటకు సూపర్ వైజర్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత కలదు. ✆ 70753 38338.
ఆత్మ విశ్వాసముతో సృజనాత్మక ఆలోచనలతో కుటుంబ వృద్ధిలో భాగస్వామ్యం కావాలనుకునే వివాహిత మహిళలకు ఒక సదావకాశం. మార్కెటింగ్ మరియు ఆఫీసు. విద్యార్హత: ఇంటర్మీడియట్ ✆ 89198 68927.
WALK -IN - INTERVIEW
విజన్ ఆటో మోటీవ్స్ - అపె ఆటో షోరూమ్ గుంటూరు, తెనాలి, నరసరావుపేట, మంగళగిరి, పిడుగురాళ్ళ నందు పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్ - 4 ★ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ -15 ★ అకౌంటెంట్స్ - 2 ★ సర్వీసు మేనేజర్ - 1 ★ సర్వీసు సూపర్‌వైజర్స్ - 4 ★ మెకానిక్స్ - 6 కావలెను. విజన్‌ఆటో మోటీవ్స్, D.No: 18-4-23, బ్రహ్మానందరెడ్డి స్టేడియం దగ్గర గుంటూరు. ఇంటర్వ్యూ తేది: 08-07-2025 నుండి 11-07-2025 వరకు. ఫోన్/ వాట్సాప్ : 77999 09045, 77999 09055,. ఇమెయిల్: visionauto.guntur@gmail.com

WANTED
A LEADING FINANCIAL SERVICES MARKETING COMPANY REQUIRES
AREA MANAGER
FOR SELLING MOTOR INSURANCE
CTC Rs.3.5-4.5 LACS/ANNUM
PREFERABLY FROM GENERAL INSURANCE COMPANIES OR INSURANCE BROKING COMPANIES WITH 3 TO 4 YEARS OF EXPERIENCE.
LOCATION GUNTUR
send your RESUME to
resume@skiretail.in
✆ 9840335849
Ski Retail Capital limited
No.1, Sambandam Street, T Nagar Chennai-600017.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

(c) eenadu

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

తెదేపా మండల కార్యవర్గాల ఎంపిక

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో సోమవారం తెదేపా మండల కార్యవర్గాలను ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా వాకా శేషుబాబు, ఉపాధ్యక్షుడిగా నూతక్కి దినకర్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా గొట్టుముక్కల లెనిన్‌ను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నియమించారు. కార్య నిర్వాహక కార్యదర్శులుగా వరి కూటి రామమనోహర హరిప్రసాద్, వేములపల్లి సుధారాణి, పప్పల గంగాధర్, కార్యదర్శులుగా యలవర్తి జార్జ్, యర్రంశెట్టి పార్థసారధి, షేక్ సైద్ మహమ్మద్ ఖాద్రి, కోశాధికారిగా టి.సోమశేఖర్, క్లస్టర్ కమిటీ సభ్యులను నియమించారు. 9వ క్లస్టర్ కన్వీనర్‌గా మోటూరి పుణ్య శ్రీనివాసరావు, 10వ క్లస్టర్ కన్వీనరుగా వామనపల్లి వెంకట కోటేశ్వరరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడిగా పోతార్లంక రాజేష్, ఎస్సీ విభాగానికి నన్నెపాముల జైపాల్, బీసీ విభాగానికి జొన్నాదుల వెంకటేశ్వరరావు, ఐటీడీపీ విభాగం అధ్యక్షుడిగా గోవర్ధనగిరి నవీన్‌ను నియమించారు.

రేపల్లెలో ఎనిమిది అర్జీలు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే : రేపల్లె రెవెన్యూ డివిజన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 8 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. రేపల్లె మండలం కమ్మువారిపాలెం నుంచి సింగుపాలెం వరకు డొంక బాట ఏర్పాటు చేయాలని, పట్టాదారు పాసు పుస్తకానికి ఆధార్ సీడింగ్ చేయాలని కోరారు. వేమూరు మండలం పెరవలి నివాసి గీతాదేవి చుండూరు మండలం మండూరులో రహదారి సమస్య పరిష్కరించాలని, ప్రభుత్వానికి విక్రయించిన ధాన్యానికి నేటికీ నగదు జమ కాలేదని రేపల్లె మండలం నల్లూరు గ్రామస్థుడు వినతి ఇచ్చారు. రేపల్లె పాత పట్టణం రోడ్డు విస్తరణలో కోల్పోయిన స్థలానికి పరిహారం ఇప్పించాలని, నగరం మండలం వెనిగళ్లవారిపాలెంలో పంచాయతీ రోడ్డు ఆక్రమణకు గురైందని, కొల్లూరు మండలం జువ్వలపాలెంలో రహదారి మార్గం చూపాలని కోరారు. రేపల్లె మండలం బేతపూడిలో చేపట్టిన సెల్ టవర్ నిర్మాణం ఆపేలా చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖలకు అర్జీలు పంపినట్లు ఆర్డీవో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? పాతనందాయపాలెం పంచాయతీలో వీధి దీపాలు నెల నుంచి పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. -స్థానికులు

✔ వీధి దీపాలు రాత్రి మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసరావు, ఎంపీడీవో – న్యూస్‌టుడే, కర్లపాలెం

? వేమూరు ఎస్సీకాలనీ 10వ వార్డులో మురుగు సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. -స్థానికుడు

✔ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి చర్యలు చేపడతాం. - శేఖర్, ఈవోపీఆర్డీ – న్యూస్‌టుడే, వేమూరు

? బొర్రావారిపాలెం పంచాయతీ అచ్యుతపురంలో రేపల్లె ప్రధాన మురుగు కాల్వ వంతెన పక్కన చెత్తా చెదారం వేస్తున్నారు. -స్థానికుడు ✔ పరిశీలన చేసి సమస్య పరిష్కరిస్తాం. -వీరాస్వామి, పంచాయతీ కార్యదర్శి బొర్రావారిపాలెం –న్యూస్‌టుడే, నిజాంపట్నం

? మండలంలోని చందోలులో బండ్లమ్మ ఆలయం ఎదుట రహదారి పక్కన కాల్వలో మురుగు పేరుకుని దుర్వాసన వస్తోంది. - ఇస్మాయిల్ ✔ పరిశీలించి సిబ్బందితో మురుగు కాల్వలు బాగు చేయించి మురుగు నిల్వ లేకుండా చేస్తాం.- సుజాత, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

చెత్త, వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

పిట్టలవానిపాలెం: చందోలు నుంచి చోడిపాలెం వెళ్లే రహదారిలో నదీముల్లాయపాలెం మలుపు వద్ద రహదారిపై చెత్త, వ్యర్థాలు వేస్తుండటంపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో 2న సమస్య ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి సుజాత చెత్త తొలగించే చర్యలు చేపట్టారు.

రూ.6 లక్షలతో కాలువ నిర్మాణం

నగరం: నగరం ఎస్ఎస్‌వీ సినిమా హాలు రహదారిలో మురుగు కాలువ లేదని మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన 'ఈనాడు'లో 4న ప్రచురితమైన సమస్యకు స్థానిక సచివాలయం అధికారులు స్పందించారు. రూ.ఆరు లక్షలతో చెరుకుపల్లి రహదారి నుంచి సినిమాహాలు మలుపు వరకు మురుగు కాలువ నిర్మాణం చేపట్టారు.

కుట్టు శిక్షణ.. భవితకు నిచ్చెన

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ముందుకు సాగేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. పట్టణం, గ్రామాల్లో వెనుకబడిన వర్గాల మహిళల్లో ఎక్కువ మందికి ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంది. మూడు నెలలు శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేయనుంది. అందులో భాగంగా రేపల్లె ప్రకాశం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేసింది. శిక్షకురాలు సుహాసినీ పర్యవేక్షణలో 90 రోజులు చేతి వృత్తి శిక్షణ సోమవారం ముగిసింది. ఈ నేపథ్యంలో పలువురు గృహిణులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

శిక్షణ పొందుతున్న మహిళలు

స్వయం ఉపాధికి దోహదం

చేతివృత్తిలో నైపుణ్యం వృద్ధి చేసుకోవాలన్న ధ్యేయంతో శిక్షణలో చేరాను. అంబరిల్లా కటింగ్, పంజాబీ డ్రెస్, మిడ్డీ, స్కర్ట్స్ కుట్టడంలో మెలకువలు నేర్చుకున్నా. ఆధునిక పద్ధతుల్లో దుస్తులు కుట్టడంలో పట్టు సాధించాను. 7, 8 తరగతులు చదువుతున్న మా ఇద్దరు ఆడపిల్లలకు దుస్తులు కుట్టుకున్నా. కొంత మేరకు కుటుంబంపై ఆర్థిక భారం తగ్గుతుంది. –నాజీమా, గృహిణి, 3వ వార్డు రేపల్లె

సద్వినియోగం చేసుకున్న మహిళలు

◆ దుస్తుల తయారీకి గిరాకీ

యువతులు, మహిళలు వస్త్రాలంకరణపై మొగ్గు చూపుతారు. చక్కగా దుస్తులు తయారు చేస్తే ఖర్చుకు వెనకాడరు. మారుతున్న ఫ్యాషన్లకు అనుగుణంగా దుస్తులు కుట్టేవారికి మార్కెట్లో గిరాకీ ఉంది. మా ఆడపిల్ల అభిరుచికి తగ్గట్టుగా డ్రెస్‌లు కుట్టాలన్న లక్ష్యంతో తర్ఫీదు పొందుతున్నా. మార్కెట్లో లాంగ్‌ఫ్రాక్, మోడల్ ఫ్రాక్ కుట్టినందుకు రూ.500 నుంచి రూ.1000 వరకు తీసుకుంటున్నారు. మా అమ్మాయిలకు విభిన్న మోడల్స్‌లో దుస్తులు తయారు చేసేందుకు శిక్షణ దోహదపడుతుంది. – మామిళ్లమ్మ, గృహిణి, రేపల్లె

ఎన్నో విషయాలు నేర్చుకున్నా.. ◆

కుటుంబ ఖర్చులు తగ్గించడంలో మహిళలకు బాధ్యత ఉంది. నేడు జాకెట్, చీర అంచులు, ఫాల్ కుడితే రూ.100 నుంచి రూ.150 వరకు ఖర్చు అవుతుంది. శిక్షణ సద్వినియోగం చేసుకున్నా. 90 రోజులు తర్ఫీదు పొందడం సంతోషంగా ఉంది. దుస్తుల తయారీలో ఎన్నో విషయాలు నేర్చుకున్నా. – సౌజన్య, గృహిణి, 25వ వార్డు, రేపల్లె

డ్రెయిన్ బాగు చేయండి

వేమూరు, న్యూస్‌టుడే : వేమూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఫిర్యాదుల దినోత్సవానికి తహసీల్దార్ సుశీలకు రెండు ఫిర్యాదులు అందాయి. వాటిలో ఒకటి జంపనికి చెందిన పలువురు రైతులు పెదరావూరు నుంచి జంపని వరకు ఆరు కిలోమీటర్ల మేర మురుగు కాల్వ పూడికతో నిండి.. పొలాల్లో మురుగు నీరు బయటకు వెళ్లడం లేదని చెప్పారు. చావలికి చెందిన ఎస్టీ కాలనీ వాసులు మాకు నివేశన పట్టాలు ఇచ్చారని, కానీ స్థలం చూపించలేదని వినతి అందజేశారు.

ఆహార శుద్ధి రంగంలో అపార అవకాశాలు

బాపట్ల, న్యూస్‌టుడే : ఆహార శుద్ధి రంగంలో భవిష్యత్తులో లభించే అపార అవకాశాలను ఫుడ్ సైన్స్ బీటెక్ విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉప కులపతి శారదా జయలక్ష్మీదేవి అన్నారు. ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన కళాశాల, వసతి గృహాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యా క్రీడా రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వీసీ బహుమతులు అందజేశారు. డీన్ మణి, రమణ, పీఏ ఎంఎస్ బేగ్, ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న వీసీ శారదా జయలక్ష్మీదేవి

పొదలు తొలగవు.. మురుగు కదలదు

ఖాజీపాలెం పంచాయతీ పరిధిలో మురుగు కాలువలు మరమ్మతులకు గురయ్యాయి. సచివాలయం ఎదురుగా ఉన్న సీసీ రహదారి పక్కనే ఉన్న కాలువలో పొదలు అల్లుకుని మురుగు కదలడం లేదు. కాలువ మెరుగుపరచి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. సమస్య పరిశీలించి చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం)

పొదలతో కాల్వ

రెవెన్యూ, పోలీసులపై ఎస్సీ కమిషన్ డైరెక్టర్‌కు ఫిర్యాదు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : తన పొలాన్ని అగ్ర కులాల వారు ఆక్రమించి.. దాడి చేస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని భట్టిప్రోలు మండలం పెసర్లంకకు చెందిన యన్నం సురేష్ సోమవారం హైదరాబాద్‌లోని జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ గడ్డం సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తన పొలం మధ్యలో నుంచి రోడ్డు వేయాలని.. గతంలో ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఆక్షేపించినా తెలిపారు. రోడ్డు తొలగించి న్యాయం చేయాలని ఛైర్మన్ ఆదేశించినా పోలీసులు, అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని, న్యాయం చేయాలని ఆయన కోరారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

మూల్పూరు, (అమృతలూరు), న్యూస్‌టుడే : మూల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు దాతలు సోమవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కొల్లూరు బసవయ్య చౌదరి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వెంకట లోకేష్, ఈరే ఏంజల్, వెంకటేశ్వరమ్మలకు నగదు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉక్కిరిబిక్కిరయ్యారు

పొగతో డంపింగ్ యార్డు పరిసరాలు

పురపాలక అధికారులు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. డంపింగ్ యార్డులో సోమవారం మళ్లీ మంటలు అంటుకుని దట్టమైన పొగ అలుముకుంది. రెండు, మూడు, నాలుగు వార్డుల ప్రజలకు ఊపిరి ఆడక అల్లాడారు. సిబ్బంది ఉదయం నుంచి అగ్నిమాపక శకటం, ట్యాంకర్లు తెచ్చి ఆర్పే పనిలో నిమగ్నమయ్యారు. అయినా రాత్రి వరకు పొగ సమస్య పరిష్కారం కాలేదు. వృద్ధులు, మహిళలు, పిల్లలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డిని సంప్రదించగా మరోసారి సమస్య తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. – న్యూస్‌టుడే బాపట్ల

ఈ గుంత పూడ్చేదెవరో?

తెనాలి నుంచి వెల్లటూరు వెళ్లే రహదారిలో జంపని వద్ద రేపల్లె తెనాలి నుంచి వెల్లటూరు వెళ్లే మార్గంలో జంపని వద్ద రేపల్లె డ్రెయినేజీపై ఉన్న వంతెన శ్లాబ్ దెబ్బతింది. పైభాగం కంకర పోయి.. ఇనుప చువ్వలు బయటపడ్డాయి. ఈ కారణంగా ఇక్కడ గుంత పడింది. దీంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ విద్యాసాగర్‌ను అడుగగా పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, వేమూరు



దుర్వాసన వస్తున్నా పట్టించుకోరా?

మండలంలోని పాతనందాయపాలెం సచివాలయం ఎదురుగా ఉన్న రహదారి పక్కన చెత్తా చెదారం పారబోస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోంది. వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్లపాలెం

రహదారి పక్కన చెత్తాచెదారం

జలం.. తాగలేం

రంగు మారిన నీటి సరఫరాతో ఆందోళన

న్యూస్‌టుడే, కర్లపాలెం

ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి రక్షిత నీరు అందించేందుకు అవకాశాలు అందించినా అధికారులు వాటిని సక్రమంగా వినియోగించడం లేదు. దీంతో గ్రామాల్లో పలుచోట్ల నీటి పథకాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి ట్యాంకులు, చెరువులు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలి. అది చేయకుండానే నీటి సరఫరా చేస్తున్నారు. కొన్నిచోట్ల ట్యాంకులు నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. కాలం చెల్లిన పైపులైన్ల కారణంగా లీకులు ఏర్పడి వాటిలోకి మురుగు చేరుతోంది. దుండివారిపాలెం రక్షిత మంచినీటి చెరువు జమ్ము, తూటికాడతో అధ్వానంగా ఉంది. మండల కేంద్రం కర్లపాలెం, పేరలిలో రంగు మారిన నీరు సరఫరా అవుతోంది. పరిస్థితి ఇలానే కొనసాగితే ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

కర్లపాలెంలో సోమవారం సరఫరా అయిన తాగునీరు

జమ్ము, తూటికాడతో దుండివారిపాలెం చెరువు

స్వచ్ఛమైన నీటి సరఫరాకు చర్యలు.. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తాం. రక్షిత నీటి పథకాలకు మరమ్మతులు చేయించి ఇబ్బందులు లేకుండా చూస్తాం. గ్రామాల్లో ట్యాంకులను క్లోరినేషన్ చేయిస్తున్నాం. ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. - బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

దేశానికి తలమానికంగా సుపరిపాలన

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, న్యూస్‌టుడే : దేశానికి తలమానికంగా నిలిచేలా సుపరిపాలన అందించటమే ఏకైక లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని 27, 28, 29 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పార్టీ నేతలతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వ విజయాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

భట్టిప్రోలు : కూటమి ప్రభుత్వ పాలనలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యమని ఎమ్మెల్యే ఆనందబాబు అన్నారు. స్థానిక రైలుపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై ముద్రించిన కరపత్రాలు అందించారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరం : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వ నాయకులు పెదపల్లిలో సోమవారం పర్యటించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు మేకా శివరామకృష్ణ, తెదేపా ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిలకా చంద్రబాబు, స్థానిక నాయకులు అట్ల నాగార్జున, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు మండలంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు.

చెరుకుపల్లి : కూటమి పాలనలోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని చెరుకుపల్లి తెదేపా అధ్యక్షుడు శొంఠి సుబ్బయ్య అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సీనియర్ తెదేపా నాయకుడు మొఖమాటం రాధాకృష్ణమూర్తి, పార్టీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు దివి రాంబాబు తదితరులతో కలసి చెరుకుపల్లి ఎస్టీకాలనీ, ఎన్టీఆర్ కాలనీల్లో పర్యటించారు.

కరపత్రాల పంపిణీలో ఎమ్మెల్యే ఆనందబాబు

నిజాంపట్నం : రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, తీర గ్రామాలు ప్రగతి పథంలో పయనించాలన్నా కూటమి ప్రభుత్వానికే సాధ్యమని రాష్ట్ర మత్స్యకార బోర్డు డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య వేర్వేరుగా పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం రామకృష్ణ నిజాంపట్నం వార్డుల్లో, సుబ్బయ్య ఆముదాలపల్లిలో ఇంటింటా పర్యటించి ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.

వేమూరులో కేకు కోస్తున్న కార్యకర్తలు

ఘనంగా మందకృష్ణ జన్మదినం

వేమూరు, న్యూస్‌టుడే : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక దినోత్సవం, మంద కృష్ణమాదిగ జన్మదినాన్ని మండలంలోని జంపనిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు స్థానిక రావులమ్మ చెరువు సెంటర్‌లో కేకు కోసి.. జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది వి.జయప్రకాష్, సీహెచ్ రత్నశేఖరరావు, క్రిస్టియన్ యువత పాల్గొన్నారు.

నగరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఎస్సీ వర్గీకరణ జరిగిందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొక్కిలగడ్డ చక్రపాణి అన్నారు. బెల్లంవారిపాలెం కూడలిలో సోమవారం ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ.. వర్గీకరణ ఫలాలు అందిపుచ్చుకోవాలంటే ప్రతి ఒక్కరు చదువుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలకు మంచి విద్య అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు, సర్పంచి చందోలు దేవదాసు, రంజిత్, నవీన్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

లేబర్ కోడ్ రద్దు చేయాల్సిందే

నిజాంపట్నం: రవాణా రంగంలో కార్మికుల సంక్షేమానికి లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని కోరుతూ 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా సోమవారం నిజాంపట్నంలో పర్యటించి ఆటోడ్రైవర్లు, వాహన చోదకులతో ఆయన మాట్లాడారు. నాయకులు గోపి, ప్రహ్లాదుడు, సురేష్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

అవీ ఇవీ

తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయండి

అమృతలూరు: తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో శోభాచంద్ అన్నారు. ఆయన ఇంటూరు లాకుల కూడలి ప్రాథమిక పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షించారు. 10న నిర్వహించాల్సిన తల్లిదండ్రుల సమావేశానికి ఏర్పాట్లు చేయాలని, తల్లిదండ్రులను ఆహ్వానించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విత్తన విక్రయ దుకాణాలు తనిఖీ

చెరుకుపల్లి: మండల కేంద్రంలోని విత్తన విక్రయ దుకాణాలను సోమవారం మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ తనిఖీ చేశారు. అమ్మకందారుల లైసెన్సులు, విత్తనాల నిల్వలు, రసీదు పుస్తకాలను పరిశీలించారు. రైతులకు వివరాలతో కూడిన రసీదులు ఇవ్వాలని ఆయన ఆదేశించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

రేపల్లె అర్బన్ : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రేపల్లెలోని నివాసంలో తెదేపా నేత శివప్రసాద్ సోమవారం సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ చేశారు. మండలంలోని రాజుకాల్వలో అనారోగ్యంతో బాధపడుతున్న ధనలక్ష్మి వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.91,870 చెక్కు అందజేశారు. కొపనాతి రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు అవగాహన సమావేశం

అమృతలూరు : పంచాయతీ అభివృద్ధి సూచికపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10కి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శేషమాంబ తెలిపారు. మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్స్, ఆరోగ్య కార్యకర్తలు హాజరు కావాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : రేపల్లె నుంచి భట్టిప్రోలు విద్యుత్తు ఉప కేంద్రానికి వచ్చే సరఫరాకు సంబంధించిన 33 కేవీ తీగల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఏఈ ఎం.శాంతాకుమారి తెలిపారు.

ఉద్యాన రైతులకు త్వరలో మొక్కలు

చెరుకుపల్లి: ఉద్యాన పంటలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా సోమవారం మండలంలోని ఉద్యాన రైతులకు మామిడి, సపోటా, నిమ్మ తదితర మొక్కలు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభానీ తెలిపారు. గూడవల్లి, పొన్నపల్లి, తూర్పుపాలెం, తుమ్మలపాలెం, గుళ్లపల్లిలో సన్నకారు, చిన్నకారు రైతులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పది ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగుకు ముందుకొచ్చారని అన్నారు.

మార్పులు.. చేర్పులు సజావుగా చేయండి

నిజాంపట్నం : పోలింగ్ అధికారులు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు తప్పులు లేకుండా చేయాలని శిక్షణ రిసోర్స్‌పర్సన్ గుర్రం మురళీమోహన్ బీఎల్వోలకు సూచించారు. స్థానిక బీసీ బాలుర గురుకుల పాఠశాలలో మూడు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. వీటిలో ఆయన మాట్లాడుతూ బీఎల్వో యాప్‌లో నూతన ఓటు ఎలా నమోదు చేయాలి, హోమ్ ఓటింగ్ ఎలా పూర్తి చేయాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు.

మాట్లాడుతున్న ఎస్సై బాబూరావు

మహిళలను ఇబ్బంది పెడితే సహించం

నిజాంపట్నం: మహిళలు, యువతులు, విద్యార్థినులను ఇబ్బంది పెడితే సహించమని అడవులదీవి ఎస్సై బత్తుల బాబూరావు పేర్కొన్నారు. సోమవారం అడవులదీవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే అనర్థాలు వివరించారు. విద్యార్థినులు ధైర్యంగా ఉండాలని, సమస్య వస్తే తన దృష్టికి తీసుకొస్తే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

కుటుంబ వివాదంలో దాడి

బాపట్ల, న్యూస్‌టుడే : కుటుంబ వివాదంపై అత్త, ఆమె బంధువులపై అల్లుడు తన వర్గీయులతో కలిసి దాడికి పాల్పడిన ఘటన అడవిపల్లెపలెం పంచాయతీ పరిధిలోని కొత్త రామాపురంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన దంపతులు శామ్యూల్, లీల గొడవపడ్డారు. దీనిపై అల్లుడిని అత్త రమణమ్మ మందలించింది. అల్లుడు తన వర్గీయులతో వచ్చి అత్త, ఆమె బంధువులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శామ్యూల్, మరో 20 మందిపై బాపట్ల గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

✦ పట్టణ శివారున దరివాదకొత్తపాలెంలో అధ్యాపకుడు మద్దిన ఆంజనేయులు ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఆయన ఫిర్యాదు మేరకు బాపట్ల పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

✦ పట్టణంలోని రాజీవ్‌గాంధీకాలనీకి చెందిన మహిళ 2న ఇంటి నుంచి వెళ్లి కనిపించలేదు. తల్లి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

చెత్త సంపద కేంద్రాల పరిశీలన

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : గ్రామాల్లో చెత్తను కేంద్రాలకు తరలించి సంపద సృష్టించాలని ఎంపీడీవో ఎలీషాబాబు కోరారు. మండలంలోని మంతెనవారిపాలెం, కొత్తపాలెం సంపద కేంద్రాలను సోమవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనగా సార్వత్రిక సమ్మె

బాపట్ల, న్యూస్‌టుడే : కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 9న సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ తెలిపారు. సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెకు మద్దతుగా పట్టణంలో ద్విచక్ర వాహనాలతో కార్మికులు సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు సింగరకొండ, శరత్, రవికిరణ్, బాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని డిమాండ్

పురపాలక సంఘ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు ప్రభుత్వం పెంచాలని సీఐటీయూ జిల్లా నేత తిరుమలరెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పురపాలక ఇంజినీరింగ్ కార్మికులు తవ్వకాల్వ వంతెన వద్ద సోమవారం మానవహారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని కోరారు. నెలకు రూ.24,500 వేతనం చెల్లించాలన్నారు. నేతలు శరత్, రత్నం, నాని, చక్రవర్తి, మురళీకృష్ణ, హరిబాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెరుకుపల్లి ఎస్సై టి.అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం చెరుకుపల్లి ఐలాండ్ సెంటర్‌లో ద్విచక్ర వాహనదారులు, ఆటో చోదకులకు ఆయన మత్తు పదార్థాలపై అవగాహన కలిగించారు. వీటికి బానిసలైతే మీపై ఆధారపడిన కుటుంబాలు వీధిన పడతాయని చెప్పారు. దేశానికి వెన్నెముకగా నిలవాల్సిన యువత మత్తుకు అలవాటుపడి దేశప్రగతిని చిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. యువశక్తి సమాజానికి ఆయువుపట్టు అన్నారు. గ్రామాల్లో మత్తు పదార్థాలు విక్రయిస్తున్న సమాచారం ఉంటే 1972 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయం

బాపట్ల, న్యూస్‌టుడే : ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయంగా అందరూ కృషి చేయాలని సరస్వతి స్మారక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్ అన్నారు. కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు పట్టణంలో ఎయిడ్స్ అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులు ఏఆర్టీ కేంద్రాల్లో చికిత్స చేయించుకోవాలని చెప్పారు. సురక్షిత లైంగిక పద్ధతులు పాటించాలని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

ప్రభుత్వ సంస్థ - ప్రాయోజిత బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

చెరుకుపల్లి బ్రాంచ్, చెరుకుపల్లి మండలం, బాపట్ల జిల్లా. ఫోన్: 9100903273

బంగారు నగల వేలము నోటీసు

ఇందుమూలముగా తెలియజేయుట ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపినసూ దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు. ఋణము చెల్లించవలసిన కాలము గతించినందున సదరు బంగారునగలను ది.17-07-2025, గురువారం మధ్యాహ్నం 3-00 గం॥లకు మా బ్రాంచి ఆవరణములో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమ కట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచినవారు ది.17-07-2025 మధ్యాహ్నం 2-00 గం॥లలోపు రూ.10,000/- ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టికారణము చూపకనే వేలమును రద్దుచేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. వేలము వేసినా బకాయిలు రద్దుకాని యెడల వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించినయెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

అకౌంట్ నెంబరు	ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	మొత్తం తూకం గ్రాములో
771330100105375	శ్రీ కప్పల రాంబాబు రెడ్డి, తండ్రి: భిక్షాలురెడ్డి, రాజపోలు గ్రామం, చెరుకుపల్లి (మం), బాపట్ల జిల్లా.	26.30
771330100117103	శ్రీ దుండి శ్రీనివాసు రెడ్డి, తండ్రి: రోసిరెడ్డి, పొన్నపల్లి గ్రామం, చెరుకుపల్లి (మం), బాపట్ల జిల్లా.	13.60

1) పైన తెలిపిన ఋణగ్రహీతలకు గతంలో జారీ చేసిన నోటీసులు (అవి ఏ కారణము చేతనైనను) తిరిగి వచ్చినా దీనినే ఆఖరి నోటీసుగా భావించవలసినది, 2) విజయవంతమైన పాటదారుడు వేలం తేది సాయంత్రం 4:00 గం॥లోగా ధరావత్తు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత భాద్యత వహించి పొందవలెను, 3) నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరిచూసుకొనవలెను. అందుకు బ్యాంక్ బాధ్యత వహించజాలదు, 4) పాటదారుడు సరైన ఫోటో మరియు చిరునామా ఋజువులను ప్రాథమికంగా దాఖలుచేయుట తప్పనిసరి.

గమనిక: పైన ప్రచురించిన ప్రకటనలో పత్రికవారి అచ్చుతప్పులకు బ్యాంకువారు భాద్యులు కాదు.

తేది : 07-07-2025, ప్రదేశం: చెరుకుపల్లి — ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, చెరుకుపల్లి బ్రాంచి, బాపట్ల జిల్లా.

(c) eenadu

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ❖ దర్బార్ రోడ్డులోని మురుగు కాలువల్లో పారుదల లేక మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. ఫలితంగా దుర్వాసన వస్తోంది. అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. **- సర్విశెట్టి సుబ్బరామయ్య, స్థానికుడు**

❖ స్వయంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. **- అబ్దుల్ రషీద్, కమిషనరు, చీరాల**

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని పంగులూరు ఉప కేంద్రం పరిధిలోని బూదవాడ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ గోరంట్ల అనిల్ కుమార్ తెలిపారు. మల్లవరం, బూదవాడ, కల్లంవారిపాలెం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

నేడు అద్దంకికి ఇద్దరు మంత్రులు రాక

అద్దంకి, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యుత్తు, రవాణా శాఖా మాత్యులు గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళవారం అద్దంకి రానున్నారు. కొత్తగా మంజూరైన రెండు సెమీలగ్జరీ, మూడు సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించనున్నారు. ఈసందర్భంగా బస్‌స్టేషన్ ప్రాంగణం మొత్తం కొత్తగా రంగులు వేసి, అందంగా తీర్చిదిద్దారు. నాలుగు రోజుల క్రితం ఈడీ నాగేంద్ర ప్రసాద్, జిల్లా ప్రజారవాణాధికారిణి సామ్రాజ్యం తదితరులు పరిశీలించి వెళ్లారు. ఉదయం 10 గంటలకు హాజరయ్యే మంత్రులకు స్వాగతం పలికేందుకు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది సమాయత్తం అవుతున్నారు.

బస్టాండ్ ప్రాంగణం

నెలరోజుల్లో క్రిటికల్ కేర్ యూనిట్ పనులు ప్రారంభం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: రాబోయే నెలరోజుల్లో క్రిటికల్ కేర్ యూనిట్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని, టెండర్ ప్రక్రియ పూర్తయిందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశానికి ఛైర్మన్ హోదాలో సోమవారం ఆయన విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా అంతర్గత రహదారులు, గేటు, ఫ్రీజర్లు, వీల్‌ఛైర్స్ అవసరమని సూపరింటెండెంట్ పి.శ్రీకాంత్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కమిటీ సభ్యులు హేమంతకుమార్, లక్ష్మి, వెంకటేశ్వరరావు, వైద్యులు హరిబాబు, హనుమంతరావు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు పోటు పాట్లు

స్ట్రయిట్‌కట్‌పై నిర్మించిన అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు తుప్పుపట్టి విరిగిన షట్టర్లు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే

ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్‌పై మూడు ఎత్తిపోతల పథకాలు ఉండగా వీటి ద్వారా వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. సముద్రం ఆటు పోటుల సమయంలో ఉప్పు నీరంతా కాలువలోకి రావడంతో పథకాలను నిలిపివేస్తున్నారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించగా సమస్య పరిష్కారానికి దీనిపై అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను సుమారు 15 ఏళ్ల క్రితం నిర్మించారు. పోటు నీరు కాలువలోకి రాకుండా ఇది అడ్డుగా ఉంటుంది. ఇదే సమయంలో ఎగువ నుంచి వచ్చే నీరంతా సముద్రంలోకి వెళ్లడానికి దీనికి బిగించిన షట్టర్లు స్వయంచాలకంగా పైకి లేచే విధంగా ఆనాడు ఏర్పాటు చేయడంతో ఉప్పు నీటి సమస్యకు అడ్డుకట్ట పడింది. కాలక్రమేణా ఇవి శిథిలావస్థకు చేరాయి. దీనికితోడు రూ.లక్షలతో వీటిని నిర్మించిన అధికారులు నిర్వహణ గాలికొదిలేశారు. దీంతో తుప్పుపట్టి బిగుసుకుపోయాయి. రెండు షట్టర్లు పూర్తిగా ఊడిపోయాయి. దీనివల్ల పోటు సమయంలో సముద్ర నీరు స్ట్రయిట్‌కట్ ఎగువకు చేరుతోంది. దీంతో ఎత్తిపోతల పథకాల ద్వారా పంటలు పండించేందుకు అన్నదాతలు వెనుకాడే పరిస్థితి నెలకొంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేసి ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎత్తిపోతల పథకాల వివరాలు

పథకం	సాగులోని ఎకరాలు	రైతులు
విజయనగర్ కాలనీ	50	100
అక్కాయిపాలెం	2000	1500
గవినివారిపాలెం	4000	800

రూ.21 లక్షలతో ప్రతిపాదనలు

షట్టర్లు దెబ్బతినడంతో ఎమ్మెల్యే ఎంఎంకొండయ్య ఆదేశాల మేరకు రూ.21 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచి త్వరలో పనులు మొదలెడతాం. **- మల్లికార్జునరావు, డీఈ, మురుగునీటి పారుదల శాఖ, చీరాల-2**

అభివృద్ధిలో చీరాలను ముందుంచుతా

పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, న్యూస్‌టుడే: ప్రజల సహకారంతో చీరాలను అభివృద్ధిలో ముందుంచుతానని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం నాయకులు, అధికారులు ఒకటో వార్డులో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచారు. ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. లోఓల్టేజీతో పాటు మురుగుకాలువల సమస్యలను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటిని ప్రాధాన్యక్రమంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ గత పాలకులు చీరాలను మర్దనలకు కేంద్రంగా మార్చారని, తాను శాంతియుత చీరాల కోసం ప్రయత్నిస్తున్నానని చెప్పారు. ఈక్రమంలో తనపై ప్రత్యర్థులు అనేక ఆరోపణలు చేస్తున్నారని, తాను వాటికి భయపడనని స్పష్టం చేశారు. లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యారావు, ఏఎంసీ ఛైర్మన్ కె.జనార్దన్, నేత అమరేంద్ర, కమిషనర్ రషీద్ పాల్గొన్నారు.

❖ వాడరేవు పంచాయతీలో స్వామి రామానందతీర్థ బహూకరించిన కంప్యూటర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. సాయంత్రం అక్కాయిపాలెంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక... స్పందన తక్కువేగా?

చినగంజాం, న్యూస్‌టుడే

వికేంద్రీకరణతో ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే మంచి ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మండల రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌సెల్)ను నిర్వహిస్తోంది. గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను ప్రజలు అర్జీల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ప్రభుత్వం ఇది కొనసాగిస్తోంది. దీనిలో రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయం, విద్య, ఉపాధి, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్, విద్యుత్తు, పోలీస్, అంగన్‌వాడీ, ఉద్యాన, ఆర్టీసీ, డ్రైనేజీ, జలవనరులు, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర సుమారు 20కు పైగా శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొనాలి. ఆ దిశగా కొనసాగడం లేదు. గ్రీవెన్స్‌కు పలు ప్రభుత్వ శాఖల అధికారులే సక్రమంగా హాజరుకావడం లేదు. దీంతో ప్రజలు రావడం లేదు. సోమవారం ఎంపీడీవో లక్ష్మీదేవి, ఏఈ రాజశేఖర్, జలవనరుల శాఖ ఏఈలు ఆళ్ల నజీర్, శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బసవ రాణి హాజరయ్యారు. ఉదయం 10.45 గంటలకు గృహ నిర్మాణ సంస్థ, జలవనరుల శాఖ ఏఈలు మాత్రమే హాజరయ్యారు. సోమవారం సర్వే కోసం రెండింటి రెండే అర్జీలు వచ్చాయి. 2025 ఏప్రిల్, మే, జూన్, జులై (ఇప్పటి వరకు) 20 అర్జీలు ప్రజలు గ్రీవెన్స్‌లో అందజేశారు. నాలుగు నెలల కాలంలో వచ్చిన 20 దరఖాస్తులు రెవెన్యూ శాఖకు చెందినవే అందాయని తహసీల్దార్ జి.ప్రభాకరరావు తెలిపారు. ప్రజలు అర్జీలు అందజేసే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఒకవేళ ఈ స్థాయిలో పరిష్కారం కాకపోతే పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఉదయం 10.45 గంటల సమయంలో గ్రీవెన్స్‌సెల్‌కు హాజరైన తహసీల్దార్ ప్రభాకరరావు, మరో ముగ్గురు అధికారులు

ఏప్రిల్ నుంచి.. ఇప్పటి వరకు అందిన అర్జీలు

21.04.25న ఆరు
28.04.25 ఒకటి
05.05.25 "
12.05.25 రెండు
19.05.25 ఒకటి
02.06.25 "
09.06.25 "
16.06.25 మూడు
23.06.25 ఒకటి
30.06.25 "
07.07.25 రెండు

అర్జీలు అందాయి. ఇప్పటి వరకు అందిన అర్జీల్లో సర్వే అడంగల్ తదితరమైన రెవెన్యూ శాఖకు చెందినవే కావడం గమనార్హం.

'సూర్యఘర్'పై అవగాహన

పర్చూరు, కారంచేడు, చినగంజాం, న్యూస్‌టుడే: సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు, కారంచేడు, చినగంజాం ఎంపీడీవోలు వి.ప్రద్యుమ్నకుమార్, కె.నేతాజీ, జి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పర్చూరు, కారంచేడు, చినగంజాం మండల సమాఖ్య కార్యాలయాల్లో సూర్యఘర్ పథకంపై గ్రామ సంఘం అధ్యక్షులు, సహాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘం పరిధిలో 10 యూనిట్ల లబ్ధిదారులను గుర్తించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఏపీఎంలు శ్రీనివాసరెడ్డి, కె.రామకృష్ణ, టి.మోహనరావు, గడ్డె సుబ్బారావు, స్త్రీ నిధి మేనేజర్ కామేశ్వరి, ఉన్నతి మేనేజర్ పణిబాబు, మహిళ సమాఖ్య అధ్యక్షులు కాపూరి శారద, సీసీ శ్రీలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛను మంజూరు చేయరూ!

బాపట్ల, న్యూస్‌టుడే: అద్దంకికి చెందిన మీసాల వెంకటేశ్వర్లు 2021లో తన పొలంలో పని చేస్తుండగా పాము కరిచింది. కాళ్లకు ఇన్‌ఫెక్షన్ సోకి వైద్యం తర్వాత రెండు కాళ్లు తొలగించారు. రైతు వయసు 75. ఆతడికి వృద్ధాప్య పింఛను మాత్రమే వస్తోంది. ఆ సాయం చాలడం లేదని, దివ్యాంగ పింఛను మంజూరు చేయాలని బాపట్ల కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ వెంకటమురళిని వెంకటేశ్వర్లు కలిసి విజ్ఞప్తి చేశారు. దీనికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

మీసాల వెంకటేశ్వర్లు, దివ్యాంగుడు

న్యూ రోశయ్య కాలనీ సందర్శించిన ఆర్డీవో

వేటపాలెం, న్యూస్‌టుడే: రామన్నపేట పంచాయతీ న్యూ రోశయ్య కాలనీలోని ఎస్టీలు (యానాదులు) మూడో రైల్వే ట్రాక్ నిర్మాణంతో తమ గృహాలకు ముంపు పొంచి ఉందని, కుదేరులో చేపలు పట్టుకోవడానికి అవకాశం కల్పించాలని, ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని, తాగునీరు సరఫరా చేయాలని గతంలో పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాలు అందజేశారు. దీనిపై విచారణ నిమిత్తం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు కాలనీని సోమవారం సందర్శించి, స్థానికులతో మాట్లాడారు. ఇళ్ల స్థలాలపై వెంటనే విచారణ చేయించాలని తహసీల్దార్ గోపికృష్ణను ఆదేశించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. కార్యదర్శి ఎన్.చక్రవర్తి, యానాది సంఘాల మహాకూటమి నాయకులు ఉన్నారు.

కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలి

ప్రదర్శన నిర్వహిస్తున్న న్యాయవాదులు

చీరాల, న్యూస్‌టుడే: ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయని, ఈ పరిస్థితుల్లో వారి భద్రత కోసం రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.రమేష్‌బాబు డిమాండ్ చేశారు. న్యాయవాదులపై దాడులను నిరసిస్తూ సోమవారం కోర్టు సముదాయం వద్ద న్యాయవాదులు ప్రదర్శన చేపట్టారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం కార్యదర్శి ఎం.రవికుమార్, న్యాయవాదులు బి.హేమంత్‌కుమార్, ఎం.పుల్లయ్య, తారక రామారావు, శ్రీనివాసరావు, అశోక్, కొండయ్య, ఈశ్వరి, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

కళలు.. మానవ జీవనశైలికి ప్రతీకలు

మార్టూరు, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: మానవజీవన శైలికి నాటకాలు, కళలు ప్రతీకలుగా నిలిచేలా తానా 24వ అంతర్జాతీయ సదస్సు నిలిచిందని మార్టూరు శ్రీరామ రేయిడి కళాపరిషత్ అధ్యక్షుడు, రంగస్థల పరిశోధకుడు, మార్టూరు మండలం కోలలపూడికి చెందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అన్నారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు అమెరికాలోని డెట్రాయిట్‌లో జరిగిన తానా అంతర్జాతీయ సదస్సులో రామోజీరావు సాహిత్య ప్రాంగణంలో 'రేపటి తెలుగునాటకం' అంశంపై ఆయన ప్రసంగించారు. తెలుగువారు ఏ దేశంలో ఉన్నా ఐక్యత చాటుతూ తెలుగుభాష ప్రాముఖ్యత, కళలు, నాటకాలపై కార్యక్రమాలు నిర్వహించటం శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్ చేతులమీదుగా జ్ఞాపిక అందుకోవటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

నటుడు మురళీమోహన్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న డాక్టర్ కందిమళ్ల

వాలిన చెట్టు.. తప్పిన ముప్పు

స్థానిక యూనియన్ బ్యాంకు ఎదురుగా ఉన్న గ్యాస్ కంపెనీ పక్కన గానుగ చెట్టు చాలా సంవత్సరాలుగా ఉంది. బ్యాంకుకు వచ్చే వారికి ఇది ఎంతగానో నీడనిస్తోంది. ఈ చెట్టు పక్కన ఉన్న భవనం యజమాని మురుగునీరు పారుదలకు ఇటీవల వరలు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో భూమిలో అడ్డుగా వచ్చిన చెట్టు వేర్లను తొలగించారు. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆ చెట్టు రోడ్డుపైకి వాలింది. ఆ సమయంలో బ్యాంకు వద్ద ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆ రోడ్డులో రాకపోకలు సైతం నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు చెట్టు కొమ్మలను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. **- వేటపాలెం, న్యూస్‌టుడే**

జనరేటర్ తొలగించరూ..!

చినగంజాంలో పాత ఎస్‌బీఐ ఎదురుగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఉంది. బీఎస్ఎన్ఎల్‌కు చెందిన పెద్ద విద్యుత్తు జనరేటర్‌ను చాలా రోజుల క్రితం రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. దీనివల్ల ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహన చోదకులు, ప్రజలకు ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. ఇటీవల జనరేటర్ ఉన్న ప్రాంతంలో పలువురు ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యారు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జనరేటర్ వాహనాన్ని తొలగించి ప్రజలకు, తమకు ఇబ్బంది లేకుండా చూడాలని ద్విచక్ర వాహన చోదకులు వి.శివనారాయణ, వెంకటేశ్వర్లు కోరుతున్నారు. **- చినగంజాం, న్యూస్‌టుడే**

రోడ్డంతా రాళ్లమయం

వాడరేవు రహదారి నుంచి సాయి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. బుర్లవారిపాలెం పంచాయతీలోని సాయి కాలనీ, ఎన్టీఆర్ కాలనీలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ప్రతిరోజు పట్టణానికి ఉపాధి, విద్య కోసం వచ్చే కాలనీ వాసులు ఇళ్లకు ఈ మార్గంలోనే వెళతారు. రోడ్డు మొత్తం గుంతలు, రాళ్లమయం కావటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఈ దారిలోనే శ్మశానం ఉంది. ఇక్కడ వీధి దీపాలు లేకపోవటంతో రాత్రి సమయాల్లో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ రహదారి కొంతభాగం వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ కొంతభాగం బుర్లవారిపాలెం పంచాయతీ కావటంతో రెండూ నిర్లక్ష్యం వహిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మించాలని కోరుతున్నారు. **- చీరాల, న్యూస్‌టుడే**

డాక్టర్ విజయభాస్కరరావు సేవలు అభినందనీయం

డాక్టర్ విజయ భాస్కరరావును సత్కరిస్తున్న వైద్యాధికారి సాయిశ్రీచరణ్

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిగా ఎనిమిదేళ్లు పనిచేసి కొవిడ్ లాంటి కీలకమైన సమయంలో డాక్టర్ ఎస్.విజయభాస్కరరావు ప్రజలకు మంచి వైద్య సేవలు అందించారని పలువురు వ్యక్తులు పేర్కొన్నారు. ఇక్కడి నుంచి ఒంగోలు రిమ్స్‌కు బదిలీపై వెళ్లిన విజయభాస్కరరావును ప్రస్తుత వైద్యాధికారి సాయిశ్రీచరణ్, సిబ్బంది, స్థానిక పెద్దలు, రాజకీయ నాయకులు శాలువాలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. సిబ్బంది సుశీలమ్మ, శ్యాంప్రసాద్, పద్మజ, తిరుపతమ్మ, సువార్త, రమాదేవి, సింగమ్మ బదిలీపై వెళ్లారు. వారిని సత్కరించారు. డాక్టర్ సిరివెన్నెల, డాక్టర్ భవాని, బ్రహ్మం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

గంధాన్ని తీసుకొస్తున్న ముస్లింలు

ఇంకొల్లులో గిరిజన నృత్యం

ఇంకొల్లు, కారంచేడు, బల్లికురవ, న్యూస్‌టుడే: త్యాగాలకు ప్రతీకగా నిర్వహించే మొహర్రం (పీర్ల పండగ)ను ఇంకొల్లులో, కారంచేడు మండలం దగ్గుబాడు, బల్లికురవ మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జెండా చెట్టు కూడలిలోని దర్గా ఎదురుగా ఉన్న చావడిలో పీర్లను ఏర్పాటుచేసి, నిత్య వేడుకలు నిర్వహించారు. ఆదివారం రాత్రి పీర్లను గుండంలో పడేసి సోమవారం సాయంత్రం ముగించారు. పీర్ల చావడి ఎదుట దర్గా పక్కన ఖతర్ నిర్వహించారు. మహిళలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన గిరిజన నృత్యాలు అలరించాయి. పీర్లచావడి ముజావరులు ఇస్మాయిల్, సైదులు, మహబాషా, బుడే, గఫూర్, నానాబుడే పర్యవేక్షించారు. దగ్గుబాడులో ఆదివారం అర్ధరాత్రి పీర్ల చావిడి వద్ద మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు పీర్లచావిడి వద్దకు ప్రత్యేక ఊరేగింపుతో గంధాన్ని తీసుకొచ్చారు. అనంతరం పీర్లను చేతబూని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిప్పులగుండాన్ని తొక్కుతూ యువత భక్తిని చాటారు. మహిళలు తమ మొక్కులు తీర్చుకునేలా మహబూబ్‌సుభానీ దర్గా వద్ద భక్తిశ్రద్ధలతో కోర్కెల మిఠాయిలు పంపిణీ చేశారు.

విజేతలకు జ్ఞాపికలు అందజేత

వేటపాలెం, న్యూస్‌టుడే: మూడు రోజుల క్రితం నియోజకవర్గస్థాయిలో తల్లికి వందనంలో భాగంగా 'పిల్లల విద్యలో తల్లి పాత్ర' అనే అంశంపై చీరాల ఎన్ఆర్ అండ్ పీఎం ఉన్నత పాఠశాలలో వివిధ పోటీలు నిర్వహించారు. వీటిల్లో స్థానిక బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కె.షణ్ముఖ ప్రియ వ్యాసరచన, కె.రాము పాటల విభాగంలో ప్రథమ స్థానాలు సాధించారు. సోమవారం పాఠశాలలో జరిగిన సభలో విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని దేవరకొండ సరోజిని బహుమతులు అందజేసి అభినందించారు.

పర్చూరు, న్యూస్‌టుడే: స్థానిక వైఆర్ హైస్కూల్ ఆవరణలో సోమవారం నియోజకవర్గస్థాయి తల్లికి వందనంలో భాగంగా పోటీలు నిర్వహించారు. వీటిని జిల్లా సైన్స్ అధికారి షేక్ సాధిక్, ఎంఈవోలు ఎంవీ సత్యనారాయణ, పి.వెంకటరామయ్య, హెచ్ఎంలు ఇ.రాజశేఖర్, ఎం.నాగిరెడ్డి పర్యవేక్షించారు.

విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

పర్చూరు: గెలుపొందిన వారితో ఉపాధ్యాయులు

తాగునీటి వనరుల పరిశీలన ప్రారంభం

శింగరకొండపాలెం(అద్దంకి),న్యూస్‌టుడే: తాగునీటి వనరుల నిశిత పరిశీలన సోమవారం నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని పంచాయతీల్లోని చేతిపంపు నుంచి నీటి లభ్యత, పరిమాణం, నాణ్యత వంటి అంశాలను నేరుగా ఎంపీడీవోలు స్వీయ పరిశీలన చేయాలని సూచించారు. ఆ మేరకు ఎంపీడీవో బి.సింగయ్య శింగరకొండపాలెం, బొమ్మనంపాడు గ్రామాల్లో పర్యటించారు. చేతిపంపు పరిశీలించారు. తాగేందుకు మాత్రం పనికిరావని, కేవలం వాడుకునేందుకే పనికొస్తాయని గ్రామస్థులు తెలిపారు. బొమ్మనంపాడు సచివాలయం వద్ద ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు.

10న మెగా తల్లిదండ్రుల సమావేశం

సంతమాగులూరు, న్యూస్‌టుడే: సంతమాగులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 10న మెగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.శివనాగలక్ష్మి తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అవీ ఇవీ

ఓట్ల నమోదు ప్రక్రియ సజావుగా జరపాలి

మార్టూరు న్యూస్‌టుడే: ఓట్ల నమోదు ప్రక్రియ సజావుగా జరపాలని కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్, పర్చూరు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి ఎస్.లవన్న అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలో ఆరు మండలాల ఎన్నికల సిబ్బందికి ఓట్ల నమోదు ప్రక్రియపై పలు సూచనలు చేశారు. పర్చూరు ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు ఎం.మాధవీలత, మార్టూరు తహసీల్దారు టి.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

రాత పుస్తకాల పంపిణీ

చీరాల: సెయింట్‌మార్క్స్ లూథరన్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం ఉచితంగా రాతపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు, కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్‌లు మాట్లాడుతూ విద్యార్థులకు తమ వంతు సాయం అందజేయాలని అధ్యాపకులు, సిబ్బంది తమ సొంత డబ్బుతో రాతపుస్తకాలు ఇస్తున్నారని తెలిపారు. జయశీలరావు, ఎజ్రా, షిఫోరా, మంజుల, సుమ, షీలా పాల్గొన్నారు.

13 అర్జీల దాఖలు

చీరాల గ్రామీణం: చీరాల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో ఇంటి స్థలాల కోసం ఎనిమిది, సర్వే కోసం ఒకటి, ఇతర సమస్యల పరిష్కారం కోసం మరో రెండు, మండల పరిషత్ కార్యాలయంలో రహదారుల నిర్మాణం కోసం రెండు దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ గోపికృష్ణ, ఎంపీడీవో శివనారాయణ తెలిపారు.

సమ్మె జయప్రదం చేయాలి

బల్లికురవ, న్యూస్‌టుడే: ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం కమిటీ సభ్యుడు తంగిరాల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. గొల్లపూడి అంజయ్య, పావులూరి రమణయ్య పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ

వేటపాలెం, న్యూస్‌టుడే: బాలికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థినుల చేత 'నేను నా జీవితంలో ఎప్పటికి పొగాకు దాని ఉత్పత్తులను వాడను, నేను నా కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులను దీనికి సంబంధించిన వాటిని వినియోగించకూడదని సూచిస్తాననే' ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయిని దేవరకొండ సరోజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ

అద్దంకి: మహావిపత్తుల నుంచి ప్రజల్ని కాపాడేందుకు అమ్మవార్లకు వడికట్టు బియ్యంతో కూడిన సారెను సమర్పించారు. పట్టణంలోని పలు ప్రదేశాల్లోని మహిళలంతా కలిసి పోలేరమ్మ, గంగమ్మ, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో సోమవారం ఈ సారె సమర్పించారు. ఆధ్యాత్మిక సాధకురాలు వేమూరి రమాసుందరి నేతృత్వం వహించారు.

సారెను ఊరేగింపుగా తరలిస్తున్న మహిళలు

పాఠశాలకు విద్యా సామగ్రి అందజేత

తిమ్మాయపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే: తిమ్మాయపాలెం ప్రాథమిక పాఠశాలకు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి పలు రకాలైన విద్యావిషయక సామగ్రి అందించారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఇది నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని పురుషోత్తమ్మ, ఎంఈవో-2 అనంతు శ్రీనివాసరావు హాజరయ్యారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు పాము కాటు

బల్లికురవ: కొప్పెరపాడు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త జె.చిన్నమ్మాయి ఆదివారం సాయంత్రం పాము కాటుకు గురయ్యారు. గుర్తించిన కుటుంబ సభ్యులు ప్రథమ చికిత్స అనంతరం ఆమెను అద్దంకి ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

మహిళపై మూకుమ్మడి దాడి

చీరాల గ్రామీణం: మహిళపై మూకుమ్మడిగా దాడికి పాల్పడిన ఘటన గవినివారిపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. గవిని రత్తమ్మ (64)తో ఇరుగుపొరుగు వారికి భూ వివాదం ఉంది. అయిదుగురు ఈమె ఇంటిపైకి వచ్చి దుర్భాషలాడుతూ.. దాడికి పాల్పడినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఇపి నెం. 40/2019 ; ఓ.యస్.నెం. 112/2017

బిట్వీన్:
సాదినేని ప్రసన్నకుమారి ...డిహెచ్ఆర్
మరియు
కేశవరపు వెంకటరత్నం ...జెడి.ఆర్

పై నెంబరు ఇ.పి. దాఖలా డిహెచ్ఆర్ డిక్రీ బాకీ రాబట్టుకొను నిమిత్తం జెడిఆర్ తాలుకు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని వేలపు యిస్తిహారు షరతులకు లోబడి ది.05-08-2025 వ తేది ఉదయం 10.30 గంటల లగాయితు పై కోర్టు నందు బహిరంగ వేలము జరపబడును. కావున సదరు వేలం పాటలో పాల్గొనదలచినవారు పై కోర్టులో ఫైన తెల్పిన సమయమునకు హాజరై వేలం షరతులు తెలుసుకుని పాల్గొనవలయును.

షెడ్యూలు: బాపట్ల జిల్లా గత ప్రకాశం జిల్లా - బాపట్ల డిస్ట్రిక్ రిజిస్ట్రేషన్ అద్దంకి సబ్ రిజిస్ట్రేషన్ - కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామ పంచాయితీ సర్వే నెం.967/2లోని Ac. 1.00 సెంటు మెట్ట భూమికి హద్దులు. తూర్పు: కర్నాటి పాపారావు; దక్షిణం: కర్నాటి వెంకట్రావు, పడమర: కర్నాటి శ్రీహరిరావు; ఉత్తరం: కాసు శివపార్వతి. పై ఆస్తిని శ్రీ కోర్టు వారు జప్తు చేయు నాటికి ఇ.సి. దాఖలా అన్యాక్రాంతములు లేవు.

డిహెచ్ఆర్ విలువ 8,00,000/-
అమీనా విలువ 12,75,000/-,
మార్కెట్ విలువ 9,00,000/-
వేలం తేది: 05-08-2025
ఫర్దర్ హియరింగ్: 12-08-2025
శ్రీ కోర్టు వారి అనుమతితో

పాపసాని సతీష్, డిహెచ్ఆర్ తరుపు న్యాయవాది, అద్దంకి. ఫోన్: 9951421509
తేది:8-07-2025

(c) eenadu

కార్‌వాష్‌లో.. పుస్తక పరిచయం

తిరుపతి పరిధిలోని కొత్తపల్లి వినాయకసాగర్ వద్ద మాస్టర్‌ప్లాన్ రహదారిలో కార్ వాష్ యజమాని ఏర్పాట్లు ఆకట్టుకుంటున్నాయి. వాహనదారుల సమయాన్ని వృథా చేయకుండా.. చరవాణికి అంకితం కాకుండా నిరీక్షణ గదిలో ప్రత్యేకంగా పుస్తకాలు ఏర్పాటు చేశారు. వాటిలో ఎక్కువగా ఆరోగ్యానికి సంబంధించి ఆయుర్వేదం, కథలు, వర్తమాన అంశాలకు సంబంధించి పిల్లల నుంచి పెద్దల వరకు చదివేలా చర్యలు తీసుకున్నారు. కార్ వాష్‌కు సమయంలో పడుతుండటంతో వచ్చిన వారు సైతం పుస్తకాలు తిరగేస్తూ కనిపిస్తున్నారు. - ఈనాడు, తిరుపతి

ప్రకృతి చెక్కిన.. శిల్పం



శ్రీవారు కొలువైన ఏడుకొండలు ప్రకృతి రమణీయతకు, అందమైన ఆకృతులకు నిలయం. మొదటి ఘాట్ రోడ్డులోని శ్రీవినాయక స్వామి ఆలయంపైన ఉన్న ఓ కొండ ఉపరితల భాగం మనిషి తలను పోలి ఉంది. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఈ ఆకారం భక్తులకు వింత అనుభూతిని కలిగిస్తోంది. - న్యూస్‌టుడే, తిరుమల

గణేశా.. తిప్పలు తప్పేనా..?

- సామాన్య భక్తుల ఎదురుచూపు
- ఉభయదారుల సమావేశంలో చర్చ
- అంతరాలయ దర్శనంపై కఠినంగా ఉండాలని సూచన

వీఐపీ గేటు వద్ద సిఫార్సు భక్తుల బారులు

కాణిపాకం, న్యూస్‌టుడే: దేశ, విదేశాల నుంచి నిత్యం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దర్శనార్థం తరలివస్తారు. వీరిలో కొందరిని సిఫార్సులపై ఆలయ ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక గేటు ద్వారా స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. వీరిలో సింహభాగం భక్తులు స్వామివారిని అత్యంత దగ్గరగా చూసేందుకు అంతరాలయ దర్శనానికి ప్రాధాన్యం ఇస్తారు. అధిక సమయం అంతరాలయంలో గడపడం వల్ల సాధారణ భక్తులకు స్వామివారి దర్శనం ఆలస్యమవుతోంది.

కఠినంగా ఉంటేనే.. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ఆదివారం జరిగిన ఉభయదారుల సమావేశంలో ప్రత్యేకంగా అంతరాలయ దర్శనంపై చర్చ జరిగింది. ఉభయదారులు, ప్రొటోకాల్ మినహా వచ్చిన ప్రతి ఒక్కరూ అంతరాలయ దర్శనం చేసుకోవడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులు కఠినంగా వ్యవహరించి, సాధారణ భక్తుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అంతరాలయ ప్రవేశానికి విధిగా సంప్రదాయ దుస్తులు(పంచె, చీర, పైజామా) ఉంటేనే అనుమతిస్తారు. ఎక్కువ మంది ప్యాంట్లపై పంచె ధరించి వెళ్తున్నారు. దీన్ని కట్టడి చేయాలని ఉభయదారులు.. ఆలయ అధికారులకు సిఫార్సు చేశారు.

అనుమతి తప్పనిసరి: స్వామివారి అంతరాలయ దర్శనానికి ఉభయదారులు, ప్రొటోకాల్ మినహా మిగిలిన భక్తులు వెళ్లాలంటే అధికారుల అనుమతి తప్పక తీసుకోవాలని ఆదేశాలిస్తాం. సాధారణ భక్తుల ఇబ్బందులు తొలగిస్తాం. - పెంచల కిషోర్, ఈవో

వారధి.. దందాల్లో ఆరితేరి..!

- అడ్డదారులు తొక్కుతున్న కొందరు ఎమ్మెల్యేల సహాయకులు
- నష్ట నివారణ చర్యలు చేపట్టకుంటే ప్రతికూల పరిస్థితులు

ఈనాడు- చిత్తూరు, తిరుపతి

శాసనసభ్యుల వ్యక్తిగత సహాయకులు (పీఏ) నిర్దేశించిన పనులకే పరిమితం కావాలి. వారి రోజువారీ కార్యక్రమాల పర్యవేక్షణ, ప్రజలు అర్జీలు ఇస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత వారిదే. ఒకరకంగా జనాలు, అధికారులు.. ఎమ్మెల్యే మధ్య వారధిగా వ్యవహరించాలి. అటు ప్రభుత్వానికి ఇటు శాసనసభ్యుడికి మంచి పేరు తీసుకురావాలి. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొందరు ఎమ్మెల్యేల పీఏల వైఖరి ఇందుకు భిన్నంగా ఉంది. ప్రైవేటు పీఏలూ, అనుచరులు కొందరు ఇదే బాటలో పయనిస్తున్నారు. నియోజకవర్గం సొంత జాగీరున్నట్లు, ఎవరైనా సరే తమ ఆజ్ఞలు పాటించాల్సిందేనన్నట్లుగా వ్యవహారశైలి ఉంది. ఇసుక, మట్టి, గనులు, మద్యం, ప్రైవేటు లేఔట్లు ఇలా ప్రతి అంశంలోనూ తలదూర్చుతున్నారు. అందినకాడికి నొక్కుతున్నారు. ఇప్పటికైనా వీరి విషయంలో నష్ట నివారణ చర్యలు చేపట్టకుంటే శాసనసభ్యుల పుట్టి మునగడం ఖాయం.

అంతకుమించి అంటోన్న పీఏ..

జిల్లా కేంద్రం తిరుపతికి ఆనుకుని ఉన్న ఓ నియోజకవర్గంలో భూముల విలువ ఎకరా ఎక్కడ చూసినా కోట్ల రూపాయల్లోనే ఉంటుంది. స్వర్ణముఖి నది కూడా ప్రవహిస్తున్నందున ఇసుకా అధికమే. పారిశ్రామికంగా ఈ ప్రాంతం దూసుకెళుతోంది. స్థానిక ప్రజాప్రతినిధి అనధికారిక పీఏ ప్రతి వ్యవహారంలోనూ వేలు పెడుతున్నారు. వైకాపా హయాంలో ఓ కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ఇటుకలు తోలిన ఈయన ఇప్పుడూ చక్రం తిప్పుతున్నారు. ఇటీవల ఓ మండలంలో గ్రావెల్ ట్రాక్టరును అధికారులు పట్టుకుంటే.. విడిచిపెట్టాలని హుకుం జారీ చేశారు. నేను చెబితేనే సీజ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అంశాల్లో పని చేయాలంటే మరో అనుచరుడు ఆమోదముద్ర వేయాల్సిందే. మద్యం దుకాణాల్లో మామూళ్ల వసూలు చేసే బాధ్యతను మరొకరు భుజాన వేసుకుని.. నాలుగు రాళ్లు సంపాదిస్తున్నారు.

ప్లాట్లు వేస్తే చుక్కలు చూపిస్తూ..

చిత్తూరు జిల్లాలోని కీలక నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు చెందిన ఇద్దరు అనధికారిక పీఏల ఆగడాలకు హద్దే లేకుండా పోయింది. ఒకరు మున్సిపల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని తాము చెప్పిన పనులు చేయాలని ముందస్తుగానే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. టెండర్లు సైతం తమకు కావాల్సిన వ్యక్తులకే కట్టబెట్టాలని చెప్పారు. మరో ప్రైవేటు పీఏ ఎక్కడ ప్లాట్లు వేస్తే అక్కడ వాలిపోయి రియల్టర్లకు చుక్కలు చూపిస్తున్నారు. 'నేను చెబితేనే అనుమతులు ఇస్తారు.. లేదంటే నువ్వు ఇబ్బంది పడాల్సిందే'అని హెచ్చరిస్తున్నారు. గ్రానైట్ అక్రమ తవ్వకాల్లోనూ వేలు పెట్టి చేతి నిండా సంపాదిస్తున్నారు.

నలుగురిని దూరం పెట్టిన నేత..

నెల్లూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాలో చేరిన ఓ నియోజకవర్గ శాసనసభ్యుడి అనుచరులు నలుగురు ఏడాదిగా పెత్తనం చెలాయించారు. ప్రైవేటు వెంచర్లు వేస్తే వాటిలో వాటాలు ఇవ్వాలని ఒకరు, మద్యం దుకాణదారులు కప్పం కట్టాలని మరొకరు.. ప్రభుత్వ భూముల ఆక్రమణలో మరో ఇద్దరు బిజీ అయ్యారు. వీరి వ్యవహారం శ్రుతి మించిందని గ్రహించిన నేత నలుగురినీ పక్కనపెట్టారు.

వైకాపాలోనూ హవా..

చిత్తూరు జిల్లాలోని ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే పీఏగా ఉన్న వ్యక్తి వైకాపాలోనూ ఓ వెలుగు వెలిగారు. శాసనసభ్యుడు పెద్దగా నియోజకవర్గంలో ఉండకపోవడాన్ని అలుసుగా తీసుకున్నారు. విద్యుత్తు పనులు చేసే గుత్తేదారులను బెదిరించి అభాసుపాలైనా అతని తీరు మారలేదు. ఇసుక, మట్టి అక్రమ రవాణాదారులకు సహకరిస్తున్నాడనే ఆరోపణలున్నాయి.

మాట తీరుతో అప్రతిష్ఠ

చిత్తూరు జిల్లాలోని పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న సీనియర్ ఎమ్మెల్యే అనధికారిక పీఏ మాట తీరుతో అప్రతిష్ఠ మూటగట్టుకుంటున్నారు. అవినీతికి దూరంగా ఉన్నా ప్రజలు ఎవరైనా వస్తే కటువుగా మాట్లాడుతున్నారు. అర్జీదారులకు సరైన సమాధానం చెప్పకుండా తిప్పుకొంటున్నారు.

మావారే.. పక్కన పెడితే ఊరుకోం

తిరుపతి (ఎస్వీయూ): ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్ల కొనసాగింపు అంశం వర్సిటీ పాలకులకు తలనొప్పిగా తయారైనట్లు తెలుస్తోంది. ఈ నెల ఒకటి నుంచి 5వ తేదీ వరకు వారి పనితీరు, సామర్థ్య మదింపు అంశాలకు సంబంధించిన పరిశీలన ప్రక్రియ పూర్తయింది. 241 మంది బోధనా సామర్థ్యాలను ప్రత్యేక నిపుణుల సమక్షంలో పరిశీలించగా ప్రస్తుతం వారిలో ఎవరెవరిని కొనసాగించాలనే అంశంపై దృష్టి సారించి జాబితా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో నియమించినవారినే కొనసాగించాలని పలువురు తీవ్ర ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం. ఓ అడుగు ముందుకేసి తమవారిని కొనసాగించని పక్షంలో అందరి జాతకాలు బయటపెడతామంటూ బెదిరింపులకు సైతం దిగుతున్నట్లు తెలుస్తోంది. పలు విద్యార్థి సంఘాలు సోమవారం వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లను కలిసి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారినే కొనసాగించాలంటూ విన్నవించారు. ఇదే విషయమై మంత్రి నుంచి గల్లీ స్థాయి నాయకుడి వరకు వర్సిటీ పెద్దలపై తీవ్ర ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలుస్తోంది.

మామిడి రైతుల వివరాల నమోదు పరిశీలన

చిత్తూరు(వ్యవసాయం): తోతాపురి మామిడి రైతుల వివరాలను వేగంగా నమోదు చేయాలని ఉద్యాన శాఖ డీడీ మధుసూదనరెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్ ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో ప్రత్యేక సిబ్బందితో మామిడి రైతుల వివరాల నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించారు. మధుసూదనరెడ్డి మాట్లాడుతూ ర్యాంపులకు మామిడి కాయలు తరలించిన రైతుల వివరాలు మార్కెటింగ్ శాఖతో నమోదు చేయిస్తున్నామన్నారు. ఇప్పటివరకు నాలుగు వేల మంది వివరాలు అంతర్జాలంలో నమోదు చేశామన్నారు.

రైతేరాజు 6లో

అనుమతులతో మాకేం పని?

- మామిడి రైతులతో మాట్లాడేందుకు 500 మందే రావాలని ఎస్పీ ప్రకటన
- జగన్ పర్యటనకు భారీగా జన సమీకరణ చేస్తోన్న వైకాపా నేతలు

ఈనాడు- చిత్తూరు: తన పర్యటనల్లో సొంత పార్టీ కార్యకర్తలు ప్రాణాలు పోతున్నా, సామాన్యులు, పోలీసులకు గాయాలవుతున్నా మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు పట్టడం లేదు. పరామర్శలకు కూడా వైకాపా నేతలు జన సమీకరణ ఆపడం లేదు. గత నెల 18న పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో నాగమల్లేశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శించేందుకు జగన్ వెళుతున్న క్రమంలో ఆ పార్టీ కార్యకర్తలు ఇద్దరు మరణించారు. ప్రకాశం జిల్లా పొదిలిలోని పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించే సందర్భంలో వైకాపా కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో మహిళలు, పోలీసులకు దెబ్బలు తగిలాయి. ఈ ఘటనల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నెల 9న మాజీ సీఎం జగన్.. బంగారుపాళ్యం యార్డుకు వచ్చి మామిడి రైతులతో మాట్లాడతారని వైకాపా నేతలు సమాచారం ఇవ్వడంతో 500 మంది తరలిరావాలని ఎస్పీ మణికంఠ స్పష్టం చేశారు. ఫ్యాను పార్టీ నేతలు ఇందుకు విరుద్ధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బంగారుపాళ్యం మార్కెట్ ఉన్న పూతలపట్టు నియోజకవర్గం నుంచే 2 వేలు- 3వేల మందికి తగ్గకుండా జనాలు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. పుంగనూరు నియోజకవర్గంలో ప్రతి పంచాయతీ నుంచి ఒక కారు పెట్టాలని నిర్ణయించుకున్నారు. పలమనేరు, చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాలను కలుపుకొంటే కనీసం 10 వేల మందిని తరలించాలని భావిస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగితే చర్యలు: ఎస్పీ

ఎస్పీ మణికంఠ

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: బంగారుపాళ్యం మండలంలో ఈ నెల 9న జరగనున్న మాజీ సీఎం జగన్.. పర్యటనకు షరతులతో కూడిన అనుమతులు ఇచ్చామని, హెలిప్యాడ్‌లోకి 30 మంది.. మార్కెట్ యార్డులోకి 500 మంది చొప్పున మొత్తం 530 మందికి మాత్రమే అనుమతి ఇచ్చామని ఎస్పీ మణికంఠ తెలిపారు. చిత్తూరు పోలీసు అతిథిగృహంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 వేల మంది వస్తారని మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ దరఖాస్తు ఇచ్చారని, అంతమంది వస్తే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని.. ర్యాలీలు, రోడ్‌షోలు చేయొద్దని చెప్పామన్నారు. బహిరంగ సభకు వినతి ఇవ్వనందున భారీ సంఖ్యలో జనాలను అనుమతించలేమని స్పష్టం చేశారు. యార్డు పక్కనే పాఠశాలలు ఉన్నాయని, సమయ పాలన పాటించకపోతే అందరికీ సమస్యలు తలెత్తుతాయన్నారు. ముందు జాగ్రత్తగా నోటీసులు ఇచ్చామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగితే సహించబోమని హెచ్చరించారు.

కనిపించని వీల్‌ఛైర్.. తప్పని ఇక్కట్లు

చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు విన్నవించుకునేందుకు ప్రజలు తరలివస్తున్నారు. వీరిలో దివ్యాంగులు, వృద్ధులు ఇతరుల సాయంతో వస్తారు. వీరు ఆటో దిగి అధికారులను కలిసే వరకు సహాయకులే వెన్నంటి ఉంటారు. మరికొందరు అడుగులో అడుగేసుకుంటూ గోడలు పట్టుకుని ఎలాగోలా తమ సమస్యలు అధికారులకు విన్నవించుకుంటున్నారు. వీరి కోసం ఏర్పాటు చేసిన ఒక వీల్‌ఛైర్ ఎవరైనా తీసుకెళ్తే.. మళ్లీ అది బయటకు రావాలంటే గంట సమయం పడుతోంది. దీంతో వారు వీల్ ఛైర్ కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నది ఒకే వీల్‌ఛైర్ కావడంతో వారికి అవస్థలు తప్పడం లేదు. - ఈనాడు, చిత్తూరు

గోడ పట్టుకుని నడుస్తున్న వృద్ధుడు

భారమైనా కలెక్టర్‌ను కలవాలంటే తప్పదు

9న జగన్ పర్యటన ఇలా..

ఐరాల: మాజీ సీఎం జగన్ బంగారుపాళ్యం పర్యటనకు సంబంధించి సోమవారం రాత్రి షెడ్యూల్ విడుదలైంది. 9న ఉదయం 10 గంటలకు బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.50కు బంగారుపాళ్యం మండలం కొత్తపల్లెలోని హెలిప్యాడ్‌కు వస్తారు. 11.20కి బంగారుపాళ్యం మామిడి మార్కెట్ యార్డుకు చేరుకుంటారు. 12.20 వరకు మామిడి రైతులతో మాట్లాడతారు. 12.20కు మళ్లీ హెలిప్యాడ్‌కు వెళ్లి 12.45కు హెలికాప్టర్‌లో బెంగళూరు బయలుదేరతారు. ఈ మేరకు సోమవారం రాత్రి షెడ్యూల్ విడుదలైంది.

పొలంలో వంటలు చేస్తున్న గ్రామస్థులు

వన భోజనానికి వెళ్తున్న గ్రామస్థులు

వరుణుడి కరుణకు.. వనభోజన బాట..!

వరుణ దేవుడి కరుణ కోసం ఏడు గ్రామాల ప్రజలు వనభోజన బాట పట్టారు. నెల రోజులుగా వాన జాడ లేకపోవడం.. ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో.. దైవానుగ్రహం కోసం గ్రామాలను ఖాళీ చేసి పిల్లా పాపలతో పొలాల్లోనే వంటా.. వార్పు చేసుకొని గ్రామ దేవతలను పూజించారు. శాంతిపురం మండలంలోని కర్లగట్ట, చిన్నకర్లగట్ట, ప్రితిచామనూరు, తమ్మిగానిపల్లె, సొన్నేగానిపల్లె, కాళిగానూరు, మాదనపల్లె గ్రామాల ప్రజలు సోమవారం ఉదయాన్నే పొలాల బాట పట్టారు. గ్రామాల్లో ఎవరూ ఉండరాదనే కట్టుబాటు మేరకు.. ఆయా గ్రామస్థులందరూ పొలాలకు చేరుకున్నారు. గ్రామాల్లోకి ఇతరులెవరూ రాకూడదని తాత్కాలిక కంచెను సైతం ఏర్పాటు చేశారు. పొలాల వద్ద గ్రామ దేవతలకు పొంగళ్లతో దీపారాధన చేసి వరుణ దేవుడిని ప్రార్థించారు. వన భోజనాల అనంతరం రాత్రి ఇళ్లకు చేరుకున్నారు. పూర్వీకుల కాలం నుంచి వరుణ దేవుడి కటాక్షం కోసం ఒక్కరోజు ఇలా వనభోజన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని రైతులు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, శాంతిపురం

ఎన్నిసార్లు విన్నవించేదయ్యా..!

కలెక్టరేట్‌కు పెట్రోల్ బాటిళ్లతో వచ్చిన మహిళ

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి పెద్దపంజాణి మండలం కొలత్తూరు గ్రామానికి చెందిన విజయలక్ష్మి.. పెట్రోల్ బాటిళ్లతో రావడం కలకలం సృష్టించింది. గ్రీవెన్స్ హాల్ వెలుపల ఉన్న పోలీసు సిబ్బంది ఆమె తెచ్చిన సంచిలో ఉన్న పెట్రోల్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. విజయలక్ష్మి మాట్లాడుతూ తన అనుభవంలోని పశువుల కొట్టం స్థలాన్ని గ్రామంలోని ఓ వ్యక్తి ఆక్రమించాడని, దీనిపై మండల అధికారులకు, కలెక్టరేట్‌లో పలుమార్లు విన్నవించినా ఫలితం దక్కలేదన్నారు. ఆక్రమించిన వ్యక్తి ప్రస్తుతం నిర్మాణాలు చేపట్టాడని, దీంతో చివరిసారిగా ఫిర్యాదు చేయాలని కలెక్టరేట్‌కు వచ్చానని ఆమె వాపోయారు. పోలీసులు ఆమెను విచారించి గ్రీవెన్స్‌లోని అధికారులకు సమాచారమిచ్చారు.

పెట్రోల్ బాటిల్ స్వాధీనం చేసుకున్న సిబ్బంది

19 మంది ఏఈలకు వేతనాల నిలిపివేత

చిత్తూరు (మిట్టూరు): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్తు సంస్థలోని 19 మంది ఏఈలకు వేతనాలు నిలిపేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. వర్క్ ఆర్డర్లు పరిష్కరించుకోవడంలో తీవ్ర జాప్యం ప్రదర్శించడమే ఇందుకు ప్రధాన కారణం. వ్యవసాయ, వాణిజ్య, ఇతర సర్వీసుల జారీ, నూతన విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు సంబంధించి వ్యయ అంచనాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. పనుల నిర్వహణకు అవసరమైన నియంత్రికలు, అనుబంధ పరికరాలు, ఇతర సామగ్రిని గోదాముకు నుంచి తెచ్చి అమర్చుతారు. పనులు పూర్తికాగానే వర్క్ ఆర్డర్లను సంబంధిత ఏఈలు పరిష్కరించుకోవాలి. 19 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా సంబంధిత వర్క్ ఆర్డర్లు పరిష్కరించుకోలేదు. ఉన్నతాధికారులు సంబంధిత ఏఈలకు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందన లేదు.

వీఆర్వోల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్న వీఆర్వోలను బదిలీ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్-1 వీఆర్వోలు 28 మంది, గ్రేడ్-2 వీఆర్వోలు 105 మందిని బదిలీ చేశారు. బదిలీ అయినవారు వెంటనే కొత్త ప్రాంతాల్లో విధుల్లో చేరాలని కలెక్టర్ ఆదేశించారు.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9000180635

బడిబాటలో.. ఆధార్ కష్టాలు

- నమోదులో తప్పని ఇబ్బందులు
- మరిన్ని కేంద్రాల ఏర్పాటుతో మేలు

జిల్లాలో ఇలా..
ఆధార్ నమోదుకాని చిన్నారులు : 3,219
సవరణలు చేయాల్సిన వారు : 2628

చిత్తూరు, తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: చిన్నారుల ఆధార్ నమోదులో సమస్యలు వీడటం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆధార్ నమోదు కోసం తల్లిదండ్రులు నానాఅవస్థలు పడుతున్నారు. సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆధార్ లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. జిల్లాలోని 34 మండలాల్లో 3,219 మంది విద్యార్థులకు ఆధార్ లేకపోవడంతో పాఠశాలల్లో చేరికలు, ఇతర అవసరాల కోసం తంటాలు పడుతున్నారు.

- తిరుపతి జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన 1,610 మంది విద్యార్థులకు ఆధార్ లేదు. అదే విధంగా ప్రైవేట్ పాఠశాలల్లో మరో 1,417 మంది విద్యార్థులకు లేనట్లు తేలింది. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న మరో 4,427 మంది విద్యార్థులకు సంబంధించి ఆధార్ సవరణలు చేయాల్సి ఉంది. తల్లిదండ్రుల వివరాలు ఇతరత్రా పొరపాట్లను సరిచేయాల్సిన అవసరం ఉంది.

ఏడు కేంద్రాల్లో నమోదు

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ నమోదు కోసం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని పలు పాఠశాలల్లోనే ప్రత్యేకంగా విద్యాశాఖ అధికారులు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇవి ఏమాత్రం సరిపోనట్లు స్పష్టమవుతోంది. ఇంతకాలం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నమోదు కేంద్రాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సచివాలయం సిబ్బంది ఉన్నా అవగాహన కల్పించడంలో విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

తగిన ధ్రువపత్రాల కొరతతో..

ఆధారు నమోదు కోసం అవసరమైన పత్రాలు, ముఖ్యంగా జనన ధ్రువపత్రం, తల్లిదండ్రుల ఆధారు కార్డులు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. పత్రాలు ఎలా పొందాలో సరైన పరిజ్ఞానం లేకపోవడంతో నమోదు ప్రక్రియ పూర్తి కావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రత్యేక కేంద్రాల్లో నమోదు అనంతరం త్వరితగతిన నూతన ఆధారు కార్డులు ఇస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. ఇందుకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

స్కిట్‌పై ఆశల ఊసులు..!

- 12వతేదీ లోగా ఆమోదిస్తేనే ప్రవేశాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: 'శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్) ఇంజినీరింగ్ కళాశాల పునః ప్రారంభంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల ప్రవేశాలకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఇప్పటి వరకు స్కిట్ కళాశాలలో ప్రవేశాలకు అనుమతి లభించకపోవడంపై ఉత్కంఠ నెలకొంది.

విలీనంపై సడలని పట్టు

కళాశాలను జేఎన్‌టీయూ పరిధిలోకి తేవాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని సాకారం చేసేలా మంత్రి నారా లోకేశ్ సూచనలతో ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. తాజాగా నెల్లూరు పర్యటనకు వచ్చిన మంత్రి లోకేశ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఇదే విషయమై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సంక్షిప్త నివేదికను అందజేశారు.

- **ఫలించేనా..:** కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కావాలంటే ఎంసెట్ ప్రవేశాలకు అవకాశం లభించాలి. ప్రస్తుతం ప్రవేశాలకు అన్నీ కళాశాలలు దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టాయి. ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ఈ నెల 13న ప్రారంభం కానుంది. ఆ లెక్కన 12వ తేదీ రాత్రి వరకు అవకాశం ఉంది. ఆలోగా కళాశాల పునః ప్రారంభంపై ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటే వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉంటుంది. లేకుంటే ఇక ఈ ఆర్థిక సంవత్సరం కళాశాల ప్రారంభం కష్టసాధ్యమే. అమరావతిలో సోమవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అనుకూల ఫలితాలు వస్తాయని కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం భావిస్తోంది.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల: నేరుగా వచ్చే భక్తులకు 10 గంటలో శ్రీవారి దర్శనం లభించనుంది. ఆదివారం శ్రీవారిని 88,938 మంది దర్శించుకోగా రూ. 4.39 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

B.Tech., and Ag.B.Sc., SPOT ADMISSION
కేవలం 6,7,8,9,10 లక్షల ఖర్చుతో నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ / అగ్రికల్చర్ బీఎస్సీ (కాలేజ్ ఫీజు + హాస్టల్ ఫీజుతో కలిపి) ఎటువంటి షూరిటీ లేకుండా విద్యార్థికి 70 నుంచి 80% లోన్ సాకర్యం కల్పించబడును. వివరాలకు సంప్రదించండి :
9502555500, 9160220527

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

(c) eenadu

డ్రోన్ వినియోగం.. సేద్యం సులభతరం

రాయితీ అందిస్తున్న ప్రభుత్వం

పుంగనూరు, న్యూస్‌టుడే: ఆధునాతన పద్ధతులతో వ్యవసాయాన్ని సులభతరం చేసేలా డ్రోన్ల వినియోగం పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై వీటిని కొన్ని విధివిధానాలతో అందిస్తోంది. ఏపీటెక్.. రైతులు ఐదుగురు సభ్యులుగా ఉండాలి. అందులో చదువుగ ఉన్న వ్యక్తిని పైలట్‌గా ఎంపిక చేస్తారు. ఇతనికి 50 ఏళ్ల లోపు వయసుండాలి. కనీసం ఇంటర్ విద్యార్హత అవసరం. పైలట్‌గా ఎంపికయ్యే రైతుకు గుంటూరులో శిక్షణ ఇస్తారు. చిత్తూరు జిల్లాకు 31 డ్రోన్లు మంజూరయ్యాయి. ఒక్కో డ్రోన్ విలువ రూ.9.80 లక్షలు కాగా ప్రభుత్వం 80 శాతం రాయితీ కింద రూ.7.84 లక్షలు రైతు సంఘం ఖాతాకు జమ చేస్తోంది. ఇందులో రైతు వాటా 1.96 లక్షలే. ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడి రూ.5 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చెల్లించాలి. దీనికి జతగా బ్యాంకు మిగిలిన సొమ్ము రూ.4.80 లక్షలు రుణంగా అందిస్తోంది. ఈ మొత్తంతో డ్రోన్ పరికరం కొనుగోలు చేసిన తరువాత అది రైతు సంఘానికి చేరుతుంది. 15 రోజుల్లో ప్రభుత్వం అందించే రాయితీ సొమ్మును రైతు సంఘం ఖాతాకు జమ చేస్తారు. దీన్ని విత్‌డ్రా చేసుకునే అవకాశం లేదు. రుణం కంతులు సక్రమంగా చెల్లిస్తే గడువు తీరాకే రాయితీ సొమ్ము పొందేందుకు వీలుంటుంది.

ఉపయోగాలు: పురుగు మందు ప్రభావం మనుషుల ఆరోగ్యంపై పడకుండా ఉంటుంది. కూలీల ఖర్చు తగ్గుతుంది, సమయం, నీరు, ఎరువులు, క్రిమిసంహారక మందు ఆదా అవుతుంది. పిచికారీ చేసే మందులు మొక్కలకు సమానంగా అందుతాయి. మిరప, వంకాయ, కాలీఫ్లవర్, టమాట, బీర, గుమ్మడి, కాకర వంటి కూరగాయల తోటలతో పాటు మునగ, బొప్పాయి, మామిడి, అరటి, రోజా, బంతి, చామంతి, కనకాంబరం తోటలకు, వరి పైరుకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేయొచ్చు.

సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు

మహిళా రైతు ఆదర్శం

తవణంపల్లె, న్యూస్‌టుడే: సేంద్రియ ఎరువులతో అన్నదాతకు దీర్ఘకాలిక ప్రయోజనాలున్నాయి. ఆవు పేడ ఎరువు, వానపాముల ఎరువులతో భూసారం పెరగడానికి ఆస్కారముంది. దిగుబడులు సైతం ఆశించిన స్థాయిలో వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పశువుల నుంచి పొందే పేడను ఎరువుగా పొలాల్లో చల్లుకోవడం వల్ల పెట్టుబడి సైతం తగ్గుతుంది. ఈ కోవలోనే ఓ మహిళా రైతు పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

తవణంపల్లె మండలం జెట్టిపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు పల్లవి సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేశారు. వంగ 20 సెంట్లు, గోరు చిక్కుడు 30 సెంట్లు, రాగి 30 సెంట్ల స్థలంలో సాగు చేశారు. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులను వినియోగించారు. వీటి వాడకం వల్ల మంచి దిగుబడులు వచ్చాయని చెబుతున్నారు. వంగలో ఇప్పటి వరకు రెండు కోతలయ్యాయి. రెండు కోతల్లో 500 కిలోలు వచ్చాయని కిలో రూ.70కు, గోరుచిక్కుడు ఇప్పటి వరకు 200 కిలోలు రాగా కిలో రూ.40కు విక్రయించినట్లు తెలిపారు. రాగి పంటను కోసి ఎండబెట్టగా 300 కిలోల రాగులు వచ్చే అవకాశముందని వెల్లడించారు.

'పొలం పిలుస్తోంది'లో ప్రదర్శన

వ్యవసాయశాఖ అధికారులు జెట్టిపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పల్లవి సాగు చేసిన పంటలను రైతులందరికీ చూపించారు. ఆమె ఎలా సాగు చేశారు? సేంద్రియ ఎరువులను ఎలా వాడారు? తదితర యాజమాన్య పద్ధతులను ఆమె వివరించి రైతులందరికీ అవగాహన కల్పించారు.

రైతేరాజు

రేణిగుంట, న్యూస్‌టుడే:

ప్రశ్న: యూరియా అధికంగా వాడితే వరి పంటకు కలిగే నష్టమేమిటి? **- మధు, రైతు, గాజులమండ్యం, రేణిగుంట మండలం**

జవాబు: ఎకరా పంటకి రెండు బస్తాల యూరియాని మూడు దఫాలుగా సమపాళ్లలో వేసుకోవాలి. మొదటి దఫా నాటు సమయంలో, రెండో దఫా పిలకల వేసే సమయంలో, మూడో దఫా చిరు పొట్ట దశలో వేసుకోవాలి. నత్రజని ఎరువు వేసినప్పుడు పొలంలో పూర్తిగా నీరు తీసేసి బురద పదును పైన వేసి 48 గంటల తర్వాత నీరు పెట్టాలి. ఎక్కువగా యూరియా వేయడంతో నేల నిస్సారంగా మారుతుంది. సూక్ష్మ పోషక లోపాలు అధికమవుతాయి. చీడపీడల ఉధృతి పెరుగుతుంది. భూగర్భ జలాలు కలుషితమవుతాయి. **- సునీల్‌కుమార్, వ్యవసాయాధికారి**

ప్రశ్న జవాబు

వరిలో కాండం తొలుచు పురుగు

నాయుడుపేట, న్యూస్‌టుడే: వరిపైర్లను కాండం తొలుచు పురుగు(మొవ్వు పిప్ప) అధికంగా ఆశిస్తోందని, వేసవిలో సాగు చేసిన రైతులు జాగ్రత్తలు పాటించాలని నాయుడుపేట మండల వ్యవసాయాధికారి జె.గణేష్ సూచించారు. కాండం తొలుచు పురుగు నారుమడి నుంచి ఈనిక దశ వరకు ఆశించే అవకాశం ఉంది. నారుమడిలో ఆశిస్తే మొక్కలు, పైరు పిలక దశలో ఆశిస్తే మొవ్వ చనిపోతుంది. ఈనిక దశలో కంకి పాలుపోసుకోకుండా తెల్లకంకి ఏర్పడుతుంది. ఆకు చివరి భాగాన గుడ్లుపెట్టి గోధుమ రంగు వెంట్రుకలతో కప్పుతుంది. గుడ్డు నుంచి విడుదల చేసిన లార్వా కాండం కింది వైపు నుంచి లోపలికి ప్రవేశించి మొవ్వను తినేస్తుంది. ఆలస్యంగా నాట్లు వేసినప్పుడు, ముదిరిన నారు నాటినప్పుడు రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువగా, పగలు తక్కువగా ఉన్నప్పుడు నత్రజని ఎరువులు అధికంగా వినియోగిస్తే ఈ పురుగు ఆశించే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

నివారణ చర్యలు.. నారుమడిలో చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా గుడ్ల సముదాయం, పిలక దశలో ఐదు శాతం చనిపోయిన మొవ్వలు పైర్లు కనిపించినప్పుడు రైతులు గుర్తించి సస్య రక్షణ చర్యలు చేపట్టాలి. నారు పీకడానికి వారం ముందు ఐదు సెంట్ల నారుమడికి 20 గ్రాములు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు చొప్పున ఎకరానికి లేదా అంకురం లేదా చిరు పొట్టదశలో పురుగులు ఆశిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 10 కిలోలు లేదా క్లోరాంట్రానిలి ప్రోల్ 4 శాతం నాలుగు కిలోలు వేయాలి. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ రెండు గ్రాములు లేదా క్లోరాంట్రినిలిప్రోల్ 0.4 మిల్లీలీటర్ల నీటికి కలిపి పిచికారీ చేస్తే నివారించవచ్చు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 332 వినతులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందే అర్జీలపై నిర్ణీత సమయం లోగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో అర్జీదారుల నుంచి వివిధ సమస్యలపై 332 వినతులు అందాయి. జేసీ విద్యాధరి, శిక్షణ కలెక్టర్ నరేంద్రపాడల్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు ఇతర అధికారులు ఉన్నారు.

అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

❖ ఉద్యోగ బదిలీలు పారదర్శకంగా జరగలేదని తిరుపతి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులు ఆరోపించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి కౌన్సెలింగ్ చిత్తూరులో జరిగిందన్నారు. ఉద్యోగుల నుంచి ఆప్షన్లు తీసుకున్నారని, పోస్టింగులు వేరే ప్రాంతాల్లో ఇచ్చారని చెప్పారు. స్పౌజ్, దివ్యాంగుల కోటాను పరిగణనలో తీసుకోలేదని వాపోయారు. కలెక్టర్ స్పందించి కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించాలని విన్నవించారు.

❖ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు తక్షణమే జమచేయాలని కోరుతూ సీఐటీయూ నేతృత్వంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు. న్యాయం దక్కకపోవడంతో సమ్మెబాట పట్టినట్లు పేర్కొన్నారు.

కలెక్టరేట్‌కు వచ్చిన తిరుపతి జిల్లాకు చెందిన వ్యవసాయ సహాయకులు

ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలి..

అనారోగ్యంతో చర్మ సమస్య రావడంతో ఏప్రిల్ 3న వి.కోటలోని ఆర్ఎంపీ వద్దకు వెళ్లా. ఆయన ఇచ్చిన కొన్ని మాత్రలను వాడిన తర్వాత నోటి నుంచి మాటలు రాలేదు. చర్మంపై బొబ్బలు వచ్చాయి. దీంతో వెంటనే ఆర్ఎంపీ వద్దకు వెళ్లగా నన్ను అవమానపరిచేలా మాట్లాడాడు. ప్రాణాంతకమైన వ్యాధి ఉందని అసత్య ప్రచారం చేశారు. ఆ తర్వాత బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాక కోలుకున్నా. అయినా ఇప్పుడు మాటలు రావడం లేదు. అధికారులు స్పందించి ఆర్ఎంపీపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా విన్నవిస్తున్నా. **-కల్పన, కొలమాసనపల్లి, పలమనేరు**

ఇబ్బందిగా ఉంది.. పింఛను పెంచండి..

అంగవైకల్యంతో పడకకే పరిమితయ్యా. ఇంట్లో ఎప్పుడూ ఒకరు ఉంటే తప్ప పనులు చేసుకోలేని పరిస్థితిలో ఉన్నా. ప్రస్తుతం రూ.6 వేలు పింఛను ఇస్తున్నారు. దీన్ని రూ.15 వేలకు పెంచాలని విన్నవిస్తున్నా. బ్యాటరీ సైకిల్‌ను అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

-గుణసుందరి, ధర్మాచెరువు, వెదురుకుప్పం మండలం

సీనియర్లు మీరు.. ఇది మంచి పద్ధతి కాదు

ఆలస్యంగా హాజరైన అధికారులపై కలెక్టర్ మండిపాటు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆలస్యంగా హాజరవ్వడంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ మండిపడ్డారు. కలెక్టరేట్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్ జరుగుతుందని ప్రతి సోమవారం షెడ్యూల్ ఇస్తున్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభమైన తర్వాత ఆలస్యంగా వచ్చిన డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఇంకా పలు శాఖల అధికారులు ఆలస్యంగా రావడంపై మండిపడ్డారు. అధికారులు అందరూ సీనియర్లే కదా.. ఇలా ఆలస్యంగా హాజరు కావడం మంచి పద్ధతి కాదన్నారు. ఇకపై సకాలంలో హాజరుకాని అధికారులకు మెమోలు ఇస్తానని, బయట నిలబెడతానని హెచ్చరించారు.

❖ తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం నిర్వహణపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. జిల్లాలోని 178 ప్రైవేట్ పాఠశాలల్లో 36,596 మంది విద్యార్థులు ఉన్నారని, అన్నిచోట్లా పీటీఎం 2.0 కార్యక్రమాల్ని నిర్వహించాలని ఆదేశించారు. డీఈవో వరలక్ష్మి, సమగ్ర శిక్షా ఏపీసీ వెంకటరమణ, డీవైఈవో ఇందిర పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయ ఉద్యోగులకు నోటీసులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో గతంలో ఈవోగా పనిచేసిన ఎగ్గిడి వెంకటేశు, ఉద్యోగులు బాలాజీనాయుడు, ప్రవీణ్‌కుమార్, వెంకటశివయ్య, వినాయకంకు.. దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి వినయ్‌చంద్ సోమవారం నోటీసులు జారీ చేశారు. 2021లో అనిశా అధికారులు నిర్వహించిన తనిఖీలకు సంబంధించి వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. వారిచ్చే వివరణపై తదుపరి చర్యలు ఉంటాయని సమాచారం.

14న సంకటహర గణపతి వ్రతం: సంకటహర చతుర్థి సందర్భంగా ఈ నెల 14న శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో ఉదయం, సాయంత్రం సామూహిక సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పెంచల కిషోర్ తెలిపారు. స్వామివారికి రాత్రి స్వర్ణ రథోత్సవం జరుగుతుందన్నారు.

గ్రీవెన్స్‌కు 54 ఫిర్యాదులు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌కు 54 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ మణికంఠ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుని ఆపై జూమ్ సమావేశం ద్వారా పోలీసు అధికారులతో మాట్లాడారు. సైబర్ నేరం 1, వేధింపులు 8, కుటుంబ సమస్యలు 14, భూ సమస్యలు 14, నగదు సమస్యలు 12, దారి గొడవలు 1, ఆస్తి తగాదాలు 4 చొప్పున 54 ఫిర్యాదులు అందాయి. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీటీసీ డీఎస్పీ రాంబాబు పాల్గొన్నారు.

అభిషేక్‌రెడ్డి అసాధారణ బ్యాటింగ్

చిత్తూరు భారీస్కోరు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు దిగాడు ఆ బ్యాటరు.. ద్విశతకం చేసి అజేయంగా నిలిచాడు. జట్టు మొత్తం పెవిలియన్ చేరినా.. అతను మాత్రం నాటౌట్‌గానే నిలవడం గమనార్హం. సౌత్‌జోన్ అంతర్ జిల్లా మూడు రోజుల క్రికెట్ పోటీల్లో చిత్తూరు బ్యాటరు అభిషేక్‌రెడ్డి (227) అసాధారణ బ్యాటింగ్‌తో అందరిని ఆకట్టుకున్నాడు. సోమవారం అనంత క్రికెట్ మైదానంలో ఉదయం 316/3 ఓవర్‌నైట్ స్కోరుతో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన చిత్తూరు జట్టు 115.2 ఓవర్లలో 455 పరుగులకు ఆలౌటైంది. అనంతపురం బౌలర్లు బి.వినయ్‌కుమార్ (4/72), దీపక్, ప్రదీప్‌రెడ్డి, రాజుకుల్లాయప్ప చెరి రెండు వికెట్లు కూల్చారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 44 ఓవర్లలో 4 వికెట్లకు 199 పరుగులు చేసింది. బ్యాటరు ఎంకే దత్తారెడ్డి (100; 83 బంతుల్లో) అజేయ శతకంతో మెరిపించాడు. చిత్తూరు జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించాలంటే చివరిరోజు బ్యాటర్లు చెలరేగాల్సి ఉంటుంది. ● మరో పోటీలో నెల్లూరు జట్టు కడప జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 44 పరుగుల ఆధిక్యం సాధించింది.

అజేయ ద్విశతకంతో అభిషేక్‌రెడ్డి (227)

దత్తారెడ్డి మెరుపు శతకం

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా విక్రమ్‌కుమార్‌రెడ్డి

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా.. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఆ స్థానంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

కుప్పం మీదుగా వందేభారత్ నడపాలి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి విజయవాడకు కుప్పం మీదుగా వందేభారత్ రైలు నడపాలని దక్షిణ పశ్చిమ రైల్వే ఏజీఎంను కుప్పం భాజపా ఇన్‌ఛార్జి తులసీనాథ్ కోరారు. సోమవారం కుప్పం రైల్వేస్టేషన్ తనిఖీ చేసేందుకు వచ్చిన ఏజీఎంను కలిసి పలు రైల్వే సమస్యలను ఆయనకు వివరించారు. కుప్పం మీదుగా విజయవాడకు వందేభారత్ రైలు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆయనను కోరినట్లు తెలిపారు.

సుపరిపాలన అందించడమే లక్ష్యం

సదుం, న్యూస్‌టుడే: ఇది మంచి ప్రభుత్వం, పాలన ప్రజల వద్దకు కాదు.. ప్రజల మధ్యే జరుగుతుందని.. ఇంటింటికి సుపరిపాలనను తీసుకెళ్తున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పుంగనూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సదుం మండలం చీకలచేనులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యకర్తలు, నాయకులు గజమాలతో మంత్రికి ఘనస్వాగతం పలికారు. మంత్రి, చల్లాబాబు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల అమలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానికులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా.. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు రెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, చల్లా బాబు

సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో జూన్‌లో నిర్వహించిన బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని పరీక్షల కార్యాలయం అధికారులు సోమవారం తెలిపారు.

11న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

చిత్తూరు (క్రీడలు): కడపలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతిలో ప్రవేశం నిమిత్తం జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు ఈ నెల 11న చిత్తూరులోని మెసానికల్ మైదానంలో నిర్వహించనున్నామని డీఎస్‌డీవో బాలాజీ సోమవారం తెలిపారు. గతంలో పేర్కొన్న షెడ్యూల్‌లో మార్పులు జరిగాయని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర స్థాయిలో మరోసారి ఎంపిక పోటీలు ఉంటాయన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్లు పరిశీలించిన 13 జిల్లాల ఉద్యోగులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా సోమవరంలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను సోమవారం 13 జిల్లాల ఉపాధి హామీ పథకం ఉద్యోగులు పరిశీలించారు. వీటి నిర్మాణంలో సాంకేతిక వివరాలను ఉపాధి హామీ పథకం రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి(సీక్యూసీవో) గోపీచంద్ వివరించారు. ఇందుకు వినియోగించే కంకర, రాళ్ల గురించి చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎలా నిర్మించుకోవాలో వివరించారు. తక్కువ ఖర్చుతో నిర్మించే ఈ డ్రెయిన్ల వల్ల నీరు భూమిలో ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. మ్యాజిక్ డ్రెయిన్ల ఫొటో ప్రదర్శనను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ఇంజినీర్లు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర స్థాయి సిబ్బంది బస్సులో గ్రామానికివచ్చి వీటిని పరిశీలించారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, తిరుపతి, బాపట్ల జిల్లాల్లో ఎంపిక చేసిన 13 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఈ డ్రెయిన్లు నిర్మిస్తారు. ఉపాధి హామీ పథకం సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి జె.సురేష్‌బాబు, ఏపీడీ ఎన్.శ్రీనివాసరావు, ఏపీవో శరత్‌బాబు, స్థానిక తెదేపా నాయకుడు ఉప్పుకొండూరు గురుప్రసాద్, యోగానందం తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్ పరిశీలిస్తున్న సీక్యూసీవో గోపీచంద్, పలు జిల్లాల సాంకేతిక సిబ్బంది

రైతులకు నగదు చెల్లించాలి

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: తోతాపురి మామిడికి ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు వెంటనే రైతులకు నగదు చెల్లించాలని రైతు సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. రైతులు మామిడి కాయలు సరఫరా చేసి 15 రోజులు గడుస్తున్నా.. ఇప్పటివరకూ నగదు చెల్లించలేదన్నారు. ఈ నెల 22న అంతర్జాతీయ మామిడి దినోత్సవాన్ని చిత్తూరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు ఆనంద నాయుడు, జనార్ధన్, గంగరాజు, హేమాద్రిచౌదరి, ఉమాపతినాయుడు, మునిరత్నంనాయుడు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన రైతు నాయకులు

టికెట్ల మాయాజాలం

బ్యాంకు సిబ్బందిపై ఈవోకు ఫిర్యాదు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో టికెట్ల మాయాజాలంతో భక్తులను మోసగించి బ్యాంకు సిబ్బంది అడ్డంగా దొరికిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. ఆలయంలోని ప్రసాదాల కౌంటర్ ఎదురుగా భక్తుల సౌకర్యార్థం టికెట్ల కౌంటర్ ఏర్పాటు చేశారు. కర్ణాటకకు చెందిన ప్రభుత్వ అధికారి కుటుంబ సభ్యులతో కలసి సోమవారం కౌంటర్ వద్ద అంతరాలయ దర్శనం కోసం 9 టికెట్లకు రూ.4500 చెల్లించారు. అక్కడ విధి నిర్వహణలోని బ్యాంకు సిబ్బంది పైన, కింద రూ.500 టికెట్లు పెట్టి, మధ్యలో రూ.200 టికెట్లు ఇచ్చేశారు. తీసుకున్న మొత్తానికి సరిపడ టికెట్లు ఇవ్వకపోవడంపై అనుమానం వచ్చిన ఆ ఉద్యోగి ఈ విషయమై ఆలయ ఈవో బాపిరెడ్డికి ఫిర్యాదు చేశారు. అయితే టికెట్టు తీసుకున్నాక స్కానర్ పాయింట్, మహద్వారం, దక్షిణామూర్తి సన్నిధి, స్వామి, అమ్మవార్ల సన్నిధిలో టికెట్లు పరిశీలిస్తారు. అయితే ఇంత ధైర్యంగా అతను భక్తులను మోసగించి టికెట్లు పంపిణీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఎంత కాలంగా ఈ అక్రమాలు జరుగుతున్నాయన్న విషయమై ఆలయ ఈవో బాపిరెడ్డి విచారణకు ఆదేశించారు. అలాగే సంబంధిత ఉద్యోగి చేసిన నేరానికి అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

105 గదిపై ఉత్కంఠ..: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న భక్తకన్నప్ప సదన్ 105 గది వివాదం సోమవారం చర్చనీయాంశమైంది. ఆలయంలో పనిచేసే ఒప్పంద ఉద్యోగి అక్కడి గదిలోకి వెళ్లి తలుపు వేసుకోవడం, మళ్లీ ఎంత కొట్టినా తలుపు తీయకపోవడంతో ఉద్యోగులు ఉత్కంఠకు గురయ్యారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే మళ్లీ తలుపు తెరిచాక అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనిపైనా విచారణ చేపట్టాలంటూ ఈవో ఆదేశించినట్లు తెలిసింది.

EENADU Classifieds

REAL ESTATE

JOBS

FLAT FOR SALE

GENERAL

PLOT FOR SALE

GENERAL

WANTED GRADUATE Trained Teachers for primary Mathematics and EVS, Computer & PET Faculty also Sudhaha Little Citizen's High School, R.C. Road, Tirupati. 93925 13633.

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

Cont: 9845458960, 9440310989.

91145 61456.

95027 74175/ 79959 92114.

99706 78818.

92469 99571, 92469 98571.

99085 42222.

గమనిక

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

80085 13290

పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST అదనము

'ప్రశ్నించే గొంతులు నొక్కడమే భాజపా వైఖరి'

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల్ని ప్రశ్నించే, వారి గొంతు నొక్కడమే భాజపా లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్రం కార్మిక, కర్షకుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని గొప్పలు చెబుతూనే వారి శ్రమను ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు దోచిపెడుతుందన్నారు. మోదీ పాలన విధానాలపై ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, దీన్ని విజయవంతం చేయాలన్నారు. సీపీఐ 24వ జిల్లా మహాసభలు ఆగస్టు 9, 10వ తేదీల్లో నగరిలో జరుగుతాయని, వీటి విజయవంతానికి సీపీఐ, అనుబంధ సంఘాలు హాజరు కావాలని ఆయన కోరారు. జిల్లా నాయకులు నాగరాజన్, విజయగౌరీ, దాసరి చంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు

చికెన్ ధరలు	
వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో)	
బ్రాయిలర్ (రైతు ధర)	105
రిటైల్	127
లేయర్	112
బ్రాయిలర్	184
బ్రాయిలర్ స్కిన్ లెస్	210
లేయర్ మాంసం	190

పూడిలో 10 కిలోల గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్టు

వడమాలపేట, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర ఆదేశాలతో.. సోమవారం ఎస్సై ధర్మారెడ్డి పోలీసులతో పూడి రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా రెండు బ్యాగులతో అటూఇటూ తిరుగుతుండగా అతడిని నిలువరించి తనిఖీ చేశారు అందులో 10 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించారు. నిందితుడిని విచారించగా తమిళనాడు రాష్ట్రం మదురై జిల్లా మీనాంబల్పురం గ్రామానికి చెందిన ఆర్ముగంగా గుర్తించామని, అతడిని అరెస్టు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మిపై కేసు

గంగాధరనెల్లూరు, పాలసముద్రం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై నియోజకవర్గ వైకాపా బాధ్యురాలు కృపాలక్ష్మి తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేసినందుకు జీడీ నెల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఆమెపై కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసంతి సోమవారం తెలిపారు. మండల జనసేన అధ్యక్షులు సురేష్‌రెడ్డి, నేతలతో కలిసి కృపాలక్ష్మిపై చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. దీనిపై పాలసముద్రం ఏఎస్సై మునస్వామికి జనసేన మండల పార్టీ అధ్యక్షుడు లతీష్ ఫిర్యాదు చేశారు.

'నాకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఖాతానే లేదు'

తనకు ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ లేనప్పుడు తాను పోస్టు ఎలా చేస్తానని కృపాలక్ష్మి ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై ఇన్‌స్టాగ్రామ్ పేజీలో అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు జనసేన నేతలు తనపై ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. ప్రాథమిక విచారణ చేపట్టకనే రెడ్‌బుక్ రాజ్యాంగం మేరకు ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టడం అలవాటైందన్నారు.

ప్రమాదవశాత్తు హీటర్ తగిలి ఎల్ఐసీ ఉద్యోగి మృతి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: బకెట్‌లో పెట్టిన హీటర్‌ను తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఎల్ఐసీ ఉద్యోగి మృతి చెందిన ఘటన కుప్పం పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన వెంకటేశ్వర్లు(29) ఎల్ఐసీ అభివృద్ధి అధికారిగా ఉద్యోగం రావడంతో కుప్పం ఎల్ఐసీ కార్యాలయంలో పని చేస్తూ స్థానిక ప్రకాశం రోడ్డులో ఒక్కరే నివాసముంటున్నారు. సోమవారం బాత్‌రూమ్‌కు వెళ్లిన అతను బకెట్‌లో ఉన్న హీటర్‌ను తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యారు. ఇంటి తలుపులు తీసి ఉండటం, ఎంతకీ బయటకు రాకపోవడంతో పక్కింటి వారికి అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా విద్యుదాఘాతానికి గురైనట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాబు తెలిపారు.

ఘటనా స్థలంలో మృతి చెందిన వెంకటేశ్వర్లు

చిత్తూరు

● చిత్తూరు ● పూతలపట్టు ● గంగాధరనెల్లూరు ● నగరి

అన్నదాన పథకానికి విరాళం

విరాళం అందజేస్తున్న గోపాల్‌రెడ్డి దంపతులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన గోపాల్‌రెడ్డి రూ.లక్ష మొత్తాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికి సోమవారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.

14న మండల సర్వసభ్య సమావేశం

పూతలపట్టు, న్యూస్‌టుడే: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14న ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగరాజు తెలిపారు. ఎమ్మెల్యే మురళీమోహన్ విచ్చేస్తారని, సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

మేమున్నాం... మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, పుత్తూరు: **సమస్య:** స్థానిక కట్టకింద రామకృష్ణాపురంలో మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడంతో ఇబ్బందిగా ఉంది. **- రమణ, పుత్తూరు**

సమాధానం: ఈ గ్రామంలో తరచూ కాలువలు శుభ్రం చేయిస్తాం. **-ప్రియాంక, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

న్యూస్‌టుడే, వెదురుకుప్పం: **సమస్య:** మండలంలోని అన్ని పాఠశాలల వద్ద ప్రధాన రహదారులపై సూచికలు ఏర్పాటు చేయాలి. **-రాజేంద్ర, సామాజిక సేవా కార్యకర్త**

సమాధానం: సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి సమస్య పరిష్కరిస్తాం. **-పురుషోత్తం, ఎంపీడీవో**

న్యూస్‌టుడే, పాలసముద్రం: **సమస్య:** వేపకుంట వద్ద పైప్‌లైను లీకై తాగునీరు వృథాగా పోతోంది. **- గ్రామస్థులు**

సమాధానం: లీకేజీ అరికట్టి కలుషితం కాకుండా తాగునీటిని అందిస్తాం. **- సుధాకర్, పంచాయతీ కార్యదర్శి**

న్యూస్‌టుడే, తవణంపల్లె: **సమస్య:** బోయపల్లి ఎస్సీ కాలనీలోని వీధుల్లో వర్షం కురిస్తే మడుగులా వర్షపు నీరు నిలుస్తుంది. **- స్థానికులు**

సమాధానం: పంచాయతీ అధికారులతో మాట్లాడి నిధులు ఉన్నపుడు అవసరమైన వీధుల్లో సీసీ రోడ్లు నిర్మింపజేస్తాం. **- హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో, తవణంపల్లె**

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులతో ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 8 మంది లబ్ధిదారులకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. సోమవారం లక్ష్మీనగర్ కాలనీలోని ఆయన కార్యాలయంలో పెనుమూరు మండలం, పులికల్లు గ్రామానికి చెందిన నాదమునికి రూ.42,746, జీడీనెల్లూరు మండలం విజంగ్రామానికి చెందిన మోహన్‌రెడ్డికి రూ.44,195, ఐరాల మండలం పొలకలకు చెందిన ప్రత్యూషకు రూ.35,917, పుంగనూరు తేరువీధికి చెందిన విజయకుమార్‌కు రూ.2 లక్షలు, ఐరాలకు చెందిన రాజారెడ్డికి రూ.1.15 లక్షలు, వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లికి చెందిన రవిబాబుకు రూ.2.09 లక్షలు, చిత్తూరు నియోజకవర్గం, 190 రామాపురానికి చెందిన దేవేంద్రబాబుకు రూ.51,385, తిరుపతి గ్రామీణ మండలం మల్లంగుంట గ్రామానికి చెందిన గిరిబాబుకు రూ.6.28 లక్షలు మొత్తం రూ.13,27,560 విలువ గల చెక్కులు అందజేశారు.

గురు పూర్ణిమ వేడుకలు

పూజలు నిర్వహిస్తున్న యోగాచార్యులు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: నగరంలోని శ్రీ రామకృష్ణ ఆశ్రమంలో గురు పూర్ణిమ వేడుకల్ని ముందస్తుగా నిర్వహించారు. ముందుగా వేదవ్యాసుని చిత్రపటానికి పూజలు చేశారు. అరగొండలోని శివగిరి ఆశ్రమ పీఠాధిపతి అప్రమేయానందగిరిస్వామి మాట్లాడుతూ వేదవ్యాసుల జయంతిని గురుపూర్ణిమగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ సద్గుణాలు ఆచరిస్తూ ఉన్నతంగా జీవించాలన్నారు. యోగాచార్యులు నరేంద్రకుమార్, ఎస్ఎస్‌వై వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టర్ బంగ్లా ఆవరణలో నూతన ప్రహరీ నిర్మాణానికి కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్ సోమవారం భూమిపూజ చేశారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కలెక్టర్ బంగ్లాకు సంబంధించిన స్థలం కొంతవరకు కేటాయించారు. ఈ విస్తరణలో తొలగించిన స్థలానికి ప్రత్యామ్నాయంగా బంగ్లాలో నూతన ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టారు. కమిషనర్ నరసింహ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏపీఎస్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశం విజయవంతం చేయాలి

తవణంపల్లె, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10న నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్ 2.0ను విజయవంతం చేయాలని ఎంఈవో హేమలత కోరారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులతో సోమవారం సమావేశం నిర్వహించారు.

దయచూపండయ్యా..!

● మండలాల్లో ఆలకించట్లేదు
● వ్యయప్రయాసలకోర్చి వస్తున్నాం
● బాధితుల కన్నీటి వేదన

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు), కలెక్టరేట్

కొన్నేళ్లుగా సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. పరిష్కారం చూపే నాథుడే లేరని కన్నీటిపర్యంతమయ్యారు పలువురు అర్జీదారులు.. వినతులు అందించేందుకు వెళ్తే మండలాల్లో తమ గోడు ఆలకించే వారే కరవయ్యారని.. అక్కడి అధికారులు అసలు పట్టించుకోవడం లేదని.. దీంతో చేసేదేమీ లేక విసిగి వేసారి ఎంతో శ్రమకోర్చి ఇక్కడకు వచ్చామని వాపోయారు.. మీరైనా తమ బాధలు ఆలకించి పరిష్కరించాలని తమ ఆవేదన వెలిబుచ్చారు.

దౌర్జన్యం చేస్తున్నారు..

పంటను నాశనం చేసి తనపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారంటూ వెదురుకుప్పం మండలం లచ్చుకూరుకు చెందిన మహిళ **ప్రమీల** కన్నీటిపర్యంతమయ్యారు. తమ పొలానికి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి కొన్నేళ్లుగా తమ అనుభవంలో ఉందని, అందులో పంటలు సాగు చేసుకుంటున్నామన్నారు. తమ భూమి పక్కన ఉన్న పొలాన్ని సంబంధిత వ్యక్తులు ఇతరులకు విక్రయించారన్నారు. ప్రస్తుతం కొందరు.. తాను సాగు చేసుకుంటున్న పొలంలోకి అక్రమంగా ప్రవేశించి తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్నారు. తాను సాగు చేసుకుంటున్న భూమికి పట్టా అందజేసి న్యాయం చేయాలని విన్నవించారు.

ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు..!

40 ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూమిని ఇతరులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ భూమికి డీకేటీ పట్టా మంజూరు చేయాలని ఎస్ఆర్‌పురం మండలం ముత్తుంవాళ్లవూరు వాసి **శ్రీనివాసులు నాయుడు** విన్నవించారు. తమకు 2.50 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, దీనికి ఆనుకుని 90 సెంట్ల భూమి ఉందన్నారు. వేరుసెనగ, ఉలవ ఇతర పంటలు సాగు చేస్తున్నానని, ఆ భూమికి పట్టా జారీ చేయాలని కొన్నేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదన్నారు. ప్రస్తుతం ఈ భూమిని ఇతరులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

మ్యూటేషన్‌కు రెండేళ్లుగా తిరుగుతున్నా..

రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలున్న భూమిని తమ పేరిట మ్యూటేషన్ చేయించుకునే నిమిత్తం రెండేళ్లుగా తిరుగుతున్నానని ఎస్ఆర్‌పురం మండలం మంగుంట వాసి **యశోదమ్మ** ఆవేదన వ్యక్తం చేశారు. అవ్వ తనకు 20సెంట్ల భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిందని, తాను ఒంటరి మహిళనన్నారు. కొద్దిపాటి పొలంలో పంటలు సాగు చేసుకుని జీవిస్తున్నానని చెప్పారు. మ్యుటేషన్ చేయాలని వీఆర్వోకు ధ్రువీకరణ పత్రాలు అందజేసినా ఇప్పటివరకు పట్టించుకోలేదని వాపోయారు. 'ఇప్పుడు కాదు.. తర్వాత చూద్దాం' అంటూ తిప్పుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఇంకెన్నాళ్లు తిరగాలో..

భూ సర్వేకు చలానా చెల్లించి నెలలు గడుస్తున్నా సర్వే చేయడం లేదని గుడిపాల మండలం నారగల్లుకు చెందిన రైతు **రఘు** వాపోయారు. తమ అనుభవంలో ఉన్న భూమి ఆక్రమించేందుకు ఎంపీటీసీ దౌర్జన్యానికి పాల్పడుతున్నాడన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, 1బీ ఉన్నప్పటికీ ఆ భూమిని సర్వే చేసి హద్దులు గుర్తించాలని మండల అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

● ఆక్రమణకు గురైన శ్రీ ఆవుదేవర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూములు పరిరక్షించాలని ఎస్ఆర్‌పురం మండలం మంగుంట గ్రామస్థులు కలెక్టరేట్‌లో అధికారులకు విన్నవించారు.

● చౌక దుకాణం తరలింపుతో తాము ఇబ్బంది పడుతున్నామని ఐరాల మండలం పుల్లూరు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు దుకాణాన్ని పి.ఒడ్డుపల్లికి మార్చడం ద్వారా 284 మంది కార్డుదారులు అవస్థలు పడుతున్నారని వాపోయారు. అధికారులు విచారించి న్యాయం చేయాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై అందే ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పింఛను 3, ఇంజినీరింగ్ 3, రెవెన్యూ 1 చొప్పున మొత్తం..7 వినతులు అందాయి. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్ పాల్గొన్నారు.

12 వినతుల స్వీకరణ..

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్పందనలో ప్రజలు, రైతుల నుంచి 12 వినతులు అందాయని అర్బన్ తహసీల్దార్ కులశేఖర్ తెలిపారు. చిత్తూరు గ్రామీణ మండల కార్యాలయంలో స్పందనకు ఐదు వినతులు అందాయని తహసీల్దార్ విజయకుమార్ పేర్కొన్నారు.

కృష్ణరామాపురంలో ద్రౌపదీదేవి తిరునాళ్ల

తిరుణాళ్లలో పాల్గొన్న మాజీ మంత్రి రోజా

నగరి, న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణరామాపురంలో ద్రౌపదమ్మ ధర్మరాజుల తిరునాళ్ల సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలంకరణతో సంప్రదాయ పద్ధతిలో పూజలు చేసి ఊరేగించారు. మాజీ మంత్రి రోజా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు, దాతలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధనం అంటే అలుసా..?

తొరూరు పంచాయతీ పరిధిలోని పైడిపల్లి దళితవాడ వద్ద 2003లో పనికి ఆహార పథకం కింద పశువుల దాహార్తి కోసం తొట్టె నిర్మించారు. కాలక్రమంలో దాన్ని పూడ్చేశారు. అదే తొట్టెలో గత ప్రభుత్వ హయాంలో ఓ నాయకుడి విగ్రహం ఏర్పాటుకు దిమ్మె ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విగ్రహం ఏర్పాటు తాత్కాలికంగా నిలిపివేశారు. రూ.వేలు ఖర్చు చేసి నిర్మించిన తొట్టెలోని మట్టి తొలగించి నీటిని నింపి ఉంటే పశువులు దాహార్తి తీర్చుకునేవి. అలాకాక మట్టి పోసి పూడ్చటం సమంజసం కాదని, ప్రజాధనం అంటే అంత అలుసా అని గ్రామస్థులు పేర్కొంటున్నారు. **-న్యూస్‌టుడే, పుత్తూరు**

విద్యుత్తు కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

చిత్తూరు గ్రామీణ: కూటమి ప్రభుత్వం విద్యుత్తు కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విద్యుత్తు ఒప్పంద ఉద్యోగుల సంఘం(3045) రాష్ట్ర నాయకులు సుధాకర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం విద్యుత్తు ఒప్పంద ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మనీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు రూప్‌కుమార్, హేమకుమార్, అంకయ్య, శరవణ, రజని పాల్గొన్నారు.

ఘనంగా ద్రౌపదీదేవి వసంతోత్సవం

ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీదేవి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ద్రౌపదీదేవిని గ్రామవీధుల్లో సోమవారం ఊరేగించారు. ఏకాంతసేవ గాడి హేమాద్రినాయుడు కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రవియాదవ్, కార్యదర్శి గౌతంవర్మ, ఉపాధ్యక్షుడు రవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతిమొదలియార్, అదనపు కార్యదర్శి సాయిరాయల్ పాల్గొన్నారు.

'ఉనికి కోసం వైకాపా దుష్ప్రచారం'

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ఉనికి కోసం కూటమి ప్రభుత్వంపై వైకాపా దుష్ప్రచారం చేస్తోందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ సోమవారం ఆరోపించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింటు మేనర్స్ శ్రీరాంసిటీ యూనియన్ ఫైనాన్స్ లి. Chittoor బ్రాంచ్ మేనేజరు వారు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి Smt. Yamala Menakshi, W/o. Y.Bhaskar, residing at Door No.4-1982/1, Back Side of Vinayaka Temple, Durga Nagar Colony, Girimpet, Chittoor Town, Post, Mandal and District, A.P. గారికి చెందిన ఆస్తి ఆని సదరు ఆస్తికి రిజిస్టరు తనఖా చేయించుకుని సదరు Smt. Yamala Menakshi, W/o. Y.Bhaskar గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారము సంబంధించి ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా ఆస్తులపై ఏటువంటి జప్తులు, వ్యాజ్యాలు, రిమేనులు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 7 దినములలోగా క్రింది కనిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

SCHEDULE OF PROPERTY

Chittoor District, Chittoor Mandal, Chittoor Municipal Corporation area (Girimpet) NO. 72, Chittoor revenue Village Sy.No. 251/1. Dry house site and out of Ac. 1.19 cents, Bharath Nagar in Ambedkar Nagar, Door No. 15-2814/1, Ground Floor, 1st Floor, 2nd Floor, RCC house and site.

Item No. I measuring: East - West : 14 1/4 feet or 4.346 Mtrs and North - South : 37 1/2 feet or 11.438 Mtrs. Total 534.375 sq.ft or 59.375 sq. yards site

In this Ground Floor measuring:- East - West : 14 1/4 feet, North South : 31 1/2 feet Total 448.78 sq.ft.

1st Floor measuring: East - West : 14 1/4 feet, North - South : 21 1/2 feet Total 306.375 sq.ft.

2nd Floor measuring: East - West : 14 1/4 feet, North - South : 10 1/2 feet. Total 149.625 sq.ft. Electric service No.5112301001123, 5112301000936 and assessment No. 1008017058.

Situated within the following boundaries: East - House of S.Ravi, bearing Door No. 15-2814/2, West - House of K.Chandrasekhar bearing Door No.15-2822/1A. North - Road, South - Current office store.

Item No. II measuring: East West: 4 feet 4 inches or 1.320 Mtrs and North-South: 11 feet or 3.350 Mtrs. Total 47.663 sq.ft or 5.29 sq. yards site

Situated within the following boundaries: East - Vacant site of S.Ravi, West-Vacant site of S.Murugan, North - Road, South - Vacant site.

కె.లక్ష్మీపతి, బికాం., ఎల్.ఎల్.బి., అడ్వకేటు, పలమనేరు
సెల్: 7013127065 & 9440550356

పుత్తూరు: గోపాలకృష్ణాపురంలో మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

గుడిపాల: నారగల్లులో పింఛను అందుతుందా అని వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

సంక్షేమం, అభివృద్ధి కూటమి లక్ష్యం

పుత్తూరు, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. గోపాలకృష్ణాపురంలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల హామీ మేరకు గోపాలకృష్ణాపురంలో చదువుతున్న ఎస్టీ కుటుంబాల్లోని ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు జమ చేయించారన్నారు. నలుగురు ఎస్టీ మహిళలకు ఉన్నతి పథకం కింద రూ.2 లక్షల చెక్కు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించి అక్కడ మొక్కలు నాటారు. పల్లెపండగలో నిర్మించిన పశువుల తొట్టె ప్రారంభించారు. ఆయన్ను నాయకులు సత్కరించారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ మాధవయ్య, ఇన్‌ఛార్జి ఎంపీడీవో వాణి, మండల తెదేపా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, వెంకటేష్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు కరుణ, సీడీపీవో ప్రమీల, వెలుగు ఏపీవో వనిత, ఎంఈవో తిరుమలరాజు, డీటీ అశోక్ రెడ్డి, విద్యుత్తు ఏఈ భాస్కర్‌రాజు, ఏవో కోదండయ్య పాల్గొన్నారు. **గుడిపాల:** ఏడాది కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. నారగల్లు, ఏఎల్‌పురం, వెంగమాంబాపురం, 197.రామాపురంలో ఇంటింటి పర్యటన చేశారు. ఏడాది పాలనలో గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించామని, రానున్న నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కొత్తకోట ఎస్సీకాలనీలో మాతమ్మ దేవాలయ నిర్మాణానికి రూ.25 వేలు నగదు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా కావాలని విద్యార్థులకు హామీ ఇచ్చారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మండల తెదేపా కన్వీనర్ సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యులు బాలాజీ పాల్గొన్నారు. **పాలసముద్రంలో** తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు రాజేంద్రన్.. బలిజకండ్రిగ, కొండం గ్రామాల్లో కరపత్రాలు అందజేశారు. **బంగారుపాళ్యంలో** తెదేపా మండల అధ్యక్షులు ధరణీప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో చీకూరుపల్లెలో కరపత్రాలు ఇంటింటికీ అందజేశారు.

పారదర్శకంగా టోకెన్లు

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: స్థానిక జైన్ గుజ్జు పరిశ్రమ ఎదుట కాయలతో నిలిచిన ట్రాక్టర్లకు సోమవారం ఉప తహసీల్దారు తులసీరాం రెవెన్యూ అధికారులతో కలిసి వరుసల ప్రకారం టోకెన్లు మంజూరు చేశారు. మధ్యలో ఎవరైనా ట్రాక్టర్లతో కాయలు తోలితే ఫిర్యాదు చేయాలని సూచించారు.

వైభవంగా మాతమ్మ తల్లి వార్షికోత్సవం

నిండ్ర, న్యూస్‌టుడే: నెట్టేరి, పాపరాజుకండ్రిగ ఆదిఆంధ్రవాడల్లో ఉన్న శ్రీ మాతమ్మ తల్లి ఆలయాల్లో వార్షికోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. గ్రామ పెద్దలు, యువకులు పర్యవేక్షించారు.

గొప్ప నాయకుడు మందకృష్ణ మాదిగ

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ 60వ పుట్టినరోజు వేడుకల్ని సోమవారం చిత్తూరు నగరం వెంగళరావు కాలనీ, ఉషానగర్ కాలనీల్లో ఘనంగా నిర్వహించారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడంతోపాటు కేకులు కోసి పంచిపెట్టారు. ప్రకాష్, మురళి, గోపాల్, ఈశ్వర్, పులివారిబాబు, గోపి, శ్రీలక్ష్మి, చిన్న, కార్తీక్, కర్ణ, ప్రసాద్ పాల్గొన్నారు. **పాలసముద్రం:** మాదిగలు ఏకతాటిపై నడవాలని చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి ధనరాజ్‌పల్లి కిషోర్ మాదిగ, పేర్కొన్నారు. స్థానిక ఆదిఆంధ్రవాడలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. మందకృష్ణ పుట్టినరోజు సందర్భంగా భారీ కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు, మురళి, ప్రకాష్ మాదిగ, నరసింహులు మాదిగ, పులిగోరు బాబు మాదిగ,మురగయ్య, చిన్నబ్బ, ప్రేమ్‌కుమార్, పవన్ పాల్గొన్నారు. **గంగాధరనెల్లూరు:** రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌ఛార్జి కిషోర్‌మాదిగ.. అక్కనగారిపల్లె అరుంధతీవాడలో పార్టీ పతాకావిష్కరణ చేశారు.

హెలిప్యాడ్ పనుల పరిశీలన

బంగారుపాళ్యం: వైకాపా అధినేత జగన్ ఈ నెల 9న బంగారుపాళ్యం పర్యటన నేపథ్యంలో అరగొండ ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను సోమవారం మాజీ మంత్రి రామచంద్రారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైకాపా జిల్లా అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, లలితకుమారి, జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్‌రాజ ఉన్నారు.

విజయవంతం చేయాలి

తవణంపల్లె: జగన్ బంగారుపాళ్యం పర్యటన విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. తవణంపల్లె, కాణిపాకంలో పార్టీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్లు హరిరెడ్డి, బుజ్జిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఐరాల ఎంపీపీ మోహన్ పాల్గొన్నారు.

PASSPORT LOST

I, **B. MUNA SWAMY** S/o Late Bala Krishnam,residing D.No.21-431,T.Chavatapalli,Sugar Factory Back Side, Chittoor Town and District,AP-517004 here by inform that I have lost my Indian Passport bearing **No M198372** was misplaced in my residential house. If any body found said Passport please handover to me at above address or Contact : **9440958684**

సింహ వాహనంపై విహారం

టి.పుత్తూరులోని శ్రీకోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీరాముడు సింహ వాహనంపై పురవీధుల్లో విహరించారు. వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, గ్రామపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.
-న్యూస్‌టుడే, తవణంపల్లె

కేంద్ర బృందం పర్యటన

తవణంపల్లె: ఎస్‌హెచ్‌జీ-25(స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ)లో భాగంగా చెర్లోపల్లి గ్రామంలో కేంద్ర బృంద సభ్యులు హేమంత్, రాజేష్ సోమవారం పర్యటించారు. గ్రామంలో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ తదితర విషయాలను పరిశీలించారు. పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



పశువులకు అందని వైద్యం...!

● నెల రోజులుగా అటెండరే దిక్కు

పశువైద్యశాల భవనం

పాలసముద్రం, న్యూస్‌టుడే: పల్లెల్లో మూగ జీవాలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. వ్యవసాయం, పశుపోషణే ప్రధాన జీవనాధారంగా జీవిస్తున్న రైతులు పెంచుకుంటున్న పశువులకు వైద్యం అందడం లేదు. మండలంలో పశు సంపద ఎక్కువగా ఉన్నా మండలం కేంద్రంలోని వైద్యశాలకు నెల రోజులుగా పశువైద్యాధికారి లేక మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఆసుపత్రిలోని అటెండర్‌తోనే పశువులకు వైద్యం అందిస్తుండటం గమనార్హం.

మూగజీవాలకు వ్యాధులు సోకితే వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసం కొరత ఏర్పడటంతో తమ జీవాలను కాపాడుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్న రైతులకు వైద్యం అందించడం తలకుమించిన భారమవుతోంది. వైద్యులు లేక పశువులతో ఆసుపత్రి వద్ద పడిగాపులు కాస్తున్నారు. సీజనల్ వ్యాధులు వస్తున్నాయి. ఔషధాల కొరత వేధిస్తోంది. బయట ఔషధాలు కొనుక్కోవాలని రాసిస్తున్నారు. ఇది రైతులకు ఆర్థికంగా భారమే. పశు దాణాకు డబ్బు కట్టించుకుని నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఊసే లేదని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వైద్యాధికారిణిని మరోచోటకు బదిలీ చేశారు. నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఎవరినీ నియమించలేదు. అటెండరే దిక్కయ్యారు. అప్పుడప్పుడు తిరుమలరాజుపురం పశువైద్యాధికారి వచ్చి సేవలందిస్తున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారిని నియమించి పశువులకు దాణా అందించాల్సిన అవసరం ఉందని పాడిరైతులు కోరుతున్నారు.

ఆసుపత్రిలో సౌకర్యాల కల్పనకు కృషి

పెనుమూరు, న్యూస్‌టుడే: స్థానిక సీహెచ్‌సీ రేడియాలజీ విభాగంలో పరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చిత్తూరు గోల్డ్ మరియు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం ఆయన ఆసుపత్రికి వచ్చి సిబ్బందితో మాట్లాడారు. రేడియాలజీ విభాగంలో పరికరాల కొరత కారణంగా సేవలు అందించలేకపోతున్నామని సిబ్బంది చెప్పగా వాటిని అందజేస్తామన్నారు. ప్రతి నెలా 9న ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలకు ఉచితంగా ఆహారం అందిస్తామన్నారు. రామకృష్ణాపురం సర్పంచి వెంకటేష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై దాడికి పాల్పడిన వారిపై కేసు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: దళిత యువకుడు, మహిళపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేశామని సీఐ హనుమంతప్ప తెలిపారు. కార్వేటినగరం కోట హరిజనవాడకు చెందిన ప్రభాకర్, అతడి చెల్లెలు సోమవారం ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బీసీ కాలనీకి చెందిన యువకులు లోకేష్, దాము, ముని, వెంకటేష్. మరో ఇద్దరు అసభ్యకరంగా మాట్లాడటంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన యువకులు నందిని, ప్రభాకర్‌పై దాడి చేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

వడమాలపేట, న్యూస్‌టుడే: పాదిరేడు గ్రామానికి చెందిన మాధవయ్య అక్రమంగా 20 మద్యం సీసాలు తీసుకెళ్తుండగా పోలీసులు గంగమ్మ గుడి సమీపంలో అతడిని తనిఖీ చేశారు. 20 క్వార్టర్ సీసాలు ఉండటంతో స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని ఎస్సై ధర్మారెడ్డి తెలిపారు.

ఇంటి స్థల వివాదంలో ఇద్దరికి గాయాలు

వడమాలపేట, న్యూస్‌టుడే: ఓబీఆర్‌కండ్రిగకు చెందిన గంగాధరం, ధనంజేయులు ఇంటి స్థలంలో గోడ గురించి మాటామాటా పెరిగి గొడవపడ్డారు. దీంతో గంగాధరం కుటుంబ సభ్యులు భాగ్యమ్మ, నాగరాజు, సుజాత, పూర్ణిమ, నాగరాజు కలిసి.. ధనంజేయులు, సుప్రియపై దాడి చేయగా వారికి గాయాలయ్యాయి. వారు స్థానిక ఆసుప్రతిలో చికిత్స పొందుతున్నారని, కేసు నమోదు చేశామని ఎస్సై ధర్మారెడ్డి తెలిపారు.



పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

సమస్యలు పరిష్కరించండి సారూ..

కడా పీడీ వికాస్ మర్మత్‌కు సమస్య చెబుతున్న హిందూ ధర్మ పరిరక్షణ వేదిక సభ్యులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: తాము ఎదుర్కొంటున్న సమస్యలపై దయ చూపి పరిష్కారానికి చొరవ చూపాలని అర్జీదారులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కడా ఆధ్వర్యంలో 'సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. అర్జీదారుల నుంచి కడా పీడీ వికాస్ మర్మత్ వినతులు స్వీకరించారు. వాటిని సత్వరం పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి..

భూమి ఆక్రమించుకున్నారు

నా పేరు వెంకట్రామప్ప. గుడుపల్లె మండలం నలగంపల్లెలో మా భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. భూమి సర్వే చేసేందుకు దరఖాస్తు చేసుకోగా.. అధికారులు సర్వే చేసేందుకు వచ్చిన సమయంలో ఆక్రమించుకున్న వ్యక్తులు అడ్డుకుంటున్నారు. వారి నుంచి మాకు ప్రాణ భయం ఉంది. ఆక్రమణకు గురైన భూమిని సర్వే చేసి సమస్యను పరిష్కరించాలి.

- వెంకట్రామప్ప, కప్పలనత్తం, గుడుపల్లె

పింఛన్ ఇప్పించండి

నా పేరు తిమ్మక్క. నా భర్త చనిపోయారు. నా బిడ్డలు నన్ను చూసుకోవడం లేదు. నా భర్తకు వస్తున్న పింఛన్‌ను నాకు ఇప్పించేందుకు దయ చూపాలి. ఏడాదిన్నరగా పింఛన్ కోసం దరఖాస్తు చేస్తున్నా పింఛన్ మంజూరు కావడం లేదు.

- తిమ్మక్క, పరసముద్రం, కుప్పం

కుప్పం ప్రాంతంలో ఇతర ప్రాంతాలకు చెందిన వారు ప్రవేశించి ఇక్కడి ప్రాంతంలో ఉన్న మతాల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని హిందూ ధర్మపరిరక్షణ వేదిక సభ్యులు కడా పీడీకి ఫిర్యాదు చేశారు.

వైభవంగా ప్రాకారోత్సవం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక శ్రీకోదండరామస్వామి ఆలయంలో సోమవారం ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో అర్చకులు స్వామివారికి అభిషేకం, పుష్పాలంకరణతో ప్రత్యేక పూజలు జరిపారు. సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఉత్సవమూర్తులను సుగంధ పరిమళ పుష్పాలు, స్వర్ణాభరణాలతో అలంకరించి తిరువారాధన ఉత్సవం, ప్రాకారోత్సవం చేశారు. ఉభయదార్లుగా కొత్తమాచు వెంకటాచలపతి కుటుంబీకులు వ్యవహరించారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ

ఈనాడు ఫోన్‌ఇన్‌లో పలమనేరు డీఎస్పీ ప్రభాకర్

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి స్పందన లభించింది. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు చరవాణి ద్వారా తమ సమస్యలను డీఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై ఆయన స్పందించి వివరణ ఇచ్చారు.

?: ప్రశ్న ✔: డీఎస్పీ

?: పట్టణంలోని గుడియాత్తం సర్కిల్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటోంది. ఓ వైపు తమిళనాడు, మరోవైపు కర్ణాటక నుంచి వచ్చే వాహనాల రద్దీనే ఇందుకు కారణం. ఇక్కడ ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలి.
- సుధాకర్, పలమనేరు

✔: ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం. గుడియాత్తం సర్కిల్ వద్ద ఇప్పటికే పోలీసు నిఘా ఏర్పాటు చేశాం.

?: గంజాయి వాడకం పెరుగుతోంది. విక్రయాల నియంత్రణపై చర్యలు తీసుకోవాలి.
- నాగరాజు, పలమనేరు

✔: ఇప్పటికే గంజాయి విక్రేతలను అరెస్టు చేసి జైలుకు పంపాం. ప్రత్యేక నిఘా వర్గాల ద్వారా గంజాయి విక్రయాలపై దృష్టి సారిస్తున్నాం. ఎవరికైనా సమాచారం ఉంటే తమకు తెలిపితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. దీనిపై పట్టణంలోని అన్ని కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

?: పట్టణంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలి.
- ఎన్.వి.రెడ్డి, మొరం

✔: పిల్లలు బెట్టింగులకు పాల్పడుతుంటే మాకు సమాచారం ఇవ్వాలి. బెట్టింగ్ స్థావరాలపై దాడులు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

?: పట్టణంలోని బజారువీధి, జవిళివీధులతో పాటు రంగమహల్ సర్కిల్‌లోని దుకాణాల వద్ద వాహనాలు ఇష్టారీతిన నిలుపుతున్నారు.
- సుకుమార్, పలమనేరు

✔: కేటాయించిన స్థలాల్లోనే వాహనాలు నిలిపేలా చూస్తాం. అందుకు అవసరమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

?: యువకులు నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టణంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు.
- సుబ్రహ్మణ్యంరెడ్డి, కల్లాడు

✔: అలాంటి వారిపై నిఘా పెట్టి వాహనాలు సీజ్ చేస్తాం. నిబంధనలను అతిక్రమించి వారికి జరిమానాలు విధిస్తాం.

?: గంగవరం బైపాస్ మీద ఆకతాయిలు ద్విచక్ర వాహనాలతో విన్యాసాలు చేస్తూ.. దానిపై బెట్టింగ్ కడుతున్నారు. ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.
- లక్ష్మీప్రసాద్, పలమనేరు

✔: బైపాస్ మీద అలాంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. కేసులు నమోదు చేస్తాం.

?: చైన్‌లింకు విధానంలో ప్రజల నుంచి నగదు వసూలు చేసి మోసం చేసే సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ఆ సంస్థలపై చర్యలు తీసుకోవాలి.
- మదన్, పలమనేరు

✔: అలాంటి వారిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినా లేదా నా నంబరుకు ఫోన్ చేసి చెప్పినా చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణం ఏవీఎం వీధిలో మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- బాబు, కుప్పం**
సమాధానం: పారిశుద్ధ్య పనులు చేపట్టేలా సిబ్బందిని ఆదేశిస్తాం. **- శ్రీనివాస రావు, కమిషనర్**
పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని పెద్దచెరువు కట్టమీద వ్యాపారులు మాంసం వ్యర్థాలు పడేస్తున్నారు. దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. **- జయకుమార్, పలమనేరు**
సమాధానం: కట్టమీద వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. **- ఎస్వీ రమణారెడ్డి, కమిషనర్**
సోమల: సమస్య: రాశెట్టివారిపల్లెలో ఆలయం ముందున్న సింగిల్‌ఫేజ్ మోటారు మరమ్మతుకు గురైంది నీటి కోసం స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. **- స్థానికులు**
సమాధానం: మరమ్మతుకు చొరవ చూపుతాం.
- రెడ్డెప్ప, సర్పంచి, ఇరికిపెంట

కుప్పంలో 30 పోలీసు యాక్టు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని డీఎస్పీ పార్థసారథి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఆందోళనలు, ధర్నాలు జరగకుండా ఎస్పీ ఆదేశాలతో కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం, రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసు యాక్టు అమలులో ఉంటుందన్నారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించకూడదన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

బైరెడ్డిపల్లె: నెల్లిపట్ల ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సరస్వతీ పూజ చేశారు. ఒకటో తరగతిలో చేరిన 29 మంది విద్యార్థులకు అక్షరాభ్యాసం చేసి పండితులు, పెద్దలచే ఆశీర్వదించారు. దాత జయకుమార్ విద్యార్థులకు పలకలు, రాత పుస్తకాలు వితరణ చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న సురేష్‌బాబు, నాయకులు

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

శాంతిపురం, న్యూస్‌టుడే: పేదల వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎం సహాయ నిధి ద్వారా తోడ్పాటును అందిస్తున్నారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనారోగ్య బాధితులకు రూ.3 లక్షల సీఎం సహాయ నిధి సాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నాయకులు నాగరాజు, ఉదయ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న ఫిర్యాదులు

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేకు వచ్చే ఫిర్యాదుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. మేలో రెండు పర్యాయాలు కలెక్టర్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడంతో అర్జీలు ఇచ్చే వారు తగ్గారని పలమనేరు ఆర్డీవో భవాని తెలిపారు. ఆర్డీవో కార్యాలయానికి ప్రతిరోజు అర్జీలు వస్తుండడంతో ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే రోజు ఎక్కువ మంది రావడం లేదని స్పష్టం చేశారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

పలమనేరు, న్యూస్‌టుడే: కొలమాసనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల సబ్ యూనిట్ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం ఆయన కేంద్రంలోని ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ అనూహి, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న మునీంద్ర నాయక్

వసతి గృహాల మరమ్మతులకు రూ.13 కోట్లు

పుంగనూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు రూ.13 కోట్లు కేటాయించడం జరిగిందని జిల్లా ఎస్సీ, ఎస్టీ, మానిటరింగ్ కమిటీ సభ్యుడు మునీంద్రనాయక్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో జరుగుతున్న వసతి గృహాల మరమ్మతు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో భాజపా నాయకుడు అయూబ్‌ఖాన్, అధికారులు చందన, శ్రీరాముల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆరోపించారు. స్థానిక కల్యాణ మండపంలో సోమవారం వైకాపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కరపత్రాలు ఆవిష్కరించారు. ఎంపీపీ రెడ్డెప్ప, వైకాపా రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, జడ్పీటీసీ సభ్యుడు కేశవులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

రొంపిచెర్ల: స్థానిక బస్టాండు ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేకు కోశారు. నాయకులు రఘునాథ్, నారాయణస్వామి, ధనుంజయ, ఓబుళేశు పాల్గొన్నారు. **పుంగనూరు:** మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని సోమవారం పట్టణంలో, గ్రామీణ మండలంలో ఘనంగా నిర్వహించారు. కేకు కోసి అంబేడ్కర్ చిత్రపటాలకు పూజలు చేశారు. **సోమల, న్యూస్‌టుడే:** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని సోమల దళితవాడల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ జెండాను జిల్లా నాయకుడు రామనాథం ఎగురవేశారు. నాయకులు ప్రకాష్, రవి, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

రామకుప్పం: సుపరిపాలనలో తొలి అడుగు జయప్రదం చేయాలని తెదేపా మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి కోరారు. సోమవారం స్థానిక కల్యాణ మండపంలో తొలి అడుగు కార్యక్రమంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. నాయకులు రామమూర్తి, చిన్నికృష్ణ, నాగభూషణం, గంట్లప్పగౌడు, వెంకట్రామేగౌడు, గుర్రప్ప శెట్టి పాల్గొన్నారు.

మంత్రికి సమస్య విన్నవిస్తున్న రంగనాథశెట్టి కుటుంబీకులు

కుమార్తెకు ఉద్యోగం ఇవ్వాలని వినతి

కల్లూరు: పక్షవాతం కారణంగా కండక్టర్ ఉద్యోగం మానేశానని. . కుటుంబం గడవడం కష్టంగా ఉందని నా కుమార్తెకు ఉద్యోగం ఇవ్వాలని కల్లూరుకు చెందిన ఆర్టీసీ కండక్టరు రంగనాథశెట్టి కుటుంబ సభ్యులతో కలిసి రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సోమవారం మండలంలోని దిగువపోకలవారిపల్లె సమీపంలోని ఓ కల్యాణ మండపంలో మంత్రిని వారు కలిసి సమస్య విన్నవించారు. స్పందించిన ఆయన చిత్తూరు డిపో మేనేజరుతో చరవాణిలో మాట్లాడారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న మొదిన్‌బాషా తదితరులు

విద్యా సామగ్రి పంపిణీ

సోమల, న్యూస్‌టుడే: నెల్లిమంద తెట్టుపల్లెకు చెందిన మోదీన్‌బాషా చిత్తూరులో వ్యాపార రీత్యా స్థిరపడ్డారు. సోమవారం ఆయన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా నెల్లిమంద ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు.

మత్తుకు బానిస కారాదు.. పుంగనూరు గ్రామీణ: యువత మత్తు పదార్థాలకు బానిస కారాదని ఎన్‌సీసీ అధికారి సోమరాజు తెలిపారు. సోమవారం 'నశా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. అనిల్‌కుమార్, ఆంజనేయులురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి తొలగింపు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పైబాట వద్ద ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన బోరు ఏర్పాటు చేశారు. అయితే బోరు తవ్వినప్పుడు వచ్చిన మట్టిని రోడ్డు పక్కనే ఉంచడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందిపై 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా..' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారిందని స్థానికులు 'ఈనాడు'కు సమస్యను తెలిపారు. 'మేమున్నాం.. మీకు తోడుగా..' శీర్షికన వార్త రావడంతో స్పందించిన అర్బన్ సీఐ శంకరయ్య ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు.

కాలువలు శుభ్రం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని దండపల్లె రోడ్డులోని మురుగు కాలువలను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. సమస్యపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. అధికారులు ఆ మేరకు స్పందించారు. గుండుబావి పార్కు సమీపంలోని కాలువను కూడా శుభ్రం చేశారు.

తొట్టెల్లో పూడికతీత

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల సచివాలయం ప్రాంగణంలోని ఉపాధి హామీ, వెలుగు కార్యాలయ భవనాల పైకప్పు వర్షపు నీటి సంరక్షణ తొట్టెల దుస్థితిపై 'తొట్టెల దుస్థితి ఇలా.. జల సంరక్షణ ఎలా..' శీర్షికన ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై ఏపీవో చిన్నరెడ్డెమ్మ స్పందించారు. తొట్టెల్లో పిచ్చి మొక్కలు, పూడికతీత పనులు చేపట్టారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు

సోమల: మండలంలోని పెద్దఉప్పరపల్లె, సోమల, కందూరు, ఆవులపల్లె, నెల్లిమంద, మేటిమంద, వల్లిగట్ల గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. అగ్నిగుండ ప్రవేశాలు నిర్వహించారు.

వైద్య శిబిరానికి స్పందన

రామకుప్పం: విజిలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం పీఈఎస్ ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు 286 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

మాగాండ్లపల్లెలో పథకాలను ప్రజలకు వివరిస్తున్న మాధవరెడ్డి

కూటమి ప్రభుత్వానికి ప్రజాదరణ

పుంగనూరు, న్యూస్‌టుడే: ఏడాది పాలనలో అమలు చేసిన ప్రజా సంక్షేమం, అభివృద్ధితో కూటమి ప్రభుత్వానికి ప్రజాదరణ లభిస్తోందని తెదేపా మండల అధ్యక్షుడు మాధవ రెడ్డి అన్నారు. మాగాండ్లపల్లెలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

పరీక్షలు చేస్తున్న ఆయుర్వేద వైద్యులు దివ్య, దీప్తి

పుంగనూరు: నేటి కల్తీ ఆహారం, ఒత్తిడితో కూడిన జీవన పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఆయుర్వేద వైద్యులు దివ్య, దీప్తి కోరారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో మదనపల్లెకు చెందిన బెటర్ లైఫ్ ఆయుర్వేదిక్ ఆస్పత్రి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వారు రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. శిబిరంలో బ్యాంకు విశ్రాంత మేనేజరు మునివెంకటప్ప, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, భరత్‌భూషణ్ పాల్గొన్నారు.

పోలీసులకు డ్రోన్ కెమెరా బహూకరణ

పలమనేరు: శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసుశాఖకు మదర్ థెరిసా కళాశాల యాజమాన్యం డ్రోన్ కెమెరాను ఉచితంగా బహూకరించింది. సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ప్రభాకర్‌కు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు అందించారు. రూ.1.5 లక్షల విలువ చేసే పరికరాన్ని ఇచ్చినందుకు ఆయన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మదనపల్లె-కృష్ణగిరి జాతీయ రహదారిలో బైరెడ్డిపల్లె సమీపంలోని పెద్దడ్యాం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పేర్నంబట్టుకు చెందిన అష్రఫ్ మహమ్మద్ ద్విచక్ర వాహనంపై బైరెడ్డిపల్లె మండలం కానాల యిండ్లుకు వెళ్తుండగా వి.కోట నుంచి వస్తున్న లారీ ఢీకొంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కల్వకుర్తి ముత్తుమారిపై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరశురాముడు తెలిపారు.

వివాహిత అదృశ్యం

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలోని లింగాపురం పంచాయతీ పరిధిలోని బాలాజీ హెచరీస్‌లో ఒడిశాలోని బలంగర్ జిల్లాకు చెందిన పంచూసాహో, అతని భార్య జానకీసాహో కూలీ పనులు చేస్తున్నారు. జానకీసాహో ఈ నెల 3న హెచరీలో పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో భర్త సోమవారం పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై చంద్రబాబు తెలిపారు.

సోమలలో బాలిక.. సోమల, న్యూస్‌టుడే: మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక(16) ఈ నెల 1 నుంచి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివశంకర్ తెలిపారు.

పైపులు చూపుతున్న రైతులు

ఆగని ఏనుగుల దాడులు

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. పాతపేట వ్యవసాయ పొలాల్లో ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన దొరస్వామి పొలంలోని మామిడి, కొబ్బరి చెట్టు, పశుగ్రాసం పూర్తిగా తొక్కి నాశనం చేశాయి. రమేష్, సుబ్రహ్మణ్యం పొలాల్లో మామిడి చెట్లు, గుర్రప్ప పొలంలో ఫిల్టరు పైపులు ధ్వంసం చేశాయి.

ఒంటరి ఏనుగు హల్‌చల్

రామకుప్పం, న్యూస్‌టుడే: ననియాల, రామాపురంతండా, నారాయణపురం తండా, ననియాల తండా గ్రామాల సమీపంలో ఒంటరి ఏనుగు సోమవారం రాత్రి హల్‌చల్ చేసింది. గ్రామ సమీపంలోని పంటలను ఏనుగు తొక్కి నాశనం చేసింది.

అన్నదాన పథకానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన గోపాల్‌రెడ్డి రూ.లక్ష మొత్తాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికి సోమవారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.

విరాళం అందజేస్తున్న గోపాల్‌రెడ్డి దంపతులు

హెలిప్యాడ్ పనుల పరిశీలన

బంగారుపాళ్యం: వైకాపా అధినేత జగన్ ఈ నెల 9న బంగారుపాళ్యం పర్యటన నేపథ్యంలో అరగొండ ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను సోమవారం మాజీ మంత్రి రామచంద్రారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైకాపా జిల్లా అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, లలితకుమారి, జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్‌రాజ తదితరులు ఉన్నారు.

గుంతలు.. చోదకులకు తిప్పలకు

కుప్పం నుంచి ములకలపల్లి మీదుగా వసనాడుకు వెళ్లే తారురోడ్డు దెబ్బతిని అడగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాధించేందుకు చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కుప్పం గ్రామీణ**

అగ్రహారం.. సీసీ రోడ్డుకు దూరం

మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో వీధులు నేటికీ సీసీ రోడ్లకు నోచుకోలేదు. మట్టి, బండలు పరిచిన వీధులే దర్శనమిస్తున్నాయి. పుంగనూరు-పలమనేరు బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా సిమెంటు రోడ్లకు దిక్కులేదని గ్రామస్థులు వాపోతున్నారు. సమస్యను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ**

వర్షపు నీరు కాదండోయ్.. మురుగే..!

రోడ్డుపై నిలిచిన ఈ నీరంతా వర్షపు నీరు కాదు.. ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు. పురపాలక పరిధిలోని నక్కబండ, గాంధీనగర్‌లో ఇలా రోడ్లపై నీరు నిలుస్తోంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించడానికి మరీ ఇబ్బంది పడుతున్నారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు

లీకేజీని అరికట్టరూ..?

పుంగనూరు పట్టణ పరిధిలోని బాలాజీ థియేటర్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన దెబ్బతిన్న పైపులైన్‌తో నీరు వృథాగా పోతోంది. రోడ్డుపై నీరు నిలవడంతో బురదగా మారి రాకపోకలకు కష్టంగా ఉంటోంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పైపునకు మరమ్మతు చేసి లీకేజీని అరికట్టాలని పురవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పుంగనూరు**

(c) eenadu

ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం జులై 8, 2025

గోదారమ్మ పరవళ్లు

ముక్తేశ్వరం రేవు వద్ద ఉద్ధృతంగా గౌతమి గోదావరి

కోతకు గురవుతున్న తాత్కాలిక రహదారి

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరద పరవళ్లు తొక్కుతోంది. తీరప్రాంత వాసులు రాకపోకలు సాగించేందుకు నిర్మించుకున్న తాత్కాలిక రోడ్లను ముంచెత్తుతోంది. ఇప్పటికే నదిలో వేసిన బాటలు మునిగిపోయాయి. తాజాగా సోమవారం ముక్తేశ్వరం రేవు వద్ద గౌతమి గోదావరి ఉద్ధృతంగా ప్రవహించి రేవులో పంటు వద్దకు వెళ్లే తాత్కాలిక రహదారిని ముట్టుముట్టింది. దీంతో ఈ రేవుపై రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఇప్పటికే రహదారి కోతకు గురవుతోంది. లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు, ముక్తేశ్వరం తొగరపాయను సైతం వరదనీరు చేరుతోంది. ఈ కారణంగా రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు అప్రమత్తం కావాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అయినవిల్లి

పైవంతెన పనులపై గడ్కరీతో మాట్లాడుతా: ఎంపీ

అమలాపురం పట్టణం: జొన్నాడ వద్ద పైవంతెన పనులు పూర్తి చేయాలని ఎంపీ హరీష్ మాధుర్ అధికారులను ఆదేశించారు. సోమవారం అమలాపురంలో జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. పనుల పురోగతి కోసం కేంద్రమంత్రి గడ్కరీతో మాట్లాడతానన్నారు. నెలాఖరుకు పైవంతెన గట్టర్లు, డిసెంబరు నెలాఖరుకు పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

జ్వర కాలం.. జరభద్రం

పొంచి ఉన్న కాలానుగుణ వ్యాధులు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

వర్షాకాలం వచ్చిందంటే వ్యాధుల దాడి పెరుగుతుంది. ఆహారం, నీరు కలుషితం కావడం, అపరిశుభ్ర వాతావరణం, దోమల కారణంగా రోగాలు పంజా విసురుతాయి. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా నిర్మూలన మాసోత్సవాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కీటక జనితంగా మలేరియా, డెంగీ, గున్యా, కలుషిత ఆహారం, నీటి ద్వారా టైఫాయిడ్, అతిసార వ్యాధులకు గురవుతున్నారు. వీటికి సకాలంలో వైద్యం అందకపోతే ఒక్కోసారి ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంది.

వ్యాధులు లక్షణాలు

డెంగీ: దోమకాటు ద్వారా వస్తుంది. ఆకస్మిక జ్వరం, కళ్లు, కండరాలు, కంటి లోపలి భాగంలో నొప్పులు ఉంటే డెంగీగా అనుమానించాలి. శరీరంపై కొంతమందికి ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తం వస్తుంది. ఎలీసా పరీక్ష ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్ధారిస్తారు.

నాలుగేళ్లలో జిల్లాలో కేసుల వివరాలు

వ్యాధి	2022	2023	2024	2025
డెంగీ	72	84	239	14
మలేరియా	0	0	0	02

(2025లో జూన్ వరకు..)

ముమ్మిడివరంలో [illegible] గుర్తించిన దోమల లార్వా

మలేరియా: దోమ కుట్టిన 7-10 రోజుల్లోపు చలి, వణుకు, ఒళ్లు నొప్పులతో విపరీతమైన జ్వరం వస్తుంది. రోజు విడిచి రోజు వస్తుంది. రక్త పరీక్ష ద్వారా నిర్ధారించి మందులు అందజేస్తారు. గత మూడేళ్లలో ఈ కేసులు నమోదు కాలేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు రెండు కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.

టైఫాయిడ్: కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం ద్వారా వస్తుంది. తీవ్ర జ్వరం, తీపు, వాంతి, పొట్టలో ఇబ్బంది వస్తాయి. చిన్న పిల్లల్లో విరేచనాలు, పెద్దవారిలో మలబద్ధకం, కడుపునొప్పి, తలనొప్పితో పాటు ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఒక్కోసారి పేగుల్లో పుండ్లు ఏర్పడతాయి.

జిల్లాలో పీహెచ్‌సీలు	47
యూపీహెచ్‌సీలు	7
సామాజిక ఆసుపత్రులు	9
ప్రాంతీయ ఆసుపత్రులు	2
వెల్‌నెస్ సెంటర్లు	432

అతిసారం: అయిదేళ్లలోపు పిల్లల మరణాలకు కారణమైన వాటిలో అతిసార వ్యాధి అగ్రస్థానంలో ఉంది. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వస్తుంది. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.

ఆహారం విషయంలో అప్రమత్తత అవసరం

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తాగునీరు, ఆహారం విషయంలో జాగ్రత్తలు వహించాలి. కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం ద్వారా వ్యాధులకు గురవుతారు. అన్ని పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. -ఎం.దుర్గారావు దొర, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

కీటక జనిత వ్యాధులపై అవగాహన

కీటక జనిత వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దోమల కారణంగా డెంగీ, చికెన్ గున్యా, మలేరియా బారిన పడే ప్రమాదం ఉంది. ప్రతి శుక్రవారం పొడి వారంగా నిర్వహించాలని.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా మాసోత్సవాల్లో ప్రజలకు వివరిస్తున్నాం. ఆరోగ్య సహాయకులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆదేశాలు ఇచ్చాం. - ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

రామచంద్రపురంలో వినతులు స్వీకరించిన కలెక్టర్

అన్న క్యాంటీన్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్, ఆర్డీవో అఖిల

రామచంద్రపురం, న్యూస్‌టుడే: అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ అధికారులను హెచ్చరించారు. సోమవారం రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయంలో ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఆర్డీవో అఖిల, కార్యాలయ పరిపాలనాధికారి బి.వి.ఎస్.భాస్కరరావు, డీఎల్‌డీవో విజయలక్ష్మి అధికారులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లు సమర్థంగా నిర్వహించాలి..

అన్నార్తుల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. రామచంద్రపురం పర్యటనలో భాగంగా ఆయన అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. నాణ్యమైన ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో వడ్డించాలని, మెనూ, సమయపాలన పాటించాలని చెప్పారు. ఆర్డీవో అఖిల, కమిషనర్ కె.వి.ఆర్.రాజు, తహసీల్దారు మృత్యుంజయరావు పాల్గొన్నారు.

సమస్యలపై సత్వరమే స్పందించాలి: జేసీ

అమలాపురం కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు ఇస్తున్న సమస్యల పట్ల అధికారులు సత్వరమే స్పందించి పరిష్కార మార్గాలు చూపాలని జేసీ నిశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో రాజకుమారి, ఇతర అధికారులతో కలసి జేసీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 290 మంది తమ సమస్యలపై అర్జీలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

జలం వృద్ధి.. మురుగు శుద్ధి

ప్రయోగాత్మకంగా మ్యాజిక్ డ్రెయిన్లు

ఈనాడు, అమలాపురం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో కాలువలు నిర్మిస్తున్నా వాటి నిర్వహణ సరిగా లేక మురుగు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతల తరహాలో కల్వర్టు డ్రెయిన్లు నిర్మించాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం సోమవరం గ్రామంలో ప్రయోగాత్మకంగా నిర్మించగా మంచి ఫలితం వచ్చింది. ● తూర్పుగోదావరి జిల్లాలో గోకవరం మండలం అమృతాపురాన్ని ఎంపిక చేశారు. కాకినాడ జిల్లాలో వన్నెపూడి, చిత్రాడ, అమరవిల్లి..రాయుడుపాలెంలో రెండు ప్రాంతాలను గుర్తించారు. కోనసీమలో నీరు ఇంకేందుకు అవకాశాలు తక్కువగా ఉన్నందున ఇక్కడ అమలు చేయడం లేదు.

నిర్మాణం ఎలా అంటే..

● 150 మీటర్ల సీసీ డ్రెయిన్‌కు దాదాపు రూ.1.50 లక్షల వ్యయమవుతుండగా ఈ విధానంలో రూ.75 వేలే ఖర్చవుతుంది. ● 150 మీటర్ల పొడవు, 0.5 మీటర్ల వెడల్పుతో తొలి 50 మీ.లను 0.4 మీ.లోతు, తరువాత 0.5 మీ.. ఆఖరి చివర 50 మీటర్లను 0.6 మీటర్ల మేర తవ్వి మట్టి తీసేయాలి. ● కాలువలో ప్రతి 30 మీటర్లకు ఒకచోట 1.2 మీ. మేర ఇంకుడు గుంత తవ్వాలి. కాలువ చివరిన ప్రాంతంలో ఇక్క వైపు అదే నాపరాళ్లు ఏర్పాటుచేసి 225 ఎం.ఎం పరిమాణంలో కంకరరాయి, 150 ఎం.ఎం మెటల్, చివరిగా 10 ఎం.ఎం మెటల్ వేయాలి. ఇంకుడు గుంతల్లోనూ ఇదే విధానంలో నిర్దేశిత పరిమాణంలో రాయి, మెటల్‌తో నింపాలి.

కాలువ నిర్మాణం జరుగుతుందిలా..

బలభద్రపురంలో సమగ్ర అధ్యయనం

ఈనాడు, రాజమహేంద్రవరం: బిక్కవోలు మండలం బలభద్రపురంలో ఇటీవల క్యాన్సర్ కేసులు బయటపడిన నేపథ్యంలో సమగ్ర అధ్యయనానికి చర్యలు ప్రారంభమయ్యాయి. స్థానికంగా ఉన్న పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయనాలతో కూడిన విషపూరిత వాయువులే ప్రధాన కారణమని అనపర్తి శాసనసభ్యుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డితోపాటు, స్థానికులు గతంలో ఆరోపించారు. అధికారులు కొద్ది రోజులుగా పర్యటించి, హడావుడి చేసి తర్వాత దృష్టి పెట్టలేదు. ఎమ్మెల్యే నల్లమిల్లి కొద్ది రోజులుగా ఈ అంశంపై పట్టుపట్టడంతో ఇటీవల కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య సందర్శించి పరిస్థితులను తెలుసుకున్నారు. స్థానిక వాతావరణం, పర్యావరణ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసే బాధ్యతను 'నీరి' సంస్థకు అప్పగిస్తూ నిర్ణయించారని నల్లమిల్లి తెలిపారు. ఇక్కడ ఉన్న ఓ పరిశ్రమను వేరే ప్రాంతానికి తరలించే అంశంపైనా దృష్టిసారించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

చరిత్రకు చెదలు

శిథిలమైన కాకినాడ పురావస్తు ప్రదర్శనశాల

పెచ్చులూడి శిథిలావస్థకు చేరిన భవనం

అద్భుతమైన కళాఖండాలు.. అపురూపమైన తాళపత్ర గ్రంథాలు.. విలువైన పుస్తకాలకు నిలయమైన కాకినాడలోని పురావస్తు శాఖ ప్రదర్శనశాల నేడు దయనీయస్థితికి చేరుకుంది. పిఠాపురం రాజా వారి సహకారంతో ఆంధ్ర సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దీనిని 1974లో పురావస్తు శాఖకు అప్పగించారు. ఎంతోమంది విద్యార్థులకు విజ్ఞానాన్ని, పరిశోధక విద్యార్థులకు చరిత్రను తెల్పుతూ వచ్చిన ఈ ప్రదర్శనశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న విలువైన వస్తువులు భద్రత కరవైంది. భవనం పెచ్చులూడి పడుతోంది. ముఖ్యమైన పుస్తకాలు దుమ్ముపడుతున్నాయి. ఇక్కడి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు భయంగానే ఉండాల్సిన పరిస్థితి. ఈ విషయాన్ని పురావస్తు శాఖ ఏడీ తిమ్మరాజు దృష్టికి తీసుకెళ్లగా నూతన భవన నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 కోట్లు విడుదల చేసేందుకు అంగీకరించాయని, సాంకేతిక కారణాలతో నిధులు రాలేదని చెప్పారు. వాటి విడుదలకు చర్యలు తీసుకుని, నూతన భవన నిర్మాణానికి టెండర్లు పిలుస్తామని తెలిపారు. – ఈనాడు, కాకినాడ

ప్రదర్శనశాలలో దుమ్ముపట్టిన విలువైన పుస్తకాలు

మూలనపడిన అపురూప కళాఖండాలు

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో చెత్త సంపద కేంద్రం

పల్లె స్వచ్ఛత...అతివకు బాధ్యత..!

అల్లవరం, న్యూస్‌టుడే: ఇల్లు చూసి.. ఇల్లాలిని చూడు అన్నది నానుడి. గృహాన్ని చక్కదిద్దుకోవడంలో ఇల్లాలిది బృహత్తర బాధ్యత మరి. ఈ నేపథ్యంలో పల్లెల పరిశుభ్రతలో మహిళలను భాగస్వాములను చేయాలని సర్కారు భావిస్తోంది. సంపద సృష్టి కేంద్రాల ద్వారా ఆదాయం రాబట్టేలా కూటమి ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. వీటి నిర్వహణ బాధ్యత అతివలకు అప్పగించడం ద్వారా మరిన్నీ సత్ఫలితాలు సాధించే దిశగా ప్రణాళిక రూపొందిస్తోంది.

మండలాలు	22
పంచాయతీలు	385
చెత్త సంపద కేంద్రాలు	272
నిర్వహణలో ఉన్నవి	198
నిర్మించాల్సినవి	79
నిర్మాణ దశలో ఉన్నవి	34

పైలట్ ప్రాజెక్టుగా ..

జిల్లాలో రెండు పంచాయతీల్లో పైలెట్ ప్రాజెక్టుగా దీనిని అమలు చేయనున్నారు. అమలాపురం డివిజన్ పరిధిలో కొమరగిరిపట్నం, రాజోలు డివిజన్ పరిధిలో శివకోడు గ్రామాలను ఎంపిక చేశారు. 'ఎంపిక చేసిన గ్రామాల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా మిగిలిన పంచాయతీల్లోనూ అమలు చేసేలా కృషి చేస్తాం' అని డీపీవో శాంతలక్ష్మి అన్నారు.

నేడు మంత్రి పార్థసారథి పర్యటన

కాకినాడ కలెక్టరేట్: రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు ఆయన విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 9 గంటలకు తునిలోని తెదేపా కార్యాలయానికి చేరుకుని తెదేపా కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తుని పురపాలక సంఘంలోని 11, 12, 13 వార్డుల్లో ఇంటింటికీ తెదేపా (సుపరిపాలనలో తొలి అడుగు) కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అక్కడి నుంచి రోడ్డుమార్గాన బయలుదేరి విజయవాడ వెళతారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

ఇక ప్రగతి పథం!

రూపుమారనున్న రహదారులు, త్వరలో పనులు ప్రారంభం

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. తొలి ఏడాదిలో రోడ్లపై గుంతలు పూడ్చి.. ప్రజల ప్రయాణాలు సౌకర్యంగా మార్చిన కూటమి ప్రభుత్వం రెండో ఏడాది ఆయా రహదారుల ప్రగతికి పచ్చజెండా ఊపింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత వైకాపా అయిదేళ్ల పాలనలో ర.భ.శాఖ పరిధిలోని మార్గాలకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో అవన్నీ ధ్వంసమయ్యాయి. వార్షిక మరమ్మతులకు నిధులివ్వని దుస్థితి పీడించింది. కూటమి ప్రభుత్వం వీటన్నింటినీ 'దారి'లోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మార్చి 29న ప్లాన్ గ్రాంట్‌తో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కొన్ని రహదారుల అభివృద్ధికి పరిపాలనా ఆమోదం ఇచ్చింది. వీటిలో నాబార్డు నిధులతో చేపట్టే పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తం 72.581 కి.మీ. పరిధిలో రూ.28.66 కోట్లతో 15 పనులకు టెండర్లు పిలువగా బిడ్‌లు పెద్దఎత్తున దాఖలయ్యాయి. రూ.2 కోట్ల విలువైన పనికి ఆర్‌అండ్‌బీ కాకినాడ సర్కిల్ కార్యాలయాల్లో ఆమోదం ఇవ్వగా, రూ.2 కోట్లపైబడిన పనుల ఆమోదానికి ఆ శాఖ చీఫ్ ఇంజినీర్‌కు పంపించారు. త్వరలో గుత్తేదారులతో ఒప్పందం చేసుకుని పనులు ప్రారంభించానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అభివృద్ధి చేయనున్న గోపాలపురం-గంటి రోడ్డు

జిల్లా	రోడ్ల పొడవు (కి.మీ.)	నిధులు (రూ.కోట్లలో)
కాకినాడ	37.516	13.20
తూర్పుగోదావరి	23.200	11.24
అంబేడ్కర్ కోనసీమ	11.865	4.22

జిల్లాలో చేపట్టే పనులివే: శివకోడు-రామరాజులంక, లక్కవరం-శంకరగుప్తం, శివకోడు-విశ్వేశ్వరరాయపురం(6.140 కి.మీ., రూ.2.50 కోట్లు), గోపాలపురం-గంటి, గోపాలపురం-పొడగట్లపల్లి, గంటి-పొడగట్లపల్లి(5.725 కి.మీ., రూ.1.72 కోట్లు)

ప్లాన్ గ్రాంటుకు బడ్జెట్ విడుదల

ఉమ్మడి జిల్లా పరిధిలో మేజర్ జిల్లా రోడ్లు(ఎండీఆర్), రాష్ట్ర రహదారులు(ఎస్‌హెచ్) అభివృద్ధికి ప్లాన్ గ్రాంటు కింద రూ.74.85 కోట్ల విలువైన 29 పనులకు పరిపాలనా ఆమోదం ఇచ్చారు. ఈ నెలలో టెండర్లు పిలిచేందుకు అధికారులు సన్నద్ధం చేస్తున్నారు.

జిల్లా రహదారులు: రాజోలు-పొన్నాడ, మొగలికుదురు-ములికిపల్లి, సోంపల్లి-అంతర్వేది, మామిడికుదురు-ముగటపల్లి, నగరం-పెదపట్నం

రాష్ట్ర రహదారులు: ద్వారపూడి-యానాం, కడియం-ఎదురుమూడి, రామచంద్రపురం-ఉండూరు, అమలాపురం-చల్లపల్లి, కాకినాడ-రాజమహేంద్రవరం, మండపేట-జొన్నాడ

పూర్తిస్థాయిలో అభివృద్ధి

నాబార్డు నిధులతో చేపట్టే పనులకు టెండర్లు పూర్తయ్యాయి. ప్లాన్ గ్రాంట్‌కు బడ్జెట్ ఇచ్చిన నేపథ్యంలో త్వరలో టెండర్లు పిలుస్తాం. దీంతో రహదారులు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతాయి.
- జి.కంరు, ఎస్ఈ, ఆర్‌అండ్‌బీ, కాకినాడ

దేవుడికే శఠగోపం

వీరేశ్వరుడికి కొబ్బరినీళ్ల అభిషేకం రద్దు

భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

ఐ.పోలవరం: అభిషేక ప్రియుడు వీరేశ్వరుడుకు సైతం శఠగోపం పెట్టేస్తున్నారు. కొబ్బరికి ధర పెరిగిందంటూ కొబ్బరినీళ్ల అభిషేకాలు రద్దు చేసేశారు. కొబ్బరికి ప్రసిద్ధి చెందిన ప్రాంతంలోనే ఉన్న మురమళ్ల వీరేశ్వరస్వామికి మాత్రం కొబ్బరినీళ్లు లభించకపోవడం గమనార్హం. సుమారు 20 రోజుల నుంచి ఆలయంలో కొబ్బరి కాయల సరఫరా నిలిచిపోయి కల్యాణాలకు సంబంధించిన అభిషేకాలు గాడి తప్పాయి. కల్యాణం జరిపించుకునే భక్తుల నుంచి దేవస్థానం రూ.1000 రుసుం తీసుకుని మూడు కొబ్బరి కాయలు అందజేస్తారు. రెండు కొబ్బరి కాయలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. మిగతా ఒకటి కల్యాణంలో వినియోగిస్తారు. రోజూ దాదాపు 110 కల్యాణాలు జరుగుతాయి. ఈ లెక్కన నిత్యం సుమారు 330 కాయలకు ఎగనామం పెట్టేస్తున్నారు. కొబ్బరికి అమాంతం ధర పెరగడంతో గిట్టుబాటుగాక గుత్తేదారుడు సరఫరా నిలిపేశారు. ఆలయ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో స్వామివారి కల్యాణాలు, అభిషేకాలు కళ తప్పాయి. కొబ్బరికాయల కోసం కొందరు భక్తులు ప్రశ్నిస్తున్నా ఏవో సాకులు చెప్పి రోజులు గడిపేస్తున్నారు. ఈ విషయాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా గుత్తేదారుడికి నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

అమ్మవారికి అభిషేక జలం

ముమ్మిడివరం మండలం కర్రివానిరేవులో విజయదుర్గ అమ్మవారికి సోమవారం ఆషాఢ మాసం సారె సమర్పించారు. సమరత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం గ్రామ కన్వీనర్ కర్రి అన్నవరం ఆధ్వర్యంలో వృద్ధ గౌతమి గోదావరి నుంచి పవిత్ర జలాలను తీసుకువచ్చి అభిషేకం చేశారు. కర్రి నాగలక్ష్మి, సుబ్బారావు, లంకే సత్యవేణి, పోతాబత్తుల బ్రహ్మాజీ, కాలాడి సత్తిబాబు, కర్రి సత్యనారాయణ, కర్రి సీతమ్మ, గని కమ్మ తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, ముమ్మిడివరం

సూపర్ సిక్స్ పథకాలు చిత్తశుద్ధితో అమలు

ముమ్మిడివరంలో కూరగాయల దుకాణదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల, ఎంపీ హరీష్‌మాధుర్

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని వార్డుల్లో ఎంపీ హరీష్‌మాధుర్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలెండరు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ జరిగినట్లు చెప్పారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, చెల్లి అశోక్, ముదునూరి రామలింగరాజు, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్ అర్ధాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాలైనా పరిహారం అందలేదు

శిరోముండనం బాధితుల ఆవేదన

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన శిరోముండనం బాధితులు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో శిరోముండనం ఘటన జరిగి మూడు దశాబ్దాలు కావొస్తున్నా ప్రభుత్వ పరిహారం అందలేదని బాధితులు వాపోయారు. తమకు పరిహారం అందజేయాలని సోమవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గతంలో తమకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయలేదని, దీనిపై మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన ఆదేశాలతో అధికారులు స్పందించి ఇటీవల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారన్నారు. ఘటన జరిగిన సమయంలో ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఇప్పటి వరకు అందలేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి ఎస్సీ, ఎస్టీ, షెడ్యూల్డ్ కులాల చట్టం ప్రకారం పరిహారం మంజూరు చేయాలని కోరారు. బాధితులు కోటి చిన్నారావు, చల్లపూడి పట్టాభిరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో వింత సమస్య

సచివాలయ బదిలీల్లో తమకు న్యాయం చేయాలని ఏఎన్ఎంలు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకున్నా తుది జాబితాలో తమ పేర్లు లేవన్నారు. తమకు బదిలీ జరగకున్నా, తమ స్థానాల్లో కొత్తవారిని నియమించారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు పట్టించుకోవడం లేదని వాపోయారు. బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియను పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దీనిపై డీఎంహెచ్‌వో దుర్గారావు దొరను వివరణ కోరగా బదిలీల ప్రక్రియ ప్రారంభంలో వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసిన తర్వాత ఆ వివరాలు మాన్యువల్‌గా జిల్లా కార్యాలయంలో ఇవ్వాల్సి ఉందన్నారు. జిల్లా నుంచి 21 మంది దరఖాస్తులు ఉన్నతాధికారులకు అందకపోవడంతో ఈ సమస్య ఏర్పడిందన్నారు. ప్రస్తుతం వీరి వివరాలు నమోదు చేస్తున్నామన్నారు. వీరికీ బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

WANTED TEACHERS
A WELL REPUTED SCHOOL IN YANAM REQUIRE
TEACHERS
to teach 6th to 10th
ENGLISH, PHYSICS, BIOLOGY & MATHEMATICS
Selected Teachers will have attractive Salary, PF, ESI & Fee Concession for their child's Education
WALK IN INTERVIEW (or)
send your C.V.Within 10 Days to
THE HEADMASTER
REGENCY PUBLIC SCHOOL
Mettakur, Yanam-533 464. Contact No.98661 97903
Email: rpsyanam@gmail.com

WE'RE HIRING!
WALK-IN-INTERVIEW
Date: 9th & 10th July
Time: 9.30 AM to 1.00 PM
At Alamuru
High School Teachers
English & Maths
Trained Graduates / Post Graduates
with min. Two years of experience
Pay Scale: 30,000 - 35,000 Per Month
FLUENCY IN ENGLISH IS MUST
The Siddhartha School
Alamuru, 73967 85156 Ravulapalem, 84639 84456

(c) eenadu

ఇల కైలాసం.. అరుణాచలేశ్వర క్షేత్రం

• కొలువుదీరిన 63 మంది నాయనార్లు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండలంలోని రాచపల్లి శ్రీరమణ సేవాశ్రమంలో వేంచేసి ఉన్న అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో 63 మంది నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠ, ఉపాలయాల్లో దక్షిణామూర్తి తదితర దేవతామూర్తుల ప్రతిష్ఠ సోమవారం కనుల పండువగా జరిగింది. క్షేత్ర మండపంలోనే నాయనార్ల శిల, పంచ లోహ విగ్రహాలను కొలువుదీర్చారు. అరుణాచల మాదిరి, స్వామి ... వారు. ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ మంత్రి జవహర్, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, గాయని ఎంఎం శ్రీలేఖ, శ్రమదానం సత్యమార్ నాయనార్లు ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని నాయనార్లను అర్చించారు. ఖులు సృష్టం చేశారు. సభలో అరుణాచల మాదిరి అద్భుత మహాచలాన్ని నిర్మించారు. తెలుగు రాష్ట్రాల్లోనే ప్రథమంగా నాయనార్ల విగ్రహాలు ఇక్కడ ఏర్పాటు చేశారని అభినందించారు. సభలో విజ్ఞానందగిరి, శారదా నంద సరస్వతి, వినమ్రానంద ఉన్నారు. అరుణాచల మాదిరి రచించిన 63 నాయనార్ల సంక్షిప్త జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు.

విగ్రహాలకు ఎమ్మెల్యేలు సత్యప్రభ, చినరాజప్ప పూజలు

ప్రతిష్ఠాపనకు తరలివచ్చిన భక్తజనం

ఆధ్యాత్మిక వారసత్వ సంపద

రావులపల్లిలో అరుణాచలేశ్వరుని ఆలయం ఆధ్యాత్మిక వారసత్వంగా నిలుస్తుందని స్వామీజీలు, ప్రముఖ లింగస్వామి తంబిరాన్ అభిప్రాయపడ్డారు.

హిందూధర్మ పరిరక్షణే ధ్యేయంగా పాదయాత్ర

ఆలమూరు, న్యూస్‌టుడే: హిందూ ధర్మపరిరక్షణే ధ్యేయంగా భీమవరం సమీపంలోని శృంగవృక్షం నుంచి పీఠాపురం స్వయంభూ దత్తక్షేత్రం వరకు చేపట్టిన పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు సాయిదత్త నాగానంద సరస్వతి మహారాజ్ తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రారంభమైన పాదయాత్ర సోమవారం ఆలమూరుకు చేరుకుంది. స్వామీజీ మాట్లాడుతూ హిందూత్వం ప్రతి గడపకు చేరేలా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. రాత్రి మండపేటకు చేరుకున్నారు. మంగళవారం తాపేశ్వరం, ద్వారపూడి, అనపర్తి మీదుగా పెదబ్రహ్మదేవం చేరుకుని అక్కడ బస చేస్తారు. బుధవారం పిఠాపురం చేరుకుంటారు.

శిష్య బృందంతో నాగానంద సరస్వతి

అన్నదాన శాల నిర్మాణం ప్రారంభం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద వకుళమాత అన్నదానశాల నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా.. స్ట్రక్చర్ నిర్మాణానికి సంబంధించి ఇనుప గడ్డర్లు బిగించారు. ఇటీవల పునాదిలో కాంక్రీటు వేశారు. ఈవో నల్లం సూర్యచక్రధరరావు, నాయకుడు ముదునూరి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగుపడాల్సింది చాలా ఉంది..!

• అన్నవరం, లోవ, వాడపల్లి ఆలయాలపై సర్వే

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం, తలుపులమ్మ లోవ, వాడపల్లి ఆలయాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు మెరుగుపడాల్సి ఉంది. భక్తులకు అందుతున్న సేవలపై గత కొద్ది నెలలుగా అసంతృప్తి శాతం ఎక్కువగానే ఉంటుంది. జూన్‌కు సంబంధించి తాజాగా విడుదల చేసిన సర్వే వివరాల్లో గతం కన్నా అసంతృప్తి శాతం కొద్దిగా తగ్గినా సంతృప్తికర స్థాయిలో లేదు. ఆలయాలకు వచ్చే భక్తుల నుంచి ప్రభుత్వం ఐవీఆర్, టెలీ కాలింగ్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా అభిప్రాయం సేకరిస్తోంది.

ఇదీ పరిస్థితి..

అన్నవరం, తుని మండలం తలుపులమ్మ లోవ, వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయంలో అసంతృప్తి శాతం ఎలా ఉందంటే..

అన్నవరం అనివేటి మండపంలో క్యూలైనులో భక్తులు

విభాగం	అన్నవరం	తలుపులమ్మలోవ (అసంతృప్తి శాతం)	వాడపల్లి
దర్శనం సంతృప్తికరంగా జరిగిందా	26.8	29.5	25.9
మౌలిక వసతులు ఎలా ఉన్నాయి	33.9	35.8	34.9
పారిశుద్ధ్యం ఎలా ఉంది	30.2	35.2	31.8
ప్రసాదం తాజాగా, రుచిగా ఉందా	23.1	27.5	27.6

కమిషనర్ సమీక్ష

భక్తుల నుంచి వస్తున్న అసంతృప్తిపై దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈవో సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు. పలు అంశాలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

కోరిన లాభం దక్కించుకో

రైతేరాజు

న్యూస్‌టుడే, మామిడికుదురు

కొబ్బరిలో అంతర పంటగా కోనసీమ ప్రాంతంలో ఎప్పటినుంచో కోకో సాగవుతోంది. కొంతకాలం నుంచి రైతులు వాటిపై మరింత దృష్టిపెట్టి తక్కువ వ్యయంతో అధిక ప్రయోజనాలు పొందుతున్నారు. నీటి వసతి, మార్కెటింగ్ సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని సేంద్రియ విధానంలో కొబ్బరితో పాటు కోకో సాగు చేస్తూ మెరుగైన లాభాలు ఆర్జిస్తున్నారు మామిడికుదురు మండలం అప్పనపల్లికి చెందిన రైతు అల్లూరు వెంకటరామరాజు.

సేంద్రియ ఎరువుతో భూసారం పెంపు

వైనతేయ నదీ తీరానికి చేరువలోని అప్పనపల్లిలో తనకున్న ఏడెకరాల కొబ్బరి తోటలో ఆయిల్డ్రిప్ క్రమం వెంకటరామరాజు కోకో మొక్కలు నాటారు. రెండెకరాల క్రమం తప్పకుండా ఆదాయం పొందుతున్నారు. కొబ్బరి చెట్ల చుట్టూ రెండు మీటర్ల మేర స్థలాన్ని ఖాళీగా వదిలి ఎకరాకు సుమారు 200 కంకర మొక్కలు నాటారు. పశువుల పెంటతో పాటు పలు సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. కోకో చెట్ల నుంచి రాలిన ఆకులతో పాటు కొబ్బరి ఆకులను ముక్కలుగా చేసి తోటల్లో వేసి నేల తేమ ఆరిపోకుండా వేసవిలోనూ, నీటి ఎద్దడి సమయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భూగర్భజలాలను వినియోగించుకుంటూ సాగునీటి వసతి కల్పిస్తున్నారు. జనవరి-ఫిబ్రవరి, జూన్-జులై మధ్య రెండుసార్లు ఫలసాయం పొందుతున్నారు. వరద, వర్షాల సమయంలో ముంపునకు తోటల్లో నీరు ఉండకుండా బోదెల ద్వారా బయటకు మళ్లించుకుంటున్నారు. పంట పండిన దశ నుంచి అయిదు నెలల సమయంలో కాయలు దృఢంగా తయారవుతున్నాయి. ఎకరాకు అయిదు క్వింటాళ్ల వరకు దిగుబడులు పొందుతున్నారు.

కొబ్బరిలో అంతర పంటగా వేసిన కోకోతో రైతు వెంకటరామరాజు

స్ఫూర్తి

ఆశాజనకంగా ఆదాయం

డిగ్రీ చదివిన నేను వ్యవసాయంపై మక్కువతో కొబ్బరితో పాటు గత రెండేళ్లుగా కోకో అంతర పంటను సాగు చేస్తున్నాను. పశువుల ఎరువుతో పాటు వర్మికంపోస్టు వాడుతున్నాను. తోటను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతూ చీడపీడలు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాను. కొబ్బరి నుంచి ఎకరాకు రూ.55 వేలు, కోకో నుంచి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు లాభం వస్తుంది. దిగుబడులను పెంచేందుకు అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తున్నాను.

- అల్లూరు వెంకటరామరాజు, రైతు, అప్పనపల్లి

బీమా చేద్దాం.. ధీమాగా ఉందాం

కరప, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి అందే సమయంలో ప్రకృతి విపత్తులు, భారీవర్షాలు, గాలి, వడగళ్ల వానలు తీవ్రనష్టం కలిగిస్తున్నాయి. దీంతో ఎంతోమంది నష్టపోయి అప్పుల పాలవుతున్నారు. దీనినుంచి కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఒక వరం వంటిది. దీనిద్వారా ఆర్థిక భరోసా కలుగుతుంది. గతంలో బ్యాంకుల పంట రుణాలు మంజూరు చేసే సమయంలోనే ప్రీమియం మినహాయించుకునేవి. ప్రస్తుతం మారిన నిబంధనల మేరకు రైతులే బీమా చేయించుకోవాల్సి ఉంటుంది. ఎకరాకు రూ.760 చొప్పున ప్రీమియం చెల్లించాలి. బ్యాంకులో పంటరుణాలు తీసుకునేవారు ఆగస్టు నెలాఖరు లోపు, ఎటువంటి రుణాలు తీసుకోనివారు జులై నెలాఖరు లోపు సమీపంలోని మీసేవా కేంద్రాల్లో ప్రీమియం చెల్లించాలని కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు తెలిపారు.

మీ కోసం

ఉపాధి ఊతం.. పశువులకు గ్రాసం

తెలుసుకుందాం..

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం నిధులతో రైతులు పశుగ్రాసం పెంచుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 5 ఎకరాల్లోపు భూమి ఉన్నవారందరూ అర్హులే. బహువార్షిక పశుగ్రాసం పెంచుకోవాలనుకునే వారు దరఖాస్తుతో పాటు జాబ్‌కార్డు, వన్‌బీ, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం, రేషన్‌కార్డు నకళ్లతో సంబంధిత రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని అనపర్తి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సాయం ఒక్క ఏడాది మాత్రమే వర్తిస్తుంది. రైతులే తమకు నచ్చిన బహువార్షిక పశుగ్రాసాలు (విత్తన రకాలు) ఎంపికచేసుకోవచ్చని వెల్లడించారు. మరిన్ని వివరాలకు పశుసంవర్ధకశాఖ అధికారిని సంప్రదించాలి. ఈ పథకం మంజూరైన రైతులకు అయిదు విడతలుగా నగదు బ్యాంకు ఖాతాలకు జమవుతుందని శ్రీనివాసరావు తెలియజేశారు.

పొలం (సెంట్లలో)	ప్రభుత్వం ఇచ్చే నిధులు (రూ.లలో)
50	32,992
40	26,934
30	19,795
20	13,197
10	6,599

ఇలా నారుమడి.. అలా నాణ్యంగా దిగుబడి

రైతులు తయారు చేసుకున్న వరి నారు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఖరీఫ్ నారుమడులు సిద్ధం చేయడంలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఈ సమయంలో కొన్ని మెలకువలు పాటిస్తే ఆరోగ్యకరమైన నారుతో మంచి దిగుబడులు సాధించవచ్చని జగ్గంపేట వ్యవసాయాధికారి ఎస్.నరసింహం సూచిస్తున్నారు. పొలంలో మెరక ప్రదేశం ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల వర్షాలు అధికంగా వచ్చినప్పుడు, బయటి నుంచి నీరు వచ్చినప్పుడు నిల్వ లేకుండా ఉంటుంది. ఎకరా నారుమడి తయారు చేసుకునే రైతులు చివరి దమ్ములో 2 కిలోల యూరియా, ఆరున్నర కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 2 కిలోల పొటాష్ వేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన నారు రావడంతో పాటు వేర్లు బాగా వృద్ధి చెంది పంట దిగుబడి అధికంగా వస్తుంది. ముందుగా విత్తనశుద్ధి తప్పనిసరి.

దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శంఖవరం మండలం అన్నవరంలో తన పైనా, దివ్యాంగురాలైన తన కుమార్తెపైనా దాడి చేసిన ఆర్.చిట్టిబాబు, ఎం.కన్నయ్య, ఎం.శివపై చర్యలు తీసుకోవాలని కాకినాడ గ్రామీణ మండలం రాయుడుపాలేనికి చెందిన రాజులపూడి ఆరుద్ర కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె తన కుమార్తెతో వచ్చి కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. తమపై దాడి చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, దివ్యాంగుల హక్కులకు సంబంధించిన సెక్షన్లతో ఛార్జిషీట్ దాఖలు చేయించాలని విన్నవించారు.

కలెక్టరేట్ వద్ద ఫిర్యాదు పత్రం చూపుతున్న ఆరుద్ర

నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

ఆదర్శనీయుడు కళా వెంకట్రావు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి కళా వెంకట్రావు జయంతిని కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు సోమవారం ఘనంగా నిర్వహించారు. రావులపాలెంలో జాతీయరహదారి చెంతన ఉన్న కళావెంకట్రావు విగ్రహానికి ఆయన మునిమనవలు సుభాషిణి, భవాని, సూర్యకుమారి, హిమనిష్, సాత్విక్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి క్షీరాభిషేకం చేసి గజమాలలు వేసి నివాళి అర్పించారు. పేదలకు కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. జడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాస్, ఉప సర్పంచి గొలుగూరి మునిరెడ్డి, సఖినేటి వాకుల రాజు, వెలగల సత్తిరెడ్డి, కొట్టు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముంచుతారో.. తేలుస్తారో!

– న్యూస్‌టుడే, పి.గన్నవరం

• కాలువలపై ఎడాపెడా ఆక్రమణలు

పంట, మురుగు కాలువలపై ఆక్రమణలు తొలగించాలని ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో జలవనరులశాఖ పరిధిలోని సాగునీటి క్రమబద్ధీకరణ(ఇరిగేషన్-వాటర్ రెగ్యులరైజేషన్), డ్రెయినేజీ విభాగం ఇంజినీరింగ్ అధికారులు గతంలో మండలాల వారీ సర్వేచేసి పలు ఆక్రమణలు గుర్తించారు. వాటి తొలగింపు విషయంలో రాజకీయ పైరవీలు మోకాలడ్డుతున్నాయి. ఈ కారణంగా నానాటికీ పెరిగిపోయి శివారు ఆయకట్టుకు సాగునీరందక ప్రధానంగా రబీ సీజన్‌లో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఖరీఫ్‌లో ముంపు ఎక్కువై పంటలు కుళ్లిపోతూ అన్నదాతలు నష్టాల బారిన పడుతున్నారు. ఆర్.సి.సి. భవనాలు, ఇటుకలతో కట్టిన కట్టడాలు, గుడిసెలు, ఆధ్యాత్మిక కట్టడాలు, విగ్రహాలు వంటివి ఏర్పాటు చేయడంతో వ్యవసాయ రంగానికి నష్టం కలుగుతోంది.

అధికారులు గుర్తించినవి

● గోదావరి సెంట్రల్‌డెల్టా 13.200, బ్యాంక్‌కెనాల్(ముక్తేశ్వరం) 62.93, గన్నవరం ప్రధాన కాలువ 59.10, అమలాపురం ప్రధాన కాలువ 50.368, బెండాకెనాల్ 13.00, బ్రాంచ్ కెనాల్స్ 485.42, పిల్లకాలువలు 445.42 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. వీటిపై 3,828 ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ● జిల్లాలో 279.80 కిలోమీటర్ల మేర 16 ప్రధాన, 280.54 కిలోమీటర్ల మేర 36 మధ్యతరహా, 583.79 కిలోమీటర్ల మేర 200 చిన్నతరహా మురుగు కాలువలు ఉన్నాయి. వీటిపై 874 ఆక్రమణలు ఉన్నట్టు గుర్తించారు.

ముంగండలో మురుగు కాలువపై పక్కా కట్టడం

కలెక్టర్ ఆదేశాల మేరకు..

పంట, మురుగు కాలువలపై ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల వారీగా ఏ తరహా ఉన్నాయో వివరాలు సేకరించాం. తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

- కె.వెంకటేశ్వరరావు, ఈఈ, గోదావరి సెంట్రల్‌డెల్టా(ఇరిగేషన్)

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

BUSINESS OFFER

మా కైజన్ పల్స్ (బెర్రీస్ & హెర్బ్స్) కలిపిన హెల్త్ డ్రింక్)ను మార్కెటింగ్ చేయుటకు ప్రాంతాల వారీగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. Contact: 95153 15198.

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్థిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ చేయబడును. ✆ 96665 47338.

గవర్నమెంట్ ఉద్యోగస్తులు & IT రిటర్న్స్ హోల్డర్స్ కి కేవలం 1 రూ. వడ్డీతో 5 లక్షల వరకు రుణాలు. నోట్: సిబిల్ స్కోర్ బాగా ఉండవలెను. ✆ 90002 54511.

HEALTH & CARE

RHEUMATOLOGY

రుమటాలజిస్ట్
డా॥ ఎ.రామకృష్ణంనాయుడు
MD, DM (Rheumatology, NIMS, HYD)
12-07-2025న (శనివారం) 2pm to 6 PM వరకు రాజమండ్రిలో ప్రైమ్ పాత్ ల్యాబ్స్, సిసిసి ఛానల్ ఎదురుగా, దానవాయిపేట వద్ద
ఫోన్: 94929 41177
మరియు
13-07-2025న (ఆదివారం) కాకినాడలో సేఫ్ హాస్పిటల్ నందు 10 AM to 5 PM వరకు అందుబాటులో ఉంటారు.
ఫోన్: 0884 2383366

REAL ESTATE

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి, బొమ్మూరులో తక్షణం ఇల్లు కట్టుకొనుటకు అన్ని సదుపాయములతో 150 చ॥గ॥ RUDA అప్రూవ్డ్ స్థలములు అమ్మకం. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ✆ 78424 28888.

JOBS

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

Required Managers, Agents. Salary and Incentives, Marketing Job, Guarantee Income, Age 50 above. Cont: 90108 09384.

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రభాకరనిధి, దేవిచౌక్, రాజమండ్రి నందు బిజినెస్ ప్రమోషన్ చేయుటకు అభ్యర్థులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించండి. సెల్: 79952 33384.

రంగంపేట మండలం, కోటపాడు గ్రామంలో సుమారు 30 ఎకరాలు వ్యవసాయ భూమిని చూసుకొనుటకు సొంత 2 వీలర్ కలిగి, 20-25 సం॥ వయస్సు గల సూపర్‌వైజర్ కావలెను. కాకినాడ వాస్తవ్యులకు ప్రాధాన్యత. సంప్రదించండి. ✆ 83284 36168.

EENADU for Advertisement Contact: 8008597607

కాకినాడ, అశోక్‌నగర్‌లో ప్రముఖ ఫంక్షన్ హాలు నందు పనిచేయుటకు మంచి నడవడిక కలిగినవారు వాచ్‌మేన్‌గా కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 91337 44388.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషెంట్ల సేవకు ఇంటి / వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

ప్రముఖ సోలార్ సంస్థ నందు కమీషన్ పద్ధతిపై పనిచేయుటకు ప్రమోటర్స్ కావలెను. Cont. Cell: 95608 58684, bandaruenergies@gmail.com

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషెంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52843.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-35 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	23,500
పాతకాయ: గండేరా	25,000
గటగట	26,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	19,000-22,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	102-00
రిటైల్ లైవ్	124-00
డ్రెస్డ్	180-00
స్కిన్‌లెస్	205-00

92.7 FM Rajamahendravaram
92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

విద్యుత్తు బిల్లు సరిచేశారు

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురంలో ఓ దుస్తుల దుకాణానికి గత నెల వచ్చిన రూ.3,38,496 బిల్లును సరిచేసినట్లు విద్యుత్తు శాఖ ఏఈ బి.ప్రసాద్ సోమవారం చెప్పారు. 'చిన్న దుకాణానికి రూ.3.38 లక్షల బిల్లు' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఈపీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ (ఆపరేషను సర్కిల్) బి.రాజేశ్వరి రాజోలు ఏడీఈ ద్వారా బిల్లును పరిశీలించి సరిచేసే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దుకాణంలో పాత మీటరు మార్చి కొత్తది వేశారని, పాత మీటరుకు సంబంధించిన మొత్తం రీడింగు నమోదుకావడం వల్ల ఎక్కువ మొత్తంలో బిల్లు వచ్చినట్లు ఆమె చెప్పారన్నారు. ఏడీఈ మీటరును పరిశీలించి, లోడును బట్టి లెక్కించి ఏడు నెలలకు సర్దుబాటు చేసి రూ.4,970కు బిల్లును సరిచేసి సంబంధిత వినియోగదారుడికి తెలియజేసినట్లు వివరించారు.

పోరాటంతో వర్గీకరణ సాధన

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ సాధనకు మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో కమిటీలు వేసి పోరాడామని జిల్లా శాఖ కన్వీనర్ మధు మాదిగ పేర్కొన్నారు. అమలాపురం గడియారస్తంభం కూడలిలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, నాయకులు భారీ కేకు కోసి సంబరాలు చేశారు. కొంత మంది యువకులు ఇనుప కత్తులతో హల్‌చల్ చేయడంతో పట్టణ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నవరపు భైరవమూర్తి, గంపల విజయ్, ఆకుమర్తి మోహన్, చుట్టుగుళ్ల సత్తిబాబు, లంక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గడియారస్తంభం ప్రాంగణంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా జాన్‌మోషే

మలికిపురం, న్యూస్‌టుడే: బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మలికిపురం గ్రామానికి చెందిన బూసి జాన్ మోషే నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బీఎస్పీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారని మోషే చెప్పారు. బీఎస్పీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

ఉద్యాన పంటలకు పెట్టుబడి సాయం

• నేడు జిల్లావ్యాప్తంగా పనులు ప్రారంభం

న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం, ఆలమూరు

గతంలో ఉపాధి హామీ పథకం అంటే కేవలం పంట కాలువలు, బోదెల్లో పూడిక తీసి వేతన శ్రామికులకు ఉపాధి కల్పించడం అన్నట్లు ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దాని రూపురేఖలను మారుస్తూ రైతులకు ఉపయోగపడేలా పథకాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటివరకు ఉద్యాన పంటల సాగుకు ఊతమిస్తుండగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 1,500 ఎకరాల్లో రైతులకు సాగు వ్యయాన్ని అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయిదు ఎకరాల్లోపు పొలం, జాబ్‌కార్డు ఉన్న రైతులకు మూడేళ్లపాటు పంట ఖర్చులు అందించనుంది. ఈ పథకంలో జిల్లాలో సుమారు 300 ఎకరాల్లో మంగళవారం పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు.

ఖాతాలకు జమ..

ఉద్యాన పంటల సాగు కింద దరఖాస్తు చేసుకున్న రైతులకు పంట రకాన్ని బట్టి 2 నుంచి 3 సంవత్సరాల వరకు పూర్తి పెట్టుబడిని ఈ పథకం ద్వారా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1500 ఎకరాల్లో సాగు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకు 872 ఎకరాలు గుర్తించారు. 710 ఎకరాల్లో సాగుకు 478 పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా 482 ఎకరాల్లో 282 పనులకు పరిపాలనా మోదం లభించింది. ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా గ్రామాల్లో రైతులతో కలిసి సాగును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. రైతులకు అవసరమైన మొక్కలను ఉద్యాన శాఖ అధికారులు అందించనున్నారు.

మూడేళ్ల వరకు ఇస్తాం..

మామిడి, కొబ్బరి, కోకో, ఆయిల్‌పామ్, జీడిమామిడి, సీతాఫలం, మునగ, గులాబీ, మల్లె, తదితర ఉద్యాన పంటలు వేసే రైతులకు పూర్తిస్థాయి పెట్టుబడిని రెండు నుంచి మూడేళ్ల వరకు రకాన్నిబట్టి అందిస్తాం. ఆసక్తి ఉన్న రైతులు ఆయా గ్రామాల్లోని ఉపాధి సిబ్బంది, సర్పంచులను కలిసి దరఖాస్తులు అందిస్తే, ప్రతిపాదనలు సిద్ధం చేసి సాగుకు అనుమతులు ఇస్తాం.

- మధుసూదన్, డ్వామా పీడీ

(c) eenadu

రేవడి వంతెన వద్ద గడ్డర్లు ఏర్పాటు చేయండి

ఈనాడు కథనానికి స్పందన

కొత్తపేట: అవిడి గ్రామ శివారు రేవడి ప్రాంతంలో వంతెన స్తంభం కుంగిపోయి ప్రమాదకరంగా ఉన్న వైనంపై 'వంతెన.. నిలిచేనా' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం ప్రచురితమైన కథనంపై ఆర్డీవో శ్రీకర్ స్పందించారు. ర.భ శాఖ అధికారి రాజేంద్రతో కలిసి వంతెనను పరిశీలించారు. వంతెనపై హెచ్చరిక బోర్డులు పెట్టాలని, ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లి వంతెన నిర్మాణానికి తగు చర్యలు చేపడతామని తెలిపారు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

ఆలమూరు ఎస్సైగా నరేష్ బాధ్యతల స్వీకరణ

ఆలమూరు, న్యూస్‌టుడే: ఆలమూరు నూతన ఎస్సైగా జి.నరేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లా క్రైం విభాగం నుంచి ఆలమూరు వచ్చారు. 2012 బ్యాచ్‌కు చెందిన నరేష్ స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం ఇలపర్రు. గత నెలలో ఆలమూరు ఎస్సై అశోక్ రహదారి ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నరేష్‌కు కూటమి నాయకులు, పోలీస్, ఇతర శాఖల సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై నరేష్

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

వెలిగిన వీధి దీపాలు

మామిడికుదురు: మండలంలోని నగరం రెండో వీధిలో దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెప్పిన సమస్యను సర్పంచి జాలెం రమణకుమారి, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. కొత్తగా ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేశారు.

ఆత్రేయపురం: రాజవరంలో వీధి దీపాలు వెలగడంలేదని స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి జాన మంగాదేవి వద్ద ప్రస్తావించగా స్పందించి, వీధి దీపాలు వేయించారు.

చెత్తాచెదారం తొలగింపు

రావులపాలెం పట్టణం: స్థానిక కొత్తకాలనీలో రోడ్డు చెంతన వ్యర్థాలు పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

దోమల నివారణకు చర్యలు

రావులపాలెం గ్రామీణం: దేవరపల్లిలో కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచి దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా నివారణ మందులను చల్లించారు.

స్వచ్ఛత విరిసేలా.. పల్లెలు మెరిసేలా

న్యూస్‌టుడే, మామిడికుదురు

స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడు వారాల నుంచి పంచాయతీ అధికారులు నిత్యం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణపై దృష్టి సారించారు. ఈ సమయంలో అమరావతి నుంచి నిర్వహించే గూగుల్ మీట్ ద్వారా సంబంధిత పంచాయతీ కార్యదర్శులంతా అందుబాటులో ఉంటున్నారు. తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమ వీడియోలను అందులో నిక్షిప్తం చేస్తున్నారు.

గ్రామాల్లో చెత్త సేకరణపై ప్రజల అభిప్రాయాలను ఐవీఆర్ఎస్ ద్వారా అమరావతి నుంచి నేరుగా సేకరిస్తున్నారు. మీ గ్రామంలో చెత్త సేకరణ జరుగుతోందా? వారానికి రెండుసార్లు మీ ఇంటి నుంచి చెత్త తీసుకువెళ్తున్నారా? అనే రెండు ప్రశ్నలపై వచ్చే సమాధానాల ఆధారంగా అక్కడి పనితీరును అంచనా వేస్తున్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో పంచాయతీ అధికారులు సంతృప్తికర మార్కులు సాధించాల్సి ఉంది. రిక్షాలకు స్పీకర్లు అమర్చి చెత్త సేకరణపై మైకు ద్వారా ప్రచారం చేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో వేసి సిద్ధంగా ఉంచేలా ప్రజలను చైతన్యపరుస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడా వ్యర్థాలు కనిపించకుండా, చెత్తకు నిప్పు పెట్టకుండా చూస్తున్నారు.

మండలం	జనాభా	కావాల్సిన క్లాప్‌మిత్రలు	ఉన్నవారు
రాజోలు	71,433	72	47
మలికిపురం	75,847	77	46
సఖినేటిపల్లి	72,560	71	40
మామిడికుదురు	67,963	61	34

క్లాప్‌మిత్రలే ప్రధానం..

రాజోలు, మలికిపురం, మామిడికుదురు, సఖినేటిపల్లి మండలాల్లో దాదాపు 48,600 కుటుంబాల్లో సుమారు 2.87 లక్షల జనాభా ఉన్నారు. 250 ఇళ్లకుగాను ఒక క్లాప్‌మిత్ర ఉండాలి. వీరికి రూ.6 వేల చొప్పున వేతనాలు ఇస్తున్నా ఎవరూ ముందుకు రాకపోవడంతో పంచాయతీ నుంచి అదనంగా రూ.4 వేలు సమకూర్చుతున్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించే క్లాప్ మిత్రలు అరకొరగా ఉండడం, రిక్షాలు మరమ్మతులకు గురవడం, సంపద కేంద్రాల్లో అవసరాల మేరకు తొట్టెలు లేకపోవడం వంటివి స్వచ్ఛగ్రామాల లక్ష్యానికి ఆటంకంగా పరిణమించాయి. క్లాప్ మిత్రలు స్థానికంగా లేకపోవడంతో తుని, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తీసుకొస్తున్నారు. రాజోలు నియోజకవర్గంలో ఇంకా 12చోట్ల ఘన వ్యర్థాల కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కొన్నిచోట్ల పైకప్పుల రేకులు దెబ్బతినగా సేంద్రియ ఎరువు తయారుచేసేందుకు నిర్మించిన సిమెంటు తొట్టెలు అధ్వానస్థితికి చేరాయి. వీటిని ఉపయోగంలోకి తీసుకురావాల్సి ఉంది. అవసరమైన చోట్ల కంపోస్టు గుంతలను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ

నిత్యం నిశితంగా పరిశీలిస్తున్నాం..

గ్రామాల్లో రోజూ ఉదయం పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో తడి, పొడి చెత్త సేకరణ విధిగా జరుగుతున్నది నిశితంగా పరిశీలిస్తున్నాం. ఈ నెలాఖరు నాటికి అన్ని గ్రామాల్లోనూ అవసరాల మేరకు క్లాప్‌మిత్రలను ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. ఘన వ్యర్థాల కేంద్రాల్లో అవసరమైన తొట్టెలు నిర్మించుకోవాలి. ఆరుబయట ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా గ్రామాలు నిత్యం శుభ్రంగా ఉండాలి. - డి.శాంతలక్ష్మి, డీపీవో

ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండాలి

ఆలమూరు: వర్షాకాలంలో గృహ నిర్మాణదారులకు ఇసుక అందుబాటులో ఉండేలా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ అన్నారు. సోమవారం ఆయన మండపేట రవాణా శాఖాధికారి శ్రీదేవి, తహసీల్దార్ కేజే ప్రకాశ్‌బాబు, ఎంపీడీవో రాజు తదితరులతో కలిసి మండలంలో ఇసుక స్టాక్ పాయింట్లను పరిశీలించారు.

కళా వెంకటరావు ఆదర్శనీయుడు

ముక్కామలలో విగ్రహానికి కుటుంబ సభ్యుల నివాళి

అంబాజీపేట, న్యూస్‌టుడే: కోనసీమ అభివృద్ధికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి కళా వెంకటరావు అని వక్తలు కొనియాడారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించి రైతు బాంధవుడిగా ఖ్యాతి గడించారన్నారు. ఆయన 125వ జయంతి సందర్భంగా సోమవారం స్వగ్రామం ముక్కామలలో పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పూల మాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

కొత్తపేట: ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో కళా వెంకట్రావు కీలకపాత్ర పోషించారని, కోనసీమ ప్రగతికి ఎనలేని కృషి చేశారని గాంధేయవాది దుళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కళావెంకట్రావు జయంతిని పురస్కరించుకుని పలివెలలో జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కంకటాల శ్రీరామ్మూర్తి, వి.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా చింతలూరు నూకాలమ్మ

ఆలమూరు, న్యూస్‌టుడే: చింతలూరు నూకాంబికా అమ్మవారు సోమవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని, దేవాలయాన్ని అలంకరించారు. మహిళలతో కుంకుమార్చన నిర్వహించారు.

చింతలూరు నూకాలమ్మ ఆలయంలో కుంకుమ పూజల్లో మహిళలు

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

అంతర్వేది: శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్ సోమాజిగూడకు చెందిన సి.వి.వాసుదేవ రాయ్, ఉషరాయ్ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని సోమవారం ఈవో ఎంకేటీఎన్‌వీ ప్రసాద్‌కు అందజేశారు.

వాడపల్లి (ఆత్రేయపురం): వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద చేపట్టిన నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన పమ్మి మురళి, మమత దంపతులు రూ.50,001 విరాళాన్ని సమర్పించారు.

వెంకన్నకు అటవీశాఖ ఐటీ సలహాదారు పూజలు

నాగబాబుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దేవస్థానం ప్రతినిధి

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారిని రాష్ట్ర అటవీశాఖ ఐటీ సలహాదారు పెన్మమరెడ్డి నాగబాబు సోమవారం దర్శించుకుని పూజలు చేశారు. నాగబాబు దంపతులను అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేషవస్త్రాలు కప్పి ఆశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటాన్ని దేవస్థానం ప్రతినిధి శ్రీను అందజేశారు.

పల్లెల స్వచ్ఛతకు ఓఎన్జీసీ సహకారం

ఆలమూరు: కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు పల్లెల స్వచ్ఛతకు ఓఎన్జీసీ సహకారం అందిస్తుందని సంస్థ ప్రతినిధులు కె.శ్రీకృష్ణ, బి.శివకుమార్ తెలిపారు. సందిపూడి పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సర్పంచి తోట భవాని అధ్యక్షతన స్వచ్ఛ భారత్, స్వచ్ఛత సేవ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరు చేసేందుకు తమవంతు సాయం అందిస్తామని తెలిపారు. పర్యావరణ హితం కోసం నార సంచులను నాయకుల చేతుల మీదుగా గ్రామస్థులకు పంచారు. ఎంపీటీసీ సభ్యురాలు తోలేటి సంతోషిణి పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఓఎన్జీసీ అధికారులు

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రాజోలు: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. పొన్నమండలో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరిశీలకుడు చిటికెన రామ్మోహనరావు, మందాల గంగసూర్యనారాయణ, డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చెల్లుబోయిన శ్రీనివాస్, ముప్పర్తి నాని, తాడి సత్యనారాయణ, చాగంటి స్వామి, అడబాల విజయ్, సత్తిరాజు స్వామి, దాకే ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మందపల్లి మాజీ సర్పంచి చింతం కృష్ణ అన్నారు. సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మందపల్లి, ఏనుగుల మహల్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకులు కరపత్రాలు పంచారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు దర్బాల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, కొల్లి వీరస్వామి, నక్కా వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పొన్నమండలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖరం, షరీఫ్ తదితరులు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

రావులపాలెం గ్రామీణం: రావులపాలెం మండలం గోపాలపురం వద్ద అక్రమంగా తరలిస్తున్న 3 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక వ్యాన్‌లో 60 బస్తాల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వ్యాన్‌ను రావులపాలెం పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు సి.ఐ మధుబాబు, డీసీటీవో నవీన్‌కుమార్, ఎంఎస్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు.

మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి

మలికిపురం, న్యూస్‌టుడే: ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతిని ఆయన స్వగ్రామం శంకరగుప్తంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బాలమురళీకృష్ణ శంకరగుప్తం గ్రామంలో జన్మించడం తమకు గర్వకారణమన్నారు. సర్పంచి రాపాక ఆనందకుమార్, ఉపసర్పంచి శిరిగినీడి నాని, ప్రముఖ నరసింహమూర్తి, కొమరగిరి శ్రీనివాస్, ఆచంట బుజ్జి, శ్రీరామచంద్రమూర్తి, దూది శంకర్, దొడ్డా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాలమురళీకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసిన గ్రామస్థులు

కొత్తూరు-వెదురుమూడి రహదారి విస్తరణ ఎప్పుడో?

కొత్తూరు-వెదురుమూడి రహదారి నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. చుట్టుపక్కల పదిగ్రామాల ప్రజలకు కొత్తూరు కూడలికాగా, ఓఎన్జీసీ రిగ్గులు సుమారు 10 వరకు ఉండటంతో భారీ వాహనాలు, రైసుమిల్లుల వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. పలుచోట్ల ఆక్రమణలు ఉన్నందున రహదారి విస్తరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. భారీవాహనాల రాకపోకలతో అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుత ప్రతిపాదన ప్రస్తుతం లేదని, రహదారి నిర్మాణానికి ఆమోదం లభించిందని ఆర్‌అండ్‌బీ ఏఈ సూర్యనారాయణ తెలిపారు. టెండర్లు పిలిచిన తరువాత నిర్మాణం చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, ఆలమూరు

కొత్తూరు రహదారిలో వాహనాల రద్దీ

శిథిలమైన కచేరి చావిడి

నరేంద్రపురంలో రెవెన్యూ శాఖకు చెందిన కచేరి చావిడి మొండి గోడలతో మిగిలింది. సుమారు పదేళ్లుగా ఇదే పరిస్థితి. రెండు దశాబ్దాల క్రితం వరకు రెవెన్యూ అధికారులు ఇక్కడ రైతుల నుంచి నీటితీరువా వసూలు చేయడం, వారికి కావాల్సిన సమాచారం అందించడం వంటి విధులు నిర్వహించేవారు. దీనిస్థానే కొత్త భవనం నిర్మిస్తే గ్రామరెవెన్యూ అధికారి కార్యాలయంగా వినియోగించుకోవచ్చు. కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతామని తహసీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

డ్రోన్ ఆపరేట్ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

సాంకేతిక వనరులను సద్వినియోగం చేసుకోవాలి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: రైతులకు రాయితీపై అందిస్తున్న సాంకేతిక వనరులను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. రాష్ట్రీయ కృషివికాస యోజన కింద పి.గన్నవరం, అంబాజీపేట మండలాలకు చెందిన రెండు గ్రూపులకు ఒక్కోటి రూ.9.81 లక్షల విలువైన రెండు డ్రోన్లను సోమవారం పి.గన్నవరంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎ.డి.ఎ. సి.హెచ్.డి.విజయకుమార్, కూటమి నాయకులు గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరదల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి

ఆత్రేయపురం: గోదావరి వరద పెరిగితే పల్లపు ప్రాంతాల్లో ప్రజలను బయటకు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ టి.ఆర్.రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరావు ఆదేశించారు. సోమవారం ఆత్రేయపురం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరద రక్షణ గట్టు బలహీనంగా ఉంటే చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యాసామగ్రి పంపిణీ

అయినవిల్లి: అయినవిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ ఏకరూప దుస్తులు, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ప్రభుత్వం, దాతలు అందిస్తోన్న సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం ఆయన అయినవిల్లిలంకలో ఎదురుబిడెం కాజ్‌వేను పరిశీలించారు. వరద ప్రవాహం పెరిగితే చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ విద్యాపతి, ఎంపీడీవో సరోవరరావు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తాం

ఆలమూరు: పినపళ్ల నుంచి మండపేట గొల్లపుంత వెళ్లే మార్గంలో కుప్పకూలిన గొడ్డుకాలువ వంతెనను సోమవారం మురుగునీటి పారుదల శాఖ డీఈ పోచారావు, జేఈ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించి పంపనున్నట్లు పోచారావు తెలిపారు. రైతుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడకుండా తాత్కాలికంగా చర్యలు తీసుకుంటామని సుబ్రహ్మణ్యం చెప్పారు. చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భాజపా నాయకుడు అబ్బాలు మృతి

మామిడికుదురు: కొమరాడకు చెందిన భాజపా మండల మాజీ అధ్యక్షుడు, జిల్లా మాజీ కార్యదర్శి పోశింశెట్టి వెంకటరావు(అబ్బాలు) (90) ఆదివారం రాత్రి మృతి చెందారు. రాజోలు నియోజకవర్గం నాయకులు పలువురు సోమవారం ఆయన మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళి అర్పించారు. 1978లో ఆర్ఎస్ఎస్‌లో, 1980 నుంచి భాజపాలో ఆయన సేవలందించారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, మండల అధ్యక్షుడు భైరిశెట్టి దుర్గారామకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు.

లారీ ఢీకొని తాపీమేస్త్రి దుర్మరణం

యలమంచిలి, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ వద్ద గోదావరి వంతెనపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన తాపీమేస్త్రి మేడిచర్ల భాస్కరరావు (60) మృతిచెందారు. పని అనంతరం సహచరుడు మద్దూరి శివతో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. శివకు గాయాలు కాగా భాస్కరరావు అక్కడికక్కడే మృతి చెందారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుక

మామిడికుదురు, కొత్తపేట, అంబాజీపేట, పి.గన్నవరం, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, సంఘ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం మామిడికుదురు, కొత్తపేట, అంబాజీపేట, కె.పెదపూడి, పి.గన్నవరంలో నాయకులు కేక్ కోసి సంబరాలు చేశారు. పి.గన్నవరంలోని మూడు రహదారుల కూడలిలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, పెదపూడి రాము, తవిటికి బుజ్జి, చింతపర్తి సంజీవ్, రవికుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు. మామిడికుదురు జాతీయ రహదారి కూడలిలో ఏర్పాటు చేసిన పతాకాన్ని జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు ఎగురవేశారు. అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. తీన్‌మార్ వాయిద్యాలతో కళాకారులు సందడి చేశారు. ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి నూటుకుర్తి సత్యనారాయణ, నాయకులు ఉండ్రాజవరపు శివ, చుట్టుగుల్ల కిషోర్, యార్లగడ్డ రవి, చేట్ల సత్యనారాయణ, మంద గాంధీ, కొత్తపేటలో కముజు శ్రీనివాసరావు, ముత్యాల బాబ్జీ, కంఠంశెట్టి శ్రీనివాసరావు, విళ్లా మారుతి, గుబ్బల మూర్తి, వాసంశెట్టి సత్యనారాయణ, మిద్దె ఆదినారాయణ, అంబాజీపేటలో రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, అరిగెల సూరిబాబు, కొర్లపాటి గోపి, దండోరా నాయకులు పాల్గొన్నారు. ఆత్రేయపురం, మెర్లపాలెం, పేరవరంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ముళ్లపూడి భాస్కరరావు, మెర్ల రాము, గంధం యాకోబ్, ముదునూరి వెంటరాజు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో కేకు కోస్తున్న జడ్పీ మాజీ ఛైర్మన్ నామన తదితరులు

తొండవరం ఉన్నత పాఠశాలలో..

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

అంబాజీపేట: తొండవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉత్తమ ఉపాధ్యాయులు ఆదుర్తి వెంకటఅప్పారావు, పిల్లి త్రిమూర్తులు, గంటి శ్రీనివాస్, ఇందుర్తి అరుణ్‌కుమార్, కొంపెల్ల వాణిలను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు హెచ్ఎం పి.వి.కేశవాచార్యులు అధ్యక్షత వహించారు. ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ పేరాబత్తుల వెంకటసుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మాణం డొల్ల.. నాణ్యత కల్ల!

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ఏదైనా పక్కా భవనం పదికాలాల పాటు పటిష్ఠంగా ఉండేలా నిర్మిస్తారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తారు. ప్రభుత్వ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోయినా అధికారులు పట్టించుకోలేదనడానికి ఆత్రేయపురం మండలంలోని ర్యాలి నగర వాగ్దేవి నగర మహాలక్ష్మి ఆలయం చెంతన నిర్మించిన పశువైద్యశాల భవనామే నిదర్శనం. ఈ భవనం 2019లో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించారు. ఆరేళ్లకే భవనం బీటలు వారడం, గదుల్లో ఫ్లోరింగ్ పగుళ్లదీయడం చూస్తే పనులు, నాణ్యతపై పంచాయతీరాజ్ అధికారుల పర్యవేక్షణ కొరవడినట్లు స్పష్టమవుతోంది. విధులు నిర్వహించేందుకు సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. ప్రస్తుతం కింద ఫ్లోరింగ్ అంతా దిగబడిపోయింది. గదుల్లో వేసిన పలకలు(స్టోన్స్) పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. ప్రహరీ గోడల వెంబడి బీటలు వారింది. మరుగుదొడ్లకు నీటి సరఫరా కనెక్షన్ ఇంకా ఇవ్వలేదు.

ర్యాలి పశువైద్యశాల

పగిలిన పలకలు

ప్రతిపాదనలు పంపాం..

అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. అన్ని గదులతోపాటు ప్రహరీ లోపల భాగంలో కూడా బీటలు వారింది. సిబ్బంది అంతా ఇబ్బందులతోనే విధులు నిర్వర్తిస్తున్నారు. అత్యవసరంగా ఫ్లోరింగ్ చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. - మౌనిక, పశువైద్యాధికారి, ర్యాలి



అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

దాతలకు స్వామివారి చిత్రపటం బహూకరణ

నిత్యాన్నదాన పథకానికి వితరణ

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పోరంకికి చెందిన దేవునిపల్లి రాంబాబు, పద్మావతి దంపతులు సోమవారం రూ.50వేలు విరాళం అందజేశారు. వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి చిత్రపటం బహూకరించారు. ఆలయ పర్యవేక్షకుడు కరాని శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

అమలాపురం గ్రామీణం: కామనగరువులోని జంగంపాలెంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు సర్పంచి నక్కా అరుణకుమారి సోమవారం సాయం అందించారు. బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ఆర్.ఎస్.ఎస్.సూరపరాజు, నక్కా చంద్రశేఖర్, పి.ఆదినారాయణ, చొల్లంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు వైకాపా నాయకుడు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు సమకూర్చిన బియ్యం, వంట సామగ్రి, నిత్యావసర సరకులు, దుస్తులను సర్పంచి నక్కా అరుణకుమారి చేతులమీదుగా పంపిణీ చేశారు. మాజీ సర్పంచి నక్కా సంపత్‌కుమార్, పెద్దింశెట్టి ప్రకాష్, కొప్పిశెట్టి వీరంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో ఉన్న మహిళ నుంచి అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీవో మాధవి

వినతుల స్వీకరణ

అమలాపురం పట్టణం: అర్జీదారుల సమస్యల పట్ల అధికారుల స్పందన క్రియాత్మకంగా ఉండాలని డివిజన్ స్థాయి అధికారులను ఆర్డీవో కొత్త మాధవి ఆదేశించారు. అమలాపురంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో సోమవారం వినతులు స్వీకరించారు. రాజోలు మండలం కడలి గంగరావి చెరువుకు చెందిన దివ్యాంగురాలు బొంతు సుదర్శన ఆటోలో ఉండగా.. ఆమె వద్దకు వెళ్లి వినతి స్వీకరించారు.

విపత్తులను సమర్థంగా ఎదుర్కొందాం

ఐ.పోలవరం: వరద విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అంతా సిద్ధంగా ఉండాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఆమె మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని వరద విపత్తులను అధిగమించాలన్నారు.

కనికరించాలి.. పరిష్కారం చూపాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొంత కాలంగా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, వాటికి పరిష్కార మార్గాలు చూపాలని పలువురు అర్జీదారులు కోరారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీ నిశాంతి ఇతర అధికారులు వినతులు స్వీకరించారు. వినతులు అందజేసిన పలువురి ఆవేదన ఇదీ..

ఉద్యానాన్ని ఆధునికీకరించాలి

మేమంతా అమలాపురంలోని చంద్రబాబు ఉద్యాన వనంలో నిత్యం వ్యాయామం చేస్తుంటాం. కొంత కాలంగా నిర్వహణ కొరవడి పార్కు అధ్వానంగా మారింది. తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. విష సర్పాలు, కీటకాలు వ్యాయామం చేసే వాళ్లపై దాడి చేస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పార్కును ఆధునికీకరించి సందర్శకులకు వసతులు కల్పించాలని కోరుతున్నాం.

—అమలాపురం వాకర్స్ సంఘం సభ్యులు

భార్యను కాపాడాలని వినతి



మాది అల్లవరం మండలం కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం. నా భార్య పాలెపు దుర్గ 11 నెలల క్రితం ఉపాధి నిమిత్తం మస్కట్ వెళ్లింది. అక్కడికి వెళ్లిన తర్వాత మూడు నెలల పాటు ఏజెంట్ కార్యాలయంలోనే ఉంచారు. తర్వాత మతి స్థిమితం లేని వ్యక్తి ఇంట్లో పనికి పెట్టారు. ఆ వ్యక్తి నా భార్యపై దాడికి పాల్పడటంతో ప్రస్తుతం గల్ఫ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అక్కడ ఉండలేనని చెబుతోంది. స్వదేశానికి తీసుకు వచ్చేందుకు అధికారులు సహకరించాలి.

—పాలెపు రాజు

భూమి లేకపోయినా నమోదు చేశారు

మాది బోడసకుర్రు. నా భార్య పోచమ్మ పేరిట 4 ఎకరాలు, కుమార్తె మానస పేరున మరో 3 ఎకరాల భూమి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారు. మూడేళ్లుగా మాకు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు రావడం లేదు. దినసరి కూలీలుగా జీవిస్తున్న మాకు భూములు ఉన్నట్లు అధికారులు ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేశారు.

—పాలెపు సత్తిబాబు, పోచమ్మ

సమస్యలు తెలుసుకుంటున్న జేసీ నిశాంతి

బిల్లులు అందక అవస్థలు

అమలాపురం డివిజన్ పరిధిలో మూడేళ్లుగా జిల్లా పరిషత్తు నుంచి పలు అభివృద్ధి పనులు పూర్తి చేశాం. వాటికి రూ.6 కోట్ల బకాయిలు చెల్లించాలి. బిల్లుల చెల్లింపులు నిలిచిపోయి మూడేళ్లుగా అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నాం. కొత్త పనులు నిర్వహించేందుకు మా వద్ద కనీసం పెట్టుబడి లేక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి బకాయి బిల్లులు చెల్లించాలి.

—గుత్తేదారులు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718 , ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

తుప్పలు తొలగించారు

సమస్య: కాట్రేనికోన నుంచి వేట్లపాలెం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరగడంతో ఇటుగా రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. —గ్రామస్థులు

పరిష్కారం: ఈ సమస్యను ఏపీవో చంద్రమోహన్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. ఉపాధి వేతనదారులతో రోడ్డుకు ఇరువైపులా తుప్పలు తొలగించారు.

స్పందనకు వందనం

సమస్య: గెద్దనపల్లిలో రోడ్డుపక్కన చెత్త పేరుకుపోయింది. పంచాయతీ అధికారులు స్పందించి తొలగించాలి —స్థానికులు

పరిష్కారం: సర్పంచి సీతారామకృష్ణంరాజు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి సిబ్బందితో చెత్తను తొలగించారు. —న్యూస్‌టుడే, కాట్రేనికోన

శారదాదేవికి ఆషాఢం సారె

యానాం: గోపాల్‌నగర్‌లోని శారదాదేవిని తమ ఇంటి ఆడపడుచుగా భావించుకునే ఆ ప్రాంత భక్తులు సోమవారం మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి ఆషాఢం సారె సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు వివిధ రకాల స్వీట్లు 80 కిలోలు, పసుపు, కుంకుమ, పుష్పాలు, చలివిడి, పానకం, బూరెలు, పులిహోర పళ్లాల్లో పెట్టుకుని సన్నాయి మేళంతో అమ్మవారి ఆలయానికి వెళ్లి సారె సమర్పించారు. వేగేశ్న గోపాలరాజు, పొన్నాడ వెంకటేశ్వరరావు, అల్లూరి నరసింహరాజు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 24 అర్జీలు

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 24 అర్జీలు అందినట్లు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి ఎస్పీ బి.కృష్ణారావు వినతులు స్వీకరించారు. సచివాలయంలో పని చేస్తున్న మహిళా పోలీసు కార్యదర్శులు బదిలీలపై వినతులు అందజేశారు. * తన కుమారుడు కనిపించడం లేదని అమలాపురం మండలం కామనగరువులోని బడుగువానిపేటకు చెందిన కొండిశెట్టి బాలయోగి ఫిర్యాదు చేశారు. తన కుమారుడు సత్యనారాయణకు ఉద్యోగం ఇప్పిస్తానని మాకేష్‌బాబు అనే వ్యక్తి తీసుకు వెళ్లాడని పేర్కొన్నారు. రెండు నెలలుగా కుమారుడి ఆచూకీ లేదని వాపోయారు. * తన ఇంట్లో దొంగలు ప్రవేశించి సుమారు రూ.10 లక్షల విలువైన బంగారు నగలు, నగదు చోరీ చేశారని రాజోలు మండలం తాటిపాకకు చెందిన తాతారావు ఫిర్యాదు చేశారు. ఏడు నెలలు గడిచినా దొంగలను పట్టుకోలేదని, తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

సుపరిపాలనతో ఇంటింటికీ లబ్ధి: ఎమ్మెల్యే

ఇమ్మిడివరప్పాడులో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం గ్రామీణం: రాష్ట్రంలో సుపరిపాలనతో ఇంటింటికీ లబ్ధి అందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సోమవారం ఇమ్మిడివరప్పాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యులు అధికారి జయవెంకటలక్ష్మి, మట్ట మహాలక్ష్మీప్రభాకరరావు, మల్లుల పోలయ్య, మంది గెద్దయ్య, మదుపల్లి యాకోబు, కసనన మల్లేశ్వరరావు, యలగన శ్రీనివాసరావు, ఈతకోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: ఏడాది పాలనలో కూటమి సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్తోందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కాట్రేనికోన, చెయ్యేరు, కొప్పిగుంట, పెనుమల్ల, నడవపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించి కరపత్రాలు అందించారు. పీఏసీఎస్ రాజు, లక్ష్మీరమణారావు, రమణ, కె.సత్యనారాయణ, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం పట్టణం: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులను, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నామని అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు తెలిపారు. అమలాపురం పట్టణంలోని 4, 5 వార్డుల్లో కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, తెదేపా నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రికలను అందించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, నల్లా స్వామి, కర్రి దత్తుడు, వలవల శివరావు, మారెడ్డి ప్రభాస తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం గోపవరంలో ఇంటింటా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల బీమాను వినియోగించుకోవాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఈ పథకానికి సంబంధించిన ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. ప్రకృతి విపత్తులు, తుపాను కారణంగా పంట నష్ట పోయిన సమయంలో బీమా తీసుకున్న వారికి పరిహారం అందుతుందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసుబాబు, ఎల్డీఎం వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

లయన్స్ క్లబ్ వశిష్ట కార్యవర్గం ప్రమాణ స్వీకారం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం లయన్స్ క్లబ్ వశిష్ట తరఫున బి.గాయత్రి మరిన్ని సేవలు అందించాలని డాక్టర్ పీఎస్ శర్మ పేర్కొన్నారు. అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లో లయన్స్ క్లబ్ వశిష్ట నూతన కార్యవర్గసభ్యుల పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలిగా గాయత్రి, కార్యదర్శిగా పిల్లా తరంగిణి, కోశాధికారిగా దేశరాజు పద్మ ప్రసాద్, ఆరుగురు కార్యవర్గసభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పోలిశెట్టి అనంతలక్ష్మి, అనిల్‌కుమార్, కామేశ్వరిదేవి, బూరగాయల శివరామకృష్ణ, చిక్కాల అరుణ, కల్వకొలను ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

గాయత్రిని అభినందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

పురపాలక ఉద్యోగులు విధుల బహిష్కరణ

యానాం, న్యూస్‌టుడే: ఏడో వేతన సంఘం సిఫార్సులు అమలు చేయాలని, ఇతర ప్రభుత్వశాఖల మాదిరి ట్రెజరీ నుంచి వేతనాలు చెల్లించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ యానాం మున్సిపల్ ఉద్యోగులు సోమవారం విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. పరిపాలనాధికారి కార్యాలయానికి సమీపంలో శిబిరం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. డిమాండ్లు పరిష్కరించకుంటే ఆగస్టు 15, 16 తేదీల్లో నిరాహార దీక్ష చేస్తామని మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పెనుపోతు కృష్ణ, కార్యదర్శి చెల్లి గోపీనాథ్ తెలిపారు.

కామన్‌వెల్త్ వైద్య సభకు డాక్టర్ శర్మ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: లండన్‌లో జరిగే కామన్‌వెల్త్ మెడికల్ సర్వసభ్య సమావేశానికి ఈ నెల 18న వెళ్తున్నట్లు సీఎంఏ సభ్యుడు డాక్టర్ పీఎస్.శర్మ తెలిపారు. సోమవారం అమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను ఆహ్వానిస్తూ సీఎంఏ అధ్యక్షుడు జయలాల్ లేఖ రాశారని చెప్పారు. డబ్ల్యూహెచ్‌వో పిలుపు మేకు 2030 నాటికి క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నామని అన్నారు.

'దళితులపై దాడులు ఆపాలి'

ఉప్పలగుప్తం: దళితులపై దాడులను ఆపాలని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డి.బి.లోక్ డిమాండు చేశారు. సోమవారం అమలాపురంలోని అరిగెలపాలెంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇ.వి.వి.సత్యనారాయణ, దోనిపాటి నాగేశ్వరరావు, డి.వెంకటేశ్వరరావు, ప్రసాదరావు, కాశి వెంకటరావు, గోసంగి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం బస్టాండ్ ఎదురుగా నిలిపే ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వీరబాబు తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. అమలాపురం మండలం బండారులంకకు చెందిన గోళ్ల నాగబసవరాజు (54) ద్విచక్రవాహనాలను దొంగతనం చేస్తుండగా ఎస్సై శ్రీనివాస్ అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అతడి నుంచి రూ.10వేల నగదు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అతడిని అమలాపురం కోర్టులో హాజరు పరుచగా 14 రోజుల రిమాండ్ విధించారన్నారు.

కళా వెంకటరావు సేవలు మరువలేనివి

అమలాపురం పట్టణం: కోనసీమ ప్రాంతానికి, రాష్ట్రానికి కళా వెంకట్రావు చేసిన సేవలు మరువలేనివని కవి నల్లా నరసింహమూర్తి కొనియాడారు. అమలాపురంలో కోనసీమ జేఏసీ సభ్యుల ఆధ్వర్యంలో కళా వెంకట్రావు 125వ జయంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కె.అగ్రహారంలో కళా వెంకట్రావు విగ్రహానికి పాలతో అభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కన్వీనర్ బండారు రామ్మోహనరావు, రాయుడు శ్రీరామచంద్రమూర్తి, వేణుగోపాల్, శాంసన్, తదితరులు పాల్గొన్నారు. ★ కోనసీమ అభివృద్ధికి కళా వెంకట్రావు ఎంతో కృషి చేశారని దువ్వూరి లక్ష్మీనారాయణ కొనియాడారు. అమలాపురం భూపయ్య అగ్రహారం వడ్డిగూడెం సమావేశ మందిరంలో కళా వెంకట్రావు జయంతి నిర్వహించారు. వెంకట్రావు మనవడు కళా వెంకట్రావు, సుభాషిణి, జితేంద్ర, పుత్సా కామేశ్వర్ పాల్గొన్నారు.

కె.అగ్రహారంలో కళా వెంకట్రావు విగ్రహం వద్ద కోనసీమ జేఏసీ సభ్యులు

'బదిలీల్లో అన్యాయం చేశారు'

కుటుంబ సభ్యులతో వచ్చి నిరసన తెలుపుతున్న లక్ష్మి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది బదిలీల్లో డబ్బులు, రాజకీయ నాయకుల సిఫార్సు లేఖలకు ప్రాధాన్యం ఇచ్చారని రంపె లక్ష్మి ఆరోపించారు. బదిలీల్లో తనకు తీవ్ర అన్యాయం చేశారని సోమవారం కలెక్టరేట్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. తాను అంబాజీపేట మండలం ముక్కామల సచివాలయంలో ఉద్యానశాఖ సహాయకురాలిగా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బదిలీల్లో భాగంగా వానపల్లి, అవిడి, మోడేకుర్రు సచివాలయాలను ఐచ్ఛికాలుగా ఎన్నుకున్నా, ఉన్నతాధికారులు మాత్రం సుదూర ప్రాంతమైన సఖినేటిపల్లి మండలంలోని మారుమూల సచివాయలయానికి బదిలీ చేశారని వాపోయారు. తనకు న్యాయం చేయాలని జేసీ నిశాంతికి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.

9న మధ్యాహ్నభోజన కార్మికుల సమ్మె

అమలాపురం గ్రామీణం: ఈ నెల 9న ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నిర్వహిస్తున్నట్లు ఎంఈవో జి.సూర్యప్రకాశానికి కార్మికుల యూనియన్ జిల్లా కన్వీనర్ లోవలక్ష్మి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సమ్మె నోటీసు అందించారు. మధ్యాహ్న భోజన బకాయిలు చెల్లించడంతోపాటు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ఎ.లక్ష్మీకుమారి, బి.మాధవి, కె.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు నిర్ణీత వస్త్రాలు ధరించాల్సిందే

యానాం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్న దుస్తుల భత్యం పొందుతున్న ప్రభుత్వ శాఖల ఉద్యోగులు తమకు కేటాయించిన ఏకరూప వస్త్రాలను విధిగా ధరించాలని ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు పుదుచ్చేరి ఫైనాన్స్‌శాఖ అండర్ సెక్రటరీ సోమవారం సర్కులర్ పంపించారు. పోలీసు, అగ్నిమాపక, జైళ్లు, ఆరోగ్యశాఖలతో పాటు విద్యుత్తు శాఖ టెక్నికల్ సిబ్బంది, ఎంటీఎస్, డ్రైవర్లు, తప్పనిసరిగా నిర్దేశించిన దుస్తులు ధరించి విధులకు హాజరు కావాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీల అందజేత

ముమ్మిడివరంలో టీవీ అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: సొంత వసతి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు మిషన్ శక్తి కార్యక్రమంలో ప్రభుత్వం టీవీలను సమకూర్చింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం, మార్కెట్ తదితర ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ హరీష్‌మాధుర్ చేతుల మీదుగా సోమవారం టీవీలను అందజేశారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లోని 84 అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీలు వచ్చినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.నిహారిక తెలిపారు. చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, గుత్తుల సాయి, సీహెచ్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కేకు కోసిన నాయకులు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భవ దినోత్సవాన్ని, మంద కృష్ణ మాదిగ పుట్టినరోజును సోమవారం కాట్రేనికోనలోని తామరచెరువులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి కేకు కోశారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సత్తాల ప్రసాద్, చెల్లూరి రాజబాబు, డేవిడ్‌రాజ్, నాగేశ్వరరావు, సుభాష్, ఎస్.నాగార్జున, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి డిమాండ్

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ముమ్మిడివరం నగర పంచాయతీ ఇంజినీరింగ్ విభాగ కార్మికులు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు పెట్టా శివప్రసాద్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ ఎదురుగా రహదారిపై మానవహారం నిర్వహించారు. జీతాలు పెంచాలని, ఐదేళ్ల సర్వీసు పూర్తయిన కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 13 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్, కమిషనర్ పి.రవివర్మకు వినతి పత్రం అందజేశారు.

క్షమాగుణం అలవర్చుకోవాలి

ఉప్పలగుప్తం: ప్రతి ఒక్కరూ క్షమాగుణం అలవర్చుకోవాలని వాకర్స్ హెల్త్ క్లబ్ ఉపాధ్యక్షుడు నూకల సత్యనారాయణ కోరారు. ప్రపంచ క్షమా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అమలాపురంలో క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రవణం వేణుగోపాలరావు, పెద్దిరాజు, లక్ష్మీనరసింహం, సత్యనారాయణ పాల్గొన్నారు.

మహారాజశ్రీ అమలాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.P.3/2025
Between:
Saladi Murthy Raju ...Petitioner
And
Vijaya Lakshmi Traders, Rajamahendravaram, Rep. by its Prop: Ganta Ramesh & 18 Others ...Respondents
ఈ నెంబరు I.P.లో పిటిషనర్‌ను Insolventగా డిక్లేర్ చేయించమని ఈ I.P.దాఖలు చేసినారు. సదరు I.P.లో శ్రీ కోర్టువారు జనరల్ నోటీసు Order వేయగా సదరు I.P. ది.11-07-25 తేదీన Respondentలు మరియు ఎవరికైనను ఆక్షేపణలు ఉన్నచో శ్రీ హైకోర్టు వారు ఎదుట వాయిదా తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకోవలెను.
శ్రీ కోర్టువారు ఉత్తర్వుల మేరకు
చింతపల్లి అజయ్‌కుమార్
అడ్వకేట్
అమలాపురం, విద్యుత్‌నగర్, అమలాపురం
ది. 07-07-2025. Cell: 98498 64699

ప్రత్యేక గ్రేడ్‌లో ఉద్యోగోన్నతికి ఆదేశాలు

యానాం, న్యూస్‌టుడే: అగ్నిమాపక శాఖలో 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 39 మందికి స్పెషల్ గ్రేడ్-1 గుర్తింపు కల్పించి స్టేషన్ ఆఫీసర్లుగా నియమిస్తూ హోం శాఖ జారీ చేసిన ఆదేశాలను ముఖ్యమంత్రి ఎన్.రంగసామి తన కార్యాలయంలో అందజేశారు. యానాం నుంచి లీడింగ్ ఫైర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న గాలి జానకిరామయ్య, లద్దిక గంగరాజు, నరహరిశెట్టి నాగేశ్వరరరావులకు ఉద్యోన్నతి లభించింది. పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఫైర్‌మెన్లు 22 మందికి లీడింగ్ ఫైర్‌మెన్(స్పెషల్ గ్రేడ్) కల్పించారు.

కృష్ణమాదిగ పోరాటం స్ఫూర్తిదాయకం

దండోరా స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం: ప్రజాసమస్యలపై కృష్ణమాదిగ పోరాటం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఉప్పలగుప్తంలోని బాలయోగి పార్కులో సోమవారం 31వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘ మండలాధ్యక్షుడు సత్తాల దుర్గారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ 60వ పుట్టిన రోజును పురస్కరించుకుని కేక్ కోశారు. అనంతరం దండోరా స్థూపాన్ని ఆవిష్కరించారు. దేశంశెట్టి లక్ష్మీనారాయణ, కడిమి చిన్నవరాజు, తొత్తరమూడి నరసింహమూర్తి, అరిగెల నానాజీ, చిక్కం భీముడు, సూర్యమోహన్, రవణం మధు, చిక్కం పెద్దబ్బులు, చీకట్ల కిషోర్, వంగలపూడి నరసింహామూర్తి, నాగులాపల్లి పాపారావు, తొత్తరమూడి దుర్గారావు పాల్గొన్నారు.

భూమి కౌలు మరియు లైసెన్స్ హక్కు నకు టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఐ.పోలవరం మండలం, మురమళ్ళ గ్రామంలో వేంచేసియున్న శ్రీ వీరేశ్వర స్వామి వారి దేవస్థానం మరియు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం తాలూకు హక్కుభుక్తంలో గల వివిధ గ్రామములో గల పల్లం భూములకు కౌలు వ్యవసాయము చేసుకొనుటకు మరియు దేవస్థాన ప్రాంగణమున పెండ్లి మండపములు వేసుకొను లైసెన్స్ హక్కునకు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించబడుచున్నది.

వ.సం.	దేవస్థానము పేరు, గ్రామము మరియు మండలం	వివరములు	వేలం పాట తేదీ, సమయం, స్థలం	పాట కాలపరిమితి
1	శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం, మురమళ్ళ గ్రా., ఐ.పోలవరం మం.	య.1-73 సెంట్లు, ఐ.పోలవరం గ్రామం	ది.21.07.2025న ఉదయం గం.10.00 లకు ఐ.పోలవరం గ్రామపంచాయతీ వద్ద	2025-2026.సం నుండి 2027-2028 సం. వరకు (3 సం.కాలపరిమితికి)
2	శ్రీ వీరేశ్వర స్వామి వారి దేవస్థానం, మురమళ్ళ గ్రా., ఐ.పోలవరం మం.	య.2.04 సెంట్లు T.కొత్తపల్లి గ్రామం	ది.21.07.2025 న ఉ.గం.11.00 లకు T.కొత్తపల్లి గ్రామపంచాయతీ వద్ద	2025-2026.సం నుండి 2027-2028 సం. వరకు (3 సం.కాలపరిమితికి)
3	శ్రీ వీరేశ్వర స్వామి వారి దేవస్థానం, మురమళ్ళ గ్రా., ఐ.పోలవరం మం.	దేవస్థాన ప్రాంగణమున పెండ్లి మండపములు వేసుకొను లైసెన్స్ హక్కు	ది.21.07.2025 న మధ్యాహ్నం గం.3.00 లకు దేవస్థానం వద్ద	19-08-2025 నుండి 18-08-2027 వరకు (2 సం.కాలపరిమితికి)

కావున ఆసక్తిగల రైతులు మరియు లైసెన్స్‌దారులు సదరు టెండర్ కమ్ బహిరంగ వేలం నందు పాల్గొనవలసినదిగా కోరుచున్నాము. వివరములకు దేవస్థానం కార్యాలయం పనిచేయు వేళలలో గాని, సెల్ నెం.8074880488 ను గాని సంప్రదించవలెను.

మురమళ్ళ
ది.07.07.2025.

అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి
శ్రీ వీరేశ్వర స్వామి వారి దేవస్థానం
మురమళ్ళ(గ్రా), ఐ.పోలవరం(మం) డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

(c) eenadu

మండపేట

•మండపేట •రామచంద్రపురం

నిత్యాన్నదాన పథకానికి రూ.50వేలు వితరణ

విరాళం అందజేసిన దంపతులకు స్వామివారి చిత్రపటం బహూకరణ

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పోరంకికి చెందిన దేవునిపల్లి రాంబాబు, పద్మావతి దంపతులు సోమవారం రూ.50వేలు విరాళం అందజేశారు. వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి చిత్రపటం బహూకరించారు. ఆలయ పర్యవేక్షకుడు కలని శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐటీఐ, డిగ్రీ, బీఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఎం.కిరణ్ సంజయ్, బి.లక్ష్మీనారాయణ, ఎం.వసంత్, మణిదీప్, పి.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు ఉ. 10 - మ. 1 ద్రాక్షారామ: 80085 74192 ద్వారపూడి: 91543 96553

చెత్త తొలగింది.. రాయవరం: రాయవరం మండలం లొల్ల ఎస్సీపేటలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సర్పంచి చాట్రాతి జానకీ రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై సర్పంచి స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో తొలగింపజేశారు. పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లించారు.

సమస్య: తాపేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాలవీధి డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడంలేదు. దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. – నాయుడు శ్రీనివాస్, తాపేశ్వరం

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి సుబ్బారావుకు వివరించగా ఆయన స్పందించారు. సిబ్బందిని పంపించి కాలువను శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

అండలు జారుతున్నా స్పందించరా..?

తాత్కాలిక రక్షణ చర్యలతోనే మమ

న్యూస్‌టుడే, పామర్రు: గౌతమీ గోదావరి ఎడమగట్టు పరిధిలోని సుందరపల్లి, కుమ్మరివారి సావరం వద్ద 40.5 కిమీ నుంచి 40.8 కిమీ వరకూ అతి బలహీన ప్రాంతంగా అధికారులు గుర్తించినా శాశ్వత చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం తప్పడం లేదు. దాదాపు ఆరేళ్లుగా గట్టు ప్రమాదకర స్థితిలోనే ఉన్నా ఏటా వరదల సమయంలో తాత్కాలిక రక్షణ చర్యలతో చేతులు దులిపేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏటిగట్టును శాశ్వతంగా పటిష్ఠపర్చడానికి దాదాపు రూ.53.55 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేశారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం జూన్ నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలని అనుకున్నా నిధులు విడుదల కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఈలోగా వరదల సీజన్ వచ్చింది. ప్రస్తుతం గోదావరికి ఎర్ర నీరొస్తోంది. క్రమంగా వరద పరిమాణం పెరుగుతోంది. దీనితో మళ్లీ తాత్కాలిక రక్షణ చర్యలకు అధికారులు ఉపక్రమించారు. అయితే ఈసారి వరదలొచ్చాక కాకుండా ముందుగానే స్పందించడం గమనార్హం. ఎడమగట్టు పలు ప్రాంతాల్లో బలహీనపడి పరివాహక ప్రాంతాల్లోని వారిని భయభ్రాంతులను గురిచేస్తోంది. కె.గంగవరం మండలంలోని కూళ్ల, సుందరపల్లి, కుమ్మరివారి సావరం, కోటిపల్లి, మసకపల్లిలతో పాటు లంకగ్రామం శేరిలంకలో కూడా గట్టుకోతకు గురయింది. అలాగే సరిహద్దులోని కాజులూరు మండలానికి చెందిన పిల్లంక, తాళ్లరేవు మండలానికి చెందిన గోవలంక ప్రాంతాల్లో కూడా గట్టు బలహీనంగానే ఉంది. వరదలొస్తాయని భావించి రూ.30 లక్షలతో చర్యలు చేపట్టారు.

సుందరపల్లి, కూళ్లలో..

సుందరపల్లి, కుమ్మరివారి సావరం వద్ద గోదావరి ప్రవాహం నేరుగా గట్టును తాకుతుంది. దీనివల్ల అండలు జారి కిందపడిపోతాయి. గతంలో నది గట్టుకు దాదాపు కిలో మీటరు దూరంలోనే ఉండేది. ప్రవాహ వేగం పెరిగి గట్టు పూర్తిగా తెగిపోయి నదీగర్భంలో కలిసిపోయింది. హైమార్జిన్ కూడా నెమ్మదిగా కోతకు గురవుతోంది. 1986 వరదల ప్రమాణాల ప్రకారం గండి పడడం ఖాయమని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అలా జరిగితే రామచంద్రపురం నియోజకవర్గంలోని పలు గ్రామాలు జలమయమవుతాయి. గతంలో టీ ఆకారంలో నాలుగు గ్రోయన్సు కట్టారు. ప్రస్తుతం అవి చెల్లాచెదురయ్యాయి. వీటిని సరిచేయాలి. అలాగే 34.4 కిమీ నుంచి 36 కిమీ వరకూ కూళ్ల వద్ద కూడా గట్టు బలహీనంగా ఉంది. సుమారు 5 మీటర్ల గట్టును ఆనుకుని ఉన్న లంకభూములు నదీగర్భంలో ఇప్పటికే కలిసిపోయాయి. ఈ రెండింటినీ పూర్తిస్థాయిలో పటిష్ఠపరచడానికి రూ.53.55 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ నిధుల మంజూరుకు కృషిచేస్తున్నా వరదల సీజన్‌కు రాలేదు.

కూళ్ల వద్ద ఏర్పాటుచేసిన ఇసుక బస్తాలు

ఆందోళన చెందవద్దు.. కుమ్మరివారిసావరం, కూళ్ల, శేరిలంకల వద్ద గట్టు బలహీనంగా ఉన్న మాట వాస్తవమే. కుమ్మరివారి సావరం వద్ద ఈసారి చాలా ముందుగానే తాత్కాలిక రక్షణ పనులు చేయిస్తున్నాం. ఇసుకబస్తాలు, సర్వేబాదులు వేసి ప్రవాహం గట్టుకు చేరకుండా నిరోధించే చర్యలు మరో నాలుగు రోజుల్లో పూర్తవుతాయి. కోటిపల్లి వరద రక్షణ సామగ్రిని గోదాములో సిద్ధంగా ఉంచాం. కూళ్ల, సుందరపల్లిలో కూడా ఇసుక బస్తాలు, సర్వేబాదులు ఉన్నాయి. వరదలొస్తే గట్టుకు గండిపడకుండా రక్షణ కల్పిస్తాం. గతంలో వేసిన గ్రోయన్సు వల్ల నదీప్రవాహ వేగం ఇక్కడ చాలా వరకూ తగ్గింది.

– రెహమాన్, ఏఈ, కన్సర్వేటివ్, కోటిపల్లి

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పత్రం అందిస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, రామచంద్రపురం: రామచంద్రపురం మండలం ఉట్రుమిల్లి గ్రామానికి చెందిన గాదంశెట్టి లక్ష్మీనారాయణ కాలేయ మార్పిడి శస్త్రచికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.10 లక్షల విలువైన మంజూరు పత్రాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు తన క్యాంపు కార్యాలయంలో అందించారు. బాధితుడు ఇటీవల మంత్రి సుభాష్‌ను కలిసి సమస్యను విన్నవించుకోగా సీఎం సహాయనిధి కోసం సిఫారసు చేయగా ఆమోదం లభించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రానికి పెద్దకొడుకుగా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారని చెప్పారు. బాధితుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ద్వారపూడి: సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని అర్హులందరికీ అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఎస్ఈసీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం తాపేశ్వరం గ్రామంలో ఆయన పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. అనంతరం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, నేతలు ముత్యాల పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘానికి ఎమ్మెల్యే అభినందన

మండపేట: పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ఐవీఆర్ఎస్ ద్వారా చేపట్టిన సర్వేలో మండపేట పురపాలక సంఘం రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన సందర్భంగా ఎస్ఈసీ ఛైర్మన్, ఎమ్మెల్యే జోగేశ్వరరావు మున్సిపల్ కమిషనర్, సిబ్బంది, మెప్మా సిబ్బందిని అభినందించారు. ఇంటింటా చెత్త సేకరణలో మెప్మా మహిళలు చేసిన కృషితో ఈ గుర్తింపు లభించిందన్నారు. భవిష్యత్‌లో ఇలాగే పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షిస్తూ పట్టణవాసులు సహకరించాలన్నారు.

పోరాటయోధుడు మంద కృష్ణ : జవహర్

ఛైర్మన్ జవహర్, ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మండపేట, న్యూస్‌టుడే: దళితులకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడేందుకు మూడు దశాబ్దాల క్రితం ప్రారంభించిన ఎమ్మార్పీఎస్‌తో ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు మందకృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం సాగించారని ఎస్సీ కమిషన్ ఛైర్మన్, మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ కొనియాడారు. అన్ని వర్గాల పేదల అభ్యున్నతికి ఆయన పాటుపడ్డారని చెప్పారు. సోమవారం సూర్య కన్వెన్షన్ హాలులో ఎమ్మార్పీఎస్ నాయకులు దూలి జయరాజు, బుంగ సంజయ్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకల్లో ఆయన మాట్లాడారు. మరో అతిథి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ తన తండ్రి వేగుళ్ల వీర్రాజు మున్సిపల్ ఛైర్మన్‌గా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ అనే బేధంలేకుండా అందరి అభ్యున్నతికి కృషిచేశారని గుర్తుచేశారు. అంతకుముందు పట్టణంలో పార్టీ పతాకావిష్కరణ చేశారు. బాణసంచా కాల్పులతో ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో కోన సత్యనారాయణ, కుక్కల రామారావు తదితరులు పాల్గొన్నారు. ● రాయవరం: ఎమ్మార్పీఎస్ వేడుకలు సర్పంచి చంద్రమళ్ల రామకృష్ణ, వార్డు సభ్యుడు చంటి ఆధ్వర్యంలో నిర్వహించారు. వృద్ధులకు పండ్లు, వస్త్రాలు అందించారు. సంఘ ఐక్యత, అభివృద్ధికి కృషిచేసిన మండపల్లి నాగేశ్వరరావు, చంద్రమళ్ల యాకోబులను సత్కరించారు. ఈ సందర్భంగా రాయవరం, గ్రామ మండల కమిటీలను ఎన్నుకున్నారు. వెంటూరు, చెల్లూరు, వెదురుపాక, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి తదితర గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ వేడుకలు నిర్వహించారు.

అషూర్ ఖానాల నిర్వహణకు నిధులు

నగదు అందిస్తున్న వాసంశెట్టి సత్యం

ద్రాక్షారామ: మొహర్రం సంతాప దినాల్లో అషూర్‌ఖానా (పంజా)ల నిర్వహణకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నుంచి పంజాకు రూ.5 వేల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ద్రాక్షారామలోని ఆరు పంజాలకు రూ.30 వేలను సోమవారం మంత్రి సుభాష్ తండ్రి సత్యం వాటి నిర్వాహకులకు అందించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యుడు అబ్దుల్ అజీమ్ రాష్ట్రంలో అన్నింటికి నిధులు మంజూరు చేయగా కోనసీమ జిల్లాలోని 60 అషూర్‌ఖానాలకు రూ.3 లక్షలు విడుదలయ్యాయి. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యుడు హాజీ ముఖరం హుస్సేన్, నాయకులు సయ్యద్ పాషా, మీర్జా రజాహుస్సేన్, మీర్జా సికిందర్ హుస్సేన్, మీర్జా, జేషన్ అబ్బాస్, షేక్ రబ్బానీ, సయ్యద్ బడాబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో డంపింగ్‌యార్డు కీలకం

యార్డు పరిశీలనలో కలెక్టర్ మహేష్‌కుమార్, ఆర్డీవో అఖిల, అధికారులు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: డంపింగ్ యార్డ్ నిర్వహణనేది పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆరోగ్యంలో అత్యంత కీలకమైన అంశమని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ చెప్పారు. సోమవారం పట్టణంలోని డంపింగ్‌యార్డును అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. చెత్త, ప్రాసెసింగ్ విధానం, అనంతరం మట్టి, ప్లాస్టిక్ ఇతరాలను వేరుచేసే పరికరాల్ని చూశారు. చెత్తను వేరుచేసే తరుణి ఏజెన్సీస్ గుత్తేదారుతో మాట్లాడారు. పురపాలక సంఘం పరిధిలో రోజూ చెత్త సేకరణ జరిగే తీరును మున్సిపల్ కమిషనర్ రాజు నుంచి తెలుసుకున్నారు. డంపింగ్‌యార్డు నుంచి క్రిమికీటకాలు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలన్నారు.

బీసీ బాలికల వసతిగృహం సందర్శన..

పట్టణంలోని ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల వసతిగృహాన్ని కలెక్టర్ సందర్శించారు. రక్షణ కల్పించేందుకు వసతిగృహ కిటికీలు, గుమ్మాలకు తెరలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వసతిగృహ నిర్మాణానికి రెండెకరాలు మున్సిపల్ పార్కులోని కొంత స్థలాన్ని కేటాయించి ప్రహరీ నిర్మించాలని, క్రీడా ప్రాంగణంగా తయారుచేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆర్డీవో అఖిల, బీసీ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

ద్వారపూడి: ఏడిద జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతి చదివి ట్రిపుల్ఐటీకి ఎంపికైన మల్లిపూడి జాహ్నవి, అడబాల విజయ, పాడిశెట్టి యశస్విని, జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన పంతంగి రమ్యశ్రీ, కొమ్ము శైలజ, కోసూరి శాలినలను సోమవారం పాఠశాల విద్యా కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. వారిని గ్రామపెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, విద్యా కమిటీ ఛైర్మన్ నూతిక రాజేష్, హెచ్ఎం చింతా జయలక్ష్మి, తెదేపా గ్రామ అధ్యక్షుడు పర్వతిని వీర్రాజు, నాయకులు రామిశెట్టి రాజా, మేకా జేజిబాబు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులొస్తే సాహసం చేయాల్సిందే..

సంగావారివీధి కేపీరోడ్డులోని విద్యుత్తు స్తంభం చుట్టూ పలు తీగలను కట్టేశారు. ప్రయివేట్ ఇంటర్నెట్ ప్రొవైడర్లు, కేబుల్ టీవీ ఆపరేటర్లు, ఇతరత్రా వ్యాపార సంస్థలకు చెందిన సిబ్బంది తీగలు, జంక్షన్ బాక్సులను గజిబిజిగా బిగించారు. ఒకరితో మరొకరు పోటీపడుతున్నట్లుగా వీటిని ఏర్పాటుచేయడంతో ఆ స్తంభం చుట్టూ బాక్సులు, తీగలే కనిపిస్తున్నాయి. విద్యుత్తు సమస్యలు తలెత్తితే సరిచేయడానికి స్తంభం ఎక్కేందుకు సైతం అవకాశం లేకుండా మారింది. వాటన్నింటినీ తప్పించుకుని స్తంభం ఎక్కడంతో పాటు తీగలను సరిచేసి సరఫరా పునరుద్ధరించాలంటే పెద్ద సాహసం చేయాల్సిందేనని స్థానికులు చెబుతున్నారు. ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ప్రమాదవశాత్తు కాలు లేదా చేయి ఈ వైర్లలో చిక్కుకుంటే ప్రాణాపాయం తప్పదు. పిచ్చుకగూళ్లను తలపిస్తున్న వీటి గురించి విద్యుత్తు శాఖ ఏడీఈ సీహెచ్ శ్రీధర్‌ని వివరణ కోరగా అనధికారంగా ఏర్పాటుచేసిన వైర్లను తొలగించాలని ఇప్పటికే నోటీసులు జారీ చేశామని చెప్పారు. - న్యూస్‌టుడే, మండపేట

వారం రోజుల్లో పచ్చని పందిరి సిద్ధం

మండపేట మండలం తాపేశ్వరం రహదారి ఎస్‌బీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఎదురుగా విద్యుత్తు స్తంభాన్ని పిచ్చి మొక్కలు, పాదులు పెనవేసుకున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో స్తంభంతో పాటు తీగలను ఆసరాగా చేసుకుని పచ్చనిపందిరిగా రూపాంతరం చెందుతున్నాయి. మరో వారం రోజులు ఇలాగే వదిలేస్తే పందిరిగా మారడం ఖాయమని స్థానికులు చెబుతున్నారు. అలాగే విద్యుత్తు సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్తంభం పక్క నుంచే వాహనాల రాకపోకలు ఎక్కువగా సాగించడంతో ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందోనని భయం వెంటాడుతోంది. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా వెంటనే పిచ్చిమొక్కలు, తీగలను తొలగిస్తామన్నారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

పల్లెల స్వచ్ఛతకు ఓఎన్జీసీ సహకారం

ఆలమూరు: కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు పల్లెల స్వచ్ఛతకు ఓఎన్జీసీ సహకారం అందిస్తుందని సంస్థ ప్రతినిధులు కె.శ్రీకృష్ణ, బి.శివకుమార్ తెలిపారు. సంధిపూడి పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సర్పంచి తోట భవాని అధ్యక్షతన స్వచ్ఛ భారత్.. స్వచ్ఛత సేవ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరు చేసేందుకు తమవంతు సాయం అందిస్తామని తెలిపారు. పర్యావరణ హితం కోసం నార సంచులను నాయకుల చేతుల మీదుగా గ్రామస్థులకు పంచారు. ఎంపీటీసీ సభ్యురాలు తోలేటి సంతోషిణి, నాయకులు తోట వేంకటేశ్వర్లు, దొడ్డా సుబ్బారావు, నల్లా వెంకన్న పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఓఎన్జీసీ అధికారులు

సమ్మెపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

హక్కుల పరిరక్షణకే సార్వత్రిక సమ్మె

కాజులూరు, న్యూస్‌టుడే: కార్మిక, కర్షక హక్కుల పరిరక్షణకు ఈనెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు కోరారు. సోమవారం పల్లిపాలెం, కోలంక, దుగ్గదూరు గ్రామాల్లో వారు పర్యటించి కౌలు రైతులు, ఉపాధి కూలీలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త సమ్మె నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కష్ట జీవులంతా ఆరోజు తహసీల్దారు కార్యాలయానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నందికోళ్ళ సత్తిబాబు, దవులూరి సత్యారావు, చల్లా సత్తిబాబు, రాయుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు ఆర్థిక సాయం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు పెంకే శివప్రసాద్ ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న సందర్భంగా అసోసియేషన్ తరఫున సోమవారం రూ.30 వేల ఆర్థికసాయం అందించారు. కుందాలమ్మ చెరువు గ్రామంలోని అతని ఇంటికి వెళ్లి ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం జోన్ అధ్యక్షుడు మద్దిరెడ్డి వరప్రసాద్ (నాని), కార్యదర్శి వీరబాబు, మాజీ అధ్యక్షుడు గాదం మధుసూదన్‌రావు, సభ్యులు అంజి, వెంకన్న, పాపాచారి, యండమూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలాంత్రంలో మంత్రి సుభాష్ పర్యటన

పామర్రు, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు విజయవంతంగా సాగుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బాలాంత్రం, గుడిగళ్ల గ్రామాల్లో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, వాటిని అందుకున్న ప్రజల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు మేడిశెట్టి రవికుమార్, మల్లిపూడి బుజ్జి పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలుకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాధాన్యతనిస్తున్నారని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. సోమవారం పసలపూడిలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ, అభివృద్ధి వివరాల కరపత్రాలు అందించారు. రామచంద్రపురం సాగునీటి సంఘం ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, తెదేపా గ్రామ అధ్యక్షుడు మల్లిడి సూర్రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్రి వెంకటరెడ్డి (కృష్ణ), వార్డుసభ్యుడు సత్తి వెంకటకృష్ణారెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తాం

ఆలమూరు: పినపళ్ల నుంచి మండపేట గొల్లపుంత వెళ్లే మార్గంలో కుప్పకూలిన గొడ్డుకాలువ వంతెనను సోమవారం మురుగునీటి పారుదల శాఖ డీఈ పోచారావు, జేఈ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించి పంపనున్నట్లు పోచారావు తెలిపారు. రైతుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడకుండా తాత్కాలికంగా చర్యలు తీసుకుంటామని సుబ్రహ్మణ్యం చెప్పారు. చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం బస్టాండ్ ఎదురుగా నిలిపే ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వీరబాబు తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. అమలాపురం మండలం బండారులంకకు చెందిన గోళ్ల నాగబసవరాజు (54) ద్విచక్రవాహనాలను దొంగతనం చేస్తుండగా ఎస్సై శ్రీనివాస్ అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అతడి నుంచి రూ.10వేల నగదు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అతడిని అమలాపురం కోర్టులో హాజరు పరుచగా 14 రోజుల రిమాండ్ విధించారన్నారు.

ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోండి

రైతుకు డ్రోన్ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్

మండపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు తక్కువ ధరలో అందిస్తున్న యంత్ర పరికరాలు, డ్రోన్ల సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈసీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. వరిచేలలో క్రిమిసంహారక మందులు, ఎరువులు పిచికారీ చేసే డ్రోన్లను రాయితీపై మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణితో కలిసి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన రైతు గ్రూపులకు అందించారు. మండపేటకు చెందిన శ్రీజనార్దనస్వామి ఆగ్రోటెక్ సీహెచ్‌సీ గ్రూపు, రాయవరం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన శ్రీవరలక్ష్మి కిసాన్ డ్రోన్ సీహెచ్‌సీ గ్రూపు రైతులకు డ్రోన్లు అందజేశారు. వీటి ఖరీదు రూ.19,60,000 కాగా ప్రభుత్వ రాయితీ రూ.15,68,000 ఉంటుందని రైతులు రూ.3,92,000 చెల్లించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చింతపల్లి రామకృష్ణ, వైస్‌ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, రాయవరం మండల వ్యవసాయ శాఖ అధికారి కె.వి.ఎన్.రమేష్ పాల్గొన్నారు.

కళా వెంకటరావు ఆదర్శనీయుడు

అంబాజీపేట, న్యూస్‌టుడే: కోనసీమ అభివృద్ధికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి కళా వెంకటరావు అని వక్తలు కొనియాడారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించి రైతు బాంధవుడిగా ఖ్యాతి గడించారన్నారు. ఆయన 125వ జయంతి సందర్భంగా సోమవారం స్వగ్రామం ముక్కామలలో పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

కొత్తపేట: ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో కళా వెంకట్రావు కీలకపాత్ర పోషించారని, కోనసీమ ప్రగతికి ఎనలేని కృషి చేశారని గాంధేయవాది దుళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కళావెంకట్రావు జయంతిని పురస్కరించుకుని పలివెలలో జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కంకటాల శ్రీరామ్మూర్తి, వి.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శతచండీ మహాయాగం

శతచండీ మహాయాగంలో అమ్మవారు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: లలితానగర్ ప్రాంగణంలో అంకుర ఫౌండేషన్ వ్యవస్థాపకులు మామిడి శర్వాణి ఆధ్వర్యంలో ప్రారంభమైన శివ పంచాయతన పూర్వక శతచండీ మహాయాగం భక్తిశ్రద్ధలతో సాగుతోంది. చీమలకొండ నరేష్, వింజమూరి సాయి శర్మ తదితరులు నిర్వహణలో భాగస్వాములవుతున్నారు. గాయత్రి నృత్యనికేతన్ ఆధ్వర్యంలో నృత్యప్రదర్శనలు, సాయిరాం కోలాటం, ఇండియన్ మెగా డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక నృత్య ప్రదర్శలు ఏర్పాటుచేశారు.

రేపు శాకాంబరిగా జ్ఞానసర్వసతి..

రామచంద్రపురం జ్ఞానసరస్వతి అమ్మవారిని ఈనెల 9న శాకాంబరిగా అలంకరిస్తామని పండితులు పెదపూడి సాయి విశ్వనాథశర్మ పేర్కొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

ద్రాక్షారామ: ద్రాక్షారామలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ సప్తసప్తాహ మహోత్సవాల్లో ఆరో వారం మొదలైన సందర్భంగా సోమవారం స్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా విద్యుద్దీపాలతో అలంకరించిన ఉష్ట్ర వాహనంపై ప్రసన్నాంజనేయస్వామిని కొలువుదీర్చి ద్రాక్షారామ, వెలంపాలెం వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఈనెల 21వ తేదీతో వేడుకలు ముగియనున్న నేపథ్యంలో ఆరోజు భారీ ఊరేగింపు ఉంటుందని ప్రసన్నాంజనేయస్వామి బాల భక్త సమాజం అధ్యక్షుడు బోణం శ్రీనివాసు తెలిపారు.

ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయస్వామి గ్రామోత్సవం

పర్యావరణ పరిరక్షణకు కృషి

కాజులూరు: పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. సోమవారం ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండలంలోని 26 గ్రామాలకు 500 కొబ్బరిమొక్కలు వచ్చాయని, ఉపాధి కూలీలతో నాటించాలని సూచించారు. గ్రామస్థులు, రైతులకు ఇబ్బందిలేని ప్రాంతాల్లో నాటించి పరిరక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.ఈశ్వరి, రవిప్రసాద్, కె.సూరిబాబు, సుబ్బారాయుడు, హేమాదేవి, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

పామర్రు, న్యూస్‌టుడే: ప్రస్తుతం వరదల సమయం కావడంతో గోదావరిలో నీటిమట్టం పెరుగుతోందని, కరకట్టలు బలహీనంగా ఉన్న చోట్ల అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఆర్డీవో దేవరకొండ అఖిల చెప్పారు. రెవెన్యూ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని, వరద పరిస్థితిని ఎప్పటికపుడు తెలియజేయాలని ఆదేశించారు. సోమవారం కె.గంగవరం మండలంలో గౌతమీ గోదావరి ఎడమగట్టు బలహీనంగా ఉన్న కుమ్మరివారి సావరం, కూళ్లలో పర్యటించారు. కుమ్మరివారి సావరంలో రూ.30 లక్షలతో చేపట్టిన గట్టు రక్షణ పనులను ఆమె పరిశీలించారు. వరద ఎక్కువైతే కోటిపల్లిలో పునరావాస కేంద్రం ఏర్పాటుచేస్తామని, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా, కోటిపల్లి-ముక్తేశ్వరం రేవులో ప్రయాణాలు లేకుండా చూడాలని సూచించారు. కన్జర్వేటివ్ ఏఈ రెహ్మాన్, ఇరిగేషన్ ఏఈ సుందర్‌సింగ్, ఆర్ఐ వెంకటేశ్వరరావు, రెవెన్యూ, జల వనరుల శాఖ సిబ్బంది స్వామినాయుడు, ఆనందరాజు, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కావలెను
Accounts, Invoices, Quotations & డేటా ఎంట్రీ చేయుటకు కంప్యూటర్ అనుభవం గలవారు కావలెను.
Qual: Min. ఇంటర్
SN Engineering & Enterprises
Mandapeta, Cell: 70753 04232

(c) eenadu

1200 కి.మీ. వచ్చి.. 15 కి.మీ. వెళ్లలేక..!

రఘుదేవపురం వద్ద నిలిపివేసిన పోలవరం జలవిద్యుత్తు కేంద్రం సామగ్రి ట్రాలీ

చెరువును తలపిస్తున్న గుంత

సీతానగరం, న్యూస్‌టుడే: గోదావరికి వరద ఉద్ధృతి పెరుగుతుండడంతో పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడానికి భారీ యంత్ర సామగ్రిని అత్యవసరంగా తరలిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం అంగులూరు వద్ద నిర్మిస్తున్న 960 మెగావాట్ల జల విద్యుత్తు కేంద్రానికి తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం గోదావరి ఎడమగట్టు నుంచే సామగ్రి చేర్చాలి. జలవిద్యుత్తు కేంద్రం వద్ద డ్రాఫ్ట్ ట్యూబ్‌లైనర్స్ ఏర్పాటుకు 12 యూనిట్లలో ఇప్పటికే 11 లైనర్స్ చేరాయి. టర్బైన్ నుంచి వేగంగా వెలువడే నీటిని డ్రాఫ్ట్ ట్యూబ్ మీద ఒత్తిడి లేకుండా చేయడానికి ఉక్కుతో తయారుచేసిన లైనర్ ఉపయోగిస్తారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ బీహెచ్‌ఈఎల్ నుంచి ఈనెల 2వ తేదీన చివరి 12వ లైనర్స్ సామగ్రి 8 ట్రాలీల్లో బయలుదేరాయి. సుమారు 1200 కిలోమీటర్లు అయిదు రోజుల్లో ప్రయాణించి సోమవారం తెల్లవారుజామున సీతానగరం మండలంలోని రఘుదేవపురం వద్ద నిలిపివేశారు. రఘుదేవపురం నుంచి పురుషోత్తపట్నం ఏటిగట్టుకు వెళ్లే 15 కిలోమీటర్ల రోడ్డు భారీ గుంతలతో ఉంది. టన్నుల కొద్దీ బరువు కలిగిన సామగ్రితో ట్రాలీలు ఇక్కడ నిలిచిపోయాయి.

ఈనాడు
తూర్పుగోదావరి
మంగళవారం జులై 8, 2025

మా జీవితాల్లో వెలుగు నింపిన ముఖ్యమంత్రి

కలెక్టర్ దత్తత తీసుకున్న కుటుంబంలోని యువకుడి భావోద్వేగం

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): "ముఖ్యమంత్రి ఈ నెల 1న మా ఇంటికి రావడంతో తమ జీవితాల్లో వెలుగు వచ్చింది. ఇది మరుపురాని సంఘటన అని" అని ఇటీవల కలెక్టర్ దత్తత తీసుకున్న కుటుంబంలోని యువకుడు మోహన్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనలో భాగంగా తాళ్లపూడి మండలం మలకపల్లిలోని యువకుడి ఇంటికి వెళ్లి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, పలు హామీలు ఇచ్చారు. ఈ కుటుంబాన్ని తాను దత్తత తీసుకుంటున్నని కలెక్టర్ ప్రశాంతి ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో మోహన్‌కు రవళి స్పిన్నింగ్ మిల్లులో క్యాట్రికన్ డిస్టిలరీ పోస్టు కల్పించారు. ఇప్పటికే ఇతను ఇక్కడ జూనియర్ ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తనకు మంచి పోస్టు కల్పించడంతో సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ ప్రశాంతిని కలిసి వివరాలు తెలియజేశారు. ముందస్తుగా నియామక ఉత్తర్వులను మిల్లు యాజమాన్యం జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంకు, తమ కుటుంబానికి మార్గదర్శిగా ఉన్న కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ అతడిని అభినందిస్తూ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో మెరుగైన ఆర్థికస్థితిలో ఉన్న 10 శాతం వ్యక్తులు, వివిధ పారిశ్రామిక సంస్థల తోడ్పాటుతో నిరుపేదలుగా ఉన్న 20 శాతం మందిని ఉన్నతస్థాయికి తీసుకెళ్లడమే మార్గదర్శి బంగారు కుటుంబం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. దీనిలో భాగంగా రవళి స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం జీవనోపాధి కల్పనకు ముందుకు వచ్చిందన్నారు.

కొత్త పోస్టు వివరాలు ప్రశాంతికి తెలుపుతున్న మోహన్

జంట జబ్బుల ఉప్పెన..!

● చుట్టుముట్టేస్తున్న రక్తపోటు.. బెంబేలెత్తిస్తున్న మధుమేహం

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం

జంట జబ్బులుగా పేరున్న మధుమేహం, అధిక రక్తపోటు రుగ్మతలతో జిల్లా ప్రజలు సతమతమవుతున్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) సర్వేలో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, తీవ్ర ఒత్తిడి, వ్యసనాలు ఇలాంటి వెన్నో వీటికి కారణమవుతున్నాయి. మెరుగైన జీవనశైలి అలవర్చుకుని చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే వీటికి దూరంగా ఉండొచ్చన్నది నిపుణుల సూచన.

ఎన్‌సీడీ సర్వే వివరాలు

గ్రామ, వార్డు సచివాలయాలు : 512

సర్వే చేయాల్సిన కుటుంబాలు : 6,54,981

పూర్తి చేసింది : 5,62068

ఇదీ పరిస్థితి..

ప్రస్తుతం ఎన్‌సీడీ సర్వే 3.0 తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా జరుగుతోంది. తొలి, రెండో దశ సర్వేలో 30 ఏళ్లు పైబడిన వారిని పరీక్షలు చేశారు. ప్రస్తుతం 18 ఏళ్లు నిండిన వారికి పరీక్షలు చేస్తుండడంతో కొత్త కేసులు అధికంగా నమోదవుతుండటం గమనార్హం. గతంలో 45 ఏళ్లు దాటిన వారిలోనే మధుమేహం, బీపీ లక్షణాలు కనిపించేవి. ప్రస్తుతం 25 ఏళ్ల వారికి పరీక్షలు చేయాల్సిన పరిస్థితి. సర్వేలో 30-40 ఏళ్ల మధ్యవారిలో అధికంగా బీపీ, మధుమేహం లక్షణాలు ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే నగరాల్లో ఉండే వారే అధికంగా వీటి బారిన పడుతున్నారు.

● కోరుకొండ మండలానికి చెందిన ఓ గ్రామంలో పది మంది సభ్యులున్న కుటుంబంలో అందరికీ మధుమేహం ఉన్నట్లు తేలింది. వీరిలో 60 ఏళ్ల వారు ముగ్గురు, 45 ఏళ్లలోపు ఇద్దరు, 32 ఏళ్ల లోపు ఇద్దరు, 26 ఏళ్ల యువకుడికి సైతం మధుమేహం లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు.

కొవ్వూరు డివిజన్ పంగిడిలో బీపీ పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

18 ఏళ్లు నిండినవారు : 15,43,830

సర్వే పూర్తి చేసింది : 13,94,741 (90.34%)

రక్తపోటు కేసులు: 1,97,779 (18.24%)

మధుమేహం : 1,67,891 (15.54%)

మెరుగైన జీవనశైలితోనే ఆరోగ్యం

మెరుగైన జీవనశైలి, వ్యాయామంతో మధుమేహాన్ని అదుపు చేయవచ్చు. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 18-23 మధ్య ఉండేలా చూసుకోవాలి. ఊబకాయం, ఒత్తిడి వల్ల పలు రుగ్మతలు వచ్చే ప్రమాదం ఉంది. 25 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ మధుమేహం పరీక్ష చేయించుకోవాలి. ఇటీవల పిల్లల్లోనూ దీని తాలుకా లక్షణాలుంటున్నాయి. వయసుతో సంబంధం లేకుండా అందరికీ రక్తపోటు వచ్చేస్తోంది. సాధ్యమైనంత వరకు ఒత్తిడిలేని జీవన విధానం అలవర్చుకోవాలి. మంచి నిద్ర, పండ్లు కూరగాయలను ఆహారంలో భాగం చేసుకోవాలి.

- దుర్గాప్రసాద్, ఎండీ, రాజమహేంద్రవరం

జలం వృద్ధి.. మురుగు శుద్ధి

ప్రయోగాత్మకంగా మ్యాజిక్ డ్రెయిన్లు

ఈనాడు, రాజమహేంద్రవరం : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో కాలువలు నిర్మిస్తున్నా వాటి నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల నిత్యం మురుగు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నమూనా విధానంలో కచ్చా డ్రెయిన్లు నిర్మించాలని రాష్ట్రస్థాయిలో నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం సోమవరం గ్రామంలో ప్రయోగాత్మకంగా నిర్మించగా మంచి ఫలితం వచ్చింది. వీటి నిర్మాణంపై ప్రతి జిల్లా నుంచి ఇంజినీరింగ్, సాంకేతిక, క్షేత్ర సహాయకులకు సోమవారం విజయవాడలో తర్ఫీదు ఇచ్చారు.

● తూర్పుగోదావరి జిల్లాలో గోకవరం మండలం అచ్చుతాపురాన్ని ఎంపిక చేశారు. కాకినాడ జిల్లాలో వన్నెపూడి, చిత్రాడ, అమరవిల్లి.. కాకినాడ గ్రామీణంలోని రాయుడుపాలెంలో రెండు ప్రాంతాలను గుర్తించారు. వీటిలో రాయుడుపాలెంలో నిర్మించే అవకాశం ఉంది. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నీరు ఇంకేందుకు అవకాశాలు తక్కువగా ఉన్నందున ఇక్కడ అమలు చేయడం లేదు.

కాలువ నిర్మాణ పనులు

నిర్మాణం ఎలా అంటే..

● సాధారణంగా 150 మీటర్ల ఈసీ డ్రెయిన్‌కు దాదాపు రూ.1.50 లక్షల వ్యయమవుతుండగా ఈ విధానంలో నిర్మిస్తే సుమారు రూ.75 వేలకే పూర్తవుతుంది. ● 150 మీటర్ల పొడవు, 0.5 మీటర్ల వెడల్పుతో తొలి 50 మీ.లను 0.4 మీ.లోతు, తరువాత 0.5 మీ.. అలానే చివరి 50 మీటర్లను 0.6 మీటర్ల మేర తవ్వి మట్టి తొలగించాలి. ● కాలువలో ప్రతి 30 మీటర్లకు ఒకచోట 1.2 మీ. మేర ఇంకుడు గుంత తవ్వాలి. కాలువ తవ్విన ప్రాంతంలో ఇళ్ల వైపు అడ్డుగా నాపరాళ్లు ఏర్పాటుచేసి తొలుత 225 ఎం.ఎం పరిమాణంలో కొండరాయి, తరువాత 150 ఎం.ఎం మెటల్, చివరిగా 10 ఎం.ఎం మెటల్ వేయాలి. ఇంకుడు గుంతల్లోనూ ఇదే విధానంలో నిర్దేశిత పరిమాణంలో రాయి, మెటల్‌తో నింపాలి. ● ఈ తరహా నిర్మాణాల వల్ల నీరు ఎప్పటికప్పుడు ఇంకిపోవడంతో మురుగు, దోమల సమస్య ఉండదు. భూగర్భ జలాల వృద్ధికి సైతం తోడ్పడుతుందని డ్వామా పీడీ నాగమహేశ్వరరావు తెలిపారు.

ఇల కైలాసం.. అరుణాచలేశ్వర క్షేత్రం

కొలువుదీరిన 63 నాయనార్ల విగ్రహాలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని రాచపల్లి శ్రీరమణసేవాశ్రమంలో వేంచేసి ఉన్న అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో 63 మంది నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠ, ఉపాలయాల్లో దక్షిణామూర్తి తదితర దేవతామూర్తుల ప్రతిష్ఠ సోమవారం కనుల పండువగా జరిగింది. క్షేత్ర మండపంలోనే నాయనార్ల శిల, పంచలోహ విగ్రహాలను కొలువుదీర్చారు. అరుణాచల మాధవి, స్వామి రామానంద పర్యవేక్షణలో అర్చకులు ఈ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, గాయని ఎంఎం శ్రీలేఖ, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తదితరులు ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని నాయనార్లను అర్చించారు.

విగ్రహాల ప్రతిష్ఠకు తరలివచ్చిన భక్తజనం

పుస్తకావిష్కరణలో మాజీ సీఎస్ఎల్వీ సుబ్రహ్మణ్యం, స్వామీజీలు చొక్కలింగం, విశ్వనాథ, అరుణాచల మాధవి, స్వామి రామానంద, శ్యామలాదేవి

ఆధ్యాత్మిక వారసత్వ సంపద

రాచపల్లిలో అరుణాచలేశ్వరుని ఆలయం ఆధ్యాత్మిక వారసత్వంగా నిలుస్తుందని స్వామీజీలు, ప్రముఖులు స్పష్టం చేశారు. సభకు అరుణాచల మాధవి అధ్యక్షత వహించారు. తెలుగు రాష్ట్రాల్లోనే ప్రప్రథమంగా నాయనార్ల విగ్రహాల ఏర్పాటు అభినందనీయమన్నారు. సభలో విజ్ఞానందగిరి, శారదానంద సరస్వతి, వినమ్రానంద ఉన్నారు. అరుణాచల మాధవి రచించిన 63 నాయనార్ల సంక్షిప్త జీవిత చరిత్ర పెరియపురాణం పుస్తకాన్ని చొక్కలింగస్మామి తంబిరాన్ ఆవిష్కరించారు.

బలభద్రపురంలో కాలుష్య పరిస్థితులపై అధ్యయనం

ఈనాడు, రాజమహేంద్రవరం: బిక్కవోలు మండలం బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు బయటపడిన నేపథ్యంలో సమగ్ర అధ్యయనానికి చర్యలు ప్రారంభమయ్యాయి. ఇక్కడ పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయనాలతో కూడిన విషపూరిత వాయువులే ప్రధాన కారణమని అనపర్తి శాసనసభ్యుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో పాటు, స్థానికులు గతంలో ఆరోపించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి ఈ అంశంపై పట్టుపట్టడంతో ఇటీవల కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య సందర్శించి పరిస్థితులను తెలుసుకున్నారు. స్థానిక వాతావరణ, పర్యావరణ పరిస్థితులపై అధ్యయనం చేసే బాధ్యతను 'నీరి' సంస్థకు అప్పగిస్తూ నిర్ణయించారని నల్లమిల్లి తెలిపారు. ఇక్కడ దీర్ఘకాలికంగా ఉన్న ఓ పరిశ్రమను వేరే ప్రాంతానికి తరలించే అంశంపైనా దృష్టిసారించాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిసింది. రాజమహేంద్రవరంలోని పేపర్ మిల్లు వ్యర్థజలాలను నగరపాలక సంస్థ నిర్మిస్తున్న 50 ఎంఎల్‌డీ ఎస్టీపీకి మళ్లించే ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారని పేర్కొన్నారు.

రైతేరాజు అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం

-6లో

పీజీఆర్‌ఎస్‌కు 216 వినతులు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మొత్తం 216 వినతులు అందాయి. కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి, ఇతర జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ✦ ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రం జారీ చేయకపోవడం వల్ల ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలు అందటం లేదని, విచారణ చేసి, ఆదుకోవాలని కోరుతూ రాజానగరం మండలం సంపత్‌నగర్‌కు చెందిన పి.శ్రీనివాస్ అధికారులకు విన్నవించారు. ✦ గ్రామంలో రహదారిని ఆక్రమించి బడ్డీకొట్టు పెట్టడం వల్ల స్థానికులకు అసౌకర్యంగా ఉందంటూ హుకుంపేటకు చెందిన మల్లికార్జునరావు అధికారులకు ఫిర్యాదు చేశారు. ✦ కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో గోకవరం మండలం వీరలంకపల్లిలో పండ్ల తోటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారంటూ ఆదర్శరైతు కొర్రిపల్లి అప్పలస్వామి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఒక కమిటీని వేసి కోతుల బెడద నుంచి పండ్ల తోటలు కాపాడేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిబంధనలకు బంకు కొడుతున్నారు..!

వినియోగదారులకు కానరాని సేవలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే : జిల్లాలోని పెట్రోలు బంకుల్లో యథేచ్ఛగా మోసాలు జరుగుతున్నాయి. వినియోగదారులకు ఉచిత సేవలు కనీసం అందడం లేదు. ప్రజలు ఎంత అవగాహన పెంచుకున్నా కొన్ని బంకుల్లో వారిని బురిడీ కొట్టించి మోసాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో మొత్తం 195 వరకు పెట్రోలు బంకులున్నాయి. ఏదైనా ఫిర్యాదు వస్తే మినహా ఎక్కడా తనిఖీలు పూర్తిస్థాయిలో జరగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పెట్రోలు కొట్టించుకునేటప్పుడు మీటరు మధ్యలో ఆగిపోతే అక్కడ ఏదో పొరపాటు జరుగుతుందని గుర్తించాలి. ఇటీవల రాజమహేంద్రవరం నగరంలోని ఓ బంకులో మీటరు తిరుగుతున్నా అందులో నుంచి పెట్రోలు రాకపోవడాన్ని వినియోగదారులు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు.

దానవాయిపేటలో గాలి పెట్టేందుకు ఎవరూ లేక ఇలా..

నాణ్యత తెలుసుకోండిలా..

పెట్రోలు నాణ్యతపై అనుమానాలుంటే వినియోగదారులే నేరుగా పరీక్షించుకోవచ్చు. ప్రస్తుతం పెట్రోలులో ఇథనాల్ కలిపి కల్తీ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రతి బంకులో ఫిల్టర్ పేపరు అందుబాటులో ఉంటుంది. బంకు సిబ్బందిని ఆ పేపరును అడిగి ఒక చుక్క పెట్రోలు దానిపై వేయాలి. వేసిన క్షణాల్లోనే అది ఆరిపోయి గతంలో మాదిరిగానే ఉంటే అది నాణ్యమైన పెట్రోలుగా గుర్తించాలి. ఒకవేళ పెట్రోలు మచ్చ కాగితంపై ఉంటే మాత్రం అది కల్తీగా పరిగణించి ఫిర్యాదు చేయాలి.

మౌలిక వసతులు కొరవడి..

జిల్లాలోని అన్ని కంపెనీల బంకుల్లోనూ వినియోగదారులతోపాటు ప్రజలకు తాగునీరు, మరుగుదొడ్లు, వాహన టైర్లలోకి గాలి పట్టే యంత్రం, ప్రాథమిక చికిత్స కిట్టు తదితర వసతులు తప్పనిసరిగా ఉచితంగా కల్పించాలి. కానీ చాలా బంకుల్లో ఇవి అందుబాటులో లేవు. వాహనాలకు గాలిపెట్టే యంత్రాలు ఉన్నా అక్కడ సిబ్బంది ఉండరు. ప్రథమచికిత్స కిట్టు కనిపించిన దాఖలాలే లేవు. రాజమహేంద్రవరం నగరం, గ్రామీణంలోని ఇటీవల పది బంకులను పరిశీలించగా సుమారు ఎనిమిది బంకుల్లో సేవలు సక్రమంగా అందడం లేదు. 'రెండు ప్రత్యేక బృందాలతో బంకులను తనిఖీలు చేపడుతున్నాం.' అని డీఎస్‌వో పార్వతి అన్నారు.

బతికుండగానే చంపేశారు..!

కుమారుడి నిర్వాకంతో నివ్వెరపోయిన అధికారులు

తణుకు, న్యూస్‌టుడే: కనిపెంచి పెద్ద చేసిన తండ్రి కుటుంబంలో మనస్పర్థలతో ఏడేళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయి సోమవారం తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యక్షమయ్యారు. దీనిపై ఆస్పత్రి సిబ్బంది సమాచారం ఇవ్వగా తనకు సంబంధం లేదని కొడుకు తేల్చి చెప్పడం గమనార్హం. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలేనికి చెందిన గలగల సుబ్బారావుకు భార్య, కుమారుడు సుధీర్, కుమార్తె ఉన్నారు. ఏడేళ్ల కిందట ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సుబ్బారావు తిరిగి రాలేదు. ఆదివారం సాయంత్రం కాల్దరి స్టేషన్లో రైలు నుంచి జారి పడి గాయాలపాలయ్యారు. తణుకు రైల్వే పోలీసులు ఆయనను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి, కుమారుడు సుధీర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. సుబ్బారావు పరిస్థితి విషమంగా ఉందని.. ఏలూరు తీసుకెళ్లాలని చెప్పడంతో 'నాకు ఆయనతో సంబంధం లేదు. అక్కడే వదిలేయండి, ఆయన ఎలాపోతే నాకేంటి అని' సమాధానం ఇవ్వడంతో అవాక్కయిన రైల్వే కానిస్టేబుల్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

సుధీర్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న ఆర్ఎంవో తాతారావు (అంతరచిత్రం) చికిత్స పొందుతున్న సుబ్బారావు

తండ్రి మరణ ధ్రువపత్రంతో తల్లికి పింఛను

సుబ్బారావు భార్యతో మాట్లాడేందుకు సోమవారం ప్రకాశరావుపాలెం గ్రామానికి వెళ్లిన పోలీసులకు అతని కుటుంబ సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తన తండ్రి చనిపోయినట్లు మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్నామని, తల్లి వితంతు పింఛను సైతం తీసుకుంటోందని చెప్పడంతో పోలీసులు నివ్వెరపోయారు.

✦ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బారావు వద్దకు వచ్చిన కుమారుడు సుధీర్ తనకు, తన కుటుంబంతో అతనికి ఎలాంటి సంబంధం లేదని లిఖితపూర్వకంగా ఇస్తానని చెప్పడంతో ఆసుపత్రి ఆర్ఎంవో ఏవీఆర్ తాతారావు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తండ్రి పట్ల నిర్లక్ష్యం వహిస్తే కేసు నమోదు చేస్తానని సీఐ కొండయ్య సైతం హెచ్చరించినప్పటికీ మొండికేయడంతో బాధితుడు సుబ్బారావుకు అదే ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ఇక.. ప్రగతి మార్గం

నాబార్డు నిధులతో చేపట్టే పనులకు వెల్లువలా బిడ్‌లు

జిల్లా	పొడవు (కి.మీ.)	కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)
తూర్పుగోదావరి	23.200	11.24

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత వైకాపా అయిదేళ్ల పాలనలో ర.భ.శాఖ పరిధిలోని మార్గాలకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో అవన్నీ ధ్వంసమయ్యాయి. కూటమి ప్రభుత్వం వీటన్నింటినీ 'దారి'లోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మార్చి 29న ప్లాన్ గ్రాంట్‌తో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లలో కొన్ని రహదారుల అభివృద్ధికి పరిపాలనా ఆమోదం ఇచ్చింది. నాబార్డు ద్వారా నిధులు తెచ్చి మరికొన్ని రోడ్ల అభివృద్ధి, విస్తరణకు మే 2న పరిపాలనా ఆమోదం ఇచ్చింది. వీటిలో నాబార్డు నిధులతో చేపట్టే పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. గత నెలలో ఉమ్మడి జిల్లా పరిధిలో 72.581 కి.మీ. పరిధిలో రూ.28.66 కోట్లతో 15 పనులకు టెండర్లు పిలువగా బిడ్‌లు పెద్దఎత్తున దాఖలయ్యాయి. రూ.2 కోట్ల విలువైన పనికి ఆర్అండ్‌బీ కాకినాడ సర్కిల్ కార్యాలయాల్లో ఆమోదం ఇవ్వగా, రూ.2 కోట్లపైబడిన పనుల ఆమోదానికి ఆ శాఖ చీఫ్ ఇంజినీర్‌కు పంపించారు.

ఉమ్మడి జిల్లాలో కేటాయింపులు

విభాగం	పనులు	పొడవు (కి.మీ.)	నిధుల కేటాయింపు (రూ.కోట్లలో)
ఎండీఆర్	10	32.540	12.50
ఎస్‌హెచ్	19	161.080	62.35

ప్లాన్ గ్రాంటుకు బడ్జెట్ విడుదల

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మేజర్ జిల్లా రోడ్లు (ఎండీఆర్), రాష్ట్ర రహదారులు(ఎస్‌హెచ్) అభివృద్ధికి ప్లాన్ గ్రాంటు కింద రూ.74.85 కోట్ల విలువైన 29 పనులకు మూడు నెలల కిందట పరిపాలనా ఆమోదం ఇచ్చారు. 193.62 కి.మీ. పరిధిలో రహదారుల అభివృద్ధికి నిర్ణయించారు. వీటికి బడ్జెట్ కేటాయించకుండా టెండర్లు పిలవొద్దని ఆర్అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. గత నెల 21న బడ్జెట్ కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఈ రోడ్లకు మోక్షం..

శాటిలైట్‌సిటీ-కొత్తతుంగపాడు (5.400 కి.మీ., రూ.2 కోట్లు), పెద్దాపురం ఏడీబీ-జి.దొంతమూరు(1.600 కి.మీ. రూ.80 లక్షలు), వీరవరం-దుల్ల (1.50 కి.మీ., రూ.1.80 కోట్లు), రాజవోలు-కొత్తూరు (1.600 కి.మీ. ,రూ.50 లక్షలు), వద్లూరు-తీపర్రు(8.500 కి.మీ., రూ.3.24 కోట్లు),తేతలి-మునిపల్లి(0.400 కి.మీ., రూ.60 లక్షలు), పశివేదల-అరికిరేవుల(4.200 కి.మీ., రూ.2.30 కోట్లు)

ఇవీ పనులు: ✦ తూర్పుగోదావరి జిల్లాలో రేపాక-చినకొండేపూడి ✦ తూర్పుగోదావరి జిల్లాలో నరసారావుపేట-కాత్రావులపల్లి, కాకినాడ-రాజమహేంద్రవరం, మార్టేరు-ప్రక్కిలంక, కానూరు-లంకల కోడూరు, జేగ్రోలు-దేవులపల్లి

'నాబార్డు నిధులతో చేపట్టే పనులకు టెండర్లు పూర్తయ్యాయి. ప్లాన్ గ్రాంట్‌కు బడ్జెట్ ఇచ్చిన నేపథ్యంలో త్వరలో టెండర్లు పిలుస్తాం.' అని ఆర్అండ్‌బీ పర్యవేక్షక ఇంజినీరు కంఠు తెలిపారు.

'ఉపాధి' పనులకు నిధులొచ్చాయ్

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ నిధులతో గత ఏడాది చివరిలో చేసిన వివిధ పనులకు సంబంధించి నిధులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతం గోశాలలు నిర్మించుకున్న రైతులతో పాటు, ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రెయిన్లు ఇతర పనులకు నిధులు విడుదలయ్యాయి.

మెళ్లూరులో గోకులం షెడ్డు

547 గోశాలలు, 476 సీసీరోడ్లు..

జిల్లాలో 547 మంది రైతులు వారి అవసరాల్ని బట్టి వివిధ విస్తీర్ణాల్లో గోశాలలు నిర్మించుకున్నారు. వాటికి సంబంధించి రూ.5,12,07,385 విడుదలయ్యాయి. ఇవి వారి బ్యాంకు ఖాతాలకు జమ అవుతున్నాయి. అలాగే 476 సీసీరోడ్లు, ఇతర పనులకు సంబంధించి రూ.23,59,95,299 విడుదలయ్యాయి. ఇప్పటివరకు గతంలో చేపట్టిన వాటికి నిధులు రాక రెండో విడత పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రాలేదు. ప్రస్తుతం నిధుల రాకతో జిల్లాలో శంకుస్థాపన చేసిన వివిధ పనులు ఊపందుకోనున్నాయి. ఇవి కాక 2014 నుంచి 2019 వరకు పెండింగ్‌లో వివిధ పనులకు సంబంధించి బకాయిలు కూడా రూ.2,04,82,036 విడుదలయ్యాయి. ఇంకా కొద్ది నిధులు రావాల్సి ఉందని, త్వరలోనే విడుదలవుతాయని రాజమహేంద్రవరం డ్వామా పీడీ నాగమహేశ్వరరావు తెలిపారు.

WANTED TEACHERS

A WELL REPUTED SCHOOL IN YANAM REQUIRE
TEACHERS
to teach 6th to 10th
ENGLISH, PHYSICS, BIOLOGY & MATHEMATICS
WALK IN INTERVIEW (or)
send your C.V.Within 10 Days to
THE HEADMASTER
REGENCY PUBLIC SCHOOL
Mettakur, Yanam-533 464. Contact No.98661 97903
Email: rpsyanam@gmail.com
Selected Teachers will have attractive Salary, PF, ESI & Fee Concession for their child's Education

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

1,050 ఎకరాల్లో ఉద్యాన మొక్కల పండుగ

ఈనాడు, రాజమహేంద్రవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం ఉద్యాన మొక్కలను నాటేందుకు నిర్ణయించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మంగళవారం 1,050 ఎకరాల్లో ఈ కార్యక్రమం ఉంటుంది. తూర్పుగోదావరిలో 500, అంబేడ్కర్ కోనసీమలో 300, కాకినాడలో 250 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లుచేశామని పీడీలు నాగమహేశ్వరరావు, మధుసూదన్, అడపా వెంకటలక్ష్మి తెలిపారు.

రైతులకు ప్రోత్సాహం..

ఉద్యాన, అంతర పంటలుగా సాగుచేసేందుకు ఆసక్తి ఉన్న రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వమే మొక్కలు కొనుగోలు చేసి ఇస్తోంది. తవ్వడం, నీళ్ల పోయడం, ఎరువులు తదితర నిర్వహణ ఖర్చులను దాదాపు మూడేళ్లపాటు నేరుగా రైతుకే అందజేస్తుంది. ఎకరాకు నిర్దేశిత మొక్కలు నాటేలా ప్రోత్సహిస్తున్నారు. ఎక్కువగా మామిడి, జీడిమామిడి, కొబ్బరి, కోకో, పూలు, పండ్ల మొక్కలు నాటేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పంట రకం ఆధారంగా రైతులకు మూడేళ్లలో సగటున రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ప్రభుత్వం అందిస్తుందని అధికారులు తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి : డీఆర్వో

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లాలో గృహనిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై వివిధ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు. గత వారం రోజుల వ్యవధిలో 1232 ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా 390 మాత్రమే చేపట్టారని, ఆప్షన్-3 కింద 3,396 ఇళ్లకుగాను 2,470 పూర్తి చేశారని తెలిపారు. ఉపాధి పనులు, పీ-4 సర్వే, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాల ఏర్పాట్లు, రెవెన్యూ తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

WE'RE HIRING!
WALK-IN-INTERVIEW
Date: 9th & 10th July
Time: 9.30 AM to 1.00 PM
At Alamuru
High School Teachers
English & Maths
Trained Graduates / Post Graduates
with min. Two years of experience
Pay Scale: 30,000 - 35,000 Per Month
FLUENCY IN ENGLISH IS MUST
The Siddhartha School
Alamuru, 73967 85156 Ravulapalem, 84639 84456

(c) eenadu

న్యూస్‌టుడే, సీతానగరం: కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయి. గత నెల పాఠశాలల పునః ప్రారంభం రోజే విద్యామిత్ర కిట్లు అందించారు. మధ్యాహ్న భోజనాన్ని సన్నబియ్యంతో వండి పెడుతున్నారు. ఏకరూప దుస్తుల్లో రంగులు

పిల్లల ఉత్తరాలు.. తల్లుల ఆనందం

● 'ఈనాడు-ఈటీవీ' కథనాలతో మరికొందరు బడికి..

మార్పులు చేసి పంపించారు. ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా అందరికీ 'తల్లికి వందనం'లో భాగంగా తల్లుల ఖాతాల్లో నగదు జమచేశారు. ఈ నేపథ్యంలో సీతానగరం మండలం వెదుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల బాలికలు ఈ నెల 10న నిర్వహించే మెగా పేరెంట్స్ మీటింగ్‌కు రావాలని తల్లిదండ్రులు, విద్యాశాఖాధికారులు, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తదితరులకు సోమవారం ఉత్తరాలు రాశారు. ఇప్పటికే రాసిన ఉత్తరాలను వారికి పోస్టు చేశారు. ప్రభుత్వ బడిలో మౌలిక వసతులు, చదువులపై 'ఈనాడు-ఈటీవీ'లో వచ్చిన ప్రత్యేక కథనాలతో బయట మాన్పించేసిన పిల్లలను సైతం బడికి తిరిగి చేర్పిస్తున్నారు.


వెదుళ్లపల్లి పాఠశాలలో ఉత్తరాలు రాస్తున్న విద్యార్థులు

చూసి ఆశ్చర్యపోయాను..

నావ ప్రజ్ఞశ్రీ, సౌమ్యజ్యోతి పిల్లలు. వెదుళ్లపల్లి పాఠశాలలో ఆరు, ఎనిమిది తరగతులు చదువుతున్నారు. ఇంటికొచ్చిన ఉత్తరాలను చూసి ఆశ్చర్యపోయాను. అవి మా పిల్లలు ఆంగ్లంలో రాశారు. పాఠశాలలో మౌలిక వసతులు, భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు తదితర వాటిని వివరిస్తూ పేరెంట్స్ మీటింగ్‌కు మమ్మల్ని ఆహ్వానించారు.
- గొంతిన అపర్ణ, రాజాపేట

ముగ్గురు పిల్లలకూ ప్రవేశాలు..

మాకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. నేను, నా భర్త శ్రీను వ్యవసాయ పనులకు వెళ్తాం. పిల్లలు చదివించలేక ఇంటివద్దనే ఉంచేశాం. రెండు రోజులుగా వెదుళ్లపల్లి పాఠశాల విద్యార్థులు ఉత్తరాలు రాయడం, ఈటీవీలో వచ్చిన ప్రత్యేక కథనం చూసి పిల్లలతో మళ్లీ బడికి వెళ్లాలని కోరిక చేయడంతో సోమవారం ప్రవేశాలు కోరాం. లక్ష్మి, అంజలిలను 9, కుమారుడు ప్రసాద్‌ను 8వ తరగతిలో ప్రవేశాలు కల్పించారు.
- కూనాడ సత్యవతి

చైతన్యానికి ఇదే నిదర్శనం

బడిలో అమలు చేసే పథకాలు, ఆకర్షణ సదుపాయాలను తల్లిదండ్రులకు ఉత్తరాల ద్వారా తెలిపి మెగా పేరెంట్స్ మీటింగ్‌కు రావాలని విద్యార్థులు రాయడం నా సర్వీసులో ఇదే ప్రథమం. ఇలా రాయడం వల్ల అక్షర జ్ఞానం కాకుండా సమస్యలపై స్పందించే భావం కూడా పెరుగుతుంది. సీఎం, డిప్యూటీ సీఎంలతో పాటు ఇతర ప్రముఖులను ఆహ్వానించడం విద్యార్థుల్లో పెరిగిన చైతన్యానికి నిదర్శనం.
- కేతావతు స్వామినాయక్, ఎంఈవో, సీతానగరం

ఆర్టీసీలో కారుణ్య నియామకానికి 10 మంది ఎంపిక

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): కారుణ్య నియామకం కింద జిల్లా ఆర్టీసీలో ఉద్యోగాలకు 10 మంది ఎంపికైనట్లు డీపీటీవో వై.సత్యనారాయణ మూర్తి తెలిపారు. కండక్టర్ గ్రేడ్-2 ఉద్యోగాలకు ఎంపికైన వీరిలో 9 మందికి మంగళవారం నియామక పత్రాలు అందిస్తామన్నారు. ఇంకొకరికి వైద్య పరీక్ష పూర్తయిన తర్వాత నియామక పత్రం అందజేస్తామన్నారు.

ఔత్సాహిక వ్యాపారులతో నేడు అవగాహన సదస్సు

ఆర్టీసీ స్థలాలను లీజు ప్రాతిపదికన ఇచ్చేందుకు ఏపీఎస్ఆర్టీసీ చర్యలు తీసుకుంటుందని, దీనిలో భాగంగా టెండర్ విధానం, స్థలాల లీజుకు సంబంధించిన విధివిధానాలు తదితర విషయాలపై అవగాహన కల్పించేందుకు ఔత్సాహిక వ్యాపారులతో సదస్సు నిర్వహిస్తున్నట్లు డీపీటీవో తెలిపారు. రాజమహేంద్రవరం డిపో వద్ద ఉన్న ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ కళాశాలలో మంగళవారం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కోరిన లాభం దక్కించుకో

రైతేరాజు

న్యూస్‌టుడే, మామిడికుదురు

కొబ్బరిలో అంతర పంటగా కోనసీమ ప్రాంతంలో ఎప్పటినుంచో కోకో సాగవుతోంది. కొంతమంది రైతులు వాటిపై మరింత దృష్టిపెట్టి తక్కువ వ్యయంతో అధిక ప్రయోజనాలు పొందుతున్నారు. నీటి వసతి, మార్కెటింగ్ సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని సేంద్రియ విధానంలో కొబ్బరితో పాటు కోకో సాగు చేస్తూ మెరుగైన లాభాలు ఆర్జిస్తున్నారు మామిడికుదురు మండలం అప్పనపల్లికి చెందిన రైతు అల్లూరు వెంకటరామరాజు.

కొబ్బరిలో అంతర పంటగా వేసిన కోకోతో రైతు వెంకటరామరాజు

సేంద్రియ ఎరువులతో భూసారం పెంపు

వైనతేయ నదీ తీరానికి చేరువలోని అప్పనపల్లిలో తనకున్న ఏడెకరాల కొబ్బరి తోటలో అంతర పంటగా వెంకటరామరాజు కోకో మొక్కలు నాటారు. రెండేళ్లుగా శ్రమ తప్పకుండా ఆదాయం పొందుతున్నారు. కొబ్బరి చెట్ల చుట్టూ రెండు మీటర్ల మేర స్థలాన్ని ఖాళీగా వదిలి ఎకరాకు సుమారు 200 వరకు మొక్కలు నాటారు. పశువుల పెంటతో పాటు పలు సేంద్రియ ఎరువులను వాడుతున్నారు. కోకో చెట్ల నుంచి రాలిన ఆకులతో పాటు కొబ్బరి ఆకులు ముక్కలుగా చేసి తోటల్లో వేసి నేల తేమ ఆరిపోకుండా చేస్తున్నారు. నీటి ఎద్దడి సమయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భూగర్భజలాలను వినియోగించుకుంటూ సాగునీటి వసతి కల్పిస్తున్నారు. జనవరి-ఫిబ్రవరి, జూన్-జులై మధ్య రెండుసార్లు పంటను పొందుతున్నారు. వరద, వర్షాల సమయంలో ముంపునీరు తోటల్లో నిల్వ ఉండకుండా బోదెల ద్వారా బయటకు మళ్లించుకుంటున్నారు. పంట పిందె దశ నుంచి ఆయిదు నెలల సమయంలో కాయలు ధృఢంగా తయారవుతున్నాయి. ఎకరాకు ఆయిదు క్వింటాళ్ల వరకు దిగుబడులు పొందుతున్నారు.

స్ఫూర్తి

ఆశాజనకంగా ఆదాయం

డిగ్రీ చదివిన నేను వ్యవసాయంపై మక్కువతోనే కొబ్బరితో పాటు గత రెండేళ్లుగా కోకో అంతర పంటను సాగు చేస్తున్నాను. పశువుల ఎరువులతో పాటు వర్మీకంపోస్టు వేస్తున్నాను. తోటను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతూ చీడపీడలు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాను. కొమ్మల వ్యాప్తిని అరికట్టేందుకు నిర్దిష్ట ఆకృతిలో కత్తిరిస్తుంటాను. కొబ్బరి నుంచి ఎకరాకు రూ.55 వేలు, కోకో నుంచి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు లాభం వచ్చింది. దిగుబడులను పెంచేందుకు అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తున్నాను.
- అల్లూరు వెంకటరామరాజు, రైతు, అప్పనపల్లి

బీమా చేద్దాం.. ధీమాగా ఉందాం

మీ కోసం

కరప, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి అందే సమయంలో ప్రకృతి విపత్తులు, భారీవర్షాలు, గాలి, వడగళ్ల వానలు తీవ్రనష్టం కలిగిస్తున్నాయి. దీంతో ఎంతోమంది నష్టపోయి అప్పుల పాలవుతున్నారు. దీనినుంచి కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఒక వరం వంటిది. దీనిద్వారా ఆర్థిక భరోసా కలుగుతుంది. గతంలో బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేసే సమయంలోనే ప్రీమియం మినహాయించుకునేవి. ప్రస్తుతం మారిన నిబంధనల మేరకు రైతులే బీమా చేయించుకోవాల్సి ఉంటుంది. ఎకరాకు రూ.760 చొప్పున ప్రీమియం చెల్లించాలి. బ్యాంకులో రుణాలు తీసుకునేవారు ఆగస్టు నెలాఖరు లోపు, ఎటువంటి రుణాలు తీసుకోనివారు జులై నెలాఖరు లోపు సమీపంలోని మీసేవ కేంద్రాల్లో ప్రీమియం చెల్లించాలని కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు తెలిపారు.

ఉపాధి ఊతం.. పశువులకు గ్రాసం

తెలుసుకుందాం..

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం నిధులతో రైతులు పశుగ్రాసం పెంచుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 5 ఎకరాల్లోపు భూమి ఉన్నవారందరూ అర్హులే. బహువార్షిక పశుగ్రాసం పెంచుకోవాలనుకునే వారు దరఖాస్తుతో పాటు జాబ్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు పాస్ పుస్తకం, రేషన్‌కార్డు నకళ్లతో సంబంధిత రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని అనపర్తి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సాయం ఒక్క ఏడాది మాత్రమే వర్తిస్తుంది. రైతులే తమకు నచ్చిన బహువార్షిక పశుగ్రాసాలు (విత్తన రకాలు) ఎంపికచేసుకుని వెళ్లడించారు. మరిన్ని వివరాలకు పశుసంవర్ధకశాఖ అధికారిని సంప్రదించాలి. ఈ పథకం మంజూరైన రైతులకు ఆయిదు విడతలుగా నగదు బ్యాంకు ఖాతాలకు జమవుతుందని శ్రీనివాసరావు తెలియజేశారు.

పొలం (సెంట్లలో)	ప్రభుత్వం ఇచ్చే నిధులు (రూ.లలో)
50	32,992
40	26,934
30	19,795
20	13,197
10	6,599

ఇలా నారుమడి.. అలా నాణ్యంగా దిగుబడి

రైతులు తయారు చేసుకున్న వరి నారు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఖరీఫ్ నారుమడులు సిద్ధం చేయడంలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఈ సమయంలో కొన్ని మెలకువలు పాటిస్తే ఆరోగ్యకరమైన నారుతో మంచి దిగుబడులను సాధించవచ్చని జగ్గంపేట వ్యవసాయాధికారి ఎస్.నరసింహం సూచిస్తున్నారు. పొలంలో మెరక ప్రదేశం ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల వర్షాలు అధికంగా వచ్చినప్పుడు, బయటి నుంచి నీరు వచ్చినప్పుడు నిల్వ లేకుండా ఉంటుంది. ఎకరా నారుమడి తయారు చేసేందుకు రైతులు చివరి దమ్ములో 2 కిలోల యూరియా, అరున్నర కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 2 కిలోల పొటాష్ వేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన నారు రావడంతో పాటు వేర్లు బాగా వృద్ధి చెంది పంట దిగుబడి అధికంగా వస్తుంది. ముందుగా విత్తనశుద్ధి తప్పనిసరి.

KVB Karur Vysya Bank Smart way to bank

ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

డివిజనల్ ఆఫీస్, డి.నెం.47-10-15, మొదటి అంతస్తు, ఎ.జి.అవెన్యూ, పొలాక్స్ స్కూల్ ఎదురుగా, 2వ లేన్, ద్వారకానగర్, విశాఖపట్నం-16

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 8(1) ప్రకారం

సెక్యూరిటైజేషన్ మరియు రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) యాక్ట్ 2002 (యాక్టు 54, 2002) ప్రకారం **ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, రాజమండ్రి బ్రాంచ్, రాజమండ్రి** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 సెక్షన్ 13(12) లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీత: 1. మెస్సర్స్ కృష్ణ మెడికల్ ఏజెన్సీస్, ప్రాతినిథ్యం వహిస్తున్న పార్ట్‌నర్స్ : ద్వారంపూడి వెంకట రెడ్డి మరియు సత్తి రామకృష్ణారెడ్డి,** డి.నెం. 28-9-5, ప్రెస్ క్లబ్ వీధి, గణేష్ చౌక్, జాంపేట, రాజమండ్రి - 533103, తూర్పుగోదావరి జిల్లా. **2. శ్రీ ద్వారంపూడి వెంకట రెడ్డి,** తండ్రి : ద్వారంపూడి రామమూర్తి రెడ్డి, డి.నెం. 5-73, శివాలయం వీధి, రామవరం, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా - 533264. **3. శ్రీ సత్తి రామకృష్ణారెడ్డి,** తండ్రి : నాగిరెడ్డి, డి.నెం. 3-128, మెరక వీధి, అర్తమూరు, తూర్పుగోదావరి జిల్లా - 533308 మరియు **4. శ్రీ ద్వారంపూడి రామమూర్తి రెడ్డి,** తండ్రి : ద్వారంపూడి వెంకట రెడ్డి, డి.నెం. 5-73, శివాలయం వీధి, రామవరం, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా - 533264. వారిని బకాయి సొమ్ము **రూ.1,97,83,372.36 పై.** (అక్షరాల ఒక కోటి తొంభై ఏడు లక్షల ఎనభై మూడు వేల మూడు వందల డెబ్బై రెండు రూపాయల ముప్పై ఆరు పైసలు మాత్రమే) **(అకౌంట్ నెం. 1408223000000792)** లను నోటీసు ముట్టిన 60 రోజుల లోపుగా చెల్లించవలసినదిగా **తేది.19-02-2025**న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది.

బకాయి సొమ్ము చెల్లించుటలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్ 8 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ **తేది.03-07-2025**న దిగువ ఉదహరించబడిన ఆస్తిని **స్వాధీనత** తీసుకోవడమైనదని బకాయిదారునికి మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది.

సదరు ఆస్తులకు సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా **రూ.2,11,71,842.36 పై.** (అక్షరాల రెండు కోట్ల పదకొండు లక్షల డెబ్బై ఒక్క వేల ఎనిమిది వందల నలభై రెండు రూపాయల ముప్పై ఆరు పైసలు మాత్రమే) **(అకౌంట్ నెం.1408223000000792) + తేది: 01-07-2025** నుండి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి **ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, రాజమండ్రి బ్రాంచ్, రాజమండ్రి** వారి ఛార్జికి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతలు / హామీదారులు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించటమైనది.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడముపైకై శ్రద్ధ వహించవలెను.

స్థిరాస్తి వివరములు:

షెడ్యూలు-(ఎ): రిజిస్టర్డు గిఫ్ట్ డీడ్ నెం.27/2008, తేది.02.01.2008 ప్రకారం గల షెడ్యూలు ఆస్తి మరియు యావత్తు ఆస్తి బ్యాంక్‌నకు ఎమ్‌ఓడి నెం.2062/2020, తేది.21.09.2020 ద్వారా సెక్యూర్డ్ చేయబడినది : తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, అనపర్తి సబ్ రిజిస్ట్రీ, రామవరం గ్రామం మరియు గ్రామ పంచాయితీ, బ్లాక్ నెం.5, కొత్త డి.నెం. 5-65, డి.నెం.5-75, రీ సర్వే నెం.260/7 వద్ద 358 ½ చ॥గ॥లు లేదా 301.14 చ॥మీ॥ల విస్తీర్ణం గల భూమి మరియు అందు ఎసి షీట్ షెడ్ నిర్మాణాలతో గల యావత్తు ఆస్తి శ్రీ ద్వారంపూడి రామమూర్తి రెడ్డి, తండ్రి : శ్రీ ద్వారంపూడి వెంకట రెడ్డి గారి పేరున కలదు.

ఐటమ్ -1: విస్తీర్ణం 82 చ॥గ॥లు లేదా 68.88 చ॥మీ॥ల స్థలమునకు హద్దులు: ఉత్తరం : కోనాల సత్యనారాయణ రెడ్డి గారికి చెందిన స్థలం - 22'-06", **తూర్పు:** ఐటమ్ నెం.2 స్థలం - 32'-09", **పడమర :** రోడ్డు - 32'-09", **దక్షిణం :** దారి స్థలం - 22'-06".

ఐటమ్ -2: విస్తీర్ణం 167 ½ చ॥గ॥లు లేదా 147.7 చ॥మీ॥ల స్థలమునకు హద్దులు: ఉత్తరం : నల్లమిల్లి విశ్వనాథ రెడ్డి మరియు ఇతరులకు చెందిన స్థలం - 46'-00", **తూర్పు:** ఐటమ్ నెం.3 స్థలం - 32'-09", **పడమర :** ఐటమ్ నెం.1 స్థలం - 32'-09", **దక్షిణం :** దారి స్థలం - 46'-00".

ఐటమ్ -3: విస్తీర్ణం 109 చ॥గ॥లు లేదా 91.56 చ॥మీ॥ల స్థలమునకు హద్దులు: ఉత్తరం : నల్లమిల్లి రామచంద్రా రెడ్డి గారికి చెందిన గోడ - 24'-00", **తూర్పు:** నల్లమిల్లి చిన వెంకట రెడ్డి గారికి చెందిన ప్రహరీ గోడ కొంతమేర మరియు 2 అ॥ల వెడల్పు గల దారి స్థలం కొంతమేర - 40'-08", **పడమర :** పైన తెలిపిన ఐటమ్ నెం.2 స్థలం కొంతమేర మరియు నల్లమిల్లి విశ్వనాథ రెడ్డి గారికి చెందిన స్థలం కొంతమేర - 41'-01", **దక్షిణం :** కొనుగోలుదారుకి చెందిన గోడ - 24'-00".

పైన తెలిపిన హద్దులలోని విస్తీర్ణం **358 ½ చ॥గ॥లు లేదా 301.14 చ॥మీ॥ల స్థలం మరియు అందు గల ఎసి షీట్ షెడ్ నిర్మాణాలు అన్నీ సూపర్ స్ట్రక్చర్స్ మరియు సదుపాయాలు మరియు అన్నీ కామన్ దారులు, నీటి దారులు మరియు అన్నీ ఈజిమెంటరీ హక్కులు మొ॥ వాటితో కలవు.**

షెడ్యూలు-(బి): రిజిస్టర్డు రెలింక్విష్‌మెంట్ డీడ్ నెం.2386/2020, తేది.09.07.2020 ప్రకారం గల షెడ్యూలు ఆస్తి మరియు యావత్తు ఆస్తి బ్యాంక్‌నకు ఎమ్‌ఓడి నెం.2062/2020, తేది.21.09.2020 ద్వారా సెక్యూర్డ్ చేయబడినది : తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, అనపర్తి సబ్ రిజిస్ట్రీ, రామవరం గ్రామం మరియు గ్రామ పంచాయితీ, బ్లాక్ నెం.5, కొత్త డి.నెం. 5-65, పాత డి.నెం.5-75, రీ సర్వే నెం.260/7 వద్ద 388.33 చ॥గ॥లు లేదా 324.70 చ॥మీ॥ల విస్తీర్ణం గల భూమి మరియు అందు గల ఆర్‌సిసి నివాస భవనం యావత్తు ఆస్తి శ్రీ ద్వారంపూడి రామమూర్తి రెడ్డి, తండ్రి : శ్రీ ద్వారంపూడి వెంకట రెడ్డి గారి పేరున కలదు. **హద్దులు: ఉత్తరం :** ఈ స్థలము యొక్క యజమానులకు మరియు నల్లమిల్లి అమ్మిరెడ్డి మరియు ఇతరుల రాకపోకలకు గల దారి - 52'-06", **తూర్పు :** ద్వారంపూడి భాస్కర్ రెడ్డి మరియు ఇతరులకు చెందిన స్థలం - 71'-0", **పడమర :** రోడ్డు - 69'-06", **దక్షిణం:** రోడ్డు - 47'-00".

పైన తెలిపిన హద్దులలోని విస్తీర్ణం **388.33 చ॥గ॥లు లేదా 324.70 చ॥మీ॥ల స్థలం మరియు అందు గల నివాస భవనం అన్నీ సూపర్ స్ట్రక్చర్స్ మరియు సదుపాయాలు మరియు అన్నీ కామన్ దారులు, నీటి దారులు మరియు అన్నీ ఈజిమెంటరీ హక్కులు మొ॥ వాటితో కలదు.**

పైన తెలిపిన షెడ్యూల్సు - (ఎ) మరియు (బి)లు వెరశి మొత్తం విస్తీర్ణం **746.83 చ॥గ॥లు (వాస్తవంగా 570.35 చ॥గ॥లు)** స్థలం, అందు గల ఎసిసి షీట్ షెడ్ నిర్మాణాలు మరియు ఆర్‌సిసి నివాస భవనం అన్నీ సూపర్ స్ట్రక్చర్స్ మరియు సదుపాయాలు మరియు అన్నీ కామన్ దారులు, నీటి దారులు మరియు అన్నీ ఈజిమెంటరీ హక్కులు మొ॥ వాటితో కలదు.

అధీకృత అధికారి
తేది: 03-07-2025 ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్
స్థలం: విశాఖపట్నం రాజమండ్రి బ్రాంచ్, రాజమండ్రి

పేదల నాయకుడు రంగా : మంత్రి దుర్గేష్

పెరవలి, న్యూస్‌టుడే: తన చివరి శ్వాస వరకు పేదల కోసం బతికిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. రంగా జయంతి సందర్భంగా పెరవలి మండలం కాకరపర్రులో ఆయన విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంగా తనయుడు రాధా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేదల వెంట ఉండి ఆయన నిరంతరం పోరాడినందుకు ఈ రోజు గ్రామగ్రామాన రంగా విగ్రహాలు వెలుస్తున్నాయన్నారు. తండ్రి మార్గంలోనే రాధా రంగా నాయకత్వాన్ని అందుకోవాలన్నారు. అంతకు ముందు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ జన్మదినోత్సవం సందర్భంగా పెరవలిలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు పిప్పర రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాకరపర్రులో మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్, వంగవీటి రాధ

రోడ్డుపై చేపపిల్లలు.. చేజిక్కించుకోవాలని పరుగులు

దేవరపల్లి, న్యూస్‌టుడే: గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారిపై డైమండ్ జంక్షన్ సమీపంలో సోమవారం చేప పిల్లల లోడుతో వెళుతున్న వ్యాన్ టైర్ పంక్చర్ కావడంతో ఆ వాహనంపై కప్పిన టార్పాలిన్ ఊడిపోయింది. దీంతో వ్యాన్ లోపల ఉన్న చేప పిల్లలు సుమారు 50 మీటర్ల పొడవునా రహదారిపై పడిపోయాయి. వాహనదారులు, ప్రయాణికులు చేపల కోసం ఎగబడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఎటువంటి సమాచారం, ఫిర్యాదు అందలేదని ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

జాతీయ రహదారిపై పడిన చేప పిల్లలు

జగన్ తీరు మారకుంటే వచ్చే ఎన్నికల్లో వైకాపా గల్లంతే

● మంత్రి వాసంశెట్టి సుభాష్

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, వీఎల్ పురం, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్ తీరు మారకుంటే వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ ఒకటి, రెండు సీట్లకే పరిమితం కావాల్సి వస్తుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం 3వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారన్నారు. పాలన నచ్చకపోవడంతోనే ప్రజలు 11 సీట్లు మాత్రమే ఇచ్చారన్నారు. జగన్ పర్యటనలో ఆయన వాహనం కింద పడిన వ్యక్తిని పక్కను తొలగించి, మానవత్వం లేకుండా వెళ్లిపోయారన్నారు. ఆయన మానసిక పరిస్థితి బాగాలేదన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి పరిశ్రమలు రాకుండా అడ్డుకొన్నారన్నారు. కూటమి పాలనలో రూ. 8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, రానున్న మూడేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఏపీని సువర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ తన పాలనపై ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.

● అమరావతిలో 500 పడకల ఆసుపత్రి నిర్మాణంతో పాటు మెడికల్ కళాశాల స్థాపనకు ప్రతిపాదనలు చేశామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. దీనికి సంబంధించి సీఆర్‌డీఏ 25 ఎకరాల స్థలాన్ని గుర్తించిందన్నారు. రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తిరుపతిలోని ఈఎస్ఐ ఆసుపత్రిని వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. ... కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఇటీవల 30 పడకల ఆసుపత్రుల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు వివరించారు. కొత్తగా 30 ఈఎస్ఐ డిస్పెన్సరీల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశామన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాలు)	ధర (రూపాయల్లో)
[illegible]	23,500
[illegible]	25,000
[illegible]	26,000
[illegible]	26,000
[illegible]	24,000
[illegible]	19,000-22,000
[illegible]	19,000-20,000
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.ల్లో

ఫారంరేటు	102-00
రిటైల్ లైవ్	124-00
డ్రెస్డ్	180-00
స్కిన్‌లెస్	205-00

జిల్లా మహిళా ప్రాంగణం ఇన్‌ఛార్జ్ మేనేజర్‌గా వరలక్ష్మి

బొమ్మూరు: బొమ్మూరులోని మహిళా ప్రాంగణం ఇన్‌ఛార్జ్ జిల్లా మేనేజర్‌గా పి.వరలక్ష్మి బాధ్యతలు స్వీకరించినట్లు సోమవారం తెలిపారు. కలెక్టర్ ప్రశాంతి ఉత్తర్వుల మేరకు కోరుకొండ ఏసీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వచేసిన డీజిల్, పెట్రోల్ పట్టివేత

అనపర్తి గ్రామీణం: డ్రమ్ములతో అక్రమంగా నిల్వచేసిన డీజిల్, పెట్రోల్‌ను అనపర్తి పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కుతుకులూరులో రెండుచోట్ల, పెడపర్తిలోని ఓ ఇంట్లో పెట్రోల్, డీజిల్ నిల్వచేస్తూ విక్రయాలు జరుపుతున్నట్లు అందిన సమాచారంతో దాడులు చేశారు. 1300 లీటర్ల ఇంధనాన్ని గుర్తించామని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై శ్రీనునాయక్ తెలిపారు. పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని, వారు పరిశీలించి నివేదిక ఇచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామని వివరించారు.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

సమిశ్రగూడెం బ్రాంచి (చిరునామా: సమిశ్రగూడెం, నిడదవోలు,
ఫోన్ : 08813-221274 & ఇ-మెయిల్ : iob0642@iob.in)

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (నెం.54 ఆఫ్ 2002) క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధీకృత అధికారి గారు దిగువ ఋణం సొమ్ము వసూలు కొరకు, బ్యాంకుకు రావలసిన బకాయిలు మరియు దిగువ తెలిపిన వడ్డీతో సహా రాబట్టుకొనుటకు దిగువ ఆస్తులను **"ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే" & "ఏది ఉంటే అది"** అను పద్ధతిలో అమ్మకం చేసే హక్కుతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేసిన నోటీసును అనుసరించి స్వాధీనం చేసుకున్నారు. సదరు బకాయిలు మరియు రావలసిన సొమ్మును చెల్లించనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారములతో బ్యాంకుకు రావలసిన బకాయి సొమ్ములు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తి అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. దిగువ సంతకందారు వెబ్‌పోర్టల్ https://baanknet.com నందు గల ఇ-వేలం ప్లాట్‌ఫారంపై సదరు అమ్మకంను నిర్వహించెదరు.

ఋణగ్రహీత /తనఖాదారు పేరు మరియు చిరునామా: ఋణగ్రహీత : మెస్సర్స్ శ్రీ రామసత్య పౌల్ట్రీ ఫార్మ్, శాశ్వత చిరునామా: శంకరపురం, సర్వే నెం.1, ఎర్నగూడెం రోడ్డు, నిడదవోలు - 534302. **కమ్యూనికేషన్ చిరునామా:** శంకరపురం, సర్వే నెం.1, ఎర్నగూడెం రోడ్డు, నిడదవోలు - 534302. **ఆఫీస్ చిరునామా:** శంకరపురం, సర్వే నెం.1, ఎర్నగూడెం రోడ్డు, నిడదవోలు - 534302. **ప్రొప్రయిటర్ : శ్రీ బండి వెంకటేశ్వరరావు,** తండ్రి : లేటు రామారావు, **శాశ్వత చిరునామా:** 2-10, బండి వారి వీధి, తిమ్మరాజుపాలెం, పశ్చిమగోదావరి, నిడదవోలు - 534302. **కమ్యూనికేషన్ చిరునామా:** 2-10, బండి వారి వీధి, తిమ్మరాజుపాలెం, పశ్చిమగోదావరి, నిడదవోలు - 534302. **ఆఫీస్ చిరునామా:** శంకరపురం, సర్వే నెం.1, ఎర్నగూడెం రోడ్డు, నిడదవోలు - 534302. **హామీదారు : బండి అరుణ కుమారి, శాశ్వత చిరునామా:** భర్త: వెంకటేశ్వరరావు, 2-10, బండి వారి వీధి, తిమ్మరాజుపాలెం, పశ్చిమగోదావరి, నిడదవోలు - 534302. **కమ్యూనికేషన్ చిరునామా:** భర్త : వెంకటేశ్వరరావు, 2-10, బండి వారి వీధి, తిమ్మరాజుపాలెం, పశ్చిమగోదావరి, నిడదవోలు - 534302. **ఆఫీస్ చిరునామా:** భర్త : వెంకటేశ్వరరావు, శంకరపురం, సర్వే నెం.1, ఎర్నగూడెం రోడ్డు, నిడదవోలు - 534302.

NPA తేది. 30.04.2024 డిమాండ్ నోటీసు తేది : 06.05.2024

డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : రూ.2,99,94,500.98 పై + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్వాధీనత నోటీసు తేది: 20.08.2024

స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: తేది.19-08-2024 నాటికి రూ.3,10,89,944/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు:

ఆస్తి నెం.1: తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు ఎస్ఆర్ఓ, నిడదవోలు మండలం, శంకరపురం గ్రామం వద్ద ఆర్.ఎస్.నెం.1 లోని ఎ.5.0 సెంట్లు లేదా 24200 చ॥గ॥లు విస్తీర్ణం గల ఆస్తి రిజిష్టర్డు పార్టీషన్ డీడ్ డాక్యుమెంట్ నెం.2566/2001, తేది.16.01.2001 ప్రకారం బండి వెంకటేశ్వరరావు గారి పేరున కలదు. **హద్దులు : తూర్పు :** బి. గోపాలకృష్ణ మరియు బి. సత్యనారాయణ గార్ల భూమి, **దక్షిణం :** బి. కృష్ణారావు గారి భూమి, **పడమర :** బి. రామచంద్రరావు & కృష్ణారావు గార్ల భూమి, **ఉత్తరం :** బి. గోపాలకృష్ణ మరియు బి. సత్యనారాయణ గార్ల భూమి.
పైన తెలిపిన హద్దులలోని మొత్తం విస్తీర్ణం ఎ.5.00 సెంట్లు లేదా 24200 చ॥గ॥ల ఖాళీ భూమి ఇప్పటికే ఉన్న పౌల్ట్రీ షెడ్, భవనంతో కలదు.

రిజర్వు ధర: రూ.2,45,46,000/- ధరావత్తు ధర : రూ.24,54,600/-

ఆస్తి నెం.2: తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు ఎస్ఆర్ఓ, నిడదవోలు మండలం, శంకరపురం గ్రామం వద్ద ఆర్.ఎస్.నెం.1 లోని ఎ.0.37 1/2 సెంట్లు లేదా 1815 చ॥గ॥లు విస్తీర్ణం గల ఆస్తి రిజిష్టర్డు గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్ నెం.4718/2004 ప్రకారం బి. అరుణ కుమారి గారి పేరున కలదు. **హద్దులు : తూర్పు :** బండి వేణుగోపాల కృష్ణ గారి భూమి, **దక్షిణం :** బండి సత్యనారాయణ గారి భూమి, **పడమర :** బండి రామచంద్రరావు గారి భూమి, **ఉత్తరం :** బండి రామచంద్రరావు గారి భూమి.
పైన తెలిపిన హద్దులలోని మొత్తం విస్తీర్ణం ఎ.0.37 1/2 సెంట్లు లేదా 1815 చ॥గ॥ల ఖాళీ భూమి.

రిజర్వు ధర: రూ.18,23,000/- ధరావత్తు ధర : రూ.1,82,300/-

ఆస్తి నెం.3: తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు ఎస్ఆర్ఓ, నిడదవోలు మండలం, శంకరపురం గ్రామం వద్ద ఆర్.ఎస్.నెం.1/33 లోని ఎ.0.37 1/2 సెంట్లు లేదా 1815 చ॥గ॥లు విస్తీర్ణం గల ఖాళీ అగ్రి స్థలం రిజిష్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.5003/2012, తేది.25.08.2012 ప్రకారం బి. అరుణ కుమారి గారి పేరున కలదు. **హద్దులు : తూర్పు :** బి. వేణుగోపాల కృష్ణ గారి భూమి, **దక్షిణం :** బి. వెంకటేశ్వరరావు గారి భూమి, **పడమర :** బి. జగదీశ్వరి మరియు ఇతరుల భూమి, **ఉత్తరం :** అమ్మకందారుని భూమి.
పైన తెలిపిన హద్దులలోని మొత్తం విస్తీర్ణం ఎ.0.37 1/2 సెంట్లు లేదా 1815 చ॥గ॥ల ఖాళీ భూమి.

రిజర్వు ధర: రూ.18,23,000/- ధరావత్తు ధర : రూ.1,82,300/-

ఇ-వేలం తేది మరియు సమయం: తేది.29-07-2025, ఉ॥ 10.30 గం॥ల నుండి మ॥ 12.30 గం॥ల వరకు మరియు https://baanknet.com ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 10 ని॥లకు ఒక సారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ధరావత్తు చెల్లించువిధానం : ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com పోర్టల్ నందు నమోదు చేసుకొనవలెను. తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసిందిగా కోరడమైనది. కెవైసి పత్రాలను ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తి గల బిడ్డర్లు/ కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని **28-07-2025, సాయంత్రం 4.00** గంటలలోపు బదిలీ చేయవలెను.

బిడ్ పెంపుదల మొత్తం: రూ. 50,000/-	బ్యాంకుకు తెలిసినంత వరకు ఎలాంటి ఋణభారములు (ఎన్‌కంబరెన్స్) : లేదు

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : తేది.09-07-2025 నుండి (ఉ॥10 గం.ల నుండి సా॥4.00 వరకు)

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ సమర్పించుట: తేది:09-07-2025, ఉ॥ 10 గం.ల నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది.28-07-2025, సా॥ 4.00 గం॥ల వరకు

* ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజ్ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.

* చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ : https://baanknet.com లేదా బ్యాంక్ వెబ్‌సైట్ : www.iob.in మరిన్ని వివరముల కొరకు : బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్,సమిశ్రగూడెం బ్రాంచి (చిరునామా: సమిశ్రగూడెం, నిడదవోలు, ఫోన్ : 08813-221274 & ఇ-మెయిల్ : iob0642@iob.in) లేదా https://baanknet.com (సర్వీస్ ప్రొవైడర్ యొక్క ఇ-వేలం వెబ్ పోర్టల్) నందు సంప్రదించవచ్చును.

తేది :01-07-2025, ప్రదేశం : సమిశ్రగూడెం సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

BUSINESS OFFER

మా కైజన్ పల్స్ (బెర్రీస్ & హెర్బ్స్) కలిపిన హెల్త్ డ్రింక్)ను మార్కెటింగ్ చేయుటకు ప్రాంతాల వారీగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. Contact: 95153 15198.

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్తిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్ట్గేజ్ లోన్ చేయబడును. ✆ 96665 47338.

గవర్నమెంట్ ఉద్యోగస్తులు & IT రిటర్న్స్ హోల్డర్స్ కి కేవలం 1 రూ. వడ్డీతో 5 లక్షల వరకు రుణాలు. నోట్: సిబిల్ స్కోర్ బాగా ఉండవలెను. ✆ 90002 54511.

HEALTH & CARE

RHEUMATOLOGY

రుమటాలజిస్ట్

డా॥ ఎ.రామకృష్ణంనాయుడు
MD, DM (Rheumatology, NIMS, HYD)
12-07-2025న (శనివారం) 2 pm to 6 PM వరకు
రాజమండ్రిలో ప్రైమ్ పాత్ ల్యాబ్స్, సిసిసి ఛానల్ ఎదురుగా, దానవాయిపేట వద్ద
ఫోన్: 94929 41177
మరియు
13-07-2025న (ఆదివారం) కాకినాడలో సేఫ్ హాస్పిటల్ నందు 10 AM to 5 PM వరకు అందుబాటులో ఉంటారు.
ఫోన్: 0884 2383366

REAL ESTATE

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి, బొమ్మూరులో తక్షణం ఇల్లు కట్టుకొనుటకు అన్ని సదుపాయములతో 150 చ॥గ॥ RUDA అప్రూవ్డ్ స్థలములు అమ్మకం. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ✆ 78424 28888.

JOBS

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

Required Managers, Agents. Salary and Incentives, Marketing Job, Guarantee Income, Age 50 above. Cont: 90108 09384.

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రభాకరనిధి, దేవిచౌక్, రాజమండ్రి నందు బిజినెస్ ప్రమోషన్ చేయుటకు అభ్యర్థులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించండి. సెల్: 79952 33384.

రంగంపేట మండలం, కోటపాడు గ్రామంలో సుమారు 30 ఎకరాలు వ్యవసాయ భూమిని చూసుకొనుటకు సొంత 2 వీలర్ కలిగి, 20-25 సం॥ వయస్సు గల సూపర్‌వైజర్ కావలెను. కాకినాడ వాస్తవ్యులకు ప్రాధాన్యత. సంప్రదించండి. ✆ 83284 36168.

EENADU for Advertisement Contact: 8008597607

కాకినాడ, అశోక్‌నగర్‌లో ప్రముఖ ఫంక్షన్ హాలు నందు పనిచేయుటకు మంచి నడవడిక కలిగినవారు వాచ్‌మేన్‌గా కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 91337 44388.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి / వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

ప్రముఖ సోలార్ సంస్థ నందు కమీషన్ పద్ధతిపై పనిచేయుటకు ప్రమోటర్స్ కావలెను. Cont. Cell: 95608 58684, bandaruenergies@gmail.com

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52843.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-35 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజమహేంద్రవరం

సినిమాలు: కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సూర్యప్యాలెస్, అనుశ్రీ, ఊర్వశి: జురాసిక్ వరల్డ్; రాజా, అప్సర, శివజ్యోతి, శ్యామలా, వీఎస్‌మహల్: తమ్ముడు; **అశోక:** కన్నప్ప; **సూర్యామినీ:** 3బీహెచ్‌కే; **స్వామి:** కుబేర; **రంభ:** మార్గన్; **మేనక:** షోటైం.

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్: టమాట 32, వంకాయలు నలుపు 34/గులాబీ 42/తెలుపు 38/దొమ్మేరు 46, బెండ 32, బీర పందిరి 42/38, దొండ 37, క్యారెట్ 35, బీట్‌రూట్ 35, గోరుచిక్కుళ్లు 40, దోస 15, అనబకాయ 18, చిక్కుళ్లు 65, పచ్చిమిర్చి 55, బంగాళదుంపలు 22, ఉల్లిపాయలు 22

వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: రాజమహేంద్రవరం నగరంలో వీధి విక్రయదారులు నూతన గుర్తింపు కార్డుల దరఖాస్తులను ఈ నెల 10 వరకు స్వీకరిస్తున్నామని కమిషనర్ , కలెక్టర్ ప్రశాంతి సోమవారం తెలిపారు. వీధి వ్యాపారులు తప్పకుండా గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. వీటి కోసం మెప్మా విభాగంలో సంప్రదించాలన్నారు. దరఖాస్తులను పరిశీలించిన తర్వాతనే కార్డులు మంజూరు చేస్తారన్నారు. తద్వారా వ్యాపార జోన్లను కేటాయిస్తారన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ నరసింహకిషోర్

నిర్దేశిత సమయంలో అర్జీలు పరిష్కరించాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 35 మంది వివిధ సమస్యలపై ఎస్పీకి వినతులు ఇచ్చారు. ఏఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో సెలూన్ ప్రారంభం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా వారి అవసరాలకు ఉపయోగపడేందుకు గాను రాజమహేంద్రవరం జిల్లా పోలీసు కార్యాలయంలో సెలూన్ దుకాణం ఏర్పాటు చేశారు. సోమవారం దీనిని ఎస్పీ నరసింహకిషోర్ ప్రారంభించి వసతులు పరిశీలించారు.

ఆలకించండి.. పరిష్కరించండి

ఈనాడు డిజిటల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం: తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు అనేక మంది సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరయ్యారు. తాము పడుతున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు. పింఛన్ అందడంలేదని.. ఏళ్లుగా తమ గ్రామాన్ని రోడ్డు సమస్య వెంటాడుతోందని.. ఇసుక లారీల కారణంగా పిల్లలను స్కూల్‌కు పంపించలేకపోతున్నామని తదితర సమస్యలను విన్నవించారు.

రహదారి నిర్మించండి

గోకవరం మండలం, వెదురుపాక గ్రామానికి చెందిన కొందరు మహిళలు తమ గ్రామానికి రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మెయిన్ రోడ్డు నుంచి జగనన్న కాలనీలో నివాసాలకు పొలాల గట్లపైనే వెళ్లాల్సి వస్తుందన్నారు. దీంతో జారిపడిపోయి ప్రమాదాల బారిన పడుతున్నామని ఆందోళన చెందారు. రాత్రి వేళల్లో పాముల బెడద ఉంటుందన్నారు.

కలెక్టర్ కార్యాలయం వద్ద వెదురుపాక గ్రామస్థులు

కాతేరుకు చెందిన మహిళలు

ఇసుక లారీలతో చింత..

రాజమహేంద్రవరం గ్రామీణం, గోదావరి గట్టు నుంచి కాతేరు వెళ్లే మార్గంలో ఇసుకలారీలను నిలుపుదల చేయాలని గ్రామానికి చెందిన కొంత మంది మహిళలు కోరారు. ఇసుక లారీల కారణంగా విద్యార్థులను స్కూల్‌కు పంపించాలంటే భయంగా ఉందని కలెక్టర్‌కు వివరించారు.

పింఛను మంజూరు చేయించండి

నిడదవోలు మండలం, కంసాలి పాడుకు చెందిన 85 ఏళ్ల పి.పి.రామారావు వృద్ధాప్య పింఛన్ రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నానని వాపోయారు. వివాహం చేసుకోకపోవడంతో తమ్ముడు కుమారుడిపై తన భారం పడిందని ఆందోళన చెందారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

పప్పు లక్ష్మణరావు

ఈనాడు డిజిటల్, రాజమహేంద్రవరం: వెన్నుపూస దెబ్బతినడంతో మూడేళ్లుగా మంచానికే పరిమితమయ్యానని ఓ వ్యక్తి ఆవేదన చెందారు. తన సమస్య విన్నవించుకునేందుకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చారు. అనపర్తి మండలం, పేరరామచంద్రాపురం గ్రామానికి చెందిన పప్పు లక్ష్మణరావు కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్ల కిందట పనిచేస్తుండగా జారి కింద పడటంతో పూర్తిగా లేవలేని స్థితిలోకి వెళ్లిపోయానని వాపోయారు. చేతికొచ్చిన 17 ఏళ్ల కుమారుడు కాలువలోకి స్నానానికి వెళ్లి మృతి చెందాడని కన్నీరు పెట్టుకున్నారు. ఉన్న ఒక్క కుమారుడూ మరణించడంతో అనాథలమైపోయామని బాధపడ్డారు. పనికి వెళ్తే గాని పూట గడవని పరిస్థితని.. మూడేళ్లుగా భారమంతా తన భార్య పప్పు లక్ష్మి మీదే పడిందన్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదని, 35 కేజీల రేషన్ కార్డు ఇప్పించి తమను ఆదుకోవాలని కోరారు.

వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలంటూ విద్యార్థుల వినతి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి అర్జీ పరిశీలించి నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. తాగునీరు, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై 20 అర్జీలు అందాయి. ఇంజినీరింగ్ విభాగంలో 7, రెవెన్యూ 7, టౌన్ ప్లానింగ్ 2, పబ్లిక్ హెల్త్ విభాగం 2, మెప్మా 1, టిడ్కో 1 సంబంధించి అర్జీలు అందుకున్నారు. గోరక్షణ పేట ప్రైవేటు స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని, ట్రాఫిక్ సైన్ బోర్డులు వేయాలని కోరుతూ పాఠశాల విద్యార్థులు వినతిపత్రం అందించారు. డిప్యూటీ కమిషనర్ రమణ, ఎస్ఈ కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ వినూత్న, సెక్రటరీ శైలజవల్లి తదితరులు పాల్గొన్నారు.

హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు సిద్ధం

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు సిద్ధమయ్యాయి. జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఎంఈఓల ద్వారా సోమవారం పంపిణీ చేసినట్లు డీఐ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ కార్డులో విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని పొందుపరిచి తల్లిదండ్రులకు అందిస్తామన్నారు. ఎంఈఓలు ప్రధానోపాధ్యాయులకు వీటిని సమయానికి అందజేసి సమావేశానికి ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు

శ్యామలా సెంటర్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 10న జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) ను విజయవంతం చేయాలని అర్బన్ రేంజ్ డీఐ దిలీప్‌కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఈ సమావేశాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. పాఠశాల అభివృద్ధి తెలియజేసే వీడియోలను రూపొందించి, తల్లిదండ్రులను, ముఖ్యఅతిథులను ఆహ్వానించాలని సూచించారు. అర్బన్ పరిధిలోని 8 స్కూలు కాంప్లెక్స్ ఛైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు జయంతి శాస్త్రి, శ్రీనివాసరావు, ప్రసాద్, కోటేశ్వరి, ఇందిర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

వారాహిదేవికి విశేష పూజలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం సమీపంలోని గాడాల గ్రామంలో శ్రీమహాలక్ష్మీ సమేత చిన్నవేంకన్నబాబు పీఠంలో వారాహి గుప్త నవరాత్రుల పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆషాఢ మాసంలో మహాలక్ష్మీ అమ్మవారు గుప్తనవరాత్రి పూజల్లో భాగంగా వారాహిదేవిగా దర్శనమిస్తారని పీఠాధిపతి వెంకన్నబాబు స్వామీజీ తెలిపారు. రాష్ట్రంలోనే అతి పెద్ద విగ్రహ రూపంలో వారాహిదేవికి నిత్యం పూజలు జరిపిస్తామన్నారు. ఈ నెల 10న ఉదయం అమ్మవారికి హారతి సమర్పణతో గుప్త నవరాత్రులు ముగుస్తాయన్నారు. వారాహీదేవికి సోమవారం ఉదయం హోమం, కుంకుమార్చన, హారతి ఉత్సవం నిర్వహించారు. అమ్మవారిని ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత: ఈఈ

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతులకు మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాజేంద్రనగర్, ప్రకాశంనగర్ రౌండ్ పార్కు ప్రాంతం, గౌతం యూరాలజీ ఆసుపత్రి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

అపరాల సాగుతో రైతులకు అదనపు ఆదాయం

విత్తనాలు అందిస్తున్న వ్యవసాయ అధికారులు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: అపరాల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చని రాజమహేంద్రవరం వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు సోమవారం సాయంత్రం స్థానిక ఏడీఏ కార్యాలయం వద్ద కందులు, మినుము, జొన్న విత్తనాల మినీ కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరిగట్లపై కందులు, జొన్న సాగు చేస్తే రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. వీటితోపాటు తెగుళ్లు తట్టుకునే మినుము రకాన్ని రైతులకు అందజేస్తున్నామన్నారు. అర్బన్ వ్యవసాయ విస్తరణాధికారి వేణుమాధవరావు, కె.సూర్యరమేష్, పలువురు గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సహకార పథకాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రతిఒక్కరూ సహకార సంఘాలు, పథకాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామిబాబు పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని రామదాసు సహకార శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న డీసీఎం శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కింది స్థాయి ఉద్యోగి నుంచి ప్రతి ఒక్కరూ కేంద్ర సహకార బ్యాంకు, సహకార సంఘాల గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, డీసీఏవో జగన్నాథరెడ్డి, డీఆర్ కనకదుర్గ, శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో చక్రధరరావు

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద చేపట్టిన నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన పమ్మి మురళి, మమత దంపతులు రూ.50,001 విరాళాన్ని సోమవారం సమర్పించారు. వీరికి స్వామి వారి చిత్రపటం అందజేసి ఈవో ఎన్ఎస్ చక్రధరరావు అభినందించారు.

ఎమ్మెల్సీ కార్యాలయానికి వచ్చిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

మాధవ్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సోమ వీర్రాజు

దేవీచౌక్, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సోమవారం ఎమ్మెల్సీ సోము వీర్రాజు కార్యాలయానికి వచ్చారు. నూతనంగా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతూ మార్గం మధ్యలో రాజమహేంద్రవరం తారకరామనగర్‌లోని సోము వీర్రాజు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు.

రామారావును ఆదర్శంగా తీసుకోవాలి

సత్తిబాబుకు నగదు పురస్కారం అందిస్తున్న న్యాయవాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: న్యాయవాద వృత్తికి గౌరవం తెచ్చిన వ్యక్తి యర్రా వెంకట శ్రీరామారావు అని.. నేటి తరం న్యాయవాదులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని రాజమహేంద్రవరం బార్ అసోసియేషర్ అధ్యక్షుడు శోభనాథశాస్త్రి పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది యర్రా వెంకట శ్రీరామారావు జయంతిని బార్ అసోసియేషన్‌లో సోమవారం నిర్వహించారు. వారి ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా జూనియర్ న్యాయవాదికి గ్రంథాలయ ఏర్పాటుకు నగదు పురస్కారం అందిస్తారు. దీనిలో భాగంగా ఈ ఏడాది గుత్తుల సత్తిబాబుకు నగదు అందించారు. సీనియర్ న్యాయవాదులు ముప్పాళ్ల సుబ్బారావు, తవ్వల వీరేంద్ర, పుట్రేవు ప్రసాద్, వాసిరెడ్డి బాబూరావు, రాచపల్లి ప్రసాద్, ట్రస్టు అధ్యక్షుడు యర్రా వేణుగోపాలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోనేరు మురళికి పరామర్శ

టి.నగర్, న్యూస్‌టుడే: పుత్ర వియోగంతో బాధపడుతున్న తెదేపా నాయకుడు కోనేరు మురళిని సోమవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. ఆయన నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్య ప్రభ, మార్కెటు యార్డు ఛైర్మన్ మార్ని వాసుదేవరావు పలువురు ఆయన కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

గోవధ నిషేధంపై హామీ ఇవ్వండి

మాట్లాడుతున్న అజ్జరపు హరిబాబు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : గోవధ నిషేధం, గో సంతతి పరిరక్షణ, సంరక్షణ, హిందూ దేవాలయ, ధర్మాదాయ సంస్థల పరిరక్షణపై ప్రభుత్వం కచ్చితమైన హామీ ఇవ్వాలని మాతృరూపిణి సేవాసంస్థ నిర్వాహకుడు అజ్జరపు హరిబాబు డిమాండ్ చేశారు. సీతంపేట మాతృరూపిణీ మందిరంలో హరిబాబు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోతే జులై 10నుంచి నిరవధిక ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి సమస్యను మెయిల్స్ ద్వారా విన్నవించామన్నారు. సంబంధిత శాఖలకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా సమాధానం రాకపోవడంతో రిలే నిరాహార దీక్ష చేపట్టామన్నారు. దూర్వాసుల సత్యనారాయణ, దేశిరెడ్డి బలరామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన సాగుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'సుపరిపాలన తొలి అడుగు' సోమవారం 3వ డివిజన్‌లో శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు ఏం మేలు చేయకపోవడం వల్లే వైకాపాకు 11 సీట్లు వచ్చాయన్నారు. అనంతరం ఇంటింటా పర్యటించి కూటమి పాలన వివరించారు. గన్ని కృష్ణ, యర్రా వేణుగోపాలరాయుడు, నక్కా చిట్టిబాబు, దేవీ వరప్రసాద్, మజ్జి రాంబాబు, రెడ్డి మణేశ్వరరావు, కాశీ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

ఈఎస్ఐ వైద్యసేవలపై మంత్రి ఆరా

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిని సోమవారం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలు తెలుసుకున్నారు. వైద్యులు అందుబాటులో ఉంటున్నారా? ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ ఎలా ఉంది..? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ ఆరా తీశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని వైద్యసిబ్బందికి స్పష్టం చేశారు. అనంతరం ఈఎస్ఐ ఆసుపత్రి కొత్త భవనాలను పరిశీలించారు. వివిధ కేటగిరిల కింద ఖాళీగా ఉన్న 855 పోస్టులను రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానాల్లో భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ సుభాకర్, ఇతర వైద్యులు, తదితరులు ఉన్నారు.

చిన్నారులకు దుప్పట్లు, పుస్తకాలు అందిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

సమాజ హితానికి వాసవీ క్లబ్ సేవలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : వాసవీ క్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో సోమవారం నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ క్లబ్ గవర్నర్ యండూరి రాఘవ కుమారి పర్యటనలో భాగంగా వీవర్స్ కాలనీలోని ప్రియదర్శిని చెవిటి, మూగ పాఠశాలకు క్లబ్ నగర అధ్యక్షురాలు శిఘాకొల్లి శైలజ నేతృత్వంలో వాటర్ ట్యాంక్ బహూకరించారు. గోదావరిగట్టున ఉన్న సదనం పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు అందజేశారు. ఆవరోడ్డులోని ఏకలవ్య అనాథ ఆశ్రమం పిల్లలకు దుప్పట్లు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆర్యాపురం శ్రీకృష్ణ ఆశ్రమం గోకులం గోశాలలో గోవులకు దాణా ఇచ్చారు. క్లబ్ గవర్నర్ రాఘవ కుమారి వాసవీ క్లబ్ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ శిఘాకొల్లి కరుణ్ కుమార్, ట్రెజరర్ కె.లక్ష్మీకాంతం, బచ్చు పార్వతి, బొండా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చేస్తున్న వికాస్ సొసైటీ నిర్వాహకులు

వృద్ధులకు సేవలందించడం గర్వకారణం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: నిరాదరణకు గురైన వృద్ధులు, దివ్యాంగులకు ప్రతి నెలా ఆర్థిక సాయం అందించడం గర్వకారణమని ఏపీ ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సిద్దెల రాజబాబు అన్నారు. సోమవారం ఉదయం వీఎల్‌పురం పార్కులో వికాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక చేయూత కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాజబాబు మాట్లాడుతూ 12ఏళ్లుగా నిర్విరామంగా సేవలందించడం ప్రశంసనీయమన్నారు. ప్రతి నెలా తన జీతం నుంచి కొంత శాతం నిరుపేదల సంక్షేమానికి వినియోగిస్తున్న సంస్థ నిర్వాహకుడు యార్లగడ్డ ప్రభాకర్ సేవలు అపురూపమన్నారు. అతిథి చేతుల మీదుగా 150 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రెండొందల వంతున పింఛన్లు పంపిణీ చేశారు. కొల్లి రత్నాకరరావు, దుళ్ల రవి, చల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుతం ఇలా..

రంగు మారినది

ఇటీవల ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి నదికి వరద నీటి ప్రవాహం చేరుతోంది. దీంతో నది ఎరుపు రంగు సంతరించుకుంది. వాతావరణంలో మార్పు రావడంతో నగరవాసులు సాయంత్రం సమయంలో రంగు మారిన నదిని చూసేందుకు వస్తుండటంతో ఘాట్లు సందడిగా మారాయి. —న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

టెండర్-కం-బహిరంగ వేలంపాట ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం నగరం మరియు మండలంలో వేంచేసియున్న శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి మరియు శ్రీ సీతారామస్వామి వార్ల దేవస్థానం యొక్క పూర్తి హక్కుభుక్తమైనటువంటి రాజమహేంద్రవరం రూరల్, కాతేరు గ్రామంలో RS No. 293లో ఎ. 3.88 సెంట్ల మెరక భూమిని 3 సంవత్సరములు కాలపరిమితికి గాను ది.16-7-2025 బుధవారం ఉదయం 11 గంటలకు టెండర్ (కం) బహిరంగ వేలంపాట శ్రీ ఉమాకోటిలింగేశ్వర స్వామి కార్యాలయం నందు నిర్వహించబడును. మిగిలిన ఇతర పాట షరతులకు ఆలయ కార్యాలయం పనిచేయు వేళల్లో అడిగి తెలుసుకొనవలెను.

రాజమహేంద్రవరం,

Dt: 07-07-2025. కార్యనిర్వహణాధికారిణి

పాల ఆసుపత్రి వద్ద ప్రధాన పెద్ద కాలువ పక్కన రోడ్డు దుస్థితి

ప్రధాన కాలువకు ప్రహరీ లేకుండా

కీలక ప్రాంతం.. సౌకర్యాలు శూన్యం

నగరంలోని కీలక ప్రాంతమైన తుమ్మలావ సాంబశివరావు పేట ప్రాంతంలో సుమారు అయిదు వేల మంది నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో అధ్వానంగా కాలువలు, గుంతల దారులతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మురుగు కాలువలపై సరైన పలకలు కూడా లేవని స్థానికులు వాపోతున్నారు. సుమారు మూడు సంవత్సరాల కిందట వాటర్ పైపులైన్ పనులకు రోడ్డు తవ్వి పెద్ద పైపులైన్లు వేశారు. పనులు పూర్తయిన తరువాత నామమాత్రంగా కంకర, సిమెంటు వేశారు. దాదాపు పది వీధుల్లో రోడ్లన్నీ గుంతలుగా మారిపోయాయి. వర్షాకాలంలో రోడ్లు మడుగులను తలపిస్తాయి. గోదావరి నదికి కూతవేటు దూరంలో ఉండటంతో వరదలు సమయంలో ఇళ్లల్లోకి నీరు చేరుతుంది. పాల ఆసుపత్రి ప్రాంగణం సైతం ముంపులో ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ ప్రాంతంలో నూతన సిమెంటు రోడ్డు నిర్మించారు. కానీ పూర్తి స్థాయిలో సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. —న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

11వ వర్ధంతి

అమృతమూర్తీ,
మీరు షిరిడీ సాయినాధునిలో
ఐక్యమై నేటికి
11 సంవత్సరములు అయిననూ
మీ జ్ఞాపకాలు, ప్రేమాభిమానాలు,
మధురస్మృతులూ
మా మనస్సులలో ఇప్పటికీ,
ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.
చల్లని మీ అమృత వీక్షణలు
కలకాలం మాపై ఉండాలని
కోరుకుంటూ...

శ్రీ దమ్ము శ్రీరామారావు గారు (D.S.రామారావు)
H/o దమ్ము లక్ష్మి (లేటు)
Retd. JAO, BSNL, Rajahmundry
జననం: 09-05-1946 మరణం: 08-07-2014

కుటుంబసభ్యులు

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

విద్యార్థులే ఆహ్వానపత్రికల రూపకర్తలు

న్యూస్‌టుడే, సీతానగరం: ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 10న నిర్వహించే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం పండుగ వాతావరణంలో పూర్తిచేసేలా అన్నిచోట్ల ఏర్పాట్లు చేస్తున్నారు. సీతానగరం మండలం బొబ్బిల్లంక జడ్పీ ఉన్నతపాఠశాల బాలబాలికలు వినూత్న రీతిలో ఆహ్వానపత్రికలు వారే తయారు చేసి గ్రామపెద్దలను, ఉద్యోగులను సోమవారం ఆహ్వానించారు.

శాకంబరిగా అమ్మవారి అలంకరణ



రంగంపేట, న్యూస్‌టుడే: శాకంబరి దేవిగా రంగంపేట శివాలయంలోని అమ్మవారు సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. దాదాపు అన్ని రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఆ ప్రాంగణంలోని వినాయకుడు, నంది ప్రతిమలను అర్చకులు మైలవరపు నాగేంద్రకుమార్ అలంకరించగా అది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కూరగాయలతో మంగళవారం 11గంటలకు సాంబారుగా తయారు చేసి భక్తులకు పంపిణీ చేయనున్నట్లు అర్చకులు తెలిపారు.

తల్లిదండ్రుల సమావేశం విజయవంతంగా జరగాలి

బొమ్మూరు: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు 10వ తేదీన జరిగే సమావేశం దిగ్విజయంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి జ్యోతి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. హుకుంపేట ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు జరిగే సమావేశం విద్యార్థి ఉన్నతికి ఉపయోగపడుతుందన్నారు. ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఈవో తులసీదాస్ మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 వరకు జరిగే వివిధ కార్యక్రమాల కోసం వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జ్యోతి

గౌరవభృతి బకాయిలు ఇప్పించండి

సీతానగరం, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులకు గౌరవభృతి బకాయిలను ఇప్పించాలని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న కోరారు. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సుమారుగా 30 నెలలుగా గౌరవభృతి రావడం లేదన్నారు. నెలకు రూ.6వేలు ఎంపీపీ, రూ.3వేలు చొప్పున ఎంపీటీసీ సభ్యులకు రావాల్సి ఉందన్నారు. బకాయిలు ఉండటం వల్ల సమావేశాలకు సైతం సభ్యులు గైర్హాజరు అవుతున్నారన్నారు. 2023 ఆగస్టు నుంచి రావాల్సి ఉన్న గౌరవభృతి బిల్లులు పెట్టామని ఎంపీడీవో ఎం. భారతి తెలిపారు.

బాలల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం

సీతానగరం,న్యూస్‌టుడే: ఆటలు, ఆహారపు అలవాట్లు, మార్కులు, ర్యాంకుల పైనే ధ్యాస వంటి కారణాలతో పిల్లలు మానసిక, ఆరోగ్య సమస్యలతో తరుచూ ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తోంది. ఈ నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష (రాష్ట్రీయ బాలల స్వాస్థ్య) కార్యక్రమం ఆర్బీకేఎస్‌కెకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు ప్రారంభించారు. 3-18 ఏళ్ల వయసు కలిగిన విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు.

డివిజన్ పరిధిలో..

రాజానగరం, రాజమహేంద్రవరం గ్రామీణం, అనపర్తి నియోజక వర్గాలతోపాటు గోకవరం మండలం 18 పీహెచ్‌సీలు, 3 సీహెచ్‌సీల పరిధిలో వైద్యసిబ్బందికి చిన్నారులకు చేయాల్సిన వైద్యపరీక్షలపై గత నెలలోనే శిక్షణ పూర్తిచేశారు. వీరంతా ప్రతి విద్యాలయంలోని చిన్నారులకు పరీక్షలు చేసి ఆరోగ్య సమస్యలను గుర్తిస్తున్నారు. అవసరం మేరకు పీహెచ్‌సీలో చికిత్స అందించడం అంతకు మించి వైద్యం అవసరమైతే ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులకు వారిని తరలించేలా ఏర్పాట్లు చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైనవారుంటే నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ఉచితంగా చేస్తారు. డివిజన్ పరిధిలో సుమారుగా 48,589 మంది చిన్నారులకు ఆరోగ్య రక్ష కార్యక్రమంలో పరీక్షలు చేపట్టారు.

పాఠశాలలో విద్యార్థుల ఎత్తు, బరువు చూస్తున్న వైద్య సిబ్బంది

ఎత్తు, బరువుకు సంబంధించినవి..

పోషకాహార లోపంతో కొన్నిచోట్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కార్యక్రమంలోనే విద్యార్థి వయసుకు తగిన బరువు, ఎత్తు, ఉన్నారా లేదా అనే అంశాలను విద్యాలయాల్లో వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో కొలతలు తీస్తున్నారు. పిల్లల్లో గుర్తించిన ఆరోగ్యలోపాలను తల్లిదండ్రులకు వివరించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రస్తుతం చిన్నారుల్లో కంటిచూపు లోపం, తలనొప్పి, రక్తలేమి, ఆయాసం, చర్మసంబంధ రుగ్మతలతో ఇబ్బంది పడుతున్నట్లు ఇప్పటికే కొన్నిచోట్ల సిబ్బంది గుర్తించారు.

నెల 10వ తేదీలోగా పూర్తిచేస్తాం..

విద్యాలయాల్లో ఉండే చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన వైద్యసిబ్బందితో పరీక్షలు మొదలుపెట్టాం. అత్యవసరమైన కేసులు అంటూ ఏమీ లేవు. సాధారణ రుగ్మతలు ఉన్నవాటికి మందులు అందిస్తున్నాం. ఈనెల 10వ తేదీలోపు బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమం పూర్తిచేస్తాం.

-డాక్టర్ ఏవీకే చైతన్య ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త-రాజానగరం

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

బిక్కవోలు, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కొంకుదురు వైద్యాధికారిణి విజయలక్ష్మి అన్నారు. కాపవరంలో సోమవారం ఆమె సిబ్బందితో పర్యటించారు. రెండు రోజులుగా కాపవరం ఎస్సీపేటలో జరుగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. డీఎంహెచ్‌వో, శాసనసభ్యుల ఆదేశాలతో ఈసర్వే మూడు బృందాలు చేశాయని వెల్లడించారు. సర్వేలో 220 గృహాలు, 632 మందిని కలిసి పరిశీలించారని, ఇందులో ఇద్దరు జ్వరంతో బాధ పడుతున్నారని, మరో 56 మందికి స్వల్ప ఇబ్బందులు ఉన్నాయని వారందరికి మందులు అందించినట్లు తెలిపారు. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న కొంకుదురు వైద్య అధికారిణి

ఐడీలు అందగానే వేతనాలు

కడియం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల బదిలీ ఐడీలు అందగానే వేతనాల చెల్లింపులుంటాయని రాష్ట్ర ఖజానాశాఖ సంచాలకుడు మోహనరావు వివరించినట్లు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యదర్శి జయరాజు తెలిపారు. ఆ మేరకు సంఘ కార్యవర్గ సభ్యులతో మంగళగిరి సచివాలయంలో మోహనరావును కలిసి తెలుగునాడు తరపున ఉపాధ్యాయుల సమస్యలను వివరించామని అన్నారు. ఆ మేరకు పదవీ విరమణ పొందిన వారికి దశల వారీగా పీఎఫ్ చెల్లించడం జరుగుతుందన్నారు. సీపీఎఫ్ ఎంఎస్ రాష్ట్ర ప్రత్యేక సలహాదారుడు శ్రీనివాస్, సంఘ సభ్యులు లజపతిరాయ్, వరహాలరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రభుత్వం చేయూత : ఎమ్మెల్యే

వడిశలేరు(రంగంపేట), న్యూస్‌టుడే: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం తగిన చేయూతను అందిస్తుందని, రైతులు ఆధునిక పద్ధతిలో సేంద్రియ వ్యవసాయం సాగించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. సోమవారం రంగంపేట మండలం వడిశలేరులో 80శాతం రాయితీపై వ్యవసాయానికి సంబంధించిన డ్రోన్‌ను రైతులకు అందించారు. రాయితీపై మినుము విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద, జనసేన మండల అధ్యక్షుడు గిరిజాల సత్తిబాబు, మండల భాజపా అధ్యక్షుడు ఎం. సాయిరామ్, మండల వ్యవసాయాధికారి కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

కులం పేరుతో దూషణ, దాడి..

అనపర్తి గ్రామీణం: దుప్పలపూడి గ్రామానికి చెందిన కొంతమంది కులం పేరుతో దూషిస్తూ దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని కొండగుంటూరుకు చెందిన మహిళ కొమ్ము బుజ్జి ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్సై శ్రీనివాస నాయక్ తెలిపారు. వివరాల ప్రకారం.. కొండగుంటూరుకు చెందిన బుజ్జి ఆమె భర్త బొంగు వీరబాబు దుప్పలపూడిలో ఉంటున్నారు. నెల రోజుల క్రితం ఆయన ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఓ వ్యక్తిని ఢీకొట్టడంతో ఆయన మృతిచెందారు. దీనిపై కేసు నమోదుకాగా స్టేషన్ బెయిల్‌పై ఆయన వచ్చారు. మృతుని బంధువులు రూ.2 లక్షల పరిహారం ఇవ్వాలని గ్రామ పెద్దలను సంప్రదించారు. గ్రామ పెద్దల పంచాయితీలో రూ.50 వేలు ఇస్తానని వీరబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం పెరిగి దుర్భాషలాడుకున్నారు. ఈ విషయమై కొమ్ము బుజ్జి, వీరబాబు, అతని భార్య అనపర్తి పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదుచేసి దుప్పలపూడి వెళుతుండగా వారిని అడ్డగించి కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదుచేశామని ఎస్సై శ్రీనునాయక్ తెలిపారు. చికిత్స పొందుతున్న బాధితులను మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, వైకాపా నాయకులు సోమవారం పరామర్శించారు.

బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

ఇంటింటా సుపరిపాలనలో తొలి అడుగు

గోకవరం, అనపర్తి గ్రామీణం, రాజానగరం: అభివృద్ధితో పాటు మరోవైపు సంక్షేమ పథకాల అమలు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం గ్రామం తారకరామానగర్‌లో సోమవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ పాలన ఏవిధంగా ఉంది అని ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ✦ అనపర్తి మండలం లక్ష్మీనరసాపురంలో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వంతోనే ప్రజాసంక్షేమం సాధ్యమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిసంక్షేమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ✦ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందని రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం తెదేపా శ్రేణులు నరేంద్రపురం గ్రామంలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. తెదేపా నాయకులు చిట్టిప్రోలు పద్దరాజు, గంగిశెట్టి చంటిబాబు, సి. హెచ్. త్రిమూర్తులు, నూనె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీవీఆర్ చౌదరి

గోకవరం: తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

In the Court of the IVth Addl. District Judge, Nellore
I.A.No. 578 / 2019
A.S.No. 100 / 2018
Yarlagadda Siva Rama Prasad
- Petitioner / Appellant
Vs
1. Katari Padmaja and 4 Others
- Respondents / Respondents
Notice to 3rd Respondent
Sathi Srinivasa Reddy
S/o Sathyanarayana Reddy
R/o Anaparthi Village and Mandal, East Godavari District.
పై నెంబరు కేసులో [illegible] I.A.No. 578/2019 [illegible] 23-7-2025 [illegible] ఉదయం 10.30 [illegible]
పొట్లూరు శ్రీనివాసులు, B.Com., B.L., న్యాయవాది, కావలి, నెల్లూరు జిల్లా.

PUBLIC NOTICE
On Instructions by my Client M/s Sriram Finance Ltd., Innespeta Branch, Rajamahendravaram issue this Notice to General Public. My Client Intends to Sanction loan to Mapathula Durga Phani Kumar, S/o Suryanarayana, Rajamahendravaram-1 on the Security of the below mentioned property belongs to them by way of registered equitable mortgage.
SCHEDULE OF THE PROPERTY/TIES
Vacant site in an area of 73-33 Sq. yards = 61-31 Sq. meters in layout plot No.73, near Door No.115-2-66/3, out of layout land Ac.0-75 cents on southern side out of Ac.1-75 cents on western side out of Ac.5-25 cents in full covered by RS No.635/2 situated at Kolamuru Village, within Kolamuru Gram Panchayati, within Rajamahendravaram Rural Mandal, within Sub Registrar of Pidimgoyyi, E.G.Dist., within the following boundaries: EAST: Land of Pattapagalu Seetharamanjaneyulu 22-0"; SOUTH: Site in layout plot No.74 30'-0"; WEST: 20 feet wide layout Road 22'-0"; NORTH: Site in layout plot No.72 30'-0"
Together with all easement rights
(As per Regd. Sale Deed dated 24-02-2023 (Vide Doct No.2223/23))
PLN PRASAD, B.Com., B.L., Advocate
Rajahmundry, D.No: 11-3-10, Seshaiahmetta
Dt. 06-7-2025. RAJAMAHENDRAVARAM-4, Cell. 98495 87025

గత ప్రభుత్వానిది విధ్వంస పాలన: పురందేశ్వరి

కోరుకొండ, రాజానగరం: గత ప్రభుత్వ పాలన విధ్వంస, విద్వేషపూరితంగా సాగిందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి, భాజపా నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరితో కలిసి ఆమె పాల్గొన్నారు. గాదరాడలో సభలో ఆమె మాట్లాడుతూ.. వైకాపా పాలనలో దోపిడీ వ్యవస్థ రాజ్యమేలిందన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతే కేంద్ర సహకారంతో కూటమి ప్రభుత్వం గాడిన పెడుతుందన్నారు. కోరుకొండలో మండల భాజపా కార్యాలయాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే బత్తుల గత వైకాపా పాలనపై విరుచుకుపడ్డారు. ఎక్కడైనా తాను అక్రమాలకు పాల్పడి ఉంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధం అన్నారు. అంతకు ముందు చేసిన పలు కార్యక్రమాలు రూ.75 కోట్లతో రహదారులు, రూ.36 కోట్లతో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేశామన్నారు. రూ.3.3 కోట్లతో నిర్మించనున్న గాడాల- తొర్రేడు , రూ.1.04 కోట్లతో పాలచర్ల- గాడాల రహదారులకు శంకుస్థాపన చేశారు. రూ.1.95 కోట్లతో కోటికేశవరం- బొల్లెద్దుపాలెం, రూ.45 లక్షలతో పాత మునగాల- కొత్త మునగాల రహదారులను ప్రారంభోత్సవం చేశారు. రూ.25 లక్షలతో కొత్త మునగాల రహదారి శంకుస్థాపన, రూ.3 కోట్లతో కణుపూరు- గాదరాడ, రూ.2.25 కోట్లతో గాదరాడ-నందరాడ, రూ.30 లక్షలతో గాదరాడ - వెంకన్న చెరువు రహదారులను ప్రారంభోత్సవం చేశారు. రూ.60 లక్షలతో నిర్మించనున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన ఎంపీ చేతుల మీదుగా జరిగింది.

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, రుడా ఛైర్మన్ తదితరులు

నేతల అనుచరుల మధ్య వర్గపోరు

ఎంపీ పురందేశ్వరి పర్యటనలో తెదేపాలోని ఇరు నేతల అనుచరుల మధ్య వర్గ పోరు బయటపడింది. తెదేపా నియోజక వర్గ ఇన్‌ఛార్జి అనుచరులు, మరో వర్గానికి చెందిన వారు ఒకరికొకరు మాటల యుద్ధంతో ఘర్షణకు దిగారు. కాన్వాయ్‌లో తమ కారు ముందు ఉండాలని ఒక వర్గం వారు, తామే ముందుండాలని మరో వర్గం అనుచరుల మధ్య మాటల పోరు కొనసాగింది. చివరికి ఎవరిదారినవారే శాంతించి కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమగ్ర పోషకాల యాజమాన్యంపై శిక్షణ

రాజానగరం, న్యూస్‌టుడే: కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వారి ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాకు చెందిన 30 మంది పీఏసీఎస్ అధికారులు, ఎరువుల డీలర్లకు పంటలలో సమగ్ర పోషకాల యాజమాన్యంపై సోమవారం శిక్షణను ప్రారంభించినట్లు కేవీకే హెడ్ వి.ఎస్.జి.ఆర్.నాయుడు తెలిపారు. 15 రోజులు కొనసాగే ఈ శిక్షణలో ఎరువుల డీలర్లకు వివిధ అంశాలైన రసాయన, జీవ, సేంద్రియ ఎరువులు, వివిధ పంటలలో పాటించాల్సిన ఎరువుల షెడ్యూల్ కేవీకే అధికారులు వివరించడంతో పాటు క్షేత్ర ప్రదర్శనను చేపట్టనున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ మాట్లాడుతూ అభ్యాసాలను వినడమేకాకుండా, సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు మాట్లాడుతూ పీఏసీఎస్ అధికారులు రైతులకు సమతుల్యమైన రసాయన ఎరువుల ఉపయోగం పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ 15 రోజుల శిక్షణలో ధ్రువపత్రం పొందాలంటే 80 శాతం హాజరు తప్పనిసరి అని కేవీకే హెడ్ తెలిపారు. కార్యక్రమంలో కేవీకేలోని పశు సంవర్ధక అధికారి డా. బి. నాగేశ్వరరెడ్డి, సస్యరక్షణ అధికారి రఘునందన్, పంటల అధికారి అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు సంబంధించిన కోర్సు మెటీరియల్‌ను ప్రదర్శిస్తున్న ముఖ్యఅతిథులు

తెరిచివున్న ప్రమాదం

హుకుంపేట సచివాలయం-3 ఎదురుగా ఉన్న పైపులైనుకు సంబంధించిన గుంత మూత కొద్ది రోజులుగా తెరిచి పెట్టడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత పంచాయతీలో ఫిర్యాదు చేసినా సమస్యను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నిత్యం రాకపోకలు సాగే ఈ దారిలో రాత్రుళ్లు గుంత కనిపించక అందులో పడిపోయే ప్రమాదం ఉందని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై సచివాలయ సిబ్బందిని వివరణ కోరగా పనుల కారణంగా మూత తెరిచి పెట్టామని, పనులు పూర్తికాగానే మూస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, బొమ్మూరు

పత్రికా ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా, మండపేట వాస్తవ్యులు కుమారి పంపన సుష్మ, D/o రామచంద్రరావు గారు చక్రద్వారబంధం నుండి రాజానగరం వస్తుండగా ది. 10-06-2025న ఆమెకు సంబంధించిన B.Sc. డిగ్రీ సర్టిఫికెట్స్ మరియు TCలు బైక్‌పై వస్తుండగా జారి పడిపోయినవి. సదరు సర్టిఫికెట్స్ ఎవరికైనా దొరికినయెడల క్రింది నంబర్లుకు తెలియపరచవలసినదిగా కోరుచున్నాము.

పంపన సుష్మ
99497 26526

ఆక్రమణలు తొలగించాలని వినతి

కోరుకొండ, న్యూస్‌టుడే: జంబూపట్నం గ్రామ పరిధిలో బలరామయ్య నుంచి వచ్చిన కాలువను కొందరు ఆక్రమించి పంట సాగుచేసుకోవడంతో తమకు సాగునీరు అందడం లేదని పలువురు గ్రామానికి చెందిన చిన్న, సన్నకారు రైతులు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు రైతులు నీరుకొండ నాగేశ్వరరావు, శేషగిరి, భజన్నారాయణ, సూర్యనారాయణ, సత్తిబాబు, పోసిబాబు తదితరులు జిల్లా అధికారుల దృష్టికి సమస్యను లిఖితపూర్వకంగా తీసుకువెళ్లారు. 431 సర్వే నంబరులో 1.82 సెంట్ల కాలువ ఆక్రమణకు గురైందన్నారు. పూడికతీయకపోవడంతో తామంతా నష్టపోతున్నామన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రేబిస్ వ్యాధిని నివారించాలి

బొమ్మూరు: కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ముందుగానే టీకా వేయాలని సత్య చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తమ్మా రవి అన్నారు. హుకుంపేట మూడు గుళ్లవద్ద ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ జి. రవి వర్మ మాట్లాడుతూ రేబిస్ వ్యాధి ప్రమాదకరమని శునకాల నుంచి మనుషులకు రాకుండా జాగ్రత్తగా ఉండేందుకు సత్య ట్రస్ట్ చేస్తున్న సేవలు కొనియాడారు. మండల పశువైద్యాధికారి వెంకటరావు, జేగురుపాడు మండల పశు వైద్యాధికారి ప్రసన్న కుమార్, తెదేపా గ్రామ కమిటీ సర్పంచి దుద్దిపూడి రమేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

గ్రామ సమస్యలను పరిష్కరించాలి

బొమ్మూరు: హుకుంపేట, పిడింగొయ్యి గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని భాజపా మండల అధ్యక్షుడు మట్ట నాగబాబు, అసెంబ్లీ కన్వీనర్ యానాపు ఏసు ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్‌ను కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో సమస్యల వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. భాజపా మండలస్థాయి పర్యటనలో భాగంగా గ్రామాల్లో పర్యటించామని తెలిపారు. స్థానిక కోనేరుపేట కూడలిలో మురుగు నీరు రోడ్డుపైకి వస్తుందని తెలిపారు. శాంతిపురం-2లో మంచినీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వెంకటేశ్వర మార్కెట్ నుంచి రోడ్డు సరిగా లేక ప్రజలు రాకపోకలు సాగించలేకపోతున్నారని వివరించారు. దీనిపై ఎంపీడీవో చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కార్యదర్శి తనుబుద్ది సూర్య భాస్కరరావు, రామకృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

చేతిపంపు చుట్టూ బరకాలు తొలగించండి

సీతానగరం, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీ స్థలంలో ఉన్న చేతిపంపు నుంచి తాగునీటిని తీసుకోకుండా కొంతమంది పంపు చుట్టూ బరకాలు కట్టేసి ఇది మాదంటూ వివాదానికి దిగుతున్నారని వంగలపూడికి చెందిన నాగోతు పోసియ్య అధికారులకు విన్నవించారు. సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తాగునీరు సమస్యపై వినతి పత్రం అందించారు. చేతిపంపు చుట్టూ బరకాలు కట్టినా యంత్రాంగం పట్టించుకోవట్లేదన్నారు. ఎవరైనా తాగునీటి కోసం బరకాలు తప్పించి లోపలకు వెళ్లితే వారిపై దాడికి దిగుతున్నారన్నారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను పరిష్కరిస్తామని ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి తెలిపారు.

పంపు చుట్టూ కట్టిన బరకాలు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

రంగంపేట, బిక్కవోలు, బొమ్మూరు, న్యూస్‌టుడే : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం రంగంపేట మండలం వడిశలేరు అరుంధతిపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర, రక్తదాన శిబిరాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం తదితర నాయకులు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. జిల్లా తెదేపా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవిందు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. ✦ బలభద్రపురంలో ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సోమవారం నిర్వహించారు. గ్రామ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఏర్పాటు చేసిన మాదిగ దండోరా జెండాను కూటమి నేతలు ఆవిష్కరించారు. కూటమి నేతలు నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, చిన్నం వీర్రాఘవరెడ్డి, సర్పంచి బుంగారామారావు, తదితరులు పాల్గొన్నారు. ✦ బొమ్మూరులో ఎమ్మార్పీఎస్ మాదిగల రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం నిర్వహించారు. తెదేపా నాయకుడు కామిని భాస్కర్‌బాబు చేతుల మీదుగా జెండా ఆవిష్కరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

ఫెలోషిప్‌ల అభివృద్ధికి సహకారాన్ని అందిస్తా: బిషప్ ప్రతాప్ సిన్హా

కడియం: రాష్ట్రంలో పాస్టర్ల ఫెలోషిప్ సంఘాల అభివృద్ధికి సహకారాన్ని అందిస్తానని ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ ప్రతాప్ సిన్హా అన్నారు. కడియం చిన్నమండ ప్రార్థనాలయంలో పాస్టర్ రాబర్ట్ అధ్వర్యంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ ప్రతాప్ సిన్హా పాల్గొని మాట్లాడారు. సంఘం జిల్లా నాయకులు పాస్టర్ జీవరత్నం, ఉపాధ్యక్షుడు ఎం. కరుణాకర్, ప్రాంతీయ ఛైర్మన్ పరంజ్యోతి , కార్యదర్శి జయశీల్ పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడుని పాస్టర్ల సంఘ సభ్యులు సత్కరించారు.

టెండర్-కం-బహిరంగ వేలంపాట ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం నగరం మరియు మండలంలో వేంచేసియున్న శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి మరియు శ్రీ సీతారామస్వామి వార్ల దేవస్థానం యొక్క పూర్తి హక్కుభుక్తమైనటువంటి రాజమహేంద్రవరం రూరల్, కాతేరు గ్రామంలో RS No. 293లో ఎ. 3.88 సెంట్ల మెరక భూమిని 3 సంవత్సరములు కాలపరిమితికి గాను ది.16-7-2025 బుధవారం ఉదయం 11 గంటలకు టెండర్ (కం) బహిరంగ వేలంపాట శ్రీ ఉమాకోటిలింగేశ్వర స్వామి కార్యాలయం నందు నిర్వహించబడును. మిగిలిన ఇతర పాట షరతులకు ఆలయ కార్యాలయం పనిచేయు వేళల్లో అడిగి తెలుసుకొనవలెను.
రాజమహేంద్రవరం,
Dt: 07-07-2025. కార్యనిర్వహణాధికారిణి

(c) eenadu

కొవ్వూరు
•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అన్నారు. ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోపై కొవ్వూరు పట్టణం, పలు గ్రామాల్లో ప్రచార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కనీస వేతనం, గిట్టుబాటు ధర, ఆటో, హమాలీ, భవన నిర్మాణం, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు, లేబర్ కోడ్‌ల రద్దు ప్రధాన డిమాండ్లతో కేంద్ర కార్మిక సంఘాలు సమ్మె చేపడుతున్నాయన్నారు. కార్మికులంతా జయప్రదం చేయాలన్నారు. టి.రాజేష్, కె.కనకారావు, కె.వీరబాబు, బి.రవి, టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించాలి

చాగల్లు, న్యూస్‌టుడే: మండలంలో ఏ పాఠశాలలోనూ డ్రాపౌట్స్ నమోదు కాకూడదని, ఉపాధ్యాయులు, అధికారులు 5 ఏళ్ల నిండిన ప్రతి పిల్లాడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని ఎంఈవో కేవీవీ.రామాంజనేయులు సూచించారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేయరాదన్నారు. విద్యార్థులు వారికి నచ్చిన చోట ఏక రూపదుస్తులు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. తగిన కారణం లేకుండా విద్యార్థుల ప్రవేశాన్ని నిరాకరించరాదన్నారు. సమావేశంలో ఎంఈవో-2 సుభాకర్ పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో మంత్రి దుర్గేష్

సేవా కార్యక్రమాల నిర్వహణలో రోటరీ ముందంజ

నిడదవోలు: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో నిడదవోలు రోటరీ క్లబ్ ముందంజలో ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కె.రత్నకుమార్ అధ్యక్షతన ఆదివారం రాత్రి స్థానిక రోటరీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించారు. ఇన్‌స్టలేషన్ ఆఫీసర్ డాక్టర్ పి.కళ్యాణ్‌చక్రవర్తి నూతన అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్, ఉపాధ్యక్షుడు కర్రోతు నగేష్, కార్యదర్శి దారువెద్ది శ్రీరామప్రతాప్, సంయుక్త కార్యదర్శి ఉజ్జిన బలరామకృష్ణ, కోశాధికారి గుంటుపల్లి రామనాగేశ్వర సత్యసాయితో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, గుంటుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకు అండగా నిలవడం స్ఫూర్తిదాయకం

విద్యార్థి చదువు కోసం రూ.50 వేల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కష్టపడి చదువుకుని ఉన్నత స్థితికి చేరి మళ్లీ చదువుకు అన్ని విధాలుగా మార్గదర్శకులుగా మారడం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరుకు చెందిన మద్దుల సంకీర్త్, శశికుమారి సాయిలక్ష్మణ్ (అమెరికా) అందించిన రూ.50 వేల చెక్కును డిగ్రీ విద్యార్థి రేపాక సుబ్రహ్మణ్య గుప్తకు సోమవారం అందించారు. తెదేపా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంకీర్త్, సాయిలక్ష్మణ్ ప్రవాస భారతీయులుగా అమెరికాలో స్థిరపడ్డారన్నారు. పేదలకు సేవలో (పీ4) కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి పిలుపునకు ఆకర్షితులై అధిక ఖర్చుతో కూడిన బీటెక్ చదువుతున్న సుబ్రహ్మణ్య గుప్త ఫీజులు, పుస్తకాలు, ఇతర అవసరాలకు నగదు పంపించారన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, పట్టణ పార్టీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, మద్దుల సాయి సంజీవ, కొండాడ సత్యనారాయణ, మద్దిపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: రామన్నపాలెం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఆర్డీఎస్ఎస్ పనులు చేపడుతున్నందున ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందని ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. చిన్నాయిగూడెం 11కేవీ ఫీడర్ పరిధిలోనూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

మేలుకోకుంటే తాగునీటికి గండం

శిథిలావస్థకు చేరిన ట్యాంకులు

న్యూస్‌టుడే, నిడదవోలు

నిడదవోలు పురపాలికలో తాగునీటి వనరుల నిర్వహణపై ప్రజాప్రతినిధులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. మూడొంతుల పట్టణ ప్రజలకు తాగునీరు అందించే నెహ్రూనగర్ రిజర్వాయరే (ట్యాంకు) ఇందుకు నిదర్శం. ఏళ్ల తరబడి లీకులు ఏర్పడి నీరు కారడంతోపాటు, ట్యాంకుపై పిచ్చిమొక్కలు పెరిగి, కూలిపోయే కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. జరగరానిది ఏదైనా జరిగి రిజర్వాయర్ కూలిపోతే పట్టణ ప్రజలకు తాగునీరు అందే పరిస్థితి లేదు.

నెహ్రూనగర్‌లో శిథిలావస్థకు చేరుకుంటున్న రిజర్వాయర్

సుమారు 40 ఏళ్లుగా సేవలు..

నిడదవోలులో 28 వార్డులు ఉండగా నెహ్రూనగర్ రిజర్వాయర్ ద్వారా 17 వార్డులకు తాగునీటి సరఫరా జరుగుతుంది. దీని నిల్వ సామర్థ్యం 1470 కేఎల్. నిర్మించి సుమారు 40 ఏళ్లపైనే అవుతుంది. గత కొంత కాలంగా లీకులు ఏర్పడి నీరు కారుతోంది. అయినా పట్టించుకోవడం లేదు. బాలాజీనగర్‌లో ఉన్న మరో రిజర్వాయర్ ద్వారా అయిదు వార్డులు, ఎంవీనగర్‌లోని రిజర్వాయర్ ద్వారా మూడు, లింగంపల్లి, తీరుగూడెం, బసివిరెడ్డిపేటల్లో ఉన్న రిజర్వాయర్ల ద్వారా ఒక్కొక్క వార్డుకు తాగునీటి సరఫరా జరుగుతోంది. పట్టణ ప్రజలకు నిత్యం ఆరు రిజర్వాయర్ల ద్వారా 5.63 ఎంఎల్‌డీ నీటిని తాగడానికి అందిస్తున్నారు.

లింగంపల్లి రిజర్వాయర్‌ది ఇదే పరిస్థితి..

పట్టణంలో శివారుగా ఉన్న లింగంపల్లి ప్రజలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో అక్కడ 75 కేఎల్ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించారు. దీని ద్వారా 23వ వార్డుకు తాగునీటిసరఫరా జరుగుతుంది. ప్రస్తుతం అది కూడా బీటలు వారి నీరు లీకవుతుంది. దీనికి కూడా తక్షణమే మరమ్మతులు చేపట్టని పక్షంలో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది.

గతంలో నిధుల మంజూరు..

గతంలో లీకుల మరమ్మతులకు నిధులు మంజూరు చేసినా తూతూమంత్రంగానే పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో పురపాలక సంఘ సాధారణ నిధులు రూ.12 లక్షలు మంజూరు చేశారు. పనులు ప్రారంభించి తర్వాత నిలిపివేశారు. పైన మొక్కలు పెరిగి వాటి వేళ్లు ట్యాంక్‌ను మరింత పగుళ్లు తీసేలా చేస్తున్నాయి. నెహ్రూనగర్ రిజర్వాయర్ లీకులకు మరమ్మతులు చేపట్టాలంటే సుమారు వారం రోజులపాటు తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. ఆ సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అధికారులు చేపట్టాల్సి ఉంటుంది. ట్యాంకర్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా సరఫరా చేయడం వంటి పనులు చేపట్టాల్సి ఉంది.

టెండర్ల ప్రక్రియ పూర్తి..

పట్టణంలో లీకులు ఏర్పడిన నెహ్రూనగర్, లింగంపల్లి ట్యాంకుల మరమ్మతులకు రూ.28 లక్షలు గత ఏడాది డిసెంబరు 28న మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. వర్క్ ఆర్డర్ అందించి మరో పది రోజుల్లో పనులు చేపడతాం.

- డి.సత్యనారాయణ, డీఈ, నిడదవోలు పురపాలక సంఘం

అల్లూరి సేవలు మార్గదర్శకం

కొవ్వూరు పట్టణం: విద్యావేత్త, పారిశ్రామికవేత్త అల్లూరి వెంకటేశ్వరరావు సేవలు మార్గదర్శకమని పలువురు కొనియాడారు. అవంతి సంస్థలు, ఏబీఎన్ కళాశాల వ్యవస్థాపకులు అల్లూరి వెంకటేశ్వరరావు 92వ జయంతిని సోమవారం నిర్వహించారు. స్థానిక వాత్సల్య వృద్ధాశ్రమంలో నెలకు సరిపడే నిత్యావసర సరకులు అందించారు. కళాశాలలోని వెంకటేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల సలహాదారు ఎన్‌వీ సుబ్బారావు, ప్రిన్సిపల్ డాక్టర్ రామ్మోహన్, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ధనుంజయ

నిడదవోలు: నిడదవోలు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా టి.ధనుంజయ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాయచోటి డిపో నుంచి బదిలీపై వచ్చారు. ఇంత వరకు ఇక్కడ పని చేసిన కె.వెంకటేశ్వర్లు మచిలీపట్నం డీపీటీవోగా బదిలీ అయ్యారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా అరుణకుమారి

నిడదవోలు: తిమ్మరాజుపాలెం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. అధ్యక్షురాలిగా బండి అరుణకుమారి, ఉపాధ్యక్షులుగా ఉప్పులూరి నరేష్, వేము రవిబాబు, కార్యదర్శిగా ఎన్‌వీవీఎస్ రామచంద్రరావు, కోశాధికారిగా సుంకవల్లి శ్రీధర్‌లను ఎన్నుకున్నారు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈనెల 10న వల్లభనేని రెసిడెన్సీ ఫంక్షన్ హల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా

నిడదవోలు: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కార్మికులు నిడదవోలు పురపాలక సంఘ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రేఖా భాస్కరరావు మాట్లాడుతూ పురపాలక రంగంలో పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఆఫీస్ సిబ్బందికి పార్కు కూలీలకు జీవో ఎంఎస్ నెం-36 ప్రకారం కేటగిరీల వారీగా రూ. 21 వేల నుంచి రూ.24 వేల వరకు వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో కాకి అప్పల రాజు, తూరుగోపు నాగేశ్వరరావు, కాకి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ఈనెల 9న జరుగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఐఎఫ్‌టీయూల ఆధ్వర్యంలో వేరువేరుగా కార్మికులతో సమావేశాలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కొవ్వూరు పట్టణం : విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ ఎంప్లాయిస్ (అంబేడ్కర్ జీవన్ పథం) రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ కోరారు. ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్‌ను కొవ్వూరులో ఆ శాఖ ఉద్యోగ సంఘ నాయకులు సోమవారం కలిసి సన్మానించి, వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు ముప్పిడి రాజు, కార్యదర్శి టి.సుబ్బలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.శ్రీదేవి, ఎండీ గౌస్‌బాషా, జి.రామకృష్ణ, ధనబాబు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యుత్తు శాఖ ఉద్యోగ సంఘ నాయకులు జవహర్‌ను కొవ్వూరులో సోమవారం సాయంత్రం కలిశారు. ఈపీఎఫ్-పెన్షన్ స్కీమ్, జీపీఎఫ్ మార్పు వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నాయకులు తురక రామకృష్ణ, పాతర్ల శ్రీనివాస్, కృష్ణకుమార్, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల వితరణ

ఉండ్రాజవరం: స్థానిక హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు తణుకు లయన్స్ క్లబ్ ప్రతినిధి చిట్టూరి సుజాత ఆర్థిక సాయంతో రెండు జతల చొప్పున ఏకరూప దుస్తులు సోమవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పొట్లచెర్వు రామకృష్ణ, అధ్యాపకులు బూరుగుపల్లి పద్మజారాణి, మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలో నాయకులు

న్యూస్‌టుడే బృందం : దశాబ్దాల కాలం అలుపెరగని పోరాటంతో వర్గీకరణను సాధించిన యోధుడు కృష్ణమాదిగ అని నాయకులు పేర్కొన్నారు. మంద కృష్ణ మాదిగ జన్మదిన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కేకులు కోసి పంచారు. జెండా ఆవిష్కరణలు చేశారు. బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ● కొవ్వూరులో మాదిగ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెనుమాక జయరాజు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు, వరిగేటి కాంతరాజు, కొక్కిరపాటి వెంకటేష్, కె.శ్రీహరి, విల్సన్ తదితరులు పాల్గొన్నారు. ● ఉండ్రాజవరంలో ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడు బి.సునీల్‌రాజ్ , నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలింకి రాము, మండల కార్యదర్శి మండవల్లి అనిల్ కుమార్, నేకూరి మధు, యల్లమెల్లి నారాయణరావు పాల్గొన్నారు. ● నల్లజర్ల మండలం జగన్నాథపురంలో జరిగిన వేడుకల్లో ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడు మర్రి కిశోర్, చెట్టే శ్రీను, గంగరాజు, దుర్గారావు, జేసుదాసు, ప్రవీణ్, రాజారావు తదితరులు పాల్గొన్నారు. ● గోపాలపురం మండలం గోపాలపురం, పెద్దగూడెం, వేళ్లచింతలగూడెం, చిట్యాలలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు తానేటి స్టీవెన్, వీరరాఘవులు, ముప్పిడి రామకృష్ణ, కొడవటి చిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● తాళ్లపూడి మండలం పెద్దేవంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పోశి రాజు, నాయకులు సిర్రా గోపి, గంగారావు, గెడ్డం విజయ భాస్కరరావు, ముప్పిడి దానియేల్ తదితరులు పాల్గొన్నారు. మలకపల్లి కార్యక్రమంలో పలువురు నాయకులను సన్మానించారు. జిల్లా ఇన్‌ఛార్జి రాజేశ్వరరావు, సర్పంచి రాపాక రాజేశ్వరి, యూత్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దగూడెంలో కేకు కోస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అర్జీల పరిష్కారంపై దృష్టి

అర్జీని స్వీకరించి సమస్య వింటున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : వారంలో రెండు రోజులు ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి అర్జీల పరిష్కారాలపై దృష్టి సారిస్తామని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 19 అర్జీలను స్వీకరించారు. రీసర్వే, భూ ఆక్రమణ, సంక్షేమ పథకాలకు అర్హత, రేషన్‌కార్డులు, సరిహద్దులు నిర్ణయించాలని, మురుగు ఇబ్బందులు, రహదారుల నిర్మాణం వంటి అంశాలపై ఇవి అందాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు.

ఆంక్షలు లేకుండా రేషన్‌కార్డులు ఇవ్వాలి

తాళ్లపూడి: తమ కుటుంబంలో వివాహాలైన పిల్లలకు ఎటువంటి ఆంక్షలు లేకుండా రేషన్‌కార్డులు ఇవ్వాలని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ లక్ష్మీలావణ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పిల్లలకు సంక్షేమ పథకాలు అందాలంటే తప్పనిసరిగా రేషన్‌కార్డు ఉండాలని చెబుతున్నారన్నారు. దరఖాస్తు చేస్తే ప్రభుత్వ ఉద్యోగులు అంటూ తిరస్కరిస్తున్నారని తెలిపారు. తమ పిల్లలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: తహసీల్దార్ లక్ష్మీలావణ్యకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆటో కార్మికులకు సూచనలు చేస్తున్న సీఐ విశ్వం

నిబంధనలు పాటించాలి

చాగల్లు, కొవ్వూరు పట్టణం: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కొవ్వూరు పట్టణ సీఐ కె.విశ్వం తెలిపారు. స్థానిక గోష్పద క్షేత్రంలో కొవ్వూరు పట్టణ ఆటో యూనియన్ల సభ్యులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రతి వాహనానికి తప్పక బీమా చేయించాలన్నారు. నిర్ణీత సంఖ్యలోనే విద్యార్థులు, ప్రయాణికులను తీసుకువెళ్లాలన్నారు. మద్యం తాగి, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

గోపాలపురం ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న పొగాకు బోర్డు అధికారులు, రైతులు

గోపాలపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ మేనేజర్ జి.ఎల్.కె.ప్రసాద్ పేర్కొన్నారు. పొగాకు బోర్డు స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని గోపాలపురం వేలం కేంద్రం ఆధ్వర్యంలో 'వన మహోత్సవం' పేరిట సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. వేలం కేంద్రం అధికారులు, పొగాకు పండించే రైతులు, కొనుగోలు కంపెనీ ప్రతినిధులు గోపాలపురం ఉన్నత పాఠశాల ఆవరణంలో నాటిన మొక్కలకు ఒక్కో విద్యార్థిని సంరక్షకుడిగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు అధికారులు రామ్ మీనా, రామ్ మోహన్ సూరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ: అయిదుగురికి గాయాలు

తాళ్లపూడి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తలపై , మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని తిరుగుడుమెట్టకు చెందిన మెంటిమి చంద్రశేఖర్ భార్య, ఇద్దరు పిల్లలతో సోమవారం సాయంత్రం తాళ్లపూడి నుంచి, బల్లిపాడుకు చెందిన మద్దిపాటి నాగేశ్వరరావు మలకపల్లి నుంచి స్వగ్రామాలకు వెళుతుండగా వారి వాహనాలు పెద్దేవం చెరువు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో చంద్రశేఖర్ తలపైన, భార్య, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. నాగేశ్వరరావు కూడా గాయపడ్డారు. వారిని వేర్వేరు 108 వాహనాల్లో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలను సేకరించారు.

వాహన చోరీపై కేసు

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు పట్టణ పరిధిలోని అచ్చాయమ్మకాలనీకి చెందిన కొయ్యల శ్రీకాంత్ ఈనెల 6వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనాన్ని ఇంటి వద్ద పెట్టారు. సోమవారం ఉదయం చూసేసరికి కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

చౌక బియ్యం తరలిస్తున్న ముగ్గురిపై...

కొవ్వూరు పట్టణం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్‌కం రైలు వంతెన సమీపంలో సోమవారం కొవ్వూరు పౌర సరఫరాలశాఖ డీటీ సునీత తనిఖీలు చేపట్టి ద్విచక్ర వాహనాలపై రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ముగ్గురిని అదుపులోనికి తీసుకుని, 500 కేజీల స్వాధీనం చేసుకుని పట్టణ స్టేషనుకు తరలించారు. వారిపై 6ఎ కేసుల నమోదు చేయించినట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

నిడదవోలు : కొవ్వూరు మండలం వాడపల్లి ఇసుక ర్యాంపు నుంచి లోడు చేసుకుని ఏ విధమైన బిల్లులు లేకుండా తణుకు వెళ్తున్న లారీని గోపవరం వేబ్రిడ్జి సమీపంలో పట్టుకున్నట్లు కొవ్వూరు సబ్ డివిజన్ టాస్క్‌ఫోర్స్ ఏఎస్సై జీఆర్‌కే గంగాధరరావు తెలిపారు. ఇందులో సుమారు పది టన్నుల ఇసుక ఉందన్నారు. లారీని సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు నిడదవోలు ఎసై తెలిపారు.

ఆర్వోబీ రెయిలింగ్‌ను ఢీకొన్న కారు

నిడదవోలు: నిడదవోలు ఆర్వోబీపై ఆదివారం అర్ధరాత్రి సమయంలో కారు రెయిలింగ్‌ను ఢీకోవడంతో అది విరిగిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటన జరిగిన చోటుకు కొద్ది దూరంలోనే సీసీ కెమెరాలున్నా అవి పని చేయడం లేదు. ఆ సమయంలో కారులో ఉన్నవారే దానిని పక్కకు తొలగించి తీసుకు వెళ్లిపోయినట్లు సమాచారం.

ప్రభుత్వ కార్యాచరణలో ప్రజా సహకారం కీలకం

సమావేశంలో ఛైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛ, ఆహ్లాదకర కొవ్వూరు సాకారంలో ప్రభుత్వ కార్యాచరణకు ప్రజా సహకారం కీలకమని పురపాలక ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. హరియాణా రాష్ట్రంలోని గుర్‌గాంలో పట్టణాల అభివృద్ధి ప్రణాళికపై జాతీయస్థాయి సమావేశానికి వెళ్లి వచ్చిన ఆమె సోమవారం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 3, 4 తేదీల్లో జరిగిన సమావేశాల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల నుంచి 25 మంది మేయర్లు, ఛైర్‌పర్సన్లకు అవకాశం వచ్చిందన్నారు. ఆ రాష్ట్ర సీఎం నయాబ్‌సింగ్, గవర్నర్ బండారు దత్తాత్రేయ, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాష్ట్ర ముఖ్యకార్యదర్శి, ఐఏఎస్ అధికారులు హాజరై అభివృద్ధి కార్యాచరణపై అవగాహన కల్పించారన్నారు. చెత్త నుంచి సంపద సృష్టి, మురుగు నీటి సద్వినియోగం, స్వచ్ఛ ప్రణాళిక, పాలనాపరమైన అంశాల్లో అనుసరించాల్సిన పద్ధతులు, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, చేయాల్సిన పనులు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారని, పట్టణాల్లో తాము అనుసరిస్తున్న పద్ధతులను వివరించామన్నారు. హరియాణా రాష్ట్రంలో స్వచ్ఛత, సంపద సృష్టి, ఫలితాలపై చేసిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఆకట్టుకుందన్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో ఆ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రజా సంక్షేమం కూటమి ధ్యేయం

వేలివెన్నులో పత్రాలను అందజేస్తున్న శేషారావు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు బూరుగుపల్లి శేషారావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో భాగంగా వేలివెన్నులో తెదేపా శ్రేణులతో కలిసి ఆయన సోమవారం పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. సమస్యలు తెలుసుకుని యాప్‌లో నమోదు చేశారు. పథకాల పత్రాలను ప్రజలకు అందజేశారు. సర్పంచి అత్తిలి సత్యనారాయణ, ఉప సర్పంచి బూరుగుపల్లి శ్రీనివాసరావు, తెదేపా మండలశాఖ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఈర్పిన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు : నిడదవోలు 26వ వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందించి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, నాయకులు ఎస్‌కే ఫాతిమా, భాస్కర్లరాజారామ్మోహన్ రాయ్, షాజహాన్, షరీఫ్ పాల్గొన్నారు.

పెరవలి: ఖండవల్లిలో ఇంటింటాతిరిగి కరపత్రాలను పంపిణీ చేసి అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో శేషారావుతో పాటు తెదేపా నాయకులు అతికాల వెంకటరామకృష్ణమ్మ, సర్పంచి పులిదిండి నాగరాజు, రెడ్డి సత్యనారాయణ, కందుల నర్సన్న తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళపై అత్యాచారయత్నం

నల్లజర్ల : ఒంటరి మహిళపై మరిది వరుసయ్యే వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం భర్తతో మనస్పర్థలు రావడంతో నాలుగేళ్ల కిందట విడాకులు తీసుకుని ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి గ్రామంలోని జగనన్న కాలనీలో నివసిస్తోంది. అదే గ్రామానికి చెందిన వరుసకు మరిదయ్యే మర్రి శోభన్‌బాబు గత కొంతకాలంగా ఆమెపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి వద్ద వంట పనిలో నిమగ్నమై ఉండగా ఆయన అక్కడికి వచ్చి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ సందర్భంగా జరిగిన పెనుగులాటలో మహిళ తల, చేతులకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బంధువులు 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందిన అనంతరం బాధితురాలు నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి శోభన్‌బాబుపై ఫిర్యాదు చేశారు.

రాగోలపల్లి సొసైటీలో అవకతవకలు

రుణాలు ఎక్కువ చేసి చూపుతున్నారని ఆరోపణ

తాళ్లపూడి, న్యూస్‌టుడే: మండలంలోని రాగోలపల్లి ప్రాథమిక సహకార సంఘంలో రుణాల లావాదేవీల్లో అక్రమాలు జరిగినట్లు సభ్యులు ఆరోపిస్తున్నారు. రూ.50 వేలు రుణం తీసుకుంటే మరో రూ. 30 వేలు ఓన్ ఫండ్ లోన్ తీసుకున్నట్లు నమోదు చేసి ఓవర్ డ్యూగా చూపించారని, రూ.50 వేలు రుణం తీసుకుంటే రూ.90 వేలు తీసుకున్నట్లు చూపించారని చెబుతున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్, కొవ్వూరు ఆర్డీవో కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు.

నకిలీ బంగారం కుదువపెట్టిన వ్యవహారంతోనే..

రాగోలపల్లి సొసైటీలో నకిలీ బంగారం కుదవపెట్టి రుణాలు తీసుకున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో గత నెలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు గోప్యంగా విచారణ నిర్వహించారు. బంగారు ఆభరణాల మీద ఇచ్చిన రుణాలు, తదితర దస్త్రాలను పరిశీలించారు. సొసైటీ నుంచి బంగారు ఆభరణాల మీద వంద మందికి రుణాలు ఇచ్చినట్లు చూపించగా 91 సక్రమంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 9 మందికిచ్చిన రుణాల విషయంలో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. 45 కాసుల నకిలీ బంగారం మీద రూ.15.90 లక్షల రుణాలు తీసుకున్నట్లు, సొసైటీ బంగారు ఆభరణాల నాణ్యత పరిశీలించే అప్రైజరే పలు దఫాలు రుణాలు పొందారని వారు గుర్తించారు. దీనికి సొసైటీ కార్యదర్శి, అప్రైజర్ బాధ్యత వహించాలని రైతులు పట్టుపట్టారు. అయితే వారిపై ఎటువంటి చర్యలు లేకుండానే కొంతమంది మధ్యవర్తుల సాయంతో నకిలీ బంగారంపై తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించినట్లు సమాచారం. ఈ విషయం సభ్యులకు తెలియడంతో వారంతా వచ్చి తాము తీసుకున్న రుణాలను పరిశీలించుకోవడంతో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

రైతులు తీసుకున్న రుణాలు దస్త్రాల్లో అధికమొత్తం చూపించారనే విషయం మా దృష్టికి వచ్చింది. కమిటీ వేసి విచారణ చేయిస్తాం. సొసైటీ కార్యదర్శి, అప్రైజర్‌పై పలు అభియోగాలున్నాయి. విచారించి కఠిన చర్యలు తీసుకుంటాం.

- వెంకటరమణ, డీసీవో

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నిడదవోలు: నిడదవోలు మండలం తాడిమళ్లలోని కోకో తోటలో గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై బాలాజీ సుందరరావు సోమవారం తెలిపారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశామన్నారు. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని, నలుపు రంగు ఛాయలో ఉండి, సుమారు 5 నుంచి 6 అడుగుల ఎత్తు ఉన్నాడన్నారు. నలుపు రంగు నిక్కరు ధరించాడన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే 94407 96661 నంబరులో సమాచారం ఇవ్వాలని కోరారు.

కుటుంబ సభ్యులు మందలించారని ఆత్మహత్య

నిడదవోలు: మద్యం సేవించి ఉన్న వ్యక్తి ఒకరు ఉరేసుకుని సోమవారం మృతి చెందినట్లు నిడదవోలు ఎస్సై జగన్ మోహనరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నిడదవోలు పట్టణంలోని కమ్మరవీధికి చెందిన గుంటూరు శ్రీనివాసరెడ్డి(50) అనే వ్యక్తి మద్యం తాగడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై ఉరేసుకునేందుకు ప్రయత్నించగా భార్య, కుమార్తె అడ్డుకున్నారు. వారిని విడిపించుకుని ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని ఉరేసుకున్నాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న నైట్‌బీట్ కానిస్టేబుళ్లను కుటుంబ సభ్యులు పిలవడంతో వారు వెళ్లి తలుపులు తీయగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

(c) eenadu

ఈనాడు ఏలూరు
మంగళవారం జులై 8, 2025 5

అన్నార్తుల ఆకలి తీరేలా..!

✶ ఉభయ జిల్లాల్లో మరో 7 అన్న క్యాంటీన్లు
✶ జనవరిలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: అన్నార్తుల ఆకలి తీర్చేలా.. అన్న క్యాంటీన్ల విస్తరణకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఉభయ జిల్లాల్లో ఇప్పటికే పలుచోట్ల అన్న క్యాంటీన్లు కొనసాగుతుండగా.. కొత్తగా ఏలూరు జిల్లాలో 4, పశ్చిమ గోదావరిలో 3 ఏర్పాటు చేయనున్నారు.

నియోజకవర్గానికొకటి చొప్పున.. ప్రతి నియోజకవర్గానికో అన్న క్యాంటీన్ ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 6, పశ్చిమలో 9 చొప్పున కొనసాగుతున్నాయి. ఇవన్నీ పట్టణ ప్రాంతాల్లోనే కొనసాగుతున్నాయి. మిగతా నియోజకవర్గాల్లోని పట్టణాల్లోనూ వచ్చే జనవరిలో కొత్తగా క్యాంటీన్లు ప్రారంభించనున్నారు. తదనుగుణంగా భవన నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఏలూరులో కొత్త క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు సేకరించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనరు భానుప్రతాప్ తెలిపారు.

పూటకు 350 మందికి.. ఉభయ జిల్లాల్లోని అన్న క్యాంటీన్లలో ప్రతి పూటకు 350 మందికి చొప్పున రూ.5కే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రివేళ భోజనం అందిస్తున్నారు. మూడు పూటలా కలిపి ఒక్కొక్కరికీ రాయితీ కింద రూ.75 కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. నెలకు సుమారు రూ.2.79 కోట్లు భరిస్తోంది.

గ్రామీణ ప్రాంతాల్లోనూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, తొలుత పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు నెలకొల్పింది. వీటిని దశలవారీగా అన్ని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తోంది. ప్రస్తుతం ఏలూరు నగరంలో 4, జంగారెడ్డిగూడెం, నూజివీడులో ఒక్కో అన్న క్యాంటీను నడుస్తోంది. కొత్తగా ఏలూరులో ఒకటి, మిగతా మూడింటిని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుతం భీమవరం, తాడేపల్లిగూడెంలో మూడేసి, పాలకొల్లు, నరసాపురం, తణుకులో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. జనవరిలో మరో మూడు కొత్తగా ప్రారంభించనున్నారు.

శ్రావణంలో.. గృహ యోగం!

❖ 13,525 ఇళ్ల పూర్తికి నిర్ణయం ❖ సామూహిక ప్రవేశాలకు సన్నాహాలు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అసంపూర్తిగా నిలిచిపోయిన గృహాలను పూర్తి చేసి. . శ్రావణ మాసంలో గృహ ప్రవేశాలు చేయించాలని నిర్ణయించింది. జిల్లాలో 13,525 ఇళ్ల పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించింది. ఇప్పటికే 67 శాతం నిర్మాణాలు పూర్తి కాగా, మిగతావి వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

2,041 ఎకరాలు సేకరించి.. జిల్లాలో గత వైకాపా ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు 2,041 ఎకరాలు సేకరించింది. 750 లేఅవుట్లు వేసింది. నివాస యోగ్యం కాని, న్యాయస్థానం వివాదాల్లోని జాగాలు ఎంపిక చేయడంతో.. లబ్ధిదారులు నిర్మాణాలకు మొగ్గుచూపలేదు. గృహ నిర్మాణాలు ప్రారంభించకుంటే పట్టాలు రద్దు చేస్తామన్న గత సర్కారు హెచ్చరికలతో కొందరు పనులు మొదలుపెట్టారు. కనీస మౌలిక వసతులు లేకపోవడంతో మధ్యలోనే ఆపేశారు. జిల్లాలో 83,612 ఇళ్లు మంజూరు కాగా, కేవలం 31,312 మాత్రమే పూర్తయ్యాయి.

నియోజకవర్గం	లక్ష్యం	పూర్తయినవి	కావాల్సినవి
ఏలూరు	2,377	1,790	587
దెందులూరు	1,322	724	598
నూజివీడు	1,987	1,361	626
కైకలూరు	1,478	625	853
చింతలపూడి	2,204	1,374	830
పోలవరం	2,778	2,291	487
ఉంగుటూరు	656	337	319
ద్వారకాతిరుమల(మం)	723	551	172
మొత్తం	13,525	9,053	4,472

కూటమి సర్కారు హామీ.. వివిధ కారణాలతో వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల పూర్తికి కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. ఎస్టీ లబ్ధిదారుకి రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు చొప్పున అదనపు ఆర్థిక సాయం ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా 5,022 లబ్ధిదారులకు 4,742 మంది ఖాతాల్లో రూ.9,54,65,000 జమ చేసింది. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేందుకు తోడ్పాటు అందించింది. 'గృహ నిర్మాణాల్లో రాష్ట్రంలోనే ఏలూరు జిల్లా మూడో స్థానంలో ఉంది. నిర్దేశిత లక్ష్యాన్ని నిర్ణీత గడువులోపు పూర్తి చేస్తాం' అని గృహ నిర్మాణ సంస్థ పీడీ జి.సత్యనారాయణ తెలిపారు.

విద్యుత్తు శాఖలో బదిలీలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో పలువురిని బదిలీలు చేస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడేపల్లిగూడెం డివిజన్ కార్యాలయ జూనియర్ అకౌంట్స్ అధికారి టి.వెంకాయమ్మకు ఉద్యోగోన్నతి కల్పించి, ఏలూరు నగర విద్యుత్తు రెవెన్యూ కార్యాలయం అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా నియమించారు. కోనసీమ జిల్లాలో ఏడీఈగా పని చేస్తున్న రఘురాజును పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేశారు.

రేషన్ ఇబ్బందులున్నాయా?

నేడు డయల్ యువర్ డీఎస్‌వో

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రేషన్ సరకులు సక్రమంగా అందడం లేదా? నిత్యావసరాల పంపిణీ తూకాల్లో తేడాలున్నాయా? వృద్ధులు, దివ్యాంగులకు డీలర్లు ఇళ్ల వద్దకు తీసుకొచ్చి సరకులు ఇవ్వడం లేదా? కొత్తగా బియ్యం కార్డులు పొందేందుకు అవస్థలు పడుతున్నారా? బంకుల్లో డీజిల్, పెట్రోలు కొలతల్లో వ్యత్యాసాలున్నాయా? వినియోగదారులకు సదుపాయాల్లేవా? వంటగ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులున్నాయా? ఆయా సమస్యలను నేరుగా జిల్లా పౌరసరఫరాల అధికారి ఇ.విలియమ్స్ దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం కల్పిస్తోంది 'ఈనాడు'. ఇంకెందుకు ఆలస్యం.. ఇక్కడ పేర్కొన్న తేదీన, నిర్ణీత సమయంలో ఫోన్ చేయాల్సిందే!

తేదీ: 08.7.2025 (మంగళవారం)	సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల వరకు	ఫోన్ నంబరు 80083 01552

ప్రైవేటు బడుల్లోనూ సమావేశాలు: కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు అన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ ఈ నెల 10న తల్లిదండ్రుల మెగా సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సోమవారం మాట్లాడారు. విద్యా పురోభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతో.. పండగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

పొగ పెట్టలేక.. పక్కనెట్టారు

మండవల్లి, పెదపాడు, కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం, ఉంగుటూరు, నూజివీడు, న్యూస్‌టుడే

మెట్ల కిందకు చేరిన భైరవపట్నం ఫాగింగ్ యంత్రం

గ్రామ పంచాయతీల్లో దోమల నివారణ కోసం కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు అటకెక్కాయి. యంత్రాలకు అవసరమైన రసాయనాలను ఆరోగ్య శాఖ సరఫరా నిలిపివేయడంతో అవి మూలన చేరాయి. ప్రతి రెండు నెలలకు ఒకసారి తప్పక యంత్రాన్ని వినియోగించాలి. లేకుంటే మరమ్మతులకు గురై.. పంచాయతీలకు ఆర్థిక భారంగా మారుతుంది. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు.

- అటకెక్కిన ఫాగింగ్ యంత్రాలు
- మరమ్మతులు చేయక నిరుపయోగం

నాసిరకం అంటగట్టి.. గత ప్రభుత్వ హయాంలో నాసిరకమైన ఫాగింగ్ యంత్రాలు అంటగట్టినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. గంట వ్యవధిలోనే మంటలు వస్తున్నాయని కార్యదర్శులు వాపోతున్నారు. రూ.70 వేలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన పొగ యంత్రాలు మెట్ల కింద, అటకలపై, స్టోర్ రూములలో కాలాన్ని వెళ్లదీస్తున్నాయి.

ఇంగిలిపాకలంకలో రెండేళ్లయినా పెట్టె నుంచి బయటకు తీయక..

జిల్లాలో ఇలా.. మొత్తం 27 మండలాల్లో 624 గ్రామ పంచాయతీలు ఉండగా 486 గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి.

పని చేయక.. ఉంగుటూరు, చేబ్రోలు వంటి మేజర్ పంచాయతీలతోపాటు నియోజకవర్గంలోని సగం గ్రామాల్లో యంత్రాలు పని చేయట్లేదు. పోలవరం మండలంలో 14 యంత్రాలకు 11 యంత్రాలు పనిచేయడం లేదు. కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, నూజివీడు, పెదపాడు, ఆగిరిపల్లి మండలాల్లో మూడొంతుల ఫాగింగ్ యంత్రాలు మూలన చేరాయి.

ఆరు నెలలకు ఒకసారి కూడా.. డిసెంబర్ తర్వాత కైకలూరు నియోజకవర్గంలోని 94 పంచాయతీల్లో ముసునూరు, చాట్రాయి, నూజివీడు మండలాల్లోని 88 గ్రామ పంచాయతీల్లో ఎక్కడా ఫాగింగ్ యంత్రాలు వాడిన దాఖలాలు లేవు. పెదపాడు మండలంలో సంవత్సరం గడుస్తున్నా నేటికి 80 శాతం గ్రామాల్లో ఫాగింగ్ వేయలేదు.

● దీనిపై జిల్లా పంచాయతీ అధికారి కొర్రాయి అనురాధను వివరణ కోరగా ఫాగింగ్ యంత్రాలపై అన్ని మండలాల ఈవోపీఆర్డీలతో మాట్లాడి వెంటనే గ్రామాల్లో ఫాగింగ్ వేసేలా చర్యలు తీసుకుంటాం. వర్షాకాలం కావడంతో దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు పాటిస్తాం. మందులు సరఫరా లేకపోయినా పంచాయతీ నిధులతో కొనుగోలు చేసేలా ఆదేశిస్తాం.

అన్నదాత సుఖీభవ.. మీకు అర్హత ఉందా

నారాయణపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: పీఎం కిసాన్‌తో కలిపి సూపర్ సిక్స్‌లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకం అమలుకు కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. మూడు విడతల్లో రూ.20 వేలను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు నిర్ణయించింది. వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఇప్పటికే మండల స్థాయిలో లబ్ధిదారుల వివరాలను వ్యవసాయ అధికారులు సేకరించారు. ఈ నెలలో నగదు పొందేందుకు తాము అర్హులమా.. అనర్హులమా అనే అనుమానాలు రైతులను వెన్నాడుతున్నాయి. తెలుసుకునేందుకు పలువురు రైతు సేవా కేంద్రాలకు వెళ్తున్నారు.

ఇలా తెలుసుకోవచ్చు.. అన్నదాత సుఖీభవ అధికారిక వెబ్‌సైట్‌లో రైతులు తమ వివరాలతో annadathasukhibhava.ap.gov.in లో నమోదు చేస్తే పేజీ వస్తుంది. అందులో 'యువర్ స్టేటస్' అనే ఐచ్ఛికం కనిపిస్తుంది. నొక్కితే ఆధార్ నంబరు అడుగుతుంది. ఆధార్ సంఖ్య నమోదు చేసి సెర్చ్ ఐచ్ఛికం నొక్కితే వివరాలు కనిపిస్తాయి. అందులో రైతు పేరు, పొలం ఉన్న గ్రామం, చివరలో ఎంపీఏ ఆమోదం అని కనిపిస్తుంది. ఇలా ఉంటే పథకంలో అర్హత పొందినట్లుగా గుర్తించాలి. అర్హులై ఉండి అనర్హులుగా చూపితే సంబంధిత ధ్రువపత్రాలతో రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 13లోపు ఫిర్యాదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా తెలిపారు.

బొప్పికట్టిన బదిలీలు!

➲ ఇష్టానుసారంగా ప్రక్రియ ➲ రోడ్డెక్కిన సచివాలయ సిబ్బంది

న్యూస్‌టుడే- ఏలూరు వన్‌టౌన్, టూటౌన్: సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి గందరగోళం నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 1,100 పైగా గ్రామ/వార్డు సచివాలయాలున్నాయి. మొత్తం 8,500 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకేచోట అయిదేళ్ల సర్వీసు పూర్తయిన వారందరికీ తప్పనిసరిగా స్థానచలనం కల్పించాలని, అభ్యర్థన బదిలీలకూ అవకాశమివ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ ప్రక్రియ ప్రారంభం నుంచి వివాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు ఏక పక్షంగా స్థానచలనం కల్పించారంటూ వ్యవసాయ గ్రామ సహాయకులు రోడ్డెక్కారు. పైరవీలకు ప్రాధాన్యమిస్తూ.. బదిలీలు చేశారంటూ ఇంజినీరింగ్ సహాయకులు ఆందోళనకు దిగారు.

ఖాళీ లేని స్థానాలకు.. తాజాగా సచివాలయ సంక్షేమ కార్యదర్శుల బదిలీలు అభ్యర్థులను గందరగోళంలో పడేశాయి. ఒకే స్థానానికి ఇద్దరికి స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు. మొత్తం 640 మంది సిబ్బందికి కౌన్సెలింగ్ ముగిసినానంతరం 606 మందిని బదిలీలు చేశారు. వారికిచ్చిన ఉత్తర్వులు లోపభూయిష్టంగా ఉండటంతో.. న్యాయం చేయాలంటూ అభ్యర్థులు సోమవారం ఏలూరు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రీ కౌన్సెలింగ్ చేపట్టాలని పట్టుబట్టారు. విషయాన్ని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. చిన్నచిన్న పొరపాట్లు జరిగాయని, వెంటనే సరి చేస్తామని హామీ ఇచ్చారు.

సంక్షేమ, విద్యా సహాయకులతో చర్చిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని

నిబంధనలకు తిలోదకాలు.. మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలు సైతం తలనొప్పిగా మారాయి. నిబంధనల ప్రకారం అయిదేళ్ల సర్వీసు పూర్తయిన వారిని మెరిట్ ప్రకారం బదిలీ చేయాలి. ఇక్కడే నాటకాలు మొదలయ్యాయి. ఆర్డర్ ప్రకారం 1, 2, 3 మెరిట్ జాబితా ప్రకారం నియామకమైన సిబ్బందిని ర్యాంకుల వారీగా పిలిచి కౌన్సెలింగ్ చేపట్టాలి. ఇందుకు భిన్నంగా ప్రక్రియ జరగడంపై సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలంటూ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. సంక్షేమ, విద్యా సహాయకులు సైతం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టడంతో.. వారితో కలెక్టర్ వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

10న 'తల్లికి వందనం' నిధుల జమ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: 'తల్లికి వందనం'కు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న రూ.15 వేల సాయం ఈ నెల 10న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు జమవుతుందని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి వై.విశ్వమోహనరెడ్డి తెలిపారు. విద్యార్థి బ్యాంకు ఖాతాకు ఆధార్(ఎన్‌పీసీఐ) అనుసంధానం కాకపోతే బ్యాంకుకెళ్లి నమోదు చేయించుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతా లేకపోతే తప్పనిసరిగా తపాలా కార్యాలయంలో ఖాతా తెరచి ఆధార్‌కు ఎన్‌పీసీఐ అనుసంధానం చేయించుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైతేరాజు
వక్క.. లాభాలు పక్కా..
వరి నాట్లు వేస్తున్నారా..! 6లో

ఇదండీ ఇంటి లెక్క

ఎంపిక చేసిన ఇళ్లలో పన్ను మదింపు బృందాల సర్వే

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: నగర పాలక, పురపాలక సంఘాల్లో పలువురు నిర్మాణ విస్తీర్ణం తక్కువ చూపి ఆస్తిపన్ను తక్కువగా చెల్లిస్తున్నారు. పలుచోట్ల ఇళ్లు, భవనాలు అసలు పన్ను పరిధిలోకి రావడంలేదు. వీటన్నింటిని గుర్తించిన కూటమి ప్రభుత్వం ఆస్తి పన్ను మదింపు పక్కాగా అమలు చేయాలని నిర్ణయించింది. ప్రతి ఇంటిని పరిశీలించి విస్తీర్ణం మేరకు కొలతలు వేసి అదనపు ఆదాయం ఉంటే పరిగణనలోకి తీసుకుంటారు. ఆస్తి పన్ను మదింపు చేస్తారు.

భీమవరంలో సర్వే చేస్తున్న అధికారులు

మార్గదర్శకాలు ఇవీ: ఇళ్లు, భవనాలు ఉన్న వారు ఆస్తి పన్ను చెల్లిస్తున్నారా లేదా, నిర్మాణ విస్తీర్ణం మేరకు సిబ్బంది పన్ను విధించారా అనే విషయాలపై సర్వే చేస్తున్నారు. లోటుపాట్లను సవరించి ఆదాయం పెంచుకునేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. దీంతో వేర్వేరు పురపాలక సంఘాల్లోని అధికారులను వేరొక పట్టణాల్లో ఎంపిక చేసిన భవనాలను పరిశీలించాలని నిర్ణయించారు. ఉదాహరణకు భీమవరం అధికారులను తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు అధికారులను భీమవరం, నరసాపురం తదితర పట్టణాలకు నియమించారు. 2021 నుంచి ఈ ఏడాది జూన్ వరకు పన్ను మదింపుపై ఆయా భవనాలను బృందాలు పరిశీలిస్తాయి.

పట్టణం	సర్వే చేయాల్సిన భవనాలు
ఏలూరు	211
జంగారెడ్డిగూడెం	24
నూజివీడు	23
చింతలపూడి	11
ఆకివీడు	58

సమస్యలు సత్వరం పరిష్కరిస్తాం: ఎస్పీ

వృద్ధుడి వద్దకెళ్లి మాట్లాడుతున్న ప్రతాప్ శివకిశోర్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం 'సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు తరలి వచ్చి తమ ఇబ్బందులను ఏకరవు పెట్టారు. పెదవేగికి చెందిన ఓ వృద్ధుడు కార్యాలయానికి రాగా, ఎస్పీ గమనించి ఆయన వద్దకెళ్లి సమస్య అడిగి తెలుసుకున్నారు. ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ.. ప్రజలు ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులు చేయొచ్చన్నారు. వాటి స్థితి తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100కు ఫోన్ చేయాలన్నారు. మొత్తం 55 ఫిర్యాదులు అందగా.. వాటిల్లో భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, మోసపూరిత లావాదేవీలపై ఎక్కువ వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఫిర్యాదుదారులకు సత్యసాయి సేవా సంస్థ భోజనాలు సమకూర్చింది.

ఆక్వా వర్సిటీకి నిధుల గండం

పునాది దశలోనే నిలిచిన నిర్మాణాలు

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పరిధి సరిపల్లి వద్ద ఆక్వా యూనివర్సిటీ భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిధుల విడుదల, బిల్లుల మంజూరులో జాప్యంతో మూడేళ్లుగా పునాదులకే పరిమితమయ్యాయి. భవనాలు లేకపోవడంతో లక్ష్మణేశ్వరంలోని తుపాను షెల్టర్‌లో తరగతులు నిర్వహించాల్సి వస్తోంది.

ఒక కోర్సుకే పరిమితం.. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆక్వా యూనివర్సిటీ మంజూరు చేసింది. 2022 నవంబరులో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసి ఏడాది తర్వాత భవనాలు ప్రారంభిస్తామంటూ బీరాలు పలికారు. 2023లో మొదలైన పనులు 2024 మే నాటికి పూర్తి కావాల్సి ఉండగా పునాది దశ దాటలేదు. పేరుకు యూనివర్సిటీ అయినా భవనాలు లేకపోవడంతో ఒక్క బీఎఫ్ఎస్సీ కోర్సుకే పరిమితం చేశారు. పూర్తి స్థాయిలో తరగతులు నిర్వహిస్తే ఉన్నతీకరణలో భాగంగా ఫిషరీస్ డిప్లొమో, ఎంఎఫ్ఎస్సీ, ఇతర అనుబంధ కోర్సులు అందుబాటులోకి వస్తాయి.

బకాయిలు రూ.25 కోట్లు

వర్సిటీ నిర్మాణానికి సరిపల్లి, లిఖితపూడి గ్రామాల మధ్య 40 ఎకరాల భూమిని సేకరించారు. రూ.332 కోట్లతో డీపీఆర్ ఆమోదించి తొలి విడతగా రూ.100 కోట్లు మంజూరు చేశారు. మొదటి దశలో పరిపాలన భవనం, విద్యార్థులకు వసతిగృహాలు, వీసీ బంగ్లా, రైతు శిక్షణ కేంద్రాల నిర్మాణాలు పూర్తిచేయాలని నిర్ణయించారు. 2023 బడ్జెట్లో రూ.40 కోట్లు కేటాయించినట్లు ప్రచారం చేసినా తాత్కాలిక రహదారులు, మట్టి పనులు తప్ప ఇంకేం చేయలేదు. నాటి సర్కారు రూ.16 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక పెండింగ్ బిల్లులు రూ.7 కోట్లు విడుదల చేసింది. మరో రూ.25 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

అద్దె భవనంలోకి.. ప్రస్తుత నిర్వహిస్తున్న ఒక కోర్సులో బ్యాచ్‌కు 60 మంది చొప్పున రెండేళ్లకు 120 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది కొత్తగా వచ్చే మరో బ్యాచ్‌కు అవసరమైన తరగతి గదులు తుపాను షెల్టరులో లేవు. దీంతో తరగతులను సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోకి మార్చనున్నారు. దీనికి నెలకు రూ.1.20 లక్షలు అద్దె చెల్లించనున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు.. ప్రయోగశాలల నిర్మాణానికి వేములదీవిలో 350 ఎకరాల భూమిని గుర్తించారు. భూసేకరణ పూర్తికాకపోవడంతో వర్సిటీకి అప్పగించలేదు. దీంతో విద్యార్థులు ప్రయోగాలు, క్షేత్ర పరిశీలన నిమిత్తం సుమారు 30 కిలోమీటర్ల దూరాన ఉన్న ఉండిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి వెళ్తున్నారు.

అధికారులూ.. అప్రమత్తం కండి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: గోదావరి పరీవాహకంలో రానున్న మూడ్రోజులపాటు భారీ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో.. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ప్రస్తుత అంచనా ప్రకారం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీలో ఈ నెల 12 నాటికి 9 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరే అవకాశముందని జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ సమాచారం ఇచ్చారన్నారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ.. క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆమె సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎత్తుకు పైఎత్తు వేస్తూ.. ఉత్కంఠగా 'ఈనాడు' ఛాంపియన్ పోటీలు 6లో

WANTED FACULTY
SIDVI EL-FINS THE PRE-SCHOOL PIONEER
Centre Head: We are seeking a dedicated Pre-School Centre Head (Female) to lead our dynamic team and create a nurturing environment for both students and Parents.
Pre-School Teachers: Degree with 2 years experience.
Primay Teachers: English (Degree with B.Ed)
High School: Physics, Maths Degree / PG with 2 years experience with (B.Ed)
Candidates May Walk-in Between 9:00 AM & 5:00 PM on Any day before 13th July 2025
సిద్ధార్థ విద్యాలయ స్కూల్స్ ఏలూరు-హనుమాన్ జంక్షన్
సెంట్రల్ ఆఫీస్: విద్యాకోకిల భవనం, వట్లూరు, ఏలూరు
సెల్: 93942 24498, 88977 30230

కలెక్టర్‌ను కలిసేందుకు క్యూలైన్లో బారులు తీరిన అర్జీదారులు

భీమవరం కలెక్టరేట్‌లో వరుస క్రమంలో కుర్చీలో కూర్చున్న అర్జీదారులు

అక్కడలా.. ఇక్కడిలా..

ఏలూరు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అర్జీలిచ్చేందుకు వస్తుంటారు. వారంతా కలెక్టర్‌ను కలిసేందుకు గోదావరి సమావేశ మందిరంలోనికి వెళ్తుంటారు. ఈ క్రమంలో గంటల తరబడి క్యూలైన్లో నిలుచోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంగులను ఎత్తుకొని వచ్చిన వారి అవస్థలు వర్ణనాతీతం. పక్కనున్న పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరం కలెక్టరేట్‌లో అర్జీదారులు వరుస క్రమంలో కూర్చొని ప్రశాంతంగా కలెక్టర్‌కు అర్జీలిస్తున్నారు. అనంతరం దాతల సహకారంతో భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏలూరులో కూడా ఇదే విధానాన్ని అవలంబించాలని అర్జీదారులు కోరుతున్నారు. -ఈనాడు, ఏలూరు.

'మీ కోసం'లో 391 వినతులు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'మీ కోసం'కు వినతులు వెల్లువెత్తాయి. ప్రజలు తరలివచ్చి 391 అర్జీలు సమర్పించారు. కలెక్టర్ వెట్రిసెల్వి, సంయుక్త కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొని వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి తగిన పరిష్కారం చూపాలన్నారు. వినతుల్లో కొన్ని ఇలా ఉన్నాయి.

✧ మతిస్థిమితం లేని తన భర్త ఇంటి నుంచి బయటకెళ్లి నెల రోజులు అయింది. ఆయన ఆచూకీ కనుగొనాలని ఏలూరు చేపలతూము కూడలికి చెందిన డి.మంగ విన్నవించారు.

✧ ఏలూరు నియోజకవర్గంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని పలువురు వైకాపా కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారు. నగరపాలక కౌన్సిల్ సమావేశంలో కనీసం మాట్లాడనీయకుండా చేస్తున్నారని ఆరోపించారు.

కనికరించక.. కరుణించక!

'మీ కోసం'లో దివ్యాంగుల ప్రదక్షిణలు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రమాదంలో కాలు కోల్పోయి ఒకరు. పుట్టుకతో వైకల్యం బారిన పడి మరొకరు. వారి బాధలు విని, వాటిని పరిష్కరించే నాథుడే లేకపోవడంతో.. మథన పడుతున్నారు. మండల స్థాయిలో వినతులు అందజేసినా, బుట్టదాఖలు కావడంతో.. కలెక్టరేట్‌కు తరలివచ్చారు. తమ వ్యధలను జిల్లా అధికారులకు విన్నవించారు. వారి దీనగాథలివి..

మూడు చక్రాల వాహనానికి..

ఈయన పేరు కె.బుజ్జిబాబు. లారీ చోదకుడు. రోడ్డు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయారు. ఏ పని చేయడం లేదని కుటుంబ సభ్యులు వదిలేశారు. కృత్రిమ కాలు అమర్చుకొని ఎన్నో బాధలు పడుతూ.. ఏలూరులోని ఓ ఆశ్రమంలో కాలం వెల్లదీస్తున్నారు. ఆశ్రమం నుంచి ఎక్కడికెళ్లాలన్నా, ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. అధికారులు స్పందించి మూడు చక్రాల వాహనాన్ని మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్నారు.

పింఛను పెంచాలని..

ఈమె పేరు టి.ఆదిలక్ష్మి. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం. 11 ఏళ్ల వయసున్న కుమారుడు కైలాశ్ ఉన్నాడు. పుట్టుకతోనే వైకల్యంతో జన్మించాడు. నూరు శాతం వైకల్యమున్న కుమారుడికి దివ్యాంగుల విభాగంలో నెలకు రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నారని, ఆ మొత్తాన్ని రూ.15 వేలకు పెంచాలని ఆదిలక్ష్మి వేడుకుంటున్నారు. సదరం శిబిరంలో పొందిన ధ్రువపత్రాన్ని మండల అధికారులకు అందజేసినా ఫలితం లేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పింఛను మొత్తం పెంచాలని ఆమె కోరుతున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జీఎస్‌టీ 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

పెద్దలకూ ఓనమాలు!

- ఆగస్టులో అక్షరాంధ్ర కార్యక్రమాలు
- 1.60 లక్షల మందికి చదువు నేర్పడమే లక్ష్యం

పాలకొల్లు, న్యూస్‌టుడే

ఈ ఏడాది ఫిబ్రవరిలో 'ఉల్లాస్' పేరిట గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పట్లో పశ్చిమలో 3,895 మంది, ఏలూరు జిల్లాలో 6 వేల మందికి తొలివిడతలో శిక్షణ పూర్తిచేసి మార్చిలో పరీక్ష నిర్వహించారు. ఇప్పుడు వారంతా అక్షరాస్యులుగా మారారు. ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాల ద్వారా డిజిటల్, ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకున్నారు. ప్రతి మండలానికి 20 మంది వీవోఏలను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆలయాల ప్రాంగణాల్లో స్థానికుల సమయానుకూలతను బట్టి ఉల్లాస్ తరగతులు నిర్వహించారు. ఇప్పుడు రెండో విడతతో ఉభయ జిల్లాల్లో ఏడు పురపాల సంఘాలు, ఒక నగరపాలక సంస్థ, రెండు నగర పంచాయతీలు, 48 మండలాల్లోనూ అక్షరాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

జిల్లా	జనాభా	నిరక్షరాస్యులు	ఈ ఏడాది లక్ష్యం
పశ్చిమ	14 లక్షలు	2.05 లక్షలు	69 వేలు
ఏలూరు	25 "	3.52 "	91 "

☛ గణపవరం మండలం మొయ్యేరుకు చెందిన లక్ష్మి సంతకం చేయగలరు. కానీ డ్వాక్రా సంఘ సమావేశంలో చేసిన తీర్మానం చదవలేరు. చేతిలో చరవాణి ఉన్నా డిజిటల్ లావాదేవీలు నిర్వహించలేకపోతున్నారు. ఇలాంటి మహిళలతో పాటు పురుషులను సైతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం అక్షరాంధ్ర కార్యక్రమాన్ని ఆగస్టులో నిర్వహించనుంది. దీని కోసం ఉభయ జిల్లాల్లో నిరక్షరాస్యుల వివరాలు సేకరిస్తున్నారు.

100 గంటల చొప్పున.. ఇరు జిల్లాల్లో సుమారు 5.50 లక్షల మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు అంచనా. వీరందరినీ 2028-29 నాటికి అక్షరాస్యులుగా మార్చాలనేది ప్రభుత్వ లక్ష్యం. వీరిలో 1.60 లక్షల మందికి వచ్చే మార్చినాటికి విద్య నేర్పాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మండలాల్లో వెలుగు, పట్టణాల్లో మెప్మా ఆధ్వర్యంలో లక్ష్యాలను నిర్దేశించుకుని మొత్తం 100 గంటల పాటు తరగతులు నిర్వహించనున్నారు. తరగతుల నిర్వహణకు వీవోఏలతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో విద్యావంతులను ఎంపిక చేయనున్నారు. టీసీఎస్ సంస్థ డిజిటల్ శిక్షణకు సహకరించనుంది. ఈ అంశంపై వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ప్రభాకర్‌ను సంప్రదించగా లక్ష్యాలను నిర్దేశించుకుని అక్షరాంధ్రను విజయవంతం చేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

అభ్యసనలో మహిళలు (పాత చిత్రం)

పీ4 స్ఫూర్తితో విరాళం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమ స్ఫూర్తితో కొర్రపాటి ఫౌండేషన్, కొర్రపాటి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కొర్రపాటి సుధాకర్ రూ.50 వేల విరాళమిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ వెట్రిసెల్విని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి చెక్కు అందజేశారు.

- న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ

సకాలంలో లక్ష్యాల పూర్తి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి వ్యవసాయం, అనుబంధ రంగాల అధికారులతో సోమవారం దూర దృశ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. 5,169 హెక్టార్లలో ఆయిల్‌పామ్ మొక్కల పెంపకానికి నిర్దేశించిన లక్ష్యాన్ని నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. మొక్కలు నాటాక, సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కౌలు రైతులకు ఈ ఏడాది రూ.375 కోట్ల పంట రుణాలు అందించాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, ఉద్యానాధికారి ఎస్.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో వేగంగా కేసుల విచారణ: ఐజీ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వేగంగా కేసుల విచారణ చేపట్టాలని ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక ఐజీ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న అసిస్టెంట్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్‌తో కలిసి సోమవారం నూతన ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ రికార్డ్స్, కోర్టు ప్రాసెసింగ్ తదితరాల్లో మరింత చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. తద్వారా కేసుల విచారణ వేగవంతమై, నిందితులకు త్వరితం శిక్షలు పడతాయని ఆయన పేర్కొన్నారు.

ల్యాప్‌టాప్ ఇస్తున్న అశోక్‌కుమార్, ఎస్పీ

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా నగరంలో సోమవారం పీర్లను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. వంగాయగూడెంలోని చేపలతూము కూడలి, పోణంగి రోడ్డులోని గాజుల, కుండీ కూడళ్లలోని గొలుసుల, గడియారపు స్తంభం పంజాల నుంచి భక్తులు పీర్లను ఎత్తుకుని మెయిన్ బజారు, పాత బస్టాండ్ మీదుగా కర్బలా మైదానానికి ప్రదర్శనగా చేరుకున్నారు. అంతకుముందు పంజాల వద్ద పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కర్బలా మైదానంలో పీర్లను నిమజ్జనం చేశారు.

'స్త్రీ గొంతుక' పట్టించింది!

బంగారం చోరీ కేసు ఛేదన

గుడివాడ, న్యూస్‌టుడే: చెడు నడత కలిగిన కొందరి మధ్య నెల్లూరు జైలులో ఏర్పడిన స్నేహం ఓ ముఠాగా ఏర్పాటై పలు చోరీలకు పాల్పడేలా చేసింది. గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా పామర్రు మండలం మలయప్పన్ పేటకు చెందిన ఎస్.ప్రమీల రాణి ఇంట్లో ఫిబ్రవరి 22న రాత్రి 16 కాసుల బంగారం దొంగల పాలైంది. నేరం జరిగిన రోజున దొంగల వెంట పడిన సమయంలో స్థానికులు ఓ స్త్రీ గొంతుకను గుర్తించినట్లు సమాచారం తెలుసుకున్న సీసీఎస్ ఎస్.ఐ శీలం స్వామి దాసు దాని ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులలో ఒకరైన ఏలూరుకు చెందిన మున్నా(సిరి) అనే ట్రాన్స్‌జెండర్‌ను అదుపులోనికి తీసుకోగా అసలు విషయం బయట పడింది. ఈ కేసులో ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ షబ్బీర్, ట్రాన్స్‌జెండర్ షేక్ మున్నా (సిరి), కాకినాడకు చెందిన కొఠారి శ్రీనివాసరావులను ప్రధాన నిందితులుగా గుర్తించారు. వారిని బల్లిపర్రు వద్ద ఆదివారం అదుపులోనికి తీసుకుని వారి నుంచి 16 కాసుల బంగారం రికవరీ చేశారు. వారిపై రాష్ట్ర వ్యాప్తంగా 110కు పైగా కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. వీరందరికీ నెల్లూరు జైలులో గొడవర్తి కిరణ్ (లిక్కా) అనే ఒక గంజాయి స్మగ్లర్‌తో పరిచయం ఏర్పడిందన్నారు. ప్రధాన నిందితులు ముగ్గురితో పాటు గుడివాడ బేతవోలుకు చెందిన గూడపాటి రాజేష్, నైజాంపేటకు చెందిన తిరుమలశెట్టి ధనుష్(పండు)లను కూడా అరెస్టు చేశామన్నారు.

కాగిత మాయాజాలం!

- ★ చింతలపూడిలో బయటకొచ్చిన ఇండెక్స్ వాల్యూము
- ★ అయిదుగురు ఉద్యోగులకు డిప్యుటేషన్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: రిజిస్ట్రేషన్ శాఖ అవినీతికి చిరునామాగా మారింది. ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో.. వారందరినీ వేర్వేరు ప్రాంతాలకు డిప్యుటేషన్‌పై పంపారు. వివరాల్లోకి వెళితే.. చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొన్నేళ్ల క్రితం ఓ దస్తావేజు ఇండెక్స్ వాల్యూములోని కాగితాన్ని ఒకరు రిజిస్ట్రేషన్ శాఖ ఐజీకి పంపారు. భద్రంగా ఉంచాల్సిన ఈ వాల్యూముల కాగితాలను గుర్తుతెలియని వ్యక్తి ఐజీకి పంపడంపై ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఇప్పటికే చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అనేక అవినీతి ఆరోపణలున్నాయి. పైగా వాల్యూముల కాగితం బయటకు రావడంతో.. సంబంధిత ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీఐజీ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ ఎస్‌కేఎం బేగంను విజయవాడ, ఇద్దరు జూనియర్, ఒక సీనియర్ సహాయకులను ఏలూరు, షరాబ్ కామవరపుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై పంపారు. జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు రావడంతో.. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అయిదుగురు ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు పంపామన్నారు. వాల్యూము కాగితం బయటకు వెళ్లిన విషయంపై అక్కడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ వ్యవహారంపై విచారణ కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

రూ.336కు చేరిన పొగాకు ధర

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వర్జీనియా పొగాకుకు సోమవారం నాటి వేలంలో జంగారెడ్డిగూడెం ఒకటో వేలం కేంద్రంలో కిలోకి రూ.336 గరిష్ఠ ధర చేకూరింది. కొయ్యలగూడెంలోను రూ.336 పలకగా, జంగారెడ్డిగూడెం రెండో వేలం కేంద్రంలో రూ.335 లభించింది. కొద్ది రోజులుగా మేలు రకం పొగాకు ధరలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలోనే కిలో రూ.290 ఉన్న గరిష్ఠ ధర రూ.46 పెరిగి రూ.336కు చేరింది. మరింత పెరగాలని కర్షకులు ఆకాంక్షిస్తున్నారు. ● ఉమ్మడి జిల్లాలోని అయిదు వేలం కేంద్రాల పరిధిలో 26.68 మిలియన్ కిలోల పొగాకు కొనుగోళ్లు ఇప్పటి వరకు జరిగాయి. కిలోకి రూ.275.47 సగటు ధర లభించింది. సగటు ధర బాగా పెరిగి, అన్ని రకాల గ్రేడ్‌లలోని పొగాకును కంపెనీలు కొనేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఎత్తుకు పైఎత్తు వేస్తూ

ఉత్కంఠగా 'ఈనాడు' ఛాంపియన్ పోటీలు

ఈనాడు ఛాంపియన్స్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: నిత్యం విధుల్లో తలమునకలై ఉండే పలు శాఖల ఉద్యోగులకు 'ఈనాడు' 'ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చదరంగం పోటీలకు విశేష ఆదరణ లభించింది. గత నెల 19 నుంచి 30వ తేదీ వరకు విద్యుత్తు, వ్యవసాయం, విద్య శాఖ, జలవనరులు, నగరపాలక సంస్థ, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖల్లోని ఉద్యోగులకు చదరంగం పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఉద్యోగులకు సోమవారం ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో చదరంగం ఫైనల్ పోటీలు నిర్వహించారు. 6 జట్లు ఉత్కంఠభరితంగా పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్స్‌లో నగరపాలక సంస్థకు చెందిన వార్డు వెల్ఫేర్ అడ్మిన్ కార్యదర్శి నంబూరి జీవన్ చాంపియన్‌గా నిలిచారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అకౌంటెంట్ బి.మహేష్ ద్వితీయ స్థానం పొందారు. వీరికి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆర్జేడీ బి.సుజాత రాణి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు చదరంగం పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి స్వరాజ్యలక్ష్మి, సూపరింటెండెంట్ రవికుమార్, ఈవో అపర్ణజి, డీసీపీవో సూర్యచక్రవేణి, చెస్ ఆర్బిటర్ జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

పోటీలో తలపడుతున్న ఉద్యోగులు

జీవన్ (ప్రథమ), మహేశ్ (ద్వితీయ)లకు ట్రోఫీ అందజేస్తున్న ఆర్జేడీ

కొబ్బరిలో తెగుళ్లు.. అశ్రద్ధ వద్దు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: కొబ్బరి చెట్లను పలు రకాల తెగుళ్లు ఆశిస్తాయి.. వాటి విషయంలో అశ్రద్ధ చేస్తే నష్టం తీవ్రంగా ఉంటుందని ఉద్యానశాఖాధికారిణి ప్రియదర్శిని తెలిపారు. వివిధ రకాల తెగుళ్ల లక్షణాలు, నివారణ చర్యలను ఆమె వివరించారు. ● ఆకు ఎండు, ఆకుమచ్చ తెగులు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. గాలి ద్వారా ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు వ్యాపిస్తాయి. ఆకులపై చిన్న గోధుమ రంగు మచ్చలు మొదట్లో క్రమేపీ విస్తరిస్తాయి. కాయలపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి శిలీంధ్రం వ్యాపించి కుళ్లిపోతాయి. మట్టల నుంచి మొవ్వను ఆశించి విరిచిన చెట్టు చనిపోతుంది. తెగులును గుర్తించిన తోటల్లో 200 గ్రాముల సూడోమోనాస్ పొడి, 50 కిలోల పశువుల ఎరువు, 5 కిలోల వేపపిండి కలిపి ఏడాదికి ఒకసారి నేలలో వేయాలి. ఉద్ధృతి ఎక్కువగా ఉన్న ముదురు తోటల్లో 2 మి.లీ హెక్సాకొనజోల్‌ను 100 మి.లీ నీటిలో కలిపి ఏడాదికి 4 సార్లు వేర్ల ద్వారా ఎక్కించాలి.

వక్క.. లాభాలు పక్కా..

మిశ్రమ సాగుతో సత్ఫలితాలు

జంగారెడ్డిగూడెం (గ్రామీణ), న్యూస్‌టుడే: మిశ్రమ సేద్యం లాభసాటిగా ఉంటుందని జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన రైతు ఎలికే వరప్రసాదరావు నమ్మారు. వ్యవసాయం ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ఏకకాలంలో పలు పంటలు సాగు చేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. స్వతహాగా వ్యవసాయ కుటుంబం కావడంతో చిన్నతనం నుంచి తండ్రి చేస్తున్న సాగు పనులు నిశితంగా పరిశీలించేవారు. చదువు పూర్తయిన తర్వాత తనకున్న ఏడెకరాల్లో మిర్చి, పొగాకు పండించేవారు. అప్పట్లో ఈ ప్రాంతంలో మిర్చి సాగు ఎక్కువగా ఉండటంతో మార్కెట్ ఒడుదొడుకులు ఉండేవి. దీనిని అధిగమించేందుకు దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్‌పామ్ వేయాలని నిర్ణయించుకున్నారు. మూడున్నర ఎకరాల్లో ఆయిల్‌పామ్ ... కంగా మొక్కలు తెచ్చి నాటారు. మరో మూడున్నర ఎకరాల్లో బొబ్బరి నాటి అంతర పంటగా కోకో వేశారు.

ఆది నుంచి వినూత్నంగా.. ప్రసాదరావు ఆది నుంచి సాగులో వినూత్నంగా పంటలు పండించి అధిక దిగుబడి సాధించాలని కోరిక. ఇందులో భాగంగానే పాతికేళ్ల కిందటే ఈ ప్రాంత వాసులకు ఆయిల్‌పామ్, కోకో పంటలను పరిచయం చేశారు. ప్రస్తుతం వక్క తోటలపై లాభాలు బాగున్నాయని తెలుసుకుని వేనిపాడ నర్సరీ నుంచి ఒక్కో మొక్క రూ.30 చొప్పున మూడేళ్ల కిందట తెచ్చి కోకోలో అంతర పంటగా నాటారు. ఎండ తీవ్రత తగల కుండా అరటి పెంచుతున్నారు. ప్రస్తుతం వక్క తోట ఏపుగా పెరగడంతో అరటిని తొలగిస్తున్నారు. వక్క కాయలు గుత్తులుగా కాస్తున్నాయి.

సేంద్రియ పద్ధతుల్లో.. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని ఇంటిపై వర్మీ కిందటే వర్మీ కంపోస్టు యూనిట్లను తన పొలంలో నెలకొల్పారు. ఏడాది పొడవునా వర్మీ, పశువుల పెంటలను ఎప్పటికప్పుడు ఎరువుగా వేయడంతోపాటు చీడపీడలు దరిచేరకుండా జీవామృతాన్ని పిచికారీ చేస్తున్నారు. ఆకులను సైతం చెట్ల మొదట్లో వేస్తున్నారు.

తక్కువ ఖర్చుతోనే.. 'తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చేలా రైతులు వ్యవసాయం చేయాలి. కొద్ది భూమిలోనే పలు రకాల పంటలు వేసి ఆదాయం గడించవచ్చు. వక్క పండ్లు కిలో రూ.60 చొప్పున లేదా చెట్టు రూ.500 దాకా కొనుగోలు చేస్తున్నారు. మొత్తం మీద ఎకరాకు రూ.2 లక్షలు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మిగతా కోకో, కొబ్బరిపై ఖర్చులు పోనూ రూ.లక్ష ఆదాయం సమకూరుతుంది..' అని రైతు ఎలికే వరప్రసాదరావు వివరించారు.

రైతేరాజు

ప్రశ్న: వరిలో మాగాణిలో నేల సారాన్ని పెంచడం ఎలా ?

- జగన్నాథరావు, తాడేపల్లిగూడెం

సమాధానం: రసాయనిక ఎరువుల వినియోగానికి ముందు ఎకరానికి పచ్చిరొట్ట విత్తనాలు (జీలుగు, జనుము, పిల్లి పెసర) 15 కిలోలు చల్లి 50 శాతం పూత దశకు వచ్చిన తర్వాత కలియదున్నాలి. ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువును నాట్లకు ముందు నేలలో వేయాలి. జీవన ఎరువులు (అజోస్పైరిల్లమ్, పీఎస్‌బీ, కేఆర్‌బీ) 2 కిలోలు 100 కిలోల పశువుల ఎరువుకు పట్టించి నేలలో కలియబెట్టాలి.

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు ✆ చరవాణి 73826 33692

వరి నాట్లు వేస్తున్నారా..!

మార్టేరు, న్యూస్‌టుడే: వరి నాట్లు వేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని.. లేకుంటే దిగుబడిపై ప్రభావం పడుతుందని మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు టి.శ్రీనివాస్ తెలిపారు. రైతులకు ఆయన చేసిన సూచనలు ఇవీ..● భూములను మెత్తగా దమ్ము చేశాక రెండు నుంచి పది రోజుల లోపు నాటుకోవాలి. పైపైన నాట్లు వేస్తే ఎక్కువ పిలకలు తొడిగి 20 శాతం వరకు దిగుబడి పెరిగినట్లు పరిశోధనల్లో తేలింది. ● నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారును నాటితే దిగుబడి తగ్గుతుంది. ● భూసారాన్ని అనుసరించి చదరపు మీటరుకు 33 మూనలు ఉండేలా చూసుకోవాలి. భూసారం తక్కువగా ఉన్న భూముల్లో, నాట్లు ఆలస్యమై ముదురు నారు వినియోగించాల్సి వస్తే మూనల సంఖ్య పెంచాలి.

యాజమాన్య పద్ధతులతో నష్ట నివారణ

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: చెరువుల్లో సాగు చేస్తున్న పండుగప్ప చేపలకు ఇటీవల తెగుళ్లు సోకి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సాగునీటి కాలువల నుంచి కొత్త నీటిని చెరువుల్లోకి తోడటం, వర్షాల ప్రభావంతో చేపలు రెడ్ డిసీజ్, తాటాకు, మొప్పల్లో జలగల వంటి తెగుళ్లకు గురవుతున్నాయి. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా దీనిని నివారించవచ్చని భీమవరానికి చెందిన ఆక్వారంగ నిపుణుడు డాక్టర్ అడబాల గోపాలరావు పేర్కొన్నారు. రైతులకు ఆయన ఇచ్చిన సూచనలు ఇవీ..

తెగులు సోకిన చేప

★ చెరువుల్లోకి కొత్త నీరు తోడిన వెంటనే బ్యాక్టీరియా కిల్లింగ్ ఏజెంట్ అయిన శానిటైజర్‌ను చల్లాలి. తగిన ఔషధాలను నిపుణుల సలహా మేరకు వినియోగించాలి. ★ పండుగప్పలు బతికి ఉన్న, మృతి చెందిన ఇతర చేపలను ఆహారంగా తీసుకుంటాయి. వాటి అవశేషాలు చెరువు అడుగు భాగంలోకి చేరి కుళ్లడంతో అమోనియా, నైట్రైట్ వంటి విషవాయువులు పెరుగుతుంటాయి. ప్రతి పదిరోజులకు ఒకసారి జియోలైట్, గ్యాసోక్యూర్, రోడోబ్యాక్టిల్, రోడోకోకస్, నైట్రోజమోనాస్ వంటి ప్రొబయోటిక్స్‌ను తగిన మోతాదులో వినియోగించి చెరువు అడుగు భాగాన్ని శుభ్రం చేసుకోవాలి. క్యూర్ వంటి శానిటైజర్‌ను వారానికోసారి చెరువుల్లో చల్లి బ్యాక్టీరియా రహితంగా చూసుకోవాలి.

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

Wanted teachers of Physical Science, Maths for Classes 6th to 10th. Contact or Send resume through Whatsapp: 98853 47949. Vijaya E.M. School, Penumantra, W.G.Dt.

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

ఎవిఆర్ బజాజ్ త్రీ వీలర్ ఆటో షోరూం, భీమవరం, ఆకివీడు, చేబ్రోలు, నిడమర్రు, గణపవరం, కాళ్ళ, పాలకొల్లు, మార్టేరు, నల్లజెర్ల, తాడేపల్లి గూడెం, నిడదవోలు, అత్తిలి, నరసాపురం, మొగల్తూరు నందు పనిచేయుటకు ఇంటర్ చదివిన సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను, టూ వీలర్ తప్పనిసరి, త్రీ వీలర్ రంగంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. Cont: 88866 31234, 97014 95202

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. బో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

మిడిల్ స్కూల్ ఇంగ్లీష్ (3rd to 7th క్లాస్), PET లు, బ్లాక్ ఇంచార్జ్‌లు, టీచర్లు కావలెను. శ్రీశ్రీ స్కూల్, శ్రీరామ్ నగర్ 10 వ రోడ్, ఏలూరు. సెల్: 94412 34626, 08812- 244084.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి / వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. బో.వ+జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. బో.వ+జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52843.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.35 పైII

తణుకు ఆఫీసు: 08819-224254

ఆయిల్‌పామ్ కర్మాగారం ప్రైవేటీకరణ వద్దు

చింతలపూడి, న్యూస్‌టుడే: పెదవేగిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. చింతలపూడిలో మూడు రోజులు జరిగిన సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభలలో తీర్మానాలను స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ, మెరుగైన పునరావాసం, వసతి కల్పించాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చింతలపూడిలో బస్ డిపో ఏర్పాటు చేయాలని, భూమి లేని నిరుపేదలకు బంజరు, అటవీ భూములను కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా మహాసభ 45 మందిని జిల్లా సమితి సభ్యులుగా, 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బాబు, జిల్లా సమితి సభ్యులు కంచర్ల గురవయ్య, దొంతా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య, పాల్గొన్న నాయకులు

కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శులు డీఎన్‌వీడీ ప్రసాద్, బి.వెంకట్రావు పిలుపునిచ్చారు. నగరంలో కార్మిక సంఘాల ఆధ్వర్యాన సోమవారం ద్విచక్ర వాహనాల ప్రదర్శన చేపట్టారు. స్థానిక జూట్ మిల్లు నుంచి గడియారస్తంభం, మార్కెట్, పాత బస్టాండ్ కూడళ్ల మీదుగా కొత్త బస్టాండ్ వరకు ప్రదర్శన సాగింది. నాయకులు కృష్ణ చైతన్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సోమయ్య, కన్నబాబు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలపై ప్రదర్శనలో నాయకులు

గోదావరిలో వరద తగ్గుముఖం

పోలవరం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు సాధారణ స్థితికి చేరడంతో గోదావరికి వరద తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద సోమవారం సాయంత్రానికి నీటిమట్టం 27.90 మీటర్లకు తగ్గింది. 48 గేట్ల నుంచి 1.90 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళ్తోంది.

దాడి ఘటనలో 10 మందిపై కేసు

కైకలూరు, న్యూస్‌టుడే: దాడి ఘటనలో పది మంది వ్యక్తులపై కైకలూరు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కైకలూరు మండలం వదర్లపాడు గ్రామానికి చెందిన ఘంటసాల సురేశ్ ఆదివారం కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం సమీపంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో సర్కారు కాలువ వంతెనపై కారు ఆపి ఫోన్‌లో ఫొటోలు దిగుతున్నారు. ఇంతలో వెనక కార్లలో వస్తున్న భీమవరానికి చెందిన యువకులు కారు పక్కకు తీయాలని హారన్లు మోగించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి వెళ్తున్న సురేశ్ కారును ఆలపాడు పెట్రోల్ బంకు సమీపంలో భీమవరం యువకులు కారుతో అడ్డగించి వాగ్వాదానికి దిగారు. తర్వాత సురేశ్, అతని సోదరుడు సుబ్రహ్మణ్యం, మరో వ్యక్తి అర్జున్‌పై కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురూ గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు సురేశ్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై వి.రాంబాబు దాడి చేసిన పది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

అక్కడే వదిలేయండి.. ఎలా పోతే నాకేంటి?

- ☛ రైలు నుంచి జారిపడి చికిత్స పొందుతున్న తండ్రి
- ☛ తనకు సంబంధం లేదన్న కొడుకు

తణుకు, న్యూస్‌టుడే: కని పెంచి పెద్ద చేసిన తండ్రి కుటుంబంలో మనస్పర్థల కారణంగా ఏడేళ్ల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి సోమవారం తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యక్షమయ్యారు. ఆస్పత్రి సిబ్బంది కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినప్పటికీ తనకు సంబంధం లేదని కొడుకు తేల్చి చెప్పడంపై పలువురు మండిపడుతున్నారు. పైగా తనకు సంబంధంలేదని రాసిస్తానని చెప్పడం చూస్తుంటే మానవత్వం మంటగలిసిందని వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన గలగల సుబ్బారావుకు భార్యతో పాటు కొడుకు సుధీర్, కుమార్తె ఉన్నారు. దాదాపు ఏడేళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సుబ్బారావు అప్పటి నుంచి తిరిగి రాలేదు. ఆదివారం సాయంత్రం కాల్దరి రైల్వేస్టేషన్లో రైలు నుంచి జారి పడి వ్యక్తి గాయాలపాలయ్యాడు. తణుకు రైల్వే పోలీసులు బాధితుణ్ని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అతడి నుంచి వివరాలు సేకరించిన రైల్వే కానిస్టేబుల్ బాల బాధితుడి కుమారుడు సుధీర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. సుబ్బారావు పరిస్థితి విషమంగా ఉందని.. ఏలూరు తీసుకెళ్లాలని చెప్పడంతో 'నాకు ఆయనతో సంబంధం లేదు. అక్కడే వదిలేయండి, ఆయన ఎలాపోతే నాకేంటి అని' సమాధానం ఇవ్వడంతో అవాక్కయిన కానిస్టేబుల్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

ఎప్పుడో చనిపోయాడన్న భార్య.. సుబ్బారావు భార్యతో మాట్లాడేందుకు సోమవారం ప్రకాశరావుపాలెం గ్రామానికి వెళ్లిన పోలీసులకు అతని కుటుంబ సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తన తండ్రి చనిపోయినట్లు మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్నామని, నా తల్లి వితంతు పింఛను సైతం తీసుకుంటోందని చెప్పడంతో పోలీసులు అవాక్కయ్యారు.

అవసరమైతే రాసిస్తా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బారావు వద్దకు కుమారుడు సుధీర్‌ను తీసుకొచ్చిన రైల్వే పోలీసులకు, తణుకు జిల్లా ఆసుపత్రి వైద్యులకు సైతం అదే సమాధానం ఇవ్వడం గమనార్హం. మరో వైపు తనకు, తన కుటుంబానికి తండ్రితో ఎలాంటి సంబంధం లేదని లిఖితపూర్వకంగా ఇస్తానని చెప్పడంతో ఆసుపత్రి ఆర్‌ఎంవో ఏవీఆర్ తాతారావు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎంత నచ్చజెప్పినప్పటికీ తండ్రిని తీసుకెళ్లేందుకు కొడుకు సుధీర్ నిరాకరించడంతో ఆర్‌ఎంవో తణుకు సీఐ కొండయ్యకు సమాచారం అందించారు. తండ్రి పట్ల నిర్లక్ష్యం వహిస్తే కేసు నమోదు చేస్తానని సీఐ సైతం హెచ్చరించినప్పటికీ మొండికేయడంతో బాధితుడు సుబ్బారావుకు అదే ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

యువకుడికి 20 ఏళ్ల జైలు

తణుకు, న్యూస్‌టుడే: ఇరగవరం పోలీస్‌స్టేషన్లో 2021లో నమోదైన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ.1.10 లక్షల జరిమానా విధిస్తూ సోమవారం భీమవరం పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ తీర్పు చెప్పారు. రేలంగి గ్రామానికి చెందిన నీలాపు గోపికృష్ణ అదే గ్రామానికి చెందిన బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీనిపై అప్పటి ఎస్సై జానా సతీష్ పోక్సో కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో గోపికృష్ణపై నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలు, జరిమానా విధిస్తూ భీమవరం పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు ఎస్సై జానా సతీష్ తెలిపారు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 6304901226

(c) eenadu

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

అప్రమత్తతతో డెంగీ నివారణ

ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెదపాడు, న్యూస్‌టుడే: అప్రమత్తతతోనే డెంగీ నివారణ సాధ్యమవుతుందని మలేరియా జిల్లా సహాయ అధికారి గోవిందరావు అన్నారు. జాతీయ డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పెదపాడు, వట్లూరు గ్రామాల్లో అవగాహన ప్రదర్శన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల నేపథ్యంలో.. కాలానుగుణ వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. దోమల వృద్ధికి అడ్డుకట్ట వేసినప్పుడు రోగాలను అరికట్టవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయన కోరారు.

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలో పని చేస్తూ. . బదిలీపై వివిధ ప్రాంతాలకెళ్లిన ఉపాధ్యాయులకు సోమవారం వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు సీహెచ్ జాకబ్‌రాజు, ఎం.సతీశ్, ఏవీ సుబ్బలక్ష్మి, రాజేశ్, విజయలక్ష్మి, శకుంతల, సిబ్బంది రత్నం, వరకృష్ణ తదితరులను శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సన్మానించారు. వారి సేవలను ప్రధానోపాధ్యాయుడు సత్యేంద్రనాథ్‌రెడ్డి కొనియాడారు.

కషాయాల తయారీపై శిక్షణ

ఉంగుటూరు, న్యూస్‌టుడే: నాచుగుంట స్వయం సహాయక సంఘంలోని మహిళలు, రైతులకు ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో కషాయాల తయారీపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం, దశపర్ణి తదితర కషాయాలు సొంతంగా ఎలా తయారు చేసుకోవాలో ఏపీసీఎన్ఎఫ్ మండల ఇన్‌ఛార్జి బండి సంధ్యారాణి, సిబ్బంది ప్రయోగ పూర్వకంగా వివరించారు. డ్రోన్ వినియోగంపైనా అవగాహన కల్పించారు.

పంట బీమా.. రైతన్నకు ధీమా!

వరికి ఆగస్టు 15 వరకు గడువు

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే వరకు అన్నదాతలకు ఆందోళన తప్పడం లేదు. క్లిష్ట పరిస్థితుల్లో రైతన్నలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో దశాబ్ద కాలంగా రైతుకు ధీమానిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడలతో పంటకు నష్టం వాటిల్లితే.. కర్షకులకు ఇబ్బందుల్లేకుండా బీమా వర్తించేలా పథకాన్ని రూపొందించింది.

నేరుగా చెల్లించేలా.. ఖరీఫ్‌లో ఉంగుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా వరి అధికంగా సాగు చేస్తారు. అక్కడక్కడా కొద్ది విస్తీర్ణంలో మినుములు పండిస్తారు. ఉంగుటూరు మండలంలో మాత్రమే కాస్తోకూస్తో మినుము సాగు కనిపిస్తుంది. నియోజకవర్గంలో 52,899 ఎకరాల్లో వరి, 315 ఎకరాల్లో మినుము పండిస్తారు. రుణం తీసుకున్న రైతులకు బ్యాంకులు, సహకార సంఘాలు ప్రీమియం మినహాయించుకుంటాయి. మిగతావారు నేరుగా చెల్లించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

వరి సాగు వివరాలిలా..

మండలం	విస్తీర్ణం
ఉంగుటూరు	24,043
భీమడోలు	12,734
నిడమర్రు	3,450
గణపవరం	12,672

వరికి రూ.840.. బీమా పొందడానికి రైతులు ఆధార్, భూమి పత్రం; కౌలు రైతులు తహసీల్దారు అందించే కౌలు పత్రం, పంట ధ్రువ పత్రం(ఆర్ఎస్‌కేలో ఇస్తారు), చరవాణి, బ్యాంకు ఖాతా నంబర్లు ఇవ్వాలి. వరికి ఎకరాకు రూ.840, మినుముకు రూ.300 చొప్పున ప్రీమియం చెల్లించాలి. పంటకు నష్టం వాటిల్లితే వరికి రూ.42 వేలు, మినుముకు రూ.20 వేలు చొప్పున బీమా పరిహారం వస్తుంది. 'రైతులు పంట దెబ్బతింటే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాలి. బీమా చెల్లించడం ద్వారా కొంత సాయం పొందొచ్చు. బీమాను సద్వినియోగం చేసుకోవాలి' అని ఉంగుటూరు మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 'పంటలను రెండు విధాలుగా విభజించారు. వాతావరణ ఆధారితం ఒకటి, దిగుబడి ఆధారం మరొకటి. మినుముకు ఈ నెల 31, వరికి ఆగస్టు 15 వరకు గడువు ఇచ్చారు.'

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: చింతమనేని

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదపాడు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా సత్యవోలు, సకలకొత్తపల్లి, కొనికి, గుడిపాడు, నాయుడుగూడెం గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. చింతమనేని మాట్లాడుతూ.. తల్లికి వందనం పథకంతో ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందన్నారు. సాంకేతిక సమస్యలతో కొందరికి నగదు జమ కాలేదని, నాలుగైదు రోజుల్లో వారికీ నగదు అందుతుందని తెలిపారు. నాయకులు శ్రీనివాసరావు, రాంప్రసాద్, సుబ్రమణ్యం, స్టాలిన్, అనిల్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు. ★ స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'పై వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని ఆయన ఆదేశించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు టూటౌన్: 80085 74487	ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483	ఉంగుటూరు: 79933 00492

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? చాటపర్రు రోడ్డులోని పంట కాలువలో చెత్తాచెదారం, వ్యర్థాలు పడేస్తున్నారు. కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నాయి. పంట సాగుకు ఇబ్బందవుతోంది. **- నాగభూషణం, రైతు**

✔ పంట కాలువలోని చెత్త, వ్యర్థాలు తొలగిస్తాం. సాగునీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా చూస్తాం. చెత్త పడేస్తే చర్యలు తీసుకుంటాం. **- దుర్గారావు, జలవనరులశాఖ ఏఈ**

? ఫిల్‌హౌస్‌పేట కూడలిలోని ప్రధాన మార్గం అధ్వానంగా తయారైంది. దారంతా గుంతలు పడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. **- కృపానందం, ఏలూరు**

✔ సమస్య నా దృష్టికి రాలేదు. గుంతలు పూడ్చేందుకు త్వరితం చర్యలు చేపడతాం. **- శేషుకుమార్, ర.భ.శాఖ ఏఈ**

? తంగెళ్లమూడి భాగ్యనగర్‌లోని ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇబ్బంది పడుతున్నాం. **- రాజు**

✔ ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. ఆ స్థలాల్లో మురుగునీరు నిలవకుండా మట్టితో చదును చేయించేందుకు చర్యలు చేపడతాం. **- చంద్రయ్య, అదనపు కమిషనర్**

స్పందనకు సంతసం

పిచ్చిమొక్కల తొలగింపు.. నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎనికేపల్లిలో ట్యాంకు సమీప విద్యుత్తు నియంత్రిక చుట్టూ అల్లుకుపోయిన పిచ్చిమొక్కలు ఎట్టకేలకు తొలగాయి. 'మేమున్నాం.. మీకు తోడుగా'లో సోమవారం ప్రచురితమైన సమస్యకు విద్యుత్తు ఏఈ ప్రసాద్‌రాజు స్పందించారు. సిబ్బందిని పంపి పిచ్చిమొక్కలు తొలగింపజేశారు.

దశలవారీగా హామీల అమలు: గన్ని

మాట్లాడుతున్న ఆప్కాబ్ ఛైర్మన్ వీరాంజనేయులు

నిడమర్రు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తోందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా పెదనింద్రకొలనులో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏడాది కాలంలోనే సుమారు 70 శాతానికి పైగా హామీలకు కార్యరూపం ఇచ్చామన్నారు. మిగతా 30 శాతం హామీలను ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు వివరిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 90 శాతానికి పైగా రహదారులను అభివృద్ధి చేశామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి, నాయకులు రామ్మూర్తి, స్వామి, భాస్కరరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు హెచ్చరించారు. స్థానిక జడ్పీ కూడలిలో సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాల్లేని చోదకులపై కేసులు నమోదు చేశారు. సీఐ మాట్లాడుతూ.. వాహనాలకు కచ్చితంగా నంబర్ ప్లేట్‌లు ఉండాలన్నారు .. ర్యాష్, ట్రిపుల్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదమని, ఎవరైనా ఉల్లంఘిస్తే కేసులు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

మహిళకు కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే చంటి

నగర సమగ్రాభివృద్ధికి కృషి: బడేటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు నగర సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక 48వ డివిజన్‌లో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ముద్రించిన కరపత్రాలను స్థానికులకు పంచిపెట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి సర్కారు ముందుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు. ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, తెదేపా నగరాధ్యక్షుడు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

గణపవరం, న్యూస్‌టుడే: కార్మిక చట్టాల రద్దు, సమస్యల పరిష్కారానికి ఈ నెల 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. సంఘం మండలాధ్యక్షుడు పెంటారావు అధ్యక్షత వహించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు.

నిడమర్రు గ్రామీణం: బువ్వనపల్లి, అడవికొలను, క్రొవ్విడి, చానమిల్లి గ్రామాల్లో సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. కర్షక, కార్మికులు, ప్రజలు సమ్మెలో భాగస్వాములు కావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

నేటి నుంచి బీఎల్వోలకు శిక్షణ

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఓటరు జాబితా తయారీ, మార్పులు, చేర్పులు, ఇతర ఎన్నికల ప్రక్రియలపై నియోజకవర్గంలోని 214 మంది బీఎల్వోలకు ఈ నెల 8 నుంచి 17 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దారు వై.పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. 8, 9 తేదీల్లో ఉంగుటూరు, 10, 11 తేదీల్లో భీమడోలు, 15న నిడమర్రు, 16, 17 తేదీల్లో గణపవరం మండలాల బీఎల్వోలకు శిక్షణ ఉంటుందన్నారు. ఆయా తేదీల్లో బీఎల్వోలు తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరు కావాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శునకాలకు టీకాలు

నిడమర్రు గ్రామీణం: జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యుడు సందీప్ సూచించారు. స్థానిక పశు వైద్యశాల ఆవరణలో సోమవారం కుక్కలకు ర్యాబిస్ నివారణ టీకాలు వేశారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	లోపలికి రా చెప్తా
అంబిక మినీ	తొలిప్రేమ
సాయిబాలాజీ	జురాసిక్ వరల్డ్ రీబర్త్
బాలాజీ	షో టైం
సత్యనారాయణ స్క్రీన్ 1	కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్ 2	మార్గన్
సత్యనారాయణ స్క్రీన్ 3	తమ్ముడు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	కుబేర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	సితారే జమీన్ పర్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	3 బీహెచ్‌కే
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	కుబేర
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	మార్గన్
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	కన్నప్ప
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	కన్నప్ప

మాట్లాడుతున్న రమేశ్

రాజ్యాధికారమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మాదిగలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేశ్ అన్నారు. కండ్రికగూడెం కూడలిలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. మాదిగలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు మద్దాల తిరుపతిరావు, ఏలూరు నగరాధ్యక్షుడు గూడురు రాజేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢ సారె

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: స్థానిక పాత బస్టాండ్ సమీప పాండురంగస్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం విఘ్నేశ్వరపూజ, ఈశ్వరుడికి పంచామృతాలు, ఏకరుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించారు. 108 ముత్తైదువులతో బాలాత్రిపురసుందరీదేవికి ఆషాఢ సారె సమర్పించారు. ఏర్పాట్లను ఈవో సీహెచ్ చిననాగేశ్వరరావు పర్యవేక్షించారు.

పెద్దింట్లమ్మకు అలంకరణ.. ఉంగుటూరు: ఆషాఢ మాసం సందర్భంగా చేబ్రోలులోని పెద్దింట్లమ్మకు గ్రామస్థులు సోమవారం సారె సమర్పించారు. అంతకుముందు మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా ఆలయానికి సారె తీసుకొచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకుడు అప్పారావు పర్యవేక్షించారు.

రామాలయానికి రూ.లక్ష విరాళం.. ఏలూరు నగరం, న్యూస్‌టుడే: స్థానిక కొత్తపేటలోని కోదండ రామాలయంలో ధూప, దీప, నైవేద్యాలకు ఇబ్బందుల్లేకుండా దేశెట్టి శాంసన్ దంపతులు, వారి కుమారులు రూ.లక్ష విరాళం అందజేశారు. వారికి ప్రధాన అర్చకుడు వేదమంత్రాలతో ఆశీర్వాచనాలు అందించారు. దాతలను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: నిడమర్రుకు చెందిన పసుపులేటి శ్రీనివాస్ కుమార్తె జ్యోతికి 2017లో తణుకు మండలం పైడిపర్రుకు చెందిన పంగం అయ్యప్పతో వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.10 లక్షలు, 10 కాసుల బంగారం, రూ.2 లక్షలతో ఇతర లాంఛనాలు కట్నంగా ఇచ్చారు. ఇంకా కట్నం తీసుకురావాలని భర్త, అత్తమామలు సుబ్బలక్ష్మి, హనుమంతు వేధింపులకు గురిచేస్తున్నారు. విసిగిపోయిన వివాహిత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

యువకుడి అదృశ్యం.. నిడమర్రు గ్రామీణం: నిడమర్రుకు చెందిన దూసనపూడి వెంకటేశ్ గత నెల 7న ఉద్యోగ రీత్యా తాడేపల్లిగూడెం వెళ్లారు. అప్పట్నుంచి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఫలితం లేకపోవడంతో అతడి భార్య అనిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

అన్నపై తమ్ముడి దాడి.. ఉంగుటూరు: నల్లజర్ల మండలం సింగరాజుపాలేనికి చెందిన కొఠారు బుల్లిరాజు స్థలంలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారు. టవర్ సామగ్రి వరసకు తమ్ముడైన కొఠారు ప్రదీప్ స్థలంలో వేశారు. ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. సోమవారం ప్రదీప్ తన స్థలంలోని సెల్ టవర్ సామగ్రిని ట్రాక్టర్‌లో వేసుకుని ఉంగుటూరు బయల్దేరారు. విషయం తెలుసుకున్న బుల్లిరాజు ఉంగుటూరు ఎర్ర చెరువు వద్ద ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. అన్నపై తమ్ముడు దాడి చేయడంతో.. బుల్లిరాజుకు గాయాలయ్యాయి. అతడిని స్థానికులు తాడేపల్లిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ.. ఉంగుటూరు: బాదంపూడికి చెందిన ఉండ్రాజవరపు గంగ ఏఎన్ఎంగా పని చేస్తున్నారు. ఈ నెల 5న ఇంటికి తాళం వేసి భర్త మహిపాల్‌తో కలిసి వరంగల్ వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటి తలుపులు తెరచి ఉండటంతో.. సమీప బంధువు ఇసుకపాటి లక్ష్మీకాంతం ఏఎన్ఎంకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వరంగల్ నుంచి హుటాహుటిన ఇంటికొచ్చిన గంగ.. బీరువా తెరచి చూడగా 6 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి గ్లాసు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదుతో చేబ్రోలు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

రాగి తీగ అపహరణ.. ఉంగుటూరు: ఉంగుటూరుకు చెందిన పాతూరి లక్ష్మీమనోహరం తన పొలంలో విద్యుత్తు పరివర్తకం ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పరివర్తకం ధ్వంసం చేసి, రాగి తీగ అపహరించారు. విద్యుత్తు ఏఈ బి.శ్రీరామ్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు పోలీసులు తెలిపారు.

పకడ్బందీగా తల్లిదండ్రుల సమావేశాలు

మాట్లాడుతున్న నరసింహమూర్తి

పెదపాడు, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 10న నిర్వహించనున్న మెగా తల్లిదండ్రుల సమావేశాలను విజయవంతం చేయాలని ఎంఈవో-1 సబ్బితి నరసింహమూర్తి కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. ఎంఈవో-2 రవీంద్ర, సీఎంఆర్‌టీలు తదితరులు పాల్గొన్నారు.

11వ వర్ధంతి

ఆప్యాయతానురాగాలు మాకు పంచి ఇచ్చి మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన మా కుటుంబ మార్గదర్శకులు

కీ॥శే॥ శింగులూరి నాగేంద్రవరప్రసాద్ గారు

మానుండి దూరమై 11 సంవత్సరాలు పూర్తి అయినా వారి జ్ఞాపకాలు ఎప్పటికీ మా మదిలో చిరస్మరణీయం.

కీ॥శే॥ శింగులూరి నాగేంద్రవరప్రసాద్ గారు B.Com.

A.P. గ్రామ పంచాయతీ అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రటరీ

భీమడోలు, నిర్యాణం: 08–07–2014

భార్య: శింగులూరి శ్రీరామతులసి

పెద్ద కుమారుడు- కోడలు:

శింగులూరి G.N.S. చైతన్యకుమార్ - శ్రీమతి అన్నపూర్ణ

M.Sc., Petroleum Exploration B.Com.,

మనుమడు: దుర్గా నాగేంద్రవరప్రసాద్, మనుమరాలు: సౌమ్యశ్రీ

చిన్నకుమారుడు-కోడలు:

శింగులూరి నారాయణ నాయుడు - శ్రీమతి జయశ్రీలలిత

B.Tech. (Civil) B.Tech. (EEE)

మనుమలు: భార్గవ్‌సాయి, జేయాన్ష్‌నాయుడు

5th Birthday

Happy birthday Gayatri

God bless you...

తల్లిదండ్రులు: చోడే రాజేష్ - శ్రీమతి ప్రియాంక

తాతయ్య- అమ్మమ్మ: మాకా M.V.S. సత్యనారాయణ- శ్రీమతి జయలలిత

తాతయ్య- నానమ్మ: చోడే రంగారావు - శ్రీమతి విజయలక్ష్మి

బ్రదర్: కుశాల్

చి॥ చోడే గాయత్రి, ఉంగుటూరు

స్వదేశాగమన శుభాకాంక్షలు

UK పర్యటనను దిగ్విజయంగా ముగించుకుని నేడు నియోజకవర్గానికి విచ్చేయుచున్న ఉంగుటూరు శాసనసభ్యులు

శ్రీ పత్సమట్ల ధర్మరాజు గార్కి స్వదేశాగమన శుభాకాంక్షలు.

గ్రామ పంచాయతీ, రాచూరు

దారపురెడ్డి సీత, సర్పంచ్

నేతల తిరుపతమ్మ, ఉప సర్పంచ్

పాలకవర్గ సభ్యులు, సెక్రటరీ (మరియు) సిబ్బంది

స్వదేశాగమన శుభాకాంక్షలు

UK పర్యటనను దిగ్విజయంగా ముగించుకుని నేడు నియోజకవర్గానికి విచ్చేయుచున్న ఉంగుటూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ప్రియతమ శాసనసభ్యులు

శ్రీ పత్సమట్ల ధర్మరాజు గార్కి

స్వదేశాగమన శుభాకాంక్షలు

చింతలపాటి బాసిరాజు

జనసేన పార్టీ సీనియర్ నాయకులు, పత్తేపురం

నిడమర్రు మండల జనసేన పార్టీ ఇన్‌ఛార్జి

వేగేశ్న లింగమూర్తిరాజు

జనసేన పార్టీ నాయకులు, నారాయణపురం

స్వదేశాగమన శుభాకాంక్షలు

UK పర్యటనను దిగ్విజయంగా ముగించుకుని నేడు నియోజకవర్గానికి విచ్చేయుచున్న ఉంగుటూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ప్రియతమ శాసనసభ్యులు

శ్రీ పత్సమట్ల ధర్మరాజు గార్కి

స్వదేశాగమన శుభాకాంక్షలు

పొత్తూరి కృష్ణంరాజు

AP స్టేట్ క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్

ఉంగుటూరు నియోజకవర్గ జనసేనపార్టీ సీనియర్ నాయకులు

వంగా రఘు

జనసేన పార్టీ సీనియర్ నాయకులు, పెదనింద్రకొలను

గణపవరం మండల జనసేన పార్టీ ఇన్‌ఛార్జి

(c) eenadu

శ్రీవారి పథకాలకు రూ.2 లక్షల విరాళం


విష్ణుకుమార్‌కు నిత్యాన్నదాన పత్రాన్ని అందజేస్తున్న హయగ్రీవాచార్యులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి పథకాలకు రూ.2లక్షల విరాళం సమకూరింది. హనుమాన్ జంక్షన్‌కు చెందిన దేవినేని విష్ణు కుమార్ శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష, కాకినాడకు చెందిన వేగుంట శ్రీలత శ్రీవారి విమాన గోపుర స్వర్ణమయ పథకానికి రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు దాతలను ప్రత్యేకంగా అభినందించి రశీదు పత్రాలు అందజేశారు.

పురపాలక కార్మికుల ధర్నా

కమిషనర్ రమణకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారం కోరుతూ జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులు సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పురపాలక కార్యాలయం ఎదుట ధర్నా చేసి కమిషనర్ రమణకు వినతి పత్రం అందించారు.

అత్యవసరానికి అగచాట్లు

కామవరపుకోట, న్యూస్‌టుడే: మండల కేంద్రం కామవరపుకోట ప్రాథమిక ఆసుపత్రికి 108 వాహనం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ద్వారకాతిరుమల, టి.నర్సాపురం, చింతలపూడి మండలాల నుంచి 108 వాహనం వచ్చేవరకు రోగులు ఎదురు చూడాల్సి వస్తోంది. దాదాపు సంవత్సర కాలంగా అత్యవసర వాహనం అందుబాటులో లేక రోగులు నానా అగచాట్లు పడుతున్నారు. సమీప మండలాల నుంచి వస్తున్న అత్యవసర వాహనంలో ఏలూరు జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లడానికి నిరాకరిస్తున్నారు. జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి మాత్రమే తీసుకెళ్తామని చెబుతున్నారని, కాదంటే రోగిని వదిలేసి వెళ్లి పోతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత కాలం కిందట విషమ పరిస్థితిలో ఉన్న రోగిని మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆసుపత్రికి తరలించేందుకు పీహెచ్‌సీ వైద్యులు 108కి కాల్ చేశారు. సకాలంలో వాహనం రాకపోవటంతో రోగి చనిపోయిన ఘటన జరిగింది. దీంతో రోగి బంధువులు ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని కామవరపుకోట ప్రాథమిక ఆసుపత్రికి ప్రత్యేకంగా 108 వాహనాన్ని కేటాయించాలని ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ప్రగతి పరుగుకు ప్రతిబంధకాలు

కాలం చెల్లిన బృహత్తర ప్రణాళికతో కష్టాలు

చింతలపూడి నగర పంచాయతీ

చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడిలో ఇప్పటికీ 1993లో రూపొందించిన బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) అమల్లో ఉంది. గ్రామ పంచాయతీ నగర పంచాయతీగా ఉన్నతీకరణ జరగడంతో నూతన బృహత్తర ప్రణాళిక రూపకల్పన చేయాల్సి అవసరం ఏర్పడింది. గత మూడు దశాబ్దాల్లో చింతలపూడి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. జనాభా పెరగడంతోపాటు పెద్ద భవనాలు, గృహ సముదాయాల నిర్మాణాలు జరిగాయి. పట్టణ విస్తరణ జరిగి ట్రాఫిక్ సమస్యలు కూడా పెరిగాయి.

పెరుగుతున్న జనాభా... ప్రతి ఇరవై ఏళ్లకు ఒకసారి ఆయా పట్టణాల అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ తయారు చేయాల్సి ఉంటుంది. భవిష్యత్తు అవసరాలు, చేపట్టబోయే ప్రాజెక్టులను దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక రూపొందిస్తారు. 1993లో అప్పటి అవసరాలకు అనుగుణంగా దానిని తయారు చేశారు. ప్రస్తుతం చింతలపూడి నగర పంచాయతీలో 35 వేల జనాభా ఉన్నారు. చిన్న పాటి వర్షం కురిస్తే డ్రెయిన్లు పొర్లుతున్నాయి. రహదారులు ఇరుకుగా మారడంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగాయి. నగర పంచాయతీ పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లు, బహుళ అంతస్తుల భవనాలు, వ్యాపార సముదాయాలు మాస్టర్ ప్లాన్ అనుగుణంగానే చేపట్టాల్సి ఉన్నా సక్రమంగా జరగడం లేదు. ఉదాహరణకు బోయగూడెం, కొత్త బస్టాండు, మారుతీనగర్‌లు ఇండస్ట్రియల్ జోన్‌లో ఉండటంతో ఈ ప్రాంతంలో చేపట్టిన నిర్మాణాలకు అనుమతులు రావడం లేదు. నూతన మాస్టర్ ప్లాన్ రూపొందిస్తే ఈ ప్రాంతాల్లో నిర్మించిన గృహాలను రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చేందుకు పట్టణ ప్రణాళిక అధికారులకు అవకాశం ఉంటుంది.

నూతన మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు సంబంధించిన దస్త్రాలను ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, డీటీసీపీలకు పంపించినట్లు నగర పంచాయతీ కమిషనర్ అంబటి రాంబాబు తెలిపారు.

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..

జంగారెడ్డిగూడెం	: 80085 74478
కొయ్యలగూడెం	: 80085 74947
చింతలపూడి	: 76759 19086

పోలవరం, న్యూస్‌టుడే: ? పట్టిసీమ గ్రామంలో పూర్వపు రోడ్డు భవనాల శాఖ రహదారి అధ్వానంగా మారింది. దారి నిరుపయోగంగా మారడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **-ఎన్.వెంకటేశ్వరరావు, పట్టిసీమ**

✔ రోడ్డుకు ఇరువైపులా మెరక చేయడంతో మధ్యలో నీరు నిలిచి పోతుంది. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- యు.రాజారావు, పంచాయతీ కార్యదర్శి, పట్టిసీమ

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ? బూసరాజుపల్లిలో జంగారెడ్డిగూడెం వెళ్లే మార్గాన చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువపై ఉన్న వంతెన మీద వర్షపు నీరు నిలిచిపోయి వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. **-వాహన చోదకులు**

✔ సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటాం.
- కుంజా జ్యోతి, ఎంపీడీవో, బుట్టాయగూడెం

నేడు విర్డ్ ఆసుపత్రికి సెలవు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రికి ఈ నెల 8న సెలవు ప్రకటించినట్లు విర్డ్ ట్రస్ట్ ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువైన రాజు వేగేశ్న ఫౌండేషన్ సంచాలకుడు వేగేశ్న ఆనందరాజు విశాఖపట్నంలో ఆదివారం కన్ను మూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. విర్డ్ ఆసుపత్రి నిర్మాణంలో కీలక భూమిక వహించారన్నారు. శ్రీవారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం కోట్లాది రూపాయిలు వెచ్చించి మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారని చెప్పారు. ఆయన మృతికి సంతాప సూచికంగా విర్డ్ ఆసుపత్రిలో మంగళవారం సంతాప సభ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆనందరాజు మృతికి చిన వేంకన్న ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి, ఆసుపత్రి ట్రస్టీలు ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణమూర్తి, ఎం.గుప్త, వంశీ, వైద్యులు భవ్యచంద్ బాలాజీ, అమీద్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

లక్కవరం పంచాయతీ కార్యదర్శిగా కొండలరావు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం పంచాయతీ కార్యదర్శిగా వై.కొండలరావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన విధుల్లో చేరారు. పోలవరం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ బొర్రంపాలెం పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు.

తరగతులు పునరుద్ధరించాలని వినతి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న 6, 7, 8 తరగతులను తొలగించడం సరికాదని, తిరిగి పునరుద్ధరించాలని వైకాపా నాయకులు ఎంఈవో పరసా వెంకట్రావుకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు.

సంక్షేమ పథకాలతో పేదలకు వెన్నుదన్ను

దొరమామిడిలో వివరిస్తున్న శ్రీనివాసులు, నాయకులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాల అమలుతో పేదలకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని ట్రైకార్ ఛైర్మన్, తెదేపా నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. దొరమామిడిలో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలను అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు మొగపర్తి సోంబాబు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాకర్ల సురేశ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా తెదేపా పాలన సాగిస్తోందని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెంలో మండల తెదేపా అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కరపత్రాలను పంచారు.

ఇరుకు గదిలో మగ్గిపోతున్న బాల్యం

చిన్న గదిలోనే పిల్లల చదువులు, కేంద్రానికి వచ్చే సామగ్రి

పోలవరం, న్యూస్‌టుడే: నాడు-నేడు రెండో దశలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. పోలవరం మండలం పట్టిసీమ గ్రామంలోని 45వ అంగన్‌వాడీ భవనం పనులు నేటికీ పూర్తి కాకపోవడంతో అద్దె భవనంలో ఇరుకు గదిలో పిల్లలు కాలం వెల్లదీస్తున్నారు. అప్పట్లో ఈ భవనం నిర్మించడానికి స్థలం దొరక్క పెద్ద తంతే నడిచింది. ఎట్టకేలకు పూర్వం ఏటిగట్టు వెంబడి ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిర్మించేందుకు రూ.16 లక్షలతో పనులు ప్రారంభించారు. ప్లాస్టింగ్, ఫ్లోరింగులు చేసి గుమ్మాలు, కిటికీలు బిగించి రంగులు వేయిస్తే అద్దె భవనంలోంచి పిల్లలు బయటపడే పరిస్థితి ఉంది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రంలో పది మంది పిల్లలున్నారు. వారంతా నిత్యం వస్తే అందులో కూర్చోవడానికి ఇబ్బందే. పిల్లల కోసం వచ్చే సరకులన్నీ అదే గదిలో ఉంచారు. బయట పిల్లలు ఆడుకోవడానికి అనువుగా లేదు. ఈ ప్రభుత్వ హయాంలోనైనా భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణిని సంప్రదించగా బడ్జెట్ వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఇంజినీర్లు చెబుతున్నారని వెల్లడించారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మీ కోసంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వి.రమణ అన్నారు. సోమవారం జరిగిన మీ కోసంలో ప్రజల నుంచి ఆర్డీవో ఎంవీ రమణ అర్జీలు స్వీకరించారు. 12 అర్జీలు అందాయి. పంగిడి గూడెంలో రహదారి వెంబడి ప్రభుత్వం నాటిన చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని బేతాళ ఆశోక్ ఫిర్యాదు చేశారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని 20 వార్డులో డ్రెయిన్, రహదారి సదుపాయం కల్పించాలని సంగదాల సరోజిని అర్జీ ఇచ్చారు. మంగిసెట్టివారిపేటలో పంట చేలకు దారి సదుపాయం కల్పించాలని బందారు సత్యనారాయణ దరఖాస్తు చేశారు. తన పేరున ఉన్న రెండెకరాల భూమిని మరో వ్యక్తి తన పేరున మార్చుకున్నారని చేబత్తుల గోపాలం ఫిర్యాదు చేశారు. తల్లికి వందనం పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని బి.బాలరాజు తదితరులు ఫిర్యాదు చేశారు. వేగవరంలో ఇళ్ల మధ్య ప్రార్థనా మందిరం కట్టి బోరు వేస్తున్నారని, దానికి అనుమతులు రద్దు చేయాలని అదే గ్రామానికి చెందిన బి.శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వీఆర్‌ఏలకు కనీస వేతనం ఇవ్వాలని వినతి

కుక్కునూరు, న్యూస్‌టుడే: వీఆర్‌ఏలకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ కోరింది. సోమవారం కుక్కునూరులో ప్రదర్శన నిర్వహించి, అనంతరం తహసీల్దార్ రమేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 9న జరిగే సమ్మెలో పాల్గొంటున్నట్లు వినతి పత్రంలో తహసీల్దార్‌కు వీఆర్‌ఏలు తెలియజేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరారు. ప్రమాదంలో మరణించిన వీఆర్‌ఏ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి సాయికిరణ్, వీఆర్‌ఏ సంఘం నాయకులు వెంకన్న బాబు, మోహనరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

126వ కి.మీ.కు చేరిన గోదారమ్మ

పోలవరం, న్యూస్‌టుడే: మండలంలోని పట్టిసీమ వద్ద గోదావరిపై నిర్మించిన పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కుడి కాలువలోకి విడుదల చేసిన నీరు 126వ కి.మీ.కు చేరినట్లు జల వనరుల శాఖాధికారులు తెలిపారు. ఈ నెల 3న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎత్తిపోతల పథకంలోని పంపులు ప్రారంభించారు. ఐదు రోజులుగా సాగుతున్న ప్రవాహం హనుమాన్ జంక్షన్ చేరువకు అధికారులు పేర్కొన్నారు. సోమవారం 16 పంపుల ద్వారా 5,600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని గోదావరిలో నీటి మట్టం 16.07 మీటర్లు ఉన్నట్లు పర్యవేక్షణ డీఈ సురేష్ చెప్పారు.

అధ్వానం.. అవస్థలమయం..

శిథిలమైన గ్రామీణ రహదారులు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. భారీ గోతులు పడి, రాళ్లు తేలి ప్రయాణం సాగించేందుకు వీలు లేకుండా ఉన్నాయి. ఇటుగా ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేత పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. భారీ వాహనాలు వెళ్తుంటే పెద్ద మొత్తంలో దుమ్ము లేచిపోతుంది. రోడ్డుకు ఇరువైపులా ఉండే ఇళ్లు, దుకాణదారులు దుమ్ముధూళికి శ్వాసకోశ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పల్లె దారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే మండలంలోని పలు ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తారని ఆయా గ్రామాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఏళ్లు గడుస్తున్నా.. జంగారెడ్డిగూడెం బైపాస్ నుండి మైసన్నగూడెం మీదుగా ములగలంపల్లి వెళ్లే రహదారిని నిర్మించే సమయంలో రెండేళ్ల క్రితం కంకర పరిచారు. కొద్ది రోజులు పనులు సాగిన అనంతరం నిలిచిపోయాయి. జంగారెడ్డిగూడెం నుంచి గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది మంది ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. దారిపొడవునా రాళ్లు లేచిపోయి ఉండడంతోపాటు రాత్రిళ్లు వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం నుంచి అక్కంపేట గ్రామానికి వెళ్లే రహదారి కూడా దారుణంగా ఉంది. కంకరపోసి ఏళ్లు గడుస్తున్నా పని మాత్రం ముందుకు సాగడం లేదు. ఆ గ్రామానికి వెళ్లేందుకు ఏకైక మార్గం కావడంతో గ్రామస్థులు నకరం చూస్తున్నారు.

జంగారెడ్డిగూడెం బైపాస్ నుంచి మైసన్నగూడెం వెళ్లే రోడ్డు రాళ్లు లేచిపోయి ఇలా..

నిధులు మంజూరు కావాలి.. 'జంగారెడ్డిగూడెం-ములగలంపల్లి, శ్రీనివాసపురం- అక్కంపేట గ్రామాలకు వెళ్లే రహదారుల పనులు గతంలో ప్రారంభమయ్యాయి. అయితే గుత్తేదారుకు బకాయిలు చెల్లించాలి. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం..' అని పంచాయతీరాజ్ ఏఈ అంకిరెడ్డి తెలిపారు.

నిత్యం నీటిలోనే నడక

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు నిత్యం నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం కురిస్తే రోజుల తరబడి ఆ మార్గంలో నీరు నిలిచి అధ్వానంగా మారుతుంది. నీళ్లలోంచే పిల్లలు పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. సమస్యను పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మట్టి టిప్పర్లు తిరగడంతో రహదారిపై మట్టి పడి సీసీ రోడ్డు కాస్తా బురదమయంగా మారిందన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజారావును సంప్రదించగా మట్టి తొలగించడంతో పాటు రహదారిపై నిలిచిన నీటిని తొలగిస్తామన్నారు.

పట్టిసీమ: జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో ఇలా..

కదలని మురుగు.. వదలని కంపు..

పోలవరం, న్యూస్‌టుడే: డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగు బయటకు వెళ్లడం లేదని గూటాల-2 పంచాయతీలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని జంగావారి తోటకు వెళ్లే మార్గంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆనుకుని మురుగు నిలిచి పోతుందన్నారు. ఇదే పరిస్థితి సబ్ సెంటర్ వద్ద నెలకొందని, ప్రధాన రహదారి వెంబడి మురుగు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. వర్షం కురిస్తే దాక్టర్‌గారి వీధి, ప్రధాన రహదారి జలమయం అవుతున్నాయి. మండల అధికారుల వద్దకు వెళ్లి ఆందోళన చేస్తే ఎంపీడీవో శ్రీనివాసబాబు పొక్లెయిన్ ఏర్పాటు చేయించి కచ్చా డ్రెయిన్ పూడిక తీయించడంతో నీరు కాస్తా తగ్గిందన్నారు. ఈ దుర్గంధం నుంచి విముక్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. డిప్యూటీ ఎంపీడీవో రాజారావును సంప్రదించగా గ్రామంలో పక్కా డ్రెయిన్ నిర్మించాల్సి ఉందని నిధులు లభ్యత బట్టి పనులు చేపడతామని చెప్పారు.

కొత్తపట్టిసీమలో పూడిక తీత పనులు

దాడిని నిరసిస్తూ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకుడు తలారి ప్రకాశ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ఆ సంఘం నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు సాలి రాజశేఖర్ మాట్లాడుతూ కామవరపుకోటలో కొందరు వ్యక్తులు ప్రకాశ్‌పై ఉద్దేశపూర్వకంగా దాడి చేశారన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి తగిన న్యాయం చేయాలని రాజశేఖర్ డిమాండు చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో ఎం.వి.రమణకు అందజేశారు.

పశుగ్రాస వారోత్సవాలు ప్రారంభం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పశుపోషకులు, రైతులు పశు సంవర్ధకశాఖ సేవలను ఉపయోగించుకోవాలని ఎంపీపీ గంజిమాల రామారావు సూచించారు. కొయ్యలగూడెం పశువైద్యశాల వద్ద పశుగ్రాస వారోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. పశువైద్యాధికారి శ్రీనివాసన్ మాట్లాడుతూ పశుగ్రాసం పెంచడానికి రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

'మందకృష్ణ అలుపెరుగని పోరాట యోధుడు'


పి.అంకంపాలెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే బాలరాజు

చింతలపూడిలో..

బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం గ్రామీణ, చింతలపూడి, టి.నర్సాపురం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ అలుపెరుగని పోరాట యోధుడని భాజపా నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ అన్నారు. బుట్టాయగూడెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ, మందకృష్ణ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించి, కేక్ కోసి పంచారు. నెహ్రూబొమ్మ కూడలి వరకు ప్రధాన రహదారులపై ప్రదర్శన చేశారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ బొబ్బర ఎలీషా, సీనియర్ నాయకుడు చిడిపి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు. పి.అంకంపాలెంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కోసి పంచారు. అనంతరం ఎమ్మెల్యేను నాయకులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కొయ్యలగూడెంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు ముప్పిడి చినబాబు ఆధ్వర్యంలో బాబూజగ్జీవన్‌రాం, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పేదల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు ఎమ్మార్పీఎస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు విస్సంపల్లి సిద్ధామాదిగ అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం, నాగులగూడెం గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను పలువురు నాయకులు ఎగరవేశారు.

చింతలపూడి, లింగపాలెం, న్యూస్‌టుడే: చింతలపూడిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు పట్టణంలో ద్విచక్ర వాహనాలతో భారీ ప్రదర్శన చేశారు. అగ్నిమాపక కేంద్రం కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి తదితరులు మాట్లాడారు. సమావేశం అనంతరం కేక్ కోసి అందరికీ పంచారు. బంధంచర్లలోని బాబూజగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు సిద్ధామాదిగ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం, కొత్తపల్లి, వేములపల్లి, రంగాపురం తదితర గ్రామాల్లో జెండా ఎగురవేసి, మిఠాయిలు పంపిణీ చేశారు.

మెరుగైన బోధన అందించాలి : పీవో

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఒప్పంద ఉపాధ్యాయులు మెరుగైన బోధన అందించి గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ కోరారు. ఈ విద్యా సంవత్సరంలో పునరుద్ధరించిన (రెన్యువల్) ఒప్పంద ఉపాధ్యాయులకు (సీఆర్టీ) పాఠశాలల్లో కేటాయింపు స్థానాలకు సంబంధించిన ఉత్తర్వులను సోమవారం కేఆర్‌పురంలో అందజేశారు. స్కూల్ అసిస్టెంట్లుగా ఏడుగురికి, ఎస్జీటీలుగా 87 మందికి సీఆర్టీలుగా ఉత్తర్వులు ఇచ్చినట్లు గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి డీడీ ఎన్.శ్రీవిద్య తెలిపారు.

మీకోసంలో ఫిర్యాదులు

కామవరపుకోట, న్యూస్‌టుడే: కామవరపుకోట, ఉప్పలపాడు పంచాయతీల్లో పారిశుద్ధ్య పరిస్థితులు చక్కదిద్దాలంటూ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మీకోసంలో పలువురు ఫిర్యాదు చేశారు. స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లో రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీల కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని విన్నవించారు.

పాఠశాలలకు సామగ్రి అందజేత

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు, ప్రాథమిక పాఠశాలకు హడ్కో కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా రూ.లక్ష విలువైన సామగ్రిని సంస్థ ప్రతినిధులు సోమవారం అందజేశారు. 12 కుర్చీలు, 12 టేబుల్స్, 8 సీలింగ్ ఫ్యాన్లు ఇచ్చారు. వీటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం అందజేశారు.

దశలవారీగా హామీల అమలు: గన్ని

నిడమర్రు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తోందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా పెదనిండ్రకొలనులో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏడాది కాలంలోనే సుమారు 70 శాతానికి పైగా హామీలకు కార్యరూపం ఇచ్చామని చెప్పారు. రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు తగదు

జంగారెడ్డిగూడెం: సమావేశంలో తెదేపా నాయకులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెదేపా సీనియర్ నాయకులు చెరుకూరి శ్రీధర్, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్ తెలిపారు. కొన్ని ప్రసార మాధ్యమాల్లో ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణ తెదేపా కార్యాలయం వద్ద సోమవారం పార్టీ సీనియర్ నాయకులు పలువురు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడారు. ఆరోపణలను తామంతా ముక్త కంఠంతో ఖండిస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ నాయకులు పెనుమర్తి రామ్‌కుమార్, పగడం సౌభాగ్యవతి, కరుటూరి రమాదేవి, నంబూరి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌పై కొంత మంది కావాలని అసత్య ఆరోపణలు చేయటం తగదని మండల తెదేపా నాయకులు ఏలూరి హరి, కోనేరు వెంకటసుబ్బారావులు ఖండించారు. ఈ మేరకు సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

పీర్ల పండగకు వెళ్తూ.. అనంత లోకాలకు..

ప్రకాశ్ (పాత చిత్రం)

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: పీర్ల పండగకు వెళ్తూ ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం వేలేరుపాడు విద్యుత్తు ఉప కేంద్రం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. రామవరానికి చెందిన మడకం ప్రకాశ్(25) కన్నాయిగుట్టలో జరుగుతున్న పీర్ల పండగకు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో తలకి బలమైన గాయమైంది. స్థానికులు జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఇతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు.

సారా స్థావరాలపై దాడులు

కుక్కునూరు, న్యూస్‌టుడే: సీతారామనగరం సమీప అడవుల్లో నిర్వహిస్తున్న నాటు సారా స్థావరాలపై సోమవారం ఎక్సైజ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 600 లీటర్ల పులిసిన బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. స్థావరాల నిర్వాహకుల గురించి ఆరా తీస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీధర, వేలేరు, మారేడుబాక గ్రామాల్లో సారా తయారు చేస్తే ఎదుర్కోవాల్సిన క్రిమినల్ కేసులను వివరించారు. ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు, కుక్కునూరు సీఐ రమేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

(c) eenadu

నూజివీడు

•నూజివీడు •కైకలూరు

చాట్రాయి తహసీల్దారుగా నాయక్

చాట్రాయి, న్యూస్‌టుడే: నూజివీడు తహసీల్దారు బద్రూ నాయక్‌ను చాట్రాయి మండలానికి అదనపు విధులపై సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ నియమించారు. ఇక్కడ పని చేస్తున్న ఈశ్వరరావు తిరిగి ఉప తహసీల్దారుగా చాట్రాయిలోనే పని చేయనున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నలుగురు కార్యదర్శుల రాక

చాట్రాయి: మండలానికి నలుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వచ్చారని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. పరసపల్లి నుంచి చనుబండ-2కు పి.వెంకటవీరరాజు, పటమటపాలెం నుంచి మర్లపాలెంకు శివ నాగరాజు, ఏ. కొండూరు మండలం గొల్లమండల నుంచి నరసింహారావుపాలెంకు కోటేశ్వరరావు, నూజివీడు మండలం సిద్ధార్థనగర్ నుంచి కృష్ణారావుపాలెంకు సాయి కుమార్‌లను నియమించారు.

వరి పొలాన్ని పరిశీలిస్తున్న శివశంకర్

ఎరువుల సమతుల్యంతోనే దిగుబడులు

చాట్రాయి, న్యూస్‌టుడే: వరి సాగులో ఎరువుల వినియోగంలో సమతుల్యం పాటించకపోతే చీడపీడల బెడద పెరిగి దిగుబడులు తగ్గుతాయని వ్యవసాయాధికారి బండారు శివశంకర్ తెలిపారు. చాట్రాయిలో వరి పైరును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరం మేరకు నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువులను వాడాలని సూచించారు. తెలుగు రైతు కార్యదర్శి కంచర్ల హనుమంతు, రైతులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	కైకలూరు	:73060 88555
ముసునూరు	:93983 81268	కలిదిండి	:90594 84862

కైకలూరు, న్యూస్‌టుడే: ? కైకలూరు 14వ వార్డులో కొన్ని రోజులుగా చెత్త సేకరణ సక్రమంగా చేయడం లేదు. వ్యర్థాల గుట్టలుగా పేరుకుపోయాయి. - గురునాథం, (గ్రామస్థుడు)

✔ చెత్త వ్యర్థాలను వెంటనే తొలగిస్తాం. - వై.ప్రసాద్, పంచాయతీ ఈవో

కరపత్రం అందజేస్తున్న నాయకులు

పదేళ్లుగా కష్టాలే!

ఉప్పుటేరు తీరంలో అధ్వానంగా రోడ్లు

కలిదిండి, న్యూస్‌టుడే: ఉప్పుటేరు తీరంలోని రహదారులు అధ్వానంగా మారాయి. రోజుకో భారీ వాహనం గుంతల్లో దిగబడిపోతోంది. దిగబడుతుండగా వాహనాలు వెళ్లాయి. చోదకులు హమ్మయ్యా అనుకుంటూ ఊపిరి పీల్చుకుంటారు. ఏళ్ల తరబడి ఓ మోస్తరు అభివృద్ధి కూడా నోచుకోని ఉప్పుటేరు గ్రామాలకు గుంతల రోడ్లు శాపంగా మారాయి. పదేళ్లుగా ప్రయాణ కష్టాలకు తెర పడటం లేదు.

★ కలిదిండి మండలంలో గుర్వాయిపాలెం, సంతోషపురం, భాస్కరరావుపేట, మూలలంక, పెదలంక, మట్టగుంట, కొండంగి, చినతాడినాడ, తాడినాడ, పోతుమర్రు గ్రామాలు ఉప్పుటేరుకు ఆనుకుని ఉన్నాయి. గుర్వాయిపాలెం నుంచి సంతోషపురం వయా భాస్కరరావుపేట వరకు రోడ్డును ఇటీవల ఓ మోస్తరుగా మరమ్మతులు చేశారు. మూలలంక నుంచి పెదలంక వరకు 4 కి.మీ. పూర్తిగా గుంతలమయంగా మారింది. కొద్దిపాటి వర్షానికి కూడా ఈ రహదారులపై ప్రయాణం ప్రాణసంకటమే. రోజుకో వాహనం గుంతలో దిగబడిపోతోంది. ద్విచక్ర వాహన చోదకులు ఆసుపత్రి పాలవుతున్నారు. కలిదిండి నుంచి పోతుమర్రు, తాడినాడ నుంచి చినతాడినాడ వెళ్లే రహదారుల పరిస్థితి ఇదే విధంగా ఉంది.

మూలలంక - పెదలంక మార్గంలో గుంతలో కూరుకుపోయిన లారీ

మూడుసార్లు జారిపడ్డా..

మూలలంక- పెదలంక మార్గం అడుగడుగునా గుంతలు పడ్డాయి. నిత్యం ఏదో ఒక పని మీద కలిదిండి వెళ్లాల్సి వస్తోంది. ఈ ఏడాదిలో నేను మూడు సార్లు ద్విచక్ర వాహనంపై నుంచి పడ్డాను. మున్ముందు ఇంకెన్నిసార్లు పడాల్సి వస్తోందనని మూలలంకకు చెందిన శేషపు మహాకాళీరావు ఆందోళన వ్యక్తం చేశారు.

రూ.4 కోట్లు మంజూరు

మూలలంక- పెదలంక మార్గంలో 5 కి.మీ. మేర రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు, చినతాడినాడ నుంచి తాడినాడ వరకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే రోడ్ల నిర్మాణం చేపడతాం. మిగిలిన రోడ్లకు సంబంధించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం' అని ఆర్ అండ్‌బీ డీఈ అనిల్‌కుమార్ తెలిపారు.

సారె తీసుకొస్తున్న మహిళలు

శాకంబరిగా వాసవీ కన్యకాపరమేశ్వరీ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లిలోని దాసాంజనేయస్వామి ఆలయంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు సోమవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, ఫలాలతో అలంకరించారు. అంతకుముందు ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి ఊరేగింపుగా ఆషాఢ సారెను తీసుకొచ్చి సమర్పించారు. పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. వాసవీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వత్తుమిల్లి ప్రసాద్, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో విప్లవాత్మక మార్పులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదకొండేళ్ల పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి కోటిపల్లి కృష్ణ అన్నారు. సోమవారం ఆపార్టీ మండలాధ్యక్షుడు సత్యవోలు నాగలక్ష్మి ఆధ్వర్యంలో ముదినేపల్లిలో గృహసంపర్క్, ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు వత్తుమిల్లి ప్రసాద్, నీలం మల్లేశ్వరరావు, కొల్లిపర నాగరాజు, నర్సిరెడ్డి వెంకన్న, కొత్తపల్లి వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

కుళాయి కనెక్షన్లు మంజూరు చేయరా?

గ్రామ సభలో ప్రజల ఆగ్రహం

ఈవోకు సమస్య వివరిస్తున్న గ్రామస్థులు

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక నాగేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సర్పంచి ఎం.యూన్సీ ఆధ్వర్యంలో ఈవో గిరిజ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఇంటింటికి కుళాయి అందించేందుకు నాలుగున్నరేళ్ల కిందట జల జీవన్ మిషన్ పథకంలో రూ.75 లక్షలు మంజూరు చేసినా.. నేటికీ ఒక కుళాయి కనెక్షన్ కూడా మంజూరు చేయలేదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యుడు తెంటు అప్పారావు ప్రశ్నించారు. పలు కాలనీల్లో డ్రెయినేజీల ఏర్పాటు, పంచాయతీ స్థలాల ఆక్రమణ, ఇంటి పన్ను విధింపులో వ్యత్యాసాలు, అనుమతి లేని ప్రదేశాల్లో పంచాయతీ కుళాయిల మంజూరు వంటి అంశాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేసి, పంచాయతీ కుళాయిల మంజూరును పరిశీలిస్తానని ఈవో గిరిజ గ్రామస్థులకు తెలియజేశారు. గ్రామ రెవెన్యూ అధికారి శ్యామల రావు, కూటమి నేత సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మా మొర ఆలకించండి.. పరిష్కరించండి

'మీ కోసం'లో వినతుల వెల్లువ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు సబ్‌కలెక్టరు కార్యాలయంలో సోమవారం సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం)కు వినతులు వెల్లువలా వచ్చాయి. మొత్తం 25 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పలు శాఖల అధికారులు సమయ పాలన పాటించకపోవడంతో సబ్‌కలెక్టరు వారిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పునరావృతమైతే చర్యలకు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు. అనంతరం పలువురు వద్ద ఫిర్యాదులు స్వీకరించి అక్కడికక్కడే సంబంధిత అధికారులకు అందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అధికారులకు సూచనలిస్తున్న స్మరణ్‌రాజ్

★ చాట్రాయి మండలం చనుబండ గ్రామంలో సర్వే నం.123లో 1.81 ఎకరాల భూమి దేవాదాయ శాఖ భూముల్లో నమోదైన కారణంగా రిజిస్ట్రేషన్ నిలిచిపోయిందని, చాట్రాయి తహసీల్దారు పట్టించుకోవడం లేదని చెరుకు హీరేన్ ముఖర్జీ వినతి పత్రం అందించారు.

★ తనకు దస్తావేజుల ప్రకారం 1.11 ఎకరాలు ఉండగా ఆన్‌లైన్లో 90 సెంట్లు మాత్రమే చూపిస్తోందని, సర్వేయర్లకు అర్జీలు దాఖలు చేసినా పట్టించుకోలేదని ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన వి.సాయి శేఖర్ పేర్కొన్నారు.

★ నా ఇద్దరు పిల్లలు రెండు, అయిదో తరగతులు చదువుతున్నారు. కానీ నాకు తల్లికి వందనం కింద నగదు జమకాలేదని నూజివీడుకు చెందిన షేక్ ఖతీజా ఆవేదన వ్యక్తం చేశారు.

★ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనులు చేసి 3 నెలలు గడిచినా వేతనాల సొమ్ము ఇంకా అందలేదని సుంకొల్లు, యనమదల గ్రామస్థులు వాపోయారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: మాదిగల అభ్యున్నతే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్‌ను మందకృష్ణ మాదిగ స్థాపించారని నాయకులు తెలిపారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి ఆగిరిపల్లిలో కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చవటపల్లి విక్టర్‌బాబు, బొబ్బర్ల సురేశ్, సాల్మన్ చంటి, కె.ప్రదీప్, నరేశ్, సురేశ్, నాని తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి, న్యూస్‌టుడే: ఐక్యతతోనే మాదిగ జాతికి కల్పించిన హక్కులను సంరక్షించు కోవచ్చని ఎమ్మార్పీఎస్ నాయకులు కొప్పుల ప్రసాద్ తెలిపారు. చాట్రాయి, సి.గుడిపాడు గ్రామాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందా కృష్ణ మాదిగ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గార్లపాటి మారేష్, విస్సంపల్లి సీతయ్య, మొలుగుమాటి రవిబాబు, గార్లపాటి మారేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

కైకలూరు, ముదినేపల్లి, ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: జగన్ పాలనలో నాశనమైన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం ఎలా అమలు చేస్తుందో వైకాపా నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పీజేఎస్ మాల్యాద్రి, తెదేపా మండలాధ్యక్షుడు పి.త్రినాథరాజు అన్నారు. బూత్ కన్వీనర్ సాబేరా బేగం ఆధ్వర్యంలో సోమవారం కైకలూరు పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ జానీ తదితరులు పాల్గొన్నారు. ★ ముదినేపల్లి మండలం దేవపూడి, వణుదుర్రు, చేవూరు, ప్రొద్దువాకలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఏడాదిలో చేసిన పనులు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తెదేపా మండలాధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి, నాయకులు బొర్రా చలమయ్య, ఈడుపుగంటి శ్రీనివాస్, దావు నాగరాజు, బొంగు రవి కుమార్, యర్రా రాంబాబు తదితరులు పాల్గొన్నారు. వడాలి 82వ బూత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పాల్గొన్నారు. ★ ఆగిరిపల్లి మండలం బొద్దనపల్లి, శోభనాపురం గ్రామాల్లో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు పాల్గొన్నారు. నాయకులు నలజాల హరిబాబు, దాసరి సాయిరామ్, పామర్తి ఆంజనేయులు, ఉప్పు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవపూడి: కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

శోభనాపురంలో...

పశుగ్రాసం సాగుపై అవగాహన

మండవల్లి, న్యూస్‌టుడే: దాణా ఖర్చులను తగ్గించి పాడి పరిశ్రమను లాభదాయకంగా మార్చుకోవాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డీవీ వరప్రసాద్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం మండవల్లిలో పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఆధునిక పద్ధతుల్లో పశుగ్రాస పంటల సాగు, సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పశువులకు ఎండుగడ్డి మాత్రమే వేస్తే వాటికి కావాల్సిన పోషకాలు అందవన్నారు. రోజుకు ఒక గేదెకు 35- 45 కిలోలు, గొర్రెలకు 4-7 కిలోల పచ్చిమేత అవసరమన్నారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	**తమ్ముడు**
సత్యనారాయణ మినీ	**సోలో బాయ్**
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	**జురాసిక్ వరల్డ్ రీబర్త్**
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	**కుబేర**
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	**కన్నప్ప**
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	**తమ్ముడు**
కైకలూరు: విజయలక్ష్మి జీ3	**తమ్ముడు**
మాగంటి సినిమాస్	**మార్గన్**
శ్రీవెంకటరమణ సినిమాస్	**జురాసిక్ వరల్డ్ రీబర్త్**
ముదినేపల్లి: పూర్ణిమ	**తమ్ముడు**

కైకలూరు: గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, నాయకులు

సమ్మె విజయవంతానికి పిలుపు

నూజివీడు రూరల్ , న్యూస్‌టుడే: జులై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు కోరారు. మండలంలోని తుక్కులూరులో కోరమండల్ పెయింట్స్ కార్మికులతో సోమవారం ఆయన సమావేశమై పలు అంశాలపై చర్చించారు. నాయకులు బలరామ్, శ్రీనివాసరావు, విజయ్, నరసింహమూర్తి, కృష్ణ, అచ్యుత్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలు, లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. కార్మిక సంఘాలు ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం స్థానిక ఉర్దూ పాఠశాల ప్రాంగణంలో సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులతో కలిసి గోడ పత్రాలను ఆవిష్కరించారు. పలు సంఘాల నాయకులు నాని, అనిల్, శివ, రమేష్, శామ్యూల్ రాజు, గంగాజలం, లీల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సాయం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పెదపాలపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలకు తెలుగు ఉపాధ్యాయిని బి.శిరీషకుమారి కుటుంబ సభ్యులు ప్రతాప్, బిందు దంపతులు సుమారు రూ.20 వేల విలువ చేసే కంప్యూటర్ బహూకరించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎన్.లక్ష్మీరాజేశ్వరికి అందించారు. పెనుమల్లి శివారు సింగారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సీనియర్ తెదేపా నాయకులు బొర్రా చలమయ్య ఆర్థిక సహాయంతో రాత పుస్తకాలు, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. తెదేపా మండలాధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల ఆక్రమణలు తొలగించాలని ధర్నా

చాట్రాయి, న్యూస్‌టుడే: అటవీ భూములను రెవెన్యూ, అటవీ శాఖలు ఉమ్మడి సర్వే చేసి ఆక్రమణలను వెంటనే తొలగించాలని సీపీఐఎంఎల్-లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్ డిమాండ్ చేశారు. చాట్రాయి రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం ఆయన ఆధ్వర్యంలో పేదలు ధర్నా చేసి తహసీల్దారు ఈశ్వరరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా హరనాథ్ మాట్లాడుతూ చిత్తపూరు, మర్రిబంధం, ఆరుగొలనపేట, చీపురుగూడెం, పోలవరం, పర్వతాపురం గ్రామాల పరిధిలో అటవీ భూములను భూస్వాములు ఆక్రమించారని తెలిపారు. వీటిని సర్వే చేసి పేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జులై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ధర్నాలో జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, నాయకులు వేముల బక్కయ్య, చాట్ల బాబూరావు, భవాని, హెచ్చు రాజేంద్రప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

☛ ఇటీవల విజయవాడ, నున్న గ్రామాలకు చెందిన యువకులు తలసిల కృష్ణ చైతన్య(24), శెట్టి సాయికుమార్ (24) ఆగిరిపల్లి మండలం కనసానపల్లి వెళ్లారు. అక్కడ స్నేహితులతో ఆనందంగా గడిపి తిరిగి ఇంటికెళ్తున్న క్రమంలో కనసానపల్లి-నెక్కలం గొల్లగూడెం రహదారిలో వాహనం అదుపుతప్పి కనిపించని నేలబావిలో పడిపోయారు. వారిద్దరి తలలకు తీవ్ర గాయాలు కావడంతో మరణించారు. శిరస్త్రాణం ఉంటే కనీసం ప్రాణాలు దక్కేవి.

☛ ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంకు చెందిన ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి మచ్చా పవన్ వెంకట సాయి జస్వంత్ (19) ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో నూజివీడు- విజయవాడ ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో మరణించారు.

శిరస్త్రాణంతో ప్రాణాలకు రక్ష..!

నూజివీడు, న్యూస్‌టుడే: నిత్యం జరుగుతున్న రహదారి ప్రమాదాల్లో చాలా మంది గాయపడుతుండగా కొందరు మృత్యువాత పడుతున్నారు. వీరిలో తలకు బలమైన గాయాలు కావడంతో మృతి చెందినవారే అధికంగా ఉంటున్నారు. అదే శిరస్త్రాణం (హెల్మెట్) ధరించి ఉంటే ప్రాణ నష్టం తప్పుతుంది. ఈ విషయం అందరికీ తెలిసినా చాలా మంది ద్విచక్ర వాహన చోదకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై శుభశేఖర్

పక్కాగా అమలుకు చర్యలు.. గడిచిన ఏడాదిలో నియోజకవర్గంలో 70కు పైగా ప్రమాదాలు జరిగాయి. 12 మంది మృత్యువాత పడ్డారు. వీరందరూ శిరస్త్రాణం ధరించి ఉంటే ప్రాణ నష్టం ఉండేది కాదని పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం శిరస్త్రాణం ధరించడం తప్పనిసరి చేయాలనే ఆదేశాలతో అమలుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. 'ద్విచక్ర వాహన చోదకులు బాధ్యతగా భావించి తప్పక శిరస్త్రాణం ధరించాలి. లేకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రూ.వెయ్యి వరకు జరిమానా విధిస్తాం.' అని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు.

తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయండి

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 10న నిర్వహించనున్న మెగా తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఈవోలు టి.రామ్మూర్తి, బీవీఎస్ సుబ్బారావు కోరారు. సోమవారం ముసునూరు ఎంఈవో కార్యాలయంలో అన్ని పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించే కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలను ఆహ్వానించాలన్నారు.

ఎంఈవో-1 బాధ్యతల స్వీకరణ.. ముసునూరు మండలం ఎంఈవో-1గా టి.రామ్మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన టి.నరసాపురం ఎంఈవోగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి బిడ్డను బడికి పంపాలి: ఎంపీపీ

కలిదిండి, న్యూస్‌టుడే: 6-14 ఏళ్ల వయసున్న ప్రతి బిడ్డను తప్పనిసరిగా బడికి పంపించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంఈవో-2 వెలమల శ్రీనివాసరావు మండలంలోని విద్యా ప్రగతిని వివరించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల పెంపు, తల్లికి వందనం, ఈనెల 10న జరగనున్న తల్లిదండ్రుల సమావేశం తదితర అంశాలపై మాట్లాడారు. ఉప ఎంపీపీ కనకదుర్గారాణి, ఎంపీడీవో ఆర్ ఫణీంద్ర, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారుల పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు: డీఏవో

కైకలూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. సోమవారం కైకలూరు మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వలు, క్రయ, విక్రయాలు, గోదాముల అనుమతులకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. ప్రతి దుకాణంలో స్టాక్ నిల్వలకు సంబంధించిన సూచిక బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అధిక ధరలకు, వ్యవసాయేతర అవసరాలకు విక్రయిస్తే ఎరువుల చట్టం 1985 ప్రకారం చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారిణి ఆర్.దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ డ్రోన్లను సద్వినియోగం చేసుకోండి..

మండవల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం రాయితీతో అందిస్తున్న డ్రోన్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ బాషా సూచించారు. వ్యవసాయశాఖ ఏడీ జి.వెంకటమణి ఆధ్వర్యంలో సోమవారం మండవల్లిలో సబ్ డివిజన్ పరిధిలోని అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు అందించాల్సిన బ్యాంకు రుణాలు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, కౌలురైతు గుర్తింపు కార్డులు వంటి అంశాలపై చర్చించారు. అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులకు ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కైకలూరు, మండవల్లి మండలాల వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరులోని ఓ ఎరువుల గోదామును పరిశీలిస్తున్న హబీబ్ బాషా

బాలిక అదృశ్యంపై కేసు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: బాలిక అదృశ్యంపై సోమవారం ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక పదో తరగతి అనుత్తీర్ణురాలై తల్లితో పాటు కూలిపనులకు వెళ్తోంది. ఆదివారం రాత్రి ఇంట్లో తల్లితో కలిసి నిద్రించింది. తల్లి సోమవారం ఉదయం లేచి చూడగా కుమార్తె కనిపించలేదు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా హెచ్‌సీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న కారు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని మర్రిబంధం వద్ద ఆదివారం ఆటోను కారు ఢీ కొట్టింది. ఏలూరు నుంచి ఆగిరిపల్లి వెళుతున్న ఆటోను నూజివీడు నుంచి హనుమాన్ జంక్షన్ వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. ఆస్పత్రి నుంచి సమాచారం అందాల్సి ఉందని రూరల్ ఎస్‌ఐ జ్యోతిబాస్ తెలిపారు.

ప్రాణహాని ఉందంటూ ఎస్పీకి ఫిర్యాదు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మటన్ బిర్యానీకి వెళ్తే బీఫ్ ఇవ్వడంపై ప్రశ్నించినందుకు పోలీసుల సమక్షంలోనే నరికిపారేస్తానని బెదిరింపులకు పాల్పడిన హోటల్ యజమానుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ముదినేపల్లికి చెందిన అరుగుల వెంకటలక్ష్మి ఎస్పీకి వినతిపత్రాన్ని అందించారు. ఏలూరులోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో పాల్గొని అర్జీ అందించారు. పశు మాంసం బిర్యానీ ఎందుకిచ్చావని అడిగినందుకు హోటల్ యజమానులు దుర్భాషలాడారని, దానిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల వారితో తన గురించి అసభ్యంగా మాట్లాడటంపై అడగటానికి వెళ్తే చంపేస్తానని బెదిరించారని వాపోయారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

ముసునూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యూటీఎఫ్ నిరంతర కృషి చేస్తోందని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పద్మకిశోర్, ప్రధాన కార్యదర్శి గుడిమెళ్ల రాంబాబు అన్నారు. సోమవారం ముసునూరు మండలం రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి, లోపూడి గ్రామాల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాసాని గాంగేయుడు, జ్యోతిప్రకాశ్, నారాయణ, పుల్లయ్య, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఇలా అయితే ఎలా..?

చాట్రాయి, న్యూస్‌టుడే: వెలగపల్లి-విస్సన్నపేట రహదారిలో పోలవరంలో ర.భ. శాఖ ఏర్పాటు చేసిన సూచిక బోర్డు తప్పుల తడకగా ఉంది. ఇక్కడ నుంచి నేరుగా 12 కి.మీ. వెళ్తే రమణక్కపేట వస్తుంది. ఇక రహదారి పక్కకు వెళ్తే వచ్చే విస్సన్నపేట 12 కి.మీ. ఉండగా 9 కి.మీ. ఉన్నట్లు చూపారు. పోలవరం నుంచి ముందుగా వచ్చే చాట్రాయి 6 కి.మీ, నరసాపురం 12 కి.మీ. చూపారు. తర్వాత వచ్చే ఎన్టీఆర్ జిల్లాలో విస్సన్నపేట 9 కి.మీ. దూరమున్నట్లు చూపడం అధికారుల నిర్లక్ష్యాన్ని చాటుతోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు వీటిని చూసి ఇబ్బంది పడే అవకాశాలున్నాయి. .

పగలూ వెలుగుతున్నాయి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పలు వీధుల్లో రాత్రివేళల్లో వీధి దీపాలు వెలగక కొంతమంది అవస్థలు పడుతుంటే .. మరి కొన్ని చోట్ల పట్టపగలు దీపాలు వెలుగుతూ కనిపిస్తున్నాయి. పట్టణంలోని 27వ వార్డు గొడుగువారిగూడెంలో పగలు వీధి దీపాలు వెలుగుతూ ఉండటాన్ని విద్యుత్తు సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. పురపాలక సంఘం పరిధిలో విద్యుత్తు సిబ్బందిపై ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. గాంధీనగర్ తదితర ప్రదేశాల్లోనూ పగలు వెలుగుతున్నాయి. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట్రామిరెడ్డిని సంప్రదించగా ఇంజినీరింగ్ డీఈఈ, ఏఈఈలతో మాట్లాడి పరిష్కరిస్తానని చెప్పారు.

గొడుగువారిగూడెంలో...

దారి.. మడుగులా మారి!

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పోతురెడ్డిపల్లి శివారులో టిడ్కో గృహాల సమీపంలో రహదారి అధ్వానంగా తయారైంది. కనీసం వాటిపై నడవలేని పరిస్థితి నెలకొంది. కొద్దిపాటి వర్షం కురిసినా ఎస్సీ కాలనీ మార్గం దారుణంగా ఉంటోందని స్థానికులు వాపోయారు. రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యను ఇన్‌ఛార్జి ఎంపీడీవో బేబీ దృష్టికి తీసుకెళ్లగా గ్రామ కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ప్రకటన

నా క్లయింట్ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, SME పటమట, విజయవాడ వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా.. శ్రీ సర్నాల నారాయణ గారు ఈదర గ్రామము నందున ఆర్.ఎస్.నెం.119/1న య.0.75 ట్లు రిజిస్టర్డ్ క్రయ దస్తావేజు నెం.4180/2007 క్రింద మరియు య.1.00ట్లును క్రయ దస్తావేజు నెం.2154/1990 క్రింద కొనుగోలు చేసినారని తదుపరి సదరు ఒరిజినల్ క్రయ దస్తావేజు నెం.2154/1990 గైర్వోర్యమయినదని శ్రీ సర్నాల నారాయణ గారు ఆగిరిపల్లి పోలీస్ వారికి కంప్లయింట్ చేయగా సదరు పోలీస్ వారు సదరు దస్తావేజు దొరకలేదని ఒక సర్టిఫికెట్ మంజూరు చేసినారని, తదుపరి సర్నాల నారాయణ మరియు వారి కుమారుడు సర్నాల వెంకటేశ్వరరావు గారి నుండి దిగువ షెడ్యూల్ దాఖలా య.1.54ట్లు శ్రీ లంక లేట్ బుచ్చిరెడ్డి గారి కుమారుడు శ్రీ లంక శ్రీనివాసరెడ్డి గారు రిజిస్టర్డ్ క్రయ దస్తావేజు నెం.4784/2017 క్రింద కొనుగోలు చేసినారని తదుపరి సదరు స్థలమునందు M/s అనిరుద్ పౌల్ట్రీస్ అను పరిశ్రమ స్థాపించినారని ఆ తదాది నుండి సదరు స్థిరాస్తిని అనుభవించుచూ శ్రీ లంక శ్రీనివాసరెడ్డి గారు ది. 21-05-2021న మరణించారని తదుపరి వారి భార్య శ్రీమతి లంక మాధవి, కుమారుడు లంక అనిరుద్‌రెడ్డి మరియు కుమార్తె లంక సంజనరెడ్డి గార్లు సదరు ఆస్తిని స్వాధీన పరుచుకొని సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించుచున్నారని సదరు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని Punjab National bank, Nuzvid Branch వారికి తనఖా చేసి ఋణము పొందినారని సదరు బ్యాంకు వారి నుండి సదరు లోన్‌ను టేకోవర్ చేసి షెడ్యూల్ దాఖలా ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము మంజూరు చేయమని నా క్లయింట్ బ్యాంకు వారిని కోరుచున్నారు. కావున సదరు దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిపై Punjab National bank, Nuzvid Branch వారికి తప్ప ఇంక ఎవరికైననూ ఎటువంటి హక్కులు గాని, క్లయిములు గాని చట్ట ప్రకారం చెల్లదగిన అభ్యంతరములు గాని ఉన్న యెడల నాకు 7 దినములలోగా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా తెలియజేయవలెను. లేనిచో సదరు ఆస్తి నిర్వివాదమైనదని భావించి సదరు ఆస్తిని తనఖాగా ఉంచుకొని నా క్లయింట్ బ్యాంకు వారు ఋణము మంజూరు చేయుదురు. తదుపరి వచ్చు క్లయిములు గాని లేక అభ్యంతరములు గాని లా ప్రకారం చెల్లవు మరియు నా క్లయింట్ బ్యాంకు వారిని బైండ్ చేయజాలవు.

షెడ్యూల్ : కృష్ణా జిల్లా నూజివీడు సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాకా ఆగిరిపల్లి మండలం, సీతారాంపురం గ్రామ పంచాయతీ పరిధిలో చేరిన ఈదర గ్రామములోని ఆర్.ఎస్.నెం. 119/1 దాఖలా య.1.54ట్లు స్థలము మరియు అందలి M/s అనిరుద్ పౌల్ట్రీస్ అను పరిశ్రమకు హద్దులు:- **తూర్పు :** జాయింటు దారి, **దక్షిణము:** చిన్ని గోపిరాజు గారి భూమి, **పడమర:** చిన్నపనేని కాశీవిశ్వనాథరావు గారి తాలూకు భూమి, **ఉత్తరం:** డొంక కొంత, సాదం శేషగిరిరావు గారి భూమి కొంత.

ఇట్లు: **పాదర్తి పూర్ణచంద్రరావు,** అడ్వకేట్

F.F-1, LRK టవర్స్, రామాలయం వీధి, కృష్ణలంక, విజయవాడ - 13. Ph: 98482 30004.

కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వద్ద వినతులు ఇవ్వడానికి వేచిచూస్తున్న అర్జీదారులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పెద్దసంఖ్యలో అర్జీలు దాఖలయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై 627 వినతులు అందజేశారు. అధికారులు ఉదయం 10.45 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు వినతులు స్వీకరించారు. కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, సీపీవో త్రినాథ్ అర్జీలు స్వీకరించగా, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ అర్జీని పరిశీలించి, నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని సూచించారు.

తప్పని నిరీక్షణ

ఉదయం 9 గంటలకే వందల సంఖ్యలో ప్రజలు అర్జీలతో వచ్చారు. కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నా అధికారులు రాలేదు. దీంతో అర్జీదారులు ఎదురుచూడాల్సి వచ్చింది. తర్వాత 10.45 గంటలకు అధికారులు వచ్చి అర్జీలు స్వీకరణ చేపట్టడంతో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. అందరూ పీజీఆర్ఎస్ మందిరంలోకి వెళ్లడానికి పరుగులు తీశారు. కలెక్టరేట్ సిబ్బంది పరిస్థితిని చక్కదిద్ది వరుస సంఖ్యలో పంపించారు.

పేదలకన్నారు... పెద్దలు కొట్టేశారు

- జిల్లాలో వైకాపా ఫ్రీహోల్డ్ మాయాజాలం
- నిషేధిత జాబితా నుంచి 3,648 ఎకరాలు అడ్డగోలుగా తొలగింపు

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్:

గత ప్రభుత్వంలో వైకాపా నేతల అండతో పేదల భూములపై పెద్దలు వాలిపోయారు. ఎన్నికలకు కొన్ని నెలలు ముందు అసైన్డ్ భూములను అమ్ముకోవచ్చని జీవో తెచ్చి చక్కబెట్టేశారు. కాకినాడ జిల్లాలో నిషేధిత జాబితా (22 ఏ) నుంచి 8 వేల ఎకరాలకు పైగా ఫ్రీహోల్డ్ చేశారు. ఈ అడ్డగోలు వ్యవహారంపై కూటమి ప్రభుత్వం విచారణలో 3,648 ఎకరాలకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించారు. ఆ మేరకు నివేదిక పంపించారు.

దళితులు, బడుగుల జీవనోపాధికి గతంలో ప్రభుత్వాలు అసైన్డ్ భూములను పంపిణీ చేశాయి. సాగు చేయాలి తప్ప అమ్మడానికి లేదు. వైకాపా హయాంలో పేదల ప్రయోజనం పేరు చెప్పి అసైన్డ్ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకు జీవో నం.596 తెచ్చారు. రైతుల ఆధీనంలో 20 ఏళ్ల పైబడి ఉన్నవి నిషేధిత జాబితా నుంచి ఫ్రీహోల్డ్ చేయాలి. ఈ ముసుగులో 20 ఏళ్లు దాటనివి.. వాగులు, వంకలు, గెడ్డలను కూడా 22(ఎ) నుంచి తప్పించేశారు. ఇలాంటివి జిల్లాలో 3,500 ఎకరాలపైనే ఉన్నాయి. వాటిలో కొన్ని భూముల రైతులతో వైకాపా నేతలు ముందే బేరసారాలు నడిపి గుప్పెట పెట్టుకున్నారు. ప్రభుత్వం మారడంతో దందాకు బ్రేక్ పడింది.

	ఎకరాల్లో
ఫ్రీహోల్డ్ చేసిన భూములు	8,091
నిబంధనలకు విరుద్ధంగా చేసింది	3,648
రిజిస్ట్రేషన్ భూముల్లో ఉల్లంఘనలు	34
అన్ రిజిస్టర్డ్ భూముల్లో తేడాలు	3,648

ఉల్లంఘనలు ఇలా	విస్తీర్ణం (ఎకరాల్లో)
కలెక్టర్ ప్రొసీడింగ్స్ లేనివి	1,667
20 ఏళ్లు దాటని అసైన్డ్ భూములు	517
అసైనీలకు ఇచ్చినట్లు ఆధారాల్లేనివి	449
పీవోటీ భూములు	61
గెడ్డలు, వాగులు ఇతర స్థలాలు	776

నిశిత పరిశీలనతో నిగ్గుతేల్చారు..

తొలుత రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. కాకినాడ జిల్లాలో 131 ఎకరాలు రిజిస్ట్రేషన్లు జరగగా ఒక ఎకరా మినహా అంతా సక్రమమే అని తేల్చేశారు. అసైన్డ్, చుక్కల భూములను నిబంధనల ప్రకారమే 22 (ఎ) నుంచి మినహాయించారా లేదా అని పరిశీలన చేశారు. రిజిస్టర్డ్ భూములను మరోసారి తనిఖీ చేయగా దందా బయటపడింది. ఫ్రీహోల్డ్ చేసి వెంటనే రిజిస్ట్రేషన్లు జరిగిన వాటిలో 34 ఎకరాలకు సంబంధించి నిబంధనలు పాటించలేదు. ఎక్కువ భాగం వైకాపా నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. నిషేధిత జాబితా నుంచి తప్పించిన అన్ రిజిస్టర్డ్ భూముల్లో 3,614 ఎకరాలకు సంబంధించి ఉల్లంఘనలు జరిగినట్లు తేలింది. ఫ్రీహోల్డ్ చేయడానికి అర్హమైన భూములన్నప్పటికీ కలెక్టర్ ప్రొసీడింగ్స్ తీసుకోకుండా వైకాపా నేతల ఒత్తిళ్లతో తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే నిషేధిత జాబితాల నుంచి తప్పించేశారు. ఇలాంటి వాటన్నింటిని మళ్లీ 22-ఏలో పెట్టి నిబంధనల ప్రకారం ఫ్రీహోల్డ్ చేసిన భూములపై హక్కులు కల్పించనున్నారు.

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. తొలి ఏడాదిలో రోడ్లపై గుంతలు పూడ్చి.. ప్రజల ప్రయాణాలు సౌకర్యంగా మార్చిన కూటమి ప్రభుత్వం రెండో ఏడాది ఆయా రహదారుల ప్రగతికి పచ్చ జెండా ఊపింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత వైకాపా అయిదేళ్ల పాలనలో ర.భ.శాఖ పరిధిలోని మార్గాలకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో అవన్నీ ధ్వంసమయ్యాయి. వార్షిక మరమ్మతులకు నిధులివ్వని దుస్థితి వీడింది. కూటమి ప్రభుత్వం వీటన్నింటిని దారికి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మార్చి 29న ప్లాన్ గ్రాంట్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కొన్ని రహదారుల అభివృద్ధికి పరిపాలన ఆమోదం ఇచ్చింది. వీటిలో నాబార్డు నిధులతో చేపట్టే పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తం 72.581 కి.మీ. పరిధిలో రూ.28.66 కోట్లతో 15 పనులకు టెండర్లు పిలవగా బిడ్లు పెద్దఎత్తున దాఖలయ్యాయి. రూ.2 కోట్ల విలువైన పనికి ఆర్అండ్‌బీ కాకినాడ సర్కిల్ కార్యాలయంలో ఆమోదం ఇవ్వగా, రూ.2 కోట్లపైబడిన పనుల ఆమోదానికి ఆ శాఖ చీఫ్ ఇంజినీర్‌కు పంపించారు.

ఇక ప్రగతి పథం!

రూపుమారనున్న రహదారులు, త్వరలో పనుల ప్రారంభం

కాకినాడ జిల్లాలో అభివృద్ధి చేయనున్న సామర్లకోట-పిఠాపురం- ఉప్పాడ రోడ్డు

జిల్లాలో చేపట్టే పనులివే: తిప్పరాజు పాలెం-కాజులూరు విస్తరణ 4.823 కి.మీ., నిధులు రూ.3.10 కోట్లు), రామచంద్రపాలెం-రయణపల్లిపేట(4.413 కి.మీ., రూ.2 కోట్లు), యండపల్లి-రావివరప్పాడు(7.055 కి.మీ., రూ.3.50 కోట్లు), జడ్.రాగంపేట-నాయకంపల్లి(3.300 కి.మీ., రూ.60 లక్షలు), ఏలేశ్వరం-జగ్గంపేట లింగంపర్తి(4.725 కి.మీ., రూ.కోటి), కట్టమూరు-జె.తిమ్మాపురం(13.200 కి.మీ., రూ.3 కోట్లు).

పూర్తిస్థాయిలో అభివృద్ధి

నాబార్డు నిధులతో చేపట్టే పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ప్లాన్ గ్రాంట్‌కు బడ్జెట్ ఇచ్చిన వెంటనే త్వరలో టెండర్లు పిలుస్తాం. దీంతో రహదారులు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతాయి.

- జి.కాంతం, ఎస్ఈ, ఆర్అండ్‌బీ, కాకినాడ

జిల్లా	రోడ్ల పొడవు (కి.మీ.)	నిధులు (రూ.కోట్లలో)
కాకినాడ	37.516	13.20
తూర్పుగోదావరి	23.200	11.24
అంబేడ్కర్ కోనసీమ	11.865	4.22

ప్లాన్ గ్రాంటు బడ్జెట్ విడుదల: ఉమ్మడి జిల్లా పరిధిలో మేజర్ జిల్లా రోడ్లు(ఎండీఆర్), రాష్ట్ర రహదారుల(ఎస్‌హెచ్) అభివృద్ధికి ప్లాన్ గ్రాంట్ కింద రూ.74.85 కోట్ల విలువైన 29 పనులకు పరిపాలనా ఆమోదం ఇచ్చారు.

రాష్ట్ర రహదారులు: సామర్లకోట-గోకవరం, పెద్దాపురం-బూరుగుపూడి, సామర్లకోట-ప్రత్తిపాడు, నర్సీపట్నం-తుని, సామర్లకోట-ఉప్పాడ, పిఠాపురం-యు.కొత్తపల్లి, కాకినాడ, అమలాపురం, నరసాపురం ఫెర్రీరోడ్డు- రామేశ్వరం.

జిల్లా రహదారులు: జల్లూరు-ఎల్ఎన్ పురం, సామర్లకోట-గోకవరం, రాజమహేంద్రవరం-గోకవరం, గండేపల్లి-శావరం, ఏలేశ్వరం-జగ్గంపేట, ఏలేశ్వరం-జడ్‌రోడ్డు, రాజానగరం-పశ్చిమ గోనగూడెం.

ఇల కైలాసం.. అరుణాచలేశ్వర క్షేత్రం

కొలువుదీరిన 63 నాయనార్ల విగ్రహాలు

విగ్రహాల ప్రతిష్ఠకు తరలివచ్చిన భక్తజనం

పుస్తకావిష్కరణలో మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, స్వామీజీలు చొక్కలింగం, విశ్వనాథ్, అరుణాచల మాధవి, స్వామి రామానంద, శ్యామలాదేవి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని రాచపల్లి శ్రీరమణసేవాశ్రమంలో వేంచేసి ఉన్న శ్రీ పీఠ కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో 63 మంది నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠ, ఆలయంలో దక్షిణామూర్తి తదితర దేవతామూర్తుల ప్రతిష్ఠ సోమవారం కనుల పండుగగా జరిగింది. క్షేత్ర మండపంలోని నాయనార్ శిల, పంచలోహ విగ్రహాలను కొలువు దీర్చారు. అరుణాచల మాధవి, స్వామి రామానంద పర్యవేక్షణలో అర్చకులు ఈ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, గాయని ఎంఎం శ్రీలేఖ, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తదితరులు ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని నాయనార్లను అర్చించారు.

ఆధ్యాత్మిక వారసత్వ సంపద

రాచపల్లిలో అరుణాచలేశ్వరుని ఆలయం ఆధ్యాత్మిక వారసత్వానికి నిలువుటద్దమని స్వామీజీలు, ప్రముఖులు స్పష్టం చేశారు. సభకు అరుణాచల మాధవి అధ్యక్షత వహించారు. తెలుగు రాష్ట్రాల్లోనే ప్రప్రథమంగా నాయనార్ల విగ్రహాల ఏర్పాటు అభినందనీయమన్నారు. సభలో విజ్ఞానందగిరి, శారదానంద సరస్వతి, వినమ్రానంద ఉన్నారు. అరుణాచల మాధవి రచించిన 63 నాయనార్ల సంక్షిప్త జీవిత చరిత్ర పెరియపురాణం పుస్తకాన్ని చొక్కలింగస్వామి తంబిరాన్ ఆవిష్కరించారు.

15న పెన్షనర్ల సమస్యలపై ధర్నా

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్, కాకినాడ జిల్లా శాఖ సమావేశాన్ని సోమవారం స్థానిక గాంధీనగర్ పార్కులోని సంఘ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎంవీ వీరభద్రస్వామి అధ్యక్షతన నిర్వహించారు. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, డీఏ బకాయిలు విడుదల, ఆరోగ్య కార్డులు అన్ని వ్యాధులకు వర్తింపజేయాలని, అదనపు సాయాన్ని అమలు చేయాలని సమావేశం తీర్మానించింది. వీటి పరిష్కారానికి ఈనెల 15న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అసోసియేషన్ ప్రతినిధులు ఆచంట రామారాయుడు, జి.అప్పారావు, ఎస్ఎం రామారావు, కేపీ జగదీశ్వరరావు, కె.సత్తిరాజు, ఎం.నారాయణరావు, రాజనాల కమల కుమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

గోదారమ్మ పరవళ్లు

ముక్తేశ్వరం రేవు వద్ద ఉద్ధృత గౌతమి

కోతకు గురవుతున్న తాత్కాలిక రహదారి

ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాలకు గోదారమ్మ పరవళ్లు తొక్కుతోంది. తీరప్రాంత వాసులు రాకపోకలు సాగించేందుకు నిర్మించుకున్న తాత్కాలిక రోడ్లను ముంచెత్తుతోంది. ఇప్పటికే నదిలో వేసిన బాటలు మునిగిపోయాయి. తాజాగా సోమవారం ముక్తేశ్వరం రేవు వద్ద గౌతమి గోదావరి ఉద్ధృతంగా ప్రవహించి రేవులో పంటు వద్దకు వెళ్లే తాత్కాలిక రహదారిని చుట్టుముట్టింది. దీంతో ఈ రేవుపై రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఇప్పటికే రహదారి కోతకు గురవుతోంది. లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు, ముక్తేశ్వరం తొగరపాయకు సైతం వరదనీరు చేరుతోంది. ఈ కారణంగా రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు అప్రమత్తం కావాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అయినవిల్లి

రైతేరాజు అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -8లో

17,500 పండ్ల మొక్కలు నాటడానికి సన్నాహాలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మంగళవారం 250 ఎకరాల్లో 17,500 పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. మామిడి, జీడిమామిడి, జామ, తైవాన్ జామ, కొబ్బరి వంటి వివిధ రకాల ఉద్యాన మొక్కలను 20 మండలాల పరిధిలో నాటేందుకు ఉద్యాన శాఖ అధికారులతో కలిసి డ్వామా అధికారులు ఏర్పాట్లు చేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప పెద్దాపురం మండలం, ఆనూరు, సామర్లకోట మండలం నవర గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరుకానున్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తాళ్లరేవు మండలంలోని కోరంగి, పోలేకుర్రు, కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ కాకినాడ గ్రామీణ మండలం, రేపూరు, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పెదపూడి గ్రామంలో, గొల్లప్రోలు మండలంలోని వన్నెపూడి, యు.కొత్తపల్లి మండలంలోని శ్రీరాంపురం, పిఠాపురం మండలంలోని చిత్రాడలో పిఠాపురం స్థానిక ముఖ్య నాయకులు మొక్కలు నాటనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు.

విద్యా ఉత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు: కలెక్టర్

సూచనలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 10న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలతో పాటు సాంకేతిక విద్యా సంస్థల్లో పేరెంట్ టీచర్ మీటింగ్-2.0 కార్యక్రమాన్ని విద్యా ఉత్సవంలా నిర్వహించాలని, దీనికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన జేసీ రాహుల్‌మీనాతో కలిసి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, విద్యాశాఖ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్య, వ్యక్తిత్వ పరంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగాలని సూచించారు. జిల్లాలోని 2వేల ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో సమావేశాలు నిర్వహించి, వీడియోలు, ఫొటోలు ప్రత్యేక యాప్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. అమ్మ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించి, తల్లులకు పువ్వులతో పాదాభివందనం కార్యక్రమం చేపట్టాలని సూచించారు. విద్యార్థులతో ముఖాముఖి, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఏర్పాట్లపై ఈనెల 9 నాటికి కలెక్టరేట్‌కు నివేదిక పంపించాలన్నారు. డీఆర్వో వెంకటరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం జిల్లాస్థాయి అధికారులతో సమావేశమై, ఈ కార్యక్రమంపై సూచనలు చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డీఈవో పి.రమేశ్, సమగ్ర శిక్షా ఏపీసీ వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

చరితకు చెదలు

శిథిలమైన కాకినాడ పురావస్తు ప్రదర్శనశాల

పెచ్చులూడుతున్న భవనం పైకప్పు

దుమ్ముపట్టిన విలువైన పుస్తకాలు


మూలనపడిన శిల్పసంపద

అద్భుతమైన కళాఖండాలు.. అపురూపమైన తాళపత్ర గ్రంథాలు.. విలువైన పుస్తకాలకు నిలయమైన కాకినాడలోని పురావస్తు శాఖ ప్రదర్శనశాల నేడు దయనీయస్థితికి చేరుకుంది. పిఠాపురం రాజా వారి సహకారంతో ఆంధ్ర సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దీనిని 1974లో పురావస్తు శాఖకు అప్పగించారు. ఎంతోమంది విద్యార్థులకు విజ్ఞానాన్ని, పరిశోధక విద్యార్థులకు చరిత్రను తెల్పుతూ వచ్చిన ఈ ప్రదర్శనశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న విలువైన వస్తువులకు భద్రత కరవైంది. భవనం పెచ్చులూడి పడుతోంది. ముఖ్యమైన పుస్తకాలు దుమ్ముపడుతున్నాయి. ఇక్కడ ఉద్యోగులు భయంగానే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. ఈ విషయాన్ని పురావస్తు శాఖ ఏడీ తిమ్మరాజు దృష్టికి తీసుకెళ్లగా నూతన భవన నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 కోట్లు విడుదల చేసేందుకు అంగీకరించాయని, సాంకేతిక కారణాలతో నిధులు రాలేదని చెప్పారు. వాటి విడుదలకు చర్యలు తీసుకుని, నూతన భవన నిర్మాణానికి టెండర్లు పిలుస్తామని తెలిపారు. - ఈనాడు, కాకినాడ

నీరు నిండేదెలా.. పైరు పండేదెలా

ఏలేరు, గోదావరి పిఠాపురం బ్రాంచి కెనాల్(పీబీసీ), ఇతర కాలువలు, చెరువుల నుంచి పొలాలకు సాగునీరు మళ్లించుకునే కళింగలాలు, రెగ్యులేటర్లు, స్లూయిస్‌లు శిథిలమయ్యాయి. వైకాపా ప్రభుత్వంలో కనీస మరమ్మతులు చేయకపోవడంతో పొలాలకు సాగునీరు మళ్లించే పరిస్థితులు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

శిథిలమైన మల్లవరం ఆర్ఆర్‌బీ చెరువు ప్రధాన రెగ్యులేటర్

కాకినాడ జిల్లాలోని పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణం, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలోని వివిధ పంట కాలువలపై కళింగలాలు, రెగ్యులేటర్లు వందకుపైగా శిథిలమయ్యాయి. పిఠాపురం నియోజకవర్గ పరిధిలోనే 22 కళింగలాలు, రెగ్యులేటర్లు బాగోలేక సాగు నీటి ఇక్కట్లు ఏర్పడ్డాయి. చేసేదిలేక తాటిదుంగలు, చెక్కలు, ఇసుక బస్తాలు అడ్డుపెట్టి ఇంతవరకు సాగునీటిని మళ్లించుకున్నారు. గతేడాది సంభవించిన వరదలతో పూర్తి స్థాయిలో శిథిలమయ్యాయి. దీంతో పొలాలకు సాగునీరు మళ్లించేందుకు వీలుకావడంలేదు. గతంలో వీటి మరమ్మతులు, షట్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదు. కూటమి ప్రభుత్వం కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగింపు చేపట్టడంతో కొంతమేర మేలు కలుగుతుందని, కళింగలాలు, రెగ్యులేటర్లకు మరమ్మతులు, షట్టర్లు ఏర్పాటు చేసి పొలాలకు సాగునీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ✦ గొల్లప్రోలులోని ఏలేరు ప్రధాన కాలువ, ఊబందకాలువ కళింగలాలు బీటలు వారి, షట్టర్లు తుప్పుపట్టాయి. చెందుర్తి శివారు చౌటు కాలువపై రెండు కళింగలాలు ఛిద్రమయ్యాయి. గండేవారి కాలువ, పాటికాలువ, సీతానగరం కాలువ, ఏడుకొండలు కళింగలాలదీ అదే పరిస్థితి. గొల్లప్రోలు శివారు ఏలేరు కాలువ బల్లకట్టు చెక్ డామ్ కాంక్రీటు గోడకు గండిపడి అయిదేళ్లయినా పనులు చేపట్టలేదు. జిజిల్లాలోనే పెద్దదైన మల్లవరం ఆర్ఆర్‌బీ చెరువు ప్రధాన రెగ్యులేటర్, షట్టర్లు ధ్వంసమై గొల్లప్రోలు, తొండంగి, కొత్తపల్లి మండలాల్లోని పంట పొలాలకు, మంచినీటి చెరువులకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ చెరువు స్లూయిస్‌లు ధ్వంసమై ఆయకట్టు పొలాలకు సాగునీరందని పరిస్థితులు ఏర్పడ్డాయి. ✦ పిఠాపురం మండలం రాపర్తిలో ఏలేరు కాలువ రెగ్యులేటర్, షట్టర్లు శిథిలమయ్యాయి. ✦ కొత్తపల్లి మండలం నాగులాపల్లి కాలువ కళింగలాలు ధ్వంసమయ్యాయి. పెదయేరుపైనవీ అవసాన దశకు చేరాయి. ✦ సామర్లకోట శివారు ఏలేరు కాలువపై ప్రధాన రెగ్యులేటర్ పూర్తిగా ధ్వంసం కావడంతో షట్టర్ల స్థానంలో ఇసుక బస్తాలతో నీటిని మళ్లించుకోవాల్సిన దుస్థితి. ప్రత్తిపాడు, కిర్లంపూడి, తొండంగి మండలాల్లోనూ అదే తీరు.

మరమ్మతులు చేపడతాం

రెగ్యులేటర్లు, కళింగలాల మరమ్మతులు, నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. ఇంకా నిధులు మంజూరు కాలేదు. షట్టర్ల ఏర్పాటుకు చర్యలు చేపడతాం. ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందిస్తాం.

- శేషగిరిరావు, ఈఈ, జలవనరులశాఖ

బలభద్రపురంలో సమగ్ర అధ్యయనం

ఈనాడు, రాజమహేంద్రవరం: బిక్కవోలు మండలం బలభద్రపురంలో ఇటీవల క్యాన్సర్ కేసులు బయటపడిన నేపథ్యంలో సమగ్ర అధ్యయనానికి చర్యలు ప్రారంభమయ్యాయి. స్థానికంగా ఉన్న పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయనాలతో కూడిన విషపూరిత వాయువులే ప్రధాన కారణమని అనపర్తి శాసనసభ్యుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డితోపాటు, స్థానికులు గతంలో ఆరోపించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి కొద్ది రోజులుగా ఈ అంశంపై పట్టుపట్టడంతో ఇటీవల కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య సందర్శించి పరిస్థితులను తెలుసుకున్నారు. స్థానిక వాతావరణ, పర్యావరణ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసే బాధ్యతను 'నీరి' సంస్థకు అప్పగించారని నల్లమిల్లి తెలిపారు. ఇక్కడ ఉన్న ఓ పరిశ్రమను తరలించే అంశంపైనా దృష్టిసారించాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిసింది.

WANTED TEACHERS
A WELL REPUTED SCHOOL IN YANAM REQUIRE
TEACHERS to teach 6th to 10th ENGLISH, PHYSICS, BIOLOGY & MATHEMATICS
Selected Teachers will have attractive Salary, PF, ESI & Fee Concession for their child's Education
WALK IN INTERVIEW (or) send your C.V.Within 10 Days to
THE HEADMASTER
REGENCY PUBLIC SCHOOL
Mettakur, Yanam-533 464. Contact No.98661 97903
Email: rpsyanam@gmail.com

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

రామలింగేశ్వరుడికి పదివేల బిందెల జలంతో అభిషేకం

దుర్గాడ శివాలయంలో నీట మునిగిన ఉమారామలింగేశ్వరుడు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: దుర్గాడలోని పంచాయతన సమేత ఉమారామలింగేశ్వర ఆలయం(శివాలయం)లో భక్తులు స్వామివారికి సోమవారం సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. 49 ఏళ్లుగా సంప్రదాయబద్ధంగా తొలి ఏకాదశి మరుసటి రోజు ఈ క్రతువు ఆనవాయితీ. అర్చకులు వీరబాబు, దత్తు, పండిత బృందం ఆదిత్యశర్మ, షణ్ముఖశర్మ, కారుణ్యశర్మ, కార్తీక్‌శర్మ, ఆకెళ్ల దిలీప్‌కుమార్‌శర్మ, సుబ్రహ్మణ్యకుమార్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ వేద మంత్రోచ్ఛారణలతో పూజలు చేయించారు. నాలుగు గంటలపాటు యువతులు, మహిళలు, భక్తులు గర్భగుడిలోని శివలింగంపైనున్న గంగాదేవి మునిగేంత వరకూ 10 వేల బిందెల నీళ్లతో అభిషేకం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు మంత్రి పార్థసారథి జిల్లా పర్యటన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు ఆయన విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 9 గంటలకు తునిలోని తెదేపా కార్యాలయానికి చేరుకుని పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తుని పురపాలక సంఘంలోని 11, 12, 13 వార్డుల్లో ఇంటింటికీ తెదేపా (సుపరిపాలనలో తొలి అడుగు) కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి విజయవాడ వెళతారు.

WE'RE HIRING!
WALK-IN-INTERVIEW
Date: 9th & 10th July
Time: 9.30 AM to 1.00 PM
At Alamuru
High School Teachers
English & Maths
Trained Graduates / Post Graduates with min. Two years of experience
Pay Scale: 30,000 - 35,000 Per Month
FLUENCY IN ENGLISH IS MUST
The Siddhartha School
Alamuru, 73967 85156 Ravulapalem, 84639 84456

(c) eenadu

KVB Karur Vysya Bank
Smart way to bank

ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

డివిజినల్ ఆఫీస్, డి.నెం.47-10-15, షాపు నెం.1, ఎ.జి.ఎవెన్యూ, ఫస్ట్ ఫ్లోర్, పొల్లాక్స్ స్కూల్ ఎదురుగా, 2వ లైన్, ద్వారకానగర్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530 016. ఫోన్ : 0891-2511706

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) నందలి నిబంధనలతో చదవుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా **1) మెస్సర్స్ శ్రీ వీర సాయి బిల్డ్ మార్ట్, ప్రొప్రయిటర్: శ్రీ మడద శ్రీనివాస రావు**, తండ్రి: శ్రీ యం.రామారావు, 2/33/9, గ్రంథాలయం వీధి, పేర్రాజుపేట, కాకినాడ-533003. **2) శ్రీ మడద శ్రీనివాస రావు,** తండ్రి: శ్రీ యం.రామారావు, డి.నెం.58-1-12/ఎ, మార్కెట్ వీధి, జగనాయక్‌పూర్, కాకినాడ-533003. **హామీదారులు: 3) శ్రీ మడద వెంకట సతీష్,** తండ్రి: శ్రీ యం.సత్యానందం, డి.నెం.58-1-12/ఎ, చిన్న మార్కెట్ వీధి, జగనాయక్‌పూర్, కాకినాడ-533002. **4) శ్రీమతి రామలక్ష్మి కందుల,** భర్త: శ్రీ కె.మురళీకృష్ణ, 2-40, రెవిన్యూ కాలనీ, చీడిగ, ఇంద్రపాలెం, కాకినాడ-533006. **5) శ్రీ రామకృష్ణా రావు కొప్పుల,** తండ్రి: శ్రీ కె.సీతారామయ్య, డి.నెం.8-61, పంచాయితీ వీధి, తురంగి, కాకినాడ-533016. **6) శ్రీమతి మేరుగు సుశీల,** భర్త: శ్రీ యం.వి.రామకృష్ణ డి.నెం.58-1-12/ఎ, మార్కెట్ వీధి, జగన్నాయక్‌పురం, కాకినాడ-533002. **7) శ్రీ కందుల మురళీ కృష్ణ,** తండ్రి: కందుల వీర రాఘవయ్య, డి.నెం.2-40, రెవిన్యూ కాలనీ, చీడిగ, ఇంద్రపాలెం, కాకినాడ-533006. **8) శ్రీమతి కొప్పుల గోపి జ్యోతి,** భర్త: శ్రీ కె.రామకృష్ణ, 8-61, పంచాయితీ వీధి, కాకినాడ అర్బన్, తురంగి, కాకినాడ-533016. **9) శ్రీ మడద రామారావు,** తండ్రి: మడద సత్తిరాజు, డి.నెం.58-1-12/ఎ, మార్కెట్ వీధి, జగన్నాయక్‌పూర్, కాకినాడ-533002. **10) శ్రీ వాసుపల్లి శ్రీనివాస రావు,** తండ్రి: శ్రీ వి.సీతారామయ్య, డి.నెం.13-21, సుబ్బంపేట, యు.కొత్తపల్లి, ఉప్పాడ, కాకినాడ-533448 వారి నుండి రావల్సిన బకాయి **రూ.3,90,10,149.47 పై.** (అక్షరాల మూడు కోట్ల తొంభై లక్షల పదివేల నూట నలభై తొమ్మిది రూపాయల నలభై ఏడు పైసలు మాత్రమే) (**A/c no.1426280000000867** నకు **రూ.2,98,81,078.04 పై + A/c. no. 1426808000000422** నకు **రూ.28,36,774.92 పై + A/c. no. 1426808000000481** నకు **రూ.62,92,296.51 పై**) + **తేది.01.07.2025** నుండి తదుపరి వడ్డీ మరియు వ్యయాలు మొదలగునవి రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, కాకినాడ బ్రాంచ్, కాకినాడ** యొక్క అధీకృత అధికారియైన సెక్యూర్డ్ క్రెడిటార్‌చే స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులను **29-07-2025** న "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అలానే ప్రాతిపదికన" విక్రయించబడును.

స్థిరాస్తుల వివరములు:

షెడ్యూల్-1: ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లా, తాళ్ళరేవు సబ్ రిజిస్ట్రీ, తాళ్ళరేవు మండలం, జి.వేమవరం గ్రామం, జి.వేమవరం గ్రామ పంచాయితీ, యానాం రోడ్డు, గ్రీన్ వ్యాలి ఎదురుగా, సర్వే నెంబు.306/1, 306/2, 306/3, 306/4, 306/4పి, 306/5, 306/5పి, 306/4బి, మరియు 297/22లోని కామన్ లేఅవుట్ ప్లాన్ అనగా టియల్‌పి నెం.140/2015/ఆర్ ప్రకారం గల మొత్తం 31266 చ॥గ॥లు (ఎ.6.46 సెంట్లు) లోని ప్లాట్ నెం.1తోగల 275.03 చ॥గ॥ల ఖాళీ నివాస స్థలం శ్రీ మడద రామారావు, తండ్రి: మడద సత్తిరాజు, శ్రీమతి కందుల రామలక్ష్మి, భర్త: శ్రీ కె.మురళీకృష్ణ మరియు శ్రీమతి కొప్పుల గోపి జ్యోతి, భర్త: శ్రీ కె.రామకృష్ణ, శ్రీ వాసుపల్లి శ్రీనివాసరావు, తండ్రి: శ్రీ వి.సీతారామయ్య మరియు శ్రీ మడద వెంకట సతీష్, తండ్రి: శ్రీ ఎం.సత్యానందం గార్ల పేరున ఉమ్మడిగా కలదు. ఎంఓడి నెం.**4087/2017, తేది.20-05-2017** ప్రకారం బ్యాంకుకు సెక్యూర్డ్ చేయబడినది. **హద్దులు: ఉత్తరం:** 74'-6" లేదా 22.70 మీ॥ల సర్వే నెం.307లోని వ్యవసాయభూమి, **తూర్పు:** 32'-4" లేదా 9.85 మీ॥ల సర్వే నెం.315లోని వ్యవసాయభూమి, **పడమర:** 34'-6" లేదా 10.51 మీ॥లు, 33 అ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** 73'-6" లేదా 22.40 మీ॥లు, ప్లాట్ నెం.2.

షెడ్యూల్-2 నుండి **షెడ్యూల్-32** వరకు: [illegible]

షెడ్యూల్-33: కాకినాడ, జగన్నాయకపూర్, మార్కెట్ వీధి, జడ్‌పి స్కూల్ ప్రక్క రోడ్డు, బ్లాక్ నెం.58, వార్డు నెం.27, డి.నెం.58-1-12లోని 127.57 చ॥గ॥ల నివాస భూమి మరియు భవనం శ్రీ మడద శ్రీనివాసరావు, తండ్రి : శ్రీ యం.రామారావు మరియు శ్రీమతి మేరుగు సుశీల, భర్త: శ్రీ యం.వి.రామకృష్ణ గారి పేరున కలదు. **ఎంఓడి నెం.222/2018, తేది.08-01-2018 ప్రకారం** బ్యాంకుకు సెక్యూర్డ్ చేయబడినది. **హద్దులు: షెడ్యూల్ ఆస్తి: టియస్ నెం.1447: ఉత్తరం:** యం.రామారావు గారికి చెందిన ఆస్తి-12.22 మీ॥లు, **తూర్పు:** ఎస్.సుహాశ్రీ గారి ఇల్లు కొంతమేర మరియు 2.42 చ॥మీ॥ల వెడల్పు గల ఉమ్మడి దారి కొంతమేర: 9.86 మీ॥లు, **పడమర:** షేక్ సాజుద్దీన్ గారి ఇల్లు-8.70 మీ॥లు, **దక్షిణం:** యస్.సత్యనారాయణ మరియు ఇతరులకు చెందిన ఇల్లు-10.95 మీ॥లు. **షెడ్యూల్ ఉమ్మడి దారి: ఉత్తరం:** 59'06" లేదా 18.13 మీ॥లు-కోరుమిల్లి కృష్ణ గారికి చెందిన ఆస్తి, **తూర్పు:** రోడ్డు 4.6 అ॥లు, **పడమర:** దరఖాస్తుదారునికి చెందిన ఆస్తి-4.6 అ॥లు, **దక్షిణం:** నగుమంత్రి సుభశ్రీ గారికి చెందిన ఆస్తి కొంతమేర, వాసుపల్లి అన్నపూర్ణ గారి ఆస్తి కొంతమేర-70 అ॥లు.

దరఖాస్తుదారునికి, ఎస్.సుభశ్రీ, వాసుపల్లి అన్నపూర్ణ వారికి ఈ ఉమ్మడి దారి వినియోగించుటకు హక్కు కలదు.

లాట్ నెం.	ఆస్తులు	రిజర్వు ధర	ధరావత్తు (రిజర్వు ధరలో 10%)	బిడ్ పెంపుదల మొత్తం
లాట్ - 1	షెడ్యూలు నెం.1 నుండి నెం.32	రూ.3,20,00,000/-	రూ.32,00,000/-	రూ.1,00,000/-
లాట్- 2	షెడ్యూలు నెం.33	రూ.48,00,000/-	రూ.4,80,000/-	రూ.50,000/-

అమ్మకం యొక్క ఇతర వివరములు మరియు నియమ నిబంధనల కొరకు https://www.bankauctions.in ని చూడండి (ఇ-వేలం యొక్క ప్రొవైడర్ వెబ్ చిరునామా) లేదా అధీకృత అధికారి, ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, కాకినాడ బ్రాంచ్, కాకినాడ, మొబైల్ నెం.**9652227227** / శ్రీ ఎన్‌వివిఎస్ ప్రసాద్ గారు : **9100072161** / శ్రీ మనీష్ ప్రసాద్ గారు : **9473474007** నందు సంప్రదించగలరు.

SARFAESI చట్టం, 2002 యొక్క రూల్ 9(1) క్రింద 15 రోజుల చట్టబద్ధ ప్రకటన

చెల్లింపు తేదీ వరకు వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో పాటు పైన తెలిపిన బకాయిలను వేలం తేదీలోపు చెల్లించవలెనని, లేనిచో, షెడ్యూల్ ఆస్తి వేలం వేయబడుతుందని/విక్రయించబడుతుందని మరియు మిగిలిన బకాయిలు ఏవైన ఉన్నట్లయితే, వడ్డీ మరియు ఖర్చులతో పాటు వసూలు చేయబడతాయని రుణగ్రహీత/లు మరియు గ్యారంటర్/లకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. **SARFAESI** చట్టం, 2002 సవరణకు అనుగుణంగా ఈ నోటీసు జారీచేయబడినది.

తేది : 07-07-2025
ప్రదేశం : విశాఖపట్నం

అధీకృత అధికారి
ది కరూర్ వైశ్యాబ్యాంక్ లిమిటెడ్, కాకినాడ బ్రాంచి, కాకినాడ

గుండెలపై బాధ.. తీరేదెలా?

దివ్యాంగురాలైన తన కుమార్తె సాయిదేవికను గుండెలపై ఎత్తుకొని వస్తున్న ఈమె పేరు కనకలక్ష్మి. కాకినాడ గ్రామీణం చీడిగ నివాసి. అమ్మాయికి 19 ఏళ్లు వచ్చినా ఇంకా పసిపాపే. పుట్టినప్పటి నుంచి మంచానికే పరిమితమైంది. భర్త నాగబాబు కూలిపని చేస్తేనే ఆ రోజు ఇల్లు గడిచే దయనీయ పరిస్థితి. ప్రస్తుతం తన కుమార్తెకు రూ.6 వేల దివ్యాంగ పింఛను వస్తోందని, భర్త సంపాదన అంతంత మాత్రమే కావటంతో పాటు కుమార్తె వైద్యఖర్చులు విపరీతంగా ఉండడంతో ఇల్లు గడవటమే కష్టంగా మారిందంటూ బాధితురాలు కనకలక్ష్మి వాపోయారు. పూర్తిగా మంచానికే పరిమితమైన వ్యక్తులకు ఇచ్చే రూ.15 వేల పింఛను తన కుమార్తెకు మంజూరు చేయాలని సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందించారు.

- ఈనాడు, కాకినాడ

దొరబాబుకు మొక్క అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రోడ్లు, భవనాల శాఖ సర్కిల్ కార్యాలయంలో సాంకేతిక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన టి.దొరబాబును సోమవారం ఏపీ స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంవీ వీరభద్రస్వామి ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఏపీఎన్‌జీవో ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఆచంట రామారాయుడు, బూరిగ ఆశీర్వాదం, కె.సుబ్బరామ్‌కుమార్, సీహెచ్.కొండలరావు, ఎస్.జియన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్య ప్రాంతీయ పర్యవేక్షకుడిగా శ్రీనివాస్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: వ్యాయామ విద్య ప్రాంతీయ పర్యవేక్షకుని (ఆర్‌ఐపీఈ)గా బి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. పాఠశాల విద్య ఆర్జేడీ జి.నాగమణి నుంచి ఆయన నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో పిల్లి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం ఈయన పశ్చిమగోదావరి జిల్లా డైట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. దీంతో పాటు ఆర్‌ఐపీగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు వ్యాయామ పర్యవేక్షకులుగా వ్యవహరించనున్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలల్లో పిల్లలకు వ్యాయామ విద్య సక్రమంగా అందేలా కృషిచేస్తానన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు లంక జార్జి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు రవిరాజ్, సునీల్‌కుమార్, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు ఆర్‌ఐపీఈని కలిసి అభినందనలు తెలిపారు.

డీఈవో రమేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్‌ఐపీఈ శ్రీనివాస్

హామీలు అమలుచేయని వారికి పాలించే అధికారం లేదు: బొత్స

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీలు అమలు పరచని వారికి రాష్ట్రాన్ని పాలించే అధికారం లేదని శాసనమండలి ప్రతిపక్ష నేత, వైకాపా రీజినల్ కో-ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ అన్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలులో సోమవారం మాజీ ఎమ్మెల్యే వంగా గీత అధ్యక్షతన జరిగిన పిఠాపురం నియోజకవర్గ వైకాపా విస్తృత స్థాయి సమావేశంలో బొత్స మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా చంద్రబాబు మోసగించారన్నారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అంటూ ఇంతవరకూ ఒకదానికే సొమ్ము చెల్లించారన్నారు. నిరుద్యోగులకు భృతి అందించలేదన్నారు. ప్రతిదానికీ బెదిరించడం ప్రజాస్వామ్యంలో సరికాదని, తాటాకు చప్పుళ్లకు బెదిరేదిలేదన్నారు. కూటమి ప్రభుత్వం ధాన్యం సొమ్మును రెండు నెలలైనా రైతులకు ఇవ్వలేదన్నారు. పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, చిత్తూరులో మామిడి, గుంటూరులో మిరప, మెట్టలో పొగాకు రైతులు గగ్గోలు పెడుతున్నారన్నారు. జిల్లా వైకాపా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రతినిధుల హక్కులను హరించే చర్యలను ఎదిరించేవారికి మద్దతుగా ఉంటామన్నారు. మరో నేత తోట నరసింహం మాట్లాడుతూ కూటమికి పిఠాపురంలో బీటలు పడ్డాయన్నారు. నాయకులు దాట్ల సూర్యనారాయణరాజు, జక్కంపూడి రాజా, దొరబాబు, యనమల కృష్ణుడు, గిరిబాబు, రాంజీ, సుజాత, బాబి, శివ, మంగతాయారు, శ్రీరామచంద్రమూర్తి, లోవరాజు, అచ్చియ్యమ్మ, అయ్యారావు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో మాట్లాడుతున్న సత్యనారాయణ

వైకాపా మాజీ కార్పొరేటర్ ఇంట్లో జూదశిబిరం

● పోలీసుల దాడి.. చిక్కిన అయిదుగురు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడలో వైకాపా మాజీ కార్పొరేటర్ ఇంట్లో జూదం ఆడుతున్న ఐదుగురిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని వెంకట్‌నగర్‌లో వైకాపా మాజీ కార్పొరేటర్ కంపర అప్పారావు అలియాస్ బాబి ఇంట్లో జూదం ఆడుతున్నారని సమాచారం మేరకు కాకినాడ రెండో పట్టణ పోలీసులు దాడి చేశారు. కంపర బాబితో పాటు శాంతినగర్‌కు చెందిన ముమ్మిడి సూర్యనారాయణమూర్తి, నరాలశెట్టి లక్ష్మీపతిరావు, మహాలక్ష్మినగర్‌కి చెందిన కె.అప్పలరాజు, శ్రీరంగ వారివీధికి చెందిన ఎం.గంగాధర్ రమేష్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.19,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కాకినాడ రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహన దొంగ అరెస్టు

తుని పట్టణం, న్యూస్‌టుడే: వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన నిందితుడిని అరెస్టు చేసి రూ.6 లక్షలు విలువైన 16 బైకులు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. రాజఒమ్మంగి మండలం జె.వనకరాయి గ్రామానికి చెందిన జి.అప్పారావు ప్రసాద్‌ను ర.భ. అతిథి గృహం వద్ద అరెస్టు చేశామన్నారు. నిందితుడు తుని, అన్నవరం, సామర్లకోట, పెద్దాపురం, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో బైకులు చోరీ చేశాడన్నారు. ఈ కేసు ఛేదించడంలో తుని, పెద్దాపురం ఎస్సైలు జె.విజయబాబు, కానిస్టేబుళ్లు నాయుడు, కిరణ్, విజయ్ తదితరులను జిల్లా ఎస్పీ అభినందించారు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

(c) eenadu

ప్రేమ వ్యవహారంలో యువతి హత్య!

మృతదేహం పక్కనే కత్తి గాయాలతో ప్రియుడు

రమ్య

జిన్నారం(రామచంద్రపురం), న్యూస్‌టుడే: ప్రేమ వ్యవహారంలో యువతి హత్య కలకలం రేపింది. ఆమె మృతదేహం పక్కనే ప్రియుడు కూడా గొంతుపై కత్తిగాట్లతో పడి ఉండటం అనుమానాలు రేకెత్తిస్తోంది. ప్రియుడే ఈ పని చేశాడా... ఇంకెవరి హస్తమైనా ఉందా...? అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. హైదరాబాద్ శివారులోని రామచంద్రపురం ఠాణా పరిధిలోని బంధుగూడలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా బాడంగి మండలం గజరాయునివలస గ్రామానికి చెందిన బొత్స శ్రీనివాస్, ఈశ్వరమ్మ దంపతులు 25 ఏళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. రామచంద్రపురం పరిధిలోని బంధుగూడ బాలాజీనగర్‌లో నివాసముంటున్నారు. వీరి కుమార్తె రమ్య (23)కు మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మాసాయిపేటకు చెందిన ప్రవీణ్‌కుమార్ (25)తో మూడేళ్ల నుంచి పరిచయముంది. బీటెక్ పూర్తి చేసిన ప్రవీణ్ ప్రస్తుతం అల్విన్ కాలనీలో ఉంటూ ట్యూషన్లు చెబుతున్నాడు. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. ఆరు నెలల క్రితం తమ ప్రేమ గురించి యువకుడు... రమ్య తల్లిదండ్రులకు చెప్పగా... వారు అంగీకరించలేదు. ఆమెకు పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. సోమవారం మధ్యాహ్నం రమ్య తల్లి ఈశ్వరమ్మ ఇంటికి వచ్చేసరికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. కిటికీ లోంచి పరిశీలించగా... రమ్య గొంతుపై తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉంది. ఆ పక్కనే మెడ మీద గాయంతో ప్రవీణ్ పడి ఉన్నాడు. ప్రవీణ్ కొన ఊపిరితో ఉండడంతో ఆసుపత్రికి తరలించారు.

అలాంటి వాటికే మీ సమయాన్ని వెచ్చించండి

అవసరం లేని విషయాల గురించి ఆలోచిస్తూ ఉంటే మీ సమయం వృథా కావడమే కాదు, దానివల్ల ముఖ్యమైన పనులపై మీ దృష్టి పెట్టలేరు. ఓ విషయం వల్ల మీకు

1. వ్యక్తిగత ప్రయోజనమైనా ఉండాలి.
2. మనశ్శాంతైనా లభించాలి.
3. మీ కుటుంబానికి, సమాజానికి పనికొచ్చే అర్థవంతమైన విషయమైనా అయ్యుండాలి.

అలాంటి వాటి కోసమే మీ సమయాన్ని, శక్తిని వెచ్చిస్తూ పూర్తి ఏకాగ్రతను నిలపండి.

– మోర్గాన్ రిచర్డ్ ఒలివియర్, రచయిత్రి

జగన్ కారులో వచ్చి వెళ్లా.. నాకేం తెలియదు

పోలీసుల విచారణలో మాజీ మంత్రి పేర్ని నాని

సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన పేర్ని నాని ★ సీఐ గది వద్ద గుమిగూడిన వైకాపా నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 18న సత్తెనపల్లి పట్టణంలో ర్యాలీ చేయడంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తిన విషయం మీకు తెలుసా? ర్యాలీ ద్వారా ప్రజలు ఆనే ఫ్లెక్సీలు మీరు ముద్రించారా? వాటిని ఎక్కడ ముద్రించారు? జనసమీకరణలో మీ పాత్ర ఉందా? పట్టణంలో ఎటువంటి అనుమతులూ లేకుండా ర్యాలీ చేయడమే కాకుండా డీజేతో నృత్యాలు చేయడం, వాహనాలు శబ్దం చేస్తూ నడపడం, బహిరంగంగా మద్యం తాగడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడం వంటి విషయాలు మీకు తెలియవా? అంటూ మాజీ మంత్రి పేర్ని నానిని సత్తెనపల్లి పోలీసులు ప్రశ్నించారు. జగన్ కారు ఎక్కమంటే ఎక్కాను. తాడేపల్లి నుంచి కారులో వచ్చా.. కారులోనే తిరిగి వెళ్లా.. అనుమతుల గురించి నాకేం తెలియదని ఆయన సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడంపై పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో పేర్ని నానిని సోమవారం విచారించారు. పట్టణంలో జరిగిన ర్యాలీలో మీరు పాల్గొన్నారా అని పోలీసులు ప్రశ్నించగా కారులో ఉన్నానని చెప్పారు. జగన్ పర్యటనకు 3 వాహనాలు, 100 మందికి అనుమతి ఇచ్చారు కదా అని నాని పోలీసుల్ని అడిగారు. పట్టణంలో ర్యాలీకి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, రెంటపాళ్లకు వెళ్లడానికి పెద్దసంఖ్యలో వాహనాలు, జనం వస్తే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని ఉన్నతాధికారులు ముందుగానే చెప్పారని పోలీసులు సమాధానమిచ్చారు. విచారణ మరోసారి పిలిస్తే రావాలని సీఐ నాగమల్లేశ్వరరావు మాజీ మంత్రికి చెప్పారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు పోలీస్‌స్టేషన్‌లోకి గుంపుగా వచ్చేసి.. విచారణ పూర్తయ్యే వరకు సీఐ గది ముందే హడావుడి చేశారు.

రెంటపాళ్ల ఎక్కడో తెలియదు

తనకు రెంటపాళ్ల కాదు సత్తెనపల్లి ఎక్కడో కూడా తెలియదని.. ఇక్కడికి రావడం ఇదే తొలిసారి అని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. పోలీసుల విచారణ తర్వాత వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుధీర్ భార్గవరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 11 సెక్షన్లతో తనపై కేసు పెట్టారని, మచిలీపట్నంలోని కార్యాలయంలో ఆదివారం పోలీసులు నోటీసు అంటించి వెళ్లడంతో విచారణకు వచ్చానని చెప్పారు. పోలీసుల ఆంక్షలు అతిక్రమించారని, ప్రజల్ని ఇబ్బందులకు గురి చేశారని, స్వంత పూచీకత్తు సొంతంగా నమోదు చేశారని, ప్రజలకు ఇబ్బంది కలిగించారని, పోలీసులకు సహకరించలేదని తనపై కేసులు నమోదు చేశారని అన్నారు. సత్తెనపల్లిలో వైకాపా ఇన్‌ఛార్జి, ఛైర్మన్ ఎవరో కూడా తనకు తెలియదని, తాను ఎవరితోనూ మాట్లాడలేదని అన్నారు. పాలకుల ఒత్తిడితో వారి కక్షసాధింపులకు పోలీసు అధికారులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని, సత్తెనపల్లి పోలీసులు అభూతకల్పనలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. తనపై కేసు పెట్టినా జగన్ జెండాను వదిలేది లేదన్నారు.

కరోనా కట్టుకథల కరోడ్‘పతి’

- బెంగళూరు మహిళను వంచించి కోట్ల ఆస్తి కాజేసిన చిత్తూరువాసి

శివప్రసాద్

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: భార్యాపిల్లలు కరోనా సోకి మృతి చెందారని మాయమాటలతో ఓ మహిళను నమ్మించి పెళ్లి చేసుకుని వంచించి రూ.28 కోట్ల సొత్తు కాజేసి పరారయ్యాడో మోసగాడు. బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజ్‌పేటకు చెందిన నాగమణి (50)కి చాన్నాళ్ల క్రితం బెంగళూరుకు చెందిన వ్యక్తితో పెళ్లయింది. కొద్దికాలం క్రితం వారి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆ తర్వాత భర్త వెంకటప్పరెడ్డి అనారోగ్యంతో మరణించారు. కొన్నాళ్లకు ఆమె మరో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని మధ్యవర్తి మహిళను ఆశ్రయించారు. ఆ మహిళ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం శేషాపురానికి చెందిన శివప్రసాద్‌కు ఆ విషయాన్ని చెప్పింది. అప్పటికే ఆతడికి భార్య, కుమార్తె ఉన్నారు. అయినా.. నాగమణి ఆస్తిపరురాలని తెలుసుకున్న శివప్రసాద్ పథకం పన్నాడు. తన భార్య, కుమార్తె కోవిడ్‌తో మరణించారంటూ నకిలీ మరణ ధ్రువపత్రాలు తయారు చేసి నాగమణికి చూపాడు. నాగమణి వాటిని నమ్మడంతో 2022లో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు.

డబ్బొస్తుందని ఆశచూపి..: ఆమె ఆస్తిపై కన్నేసిన శివప్రసాద్ ఆర్‌బీఐ నుంచి కోట్లలో సొమ్ము రానుందని చెబుతూ కొన్ని నకిలీ పత్రాలు సృష్టించి, ఆ నగదు దక్కాలంటే కొంతసొమ్ము ఆర్‌బీఐకి చెల్లించాలని నమ్మించాడు. భర్తే కదా అని ఆమె నమ్మడంతో తన తల్లి, సోదరుడు, పరిసర బంధువుల ఖాతాల్లోకి ఆమె నుంచి సొమ్ము బదలాయించుకున్నాడు. అప్పటికే నాగమణి సంతకాలు ఫోర్జరీ చేసిన శివప్రసాద్ బెంగళూరులో మొదటి భర్త నుంచి ఆమెకు సంక్రమించిన రూ.15 కోట్ల విలువైన భూమిని, రూ.10 కోట్ల విలువైన భవనాన్ని అమ్మేశాడు. ఆమె ఆభరణాలను కూడా బ్యాంకుల్లో తనఖా పెట్టాడు. బంధువుల పెళ్లికి వెళ్లాల్సి ఉందని, ఆభరణాలు కావాలని నాగమణి కోరగా అప్పటి నుంచి అతడు పరారయ్యాడు. భర్తను వెతుక్కుంటూ ఆమె బంగారుపాళ్యం వెళ్లగా.. అప్పటికే ఆతడికి భార్య, కూతురు ఉన్నట్లు తెలిసింది. దీంతో బాధితురాలు ఎస్పీ మణికంఠను ఆశ్రయించి న్యాయం చేయాలని విన్నవించారు.

మాలిలో కిడ్నాపర్ల చెర నుంచి మా బిడ్డను కాపాడండి

అమరలింగేశ్వరరావు తల్లిదండ్రుల వేడుకోలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: ‘అమ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది? మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ చేశారు కదా.. ఇప్పుడు బాగానే నడవగలుగుతున్నావా?’ అని చివరిసారిగా తన కుమారుడు అమరలింగేశ్వరరావు అన్న మాటలను గుర్తు చేసుకుని ఆ తల్లి కుమిలిపోతున్నారు. ఉపాధి కోసం ఆఫ్రికాలోని మాలి దేశం వెళ్లిన పల్నాడు జిల్లా మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన అమరలింగేశ్వరరావును వారం రోజుల క్రితం ఉగ్రవాదులు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. రోజులు గడుస్తున్నా ఆచూకీ లభించకపోవడంతో ఆతని తల్లిదండ్రులు లక్ష్మీరమణ, రాజ్యలక్ష్మి, భార్య, ముగ్గురు పిల్లలు ఆందోళన చెందుతున్నారు. ఆయన తల్లిదండ్రులు ఇలా చెప్పారు.. ‘అమరలింగేశ్వరరావు గ్రామంలో పదో తరగతి చదివాక మాచర్లలో ఐటీఐ పూర్తి చేశాడు. తర్వాత పల్నాడులోని సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగం వచ్చింది. పెళ్లై ముగ్గురు పిల్లలు పుట్టాక కుటుంబ పోషణ కష్టమైంది. మరోవైపు ఫ్యాక్టరీలో పనిచేసే స్నేహితుడి ద్వారా మాలిలో ఉద్యోగం ఉందంటే దరఖాస్తు చేసి వెళ్లాడు. ఇప్పటికి 11 ఏళ్లు అయ్యింది. ఏటా ఒకసారి వచ్చి వెళ్తాడు. ఈసారి రెండు నెలల్లో వస్తానని మాతో అన్నాడు’ అని తల్లి రాజ్యలక్ష్మి తెలిపింది. చివరిసారి జులై 1న ఫోన్‌లో తాము మాట్లాడామని, తర్వాత కిడ్నాప్ విషయం తెలిసిందని తల్లిదండ్రులు చెప్పారు. ఉగ్రవాదుల చెర నుంచి తమ కుమారుడిని విడిపించి క్షేమంగా ఇక్కడికి వచ్చేలా చూడాలని వారు వేడుకుంటున్నారు.

త్వరలోనే ధాన్యం రైతుల బకాయిలు చెల్లింపు

ఏపీమార్క్‌ఫెడ్ ఎండీ ఢిల్లీరావు

ఈనాడు, అమరావతి: ధాన్యం రైతుల బకాయిలను (ఖరీఫ్ 2024-25 పంట కాలానికి) త్వరలో చెల్లించనున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ ఢిల్లీరావు తెలిపారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి రూ.1,000 కోట్ల రుణం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4న అనుమతించిదన్నారు. మూడు రోజుల్లో ఆ మొత్తం మార్క్‌ఫెడ్‌కు బదిలీ అవనుందన్నారు. రుణం బదిలీ అయిన వెంటనే రైతుల బకాయిలు చెల్లిస్తామని తెలిపారు.

గ్రూప్-1 కేసులో మధుసూదన్‌కు బెయిల్

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 (2018) ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు, నిధుల దుర్వినియోగం కేసులో రెండో నిందితుడు, క్యామ్‌సైన్ మీడియా సంస్థ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్‌కు హైకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. విజయవాడ కోర్టులో రూ.25 వేల విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. అభియోగపత్రం దాఖలు చేసే వరకు ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరుకావాలని మధుసూదన్‌కు స్పష్టంచేశారు. మూల్యాంకనంలో అక్రమాలపై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం మధుసూదన్ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇటీవల వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి.. సోమవారం నిర్ణయాన్ని ప్రకటించారు. ఏపీపీఎస్సీతో చేసుకున్న ఒప్పందంలోని నిబంధనలకు అనుగుణంగానే మధుసూదన్ పనులు నిర్వహించారన్నారు. వైద్య నివేదికలు, కేసులోని వివరాలను పరిగణనలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు
- హైకోర్టులో నేడు విచారణ

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి(ఏ39) ఉపసంహరించుకున్నారు. సోమవారం జరిగిన విచారణలో వ్యాజ్యం ఉపసంహరణకు మోహిత్‌రెడ్డి తరఫు న్యాయవాది అభ్యర్థించారు. అందుకు అనుమతిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులిచ్చారు. సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని, కేసులో తనను నిందితుడిగా పేర్కొంటూ ‘సాక్షి’గా విచారణకు రావాలని దర్యాప్తు అధికారి నోటీసు ఇవ్వడం చెల్లదంటూ హైకోర్టులో మోహిత్‌రెడ్డి క్వాష్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇటీవల జరిగిన విచారణలో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని అతని తరఫు సీనియర్ న్యాయవాది సి. నాగేశ్వరరావు అభ్యర్థించగా, ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి నిరాకరించారు. అరెస్ట్‌పై ఆందోళన ఉంటే ముందస్తు బెయిలు పిటిషన్ వేసుకోవాలన్నారు.

వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రానుంది. ‘మద్యం ముడుపులను తరలించడానికి నేను తుడా ఛైర్మన్‌గా ఉన్న సమయంలో వాహనాలను వినియోగించినట్లు నాపై ఆరోపణ చేస్తున్నారు. వాస్తవానికి అప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తుడా వాహనాలను వినియోగించడం, రూ.కోట్లు తరలించడం సాధ్యం కాదు. నేను నేరానికి పాల్పడలేదు. నా ప్రతిష్ఠను దిగజార్చేందుకు రాజకీయ నేతలు చెప్పిన మాటలు విని పోలీసులు నన్ను ఈ కేసులో ఇరికించార’ని వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఇప్పటికే బెయిలు కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను విజయవాడ కోర్టు కొట్టివేసిందని వెల్లడించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరారు.

బూనేటి చాణక్య బెయిల్ పిటిషన్ కొట్టివేత

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన రాజ్ కసిరెడ్డి ప్రధాన అనుచరుడు బూనేటి చాణక్య (ఏ-8) బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం కొట్టేసింది. అతనికి బెయిల్ నిరాకరిస్తూ ఏసీబీ న్యాయస్థానం న్యాయాధికారి భాస్కర్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- ఇంటి నుంచి ఆహారం తీసుకొచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మద్యం కుంభకోణం కేసు నిందితుడు రాజ్ కసిరెడ్డి (ఏ-1) దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా విజయవాడ ఏసీబీ న్యాయస్థానం కొట్టేసింది.
- మద్యం కుంభకోణం కేసులో నిందితులైన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్‌నాయుడు బెయిల్ పిటిషన్లపై తదుపరి విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. వీరిద్దరికీ బెయిల్ ఇవ్వొద్దంటూ సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు.

దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శంఖవరం మండలం అన్నవరంలో తన పైనా, దివ్యాంగురాలైన తన కుమార్తెపైనా దాడి చేసిన ఆర్.చిట్టిబాబు, ఎం.కన్నయ్య, ఎం.శివపై చర్యలు తీసుకోవాలని కాకినాడ గ్రామీణ మండలం రాయుడుపాలేనికి చెందిన రాజులపూడి ఆరుద్ర కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె తన కుమార్తెతో వచ్చి కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. తమపై దాడి చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, దివ్యాంగుల హక్కులకు సంబంధించిన సెక్షన్లతో ఛార్జిషీట్ దాఖలు చేయించాలని విన్నవించారు.

కలెక్టరేట్ వద్ద ఫిర్యాదు పత్రం చూపుతున్న ఆరుద్ర

నేనెక్కడ పోటీ చేయాలనేది జనసేన అధినేత నిర్ణయిస్తారు..

- మాజీమంత్రి ముద్రగడ కుమార్తె క్రాంతి

స్వామి దర్శనానికి వచ్చిన క్రాంతి

అన్నవరం, న్యూస్‌టుడే: భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల్లో తాను ఎక్కడ పోటీ చేయాలనే విషయం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిర్ణయిస్తారని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి కుమార్తె క్రాంతి తెలిపారు. సోమవారం ఆమె అన్నవరం సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం గావించారు. ఈవో సుబ్బారావు మర్యాదపూర్వకంగా కలిశారు. కొండ దిగువన ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. భవిష్యత్తులో ప్రత్తిపాడు నుంచి సీటు కేటాయిస్తే సోదరుడిపై పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నారా అన్న ప్రశ్నకు పవన్‌కల్యాణ్ నిర్ణయిస్తారని సమాధానమిచ్చారు. పోటీ అనేది పార్టీ పరంగానే అవుతుందని ఆమె బదులిచ్చారు. నాన్న ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు.

డొక్కా సీతమ్మ జీవితం ఆదర్శం

విగ్రహం ప్రారంభించి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్ (కాకినాడ): డొక్కా సీతమ్మ జీవిత చరిత్ర, సేవా నిరతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే నానాజీ పిలుపునిచ్చారు. కాకినాడ గ్రామీణం రమణయ్యపేట ఏపీఎస్పీ జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు ముత్య వెంకటరామలక్ష్మి సొంత డబ్బు రూ.80 వేలతో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ విగ్రహాన్ని నానాజీ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి ఆమె పేరు పెట్టారన్నారు. మంత్రి లోకేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మరింత బలోపేతం చేయడానికి విశేష కృషి చేస్తున్నారన్నారు. పాఠశాలలోని వృత్తివిద్యా కోర్సుల ల్యాబ్ ప్రారంభించి, ఆవరణలో మొక్క నాటారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి తిన్నారు. ముత్యా వెంకటరామలక్ష్మిని సన్మానించారు. ఏపీఎస్పీ అడిషనల్ కమాండెంట్ దేవానంద రావు, డీవైఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవో వేణుగోపాల్, హెచ్ఎం గాయత్రి, సత్యవోలు శ్రీనివాస్, పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):		23,500
పాతకాయ:	గండేరా	25,000
	గటగట	26,000
కొత్తకాయ:	గండేరా	26,000
	గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		19,000-22,000
కొత్త (పచ్చి) కాయ		19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు		6,000
కిలో		400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారం రేటు	102-00
రిటైల్ లైవ్	124-00
డ్రెస్డ్	180-00
స్కిన్‌లెస్	205-00

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

BUSINESS OFFER

మా హైజన్ పల్స్ (బెర్రీస్ & హెర్బ్స్) కలిపిన హెల్త్ డ్రింక్)ను మార్కెటింగ్ చేయుటకు ప్రాంతాల వారీగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. Contact: 95153 15198.

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్థిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ చేయబడును. ✆ 96665 47338.

గవర్నమెంట్ ఉద్యోగస్తులు & IT రిటర్న్స్ హోల్డర్స్ కి కేవలం 1 రూ. వడ్డీతో 5 లక్షల వరకు రుణాలు. నోట్: సిబిల్ స్కోర్ బాగా ఉండవలెను. ✆ 90002 54511.

HEALTH & CARE

RHEUMATOLOGY

రుమటాలజిస్ట్ డా॥ ఎ.రామకృష్ణంనాయుడు MD, DM (Rheumatology, NIMS, HYD) 12-07-2025న (శనివారం) 2pm to 6 PM వరకు రాజమండ్రిలో ప్రైమ్ పాత్ ల్యాబ్స్, సిసిసి ఛానల్ ఎదురుగా, దానవాయిపేట వద్ద ఫోన్: 94929 41177 మరియు 13-07-2025న (ఆదివారం) కాకినాడలో సేఫ్ హాస్పిటల్ నందు 10 AM to 5 PM వరకు అందుబాటులో ఉంటారు. ఫోన్: 0884 2383366

REAL ESTATE

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి, బొమ్మూరులో తక్షణం ఇల్లు కట్టుకొనుటకు అన్ని సదుపాయములతో 150 చ॥గ॥ RUDA అప్రూవ్డ్ స్థలములు అమ్మకం. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ✆ 78424 28888.

JOBS

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

Required Managers, Agents. Salary and Incentives, Marketing Job, Guarantee Income, Age 50 above. Cont: 90108 09384.

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రభాకరనిధి, దేవిచౌక్, రాజమండ్రి నందు బిజినెస్ ప్రమోషన్ చేయుటకు అభ్యర్థులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించండి. సెల్: 79952 33384.

రంగంపేట మండలం, కోటపాడు గ్రామంలో సుమారు 30 ఎకరాలు వ్యవసాయ భూమిని చూసుకొనుటకు సొంత 2 వీలర్ కలిగి, 20-25 సం॥ వయస్సు గల సూపర్‌వైజర్ కావలెను. కాకినాడ వాస్తవ్యులకు ప్రాధాన్యత. సంప్రదించండి. ✆ 83284 36168.

EENADU for Advertisement Contact: 8008597607

కాకినాడ, అశోక్‌నగర్‌లో ప్రముఖ ఫంక్షన్ హాలు నందు పనిచేయుటకు మంచి నడవడిక కలిగినవారు వాచ్‌మేన్‌గా కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 91337 44388.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషెంట్ల సేవకు ఇంటి / వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

ప్రముఖ సోలార్ సంస్థ నందు కమీషన్ పద్ధతిపై పనిచేయుటకు ప్రమోటర్స్ కావలెను. Cont. Cell: 95608 58684, bandaruenergies@gmail.com

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషెంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52843.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-35 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రైతేరాజు

కోరిన లాభం దక్కించుకో

న్యూస్‌టుడే, మామిడికుదురు

కొబ్బరిలో అంతర పంటగా కోనసీమ ప్రాంతంలో ఎప్పటినుంచో కోకో సాగవుతోంది. కొంతమంది రైతులు వాటిపై మరింత దృష్టిపెట్టి తక్కువ వ్యయంతో అధిక ప్రయోజనాలు పొందుతున్నారు. నీటి వసతి, మార్కెటింగ్ సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని సేంద్రియ విధానంలో కొబ్బరితో పాటు కోకో సాగు చేస్తూ మెరుగైన లాభాలు ఆర్జిస్తున్నారు మామిడికుదురు మండలం అప్పనపల్లికి చెందిన రైతు అల్లూరు వెంకటరామరాజు.

సేంద్రియ ఎరువుతో భూసారం పెంపు

వైనతేయ నదీ తీరానికి చేరువలోని అప్పనపల్లిలో తనకున్న ఏడెకరాల కొబ్బరి తోటలో అయిదేళ్ల క్రితం వెంకటరామరాజు కోకో మొక్కలు నాటారు. రెండేళ్లుగా క్రమం తప్పకుండా ఆదాయం పొందుతున్నారు. కొబ్బరి చెట్ల చుట్టూ రెండు మీటర్ల మేర స్థలాన్ని ఖాళీగా వదిలి ఎకరాకు సుమారు 200 వరకు మొక్కలు నాటారు. పశువుల పెంటతో పాటు పలు సేంద్రియ ఎరువులను వాడుతున్నారు. కోకో చెట్ల నుంచి రాలిన ఆకులతో పాటు కొబ్బరి ఆకులను ముక్కలుగా చేసి తోటల్లో వేసి నేల తేమ ఆరిపోకుండా వేసవిలోనూ, నీటి ఎద్దడి సమయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కొబ్బరిలో అంతర పంటగా వేసిన కోకోతో రైతు వెంకటరామరాజు

స్ఫూర్తి

భూగర్భజలాలను వినియోగించుకుంటూ సాగునీటి వసతి కల్పిస్తున్నారు. జనవరి-ఫిబ్రవరి, జూన్-జులై మధ్య రెండుసార్లు ఫలసాయం పొందుతున్నారు. వరద, వర్షాల సమయంలో ముంపునీరు తోటల్లో నిల్వ ఉండకుండా బోదెల ద్వారా బయటకు మళ్లించుకుంటున్నారు. పంట పిందె దశ నుంచి అయిదు నెలల సమయంలో కాయలు దృఢంగా తయారవుతున్నాయి. ఎకరాకు అయిదు క్వింటాళ్ల వరకు దిగుబడులు పొందుతున్నారు.

ఆశాజనకంగా ఆదాయం

డిగ్రీ చదివిన నేను వ్యవసాయంపై మక్కువకొద్దీ కొబ్బరితో పాటు గత రెండేళ్లుగా కోకో అంతర పంటను సాగు చేస్తున్నాను. పశువుల ఎరువుతో పాటు వర్మీకంపోస్టు వేస్తున్నాను. తోటను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతూ చీడపీడలు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాను. కొమ్మల వ్యాప్తిని అరికట్టేందుకు నిర్దిష్ట ఆకృతిలో కత్తిరిస్తుంటాను. కొబ్బరి నుంచి ఎకరాకు రూ.55 వేలు, కోకో నుంచి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు లాభం వచ్చింది. దిగుబడులను పెంచేందుకు అధికారులు సలహాలు, సూచనలు పాటిస్తున్నాను.

- అల్లూరు వెంకటరామరాజు, రైతు, అప్పనపల్లి

బీమా చేద్దాం.. ధీమాగా ఉందాం

మీ కోసం

కరప, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి అందే సమయంలో ప్రకృతి విపత్తులు, భారీవర్షాలు, గాలి, వడగళ్ల వానలు తీవ్రనష్టం కలిగిస్తున్నాయి. దీంతో ఎంతోమంది నష్టపోయి అప్పుల పాలవుతున్నారు. దీనినుంచి కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఒక వరం వంటిది. దీనిద్వారా ఆర్థిక భరోసా కలుగుతుంది. గతంలో బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేసే సమయంలోనే ప్రీమియం మినహాయించుకునేవి. ప్రస్తుతం మారిన నిబంధనల మేరకు రైతులే బీమా చేయించుకోవాల్సి ఉంటుంది. ఎకరాకు రూ.760 చొప్పున ప్రీమియం చెల్లించాలి. బ్యాంకులో పంటరుణాలు తీసుకునేవారు ఆగస్టు నెలాఖరు లోపు, ఎటువంటి రుణాలు తీసుకోనివారు జులై నెలాఖరు లోపు సమీపంలోని మీసేవా కేంద్రాల్లో ప్రీమియం చెల్లించాలని కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు తెలిపారు.

ఉపాధి ఊతం.. పశువులకు గ్రాసం


తెలుసుకుందాం..

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం నిధులతో రైతులు పశుగ్రాసం పెంచుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 5 ఎకరాల్లోపు భూమి ఉన్నవారందరూ అర్హులే. బహువార్షిక పశుగ్రాసం పెంచుకోవాలనుకునే వారు దరఖాస్తుతో పాటు జాబ్‌కార్డు, వన్‌బీ, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం, రేషన్‌కార్డు నకళ్లతో సంబంధిత రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని అనపర్తి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సాయం ఒక్క ఏడాది మాత్రమే వర్తిస్తుంది. రైతులే తమకు నచ్చిన బహువార్షిక పశుగ్రాసాలు (విత్తన రకాలు) ఎంచుకోవచ్చని వెల్లడించారు. మరిన్ని వివరాలకు పశుసంవర్ధకశాఖ అధికారిని సంప్రదించాలి. ఈ పథకం మంజూరైన రైతులకు అయిదు విడతలుగా నగదు బ్యాంకు ఖాతాలకు జమవుతుందని శ్రీనివాసరావు తెలియజేశారు.

పొలం (సెంట్లలో)	ప్రభుత్వం ఇచ్చే నిధులు (రూ.లలో)
50	32,992
40	26,934
30	19,795
20	13,197
10	6,599

ఇలా నారుమడి.. అలా నాణ్యంగా దిగుబడి

రైతులు తయారు చేసుకున్న వరి నారు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఖరీఫ్ నారుమడులు సిద్ధం చేయడంలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఈ సమయంలో కొన్ని మెలకువలు పాటిస్తే ఆరోగ్యకరమైన నారుతో మంచి దిగుబడులు సాధించవచ్చని జగ్గంపేట వ్యవసాయాధికారి ఎస్.నరసింహం సూచిస్తున్నారు. పొలంలో మెరక ప్రదేశం ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల వర్షాలు అధికంగా వచ్చినప్పుడు, బయటి నుంచి నీరు వచ్చినప్పుడు నిల్వ లేకుండా ఉంటుంది. ఎకరా నారుమడి తయారు చేసుకునే రైతులు చివరి దమ్ములో 2 కిలోల యూరియా, ఆరున్నర కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 2 కిలోల పొటాష్ వేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన నారు రావడంతో పాటు వేర్లు బాగా వృద్ధి చెంది పంట దిగుబడి అధికంగా వస్తుంది. ముందుగా విత్తనశుద్ధి తప్పనిసరి.

కాకినాడ

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- తమ్ముడు, జురాసిక్ వరల్డ్ రీబర్త్, కన్నప్ప, కుబేర, మార్గన్, సోలోబాయ్, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- తమ్ముడు, కన్నప్ప, 3బి హెచ్‌కే, షోటైమ్, లక్ష్మీ- తమ్ముడు, సత్యగౌరి - జురాసిక్ వరల్డ్ రీబర్త్, తిరుమల - తమ్ముడు, సీఅండ్‌సీ 1- తమ్ముడు, సీఅండ్‌సీ 2- తమ్ముడు, శ్రీప్రియ - జురాసిక్ వరల్డ్ రీబర్త్, పద్మప్రియ- తమ్ముడు, సూర్య1(వాకలపూడి) - జురాసిక్ వరల్డ్ రీబర్త్, సూర్య 2 - తమ్ముడు.

రైతు బజార్‌లో నిన్నటి ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాట - 22, 24, వంకాయలు - 40, 46, 50, బెండకాయలు - 36, పచ్చిమిర్చి - 56, 74, కాకరకాయ - 40, బీర - 40, 50, క్యాబేజీ - 30, క్యారెట్ - 34, దొండకాయలు - 40, 46, బంగాళా దుంపలు - 20, 23, ఉల్లి - 23, 29, గోరుచిక్కుళ్లు - 40, దోసకాయలు - 14, చిక్కుళ్లు- 70, చేమదుంపలు - 40, బీట్‌రూట్ - 34, కీరదోస - 40, బీన్స్‌కాయలు - 90, అల్లం - 50, క్యాప్సికం - 72, బొబ్బర్లు - 38, చిలకడదుంపలు - 36, ఒకటి చొప్పున అనపకాయ - 12, 18, పొట్లకాయ - 25, 30, అరటికాయ - 5, 7, మునగకాడ - 10, 12, మామిడికాయ - 10, 12, నిమ్మకాయలు(డజన్) - 24, 36, 48.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ఉ॥ 10 - మ॥ 1	
సాంబమూర్తినగర్	91548 46719
మసీదుసెంటర్	91541 18210
గాంధీనగర్	80085 74159
బాలాజీచెరువు	80085 74154
కాకినాడ నగరం	80085 74157

రహదారి పరిశుభ్రం

కాకినాడలోని పళ్లంరాజునగర్, రాజారామ్మోహననగర్ ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు పెరిగి స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఈ నెల 4న 'అభివృద్ధికి దూరం.. సమస్యలతో సతమతం' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి నగరపాలక అధికారులు స్పందించారు. సిబ్బందితో ముళ్ల కంపలు తొలగించారు.

నీటి వృథాకు అడ్డుకట్ట

స్పందనకు వందనం

గొడారిగుంట సమీపంలోని లక్ష్మీనగర్ ప్రధాన రహదారిలో గుడి వద్ద నగరపాలక సంస్థకు చెందిన వీధి కొళాయి ద్వారా కొన్ని రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. దీనిపై ఈ నెల 6న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొళాయికి బిరడా బిగించి సమస్యను పరిష్కరించారు.

డివైడర్ రాళ్లు తొలగించారు..

శ్రీనగర్ ప్రధాన రహదారిలో నాలుగు రోడ్ల కూడలి వద్ద స్లాబురాళ్లు అడ్డుగా ఉండటంతో మలుపు తిరిగే క్రమంలో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకురాగా స్పందించారు. సిబ్బందితో అడ్డుగా ఉన్న డివైడర్ రాళ్లను తొలగించి పరిష్కరించారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

తీరని వేదన.. ఏదీ సాంత్వన

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లినా, మండలాల్లో అధికారుల చుట్టూ తిరిగినా సమస్యలు పట్టించుకోవడం లేదని, మీరైనా వేదనను అర్థం చేసుకుని పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావుకు మొరపెట్టుకున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఇక్కడకు వస్తున్నామని, తమ బాధలు తెలుసుకుని సాంత్వన చేకూర్చాలని వేడుకున్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, తల్లికి వందనం, భూ సమస్యలు, ఉపాధి కల్పన వంటి అనేక సమస్యలపై అర్జీలు అందించారు.

భూమి లేకపోయినా.. రికార్డుల్లో ఉందంటున్నారు

నాకు సెంటు భూమి లేదు. అయినా నా పేరుతో 11.303 ఎకరాలు ఉందని రికార్డుల్లో నమోదైంది. దీంతో నా ఇద్దరి పిల్లలకు తల్లికి వందనం ఆపేశారు. నా పేరుతో ఉన్న భూమిని రికార్డుల నుంచి తొలగించాలని తహసీల్దారును కలిసినా పట్టించుకోలేదు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో రెండుసార్లు అర్జీ ఇచ్చినా.. న్యాయం జరగలేదు. ఇప్పటికైనా ఆ భూమిని రికార్డుల నుంచి తొలగించి, నా ఇద్దరి పిల్లలకు తల్లి వందనం సొమ్ములు మంజూరు చేసి ఆదుకోవాలి.

- రాయుడు గిరిజ, యండమూరు, కరప మండలం

కుటుంబానికి ఆసరా కల్పించండయ్యా..

మాది కొత్త కాకినాడ. నా భర్త భర్త మల్లికార్జునరావు, నేను కూలీ పనులు చేసుకుని ఇద్దరు ఆడపిల్లల్ని పెంచుకుంటున్నాం. అనారోగ్యంతో నా భర్త మరణించాడు. ఒక అమ్మాయికి వివాహం చేశాం. రెండో ఆడబిడ్డ, నేను కూలీ పనులు చేసుకుని మా అమ్మ ఇంటికి వెళ్లి జీవిస్తున్నాం. వితంతువు పింఛనుకు గ్రామ సచివాలయానికి వెళ్లినా పట్టించుకోవడం లేదు. మంజూరు చేసి మా కుటుంబానికి ఆసరా కల్పించాలని కోరుతున్నాను.

- మేడిశెట్టి మంగాదేవి, రేపూరు, కాకినాడ గ్రామీణ మండలం

మూడు విద్యుత్తు కనెక్షన్ల పేరుతో కార్డు తీసేశారు..

నేను వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాను. నాకు భార్య, ఇద్దరు పిల్లలు. నా పేరుతో మూడు విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. నాకు ఒకే విద్యుత్తు మీటరు ఉంది. గతంలో రేషన్‌కార్డు ఈ కారణంతో ఆపేశారు. దీంతో సంక్షేమ పథకాలు రావడం లేదు. కొత్తగా దరఖాస్తు చేసినా తిరస్కరిస్తున్నారు. నా పేరుపై అక్రమంగా ఉన్న రెండు కనెక్షన్లు తొలగించి, కొత్త రేషన్ కార్డు ఇప్పించాలి.

- మొయ్యేటి తారకేశ్వరరావు, ఎ.కొత్తపల్లి, తొండంగి మండలం

కాలు లేకున్నా కనికరించరా?

గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నా కాలు పాక్షికంగా దెబ్బతింది. కాళ్లల్లో అమర్చిన ఇనుపరాడ్లకు సంబంధించి తలెత్తిన సమస్యతో రెండేళ్ల కిందట కుడి కాలును పూర్తిగా కోల్పోయాను. దీంతో నా కుటుంబం వీధిన పడింది. దివ్యాంగుల పింఛను కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా. ఇప్పటికీ మంజూరు కాలేదు. అధికారులు నాకు న్యాయం చేయాలి.

- బర్రే ధనరాజ్, శ్రీరాం నగర్, జగన్నాథపురం

ఎన్‌సీసీ కేడెట్లకు ర్యాంకుల ప్రదానం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ర్యాంకుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ కెప్టెన్ డాక్టర్ జిజి. ప్రమీలరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ర్యాంక్స్ కల్నల్ హెచ్ఎస్ మానిక్, ప్రిన్సిపల్ డా. వి.అనంతలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ర్యాంకులు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సువర్చల, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం.వసంతలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్థానిక ప్రతాప్‌నగర్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మల్లయ్యఅగ్రహారం, రెడ్‌క్రాస్ వీధి, ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్, ఎల్విన్‌పేట, సుబ్బారావు వీధి, దాట్లవారి వీధి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని చెప్పారు.

భాజపా ఈస్ట్ మండలాధ్యక్షుడిగా శేఖర్

గాంధీనగర్, న్యూస్‌టుడే: భారతీయజనతా పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఈస్ట్ మండలాధ్యక్షుడిగా గాలిదేవర శేఖర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేలా కార్యకర్తలు, నాయకులతో కలిసి ముందుకు సాగుతానన్నారు. కేంద్రంలోని మోదీ నాయకత్వంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింతగా ప్రజల్లోకి తీసుకెళతానని చెప్పారు.

ద్విచక్రవాహనదారులకు కౌన్సెలింగ్

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ నగరంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లతో ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారిపై ట్రాఫిక్-2 సీఐ డి.రామారావు సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇలా నడుపుతున్న 52 మందిపై కేసులు నమోదు చేసి, చలానా విధించారు. అనంతరం ఆయా సైలెన్సర్లను తొలగించారు. తర్వాత ట్రాఫిక్-2 స్టేషన్‌లో వాహనదారులకు సీఐ అవగాహన కల్పించారు. ట్రాఫిక్-2 ఆర్ఎస్సై రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్‌రైజ్ నూతన కార్యవర్గం

రోటరీ సేవలు మరింత విస్తృతం

గాంధీనగర్, న్యూస్‌టుడే: రోటరీ సేవలు ప్రజలకు పూర్తిగా అందేలా సభ్యులు వివిధ మాధ్యమాల ద్వారా విస్తృతం చేయాలని రోటరీ పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.వీరభద్రారెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్‌రైజ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని సోమవారం నగరంలోని హోటల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీరభద్రారెడ్డి మాట్లాడుతూ క్లబ్ చేసే కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. క్లబ్ అధ్యక్షుడిగా ఎ.శామ్యూల్, కార్యదర్శిగా ఎం.విజయలక్ష్మిలతో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ కృష్ణకుమారి ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీకృష్ణవర్మ, సాయిసుందర్, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎఫ్‌టీలో ఎంబీఏ తరగతుల ప్రారంభం

గాంధీనగర్, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూకే ప్రాంగణంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)లో ఎంబీఏ (ఇంటర్నేషనల్ బిజినెస్) మొదటి బ్యాచ్ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ బ్యాచ్‌లో ఐపీఎం-2022 కోహోర్ట్ విద్యార్థులు, కొత్తగా ప్రవేశించిన వారు ఉన్నారు. కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించిన అనంతరం ఐఐఎఫ్‌టీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాకేష్ మోహన్ జోషి మాట్లాడుతూ ఎంబీఏ(ఐబీ) కార్యక్రమం ప్రపంచ వాణిజ్యం, అంతర్జాతీయ వ్యాపారాల సంక్లిష్టతలపై మార్గదర్శనం చేయడానికి, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నిపుణులను తయారు చేయడానికి ఒక గొప్ప అవకాశంగా పేర్కొన్నారు. సెంటర్ హెడ్ ప్రొఫెసర్ వి.రవీంద్ర సారధి మాట్లాడుతూ నాలుగు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులకు సంస్థ విద్యా వృత్తిపరమైన వాతావరణాన్ని పరిచయం చేస్తామని చెప్పారు. ప్రోగ్రామ్ డైరెక్టర్ మికలేష్ ప్రసాద్ యాదవ్, అధ్యాపకులు సౌరవ్ దాస్, జేకే వర్మ, సిద్ధార్థ్ శంకర్ రాయ్, రష్మిరస్తోగి, ఓలీ మిశ్రాలు మాట్లాడారు. ఐఐఎఫ్‌టీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐఎఫ్‌టీ మొదటి ఎంబీఏ బ్యాచ్ విద్యార్థులు

నినాదాలు చేస్తున్న మహిళలు

కలెక్టరేట్ వద్ద మహిళల ధర్నా

కాకినాడ కలెక్టరేట్: అర్హులకు ఇళ్ల స్థలాలు, సామాజిక భద్రత పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ(ఆర్‌సీపీఐ) ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో పేద మహిళలు ధర్నా నిర్వహించారు. కాకినాడ నగరంలోని పర్లోపేట, శాంతినగర్, దుమ్ములపేటలో పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. బుల్లబ్బాయిరెడ్డి కాలనీలో రహదారులు, డ్రెయిన్లు, తాగునీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఆర్‌సీపీఐ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి శివకోటి రాజు, వడ్లమూరి మంగాదేవి, పి.వరలక్ష్మి పాల్గొన్నారు.

'స్త్రీ గొంతుక' పట్టించింది!

బంగారం చోరీ కేసు ఛేదన

గుడివాడ: చెడు నడత కలిగిన కొందరి మధ్య నెల్లూరు జైలులో ఏర్పడిన స్నేహం ఓ ముఠాగా ఏర్పాటై పలు చోరీలకు పాల్పడేలా చేసింది. గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా పామర్రు మండలం మలయప్పన్ పేటకు చెందిన ఎస్.ప్రమీల రాణి ఇంట్లో ఫిబ్రవరి 22న రాత్రి 16 కాసుల బంగారం దొంగల పాలైంది. నేరం జరిగిన రోజున దొంగల వెంట పడిన సమయంలో స్థానికులు ఓ స్త్రీ గొంతుకను గుర్తించినట్లు సమాచారం తెలుసుకున్న సీసీఎస్ ఎస్.ఐ శీలం స్వామి దాసు దాని ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులలో ఒకరైన ఏలూరుకు చెందిన మున్నా(సిరి) అనే ట్రాన్స్‌జెండర్‌ను అదుపులోనికి తీసుకోగా అసలు విషయం బయట పడింది. ఈ కేసులో ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ షబ్బీర్, ట్రాన్స్‌జెండర్ షేక్ మున్నా (సిరి), కాకినాడకు చెందిన కోరాది శ్రీనివాసరావులను ప్రధాన నిందితులుగా గుర్తించారు. వారిని బల్లిపర్రు వద్ద ఆదివారం అదుపులోనికి తీసుకుని వారి నుంచి 16 కాసుల బంగారం రికవరీ చేశారు. వారిపై రాష్ట్ర వ్యాప్తంగా 110కు పైగా కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు.

ఎన్నాళ్లిలా వదిలేస్తారు?

కాకినాడ ఆర్ఆర్‌నగర్‌లోని రోడ్ నంబరు 1లో మూడు రోడ్ల కూడలి వద్ద కల్వర్టు పై ఉన్న స్లాబు రాళ్లు దెబ్బతిన్నాయి. నెల రోజులు గడుస్తున్నా ఇంతవరకు వాటికి మరమ్మతులు చేపట్టలేదు. కల్వర్టు వద్ద కర్రలతో అడ్డుకట్ట వేసి వదిలేశారు. రాత్రి రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

ఉద్యానం.. పక్కన అధ్వానం

కాకినాడ పెద్దిరెడ్డివారివీధిలోని నగర పాలకసంస్థ పార్కు పక్కన చెత్తా చెదారం పేరుకుపోయి అధ్వానంగా దర్శనమిస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, దుర్వాసన వస్తుందని సందర్శకులు వాపోతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో పురుగులు, విష కీటకాలు చేరే అవకాశాలు ఉన్నాయని భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదుసెంటర్

పచ్చదనం పోయే.. పిచ్చిమొక్కలు పెరిగే..

నగర సుందరీకరణలో భాగంగా పలు ప్రాంతాల్లో రహదారులు, రహదారి విభాగినుల వద్ద మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో మొక్కలు ఎండిపోయి లక్ష్యం నీరు గారుతోంది. శశికాంత్‌నగర్, సురేష్‌నగర్, దుమ్ములపేట బైపాస్ రహదారుల్లో డివైడర్ల వద్ద రెండేళ్ల క్రితం మొక్కలు నాటారు. సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో కొద్దికాలానికే నాటిన మొక్కలు పశువులకు ఆహారంగా మారాయి. మరికొన్ని నీరు లేక ఎండిపోయాయి. ప్రస్తుతం ఆ విభాగినుల వద్ద పిచ్చిమొక్కలు పెరిగి కళా విహీనంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా నగరపాలక అధికారులు స్పందించి మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

జనవిజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీ ఎన్నిక

గాంధీనగర్: జనవిజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా సమావేశాన్ని సోమవారం రామారావుపేటలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జవివే జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంవీఆర్ కృష్ణాజీ హాజరై మాట్లాడుతూ సైన్స్‌పై సరైన అవగాహన ప్రజా జీవితాలను మెరుగుపరుస్తుందన్నారు. జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచ స్థిరత్వానికి ప్రజా అవగాహన ప్రాముఖ్యాన్ని తెలియజేశారు. విశ్రాంత ఆచార్యుడు అబ్బయ్య ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రజలకు ఉండాల్సిన అవగాహనను వివరించారు. ఈ సందర్భంగా జవివే జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ కాదా వెంకటరమణ, అధ్యక్షులుగా కొమ్మన తాతారావు, ప్రధాన కార్యదర్శిగా పి.రామకృష్ణ, కోశాధికారిగా దీక్షితుల కిరణ్మయి, ఉపాధ్యక్షులుగా సత్యమూర్తి, చింతపల్లి సుబ్బారావు, కార్యదర్శులుగా మాణిక్, సహాయకార్యదర్శులుగా అంటోని శ్రీనివాసు, అబ్బయ్య, పి.సూర్యప్రసాద్, క్రీడా జగన్నాథరావులను ఎన్నుకున్నారు. జిల్లా ప్రగతిశీల రచయితల సంఘం అధ్యక్షుడు పి.సుబ్బరాజు, కాశీ విశ్వనాథ్, శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యులు, విద్యావేత్త అబ్బయ్య

ప్రతి కుటుంబానికి సుపరిపాలన ఫలాలు: ఎమ్మెల్యే

కాకినాడ నగరం: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సుపరిపాలన ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. 'సుపరిపాలనలో ముందడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని 10, 25వ డివిజన్లలో కొండబాబు పర్యటించారు. ఇంటింటా తిరిగి ఏడాది పాలనలో చేసిన సంక్షేమ, అభివృద్ధి వివరాలను కరపత్రాల రూపంలో ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని చక్కదిద్దుతూనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని చెప్పారు.

ప్రభుత్వ పాలన తీరును వివరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

ఆయా డివిజన్ల పార్టీ నాయకులు ఏరిపిల్లి రాము, మూగు రాజు, మేడిశెట్టి ఈశ్వరరావు, కొప్పనాతి నాగకుమారి, మోసా పేతురు, చోడిపిల్లి సతీష్, ఎ.అబ్బాయి, ఎం.అంద్రియ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పుట్టినరోజు వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక 47వ డివిజన్ నరసన్ననగర్‌లోని సామాజిక భవనంలో ఎమ్మార్పీఎస్ నేత కొండేపూడి శ్యాంబాబు కుమారుడు డాక్టర్ రాజాజీరామ్ ఆధ్వర్యంలో బాబూజగ్జీవన్‌రామ్ యూత్ సారథ్యంలో ఉచిత వైద్యం, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వీటిని ఆర్డీవో ఎస్.మల్లిబాబు ప్రారంభించారు. రాజాజీరాయ్ మాట్లాడుతూ మంద కృష్ణ సుదీర్ఘ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. వైద్యులు రవికిరణ్, రమేశ్‌చంద్ర, యండమూరి లావణ్య, ఎం.విశ్వనాథ్‌గంగాధర్ ఉచిత శిబిరంలో పేదలకు వైద్య సేవలందించారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

వర్గీకరణతో మేలు..

కాకినాడ నగరం: ఎస్సీ వర్గీకరణతో మాదిగ ఉప కులాలకూ ప్రయోజనం చేకూరనుందని మోచీకుల సంఘ జిల్లా ప్రతినిధి కటారి పద్మనాభం అన్నారు. స్థానిక మోచీ వీధిలో సోమవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ ఉద్యమ ఫలితంగానే వర్గీకరణ సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన పిల్లలను సత్కరించి వారికి విద్యాసామగ్రి అందజేశారు. బోనగిరి పోతురాజు, కటారి ప్రసాద్, శ్రీను, బోనగిరి సురేష్, సర్వశుద్ధి రాంబాబు, చింతం ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 64 ఫిర్యాదులు

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఏఎస్పీ భాస్కరరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 64 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను విన్నవించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఏఎస్పీ నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసు అధికారులు, ఫిర్యాదుదారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ

బుద్ధుడి సిద్ధాంతాలు ఆచరణీయం

కాకినాడ నగరం: గౌతమ బుద్ధుని సిద్ధాంతాలు, ఆశయాలు అనుసరణీయం, ఆచరణీయమని సామాజిక సాధన సమితి అధ్యక్షురాలు డాక్టర్ భానుమతి, జిల్లా ఎస్సీ ఎస్టీ మానటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు అయితాబత్తుల రామేశ్వరరావు, డా.కేఆర్ఎస్ జవహర్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం 'బుద్ధునితో నా ప్రయాణం' అనే తెలుగు నాటక ప్రదర్శనకు సంబంధించి కరపత్రాలు, పోస్టర్లను వారు ఆవిష్కరించారు. నాటక ప్రదర్శక కమిటీ కన్వీనర్ పిల్లి రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భానుమతి, రామేశ్వరరావు మాట్లాడుతూ సుదీర్ఘ అధ్యయనం తరువాత అంబేడ్కర్ బౌద్ధాన్ని స్వీకరించారని, ఆ నేపథ్యాన్ని వివరించే ఈ నాటకాన్ని ఈ నెల 26న కాకినాడలో ప్రదర్శిస్తారని వివరించారు. రాంప్రసాద్, టి.నూకరాజు, ఎన్.పెద్దిరాజు, మౌర్య, ఎన్.రమేష్, ఎస్వీ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం కోరుతూ ప్రదర్శన

గాంధీనగర్, న్యూస్‌టుడే: కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం నగరంలో ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. భానుగుడి సెంటర్‌లో ప్రదర్శనను సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా బేబిరాణితో పాటు ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్‌టీయూసీ నేత తాళ్లూరి రాజు, ఏఐసీసీటీయూ రాష్ట్ర కన్వీనర్ జి.సత్యనారాయణలు మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పనిగంటలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్త పోరాటాలకు సిద్ధమని ప్రకటించారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు మోదీ నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చారని ఆరోపించారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భానుగుడి సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మసీదుసెంటర్: ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ కాంట్రాక్ట్ అండ్ సెక్యూరిటీ వర్కర్స్ యూనియన్ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జీజీహెచ్‌లో యూనియన్ అధ్యక్షుడు రామయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరై మాట్లాడుతూ దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ధర్మ, మధు, జాన్‌బాబు, రమణమ్మ, వెంకటేష్, కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: కరప మండలం గురజనాపల్లికి చెందిన బి.లోవతల్లి(31) ఇంటి వద్ద పాముకాటుకు గురవడంతో ఈ నెల 3న జీజీహెచ్‌లో చేర్చారు. ఆమె చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందారు. దీనిపై కరప పోలీసులు కేసు నమోదు చేశారు.

టౌన్ రైల్వేస్టేషన్‌కు ఆధునిక హంగులు

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

అమృత్ భారత్ పథకం కింద కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆధునిక హంగులతో, విశాలమైన ప్రాంగణం, ప్రయాణికులు వేచి ఉండేందుకు ఏసీ గదులు.. తదితర వసతులు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. స్టేషన్ ఆవరణను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. స్టేషన్ ముఖ ద్వారం వద్ద గోడలకు గొడుగు ఆకారంలో పెంకులను అమర్చారు. లోపలి వైపు గాలి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. గోడలకు రంగులు అద్దారు. ప్రయాణికులు, వాహనాల రాకపోకలకు ఇంతకు ముందు ఉన్న రహదారిని, డివైడర్‌ను తొలగించి విస్తరించారు. పార్కింగ్‌కు విశాలమైన ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. కొత్త షెడ్‌ను నిర్మించారు. ఇప్పటికే ఒకటో నంబరు ప్లాట్‌ఫాం పనులు పూర్తయ్యాయి. రెండో నంబరు ప్లాట్‌ఫాం వద్ద పై భాగాన ఉన్న పాత షెడ్డును తొలగించి కొత్తది నిర్మిస్తున్నారు. ప్రయాణికులు కూర్చునేందుకు ప్లాట్‌ఫాం పొడవునా కొత్త స్టీలు కుర్చీలను ఏర్పాటు చేశారు. తాగునీటి కొళాయిలు కొత్తవి బిగించారు. ఇప్పుడున్న వెయిటింగ్ హాళ్లు కాకుండా కొత్తగా మరో మూడు ఏసీ వెయిటింగ్ హాళ్ల నిర్మాణం చేపట్టారు. మరింత నాణ్యమైన అనౌన్స్‌మెంట్ సిస్టం, అధునాతన ఎల్ఈడీ బోర్డులను అమర్చారు. ఆవరణలో మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అతి త్వరలోనే అన్ని పనులు పూర్తిచేసుకుని ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

ప్లాట్‌ఫాం వద్ద ఏర్పాటుచేసిన కుర్చీలు

నిర్మాణంలో విశ్రాంతి గదులు

వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు కైవసం

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఈనెల 6న రాజమహేంద్రవరంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఓపెన్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని కళాశాల పీడీ రమణ సోమవారం తెలిపారు. 61 కేజీల బాడీ కేటగిరీలో పి.సతీష్‌కుమార్, 79 కేజీల విభాగంలో యశ్వంత్‌కుమార్ బంగారు పతకాలతో సత్తా చాటారని చెప్పారు. వారిని ప్రిన్సిపల్ డా.కందుల ఆంజనేయులు అభినందించారు. పీడీ డా.రమణ, జూవాలజీ హెచ్‌వోడీ డా.చక్రవర్తి, కామర్స్ హెచ్‌వోడీ డా.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత వైద్యుడికి సన్మానం

సర్పవరం జంక్షన్: కాకినాడ అర్బన్ బ్యాంకు కాలనీలో సోమవారం విశ్రాంత వైద్యుడు పాండురంగవిఠల్‌ను 48 ఏళ్ల తరువాత వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన చిన్ననాటి స్నేహితులు కలుసుకుని జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. కాకినాడ జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థో హెచ్‌వోడీగా పదవీ విరమణ చేసిన డా.పాండురంగవిఠల్, ఆయన భార్యను పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ హైస్కూల్‌లో 1976-77లో ఆయనతో పదో తరగతి చదివిన వారంతా కలిసి సన్మానించారు. డా.వేణుగోపాల్, రాంబాబు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రాజు, సలీందేవా తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

గాడిమొగ రిలయన్స్ కంపెనీలో మాక్ డ్రిల్

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

తాళ్లరేవు: గాడిమొగ రిలయన్స్ కంపెనీలో కాకినాడ జిల్లా కర్మాగారాల తనిఖీ విభాగం, అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ట్రక్కు, లోడింగ్ ప్రదేశంలో గ్యాస్‌లీకైతే ఎలా స్పందించాలో చేసి చూపించారు. రిలయన్స్ కంపెనీకి చెందిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిశ్రమల విభాగం అధికారులు నారాయణ, రాంబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి రాజేశ్వర్, రిలయన్స్, ఓఎన్‌జీసీ అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

అర్జీల గురించి ఆరా తీయొచ్చు

పిఠాపురం: పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన అర్జీలు ఏ స్థాయిలో ఉన్నాయో 1100కు నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పాడా పీడీ చైత్రవర్షిణి తెలిపారు. సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. 46 అర్జీలు స్వీకరించారు. తహసీల్దారు గోపాలకృష్ణ, కమిషనర్ కనకారావు పాల్గొన్నారు. ✦ **పెద్దాపురం:** పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో నాలుగు అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో శ్రీరమణి తెలిపారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న పాడా పీడీ చైత్రవర్షిణి

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: కాకినాడ గ్రామీణం: 80085 74325 | పెద్దాపురం: 80085 74198 | పిఠాపురం: 80085 65544

సమస్య: పెనుగుదురు దేవుడమ్మ నీకి వెళ్లే దారిలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. **- సత్యనారాయణ**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ చెప్పగా పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, కరప**

సమస్య: గొల్లప్రోలు కరణంగారి తోట వీధి రోడ్డుపై చెత్త పేరుకుపోయి సమీప ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. **- స్థానికులు**

పరిష్కారం: ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

సమస్య: స్థానిక శివాలయంవీధి మలుపులో చెత్తకుప్పలు తొలగించక దుర్వాసన వస్తోంది. **- ఎం.ప్రసాద్**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా కార్మికులతో శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, పెద్దాపురం**

సమస్య: కాకినాడ అర్బన్ రమణయ్యపేట మార్కెట్ వద్ద మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదు. **- ఎం.రాఘవేంద్రస్వామి**

పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షకుడు పరిపూర్ణ చెప్పగా సిబ్బంది పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్**

సమస్య: పిఠాపురం జగ్గయ్యచెరువులో పారిశుద్ధ్య పనులు జరగలేదు. చెత్త పేరుకుంది. **- కృష్ణవేణి**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్ చెప్పగా కార్మికులతో చెత్తకుప్పలు తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, పిఠాపురం**

సమస్య: కొత్తపల్లి ప్రధాన సెంటర్‌లో మురుగు కాలువ పూడికతో నిండిపోయింది. **- సుబ్బారావు**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సిబ్బందిని పంపి పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, కొత్తపల్లి**

ప్రత్యామ్నాయం చూపక.. పాఠం సాగదిక..

రూ.17.50 కోట్లతో 52 గదులు..

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: పాఠశాలలు తెరిచేనాటికి అదనపు తరగతి గదులు అందుబాటులోకి వస్తాయని, చదువులు మంచి వాతావరణంలో కొనసాగించవచ్చని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదురుచూశారు. గత ప్రభుత్వంలో నిధులు సరిగా కేటాయించని కారణంగా వారి ఆశలు నెరవేరలేదు. ప్రభుత్వ పాఠశాలలు తెరిచిన వెంటనే పుస్తకాలు తదితర వస్తువులు అందించినప్పటికీ తరగతి గదులు సరిపోక కాకినాడ గ్రామీణంలో చాలాచోట్ల ఇప్పటికీ చాలీచాలని ఇరుకు గదుల్లోనే బోధన సాగుతోంది.

కాకినాడ గ్రామీణ పరిధిలో 13 ఎంపీపీ, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సుమారు రూ.17.50 కోట్లతో 52 అదనపు తరగతి గదుల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. కొన్ని నెలలుగా నిధులు మంజూరు కాకపోవడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. కొన్నిచోట్ల తరగతి గదుల నిర్మాణం పూర్తయినప్పటికీ తలుపులు, కిటికీలు, విద్యుత్తు సౌకర్యం కల్పించకపోవడంతో ఉపయోగంలోకి రాలేదు. మరి కొన్ని చోట్ల నిర్మాణం మధ్యలో ఆగిపోయి ఉన్నాయి. తూరంగి వగలాలపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో అధికారులు ముందుగా మట్టి నమూనాలు సేకరించకుండా రూ.24 లక్షల అంచనాతో రెండు తరగతి గదుల నిర్మాణానికి రూ.8 లక్షలతో పునాది వేశారు. అక్కడ నిర్మాణం సాధ్యం కాదని నిపుణులు తేల్చడంతో నిధులు నిరుపయోగమయ్యాయి. సుమారు రూ.6 కోట్లు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కాకినాడ గ్రామీణంలో సగంలో ఆగిన గదుల నిర్మాణం

ఉన్నతాధికారులకు తెలిపాం..

అదనపు తరగతి గదుల నిర్మాణాలు నిధులు మంజూరు కాక నిలిచిపోయాయి. చాలా చోట్ల గదులు పూర్తయినా.. ఇతర సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఉన్నతాధికారులకు తెలిపి వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

- వేణుగోపాల్, మండల విద్యాశాఖాధికారి

విద్యార్థుల ఆరోగ్య వివరాలు నమోదు

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. యూపీహెచ్‌సీ వైద్యుడు అమృతరావు విద్యార్థుల ఎత్తు, బరువు, హెచ్‌బీ స్థాయిల వివరాలు హెల్త్ కార్డుల్లో నమోదు చేశారు. మలేరియా, డెంగీ జ్వరాలపై అవగాహన కల్పించారు. హెచ్‌వీ లక్ష్మీరమణ, సిబ్బంది ఆనంద్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానానికి విరాళాలు

పెద్దాపురం: పెద్దాపురం మరిడమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా అన్నదానానికి కాకినాడకు చెందిన ఫైండా భీమేశ్వరరావు దంపతులు రూ.50,001, పెద్దాపురానికి చెందిన చలపాక రామకృష్ణ రూ.10,116 సోమవారం అందించారు. ఆలయ ఏసీ విజయలక్ష్మి, వేదపండితులు వేంకటశాస్త్రి, ప్రసాదశర్మ, ఆసాదులు నాని, విజయ్ వారికి అభినందనలు తెలిపారు.

ప్రజలకు కరపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి

సామర్లకోట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు లభిస్తాయని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. సోమవారం సామర్లకోటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కుమ్మరవీధిలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ✦ **పెద్దాపురం:** ఎమ్మెల్యే చినరాజప్ప స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యక్రమంలో భాగంగా పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ప్రతిపాదించిన కార్యాలయం భవనాన్ని సోమవారం సందర్శించారు. విజన్ టీమ్ సభ్యులతో మాట్లాడారు. ఆర్డీవో శ్రీరమణి, రాజాసూరిబాబురాజు తదితరులు పాల్గొన్నారు. ✦ **తాళ్లరేవు:** ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే బుచ్చిబాబు జెల్లావారి పేట, రత్నావారి పేట, సీతారామపురం ప్రతాప్‌నగర్, కోరింగ గ్రామాల్లో కొప్పిశెట్టి చంటి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ✦ **సర్పవరం జంక్షన్:** మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి చీడిగలో సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పాల్గొన్నారు. కాకినాడ అర్బన్ 47వ డివిజన్‌లో కటకంశెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో అప్పారావు, నాగమణి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ✦ **పెద్దాపురం:** పెద్దాపురంలో నాయకులు రాజాసూరిబాబురాజు, సత్యనారాయణ, కాండ్రకోటలో నాని, గొల్లబాబు, ప్రకాష్, శివరామకృష్ణ, రుద్రయ్య, నాగన్న, రాజా, సూరిబాబు ప్రచారం నిర్వహించారు.

సీతారామపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

47వ డివిజన్‌లో పాల్గొన్న ప్రభాకర్ తదితరులు

భీమేశ్వరస్వామికి విశేష పూజలు

సామర్లకోట: సామర్లకోట కుమారారామా భీమేశ్వర స్వామి ఆలయంలో యోగలింగమూర్తి భీమేశ్వరస్వామికి, అమ్మవారికి ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.

అలంకరణలో యోగలింగమూర్తి

నేటి నుంచి గురుపౌర్ణమి మహోత్సవాలు

సామర్లకోట: సామర్లకోట స్టేషన్ సెంటర్‌లోని శిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం నుంచి గురుపౌర్ణమి మహోత్సవాలు జరుగుతాయని ఆంధ్రా సాయి గీతా సమాజం ప్రతినిధులు అప్పారావు, సత్యనారాయణ, రాజబాబు తెలిపారు.

విశ్రాంత వైద్యుడికి సన్మానం

సర్పవరం జంక్షన్: కాకినాడ అర్బన్ బ్యాంకు కాలనీలో సోమవారం విశ్రాంత వైద్యుడు పాండురంగవిఠల్‌ను 48 ఏళ్ల తరువాత వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన చిన్ననాటి స్నేహితులు కలుసుకుని జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. కాకినాడ జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థో హెచ్‌వోడీగా పదవీ విరమణ చేసిన డా.పాండురంగవిఠల్, ఆయన భార్యను పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ హైస్కూల్‌లో 1976-77లో ఆయనతో పదో తరగతి చదివిన వారంతా కలిసి సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు. డా.వేణుగోపాల్, రాంబాబు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రాజు, సలీందేవా తదితరులు పాల్గొన్నారు.

డా.పాండురంగవిఠల్‌తో పూర్వ విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు కృషి

కాజులూరు: పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని ఎంపీడీవో రాంబాబు అన్నారు. సోమవారం ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 26 గ్రామాల్లో 500 కొబ్బరి మొక్కలు ఉపాధి కూలీలతో నాటించాలన్నారు

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

తాళ్లరేవు: సీతారామపురం ఆదర్శ పాఠశాలలో జాతీయ డెంగీ మాసోత్సవాన్ని గాడిమొగ పీహెచ్‌సీ వైద్యులు ఈశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వీధుల్లో ర్యాలీ చేశారు. తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.

గ్రామసభలో వాగ్వాదం

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచి గోవలక్ష్మి అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రమణమ్మ మాట్లాడుతూ ఇంటి పన్నులతో రూ.10 లక్షల ఆదాయం వస్తోందని, ఆర్థిక సంఘం, రిలయన్స్ సంస్థ ద్వారా సీఎస్ఆర్ నిధులతో కలిపితే రూ.6.72 కోట్లు ఉన్నట్లు వివరించారు. ఓ పాలకవర్గ సభ్యుడు పంచాయతీలో జరుగుతున్న పలు అంశాలపై మాట్లాడుతుండగా కొందరు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. కాసేపటికి సర్పంచి భర్త మాతరాజు మాట్లాడుతుండగా మళ్లీ వాగ్వాదం జరిగింది. దీంతో సర్పంచి గ్రామసభను ముగించారు.

పిఠాపురంలో ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

హక్కుల పరిరక్షణకే సార్వత్రిక సమ్మె

కాజులూరు: కార్మిక, కర్షక హక్కుల పరిరక్షణకు ఈ నెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు కోరారు. సోమవారం పల్లిపాలెం, కోలంక, దుగ్గదూరు గ్రామాల్లో పర్యటించారు. ● **పెద్దాపురం:** పెద్దాపురం మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పురపాలిక కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్దాపురంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభాకర్‌వర్మ, సత్తిబాబు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు. ● **పిఠాపురం:** పిఠాపురం పట్టణంలో అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. సత్యనారాయణ, చిన్నా, సూరిబాబు, గోపాలకృష్ణ, వీరబాబు, గోవిందు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బురద నీటనే రాకపోకలు సాగించాలా..

తాటిపర్తి సచివాలయం ఎదురుగా ప్రధాన రహదారికి రెండువైపులా డ్రెయిన్లు లేకపోవడంతో మురుగు, వర్షం నీరు రోడ్డుపై నిలిచి ప్రయాణికులు, సమీప ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కచ్చా డ్రెయిన్లు సైతం ఏర్పాటుచేయకపోవడం ఇబ్బందిగా మారింది. చర్యలు చేపడతామని డిప్యూటీ ఎంపీడీవో కుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

కాలనీలో సౌకర్యాల కొరత

గాడిమొగలోని జగనన్నకాలనీలో రూ.లక్షలు వెచ్చించి ఇళ్లు నిర్మించుకున్నా, వెళ్లేందుకు రహదారులు, తాగునీరు సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని పినపోతు పద్మ, ఓలేటి ధనలక్ష్మి, ఓలేటి లీలావతి, 4వ వార్డు సభ్యురాలు ఓలేటి శ్రీదేవి తదితరులు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. –న్యూస్‌టుడే, తాళ్లరేవు

హెచ్చరిక.. కనిపించే దారిలేక..

కరప మండలం కొరిపల్లి నుంచి అరట్లకట్ట వెళ్లే దారిలో మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వెంటనే ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ సాయిబాబారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

ఆక్రమణలపై కన్నెర్ర

యు.కొత్తపల్లి మండలం రవీంద్రపురంలో కాలువ ఆక్రమించి చేసిన నిర్మాణాలు తొలగించాలని సోమవారం గ్రామస్థులు నిరసన ప్రదర్శన చేశారు. వరదల సమయంలో రవీంద్రపురం ముంపుబారిన పడుతోందని కాలువలో పూడిక తొలగిస్తున్న యంత్రాన్ని ఆక్రమణదారులు అడ్డుకోవడంతో గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. – న్యూస్‌టుడే, కొత్తపల్లి

పిచ్చిమొక్కలు తొలగించక ఇక్కట్లు

గొల్లప్రోలు గాంధీనగరంలోని ప్రధాన కాలువ పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో మూసుకుపోయి మురుగునీరు ప్రవహించక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే కాలువల్లో నీరు ప్రవహించక రోడ్లు జలమయమవుతున్నాయి. ప్రధాన కాలువలో పిచ్చిమొక్కలు, వ్యర్థాలను తొలగించే పనులు చేపడతామని పారిశుద్ధ్య ఇన్‌ఛార్జి పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ తెలిపారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

వివాహిత ప్రాణం తీసిన పాముకాటు

కరప: గురజనాపల్లికి చెందిన బోనంగి లోవతల్లి(31) తన భర్త ప్రసాద్‌తో మనస్పర్థల నేపథ్యంలో ఏడాదిగా తన రెండేళ్ల కుమారుడుతో కలిసి తన తల్లి నివాసం వద్ద ఉంటున్నారు. ఈ నెల 3న ఇంట్లో వంట చేస్తుండగా పాము కరిచింది. అప్పటినుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి సోదరి శ్రీదేవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీత తెలిపారు.

నిందితుడికి 14 రోజుల రిమాండ్

కరప: నడకుదురులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 3న హుండీ చోరీ కేసులో తూరంగికి చెందిన అంజిబాబును అరెస్ట్ చేసి అతని నుంచి పోలీసులు రూ.3,060 స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నిందితుడిని ఎస్‌జేఎఫ్‌సీఎం ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్సై సునీత తెలిపారు.

అమినాబాదులో చోరీ

కొత్తపల్లి: అమినాబాదులోని కాకాడ ఆనందరావు ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బంధువుల ఇంటికి వెళ్లి సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులోని రూ.58 వేల నగదు చోరీ జరిగిందని బాధితులు తెలిపారు.

బాలికల హక్కులపై అవగాహన

పిఠాపురం: బాలికల హక్కుల గురించి అందరూ తెలుసుకోవాలని, ఎప్పుడైనా అన్యాయం జరిగితే విముక్తి పొందవచ్చని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సెలర్ దుర్గాదేవి అన్నారు. సోమవారం పిఠాపురం జగ్గయ్యచెరువులోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత ప్లస్ టూ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు జీవించే హక్కు, రక్షణ, అభివృద్ధి, పాల్గొనే హక్కు, మంచి చెడు స్పర్శల గురించి వివరించారు. సీడీపీవో దుర్గాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు వివరిస్తున్న కౌన్సెలర్ దుర్గాదేవి

కరకుదురులో దండోరా జెండా ఎగురవేస్తున్న కూటమి నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

పిఠాపురం, గొల్లప్రోలు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు, వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పుట్టినరోజు సంబరాలను కలిపి జరిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పిఠాపురం ఇందిరానగర్‌లో పేదలకు కేకు, దుస్తులు పంపిణీ చేశారు. కాకడ చిన్నబ్బాయి పెదపాటి బాల, తెదేపా నేతలు నల్లాశ్రీను, నామా దొరబాబు, కొరుప్రోలు శ్రీను, కోళ్ల బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు. రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉప్పాడసెంటర్‌లో వేడుకలు జరిపారు. కుమారపురంలో సోమవారం రాత్రి పాలాభిషేకం, మాధవపురంలో అన్నదానం నిర్వహించారు. చెందుర్తిలో డప్పులతో ఊరేగింపు అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి కేకు పంచారు. కాకాడ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ✦ **కరప:** కాకినాడ గ్రామీణ తెదేపా ఎస్సీ సెల్ నాయకుడు చాట్ర ఇమ్మాన్యుయేల్ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని వలసపాకల, కరపలలో బాబూజగ్జీవన్‌రామ్‌కు నివాళి అర్పించారు. రాయి చిన్న, తాతపూడి అప్పారావు, పెద్దపాపారావు, వీర్రాజు, సుధీర్ పాల్గొన్నారు. ✦ **కొత్తపల్లి:** నవచైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం అమినాబాదు సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. మోర్త రవి జెండా ఎగురవేశారు. బెన్‌జాన్సన్, ప్రసాద్, మనీష్, కిరణ్, దొరబాబు పాల్గొన్నారు. ✦ **పెదపూడి:** కరకుదురులో న్యూక్రాంతి యూత్ ఆధ్వర్యంలో దండోరా జెండా ఆవిష్కరించారు. నాగతిరుపతిరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పిఠాపురంలో చీరలు పంచుతున్న ఎమ్మార్పీఎస్, తెదేపా నేతలు

సమావేశాలు విజయవంతం చేద్దాం

పిఠాపురం: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్-2.0ను విజయవంతం చేయాలని ఎంపీడీవో చిన్నారావు, మండల ప్రత్యేక అధికారి మెల్లిని సునీల్‌కుమార్ తెలిపారు. సోమవారం పిఠాపురం మండల వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈవోలో శ్యాంబాబు, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చిన్నారావు

మత్తుపదార్థం అమ్మొద్దు.. వాడొద్దు

పెద్దాపురం, గొల్లప్రోలు, పిఠాపురం: యువత మద్యం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పెద్దాపురం సీఐ విజయశంకర్ అన్నారు. సోమవారం దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 'రహదారి భద్రత-మాదక ద్రవ్యాల నిషేధం'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్సై మౌనిక, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న దుకాణాల్లో పొగాకు, ఆల్కహాల్ సంబంధిత ఉత్పత్తులు అమ్మడం చట్ట విరుద్ధమని గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ ఓ ప్రకటనలో సోమవారం హెచ్చరించారు. ● పిఠాపురం నియోజకవర్గంలోని విద్యాసంస్థల వద్ద ఉండే దుకాణాలపై ప్రత్యేక నిఘా పెట్టామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. పాన్ షాపుల్లో సిగిరెట్లు, పొగాకు తదితర విక్రయాలు ఆపేయాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న సీఐ విజయశంకర్

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ షరీఫ్ అన్నారు. సోమవారం ఆయోధ్యరామపురం బచ్చు ఫౌండేషన్ పురపాలిక ఉన్నత పాఠశాలలో ఉదయం జరుగుతున్న అసెంబ్లీ సమయానికి విచ్చేసి పరిశీలించారు. మధ్యాహ్నభోజన పథకం అమలు గురించి తెలుసుకున్నారు. హెచ్ఎం సాయిరామకృష్ణ మెగా పేరెంట్స్ సమావేశానికి ఆహ్వానించారు.

పన్నే దన్ను..

అయిదేళ్లుగా అభివృద్ధికి దూరంగా జలవనరులు

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

వ్యవసాయ భూముల నీటి పన్ను వసూలు 2020 సంవత్సరం నుంచి నిలిచిపోవడంతో నిధుల్లేక కాలువలు, నీటి పారుదల వనరుల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కాలువ గట్ల గండ్లు పూడ్చే పనులు, గుర్రపుడెక్క, పూడిక తొలగింపు చేపట్టకపోవడంతో భారీ వర్షాలు, వరదలప్పుడు పంట పొలాలు ముంపునకుగురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎద్దడి సమయంలో ఆయకట్టు పొలాలకు సాగునీరు అందడంలేదు. రైతుల ఇబ్బందులను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం నీటి పారుదల వనరుల అభివృద్ధి పనులు చేపట్టింది. పన్నులు వసూలుచేసి వచ్చే ఆదాయంతో పూర్తి స్థాయిలో ఆధునికీకరించడంపై దృష్టిపెట్టింది.

✦ అయిదేళ్ల బకాయిలను నిర్ధారించి 2024 వరకు(1430 నుంచి 1434 ఫసలీల వరకు) నీటి పన్నును సచివాలయాల్లో రైతులు చెల్లించేలా సాంకేతిక వ్యవస్థ తీసుకువచ్చారు. రైతులకు నోటీసులు జారీ చేసి నీటిపన్ను చెల్లించి రెవెన్యూ దస్త్రాల్లో వివరాలు నమోదు చేయించుకుని రశీదు పొందాలని వీఆర్వోలు వివరిస్తున్నారు. రైతులు చెల్లించే నీటి పన్నును గ్రామాల్లోని నీటి సంఘాల ద్వారా కాలువలు, నీటి పారుదల అభివృద్ధికి ఉపయోగించనున్నారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో రూ.4,78,68,759 బకాయి ఉండగా, ఇప్పటివరకు రూ.23,72,168 వసూలు చేయగా జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది.

మండలం	భూవిస్తీర్ణం (ఎకరాల్లో)	పన్ను బకాయిలు (రూ.లలో)	వసూలైనవి
పిఠాపురం	30,551	3,47,85,487	20,43,516
గొల్లప్రోలు	29,928	58,37,832	46,414
యు.కొత్తపల్లి	17,386	72,45,440	2,82,238

గొల్లప్రోలు పరిధిలో నీరందని పంట పొలం

రోజువారీ లక్ష్యాలతో వసూలు

నీటి పన్ను బకాయిల వసూలుకు రోజువారీ లక్ష్యాలు నిర్ణయించాం. బకాయిల జాబితాలు వీఆర్వోలకు అందజేశాం. రైతులు చెల్లించే పన్నుతోనే కాలువలు, జల వనరుల అభివృద్ధికి అవకాశం కలుగుతుంది.

- గోపాలకృష్ణ, తహసీల్దారు

కౌలు హక్కు టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన 4వ పిలుపు

కాకినాడ జిల్లా, పెదపూడి మండలం, పెదపూడి గ్రామములో వేంచేసియున్న శ్రీ సోమేశ్వర స్వామివారి దేవస్థానము యొక్క పై గ్రామంలో గల సర్వే నెం.62రు నందు య.6.14ట్లు పల్లం భూమిని చేపల చెరువులుగా స్వంత ఖర్చులతో మార్పు చేసుకుని అనుభవించుటకు గాను అప్పగించిన తేదీ నుండి 5 సం॥లు కాల పరిమితికి మాత్రమే ది.14-07-2025వ తేదీ ఉదయం గం.10.30 ని॥లకు దేవాలయం వద్ద టెండర్-కమ్-బహిరంగ వేలం నందు అమరకం జరుపబడును. కావున ఆసక్తిగలవారు నిర్ణయించిన ధరావత్తు చెల్లించి పాల్గొన కోరడమైనది.

పెదపూడి, ది.07-07-2025. కార్యనిర్వహణాధికారి

(c) eenadu

తుని

•తుని •ప్రత్తిపాడు •జగ్గంపేట

నటుడు ప్రభాస్ పేరిట అర్చనలు

తుని గ్రామీణం: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థాన్ని సినీనటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి సోమవారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి చీర, సారె సమర్పించి ప్రభాస్ పేరున అర్చనలు చేయించారు.

రౌతులపూడి: శృంగవరంలో నందనవనంలో శ్రీఉమావర్ధిని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు.

సాంస్కృతిక వికాసానికి దోహదం

ప్రత్తిపాడు: సంస్కృతీ వికాసానికి దోహదపడే కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని అరుణాచలేశ్వర దర్శనం అనంతరం భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. పార్టీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన ఆయనకు అరుణాచలేశ్వర క్షేత్రం వద్ద పార్టీ శ్రేణులు సోమవారం ఘనస్వాగతం పలికాయి. భాజపా జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, జిల్లా పూర్వపు అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో జిల్లా అధ్యక్షుడు బిక్కిన తదితరులు

మెరుగుపడాల్సింది చాలా ఉంది..!

• అన్నవరం, లోవ, వాడపల్లి ఆలయాలపై సర్వే

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం, తలుపులమ్మ లోవ, వాడపల్లి ఆలయాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు మెరుగుపడాల్సింది చాలా ఉంది. భక్తులకు అందుతున్న సేవలపై గత కొద్ది నెలలుగా అసంతృప్తి శాతం ఎక్కువగానే ఉంటుంది. జూన్‌కు సంబంధించి తాజాగా విడుదల చేసిన సర్వే వివరాల్లో గతం కన్నా అసంతృప్తి శాతం కొద్దిగా తగ్గినా సంతృప్తికర స్థాయిలో లేదు. ఆలయాలకు వచ్చే భక్తుల నుంచి ప్రభుత్వం ఐవీఆర్, టెలీ కాలింగ్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా అభిప్రాయం సేకరిస్తోంది.

ఇదీ పరిస్థితి..

అన్నవరం, తుని మండలం తలుపులమ్మ లోవ, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయంలో అసంతృప్తి శాతం ఎలా ఉందంటే..

అన్నవరం అనివేటి మండపంలో క్యూలైన్లలో భక్తులు

విభాగం	అన్నవరం	తలుపులమ్మలోవ (అసంతృప్తి శాతం)	వాడపల్లి
దర్శనం సంతృప్తికరంగా జరిగిందా	26.8	29.5	25.9
మౌలిక వసతులు ఎలా ఉన్నాయి	33.9	35.8	34.9
పారిశుద్ధ్యం ఎలా ఉంది	30.2	35.2	31.8
ప్రసాదం తాజాగా, రుచిగా ఉందా	23.1	27.5	27.6

కమిషనర్ సమీక్ష

భక్తుల నుంచి వస్తున్న అసంతృప్తిపై దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ సోమవారం వీసీ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈవో సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు. పలు అంశాలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

దేవతా మూర్తులకు నీరాజనం

వైభవంగా నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠ

ప్రత్తిపాడు: రాచపల్లిలో ఆంధ్రా అరుణాచలంగా పేరుగాంచిన క్షేత్రంలో నాయనార్ల ప్రతిష్ఠా మహోత్సవాలు నాలుగురోజుల పాటు దిగ్విజయంగా జరిగి సోమవారం ముగిశాయి. శ్రీఅపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి సన్నిధిలో 63 నాయనార్ల విగ్రహాలను ప్రతిష్ఠించడంతో పాటు, దక్షిణామూర్తితో సహా 9 మంది దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. ప్రవచనకర్త అరుణాచల మాధవి,స్వామి రామానంద నేతృత్వంలో మహోత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు జరిగాయి. సోమవారం రోజంతా మబ్బులతోనే ఉంది. వేలాదిగా తరలివచ్చిన భక్తజనం, దర్శనం, అన్నప్రసాద స్వీకరణకు వాతావరణం అనుకూలించడంతో ఆలయకమిటీ, ఉత్సవ నిర్వాహకులు సంతోషించారు. నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ పలుమార్లు ఆలయానికి విచ్చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. నాయనార్ల శిలా విగ్రహాలు, పంచలోహ ప్రతిమలను క్షేత్ర మండపంలోనే కొలువు దీర్చగా, ఉపాయలాల్లో దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, గాయని శ్రీలేఖ రెండు రోజులుగా జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం ఆలయ దర్శనం అనంతరం సభలో మాట్లాడారు. భారతమాత విగ్రహాన్ని ఆలయంలోని పుష్కరిణిలో ప్రతిష్ఠించగా. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు ఓలేటి సత్యనారాయణ, ముక్కు సుబ్రహ్మణ్యం, వీర కమలావతి తదితరులు పాల్గొన్నారు. సీఐ సూర్యఅప్పారావు, ఎస్సైలు లక్ష్మీకాంతం, శ్రీహరిబాబు నేతృత్వంలో సిబ్బంది గస్తీ నిర్వహించారు. శ్రీభారతి విద్యానికేతన్ విద్యార్థులు సేవలందించారు.

జ్ఞాపికలు అందుకుంటున్న ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ తదితరులు

పూజల్లో పాల్గొన్న కనుమూరి బాపిరాజు

గాయని ఎంఎం శ్రీలేఖ

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066 (ఉ॥ 10 - మ॥ 1)

ఏలేశ్వరం: ఏలేశ్వరం 20వ వార్డులో రహదారులపై చెత్త ఉందని, రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. సమస్యను కమిషనర్ ఎం.సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. కార్మికులతో రహదారులపై, అంచుల్లో ఉన్న వ్యర్థాలను తొలగించారు. డంపింగ్ యార్డుకి తరలించే ఏర్పాట్లు చేస్తామని కమిషనర్ తెలిపారు.

సిమెంట్ పలకలు వేశారు

స్పందనకు వందనం

జగ్గంపేట: ఎన్‌హెచ్ రాజమండ్రి - జగ్గంపేట సర్వీస్ రోడ్డును ఇటీవల నిర్వహణలో భాగంగా శుభ్రం చేశారు. శుభ్రం చేసిన అనంతరం కాలువలపై ఉన్న పలకలను డ్రెయినేజీపై వేయకుండా పక్కన పెట్టేశారు. దీంతో అక్కడ ఉన్న దుకాణదారులు, వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై 'ఈనాడు'లో జూన్ 26న సిమెంట్ పలకలు వేయరూ..! అనే శీర్షిక వెలువడంతో అధికారులు స్పందించి డ్రెయినేజీపై సిమెంట్ పలకలు వేశారు.

విద్యుత్తు స్తంభం ఏర్పాటు

తొండంగి: తొండంగి 14వ వార్డులో ఉన్న విద్యుత్తు స్తంభం సోమవారం ఉదయం విరిగి కిందపడింది. సమస్యను విద్యుత్తు శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని స్థానికులు కోరారు. వెంటనే సమస్యను ఆ శాఖ ఏఈ లోవరాజు, లైన్‌మన్ నరేష్‌ల దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించారు. సాయంత్రానికి కొత్త స్తంభం తీసుకొచ్చి ఏర్పాటు చేశారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

తొండంగి, న్యూస్‌టుడే: సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. శృంగవృక్షం, దానవాయిపేట గ్రామాల్లో సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే దివ్య ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. పింఛను అందించాలని ఓ దివ్యాంగుడు ఎమ్మెల్యేను కోరగా పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి పింఛను వచ్చేలా చూడాలని ఆదేశించారు. దానవాయిపేటలో మత్స్యకారులతో మాట్లాడారు. నాయకులు యనమల రాజేష్, చొక్కా కాశి, దూలం అప్పారావు, నేపా కృష్ణ, గంపల కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

శృంగవృక్షంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దివ్య

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

జగ్గంపేట గ్రామీణం, కిర్లంపూడి: ఏడాది కూటమి పాలనలో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తు పనిచేస్తుందని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు అన్నారు. కాండ్రేగులలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి అభివృద్ధిని వివరించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి బస్వా చినబాబు, రామిశెట్టి చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు. రాజపూడిలో తెదేపా మండలపార్టీ అధ్యక్షుడు మారిశెట్టి భద్రం పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ● కూటమి ప్రభుత్వ పాలనలో సౌకర్యమవంతైన సేవలు అందించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి వీరంరెడ్డి కాశిబాబు పేర్కొన్నారు. శృంగరాయునిపాలెం, ఎస్.తిమ్మాపురం తదితర గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు.

శృంగరాయునిపాలెంలో తెదేపా శ్రేణులు

శిరస్త్రాణం మీ ప్రాణ కవచం

అవీ ఇవీ అన్నీ

తుని గ్రామీణం: ద్విచక్రవాహనం నడిపేవారికి శిరస్త్రాణం ఒక ప్రాణకవచమని ఎస్సై రామకృష్ణ సూచించారు. కోటనందూరు స్టేషన్ వద్ద ఆయన శిరస్త్రాణం ధరించని వారికి కౌన్సిలింగ్ చేశారు.

● **మత్తు పదార్థాలు విక్రయిస్తే ఉపేక్షించం**

గండేపల్లి: పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల సమీపంలో మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శివనాగబాబు హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలు, కళాశాలలకు సమీపంలో గుట్కా ప్యాకెట్లు, మద్యం విక్రయించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

● **10న పేరెంట్స్ సమావేశాలు.. తుని గ్రామీణం:** 10న పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్స్ మీటింగ్ పండుగ వాతావరణంలో నిర్వహించాలని హెచ్‌ఎంలకు ఎంఈవో గీతాదేవి సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

● **పాఠశాలలు పరిశీలించిన ఛైర్‌పర్సన్.. తుని:** పట్టణంలోని రెల్లిపేట, కొండవారిపేట పురపాలక ప్రాథమిక పాఠశాలలను ఛైర్‌పర్సన్ నార్ల భువనసుందరి సోమవారం పరిశీలించారు.

● **విజేతలకు బహుమతుల ప్రదానం.. తుని పట్టణం:** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి సందర్భంగా చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో బహుమతులు అందజేశారు.

● **ఇంటింటా సంక్షేమం .. శంఖవరం:** ఇంటింటా సంక్షేమం ఊరురా అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడిందని ఎమ్మెల్యే సత్యప్రభ అన్నారు. వజ్రకూటం గ్రామంలో మాజీ సర్పంచి కీర్తి సుభాష్ ఆధ్వర్యంలో తొలిఅడుగులో ఆమె పాల్గొన్నారు.

● **పంచాయతీ ఉద్యోగులకు శిక్షణ .. తొండంగి:** పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం అన్ని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపీడీవో రాజేశ్వరరావు తెలిపారు.

● **నేడు రక్తదాన శిబిరం.. ప్రత్తిపాడు:** వైఎస్సార్ జయంతి సందర్భంగా ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాల్లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త ముద్రగడ గిరిబాబు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

తుని, కిర్లంపూడి, శంఖవరం, రౌతులపూడి: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంపల బాబూరావు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. ● రాష్ట్రంలో మాదిగ, వారి ఉపకులాలకు న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. రామచంద్రపురంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. శంఖవరం, రౌతులపూడి, బలరాంపురం గ్రామాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు.

రామచంద్రపురంలో మాట్లాడుతున్న తుమ్మలపల్లి రమేష్

మెట్టకు చేరిన పుష్కర జలాలు

జగ్గంపేట గ్రామీణం: వారం రోజుల కిందట విడుదల చేసిన పుష్కర జలాలు మెట్టప్రాంతానికి చేరుకున్నాయి. ప్రధాన పంపుహౌసు పురుషోత్తపట్నం వద్ద ఇటీవల మంత్రి రామనాయుడు, ఎమ్మెల్యే నెహ్రూ తదితరులు స్విచ్‌ఆన్‌చేసి నీటిని విడుదల చేయగా సోమవారం జగ్గంపేటకు చేరుకున్నాయి.

నిరుపయోగంగా శౌచాలయాలు

రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సచివాలయ సముదాయాల వద్ద శౌచాలయాల పనులు పూర్తికాకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. టి.వెంకటపురంలో సచివాలయం, రైతుసేవా కేంద్రానికి అనుబంధంగా రెండేళ్ల కిందట నిర్మించిన మరుగుదొడ్లకు నేటికి తలుపులు ఏర్పాటు ఏర్పాటు చేయలేదు. దీంతో వివిధ పనులు నిమిత్తం ఈ కార్యాలయాలకు వచ్చేవారు అత్యావసర సమయంలో వీటిని వినియోగించే పరిస్థితి లేదు. సంబంధిత అధికారులు స్పందించి 90 శాతం పూర్తి చేసిన మరుగుదొడ్లను వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం

ఎన్నాళ్లో తాత్సారం..!

✦ హైవేపై గుంతలు పూడ్చరా..!

గండేపల్లి, న్యూస్‌టుడే: ఎన్‌హెచ్ నిర్వాహకుల పనితీరుతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. వీరి దోరణి చూస్తుంటే ప్రమాదాలు నివారణ కంటే వాటికి ఊతమిచ్చేలా వ్యవహరిస్తున్నారు. కొన్ని ప్రమాదాలు వాహనదారుల నిర్లక్ష్యం వలన జరుగుతుంటే, మరికొన్ని చిన్నపాటి నిర్లక్ష్యంతో సంభవిస్తున్నాయనే చెప్పొచ్చు.

ఈ గుట్టలు ఎక్కడంటే..

ఎన్‌హెచ్‌పై గండేపల్లి మండలంలో మల్లేపల్లి కరుణకుమార్ దాబా ఎదురుగా, మల్లేపల్లి శివారు పెట్రోలు బంకు వద్ద, గండేపల్లిలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా, మురారి గ్రామంలోనూ గుంతలు ఉన్నచోట్ల ఈ గుట్టలను వేసి వదిలేశారు.

మల్లేపల్లిలో రోజుల తరబడి దర్శనమిస్తున్న మట్టిగుట్టలు

మీనమేషాలు

ఎన్‌హెచ్ పక్కన ఎత్తుపల్లాలు, ప్రమాదకర గుంతలను పూడ్చేందుకు నిర్వాహకులు తారు వ్యర్థాలు, గ్రావెల్‌ను కలిపిన గుట్టలను వేశారు. ఇవి వేసినా ఒకటి, రెండు రోజుల్లో గుంతల్లో వేసి చదును చేయాలి. ఈ గుట్టలు రహదారి పక్కన వేసి నెలలు గడుస్తున్నా రాత్రి సమయాల్లో దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. ఇప్పటికే ఈ గుట్టలను ఢీ కొన్న కొందరు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు.

వర్షాలతో పనులు జాప్యం

ప్రస్తుతం గుంతల్లో మట్టి చదును చేస్తున్నారు. వర్షాల వలన కొన్నిరోజులు పనులు ఆపాం. మళ్లీ పనులు జరుగుతున్నాయి. రెండు, మూడు రోజుల్లో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా గుట్టలన్ని సర్దిస్తాం.
- శ్రీనివాస్, ఎన్‌హెచ్ అసిస్టెంట్ మేనేజర్

తాగునీటి వృథాను అరికట్టరూ..!

జగ్గంపేట గుర్రప్పాలెం రోడ్డులో బాలాజీ నగర్ సమీపాన రోడ్డు పక్కన ఓ మంచినీటి పైపు పగిలి మంచినీరు వృధాగా పోతుంది. దీంతో రోడ్డు అంతా బురదగా తయారైంది. భావవరం నుంచి శుద్ధిచేసి పట్టణ ప్రజలకు సరఫరా అవుతున్న మంచినీటి పైపు రంధ్రం పడి నీరు పోతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శివాని వివరణ కోరగా అధిక లోడుతో లారీ అటుగా వెళ్లడంతో పైపు పగిలింది, నేడు మరమ్మతులు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, జగ్గంపేట

రోడ్డు పనులు నిలిపివేయడంపై ఆందోళన

కిర్లంపూడి: రాజుపాలెం నుంచి జగ్గంపేట మండలం రామవరం వరకు సుమారు రూ.30 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంపై గోనేడ గ్రామస్థులతో కలిసి మాజీ సర్పంచి పాటంశెట్టి సూర్యచంద్ర సోమవారం ఆందోళన నిర్వహించారు. రోడ్డుపనులు సత్వరం ప్రారంభించి పూర్తిచేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

సర్పంచి చెక్‌పవర్ రద్దు

ప్రత్తిపాడు: పోతులూరు సర్పంచి బోండు రాంబాబు చెక్‌పవర్ రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో కుమార్‌బాబు తెలిపారు. నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామానికి చెందిన బర్ల చక్రం, పంచాది వీరవెంకట సూర్యనారాయణలు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. డీఎల్పీవో బాలామణి విచారణ జరిపారు. సర్పంచికి షోకాజ్ నోటీసు జారీ చేయగా స్పందించకపోవడంతో చెక్‌పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. చెక్‌పవర్‌ను డిప్యూటీ ఎంపీడీవో కాశీవిశ్వనాథానికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని మాడుగుల వాసి మృతి

తుని పట్టణం: తుని రైల్వేస్టేషన్ వద్ద రైలు ఢీకొని అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం, కిమ్ముడుపల్లి గ్రామానికి చెందిన **బి.నూకరాజు** (50) మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈయనకు భార్య, పిల్లలు ఉన్నారన్నారు. ఏలూరు వెళ్లేందుకు స్వగ్రామం నుంచి భార్యతో వచ్చి రెండో నంబరు ప్లాట్‌ఫామ్ నుంచి, వచ్చి ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చే క్రమంలో రైలు ఢీకొట్టిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

జగ్గంపేట గ్రామీణం: మన్యంవారిపాలెంలో జూదశిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. స్టేషన్‌కు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి నలుగురు జూదరులతో పాటు వారి వద్ద నుంచి రూ. 5,150 నగదు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

తుని: పట్టణంలోని టైలర్స్ కాలనీ ప్రాంతంలో ఇంటి తాళాలు పగలగొట్టి రూ.1.45 లక్షలు విలువైన బంగారం, నగదు దుండగులు చోరీ చేశారని ఎస్సై విజయబాబు తెలిపారు. 5న రాత్రి కుటుంబసభ్యులతో కలిసి దారాకొండ వెళ్లి, తిరిగి 6వ తేదీ రాత్రి వచ్చే సరికి తాళాలు పగలగొట్టి ఉన్నట్లు బాధితుడు కె.బాబ్జి ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దైవసేవకులు సంఘాలను సమర్థంగా నడపాలి

జగ్గంపేట: జగ్గంపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నికయింది. నూతన అధ్యక్షుడు చిత్తరపు యోహాను, కార్యవర్గ సభ్యులు సోమవారం కాకినాడ జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో కలిశారు. నవీన్ మాట్లాడుతూ.. మండలంలోని దైవసేవకుల సంఘాలను సమర్థవంతంగా నడిపించాలన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్నక్యాంటీన్

పేదల ఆకలి తీర్చేందుకే తెదేపా ప్రభుత్వం అన్నక్యాంటీన్ ఏర్పాటుచేసిందని జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. ఈ వారం కె.గోపాలపురానికి చెందిన అవసరాల బాలసుబ్రహ్మణ్యం సాయంతో క్యాంటీన్‌ను నిర్వహించారు. నవీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని పేదలకు వడ్డన చేశారు.

కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న నవీన్‌కుమార్

మహిళల చేతిలో పాశుపతాస్త్రం శక్తి యాప్

కిర్లంపూడి: మహిళలకు రక్షణ కల్పించేందుకు ఏర్పాటుచేసిన శక్తియాప్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే నిమిషాల్లో పోలీసుల రక్షణ పొందవచ్చని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ విద్యార్థినులకు తెలియజేశారు. తామరాడలో ప్రభుత్వ మహిళాకళాల, ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థినిలకు శక్తి యాప్‌పై సోమవారం కిర్లంపూడి పోలీసుల ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై జి.సతీష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర ఐ.టి.ఐ - జగ్గంపేట
గోకవరం రోడ్, సెల్: 92474 30301
ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్లందు
అడ్మిషన్లు జరుగుచున్నవి.
కొద్ది సీట్లు మాత్రమే కలవు

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

తుని, న్యూస్‌టుడే: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పురవీధుల్లో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా, విభాగ్ కన్వీనర్లు చందూ, సత్యసాయి మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామన్నారు. విద్యార్థులు జెండాలు చేతపట్టి, నినాదాలు చేస్తూ మెయిన్‌రోడ్డు, గొల్లప్రోలావు సెంటర్, జీఎన్‌టీరోడ్డు మీదుగా ప్రదర్శన నిర్వహించారు.

తునిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

అరకొర సిబ్బందితో బోధన ఎలా..?

తొండంగి, న్యూస్‌టుడే: ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన తొండంగి జడ్పీ ఉన్నత పాఠశాలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఈ పాఠశాలలో ప్రస్తుతం ఆరు నుంచి పదో తరగతి వరకు 292 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు వేరే పాఠశాలలకు బదిలీ అవడంతో ప్రస్తుతం నలుగురు ఉపాధ్యాయులు, హెచ్‌ఎం మాత్రమే ఉన్నారు. దీంతో తరగతులు పూర్తిస్థాయిలో నడవడం లేదు. ఇటీవల జరిగిన బదిలీల్లోనూ ఈ పాఠశాలకు ఒక్క ఉపాధ్యాయుడు రాలేదు. ప్రస్తుతం హెచ్‌ఎం, తెలుగుకు ఇద్దరు, ఇంగ్లీషుకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. దీనిపై హెచ్‌ఎం సత్యన్నారాయణను వివరణ కోరగా ఉపాధ్యాయుల కొరత ఉందని ఎప్పటికప్పుడు డీఈవో కార్యాలయానికి నివేదిస్తున్నామని తెలిపారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఏలేశ్వరం, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : ఉద్యమించకపోతే కార్మికులు తమకున్న హక్కులను కోల్పోయే పరిస్థితి వస్తుందని సీపీఎం నాయకుడు పాకలపాటి సోమరాజు, లారీ యజమానులు, వర్కర్ల సంఘ నాయకులు జ్యోతుల సత్తిబాబు, గొర్ల శివ, సీఐటీయూ నాయకుడు పిల్లా రాంబాబు అన్నారు. ఈ నెల 9న నిర్వహించే దేశ వ్యాప్త జయప్రదం కోరుతూ సోమవారం ఏలేశ్వరం బాలాజీ చౌక్ కూడలి నుంచి సీపీఎం, సీఐటీయూ, ఏఐసీసీటీయూ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ మండల కేంద్రం మీదుగా పలు గ్రామాల్లో సాగింది. కొత్తగా అమలుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు నెల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో కె.సునీత, అర్జునరావు, బి.వీరబాబు, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

ర్యాలీలో వామపక్ష పార్టీల నాయకులు

అమృతమూర్తికి అశ్రునివాళి

శ్రీమతి అలకాపురిమఠం రాధిక గారు
W/o AGK మూర్తి గారు
మరణం: 27-06-2025, జగ్గంపేట

మంచితనం, ప్రేమ, ఆప్యాయతలతో
మా అందరి మనస్సులలో చిరస్థాయిగా
నిలిచి మా ఇంటి దేవత,
మా తల్లిగారైన శ్రీమతి A.రాధిక గారు
ది.27-06-2025 శుక్రవారం రాత్రి
స్వర్గస్తులైనారని తెలియజేయుటకు
చింతిస్తూ, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి
చేకూరాలని భగవంతుని
ప్రార్థిస్తూ...

అలకాపురిమఠం శ్రీనివాస్
అలకాపురిమఠం మాధవ్
Dr. సుస్మిత, M.D., (Ayush)
అయ్యర్ హోటల్, జగ్గంపేట మరియు కుటుంబసభ్యులు

మిత్రభోజనం (వై.సమారాధన) ది.09-07-2025 బుధవారం, జగ్గంపేట-గోకవరం రోడ్‌లో గల క్షత్రియ కళ్యాణ మండపంలో జరుగునని తెలియపర్చడమైనది.

(c) eenadu

చిరుద్యోగుల గర్జన

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే: తమకు ఉద్యోగ భద్రత కల్పించి, వేతన పెంపు చేయాలని గ్రామ పంచాయతీల్లో రికార్డులు రాసే సిబ్బంది డిమాండ్ చేశారు. వేర్వేరు జిల్లాలు, తాలూకాల నుంచి వచ్చిన ఆందోళనకారులు స్వాతంత్ర్య ఉద్యానంలో సోమవారం ధర్నాకు దిగారు. గ్రామీణ జీవనోపాధి అభియాన్‌లో భాగంగా తాము అందిస్తున్న సేవలకు విలువ లేకుండా పోయిందని సంఘం అధ్యక్షురాలు రుద్రమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమకు ఇచ్చిన హామీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలంటూ ఆందోళనకారులు నినదించారు.

ధర్నాలో నినాదాలు చేస్తున్న ఆందోళనకారులు

శుభకరిణి.. నమోనమః

ఆషాఢమాస సోమవారం సందర్భంలో పరశురామ క్షేత్రమైన మంగళూరు మహానగరంలో లింగరూపంలో వెలసిన మంగళామాతకు ఘనంగా శతరుద్రాభిషేకం, తదితర సేవలు జరిగాయి. ఉదయం భక్తుల సమక్షంలో మహాన్యాస పూర్వక రుద్ర నమకం, చమకం మహామంత్ర యుక్త శతరుద్రాభిషేకం జరిగింది. అనంతరం సుందర సర్వాలంకార యుక్త మహాపూజ, మహామంగళహారతులు, భక్తులకు అన్న సంతర్పణ జరిగాయి. నెలవంక తన శిరస్సుపై అలంకరించుకున్న అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. - **బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే**

సుందర అలంకారంలో మంగళాదేవి

కన్నడనాట.. మూడుముక్కలాట

● అధికార పంపిణీపై కొనసాగుతున్న సందిగ్ధత

● ఎటూ తేల్చని అధిష్ఠానం

ఈనాడు– బెంగళూరు

కన్నడనాట అధికార పక్షంలో నాయకత్వ మార్పు ఓ ప్రహసనంగా మారింది. గత నెల రోజులుగా ముఖ్యమంత్రి పీఠంపై కొనసాగుతున్న చర్చ..మంత్రుల పనితీరు సమీక్ష, ఎమ్మెల్యేల అభిప్రాయ సేకరణ ఎంతకీ తెగటం లేదు. ఎమ్మెల్యేలు వెల్లడించే అభిప్రాయాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా మారిపోతుండటంతో నాయకత్వం, మంత్రివర్గ ప్రక్షాళనపై అధిష్ఠానం సైతం ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. ఇందుకు కారణం మంత్రుల పనితీరే, వారి పట్ల స్థానిక నేతలకున్న సమన్వయ పరోక్షంగా నాయకత్వంపై ప్రభావం చూపుతున్నట్లు ఈ సమీక్షల ద్వారా వెల్లడవుతోంది. ఓ వైపు పార్టీ రాష్ట్ర బాధ్యుడు రణదీప్ సింగ్ సుర్జేవాలా ప్రతి ఎమ్మెల్యే, మంత్రులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ వారి నుంచి వాస్తవాభిప్రాయాన్ని రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. మరో వారం రోజుల పాటు ఈ అభిప్రాయ సేకరణ కొనసాగనుందని తెలిసింది. ఈ మధ్యలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రుల దిల్లీ పయనం ఎక్కువలేని కుతూహలాన్ని రేకెత్తిస్తోంది.

మారుతున్న హోదాలు

ఓ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వారికి జాతీయ స్థాయిలో బాధ్యతలు అప్పగించటం ఏ పార్టీలోనైనా రాజకీయ పరిణామాలకు సంకేతమనే చెప్పాలి. గతంలో రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పే స్థాయికి చేరుకున్న మల్లికార్జున ఖర్గేను ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విభాగాలకు అధ్యక్షులుగా చేసి ఆపై లోక్‌సభ సభ్యులుగా, కేంద్ర మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. ఖర్గేతో రాష్ట్ర నాయకత్వంపై పోటీ పడేవారికి అడ్డు తొలగిపోయింది. అదే స్థాయిలో భాజపాలోనూ ప్రహ్లాద్ జోషి, తాజాగా బసవరాజబొమ్మై, జగదీశ్ శెట్టర్ తదితరులూ రాష్ట్ర రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాలకు వెళ్లి ఇక్కడి నేతలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక పదవులు దక్కించుకునే అవకాశాలను మరింత సుగమం చేశారు. నేడు ఇదే పరిస్థితి సిద్దరామయ్యకు వచ్చిందన్న వార్తలు రాష్ట్ర రాజకీయాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఆయనను ఏఐసీసీ బీసీ సలహా సమితి అధ్యక్షుడిగా నియమిస్తూ ఏఐసీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనపై తనకు ఏమాత్రం అవగాహన లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య చెప్పటం మరింత ఆసక్తికరం. ముఖ్యమంత్రి స్థాయి నేతతో కనీస చర్చలు లేకుండా పార్టీ అధిష్ఠానం జాతీయ హోదా కట్టబెట్టిందంటే అది నమ్మశక్యం కాని పరిణామంగా రాజకీయ వర్గాలు విశ్లేషించుకుంటున్నాయి. గత నెలలోనే ఈ అధ్యక్ష పదవితో పాటు సభ్యుల కోసం బీకే హరిప్రసాద్, సచిన్ పైలెట్, గురుదీప్ సింగ్ సప్పాల్, అరుణ్ యాదవ్, కమలేశ్వర్ పటేల్ వంటి సీనియర్ల పేరు పరిశీలించారు. వీరెవరూ ప్రస్తుతం కీలక హోదాలో లేని వారు. ఒక్క సిద్దరామయ్య మాత్రమే ముఖ్యమంత్రి స్థాయి హోదాలో ఉన్నారు.

హస్తిన ప్రయాణం ఎందుకో?

నేడు(మంగళవారం) ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, రేపు (బుధవారం) ముఖ్యమంత్రి సిద్దరామయ్య దిల్లీకి వెళ్తున్నట్లు వారి అధికారిక పర్యటన విభాగం స్పష్టం చేసింది. ఈ పర్యటన సందర్భంగా కేంద్ర మంత్రులతో పలు అంశాలపై చర్చించే అవకాశమున్నా అత్యంత కీలకమైన రాష్ట్ర రాజకీయ పరిణామాలపై చర్చించాలన్నది వీరిరువురి లక్ష్యం. వాస్తవానికి గత నెల చివరి వారంలోనే వీరిద్దరూ దిల్లీకి వెళ్లి ఆర్థికమంత్రితో పాటు పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. అదే సందర్భంగా రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు అవకాశం ఉందన్న వాదనలు వినిపించాయి. ఈసారి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సమావేశాలు కొనసాగుతున్న దశలో మళ్లీ దిల్లీకి వెళ్లనుండటం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.



ముగ్గురి మధ్య దోబూచులాట.. ఏం జరుగుతుందో?

ముగింపునకు చేరుకున్నట్లే..

కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ మార్పు ప్రక్రియ క్లైమాక్స్‌కు చేరుకుందని విపక్ష నేతలు విమర్శలతో పాటు విశ్లేషణలతో విరుచుకుపడుతున్నారు. రణదీప్ సింగ్ సుర్జేవాలా ఇంతకాలం చేస్తున్న సమీక్షలు కొలిక్కివచ్చినట్లేనని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర అంటున్నారు. తన పని ముగిసినట్లు ముఖ్యమంత్రికి తెలిసిపోయింది. ఇక చేయాల్సిందల్లా ఆయనను రాష్ట్ర రాజకీయాల నుంచి సాదరంగా సాగనంపడం, ఆ లాంఛనాన్ని పూర్తి చేసేందుకు రణదీప్ సింగ్ వేదికను సిద్ధం చేసే పనిలో ఉన్నారన్నారు. ప్రస్తుతం అధికార పక్షం అభివృద్ధి, పాలనను మరచి అంతర్గత రాజకీయాలతో సతమవుతోంది. ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలి తమ స్థానాలను రక్షించుకునే పనిలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులున్నారని విపక్ష నేత ఆర్.అశోక్ ఆరోపించారు.

ఉన్నతాధికారులతో సీఎం సమావేశం



బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అవినీతి కుంభకోణంపై సీబీఐ దర్యాప్తునకు అప్పగించాలని ఉన్నత న్యాయస్థానం సూచించడంతో సోమవారం ఇక్కడ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మండలి పరిధిలోకి వచ్చే ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. వాల్మీకి అభివృద్ధి మండలిలో అవినీతి కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు రావడంతో మంత్రి నాగేంద్ర తన స్థానానికి రాజీనామా చేశారు. కుంభకోణాన్ని విచారించేందుకు ఎస్ఐటీ దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి నాగేంద్రకు కుంభకోణానికి ఎలాంటి సంబంధం లేదని ఎస్ఐటీ క్లీన్ చీట్ ఇచ్చింది. అందుకు ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. భాజపా నేతలు బసనగౌడ పాటిల్ యత్నాళ్, అరవింద లింబావళి, కుమారబంగారప్ప తదితరులు సీబీఐ దర్యాప్తునకు అప్పగించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సీబీఐ దర్యాప్తుకు అప్పగించాలని న్యాయస్థానం సూచించింది. దీంతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉన్నతాధికారులతో సమావేశమై జరిగిన ఎస్ఐటీ దర్యాప్తు నివేదిక, ఇతర అంశాలపై చర్చించారు.

9న సీఎం దిల్లీకి

మైసూరు దసరా ఉత్సవాలు సందర్భంగా మైసూరు వైమానిక ప్రదర్శన నిర్వహణకు సంబంధించి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్‌సింగ్‌ను కలిసి చర్చించేందుకు ఈనెల 9న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిల్లీకి వెళ్లనున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా వైమానిక ప్రదర్శన ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని భేటీ చేసి విన్నవించుకోనున్నారు. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ఆయనను భేటీ చేయనున్నారు. అనంతరం పార్టీ అధిష్ఠాన వర్గాన్ని కలిసి రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులు ఏఐసీసీ ఓబీసీ జాతీయ సమితి నియామకం తదితర అంశాలపై చర్చించనున్నారు.

‘ముఖ్యమంత్రి మార్పు తథ్యం’

హాసన, న్యూస్‌టుడే: కర్ణాటకలో ముఖ్యమంత్రి పీఠం నుంచి సిద్ధరామయ్య కిందకు దిగడం తథ్యమని విపక్ష నేత ఆర్.అశోక్ వ్యాఖ్యానించారు. హాసనలో విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రిని మార్చమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఒక ప్రకటన ఇస్తే చూడాలని తాను కోరుకుంటున్నానని చెప్పారు. సీఎం పీఠం కోసం మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ప్రజలందరికీ తెలుసన్నారు. రెండేన్నరేళ్ల కాలం పూర్తయ్యాక డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారని గుర్తించే, ఎమ్మెల్యేలు కొందరు తమకు మంత్రి పదవులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. శివకుమార్ సీఎం అవుతారని రామనగర ఎమ్మెల్యే ఇక్బాల్‌హుసేన్ చేసిన వ్యాఖ్యలకు నోటీసులు జారీ చేశారని, అయినా, మళ్లీ అదే వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి తాకత్తు ఉంటే ఇక్బాల్ హుసేన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సవాలు విసిరారు.

రూ.15 లక్షల పరిహారాన్ని అందించిన స్పీకర్

మంగళూరు, న్యూస్‌టుడే: మంగళూరులో మూకదాడిలో మరణించిన కేరళకు చెందిన అష్రఫ్ కుటుంబ సభ్యులకు స్పీకర్ యూటీఖాదర్, మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ రూ.15 లక్షల పరిహారాన్ని సోమవారం అందించారు. ఏఐసీసీ కార్యదర్శి బీకే హరిప్రసాద్, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్‌లతో కలిసి అశ్రఫ్ కుటుంబ సభ్యులను మంగళూరుకు పిలిపించుకుని పరిహారాన్ని ఇచ్చారు. తన వ్యక్తిగత ఖాతా నుంచి జమీర్ రూ.10 లక్షలు, ఖాదర్ ఖాతా నుంచి రూ.5 లక్షల పరిహారాన్ని కలిపి అందించారు.

కాలంచెల్లిన వస్తువులకు విలువుండదు

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: కాలం చెల్లిన(ఔట్ డేటెడ్) వస్తువులకు విపణిలో విలువ ఉండదని గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రియాంక్‌ఖర్గే పరోక్షంగా మాజీ ఎంపీ ప్రతాప్‌సింహపై విరుచుకుపడ్డారు. సోమవారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భాజపా నుంచి తిరస్కరణకు గురైన వ్యక్తిగా ప్రతాప్‌సింహ ముద్ర పడ్డారని, ఆయన ఎందుకు పనికి రానీ వ్యక్తిగా ఆ పార్టీ నేతలు చూస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తికి కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. ప్రతాప్‌సింహ గత లోక్‌సభ ఎన్నికల్లో భాజపా నేతలు ఎందుకు టికెట్ ఇవ్వలేదని ప్రశ్నించారు. పార్టీ పదవులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా చూస్తున్నారని, సింహ అనే పేరు ఉన్నంత మాత్రం సింహం కావని ఎద్దేవా చేశారు.

నోటిఫికేషన్ రద్దు చేసిన హైకోర్టు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ఇస్రో తన సేవలను విస్తరించుకునేందుకు దేవనహళ్లి సమీపంలోని అబ్బచిక్కనహళ్లి, లాలగొండనహళ్లి గ్రామాల్లో 81 ఎకరాల భూమిని స్వాధీనపరుచుకుంటూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను హైకోర్టు రద్దు చేసింది. ప్రభుత్వం భూస్వాధీన ప్రక్రియను పూర్తి చేసి ఇస్రోకు భూమిని 2013లోనే భూమి కేటాయియించినా, ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని ఆరోపిస్తూ స్థానికులు వేసుకున్న అర్జీని పరిగణనలోకి తీసుకుని జస్టిస్ ఎస్ఆర్ కృష్ణ కుమార్ నోటిఫికేషన్‌కు సంబంధించిన ఆదేశాలను రద్దు చేశారు.

అయ్యో తల్లీ..ఇదేం పని

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: తాగుబోతు భర్త, బయటపడలేని పేదరికంతో వ్యధకు గురైన రాధ అనే బాలింత తన 45 రోజుల మగబిడ్డను హత్య చేసింది. నీరు వేడి చేసుకునే కాగులో బిడ్డను ముంచి హత్య చేసింది. నెలమంగల తాలూకా నాగకల్లుకు చెందిన పవన్, రాధ భార్యాభర్తలు. ఆదివారం రాత్రి బిడ్డను నీటిలో ముంచి హత్య చేసిన ఆరోపణలపై ఆమెను నెలమంగల ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు సహకరించిన ఆరోపణలపై పవన్‌ను అదుపునకు తీసుకుని విచారణ చేపట్టారు.

ఉద్యాననగరే అగ్రస్థానం

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: డేటింగ్ యాప్‌లను వినియోగించుకోవడంలో దేశంలో ఇతర నగరాల వారి కన్నా బెంగళూరు యువత ముందంజలో ఉన్నారు. వివాహేతర సంబంధాల కోసం దేశంలో డేటింగ్ యాప్‌లను వినియోగించుకుంటున్న వారి సంఖ్య మూడు మిలియన్లు దాటింది. గతేడాదితో పోల్చితే యాప్‌ల వినియోగం 270 శాతం పెరిగిందని గ్లీడన్ సంస్థ తన నివేదికలో పేర్కొంది. వీరిలో 128 శాతం మహిళలే ఉన్నారని తమ అధ్యయనంలో గుర్తించామని ఆ సంస్థ ప్రకటించింది. వీరిలో 40 శాతం మంది 30-45 ఏళ్ల వయస్సు వివాహితలే కావడం విశేషం. డేటింగ్ యాప్‌లను వినియోగిస్తున్న వారిలో బెంగళూరులో 20 శాతం, ముంబయి 19, కోల్‌కతా 18, దిల్లీలో 15 శాతం మంది ఉన్నారని నివేదికలో పేర్కొన్నారు.

ఆకస్మిక మరణాలపై అప్రమత్తం

ఈనాడు, బెంగళూరు: కర్ణాటకలో ఇకపై ఆకస్మిక మరణాలను ఆరోగ్య నివేదికల్లో నమోదు చేసి సమగ్ర సమీక్షల ద్వారా పర్యవేక్షించనున్నారు. ప్రజారోగ్యానికి హెచ్చరిక గంటలా మారిన వీటిపై మరణోత్తర పరీక్షలు చేపట్టి జాతీయ ఆరోగ్య మిషన్, ఐసీఎంఆర్ ద్వారా సమీక్షిస్తారు. రాష్ట్రంలో గుండెపోటుతో ఆకస్మికంగా తనువు చాలిస్తున్న యువత ప్రజారోగ్యాన్ని అత్యవసర పరిస్థితిగా మార్చింది. 45 ఏళ్లలోపు వారు ఎలాంటి దీర్ఘకాలిక రోగాలు లేకున్నా గుండెపోటుతో మరణించటం వెనుక ఆరోగ్యశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మరణాలపై నివేదిక ఇవ్వాలని జయదేవ గుండె ఆరోగ్య విజ్ఞాన, పరిశోధన సంస్థ డైరెక్టర్ డా. రవీంద్రనాథ్‌తో సమితి ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కరోనా టీకా దుష్పరిణామాలపై ఈ అధ్యయనం చేయాలన్న ఆరోగ్యశాఖ సూచనతో ఈ నివేదిక రూపొందించారు. ప్రాథమిక నివేదికను అధికారికంగా ఈనెల 10న సర్కారుకు అందిస్తారు. ఆ నివేదికలో కరోనా టీకా ఆకస్మిక మరణాలకు కారణం కాదని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

సమీక్ష తప్పదు

క్షయ, హెపటైటిస్, కలరా వంటి ప్రత్యేక వ్యాధులను అత్యవసర ప్రజారోగ్య సమస్యలుగా గుర్తించి ఆరోగ్యశాఖ సమీక్ష చేపడుతుంది. వీటిని నోటిఫైయబుల్ వ్యాధులుగా నమోదు ఆరోగ్య నివేదికల్లో నమోదు చేసి వీటిని నియంత్రించే చర్యలు చేపడతారు. ప్రత్యేక అవగాహన శిబిరాలు, ఉచిత ఔషధాలతో ఈ సమస్యలను నియంత్రించేందుకు సర్కారు కసరత్తు చేస్తుంది. ఈ జాబితాలో ఇకపై ఆకస్మిక మరణాలు కూడా చేరనున్నాయి. ఇప్పటికే గత నాలుగేళ్లలో వందలాది ఆకస్మిక గుండెపోటు కేసులు రాష్ట్రంలో నమోదైన విషయం తెలిసిందే. హాసన ఒక్క జిల్లాలోనే దాదాపు 25 మంది 40 రోజుల్లో మరణించారు. ఈ మరణాలపై సర్కారు అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ కరోనా టీకాతో గుండెపోటు మరణాలు సంభవించలేదని డా.రవీంద్రనాథ్ కమిటీ తేల్చింది. ఇదే సందర్భంగా కరోనా సోకిన వ్యక్తుల్లో మధుమేహం, ఊబకాయ సమస్యలు పెరిగి తద్వారా గుండె జబ్బులకు దారి తీసినట్లు ఈ అధ్యయనం ద్వారా తేలిందన్నారు.

మాట్లాడుతున్న దినేశ్ గుండూరావ్

అవగాహన పెంచాలి

కరోనా సమయంలో శారీరక శ్రమ తగ్గి ఇంటి వద్దనే ఉంటూ విధులు నిర్వహించటం వల్ల యువకుల్లో రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు ఎదురయ్యాయి. ఈ జీవనశైలి నుంచి అప్రమత్తం చేసేందుకు సర్కారు ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించాలని తీర్మానించినట్లు మంత్రి తెలిపారు. ఆకస్మికంగా మరణించిన వారి నివేదికలతో ఆరోగ్యశాఖ ప్రత్యేక నిబంధనలు రూపొందించి వాటిపై అవగాహన కల్పిస్తుంది. 15 ఏళ్లలోపు పిల్లలకు కూడా హృదయ సంబంధ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లోనే ప్రత్యేక తరగతులు, వీలైతే పాఠ్యాంశాల ద్వారా అవగాహన కల్పించే ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సిబ్బందికి కూడా నిరంతర ఆరోగ్య పరీక్షలతో అప్రమత్తం చేస్తామన్నారు. ఇదే సందర్భంగా పునీత్ రాజ్‌కుమార్ విజయజ్యోతి పథకాన్ని తాలూకా ఆస్పత్రులకు విస్తరించి ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫైబ్రిలేటర్ (ఏఈడీ)లతో ఆరోగ్య పరీక్షలను చేపడతామన్నారు.

రెండువందల మంది బహిష్కరణ

బెంగళూరు(న్యూతిప్పసంద్ర),న్యూస్‌టుడే: రాష్ట్రంలో అక్రమంగా నివశిస్తున్న బంగ్లాదేశీయులను గుర్తించి వారిని బహిష్కరించే ప్రక్రియ నిరంతరం సాగుతుందని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ తెలిపారు. సోమవారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెండువందల మందిని రాష్ట్రం నుంచి బహిష్కరించామని తెలియజేశారు. ఎఫ్ఆర్ఆర్‌వో అధికారులు అక్రమవలసదారులను గుర్తించి సమాచారం ఇస్తున్నారని, అనంతరం పోలీసులు వారిని బహిష్కరించే ప్రక్రియ సాగిస్తున్నారని తెలిపారు. ఆ ప్రక్రియ నిలుపుదల చేయలేదని స్పష్టం చేశారు.

డిజిటల్ అరెస్టు పేరిట రూ.3.15 కోట్లకు టోపీ

మంగళూరు, న్యూస్‌టుడే: తాను ఇన్‌స్పెక్టర్ శర్మనని, మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామని మంగళూరుకు చెందిన ఒక మహిళకు ఫోన్ చేసిన నిందితుడు ఆమె ఖాతా నుంచి రూ.3.15 కోట్ల నగదును తనఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. నేషనల్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో మీరు, మీ భర్త అక్రమ లావాదేవీలకు పాల్పడ్డారని కేసు నమోదైందని శర్మ బెదిరించాడు. మరో పోలీసు స్టేషన్‌కు కాల్ బదిలీ చేస్తున్నానని చెప్పారు. తాను సహార్ ఠాణా ఎస్సై అంటూ మోహన్ కుమార్, ఆ తరువాత పబ్లిక్ ప్రాసిక్యూటర్ దీపక్ వెంకటరమణ అనే వ్యక్తికి కాల్‌ను బదిలీ చేశారు. మహిళ, ఆమె భర్త బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకుని, ఆన్‌లైన్‌లో మీ వద్ద ఉన్న నగదు మొత్తాన్ని బదిలీ చేయాలని ఒత్తిడి చేశాడు. నగదు బదిలీ అనంతరం నిందితుల నుంచి ఫోన్లు నిలిచి పోయాయి. తాను మోసపోయానని ఆలస్యంగా గుర్తించిన బాధితురాలు సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

రూ.4.5 కోట్ల విలువైన మాదక ద్రవ్యాల జప్తు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: రాజానుకుంటె పరిధి ఆదిగానహళ్లిలో ఉంటూ, చుట్టుపక్కల ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న ముగ్గురు నైజీరియన్లను పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రూ.4.5 కోట్ల విలువైన 2 కిలోల హైడ్రో గంజా, 600 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనపరుచుకున్నారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలను రాబట్టేందుకు రాజానుకుంటె ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కలుషిత నీరు తాగి ముగ్గురి మృతి

యాదగిరి, న్యూస్‌టుడే: కలుషిత నీరు తాగి సురపుర సమీపంలోని తిప్పనటగి గ్రామానికి చెందిన పాతిక మంది అస్వస్థతకు గురయ్యారు. చికిత్స పొందుతూ దేవికమ్మ హొట్టి (48), వెంకప్ప (60), రామణ్ణ పూజారి (50) మరణించారు. మిగిలిన వారు చికిత్సకు స్పందిస్తున్నారని వైద్యులు తెలిపారు. తాగు నీరు గొట్టాలు పగిలి మురుగు నీరు చేరడంతోనే నీరు కలుషితమైందని అధికారులు గుర్తించారు.

వేటకు సెలవులు.. బోటు మరమ్మతులు

అరేబియా సముద్ర తీరంలో ఈనెల 31 వరకు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈనేపథ్యంలో రేవునగరి మంగళూరు సమీపంలోని తీరంలో వేలాదిగా మత్స్యకారులు బోట్లను నిలిపేశారు. కొందరు వాటికి మరమ్మతులు చేయించడం, రంగులు అద్దడం, అందంగా తయారుచేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. సోమవారం ఓ బోటుకు ఇలా రంగులు వేస్తున్న దృశ్యాన్ని చిత్రంలో చూడవచ్చు. **- మంగళూరు, న్యూస్‌టుడే**

దర్శన్ కేసు విచారణ వాయిదా

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్), న్యూస్‌టుడే: తన డెవిల్ సినిమా చిత్రీకరణకు విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ నటుడు దర్శన్ వేసుకున్న అర్జీ విచారణ నేటికి (మంగళ) వాయిదా పడింది. జూన్ 1 నుంచి 25వరకు విదేశాలకు వెళ్లి వచ్చేందుకు న్యాయస్థానం అనుమతించింది. వీసా లభించకపోవడంతో విదేశాలకు వెళ్లలేదు. ఇప్పుడు వీసా లభించడంతో జులై 11 నుంచి 30 వరకు విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలని వేసుకున్న అర్జీపై విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేసి, నేటికి విచారణను వాయిదా వేశారు.

ఇద్దరి విషాదాంతం

మండ్య: హొసగావి రహదారిలో సోమవారం ఉదయం సంభవించిన ప్రమాదంలో రామణ్ణ, భరత్ అనే యువకులు మరణించారు. వీరు వెళుతున్న బైకు అదుపు తప్పి వీసీ కాలువ అడ్డుగోడకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

చివరికి చిక్కింది

తిపటూరు తాలూకా అంచెకొప్పలు గ్రామంలో బోనులో పడిన చిరుత

తుమకూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని తిపటూరు తాలూకా హొన్నవళ్లి హోబళీలోని అంచెకొప్పలు గ్రామంలో చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. హొన్నవళ్లి హోబళీలోని బిదరె గుడి, కరికెరె, అంచెకొప్పల గ్రామాలతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల్లో చిరుతల బెడదతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో గ్రామాల్లోకి చిరుతలు ప్రవేశించి కుక్కలు, గొర్రెలు, మేకలు, కోళ్లను పెంపుడు జంతువులను చంపి తింటున్నాయని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ సిబ్బంది గ్రామ సమీపంలోని తోటల వద్ద బోను ఏర్పాటు చేశారు. ఆహారం కోసం అర్ధరాత్రి గ్రామంలోకి ప్రవేశించిన చిరుత బోనులోకి వెళ్లిన వెంటనే అటవీ శాఖ అధికారులకు విషయం చెప్పారు. సోమవారం తెల్లవారుజామునే చిరుతను చూడడానికి ప్రజలు చుట్టుముట్టారు. అధికారులు, సిబ్బంది కలసి చిరుతను అభయారణ్య ప్రాంతానికి తరలించారు.

తీర ప్రాంతంలో కొనసాగుతున్న వాన దూకుడు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ, ఉడుపి, శివమొగ్గ, చిక్కమగళూరు, కొడగు జిల్లాల్లో భారీ వర్షాలు కొనసాగాయి. బుధవారం వరకు ఈ జిల్లాల్లో ఎల్లో అలర్ట్ కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. బెంగళూరు, బెంగళూరు గ్రామీణం, చిక్కబళ్లాపుర, కోలారు, మైసూరు, మండ్య, హాసన, తుమకూరు, రామనగర, దావణగెరె, చిత్రదుర్గ, హావేరి, గదగ, ధార్వాడ, బీదర్, బెళగావి, విజయనగర, చామరాజనగర, యాదగిరి, విజయపుర, రాయచూరు, కొప్పళ, కలబురగిలో సాధారణం నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. గోకర్ణ, భాగమండల, ఉడుపి, ఆగుంబె, సుళ్య, కద్రా, క్యాసల్‌రాక్, పుత్తూరులో ఆదివారం భారీ వర్షం కురిసింది. గాలులు గంటకు 40-50 కి.మీ. వేగంతో వీస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

మెట్రో ఛార్జీలపై సమితి ఎప్పుడు?

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే: మెట్రో రైలు ప్రయాణ ఛార్జీలను నిర్ణయించేందుకు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలోని సమితిని ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీ తేజస్వి సూర్య వేసుకున్న అర్జీ విచారణ వాయిదా పడింది. సహేతుకంగా ధరలను నిర్ణయించాలని బీఎంఆర్‌సీఎల్ అధికారులను కోరినా, లేఖలు రాసినా స్పందన రాలేదని సూర్య తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలను ఆలకించిన న్యాయమూర్తి జస్టిస్ సునీల్ దత్ యాదవ్ రెండు వారాల పాటు విచారణను వాయిదా వేశారు.



అన్నదాతకు బాసట

రైతు సమస్యలపై చర్చించేందుకు సోమవారం బెంగళూరులోని గాంధీభవన్‌లో రైతు సంఘం నేతలు సమావేశమయ్యారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రైతు సంఘం నేతలు జగిత్‌సింగ్ దల్లేవాల్, కురుబూరు శాంతకుమార్ తదితరులు హాజరయ్యారు. కేంద్రం తెచ్చిన రైతు చట్టాలపై భవిష్యత్తులో చేపట్టే ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. ఆ చిత్రమే ఇది. **-బెంగళూరు(మల్లేశ్వరం), న్యూస్‌టుడే**

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 9121167525

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 9945050116

(c) eenadu

దేశవాళీ విత్తనాలు .. మదిదోచే ఫలాలు

విత్తనాలు కొనుగోలు చేసే స్టాల్

మైసూరు, న్యూస్‌టుడే: దేశ వాళీ విత్తనాలు, చిరుధాన్యాలు, టిప్పు సుల్తాన్ కాలంలో వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వివిధ జాతుల మామిడి పండ్ల మేళాను నంజరాజ బహద్దూర్ ఛత్రంలో ఏర్పాటు చేశారు.

కొనుగోలుకు సిద్ధంగా విత్తనాలు

ఆకట్టుకుంటున్న మేళా

సహజ సమృద్ధ సంస్థ నిర్వహిస్తున్న ఈ మేళాలో మండ్య, మైసూరు, చామరాజనగర, హాసన, కొడగు జిల్లాల్లో కొన్ని వందల ఏళ్ల నుంచి ఆదివాసీలు, రైతులు సాగు చేస్తున్న చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, వరి, పెసలు, మినుములు, అలసంద, కూరగాయలు, పండ్ల విత్తనాలను బీజోత్సవం పేరిట ఏర్పాటు చేసిన స్టాళ్లలో విక్రయానికి ఉంచారు. చిరుధాన్యాలతో చేసిన వంటకాలు, పానీయాలను కొందరు అమ్మకానికి ఉంచారు. రాచనగరిలోని కృషి కళా సంస్థ సొరకాయతో చేసిన ఆకర్షణీయమైన అలంకరణ ఉత్పత్తులు అందరినీ ఆకట్టుకున్నాయి. హెగ్గడదేవన కోటె హులికాడు ప్రాంత రైతులు పనస, కూరగాయాలు, అరుదైన విత్తనాలు, వివిధ జాతుల అరటి గెలలు, మొక్కలను విక్రయించారు. హాళె సరసీపురకు చెందిన రేఖా అప్పాజీ తమ తోటలో పండిన దశేరి, లంగడా, మల్లికా, ఆమ్రమాలి మామిడి పండ్లు విక్రయించారు. ముంగారులో విత్తుకునేందుకు సిద్ధ సణ్ణ, రత్నచూడి, హెచ్ ఎంటీ, సింధూర మధుసాలె, నవర, దొడ్డబైర నెల్లు, సేలం సణ్ణ తదితర వరి విత్తనాలు, జనప్రియ రాగి, జగళూరు రాగి విత్తనాలను రైతులు కొనుగోలు చేసుకున్నారు. ఈసారి బీజోత్సవంలో 400 రకాల వరి, రాగి, జొన్న, చిరుధాన్యాల విత్తనాలను ప్రత్యేకంగా విక్రయించారు. సేంద్రియ సాగులో ఎక్కువ దిగుబడి ఇచ్చే విత్తనాలు కూడా అందుబాటులో ఉంచారు. టిప్పు సుల్తాన్ తన సామ్రాజ్య విస్తరణకు వెళ్లిన సమయంలో ఆయా ప్రాంతాల్లో సాగు చేసే మామిడి జాతులను మైసూరుకు తీసుకువచ్చారు. సుల్తాన్‌ను భేటీ అయ్యేందుకు వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చే వారు మామిడి విత్తనాలు, అంట్లు ఇచ్చేవారు. కిసాన్, మావ్‌సింబి కా మావు, జీవన్‌పు, సజిద్, రేహన్, లాల్ బాదామ్, సుల్తాన్, హైదర్, మోస, రాజ్, కబిని, కలమల్ గోబ్, రూబీ, రసల్ అబిద్ తదితర 120 జాతుల మామిడి పండ్లను ప్రత్యేకంగా ప్రదర్శించారు. మండ్య జిల్లా మళవల్లి తాలూకా కిరుగావలు వద్ద పెద్ద మామిడి తోటను టిప్పు సుల్తాన్ సాగు చేయించేవాడు. మామిడి పండే సీజన్‌లో చెట్ల కింద పడే పండ్లను సైనికులు తినేవారు. ఇతర సమయాల్లో విశ్రాంతి తీసుకునేవారని చరిత్ర చెబుతోంది.

ఒక స్టాల్ వద్ద సీనియరు సిటిజన్లు

టిప్పు కాలంలో అభివృద్ధి చేసిన మామిడి జాతి పండ్లు

భక్తిశ్రద్ధలతో పీర్ల నిమజ్జనం

కంప్లిలో పీర్ల ఊరేగింపు

కురుగోడు (బళ్లారి), న్యూస్‌టుడే: కురుగోడు తాలూకా బాదనహట్టి గ్రామంలో మొహర్రంను సోమవారం సాయంత్రం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం రాత్రి మసీదుల్లో పీర్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు బెల్లం, చక్కెర చదివింపు చేశారు. అనంతరం గ్రామంలో పీర్లను ఊరేగించారు.

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లిలో మొహర్రం చివరిరోజు ఆదివారం రాత్రి పీర్ల నిమజ్జనం భక్తిశ్రద్ధలతో జరిగింది. 18వ వార్డులోని మసీదులో నిలబెట్టిన హసేన్-హుసేన్, కడెపీర, మౌలాలీ తాత, ఇమాం బాషా తదితర పీర్లను డప్పుల మధ్య ఊరేగించి జల్దీకి తరలించారు. తాలూకాలోని ఉప్పారహళ్లిలో సోమవారం పీర్ల నిమజ్జనం జరిగింది.

కురుగోడులో...

సాగునీటికి రైతుల ఎదురుచూపు

19 గేట్ల గుండా నది వైపు పరుగులు తీస్తున్న తుంగభద్ర జలాలు

ఇప్పటివరకు నదిలోకి 50 టీఎంసీలు

హొసపేటె, న్యూస్‌టుడే: కాలువలకు సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తారా అని ఆయకట్టు రైతులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. రాయచూరు, కొప్పళ జిల్లాలకు తడిపే ఎడమ కాలువకు ఈ నెల 2 నుంచి సాగునీటిని విడుదల చేశారు. మరోవైపు తుంగభద్ర కుడి ఎగువకాలువ(హెచ్చెల్సీ), దిగువ కాలువ(ఎల్లెల్సీ)లకు 10 నుంచి ఇవ్వాలని ఐసీసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం అన్నదాతలకు మింగుడుపడటం లేదు. ఈ ఏడాది జలాశయంలో కేవలం 80 టీఎంసీలు మాత్రమే నిల్వ చేసుకోవాలని నిపుణులు హెచ్చరించారు. జూన్ చివరి కల్లా జలాశయంలో నీటినిల్వలు 75 టీఎంసీలు దాటాయి. డ్యామ్ భద్రత దృష్ట్యా ముందుజాగ్రత్త చర్యగా పది రోజుల నుంచి గేట్లను ఎత్తిన నదికి నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటివరకూ సుమారు 50 టీఎంసీల నీరు నదికి పారింది. ప్రస్తుతం 19 గేట్ల ద్వారా 54340 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తున్నారు. ఎడమ కాలువ కింద ఇప్పటికే రాయచూరు, కొప్పళ జిల్లాల్లో నాట్లు ప్రారంభమయ్యాయి. హెచ్చెల్సీ, ఎల్లెల్సీ జలాలపై ఆధారపడిన విజయనగర, బళ్లారి జిల్లా రైతులు కాలువల నీటి కోసం వేచిచూస్తున్నారు. ఈ నెల 2 నుంచి హెచ్చెల్సీ, ఎల్లెల్సీలకు నీటిని విడుదల చేయాలని ఐసీసీ సమావేశంలో మంత్రులు ఇంజినీర్లకు తాఖీదులు జారీ చేశారు. బళ్లారి సమీప ఎల్లెల్సీ ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో 10 వరకు గడువు ఇవ్వాలని తుంగభద్ర మండలి ఇంజినీర్లు కోరారు. అందువల్ల ఆ రెండు కాలువలకు నీటి విడుదలలో జాప్యం జరుగుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.

ముందస్తు నీటి విడుదల

నిరుడు పరిస్థితులు పోల్చుకుంటే ఈ ఏడాది ముందస్తుగానే 10న రెండు కాలువలకూ నీటిని విడుదల చేస్తున్నామని తుంగభద్ర మండలి ఇంజినీర్లు పేర్కొన్నారు. సాధారణంగా కాలువలకు జులై మాసం చివరిలో నీటిని విడుదల చేసేవారు. ముంగారు వర్షాలు త్వరగా పలకరించడంతో 20 రోజులు ముందస్తుగానే కాలువలకు నీటిని విడుదల చేస్తున్నామని వారన్నారు. దీనివల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

వృథాగా నదిలోకి: పది రోజులనుంచి తుంగభద్ర జలాలు వృథాగా నదిలోకి పారుతున్నాయని రైతు సంఘం నాయకుడు దరూరు పురుషోత్తం ఆవేదన వ్యక్తం చేశారు. దానికి బదులు కాలువలకు విడుదల చేసుంటే కర్షకులు నాట్లకు సిద్ధం చేసుకునే వారన్నారు. ఎల్లెల్సీ ఆధునికీకరణ పనులను ఆలస్యంగా చేపట్టడంతో నీటి విడుదలలో ఆలస్యం చోటుచేసుకుందని మండిపడ్డారు.

1.7 కిలోల గంజాయి పట్టివేత

నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో కొనుగోలు చేసిన గంజాయిని అమ్మేందుకు తీసుకెళ్తున్న ముఠా సభ్యులను కణేకల్లు రోడ్డులో పట్టుకున్నట్లు రాయదుర్గం యూపీఎస్ సీఐ జయనాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బళ్లారిలో రైల్వే స్టేషన్‌లో సాధువుల నుంచి గంజాయి కొనుగోలు చేసి రాయదుర్గం, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో ప్యాకెట్ రూ.800కు అమ్ముతున్నట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. ఇన్నాళ్లు రైలు మార్గంలోనే గంజాయి తరలించే ముఠా సోమవారం కణేకల్లు రోడ్డులో నిర్వహించిన ముమ్మర తనిఖీల్లో పట్టుబడ్డారన్నారు. నిందితులు కంబదూరు మండలం కర్తనపర్తికి చెందిన బోయ నరేశ్, కొత్తూరుకు చెందిన కొడవల్లి రామాంజనేయులు, చెన్నంపల్లికి చెందిన వై.మారెన్న, ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన సి.మారెన్న, కంబగిరి వెంకటరాముడు, అనంతపురం నగరం చంద్రబాబు కొట్టాలకు చెందిన దంపతి జీవన్‌కుమార్, రుద్రంపేటకు చెందిన బండి ఉదయ్ కిరణ్, ఎన్‌టీ కాలనీకి చెందిన అహమ్ సాబ్, రాణినగర్‌కు చెందిన అన్వర్‌బాష, గాదెన్న పాతకళ్లుకు చెందిన అంబేరసూల్‌ఖాన్‌లను అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చడంతోపాటు 1.7 కిలోల గంజాయి, 7 చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సహకార సంఘానికి జరిమానా

కార్వార, న్యూస్‌టుడే: పదవీ విరమణ సమయంలో వచ్చిన నగదును మూడు మొత్తాలుగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన తనకు ఆ నగదును వెనక్కు ఇవ్వడం లేదని దినకర్ నాగప్ప అనే సీనియరు సిటిజన్ వినియోగదారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి దినకర నాగప్పకు రూ.4,96,898 నగదుకు సాలీనా 9.5 శాతం వడ్డీ, కోర్టు ఖర్చులు, పరిహారంగా మరో రూ.25 వేలు ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు.

వరుణుడి కరుణకు గాడిదలకు పెళ్లి

హొళల్కెర తాలూకాలో వర్షాభావం నెలకొనడంతో ఉప్పేరిగేనహళ్లి గ్రామస్థులు వరుణుడి కరుణ కోసం దేవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆడ, మగ గాడిదలకు పెళ్లిచేసి వాటిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. గత నెల రోజులుగా వానలు కురవకపోవడంలో గ్రామంలోని గొట్టపు బావులు వట్టి పోయాయని గ్రామ పెద్ద తిప్పేస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. తాగు, సాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, విత్తనాలు సిద్ధం చేసుకున్నా పంటలను సాగు చేయలేని పరిస్థితి నెలకొందని ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో గాడిదలకు పెళ్లి చేశామన్నారు. **-న్యూస్‌టుడే, చెళ్లకెర (చిత్రదుర్గం)**

రెండు లారీలు ఢీ: చోదకుడి దుర్మరణం

హొసపేటె, న్యూస్‌టుడే: పాడై నిల్చున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొన్న ఘటనలో చోదకుడు సుడలై (50) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే చనిపోయారు. ఈ ఘటన ఆదివారం రాత్రి కూడ్లిగి తాలూకా కైవల్యాపుర సమీప 50వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ నుంచి మామిడిపండ్ల లోడుతో ముంబయికి బయలుదేరిన ఓ లారీ కూడ్లిగి వద్ద పాడై ఆగిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన మరో లారీ దాన్ని ఢీకొంది. పాడైన లారీలో ఉన్న సుడలై మృతి చెందాడు. ఆయనను తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి వాసిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి కారణమైన లారీ చోదకుడు కె.శరవణకు గాయాలయ్యాయి. కూడ్లిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

హొసపేటె, న్యూస్‌టుడే: హరపనహళ్లి తాలూకా బాగళి చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చెరువు గట్టుపైన మృతుడి పాదరక్షలు, లుంగీ, తువాలు లభ్యమయ్యాయి. మృతుడి చేతిలో వల ఉండటంతో చేపలు పడుతూ ఆకస్మికంగా చెరువులో పడిపోయి చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడికి వయస్సు 30 ఏళ్లు ఉండొచ్చని, ఎవరికైనా వివరాలు తెలిస్తే చరవాణి సంఖ్య 9480805776కు సమాచారం ఇవ్వాలని హరపనహళ్లి పోలీసులు కోరారు.

వాహనం బోల్తా: ఐదుగురికి గాయాలు

వాగులో బోల్తాపడిన బొలెరో వాహనం

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: చెళ్లకెర నుంచి సాణికెర వైపు వెళుతున్న బొలెరో పికప్ వాహనం వాగులో బోల్తాపడటంతో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరకులు తేవడానికి బయలుదేరిన వాహనం వాగుకు అడ్డంగా నిర్మించిన కల్వర్టు వద్ద చోదకుడి అదుపుతప్పి అందులోకి పడిపోయింది. కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో వాహనం వాగులోకి పడిపోయిందని క్షతగాత్రులు వాపోయారు. బాధితులను పోలీసులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

లోకాయుక్త జిల్లా పర్యటన ఖరారు

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక, బళ్లారి లోకాయుక్త పోలీస్ అధికారులు జిల్లాలో వివిధ తాలూకాల వారీగా పర్యటించి సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించి, అక్కడికక్కడే పరిష్కరిస్తామని లోకాయుక్త ఎస్పీ వాసుదేవ రామ్ తెలిపారు. 9న కురుగోడు తహసీల్దార్, 15న బళ్లారి నగరంలోని నూతన డీసీ కార్యాలయంలోని తహసీల్దార్, 17న సిరుగుప్ప సీడీపీవో, 23న సండూరు తహసీల్దార్, 25న కంప్లి తహసీల్దార్ కార్యాలయాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించి విజ్ఞప్తులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

గనినాడు కాంగ్రెస్‌లో లుకలుకలు

● నాయకుల్లో భేదాభిప్రాయాలు ● సమావేశానికి ఎమ్మెల్యేలు, మంత్రి గైర్హాజరు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా కాంగ్రెస్‌లో లుకలుకలు బయటపడగా, నాయకుల్లో భేదాభిప్రాయాలు పొడచూపాయి. ఇక్కడ పార్టీకి పెద్దదిక్కు లేకపోవడంతో ఎవరికివారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల ముందు నగరంలో కార్మికశాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి నగర, గ్రామీణ నియోజకవర్గాలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు జిల్లా బాధ్య మంత్రి జమీర్ అహమ్మద్‌ఖాన్ దూరంగా ఉండటం అసమ్మతికి సంకేతమేనని వినిపిస్తోంది. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న గనినాడులో ఈ పరిణామం పార్టీ అధిష్ఠానానికి తలనొప్పిగా మారుతుందనడంలో సందేహం లేదు.

మొదటినుంచి ఇదే పరిస్థితి: తొలినుంచి జిల్లా కాంగ్రెస్ అసమ్మతి రాజకీయాలకు పెట్టింది పేరు. రాజకీయ కురువృద్ధుడు ఎం.వై.ఘోర్పడే జిల్లా బాధ్య మంత్రిగా ఉన్న సమయంలోనూ జిల్లా నాయకుల మధ్య భేదాభిప్రాయాలు కనిపించేవి. 1994లో నగర విధానసభ క్షేత్రం నుంచి కేంద్ర మంత్రి బసవరాజేశ్వరి కుమారుడు డా.వెంకట మహిపాల్ పార్టీ నుంచి పోటీ చేసినప్పుడు నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయారు. ఫలితంగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన ముండ్లూరు దివాకర్ బాబు గెలిచారు. 1999 విధానసభ ఎన్నికల తర్వాత పార్టీలో మూడు గ్రూపులు ఏర్పడ్డాయి. అల్లం వీరభద్రప్ప, కె.సి.కొండయ్య ఒక వర్గంగా, ఎం.వై.ఘోర్పడే, సిరాజ్‌షేక్ మరో వర్గంగా, మాజీ మంత్రి దివాకర్‌బాబు అనుచరులు మూడో గ్రూపుగా విడిపోయారు. పైకి బాగున్నట్లు కనిపించినా లోలోపల ఒకరినొకరు ఓడించడానికి ఎత్తుకు పైఎత్తులు వేసేవారు. 2004లో బళ్లారి నగర అసెంబ్లీ క్షేత్రం నుంచి పార్టీ అభ్యర్థి దివాకర్‌బాబు, కురుగోడు నియోజకవర్గం నుంచి అల్లం వీరభద్రప్పల ఓటమికి అసమ్మతి రాజకీయాలే కారణమన్నది బహిరంగ రహస్యం.

నేడూ అదే బాటలో..: జిల్లా కాంగ్రెస్‌లో రెండో తరం నాయకులొచ్చినా పరిస్థితిలో మార్పు లేదని, మంత్రిగా నాగేంద్ర రాజీనామా చేసిన తర్వాత పార్టీకి పెద్దదిక్కు లేకుండా పోయిందని కార్యకర్తలు అంటున్నారు. జిల్లా బాధ్య మంత్రిగా సంతోష్ ఎస్.లాడ్‌ను తేవడానికి ప్రయత్నాలు చేసినా, పార్టీ అధిష్ఠానంపై జిల్లా నేతలు ఒత్తిడి తెచ్చి విజయనగర జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జమీర్‌కే బాధ్యతలు అప్పగించేలా చేశారు. ఆయన జిల్లా గురించి పట్టించుకోరని, ఎమ్మెల్యేలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని భావించారు. మరోవైపు రెండు రోజుల ముందు కార్మిక మంత్రి సంతోష్ లాడ్ అధ్యక్షతన అసంఘటిత కార్మికులకు స్మార్ట్ కార్డుల అందజేత కార్యక్రమానికి గ్రామీణ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డా.సయ్యద్‌నాసిర్, మంత్రి జమీర్ అహమ్మద్‌ఖాన్ దూరంగా ఉండిపోయారు. మంత్రి సంతోష్ లాడ్ వర్గం ఎమ్మెల్యేలు గణేశ్, బి.ఎం.నాగరాజు, ఇ.అన్నపూర్ణ, ఎంపీ ఇ.తుకారామ్ హాజరయ్యారు. సమావేశానికి ముందు స్థానిక ఎమ్మెల్యేలతో జరిగిన భేటీలో వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపణలు వినవచ్చాయి. ఇలాగే కొనసాగితే జిల్లాలో భాజపా మరోసారి పుంజుకోవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

బళ్లారిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం

విద్యార్థుల ప్రగతి పరిశీలన

కారటగి తాలూకా మర్లానహళ్లి గ్రామ పంచాయతీ పరిధి మారుతీనగర్ ప్రభుత్వ పాఠశాలలో క్షేత్ర విద్యాశాఖ అధికారి నటేశ్ విద్యార్థుల కలికా ప్రగతిని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే అక్షరాలు సరిగా రాయడం, తప్పులు లేకుండా చదవడం వంటి కలికా సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. ఉన్నత విద్యాభ్యాసానికి ఇది ఉపయోగపడుతుందని అన్నారు. గతేడాది చదివిన పాఠ్యపుస్తకాల నుంచి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి శిశువుల హాజరు, వారి ఆరోగ్యం గురించి కేంద్రం ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. **-న్యూస్‌టుడే, కారటగి**

టికెట్ల మాయాజాలం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో టికెట్ల మాయాజాలంతో భక్తులను మోసగించిన బ్యాంకు సిబ్బంది అడ్డంగా దొరికిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. ఆలయంలోని ప్రసాదాల కౌంటర్ ఎదురుగా భక్తుల సౌకర్యార్థం టికెట్ల కౌంటర్ ఏర్పాటు చేశారు. కర్ణాటకకు చెందిన ప్రభుత్వ అధికారి కుటుంబ సభ్యులతో కలసి సోమవారం కౌంటర్ వద్ద అంతరాలయ దర్శనం కోసం 9 టికెట్లకు రూ.4,500 చెల్లించారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న బ్యాంకు సిబ్బంది పైన, కింద రూ.500 టికెట్లు పెట్టి, మధ్యలో రూ.200 టికెట్లు ఇచ్చేశారు. తీసుకున్న మొత్తానికి సరిపడా టికెట్లు ఇవ్వకపోవడంపై అనుమానం వచ్చిన ఆ ఉద్యోగి ఈ విషయమై ఆలయ ఈవో బాపిరెడ్డికి ఫిర్యాదు చేశారు. టికెట్ తీసుకున్నాక స్కానర్ పాయింట్, మహాద్వారం, దక్షిణామూర్తి సన్నిధి, స్వామి, అమ్మవార్ల సన్నిధిలో టికెట్లు పరిశీలిస్తారు. అక్రమాలు జరుగుతున్నాయన్న విషయమై ఆలయ ఈవో బాపిరెడ్డి విచారణకు ఆదేశించారు.

14న పింఛన్ అదాలత్

బళ్లారి: కార్మికర భవిష్య నిధి సంస్థ, బళ్లారి ప్రాదేశిక కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 14న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నగర ప్రాదేశిక కార్యాలయంలో పింఛన్ అదాలత్ ఉంటుందని భవిష్యనిధి కమిషనర్ కె.ప్రవీణ్ తెలిపారు. బళ్లారి, విజయనగర, కొప్పళ, చిత్రదుర్గం జిల్లాలకు చెందిన పింఛనుదారులు తమ సమస్యలను వినతి పత్రాల రూపంలో ఈ నెల 10వ తేదీన కార్యాలయానికి పంపాలన్నారు.

అధ్యయన శిబిరానికి దరఖాస్తులు

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో పాత్రికేయులకు కన్నడ సాహిత్యంపై నిర్వహించనున్న మూడు రోజుల అధ్యయన శిబిరంలో పాలుపంచుకోవడానికి ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. శిబిరం ఆగస్టు మూడో వారంలో జరుగుతుంది. అర్హులు 20 నుంచి 40 ఏళ్లలోపు ఉండాలి. పత్రికా విభాగంలో డిగ్రీ పొందిన వివిధ విభాగాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 25వ తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొంది, ఆన్‌లైన్‌లో పూర్తిచేసి పంపాలని అధికారులు సూచించారు.

10 నుంచి చాతుర్మాస వ్రతం

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లిలోని శ్రీమన్నారాయణ ఆశ్రమ విద్యాభారతి స్వామి 10నుంచి చాతుర్మాస వ్రతాన్ని ప్రారంభించనున్నారు. కంప్లిలో సోమవారం ఆయన ఈమేరకు విలేకరులకు తెలిపారు. సంకేశ్వర-కరవీర సచ్చిదానంద విద్యానరసింహ భారతి స్వామి సూచన మేరకు గురుపౌర్ణమి రోజున వ్రతం ప్రారంభిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

మాధ్యమ రంగానికి పత్రికలే ఊపిరి

పత్రికా దినోత్సవంలో వక్తలు

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నందీశ్, ఎస్పీ, కేవీ ప్రభాకర్ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: మన రాజ్యాంగంలో పత్రికలకు ప్రత్యేక స్వేచ్ఛ లేదు. వాక్ స్వాతంత్ర్యమే పత్రికా స్వేచ్ఛగా పరిగణించాలని సీఎం మాధ్యమ సలహాదారు కె.వి.ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర, జిల్లా కార్యనిరత పత్రకర్తర సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన పత్రికా దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేడు మాధ్యమ రంగం కొనసాగుతోందంటే కేవలం పత్రికలతో సాధ్యమైందన్నారు. ప్రస్తుతం పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో ఉందని, పాత్రికేయులు అప్రమత్తం కావాలని సూచించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మనం ధైర్యంగా చేసే ప్రయత్నాల్లో స్థిరంగా నిలబడకపోతే మాధ్యమ రంగం తన ఉనికిని కొనసాగించదు అన్నారు. భారతీయ జర్నలిజానికి ఉన్నత చరిత్ర ఉందన్నారు. స్వాతంత్ర్యం పోరాటం నుంచి ప్రజాస్వామ్య ఏకీకరణ వరకు ముఖ్యమైన పాత్ర పోషించిందన్నారు. దేశంలో మొదటి వార్తా పత్రికగా చెప్పబడే 'బెంగాల్ గెజిట్' ఆంగ్లేయ పాలనను విమర్శించిందని గుర్తుచేశారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో గాంధీ, భగత్‌సింగ్, అంబేడ్కర్, బాలగంగాధర తిలక్ ప్రారంభించిన వార్తా పత్రికలు భిన్న స్వరాలతో దేశాన్ని ఏకం చేయడానికి శ్రమించాయని గుర్తు చేశారు.

తప్పుడు సమాచారం ఇవ్వొద్దు

అందరికన్నా ముందుగా సమాచారం అందించాలన్న ఆత్రుతతో బ్రేకింగ్ న్యూస్ ఇచ్చి, దాన్ని సమర్థించుకోవడానికి ప్రయత్నాలు చేయడం వల్ల మాధ్యమ రంగంపై విశ్వాసం పోతుందని ప్రభాకర్ అన్నారు. ఇలాంటి వాటిని కట్టడి చేయడానికి ప్రత్యేక చట్టం తెస్తున్నట్లు చెప్పారు. పత్రకర్తర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివానంద తగడూరు మాట్లాడుతూ గ్రామీణ విలేకరులకు బస్సుపాసులు తేవడానికి శ్రమించినట్లు తెలిపారు. పాత్రికేయులకు ఆరోగ్య సంజీవిని పథకాన్ని తెచ్చామని చెప్పారు. భవిష్యత్తులో ఇంటి స్థలాలు పంపిణీ చేస్తామన్నారు. దావణగెరె విశ్వవిద్యాలయ ఆచార్యులు మాట్లాడుతూ మార్పునకు అనుగుణంగా ముందుకు సాగితే మాధ్యమ రంగానికి ఢోకా ఉండదన్నారు. మేయర్ ముల్లంగి నందీశ్, మంత్రి జమీర్ మహమ్మద్ ఖాన్ మాధ్యమ సలహాదారుడు లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి లోకేష్, సోమశేఖర్ కెరగూడు, డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణి, వార్తశాఖాధికారి తుకారామ్, సంఘం రాష్ట్ర, జిల్లా సమితి సభ్యులు వీరభద్ర గౌడ, మల్లయ్య మోక, వెంకోబి సంగనకల్లు తదితరులు పాల్గొన్నారు. తొలుత పదో తరగతి, ద్వితీయ పీయూసీలో అత్యధిక మార్కులు సాధించిన పాత్రికేయుల పిల్లలను సన్మానించి అభినందించారు.

సత్కారం అందుకున్న ప్రతిభావంత విద్యార్థులు

క్రికెట్ టోర్నీ విజేత కేకే బుల్స్ క్రీడాకారులకు కప్ అందజేస్తున్న ఎస్పీ శోభారాణి, ప్రభాకర్ తదితరులు

EENADU Classifieds

PROFESSIONAL SERVICES

ASTROLOGY

సింహాద్రి జ్యోతిష్యం: ఫొటో, తాళపత్రం, జన్మ పత్రిక చూసి ఉద్యోగం, వివాహం, సంతానం, ఆర్థిక ఇబ్బందులు, స్త్రీ ప్రేమ, దాంపత్య సమస్యలు ఎటువంటివి ఉన్న పరిష్కారం, N.T. రమణాచారి, విశాఖపట్నం. 9866066393.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్లారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

(c) eenadu

బళ్ళారి
● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

'సర్కారుకు ఆర్థిక సంకటం'

హొసపేటె: రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని సీఎం ఆర్థిక సలహాదారు, యలబుర్గా ఎమ్మెల్యే బసవరాజ రాయరెడ్డి అన్న మాటలతో కాంగ్రెస్ సర్కారు దయనీయ పరిస్థితి మరోసారి బహిర్గతమైందని విజయనగర జిల్లా భాజపా అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ జేవీల రాయరెడ్డి సొంత నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ 'గ్యారంటీలతో పలు అభివృద్ధి పథకాలు ఆగిపోయాయి. పథకాలను రద్దు చేసుకోవాలని ప్రజలు కోరితే, ఆ మాటను ముఖ్యమంత్రి వద్ద ప్రస్తావిస్తా'నని చెప్పడం సర్కారు దివాళాతనానికి నిదర్శనమని సంజీవరెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆర్థిక స్థితి బాగాలేదని ఈ సమయంలో చెప్పడానికే చెబుతోందన్నారు. గ్యారంటీ పథకాలతో అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం వాటిని కొనసాగించే గ్యారంటీ లేదని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం ఎన్నాళ్లు కొనసాగుతుందో చూడాలన్నారు.

వారసత్వ ఆస్తుల బదిలీకి ఈ-పౌతి

ఈ-పౌతి గోడపత్రికలు విడుదల చేస్తున్న మంత్రి శివరాజ తంగడగి తదితరులు

గంగావతి, న్యూస్‌టుడే: వ్యవసాయ భూముల యజమానులు చనిపోతే వారి వారసుల పేర్లకు ఆస్తులను బదిలీ చేసేందుకు ప్రభుత్వం ఈ-పౌతి సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని రాష్ట్ర కన్నడ, సాంస్కృతిక, వెనుకబడ్డ వర్గాల సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ తంగడిగి తెలిపారు. ఆయన సోమవారం కొప్పళలో ఈ-పౌతి జాగృతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దీనిపై వారసత్వ ముటేషన్ ప్రక్రియ సులభమవుతుందన్నారు. మృతుల పేరిట భూములు ఉంటే రుణాలు, పంటనష్ట పరిహారం లభించవని, భూ సేకరణ పరిహారానికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పహణీలకు ఆధార్ అనుసంధానం చేసిన తర్వాత ఇది వర్తిస్తుందన్నారు. జిల్లాలోని ఐదు తాలూకాల్లో ఈ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటివి 70,579 కేసులను గుర్తించినట్లు చెప్పారు. వారసుల అర్జీలు అందితే పహణీ వరస 11లో నమోదు చేస్తున్నారు. రైతులు దాఖలాలను సమర్పించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లోకసభ సభ్యుడు రాజశేఖర్ హిట్నాళ్, గ్యారంటీ పథకాల జిల్లాధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, జిల్లా పాలనాధికారి సురేష్ ఇట్నాళ్, ఎస్పీ రామ్ అరసిద్ధి, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు టి.రుద్రేశప్ప పాల్గొన్నారు.

వెంటాడుతుంది.. పట్టేస్తుంది

- వైద్యులపై నిఘాకు యాప్
- ఈ నెల 1 నుంచి అమలు

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొందరు వైద్యులు విధులకు హాజరై సంతకం లేదా బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేసి, కొద్దిసేపు పనిచేసి సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఫలితంగా వైద్యులు అందుబాటులో లేక దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు ఇబ్బందులు పడేవారు. దీన్ని అరికట్టడానికి ఆరోగ్య శాఖ చరవాణుల్లో యాప్ ద్వారా ఫొటో, పని స్థలం ఆధారిత హాజరును తప్పనిసరి చేసింది. వైద్యులతో పాటు ఆరోగ్య సిబ్బంది, అధికారులు ఈ యాప్‌ను చరవాణుల్లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 1 నుంచి ఆరోగ్యశాఖ లొకేషన్ ఆధారిత హాజరు యాప్‌ను తప్పనిసరి చేయడంతో రోగులకు ఇబ్బందులు లేకుండా పోయింది.

ప్రదేశం ఆధారిత హాజరు అంటే?: వైద్యులు, సిబ్బంది తమ చరవాణుల్లో తమ ఫొటోతో కూడిన పనిచోటు (లొకేషన్) ఆధారిత హాజరు యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. వైద్యులు, అధికారులు, సిబ్బంది తమ సర్వీస్, లొకేషన్ హాజరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఉదయం విధులకు హాజరైన సమయం, ముగింపు వేళ తర్వాత యాప్ ద్వారా లొకేషన్‌తో పాటు ఫొటోను షేర్ చేయాలి. ఒకవేళ పనిచేసే చోటు మారితే కారణం చెప్పాల్సిందే. లేకుంటే గైర్హాజరు వేస్తారు. ఒకసారి యాప్‌ను తెరిస్తే ఇక పని ముగిసే వరకు వారిపై నిఘా ఉంచుతుంది. ఎక్కడున్నా తెలిసిపోతుంది. సొంత పనులు చక్కబెట్టుకునేందుకు వెళితే ఇటే పట్టేస్తుంది. యాప్ పనితీరును ఆరోగ్య శాఖ మే, జూన్ నెలలో ప్రయోగాత్మకంగా పరిశీలించి చక్కటి ఫలితాలు రావడంతో జులై 1 నుంచి తప్పనిసరి చేసింది. జిల్లా ఆరోగ్యశాఖలో 877 మందికిగాను 803 మందికి ఈ యాప్ హాజరు అమలుచేశారు.

పని ప్రదేశం నుంచి యాప్‌లో ఫొటోతో నమోదు

చక్కటి ఫలితాలు వచ్చాయి

ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బందిపై ప్రత్యేక నిఘా పెట్టడానికి లొకేషన్ ఆధారిత హాజరు యాప్ తెచ్చాం. దీన్ని రెండు నెలల ప్రయోగాత్మకంగా పరిశీలించాం. చక్కటి ఫలితాలు వచ్చాయి. ఇకపై సిబ్బంది, వైద్యులు విధులు ఎగరగొట్టే అవకాశం ఉండదు. ఈ నెల 1 నుంచి యాప్‌ను అమల్లోకి తెచ్చాం. రోగులకు మెరుగైన సేవలందించానికి యాప్ అనుకూలంగా మారింది. - డా.యల్లా రమేష్‌బాబు, డీహెచ్‌ఓ, బళ్లారి



గ్రామీణ ఆణిముత్యాలు

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రతిభ ఒకరి సొత్తు కాదని గ్రామీణ ప్రాంతాల్లోని రైతు కుటుంబం నుంచి ఇద్దరు బాలికలు నిరూపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కన్నడ మాధ్యమంలో చదివి సీఏ ఉత్తీర్ణత సాధించారు. ఛార్టెడ్ అకౌంటెంట్‌లో పేర్లు నమోదు చేసుకోవడానికి అర్హత సాధించారు. సిరుగుప్ప తాలూకా హచ్చొళ్లి గ్రామానికి చెందిన నీలమ్మ, బసవరాజగౌడల కుమార్తె ఎం.శిల్ప, బళ్లారి తాలూకా బెళగల్లు గ్రామస్థులు మమత, మంజునాథగౌడ కుమార్తె హెచ్.పవిత్ర ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కన్నడ మాధ్యమంలో చదివారు. సీఏపై ఆసక్తితో బళ్లారి సీఏ కేంద్రంలో చేరారు. ఫైనల్ పరీక్షలు మేలో జరిగాయి. ఈ నెల 5వ విడుదల చేసిన ఫలితాల్లో ఇద్దరూ ఉత్తీర్ణత సాధించి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు.

ఎం.శిల్ప


హెచ్.పవిత్ర

సింధనూరులో ప్రొటోకాల్ లేదు

సింధనూరు, న్యూస్‌టుడే: 'సింధనూరు ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ ప్రభుత్వ ప్రొటోకాల్ పాటించడం లేదు. ఆయన తనయులే అధికార కార్యక్రమాలు నడిపిస్తున్నారని, ఆయన ఇంటి వారంతా ఎమ్మెల్యేలుగా చెలామణి అవుతున్నారు' అని భాజపా నాయకుడు కె.కరియప్ప ఆరోపించారు. మరోపక్క కాంగ్రెస్ ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లికీ ప్రొటోకాల్ లేదన్నారు. ఆయన సోమవారం ఇక్కడ మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నువ్వా-నేనా అంటూ పోటీపడి అధికారులపై దర్పం చూపిస్తున్నారని, కొన్ని కార్యాలయాలకు వీరు తాళాలు బిగించారని కరియప్ప స్థానిక కాంగ్రెస్ నాయకులపై ధ్వజమెత్తారు. ప్రొటోకాల్‌పై తహసీల్దారును వివరణ అడిగితే నీళ్లు నమిలారే తప్ప ఆ పత్రం మా చేతికి ఇవ్వలేదని ఆరోపించారు. సింధనూరులో ఎమ్మెల్యే తనయులది ఇష్టారాజ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేపదే సామాజిక న్యాయమంటూ ఎలుగెత్తి చాటే కాంగ్రెస్ నాయకులు సింధనూరులో దాన్ని విస్మరిస్తున్నారని ఎద్దేవా చేశారు. తనయుడికి ప్రాధికార అధ్యక్ష పట్టం కట్టిన ఎమ్మెల్యే బాదర్లి సామాజిక న్యాయం గురించి ఏం చెబుతారని కరియప్ప విమర్శించారు. సింధనూరు నగరసభ ఉన్నా లేనట్లేనని భాజపా నాయకులు ఆరోపించారు. అభివృద్ధి నిలిచిపోయిందని, ఆరా తీయాల్సిన ఎమ్మెల్యే మౌనం పాటిస్తున్నారని మండిపడ్డారు. వీళ్ల ధోరణి ఇలానే ఉంటే జనం తిరగబడటం ఖాయమని కరియప్ప జోస్యం చెప్పారు. ఆయన వెంట భాజపా గ్రామీణ అధ్యక్షుడు యంకోబ నాయక్, నగర అధ్యక్షుడు సిద్ధరామేశ్ తదితరులున్నారు.

అధికార పార్టీ నాయకుల తీరును వెల్లడిస్తున్న కరియప్ప తదితరులు

ఉన్న దాంట్లో దాతృత్వం చూపాలి

సింధనూరు, న్యూస్‌టుడే: 'మనిషికి మనిషి సాయం చేసుకోవాలి. మనకున్న దాంట్లో కష్టంలో ఉన్నవారిని ఆదుకోవాలి. అదే మానవ జీవితానికి సార్థకత' అని సింధనూరు కమ్మవారి సంఘం అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీహర్ష అన్నారు. స్థానిక తెలుగు ప్రముఖుడు గొడితి విశ్వనాథ్ చౌదరి తన కుమారుడు నాగేశ్వరనాథ్ జ్ఞాపకార్థం ఓ ట్రస్ట్‌ను స్థాపించి ఏడాదిగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. తనయుడి తొలి వార్షికం సందర్భంగా మస్కి మార్గంలోని ముళ్లూరు క్యాంపు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించి కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటించారు. విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేయించారు. అతిథిగా పాల్గొన్న శ్రీహర్ష విశ్వనాథ్ చౌదరి సేవాభావాన్ని కొనియాడారు. మరో అతిథి క్లబ్ కాకతీయ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కల్యాణ కర్ణాటక ఇకపై వెనుకబడే అవకాశం లేదన్నారు. ప్రభుత్వ పరంగా అభివృద్ధికి తోడు విశ్వనాథ్ చౌదరి వంటి దాతలు ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుంటుంటే వెనుకబాటుకు అవకాశమే ఎక్కడిదని ప్రశ్నించారు. కార్యక్రమంలో వనసిరి అమరేగౌడ, నెక్కంటి సురేశ్, బాధ్య విద్యాశాఖ అధికారి బసవలింగప్ప, అశోక్ బెన్నూరు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న శ్రీహర్ష, చిట్టూరి శ్రీనివాస్, విశ్వనాథ్ చౌదరి

స్మయోర్‌కు 7స్టార్ రేటింగ్ పురస్కారం

సండూరు(బళ్లారి), న్యూస్‌టుడే: సండూరు తాలూకా కమతూరు స్మయోర్ మైనింగ్ సంస్థను భారత ప్రభుత్వ గని సచివాలయం 2023-24 ఏడాదికి 7 స్టార్ రేటింగ్ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సోమవారం భారత ప్రభుత్వం ఆధీనంలోని ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబీఎం) ఆధ్వర్యంలో రాజస్థాన్‌లోని జైపూర్ అంతర్జాతీయ కేంద్రంలో కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన సీఎం భజన్‌లాల్‌శర్మ, కేంద్ర గని భూవిజ్ఞాన శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి స్మయోర్ సంస్థ వ్యవస్థాపక నిర్దేశకుడు బహిర్జీ అజయ్ ఘోర్పడేకు 7స్టార్ రేటింగ్ పురస్కారం అందజేసి అభినందించారు. 2014-15 ఏడాది నుంచి భారత ప్రభుత్వ గని సచివాలయం గనులను సక్రమంగా నిర్వహిస్తున్న కంపెనీలకు 5 స్టార్ రేటింగ్ పురస్కారాలు అందజేసి అభినందిస్తోంది. స్మయోర్ సంస్థ పదేళ్లుగా వరుసగా పురస్కారం అందుకుంటోంది. దేశంలో మూడు గనుల సంస్థలను మాత్రమే 7 స్టార్ పురస్కారాలను ఎంపిక చేశారు. వాటిలో దక్షిణ భారతదేశంలో స్మయోర్ సంస్థ ఉండటం విశేషం. స్మయోర్ గని సంస్థ వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం, ఉద్యోగాలు సృష్టించడం, పరిసరాలకు హాని చేయకుండా గనుల తవ్వకాలు సాగించడం, నష్టపోయిన ప్రాంతాల్లో మొక్కలు పెంచడం వంటి సామాజిక కార్యక్రమాలతో పురస్కారానికి ఎంపికైంది. ఈ కార్యక్రమంలో స్మయోర్ సంస్థ ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన వ్యవస్థాపకుడు దిప్‌కుక్కె తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపికలు అందుకున్న కళాకారులతో వెంకోబరావు, శివరుద్రయ్య, బసవరాజు

ఎరువుల కొరత తలెత్తకుండా చూడండి

సింధనూరు, న్యూస్‌టుడే: ఈ ఏడాది సకాలంలో వానలు పుష్కలంగా కురిసి తుంగభద్ర జలాశయం నిండింది. నెల రోజుల ముందుగానే కాలువలకు సాగునీరు వదిలినట్టైంది. ఇది రైతులకు మంచి పరిణామం. ఒక్కసారిగా వ్యవసాయ పనులు వేగం పుంజుకున్నందున దీని ప్రభావం రసాయన ఎరువుల అమ్మకాలపై పడొచ్చు. ఎరువుల కొరత ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి సింధనూరు తాలూకా వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ఆయన సోమవారం జనస్పందన కార్యాలయంలో ఆ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. నకిలీ ఎరువులు, విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రయత్నం జరుగుతోందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఎరువులు, విత్తనాల నిల్వలు, ఖరీఫ్ సాగు క్షేత్రం, ఏయే పంటలు వేస్తున్నారు తదితర గణాంకాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఏడీఏ మల్లికార్జున సమావేశంలో వివరాలు వెల్లడించారు.

సమావేశంలో వివరాలు అడుగుతున్న ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి

సద్భావన మంటపం ప్రారంభం

గంగావతి ప్రభుత్వ పీయూ కళాశాలలో ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి సోమవారం సోమవారం సద్భావన మంటపాన్ని ప్రారంభించారు. దీన్ని 12వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.20 కోట్లతో నిర్మించినట్లు చెప్పారు. కళాశాలలో జరిగే సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బళ్లారి మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, నగరసభ అధ్యక్షురాలు హీరాబాయి తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, గంగావతి**

ఆకట్టుకున్న ఆషాఢ నాట్యవైభవం

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: భారతీయ కళాసంపదను నేటి తరానికి అందించే ప్రయత్నం చేయాలని పాండురంగ ఆలయ ధర్మకర్త వెంకోబరావు అన్నారు. తొలి ఏకాదశి పురస్కరించుకుని పాండురంగ కళా వేదికపై ఏర్పాటు చేసిన తుంగా ఆషాఢ నాట్య వైభవం-2025 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గత 15 ఏళ్లుగా ఆలయంలో ఏకాదశి రోజున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తు కళాకారులను ప్రోత్సహిస్తున్నామని గుర్తుచేశారు. అనంతరం తుంగ-గంగా సాంస్కృతిక కళా ట్రస్ట్ కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం, ఏకపాత్రాభినయం, పిడేలు వాద్యం, సంగీత, భక్తి గీతాలాపన భక్తులను పరవశింపజేశాయి. కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీనివాసరావు, రామగిరి, సురేంద్రరావు, రాఘవేంద్రచార్, మనస్విత, ప్రతీక్ష, సన్నిధి, సహన, రాధాకృష్ణ, రాఘవి, లలిత, శివరుద్రయ్య, నృత్యాచార్యుడు బసవరాజు, వసుంధర, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ నృత్యం చేస్తున్న కళాకారులు

రహదారుల విస్తరణకు సహకరించండి

కారటగి, న్యూస్‌టుడే: కారటగి పట్టణంలోని ప్రధాన రహదారుల విస్తరణకు క్రియా యోజన రూపొందించడం జరిగింది. ప్రజలు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడగి కోరారు. ఆయన పట్టణంలో చెత్త సేకరణకు పురసభ ద్వారా కొనుగోలు చేసిన రెండు ఆటోలు, ఒక టిప్పర్, ట్రాక్టర్‌కు సోమవారం పూజచేసి ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని ఆర్‌జీ రోడ్డు, నవలి, బూదగుంప మార్గాలను విస్తరించి రెండు వైపులా మురుగు కాలువలు నిర్మించి వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులతో పాటు కనకదాస కూడలిలో కనకదాస విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షురాలు రేఖ, ఉపాధ్యక్షురాలు దేవమ్మ, ముఖ్యాధికారి సాబణ్ణ, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి శివరాజ్ తంగడగి

రోడ్ల అభివృద్ధికి రూ.కోటి నిధులు

రూ.కోటి నిధులతో మస్కల్, హొసయలనాడు గ్రామాల మధ్యన కొత్త రోడ్డు నిర్మించనున్నట్లు జిల్లా బాధ్య మంత్రి సుధాకర్ తెలిపారు. సోమవారం హిరియూరు తాలూకా మస్కల్ వద్ద ఆయన రోడ్డు పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలు త్వరితగతిన అభివృద్ధి చెందటానికి చక్కటి రోడ్లు అవసరమన్నారు. ప్రజలు సుఖంగా, సులభంగా, సురక్షితంగా సంచరించడానికి ఆధునిక రహదారులు కావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, చెళ్లకెర (చిత్రదుర్గం)**

గురుపౌర్ణమికి ఆహ్వానం

గురుపౌర్ణమిని పురస్కరించుకుని విశాలనగర్‌లోని శిర్డీ సాయిబాబా ఆలయ ధర్మకర్త నామాల కుమారస్వామి సోమవారం ఎస్పీ డా.శోభారాణిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10న గురుపౌర్ణమి ఉత్సవాలు జరుగతాయన్నారు. గత 16 ఏళ్లుగా రక్తదానం, అన్నదానం, ఉచిత వైద్య శిబిరం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్పీ ఉత్సవాలకు వస్తానని అంగీకారం తెలిపిందన్నారు. **- న్యూస్‌టుడే, బళ్లారి గ్రామీణ**

రోటరీ అధ్యక్షుడిగా జగదీశ్ అంగడి

గంగావతి రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా జగదీశ్ అంగడి నియమితులయ్యారు. మాజీ జిల్లా గవర్నర్ తిరుపతినాయుడు ఆయనకు సోమవారం బాధ్యతలు అప్పగించారు. కార్యదర్శిగా బసవరాజ్ కుంబార్ నియమితులయ్యారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ రాజేశ్ కోరిశెట్టర్, హంపీ విశ్వవిద్యాలయం ఆచార్యులు చెలువరాజ్, మాజీ అసిస్టెంట్ గవర్నర్ మహేశ్ సాగర్, టి.ఆంజనేయ, వాసు కొళగద పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, గంగావతి**

టోర్నీ విజేత జట్టుతో గ్రామ ప్రముఖులు

క్రీడలను ప్రోత్సహించాలి

కురుగోడు(బళ్లారి), న్యూస్‌టుడే: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, ఆటలు ఆడటం వల్ల శారీరకంగానే కాకుండా మానసికంగానూ దృఢంగా ఉంటారని కాంగ్రెస్ నాయకుడు టి.గంగాధర్ తెలిపారు. తాలూకాలోని కల్లుకంభ గ్రామంలో కేపీఎల్ క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు కప్ అందజేసి అభినందించారు. ప్రస్తుతం యువత స్మార్ట్‌ఫోన్ మోజులో పడి క్రీడలపై ఆసక్తి చూపించడం లేదన్నారు. మూడు రోజుల జరిగిన టోర్నీలో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. విన్నర్, రన్నర్‌లుగా నిలిచిన ఆర్‌సీబీ, హిటౌట్ జట్లకు కప్‌తో పాటు నగదు అందజేసి అభినందించారు.

ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలు వద్దు

మాన్వి: ప్రభుత్వ పనులను ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించటంతో దాని ప్రభావం శిక్షణపై పడుతుందని, ఇప్పటికే ఉపాధ్యాయుల కొరతతో పాఠశాలల నిర్వహణ సాగుతోందని రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు తహసీల్దార్ భీమరాయను కలిసి వినతి పత్రం అందించారు. విద్యార్థులకు బోధన, శిక్షణను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులను బీఎల్‌ఓ విధుల నుంచి దూరం పెట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు విజయకుమార్, ఇసాక్, ప్రశాంత్, హనుమంతప్ప, బసవరాజ్, శృతిపత్తార్, శంకరప్ప, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం సభ్యులు

విద్యార్థి దశలో పీయూసీ కీలకం

బళ్లారి, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో పీయూసీ కీలకమైందని, విద్యార్థులు సమయం వృథా చేయకుండా ప్రణాళికబద్ధంగా చదువుకుంటే గొప్ప భవిష్యత్తు లభిస్తుందని విద్యాసంస్థల ఛైర్మన్ కోనంకి రామప్ప అన్నారు. ఇక్కడి బెస్ట్ పదవీ పూర్వ కళాశాలలో పీయూసీ మొదటి ఏడాదిలో చేరిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి పలు సూచనలు చేశారు. కొత్త విద్యార్థులు తమ సీనియర్ల మార్గదర్శనంలో ముందుకు సాగాలన్నారు. అనంతరం ద్వితీయ పీయూసీ, నీట్, జేఈఈ తదితరాల్లో అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు జైకిషన్ పాటీల్, మహిర్, పవన్‌కుమార్, లిఖిత, సహనలను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు తిలక్‌కుమార్, విశ్రాంత ఉపాధ్యాయుడు మన్నెం సంజీవప్ప, కార్యదర్శి మన్నెం శ్రీనివాసులు, ప్రధానాచార్యుడు వెంకటేశ్వరరావు, ఉప ఆచార్యుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభావంత విద్యార్థులకు సన్మానం

కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

హొసపేటె, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయడానికి జానపద సంగీత కళాకారులు, వీధినాటక కళాబృందాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమాచార, పౌర సంబంధాల శాఖ సహాయక సంచాలకుడు బి.ధనంజయప్ప తెలిపారు. పేర్లను నమోదు చేసుకున్న యువ సంఘాలు, బృందాలకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. వీధి నాటక కళాకారుల బృందంలో కనీసం ఎనిమిదిమంది, జానపద సంగీత కళాకారుల బృందంలో కనీసం ముగ్గురు సభ్యులుగా ఉండాలన్నారు. బృందాల ఎంపిక ప్రక్రియ ఆగస్టు 12న హొసపేటెలో జరుగుతుందన్నారు. భర్తీ చేసిన దరఖాస్తులకు ధ్రువీకరణ పత్రాలు జతపర్చి ఆగస్టు 5లోగా హొసపేటెలోని సమాచార, పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

7-07-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1625.07	1597.31
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	54,550	50,715
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	61,645	263
నీటి నిల్వ (టి.ఎం.సి)	76.713	18.249

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

నిరంతరం తాగునీటి సదుపాయం

మాన్వి: ప్రజలకు రోజంతా తాగునీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చిన్ననీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. సోమవారం కవితాళ పట్టణంలో అమృత-2 పథకానికి భూమిపూజ చేసి మాట్లాడారు. కవితాళ, చుట్టుపక్కల ప్రజల దాహార్తి తీర్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. రూ.34.50 కోట్లతో అమృత-2ను ప్రారంభించి 24 గంటల పాటు నీటి సరఫరా చేస్తామన్నారు. స్థానికులు చాలా ఏళ్లుగా నీటి సమస్య ఎదుర్కొంటున్నందున చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తి చేసి తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని, పనులు నాణ్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి ఎస్ అంగడి, ప్రముఖులు కిరిలింగప్ప, శాంతప్ప, శివమూర్తి, దావణగెరి వెంకటరావు, కాసీంబీ, చాంద్‌పాషా, శివణ్ణ, సురేష్, కరియప్ప, గంగప్పదిన్ని, హనుమంత, పరశురామ్, అధికారులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్

9న కంప్లిలో జనశక్తి ధర్నా

కంప్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ 9న తలపెట్టిన అఖిలభారత సార్వత్రిక సమ్మెకు మద్దతుగా కంప్లిలో ధర్నా నిర్వహించనున్నట్లు కర్ణాటక జనశక్తి రాష్ట్ర కార్యదర్శి కరియప్ప గుడిమని తెలిపారు. స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో సోమవారం జరిగిన వివిధ సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆ రోజు ఉదయం ఉద్భవ గణపతి ఆలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం కూడలిలో సమావేశం జరుపుతామన్నారు. రైతులు, దళితులు, కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంయుక్త పోరాట కర్ణాటక నాయకులు బండి బసవరాజ్, వసంతరాజ్ కహళె, నాగరాజ్, హొన్నూర్ సాబ్, యల్లప్ప, మరిస్వామి, ఎస్.బసవరాజ్, టి.అనురాధ, తిప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.



(c) eenadu

దేశవాళీ విత్తనాలు .. మదిదోచే ఫలాలు

ఆకట్టుకుంటున్న మేళా

కొనుగోలుకు సిద్ధంగా విత్తనాలు

మైసూరు, న్యూస్‌టుడే: దేశ వాళీ విత్తనాలు, చిరుధాన్యాలు, టిప్పు సుల్తాన్ కాలంలో వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వివిధ జాతుల మామిడి పండ్ల మేళాను నంజరాజ బహదూర్ ఛత్రంలో ఏర్పాటు చేశారు. సహజ సమృద్ధ సంస్థ నిర్వహిస్తున్న ఈ మేళాలో మండ్య, మైసూరు, చామ రాజనగర, హాసన, కొడగు జిల్లాల్లో కొన్ని వందల ఏళ్ల నుంచి ఆదివాసీలు, రైతులు సాగు చేస్తున్న చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, వరి, పెసలు, మినుములు, అలసంద, కూరగాయలు, పండ్ల విత్తనాలను బీజోత్సవం పేరిట ఏర్పాటు చేసిన స్టాళ్లలో విక్రయానికి ఉంచారు. చిరుధాన్యాలతో చేసిన వంటకాలు, పానీయాలను కొందరు అమ్మకానికి ఉంచారు. రావనగిరిలోని కృషి కళా సంస్థ సొరకాయతో చేసిన ఆకర్షణీయమైన అలంకరణ ఉత్పత్తులు అందరినీ ఆకట్టుకున్నాయి. హెగ్గడదేవన కోటె హాలికాడు ప్రాంత రైతులు పసుపు, కూరగాయలు, అరుదైన విత్తనాలు, వివిధ జాతుల అరటి గెలలు, మొక్కలను విక్రయించారు. హొళె నరసీపురకు చెందిన రేఖా అప్పాజీ తమ తోటలో పండిన దశేరి, లంగడా, మల్లికా, ఆమ్రపాలి మామిడి పండ్ల విక్రయించారు. ముంగారులో విత్తుకునేందుకు సిద్ధ సణ్ణ, రత్నచూడి, హెచ్ఎంటీ, సింధూర మదుసాలె, నవర, దొడ్డబైర నెల్లు, సేలం సణ్ణ తదితర వరి విత్తనాలు, జనప్రియ రాగి, జగళూరు రాగి విత్తనాలను కొనుగోలు చేసుకున్నారు. ఈసారి బీజోత్సవంలో 400 రకాల వరి, రాగి, జొన్న, చిరుధాన్యాల విత్తనాలను ప్రత్యేకంగా విక్రయించారు. సేంద్రియ సాగులో ఎక్కువ దిగుబడి ఇచ్చే విత్తనాలు కూడా అందుబాటులో ఉంచారు. టిప్పు సుల్తాన్ తన సామ్రాజ్య విస్తరణకు వెళ్లిన సమయంలో ఆయా ప్రాంతాల్లో సాగు చేసే మామిడి జాతులను మైసూరుకు తీసుకువచ్చారు. సుల్తాన్‌ను భేటీ అయ్యేందుకు వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చే వారు మామిడి విత్తనాలు, అంట్లు ఇచ్చేవారు. కిసాన్, మావ్‌సింబి కా మావు, జీవన్‌వు, సజిద్, రేహన్, లాల్ బాదామ్, సుల్తాన్, హైదర్, మోస, రాజ్, కబిని, కలమల్ గోబ్, రూబీ, రసల్ అబిద్ తదితర 120 జాతుల మామిడి పండ్లను ప్రత్యేకంగా ప్రదర్శించారు. మండ్య జిల్లా మళవళ్లి తాలూకా కిరుగావలు వద్ద పెద్ద మామిడి తోటను టిప్పు సుల్తాన్ సాగు చేయించేవాడు. మామిడి పండే సీజన్‌లో చెట్ల కింద పడే పండ్లను సైనికులు తినేవారు. ఇతర సమయాల్లో విశ్రాంతి తీసుకునేవారని చరిత్ర చెబుతోంది.

దేశవాళీ విత్తనాలు

ఒక స్టాల్ వద్ద సీనియరు సిటిజన్లు

టిప్పు కాలంలో అభివృద్ధి చేసిన మామిడి జాతి పండ్లు

మేలుకోటె బ్రహ్మోత్సవాలకు వేళాయె

రాజముడి కిరీటం

మండ్య, న్యూస్‌టుడే: మేలుకోటె చెలువ నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు జులై 11 నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగో చామరాజ ఒడెయరు కానుకగా ఇచ్చిన రాజముడి కిరీటాన్ని స్వామి వారికి 16వ తేదీ అలంకరించనున్నారు. ఈ నెల 21 వరకు కొనసాగే ఉత్సవాలకు వేర్వేరు ప్రాంతాల నుంచి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. రాజముడి కిరీటం ధరించి, శ్రీదేవి, భూదేవిలతో మాడవీధుల్లో స్వామివారిని ఊరేగిస్తారు. చివరి రోజు కళ్యాణిలో నిర్వహించే తీర్థ స్నానంతో ఆషాఢమాస బ్రహ్మోత్సవ జాతర వేడుకలకు తెరపడుతుందని ఆలయం ఈఓ శిల్ప తెలిపారు.

గుండెపోటుతో ఇద్దరు రైతుల మృతి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: హాసన, శివమొగ్గ జిల్లాల్లో గుండెపోటుతో ఇద్దరు రైతులు కన్నుమూశారు. సకలేశపుర తాలూకా బెళగోడు హోబళి మెణసమక్కి గ్రామానికి చెందిన రైతు లక్ష్మణ (52) ఆదివారం పొలంలో పని చేసి, ఇంటికి చేరుకున్న అనంతరం ఛాతీలో నొప్పి అంటూ ఇబ్బంది పడ్డారు. అంబులెన్సును పిలిపించి, ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించారు. శివమొగ్గ జిల్లా సొరబ సమీపంలోని హిరేశకున గ్రామంలో కృష్ణమూర్తి శిగ్గాద్ (62) అనే రైతు పొలంలో పని చేస్తూ కుప్పకూలిపోయారు. ఆయన గుండెపోటుతో మరణించారని వైద్యులు ధ్రువీకరించారు.

బోల్తా కొట్టిన మినీ బస్సు

చామరాజనగర, న్యూస్‌టుడే: బిళిగిరి రంగన బెట్టకు భక్తులతో వచ్చిన ఒక మినీ బస్సు చైన్‌గేటు వద్ద బోల్తా కొట్టింది. ప్రమాదంలో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. మలుపులో రహదారి ఇరుకుగా ఉండడంతో డ్రైవరుకు స్టీరింగ్‌పై నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదం సంభవించింది. స్థానికులు తక్షణమే స్పందించి బాధితులను ఆసుపత్రికి తరలించేందుకు సహకరించారు. బిళిగిరి రంగన బెట్ట ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నదిలో కొట్టుకుపోయిన డ్రైవరు

మండ్య, న్యూస్‌టుడే: స్వీయ చిత్రాలు, ఫొటోలు తీసుకునేందుకు కావేరి నది వద్దకు వెళ్లిన మహేశ్ (36) అనే ఆటో డ్రైవరు నీటిలో పొడి కొట్టుకుపోయారు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఈత కొట్టుకుని ఆయన ఒడ్డుకు రాలేకపోయారు. శ్రీరంగపట్టణ తాలూకా సర్వధర్మ ఆశ్రమం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. అగ్నిమాపకదళ సిబ్బందితో కలిసి కేఆర్‌ఎస్ ఠాణా పోలీసులు మృతదేహం కోసం గాలింపు చేపట్టారు.

మగవారికీ పథకాన్ని విస్తరించండి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: పురుషులకూ ఉచితంగా బస్సుల్లో ప్రయాణించేందుకు అనువుగా శక్తి పథకాన్ని విస్తరించాలని ఎమ్మెల్యే బసవరాజ రాయరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి ఈ అంశాన్ని తాను తీసుకువెళతానని చెప్పారు. ముఖ్యమంత్రికి ఆర్థిక సలహాదారుగా ఉన్న తనకు ఖజానా స్థితిగతులు తెలుసన్నారు. కొందరు ఎమ్మెల్యేలు మాత్రమే ప్రభుత్వ గ్యారంటీ పథకాలను వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. భాజపా అధికార పీఠాన్ని కాంగ్రెస్‌కు అప్పగించే సమయంలో రూ.2 లక్షల కోట్ల రుణ భారాన్ని వదిలి వెళ్లారని తెలిపారు. ఖజానాపై ఆ భారం లేకుండా ఉంటే, మరికొన్ని పథకాలను జారీ చేసేందుకు అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డారు.

ఎనిమిది మంది అరెస్టు

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: ఒక యువతికి చరవాణిలో సందేశాన్ని పంపించాడని కుశాల్ అనే యువకుడిపై దాడి చేసి కొట్టిన ఎనిమిది మందిని సోలదేవనహళ్లి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. రెండేళ్ల పాటు తనను ప్రేమించిన యువతి, కొత్తగా మరో యువకునితో కలిసి తిరుగుతున్నట్లు కుశాల్ గుర్తించాడు. ఇదే విషయాన్ని ప్రశ్నిస్తే ఆమె నిర్లక్ష్యంగా బదులిచ్చింది. దీంతో ఆమెకు ఒక అశ్లీల సందేశాన్ని కుశాల్ పంపించాడు. ఆ యువతి తనను ప్రేమిస్తున్న యువకునికి ఈ విషయం చెప్పడంతో కుశాల్‌పై దాడి చేశారు. అతన్ని నగ్నంగా చేసి బెల్టులు, కట్టెలతో కొట్టి పరారయ్యారు. బాధితుని ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి హేమంత్, యశ్వంత్, శివశంకర్, శశాంక్‌గౌడ తదితరులను నిందితులుగా గుర్తించారు. వారి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసులు విచారణను తీవ్రం చేశారు.

దోషులకు పదేళ్ల కారాగార శిక్ష

కార్వార, న్యూస్‌టుడే: భర్తను హత్య చేయించేందుకు ప్రయత్నించిన తేజస్విని అనే గృహిణికి, కిరాయి తీసుకుని హత్యకు యత్నించిన గణేశ్ పాటిల్‌కు కార్వార జిల్లా న్యాయస్థానం తలా పదేళ్ల కారాగార శిక్షను విధించింది. అంకుశ్ సుతారెపై 2021 జూన్ 11న హత్యాయత్నం జరిగింది. అతనిపై దాడి చేసిన గణేశ్ అనే నిందితుడు, ఒక బాలునితో కలిసి హత్యకు యత్నించాడు. అంకుశ్ కేకలు వేయడంతో నిందితులు పరాయ్యారు. బాధితుని ఫిర్యాదుతో దాండేలి ఠాణా పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. అంకుశ్ భార్య తేజస్విని వద్ద రూ.30 వేలు తీసుకుని హత్యకు ప్రయత్నించానని గణేశ్ చెప్పాడు. బాలుడ్ని రిమాండ్ హోంకు పంపించారు. విచారణ పూర్తి చేసి నిందితులు ఇద్దరికీ తలా పదేళ్ల సాదా కారాగార శిక్షను విధిస్తూ న్యాయమూర్తి కిరణ్ కిణి ఆదేశించారు.

ప్రైవేటు సంస్థకు జరిమానా

కార్వార, న్యూస్‌టుడే: సెల్ టవర్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చినా ఏడాది బాడుగ చెల్లించని జేటీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు వినియోగదారుల న్యాయస్థానం జరిమానా, వడ్డీ విధిస్తూ ఆదేశించింది. హొన్నావర తాలూకాకు చెందిన విఠల గాయత్రొండెకు బాడుగు చెల్లించకుండా ఆ సంస్థ ప్రతినిధులు వేధించారు. విచారణ పూర్తి చేసి బాడుగ మొత్తం రూ.5.39 లక్షలు, ఇతర ఖర్చులు, జరిమానాతో కలిపి మొత్తం రూ.7.74 లక్షలు చెల్లించాలని వినియోగదారుల కోర్టు ఆదేశించింది.

సహకార సంఘానికీ..

కార్వార, న్యూస్‌టుడే: పదవీ విరమణ సమయంలో వచ్చిన నగదును మూడు మొత్తాలుగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన తనకు ఆ నగదును వెనక్కు ఇవ్వడం లేదని దినకర్ నాగప్ప అనే సీనియరు సిటిజన్ వినియోగదారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి దినకర నాగప్పకు రూ.4,96,898 నగదుకు సాలీనా 9.5 శాతం వడ్డీ, కోర్టు ఖర్చులు, పరిహారంగా మరో రూ.25 వేలు ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు.

నైతిక పోలీసు గిరి కేసులో ఇద్దరి అరెస్టు

మంగళూరు : తమ ధర్మానికి చెందిన యువతితో ఎందుకు కలిసి వెళ్తున్నావంటూ ఒక యువకుడిపై నైతిక పోలీసు గిరికి పాల్పడిన పురుషోత్తమ (43), రామచంద్ర (38) అనే వ్యక్తులను అరెస్టు చేశామని దక్షిణ కన్నడ జిల్లా ఎస్పీ అరుణ్ తెలిపారు. తమ ధర్మానికి చెందిన యువతితో కలిసి వెళ్తున్న యువకుడిని వేధిస్తూ తీసుకున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో వీరిద్దరూ పోస్టు చేశారు.

ఫోను తిరిగి ఇవ్వమన్నందుకు దాడి

బెంగళూరు (జయనగర) న్యూస్‌టుడే: ఒకరితో మాట్లాడి ఇస్తానని తీసుకున్న ఫోన్‌ను వెనక్కు ఇవ్వమని కోరిన పర్విందర్ అనే కాపలాదారుపై అస్గర్ అనే యువకుడు మారణాయుధంతో దాడి చేసి పరారయ్యాడు. మిథున్ కుమార్ అనే ఇంజినీరు స్వల్పంగా గాయపడ్డారు. బాధితుని ఫిర్యాదుతో జయనగర పోలీసులు కార్యాచరణ చేపట్టి నిందితుడ్ని అరెస్టు చేశారు. పట్టాకమ్మ దేవాలయం సమీపంలో నిర్మిస్తున్న ఇంటికి మిథున్ కుమార్ ఇంజినీరుగా పని చేస్తున్నారు. అతని వద్దకు బైకుపై వచ్చిన అస్గర్ తన చరవాణి పాడైందని, అత్యవసరం ఫోను చేయాలని ఆయనను కోరారు. చరవాణి తీసుకుని రెండు కాల్స్ చేసి, అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఫోన్ తిరిగి ఇవ్వాలని కోరిన మిథున్ కుమార్‌పై తన వద్ద ఉన్న కత్తితో దాడి చేశాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన పర్విందర్‌పై మరింత తెగబడి పరారయ్యాడు. దాడి ఘటన అక్కడి సీసీ కెమెరాలో రికార్డయింది. బాధితుల ఫిర్యాదుతో కార్యాచరణ పూర్తి చేసి నిందితుడ్ని అరెస్టు చేశారు.

తట్టు, రుబెల్లా రహిత జిల్లాగా చేద్దాం

జిల్లాధికారితో కలిసి గోడపత్రికను ప్రదర్శిస్తున్న అధికారులు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: ఒక ఏడాది అవధిలో జిల్లాను తట్టు, రుబెల్లా రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లాధికారి పి.ఎన్. రవీంద్ర పిలుపునిచ్చారు. ఐదేళ్ల కన్నా తక్కువ వయసు ఉన్న బాలలకు టీకాలు వేయించే ప్రక్రియను జిల్లా ఆరోగ్య శాఖ ప్రారంభించిందని తెలిపారు. జాతీయ సార్వత్రిక రోగ నిరోధక కార్యదళంతో కలిసి గోడ పత్రికను విడుదల చేసి మాట్లాడారు. మొదటి మోతాదును 9 - 11 నెలల వయస్సులో, రెండవ మోతాదును 12 నెలల నుంచి 5 ఏళ్లలోపు వేయించాలని తెలిపారు. దీనిపై గ్రామీణ, తండాల్లోని తల్లిదండ్రులకు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సహకారంతో జాగృతి కల్పించాలని సూచించారు. డిప్యూటీ జిల్లాధికారి డాక్టర్ ఎన్. భాస్కర్, అధికారులు హెచ్.అశ్విన్, రఘు, డాక్టర్ ఎస్.ఎస్. మహేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	90
క్యారెట్-	95
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	35
సొరకాయ-	45
దొండకాయలు-	45
పొట్లకాయ-	35
టమాటా(నాటు)-	25
టమాటా-	20
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	30
ఉల్లి(మేలురకం)-	30
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	190
సాంబారు ఉల్లి-	170
బీట్‌రూట్-	40
వంకాయలు-	60
బెండకాయలు-	55
ముల్లంగి-	45
నిమ్మకాయ-	280
పండ్లు,ఫలాలు ధరలు	
వాషింగ్టన్ ఆపిల్-	420
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	395
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	45
బొప్పాయి-	35
ఆరంజి-	195
బత్తాయి-	95

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

గనినాడు కాంగ్రెస్‌లో లుకలుకలు

● నాయకుల్లో భేదాభిప్రాయాలు ● సమావేశానికి ఎమ్మెల్యేలు, మంత్రి గైర్హాజరు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా కాంగ్రెస్‌లో లుకలుకలు బయటపడగా, నాయకుల్లో భేదాభిప్రాయాలు పొడచూపాయి. ఇక్కడ పార్టీకి పెద్దదిక్కు లేకపోవడంతో ఎవరికివారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల ముందు నగరంలో కార్మికశాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి నగర, గ్రామీణ నియోజకవర్గాలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు జిల్లా బాధ్య మంత్రి జమీర్ అహమ్మద్‌ఖాన్ దూరంగా ఉండటం అసమ్మతికి సంకేతమేనని వినిపిస్తోంది. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న గనినాడులో ఈ పరిణామం పార్టీ అధిష్ఠానానికి తలనొప్పిగా మారుతుందనడంలో సందేహం లేదు.

మొదటినుంచి ఇదే పరిస్థితి: తొలినుంచి జిల్లా కాంగ్రెస్ అసమ్మతి రాజకీయాలకు పెట్టింది పేరు. రాజకీయ కురువృద్ధుడు ఎం.వై.ఘోర్పడే జిల్లా బాధ్య మంత్రిగా ఉన్న సమయంలోనూ జిల్లా నాయకుల మధ్య భేదాభిప్రాయాలు కనిపించేవి. 1994లో నగర విధానసభ క్షేత్రం నుంచి కేంద్ర మంత్రి బసవరాజేశ్వరి కుమారుడు డా.వెంకట మహిపాల్ పార్టీ నుంచి పోటీ చేసినప్పుడు నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయారు. ఫలితంగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన ముండ్లూరు దివాకర్ బాబు గెలిచారు. 1999 విధానసభ ఎన్నికల తర్వాత పార్టీలో మూడు గ్రూపులు ఏర్పడ్డాయి. అల్లం వీరభద్రప్ప, కె.సి. కొండయ్య ఒక వర్గంగా, ఎం.వై.ఘోర్పడే, సిరాజ్‌షేక్ మరో వర్గంగా, మాజీ మంత్రి దివాకర్‌బాబు అనుచరులు మూడో గ్రూపుగా విడిపోయారు. పైకి బాగున్నట్లు కనిపించినా లోలోపల ఒకరినొకరు ఓడించడానికి ఎత్తుకు పైఎత్తులు వేసేవారు. 2004లో బళ్లారి నగర అసెంబ్లీ క్షేత్రం నుంచి పార్టీ అభ్యర్థి దివాకర్‌బాబు, కురుగోడు నియోజకవర్గం నుంచి అల్లం వీరభద్రప్పల ఓటమికి అసమ్మతి రాజకీయాలే కారణమన్నది బహిరంగ రహస్యం.

నేడూ అదే బాటలో..: జిల్లా కాంగ్రెస్‌లో రెండో తరం నాయకులొచ్చినా పరిస్థితిలో మార్పు లేదని, మంత్రిగా నాగేంద్ర రాజీనామా చేసిన తర్వాత పార్టీకి పెద్దదిక్కు లేకుండా పోయిందని కార్యకర్తలు అంటున్నారు. జిల్లా బాధ్య మంత్రిగా సంతోష్ ఎస్.లాడ్‌ను తేవడానికి ప్రయత్నాలు చేసినా, పార్టీ అధిష్ఠానంపై జిల్లా నేతలు ఒత్తిడి తెచ్చి విజయనగర జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జమీర్‌కే బాధ్యతలు అప్పగించేలా చేశారు. ఆయన జిల్లా గురించి పట్టించుకోరని, ఎమ్మెల్యేలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని భావించారు. మరోవైపు రెండు రోజుల ముందు కార్మిక మంత్రి సంతోష్ లాడ్ అధ్యక్షతన అసంఘటిత కార్మికులకు స్మార్ట్ కార్డుల అందజేత కార్యక్రమానికి గ్రామీణ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డా.సయ్యద్‌నాసిర్, మంత్రి జమీర్ అహమ్మద్‌ఖాన్ దూరంగా ఉండిపోయారు. మంత్రి సంతోష్ లాడ్ వర్గం ఎమ్మెల్యేలు గణేశ్, బి.ఎం.నాగరాజు, ఇ.అన్నపూర్ణ, ఎంపీ ఇ.తుకారామ్ హాజరయ్యారు. సమావేశానికి ముందు స్థానిక ఎమ్మెల్యేలతో జరిగిన భేటీలో వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపణలు వినవచ్చాయి. ఇలాగే కొనసాగితే జిల్లాలో భాజపా మరోసారి పుంజుకోవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

బళ్లారిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం

సాగునీటికి రైతుల ఎదురుచూపు

హొసపేటె, న్యూస్‌టుడే: కాలువలకు సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తారా అని ఆయకట్టు రైతులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. రాయచూరు, కొప్పళ జిల్లాలను తడిపే ఎడమ కాలువలకు ఈ నెల 2 నుంచి సాగునీటిని విడుదల చేశారు. మరోవైపు తుంగభద్ర కుడి ఎగువకాలువ(హెచ్చెల్సీ), దిగువ కాలువ(ఎల్లెల్సీ)లకు 10 నుంచి ఇవ్వాలని ఐసీసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం అన్నదాతలకు మింగుడుపడటం లేదు. ఈ ఏడాది జలాశయంలో కేవలం 80 టీఎంసీలు మాత్రమే నిల్వ చేసుకోవాలని నిపుణులు హెచ్చరించారు. జూన్ చివరికల్లా జలాశయంలో నీటినిల్వలు 75 టీఎంసీలు దాటాయి. డ్యామ్ భద్రత దృష్ట్యా ముందుజాగ్రత్త చర్యగా పది రోజుల నుంచి గేట్లను ఎత్తిన నదికి నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటివరకూ సుమారు 50 టీఎంసీల నీరు నదికి పారింది. ప్రస్తుతం 19 గేట్ల ద్వారా 54340 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తున్నారు. ఎడమ కాలువ కింద ఇప్పటికే రాయచూరు, కొప్పళ జిల్లాల్లో నాట్లు ప్రారంభమయ్యాయి. హెచ్చెల్సీ, ఎల్లెల్సీ జలాలపై ఆధారపడిన విజయనగర, బళ్లారి జిల్లా రైతులు కాలువల నీటి కోసం వేచిచూస్తున్నారు. ఈ నెల 2 నుంచి హెచ్చెల్సీ, ఎల్లెల్సీలకు నీటిని విడుదల చేయాని ఐసీసీ సమావేశంలో మంత్రులు ఇంజినీర్లకు తాఖీదులు జారీ చేశారు. బళ్లారి సమీప ఎల్లెల్సీ ఆధునీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో 10 వరకు గడువు ఇవ్వాలని తుంగభద్ర మండలి ఇంజినీర్లు కోరారు. అందువల్ల ఆ రెండూ కాలువలకు నీటి విడుదలలో జాప్యం జరుగుతోందని రైతలు ఆరోపిస్తున్నారు.

ముందస్తు నీటి విడుదల: నిరుడు పరిస్థితులను పోల్చుకుంటే ఈ ఏడాది ముందస్తుగానే 10న రెండు కాలువలకూ నీటిని విడుదల చేస్తున్నామని తుంగభద్ర మండలి ఇంజినీర్లు పేర్కొన్నారు. సాధారణంగా కాలువలకు జులై మాసం చివరిలో నీటిని విడుదల చేస్తామని, ముంగారు వర్షాలు త్వరగా పలకరించడంతో 20 రోజులు ముందస్తుగానే కాలువలకు నీటిని విడుదల చేస్తున్నామని అన్నారు. దీనివల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

నగరం.. పద్మవ్యూహం — వాహన రద్దీ

సోమవారం ఎక్కువ మంది తమ సొంత వాహనాలను బయటకు తీయడం, పలు ప్రధాన మార్గాలలో రహదారి విస్తరణ, మెట్రో నిర్మాణపనులతో ప్రధాన వీధుల్లో సోమవారం వాహన రద్దీ నెలకొంది. రద్దీ వేళల్లో ఆటో, క్యాబ్‌లలో ప్రయాణ ఛార్జీలు భారం కావడం, మెట్రో ఛార్జీల ధరలు ఎక్కువ కావడం, బీఎంటీసీలో మహిళలే ఉచితంగా ప్రయాణిస్తుండడంతో ఉద్యోగులు ఎక్కువ మంది సొంత వాహనాలను బయటకు తీయడంతో సోమవారం రద్దీ ఎక్కువగా కనిపించింది. -బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే

నేడు పాలికె సిబ్బంది ఆందోళన

బెంగళూరు(అడుగోడి),న్యూస్‌టుడే: వివిధ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న పాలికె అధికారులు, ఉద్యోగులు సామూహికంగా సెలవు పెట్టి ఆందోళన చేపట్టనున్నారు. పాలికెలో ఉన్న అన్ని సంఘాలు ఆందోళనకు మద్దతు ప్రకటించాయి. అధికారులు ఉద్యోగులు కలిసి ఆందోళన చేపడుతున్నట్లు సంఘం నేత అమృత్ రాజ్ తెలిపారు. పారిశుద్ధ్య కార్మిక సంఘాలు కూడా మద్దతు ఇచ్చినట్లు తెలియజేశారు. 12 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచినట్లు తెలిపారు. దీని వల్ల పాలికె సేవల్లో వ్యత్యాసం ఉండే అవకాశాలు ఉన్నాయి.

న్యాయవ్యవస్థను కించపరిచి కటకటాల పాలయ్యాడు

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులు, న్యాయవాదులను అకారణంగా దూషించడం, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్న మండ్యకు చెందిన ఆర్ సర్వేశ్‌కు ఆరు నెలల సాధారణ కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ జస్టిస్ కెఎస్ ముద్గల్, జస్టిస్ ఎ విజయకుమార్‌ల పీఠం ఆదేశాలు జారీ చేసింది. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన సర్వేశ్‌పై అతను పని చేసిన కంపెనీ నిర్ణయం సబబే అంటూ మైసూరులోని కార్మిక న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి కోర్టు వ్యవస్థను దూషిస్తూ వచ్చాడు. కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదుతో ఉన్నత న్యాయస్థానంలో కేసు నమోదైంది. విచారణ పూర్తి చేసి అతనికి శిక్ష, జరిమానా విధిస్తూ ధర్మాసనం తీర్పు ఇచ్చింది.

ఐక్య మండపాన్ని సంరక్షించాలి

నీటిలో కనిపిస్తున్న మండపం గోపురం

హావేరి, న్యూస్‌టుడే: బసవేశ్వరుని సమకాలీకుడు అంబిగెరె చౌడయ్య సమాధి స్థలం రాణెబెన్నూరు తాలూకా చౌడయ్యదానపురలో ఉంది. తుంగభద్ర తీరంలో అంబిగెరె చౌడయ్య తన తుది శ్వాసను విడిచారు. అదే ప్రదేశంలో నిర్మించిన ఐక్య మండపం వద్ద భక్తులు, మఠాధిపతి, అనుయాయిలు నిత్యం పూజలు చేస్తుంటారు. వర్షాకాలంలో తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు ఐక్యమండపం పూర్తిగా నీటిలో మునిగిపోతూ ఉంటుంది. దోణిలోనే భక్తులు వెళ్లి పూజలు చేసుకుంటూ వస్తుంటారు. భవిష్యత్తులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నా ఐక్యమండపం నీట మునగకుండా చర్యలు తీసుకోవాలని మఠాధిపతి అభినవ అంబిగ చౌడయ్య ప్రభుత్వాన్ని కోరారు. కూడల సంగమలోని ఐక్య మండపం తరహాలో ఒక్కడ కూడా ఒక మండపాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. దీనికి సమీపంలో 11వ శతాబ్దపు ముక్తేశ్వర ఆలయం ఉండడంతో కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు ఇబ్బంది ఎదురవుతోందని చెప్పారు. సమస్యను పరిష్కరించి, మండపాన్ని నిర్మిస్తే, వర్షాకాలంలోనూ భక్తులు ఐక్యమండపం వద్ద పూజ చేసుకునేందుకు అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

దోణిలో వెళుతున్న మఠాధిపతి అభినవ అంబిగ చౌడయ్య

EENADU Classifieds

PROFESSIONAL SERVICES

ASTROLOGY

సింహాద్రి జ్యోతిష్యం: ఫొటో, తాళపత్రం, జన్మ పత్రిక చూసి ఉద్యోగం, వివాహం, సంతానం, ఆర్థిక ఇబ్బందులు, స్త్రీ ప్రేమ, దాంపత్య సమస్యలు ఎటువంటివి ఉన్న పరిష్కారం, N.T. రమణాచారి, విశాఖపట్నం. 9866066393.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

దూకుడు తగ్గిన కృష్ణవేణి

రాయచూరు, న్యూస్‌టుడే: ఎగువన వర్షం తగ్గడంతో చల్లని నదీమతల్లి కృష్ణమ్మలో ప్రవాహ వేగం మందగించింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు బాగలకోట జిల్లా ఆలమట్టిలోకి 1,11,472 క్యూసెక్కులు, యాదగిరి జిల్లా నారాయణపురలోకి 1,15,000 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ఆదివారం ఆలమట్టి ఇన్‌ఫ్లో 1,24,666 క్యూసెక్కులు ఉండేది. ప్రస్తుతం దిగువ నదికి లక్షా 15 వేలు క్యూసెక్కులు విడుస్తున్నారు. ఆలమట్టిలో 88. 248 టీఎంసీల నీటి మట్టం నమోదైంది. నారాయణపుర లోకి 24 గంటల ముందు మాదిరే 1,15,000 క్యూసె క్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నారాయణపురలో 26.936 టీఎంసీల (గరిష్ఠ మట్టం 33.313) నీటి నిల్వ ఉంది. 30 గేట్లను ఎత్తి జల విద్యుదుత్పాదనకు, జూరాలకు 1,12,577 క్యూసెక్కులను పంపుతున్నారు. ఆనకట్టల పరిధిలోని కాలువలు, ఉపకాలువులకు మంగళవారం నీటిని విడుదల చేయనున్నారు.

వైభవంగా రంగనాథస్వామి ఉత్సవాలు

విశేష అలంకరణలో రంగనాథస్వామి

పావగడ, న్యూస్‌టుడే: పట్టణంలోని చాకలికుంట సమీపంలో కొండగుహలో వెలసిన రంగనాథస్వామి, శ్రీదేవి, భూదేవికి ఆషాఢమాసం, శుక్లపక్ష ద్వాదశి సందర్భంగా మర్రిమాను తోట వంశస్థులైన వాల్మీకి ముద్దరంగనాయక ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి ఉత్సవ విగ్రహాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లి సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్న భక్తులకు ఆలయ యాజమాన్యం అన్నప్రసాదాలు అందజేశారు.

హో సూ రు క బు ర్లు

14న బెట్టదమ్మస్వామి కుంభాభిషేకం

ధ్వజస్తంభం ఏర్పాటుకు పూజలు చేస్తున్న ప్రముఖులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు, డెంకణీకోట తాలూకాల సరిహద్దులో కొండమీద వెలిసిన శ్రీబెట్టదమ్మదేవి ఆలయ మహా కుంభాభిషేకం శివశ్రీమణికంఠ శివాచార్య స్వాముల నేతృత్వంలోఈ నెల 14న ఉదయం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం ధ్వజ స్తంభం ఏర్పాటు చేయడానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 12 నుంచీ ప్రత్యేక పూజలు మొదలవుతాయి. రాజుల పాలనలో విరాజిల్లిన గ్రామదేవత 20 గ్రామాల ప్రజలకు ఆరాధ్యదైవంగా కొలుస్తారు. శిథిలమైన ఆలయాన్ని పునరుద్ధరించాలని కలుగొండపల్లి, ఇతర గ్రామాల పెద్దలు టి.వి.ఎస్ యాజమాన్యానికి విన్నవించగా.. రూ.1.75 కోట్లతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అక్కడ వీరగాశి శిలలు 20కి పైగా ఉన్నాయి. గ్రామస్తులు వీటిని సేకరించి భద్రపరిచి గ్రామ చరిత్రకు ప్రాణం పోశారు. కార్యక్రమంలో పంచాయతీ మాజీ అధ్యక్షుడు బి.ఎన్.శ్రీనివాస్, ప్రముఖులు ఎన్.రమేష్, కృష్ణప్ప, ప్యారకపల్లి రమేష్, కృష్ణారెడ్డి, నాగరాజ్, ఎస్.బి.పి.ప్రభాకర్, వెంకటాచలపతి, టి.వి.ఎస్.మోటార్స్ అధికారులు, ఆలయ అర్చకులు నాగరాజు, సావిత్రి పాల్గొన్నారు. కుంభాభిషేకానికి ఐదు వేలు మంది భక్తులు హాజరుకానున్నారు. ఈ ఆలయానికి తళి రోడ్డు హులివీరనహళ్లి నుంచి.. హోసూరు-డెంకణీకోట మార్గంలో ముదుగానపల్లి నుంచి చేరుకోవచ్చు.

ముళబాగిలు సమాచారం : ● కోలారు జిల్లా మాలూరు నగరం వివేకానంద పాఠశాలలో చంపకధామ తొలిఏకాదశి సందర్భంగా ముళబాగిలు పాదరాజ మఠం పీఠాధిపతి సుజయతీర్థులు తప్త ముద్రధారణ చేశారు. ● మాదిగ దండోరా కర్ణాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ముళబాగిలు నాగరాజును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారు. ● నగరంలోని కొండపై వెలసిన అభయ మునీశ్వరస్వామి మూడో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ● పట్టణంలోని కోర్టులో ఈ నెల 12న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ న్యాయమూర్తి జగదీశ్ రుద్రి తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ● కోలారు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బంగారుపేట తాలూకా జుంజనహళ్లి గ్రామానికి చెందిన భీమ (26) మృతి చెందినట్లు డీవైఎస్పీ తెలిపారు. ● ముళబాగిలు తాలూకా హూసకెరే గ్రామ సమీపంలోని కొండప్రాంతంలో కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ పీఎస్సై అరుణ గెడపాటి తెలిపారు.

వాననీటి సంరక్షణతో చెరువుల్లో జలకళ

వాననీటి సంరక్షణ చర్యలు చేపట్టిన కొత్తనూరు చెరువులో జలకళ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు నగరంలో బోరుబావులు, చెరువులు ఎండిపోతున్నప్పటికీ కొన్ని దిగుడుబావులు, చెరువులు కురుస్తున్న వర్షాలకు జలకళ సంతరించుకున్నాయి. సిటిజన్ టీమ్ సభ్యులు ముందు చూపుతో చేపట్టిన వాననీటి సంరక్షణ చర్యలు కారణమని నీటి సంరక్షణ నిపుణులు వెల్లడించారు. తమకు అందుబాటులో ఉన్న చెరువులను సంరక్షించారు. వాననీరు ప్రవహించే కాలువలు కబ్జాకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆకాశం నుంచి భూమి మీదపడే ప్రతి నీటి బొట్టు చెరువుల్లోకి ప్రవహించే విధంగా చర్యలు తీసుకున్నారు. చుట్టుపక్కల జననివాస ప్రదేశాల నుంచి వచ్చే మురుగునీరు శుద్ధీకరించే విధానాలను అమలులోకి తెచ్చారు. దీంతో ప్రస్తుతం శివార్లలోని కొత్తనూరు చెరువులో పుష్కలంగా నీరు ఉండటంతో చుట్టుపక్కల బోరుబావుల్లో సమృద్ధిగా నీరు ఉంది. కాంక్రీట్ జంగిల్ మధ్య ఉన్న జేపీనగర పుట్టనహళ్లి చెరువు కబ్జా కాకుండా పరిసర సంరక్షణకారులు కాపాడుకున్నారు. 25 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువు సంరక్షించారు. వాననీరు నిల్వ ఉండే విధంగా పాలికె సాయంతో చెరువులో పూడిక తొలగించారు. వాననీటి కాలువలను పునరుద్ధరించారు. ప్రస్తుతం వేసవిలో చెరువులు నీరు ఉండటంతో చుట్టు పక్కల భూగర్భ జలాల మట్టం క్షీణించలేదు. ఆయా ప్రదేశాల్లో తాగునీటి సమస్య తలెత్తలేదని సిటిజన్ టీమ్ సభ్యుడు ముకుందా తెలిపారు. వాననీటి సంరక్షణ ఇప్పుడు ప్రజలకు ఉపయోగకరంగా మారిందన్నారు. చెరువులతో పాటు ప్రాచీన కాలం నాటి బావులను సంరక్షించారు. రిచర్డ్ లేఅవుట్‌లో ఉన్న ప్రాచీన కాలం నాటి దిగుడు బావి శిథిలం కాకుండా సంరక్షించారు. ప్రస్తుతం బావిలో సమృద్ధిగా నీరు ఉంది. చుట్టు పక్కల ప్రజల దాహం తీర్చుతోంది. పురాతనకాలం నాటి బావులను పూడ్చకూడదు. వాననీటి గుంతలను సంరక్షించాలి. చెరువుల్లోకి మురుగునీరు విడిచి పెట్టకుండా శుద్ధీకరించిన నీరు వదలడం ద్వారా భూగర్భజలాలు కలుషితం కావు. చెరువులన్నింటినీ సంరక్షించాలి. చెరువుల్లో వాననీరు సమృద్ధిగా ఉండే విధంగా వాననీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. వాననీటి కాలువలను పునరుద్ధరించాలని సిటిజన్ టీమ్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఇప్పటి తాగునీటి సమస్య వచ్చే ఏడాది మరింత ఎక్కువ కావచ్చని, ముందుగా వాననీటి సంరక్షణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

జేపీనగర పుట్టనహళ్లి చెరువును పరిశీలిస్తున్న సిటిజన్ టీమ్ సభ్యులు

రిచర్డ్ లేఅవుట్‌లో దిగుడు బావిలో పుష్కలంగా నీరు

అన్నమయ్య జిల్లాలో దొంగ నోట్ల ముఠా గుట్టురట్టు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో దొంగ నోట్లు ముద్రిస్తూ గుట్టుచప్పుడు కాకుండా చలామణి చేస్తున్న ముఠాను అరెస్టు చేశామని ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జూన్ నెల 26వ తేదీన ఎస్.కాలేషా అనే ఓ వ్యక్తి నకిలీ రూ.500 నోటుతో మద్యం కొనుగోలు చేసేందుకు వాయల్పాడులోని ఓ దుకాణానికి వెళ్లాడు. దుకాణ మేనేజర్ నవీన్‌కుమార్ గుర్తించి నోటు ఎక్కడిదని ప్రశ్నించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఆయన ఫిర్యాదుతో కాలేషా కోసం పోలీసులు గాలించారు. కర్ణాటకకు చెందిన రాథోడ్, కుమార్, బాబులు మదనపల్లెలో దొంగ నోట్లు ముద్రిస్తున్నట్లు గుర్తించామన్నారు. కర్ణాటక, అన్నమయ్య జిల్లాలో చలామణి చేస్తున్న షేక్ కాలేషా, వి.ఎం.ముస్తాక్ అహ్మద్, ఎస్ఎండీ హఫీజ్, భీమ సింగ్ పండిత్ రాథోడ్, కుమారస్వామి, షేక్ షఫిక్ అహ్మద్, నందిమంగళం యోజాజ్‌పాషా, వి.ఎం.ఫుర్ఖాన్, షేక్ ఆసిఫ్, షేక్ సుహేల్ అనే వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్పీ వివరించారు.

నేడు తుమకూరు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం


దిలీప్.జి.సురాన హంప నాగరాజయ్య ఎస్.నాగణ్ణ

తుమకూరు న్యూస్‌టుడే : తుమకూరు విశ్వవిద్యాలయం 18వ స్నాతకోత్సవం మంగళవారం ఉదయం 11 గంటలకు విశ్వవిద్యాలయం ఆవరణలో నిర్వహించనున్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ ముగ్గురు సామాజిక సేవలకు డాక్టరేట్లు అందజేస్తారు. బెంగళూరులోని మైక్రోల్యాబ్స్ మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్ జి.సురానా, డాక్టర్ హంప నాగరాజయ్య, ఎడిటర్ ఎస్.నాగణ్ణకు డాక్టరేట్‌లు గవర్నర్ ప్రదానం చేస్తారు. డిగ్రీ పట్టాల ప్రదానోత్సవంలో డి.లిట్- ఇద్దరు, పీహెచ్‌డీ-59 మంది, పీజీ 1911మంది, డిగ్రీ పట్టాలు 9438 మంది విద్యార్థులకు ప్రదానం చేస్తారు. మొత్తం 11,349 మంది పట్టాలను అందజేస్తామని ఉప కులపతి వెంకటేశ్వరులు తెలిపారు. 10మందికి ర్యాంకులు కన్నడ పండిత్‌తో ర్యాంకులు సాధించిన 10 మందికి, 76 మంది విద్యార్థులు బంగారు పతకాలు తీసుకుంటారు. నలుగురికి నగదు బహుమతులు అందజేస్తారు.

ఆసక్తికరంగా కలర్‌ఛాంప్ పోటీలు

పోటీలను ప్రారంభిస్తున్న దినేష్‌విక్టర్, సువర్ణదాస్‌గుప్తా తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : పిల్లలకు సృజనాత్మకత చాలా అవసరమని ఎస్.ఐ.పీ అకాడమీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకురాలు, మేనేజింగ్ డైరెక్టర్ దినేష్‌విక్టర్ తెలిపారు. సోమవారం నగరంలో గ్లోబలార్ట్ ప్రాంతీయ కలర్‌ఛాంప్-25 పేరిట ఏర్పాటు చేసిన పోటీలను యూరోస్కూల్ వ్యవస్థాపకురాలు, ప్రిన్సిపల్ సువర్ణదాస్‌గుప్తా, దినేష్‌విక్టర్ ప్రారంభించారు. సువర్ణదాస్‌గుప్తా మాట్లాడుతూ బాలల శిక్షణలో కళలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చిత్రలేఖనం, కలరింగ్‌తో సృజనాత్మక పెరుగుతుందన్నారు. ఐదు నుంచి 15 ఏళ్ల బాలలు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

ప్రతిపక్షాలతో చర్చించి 'గ్రేటర్ బెంగళూరు' నిర్ణయం

రవిచందర్‌కు కెంపేగౌడ అవార్డు ప్రదానం చేస్తున్న డీకే శివకుమార్, పరమేశ్వర్ తదితరులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : గ్రేటర్ బెంగళూరు ఏర్పాటుకు సంబంధించి ప్రతిపక్షాలతో చర్చించి అమలులోకి తెస్తామని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. సోమవారం ఇక్కడ విధానసౌధలో గ్రేటర్ బెంగళూరు నిపుణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బ్రాండ్ బెంగళూరు నిపుణుల సమితి సభ్యుడు రవిచందర్‌కు కెంపేగౌడ పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని గ్రేటర్ బెంగళూరును అస్తిత్వంలోకి తెస్తామన్నారు. ప్రస్తుతం పాలికె ఉండే ప్రాంతాలు గ్రేటర్ బెంగళూరులో ఉంటాయని తెలిపారు. నిపుణుల సమితి ఆఖరి నివేదిక సమర్పించిందని దానిపై మంత్రివర్గంలో చర్చించి తీర్మానిస్తామన్నారు. ఎత్తినహొళె పథకం వల్ల ఏ గ్రామానికి నీరు నిలిచిపోవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హోంమంత్రి డాక్టర్ పరమేశ్వర్, పాలికె చీఫ్ కమిషనర్ మహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి స్థలం దానం

సీడీపీవో సునీతకు పత్రం అందజేస్తున్న శాంతమ్మ

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని కన్నమేడి గ్రామ పంచాయతీ ఓబెనహళ్లి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త శాంతమ్మ దాతృత్వం చాటుకున్నారు. కొనేళ్లుగా గ్రామంలో అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం భవన నిర్మానానికి స్థలం మంజూరు చేయలేదు. చిన్నారుల సంక్షేమాన్ని కాంక్షించిన శాంతమ్మ సర్వే నంబరు 574లో ఉన్న స్థలాన్ని ఇతరుల నుంచి కొనుగోలు చేసి స్త్రీ, శిశు సంక్షేమశాఖ సీడీపీవో సునీతకు సోమవారం స్థలం పత్రాలను దానం కింద అందజేశారు. గ్రామస్థులు, తాలూకాలోని ప్రజలు ఆమెను అభినందిస్తూ కొనియాడారు.

21న పావగడకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

నాయకులు, అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని ప్రజల చిరకాల కోరిక అయిన తుంగభద్ర తాగునీరు పథకం ప్రారంభోత్సవం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సాయం అందించడానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ నెల 21న పట్టణానికి రానున్నారు. తుముల్ అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్ సోమవారం అధికారులతో కలిసి పట్టణంలోని గురుభవన మైదానాన్ని పరిశీలించాడు. తహసీల్దారు వరదరాజు, పురసభ మాజీ అధ్యక్షుడు పి.హెచ్.రాజేశ్, మాజీ అధ్యక్షుడు శంకరరెడ్డి, సమాజ సేవకుడు బత్తినేని నాని, ఎన్.రవి, హనుమంతరాయప్ప, జయరామ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యక్షురాలిగా నరహళ్లి మంగళమ్మ

సత్కారం అందుకున్న సభ్యులు

మండ్య, న్యూస్‌టుడే : మేలుకోటె హోబళి హళేబీడు గ్రామ పంచాయతీ నూతన ఉపాధ్యక్షురాలిగా దళ్ మద్దతు ఇచ్చిన నరహళ్లి మంగళమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఉపాధ్యక్షురాలిగా సేవలందించిన గౌరమ్మ తన పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక నిర్వహించారు. పోటీకి కొందరు సిద్ధమైనా, చివరి క్షణంలో మంగళమ్మ మినహా సభ్యులు ఎవరూ నామినేషన్ పత్రాలు దాఖలు చేయలేదు. ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎల్ శివప్రసాద్ ప్రకటించారు. ఆమెకు మద్ధతు పలికిన సభ్యులను స్థానిక నేతలు సత్కరించారు.

క్వీన్స్ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్

జ్యోతి వెలిగిస్తున్న రమ్య, సౌమ్యారెడ్డి, నారాయణగౌడ, ప్రమోద్ శెట్టి తదితరులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : త్వరలో క్వీన్స్ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌ను నిర్వహిస్తామని నిర్వాహక ప్రతినిధి మహేశ్ గౌడ వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే సౌమ్యగౌడ, మాజీ ఎంపీ రమ్య, నటుడు ప్రమోద్ శెట్టి, కర్ణాటక రక్షణ వేదికె అధ్యక్షుడు నారాయణ గౌడ తదితరులతో కలిసి క్యూపీఎల్ లాంఛనాన్ని విడుదల చేశారు. గత ఏడాది నిర్వహించిన 5 పోటీలను వేల మంది ప్రత్యక్షంగా, పాతిక మిలియన్ల మంది ఆన్‌లైన్‌లో వీక్షించారని తెలిపారు. సీరిస్ నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

క్రైమ్.. కార్నర్

నిందితుల కోసం గాలింపు

మైసూరు, న్యూస్‌టుడే: ఆస్తి కోసం బంధువుల మధ్య జరిగిన గొడవలో యోగమణి అనే మహిళ చేయి విరిగింది. క్యాతనహళ్లికి చెందిన రాజేశ్ పేరిట 2.5 ఎకరాల భూమి ఉంది. అనారోగ్యంతో అతను మరణించిన అనంతరం యోగమణికి ఆ భూమి దక్కింది. దానిపై తమకూ హక్కు ఉంటుందని బంధువులు మహదేవమ్మ, సోము ఆమెపై గొడవకు వచ్చారు. మారణాయుధాలతో దాడి చేయడంతో చేయి విరిగింది. చికిత్స కోసం బాధితురాలిని ఆసుపత్రిలో చేర్పించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం మైసూరు గ్రామీణ ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

డెలివరీ బాయ్ అరెస్టు

హుబ్బళ్లి: ఆన్‌లైన్‌లో ఆర్డరు చేసిన మహిళా వినియోగదారులకు అశ్లీల సందేశాలు పంపించి వేధిస్తున్న రమేశ్‌రెడ్డి అనే డెలివరీ బాయ్‌ను గోకుల రోడ్డు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఫుడ్, కొరియర్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న చోటు నుంచి మహిళా వినియోగదారుల నంబర్లు తీసుకుని అశ్లీల సందేశాలు పంపించేవాడు. ఒక బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కార్యాచరణ నిర్వహించి నిందితుడ్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

యువతులను రక్షించిన సీసీబీ పోలీసులు

మైసూరు, న్యూస్‌టుడే: దాసనకొప్పలు గ్రామంలోని ఒక ఇంటిపై దాడి చేసిన సీసీబీ పోలీసులు అక్కడి నుంచి ఇద్దరు యువతులను రక్షించారు. మరో ఆరుగురు విటులు, ఇద్దరు మహిళలు, పడుపు వృత్తి చేయిస్తున్న మంజు అనే నిందితుడ్ని అరెస్టు చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా గ్రామంలో నిర్మించిన విలాసవంతమైన భవంతిలో వీరు పడుపు వృత్తి నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారంతో పోలీసులు కార్యాచరణ నిర్వహించి అరెస్టు చేశారు.

ఆర్టీసీ డ్రైవరు బలన్మరణం

హాసన, న్యూస్‌టుడే: ఆర్టీసీ బేలూరు విభాగం డివిజనల్ మేనేజరు షాజియా భాను తనను వేధిస్తోందని ఆరోపిస్తూ డ్రైవర్ కమ్ కండక్టర్ హరీశ్ విషం తాగి బలవన్మరణానికి యత్నించాడు. బాధితుడ్ని తక్షణమే బేలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స ఇప్పించడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడు కోటిగానహళ్లి నివాసి. ప్రయాణించే రూటును కేటాయించే విషయంలో ఆమె అనుచితంగా ప్రవర్తిస్తోందని హరీశ్ ఆరోపించాడు. అందరి ముందు ఆమె మందలించడంతో అవమానానికి గురైన హరీశ్, విశ్రాంతి మందిరంలోకి వెళ్లి విషం తాగాడు. బేలూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ ఏఎస్సై మృతి

శివమొగ్గ, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంతో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన బసవరాజప్ప (50) అనే ఏఎస్సై చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆనవట్టి ఠాణాలో పని చేస్తున్న ఆయన బైకులో శిరాళకుప్పకు వెళుతూ ఈ ఏడాది ఏప్రిల్ 30న ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించారు. జిల్లా ఎస్పీ మిథున్ కుమార్‌తో పాటు పోలీసుల అధికారులు, సహ సిబ్బంది బసవరాజప్ప కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి..

బెళగావి, న్యూస్‌టుడే : అథణి వద్ద ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాధిక మ్యాలేశి (30) చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మరణించారు. ప్రమాదంలో ఆమె కుటుంబ సభ్యులు గిరీశ్, రాహుల్ మ్యాలేశి, కారు డ్రైవరు సంగు అమరగొండ అక్కడికక్కడే మరణించారు. కొల్హాపుర మహాలక్ష్మి ఆలయంలో దర్శనం పూర్తి చేసుకుని కలబురగి జిల్లా అఫ్జలపురకు వెళుతుండగా, ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది.

ప్రమాదంలో యువకుడు..

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే : చిక్కజాల వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒక మోటారు కంపెనీ ఏజెన్సీలో పని చేస్తున్న మనోజ్ (23) అనే యువకుడు మరణించాడు. దొడ్డజాల నుంచి చిక్కజాలకు ఆదివారం అర్ధరాత్రి వస్తున్న సమయంలో వాహనం అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న గోడను ఢీకొట్టి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మరణించాడు. చిక్కజాల ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇంట్లో దొంగతనం

బెంగళూరు (గ్రామీణం): కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లి వచ్చేసరికి తమ నివాసంలో దొంగతనమైందని మహేశ్ అనే వ్యక్తి నెలమంగల ఠాణాలో ఫిర్యాదు చేశారు. వాజరహళ్లిలో ట్రావెల్స్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ మేనేజరుగా పని చేస్తున్న ఆయన ఇంటికి తిరిగి వచ్చేసరికి బీరువాలో ఉంచిన 632 గ్రాముల ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు చోరీకి గురయినట్లు గుర్తించారు. వాటి విలువ రూ.35 లక్షలని నెలమంగల ఠాణాలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీసీ టీవీ ఫుటేజ్‌ల పరిశీలన

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: నగరంలోని అన్ని బార్లు, పబ్‌లు, రెస్టారెంట్లలోని సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించేందుకు సీసీబీ పోలీసులు చర్యలు చేపట్టారు. మద్యం తాగడానికి వచ్చే వారు అక్కడ యువతులను వేధించడం, అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సంఘ విద్రోహక శక్తులు కూడా కొన్ని బార్లకు వస్తున్నారని గుర్తించారు. నిత్యం పెన్‌డ్రైవ్‌లలో ఫుటేజ్‌ను కాపీ చేసుకుని, వాటి పరిధిలోకి వచ్చే ఠాణాలో పరిశీలించేలా చర్యలు తీసుకుంటున్నామని ఉన్నతాధికారులు తెలిపారు. మద్యం విక్రయించే పబ్, బార్, రెస్టారెంట్ల ప్రతినిధులు పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు.

న్యాయవాదిపై దాడి

బెళగావి, న్యూస్‌టుడే: బెళగావిలోని కోర్టులో భూవివాదానికి సంబంధించిన కేసు విచారణ పూర్తి చేసుకుని వస్తున్న జహీర్ అనే న్యాయవాదిపై కొందరు దుండగులు దాడి చేశారు. ఇనుపరాడ్లు, రాళ్లతో న్యాయస్థానం ఆవరణలో దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం బెళగావి బిమ్స్‌లో చేర్పించారు. మార్కెట ఠాణా పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

నలుగురి అరెస్టు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: బొమ్మనహళ్లి ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి ఇంటి వెనుక రోడ్డులో నిలిపిన 20 కార్లను ధ్వంసం చేసి పరారైన నలుగురు నిందితులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. అరుణ్, సాగర్, సతీశ్, మరియప్పలను నిందితులుగా గుర్తించారు. నిందితులు మద్యం తాగి రహదారి పక్కన నిలిపి ఉంచిన 20 కార్లు, కొన్ని ఆటోలను ధ్వంసం చేసి పరారయ్యారు. సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా గాలింపు చేపట్టి నిందితులను అరెస్టు చేసి, విచారణ చేపట్టారు.

హంతకులు..

కలబురగి: కలబురగి నగరానికి చెందిన రాఘవేంద్ర నాయక్ హత్య కేసును స్టేషన్ బజార్ ఠాణా పోలీసులు ఛేదించారు. అతన్ని అపహరించి కీర్తినగరలోని శ్మశాన వాటికకు తీసుకువెళ్లిన నిందితులు 2025 మార్చి 12న హత్య చేసి పరారయ్యారు. హంతకులను అశ్విని, ఆమె స్నేహితులు గురురాజ్, లక్ష్మీకాంత్‌గా గుర్తించారు. రాఘవేంద్ర నాయక్ కొద్ది నెలలుగా అశ్వినికి అశ్లీల సందేశాలు పంపించి వేధిస్తూ వచ్చాడు. ఈ విషయాన్ని తన స్నేహితులు ఇద్దరికీ చెప్పడంతో పథకాన్ని రచించి రాఘవేంద్రను అపహరించి, హత్య చేశారు. దర్శన్ తన ప్రేయసి పవిత్రాగౌడ కోసం హత్య చేసిన తీరులోనే ఈ హత్య కూడా జరిగింది. దర్యాప్తు పూర్తి చేసి హంతకులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

విద్యార్థి విషాదాంతం

ఉడుపి: మూర్ఛతో బాధపడుతున్న సాయి గణేశ్ (15) అనే విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాగలకోటెకు చెందిన బాధితుడు మణిపాల సమీపంలోని రాజీవనగరలో ఉంటూ, స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మూర్ఛతో విద్యాభ్యాసానికి భంగం కలుగుతుందన్న వ్యథతో ఉరి వేసుకున్నాడు. మణిపాల ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆలయంలోకి వచ్చిన పాములు

కలబురగి, న్యూస్‌టుడే: చించోళి తాలూకా కనకపుర గ్రామంలోని రేణుకా యల్లమ్మ దేవాలయంలోకి సోమవారం ఉదయం ఆలయంలో పూజలు చేసేందుకు వచ్చిన అర్చకులకు ఐదు పాములు కనిపించాయి. ఆలయంలోని తలుపు, గర్భగుడి, విగ్రహంపై ఉన్న పాములను వీడియో తీశారు. ఆ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు

బెంగళూరు (యశ్వంతపుర): ప్రీతి జోడియాక్ మిక్సర్ గ్రైండర్‌తో ఆహార ధాన్యాలు ఇతర వాటిని నిమిషాల్లో పొడి చేసే పోటీలు బెంగళూరు, హైదరాబాద్, కొచ్చి చెన్నై నగరాల్లో నిర్వహించగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదైనట్లు ఆ సంస్థ ఎండీ గుల్బహర్ తౌరాని తెలిపారు. ధాన్యం, కూరగాయలు, పండ్లు తదితర వాటిని పొడి చేయడంలో ప్రీతి మిక్సర్ ముందంజలో ఉందని తెలిపారు. పసుపు కొమ్ములు నుంచి 30 కఠినమైన వాటిని ప్రీతి మిక్సర్ నిమిషాల్లో పొడి చేసిందని, పోటీలను తిలకించిన నిర్వాహకులు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేశారని వివరించారు.

10న యువకవుల సమ్మేళనం

తుమకూరు, న్యూస్‌టుడే : సాహిత్య అకాడమీ, కర్ణాటక కవయిత్రుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉదయం 10.30 గంటలకు తుమకూరు నగరంలోని జిల్లా ఆసుపత్రి ఆవరణలో యువ కవుల సమ్మేళనం నిర్వహిస్తామని కవయిత్రుల సంఘం జిల్లా అధ్యక్షురాలు మల్లికా బసవరాజు తెలిపారు. సోమవారం తుమకూరులోని పత్రికా భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కర్ణాటక సాహిత్య అకాడమీ అధ్యక్షుడు ఎల్.ఎన్.ముకుందరాజ్ ప్రారంభిస్తారని, రిజిస్ట్రార్ కరియప్ప, ఆసుపత్రి సర్జన్ అస్గర్‌బేగ్, అకాడమీ సభ్యురాలు చంద్రిక, అక్కై పద్మశాలి హాజరవుతారన్నారు. 22 మంది యువ కవులను ఎంపిక చేశామన్నారు. కథాకారుడు నటరాజ్ హుళియార్, శ్రీనివాసమూర్తి, రవికుమార్ పాల్గొననున్నారు. సమావేశంలో సుమా సతీష్, రమాకుమారి, శైలా నాగరాజ్, సుగుణాదేవి, అమీనగడ తదితరులు పాల్గొన్నారు.

పోటీలో గెలుపోటములు ముఖ్యం కాదు

పోటీలను ప్రారంభిస్తున్న వినయ్‌ఆళ్వా, ఉమేష్ తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : క్రీడ అంటే కేవలం గెలుపు, ఓటమి కాదు.. ఆటల బరిలో ప్రత్యర్థులను గౌరవించాలని, ఆటల నియమాలను పాటించాలని క్రీడామనోభావం అభివృద్ధి చాలా ముఖ్యమని ఆళ్వాస్ శిక్షణా ప్రతిష్ఠాన ట్రస్టీ డాక్టర్ వినయ్‌ఆళ్వా తెలిపారు. సోమవారం ఆళ్వాస్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో ఎంకే అనంతరాజ్ బ్యాడ్మింటన్ ఇండోర్ కోర్ట్‌లో తొలి మాన్సూన్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. సి.ఎ.ఉమేష్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో మూడబిదిరేలో బ్యాడ్మింటన్ క్రీడకు చక్కని ప్రోత్సాహం లభిస్తోందని, జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. 11 నుంచి 13, 15, 17 ఏళ్ల లోపు బాలబాలికలకు నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ జిల్లా ప్రాంతాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు జ్ఞాపికతో పాటు నగదు బహుమతులు అందజేశారు.

దివ్యాంగులకు కుట్టు యంత్రాల పంపిణీ

కుట్టు యంత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయచంద్ర, తదితరులు

శిర (తుమకూరు) న్యూస్‌టుడే : శిర తాలూకా పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాంతీయ అభివృద్ధి పథకం కింద రూ.20 లక్షల విలువైన విద్యుత్తు కుట్టు యంత్రాలను దిల్లీ ప్రత్యేక ప్రతినిధి, శిర ఎమ్మెల్యే టి.బి.జయచంద్ర.. దివ్యాంగులకు పంపిణీ చేశారు. స్వయం ఉపాధి పొందడానికి తాలూకాలోని 174 మంది దివ్యాంగులకు కుట్టు యంత్రాలను అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. లబ్ధిదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నగరసభ సభ్యుడు అమానుల్లా ఖాన్, టీపీఈవో హరీష్, గ్యారంటీ పథకాల అమలు సమితి తాలూకు అధ్యక్షుడు నాగరాజు, జిల్లా దివ్యాంగుల సంక్షేమాధికారి చిదానంద మూర్తి, పంచాయతీ అభివృద్ధి అధికారి నాగరాజ్, దివ్యాంగులు పాల్గొన్నారు.

చేనేత సామాజికవర్గం జనాభా 50 లక్షలు

విలేకరులతో మాట్లాడుతున్న సోమశేఖర్, ప్రతినిధులు

చిత్రదుర్గం: రాష్ట్రంలో చేనేత (దేవాంగ) సామాజికవర్గం ప్రజల జనాభా సుమారు 50 లక్షలు ఉందని రాష్ట్ర చేనేత కార్మికుల సమాఖ్య అధ్యక్షుడు సోమశేఖర్ తెలిపారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక సర్వే గణాంకాల ప్రకారం ఈ సామాజిక వర్గం ప్రజల జనాభాను కేవలం 9 లక్షలుగా చూపించారన్నారు. సామాజికవర్గం ప్రజల జనసంఖ్య సర్వే కోసం తామే ఒక చరవాణి యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా రాష్ట్రంలో 224 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమ సామాజికవర్గం జనసంఖ్య వివరాలను సేకరించి మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. ప్రభుత్వంలో తమ సామాజికవర్గానికి న్యాయబద్ధంగా అందాల్సిన సదుపాయాలను పొందటానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తిప్పేస్వామి, జిల్లా అధ్యక్షుడు గోవిందప్ప, ప్రతినిధులు నాగరాజ్, శివకుమార్ పాల్గొన్నారు.

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

సుందర అలంకారంలో మంగళాదేవి

మంగళామాతా .. నమోనమః

ఆషాఢమాస సోమవారం సందర్భంలో పరశురామ క్షేత్రమైన మంగళూరు మహానగరంలో లింగరూపంలో వెలసిన మంగళామాతకు ఘనంగా శతరుద్రాభిషేకం, తదితర సేవలు జరిగాయి. ఉదయం భక్తుల సమక్షంలో మహాన్యాస పూర్వక రుద్ర నమకం, చమకం మహామంత్ర యుక్త శతరుద్రాభిషేకం జరిగింది. అనంతరం సుందర సర్వాలంకార యుక్త మహాపూజ, మహామంగళహారతులు, భక్తులకు అన్న సంతర్పణ జరిగాయి. నెలవంకను తన శిరస్సుపై అలంకరించుకున్న అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు.

- బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే

ఉద్యోగ భద్రతకు పట్టు

ధర్నాలో నినాదాలు చేస్తున్న ఆందోళనకారులు

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే: తమకు ఉద్యోగ భద్రత కల్పించి, వేతన పెంపు చేయాలని గ్రామ పంచాయతీల్లో రికార్డులు రాసే సిబ్బంది డిమాండ్ చేశారు. వేర్వేరు జిల్లాలు, తాలూకాల నుంచి వచ్చిన ఆందోళనకారులు స్వాతంత్ర్య ఉద్యానవనంలో సోమవారం ధర్నాకు దిగారు. గ్రామీణ జీవనోపాధి అభియాన్‌లో భాగంగా తాము అందిస్తున్న సేవలకు విలువ లేకుండా పోయిందని సంఘం అధ్యక్షురాలు రుద్రమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమకు ఇచ్చిన హామీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారు.

కన్నడనాట.. మూడుముక్కలాట

● అధికార పంపిణీపై కొనసాగుతున్న సందిగ్ధత ● ఎటూ తేల్చని అధిష్ఠానం

ముగ్గురి మధ్య దోబూచులాట

ఈనాడు- బెంగళూరు: కన్నడనాట అధికార పక్షంలో నాయకత్వ మార్పు ఓ ప్రహసనంగా మారింది. గత నెల రోజులుగా ముఖ్యమంత్రి పీఠంపై కొనసాగుతున్న చర్చ..మంత్రుల పనితీరు సమీక్ష, ఎమ్మెల్యేల అభిప్రాయ సేకరణ ఎంతకీ తెగటం లేదు. ఎమ్మెల్యేలు వెల్లడించే అభిప్రాయాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా మారిపోతుండటంతో నాయకత్వం, మంత్రివర్గ ప్రక్షాళనపై అధిష్ఠానం సైతం ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. ఇందుకు కారణం మంత్రుల పనితీరు, వారి పట్ల స్థానిక నేతలకున్న సమన్వయం పరోక్షంగా నాయకత్వంపై ప్రభావం చూపుతున్నట్లు ఈ సమీక్షల ద్వారా వెల్లడవుతోంది. ఓ వైపు పార్టీ రాష్ట్ర బాధ్యుడు రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా ప్రతి ఎమ్మెల్యే, మంత్రులతో మాట్లాడుతూ వారి నుంచి వాస్తవాభిప్రాయాన్ని రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. మరో వారం రోజుల పాటు ఈ అభిప్రాయ సేకరణ కొనసాగుతుందని తెలుస్తోంది. ఈ మధ్యలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు దిల్లీ పయనం ఎక్కడాతలేని కుతూహలాన్ని రేకెత్తిస్తోంది.

మారుతున్న హోదాలు

ఓ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వారికి జాతీయ స్థాయిలో బాధ్యతలు అప్పగించటం ఏ పార్టీలోనైనా రాజకీయ పరిణామాలకు సంకేతమనే చెప్పాలి. గతంలో రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పే స్థాయికి చేరుకున్న మల్లికార్జున ఖర్గేను ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విభాగాలకు అధ్యక్షులుగా చేసి ఆపై లోక్‌సభ సభ్యులుగా, కేంద్ర మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. భాజపాలోనూ ప్రహ్లాద్ జోషి, తాజాగా బసవరాజబొమ్మై, జగదీశ్ శెట్టర్ తదితరులూ రాష్ట్ర రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాలకు వెళ్లి ఇక్కడి నేతలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక పదవులు దక్కించుకునే అవకాశాలను మరింత సుగమం చేశారు. నేడు ఇదే పరిస్థితి సిద్ధరామయ్యకు వచ్చిందన్న వార్తలు రాష్ట్ర రాజకీయాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఆయనను ఏఐసీసీ బీసీ సలహా సమితి అధ్యక్షులుగా నియమిస్తూ ఏఐసీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. ముఖ్యమంత్రి స్థాయి నేతతో కనీస చర్చలు లేకుండా పార్టీ అధిష్ఠానం జాతీయ హోదా కట్టబెట్టిందంటే అది నమ్మశక్యం కాని పరిణామంగా రాజకీయ వర్గాలు విశ్లేషించుకుంటున్నాయి. గత నెలలోనే ఈ అధ్యక్ష పదవితో పాటు సభ్యుల కోసం బీకే హరిప్రసాద్, సచిన్ పైలెట్, గుర్‌దీప్ సింగ్ సప్పాల్, అరుణ్ యాదవ్, కమలేశ్వర్ పటేల్ వంటి సీనియర్ల పేరు పరిశీలించారు. వీరెవరూ ప్రస్తుతం కీలక హోదాలో లేని వారు. ఒక్క సిద్ధరామయ్య మాత్రమే ముఖ్యమంత్రి స్థాయి హోదాలో ఉన్నవారు.

హస్తిన ప్రయాణం ఎందుకో?

నేడు(మంగళవారం) ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, రేపు (బుధవారం) ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిల్లీకి వెళ్తున్నట్లు వారి అధికారిక పర్యటన విభాగం స్పష్టం చేసింది. ఈ పర్యటన సందర్భంగా కేంద్ర మంత్రులతో పలు అంశాలపై చర్చించే అవకాశమున్నా రాష్ట్ర రాజకీయ పరిణామాలపై చర్చించాలన్నది వీరిరువురి లక్ష్యం.

కోటల ప్రాంతాల్లో మంత్రి బోసురాజు పర్యటన

అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి

రాయచూరు, న్యూస్‌టుడే : చిన్ననీటి పారుదలశాఖ మంత్రి బోసురాజు సోమవారం ఉన్నాధికారులతో కలసి నగరంలోని కోటల ప్రాంతంలో పర్యటించారు. తొలుత ఆర్టీసీ బస్టాండ్ దగ్గర మక్కా ధర్వాజ్‌కు వెళ్లి అక్కడ జరుగుతున్న కందకం పనులను పరిశీలించారు. జేసీబీలను వినియోగించి చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమానికి ప్రజల నుంచి మెరుగైన స్పందన లభిస్తోందని, ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు శాశ్వత పనులు చేయాలని స్థానికులు కోరుతున్నట్లు జిల్లా పాలనాధికారి నితీష్ మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పూర్తి స్థాయి వెలుగును ప్రసరించే దీపాలు అమర్చాలని, దెబ్బతిన్న గ్రిల్‌ను బాగు చేయించాలని సూచించారు. లైటింగ్ వ్యవస్థ కల్పించేందుకు ప్రతిపాదనలు తయారు చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహాపాత్ర వెల్లడించారు. అనంతరం కాటా దర్వాజ్, తీనకందిల్ కూడలి ప్రాంతాల్లో పర్యటించారు. నగర పాలక సంస్థ అధ్యక్షురాలు నరసమ్మ, పర్యాటక శాఖ ఉప నిర్దేశకుడు కృష్ణ శావంతగేరా, ప్రజా పనుల శాఖ ఇంజినీర్ మహేశ్, అధికారులు రాఘవేంద్ర, మేనకా పటేల్ పాల్గొన్నారు.

దూకుడు తగ్గిన కృష్ణవేణి

రాయచూరు : ఎగువున వర్షం తగ్గడంతో చల్లని నదీమతల్లి కృష్ణమ్మలో ప్రవాహ వేగం మందగించింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు బాగలకోట జిల్లా ఆలమట్టిలోకి 1,11,472 క్యూసెక్కులు, యాదగిరి జిల్లా నారాయణపురలోకి 1,15,000 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ఆదివారం ఆలమట్టి ఇన్‌ఫ్లో 1,24,666 క్యూసెక్కులు ఉండేది. ప్రస్తుతం దిగువ నదికి లక్షా 15 వేలు క్యూసెక్కులు వదులుతున్నారు. ఆలమట్టిలో 88.248 టీఎంసీల మట్టం నమోదైంది. నారాయణపురలోకి 24 గంటల ముందు మాదిరే 1,15,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నారాయణపురలో 26.936 టీఎంసీల (గరిష్ఠ మట్టం 33.313) నీటి నిల్వ ఉంది. 30 గేట్లను ఎత్తి జల విద్యుదుత్పాదనకు, జూరాలకు 1,12,577 క్యూసెక్కులను పంపుతున్నారు. ఆనకట్టల పరిధిలోని కాలువలు, ఉపకాలువులకు మంగళవారం నీటిని విడుదల చేయనున్నారు.

నిరంతరం తాగునీటి సదుపాయం

భూమిపూజ చేస్తున్న మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్

మాన్వి, న్యూస్‌టుడే : ప్రజలకు రోజంతా తాగునీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చిన్ననీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. సోమవారం కవితాళ పట్టణంలో అమృత-2 పథకానికి భూమిపూజ చేసి మాట్లాడారు. కవితాళ, చుట్టుపక్కల ప్రజల దాహార్తి తీర్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. రూ.34.50 కోట్లతో అమృత-2ను ప్రారంభించి 24 గంటల పాటు నీటి సరఫరా చేస్తామన్నారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తి చేసి తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని, పనులు నాణ్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ రవి ఎస్ అంగడి, ప్రముఖులు కిరిలింగప్ప, శాంతప్ప, శివమూర్తి, వెంకటరావు, కాసీంబీ, చాంద్‌పాషా పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ సేవలు ప్రశంసనీయం

ప్రసంగిస్తున్న ఉప కులపతి శివానంద

రాయచూరు, న్యూస్‌టుడే : ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల ప్రశాంతంగా జీవించవచ్చని మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం నూతన ఉప కులపతి డాక్టర్ శివానంద కెళగినమని పేర్కొన్నారు. ఉద్యోగం, వ్యాపారం, వివిధ పనుల నిమిత్తం రోజు హాజరు కాకపోయినా, వారంలో ఒక సారైనా వెళ్లాలని కోరారు. ఆయన సోమవారం నగరంలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ ప్రజలను భక్తిమార్గం వైపు మళ్లించడంతో సహా సామాజిక సేవలను నిరంతరం కొనసాగించడం హర్షణీయమన్నారు. వీరి సేవా కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామం కావాలని విజ్ఞప్తి చేశారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంచాకురాలు స్మితా, ప్రతినిధి శారదా.. ఉపకులపతి దంపతులను సత్కరించారు.

'ముఖ్యమంత్రి మార్పు తథ్యం'

అశోక్

హాసన, న్యూస్‌టుడే: కర్ణాటకలో ముఖ్యమంత్రి పీఠం నుంచి సిద్ధరామయ్య కిందకు దిగడం తథ్యమని విపక్ష నేత ఆర్.అశోక్ వ్యాఖ్యానించారు. హాసనలో విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రిని మార్చమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఒక ప్రకటన ఇస్తే చూడాలని తాను కోరుకుంటున్నానని చెప్పారు. సీఎం పీఠం కోసం మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ప్రజలు అందరికీ తెలుసన్నారు. రెండేన్నరేళ్ల కాలం పూర్తయ్యాక డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారని గుర్తించే, ఎమ్మెల్యేలు కొందరు తమకు మంత్రి పదవులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. శివకుమార్ సీఎం అవుతారని రామనగర ఎమ్మెల్యే ఇక్బాల్‌హుసేన్ చేసిన వ్యాఖ్యలకు నోటీసులు జారీ చేశారని, అయినా, మళ్లీ అదే వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి తాకత్తు ఉంటే ఇక్బాల్ హుసేన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సవాలు విసిరారు.

రూ.2 కోట్ల విలువైన మాదక ద్రవ్యాల జప్తు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: రాజానుకుంటె పరిధి ఆదిగానహళ్లిలో ఉంటూ, చుట్టుపక్కల ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న ఒక నైజీరియన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రూ.2 కోట్ల విలువైన 2 కిలోల హైడ్రో గంజా, 600 గ్రాముల ఎండీఎంఏను స్వాధీన పరుచుకున్నారు. నిందితుడి నుంచి మరిన్ని వివాలను రాబట్టేందుకు రాజానుకుంటె ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డిజిటల్ అరెస్టు పేరిట రూ.3.15 కోట్లు దోపిడీ

మంగళూరు, న్యూస్‌టుడే: తాను ఇన్‌స్పెక్టర్ శర్మనని, మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామని మంగళూరుకు చెందిన ఒక మహిళకు ఫోన్ చేసిన నిందితుడు ఆమె ఖాతా నుంచి రూ.3.15 కోట్ల నగదును తనఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. నేషనల్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో మీరు, మీ భర్త అక్రమ లావాదేవీలకు పాల్పడ్డారని కేసు నమోదైందని శర్మ బెదిరించాడు. మరో పోలీసు స్టేషన్‌కు కాల్ బదిలీ చేస్తున్నానని చెప్పారు. తాను సహార్ ఠాణా ఎస్సై అంటూ మోహన్ కుమార్, ఆ తరువాత పబ్లిక్ ప్రాసిక్యూటర్ దీపక్ వెంకటరమణ అనే వ్యక్తికి కాల్‌ను బదిలీ చేశారు. మహిళ, ఆమె భర్త బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకుని, ఆన్‌లైన్‌లో మీ వద్ద ఉన్న నగదు మొత్తాన్ని బదిలీ చేయాలని ఒత్తిడి చేశాడు. నగదు బదిలీ అనంతరం నిందితుల నుంచి ఫోన్లు నిలిచి పోయాయి.తాను మోసపోయానని ఆలస్యంగా గుర్తించిన బాధితురాలు సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

రెండువందల మంది బహిష్కరణ

బెంగళూరు(న్యాతిప్పసంద్ర),న్యూస్‌టుడే: రాష్ట్రంలో అక్రమంగా నివశిస్తున్న బంగ్లాదేశీయులను గుర్తించి వారిని బహిష్కరించే ప్రక్రియ నిరంతరం సాగుతుందని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ తెలిపారు. సోమవారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెండువందల మందిని రాష్ట్రం నుంచి బహిష్కరించామని తెలియజేశారు. ఎఫ్ఆర్ఆర్‌వో అధికారులు అక్రమవలసదారులను గుర్తించి సమాచారం ఇస్తున్నారని, అనంతరం పోలీసులు వారిని బహిష్కరించే ప్రక్రియ సాగిస్తున్నారని తెలిపారు. ఆ ప్రక్రియ నిలుపుదల చేయలేదని స్పష్టం చేశారు.

గడువు తీరిన వస్తువులకు విలువుండదు

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: ఔట్ డేటెడ్ వస్తువులకు విపణిలో విలువ ఉండదని గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రియాంక్‌ఖర్గే పరోక్షంగా మాజీ ఎంపీ ప్రతాప్‌సింహాపై విరుచుకుపడ్డారు. సోమవారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భాజపా నుంచి తిరస్కరణకు గురైన వ్యక్తిగా ప్రతాప్‌సింహ ముద్ర పడ్డారని, ఆయన ఎందుకు పనికి రానీ వ్యక్తిగా ఆ పార్టీ నేతలు చూస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తికి కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. ప్రతాప్‌సింహ గత లోక్‌సభ ఎన్నికల్లో భాజపా నేతలు ఎందుకు టికెట్ ఇవ్వలేదని ప్రశ్నించారు. పార్టీ పదవులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా చూస్తున్నారని, సింహ అనే పేరు ఉన్నంత మాత్రం సింహం కావని ఎద్దేవా చేశారు.

ఉన్నతాధికారులతో సీఎం సమావేశం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అవినీతి కుంభకోణంపై సీబీఐ దర్యాప్తునకు అప్పగించాలని ఉన్నత న్యాయస్థానం సూచించడంతో సోమవారం ఇక్కడ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మండలి పరిధిలోకి వచ్చే ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. వాల్మీకి అభివృద్ధి మండలిలో అవినీతి కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు రావడంతో మంత్రి నాగేంద్ర తన స్థానానికి రాజీనామా చేశారు. కుంభకోణాన్ని విచారించేందుకు ఎస్ఐటీ దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి నాగేంద్రకు కుంభకోణానికి ఎలాంటి సంబంధంలేదని ఎస్ఐటీ క్లీన్ చీట్ ఇచ్చింది. అందుకు ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. భాజపా నేతలు బసనగౌడ పాటిల్ యత్నాళ్, అరవింద లింబావళి, కుమారబంగారప్ప తదితరులు సీబీఐ దర్యాప్తునకు అప్పగించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సీబీఐ దర్యాప్తుకు అప్పగించాలని న్యాయస్థానం సూచించింది. దీంతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉన్నతాధికారులతో సమావేశమై జరిగిన ఎస్ఐటీ దర్యాప్తు నివేదిక, ఇతర అంశాలపై చర్చించారు.

వ్యభిచారం ఆరోపణలతో లాడ్జిపై దాడి

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు తాలూకా హైదరాబాద్ రహదారి దగ్గర్లోని ఒక లాడ్జిలో వ్యభిచారం చేయిస్తున్నారన్న పక్కా సమాచారంతో గ్రామీణ ఠాణా పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టుబడ్డ ఆరు మంది మహిళలను మహిళా సాంత్వన కేంద్రానికి తరలించారు. లాడ్జి మేనేజర్‌తో సహా మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సాయం పెంచాలని వినతి

నినాదాలు చేస్తున్న కార్మికులు

రాయచూరు: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ 'జిల్లా కట్టడ కార్మికుల సంఘం సమన్వయ సమితి' ఆధ్వర్యంలో శ్రామికులు సోమవారం కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వీరనగౌడ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. పిల్లలకు విద్యా సాయాన్ని పునరుద్ధరించాలని, వైద్య, వివాహం, పింఛన్, అంత్యక్రియలకు ఇస్తున్న ఆర్థిక సాయాన్ని పెంచాలని మనవి చేశారు. ఆరోగ్య శిబిరాలు, సంచార క్లినిక్ నిర్వహణ పేరిట వృథాగా ఖర్చు చేయవద్దని, సేవా కేంద్రాలను టెండర్ ద్వారా ప్రైవేటుకు అప్పగించే విధానాన్ని రద్దు చేయాలని ఒత్తిడి తెచ్చారు. ప్రతినిధులు ఆనందప్ప, వీరణ్ణ హోసూరు, రంగప్ప అన్నిహాళ, తిమ్మప్పస్వామి, భీమప్ప, నాగరాజ్, వీరేశ్ జాలగార, వెంకటేష్ రాథోడ్ పాల్గొన్నారు.

నేడు ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగ మేళా

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో మంగళవారం క్యాంపస్ డ్రైవ్ (ఉద్యోగమేళా) ఏర్పాటు చేసినట్లు అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. విప్రో, కవాసకి, టీవీఎస్, మహీంద్ర, డీవీ వరల్డ్, జేబీఎం, యాజకి, శక్తి కంపెనీలు నియామకాలు చేసుకుంటాయని వివరించారు. ఉదయం 10 గంటలకు మొదలవుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అభ్యర్థులను కోరారు.

ఆకస్మిక మరణాలపై అప్రమత్తం

దినేశ్ గుండూరావ్

ఈనాడు, బెంగళూరు: కర్ణాటకలో ఇకపై ఆకస్మిక మరణాలను ఆరోగ్య నివేదికల్లో నమోదు చేసి సమగ్ర సమీక్షల ద్వారా పర్యవేక్షించనున్నారు. ప్రజారోగ్యానికి హెచ్చరిక గంటలా మారిన వీటిపై మరణోత్తర పరీక్షలు చేపట్టి జాతీయ ఆరోగ్య మిషన్, ఐసీఎంఆర్ ద్వారా సమీక్షిస్తారు. రాష్ట్రంలో గుండెపోటుతో ఆకస్మిక మరణాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖ తనవంతు చర్యలు ప్రారంభించింది. సోమవారం ప్రజారోగ్యాన్ని అత్యవసర పరిస్థితిగా మార్చింది. 45 ఏళ్లలోపు వారి ఎలాంటి దీర్ఘకాలిక రోగాలు లేకున్నా గుండెపోటుతో మరణించటం వెనుక ఆరోగ్యశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మరణాలపై నివేదిక ఇవ్వాలని జయదేవ గుండె ఆరోగ్య విజ్ఞాన, పరిశోధన సంస్థ డైరెక్టర్ డా.రవీంద్రనాథ్‌తో సమితి ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కరోనా టీకా దుష్పరిణామాలపై ఈ అధ్యయనం చేయాలన్న ఆరోగ్యశాఖ సూచనతో ఈ నివేదిక రూపొందించారు. ప్రాథమిక నివేదికను అధికారికంగా ఈనెల 10న సర్కారుకు అందిస్తారు. ఆ నివేదికలో కరోనా టీకా ఆకస్మిక మరణాలకు కారణం కాదని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

సమీక్ష తప్పదు

క్షయ, హెపటైటిస్, కలరా వంటి ప్రత్యేక వ్యాధులను అత్యవసర ప్రజారోగ్య సమస్యలుగా గుర్తించి ఆరోగ్యశాఖ సమీక్ష చేపడుతుంది. వీటిని నోటిఫైయబుల్ వ్యాధులుగా నమోదు ఆరోగ్య నివేదికల్లో నమోదు చేసి వీటిని నియంత్రించే చర్యలు చేపడతారు. ఈ జాబితాలో ఇకపై ఆకస్మిక మరణాలు కూడా చేరనున్నాయి. ఇప్పటికే గత నాలుగేళ్లలో వందలాది ఆకస్మిక గుండెపోటు కేసులు రాష్ట్రంలో నమోదైన విషయం తెలిసిందే. హాసన ఒక్క జిల్లాలోనే దాదాపు 25 మంది 40 రోజుల్లో మరణించారు. ఈ మరణాలపై సర్కారు అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ కరోనా టీకాతో గుండెపోటు మరణాలు సంభవించలేదని డా.రవీంద్రనాథ్ కమిటీ తేల్చింది. ఇదే సందర్భంగా కరోనా సోకిన వ్యక్తుల్లో మధుమేహం, ఊబకాయ సమస్యలు పెరిగి తద్వారా గుండె జబ్బులకు దారి తీసినట్లు ఈ అధ్యయనం ద్వారా తేలిందన్నారు.

అవగాహన పెంచాలి

కరోనా సమయంలో శారీరక శ్రమ తగ్గి ఇంటి నుంచే ఉద్యోగం విధులు నిర్వహించటం వల్ల ఊబకాయంతో రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు ఎదురయ్యాయి. ఈ జీవనశైలి నుంచి అప్రమత్తం చేసేందుకు సర్కారు ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించాలని తీర్మానించినట్లు మంత్రి తెలిపారు. ఆకస్మికంగా మరణించిన వారి నివేదికలతో నిబంధనలు రూపొందించి వాటిపై అవగాహన కల్పిస్తారు. 15 ఏళ్లలోపు పిల్లలకు కూడా హృదయ సంబంధ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు, మహిళలకు ప్రత్యేక అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పునీత్ రాజ్‌కుమార్ హృదయజ్యోతి పథకాన్ని తాలూకా ఆస్పత్రులకు విస్తరించి ఆటోమేటెడ్‌ఎక్స్‌టర్నల్ డిఫైబ్రిలేటర్ (ఏఈడీ)లతో ఆరోగ్య పరీక్షలను చేపడతామన్నారు.

నైతిక పోలీసు గిరి కేసులో ఇద్దరి అరెస్టు

మంగళూరు, న్యూస్‌టుడే: తమ ధర్మానికి చెందిన యువతితో ఎందుకు కలిసి వెళ్తున్నావంటూ ఒక యువకుడిపై నైతిక పోలీసు గిరికి పాల్పడిన పురుషోత్తమ (43), రామచంద్ర (38) అనే వ్యక్తులను అరెస్టు చేశామని దక్షిణ కన్నడ జిల్లా ఎస్పీ అరుణ్ తెలిపారు. తమ ధర్మానికి చెందిన యువతితో కలిసి వెళ్తున్న యువకుడిని వేధిస్తూ తీసుకున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో వీరిద్దరూ పోస్టు చేశారు. ఆ యువతికి చెందిన వ్యక్తి ఉద్రేకపడ్డారంటూ మత మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారని గుర్తించి, వారిని అరెస్టు చేశామని చెప్పారు. పుత్తూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అయ్యో తల్లీ..ఇదేం పని

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: తాగుబోతు భర్త, బయటపడలేని పేదరికంతో వ్యథకు గురైన ఒక తల్లి తన కన్న బాలింత 45 రోజుల మగబిడ్డను హత్య చేసింది. నీరు వేడి చేసుకునే కాగులో బిడ్డను ముంచి హత్య చేసింది. నెలమంగల తాలూకా గాణకలుకు చెందిన ఏసీ, రాధ భార్యాభర్తలు. ఆదివారం రాత్రి బిడ్డను నీటిలో ముంచి హత్య చేసిన ఆరోపణలపై ఆమెను నెలమంగల ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు సహకరించిన ఆమె అత్తను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కలుషిత నీరు తాగి ముగ్గురి మృతి

యాదగిరి, న్యూస్‌టుడే: కలుషిత నీరు తాగి సురపుర సమీపంలోని తిప్పనటగి గ్రామానికి చెందిన పాతిక మంది అస్వస్థతకు గురయ్యారు. చికిత్స పొందుతూ దేవికమ్మ హొట్టి (48), వెంకప్ప (60), రామణ్ణ పూజారి (50) మరణించారు. మిగిలిన వారు చికిత్సకు స్పందిస్తున్నారని వైద్యులు తెలిపారు. తాగు నీరు గొట్టాలు పగిలి మురుగు నీరు చేరడంతోనే నీరు కలుషితమైందని అధికారులు గుర్తించారు.

కొత్త చట్టాలను రద్దు చేయాలని రాస్తారోకో

రాయచూరు: కార్మికుల ప్రయోజనాలను కాలరాసేందుకు రూపొందించిన నాలుగు చట్టాలను అమలు చేయవద్దని ఒత్తిడి తేవటానికి ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా పాలనాధికారి పాత కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు హెచ్.పద్మ, ప్రధాన కార్యదర్శి డి.ఎస్.శరణబసవ ఒక ప్రకటనలో వెల్లడించారు. పెద్ద ఎత్తున శ్రామికులు పాల్గొనాలని కోరుతున్నారు. చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధమైనట్లు వివరించారు.

దర్శన్ అర్జీ విచారణ నేటికి వాయిదా

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్): తన డెవిల్ సినిమా చిత్రీకరణకు విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ నటుడు దర్శన్ వేసుకున్న అర్జీ విచారణ నేటికి (మంగళ) వాయిదా పడింది. జూన్ 1 నుంచి 25వరకు విదేశాలకు వెళ్లి వచ్చేందుకు న్యాయస్థానం అనుమతించింది. వీసా లభించకపోవడంతో విదేశాలకు వెళ్లలేదు.

9న సీఎం దిల్లీకి

బెంగళూరు (యశ్వంతపుర) : మైసూరు దసరా ఉత్సవాలు సందర్భంగా వైమానిక ప్రదర్శన నిర్వహణకు సంబంధించి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజనాథ్‌సింగ్‌ను కలిసి చర్చించేందుకు ఈనెల 9న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిల్లీకి వెళ్లనున్నారు. దసరా ఉత్సవాలు సందర్భంగా వైమానిక ప్రదర్శన ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని విన్నవించుకోనున్నారు. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ఆయనను భేటీ చేయనున్నారు. పార్టీ అధిష్ఠానాన్ని కలిసి రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులు ఏఐసీసీ ఓబీసీ జాతీయ సమితి నియామకం తదితర అంశాలపై చర్చించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి విషాదాంతం

మండ్య, న్యూస్‌టుడే: హొసగావి రహదారిలో సోమవారం ఉదయం సంభవించిన ప్రమాదంలో రామణ్ణ, భరత్ అనే యువకులు మరణించారు. వీరు వెళుతున్న బైకు అదుపు తప్పి వీసీ కాలువ అడ్డుగోడకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

నోటిఫికేషన్ రద్దు చేసిన హైకోర్టు

బెంగళూరు (సదాశివనగర) : ఇస్రో తన సేవలను విస్తరించుకునేందుకు దేవనహళ్లి సమీపంలోని అబ్బచిక్కనహళ్లి, లాలగొండనహళ్లి గ్రామాల్లో 81 ఎకరాల భూమిని స్వాధీనపరుచుకుంటూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను హైకోర్టు రద్దు చేసింది. ఇస్రోకు భూమిని 2013లోనే భూమి కేటాయించినా, పనులు ప్రారంభించలేదని ఆరోపిస్తూ స్థానికులు వేసుకున్న అర్జీని పరిగణనలోకి తీసుకుని జస్టిస్ ఎస్ఆర్ కృష్ణ కుమార్ నోటిఫికేషన్‌కు సంబంధించిన ఆదేశాలను రద్దు చేశారు.

ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలు వద్దు

తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం సభ్యులు

మాన్వి, న్యూస్‌టుడే : ప్రభుత్వ పనులను ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించటంతో దాని ప్రభావం శిక్షణపై పడుతుందని, ఇప్పటికే ఉపాధ్యాయుల కొరతతో పాఠశాలల నిర్వహణ సాగుతోందని రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు తహసీల్దార్ భీమరాయను కలిసి వినతి పత్రం అందించారు. విద్యార్థులకు బోధన, శిక్షణను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులను బీఎల్ఓ విధుల నుంచి దూరం పెట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు విజయకుమార్, ఇసాక్, ప్రశాంత్, హనుమంతప్ప, బసవరాజ్, శృతిపత్తార్, శంకరప్ప, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రూ.15 లక్షల పరిహారాన్ని అందించిన స్పీకర్



ఖాదర్

మంగళూరు, న్యూస్‌టుడే: మంగళూరులో మూకదాడిలో మరణించిన కేరళకు చెందిన అష్రఫ్ కుటుంబ సభ్యులకు స్పీకర్ యూటీఖాదర్, మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ రూ.15 లక్షల పరిహారాన్ని సోమవారం అందించారు. ఏఐసీసీ కార్యదర్శి బీకే హరిప్రసాద్, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్‌లతో కలిసి అశ్రఫ్ కుటుంబ సభ్యులను మంగళూరుకు పిలిపించుకుని పరిహారాన్ని ఇచ్చారు. తన వ్యక్తిగత ఖాతా నుంచి జమీర్ రూ.10 లక్షలు, ఖాదర్ ఖాతా నుంచి రూ.5 లక్షల పరిహారాన్ని కలిపి అందించారు.

విలేకరి మృతికి సంతాపం

నివాళులు అర్పిస్తున్న పాత్రికేయులు

రాయచూరు, న్యూస్‌టుడే : ఇటీవల మృతి చెందిన సీనియర్ పాత్రికేయుడు ఆర్.రాముకు సోమవారం పత్రికాభవన్‌లో శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా విలేకర్ల సంఘం రాయచూరు రిపోర్టర్స్ గిల్డ్ ఆధ్వర్యంలో సంతాప సమావేశం జరిగింది. విలేకర్లు రాము చిత్రపటానికి పుష్పార్చన చేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. సంఘం అధ్యక్షుడు ఆర్.గురునాథ్, రాష్ట్ర కార్యకారి సమితి సభ్యుడు శివమూర్తి, సీనియర్లు బి.వెంకటసింగ్, భీమరాయ హద్దినాళ మాట్లాడుతూ స్థానికంగా ఓ ఛానెల్ విలేకరిగా పాత్రికేయ వృత్తిలో ప్రవేశించిన రాము పాతికేళ్లలో ప్రజా సమస్యలపై అలుపెరగని కలం పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్.వీరనగౌడ, వెంకటేష్ హూగార్, అణ్ణప్ప మేటి గౌడ, శివప్ప మడివాళ, వీరారెడ్డి, సిద్ధయ్య స్వామి, రఘునాథరెడ్డి, శ్రీకాంత్ సావూర్, ధీరేంద్ర కులకర్ణి, నీలకంఠ, ఎం.పాషా, శివరాజ్, విజయకుమార్, మంజునాథ స్వామి, దుర్గేశ్, ఖాదర్ హాజరయ్యారు.



చూడదు కన్ను.. వేసేయ్ మన్ను

■ నాసిరకంగా ఓఅండ్‌ఎం పనులు
■ కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాగునీటి చెరువుల్లో జరుగుతున్న పనులు నాసిరకంగా మారాయి. పేరుకు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు చెబుతున్నప్పటికీ ఆయా ప్రాంతాలకు చెందిన కొందరు నాయకుల ఆధ్వర్యంలో సాగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో చెరువులకు నీటి విడుదల జరుగుతుండగా.. ఆలోపే పనులు పూర్తి చేయాలన్న తొందరలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

– న్యూస్‌టుడే, దేవనకొండ

పేరు ఒకరిది చేస్తున్నది మరొకరు

కర్నూలు జిల్లాలో 21 పనులకు 1.27 కోట్లు నంద్యాలలో 49 పనులకు రూ.2.68 కోట్లు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు నియోజకవర్గాల్లో 10 శాతం కమీషన్‌పై ఐదు చెరువులను ఒక గుత్తేదారుడు చేస్తున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో పనులను విడగొట్టుకుని గ్రామ నాయకులే నిర్వహిస్తున్నారు. పశ్చిమ ప్రాంతం మంత్రాలయంలో ఓ నేత కనుసన్నల్లో జరుగుతున్నాయి. డోన్‌లో ఓ గుత్తేదారుడు రెండు పనులను ముందస్తుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు చేస్తున్నారు.

నియోజకవర్గం	పనులు	నిధులు (రూ.లక్షల్లో)
కర్నూలు	2	14
ఆదోని	2	18
ఎమ్మిగనూరు	2	17
డోన్	3	18
కోడుమూరు	3	15
మంత్రాలయం	3	15
పత్తికొండ	3	15
ఆలూరు	3	15

ముళ్ల పొదలు తొలగించకుండానే

దేవనకొండ మండలం మాచాపురం చెరువుకు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. కట్ట పటిష్టపరిచేందుకు మట్టి వేస్తున్నారు. కట్టకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు తొలగించలేదు. త్వరగా పనులు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో తూతూమంత్రంగా కానిచేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

రూ.3.95 కోట్లు మంజూరు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో ఓఅండ్‌ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులకు రూ.3.95 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో చెరువులకు సంబంధించిన పంట కాలువలను శుభ్రం చేసి శివారు ప్రాంతాల్లోని పొలాలకు నీళ్లివ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కట్టలను మట్టితో పటిష్ఠం చేయడంతోపాటు చెరువులు, కట్టలపై ఉన్న ముళ్ల పొదలు, కంపచెట్లు తొలగించడం. . స్లూయిజ్‌లలో ఎలాంటి అడ్డంకులు లేకుండా లేకుండా శుభ్రం చేయాలి. పనులను సాగునీటి సంఘాలకు అప్పగించారు. పేరుకు సంఘాలు ఆధ్వర్యంలో చేస్తున్నట్లు చెబుతున్నా పరోక్షంగా కొందరు నాయకుల ఆధ్వర్యంలోనే ఇవి జరుగుతున్నాయి. మరికొన్నిచోట్ల గుత్తేదారులు పనులు చేస్తున్నారు.

పనులన్నీ నాసిరకమే..

చెరువుల గట్లపై ముళ్ల పొదలు తొలగించాల్సి ఉండగా ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో తొలగించడం లేదు. కొన్నిచోట్ల నిప్పు పెట్టి అలానే వదిలేస్తున్నారు. మరికొన్నిచోట్ల గడ్డి మందు చల్లుతున్నారు. చెరువులో పెద్దఎత్తున వ్యర్థాలు ఉన్నప్పటికీ అలానే ఉంచేస్తున్నారు. చెరువు కట్టలకు నాసిరకం మట్టి వాడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారుల పర్యవేక్షణ కరవవడంతో నిధులు పక్కదారి పడుతున్నాయి.

14 నుంచి కేసీకి నీటి విడుదల

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు ఈనెల 18న, కేసీ కాలువకు 14 నుంచి, హంద్రీనీవా కాలువకు 15వ తేదీ నుంచి నీటిని విడుదల చేయాలని జిల్లా సాగు నీటి సలహా మండలి (ఐఏబీ) నిర్ణయించింది. నీటి విడుదలకు ముందే కాలువల్లో ఉపాధిహామీ పథకం ద్వారా పూడిక తొలగింపు, ఇతర పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

అదే వరుస.. రైతు రుసరుస

యూరియా కొరత రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. సహకార సంఘాల పరిధిలో ఎరువులు సమృద్ధిగా లభించకపోవడంతో చాలా ప్రాంతాల్లో ప్రైవేటు వ్యాపారులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 97 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. కర్నూలుకు 150 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించారు. చాలా ప్రాంతాల్లో యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. డిమాండ్ నేపథ్యంలో కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఒక్కో యూరియా సంచికపై రూ.350 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

● ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల రైతులు యూరియా కోసం సోమవారం డీసీఎంఎస్ కేంద్రం వద్ద వరుస కట్టారు. వందలాది మంది రైతులు రావడంతో పోలీసులు వారిని వరుస క్రమంలో నిలబెట్టారు. డీసీఎంఎస్ అధికారులు రైతులకు యూరియా టోకెన్లు పంపిణీ చేశారు. పెద్దకడబూరులో సహకార సంఘం కార్యాలయం వద్ద రైతులు బారులు తీరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వరుసలో నిరీక్షించినా చాలా మందికి దొరకలేదు.

–న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం, పెద్దకడబూరు

పెద్దకడబూరులో యూరియా కోసం బారులు తీరిన రైతులు

నేడు శ్రీశైలానికి సీఎం చంద్రబాబు రాక

కర్నూలు సచివాలయం, శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం శ్రీశైలం రానున్నారు. జలాశయం వద్ద కృష్ణా నదికి జలహారతి ఇస్తారు.

❑ ఉదయం 10.50 గంటలకు హెలికాప్టర్‌లో సున్నిపెంటకు చేరుకుంటారు. 10 నిమిషాలపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరులతో మాట్లాడతారు. అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి 11.15 గంటలకు శ్రీశైలం ఆలయానికి చేరుకుంటారు.

❑ ఉదయం 11.15 నుంచి 11.35 గంటల వరకు శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుంటారు. 11.35 గంటలకు శ్రీశైలం ఆలయం నుంచి బయలుదేరి 11.50కు నీలం సంజీవరెడ్డి శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుకుంటారు.

❑ మధ్యాహ్నం 12.25 నుంచి 1.10 గంట వరకు సాగునీటి సంఘాల నాయకులతో ముఖాముఖి అవుతారు.

ఆదర్శ బడి.. బస్సుల్లేక బాధపడి

36 పాఠశాలలు.. 28,510 మంది విద్యార్థులు

కర్నూలు విద్య న్యూస్‌టుడే : పేరు 'ఆదర్శం.. వసతి లేదు. . బస్సు ఉండదు.. బడికెళ్లాలంటే భావితరం అవస్థలు పడుతోంది. విద్యాభివృద్ధికి వెనుకబడిన మండలాల్లో ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేశారు. అక్కడికెళ్లడానికి రవాణా సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు విద్యార్థులు ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 36 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఆదర్శ పాఠశాలల విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో సీట్లు సాధిస్తున్నారు. పది, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తుండడంతో ఈ విద్యాలయాలకు ఆదరణ పెరిగింది. 6 నుంచి 10 వరకు ప్రతి తరగతికి 100 సీట్లు, ఇంటర్మీడియట్‌లో రెండు సంవత్సరాలకు 320 సీట్లు ఉన్నాయి. మొత్తం 28,510 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఆదర్శ	కర్నూలు	నంద్యాల
పాఠశాలలు	16	13,120
విద్యార్థులు	20	15,390

ఆస్పరి: పుటకలమర్రిలోని ఆదర్శ పాఠశాలకు కైరుప్పల, వెంగళాయదొడ్డి, తంగరడోణ, చెన్నంపల్లి, ఆల్లారుదిన్నె, కుంకనూరు, దేవనకొండ గ్రామాల విద్యార్థులు వెళ్తుంటారు. బస్సు సౌకర్యం లేక ప్రమాదకరంగా ఆటోల్లో పోతున్నారు.

ఆటోలో వెళ్తేనే

● పత్తికొండ ఆదర్శ బడికి దూదేబండ, చక్రాళ్ల, హొద్దహుళ్తి, చిన్నహుళ్తి గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

● కోసిగిలోని ఆదర్శ పాఠశాలకు హాల్వీ, వల్లూరు, గుడికంబాలు, కోసిగి మండలానికి చెందినవారు వస్తుంటారు. బస్సు సౌకర్యం లేదు. కౌతాళం మండలం నుంచి 10 కి.మీల దూరం ప్రయాణానికి నెల అద్దెకు మాట్లాడుకుని ఆటోల్లో వస్తున్నారు.

రవాణా భత్యం ఇవ్వాలని వినతి

బడికి కిలోమీటరు కంటే ఎక్కువ దూరంలో ఉన్న 1 నుంచి 5వ తరగతి పిల్లలు, 3 కి.మీ కంటే ఎక్కువ దూరం నుంచి వచ్చే 6, 7, 8వ తరగతుల విద్యార్థులకు ఈ ఆర్థిక సాయం అందిస్తున్నారు. చాలాచోట్ల ఆదర్శ పాఠశాలలకు 3 నుంచి 15 కి.మీ దూరం నుంచి విద్యార్థులు వస్తున్నారు. వీరికీ రవాణా భత్యం వర్తింపచేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వసతి సౌకర్యం ఎప్పుడో

⏩ తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కేవలం విద్యార్థినులకే వసతిగృహ సౌకర్యం కల్పిస్తున్నారు. నంద్యాల మినహా అన్నిచోట్లా హాస్టల్ సౌకర్యం ఉంది. ఆరో తరగతి నుంచి హాస్టల్ వసతి కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రుల విన్నవిస్తున్నారు.

⏩ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో చాలావరకు బస్సులు తిరగని ప్రాంతాలు ఉండడంతో పలువురు విద్యార్థినులు చదువుకు దూరమవుతున్నారు. మరికొందరు పిల్లలు సైకిళ్లపై వస్తున్నారు. వర్షం పడిన సమయంలో వారు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.

కట్ట చుట్టూ కోతలు.. వదిలేస్తే కన్నీళ్లు

ఆలూరు బ్రాంచి కెనాల్ (ఏబీసీ) ఐదో డిస్ట్రిబ్యూటరీ పాయింట్ (డీపీ) దెబ్బతింది. కట్ట చుట్టూ మట్టి కోతకు గురై గోతులు ఏర్పడ్డాయి. ఇలాగే వదిలేస్తే కట్టపైకి నీరు చేరే ప్రమాదం ఉంది. డీపీకి ఏర్పాటు చేసిన షటర్ పడిపోయే ప్రమాదం ఉంది. దీని కింద 3,500 ఎకరాల ఆయకట్టు ఉంది.. ఎన్నోసార్లు విన్నవించినా. నిధులు విడుదల చేయలేదని రైతులు వాపోయారు.

– న్యూస్‌టుడే,ఆలూరు గ్రామీణ

అంబేడ్కర్ గురుకులంలో సీట్ల భర్తీకి 9న మంత్రణం

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యా సంస్థల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈనెల 9వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త డాక్టర్ శ్రీదేవి సోమవారం తెలిపారు. 5వ తరగతిలో బాలురకు 2 సీట్లు, ఇంటర్ ఎంపీసీలో 6, బైపీసీ 5, సీఈసీలో 36 సీట్లు ఉన్నాయన్నారు. అమ్మాయిలకు 5వ తరగతిలో 70 సీట్లు, ఇంటర్మీడియట్ ఎంపీసీ 70, బైపీసీ 26 సీట్లు ఉన్నట్లు వెల్లడించారు. ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలో ఎస్సీ2 ర్యాంకు 13,200, బీసీలు 4,995 లోపు వచ్చిన వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని సూచించారు. 5వ తరగతిలో చేరే అమ్మాయిల్లో ఎస్సీ2 6,000, బీసీలైతే 1450లోపు ర్యాంకు వచ్చిన వారు హాజరుకావాలన్నారు. బాలురలో బీసీలు 288లోపు ర్యాంకు వచ్చినవారు రావాలన్నారు. అమ్మాయిలకు దిన్నెదేవరపాడు, అబ్బాయిలకు చిన్నటేకూరులో కౌన్సెలింగ్ ఉంటుందని వివరించారు. ఉదయం 10 గంటల నుంచి 5వ తరగతి వారికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇంటర్మీడియట్ వారికి కౌన్సెలింగ్ జరుగుతుందని చెప్పారు.

రైతేరాజు 6

ఖాతా బీమాకు రాత

■ సెప్టెంబరు వరకు కార్యక్రమం ■ జన్‌ధన్ అకౌంట్ల నవీకరణ

ఉమ్మడి జిల్లాలో లక్షల మందికి జన్‌ధన్ ఖాతాలున్నాయి. వాటిలో చాలావరకు ఉపయోగించలేని స్థితిలో ఉన్నాయి. దీంతో నగదు బదిలీ పథకాల లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు బీమా పథకాల ప్రయోజనాలకు దూరమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో.. ప్రతిఒక్కరికి బీమా పథకాల ప్రయోజనాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బ్యాంకు ఖాతాలు లేని వారితో జన్‌ధన్ ఖాతాలు తెరిపించడం.. వినియోగంలోని ఖాతాలను ఈకేవైసీ చేయించడం ద్వారా పునరుద్ధరించడమే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈనెల 1 నుంచి సెప్టెంబరు 30 వరకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామానికి ఒక బ్యాంకు బాధ్యత వహిస్తుంది.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

సూదిరెడ్డిపల్లెలో 1వ తేదీన బీమా పథకాల ప్రయోజనాలు వివరించే గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎల్‌డీఎం రామచంద్రరావు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి, కేడీసీసీ బ్యాంకు సీఈవో రామాంజనేయులు తదితరులు

పథకం పేరు	పీఎంజేజే	పీఎంఎస్‌బీ
ఏడాదికి ప్రీమియం	రూ.436	రూ.20
ప్రయోజనం	రూ.2 లక్షల	రూ.2 లక్షల
	జీవిత బీమా	ప్రమాద బీమా
అర్హులు	18- 50 ఏళ్ల వారు	18- 70 ఏళ్ల వారు

ఒక్కసారి ఆలోచించండి

కుటుంబంతో ఒకసారి సినిమాకు వెళ్తే రూ.వెయ్యికి పైగా ఖర్చవుతుంది. వారాంతంలో హోటల్‌కు వెళ్తే రూ.1500- రూ.2 వేలు పెట్టాల్సిందే. తాత్కాలిక ఆనందాన్నిచ్చే.. ఈ ఖర్చులతో పోల్చుకుంటే కష్టకాలంలో కుటుంబానికి ఆర్థిక భద్రతనిచ్చే బీమా పథకాలకు చెల్లించే ప్రీమియం చాలా తక్కువే ఉంటుంది. ఏడాదికి రూ.456 చెల్లిస్తే.. ఊహించని ప్రమాదం జరిగినప్పుడు, సహజ మరణం సంభవించినప్పుడు ఆర్థిక భరోసా లభిస్తుంది. అవగాహన లేక కొందరు.. ఉదాసీనతతో చాలామంది ప్రధానమంత్రి జీవన జ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవడం లేదు.

బ్యాంకు జాడలేని పల్లెలెన్నో..

● జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలోని 14 గ్రామాల్లో బ్యాంకు సేవలకు చాలా దూరంగా ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో 5 వేల నుంచి 9 వేల వరకు జనాభా ఉంది. పందికోనలో 9,078, కడిమెట్లలో 8,919 మంది ప్రజలు నివసిస్తున్నా బ్యాంకు సదుపాయం లేదు.

● ఆదోని మండలం మదిరె, ఆస్పరి మండలం ములుగుందం, దేవనకొండ మండలం గుండ్లకొండ, కోడుమూరు మండలం గోరంట్ల, మంత్రాలయం మండలం వగరూరు తిమ్మాపురం, రచ్చుమర్రి, పత్తికొండ మండలం పందికోన, దూదేకొండ, పెద్దకడుబూరు మండలం చిన్నతుంబళం, తుగ్గలి మండలం చెన్నంపల్లి, ముక్కెళ్ల, ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల, కందనాతి, కడిమెట్ల గ్రామాలదీ ఇదే పరిస్థితి.

40 శాతం నిరుపయోగం

⏩ కర్నూలు జిల్లాలో వివిధ బ్యాంకుల శాఖలు 588 ఉండగా.. 8,79,585 జన్‌ధన్ ఖాతాలున్నాయని అధికారులు చెబుతున్నారు. నంద్యాల జిల్లాలో 5,60,269 ఖాతాలు ఉన్నాయి. వీటిలో 60 శాతం ఖాతాలు వినియోగంలో ఉండగా.. 40 శాతం ఖాతాలు వినియోగంలో లేవు. ఆధార్‌తో అనుసంధానం చేసుకోని కారణంగా ఈ ఖాతాలు వినియోగంలో లేవని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

⏩ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా ప్రయోజనం పొందాలంటే పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ బ్యాంకు ఖాతాలు ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రజలందరికీ బ్యాంకింగ్ సేవల్ని చేరువ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఎల్‌డీఎం రామచంద్రరావు తెలిపారు.

⏩ కర్నూలు జిల్లాలో 484 గ్రామాల్లో పీఎంజేజేబీవైకి సంబంధించి 57,855, పీఎంఎస్‌బీవైకి చెందిన 85,239 మందికి సెప్టెంబరు నెలాఖరు వరకు బీమా చేయించాల్సిన లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు.

ముడుపులకు పెద్దపీట

■ వ్యవసాయ శాఖలో ఇష్టారాజ్యంగా బదిలీలు

ఈనాడు, కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకుల బదిలీల్లో పైరవీలకే పెద్దపీట వేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవోతో ఏమాత్రం సంబంధం లేకుండా అధికారులు ఇష్టారాజ్యంగా బదిలీ చేశారు. గతంలో సొంత మండలాలకు సమీపంలోనే బదిలీలుండేవి. ప్రస్తుతం 100 నుంచి 200 కి.మీ.ల దూరానికి బదిలీ చేయడంతో వారు ఆందోళన చెందుతున్నారు. అధికారులు సూచించిన మేరకు ఉద్యోగులు 1, 2, 3 ఆప్షన్లు ఇచ్చినా తాజా బదిలీల సరళిని పరిశీలిస్తే ఇష్టారాజ్యంగా పోస్టింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హరనాథరెడ్డి అనే వీఏఏ ఆత్మహత్య చేసుకుని నెలలు గడిచాక ఆయనకు ప్రస్తుతం పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. విధులకు నెలలు తరబడి గైర్హాజరవుతున్న వారికి సైతం పోస్టింగులు ఇచ్చారు. దీంతో పలువురు బాధితులు సోమవారం కలెక్టర్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు.

దూరానికి విసిరేసి..

గ్రామ వ్యవసాయ సహాయకుల బదిలీల్లో సిఫార్సు లేఖలు తెచ్చుకున్నవారికి, ముడుపులిచ్చిన వారికి కోరుకున్న చోట పోస్టింగులు దక్కాయి. ఏకంగా 410 మంది సిఫార్సు లేఖలు సంపాదించుకున్నారు. 40 మంది మాత్రం తాము ఆప్షన్ పెట్టిన మూడు ప్రాంతాల్లో ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధపడ్డారు. అలాంటి వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రజాప్రతినిధులను ఆశ్రయించని వారిని కక్ష కట్టినట్లు సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారన్న ఆరోపణలున్నాయి.

○ సీనియారిటీ జాబితాలో 154 స్థానంలో ఉన్న గురుగోవర్ధన్ అనే వీఏఏ గుండుపాపల గ్రామంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన్ను ఆస్పరి మండలంలోని జొహరాపురం గ్రామానికి బదిలీ చేశారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న ప్రాంతానికి 150 కి.మీ.ల దూరం.

○ మనోజ్‌కుమార్‌రెడ్డి అనే వీఏఏ ఉద్యోగం వచ్చిన తర్వాత పేరూరు గ్రామంలో ఏడాదిపాటు విధులు నిర్వర్తించారు. ఆ తర్వాతి నుంచి విధులకు వచ్చిన దాఖలాల్లేవు. ఆయనకు ఆదోని మండల పరిధిలో పోస్టింగు ఇవ్వడం గమనార్హం.

○ మనోహర్ అనే మరో వీఏఏ సైతం గత కొన్ని నెలలుగా విధులకు హాజరురావడం లేదు. ఆయనకు శిరివెళ్ల మండలం జీనేపల్లి గ్రామంలో పోస్టింగు ఇచ్చినట్లు సమాచారం. నాలుగు నెలల నుంచి విధులకు హాజరు కాని ఓ ఉద్యోగినికి పోస్టింగు ఇవ్వడం గమనార్హం.

○ నిబంధనల ఉల్లంఘనలపై వివరణ కోసం జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని 'ఈనాడు' ప్రతినిధి ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

B.Tech., and Ag.B.Sc., SPOT ADMISSION
కేవలం 6,7,8,9,10 లక్షల ఖర్చుతో నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ / అగ్రికల్చర్ బీఎస్సీ (కాలేజ్ ఫీజు + హాస్టల్ ఫీజుతో కలిపి) ఎటువంటి షూరిటీ లేకుండా విద్యార్థికి 70 నుంచి 80% లోన్ సౌకర్యం కల్పించబడును. వివరాలకు సంప్రదించండి :
9502555500, 9160220527

జలధికి పీర్లు

ఆలూరు, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రాంతంలో మొహర్రం సందడి నెలకొంది. సోమవారం పలు పల్లెల్లో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. తర్వాత జలధికి తరలాయి.

అన్నదాత కష్టం.. సైబర్ నేరగాళ్ల కన్నం

■ ఫోన్ హ్యాక్‌చేసి.. రూ.9 లక్షలు దోచేసి

అన్నదాత కష్టాన్ని సైబర్ మోసగాళ్లు దోచేశారు..ఫోన్ హ్యాక్ చేసి రూ.9 లక్షలు తస్కరించడంతో ఆ రైతు కంట కన్నీరు ఆగడం లేదు. హొళగుంద మండలం హెబ్బటం గ్రామానికి చెందిన పైగేరి కురవ రంగస్వామి 15 ఎకరాల్లో మిరప సాగు చేశారు. మంచి ధర వస్తుందని 400 సంచుల దిగుబడిని కర్ణాటక రాష్ట్రం బ్యాడిగలోని శీతల గోదాంలో భద్రపరిచారు. ఖరీఫ్ పెట్టుబడి కోసం జూన్ 24న విక్రయించారు. రూ.9.2 లక్షలు వచ్చింది.. డబ్బు రూపంగా వద్దు.. ఖాతాలో జమ చేయమని రైతు కోరారు.. ఆదోనిలోని కెనరా బ్యాంకు ఖాతా (0601101023863)లో రూ.5 లక్షలు, బ్యాంకు ఆఫ్ బరోడా (37038100011295)లో రూ.4.2 లక్షలు జమ చేశారు. బ్యాంకు చరవాణికి ఎలాంటి మెసేజ్ రాలేదు. సిమ్‌కార్డు చాలా కాలం నుంచి వాడటం లేదు.. డెడ్ అయ్యుంటుందని రైతు భావించారు.. అదే నెంబరు సిమ్ తీసుకోవాలని ఆధార్ కార్డుతో సంబంధిత దుకాణానికి వెళ్లారు. సిమ్, ఆధార్ కార్డు బ్లాక్ అయ్యాయని దుకాణ నిర్వాహకుడు తెలపడంతో అవాక్కయ్యారు. వారం రోజుల తర్వాత బ్యాంకుకు వెళ్లి ఖాతాలో నగదును చూసుకోగా రూ.లక్ష మాత్రమే ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. ఖాతాను హ్యాక్ చేసి 30వ తేదీ నుంచి విడతల వారీగా సైబర్ నేరగాళ్లు రూ.8 లక్షలు ఖాళీ చేశారని బ్యాంకు అధికారులు తెలిపారు. స్టేట్‌మెంట్ పరిశీలించగా.. నాసిక్, కోల్‌కతా, తమిళనాడు ప్రాంతాల నుంచి హ్యాక్ చేసి విత్‌డ్రా చేసినట్లు బాధితుడు వాపోయారు. హొళగుంద పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కష్టమంతా సైబర్ మోసగాళ్ల చేతికి చేరిందని కన్నీటి పర్యంతమయ్యారు.

– న్యూస్‌టుడే, హొళగుంద

ఏపీకే ఫైళ్లు.. దోచేస్తాయ్ పైసలు

■ ఆర్థిక నేరాలపై ఫిర్యాదుల వెల్లువ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : సైబర్ నేరగాళ్లు ప్రజల చరవాణులకు ఏపీకే ఫైళ్లను పంపి వారి ఖాతాల్లోని నగదును దోచేస్తున్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సూచించారు. కర్నూలు నగరంలోని కొత్తపేటలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. 85 మంది బాధితులు ఫిర్యాదులు సమర్పించారు. బాధితుల సమస్యలు విన్న ఎస్పీ విచారణ జరిపించి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐలు పాల్గొన్నారు.

★ పీఎం కిసాన్ పేరుతో చరవాణికి వచ్చిన ఏపీకే ఫైల్‌ను క్లిక్ చేయగా తన ప్రమేయం లేకుండానే తన బ్యాంకు ఖాతా నుంచి రూ.1.96 లక్షలు ఇతరుల ఖాతాకు బదిలీ అయ్యాయని కల్లూరు మండలానికి చెందిన ఓ బాధితుడు విన్నవించుకున్నారు.

బాధితుల సమస్య వింటున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

సమస్యల ఏకరువు

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.2 లక్షలు తీసుకుని శిక్షణ ఇప్పించి, ప్రాజెక్టు వర్క్ పేరుతో ఆరు నెలలు పనిచేయించుకుని నెల జీతం మాత్రమే ఇచ్చి అనంతపురానికి చెందిన బాబు తనను మోసగించారంటూ కర్నూలులోని ముజఫర్‌నగర్‌కు చెందిన అభిలాష్ ఫిర్యాదు చేశారు.

★ నంద్యాల ఆటోనగర్‌కు చెందిన కురువ ఈరన్న నెలకు రూ.20 వేల అద్దె చెల్లిస్తానని చెప్పి తమ ట్రాక్టర్‌ను తీసుకెళ్లారని, 8 మాసాలైనా అద్దె ఇవ్వకుండా వాహనంతో పారిపోయాడని ఆదోని మండలం ఇస్వికి చెందిన రామాంజనేయులు, మల్లప్ప ఫిర్యాదు చేశారు.

★ కర్నూలులోని ఓ పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడి ఉద్యోగం ఇప్పిస్తానని లక్ష్మయ్య అనే వ్యక్తి తన నుంచి రూ.6 లక్షలు తీసుకుని మోసగించాడని కర్నూలులోని తిలక్‌నగర్‌కు చెందిన యువరాజు ఫిర్యాదు చేశారు.

★ కర్నూలులోని వడ్డెగేరికి చెందిన ఖాజాఖాన్ తన భర్త పేరుతో ఇన్‌స్టాగ్రాంలో నకిలీ ఐడీ సృష్టించి ప్రముఖులను దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడుతూ వివాదాలు సృష్టిస్తున్నాడని ఓ మహిళ విన్నవించారు.

★ తనకు చెందిన 1.20 ఎకరాల పొలాన్ని సర్వేయర్ నిర్ధారించినా కూడా ఉగాది జయన్న దౌర్జన్యంగా ఆక్రమించారంటూ కర్నూలులోని ప్యాలకుర్తికి చెందిన పెరుగు నరేష్ ఫిర్యాదు చేశారు.

★ నకిలీ మరణ ధ్రువీకరణపత్రంతో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించి తన ఆస్తిని కాజేయాలని ఓ వ్యక్తి ప్రయత్నిస్తున్నాడని కర్నూలులోని కుమ్మరివీధికి చెందిన రాకేశ్ ఫిర్యాదు చేశారు.

(c) eenadu

కొర్ర సాగు.. భలే బాగు

బనగానపల్లి, న్యూస్‌టుడే: మారిన జీవనశైలి నేపథ్యంలో ఆహారపు అలవాట్లు మారాయి.. 'చిరు'ధాన్యాలు తినడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.. ఆదరణ బాగుంటుండడంతో సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతోంది.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు కొర్ర సాగుపై దృష్టి సారించారు.. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే లాభాలు పొందొచ్చని బనగానపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధాకర్ సూచిస్తున్నారు. జూన్, జులై మాసాల్లో పంట వేసుకోవడానికి అనుకూలమైన కాలం.. స్వల్పకాలిక పంట కావడంతో బెట్ట పరిస్థితులు తట్టుకొని మంచి దిగుబడి ఇస్తుంది. సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు సాధించొచ్చు.

సుధాకర్

ఇలా విత్తుకోవాలి: ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుంది. ఒక కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండజిమ్‌తో శుద్ధి చేయాలి. సాళ్ల మధ్య 22 సె.మీ. దూరం, మొక్కల మధ్య 7.5 సెం.మీ. దూరం ఉండేలా చూసుకోవాలి. విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలు తీసి వేయాలి. విత్తిన 30 రోజుల వరకు కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.

అంతర పంటలు: కొర్ర పంటలో అంతర పంటగా కంది, వేరుశనగ పంటలు సాగు చేసుకోవచ్చు. 5 సాళ్ల కొర్రకు ఒక సాలు కంది లేదా 2 సాళ్ల కొర్రకు ఒక సాలు వేరుశనగ వేసుకోవచ్చు.

అంతర కృషి: విత్తిన 20 రోజుల తర్వాత సాళ్లలో గొర్రుతో ఎడసేద్యం చేయడంతో కలుపు మొక్కలు రాకుండా నివారించుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం: ఆఖరి దుక్కిలో నాలుగు టన్నుల పశువుల ఎరువును ఎకరా పొలంలో వేసి బాగా కలియ దున్నాలి. విత్తేటప్పుడు 8 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరాన్ని ఇచ్చే ఎరువులను ఎకరా పొలానికి దుక్కిలో వేయాలి. మళ్లీ విత్తిన నెల రోజులకు మరో 8 కిలోల నత్రజని ఎరువును పైపాటుగా పైరులో వేయాలి.

సందేహాలు సమాధానాలు

ప్రశ్న : వేరుసెనగలో మొదలు కుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతున్నాయి. నివారణ తెలపగలరు?

- బసవరాజు, కోటేకల్లు గ్రామం

సమాధానం : విత్తనశుద్ధి చేసుకోకుంటే వాటి ద్వారా మొలకెత్తిన తర్వాత కాండానికి శిలీంధ్రం ఆశించి మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు ట్రైకోడర్మవిరిడి 5 గా. లీటరు నీటిలో లేదా సాఫ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలి. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

అంతర పంట.. ఆదాయ బాట

మహానంది, న్యూస్‌టుడే : మహానంది మండలం చెంచులక్ష్మి గూడేనికి చెందిన చెంచు రాగుల బయమ్మ ఎకరా భూమిలో అంతర పంటలు సాగుచేస్తూ నిరంతర ఆదాయం పొందుతున్నారు. ప్రధాన పంటగా మామిడి, జామ, కొబ్బరి మొక్కలు పెంచుతున్నారు. వాటి మధ్యలో కొర్ర, మినుము, మొక్కజొన్న, నువ్వులు వంటి పంటలు సాగు చేస్తున్నారు.

★ ఎకరా పొలంలో అన్ని పంటల సాగుకు రూ.20 వేల వరకు ఖర్చు చేసినట్లు బయమ్మ చెబుతున్నారు. వ్యవసాయశాఖ వారు జన్ జాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా ఉచితంగా అందజేసిన వీబీఎన్-8 రకం మినుము విత్తనాలు సాగుచేసి 6 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. క్వింటా రూ.7,400తో విక్రయించగా రూ.44,400 ఆదాయం వచ్చింది. కొర్రపంట ఒక క్వింటా దిగుబడి రాగా రూ.3 వేలకు విక్రయించారు. మొక్కజొన్నను క్వింటా రూ.9 వేల ప్రకారం అమ్ముకున్నారు. వీటి మధ్యలో బంతిపూలు కూడా పండించి మహానంది దేవస్థానంలో వ్యాపారికి రూ.2,200లకు విక్రయించి ఆదాయాన్ని పొందారు. రూ.60 వేలు లాభం ఆర్జించారు. ఖర్చులు పోను రూ.40 వేల నికర ఆదాయం రావడం విశేషం.

మామిడిచెట్ల సంరక్షణలో చెంచు బయమ్మ

రైతేరాజు

పత్తి పురుగు కత్తి
ముందస్తు నివారణే మేలు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : వర్షం జోరందుకుంది.. ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు పెరిగింది.. విత్తనం వేసి నెల రోజులు దాటింది. పంట 30-50 రోజుల మధ్య పురుగుల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. అప్రమత్తంగా ఉండాలి.

● వర్షాల నేపథ్యంలో ఎకరానికి 36 కిలోల యూరియా వేసుకోవాలి. 45 రోజుల సమయంలో ఎకరానికి 20 కిలోల పొటాష్ వేయాలి. కిలో మెగ్నీషియం పిచికారీ చేయాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా. రాఘవేంద్రచౌదరి వివరించారు.

తెల్ల దోమ: పూతకాయ దశలో తెల్ల దోమ ఆశిస్తుంది. కాయ, పూత పక్వానికి రాకముందే పగిలిపోయేలా చేస్తుంది.. నష్టం తీవ్రంగా ఉంటుంది.. దోమ ఉద్ధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు గిడస బారిపోతాయి.

నివారణ: పసుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 10 పెట్టుకోవాలి. వేప నూనె 10,000 పీపీఎం, 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి లేదా 1,500 పీపీఎం.. 5 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పైరిప్రాక్సిఫెన్ 1.25 గ్రాముల లీటరు నీటికి లేదా అసిటామిప్రిడ్ 0.5 గ్రాముల లీటరు నీటికి కలిపి ఆకుల అడుగుభాగం, కొమ్మలు, కాండం తడిసే విధంగా పిచికారీ చేయాలి.

పచ్చదోమ: ఈ పురుగు ఆకుల అడుగు భాగంలో చేరి రసం పీల్చుతుంది. ఆకు మొదట ముడుచుకొని క్రమేపీ లేత పసుపు రంగుకు మారుతుంది.. తర్వాత ఆకు అంచులు ముదురు ఎరువు రంగులోకి మారి ఆకు మొత్తం ఎర్రబడి రాలిపోతుంది. మొక్కల ఎదుగుదల క్షీణించి గిడస బారిపోవడంతో మొగ్గలు ఏర్పడవు.

నివారణ: పసుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 10 పెట్టుకోవాలి. పురుగు గుడ్డ దశలో ఉద్ధృతి తక్కువగా ఉన్నప్పుడు వేప నూనె 10,000 పీపీఎం 2 మిల్లీలీటర్లు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఫ్లోనికామిడ్ 0.3 గ్రాముల లీటరు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీటరు లేదా థయామీతాక్సామ్ 0.2 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

పేనుబంక: సాధారణంగా వేడి, పొడి వాతావరణంలో పేనుబంక ఎక్కువగా వ్యాపిస్తుంది. వేప నూనె లీటరు లేదా వేప గింజల కషాయం పిచికారీ చేయాలి. ప్రోపినోఫాస్ 2 మి.లీటరు లీటరు నీరు, గమ్, 0.5 మి.లీల లీటరు నీరు లేదా థైమేతోయేట్ 2 మి.లీల లీటరు నీరు, గమ్ 0.5 మిలీలు లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి.

జలాశయాలు నింపాలి.. ఆయకట్టుకు నీరందించాలి

☛ ఐఏబీ సమావేశంలో సభ్యుల తీర్మానం

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : తుంగభద్ర, కృష్ణా నదుల్లో వరద ప్రవాహం కొనసాగుతున్నందున ఈసారి జలాశయాలను పూర్తిగా నింపడంతో పాటు ఆయకట్టు అవసరాల మేరకు సాగునీరు విడుదల చేయాలని కర్నూలు జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) నిర్ణయించింది. ఐఏబీ ఛైర్మన్, కలెక్టర్ రంజిత్‌బాషా అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం సలహా మండలి సమావేశం జరిగింది. జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ నవ్య, ఎమ్మెల్యేలు డా.పార్థసారథి, గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, వివిధ శాఖల అధికారులు, సాగునీటి సంఘాల డీసీ సభ్యులు హాజరయ్యారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డి అజెండా అంశాలను చదివి వినిపించారు.

➤ ఏటా వందల టీఎంసీల తుంగభద్ర జలాలను దిగువకు వదిలేస్తున్నామని, గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తే నీటి నిల్వకు అవకాశం ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. జలాశయం నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు నివేదికలు పంపితే, తాము సీఎంతో చర్చిస్తామన్నారు. హంద్రీనీవా పరిధిలోని అన్ని చెరువులను నింపాలని కోరారు.

➤ నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు మేరకు కర్నూలు మండల పరిధిలోని గంగమ్మ చెరువులో ఆక్రమణలు తొలగించి పూర్వవైభవం తేవాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కలెక్టర్‌ను కోరారు.

➤ గాజులదిన్నె జలాశయంలో పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేయాలన్నారు. ఆదోని సబ్ డివిజన్ పరిధిలో ఏడాదిగా డీఈఈ పోస్టు ఖాళీగా ఉండటంతో ఒక్క ప్రతిపాదన కూడా పంపలేకపోతున్నామని ఎమ్మెల్యే డా.పార్థసారథి పేర్కొన్నారు.

➤ ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలో సాగునీటి వనరులు లేక ప్రజలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో హంద్రీనీవా ఎస్ఈ పాండురంగయ్య, కేసీసీ ఈఈ ప్రతాప్, ఈఈ శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, డీఈఈ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, వేదికపై ఎమ్మెల్యేలు, జేసీ నవ్య

సమావేశంలో చేసిన తీర్మానాలు

➤ తుంగభద్ర జలాలు నిల్వ చేసేందుకు గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులు నిర్మించాలి.

➤ ఈనెల 14వ తేదీ నుంచి కేసీ కాలువకు నీటి విడుదల చేయాలి.

➤ ఎల్లెల్సీ కాలువకు నీటి విడుదలకు సంబంధించి టీబీబోర్డుకు ఈనెల 10న ఇండెంట్ పంపాలని, 18వ తేదీకి జిల్లా సరిహద్దుకు 550 క్యూసెక్కుల నీరు చేరేలా చూడాలి.

➤ ఈనెల 15 నుంచి హంద్రీనీవా ప్రధాన కాలువకు విడుదల చేసే నీటిని వచ్చే ఏడాది మార్చి వరకు గాజులదిన్నె ప్రాజెక్టుకు సరఫరా చేయాలి.

➤ హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా 40 టీఎంసీల నీటిని పూర్తిగా వినియోగించుకునేలా కాలువ వెంట ఉన్న చెరువులను నింపాలి.

➤ నగరానికి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు గాజులదిన్నె జలాశయాన్ని పూర్తిస్థాయిలో నింపాలి.

➤ ఎల్లెల్సీలో ఇండెంట్ ప్రకారం నీటి విడుదలకు కాలువ వెంట పహారా ఉంచాలి.

➤ పశ్చిమ ప్రాంతంలోని 68 చెరువుల ప్రాజెక్టుకు నిర్వహణకు నిధులు విడుదలయ్యేలా కృషిచేయాలని తీర్మానించారు.

ప్రజాప్రతినిధుల గైర్హాజరు

సాగునీటి వనరులపై ఏడాదికోసారి చర్చించి, కీలకమైన నిర్ణయాలు తీసుకునే ఐఏబీ సమావేశానికి మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు జయనాగేశ్వరరెడ్డి, శ్యాంబాబు, విరూపాక్షి హాజరుకాలేదు.

వసతికి పోటెత్తిన దరఖాస్తులు

డోన్ పట్టణం, కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే: వసతిగృహాల్లో ఉండేది అంతా గ్రామీణ పేద విద్యార్థులే. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకునే స్థోమత లేక సర్కారుబడుల్లో చేరి.. వసతిగృహాల్లో ఉంటూ అభ్యసిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం వసతిగృహాలను నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థుల సౌకర్యార్థం పలు చర్యలు చేపట్టడంతో నూతన శోభను సంతరించుకున్నాయి. తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తుండడంతో విద్యార్థుల ప్రవేశాలు బాగా పెరిగాయి. సీట్ల కోసం సిఫార్సులు చేయించుకుని మరీ ప్రవేశాలు పొందుతుండడం గమనార్హం.

● కర్నూలు జిల్లాలో ఎస్సీ బాల, బాలికల వసతిగృహాలకు సంబంధించి ప్రీమెట్రిక్ వసతి గృహాలు 29, పోస్టుమెట్రిక్ వసతిగృహాలు 8 ఉన్నాయి. వీటిల్లో 5,734 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. నంద్యాల జిల్లాలో ప్రీమెట్రిక్ 25, పోస్టుమెట్రిక్ 13 వసతిగృహాలు ఉండగా.. 4,023 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో సీట్లు ఖాళీ లేవని, పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో 172 దాకా ఖాళీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

● కర్నూలు జిల్లాలో బీసీ వసతిగృహాలకు సంబంధించి ప్రీమెట్రిక్ వసతిగృహాలు 31 ఉండగా.. పోస్టుమెట్రిక్ వసతిగృహాలు 14 ఉన్నాయి. అందులో 10,123 మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లాలో ప్రీమెట్రిక్ వసతిగృహాలు 21 ఉండగా.. పోస్టుమెట్రిక్ వసతిగృహాలు 12 ఉన్నాయి. వీటిల్లో 3,337 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఇందులో 1,350 దాకా సీట్లు ఖాళీగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2వేలకు పైగా సీట్లు ఖాళీ ఉండగా.. వాటిని భర్తీ చేసేందుకు ఆయా వసతిగృహాల సంరక్షకులు తలమునకలవుతున్నారు. కొన్ని వసతిగృహాల్లో విద్యార్థులు మంజూరైన సీట్ల కంటే ఎక్కువగానే ఉండడం గమనార్హం.

ఎస్సీ వసతిగృహంలో బాలికలను చేరుస్తున్న వారి తల్లులు

ఆధునికీకరణ.. సన్నబియ్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి కర్నూలు జిల్లాలో 75కి పైగా వసతిగృహాల్లో మైనర్, మేజర్ మరమ్మతులకు సంబంధించి 2024 డిసెంబరులో రూ.16కోట్లకు పైగా నిధులను కేటాయించి.. వేసవి సెలవుల్లో సంబంధిత గుత్తేదారులతో పనులను ప్రారంభించారు. అవన్నీ ఓ కొలిక్కి వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదేమాదిరిగా విద్యార్థులకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ విద్యా సంవత్సరం సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం తయారు చేసి వడ్డిస్తున్నారు.

19 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : రేషనలైజేషన్‌లో భాగంగా పాణ్యం నియోజకవర్గంలో కొత్తగా 19 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పాణ్యం నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జేసీ డా.బి.నవ్య తెలిపారు. నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాల్‌లో సోమవారం పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఒక పోలింగ్ స్టేషన్‌లో 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండాలన్నారు. ఆపై ఉన్న ఓటర్లను సమీపంలోని మరో పోలింగ్ కేంద్రంలోకి మార్చడం లేదా కొత్త కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం కల్లూరు మండలంలో 14, ఓర్వకల్లు మండలంలో 4, పాణ్యంలో 1 కేంద్రం పెరిగాయన్నారు. కళాశాలలు తెరిచినందున 18 సంవత్సరాలు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు నమోదు, చిరునామా మార్పులకు ఫారం-8 దరఖాస్తులను వినియోగించాలన్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ఓటర్లకు ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో కల్లూరు, ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం తహసీల్దార్లు ఆంజనేయులు, బీవీఎన్ విద్యాసాగర్, వెంకటరమణ, నరేంద్రనాథ్‌రెడ్డి, ఎలక్షన్ డీటీ అనురాధ, జనసేన పార్టీ నాయకుడు తోళ్ల మంజునాథ్, తెదేపా నాయకులు టి.చౌడయ్య, నాగేశ్వరరెడ్డి, సీపీఎం ప్రతినిధి జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాణ్యం ఈఆర్వో, జేసీ డా.నవ్య. చిత్రంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

సమస్యలు వేగంగా పరిష్కరించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ప్రజల సమస్యలను వేగంగా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్, జేసీ డా.బి.నవ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సీఎంవో గ్రీవెన్స్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా పరిష్కరించాలని చెప్పారు.

బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ నవ్య

పది రోజుల్లో బీఎల్వోలను నియమించాలి

ఇటీవల జరిగిన బదిలీల్లో చాలామంది బీఎల్వోలు బదిలీలు అయ్యారని కలెక్టర్ తెలిపారు. రానున్న పదిరోజుల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్వోలను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఈఆర్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఎస్ఎస్‌పీ ఉప కలెక్టర్ బీకే వెంకటేశ్వర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాచిగూడ- తిరుపతి ప్రత్యేక రైలు నేడు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీని తగ్గించడం కోసం మంగళవారం కాచిగూడ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి శ్రీధర్ సోమవారం తెలిపారు. 97676 నంబర్ గల ఈ రైలు కాచిగూడ నుంచి 23.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 12.30 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. ఈ రైలు జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు నగరం, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగుల వివరాలు నమోదు చేసుకోండి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా చిన్నతరహా పరిశ్రమలు, కర్మాగారాల వారు ఉద్యోగుల వివరాలను ఈఎస్ఐ కింద నమోదు చేసుకోవాలని ఈఎస్ఐ కర్నూలు బ్రాంచి మేనేజర్ దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. పదిమంది ఆపై ఉద్యోగులతో నిర్వహించే చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, కర్మాగారాలు ఎస్‌పీఆర్ఈఈ పథకం ద్వారా ఈఎస్ఐ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 1 నుంచి డిసెంబరు 31 వరకు రిజిస్ట్రేషన్లు చేసుకొనేందుకు అవకాశం ఉందన్నారు. వివరాలకు 8247055204 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ఈగల్ ఐజీ రవికృష్ణ రాక రేపు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఈగల్ విభాగాధిపతి, ఐజీ ఆకె రవి కృష్ణ బుధవారం కర్నూలుకు రానున్నట్లు తెలిసింది. స్థానిక బీక్యాంపులోని ఓ కళాశాలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై విద్యార్థులకు నిర్వహించే అవగాహన సదస్సులో ఆయన పాల్గొంటారని, తర్వాత దేవనకొండ మండలం కప్పట్రాళ్లకు వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచారం.

డిప్యూటీ ఎంపీడీవోలకు స్థానాల కేటాయింపు

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే : జిల్లాలో డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన వారికి స్థానాలు కేటాయిస్తూ డీపీవో భాస్కర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జేమ్స్‌కృపావరంను కర్నూలు గ్రామీణ, ఎ.నాగరాజును చిప్పగిరి, విజయలక్ష్మిని మద్దికెర, మహేశ్వరిని సి.బెళగల్, పి.గోపాల్‌ను దేవనకొండ, జీఎంఎ కిశోర్‌కుమార్‌ను కోడుమూరు, కె.నాగరాజును హాలహర్విలో నియమించారు.

22,278 టన్నుల ఎరువులు అవసరం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జులై నెలలో 25,080 మెట్రిక్ టన్నుల ఎరువుల కేటాయింపులు చేయగా.. ఇప్పటి వరకు 2,801 టన్నులు వచ్చాయని జిల్లా ఇన్‌ఛార్జి వ్యవసాయశాఖ అధికారిణి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. మరో 22,278 టన్నుల ఎరువులు రావాల్సి ఉందని సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈనెలకు సంబంధించి యూరియా 9,500 టన్నులు అవసరం కాగా వారం రోజులైనా ఒక టన్ను కూడా రాలేదన్నారు. డీఏపీ 4,250, ఎంవోపీ 500, మిశ్రమ ఎరువులు 8,028 టన్నులు ఆయా కంపెనీల నుంచి రావాల్సి ఉందన్నారు. రానున్న 3- 4 రోజుల్లో 1,896 టన్నుల యూరియా కోరమండల్, ఆర్సీఎఫ్ కంపెనీల నుంచి రానుందని వెల్లడించారు. డీలర్లు ఎవరైనా యూరియా, ఇతర ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, ఇతర అనుబంధ ఎరువులు, పురుగు మందులు కొంటేనే ఎరువులు ఇస్తామని మెలికపెట్టినా కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు.

THE DISTRICT CO-OPERATIVE CENTRAL BANK LTD.
Door No. 46-1-C, Budhawarpeta, Opp: Govt. Regional Eye Hospital, KURNOOL-518002.
E-Mail: ceokrnl@apcob.org. Fax No. 08518-255510
Telephone No. (STD CODE No: 08518) 255342, 255730, 649414,
RBI License No. RPCD.Co-Op(H). 18/05.08. 01/2011-12

DCC BANK KURNOOL · 2025 International Year of Cooperatives

ది జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి.,
ఇంటి నెం. 46-I-సి, బుధవారపేట, ప్రభుత్వ కంటి హాస్పిటల్ ఎదురుగా, కర్నూలు-518 002.

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘముల సభ్యులకు విజ్ఞప్తి

PACS కంప్యూటరీకరణ జరిగినందున ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘముల ద్వారా ఋణములు పొందిన ఋణగ్రస్తులు ఋణము తిరిగి చెల్లించినప్పుడు, సహకార సంఘములో System Generate చేసిన రశీదు నందు సంఘ ముఖ్యకార్యనిర్వహణాధికారి సంతకము, సీల్ వేసిన తదుపరి మాత్రమే రశీదును తీసుకోవలసినదిగా సూచించడమైనది. System Generate చేసిన రశీదు మాత్రమే చెల్లుబాటౌతుంది. మాన్యువల్‌గా జారీ చేసిన రశీదు చెల్లుబాటుకాదని తెలియజేయడమైనది.

సం/- పి.రామాంజనేయులు, ముఖ్యకార్యనిర్వహణాధికారి, డి.సి.సి. బ్యాంకు లిమిటెడ్, కర్నూలు.

తాగునీటి చెంత.. మురుగు చింత

ఎమ్మిగనూరు మండలంలోని కందనాతిలో జలజీవన్ మిషన్ కింద రూ.8లక్షలతో తాగునీరు సరఫరా చేసే సంపు ఏర్పాటు చేశారు. ట్యాంకు వద్ద మురుగు నీరు నిలిచి అపరిశుభ్రంగా మారింది. ట్యాంకు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

కదలని కార్యదర్శులు

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే : గ్రామ సచివాలయాల్లోని గ్రేడ్-5, 6 పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ పూర్తయి.. నియామక పత్రాలు జారీ చేసినా కొందరు ఉద్యోగులు మొండికేస్తున్నారు. కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయానికి చేరుకుని తమ స్థానాలను తిరిగి మార్చాలని కోరుతున్నారు. సిఫార్సు లేఖలు తెచ్చినా ప్రయోజనం లేదని పేర్కొంటున్నారు. జిల్లాలో 37 మంది గ్రేడ్-5, 232 మంది గ్రేడ్-6 కార్యదర్శులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో చాలామంది సోమవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. డీపీవో భాస్కర్ బీజీగా ఉన్నప్పటికీ ఉదయం నుంచి రాత్రి వరకు డీపీవో కార్యాలయం వద్దే వేచి చూశారు. కార్యాలయానికి వస్తే ఎదురయ్యే ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని డీపీవో వెళ్లిపోయారు. ఓ ఎమ్మెల్యే వచ్చారని తెలుసుకుని హడావుడిగా కార్యాలయం చేరుకున్నారు. అప్పటికే ఎదురు చూస్తున్న గ్రేడ్-5, 6 ఉద్యోగులు ఒక్కసారిగా డీపీవో ఛాంబరు వద్ద బారులుతీరారు. తమ అభ్యర్థనలు విన్నవించేందుకు పోటీపడ్డారు. నిబంధనల మేరకు బదిలీలు చేశామని, స్థానాల మార్పులు చేసే అవకాశం లేదని, ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడే పనిచేయాల్సి ఉంటుందని డీపీవో స్పష్టం చేశారు.

జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద గుమికూడిన కార్యదర్శులు

హత్య కేసులో అన్నదమ్ముల అరెస్టు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లెలో సంచలనం సృష్టించిన కురువ శేషన్న (63) హత్య కేసులో నిందితులను కర్నూలు తాలూకా, అర్బన్ పోలీసులు పట్టుకున్నారు. అదే గ్రామానికి చెందిన అన్నదమ్ములైన కురువ పరశురాముడు, కురువ విజయ్‌కుమార్, కురువ గోవిందు అలియాస్ చౌదరి, కురువ బీసన్నలు హత్యకు పాల్పడినట్లు తేల్చారు. నగరంలోని తన కార్యాలయంలో కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్ సోమవారం సీఐ శ్రీధర్, ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డిలతో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. కురువ శేషన్న లారీ డ్రైవర్‌గా పనిచేసేవారు. ఆయన కురువ పరశురాముడు భార్య పట్ల అవమానకరంగా మాట్లాడేవాడన్నారు. ఇది జీర్ణించుకోలేని పరశురాముడు ఈనెల 1న రాత్రి తన సోదరులతో కలిసి కుమార్తె ఇంట్లో నిద్రిస్తున్న శేషన్నపై దాడి చేశారు. అచేతన స్థితిలో ఉన్న అతని కుడి కాలును వేటకొడవళ్లతో మోకాలు వరకు నరికారు. తెగిన కాలును ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి కర్నూలు తాలుకా అర్బన్ పోలీసుస్టేషన్ సమీపంలోని ముళ్లపొదల్లో పడేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో శేషన్న మృతి చెందారు. హతుడి కుమార్తె శకుంతల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 6న వెంకన్న బావి వద్ద నలుగురిని అరెస్టు చేసి రెండు వేటకొడవళ్లు, రక్తం మరకలు అంటిన దుస్తులు, బైకును స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వివరించారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబూప్రసాద్, సీఐ శ్రీధర్, ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి

చికిత్స పొందుతూ మృతి

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ద్విచక్ర వాహన దారుడు చికిత్స పొందుతూ సోమవారం చోటుచేసుకుంది. అగ్రహారం గ్రామానికి చెందిన వీరేష్(30) గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన దాబా నిర్వహిస్తున్నారు. ఈనెల 4వ తేదీన దాబాకు కావాల్సిన సరకులు తీసుకుని ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. బళ్లారి నుంచి ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి వెళ్తున్న ఆటో ఆలూరు సమీపంలో మారెమ్మ ఆలయం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్, ద్విచక్ర వాహనదారుడు వీరేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వీరేష్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోనికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడు వీరేష్‌కు భార్య కవిత ఉన్నారు.

బాలికపై అత్యాచారం చేసిన ఆటోడ్రైవర్ అరెస్టు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ సరిహద్దులో ఓ బాలికపై అత్యాచారం చేసిన ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన ఆటోడ్రైవరు సంగిపోగు రమేశ్‌ను సోమవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ నల్లప్ప తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఆదోని ఆర్టీసీ బస్టాండులో ఉన్న ఓ బాలికను ఆటోడ్రైవరు రమేశ్ మాయమాటలు చెప్పి పట్టణ శివారున తీసుకెళ్లి అత్యాచారం చేసిన విషయం విదితమే. ఈ కేసులో నిందితుడు రమేశ్‌ను ఆదోని మండలం కడితోట క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండుకు తరలించారన్నారు. నిందితుడిని పట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్ జానీవాకర్, సిబ్బంది ఖాసీం, సురేశ్, కాశీలింగం, శ్రీనివాస్‌ను సీఐ అభినందించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

REAL ESTATE

HOUSE FOR SALE

JOBS

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే
ప్రకటనపై 5% GST అదనము
సంప్రదించండి 99899 97628

గమనిక

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

గ్రంథాలయాధికారిణి బదిలీ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తిలో పనిచేస్తూ గూడూరుకు బదిలీపై వెళ్లిన గ్రంథాలయాధికారిణి కవితబాయిని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. సమావేశంలో జడ్పీటీసీ సుంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి తోటమ్మ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు హరిసింహానాయుడు, వైద్యం రామనాయుడు, గఫూర్, శేక్షావలి, అమీర్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

ఆస్పరి, న్యూస్‌టుడే:ఆస్పరితో పాటు పలు గ్రామాల్లో మొహర్రం కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంతంగా నిర్వహించినందుకు గాను సీఐ మస్తాన్ వలీని ఆస్పరి వాసులు సన్మానించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో కేడీసీసీ మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, మాజీ తెదేపా మండల కన్వీనర్ ఎస్. తిమ్మన్న, మాజీ సొసైటీ ఛైర్మన్ నౌనేపాటిచౌదరి, నాయకులు సతీష్‌కుమార్, చంద్రశేఖర్, గఫూర్, ఆలీలు, ఆస్పరి గ్రామస్థులు, ముస్లిం సోదరులు సన్మానించారు.

పకడ్బందీగా సమావేశాలు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10వ తేదీన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదోని మండల విద్యాధికారులు శ్రీనివాసులు, భూపాల్ రెడ్డి అన్నారు. ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాల పేరెంట్స్ హాల్‌లో నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సమగ్ర విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర తదితర అంశాలపై వివరించారు.

ఏపీఎం బాధ్యతల స్వీకరణ

దేవనకొండ, న్యూస్‌టుడే: మండల డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎంగా వెంకటరామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఓర్వకల్లు మండలం నుంచి బదిలీపై వచ్చారు. పొదుపు మహిళలు సకాలంలో రుణాలు చెల్లించి పొదుపు సంఘాలను అభివృద్ధి చేసుకోవాలని, సీసీలు, బుక్‌కీపర్లు అవినీతికి పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇన్‌ఛార్జి ఏపీఎం నరసన్న, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మీ, సీసీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

హొళగుంద, న్యూస్‌టుడే: ఎరువులు, పురుగు మందులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హొళగుంద మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోక్‌దళ్ అన్నారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణదారుల ప్రైవేట్ డీలర్ అవుట్‌లెట్‌లను, యూరియా నిల్వల రికార్డులను సోమవారం తనిఖీ చేశారు. ఏఈవో విరుపాక్షి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో జడ్పీ అతిథి గృహం వెనుక భాగంలో విద్యుత్తు స్తంభం సంఖ్య 24-6కు వీధి దీపం వెలగడం లేదు. - రత్నకుమార్, ఆదోని

✔: పురపాలక విద్యుత్తు విభాగం సిబ్బందికి సూచించి, సమస్య పరిష్కరిస్తాం.
- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ?: ఆలూరులోని కోయనగర్ కాలనీలో 15 రోజులు గడిచినా తాగునీరు సరఫరా చేయలేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. - వీరేశ్వరి, కోయనగర్ కాలనీ, ఆలూరు

✔: తాగునీటి పైపులైన్ కొన్నిచోట్ల దెబ్బతింది. వాటికి మరమ్మతులు చేసిన వెంటనే తాగునీరు సరఫరా చేస్తాం.
- అరుణ, సర్పంచి ఆలూరు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోతిరాళ్ల గ్రామంలోని పలు వీధుల్లో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగటం లేదు. విషపురుగుల సంచారం ఎక్కువగా ఉంటోంది. - గ్రామస్థులు, కోతిరాళ్ల

✔: గ్రామంలో ఇటీవలే దీపాల ఏర్పాటు చేశాం. ఇంకా ఎక్కడెక్కడ అవసరమో గుర్తించి, ఏర్పాటు చేస్తాం.
- అంజనయ్య, సర్పంచి

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని ప్రధాన రహదారిలో సచివాలయం వద్ద వర్షం నీరు, మురుగు నిలుస్తోంది. - భీమలింగప్ప, మద్దికెర

✔: పరిశీలించి నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటాం. - శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

ఈ దారుల్లో ప్రయాణం.. తప్పదు సాహసం

సంతేకూడ్లూరు– పెద్దహరివాణం ప్రధాన రహదారిపై పడిన గుంతలు

సంతేకూడ్లూరు(ఆదోని నేరవార్తలు), న్యూస్‌టుడే: ఆదోని మండలం సంతేకూడ్లూరు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. తారు చెదిరిపోయింది. వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిహద్దు కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప ప్రాంతం నుంచి రోజూ వేలాది వాహనాలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఆదోని మండలం సంతేకూడ్లూరు నుంచి పెద్దహరివాణంకు వెళ్లే ప్రధాన రహదారిలో ఎక్కడ చూసినా పెద్దపెద్ద గుంతలు పడి వాహన చోదకులకు ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయంలో ఈ గుంతలు కానరాక పలువురు వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలు పడిన రహదారిని మరమ్మతు చేసి ప్రమాదాలు నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అవును ఇది జాతీయ రహదారే..

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరు పట్టణంలోని జాతీయ రహదారి గుంతలమయంగా మారింది. హాలహర్వి మండలం చింతకుంట నుంచి ఆలూరు మీదుగా ఆదోని వరకు జాతీయ రహదారి వేశారు. ఆలూరు పట్టణంలో కొంత దూరం వరకు రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గం మీదుగా ఆదోని, కర్నూలు, బళ్లారి, గుంతకల్లు వంటి ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ప్రధానంగా ఎక్సైజ్ కార్యాలయం వద్ద రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో గుంతను గమనించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి ఇబ్బందులు లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

రహదారిపై గుంతలు

రాళ్లే.. సూచికలు

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి మండల కేంద్రం శివారులోని చత్రగుడి నుంచి ఆంధ్ర సరిహద్దు వరకు 3 కి.మీ. రహదారి గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. రహదారి మధ్యలో ఓ పెద్ద గుంత పడటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో కొందరు స్థానికులు స్పందించి గుంత వైపు వాహనాలు రాకుండా ఉండేందుకు రాళ్లు ఏర్పాటు చేశారు. భారీ వాహనాలకు రాళ్లు సైతం గుంతలో పడ్డాయి. దీంతో ఈ రహదారి మరింత ప్రమాదకరంగా మారింది. నిత్యం ఒకటో, రెండు ప్రమాదాలు జరుగుతున్న అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం కనిపించడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

గుంతలో వేసిన రాళ్లు

ఫిజియోథెరపి సేవలు పునఃప్రారంభం

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరులోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపి సేవలు పునఃప్రారంభమైనట్లు మండల విద్యాధికారిణి కోమలాదేవి తెలిపారు. ప్రతి సోమవారం ఇక్కడ 18 సంవత్సరాల లోపు మానసిక వైకల్యం, మెదడు పక్షవాతం, శారీరక వైకల్యం ఉన్న వారికి ఫిజియోథెరపి నిర్వహిస్తామన్నారు. భవిత కేంద్ర ఉపాధ్యాయుడు రామదాసు, ఫిజియోథెరపిస్ట్ సోమశేఖర్ మాట్లాడారు.

రాజకీయ హక్కుల సాధనకు పోరాటం

ఆదోని: జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆస్పరి: బిల్లేకల్లు గ్రామంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుభాష్‌చంద్ర, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కృష్ణ

సామాజిక న్యాయం, రాజకీయ హక్కుల సాధనకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఎనలేని పోరాటం చేశారని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఆ పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. మండలాల్లో జెండాను ఆవిష్కరించారు. ఆస్పరి మండలంలో ఎమ్మార్పీఎస్ జెండాను జిల్లా అధ్యక్షుడు సుభాష్‌చంద్ర, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు.
– న్యూస్‌టుడే, బృందం

కలుపుగోలుగా వజ్రాన్వేషకులు

విత్తులు వేసిన సమయంలో వజ్రాన్వేషణ చేయడం వల్ల మొలకలు దెబ్బతింటున్నాయని, పొలం గట్టిపడి దున్నేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో వజ్రాన్వేషకులు కొత్త ఎత్తుగడ ప్రదర్శిస్తున్నారు. పంట చేలల్లో వజ్రాన్వేషణ చేస్తున్నప్పుడు అటుగా వెళ్లే రైతులు ప్రశ్నిస్తే.. కలుపు తీస్తున్నామని బుకాయిస్తున్నారు. సొంత పొలం రైతులు వచ్చినప్పుడు ఆ పొలం గట్టు దాటి ఇతర పొలాల్లో వజ్రాన్వేషణ సాగిస్తున్నారు. వజ్రాల వేట మాత్రం వీడటం లేదని అన్నదాతలు అంటున్నారు. – న్యూస్‌టుడే, తుగ్గలి

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ

పత్తికొండ నియోజకవర్గంలోని మద్దికెర ఆదర్శ పాఠశాలకు మండలంలోని పలు గ్రామాల నుంచి విద్యార్థులు సైకిళ్లపై వస్తున్నారు. ఆవరణలో వాటికి ఎలాంటి రక్షణ లేకుండా పోతోంది. బొజ్జనాయునిపేట, యడవలి, అగ్రహారం తదితర గ్రామాల నుంచి సైకిళ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. ఆరు నుంచి ఇంటర్ వరకు చదివే వారి సంఖ్య 510 ఉన్నారు. వంద మంది స్థానిక వసతి గృహంలోనే ఉండగా.. 410 మంది ఇళ్ల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు సైకిళ్లు తెస్తున్నారు. వాటికి కనీసం నీడ కరవైంది. ఎండకు, వానకు తడుస్తూ.. తుప్పుపట్టిపోతున్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –న్యూస్‌టుడే, పత్తికొండ

రూ.లక్షల వ్యయం.. లక్ష్యానికి దూరం

మద్దికెరలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో గతంలో తెదేపా ప్రభుత్వం రూ. 80 లక్షలతో ఎస్సీ వసతి గృహ భవనం నిర్మించింది. 2015లో అప్పటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి భవనాన్ని ప్రారంభించారు. ఆపై కొన్నాళ్లకే మూతబడింది. జిల్లాలో ఆరు వసతి గృహాలను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థులకు శాపంగా మారింది. అప్పటి నుంచి భవనం నిరుపయోగంగా మారింది. కొందరు ఆకతాయిలు ఇక్కడే మద్యం తాగి, అపరిశుభ్రంగా మారుస్తున్నారు. గదుల్లోని విద్యుత్తు తీగలు, ఇతర పరికరాలు చోరీకి గురయ్యారు. తలుపులు కూడా మాయమయ్యాయి. –న్యూస్‌టుడే, మద్దికెర

సంక్షిప్త సమాచారం

అమకతాడు(కృష్ణగిరి), న్యూస్‌టుడే: ఈ నెల 9న దేశవ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని డోన్ సీఐటీయూ అధ్యక్షుడు టి. శివరాం అన్నారు. సోమవారం అమకతాడు టోల్ ప్లాజా ఎంప్లాయిస్, వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాజు, కోశాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో ప్రధాన రహదారులపై గోవులు, పశువులను వదిలేస్తే, వాటిని గో శాలకు తరలిస్తామని పురపాలక కమిషనర్ కృష్ణ సోమవారం తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలోని అన్న క్యాంటిన్‌ను సోమవారం ఉదయం అల్పాహార సమయంలో పురపాలక కమిషనర్ కృష్ణ పరిశీలించారు. అక్కడి వచ్చిన వారితో కమిషనర్ మాట్లాడారు. క్యాంటిన్ ఆకలి తీరుస్తోందని జనం తెలిపారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో చిన్న వ్యాపారుల నుంచి వసూలు చేస్తున్న సుంకం రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ అన్నారు. సుమారు 500 కుటుంబాలు చిరు వ్యాపారం చేస్తూ.. జీవనం సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో చిన్న వ్యాపారుల సంఘం నాయకులు రామాంజనేయులు, అనిల్, బాషా, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం గౌళిపేట అంబాభవాని ఆలయంలో వెలసిన శ్రీరుక్మిణి పాండురంగస్వామి సన్నిధిలో సోమవారం ఉదయం ఆషాఢ మాసం ద్వాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి తెల్లవారుజామున కాకడహారతి, పంచామృతాభిషేకం, పుష్పార్చన నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆరు పథకాలతో ప్రతి ఇంట సంతోషం

పథకాల గురించి వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, పరిశీలకుడు ధర్మవరం సుబ్బారెడ్డి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి ఇంట సంతోషం నింపారని ఆదోని తెదేపా బాధ్యుడు మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, పరిశీలకుడు ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదోని పట్టణంలోని దివాకర్‌రెడ్డి నగర్‌లో తెదేపా ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. వైకాపా నాయకులు కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని.. ఏడాదిలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి వారి కళ్లకు కనిపించలేదా.. అని ప్రశ్నించారు. తెదేపా నాయకులు గుడిసె కృష్ణమ్మ, రామస్వామి, వార్డు ఇన్‌ఛార్జి శ్రీనివాస ఆచారి, ఫకృద్దీన్, బుద్దారెడ్డి, తిమ్మప్ప, అయ్యన్న, భూపాల్‌చౌదరి, వెంకటేశ్‌చౌదరి, రామకృష్ణ, అప్సర్ బాషా, నీలకంఠప్ప, చాంద్‌బాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

విభేదాలు లేవు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: తెదేపాకు సంబంధించి ఆదోని నియోజకవర్గంలో నాయకుల మధ్య ఎలాంటి తగాదాలు.. విభేదాలు లేవని ఆదోని తెదేపా బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు అన్నారు. ఆదోనిలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఆదోని పరిశీలకుడు ధర్మవరం సుబ్బారెడ్డి తెదేపా నాయకులందరినీ కలిపి పార్టీ కోసం పని చేయాలని సూచించారన్నారు. తెదేపా చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ఆదోని నాయకులంతా కలిసికట్టుగా ఓ కుటుంబంలా ఇల్లిల్లూ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకుడు ధర్మవరం సుబ్బారెడ్డి, తెదేపా నాయకులు గుడిసె కృష్ణమ్మ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలు రద్దు చేయాలి

ఆదోని పట్టణంలో ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండు చేస్తూ.. ఈ నెల 9వ తేదీన చేపట్టనున్న కార్మిక సంఘాల జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం ఆదోని పట్టణంలో కార్మిక సంఘాలు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప మాట్లాడుతూ.. సమ్మె కార్యక్రమానికి ఉద్యోగ, కార్మికులు, కర్షకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పాలన, సంక్షేమం చంద్రబాబుకు రెండు కళ్లు

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తదితరులు

తుగ్గలి, న్యూస్‌టుడే: సుపరిపాలనా, ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రెండు కళ్లలాంటివని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. కడమకుంట్ల గ్రామంలో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలకు సుపరిపాలన ఇవ్వడం పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వంలో బాబు పాలన ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను తెదేపా నాయకులు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, మనోహర్‌చౌదరి, వెంకటస్వామి, తిరుపాల్‌నాయుడు, పక్కీరప్ప, సుధాకర్, ఏకాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన అవసరం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదోని రెండో పట్టణ సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదోని రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో సోమవారం సచివాలయ మహిళా పోలీసులతో సీఐ సమీక్ష సమావేశం నిర్వహించారు. మహిళలు, యువతులకు ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసులకు సమాచారం అందించేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. వార్డుల్లో సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు వివరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

వృద్ధుడిపై దాడి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని మండలం నెట్టేకల్లు గ్రామంలో సోమవారం జరిగిన ఘర్షణలో గ్రామానికి చెందిన పెద్దదస్తగిరి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పొలం విషయంలో తన తండ్రి పెద్దదస్తగిరిపై గ్రామానికి చెందిన రామాంజిని(చిట్టి), తాయప్ప మరికొందరు కలిసి దాడి చేశారని బాధితుడు కుమారుడు హుసేని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఢీకొని ఐదుగురికి గాయాలు

ఆర్.మండగిరి(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆర్. మండగిరి గ్రామానికి వెళ్లే రహదారిలో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. మండగిరి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు సాయి, అజయ్, చింటూ ద్విచక్రవాహనంపై పత్తికొండ వైపు వెళ్తుండగా, పత్తికొండ నుంచి జే. అగ్రహారం వైపు వెళ్తున్న రామన్న, గోవిందు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం పరస్పరం ఢీకొన్నాయి. పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

పాముకాటుతో బాలుడికి తీవ్ర అస్వస్థత

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: చిన్న పెండేకల్లు గ్రామానికి చెందిన బాలుడు దుర్గాప్రసాద్ సోమవారం తెల్లవారుజామున ఇంట్లో పడుకొని ఉండగా పాము కాటు వేసింది. తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలుకు తరలించారు.

ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించండి

ఆదోని సబ్ కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న అర్జీదారులు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు పెట్టుకున్న అర్జీలను సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా.. త్వరగా పరిష్కరించేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కార్యక్రమం జరిగింది. సంబంధిత శాఖ అధికారులు జాప్యం చేయకుండా వేగంగా పరిష్కరించాలన్నారు. పలువురు వ్యక్తిగత సమస్యలపై అర్జీలు సమర్పించారు.

● ఆదోని మండలం ఢణాపురం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. బారికేడ్లు ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు ఉదయ, ప్రదీప్ వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో బాలకృష్ణారెడ్డి, డీఎల్‌పీవో తిమ్మక్క, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయరు వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఆర్టీసీ డీఎం మహమ్మద్ రఫిక్, వ్యవసాయ శాఖ ఏడీ బాలవర్ధిరాజు, పరిపాలన అధికారిణిరమాదేవి, ఉప తహసీల్దారు బాబు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సత్యవతి, ఉప తహసీల్దారు రుద్రగౌడు పాల్గొన్నారు.

విద్యార్థుల బకాయిలు చెల్లించాలని ధర్నా

ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండు చేస్తూ.. ఆదోని పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు సోమవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాబీర్‌బాషా మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, వసతి దీవెన బకాయిలు చెల్లించాలని డిమాండు చేశారు. నాయకులు దస్తగిరి, మోహన్, శివ, దేవేంద్ర, వీరేశ్, రాజశేఖర్, అంజి, నిసాద్, ఫాతిమా, తబుసుమ్, వైశాలి పాల్గొన్నారు.

వీధి దీపం రంగు మారుతోంది



వీధి దీపం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో వీధి దీపాలు రంగు మారుతున్నాయి. సహజ వెలుతురు కనుమరుగై.. పసుపు వర్ణంలో వెలుగుతున్నాయి. పట్టణ వ్యాప్తంగా తొమ్మిది వేల దాకా ఎల్ఈడీ దీపాలున్నాయి. 2014 తెదేపా ప్రభుత్వం పాత వీధి దీపాల విధానానికి స్వస్తి పలికి ఎల్ఈడీ దీపాలను తెరపైకి తెచ్చింది. ఇందుకు ఈఈఎస్ఎల్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. 2019 తెదేపా పాలన ఉన్నంత వరకు వీధి దీపాల నిర్వహణ సవ్యంగా సాగింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటి నిర్వహణపై నిర్లక్ష్యం వహించింది. కాలపరిమితి తీరిపోవడంతో సహజకంగా రంగు మారి వెలుతురు సన్నగిల్లుతోంది.

రూ.లక్షలు అవసరం

సహజంగా ఎల్ఈడీ దీపాల్లో వెలుతురు తగ్గి, రంగు మారేదుకు కారణం.. ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు పాడవడమే కారణమని చెబుతున్నారు. దీని వల్ల పసుపు రంగులో వెలుగుతూంటాయని చెబుతున్నారు. వీటి స్థానంలో కొత్త ప్రింటెడ్ బోర్డులు ఏర్పాటు చేస్తే సహజ వెలుతురుతో వెలుగుతాయంటున్నారు. ఇలా 1100 దీపాల వరకు మార్చాలని భావిస్తున్నారు. ఇందులో 240-200, 120-20, 70-80, 40-50, 20-500, 18 వాట్స్ 150 దీపాలకు బోర్డులు మార్చాలని భావిస్తున్నారు. ఇందుకు రూ. 6. 50 లక్షలు అవసరమని లెక్కకట్టారు. వీటిని సాధారణ నిధుల నుంచి వ్యయం చేయాలని నిర్ణయించారు.

శివారు కాలనీల్లో వీడని చీకట్లు

ఆదోని పట్టణంలో జనాభాతో పాటు నివాసాల సంఖ్య పెరుగుతోంది. వీధి దీపాల అవసరమూ రెట్టింపైంది. సుమారు రెండు వేల దీపాల దాకా అవసరం ఉంది. మహాయోగి లక్ష్మమ్మ నగర్, సాయి నగర్, ఎస్కేడీ కాలనీ, ఆర్టీసీ కాలనీ పొడగింపు కాలనీలు, పైకొట్టాలు, రైల్వేస్టేషన్ రహదారి, శిరుగుప్ప కూడలి ప్రాంతం, కొండ శివారు ప్రాంతం ఇలా పలు ప్రాంతాల్లో దీపాలు అమర్చాల్సి ఉంది. దీంతో జనం చీకట్ల మధ్య రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

గుంతలు పూడ్చారు.. ఇబ్బందులు తీర్చారు

స్పందనకు వందనం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని నిర్మల్ థియేటర్ సమీపంలోని అన్న క్యాంటీన్ ఎదురుగా పెద్ద గుంత పడడంతో 'ఈనాడు'లో ఈ నెల 24న ప్రచురితమైన 'దారిలో గోతులు.. తప్పని ప్రమాదాలు' అనే కథనానికి అధికారులు స్పందించారు. రహదారిపై పడిన గుంతను సిమెంటు, కంకరవేసి పూడ్చేశారు.

మద్దికెర, న్యూస్‌టుడే: నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో మురుగు నిలిచిన గుంతలను పంచాయతీ అధికారులు సోమవారం పూడ్చివేశారు. కాలనీవాసుల సమస్యపై 'ఈనాడు'లో జూన్ 30న ప్రచురితమైన 'కాలనీలో మురుగు' కథనానికి పంచాయతీ సర్పంచి సుహాసిని, కార్యదర్శి శివకుమార్ స్పందించారు. వెంటనే మట్టి, రాళ్లు తరలించి గుంతలు పూడ్చారు. ఎంతో కాలంగా ఇక్కడ స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల స్పందనతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: హోసూరు ఎస్‌డబ్ల్యూ స్కూల్ ఎదుట రహదారిపై నిత్యం పారుతున్న మురుగును నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మురుగు సమస్యపై 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైన 'పాఠశాల ముందు పారుతున్న మురుగు' అనే కథనానికి అధికారులు స్పందించారు. పాఠశాల ముందున్న అపరిశుభ్రతను పంచాయతీ కార్యదర్శి మునిస్వామి పర్యవేక్షణలో సమస్య పరిష్కరించారు. మురుగు పారేందుకు తాత్కాలికంగా డ్రైనేజీ కాల్వను ఏర్పాటు చేశారు. ఆర్థిక సంఘం నిధులు వచ్చిన వెంటనే శాశ్వత ప్రాతిపదికన డ్రైనేజీ కాల్వను నిర్మిస్తామని కార్యదర్శి తెలిపారు.

మహారాజశ్రీ గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 154/2023

Between:
కె.ప్రవీణ్‌కుమార్. ... వాది
మరియు
తలారి రామాంజిని ... ప్రతివాది

To,
తలారి రామాంజిని S/o తలారి జానయ్య, R/o 1-23, హరిజన కాలనీ, తుర్వగల్ (Vill), ఆస్పరి (మం॥) - 518347, కర్నూలు జిల్లా. Cell: 8106770997.

ప్రతివాదికి దావా సమను

పై దావాను వాది దావాలో కనపరచిన ప్రామిసరీ నోటు బాకీ రాబట్టుకొనుటకు గాను దాఖలు చేసియున్నాడు. పై దావాను నీ యొక్క హాజరు కొరకు వాయిదా 11-07-2025 తేదీన చేయబడినది. కావున నీకేమైన అక్షేపణలు ఉన్న యెడల పై తేదీన ఉదయం 10-30 గం॥లకు పై కోర్టు నందు స్వతహాగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై తెలుపుకొనవచ్చును. లేని యెడల దావా నీ పరోక్షమందు తీర్మానం చేయబడును.

వాయిదా : 11-07-2025
(కోర్టువారి ఉత్తర్వు మేరకు)

ఇట్లు: మాదినేని రవిశంకర్, వాది తరపు అడ్వకేట్, గుంతకల్లు
సెల్ నెం. 9247832306

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

తాగునీటి సమస్య తీర్చేందుకు చర్యలు

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సోమప్ప నగర్‌లో తాగునీటి సమస్యను తీర్చేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం సోమప్ప నగర్‌లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ బీటీ నాయుడితో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేనేత ఉపాధి కోసం టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో ద్వాదశి పూజలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: ద్వాదశి పురస్కరించుకొని శ్రీమఠంలో అర్చకులు ద్వాదశి పూజలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామునే బృందావనానికి అర్చకులు నిర్మాల్యం, పంచామృతాభిషేకం నిర్వహించి, బంగారు కవచాలు, విశేష పూలతో అలంకరించి రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి హారతి ఇచ్చారు.

విశేష అలంకరణలో బృందావనం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఎమ్మిగనూరు గ్రామీణ 80085 73794 | కోసిగి 9550434095

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ?: గోనెగండ్ల గ్రామ పంచాయతీలోని శివారున ఉన్న ఇప్పరి, కురవ కాలనీల మధ్య విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రుల్లో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి. **- సత్య, గోనెగండ్ల.**

✔: కాలనీ వాసుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. త్వరలో విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- సతీష్, పంచాయతీ కార్యదర్శి, గోనెగండ్ల.**

కోసిగి: ?: కోసిగి మండల కేంద్రం ఆది ఆంధ్ర పాఠశాల ఎదుట ఉన్న కాలువల్లో మురుగు నీరు నిండి విద్యార్థులకు దుర్వాసన వస్తోంది. వెంటనే శుభ్రం చేయాలి. **-యల్లప్ప, కోసిగి**

✔: పారిశుద్ధ్య కార్మికులను పంపించి మురుగు తొలగిస్తాం. **- చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, కోసిగి**

తెదేపాతోనే అభివృద్ధి సాధ్యం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపాతోనే అభివృద్ధి సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. సోమ

ఎమ్మెల్యే దస్తగిరిని సన్మానిస్తున్న పట్టణ తెదేపా నాయకులు

వారం పట్టణంలోని సింగనగిరిలోని 7వ, 11వ వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

ప్రగతి పథంలో రాష్ట్రం

వగరూరు(మంత్రాలయం), న్యూస్‌టుడే: వైఎస్ జగన్ అరాచక పాలనలో అస్తవ్యస్తమైన రాష్ట్రాన్ని ఏడాదిలోనే అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని తెదేపా మంత్రాలయం నియోజకవర్గ బాధ్యుడు రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వగరూరు గ్రామంలో పర్యటించారు. మాధవరంలో రైతులకు రాయితీ మొక్కలను పంపిణీ చేశారు. సహకార సంఘం ఛైర్‌పర్సన్ రాఘమ్మ పాల్గొన్నారు.

బడి దూరమై.. చదువు భారమై

☛ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు రవాణా ఇబ్బందులు

సరైన రవాణా సౌకర్యం లేక ఆదర్శ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బడి సమయానికి బస్సు రాకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కొందరు విద్యార్థులు సైకిళ్లపై వస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినెలా ప్రైవేటు వాహనాలకు చెల్లించే మొత్తం భారంగా మారుతోందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం..

సైకిళ్లపై వెళ్తున్న విద్యార్థులు

బస్సులు లేక

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి గ్రామ శివారులోని ఆదర్శ పాఠశాలలో 580 మంది చదువుతున్నారు. ఇందులో 280 మంది విద్యార్థులు ఆటోల్లో వస్తున్నారు. రెండు నుంచి 12 కి.మీ. దూరంలో ఉన్న గ్రామాల నుంచి వందల మంది విద్యార్థులు ఆటోలు, ద్విచక్రవాహనాలపై బడికి వస్తున్నారు. ఉదయం 7 గంటలకే సింగరాజనహళ్లి నుంచి బస్సు రావడంతో దాన్ని అందుకోలేక పోతున్నారు.

గంట నిరీక్షించాల్సిందే..

పరిశీలన

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్ల మండలంలోని ఐరన్‌బండ, ఎన్నెకండ్ల గ్రామాల నుంచి ఆదర్శ, జడ్పీ ఉన్నత పాఠశాలలకు సుమారు 70 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయానికి బస్సు రాక బస్టాండు ప్రాంతంలో సుమారు గంట పాటు నిరీక్షిస్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చేరే లోపు చీకటి పడుతుందని, హోంవర్కు చేయలేకపోతున్నామని వాపోయారు.

కిక్కిరిసిన బస్సులో విద్యార్థుల అవస్థలు

నడిచి వెళ్తూ..

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరులోని ఆదర్శ పాఠశాల ఊరికి నాలుగు కిలోమీటర్ల దూరంలో పంట పొలాల్లో ఉంది. ఇందులో 612మంది విద్యార్థులు చదువుతున్నారు. సగం మంది బైన్‌దొడ్డి, కల్లపరి, ప్యాలకుర్తి, వెంకటగిరి, కొత్తూరు తదితర గ్రామాల నుంచి వస్తున్నారు. బస్సులు వేళకురాకపోవడంతో ఆటోలు, సైకిళ్లే దిక్కు. కొందరు రెండు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారు.

ప్రయాసతో ప్రయాణం

గూడూరు, గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు మండలంలోని ఆదర్శ పాఠశాలలో చదివే 530 మంది విద్యార్థులు ఇళ్ల నుంచి వస్తున్నారు. దాదాపు 60 మంది ఆర్టీసీ బస్సుల్లో, మిగతా విద్యార్థులు ఆటో, ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై బడికి వస్తున్నారు. ఆర్టీసీ పాసులు ఉన్నా సకాలంలో బస్సులు లేకపోవడంతో ఆటో ఛార్జీల భారం పడుతోంది.

ఆటోకే రూ.600 ఖర్చు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ పాఠశాలలో చదివే కల్లుకుంట, గంగులపాడు, రగిమాన్‌దొడ్డి, చిన్నకడబూరు, మేకడోన, నౌలేకల్, రంగాపురం, జాలవాడి, కంబళదిన్నె, చిన్నతుంబళం, బాపురం, తదితర గ్రామాల విద్యార్థులకు బస్సు సౌకర్యం లేదు. ఉన్న బస్సుల్లోనూ సీట్లు సరిపోక చాలా మంది విద్యార్థులు ఆటోల్లో ప్రమాదకరంగా వెళ్తున్నారు. కల్లుకుంట గ్రామం నుంచి అధిక సంఖ్యలో 70 మంది వరకు వస్తున్నారు. వీరంతా నెలకు రూ.600 చెల్లించి అద్దె ఆటోల్లోనే వెళ్తున్నారు.

← ఆటోపై కూర్చొని వెళ్తున్న విద్యార్థులు

సమ్మెను జయప్రదం చేయండి

కోసిగి, న్యూస్‌టుడే: పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్రంలోని భాజపా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని, దీన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు అన్నారు. కోసిగిలో సోమవారం మండల కార్యదర్శి రాముడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు అందజేయాలన్నారు. ఈనెల 9వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు వీరేష్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు లూసమ్మ, వెంకటమ్మ, సూజత తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు ఉన్నా.. నీరే లేదు

మండలంలోని కల్లుకుంట గ్రామ బీసీ కాలనీలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరు మోటారు కాలిపోయింది. దీంతో నీటిని నిల్వ చేసే మినీ ట్యాంకు ఖాళీగా మిగిలింది. ఈ సమస్య నెలకొని నెల రోజులు కావస్తున్నా పట్టించుకొనే నాథుడే లేరని గ్రామస్థులు వాపోతున్నారు. నీటి కోసం నిత్యం ఇతర కాలనీలను ఆశ్రయించే దుస్థితి ఉందని పేర్కొన్నారు. అక్కడి ప్రజలు తమకు నీటి కొరత వస్తుందని అభ్యంతరం చెబుతున్నారని వాపోతున్నారు. మోటారుకు మరమ్మతులు చేయించి నీటి ఎద్దడి తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కల్లుకుంట (పెద్దకడబూరు)

అదుపు తప్పితే ప్రమాదమే..

ఎమ్మిగనూరు-పత్తికొండ రహదారిలో గుడేకల్ ఉప విద్యుత్తు కేంద్రం వద్ద రహదారి వంద మీటర్ల మేర వర్షానికి కోసుకుపోయింది. రహదారి కోతకు గురై రెండు అడుగుల మేర గుంత ఏర్పడింది. ఈ రహదారిపై నిత్యం వెయ్యి వాహనాలకు పైగా రాకపోకలు సాగిస్తాయి. బెంగళూరు నుంచి మంత్రాలయానికి వెళ్లేందుకు దగ్గరి దారని భక్తులు వాహనాల్లో ఇక్కడి నుంచే వెళ్తారు. అసలే ఒక వరుస రహదారి.. వాహన చోదకులు ఏమరుపాటుగా వెళ్తే ప్రమాదాలు తప్పవు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. **–న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం**

బండరాళ్లే.. వారధి

మురుగు కాలువ తవ్వి వదిలేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయతీలోని పడమర బీసీ కాలనీలో పలు చోట్ల కల్వర్టులు లేవు. రూ.లక్షల ఖర్చుతో సీసీ దారులను నిర్మించిన అధికారులు రూ.వేల ఖర్చుతో పూర్తయ్యే కల్వర్టులు నిర్మించకపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు తాత్కాలికంగా కాల్వపై నాప బండరాళ్లు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో పలుమార్లు కోరినా పట్టించుకోలేదని.. కూటమి ప్రభుత్వం స్పందించి కల్వర్టులు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, గూడూరు**

అత్యవసరంలో అవస్థలే

గోనెగండ్లలో ఎస్టీబీ, బస్టాండు కూడళ్లలో శౌచాలయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 28 గ్రామాల ప్రజలు పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తారు. ఇక్కడ శౌచాలయాలు లేకపోవడంతో అత్యవసర సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు పన్నుల రూపంలో రూ.లక్షలు వసూలు చేస్తున్నా ఉచిత శౌచాలయాలు నిర్మించడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలు, ప్రయాణికుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, గోనెగండ్ల**

కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: పెద్దకడబూరులో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తూ రైతుల నుంచి సొమ్ము చేసుకొంటున్న వ్యవసాయ పరపతి సహకార సంఘం కార్యదర్శి మురళీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల నాయకుడు అంజినయ్య డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో రైతుల సమక్షంలో ధర్నా చేశారు. యూరియాను ఎమ్మిగనూరు మండలం బనవాసి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకొంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులను దోచుకుంటున్న వ్యాపారులు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో యూరియా కృత్రిమ కొరత సృష్టించి రైతులకు దోచుకుంటున్న ఎరువుల దుకాణాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కేసీ జబ్బార్ అన్నారు. సోమవారం యూరియా కొరతపై స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ యూరియా ఉన్నా కొందరు వ్యాపారులు లింకు, అధిక ధరకు విక్రయిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏడీఏ కార్యాలయం సహాయకుడు బాలిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు భాస్కర్‌యాదవ్, మాలిక్, హనుమంతు, తిమ్మగురుడు, రంగన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

క్షయ నిర్మూలనపై అవగాహన

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు ఆరోగ్య కేంద్రం పరిధిలోని పులకుర్తిలో సోమవారం వైద్య సిబ్బంది క్షయ నిర్మూలనపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వైద్యురాలు షఫియాబేగం, సీహెచ్‌వో శాంతకుమారి, ఎంపీహెచ్‌వో రామకృష్ణ, టీబీ పర్యవేక్షకులు

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మల్లికార్జున, మహేంద్రలు 33 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మోదీ, చంద్రబాబు సహకారంతోనే ఎస్సీ వర్గీకరణ

గూడూరు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ సాధనకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి చేసిన సహకారం మరవబోమని, వారి పాలనకు దళితుల సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ నాయకులు మణిరాజు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని పాత బస్టాండు కూడలిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు సోమవారం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ బుడ్డేంగిళి, తెదేపా నాయకులు సుందరాజు, పౌల్ పాల్గొన్నారు.

కౌతాళం, న్యూస్‌టుడే: కౌతాళం మండలంలోని ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలో బదినేహాల్, ఎరిగేరి, బాపురం, లింగాలదిన్నె గ్రామాల్లో జెండాను మండలాధ్యక్షుడు ఆనంద్ ఆవిష్కరించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని హెచ్. మురవణి గ్రామంలో మొహర్రం రోజున దళితుడిపై దాడి చేసిన నిందితులపై తక్షణమే కేసు నమోదు చేయాలంటూ జైభీం ఎమ్మార్పీఎస్ నాయకుడు చిక్కం జానయ్య సోమవారం స్టేషన్ ముందు బైఠాయించారు. గ్రామానికి చెందిన వెంకట్రాముడిపై వీరేశ్, లక్ష్మన్నలు దాడి చేశారని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేయాలంటూ ఏఎస్ఐకి వినతి పత్రం సమర్పించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి

నాగరాజుకు వినతి పత్రం అందజేస్తున్న మాధవస్వామి, మహిళలు

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో కోడుమూరు పట్టణానికి దూరంగా కొండ ప్రాంతాల్లో కేటాయించిన ఇళ్ల స్థలాలను పట్టణ సమీపంలో కేటాయించాలని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు బి.మాధవ స్వామి డిమాండు చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి సౌకర్యాలు లేని కొండ ప్రాంతాల్లో స్థలాలు కేటాయిస్తే పేదలు ఎలా ఇళ్లు నిర్మించుకుంటారని అన్నారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బి.లక్ష్మీదేవి, నీలావతి, ఫాతిమా, కోమలి, చేనేత మహిళ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు మనోధైర్యంతో ఉండాలి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బనవాసి బాలికల గురుకుల కళాశాలను సోమవారం మాజీ ఎంపీ, వైకాపా నియోజకవర్గ బాధ్యురాలు బుట్టా రేణుక సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి మనోధైర్యంగా ఉండాలని చెప్పారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థిని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తల్లిదండ్రులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

సామాజిక తనిఖీ వివరాల వెల్లడి

పలుకుదొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని పలుకుదొడ్డి గ్రామంలో సోమవారం సర్పంచి నాగమ్మ అధ్యక్షతన ఉపాధి పనుల సామాజిక తనిఖీ వివరాలు వెల్లడించారు. పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో డీఆర్పీ మనోజ్‌కుమార్ వివరాలు చదివారు. రైతు వెంకటేశ్వర్లుకు 235 కొబ్బరి మొక్కలు ఇచ్చి సాగు చేసినా.. ప్రస్తుతం సామాజిక తనిఖీలో 60మొక్కలు దర్శనమిస్తున్నాయి.

ఫీజు బకాయిలు చెల్లించాలని నిరసన

గోనెగండ్ల, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, తాలూకా నాయకుడు మునిస్వామి డిమాండ్ చేశారు. సోమవారం గోనెగండ్లలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

కోడుమూరు గ్రామీణం, నందవరం, సి.బెళగల్, గోనెగండ్ల, కౌతాళం, గూడూరు గ్రామీణం, ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: త్యాగానికి ప్రతీక అయిన మొహర్రంను కులమతాలకతీతంగా జరుపుకున్నారు. అన్ని మండలాల్లోని గ్రామాలు, పట్టణాల్లో సోమవారం వేకువజామున మసీదుల ఎదుట ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో పీర్ల స్వాములతో భక్తులు అగ్నిగుండంలో నడిచి త్యాగాన్ని చాటిచెప్పారు. పీర్లను పురవీధుల్లో ఊరేగించారు. పీర్ల నిమజ్జనంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సి.బెళగల్‌లో పీర్లను నిమజ్జనం చేసి పీర్లచావిడిలకు చేరారు.

కోడుమూరులో నిమజ్జనానికి తరలిస్తున్న పీర్లు

హాల్వి: గ్రామంలో తరలివెళ్తూ..

సంక్షిప్త సమాచారం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బనవాసి బాలికల గురుకుల కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులకు సోమవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తరపున తెదేపా నాయకులు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ప్రధాన పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వీరేశ్, తెదేపా జిల్లా మహిళా కార్యదర్శి శశిరేఖ, విద్యాకమిటీ ఛైర్మన్ హనుమంతు ఆధ్వర్యంలో కిట్లను విద్యార్థులకు అందించారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ఆదర్శ పాఠశాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించాలంటూ తల్లిదండ్రులు కల్లుకుంట గ్రామ సర్పంచి ఇస్మాయిల్‌ను కోరారు.

గూడూరు, న్యూస్‌టుడే: సుంకేశుల జలాశయానికి సోమవారం నాటికి ఎగువ నుంచి 57 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు జలాశయ ఇంజినీరు మహేంద్ర రెడ్డి తెలిపారు. జలాశయం నిండుగా ఉండటంతో 15 గేట్లు మీటరు ఎత్తు తెరచి నది దిగువకు 59,310 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్రంలో ప్రధాని మోదీ పాలనలో పేదల సంక్షేమం, అభివృద్ధికి పలు పథకాలు ప్రవేశపెట్టారని కౌన్సిలరు దయాసాగర్, నాయకుడు లలిత్‌కుమార్‌జైన్ అన్నారు. పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మికుల వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు కరుణాకర్, నబిరసూల్ డిమాండ్ చేశారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 10వ తేదీన నిర్వహించే తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాన్ని పండగలా చేయాలని మండల విద్యాధికారిణి వసంతలక్ష్మి పిలుపునిచ్చారు.

సి.బెళగల్ ,న్యూస్‌టుడే: మండలంలోని 8 చెరువుల కింద సాగు చేసిన రైతులను గుర్తించి నీటి తీరువా పన్నును వసూలు చేయాలని తహసీల్దారు వెంకటలక్ష్మి పేర్కొన్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సీపీఐ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అధ్యక్షతన మండల కమిటీలో 19, పట్టణ కమిటీలో 17మందిని ఎంపిక చేశారు. మండల, పట్టణ కార్యదర్శులుగా రాజు, శేషఫణిలను ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి తెలిపారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తగొల్లదొడ్డిలో ఆదివారం జరిగిన మొహర్రం సందర్భంగా గ్రామానికి చెందిన బోయ ముసలప్ప, దుబ్బ వీరేశ్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా.. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: వినుకొండ కొత్తపేటకు చెందిన ఆంజినేయులు శ్రీమఠంకు రూ.1.12 లక్షలు విలువ చేసే వెండిని విరాళంగా అందజేసినట్లు మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ప్రజలు సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వెంకటేష్ నాయక్ తెలిపారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నగరపంచాయతీలోని భువనేశ్వరి నీలకంఠేశ్వర ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

సి.బెళగల్ ,న్యూస్‌టుడే: ప్రతి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంఈవో జ్యోతి పేర్కొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ హెచ్చరించారు. పట్టణంలోని ఎరువులు దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలానికి 220 టన్నుల యూరియా విడుదలైందని మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ తెలిపారు. ప్రతి రైతు సేవకేంద్రంలో యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. ప్యాలకుర్తి, పులకుర్తి, వర్కూరు, లద్దగిరిలకు 25టన్నుల చొప్పున, గోరంట్ల, కోడుమూరు, ముడుమలగుర్తి, అనుగొండ, అమడగుంట్లలకు 20టన్నుల చొప్పున, ఎర్రదొడ్డికి 15 క్వింటాళ్ల యూరియా మంజూరైందని.. ఇప్పటికే కొన్ని సేవ కేంద్రాలకు చేరిందన్నారు.

బిల్లులను తనిఖీ చేస్తున్న ఎంఏవో

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు మండలంలోని రైతులకు యూరియా కొరత లేకుండా చూస్తామని మండల వ్యవసాయ అధికారి దస్తగిరి రెడ్డి తెలిపారు. సోమవారం కేడీసీఎంఎస్ ఎరువుల స్టాక్ పాయింట్‌ను, నిల్వలను తనిఖీ చేశారు.

మంత్రాలయ, న్యూస్‌టుడే: దుకాణాలలో ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి జీరా గణేశ్ దుకాణదారులకు సూచించారు. మాలపల్లి గ్రామంలో ఎరువుల రికార్డులను పరిశీలించారు.

సి.బెళగల్ , న్యూస్‌టుడే: మండలంలో అన్ని గ్రామాల్లో ఎరువుల దుకాణాలను ఏవో మల్లేష్ కుమార్ తనిఖీ చేశారు. 150టన్నుల యూరియా అందుబాటులో ఉండేట్లు చర్యలు చేపట్టామన్నారు.

ప్రభ తగ్గిన ప్రదర్శన క్షేత్రం

☛ సీడ్ వరి విత్తనానికే పరిమితం

సీడ్ వరి పంటను కోత కోస్తూ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో వస్తున్న మార్పులను రైతులకు చేరువ చేసేందుకు, అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రాజెక్టు అభివృద్ధి ప్రదర్శన క్షేత్రం ప్రస్తుతం నామమాత్రంగా మిగిలిపోయింది. ప్రస్తుతం సీడ్ వరి విత్తనం మాత్రమే పండిస్తున్నారు. దశాబ్దాల క్రితం ఇక్కడ నిర్వహించే కార్యక్రమాలకు అనుగుణంగా వ్యవసాయాధికారులు, సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం అక్కడ ఉన్న అధికారులను అవసరమైన చోట వినియోగించుకుంటే రైతులకు మేలు చేకూరుతుందనే వాదన వినిపిస్తోంది.

ఉద్యాన పంటలపై అవగాహన

ఎమ్మిగనూరు వద్ద మంత్రాలయం రహదారిలో 1959లో ప్రాజెక్టు అభివృద్ధి ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేశారు. జిల్లాలోని రైతులకు నెల, రెండు నెలల శిక్షణతో పాటు ఫారంలోనే ఉండేందుకు వసతిగృహం నిర్వహించేవారు. ఉద్యాన పంటల్లో ఉత్పాదకతను పెంచేందుకు మామిడి, జామ వంటి పండ్ల తోటల్లో అంటుకట్టు విధానం వంటి వాటిపై రైతులకు శిక్షణ ఇచ్చేవారు. ఇవన్నీ ఇప్పుడు కనుమరుగై సీడ్ వరి విత్తనానికి పరిమితమైంది. అయితే దశాబ్దాల కిందట ఉన్న అధికారులను, సిబ్బందిని అలానే కొనసాగిస్తుండటం గమనార్హం. ప్రస్తుతం డీడీ, నలుగురు ఏవోలు, జూనియర్ సహాయకుడు, స్వీపర్, వాచ్‌మన్ పని చేస్తున్నారు. ఏడీఏ, ఇతర సహాయకులు, టైపిస్టు, అటెండర్ డిప్యూటేషన్‌పై వెళ్లారు.

57 ఎకరాలు పండించేందుకు 8 మంది

ప్రాజెక్టు అభివృద్ధి ప్రదర్శన క్షేత్రం 57 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సీడ్ వరి మాత్రమే సాగు చేస్తున్నారు. ఈ భూమికి తుంగభద్ర దిగువ కాల్వ ద్వారా కేవలం ఖరీఫ్‌లో మాత్రమే నీరందిస్తారు. సాధారణంగా 57ఎకరాలను ఓ రైతు నిర్వహిస్తూ పలు పంటలు పండిస్తాడు. ఇక్కడ మాత్రం 8 మంది ఉన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి అవసరమైన చోటికి వారిని కేటాయిస్తే పంట ఉత్పాదకతకు వారి సేవలు ఉపయోగపడతారని రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

గుండెపోటుతో యువ రైతు మృతి

నాగరాజు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మసీదుపురానికి చెందిన నాగరాజు(27) అనే యువ రైతు సోమవారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. సోమవారం ఇంట్లో ఛాతిలో నొప్పిగా ఉందని అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం ఎమ్మిగనూరులోని ప్రైవేట్ ఆసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

సి. బెళగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇసుక రీచ్‌ల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా టిప్పర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జగన్‌గౌడ్ డిమాండ్ చేశారు. సి.బెళగల్ మండల పరిధిలోని కె.శింగవరం ఇసుక రీచ్ వద్ద సోమవారం ఇసుక టిప్పర్ల యజమానులు నిరసన వ్యక్తం చేశారు.

(c) eenadu

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

వసతిగృహాల్లోని సమస్యలు చెప్పండి

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే : వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను చెబితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి వార్డన్లకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ సమీపంలోని బీసీ, ఎస్సీ, ఆనంద నిలయం వసతిగృహాలను సోమవారం న్యాయమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు, సౌకర్యాలు, పారిశుద్ధ్యం పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమైన సమస్యలు తెలుసుకున్నారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

కర్నూలు క్రీడలు(బి.క్యాంపు), న్యూస్‌టుడే : ఈనెల 5వ తేదీన నంద్యాలలోని నంది పైపుల బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు సత్తాచాటారు. వీఆర్ కాలనీకి చెందిన పెద్దిరెడ్డి కార్తీక్‌రెడ్డి అండర్-11లో, పెద్దిరెడ్డి హర్షకార్తికేయ అండర్-13 విభాగాల్లో డబుల్స్ విభాగంలో రజత పతకాలు అందుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408 ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : ?: గణేష్‌నగర్ కాలనీల్లో వీధిదీపాలు సరిగా వెలగడం లేదు. రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. - ప్రణీత్

✔: కల్లూరు చెన్నమ్మకూడలి సమీపంలో రహదారులపై పశువులు సంచరిస్తున్నాయి. - వినయ్

✔: సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం. - నగరపాలక అధికారులు

ఐరన్ ఓర్ లీజు రద్దు చేయాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి గ్రామ రైతులకు నష్టం కలిగించే ఐరన్ ఓర్ లీజును తక్షణమే రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. యాపర్లపాడు గ్రామంలో పుల్లగుమ్మి గ్రామస్థులు ఏళ్ల తరబడి భూములను సాగు చేస్తున్నారు. వారికి ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన భూముల్లో అధికారులు మైనింగ్ లీజులు ఇవ్వడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : ఓర్వకల్లులోని ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు 9వ తేదీన నిర్వహించే డెమో తరగతులకు హాజరుకావాలని కోరారు.

ఆదర్శ బోధన.. అందుకోవాలంటే వేదన

☛ ఉచిత బస్సు సదుపాయం లేక విద్యార్థుల అవస్థలు ☛ ఆటోల్లో, కాలినడకన చేరుకోవాల్సిన దైన్యం

నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. వీటిలో బోధన బాగుండటంతో ఏటా ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి. దీంతో విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతున్నాయి. ఇవి మండల కేంద్రాలకు దూరంగా ఉండటంతో బడికి వెళ్లిరావడం విద్యార్థులకు కష్టంగా మారింది. చాలాచోట్ల విద్యార్థి బస్సు సౌకర్యం లేకపోవడంతో పిల్లలు నడిచివెళ్లాల్సి వస్తోంది. మరికొందరు ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. దీనివల్ల ప్రతినెలా రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ఖర్చవుతోందని, అధికారులు స్పందించి ఉచిత రవాణా సదుపాయం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కర్నూలు విద్య, ఓర్వకల్లు

కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

బస్సులేక పెద్ద కష్టం

● కర్నూలు నగర శివారులోని పెద్దపాడు గ్రామంలో ఆదర్శ పాఠశాల ఉంది. ఇక్కడ 435 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో వందమంది బాలికలు వసతిగృహంలో ఉంటున్నారు. మిగతా 335 మంది రోజూ ఇళ్ల నుంచి వెళ్తున్నారు.

● ఈ పాఠశాలకు కల్లూరు పట్టణ పరిధిలోని కాలనీలతో పాటు కర్నూలు నగర శివారు కాలనీలు, ఎన్టీఆర్ బిల్డింగ్స్, పెద్దపాడు తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. వీరంతా రోజూ 5 నుంచి 7 కిలోమీటర్ల దూరం ప్రయాణించి బడికి చేరుకోవాల్సి వస్తోంది. సమీప ప్రాంతాల పిల్లలు నడిచివెళ్తున్నారు. దూరం ఉన్న వారు ఆటోల్లో చేరుకుంటున్నారు. షేర్ ఆటోల్లో ప్రయాణించే వారు ప్రధాన రహదారిపై దిగి పాఠశాల వరకు కిలోమీటరు దూరం నడిచి వెళ్లాల్సి వస్తోంది.

● ప్రధాన రహదారి నుంచి పాఠశాల వరకు ఉన్న కిలోమీటర్ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ దారిలో నడిచి వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థి బస్సు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పరిశీలన

అందరికీ ఆటోలే దిక్కు

● ఓర్వకల్లు మండలంలోని ఆదర్శ పాఠశాలకు పలు గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 680 మంది చదువుతున్నారు.

● కనమడకల, తిప్పాయిపల్లె, బ్రాహ్మణపల్లె, గుట్టపాడు, కొంతలపాడు, పూడిచర్ల, కేతవరం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. విద్యార్థి బస్సు లేక వీరంతా ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆటోలో వెళ్లిన పిల్లలు తిరిగి ఇల్లు చేరే వరకు తల్లిదండ్రులు ఆందోళనగా ఎదురు చూడాల్సి వస్తోంది.

ఆటోలో వచ్చిన విద్యార్థులు

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నగరంలో పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్యలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని డీ1 సెక్షన్ ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

20 రోజుల పాటు లైన్ల నిర్వహణ పనులు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నన్నూరు నుంచి ఏపీకార్బైడ్ పరిశ్రమ వరకు 220 కేవీ లైనుకు సంబంధించిన పాత తీగలను మార్చేందుకు మంగళవారం నుంచి 20 రోజుల పాటు పనులు చేయనున్నట్లు కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పనుల కారణంగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడే ఆస్కారముందని ఆయన వివరించారు.

లక్ష్మీనగర్‌లో ఉద్రిక్తత

కర్నూలు నేర విభాగం, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలోని లక్ష్మీనగర్‌లో సోమవారం ఇద్దరు మందుబాబుల నిర్వాకం వల్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇద్దరు పండ్ల వ్యాపారులు మద్యం తాగి ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడాన్ని గమనించిన స్థానికులు వారికి దేహశుద్ధి చేశారు. వారి తోపుడుబండ్లు, కారును ధ్వంసం చేశారు. దీనిపై బాలిక కుటుంబ సభ్యులు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

నంబరు మార్చరు.. అవినీతిని నిరోధించరు

వైకాపా ప్రభుత్వ హయాంలో అవినీతి నిరోధకశాఖ టోల్‌ఫ్రీ నంబరు 14400 ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని 1064గా మార్చారు. టోల్‌ఫ్రీ నంబరు మారి దాదాపు 11 మాసాలు దాటింది. అవినీతికి పాల్పడే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల గురించి 1064కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, కర్నూలు రేంజ్ అనిశా అధికారులు ప్రచారం చేస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో అధికారులు మాత్రం డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టుకు సంబంధించిన ప్రచార బోర్డుపై అనిశా టోల్‌ఫ్రీ నంబరు పాతదే ఉంచారు. ఎవరైనా లంచం అడిగితే 14400కు ఫోన్ చేయాలంటూ పాత నంబరునే ప్రదర్శిస్తుండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. - న్యూస్‌టుడే, కర్నూలు గాయత్రీఎస్టేట్

దారంతా చెత్త.. రాకపోకలకు వ్యథ

నగరంలోని ఇందిరాగాంధీనగర్ నుంచి కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లోని కూరగాయల మార్కెట్‌కు వెళ్లే ప్రధాన రహదారి చెత్తా చెదారంతో నిండిపోయింది. సగం రోడ్డుపై వ్యర్థాలు విస్తరించడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది రోడ్లను సరిగా శుభ్రం చేయడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులు ఫొటోలు తీసే వరకు పైపైన ఊడుస్తున్నారని.. వారు అటు వెళ్లగానే వీరు కూడా వెళ్లిపోతున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక అధికారులు స్పందించి నిత్యం రద్దీగా ఉండే మార్గంలో చెత్త పూర్తిగా తొలగించి శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

గోదారి.. వెళ్లేదెలా వాహనదారి

నగరంలోని కృష్ణానగర్ ఐటీసీ వద్ద జాతీయ రహదారి ప్లైఓవర్ కింద ప్రధాన రహదారిపై పశువుల సంచారం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నిత్యం ఆవులు మందలు రోడ్డుపైనే తిష్టవేస్తున్నాయి. నడిరోడ్డుపై వాహనాలకు అడ్డుగా నిల్చుంటున్నాయి. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో వీటి కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారినపడుతున్నారు. రహదారులపైకి ఆవులను వదలకుండా వాటి యజమానులపై నగరపాలక అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

వ్యర్థాలు పోగేసి.. దుర్గంధం మిగిల్చి

నగర పరిధిలోని కప్పల్‌నగర్‌లోని వీధుల్లో సేకరించిన చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది ఓ చోట పోగేస్తున్నారు. రహదారి పక్కనే కుప్పలుగా పేరుకుపోయిన చెత్తను సకాలంలో తొలగించడం లేదు. రోజుల తరబడి రహదారులపైనే వదిలేస్తున్నారు. వర్షాలకు వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. నగరంలో పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొన్నా నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలకసంస్థ


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నట్లు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గొందిపర్ల గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో పర్యటించి ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు వెంకటేష్, రామాంజనేయులు, జయన్న, మాజీ సర్పంచి సోమన్న, అంజన్న, నరసింహులు, ఉప సర్పంచి తిమ్మారెడ్డి, సూర్యచంద్ర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు

పందిపాడు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే : రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కల్లూరు పట్టణ పరిధిలోని పందిపాడులో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు తెదేపా మహిళా విభాగం అధ్యక్షురాలు పార్వతమ్మ, తెదేపా నాయకులు కూరపాటి దేవేంద్రరెడ్డి, శేఖర్‌చౌదరి, పూల శివ శంకర్, కురువ భీష్ముడు, లక్ష్మణయాదవ్, బోయ నాగరాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఆహార పదార్థాల్లో వాడే రంగులతో క్యాన్సర్ ముప్పు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : బిర్యానీ, గోబీ వంటి ఆహార పదార్థాల్లో వాడే రంగులు, పదే పదే కాచిన నూనెతో తయారు చేసే వంటలతో జీర్ణ సంబంధిత వ్యాధులతో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని ఆహార భద్రతాధికారి రాజగోపాల్ తెలిపారు. నగరంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో కేవీజీవీఎం ఆధ్వర్యంలో సోమవారం ఫాస్ట్‌ట్రాక్ ఫుడ్ సేఫ్టీ సూపర్‌వైజర్ కోర్సులో శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ.. హోటళ్లలో పనిచేసే వారు కచ్చితంగా డ్రస్, తలకు క్యాప్‌లు, గ్లౌజులు వేసుకోవాలన్నారు. వారికి ఆరోగ్య పరీక్షలు చేయించాలని హోటళ్ల నిర్వాహకులకు సూచించారు. పాడైన ఆహార పదార్థాలను వంటల్లో వినియోగించరాదన్నారు. దీనివల్ల ఆహారం విషతుల్యమయ్యే ప్రమాదం ఉందన్నారు. కేవీజీవీఎం ప్రతినిధులు సింధు, మోహన్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆహార భద్రతాధికారి రాజగోపాల్

ఎరువుల గోదాము తనిఖీ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లోని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి సంబంధించిన ఎరువుల గోదామును డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ సోమవారం తనిఖీ చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కర్నూలు, కల్లూరు మండలాల పరిధిలోని డీసీఎంఎస్ శాఖకు ఎన్ని ఎరువులు వచ్చాయని బ్రాంచి మేనేజర్ రాజీవ్‌ను ఆరా తీశారు. ఇదివరకు 27 టన్నుల యూరియా రాగా కర్నూలు, కల్లూరు మండలాల రైతులకు పంపిణీ చేశామని ఆయన ఛైర్మన్‌కు వివరించారు. మరో 27 టన్నుల యూరియా వచ్చిందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు యూరియాను పంపిణీ చేయాలని ఛైర్మన్ సూచించారు. డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ఎరువులు పరిశీలిస్తున్న డీసీఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు యాదవ్

నవధాన్యాల సాగుతో భూసారం మెరుగు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : నవధాన్యాల సాగుతో నేలలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుందని, దీనివల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం ఎ.మాధురి పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను సోమవారం ఆమె సందర్శించారు. అనంతరం కర్నూలు, కల్లూరు మండలాల్లో పర్యటించారు. దిన్నెదేవరపాడులో నాలుగు ఎకరాల్లో నవధాన్యాల సాగును పరిశీలించారు. కల్లూరు మండలం నాయకల్లులో బాల భాస్కరశర్మ ఎనిమిది ఎకరాల్లో సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. డీఎల్‌పీఎం లక్ష్మయ్య, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్, ఎన్ఎఫ్ఏ మల్లికార్జున, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : ప్రజలు ఇచ్చే వినతిపత్రాలను పరిశీలించి సత్వరం పరిష్కారం చూపాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలని వినతి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : బేడ, బుడగ జంగాలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కుల సంఘం అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ కోరారు. అటవీ, చైల్డ్ లేబర్ కమిటీ అధికారులకు సోమవారం ఆయన వినతిపత్రాలు అందజేశారు. 25 సంవత్సరాలుగా తమకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అధికారులు స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు పంపుతామని చెప్పారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : లేబర్ కోడ్లను రద్దు చేసి 8 గంటల పనివిధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఈనెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. నగరంలోని సీక్యాంపు నుంచి పాతబస్టాండు వరకు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, చంద్రశేఖర్, ఆటో కార్మికుల సంఘం నాయకులు రాము, కృష్ణారెడ్డి, సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, సాయిబాబా పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న నాయకులు

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ప్రభుత్వ వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు అఖండ, ఉపాధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, జిల్లా నాయకులు నరేష్ అస్లాం, కిరణ్, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు

15న ఆట్యా- పాట్యా ఎంపిక పోటీలు

కర్నూలు క్రీడలు(బి.క్యాంపు), న్యూస్‌టుడే : ఈనెల 15వ తేదీన కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో ఉమ్మడి జిల్లాల ఆట్యా- పాట్యా జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకుడు నాగరత్నమయ్య సోమవారం తెలిపారు. అండర్-17 విభాగంలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 9393855460, 9121040166 నంబర్లకు సంప్రదించాలన్నారు.

మంద కృష్ణ జన్మదిన వేడుకలు

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే : కర్నూలులోని మాదిగ న్యాయవాదుల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవం నిర్వహించారు. మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కోశారు. కార్యక్రమంలో ఎంఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు బీఎస్ రవికాంత్‌ప్రసాద్, ఎ.మాదన్న, కె.ప్రభాకర్, రాజేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సం క్షి ప్త స మా చా రం

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న నిర్వహించే దేశ సార్వత్రిక సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కేంద్ర ఆయుష్, విద్యాశాఖల సంయుక్త ఆదేశానుసారం బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని యోగా శిక్షకులకు న్యాయం చేయాలంటూ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నగర కార్యదర్శి బిసన్న, అఖిల తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ జులై 14న విద్యుత్తు భవన్ ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాముడు పిలుపునిచ్చారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : ఈనెల 10వ తేదీన పాఠశాలల్లో నిర్వహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఈవోలు ఓంకార్, శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఓర్వకల్లులో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సలహాలు ఇచ్చారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : ఈనెల 9వ తేదీన కేంద్ర కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో ఓర్వకల్లులో నిర్వహించే సమ్మెలో కార్మికులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న పిలుపునిచ్చారు. సమ్మెకు సంబంధించిన కరపత్రాలను సోమవారం విడుదల చేశారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : కర్నూలు విమానాశ్రయం నూతన ఇన్‌స్పెక్టర్‌గా యశ్వంత్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సన్యాసయ్యను అధికారులు విజయవాడకు బదిలీ చేశారు.

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా శుభ్రంగా ఉంచుకోవాలని డెమో శ్రీనివాసులుశెట్టి సూచించారు. వడ్డెగేరి పట్టణ ఆరోగ్యకేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నీటి నిల్వ వల్ల దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధిలో అంధకారం.. దీపాలు అలంకారప్రాయం

☛ ప్రధాన మార్గాల్లోనూ పట్టించుకోని యంత్రాంగం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : నగరంలోని పలు ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదు. ప్రధాన రహదారుల్లో సైతం పలు దీపాలు అలంకారప్రాయంగా మారాయి. రాత్రిళ్లు చీకట్లు అలుముకుంటుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో నెలల తరబడి వెలగకున్నా నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదని జనం విమర్శిస్తున్నారు.

■ స్థానిక కొత్తబస్టాండు నుంచి బళ్లారి చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారిలో పది రోజులుగా నాలుగు విద్యుత్తు దీపాలు వెలగడం లేదు.

■ ఆనంద్ థియేటర్ ఎదురుగా ఈతకొలను, స్వామిరెడ్డినగర్ ప్రాంతాలకు వెళ్లేందుకు హంద్రీనదిపై ఉన్న వంతెనపై విద్యుత్తు దీపాలన్నీ వెలగడం లేదు. దీంతో ఈ వంతెన దారిని చిమ్మచీకట్లు కమ్మేస్తున్నారు.

■ మౌర్యఇన్ నుంచి బంగారుపేటకు వెళ్లే మార్గంలో ఐదు దీపాలు పనిచేయడం లేదు.

■ ఆర్ఎస్ రోడ్డులోని ఐదు రోడ్ల కూడలి నుంచి బంగారుపేటకు వెళ్లే మార్గంలో సైతం రెండు దీపాలు నిరుపయోగంగా మారాయి.

■ బళ్లారి చౌరస్తా నుంచి వై జంక్షన్ వరకు నాలుగు వీధిదీపాలు వెలగడం లేదు.

■ ఆనంద్ థియేటర్ దగ్గర కేసీ కాలువ వంతెన కింద రహదారికి ఇరువైపులా ఉన్న వీధిదీపాలు మినుకుమినుకుమంటూ వెలుగుతూ ఆరిపోతున్నాయి.

బస్టాండు సమీపంలో ప్రధాన రహదారిపై వెలగని దీపాలు

నిర్వహణ గాలికి..

నగరపాలక సంస్థ అధికారులు వీధిదీపాల నిర్వహణను గాలికొదిలేశారు. పాడైన దీపాలకు రోజులు, వారాల పాటు మరమ్మతులు చేయించడం లేదు. కొన్నిచోట్ల వెలుగుతూ ఆరిపోతున్నాయి. ప్రధాన రహదారుల్లో కూడా చీకటిగా ఉందని పలువురు నగరపాలక అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని కొత్త బస్టాండు ప్రాంతంలోని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా నగరపాలక అధికారులు స్పందించి వీధిదీపాలకు మరమ్మతులు చేయించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలోనే మాదిగలకు న్యాయం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వంలో మాదిగలకు న్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ నాయకుడు పాములకుమార్ పేర్కొన్నారు. కల్లూరులోని మతమారెమ్మ ఆలయం వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా, భాజపా నాయకులు ఎన్.వి.రామకృష్ణ, జి.ఎస్.నాగరాజు మాట్లాడుతూ ఎన్ని అవరోధాలు ఎదురైనా వర్గీకరణ కేసును కోర్టులో విజయవంతం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో భాజపా, తెదేపా నాయకులు తేజ, కె.రామాంజనేయులు, చంద్రశేఖర్, రమణ, కృష్ణారెడ్డి, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

సభలో పాల్గొన్న కూటమి నాయకులు

వారం గడిచినా ఒప్పంద ఉద్యోగులకు అందని వేతనాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఒప్పంద పద్ధతిన పనిచేస్తున్న 600 మందికి జూన్ నెల వేతనం అందక ఇబ్బందులు పడుతున్నారని వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు పీటీ సాయిప్రదీప్ సోమవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేశారు. జీజీహెచ్ కార్యాలయ అధికారులు ప్రతినెలా 25వ తేదీలోపు వేతనాల బిల్లులను ట్రెజరీకి పంపించాల్సి ఉండగా, 3వ తేదీ వచ్చినా ఇప్పటి వరకు బిల్లుల వివరాలు పంపకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వేతనాలు అందక స్టాఫ్‌నర్సులు, పారా మెడికల్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వివిధ క్యాడర్లలో పనిచేసే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. ఈ విషయమై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌ను పిలిపించి వివరణ కోరారు.

డాక్యుమెంట్ పోయినది

10-04-2025 తేదీన సంతోష్‌నగర్ నుండి బళ్లారి చౌరస్తాకు జిరాక్స్ కోసం వెళుతున్నప్పుడు మా ప్లాటు ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. డాక్యుమెంట్ నెం: 5127/1985 Sy. No: 56/2C3, ప్లాటు నెం: 33 గల డాక్యుమెంట్ పోయినది. కావున ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

T.పెద్దరాముడు
H.No. : 3-155/1, సంతోష్ నగర్, కర్నూలు. Cell No: 94401 22187.

(c) eenadu

ఈనాడు నంద్యాల

మల్లన్న సన్నిధి
కావాలి ప్రగతి పెన్నిధి

రోప్‌వేలో శ్రీశైల జలాశయం చెంతకు వెళ్తున్న పర్యాటకులు

శ్రీశైల క్షేత్రానికి రోజురోజుకు భక్తుల రాక పెరుగుతోంది. ఏటా కోట్లాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు తరలొస్తున్నారు. భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల ఆలయంతోపాటు ప్రకృతి రమణీయత, సుందరమైన కృష్ణానది వంటివి పర్యాటకాభివృద్ధికి ప్రధాన వనరులు. కానీ ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం శ్రీశైలానికి వస్తున్న నేపథ్యంలో పలు అంశాలపై సమీక్షించి వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

సీప్లేన్ ఎగిరితే ఎంత బాగుండో

శ్రీశైలానికి సీప్లేన్ రాపోకలు సాగించేలా సీఎం చంద్రబాబు ఆసక్తి చూపారు. ఆయన విజయవాడ నుంచి శ్రీశైలానికి సీప్లేన్‌లో వచ్చారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో ఇది అమలవుతుందని భావించారు. ఏడాది గడిచినా జాడ లేకపోయింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు, భక్తులను ఆకట్టుకునేందుకు సీప్లేన్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

మాస్టర్ ప్లాన్ అమలవ్వాలి

- శ్రీశైల దేవస్థానం అభివృద్ధి కోసం దేవాదాయ శాఖ మాస్టర్ ప్లాన్‌ను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ పనులు చేపట్టాల్సి ఉంది. రూ.100 కోట్లతో నూతన క్యూకాంప్లెక్స్, సాలు మండపాల నిర్మాణ పనులు టెండర్ దశ వరకు వెళ్లి ఆగిపోయాయి. నూతన క్యూకాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టాల్సి ఉంది.
- శ్రీశైల దేవస్థానం భూముల సరిహద్దుల సమస్య పునరావృతమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో దేవస్థానం భూములపై అటవీ, రెవెన్యూ, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ శాఖ సంయుక్త సర్వేలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సంయుక్త సర్వే ప్రకారం దేవస్థానం భూములకు అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేయకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.
- ప్రస్తుతం ఉన్న క్యూకాంప్లెక్స్ సాధారణ రోజుల్లో అనుకూలంగా ఉన్నా...బ్రహ్మోత్సవాల్లో ఇరుకుగా మారుతోంది. ఆర్జిత సేవలు, దర్శనాల నిర్వహణకు నూతన క్యూకాంప్లెక్స్ నిర్మాణం తప్పనిసరి.

వీటిపై దృష్టి పెట్టాలి మరి

- శ్రీశైల ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు విస్తృత అవకాశాలున్నాయి. శ్రీశైల దేవస్థానం పరిధిలో మరిన్ని వసతి సముదాయాల అవసరం. భక్తులు, పర్యాటకులకు విస్తృత సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆదాయాభివృద్ధికి వీలుంటుంది. సున్నిపెంటలో త్రీస్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లు నిర్మించడం ద్వారా సౌకర్యాలు పెరుగుతాయి.
- శ్రీశైల మహాక్షేత్రంలో వివాహాలకు భక్తులు ప్రాధాన్యమిస్తారు. వారి సౌకర్యార్థం క్షేత్ర పరిధిలో మరిన్ని కల్యాణ మండపాలు నిర్మించాలి.
- ఆలయానికి సమీపంలో భక్తులకు పార్కింగ్ ప్రదేశం సంఖ్యను పెంచాలి. అక్కడి నుంచి బస్సులను ఏర్పాటు చేసేందుకు దేవదాయశాఖ చొరవ చేపట్టాలి. సున్నిపెంట-శ్రీశైలం మధ్యన వంతెనకు చర్యలు చేపట్టాలి. రూ.20 కోట్లతో 2.2 కి.మీ. పొడవు, 18 మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మించాలనుకున్నారు. ప్రస్తుతం సున్నిపెంటలో దేవస్థానం సిబ్బంది నివాస గృహాల నిర్మాణం జరుగుతోంది. దేవస్థానం ఉద్యోగులు త్వరగా శ్రీశైలం చేరుకొని విధులు నిర్వర్తించేందుకు దీన్ని గతంలో ప్రతిపాదించారు.

నేడు శ్రీశైలానికి సీఎం చంద్రబాబు రాక



శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం శ్రీశైలం రానున్నారు. జలాశయం వద్ద కృష్ణా నదికి జలహారతి ఇస్తారు.

- ఉదయం 10.50 గంటలకు హెలికాప్టర్‌లో సున్నిపెంటకు చేరుకుంటారు. 10 నిమిషాలపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరులతో మాట్లాడతారు. అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి 11.15 గంటలకు శ్రీశైలం ఆలయానికి చేరుకుంటారు.
- ఉదయం 11.15 నుంచి 11.35 గంటల వరకు భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుంటారు. 11.35 గంటలకు శ్రీశైలం ఆలయం నుంచి బయలుదేరి 11.50కు నీలం సంజీవరెడ్డి శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12.25 నుంచి 1.10 గంట వరకు సాగునీటి సంఘాల నాయకులతో ముఖాముఖి అవుతారు.

పనులు విడగొట్టి.. నిధులు చెరబట్టి

- నాసిరకంగా ఓఅండ్ఎం పనులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో సాగునీటి చెరువుల్లో పనులు నాసిరకంగా మారాయి. చెరువు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు చెబుతున్నప్పటికీ అధికార పార్టీ ప్రాంతాలకు చెందిన కొందరు నాయకుల ఆధ్వర్యంలో సాగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో చెరువులకు నీటి విడుదల జరుగుతుండగా.. ఆలోపే పనులు పూర్తి చేయాలన్న తొందరలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

రూ.3.95 కోట్లు మంజూరు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో 'ఓ అండ్ ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్)' పనులకు రూ.3.95 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో చెరువుల సంబంధించి పంట కాలువలను శుభ్రం చేసి శివారు ప్రాంతాల్లోని పొలాలకు నీళ్లివ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కట్టలను మట్టితో పటిష్టం చేయడంతోపాటు చెరువులు, కట్టలపై ఉన్న ముళ్ల పొదలు, కంప చెట్లు తొలగించ వచ్చు. సూయిజ్‌లలో ఎలాంటి అడ్డంకులు లేకుండా శుభ్రం చేయాలి. పనులను సాగునీటి సంఘాలకు అప్పగించారు. పేరుకు సంఘాల ఆధ్వర్యంలో చేస్తున్నట్లు చెబుతున్నా పరోక్షంగా కొందరు నాయకుల ఆధ్వర్యంలోనే ఇవి జరుగుతున్నాయి. మరికొన్నిచోట్ల గుత్తేదారులు పనులు చేస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్

చెరువు మట్టే వినియోగం

నంద్యాల మండలం అయ్యలూరు మెట్ట గ్రామంలోని చిన్న చెరువు. ఇందులో డీసిల్టింగ్, సప్లయ్ చానల్ అభివృద్ధి, కట్ట పటిష్టతకు రూ.16 లక్షలు మంజూరయ్యాయి. ఒక్క కట్ట పనులు చేసేందుకే రూ.5 లక్షలు కేటాయించారు. నిబంధనల ప్రకారం బయట నుంచి మట్టి తీసుకొచ్చి కట్ట పటిష్టతకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. చెరువు ఆనుకుని ఉన్న మట్టినే వాడుతున్నారు. ఈ మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు అనుమతులు తీసుకోలేదు. పనులు ఇష్టారాజ్యంగా చేయడంతో ఇటీవల కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే మట్టి జారిపోతోంది.

పేరు ఒకరిది చేస్తున్నది మరొకరు

నంద్యాల జిల్లాలో 49 పనులకు రూ.2.68 కోట్లు, కర్నూలు జిల్లాలో 21 పనులకు 1.27 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆళ్లగడ్డ, నందికొట్కూరు నియోజకవర్గాల్లో 10 శాతం కమీషన్‌పై ఐదు చెరువులను ఒక గుత్తేదారుడు చేస్తున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో పనులను విడగొట్టుకుని గ్రామ నాయకులే నిర్వహిస్తున్నారు. మంత్రాలయంలో ఓ నేత కనుసన్నల్లో జరుగుతున్నాయి. డోన్‌లో ఓ గుత్తేదారుడు రెండు పనులను ముందస్తుగా కుదుర్చుకుని ఒప్పందం మేరకు చేస్తున్నారు.

అంతా నాసిరకమే..

చెరువుల గట్లపై ముళ్ల పొదలు తొలగించాల్సి ఉండగా ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో తొలగించడం లేదు. కొన్ని చోట్ల నిప్పు పెట్టి అలానే వదిలేస్తున్నారు. మరికొన్నిచోట్ల గడ్డి మందు చల్లుతున్నారు. చెరువులో పెద్దఎత్తున పూడ్చలు ఉన్నప్పటికీ అలానే ఉంచేస్తున్నారు. చెరువు కట్టలకు నాసిరకం మట్టి వాడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారుల పర్యవేక్షణ కరవవడంతో నిధులు పక్కదారి పడుతున్నాయి.

నియోజకవర్గం	పనులు	నిధులు (రూ.లక్షల్లో)
నందికొట్కూరు	9	50
శ్రీశైలం	8	40
ఆళ్లగడ్డ	8	50
బనగానపల్లి	8	50
నంద్యాల	8	45
పాణ్యం	8	33

ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఈవో శ్రీనివాసరావు

25 నుంచి శ్రావణ మాసోత్సవాలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 24వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవాలు జరుగుతాయని దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన సోమవారం దేవస్థానంలోని అన్ని విభాగాల అధికారులతో పరిపాలనా భవనంలో సమీక్షించారు. శ్రావణ మాసోత్సవాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పించడం, దర్శనం, ఆర్జిత అభిషేకాల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భక్తుల రద్దీ నేపథ్యంలో శని, ఆది, సోమవారం, వరలక్ష్మి వ్రతం, పౌర్ణమి రోజుల్లో గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు రద్దు చేసినట్లు తెలిపారు. శ్రావణమాసం రద్దీ రోజుల్లో రోజుకు మూడు పర్యాయాలు స్పర్శ దర్శనం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 15 నుంచి 18వ తేదీ వరకు స్పర్శ దర్శనాన్ని పూర్తిగా ఆపేస్తున్నట్లు చెప్పారు. శ్రావణ మాసంలో రెండు పర్యాయాలు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిపిస్తున్నట్లు చెప్పారు. ఒక్కో పర్యాయం 1,600 మందికి అవకాశం కల్పిస్తున్నామని అన్నారు.

ఆదర్శ బడి.. అవస్థలు పడి

పేరు 'ఆదర్శం.. వసతి లేదు.. బస్సు ఉండదు.. బడికెళ్లాలంటే భావితరం అవస్థలు పడుతోంది. వెనుకబడిన మండలాల్లో ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేశారు. అక్కడికెళ్లడానికి సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చివరికి ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. అధికారులు దృష్టి సారించడం లేదు.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

పరిశీలన

'వసతి' సౌకర్యం ఎప్పుడో

- తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కేవలం విద్యార్థినులకే వసతిగృహ సౌకర్యం కల్పిస్తున్నారు. నంద్యాల మినహా అన్నిచోట్ల హాస్టల్ సౌకర్యం ఉంది. ఆరో తరగతి నుంచి హాస్టల్ వసతి కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు.
- ఉమ్మడి జిల్లాలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో చాలావరకు బస్సులు తిరగని ప్రాంతాలు ఉండడంతో పలువురు విద్యార్థినులు చదువుకు దూరమవుతున్నారు. మరికొందరు పిల్లలు సైకిళ్లపై వస్తున్నారు. వర్షం పడిన సమయంలో వారు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు.

కిక్కిరిసి వెళ్లాల్సిందే

పట్టణ శివారు క్రాంతినగర్‌లోని ఆదర్శ పాఠశాలలో 486 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరి కోసం ఉదయం రెండు, సాయంత్రం మూడు బస్సులు ఏర్పాటు చేశారు. ఒక్కోదాంట్లో 55 మందే ప్రయాణించొచ్చు. కానీ 130 నుంచి 140 మంది వెళ్తున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల గ్రామీణం, నంద్యాల బొమ్మలసత్రం

బస్సు వెళ్లిపోవడంతో ఆటోలో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు

28,510 మంది విద్యార్థులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 36 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఆదర్శ పాఠశాలల విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో సీట్లు సాధిస్తున్నారు. పది, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తుండడంతో ఈ విద్యాలయాలకు ఆదరణ పెరిగింది. 6 నుంచి 10 వరకు ప్రతి తరగతికి 100 సీట్లు, ఇంటర్మీడియట్‌లో రెండు సంవత్సరాలకు 320 సీట్లు ఉన్నాయి. మొత్తం 28,510 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఆదర్శ	కర్నూలు	నంద్యాల
పాఠశాలలు	16	13,120
విద్యార్థులు	20	15,390

బస్సులు లేక ఇబ్బందులు

- శిరివెళ్ల విద్యాలయానికి ఒకటే బస్సు నడుస్తుంది. గుంప్రమాన్‌దిన్నె, వనికినదిన్నె, రాజానగరం గ్రామాల వైపు నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు అందుబాటులో ఉండటం లేదు.
- గుళ్లదుర్తి, గుండుపాపల, రేవనూరు, కోవెలకుంట్ల ప్రాంతాల మీదుగా బస్సు నడిపితే విద్యార్థులు గోస్పాడులోని పాఠశాలకు వెళ్లేందుకు మార్గం సుగమమవుతుంది. ఈ స్కూల్‌కు 15 కి.మీల దూరం నుంచి విద్యార్థులు వస్తుంటారు.
- కొలిమిగుండ్లలోని పాఠశాలకు అవుకు నుంచి వెళ్లేందుకు అవకాశాలుండగా.. వివిధ గ్రామాలకు రవాణా సౌకర్యాలు లేవు.
- గుంప్రమాన్‌దిన్నె, వనికిన్‌దిన్నె మీదుగా విద్యార్థి బస్సు ఏర్పాటు చేస్తే ఆళ్లగడ్డలోని ఆదర్శ బడికి వెళ్లడానికి వీలుంటుంది.
- బేతంచెర్ల మండల కేంద్రం నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఆదర్శ పాఠశాల ఉంది. బస్సు ఒక్కటే ఉండటంతో కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తోంది.
- ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో మండలంలోని మిట్నాల, పుసులూరు, చాపిరేవుల గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు ఆటోల్లో వస్తున్నారు. నెలకు రూ.600 నుంచి రూ.1,000 వరకు చెల్లిస్తున్నారు.

తల్లికి వందనం రెండో జాబితా సిద్ధం చేయండి

సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో తల్లికి వందనం పథకానికి సంబంధించి రెండో జాబితాను 10వ తేదీలోగా సిద్ధం చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. అన్నదాత సుఖీభవ జాబితాను సైతం వెల్లడించాలని చెప్పారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వివిధ అంశాలపై సోమవారం అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల్లో చేరే విద్యార్థుల వివరాలను సైతం తల్లికి వందనం జాబితాలో చేర్చాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి పెండింగ్ ఈనామ్ భూముల వివరాలను ఆర్డీవోలు, తహసీల్దార్లు సంబంధిత సైట్‌లో నమోదు చేసేలా చూడాలని పేర్కొన్నారు. విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. పీ4 కింద బంగారు కుటుంబాలకు చేయూతనిచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్ పాల్గొన్నారు.

స్వర్ణ అలంకృత.. సత్యరూప..

ఉత్సవమూర్తులకు అభిషేకం

అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జ్యేష్ఠాభిషేక మహోత్సవం వైభవంగా సాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచారు. స్వామి తిరుమేనికి పంచామృతాలతో అభిషేకం చేశారు. భక్తుల సమక్షంలో వేదమంత్రాలు పఠిస్తూ స్వామి వారికి మహామంగళహారతి అందించారు. సాయంత్రం స్వామికి పరిమళద్రవ్యాలు, సుగంధాలను సమర్పించి స్వర్ణకవచంతో అలంకరించారు. స్వర్ణకవచంలో స్వామి వారిని దర్శించుకుని భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఇప్పటి నుంచి 40 రోజుల వరకు స్వామికి అభిషేకాలు ఉండవని ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలన్ తెలిపారు.

– న్యూస్‌టుడే, అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం)

అడుగు చెదిరింది.. నీరు చేరకుంది

బనగానపల్లి పట్టణ శివారులోని కోవెలకుంట్ల పరిధిలోని 2 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే 10వ బ్లాక్ ఎస్సార్బీసీ ఉప కాల్వ పూర్తిగా శిథిలమైంది. లైనింగ్, ఫ్లోరింగ్ పలకలు ఊడిపోయాయి. పెద్దపెద్ద రాళ్లు కాల్వలో పడి ఉన్నాయి. కరకట్ట అధ్వాన స్థితికి చేరుకుంది. ఈ ఏడాది కాల్వలకు నీరు వస్తే కట్ట తెగే ప్రమాదముంది. సంబంధిత అధికారులు తక్షణమే కాల్వకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

పైరవీలకే పెద్దపీట

- వ్యవసాయ శాఖలో ఇష్టారాజ్యంగా బదిలీలు

ఈనాడు, నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకుల బదిలీల్లో పైరవీలకే పెద్దపీట వేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవోతో ఏమాత్రం సంబంధం లేకుండా అధికారులు ఇష్టారాజ్యంగా బదిలీ చేశారు. గతంలో సొంత మండలాలకు సమీపంలోనే బదిలీలుండేవి. ప్రస్తుతం 100 నుంచి 200 కి.మీ.ల దూరానికి బదిలీ చేయడంతో వారు ఆందోళన చెందుతున్నారు. అధికారులు సూచించిన మేరకు ఉద్యోగులు 1, 2, 3 ఆప్షన్లు ఇచ్చినా తాజా బదిలీల సరళిని పరిశీలిస్తే ఇష్టారాజ్యంగా పోస్టింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హరనాథరెడ్డి అనే వీఏఏ ఆత్మహత్య చేసుకుని నెలలు గడిచాక ఆయనకు ప్రస్తుతం పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం.

దూరానికి విసిరేసి..

గ్రామ వ్యవసాయ సహాయకుల బదిలీల్లో సిఫార్సు లేఖలు తెచ్చుకున్నవారికి, ముడుపులిచ్చిన వారికి కోరుకున్న చోట పోస్టింగులు దక్కాయి. ఏకంగా 410 మంది సిఫార్సు లేఖలు సంపాదించుకున్నారు. 40 మంది మాత్రం తాము ఆప్షన్ పెట్టిన మూడు ప్రాంతాల్లో ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధపడ్డారు. అలాంటి వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రజాప్రతినిధులను ఆశ్రయించని వారిని కక్ష కట్టినట్లు సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అందుబాటులో కంది విత్తనాలు

మహానందిఫారం, (మహానంది), న్యూస్‌టుడే: మహానందిఫారంలోని ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో ఎల్.ఆర్.జీ-52/అమరావతి రకం కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అసోసియేట్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.జయలక్ష్మీ తెలిపారు. ఈ రకం పంట కాలం 150-160 రోజులు.. ఎండు తెగులును తట్టుకొంటుంది.. గింజ లావుగా, ఆకర్షణీయంగా ఉంటుందన్నారు. ఎకరాకు 8-9 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.. ఎకరాకు నాలుగు కిలోలు విత్తుతే సరిపోతుందన్నారు. కిలో విత్తనం రూ.150 లభిస్తుంది.. సమాచారం కోసం 8374729292, 9989208210, 9704018629 నంబర్లలో సంప్రదించాలన్నారు.

యూరియా ఏదయా


ఎ.కోడూరు సొసైటీ వద్ద క్యూలో నిల్చున్న రైతులు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: యూరియా కష్టాలు రైతులను వీడటం లేదు. సహకార సంఘాల పరిధిలో ఎరువులు సమృద్ధిగా లభించకపోవడంతో చాలా ప్రాంతాల్లో ప్రైవేటు వ్యాపారులపైనే ఆధారపడాల్సి వస్తోంది. వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు సోమవారం ఎ.కోడూరు సహకార సంఘం, ఆత్మకూరులో బారులు తీరారు. ఖరీఫ్ సీజన్ ఆరంభ దశలోనే పరిస్థితి ఇలా ఉంటే వరినాట్లు వేసే సమయంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 97 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. నంద్యాలకు 169 మెట్రిక్ టన్నులు, కర్నూలుకు 150 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించారు. పీఏసీఎస్‌లు విక్రయించే ఎరువుల లెక్కలు పూర్తిస్థాయిలో తేలడం లేదు. చాలా ప్రాంతాల్లో యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. డిమాండ్ నేపథ్యంలో కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఒక్కో యూరియా బస్తాపై రూ.350 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. మరోవైపు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని పేర్కొంటుండటం గమనార్హం.

ఖాతా బీమాకు రాత

సెప్టెంబరు వరకు కార్యక్రమం ● జన్‌ధన్ అకౌంట్ల నవీకరణ

ఉమ్మడి జిల్లాలో లక్షల మందికి జన్‌ధన్ ఖాతాలున్నాయి. వాటిలో చాలావరకు ఉపయోగించలేని స్థితిలో ఉన్నాయి. దీంతో నగదు బదిలీ పథకాల లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు బీమా పథకాల ప్రయోజనాలకు దూరమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో.. ప్రతిఒక్కరికి బీమా పథకాల ప్రయోజనాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బ్యాంకు ఖాతాలు లేని వారితో జన్‌ధన్ ఖాతాలు తెరిపించడం.. వినియోగంలోని ఖాతాలను ఈకేవైసీ చేయించడం ద్వారా పునరుద్ధరించడమే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈనెల 1 నుంచి సెప్టెంబరు 30 వరకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామానికి ఒక బ్యాంకు బాధ్యత వహిస్తుంది.

– న్యూస్‌టుడే, సచివాలయం

పథకం పేరు	పీఎంజేజే	పీఎంఎస్‌బీ
ఏడాదికి ప్రీమియం	రూ.436	రూ.20
ప్రయోజనం	రూ.2 లక్షల జీవిత బీమా	రూ.2 లక్షల ప్రమాద బీమా
అర్హులు	18- 50 ఏళ్ల వారు	18- 70 ఏళ్ల వారు

ఒక్కసారి ఆలోచించండి

సూదిరెడ్డిపల్లెలో 1వ తేదీన బీమా పథకాల ప్రయోజనాలు వివరించే గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎల్‌డీఎం రామచంద్రరావు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి, కేడీసీసీ బ్యాంకు సీఈవో రామాంజనేయులు తదితరులు

కుటుంబంతో ఒకసారి సినిమాకు వెళ్తే రూ.వెయ్యికి పైగా ఖర్చవుతుంది. వారాంతంలో హోటల్‌కు వెళ్తే రూ.1500- రూ.2 వేలు పెట్టాల్సిందే. తాత్కాలిక ఆనందాన్నిచ్చే.. ఈ ఖర్చులతో పోల్చుకుంటే కష్టకాలంలో కుటుంబానికి ఆర్థిక భద్రతనిచ్చే బీమా పథకాలకు చెల్లించే ప్రీమియం చాలా తక్కువే ఉంటుంది. ఏడాదికి రూ.456 చెల్లిస్తే.. ఊహించని ప్రమాదం జరిగినప్పుడు, సహజ మరణం సంభవించినప్పుడు ఆర్థిక భరోసా లభిస్తుంది. అవగాహన లేక కొందరు.. ఉదాసీనతతో చాలామంది ప్రధానమంత్రి జీవన జ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవడం లేదు.

బ్యాంకు జాడలేని పల్లెలెన్నో..

నంద్యాల జిల్లాలోని బేతంచెర్ల మండలం ఎంబాయిలో 5,206 జనాబా ఉంది. ఈ గ్రామానికి 5 కిలోమీటర్ల పరిధిలో ఒక్క బ్యాంకు కూడా లేదు. డోన్ మండలం వెంకటాపురం, దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నె, జూపాడుబంగ్లా మండలం మండ్లెం, పగిడ్యాల మండలం ముచ్చుమర్రి, మురువకొండలో ఇదే పరిస్థితి. ప్యాపిలి మండలంలో 5,260 మంది నివసిస్తున్న గుడిపాడు, 5,012 మంది జనాబా ఉన్న రాచర్ల గ్రామాలు గ్రామం బ్యాంకు సేవలకు చాలా దూరంగా ఉన్నాయి.

40 శాతం నిరుపయోగం

- కర్నూలు జిల్లాలో వివిధ బ్యాంకుల శాఖలు 588 ఉండగా. 8,79,585 జన్‌ధన్ ఖాతాలున్నాయని అధికారులు చెబుతున్నారు. నంద్యాల జిల్లాలో 5,60,269 ఖాతాలు ఉన్నాయి. వీటిలో 60 శాతం ఖాతాలు వినియోగంలో ఉండగా.. 40 శాతం ఖాతాలు వినియోగంలో లేవు. ఆధార్‌తో అనుసంధానం చేసుకోని కారణంగా ఈ ఖాతాలు వినియోగంలో లేవని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా ప్రయోజనం పొందాలంటే పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ బ్యాంకు ఖాతాలు ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రజలందరికీ బ్యాంకింగ్ సేవల్ని చేరువ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఎల్‌డీఎం రామచంద్రరావు తెలిపారు.
- జిల్లాలో 489 గ్రామాల్లో పీఎంజేజేబీవైకి సంబంధించి 45,378, పీఎంఎస్‌బీవైకి చెందిన 66,857 మందికి సెప్టెంబరు నెలాఖరు వరకు బీమా చేయించాల్సిన లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు.

రైతేరాజు 6లో

వసతికి పోటెత్తిన దరఖాస్తులు

B.Tech., and Ag.B.Sc., SPOT ADMISSION
కేవలం 6,7,8,9,10 లక్షల ఖర్చుతో నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ / అగ్రికల్చర్ బీఎస్సీ (కాలేజ్ ఫీజు + హాస్టల్ ఫీజుతో కలిపి) ఎటువంటి షూరిటీ లేకుండా విద్యార్థికి 70 నుంచి 80% లోన్ సౌకర్యం కల్పించబడును. వివరాలకు సంప్రదించండి :
9502555500, 9160220527

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోను మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో నివేదించడం తప్ప
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
కర్నూలు: 99899 97628
80080 12489
నంద్యాల: 90007 66039, ఆదోని: 80087 09793

(c) eenadu

కొర్ర సాగు.. భలే బాగు

బనగానపల్లి, న్యూస్‌టుడే: మారిన జీవనశైలి నేపథ్యంలో ఆహారపు అలవాట్లు మారాయి.. 'చిరు'ధాన్యాలు తినడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.. ఆదరణ బాగుంటుండడంతో సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతోంది.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు కొర్ర సాగుపై దృష్టి సారించారు.. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే లాభాలు పొందొచ్చని బనగానపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధాకర్ సూచిస్తున్నారు. జూన్, జులై మాసాల్లో పంట వేసుకోవడానికి అనుకూలమైన కాలం.. స్వల్పకాలిక పంట కావడంతో బెట్ట పరిస్థితులు తట్టుకొని మంచి దిగుబడి ఇస్తుంది. సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు సాధించొచ్చు.

సుధాకర్

ఇలా విత్తుకోవాలి: ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుంది. ఒక కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండజిమ్‌తో శుద్ధి చేయాలి. సాళ్ల మధ్య 22 సె.మీ.దూరం, మొక్కల మధ్య 7.5 సెం.మీ. దూరం ఉండేలా చూసుకోవాలి. విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలు తీసి వేయాలి. విత్తిన 30 రోజుల వరకు కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.

అంతర పంటలు: కొర్ర పంటలో అంతర పంటగా కంది, వేరుశనగ పంటలు సాగు చేసుకోవచ్చు. 5 సాళ్ల కొర్రకు ఒక సాలు కంది లేదా 2 సాళ్ల కొర్రకు ఒక సాలు వేరుశనగ వేసుకోవచ్చు.

అంతర కృషి: విత్తిన 20 రోజుల తర్వాత సాళ్లలో గొర్రుతో ఎడసేద్యం చేయడంతో కలుపు మొక్కలు రాకుండా నివారించుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం: ఆఖరి దుక్కిలో నాలుగు టన్నుల పశువుల ఎరువును ఎకరా పొలంలో వేసి బాగా కలియ దున్నాలి. విత్తేటప్పుడు 8 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరాన్ని ఇచ్చే ఎరువులను ఎకరా పొలానికి దుక్కిలో వేయాలి. మళ్లీ విత్తిన నెల రోజులకు మరో 8 కిలోల నత్రజని ఎరువును పైపాటుగా పైరులో వేయాలి.

సందేహాలు సమాధానాలు

ప్రశ్న : వేరుసెనగలో మొదలు కుళ్లు తెగులు ఆశించి మొక్కలు చని పోతున్నాయి. నివారణ తెలపగలరు?

- బసవరాజు, కోటేకల్లు గ్రామం

సమాధానం : విత్తనశుద్ధి చేసుకోకుంటే వాటి ద్వారా మొలకెత్తిన తర్వాత కాండానికి శిలీంద్రం ఆశించి మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు ట్రైకోడర్మవిరిడి 5 గా. లీటరు నీటిలో లేదా సాఫ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలి. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

అంతర పంట.. ఆదాయ బాట

మహానంది, న్యూస్‌టుడే : మహానంది మండలం చెంచులక్ష్మి గూడేనికి చెందిన చెంచు రాగుల బయమ్మ ఎకరా భూమిలో అంతర పంటలు సాగుచేస్తూ నిరంతర ఆదాయం పొందుతున్నారు. ప్రధాన పంటగా మామిడి, జామ, కొబ్బరి మొక్కలు పెంచుతున్నారు. వాటి మధ్యలో కొర్ర, మినుము, మొక్కజొన్న, నువ్వులు వంటి పంటలు సాగు చేస్తున్నారు.

★ ఎకరా పొలంలో అన్ని పంటల సాగుకు రూ.20 వేల వరకు ఖర్చు చేసినట్లు బయమ్మ చెబుతున్నారు. వ్యవసాయశాఖ వారు జన్ జాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా ఉచితంగా అందజేసిన వీబీఎన్-8 రకం మినుము విత్తనాలు సాగుచేసి 6 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. క్వింటా రూ.7,400తో విక్రయించగా రూ.44,400 ఆదాయం వచ్చింది. కొర్రపంట ఒక క్వింటా దిగుబడి రాగా రూ.3 వేలకు విక్రయించారు. మొక్కజొన్నను క్వింటా రూ.9 వేల ప్రకారం అమ్ముకున్నారు. వీటి మధ్యలో బంతిపూలు కూడా పండించి మహానంది దేవస్థానంలో వ్యాపారికి రూ.2,200లకు విక్రయించి ఆదాయాన్ని పొందారు. రూ.60 వేలు లాభం ఆర్జించారు. ఖర్చులు పోను రూ.40 వేల నికర ఆదాయం రావడం విశేషం.

మామిడిచెట్ల సంరక్షణలో చెంచు బయమ్మ

రైతేరాజు

పత్తి పురుగు కత్తి

ముందస్తు నివారణే మేలు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : వర్షం జోరందుకుంది.. ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు పెరిగింది.. విత్తనం వేసి నెల రోజులు దాటింది.. పంట 30-50 రోజుల మధ్య పురుగుల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. అప్రమత్తంగా ఉండాలి..

● వర్షాల నేపథ్యంలో ఎకరానికి 36 కిలోల యూరియా వేసుకోవాలి. 45 రోజుల సమయంలో ఎకరానికి 20 కిలోల పొటాష్ వేయాలి. కిలో మెగ్నీషియం పిచికారీ చేయాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా. రాఘవేంద్రచౌదరి వివరించారు.

తెల్ల దోమ: పూతకాయ దశలో తెల్ల దోమ ఆశిస్తుంది. కాయ, పూత పక్వానికి రాకముందే పగిలిపోయేలా చేస్తుంది.. నష్టం తీవ్రంగా ఉంటుంది.. దోమ ఉద్ధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు గిడస బారిపోతాయి.

నివారణ : పసుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 10 పెట్టుకోవాలి. వేప నూనె 10,000 పీపీఎం, రెండు మిల్లీలీటర్లు లీటరు నీటికి లేదా 1,500 పీపీఎం.. 5 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. డైపెంతురాన్ 1.25 గ్రాములు లీటరు నీటికి లేదా అసిటామిప్రైడ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి ఆకులు అడుగుభాగం, కొమ్మలు, కాండం తడిచే విధంగా పిచికారీ చేయాలి.

పచ్చదోమ: ఈ పురుగు ఆకుల అడుగు భాగంలో చేరి రసం పీల్చుతుంది. ఆకు మొదట ముడుచుకొని క్రమేపీ లేత పసుపు రంగుకు మారుతుంది.. తర్వాత ఆకు అంచులు ముదురు ఎరుపు రంగులోకి మారి ఆకు మొత్తం ఎర్రబడి రాలిపోతుంది. మొక్కల ఎదుగుదల క్షీణించి గిడస బారిపోవడంతో మొగ్గలు ఏర్పడవు.

నివారణ: పసుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 10 పెట్టుకోవాలి. పురుగు గుడ్డు దశలో ఉద్ధృతి తక్కువగా ఉన్నప్పుడు వేప నూనె 10,000 పీపీఎం 2 మిల్లీలీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఫ్లోనికోమైడ్ 0.3 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీలు లేదా తమోమీథక్యాం 0.2 గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేసుకోవాలి.

పెనుబంక: సాధారణంగా వేడి, పొడి వాతావరణంలో పెనుబంక ఎక్కువగా వ్యాపిస్తుంది. వేప నూనె లీటరు లేదా వేప గింజల కషాయం పిచికారీ చేయాలి. ప్రొపినోఫాస్ 2 మి.లీలు లీటరు నీరు, గమ్, 0.5 మి.లీల లీటరు నీరు లేదా థైమేతోయేట్ 2 మి.లీల లీటరు నీరు, గమ్ 0.5 మిలీలు లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి.

వసతికి పోటెత్తిన దరఖాస్తులు

డోన్ పట్టణం, కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే: వసతిగృహాల్లో ఉండేది అంతా గ్రామీణ పేద విద్యార్థులే. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకునే స్థోమత లేక సర్కారుబడుల్లో చేరి.. వసతిగృహాల్లో ఉంటూ అభ్యసిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం వసతిగృహాలను నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థుల సౌకర్యార్థం పలు చర్యలు చేపట్టడంతో నూతన శోభను సంతరించుకున్నాయి. తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తుండడంతో విద్యార్థుల ప్రవేశాలు బాగా పెరిగాయి. సీట్ల కోసం సిఫార్సులు చేయించుకుని మరీ ప్రవేశాలు పొందుతుండడం గమనార్హం.

ఎస్సీ వసతిగృహంలో బాలికలను చేరుస్తున్న వారి తల్లులు

● కర్నూలు జిల్లాలో ఎస్సీ బాల, బాలికల వసతిగృహాలకు సంబంధించి ప్రీమెట్రిక్ వసతి గృహాలు 29, పోస్టుమెట్రిక్ వసతిగృహాలు 8 ఉన్నాయి. వీటిల్లో 5,734 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. నంద్యాల జిల్లాలో ప్రీమెట్రిక్ 25, పోస్టుమెట్రిక్ 13 వసతిగృహాలు ఉండగా.. 4,023 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో సీట్లు ఖాళీ లేవని, పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో 172 దాకా ఖాళీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

● కర్నూలు జిల్లాలో బీసీ వసతిగృహాలకు సంబంధించి ప్రీమెట్రిక్ వసతిగృహాలు 31 ఉండగా.. పోస్టుమెట్రిక్ వసతిగృహాలు 14 ఉన్నాయి. అందులో 10,123 మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లాలో ప్రీమెట్రిక్ వసతిగృహాలు 21 ఉండగా.. పోస్టుమెట్రిక్ వసతిగృహాలు 12 ఉన్నాయి. వీటిల్లో 3,337 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఇందులో 1,350 దాకా సీట్లు ఖాళీగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2వేలకు పైగా సీట్లు ఖాళీ ఉండగా.. వాటిని భర్తీ చేసేందుకు ఆయా వసతిగృహాల సంరక్షకులు తలమునకలవుతున్నారు. కొన్ని వసతిగృహాల్లో విద్యార్థులు మంజూరైన సీట్ల కంటే ఎక్కువగానే ఉండడం గమనార్హం.

ఆధునికీకరణ.. సన్నబియ్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి కర్నూలు జిల్లాలో 75కి పైగా వసతిగృహాల్లో మైనర్, మేజర్ మరమ్మతులకు సంబంధించి 2024 డిసెంబరులో రూ.16కోట్లకు పైగా నిధులను కేటాయించి.. వేసవి సెలవుల్లో సంబంధిత గుత్తేదారులతో పనులను ప్రారంభించారు. అవన్నీ ఓ కొలిక్కి వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదేమాదిరిగా విద్యార్థులకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ విద్యా సంవత్సరం సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం తయారు చేసి వడ్డిస్తున్నారు.

ప్రమాదాల ప్రవేశ ద్వారం

ఆళ్లగడ్డ పురపాలిక పరిధిలోని పడకండ్ల వద్ద ఉన్న గిరిజన సంక్షేమ బాలుర గురుకులం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గురుకులం ప్రవేశ మార్గమే శిథిలమై ఏ క్షణాన కూలుతుందో చెప్పేందుకు వీలు లేని స్థితిలో ఉంది. అసలే వర్షాకాలం ఇలాంటి ప్రవేశ మార్గం శిథిలమై ప్రమాదకరంగా ఉంది. గురుకులం నిర్వహిస్తున్న భవనం సైతం దెబ్బతినడంతో ఉండడం గమనార్హం. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

రహదారి బాగుపడింది

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు నుంచి నంద్యాల జిల్లా కేంద్రానికి వెళ్లే దారికి మోక్షం కలిగింది. తారు రోడ్డు మిడుతూరు విద్యుత్తు ఉప కేంద్రం సమీపంలో దెబ్బతింది. దీనిపై గత నెల 4వ తేదీ 'రూ. కోట్ల వ్యయం.. వీడని దారిద్ర్యం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితం అయ్యింది. దీంతో స్పందించిన అధికారులు నూతన రహదారి నిర్మించి రాకపోకలకు సుగమం చేశారు. సమస్య పరిష్కరించిన అధికారులకు స్థానికులు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

స్పందనకు వందనం

జారిపడుతున్నా.. జాలిపడరు

డోన్ పట్టణంలోని ఇందిరానగర్ నుంచి శ్రీనివాసనగర్ మీదుగా బైపాస్‌ను కలిపే ప్రధాన రహదారి చాలా అధ్వానంగా మారింది. ఈ దారిలో కొంతభాగం అధికారులు సీసీ రోడ్డు వేయకుండా విస్మరించారు. సీసీ రోడ్డు వేయని ప్రాంతంలో రహదారిలో గుంతలు ఏర్పడి అధ్వానస్థితికి చేరాయి. వర్షం వస్తే గుంతల్లో నీరు నిల్వ ఉండి.. బురదమయంగా మారుతోంది. వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

10న శ్రీశైలంలో శాకంబరీ ఉత్సవం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీభ్రమరాంబాదేవికి 10వ తేదీన శాకంబరీ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. అమ్మవారి మూలమూర్తి, ఉత్సవమూర్తిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పలు రకాల ఫలాలతో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరిదేవికి, గ్రామదేవత అంకాలమ్మకు సైతం విశేష అలంకారం, పూజలు జరుగుతాయన్నారు.

ఫ్యాక్టరీ అధికారులతో చర్చలు విఫలం

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: స్థానికంగా ఉన్న ర్యాంకో సిమెంట్ కర్మాగారం అధికారులు, రైతుల మధ్య సోమవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. వారం రోజుల క్రితం రైతు సంఘం నాయకత్వంలో కర్మాగారం ప్రధాన గేటు వద్ద రైతులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. ఫ్యాక్టరీ కారణంగా పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం, భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు కర్మాగారంలో ఉద్యోగాల కల్పనపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కార్మాగారం అధికారులు యాజమాన్యంతో చర్చించలేదని సీపీఐ నాయకులు ప్రశ్నించారు. కర్మాగారానికి చెందిన అధికారులు ఒక్క డిమాండుకు ఒప్పుకోలేదన్నారు. దీంతో రైతు సంఘం నాయకులు నిరాశతో వెనుదిరిగారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రంగయ్యానాయుడు, సుంకయ్య, సోమన్న, రైతులు పుల్లయ్య, పెద్దయ్య, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కమనీయంగా పల్లకి సేవ

యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయాధికారుల ఆధ్వర్యంలో కమనీయంగా ఉమామహేశ్వరుడి పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకిలో ఉత్సవ విగ్రహాలుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకితో ప్రాకారోత్సవం గావించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచి మహేశ్వరరెడ్డి, ఆలయసిబ్బంది, భక్తులున్నారు.

ఉత్సవంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

గురుకులం సీట్ల భర్తీకి 9న మంత్రణం

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యా సంస్థల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈనెల 9వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త డాక్టర్ శ్రీదేవి సోమవారం తెలిపారు. 5వ తరగతిలో బాలురకు 2 సీట్లు, ఇంటర్ ఎంపీసీలో 6, బైపీసీ 5, సీఈసీలో 36 సీట్లు ఉన్నాయన్నారు. బాలికలకు ఐదో తరగతిలో 70 సీట్లు, ఇంటర్ ఎంపీసీ 70, బైపీసీ 26 సీట్లు ఉన్నట్లు వెల్లడించారు. ఇంటర్ ప్రవేశ పరీక్షలో ఎస్సీ2 ర్యాంకు 13,200, బీసీలు 4,995లోపు వచ్చిన వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని సూచించారు. ఐదో తరగతిలో చేరే బాలికల్లో ఎస్సీ2 6,000, బీసీలైతే 1450 లోపు ర్యాంకు వచ్చిన వారు హాజరుకావాలన్నారు. బాలురలో బీసీలు 288లోపు ర్యాంకు వచ్చినవారు రావాలన్నారు. బాలికలకు దిన్నెదేవరపాడు, బాలురకు చిన్నటేకూరులో కౌన్సెలింగ్ ఉంటుందని వివరించారు.

పీజీఆర్ఎస్‌కు 75 వినతులు

బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాలలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 75 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల నుంచి ఎస్పీ స్వయంగా వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. నిర్ణీత గడువు లోపు ఫిర్యాదులను పరిష్కరించాలని, ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ యుగంధర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చిన సమస్యల్లో కొన్ని..

◆ వెంకటరమణ అనే వ్యక్తి తన పొలంలో అక్రమంగా ప్రవేశించి సుమారు 150 అరటి చెట్లను నరికేశాడని.. తనకు న్యాయం చేయాలని ఎం. తిమ్మాపురం గ్రామానికి చెందిన వెంకటస్వామి విన్నవించారు.

◆ శిరివెళ్ల మండలం సుబ్బరాయుడు అనే వ్యక్తి వద్ద రూ.2 లక్షల చీటీ వేశామని.. నెలకు రూ.10 వేల చొప్పున డబ్బులు చెల్లించామని.. కంతులు పూర్తై రెండు నెలలు దాటినా డబ్బులు ఇవ్వక పోగా.. బెదిరిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన కె.రాఘవేంద్ర ఫిర్యాదు చేశారు.

సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ రాజకుమారి

అర్జీలపై ప్రత్యేక దృష్టి అవసరం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జేసీ సి.విష్ణుచరణ్‌తో కలిసి వినతులు స్వీకరించారు. మొత్తం 221 దరఖాస్తులు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, రీసర్వే అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై ఆర్డీవోలు, తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఆర్వో రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో మరింత అభివృద్ధి

కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి

హెచ్‌కొట్టాల (బేతంచెర్ల), న్యూస్‌టుడే: ఏడాదిలో తాము చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలకు ఇది తొలి అడుగు మాత్రమేనని రానున్న నాలుగేళ్లలో మరింత అభివృద్ధి, సంక్షేమం చూస్తారని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పేర్కొన్నారు. మండలంలోని హెచ్‌కొట్టాల, కొమ్మూరు కొట్టాల, గొర్లగుట్ట గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఉన్నం రామచంద్రా రెడ్డి, రఘు, యండూరి మహేశ్వరుడు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ యజమానులపై కోట్ల అసహనం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల నాపరాయి, పాలిష్ ఫ్యాక్టరీ యజమానులపై ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఫ్యాక్టరీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరి ఉస్సేన్‌రెడ్డి ఫ్యాక్టరీ, క్వారీ యజమానుల సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. అయితే 400కు పైగా పరిశ్రమలు ఉంటే కనీసం 40 మంది కూడా హాజరుకాకపోతే సమస్యలు లేనట్లే అనుకోవచ్చా అని కోట్ల వ్యాఖ్యానించారు. యజమానులందరూ సంఘటితంగా ముందుకు వస్తే సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

THE DISTRICT CO-OPERATIVE CENTRAL BANK LTD.
Door No. 46-1-C, Budhawarpeta, Opp: Govt. Regional Eye Hospital, KURNOOL-518002.
E-Mail: ceokrnl@apcob.org. Fax No. 08518-255510
Telephone No. (STD CODE No: 08518) 255342, 255730, 649414,
RBI License No. RPCD.Co-Op(H). 18/05.08. 01/2011-12
DCC BANK KURNOOL
2025 International Year of Cooperatives
ది జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి.,
ఇంటి నెం. 46-1-సి, బుధవారపేట, ప్రభుత్వ కంటి హాస్పిటల్ ఎదురుగా, కర్నూలు-518 002.
ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘముల సభ్యులకు విజ్ఞప్తి
PACS కంప్యూటరీకరణ జరిగినందున ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘముల ద్వారా ఋణములు పొందిన ఋణగ్రస్తులు ఋణము తిరిగి చెల్లించినప్పుడు, సహకార సంఘములో System Generate చేసిన రశీదు నందు సంఘ ముఖ్యకార్యనిర్వహణాధికారి సంతకము, సీల్ వేసిన తదుపరి మాత్రమే రశీదును తీసుకోవలసినదిగా సూచించడమైనది. System Generate చేసిన రశీదు మాత్రమే చెల్లుబాటౌతుంది. మాన్యువల్‌గా జారీ చేసిన రశీదు చెల్లుబాటుకాదని తెలియజేయడమైనది.
సం/- పి.రామాంజనేయులు, ముఖ్యకార్యనిర్వహణాధికారి, డి.సి.సి. బ్యాంకు లిమిటెడ్, కర్నూలు.

పెద్దల దానం.. పిల్లల పేచీ

ఆళ్లగడ్డ, రుద్రవరం, న్యూస్‌టుడే: పుట్టిన గడ్డపై మమకారం.. బడి, గుడి బాగుండాలని.. పేదలకు సొంతిళ్లుండాలని తలచారు.. ఉన్నదాంట్లో కొంత దానం చేశారు.. 'నోటి' మాటతో ఇచ్చేశారు.. గ్రామస్థుల సమక్షంలో పత్రం రాసి ఇచ్చారు. ఆయా భూముల్లో ప్రజాప్రయోజన నిర్మాణాలు చేపట్టారు.. వారి మరణానంతరం వారసులు పేచీ పెడుతున్నారు. దానంగా ఇచ్చేసిన ఆస్తులు స్వాధీనం చేసుకోవడానికి యత్నిస్తుండటంపై గ్రామీణులు మండిపడుతున్నారు.

■ పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి రుద్రవరం మండలం చందలూరుకు చెందిన ఓ భూస్వామి 40 ఏళ్ల కిందట 7.70 ఎకరాలు దానం చేశారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి లే అవుట్లు వేసి మట్టిరోడ్లు నిర్మించారు. మరికొంత స్థలంలో గత ప్రభుత్వం గోదాములు నిర్మించింది. దాత కుటుంబానికి చెందిన కొందరు వ్యక్తులు ఇటీవల రంగంలోకి దిగి ఆ భూముల స్వాధీనానికి యత్నించారు. లేఅవుట్లను దున్నేశారు. బాధితులు అధికారులను ఆశ్రయించారు. దానం చేసినట్లు పత్రాలు లేకపోవడంతో అధికారులు తలపట్టుకున్నారు.

■ దొర్నిపాడులో ప్రధాన రహదారి పక్కనే ఆర్టీసీ బస్టాప్‌కు ఒకరు 10 సెంట్ల స్థలం దానంగా ఇచ్చారు. వందల ఎకరాల భూస్వామిగా ఉన్న ఆయన ఇచ్చిన దానాన్ని ఆర్టీసీ వారు స్వీకరించి రూ.6లక్షల వ్యయంతో బస్టాప్ నిర్మించారు. ఆ భూస్వామి మరణానంతరం ఆయన వారసులు తాము ఆర్టీసీకి దానంగా ఇచ్చిన భూమిని తమకు తిరిగి ఇవ్వాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు.

చందలూరులో దాత వారసులు దున్నేసిన భూమి

■ దొర్నిపాడు నడిబొడ్డున ఒక భూస్వామి విలువైన అరెకర భూమిని గ్రామానికి ఇవ్వడంతో సత్రాలు నిర్మించారు. అయితే భూస్వామి మాట మాత్రంగానే దానం చేశారు. రాతపూర్వకంగా ఇవ్వకపోవడంతో నేడు ఆయన వారసులు ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

■ ఆళ్లగడ్డ పట్టణంలో డా.ఎంవీ ప్రసాదు వీధిలో ఒక వ్యక్తి ప్రభుత్వ పాఠశాల కోసం దాదాపు 8 సెంట్ల స్థలం దానంగా ఇచ్చారు. ఆ స్థలంలోనే ప్రభుత్వ పాఠశాలను నిర్మించారు. 8 ఏళ్ల క్రితం పాఠశాలకు స్థలం దానం ఇచ్చిన ఆ భూస్వామి వారసులు తిరిగి స్థలాన్ని స్వాధీనం చేసుకుని భవంతి నిర్మించి సొంతం చేసుకున్నారు.

■ ఆళ్లగడ్డ పట్టణంలోని పాలసాగరం ఉన్నత పాఠశాలకు దాత 5 దశాబ్దాల క్రితం ఏడెకరాలు విరాళంగా ఇచ్చారు. ఇందులో ఒక ఎకరా ఎస్సీ వసతి గృహానికి ఇచ్చారు. మరో 10 సెంట్లు నీటి తొట్టెకు కేటాయించారు. పాఠశాలకు స్థలం ఇచ్చిన దాత బంధువులు తాము ఏడెకరాలు ఇవ్వలేదని నాలుగు ఎకరాలు మాత్రమే ఇచ్చామంటూ రెండు ఎకరాలకుపైగా తమకే ఇవ్వాలంటూ ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నారు.

పత్రాలు లేకపోవడం అసలు సమస్య

ప్రభుత్వం ఇలాంటి ఆక్రమణల నుంచి భూములను రక్షించుకోవాలంటే వెంటనే అప్రమత్తమై ఎవరైతే దానం ఇచ్చి ఉంటారో వాటికి సంబంధించిన దానవిక్రయ పత్రాలను సిద్ధం చేసుకోవాలి. దాన విక్రయ పత్రాలు లేకపోతే రెవెన్యూ అధికారులు సదరు భూమి ప్రభుత్వానికి చెందినట్లుగా పత్రాలు సిద్ధం చేసి ఏ శాఖకు ఇచ్చారో ఆ శాఖకు అప్పగించాలి. లేకపోతే దాత వారసులు దానం ఇచ్చిన భూములు తమవే అంటూ వాటిని తిరిగి ఆక్రమించుకునే ప్రమాదం ఉంది.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కృష్ణగిరి, న్యూస్‌టుడే: మండలానికి చెందిన ఓ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. గమనించిన కళాశాల సిబ్బంది వెంటనే ఆటోలో వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి, అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: గేదెను తప్పించబోయి ద్విచక్ర వాహనం లారీని ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని అయ్యలూరు గ్రామంలో సోమవారం జరిగింది. ట్రాఫిక్ సీఐ మధుసూదన గుప్త కథనం ప్రకారం... రుద్రవరం మండలం ఎల్లావత్తుల గ్రామానికి చెందిన రమేశ్ తన స్నేహితునితో కలిసి నంద్యాలకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. మార్గం మధ్యలో అయ్యలూరులో గేదె ద్విచక్ర వాహనానికి అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి ఎదురువస్తున్న లారీని బైక్ ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుల్లో ఒకరిని ఎల్లావత్తుల గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు రమేశ్‌గా (35), మరో వ్యక్తిని శ్రీరంగాపురానికి చెందిన అశోక్‌గా గుర్తించారు.

మృతుడు రమేశ్

గుర్తు తెలియని వ్యక్తి

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం|| Cell: 7382114647.

REAL ESTATE

HOUSE FOR SALE
రోహిణి ఇన్‌ఫ్రా వారి నూతన ప్రాజెక్ట్ కామదేను నివాస్ - 2, బెంగుళూరు రోడ్డు లక్ష్మీపురం దగ్గర ఇండిపెండెంట్ హౌసెస్ కలవు. అనూష: 91600 38988, 88866 62148.

JOBS
Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

కర్నూలులో ప్రముఖ బ్యాంకింగ్ కలెక్షన్ ఏజెన్సీకి ఫ్రెషర్/ అనుభవజ్ఞులైన టెలికాలర్స్, టీమ్ లీడర్స్ కావలెను. జీతం: 12,000- 40,000+ ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్. వాక్ ఇన్ ఇంటర్వ్యూ @ ఐకాన్స్ RK రెసిడెన్సీ, ఫ్లాట్ నెం: 202, 3rd ఫ్లోర్ నెం: 202, న్యూ కర్నూలు బస్టాండ్ ఎదురుగా. ✆ 8885372560, 6301470156.

కర్నూలు సిటీలో గల ప్రముఖ హోటల్ లో పనిచేయుటకు రూం బాయ్స్, వెయిటర్స్, సూపర్ వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్ మరియు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ రూమ్స్ + భోజనం కలదు. 9 గంటలు డ్యూటీ. అర్హత: 10th/ ఇంటర్/ డిగ్రీ. వెంటనే సంప్ర: 94943 33443.

రియల్ యాడ్స్ సొసైటీ కంపెనీకి అనుభవం కలిగిన మార్కెటింగ్ లీడర్స్, మేనేజర్లు మరియు రిసెప్షనిస్ట్ కావలెను. జీతం: 30 వేలు. సంప్ర: 9391551520.

ఉలిందకొండలోని మా సంస్థ నందు పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గం|| డ్యూటీ, 16500/- జీతం, వయస్సు: 25 to 45, అర్హత 12th పాస్/ ఫెయిల్, హైట్ 5.5 ✆ 91829 64173.

EENADU THE WAY CLASSIFIEDS
అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల
•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

ట్యాబ్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

జీవనోపాధులు పెంపొందించుకోవాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మహిళలు జీవనోపాధులను పెంచుకోవాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మెప్మా సంఘాల సమావేశం నిర్వహించారు. సంఘాల నిర్వహణకు ఎంపికైన ఆర్పీలకు ఆధునిక ట్యాబ్‌లు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డీజీ లక్ష్మి కేంద్రాల ఏర్పాటుకు ఎంపికైన వారికి వస్త్రాలకు సంబంధించిన డిజైన్‌లు పంపిణీ చేశారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కొత్తపల్లి మండల కన్వీనర్ నారపురెడ్డి అన్నారు. కొత్తపల్లిలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజలకు వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం : ?: పట్టణంలోని శ్యామ్‌నగర్‌లో వీధిదీపం వెలగక ఇబ్బందులు పడుతున్నాం. – కిశోర్, స్థానికుడు

✔: సిబ్బందిని పంపి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. – పవన్‌కుమార్, డీఈ

?: ఎస్బీఐ కాలనీలోని గోశాల వద్ద కుక్కల బెడద అధికమైంది. మనుషులపై దాడి చేస్తున్నాయి. – నరేంద్ర

?: పట్టణంలోని నబీనగర్‌లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. – రఫీ

✔: త్వరలోనే కుక్కలను పట్టించి సమస్యను పరిష్కరిస్తాం. – లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆత్మకూరు పట్టణం : ?: ఖిల్లావీధిలో సంతమార్కెట్ ప్రహరీ గోడను ఆనుకుని ఉన్న స్తంభం వేలాడుతోంది. కూలిపోయే ప్రమాదం ఉంది. – అన్వర్

✔: పాత స్తంభం తొలగిస్తాం. – జయశంకర్, ట్రాన్స్‌కో ఈఈ

?: పాత బస్టాండు నుంచి నేతాజీనగర్‌కు వెళ్లే రహదారిలో ఉన్న విద్యుత్తు దీపం వెలగటం లేదు. వీధిలో చీకటిగా ఉంది. – సాయి

✔: కార్మికులకు సూచించి వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. –షాహీర్‌బాష, పురపాలక ఏఈ

పేదలకు వరం.. సీఎం సహాయ నిధి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

మిడుతూరు, న్యూస్‌టుడే: పేదల పాలిట వరంలా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఉందని నియోజకవర్గ ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మండలంలోని చెరకుచెర్ల గ్రామానికి చెందిన జయమ్మకు రూ. 87,183, విజయలక్ష్మికి రూ.70 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా సోమవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఆయన వెంట తెదేపా మండల అధ్యక్షుడు కాతా రమేష్ రెడ్డి, నాయకులు హరి సర్వోత్తమరెడ్డి ఉన్నారు.

పింఛను పెంచిన ఘనత మాదే

మిడుతూరు, న్యూస్‌టుడే: అన్ని విధాలా మంచానికే పరిమితమైన వారికి పింఛను రూ.15 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడిదేనని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు కాతా రమేష్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మండలంలోని వీపనగండ్లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన సంక్షేమం, అభివృద్ధి కరపత్రాలను పంచుతూ ఇంటింటికి తిరిగారు. ఈ సందర్భంగా స్థానికులు తల్లికి వందనం పథకం అమలుపై తమ ఆనందం వ్యక్తం చేశారు. తమ కాలనీలో సామూహిక మరుగుదొడ్డి, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మహిళలు అడగ్గా సంబంధిత అధికారులను పిలిపించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్ రెడ్డి, స్వామిరెడ్డి కార్యకర్తలు, బూత్ ఏజెంట్లు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలకు బస్సు దూరం

☛ సరిపడా బస్సులు లేక విద్యార్థుల అవస్థలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: విద్యా పరంగా వెనుకబడిన మండలాల్లో మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులు ఎక్కువ మంది వచ్చే ఈ ఆదర్శ పాఠశాలలకు రవాణా సౌకర్యాలు సరిగ్గా లేవు. మోడల్ స్కూళ్ల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నడిపే విద్యార్థి బస్సు కూడా కొన్ని పాఠశాలలకు తిరగడం లేదు. నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గాల్లోని తొమ్మిది పాఠశాలల్లో 7,335 మంది విద్యార్థులు చదువుతున్నారు.

బురద మార్గంలో నడుచుకుంటూ..

నందికొట్కూరు, మిడుతూరు: మిడుతూరు బస్టాండు నుంచి ఆదర్శ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు కి.మీ. మేర బురదలో నడుచుకుంటూ వెళుతున్నారు. పేరుకు సీసీ రోడ్డు ఉన్నా స్థానిక ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్డుపై నిలుస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది.

ప్రమాదకరంగా మారి..

పాణ్యం గ్రామీణం: మండలంలోని సుగాలిమెట్టలో ఉన్న ఆదర్శ, కస్తూర్బా పాఠశాలల విద్యార్థులు 18 కిలోమీటర్లకు పైగా దూరం ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. జాతీయ రహదారిపై దిగి అరకిలోమీటరుకు పైగా నడిచి వెళ్తున్నారు. వర్షం పడితే చాలు బురదలో ప్రయాణించడం తప్పడం లేదు.

ప్రయాణ భారం తప్పదు

గడివేముల: గడివేములకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఆదర్శ పాఠశాలలో 400 మంది చదువుతున్నారు. రెండు బస్సులు మాత్రమే ఉండటంతో విద్యార్థులు ఆటోల్లో వెళుతున్నారు. సరిపడా బస్సులు లేకపోవడంతో వంద మందికి పైగా వాటిలోనే కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు.

పరిశీలన

ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు

నందిపల్లె నుంచి తమడపల్లె వరకు బస్సు కోసం వాహనాలపై వస్తున్న విద్యార్థులు

కుదింపు.. కష్టాల మేళవింపు

మహానంది: మండల కేంద్రంలోని ఎం.తిమ్మాపురంలోని మోడల్ స్కూల్‌కు గతేడాది మూడు బస్సులు తిరిగేవి. ఈ ఏడాది ఒక బస్సును తగ్గించారు. దీంతో నందిపల్లె, బసవాపురం, ఆంజనేయపురం గ్రామాల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలపై వదిలిపెడుతున్నారు. గాజులపల్లెఆర్.ఎస్. నుంచి గోపవరం విద్యార్థులు నిత్యం కాలినడకన 4 కి.మీ.ల నడిచి విద్యాభ్యాసం చేస్తున్నారు.

నియోజకవర్గం	ఆదర్శ పాఠశాలలు	విద్యార్థులు
నంద్యాల	2	1640
నందికొట్కూరు	3	2,450
శ్రీశైలం	3	2,425
పాణ్యం	1	820

మౌలిక వసతులు కల్పించాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ నాయకుడు ఆది డిమాండ్ చేశారు. సోమవారం జూనియర్ కళాశాలను సందర్శించి సమస్యలపై ఆరా తీశారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలతో విలువైన జీవితాలను నాశనం చేసుకుని కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి సూచించారు. పాణ్యంలోని ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలల్లో సోమవారం విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.

చువ్వలు తేలి.. ప్రాణాలు బలి

నంద్యాల నుంచి బండిఆత్మకూరు వెళ్లే మార్గంలో కొత్తపల్లె సమీపంలో ఉన్న సంకల వాగుపై గతంలో వంతెన నిర్మించారు. నిర్వహణ పట్టించుకోకపోవడంతో వంతెనపై రహదారి దెబ్బతిని కడ్డీలు తేలాయి. గుంతలు సైతం పడటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వెంటనే స్పందించి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

చుట్టూ నీరు.. తప్పని అవస్థలు

బండిఆత్మకూరులోని సచివాలయం -1, ఐకేపీ కార్యాలయం, రైతు సేవా కేంద్రాల చుట్టూ వర్షం నీరు నిల్వ ఉండి కుంటను తలపిస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సమీప పంటపొలాల్లోని నీరంతా ఇక్కడికి చేరి నిల్వ ఉంటోంది. కార్యాలయాలకు వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆవరణమంతా పిచ్చిమొక్కలతో, గడ్డితో నిండిపోయింది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బండి ఆత్మకూరు

విత్తు వేసి.. ఎరువులకు క్యూకట్టి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎరువుల కోసం డీసీఎంఎస్ కేంద్రాల వద్ద రైతులు బారులుదీరుతున్నారు. యూరియా ఇతర ఎరువుల కోసం నిరీక్షిస్తున్నారు. ఆత్మకూరు మండల కేంద్రంతోపాటు బండి ఆత్మకూరు మండలం ఎ.కోడూరు సహకార సంఘం సొసైటీ వద్దకు సోమవారం భారీగా తరలివచ్చారు. గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో ఇబ్బందులు పడ్డారు. - న్యూస్‌టుడే, ఆత్మకూరు, బండి ఆత్మకూరు

ఆత్మకూరులో తప్పని నిరీక్షణ

బండి ఆత్మకూరు : సొసైటీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, సీపీఎం నేతలు

ఏటికి తరలుతున్న పీర్లు

నిమజ్జనానికి తరలిన పీర్లు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ముసలిమడుగులో పీర్లని మజ్జనం నిర్వహించారు. నాలుగు రోజుల పాటు, హుసేన్, హసేన్, ఇమామ్‌ఖాసీంఅలీ, అబ్బాస్ తదితర పీర్లకు ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఏటికి తరలించారు.

మహానంది, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం సాయంత్రం తిమ్మాపురం, అబ్బీపురం, గాజులపల్లె, బొల్లవరం తదితర గ్రామాల్లో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొన్నారు.

నంద్యాల గ్రామీణం: మండలంలో మొహర్రం కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అల్లా అక్బర్, ఇమాం ఖాసీం, పెద్ద హసన్, చిన్న హసన్, పెద్దమౌలాలి, దస్తగిరి తదితర పేర్లతో ఉన్న పీర్లకు ముజావర్లు ఫాతేహాలు నిర్వహించారు.

తిమ్మాపురంలో..

ప్రతి కుటుంబానికి వందరోజుల పని

వెలుగోడు, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి వందరోజుల పని, రూ.307 వేతనం కల్పిస్తామని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వెలుగోడు మండలంలోని గుంతకందాల గ్రామంలో సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఎస్ఆర్‌పీలు రాజు, లక్ష్మీనారాయణ, సర్పంచి అచ్చమ్మ, ఏపీవో నాగజ్యోతి, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రం అందజేస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

అభివృద్ధే ధ్యేయంగా పాలన

యాళ్లూరు(గోస్పాడు), న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని యాళ్లూరులో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ఏడాది పాలనా విజయాలను వివరించారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. పార్టీ మండల బాధ్యుడు తులసీశ్వరరెడ్డి, నాయకుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

గడివేముల, న్యూస్‌టుడే: మండలంలోని కొరటమద్ది మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాదాన్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. పాఠశాలలోని 30 మంది విద్యార్థులకు పుస్తకాలతో పాటు పెన్నులు, పెన్సిల్లు, ఇతర సామగ్రి అందించినట్లు విద్యాదాన్ సొసైటీ వ్యవస్థాపకులు డీబీ వెంకటేశ్వర్లు తెలిపారు. హెచ్ఎం విజయలక్ష్మి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మనోహర్, తెదేపా నాయకుడు సుకుమార్‌ఆచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేస్తున్న డీబీ వెంకటేశ్వర్లు

తైక్వాండో విజేతలకు అభినందన

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను డీపాల్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ ఫాదర్ షిన్స్ అభినందించారు. పాఠశాలకు చెందిన అబ్దుల్ రహిమాన్ 58 కిలోల విభాగంలో బంగారు పతకం, 45 కిలోల విభాగంలో మహ్మద్ జుబేర్ రజత పతకం, 35 కిలోల విభాగంలో ఉషారాణి కాంస్య పతకం సాధించారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ స్వామన్న, ఖాజాహుసేన్, పీఈటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంతో ఉత్తమ ఫలితాలు

సీతారామాపురం, (మహానంది), న్యూస్‌టుడే: ఆధునిక వ్యవసాయంతోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి బి.నాగేశ్వరరెడ్డితో కలిసి సోమవారం మహానంది మండలం సీతారామాపురం గ్రామంలోని శ్రీభువన రైతు గ్రూపునకు రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం ద్వారా డ్రోన్ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం 80% సబ్సిడీతో డ్రోన్ పరికరాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ నాగేంద్రుడు, భూపాల్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేలిన నియంత్రిక.. తప్పిన ప్రమాదం

వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు పట్టణంలోని రోఖియాబి దర్గా.. సంత మార్కెట్ సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రిక సోమవారం ఒక్కసారిగా పేలి మంటలు వ్యాపించాయి. నియంత్రికతోపాటు తీగలు కాలిపోయాయి. ఈ ప్రమాదంతో సమీప ఇళ్లల్లోని టీవీలు, ఫ్యాన్లు, కంప్యూటర్లు, ఇతర విద్యుత్తు పరికరాలు దెబ్బతిన్నాయని జనం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు నియంత్రిక పేలిన సమయంలో అక్కడే ఉన్న జనాలు ఒక్కసారిగా పరుగులు తీశారు. విద్యుత్తు శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే స్పందించి సరఫరా ఆపేశారు.

రోటరీక్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రోటరీక్లబ్ ఆఫ్ నంద్యాల 2025-26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రోటరీ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో అధ్యక్షునిగా ముక్కమళ్ల వివేకానందరెడ్డి, ఉపాధ్యక్షునిగా ఎస్.ప్రసాదరెడ్డి, కార్యదర్శిగా కామిని బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా లక్క భూషణం, కోశాధికారిగా లక్ష్మీకాంతరెడ్డిలను ఎనుకున్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలిగా ఎంఎన్.మల్లేశ్వరి, కార్యదర్శిగా రుణుక, జాయింట్ కార్యదర్శిగా పద్మ, కోశాధికారిగా సుధాకుమారి, జయమ్మలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ముఖ్య అతిధులుగా ఎలెక్ట్ గవర్నర్ కేశవరెడ్డి, పీడీజీలు శ్రీరామమూర్తి, చిన్నపురెడ్డి, శ్వేతారెడ్డి, బీవీ. రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందరెడ్డికి బాధ్యతలు అప్పగిస్తున్న కేశవరెడ్డి

ఉచిత వైద్య పరీక్షలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నల్లకాల్వ గ్రామంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి బాలునాయక్‌తో కలిసి కాలనీలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటరమణ, సిహెచ్‌వో శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి

పగిడ్యాల, న్యూస్‌టుడే: విత్తనాలు ఎరువులు, పురుగు మందుల దుకాణదారులు తప్పనిసరిగా నింబధనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి డి.మురళీధర్ సూచించారు. పగిడ్యాలలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మండల పరిధిలోని వివిధ గ్రామాల ఎరువులు, పురుగు మందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. లైసెన్స్, స్టాక్‌బోర్డు, ధరల పట్టికలు ప్రతి షాపులో ఏర్పాటు చేయాలని సూచించారు. నాసిరకం, లూజు విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యోగాలో శిక్షణ

శ్రీశైలం, నందిసర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో ప్రతి మంగళ, బుధవారాల్లో ఉచిత యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. క్షేత్ర పరిధిలోని చంద్రావతి కల్యాణ మండపంలో ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు శిక్షన ఉంటుందన్నారు. స్థానికులు, ఉద్యోగులు, సత్రాల సిబ్బంది, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పూరిల్లు దగ్ధం

గాజులపల్లె, (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో సచివాలయం-2 సమీపంలో సోమవారం రాత్రి విద్యుత్ ప్రమాదంలో పూరిగుడిసె దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లబోతుల పెద్ద కుళ్లాయి కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురం జిల్లా గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి ఆదివారం వెళ్లారు. ప్రమాదం జరిగే సమయానికి ఇంట్లో ఎవరూ లేనందున పెద్ద ప్రాణ నష్టం తప్పిందన్నారు. గుడిసెలో ఉన్న నిత్యావసర వస్తువులు, సరుకులు, దుస్తులు, టీవీ, బీరువాతోపాటు ఇతర వస్తువులు కాలిపోయాయి.

విజయవంతం చేద్దాం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మెగా పండగను విజయవంతం చేద్దామని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. కలెక్టర్ రాజకుమారి సోమవారం నిర్వహించిన వెబ్‌నార్ సమావేశంలో పాణ్యం ఎంఈవో కార్యాలయం నుంచి పాల్గొన్నారు. 10న నిర్వహించనున్న మెగా పీటీఎం 2.0కు సంబంధించి సూచనలు అందించారు.

మహాసభల జయప్రదానికి వినతి

జూపాడుబంగ్లా(నందికొట్కూరు), న్యూస్‌టుడే: ఈ నెల 13వ తేదీ జరిగే మండల మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద కరపత్రాలను విడుదల చేశారు.

అరటికి బీమా

మహానంది, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఖరీఫ్ 2025 పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్‌డబ్ల్యూబీ సీఐఎస్)లో భాగంగా అరటిపంటకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు నంద్యాల ఉద్యానశాఖాధికారి శ్రీధర్ స్పష్టం చేశారు. నంద్యాల జిల్లాలో అరటి పంటలను ఈ పథకానికి ఎంపిక చేసినట్లుగా తెలిపారు. రైతులు పట్టాదారు, బ్యాంక్ పాసుపుస్తకం, ఆధార్ కార్డుల జిరాక్సులతో పాటు, పంట ధ్రువీకరణ పత్రాలను ఆయా గ్రామాల్లోని వీఏఏ/వీహెచ్‌ఏ/వీఎస్ఏలలో తీసుకోవాలని సూచించారు. ఆయా పత్రాలతో కామన్ సర్వీస్ సెంటర్‌లో గానీ, మీసేవా కేంద్రాల్లోగానీ బీమా చేయించుకోవాలని వివరించారు. బీమా కంపెనీ ద్వారా నియమించిన మధ్యవర్తుల (పీవోఎస్‌పీ) బ్యాంక్ నందు రైతులు తెలిపిన పత్రాలతో ఎకరాకు రూ.2,750 చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. ఎకరాకు బీమా మొత్తం రూ.55 వేలు వర్తిస్తుందని తెలిపారు. ఈనెల 15వ తేదీలోగా అరటి రైతులు ప్రభుత్వం కల్పించిన సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సున్నిపెంటలోని ఎమ్మార్పీఎస్ భవనంలో సోమవారం ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, జాతీయ నాయకులు రాబిన్‌సన్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పీఠాధిపతి డా.ముసుగు శ్రీనివాసరావు, ఎంఈఎఫ్ జిల్లా నాయకులు వేశపోగు లక్ష్మయ్య, శ్యాంబాబులు పలు ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణ చేశారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగేళ్ల సురేశ్, పాపయ్య, యోహాన్, రాజు, యోగయ్య, రాము, తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షించి.. విన్నవించి

☛ న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

ఈనాడు డిజిటల్, నంద్యాల : తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు విన్నవించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన బాధితులు తరలివచ్చారు. తమ సమస్యలను అధికారులకు ఏకరవు పెట్టారు. ఆలనాపాలనా చూడడం లేదని ఒకరు.. ఎవరిదో భూమి తమ పాసు పుస్తకంలో చేర్చారని.. పథకాలు తమకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వేరే వారి భూమి చూపుతున్నారు

ఈ చిత్రంలోని రైతు పేరు పి.సుబ్బారెడ్డి. ఈయనది బేతంచెర్ల మండలం తవిసికొండ గ్రామం. ఆయన భార్య పి.పుష్పావతి పేరుతో ఉన్న 1.6 ఎకరాల భూమికి అదనంగా మరో 5.40 ఎకరాలు కలిపి చూపుతున్నారు. మొత్తం 8 ఎకరాల భూమిగా ఉండటంతో రేషన్ కార్డు ఇవ్వడం లేదని బాధితుడు వాపోయారు. గత కొన్నేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. వెంటనే తగిన చర్యలు చేపట్టాలని.. అర్హుడైన తనకు రేషన్ కార్డు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పథకం అందలేదు

ఈ చిత్రంలోని మహిళ పేరు పసుపుల లక్ష్మి. ఈమెది బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామం. ఆమె కుమార్తె ఏడో తరగతి చదువుతోంది. ఈమె అర్హురాలైనప్పటికీ తల్లికి వందనం నగదు జమ కాలేదు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని బాధితురాలు వాపోయారు. వెంటనే పరిశీలించి రెండో విడత జాబితాలో తమ వివరాలు చేర్చాలని విన్నవించారు.

పంచమఠాల్లో విశేష పూజలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలోని పంచమఠాల్లో సోమవారం విశేష పూజలు జరిగాయి. ఆయా మఠాల్లోని శివలింగం, దేవతామూర్తులకు అర్చకులు సంప్రదాయబద్ధంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఘంటామఠం ప్రాంగణంలో దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు బిల్వం, దేవతామొక్కలను నాటారు. వర్షాకాలం ముగిసేలోపు క్షేత్ర పరిధిలో 3వేల మొక్కలను నాటటం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈవో తెలిపారు.

శివలింగానికి విశేష అలంకరణ

మహానంది క్షేత్రంలో..

మహానంది, న్యూస్‌టుడే: మహానంది క్షేత్రంలో గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లకు రెండో రోజు సోమవారం ద్వాదశిని పురస్కరించుకొని విశేష పూజలు చేసి ఉపవాస దీక్షలు విరమించారు. గాజులపల్లె, గోపవరం, తిమ్మాపురం, బుక్కాపురం, తమడపల్లె తదితర గ్రామాల్లోని శివ, కోదండ రామ, విష్ణుమూర్తి ఆలయాల్లోని దేవతామూర్తులను దర్శించి పూజించుకున్నారు. మహానంది దేవస్థానంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

వైభవంగా శోభాయాత్ర

ఆధ్యాత్మికం

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం.. నాగులకుంట రోడ్డులో శిర్డీ సాయిబాబా శోభాయాత్రను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 10వ తేదీన గురుపౌర్ణమి నేపథ్యంలో ముందస్తుగా వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయం నుంచి నాగులకుంట రహదారి, కల్పనసెంటర్, బస్టాండ్ మీదుగా శోభాయాత్ర జరిపారు. పల్లకిలో సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ట్రాక్టరులో బాబా చిత్రపటాన్ని ఉంచి భజనలు చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టణంలో ఊరేగింపు

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

డోన్, ప్యాపిలి, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని పేరంటాలమ్మ గుడి సబ్‌స్టేషన్ వద్ద 33 కేవీ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా మంగళ, బుధవారాల్లో మల్లెంపల్లె ఫీడర్, హైవే ఫీడర్ల కింద విద్యుత్తు సరఫరాకు అంతరాయం కల్గుతుందని డీఈఈ నాగేంద్ర తెలిపారు. పట్టణంలోని శ్రీరామనగర్, టీచర్స్‌కాలనీ, వైఎస్ఆర్ నగర్, కోట్లవిజయభాస్కర్‌రెడ్డినగర్, నల్లగుట్ట, పాతగీతా ఐస్ పరిశ్రమ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్తు కోత ఉంటుందన్నారు. ప్యాపిలి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పట్టణంలోని వెంగళాంపల్లి, ఎన్.రంగాపురం, వెంకటాంపల్లి గ్రామాల్లో మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్తుశాఖ అధికారులు వెల్లడించారు. వినియోగదారులు గమనించాలని చెప్పారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి తరుణ్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ గీత సోమవారం తెలిపారు. నంద్యాలలోని నెరవాటి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో తమ విద్యార్థి పాల్గొని ప్రతిభ చూపాడన్నారు. విద్యార్థిని అభినందిస్తూ ఇదే విజయస్ఫూర్తితో భవిష్యత్తు పోటీల్లో రాణించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

బత్తలూరు(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ?: నందింపల్లె గ్రామంలో వీధి దీపాలు లేక అంధకారం నెలకొంది. విషపురుగులు సంచరిస్తున్నాయి. **- వాసు, నందింపల్లె.**

✔: పరిశీలించి వీధిలైట్లు ఏర్పాటు చేస్తాం. **- అశ్విన్, ఈవోపీఆర్డీ.**

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: బుగ్గానిపల్లె గ్రామంలో మాలపేట కాలనీ చర్చి సమీపంలో విద్యుత్ తీగలు కిందికి వాలి ప్రమాదకరంగా ఉన్నాయి. **- సుమంత్, బుగ్గానిపల్లె.**

✔: కాలనీలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. **- మధుసూదన్‌రెడ్డి, విద్యుత్ ఏడీ.**

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని శిరివెళ్ల రామునిమాన్యం కాలనీలో సీసీ రహదారులు ఏర్పాటు చేయాలి. **- ఉమామహేశ్వరి, స్థానికురాలు.**

✔: సీసీ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. **- అశ్విన్‌కుమార్, ఈవో, శిరివెళ్ల.**

బనగానపల్లి, న్యూస్‌టుడే: ?: బనగానపల్లి పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న వీధిలో చెత్తచెదారం రోడ్డు పక్కనే పేరుకు పోయింది. **- మోహన్, కాలనీవాసి.**

✔: సిబ్బందితో పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటాం. **- సతీష్‌కుమార్‌రెడ్డి, ఈవో.**

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: రెవెన్యూ క్వార్టర్స్ వీధిలో ప్రధాన రహదారిపై సీసీ రోడ్డు వేయలేదు. వర్షాకాలంలో రహదారి బురదమయంగా మారుతోంది. **- లక్ష్మణ్, రెవెన్యూ క్వార్టర్స్ వీధి**

✔: ఆ ప్రాంతాన్ని పరిశీలించి సీసీ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తాం. **- సురేష్, మున్సిపల్ ఏఈ.**

ట్రాఫిక్ సమస్యలా?

డోన్, న్యూస్‌టుడే: ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బంది పడటం, కళాశాలలు, పాఠశాలల వద్ద యువకులు ఈవ్ టీజింగ్‌లకు పాల్పడుతున్నారా, జాతీయ రహదారిలో ఏమైనా సమస్యలున్నాయా, పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా సరైన న్యాయం అందడం లేదా ఇలాంటి వాటిని నేరుగా డోన్ డీఎస్పీ దృష్టికి తీసుకువెళ్లవచ్చు. 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డీఎస్పీ శ్రీనివాసులుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. ఆయన స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తారు.

తేదీ: జులై 8వ తేదీ (మంగళవారం)
సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 వరకు
✆: 9121101113, 8008574912

నేడు పరికరాల ఎంపిక శిబిరం

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం దివ్యాంగులు, వృద్ధులకు సహాయ పరికరాల ఎంపిక కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో నాగరాజు సోమవారం తెలిపారు. నియోజకవర్గంలోని దివ్యాంగులు, వృద్ధులు సంబంధిత ధ్రువపత్రాలను తీసుకొని రావాలన్నారు.

చదువుల ప్రయాణం.. అగమ్యగోచరం

○ ఆదర్శ పాఠశాల విద్యార్థుల అగచాట్లు

పరిశీలన

విద్యార్థుల నిరీక్షణ

ఉయ్యాలవాడ, చాగలమర్రి, న్యూస్‌టుడే: ఉయ్యాలవాడ ఆదర్శ పాఠశాలలో ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు 650 మంది విద్యార్థులు చదువుతున్నారు. సమీప గ్రామాల నుంచి 175 మంది విద్యార్థి బస్సులో వస్తున్నారు. దాదాపు 12 కి.మీ. దూరంలో ఉన్న సర్వాయిపల్లె, పెద్దయమ్మనూరు నుంచి 50 మంది విద్యార్థులు బస్సులో ప్రయాణిస్తున్నారు. ఆళ్లగడ్డ డిపో బస్సు ఉదయం 6.30 గంటలకు సర్వాయిపల్లె, ఉదయం 6.45 పెద్దయమ్మనూరు చేరుకొని ఉయ్యాలవాడ ఆదర్శ పాఠశాలకు ఉదయం 7.30 గంటలకు చేరుకుంటుంది. ప్రతి రోజు ఉదయమే విద్యార్థులు పాఠశాలకు రావటానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇదే బస్సు సాయంత్రం 4 గంటలకు ఆళ్లగడ్డ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను కోటకందుకూరులో వదిలి 5.30 గంటలకు ఉయ్యాలవాడ చేరుకుంటుంది. అక్కడ గంట పాటు నిరీక్షణ చేస్తున్న విద్యార్థులు బస్సులో ఇంటికి వెళ్లే సరికి సాయంత్రం 6 గంటలు దాటుతోంది. బస్సు బయలుదేరు వేళల్లో మార్పులు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. బడి బస్సులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పలు మార్గాల్లో బస్సు సర్వీసులు లేవు. ఉన్న రూట్లలో సమయానికి రాక ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పటం లేదు. సమయానికి పాఠశాలలకు వెళ్లలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. చేసేదేంలేక విద్యార్థులు నడుచుకుంటూనో, సైకిళ్లపైనో, ఇతర ప్రైవేట్ వాహనాలపై వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

కిక్కిరిసిన బస్సు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు బస్సుల కోసం బస్టాండులో గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. పట్టణానికి 5 కి.మీ. దూరంలో గల ఆదర్శ పాఠశాలకు వెళ్లేందుకు పట్టణంలోని పలు కాలనీలకు చెందిన విద్యార్థులు పాతబస్టాండు వద్ద మరికొందరు కొత్తబస్టాండు వద్ద బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. ఆర్టీసీ సంస్థ విద్యార్థుల కోసం మొత్తం ఏడు బస్సులు తిప్పుతోంది. ఇందులో నాలుగు బస్సులు ఆదర్శ పాఠశాలకే ట్రిప్పులు వేస్తున్నాయి. పల్లెల నుంచి డోన్‌కు బస్సులు చేరుకోవడానికి కొన్నిసార్లు ఆలస్యం అవుతోంది. సోమవారం ఉదయం స్థానిక పాతబస్టాండుకు 8.37గంటలకు విద్యార్థి బస్సు వచ్చింది. విద్యార్థులకు సమయాభావం కావడమే కాక బస్సు కిక్కిరిసి పోవడంతో ఇబ్బందిపడ్డారు. ఒకరినొకరు తోసుకుంటూ బస్సెక్కాల్సిన పరిస్థితి. బస్సులోపలా కిక్కిరిసిపోవడంతో అవస్థపడ్డారు. ఇక్కడ ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 700 మంది విద్యార్థులు చదువుతుండగా 300మందికి పైగానే గ్రామీణ ప్రాంతాల నుంచి బస్సుల ద్వారా ఈ విద్యాలయానికి వెళ్తుంటారు.

సుపరిపాలన తెదేపాతోనే సాధ్యం

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ఆచారి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలకు పథకాలు అందుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. సుపరిపాలన తెదేపాతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ బాషా తెదేపా నాయకులు రామాచారి, చరణ్, బండారు భాస్కర్ యాదవ్, వీరన్న పాల్గొన్నారు.

రోడ్డు ఛిద్రం... ప్రయాణం దుర్భరం

ఆళ్లగడ్డ మండలం ఆర్.కృష్ణాపురం గ్రామం నుంచి బాచేపల్లె రహదారి అధ్వానంగా మారింది. రోడ్డు దెబ్బతిని తారు లేచిపోవడంతో గుంతలు పడ్డాయి. 3 కి.మీ ఉన్న ఈ దారిలో రూ.4.50లక్షల నిధులతో ఆర్అండ్‌బీ శాఖ అధికారులు ఇటీవల మరమ్మతులు చేసినా ఫలితం లేదు. రోడ్డు చాలా చోట్ల ఛిద్రమై ప్రయాణానికి ఇబ్బందికరంగా మారింది. చాగలమర్రి నుంచి అహోబిలానికి ఈ దారిలోనే భక్తులు అధికంగా ప్రయాణిస్తుంటారు. అధికారులు రోడ్డు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం)**

రక్షణ కవచం.. హరితహారం

బనగానపల్లి పట్టణంలోని పెట్రోలు బంకు కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండు వెళ్లే రహదారి విభాగిని వెంట మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ సొంత నిధులతో ప్రజల భాగస్వామ్యంతో మొక్కలు నాటించారు. సంరక్షణ చర్యల్లో సోమవారం భాగంగా స్థానికులు మొక్కల చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. మొక్కలు నాటి కంచె వేసి సంరక్షణ బాధ్యత చేపట్టడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, బనగానపల్లి**

ప్రమాదకరంగా విద్యుత్తు తీగ

ఆళ్లగడ్డ పట్టణంలోని వక్కిలేరు వంతెన పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్తు లైన్ ఉంది. లైన్ కోసం ఏర్పాటు చేసిన స్తంభానికి సపోర్టింగ్ కోసం నేరుగా స్తంభానికే ఒక అల్యూమినియం విద్యుత్తు తీగను కట్టి దాన్ని వక్కిలేరు వంతెనకు కట్టారు. లైన్‌లో ఏ చిన్న ప్రమాదం జరిగినా వంతెనపై కాలిబాటపై రాకపోకలు సాగించే ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యుత్తు అధికారులు తీగను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ**

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా

ద్విచక్రవాహనాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఇంతియాజ్‌బాషా

డోన్, న్యూస్‌టుడే: పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధించాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయం వద్ద ట్రాఫిక్ నియంత్రణకు కొత్తగా రెండు నూతన ద్విచక్రవాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాహనాల ద్వారా పట్టణంలో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది ఎప్పటికప్పుడు కృషి చేస్తారన్నారు.

సంక్షిప్త సమాచారం

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలను సంబంధిత అధికారులు నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించాలని ఎంపీడీవో, తహసీల్దార్ శివమల్లేశ్వరప్ప, విజయశ్రీ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నకంబలూరు(రుద్రవరం), న్యూస్‌టుడే: చిన్నకంబలూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో రామాంజనేయులు, భాస్కర్, నరసింహులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన భద్రాద్రి భావనారాయణ స్వామి ఆలయ, పద్మశాలీయ సంఘం అధ్యక్షుడిగా ఉన్న కల్లా రామకృష్ణ పద్మశాలీయులు నివాళి అర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ పద్మశాలీయులు సోమవారం సంస్మరణ సభ ఏర్పాటు చేశారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: రాంపల్లె గ్రామంలో మొహర్రం ప్రశాంతంగా నిర్వహించాలని ఆర్ఐ విశ్వనాథ్ అన్నారు. ఆందోళనకు తావులేకుండా జరగాలని ఉద్దేశంతో గ్రామ పెద్దలతో తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు.

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: దిగువ అహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయ ఆవరణలోని అద్దాల మండపం పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. సుమారు రూ.20లక్షలు నిధులతో మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు మణియార్ సౌమ్యనారాయణన్ తెలిపారు.

డోన్, న్యూస్‌టుడే: భారత ఎన్నికల సంఘం, ఐఐఐడీఈఎం ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని బూత్ లెవెల్ అధికారులకు ఈనెల 8వ తేదీ నుంచి 11 వరకు ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ నరసింహులు తెలిపారు.

బాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని బాచేపల్లె గ్రామంలో సోమవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. అహోబిలం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.స్వాతి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: పేద సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా నాయకులు అబ్దుల్ సిద్దిక్ పేర్కొన్నారు. గ్రామంలో సోమవారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెదేపా మండల ప్రధాన కార్యదర్శి హనీఫ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వేణుగోపాల్, ఎంఆర్పీఎస్ తాలూకా కార్యదర్శి మున్ని మద్దిలేటి, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ సంజీవరాయుడు పాల్గొన్నారు.

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: రేబిస్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మండల పశువైద్యశాఖ అధికారి డా.దస్తగిరి పేర్కొన్నారు. యర్రగుంట్ల, శిరివెళ్ల గ్రామాల్లో సోమవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేవీవోలు కృష్ణదేవరాయ రెడ్డి, తులశమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

ద్విచక్రవాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

డోన్, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం డోన్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అన్వర్, అబ్బాస్‌ల ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ నుంచి బైక్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, మోటారాముడు, రామ్మోహన్, వెంకటేశ్‌గౌడ్, భాస్కర్‌కృష్ణ పాల్గొన్నారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం ప్యాపిలి పట్టణంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి చిన్న రహిమాన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: రవాణా రంగానికి ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు సుధాకర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మి అన్నారు. కోవెలకుంట్లలోని జీపు, కారు డ్రైవర్ల యూనియన్ నాయకులను సోమవారం కలిసి 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కోగిల సుధాకర్, నాగరాజు, గిరి, రమణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంజామల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ అన్నారు. ఈ మేరకు సంజామలలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు.

ఈనెల 10న సమావేశం

సంజామల, న్యూస్‌టుడే: విద్యాసంస్థల్లో ఈ నెల 10న జరుగనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని విజయవంతం చేయాలి తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంపీడీవో సాల్మన్ చెప్పారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దారు, ఎంపీడీవో, మండల విద్యాధికారి ఈశ్వరయ్య, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు సక్రమంగా అందించడంలేదు

డోన్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎస్.వలసల గ్రామంలో రేషన్ డీలరు నిత్యావసర సరకులు సక్రమంగా అందించటం లేదని, డీలరుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సోమవారం తహసీల్దారు రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన పలువురు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల వేదికలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో డీలరు రేషన్ బియ్యం తూకంలో తక్కువగా వేస్తున్నారని, చక్కెర ప్యాకెట్లను నిర్ణయించిన ధర కంటే అధిక ధర వసూలు చేస్తున్నారని ఆరోపించారు. డీలరుపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థులు సుధాకర్, రామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



తహసీల్దారు రవికుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎస్.వలసల గ్రామస్థులు

క్రియాశీల సభ్యుల సమావేశం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైఫల్యాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైకాపా జిల్లా పరిశీలకులు కల్పలతారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వైకాపా కార్యాలయంలో క్రియాశీల సభ్యుల విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో వైకాపా జిల్లా ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

బనగానపల్లి గ్రామీణం, పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని నందివర్గం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2008 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్వ విద్యార్థులు మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచారు. పాణ్యం మండలం అలమూరుకు చెందిన సుబ్రహ్మణ్యం ఇటీవల మృతిచెందడంతో రూ.51వేల నగదును సోమవారం బాధిత కుటుంబానికి అందించారు.

బేతంచెర్ల,న్యూస్‌టుడే: బేతంచెర్లకు చెందిన రమేశ్ గత కొన్ని రోజుల కిందట మృతిచెందారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆయన కుటుంబానికి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ వంతు ఆర్థికసాయం అందించారు. వెల్దుర్తిలోని సోషల్ వెల్ఫేర్ ఎస్సీ బాలుర వసతి గృహంలో సోమవారం వారు రూ.55 వేల నగదును స్నేహితుడి కుటుంబానికి అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మందకృష్ణ అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ పయనించాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌ఛార్జి ఇరిగెమాను నాగేశ్వరరావు అన్నారు. కోవెలకుంట్లలోని స్వామినగర్ కాలనీలో మండల కోఇన్‌ఛార్జి, పట్టణ అధ్యక్షుడు నవీన్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి సంఘం వ్యవస్థాపకులు ఓబులేసు, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, విజయ్, చుక్కరాజు, రఘు, ప్రవీణ్, చుక్క బాలస్వామి, అర్లప్ప పాల్గొన్నారు.

విద్యాశాఖ పట్టించుకోకపోవడం దారుణం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని పడకండ్లలో ఒకే ప్రాంగణంలో రెండు ఎయిడెడ్, ఒక ప్రైవేటు పాఠశాలలను నిర్వహిస్తూ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసీ నాయకుడు బి.ఓబులేసు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఒకే ప్రాంగణంలో హెచ్‌పీటీ, వాసవీ ఓరియెంటెడ్ అనే రెండు ఎయిడెడ్ పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఇక్కడున్న ఎయిడెడ్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేవన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు జయరాజ్, వెంకట్, రియాజ్, కత్తి ఓబులేసు, నాయక్ పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలకు వినతి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో చిన్నారి హరిప్రియ మృతికి కారణమైన పాఠశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డీవీవైఏ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ డిమాండ్ చేశారు. సోమవారం పలు విద్యార్థి సంఘాల నాయకులు డీఎస్పీ కె.ప్రమోద్‌కుమార్‌ను కలిశారు. రియాజ్ మాట్లాడుతూ కీర్తన హైస్కూల్‌లో ఎల్‌కేజీ చదువుకుంటున్న హరిప్రియ అదే పాఠశాల బస్సు కిందపడి మరణించిన ఘటన పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం సూచిస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఓబులేసు, పూల వెంకట్, రవీంద్ర నాయక్, జయరాజ్, కత్తి ఓబులేసు, రమేష్ పాల్గొన్నారు.

డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న డీవీవైఏ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్

పేర్ల మార్పిడిపై చర్యలు తీసుకోవాలి

డోన్, న్యూస్‌టుడే: తమకు సంబంధించిన స్థలాన్ని మరొకరి పేరిట ఆన్‌లైన్‌లో మార్చడంపై చర్యలు తీసుకోవాలని డోన్‌కు చెందిన పలువురు పాత్రికేయులు వాపోయారు. సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆర్డీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. పాత్రికేయులు నాగరాజు, రాజు, వలీ బాషా, శివరామయ్య ఆచారి, గోపికృష్ణ, శేఖర్, సుధాకర్, కల్యాణ్, నాగరాజు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో నిమజ్జనానికి వెళ్తున్న పీర్లు

చిన్నమల్కాపురంలో స్వాముల ఊరేగింపు

బాచేపల్లెలో..

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ముహమ్మద్ ప్రవక్త(సొ.అ.వ) మనవడు ఇమామ్ హుస్సేన్(ర.అ) త్యాగనిరతికి తార్కాణమైన మొహర్రంను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వారం రోజులుగా చావిళ్లలో కొలువైన పీర్లకు భక్తులు ఫాతెహాలు సమర్పిస్తూ వచ్చారు. చివరి రోజు సోమవారం పీర్లను నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. బాచేపల్లె గ్రామంలో మొహర్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం మౌలాలీ, చిన్న, పెద్ద కాశీం, బాదుల్లా పీర్లను అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లి ఊర్లోని బావి వద్ద నిమజ్జనం చేశారు.

చిన్నమల్కాపురం(డోన్), న్యూస్‌టుడే: చిన్నమల్కాపురంతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం భక్తిశ్రద్ధల నడుమ పీర్లస్వాములకు ఊరేగింపు నిర్వహించారు. యువకులు అగ్నిగుండాలను మూసివేసి వాటిచుట్టూ నృత్యాలు వేస్తూ పీర్లను ఏటికి పంపారు. ఊరేగింపును తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: ముత్యాలపాడు గ్రామంలో భక్తిశ్రద్ధల నడుమ మొహర్రం నిర్వహించారు. లాలుస్వామి చావిడి వద్ద భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. కార్యక్రమంలో రసూల్, మాబుసుభాని, సయ్యద్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలపాడులో..

నీరివ్వని పథకాలు.. నిరాశలో రైతులు

పరిశీలన

గ్రామాల్లో ఎత్తిపోతల పథకం మూలకు చేరాయి. నిర్వహణకు నిధుల్లేక నిరుపయోగంగా మారాయి. మరమ్మతులకు నోచుకోక సాగునీరు సరిగా అందడం లేదు. సక్రమంగా నిర్వహణ కొనసాగిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా నీటి మీద రాతలయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వమైనా చొరవ చూపి అవసరమైన నిధులు మంజూరు చేసి పర్యవేక్షించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు కరవు

సంజామల, బనగానపల్లి, న్యూస్‌టుడే: ఖరీఫ్ నేపథ్యంలో అక్కంపల్లె రైతులు సాగు ప్రారంభించారు. ఎత్తిపోతల పథకం ఆదుకుంటుందనే ఉద్దేశంతో ఇప్పటికే పత్తి, మినుము, మొక్కజొన్న తదితర పంటలు సాగుచేశారు. ఆ పథకం నీటి గొట్టాలు పగిలిపోవటంతో ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు అందే పరిస్థితి అన్నదాతకు కన్పించటం లేదు. అక్కంపల్లె సమీపంలో కుందూ నది వరదనీరు అక్కంపల్లె ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని మళ్లించేందుకు వీలుగా ఎనిమిదేళ్ల క్రితం రూ.25 కోట్లతో పథకం నిర్మించి 2018 నవంబరులో ప్రారంభించారు. ఈ పథకం కింద 2 వేల ఎకరాలు ఆయకట్టు భూమి ఉంది. నేడు పథకం పైప్‌లైన్ దెబ్బతిని ఆయకట్టుకు నీరు అందటం లేదు. పథకం అందుబాటులోకి వస్తే మంచి దిగుబడులను సాధించేవారమని రైతులు చెబుతున్నారు. గొట్టాల ఏర్పాటుకు సాగునీటి సంఘం సభ్యులతో చర్చించి చర్యలు చేపడతామని నీటి పారుదల అధికారి నారాయణరెడ్డి తెలిపారు.

ఉపయోగపడని వైనం

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ఉయ్యాలవాడలో కుందూ నది ఒడ్డున నిర్మాణాత్మకంగా చేపట్టిన ఎత్తిపోతల పథకం రైతులకు ఉపయోగపడక వృథాగా మారింది. 2001లో ఎత్తిపోతల నిర్మాణానికి రూ.40 లక్షల ప్రపంచ బ్యాంకు నిధులను ఖర్చు చేసింది. దీని పరిధిలో 525 ఎకరాలకు సాగునీరు అందించాలి. అప్పట్లో ఎత్తిపోతలకు కేసీ కాల్వను అనుసంధానం చేసుకొని ఉయ్యాలవాడ, పడిగపాడు, ఇంజేడు గ్రామాల పరిధిలోని 1,050 ఎకరాలకు సాగు నీరు అందించారు. సాగు నీటితో పత్తి, మిరప, మినుము పంటలు సాగు చేశారు. పథకం గొట్టం మార్గం దెబ్బతినటంతో ఆయకట్టుకు సాగు నీరు రావటం లేదు. దీంతో ఆరేళ్లుగా పథకం దిష్టిబొమ్మలా మారింది.

(c) eenadu

ఈనాడు ఒడిశా
మంగళవారం జులై 8, 2025

బాలేశ్వర్‌లో వరదలు

బాలేశ్వర్ బజారు వీధిలో వరద

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలేశ్వర్ పట్టణంలో సోమవారం భారీ వర్షాలు కురిశాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. రోడ్లపై రెండడుగుల నీరు ప్రవహించింది. 8, 10, 12, 16వ నెంబరు వార్డుల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని నీటిని పురపాలక సంఘం అధికారులు యంత్రాలతో తోడేశారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. బాలేశ్వర్ జిల్లాలోని రెమునా, జలేశ్వర్ సమితుల్లోనూ వర్షాలు కురిశాయి.

ప్రమాదస్థాయి చేరువలో వైతరణి

భారీ వర్షాలతో భద్రక్ జిల్లా అఖువాపద వద్ద వైతరణి నదిలో నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరువైంది. ఇక్కడ ప్రమాదస్థాయి 18.33 మీటర్లు కాగా సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో నీటిమట్టం 18.03 మీటర్లుగా ఉన్నట్లు జలవనరుల శాఖ అధికారవర్గాలు తెలిపాయి. ప్రవాహం మరింత పెరిగితే తిహిడి, ధాంనగర్ సమితులతోపాటు జాజ్‌పూర్ జిల్లాకూ ముప్పు ఉంటుంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పరిస్థితిపై నిఘా ఉంచామని జిల్లా పాలనాధికారి దిలీప్‌రౌత్రాయ్ విలేకర్లకు తెలిపారు.

అఖువాపద వద్ద వైతరణి వరద నీరు

అలక మానవే...తలుపుతీయవే

★ రథయాత్రకు తెర ★ నేడు జగన్నాథుని నీలాద్రి బిజె

స్వామి నైవేద్యానికి సిద్ధం చేసిన రసగుల్లాలతో సేవాయత్‌లు

గోపాలపూర్, న్యూస్‌టుడే: 'మహాలక్ష్మీ నేను నీ ప్రియసఖుడిని. నాపై అలక మాని తలుపు తీయి' అంటూ జగన్నాథుడు ప్రియసఖిని బతిమాలాడుకునే ఘట్టం మంగళవారం రాత్రి జరగనుంది. నేత్రపర్వం చేయనుంది. అలిగిన లక్ష్మి స్వామి రసగుల్లాలు ఇచ్చి శాంతపరచి ఆలయ ప్రవేశం చేసే ఘట్టం కమనీయం, రమణీయం. విశ్వప్రసిద్ధ పూరీ రథయాత్రలో ఇది అంతిమ ఘట్టం.

చతుర్ధామూర్తుల ఆలయ పొహండి

ఆషాఢమాసం శుక్లపక్షమి త్రయోదశి తిథిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి జగన్నాథ, బలభద్ర, సుభద్ర, సుదర్శనుల (చతుర్ధామూర్తులు) నీలాద్రిబిజెలో భాగంగా ఆలయ పొహండి జరగనుంది. మూర్తులను సేవాయత్‌లు శ్రీక్షేత్రంలోని గర్భగుడిలో రత్నసింహాసనంపై ఆసీనం చేయిస్తారు.

రసగుల్లాల పండగ

నీలాద్రి బిజెను భక్తులు రసగుల్లాల ఉత్సవంగా ఆచరిస్తారు. రథాలపై కొలువుదీరి ఉన్న దారు విగ్రహాలకు రసగుల్లాలు నైవేద్యం చేయడం ఆనవాయితీ. పూరీ బొడొదండోలో మంగళవారం అడుగడుగునా రసగుల్లాలు, ఛెన్నాపుడొ తదితర జున్ను మిఠాయి విక్రయాలు జరుగుతాయి.

ఇబ్బందులు విన్నారు... న్యాయం చేశారు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి, ఆయన మంత్రివర్గ సహచరులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు సోమవారం వినతులు విన్నారు, విన్నపాలు విని పింఛనవారికి న్యాయం చేశారు. భువనేశ్వర్ యూనిట్-2 పరిధిలోని సీఎం వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది.

దివ్యాంగుడి దరఖాస్తులు పరిశీలిస్తున్న సీఎం మోహన్

ఈసారి దివ్యాంగులు, వ్యాధి పీడితులు అధికంగా వచ్చారు. ముఖ్యమంత్రి వారి వద్దకెళ్లి ఇబ్బందులు విని అక్కడికక్కడ పరిష్కరించారు. అనంతరం సీఎం విలేకర్లతో మాట్లాడుతూ తాను ప్రజల సేవకున్ని అని, వారికి సేవ చేయడం తన ధర్మమన్నారు. వినతుల స్వీకరణ కార్యక్రమం భువనేశ్వర్‌కే పరిమితం కాదని, గతంలో సంబల్‌పూర్‌లోనూ ఈ కార్యక్రమం నిర్వహించామని, తాము త్వరలో రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలు, పట్టణాల్లో చేపడతామన్నారు.

భూతాపం మానవాళికి పెనుముప్పు

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి: సీఎం

వేదికపై సంచిక విడుదల చేస్తున్న సీఎం మోహన్, మంత్రి ఖుంటియా, ఎమ్మెల్యే, మేయరు, అధికారులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భూతాపం మానవాళికి పెనుముప్పుగా పరిణమించింది, ప్రతిఒక్కరు అప్రమత్తం కావాల్సిన సమయం ఆసన్నమైందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. సోమవారం భువనేశ్వర్‌లోని డీఏం ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి 76వ వనమహోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో భూతాపం నియంత్రణలోకి వస్తుందని, మొక్కల సంరక్షణ, కాలుష్య నివారణతో ఇది సాధ్యమని చెప్పారు. బాలబాలికలు ఈ దిశగా అవగాహన పెంచుకోవాలని, తల్లిదండ్రులతో కలిసి తమ నివాస గృహాల్లో మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వం దీన్ని ఉద్యమంగా చేపట్టిన నేపథ్యంలో ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖల మంత్రి గణేశ్‌రామ్ సింగ్ ఖుంటియా, భువనేశ్వర్-ఏకామ్ర ఎమ్మెల్యే బాబుసింగ్, మేయరు సులోచనాదాస్, అటవీ, పర్యావరణ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యబ్రత సాహు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు వేదికపై సంచిక ఆవిష్కరించారు. తర్వాత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

మొక్క నాటి నీరు పోస్తున్న ముఖ్యమంత్రి

మూడోసారి సామల్ ఏకగ్రీవం

సీఎం, పర్యవేక్షకుడు, ఇతర నేతల సమక్షంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న మన్మోహన్ సామల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మరో మూడేళ్లు మన్మోహన్ సామల్ భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షునిగా సేవలందిస్తారు. సోమవారం భువనేశ్వర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన ఒక్కరే అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి, కేంద్ర పర్యవేక్షకుడు సంజయ్ జైశ్వాల్, ఎన్నికల అధికారి, బాలేశ్వర్ ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగి, ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సమక్షంలో వారి హర్షధ్వానాల మధ్య నామినేషన్ పత్రాలు సమర్పించారు. మంగళవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

విద్యార్థి నేతగా ప్రస్థానం ప్రారంభం

భద్రక్ జిల్లా ధాంనగర్‌కు చెందిన మన్మోహన్ విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. ఆరెస్సెస్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న ఆయన 1999లో తొలిసారిగా భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టారు. 2000లో రాజ్యసభ ఎంపీగా ఎంపికయ్యారు. 2004లో ధాంనగర్ నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. నాటి బిజద, భాజపా కూటమి ప్రభుత్వంలో రెవెన్యూ, విపత్తుల నివారణ, ఆహార, పౌరసరఫరాల శాఖల మంత్రిగా విధులు నిర్వహించారు. 2023లో రెండోసారి భాజపా రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవమయ్యారు. ఆయన నాయకత్వంలో గతేడాదిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కమలదళం రాష్ట్ర పాలనా పగ్గాలు సొంతం చేసుకుంది. చిరకాల వాంఛ నెరవేరింది. 20 పార్లమెంటు స్థానాలనూ కైవసం చేసుకుంది.

సమీపించిన స్థానిక సంస్థల ఎన్నికలు

2026 సంవత్సరాంతంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత పురపాలక ఎన్నికలకు నగారా మోగనుంది. అధికారంలో ఉన్న భాజపాకు స్థానిక సంస్థల ఎన్నికలు కీలకం. బిజద చేతిలో ఉన్న జడ్పీ, సమితులు, పంచాయతీలను రానున్న ఎన్నికల్లో సొంతం చేసుకోవాలన్న ధ్యేయంతో భాజపా మళ్లీ సామల్‌కి పార్టీ పగ్గాలు కట్టబెట్టాలని నిర్ణయించింది. అనుభవం, విధేయత, దూరదృష్టి గల నేతగా గుర్తింపు పొందిన సామల్‌కు వ్యతిరేకులు లేరు. ఇదంతా పరిశీలించిన దిల్లీ పెద్దలు మూడోసారి అధ్యక్ష పీఠం కట్టబెట్టారని పరిశీలకులు పేర్కొన్నారు.

కేంద్ర కార్యవర్గానికి 32 మంది

కేంద్ర భాజపా కార్యవర్గంలో సభ్య పదవులకు 32 మంది రాష్ట్ర నేతలు నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష పదవిపై ఆశలు పెంచుకున్న సీనియర్ నాయకుడు గోలక్ మహాపాత్ర్ విలేకర్లతో మాట్లాడుతూ క్రమశిక్షణకు భాజపా మారోపేరని, కేంద్ర నాయకత్వం నిర్ణయం శిరోధార్యమన్నారు. ఇందులో ఎవరికీ ఎలాంటి అసంతృప్తి లేదని, కలిసిమెలిసి పార్టీ కోసం పనులు చేయడం అందరి బాధ్యతని చెప్పారు.

సామల్‌కు నేతల అభినందన

అధ్యక్ష పదవికి ఏకగ్రీవమైన సామల్‌కు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులంతా అభినందించారు. మంగళవారం భువనేశ్వర్‌లోని కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించనున్నారు.

స్నేహశీలిని కోల్పోయాం

నారాయణమూర్తి చిత్రపటం వద్ద పుష్పాలుంచి నివాళులర్పిస్తున్న సంఘం ప్రతినిధులు ఇతరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక 'తెలుగు బ్రాహ్మణ సేవా సంఘం' (టీబీఎస్ఎస్) మాజీ కార్యదర్శిగా, 'వైదిక సంఘం' అధ్యక్షునిగా భానుదేవపురపు నారాయణమూర్తి ఎన్నో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించిన కార్యదక్షత గలవారని వక్తలన్నారు. నారాయణమూర్తి మృతికి సంతాపంగా టీబీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక నీలకంఠనగర్ హౌసింగు బోర్డులో గాయత్రీ మందిరం ఆవరణలోని వేద భవనంలో సంతాప సభ నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన టీబీఎస్ఎస్ అధ్యక్షుడు పూడిపెద్ది సత్యనారాయణ (బాబు) మాట్లాడుతూ నారాయణమూర్తి మృతితో మంచి స్నేహశీలిని కోల్పోయామని చెప్పారు. రాజమండ్రిలో ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో నారాయణమూర్తి, ఆయన చిన్న కుమారుడు ఉదయ భాస్కర్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల వ్యవధిలో ఇద్దరూ కన్నుమూశారని అన్నారు. నిర్వాహక సంఘం కోశాధికారి వనమాలి విశ్వేశ్వర శర్మ, ఇతర ప్రతినిధులు మావుదూరు చంద్రశేఖర్, టి.శ్రీనివాస్, జయంతి కామేశ్వర శర్మ, కె.పి.కృష్ణారావు, టీవీ బాబ్జీ, ఆర్.వి.రామ శర్మ, ఎన్.ఎన్.మూర్తి, టి.వి.రమణ, వి.జగన్నాథరావు తదితరులు పాల్గొని నారాయణమూర్తితో తమకున్న అనుబంధాన్ని వివరించారు. అంతకుముందు వారంతా ఆయన చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి, పుష్పాలుంచి, మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. చివరిగా నారాయణమూర్తి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ వేద పండితులు శాంతి మంత్రం పఠించారు.

ఆసుపత్రి నుంచి నవీన్ డిశ్చార్జ

ముంబయి ఆసుపత్రిలో వైద్యులతో నవీన్ పట్నాయక్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న బిజద అధినేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ సోమవారం డిశ్చార్జ్ అయ్యారు. ఆయన ఆరోగ్య పరిస్థితి బాగుందని నవీన్ వ్యక్తిగత కార్యదర్శి సంతృప్త మిశ్ర ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీలు, పరీక్షలు అవసరమని, దీన్ని దృష్టిలో పెట్టుకుని కొద్దిరోజుల వరకు ముంబయిలో ఉంటారని పేర్కొన్నారు. కొద్ది రోజుల్లో భువనేశ్వర్ చేరుకుంటారని తెలిపారు.

పతక వీరులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బర్మింగ్‌హోంలో జరిగిన ప్రపంచ పోలీసు, అగ్నిమాపక క్రీడలు-2025 పోటీల్లో రాష్ట్ర పోలీసులు పతకాల సాధించారు. ఇందులో ఆదివారం జరిగిన పురుషుల హాఫ్ మారథాన్ అంశంలో రాష్ట్ర క్రీడాకారుడు అశోక్‌దండసేన మొదటిస్థానంలో నిలిచి పసిడి పతకం గెలుచుకోగా మహిళా విభాగంలో ఇదే పోటీలో సుష్మిత తిగ్గ రెండోస్థానం పొంది రజత పతకం కైవసం చేసుకున్నారు. ఇదే పోటీల్లో నిర్వహించిన వివిధ అథ్లెటిక్స్ అంశాల్లో వీరిద్దరు పలు పతకాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే.

పసిడి పతకంతో అశోక్ దండసేన. సుష్మిత తిగ్గ

రోడ్లు ఛిద్రం.... ప్రయాణం నరకం

అధ్వానంగా కిముడుగుడ రహదారి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో గత 15 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రోజుల తరబడి కురిసే వర్షాలతో జాతీయ రహదారిపై గోతులు ఏర్పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. గ్రామీణ రహదారుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. నందపూర్, దశమంత్‌పూర్, పొట్టంగి, సిమిలిగుడ సమితిల్లో గ్రామీణ రహదారులపై ప్రయాణం నరకాన్ని చూపిస్తున్నాయి. మట్టి రోడ్లు కావడంతో వర్షానికి బురదగా మారి వాహనాలు అందులో నిలిచిపోతున్నాయి. ద్విచక్ర వాహనదారులు పడే అవస్థలు వర్ణనాతీతం. గ్రామీణ రహదారులను అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నడిచి వెళ్లేందుకు కూడా అవస్థలు పడుతున్నారు. దీనిపై జిల్లా పరిషత్ కార్య నిర్వాహక అధికారి వేణుధర్ సబర్‌ను ప్రశ్నించగా జిల్లాలో చాలా వరకు రహదారుల అభివృద్ధి జరిగిందని, మిగిలిన రహదారుల కోసం కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.

రాణి కోనా రోడ్డు ఇలా

గోతులమయంగా లుంగీరి- రాజన్నగుడ రహదారి

రత్నభాండాగారం మరమ్మతులు పూర్తి

అరవిందపాఢి

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జగన్నాథుని రత్న భాండాగారం లోపల, వెలుపల మరమ్మతులు పూర్తయినట్లు శ్రీక్షేత్ర పాలనాధికారి అరవిందపాఢి సోమవారం సాయంత్రం పూరీలో విలేకర్లకు చెప్పారు. 95 రోజుల్లో 333 గంటలు పనులు జరిగాయని, ఈ వ్యవధిలో స్వామి సేవలు, భక్తుల దర్శనాలకు అంతరాయం కలగలేదని తెలిపారు. భాండాగారం పైకప్పు పనులతోపాటు గోడలకు మరమ్మతులు జరిగాయని, లోపల స్టీల్ ఫ్రేమింగ్, గోడలకు రసాయన ప్లాస్టరింగ్ పనులు జరిగాయన్నారు. తాత్కాలిక స్ట్రాంగ్‌రూంలో ఉంచిన లోపలి భాండాగారంలోని స్వామి ఆభరణాలు మళ్లీ యథాస్థానానికి తెచ్చిన తర్వాత లెక్కింపు జరుగుతుందన్నారు. ఇదంతా ప్రభుత్వ నియమావళి ప్రకారం అధ్యయన సంఘం పర్యవేక్షణలో చేపడతామన్నారు. జగన్నాథుని కృపతో పనులన్నీ సవ్యంగా జరిగాయని, పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ ఇటీవల చూసి సంతృప్తి వ్యక్తం చేసిన సంగతి గుర్తు చేశారు. నిర్ణీత వ్యవధిలో పురావస్తుశాఖ(ఏఎస్ఐ) బాధ్యతగా మరమ్మతులు పూర్తి చేసినట్లు పాఢి పేర్కొన్నారు.

హరిత ఉద్యమం... సమన్వయంతో ప్రతిఫలం

'ప్రకృతి బంధు' అవార్డుల ప్రదానం


'ప్రకృతి బంధు' అవార్డులు అందుకున్న వారితో అతిథులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: పర్యావరణం కాపాడేందుకు, పచ్చదనం పెంచేందుకు ప్రజలు, వివిధ ప్రభుత్వశాఖలు కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలొస్తాయని అటవీశాఖ రీజనల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్' (ఆర్‌సీసీఎఫ్, బ్రహ్మపుర) ఎన్. విశ్వనాథ్ అన్నారు. బ్రహ్మపుర అటవీ డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాస్థాయి వన మహోత్సవాలు, 2024-25 సంవత్సరానికిగాను 'ప్రకృతి బంధు' అవార్డుల ప్రదాన కార్యక్రమం ఏర్పాటైంది. గంజాం జిల్లా ఛత్రపురం సమితిలో సింధూరపల్లిలోని నగరవనం ఆవరణలో నిర్వహించిన వేడుకలకు ఆర్‌సీసీఎఫ్ విశ్వనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని పిలుపు మేరకు 'అమ్మ పేరిట మొక్క' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాం జిల్లాలోని జనాభా ప్రకారం ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు చొప్పున నాటి, సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. బ్రహ్మపుర అటవీ అధికారి (డీఎఫ్‌వో) సన్నీ ఖొఖర్ అధ్యక్షతన జరిగిన దీనికి ఎకో క్లబ్ సమన్వయకర్త డాక్టర్ శంకర నారాయణ బెజ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఇంకా ఇందులో అతిథులుగా దక్షిణ ఘుముసుర డీఎఫ్‌వో బిపాస పరుల్, ఉత్తర ఘుముసుర డీఎఫ్‌వో హిమాంశు శేఖర్ మహంతి, ఛత్రపురం సబ్ కలెక్టరు శిబాశీష్ బొరాల్ తదితరులు అతిథులుగా పాల్గొని మాట్లాడారు.

సేవలకు అభినందనలు

గంజాం జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, హరిత ఉద్యమానికి విశేషంగా కృషి చేస్తున్న 22 మందికి అతిథులు 'ప్రకృతి బంధు' అవార్డులు అందజేశారు. ఒక్కొక్కరికి రూ.10 వేల పారితోషికం, ప్రశంసాపత్రం అందించి వారి సేవల్ని అభినందించారు. గంజాం జిల్లాతోపాటు గజపతి తదితర జిల్లాల్లో పిచ్చుకల సంరక్షణకు దశాబ్దానికిపైగా ఉద్యమిస్తున్న ఆంచలిక వికాస్ పరిషత్ (గుంఠొబంధొ) కార్యదర్శి బిజేంద్ర మాఝి అవార్డు అందుకున్నవారిలో ఉన్నారు.

వచ్చే ఏడాది కొత్త ఆభరణాలు

పృథ్వీరాజ్ హరిచందన్

గోపాలపూర్, న్యూస్‌టుడే: అపార సంపద ఉన్న పూరీ జగన్నాథునికి సున్నాభెషా వేడుకలో పాత ఆభరణాలనే వినియోగిస్తున్నారని ఎంతో మంది భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురుషోత్తమునికి తొడుగుతున్న స్వర్ణ కిరీటంలో డిజైన్ నాలుగుచోట్ల తెగినట్లు కనిపిస్తోంది. రెండేళ్ల కిందట స్వామి ఆభరణాలకు మరమ్మతులు చేశారు. విలువైన సంపద రహస్యగదిలో నిక్షిప్తం చేయడం తగదని, ఉత్సవాల్లో తొడిగితే వైభవం రెట్టింపవుతుందని సేవాయత్‌లు పేర్కొన్నారు. దీనిపై న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఆదివారం రాత్రి పూరీలో విలేకర్లతో మాట్లాడుతూ రత్నభాండాగారం మరమ్మతులు పూర్తయిన నేపథ్యంలో ఆభరణాల లెక్కింపు ప్రక్రియను డిజిటలైజేషన్ చేయిస్తామన్నారు. 2026 రథయాత్ర, సున్నాభెషా వేడుకలో స్వామికి నూతన ఆభరణాలతో అలంకరణ చేయించాలన్న ధ్యేయంతో ఉన్నామన్నారు. జగన్నాథునికి రెండేసి సెట్లు ఆభరణాలు తయారు చేయాలని అంతా కోరుతున్నందున త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

అక్షరాస్యత పెంపునకు కసరత్తు అవసరం

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో స్థానిక సద్భావన సభాగృహంలో ఆదివారం సాయంత్రం కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కొరాపుట్, రాయగడ, నవరంగపూర్, మల్కాన్‌గిరి జిల్లాల విద్యా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి ఆయా జిల్లాల తాజా ఫలితాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన జిల్లాలుగా గుర్తింపు పొందిన అవిభక్త కొరాపుట్ జిల్లాలో అక్షరాస్యత పెంపొందించడానికి ప్రత్యేక కసరత్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గిరిజన గ్రామాల్లో విద్యపై ప్రత్యేక కసరత్తు చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం ప్రవేశపెడుతున్న నూతన విద్యా విధానాలపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. అన్ని సమితిలలో ఆదర్శ విద్యాలయాలు, వసతి గృహాలు ఏర్పాటు చేయడంపై నివేదిక పంపించాలని అధికారులకు సూచించారు.

సమీక్షా సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

మహానదిలో పెరుగుతున్న నీటిమట్టం

- హిరాకుడ్ నుంచి విడుదలవుతున్న నీరు
- వరదల పరిస్థితి లేదన్న మంత్రి సురేష్

హిరాకుడ్ జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: హిరాకుడ్ జలాశయం నుంచి 20 స్లూస్‌గేట్లు ఎత్తి మహానదికి నీరు విడుదల చేస్తున్నారు. దీంతో నదిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో బరగడ్, బౌద్ధ్, సోన్‌పూర్ జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల పంట పొలాల్లోకి సోమవారం స్వల్పంగా నీరు చేరింది. ఇదింకా పెరిగే అవకాశం ఉంది. ఛత్తీస్‌గఢ్ ఎగువ ప్రాంతాల్లో వానలు కురుస్తున్నందున హిరాకుడ్ రిజర్వాయరులోకి సెకనుకు 3,42,433 క్యూసెక్కుల నీరు ప్రవేశిస్తోంది. 3,35,649 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి జలాశయంలో నీటిమట్టం 609.79 అడుగులుగా ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. మరోవైపు వర్షాల వల్ల ఝార్సుగుడ, మయూర్‌భంజ్, బరగడ్ జిల్లాలు ప్రభావితమయ్యాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. ఝార్సుగుడలోని లైకిరా సమితి రోడ్డు కొట్టుకుపోయింది. దీనిపై రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖల మంత్రి సురేష్‌పూజారి భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో నదులేవీ ప్రమాదస్థాయి దాటలేదని, వరద పరిస్థితి లేదన్నారు. పశ్చిమంలోని కొద్ది జిల్లాల్లో వర్షాల వల్ల ఇబ్బందులు కలిగాయని, ఎప్పటికప్పుడు పరిస్థితి సమీక్షిస్తున్నామన్నారు. దెబ్బతిన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తామన్నారు.

సురేష్‌పూజారి

పోలీసుల ఎదుట లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొంధమాల్ జిల్లా పోలీసుల ఎదుట సోమవారం ముగ్గురు మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు మహిళలున్నారు. వారు బంశధార-ఘుముసుర-నాగావళి (బీజీఎన్) డివిజనల్ కమిటీ సభ్యురాలు (డీసీఎం) మాదె బెటి అలియాస్ చంపా (30), కలహండి-కొంధమాల్-బౌద్ధ్-నయాగఢ్ (కేకేబీఎన్) డివిజన్‌కు చెందిన ఏరియా కమిటీ (ఏసీఎం) సభ్యుడు రాజు దొడి అలియాస్ అజయ్ (35), అడ్మొ మాధ్వి అలియాస్ మంజు (27)లని దక్షిణ మండల ఐజీ నితీ శేఖర్ చెప్పారు. మధ్యాహ్నం కొంధమాల్ జిల్లా కేంద్రం ఫుల్బాణీలోని పోలీసు జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఐజీ నితీ శేఖర్ ఆ వివరాలు తెలిపారు. చంపా 2009 నుంచి, అజయ్ 2016 నుంచి, మంజు 2011 నుంచి మావోయిస్టు ఉద్యమంలో ఉన్నారన్నారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ క్యాడర్ అని, కలహండి, కొంధమాల్, బౌద్ధ్ జిల్లాల్లో క్రియాశీలకంగా ఉద్యమంలో పాల్గొనేవారని తెలిపారు. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లలో మావోయిస్టు ఉద్యమాన్ని చురుకుగా నిర్వహించేందుకు వీరు పనిచేసేవారని వివరించారు. గతంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో పాల్గొన్నారన్నారు. మావోయిస్టుల వ్యతిరేక ఆపరేషన్లు, ఉద్యమంపై నిరాశ చెందిన వీరు లొంగిపోయారని పేర్కొన్నారు. వీరికి ప్రభుత్వ ప్రోత్సాహంతోపాటు పునరావాస ప్యాకేజీ ఇస్తామని ఐజీ తెలిపారు. విలేకరుల సమావేశంలో కొంధమాల్ ఎస్పీ హరీష్ బి.సి., 127 సీఆర్పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ పంకజ్ వర్మ పాల్గొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులు. చిత్రంలో దక్షిణ మండల ఐజీ నితీ శేఖర్, అధికారులు

(c) eenadu

ధర్మేంద్రకు 'కళింగరత్న' అవార్డు

ధర్మేంద్ర ప్రధాన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు 'కళింగరత్న' అవార్డు ప్రదానం చేయనున్నారు. రాష్ట్ర సరళా సాహిత్య సంసద్ 45వ వార్షికోత్సవం ఈ నెల 15న కటక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటుచేశారు. ఇందులో ధర్మేంద్రకు అవార్డుతో సత్కరించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పాల్గొని సత్కరిస్తారని సరళా అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ స్వయిన్, కార్యదర్శి డాక్టర్ నిరంజన్ కటక్‌లో ఆదివారం రాత్రి విలేకరులకు చెప్పారు. ఉత్కళ విశ్వవిద్యాలయం (భువనేశ్వర్)లో స్నాతకోత్తర (పీజీ) డిగ్రీ సాధించిన ధర్మేంద్ర విద్యార్థి దశ నుంచే క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. సేవల్లో ముందుండేవారు. కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా సమర్థత నిరూపించుకున్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రిగా దేశవ్యాప్తంగా కేంద్ర నూతన విద్యావిధాన(ఎన్ఈపీ) విజయవంతంగా అమలు చేస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని 'కళింగరత్న' అవార్డుతో సత్కరించాలని నిర్ణయించినట్లు సరళా సంస్థ ప్రతినిధులు తెలిపారు.

కొరాపుట్ జిల్లాలో క్రీడా సౌకర్యాలు సమకూరుస్తాం

మాట్లాడుతున్న మంత్రి సూర్యవంశీ, మంత్రి నిత్యానంద

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో 14 సమితులలో మౌలిక సదుపాయాలతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఉన్నత విద్య, క్రీడాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ వెల్లడించారు. జిల్లా కేంద్రం కొరాపుట్‌లో మినీ సద్భావన భవనంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మంత్రి సూర్యవంశీ, విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండ్ మాట్లాడారు. ఇద్దరు మంత్రులు రాష్ట్రంలో విద్యాభివృద్ధిపై మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సూర్యవంశీ మాట్లాడుతూ కొరాపుట్‌లో విద్యాభివృద్ధికి కృషి చేశామని, 40 శాతం గిరిజనులు నివసిస్తుండే కొరాపుట్ జిల్లాలో గిరిజన విద్యార్థుల సాంకేతిక విద్య కోసం ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కేంద్రీయ విశ్వవిద్యాలయంలో కోర్సులు ప్రారంభమవుతున్నాయన్నారు. జిల్లాలో 14 సమితులలో 14.50 కోట్ల రూపాయలతో స్పోర్ట్స్ కాంప్లెక్సు ఏర్పాటు చేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రంలో 1,352 అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రజల కోసం పనిచేయండి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: అన్ని విభాగాల అధికారులు ప్రజల కోసం పనిచేయాలని పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర కదం సూచించారు. నందపూర్‌లో జిల్లా యంత్రాంగం ద్వారా సోమవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేసి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని, వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మహిళలకు రుణాల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కదం

కంసావతి రైల్వే బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై రాకపోకల నిషేధం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్- మిడ్నాపూర్ నడుమ కంసావతి నదిపై రైల్వే బ్రిడ్జి ఉంది. దీని ఫుట్‌పాత్ మార్గం గుండా జనాల రాకపోకలు చేయకూడదని రైల్వే శాఖ నోటీసులు జారీ చేసింది. కంసాయి, లిలువా ఇతర గ్రామాల వారు వ్యతిరేకిస్తున్నారు. ఈ మార్గం మూసివేయడంతో 40 కిలోమీటర్ల దూరం తిరిగి తమ ఇళ్లకు రాకపోకలు చేయాల్సి వస్తుందని వారు వాపోతున్నారు.

పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలిన రెండిళ్ల గోడలు

కలియపోదలో కూలిన ఇంటిగోడ

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కాశీపూర్ సమితిలో గత పదిరోజులుగా కురుస్తున్న వానలకు ఇంటి గోడలు కూలిపోతున్నాయి. సమితిలో దుడుకబలి పంచాయతీ కలియపోద గ్రామంలో బలినాయక్ ఇంటి గోడ కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లోనే నిద్రిస్తున్నారు. వారి పక్కనే గోడ రాత్రి 11 గంటల సమయంలో కూలిపోయింది. ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. సొంకరాడ గ్రామం బ్రాహ్మణవీధిలో గగనకుమార దాస్ ఇంటి గోడ రాత్రి కురిసిన వానకు కూలిపోయింది.

సమావేశంలో పాల్గొన్న శ్రీవారి భక్తులు

శ్రీవారి సేవకు 155 మంది

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ పాతకోళీ శ్రీవేంకటేశ్వర ఆలయం తరఫున బాలాజీ కల్యాణ మండపంలో ఆదివారం శ్రీవారి భక్తులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తిరుమల సేవకు వెళ్లే భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.శ్రీకాంత్ మాట్లాడుతూ మొత్తం 155 మంది శ్రీవారి సేవకులు జులై 20న తిరుపతి వెళ్లనున్నారని, వారం రోజులు సేవలు చేస్తారని తెలిపారు.

అలంకరణలో ముగ్గురుమూర్తులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ కొత్తకోళీ శ్రీ జగన్నాథ మందిరంలో వైభవంగా రథయాత్ర సాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి జగన్నాథ, బలభద్ర, సుభద్రమ్మవార్లకు బంగారు ఆభరణాలతో అలంకరించి సున్నాబెషా వేడుకలు అర్చకస్వాములు జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై దేవదేవులను దర్శించుకున్నారు.

గర్భగుడిలోకి దేవదేవుళ్లు

రథంపై జగన్నాథ, బలభద్ర, సుభద్ర

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం పట్టణంలో రథాలపై ఉన్న దేవదేవుళ్లను సోమవారం రాత్రికి గర్భ గుడిలోకి తీసుకుని వెళ్లారు. అదివారం దేవుళ్లకు బంగారు ఆభరణాలు అలంకరించారు.

శ్రీక్షేత్ర శిఖరాన మహాదీప ప్రజ్వలన

భక్తుల ప్రార్థనలు

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: హరియన ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి పూరీ శ్రీక్షేత్ర శిఖరాన మహాదీప ప్రజ్వలన వేడుక జరిగింది. ఇక్కడ నిష్ఠగా వ్రతాలు చేసిన భక్తులంతా తిలకించి దీపారాధన చేశారు. ఒకవైపు జగన్నాథ, బలభద్ర, సుభద్రల 'సున్నాబెషా' వేడుక జరుగుతుండగా, మరోవైపు ఆలయ శిఖరాన ఏకాదశి సేవలు కొనసాగాయి.

మొక్కలు నాటి చైతన్యం

కళింగ విద్యా మందిర్ బయట విద్యార్థుల ప్రదర్శన. చిత్రంలో అతిథులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'వన మహోత్సవాల' సందర్భంగా బ్రహ్మపురంలోని ఆస్పత్రి రోడ్డు మొదటి గేటు సమీపాన రమ్యపతి నగర్ ప్రాంతంలోని కళింగ విద్యా మందిర్‌లో ప్రముఖులు అభిషేక్ పాత్ర్, శంకర మాఝి, అశోక్ కుమార్ సామంత మొక్కలు నాటారు. మీనాక్షినగర్‌లోని సెయింట్ జేవియర్స్ పాఠశాల ఆవరణలోనూ ఇదే కార్యక్రమం నిర్వహించారు. బిజద ఆధ్వర్యంలో ప్రకృతి ప్రేమికుడు సుభాష్ మహారాణా నాయకత్వంలో నగరంలోని వివిధ చోట్ల పలు జాతుల మొక్కలు నాటి, వాటి రక్షణకు చుట్టూ కంచె అమర్చారు.

ఉపాధ్యాయుడు కాహ్నుచరణ్‌బెహరా రచించిన శిశు కవితా పుస్తకం 'ఫుల్ పాఖుడ' సోమవారం కొరాపుట్ జిల్లా బొయిపరిగూడలో ఆవిష్కరించారు.
–న్యూస్‌టుడే, జయపురం

చెట్టు నేలకొరిగి నిలిచిన రాకపోకలు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితిలో సోమవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాంతో టంగిణిగూడ చౌక్, లింబాగూడ గ్రామాల వద్ద భారీ వృక్షాలు నేలకొరిగి బొయిపరిగుడ- మల్కాన్‌గిరి రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి చెట్లను తొలగించారు.

చెట్టు కొమ్మను తొలగిస్తున్న ఉద్యోగి

మొక్కలు నాటండి... పర్యావరణాన్ని కాపాడండి

ఏకపేడ్‌మాకే నామ్ ప్రమలో పరుల్, స్వాతి

రాయగడ పట్టణం, గుణుపురం, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబం విలువైన మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని కలెక్టర్ పరుల్ పట్వారీ అన్నారు. ఖరి జోల్ల గ్రామ సమీపంలో కొత్త హనుమాన్ మందిర కొండపై సోమవారం అటవీశాఖ తల్లి పేరున ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఎస్పీ స్వాతి ఎస్‌కుమార్, ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక, డీఎఫ్‌వో సచిన్ అన్నా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ వద్దకు డోలీతో మోత

డోలీలో రోగిని తీసుకొస్తున్న బంధువులు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే; రాయగడ జిల్లా కాశీపూర్ సమితిలో పలు గ్రామలకు రహదారులు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. 108 వాహనాలు వచ్చినా అవి ప్రధాన రహదారిలో గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో నిలిచిపోవాల్సి వస్తోంది. శనివారం సాయంత్రం కాశీపూర్ సమితి సిరి సరపస గ్రామానికి చెందిన లచిమాఝీ (44) తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఆయనను ఆసుపత్రికి తీసుకొని వెళ్లేందుకు కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ బాసింగిమాలి కొండ వరకు వచ్చి నిలిచిపోయింది. సరపస గ్రామానికి చేరుకోలేమని రోడ్డు సరిగా లేదని వాహన సిబ్బంది తెలిపారు. దాంతో చేసేది లేక కుటుంబ సభ్యులు, బంధువుల దుప్పటితో డోలీ కట్టి కొండ పైనుంచి మోసుకుని అంబులెన్స్ వద్దకు తీసుకొచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రోడ్డు నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన గంజాం బ్యాడ్మింటన్ పోటీలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గంజాం జిల్లా బ్యాడ్మింటన్ సంఘం తరఫున స్థానిక ఇంజినీరింగ్ స్కూల్ క్రీడామైదానంలోని ఇండోర్‌హాల్లో జరిగిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఇందులో అండర్-19, సీనియర్, మాస్టర్ కేటగిరీలలో నిర్వహించిన సింగిల్స్ డబుల్స్ బాలబాలికల తుదిపోరు మ్యాచులలో సత్యనారాయణ జెనా, సత్యరంజన్, ఎ.సాయిలక్ష్మిరావు, సమీర్ గంటా, బి.సరోజ్‌దొర, ప్రతీక్ దొళాయి, శిబప్రసాద్ పాఢి, శ్రవణ్‌కుమార్ విజేతలుగా నిలిచారు. రన్నర్‌లుగా జహాన్‌ఠాకూర్, అమృత్ అభిలాష్, జి.రోషన్‌రెడ్డి, అర్పిసపండా, రుద్రప్రతాప్ సామంత, కేశవ్ బెహరా, తహీర్ మహమ్మద్ నిలిచారు.

బహుమతులతో సీనియర్, మాస్టర్ క్రీడాకారులు. చిత్రంలో నిర్వాహకులు

జైహింద్‌నగర్‌లో దంపతుల మృతి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ జైహింద్‌నగర్ రైల్వే క్వార్టర్స్‌లో దంపతుల మృతదేహాలు లభించడం సోమవారం కలకలం రేగింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం భార్య దీపా మెహతా(26) పీక కోసిన మృతదేహం పడి ఉండగా, భర్త విక్రమ్‌పుత్ర(37) ఉరేసుకొని మృతి చెందాడు. పక్కన మూడేళ్ల బాలిక ఏడుస్తూ కనిపించిందని చెప్పారు. విక్రమ్ వృత్తి రీత్యా డ్రైవరు. ఈ ఘటన వెనుక కారణాలు తెలియలేదని, స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పైకప్పు పడి మహిళ మృత్యువాత

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా డాబుగావ్ ఠాణా పరిధిలో జామగూడ గ్రామానికి చెందిన అర్జున్ పనక కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రపోతుండగా, అర్ధరాత్రి ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో ఇంటి పైకప్పు అర్జున్ భార్య రూబీపనక(62)పై పడింది. ఆమె తీవ్రంగా గాయపడటంతో కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మరో ఘటనలో రైతు దుర్మరణం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: గోడ కూలడంతో ఓ రైతు మృతిచెందిన ఘటన సుందర్‌గడ్ జిల్లాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. టికాయత్‌పాలి పోలీసుల కథనం మేరకు... సొరసర గ్రామానికి చెందిన దేబేంద్ర భైంసా(54) అనే రైతు తన కూరగాయల పంట కాపలా కోసం పొలానికి వెళ్లాడు. అక్కడ మట్టిగోడలతో నిర్మించిన గుడిసెలో నిద్రిస్తుండగా ఒక్కసారిగా గోడ కూలిపోయింది. దీంతో మట్టిపెల్లలు కింద దేబేంద్ర మృతిచెందాడు.

పాత కక్షలతో ఒకరి హత్య

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా గొళంత్రా ఠాణా పరిధిలోని సింఘబాడి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దిలీప్ (మొంటు) పాత్ర్ (50) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఆ సమయంలో ఇద్దరు యువకులు ఆయన ఇంటి తలుపులు తట్టారు. బయటకు వచ్చిన పాత్ర్‌తో వాగ్వాదానికి దిగిన యువకుల్లో ఒకరు తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేసి పరారయ్యాడు. శరీరంలో పలు చోట్ల తీవ్ర గాయాలైన పాత్ర్ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. పోలీసులు గ్రామానికి చేరుకుని, మృతదేహాన్ని పరీక్షకు తరలించి దర్యాప్తు చేపట్టారు. పాతకక్షలతో ఈ హత్య జరిగినట్లు ప్రాథమికంగా తెలిసింది.

వాహనం ఢీకొని మూగజీవులు బలి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు ఆవులు మృతి చెందగా మరో నాలుగు ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది.

యువకుడి గల్లంతు

గౌరవ్‌బిప్రా

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: సుందర్‌గడ్ జిల్లా బాదల్‌గిరి జలపాతంలో ఓ యువకుడు గల్లంతైన ఘటన బాధిత కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజ్‌గంగపూర్‌కు చెందిన 13 మంది స్నేహితులు బాదల్‌గిరి జలపాతం వద్ద విహారయాత్రకు వెళ్లారు. వీరంతా స్నానానికి జలపాతంలోకి దిగగా గౌరవ్ బిప్రా(22) అనే యువకుడు గల్లంతయ్యాడు. అగ్నిమాపక సిబ్బంది గాలిస్తున్నారు.

బైకుల చోరీ కేసులో నలుగురి అరెస్టు

నవరంగపూర్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. ఎస్సై శివాజీ పండా తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న సబ్‌డివిజనల్ కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి సీమాంచల్ పాఢి పార్కు చేసిన వాహనం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించి తెప్పగూడకు చెందిన రాజ్‌కుమార్ హరిజన్, చతేయిగూడకి చెందిన బబులాహరిజన్, గాంధీచౌక్ ప్రాంతానికి చెందిన ఆకాష్ నాయక్, ఘసరాబెడ గ్రామానికి చెందిన సమీర్ హరిజన్‌ను అరెస్టు చేశారు.

విజిలెన్స్ వలలో బీవీవో, ప్రోగ్రాం అసిస్టెంట్

రాయగడ పట్టణం: సంబల్‌పూర్ జిల్లాలో ఓ సమితి పశువైద్యాధికారి, ప్రోగ్రాం అసిస్టెంట్ రూ.5 వేలు లంచం తీసుకుంటూ విజిలెన్స్ అధికారులకు చిక్కారు. విజిలెన్స్ వర్గాల సమాచారం మేరకు గోసుగం పథకం కింద బ్రాయిలర్ కోళ్లఫారం ఏర్పాటుకు రాయిరఖోల్ సమితి పశు వైద్యాధికారి(బీవీవో) శుభప్రకాష్ సోరేన్ రూ.5 వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు విజిలెన్స్ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు సోమవారం ప్రోగ్రాం అసిస్టెంట్ మహేశ్వర్‌సాహుకు లంచం ఇస్తుండగా, విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు.

జూద శిబిరంపై దాడి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: కాశీనగర్ ఠాణా పరిధిలోని కొండూరు గ్రామ ప్రాంతంలో జూద శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకోవడంతోపాటు ఐదు బైకులు సీజ్ చేసినట్లు, రూ.1.05 లక్షల నగదు, ఐదు చరవాణిలు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్పీ జేకే పండా తెలిపారు.

డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యోగాలకు గైర్హాజరు

పాలనాధికారి కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా ఒడిశా రజస్వ అమ్లా సంఘం సభ్యులు కొన్ని నెలలుగా తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ ప్రభుత్వాలకు వినతులు సమర్పించినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో సోమవారం నుంచి నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. సభ్యులు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పనిచేస్తున్న రెవెన్యూ మినిస్టీరియల్ ఉద్యోగుల ప్రారంభ వేతనాన్ని పెంచాలని, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.20 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని, ఇలా పలు డిమాండ్లు ఈ నెల 11వ తేదీ లోపల పరిష్కరించకపోతే 14వ తేదీ నుంచి విధులకు గైర్హాజరై నిరసన వ్యక్తం చేస్తామని అన్నారు.

అతిసారంతో అప్రమత్తంగా ఉండాలి

శిబిరంలో రక్తపోటు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు నకుల్ సాహు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అతిసారం ప్రబలుతోందని, తాజాగా గంజాం జిల్లాలోనూ ప్రజలు దీని బారిన పడుతున్నారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యుడు నకుల్ సాహు సూచించారు. భరద్వాజ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నీలకంఠనగర్ ప్రాంతంలోని హరిహర నగర్‌లో వర్షాకాలంలో ప్రబలే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్య కార్యక్రమం జరిగింది.

దరఖాస్తు కోసం లైనులో నిల్చొన్న రోగులు

నవరంగపూర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ముఖ్యమంత్రి వాయు స్వస్థ సేవా' కార్యక్రమం సోమవారం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరంలో 263 మందికి వివిధ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

యాదవ్ సమాజ్ తరఫున విద్యార్థులకు సన్మానం

సన్మానం పొందిన విద్యార్థులతో సమాజ్ సభ్యులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఇటీవల ప్లస్‌టూ పరీక్షల్లో పనాబెడ కళాశాల ఆర్ట్స్ విద్యార్థి 76 శాతం స్కులు సాధించి సమితిలో మూడో స్థానంలో నిలిచాడు. ప్రగతి కళాశాలలో సైన్స్ విభాగానికి చెందిన చింతామణి 93 శాతం, ఒడిశా ఆదర్శ్ విద్యాలయంలో చదువుతున్న అనుపంద్ 94 శాతం మార్కులు సాధించారు. సమాజ్ అధ్యక్షుడు జగదీష్ గౌడ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సమాజ్ సభ్యులు, ఉపాధ్యాయులు వారిని సన్మానించారు.

దుకాణాలకు మరమ్మతులు చేయాలి

అధ్యక్షుడు రాజేంద్రను కలిసిన వ్యాపారులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడలో గోపబంధు మార్కెట్ కాంప్లెక్స్‌లో ఉన్న దుకాణాలకు మరమ్మతులు చేయాలని వ్యాపారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గోపబంధు మార్కెట్ వ్యాపారుల సంఘం సభ్యులు పురపాలక సంస్థ కార్యాలయానికి చేరుకొని పురాధ్యక్షులు రాజేంద్రకుమార్ పాత్ర్, కార్యనిర్వాహక అధికారి సుజిత్‌కుమార్ చౌదరిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

నందన్‌కాననక్‌కు కొత్త అతిథులు

భువనేశ్వర్‌లోని నందన్‌కాననక్‌కు సోమవారం కొత్త అతిథులు వచ్చాయి. 11 పసుపు రంగు అనకొండ (పాములు)లు జన్మించాయి. గతనెల 29న 7 పిల్లలు జూలో పుట్టాయి. దీంతో ఈ జంతు ప్రదర్శనశాలలో వీటి సంఖ్య 25కి పెరిగింది. –న్యూస్‌టుడే, భువనేశ్వర్

దయనీయ స్థితిలో ఆరోగ్య కేంద్రం రోడ్డు

కాశీనగర్, న్యూస్‌టుడే: గజపతి జిల్లాలోని కాశీనగర్ సమితి హడ్డుభంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గ్రామ ప్రధాన రహదారి నుంచి ఆరోగ్య కేంద్రాన్ని కలిపే రహదారి దయనీయంగా మారింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రోడ్డుపై చెత్త, బురద నీరు పేరుకుపోతోంది. రోడ్డు పక్కన పనికిరాని మొక్కలు బాగా పెరుగుతున్నాయి. ఆ రహదారి గుండా రోగులను ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. రోడ్ల దుస్థితిపై గ్రామస్థులు ఫిర్యాదు చేసినప్పటికీ, పరిపాలనా విభాగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బురదతో నిండిన రహదారి

ఉస్తపల్లిలో అతిసారం.. ప్రజల్లో భయం

వ్యాధితో మరో వ్యక్తి మృతి ఆరోపణలు

దిగపాహండి ఆరోగ్య కేంద్రం నుంచి రొయితొ మృతదేహాన్ని పరీక్షకు ఎమ్కేసీజీకి తరలింపు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపాహండి సమితిలో సహదేవ్ టికరపడ పంచాయతీలోని ఉస్తపల్లి గ్రామంలో అతిసారం విజృంభణతో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. అతిసారం బారిన పడి గ్రామానికి చెందిన ప్రకాశ రొయితొ (37) అనే యువకుడు దిగపాహండి ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని రొయితొ మృతదేహాన్ని పరీక్షకు ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. ఇదే గ్రామానికి చెందిన దాస సబర (60) అనే వృద్ధుడు నాలుగు రోజుల కిందట అతిసారంతో మృతిచెందాడంటూ వార్తలు వచ్చాయి. జిల్లా ర్యాపిడ్ రెస్పాన్స్ బృందం (ఆర్ఆర్‌టీ) చేపట్టిన దర్యాప్తులో వీరిద్దరి మృతికి అతిసారం కారణం కాదని, ఇతర ఆరోగ్య సమస్యలని జిల్లా ముఖ్య వైద్యం, ప్రజారోగ్య అధికారి (సీడీఎం, పీహెచ్‌వో) కార్యాలయవర్గాలు రాత్రి ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రస్తుతం అతిసారంతో ఆరుగురు స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వీరిలో ఒకరు ఐసీయూలో ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలోని పాత్రపురం సమితిలో బాదపూర్ పంచాయతీలోని ఎస్.మర్దరాజపూర్ గ్రామానికి చెందిన ఎనిమిది మంది అతిసారం బారిన పడి ఆదివారం పాత్రపురం ఆరోగ్య కేంద్రంలో చికిత్సకు చేరారని పేర్కొన్నారు.

జాతీయ ఉషు పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులకు పతకాలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ మైదానంలో ఈ నెల 1 నుంచి ఆదివారం వరకు జరిగిన 24వ జాతీయ జూనియర్ ఉషు పోటీలు-2025లో సోనాక్షి మహంతి పసిడి, సాధనా మాఝి, సమృద్ధి, రోమేష్ ముండ రజతాలు, ఆయుష్ అంశుమన్ సాహు, రాహుల్‌ఘడెయి, యు. ప్రసాద్ కాంస్య పతకాలు సాధించారు.

పతకాలతో రాష్ట్ర బాలబాలికలు. చిత్రంలో కోచ్ తదితరులు

విశ్వ ప్రసిద్ధ పూరీ పుణ్యక్షేత్రంలో జగన్నాథ్ మందిర, పూరి జిల్లా పరిపాలన విభాగం సంయుక్తంగా నిర్వహించిన 30వ సునాబెషా కార్యక్రమంలో పర్లాఖెముండి పట్టణానికి చెందిన ప్రముఖ సంగీత దర్శకుడు, కంఠశిల్పి రఘునాథ్ పాత్ర్‌ను ఆదివారం సన్మానించి సత్కరించారు.
–న్యూస్‌టుడే, పర్లాఖెముండి

11న పది రైళ్ల రద్దు: ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి రైలునిలయంలో విద్యుదీకరణ పనుల కారణంగా 11న పది రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారని డీఆర్‌యూసీసీ సభ్యుడు కె.సూర్యప్రకాశరావు తెలిపారు. రద్దయిన రైళ్లలో గుణుపూర్-విశాఖపట్నం-గుణుపురం (58505, 58506), బ్రహ్మపుర - విశాఖపట్నం - బ్రహ్మపుర (58531, 58532), భువనేశ్వర్ - విశాఖపట్నం - భువనేశ్వర్ (22819, 22820), విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం మెము (67289, 67290), విశాఖపట్నం-బ్రహ్మపుర్-విశాఖపట్నం (18526, 18525) ఉన్నాయని ఆయన వివరించారు.

(c) eenadu

గొలుసు దొంగల అరెస్ట్

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఒంటరి మహిళలే లక్ష్యంగా బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పాతపట్నం సీఐ రామారావు, మెళియాపుట్టి ఎస్సై రమేష్‌బాబు సోమవారం వెల్లడించారు. గత నెల 9న శేఖరాపురం వద్ద నక్క శకుంతలమ్మ ఒంటరిగా పొలం నుంచి వస్తుండగా.. ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి పుస్తెలు తాడు లాక్కొని వెళ్లిపోయిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. గంజాం జిల్లా బ్రహ్మపురకు చెందిన బాలకృష్ణ సాహు, సుజిత్‌కుమార్ పాడిలను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు బ్రహ్మపురలో ద్విచక్రవాహనం చోరీ చేసి అదే వాహనంపై తిరుగుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. శేఖరాపురంలో చోరీ అనంతరం ఒడిశాలోని గురండి వద్ద వీరు దొంగతనానికి పాల్పడినట్లు సీఐ పేర్కొన్నారు. 2024 జనవరిలో గంగరాజపురం పరిధి జగన్నాథపురం వద్ద వి.రాజేశ్వరి అనే మహిళ మెడలో తులంన్నర బంగారం తాడు చోరీ చేసినట్లు తెలిపారు. వీరిపై ఆంధ్రా- ఒడిశా పరిధిలో 15- 20 కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రైల్వే పనులతో రాకపోకలకు అంతరాయం

కొమరాడ, న్యూస్‌టుడే: మండలంలోని అర్తాం రైల్వే గేటు వద్ద సోమవారం ట్రాక్ నిర్వహణ పనులు చేపట్టారు. మూడు గంటలపాటు యంత్రాలతో పట్టాలను సరిచేశారు. ఈ సమయంలో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వర్షాకాలం నేపథ్యంలో ట్రాక్‌ను సరిచేసి రైళ్ల రాకపోకలు అవాంతరాలు లేకుండా చేస్తున్నామని రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

ట్రాక్ పనులు చేస్తున్న సిబ్బంది

నిలిచిన వాహనాలు

దారి చెరువండి.. మా బాధలు చూడండి

కొత్తూరు- పాలకొండ మార్గం అధ్వానంగా మారింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డుపై గొయ్యి ఏర్పడింది. వర్షాలకు అందులో నీరు చేరడంతో చెరువును తలపిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ సమస్యపై ఆర్‌అండ్‌బీ డీఈఈ సాగరను సంప్రదించగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

సరకులు కావాలంటే.. కాళ్లు అరగాలంతే..!

- రేషన్ అందుకునేందుకు గిరిజనులకు తప్పని పాట్లు
- కిలోమీటర్లు నడిచి రావాల్సిందే

ఇదీ పరిస్థితి		
మండలం	డిపోలు	కార్డులు
కొత్తూరు	61	22150
హిరమండలం	47	11980
మెళియాపుట్టి	44	16413

కొత్తూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రేషన్ డిపో ద్వారా నిత్యావసర సరకులు పంపిణీ చేస్తోంది. ఈ పద్ధతి బాగానే ఉన్నా.. గిరిజన గ్రామాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీ పరిధిలో ఎక్కువ గ్రామాలు ఉండడం, వాటికి ఒకే రేషన్ దుకాణం నుంచి సేవలందించాల్సి రావడంతో అవస్థలు పడుతున్నారు. శిఖరాగ్ర, మారుమూల గ్రామాలు కావడంతో వ్యయ ప్రయాసలకోర్చి.. కాలినడకన, కొండ మీద నుంచి కిందకు దిగి దూరాన ఉన్న రేషన్ డిపోకు వెళ్లేందుకు ఇక్కట్లు పడుతున్నారు. తమకు ఇంటి వద్దే సరకులు అందించాలని లేదంటే సమీపంలో డిపోలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గొట్టిపల్లిలో రేషన్ దుకాణం నుంచి సరకులు తీసుకువెళ్తున్న గిరిజనులు

ఆ గ్రామాల ప్రజలకు అవస్థలు

కొత్తూరు మండలంలో అడ్డంగి, గొట్టిపల్లి, లబ్బ, అల్తి పంచాయతీల్లో పుల్లగూడ, బూతాలగూడ, పెద్దరాజపురం, చిన్నరాజపురం, ఉల్లిమానుగూడ, ఎగువగూడ, దాపాకులగూడ, చీపురపల్లి, బొండూరు, బాపడుగూడ చిన్నయ్యగూడ, అడ్డంగి, ఎగువముల్లేలగూడ, దిగువముల్లేలగూడ, డెప్పిగూడ, లబ్బ జీసీసీ డిపోకు కారిగూడ పంచాయతీలోని కారిగూడ, చింతమానుగూడ, శ్రీరాములగూడ, బాంద్రగూడ, దొండమానుగూడ, అడ్డాయిగూడ, ఎగువదొండమానుగూడ లబ్ధిదారులు కిలోమీటర్లు నడిచి వచ్చి సరకులు తీసుకెళ్తున్నారు.

- మెళియాపుట్టి మండలంలోని డబారు డిపోనకు కేరాసింగి, గూడ, అంపురం, రింపి.. నేతబొంతుకు చందనగిరి, గొట్టిపల్లి, ముత్యాలబొంతు ఇతర గ్రామాలు, బందపల్లి రేషన్ దుకాణానికి దబ్బగుడ్డి, పెద్దకేదారి, గేటుపేట, అడ్డివాడ నుంచి వస్తున్నారు. వీరికి రానుపోను సుమారు 20 కి.మీ ఉండటంతో బాధలు తప్పడం లేదు.
- హిరమండలం మండలంలోని పెద్దగూడ రేషన్ దుకాణానికి జన్నొడుగూడ, పొలంగూడ, బలదగూడ, కిరడ ఇతర గ్రామాలతోపాటు మద్రిగూడ జీసీసీ డిపోనకు సుమారు 8 గ్రామాల నుంచి వస్తున్నారు.

కష్టాలను తీర్చాలి: మాది కారిగూడ పంచాయతీలోని చింతమానుగూడ గ్రామం. గతంలో ఇంటి వద్దే సరకులు ఇచ్చేవారు. రెండు నెలలుగా మూడు కిలోమీటర్ల దూరంలో లబ్బ జీసీసీ డిపోనకు వెళ్లి సరకులను తెచ్చుకోవాల్సి వస్తుంది అధికారులు స్పందించి తమ బాధలు తీర్చాలి.
- నవర జూతయ్య, కార్డుదారుడు, చింతమానుగూడ

ఉన్నతాధికారులకు నివేదిక: కొన్ని పంచాయతీల్లో డిపోల ఏర్పాటుకు ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వివరాలు తీసుకుని, ఉన్నతాధికారులకు సమర్పిస్తాం. వారి ఆదేశాల ప్రకారం.. చర్యలు తీసుకుంటాం.
- భీమారావు, పౌరసరఫరాలశాఖ ఉప తహసీల్దారు

యాజమాన్య పద్ధతులు పాటిస్తే మెరుగైన దిగుబడులు

సోంపేట, న్యూస్‌టుడే: నారుమడి, వెద జల్లిన పంట పొలాల్లో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించడంతోపాటు పెట్టుబడిని తగ్గించుకోవచ్చని ఏవో బి.నర్సింహమూర్తి సూచించారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో నారు, వెద జల్లిన పొలాలను పరిశీలించారు. వ్యవసాయదారులు సూచించిన విధంగా ఎరువులు వినియోగించాలని తెలిపారు.

పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న శ్రీ ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

మొక్కలు నాటి సంరక్షిద్దాం

సోంపేట, న్యూస్‌టుడే: వాతావరణ మార్పులు, ఇతర కాలుష్య పరిస్థితులను ఎదుర్కొనడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందని శ్రీ ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త కె.సోమశేఖరరావు పేర్కొన్నారు. కర్లిపాలెం స్కూలు ఆవరణలో అటవీశాఖ, శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఉపాధ్యాయుడు లండ బాబూరావుతోపాటు ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ మొక్కల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు.

లొద్ద గ్రామానికి వెళ్లే రహదారి

గిరి దారి.. గండాల మారి!

సాలూరు మండలంలోని చిలకమెండంగి-సిరివర రోడ్డు అత్యంత దయనీయంగా మారింది. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ మార్గానికి శంకుస్థాపన చేశారు. 6.6 కిలోమీటర్ల మేర రూ.9 కోట్లతో గతేడాది సెప్టెంబరులో పనులు ప్రారంభించారు. వర్షాల కారణంగా ప్రస్తుతం పనులు ఆపేశారు. వాన నీటికి రోడ్డంతా కోతకు గురై మట్టి లోయలోకి జారిపోయింది. రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద రాళ్లు తేలిపోయాయి. ఇటువైపు ప్రయాణమంటేనే స్థానికులు భయపడుతున్నారు.

◆ పర్యాటక ప్రాంతం లొద్ద జలపాతానికి వెళ్లే రహదారి పరిస్థితి ఇంతే. రూ.6 కోట్లతో నిర్మిస్తున్న ఈ రోడ్డు కోతకు గురై అధ్వానంగా తయారైంది. కనీసం కాలినడకన వెళ్లాలన్నా గుబులు రేపుతోంది. వాహనాలు వెళ్లలేని పరిస్థితి. నంద-పగులుచెన్నూరు ప్రధాన రహదారి నుంచి లొద్ద వరకు ఇంతే. పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ ఏఈ శంకరరావు మాట్లాడుతూ చిలకమెండంగి-సిరివర రోడ్డులో ఎర్త్‌వర్క్ జరిగిందని, త్వరలో పనులు ప్రారంభించి ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. రక్షణ గోడలు ప్రతిపాదనల్లో లేవని, కొండల వైపు కాలువలు నిర్మించి వర్షపు నీరు వెళ్లేలా చూస్తామన్నారు.
– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

రాళ్లు తేలిన చిలకమెండంగి- సిరివర రోడ్డు

పిల్లల పేరిట మేత.. సంక్షేమానికి వాత!

న్యూస్‌టుడే, సోంపేట

జిల్లాలో కొన్ని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతిగృహాల నిర్వహణ గాడి తప్పింది. రిజిస్టర్‌లో నమోదైన పిల్లల్లో సగం మంది ఉదయం, రాత్రి భోజనాలకు హాజరు కావడం లేదు. తీర, మైదాన ప్రాంతాల్లో కొన్నిచోట్ల ఇలాంటి పరిస్థితులు నెలకొన్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడు. చదువు పేరిట ఏటా రూ.లక్షల వ్యయం చేస్తున్నప్పటికీ లెక్కల్లో చూపుతూ దారి మళ్లిస్తున్నారు. వసతిగృహాల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడుతుండటంతో అక్రమ పర్వం యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

★ కవిటి మండలం పెద్దకర్రివానిపాలెం వసతిగృహంలో 102 మంది విద్యార్థులుండగా ఈ నెల 6న మధ్యాహ్నం 53 మంది భోజనం చేశారు. రాజపురం వసతిగృహంలో 120 మంది పిల్లలు నమోదు కాగా కంచిలి మండలం ఎం.ఎస్.పల్లిలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న సంక్షేమాధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. రాత్రి వేళ పరిశీలిస్తే ఇక్కడ వసతిగృహం ఉండన్న సంగతి తెలియదు.

★ సోంపేట మండలం వాడపాలెం బీసీ బాలికల సంక్షేమ వసతిగృహంలో 90 మంది పైగా విద్యార్థినులుండగా ఉదయం, రాత్రి భోజనానికి 20 మంది కూడా హాజరు కావడం లేదు. ఈ నెల 4న రాత్రి 19 మంది, 6న మధ్యాహ్నం 8 మంది భోజనం చేశారు. రిజిస్టర్‌లో తప్ప ఇక్కడ పిల్లలు కనిపించరు. కొన్నేళ్లుగా ఇదే తంతు కొనసాగుతున్నా వసతిగృహం నిర్వహిస్తున్నారు. ఇక్కడ కొన్నేళ్లుగా సంక్షేమాధికారి పోస్టు ఖాళీగా ఉంది. సోంపేట మెట్రిన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఎర్రముక్కాంలో వసతిగృహం ఎప్పుడూ తాళం వేసే ఉంటుంది.

బీసీ వసతిగృహాల నిర్వహణపై కొరవడిన పర్యవేక్షణ

వాడపాలెం బీసీ బాలికల వసతిగృహంలో ఈ నెల 4న రాత్రి భోజనం చేస్తున్న విద్యార్థినులు

ఇదీ పరిస్థితి

★ ఒక్కో విద్యార్థి భోజనానికి ప్రభుత్వం నెలకు రూ.1,400 వెచ్చిస్తోంది. కాస్మోటిక్ ఛార్జీల కింద బాలికలకు రూ.175, బాలురకు రూ.150 ముంజూరు చేస్తోంది. ట్యూషన్ పేరిట ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించి వేతనాలు చెల్లిస్తున్నారు. దుప్పట్లు, కంచాలు, గ్లాసులు, ఇతర వసతుల కల్పన, నిర్వహణ పేరిట రూ.లక్షల్లో నిధులు వ్యయం చేస్తున్నప్పటికీ విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు.

★ జిల్లాలో 83 బీసీ వసతిగృహాలుండగా పిల్లలు లేకపోవడంతో 3 మూతపడ్డాయి. 37 మంది సంక్షేమాధికారులు ఉండగా ఒక్కొక్కరు రెండు, మూడు హాస్టళ్ల బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. 100 మందికి పైగా విద్యార్థులున్న చోట ఒకరే నాలుగో తరగతి సిబ్బంది ఉండటంతో వారిపైనే మొత్తం భారం పడుతోంది.

★ డి.మత్స్యలేశం, మురపాక, ఏపీపేట, బీపీపేట, పాతటెక్కలి, సంతబొమ్మాళి, కురుదు, బోరుభద్ర, జగన్నాథపురం, మెట్టవలస, కె.మత్స్యలేశం, జీరుపాలెం సహా 20 వసతిగృహాల్లో 2 వేల మందికి పైగా విద్యార్థులు నమోదు కాగా సగం మంది కూడా భోజనం చేయడం లేదు. కొందరి మాయాజాలంతో ఆయా వసతిగృహాలు కొనసాగిస్తున్నారు. సగానికి పైగా ఇన్‌ఛార్జులతోనే నడుస్తుండటం గమనార్హం.

తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులతో చర్చిస్తాం..

స్థానికుల ఒత్తిడి మేరకే తీర ప్రాంతం, కొన్నిచోట్ల వసతిగృహాలను నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది ఒకట్రెండు మూతపడే పరిస్థితి ఉంది. పిల్లలు భోజనానికే వస్తుండటంతో ఇబ్బందులు నెలకొన్నాయి. సంక్షేమాధికారులు, నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలు ఎక్కువగా ఉండటంతో పర్యవేక్షణ కష్టమవుతోంది. తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి పిల్లలు వసతిగృహాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటాం.
– అనురాధ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారిణి, శ్రీకాకుళం

త్వరలోనే స్మార్ట్‌కార్డులు..!

నూతన పద్ధతిలో రేషన్ పంపిణీ

న్యూస్‌టుడే, లావేరు, జి.సిగడాం

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఉన్న రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్‌కార్డులను అందుబాటులోకి తీసుకొస్తోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఏటీఎం కార్డు పరిమాణంలో రూపొందిస్తోంది. కార్డు ముందు వైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, కుటుంబ పెద్ద చిత్రం, కార్డుదారు, రేషన్ దుకాణం సంఖ్యలు, ఇతర వివరాలుంటాయి. ఈ-పోస్ యంత్రాల సాయంతో కార్డుపై గల క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన, తీసుకునే సరకుల వివరాలు కనిపించేలా డిజైన్ చేశారు.

జాప్యానికి అవకాశం లేకుండా..

జిల్లాలోని 30 మండలాల పరిధిలో కొత్తగా 866 మందికి రేషన్ కార్డులు మంజూరయ్యాయి. వీరందరికీ స్మార్ట్‌కార్డులు సరఫరా చేయనున్నారు. ఇప్పటివరకు ఉన్న 6,60,739 పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్తవి అందజేస్తారు. దుకాణాల్లో బియ్యం, పంచదార, ఇతర సరకులు సులభంగా తీసుకోవచ్చు. కార్డుదారులు దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం ఉండదని అధికారులు చెబుతున్నారు.

కార్డుదారులకు మేలు..

స్మార్ట్‌కార్డులు అందుబాటులోకి వచ్చిన తరువాత లబ్ధిదారులకు మేలు జరుగుతుంది. పౌర సరఫరాల సంస్థ ద్వారా పంపిణీ చేసే వివిధ సరకులు, ఇతర వివరాలు కార్డులో పొందుపరుస్తారు. వచ్చే నెలలో కొత్తవి అందజేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.
– జి.సూర్యప్రకాశరావు, డీఎస్‌వో, శ్రీకాకుళం

ఇలాగైతే రాకపోకలెలా..!

పలాస మండలం కేదారిపురంలోని పెద్ద వీధి రోడ్డు దారుణంగా తయారైంది. కాలువలు లేకపోవడంతో మురుగు నీరంతా రహదారి మీదకే వస్తోందని, దానికి తోడు చిన్న వర్షం పడినా రోడ్డంతా బురదమయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు, రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి ఆశ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే కాలువలు, రోడ్డు నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

స్తంభం తీశారు.. దిమ్మె మరిచారు..

సోంపేట ప్రధాన రహదారిపై విద్యుత్తు స్తంభం తొలగించి దిమ్మ వదిలేయడంతో స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారు. దిమ్మెపై ఇనుప స్తంభం ముక్కలు ఉండిపోవడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పాదచారులు వీటిని తన్నుకొని గాయాల పాలవుతున్నారు. దిమ్మెను తొలగించి ప్రమాదాలు నివారించాలని వేదం ఫౌండేషన్ అధ్యక్షుడు డి.జోగారావు కోరారు. సమస్యను ట్రాన్స్‌కో ఏఈ రామారావు దృష్టిలో ఉంచగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

చెక్‌డ్యాం శిథిలం

కవిటి మండలంలోని బీల ప్రాంతంలో గొనమారి గెడ్డలో పెద్దకర్రివానిపాలెం వద్ద ఉప్పునీరు సాగు నీటిలో కలవకుండా ఏర్పాటు చేసిన చెక్‌డ్యాం శిథిలావస్థకు చేరింది. కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులు చేయకపోవడంతో రంధ్రాలు ఏర్పడి సాగునీటిలో ఉప్పునీరు కలిసి పంటలకు ఇబ్బందులు కలుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ మధుసూదన పాణిగ్రహిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

మరమ్మతులు చేపట్టరూ...

బలియాపుట్టుగలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల పథకం ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. దీనిపై ఆధారపడిన పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వినియోగంలో లేకపోవడంతో పథకం చుట్టూ పనికిరాని మొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. పనికిరాని మొక్కలు తొలగించి, పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి

ప్రజాజీవనం కన్నా.. దోమల నివాసానికి మిన్న

ఈ గ్రామంలో ఎక్కడ చూసినా మురుగు తాండవిస్తోంది. ప్రజాజీవనం కన్నా దోమల నివాసానికి మిన్న అన్నట్లు ఉంది ఇచ్ఛాపురం మండలం ముచ్చీంద్ర గ్రామం దుస్థితి. ఇక్కడ రెండు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా క్షేత్రస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే రెండు, మూడు రోజులు ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ కృష్ణకు వివరణ కోరగా త్వరలోనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

బాలల భవితకు రక్షణేదీ..?

గుమ్మలక్ష్మీపురం, కురుపాం గ్రామీణం, సీతంపేట, న్యూస్‌టుడే: ఒక ఇల్లు కడితేనే చుట్టూ ప్రహరీ నిర్మిస్తాం. బయట వ్యక్తులు రాకుండా.. దొంగతనాలకు ఆస్కారం లేకుండా పక్కాగా చర్యలు చేపడతాం. కానీ వందల మంది విద్యార్థులు చదువుతున్న గిరిజన సంక్షేమ వసతి గృహాలకు మాత్రం రక్షణ కరవవుతోంది. ఏళ్లుగా గోడలు లేక నిత్యం భయాందోళనతో ఉంటున్నారు. పాముకాట్లతో పలువురు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు.

కురుపాం ఆశ్రమ పాఠశాలకు రక్షణగా కర్రలు

కర్రల కంచెలే దిక్కు..

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు రక్షణ గోడల నిర్మాణానికి 2019లో నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించిన కొన్ని రోజులకే బిల్లులు చెల్లించలేదని ఆపేశారు. సుమారు అయిదేళ్లు అవుతున్నా నిర్మాణాలు ముందుకు కదల్లేదు. చేసేది లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు కర్రలతో కంచెలు ఏర్పాటు చేసుకున్నారు. మరికొన్ని చోట్ల మొండి గోడలే దర్శనమిస్తున్నాయి.

మండలాల్లో పరిస్థితి..

- గుమ్మలక్ష్మీపురం మండలంలోని కొత్తగూడ, టిక్కబాయి, తాడికొండ ఆశ్రమ పాఠశాలలకు రక్షణ గోడలు లేవు. అయిదేళ్ల క్రితమే ప్రారంభించినా నేటికీ పనులు పూర్తి కాలేదు. దీంతో కర్రలనే కంచెలుగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ 3 పాఠశాలల్లో 800 మందికి పైగా విద్యార్థులు భయాందోళనతో గడుపుతున్నారు.
- కురుపాం ఆశ్రమ పాఠశాలలో సుమారు 400 మంది చదువుతున్నారు. పక్కనే ఉన్న జ్యోతిబాపులే పాఠశాల విద్యార్థి పాము కాటుతో మృతి చెందడంతో రక్షణ గోడ నిర్మించారు. కానీ ఆశ్రమ పాఠశాలను పట్టించుకోలేదు. ధర్మలక్ష్మీపురంలో గోడ పునాది స్థాయిలో వదిలేశారు. ఇక్కడా 400 మందికి పైగా విద్యార్థులున్నారు.
- సీతంపేట బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో రక్షణ గోడ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, పోస్టుమెట్రిక్ వసతి గృహానికి ప్రహరీలు లేవు.

పనులు చేపట్టేలా చూస్తాం..

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు రక్షణ గోడల నిర్మాణంపై దృష్టి పెడతాం. ఇప్పటికే పాఠశాలలకు పెద్ద ఎత్తున ప్రహరీలు నిర్మించాం. గతంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న పనుల పూర్తిపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలిస్తాం.
- టి.జగదీశ్వరి, ప్రభుత్వ విప్

విషసర్పాలకు నిలయం..

అటవీ ప్రాంతానికి సమీపంలో వసతి గృహాలు ఉండటంతో విషసర్పాలు దర్శనమిస్తున్నాయి. కురుపాం వసతి గృహంలో పాము కాటుకు గురై ఓ విద్యార్థి గతంలో మృతి చెందాడు. గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుఖల్లు ఆశ్రమ పాఠశాలలో రెండేళ్ల క్రితం ఓ విద్యార్థి పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. 2023 ఆగస్టులో టిక్కబాయిలో ఇలానే మరో విద్యార్థి ప్రాణాలొదిలేశాడు. పశువులు, మేకలు సైతం ఆవరణలోకి వచ్చి మొక్కలను తినేస్తున్నాయి. ఏనుగుల సంచారంతో రాత్రి వేళల్లో విద్యార్థులు బయటకు రావాలంటే భయపడుతున్నారు.

రోటరీ క్లబ్ సేవలు ఆదర్శనీయం

ర్యాలీని ప్రారంభిస్తున్న కూన రవి, రూపేష్ పాణిగ్రాహి

ఆముదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ సేవలు ఆదర్శనీయమని ఒడిశాలోని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో కలిసి ఆముదాలవలసలోని ఓ కల్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు ఇద్దరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హైటెక్ గ్రూప్ సంస్థల ఛైర్మన్ తిరుపతి పాణిగ్రాహి, రోటరీ గవర్నర్ కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

ఘనంగా అధరపాణా వేడుక

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో బొడొదండో ఆవరణలో సోమవారం రాత్రి అధరపాణా వేడుక ఘనంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు ఈ వేడుకను తిలకించారు. 7.30 గంటలకు ప్రారంభమైన ఉత్సవం రాత్రి 9.40 గంటలకు ముగిసింది. మూడు రథాలపై జగన్నాథ, బలభద్ర, సుభద్ర సన్నిధిలో సేవాయత్‌లు 9 పొడా కుండలు ఉంచి నైవేద్యం తర్వాత ఆనవాయితీ ప్రకారం పగలగొట్టారు.

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

(c) eenadu

కొండవీడులో నిప్పుల గుండం

రెడ్డిగూడెంలో పీర్లను ఊరేగిస్తున్న యువకులు

భక్తిప్రపత్తులతో మొహర్రం

యడ్లపాడు, రాజుపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని కొండవీడు, కోట గ్రామాల్లో సోమవారం మొహర్రంను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. పీర్ల చావిడిని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. పీర్లను అలంకరించి డీజే వాయిద్యాల నడుమ ఊరేగించారు. పొలిమేర్ల వద్ద గ్రామస్థులు సంప్రదాయం ప్రకారం పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి ముజావర్లు పీర్లను పట్టుకుని వరుస క్రమంలో నిప్పుల గుండంలో పరుగు తీశారు.
❖ రాజుపాలెం మండలం రెడ్డిగూడెం, మొక్కపాడు తదితర గ్రామాల్లో పీర్లను ఊరేగించారు.

అవసరానికా.. అక్రమానికా?

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే

జీపు ట్రాక్‌లకు ప్రతిపాదనలు

ఎక్కడైనా మైనర్ కాలువ కట్టలు 1.50 మీటర్ల వెడల్పు ఉంటాయి. పొలాలకు సాగునీటి సరఫరా తదితర పనులు పరిశీలించేందుకు అధికారులు ఆ కట్టలపై కాలి నడకన వెళుతుంటారు. కానీ వాహనాలు వెళ్తాయని.. అందుకు జీప్ ట్రాక్‌ల మేజరు కాలువల కింద పలు మైనర్ కాలువలపై జీప్ ట్రాక్‌లు నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. కాలువలపై 25 జీప్ ట్రాక్‌లు అవసరమని, ఒక్కో దానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు.. మొత్తం రూ.65 లక్షలు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపగా పరిపాలన అనుమతులు మంజూరుచేశారు. కాగా ఆర్థికపరమైన అనుమతుల నిమిత్తం ప్రభుత్వానికి నివేదించారు. ఆ అనుమతులు సాధించేందుకు రాజకీయ పైరవీలు చేయిస్తున్నట్లు తెలిసింది. అసలు సాధ్యం కాని, సాంకేతిక సమస్యలు

తంగెడుమల్లి మేజరు పరిధిలో మైనర్ కాలువపై దారి

నిర్మాణం చేపట్టాలంటూ ఆ శాఖకు చెందిన ఓ అధికారి ప్రతిపాదనలు చేశారు. ఈ విషయాన్ని అదే శాఖలో మరో అధికారి గమనించి ఇదెలా సాధ్యమవుతుందని ప్రశ్నించే సమయానికే ఆ ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి.

లింగంగుంట్ల సబ్ డివిజన్‌లోని తంగెడుమల్లి, గంటావారిపాలెం పరిధిలోని ఉన్న ఆయా పనుల విషయమై ఉన్నత స్థాయిలో విచారించి.. నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని పలువురు అధికారులు కోరుతున్నారు. ఈ విషయమై లింగంగుంట్ల ఎన్నెస్పీ ఎస్‌ఈ కృష్ణమోహన్‌ను వివరణ కోరగా.. అలాంటివి తన దృష్టికొస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భయపెట్టి బాదేస్తున్నారు!

ఎన్టీఆర్ నెట్‌వర్క్ వైద్యశాలల్లో వైద్యం తీరు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే

జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ కింద సేవలందిస్తున్న ప్రైవేటు వైద్యశాలలు పైసలే పరమావధిగా పని చేస్తున్నాయి. బాధితుల నుంచి అదనపు సొమ్ము ఎలా రాబట్టాలన్న విషయం పైనే దృష్టి పెడుతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే రుసుము చాలదని, నాణ్యమైన వైద్య సేవలు అందించలేమని చెబుతూ రోగులు, వారి కుటుంబ సభ్యులను భయపెట్టి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఫలితంగా పేదలకు మెరుగైన వైద్యం ఉచితంగా అందించాలన్న లక్ష్యం నీరుగారుతోంది.

నరసరావుపేటలోని ఎన్టీఆర్ వైద్యసేవ సమన్వయకర్త కార్యాలయం

జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ వైద్యశాలలు: 80

ప్రైవేటు వైద్యశాలల్లో చేరుతున్న కేసులు: నెలకు 1500

వసూలు పర్వం ఇలా..

ఏదైనా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తే చాలు పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారిస్తారు. ఇందుకు బిల్లులు వసూలు చేస్తారు. శస్త్ర చికిత్స అవసరమైతే అప్పుడు అసలు కథ ప్రారంభమవుతుంది. ఎన్టీఆర్ వైద్యసేవ కింద చేస్తామని వివరాలు తీసుకుంటారు. తర్వాత వైద్యసేవ కింద అయితే వినియోగించే పరికరాలు అంత నాణ్యంగా ఉండవని.. ఖర్చు భరిస్తే నాణ్యమైనవి వాడతామని చెబుతూ అదిక బిల్లులు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా వైద్యసేవ కింద చికిత్స పొందుతున్న రోగులకు జనరల్ వార్డుల్లో పరిమితికి మించి పడకలు వేస్తారు. పారిశుద్ధ్యం నిర్వహణ ప్రమాణాల మేరకు ఉండటం లేదు. ప్రత్యేక గదుల పేరుతో అదనపు వసూళ్లకు తెరదీస్తున్నారు.

➻ నకరికల్లుకు చెందిన మహిళ మూత్రపిండాల సమస్యతో ప్రకాశ్ నగర్‌లోని వైద్యశాలలో చేరింది. ప్రత్యేక గదులు, పరీక్షల పేరుతో రూ.14 వేలు వసూలు చేశారు. అంత చెల్లించలేమని ఆమె భర్త వేడుకున్నా కట్టాల్సిందేనని వైద్యశాల యాజమాన్యం తేల్చిచెప్పడంతో ఆ మొత్తం చెల్లించి బయటపడ్డారు.

➻ చిలకలూరిపేట మండలం పసుమర్రుకు చెందిన రైతు ప్రమాదంలో గాయపడగా శస్త్ర చికిత్స చేయించాల్సి వచ్చింది. చిలకలూరిపేటలోని ఓ వైద్యశాలలో చేరారు. ఎముకలు అతుక్కోవాలంటే పేరున్న కంపెనీ రాడ్లు వాడాలని.. వాటిని ఎన్టీఆర్ వైద్యసేవ కింద వాడలేమని చెప్పారు. రూ.30 వేలు అదనంగా వసూలు చేశారు.

సిబ్బంది మాటలు నమ్మి..

ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవ కింద అందించే సేవలకు అన్నీ లెక్కించే రుసుములు నిర్ణయించింది. అందులో నాణ్యమైన పరికరాలకే అనుమతి ఉంటుంది. అవసరమున్న వైద్యాధికారులే రుసుములు నిర్ణయించి ఉంటారు. అయితే కొన్ని ప్రైవేటు వైద్యశాలల నిర్వాహకులు, సిబ్బంది చెప్పే మాటలు నమ్మి.. అదనంగా సొమ్ము చెల్లిస్తున్నారని కొందరు పేర్కొంటున్నారు.

ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటున్నాం.. 'జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ కింద చికిత్స అందిస్తున్న వైద్యశాలలపై మూడంచెల పర్యవేక్షణ ఉంటుంది. వీఆర్ ఆర్‌ఎస్ కాల్స్, ట్రస్టు అధికారుల కాల్స్‌తో పాటు అధికారులూ వైద్యశాలల్లో తనిఖీలు చేస్తారు. వాటిల్లో ఫిర్యాదులొస్తే విచారణ చేసి జరిమానాలు విధిస్తున్నాం' అని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా సమన్వయకర్త డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు.

గుంటూరు ఘాటు అదిరింది

మిర్చికి జాతీయ అవార్డు

గుంటూరు : గుంటూరు మిర్చికి మరో జాతీయ అవార్డు దక్కింది. ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) విభాగంలో ఈ గుర్తింపు లభించింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో మిరప సాగు, ప్రభుత్వ సహకారం, రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలపై జిల్లా పాలనాధికారి నాగలక్ష్మి కేంద్రానికి నివేదించారు. స్పందించిన కేంద్ర బృందం ఒక జిల్లా... ఒక ఉత్పత్తి విభాగం కేటగిరీలో ఈ ఏడాది జనవరిలో జిల్లాలో పర్యటించింది. ఈ మేరకు ఓడీఓపీ విభాగంలో అవార్డుకు గుంటూరు మిర్చిని ఎంపిక చేసినట్టు కేంద్రం ప్రకటించింది. ఈ నెల 14న దిల్లీలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్‌గోయల్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట మిరప. దీనికి ఘాటెక్కువ. ఇక్కడి భూములు, వాతావరణం, సాగు విధానాల వల్ల ఇతర ప్రాంతాల్లో పండే మిర్చితో పోలిస్తే దీనికి ప్రత్యేకత ఉంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా మన్నన పొందుతోంది. గుంటూరులో విత్తనం మొదలుకుని ఎగుమతుల వరకు అన్ని దశల్లోనూ ఇక్కడ ప్రత్యేకతలున్నాయి. పొరుగు రాష్ట్రాల రైతులు కూడా ఇక్కడి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పురుగుమందులు, కొత్తగా మార్కెట్లోకి వచ్చే ఎరువులను ఇక్కడే పరిచయం చేస్తున్నారు. సాగులో కొత్త పద్ధతులకూ జిల్లా నెలవుగా ఉంది. ఆసియాలో అతిపెద్దదైన మిర్చియార్డు కొలువైందీ ఇక్కడే. రైతులకు గిట్టుబాటు ధర దక్కేవరకు మిర్చిని నిల్వ చేసుకోవడానికి గుంటూరు పరిసరాల్లో 80కి పైగా శీతలగోదాములున్నాయి. విత్తన పరిశోధన స్థానం లాం, మిర్చిలో పురుగుమందుల అవశేషాల శాతాన్ని పరీక్షించే ప్రయోగశాల అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రత్యేకతలతో జిల్లా యంత్రాంగం 76 పేజీల నివేదికను ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి విభాగం కింద కేంద్రానికి పంపింది. రైతులు బృందంగా ఏర్పడి రసాయన రహిత మిర్చి ఉత్పత్తిలో భాగస్వాములు కావడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను అందులో వివరించారు. గత జనవరిలో పర్యటించిన కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో అన్ని అంశాలను పరిశీలించి అవార్డుకు ఎంపిక చేసింది.

తనిఖీల వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వరరావు, అధికారులు

విద్యుత్తు చౌర్యం సామాజిక నేరం

రొంపిచర్ల, న్యూస్‌టుడే: విద్యుత్తు చౌర్యం సామాజిక నేరమని.. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని విద్యుత్తు శాఖ విజిలెన్స్ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. రొంపిచర్ల సెక్షన్ పరిధిలోని అలవాల, ఆరేపల్లి, గోగులపాడు, కర్లకుంట, కొత్తపల్లి, మాచవరం, సంతగుడిపాడు, తుంగపాడు, వీరవట్నం, విప్పర్లపల్లిలో విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్తు శాఖ ఆపరేషన్ విభాగం ఈఈ సీహెచ్ రాంబొట్లుతో కలిసి మాట్లాడారు. 42 మంది అధికారులు, 152 మంది సిబ్బంది 42 బృందాలుగా ఏర్పడి 2,847 సర్వీసులు తనిఖీ చేశారన్నారు. మీటరు లేకుండా నేరుగా చౌర్యానికి పాల్పడుతున్న నలుగురికి రూ.8 వేలు, మీటరు ఉన్నా అక్రమంగా వినియోగిస్తున్న ముగ్గురికి రూ.50 వేలు, అనుమతించిన కేటగిరీ కాక ఇతర కేటగిరిలో వాడుకుంటున్న ఒకరికి రూ.3 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా వినియోగిస్తున్న 94 మందికి రూ.3.97 లక్షల అపరాధ రుసుం విధించినట్లు వివరించారు. కార్యక్రమంలో డీఈఈ కె.రవికుమార్, ఎన్.మల్లికార్జునప్రసాద్, బి.వెంకటేశ్వరరెడ్డి, ఏఈలు కె.రాంబాబు, కె.కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా సమావేశం పండగలా నిర్వహించాలి: కలెక్టర్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు ఆహ్లాదకర వాతావరణంలో పండగలా నిర్వహించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. విద్యా శాఖ సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన వీక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 2038 పాఠశాలలు, 91 జూనియర్ కళాశాలల్లో ఈ నెల 10న సమావేశాలు నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆకర్షణీయంగా ఆహ్వానపత్రికలు తయారు చేసి విద్యార్థుల తల్లిదండ్రులు, పుర, గ్రామాల ప్రముఖులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందరికీ భోజనం ఏర్పాట్లు చేయాలన్నారు. పాఠశాలల్లో నాటేందుకు అటవీ శాఖ మొక్కలు అందిస్తుందని తెలిపారు. మెగా సమావేశం చిత్రాలను లీప్ యాప్‌లో పంపాలని సూచించారు. డీఈవో చంద్రకళ, డీఐఈవో నీలావతిదేవి, సమగ్రశిక్ష సమన్వయకర్త వరద సుబ్బారావు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

పీజీఆర్‌ఎస్‌కు 198 అర్జీలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అధికారులకు అర్జీలిచ్చి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. కలెక్టర్‌తో పాటు జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి, జిల్లా అధికారులు అర్జీలను స్వీకరించారు. మొత్తం 198 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు.

సాగుభూమికి దారి చూపండి.. తమకు వారసత్వంగా లభించిన సాగుభూమికి దారి చూపాలని నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన వేదవల్లి కోరారు. పెట్లూరివారిపాలెం నుంచి కోటప్పకొండకు వెళ్లే మార్గంలో పంట కాలువ ఉందని, దాని గట్టును కొందరు ఆక్రమించి పంట వేస్తున్నందున తమ భూములకు దారి లేకుండా పోయిందన్నారు. పంట కాలువను సర్వే చేసి తమ భూములకు దారి చూపాలని విన్నవించారు.

వ్యక్తిగత కక్షతో తొలగించారు.. నాగార్జునసాగర్‌లోని ఏపీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపల్ సరోజిని తమను వ్యక్తిగత కక్షతో విధుల నుంచి తొలగించారని, న్యాయం చేయాలని అతిథి అధ్యాపకులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఇంటర్మీడియట్ పరీక్షల సమయంలో నూరు శాతం ఫలితాలు రావాలని ఒత్తిడి చేసి.. విద్యార్థులను చూచిరాతలకు ప్రోత్సహించాలని ఆదేశించారని.. అంగీకరించకపోవడంతో తమపై కక్ష పెంచుకున్నారన్నారు. ఈ విషయమై విచారణ చేయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని అతిథి అధ్యాపకులు తెలిపారు.

దీపావళికి టిడ్కో ఇళ్ల కానుక!

6,016 మందికి గృహ యోగం

వినుకొండ, న్యూస్‌టుడే

టిడ్కో ఇళ్ల పెండింగ్ పనులు పూర్తి చేసి దీపావళి నాటికి లబ్ధిదారులకు అందజేస్తామని, అందులోనూ ముందుగా 365, 430 చదరపు అడుగుల ఇళ్ల పూర్తిపై దృష్టిపెడతామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఇటీవల వెల్లడించడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అదే సమయంలో పనుల పూర్తిపై సందేహాలు లేకపోలేదు.

పట్టించుకోని వైకాపా

తెదేపా ప్రభుత్వం 2014-19 మధ్య చేపట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణంపై.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఏడాది కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బ్యాంకు బకాయిలు రూ.140 కోట్లు చెల్లించి ముందుగా 365, 430 చదరపు అడుగుల కేటగిరీల ఇళ్లను పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ రెండు కేటగిరీల్లో 6016కు 3456 ఇళ్లు అసంపూర్తిగానే ఉన్నాయి. పల్నాడు జిల్లాలో ఆరు పురపాలక సంఘాలకు 12,512 ఇళ్లు కేటాయించగా. వాటిలో అత్యధికంగా 300 చదరపు అడుగుల ఒక పడక గది ఇళ్లు 6,496 కాగా.. 365, 430 చ.అ. ఇళ్లు 6016. పట్టణాల వారీగా మూడు కేటగిరీల్ని పరిశీలిస్తే.. రెండో విడత చిలకలూరిపేటలో 1008, పిడుగురాళ్ల 1536, మాచర్ల 1056, వినుకొండ 1440 నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఫేజ్-1లో నరసరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేటలో మంజూరైన ఇళ్లను పూర్తిచేశారు.

వినుకొండలో చివరి దశకు చేరిన 300 చదరపు అడుగుల ఇళ్లు

పట్టణాల వారీగా మంజూరైన ఇళ్ల వివరాలు (విస్తీర్ణం చ.అ.)

పేరు	300	365	430
చిలకలూరిపేట	3248	1136	1136
సత్తెనపల్లి	128	0	32
నరసరావుపేట	0	1504	0
పిడుగురాళ్ల	2016	816	0
మాచర్ల	240	576	240
వినుకొండ	864	0	576

ఇప్పటికీ ప్రారంభం కాని పనులు

జిల్లాలో ఇళ్ల నిర్మాణ పనుల్ని ప్రముఖ సంస్థలు చేపట్టాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గతంలో చేసిన పనులకు సుమారు రూ.40 కోట్ల వరకు బకాయిలు ఉండటంతో చాలాచోట్ల పనులు నిలిచిపోయాయి. చిలకలూరిపేట, పిడుగురాళ్లలో నిర్మాణ సంస్థలు.. కూలీలు, ఇతర సామగ్రిని సమకూర్చుకుంటున్నా బకాయిలు విడుదల చేయకుంటే దీపావళికి ఇళ్లు అప్పగిస్తామన్న మంత్రి నారాయణ మాట కార్యరూపం దాల్చడం సందేహమేనని అధికారులు చెబుతున్నారు.

పనుల మొదలుకు ఏర్పాట్లు.. ఆగిన ఇళ్ల నిర్మాణ పనులు మొదలుపెట్టేందుకు సంస్థలు ఏర్పాట్లు చేస్తున్నాయి. బకాయిలు అందకపోవడంతో వేగంగా ముందుకు రావడం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – డి.ఉమాశంకరశాస్త్రి, ఎస్‌ఈ, టిడ్కో

క్షయ విముక్తి పల్నాడు లక్ష్యం!

జిల్లాలో అనుమానితులపై సర్వే

టీబీ స్క్రీనింగ్ లక్ష్యం:	362450
ఇప్పటి వరకు పూర్తి:	70947
గుర్తించిన కేసులు:	125

వినుకొండ, న్యూస్‌టుడే: క్షయ (టీబీ) వ్యాధిని అరికట్టాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముక్తభారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ టీబీ పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. అనుమానితులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని గుర్తించి బాధిత బృందం కింద చేర్చి సిబ్బంది వారి గృహాలను సందర్శించి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు సేకరిస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లాలో ఈ నెల 2 నుంచి సర్వే ప్రారంభించారు.

వీరికి పరీక్షలు తప్పనిసరి : మధుమేహ వ్యాధిగ్రస్తులు, మద్యం తాగేవారు, పొగ తాగడం అలవాటున్నవారు, పొగాకు ఉత్పత్తులు తినేవారు, 60 ఏళ్లు పైబడినవారు, బాడీ మాస్ ఇండెక్స్ 18.5 కంటే తక్కువ ఉన్నవారు, అయిదేళ్లుగా వ్యాధితో బాధపడినవారు, బాధితుల ఇంట్లో మూడేళ్లుగా నివాసం ఉన్న సభ్యులంతా తప్పనిసరిగా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. అయిదు నెలల కిందట ఎన్‌సీడీ సర్వేలో వారి వివరాలను సేకరించారు. ఇంటింటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై సమాచారం సేకరించడంతో పాటు ఎక్స్‌రే తీయాలని ఆదేశాలిచ్చారు. ఇందుకు అవసరమైన హ్యాండ్ హెల్త్ ఎక్స్‌రే యంత్రాలను వైద్య సిబ్బందికి సమకూర్చారు. ఆశా, హెల్త్ వర్కర్లు సర్వేలో పాల్గొంటున్నారు. జిల్లా టీబీ కంట్రోల్ విభాగం అధికారి డాక్టర్ మురళీకృష్ణ పర్యవేక్షణలో ఈ ఏడాది డిసెంబరు ఆఖరుకు సర్వే పూర్తవుతుందని క్షయ వ్యాధికి చికిత్స ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందిస్తారని ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ రాజారమేష్ తెలిపారు.

ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న సిబ్బంది

మరణ ధ్రువీకరణపత్రం జారీపై విచారణ

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: పిడుగురాళ్ల మున్సిపాలిటీలో ఎటువంటి విచారణ చేపట్టకుండా మరణ ధ్రువీకరణపత్రం జారీ చేయడంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. 2014-15 మధ్య కాలంలో మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జి.రఘుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ నజీర్‌లపై ఆరోపణలొచ్చాయి. పిడుగురాళ్లకు చెందిన యరగాని శేషయ్య మరణ ధ్రువపత్రం జారీలో అక్రమాలకు పాల్పడ్డారని, నిగ్గు తేల్చాలని ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. విచారణ అధికారిగా గుంటూరుకు చెందిన ఆర్‌డీఎంఏ హరికృష్ణను నియమించారు.

నరసరావుపేటలో జీఐఎస్ మాస్టర్ ప్లాన్ అమలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: నరసరావుపేట మున్సిపాలిటీలో జియోగ్రాఫికల్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) మాస్టర్ ప్లాన్ అమలుచేసేలా ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. ఇరవై సంవత్సరాలకోసారి మాస్టర్ ప్లాన్ మారుస్తుంటారు. అందులో భాగంగా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నరసరావుపేటకు ఏడు కిలోమీటర్ల దూరం వరకు పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్‌ను విస్తరిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు. అంతేకాకుండా ఇకపై నిర్మించే భవనాలకు అనుమతులు జీఐఎస్ రూపంలో ఇవ్వనున్నారు.

వాత్సల్యం కురిసి.. బాల్యం మురిసి

కష్టాల్లో ఉన్నవారికి అండ

నరసరావుపేట, న్యూస్‌టుడే

వివిధ కారణాలతో తల్లిదండ్రుల ప్రేమకు దూరమై కష్టాలతో బాల్యాన్ని ఎదురీదుతున్న చిన్నారులకు మిషన్ వాత్సల్య అండగా నిలుస్తోంది. పూర్తి, పాక్షిక అనాథ బాలల చదువులు, వారి పోషణకు కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో అర్హుల ఎంపికలో తీవ్ర జాప్యం జరిగి ఒక ఏడాది లబ్ధిని కోల్పోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారిని ఆదుకోవడంపై దృష్టి సారించింది. గడచిన సంవత్సరానికి ఒక్కో లబ్ధిదారుకు నెలకు రూ.4 వేల చొప్పున ఆరు నెలలకు రూ.24 వేలు అందించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం తొలివిడతగా ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. రాష్ట్రంలోనే పల్నాడు జిల్లాలో తొలివిడత లబ్ధిని అందించే చర్యలు చేపట్టారు.

❖ సత్తెనపల్లి మండలం కందులవారిపాలేనికి చెందిన దంపతులు అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో వేర్వేరుగా బలవన్మరణం చెందారు. వారి కుమార్తె అమ్మానాన్నల ప్రేమకు దూరమైంది. నాయనమ్మ పెంపకంలో మూడో తరగతి చదువుతోంది. మిషన్ వాత్సల్య కింద ఆ బాలిక బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం నగదు జమ చేసింది. ఇదే మండలానికి చెందిన బాలిక తండ్రి మృతి చెందారు. తల్లి అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. ఆ బాలిక మూడో తరగతి చదువుతోంది. మిషన్ వాత్సల్య కింద సాయం మంజూరైంది.

❖ నరసరావుపేటకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి దంపతులు కొవిడ్ రెండో దశలో మృతిచెందారు. వారి కుమారుడు ఐదో తరగతి చదువుతున్నాడు. తాత, అమ్మమ్మల సంరక్షణలో ఉన్న ఆ బాలుడికి మిషన్ వాత్సల్య కింద లబ్ధి అందిస్తోంది.

❖ జిల్లాలో 408 మందికి లబ్ధి.. జిల్లాలోని 28 మండలాలు, ఆరు పట్టణాలు, రెండు నగర పంచాయతీల పరిధిలో 2,031 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిద్వారా అనాథ బాలల వివరాలు సేకరించి 408 మందిని మిషన్ వాత్సల్యకు ఎంపిక చేశారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా లబ్ధిదారులు

పేరు	సంఖ్య
ఈపూరు	24
గురజాల	23
క్రోసూరు	62
మాచర్ల	72
నాదెండ్ల	46
నరసరావుపేట	36
పిడుగురాళ్ల	36
సత్తెనపల్లి	61
వినుకొండ	48

లబ్ధిదారుల్లో.. తల్లిదండ్రులను కోల్పోయి 127 మంది తమ రక్త సంబంధీకుల సంరక్షణలో ఉంటున్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, కొవిడ్ బారినపడి అనాథలైన చిన్నారులు 96 మంది, పీఎం కేర్ పథకం కింద ఎంపికైన వారు నలుగురు, పాక్షిక అనాథలు 177 మంది, పోషణ బాధ్యత నుంచి తల్లిదండ్రులు తప్పుకోవడంతో ఇబ్బందుల్లో ఉన్నవారు నలుగురున్నారు. వీరికి ఆర్థిక సహాయంతో పాటు ప్రభుత్వ విద్యాలయాలు, వసతిగృహాల్లో ప్రవేశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మిషన్ వాత్సల్యతో అభాగ్యులైన 18 ఏళ్లలోపు పిల్లలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి తెలిపారు. జిల్లాలో 408 మంది లబ్ధిదారుల ఖాతాలకు తొలి విడతగా రూ.6 వేల చొప్పున తొలి విడత లబ్ధి జమ చేసినట్లు వివరించారు.

ఆయకట్టుకు సాగునీటి భరోసా

కృష్ణమ్మ కళకళ

ఈనాడు, అమరావతి, విజయపురిసౌత్, న్యూస్‌టుడే: జలాశయాలకు జులైలోనే వరద పోటెత్తడంతో కృష్ణా నది జలకళ సంతరించుకుంది. శ్రీశైలం ఎగువన ఉన్న ప్రాజెక్టులు నీటితో నిండడంతో దిగువకు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. శ్రీశైలం జలాశయ గరిష్ఠ నీటిమట్టానికి చేరువైంది. దీంతో గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయనున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 78 వేల క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయంలో 529.10 అడుగుల వద్ద 166.39 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కృష్ణా నదికి ప్రస్తుతం ఉన్న ప్రవాహం కొనసాగితే త్వరలోనే సాగర్ డ్యామ్ కూడా నిండుతుంది. పులిచింతల ప్రాజెక్టు గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 19.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాగర్ జలాశయం నిండితే పులిచింతలకు వరద ప్రవాహం మొదలవుతుంది. ఈ నేపథ్యంలో సాగర్ కుడి, ఎడమ కాలువలతోపాటు కృష్ణా డెల్టా ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా లభించింది. సకాలంలో పంటల సాగుకు వెసులుబాటు కలిగిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

❖ ప్రకాశం బ్యారేజీకి పట్టిసీమ నుంచి గోదావరి జలాలు తరలిస్తున్నారు. కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలకు నీటిని విడుదల చేయడంతో రైతులు వరి నాట్లు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. పశ్చిమ డెల్టాలో వెద పద్ధతిలో వరి సాగు మొదలైంది. సాగర్ కాలువల కింద కూడా ఈసారి సాగునీరు ముందుగానే విడుదలవుతుందన్న అంచనాల నేపథ్యంలో రైతులు బోరుబావుల కింద నారుమళ్లు వేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగర్ కాలువల కింద 7 లక్షల ఎకరాలు, కృష్ణా పశ్చిమ డెల్టాలో 5 లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా లభించింది. సాగర్ కాలువలకు నీటిని విడుదల చేస్తే వాగుల్లో నీటి లభ్యత పెరిగి ఎత్తిపోతల పథకాల కింద ఉన్న 2 లక్షల ఎకరాల మెట్ట పంటలకు నీరందుతుంది. కాలువలు, వాగుల్లో నీటి ప్రవాహం పెరిగితే భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి.

(c) eenadu

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

అర్జీదారుడి కష్టం తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపుతామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వేదికలో బాధితుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం ఆయా సమస్యలకు సంబంధించి మొత్తం 96 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

సంతానం లేదని వేధింపులు: సత్తెనపల్లి మండలం నాగన్నకుంటకు చెందిన షేక్ తాహిరకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇప్పటికీ సంతానం లేకపోవడంతో భర్త హుస్సేన్ మద్యం తాగి వచ్చి రోజు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇదే అదునుగా అత్త, ఆడబిడ్డ దురుసుగా ప్రవర్తిస్తున్నారని, రక్షణ కల్పించాలని ఎస్పీకి ఫిర్యాదు చేసింది.

ఆధార్ సెంటర్ ఇప్పిస్తామని నమ్మించి..: సత్తెనపల్లి మండలం బట్లూరుకు చెందిన కట్ట నరేంద్ర డిగ్రీ చదివి పొలం పనులు చేసుకుంటుండగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన జోగిపర్తి అశోక్, వెంకటేష్ ఆధార్ సెంటర్ ఇప్పిస్తామని నమ్మించి అతని వద్ద రూ.90 వేలు తీసుకున్నారు. ఆధార్ సెంటర్ ఇప్పించకపోవడంతో డబ్బులు అడుగుతుండగా బెదిరిస్తున్నారని బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ఆస్ట్రేలియాలో ఉద్యోగం పేరిట..: గురజాల మండలం మాడుగుల గ్రామానికి చెందిన కె.హనుమంతరావు డిగ్రీ చదివి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా అతని మేనమామ కుమారుడు తాటికొండ మల్లికార్జునరావు, విజయవాడకు చెందిన అమోకిరి అఖిల్ స్వరూప్ ఆస్ట్రేలియాలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి హనుమంతరావు, అతని స్నేహితుడు ప్రసాదం తేజ నుంచి రూ.18,50,000 చొప్పున వసూలు చేసి ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

NARASARAOPET MUNICIPALITY, NARASARAOPET
'e'-Procurement - Short Tender NOtice
Tender Notice No. 147/2025/E1, Dt. 07-07-2025

1	Total No of Works	1 No. of Work (Nit. No. 15A/2025-26-Short Tender 1st Call)
2	Total Estimate Value of Works	Rs. 17,00,000/-
3	Bid document download Starting Date.	08-07-2025 11:00 AM
4	Bid Document download end date.	15-07-2025 04:00
5	Last Date & Time for receipt of Bids.	15-07-2025 05:00 PM
6	(Nit. No. 15A/2025-26 - (Municipal General Funds)	

Note: Any addendum/corrigendum/bid clarifications/time extension shall be issued on the website only. No Separate Press notification shall be issued. Further details can be seen @ e-Procurement market place at www.tender.apeprocurement.gov.in

Sd/- Commissioner, Narasaraopet Municipality, Narasaraopet

బహిరంగ వేలం ప్రకటన

ఇన్స్పెక్టర్ ఆడిటర్ వక్ఫ్స్ నరసరావుపేట తేది: 07-07-2025
పల్నాడు జిల్లా, నరసరావుపేట

R.C. No. 31/ASK/DCP/97

[illegible] దాచేపల్లి గ్రామము & మండలము పరిధిలోని [illegible] 1018 డి.సి. నెంబర్ 868, సర్వే నెంబర్ 569/1A1 లో మొత్తం ఎకరం 8.00 సెంట్ల [illegible] 2025-2028కు [illegible] 09-07-2025న 11.30 గంటలకు [illegible] 10,000/- [illegible]

వరుస సంఖ్య	వేలము వేయు భూమి	సర్వే నెంబర్	విస్తీర్ణము ఎకరం – సెంట్లు
1.	దాచేపల్లి గ్రామము & మండలము పల్నాడు జిల్లా	569/1A1	8.00

మరియు కౌలు రొక్కమును డి.డి. రూపములో C.E.O. A.P. State Waqf Board, విజయవాడ వారి పేరు మీద చెల్లించగలరు.

ఇన్స్పెక్టర్ ఆడిటర్ వక్ఫ్స్, నరసరావుపేట,
పల్నాడు జిల్లా, నరసరావుపేట

ఎండిన వాగులు.. బీళ్లుగా పొలాలు

అయోమయంలో అన్నదాత

నూజండ్ల, న్యూస్‌టుడే

ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురిసి, పంటలు సమృద్ధిగా పండుతాయని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలేలా ఉంది. మే నెలాఖరులో మబ్బులు, వర్షాలతో మురిపించినా, ప్రస్తుతం వానలు ముఖం చాటేయడంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే వాగులు, చెరువులు ఎండిపోయాయి. కళకళలాడాల్సిన వేలాది ఎకరాల సాగు భూములు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. వరుణుడు కరుణించకుంటే కష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చుక్కనీరు లేని నూజండ్ల చెరువు

రాళ్లు తేలిన వల్లేరువాగు

నిరుపయోగంగా ఎత్తిపోతల

మండలంలో పెద్దవాగు, రెల్లాగు, మేడోగు, చిలకలేరు, వల్లేరు తదితర వాగులు ఎండిపోవడంతో గొల్లపాలెం, త్రిపురాపురాలు, తలార్లపల్లె, రెడ్డిపాలెం, చెరువుకొమ్ముపాలెం, చింతలచెరువు, అప్పాపురం, ముక్కెళ్లపాడు తదితర గ్రామాల్లో వేలాది ఎకరాలు సాగుకు నోచుకోలేదు. గుండ్లకమ్మ నది కూడా ఎండిపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోతుండగా, పంట కోసం పొలాలు ఎదురు చూస్తున్నాయి. వాగులకు అనుసంధానంగా రూ.లక్షల వ్యయంతో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. చెక్‌డ్యాంలు నీరు లేక వెలవెలపోతున్నాయి. దీంతో రైతులు ఏం చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. వర్షాభావ పరిస్థితులతో చెరువుల్లో నీరు లేక సాగునీటి సమస్య ఏర్పడింది.

తాగునీటికీ కొరత

★ పెద్దవాగు ఆధారంగా ఆరు గ్రామాల్లో 3500 ఎకరాల మాగాణి, వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంల కింద 120 ఎకరాల భూములు సాగవుతున్నాయి. 4 వేల ఎకరాల మెట్ట పంటలకు ఆరుతడికి కూడా నీరందిస్తుంది. పశువులకు తాగునీరు, గ్రాసం కొరత ఏర్పడుతోంది.

★ వల్లేరువాగు ఎండిపోవడంతో దీని పరిధిలోని పొలాలకు సాగునీటి సమస్య ఏర్పడింది. ఏటా ఇప్పటికే నాట్లు వేసి కళకళలాడాల్సిన పొలాలు ఈ ఏడాది బీడు భూములుగానే ఉన్నాయి. ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు.

గత అయిదారేళ్లలో పెద్దవాగు ఎప్పుడూ ఎండలేదు. వాగు వచ్చి పంట పండితేనే జీవనం, లేకపోతే ఇబ్బందులు ఎదుర్కోక తప్పని పరిస్థితి ఉంటుంది. వేసిన మెట్ట పంటలకు ఆరుతడి నీరు పెడదామన్నా అవకాశం లేదు. గత ఏడాది ఇబ్బంది పడ్డాం. కరవు వస్తే రైతుల పరిస్థితి దయనీయంగా మారుతుంది. సాగర్ కాల్వలు వచ్చినా మా గ్రామానికి సాగు నీరు రాదు. ఏం చేయాలో అర్థంకాక మిన్నకుండిపోయాం.
- కుంటా కోటిరెడ్డి, రైతు, గొల్లపాలెం

దిక్కుతోచడం లేదు

చెరువులు, వాగుల్లో నీళ్లుంటేనే పంటలు పండేది. వాగు కింద అయిదెకరాల మాగాణి ఉంది. అది పండితేనే తిండి గింజలు వచ్చేది. వర్షాలు పడక ఈ ఏడాది ఇప్పటికి సాగు ప్రారంభించలేదు. కాలువలకు నీరొచ్చినా మా భూములకు అందవు. వాగుపైనే ఆధారపడాలి. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. - అప్పిరెడ్డి, రైతు, తలార్లపల్లె

పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మూడు అదనపు కోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదన

వినుకొండ, న్యూస్‌టుడే: పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మూడు అదనపు కోర్టుల ఏర్పాటుకు హైకోర్టు రిజిస్ట్రీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. రాష్ట్రంలోని 22 జిల్లాల్లో 79 కొత్త కోర్టులకు ప్రతిపాదించిన పట్టణాల జాబితాలో వినుకొండ, బాపట్ల, చీరాల ఉన్నాయి. ఆయా పట్టణాల్లో కోర్టుల ఏర్పాటుకు వసతుల లభ్యతను తెలియజేయాలని కోరుతూ లేఖలు పంపించారని న్యాయవాదుల సంఘం కార్యదర్శి పఠాన్ గౌస్‌మొహిద్దీన్‌ఖాన్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న కోర్టు భవనాల్లో వసతి ఉందా..? లేనట్లయితే కొత్త నిర్మాణం లేదా అదే ప్రాంగణంలో లేదా ఇతర చోట్ల ఖాళీ స్థలాలు ఉంటే వాటి వివరాలు తెలియజేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) కోరినట్లు ఆయన చెప్పారు. కొత్త కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదిస్తే వినుకొండలో న్యాయసేవలు మరింత మెరుగుపడనున్నాయి.

ఘనవ్యర్థ కేంద్రాల నిర్వహణపై అసంతృప్తి

మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

నూజండ్ల, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, తాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ ఆధారంగా పంచాయతీలకు గ్రేడ్లు ఇస్తామని కేంద్ర బృందం సభ్యుడు బాసిత్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కేంద్ర బృందం పుచ్చనూతల పంచాయతీలో సోమవారం పర్యటించారు. ఘనవ్యర్థ నిర్వహణ కేంద్రాల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బహిరంగ మలవిసర్జన ఉండకూడదన్నారు. గ్రామాల్లో నూరుశాతం మరుగుదొడ్లు ఉండేలా గ్రామ ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా లేదని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పథకం ఉన్నా నీరు సరఫరా చేయడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడతామని సభ్యులు పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రాలు, పాఠశాల్లో మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. మార్పులు చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. డీడబ్ల్యూఎస్ కన్సల్టెంట్ రమేష్, ఈవోపీఆర్డీ రబ్బాని, సర్పంచి నాగరాజు, కార్యదర్శి చిట్టిబాబు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, బలరాం సిబ్బంది ఉన్నారు.

యానిమేటర్‌పై చర్యలకు వినతి

పీడీ ఝాన్సీలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న మహిళలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాజుపాలెం మండలం ఇనుమెట్ల డ్వాక్రా మహిళలను మోసగించిన యానిమేటర్ మస్తాన్‌వలిపై చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీలక్ష్మికి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మీరయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నాగమ్మ డ్వాక్రా సంఘం సభ్యులతో కలిసి కలెక్టరేట్‌లో పీడీని కలిసి సోమవారం విన్నవించారు. బ్యాంకులో రుణం కింద జమ చేస్తానని తమ నుంచి రూ.5.5లక్షలు తీసుకుని చెల్లించకుండా మోసగించాడని తెలిపారు. దీనిపై బ్యాంకు అధికారులు తమకు నోటీసులు ఇచ్చి బాకీ చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని డీఆర్‌డీఏ పీడీ దృష్టికి తెచ్చారు. తమకు న్యాయం చేయాలని కోరారు

స్వయం ఉపాధి పథకాలపై అవగాహన

నరసరావుపేట అర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాల లబ్ధిదారులు ఆర్థిక సహకారాన్ని అందుకుని పురోగతి సాధించాలని అధికారులు పేర్కొన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాల లబ్ధిదారులకు కలెక్టరేట్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మంచి యూనిట్‌ను ఎంచుకుని కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు శిక్షణతో పాటు అవసరమైన మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో |కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 107, రిటైల్ ధర - 129, చికెన్ విత్‌స్కిన్ - 187, చికెన్ స్కిన్‌లెస్ - 213.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 106, 114, 125 చికెన్ విత్ స్కిన్ - 204 చికెన్ స్కిన్‌లెస్ - 214.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

'ఆడుదాం ఆంధ్రా'పై విచారణ

నిధుల దుర్వినియోగంపై ఆధారాల సేకరణ

విచారణ నిర్వహిస్తున్న అధికారి సైదులు

నూజండ్ల, న్యూస్‌టుడే: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరిట నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం నూజండ్లలో విచారణ చేపట్టారు. క్రీడా కిట్లపై ఆరా తీశారు. క్రీడలు పూర్తయిన తర్వాత సంబంధిత ఎంఈవోకు క్రీడా సామగ్రి అప్పగించాల్సి ఉన్నా అలా జరగలేదని తేలింది. అవి ఎక్కడ ఉన్నాయో తెలియకపోవడంపైనా విచారణ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కిట్లు నాసిరకంగా ఉన్నట్లు వ్యాయామోపాధ్యాయులు వారి దృష్టికి తీసుకొచ్చారు. సచివాలయానికి రూ.10 వేలు, ఎంపీడీవో కార్యాలయానికి రూ. 25 వేలు చొప్పున వచ్చిన నిధులపై ఆరా తీశారు. వాటికి సంబంధించిన రికార్డులు లేకపోవడంతో నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదని తెలుసుకున్నారు. ఈ విషయమై వ్యాయోపాధ్యాయులు, క్రీడాకారులను పిలిచి విచారణ చేశారు. వారి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. విజేత జట్టుకు రూ.25వేలు ఇవ్వాల్సి ఉన్నా, ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పీడీ వెంకటరత్నం వివరించారు. ప్రొఫెషనల్ కిట్‌కు రూ. 20 వేలు, ప్రైమరీ కిట్లకు రూ. 10 వేలు ఖర్చు చేశారని, అవి ఎక్కడ ఉన్నాయనే దానిపై ఆరా తీశారు. నిధుల దుర్వినియోగంపై జిల్లా అధికారులను ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు రావడంతో వాటికి సంబంధించిన రికార్డులు ఇవ్వాలని కోరారు. ఆడుదాం ఆంధ్రాలో దాదాపు రూ. 100 కోట్లు దుర్వినియోగం అయినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. వీటిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు గుంటూరు రేజ్ అధికారి సైదులు తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తానే విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ఉమాదేవి, సిబ్బంది ఉన్నారు.

టీ-20 క్రికెట్ పోటీల విజేత నకరికల్లు

విజేత జట్టుకు కప్పు, నగదు అందిస్తున్న నిర్వాహకులు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని విప్పర్లపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నియోజకవర్గాల టీ-20 క్రికెట్ పోటీల్లో సత్తెనపల్లి నియోజకవర్గం నకరికల్లు సీసీ జట్టు విజేతగా నిలించింది. జూన్ 12వ తేదీ నుంచి విప్పర్లపల్లివారి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచిన జట్టుకు వడ్లమూడి కిషోర్, కాకర్ల సాంబశివరావు, పగడాల వెంకటేశ్వరరెడ్డి, శాఖమూరి మారుతి చేతులమీదగా రూ.1.30లక్షలు నగదు బహుమతి సోమవారం అందజేశారు. పర్చూరు నియోజకవర్గం దుద్దుకూరు యూత్ జట్టు రెండో బహుమతి దక్కించుకోగా వారికి డాక్టర్ శాఖమూరి బాజీబాబు, డాక్టర్ చెరుకూరి ఫణికుమార్, ఏనుగంటి వెంకటరత్నం సమకూర్చిన రూ.80వేలు నగదును నిర్వాహకులు అందించారు. మూడో బహుమతిని చీరాల కోటి ఫ్రెండ్స్ టీమ్ గెలుచుకోగా చట్టు నాగరాజు చేతుల మీదగా రూ. 50వేలు, నరసరావుపేట జట్టు 4వ బహుమతిని దక్కించుకోగా వారికి యాంపాటి అంజిరెడ్డి, గ్రామ సర్పంచి గాదె రామిరెడ్డి రూ.30వేలు అందించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

జూద కేంద్రంపై దాడి

25 ద్విచక్ర వాహనాలు, రూ.1.87 లక్షలు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న వాహనాలతో డీఎస్పీ జగదీష్ తదితరులు

దుర్గి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కాకిరాల అటవీ ప్రాంతంలోని జూద కేంద్రంపై సోమవారం గురజాల డీఎస్పీ జగదీష్ నేతృత్వంలో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా స్థానిక స్టేషన్‌లో డీఎస్పీ విలేకరులకు వివరాలు వెల్లడించారు. జూద కేంద్రంపై దాడి చేసి 22 మందిని అదుపులోకి తీసుకున్నామని, మరికొందరు పరారైనట్లు తెలిపారు. కేంద్రం నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. రూ.1,87,680 నగదు, 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కారంపూడి సీఐ శ్రీనివాసరావు, ఎస్సై సుధీర్‌కుమార్ తదితరులు దాడి చేశారన్నారు.

భర్త చేతిలో భార్య హతం?

మేళ్లవాగులో ఘోరం

బొల్లాపల్లి, వినుకొండ, న్యూస్‌టుడే: బొల్లాపల్లి మండలం మేళ్లవాగు గ్రామ పరిధిలో కట్టుకున్న భార్యను కడతేర్చాడో భర్త. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రం బొల్లాపల్లికి చెందిన గంగనబోయిన వెంకటేశ్వర్లుకు 20ఏళ్ల క్రితం మేళ్లవాగుకు చెందిన కృష్ణకుమారితో వివాహమైంది. కొద్ది రోజులకు దంపతుల మధ్య గొడవలు తలెత్తడంతో అత్తింటి వద్దే కాపురం ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం సాయంత్రం పొలం వెళ్లిన భార్యాభర్తలు తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయం పిల్లలు స్థానికులకు తెలపగా కొందరు గ్రామపెద్దలు పొలం వెళ్లిచూడగా ఓ చెట్టు కింద ముఖంపై కత్తితో నరికిన గాయాలతో పట్ట కప్పి ఉన్న కృష్ణకుమారి మృతదేహం చూసి హతాశులయ్యారు. చుట్టుపక్కల వెతికినా భర్త వెంకటేశ్వర్లు ఆచూకీ లేకపోవడంతో అతనే దారుణానికి ఒడిగట్టాడన్న అనుమానంతో బండ్లమోటు పోలీసులకు సమాచారం అందించారు. గ్రామీణ సీఐ ప్రభాకరరావు, ఎస్సై బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై దాడి: కేసు నమోదు

చిలకలూరిపేట గ్రామీణ: నాదెండ్ల మండలం సాతులూరులో ఓ యువకుడిని కులం పేరుతో దూషించి దాడి చేసిన వ్యక్తిపై ఎట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుల్లారావు తెలిపారు. యువకుడు ఓ స్కూలుకు సంబంధించి ప్రహరీ నిర్మాణ పనులు చేస్తున్నాడు. ప్రహరీ వెనుక వైపు ఉన్న మేడంపల్లి శ్రీనివాసరావు తన ఇంటి వైపు వచ్చి పని చేస్తావా అంటూ అతన్ని తిట్టడంతో పాటు ఇటుక పెళ్లతో కొట్టాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

చిరుద్యోగి ఆత్మహత్య

సత్తెనపల్లి గ్రామీణ: గుడిపూడి రైల్వే స్టేషను వద్ద చుక్కా సన్నీ(22) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగు చూసింది. గుడిపూడి గ్రామానికి చెందిన చుక్కా అనిత, థామస్ దంపతుల కుమారుడు సన్నీ బెంగళూరులో చిరుద్యోగి. అతడి తల్లి అనారోగ్యం పాలవడంతో శుక్రవారం గ్రామానికి వచ్చాడు. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయాడు. ఆదివారం రాత్రి చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడ్డాడు. గమనించిన లోకో పైలట్ సత్తెనపల్లి రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. నడికుడి పోలీసులు అతడి మృతదేహాన్ని గుర్తించారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, గుంటూరు సిటీ, రాజేంద్రనగర్ 2వలైను, డోర్ నెంబర్ 3-28-18-124/1 కాపురస్థులైన తులసి రామచంద్ర ప్రభు గారి కుమారుడు తులసి కృష్ణచైతన్య గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈక్రింది షెడ్యూల్ ఆస్తిని దుర్గి మండలం , కోళ్లగుట్ల గ్రామ వాస్తవ్యులు కందారపు రామయ్య S/o పుల్లయ్య వారు గతంలో భూమిపై స్వాధీన హక్కులు కలిగివున్నారని, సదరు ఆస్తిని కందారపు రామయ్య గారి మరణానంతరం వారి కుమారులు 1) కందారపు పెద్ద వెంకటేశ్వర్లు 2) కందారపు చిన్న వెంకటేశ్వర్లు గార్లకు సంక్రమించి అప్పటి నుండి షెడ్యూల్ ఆస్తిని స్వాధీన పరుచుకొని దుర్గి మండల తహశీల్దారు వారి కార్యాలయం నుండి తహశీల్దారు వారి వారిచే 1B, అడంగల్ మరియు పట్టాదారు పాస్‌బుక్ నెంబర్ 743, 744ర్లుగా పొంది సర్వ హక్కులతో అనుభవించుచున్నారని తెలియజేస్తూ సదరు షెడ్యూల్ ఆస్తిని నా క్లయింటుకు అమ్మచూపగా. సదరు ఆస్తిని నాక్లయింట్ కొనుగోలు చేయుటకు సిద్ధపడి ఉన్నారు. కావున సదరు ఆస్తికి సంబంధించి ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల, ఈ రోజు నుండి వారం రోజులులోగా దిగువ అడ్రస్ లో వ్రాతపూర్వకమైన ఆధారాలతో సంప్రదించగలరు. గడువులోగా ఎట్టి అభ్యంతరములు రాని యెడల సదరాస్తి నిర్వివాదం , నిష్పేచి ఆస్తిగా భావించి నా క్లయింటు రిజిస్టర్ దస్తావేజు ద్వారా కొనుగోలు చేయగలడు. గడువు దాటిన పిమ్మట వచ్చు ఎట్టి అభ్యంతరములైననూ నా క్లయింటును బంధింపజాలవు.

షెడ్యూల్: నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లాలో చేరిన మాచర్ల సబ్.రి, యిలాక దుర్గి మండలం, కోళ్లగుట్ల గ్రామ డి.నెం. 297/Bరు య 6.04 సెంట్లు మింజుమలే య1.98 సెంట్లు భూమిని దుర్గి మండల సర్వేయరుగారిచే సర్వే చేయించగా, మండల సర్వేయరు వారు అర్జీ నెం . FSNV012500758190 మరియు FSNV012500758194ర్లు Dt. 06 జూన్ 2025, ప్రకారం ది 12 జూన్ 2025 తేదీన సర్వే చేసి ఎండార్సుమెంట్ నెం RC. No. FL338627/2025 మరియు RC. No. FL338629/2025ర్లు ఇచ్చిన ఎండార్సుమెంట్ దాఖలా కోళ్లగుట్ల గ్రామ డి.నెం 297/Bరులో య 1.98 సెంట్లు వ్యవసాయ భూమికి హద్దులు.

తూర్పు : తాళ్లూరి వెంకటేశ్వర్లు. **దక్షిణం** : ముక్కపాటి వీరాంజనేయులు. **పడమర** : కంటేకర్ అశోక్ (వీరోజి). **ఉత్తరం** : దుర్గి - ఉప్పలపాడు రోడ్డు. ఈ హద్దుల మధ్య గల ఎకరం 1.98 సెంట్లు లేదా 0.8012776హెక్టార్ స్థిరాస్తి స్థలము మాత్రము

G V RAMANA, Advocate
D.No: 13-2-50, 1st Line, Gunturivarithota,
Guntur-522001 Cell No. 98482 31931

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, గుంటూరు సిటీ, రాజేంద్రనగర్ 2వ లైను, డోర్ నెంబర్ 3-28-18-124/1 కాపురస్థులైన తులసి రామచంద్ర ప్రభు గారి కుమారుడు తులసి కృష్ణచైతన్య గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని దుర్గి మండలం, కోళ్లగుట్ల గ్రామ వాస్తవ్యులు ముక్కపాటి హనుమంతురావు గారి కుమారుడు ముక్కపాటి వీరాంజనేయులు గారు, ముక్కపాటి సీతారామయ్య గారి కుమార్తె ముక్కపాటి అనూష (భర్త ప్రత్తిపాటి వీరయ్య) మరియు ప్రత్తిపాటి మంగారావు గారి కుమారుడు ప్రత్తిపాటి వీరయ్య అను వార్ల నుండి కొనుగోలు చేసి, మాచర్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నందు రిజిస్టర్ విక్రయ దస్తావేజు నెం. 2142/2023 ది. 24 ఏప్రిల్ 2023 రీత్యా షెడ్యూల్ ఆస్తి స్వాధీనపరుచుకొని దుర్గి మండల తహశీల్దారు వారి కార్యాలయం నుండి తహశీల్దారు వారిచే 1B, అడంగల్ మరియు పట్టాదారు పాస్‌బుక్ నెంబర్ 1282 రు గా పొంది, సర్వహక్కులతో అనుభవించుచున్నారని తెలియజేస్తూ సదరు షెడ్యూల్ ఆస్తిని నా క్లయింటుకు అమ్మచూపగా. సదరు ఆస్తిని నాక్లయింట్ కొనుగోలు చేయుటకు సిద్ధపడి ఉన్నారు. కావున సదరు ఆస్తికి సంబంధించి ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల, ఈ రోజు నుండి వారం రోజులు లోగా దిగువ అడ్రస్ లో వ్రాతపూర్వకమైన ఆధారాలతో సంప్రదించగలరు. గడువులోగా ఎట్టి అభ్యంతరములు రాని యెడల సదరాస్తి నిర్వివాదం , నిష్పేచి ఆస్తిగా బావించి నా క్లయింటు రిజిస్టర్ దస్తావేజు ద్వారా కొనుగోలు చేయగలడు. గడువు దాటిన పిమ్మట వచ్చు ఎట్టి అభ్యంతరములైననూ నా క్లయింటును బంధింపజాలవు.

షెడ్యూల్: నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లాలో చేరిన మాచర్ల సబ్.రి, యిలాక దుర్గి మండలం, కోళ్లగుట్ల గ్రామ డి.నెం 296/Aరు య 0.86 సెంట్లు మరియు డి.నెం 349/Aరు య 0.675 సెంట్లు, వెరసి ఏకఖండముగా గల య 1.535 సెంట్లు భూమిని దుర్గి మండల సర్వేయరు గారిచే సర్వే చేయించగా, మండల సర్వేయరు వారు అర్జీ నెం. FSNV012500758188రు Dt. 06 జూన్ 2025, ప్రకారం ది 12 జూన్ 2025 తేదీన సర్వే చేసి ఎండార్సుమెంట్ నెంబర్ గా RC. No. FL338624/2025రు న ఇచ్చిన ఎండార్సుమెంట్ దాఖలా కోళ్లగుట్ల గ్రామ డి.నెం 296/A రు మరియు 349/Aర్లు, లో య 1.535 సెంట్లు వ్యవసాయ భూమికి హద్దులు.

తూర్పు : నేరెళ్ల హనుమంతరావు భూమి. **దక్షిణం** : ప్రత్తిపాటి వెంకటేశ్వర్లు భూమి. **పడమర** : అల్లం మల్లారెడ్డి పగ్గెరాల భూమి. **ఉత్తరం** : కందారపు పెద్ద వెంకటేశ్వర్లు పగ్గెరాల భూమి. ఈ హద్దుల మధ్య గల ఎకరం 1.535 సెంట్లు లేదా 0.621 హెక్టార్ స్థిరాస్తి స్థలము మాత్రమే

G V RAMANA Advocate
D.No: 13-2-50, 1st Line, Gunturivarithota,
Guntur-522001 Cell No. 98482 31931

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES

బిజినెస్ మరియు ఎంప్లాయీస్‌కి లోన్ ఎలిజిబిలిటీ ఉండి ప్రాపర్టీ లేక ప్రాపర్టీ ఉండి ఎలిజిబిలిటి లేని వారికి 1 Cr. నుండి 10 Cr. వరకు లోన్ ఇప్పించబడును. ✆ 99597 71529.

PEOPLE CARE

అశ్విని హోమ్‌కేర్ సర్వీసెస్ చిన్నపిల్లలను చూసుకునుటకు అనుభవంగల కేర్ టేకర్లు, హౌస్ కీపర్స్, పేషంట్స్ కొరకు నర్సులు, ఆయాలు మీ ఇంటి వద్దకే పంపించబడును. గుంటూరు. 88533 83338.

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

బాపట్ల పట్టణము మెయిన్‌రోడ్ మరియు నేషనల్ హైవే మధ్యగల రోడ్డు ప్రక్కన గల పటేల్ నగర్ 1వలైనులో బిజెపి ఆఫీస్ ప్రక్కన 5.5 సెంట్ల విస్తీర్ణములో గల 2 అంతస్తుల డాబా అమ్మకమునకు కలదు. ✆ 99498 43944, 94416 49539.

LAND FOR SALE

GENERAL

మెగా ★ అవకడో ★ఫామ్ ల్యాండ్‌లో 11 సెంట్లు ★5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్: 9133574455.

PLOT FOR SALE

GENERAL

అమరావతి రోడ్, మల్లికార్జునపేట, 30 అ॥ రోడ్, వెస్ట్ ఫేసింగ్ 25X45=125 చ.గ.ల ఖాళీ స్థలం అమ్మకానికి కలదు. గజం 44వేలు. ఫోన్: 90308 07472.

JOBS

Amaravathi Roofings: Roofing Sheats Distributor looking for Sales executives for Palnadu District with 2 to 3 yrs. Experience, Any Degree/Diploma. ✆ 95505 33666.

SIMS Group of Institutiona Require Hostel Wardens and Supervisors Male and Female, Qulification any Degree, Interested Candidates Call- Ph:- 76759 63955, 9133858238.

Wanted Primary, High School Telugu, English and Physics Teachers Contact Immediately. Perecherla Ph : 97017 59405, 99123 77669.

Required Accountant with Tally Knowledge for a Company Salary: 20000 to 30000. Contact: 95023 82228.

Looking for Senior Shift Supervisor & Maintenance Manager & Training Officer for a Spinning Mill Company with Plant @ Medchal with minimum of 10 Years. Exp. ✆ 8187860597.

Wanted Marketing Executives to work in Reputed Organization. Salary 12K to 15K. For Details. Reena's, 10/2, Arundalpet, Guntur. Interview Timings. 8 AM to 12 PM. Call: 98499 89951.

గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా భోజనం మరియు వసతితో పాటు Tally + Ms-Office కోర్సు నందు శిక్షణతో 100% ఉపాధి కల్పించబడును. 88851 81110.

కంప్యూటర్ డిజైనర్, ఐటీ కోఆర్డినేటర్, నర్సింగ్ స్టాఫ్, హెల్పర్స్, ల్యాబ్ టెక్నీషియన్ (నైట్ డ్యూటీ) కావలెను. ✆: 77999 77855.

గుంటూరులోని ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనిలో పనిచేయుటకు సూపర్ వైజర్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత కలదు. ✆ 70753 38338.

ఆత్మ విశ్వాసముతో సృజనాత్మక ఆలోచనలతో కుటుంబ వృద్ధిలో భాగస్వామ్యం కావాలనుకునే వివాహిత మహిళలకు ఒక సదావకాశం. మార్కెటింగ్ మరియు ఆఫీసు. విద్యార్హత: ఇంటర్‌మీడియట్ ✆ 89198 68927.

WALK -IN - INTERVIEW విజన్ ఆటో మోటీవ్స్ - అపె ఆటో షోరూమ్ గుంటూరు, తెనాలి, నరసరావుపేట, మంగళగిరి, పిడుగురాళ్ళ నందు పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్ - 4 ★ సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ -15 ★ అకౌంటెంట్స్ - 2 ★ సర్వీసు మేనేజర్ - 1 ★ సర్వీసు సూపర్‌వైజర్స్ - 4 ★ మెకానిక్స్ - 6 కావలెను. విజన్‌ఆటో మోటీవ్స్, D.No: 18-4-23, బ్రహ్మానందరెడ్డి స్టేడియం దగ్గర గుంటూరు. ఇంటర్వ్యూ తేది: 08-07-2025 నుండి 11-07-2025 వరకు. ఫోన్/ వాట్సాప్ : 77999 09045, 77999 09055,. ఇమెయిల్: visionauto.guntur@gmail.com

WANTED
A LEADING FINANCIAL SERVICES MARKETING COMPANY REQUIRES
AREA MANAGER
FOR SELLING MOTOR INSURANCE
CTC Rs.3.5-4.5 LACS/ANNUM
PREFERABLY FROM GENERAL INSURANCE COMPANIES OR INSURANCE BROKING COMPANIES WITH 3 TO 4 YEARS OF EXPERIENCE.
LOCATION **GUNTUR**
send your RESUME to
resume@skiretail.in
✆ 9840335849
Ski Retail Capital limited
No.1, Sambandam Street, T Nagar Chennai-600017.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

నరసరావుపేట

•నరసరావుపేట •వినుకొండ •చిలకలూరిపేట

12న కంటి వైద్య శిబిరం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఈనెల 12న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు నెల్లూరి సదాశివరావు, కంచర్ల శ్రీనివాసరావు, జవ్వాజి మదన్ సోమవారం తెలిపారు. మే 29న ఎమ్మెల్యే ప్రత్తిపాటి జన్మదినం సందర్భంగా మెగా వైద్య శిబిరం ద్వారా ఎంపిక చేసిన 2వేల మందికి శంకర్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించారని, వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు ఇస్తారని తెలిపారు. గతంలో శిబిరాన్ని సద్వినియోగం చేసుకోలేని వారు హాజరైతే పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో రజక కాలనీ శివారున రోడ్డుపైనే గేదెలను కట్టి వేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - శ్రీనివాసరావు

✔ పరిశీలించి పశువుల యజమానికి తగిన సూచనలిస్తాం. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. - పి.వెంకటేశ్వరరావు, టీపీఎస్ – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

విద్యుత్తు వృథా అరికట్టారు

స్పందనకు వందనం

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట రెడ్డినగర్ రెండో వీధిలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఈ విషయాన్ని ఈనెల 5న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఏఈ రఫీ దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా ఆయన స్పందించారు. విద్యుత్తు వృథా అరికట్టే చర్యలు తీసుకున్నారు.

శునకాల పట్టివేత.. నూజండ్ల: నూజండ్లలో కుక్కల బెడదపై ఈ నెల 7న అధికారుల దృష్టికి తేగా స్పందించిన సర్పంచి, అధికారులు కుక్కలను పట్టించి అడవులకు తరలించారు.

కోటప్పకొండ త్రికోటేశ్వరుడి ఆదాయం రూ.24లక్షలు

నరసరావుపేట అర్బన్: కోటప్పకొండపై శ్రీత్రికోటేశ్వరస్వామి ఆలయానికి రూ.24,02,549 ఆదాయం లభించినట్లు ఈవో డి.చంద్రశేఖరరావు తెలిపారు. తొలి ఏకాదశి తర్వాత రోజు సోమవారం ఆలయంలో హుండీ లెక్కింపు చేశారు. హుండీల ద్వారా రూ.968028, టిక్కెట్ల విక్రయంతో రూ.909090, ప్రసాదాలకు రూ.439380, అన్నదానం హుండీల నుంచి రూ.86051 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

కొండ పండగకు.. వినుకొండ: కొండపై వేంచేసిన రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి తొలి ఏకాదశి పండగ ఆదాయం రూ.6,88,982 లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకరరెడ్డి సోమవారం తెలిపారు. ఇందులో వేలం పాటల ద్వారా రూ.2,42,000, విరాళాలు రూ.1,45,677, హుండీ ఆదాయం రూ.3,01,305 ఉన్నట్లు ప్రకటించారు. తిరునాళ్ల విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'నవోదయ'కు చిరుమామిళ్ల విద్యార్థిని ఎంపిక

చిరుమామిళ్ల(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలోని కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో 5వ తరగతి చదివిన విద్యార్థిని కె.లలిత రెండో విడత ప్రకటించిన జవహర్ నవోదయ ఫలితాల్లో సీటు సాధించింది. ప్రభుత్వ పాఠశాల నుంచి విద్యార్థిని ఎంపిక కావడంతో ఉపాధ్యాయులను గ్రామస్థులు అభినందించారు.

ఇక్కడ మోటారు అపహరించారు

విద్యుత్తు సామగ్రి ఎత్తుకెళ్లిన ఇల్లు

గోడ పగులకొట్టి.. గేటు తీసుకెళ్లారు

సులువుగా కొల్లగొట్టేస్తున్నారు!

శివారు కాలనీలో దొంగల స్వైరవిహారం

న్యూస్‌టుడే, వినుకొండ రూరల్

వినుకొండ పట్టణంలో పేదలకు గత ప్రభుత్వ హయాంలో జాలలపాలెం వద్ద 4వేల మంది పైగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇక్కడ కొందరు ఇళ్లు నిర్మించినా ఊరికి దూరంగా ఉండడంతో నివాసం ఉండడం లేదు. వీటికి పడికే చాలు ఈ గృహ నిర్మాణాల వద్దకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో రాత్రయితే చాలు దొంగలు స్వైరవిహారం చేస్తూ ఇళ్ల తాళాలు పగలగొట్టి అందులో సిమెంటు, ఇనుము, మోటార్లు, గోడకు అమర్చిన గేట్లు సైతం ఎత్తుకెళ్తున్నారు. ఊరికి దూరంగా ఉండటంతో పాటు కొండలకు దగ్గరగా ఉండి ముళ్ల చెట్లు పెరిగి నిర్మానుష్యంగా ఉండటంతో అవైపు కన్నెత్తి చూసేవారు లేరు. దీంతో దొంగలు తమ పని సులువుగా కానిచ్చేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులతో పాటు పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు పగటి పూట ఈ ప్రాంతంలో తిరిగి కొన్ని ఇళ్లను ఎంచుకుని చోరీలకు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇటీవల శ్రీనివాసరావుకు చెందిన ఇంటి తాళం పగల కొట్టి అందులో విలువైన విద్యుత్తు సామాన్లు ఎత్తుకెళ్లారని బాధితుడు వాపోయాడు. దీంతో ఇళ్ల నిర్మాణం పూర్తయిన వారు కూడా నివాసం ఉండటానికి సాహసించడం లేదు. ఇప్పటి వరకు ఇక్కడ కనీస వసతులు కల్పించలేదని పట్టణానికి 7 కి.మీ దూరం ఉండటంతో రవాణా సౌకర్యం సరిగా లేదని వాపోతున్నారు. ఇక్కడ నివాసం ఉండేందుకు అనువుగా వసతులు కల్పించాలని, దొంగతనాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పురపాలక కమిషనర్ సుభాష్‌చంద్రబోస్‌ను సంప్రదించగా పూర్తయిన ఇళ్లలో కొంతమందైనా నివాసం ఉంటే దొంగతనాలు జరగవని, అందుకు అవసరమైన వసతులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేత

కనపర్రు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం కనపర్రులోని ఎంపీపీఎస్ (బీపీఆర్) పాఠశాల విద్యార్థులకు నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లోని శ్రీశిర్డీ సాయి క్షేత్రం ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. దివ్యాంగ బాలుడికి మూడు చక్రాల సైకిల్ అందజేశారు. పిల్లలందరికీ భోజనం ప్లేట్లను దాతలు కోట్ల బలరామిరెడ్డి, సతీమణి అనూరాధ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయి క్షేత్ర నిర్వాహకులు మురారిశెట్టి గోపాలబాబు, పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, పంతంగి శ్రీనివాస్, శ్రీలత, పాఠశాల ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, యశోద, గురునాథం, శంకరయ్య పాల్గొన్నారు.

దివ్యాంగు బాలుడికి ట్రైసైకిల్ ఇస్తున్న ప్రతినిధులు

లోక కల్యాణార్థం గణపతి వాస్తు హోమం

వినుకొండ: కొండమెట్ల వద్ద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం లోక కల్యాణార్థం మహాసుదర్శన నవగ్రహ లక్ష్మీ గణపతి వాస్తు హోమం నిర్వహించారు. అయిదు హోమ గుండాలతో దక్షిణామూర్తి శిష్య బృందం మంత్రోచ్ఛరణ నిర్వహించారు. సైదారావు దంపతులు కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారని ఆలయ నిర్వాహకుడు గాజుల మాల్యాద్రి తెలిపారు.

కూటమి ప్రభుత్వ పాలనలో ఇంటింటికీ మేలు

చిలకలూరిపేట గ్రామీణ, నరసరావుపేట సెంట్రల్, రొంపిచర్ల, నూజండ్ల, ఈపూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఏడాది పాలనలో ఇంటింటికీ మేలు చేకూరే పథకాలు అందించారని ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో పలు మండలాల్లో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను అందించి సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. నూజండ్ల మండలం జంగాలపల్లెలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ యువతకు ఉద్యోక కల్పనకు పరిశ్రమల ఏర్పాటులో కూటమి ప్రభుత్వం విజయాలు సాధిస్తున్నట్లు తెలిపారు. జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు, వినుకొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ మీసాల మురళీకృష్ణ, సర్పంచి కూచిపూడి చిన వెంకటేశ్వర్లు ఆయన వెంట ఉన్నారు. నాదెండ్ల మండలం ఇర్లపాడు, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పర్యటించారు. ఇర్లపాడులో కృష్ణారావు, కృష్ణంనాయుడు ఏర్పాటు చేసిన వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి తోట రాజారమేష్, తెదేపా నాయకులు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, గుర్రం నాగపూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. నరసరావుపేట మండలం పాలపాడులో తెదేపా నాయకులు మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రభుత్వం అన్ని పథకాలు అమలు చేస్తుందన్నారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, పులిమి రామిరెడ్డి, బ్రహ్మయ్య పాల్గొన్నారు. పట్టణంలోని 17వ వార్డులో మాజీ కౌన్సిలర్ కథం నాగజ్యోతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. రొంపిచర్ల మండలం తురిమెళ్ల, చిట్టిపోతులవారిపాలెం, అచ్చయ్యపాలెంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు పల్లెల నాగిరెడ్డి, మన్నాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈపూరు మండలం యర్రగుంటతండాలో తెదేపా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు తదితరులు ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రాపర్ల మురళి, తెదేపా మండల యూత్ అధ్యక్షుడు బచ్చనబోయిన బ్రహ్మం, మండల ఐటీడీపీ కన్వీనర్ కోమటిగుంట శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నూజండ్ల: జంగాలపల్లెలో కరపత్రాలు పంచుతున్న జీవీ ఆంజనేయులు, మక్కెన

చిలకలూరిపేట: ఇర్లపాడులో రంగా విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

కళలు.. మానవ జీవనశైలికి ప్రతీకలు

చిలకలూరిపేట గ్రామీణ, మార్టూరు, న్యూస్‌టుడే : మానవజీవన శైలికి నాటకాలు, కళలు ప్రతీకలుగా నిలిచేలా తానా 24వ అంతర్జాతీయ సదస్సు నిలిచిందని మార్టూరు శ్రీకారం రోటరీ కళాపరిషత్ అధ్యక్షుడు, రంగస్థల పరిశోధకుడు, మార్టూరు మండలం కోలలపూడికి చెందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అన్నారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు అమెరికాలోని డెట్రాయిట్‌లో జరిగిన తానా అంతర్జాతీయ సదస్సులో రామోజీరావు సాహిత్య ప్రాంగణంలో 'రేపటి తెలుగునాటకం' అంశంపై ఆయన ప్రసంగించారు. తెలుగువారు ఏ దేశంలో ఉన్నా ఐక్యత చాటుతూ తెలుగుభాష ప్రాముఖ్యత, కళలు, నాటకాలపై కార్యక్రమాలు నిర్వహించటం శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్ చేతులమీదుగా జ్ఞాపిక అందుకోవటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

నటుడు మురళీమోహన్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న డాక్టర్ కందిమళ్ల

మహారాజశ్రీ నరసరావుపేట 13వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో..
CMA No. 2/2020
కొల్లిపర అంజమ్మ (లేట్) వగైరాలు ...అప్పిలెంట్లు..
To
కె.నాగేశ్వరరావు, S/o. ఆదినారాయణ, D.No.34-4-35, చిలకలూరిపేట పట్టణం, పల్నాడు జిల్లా ...రెస్పాండెంట్
పై నెంబరు CMA లో మీరు శ్రీ కోర్టు వారి నోటీసులు తీసుకొని కారణంగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తం ది.14-07-2025కి వాయిదా వున్నది. కావున వాయిదా రోజున ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల సదరు CMA మీ పరోక్షమందు తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం వాయిదా ది.14-07-2025
శ్రీ వి.అనిల్‌కుమార్, అప్పిలెంట్ల తరుపు న్యాయవాది, నరసరావుపేట

మహారాజశ్రీ నరసరావుపేట 13వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో..
CMA No. 1/2020
కొల్లిపర అంజమ్మ (లేట్) వగైరాలు ...అప్పిలెంట్లు..
To
కె.నాగేశ్వరరావు, S/o. ఆదినారాయణ, D.No.34-4-35, చిలకలూరిపేట పట్టణం, పల్నాడు జిల్లా ...రెస్పాండెంట్
పై నెంబరు CMA లో మీరు శ్రీ కోర్టు వారి నోటీసులు తీసుకొని కారణంగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తం ది.14-07-2025కి వాయిదా వున్నది. కావున వాయిదా రోజున ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల సదరు CMA మీ పరోక్షమందు తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం వాయిదా ది.14-07-2025
శ్రీ వి.అనిల్‌కుమార్, అప్పిలెంట్ల తరుపు న్యాయవాది, నరసరావుపేట

మహారాజశ్రీ నరసరావుపేట 13వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
I.A.No.453/2024 in AS No.9/2017
మందపాటి రామయ్య వగైరాలు ...పిటీషనర్లు/ అప్పీలెంట్లు
మరియు
గుర్రం అంజమ్మ వగైరాలు ...రెస్పాండెంట్లు/రెస్పాండెంట్లు
To
R4 - దాసరి @ కొల్లా కుసుమ, W/o. దాసరి అశోక చక్రవర్తి, కేతముక్కల అగ్రహారం, నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా.
పై నెంబరు అప్పీలులో I.A.No.453/2024 నంబరున మిమ్ముల్ని పార్టీగా చేర్చించమని పిటీషను దాఖలు చేయగా మీరు కోర్టు వారి నోటీసులు తీసుకొని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తం ది.14.07.2025కి వాయిదా అయి ఉన్నది. కావున వాయిదా రోజు ఉ.10.30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల సదరు పిటీషను మీ పరోక్షము నందు తీర్మానించబడును.
వాయిదా 14.07.2025
(By Court Order)
శ్రీ వి.అనీల్‌కుమార్, ఎం.ఎన్.ప్రసాద్ పిటీషనరు తరుపు న్యాయవాదులు, నరసరావుపేట

మహారాజశ్రీ నరసరావుపేట 13వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
I.A. No. 452/2024 in A.S. No. 8/2017
మందపాటి రామయ్య వగైరాలు ...పిటీషనర్లు/ అప్పీలెంట్లు
మరియు
మాఘం వెంకటేశ్వర్లు వగైరాలు ...రెస్పాండెంట్లు/రెస్పాండెంట్లు
To:
R8 - దాసరి @ కొల్లా కుసుమ, W/o. దాసరి అశోక చక్రవర్తి, కేతముక్కల అగ్రహారం, నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా.
పై నెంబరు అప్పీలులో I.A.No.452/2024 నంబరున మిమ్ముల్ని పార్టీగా చేర్చించమని పిటీషను దాఖలు చేయగా, మీరు కోర్టు వారి నోటీసులు తీసుకొని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తం ది.14-07-2025న వాయిదా అయి ఉన్నది. కావున వాయిదా రోజున ఉ॥ 10.30 నిలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల పిటీషను మీ పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా: 14.7.2025
(By Court Order)
శ్రీ వి.అనీల్‌కుమార్, ఎం.ఎన్. ప్రసాద్ పిటీషనరు తరుపు న్యాయవాదులు, నరసరావుపేట

కుళాయి చుట్టూ పాచి.. వ్యాధులకు చోటిచ్చి!

మండలంలోని కొప్పుకొండలో తాగునీరు సరఫరా అయ్యే ప్రధాన ట్యాంకుకు బోరు ద్వారా నీటిని పంపుతారు. ఈ బోరు పక్కనే ఏర్పాటు చేసిన నీటి కుళాయి చుట్టూ పాచి పట్టి అపరిశుభ్రంగా ఉంది. దీంతో ఆ ప్రాంతంలో దోమలు, పురుగులు వస్తున్నాయని నెలకొసారైనా శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. తప్పని పరిస్థితిలో అక్కడే నీటిని పట్టుకుని వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వెంకటకృష్ణను సంప్రదించగా వెంటనే శుభ్రం చేయిస్తానని తెలిపారు. – న్యూస్‌టుడే, వినుకొండ రూరల్

రోడ్డే క్రీడా మైదానం... ప్రమాదంతో చెలగాటం

చిలకలూరిపేట పట్టణంలో సుమారు 1.50లక్షల జనాభా ఉన్నారు. అయినా పట్టణంలో కనీసం పిల్లలు ఆడుకోవడానికి క్రీడా మైదానం లేదు. దీంతో ఆదివారాలు, సెలవు రోజుల్లో చాలా చోట్ల రోడ్లు వివిధ రకాల ఆటలతో క్రీడా మైదానాలుగా మారుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉంది. పిల్లలు ఏమరుపాటుగా ఉంటే ఇబ్బందులు తప్పవు. అధికారులు స్పందించి పట్టణంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

రహదారి విస్తరించి.. స్తంభాలను విస్మరించి..

పట్టణంలో స్తూపం సెంటర్ నుంచి పాత మార్కెట్‌కు వెళ్లే మార్గం వెడల్పు చేశారు. ఆ సమయంలో దారికి అడ్డంగా ఉన్న పురపాలక సంఘానికి చెందిన మూడు దుకాణాలను తొలగించారు. నెల రోజులు గడిచినా రహదారికి మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలు అలాగే ఉన్నాయి. వాటిని పక్కకు తరలించాలని పురపాలక అధికారులు విద్యుత్తు శాఖకు అభ్యర్థన పంపినా ఫలితం లేదు. దీనిపై విద్యుత్తుశాఖ పట్టణ ఏఈ పిచ్చయ్యను సంప్రదించగా త్వరలో వాటిని అక్కడ నుంచి పక్కకు మార్చుతామని తెలిపారు. – న్యూస్‌టుడే, వినుకొండ

చెత్త తొలగించారు

ఈనాడు కథనానికి స్పందన

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని కొప్పుకొండలో సచివాలయం ఎదుట ఇళ్ల సమీపంలో రోడ్డుపైనే కొందరు వ్యర్థాలను పారబోస్తున్నారు. అవి సక్రమంగా తొలగించక రోడ్డుపైనే పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు తెలిపారు. దీనికి తోడు రాత్రిళ్లు దోమలతో అల్లాడుతున్నామని వాపోతున్నారు. దీనిపై జూన్ 25న 'నిర్లక్ష్యం చేస్తే మోతే' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు చెత్తను తొలగించారు.

మాదిగల ఆత్మగౌరవం మందకృష్ణ

వినుకొండ, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ సాధించిన పోరాటయోధుడు మంద కృష్ణమాదిగ అని పలువురు కొనియాడారు. ఆయన పుట్టినరోజు పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబును మెప్పించి మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్ ఫలితాలను అందించడంలో సఫలీకృతుడయ్యారని వైద్యమిత్ర ఎస్సీ, ఎస్టీ పోరుగు, ఒప్పంద సేవల రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి తెలిపారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

'పేట' అభివృద్ధిపై సమీక్ష

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: పుర ప్రజల సమస్యలపై పురపాలక కౌన్సిలర్లు, అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. పట్టణాభివృద్ధి పనులపై స్థానిక కౌన్సిల్ భవనంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ, వీధి లైట్లు, రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, కాలువల శుభ్రత, తాగునీటి సరఫరాపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని అధికారులను కోరారు. ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ.1.90 కోట్లతో వార్డుల్లో అత్యవసర పనులను చేయించుకోవాలని కౌన్సిలర్లను కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంజూరైన బీపీఎస్, ఎల్ఆర్ఎస్ నిధులు రూ.3.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ శ్రీహరి, డీఈ రహీం, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

చిలకలూరిపేట పట్టణం: స్థానిక శారదా జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో ఇమ్మడి కృష్ణచైతన్య నివాసం ఉంటున్నారు. గత శనివారం కుటుంబ సమేతంగా అవనిగడ్డ వెళ్లారు. తిరిగి సోమవారం వచ్చేసరికి తలుపులు, బీరువా పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న సుమారు 70 గ్రాముల బంగారం, ఒకటిన్నర కేజీ వెండి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీకి విఫలయత్నం

నాదెండ్ల(చిలకలూరిపేట గ్రామీణ): నాదెండ్ల నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ఇద్దరు గుర్తుతెలియని యువకులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి ప్రయత్నం చేశారు. కాపలాగా ఉన్న వ్యక్తి అడ్డుకోవడంతో అతన్ని నెట్టి పారిపోయారు. ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోర్టు భవన నిర్మాణానికి స్థల పరిశీలన

చిలకలూరిపేట పట్టణం: పట్టణంలో జూనియర్ సివిల్ కోర్టు నూతన భవన నిర్మాణానికి బార్ అసోసియేషన్ సభ్యులు, మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్థలాలను సోమవారం పరిశీలించారు. కోర్టు భవన నిర్మాణ స్థలం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఛైర్మన్ ఎస్‌కే రఫాని, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, డీఈ రహీం, తెదేపా నాయకులు ఉన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట పట్టణం: చిలకలూరిపేట పట్టణంలో లైన్ల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తుశాఖ డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. పోలిరెడ్డిపాలెం, లక్ష్మీనృసింహ కాలనీ, మదర్‌థెరెసా కాలనీ, బ్యాంక్ కాలనీల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంటు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉర్దూ అధ్యాపకులను నియమించరూ!

వినుకొండ: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఉర్దూ అధ్యాపకులను నియమించాలని ముస్లిం చైతన్య పోరాట సమితి నాయకులు బాజీద్ కోరారు. ఈమేరకు సోమవారం ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో ఉర్దూ మాధ్యమంలో చదివి కళాశాలలో చేరిన తర్వాత పాఠ్యాంశాలు అర్థం కాక ఇబ్బంది పడుతున్నందున ఉర్దూ అధ్యాపకులను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

అవీ ఇవీ

పెంపుడు కుక్కలకు టీకాలు

వినుకొండ: జూనోసిస్ దినోత్సవం సందర్భంగా 75 పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలను ఆదివారం ఉచితంగా చేసినట్లు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు ఎన్.శ్రీరాములు తెలిపారు. ఈసందర్భంగా పలువురు పెంపకందార్లకు సంక్రమణ వ్యాధులపై అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

చిలకలూరిపేట గ్రామీణ: నాదెండ్ల మండలం చందవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సాయిశ్వేత ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలను గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది జ్ఞానేశ్వరి, ఏడుకొండలు, నాగరత్నం, సుభాషిణి, జ్ఞానసుందరి, కోటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి అంకయ్య పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథ ప్రచారం

చిలకలూరిపేట గ్రామీణ: మండలంలో కావూరు, లింగంగుంట్ల గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞానవేదిక నరసరావుపేట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత గ్రంథ ప్రచారం సోమవారం నిర్వహించారు.

మరణానంతర నేత్రదానం

శావల్యాపురం: మండలంలో వేల్పూరుకు చెందిన ఎస్‌కే మస్తాన్ సాహెబ్ (60) మృతిచెందారు. ఆయన నేత్రాలు దానం చేసేందుకు నిర్ణయించిన కుటుంబ సభ్యులు అమ్మ, అవయవ, శరీరదాన ప్రోత్సాహక సంఘం పల్నాడు జిల్లా కోఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావును సంప్రదించారు. ఆయన పెదకాకాని శంకర కంటి నేత్రాలయం వారికి సమాచారం ఇచ్చారు. వైద్యుల బృందం గ్రామానికి చేరుకుని మృతుడి నుంచి కార్నియా సేకరించారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

మండల కేంద్రం నూజండ్లతో పాటు పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ 2025లో భాగంగా అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించాల్సి ఉంది. కేంద్ర బృందం పరిశీలన చేస్తుందని తప్పనిసరిగా పారిశుద్ధ్య పనుల చేయించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినా కొన్ని పంచాయతీల్లో అధికారులు పట్టనట్లే వ్యవహరించడం గమనార్హం. సాక్షాత్తు మండల పరిషత్ కార్యాలయం వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. కాల్వల్లో మురుగు నీరు రోడ్లపైకి పారుతున్నా ఎలాంటి చర్యలు లేవు. తలార్లపల్లె, పుచ్చనూతల, పమిడిపాడు, కంభంపాడు, చింతలచెరువు తదితర గ్రామాల్లో ఎక్కడ చెత్త అక్కడే పేరుకు పోయినా పట్టించుకునే వారే లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఘన వ్యర్థాల కేంద్రాలు నిర్వహించాలని ప్రభుత్వం ఎంత మొత్తుకున్నా ఎక్కడా నిర్వహణ చేయడం లేదు. చెత్త తరలించే రిక్షాలు, ఆటోలు మూలకు చేరాయి. కొన్ని గ్రామాల్లో కనీసం వారంలో ఒక రోజు కూడా పారిశుద్ధ్య పనులు చేయకపోవడం విశేషం. దీనిపై ఈవోపీఆర్డీ రబ్బానిని సంప్రదించగా అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, నూజండ్ల

మండల పరిషత్ కార్యాలయం వద్ద కాలువలో చెత్త, పిచ్చిమొక్కలు

రోడ్డుపైకి చేరిన మురుగు

12 నుంచి నిరవధిక ఆందోళన

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: వేతనాలు పెంచి దీర్ఘకాలంగా నెలకొన్న కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 12 నుంచి నిరవధిక సమ్మె చేపట్టాల్సి వస్తుందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు షేక్ సిలార్ మసూద్ అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పురపాలక సంఘ కార్యాలయం ఎదుట మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిలార్ మసూద్ మాట్లాడుతూ ఈనెల 4న విజయవాడలో నిర్వహించిన సమ్మె శంఖారావంలో మున్సిపల్, ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొని నిరసన వ్యక్తం చేసినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. కార్యక్రమంలో అల్లాభక్షు, సోమశేఖర్, సామ్రాజ్యం, నాగయ్య, మాలిక్, రంగా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

వినుకొండ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎం నాయకులు ద్విచక్రవాహనాలతో పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కారంపూడి రోడ్డులోని విద్యుత్తు ఉపకేంద్రం నుంచి బయల్దేరి పురవీధుల్లో తిరిగి నినాదాలు చేశారు. కార్మిక చట్టాలను రద్దు చేయాలని ఈనెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు హనుమంతరెడ్డి, రైతు సంఘం నాయకులు శివరామకృష్ణ, కోటిరెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

నిర్యాణము

మా జీవితాల్లో వెలుగులు నింపిన అమృతమూర్తి,
శ్రీమతి మోపర్తి ఉమాదేవి గారు
ది.07-07-2025, సోమవారం
సాయంత్రం గం.4-30 ని.లకు పరమపదించినారని
తెలియజేయుటకు చింతించుచున్నాము.
వారి భౌతిక కాయాన్ని బంధు మిత్రుల దర్శనార్థం
ది.08-07-2025 మంగళవారం మధ్యాహ్నం
వరకు నరసరావుపేట, రాజాగారి కోటలోని
మోపర్తి వారి ఆసుపత్రిలో ఉంచుతారు.
సాయంత్రం 2.00 - 5.00 గంటల మధ్య గుంటూరు
సమీపంలోని అనంతవరప్పాడు గ్రామం
(వట్టిచెరుకూరు మండలం) లో వారి భౌతిక
కాయానికి సమాధి కార్యక్రమం నిర్వహించబడును.

భర్త : డా॥ మోపర్తి వెంకటేశ్వరరావు
కుమారులు - కోడళ్ళు : డా॥ మోపర్తి శివప్రసాద్ - అరుణ డా॥ మోపర్తి శ్రీనివాస్ - ఉషారాణి
మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు
మోపర్తి హాస్పిటల్స్ - రాజాగారికోట, నరసరావుపేట

(c) eenadu

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

విద్యార్థులతో మాట్లాడుతున్న ధారునాయక్

గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శన

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: మాచర్ల మండలం ఎత్తిపోతలలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను తెదేపా రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.ధారునాయక్ సోమవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రిన్సిపల్ దుర్గాభవానిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

సమాజ సేవకుడికి సత్కారం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: భరతమాత అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని 713 రోజులపాటు నిర్విరామంగా నిర్వహించి, అన్నార్తుల ఆకలి తీర్చిన న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావును స్థానిక ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో సత్కరించారు. సామాజిక సేవలో శ్రీనివాసరావును ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సంఘాల పెద్దలు అన్నారు.



న్యాయవాది శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘాల నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? ఆంజనేయస్వామి గుడి సమీపంలో కాలువల్లో మురుగు కదలక దుర్వాసన వస్తోంది. - **తిరుపతయ్య, చౌటపాపాయపాలెం**

✔ పారిశుద్ధ్య కార్మికులతో వెంటనే పూడిక తొలగించి, బ్లీచింగ్ చల్లిస్తాం. - **శౌరయ్య, కార్యదర్శి, - న్యూస్‌టుడే, రాజుపాలెం**

వీధి దీపాలు వెలిగాయ్

స్పందనకు వందనం

వెల్దుర్తి: బొదిలవీడు గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన వార్త ఇవ్వగా అధికారులు స్పందించారు. వెంటనే వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. ☛ వెల్దుర్తి శివాలయ పరిసరాల్లో గ్రామస్థులు చెత్తవేయడంతో దుర్వాసన వస్తోంది. దీనిపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురించగా పంచాయతీ అధికారులు స్పందించారు. చెత్తను అక్కడ్నుంచి తొలగించారు. ఎవరూ చెత్త వేయొద్దని దండోరా వేయించారు.

రెంటాలలో మురుగు తొలగింపు

రెంటచింతల: రెంటాలలో సోమవారం మురుగు కాలువల్లో పూడిక తొలగించారు. గత నెల 29న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన కాలువల దుస్థితిపై వార్త ఇవ్వగా స్పందించిన కార్యదర్శి వెంకయ్య కాలువలు శుభ్రం చేయించారు.

మోసగిస్తున్నారు.. జాగ్రత్త! తూకాల్లో మాయాజాలం

☛ **పిడుగురాళ్ల** ప్రధాన రోడ్డులోని ఓ దుకాణంలో ఓ వ్యక్తి పది కిలోల చికెన్ కొనుగోలు చేశాడు. బరువు తక్కువగా ఉండటంతో అనుమానం వచ్చి మరోచోట తూకం వేయించగా 8.5 కిలోలే వచ్చింది. కిలో మాంసానికి 150 గ్రాముల తక్కువ ఉన్నట్లు గుర్తించాడు.

☛ **బేకరీలో ఓ వ్యక్తి** కిలో కేకు కొనుగోలు చేశాడు. వ్యాపారి కేకు కింద ఉన్న అట్టతో కలిపి తూకం వేసి ఇచ్చాడు. అట్ట బరువు 130 గ్రాములు ఉంది. దీనివల్ల కిలో కేకు కొంటే 130 గ్రాములు తక్కువ ఉన్నట్లే. అట్ట బరువును మినహాయించి విక్రయాలు జరపాలని అధికారులు చెబుతున్నారు.

☛ **ఓ వినియోగదారుడు** 25 కిలోల బియ్యం సంచిని కొనుగోలు చేశాడు. బయటకు వచ్చిన తర్వాత ఆ సంచిని తూకం వేయగా 24 కిలోలే ఉంది. కిలో బియ్యం తక్కువగా ఉన్నాయి.

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

కూరగాయలు మొదలుకుని చికెన్, మటన్ వరకు అన్నింట్లోనూ తూకాల్లో మోసం చేస్తున్నారు. వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. గత రెండు రోజులు నుంచి పిడుగురాళ్లలోని పలు దుకాణాలపై తూనికలు కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పలు రకాల మోసాలు బయటపడ్డాయి. తూకాల్లో మోసం చేసే 13 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. ఎలక్ట్రానిక్ కాటాల్లో ప్రీలర్ మోడ్‌లో పెట్టి తూకాల్లో మోసం చేస్తున్నట్లు గుర్తించారు.

అన్ని దుకాణాల్లోనూ అంతే

పిడుగురాళ్ల పల్నాడు ప్రాంతానికి ముఖద్వారంగా ఉంది. మాచర్ల, గురజాల నియోజకవర్గాలకు ఇది వ్యాపార కేంద్రం. దాంతోపాటు రాజుపాలెం, బెల్లంకొండ మండలాల ప్రజలు ఏ అవసరం ఉన్నా ఇక్కడికే వస్తున్నారు. పట్టణంలో ప్రధాన రహదారి పక్క సుమారు 100 తోపుడు బండ్లపై కూరగాయలు, పళ్లు విక్రయిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది కాటాల్లో దిగువన ఉన్న లింక్‌ను పక్కకు పెట్టి మోసగిస్తున్నారు. వినియోగదారుడు కిలో కూరగాయలు కొంటే 900 గ్రాములే తూకం వస్తోంది. చికెన్, మటన్, చేపల విక్రయించే దుకాణాలు 80 పైనే ఉన్నాయి. వీరందరూ ఎలక్ట్రానిక్ కాటాలను వినియోగిస్తున్నారు. ఈ కాటాలను ప్రీలర్ మోడ్‌లో పెట్టుకుని విక్రయాలు చేస్తున్నారు. ప్రీలర్ మోడ్‌లో కిలో మాంసం కొంటే 850 గ్రాములే వస్తుంది. బియ్యం 50, 25 కిలోల బస్తాల్లో విక్రయిస్తున్నారు. వాటిని తూకం వేస్తే 50కి 48 కిలోలే వస్తున్నాయి. వినియోగదారులు జాగ్రత్తలు పాటించకపోతే నష్టపోతారు. అధికారులు కూడా నిఘా పెట్టి మోసాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తూకం పరిశీలిస్తున్న అధికారులు

ఫిర్యాదు చేయండి

తరచూ తనిఖీలు చేస్తూనే ఉన్నాం. మోసాలపై కేసులు నమోదు చేస్తున్నాం. వ్యాపారులు కచ్చితమైన తూకాలతో వస్తువులు విక్రయించాలి. ఎక్కడైనా తేడాలు గుర్తిస్తే ఫిర్యాదు చేయాలి. 08632223202 ఫోన్ నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చు. **- షేక్ సైదా, తూ.కొ.శాఖ ఇన్‌స్పెక్టర్**

త్యాగానికి ప్రతీక మొహర్రం

క్రోసూరు (అచ్చంపేట), న్యూస్‌టుడే: మహోన్నత త్యాగానికి ప్రతీక మొహర్రం అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన క్రోసూరు మండలం దొడ్లేరులో జరిగిన మొహర్రం ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. పీర్ల చావిడి సందర్శించి పూజలు చేశారు. పీర్లను మోసి ఉత్సాహపరిచారు. తెదేపా మండల అధ్యక్షుడు మొగల్‌జాన్, నేతలు వెన్నా సాంబశివారెడ్డి, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రెడ్డిగూడెం, మొక్కపాడు, ఆకులగణపవరం, ఉప్పలపాడు, బలిజేపల్లి గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. చావిడిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మాచర్ల (కారంపూడి): మాచర్ల పాతూరులోని పెద్ద చావిడి, జెండా చెట్టు వద్ద చిన్న చావిడిల్లోని పీర్లను ఊరేగించారు. కారంపూడిలోనూ పీర్లను ఊరేగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కోటప్పకొండ త్రికోటేశ్వరుడి ఆదాయం రూ.24లక్షలు

నరసరావుపేట అర్బన్: కోటప్పకొండపై శ్రీత్రికోటేశ్వరస్వామి ఆలయానికి రూ.24,02,549 ఆదాయం లభించినట్లు ఈవో డి.చంద్రశేఖరరావు తెలిపారు. తొలి ఏకాదశి తర్వాత రోజు సోమవారం ఆలయంలో హుండీ లెక్కింపు చేశారు. హుండీల ద్వారా రూ.968028, టిక్కెట్ల విక్రయంతో రూ.909090, ప్రసాదాలకు రూ.439380, అన్నదానం హుండీల నుంచి రూ.86051 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

స్పందనకు వందనం

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మాచర్ల మున్సిపాలిటీలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో అపరిశుభ్రత, దోమల బెడదతో ప్రజల ఇబ్బందులపై 'ఈనాడు'లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ వేణుబాబు ఆదేశాలతో సోమవారం పలు ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

కళలు.. మానవ జీవనశైలికి ప్రతీకలు

చిలకలూరిపేట గ్రామీణ, మార్టూరు, న్యూస్‌టుడే : మానవ జీవన శైలికి నాటకాలు, కళలు ప్రతీకలుగా నిలిచేలా తానా 24వ అంతర్జాతీయ సదస్సు నిలిచిందని మార్టూరు శ్రీకారం రోటరీ కళా పరిషత్ అధ్యక్షుడు, రంగస్థల పరిశోధకుడు, మార్టూరు మండలం కోలలపూడికి చెందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అన్నారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు అమెరికాలోని డెట్రాయిట్‌లో జరిగిన తానా అంతర్జాతీయ సదస్సులో రామోజీరావు సాహిత్య ప్రాంగణంలో 'రేపటి తెలుగునాటకం' అంశంపై ఆయన ప్రసంగించారు. తెలుగువారు ఏ దేశంలో ఉన్నా ఐక్యత చాటుతూ తెలుగుభాష ప్రాముఖ్యత, కళలు, నాటకాలపై కార్యక్రమాలు నిర్వహించటం శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్ చేతులమీదుగా జ్ఞాపిక అందుకోవటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఇంటింటికీ సంక్షేమం.. కూటమి లక్ష్యం

సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, తెదేపా నాయకులు

గర్నెపూడిలో మహిళకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్నికల హామీ మేరకు సుపరిపాలన ద్వారా ఇంటింటికీ రెట్టింపు సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం గర్నెపూడిలో సోమవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎన్టీరామారావు, కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు నివాళులర్పించారు. అనేక గృహాలను దర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను మై టీడీపీ యాప్‌లో స్వయంగా నమోదు చేశారు. వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యార్డు ఛైర్మన్ కోమటినేని శోభారాణి, నాయకులు మక్కపాటి రామచంద్రరావు, గద్దె అప్పారావు, లగడపాటి గజానన, యర్రా వెంకటేశ్వరరావు, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణానికి కృషి

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం ఆయన క్రోసూరు మండలం హసనాబాద్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ఏడాదిలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. సమస్యలను మై టీడీపీ యాప్‌లో నమోదు చేయించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రానున్న నాలుగేళ్లలో కృషి చేస్తానన్నారు. తెదేపా నాయకులు మొగల్‌జాన్, సాంబశివారెడ్డి, సాయిబాబు, శ్రీను, నాగేశ్వరరావు, యోహాను, జనసేన నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తున్నాం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు తెదేపా యువ నాయకుడు యరపతినేని సాయినిఖిల్ చెప్పారు. సోమవారం రాత్రి పట్టణంలోని ఎనిమిదో వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. తెదేపా జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలీ, మార్కెట్‌యార్డు ఛైర్మన్ తురకా వీరస్వామి, గొంట్ల శ్రీనివాసరావు, జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టరు వడ్డవల్లి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

కరపత్రం పంపిణీ చేస్తున్న యరపతినేని నిఖిల్

పొడపాడులో..

పెదకూరపాడు: సీఎం చంద్రబాబు నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవంతో రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారని తెదేపా జిల్లా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్, మండల తెదేపా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం పొడపాడు, ముస్సాపురం గ్రామాల్లో నిర్వహించారు. నేతలు గోపాలరావు, అప్పారావు, బాబు, ప్రసాద్, సర్పంచి రూపలక్ష్మి పాల్గొన్నారు.

తాడువాయి(అచ్చంపేట): స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని మండల తెదేపా నేతలు ఆశీర్వాదం, పాపిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం తాడువాయిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచి బాలునాయక్, వెంకటేశ్వరరావు, చంటి పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

దుర్గి, న్యూస్‌టుడే: మండలంలోని కోలగుట్ల, కంచరగుంట గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అందించిన పథకాలు, మాచర్ల నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఏడాది కాలంలోనే పలు సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. నాయకులు ఏచూరి సాయిశంకర్, జానకీరమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు

ఇదో దోమల కేంద్రం

దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని 3వ వార్డు మన్నెంవారి వీధిలో ఇళ్ల పక్కనే మురుగు నిలిచింది. కాలువల్లో పూడిక నిండటంతో నీరు పారే దారిలేక రోడ్లపైకి చేరుతున్నాయి. ఇళ్ల మధ్య ఖాళీలు స్థలాలు మురుగు కుంటల్లా మారాయి. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగాలు వ్యాపించకముందే అధికారులు స్పందించి మురుగు కాలువల్లో పూడిక తొలగించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, దాచేపల్లి**

చెట్లే అడ్డొస్తున్నాయా?

ప్రకృతిని మనం కాపాడితే.. అది మనల్ని కాపాడుతుంది.. ఈ నినాదం బాగానే ఉన్నా, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. పూర్వం రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటగా.. అవి వృక్షాలుగా మారి నేడు నీడనిస్తున్నాయి. విద్యుత్తు తీగల ఏర్పాటు పేరుతో ఆ చెట్లను నరికేస్తున్నారు. ఇటీవల మండలంలోని పలుచోట్ల విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు చెట్లు అడ్డుగా ఉన్నాయని, వాటిని తొలగించారు. చెట్లకు కాస్త దూరంగా స్తంభాలు, తీగలు ఏర్పాటు చేస్తే సరిపోతుంది కదా? అన్న ప్రశ్న వాహన చోదకుల్లో తలెత్తుతోంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మాచవరం**

కల్వర్టు కుంగింది.. నాణ్యత తేలింది

పురపాలక సంఘం కొత్త భవనం వద్ద మురుగు కాలువపై కల్వర్టు కుంగిపోయింది. గత వైకాపా ప్రభుత్వం 2023లో మున్సిపల్ భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులు అసంపూర్తిగా ఉండటంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రూ.80 లక్షలు మంజూరు చేయించారు. గత నెల పనులు ప్రారంభించారు. ఇసుక, ఇటుకలు, కంకర తదితర సామగ్రిని తరలిస్తుండగా కల్వర్టు కుంగిపోయింది. కల్వర్టు పనులు నాసిరకంగా చేపట్టడంతోనే కుంగిందని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. **- న్యూస్‌టుడే, పిడుగురాళ్ల**

ట్రాఫిక్ కష్టాలు ఎన్నాళ్లు?

దాచేపల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్య వెంటాడుతూనే ఉంది. దుకాణాలతోపాటు కూరగాయల మార్కెట్లు, తోపుడు బండ్లతో సర్వీస్ రోడ్లు ఆక్రమణకు గురయ్యాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలను రోడ్డుపై ఇష్టారాజ్యంగా నిలిపేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వాహన రద్దీతో అడుగుతీసి అడుగు పెట్టడం కష్టంగా మారుతోంది. నగర పంచాయతీ, పోలీసు అధికారులు స్పందించి సర్వీసు రోడ్డుపై ఆక్రమణలు తొలగించి, ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని పట్టణవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, దాచేపల్లి**

కొత్తపాలేనికి విద్యుత్తు కష్టాలు

మాచవరం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపాలేనికి సక్రమంగా విద్యుత్తు సరఫరా కావడం లేదు. గృహ, వ్యవసాయ విద్యుత్తుకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. స్థానిక ఉపకేంద్రంలోని మోర్జంపాడు ఫీడర్ కింద సరఫరా అందించేవారు. ఏడాది కిందట బ్రేకర్ మరమ్మతులకు గురికావడంతో, పిన్నెల్లి ఫీడర్ కింద ఆ గ్రామానికి సరఫరా అందిస్తున్నారు. కొత్తపాలెం, గంగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీ, గాంధీనగరం గ్రామాల్లో ఎక్కడ సమస్య వచ్చినా.. కొత్తపాలెం గ్రామానికి సరఫరా నిలిచిపోతోంది. ప్రస్తుతం బావులు, బోర్ల కింద పత్తి సాగు చేసి, నీటి తడులు అందిస్తున్నారు. ఈ సమయంలో తరచూ విద్యుత్తు అంతరాయంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని, వెంటనే దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

అమరావతి: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం లేమల్లె, కర్లపూడి గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవికిరణ్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వేధింపులు తాళలేక మహిళ బలవన్మరణం

భవానీపురం, న్యూస్‌టుడే: వేధింపులు తాళలేక మహిళ బలవన్మరణానికి పాల్పడింది. హెచ్‌బీకాలనీలో పోట్ల నాగమణి(30) నివాసం ఉంటోంది. ఆమెకు పదేళ్ల క్రితం గురజాలకు చెందిన వెంకటరామారావుతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. ఐదేళ్ల క్రితం భర్తను వదిలేసి ఆమె పుట్టింటికి వచ్చేసింది. భవానీపురం రైతుబజారులో కూరగాయలు విక్రయిస్తున్న సమయంలో శ్రీనివాస్ అనే వ్యక్తి పరిచయం కావటంతో ఇద్దరూ కలిసి హెచ్‌బీకాలనీలో ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. అయితే ఈనెల 6వ తేదీ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయింది. ఆమె తల్లి సమాచారంతో పోలీసులు విచారణ చేపట్టారు. శ్రీనివాస్ వేధించేవాడని, ఆ కారణంతోనే చనిపోయి ఉంటుందని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. బంగ్లా సెంటరు నుంచి తహసీల్దారు కార్యాలయం దాకా ద్విచక్ర వాహనాలపై ప్రదర్శన చేపట్టారు. సీఐటీయూ నాయకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ కార్పొరేట్లకు పెద్దపీట వేశారన్నారు. నాయకులు విజయ్, మధు, శ్రీను, ప్రతాప్, నాగేశ్వరరావు, బాబు, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి, న్యూస్‌టుడే: ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ కార్యదర్శి సూరిబాబు కోరారు. సోమవారం పంచాయతీ కార్మికులను కలిసి సమ్మె వివరాలు తెలియజేశారు. అమరావతిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

అక్రమ మైనింగ్ అడ్డుకోండి

వినతి పత్రం స్వీకరిస్తున్న కలెక్టరు అరుణ్‌బాబు

నకరికల్లు, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లాలో అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని కలెక్టరు అరుణ్‌బాబు ఆదేశించారు. గ్రావెల్ తవ్వకాలపై అందుతున్న ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. నకరికల్లు మండలంలో సోమవారం మధ్యాహ్నం నుంచి కలెక్టరు పర్యటించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలు, మ్యుటేషన్లు, రీసర్వే, ఇళ్ల పట్టాల దరఖాస్తులను పరిశీలించారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై సమీక్షించారు. సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వీఆర్వోలు, సర్వేయర్‌లు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ సూరజ్ గనోరే, ఆర్డీవో రమణకాంతరెడ్డి, జిల్లా మైన్స్ అధికారి నాగిని, సర్వే ఏడీ భానుకీర్తి, తహసీల్దార్ పుల్లారావు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక

కారంపూడి, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి మూల్యాంకన సంస్థ ఎన్‌టీఏ నిర్వహించిన శ్రేష్ఠ పరీక్షలో స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థి రిషి రాజేష్ 977 మార్కులు సాధించి, ఉపకార వేతనానికి ఎంపికయ్యాడు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థికి ఇంటర్ పూర్తయ్యే వరకు జాతీయ విద్యాసంస్థల్లో ఉచితంగా చదివే అవకాశం ఉంది. అతడిని ప్రిన్సిపల్ నయోమి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

అచ్చంపేటలో కేకు కోస్తున్న నాయకులు

అచ్చంపేట, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ సాధకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ కృషి అమోఘమని నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు బుర్రి కిరణ్, నాగయ్య అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం స్థానిక ఆంజనేయ స్వామి విగ్రహం కూడలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా 30 కిలోల కేకు కోశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు పాపిరెడ్డి, నాయకులు చంటి, వెంకట్రావు, రాంబాబు, లక్ష్మయ్య శ్రీను పాల్గొన్నారు.

మాచర్ల (కారంపూడి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం మాచర్లలో నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి హాజరై పార్కు సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం కేకు కోసి నాయకులకు తినిపించారు.

పిడుగురాళ్ల: పట్టణంలో వేడుకలు జరిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య నేషనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అశోక్, నియోజకవర్గ అధ్యక్షుడు సాగర్‌బాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు విజయ్‌బాబు, ఇశ్రాయేలు, యాకోబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు: పెదకూరపాడులో ఎమ్మార్పీఎస్ దినోత్సవం, కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాజన సోషలిస్టు పార్టీ పల్నాడు జిల్లా కోశాధికారి కంచర్ల జాన్‌బాబు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

విజయపురిసౌత్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం విజయపురిసౌత్ ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు ఊరే మార్కు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెదేపా నాయకులు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, బసివిరెడ్డి పాల్గొని ప్రసంగించారు.

నిబంధనలు బేఖాతరు

దాచేపల్లి, న్యూస్‌టుడే

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. వినియోగదారులకు కనీస వసతులు కల్పించడం లేదు. సొమ్ము తీసుకుని వాహనాలకు ఇంధనం నింపటమే తమ పని అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అధికారులు కూడా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. డీజిల్, పెట్రోలు కొలతల్లో తేడాలున్నాయని ఫిర్యాదు చేస్తున్నా చర్యలు లేవు. అగ్ని ప్రమాద నియంత్రణ పరికరాలు అంతంతే. నిబంధనల ప్రకారం పెట్రోలు నాణ్యత పరీక్షించడానికి ఫిల్టర్ పేపర్లు వినియోగదారులకు ఇవ్వాలి. అవి ఎక్కడా కనిపించడం లేదు.

నిరుపయోగంగా గాలి యంత్రం

పెట్రోల్ బంకుల్లో కనీస వసతుల్లేవ్

పనిచేయని గాలి యంత్రాలు

పెట్రోల్ బంకుల్లో వాహనాల టైర్లకు ఉచితంగా గాలి నింపాలి. యంత్రాలతోపాటు గాలి నింపేందుకు ఓ వ్యక్తిని అందుబాటులో ఉంచాలి. చాలాచోట్ల గాలి యంత్రాలు పనిచేయడం లేదు. పనిచేసే చోట కూడా సిబ్బంది నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారు. రాత్రి వేళల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల టైర్లకు గాలి తగ్గితే, ఆ సమయంలో బయట కూడా గాలి మిషన్లు అందుబాటులో ఉండటం లేదు. ఏ బంకులోనూ తాగునీటి వసతి లేదు.

మరుగుదొడ్లకు తాళాలు

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా అన్ని బంకుల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. లీటరు పెట్రోల్ లేదా డీజిల్ కొనుగోలు చేస్తే, అందులో 4 నుంచి 8 పైసల వరకు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు చెల్లిస్తున్నాం. అయినా ఎక్కడా ఆ వసతి సౌకర్యం లేదు. అక్కడ పనిచేస్తే సిబ్బంది వాడుకుని, మరుగుదొడ్లకు తాళాలు వేస్తున్నారు.

ఫిర్యాదుల పెట్టెలు కనిపించవు

బంకులపై ఫిర్యాదు చేసేందుకు ఫిర్యాదుల పెట్టెలు లేదా రిజిస్టర్లు ఉంచాలి. అవి ఎవరికీ కనిపించవు. అధికారులకు ఫోన్ చేసినా స్పందించరు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు పాటించేలా పెట్రోలు బంకుల యజమానులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆక్రమిత స్థలంపై విచారణ

కారంపూడి, న్యూస్‌టుడే: పంచాయతీ స్థలం ఆక్రమణపై 'ఈనాడు'లో వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వ నాయక్ విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కార్యదర్శి కాశిన్యానాయక్‌ను ఆదేశించారు. బావి ప్రాంతంలో పంచాయతీ స్థలం ఎంత ఉంది, వాణిజ్య గదికి కార్యదర్శి పేరున విద్యుత్తు మీటరు ఎందుకిచ్చారు వంటి వివరాలు వివరిస్తూ నివేదికలు ఇవ్వాలని కార్యదర్శికి సూచించారు. ఈమేరకు విచారణ చేపట్టారు.

కారం మిల్లుతో ఇబ్బందులు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం రెండు అర్జీలు అందినట్లు తహసీల్దారు ధనలక్ష్మి తెలిపారు. కాశిపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన కారం మిల్లుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మల్లిశెట్టి సత్యనారాయణ, రమణమ్మ దంపతులు ఫిర్యాదు చేశారు. అర్హత కలిగిన కౌలు రైతులందరికీ కౌలు కార్డులతోపాటు అన్నదాత సుఖీభవ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం, పెదకూరపాడు అభివృద్ధి వేదిక ప్రతినిధులు వినతిపత్రం అందించారు.

దస్తావేజులు పోయినవి

పల్నాడు జిల్లా, అమరావతి మండలం, మండెపూడి గ్రామం, డోరు నెం. 3-58/ఎ కాపురస్తులు **చెరుకూరి చంద్రయ్య (లేటు) గారి కుమారుడు చెరుకూరి రామారావు (సెల్: 98481 51928)** తెలియజేయునది. నా తండ్రి గారైన (లేటు) చెరుకూరి చంద్రయ్య గారి పేరిటకు రిజిస్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం. 226/1962 ఒరిజినల్ మరియు విక్రయ దస్తావేజు నెం. 1353/1974 ఒరిజినల్‌లను ఒక కవరులో పెట్టుకుని ది. 27-06-2025న మండెపూడి నుండి అమరావతికి బైక్‌పై వెళ్లుచుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల పైన తెలిపిన ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు.

(c) eenadu

రైల్వే పనులతో రాకపోకలకు అంతరాయం

ట్రాక్ పనులు చేస్తున్న సిబ్బంది

కొమరాడ, న్యూస్‌టుడే: మండలంలోని అర్తాం రైల్వే గేటు వద్ద సోమవారం ట్రాక్ నిర్వహణ పనులు చేపట్టారు. మూడు గంటల పాటు యంత్రాలతో పట్టాలను సరిచేశారు. ఈ సమయంలో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వర్షాకాలం నేపథ్యంలో ట్రాక్‌ను సరిచేసి రైళ్ల రాకపోకలకు అవాంతరాలు లేకుండా చేస్తున్నామని రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

ఐటీఐ విద్యార్థులకు రైల్వే కొలువులు వరించనున్నాయి. ఉమ్మడి జిల్లా వారికి కొత్తగా ఈ విభాగంలో అప్రంటీస్ అవకాశాలు కల్పించనున్నారు. ప్రధానమంత్రి జాతీయ అప్రంటీస్‌షిప్‌లో భాగంగా ఈనెల 14న విజయనగరంలోని కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక మేళా జరగనుంది. సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు సులువుగా దక్కనున్నాయి.

శిక్షణకు పదండి..
కొలువుకు మార్గమండి

ఐటీఐ విద్యార్థులకు రైల్వేలో అప్రంటీస్‌షిప్

500 మందికి అవకాశం..: మేళా ద్వారా 500 మందిని ఎంపిక చేయనున్నారు. 13 ట్రేడుల్లో ఐటీఐ పూర్తి చేసినవారు, ప్రస్తుతం తుది సంవత్సరం చదువుతున్న వారు అర్హులు. ఎంపికైన వారికి 12 నెలల పాటు అప్రంటీస్‌షిప్ ఉంటుంది. నెలకు రూ.7 వేల నుంచి రూ.12 వేల వరకు భృతి చెల్లిస్తారు.

కొలువుల్లో వెయిటేజీ..: శిక్షణ తీసుకున్న వారికి రైల్వే ఉద్యోగాల్లో వెయిటేజీ కల్పిస్తారు. దీంతో అభ్యర్థులు సులువుగా ఉద్యోగాలు పొందేందుకు వీలుంటుంది. ఇటీవల కాలంలో రైల్వేలో ఐటీఐ విద్యార్థులకు అవకాశాలు పెరుగుతున్నాయి. సహాయ లోకో పైలెట్, టెక్నీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితర విభాగాల్లో పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో అప్రంటీస్‌కు ఎక్కువ సంఖ్యలో ముందుకొస్తారని అధికారులు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆరు ప్రభుత్వ ఐటీఐలు, 30 ప్రైవేటు ఐటీసీలున్నాయి. వీటిలో 10 వేల మంది వరకు చదువుతున్నారు. తుది సంవత్సరం విద్యార్థులు 5 వేల మంది ఉన్నారు. ఇప్పటికే ఉత్తీర్ణత సాధించినవారు వీరికి అదనం.

ట్రేడులివే..: ఫిట్టర్, వెల్డర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ మెకానికల్, రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ మెకానిక్, వైర్‌మెన్, కార్పెంటర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ప్లంబర్, మేషన్.

ఇతర జిల్లాల వారూ అర్హులే..

విజయనగరం ప్రభుత్వ ఐటీఐను నోడల్ కేంద్రంగా ఎంపిక చేశారు. ఇక్కడే మేళా జరగనుంది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా సమీప ప్రాంతాల వారు కూడా హాజరుకావచ్చు. ముందుగా అభ్యర్థులు అప్రంటీస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నిర్దేశించిన తేదీన ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలి. ఇతర వివరాలకు 94415 18355, 98499 44654 నంబర్లను సంప్రదించాలి. – టి.వి.గిరి, కన్వీనర్, ఐటీఐ విద్య

రూ. 1,300 కోట్లతో గిరిజన గ్రామాలకు రోడ్లు

మంత్రి సంధ్యారాణి

బీటీ రోడ్డు శిలాఫలకం ఆవిష్కరించిన దృశ్యం

పాచిపెంట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రాష్ట్రంలో రహదారులు లేని 616 గిరిజన గ్రామాలకు రూ.1300 కోట్లతో రోడ్లు మంజూరు చేసినట్లు మంత్రి జి.సంధ్యారాణి పేర్కొన్నారు. పాచిపెంట మండలం పూడి- కేరంగి మధ్య రూ.6 కోట్లతో నిర్మించిన 8 కిలోమీటర్ల బీటీ రోడ్డును సోమవారం ప్రారంభించారు. ఈ రహదారితో 20 గిరిజన గ్రామాలకు మేలు జరుగుతుందన్నారు. ఓ తల్లిగా గర్భిణుల బాధలు తెలుసని, డోలీ మోతలు లేకుండా చూస్తామన్నారు. రూ.155 కోట్లతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. మండలంలో రూ.20 కోట్లతో అనుసంధాన రోడ్లు వేస్తున్నామన్నారు. రేషన్ సరకులు తీసుకోవడంలో గిరిశిఖర ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతి 3 కిలోమీటర్లకు ఒక మినీ డిపో ఏర్పాటుపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. జడ్పీ ఉపాధ్యక్షుడు సింహాచలం, ఏఎంసీ ఛైర్మన్ సూర్యనారాయణ, పాచిపెంట, సాలూరు తెదేపా మండలాధ్యక్షులు యుగంధర్, ఎన్.చిట్టి, సర్పంచి లచ్చయ్య, అధికారులు శ్రీనివాసరావు, మణిరాజు, పాత్రో, రవి తదితరులు పాల్గొన్నారు.

17 వరకు ఈఏపీసెట్ కౌన్సెలింగ్

విలియం కేరీ

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్‌లో చేరికలకు సంబంధించి ఈఏపీసెట్ దరఖాస్తుల పరిశీలన పార్వతీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైందని ప్రిన్సిపల్ విలియం కేరీ తెలిపారు. సోమవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. ముందుగా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600, ఇతరులు రూ.1,200 చొప్పున చెల్లించి ఆన్‌లైన్లో దరఖాస్తులు పంపించాలని చెప్పారు. ఎవరూ కళాశాలకు రావాల్సిన అవసరం లేదని, ఇళ్ల నుంచే అవసరమైన ధ్రువపత్రాలు, రుసుము చెల్లింపు రసీదులు ఆన్‌లైన్లో నమోదు చేస్తే చాలన్నారు. ఈ నెల 17 వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని చెప్పారు.

మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో అధికారులు

స్నేహపూర్వక వాతావరణంలో మెగా సమావేశం

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఈ నెల 10 జరగనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో చేపట్టాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. సోమవారం విద్యాశాఖ, ప్రత్యేక అధికారులతో చర్చించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 16 రకాల కమిటీలు వేసి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బుధవారం నాటికి ప్రముఖులు, తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రాలు అందేలా చూడాలన్నారు. పిల్లలు విధిగా ఏకరూప దుస్తులు ధరించాలన్నారు. జేసీ శోభిక, సబ్‌కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతేరాజు 6లో

ఉద్యోగులే ఆక్రమిస్తే ఎలా..?

కఠిన చర్యలు చేపడతామని కలెక్టర్ హెచ్చరికలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: రెవెన్యూ ఉద్యోగులు ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరిస్తే ఇంటికి సాగనంపుతామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం జేసీ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవ, డీఆర్వో హేమలత, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, కేఆర్సీ ఉపకలెక్టరు ధర్మచంద్రారెడ్డితో కలిసి 109 మంది నుంచి అర్జీలు స్వీకరించారు.

అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక, అధికారులు

ఉద్యోగిపై బాధితురాలి ఫిర్యాదు

పార్వతీపురం మండలంలోని కృష్ణపల్లికి చెందిన **సంతోషమ్మ,** అక్కాచెల్లెళ్లకు తల్లి నుంచి 1.5 ఎకరాల భూమి సంక్రమించింది. గ్రామంలో వీఆర్వోగా పనిచేసి ప్రస్తుతం వేరే మండలంలో సీనియర్ సహాయకుడిగా ఉన్న ఉద్యోగి ఆ భూమిని తన పేరున నమోదు చేసుకున్నారు. సంతోషమ్మ కుటుంబం సాగుకు వెళ్తే పొలం చుట్టూ కంచె వేసి అక్రమంగా చొరబడుతున్నారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంతోషమ్మ సమస్యను కలెక్టర్‌కు చెప్పారు. వెంటనే పరిష్కరించాలని ఆయన తహసీల్దారును ఆదేశించారు. ఉద్యోగులే భూ వివాదాలు సృష్టిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

9 నుంచి మినిస్టీరియల్ ఉద్యోగ సంఘ ఎన్నికలు

కొత్తవలస: ఉమ్మడి జిల్లాలో పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఈనెల 9 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. కాలపరిమితి పూర్తవడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు, పరిశీలకులను జిల్లా సంఘ అధ్యక్షుడు మురళీ నియమించారు. 9న కురుపాం, 12న చీపురుపల్లి, నెల్లిమర్ల, 13న పార్వతీపురం, సాలూరు, 15న గజపతినగరం, 16న భోగాపురం, 17న జడ్పీ యూనిట్, 18న గంట్యాడ, 20న బొబ్బిలి, బాడంగి, 27న ఎస్.కోట, కొత్తవలస యూనిట్లకు జరగనున్నట్లు ఎన్నికల అధికారి ప్రసాద్ సోమవారం తెలిపారు.



(c) eenadu

సుద్దులు చెప్పారు.. శుద్ధి మరిచారు!

పురాలను వెంటాడుతున్న చెత్త సమస్య

ఈనాడు–విజయనగరం, న్యూస్‌టుడే–సాలూరు

పట్టణాలను పరిశుభ్రంగా మారుస్తాం.. చెత్త సమస్య నివారిస్తాం.. ఇళ్ల నుంచి సేకరించి డంపింగ్ యార్డుల్లో నిల్వ చేసిన చెత్తను జీరో లెవెల్‌కి తీసుకొస్తాం.. స్వచ్ఛాంధ్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలంటూ సుద్దులు చెప్పిన గత ప్రభుత్వ పాలకులు ఆచరణలో శుద్ధి మరిచారు. ఇందుకు ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లోని డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన వేల టన్నుల చెత్త కుప్పలే నిదర్శనం. సీసీ కెమెరాలు పెట్టి తూతూమంత్రంగా యార్డుల్లో చర్యలు చేపట్టారు. నదులు, చెరువుల్లో నీటిలో మురుగు కలవకుండా శుద్ధికి రసాయన ట్యాంకులు ఏర్పాటు చేసి నామమాత్ర చర్యలే చేపట్టారు.

పట్టణాల్లో వ్యాధుల భయం

పార్వతీపురం పట్టణంలో డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించకపోవడంతో చెత్త సమస్య ఎక్కువైంది. రోజుకు 21 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. యార్డు లేక ఇంటింటా సేకరించినది రాయగడ మార్గంలో రోడ్డు పక్క వేస్తున్నారు. కుప్పలకు నిప్పంటిస్తున్నారు. వాహన చోదకులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ★ సాలూరు పట్టణంలోని 26వ జాతీయ రహదారి పక్కన డంపింగ్ యార్డు ఉంది. రోజూ 17 టన్నుల వరకు చెత్త సేకరించి యార్డులో వేస్తున్నారు. శుద్ధి పనులు జరగక కొండలా పేరుకుపోతోంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మాయమయ్యాయి. యంత్రాలు మూలకు చేరాయి. చెత్తకు నిప్పు పెట్టడంతో వాయుకాలుష్యం శ్వాస సంబంధిత వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ★ పాలకొండ నగర పంచాయతీలో డంపింగ్‌యార్డు లేక పారిశుద్ధ్య సమస్య తీవ్రమైంది. రోజుకు పది టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి అవుతోంది. పట్టణ నలుదిశలా ఈ కుప్పలే దర్శనమిస్తున్నాయి.

పార్వతీపురం శివారు డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త కుప్పలు

తప్పులు కప్పేందుకు తిప్పలు

పట్టణాల్లో ఉత్పత్తి అయిన చెత్త విశాఖకు తరలించి, డంపింగ్ యార్డులను జీరో లెవల్‌కి తెచ్చేందుకు రాష్ట్రంలో తరుణి అసోసియేట్ సంస్థతో గత వైకాపా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ మేరకు పనులు చేపట్టిన సంస్థకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే నిలిపేసింది. ఇప్పుడు ఆ ఒప్పందం గడువు ముగిసింది. పొరుగు రాష్ట్రంలో మురికినీటి శుద్ధి పనులు సకాలంలో చేపట్టలేదంటూ గతంలో గ్రీన్ ట్రైబ్యునల్ ఆ ప్రభుత్వానికి భారీగా జరిమానా విధించింది. మేల్కొన్న వైకాపా ప్రభుత్వం అలాంటి పరిస్థితి ఎదురుకాకుండా యార్డులు, శుద్ధి కేంద్రాల్లో పనులు జరుగుతున్నట్లు చూపేందుకు ఫొటోలు, వీడియోలు తీసి కాలుష్య నియంత్రణ మండలికి చూపించింది. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కొన్నాళ్లకు వెనక్కి తీసుకుపోయారు.

అక్టోబరు నాటికి పూర్తి చేస్తాం: ఉత్తరాంధ్రలోని పట్టణాల్లో చెత్త ఉత్పత్తి, తరలింపు, ఎరువు తయారీ ప్రక్రియపై సంబంధిత అధికారులతో చర్చించా. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రైవేటు సంస్థలతోనూ మాట్లాడా. పట్టణాల్లోని డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తను జీరో లెవల్‌కు తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది. వచ్చే అక్టోబరు నాటికి నిర్దేశించుకున్న లక్ష్యం పూర్తి చేసేలా ముందుకెళ్తున్నాం.

- కామేశ్వరరావు, ఎస్ఈ, ప్రజారోగ్యశాఖ, విశాఖపట్నం

జాజి పంట.. కేరళ టు పాచిపెంట!

వక్కలో అంతరపంటగా సాగుతో లాభం

న్యూస్‌టుడే, పాచిపెంట

సుగంధ ద్రవ్యాల సాగు అంటే మన ప్రాంతం అనుకూలం కాదని ఇప్పటి వరకు రైతులు ఆ ఆలోచనే చేయలేదు. దీనికి భిన్నంగా వక్కలో అంతర పంటగా జాజి సాగు చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలిచారు పాచిపెంట మండలం గోగాడవలస గ్రామానికి చెందిన చలసాని లీలా ప్రసాద్. గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలో వక్క, కొబ్బరి, ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఏడేళ్ల కిందట కేరళకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలతో అంతర పంటగా జాజి సాగు చేయాలని ఈయన నిర్ణయించారు. కేరళలో కొనుగోలు చేసి తెచ్చిన జాజి మొక్కలను ఎకరాలో 40 చొప్పున 20 ఎకరాల్లో నాటారు. ప్రస్తుతం పంట దిగుబడి వస్తోంది. దీర్ఘ కాలిక ఫలసాయాన్ని ఇచ్చే ఈ పంట వందేళ్ల వరకు కాపునిస్తుంది.

సస్యరక్షణ ఇలా..

● ఈ పంట సాగుకు నీడ, చల్లని వాతావరణం అనుకూలం. ● వక్క, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటగా వేస్తే మొక్కల ఎదుగుదల, దిగుబడి బాగుంటుంది. ● వక్కలో అంతర పంటలు వేయడం వల్ల ప్రత్యేకంగా వీటికి నీటి తడులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ● డ్రిప్‌తో నిరంతరం నీరు పంటకు అందుతుంది. ● సేంద్రియ ఎరువైన పశువుల గెత్తం వాడడం వల్ల పంట తెగుళ్ల బారిన పడకుండా ఉంటుంది. ● వారంలో ఒకటి, రెండు రోజులు పంట పరిశీలించాలి.

దిగుబడి.. అమ్మకం

మొక్కలు నాటిన ఏడేళ్ల నుంచి దిగుబడి ప్రారంభం అవుతుంది. వందేళ్ల వరకు మొక్క అయిదు కిలోలకు తక్కువ కాకుండా కాయలు కాస్తుంది. మార్కెట్‌లో కిలో రూ.600 నుంచి రూ.700 వరకు ధర పలుకుతోంది. సగటున రెండు క్వింటాళ్ల దిగుబడికి పెట్టుబడి ఖర్చులు, మొక్కలు నాటడం, ఎరువులు, నిర్వహణకు ఖర్చులు ఏడాదికి సుమారు రూ. 40 వేల వరకు అవుతుంది. ఆ లెక్కన రూ.1.20 లక్షల ఆదాయం వస్తుంది. ఖర్చులు పోనూ రూ.80 వేల లాభం వస్తుందని రైతు చెబుతున్నారు. ప్రస్తుతం కేరళ, తమిళనాడులో ఒక్కో మొక్క నాణ్యతను బట్టి రూ.200 నుంచి రూ.1000 వరకు పలుకుతోంది. అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటే వ్యయప్రయాసలు తప్పవని, మరో పది ఎకరాలకు సరిపడే మొక్కల కోసం విత్తనాలు తెప్పించి నర్సరీని పెంచుతున్నట్లు ఆయన తెలిపారు.

రైతేరాజు

సకాలంలో చూడి కడితేనే సత్ఫలితం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పశు పోషణలో వ్యయం పెరిగి ఆదాయం తగ్గడంతో రైతులు నష్టపోతున్నారు. సకాలంలో చూడికట్టడం, సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక పాల దిగుబడి, పోషకులకు లాభం ఉంటుందని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారిణి శైలజ తెలిపారు. ఎద లక్షణాలు గుర్తించి సకాలంలో కృత్రిమ గర్భోత్పత్తి చేయించాలి. ఆవుల్లో ఆ లక్షణాలు ప్రస్ఫుటంగా ఉంటాయి. గేదెల్లో 40 శాతమే గుర్తించగలం. కృత్రిమ గర్భోత్పత్తి జరిపినపుడు కచ్చితంగా చూడి నిలబడాలని లేదు. ఈతల మధ్య వ్యవధి తక్కువగా ఉండాలి. గేదెలు 14 నుంచి 16, ఆవులు 12 నుంచి 14 నెలల్లో ఈనేలా చర్యలు ఉండాలి. గర్భధారణ జరిగిన మూడు నెలల్లోపు ఎదకు రాకుంటే పరీక్ష చేయించాలి. ఈనిన నాలుగు నెలల్లోపు చూడి కట్టేలా, పాల దిగుబడి తగ్గకుండా అదనపు మేపు అందించాలని సూచించారు.

కోతలు అనంతరం సస్యరక్షణ అవసరం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: జీడి, మామిడి కోతల అనంతరం సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కేవీకే ఉద్యాన విభాగ శాస్త్రవేత్త శ్రీనివాసరాజు సూచించారు. రైతుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

ప్రశ్న: మామిడి కోతల తర్వాత ఎలాంటి ఎరువులు వేయాలి? **- చిన్నారావు, బొండపల్లి**

సమాధానం: ఎరువులను జులై-ఆగస్టు మాసాల్లో చెట్టు మొదట్లో చల్లి నేలలో కలిసేలా తిరగబెట్టాలి. తక్కువ వర్షపాతం గల ప్రదేశాల్లో ఎరువులను, పోషక పదార్థాలను వర్షాకాలం మొదట్లో, రెండో దఫా చివరిలో వేయాలి. వర్షపాతం ఎక్కువున్న ప్రదేశాల్లో చివర్లో అందించాలి. తేలికపాటి భూముల్లో తగినంత చెరువు మట్టిని లేదా కంపోస్టు వేయాలి. ఒక్కో మొక్కకు మొదటి ఏడాది 100 గ్రాముల నత్రజని, 100గ్రా. భాస్వరం, 100 గ్రా. పొటాష్ అందేలా ఎరువులు వేయాలి.

?: మామిడి, జీడి మామిడి మొక్కలను ఎంత దూరంలో నాటుకోవాలి.?

● అంటు మొక్కలను మట్టిగడ్డతో సహ తీసి వేర్లు కదలకుండా గుంత మధ్యలో నాటాలి. మామిడి మొక్కలను 7.5×7.5 మీటర్ల దూరంలో హెక్టారుకు 178 మొక్కలు నాటాలి. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు 5×5 మీటర్ల దూరంలో 400 మొక్కలు నాటుకోవచ్చు. జీడిమామిడి 6×6 మీటర్లు దూరం చొప్పున 278 మొక్కలు నాటుకోవాలి.

వెద సాగు.. ఆదాయం బాగు

గుమ్మలక్ష్మీపురం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: ఖరీఫ్ సాగులో వరి ప్రధానం. పెరుగుతున్న ఖర్చులు, కూలీల కొరత లాంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని వెద సాగు పద్ధతి అవలంబిస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.తేజేశ్వరరావు సూచించారు.

ఖర్చులు మిగులు.. నాట్లు వేస్తే ఎకరాకు 25 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. ట్రాక్టర్ కిరాయి, కూలీలు, ఎరువులు, పురుగు మందులకు ఎకరాకు రూ.30 వేలు అవుతుంది. దిగుబడి ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్లలోపే. వెద సాగులో ఎకరాకు 15 కిలోల విత్తనం సరిపోతుంది. నాటేందుకు కూలీల ఖర్చు ఉండదు. ముందస్తు చర్యలతో కలుపుతీత అవసరం లేదు. ఇదంతా కలిసి రూ.10 వేల వరకు ఆదా చేసుకోవచ్చు. దిగుబడి ఎకరాకు 25 నుంచి 32 క్వింటాళ్ల వరకు వస్తుంది.

ఎరువుల యాజమాన్యం

పొలం తయారీ సమయంలో ఎకరానికి 8-10 టన్నుల పశువుల గెత్తం వేయాలి. తొలకరి వర్షాలకు పెసర వంటి అపరాల పంటలు వేసి కలియదున్నాలి. ఎకరానికి 500 మి.లీ. అజోస్పైరిల్లం, 500 మి.లీ పాస్ఫో బాక్టీరియాను 100 కిలోల పశువుల గెత్తంతో కలిపి విత్తిన తర్వాత తేమ ఉన్నప్పుడు వేసుకోవాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

ఖరీఫ్‌లో సాగవుతున్న వరి, మొక్కజొన్న, చెరకు తదితర పంటల్లో ఎరువుల యాజమాన్యం, విత్తనశుద్ధి, నేలలకు అనుకూలమైన ఎలాంటి పంటలు వేసుకోవాలి వంటి సలహాలకు 89781 14299 నంబరును సంప్రదించాలని కేవీకే ప్రోగ్రాం సమన్వయకర్త ధృవ తెలిపారు.

వరద పెరిగింది.. పడవ ఆగింది

నాగావళి నదిలో వరద ఉద్ధృతి పెరగడంతో పలు గ్రామాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొట్టు తదితర గ్రామాల నుంచి కొమరాడ పాఠశాలకు రావాలంటే నదిలో నడవాల్సిందే. కొన్ని రోజులుగా ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పడవపై రాకపోకలు సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి నుంచి ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో పడవను సైతం అనుమతించకపోవడంతో విద్యార్థులు బడికి వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. – న్యూస్‌టుడే, కొమరాడ

ఏడాది పాలనలో ఎంతో సంతృప్తి

పార్వతీపురం మన్యం కలెక్టర్‌గా ఎ.శ్యామ్‌ప్రసాద్ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం అధికారుల సమక్షంలో సంబరాలు చేసుకున్నారు. ఏడాదిగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు ఎంతో సంతృప్తిని ఇచ్చాయని, యంత్రాంగం బాగా కష్టపడి సహకరించిందన్నారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. జేసీ శోభిక, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో హేమలత, ఎస్డీసీ ధర్మచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం

రేపు పార్వతీపురంలో ఉద్యోగ మేళా

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆర్.వహిదా తెలిపారు. వివిధ ఫార్మా కంపెనీల్లో 85 ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా www.ncs.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకొని, ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. బయోడేటా, ధ్రువపత్రాలు, రెండు ఫొటోలతో రావాలన్నారు.

సంస్థల వివరాలు.. కంపెనీ: వశిష్ఠ ఫార్మాకెమ్, విశాఖ. **ఉద్యోగం:** ఆపరేటర్. **విద్యార్హత:** ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, బీఎస్సీ కెమిస్ట్రీ. **జీతం:** రూ.16 వేలు, **వయసు:** 27 ఏళ్లు ★ ఆర్.యు.ఐ ల్యాబ్స్, విశాఖ- ట్రైనీ ఎగ్జిక్యూటివ్- బీఎస్సీ కెమిస్ట్రీ - రూ.16 వేలు - 27 ఏళ్లు. ★ సినాస్టిక్స్ ల్యాబ్స్, విశాఖ- ఆపరేటర్ - పది, ఇంటర్, బీకాం, బీఏ, ఐటీఐ- రూ.15 వేలు - 27 ఏళ్లు ★ ఓసీమం లాబ్స్, విశాఖ- కెమిస్ట్- బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ- రూ.15- 17 వేలు- 27 ఏళ్లు ★ మంజూషి ఈ టెక్నో ప్యాక్, విశాఖ - అప్రెంటీస్- ఐటీఐలో అన్ని గ్రేడులు- రూ.18వేలు - 30 ఏళ్లు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, విజయనగరం జిల్లా

షార్ట్ టెండర్ ప్రకటన

టెండర్ నోటీసు నం.339/2025-26/A1 తేది.08/07/2025.

మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ విజయనగరం జిల్లా పరిధిలో గల 11 ICDS ప్రాజెక్టులకు మరియు Institutionsకు స్టేషనరీ, ఎక్యూప్‌మెంట్ మరియు ఇతర సామానులు సరఫరా చేయుటకు సీల్డు టెండర్లు తే 14-07-2025 ది లోపు ఆఫీసు పనిదినములలో కోరబడుచున్నవి. సీల్డు టెండర్లు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి, విజయనగరం వారి కార్యాలయమునకు సమర్పించవలెను.

టెండర్లు స్వీకరణ మొదలయ్యే తేది : 09-07-2025, ఉదయం 11.00 గంటలు.
టెండర్లు స్వీకరణకు చివరి తేది : 14-07-2025, సాయంత్రం 5.00 గంటలు.
టెండర్లు ఓపెనింగ్ తేది : 15-07-2025, ఉదయం 11.00 గంటలకు

సం/- జిల్లా సంయుక్త కలెక్టర్ మరియు ఛైర్మన్, జిల్లా కొనుగోలు కమిటి (DPC), విజయనగరం

EENADU Classifieds

AGRI BUSINESS

Tomato Trading. Earn 1000 daily profit on investment. Cntct: 6309090490. Svfpl.

BUSINESS SERVICES

BATH CLEANING

శ్రీ కనకదుర్గ హౌస్‌కీపింగ్ సర్వీస్ మీ ఇంటి వద్దకు వచ్చి పరిశుభ్రంగా సకాలంలో చేయబడును. (టాయిలెట్, హౌస్, సోఫాసెట్, డస్ట్, గ్లాస్, వాటర్ ట్యాంక్ etc.,) Cell: 8520804641, 9959138591.

HEALTH & CARE

NEURO

నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్. మెదడు, నరములు & వెన్నెముక వ్యాధి నిపుణులు. Dr.Nirmala Vangapandu M.D.(Gen.Med) DM (Neuro) JIPMER Specialist in Brain & Nerve Problems & General Physician. R.T.C.కాంప్లెక్స్ ఎదురుగా, INOX మల్టీప్లెక్స్ వెనుక వైపు, VZM. FOR APPOINTMENT : 63054 71147

REAL ESTATE

FLAT FOR SALE

2, 3 BHK VZM జమ్మునారాయణపురంలో G+3 (డీలక్స్ ఫ్లాట్స్) 950, 1300 sftలు వరుసగా 25, 30 Lakhs N, S/F, కార్ పార్కింగ్, లిఫ్ట్, జనరేటర్, 100% వాస్తు. రెడీ టు అక్యూపై Cont : 7032505552

LAND FOR SALE

Land for Sale: 1.5 Acres (NH-16) Highway Adjacent along Vizag- Srikakulam Rd. @ Nathavalasa Jn., Nr. Bhogapuram. Ph: 9959964304.

PLOT FOR SALE

ఆఫర్.. ఆఫర్.. చెల్లూరు హైవేకి అతి దగ్గరలో VMRDA లే అవుట్ నందు Open Plot అమ్మకానికి కలవు. C.C. రోడ్లు మొ॥ సదుపాయాలతో స్పాట్ రిజిస్ట్రేషన్ బ్యాంకులోను. ✆ 8142619849.

116 Sq. Yards Plot No.24, Sarvani Nagar. Contact: 8374612225.

విజయనగరం, రామవరం రోడ్, కలక్టరేట్ దగ్గర, వాసవీనగర్ లేఅవుట్ నందు 220 చ॥గ॥ దక్షిణ ముఖం గల ఇంటి స్థలం అమ్మకం నకు కలదు. డైరెక్ట్ పార్టీస్ మాత్రమే ✆ 9700112125, 9597467913.

ప్లాట్ ఫర్ సేల్, భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కి 8 km దూరంలో మరియు NH-16 రోడ్ ఫేసింగ్ ప్లాట్. సంప్రదించండి ఫోన్ నెంబర్: 7670898605.

TO LET

2BHK with Car Parking in between Sun School and Fort City School for rent. Mobile: 9441837846 or 7013056499.

JOBS

Wanted Business Associate Leaders TATA AIA Life Insurance Company Age: 27 Y above Oly: 10th / Inter / Degree Walk in Interview ✆ 9441813850.

విజయనగరం రింగ్ రోడ్‌లో గల ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్ (Female) కావలెను అర్హత : డిగ్రీ & కంప్యూటర్ అనుభవం కలవారికి ప్రాధాన్యత. సం: 9492933336.

విజయనగరంలో గల ప్రముఖ స్పా నందు పనిచేయుటకు అనుభవం గల మేనేజర్లు (Male) కావలెను. Qly: Degree / MBA. (Freshers also apply) Con: 9291221394, 9666363631.

Receptionist and Waiters Required Age: below 35 yrs. with Computer & Hindi & English speaking skills Hotel Winsar Park, Opp. KGH, Vizag. 9849581868.

Wanted Marketing Managers to work in Ministry of Divinity, Vizag. Salary Rs. 27,500/-. ✆: 86393 67991.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Oyo హోటల్ రూమ్స్ (Lodge) నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్ cum రూమ్ బాయ్స్ కావలెను (Age below 28). భోజనం & వసతి కలదు. MVP కాలనీ, వైజాగ్. ✆ 7036488899.

విజయనగరం జిల్లా పరిధిలో గల శ్రీరామ్ చిట్స్ & శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లకు సంబంధించిన రాజాం, పాలకొండ రూరల్ & అర్బన్ ప్రాంతాలలో పనిచేయుటకు వెంటనే 30 మంది BDES, ఏదైనా డిగ్రీ కలిగి వ. 43 సం॥లు లోపు వారు ఇంఛార్జ్‌లుగా కావలెను. రెన్యూవల్ కలెక్షన్ టీమ్, ఎగ్జిక్యూటివ్స్ ట్రైనీస్ (MBA or PG), శాలరీ:18,000/- + ఇన్సెంటివ్స్, PF, ESI, GR INS, సం.కు బోనస్ 28,000/- కలవు. LIC ఏజెంట్స్‌గా గాని ఇతర లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్, Bank Loan's చేసే DAC ఎగ్జిక్యూటివ్స్, ఇతర చిట్ ఫండ్ ఏజెంట్స్, సంప్ర: 9849824071.

WANTED

A Leading Woman & Child Hospital in Vizianagaram required working team
1) Anaesthetist (Part/Full Time)
2) Obstetrician and Gynecology (Part/Full Time)
3) O.T. Technician
4) X-ray Technician
5) Pharmacist
6) Receptionist Female (Age:35)

VENKATAPADMA HOSPITAL, 3 Lamps Jn., Vizianagaram. Cell: 9985513355, 08922-227131,225777

FACULTY/ TEACHERS

KNBR Upper Primary School, కొత్త అగ్రహారం 1వ వీధి, విజయనగరం నందు పర్క్ చేయుటకు అనుభవంగల క్వాలిఫైడ్ టీచర్స్ కావలెను. జీతం అనుభవం ఆధారంగా ఇవ్వబడును. సెల్: 9391446385.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

సచివాలయాల్లో 3,875 మందికి బదిలీ!!

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల్లో భారీగా బదిలీలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో 3,875 మంది సొంత మండలం దాటి వెళ్లనున్నారు. వీరిలో 3,571 మంది అయిదేళ్ల సర్వీసు పూర్తి చేయడంతో తప్పనిసరిగా స్థానాలు మారనున్నారు. మిగిలిన 304 మందిని రిక్వెస్ట్ కింద ఇతర ప్రాంతాలకు పంపనున్నారు. శాఖల వారీగా ఇప్పటికే ప్రక్రియ పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. సంబంధిత జాబితాపై ప్రస్తుతం పరిశీలన జరుగుతోంది. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సిబ్బంది మరో రెండు రోజుల్లో కేటాయించిన స్థానాలకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

హేతుబద్ధీకరణతో ఖాళీలు.. గ్రేడ్- 5 కార్యదర్శులు, పట్టు పరిశ్రమ, విద్యుత్తుశాఖ మినహా 12 విభాగాల్లో బదిలీలు నిర్వహించారు. ఇందులో పురపాలక/అర్బన్ డెవలప్‌మెంట్, 11 ఇతర ప్రభుత్వ శాఖలున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 778 సచివాలయాలకు 6,178 పోస్టులు మంజూరయ్యాయి. 5,452 మంది మాత్రమే పనిచేస్తున్నారు. హేతుబద్ధీకరణ తర్వాత అన్ని శాఖల్లో కలిపి 5,894 ఉద్యోగులే అవసరముంటుందని ప్రాథమికంగా గుర్తించారు. కొన్నిచోట్ల తక్కువ మందినే వినియోగిస్తుండడంతో మిగిలిన వారిని జిల్లా, డివిజన్ కార్యాలయాల్లో సర్దనున్నారు. విద్యుత్తుశాఖలో ఎనర్జీ సహాయకుల నియామకాలను శాఖపరంగా నిర్వహించినందున, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారికి స్థానచలనం కల్పిస్తారు. పట్టుపరిశ్రమల శాఖలో ఉన్న ఇద్దరు ఉద్యోగులు పదోన్నతిపై వెళ్లడంతో బదిలీలు జరగలేదని సచివాలయాల జిల్లా అధికారిణి ఎస్.రోజారాణి తెలిపారు.

శాఖల వారీగా స్థానచలనాలిలా..

శాఖ	తప్పనిసరి	రిక్వెస్ట్
రెవెన్యూ	57	-
ఉద్యాన	106	05
సాంఘికసంక్షేమ	333	01
పంచాయతీరాజ్	361	27
వైద్య శాఖ	530	10
మహిళా పోలీసు	554	04
పంచాయతీ(డీఏ)	255	23
పశుసంవర్ధక	213	72
మత్స్యశాఖ	34	-
వ్యవసాయ	340	149
సర్వే, భూములశాఖ	342	10
పురపాలక, అర్బన్	446	03

బ్యాంకు ఖాతాలు తప్పనిసరి

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: తల్లికి వందనం పథకం వర్తించేందుకు ఎస్సీ వర్గానికి చెందిన ఒకటో తరగతి విద్యార్థులు తల్లి పేరుతో, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నవారు వ్యక్తిగతంగా బ్యాంకు లేదా తపాలా శాఖల్లో ఖాతాలను తెరుచుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు యు.అన్నపూర్ణమ్మ తెలిపారు. వాటికి ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని చెప్పారు. వివరాలకు 96868 02519ను సంప్రదించాలన్నారు.

ఎస్పీ దృష్టికి 16 సమస్యలు

అర్జీలు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో 16 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. భూ, ఆస్తి తగాదాలు, సైబర్, భర్త, అత్తారింటి వేధింపులు, నకిలీ పత్రాలు, ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన వినతిపత్రాలు వచ్చాయన్నారు. డీసీఆర్బీ సీఐ ఆదాం, సిబ్బంది ఉన్నారు.

ప్రాంతీయాసుపత్రి కిటకిట

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేటలోని ప్రాంతీయాసుపత్రి సోమవారం రోగులు, వారి సహాయకులతో కిటకిటలాడింది. మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర జ్వరాలు, ఇతర సాధారణ వ్యాధులు విజృంభిస్తుండడంతో మన్యంలోని రోగులంతా ఆసుపత్రి బాటపడుతున్నారు. ఒక్క రోజే 334 ఓపీ నమోదైందని ఆసుపత్రి పర్యవేక్షకుడు బి.శ్రీనివాసరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. 42 మందిని ఇన్ పేషెంట్లుగా చేర్చామన్నారు. 87 మంది సాధారణ జ్వరాలతో బాధపడుతున్నారని చెప్పారు. మలేరియా పాజిటివ్ కేసు ఒకటి నమోదైందని, 18 మంది ఆ వ్యాధి లక్షణాలతో వచ్చారన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	98	166	176

అసభ్యకరంగా చిత్రీకరణ
యువకుడి అరెస్టు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ఓ వివాహిత స్నానం చేస్తుండగా వీడియో తీసి, ప్రశ్నించిన ఆమె భర్తపై దాడి చేసిన నిందితుడ్ని ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించారు. ఈ కేసు వివరాలను సీఐ శ్రీనివాస్ సోమవారం వెల్లడించారు. బాధితురాలు ఈనెల 4వ తేదీన స్నానం చేస్తున్న సమయంలో పి.శంకర్ అనే వ్యక్తి వీడియో తీశాడు. గమనించిన ఆమె కేకలు వేయగా.. పరారయ్యాడు. భర్తకు విషయం తెలియడంతో అతను వెళ్లి శంకర్‌ను నిలదీసి, చరవాణి తీసుకున్నాడు. ఈక్రమంలో అతడిపై దాడికి పాల్పడి, చరవాణితో శంకర్ పారిపోయాడు. సాంకేతికత ఆధారంగా అతడిని అరెస్టు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు

మన్యం వాసి మృత్యువాత

ఘటనా స్థలంలో దెబ్బతిన్న కారు

ఆనందపురం, పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆగిఉన్న లారీని కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన 16వ జాతీయ రహదారి ఆనందపురంలోని వేములవలస సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ట్రాఫిక్ ఎస్సై పాపారావు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం బీజేపురం అగ్రహారం గ్రామానికి చెందిన కె.రమణమూర్తి(57) 30 ఏళ్లుగా ఓ బీమా సంస్థలో ఏజెంట్‌గా పని చేస్తున్నారు. దేవిసంతోష్, గాయత్రిదేవి సంతానం. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కుమారుడు దేవిసంతోష్ ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో మద్దిలపాలెంలో నివాసముంటున్న కుమార్తె గాయత్రిదేవి వద్దకు వెళ్లేందుకు ఇద్దరూ కారులో బయలుదేరారు. వేములవలస వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి ఆగిఉన్న లారీని ఢీకొంది. దీంతో రమణమూర్తి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు చేరుకుని కారులో ఇరుక్కుపోయిన సంతోష్(31)ను బయటకు తీసి ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం క్షతగాత్రుడిని తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కారును పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆనందపురం సీఐ వాసునాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు. రమణమూర్తి భార్య రమణి ఎనిమిదేళ్ల కిందట మృతి చెందారు.

రమణమూర్తి (పాతచిత్రం)

నగరంలో పీర్ల పండగ

ఊరేగింపులో పాల్గొన్న ముస్లిం సోదరులు, నగరవాసులు

మొహర్రంను పురస్కరించుకొని విజయనగరంలో పీర్ల పండగను సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురవీధుల్లో పీర్లను ఊరేగించారు. అంబటిసత్రం నుంచి మూడులాంతర్లు, కోట తదితర ప్రాంతాల మీదుగా తిరిగారు. ముస్లిం సోదరులతో పాటు పట్టణవాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పీర్ల ముందు కర్రసాము చేస్తున్న దృశ్యం

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80081 11237

70 మంది బాలికలకు సైకిళ్ల పంపిణీ

బాడంగి, న్యూస్‌టుడే: వీకే ట్రస్టు మరోసారి దాతృత్వం చాటుకుంది. బాడంగి మండలంలో తల్లిదండ్రులను కోల్పోయిన 70 మంది విద్యార్థినులకు రూ.5 లక్షలు విలువజేసే సైకిళ్లను అందించింది. బాడంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి ఎస్.సత్యకుమార్ చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. క్రేజీబీ ఫైనాన్స్ సర్వీసు సహకారం అందించినట్లు చెప్పారు. ఎంఈవో రాజేశ్వరి, హెచ్ఎం సత్యనారాయణ, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గతంలోనూ పెద్దఎత్తున సైకిళ్లను అందించింది.

విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

(c) eenadu

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి సాధ్యం

కరపత్రం అందజేస్తున్న విప్ జగదీశ్వరి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పొడి గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి వి.వీరేశ్‌చంద్రదేవ్, నాయకులు కె.రంజిత్‌కుమార్, కొండయ్య, గోవింద, మాసయ్య, మురళి, చంటి, గంగులు తదితరులు పాల్గొన్నారు.

తొలి అడుగుకు ప్రజాదరణ

కేకు కోస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా చేపడుతున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ప్రజాదరణ లభిస్తోందని ఎమ్మెల్యే బి.విజయచంద్ర పేర్కొన్నారు. సోమవారం 28వ వార్డు కౌన్సిలర్ ఎం.శశికర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించారు. కంచరవీధి రోడ్డులో కాలువ, బోరు సమస్యలు ఉన్నాయని స్థానికులు చెప్పారు. ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. పుర మాజీ ఉపాధ్యక్షుడు బి.జయప్రకాశ్, కౌన్సిలర్లు కె.నారాయణరావు, బి.గౌరునాయుడు, ఎం.రవికుమార్, పి.జయంతి, జి.రవికుమార్, ఎం.వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన బాలిక చదువుకు అండ

విద్యార్థిని తండ్రికి చెక్కు ఇస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పీవో

పార్వతీపురం, న్యూస్‌టుడే: సాలూరు మండలంలోని దత్తివలసకు చెందిన శివయ్య కుమార్తె వెంకటలక్ష్మి జేఈఈ పరీక్షల్లో ర్యాంకు సాధించి పుదుచ్చేరి ఎన్ఐటీలో కంప్యూటరు సైన్స్‌లో సీటు పొందింది. ఆమెను కళాశాలలో చేర్పించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తండ్రి శివయ్య తీసుకువచ్చారు. ఆయన ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవతో చర్చించి రూ.25 వేలు అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం.. పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి డీఈవో రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈనెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యతోనే పురోగతి

విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని కేపీఎం పుర ఉన్నత పాఠశాల హెచ్ఎం అప్పలనాయుడు అన్నారు. పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన 14 మంది ఉపాధ్యాయులకు సోమవారం జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కౌన్సిలర్ కె.నారాయణరావు, విద్యార్థులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం పురపాలక

దారులు దారుణం.. ప్రయాణం నరకం

గోతులుగా మారిన ఎమ్మార్‌నగరం రహదారి

పార్వతీపురం గ్రామీణం, భామిని, పాలకొండ, వీరఘట్టం గ్రామీణం, కొమరాడ, న్యూస్‌టుడే: ఇటీవల కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాల రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా వదిలేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పలు గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పించింది. తమ గ్రామాలకూ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.3 కోట్లతో నిర్మించినా.. భామిని మండలంలోని అలికాం- బత్తిలి రహదారి అధ్వానంగా మారింది. కొరమ నుంచి బత్తిలి వరకు గుంతలే దర్శనమిస్తున్నాయి. వర్షం నీరు చేరి ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో రూ.3 కోట్లతో తారు రోడ్డు వేసినా నాణ్యత లోపంతో కొన్నాళ్లకే పాడైంది.

రూ.1.80 కోట్లు మంజూరైనా.. కొమరాడ మండలంలోని కుంతేసుకు రహదారి లేదు. ఈ మార్గంలో ఒడిశాలోని అలమండ, సోరిపల్లి, పార్వతీపురం మీదుగా ప్రజలు రాకపోకలు సాగిస్తారు. ఇక్కడ మురడ గెడ్డ చప్టాపై నుంచి నీరు పారడంతో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరైనా పనులు చేపట్టలేదు.

30 పల్లెల ప్రజలకు అవస్థలు.. పార్వతీపురం నుంచి మక్కువ మండలంలోని దుగ్గేరు మార్గంలో ఎమ్మార్‌నగరం ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు గుంతలుగా మారింది. ఈ దారిలో రోజూ ప్రయాణం చేసే 30 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఇది సాలూరు మండలంలోని సూళ్లారి రోడ్డు. ఇక్కడ 25 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరు కురుకుట్టి రావాలంటే 3 కిలోమీటర్ల మేర మట్టి రోడ్డే దిక్కు. ఐటీడీఏ ఏఈ సత్యనారాయణ మాట్లాడుతూ.. రూ.5 కోట్లతో పనులకు ప్రతిపాదించామని చెప్పారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

వీటి పరిస్థితీ అంతే..

పాలకొండ పట్టణంలోని కార్గిల్ కూడలిలో భారీ గుంత ఏర్పడింది. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం భారీ వాహనాలు రాజాం, విశాఖకు వెళ్తుంటాయి. పలువురు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ● వీరఘట్టం మండలంలోని సంతనర్సిపురం రహదారిలో వర్షం నీరు నిలిచి చోదకులు, పాదచారులు ఇక్కట్లు పడుతున్నారు. పక్కనే ప్రైవేటు వేబ్రిడ్జి నిర్మించడంతో రహదారి లోతుగా మారి సమస్య ఏర్పడింది.

పరిశీలించి బాగు చేస్తాం.. భామిని, పాలకొండ, వీరఘట్టంలో పాడైన రహదారులను బాగు చేస్తామని ర.భ.శాఖ జేఈ కిరణ్‌కుమార్ తెలిపారు. పార్వతీపురం మండలంలో రోడ్లు పరిశీలించి చర్యలు చేపడతామని ఏఈ గౌరునాయుడు చెప్పారు.

ప్రత్యేక అధికారుల నియామకం తగదు

నిరసన తెలుపుతున్న సంఘాల నాయకులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశానికి ప్రతి పాఠశాల నుంచి పర్యవేక్షణకు అధికారులను నియమించడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి పేర్కొంది. సోమవారం పార్వతీపురంలో డీఈవో కార్యాలయం వద్ద నాయకులు నిరసన తెలిపారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎ.సూర్యనారాయణ, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.విజయ్, ఎన్.బాలకృష్ణ, భాస్కరరావు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశం ఉత్సవంలా జరగాలి

సీతంపేట, న్యూస్‌టుడే: అన్ని పాఠశాలల్లో ఈ నెల 10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం వేడుకలా నిర్వహించాలని ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి సూచించారు. 8న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య కార్డులు ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించాలని, చిన్నారులకు ప్రగతి పత్రాలు అందజేయాలన్నారు. విద్యార్థులు కొత్త ఏకరూప దుస్తులతో హాజరయ్యేలా చూడాలన్నారు. ● వీరఘట్టం: మండలంలోని 72 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈవో ఆనందరావు తెలిపారు. పండగ వాతావరణంలో నిర్వహిస్తామన్నారు.

ఐటీడీఏకు వినతుల వెల్లువ

సమస్యలు తెలుసుకుంటున్న పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏలో పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు 43 వినతులు అందాయి. వితంతు పింఛను కోసం కె.కొత్తగూడకు చెందిన సోంబారమ్మ, పాఠశాలలో వంటశాల నిర్మించాలని ఎస్.ముకుందపురానికి చెందిన ఎస్.భాస్కరరావు, విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయాలని భామిని మండలం నూకాలమ్మగూడ గ్రామస్థులు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ ఎం.అన్నాదొర, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆహార భద్రత, తూ.కొ. శాఖల అధికారులు ఎక్కడ?

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఆహార భద్రత తనిఖీ, తూనికలు-కొలతల శాఖ అధికారులు జిల్లాలో ఎక్కడ ఉన్నారో తెలియడం లేదని, కల్తీ ఆహార పదార్థాలపై తనిఖీలు చేపట్టడం లేదని విని యోగదారుల సంఘం ప్రతినిధి రామకృష్ణ కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో అర్జీ ఇచ్చారు. ● గుమ్మలక్ష్మీపురం మండలం జర్నలో నాటు సారా తయారు చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని చిరంజీవి కోరారు. ● పార్వతీపురం పట్టణానికి చెందిన ఎస్.స్రవంతి వంద శాతం మానసిక దివ్యాంగురాలు. గతంలో పింఛను వచ్చేది. ప్రస్తుతం భూమి ఎక్కువగా ఉందని చూపుతూ పింఛను ఆపేశారని ఆమె తల్లి ఆవేదన చెందారు. రికార్డులో భూ విస్తీర్ణం సరిచేసి పింఛను మంజూరు చేయాలన్నారు. ● తమకు బదిలీల్లో అన్యాయం జరిగిందని, అర్హతలు ఉన్నా వేరే జిల్లాకు పంపించారని పలువురు సచివాలయ వెటర్నరీ సహాయకులు తెలిపారు.

ధ్రువపత్రాలకు డబ్బులు అడుగుతున్నారు..

ఊతమిస్తే తప్ప కదల్లేని స్థితిలో ఉన్న తనకు పింఛను మంజూరు చేయాలని దరఖాస్తులు చేస్తున్నా ఫలితం ఉండటం లేదని పాలకొండ మండలం భాసూరుకు చెందిన ఈసర్ల పోలయ్య అన్నారు. వైకల్య నిర్ధారణ ధ్రువపత్రం కోసం వెళ్తే డబ్బులు అడుగుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు.

బృహత్తర ప్రణాళికతో అభివృద్ధి

ప్రణాళిక చూపుతున్న కమిషనర్, అధికారులు

సాలూరు, న్యూస్‌టుడే: బృహత్తర ప్రణాళికతో సాలూరు పట్టణం అభివృద్ధి చెందుతుందని పుర కమిషనర్ బి.వి.ప్రసాద్ అన్నారు. సోమవారం పుర కార్యాలయంలో మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. 2040 వరకు ప్రణాళిక అమలులో ఉంటుందని చెప్పారు. రహదారులు, పార్కులు, వాణిజ్య, నివాస, నివాసేతర, వ్యవసాయ, ప్రభుత్వ తదితర ప్రాంతాలను గుర్తించామన్నారు. కార్యక్రమంలో మేనేజరు శివప్రసాద్, ఆర్వో ప్రసాద్, ఏఈ అలేక్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో హామీలు ఇవ్వలేదు

మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి

సాలూరు, న్యూస్‌టుడే: ఎన్నికల్లో తామెప్పుడూ హామీలు ఇవ్వలేదని మాజీ ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర అన్నారు. సోమవారం సాలూరులో వైకాపా నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. చిన్న చిన్న పొరపాట్లతో ఓటమి చెందామని జడ్పీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎంపీ తనూజరాణి అన్నారు. పార్లమెంట్ పరిశీలకుడు ప్రసాద్, వైకాపా జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ

జైలు పరిసరాలు చూస్తున్న హరిబాబు

పాలకొండ, న్యూస్‌టుడే: రిమాండ్ ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవా సంస్థ అధ్యక్షుడు కె.హరిబాబు సూచించారు. వారానికి ఒకసారి వైద్యపరీక్షలు చేయాలన్నారు. సోమవారం పాలకొండ ఉపకారాగారాన్ని తనిఖీ చేసి సౌకర్యాలపై ఆరా తీశారు. ఖైదీలతో మాట్లాడారు. బెయిల్ కోసం న్యాయసహాయం అందిస్తామన్నారు. మండల న్యాయ సేవాసంస్థ అధ్యక్షురాలు హరిప్రియ, న్యాయవాదులు సింహాచలం, ఎం.వెంకటేశ్వరరావు, ఆనందరావు, సబ్‌జైలు అధికారి బి.జోగులు ఉన్నారు.

3.38 కిలోల కణితి తొలగింపు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: కొమరాడ మండలంలోని పెదఖేర్జకు చెందిన మహిళ 3 నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నారు. చాలా చోట్ల మందులు వాడినా తగ్గకపోవడంతో జిల్లా ఆసుపత్రిలో చేరారు. వైద్యులు పరిశీలించి భారీ కణితి ఉన్నట్లు గుర్తించారు. సీనియర్ స్త్రీ వైద్య నిపుణులు నాగశివజ్యోతి బృందం ఆధ్వర్యంలో వైద్యురాలు కమలకుమారి, మత్తు వైద్యుడు ధనుంజయనాయుడు, స్టాఫ్‌నర్సు రమణమూర్తి, సిబ్బంది శస్త్ర చికిత్స చేసి 3.38 కిలోల కణితి తొలగించారు. శస్త్ర చికిత్స చేసిన బృందాన్ని డీసీహెచ్ఎస్ జి.నాగభూషణరావు అభినందించారు.

కుప్పకూలిన ఐటీడీఏ భవనం

సాలూరు మండలంలోని జీగిరాం జూట్ మిల్లు ఎదురుగా ఉన్న ఐటీడీఏ శిక్షణ కేంద్రానికి చెందిన భవనం సోమవారం కూలిపోయింది. 1990లో ఈ భవనం నిర్మించారు. అప్పట్లో గిరిజన మహిళలకు కుట్టు శిక్షణకు, తర్వాత ఉపాధ్యాయుల సమావేశాలకు వినియోగించే వారు. 2019 నుంచి ఖాళీగా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కూలిపోయింది. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

ఏపీఎంగా శివున్నాయుడు

జియ్యమ్మవలస: వెలుగు ఏపీఎంగా బి.శివున్నాయుడు బాధ్యతలు స్వీకరించారు. గతంలో పార్వతీపురంలో బ్యాంకు లింకేజీ ఏపీఎంగా పని చేశారు. ఇక్కడ నుంచి త్రినాథమ్మ బదిలీపై వెళ్లారు.

నేడు శాకంబరి ఉత్సవం

పాలకొండ గ్రామీణం: కోటదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని మంగళవారం శాకంబరిగా అలంకరించి పూజలు చేస్తామని ఈవో సూర్యనారాయణ చెప్పారు.

పాడి రైతులకు రాయితీలు

కురుపాం గ్రామీణం: ప్రభుత్వం అందిస్తున్న పశు గ్రాస రాయితీలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ వైద్యురాలు కె.శైలజ సూచించారు. మండలంలోని సీతంపేటలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు 10 నుంచి 50 సెంట్లలో పశు గ్రాసం వేస్తే ప్రభుత్వం రూ.32,992 అందిస్తుందన్నారు.

అప్రమత్తత అవసరం

గరుగుబిల్లి: ప్రస్తుతం ప్రజలు జ్వరాల బారిన పడుతున్నందున సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్‌కుమార్ అన్నారు. ఉల్లిభద్ర ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు.

ఇంటింటికీ కూటమి నాయకులు

పాలకొండ: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూదేవి, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రామినాయుడు అన్నారు. అంపిలిలో ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించారు.

ప్రధాన కార్యదర్శిగా ఎంపిక

సీతంపేట: ఏపీ గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భామినికి చెందిన బి.తేజేశ్వరరావు ఎంపికయ్యారు. విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయనను ఎనుకున్నారు.

మొక్కలను సంరక్షించండి

వీరఘట్టం గ్రామీణం: రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించాలని ఏపీవో సత్యంనాయుడు అన్నారు. మండలంలోని 61 చెరువు గట్లపై నాటేందుకు 3,020 కొబ్బరి మొక్కలను ఉపాధి హామీ సిబ్బందికి అందజేశారు. జీడిమామిడి 3,808, మామిడి 748, మునగ 440 మొక్కలు రావాల్సి ఉందని తెలిపారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

ర్యాలీ ప్రారంభిస్తున్న సీపీఎం నాయకులు

బలిజిపేట, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఈనెల 9న చేపట్టనున్న సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ బలిజిపేట మండలంలో సీపీఎం, రైతు, ప్రజా సంఘాల నాయకులు సోమవారం ద్విచక్రవాహన ర్యాలీ చేపట్టారు. నాయకులు మన్మథరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ❖ పాలకొండ: ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్తు సరఫరా కొనసాగించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డి.రమణారావు, బి.మోహన్ కోరారు. పాలకొండ ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ❖ సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. విద్యాశాఖ అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. ❖ ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కార్యదర్శి బి.అప్పలనాయుడు తెలిపారు. ❖ గుమ్మలక్ష్మీపురం, కురుపాం గ్రామీణం: దేశ వ్యాప్త సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల ఎస్ఎఫ్ఐ కార్యదర్శులు ఎ.రంగారావు, బి.అనిల్ తెలిపారు. ❖ కురుపాం మండలంలో నిర్మిస్తున్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులు వేగంగా పూర్తి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జీవన్న కోరారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

బత్తిలిలో నినాదాలు చేస్తున్న నాయకులు

పార్వతీపురం గ్రామీణం, బలిజిపేట గ్రామీణం, భామిని, వీరఘట్టం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మాదిగ జాతి ఉనికి కోసం పోరాడిన నాయకుడు మందకృష్ణ మాదిగ అని మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కృష్ణపల్లిలో మందకృష్ణ చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ● భామినిలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బి.మన్మథరావు జెండా ఆవిష్కరించారు. ● వీరఘట్టం సీబీఎం చర్చి వీధిలో సంఘ నాయకులు ప్రేమభూషణరావు, రామ్‌కుమార్ తదితరులు కేకు కోశారు. ● బలిజిపేట మండలంలోని పెదపెంకిలో బాప్టిస్టు చర్చి పాస్టర్ జోసెఫ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Madhurawada Branch, Visakhapatnam**, I issue the following notice to general public. My client intends to grant loan to **Smt. CHIGURUKOTI ADI LAKSHMI** W/o Venkata Ramana by keeping the below mentioned schedule property of **Smt. CHIGURUKOTI SATYAVATHI** W/o Ch Chinna Rao as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY

Parvathipuram Manyam District, Saluru Sub-District, Saluru Mandalam, Gumadam Gram panchayat (VS No.240part) Naidu Street, Southern side of Municipal Road, old 3rd ward, new 6th ward, presently 3rd ward, Block No.1, assessment No.1092010989, old D.No. 1-3-161, New D.No.1-149/3, site measuring East to West 10.5 feet or 3.20 Meters and North to South 22 feet or 6.70 meters totaling 25.66 Sq.yards or 20.64 Sq. meters of site together with RCC ground floor with plinth area of 231 SFT and first floor ACC sheet shed with plinth area of 136.5 SFT is bounded by:

East	Joint wall between this property and property of Ch. Ganga
South	Vacant site of Chigurukoti Maha Lakshmi
West	Vacant site of Donthala Ramu
North	Naidu Veedhi Municipal Road

KODURI SREENIVASA RAO
Smt. SIVA KUMARI JALADI
Advocates
S-2, Bharat Apartments, Behind Rythu Bazar, Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam Dt.07.07.2025
Mobile No. 9885166648
Mail: sreenivaskoduri@gmail.com




పేదలది పట్టా... పెద్దలదే చిట్టా!

▶ వైకాపా హయాంలో ధనికులకే పెద్దపీట ▶ 20 వేల మందికిపైగా అనర్హుల గుర్తింపు

▶ ఒంగోలు సమీపంలోని అన్నవరప్పాడులో ఓ వ్యక్తికి మూడంతస్తుల ఇల్లు ఉంది. పైగా ఆరు వాకిళ్లు ఉండగా నాలుగు వాకిళ్లు అద్దెకు ఇచ్చారు. ఈయనకు ఇంటి పట్టా ఇచ్చారు.

▶ ఒంగోలు నగరంలోని ఓ కాలనీకి చెందిన తండ్రీకొడుకులిద్దరికి రెండు ఇళ్లు ఉన్నాయి. పీఎంఏవై కింద గతంలో ఇల్లు తీసుకున్నారు... పైగా నాలుగు చక్రాల వాహనం ఉంది. వీరికి ఇంటి పట్టా మంజూరు చేశారు.

ఒంగోలు నగర సమీపంలోని ఎన్.అగ్రహారం వద్ద ఏర్పాటు చేసిన లేఅవుట్

▶ జిల్లాలోని మొత్తం లేఅవుట్లు : 620
▶ పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులు : 84 వేలు
▶ సర్వేలో తేలిన అనర్హులు : 20 వేలు
▶ ఆచూకీ తెలియని లబ్ధిదారులు : 4 వేలు

న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

గత వైకాపా ప్రభుత్వ హయాంలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా ఇంటి పట్టాల పంపిణీ నిమిత్తం జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, ప్రభుత్వ భూములు సేకరించారు. మొత్తం 620 లేఅవుట్లు వేసి సుమారు 84 వేల మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఇవన్నీ శివారు ప్రాంతాల్లో ఉండడంతో నేటికి కొందరు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేదు. వీటిపై ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలో జిల్లావ్యాప్తంగా 20 వేల మందికిపైగా అనర్హులు ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రత్యేకించి ఒంగోలు నగరంలో సుమారు 20,800 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 2023 చివరిలో ఒంగోలు సమీపంలోని వెంగముక్కపాలెం, ఎన్.అగ్రహారం వద్ద స్థానిక రైతుల నుంచి భూములు సేకరించారు. సార్వత్రిక ఎన్నికల ముందు హడావుడిగా అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదగా పట్టాల పంపిణీ చేశారు. భూ సేకరణ పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా ఒంగోలు నగరానికి దూరంగా ఉన్న రెండు లేఅవుట్లలోనూ అప్పటి ప్రజాప్రతినిధులు, రెవెన్యూశాఖాధికారులు మాత్రం లబ్ధిదారులకు పొజిషన్ చూపలేదు. అప్పట్లోనే లబ్ధిదారుల జాబితాలో సగం మంది అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అనంతరం ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టాక లేఅవుట్లలోని అనర్హుల ఏరివేతపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టిసారించారు. గత ఆరు నెలలుగా రెవెన్యూ, విద్యుత్తుశాఖలతో పాటు నగరపాలకసంస్థ ఉద్యోగులు వారి వద్ద ఉన్న వివరాల ఆధారంగా లబ్ధిదారుల ఇళ్లకెళ్లి వారి పూర్తి వివరాలు సేకరించారు. తద్వారా అనర్హులను గుర్తించారు.

గత వైకాపా పాలనలో ఇంటి పట్టాలకు అర్హులైన వారి జాబితాను మండలాల్లో రెవెన్యూశాఖ , ఒంగోలు నగరంలో నగరపాలక సంస్థ అధికారులు తయారు చేశారు. వీటి ఆధారంగానే స్థానిక రెవెన్యూ అధికారులు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. లేఅవుట్లల్లో అప్పటి వైకాపా నాయకులు, కార్యకర్తలే రెండు, మూడు పట్టాలు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిపై విచారణకు ఆదేశించింది.

ఆరంచెల విధానంపై క్షేత్ర పరిశీలన

ఈ మేరకు గత ఆరు నెలలుగా రెవెన్యూశాఖ అధికారులు విచారణ జరిపారు. నిబంధనల ప్రకారం ఎవరికైనా ఇల్లు ఉంటేనే వారి పేరిటే విద్యుత్తు మీటరు ఇస్తారు. అప్పటికే మీటరు ఉండి ఎక్కువ మంది పట్టాలు తీసుకున్నట్లు గుర్తించారు. ఆరంచెల విధానంలో భాగంగా ఇంటి పన్ను చెల్లింపు, కారు, ఆదాయ పన్ను, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా..? తదితర వివరాలపై విచారించి అనర్హులను తేల్చారు. మరికొందరికి రెండేసి పట్టాలున్నట్లు తేల్చారు. ఒంగోలు నగరంలో ప్రత్యేక బృందాల ద్వారా ఇంటింటి సర్వే పూర్తి ద్వారా అనర్హుల జాబితా రూపొందించారు. తద్వారా 10,750 మంది లబ్ధిదారులను అనర్హులుగా గుర్తించారు. వీరి పటాల రద్దుకు రెవెన్యూశాఖ అధికారులు సిఫార్సు చేయనున్నట్లు సమాచారం. మరో మూడు వారాల్లో జిల్లా అంతటా సర్వే పూర్తి కానుండగా; పూర్తిస్థాయి అనర్హుల లెక్క తేలనుంది.

ఈనాడు... కనిగిరికి తోడు!

▶ ఒక్కరోజులోనే రూ.5 లక్షల విలువైన పనులు
▶ ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డితో ఉదయపు నడక

కనిగిరి పట్టణంలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డితో నిర్వహించిన ఉదయపు నడక కార్యక్రమంలో ఒకే రోజు రూ.5 లక్షల విలువైన పనులు చేపట్టారు. పురపాలక సంఘం పరిధిలోని మాచవరం, బీసీ, ఎస్సీ కాలనీల్లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే పలు సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో 50 వీధి దీపాలు అమర్చారు. రహదారులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాల్లోని ముళ్లచెట్లను జేసీబీలతో తొలగించారు. నీళ్ల ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించారు. దీంతో పాటు ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.65 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. ఎమ్మెల్యే స్వయంగా జేసీబీ నడిపి జంగిల్ క్లియరెన్స్ చేశారు. రూ.లక్షల విలువ చేసే ప్రజోపయోగ పనులు చేసేవిధంగా ప్రోత్సహించిన 'ఈనాడు'కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. -న్యూస్‌టుడే, కనిగిరి

జేసీబీతో ముళ్ల కంపలు తొలగిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

అధికార యంత్రాంగంతో కలిసి ఉదయపు నడక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

భక్తిశ్రద్ధలతో మొహర్రం!

జిల్లావ్యాప్తంగా సోమవారం మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పొదిలి పట్టణంలో పీర్లను ఘనంగా ఊరేగించారు. వీటిని పెద్దగం ఇల్లో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గత పది రోజులుగా ప్రారంభమైన పండగ పీర్ల బావికి చేరడంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. -న్యూస్‌టుడే, పొదిలి

చిక్కీలు చిక్కేనా?

▶ ఈ నెలలో సరఫరా కాక విద్యార్థుల ఎదురుచూపులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహారంలో భాగంగా పంపిణీ చేయాల్సిన చిక్కీలు ఈ నెలలో అందకపోవడంతో విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు గల విద్యార్థులకు ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ప్రతి విద్యార్థికి వారానికి మూడు చొప్పున ప్రతి పదిహేను రోజులకోసారి పాఠశాలలవారీగా లెక్కించి సరఫరా చేస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ప్రస్తుత నెలకు సంబంధించి ఇప్పటివరకు చిక్కీలు సరఫరా కాలేదు. దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాల విద్యార్థులకు దొనకొండకు చెందిన వారు నెలకు రెండు పర్యాయాలు చిక్కీలు సరఫరా చేస్తారు. ప్రస్తుత నెలకు సంబంధించిన సరఫరా కాకపోవడంతో వారం రోజులుగా చిన్నారులకు చిక్కీల సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, సరఫరా ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడామని, ఒకట్రెండు రోజుల్లో అన్ని పాఠశాలల విద్యార్థులకు అందజేస్తామన్నారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

పండగ వాతావరణంలో తల్లిదండ్రుల సమావేశాలు: కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ నెల 10న పండగ వాతావరణంలో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంఈవోలతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి పాఠశాల విద్య, సమగ్ర శిక్ష భాగస్వామ్యంతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 2,955 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 188 జూనియర్ కళాశాలల్లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు గల ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో డీఈవో కిరణ్‌కుమార్, ఆర్ఐవో సైమన్ విక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి ఎన్.లక్ష్మానాయక్, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూ బకాసురులకు అధికారుల హెచ్చరిక

ఈనాడు కథనానికి స్పందన

మార్కాపురం: ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులను ఎవరైనా ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దారు కె.చిరంజీవి హెచ్చరించారు. చింతకుంట గ్రామంలో సర్వే నంబరు 71లో 2.98 ఎకరాల విస్తీర్ణం గల కాసరికుంటను ఆక్రమించి పంటలు సాగు చేస్తున్న విషయమై 7వ తేదీన 'కుంటను మింగిన ఘనులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, మార్కాపురం ఉప కలెక్టర్ బి.సహదిత్ వెంకట త్రివినాగ్ స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు తహసీల్దారు కె.చిరంజీవితో పాటు ఇతర అధికారులు సోమవారం చింతకుంట గ్రామానికి చేరుకుని ఆక్రమణకు గురైన కాసరి కుంటను పరిశీలించారు. కుంటను పూర్తిగా సర్వే చేయించి హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. అనంతరం జేసీబీ యంత్రంతో కుంట చుట్టూ లోతుగా కాలువను తీయించారు. అనంతరం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

కాసరి కుంట చుట్టూ కాలువ తీయిస్తున్న తహసీల్దారు చిరంజీవి, అధికారులు

రూపురేఖలు కోల్పోయిన త్రోవగుంట మేజరు కాలువ

పారని నీళ్లు... ఆరని కన్నీళ్లు!

▶ మరమ్మతులకు నోచుకోని సాగర్ కాలువలు

న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

ఒంగోలు బ్రాంచ్ కెనాల్ (ఓబీసీ) పరిధిలోని సాగర్ కాలువలకు మరమ్మతుల ఊసేలేదు. కాలువ నీరు ప్రవహించే లోతట్టు ప్రాంతమంతా చిల్లచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పూడికతీత పనులు, కాలువ గట్లు బలంగా లేకపోవడంతో నీరు వృథా అవుతోంది. సమస్యను పలుమార్లు విన్నవించినా నిధుల్లేకపోవడంతో అధికారులు పట్టించుకోవడంలేదు.

▶ సాగర్ నీరు విడుదల సమయంలో ఒంగోలు బ్రాంచ్ కెనాల్ ద్వారా తొలుత చీమకుర్తిలోని రామతీర్థం రిజర్వాయరును నింపుతారు. అనంతరం ఒంగోలు నగరంలోని రెండు వేసవి జలాశయాలు, ఒంగోలు, కొత్తపట్నం, సంతనూతలపాడు, మద్దిపాడు, టంగుటూరు మండలాల్లోని సాగు, తాగు నీటి చెరువులను నింపుతారు. ఓబీసీ నుంచి దిగువ ప్రాంతమైన ఆయా మండలాల్లోని గ్రామాలకు నీరు ప్రవహించేందుకు వీలుగా ఈతముక్కల, కొప్పోలు, త్రోవగుంట మేజర్, అల్లూరు మైనర్ కాలువలున్నాయి. ఈతముక్కల కాలువ ద్వారా వల్లూరు సాగు నీటి చెరువు తోపాటు మంగళాద్రిపురం, కందులూరు, మల్లవరప్పాడు, సూరారెడ్డిపాలెం చెరువులు నింపుతారు. అల్లూరు కాలువ ద్వారా అల్లూరు, పెళ్లూరు చెరువు, కొప్పోలు కాలువ ద్వారా ఒంగోలు వేసవి జలాశయం, కొప్పోలు చెరువులకు నీటిని మళ్లిస్తారు. త్రోవగుంట కాలువ ద్వారా సంతనూతలపాడు మండలం మైనంపాడు, ఎర్రగుడిపాడు, మద్దిపాడు మండలం లింగం గుంట, ఒంగోలు మండలం మండువవారిపాలెం, ముక్తినూతలపాడు, దశరాజుపల్లె లోని చెరువులను నింపుతారు. ఇంతటి ప్రాధాన్యం గల కాలువలకు గత ఆరేళ్లుగా పట్టించుకోలేదు. వీటి నిర్వహణకు అధికారులు ప్రతిపాదనలు తయారుచేసినా కాగితాలకే పరిమితం కావడం గమనార్హం.

వీరయ్య హత్య కేసులో కదలిక!

▶ 10న విచారణకు హాజరు కావాలని ముప్పా సురేష్ భార్యకు నోటీసులు

న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం

తెదేపా నేత, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో కీలక నిందితుడు ముప్పా సురేష్ భార్య అనితకు పోలీసులు నోటీసులు అందజేశారు. ఈ నెల 10వ తేదీన ఒంగోలులోని డీఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే.. నాగులుప్పల పాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరికి హైదరాబాద్‌లో నివాసం ఉండే అదే గ్రామవాసి ముప్పా సురేష్‌తో పాటు వీరగంధం దేవేంద్రనాథ్ చౌదరిలతో రాజకీయ విభేధాలున్నాయి. ఈ నేపథ్యంలో ఒంగోలు నగరంలోని సాంబశివ నగర్‌లోని తన కార్యాలయంలో వీరయ్య చౌదరి ఏప్రిల్ 24వ తేదీన దారుణ హత్యకు గురయ్యారు. సురేష్ సహకారంతో ఒంగోలుకు చెందిన బోరుగుంట్ల వినోద్‌కుమార్ కిరాయి హంతకులతో అత్యంత కిరాతకంగా అంతమొందించారు. కేసులో సురేష్ మేనమామ ఆళ్ల సాంబశివరావు అలియాస్ సిద్ధాంతి, దేవేంద్రనాథ్‌చౌదరి సహా మొత్తం తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేశారు. కీలక నిందితుడు ముప్పా సురేష్ మాత్రం హత్య జరిగిన నాటి నుంచి అజ్ఞాతంలోనే ఉన్నాడు. ఆఫ్రికాలో బంగారు గనులు నిర్వహించే సురేష్‌కు దిల్లీ, హైదరాబాద్ స్థాయిలో బ్యూరోక్రాట్లతో సంబంధాలుండటంతో అతను పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్నాడనే ప్రచారం నడుస్తోంది. పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి తీవ్రంగా గాలించినా ఫలితం లేకపోయింది.

హత్య జరిగిన ప్రాంతంలో స్థానికులను విచారిస్తున్న ఎస్పీ దామోదర్ (పాత చిత్రం)

సురేష్ ఇంట్లోనే పథక రచన

ఒంగోలు జిల్లా కారాగారాంలో రిమాండులో ఉన్న నిందితులను పోలీసులు రెండు సార్లు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. తొలుత గ్రామకక్షల నేపథ్యంలో సురేష్ మేనమామ ఆళ్ల సాంబశివరావు కీలక నిందితుడిగా ప్రకటించారు. జైల్లో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం కీలక విషయాలు వెలుగు చూశాయి. ఆళ్ల సాంబశివరావు, బోరుగుంట్ల వినోద్‌కుమార్‌లు హత్యకు కొన్నినెలల ముందుగా హైదరాబాద్ వెళ్లి సురేష్ ఇంట్లో సమావేశమయ్యారు. ఆ సమయంలో సురేష్ భార్య అనిత అక్కడే ఉన్నారు. అందరి సమక్షంలోనే వీరయ్యచౌదరి హత్యకు కుట్ర చేసినట్లు నిందితులు వెల్లడించారు. హత్యలో అనిత పాత్ర కూడా ఉందని తేల్చి నోటీసులిచ్చారు.

పోలీసులకు బెదిరింపులు

కేసులో విచారణకు హాజరు కావాలని అనితకు పోలీసులు నోటీసులివ్వగా, ఆమె వారిపై పెద్దపెద్దగా కేకలేస్తూ హడావుడి చేసినట్లు సమాచారం. తనకేమీ తెలియదని, కేసులో అన్యాయంగా ఇరికించి వేధిస్తున్నారని దూషిస్తూ, తన సెల్‌ఫోన్‌ను విసిరికొట్టి పోలీసులను బెదిరించే విధంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 10న ఆమె ఒంగోలు వచ్చి పోలీసు విచారణకు హాజరవుతారా., ఇన్నేళ్లుగా అజ్ఞాతంలో ఉన్న ముప్పా సురేష్ ఇప్పుడైనా బయటకొస్తాడా? అనే చర్చ నడుస్తోంది.

సీసాలు వేలాడతీయగ!

వెలిగొండ జలాశయం ముంపు గ్రామమైన పెద్దారవీడు మండలం కలనూతలలో విద్యుత్తు తీగలకు ఇలా ప్రమాదకరంగా నీళ్ల సీసాలు వేలాడదీశారు. ఈదురు గాలులకు తీగలు తెగిపోకుండా గ్రామస్థులు ఇలా సీసాల్లో నీళ్లు నింపి వేలాడదీశారు. మరికొందరు విద్యుత్తు తీగలకు తాళ్లతో రాళ్లను కట్టుకున్నారు. విద్యుత్తుశాఖాధికారులు స్తంభాలకు విద్యుత్తు తీగలను పటిష్ఠంగా బిగించాల్సి ఉండగా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్తు తీగలను సరి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పెద్దారవీడు

మంత్రి స్వామికి హైకోర్టులో ఊరట

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి హైకోర్టులో ఊరట లభించింది. 2021లో అప్పటి సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం వ్యవహారంలో సింగరాయకొండ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా దిగువ కోర్టులో నడుస్తున్న విచారణపై తదుపరి చర్యలన్నింటినీ 8 వారాలు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సోమవారం ఆదేశాలు జారీచేశారు. ఫిర్యాదిదారు, సింగరాయకొండ అప్పటి ఆర్ఐ సుజాతకు నోటీసులు జారీచేశారు. దిష్టిబొమ్మ దహనం కేసులో పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా దాఖలు చేసిన అభియోగపత్రాన్ని కొట్టేయాలని కోరుతూ మంత్రి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరపున న్యాయవాది నల్లూరి మాధవరావు వాదనలు వినిపించారు. కేసు విషయమై కందుకూరు అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ కోర్టులో జరుగుతున్న విచారణపై స్టే విధించాలని కోరారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవన్నారు. ఏపీపీ నీలోత్పల్ వాదనలు వినిపిస్తూ కేసులో 48 మంది నిందితులున్నారని, అభియోగపత్రం దాఖలు చేసినట్లు తెలిపారు.

2,020 పొగాకు బేళ్ల తిరస్కరణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని రెండు రీజియన్ల పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో సోమవారం 2,020 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. ఎస్‌బీఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు 5,353 బేళ్లు రాగా, 1,148, ఎస్ఎల్ఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు 4,498 బేళ్లు రాగా 872 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ.150 చొప్పున పలికింది.

B.Tech., and Ag.B.Sc.,
SPOT ADMISSION
కేవలం 6,7,8,9,10 లక్షల ఖర్చుతో నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ / అగ్రికల్చర్ బీఎస్సీ (కాలేజ్ ఫీజు + హాస్టల్ ఫీజుతో కలిపి) ఎటువంటి షూరిటీ లేకుండా విద్యార్థికి 70 నుంచి 80% లోన్ సౌకర్యం కల్పించబడును. వివరాలకు సంప్రదించండి :
9502555500, 9160220527

డీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: డైట్‌లో ప్రవేశాలకు నిర్వహించిన డీసెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఆది, సోమవారాల్లో మొదటి విడత కౌన్సెలింగ్‌కు జాబితా సిద్ధం చేశారు. మంగళవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. 13 నుంచి 16వ తేదీల మధ్య సీట్ల కేటాయింపు, 17 నుంచి 22వ తేదీల మధ్య ధ్రువపత్రాల పరిశీలన చేపట్టి ప్రవేశ పత్రాలు అందజేస్తారు. ఈనెల 25వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ర్యాంకులు సాధించిన వారు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని డైట్ ప్రిన్సిపల్ సామా సుబ్బారావు తెలిపారు.

పండ్ల మొక్కల పండగ!

▶ నేడు జిల్లా వ్యాప్తంగా 750 ఎకరాల్లో నాటింపు
▶ పాల్గొననున్న ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం

వ్యవసాయ పంటలతో పోలిస్తే ఉద్యాన పంటలతో రైతులకు అధిక ఆదాయం సమకూరుతోంది. దీనిని గుర్తించిన ఎన్డీయే ప్రభుత్వం పండ్ల మొక్కల పంపిణీతో పాటు మూడేళ్ల పాటు నిర్వహణ, సాగునీటి సరఫరా, మందులు, ఎరువులకు అయ్యే మొత్తాన్ని సైతం అందజేస్తోంది. సాగు ఖర్చుల్లో వంద శాతం మొత్తాన్ని ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం కింద అందించనుంది. చిన్న, సన్నకారు రైతుల పొలాలతోపాటు మెట్ట, బీడు భూములను సాగులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. -న్యూస్‌టుడే, కలెక్టరేట్

పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించనున్న గ్రామాలు

గ్రామం	నియోజకవర్గం	ఎమ్మెల్యే/ఇన్‌ఛార్జి
కొత్తకోట	గిద్దలూరు	ముత్తుముల అశోక్‌రెడ్డి
పోలవరం	కనిగిరి	ముక్కు ఉగ్రనరసింహారెడ్డి
పిడికిటివారిపాలెం	వైపాలెం	గూడూరి ఎరిక్షన్‌బాబు
నాగన్నపాలెం	ఎస్ఎన్‌పాడు	బీఎన్.విజయ్‌కుమార్
మల్లంపేట	దర్శి	గొట్టిపాటి లక్ష్మి
గవండ్లపాలెం	ఒంగోలు	దామచర్ల జనార్దన్
గజ్జలకొండ	మార్కాపురం	కందుల నారాయణరెడ్డి

తానంచింతలలో సిద్ధం చేసిన మొక్కలు

▶ వర్షాకాలం దృష్ట్యా రైతువారీ భూముల్లో రాష్ట్ర వ్యాప్తంగా పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 6,500 ఎకరాల విస్తీర్ణంలో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మంగళవారం బృహత్తర కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు 25 వేల ఎకరాల్లో మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, జిల్లాలో 750 ఎకరాల్లో పలు రకాల పండ్ల మొక్కల పెంపకం చేపట్టనున్నారు. ఇప్పటికే పొలాల్లో గుంతలు తీసి సిద్ధం చేశారు. నర్సరీల నుంచి పండ్ల మొక్కలు తరలించారు.

▶ డ్వామా, ఉద్యానశాఖ భాగస్వామ్యంతో పండ్ల తోటల సాగుకు శ్రీకారం చుట్టారు. ఒకేరోజు పెద్దసంఖ్యలో మొక్కలు నాటేందుకు సమాయత్తమయ్యారు. జిల్లాలోని ప్రతి మండలంలో కనీసం 150 నుంచి 200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్దేశించారు. మామిడి, బత్తాయి, తైవాన్ జామ, నేరేడు, ఆపిల్ బేర్, చింత, అంజూర, డ్రాగన్ ఫ్రూట్, మునగ, గులాబీ, మల్లె, జామ, దానిమ్మ, కొబ్బరి, సీతాఫలం, సపోటా, నిమ్మ తదితర పంటల సాగుకు ఆర్థిక సాయం అందించనున్నారు. తైవాన్ జామకు గరిష్ఠంగా రూ.2.25 లక్షలు, కనిష్ఠంగా సపోటా రూ.89.04 వేల వరకు అందనుంది. ప్రారంభ కార్యక్రమానికి జిల్లాలోని కొండపి నియోజకవర్గం మినహా మిగతా నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, తెదేపా ఇన్‌ఛార్జులు హాజరు కానున్నారు.

స్టార్ హాస్పిటల్స్ వైద్యనిపుణులను ఇప్పుడు స్టార్ ఇన్ఫర్మేషన్ సెంటర్ & సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్, ఒంగోలులో సంప్రదించగలరు
STAR HOSPITALS Expertise • Excellence • Empathy Hyderabad
మీరు ఈ క్రింది సమస్యలతో బాధపడుతున్నారా?
• జాయింట్ పెయిన్స్ (తుంటి, మోకాలు, భుజాలు, చిలమండ)
• అన్ని లిగమెంట్ టియర్స్ సహా స్పోర్ట్స్ గాయాలు
• నాన్ హీలింగ్ ఫ్రాక్చర్స్
డా. ప్రవీణ్ మేరెడ్డి
సీనియర్ కన్సల్టెంట్-ఆర్థోపెడిక్ సర్జన్
మీరు ఈ క్రింది సమస్యలతో బాధపడుతున్నారా?
• ఛాతి నొప్పి
• తిమ్మిరి
• శ్వాస ఆడకపోవుట
• మూర్ఛ
• రాత్రిపూట దగ్గు
• స్పృహ కోల్పోవడం
• గుండె దడ
• కాళ్ళ వాపు
డా. శ్రీకాంత్ ఎర్రం
కన్సల్టెంట్- ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ
09 జులై 2025
(ప్రతి నెల 2వ బుధవారం అందుబాటులో కలరు)
ఉ॥ 11:00 - సా॥ 05:00
స్టార్ ఇన్ఫర్మేషన్ సెంటర్ & సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్
వేమూరి మెడికల్స్ వెనుక, సుందరయ్య భవన్ రోడ్, ఒంగోలు
అపాయింట్‌మెంట్స్ కొరకు, కాల్ చేయండి:
9063 443 707 | 9849 133 956
స్టార్ హాస్పిటల్స్ నానక్‌రామ్‌గూడ । బంజారాహిల్స్

(c) eenadu

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1అంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీ వెంకటేశ్వర్లు పరుచూరి, తండ్రి: దివనగాయ్య, డి.నెం. 2-37, వెస్ట్ గంగవరం, కురిచేడు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523304 (ఋణగ్రహీత).
2. శ్రీ పరుకూటి నాగయ్య, తండ్రి: కోటయ్య, వెస్ట్ గంగవరం, కురిచేడు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523304 (హామీదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, కురిచేడు బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది

ఋణగ్రహీత: శ్రీ వెంకటేశ్వర్లు పరుచూరి, తండ్రి: దివనగాయ్య మరియు హామీదారు: శ్రీ పరుకూటి నాగయ్య, తండ్రి: కోటయ్య వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ. 6,08,709.03/-** (అక్షరాల ఆరు లక్షల ఎనిమిది వేల ఏడు వందల తొమ్మిది రూపాయలు మరియు మూడు పైసలు మాత్రమే) మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద **14.07.2022** తేదీన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది. **13.10.2022** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును సాక్షి (తెలుగు) & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో **19.10.2022** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **31.03.2022** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 6,08,709.03/-** (అక్షరాల ఆరు లక్షల ఎనిమిది వేల ఏడు వందల తొమ్మిది రూపాయలు మరియు మూడు పైసలు మాత్రమే) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

ప్రకాశం జిల్లా, మార్కాపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, దర్శి సబ్ జిల్లా, కురిచేడు మండలం, వెస్ట్ గంగవరం గ్రామ పంచాయతీ, ఎస్.నెం. 331, పాత డోర్ నెం.2-37, క్రొత్త డోర్ నెం.1-49 లోని 168 చదరపు గజాల విస్తీర్ణం గల భూమి మరియు అందులోనున్న బిల్డింగ్. హద్దులు: తూర్పు: [illegible], దక్షిణం: [illegible], పడమర: [illegible], ఉత్తరం: [illegible].
టైటిల్ హోల్డర్: శ్రీ వెంకటేశ్వర్లు పరుచూరి, తండ్రి: దివనగాయ్య.

తేది: 03.07.2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1అంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీమతి షేక్ ఫాతిమా, భర్త: షేక్ బాషా లేట్, డి.నెం. 10/709Z-22-D, నాగులవరం రోడ్డు, మార్కాపూర్ టౌన్, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523316 (ఋణగ్రహీత).
2. శ్రీ షేక్ షఫీవుల్లా అలియాస్ షఫీ, తండ్రి: అస్గర్ బాషా, డి.నెం. 10/709Z-22-D, నాగులవరం రోడ్డు, మార్కాపూర్ టౌన్, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523316 (హామీదారు).
3. శ్రీ పఠాన్ మెహబూబ్ ఖాన్, తండ్రి: గఫూర్ ఖాన్, డి.నెం. 10-103-A-3, [illegible], మార్కాపూర్, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523316 (హామీదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, మార్కాపూర్ బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది

ఋణగ్రహీత: శ్రీమతి షేక్ ఫాతిమా, భర్త: షేక్ బాషా లేట్ మరియు హామీదారులు: శ్రీ షేక్ షఫీవుల్లా అలియాస్ షఫీ, తండ్రి: అస్గర్ బాషా & శ్రీ పఠాన్ మెహబూబ్ ఖాన్, తండ్రి: గఫూర్ ఖాన్ వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ. 1,56,291/-** (అక్షరాల ఒక లక్ష యాభై ఆరు వేల రెండు వందల తొంభై ఒక్క రూపాయలు మాత్రమే) మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద **26.11.2024** తేదీన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది. **06.03.2025** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును సాక్షి & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తాపత్రికలలో **11.03.2025** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **31.10.2024** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 1,56,291/-** (అక్షరాల ఒక లక్ష యాభై ఆరు వేల రెండు వందల తొంభై ఒక్క రూపాయలు మాత్రమే) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

ప్రకాశం జిల్లా, మార్కాపూర్ ఆర్.ఓ., మార్కాపూర్ టౌన్, డి.నెం.10-709Z-22-D, సర్వే నెం.323 లోని 117 చ.గజాలు లేదా 98.28 చ.మీ. [illegible]. తేది 02.06.2011, డాక్యుమెంట్ నెం.4368/2011 [illegible].
టైటిల్ హోల్డర్: శ్రీమతి షేక్ ఫాతిమా, భర్త: షేక్ బాషా లేట్ [illegible].

తేది: 03.07.2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1అంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. M/s ఆర్ కె పేపర్ ప్లేట్స్ & క్లీన్స్, ప్రొప్రయిటర్: శ్రీమతి అమ్మినేటి రజని కుమారి, [illegible] - 523261 (ఋణగ్రహీత).
2. శ్రీమతి అమ్మినేటి రజని కుమారి, భర్త: సిహెచ్. కోటయ్య, [illegible], ప్రకాశం జిల్లా - 523211 (హామీదారు).
3. [illegible] (హామీదారు/తనఖాదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, [illegible] బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది

ఋణగ్రహీత: M/s ఆర్ కె పేపర్ ప్లేట్స్ & క్లీన్స్, ప్రొప్రయిటర్: శ్రీమతి అమ్మినేటి రజని కుమారి [illegible] వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ. 14,58,696/-** (అక్షరాల పద్నాలుగు లక్షల యాభై ఎనిమిది వేల ఆరు వందల తొంభై ఆరు రూపాయలు మాత్రమే) మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద **02.04.2024** తేదీన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది. **30.08.2024** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును సాక్షి (తెలుగు) & ది హిందూ (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో **04.09.2024** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **16.03.2024** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 14,58,696/-** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

ప్రకాశం జిల్లా, మార్కాపూర్ [illegible], సర్వే నెం. 129/1, 129/1A, 129/1B, 129/1D [illegible] 385.77 [illegible].
టైటిల్ హోల్డర్: శ్రీమతి అమ్మినేటి రజని కుమారి, భర్త: సిహెచ్. కోటయ్య.

తేది: 03.07.2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

తండ్రిపై దాడి చేసిన తనయుడికి రిమాండు

టంగుటూరు, న్యూస్‌టుడే: తండ్రిపై దాడిచేసిన తనయుడిని న్యాయస్థానంలో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరు మండలం ఆలకూరపాడుకు చెందిన దివి చందు వ్యసనాలకు బానిసై తండ్రి వెంకటరావును డబ్బు ఇవ్వాలని వేధిస్తుండేవాడు. దీంతో విసిగిపోయిన తల్లిదండ్రులు అతనికి దూరంగా శివారులోని బంధువుల వద్ద ఉంటున్నారు. ఈ నెల 3న పింఛను తీసుకునేందుకు తండ్రి గ్రామంలోకి రాగా నగదు ఇవ్వాలని చందు గొడవ పడి..కర్రతో దాడి చేశాడు. దీంతో గాయపడిన వెంకటరావును ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి సింగరాయకొండ న్యాయస్థానంలో హాజరుపర్చగా..14 రోజుల రిమాండ్ విధించారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1అంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీమతి బొగ్గుల మాధవి, భర్త : బొగ్గుల రామస్వామి, డి నెం.10-58, సంగు వారి వీధి, దర్శి గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523247 (ఋణగ్రహీత)
2. శ్రీమతి మాతం సుజాత, భర్త: వెంకట శివకుమార్, పుచ్చలమెట్ల గ్రామం, అద్దంకి రోడ్డు, దర్శి మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523247 (హామీదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, మార్టెల్ల బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది

ఋణగ్రహీత : శ్రీమతి బొగ్గుల మాధవి, భర్త : బొగ్గుల రామస్వామి మరియు హామీదారు/లు: శ్రీమతి మాతం సుజాత, భర్త: వెంకట శివకుమార్ వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ.2,63,535/-** (అక్షరాల రెండు లక్షల అరవై మూడు వేల ఐదు వందల ముప్పై ఐదు **రూపాయలు మాత్రమే**) మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2)** క్రింద **07.04.2025** తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది.16.06.2025** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును సాక్షి & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తాపత్రికలలో **20.06.2025** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **02.04.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.2,63,535/- (అక్షరాల రెండు లక్షల అరవై మూడు వేల ఐదు వందల ముప్పై ఐదు రూపాయలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

ప్రకాశం జిల్లా, మార్కాపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, దర్శి సబ్-జిల్లా, దర్శి మండలం, దర్శి గ్రామ పంచాయతీ ఏరియా, దర్శి గ్రామం, సమీప ఇంటి డోర్ నెం. 14-399, సర్వే నెం. 65/1ఎ లో 128.12 చ॥గ॥ల ఖాళీ స్థలం మరియు అందులో కొత్తగా నిర్మించిన ఆర్.సి.సి స్లాబ్ బిల్డింగ్. హద్దులు: **ఉత్తరం:** వెన్నపూస నాగిరెడ్డి యొక్క స్థలం, **దక్షిణం:** వెన్నపూస నాగిరెడ్డి యొక్క స్థలం, **తూర్పు:** రోడ్డు, **పడమర:** రోడ్డు. ఈ హద్దులలో 128.12 చ॥గ॥ల ఖాళీ స్థలం మరియు అందులో నిర్మాణపు ఏరియా 749 చ॥అ॥ల కొత్తగా నిర్మించిన ఆర్.సి.సి. స్లాబ్ బిల్డింగ్, తలుపులు, డోర్ ఫ్రేమ్స్, కిటికీలు, ఉడ్ ఆర్టికల్స్, కరెంట్ మీటర్ నెం. 11019 అన్ని హక్కులతో. **(దర్శి యస్.ఆర్.ఒ., రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4199/2014, తేది 14.11.2014)**
టైటిల్ హోల్డర్: శ్రీమతి బొగ్గుల మాధవి, భర్త: బొగ్గుల రామస్వామి.

తేది: 07.07.2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1అంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీ మల్లెల కోటయ్య, తండ్రి: పెద్ద నరసయ్య, వెస్ట్ వీరయ్యపాలెం, కురిచేడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523304 (ఋణగ్రహీత).
2. శ్రీ వరికూటి రాజులయ్య, తండ్రి: కోటయ్య, వెస్ట్ గంగవరం, కురిచేడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523304 (హామీదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, కురిచేడు బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది

ఋణగ్రహీత: శ్రీ మల్లెల కోటయ్య, తండ్రి: పెద్ద నరసయ్య మరియు హామీదారు: శ్రీ వరికూటి రాజులయ్య, తండ్రి: కోటయ్య వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ.5,97,298.11/- (అక్షరాల ఐదు లక్షల తొంభై ఏడు వేల రెండు వందల తొంభై ఎనిమిది రూపాయలు మరియు పదకొండు పైసలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2)** క్రింద **12.04.2023 తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది. 06.07.2023** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక **స్వాధీనం** తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **సాక్షి (తెలుగు) & ది హిందూ (ఇంగ్లీష్)** వార్తాపత్రికలలో **11.07.2023** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **31.03.2023** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.5,97,298.11/- (అక్షరాల ఐదు లక్షల తొంభై ఏడు వేల రెండు వందల తొంభై ఎనిమిది రూపాయలు మరియు పదకొండు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

ప్రకాశం జిల్లా, మార్కాపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, దర్శి సబ్ జిల్లా, కురిచేడు మండలం, పడమర వీరాయపాలెం గ్రామ పంచాయతీ, హెచ్.నెం.2-115, అసెస్‌మెంట్ నెం.186, తూర్పు నుండి పడమర వరకు 33 అ॥లు, ఉత్తరం నుండి దక్షిణం వరకు 22 అ॥ల నిర్మాణ ప్రాంతం, 242 చ॥గ॥ల విస్తీర్ణంలో రెసిడెన్షియల్ స్థలం మరియు బిల్డింగ్ యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు:** పూళ్ల కోటేశ్వరరావు యొక్క ఆస్తి, **దక్షిణం:** మేకల గాలయ్య యొక్క ఆస్తి, **పడమర:** కాను గురవయ్య యొక్క ఆస్తి, **ఉత్తరం:** దరఖాస్తుదారునికి చెందిన ఇంటి స్థలం మరియు స్వంత దారి.
టైటిల్ హోల్డర్: శ్రీ మల్లెల కోటయ్య, తండ్రి: పెద్ద నరసయ్య.

తేది: 03.07.2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1అంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీమతి కంభంపాటి రాణి, భర్త : లేటు శ్రీ కంభంపాటి నాగేశ్వర్ రావు (మరణించిన ఋణగ్రహీత యొక్క చట్టపరమైన వారసులు), హెచ్ నెం.1-30-196, SC కాలనీ, కురిచేడు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523304
2. శ్రీమతి కంభంపాటి నాగమణి, భర్త: లేటు శ్రీ దేవిడ్ కంభంపాటి (మరణించిన హామీదారు యొక్క చట్టపరమైన వారసులు), హెచ్ నెం.5-139/1, SC కాలనీ, కురిచేడు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523304.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, కురిచేడు బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది

శ్రీమతి కంభంపాటి రాణి, భర్త: లేటు శ్రీ కంభంపాటి నాగేశ్వరరావు, (మరణించిన ఋణగ్రహీత శ్రీ కంభంపాటి నాగేశ్వరరావు, తండ్రి: శ్రీ నాగయ్య యొక్క చట్టపరమైన వారసులు) మరియు శ్రీమతి కంభంపాటి నాగమణి, భర్త: లేటు శ్రీ కంభంపాటి దేవిడ్ (మరణించిన హామీదారు శ్రీ కంభంపాటి దేవిడ్, తండ్రి: శ్రీ నాగయ్య యొక్క చట్టపరమైన వారసుడు) వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ.6,32,754.51/- (అక్షరాల ఆరు లక్షల ముప్పై రెండు వేల ఏడు వందల యాభై నాలుగు రూపాయలు మరియు యాభై ఒక్క పైసలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 08.03.2023 తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది. 06.07.2023** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **సాక్షి (తెలుగు) & ది హిందూ (ఇంగ్లీష్)** వార్తాపత్రికలలో **11.07.2023** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **28.02.2023** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.6,32,754.51/- (అక్షరాల ఆరు లక్షల ముప్పై రెండు వేల ఏడు వందల యాభై నాలుగు రూపాయలు మరియు యాభై ఒక్క పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

ప్రకాశం జిల్లా, మార్కాపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, దర్శి సబ్ జిల్లా, కురిచేడు మండలం, గ్రామ పంచాయతీ, డి.నెం. 5-113 తో సర్వే నెం.178/2 లో 76 చ॥గ॥ల విస్తీర్ణంలో భూమి & బిల్డింగ్ మరియు యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు:** లెక్కపోగు జాన్ యొక్క స్థలం, **దక్షిణం:** ప్రవేశం మరియు నిష్క్రమణ బజార్, **పడమర:** కోల రత్నం యొక్క ఇల్లు, **ఉత్తరం:** కంభంపాటి జాన్ యొక్క స్థలం.
టైటిల్ హోల్డర్: శ్రీ కంభంపాటి నాగేశ్వరరావు, తండ్రి: శ్రీ నాగయ్య.

తేది: 03.07.2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1అంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీ దాసరి సుబ్బారావు, తండ్రి: చిన్నగాలయ్య, డి.నెం. 2-114-ఎ, వెస్ట్ గంగవరం గ్రామం, కురిచేడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523304 (ఋణగ్రహీత).
2. శ్రీ పసుపులేటి వెంకటేశ్వర్లు, తండ్రి: వెంకటయ్య, వెస్ట్ గంగవరం గ్రామం, కురిచేడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523304 (హామీదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, కురిచేడు బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది

ఋణగ్రహీత: శ్రీ దాసరి సుబ్బారావు, తండ్రి: చిన్నగాలయ్య మరియు శ్రీ పసుపులేటి వెంకటేశ్వర్లు, తండ్రి: వెంకటయ్య వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ. 6,50,400.65 (అక్షరాల ఆరు లక్షల యాభై వేల నాలుగు వందలు మరియు అరవై ఐదు పైసలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2)** క్రింద **14.07.2022 తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి తేది. **13.10.2022** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **సాక్షి (తెలుగు) & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్)** వార్తాపత్రికలలో **19.10.2022** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **23.06.2022** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.6,50,400.65 (అక్షరాల ఆరు లక్షల యాభై వేల నాలుగు వందలు రూపాయల అరవై ఐదు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

ప్రకాశం జిల్లా, మార్కాపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, దర్శి సబ్ జిల్లా, కురిచేడు మండలం, వెస్ట్ గంగవరం గ్రామ పంచాయితీ, ఎస్. నెం.331, ఇంటి నెం. 4-2-114/ఎ కలిగిన **90 చ॥గ॥ విస్తీర్ణం భూమి మరియు అందులోనున్న బిల్డింగ్ యావత్తు. హద్దులు: తూర్పు:** యర్రబాలెం వెళ్లే రహదారి, **దక్షిణం:** వరికూటి బుజ్జయ్యకు చెందిన ఇల్లు, **పడమర:** దగ్గుబాటి బాల రాములమ్మకు చెందిన ఇల్లు, **ఉత్తరం:** వరికూటి రాజులయ్యకు చెందిన ఇల్లు. **టైటిల్ హోల్డర్:** శ్రీ దాసరి సుబ్బారావు, తండ్రి: చిన్న గాలయ్య.

తేది: 03.07.2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1అంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీ అన్నెం అంజి రెడ్డి, తండ్రి: రామిరెడ్డి, పడమర గంగవరం, కురిచేడు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523304 (ఋణగ్రహీత)
2. శ్రీ కాను గోవిందరెడ్డి, తండ్రి: వెంకటేశ్వర రెడ్డి, పడమర గంగవరం, కురిచేడు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523304 (హామీదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, కురిచేడు బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది

ఋణగ్రహీత: శ్రీ అన్నెం అంజిరెడ్డి, తండ్రి: రామిరెడ్డి మరియు శ్రీ కాను గోవిందరెడ్డి, తండ్రి: వెంకటేశ్వరరెడ్డి వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ. 8,80,133.54 (అక్షరాల ఎనిమిది లక్షల ఎనభై వేల నూట ముప్పై మూడు రూపాయలు మరియు యాభై నాలుగు పైసలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 14.07.2022 తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి తేది. **13.10.2022** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **సాక్షి (తెలుగు) & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్)** వార్తాపత్రికలలో **19.10.2022** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **31.03.2022** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.8,80,133.54 (అక్షరాల ఎనిమిది లక్షల ఎనభై వేల నూట ముప్పై మూడు రూపాయలు మరియు యాభై నాలుగు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

ప్రకాశం జిల్లా, మార్కాపురం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, దర్శి సబ్-డిస్ట్రిక్ట్, కురిచేడు మండలం, వెస్ట్ గంగవరం గ్రామ పంచాయితీ, ఇంటి అసెస్‌మెంట్ నెం. 22, సర్వే నెం. 331 నందు **96.87** చ॥గ॥లు విస్తీర్ణంలోని **ఇంటి నెం. 1-57 గల యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** సరెడ్డి అంజి రెడ్డి గారి ఆస్తి, **పడమర:** తుపాకుల పిచ్చి రెడ్డి గారి ఆస్తి, **ఉత్తరం:** మారసు నరసింహులు గారి ఆస్తి.
టైటిల్ హోల్డర్: శ్రీ అన్నెం అంజిరెడ్డి, తండ్రి: రామిరెడ్డి.

తేది: 03.07.2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1అంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీ నుసుం శివశంకర్ రెడ్డి, తండ్రి: మల్లారెడ్డి, హెచ్‌నెం. 7-40, నుసుము వీధి, కురిచేడు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523304 (ఋణగ్రహీత).
2. శ్రీ నుసుం గురువారెడ్డి, తండ్రి: మల్లారెడ్డి, హెచ్‌నెం. 7-40, నుసుము వీధి, కురిచేడు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523304 (హామీదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, కురిచేడు బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది

ఋణగ్రహీత: శ్రీ నుసుం శివశంకర్ రెడ్డి, తండ్రి: మల్లారెడ్డి మరియు హామీదారు: శ్రీ నుసుం గురువారెడ్డి, తండ్రి: మల్లారెడ్డి వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ. 4,43,625.02/- (అక్షరాల నాలుగు లక్షల నలభై మూడు వేల ఆరు వందల ఇరవై ఐదు రూపాయలు మరియు రెండు పైసలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 14.07.2022 తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి తేది. **13.10.2022** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **సాక్షి (తెలుగు) & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్)** వార్తాపత్రికలలో **19.10.2022** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **31.03.2022** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.4,43,625.02/- (అక్షరాల నాలుగు లక్షల నలభై మూడు వేల ఆరు వందల ఇరవై ఐదు రూపాయలు మరియు రెండు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

ప్రకాశం జిల్లా, మార్కాపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, దర్శి సబ్-జిల్లా, కురిచేడు మండలం, కురిచేడు గ్రామ పంచాయితీ, కురిచేడు, నుసుం బజారు, పోస్టాఫీసు దగ్గర, సర్వేనెం. 178/2, సమీప డోర్ నెం. 7-39, ప్రస్తుత డోర్ నెం. 7-40 లో 41.083 చ॥గ॥ల విస్తీర్ణంగల భూమి మరియు అందులోనున్న బిల్డింగ్. **హద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** నుసుం వెంకటేశ్వర రెడ్డి యొక్క ఖాళీ స్థలం, **పడమర:** బీమల అంకి రెడ్డి యొక్క ఖాళీ స్థలం, **ఉత్తరం:** నుసుం సుబ్బారెడ్డి యొక్క పశువుల షెడ్.
టైటిల్ హోల్డర్: శ్రీ నుసుం శివశంకర్‌రెడ్డి, తండ్రి: మల్లారెడ్డి.

తేది: 03.07.2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1అంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీ నుసుం గురువారెడ్డి, తండ్రి: మల్లారెడ్డి, హెచ్‌నెం. 7-40, నుసుము వీధి, కురిచేడు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523304 (ఋణగ్రహీత).
2. శ్రీ నుసుం శివశంకరరెడ్డి, తండ్రి: మల్లారెడ్డి, హెచ్‌నెం. 7-40, నుసుము వీధి, కురిచేడు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523304 (హామీదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, కురిచేడు బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది

ఋణగ్రహీత: శ్రీ నుసుం గురువారెడ్డి, తండ్రి: మల్లారెడ్డి మరియు హామీదారు: శ్రీ నుసుం శివశంకర్‌రెడ్డి, తండ్రి: మల్లారెడ్డి వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ. 5,54,514.88/- (అక్షరాల ఐదు లక్షల యాభై నాలుగు వేల ఐదు వందల పద్నాలుగు రూపాయలు మరియు ఎనభై ఎనిమిది పైసలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 14.07.2022 తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి తేది. **13.10.2022** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **సాక్షి (తెలుగు) & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్)** వార్తాపత్రికలలో **19.10.2022** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **31.03.2022** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.5,54,514.88/- (అక్షరాల ఐదు లక్షల యాభై నాలుగు వేల ఐదు వందల పద్నాలుగు రూపాయలు మరియు ఎనభై ఎనిమిది పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

ప్రకాశం జిల్లా, మార్కాపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, దర్శి సబ్-జిల్లా, కురిచేడు మండలం, కురిచేడు గ్రామ పంచాయితీ, నుసుం బజారు, పోస్టాఫీసు దగ్గర, సమీప డోర్ నెం. 7-39, సర్వే నెం.178/2 లో 42.11 చ॥గ॥ల విస్తీర్ణంగల భూమి మరియు అందులోనున్న బిల్డింగ్. **హద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** నుసుం చిన వెంకట రెడ్డి యొక్క ఖాళీ స్థలం, **పడమర:** మల్లా రెడ్డి యొక్క ఖాళీ స్థలం, **ఉత్తరం:** నుసుం వెంకటేశ్వర రెడ్డి యొక్క ఖాళీ స్థలం.
టైటిల్ హోల్డర్: శ్రీ నుసుం గురువారెడ్డి, తండ్రి: మల్లారెడ్డి.

తేది: 03.07.2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1అంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీ బత్తుల రామకృష్ణ, తండ్రి : బత్తుల అచ్చయ్య, శింగనపాలెం గ్రామం, ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523252. (ఋణగ్రహీత)
2. శ్రీ బత్తుల హరిబాబు, తండ్రి : అచ్చయ్య బత్తుల, శింగనపాలెం గ్రామం, ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523252. (హామీదారు)
3. శ్రీ మనం నరసింహారావు, తండ్రి : వెంకట సుబ్బయ్య, హెచ్ నెం.1/19G, శింగనపాలెం గ్రామం, ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523252. (హామీదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, దర్శి బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది

ఋణగ్రహీత : శ్రీ బత్తుల రామకృష్ణ, తండ్రి : బత్తుల అచ్చయ్య మరియు హామీదారు/లు: (1) శ్రీ బత్తుల హరిబాబు, తండ్రి : అచ్చయ్య బత్తుల, (2) శ్రీ మనం నరసింహారావు, తండ్రి : వెంకట సుబ్బయ్య వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ.7,17,202/- (అక్షరాల ఏడు లక్షల పదిహేడు వేల రెండు వందల రెండు రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2)** క్రింద **24.04.2025** తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది.30.06.2025** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును సాక్షి & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తాపత్రికలలో **03.07.2025** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **31.03.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.7,17,202/- (అక్షరాల ఏడు లక్షల పదిహేడు వేల రెండు వందల రెండు రూపాయలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

ప్రకాశం జిల్లా, మార్కాపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, దర్శి సబ్-జిల్లా, ముండ్లమూరు మండలం, శింగనపాలెం గ్రామ పంచాయతీ, శింగనపాలెం గ్రామ సర్వే నెం.93/11, శింగనపాలెం గ్రామం, డోర్ నెం. 1-49 నందు మొత్తం విస్తీర్ణం ఎకరా 3.12 సెంట్లు భూమిలోని విస్తీర్ణం ఎ॥ 0.05 సెంట్లు లేదా 0.02 హెక్టార్లు లేదా 242 చ॥గ॥లులోని నిర్మించబడిన ఆర్‌సిసి రూఫ్ నివాసయోగ్యమైన భవనం. **హద్దులు: తూర్పు:** రాకపోకలకు, **దక్షిణం:** కందిమల్ల పెద రోశయ్య గారి ఇల్లు, **పడమర:** రెడ్డిమసు రాములు గారి ఇల్లు, **ఉత్తరం :** కందిమల్ల పెదశేషయ్య గారి భూమి.
(దర్శి S.R.O, 10.06.2009 నాటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.2131/2009 ప్రకారం).
టైటిల్ హోల్డర్: శ్రీ బత్తుల రామకృష్ణ, తండ్రి : అచ్చయ్య బత్తుల.

తేది: 05.07.2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1అంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. M/s. గోవర్ధన్ ఏజెన్సీస్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ శ్రీ గోను తిరపతి రెడ్డి, రిజిష్టర్డ్ కార్యాలయం: డి.నెం.14-230, అద్దంకి రోడ్, దర్శి గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523247. వర్క్స్/అడ్మిన్ ఆఫీస్: సర్వే నెం. 98/12C, సబ్ డివిజన్ తర్వాత 98/12C2, బసవపురం గ్రామం, కెల్లంపల్లి గ్రామ పంచాయతీ, ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523247.
2. శ్రీ గోను తిరపతి రెడ్డి, తండ్రి: వెంకట సుబ్బా రెడ్డి, డి.నెం.14-230, దర్శి గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523247.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, దర్శి బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది

ఋణగ్రహీత : M/s. గోవర్ధన్ ఏజెన్సీస్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ శ్రీ గోను తిరపతి రెడ్డి, తండ్రి : వెంకట సుబ్బా రెడ్డి, (2) శ్రీ గోను తిరపతి రెడ్డి, తండ్రి: వెంకట సుబ్బా రెడ్డి వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ.1,00,21,642/- (అక్షరాల ఒక కోటి ఇరవై ఒక్క వేల ఆరు వందల నలభై రెండు రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2)** క్రింద **11.04.2025** తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది. 20.06.2025** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **ఈనాడు & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్** వార్తాపత్రికలలో **25.06.2025** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **28.03.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.1,00,21,642/- (అక్షరాల ఒక కోటి ఇరవై ఒక్క వేల ఆరు వందల నలభై రెండు రూపాయలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా స) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన ఆస్తుల వివరములు

చరాస్తి : ప్రకాశం జిల్లా, ముండ్లమూరు మండలం, కెల్లంపల్లి గ్రామ పంచాయతీ, బసవపురం గ్రామం, కెల్లంపల్లి గ్రామ పంచాయతీ, సర్వే నెం. 98/12C, సబ్ డివిజన్ తర్వాత 98/12C2 వద్ద బ్యాంక్ ఫైనాన్స్ నుండి కొనుగోలు చేయబడిన ప్లాంట్ & మెషినరీ యొక్క హైపోథికేషన్. టైటిల్ హోల్డర్ M/s **గోవర్ధన్ ఏజెన్సీస్ ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రొప్రయిటర్ శ్రీ గోను తిరపతి రెడ్డి.**

స్థిరాస్తి: ప్రకాశం జిల్లా, ఒంగోలు రిజిస్ట్రేషన్ జిల్లా, దర్శి సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, ముండ్లమూరు మండలం, కెల్లంపల్లి గ్రామ పంచాయతీ ప్రాంతం, బసవపురం గ్రామం, సర్వే నెం.98/12C, తరువాత సర్వే నెం.98/12C2, L.P నెం.619 గా ఉపవిభజన చేయబడింది, విస్తీర్ణం ఎ. 0.55 సెంట్లు ఫ్యాక్టరీ భూమి & అందులో నిర్మించబడిన భవనం ఆస్తికి **సరిహద్దులు : తూర్పు :** ఏలూరి సుబ్బారావు మరియు ఇతరుల భూమి, **దక్షిణం :** కార్ట్ ట్రాక్, **పశ్చిమం :** కార్ట్ ట్రాక్, **ఉత్తరం :** పేరం సుబ్బారెడ్డి భూమి.
(దర్శి S.R.O, 22.11.2022 నాటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.10805/2022).
టైటిల్ హోల్డర్: శ్రీ గోను తిరపతి రెడ్డి, తండ్రి: వెంకట సుబ్బారెడ్డి.

తేది: 05.07.2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ప్రేమ వ్యవహారంలో యువతి హత్య!

మృతదేహం పక్కనే కత్తి గాయాలతో ప్రియుడు

రమ్య

జిన్నారం(రామచంద్రాపురం), న్యూస్‌టుడే: ప్రేమ వ్యవహారంలో యువతి హత్య కలకలం రేపింది. ఆమె మృతదేహం పక్కనే ప్రియుడు కూడా గొంతుపై కత్తిగాట్లతో పడి ఉండటం అనుమానాలు రేకెత్తిస్తోంది. ప్రియుడే ఈ పని చేశాడా... ఇంకెవరి హస్తమైనా ఉందా..? అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. హైదరాబాద్ శివారులోని రామచంద్రాపురం ఠాణా పరిధిలోని బంధ్లగూడలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా బాడంగి మండలం గజరాయునివలస గ్రామానికి చెందిన బొత్స శ్రీనివాస్, ఈశ్వరమ్మ దంపతులు 25 ఏళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. రామచంద్రాపురం పరిధిలోని బంధ్లగూడ బాలాజీనగర్‌లో నివాసముంటున్నారు. వీరి కుమార్తె రమ్య (23)కు మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మాసాయిపేటకు చెందిన ప్రవీణ్‌కుమార్ (25)తో మూడేళ్ల నుంచి పరిచయముంది. బీటెక్ పూర్తి చేసిన ప్రవీణ్ ప్రస్తుతం ఆల్విన్ కాలనీలో ఉంటూ ట్యూషన్లు చెబుతున్నాడు. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. ఆరు నెలల క్రితం తమ ప్రేమ గురించి యువకుడు... రమ్య తల్లిదండ్రులకు చెప్పగా.. వారు అంగీకరించలేదు. ఆమెకు పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. సోమవారం మధ్యాహ్నం యువతి తల్లి ఈశ్వరమ్మ ఇంటికి వచ్చేసరికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. కిటికీ లోంచి పరిశీలించగా... రమ్య గొంతుపై తీవ్ర గాయంతో రక్తపు మడుగులో ఉంది. ఆ పక్కనే మెడ మీద గాయంతో ప్రవీణ్ పడి ఉన్నాడు. ప్రవీణ్ కొన ఊపిరితో ఉండడంతో ఆసుపత్రికి తరలించారు.

అలాంటి వాటికే మీ సమయాన్ని వెచ్చించండి

అవసరం లేని విషయాల గురించి ఆలోచిస్తూ ఉంటే మీ సమయం వృథా కావడమే కాదు, దానివల్ల ముఖ్యమైన పనులపై మీరు దృష్టి పెట్టలేరు.
ఓ విషయం వల్ల మీకు
1. వ్యక్తిగత ప్రయోజనమైనా ఉండాలి.
2. మనశ్శాంతైనా లభించాలి.
3. మీ కుటుంబానికి, సమాజానికి పనికొచ్చే అర్థవంతమైన విషయమైనా అయ్యుండాలి.
అలాంటి వాటి కోసమే మీ సమయాన్ని, శక్తిని వెచ్చిస్తూ పూర్తి ఏకాగ్రతను నిలపండి.
– మోర్గాన్ రిచర్డ్ ఒలివియర్, రచయిత్రి

జగన్ కారులో వచ్చి వెళ్లా.. నాకేం తెలియదు

పోలీసుల విచారణలో మాజీ మంత్రి పేర్ని నాని

సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన పేర్ని నాని ★ సీఐ గది వద్ద గుమిగూడిన వైకాపా నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి జూన్ 18న సత్తెనపల్లి పట్టణంలో ర్యాలీ చేయడంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తిన విషయం మీకు తెలుసా? రప్పా రప్పా అనే ఫ్లెక్సీలు మీరు చూశారా? వాటిని ఎక్కడ ముద్రించారు? జనసమీకరణలో మీ పాత్ర ఉందా? పట్టణంలో ఎటువంటి అనుమతులే కుండా ర్యాలీ చేయడమే కాకుండా డీజేతో నృత్యాలు చేయడం, వాహనాలు శబ్దం చేస్తూ నడపడం, బహిరంగంగా మద్యం తాగడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడం వంటి విషయాలు మీకు తెలియవా? అంటూ మాజీ మంత్రి పేర్ని నానిని సత్తెనపల్లి పోలీసులు ప్రశ్నించారు. జగన్ కారు ఎక్కమంటే ఎక్కాను.. తాడేపల్లి నుంచి కారులో వచ్చా.. కారులోనే తిరిగి వెళ్లా.. అనుమతుల గురించి నాకు తెలియదని ఆయన సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడంపై పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో పేర్ని నానిని సోమవారం విచారించారు. పట్టణంలో జరిగిన ర్యాలీలో మీరు పాల్గొన్నారా అని పోలీసులు ప్రశ్నించగా కారులో ఉన్నానని చెప్పారు. జగన్ పర్యటనకు 3 వాహనాలు, 100 మందికి అనుమతి ఇచ్చారు కదా అని నాని పోలీసులు అడిగారు. పట్టణంలో ర్యాలీకి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, రెంటపాళ్లకు పెద్దసంఖ్యలో వాహనాలు, జనం వస్తే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని ఉన్నతాధికారులు ముందుగానే చెప్పారని పోలీసులు సమాధానమిచ్చారు. విచారణకు మరోసారి పిలిస్తే రావాలని సీఐ నాగమల్లేశ్వరరావు మాజీ మంత్రికి చెప్పారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు పోలీస్‌స్టేషన్‌లోకి గుంపుగా వచ్చేసి... విచారణ పూర్తయ్యే వరకు సీఐ గది ముందే హడావుడి చేశారు.

రెంటపాళ్ల ఎక్కడో తెలియదు

తనకు రెంటపాళ్లే కాదు సత్తెనపల్లి ఎక్కడో కూడా తెలియదని.. ఇక్కడికి రావడం ఇదే తొలిసారి అని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. పోలీసుల విచారణ తర్వాత వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుధీర్ భార్గవరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 11 సెక్షన్లతో తనపై కేసు పెట్టారని, మచిలీపట్నంలోని కార్యాలయంలో ఆదివారం పోలీసులు నోటీసు అంటించి వెళ్లడంతో విచారణకు వచ్చానని చెప్పారు. పోలీసుల ఆంక్షలు అతిక్రమించారని, ప్రజల్ని ఇబ్బందులకు గురి చేశారని, ప్రాథమికంగా రుజువు కావడంతో మిమ్మల్ని విచారణకు పిలుస్తున్నామంటూ నోటీసులో పేర్కొన్నారన్నారు. సత్తెనపల్లిలో వైకాపా ఇన్‌ఛార్జి, చైర్‌పర్సన్ ఎవరో కూడా ఇక్కడికి వచ్చేవరకు తనకు తెలియదని, తాను ఎవరితోనూ మాట్లాడలేదని అన్నారు. పాలకుల ఒత్తిడితో వారి కుర్చీలను కాపాడుకునేందుకు పోలీసు అధికారులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని, సత్తెనపల్లి పోలీసులు అమాయకులని వ్యాఖ్యానించారు. తనపై కేసులు పెట్టినా జగన్ జెండాను వదిలేది లేదన్నారు.

గ్రూప్-1 కేసులో మధుసూదన్‌కు బెయిల్

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 (2018) ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు, నిధుల దుర్వినియోగం కేసులో రెండో నిందితుడు, క్యామ్‌సైన్ మీడియా సంస్థ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్‌కు హైకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. విజయవాడ కోర్టులో రూ.25 వేల విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. అభియోగపత్రం దాఖలు చేసే వరకు ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరుకావాలని మధుసూదన్‌కు స్పష్టంచేశారు. మూల్యాంకనంలో అక్రమాలపై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం మధుసూదన్ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇటీవల వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి.. సోమవారం నిర్ణయాన్ని ప్రకటించారు. ఏపీపీఎస్సీ చేసుకున్న ఒప్పందంలోని నిబంధనలకు అనుగుణంగానే మధుసూదన్ పనులు నిర్వహించారు. వైద్య నివేదికలు, కేసులో వివరాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

● ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు ● హైకోర్టులో నేడు విచారణ

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను చెవిరెడ్డి మోహిత్ రెడ్డి(ఏ39) ఉపసంహరించుకున్నారు. సోమవారం జరిగిన విచారణలో వ్యాజ్యం ఉపసంహరణకు మోహిత్‌రెడ్డి తరఫు న్యాయవాది అభ్యర్థించారు. అందుకు అనుమతిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులిచ్చారు. సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని, కేసులో తనను నిందితుడిగా పేర్కొంటూ 'సాక్షి'గా విచారణకు రావాలని దర్యాప్తు అధికారి నోటీసు ఇవ్వడం చెల్లదంటూ హైకోర్టులో మోహిత్‌రెడ్డి క్వాష్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇటీవల జరిగిన విచారణలో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని అతని తరఫు సీనియర్ న్యాయవాది సి. నాగేశ్వరరావు అభ్యర్థించగా, ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి నిరాకరించారు. అరెస్టుపై ఆందోళన ఉంటే ముందస్తు బెయిలు పిటిషన్ వేసుకోవాలన్నారు.

వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రానుంది. 'మద్యం ముడుపులను తరలించడానికి నేను తుడా ఛైర్మన్‌గా ఉన్న సమయంలో వాహనాలను వినియోగించినట్లు నాపై ఆరోపణ చేస్తున్నారు. వాస్తవానికి అప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తుడా వాహనాలను వినియోగించడం, రూ.కోట్లు తరలించడం సాధ్యం కాదు. నేను నేరానికి పాల్పడలేదు. నా ప్రతిష్ఠను దిగజార్చేందుకు రాజకీయ నేతలు చెప్పిన మాటలు విని పోలీసులు నన్ను ఈ కేసులో ఇరికించార'ని వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఇప్పటికే బెయిలు కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను విజయవాడ కోర్టు కొట్టివేసిందని వెల్లడించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరారు.

కరోనా కట్టుకథల కరోడ్'పతి'

● బెంగళూరు మహిళను వంచించి కోట్ల ఆస్తి కాజేసిన చిత్తూరువాసి

శివప్రసాద్

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: భార్యాపిల్లలు కరోనా సోకి మృతి చెందారని మాయమాటలతో ఓ మహిళను నమ్మించి పెళ్లి చేసుకుని వంచించి రూ.28 కోట్ల సొత్తు కాజేసి పరారయ్యాడొక మోసగాడు. బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజ్‌పేట్‌కు చెందిన నాగమణి (50)కి చాన్నాళ్ల క్రితం బెంగళూరుకు చెందిన వెంకటప్పరెడ్డితో పెళ్లయింది. కొద్దికాలం క్రితం వారి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ బెంగతో భర్త వెంకటప్పరెడ్డి అనారోగ్యంతో మరణించారు. కొన్నాళ్లకు ఆమె మరో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని మధ్యవర్తి మహిళను ఆశ్రయించారు. ఆ మహిళ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం శేషాపురానికి చెందిన శివప్రసాద్‌కు ఈ విషయాన్ని చెప్పింది. అప్పటికే అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. అయినా.. నాగమణి ఆస్తిపరురాలని తెలుసుకున్న శివప్రసాద్ పథకం పన్నాడు. తన భార్య, కుమార్తె కొవిడ్‌తో మరణించారంటూ నకిలీ మరణ ధ్రువపత్రాలు తయారు చేసి నాగమణికి చూపాడు. నాగమణి వాటిని నమ్మడంతో 2022లో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు.

డబ్బొస్తుందని ఆశజూపి..: ఆమె ఆస్తిపై కన్నేసిన శివప్రసాద్ ఆర్‌బీఐ నుంచి కోట్లలో సొమ్ము రానుందని చెబుతూ కొన్ని నకిలీ పత్రాలు సృష్టించి, ఆ నగదు దక్కాలంటే కొంతసొమ్ము ఆర్‌బీఐకి చెల్లించాలని నమ్మించాడు. భర్తే కదా అని ఆమె నమ్మడంతో తన తండ్రి, సోదరుడు, వదినల ఖాతాల్లోకి ఆమె నుంచి సొమ్ము బదలాయించుకున్నాడు. అప్పటికే నాగమణి సంతకాలు ఫోర్జరీ చేసిన శివప్రసాద్ బెంగళూరులో మొదటి భర్త నుంచి ఆమెకు సంక్రమించిన రూ.15 కోట్ల విలువైన భూమిని, రూ.10 కోట్ల విలువైన భవనాన్ని అమ్మేశాడు. ఆమె ఆభరణాలను కూడా బ్యాంకుల్లో తనఖా పెట్టాడు. బంధువుల పెళ్లికి వెళ్లాల్సి ఉందని, ఆభరణాలు కావాలని నాగమణి కోరగా అప్పటి నుంచి అతడు పరారయ్యాడు. భర్తను వెతుక్కుంటూ ఆమె బంగారుపాళ్యానికి రాగా.. అప్పటికే అతనికి భార్య, కూతురు ఉన్న తెలిసింది. దీంతో బాధితురాలు ఎస్పీ మణికంఠను ఆశ్రయించి న్యాయం చేయాలని విన్నవించారు.

త్వరలోనే ధాన్యం రైతుల బకాయిలు చెల్లింపు

ఏపీమార్క్‌ఫెడ్ ఎండీ ఢిల్లీరావు

ఈనాడు, అమరావతి: ధాన్యం రైతుల బకాయిలను (ఖరీఫ్ 2024-25 పంట కాలానికి) త్వరలో చెల్లించనున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ ఢిల్లీరావు తెలిపారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి రూ.1,000 కోట్ల రుణం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4న అనుమతించిందన్నారు. మూడు రోజుల్లో ఆ మొత్తం మార్క్‌ఫెడ్‌కు బదిలీ అవనుందన్నారు. రుణం బదిలీ అయిన వెంటనే రైతుల బకాయిలు చెల్లిస్తామని తెలిపారు.

మాలిలో కిడ్నాపర్ల చెర నుంచి మా బిడ్డను కాపాడండి

అమరలింగేశ్వరరావు తల్లిదండ్రుల వేడుకోలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: 'అమ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది? మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ చేశారు కదా.. ఇప్పుడు బాగానే నడవగలుగుతున్నావా?' అని చివరిసారిగా తన కుమారుడు అమరలింగేశ్వరరావు అన్న మాటలను గుర్తు చేసుకుని ఆ తల్లి కుమిలిపోతున్నారు. ఉపాధి కోసం ఆఫ్రికాలోని మాలి దేశం వెళ్లిన పల్నాడు జిల్లా మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన అమరలింగేశ్వరరావును వారం రోజుల క్రితం ఉగ్రవాదులు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. రోజులు గడుస్తున్నా ఆచూకీ లేకపోవడంతో అతని తల్లిదండ్రులు వెంకటరమణ, రాజ్యలక్ష్మి, భార్య, ముగ్గురు పిల్లలు ఆందోళన చెందుతున్నారు. ఆయన తల్లిదండ్రులను పలకరించగా.. 'అమరలింగేశ్వరరావు గ్రామంలో పదో తరగతి చదివాక మాచర్లలో ఐటీఐ పూర్తి చేశాడు. తర్వాత నల్గొండలో సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగం వచ్చింది. పెళ్లై ముగ్గురు పిల్లలు పుట్టాక కుటుంబ పోషణ కష్టమైంది. మరోవైపు ఫ్యాక్టరీలో పనిచేసే స్నేహితుడి ద్వారా మాలిలో ఉద్యోగం ఉందంటే దరఖాస్తు చేసి వెళ్లాడు. ఇప్పటికి 11 ఏళ్లు అయ్యింది. ఏటా ఒకసారి వచ్చి వెళ్తాడు. ఈసారి రెండు నెలల్లో వస్తానని మాతో అన్నాడు' అని తల్లి రాజ్యలక్ష్మి తెలిపింది. చివరిసారి జులై 1న ఫోన్‌లో తాము మాట్లాడామని, తర్వాత కిడ్నాప్ విషయం తెలిసిందని తల్లిదండ్రులు చెప్పారు. ఉగ్రవాదుల చెర నుంచి తమ కుమారుడిని విడిపించి క్షేమంగా ఇక్కడికి వచ్చేలా చూడాలని వారు వేడుకుంటున్నారు.

బూనేటి చాణక్య బెయిల్ పిటిషన్ కొట్టివేత

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన రాజ్ కసిరెడ్డి ప్రధాన అనుచరుడు బూనేటి చాణక్య (ఏ-8) బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం కొట్టేసింది. అతనికి బెయిల్ నిరాకరిస్తూ ఏసీబీ న్యాయస్థానం న్యాయాధికారి భాస్కర్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

● ఇంటి నుంచి ఆహారం తీసుకొచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మద్యం కుంభకోణం కేసు నిందితుడు రాజ్ కసిరెడ్డి (ఏ-1) దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా విజయవాడ ఏసీబీ న్యాయస్థానం కొట్టేసింది.

● మద్యం కుంభకోణం కేసులో నిందితులైన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్‌నాయుడు బెయిల్ పిటిషన్లపై తదుపరి విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. వీరిద్దరికీ బెయిల్ ఇవ్వొద్దంటూ సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు.

అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సభలో ఎమ్మార్పీఎస్ నాయకులు

మాదిగల వికాసానికి మందకృష్ణ కృషి

ఒంగోలు గ్రామీణం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాలు స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో జిల్లా ఇన్‌ఛార్జి నరేంద్ర మాదిగ మాట్లాడుతూ, తమ సామాజికవర్గ వికాసానికి మందకృష్ణ మాదిగ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. సంఘం నాయకులు గుంటూరు ప్రభుదాస్, బిక్షాలు, కత్తి ఐజాక్, బి.ఏసుదాసు పాల్గొన్నారు.

ఘనంగా మహామేళా : మాదిగ మహా మేళా కార్యక్రమాన్ని స్థానిక నెల్లూరు బస్టాండ్‌లోని మున్సిపల్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ నాగరిగిరి ప్రీతమ్ మాట్లాడుతూ మాదిగలు మరింత బలోపేతం కావాలని సూచించారు. సంఘం నాయకులు ఉసురుపాటి బ్రహ్మయ్య, రావినూతల కోటి, గోపి, మాధవ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల ప్రగతి ఆన్‌లైన్‌లో నమోదు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఓబులేసు, ఎస్‌డీసీలు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, పార్థసారథి, విజయజ్యోతి పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు : ఎస్పీ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో క్షేత్రస్థాయి అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించగా.. 79 ఫిర్యాదులందాయి. స్థిరాస్తి వ్యాపారం పేరిట ఒంగోలు సమతానగర్‌కు చెందిన వ్యక్తి ఒకరు ఏడునెలల క్రితం తనవద్దనుంచి మూడు కార్లు తీసుకుని నేటికీ ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నాడని మారుతీనగర్‌కు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుధాకర్‌బాబు, ఎస్సీ, ఎస్టీ కేసుల విభాగం ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్, ఐటీ కోర్ టీమ్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ; ట్రాఫిక్ సీఐ వై.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధితో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం

ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని మేళవించి ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మంత్రి బాలవీరాంజనేయస్వామి అన్నారు. సోమరాజుపల్లి గ్రామ పరిధిలోని టీపీ నగర్‌లో సోమవారం మండల తెదేపా అధ్యక్షుడు సింగయ్య ఆధ్వర్యంలో సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ముందుగా కాలనీలో సుమారు రూ.27 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. రాబోవు రోజుల్లో వీధివీధిలో కాలువలు నిర్మించి మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ప్రాంతవాసులకు హామీ ఇచ్చారు. అనంతరం ఇంటింటికీ తిరిగి అమలు చేస్తున్న పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని పోలీసుస్టేషన్లలో ఉన్న ఖాళీల ఆధారంగా హెడ్‌కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొందరిని పక్క జిల్లాలకు పంపారు. ఈ సందర్భంగా వారికి ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో నియామకపు ఉత్తర్వులు అందజేశారు. టి.ఇన్నయ్య (ఏఎస్సై: 1817) పొన్నలూరు, టి.మాలకొండయ్య (ఏఎస్సై: 1846) పొన్నలూరు, వై.డేనియల్ (ఏఎస్సై: 1847) నెల్లూరు జిల్లా, సీహెచ్.భాస్కర్‌రావు (ఏఎస్సై: 1853) వీఆర్, ఒంగోలు, జి.కృష్ణమూర్తి(ఏఎస్సై: 1856) ఒంగోలు తాలూకా, కె.కోటేశ్వరరావు (ఏఎస్సై: 1857) ముండ్లమూరు, కె.హరిబాబు(ఏఎస్సై: 1858) డీసీఆర్‌బీ, ఒంగోలు, బి.శ్రీనివాసరావు (ఏఎస్సై: 1859) బాపట్ల జిల్లా, పి.ప్రసాదరావు(ఏఎస్సై: 1860) చీమకుర్తి, వై.శ్రీనివాసరావు (ఏఎస్సై: 1864) ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

యువ ఉద్యోగి ఉసురుతీసిన హీటర్

వెంకటేష్ (పాత చిత్రం)

పొదిలి, కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఓ యువ ఉద్యోగి విద్యుదాఘాతానికి ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన చిత్తూరు జిల్లా కుప్పం పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... పొదిలికి చెందిన వీరేపల్లి వెంకటేష్(29)కు ఎల్ఐసీ అభివృద్ధి అధికారిగా ఉద్యోగం రావడంతో కుప్పంలోని కార్యాలయంలో పనిచేస్తూ స్థానిక ప్రకాశం రోడ్డులో ఒక్కరే నివాసముంటున్నారు. సోమవారం బాత్‌రూమ్‌కు వెళ్లిన ఆయన బకెట్‌లో ఉన్న హీటర్‌ను తీసే క్రమంలో తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యారు. ఇంటి తలుపులు తీసి ఉండటం, ఎంతకీ బయటకు రాకపోవడంతో పక్కింటి వారికి అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి విద్యుదాఘాతానికి గురైనట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాబు తెలిపారు. ఈయన తండ్రి వెంకటేశ్వర్లు పొదిలిలో ఆర్ఎంపీగా పనిచేస్తున్నారు. ఇటీవల కుమారుడికి పెళ్లి సంబంధాలు చూస్తుండగా.. ఈ ఘటన చోటు చేసుకుందని వారు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఏకేయూ పాలనాధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రిన్సిపల్ నిర్మలామణిని అభినందిస్తున్న సిబ్బంది

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిపాలనా విభాగంలో జరిగిన మార్పులు ప్రకారం కొత్త అధికారులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపల్‌గా నిర్మలామణి బాధ్యతలు చేపట్టగా సిబ్బంది కలసి అభినందనలు తెలిపారు. బాధ్యతాయుతంగా పనిచేసి ప్రిన్సిపల్ పదవికి వన్నెతెస్తానని ఆమె పేర్కొన్నారు. డీన్‌గా కేవీఎన్ రాజు, పరీక్షల విభాగం అధికారిగా జి.సోమశేఖర బాధ్యతలు స్వీకరించారు.

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి జైలు

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: తీసుకున్న బాకీ చెల్లించే నిమిత్తం ఇచ్చిన చెక్కు చెల్లని కేసులో నిందితుడు మద్దిపాడుకు చెందిన ఈమని సింగారావుకు ఒంగోలు మొబైల్ మెజిస్ట్రేటు వి.వెంకటేశ్వరరావు జైలుశిక్ష, జరిమానా విధించారు. నిందితుడు తన అవసరాల నిమిత్తం మద్దిపాడుకే చెందిన గంగిశెట్టి సంజీవరావు వద్ద రూ.3 లక్షలు అప్పు తీసుకున్నారు. ఈ బాకీ చెల్లించే నిమిత్తం రూ. 4.92 లక్షలకు చెక్కు ఇచ్చారు. నిందితుడి ఖాతాలో తగినంత డబ్బు లేకపోవటంతో చెక్కు చెల్లలేదు. దీంతో ఆయన న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు. విచారించిన మెజిస్ట్రేటు నిందితుడిపై నేరం రుజువైనందున ఏడాది జైలుశిక్ష, రూ. 5.02 లక్షల జరిమానా వేశారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

టంగుటూరు, న్యూస్‌టుడే: పట్టపగలే దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకోగా, ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..జయవరం శివారులోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఇత్తడి వినోద్‌కుమార్, ప్రసన్న దంపతులు. ఈ నెల 4న వారు పనుల నిమిత్తం బయటకు వెళ్లి..మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా..ఇంట్లో ఉన్న రూ.92 వేల నగదు, మూడు సవర్ల బంగారం కన్పించలేదు. దీనిపై పోలీసులుకు సమాచారం అందించగా వారితో పాటు క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించారని బాధితులు చెబుతున్నారు. అయితే దీనిపై పోలీసులు నోరు మెదపడం లేదు. టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా..కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్లు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 110, రిటైల్ లైవ్ - 132, చికెన్ విత్ స్కిన్ - 191, చికెన్ స్కిన్‌లెస్- 218

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

FLAT FOR SALE

Ready to Occupy, Fully Furnished 2800 Square Feet. Duplex flat for sale at Gupthas Royale (Gauted Community) 2 Car Parkings, 5 Ac's and 3 BEDS, Dining Table etc.. Back side of Ratna Mahal Theatre/ Hotel Sarovar, Ongole. Cell: 9849119754.

JOBS

ట్రాక్టర్ డ్రైవర్లు, కార్ డ్రైవర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, వంటమనుషులు, ఆయాలు, రొయ్యల చెరువుల దగ్గర మరియు డైరీ ఫామ్‌లో పనిచేయుటకు మనుషులు, కంప్యూటర్ ఆపరేటర్, ఫార్మశిస్టులు, రిసెప్షనిస్టులు కావలెను. సెల్: 95420 94445, 94933 29234.

ప్రముఖ ఆర్థో హాస్పిటల్, ఒంగోలు నందు ICUలో నైట్‌డ్యూటీ చేయుటకు 5సం॥ల అనుభవం & సర్టిఫికేట్ ఉన్న స్టాఫ్ కావలెను. డ్యూటీ సమయం రాత్రి 8 గం॥ల నుండి ఉ॥ 8 గం॥ల వరకు. ఆకర్షణీయమైన జీతం కలదు. సంప్ర॥ 98491 61123.

మాల్స్, ప్రైవేట్ సంస్థలు & షాపులలో పనిచేయుటకు స్త్రీ పురుషులు (విద్యార్హతను బట్టి) ఉద్యోగ అవకాశములు కల్పించబడును. విజేత జాబ్ కన్సల్టెన్సీ అకాడమి, రైలుపేట, ఒంగోలు. 98853 15403.

ఒంగోలులోని ప్రముఖ విద్యాసంస్థ నందు పనిచేయుటకు Maths, Physics, Chemistry, Botany, Zoology, English, Sanscrit సబ్జెక్టులకు JL's కావలెను. సంప్ర॥ 63995 52222.

ఒంగోలులోని ప్రముఖ కాలేజ్ నందు సెక్యూరిటీ గార్డ్స్ & అనుభవం గల కారు డ్రైవర్ కావలెను. జీతం : 15,000/-, 20,000/-. సంప్రదించండి. 80194 79999.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్త ను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

టైరు పేలి వాహనం బోల్తా

మద్దిపాడు, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై సోమవారం ఉదయం మామిడికాయల వాహనం బోల్తాపడింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం..చిత్తూరు నుంచి రాజమండ్రికి మామిడికాయలతో వెళుతున్న బొలెరో వాహనం మద్దిపాడు లారీ యూనియన్ ఆఫీస్ సమీపంలోకి రాగానే వెనుక టైరు పేలిపోయింది. దీంతో వాహనం అదుపుతప్పి రోడ్డు పైనే బోల్తాపడింది. దీంతో మామిడి కాయలన్నీ రోడ్డుపై చిందర వందరగా పడిపోయాయి. స్థానికులు హుటాహుటిన వచ్చి లారీలో ఇరుక్కున్న చోదకుడితో పాటు మరో వ్యక్తిని బయటకు తీశారు. వారిద్దరికీ గాయాలయ్యాయి.

ఖాసిం పీర్ల జులూస్‌లో విషాదం

● ముజావర్ మృతితో నిలిచిన మొహర్రం

అంత్యక్రియల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి (అంతర చిత్రంలో) ఖైదా మృతదేహం

తర్లుపాడు, న్యూస్‌టుడే: రెండు రోజులుగా భక్తులతో సందడిగా ఉన్న ఖాసిం దర్గా ప్రాంతంలో విషాదం అలముకుంది. భక్తిశ్రద్ధలతో సాగుతున్న జులూస్‌కు నేతృత్వం వహిస్తున్న దర్గా ప్రధాన ముజావర్ ఖైదా కుప్పకూలి ప్రాణాలు కోల్పోవడంతో తుమ్మలచెరువు దర్గాలో మొహర్రం నిలిచిపోయింది. ఆదివారం అర్ధరాత్రి మంగళకుంట పీరుతో పాటు చిన్న ఖాసిం, పెద్ద ఖాసిం పీర్లు ఊరేగింపుగా తుమ్మలచెరువు పురవీధుల్లోకి తరలివచ్చాయి. ఉత్సాహంగా జులూస్‌లో ముందుకు సాగుతున్న దర్గా పెద్ద ముజావర్ ఖైదా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. అక్కడే ఉన్న వారు స్థానికులు, భక్తులు అప్రమత్తమై ఆయన్ను ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా, అప్పటికే ప్రాణాలు కోల్పోయారు. ఈ హఠాత్పరిణామంతో అక్కడి వారు తీవ్ర వేదనకు గురయ్యారు. దీంతో దర్గా పరిధిలో జరుగుతున్న మొహర్రం కార్యక్రమాలను నిలిపివేయాలని నిర్వాహకులు నిర్ణయించారు. వెంటనే పీర్లను దర్గాలోకి తరలించారు. మొక్కులు తీర్చుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఆ కార్యక్రమాన్ని కూడా నిలిపేశారు. ఫాతెహా, నైవేద్యాల సమర్పణను ఆపేయడంతో వారు నిరాశగా వెనుదిరిగారు. ప్రధాన ముజావర్ మృతి వార్త తెలుసుకున్న మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి తుమ్మలచెరువుకు వచ్చి బాధితులకు సంతాపం తెలిపి ముజావర్ మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం ముజావర్ అంత్యక్రియలు నిర్వహించారు.

భార్య పుట్టింటికి వెళ్లడంతో ఆత్మహత్య

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పుగుండూరులో సోమవారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు ఉప్పుగుండూరు ఎస్సీ కాలనీకి చెందిన కొలకలూరి అనిల్(32) భార్య కుటుంబ కలహాల నేపథ్యంలో పుట్టింటికి వెళ్లిపోయారు. దీంతో మనస్తాపానికి గురైన అనిల్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

(c) eenadu

కొనకనమిట్ల : పద్మమడుగులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

వై.పాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా పరిశీలకులు బ్రహ్మచౌదరి, ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు

మార్కాపురం

•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

నిబంధనలు పాటించకుంటే చర్యలు

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలో సంచరించే పలు వాహనాలు, ప్రైవేటు పాఠశాల బస్సులను ఎంవీఐ మాధవరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరకు రవాణా వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించి రాకపోకలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలిస్తున్న వాహనాన్ని నిలిపి రూ.4100 జరిమానా విధించినట్లు తెలిపారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ మాధవరావు

సుపరిపాలనతో ఆనంద జీవనం

మార్కాపురం పట్టణం, మార్కాపురం గ్రామీణం, కొనకనమిట్ల, యర్రగొండపాలెం పట్టణం, పొదిలి, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మార్కాపురం పట్టణంలోని 12వ వార్డులో, మండలంలోని రాయవరం గ్రామంలో, కొనకనమిట్ల మండలంలోని పద్మమడుగు గ్రామంలో సోమవారం ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. ● వై.పాలెంలోని స్టేట్‌బ్యాంక్ బజారులో తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మచౌదరి, తెదేపానాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ● పొదిలి ఇస్లాంపేటలో తెదేపా నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

మొక్కల చుట్టూ చిక్కులు

● వన మహోత్సవాలకు తప్పని ఇబ్బంది ● వేధిస్తున్న సిబ్బంది కొరత

కలుజువ్వలపాడు నర్సరీలో పెంచుతున్న నేరేడు మొక్కలు

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: ప్రస్తుతం పచ్చని ప్రకాశంలో విస్తీర్ణం 36 శాతంగా ఉంది. వన మహోత్సవం కార్యక్రమం ద్వారా 2029 నాటికి దీనిని యాభై శాతానికి పెంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది నవంబరు నాటికి పచ్చని ప్రకాశంలో 14 లక్షలు మొక్కలు నాటాలని నిర్ణయించారు. చిన్న చిన్న అవరోధాల కారణంగా సామాజిక అటవీ నర్సరీల్లో మొక్కల పెంపకానికి అవరోధాలు ఏర్పాడుతున్నాయి. ఉపాధి బిల్లులు మంజూరు కాకపోవడంతో సిబ్బంది కొరత కారణంగా చిక్కులు తప్పడం లేదు. ఇది వన మహోత్సవం లక్ష్యంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున యంత్రాంగం స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మొత్తం లక్ష్యం 12 లక్షలు

నవంబరు నాటికి పచ్చని ప్రకాశం మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యాలను సిద్ధం చేశారు. మర్రిపాలెం, కలుజువ్వలపాడు, తుమ్మలచెరువు, హెచ్ఎంపాడు కలిపి ఆరు నర్సరీల్లో ఇప్పటికే 14లక్షలు మొక్కలు సిద్ధం చేశారు. ఇందులో నేరేడు, వేప, ఎర్రచందనం, టేకు, జామ, బాదం, వెదురు, కానుగ, మున వంటి పలు రకాలున్నాయి. వీటిని ఇళ్లు, పొలాల గట్టు ప్రభుత్వం కార్యాలయాల ఆవరణలో నాటుతారు.

ఎనిమిది నెలలు జీతాలు లేవు

ఉపాధి హామీ పథకం అనుసంధాన నిధులతో నర్సరీల్లో మొక్కలు పెంపకం చేస్తున్నారు. కూలీలు, మెటీరియల్ ఖర్చులన్నీ కలిపి ఇప్పటి వరకు రూ.30లక్షలు మేర వెచ్చించారు. నిధుల విడుదల లేక నర్సరీల్లో పనులు కాస్త నెమ్మదించాయి. దీనికితోడు కూలీలకు వంద పని దినాలు పూర్తి కావడం వారికి ఇంకా వేతనాలు రాకపోవడంతో కొనసాగించాల్సిన పనులకు అంతరాయం ఏర్పడుతోంది. సామాజిక అటవీ విభాగాలనూ సిబ్బంది కొరత వేదిస్తోంది. నర్సరీలో పని చేసే వారికి ఎనిమిది నెలలు జీతాలు మంజూరు కాకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. వారు మొక్కల పెంపకంపై సరిగా దృష్టి పెట్టడం లేదు.

ఆగని నీటి వృథా

కంభం: కంభం చెరువు నుంచి సోమవారం నీరు వృథాగా పోతోంది. ఎంతో విలువైన జలాన్ని సుమారు నాలుగు రోజుల నుంచి చిన్నకంభం తూము ద్వారా వదిలేస్తున్నారు. స్థానికులు అధికారులకు ఎంత చెప్పినా స్పందించలేదు. చెరువు ఖాళీ అయితే సుమారు నాలుగు మండలాల్లోని పదుల సంఖ్యలో గ్రామాలు తీవ్రమైన నీటి సమస్యలు ఎదుర్కొంటారు. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. తూముల నుంచి నీటి సరఫరా ఆపివేయడానికి చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ ఎస్ఈ వరలక్ష్మి తెలిపారు.

చిన్నకంభం కాలువలో సోమవారం కొనసాగిన నీటి ప్రవాహం

కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోరా?

❑ మీ కోసంలో సమస్యల వెల్లువ

మార్కాపురం, మార్కాపురం గ్రామీణం : కాళ్లు అరిగేలా తిరుగుతున్నాము.. మా సమస్యలను పరిష్కరించాలని మీ కోసంలో అర్జీదారులు అధికారుల ఎదుట వాపోయారు. స్థానిక ఉప కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయం సోమవారం అధికారులు వెంకటేశ్వర్లు, దీపక్‌కుమార్, రత్నకుమారి మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని పలు మండలాల నుంచి 20 దరఖాస్తులు వరకు వచ్చాయని అధికారులు తెలిపారు. ● మార్కాపురం మండలం తిప్పాయపాలెంకు చెందిన బాలా అంజిరెడ్డి తన పట్టా భూమి వెబ్‌ల్యాండ్‌లో ఇతరుల పేరుతో ఉందని ఆన్‌లైన్ చేయాలని కోరారు. ● తనకు 11 మంది సంతానమని, పెద్దకుమారుడికి రూ.లక్షలు విలువ చేసే ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించానని, తన పోషణ పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, న్యాయం చేయాలని దోర్నాల గ్రామానికి చెందిన సయ్యద్ అమీర్‌బాషా కోరారు.. ● తన ఆధార్ సంఖ్యను తన మామ పొలానికి సంబంధించిన ఖాతా నంబరుకు వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయడంతో తనకు తల్లికివందనం, వితంతువు పింఛన్ రావడం లేదని యర్రగొండపాలెం మండలం గంగపాలెంకు చెందిన గాజుల బాల తెలిపారు. ● తనకు భూమి విక్రయం చేసిన వారు డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయడం లేదని పెద్దారవీడు మండలం ప్రగళ్లపాడు గ్రామానికి చెందిన జనుమాల జక్రయ్య కోరారు. తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో 13 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు చిరంజీవి తెలిపారు.

మార్కాపురం ఉప కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

విత్తన నాణ్యత తప్పని సరి

విత్తన ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి మహమ్మద్

కంభం: విత్తన నాణ్యతలో ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి ఎస్‌కే మహమ్మద్ అన్నారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. అన్ని దుకాణాల్లోని వరి విత్తనాల శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపిస్తామని చెప్పారు.

పంచాయతీ కార్యదర్శిని నియమించరా..!

యర్రగొండపాలెం పట్టణం: యర్రగొండపాలెం మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎవరో తెలియక ప్రజలు తికమక పడుతున్నారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డిని గత మే నెల 1న ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి ఈ పంచాయతీకి కార్యదర్శిని నియమించలేదు. ప్రస్తుతం ఈవోఆర్డీ శ్రీనివాసరావుకు పంచాయతీ కార్యదర్శి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ అధికారి ఈవోఆర్డీ బాధ్యతలతోనే ఎక్కువగా ఎంపీడీవో కార్యాలయంలో గడుపుతున్నారు. దీంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో ప్రజలకు తెలియడం లేదు. ఈ విషయంపై మార్కాపురం డీఎల్‌పీవో భాస్కర్‌రెడ్డి సంప్రదించగా పంచాయతీ కార్యదర్శిగా ఎవరిని నియమించలేదని, త్వరలో నియమిస్తారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మార్కాపురం పట్టణం, పెద్దదోర్నాల, పెద్దారవీడు, యర్రగొండపాలెం: మార్కాపురం పట్టణంలోని గొర్ల గడ్డ వీధిలో సోమవారం పీర్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ● పెద్దదోర్నాల మండలంలోని తిమ్మాపురం, ఐనముక్కల, చిన్నగుడిపాడు గ్రామాల్లో పెద్దారవీడు మండలంలోని మొహర్రంను ఘనంగా నిర్వహించారు. ● యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల, వీరభద్రాపురం, గంజివారిపల్లె తదితర గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. ● కంభం, రాచర్ల మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పెద్దారవీడు : కలనూతలలో అగ్నిగుండం వద్ద భక్తజనం

పెద్దదోర్నాల : ఐనముక్కులలో గుండం వద్ద..

కంప చెట్లతో ఇబ్బంది

గిద్దలూరు పట్టణం: తిమ్మాపురం గ్రామం నుంచి ఎస్సీకాలనీకి వెళ్లే రహదారికి ఇరువైపులా కంపచెట్లు పెరిగి స్థానికులు నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కంపచెట్లు పెరిగి పోవడంతో ఎదురుగా మోటారు సైకిల్ వచ్చినా పక్కకు తప్పుకోవడానికి అవకాశం లేకుండా ఉంది. ఎస్సీ కాలనీ వాసులు రాత్రి వేళ నడిచి వెళ్లాలంటే ఎప్పుడు ఏ విషపురుగు కరుస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. సచివాలయ కార్యదర్శికి కంపచెట్లను తొలగించాలని పలుసార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సిమెంట్ రహదారికి ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పొదిలి, గిద్దలూరు పట్టణం పెద్దదోర్నాల,: పొదిలిలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏబీఎం పాఠశాల వద్ద డా.బి.ఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. కేక్ కత్తిరించారు.● గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు, అంబవరం, కొమ్మునూరు, సంజీవరాయునిపేట, కృష్ణంశెట్టిపల్లె గ్రామంలో ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.దేవప్రభాకర్ ఆధ్వర్యంలో నాయకులు జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ● పెద్దదోర్నాల మండలంలో సోమవారం ఎమ్మార్పీఎస్ సంఘం నాయకుడు సింగా ఎర్రబూసి ఆధ్వర్యంలో సర్పంచి చిత్తూరి హారిక జెండాను ఆవిష్కరించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేకు కట్ చేశారు.

పొదిలిలో కేకు కోస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దదోర్నాల: జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే :

?:పట్టణం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే చెరువుకట్టపై ఎక్కడ చూసిన గుంతలే దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రెండు సంవత్సరాలుగా ఈ సమస్య ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నాం. – కె.గోపి, స్థానికుడు

✓: ప్రస్తుతం రోడ్ల మరమ్మతులకు సంబంధించి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరైన వెంటనే సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటాం. – సందీప్, ఆర్అండ్‌బీ ఏఈ, మార్కాపురం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే:

?: వై.పాలెంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. చర్యలు తీసుకోండి. – ఎస్కే.షరీఫ్, స్థానికుడు

✓: త్వరలో దోమల నివారణకు చర్యలు చేపడతాం. – శ్రీనివాసరావు, ఈవో ఆర్డీ

పుల్లలచెరువు, న్యూస్‌టుడే:

?: పుల్లలచెరువు ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగటం లేదు. – దాసి వెంకటేశ్వర్లు

✓: త్వరలోనే కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేస్తాం. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

సీఐటీయూ బైక్ ర్యాలీ

పొదిలి, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పొదిలిలో సోమవారం కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ ప్రారంభించారు. చిన్నబస్టాండ్ నుంచి ప్రారంభమైన కొత్తూరు కూడలి వరకు సాగింది. కార్మికుల వ్యతిరేకమైన లేబర్‌కోడ్స్‌ను రద్దుచేయాలని, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు మేలు చేకూర్చే చట్టాలను అమలు చేయాలని కోరారు.

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

కుంగిపోయి మూడేళ్లు.. మరమ్మతులకు ఎన్నేళ్లు?

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే :

నిత్యం రాకపోకలు సాగించే మేడపి-కంకణాలపల్లి రహదారిలో మేడపి కుంట వద్ద వాగుపై ఉన్న కల్వర్టు మూడేళ్ల క్రితం కుంగిపోయింది. దీంతో ఆ మార్గంలో ద్విచక్రవాహనాలు మినహా మిగిలిన వాహన రాకపోకలకు వీలు లేకుండా పోయింది. దీంతో మేడపి, నాసర్‌రెడ్డి నగర్, లాజరస్ కొష్టాలు, కంకణాలపల్లి, మిరియంపల్లి, గాంధీనగర్, ఒడ్డుపాలెం తదితర గ్రామాల ప్రజలు త్రిపురాంతకం మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది.

మేడపి నుంచి నాసర్‌రెడ్డి నగర్ వరకు రహదారి ఆధునికీకరణకు 2018లో నిధులు కేటాయించారు. 2019లో వైకాపా అధికారం చేపట్టాక రీటెండర్లు పిలిచారు. ఆ నిధులతో మేడపి బస్టాండు నుంచి ఆంధ్రా బ్యాంకు వరకు సీసీ రోడ్డుతో పాటు కల్వర్టులు దెబ్బతిన్న చోట కొత్త వంతెనల నిర్మాణం చేయాలి. మేడపి నుంచి నాసర్‌రెడ్డి నగర్ వరకు తారు వేయాల్సి ఉంది. అయితే రహదారి వెడల్పు చేసి సన్న కంకర పరిచి పనులను అర్థాంతరంగా వదిలేశారు. ఆ తర్వాత కల్వర్టు నెమ్మదిగా కుంగుతూ మూడేళ్ల క్రితం పూర్తిగా పడిపోయింది. కొద్దిగా మిగలడంతో దారి మధ్య నుంచి ప్రజలు, ద్విచక్రవాహనాలు, పశువులు రాకపోకలు సాగిస్తున్నాయి. పంటల సాగు సీజన్‌లో ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా ఎరువులతో పాటు కూలీలను తీసుకెళ్లాలన్నా, పంట ఉత్పత్తులు ఇంటికి చేరాలన్నా కల్వర్టు ఎంతో అవసరం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కల్వర్టును పునర్ నిర్మించి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

కంకణాపల్లి రహదారిలో కుంగిపోయిన కల్వర్టు

ఉపాధ్యాయులకు సత్కారం

కంభం: మండలంలోని పెద్దనల్లకాలువ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎస్.ఏ.ఖాదర్‌ను ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. తురిమెళ్ల ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన కల్యాణిని ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ నాయుడు, ఉపాధ్యాయిని జ్యోతిలక్ష్మమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు సత్కరించారు.

ఉపాధ్యాయిని కల్యాణిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వక్ఫ్‌బోర్డు భూముల్లో ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి వక్ఫ్‌బోర్డు భూముల్లో ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం రెవెన్యూ, నగర పంచాయతీ, పోలీసు, ఆర్అండ్‌బీ అధికారులు ఓ అంచనాకు వచ్చినట్లు తెలిసింది. గతంలో ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, ఆ తరువాత ఎంతమంది కొత్తగా ఇళ్లు నిర్మించుకున్నారు, ప్రస్తుతం మొత్తం ఎంతమంది ఆక్రమణల్లో ఉన్నారన్న విషయాలపై వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ పోలీసు అధికారులతో సమావేశమై చర్చించినట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో ఆక్రమణలను పూర్తిగా తొలగించనున్నట్లు తెలిసింది.

ఈనాడు కథనానికి స్పందన

పార్టీ బలోపేతానికి కృషి

మార్కాపురం: నియోజకవర్గంలో వైకాపా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సోమవారం మార్కాపురంలోని జవహర్ నగర్‌లోని అన్నా రాంబాబు నివాసంలో ఇటీవల వైకాపా రాష్ట్ర ట్రేడ్ యూనియన్ సహాయ కార్యదర్శిగా ఎంపికైన బట్టగిరి తిరుపతిరెడ్డి రాంబాబును మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.

సర్వే పూర్తి చేయండి

మార్కాపురం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయంలో సచివాలయ అధికారులతో జిల్లా నోడల్ అధికారి వి.గిరిధరశర్మ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా పోలీసులందరూ తమ సచివాలయ పరిధిలోని అనాథ బాలుర వివరాలను తక్షణమే సర్వే చేయాలన్నారు. ఈ నెల 10వ తేది లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

11న ఉచిత కంటి వైద్యశిబిరం

పుల్లలచెరువు (యర్రగొండపాలెం), న్యూస్‌టుడే: ముటుకుల పీహెచ్‌సీలో ఈనెల 11న శంకర కంటి వైద్యశాల సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు శంకర్ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గిద్దలూరు మండలంలోని అంబవరం విద్యుత్తు లైను మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ శేషగిరిరావు తెలిపారు. ముండ్లపాడు, బురుజుపల్లె, కృష్ణంశెట్టిపల్లె, కంచిపల్లె, పీఆర్‌కాలనీ విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్తు సరఫరా ఉండదని, వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

కంభం: సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ మల్లికార్జున పేర్కొన్నారు. స్థానిక వాసవీ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్, సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు ఆయా విషయాలపై పలు సూచనలు చేశారు. ఎస్సై నరసింహారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న సీఐ మల్లికార్జున

హనుమంతునిపాడు: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మాధవరావు సూచించారు. సోమవారం హెచ్ఎంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వీటి నియంత్రణపై అవగాహన కల్పించారు. లాటరీలో మీకు బహుమతులు వచ్చాయని, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నంబరు చెప్పాలని మోసాలకు పాల్పడినా, గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించినా, అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్ ఉపయోగించడం తగ్గించాలని కోరారు.

పొగాకు రైతులకు తప్పని తిప్పలు

పొదిలి, న్యూస్‌టుడే: పొగాకు రైతులకు ఈ ఏడాది గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పొదిలి వేలం కేంద్రంలో సరాసరిన 800 బేళ్లు వేలానికి తీసుకురాగా అందులో 25 శాతానికి పైగా బేళ్లు తిరస్కరణకు గురవుతున్నాయి. ఆ బేళ్లను తిరిగి ఇళ్లకు తీసుకెళ్లి తీసుకురావడం రైతులకు కష్టతరంగా మారుతోంది. ఆ బేళ్లను మరోసారి గ్రేడింగ్ చేసుకుని తెచ్చుకోవడం వల్ల అదనపు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు అన్నిరకాల బేళ్లను కొనుగోలుచేయాలని, రైతులకు అన్నిరకాల గ్రేడ్లకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

తిరస్కరణకు గురైన బేళ్లను ట్రాక్టర్‌లో ఇళ్లకు తీసుకెళ్తున్న రైతులు

గుంతల రహదారితో అవస్థలు

బేస్తవారపేట: మండలంలోని చింతలపాలెం ప్రధాన రహదారి గుంతలమయంగా తయారైంది. ఆ గ్రామ ప్రారంభం నుంచి హజరత్‌గూడెం వరకు సుమారు కిలోమీటర్ మేర ఉన్న సీసీ రహదారి పూర్తిగా గుంతలు పడటంతో అటుహజరత్‌గూడెం, ఇటు చింతలపాలెం రెండు గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన రహదారి కావడంతో ప్రస్తుతం రహదారంతా శిథిలావస్థకు చేరింది. రహదారి మరమ్మతుల విషయాన్ని పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా వారిలో కనీస స్పందనకరవైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయం

ఒంగోలు కలెక్టరేట్: అందరినీ అక్షరాస్యులుగా మార్చే 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2029 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలన్నది లక్ష్యమని తెలిపారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 1,29,497 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఆగస్టు 7 నుంచి బోధన ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలోగా వాలంటీర్ల గుర్తింపు, శిక్షణ తరగతుల ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

వసతుల కల్పన దిశగా అడుగులు

☛ రహదారులు, కాలువ అభివృద్ధికి ప్రతిపాదనలు

పక్కా కాలువలకు నోచుకోనున్న పిడతల రాంభూపాల్‌రెడ్డి కాలనీ

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు పట్టణంలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించే దిశగా ముందుకు వెళుతున్నారు. నగర పంచాయతీగా ఉన్న గిద్దలూరును పురపాలకగా హోదా కల్పించారు. పట్టణంలో పలు వీధుల్లో పక్కా కాలువలు, అంతర్గత రహదారులు సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం గమనించారు. వర్షాకాలంలో వారు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న ఆ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం : పురపాలకలో ఏడాదికేడాది శివారు ప్రాంతాల్లో నివాస గృహాలు పెరిగిపోతున్నాయి. గత వైకాపా పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. దీంతో మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యే దృష్టిపెట్టారు. ఇప్పటికే సుమారు రూ.3 కోట్లతో రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి పలు సిమెంట్ రహదారి నిర్మాణం పనులు పూర్తిచేశారు.

తాజాగా... : జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిధులతో 7 అభివృద్ధి పనులను రూ.1.67కోట్లతో చేపట్టేందుకు జిజిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపారు. గిద్దలూరు 20వ వార్డులోని ఎస్టీకాలనీలో పక్కా కాలువ నిర్మాణానికి రూ.17లక్షలు, 13వ వార్డులోని పాతాళనాగేశ్వరస్వామి దేవస్థానం నుంచి శ్రీనివాస థియేటర్ వరకు పక్కాకాలువ కోసం రూ.21లక్షలు, 19వ వార్డులోని రాచర్ల రహదారిలోని పిడతల రాంభూపాల్‌రెడ్డి కాలనీలో ఇరువైపులా పక్కా కాలువ నిర్మాణానికి రూ.52లక్షలు, 17వ వార్డులో బుక్కె సావిత్రి ఇంటి నుంచి గంగయ్య గృహం వరకు రహదారి నిర్మాణానికి రూ.18లక్షలు, 7వ వార్డులోని ఆర్యవైశ్యకాలనీ సమీపంలోని చాంద్‌బాషా ఇంటి నుంచి రీటా శ్రీనివాసులు ఇంటి వరకు రహదారి నిర్మాణం కొరకు రూ.15లక్షలు, 17వ వార్డు నల్లబండ వీధిలోని ప్రధాన రహదారి నుంచి నాయీ బ్రాహ్మణ కాలనీ వరకు రహదారి నిర్మాణం చేపట్టేందుకు రూ.24లక్షలు, గిద్దలూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీనివాసనగర్ ప్రాంతంలో సిమెంట్ రహదారి నిర్మాణానికి రూ.20లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా జిల్లా డీఎంఎఫ్‌టీ అధికారులు నిధుల కోసం ఆమోదం తెలియజేశారు.

మెరుగుపడనున్న గిద్దలూరు శ్రీనివాసనగర్‌లోని అంతర్గత రహదారి

(c) eenadu

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

పీసీపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వెంగళాయపల్లిలో నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి 220 పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. దీని పరిధిలో ఎక్కువ మంది ఓటర్లు ఉండటంతో మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో 1,396 మంది ఓటర్లు ఉన్నారని, పక్కనే ఉన్న మరో పాఠశాల భవనంలో నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు పరిశీలించినట్లు చెప్పారు. తహసీల్దార్ ఉష, వీఆర్వో మధు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

వెంగళాయపల్లిలో పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, అధికారులు

◗ సి.ఎస్.పురం: మండలంలోని రేగులచెలక గ్రామంలో 1200 మంది ఓటర్లు దాటినందున ఎన్నికల కమిషన్ సూచనల మేరకు అదనంగా రెండో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆ పంచాయతీ పరిధిలోని గణేశునిపల్లి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం రేగులచెలకలోని ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఉండగా.. అది చాలా చిన్నదిగా ఉండడంతో ఎన్నికల సిబ్బంది, ఓటర్లకు ఇబ్బందిగా ఉంటుండడంతో గణేశునిపల్లి ప్రాథమిక పాఠశాలలో రెండో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్, సీనియర్, జూనియర్ సహాయకులు కె.పద్మనాభం, మన్సూర్, స్థానికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

దర్శి, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రఓబనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఏడుగురు ఉపాధ్యాయులకు ఘనంగా సత్కారించారు. ఉపాధ్యాయులు సాంబయ్య, రంగస్వామి, శ్రీనివాసులు, చిన్న మహబూబ్, నాగలత, రాజునాయక్, పార్వతిలకు హెచ్‌ఎం ఆదిశేషయ్య అధ్యక్షతన పూలదండలు, శాలువాలతో సన్మానం చేశారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల శ్రేయస్సుకు వారి చేసిన కృషిని కొనియాడారు. పాఠశాల కాంప్లెక్స్ ఛైర్మన్ ప్రకాశరావు, ఉపాధ్యాయులు చక్రధర్, విజయశాంతి, శ్రీనివాసరెడ్డి, నాగరాజమ్మ, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.
◗కొండపి గ్రామీణం: మండలంలోని కె.ఉప్పలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సోమవారం ప్రధానోపాధ్యాయుడు సుసన్న కుమార్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. తెలుగు పండితురాలు కె.విశాల టంగుటూరు మండలం పొందూరుకు, గణిత ఉపాధ్యాయురాలు విజయ కందులూరు ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా వెళ్తున్నట్లు తెలిపారు. వారిని పాఠశాల సిబ్బందితో కలిసి సత్కరించారు.
◗ మర్రిపూడి: మండలంలోని గార్లపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బిక్షాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు మురళి, గౌస్‌బాషా, అమరేశ్వరి, విశ్రాంత ఎంఈవో2 ప్రసాద్ రెడ్డిలను పూలమాల, శాలువాలతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు రాఘవాచారి పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయాలని ర్యాలీ

టంగుటూరు, న్యూస్‌టుడే: ఈ నెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ, అనుబంధ సంఘాలు సోమవారం టంగుటూరులో ర్యాలీ చేపట్టాయి. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ప్రతి కార్మికుడికి రూ.26 వేలు వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు టంగుటూరి రాము, మోజెస్, ప్రభాకర్, కాలేషా బేగ్, వెంకట్రావు, బ్రహ్మానందం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

పామూరు, న్యూస్‌టుడే: పామూరులో సోమవారం మొహర్రం సందర్భంగా భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. స్థానిక మార్కెట్ పీర్ల చావిడి, కందుకూరు, సి.ఎస్.పురం రోడ్లలో ఉన్న పీర్లకు ముజావర్లు, హిందూ, ముస్లిం సోదరులు పూజలు నిర్వహించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో ఊరేగించి జలధిస్నానానికి తరలించారు. సీఐ భీమానాయక్, ఎస్సై కిశోర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ఆదినంద పాల్గొన్నారు.
◗ దొనకొండ: దొనకొండ మండలంలోని ఇండ్లచెరువులో పీర్ల పండగను సోమవారం నిర్వహించారు. పీర్లను పూలతో అందంగా అలంకరించి వాటిని ఎత్తుకొని వీధుల్లో ఊరేగించారు. గ్రామస్థులు అంతా టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పామూరులో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

దొనకొండ మండలం ఇండ్లచెరువు గ్రామంలో..

పొగాకు కనిష్ఠ ధర రూ.160

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో సోమవారం సరాసరి ధర రూ.221 పలికింది. ఎం.నిడమానూరుకు చెందిన రైతులు 912 పొగాకు బేళ్లు తీసుకురాగా..746 కొనుగోలు చేశారు. 166 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160 పలికినట్లు వేలం కేంద్ర నిర్వాహకుడు అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.
◗ కొండపి గ్రామీణం: కొండపి వేలం కేంద్రంలో 253 పొగాకు బేళ్లను తిరస్కరించినట్లు నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని పెరిదేపి, ముప్పరాజుపాలెం, మిట్టపాలెం, అనకర్లపూడి గ్రామాలకు చెందిన రైతులు కేంద్రానికి 981 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, అందులో 728 కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160 పలికిందన్నారు.

కదిలిన యంత్రాంగం.. సమస్యల పరిష్కారం

న్యూస్‌టుడే, కనిగిరి, ఈనాడు ఒంగోలు

ఈనాడు మీ తోడు

ప్రభుత్వ యంత్రాంగం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కదలి వచ్చింది. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే తక్షణ పరిష్కారం చూపింది. సోమవారం కనిగిరి పట్టణంలోని మాచవరం, బీసీ, ఎస్సీ కాలనీల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డితో నిర్వహించిన ఉదయపు కార్యక్రమంలో మున్సిపల్ అధికార్లు, సచివాలయ సిబ్బంది, కార్మికులు పాల్గొని గుర్తించిన సమస్యలన్నింటికీ సాయంత్రంలోగానే పరిష్కారం చూపారు.

పూడిక తీస్తున్న సిబ్బంది

ఎస్సీ కాలనీకి వెలుగులు

చిల్లచెట్లు తొలగాయి.. వెలుగులు విరజిమ్మాయి..

'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ఉదయపు నడకలో పాల్గొన్న ఎమ్మెల్యే.. మూడు ప్రాంతాల్లోనూ ఖాళీ స్థలాలు, రోడ్ల కిరువైపులా, గృహాల వద్ద ఉన్న పిచ్చిమొక్కలు, చిల్లచెట్లను వంద శాతం తొలగింపజేయించి రాకపోకలకు ఇబ్బందులు తీర్చారు.
● మంచినీటి పథకాల వద్ద శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. మురుగునీరు సాఫీగా పోయేలా జేసీబీతో కాలువలను తీయించారు. ఎల్ఈడీ వీధి లైట్లు 50 వరకు కొత్తవి వేశారు.
● పూర్తిగా వెలగని, రాత్రి, పగలు వెలుగుతున్న వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు. కుళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేయించారు.● రోడ్లపై గుంతలను పూడ్పించారు.
● జాతీయ రహదారి నుంచి మాచవరం, బీసీ, ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పెద్ద దిమ్మలు, కట్టడాన్ని జేసీబీతో తొలగించారు. వర్షపు నీరు పోయేలా కాలువ ఏర్పాటు చేశారు. ● పదేళ్లుగా మాచవరం జడ్పీ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, మంచినీటి పథకం వద్ద చిల్ల చెట్లు, పిచ్చిమొక్కలు మొలిచి విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఈ రెండు ప్రాంతాల్లో పూర్తిగా జంగిల్ క్లియరెన్స్ చేశారు. వర్షపు నీరు నిల్వ చేరకుండా ఏర్పాట్లు చేశారు.
● ఉదయపు నడకలో పట్టణవాసుల నుంచి వివిధ సమస్యలపై ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించారు. కాలువలు, సీసీరోడ్లు, పాఠశాల భవనం, వంతెన, పైపులైన్ నిర్మాణానికి సంబంధించిన పనులు చేపట్టాలని స్థానికులు కోరారు. అందుకు ఆయన రూ.65 లక్షలు మున్సిపాలిటీ నిధులు వెచ్చించేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. అవి మంజూరు కాగానే యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా రేషన్ కార్డులు, పింఛన్లు తదితర సమస్యలను కూడా పలువురు ఆయన దృష్టికి తీసుకురాగా.. ప్రభుత్వపరంగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ మాధవరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, ఎమ్మెల్యే ప్రతినిధి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

జేసీబీతో రోడ్డుపై నీరు నిలవకుండా ఎత్తుచేస్తూ..

శుభ్రం చేసిన మంచినీటి ట్యాంకు

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

దర్శి: ప్రణాళికతో ముందుకు సాగితే డిగ్రీతో పాటు ఉద్యోగం సంపాదించి జీవితంలో స్థిరపడవచ్చని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ స్టడీస్ సంస్థ సభ్యుడు దినేష్ అన్నారు. దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రభుదాస్, దినేష్‌లు.. మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు భవిష్యత్తులో ఏ ఉద్యోగం చేయాలో నిర్ణయించుకుని డిగ్రీతో పాటు ఆన్‌లైన్ కోచింగ్ తీసుకోవాలని తద్వారా జీవితంలో స్థిరపడవచ్చన్నారు. అధ్యాపకులు నగేష్, వేణు, సౌరిలమ్మ, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

హనుమంతునిపాడు: పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాతల చేయూత స్ఫూర్తిదాయకమని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బొప్పరాజు సుబ్బారావు అన్నారు. సోమవారం మండలంలోని సీతారాంపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, హర్షవర్ధనరెడ్డిలు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.20 వేల విలువచేసే మైక్‌సెట్‌ను అందజేశారు. విశ్రాంత ఏఈ టి.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వేధింపులపై ఫిర్యాదు చేయండి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రణాళికతో చదివి లక్ష్యాన్ని సాధించాలని పామూరు సీఐ ఎం.భీమానాయక్ సూచించారు. మండలంలోని సి.నాగులవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎవరు ఇబ్బందులు కలిగించినా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని చెప్పారు. మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే నష్టాలు, ఇంటర్నెట్ వినియోగించే విధానం, చరవాణి వాడకం తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.డేవిడ్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సీఐ భీమానాయక్

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కనిగిరి, వెలిగండ్ల: కనిగిరి, వెలిగండ్ల మండలాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పుట్టిన రోజు కావడంతో నాయకులు, కార్యకర్తలు కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు సురేష్, కోటయ్య పాల్గొన్నారు. ◗ కురిచేడు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని కురిచేడులో నిర్వహించారు. తొలుత కేక్ కోసి మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఎంఆర్‌పీఎస్ నాయకుడు జ్ఞానసుందర్‌రాజ్ ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. ◗ దర్శి: తెదేపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు, లలిత్‌సాగర్‌లు కేకు కోసి మందకృష్ణ మాదిగకు శుభాకాంక్షలు తెలిపారు. యోగేశ్వరరావు, తెల్లయ్య, చిన్నయ్య, మణీందర్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: తాళ్లూరు మండలంలోని విఠలాపురం పాతూరులో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో తేలికపాటి వర్షం కురిసినా నీరంతా ప్రధాన రహదారిపైనే నిలిచిపోతుంది.
– వెంకటేశ్వర్లు, గ్రామస్థుడు
✓: త్వరలోనే పరిశీలించి మురుగు, వర్షం నీరు నిలవకుండా చర్యలు చేపడతాం. –దారా హనుమంతరావు, ఎంపీడీవో

?: మర్రిపూడి మండలం చిమట పంచాయతీలోని తూర్పుకొత్తూరులో వీధి దీపాలు మరమ్మతులకు గురికావడంతో రాత్రి పూట ఇబ్బందిగా ఉంటుంది. – వీరనారాయణ, స్థానికుడు
✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. –నాగూర్‌వలి, ఈవోఆర్డీ

?: ముండ్లమూరు మండలం తూర్పుకంభంపాడులోని కాలువల్లో చెత్త, చెదారం పేరుకుపోయి మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు. – గ్రామస్థులు
✓: పంచాయతీ కార్యదర్శికి తెలియజేసి వెంటనే కాలువలను శుభ్రం చేయిస్తాం. –జనార్దన్, డిప్యూటీ ఎంపీడీవో

?: కురిచేడు మండలం అలవలపాడు పంచాయతీలోని పెనగమూరులో కాలువలను నిర్మించలేదు. మురుగునీరు రోడ్డు పక్కన చేరుతోంది. – వెంకయ్య, స్థానికుడు
✓: కాలువలు నిర్మించాలని ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం.
– అల్లూరురెడ్డి, పంచాయతీ కార్యదర్శి

-న్యూస్‌టుడే, తాళ్లూరు, మర్రిపూడి, ముండ్లమూరు, కురిచేడు

ఆక్రమణల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

కనిగిరి: పట్టణంలోని విజయమార్తాండేశ్వర దేవస్థానం భూములు, విలువైన కాంప్లెక్స్ స్థలం, ఇతర దేవాలయాల భూములు అన్యాక్రాంతంపై గత నెల 30న.. 'అంతా అయ్యాక మేల్కొన్నారు' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన దేవాదాయ శాఖ ఈవో నరసింహబాబు సోమవారం పట్టణంలోని విజయమార్తాండేశ్వర దేవస్థానం కాంప్లెక్స్ స్థలంలో నిర్మించిన కట్టడాలను కూల్చి వేయించారు. దీనిపై ఆక్రమణదారులకు ఈవోకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. దేవస్థానం స్థలం ఎంతవరకు ఉంటే అంత వరకు స్వాధీనం చేసుకున్నామే తప్ప ఎవరి స్థలాన్ని స్వాధీనం చేసుకోలేదని స్పష్టం చేశారు. ఫోర్జరీ సంతకాలతో నకిలీ పట్టాలు తీసుకొచ్చి చూపిస్తే కేసులు పెట్టిస్తామని హెచ్చరించారు. తమ వద్ద దేవస్థానం ఆస్తులకు సంబంధించి ఒరిజనల్ పత్రాలు ఉన్నాయని, వాటి ప్రకారమే ఆక్రమణలు తొలగిస్తున్నట్లు తెలిపారు. వివాదం విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు రావడంతో ఆక్రమణదారులు వెళ్లి పోయారు.

దేవస్థానం స్థలంలో అక్రమ కట్టడాలను కూల్చి వేయిస్తున్న ఈవో నరసింహబాబు

పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

పామూరు, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. పామూరులోని వాటర్ ట్యాంక్ వీధిలో సోమవారం ఆయన 'సుపరి పాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ..సంక్షేమ పథకాలను వివరించారు. పేదరికం లేని సమాజ నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అనంతరం స్థానిక శేషమహల్ ప్రాంగణంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. గత వైకాపా ప్రభుత్వం దౌర్జన్యాలు, అరాచకాలు, కక్షసాధింపు చర్యలకు పాల్పడిందని.. అందుకే ప్రజలు కూటమికి పట్టం కట్టారని వివరించారు. నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. మండలంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల తెదేపా అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ జి.దశరథరామయ్య, తెదేపా నాయకులు వై.శ్రీనివాసులు, ఏ.ప్రభాకర్‌చౌదరి, జి.శ్రీను, ఎస్‌కే.గౌస్‌బాషా, ఇ.శ్రీనివాసులురెడ్డి, ఎస్టీ.అమీర్‌బాబు, ఎన్.నాగేంద్రాచారి, ఎ.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో మహిళలతో మాట్లాడుతున్న తెదేపా నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి

◗ కనిగిరి: 7వ వార్డులో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. తెదేపా నాయకులు టి.శ్రీనివాసులరెడ్డి, హజరత్‌రెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.
◗ వెలిగండ్ల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డీసీఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మరపగుంట్ల, మొగుళ్లూరు పంచాయతీల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మాట్లాడారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. నాయకులు వెంకటరెడ్డి, ఇంద్రభూపాల్ రెడ్డి, శ్రీను, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
◗దర్శి: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన సాగుతుందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పాపారావుతో కలిసి 12వ వార్డులో ఇంటింటికీ తిరిగి పథకాలను వివరించారు. రూ.30 లక్షలతో సైడ్ కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య, నాయకులు లలిత్‌సాగర్, వెంకటేశ్వర్లు, చిన్నా, చంద్ర, రంగా పాల్గొన్నారు.
◗ తాళ్లూరు: రజానగరం, మల్కాపురంలో మండల తెదేపా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి పథకాలను వివరించారు.

పామూరులో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తం

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మాధవరావు సూచించారు. సోమవారం హెచ్‌ఎంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వీటి నియంత్రణపై అవగాహన కల్పించారు. లాటరీలో మీకు బహుమతులు వచ్చాయని, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నంబరు చెప్పాలని మోసాలకు పాల్పడినా, గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించినా, అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్ ఉపయోగించడం తగ్గించాలని కోరారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, సీసీ కెమెరాల పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవకతవకలకు అడ్డుకట్ట!

☛ పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా చర్యలు

న్యూస్‌టుడే, పామూరు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. లబ్ధిదారులకు ఇచ్చే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా కేంద్ర ప్రభుత్వం ముఖ ఆధారిత హాజరు అమలు చేస్తోంది. ఈ నెల ఒకటి నుంచి పోషణ్ ట్రాకర్ పేరుతో ముఖ ఆధారిత హాజరు ద్వారా సరకులు పంపిణీకి ఏర్పాట్లు చేసింది. దీనివల్ల ఎలాంటి అవకతవకలకు అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి ఎంత మంది లబ్ధిదారులు వచ్చారో చరవాణి ద్వారా చిత్రాలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సరకులు పంపిణీ చేసేటప్పుడు, ఆహారం అందించే సమయంలోనూ ముఖ ఆధారిత గుర్తింపు తీసుకుంటున్నారు.

పునుగోడులో ముఖ హాజరు నమోదు చేస్తున్న సిబ్బంది

ముఖ ఆధారిత హాజరు నమోదుతో..

ముఖ ఆధారిత హాజరు నమోదుకు కేంద్ర మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. దీని ద్వారా లబ్ధిదారుల హాజరు తీసుకుని వివరాలు నమోదు చేసుకుంటారు. దీని ఆధారంగానే సరకులు పంపిణీ చేస్తారు. కనిగిరి నియోజకవర్గంలోని వెలిగండ్ల ప్రాజెక్టు పరిధిలో 205, కనిగిరి ప్రాజెక్టులో 238 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. లబ్ధిదారులకు ఉదయం, సాయంత్రం హాజరు తీసుకుంటారు. కేంద్రాల్లో చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజన సమయంలోనూ చిత్రాలు తీయడంతో పాటే ఈ వివరాలు పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రెండు యాప్‌ల్లోనూ అభ్యర్థుల వివరాలను అంగన్‌వాడీ సిబ్బంది నమోదు చేస్తున్నారు. ముఖ ఆధారిత హాజరు నమోదుతోనే కార్యకర్తలు లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేయాలని కనిగిరి, వెలిగండ్ల ఐసీడీఎస్ సీడీపీవోలు పి.సరోజిని, కె.కxపావరం సిబ్బందికి స్పష్టం చేశారు. అర్హులందరూ వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారులు	గర్భిణులు	బాలింతలు
కనిగిరి	238	8,357	812	740
వెలిగండ్ల	205	4,233	406	292 మంది

ఆలయ ఆదాయం రూ.1,48,681

సి.ఎస్.పురం: మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.1,48,681 వచ్చినట్లు ఈవో ఎస్.నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ కె.చిన్నఆదినారాయణ తెలిపారు. స్వామివారి దర్శన టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.66,230, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.29,870, శాశ్వత అన్నదాన పథకానికి రూ.52,581 విరాళాలు వచ్చాయి.

అన్న క్యాంటీన్ పనుల పునఃప్రారంభం

దర్శి, న్యూస్‌టుడే: పేదలకు రూ.5లకే అల్పాహారం, భోజనం అందించే అన్న క్యాంటీన్ పనులు దర్శిలో సోమవారం పునఃప్రారంభమయ్యాయి. అక్టోబర్ 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించే క్యాంటీన్లలో ఇది కూడా ఒకటి. భవనం చుట్టూ ఉన్న పిచ్చి చెట్లను తొలగించారు.

కారు ఢీకొని మృతి: పెళ్లింట తీవ్ర విషాదం

దుత్తలూరు: ఆ ఇంట్లో మరో పది రోజుల్లో కుమారుడి వివాహం. తల్లిదండ్రులు ఏర్పాట్లు చేస్తున్నారు. బంధువులతో ఇంటిల్లిపాది సందడి. వారిని చూసిన విధికి కన్నుకుట్టింది. కారు రూపంలో వరుడి తండ్రి మృత్యు ఒడికి చేరుకున్నారు. ఈ ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలంలోని నందిపాడులో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... నందిపాడు కూడలికి చెందిన నల్లబోతుల వెంకటేశ్వర్లు (54) ఉదయగిరి వెళ్లేందుకు బస్సు కోసం రహదారి పక్కనే దుకాణం వద్ద నిరీక్షిస్తున్నారు. ఈ సమయంలో కనిగిరి నుంచి తిరుపతి వెళుతున్న కారు ఇక్కడికొచ్చేసరికి ఉదయగిరి నుంచి సంగం వెళుతున్న కారును ఢీకొంది. దీంతో తిరుపతి వెళుతున్న కారు టైరు పగిలి జాతీయ రహదారి పక్కనే ఉన్న దుకాణాల వైపు దూసుకొచ్చింది. అక్కడే ఉన్న వెంకటేశ్వర్లును ఢీకొని ఈడ్చుకుంటూ వెళ్లగా అక్కడిక్కడే అతడు మృతి చెందారు. ఉదయగిరి సీఐ ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వెంకటేశ్వర్లుకు ముగ్గురు పిల్లలు. రెండో కుమారుడికి పది రోజుల్లో వివాహం చేయనున్నారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బంధువులు రావడంతో ఇల్లంతా కోలాహలంగా ఉంది. ఇంతలోనే వెంకటేశ్వర్లు మృతి చెందారన్న వార్త తెలిసి కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

కనిగిరి: మున్సిపాలిటీలోని బీసీ కాలనీకి చెందిన చల్లా వెంకటరామయ్య కనిగిరి నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. పామూరు నుంచి వస్తున్న లారీ పట్టణంలోని కొత్తూరు వద్ద సోమవారం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో కమ్యూనిటీ వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీరామ్ కేసు నమోదు చేశారు.
◗ హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై పొన్నలూరు వెళ్లేందుకు వి.రమేష్, తన కుమారుడు మనోజ్‌కుమార్‌తో కలిసి వస్తున్నారు. కనిగిరి మండలం పేరంగుడిపల్లి వద్దకు వచ్చే సరికి పీసీపల్లి మండలం పెదఅలవలపాడు వైపు నుంచి కనిగిరికి వస్తున్న ఆటో వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. తండ్రి శిరస్త్రాణం ధరించడంతో స్వల్ప గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న కుమారుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా కనిగిరి సీహెచ్‌సీకి, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శ్రీనివాసులరెడ్డి తెలిపారు.
◗ ముండ్లమూరు: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటన మారెళ్ల సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పూరిమెట్ల గ్రామానికి చెందిన మీసాల సిద్ధయ్య సుంకరవారిపాలెం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతున్నాడు. సుంకరవారిపాలేనికి చెందిన ఎం.బ్రహ్మయ్య మారెళ్ల నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో మారెళ్ల-సుంకరవారిపాలెం దారిలో రెండు వాహనాలు ఢీకొనడంతో బ్రహ్మయ్య గాయపడ్డారు. ప్రైవేటు వాహనంలో నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

జననం: 10-10-1943
మరణం: 25-06-2025

మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి, మా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన మా తండ్రిగారైన కీ॥శే॥ అన్నంగి వెంకటరత్నం గారు తేది.25-06-2025 బుధవారం స్వర్గస్తులైనారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

కుమారుడు : అన్నంగి వెంకట రమేష్
Sri Savitr Solar Pvt.Ltd.
Annangi Industries Pvt.Ltd.
మరియు కుటుంబసభ్యులు

పెద్దకర్మ: తేది.09-07-2025 బుధవారం ఉదయం 11.30 గం॥లకు సింగరాయకొండ ప్రశాంతి థియేటర్ ఎదురుగా గల మా స్వగృహం నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయటమైనది.

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

యువతికి వేధింపులు... ▶ ఒంగోలులో యువకుడి దురాగతం

ప్రశ్నించిన మేనమామపై హత్యాయత్నం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: యువతిని వేధిస్తున్న విషయం ప్రశ్నించినందుకు ఓ యువకుడు... కత్తితో దాడికి తెగబడ్డాడు. ఒంగోలులో సోమవారం రాత్రి చోటుచేసుకున్న ఈ సంఘటనలో యువతి మేనమామకు తీవ్ర గాయాలయ్యాయి. తాలూకా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు ఆంధ్రకేసరి నగర్ ప్రాంతానికి చెందిన యువతిని మారుతీనగర్‌కు చెందిన అఖిల ఆనంద్ అనే యువకుడు కొద్ది రోజులుగా వేధిస్తున్నాడు. ఈ విషయం బాధితురాలు తన సోదరుడికి తెలియజేసింది. దీంతో ఆయన బంధువులతో కలిసి ఆనంద్‌పై ఆదివారం దాడి చేశారు. దీన్ని మనసులో పెట్టుకున్న ఆనంద్... కర్నూలు రోడ్డులోని ఓ హోటల్ సమీపంలో యువతి సోదరుడు ఉన్నాడని తెలుసుకుని... మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో కత్తితో దాడి చేశాడు. తప్పించుకున్న ఆయన విషయాన్ని ఫోన్ ద్వారా తన మేనమామకు తెలియజేశాడు. ఆయన అక్కడకు చేరుకోగా... ఆతడిపైనా ఆనంద్ కత్తితో దాడి చేశాడు. తల, కడుపు, మణికట్టు, ఎడమకాలి తొడకు తీవ్ర గాయాలు కావడంతో... స్థానికులు ఆయనను నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఇదే క్రమంలో అక్కడున్న వ్యక్తులు రాళ్లతో దాడి చేయడంతో ఆనంద్‌కూ గాయాలయ్యాయి. అతడిని జీజీహెచ్‌కు తరలించారు. తాలూకా సీఐ టి.విజయకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొత్తపట్నం, న్యూస్‌టుడే: నిర్వహణ పనుల కారణంగా మడనూరు గ్రామంతో పాటు ఆ పరిధిలోని ఆక్వా చెరువులకు... మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చంద్రకాంత్ తెలిపారు.

రుణాల చెల్లింపుతో పరపతి మెరుగు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలకు స్త్రీనిధి కింద రూ.214 కోట్లు మంజూరయ్యాయని ఏపీఎం విజయకుమారి తెలిపారు. కొత్తపట్నం వెలుగు కార్యాలయంలో వీవోఏలకు సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు సక్రమంగా తిరిగి చెల్లించాలన్నారు. తద్వారా పరపతి పెరిగి మరింత ఎక్కువ రుణం పొందవచ్చన్నారు. బకాయిలు ఉంటే వెంటనే చెల్లించాలని సభ్యులకు సూచించారు. ఏపీఎం విజయకుమారి, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, సుధాకర్, రామారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 'సుపరిపాలనలో తొలి అడుగు... ఇంటింటికీ తెదేపా'లో భాగంగా సోమవారం... ఒంగోలు 24వ డివిజన్‌లోని బండ్లమిట్ట, 25వ డివిజన్‌లోని దేవరాజులవీధిలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పర్యటించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాల మంజూరులో తలెత్తిన ఇబ్బందులను పలువురు తెలియజేశారు. ఉప మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్ ఎస్.శైలజ, నాయకులు కొల్లిపల్లి సురేష్, గుంటూరి రాంబాబు, అజయ్ తదితరులు పాల్గొన్నారు. ▶ నగరంలోని అన్ని డివిజన్ల పరిధిలో స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గోపాలనగర్ అయిదో లైన్‌లో ఐటీసీ సహకారంతో రూ.5 లక్షలతో నిర్మించిన శుద్ధ జల కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జనార్దన్

రామతీర్థం... విద్యుత్తుకేదీ ప్రాప్తం!

చీమకుర్తి - న్యూస్‌టుడే

తాగు, సాగునీటి అవసరాలు తీర్చే కల్పతరువుగా పేరొందిన రామతీర్థం జలాశయానికి విద్యుత్తు సౌకర్యం లేక చిక్కులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా గేట్ల నిర్వహణకు గంటల తరబడి శ్రమించాల్సి వస్తోంది. ఈ క్రమంలో విలువైన జలాలూ వృథాగా పోతున్నాయి.

ఏళ్లుగా సమస్య...: బకాయిలు చెల్లించలేదని దాదాపు పన్నెండేళ్ల క్రితం రామతీర్థం జలాశయానికి విద్యుత్తు సరఫరా నిలిపేశారు. అప్పటి నుంచి మాన్యువల్ విధానంలోనే గేట్ల నిర్వహణ చేపడుతున్నారు. కట్టలపై ఏర్పాటు చేసిన దీపాలు సైతం అలంకారప్రాయంగా మారాయి. ఈ విషయమై 'ఈనాడు'లో కథనాలు ప్రచురితం కావడంతో బకాయిలు చెల్లింపు దిశగా అధికారులు చర్యలు తీసుకున్నారు. చేపల పెంపకందారుల ద్వారా వచ్చిన మొత్తంతో కొద్ది నెలల క్రితం బకాయిలు చెల్లించారు. త్వరలోనే విద్యుత్తు సౌకర్యం సమకూరుతుందని అధికారులు చెప్పినా... ఆ దిశగా ఆశించిన స్థాయిలో అడుగులు పడక నేటికీ సమస్య కొనసాగుతోంది.

▶ గేట్ల నిర్వహణకు తప్పని పాట్లు

కట్టపై అలంకారప్రాయంగా విద్యుత్తు దీపాలు

☛ జలాశయం వద్ద ఉన్న పరివర్తకాన్ని వినియోగంలోకి తెచ్చి సరఫరా పునరుద్ధరించాలని జలవనరుల శాఖ వారు విద్యుత్తు శాఖ అధికారులను కోరారు. ఆ మేరకు ఏఈ, సిబ్బంది పరిశీలించారు. ఏళ్లుగా వినియోగంలో లేనందున సామగ్రి దెబ్బతిందని వాటిని సమకూరిస్తే సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. సామగ్రి కొనుగోలుకు అవసరమైన నిధులు లేక సమస్య మొదటికొచ్చింది. దాతల సహకారం తీసుకోవాలని భావించినా ఆ దిశగానూ చొరవ చూపలేదు.

వృథాగా పోతున్న జలాలు...: విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో జలాశయం నుంచి దిగువకు నీటి విడుదల, ఆపే సమయంలో... మాన్యువల్‌గా గేట్ల నిర్వహణకు జలవనరుల శాఖ ఇంజినీర్లు, సిబ్బంది నానాపాట్లు పడుతున్నారు. గేట్లు తుప్పుపట్టడంతో ఓ పట్టాన కదలడం లేదు. ఇటీవల జలాశయం నుంచి దిగువకు నీటి సరఫరా నిలిపే సమయంలో ఎంత ప్రయత్నించినా గేట్లు దిగకపోవడంతో క్యూసెక్కుల కొద్దీ నీరు వృథాగా పోయింది. చివరకు గజ ఈతగాళ్లను రప్పించి రెండు రోజుల పాటు శ్రమిస్తే తప్ప ప్రయోజనం లేకపోయింది. విద్యుత్తు గేట్లు ఉంటే ఈ సమస్య ఉండదని... వృథాకూ అడ్డుకట్ట వేయొచ్చని పలువురు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

కేవీపాలెం పథకానికి మోక్షం

ఈనాడు కథనానికి స్పందన

చీమకుర్తి, న్యూస్‌టుడే: కె.వి.పాలేనికి రామతీర్థం జలాలు అందించేందుకు ఉద్దేశించిన పథకం ద్వారా రెండు రోజుల్లో ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామానికి ఏళ్లుగా సాగర్ నీరందని విషయమై 'సాగర్ జలం... సాకారం ఎన్నడో' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శాంతిప్రియ, జడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు తదితరులు మర్రిపాలెం, కె.వి.పాలెంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. రెండు రోజుల్లో అవి పూర్తవుతాయని.. . అనంతరం ట్రయల్ రన్ నిర్వహిస్తామని ఏఈ తెలిపారు. నీటి పంపిణీ సంఘం అధ్యక్షుడు వెంకటనారాయణ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుదాస్‌కు ఉద్యోగోన్నతి సత్కారం

ఒంగోలు: జిల్లా పోలీసు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతి బదిలీపై ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ కార్యాలయ పర్యవేక్షకుడిగా మంగళగిరి వెళ్తున్న ఎ.ప్రభుదాస్‌ను ఎస్పీ దామోదర్ సత్కరించి, ఘనంగా వీడ్కోలు పలికారు. నూతన బాధ్యతలు మరింత సమర్థంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఏవో రామ్మోహనరావు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు

కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, నాయకులు

మద్దిపాడు, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో గాడితప్పిన రాష్ట్ర అభివృద్ధిని కూటమి ప్రభుత్వం పట్టాలెక్కించి పరుగులు పెట్టిస్తోందని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తెలిపారు. బూరేపల్లిలో సోమవారం రాత్రి నిర్వహించిన సుపరిపాలన కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పునరావాస కాలనీ వాసుల ఇక్కట్లు తీరుస్తామని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి స్వాములు, నియోజకవర్గ సలహాదారు మండవ జయంత్‌బాబు, మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, రామకృష్ణ, రాయపాటి శ్రీనివాసరావు, మందపల్లి శ్రీనివాసరావు, పీఎస్ఆర్, సర్పంచి రావిపాటి అంజమ్మ శేషయ్య; జనసేన, భాజపా మండలాధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం, రమణ తదితరులు పాల్గొన్నారు.

▶ అన్నంగిలోని ఏపీఎస్పీ బెటాలియన్ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అసిస్టెంట్ కమాండర్ జనార్దన్‌రెడ్డి, ఆర్ఐ వెంకటేశ్వర్లు, మద్దిపాడు ఎస్సై శివరామయ్య పాల్గొన్నారు.

▶ **చీమకుర్తి:** బిలాల్‌నగర్, ఎన్టీఆర్ నగర్ ప్రాంతాల్లో తెదేపా నాయకులు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, సుబ్బారావు, శేషారావు, కోటేశ్వరరావు, నాగయ్య, షేక్‌జానీ, శ్రీనివాసరావు, షేక్ జాకిర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

కొత్తపట్నం: మొహర్రం సందర్భంగా ఈతముక్కలలో సోమవారం రాత్రి పీర్ల ఊరేగింపు చేపట్టారు. ముందుగా పీర్లను ప్రత్యేకంగా అలంకరించి... భక్తిశ్రద్ధలతో గ్రామ వీధుల్లో తిప్పారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గ్రామంలో పీర్ల ఊరేగింపు

వైభవంగా సాయి పాదుకా సేవ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: చదలవాడలోని సాయి విష్ణు విల్లాస్‌లోని బాబా మందిరంలో సోమవారం.. సాయి పాదుకా సేవ ఘనంగా నిర్వహించారు. ముందుగా శిర్డీ (మహారాష్ట్ర) దేవస్థానం నుంచి తెచ్చిన సాయి పాదుకలను ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకువెళ్లారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. వేడుకలో కంది రవిశంకర్, కుటుంబ సభ్యులతో పాటు సంతపేట సాయి ఆలయం అధ్యక్షుడు అళహరి చెంచలరావు, పొన్నూరి శ్రీనివాసరావు, సర్పంచి దాసరి వరప్రసాద్, ఉప సర్పంచి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపుగా సాయి పాదుకలు తీసుకువెళ్తున్న రవిశంకర్, భక్తులు

సీతారాముల తిరు కల్యాణోత్సవం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కొప్పోలులో సీతారాముల తిరు కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆర్య వైశ్య బాల భక్త సమాజం ఆధ్వర్యంలో ఈ వేడుక చేపట్టారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

శిర్డీలో కూచిపూడి వైభవం

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గురుపూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా శిర్డీలోని సాయి మందిరంలో... నగరానికి చెందిన నళినీ ప్రియ కూచిపూడి నృత్యానికేతన్ విద్యార్థులు సోమవారం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా దేవస్థానం వారు కళాకారులను అభినందించి... ప్రత్యేక దర్శనం, ప్రసాదాలు అందజేసినట్లు శివకుమారి తెలిపారు.

ప్రభుత్వ ఖాజీగా అబ్బాస్

మద్దిపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడు నియోజకవర్గ ప్రభుత్వ ఖాజీగా మద్దిపాడుకు చెందిన షేక్ అబ్బాస్ నియమితులయ్యారు. ఆ మేరకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు. ముస్లిం సోదరులకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన సేవలందించాలని సూచించారు.

CHANGE OF NAME

I, **PARIMI MINNI BLESSY ISRAEL NEHU** (Old Name), W/o. **RAVIPATI VINOD KUMAR**, Resident of H.No.53-1-58(1), Cloughpet, 3rd line, near A.B.M.Degree College, Ongole, Prakasam District, Andhra Pradesh, Pin: 523001, India., have changed my name as **(New Name) PARIMI MINI NEHU W/o. RAVIPATI VINOD KUMAR.** Hereafter my name is known as **PARIMI MINI NEHU.**

మహారాజశ్రీ గౌరవ 12వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో, విజయవాడ

MVOP No.440/2021

Between

1. అచ్చిరాణి, 2. వల్లభనేని పవన్ కుమార్ ... పిటీషనర్స్

మరియు

చాకిరాల సునీల్ సాయికృష్ణ & ఇతరులు ... రెస్పాండెంట్స్

టు: (రెస్పాండెంట్ నెం. 1) **చాకిరాల సునీల్ సాయికృష్ణ,** తండ్రి: శేషగిరి, హిందువు, వయస్సు: 31 సం॥లు, కారు డ్రైవర్, డోర్ నెం. 1-19, ఎ.ఆర్. పోలీస్ క్వార్టర్స్, కర్నూల్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523 002.

పై నెంబరు పిటీషన్‌ను పిటీషనర్స్ కాంపెన్సేషన్ నిమిత్తం దాఖలు చేసి అందు మిమ్ములను రెస్పాండెంట్ నెం.1గా చూపియున్నారు. అయితే సదరు పిటీషన్ దాఖలు చేసిన నాటి నుండి మీ హాజరు నిమిత్తం మీకు ఎన్ని పర్యాయాలు కోర్టు నోటీసులు పంపినను మీరు ఉద్దేశపూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఇవ్వడం జరిగినది. కావున మీరు ది. 30.07.2025వ తేదీ ఉదయం గం. 10.30 ని॥లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయముగా గాని, మీ అడ్వకేటు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకొనవలసియున్నది. లేనిచో మీ పరోక్షమున పై పిటీషన్‌ను తీర్మానం చేయబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేదీ: 30.07.2025 // శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము //

ఇట్లు : **కంచర్ల త్రినాథ్ కుమార్, మహ్మద్ రుహీ సుల్తానా, పీతా శ్రీకాంత్ వర్మ, గుడికందుల ప్రకాష్,** న్యాయవాదులు

అజిత్‌సింగ్‌నగర్, విజయవాడ – 520 015. సెల్ : 99080 15980

మహారాజశ్రీ ఒంగోలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

EP: 47/2023/ OS: 240/2018

సయ్యద్ మహబూబ్ బాషా - DHR

V/s

బొమ్మిరెడ్డి సుధాకరరెడ్డి - JDR

వేలం ప్రకటన

JDRకు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పైకోర్టు వారిచే జప్తు చేయబడియుండి దరిమిలా తేది 25.07.2025న ఉ॥ 10.30 ని॥ నుండి సాయంత్రం 5 గంటల లోపు వేలం ద్వారా అమ్మకము చేయుటకు పైకోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున ఆసక్తియున్న వారు ఎవరైనా వేలంపాటలో పాల్గొని పైకోర్టు వారి నిబంధనల మేరకు దిగువ షెడ్యూలు ఆస్తిని కొనుగోలు చేయవచ్చును.

షెడ్యూలు ఆస్తి వివరములు:– ప్రకాశం జిల్లా ఒంగోలు సబ్ రిజిస్ట్రేషన్ కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామ సర్వే నెం. 760/1లో గల య 0.58 సెంట్ల వ్యవసాయ భూమికి హద్దులు **తూర్పు:** మిట్నసల పోలయ్య, రోశయ్య భూమి, **దక్షిణం:** కెనాల్, **పడమర:** మద్దులూరి శ్రీను భూమి, **ఉత్తరం:** దిబ్బ.

మార్కెట్ విలువ:**5,22,000/-** DHR విలువ:**6,00,000/-**

అమీనా విలువ: **15,00,000/-** వారెంటు మొత్తం:**10,66,865/-**

వేలం తేది:**25.7.2025** తదుపరి విచారణ తేది:**01.8.2025**

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఒంగోలు, తేది:7.7.2025

సం/- **ఉడుతా రవికుమార్,** DHR అడ్వకేట్, ఒంగోలు సెల్: 94402 36046.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఒంగోలు కర్నూల్ రోడ్డు : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: **ఒంగోలు నగరం:** గాంధీరోడ్డులోని విఘ్నేశ్వర మ్యాచింగ్ సెంటర్ ఎదుట వ్యర్థాలు పోసి... రోజుల తరబడి తరలించడం లేదు. – స్థానికులు

?: సంతపేట పశువుల ఆసుపత్రి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ ఎదుట రోడ్డులో చెత్త కుప్పలు పేరుకుని రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – చిన్ని సుబ్రహ్మణ్యం, విశ్రాంత అధ్యాపకుడు

✓: రెండు రోజుల్లో ఈ సమస్యలు పరిష్కరిస్తాం. – పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

?: **ఒంగోలు నగరం:** గోపాల్‌నగర్ నాలుగో లైన్ అడ్డరోడ్డులోని మున్సిపల్ కుళాయి నిరుపయోగంగా ఉంది. సరఫరా సమయంలో నీరంతా వృథాగా కాలువలోకి పోతోంది. దానిని డమ్మీ చేయాలి. – కాలనీవాసులు

✓: సిబ్బందిని పంపి తగు చర్యలు తీసుకుంటాం. – ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్

?: **ఒంగోలు కర్నూలు రోడ్డు:** సీతారామపురంలోని వీధి దీపాలు సక్రమంగా వెలగక రాత్రి వేళ అటుగా వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. చర్చి సమీపంలోని రెండు దీపాలు సైతం వెలగడం లేదు. – స్వప్న, శ్రీదేవి, స్థానిక మహిళలు

✓: ఆయా ప్రాంతాల్లో కొత్త దీపాలు ఏర్పాటు చేస్తాం. – నారాయణరెడ్డి, వీధి దీపాల పర్యవేక్షకుడు

?: **ఒంగోలు అంజయ్యరోడ్డు:** సీతారామపురంలో కుళాయిల నుంచి రంగు మారిన నీరు సరఫరా అవుతోంది. తాగేందుకు పనికి రాక డబ్బానీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. – సత్యనారాయణ, స్థానికుడు

✓: పరిశీలించి... రక్షిత జలాలు సరఫరా అయ్యేలా చూస్తాం. – నరసింహారావు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్

?: **చీమకుర్తి:** పల్లామల్లి పరిసర ప్రాంతాలకు విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోంది. వ్యవసాయానికీ సరఫరా సక్రమంగా లేదు. – ఆంజనేయులు, గ్రామస్థుడు

✓: సరఫరా మెరుగుకు చర్యలు తీసుకుంటాం. – చంద్రశేఖర్, ఏఈ

పశు పోషణలో జాగ్రత్తలు తప్పనిసరి

కొత్తపట్నం, న్యూస్‌టుడే: ఏక, బహు వార్షిక పశుగ్రాసం సాగుతో పోషకులు మంచి ఫలితాలు సాధించవచ్చని పశు సంవర్ధక శాఖ జేడీఏ రవి పేర్కొన్నారు. రంగాయపాలెంలో సోమవారం నిర్వహించిన పశుగ్రాస వారోత్సవాల్లో మాట్లాడారు. పశు పోషణలో పాటించాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. నవధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయ అధికారి సీహెచ్ రెడ్డప్ప తెలియజేశారు. ఒంగోలు డివిజనల్ ఉప సంచాలకులు జగత్ శ్రీనివాస్, త్రోవగుంట ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు బసవ శంకరరావు... రాయితీపై ఇస్తున్న గ్రాసం విత్తనాలు, సమీకృత దాణా, గడ్డి కత్తిరింపు యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బహువార్షిక గ్రాసం, నవ ధాన్యాల క్షేత్రాలు, గడ్డి కత్తిరింపు యంత్రం పనితీరు రైతులతో కలిసి పరిశీలించారు. పశువైద్యాధికారులు ప్రశాంతి, అమూల్య, నరహింహులు, వెంకట్రావు పాల్గొన్నారు.

గడ్డి కత్తిరింపు యంత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు, పశు పోషకులు

మ్యాజిక్ డ్రెయిన్ల పరిశీలన

నందిగామ గ్రామీణం: ఎన్టీఆర్ జిల్లా సోమవరంలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్లను 13 జిల్లాల ఉపాధి హామీ పథకం ఉద్యోగులు సోమవారం పరిశీలించారు. నిర్మాణ, సాంకేతిక వివరాలను ఉపాధి హామీ పథకం రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీచంద్ వివరించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, తూర్పు, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, తిరుపతి, బాపట్ల జిల్లాల్లో ఎంపిక చేసిన 13 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా వీటిని నిర్మించనున్నట్లు తెలిపారు.

భవనాల కొలతల పునఃపరిశీలన

మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడులో నిర్వహిస్తున్న ఇంటి పన్నుల పునఃమూల్యాంకన ప్రక్రియను జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు సోమవారం పరిశీలించారు. పది వేల చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన భవనాలకు మళ్లీ కొలతలు వేసి ఆస్తి పన్ను నిర్ధారిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలో 57 భవనాలను గుర్తించినట్లు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో కొండపి రఘుబాబు, కార్యదర్శి నూరుల్లా, సర్వేయర్ షరీఫ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నవ్య ఆధ్వర్యంలో సర్వే చేపడుతున్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం

మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం... కుష్ఠు అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి వరప్రసాదరావు మాట్లాడుతూ... స్పర్శలేని, రాగి రంగు మచ్చలు ఉంటే పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ విషయమై అందరికీ అవగాహన కల్పించాలన్నారు.

నిర్మాణాత్మక శక్తిగా ఎదగాలి

వేదికపై ఎస్సీ వర్గీకరణ చట్టం ఆర్డినెన్స్ జీవోలు చూపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, ఉద్యమకారులు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఉద్యమం ద్వారా సాధించుకున్న ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు... రాజకీయంగానూ నిర్మాణాత్మక శక్తిగా మాదిగలు ఎదగాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ పేర్కొన్నారు. ఈదుమూడిలో సోమవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలోని విజయస్తూపం నుంచి జైత్రయాత్ర ప్రారంభించారు. దండోరా ఉద్యమంలో అమరులైన వారికి నివాళులర్పించారు. కొమ్మూరి సైమన్ జెండా ఆవిష్కరించి కేకు కత్తిరించారు. నాయకులు గరటయ్య, కనకారావు మాదిగ, డొక్కా మాణిక్య వరప్రసాద్, పెదపోగు వెంకటేశ్వరరావు, పాలడుగు శ్రీనివాసరావు, ఉభయ తెలుగు రాష్ట్రాల ఉద్యమకారులు పాల్గొన్నారు.

మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం: చీమకుర్తి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బండ్లమూడి ఎస్సీ కాలనీలో జెండా ఆవిష్కరణ అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు. నియోజకవర్గ బాధ్యుడు పి.జక్రయ్య మాదిగ, నాయకులు జె.విజయ్‌కుమార్, కొండయ్య, బి.సాల్మన్, కె.ప్రసాద్, విజయబాబు, ఏసోబు, జె.అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంతో నష్టం

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పాఠశాలల విలీనం పేరుతో దళితులను ప్రభుత్వ విద్యకు దూరం చేయొద్దని ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. వ్యకాసం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ... నూతన విద్యా విధానంతో ప్రతి మండలంలో 15 ప్రాథమిక పాఠశాలల వరకు మూత పడుతున్నాయని తెలిపారు. దీంతో పిల్లలు రెండు మూడు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లడం ఎంతవరకు సాధ్యమని పేర్కొన్నారు. నాయకులు వీరాస్వామి, బి.రఘురామ్, కె.రమాదేవి, సీహెచ్.వినోద్, ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సంఘాల ప్రతినిధులు

జీవో 77 రద్దుకు డిమాండు..

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మిరియాలపాలెం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ... ఆరు రకాలుగా ఉన్న పాఠశాల వ్యవస్థను తొమ్మిది రకాలుగా మార్చి గందరగోళం సృష్టించారని విమర్శించారు. జీవో నం.77 రద్దు చేయాలని, అర్హులందరికీ ఉపకార వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిసింద్రీబాబు, సీహెచ్.శ్యామ్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ ర్యాంకర్లకు ఎస్పీ అభినందన

ఒంగోలు: జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎస్పీ దామోదర్ సోమవారం అభినందించారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో కె.షణ్ముఖ సాయిరెడ్డి (ఈడబ్ల్యూఎస్ 2వ ర్యాంకు), ఎస్.వి.సాయిచక్రి (3), షేక్ అబ్దుల్ రహీమ్ (4), సాకేత్ రామ్ (587వ ర్యాంక్) సాధించారు. వీరిని ఎస్పీ అభినందించి... ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: డిమాండ్ల సాధనకు ఈ నెల 9న చేపడుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో... నగరంలోని నెల్లూరు బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు మంగళవారం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుతో పాటు పెంచిన పని గంటలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొండారెడ్డి, సంఘాల నాయకులు జి.శ్రీనివాసులు, ఎం.ఎస్.సాయి, కె.వెంకటేశ్వర్లు, చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, దామా శ్రీనివాసరావు, రాంబాబు, పి.కల్పన, సుందరం తదితరులు పాల్గొన్నారు.

▶ **చీమకుర్తి:** ఎన్నెస్పీ కాలనీ వద్ద చేపట్టిన బైకు ర్యాలీని జిల్లా రైతు సంఘం కార్యదర్శి పమిడి వెంకట్రావు ప్రారంభించారు. కార్మిక, కర్షకుల హక్కుల సాధనకు చేపడుతున్న సమ్మెలో అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బారావు, మండల కార్యదర్శి పి.ఆంజనేయులు, బి.ఓబులేసు, బి.ఆంజనేయులు, నాగరాజు, ఎన్.శ్రీను, ఎం.పాండు, కనకరాజు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు: ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్న సంఘాల నాయకులు

సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయం

ఒంగోలు కలెక్టరేట్: అందరినీ అక్షరాస్యులుగా మార్చే 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2029 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలన్నది లక్ష్యమని తెలిపారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 1,29,497 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఆగస్టు 7 నుంచి బోధన ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలోగా వాలంటీర్ల గుర్తింపు, శిక్షణ తరగతుల ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. జడ్పీ సీఈవో చిరంజీవి, డీఈవో కిరణ్‌కుమార్, వయోజన విద్య డీడీ జగన్‌మోహనరావు పాల్గొన్నారు.

(c) eenadu

ఊరేగింపుగా గంధం తీసుకొస్తున్న మత పెద్దలు

రాత్రి వేళ దర్గా పరిసరాల్లో భక్తుల రద్దీ

అపురూపం.. ఆధ్యాత్మిక సుగంధం

రెండో రోజు.. పండగకు పోటెత్తిన భక్తులు

దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి లోకేశ్, ఇతర ప్రజాప్రతినిధులు

కిక్కిరిసిన స్వర్ణాల చెరువు



రొట్టె మార్చుకుంటున్న మహిళలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఒక్కొక్కరిది ఒక్కో రకం కోరిక.. అందరిదీ ఒకే నమ్మకం.. ఆ భక్తిభావంతోనే రొట్టెల పండగ రెండో రోజు సోమవారం భక్తులు బారాషహీద్ దర్గాకు పోటెత్తారు. అమరవీరులను దర్శించుకుని ఫాతెహాలు చేస్తూ.. మజహర్ల వద్ద గలేఫ్‌లు కప్పి ప్రార్థనలు చేస్తూ.. స్వర్ణాల చెరువులో పుణ్యస్నానాలు ఆచరిస్తూ.. కోరికల రొట్టెలు మార్చుకుంటూ పులకించారు. దీంతో స్వర్ణాల చెరువుతో పాటు బారాషహీద్ దర్గా పరిసరాల్లో అద్వితీయ ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

ఉద్యోగం, సంతానం, గృహ రొట్టెలకు...

వివాహం కావాలని యువత పెళ్లిరొట్టె పట్టుకుంటుంటే... కొలువు రావాలని నిరుద్యోగులు ఉద్యోగ రొట్టెను అందుకున్నారు. ఉద్యోగోన్నతులు, సంతానం, ఆరోగ్యం, గృహం.. ఇలా పలు రకాల రొట్టెలను ఎక్కువ మంది పట్టుకున్నారు. పరస్పరం మార్చుకున్నారు. ఉద్యోగం, గృహ, సంతానం రొట్టెలకు గిరాకీ ఏర్పడింది. ఉద్యోగ రొట్టె.. చిన్న ముక్కయినా దొరక్కపోతుందా అని యువత ఆరా తీయడం స్వర్ణాల చెరువు వద్ద కనిపించింది.

దర్శనానికి నిరీక్షణ

కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఒడిశా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో.. బారాషహీద్‌ల దర్శనానికి గంటలకొద్దీ క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. పలువురు దర్గా ప్రాంగణంలోనే మొక్కులు తీర్చుకున్నారు.

మేళతాళాలతో ఊరేగింపుగా

బాణసంచా పేలుళ్లు.. పూల చాందినీలు.. పకీర్ల జరుబులు.. మేళతాళాలతో భక్తజన సందోహం మధ్య సోమవారం అర్ధరాత్రి తర్వాత కోటమిట్టలోని అమీనియా మసీదు నుంచి గంధాన్ని ఊరేగింపుగా బారాషహీద్ దర్గాకు తీసుకొచ్చారు. సయ్యద్ సమీ హుస్సేనీ ఆధ్వర్యంలో 12 బిందెల్లో అత్తరు, సుగంధ ద్రవ్యాలతో గంధం కలిపారు. ప్రార్థనల అనంతరం మొదటి బిందెను షేక్ ఖలీల్‌అహ్మద్ ఎత్తుకోగా.. 11 మంది మిగిలిన బిందెలు తీసుకుని.. ప్రత్యేకంగా అలంకరించిన మినీ లారీలోకి చేర్చారు. ముందు నిషాన్ జెండాను తీసుకువెళుతుండగా.. పోలీసు బందోబస్తు మధ్య గంధమహోత్సవం బయలుదేరింది. కోటమిట్ట, జెండావీధి, బారకాసు, పెద్దబజారు, ఆర్టీసీ బస్టాండు, కేవీఆర్ పెట్రోలు బంకు మీదుగా తొలుత పోలీసు కార్యాలయం వద్దకు చేరింది. భక్తుల తాకిడి నేపథ్యంలో అక్కడి నుంచి పోలీసుల రోప్ పార్టీ మధ్య గంధాన్ని బారాషహీద్ దర్గా ఈద్గా మైదానానికి తీసుకువచ్చారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ ఆధ్వర్యంలో ముజావర్లు, పకీర్ల ప్రార్థనల అనంతరం అమరవీరుల మజహర్లపై లేపనం చేశారు. అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టడంతో పాటు స్వర్ణాల చెరువులో కలిపారు.

కార్యకర్తలే.. తెదేపా గుండెచప్పుడు!

సమస్యలు తెలుసుకునేందుకే సమావేశాల నిర్వహణ ● విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

మాట్లాడుతున్న మంత్రి లోకేశ్ చిత్రంలో ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణ, అజీజ్, రాంగోపాల్‌రెడ్డి

ఈనాడు, నెల్లూరు: విద్య, న్యూస్‌టుడే: కార్యకర్తలే తెదేపాకు గుండెచప్పుడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంతా పార్టీకి అండగా ఉన్నారు. గత ప్రభుత్వం ఎన్ని విధాలుగా వేధించినా చెక్కు చెదరని సంకల్పంతో నిలిచారు. మీ పోరాటం.. ప్రజల మద్దతుతో భారీ మెజార్టీతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కార్యకర్తల సమస్యలు తెలుసుకునేందుకే సమావేశాలు నిర్వహిస్తున్నాం. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ ఫలాలను తీసుకువెళ్లాలి' అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన నెల్లూరు అనిల్‌గార్డెన్స్‌లో సోమవారం నగర నియోజకవర్గ తెదేపా కార్యకర్తలు, నాయకుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా మనుషుల్ని చంపుకొంటూ వెళుతున్నారు. పల్నాడు జిల్లా పర్యటనలో ఒకరిని పరామర్శించడానికి వెళ్లి.. ముగ్గురిని చంపారు. బాధితులను తీసుకొచ్చి.. కనీసం కూర్చోబెట్టకుండా రెండు భుజాలు తట్టి పంపించారు' అని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నా జగన్‌లో మార్పు రాలేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, సమస్యలను కలిసికట్టుగా పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం వివిధ సమస్యలపై ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిష్కరించి.. అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరితో ఫొటోలు దిగారు. కార్యక్రమంలో మంత్రి నారాయణ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎన్‌ఎండీ ఫరూఖ్, జిల్లా తెదేపా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బీద రవిచంద్ర యాదవ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఏపీ ఖాదీ అండ్ ఇండస్ట్రీస్ బోర్డు ఛైర్మన్ కేపీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నారాయణ మాస్టారు కృషితోనే...

మంత్రి నారాయణ మాస్టారు కృషితోనే మూతపడిన వీఆర్ హైస్కూల్.. దేశంలోనే ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చెందిందని మంత్రి లోకేశ్ కొనియాడారు. సోమవారం పాఠశాలను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. పునః ప్రారంభమైన మొదటి రోజే నో అడ్మిషన్ బోర్డు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇంటర్మీడియెట్ స్థాయికి విస్తరిస్తారని తెలిపారు. పాఠశాలలోని అన్ని గదులను పరిశీలించారు. క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించి.. క్రికెట్, వాలీబాల్ ఆడారు. మంత్రి నారాయణ ప్రసంగిస్తూ.. నారా లోకేశ్ సహకారంతోనే వీఆర్ పాఠశాలను త్వరితగతిన అభివృద్ధి చేశామన్నారు. నెల్లూరులో పుట్టి పెరిగిన ప్రతి ఒక్కరూ పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. మంత్రి ఫరూక్ ప్రసంగిస్తూ.. మంత్రి నారాయణ పేద విద్యార్థుల కోసం వీఆర్ హైస్కూల్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దారని, సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలో నూతన సంస్కరణలకు నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. వీఆర్ హైస్కూల్ తరహాలోనే.. వీఆర్ కళాశాలనూ తీర్చిదిద్దాలని కోరారు.

వీఆర్‌హైస్కూల్ శిలాఫలకం వద్ద మంత్రి లోకేశ్, ఇతర ప్రజాప్రతినిధులు

యుద్ధ నౌకకు ఉదయగిరి పేరు

దుర్గం కొండపై పెద్ద మసీదు ప్రాంతం వద్ద నేవీ బృందం

ఉదయగిరి, న్యూస్‌టుడే : జిల్లాలోని ఉదయగిరి దుర్గాన్ని విశాఖపట్నం నేవీ బృందం సోమవారం సందర్శించింది. చారిత్రక నేపథ్యమున్న ఉదయగిరి పేరుతో యుద్ధ నౌక రూపుదిద్దుకొని ఆగస్టు 26న ప్రారంభోత్సవం కానుండడంతో లెఫ్టినెంట్ కమాండర్ ప్రశాంత్, బృంద సభ్యులు నరసింగరావు, నవీన్, ప్రకాష్‌కుమార్ స్థానిక పంచాయతీ అధికారులతో కలిసి దుర్గం కొండపై పర్యటించారు. పెద్ద మసీదు, చిన్న మసీదుతోపాటు అలనాటి చరిత్రకు గుర్తుగా ఉన్న కట్టడాలను పరిశీలించారు. ఉదయగిరి దుర్గం పేరుతో 149 మీటర్ల పొడవుతో 40 మిస్సైళ్లు ఉండేలా రూ.600 కోట్లతో యుద్ధ నౌక తయారై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందన్నారు. దీని గురించి తెలియజేయడంతోపాటు ఉదయగిరి చరిత్రను తెలుసుకొనేందుకు నేవీ బృందం పట్టణంలో పర్యటించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సర్పంచి పాములూరి సామ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శి కరిముల్లాతో నేవీ బృందం చర్చించి ఈప్రాంత చారిత్రక విషయాలను తెలుసుకున్నారు. పంచాయతీకి నౌకాదళ కమిటీ నుంచి సంక్షేమ నిధులు వచ్చేలా ప్రయత్నాలు చేస్తామని నేవీ బృందం తెలిపినట్లు అధికారులు తెలిపారు. వారి వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఉదయగిరి పేరుతో ప్రారంభం కానున్న యుద్ధ నౌక

పెళ్లింట.. కన్నీటి మంట

కారు ఢీకొని వరుడి తండ్రి దుర్మరణం

దుకాణంపైకి దూసుకెళ్లిన కారు

వెంకటేశ్వర్లు (పాతచిత్రం)

దుత్తలూరు, న్యూస్‌టుడే: ఆ ఇంట్లో మరో పది రోజుల్లో కుమారుడి వివాహం. తల్లిదండ్రులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. బంధువుల రాకపోలతో ఇంటి లోగిలి సందడిగా ఉండగా.. ఇంతలోనే ఆ విధికి కన్నుకుట్టింది. కారు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు వరుడి తండ్రిని మింగేసింది. దుత్తలూరు మండలం నందిపాడులో సోమవారం ఈ విషాదకర సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నందిపాడు కూడలికి చెందిన నల్లబోతుల వెంకటేశ్వర్లు (54) ఉదయగిరి వెళ్లేందుకు బస్సు కోసం రహదారి పక్కనే నిరీక్షిస్తూ ఉన్నారు. ఆ సమయంలో ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి తిరుపతి వెళుతున్న కారు ఇక్కడికొచ్చేసరికి ఉదయగిరి నుంచి సంగం వెళుతున్న మరో కారును ఢీకొట్టింది. ఆ క్రమంలో తిరుపతి వెళుతున్న కారు టైరు పగిలి జాతీయ రహదారి పక్కనే ఉన్న దుకాణాల వైపు దూసుకొచ్చింది. అక్కడే ఉన్న వెంకటేశ్వర్లును ఢీకొని ఈడ్చుకుంటూ వెళ్లగా అక్కడికక్కడే మృతి చెందారు. ఉదయగిరి సీఐ ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

తల్లడిల్లిన కుటుంబసభ్యులు

వెంకటేశ్వర్లుకు ముగ్గురు పిల్లలు. రెండో కుమారుడికి పది రోజుల్లో వివాహం చేయనున్నారు. ఇంతలోనే వెంకటేశ్వర్లు మృతి చెందారన్న పిడుగు లాంటి వార్త తెలిసి తల్లడిల్లిపోయారు. భార్య, బిడ్డలు దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తున్నారు. పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట కన్నీరు పారుతోంది.

జలగలే నయం.. ఏదీ భయం!

ముత్తుకూరు మండలంలో నీటి దోపిడీకి అడ్డూ ఆపు లేకుండా పోతోంది. ఇక్కడి పరిశ్రమలకు అవసరమవుతుండటం.. ఆయా చోట్ల ఉప్పునీరు లభిస్తుండటంతో గిరాకీ ఏర్పడగా.. అదే అదనుగా కొందరు నిబంధనలకు విరుద్ధంగా బోర్లు తవ్వి.. నీటి వ్యాపారం చేస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు.

న్యూస్‌టుడే, ముత్తుకూరు, వెంకటాచలం

నెల్లూరు-ముత్తుకూరు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన బోర్ల నుంచి ట్యాంకర్లలో నీరు నింపుతూ..

ముత్తుకూరు- నెల్లూరు ప్రధాన రహదారి పక్కన.. ముత్తుకూరు సమీపంలోని మల్లూరు రోడ్డు వద్ద, ముత్తుకూరు-వెంకటాచలం మార్గాల్లోని పంటపాళెం, కోళ్లమిట్ట సమీపంతో పాటు మరికొన్నిచోట్ల అనధికారికంగా బోర్లు తవ్వారు. ఆయా ప్రాంతాల నుంచి నిత్యం సుమారు 110 నుంచి 130 ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు. దాదాపు 15 ఏళ్లుగా ఈ దోపిడీ జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.

38 బోర్లు.. ఏడింటికే అనుమతి

మొత్తం 38 వరకు బోర్లు ఉండగా.. వాటిలో ఏడింటికే అనుమతులు ఉండటం గమనార్హం. మల్లూరు రోడ్డు సమీపంలో.. ఒకే ప్రాంతంలో 24 బోర్లు ఏర్పాటు చేసి.. నిరంతరం నీటిని సరఫరా చేస్తున్నారు. దాంతో భూగర్భ జలాలు పడిపోయాయి. అక్రమ తరలింపులు అడ్డుకోవాలని స్థానికులు ఫిర్యాదులు చేసినా చర్యలు ఉండటం లేదు.

ఎన్‌జీటీకి ఫిర్యాదు చేసినా..

చలివేంద్ర గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు నీటి దోపిడీపైనా, ఆ క్రమంలో జరుగుతున్న నష్టాలపైన, అధికారుల నిర్లిప్తతపైనా జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. బాధ్యులపై వాల్టా చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎన్‌జీటీ అధికారుల బృందం దిల్లీ నుంచి వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనుమతులు లేకుండా బోర్లు తవ్వకాలు, అక్రమ నీటి తరలింపులు నిజమని తేల్చి... వాటి కారణంగా భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతి లేని బోర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

శాశ్వత చర్యలేవీ?

ఉన్నతాధికారుల ఆదేశాలు, ఎన్‌జీటీ సూచనల మేరకు ఇటీవల ముత్తుకూరు తహసీల్దారు ఆధ్వర్యంలో మల్లూరు రోడ్డు వద్ద ఉన్న బోర్లను తనిఖీ చేశారు. ఒకే ప్రాంతంలో 24 బోర్లు ఉండగా.. వాటిలో ఆరుకే అనుమతులు ఉన్నట్లు గుర్తించి.. 18 సీజ్ చేసినట్లు ప్రకటించారు. మండలంలో మిగిలిన చోట్ల ఉన్నవి పరిశీలించలేదు. తహసీల్దారు సీజ్ చేసిన బోర్లలోనూ.. కొన్నింటిని తిరిగి కొనసాగిస్తుండటం గమనార్హం. ఇప్పటికైనా వాటిని శాశ్వతంగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బదిలీల్లో అవకతవకలు

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లాలో పశుసంవర్ధకశాఖ సహాయకుల బదిలీల్లో అవకతవకలు జరిగాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. పశుసంవర్ధకశాఖ సహాయకుడు ఎస్‌కే ఖాదర్ నవాజ్ మాట్లాడుతూ మెరిట్, సీనియారిటీ ప్రకారం బదిలీలు జరపకుండా జిల్లా అధికారికి అనుకూలంగా ఉన్న వారిని కోరుకున్న చోట ఇచ్చారని ఆరోపించారు.

అంతర పంట.. లాభాలంట! 6లో..

B.Tech., and Ag.B.Sc.,
SPOT ADMISSION
కేవలం 6,7,8,9,10 లక్షల ఖర్చుతో నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ / అగ్రికల్చర్ బీఎస్సీ (కాలేజ్ ఫీజు + హాస్టల్ ఫీజుతో కలిపి) ఎటువంటి షూరిటీ లేకుండా విద్యార్థికి 70 నుంచి 80% లోన్ సౌకర్యం కల్పించబడును. వివరాలకు సంప్రదించండి :
9502555500, 9160220527

Sree Sai D.Ed. College
Jaladanki (Vil), Kavali (Div.), Nellore Dt.
(Recogd. by AP)
For 2025-26 D.Ed. Admissions
D.Ed., Web Options
Starts From 8, 9, 10, 11, 12th July 2025.
College Code: 0921
Contact:

B.Ayyala Reddy
Physics
98492 49118

● పడమటిపాలేనికి చెందిన నూతి యానాదమ్మ తనకు వారసత్వంగా వచ్చిన భూమిని సాగు చేసుకుంటుండగా- వీర్లగుడిపాడుకు చెందిన ఎం.సాయమ్మకు 3.50 ఎకరాల పొలం ఉంది. వీరిద్దరి భూములకు అన్ని దస్త్రాలు ఉన్నా.. 'మీ భూమి' పోర్టల్‌లో కనిపించకపోవడంతో అన్నదాత సుఖీభవ సాయానికి అర్హత లభించలేదు.

● బుచ్చిరెడ్డిపాళెం మినగల్లులో నివాసం ఉంటున్న షేక్ ఖాజారంతుల్లాకు కొరిమెర్లలో పొలం ఉంది. ఈయన భూమికి వేరొకరి ఆధార్ సంఖ్య జత కావడంతో సాయం అందని పరిస్థితి వచ్చింది.

చిక్కులు.. తప్పని తిప్పలు

అన్నదాత సుఖీభవ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం

న్యూస్‌టుడే, సంగం

అన్నదాత సుఖీభవ పథకం అర్హుల జాబితాలో వివిధ కారణాలతో పేర్లు నమోదు కాని రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవకాశం కల్పించింది. ఈ నెల పదో తేదీలోపు రైతు సేవా కేంద్రాల(ఆర్‌ఎస్‌కే)లకు వెళ్లి సమస్య పరిష్కరించుకోవాలని సూచించింది. అందుకు ఇక మూడు రోజులే గడువు ఉండగా.. అర్హత సాధించనివారు అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

తన పేరు నమోదు చేయించాలని తహసీల్దారును కోరుతున్న యానాదమ్మ

అర్హత ఉన్నా...

ఆరంచెల వడపోత తర్వాత.. జిల్లాలో ఇప్పటి పథకానికి 2,00,295 మంది రైతులు ఎంపికయ్యారు. వారి ఈకేవైసీ ప్రక్రియ ఆటోమేటిక్‌గా పూర్తయింది. కానీ, అన్ని అర్హతలు ఉన్నా.. ఇప్పటికీ కొందరు పథకానికి దూరంగానే ఉన్నారు. ఇలాంటి వారి సంఖ్య జిల్లా వ్యాప్తంగా సుమారు అయిదు వేలకుపైగా ఉంటుందని సమాచారం. వీరంతా ఆర్‌ఎస్‌కేల్లో కారణాలు తెలుసుకుని.. సంబంధిత దస్త్రాలు అందిస్తే అర్హత పొందుతారని ప్రభుత్వం స్పష్టం చేసింది.

సాంకేతిక సమస్యలతో...

అన్ని దస్త్రాలు సక్రమంగా ఉన్నా.. 'మీ భూమి' పోర్టల్‌లో సాంకేతిక ఇబ్బందులతో వివరాలు చూపడం లేదు. దాంతో సాయానికి దూరమవుతున్న వారి సంఖ్య అధికంగానే ఉంది. వ్యవసాయ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం లభించడం లేదు. తమకు పరిష్కారం చూపాలని బాధిత రైతులు కోరుతున్నారు. దీనిపై జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి వివరణ కోరగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు.

సాధారణ వ్యక్తుల్లా ఏసీబీ అధికారుల విచారణ

ఉదయగిరి, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో సోమవారం ఏసీబీ అధికారులు రహస్య విచారణ చేసినట్లు సమాచారం. కారులో ఉదయగిరి తహసీల్దారు కార్యాలయం వద్దకు వచ్చారు. సాధారణ వ్యక్తుల మాదిరిగా తిరుగుతూ కార్యాలయాలకు పనులపై వచ్చిన వారితో మాట్లాడారు. తహసీల్దారు, ఉపఖజానా, సబ్‌రిజిస్ట్రారు, పోలీసుస్టేషన్ ప్రాంతాల్లో పనులపై వచ్చిన వారితో అధికారులు, సిబ్బంది పనితీరుపై మాట్లాడినట్లు సమాచారం. ఈవిషయం అధికార యంత్రాంగానికి తెలియడంతో ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, సిబ్బందిలో అలజడి రేగింది. మధ్యాహ్నం వరకు ఏసీబీ అధికారులు తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఉండి వెళ్లారు.

(c) eenadu

గోడలపై బొమ్మ.. బాల్యానికి రెమ్మ

బాల్యం నుంచి మొదలయ్యే జీవిత చక్రం నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి కింద అద్భుతంగా రూపొందించారు. స్వచ్ఛ ఆంధ్రా, స్వచ్ఛ నెల్లూరులో భాగంగా మంత్రి నారాయణ చొరవతో ఏర్పాటు చేసిన అందమైన చిత్రాలు కనువిందు చేస్తున్నాయి. చిన్ననాటి ఆటలు, అల్లర్లు అన్నీ ఇక్కడ కనిపిస్తున్నాయి. స్నేహితులతో సరదాగా ఆడుకుంటున్న ఆటలు కళాకారులు తమ ప్రతిభతో కళ్లకు కట్టినట్లు చూపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

ఆధార్‌కు అనుసంధానమైతేనే అన్నదాత సుఖీభవ

నెల్లూరు (మార్కెట్ సెంటర్): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి అర్హత పొందాలంటే ప్రతి రైతు తమ భూమిని ఆధార్‌కు అనుసంధానించుకోవాలని వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 2,00,295 మంది అర్హత పొందారని చెప్పారు. తిరస్కరించిన రైతుల వివరాలు గ్రీవెన్స్ మాడ్యుల్‌లో నమోదు కు ఈనెల పది వరకు అవకాశం ఉందన్నారు.

తూకాలు.. మోసాలు..

నామమాత్రంగా దాడులు

- గతనెల 22న నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు, డైకస్ రోడ్డు, గాంధీ రోడ్డు, మినీబైపాసు రోడ్డు తదితర ప్రాంతాల్లోని రోడ్డు మార్జిన్లలో నిర్వహిస్తున్న చేపల విక్రయాలపై తూనికలు కొలతలు శాఖ అధికారులు దాడులు చేశారు. దాడుల్లో కేజీకి 250 గ్రాముల కోత విధిస్తున్నట్లు గుర్తించి మూడు కేసులు నమోదు చేశారు.
- పెట్రోల్ బంకుల్లో మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. రూ.400కు పెట్రోల్ పట్టిస్తే అర లీటరే వచ్చిందని ఇటీవల ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. పెట్రోల్ బంకువద్ద ఆగ్రహంవ్యక్తం చేశారు.
- తాజాగా సోమవారం నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్‌లో తూ.కొ. అధికారులు దాడులు చేశారు. తనిఖీల్లో ధ్రువీకరించని ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు ఉపయోగించినందుకు అధికారులు వాటిని సీజ్ చేసి.. ఎనిమిది కేసులు నమోదు చేశారు.

ఏసీ కూరగాయల మార్కెట్‌లో ధ్రువీకరించని ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు సీజ్ చేసిన తూ.కొ. అధికారులు

న్యూస్‌టుడే, నెల్లూరు (వేదాయపాలెం)

కేజీకి 250 గ్రాములు తక్కువ.. సీల్ లేని కాటాల ఉపయోగం.. వ్యాపారుల ఇష్టారాజ్యం.. ఫిర్యాదు చేస్తేనే తప్ప దాడులు చేయలేని అధికారులు.. ఇదీ జిల్లాలో తూనికలు కొలతల శాఖ పనితీరు. నిత్యం మోసాలు జరుగుతున్నా పట్టించుకునే వారే లేరు.. అప్పుడప్పుడు తనిఖీలు, దాడులు చేసి మిన్నకుంటున్నారేగానీ.. నిత్యం చేయడంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

● బరువు, కొలతలు, కల్తీ, ప్యాకేజీ.. తూనికలు కొలతలుశాఖ కిందికి వస్తాయి. ప్రభుత్వానివిగానీ, ప్రైవేటువిగానీ ఎలాంటి వస్తువైనా ప్యాకింగ్ చేసి నిబంధనలు అతిక్రమిస్తే వాటిపై, ఎంఆర్‌పీ ధర కంటే అత్యధికంగా విక్రయించినా చర్యలు తీసుకోవచ్చు. ప్యాకింగ్ తేదీ, పూర్తయ్యే గడువు లేకపోయినా వారిని నిలదీయవచ్చు. తయారీ వస్తువుపై కస్టమర్ నంబరు ఉండాలి. ఇలా ఎన్నో నిబంధనలు ఉన్నాయి. ఏ ఒక్కటీ అమలు చేయడం లేదు. ఎలక్ట్రానిక్, ప్లాట్‌ఫాం కాటాలు సంవత్సరానికి ఒకసారి ముద్ర వేయించుకోవాలి. తూకపు రాళ్లు, బీం స్కేల్స్, ద్రవ పదార్థాలు కొలిచే పరికరాలు, దుస్తులు కొలిచే బద్దలు తదితరాలు రెండేళ్లకోసారి ముద్రలు వేయించుకోవాలి. ప్రస్తుతం చాలా వరకు సీల్ వేసుకోవడం లేదు. తూ.కొ. అధికారులు తాజాగా కూరగాయల మార్కెట్‌లో దాడులు చేయగా... ఇదే విషయం వెలుగులోకి వచ్చింది. అధికారులు ధ్రువీకరించని ఎనిమిది కాటాలను సీజ్ చేశారు. గతంలో ఎన్నిసార్లు దాడులుచేసినా ఈ మోసాన్ని కనిపెట్టలేకపోయారు.

సం॥	● తూకాల్లో తేడాపై కేసులు	● ప్యాకింగ్ కేసులు
2019–20	150	93
2020–21	134	189
2021–22	88	139
2022–23	174	102
2023–24	107	100

చర్యలు తీసుకుంటాం

ఐజాక్, డిప్యూటీ కంట్రోలర్ తూనికలు కొలతలు

జిల్లాలో మండలాల వారీగా నిత్యం తనిఖీలు చేస్తున్నాం. సిబ్బంది తక్కువగా ఉన్నా.. పక్క జిల్లాల నుంచి అధికారులను రప్పించుకొని దాడులు చేస్తూ.. కేసులు నమోదు చేస్తున్నాం. వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటాం.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు 10న మెగా సమావేశం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం జిల్లా వ్యాప్తంగా ఈనెల 10న మెగా తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండోసారి ఈనెల 10న 3,600 పాఠశాలలతో పాటు 143 కళాశాలల్లో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను తెలియ జేస్తారన్నారు. మొక్కలు నాటించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 3.50 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వారి ప్రతిభా పాటవాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో డీఈవో బాలాజీ రావు, సర్వశిక్షా అభియాన్ ఏపీసీ వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

కావలి పురపాలక సంఘము

ఆర్.ఓ.సి.నెం.390/2021/ఏ1 తేది: 05.07.2025.

బహిరంగ వేలం ప్రకటన

కావలి పురపాలక సంఘమునకు సంబంధించి BSNL Office ప్రక్కన షాపు రూముల నెం.1 మరియు ముసునూరు నందు గల షాపు నెం.2నకు బహిరంగ వేలం పద్ధతిపై అద్దెకు ఇచ్చుటకు తేది: 11-07-2025న ఉదయము గం.11.00లకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో కమీషనరు గారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. సదరు పాటలో పాల్గొనువారు ఈ క్రింది తెలిపిన వాటిని సమర్పించి వేలంపాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

1. పాటలో పాల్గొనదలచినవారు రూ.2,00,000/-లు సాల్వేన్సు సర్టిఫికేటు లేదా సరిసమానమైన మొత్తమును జమచేయవలెను.
2. పాటలో పాల్గొనదలచినవారు డిపాజిట్ రూ.1,00,000/-లు చెల్లించవలెను.

పై తెలిపినవి దాఖలు చేసి నిర్ణయించిన ధరావత్తు మొత్తము చెల్లించి వేలంపాటలో పాల్గొనవలెను. సంబంధిత వివరములు కార్యాలయము పనిచేయు వేళలలో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొనవచ్చును. పాటను ఆమోదించుటకు లేదా ఏ కారణము చూపకనే తిరస్కరించుటకు కమీషనరు, కావలి పురపాలక సంఘము వారికి పూర్తి అధికారము కలదు.

సం/- కమీషనరు, కావలి పురపాలక సంఘము

అంతర పంట.. లాభాలంట!

న్యూస్‌టుడే, వరికుంటపాడు,ఉదయగిరి

అసలే కరవు ప్రాంతం.. వర్షాలు పడక పంటలు పండించడం కష్టమైంది. ఈతరుణంలో ఆయన పండ్ల తోటల సాగు చేపట్టారు. ఇందులో అంతరపంటగా కూరగాయలు వేసి లాభాలు ఆర్జిస్తున్నారు. నీటిని పొదుపుగా వాడుతూ సిరులు కురిపిస్తున్నారు. ఉదయగిరి మండలంలోని గంగిరెడ్డిపల్లికి చెందిన దేవండ్ల రమణయ్య. నాలుగెకరాలు కౌలుకు తీసుకొని మామిడి, జామ, ఉసిరి, దానిమ్మ, సీతాఫలం, అంజూర, నిమ్మ, యాపిల్‌బేర్, మహగని మొక్కలు పెంచుతున్నారు. వాటికి నీరు పెట్టాల్సి ఉన్నందున అంతర పంటలు సాగు చేస్తే లాభాలు పొందవచ్చని భావించారు. దీంతో రూ.10 వేల వరకు ఖర్చు చేసి వేరుసెనగ, బంతి, కూరగాయలైన టమోట, చిక్కుడు, మిరప తదితర పంటలు సాగు చేశారు. దీంతో విడతల వారీగా వేరుసెనగ, బంతి, కూరగాయలు చేతి కందుతున్నాయి. కాయలను నిత్యం అమ్మకం చేస్తున్నారు. ఇప్పటికే పెట్టుబడి పోను రూ.10 వేల వరకు లాభాలు వచ్చాయి. ఇంకా రూ. 50 వేల వరకు వచ్చే అవకాశం ఉంది. సీజన్ వారీగా కూరగాయలను సాగు చేసి వచ్చే పంటను విక్రయిస్తున్నారు. నిత్యం పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకొని సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు. తోట వద్దనే పండించిన కూరగాయలను భార్య, పిల్లలు అమ్మకం చేస్తున్నారు. మరో ఏడాదికి చెట్ల నుంచి ఫలసాయం చేతికొస్తుంది. అంత వరకు చెట్ల మధ్యలో ఖాళీ స్థలంలో అంతర పంటలు సాగు చేస్తే కొంతమేరకు పెట్టుబడి వస్తుందని నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి లాభాలు గడిస్తున్నారు.

వేరుసెనగ తోటలో రమణయ్య

బంతి తోట

సమస్య- సమాధానం

సమస్య : నేరుగా వెద జల్లే విధానంలో వరి ఎన్ని రోజులు ముందుగా కోతకు వస్తోంది? – బాబు, అల్లూరుపేట

సమాధానం : వారం నుంచి పది రోజుల ముందుగా కోతకు వస్తోంది

సమస్య : తెల్లకంకి రాకుండా నివారణ చర్యలు తెలుపగలరు ? –చంద్ర, అల్లూరు

సమాధానం : అంకుర దశలో గుళికలు వేసుకోవచ్చు. లేదా గుళికలు పొడి చల్లుకోవాలి.

సమస్య: కంకి నల్లి రాకుండా నివారణకు ఏం చేయాలి? –రామయ్య, గోగులపల్లి

సమాధానం : కంకి బయటకు వచ్చే దశలో నల్లి నివారణకు ప్రొపికెనజోల్ వాడుకోవాలి.

సమస్య: మట్టి పరీక్షలు ఎక్కడ చేయించుకోవాలి ? -శ్రీనివాసులు, అల్లూరు

సమాధానం : స్థానిక వ్యవసాయ సిబ్బంది ద్వారా చేయించుకోవచ్చు

(రైతుల సందేహాలకు అల్లూరు వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సమాధానాలు ఇచ్చారు.)

– న్యూస్‌టుడే, అల్లూరు

రైతేరాజు

మిరప .. సిరుల రుచి

న్యూస్‌టుడే, అల్లూరు

మండలంలోని బట్రకాగొల్లు గ్రామానికి చెందిన వెంకయ్య ఎకరం నేలలో మిరప సాగు చేసి రూ.50 వేలు ఆదాయం పొందారు. సాగుకు ముందుగా పొలంలో పశువుల ఎరువును రెండు ట్రక్కులు చల్లారు. సేద్యం చేయించారు. గుంటూరు ప్రాంతం నుంచి మొక్క రెండు రూపాయల చొప్పున కొనుగోలు చేసి నారు తీసుకొచ్చి నాటారు. కుటుంబసభ్యులంతా కలసి పనులు స్వయంగా చేసుకోవడంతో కూలీల వ్యయం తగ్గింది. పూత దశ నుంచి జాగ్రత్తలు పాటించారు. అవసరం మేరకు పోషకాలు, రసాయనాలు పిచికారీ చేశారు. ఆరంభంలో 50 కేజీల చొప్పున దిగుబడి వచ్చింది. తరువాత క్రమంలో రెండు క్వింటాళ్ల దిగుబడి వరకు సాధించారు. మొత్తం మీద దిగుబడి పూర్తయ్యే సమయానికి నాలుగు క్వింటాళ్లు కోశారు. కేజీ రూ.25 చొప్పున విక్రయించగా రూ.లక్ష వరకు రాబడి సాధించారు. ఇందులో పెట్టుబడి రూపంలో రూ.50 వేల వరకు కాగా, ఆదాయంగా రూ.50 వేలు వరకు వచ్చింది. స్వయంగా పనులు చేసుకోవడం ద్వారా ఆదాయం వచ్చిందని రైతు వెంకయ్య వివరించారు.

ఆకుకూరలు.. ఆదాయం భలే!

న్యూస్‌టుడే, వింజమూరు

మండలంలోని లెక్కలవారిపాలెం గ్రామానికి చెందిన **గుమ్మా గోపాల్** ఆకుకూరల సాగులో నిత్యం రాబడి పొందుతున్నారు. ఆయనకున్న మూడెకరాల్లో ఎకరంలో ఆకుకూరలు సాగు చేసి నిత్యం రాబడి పొందుతున్నారు. ప్రతిరోజూ కోతకు వచ్చేలా పొలాన్ని భాగాలుగా చేసి గోంగూర, పాలకూర దశలవారీగా వేశారు. దీంతో ఒక భాగంలో కోత పూర్తికాగానే మరోదానిలో వస్తోంది. ముందుగా పొలాన్ని బాగా దుక్కి చేసి 10 సెంట్లకు ఒక ట్రాక్టరు వంతున చితికిన పశువుల ఎరువు వేసి కలియదున్నారు. హైబ్రిడ్ రకం విత్తనాలు తెచ్చి చల్లిన నెల రోజుల్లో తోటకూర కోతకు వచ్చింది. రోజుకు సుమారు 300 కట్టలకు పైగా దిగుబడి రాగా కట్ట మూడు రూపాయలకు మార్కెట్లో విక్రయించారు. గ్రామంతో పాటు కలిగిరి చుట్టు పక్కల మండలాలకు సరఫరా చేస్తున్నారు. రోజుకు రూ. 900ల వంతున నెలకు రూ. 27 వేల వరకు రాబడి వచ్చింది. ఇలా ఆరు నెలల వరకు తోటకూర రాగా.. సుమారు రూ. 1.60 లక్షల రాబడి వచ్చింది. ఎరువులు, సేద్యం, కూలీల ఖర్చులు పోను ఆరునెల్లో రూ.80 వేల వరకు నికరాదాయం వచ్చింది. గోంగూర జనవరి నుంచి అక్టోబరు వరకు కోస్తే తిరిగి వస్తూనే ఉంటుంది. అక్టోబరు నుంచి జనవరి వరకు గోంగూరకు కాయలు వస్తుండడంతో మొక్కలను వేర్లతో సహా పీకి అమ్మాల్సి ఉంటుంది. గోపాల్ మాట్లాడుతూ ఆకు కూరల సాగుపై ఆదాయం బాగానే ఉందని వివరించారు.

సాగులో ఉన్న తోట కూర తోట

గోపాల్

హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అమరావతి నూతన రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైంది. నెల్లూరు ధనలక్ష్మీపురం కల్పనా రెసిడెన్సీలో ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమావేశం రెండో రోజు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎన్నిక జరగ్గా.. అసోసియేషన్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డబ్ల్యూ వెంకటరమణ, చేజర్ల సుధాకర్‌రావు, కోశాధికారిగా ఎన్.హరిప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జయప్రకాష్, ఉపాధ్యక్షులుగా పి.శివరామకృష్ణ, సయ్యద్‌బేగం, కె.మహమ్మద్ రఫీ, ఎస్.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ ఎడ్యుకేటర్ పేరును డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లుగా మార్చేందుకు కృషి చేసిన మంత్రులు సత్యకుమార్, నారాయణ, ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గం

హెచ్‌ఎంపై ఉపాధ్యాయుడి దాడి

దగదర్తి, న్యూస్‌టుడే : పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై ఉపాధ్యాయుడు దాడి చేసి గాయపరిచిన ఉదంతమిది. ఈ సంఘటన దగదర్తి మండలంలోని కట్టుబడిపాలెం ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కట్టుబడిపాలెం ఉన్నత పాఠశాలలో ప్రమీల, కిరణ్‌కుమార్, వెంకటనాగాచార్యులు, సాయికృష్ణ గతంలో ఉపాధ్యాయులుగా పనిచేసేవారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో సోమవారం ధ్రువీకరణ పత్రాల కోసం పాఠశాలకు వచ్చారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావును ఎల్‌పీసీ (లాస్ట్ పే సర్టిఫికెట్) గురించి అడగ్గా ఇచ్చారు. ఎస్‌ఆర్ కూడా ఇవ్వాలని కోరారు. స్టాఫ్ లేకపోవడం.. బీరువా తాళాలు తీసుకురాలేదని.. నాలుగు రోజుల్లో ఇస్తానని చెప్పారు. ప్రమీల, ఆమె భర్త ప్రసాద్ (బుచ్చిరెడ్డిపాళెం పాఠశాల ఉపాధ్యాయుడు) ఒప్పుకోలేదు. తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో వాదనలు జరగడంతో భార్యాభర్తలిద్దరూ పిడిగుద్దులు కురిపించడంతో హెచ్‌ఎం సుబ్బారావు గాయాలయ్యాయి. అనంతరం దగదర్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. హెచ్‌ఎంపై దాడి పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 9,280
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 74,240
వెండి గ్రాము :	రూ. 113.40

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	110
రిటైల్	132
లేయర్	112
బ్రాయిలర్స్	191
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	218
లేయర్ మాంసం	190
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	125
లేయర్	112
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	250
లేయర్ మాంసం	190

రొట్టెల పండగకు ప్రత్యేక బస్సులు

నెల్లూరు(రవాణా) : రొట్టెల పండగ భక్తుల సౌకర్యార్థం నెల్లూరు రీజియన్ ఆధ్వర్యంలో ఈ నెల 10 వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి షేక్ షమీమ్ సోమవారం తెలిపారు. నెల్లూరు నుంచి కసుమూరుకు-20, ఏఎస్‌పేటకు-20, నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ నుంచి బారాషహీద్ దర్గాకు ఆరు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెల్లూరు నుంచి చెన్నైకు-4, బెంగళూరుకు-4, కడపకు-4, తిరుపతికి-5, ఒంగోలుకు-5, విజయవాడకు-10, హైదరాబాద్‌కు-4 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

టీఆర్‌ఆర్‌లో కంప్యూటర్ శిక్షణ

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ కమ్యూనికేషన్స్, కంప్యూటర్ బేసిక్స్, జనరల్ అవేర్‌నెస్‌లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల పదో తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులై డిగ్రీలో చేరాలనుకునే వారు హాజరుకావచ్చన్నారు.

EENADU Classifieds

EDUCATION

LAST CHANCE: 10TH-INTER, DIRECT DEGREE (Discontinue), BA, B.Com., B.Sc., BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc., MBA, MCA, B.Ed., and Nursing Regular/Lateral Entry. Ph No: ✆ 93812 87629.

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్తిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్‌లోన్ చేయబడును. ✆ 96665 47338.

REAL ESTATE

HOUSE FOR SALE

నెల్లూరు కల్లూరుపల్లి AP హౌసింగ్ బోర్డు కాలనీ నందు 16.66 అంకణాల స్థలంలో 733.60 sq.ft. గ్రౌండ్ ఫ్లోర్ + 733.60 sq.ft (1st ఫ్లోర్) అమ్మకమునకు కలదు. Rs. 45,00,000/- సంప్రదించండి. ✆ 98665 71279, 91500 38374

నెల్లూరు భువనేశ్వరి అగ్రహారం మూలాపేట, 20 /754 స్కూల్ ఎదురు సందు 30 అంకణాలు ఇల్లు తూర్పు ఫేసింగ్ అమ్మకమును నో బ్రోకర్స్. సంప్రదించండి నరసింహం: 9866542937

JOBS

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

శ్రీరామ్ ఫార్మ ఎక్విప్‌మెంట్స్ సంస్థ (Lovol) షోరూం నందు, నెల్లూరు, మిర్యాలగూడ, సూర్యపేట బ్రాంచ్‌లలో పనిచేయుటకు 1-2 సం// అనుభవం గల అకౌంటెంట్లు కావలెను. మంచి జీతము. ✆ 96403 06306

అడ్మిషన్ డిపార్టుమెంట్ నందు వర్క్ చేయుటకు కంప్యూటర్, టెలికాలింగ్‌లో అనుభవం కలిగిన లేడీ టెలికాలర్స్ కావలెను. అర్హత : B.Tech, డిగ్రీ, MBA, జీతం 10-12k+ Inc. (టార్గెట్ లేదు) ✆ 79934 71557

FREE JOBS: తిరుపతిలోని మా సంస్థ కొరకు, కంప్యూటర్ ఆపరేటర్లు, HR Recruiters, Counsellors, Tele Callers, BDMలు కావలెను. జీ: 15-35 వేలు. # ✆ 99906 78818.

లేడీ టెలికాలర్స్ కావలెను. ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ నందు జాబ్ చేయుటకు లేడి టెలికాలర్స్ కావలెను. అర్హత : ఏదైనా డిగ్రీ, జీతం + ఇన్సెంటివ్స్ ✆ 91772 34987

పొదలకూరు మండలం కిసాన్ క్రాఫ్ట్ కంపెనీ నందు పనిచేయుటకు 5 సంవత్సరముల అనుభవం కలిగిన ముగ్గురు (03 No's) మగ వంట మనిషి కావలెను. వయస్సు: 40 లోపు. సం|| ✆ 91821 78985

DOST, EICHER - 4.5, 6.5 & 10 Ton, వెహికల్‌కి డ్రైవర్లు -4 కావలెను. లైసెన్సు, బ్యాడ్జ్ అనుభవం కలవారికి ప్రాధాన్యత. నెల్లూరు Cont: 79815 40612

నెల్లూరులోని ప్రముఖ కార్ల కంపెనీ వారికి సేల్స్ కన్సల్టెంట్స్ (Male) టెలీకాలర్స్ (Female) కావలెను. వెంటనే సంప్రదించండి. ✆ 99085 42222.

FACULTY/ TEACHERS

WANTED TEACHER TO TEACH IX, X HINDI-1, VI TO X COMPUTER-1, SPOKEN ENGLISH-1. Attractive Salary. CONT: VIVEKANANDHA SCHOOL, BUCHI. ✆ 94401 22213.

ACCOUNTING

Wanted Tally Accountant (Male) 4 Years experience with computer knowledge. Sri Durga Hotel, Nellore. Send Resume to WhatsApp No: 7981540612

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇల్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇల్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే విరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800 ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రైలు ప్రమాదంలో 'సీఐఎస్ఎఫ్' హెడ్ కానిస్టేబుల్ మృతి

వడపళని, న్యూస్‌టుడే: 'సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్' (సీఐఎస్ఎఫ్)కు చెందిన హెడ్ కానిస్టేబుల్ చెన్నై బీచ్ రైల్వే స్టేషను వద్ద ఆదివారం సాయంత్రం కదులుతున్న రైలు నుంచి పడి మృతి చెందారు. అరక్కోణం రైల్వే స్టేషనులో సీఐఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నెల్లూరుకు చెందిన కె.పడ్డల పోలయ్య ఆదివారం తిరుక్కురళ్ ఎక్స్‌ప్రెస్‌లో ఎగ్మూర్‌కు బయలుదేరారు. రైలు బీచ్ స్టేషన్‌కు రాగానే అరక్కోణానికి వెళ్లే సబర్బన్ రైలు ఎక్కాలనే ఆలోచనతో దిగే ప్రయత్నం చేశారు. అదుపు తప్పి కింద పడగా రెండు కాళ్లకు గాయాలయ్యాయి. రైల్వే సిబ్బంది చికిత్స నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స ఫలించక మృతి చెందాడు. ఎగ్మూర్ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'స్త్రీ గొంతుక' పట్టించింది!

బంగారం చోరీ కేసు ఛేదన

గుడివాడ, న్యూస్‌టుడే: చెడు నడత కలిగిన కొందరి మధ్య నెల్లూరు జైలులో ఏర్పడిన స్నేహం ఓ ముఠాగా ఏర్పాటై పలు చోరీలకు పాల్పడేలా చేసింది. గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా పామర్రు మండలం మలయప్పన్ పేటకు చెందిన ఎస్.ప్రమీల రాణి ఇంట్లో ఫిబ్రవరి 22న 16 కాసుల బంగారం దొంగల పాలైంది. నేరం జరిగిన రోజున దొంగల వెంట పడిన సమయంలో స్థానికులు ఓ స్త్రీ గొంతుకను గుర్తించినట్లు సమాచారం తెలుసుకున్న సీసీఎస్ ఎస్.ఐ శీలం స్వామి దాసు దాని ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులలో ఒకరైన ఏలూరుకు చెందిన మున్నా(సిరి) అనే ట్రాన్స్‌జెండర్‌ను అదుపులోనికి తీసుకోగా అసలు విషయం బయట పడింది. ఈ కేసులో ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ షబ్బీర్, ట్రాన్స్‌జెండర్ షేక్ మున్నా (సిరి), కాకినాడకు చెందిన కొరారి శ్రీనివాసరావులను ప్రధాన నిందితులుగా గుర్తించారు. వారిని బల్లిపర్రు వద్ద ఆదివారం అదుపులోనికి తీసుకుని వారి నుంచి 16 కాసుల బంగారం రికవరీ చేశారు. వీరందరికీ నెల్లూరు జైలులో గొడవర్తి కిరణ్ (లిక్కా) అనే గంజాయి స్మగ్లర్‌తో పరిచయం ఏర్పడిందన్నారు. ప్రధాన నిందితులు ముగ్గురితో పాటు గుడివాడ బేతవోలుకు చెందిన గూడపాటి రాజేష్, నైజాంపేటకు చెందిన తిరుమలశెట్టి ధనుష్ (పండు)లను కూడా అరెస్టు చేశామన్నారు.

వీఎస్‌యూలో లేటరల్ ఎంట్రీకి నోటిఫికేషన్

వెంకటాచలం, న్యూస్‌టుడే: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో లేటరల్ ఎంట్రీ ద్వారా నేరుగా పీజీ రెండో ఏడాది ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. డిగ్రీ నాలుగేళ్ల ఆనర్స్, ఆనర్స్ విత్ రీసెర్చ్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని అడ్మిషన్స్ డైరెక్టర్ హనుమారెడ్డి తెలిపారు. 21వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు.

ఉద్యోగులు, గృహిణులకు ఓపెన్‌స్కూల్ ఉపయోగం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: విద్యపై ఆసక్తి ఉన్న ఉద్యోగులు, గృహిణులు ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి డీఆర్వో హుస్సేన్‌సాహెబ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యాపీఠం గోడప్రతులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్లో విద్యను అభ్యసించేందుకు అవగాహన కల్పించాలన్నారు. సార్వత్రిక విద్యాపీఠం విద్యావిధానంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్నవారికి, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి మంచి అవకాశం అన్నారు. కార్యక్రమంలో డీఈవో బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న ఇన్‌ఛార్జి డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, డీఈవో బాలాజీరావు

రవాణా భత్యం.. చదువుకు ఊతం

న్యూస్‌టుడే, దుత్తలూరు, ఉదయగిరి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడానికి దూర ప్రాంతాల నుంచి నుంచి వచ్చే విద్యార్థులకు ఊతమిచ్చేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీరికి రవాణా భత్యం చెల్లించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం జిల్లాలో అనేక గ్రామాల్లో పాఠశాలలు దూరంగా ఉన్న చోట్ల విద్యార్థులు అందుబాటులో ఉంటే బస్సులు... లేకపోతే ఇతర వాహనాల్లో పాఠశాలలకు వెళుతున్నారు. ఇది తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారింది. ఈక్రమంలో ఈఏడాది నుంచి మూడు నెలలకొకసారి విద్యార్థులకు రవాణా భత్యం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలో 2,571 ప్రభుత్వ పాఠశాలలుండగా ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు సుమారు 56 వేల మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వాస్తవంగా విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు పాఠశాలలు నిర్ణీత దూరంలో లేని పక్షంలో వారికి తప్పనిసరిగా రవాణా ఛార్జీలను ప్రభుత్వమే చెల్లించాలి. ఈ భత్యంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం భరిస్తే మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు ఉండే ప్రాథమిక పాఠశాల ఇంటి నుంచి కిలోమీటరు కంటే ఎక్కువ దూరంలో ఉన్నా... ఆరు నుంచి ఎనిమిదో తరగతుల పాఠశాలలు విద్యార్థుల ఇళ్ల నుంచి మూడు కిలోమీటర్ల దూరం కంటే ఎక్కువ ఉన్నా ఒక్కో విద్యార్థికి నెలకు రూ. 600 వంతున చెల్లించాలి. ఇప్పటివరకు విద్యార్థులకు ఈ రవాణా భత్యం పాఠశాలల ముగింపు సమయంలో చెల్లించేవారు. ఈఏడాది నుంచి మూడు నెలలకొకసారి చెల్లిస్తే విద్యార్థుల తల్లిదండ్రులకు వెసులుబాటు కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకంలో జిల్లాలో 12,951 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. వీరి రవాణా ఛార్జీలను విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలకు జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

జిల్లాలో 12,951 మంది విద్యార్థులకు లబ్ధి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

మంచి నిర్ణయం.. సాయిశ్రీ, స్పందన, విద్యార్థినులు, దుత్తలూరు



మేము రోజూ 12 కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలకు వెళుతున్నాం. ప్రతి రోజూ ఛార్జీలు ఇవ్వాలంటే తల్లిదండ్రులకు భారంగా ఉంది. బస్సులు లేకపోవడంతో ఇతర వాహనాల్లో రావాల్సి వస్తోంది. గతంలో ఏడాది చివర రవాణా ఛార్జీలు ఇచ్చేవారు. ఈ ఏడాది మూడు నెలలకొకసారి ఇస్తారని చెప్పడంతో తల్లిదండ్రులకు వెసులుబాటు కలుగుతుంది.

కావలి

•కావలి •ఉదయగిరి •కందుకూరు

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

గుడ్లూరు, న్యూస్‌టుడే: గ్రామంలో మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మధుబాబు తెలిపారు. లైనుకు తగులుతున్న చెట్లను తొలగిస్తున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

10న కరేడుకు రామకృష్ణ

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు మద్దతుగా ఈనెల 10న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కరేడు గ్రామానికి వస్తున్నట్లు రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు వి.హనుమారెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతుల ఉద్యమానికి మద్దతుగా కరేడులో ముఖాముఖి నిర్వహించి సమస్యలు తెలుసుకుంటారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పి.మాలకొండయ్య, నాయకులు బూసి సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన

ఉదయగిరి, న్యూస్‌టుడే: పట్టణంలో దెబ్బతిన్న సీసీ రోడ్లను పంచాయతీరాజ్ శాఖ డీఈఈ మణికుమార్, ఏఈ శ్రీనివాసరావు తెదేపా నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పలు వీధుల్లో దెబ్బతిన్న రోడ్లను ఇటీవల ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పరిశీలించారన్నారు. ఆయా ప్రాంతాల్లో నూతన రోడ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారన్నారు. దీంతో సిబ్బందితో రహదారుల నిర్మాణానికి కొలతలు సేకరించామన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనరు బయ్యన్న, నాయకులు రియాజ్, పెద్ద వెంకటయ్య, ఇంజినీరింగ్ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా అప్పాజీ

సీతారామపురం, న్యూస్‌టుడే: ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా అప్పాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న భార్గవి బాపట్ల ఈటీసీ కేంద్రానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అప్పాజీ బాధ్యతలు స్వీకరించారు. భార్గవిని సిబ్బంది సత్కరించారు.

విలీన గ్రామాలు.. సమస్యల గూళ్లు

ముసునూరులో అధ్వానంగా రహదారి

న్యూస్‌టుడే, కావలి

పట్టణ పరిధిలోని శివారు ప్రాంతాల్లో సమస్యలతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. బుడంగుంట, మద్దూరుపాడు, ముసునూరులో మట్టిరోడ్లు, కచ్చా కాలువలతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కచ్చా కాలువలు కూడా లేకపోవడంతో ఇళ్ల ముందు గుంతలు తవ్వుకుని వాటిలో మురుగునీరు నిల్వచేసుకుంటున్నారు. ముసునూరు, వైకుంఠపురం, గాయత్రీనగర్ తదితర ప్రాంతాల్లో మురుగునీటికి మోటార్లు వినియోగిస్తుండడం సాధారణమైంది. దోమల బెడద ఎక్కువగా ఉంది. వర్షాలొచ్చినప్పుడల్లా మట్టిరోడ్లు బురదమయంగా మారుతున్నాయి. శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియ సజావుగా జరగడం లేదు. దీంతో చెత్త ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో పోలీసు అవుట్‌పోస్టులు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది. విలీన గ్రామాల్లో దొంగల బెడద, ఇతర నేరాలు అధికంగా ఉంటున్నాయి. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ముసునూరు ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇతర సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు.

ఫాగింగ్ చేయిస్తే : ఉమాదేవి, ముసునూరు

నిత్యం ఫాగింగ్ వాహనాలను నడిపితే మా ప్రాంతంలో దోమల సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ప్రతిరోజూ దోమల నివారణకు వివిధ జాగ్రత్తలు తీసుకుంటున్నా తగ్గడం లేదు.

పురపాలక చర్యలు మెరుగుపడాలి : అరుణమ్మ, మద్దూరుపాడు

సదుపాయాలు కల్పించాలి. పారిశుద్ధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు మెరుగుపరచాలి. దోమల సమస్య చాలా ఎక్కువగా ఉంది.

తవ్వుకోండి.. చూడం
అమ్ముకోండి.. పట్టించుకోం

న్యూస్‌టుడే, దుత్తలూరు, వింజమూరు, జలదంకి

- ఈ నెల 29న జలదంకి మండలంలోని ఓ చెరువులో యంత్రాలతో అనుమతులు లేకుండా ఒక వర్గానికి చెందిన వారు అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తుండగా మరో వర్గం వారు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో పలువురు గాయాల పాలయ్యారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
- వింజమూరు ప్రాంతంలోని చెరువుల్లో మట్టి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. భారీ యంత్రాలతో టిప్పర్లు, ట్రాక్టర్లలో కొద్ది నెలలుగా లేఅవుట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. వింజమూరు మండలంలోని పలు చెరువుల్లో తవ్వకాలను స్థానికులు అడ్డుకుంటున్నా ఫలితం లేదు.

ఉదయగిరి నియోజకవర్గంలో మట్టి, గ్రావెల్ మాఫియా బరితెగించింది. చెరువుల్లో మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరి కారణంగా తటాకాలన్నీ గోతులతో రూపుకోల్పోతున్నాయి. వీటిపై ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు చెవికెక్కడం లేదు.

ఉదయగిరి నియోజకవర్గంలో 178 చెరువులు ఉండగా వాటిలో ప్రధానమైనవి 69 ఉన్నాయి. పేదలు అవసరం కోసం రెండు మూడు ట్రిప్పులు తోలుకుంటుంటే అడ్డుకొనే అధికారులు అక్రమార్కులు పదులు, వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లలో కళ్లెదుటే తీసుకెళుతున్నా పట్టించుకుంటున్న పాపాన పోవడం లేదు.

జలదంకి మండలంలో చెరువు మట్టిని ట్రాక్టర్లలో నింపుతున్న యంత్రం

చెరువుల మనుగడ ప్రశ్నార్థకం

మండలాల్లోని చెరువులు నామరూపాల్లేకుండా పోయాయి. వందల అడుగుల వరకు తవ్వి ఇటుక బట్టీలు, లేఅవుట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో చెరువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వర్షాలు కురిస్తే నీరు చేరినా చేలకు రాదని రైతులు వాపోతున్నారు.

అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు
రమణారావు, డీఈ, నీటిపారుదల శాఖ

అనుమతులు లేకుండా చెరువుల్లో తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మండలాల్లోని అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి పర్యవేక్షణ ఉండేలా చూస్తాం.

వయసు పైబడి.. ఆదరణ కరవై

న్యూస్‌టుడే, కావలి

ఈ వృద్ధురాలి పేరు **మర్రి యలమందమ్మ.** ఊరు బోగోలు మండలంలోని ఎస్వీపాలెం. వయసు 90 సంవత్సరాలు. నడిచేందుకు ఓపిక లేక.. పనిచేసే శక్తి లేక జీవనానికి నానాఇబ్బందులు పడుతోంది. ఈతరుణంలో అయిన వారు ఇబ్బందులు పెడుతున్నారని.. తిండి పెట్టకపోగా ఇంటి నుంచి గెంటేశారని ఆర్డీవోకి విన్నవించారు. సోమవారం ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అతికష్టంగా వచ్చి తన బాధను వివరించారు. భర్త లేరు. తన పేరిట ఉన్న స్థిరచరాస్తులన్నీ బంధువులు తీసుకున్నారని, దాంతో ఎస్టీ కాలనీలోని ఓ చిన్న ఇంట్లో తలదాచుకుంటున్నట్లు చెప్పారు. దాన్ని కూడా ఖాళీ చేసి పోవాలని వేధిస్తున్నట్లు ఆమె ఆవేదన చెందారు. నీడ కరవైందని గోడు వెళ్లబోసుకున్నారు.

ఇంట్లో నుంచి గెంటేశారని..

ఇంట్లో నుంచి కుమారులు పంపించేస్తున్నారని వింజమూరు మండలంలోని ఊటుకూరుకు చెందిన **బచ్చు సౌభాగ్యమ్మ** వాపోయింది. తన భర్త ఇచ్చిన ఇల్లు అంటూ ఆమె చెబుతున్నారు. ప్రభుత్వ పింఛన్‌తో ఆ ఇంట్లో తలదాచుకుంటానన్నా ఒప్పుకోవడం లేదని విలపించారు. పెద్ద మనుషులు నచ్చజెబితే పదిరోజులు ఇంట్లో ఆశ్రయమిచ్చి ఆతరువాత వేధిస్తున్నారని ఆరోపించారు.

ఇళ్లలోనే తేల్చుకోవాలి
ఎం.సన్నీ వంశీకృష్ణ, ఆర్డీవో, కావలి

ప్రతి సోమవారం వృద్ధులు వస్తున్నారు. వారి గోడు వింటే చాలా బాధగా ఉంటోంది. ఇలాంటివన్నీ ఆయా కుటుంబాలు, బంధుమిత్రుల ద్వారా పరిష్కరించుకోవాలి. మా వద్దకు వస్తే చట్టప్రకారం వెళ్లక తప్పదు.

సమస్యల పరిష్కారానికి కృషి

వరికుంటపాడులో సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులు

వరికుంటపాడు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి దొడ్డా మాల్యాద్రి తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.బాలకృష్ణ, ఎం.జిలానీబాషా అధ్యక్షతన సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, మండల బాధ్యులు పి.మాల్యాద్రి, ఎ.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

దుకాణం దగ్ధం

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ కూడలి సమీపంలోని పెండెం వారి వీధిలో ఉన్న ఇలింద్ర కాంప్లెక్స్‌లో ఆదివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రాత్రి గస్తీ విధులు నిర్వహిస్తున్న ఒకటో పట్టణ పోలీసు కానిస్టేబుళ్లు గమనించి అగ్నిమాపక దళానికి సమాచారం తెలపగా వచ్చి మంటలు అదుపుచేశారు. మామిడాల వంశీకృష్ణ అనే వ్యాపారికి చెందిన టోకు దుకాణంలో వస్తువులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

గ్రామాభివృద్ధిలో మహిళా సర్పంచులు కీలకం

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ పాలన, అభివృద్ధిలో మహిళా సర్పంచులు కీలకంగా వ్యవహరించాలని ఎంపీడీవో రత్నజ్యోతి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని మహిళా సర్పంచులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ఇచ్చేందుకు ప్రకాశం జిల్లా పొన్నలూరు ఎంపీడీవో పి.సుజాతను నియమించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు పి.ఓబులేసు, టి.అశోక్, భార్గవి, నియోజకవర్గంలోని మహిళా సర్పంచులు పాల్గొన్నారు.

కొత్త కార్మిక చట్టాలు రద్దు చేయాలి

కావలి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కొత్త కార్మిక చట్టాలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు తాళ్లూరి మాల్యాద్రి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పాత కార్మిక చట్టాలనే అమలుచేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సీతారామయ్య, జాన్ పాల్గొన్నారు.

పెట్రోలు బంకు అనుమతి రద్దుకు డిమాండ్

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్న పెట్రోలు బంకు అనుమతులు రద్దు చేయాలని సీపీఎం పట్టణ కమిటీ సబ్‌కలెక్టరు శ్రీపూజకు వినతి పత్రం అందజేసింది. సోమవారం ఉపకలెక్టరు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దీనిని అందజేసినట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ఎస్ఐ గౌస్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వార్షిక సంచిక ఆవిష్కరణ

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని పీబీఆర్ విట్స్ కళాశాలలో ఐక్యూఏసీ సంకలనం చేసిన వార్షిక సంచికను సోమవారం ఆవిష్కరించారు. ఇందులో గత సంవత్సరం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, విద్యార్థుల ప్రతిభ, లబ్ధి పొందిన వైనంపై వివరించారు. కళాశాల ఛైర్మన్ దొడ్ల విద్యాధరకుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ దొడ్ల ప్రత్యూషరెడ్డి, ఈడీ లిఖిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీరు వెళ్లే దారేది?

దుత్తలూరు పంచాయతీ పరిధిలోని కమ్మవారిపాలెం సమీపంలో రహదారి పక్కనే వృథా నీరు నిలిచిపోతోంది. అలాగే నిల్వ ఉండి మురుగు కూపంగా తయారై దోమలకు ఆవాసంగా మారుతోంది. దీంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి నజీముల్లా మాట్లాడుతూ పరిశీలించి నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, దుత్తలూరు**

కరదీపికలు వచ్చాయండి!

ఇవి పాఠ్యపుస్తకాలు కాదు. మండల విద్యావనరుల కేంద్రానికి వచ్చిన వివిధ సబ్జెక్టులకు సంబంధించిన కరదీపికలు. వీటి ప్రకారం బోధన సాగాలని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. సీఆర్పీల వారీగా పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కావలి**

ఈ కార్యాలయం తీయరా!

తాతాహోటల్ సమీపంలోని రాళ్లపాడు జలాశయం ఈఈ కార్యాలయం కొంత కాలంగా మూత పడింది. సోమవారం కూడా తలుపులు తెరవ లేదు. దీంతో ప్రాజెక్టు పర్యవేక్షణ నామమాత్రంగా ఉంది. కింది స్థాయి ఉద్యోగులు కూడా కార్యాలయానికి రావడం మానేశారు. **- న్యూస్‌టుడే, లింగసముద్రం**

వీటి గతి ఇంతేనా!

ఉపాధి హామీ పథకంలో చేసిన పనుల వివరాలను పని ప్రదేశాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. కోవూరు అంగన్‌వాడీ కేంద్రాల దగ్గర గతంలో చేసిన పనుల వివరాలను రాయించిన ఫలకాలు ఆయా ప్రదేశాల్లో ఏర్పాటు చేయకుండా వదిలేశారు. ఒక్కో దానికి సుమారు రూ.500 నుంచి రూ.1000 వరకు ఖర్చు చేస్తున్నారు. ఇలా 30కి పైగా ఉన్నాయి. **- న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం**

రూ.లక్షలు ఖర్చు.. సంపద సృష్టిస్తే ఒట్టు!

మండలంలోని బట్రకాగొల్లు గ్రామంలో డంపింగ్ యార్డు నిరుపయోగంగా మారింది. రూ.లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేస్తే చెత్తతో సంపద తయారు చేయడం లేదు. దీంతో గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపడడం లేదు. వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీఓ పెంచల్ వీరేంద్ర మాట్లాడుతూ వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. **-న్యూస్‌టుడే, అల్లూరు**

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: మా గ్రామంలో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. **- శ్రీను, కొత్తూరు**
సమాధానం: మరమ్మతులు చేసి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- మయూరి, పంచాయతీ కార్యదర్శి - దగదర్తి, న్యూస్‌టుడే**

? ఉక్కపోత వేధిస్తోంది. ఇలాంటి వాతావరణంలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. **- రత్నకిషోర్, 3వ వీధి, కోఆపరేటివ్ కాలనీ**
✓ ఎక్కడన్నా సమస్యలు ఎదురైనప్పుడు మాత్రమే సరఫరాలో అంతరాయం చోటుచేసుకుంటుంది. అలాంటి సమస్య వస్తే సత్వరం పరిష్కరిస్తున్నాం. **- రవికుమార్, డీఈఈ, ఎస్పీడీసీఎల్ - న్యూస్‌టుడే, కావలి**

? మా గ్రామంలోని ప్రధాన కూడళ్లలో చెత్త కుండీలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. చెత్త సేకరణ ట్రాక్టర్లు వచ్చినప్పుడు ఇళ్లలో లేని వారు వాటిలో వేసేందుకు అవకాశం ఉంటుంది. **- రమేష్, కలిగిరి**
✓ పరిశీలించి ఏర్పాటుకు కృషి చేస్తాం. **- రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శి, - కలిగిరి**

? బీరంగుంట సమీపంలో ఇటుక బట్టీలు రోడ్డు పక్కన ఉండడంతో పొగతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. **- సురేష్, అల్లూరు**
✓ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.- **పెంచల్ వీరేంద్ర, డిప్యూటీ ఎంపీడీఓ - న్యూస్‌టుడే, అల్లూరు**

? మా కాలనీ ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు.
- కోటయ్య, కాకర్లపాలెం ఎస్సీ కాలనీ
✓ సర్పంచితో మాట్లాడి మరమ్మతులు చేయిస్తాం. **- రవి, పంచాయతీ కార్యదర్శి - వలేటివారిపాలెం, న్యూస్‌టుడే**

? మా పంచాయతీలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. **- రాజేష్, లింగసముద్రం**
✓ ఈ సమస్యను పరిష్కరిస్తాం. **మాధవరావు, పంచాయతీ కార్యదర్శి - లింగసముద్రం, న్యూస్‌టుడే**

? మా గ్రామ సమీపంలో రహదారి పక్కన రెండు విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. **-రమణయ్య, పాలూరు**
✓ పరిశీలించి స్తంభాలను సరి చేయిస్తాం. **-నరసింహం, గ్రామీణ ఏఈ - కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే**

తెదేపా నాయకుల ఇంటింటి ప్రచారం

ఉదయగిరి, వింజమూరు, న్యూస్‌టుడే : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి పట్టణంలోని ఎస్సీ కాలనీలో సోమవారం తెదేపా నాయకులు ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన పథకాల కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనరు బయ్యన్న, నాయకులు బి.నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహ, పెద్దవెంకటయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు. వింజమూరు మండలంలోని నందిగుంటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, తెదేపా నాయకులు గంగపట్ల వెంగయ్య, చిలకల వెంకటరెడ్డి, మంచాల శ్రీనివాసులు, చల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

తల్లిదండ్రుల సమావేశానికి ఏర్పాట్లు

వింజమూరు, న్యూస్‌టుడే : ఈ నెల పదో తేదీ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని 62 పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశానికి ఏర్పాట్లు చేయాలని ఎంఈవో ఎం.మధుసూదన్ రెడి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అమ్మ పేరుతో ఒక మొక్క నాటి సంరక్షించాలన్నారు. ఆ బాధ్యతను ఉపాధ్యాయులకు అప్పగించాలన్నారు. సమావేశంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకో!

న్యూస్‌టుడే, కలిగిరి

విస్తరించిన ఉత్తరకాలువ

సోమశిల జలాశయం నుంచి కలిగిరి ప్రాంతానికి నీరు తరలించే ఉత్తర కాలువ (జీకేఎన్) విస్తరణ పనులు ఎట్టకేలకు జరుగుతున్నాయి. ఏళ్లుగా ఊరిస్తున్న దీని విస్తరణ పనులు ప్రారంభం కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాలువ వెడల్పు తక్కువగా ఉండడంతో కొద్దిపాటి నీరు మాత్రమే ప్రవహించేది. మార్గమధ్యంలో నీటి ప్రవాహానికి వ్యర్థాలు, ఇతరత్రా ఏమైనా అడ్డంకులు ఎదురైన సందర్భాల్లో కాలువ పైకి నీరు ఉబికేది. వెడల్పు తక్కువగా ఉండడంతో నీటి సరఫరాకు అంతరాయాలు ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కాలువ బాగుపై దృష్టి పెట్టింది. ప్రస్తుతం కాలువ విస్తరణ, పూడికతీత, ఆధునికీకరణ పనులు మండలంలో శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో సరఫరాకు అంతరాయాలు తొలగి, సాఫీగా నీరు ప్రవహించే అవకాశం లభించింది. కాలువ నుంచి కలిగిరిలోని చెరువులకు సైతం నీరందించే పనులు జరిగితే వేలాది మందికి ఉపయోగమని రైతాంగం భావిస్తోంది. పొలాలకు నీరు అందితే పంటలు సాగు చేసుకుంటామని కర్షకులు ఆశిస్తున్నారు.

చెరువులో ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థుల ఆందోళన

జలదంకి, న్యూస్‌టుడే : మండలంలోని గోపనపాలెంలో సర్వే నంబరు 1861లో ఉన్న 44.02 ఎకరాల చెరువు విస్తీర్ణంలో ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. చెరువు స్థలంలో 15 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురైనట్లు ఆరోపించారు. తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు ఎం.సుబ్బారెడ్డి, తమ్మినేని మాలకొండయ్య, డి.వెంగయ్య, రామిరెడ్డి పాల్గొన్నారు.

పొరుగు సేవల సిబ్బంది ఆందోళన

కావలి, న్యూస్‌టుడే: పొరుగు సేవల్లో పనిచేస్తున్న కార్మిక కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని సీపీఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి కె.నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై కావలి పురపాలక కార్యాలయం వద్ద దర్నా నిర్వహించి మేనేజర్ ఫణిభూషణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దమ్ము దర్గాబాబు, మల్లి అంకయ్య, వెంకటేశ్వర్లు, రవి, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు.. మురుగు హోరు

న్యూస్‌టుడే, వింజమూరు

ఉదయగిరి నియోజకవర్గంలో మేజర్ పంచాయతీ అయిన వింజమూరులో మురుగుకాలువల వ్యవస్థ అస్తవ్యస్థంగా అధ్వానంగా తయారైంది. ప్రధాన రహదారిలో కొన్ని ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా మురుగుకాలువలు లేవు. దీంతో ఇళ్ల ముందు మురుగునీటి నిల్వకు గుంతలు ఏర్పాటు చేసుకున్నారు. అవి నిండి రహదారిపై ప్రవహిస్తుంది. రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగైదు రోజులకోసారి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో అందులోనే నడవాల్సి వస్తోంది. కాలువలు ఉన్న చోట్ల పూడిక తీయకపోవడంతో ప్రవాహం సాగడం లేదు. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో చాలా వీధులకు కాలువలు లేవు. వృథా నీరు రోడ్లపైకి చేరుతోంది.

హిందూనగర్‌లో కాలువలో నిలిచిన మురుగునీరు

ఎక్కడ చూసినా..

- ఆర్టీసీ బస్టాండు వెనుక గంగమిట్ట మీదుగా ఉన్న మురుగుకాలువ పూడికతో నిండి మురుగునీరు ముందుకు కదలడం లేదు.
- ప్రధాన రహదారి నుంచి గ్రంథాలయం మీదుగా నేరేడుపల్లికి వెళ్లే రోడ్డు ప్రారంభంలో కాలువ కొద్ది దూరం పూడిక తీసి వదిలివేయడంతో మడుగు ఏర్పడింది.
- హిందూనగర్‌లో అసంపూర్తిగా కాలువ నిర్మించారు. అది నిండి బయటకు ప్రవహిస్తోంది.
- ప్రధాన రహదారి నుంచి షఫీ హాస్పిటల్ మీదుగా టీచర్స్ కాలనీకి వెళ్లే రోడ్డులోనూ నిలిచి పోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఆర్టీసీ రోడ్డులో తరచూ వీధిలోకి రావడంతో అందులోనే నడుచుకుంటూ ప్రజలు వెళ్లాల్సి వస్తోంది.
- మెయిన్‌రోడ్‌లో యూనియన్ బ్యాంకు పైభాగం నుంచి వీఆర్ ఫంక్షన్ ప్లాజా వరకు కాలువలు లేక తరచూ మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది.

మురుగుకాలువల వ్యవస్థ అస్తవ్యస్తమే - కె. శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో

గ్రామంలో మురుగుకాలువల వ్యవస్థ సరిగాలేదు. దీంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పంచాయతీలో ఉన్న నిధులు వాడారు. మండల పరిషత్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 40 లక్షలు. జనరల్ ఫండ్ రూ. 40 లక్షల నిధులున్నాయి. కాలువల నిర్మాణానికి నిర్మాణానికి ప్రాధాన్యమిస్తాం. సాధ్యమైనంత వరకు మురుగుకాలువల నిర్మాణం పూర్తి చేసి పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటాం.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

న్యూస్‌టుడే బృందం, కావలి, ఉదయగిరి, కందుకూరు: ఉదయగిరి, న్యూస్‌టుడే : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ, ఈసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు సోమవారం పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో ఆ సంఘం నాయకులు బాణసంచా కాల్చి, జెండాలు ఆవిష్కరించారు.

ఉదయగిరి: జెండా ఎగురవేస్తున్న నాయకులు

(c) eenadu

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో సోమవారం నాటికి 77.988కి 29.710 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 300.259 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. ఎగువ ప్రాంతాల నుంచి 190 క్యూసెక్కుల వరద జలాశయానికి వస్తోంది. -17, -18 క్రస్ట్ గేట్ల ద్వారా 30, పవర్ టన్నల్ ద్వారా 2,570 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాకు దక్షిణ కాలువకు 400, ఉత్తర కాలువకు 425 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 121 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

విడవలూరు, న్యూస్‌టుడే: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విడవలూరు బిట్-1 ఎంపీటీసీ సభ్యుల ఉప ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాను ఎంపీడీవో నగేష్‌కుమారి సోమవారం ప్రదర్శించారు. సచివాలయం, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

సమష్టి కృషితో సమస్యల పరిష్కారం

సైదాపురం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేస్తే గ్రామాల్లోని ప్రధాన సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఎంపీపీ పెంచలమ్మ అన్నారు. సోమవారం సైదాపురం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, వాటి పురోగతిని అధికారులు సభలో వివరించారు. ఎంపీడీవో రమేష్‌బాబు, మండల ప్రత్యేకాధికారి భాస్కర్, జడ్పీటీసీ సభ్యులు పోలయ్య, సర్పంచులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: మర్రిపాడు మండలంలోని పాత అంగన్‌వాడీ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతోంది. - **చిరంజీవి, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతాం. - **ధనలక్ష్మి, ఎంఈవో-2**

? మర్రిపాడు మండలంలోని పెగళ్లపాడు ప్రాథమిక పాఠశాల వద్ద మురుగు కాలువలు లేకపోవడంతో నీరు రోడ్డుపై పారుతోంది. - **రవి, స్థానికుడు**

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **నాగేశ్వర ప్రసాద్, ఎంపీడీవో**

? సంగం మండలం దువ్వూరు గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో అపరిశుభ్రంగా ఉంది. - **పెంచలయ్య, స్థానికుడు**

✓ వెంటనే పారిశుద్ధ్య సిబ్బందికి తెలిపి శుభ్రం చేయిస్తాం. - **రమేష్, పంచాయతీ కార్యదర్శి**

? పొదలకూరు సీహెచ్‌సీలో గర్భకోశ వ్యాధుల సంబంధించిన వైద్యుడు లేక ఇబ్బందులు పడుతున్నాం. - **శేషయ్య, స్థానికుడు**

✓ వారానికి రెండుసార్లు వైద్యుడు వచ్చేలా ఏర్పాటు చేశాం. సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం. - **ప్రసాద్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్**

? పొదలకూరులో తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు వస్తున్నాయి. సమస్యను చెప్పుకొనేందుకు అధికారులు సైతం అందుబాటులో లేరు. - **రమణయ్య, రైతు**

✓ త్వరలో ఐసోలేటర్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తాం. - **సుబ్రహ్మణ్యం, డీఈఈ**

? విడవలూరు మండలం అలగానిపాడులో మురుగు కాలువల్లో పూడిక తీయక దుర్వాసన వస్తోంది. రాకపోకలు చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు**

✓ వెంటనే పరిశీలించి కాలువల్లో పూడిక తీయిస్తాం. - **మస్తాన్‌ఖాన్, ఈవోపీఆర్డీ**

? అనంతసాగరం మండలంలోని సోమశిల గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. సమస్య పరిష్కరించాలి. - **శేషు**

✓ కోతులను దూర ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. - **తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి**

లోకేశ్‌కు ఘన వీడ్కోలు

నాయకులు, కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న మంత్రి లోకేశ్

వెంకటాచలం, మనుబోలు, న్యూస్‌టుడే: నెల్లూరు పర్యటన ముగించుకుని వెళుతున్న మంత్రి లోకేశ్‌కు వెంకటాచలం వద్ద ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు ఘనంగా వీడ్కోలు పలికాయి. వందలాది మంది నాయకులు, కార్యకర్తలు సర్వేపల్లి రోడ్డు వద్దకు చేరుకోవడంతో లోకేశ్ కారును నిలిపి అభివాదం చేశారు. అనంతరం కరచాలనం చేసేందుకు పలువురు పోటీపడ్డారు. మనుబోలు బైపాస్ కూడలి వద్ద ఆగి శ్రేణులకు అభివాదం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, నాయకులు రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: బావితరాల భవిష్యత్తుకు మంత్రి లోకేశ్ పునాదులు వేస్తున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. పడుగుపాడులో సుపరిపాలన తొలిఅడుగు-ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం సోమవారం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నాం. జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం ఎంపీ వేమిరెడ్డి కృషిచేస్తున్నారన్నారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. తెదేపా నాయకులు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంట కుంట.. లక్ష్యంలో వెనకడుగు

మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం), న్యూస్‌టుడే: కరవు పరిస్థితులను ఎదుర్కోవడానికి, భూగర్భ జలాలు పెంపొందించేందుకు చేపట్టిన పంట కుంటల పనులు మందకొడిగా సాగుతున్నాయి. వీటి తవ్వకానికి సుమారు అయిదు సెంట్ల భూమి కేటాయించాల్సి రావడంతో సన్న, చిన్న కారు రైతులు వెనకడుగు వేస్తున్నారు. వారిని ఒప్పించేందుకు ఉపాధిహామీ యంత్రాంగం తంటాలు పడాల్సి వస్తోంది. మరోవైపు ఉపాధి కూలీలు సైతం ఆసక్తి చూపకపోవడంతో ఏప్రిల్, మే, జూన్ నెల్లో పూర్తి చేయాల్సి ఉండగా లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు.

ఆసక్తి చూపని కూలీలు

నియోజకవర్గంలో 52,923 జాబ్ కార్డులు ఉండగా యాక్టివ్‌గా 43,210 ఉన్నాయి. 68,863 మంది కూలీలకు గాను 34,681 మంది పనులకు వెళుతున్నారు. ఒక్కో కుంట నిర్మాణానికి 125 పని దినాలు కేటాయించారు. కనీసం పది మంది వరకు పని చేయడానికి అవకాశం ఉంది. కొలతలను బట్టి ఒక్కో కుంట తవ్వితే రూ.35 వేల వరకు వస్తుంది. అది వేతనాల రూపంలో జమవుతుంది. భూమి గట్టిగా ఉండటం, మెట్ట ప్రాంతాల్లో రాళ్లు, బండలు అడ్డుపడటంతో తవ్వకం కష్టంగా ఉందని కూలీలు అంటున్నారు. సకాలంలో వేతనాలు

మర్రిపాడులో పూర్తయిన పంట కుంట నిర్మాణం

అందక ఇతర పనులకు వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. దీనికితోడు చిన్నసన్నకారు రైతులు సైతం వెనకడుగు వేస్తున్నారు. ఉన్న కొద్ది స్థలంలో వీటిని నిర్మిస్తే సాగుకు ఇబ్బంది అని ముందుకు రావడం లేదు. దీంతో మంజూరైన పంట కుంటల సంఖ్యకు ఆమోదం పొంది, పూర్తయిన వాటికి చాలా వ్యత్యాసం ఉంది. అది కూడా వీటి నిర్మాణం జరిగేలా అవగాహన కల్పించాల్సి ఉంది.

నియోజకవర్గంలో వివరాలు ఇలా..

మండలం	మంజూరు	ఆమోదం పొందినవి	పూర్తయినవి
ఆత్మకూరు	240	138	69
మర్రిపాడు	280	131	101
ఏఎస్‌పేట	380	103	60
అనంతసాగరం	200	38	25
చేజర్ల	300	57	16

రైతులకు ప్రయోజనం

ఉపాధిహామీ పథకంలో పొలాల్లో పంట కుంట తవ్వకాన్ని చేపడుతున్నాం. వర్షపు నీటిని నిల్వ చేస్తే భూగర్భ జల మట్టం పెరగడంతో పాటు, రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. నేల గట్టిగా ఉండటంతో కూలీలు తవ్వకానికి వెనకంజ వేస్తున్నారు. ఇతరపనులపైనే మొగ్గు చూపుతున్నారు. రైతులు, కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. లక్ష్యం మేరకు కుంటల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేలా కృషి చేస్తాం. - **ప్రతాప్‌రెడ్డి, ఏపీడీ, ఆత్మకూరు**

రైతులకు యూరియా కష్టాలు

అనంతసాగరం, న్యూస్‌టుడే: రైతులకు మండలంలోని కొన్ని దుకాణాల్లో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం సొసైటీ, రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో లేదు. దీంతో దుకాణాల వద్ద యూరియా కోసం పడిగాపులు గాస్తున్నారు. బస్తా యూరియాను రూ.266 లకు విక్రయించాల్సి ఉండగా హమాలీకి రూ.4 చొప్పున రూ.270 చొప్పున విక్రయించాలి. కొందరు దుకాణాదారులు రూ.80 నుంచి రూ.120 వరకు అధికంగా యూరియాను విక్రయిస్తున్నారని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి శైలజా కుమారి మాట్లాడుతూ దుకాణాల్లో జరుగుతున్న విక్రయాలపై ఎప్పటికప్పుడు సిబ్బందితో కలిసి పర్యవేక్షిస్తున్నామన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పారా అథ్లెటిక్స్ విజేత భవానీకి సన్మానం

భవానీని సన్మానిస్తున్న తెదేపా నాయకులు

ముత్తుకూరు, న్యూస్‌టుడే: చెక్ రిపబ్లిక్ దేశం ఒలోమౌక్‌లో ఇటీవల జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్ గ్రాండ్ ప్రిక్స్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచిన ముత్తుకూరుకు చెందిన వలసగాని భవానీకి సోమవారం స్థానిక తెదేపా నాయకులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, ఈదూరు రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు

ఆత్మకూరు: విద్యార్థులను ఉన్నతస్థితికి చేరేలా తీర్చిదిద్దిన పూర్వ ఉపాధ్యాయులకు గుర్తింపు అని మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీకాంతనాయుడు అన్నారు. నారంపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీ అయిన నరేంద్రరెడ్డిని సోమవారం సన్మానించారు. ఈ పాఠశాలలో పనిచేస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పూడిక తీయించదయ్యా..!

విడవలూరు చెరువు నుంచి తుమ్మగుంట మీదుగా దంపూరుకు వెళ్లే డ్రెయిన్ జమ్ము, గుర్రపు డెక్కతో నిండిపోయింది. దీంతో సాగునీరందడంలేదని అన్నదాతలు వాపోతున్నారు. గత ప్రభుత్వం మూడేళ్ల క్రితం కాలువలో ఒకవైపునే అరకొరగా పూడికతీసి వదిలేశారు. తర్వాత పట్టించుకోలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పూడిక తీయించాలని రైతులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, విడవలూరు**

పేరు మార్చరా?

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా.. పలు కార్యాలయాలకు గత ప్రభుత్వం పెట్టిన పేర్లే దర్శనమిస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాలను.. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసినా.. మండలంలోని పలు చోట్ల పాత పేరే కనిపిస్తోంది. చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారిణి కవిత తెలిపారు. - **న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం)**

ప్రమాదకరంగా వాల్వు గుంత

అనంతసాగరంలోని రామాలయం వీధి ప్రధాన రహదారి వద్ద వాల్వు గుంత ప్రమాదకరంగా ఉంది. ఎలాంటి రక్షణ మూతను ఏర్పాటు చేయక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ట్రాక్టరు ప్రమాదవశాత్తు ముందు చక్రం గుంతలో పడటంతో వాహనదారుడు అవస్థలు పడ్డారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ సమస్య మా దృష్టికి రాలేదన్నారు. వెంటనే వాల్వు గుంతకు మూతను ఏర్పాటు చేస్తామన్నారు. - **న్యూస్‌టుడే, అనంతసాగరం**

ట్రాఫిక్‌తో సతమతం

అనంతసాగరంలో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆటోలు, ఇతర వాహనాలు రోడ్డుపై నిలుపుతున్నారు. ఎస్సై సూర్యప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రోడ్లపై వాహనాలు నిలపకుండా చర్యలు చేపడతామన్నారు. - **న్యూస్‌టుడే, అనంతసాగరం**

తప్పిన ప్రమాదం

పెరమన - కొలగట్ల గ్రామాల మధ్య సోమవారం నెల్లూరు ముంబయి జాతీయరహదారిపై వెళుతున్న ఆటో అదుపు తప్పింది. రహదారి దిగువనే ఊట కాలువలోకి దూసుకెళ్లింది. రోడ్డుపై బోల్తా పడి ఉంటే పెనుప్రమాదం జరిగి ఉండేది. ఆటో కాలువలో ఇరుక్కోవడంతో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. - **న్యూస్‌టుడే, సంగం**

ఏఎస్‌పేటలో భక్తుల సందడి

అనుమసముద్రంపేట : నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండగకు హాజరైన భక్తులు, యాత్రికులు ఏఎస్‌పేట దర్గాను సందర్శిస్తుండడంతో స్థానికంగా సందడి వాతావరణం నెలకొంది. ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి పది, నెల్లూరు-2 డిపో అయిదు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా వారికి ఇబ్బందులు రాకుండా వక్ఫ్ బోర్డు ఈవో మహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో దర్గా వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. సీసీ కెమెరాలతో నిఘా ఉంచారు. భక్తులు హజరత్‌ఖాజానాయబ్‌రసూల్, బీబీ హబీబీ ఖాతూన్ సమాధులను దర్శించుకుంటున్నారు. కాగా యాత్రికులు వాహనాల్లో వస్తుండడంతో స్థానిక బస్టాండు నుంచి నగారఖానా వరకు ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ఎలాంటి సమస్యలు రాకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని డీఎస్పీ వేణుగోపాల్ అన్నారు. సోమవారం రాత్రి దర్గా వద్ద పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

అనంతసాగరం, కలువాయి, రాపూరు, న్యూస్‌టుడే: సోమశిల, ఉప్పలపాడు, ముస్తాపురం, అనంతసాగరం, పాతదేవరాయపల్లి తదితర గ్రామాల్లో సోమవారం పీర్లను ఊరేగించారు. హిందూ, ముస్లింలు పాల్గొన్నారు. రాపూరు, ఓబులాయపల్లి, మసీదుపేట గ్రామాలతోపాటు కలువాయిలో భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు కార్యక్రమం నిర్వహించారు.

కలువాయిలో పీర్ల ఊరేగింపులో భక్తులు

వనం వీడి.. ప్రాణం వదిలి

మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లాలో మర్రిపాడు, అనంతసాగరం, రాపూరు, ఉదయగిరి, దుత్తలూరు, సీతారామపురం అటవీ ప్రాంతాల్లో దుప్పులు, జింకల సంఖ్య ఎక్కువగా ఉంది. సాధారణంగా ఇవి జన సంచారం లేని ప్రాంతాల్లో ఉండటానికి ఇష్టపడుతుంటాయి. అడవుల్లో నీటి సౌకర్యం కొరవడడంతో మైదానాలు, పొలాల బాట పడుతున్నాయి. ఈ క్రమంలో కుక్కల నోటికి చిక్కి ప్రాణాలు కోల్పోతున్నాయి. అటవీ శాఖ అధికారులు స్పందించి వన్యప్రాణులు సంచరించే ప్రాంతాల్లో జలవనరులను అభివృద్ధి చేసి వాటి ప్రాణాలు కాపాడాలని పలువురు కోరుతున్నారు.

మృతి చెందిన దుప్పిని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (పాత చిత్రం)

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు

❖ ఈ నెల 3న పొంగూరు కండ్రికలో జనావాసాల్లోకి వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. ❖ జూన్ 26న రాపూరు ఎర్రచెరువు సమీపంలో నీటి కోసం వచ్చిన చుక్కల దుప్పి అదేవిధంగా చనిపోయింది. ❖ ఫిబ్రవరి 21న అనంతసాగరం బి.సి.కాలనీ సమీపంలో దుప్పి జనావాసాల్లోకి వచ్చింది. రాగా అధికారులు అడవిలో వదిలిపెట్టారు. గత ఆగస్టు 20 పి.ఎన్.పల్లిలో అటవీ ప్రాంతం నుంచి తప్పిపోయిన చుక్కల దుప్పి తాగునీటి కోసం వచ్చి బావిలో పడింది. స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బయటకు తీసి సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలారు. ❖ గత ఏడాది ఆగస్టు 30న పడమటినాయుడుపల్లి సమీపంలో, సెప్టెంబర్ 4న కదిరినాయుడుపల్లి పొలాల వద్ద కుక్కలు దాడి చేయడంతో ఈ వన్యప్రాణులు మృత్యువాత పడ్డాయి.

చర్యలు తీసుకుంటాం

వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం అటవీ ప్రాంతంలో తాగునీరు పుష్కలంగా ఉంది. మేత కోసం సమీప గ్రామాల్లోకి వన్యప్రాణులు వస్తున్నాయి. అవి కనిపిస్తే తమకు సమాచారం అందించాలని ప్రజలకు తెలుపుతున్నాం.

– **నాగయ్య, డీఆర్వో, కదిరినాయుడుపల్లి బీట్**

పూరిల్లు దగ్ధం

అనంతసాగరం, న్యూస్‌టుడే: ఉప్పలపాడులో టపాసులు పేలి సోమవారం పూరిల్లు దగ్ధమైంది. బాధితురాలు ఆషాబీ తెలిపిన వివరాల మేరకు గ్రామంలో 15 కుటుంబాల వారు పీర్ల పండగకు దూరంగా ఉన్నామన్నారు. దీంతో మరొక వర్గం వారు రాలేదనే కక్షతో ఇంటి ముందు అగ్నిగుండంలో టపాసులు వేశారన్నారు. అవి పేలడంతో నిప్పు రవ్వలు ఇంటిపై పడి పూర్తిగా దగ్ధమైందన్నారు. ఇంటిలో ఉన్న ట్రాక్టర్ పనిముట్లు, టైర్లు కాలిపోయాయని సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం వచ్చిందన్నారు. ఈ మేరకు సోమశిల పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు.

పేలిన మినీ గ్యాస్ సిలిండర్

మనుబోలు, న్యూస్‌టుడే: స్థానిక బీసీ కాలనీలో నివాసముంటున్న మీరా సాహెబ్ ఇంటిలో వంటకు వినియోగించే మినీ గ్యాస్ సిలిండర్ సోమవారం పేలడంతో కాలనీ వాసులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పేలడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

యువకుడిపై దాడి

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: క్రికెట్ ఆడుతుండగా జరిగిన వివాదంలో ఓ యువకుడిపై దాడి జరిగిన సంఘటన సోమవారం కావలిఎడవల్లిలో చోటుచేసుకుంది. బాధితుడి తల్లి వివరాల మేరకు కల్యాణ్ అనే యువకుడు స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన బాలాజీ అనే యువకుడితో గొడవ జరిగింది. అనంతరం ఆ యువకుడి తండ్రి శ్రీనివాసులు, మామ రామకృష్ణ వచ్చి కల్యాణ్‌ను రాళ్లతో కొట్టి గాయపరచారు. ఆ మేరకు బాధితుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్తు మోటార్ల చోరీపై ఫిర్యాదు

అనుమసముద్రంపేట : కావలిఎడవల్లి గ్రామ పొలాల్లో విద్యుత్తు మోటార్లు, వైర్లు చోరీకి గురవుతున్నాయని ఆ గ్రామానికి చెందిన రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికి నాలుగైదు సార్లు ఇలాగే జరిగిందన్నారు. దర్యాప్తు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

భూమిని అప్పగించాలంటూ ఆందోళన

సంగం : తలుపూరుపాడులో తాము కొనుగోలు చేసిన భూమిని తమకు అప్పగించాలంటూ బాధిత కుటుంబసభ్యులు సోమవారం ఆందోళన చేపట్టారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్ ఆధ్వర్యంలో మహ్మద్ రఫీ కుటుంబసభ్యులు తహసీల్దారు సోమ్లానాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఎనిమిదెకరాల భూమి కొనుగోలు చేశామని, పట్టాదారు పాసుపుస్తకాలు పొందామని, అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా ఉన్నామన్నారు. తమ అనుభవంలో మాత్రం భూమి లేదని కొందరు ఆక్రమించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు.

గాంధేయవాది రావిప్రోలుకు నివాళి

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: గాంధేయవాది రావిప్రోలు సుబ్రహ్మణ్యం సంతాప దినాన్ని ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో సోమవారం నిర్వహించారు. గాంధీపై ఉన్న భక్తి, అభిమానంతో ఈ ఆశ్రమానికి ఎంతో సేవ చేశారని పలువురు వక్తలు కొనియాడారు. గాంధీపై ఉన్న విధేయతతో సుబ్రహ్మణ్యం 78 ఏళ్ల వయసులో 'పర్షప్సన్ ఆఫ్ స్టూడెంట్ యూత్ ఆన్ మహాత్మాగాంధీ-ఎ-స్టడీ ఇన్ ఆంధ్రా యూనివర్సిటీ' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, సభ్యులు జీవి రామిరెడ్డి, షేక్ అల్లాబక్షు, రావిప్రోలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మృతికి సంతాపం

కోవూరు, న్యూస్‌టుడే: పోతిరెడ్డిపాళెం ఎయిడెడ్ పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ఎయిడెడ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకుడు రామకృష్ణ అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. దీంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. **సైదాపురం:** అనంతమడుగుకు చెందిన సీఐఎస్‌ఎఫ్ ఉద్యోగి పోలయ్య(48) ఆదివారం చెన్నై సమీపంలో రైలు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సోమవారం స్వగ్రామానికి తీసుకురాగా పలువురు నివాళులు అర్పించారు.

కళాశాలలో వైద్య శిబిరం

రాపూరు, న్యూస్‌టుడే: రాపూరు సీవీ కృష్ణయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సూత్రాలపై వైద్యాధికారిణి భాను అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ కృష్ణవేణి సూపర్‌వైజర్ సుప్రజ తదితరులు ఉన్నారు. పొదలకూరు: పొదలకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీహెచ్‌సీ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ పెంచలమ్మ విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. బ్లడ్‌గ్రూపు, హిమోగ్లోబిన్ శాతాన్ని నమోదు చేసి వారికి అవసరమైన ఆరోగ్య సూచనలు చేశారు. ప్రిన్సిపల్ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

పేరుకే నిషేధం.. చేపకు వేయ్ గాలం

సోమశిలలో యథేచ్ఛగా అక్రమ వేట

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో చేపల అక్రమ వేట సాగుతూనే ఉంది. జులై, ఆగస్టు నెలల్లో చేప గుడ్డు దశలో ఉంటుంది. వాటి పునరుత్పత్తికి ఈ కాలం చాలా విలువైనది కావడంతో అధికారులు ఏటా ఈ రెండు నెలల పాటు నిషేధం విధిస్తారు. కాగా వారి పర్యవేక్షణ కొరవడడంతో అమలుకు నోచుకోవడం లేదు.

ధనార్జనే ధ్యేయం

ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారస్థులు బయట ప్రాంతాల నుంచి జాలర్లను తీసుకొచ్చి రాత్రివేళల్లో జలాశయం వెనుక ప్రాంతాల్లో పెన్నానది ఒడ్డున స్థావరాలు ఏర్పాటు చేసుకుని వేట సాగిస్తున్నారు. సాధారణంగా కండి వల, ఇసురు వలలను ఉపయోగించాలి. ఇందుకు విరుద్ధంగా కడప జిల్లా సరిహద్దుల్లో అలివి వలలను వాడుతున్నారు. సుమారు 2 కిలోమీటర్ల పొడవు కలిగిన ఈ వలను సుమారు 20 మంది జాలర్లను ఉపయోగించి వేట సాగిస్తారు. దీని వల్ల పెద్ద చేప నుంచి చిన్న వాటి వరకు వలలో పడాల్సిందే. దీంతో మత్స్య సంపదకు గండి పడటంతో పాటు అసలైన మత్స్యకారులు

పడవలో వెళుతున్న మత్స్యకారులు

ఉపాధి కోల్పోతున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరవు

పట్టిన మత్స్య సంపదను తెల్లవారుజామున బయట ప్రాంతాలకు, దుకాణాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దుకాణాదారులను ప్రశ్నిస్తే చెరువుల నుంచి చేపల తీసుకొస్తున్నామని బుకాయిస్తున్నారు. అలా తెచ్చి విక్రయించాలన్నా రసీదు ఉండాలని గతంలో మత్స్యశాఖ జిల్లా అధికారులు సూచించారు. అవేమి పట్టని వ్యాపారస్థులు వేట సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మత్స్యశాఖ, జలాశయం అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం

అక్రమ చేపల వేట జరగకుండా సిబ్బందిని ఏర్పాటు చేశాం. రాత్రి వేళల్లో, తెల్లవారు జామున జలాశయం నుంచి చేపలు వస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిసర ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు, మత్స్యకారులు, వ్యాపారస్థులు సంచరించినా కేసులు నమోదు చేస్తాం. ఇటీవల కొందరి పట్టుకుని కోర్టులో హాజరు పరచాం. నిషేధ సమయంలో చేపల వేట సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– **శ్రీనివాసులు, ఏడీ, మత్స్యశాఖ**

ఫ్రీహోల్డ్ భూములపై విజిలెన్సు విచారణ

చేజర్ల, న్యూస్‌టుడే: అసైన్‌మెంట్ భూములు ఫ్రీహోల్డ్ అయిన అనంతరం జిల్లాలో జరిగిన రిజిస్ట్రేషన్లపై విజిలెన్సు విచారణ చేపట్టనుంది. లబ్ధిదారులకు మంజూరైన పట్టాల విశ్వసనీయతపై మండలానికి మూడు నుంచి పది వరకు దస్త్రాలను ఎంచుకుని మంగళవారం జిల్లా కేంద్రంలో విచారణ జరపనుంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఈ చర్యలు తీసుకుంది. పట్టాల మంజూరు మొదలు రిజిస్ట్రేషన్ల వరకు జరిగిన ప్రక్రియపై నివేదికల విజిలెన్సు కమిటీ ఎదుట హాజరు కావాలని తహసీల్దారు కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేసింది. చేజర్ల మండలం చిత్తలూరు పరిధిలోని మూడు దస్త్రాలను ఎంపిక చేసి నివేదిక కోరింది. ఇందు కోసం రెవెన్యూ అధికారులు సోమవారం లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

పొదలకూరు, న్యూస్‌టుడే: రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడి భూములు నిస్సారంగా మారాయని ప్రకృతి వ్యవసాయంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం పొదలకూరు మండల పరిషత్తు కార్యాలయంలో పొదలకూరు, కలువాయి, చేజర్ల, సైదాపురం, రాపూరు మండలాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 80,000 ఎకరాలు సారవంతం చేయాలన్న లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అందుకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. పైరు పండిన తర్వాత పొలంలో ఈ విత్తనాలు చల్లిన 60 రోజుల అనంతరం కలియ దున్నితే నేల సారవంతమవుతుందన్నారు. పొదలకూరు సబ్‌డివిజన్ పరిధిలో 5880 మంది రైతులు 7719 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న డీపీఎం రాజ్‌కుమార్

(c) eenadu

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

ఆకట్టుకున్న మల్లయుద్ధం అలంకరణ

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నగరంలోని మూలాపేటలో కొలువుదీరిన ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు 13 రోజులు పూర్తి చేసుకున్నాయి. అందులో భాగంగా సోమవారం సాయంత్రం భారతంలోని మల్ల యుద్ధ ఘట్టం నిర్వహించారు. మల్లుడికి, భీముడికి జరిగిన యుద్ధ సన్నివేశం ఆకట్టుకుంది. మహాభారత పురాణ కాలక్షేపాన్ని వినిపించారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, ఉభయకర్తలు, ఈవో జానకమ్మ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహిళా సమస్యలు.. మోసాలపైనే వినతులు

పరిష్కార వేదికకు వచ్చిన అర్జీదారులు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు తక్కువ సంఖ్యలో వచ్చారు. ప్రతివారం 80 నుంచి 100 వరకు అర్జీలు వస్తుండగా.. సోమవారం కేవలం 47 అర్జీదారులే హాజరయ్యారు. కార్యక్రమంలో కావలి డీఎస్పీ శ్రీధర్, డీటీసీ సీఐ నాగేశ్వరమ్మ, ఎస్‌బీ-2 సీఐ శ్రీనివాస రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● మద్యానికి బానిసైన భర్త నిత్యం దుర్భాషలాడుతున్నారని, తనను, పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని జలదంకికి చెందిన మహిళ, అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారని చిన్నబజారుకు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తమను కుమారుడు వెంకటేశ్వర్లు దుర్భాషలాడుతున్నారని, ఆస్తి కోసం మనుమడు, కోడలు, కుటుంబ సభ్యులు బెదిరిస్తున్నారని నవాబుపేటకు చెందిన వృద్ధ దంపతులు, కావలికి చెందిన ఓ వృద్ధురాలు అధికారులకు మొరపెట్టుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తిరుపతికి చెందిన జయప్రకాష్ అనే వ్యక్తి రూ.14లక్షలు తీసుకుని ఎనిమిది నెలల నుంచి ఉద్యోగం ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కావలి రెండో పట్టణానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో వ్యాపారం చేస్తే అధిక ఆదాయం వస్తుందని ఒంగోలు కొత్తపట్నానికి చెందిన ఆశారాణి అనే మహిళ రూ.12.70లక్షలు తీసుకుని మోసం చేసిందని కందుకూరుకు చెందిన వ్యక్తి ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఓ వ్యక్తి బలవంతం చేశాడని అతనిపై కేసు నమోదైనా తదుపరి చర్యలు తీసుకోలేదని జలదంకికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. పొలం హద్దుల విషయంపై పొదలకూరుకు చెందిన శ్రీనివాసులు, అతని సహచరులు ఆరుగురు దాడికి పాల్పడినట్లు అదే ప్రాంతానికి చెందిన మహిళ అధికారులకు మొరపెట్టుకున్నారు.

అత్యంత పరిశుభ్రంగా దర్గా ఆవరణం

దర్గా ఆవరణ పరిశీలిస్తున్న కమిషనర్ వైఓ నందన్

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని అన్ని శిబిరాల వద్ద శుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ సూచించారు. సోమవారం బారాషహీద్ దర్గా రొట్టెల పండగ సౌకర్యాలను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆవరణంలో వాడి పడేసిన ప్లేట్లు, గ్లాసులు ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకునే ప్రాంతంలో అత్యంత పరిశుభ్రంగా ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణ పనులను సంబంధిత విభాగాల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని రొట్టెల పండగ నిర్వహణను విజయవంతం చేయాలని కోరారు.

శివారు.. అధ్వాన రహదారులతో బేజారు

రోజురోజుకు విస్తరిస్తున్న నెల్లూరు నగరంలో.. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లోని రహదారులతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పలు కాలనీల్లో ఇవి రోడ్లేనా అన్నట్లు పరిస్థితి తయారైంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో అభివృద్ధికి నోచుకోక దారుణంగా తయారయ్యాయి. -న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

హరనాథపురం వద్ద అధ్వానంగా క్రాస్ రోడ్డు

గుంతలతో ఉన్న పొట్టేపాలెం వెళ్లే రహదారి

నగరంలోని హరనాథపురం, జొన్నవాడ రోడ్డు, కొత్తూరు, కొండాయపాలెం, మైపాడు రోడ్డు ప్రాంతాల్లో నగరం విస్తరిస్తోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేస్తోంది. పలు కాలనీల్లో ప్రధాన రోడ్లు నిర్మించినా, ఇంకా చాలా చోట్ల అధ్వానస్థితిలో ఉన్నాయి. రామకోటయ్య నగర్, టైలర్స్‌కాలనీ, పోలీసుకాలనీ, పరమేశ్వరి నగర్ ప్రాంతాల్లో క్రాస్‌రోడ్లు రాళ్లు రప్పలు, పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయి. చంద్రబాబునగర్ నుంచి బుజబుజనెల్లూరుకు వెళ్లే రహదారిపై అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. పొర్లుకట్ట నుంచి పొట్టేపాలెంకు వెళ్లే రహదారి సగం వరకు సిమెంట్ రోడ్డు వేయగా.. మిగిలిన సగం గుంతలమయంగా ఉంది. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఖరీదైన ప్రాంతాల్లోనూ..

ఖరీదైన ప్రాంతాల్లోనూ రోడ్ల పరిస్థితి ఇలాగే ఉంది. హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ఏరియాలో నాగసాయినగర్, ఎన్‌జీవో కాలనీలో భారీ భవనాలు వెలిశాయి. కాలనీలకు వెళ్లాలంటే పడవలో ప్రయాణించినట్లే ఉంటుంది. అపోలో హాస్పిటల్ సెంటర్ నుంచి జాతీయ రహదారిని కలిపే ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలకు కనీసం మట్టి పోసిన దాఖలు లేవు. వడ్డిపాలెం కొత్తూరు కాలనీకి వెళ్లే రహదారి, అంతర్గత రోడ్లు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. వర్షాకాలం వస్తే శివారు కాలనీల రోడ్ల పరిస్థితి వర్ణనాతీతం. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ మిట్ట ఉందో తెలియక వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. మట్టి రోడ్లు బురదమయంగా మారి నడిచేందుకు వీలుకాని విధంగా మారుతున్నాయి. రాత్రిపూట వీధిలైట్లు వెలగక చీకట్లో రాళ్లుతేలిన రహదారులపై అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి రహదారులను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్యులను గౌరవించడం అభినందనీయం

నెల్లూరు(బృందావనం), న్యూస్‌టుడే: సమాజంలో ప్రజలకు సేవలందిస్తున్న వైద్యులను గుర్తించి గౌరవించడం అభినందనీయమని డీఎంహెచ్‌వో డాక్టర్ వి.సుజాత అన్నారు. సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నగరంలోని పురమందిరంలో బెస్ట్ డాక్టర్ల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ మాట్లాడుతూ సమాజంలో వైద్యులు నిత్యం సేవలిందిస్తూ దేవుళ్లంతటి గౌరవం పొందుతున్నారన్నారు. కరోనా బాధితులకు వైద్య సేవలందించిన విషయాన్ని ప్రజలెవరూ మరిచిపోలేరన్నారు. నగరంలోని విశిష్ట సేవలందిస్తున్న 16 మంది వైద్యులను ఉత్తమ డాక్టర్ జ్ఞాపికలు అందించి సత్కరించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కెమిస్ట్, డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ప్రదీప్, పారిశ్రామిక వేత్త రాధారెడ్డి, డాక్టర్లు ఎస్వీ కృష్ణారెడ్డి, కాశయ్య, ప్రభంజన్ కుమార్, వైష్ణవి, భార్గవి, అపర్ణ పాల్గొన్నారు.

In the Court of the IV Addl. District Judge : Nellore

I.A. No. 791/2024

O.S.No. 112/2022

1. **Bapanapalli Suseela** and 2 Others ... Petitioners / Plaintiffs

Vs.

1. Kunda Indira and 3 Others ... Respondents / Defendants

NOTICE

To,

R1. **Kunda Indira,** W/o. Kumar, residing in Neelagiri Sangam, Dargamitta, Nellore City.

R2. **Malli Lilly Grace** W/o. M. Phillip, residing in D.No: 23/1206, Sodhan Nagar, Nellore City.

R3. **Kothuru Anjaneyulu,** S/o. Late Subba Rao, residing in D.No: 5/1/745, Narukuru Road, Stonehousepet, Nellore City.

R4. **Dampuru Venkata Surendra Reddy** S/o. Sudhakar Reddy, residing in D.No: 25/2-134, New Military Colony, Nellore City.

పై నెంబరున పిటిషనరు / వాది డిక్రీ షెడ్యూలు మరియు దావా షెడ్యూలులో "సర్వే నెం. 123/C" స్థానంలో "సర్వే నెం. 122/C" గా సవరించమని కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తే 04-08-2025దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

సిహెచ్. శరత్, B.Com., LLB.,
సిహెచ్. నవీన్, B.Com., LLB.,
వి. కృష్ణవేణి, B.A., LLB.,
పిటిషనర్లు / వాదుల తరపు అడ్వకేట్స్, నెల్లూరు.

భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు

రోడ్డుపై ట్రాఫిక్ పరిశీలిస్తున్న ఎస్పీ

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: బారాషహీద్ దర్గా రొట్టెల పండగకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీసులు విధులు నిర్వర్తించాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ సూచించారు. సోమవారం ఆయన బారాషహీద్ దర్గా రొట్టెల పండగ బందోబస్తును పరిశీలించారు. పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. డాగ్ స్క్వాడ్, బీడీ టీములను తనిఖీ చేశారు. 31 మంది తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రుల వద్దకు చేర్పించారు.

ప్రజలకు అందుబాటులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(పద్మావతి సెంటర్), న్యూస్‌టుడే: సహజ విధానంలో పండించిన విషరహిత వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసినట్లు నెల్లూరు ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజ్ కుమార్ తెలిపారు. గ్రామాల్లో రైతులు సహజ సిద్ధంగా పండించిన కూరగాయాలు, ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 24 మండలాల్లో మండల రెవెన్యూ, పంచాయతీ రాజ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఉంచి ప్రజలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టర్ వద్ద ప్రకృతి ఉత్పత్తులు విక్రయించడం ద్వారా ప్రజల్లో ఆహారం, ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధి 31వ డివిజన్ టైలర్స్ కాలనీలో సుపరిపాలనపై తొలి అడుగు.. ఇంటింటికీ తెదేపా కార్యక్రమం సోమవారం జరిగింది. సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ ఇంటింటా కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మన్నేపల్లి రఘు, పల్నాటి మస్తాన్‌నాయుడు, స్థానిక కార్పొరేటర్ బత్తల మంజుల, డివిజన్ అధ్యక్షుడు కూకటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ, రెవెన్యూ సమస్యలపై పెద్దసంఖ్యలో అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జేసీ కార్తీక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, డీపీవో శ్రీధర్ రెడ్డితో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానంగా భూ సమస్యలు, రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. అధికారులు దృష్టిపెట్టి ప్రతి అర్జీని పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. మొత్తం 327 అర్జీలు రగా.. వీటిలో రెవెన్యూ 120, మున్సిపల్ 17, పంచాయతీరాజ్ 19, పోలీసు 43 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్యకర్తలకు అవార్డులు

లోకేశ్ నుంచి అవార్డులు అందుకున్న కార్యకర్తలు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలోని 47వ డివిజన్ నుంచి ఆరుగురు ఉత్తమ కార్యకర్తలుగా ఎంపికై లోకేశ్ నుంచి అవార్డు అందుకోవడం హర్షణీయమని బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. సోమవారం అనిల్‌గార్డెన్స్‌లో మంత్రి నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న కార్యకర్తలకు అవార్డులిచ్చి గుర్తించడం సంతోషకరమన్నారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారి ఆలయ సెంటర్‌లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.

మరిచిపోయి.. తడిచిపోయి

బారాషహీద్ దర్గా రొట్టెల పండగ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన భక్తులు స్వర్ణాల చెరువులో స్నానం చేశారు. తమ జేబుల్లో ఉన్న రైల్వే టికెట్లు, డబ్బులు మరిచిపోయి స్వర్ణాల చెరువులో దిగి స్నానం చేయడంతో తడిచి పోయాయి. వాటిని తీసి ఘాట్‌లో ఎండకు ఆరబెట్టుకున్నారు. గాలికి ఎగిరిపోకుండా ప్రతి నోటుపై రాళ్లు పెట్టారు. – ఈనాడు, నెల్లూరు

ఆరునెలలైనా పట్టించుకోరా?

నెల్లూరు నగరంలోని ఫత్తేఖాన్‌పేట రైతుబజారు ఎదురు నగరపాలక సంస్థకు చెందిన బోరు ఆరు నెలల కిందట మరమ్మతులకు గురైంది. స్థానికులతోపాటు రైతుబజారుకు వచ్చే వారికి ఇది ఎంతో ఉపయోగంగా ఉంది. అధికారులు పట్టించుకోక తుప్పపట్టి పోతోంది. మరమ్మతులు చేయిస్తే ఉపయోగంలోకి వస్తుందని.. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. , – న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

ప్రమాదకర ప్రయాణం

బారాషహీద్ దర్గాకు వస్తున్న భక్తులను ఆటోవాలాలు పరిమితికి మించి తీసుకెళుతున్నారు. డ్రైవర్ సీటులో కూడా ముగ్గురు కూర్చుంటున్నారు. వెనుక నలుగురికి కూర్చొబెట్టాల్సిన ఆటోల్లో సుమారు పదిమందిని తీసుకెళుతున్నారు. ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భయం భయంగా ప్రయాణిస్తున్నారు. -న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

జనరల్ నోటీసు

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **రాళ్ళపల్లి వెంకటసుబ్రహమణ్యాం** గారి భార్య **రాళ్ళపల్లి సుదర్శనమ్మ** గారు రిజిష్టరు విక్రయ పత్రము నెంబరు **1719/1988** తేదీ **10-03-1988** ద్వారా **మద్దులూరు మురళి** rep by his GPA **జల్లి చెంగయ్య** గారి కుమారుడు **జల్లి వెంకటేశ్వర్లు** గారి వద్ద కొనుగోలు చేసుకొని పూర్తి హక్కులతో అనుభవించు కొనుచుండినారు. సదరు **సుదర్శనమ్మ** గారి వద్ద సదరు రిజిష్టరు విక్రయ పత్రము ఒరిజినల్ డాక్యుమెంటు నవంబరు **2021**లో పోయినదని **SHO Kovur PS** వారికి రిపోర్టు ఇచ్చినారు. సదరు **SHO Kovur PS** వారు ప్రయత్నము చేసినప్పటికి కనబడలేదని **23-12-2023**న **certificate** ను ఇచ్చినారు. సదరు **సుదర్శనమ్మ** గారు వ్రాసిన ఆఖరి వీలునామా ద్వారా అనగా **రిజిష్టరు వీలునామా నెం. 16/2024**రు తేదీ **06-03-2024** ద్వారా సదరు **సుదర్శనమ్మ** గారి తదనంతరం సదరు ఆస్తి ఆమె కుమారులు అయిన **రాళ్ళపల్లి మృత్యుంజయ బాబు** మరియు **రాళ్ళపల్లి సాయికుమార్** గార్లకు సంక్రమించినది. వారు సదరు ఆస్తిని పూర్తి హక్కులతో అనుభవించుకొనుచున్నారు. సదరు ఆస్తి మీద **రాళ్ళపల్లి వెంకటసుబ్రహమణ్యాం** గారి కుమారులు **రాళ్ళపల్లి మృత్యుంజయబాబు** మరియు **రాళ్ళపల్లి సాయికుమార్** గార్లకు గల హక్కుల గురించి ఎవరికైనా ఎలాంటి అభ్యంతరములు ఉన్న యెడల నాకు, ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోపల తెలుపుకొనవలసినది. లేనిచో ఎలాంటి అభ్యంతరము లేవని సదరు **రాళ్ళపల్లి మృత్యుంజయబాబు** మరియు **రాళ్ళపల్లి సాయికుమార్** గార్లకు పూర్తి హక్కులు ఉన్నవని భావించగలవారము.

షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రి.డి. యిలాకా, స్టోన్‌హౌస్‌పేట స.రి.లో చేరిన నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా లిమిట్స్‌లో గల **నెల్లూరు బిట్-2లోని సర్వే నెం. 617, 618-ఎ, 618-బి, 618-సి, 619-1, 619-2, 619-3, 620 ర్లు ప్లాటుకు విస్తీర్ణం 40 అంకణములు 60 చ.అ. లేక 273.134 చ.మీ.** యింటి నివేశన ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు**: నెం. 116 రు ప్లాటు, **దక్షిణం** : పారుదల కాలువ, **పడమర** : నెం. 114 రు ప్లాటు **ఉత్తరం**: లే-అవుట్ రోడ్డు.

ఇట్లు : **కొండూరు శేషారెడ్డి**, B.Com.,B.L.,
అడ్వకేట్, బాలాజీనగర్, నెల్లూరు. **Cell No: 9440277290**

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: పొర్లుకట్టలో పందుల బెడద ఎక్కువగా ఉంది. ఇళ్లలోకి వస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. – సుబ్బరత్నమ్మ

సమాధానం: పందులను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? సుందరయ్యకాలనీలో కాలువలు శుభ్రం చేయడం లేదు. దుర్వాసన వస్తోంది. – శ్రీహరి

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? టైలర్స్ కాలనీ మెయిన్‌రోడ్డులో చెత్తను తీసుకెళ్లేవారు రావడం లేదు. గుట్టలుగా పేరుకుపోయింది. – షాజహాన్

? నగరంలోని 31వ డివిజన్ తెలుగుగంగ కార్యాలయం నుంచి టైలర్స్‌కాలనీ రోడ్డు ప్రాంతంలో చెత్తచెదారాలు తీసుకువెళ్లే వాహనం వచ్చి వారం రోజులైంది. – చంద్రమౌళి

✓ ప్రతి రోజూ చెత్తను తొలగించేలా చర్యలు చేపడతాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? నగరంలోని శివగిరి కాలనీలో సక్రమంగా నీరు రావడం లేదు. –లలిత

✓ చర్యలు తీసుకుంటాం. - రామోహన్‌రావు, ఎస్‌ఈ

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

విద్యుత్తు శాఖ స్టాళ్ల పరిశీలన

నెల్లూరు(విద్య): జిల్లాలో విద్యుత్తుశాఖ ఎస్‌ఈగా పనిచేసి ప్రస్తుతం తెలంగాణ విద్యుత్తు శాఖ చీఫ్ మేనేజర్‌గా పనిచేస్తున్న నందకుమార్ సోమవారం బారాషహీద్ దర్గాను సందర్శించారు. అక్కడ విద్యుత్తు శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఈ వి.విజయన్, ఈఈ శ్రీధర్, ఎంఆర్‌టీ లక్ష్మీనారాయణ, డీఈఈ అశోక్ పాల్గొన్నారు.

గ్రంథాలయం అభివృద్ధికి హామీ

నెల్లూరు(విద్య): జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి లోకేశ్‌ను జాషువ గ్రంథాలయ కమిటీ సభ్యులు కలిసి వినతి పత్రం ఇచ్చారు. కమిటీ సభ్యులు ఖాసిం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం ద్వారా గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసి విద్యార్థులకు డిజిటల్ గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొమ్మల కృష్ణయ్య, సుబ్బారావు, జనార్ధన్, అంకయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వేడుకగా ఏకాదశి రుద్ర హోమం

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నెల్లూరులో కామ్య హోమసప్తాహ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మూలాపేటలో విశేష హోమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ముందుగా పూజలు చేపట్టారు. అనంతరం మహన్యాస ఏకదాశ రుద్రహోమం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు మురళీస్వామి దేవతామూర్తులను అలంకరించారు. ఆలయ మేనేజర్, కార్యనిర్వాహకురాలు నందకిశోర్, ఉషాకుమారి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇనుప కమ్మీలతో ప్రమాదం

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరంలోని ఆచారివీధి పాత జడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న స్టేట్‌బ్యాంక్ వద్ద నడిరోడ్డుపై కొన్ని ఇనుప కమ్మీలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏడాది క్రితం ఇక్కడ సెంట్రల్ లైటింగ్ దిమ్మెలు నిర్మించి వాటిని ధ్వంసం చేశారు. అందులో ఉన్న ఇనుప కమ్మీలు రహదారిపై అలాగే ఉంచారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రమాదం జరిగే అవకాశం ఉంది. నగరపాలిక అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కడప జట్టుపై నెల్లూరు విజయం

అనంతపురం, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ అంతర్ జిల్లా మూడు రోజుల క్రికెట్ పోటీల్లో నెల్లూరు జట్టు కడప జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 44 పరుగుల ఆధిక్యత సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 47/1తో మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన కడప జట్టు 244 పరుగులకే కుప్పకూలింది. ఆరిఫ్‌బాషా (62), టి.వంశీకృష్ణ (54) బ్యాటింగ్‌లో రాణించినా జట్టుకు ఆధిక్యత సాధించలేకపోయారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లకు 179 పరుగులు చేసింది. రేవంత్ రెడ్డి(76) చక్కటి బ్యాటింగ్‌తో అలరించాడు. మూడో రౌండు మ్యాచ్‌లు రెండు డ్రా దిశగానే పయనిస్తున్నాయి.

విద్యారంగ సమస్యలపై మంత్రికి వినతి

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం జిల్లాకు వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను అనిల్ గార్డెన్స్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకులు కలిసి వినతి పత్రం ఇచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. జూనియర్ కళాశాలల్లో తరగతి గదుల కొరత తీర్చాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటు బాకాయిలు విడుదల చేయాలన్నారు.

తెరపై ఈనాడు

ఎం.I సినిమాస్.: స్క్రీన్. 1 జురాసిక్ వరల్డ్ 3డి, తెలుగు, నాలుగు షోస్ స్క్రీన్ ..2. తమ్ముడు, తెలుగు, నాలుగు షోస్ స్క్రీన్..3. కుబేర, తెలుగు రెండు, షోస్, కన్నప్ప తెలుగు రెండు షోస్ **స్పైస్.సినిమాస్:** స్క్రీన్ 1. కుబేర, తెలుగు రెండు, షోస్, కన్నప్ప తెలుగు రెండు షోస్ స్క్రీన్..2 ఎఫ్1, ఇంగ్లీషు ఒక షో, సోలో బాయ్ తెలుగు ఒక షో, షోటైం, తెలుగు రెండు షోస్‌లు స్క్రీన్..3. మార్గన్, తెలుగు ఒకషో, 3బిహెచ్‌కె తెలుగు మూడు షోస్ స్క్రీన్.. 4 జురాసిక్ వరల్డ్ 3డి, తెలుగు మూడు షోస్, జురాసిక్ వరల్డ్ 3డి, ఇంగ్లీషు ఒక షో స్క్రీన్..5 తమ్ముడు తెలుగు, నాలుగు షోస్ **రెయిన్ సినిమా:** స్క్రీన్ 1. .జురాసిక్‌వరల్డ్ 3డి, ఇంగ్లీషు స్క్రీన్..2. తమ్ముడు (తెలుగు) స్క్రీన్..3.. కన్నప్ప తెలుగు, కుబేరా తెలుగు, ఎఫ్1, ఇంగ్లీషు స్క్రీన్..4..మార్గన్ తెలుగు, షోటైం తెలుగు, 3బిహెచ్‌కె, తెలుగు **సిరి మల్టిప్లెక్స్:** స్క్రీన్1తమ్ముడు స్క్రీన్2 కన్నప్ప మూడు షోస్, కుబేరా 1షో స్క్రీన్ 3 3బిహెచ్‌కె, నాలుగు షోస్ స్క్రీన్ 4కుబేర 2షోస్, మార్గన్ 2షోస్

బృందావనంలో పద్మవ్యూహమే

బృందావనంలో నిత్యం ఇదే పరిస్థితి

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

ఆత్మకూరు బస్టాండ్, ట్రంకురోడ్డు, మినీబైపాసు రోడ్డుకు సమీపంలో నగరానికి నడిబొడ్డున ఉన్న బృందావనంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇక్కడి ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద వాహనాలు తరచూ నిలిచిపోతున్నాయి. సమీపంలో అయిదు బ్యాంకులు, పెద్దపెద్ద భవనాలు, ఆసుపత్రులు, మెస్‌లు ఉన్నాయి. బ్యాంకులకు వచ్చే ఖాతాదారులు, స్థానిక ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే రోగులు, మెస్‌లకు వచ్చే వారు వాహనాలు నిలిపేందుకు స్థలం లేదు. ఎవరైనా వాహనం తీస్తారేమో అని నిరీక్షిస్తుంటారు. ప్రధానంగా కార్యాలయాలు పనిచేసే సమయంలో వాహనాల రాకపోకల పరిస్థితి గందరగోళంగా ఉంటోంది. సెల్లార్లు లేక సమస్య అధికమవుతోందని స్థానికులు తెలిపారు. భవన యజమానులు పార్కింగ్ స్థలాలు చూపడం లేదు. దీంతో వాహనాలు వీధుల్లో ఉంచుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్సులు వచ్చినా ముందుకు వెళ్ల లేని పరిస్థితి ఇక్కడ నెలకొంది. కొన్ని సందర్భాల్లో రోగులు ఇబ్బంది పడ్డ పరిస్థితి ఉంది. స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పార్కింగ్ లేక రోడ్డుపై అడ్డుగా వాహనం



(c) eenadu

బత్తలపల్లిలో పీర్లు భేటీ

● భారీగా తరలివచ్చిన భక్తులు

బత్తలపల్లి కూడలిలో భక్తజన సందోహం నడుమ భేటీ అవుతున్న పీర్లు

బత్తలపల్లి, న్యూస్‌టుడే: బత్తలపల్లి కూడలిలో సోమవారం ఉదయం వేలాది మంది భక్తుల నడుమ వివిధ గ్రామాల నుంచి వచ్చిన పీర్లు ఖాశీంస్వామితో భేటీ అయ్యాయి. ఏటా మొహర్రం సందర్భంగా పీర్లు ఇక్కడ భేటీ కావడం ఆనవాయితీ. తెల్లవారుజామున ఖాశీంస్వామి పీరును ఊరేగింపుగా కూడలి వద్దకు తీసుకొచ్చారు. ఆతర్వాత గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి, మలకాపురం, రాఘంపల్లి, ముష్టూరు గ్రామాల పీర్లు కూడలికి చేరుకొని ఖాశీంస్వామితో భేటీ అయ్యాయి. పీర్లను చూసేందుకు తరలివచ్చిన భక్తులతో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం పీర్లను ఊరేగింపుగా చావిళ్లకు తరలించారు. అక్కడ ముజావర్లు ప్రార్థనలు చేసి చక్కెర, బెల్లం చదివింపులు చేశారు. సాయంత్రం పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించి, జలధికి తరలించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ధర్మవరం గ్రామీణ సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఖరీఫ్ సాగుపై సందేహాలా?

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై.. 35 రోజులు గడిచిపోయింది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి అనంత జిల్లాలో వర్షాధారం కింద సాగు లక్ష్యం 16,12,991 ఎకరాలు. ఇప్పటి వరకు 47 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు మాత్రమే సాగయ్యాయి. వర్షం వస్తే ఏయే పంటలు వేసుకో వచ్చు? ప్రధాన పంట వేరుసెనగ ఈనెల (జులై)లో కూడా సాగుకు అనుకూలమా? ఆ తర్వాత ఏ పంటలు వేసుకోవాలి? విత్తన మోతాదు, ఎరువుల వినియోగం.. తదితర అంశాలపై సందేహాల నివృత్తి కోసం 'ఈనాడు' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. జిల్లా వ్యవసాధికారిణితో పాటు శాస్త్రవేత్తలతో ఫోన్లో నేరుగా మాట్లాడే అవకాశం కల్పిస్తోంది. ఫోన్ చేయండి.. సూచనలు, సలహాలు పొందండి.

సలహాలు, సూచనలు ఇచ్చేవారు

అనంత జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మతో పాటు రెడ్డిపల్లి, కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రాల సమన్వయకర్తలు డాక్టర్ సాధినేని మల్లీశ్వరి, డాక్టర్ ఇ.చంద్రాయుడు, రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి.

ఫోన్ చేయాల్సిన తేదీ : 09-07-2025 (బుధవారం)
సమయం : ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు
నంబర్లు : 99896 23825, 83310 57714

పేదలకు ప్రైవేటు విద్యే దిక్కు

గోరంట్ల, కొత్తచెరువు, కదిరి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో పేదలకు సర్కారు విద్య దూరంగా ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. చాలా మండలాల్లో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు లేవు. పేద విద్యార్థులు కేవలం ప్రైవేటు సంస్థలపైనే ఆధారపడి చదువు కొనసాగిస్తున్నారు. అత్యధికులు ఫీజులు కట్టలేక చదువుకు దూరమవుతున్నారు.

తప్పదు ప్రయాణ తిప్పలు

జిల్లా వ్యాప్తంగా ధర్మవరం, బుక్కపట్నం, కదిరి, పెనుకొండ, హిందూపురం, మడకశిర పట్టణాల్లో మాత్రం ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. హిందూపురంలో మహిళలకు మాత్రం డిగ్రీ కళాశాల ఉంది. జూనియర్ కళాశాలల పరిస్థితి అంతే. ఉదాహరణకు పెనుకొండ నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో 50కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలున్నాయి. వేలమంది విద్యార్థులు ప్రతి ఏటా పదోతరగతి పూర్తి చేసుకుంటున్నారు. పెనుకొండలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, రొద్దం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. గోరంట్ల, పరిగి, సోమందేపల్లి మండలాల్లో ప్రైవేటు విద్యపై ఆధారపడాల్సిన పరిస్థితి. కదిరిలో ఒక డిగ్రీ, రెండు జూనియర్ (బాలుర, బాలికల) తనకల్లు, తలుపుల మండలాల్లో జూనియర్ కళాశాలలున్నాయి. పుట్టపర్తి నియోజకవర్గంలోని చాలా మండలాల విద్యార్థులు డిగ్రీ చదువుకోవాలంటే 80 కిలోమీటర్లకు పైగా నిత్యం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది గమనార్హం.

జిల్లా:	శ్రీసత్యసాయి
మండలాలు:	32
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు:	06
జూనియర్ కళాశాలలు:	21
జిల్లాలో ఉన్నత పాఠశాలలు: (ప్రభుత్వ+ ప్రైవేటు)	447
గతేడాది పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు:	22,460

పరిమితంగానే..

జిల్లాలోని 18 మండలాల పరిధిలో 21 జూనియర్ కళాశాలలున్నాయి. 30 కస్తూర్బాల్లో ప్లస్‌టూ ఉన్నప్పటికీ ఒక్కోచోట ఒకగ్రూప్ మాత్రమే అమ్మాయిలకు అందుబాటులో ఉంది. ఒక ఎయిడెడ్ కళాశాల గోరంట్లలో ఉంది. ఆదర్శ, బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలు ఉన్నప్పటికీ అవి కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడం.. పరీక్షల ద్వారా ప్రవేశం ఉండడంతో అందరూ వెళ్లి చేరడం సాధ్యం కాదు. అన్ని యాజమాన్యాలకు సంబంధించి 122 జూనియర్ కళాశాలలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

■ జిల్లాలో అందుబాటులో లేని ప్రభుత్వ కళాశాలలు

డిగ్రీ చదవాలంటే వంద కిలోమీటర్లు వెళ్లాలి

-రవి, మహమ్మదాబాద్, అమడగూరు మండలం

జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం అమడగూరు మండలం. విద్యార్థులు డిగ్రీ చదవాలంటే నిత్యం కదిరికి వెళ్లిరావడానికి వంద కిలోమీటర్లు ప్రయాణించాలి. కదిరిలో నివాసం ఉండాలంటే ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది.

ఫీజు చెల్లించి చదువుకోవాల్సిందే..

-నవీన్‌కుమార్, గోరంట్ల

స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక దూరప్రాంతానికి వెళ్లలేక స్థానికంగా ఉన్న ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు చెల్లించి పూర్తి చేశా. ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేస్తే వందలాది మంది పట్టభద్రులు అవుతారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం..

-నాగవెంకారెడ్డి, ఇన్‌ఛార్జి ఆర్జేడీ

జిల్లాలో ప్రస్తుతం ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలే ఉన్నాయి. ముదిగుబ్బ, గుడిబండ మండలాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. సాధ్యాసాధ్యాలు పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

ఫసల్ బీమా యోజన సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఖరీఫ్ 2025 సంవత్సరానికి పంటల దిగుబడి ఆధారంగా బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన గోడపత్రాలను కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్‌తో కలిసి విడుదల చేశారు. జిల్లాలో దిగుబడుల ఆధారంగా పంటల బీమా కోసం కంది, వరి, మొక్కజొన్న, ఆముదం, రాగి పంటలు ఉన్నాయని తెలిపారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో జిల్లాలో పత్తి, వేరుసెనగ, దానిమ్మ, బత్తాయి, టమాటా పంటలు ఉన్నాయి. పంటలకు రైతులు సొంతంగా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని తెలిపారు. బీమా ఎకరాకు కందికి రూ.102, వరికి 200, మొక్కజొన్నకు రూ.165, ఆముదం, రాగి పంటలకు రూ.100, ప్రత్తి రూ.1,900, వేరుసెనగ రూ.640, దానిమ్మ రూ.3,750, బత్తాయి రూ.2,750, టమాటా రూ.1,600 చెల్లించి నమోదు చేసుకోవాలని కోరారు.

గోడపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, అధికారులు

తుక్కు అక్రమ రవాణా

➠ రూ.లక్షల్లో జీఎస్టీ ఎగవేత

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: ఈ-వేబిల్లు లేకుండా కొందరు డీలర్లు సరకులను అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అనంతపురం జిల్లాలో కొందరు డీలర్లు ఈ-వేబిల్లు లేకుండా తుక్కును రాత్రిపూట లారీల్లో కర్నూలు మీదుగా హైదరాబాదుకు రవాణా చేస్తున్నారు. తాజాగా గుత్తి సమీపంలో ఈ-వేబిల్లు లేకుండా తరలిస్తున్న 7 వేల కిలోల తుక్కు సామగ్రిని అధికారులు సీజ్ చేశారు. సంబంధిత డీలరుకు సుమారు రూ.3 లక్షలు అపరాధ రుసుం విధించారు. తుక్కు అక్రమ రవాణాదారులు అధికారుల ఆకస్మిక తనిఖీలకు చిక్కకుండా తప్పించుకోవడానికి లారీకి కొంత దూరంలో వెనుక వైపు, ముందు తమ అనుచరులతో కార్లలో గస్తీ తిరుగుతూ.. రవాణా చేస్తున్నారు.

తనిఖీల్లో విస్తుపోయే నిజాలు..

హిందూపురం డివిజన్‌లో కొందరు డీలర్లు పారిశ్రామిక వాడలో తుప్పుపట్టిన యంత్రాలు, ఇనుప సామగ్రిని కొనుగోలు చేసి ఈ-వేబిల్లు లేకుండానే బెంగళూరుకు తరలిస్తున్నారు. అక్కడ తుక్కును కరిగించి కావాల్సిన మందంతో ఇనుప కడ్డీలు తయారు చేయించి, వాటిని మళ్లీ హిందూపురంలో అమ్ముతున్నారు. కర్ణాటక నుంచి కొబ్బెర, వక్క, ఉత్తరాది రాష్ట్రాలకు ఈ-వేబిల్లు లేకుండానే తరలిపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో జరిపిన ఆకస్మిక తనిఖీల్లో వాణిజ్య పంటలు, గ్రానైట్, రెడీమేడ్ దుస్తులు, చీరలు, కర్టెన్లు, పాన్‌మసాలా, తుక్కు తదితర సరకులను ఈ-వేబిల్లు లేకుండా రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత వ్యాపారులకు రూ.30 లక్షలు అపరాధ రుసుం విధించారు. ఈ లెక్కన ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజుకు లక్ష రూపాయలు, సంవత్సరానికి సుమారు రూ.40 కోట్లు జీఎస్టీ ఎగ్గొడుతున్నారని అంచనా.

కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. సమస్యలు పరిష్కరించండి

■ కలెక్టరేట్‌లో బాధితుల ఆవేదన

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోసం కొన్నేళ్లుగా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరవయ్యారు. మీరైనా సమస్య పరిష్కరించండి అంటూ బాధితులు జిల్లా అధికారులకు అర్జీలు అందించారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలకు కలెక్టరేట్‌కు రావాల్సి వస్తుందని బాధితులు వాపోయారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ విజయసారథితో కలిసి 172 ఫిర్యాదులను స్వీకరించారు. పుట్టపర్తి 60, పెనుకొండ 44, ధర్మవరం 41, కదిరి నుంచి 27 ఫిర్యాదులు రెవెన్యూ డివిజన్ల వారీగా వచ్చాయి. అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బయ్య, ఆర్డీవో సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

భూమి కబ్జాకు ప్రయత్నిస్తున్నారు

కనగానపల్లి మండలం దాదులూరు పంచాయతీలో 5.16 ఎకరాల భూమిని కొనుగోలు చేశాం. కొందరు నాయకులు ఈ భూమి తమదని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ తీసుకువచ్చాం. అయినా పొలంలోకి వెళ్లనివ్వడం లేదని ధర్మవరం మండలం బడన్నపల్లికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ చెన్నారెడ్డి వాపోయారు. తహసీల్దార్, ఆర్డీవో, డీఎస్పీలకు న్యాయం చేయాలని పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం జమ్మూకశ్మీర్‌లో పని చేస్తున్నాను. నాకే ఇలా జరుగుతుంటే.. సామాన్యులు, పేదల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. విచారణ చేసి న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు.

న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యం

తమ సాగులో ఉన్న భూమిని సోదరుడు పుల్లప్ప పట్టా చేయించుకున్నాడు. న్యాయం చేయాలని వీఆర్వో నుంచి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకు తిరుగుతూనే ఉన్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదని ధర్మవరం మండలం నడిపిగడ్డకు చెందిన గంగమ్మ, పెద్దన్న ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయకుంటే కలెక్టరేట్‌లోనే ఆత్మహత్య చేసుకుంటామని బాధితులు వాపోయారు. విచారణ జరిపి న్యాయం చేస్తామని జేసీ హామీఇచ్చారు.

ఎస్పీకి సమస్యల ఏకరవు

ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన పిటిషనర్లకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ రత్న ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఎస్పీ వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో సమస్యలు తెలుసుకుని, అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

B.Tech., and Ag.B.Sc.,
SPOT ADMISSION
కేవలం 6,7,8,9,10 లక్షల ఖర్చుతో నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ / అగ్రికల్చర్ బీఎస్సీ (కాలేజ్ ఫీజు + హాస్టల్ ఫీజుతో కలిపి) ఎటువంటి షూరిటీ లేకుండా విద్యార్థికి 70 నుంచి 80% లోన్ సౌకర్యం కల్పించబడును. వివరాలకు సంప్రదించండి :
9502555500, 9160220527

వడ్డీకిస్తారు.. ఆనక నడ్డి విరుస్తారు!

■ శ్రుతి మించుతున్న వ్యాపారుల ఆగడాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. ఎంత కావాలంటే అంత డబ్బు ఇస్తారు. కాకపోతే వడ్డీ ఎక్కువ. అవసరం కదా అని తీసుకున్నారా చిక్కుల్లో పడినట్లే. నగరంలోని భవానీనగర్, రాణినగర్, టీవీటవర్, రామకృష్ణ కాలనీ, కళాకారుల కాలనీ, నాలుగో, ఐదో రోడ్డు... తదితర ప్రాంతాల్లో వ్యాపారుల దౌర్జన్యాలు అంతా ఇంతా కాదు. వసూళ్లకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతినెలా వడ్డీ ఇవ్వకపోతే గొడవలకు దిగుతారు. దాడులు చేయడానికి వెనుకాడరు. టవర్ క్లాక్ వద్ద ఓ మహిళా వ్యాపారి రోజువారీ, వారం, నెల వడ్డీలకు అప్పు ఇస్తుంటుంది. వసూళ్లకు ఓ యువకుడ్ని నియమించుకుంది. వారి ఆగడాలపై ఎందరో బాధితులు ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదులు చేశారు.

వసూళ్లు ఇలా..

★ వడ్డీ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి వారం, నెల వడ్డీ రూపంలో వసూలు చేస్తున్నారు. అవసరాన్ని బట్టి రూ.100కు రూ.5 నుంచి 10 వరకు వసూలు చేస్తున్నారు.

★ రూ.10 వేలు అవసరమైతే రూ.వెయ్యి మినహాయించుకుని రూ.9 వేలు ఇస్తారు. వారం రోజుల్లో రూ.10 వేలు చెల్లించాలి. దీన్ని వారం వడ్డీ అంటారు. ఈ తరహా వ్యాపారం ధర్మవరం, అనంతపురం, గుంతకల్లులో అధికంగా సాగుతోంది.

★ రూ.లక్ష అవసరమైన వారికి రూ.22 వేలు మినహాయించుకుని రూ.78 వేలు ఇస్తారు. రోజుకు వెయ్యి చొప్పున వంద రోజుల్లో లక్ష చెల్లించాలి.

ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకొని..

వ్యాపారులు ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకుంటారు. ఒకరి ప్రాంతంలోకి మరొకరు వెళ్లరు. అప్పట్లో కాల్‌మనీ కేసులు నమోదు కావడంతో వడ్డీ వ్యాపారులు కాస్త తగ్గారు. సమయానికి వడ్డీ చెల్లించలేదో నరకం చూపిస్తారు. కిరాయి మనుషులతో దాడులు చేయిస్తారు. బాధితులు కొందరు వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. చక్రవడ్డీల పేరుతో ఆస్తులు రాయించుకుంటున్న సందర్భాలూ ఉన్నాయి.

వడ్డీ చెల్లించలేదని దాడి

అనంత నగరంలో వడ్డీ చెల్లించలేదని ఓ వ్యక్తిపై దాడి జరిగింది. ఒకటో పట్టణ ఇన్‌ఛార్జి సీఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. పాతూరులోని ఉమానగర్‌కు చెందిన బాబ్‌జాన్ బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. ఐదేళ్ల కిందట భవానీనగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారి తిరుపాలు వద్ద రూ.10 వడ్డీతో రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. కొంతకాలం వడ్డీ చెల్లించిన బాధితుడు.. తర్వాత చెల్లించలేదు. సోమవారం దుకాణం వద్ద ఉన్న బాబ్‌జాన్‌తో వడ్డీవ్యాపారి కుమారుడు సూరి, అతని అనుచరులు సోము, అంజి, హసేన్‌వలి వాగ్వాదానికి దిగారు. వారిలో ఒకడు బాబ్‌జాన్‌పై చేయి చేసుకున్నాడు. అంతటితో ఆగకుండా రోడ్డుపైకి ఈడ్చుకెళ్లి.. కాళ్లు, చేతులతో దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

జేఎన్‌టీయూలో ఈఏపీసెట్ సహాయ కేంద్రం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్, ఔషధ, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఆరంభమైంది. ఇందులో భాగంగా జేఎన్‌టీయూలో ఈఏపీసెట్ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక విద్య కమిషనర్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య ఆదేశాల మేరకు అడ్మిషన్స్ డైరెక్టర్ సురేష్‌బాబు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వర్సిటీలోని ఏపీజే అబ్దుల్ కలాం భవనంలో ఈ కేంద్రం నిర్వహిస్తున్నారు.

వీఆర్‌ఓలకు బదిలీ ఉత్తర్వులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 248 మంది గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులకు (వీఆర్‌ఓ) బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం ఉత్తర్వులను నిర్దేశిత ఉద్యోగులకు పంపించారు. గత నెల 29న అనంత రెవెన్యూ భవన్‌లో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. తీవ్ర తర్జనభర్జన తర్వాత ఉమ్మడి జాబితా ప్రకారం ఉత్తర్వులు వెలువరించారు. ఆ 248 మందిలో అనంత జిల్లా పరిధిలో 150 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 98 మంది ప్రకారం ఉన్నారు. రెండు జిల్లాల పరిధిలో అటుఇటు నలుగురు బదిలీ అయ్యారు. ప్రాధాన్యత కేటగిరీలతో నిమిత్తం లేకుండా అనంత నగరంలో పని చేస్తున్న కొందరు వీఆర్‌ఓలకు మళ్లీ ఇక్కడే పోస్టింగ్ రావడం విశేషం. ఇదే తరహాలో కీలక పట్టణాల్లోనూ చోటు చేసుకుంది.

CHIRANJEEVI REDDY
INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY FOR WOMEN
(All Courses approved by AICTE New Delhi.)
WE'RE HIRING
We're seeking talented and passionate women to join our faculty and staff. Send your resume and cover letter to careercritatp@gmail.com. This opportunity is open to women candidates only, as part of our commitment to creating a women-centric academic environment.
POSITIONS
>Principal >ECE (Asst. Prof.) >Chemistry
>Vice Principal >MBA (Assoc. Prof.) >English
>CSE (Asst. Prof.) >Physics >Librarian
Qualification and Salary as per AICTE Norms
Rachanapalli, Bellary Road, Anantapur - 515004
CONTACT: 9666886027 & 9666886029

గౌతమి
COLLEGE CODE GTMW
మహిళా ఇంజనీరింగ్ కాలేజి
సాయి నగర్, పెద్దశెట్టిపల్లి గ్రామం, ప్రొద్దుటూరు, వై.యస్.ఆర్. కడప జిల్లా.
సెల్ : 9848349885, 9642076632, 9849570557.
WE ARE AUTONOMOUS

B.TECH
CSE & CSE (AI & ML)
ECE & EEE
DIPLOMA
DEEE DECE
DCME
2025 - 26 ADMISSION OPEN
✦ 100% Campus Placements for Eligible Students.
✦ Girl's Hostel Available in Campus with All facilities.
✦ Bus Facility available
Chagalamarri, Jammalamadugu, Yerraguntla, RTPP & Muddanur
B++ NAAC
UGC AUTONOMOUS
AWARDED AAA+ RANKING BY CAREERS360

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి
మీ ఉన్నతికై శ్రమించిన, మీ కుటుంబ సభ్యుల/ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రకటనలు ప్రచురణ కొరకు
పూర్తి వివరములకు:
8008709784

వైకాపా నాయకుడి శీతల గిడ్డంగిలో తనిఖీలు

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం వైకాపా నాయకుడు, నియోజకవర్గం మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డికి చెందిన హిమని శీతల గిడ్డంగిలో సోమవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాసులు, డీసీటీవో సురేశ్‌కుమార్, వ్యవసాయ అధికారి వాసుప్రకాశ్ తనిఖీల్లో పాల్గొన్నారు. గిడ్డంగిలో అధికంగా చింతపండు, కొంత ఎండుమిరప నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దీనికి సంబంధించిన దస్త్రాలు పరిశీలించారు. నిబంధనలను ఎక్కడైనా ఉల్లంఘించారా అనే విషయంపై ఆరా తీశారు. సేకరించిన సమాచారాన్ని జిల్లా ఎస్పీ ద్వారా సంబంధిత డీసీటీవోకు అందజేస్తారని, అనంతరం వారు వచ్చి మరోసారి పరిశీలిస్తారని తెలిసింది. చింతపండుకు జీఎస్టీ మినహాయించగా, ఎండుమిరపకు మాత్రమే దీనిని వసూలు చేస్తున్నారు. వైకాపా నాయకుడి శీతలగిడ్డంగిలో తనిఖీలు చేపట్టడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

ధర్మబద్ధ జీవనానికి రామాయణం దిక్సూచి

ప్రశాంతి నిలయంలో రామకథా గానాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు

ప్రసంగిస్తున్న నివేదితాబిడే

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ధర్మబద్ధ జీవనానికి రామాయణం దిక్సూచి అని కన్యాకుమారి వివేకానంద కేంద్రం అఖిల భారత ఉపాధ్యక్షురాలు శ్రీమతి నివేదితాబిడే పేర్కొన్నారు. శ్రీసత్యసాయి సేవా సంస్థలు, శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సార్వత్రిక మానవ విలువలు అనే అంశంపై ఈనెల 8వ తేదీ వరకూ ప్రశాంతి నిలయంలో నాలుగు రోజుల వేసవి శిబిరంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం రామాయణ, మహాభారతాల్లోని ధర్మబద్ధ జీవనం గురించి, మానవ విలువల గూర్చి నివేదితాబిడే ప్రసంగించారు. అనంతరం లవకుశ వేషధారణలో విద్యార్థులు ఆలపించిన రామకథా గానం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. మంగళహారతి అందుకున్న తరువాత భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

(c) eenadu

కుళ్లాయిస్వామి గోవిందా..

● స్వామి అగ్నిగుండ ప్రవేశం ● ముగిసిన బ్రహ్మోత్సవాలు

నార్పల, న్యూస్‌టుడే : గూగూడు కుళ్లాయి స్వామి మొహర్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జలధి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన ఘట్టమైన కుళ్లాయిస్వామి పీర్ల అగ్నిగుండ ప్రవేశ దృశ్యాలు తిలకించడానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. సోమవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి పీర్లను గ్రామంలో ప్రదర్శనగా తీసుకెళ్లారు. దేవదేవుడు ప్రజల దగ్గరికే రావడంతో కుళ్లాయిస్వామి గోవిందా.. గోవిందా అంటూ భక్తులు చక్కెర చల్లుతూ మొక్కులు చెల్లించారు. కొందరు పొర్లుదండాలు పెడుతూ కోర్కెలు తీరాలని స్వామిని వేడుకున్నారు. ఉదయం 6 గంటలకంతా కుళ్లాయిస్వామి పీరుతో సహా మరో 20 పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేసి చావిడిలో కొలువుదీరాయి. మళ్లీ మధ్యాహ్నం 3 గంటలకు మరో సారి అగ్నిగుండ ప్రవేశం చేసి గ్రామంలోకి వెళ్లాయి. సాయంత్రం 6 గంటల సమయంలో కొర్లగుట్ట మీదుగా జలధికి వెళ్లడంతో గూగూడు బ్రహ్మోత్సవాలు ముగిశాయి. పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు పీర్ల మకానంలో స్వామి చివరి దర్శనం ఉంటుందని అర్చకులు తెలిపారు.

జలధికి వెళ్తున్న పీర్ల సమూహం

అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న ప్రధాన పీరు

పొట్టేళ్ల పెంపకం.. లాభదాయకం

" కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : కళ్యాణదుర్గం మండలం కురాకులతోటకు చెందిన నాగరాజు పొట్టేళ్ల పెంపకంతో లాభాలు గడిస్తున్నారు. తనకున్న రెండెకరాల్లో పంటలు సాగు చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. చివరకు పలువురు రైతుల నుంచి పొట్టేళ్లను కొనుగోలు చేసి వాటిని సంరక్షించుకుంటూ విక్రయాలు చేస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు. "

★ సొంత వ్యవసాయ క్షేత్రంలో 2022లో షెడ్డు, దాణా గోదాంను రూ.20 లక్షలు ఖర్చుతో నిర్మించాడు. రైతుల వద్ద నుంచి ఒక్కో పొట్టేలు పిల్లను రూ.7 వేల- రూ.12 వేల మధ్య కొనుగో చేశాడు. వీటి కోసం సుమారుగా రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. నెల నుంచి రెండు నెలలలోపు వాటిని విక్రయించారు. 30-40 కిలోల వరకు ఉన్న ఒక్కో పొట్టేలను రూ.15 వేల నుంచి రూ.16,500 వరకు విక్రయాలు జరుపుతున్నారు. 50 పొట్టేళ్లు విక్రయిస్తే రూ.1.80 లక్షల వరకు ఆదాయం వస్తోంది. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి ధరలు ఉంటున్నాయి. ఎక్కువ శాతం ధరలు నిలకడగానే ఉంటున్నాయి. ఒక్కో విడతలో 50 -250 పొట్టేళ్ల పిల్లలను కొనుగోలు చేసి 30-46 రోజుల్లో విక్రయిస్తున్నారు. ప్రతి శనివారం అనంతపురం, పావగడ మార్కెట్లో విక్రయాలు జరుపుతున్నారు. ఇలా ఏడాదికి సుమారుగా రూ.25 లక్షల వరకు ఆదాయాన్ని గడిస్తున్నారు.

జీవాలకు ప్రత్యేక ఆహారం

టీఎంఆర్ దాణా టన్ను రూ.18 వేలతో 30 టన్నులు కొనుగోలు చేసి గోదాంలో నిల్వ చేశారు. వీటికి తోడు గానుగ చెక్క కిలో రూ.26తో కొనుగోలు చేశారు. ఒకటిన్నర ఎకరాలో సొంత వ్యవసాయ తోటలోనే మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పంటను యంత్రంతో కత్తిరించి పొట్టేళ్లకు మేతగా వేస్తున్నారు.

షెడ్డులో ఉన్న పొట్టేళ్లు

నాగరాజు రైతు

ఒక్కో పొట్టేలుకు 250 గ్రాములు - 500 గ్రాముల వరకు టీఎంఆర్, గానుగ చెక్క, మొక్కజొన్న కలిపి వేస్తున్నారు. 21 రోజులకోసారి డివార్మింగ్ చేయించి, 15 రోజులకోసారి వ్యాక్సిన్, వారానికి మూడు సార్లు లివర్, క్యాల్షియం టానిక్‌ను తాగిస్తున్నారు. దీని వల్ల జీవాలు వ్యాధుల బారిన పడకుండా ఉండటానికి ఎక్కువ శాతం అవకాశం ఉంటుంది. అలాగే బరువు కూడా పెరుగుతాయి.

యూట్యూబ్‌లో సలహాలు..

-నాగరాజు, కురాకులతోట

ఎంఏ, బీఈడీ, డీ-ఫార్మసీ పూర్తి చేశా. సివిల్స్ సాధించాలని ప్రయత్నించినా ఫలితం లేక పోయింది. కళ్యాణదుర్గంలో పశువుల ఔషధ దుకాణం ఏర్పాటు చేసుకున్నా. గ్రామాల్లో ఎక్కువగా తిరుగుతుండటంతో అక్కడి రైతుల గొర్రెలు, పొట్టేళ్ల పోషణ గురించి తెలుసుకున్నా. యూట్యూబ్‌లో చూసి షెడ్డు ఏర్పాటు చేశా. పొట్టేళ్ల పెంపకంతో లాభాలు బాగా ఉన్నాయి.

ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ జిల్లా జట్ల ఎంపిక

ఎంపికైన క్రీడాకారులతో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

హిందూపురం, న్యూస్‌టుడే: ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక సోమవారం సాయంత్రం స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో జరిగింది. ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని జట్టు సభ్యులుగా ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సంఘం ప్రతినిధులు అభినందించారు. సంఘం కార్యదర్శి బీకే మొహమ్మద్‌నబీలు, కోశాధికారి శేఖర్, పీడీ లోకేనాథ్, ఉప సభ్యుడు ఆజాద్, ఫుట్‌బాల్ కోచ్‌లు చైతన్య, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

జాతీయ పారాఫెన్సింగ్ పోటీల్లో ధర్మపురి వాసి సత్తా

ధర్మవరం, న్యూస్‌టుడే: చెన్నైలో ఈనెల 4 నుంచి 6 వరకు జరిగిన జాతీయ పారా ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ధర్మవరం మండలం ధర్మపురి గ్రామానికి చెందిన క్రీడాకారుడు ఉమాపతి మహేశ్‌కుమార్ బంగారు, కాంస్య పతకాలు సాధించాడు. వీల్ చైర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున మహేశ్ పాల్గొన్నాడు. పాయిల్ ఈవెంట్‌లో బంగారు, సాబ్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించాడు. వచ్చేనెల రాష్ట్ర జట్టు తరఫున ఫెన్సింగ్ ఆడుతున్న మహేశ్‌కుమార్ మొదటిసారి బంగారు పతకం సాధించాడు.

పతకాలతో ఉమాపతి మహేశ్‌కుమార్

సమస్య- సమాధానం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో పంటలు సాగుచేసే రైతులు పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త నారాయణస్వామి నంబరు 62812 84235 ఫోన్ చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య: ప్రస్తుత ఖరీఫ్‌లో మునగ పంట సాగు చేయాలనుకుంటున్నా. అధిక దిగుబడులు ఇచ్చే మునగ విత్తన రకాలు తెలపండి.
-వెంకటేశ్వరనాయుడు, వెంకటాపురం

సమాధానం: మునగ సాగులో పీకేఎం-1 అధిక దిగుబడులు ఇస్తుంది. ధనుష్, సువర్ణ, రకాలు కూడా అధిక దిగుబడులు ఇచ్చే రకాలు. రైతులు వాటిని సాగు చేసుకోవచ్చు.

సమస్య: పత్తి పంటను నాగులు ఎకరాల్లో సాగు చేస్తున్నా. సాళ్ల మధ్య అంతర పంటలు సాగు చేయవచ్చా.
-నాగభూషణ, రేణికొత్తూరు

సమాధానం: పత్తి పంటలో అంతర పంటలు సాగుచేయవచ్చు. పెసర, మినుము, కంది, చిక్కుడు, పంటలు సాగు చేసుకుంటే రెండు పంటల నుంచి రైతులకు ఆదాయం వస్తుంది.

రైతేరాజు

చిట్కా

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో వరిసాగుచేసే రైతులు నారుమడి పెంపకంలో తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. వరి మధ్యకాలిక రకాలు సాగుచేసే రైతులు జులై 15వ తేదీ లోపు నారుమడి సిద్ధం చేసుకోవాలన్నారు. స్వల్పకాలిక రకాలు సాగు చేసే రైతులు జులై 25వ తేదీ లోపు నారుమడి సిద్ధం చేసుకోవాలన్నారు. బీపీటీ లేక రకం విత్తనాలు ఎకరాకు 20 కిలోలు, దొడ్డు రకాలు 25 కిలోలు చొప్పున 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమడి ఏర్పాటు చేసుకోవాలన్నారు. నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ వేసుకుంటే ఆరోగ్యంగా పెరుగుతుందని శాస్త్రవేత్త తెలిపారు.

అరటి పంట.. అన్నదాత కులాసా

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : ఏడేళ్లుగా అరటిసాగుతో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు కదిరి మండలంలోని వీరేపల్లిపేటకు చెందిన రైతు లోకేనాథ్‌రెడ్డి. ఇతనికి 8.5 ఎకరాల భూమి ఉంది. గతేడాది 4.5 ఎకరాల్లో అరటి సాగు చేశారు. కోతకోణ తర్వాత పిలకల ద్వారా కూడా లాభాలు సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

బెంగళూరు నుంచి పిలకలు

సాగుకు ముందు భూమిని ఒక మడకతో దున్నారు. తర్వాత పేడ ఎరువులు చల్లించి ఐదు మడకలతో ఇరుసాలు దున్నారు. బిల్లరుతో సేద్యం చేసి ఆ తరువాత డ్రిప్పు ద్వారా నీటి తడులు అందించారు. బెంగళూరు నుంచి క్యాండిష్ రకానికి చెందిన అరటి మొక్కను రూ.18.25తో కొనుగోలు చేశారు. ఎకరాకు 1300 మొక్కల చొప్పున మొక్కకు 5.5X5.5 దూరంతో నాటించారు. అరటిలో ప్రధానంగా సిగటోక తెగుళ్లు ఆశిస్తే ఆకులు పసుపు రంగులోకి మారి తర్వాత ఎండిపోతాయి. వీటి నివారణకు ప్రొఫికోనజోల్ ఒక మి.లీ నీటికి, రెండో పిచికారీలో కార్బెండజిమ్, మాంకోజెబ్ మిశ్రమాన్ని ఒక గ్రాము లీటరు నీటికి, మూడో పిచికారీలో ట్రైఫ్లోక్సిస్ట్రోబిన్, టెబుకొనజోల్ మిశ్రమాన్ని 1.5 గ్రాముల లీటరు నీటికి, నాలుగో పిచికారీలో డైఫెనకొనజోల్ ఒక మి.లీ నీటికి కలిపి పిచికారీ చేశారు. వీటితోపాటు ఎకరాకు ఐదుమూటల యూరియా, పెచ్చు, పొటాష్ వినియోగించారు. మొత్తం పెట్టుబడికి రూ.6 లక్షలు ఖర్చు చేశారు.

మొదటి కోతకు వంద టన్నులు

● ఎరువులు, మందులు బాగా పిచికారీ చేయడంతో కాయ పరిమాణం బాగా పెరిగింది. మొదటి కోతలో వంద టన్నులు దిగుబడి రాగా టన్ను రూ.12వేలతో, రెండో కోతలో 25 టన్నుల దిగుబడి రాగా టన్ను రూ.15వేలతో పులివెందులకు చెందిన వ్యాపారులకు విక్రయించారు. మొత్తం రూ.15లక్షల దిగుబడి రాగా పెట్టుబడిపోయి రూ.9 లక్షలు లాభం మిగిలింది. తర్వాత పిలకల ద్వారా మరో రూ.7లక్షల నుంచి 9 లక్షల వరకు లాభం వస్తుందని రైతు చెబుతున్నారు.

సాగులో అరటితోట, రైతు, లోకేనాథ్‌రెడ్డి

ఘనంగా భూతప్పల ఉత్సవం

లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి ఊరేగింపు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసిద్ధిగాంచిన భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం భూతప్పల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడగుంట ఆంజనేయస్వామిలను ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. అక్కడ భూతప్పలకు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా మొక్కుబడి ఉన్న భక్తులు భూతప్పలు వచ్చే దారిలో ఆకువక్క, పండ్లు, పూలు, అగరబత్తులు చేతపట్టుకుని భక్తిశ్రద్ధలతో బోర్ల పడుకుని స్వామి కాలి స్పర్శకోసం ఎదురు చూశారు. భూతప్పలు మండపం నుంచి భక్తులను తొక్కుకుంటూ నరసింహస్వామి ఆలయం వరకు వెళ్లారు.

భక్తులపై నడుచుకుంటూ వస్తున్న భూతప్పలు

అంతర్జాతీయ వైద్యశిబిరం ప్రారంభం

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా వచ్చే భక్తులు, సందర్శకులను దృష్టిలో ఉంచుకుని ప్రశాంతి నిలయంలో అంతర్జాతీయ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రశాంతి నిలయంలోని నార్త్-1 భవనంలో సోమవారం సత్యసాయి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈనెల 11వ తేదీ వరకూ నిర్వహించే ఈ శిబిరంలో సాధారణ జబ్బులతోపాటు గైనకాలజి, డెంటల్, ఈఎన్‌టీ, పల్మనాలజి, సైకియాట్రి, అంకాలజి, గ్యాస్ట్రోఎంటరాలజీ వంటి జబ్బులకు వైద్యం అందించనున్నారు. శిబిరంలో దాదాపు 60 మంది ప్రముఖ వైద్య నిపుణులతోపాటు 20 మంది పారామెడికల్ సిబ్బంది, 120 మంది సేవకులు, సేవాదళాలు సేవలు అందించనున్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే, డాక్టర్ గీతా కామత్, డాక్టర్ అక్షయ్ కలథియా పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్జే రత్నాకర్

అభిషేక్‌రెడ్డి అసాధారణ బ్యాటింగ్.. చిత్తూరు భారీస్కోరు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు దిగాడు ఆ బ్యాటరు.. ద్విశతకం చేసి అజేయంగా నిలిచాడు. జట్టు మొత్తం పెవిలియన్ చేరినా.. అతను మాత్రం నాటౌట్‌గానే నిలవడం గమనార్హం. సౌత్‌జోన్ అంతర్ జిల్లా మూడు రోజుల క్రికెట్ పోటీల్లో చిత్తూరు బ్యాటరు అభిషేక్‌రెడ్డి (227) అసాధారణ బ్యాటింగ్‌తో అందరిని ఆకట్టుకున్నాడు. సోమవారం అనంత క్రికెట్ మైదానంలో ఉదయం 316/3 ఓవర్ నైట్ స్కోరుతో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన చిత్తూరు జట్టు 115.2 ఓవర్లలో 455 పరుగులకు ఆలౌటైంది. అనంతపురం బౌలర్లు బి.వినయ్‌కుమార్ (4/72), దీపక్, ప్రదీప్ రెడ్డి, రాజుకుళ్లాయప్ప చెరి రెండు వికెట్లు కూల్చారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 44 ఓవర్లలో 4 వికెట్లకు 199 పరుగులు చేసింది. బ్యాటరు ఎంకే దత్తారెడ్డి (100; 83 బంతుల్లో) అజేయ శతకంతో మెరిపించాడు. చిత్తూరు జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించాలంటే చివరిరోజు బ్యాటర్లు చెలరేగాల్సి ఉంటుంది.

● మరో పోటీలో నెల్లూరు జట్టు కడప జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 44 పరుగుల ఆధిక్యత సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 47/1తో మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన కడప జట్టు 244 పరుగులకే కుప్పకూలింది. ఆరిఫ్‌బాషా (62), టి.వంశీకృష్ణ (54) బ్యాటింగ్‌లో రాణించినా జట్టుకు ఆధిక్యత సాధించలేకపోయారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లకు 179 పరుగులు చేసింది. రేవంత్‌రెడ్డి(76) చక్కటి బ్యాటింగ్‌తో అలరించాడు. మూడో రౌండు మ్యాచ్‌లు రెండు డ్రా దిశగానే పయనిస్తున్నాయి.

అజేయ ద్విశతకంతో అభిషేక్‌రెడ్డి (227)

దత్తారెడ్డి మెరుపు శతకం

స్పందించు.. సంధించు!

పాఠకులారా..! మీలో సామాజిక స్పృహ.. ఏదైనా మంచి చేయాలన్న తపన ఉందా? అన్యాయాలను నిగ్గదీసి ప్రశ్నిస్తారా? సమస్యలను మీ చేతుల మీదుగా పరిష్కారం చూపాలని ఆరాటపడుతున్నారా? ఏ వర్గానికైనా అత్యంత విలువైన సమాచారం చేరవేయాలని అనుకుంటున్నారా? మీ చుట్టుపక్కల ఆహ్లాదకర.. ఆసక్తిదాయక.. ఆదర్శప్రాయమైన అంశాలు నలుగురికి పంచాలని ఆశిస్తున్నారా? అయితే ఈ వేదిక మీ కోసమే.. మీ గొంతుకకు ఈనాడు తోడు అవుతుంది. ప్రజాశ్రేయస్సు పరమావధిగా మీరు రాసిన అక్షరాలు, తీసిన ఫొటోలకు పత్రికలో సముచిత స్థానం కల్పించేందుకు ముందుకొస్తున్నాం..

ఇంకెందుకు ఆలస్యం.. తీసుకోండి కలం.. పట్టండి కెమెరా.. సమస్యలపై మీదైన శైలిలో ఎక్కుపెట్టండి..!

మీరు చేయాల్సినవి..

- ఏదేని అంశాన్ని పది వాక్యాలకు మించకుండా సూటిగా, స్పష్టంగా రాయడం.
- నాణ్యమైన ఫొటోలు తీసి పంపడం.
- వ్యక్తిగతమైనవి వద్దు.. సమాజశ్రేయస్సుకే ఈనాడు వేదిక అనేది మదిలో మెదలాలి.

★ మీరు పంపిన అంశాలను పరిశీలించి.. అర్హత ఉన్నవి ప్రచురిస్తాం.

పోస్టు చేయాల్సిన నంబరు 93901 60428

అప్పుల బాధతో
ఇద్దరు రైతుల ఆత్మహత్య

రాప్తాడు, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రాంతాల్లో అప్పుల బాధ తాళలేక ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కరుణాకర్ (32) తనకున్న వ్యవసాయ పొలంలో పంటలు సాగు చేస్తూ జీవనం సాగించేవారు. సుమారు నాలుగేళ్ల నుంచి పంటలు పండక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తనకు తెలిసిన వారి దగ్గర సుమారు రూ.15 లక్షల వరకు అప్పులు చేశారు. వాటిని తీర్చలేక మదనపడేవాడు. ఈ నెల 3వ తేదీన పొలంలో గడ్డికి కొట్టే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. వెంటనే బంధువులు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సలందించారు. ఆతర్వాత ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు భార్య వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె సంతానం. ఇంటికి పెద్ద దిక్కు మృతితో భార్య, కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

(కూడేరు)ఉరవకొండ, న్యూస్‌టుడే: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కూడేరులో చోటుచేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాలిలా.. స్థానికంగా ప్రధాన వీధిలో నివసించే గురుస్వామి(55)కి తనకున్న 11.5 ఎకరాల్లో కొన్నేళ్లుగా వేరుసెనగ, వరి సాగు చేస్తున్నాడు. రెండు మూడేళ్లుగా వ్యవసాయంలో వరుస నష్టాలు ఎదురవగా.. రూ.6 లక్షలు అప్పులయ్యాయి. వాటిని తీర్చేమార్గం లేక మనస్తాపానికి గురై ఆదివారం ఇంటి నుంచి వెళ్లి పొలంలో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం ఉదయం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

గురుస్వామి

బదిలీ ఉత్తర్వులు ఇవ్వండి

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీల విషయం ఎటూ తేలడం లేదు. బదిలీల ప్రక్రియ పూర్తి అయినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు ఏఎన్ఎంలకు ఉత్తర్వులు జారీ చేయలేదు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి ఏఎన్ఎంల సమస్యను డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి.దేవి తీసుకెళ్లారు. ఈ విషయంపై తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై ఆదేశాలు అందకపోవటంతో నిరీక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా బదిలీ ఉత్తర్వులు అందజేయాలని కోరుతూ సంబంధిత ఏఎన్ఎంలు డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చారు. ఏడు రోజులుగా తిరుగుతున్నా పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు త్వరితగతిన ఏదో ఒక విషయం తేల్చాలని డిమాండ్ చేస్తూ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

ఉపాధి బిల్లుల విషయంలో ఘర్షణ

ఒకరి మృతి

కదిరి పట్టణం, గాండ్లపెంట, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పని, బిల్లుల విషయంలో ఘర్షణ చోటుచేసుకొని గాండ్లపెంట మండలం కురుమామిడి పంచాయతీ గుట్టకిందపల్లికి చెందిన రంగారెడ్డి (50) మృతిచెందారు. గ్రామస్థులు, పోలీసుల వివరాల మేరకు.. గుట్టకిందపల్లికి చెందిన రంగారెడ్డి ఉపాధిహామీ పథకంలో చేసిన పనులకు బిల్లులు పడలేదని, తనకు పనులు చూపలేదన్న విషయమై క్షేత్ర సహాయకుడు మనోహర్‌ను నిలదీశాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. గ్రామస్థులు కల్పించుకుని సర్దుకుపోవాలని ఇద్దరికి నచ్చచెప్పి పంపించేశారు. రంగారెడ్డి వ్యక్తిగత పని మీద రెక్కమానుకు వెళ్లి రాత్రి 8 గంటల సమయంలో స్వగ్రామానికి చేరుకున్నారు. క్షేత్ర సహాయకుడు మనోహర్, ఆయన బావ దాదెప్ప, సోదరుడు రమణ గుట్టకిందపల్లికి వెళ్లి రంగారెడ్డితో మరోసారి ఘర్షణ పడ్డారు. గొడవలో రంగారెడ్డి కిందపడటంతో బలమైన గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నారు. బంధువులు ఆయన్ను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కదిరి డీఎస్పీ శివన్నారాయణస్వామి, సీఐ నాగేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించి, బంధువులతో వివరాలు ఆరా తీశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తామని వారు తెలిపారు.

మృతదేహం వద్ద ఆరా తీస్తున్న డీఎస్పీ, గ్రామీణ సీఐ

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం, రామగిరిలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో సోమవారం రాత్రి దిచక్ర వాహనం ఢీకొని ఈశ్వరయ్య (54) మృతిచెందాడు. సదరు వ్యక్తి స్థానిక రుద్ర వైన్స్ వద్ద రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. ట్రాఫిక్ సీఐ వెంకటేశ్‌నాయక్ ఘటనా స్థలిని చేరుకుని క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి జేబులో ఆధార్ కార్డు ఉండటంతో ధర్మవరానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

ట్రాక్టర్ బోల్తా పడి..

రామగిరి: మండలంలోని పేరూరు సమీపంలో సోమవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తాపడి సాయికుమార్ (23) మృతిచెందినట్లు రామగిరి ఎస్సై సుధాకర్‌యాదవ్ తెలిపారు. ట్రాక్టర్‌తో పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని ట్రాక్టర్ కింద నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. అతనికి భార్య పవిత్ర, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కదిరి పురపాలక సంఘం

ప్రొక్యూర్‌మెంట్

Tender Notice No. 1465/KDR/General Funds/E1 and 1466 to 1467/KDR/MPLADS/E1, Dated: 07-07-2025

క్రింద తెలిపిన పనులకు అర్హులైన వారి నుండి టెండర్లు పిలవడమైనది.

పని పేరు	పనుల సంఖ్య	అంచనా మొత్తము
General Funds	1 నెం.	రూ. 36.60 లక్షలు
MPLADS	2 నెం.	రూ. 10.00 లక్షలు

ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 08-07-2025 ఉ॥ 11-00 గం॥లకు
ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్‌లోడింగ్ చివరి తేది : 22-07-2025 సా॥ 5-00 గం॥లకు
బిడ్ తెరిచే తేది : 22-07-2025 సా॥ 5-30 గం॥లకు

తదుపరి వివరములకు https://tender.apeprocurement.gov.in "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్‌లో పొందవచ్చును.

ఆఫీసు చిరునామా:- కమిషనర్, కదిరి పురపాలక సంఘం, ఫోన్ నెం. 9849908160.

Note: Any Addendum/ Corrigendum / Bid Clarifications/ Time extension shall be issued on the website only. No separate press Notification shall be issued.

సం/- కమిషనర్, కదిరి పురపాలక సంఘం

తాళం వేసిన ఇంట్లో చోరీ

10 తులాల బంగారం, రెండున్నర కిలోల వెండి అపహరణ

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి నిజాంవలి కాలనీలో తాళం వేసిన ఇంటి కిటికీల ఊచలు కోసి లోనికి చొరబడిన దొంగలు బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఇంటి యజమాని బంధువులు పోలీసులకు తెలిపిన మేరకు వివరాలిలా.. నరసారెడ్డి నెలన్నర కిందట కుటుంబ సభ్యులతో కలిసి అమెరికాలోని కుమారుడి వద్దకు వెళ్లారు. ఇంటికి తాళం వేసిన విషయాన్ని గుర్తించిన దొంగలు కిటికీ ఊచలు కోసి లోనికి ప్రవేశించి, 10 తులాల బంగారం, రెండున్నర కిలోల వెండిని ఎత్తుకెళ్లారు. పక్క ఇంట్లో నివాసం ఉంటున్న నరసారెడ్డి బంధువులు కిటికీలు తెరిచి ఉండటాన్ని గుర్తించి సోమవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. అమెరికాలోని నరసారెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని పట్టణ పోలీసులు తెలిపారు. గత నెల ఒకటిన వైశ్యా బ్యాంకు కాలనీలోనూ ఇదే తరహాలో చోరీ జరిగింది. కిటికీల ఊచలు కోసి దొంగలు బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. ఇది చెడ్డీ గ్యాంగ్ పనేనా అని స్థానికులు అనుమానిస్తున్నారు.

ఇంట్లోకి ప్రవేశిస్తున్న దొంగ (సీసీ కెమెరా చిత్రం)

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, R. Jabhid, S/o R.Mahaboob Basha, residing at H.No. 13/49a, marama gudi street, Madakasira, Sathya Sai district, Andhra Pradesh – 515301, have changed my name to R. Javeed, and shall hereafter be known as R. Javeed for all purposes.

TO LET

COMMERCIAL

ATP టౌన్, NH.44, సుధీర్ లారీ కాటా వెనుక, D Mart Lane/ రిలయన్స్ డిజిటల్/ ట్రెండ్స్ ప్రక్కన ఉన్న రెస్టారెంట్/ 70 సెంట్ల ఖాళీ స్థలం బాడుగకు ఇవ్వబడును. Cell: 6305772976.

JOBS

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

ఆలమూరు రోడ్డులో ప్లాటింగులో గార్డెన్ పనికి మగ మనిషి కావలెను (పార్ట్/ఫుల్ టైం). ఫోన్: 7093037333

MARKETING/ SALES

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ అనంతపురం నందు పనిచేయుటకు Sales Executives and Telecallers కావలెను. సెల్: 94923 85111.

HUMAN RESOURCES

Wanted HR Executive A IT start-up company is looking Strong knowledge in recruitment, payroll, and employee engagement is a must. Note: English is must. Location: Anantapur Email : - atp.hr@cnnitech.com

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

(c) eenadu

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

అర్హులందరికీ ఇల్లు మంజూరు చేయాలి: ఎమ్మెల్యే

మడకశిర : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇల్లు లేని ప్రతి లబ్ధిదారుడిని గుర్తించి తప్పనిసరిగా మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి రెవెన్యూ, హౌసింగ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామానికి శ్మశాన వాటికలు కూడా ఉండేలా స్థలాలు గుర్తించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు స్థలం లేకపోతే గుర్తించి పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఇప్పటికే మంజూరైన ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేలా ప్రోత్సహించాలన్నారు. పలు గ్రామాల్లో పర్యటించినప్పుడు ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదులు వస్తున్నాయని అలాంటి వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో 5 మండలాల తహసీల్దార్‌లు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

పిల్లల హాజరుశాతం పెంచాలి

రికార్డులను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

రొళ్ల, న్యూస్‌టుడే: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల హాజరు శాతాన్ని పెంచాలని విద్యాశాఖ అధికారులు మల్లికార్జున, చంద్రలు పేర్కొన్నారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి పిల్లలకు విలువలతో కూడిన విద్యను బోధించాలని కోరారు. సీఆర్పీలు ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పాపిరెడ్డిపల్లి కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సోమవారం ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ పరిశీలించారు. నీటి ట్యాంకు, శుద్ధజలం ప్లాంటు, వంట గది, కూరగాయలు, నిత్యావసర వస్తువుల నాణ్యతను ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను రప్పించి నీటి ట్యాంకును శుభ్రం చేయించారు. అస్వస్థతకు గురైన 31 మంది విద్యార్థినుల్లో ఇప్పటివరకు 23 మంది కోలుకోగా, ఐదుగురు హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో, మరో ముగ్గురు సోమందేపల్లి ఆరోగ్య కేంద్రంలో చికిత్సలు పొందుతున్నారు. సోమవారం ఎంపీడీవోతో పాటు ఎంఈవో ఆంజనేయులు నాయక్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొన్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారి ఓంకార్, పర్యవేక్షకులు రత్నమ్మ, స్టాఫ్ నర్సులకు సూచించారు.

విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ

మూలకు చేరిన సైకిళ్లు.. తొలగని చెత్త

సచివాలయం ముందు విరిగిన సైకిళ్లు

మడకశిర గ్రామీణం, గుడిబండ, న్యూస్‌టుడే: గ్రామాల్లో శుభ్రపరచి ప్రజల ఆరోగ్యం పెంపొందించడంతో పాటు రైతులకు తక్కువ ధరకే సేంద్రీయ ఎరువులు తయారు చేసి ఇచ్చే విధంగా గత తెదేపా ప్రభుత్వ హయాంలో పంచాయతీకో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించారు. పంచాయతీ సిబ్బంది, సర్పంచుల పర్యవేక్షణలో సంపద కేంద్రాలకు తడిచెత్త, పొడిచెత్త చేరవేసి ఎరువులను తయారు చేయాల్సి ఉంది. ఏ

వృథాగా సంపద కేంద్రాలు.. తయారుకాని ఎరువులు

ఒక్క సంపద కేంద్రంలోనూ సేంద్రీయ ఎరువులు సిద్ధం కావడం లేదు. చాలా కేంద్రాలకు చెత్త చేరడం లేదు. గ్రామాలలో సేకరించిన చెత్తను కొన్ని పంచాయతీల్లో ఆరు బయట రోడ్ల పక్కన పడేసి వెళ్తున్నారు.

నియోజకవర్గంలో 72 కేంద్రాలు

మడకశిర నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండలాల్లో 72 సంపద కేంద్రాలు న్నాయి. వీటి పరిధిలో దాదాపు 300 మంది హరితరాయబారులు పనిచేయాల్సి ఉంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఏడాదికి పైగా జీతాలు రాకపోవడంతో అప్పట్లో కొంత మంది మానేశారు. పంచాయతీకి ఐదు మందికి పైగా పనిచేసే వారు. ప్రస్తుతం ఇద్దరు, ముగ్గురు మాత్రమే కనిపిస్తున్నారు.

చెత్తను తరలించి ఎరువుగా మారుస్తాం
- పి.కేశవరెడ్డి, ఎంపీడీఓ, గుడిబండ

గ్రామాల్లో చెత్తను ఆరుబయట వేయకుండా సంపద కేంద్రానికి తరలించే విధంగా చర్యలు చేపడతాం. సేంద్రీయ ఎరువులు సిద్ధం చేసి రైతులకు అందజేస్తాం.

300లకు పైగా విరిగినవే..

ఏళ్ల కాలం నాటి చెత్త సేకరణ సైకిళ్లు కావడంతో అవి విరిగి మూలన పడ్డాయి. నియోజకవర్గవ్యాప్తంగా సుమారు 600 సైకిళ్లు ఉండగా అందులో 300లకు పైగా విరిగినవే. సైకిళ్లు లేని కారణంగా పంచాయతీల్లో చెత్త తొలగడం లేదు. ఫలితంగా గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. అసలే వర్షాకాలం కావడంతో దోమల బెడద, దుర్గంధంతో ప్రజలు బెంబేలెత్తున్నారు.

★ మడకశిర మండలం ఆమిదాలగొంది, గౌడనహళ్లి, చందకర్ల, మెళవాయి, బుళ్లసముద్రం తదితర సంపద కేంద్రాలకు చెత్తచేరడం లేదు.

★ గుడిబండ, అమరాపురం మండల కేంద్రాలల్లో మినహా మిగతా పంచాయతీల్లో నిర్మించిన సంపద కేంద్రాలకు చెత్త తరలించడం లేదు. దీంతో పంచాయతీ గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొంది.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 80085 73018
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: దాసరపల్లి గ్రామంలోని బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **- గుజ్జారప్ప**
సమాధానం: రెండు రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **- గౌరమ్మ, సర్పంచి, కరికెర**
సమస్య: కేకేపాళ్యం గ్రామ మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో కంపచెట్లు పెరిగి విషపురుగులు సంచరిస్తున్నాయి. **- నరసప్ప**
సమాధానం: కంపచెట్లు వెంటనే తొలగిస్తాం. **- అమరీశ్, పంచాయతీ కార్యదర్శి, ముతుకూరు.**
సమస్య: దొక్కలపల్లి ఎస్సీ కాలనీలో చెక్‌వాల్వు పగిలి నీరు వృథా అవుతున్నాయి **-మంజునాథ్**
సమస్య: హనుమయ్య పాళ్యంలో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు **- మణి**
సమాధానం: వాటర్‌మ్యాన్‌ను పంపించి కొత్త వాల్వు మార్చుతాం. సిబ్బందిని పంపించి కొత్తవి దీపాలు ఏర్పాటు చేస్తాం **- రంగనాథ్, పంచాయతీ కార్యదర్శి, ఇనగలూరు.**

– న్యూస్‌టుడే, గుడిబండ, అగళి

ఆకట్టుకున్న ఉట్లపరుష

సోమందేపల్లి: కదిరేపల్లిలో ఉట్ల పరుషను ఆసక్తిగా తిలకిస్తున్న భక్తులు

పెనుకొండ, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పండగను పురస్కరించుకుని సోమవారం పెనుకొండ పట్టణం చెరువుకట్టలోని దర్గా ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో నిర్వహించిన ఉట్లపరుష ఆకట్టుకుంది.

కొడిగెనహళ్లి(పరిగి) : బాలిరెడ్డిపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఉట్ల పరుష నిర్వహించారు. రైతన్నలు ఎడ్లబండ్లతో ప్రదర్శన నిర్వహించారు. ఉట్లమాను ఎక్కేందుకు యువత పోటీ పడ్డారు.

సోమందేపల్లి : కదిరేపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఉట్ల పరుష నిర్వహించారు. చుట్టుపక్కల మండలాలతోపాటు కర్ణాటక, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పెనుకొండ: ఏకాదశి పండగ సందర్భంగా సోమవారం కనుమ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిమ్మాపురం ఆంజనేయస్వామి ఆలయంలో మహిళలు జ్యోతులను సమర్పించారు.

రొద్దం: ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆర్.కుర్లపల్లిలో వెలసిన మూక్కా హనుమంతరాయస్వామికి మహిళలు జ్యోతులు సమర్పించారు.

ఉట్లమాను ఎక్కుతూ జారి కింద బురదలో పడుతూ భక్తులను నవ్విస్తున్న యువకులు

ఆర్.కుర్లపల్లిలో జ్యోతుల ప్రదర్శన చేస్తున్న మహిళలు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం దళిత నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. మందకృష్ణ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ నిరంతర పోరాటాలు చేసి సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు పులజాతి నారాయణప్ప, నరసింహులు, నరసింహమూర్తి, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిగి: పరిగిలోని ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేశారు. నాయకులు రమేశ్, సర్పంచి లక్ష్మీ, శివశంకర్, రామకృష్ణ, నరసింహప్ప, లోకేష్, ఓబులేసు, ఆదిమూర్తి, రమేష్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సోమందేపల్లి: అంబేడ్కర్ కూడలిలో మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేకు కోస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, దళితులు

రొద్దం : స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బైలాంజనేయులు ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు.

సమస్యల పరిష్కారం

హిందూపురం అర్బన్: పట్టణంలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ స్పందించి పరిష్కరింపజేశారు. గుడ్డం రంగనాథస్వామి ఆలయం నుంచి మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే రహదారిలో నెలకొన్న చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

చిలమత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని వీరాపురం ఎస్సీ కాలనీకి చెందిన ఆదినారాయణప్ప రెండో కుమారుడు గోవర్ధన్(30) వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతను కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపంతో సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్ తెలిపారు.

రస్తా సమస్య పరిష్కరించాలని మహిళల వినతి

గోరంట్ల: మండలంలోని దిగువ గంగంపల్లి గ్రామంలో పొలాలకు వెళ్లే దారి వివాదంగా మారిందని, వెళ్లలేకపోతున్నామని పలువురు మహిళలు సోమవారం తహసీల్దార్ మారుతీప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న రహదారిలో వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ మండల సర్వేయర్‌ను పిలిచి సమస్యపై ఆరాతీశారు. వెంటనే పరిశీలించి రెవెన్యూ రికార్డుల్లో ఉన్న దారిలో మాత్రమే రాకపోకలు సాగించే విధంగా ఆదేశించారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

రొళ్ల, న్యూస్‌టుడే: అవినకుంటతండా గ్రామానికి చెందిన నరసనాయక్ కుమారుడు గోపాల్ నాయక్ సోమవారం ఉదయం కుళాయి నుంచి సంపునకు నీరు నింపేందుకు మోటారు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెనక్కు పడిపోవడంతో తలకు తీవ్రగాయం అయ్యింది. గమనించిన స్థానికులు వెంటనే రొళ్ల ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మడకశిర ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు మహిళలు సోమవారం ఆత్మహత్యాయత్నం చేశారు. విషద్రావకం తాగి ఒకరు, మాత్రలు ఎక్కువగా మింగి మరొకరు అఘాయిత్యానికి పాల్పడ్డారు. గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం హిందూపురం పంపించారు.

గృహహింస చట్టం కేసు నమోదు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లకు చెందిన నిర్మల అనే మహిళ ఫిర్యాదుపై సోమవారం గృహహింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ పేర్కొన్నారు. అయిదేళ్ల క్రితం నిర్మలకు నల్లమాడ మండలం మసకవంకపల్లికి చెందిన నాగేంద్రతో వివాహం అయింది. ఒక కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో భర్తతో పాటు అత్త, ఆడపడుచూ తరచూ వేధిస్తున్నట్లు ఆమె చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆంగ్ల ఉపాధ్యాయుడు విధులకు వచ్చేలా చూడాలి

గుడిబండ, న్యూస్‌టుడే: పేసినిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు రవికుమార్ విధులకు హాజరయ్యేలా చూడాలని విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు గుడిబండ తహసీల్దార్ కె.శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీ కౌన్సెలింగ్‌లో రవికుమార్ పైరెడి నరసాపురం పాఠశాలకు బదిలీ అయ్యారు. అక్కడ చేరి మళ్లీ విధులకు రావడంలేదు. సీఎస్‌ఈ నిబంధనల ప్రకారం బదిలీపై వెళ్లిన సర్‌ప్లస్ వరకు పాత పాఠశాలలోనే కొనసాగాల్సి ఉంది. ఆంగ్ల సబ్జెక్టులో విద్యార్థులు వెనకబడుతున్నారని సత్వరమే ఉపాధ్యాయుడు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

విద్యతోనే చిన్నారుల భవిష్యత్తు

మడకశిర గ్రామీణం : పిల్లలను సక్రమంగా బడికి పంపాలని ఏఆర్ రొప్పం గ్రామంలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. సోమవారం బడిబాటలో భాగంగా పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పిల్లల చదువులే తరగని ఆస్తులని, బాగా చదివించి విద్యావంతులను చేస్తే కుటుంబాలు బాగుపడతాయని, బడిలో రోజూ పంపాలని కోరారు.

నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు

హిందూపురం అర్బన్ : పట్టణంలోని సత్యనారాయణపేట నాగులకట్ట సమీపంలో శ్రీ శేషసాయి సంస్థానంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రమేశ్, సురేఖలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని సాయి భక్తులందరూ హాజరు కావాలని కోరారు.

తెదేపా కార్యకర్త మృతికి ఎంపీ సంతాపం

రొద్దం : రొద్దం గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త చంద్రశేఖర్ నాయుడు(47) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ బీకే పార్థసారథి కార్యకర్త ఇంటికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి పార్టీ జెండా కప్పి సంతాపం తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వాహనాల అద్దాలు ధ్వంసం

దుండగుల దాడిలో ధ్వంసమైన ఐచర్ అద్దాలు

పెనుకొండ, న్యూస్‌టుడే: కియా ఇండియా, అనుబంధ పరిశ్రమల్లో ముడి సరకులు రవాణా చేసే పీఎంకే రవాణా సంస్థ వాహనాలను సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని దుండగులు ద్విచక్రవాహనాల్లో వెంబడించి అద్దాలు ధ్వంసం చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని దుద్దేబండ కూడలి సమీపంలో ఓ అనుబంధ సంస్థ నుంచి కియా పరిశ్రమకు ముడిసరకు రవాణా చేస్తున్న ఐచర్ వాహనాన్ని వెంబడించి దుండగులు అద్దాలు ధ్వంసం చేశారు. గోరంట్ల మండలంలోని పాలసముద్రం సమీపంలో సైతం పీఎంకే సంస్థకు సంబంధించిన మరో వాహనం అద్దాలు పగులగొట్టారు. ఈ ఘటనపై కియా ఇండస్ట్రియల్ ఏరియా స్టేషన్ ఎస్సై రాజేశ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలని నిరసన

నిరసన తెలుపుతున్న పీడీఎస్ విద్యార్థి సంఘం నాయకులు

హిందూపురం, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, పీజీ విద్యార్థులకు ఉరితాడుగా మారిన 77 జీవో రద్దు చేయాని పీడీఎస్ విద్యార్థి సంఘం నాయకులు సోమవారం మోకాళ్లపై కూర్చొని నిర్సన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి బాబావలి, ఉమేశ్ నాయక్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కరించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వసతిగృహాల్లో మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వెంటనే ఆపాలన్నారు. నిరసనలో జిల్లా సహాయ కార్యదర్శి భగత్, జిల్లా కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథస్వామి ఉత్సవాలు

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలోని చాకలికుంట సమీపంలో కొండగుహలో వెలసిన రంగనాథస్వామి, శ్రీదేవి, భూదేవికి ఆషాడమాసం, శుక్లపక్ష ద్వాదశి సందర్భంగా మర్రిమాను తోట వంశస్తులైన వాల్మీకి ముద్దరంగనాయక ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి ఉత్సవ విగ్రహాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లి సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్న భక్తులకు ఆలయ యాజమాన్యం అన్నప్రసాదాలు అందజేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

చిలమత్తూరు: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని నూతన ఉపాధ్యాయ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జేఏసీ మండల కార్యవర్గాన్ని ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అలీముల్లా, అధ్యక్షుడిగా రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా సుందర్‌రాజు, కోశాధికారిగా శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలిగా పద్మావతి, మహిళా ఉపాధ్యక్షురాలిగా శశికళతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నూతనంగా ఎంపికైన జేఏసీ ఉపాధ్యాయ బృందం


ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

చంద్రబాబుతోనే సుపరిపాలన

అగళి న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కెంకెర, పి.బ్యాడిగర, హెచ్‌డీపల్లి, గాయత్రి కాలనీ, హుల్లెకెర గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, జడ్పీటీసీ సభ్యుడు ఉమేశ్, కన్వీనర్ తిప్పేస్వామి, శివకుమార్, రాజ్‌గోపాల్, మాజీ ఎంపీపీ బసవరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సతీమణి ఉమాదేవి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలమత్తూరు: తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం చిలమత్తూరులో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు గురించి తెలియజేశారు. సీనియర్ నాయకులు అశ్వర్థప్ప, రామాంజనేయులు, చంద్రమోహన్, గౌస్‌బాషా, జమీర్ బాషా, గొల్ల నాగరాజు, పరిటాల వెంకటేష్, ప్రవీణ్, మంజునాథ పాల్గొన్నారు.

విద్యుత్తు స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

హిందూపురం పట్టణం నంజుండేశ్వర సముదాయం సమీపంలోని ఎస్సీ బాలికల వసతిగృహం వద్ద ఇనుప స్తంభం కింది భాగం తుప్పుపట్టింది. చిన్నపాటి గాలివీచినా ఎక్కడ పడిపోతుందా అని సమీప ప్రాంతాల వారు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఏఈ విష్ణు దృష్టికి తీసుకెళ్లగా స్తంభాల కొరత ఉందని, వచ్చిన వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, హిందూపురం

పైప్‌లైన్ లీకేజీతో బురదమయం

హేమావతి కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి గుణేహళ్లి వెళ్లే రోడ్డులో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీరు రోడ్డుపై నిలుస్తోంది. బురదమయం కావడంతో పిల్లలు, వృద్ధులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సర్పంచి తిప్పేస్వామిని వివరణ కోరగా రెండు రోజుల్లో పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించి సమస్య పరిష్కరిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, అమరాపురం**

నీరు నింపడం మరిచారు

భక్తరపల్లి గ్రామంలోని క్యాంపురం వెళ్లే రోడ్డులో పశువుల తాగునీటి కోసం నీటి తొట్టెను నిర్మించారు. నీరు వదలకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ బోర్ల వద్దకు పశువులను తోలుకెళ్లి దాహార్తిని తీర్చుతున్నామని వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అశ్వర్థరెడ్డి మాట్లాడుతూ తొట్టెకు నీరు నింపుతామని తెలిపారు.

- న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

ఎట్టకేలకు మోక్షం

▸ ఆదర్శ పాఠశాలకు వసతిగృహం
▸ చురుగ్గా సాగుతున్న నిర్మాణ పనులు

వసతిగృహం వద్ద ప్రహరీ పనులు చేస్తున్న కార్మికులు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి రహదారిలోని సి.చెర్లోపల్లి వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రాంగణంలో 16 ఏళ్లుగా ఆగిపోయిన వసతిగృహం నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. 2009లో సమగ్ర శిక్షణ అభియాన్ కింద రూ.1.23 కోట్లు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. బిల్లులు సకాలంలో చెల్లించలేదనే సాకుతో ఒప్పందదారుడు పనులను ఉన్నపళంగా ఆపేశాడు. తదుపరి అతడు ముందుకురాలేదు. రాష్ట్రం విడిపోవడం, ప్రభుత్వాలు మారిన నేపథ్యంలో నిర్మాణం కలగానే మిగిలిపోయింది. 2014 తెదేపా ప్రభుత్వ పాలనలో మరో కొత్త ఒప్పందదారుడు ముందుకొచ్చినా పనులనేవి పూర్తిస్థాయిలో జరగలేదు. విద్యార్థులు ఉండటానికి నిర్మించిన 10 గదులు, మరుగుదొడ్లు దిష్టిబొమ్మలా మిగిలాయి. తర్వాత 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్ల కాలంలో పైసా నిధులు కేటాయించలేదు. దీంతో పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో..

ఇక్కడ గతంలో ప్రిన్సిపల్‌గా పనిచేసిన అశోక్‌నాయక్ పలుసార్లు ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చొరవచూపింది. అయితే మిగిలి ఉన్న నిధులను పూర్తిగా ఖర్చుచేస్తే తదుపరి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో సదరు కాంట్రాక్టరు గత జనవరిలో మిగులుగా ఉన్న రూ.19లక్షలను వెచ్చించి వసతిగృహానికి నీటివసతి కల్పించడానికి పైపుల ఏర్పాటు, గదులకు తలుపులు, కిటికీలు, తదితర సదుపాయాలను సమకూర్చారు. దీంతో రూ.1.25కోట్లు రెండోవిడతగా ప్రభుత్వం మంజూరు చేసింది. వారం రోజులుగా ప్రహరీ నిర్మించే పనులను చురుగ్గా చేపడుతున్నారు. తర్వాత వసతిగృహం పైభాగంలో మరో 20 గదులు నిర్మించడానికి నిధులను వెచ్చిస్తున్నారు.

రెండు నెలల్లో పూర్తి చేస్తాం

ఎన్నో కారణాలు, అవాంతరాలతో భవన నిర్మాణం కుంటుపడింది వాస్తవమే. ప్రస్తుతం వచ్చిన నిధులతో అన్ని సదుపాయాలతో రెండు నెలల్లో నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించి నాణ్యత ఉండేలా చూస్తున్నాం.

- నౌషద్ అలీ, సమగ్ర శిక్షణ అభియాన్, ఇంజినీర్

ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ

మడకశిర గ్రామీణం : మడకశిర అసెంబ్లీ నియోజకవర్గంలోని బూత్‌లెవల్ ఆఫీసర్లకు ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ ఉంటుందని ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.సూర్యనారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. .జులై 8, 9, 10, 11, 15వ తేదీలలో బ్యాంక్‌కు 50 మంది చొప్పున స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

తాగునీటిలో ఇనుప తుప్పు

మడకశిర, న్యూస్‌టుడే: గుడిబండ మండలం కొంకల్లులో రక్షిత మంచినీటి పథకం నుంచి కుళాయిల ద్వారా సరఫరా అయ్యే తాగునీటిలో తుప్పు పట్టిన ఇనుప రవ్వలు వస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. గత పది రోజుల నుంచి కుళాయిల్లో మట్టి, ఇనుప ముక్కలు వస్తున్నాయని తాగలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం బోరు ద్వారా దాదాపు 1500 ఇళ్లకు పైగా ఈ నీరు సరఫరా అవుతోంది. నీటిలో చిన్న చిన్న ఇనుప ముక్కల ఉండటంతో గమనించక కొంతమంది అవే నీటిని తాగుతున్నారని తద్వారా ఆరోగ్య సమస్యలు వస్తాయంటున్నారు. గత ఏడాది కూడా ఇదే గ్రామంలో అతిసారం ప్రబలి నలుగురు మృతి చెందారు. ప్రస్తుతం నీటిలో ఇనుప పైపు తుప్పు పట్టడంతో ఇలా వస్తున్నాయని వెంటనే అధికారులు స్పందించి తాగునీటి పైప్‌లైన్ మార్చి మంచినీరు సరఫరా అయ్యేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీశ్‌ను వివరణ కోరగా వంకలో బోరు వేయడం మట్టి కూరుకుపోయి మోటార్ బ్లాక్ అయ్యింది. మరో వారం రోజుల్లో రీబోర్ చేయించి మంచి నీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నీటిలో వచ్చిన ఇనుప రవ్వలు

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

శక్తి బృందం సభ్యులను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ కిరణ్

శక్తి యాప్‌పై అవగాహన

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎరుకులవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీశ్ పాఠశాలలో సోమవారం కదిరి డివిజన్ శక్తి బృందం సభ్యులు విద్యార్థులకు యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. యాప్ వినియోగంతో పాటు బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, బాలికల వేధింపుల నుంచి రక్షణ కోసం ఉన్న చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బృందం సభ్యులకు పాఠశాల ప్రిన్సిపల్ కిరణ్ సన్మానించారు. కార్యక్రమంలో శక్తి బృందం సభ్యులు మంజుల, సౌభాగ్య, షౌకత్ ఖాన్, తాజుద్దీన్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు

సత్కారం పొందిన ఉపాధ్యాయులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బీఎస్ఆర్ పురపాలక ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. వీరిని ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం మేరీ వరకుమారి మాట్లాడుతూ.. బీఎస్ఆర్ పురపాలక బాలుర ఉన్నత పాఠశాల ఏటా పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు. దీనికి ఉపాధ్యాయులే కారణమని కొనియాడారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

నల్లచెరువు, న్యూస్‌టుడే: నల్లచెరువు మండల తహసీల్దారుగా టి.ఆర్ జమానుల్లాఖాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు రవికుమార్ కదిరి ఆర్డీవో కార్యాలయానికి ఏవోగా బదిలీపై వెళ్లారు. రామగిరి మండలంలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు నూతన తహసీల్దారు తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు.

'విద్యాసంస్థల్లో అక్రమాలపై విచారణ చేపట్టాలి'

కదిరి పట్టణం: కదిరి పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పీఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాలు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టాయి. విద్యాశాఖ అధికారి దీర్ఘకాలంగా ఇక్కడే పనిచేస్తున్నారని, బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న లంబాడీల నృత్య ప్రదర్శన

తనకల్లు, నల్లచెరువు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనంత అటవీ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం లంబాడీలు నృత్య ప్రదర్శనతో అలరించారు. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్లు అధ్యాపకులు తెలిపారు. లంబాడీల నృత్యాలు, జానపద కళల పునరుజ్జీవం తెచ్చేలా ప్రభుత్వ ప్రోత్సహించాలని పలువురు కోరారు. అనంతరం వీర మరణం పొందిన మురళీనాయక్‌కు సంతాపం తెలుపుతూ నృత్యాలు చేస్తూ పాటలు పాడారు. ప్రిన్సిపల్ చెన్నకేశవప్రసాద్, కోఆర్డినేటర్ శివశంకర, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు

గాండ్లపెంట: ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్తు లైన్ తాకడంతో బాలుడు గాయపడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గాండ్లపెంటకు చెందిన సంతోష్ కుమారుడు ఆర్యా గగన్ పశువైద్యశాల సమీపంలో ఆడుకుంటూ పక్కనే ప్రహరీ ఎక్కాడు. సమీపంలో విద్యుత్తు నియంత్రికకు ఏర్పాటు చేసిన తీగలు తాకడంతో విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం కదిరి ఆసుపత్రికి తరలించారు. విద్యుత్తు నియంత్రిక వద్ద కంచె వేయాలని ఇన్‌ఛార్జి ఏఈ శ్రీకాంత్ తెలిపారు.

పోగొట్టుకున్న వస్తువుల అప్పగింత

చెన్నేకొత్తపల్లి: ఓ యువతి బస్సులో పోగొట్టుకున్న వస్తువులను చెన్నేకొత్తపల్లి పోలీసులు సోమవారం అందజేశారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం నగరానికి చెందిన తేజస్విని బెంగళూరులోని ఓ కంపెనీలో టెకీగా విధులు నిర్వహిస్తోంది. ఆమె బెంగళూరు నుంచి స్వగ్రామం అనంతపురానికి ఆదివారం ఉదయం 8 గంటలకు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. రాప్తాడు వద్ద ల్యాప్‌టాప్, ఇతర లగేజీ బ్యాగుల కోసం చూడగా కనిపించలేదు. వెంటనే తన అన్నకు ఫోన్ చేసి విషయం తెలిపింది. ఇద్దరు చెన్నేకొత్తపల్లి ఠాణాకు వచ్చి ఫిర్యాదు చేశారు. ఎన్ఎస్‌గేట్‌లో 14 మంది బస్సు దిగారని తెలిపింది. చెన్నేకొత్తపల్లి ఓబుళ లక్ష్మీనరసింహస్వామి పూజా కార్యక్రమాల కోసం పలువురు బెంగళూరు నుంచి వచ్చారు. బస్సు దిగి వచ్చిన వారివద్దనా ల్యాప్‌టాప్, ఇతర వస్తువులు పొరపాటున తీసుకెళ్లి ఉన్నారేమోనని మైక్ ద్వారా విషయాన్ని భక్తులకు తెలియజేశారు. 10 నిమిషాలకే ఓ వ్యక్తి వస్తువులను పోలీసులకు అందజేశారు. సోమవారం స్టేషన్‌లో యువతికి అందజేశారు.

స్థలం ఆక్రమణకు యత్నిస్తున్నారని ఫిర్యాదు

నల్లచెరువు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న తనకు చెందిన స్థలాన్ని ఆక్రమించుకోవడానికి యత్నిస్తున్నారని పదువూరి నగేశ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేపనగ మిల్లు ముందు ఉన్న తనకు చెందిన ఖాళీ స్థలాన్ని మండల కేంద్రానికి చెందిన అల్లాబకాశ్, తెదేపా మాజీ కన్వీనర్ శివారెడ్డి, ఆయన అల్లుడు ప్రసాద్‌రెడ్డి ఆదివారం పొక్లెయిన్‌తో చదును చేసే ప్రయత్నం చేశారన్నారు. అడ్డుకునే ప్రయత్నం చేస్తే తనకు వారం రోజులు గడువు ఇచ్చి పనులు చేపడతామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై ఎస్ఐ మగ్బూల్‌బాషాను వివరణ కోరగా. . ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, ఇరువర్గాలను విచారించిన తరువాత చర్యలు తీసుకుంటామన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

అడుగడుగునా గుంతలతో రాకపోకలకు అవస్థలు

ధర్మవరం పట్టణం, కదిరి, ముదిగుబ్బ, న్యూస్‌టుడే: పట్టణాలకు అనుసంధానం చేసే.. పల్లె దారులు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి. అడుగడుగునా గుంతలు ఉండటంతో తప్పని పరిస్థితుల్లో ఆ దారులపై రాకపోకలు సాగించాల్సిన దుస్థితి గ్రామీణ ప్రజలకు నెలకొంది. వర్షం పడితే గుంతల్లో నీరు నిల్వ ఉంటూ ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆందోళన చెందుతున్నారు. తాత్కాలికంగా మరమ్మతులు చేద్దామన్న ఆలోచన కూడా సంబంధిత శాఖాధికారులు, నాయకులు చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలు గ్రామీణ దారుల్లోనే అధికంగా అవుతున్నట్లు పోలీసు అధికారుల గణంకాలు చెబుతున్నాయి. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాల్సి రావడం, పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్నప్పుడు గోతుల్లో పడి గాయపడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

కంకర పరిచి..వదిలేశారు

గత వైకాపా పాలనలో పలు దారుల అభివృద్ధి, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని పంచాయతీరాజ్ శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాగానే పనులు దక్కించుకున్న గుత్తేదారులు వాటిని ఆర్భాటంగా ప్రారంభించారు. కొన్ని మీటర్ల వరకు కంకర పరిచి పనులకు శంకుస్థాపన చేశారు. తీరా పనులు ఆలస్యం కావడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో కంకర పరిచిన, ఇతర పనులు చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు వదిలేసుకున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి గ్రామీణ రహదారులకు మోక్షం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మల్లేనిపల్లి ప్రధాన రహదారి దుస్థితి

ప్రతిపాదనలు పంపాం - మురళి, పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈఈ

గోతుల దారుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు మంజూరవుతాయని ఉన్నతాధికారులు తెలిపారు. నాణ్యంగా పనులు చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

జలధికి తరలిన పీర్లు

ధర్మవరంలో పీర్ల ఊరేగింపు

నంబులపూలకుంట, గాండ్లపెంట, న్యూస్‌టుడే: గాండ్లపెంట, ఎన్పీకుంట మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం పీర్లు జలధికి తరలివెళ్లాయి. గాండ్లపెంట మండలంలోని తూపల్లి, జీనులకుంట, గాండ్లపెంట తదితర గ్రామాల్లో జలధి కార్యక్రమం నిర్వహించారు.

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పీర్లు జలధికి తరలివెళ్లాయి. ఈ సందర్భంగా పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామాల్లో ఊరేగించారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం చేయించారు. భక్తులు చక్కెర, బెల్లాన్ని చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

ధర్మవరం: పట్టణంలోని సాయినగర్, పీఆర్టీ కాలనీ, కొత్తపేట, రామ్‌నగర్ ప్రాంతాల్లో ఖాసీం స్వామి, కుళ్లాయిస్వామి పీర్లను ఊరేగింపుగా జలధికి తరలించారు. భక్తులు చక్కెర చదివింపులు చేయించారు.

తలుపుల: మండలంలో ఎగుర పేట, కోట, కుమ్మరపేట, గంజివారిపల్లి, నూతన కాల్వ, వేపమానిపేట, పెద్దన్నవారిపల్లి, బూదనంపల్లి గ్రామాల్లో పీర్లను జలధికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

వందశాతం హాజరు తప్పనిసరి

మాట్లాడుతున్న మానిటరింగ్ కమిటీ సభ్యులు

కదిరి, న్యూస్‌టుడే: పాఠశాలల్లో వందశాతం హాజరు తప్పనిసరిగా వేయాలని విద్యా సమీక్ష కేంద్ర (వీఎస్‌కే) సభ్యులు తెలిపారు. వీఎస్‌కే బృందంలోని సభ్యులు ఏసుబాబు, సువర్ణరోజా, నాగుల్‌మీరాలు కదిరి నియోజకవర్గంలో సోమవారం పర్యటించారు. తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, తలుపుల, ఎన్పీకుంటతో పాటు కదిరి ఎమ్మార్సీలను సందర్శించారు. ఇందులో భాగంగా పాఠశాలల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థుల హాజరును తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల్లో వందశాతం హాజరు వేయకపోవడాన్ని గుర్తించారు. ఇందుకు కారణాలను విచారించారు. కొందరికి హాజరు పడకుండా ఉన్నట్లు గుర్తించారు. దీంతో అంతర్జాలం, బహుళ వైఫల్యం, నమోదు కాకపోవడం, ముఖాన్ని గుర్తించకపోవటమేగాక, లోకేషన్ లేవన్న చూపుతున్న సమస్యలు ఉన్నట్లు ఎంఈవోలు తెలిపారు. దీంతో ఆయా సమస్యతో హాజరు పడని ఉపాధ్యాయులను పిలిపించి లోపాలను సరిచేశారు. అన్నిపై వందశాతం హాజరు విజయవంతంగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి, ఎమ్మార్సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తప్పక నెరవేరుస్తారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకమ్మవారిపల్లిలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు తెలియజేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. గత వైకాపా పాలనలో పుట్టపర్తి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. కృష్ణా జలాలతో నియోజకవర్గంలోని 193 చెరువులు, 2 రిజర్వాయర్లను నింపుతామని వివరించారు. తాగునీటి సమస్య ఉందని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో గంటలోనే బోరు వేయించి పరిష్కరించారు. బోరు వేయడానికి స్థలం కేటాయించిన దాతలు ముమ్మనేని సోదరులను అభినందించారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్యేక పూజలు చేశారు.

పుట్టపర్తి: సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

గాండ్లపెంట: సుపరిపాలన తెదేపాతోనే సాధ్యమని.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం గాండ్లపెంటలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. పలువురు సమస్యలను ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, మహిళ సభ్యులు పర్వీన్‌బాను, సత్యవతి, నాయకులు వెంకటరమణారెడ్డి, అక్రం బాషా, ఈశ్వర్‌రెడ్డి, సిద్దారెడ్డి, పవన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే కందికుంట



ధర్మవరం: చిగిచెర్లలో కరపత్రం అందజేస్తున్న పరిటాల శ్రీరామ్, నాయకులు

ధర్మవరం: చిగిచెర్లలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, నియోజకవర్గ పరిశీలకుడు నాగేంద్ర, నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వంలో విధ్వంస పాలన సాగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. మాజీ జడ్పీ ఛైర్మన్ ఓబిరెడ్డి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని శ్రీరామ్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేశ్ చౌదరి, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆచూకీ లభ్యం

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరంలో అదృశ్యమైన తల్లీబిడ్డల ఆచూకీ సోమవారం లభించింది. తన భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయిందని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో భర్త ఆదివారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వారి కోసం గాలించారు. బళ్లారి జిల్లా బెళగుప్ప క్షేత్రంలో ఉన్నట్లు తెలియడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని భర్తకు అప్పగించినట్లు రెండో పట్టణ సీఐ రెడ్డెప్ప తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తనకల్లు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని పట్ల 42 జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. కదిరికి చెందిన మహమ్మద్ అబుజార్ కాలు, తన్వీర్ తలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వందేమాతరం బృంద సభ్యులు అశోక్, బాలు ఉచిత అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి కదిరి ప్రాంతీయ వైద్యశాలకు తీసుకెళ్లారు.

కాలువ మరమ్మతు చేయరూ..

కదిరి పట్టణం అడపాలవీధిలోని ఓ బజారులో కాలువ, రహదారి దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. కాలువపై నిర్మించిన సిమెంటు పలకలు రోడ్డుపై పడ్డాయి. పెద్ద వాహనాలు వెళ్లడం వల్ల దారితో పాటు సిమెంటు పలకలు ధ్వంసమయ్యాయి. దీంతో రాత్రివేళల్లో పిల్లలు, వృద్ధులు, వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. సమస్యను మున్సిపల్ సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కమిషనర్ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి మరమ్మతు చేపడతామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కదిరి పట్టణం**

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కదిరి, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఆర్అండ్‌బీ అతిథి భవన ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. మందకృష్ణ నాయకత్వంలో ఎన్నో పోరాటాల ఫలితంగా జాతికి మేలు జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్, ఆనంద్, శ్రీనివాసులు, చిన్నప్ప, ఆంజనేయులు, నాగరాజు, శ్రీనివాసులు, నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బలోని పాముదుర్తిక్రాస్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కోటప్ప ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. నాయకులు ఓబులేశు, కుళ్లాయప్ప, ఓబులపతి, నారాయణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

కదిరి: కేకు కోసి సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ఉత్సాహంగా ఎద్దులబండ్ల పోటీలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువులో ఏకాదశి పండగ సందర్భంగా స్థానిక తెదేపా నాయకుల ఆధ్వర్యంలో ఎద్దుల బండ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. సోమవారం జరిగిన పోటీల్లో 18 ఎద్దులబండ్లు పాల్గొన్నాయి. మొదట నాగుల కనుమ దగ్గర, తరువాత చిత్రావతి వంతెనపై పోటీలు నిర్వహించారు. బుచ్చయ్యగారిపల్లి రామాంజి, కట్టుబడి శీన, నారాయణపురం సాయి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మారుతీశంకర్ బందోబస్తు చేపట్టారు.

ఆరుబయటే వంటావార్పు

బుక్కపట్నం మండలంలోని కృష్ణాపురం ఉన్నత పాఠశాలలో వంటగది నిర్మాణం చేయకపోవడంతో ఆరుబయట వంట చేయాల్సి వస్తోంది. సుమారు 250 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వంలో వంటగది మంజూరు చేసినా.. పునాదికే పరిమితమైంది. భవనం నిర్మించేందుకు విద్యుత్తు లైను అడ్డుగా ఉందని ఆపేశారు. దుమ్ముధూళి, గాలివానలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు నిర్వాహకులు వాపోయారు. దీనిపై ఎంఈవో గోపాల్‌నాయక్‌ను వివరణ కోరగా.. సమస్యను ఉన్నతాధికారులకు తెలిపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, బుక్కపట్నం**

రసాభాసగా గ్రామ కమిటీ విస్తృతస్థాయి సమావేశం

నల్లచెరువు, న్యూస్‌టుడే: నల్లచెరువులోని గీతా మందిరంలో మండల కన్వీనర్ రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో గ్రామ కమిటీ విస్తృతస్థాయి సమావేశం రసాభాసగా జరిగింది. మండలంలోని సమస్యలను ఎమ్మెల్యే తక్షణం పరిష్కరించాలని, వ్యక్తిగత కార్యదర్శి (పీఏ) చంద్రశేఖర్‌కు తెలపడంతో పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకుల సమస్యలు పరిష్కరిస్తేనే పార్టీ గ్రామస్థాయి నుంచి బలోపేతం అవుతుందని కన్వీనర్ దృష్టికి తీసుకెళ్లారు. మాజీ జడ్పీటీసీ అబ్దుల్‌ఖాదర్, మాజీ ఎంపీపీలు మాబుసాబ్, శివరెడ్డి, మాజీ కన్వీనర్ నాగభూషణం నాయుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు అంజినప్ప, సర్పంచులు నాగరాజు, ప్రసాద్, దేవేంద్రగౌడు, రమణారెడ్డి, సతీశ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో కన్వీనర్ రాజశేఖర్‌బాబు, నాయకులు

డెంగీపై అవగాహన కల్పించాలి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ డెంగీ నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య, ఆరోగ్యశాఖపై ఉందని ఆ శాఖ కదిరి పడమర యూనిట్ అధికారి దేవలనాయక్ సూచించారు. సోమవారం మూర్తిపల్లి అర్బన్ ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్ఏలతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త తమకు కేటాయించిన గ్రామాలను సందర్శించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం యాప్ ద్వారా వెక్టార్ కంట్రోల్ హైజీన్‌కు సంబంధించి చేపడుతున్న చర్యలను వివరించాలని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రంపై అవగాహన కల్పించాలని చెప్పారు.

మాట్లాడుతున్న యూనిట్ అధికారి దేవలనాయక్

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

కొత్తచెరువు: కొత్తచెరువు మండలం తలమర్ల గ్రామానికి చెందిన మిద్దె నాగరాజు ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ మారుతీశంకర్ తెలిపారు. నాగరాజు బెంగళూరులో కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఏకాదశి పండగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన నాగరాజు గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపే గోడపత్రాలు అతికిస్తుండగా, అదే గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి కులం పేరుతో దూషిస్తూ కుటుంబ సభ్యులపై దౌర్జన్యం చేశారని ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వివరించారు.

గృహహింస చట్టం కింద..

గోరంట్ల: గోరంట్లకు చెందిన నిర్మల అనే మహిళ ఫిర్యాదుపై సోమవారం గృహహింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ పేర్కొన్నారు. అయిదేళ్ల క్రితం నిర్మలకు నల్లమాడ మండలం మసకవంకపల్లికి చెందిన నాగేంద్రతో వివాహమైంది. భర్తతో పాటు అత్త, ఆడపడుచూ తరచూ వేధిస్తున్నట్లు ఆమె చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నానమ్మ సంరక్షణ పట్టించుకోని మనవడి నుంచి ఆస్తి బదిలీ

తీర్పు వెలువరించిన ధర్మవరం ఆర్డీవో మహేశ్

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం కొత్తపేటకు చెందిన గాజుల వెంకటలక్ష్మీ అనే వృద్ధురాలు మనవడు అనిల్‌కుమార్‌కు రాసి ఇచ్చిన ఆస్తిని తిరిగి ఆమెకు చెందే విధంగా ధర్మవరం ఆర్డీవో మహేశ్ తీర్పు వెలువరించారు. అందుకు సంబంధించిన ఉత్తర్వును సోమవారం ఆర్డీవో కార్యాలయంలో వృద్ధురాలికి అందజేశారు. వెంకటలక్ష్మీ భర్త తిప్పన్న మృతి చెందడంతో ఆస్తి ఆమెకు సంక్రమించింది. జీవించినంత కాలం బాగోగులు చూసుకుంటానని మనవడు అనిల్‌కుమార్ నానమ్మను నమ్మించి ఆస్తిని రాయించుకున్నాడు. కొన్నాళ్లకు ఆమె అనారోగ్యానికి గురై బాధపడుతున్నా పట్టించుకోలేదు. తనకు వచ్చే పింఛన్‌తో జీవనం సాగించింది. తన సంరక్షణను మనవడు పట్టించుకోలేదని గత ఫిబ్రవరిలో ధర్మవరం ఆర్డీవో కార్యాలయంలో వెంకటలక్ష్మీ ఫిర్యాదు చేసింది. ఆర్డీవో విచారణ చేపట్టి అనిల్‌కుమార్‌కు మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టం 2007 ప్రకారం విచారణ చేపట్టి మనవడి నుంచి ఆస్తి తిరిగి వెంకటలక్ష్మీకి చెందేవిధంగా తీర్పు వెలువరించి ఉత్తర్వును అందజేశామని ఆర్డీవో తెలిపారు.

వెంకటలక్ష్మమ్మకు తీర్పు ప్రతిని అందజేస్తున్న ఆర్డీవో మహేశ్

'దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి'

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: భాజపా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ బిల్లులు రద్దు చేయాలనే డిమాండుతో ఈనెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలంటూ కదిరిలో సోమవారం సీఐటీయూ, రైతు సంఘం నాయకులు ద్విచక్ర వాహన ప్రదర్శన చేపట్టారు. టవర్‌క్లాక్ నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ సాగింది. రైతుల పంటలకు గిట్టుబాటు ధర, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెకు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాంబశివ, జగన్‌మోహన్, ముస్తాక్, రామ్మోహన్, బాబ్జాన్, ఆంజనేయులు శివప్రసాద్, తిరుపాలు, బాలకృష్ణ, సుధాకర్‌రెడ్డి, శివన్న పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ఈనెల 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పెద్దన్న తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సమ్మె నోటీసును పోలీసులకు అందించారు. దేశవ్యాప్త సమ్మెలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్, ఆవాజ్ కమిటీ సభ్యుడు బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహన ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

పొదుపు సంఘం.. ఉపాధికి గమ్యం

● ఆర్థికంగా రాణిస్తున్న మహిళలు

పొదుపు సంఘాలు మహిళల ఉపాధికి గమ్యం చూపుతున్నాయి. తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. పలు రంగాల్లో ఆర్థిక స్వావలంబన సాధిస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్న మహిళలపై ప్రత్యేక కథనం. **- న్యూస్‌టుడే, కదిరి పట్టణం, కదిరి, ధర్మవరం పట్టణం**

వస్త్రదుకాణం ఏర్పాటు

టైలరింగ్ వృత్తిని కొనసాగిస్తూనే సంఘం ద్వారా తీసుకున్న రుణంతో వస్త్రదుకాణం ఏర్పాటు చేసుకున్నాను. పట్టు చీరలతో పాటు బాలికలు, మహిళలకు సంబంధించిన దుస్తులు విక్రయించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకున్నా. వాయిదాలు చెల్లిస్తూనే సొంతంగా కుటుంబ పోషణకు ఆసరాగా ఉంటున్నాను. **- మంజుల, కదిరి**

సంఘం దారి చూపింది

కిరాణా దుకాణం పెట్టుకునేందుకు సంఘం దారిచూపింది. పిల్లలు పెద్దవాళ్లు కావడంతో ఇంట్లో పని చూసుకుంటేనే దుకాణం నడుపుతున్నాను. కుటుంబ ఆదాయం పెరుగుతోంది. తీసుకున్న అప్పును వాయిదాలు చెల్లిస్తూ కుటుంబ పోషణలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉంది. **- నాగలక్ష్మి, కదిరి**

కుటుంబ ప్రగతికి..

15 ఏళ్ల కిందట కృపా మహిళా సంఘంలో చేరాను. రూ. 5 వేల రుణంతో కదిరిలో మహిళలకు కుట్టుశిక్షణతో పాటు లేడీస్ కార్నర్ నిర్వహిస్తున్నా. కుట్టుతో మహిళలకు డిజైనింగ్‌లో శిక్షణ ఇస్తున్నాను. పిల్లల చదువులు పూర్తి చేయించి, కుటుంబానికి తోడుగా నిలిచాను. పలువురికి చేతివృత్తి నైపుణ్యాలు నేర్పడం సంతోషంగా ఉంది. **- నాగలక్ష్మి, కదిరి**

ప్రతినెలా ఆదాయం

2007లో పొదుపు సంఘంలో చేరాను. రూ.5 వేల రుణంతో ఇంట్లోనే ఫ్యాన్సీ దుకాణం ప్రారంభించాను. రుణం సక్రమంగా చెల్లిస్తుండటంతో 5వ విడతలో రూ. లక్ష ఇవ్వడంతో వ్యాపారాన్ని బలోపేతం చేశాను. వ్యాపారం బాగా జరగడంతో కుటుంబ అవసరాలు, సంఘంలో చేసిన రుణం పూర్తిగా తీర్చాను. ప్రతినెలా సుమారు రూ. 30 వేలు ఆదాయం వస్తోంది. **- హబీబున్నిసా, ధర్మవరం**

(c) eenadu

మెరిసిన తెల్ల బంగారం..!

సిక్కోలు జీడిపప్పునకు జాతీయ పురస్కారం

న్యూస్‌టుడే, సోంపేట

రైతుల శ్రమ, అధికార యంత్రాంగం చొరవ ఫలితంగా సిక్కోలు జీడిపప్పునకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ) కార్యక్రమంలో భాగంగా పురస్కారం సొంతం చేసుకుంది. ఈ నెల 14న దిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఉద్యానాధికారి రత్నాల వరప్రసాద్ దీన్ని అందుకోనున్నారు. జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 లక్షల మందికి పైగా జీడి పంట ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. 60 వేల ఎకరాల్లో తోటలుండగా 85 శాతానికి పైగా ఉద్దానం ఏడు మండలాల పరిధిలో సాగు చేస్తున్నారు. కవిటి ఉద్దానంలో కొబ్బరి, పనస, మామిడి తోటల్లో అంతర పంటగా మందస ఉద్దానంలో పండిస్తున్నారు.

అంతర్జాతీయంగా ప్రాధాన్యం..

వజ్రపుకొత్తూరు, పలాస, మందస, సంతబొమ్మాళి, సోంపేట, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి మండలాల్లో ఈ పంట ఆధారంగా 1.05 లక్షల రైతు కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. పలాస, ఇతర ప్రాంతాల్లో 450 వరకు జీడి పరిశ్రమల ద్వారా కూలీలు, ఇతర వర్గాలు, వ్యాపారులు లక్ష మంది వరకు ఉపాధి పొందుతున్నారు. పలాస నుంచి పంపుతున్న జీడిపప్పు తిరుమలలో వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో వినియోగిస్తున్నారు. రోజూ 3 వేల కిలోల పప్పు సరఫరా చేస్తున్నారు. విదేశాలకు పెద్దఎత్తున ఎగుమతి అవుతుండటంతో అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. జీడిపప్పునకు లభించిన గుర్తింపు రాష్ట్ర ఉద్యాన రంగానికి మైలురాయిలా నిలుస్తోందని రైతులు, అధికారులు చెబుతున్నారు.

ప్రోత్సాహం అందిస్తే సత్ఫలితాలు..

సిక్కోలు జీడిపప్పు జాతీయ పురస్కారం సాధించడం వెనుక రైతులు, కార్మికులు, అధికారుల శ్రమ ఉంది. ప్రభుత్వం సాగు చేస్తున్న వారి సమస్యలు పరిష్కరించి మద్దతు ధర అందేలా చేసి ప్రోత్సాహం అందిస్తే దిగుబడులు పెరుగుతాయి. జీడి కార్పొరేషన్, పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తే అంతర్జాతీయంగా సత్తా చాటే అవకాశం ఉంది.
– టి.అజయ్‌కుమార్, జీడి రైతు సంఘం, జిల్లా కన్వీనర్

రాష్ట్రానికి గర్వకారణం..

సిక్కోలు జీడికి జాతీయ పురస్కారం రావడం రాష్ట్రానికి గర్వకారణం. కలెక్టర్ పట్టుదల, ప్రణాళికతో ఈ రంగం అభివృద్ధికి ఇచ్చిన ప్రోత్సాహంతోనే అవార్డు సాధించగలిగాం. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా పర్యవేక్షించడం.. ఆధునిక పద్ధతుల్లో సాగు చేసేలా ప్రోత్సహించడంలో ఉద్యాన శాఖ తీసుకున్న చర్యలు ఫలించాయి.
– రత్నాల వరప్రసాద్, జిల్లా ఉద్యానాధికారి, శ్రీకాకుళం

బియ్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు

సింగన్నపాలెం వద్ద గోదాంలో బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

బూర్జ, న్యూస్‌టుడే: బియ్యం బస్తాల తూకంలో తేడా ఉన్నా, అక్రమ రవాణా చేసినా సంబంధిత అధికారులు, నిర్వాహకులపై చర్యలు తప్పవని సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. బూర్జ మండలం సింగన్నపాలెం పరిధి నామాల లక్ష్మీపురం రహదారిలో గోదాంను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, ఇతర అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. తహసీల్దారు వైవీ పద్మావతి, పౌర సరఫరాల శాఖ బూర్జ, ఆమదాలవలస మండలాల అధికారులు ఉన్నారు.

ఆసుపత్రికి వెళ్లనీరు

కంచిలి మండల పరిధి ఎంఎస్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన గేటు వద్ద రహదారిపై గుంతలో వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. రోగులు లోపలికి వెళ్లడానికి ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు చొరవ తీసుకుని కొత్త రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ జేఈ ప్రవీణ్‌ను సంప్రదించగా ప్రభుత్వం రహదారి నిర్మాణానికి అనుమతించిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

గేట్లకు చిల్లులు.. నీటి నిల్వకు అవస్థలు

గొట్టా బ్యారేజీ వద్ద ఎడమ ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటర్ గేట్లకు రంధ్రాలు పడ్డాయి. దీంతో సరఫరా నిలిపేసినా 50 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది. దీనికి ప్రధాన కారణం ఏళ్లుగా గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయక పోవడమే. కూటమి ప్రభుత్వం ఇటీవల రూ.33 లక్షల నిర్వహణ నిధులు మంజూరు చేసినా.. విద్యుత్తు పరికరాలు, తాత్కాలిక ఉద్యోగుల వేతనాలు, గేట్ల రోప్‌లకు గ్రీజు తదితర పనులు చేపట్టేందుకు కేటాయించారు. సమస్యపై నరసన్నపేట వంశధార డివిజన్ కార్యాలయం ఈఈ ఎంఏ సీతారామనాయుడు మాట్లాడుతూ.. గేట్ల పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. – న్యూస్‌టుడే, హిరమండలం

గోడు వినండి.. సమస్యకో దారి చూపండి

కలెక్టరేట్(శ్రీకాకుళం), శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అధికారులు

జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'మీ కోసం'లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు వినతులు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 60 అర్జీలు వచ్చాయి. ● జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అర్జీలు స్వీకరించారు. 72 వినతులు అందాయని అధికారులు తెలిపారు.

● గార మండలం వాడాడ పంచాయతీ రెడ్డిపేట గ్రామానికి చెందిన గృహనిర్మాణ లబ్ధిదారులకు గత ప్రభుత్వంలో కాలనీలో ఇళ్లు మంజూరయ్యాయి. ప్రభుత్వానికి, స్థలానికి చెందిన వ్యక్తికి మధ్య ఉన్న వివాదం కారణంగా తమకు పనులు కల్పించడం లేదని ఫిర్యాదు చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

వార్డెన్ పట్టించుకోవడం లేదు.. మా వసతిగృహం వార్డెన్ మమ్మల్ని పట్టించుకోవడం లేదు. విశాఖపట్నంలో ఉంటూ 15 రోజులకు ఒకసారి వచ్చి వెళ్తున్నారు. వంట చేసేవారు, వాచ్‌మెన్ లేక ఇబ్బందులు పడుతున్నాం.
– గిరిజన సంక్షేమ వసతి గృహ విద్యార్థినులు (పలాస)

● ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ పంచాయతీ మర్రి కొత్తవలసకు చెందిన పలువురు రైతులు 14 రావడంలేదని ఫిర్యాదు చేశారు. అన్నదాతా సుఖీభవలో తమ పేర్లు లేవన్నారు.

కుమారుడికి భారమయ్యాను.. కొడుకు సరిగా చూడటం లేదు. తాను ఉంటున్న ప్రాంతంలో కష్టార్జితంతో కొనుగోలు చేసిన ఇంటిని తన పేరున రాయాలని మనవడు బెదిరిస్తున్నాడు. న్యాయం చేయండి
– ఓ వృద్ధురాలు, పాతపట్నం మండలం

● పెద్దగనగళ్లవానిపేట పంచాయతీ పరిధిలోని నరసయ్యపేట గ్రామం నాగావళి నది కోతకు గురవుతోంది. ప్రహరీ నిర్మించాలని మత్స్యకార సంఘ నాయకులు మైలపల్లి నర్సింగరావు తెలిపారు.

కొలువు కావాలంటారు.. వస్తే కదలరు..!

ఉపాధి మేళాలో ఎంపికైన అభ్యర్థుల్లో అనాసక్తి

న్యూస్‌టుడే, పాతబస్టాండ్

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు ప్రణాళిక రూపొందించింది. తెదేపా హయాంలో ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి సంస్థ కేంద్రాల ఆధ్వర్యంలో ఉద్యోగావకాశాలు కల్పించాలని నిర్ణయించింది. 7 నెలలుగా జిల్లాలో నియోజకవర్గాల వారీగా అధికారులు 8 మెగా జాబ్ మేళాలు నిర్వహించారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా అవకాశాలు కల్పిస్తున్నారు. ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరడానికి అంతగా ఆసక్తి చూపడం లేదు. మరో జిల్లాలో తక్కువ జీతంతో ఎలా జీవనం సాగిస్తామని యోచనతో ఇంటికే పరిమితమవుతున్నారు.

ఇదీ పరిస్థితి

జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 8 జాబ్ మేళాలకు 8 నెలలుగా సంబంధించిన 139 సంస్థలు పాల్గొన్నాయి. 8,019 మంది అభ్యర్థులు హాజరు కాగా 2,389 మందిని ఎంపిక చేశారు. వారిలో సుమారు 50 శాతం మంది మాత్రమే ఆయా ఉద్యోగాల్లో చేరుతున్నారని అధికారులు చెబుతున్నారు.

ఇలా చేస్తే మేలు..

జాబ్ మేళాలో ఎంపిక సమయంలోనే ఉద్యోగానికి సంబంధించిన పూర్తి వివరాలు అభ్యర్థులకు తెలియజేస్తే మేలని సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. పని చేసే ప్రదేశం, ఇతర అంశాలు చర్చించిన అనంతరం ముందుకొచ్చిన వారికే ఆఫర్ లెటర్ ఇవ్వాలని యోచిస్తున్నారు. రానున్న మేళాల్లో తగిన మార్పులు చేస్తే సత్ఫలితాలుంటాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

అభ్యర్థుల వివరాలు ఆరా తీస్తున్న కంపెనీ ప్రతినిధులు

నియోజకవర్గం	మేళాల్లో పాల్గొన్న సంస్థలు	హాజరైన అభ్యర్థులు	ఎంపికైన వారు
ఇచ్ఛాపురం	17	832	281
పలాస	15	767	263
పాతపట్నం	14	523	201
టెక్కలి	29	1,213	365
శ్రీకాకుళం	21	3,264	763
నరసన్నపేట	12	327	112
ఆమదాలవలస	10	317	102
ఎచ్చెర్ల	21	781	302

● పరిశ్రమల్లో మారుతున్న అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు లేకపోవడంతో కొందరు వెనకడుగు వేస్తున్నారు. 'మీరెప్పుడు ఉద్యోగంలో చేరతారని' ఆఫర్ లెటర్లు తీసుకున్న అభ్యర్థులను కంపెనీల ప్రతినిధులు సంప్రదిస్తే 'ఆ జీతానికి అక్కడ పని చేయలేం' అని చెబుతున్నారు. 'మీ సంస్థలో చేరడానికి అంతగా ఆసక్తి లేదు' అని మరికొందరు బదులిస్తున్నారు. జాబ్ మేళాలు విజయవంతంగా నిర్వహిస్తున్నా లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు.

పేరున్న పరిశ్రమల్లో చేరాలని..

ప్రస్తుత నిరుద్యోగ యువత పేరున్న పరిశ్రమలు, సంస్థల్లో ఉద్యోగావకాశాల కోసం నిరీక్షిస్తోంది. ఉత్తరాంధ్ర పరిధిలో గుర్తింపు కలిగిన పరిశ్రమల్లో పని చేస్తే జీతం, భద్రత ఉంటుందని ఎంపికైన వారిలో ఎక్కువ మంది అభిప్రాయం. అర్హత, అనుభవం ఉన్న వారిలో చాలా మంది తగిన ఉద్యోగాలు లేవని తెలిసినా మంచి సమయంలో ముఖ్యమైన ఆఫర్ లెటర్ అందుకుంటున్నారు. వారికి పరిశ్రమల నుంచి పోస్టు వస్తున్నా స్పందించడం లేదని సమాచారం. మంచి సంస్థల్లో ఉద్యోగం రావాలంటే తగిన విద్యార్హత, ఏదైనా పరిశ్రమలో పని చేసిన అనుభవం ఉంటే మెరుగైన అవకాశాలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

జాబ్ మేళాలు జరుగుతున్నప్పుడు కొందరు ఏ ఉద్యోగం వస్తుందో తెలుసుకోవడానికి వస్తుంటారు. ఆఫర్ లెటర్ అందుకున్న వారిలో 20 నుంచి 30 శాతం మంది ఉద్యోగాల్లో చేరడం లేదు. చాలా మంది కంప్యూటర్, సాంకేతిక రంగాల్లో ఆసక్తి చూపుతున్నారు. అలాంటి వారికి తగిన ఉద్యోగాలు కల్పించడానికి స్థానికంగా వనరులు అందుబాటులో లేవు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని రానున్న జాబ్ మేళాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకుంటాం.
– యు.సాయికుమార్, జిల్లా అధికారి, నైపుణ్యాభివృద్ధి సంస్థ

సాగునీటి ప్రాజెక్టులకు మరమ్మతులు చేయక ఇబ్బందులు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు కొన్ని దశాబ్దాలుగా నిర్మాణంలో ఉన్నాయని, పోలవరం నిర్మాణ పరిస్థితి లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో అరకులో కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టడంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన విచారణకు సోమవారం శ్రీకాకుళం నగరంలోని జిల్లా న్యాయస్థానంలో హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సాగునీటి ప్రాజెక్టులకు మరమ్మతులు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సమీపించినా కాలువల్లో పూడికతీత పనులు కూడా చేపట్టకపోవడం బాధాకరం. ఒలింపిక్స్‌లో యోగా చేర్పిస్తే మోదీకి స్వర్ణం, చంద్రబాబుకు రజతం, పవన్ కాంస్య పతకాలు వస్తాయి' అని విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే ఊరుకోం

రణస్థలంలోని ఎరువుల దుకాణంలో దస్త్రాలు పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో విజయభాస్కర్

రణస్థలం, న్యూస్‌టుడే: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. 'ఈనాడు'లో ఈ నెల 7న 'యూరియా కొరత అన్నదాతల కలత' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. రణస్థలం, కోష్ట, రావాడలోని ఎరువుల దుకాణాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజూ విత్తనాలు, ఎరువుల నిల్వ, విక్రయాల వివరాలు వ్యవసాయాధికారి కార్యాలయానికి అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు పాటించకపోతే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయాధికారి విజయభాస్కర్ ఉన్నారు.

11న 10 రైళ్ల రద్దు!

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి రైలు నిలయంలో విద్యుదీకరణ పనుల కారణంగా 11న 10 రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారని డీఆర్‌యూసీసీ సభ్యుడు కె.సూర్యప్రకాశరావు తెలిపారు. రద్దయిన రైళ్లలో గుణుపురం-విశాఖపట్నం-గుణుపురం (58505, 58506), బ్రహ్మపుర - విశాఖపట్నం - బ్రహ్మపుర (58531, 58532), భువనేశ్వర్ - విశాఖపట్నం - భువనేశ్వర్ (22819, 22820), విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం మెము (67289, 67290), విశాఖపట్నం-బ్రహ్మపుర-విశాఖపట్నం (18526, 18525) ఉన్నాయని వివరించారు.

న్యాయం జరిగే వరకు పోరాటమే

డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన గ్రామ, వార్డు సచివాలయ గ్రేడ్-3 ఏఎన్‌ఎంల బదిలీల్లో అధికారులు నిబంధనలు అతిక్రమించడంతో నష్టపోయామని, రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని పలువురు ఏఎన్‌ఎంలు సోమవారం శ్రీకాకుళం నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యాలయంలో బైఠాయించి ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్ విధానం పాటించలేదని.. జూమ్ యాప్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారని, ఖాళీలు చూపకుండా బ్లాక్ చేసి కొందరికి లబ్ధి చేకూర్చారని ఆక్షేపించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

దేశవ్యాప్త సమ్మెకు వామపక్షాల మద్దతు

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించనున్న సమ్మెకు వామపక్షాలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.ప్రకాశ్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి టి.సన్యాసిరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతి భవన్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని. . విశాఖ ఉక్కు కర్మాగారం సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండు చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, సమగ్ర శిక్షా ఇతర విభాగాల్లో పని చేస్తున్న చిరుద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, విద్యుత్తు సవరణ చట్టం రద్దు చేయాలని కోరారు.

కరకట్టరు.. భయం పోగొట్టరు..!

నాగావళి నదీ పరివాహక గ్రామాల్లో అవస్థలు

న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం, బూర్జ

ఆమదాలవలస, బూర్జ, శ్రీకాకుళం గ్రామీణ మండలాల్లో నాగావళి నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు వర్షాకాలంలో బితుకుబితుకుమంటూ గడుపుతున్నారు. వరదలకు నది గట్టు కోతకు గురై గ్రామాల్లోకి నీరు వచ్చేయడంతో జలదిగ్బంధంలో గడుపుతున్నారు. కరకట్ట నిర్మిస్తామని ప్రభుత్వాలు హామీలు ఇచ్చినా.. అవి మాటలుగానే మిగిలిపోయాయి.

ఆమదాలవలస మండలం కొత్తవలసలో నది ఒడ్డున కూలేందుకు సిద్ధంగా ఉన్న భారీ వృక్షాలు

గత 20 ఏళ్లుగా నాగావళి నది ఒడ్డున కరకట్ట నిర్మించాలని అక్కడి ప్రజలు కోరుతూనే ఉన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.300 కోట్లతో కట్ట నిర్మాణానికి 2001లో శిలాఫలకం ఏర్పాటు చేశారు. కొలతలు తీశారే తప్ప పనుల్లో అడుగు కూడా ముందుకు పడలేదు. అప్పటి నుంచి మాటలే తప్ప ఒక్క ఇటుకా వేసిన పాపాన పోలేదు. దీంతో వరదలు వేళ పరివాహక ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకు ఉండటం లేదు. ఏ క్షణంలో వరద ఉద్ధృతి పెరిగి గ్రామాలను ముంచేస్తుందోనని వణికిపోతున్నారు.

అన్నదాతకు నష్టం.. జనాలకు కష్టం

ఆమదాలవలస మండలంలో జికె.వతస, ఎన్టీవాడ, కొరపాం, కొత్తవలస, పాతూరు, ఇస్కలపేట, కలివరం, తొలగరాం, దూసి, ముద్దాడపేట, దిబ్బలపేట, తోటాడ, బూర్జ మండలంలో అల్లెన నారాయణపురం, లాభాం, గుత్తావల్లితోపాటు శ్రీకాకుళం గ్రామీణం మండలాల్లో 50 వేల ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. వరదల వల్ల ఏటా అన్నదాతలకు నష్టం వాటిల్లుతోంది. అధికారులు తక్షణమే స్పందించి నాగావళి నది ఒడ్డు కోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆ దిశగా దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా .. కరకట్ట నిర్మాణం విషయమై ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. నదీ పరివాహక ప్రాంతంలో ముందుగా కొలతలు వేయాలి. అధికారులతో చర్చించి నిధులు ఎంత అవసరమో, ఏ విధంగా చర్యలు తీసుకోవాలో నివేదిక తీసుకున్న అనంతరం చర్యలు తీసుకుంటాం.
– ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

సాగులో డిజిటల్ లెక్క..

★ ఖరీఫ్‌లో ఈక్రాప్ సర్వేకు సమాయత్తం

● రణస్థలం మండలం కొండములగాంకు చెందిన దన్నాన కామునాయుడు విశాఖపట్నంలో ఉంటూ ఇక్కడ పంట సాగు చేసేవారు. ఈ-పంట నమోదు సమయంలో ఈకేవైసీకి అందుబాటులో లేక ఆయన వివరాల నమోదుకు అవకాశం ఉండేది కాదు.

● లావేరు మండలం శిగిరికొత్తపల్లికి చెందిన ఓ రైతు ఏటా మొక్కజొన్న సాగు చేస్తారు. పంట రుణం పొందే సమయంలో బ్యాంకులో వరి పంట సాగు చేస్తున్నట్లు కాగితాల్లో చూపేవారు. నూతన విధానంలో ఏ పంట సాగు చేస్తే ఆ వివరాలే నమోదు చేయాలి.

● రణస్థలం మండలం కోష్ట, పతివాడపాలెం, పైడిభీమవరం, చిల్లపేటరాజాం, తీర ప్రాంత గ్రామాల్లో ఎక్కువగా ఇతర ప్రాంతాలకు చెందిన వారికి, పలుకుబడి కలిగిన వ్యక్తులకు సాగు భూములున్నాయి. ఈ-పంట నమోదు సమయంలో వారు అందుబాటులో ఉండరు. వారి భూములను స్థానిక రైతులకు కౌలుకు ఇస్తుంటారు. ప్రస్తుతం కౌలుకు సాగు చేసేవారి పేర్లు నమోదు చేయనున్నారు. యజమానులే సాగు చేస్తే వారి పేరిట ఈ-పంట నమోదు చేస్తారు. గతంలో మాదిరిగా ఈకేవైసీ అవసరం లేదు.

చిల్లపేటరాజాంలో ఈక్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

న్యూస్‌టుడే, రణస్థలం

ఈ ఏడాది నుంచి ఖరీఫ్ సాగుకు నూతన విధానంలో డిజిటల్ సర్వే చేయనున్నారు. గతంలో ఈ-పంట నమోదులో ఈక్రాప్ సహా రైతుల ఈకేవైసీ తీసుకునేవారు. దీనికి అందుబాటులో లేని వారి వివరాలు నమోదయ్యేవి కాదు. ఈసారి కర్షకులు లేకున్నా ఈ-పంట నమోదు చేస్తారు. గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుతూ డిజిటల్ ఈక్రాప్ సర్వే చేయనున్నారు. ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా చేపట్టడానికి వ్యవసాయ శాఖ సమాయత్తమవుతోంది. ఇందుకు రూపొందించిన యాప్‌లో సిబ్బంది వివరాలు నమోదు చేస్తారు.

ఇలా చేస్తారు..

★ గతంలో 50 మీటర్ల పరిధిలో ఫొటోలు తీస్తే సరిపోయేది. ప్రస్తుతం ప్రతి 20 మీటర్ల పరిధిలో ఫొటోలు తీసి పంట నమోదు చేస్తేనే యాప్ అంగీకరిస్తుంది. సాగుకు యోగ్యం కాని వ్యవసాయేతర భూములను తొలగించి అనువైన భూముల వివరాలు నమోదు చేయనున్నారు.

★ కౌలు రైతులు సాగు చేస్తున్న పొలాలు, డి.పట్టా భూములు, సరుగుడు, నీలగిరి తదితర పంటలన్నీ ఈదఫా నమోదు చేయాలి. ప్రతీ సర్వే నంబరు, సబ్‌డివిజన్ ఫొటో తీయాలి.

★ ఉద్యాన పంటలకు గతంలో ఈ-పంట నమోదు చేసేవారు కాదు. ఈ ఏడాది నుంచి వాటికి కూడా తప్పనిసరి. భూములు ఖాళీగా ఉన్నా నమోదు చేసి పంట సాగు చేయలేదని పేర్కొనాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలిస్తారు. అభ్యంతరాలున్న భూములకు సంబంధించి సంయుక్త కలెక్టర్ అనుమతి తీసుకోవాలి.

బీమా పొందడానికి కీలకం

జిల్లాలో 1,82,125 హెక్టార్లలో ఖరీఫ్ సాగు చేయనున్నారు. 1.70 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేసినట్లు పంట నమోదు చేశారు. ఈ ఏడాది ఇంకా పెరిగే అవకాశముందని అధికారుల అంచనా. భూ యజమాని సహా కౌలు రైతు వివరాలు నమోదు చేయాలి. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయినప్పుడు ప్రభుత్వం నుంచి బీమా పొందాలంటే ఈ-పంట నమోదు కీలకం. భూ యజమానికి బీమా వర్తిస్తుంది. అదే సమయంలో పొలం లీజుకిస్తే ఆ పరిహారం కౌలు రైతుకు అందుతుంది. 'బదిలీల ప్రక్రియ పూర్తయిన వెంటనే నూతన విధానంలో సర్వే ప్రారంభిస్తాం' అని వ్యవసాయ శాఖ జేడీ త్రినాథస్వామి తెలిపారు.

విమానాశ్రయం ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన

హరిపురం (మందస), న్యూస్‌టుడే: పచ్చని ఉద్దానం తోటలను ధ్వంసం చేసి కార్గో విమానాశ్రయం ఏర్పాటు చేయొద్దని, తరతరాల నుంచి అనుభవిస్తున్న భూములను తీసుకోవద్దని రైతులు కోరారు. మందస మండలం రాంపురం సచివాలయం ఎదుట సోమవారం రాంపురం ఎం.గంగువాడ, టి.గంగువాడకు చెందిన రైతులు నిరసన తెలిపారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష పునరాలోచించి న్యాయం జరిగేలా చూడాలని నినాదాలు చేశారు. విమానాశ్రయం ఏర్పాటు వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త కె.వాసు ఆధ్వర్యంలో పలువురు పాల్గొన్నారు.★ పోలీసుల అనుమతి లేకుండా ఆందోళనలు, నిరసనలు చేపట్టకూడదని తహసీల్దారు ఎం.శ్రీకాంత్, ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటు విషయమై ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే ప్రక్రియ మొదలవుతుందని స్పష్టం చేశారు.

రాంపురం గ్రామ సచివాలయం వద్ద రైతుల ఆందోళన

వచ్చారు.. చూశారు.. వెళ్లారు

ఆక్రమణలు తొలగింపులో అధికారుల తాత్సారం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: నౌపడలో పలు చోట్ల ఆక్రమణలపై ఈనాడులో 'ఆక్రమించెయ్.. అడిగేదెవరు..?' శీర్షికతో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తహసీల్దార్ హేమసుందర్ గ్రామంలో పర్యటించారు. వీఆర్వో మంగలు, సర్వేయర్ శివాజీతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బజారువీధిలో గ్రామకంఠం ఆక్రమణలపై నివేదిక అందజేయాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఉమాపతిని ఆదేశించారు. మరో వైపు ఆక్రమణల తొలగింపునకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నౌపడ గ్రామ సచివాలయం-2 పరిధిలో జబ్బలదగ్గరలో 30 సెంట్లకు పైగా ప్రభుత్వ స్థలం, పంతధార కాలువ ప్రాంతాన్ని లే అవుట్‌గా మార్చి క్రయ విక్రయాలు జరుపుతున్నా ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి అధికారులు చొరవ చూపట్లేదని పలువురు పెదవి విరుస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ కొన్ని చెరువుల్లో చెట్టు, గట్లు ఉండటంతో హద్దులు గుర్తించడానికి వీలు కావడం లేదని, రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నౌపడలో ఆక్రమణలు పరిశీలిస్తున్న తహసీల్దారు హేమసుందర్, అధికారులు

ఆయుష్ పోస్తే.. ఆరోగ్యమే..!

ఆయుర్వేద వైద్యానికి పెరుగుతున్న ఆదరణ

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు సేవలందించేందుకు 'ఆయుష్' పేరిట ప్రభుత్వం ప్రాచీన వైద్యం అందించే ఆసుపత్రులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయుర్వేదం, హోమియో, సిద్ధ, యునాని వైద్య చికిత్సలపై నేడు ప్రజల్లో ఆదరణ పెరుగుతుండగా కొన్ని చోట్ల సిబ్బంది కొరతతో ఆయుష్ సేవలు తగ్గుతూ వచ్చాయి. చాలా చోట్ల ఆయుష్ కేంద్రాలకు సరైన సౌకర్యం లేక ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాలకు పూర్తిస్థాయిలో భవనాలు అందుబాటులోకి తీసుకొస్తే గ్రామీణ ప్రాంత వాసులకు మరింత సేవలు అందే వీలు కలుగుతుంది. గత ప్రభుత్వ హయాంలో కొందరు వైద్యులు పల్లెల్లో సేవలు అందించేందుకు ఆసక్తి చూపించకుండా పట్టణ ప్రాంతాలకు డిప్యూటేషన్లపై వెళ్లేవారు. దీంతో వైద్యులు, సిబ్బంది కొరతతో ఆయుష్ వైద్యశాలలు మూతపడే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ఆయుష్ వైద్య కేంద్రాలు	28
ఆయుర్వేదం	14
హోమియోపతి	12
యునాని	02

మాకివలసలో సేవలందిస్తున్న వైద్యురాలు

ఇదీ సంగతి

జిల్లాలో 14 చోట్ల సొంత భవనాలు ఉండగా ఉచిత భవనాలు 6, పీహెచ్‌సీల్లో 3, సీహెచ్‌సీల్లో 5 కొనసాగుతున్నాయి.

★ హోమియోపతికి సంబంధించి శ్రీకాకుళం, పొన్నాడ, కింతలి, సంతఉరిటి, తొగరాం, తోటాడ, శ్రీముఖలింగం, చీడిపూడి, జగతి, పాతపట్నం, బ్రహ్మణతర్ల, తెంబూరులో ఏర్పాటు చేశారు.

★ ఆయుర్వేదానికి సంబంధించి శ్రీకాకుళం, సింగుపురం, రణస్థలం, కొమరవానిపేట, మాకివలస, జలుమూరు, పూండి, కోటబొమ్మాళి, బూర్జ, కస్పానౌపాడ, వజ్రపుకొత్తూరు, హిరమండలం, నివగాం, షళంత్రిలో ఉన్నాయి.

★ యునానీకి సంబంధించి శ్రీకాకుళం, సోంపేటల్లో కేంద్రాలు ఉన్నాయి.

★ హోమియోకి సంబంధించి పాతపట్నం, తోటాడ, బ్రహ్మణతర్ల, యునానీ కేంద్రాలు ఉన్న రెండు చోట్ల వైద్యాధికారులు లేరు. దీంతో రోగులకు సేవలందడం లేదు. 'జిల్లాలో అన్ని ఆయుష్ కేంద్రాల్లోనూ మందులు, తగినంత మంది వైద్యులు, సిబ్బంది ఉన్నారు. ఒకటి, రెండు ఆసుపత్రుల్లో వైద్యులు లేకున్నా పక్క కేంద్రాల సిబ్బంది వచ్చి సేవలు అందిస్తున్నారు' అని ఆయుష్ జిల్లా వైద్యాధికారి, జగదీష్ అన్నారు.

గ్రామాల్లో ఉపాధిపై దృష్టి

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలోని ఆదాయ, గ్రామాల్లో ఉపాధిపై దృష్టి సారించాలని, శాఖల సమన్వయంతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలోనూ కనీసం ఒక మోడల్ గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. ఉపాధి ఆదాయ వృద్ధికి శాఖల సమన్వయం ద్వారా ముందడుగు వేయడమే అంతిమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ పృథ్వీ రాజ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డ్వామా పీడీ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల భద్రతపై చర్యలు తప్పనిసరి: జిల్లాలో పారిశ్రామిక భద్రతపై కఠినచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పరిశ్రమ భద్రతపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల్లోగా అన్ని ఫ్యాక్టరీలు సేఫ్టీ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. ప్రమాదకర పరిశ్రమలు తప్పనిసరిగా అత్యవసర ప్రణాళిక సిద్ధం చేయాలని, కమాండ్ కంట్రోల్ రూమ్ ఉండాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, అగ్నిమాపక అధికారి మోహనరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫారం - 1

శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ (సుడా)

ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ ప్రాంతం మరియు పట్టణ అభివృద్ధి సంస్థల చట్టం, 2016 లోని సెక్షన్ 12 లోని సబ్- సెక్షన్ (1) మరియు ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ ప్రాంతం మరియు పట్టణ అభివృద్ధి సంస్థల నియమాలు, 2018 లోని రూల్ 16 లోని సబ్-రూల్ (3) కింద జారీ చేయబడిన నోటీసు.

ఆర్ సి. నెం. 377/2024/SUDA-TECH/MP/IPM, తేదీ. 05.07.2025

1. ఇచ్ఛాపురం ప్లానింగ్ ఏరియా (పురపాలక సంఘం మరియు 4 పరిసర రెవెన్యూ (గ్రామాలు) ముసాయిదా మాస్టర్ ప్లాన్లు ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ మరియు పట్టణాభివృద్ధి సంస్థల నియమాలు, 2018 లో రూల్ 16 యొక్క సబ్-రూల్ (3) ప్రకారం రూపొందించబడింది. ఇందుమూలంగా ప్రచురించబడింది, దీని ప్రతిని దిగువ షెడ్యూల్లో వివరించిన ప్రాంతం కోసం జ్ఞప్తి చేయబడింది.
2. శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయం, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం మరియు ఇచ్ఛాపురం పురపాలక సంఘం కార్యాలయములు మరియు కార్యాలయ పనివేళల్లో వివిధ భూ వినియోగాలను చూపించే మ్యాపును ఛార్జీ లేకుండా తనిఖీ చేయవచ్చు.
3. ముసాయిదా మాస్టర్ ప్లాన్ పట్ల ఆసక్తి ఉన్న ఎవరైనా శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ వైస్ ఛైర్మన్ కు మరియు ఇచ్ఛాపురం పురపాలక సంఘ మునిసిపల్ కమిషనరుకు వ్రాతపూర్వకంగా దానికి సంబంధించిన అభ్యంతరాలు మరియు సూచనలను తెలియజేయవచ్చు.

ఫర్హాన్ అహ్మద్‌ఖాన్, IAS
జాయింట్ కలెక్టర్ మరియు వైస్ ఛైర్మన్ సుడా, శ్రీకాకుళం

గమనిక: సదరు ముసాయిదా బృహత్ప్రణాళిక చిత్రపటము (ముసాయిదా మాస్టర్ ప్లాన్) మరియు జోనింగ్ నిబంధనలను SUDA వారి వెబ్ సైట్ (www.suda.ap.gov.in) నందు మరియు శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ, ఇచ్ఛాపురం పురపాలక సంఘం కార్యాలయముల నందు ప్రజల సందర్శనార్థం కొరకు ఉంచడమైనది. సదరు భూ వినియోగ ముసాయిదా ప్రతిపాదనల కార్యాలయ పని వేళలయందు 30 రోజుల అనగా తేదీ 05.07.2025 నుండి 04.08.2025 వరకు సందర్శించవచ్చును. దీనిపట్ల అభ్యంతరములు/సూచనలను తగు మద్దతుపత్రాలతో వ్రాతపూర్వకముగా ఈ-మెయిల్ (sudamasterplan@gmail.com) ద్వారా గాని, తపాలా ద్వారాగాని, స్వయముగా గాని వైస్ ఛైర్మన్, SUDA, శ్రీకాకుళం మరియు ఇచ్ఛాపురం పురపాలక సంఘ మునిసిపల్ కమిషనరు వారికి తేదీ 04.08.2025 లోగా అందజేయవలెను.

షెడ్యూల్

శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకి వచ్చే ఇచ్ఛాపురం ప్లానింగ్ ఏరియాలో స్థానిక సంస్థ / రెవెన్యూ గ్రామాల జాబితా

క్రమ సంఖ్య	స్థానిక సంస్థ / రెవెన్యూ గ్రామం పేరు	వర్గీకరణ	జిల్లా
1	ఇచ్ఛాపురం పురపాలక సంఘం	స్థానిక సంస్థ	శ్రీకాకుళం
2	కేదారిపురం	రెవెన్యూ గ్రామం	శ్రీకాకుళం
3	మునిభద్ర	రెవెన్యూ గ్రామం	శ్రీకాకుళం
4	మండపల్లి	రెవెన్యూ గ్రామం	శ్రీకాకుళం
5	తేలుకుంచి	రెవెన్యూ గ్రామం	శ్రీకాకుళం

ఇచ్ఛాపురం ప్లానింగ్ ఏరియా అధికార పరిధిలో ఉన్న ప్రతిపాదిత ముసాయిదా మాస్టర్ ప్లాన్ యొక్క సరిహద్దుల షెడ్యూల్

క్రమ సంఖ్య	దిశ	హద్దులు
1	ఈశాన్యం	పురుషోత్తపురం రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 66 నుండి NH-16 తూర్పు వైపు పురుషోత్తపురం రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 80 మధ్య ఉంది.
2	తూర్పు	పురుషోత్తపురం రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 80 నుండి బెల్లుపడ రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 525 మధ్య అమీన్ సాహెబ్ పేట, బెల్లుపడ రెవెన్యూ గ్రామాల సరిహద్దు మీదుగా వెళుతుంది.
3	ఆగ్నేయం	బెల్లుపడ రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 520 నుండి బెల్లుపడ రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 310 మధ్య ఉంది.
4	దక్షిణ	ఇది బెల్లుపడ రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 307 నుండి రత్తకన్న రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 169 మధ్య బాహుదా నదికి ఉత్తరం వైపున ఉంది.
5	నైరుతి	రత్తకన్న రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 168 నుండి రత్తకన్న రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 160 మధ్య ఉంది.
6	పడమర	రత్తకన్న గ్రామంలోని R.S. నెం. 159 నుండి రత్తకన్న గ్రామంలోని R.S. నెం. 67 మరియు తేలుకుంచిలోని R.S. నెం. 124 నుండి R.S. నెం. 68 మధ్య, కేదారిపురం రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 3 నుండి 93 వరకు, మునిభద్రలో ఉన్న R.S. నెం. 1 నుండి 46 వరకు, తేలుకుంచి రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 1, 2 మరియు 68 నుండి 102 వరకు ఉంది.
7	వాయువ్యం	కేదారిపురం రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 2, 3. తేలుకుంచి రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 3 & 68 సరిహద్దు వరకు.
8	ఉత్తర	కేదారిపురంలోని R.S. నెం. 1 నుండి NH-16 పశ్చిమ వైపున పురుషోత్తపురంలోని R.S. నెం. 44 మధ్య, అమీన్‌సాహెబ్ పేట గ్రామంలోని R.S. నెం. 52 నుండి R.S. నెం. 64, బల్లుపడలోని R.S. నెం. 50 మరియు R.S. నెం. 597 మధ్య, తేలికుంచి రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 3 నుండి 9 వరకు, మండపల్లి రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 4, 3 మరియు 50 నుండి 73 వరకు, మునిభద్ర రెవెన్యూ గ్రామంలోని R.S. నెం. 1, 2 మరియు 69 నుండి 103 వరకు ఉంది.

ఫర్హాన్ అహ్మద్‌ఖాన్, IAS
జాయింట్ కలెక్టర్ మరియు వైస్ ఛైర్మన్ సుడా, శ్రీకాకుళం

స్పందించే హృదయాలు..

కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బాలుడికి దాతల సాయం

ఈనాడు కథనానికి స్పందన

పాతపట్నం, న్యూస్‌టుడే: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పాతపట్నానికి చెందిన చిన్నారి పోతల విజయ్ చికిత్సకు దాతలు స్పందిస్తున్నారు. ఈనెల 6న 'ఈనాడు' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర వ్యాప్తంగా మానవతావాదులు బాలుడికి అండగా నిలుస్తున్నారు. మేమున్నామంటూ తోచిన సాయం చేసేందుకు ముందుకొస్తున్నారు. ఆదివారం రూ.1.50 లక్షలు రాగా, సోమవారం వివిధ ప్రాంతాల నుంచి రూ.లక్ష వరకు ఆర్థిక సాయం అందించారు. ఒంగోలు నుంచి ఓ వ్యక్తి రూ.50 వేలు పంపించారు. మిగిలిన దాతలు సాయం చేశారు. తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు ఆదేశాల మేరకు వీఆర్వో బి.అన్నాజీరావు బాధితుడి ఇంటికి వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకున్నారు.

వరుసలో ఉంచారు.. సమస్యలు విన్నారు!

శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న 'మీకోసం' కార్యక్రమంలో పలు విభాగాలు బాధ్యతలు విస్మరిస్తుండటంతో అర్జీదారులు సహా అధికారులకు ఇబ్బంది కలుగుతోంది. సోమవారం కలెక్టర్, జేసీలకు వినతులు ఇవ్వడానికి గుంపులుగా లోపలికి రావడంతో గందరగోళం నెలకొంది. వారిని వరుసలో ఉంచేందుకు అక్కడున్న సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకోలేదు. స్వయంగా కలెక్టరే అందర్నీ వరుసలో వచ్చేలా పర్యవేక్షించారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

10న ప్రభుత్వ ఐటీఐలో ఉద్యోగమేళా

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం బలగలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో ఈ నెల 10న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు సహాయ సంచాలకుడు వై.రామ్మోహనరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐలో ఎలక్ట్రికల్, ఫిట్టర్, డిప్లొమా, మెకానికల్, బి.ఎస్సీ(కెమిస్ట్రీ), బి.ఏ. బి.కాం., ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) విద్యార్హతలు గల అభ్యర్థులు హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రముఖ ఔషధ పరిశ్రమలో వివిధ విభాగాలకు ఉద్యోగావకాశాలను మేళా ద్వారా కల్పించనున్నామని తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలు, రెజ్యూమె, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని స్పష్టం చేశారు. మరింత సమాచారం కోసం 98859 60809, 92989 52764, 95051 61701 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

సమ్మెకు మద్దతు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: అఖిల భారత సమ్మెకు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ మద్దతు తెలుపుతున్నట్లు అధ్యక్ష, కార్యదర్శిలు దొంతం పార్వతీశం, ఎం.ఆదినారాయణమూర్తిలు తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో విశ్రాంత ఉద్యోగభవనంలో సోమవారం సమావేశం నిర్వహించారు. పింఛనుదారులకు నవీకరణ ప్రక్రియలో పలు సమస్యలు ఎదురయ్యే విధంగా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని వాటిని ఉపసంహరించుకోవాలన్నారు. కరవుభత్యం చెల్లించాలని, ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ కింద పెన్షనర్లకు కనీసం తొమ్మిది వేలు చెల్లించాలన్నారు. పూర్తి స్థాయి వైద్య సదుపాయం కల్పించాలని, రైల్వే రాయితీ పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో కోశాధికారి పి.సుధాకరరావు, బి.జనార్ధనరావు, సహాయ కార్యదర్శి పి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	110	175	195

బీర సాగు.. భలే బాగు

– జలుమూరు, న్యూస్‌టుడే:

బీర వంటి తీగజాతి పంటలను ఖరీఫ్‌లో వేస్తే లాభాలు గడించొచ్చని కోటబొమ్మాళి మండలం సౌడాం గ్రామానికి చెందిన రైతు సాధు రామారావు తెలిపారు. తన వ్యవసాయ కమతంలో 30 సెంట్ల విస్తీర్ణంలో వేసవి బీర పంట వేశారు. బాగా దుక్కిచేసి పశువుల వ్యర్థాలు, రెండు టన్నుల గొర్రెలు, మేకల వ్యర్థాలు వేసి మెత్తగా కలియదున్నారు. పొలంలో పిల్లకాలువలు ఏర్పాటు చేసి వాటి మధ్యలో విత్తనాలు నాటేందుకు గుంతలు తీశారు. మొక్కకు మొక్కకు రెండు అడుగుల దూరంలో నాటారు. 300 గ్రాముల విత్తనాలను రూ.3000 ఇచ్చి కొనుగోలు చేశానని, నాటేందుకు, కలుపు తీసేందుకు, నీరు తడులు వేసేందుకు, ఎరువులు అన్ని కలిసి సుమారుగా రూ.10 వేల వరకు ఖర్చయిందని రామారావు తెలిపారు. మరో 40 రోజులకు పంట చేతికి అందుతుందన్నారు. 2300 కిలోల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ప్రస్తుత మార్కెట్‌లో కిలో ధర రూ.30 పలుకుతుందని, సరకు మొత్తం రూ.69 వేల వరకు వస్తుందన్నారు. పెట్టుబడి మినహా రూ.59 వేలు లాభం అందుతుందన్నారు.

సస్యరక్షణ చర్యలు ఇలా..

గుంతలు తీసి పశువుల వ్యర్థాలు, ఎకరాకు 60 కిలోల యూరియ, సూపర్ ఫాస్పేట్ 120 కిలోలు, పొటాష్ 80 కిలోలు కలిపి విత్తనం నాటే ముందు వేయాలి. నాలుగు ఆకుల దశలో పెంకు పురుగు ఆశిస్తుంది. నివారణకు ఎస్పేట్ -1 గ్రాము, శాఫ్ -2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మరో వారం తరువాత బోరాన్ 2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే పూత బాగా వచ్చి దిగుబడి వస్తుంది.

మూడు పంటలు చేతికి అందుతాయి

బీర పంట లాభదాయకమే. గత మూడేళ్లుగా పండిస్తున్నాను. 30 సెంట్ల విస్తీర్ణంలో పంట వేశాను. అంతరపంటగా తోటకూర వేశాను. ఉదయం సమయంలో పంటకు నీటి తడులు, సస్యరక్షణ చర్యలు చేపట్టి, తరువాత ఇతర వ్యవసాయ పనులు చూసుకుంటాం. బీర పూర్తయిన తరువాత పొలం బాగా దుక్కిచేసి రబీలో వంగ, బెండ వంటి పంటలు వేస్తాను. ఏడాదిలో మూడు పంటలు చేతికి అందుతాయి. ఇలా వరుస క్రమంలో కాయగూరల పంటకు ప్రాధాన్యం ఇస్తాం.

– సాధు రామారావు, రైతు (సౌడాం)

సౌడాం పొలంలో పెరిగిన బీర పంట

రైతేరాజు

బంతి పంట ఇలా వేయండి

డాక్టర్ ఎస్.నీలవేణి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: అధిక దిగుబడులు సాధించాలంటే కలుపు నివారణలో ఎలాంటి చర్యలు తీసుకోవాలి. ఏ రకమైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంట కాపాడుకోవచ్చో తొగరాం పాలిటెక్నిక్ వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నీలవేణి తెలిపారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

ప్రశ్న: వరి వెద వేసి రెండు రోజులైంది. కలుపు రాకుండా ఎలాంటి మందులు వాడుకుంటే అధిక దిగుబడులు సాధించొచ్చు

-కె.చిన్నవాడు, సంతకవిటి

సమాధానం: వరి వెద వేసిన వెంటనే 1-2 రోజుల లోపు తేమ ఉన్నప్పుడు ఎకరానికి 400 మి.లీ ప్రెటిలాక్లోర్ 50 శాతం 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే కలుపు పెరగకుండా నివారించొచ్చు.

ప్రశ్న: వర్షాకాలం వచ్చింది. బంతి పంట సాగుచేయాలనుకుంటున్నాం.

-పి.నారాయణరావు, నందిగాం

సమాధానం: 25 రోజుల వయసు, 3-4 ఆకులు కలిగిన మొక్కలు నాటుకోవడానికి అనుకూలంగా ఉంటాయి. సాయంత్రం వేళలో మొక్కలు నాటుకుంటే భూమిలోకి బాగా పాతుకుంటాయి. ఆఫ్రికన్ బంతి మొక్కలను 30-40 సెంటీమీటర్ల దూరం, ఫ్రెంచిబంతి నారు మొక్కలను 20-20 సెంటీమీటర్ల దూరంలో నాటుకుంటే మంచి దిగుబడి సాధించొచ్చు.

ప్రశ్న: వరి నారు, ఎరువుల వినియోగంపై యాజమాన్య పద్ధతులు తెలపండి. -సీహెచ్.మోహనరావు, ధర్మవరం

సమాధానం: వరిలో 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని(విత్తనం చల్లే ముందు 1 కిలో, 10-15 రోజుల తరువాత 1 కిలో), భాస్వరం 1 కిలో, పొటాష్ 1 కిలో దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం మోతాదు పెంచి వేసుకోవాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

సాగులో చీడపీడల నివారణ, కొత్త వంగడాలు ఇతర సమస్యలపై ఆమదాలవలస కేవీకే వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్.. జి.చిట్టిబాబు.. 9849035068 చరవాణిని నంబరును సంప్రదించగలరు.

పంచపత్ర కషాయం పైరుకు దివ్య ఔషధం

సారవకోట, న్యూస్‌టుడే: వరి పైరు, కూరగాయల పంటలు, పండ్ల మొక్కలకు రసం పీల్చే పురుగు ఆశిస్తుందని, వీటి నివారణకు పంచపత్ర కషాయం దివ్య ఔషధమని మండల ప్రకృతి వ్యవసాయ సమన్వయకర్త వైభవలక్ష్మి తెలిపారు. అంగూరు పంచాయతీ సవరడ్డపనస గ్రామానికి చెందిన రైతు పట్ట ఉమామహేశ్వరరావు పెంచుతున్న జామ తోటకు రసంపీల్చే పురుగు, ఆకుముడత సోకడంతో కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు.

తయారీపై అవగాహన కల్పిస్తున్న వైభవలక్ష్మి

తయారీ ఇలా: బొప్పాయి, వేప, జిల్లేడు, జామ, సీతాఫలం అయిదు రకాల ఆకులను 5 కిలోల చొప్పున తీసుకొచ్చి మెత్తగా దంచాలి. 15 లీటర్ల నీటిలో వేసి 10 లీటర్లు తయారయ్యే వరకు మరిగించుకోవాలి. ఈ ద్రావణం ఎకరా విస్తీర్ణంలో సాగు చేసే పంటకు సరిపోతుంది. 3 నెలల పాటు నిల్వ ఉంచుకోవచ్చు. 15 లీ. నీటిలో అరలీటరు ద్రావణం, మరో అరలీటరు ఆవుమూత్రం చొప్పున కలిపి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు ఇస్తుంది. 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేస్తే పైర్లకు ఉన్న తెగుళ్లు, పురుగులు పూర్తిగా నాశనమవుతాయి. దిగుబడి బాగుటుంది.

EENADU eClassifieds

REAL ESTATE

LAND FOR SALE

Land for Sale: 1.5 Acres (NH-16) Highway Adjacent along Vizag- Srikakulam Rd. @ Nathavalasa Jn., Nr. Bhogapuram. Ph: 9959964304.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

Receptionist and Waiters Required Age: below 35 yrs. with Computer & Hindi & English speaking skills Hotel Winsar Park, Opp. KGH, Vizag. 9849581868.

Wanted Marketing Managers to work in Ministry of Divinity, Vizag. Salary Rs. 27,500/-. ✆: 86393 67991.

మీ మండలంలో మీ చుట్టూ ఉన్న గ్రామాల్లో మార్కెటింగ్ చేస్తూ నెలకు 20 వేల దాకా సంపాదించుకొనే అవకాశం మార్కెటింగ్ చేయుట ద్వారా పొందవచ్చును. అర్హత పదవ తరగతి ఆపైన 22 సం॥ దాటి బైక్ కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత. ✆ 7732057408.

ప్రముఖ మార్కెటింగ్ కంపెనీలో పని చేయుటకు యువతీ యువకులు కావలెను. విద్యార్హత : 10th Pass or Fail, Age : 18+ జీతం: 12,000 to 45,000 + ఇన్సెంటివ్ + ఫార్వర్టీవ్స్ Cont: 6300326163, 8919474693.

Oyo హోటల్ రూమ్స్ (Lodge) నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్ cum రూమ్ బాయ్స్ కావలెను (Age below 28). భోజనం & వసతి కలదు. MVP కాలనీ, వైజాగ్. ✆ 7036488899.

శ్రీకాకుళం జిల్లా పరిధిలో గల శ్రీరామ్ చిట్స్ & శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లకు సంబంధించిన రూరల్ & అర్బన్ ప్రాంతాల్లో పనిచేయుటకు వెంటనే 30 మంది BDES, ఏదైనా డిగ్రీ కలిగి 43 సం॥లు లోపు కలిగిన వారు ఇంఛార్జెస్‌గా కావలెను. రెన్యూవల్ కలెక్షన్ టీమ్, ఎగ్జిక్యూటివ్స్ ట్రైనీస్ (MBA or PG), శాలరీ:18,000/- + ఇన్సెంటివ్స్, PF, ESI, GR INS, సం.కు బోనస్ 28,000/- కలవు. LIC ఏజెంట్స్‌గా గాని ఇతర లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్, Bank Loan's చేసే DAC ఎగ్జిక్యూటివ్స్, ఇతర చిట్ ఫండ్ ఏజెంట్స్, సంప్ర: 9849824071.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గొలుసు దొంగల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఒంటరి మహిళలే లక్ష్యంగా బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పాతపట్నం సీఐ రామారావు, మెళియాపుట్టి ఎస్సై రమేష్‌బాబు సోమవారం వెల్లడించారు. గత నెల 9న శేఖరాపురం వద్ద నక్క శకుంతలమ్మ ఒంటరిగా పొలం నుంచి వస్తుండగా.. ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి పుస్తెలు తాడు లాక్కొని వెళ్లిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. గంజాం జిల్లా బ్రహ్మపురానికి పరిధికి చెందిన బాలకృష్ణ సాహు, సుజిత్‌కుమార్ పాఢిలను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు బ్రహ్మపురలో ద్విచక్రవాహనం చోరీ చేసి అదే వాహనంపై తిరుగుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. శేఖరాపురంలో చోరీ అనంతరం ఒడిశాలోని గురండి వద్ద వీరు దొంగతనానికి పాల్పడినట్లు సీఐ పేర్కొన్నారు. 2024 జనవరిలో గంగరాజపురం పరిధి జగన్నాథపురం వద్ద వి.రాజేశ్వరి అనే మహిళ మెడలో తులంన్నర బంగారం తాడు చోరీ చేసినట్లు తెలిపారు. వీరిపై ఆంధ్రా- ఒడిశా పరిధిలో 15- 20 కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నరసన్నపేట మండలం ఉర్లాం రైలు నిలయం సమీపంలో కుమ్మరిపేట గ్రామానికి చెందిన దువ్వారపు మల్లేశ్(75) సోమవారం రైలు ఢీకొని మృతి చెందారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని, మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించామని రైల్వే ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. మల్లేశ్ భార్య చనిపోగా, ఇద్దరు కుమారులున్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80081 11237

లారీ ఢీకొని యాచకుడి మృతి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణ బాహ్యావలయ జాతీయరహదారి మార్గం (బైపాస్‌రోడ్డు)లో పాత టోల్‌ప్లాజా సమీపంలో లారీ ఢీకొట్టడంతో ఓ యాచకుడు మృతి చెందారు. వ్యక్తిని ఢీకొన్న తరవాత అదుపుతప్పిన వాహనం బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు నుంచి ఒడిశా రాష్ట్రంలోని బ్రహ్మపురకు టమాటా లోడుతో సోమవారం ఇచ్ఛాపురం మీదుగా వెళ్తున్న లారీ రోడ్డు పక్కగా నడుచుకుంటూ వెళ్తున్న యాచకుడు సాహును ఢీకొంది. అతను అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో వాహనం అదుపుతప్పి, రోడ్డు పక్కన బోల్తా పడటంతో చోదకుడికీ గాయాలయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని, చికిత్స కోసం లారీ డ్రైవర్‌ను ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు పట్టణ హెచ్‌సీ ప్రకాశరావు తెలిపారు. ఇచ్ఛాపురం (బెల్లుపడ) వీఆర్వో నర్తు కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాయంత్రం కేసు నమోదు చేశామని హెచ్‌సీ వివరించారు.

అంబేడ్కర్ వర్సిటీ పరిశోధనా పత్రాలకు గుర్తింపు

అంతర్జాతీయ జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రజని, అధికారులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 14, 15 తేదీల్లో సోషల్‌వర్క్ విభాగం, సెంటర్ ఫర్ డా.బి.ఆర్.అంబేడ్కర్ స్టడీస్ సంయుక్తంగా జాతీయ సదస్సు నిర్వహించింది. ఆ సమయంలో సమర్పించిన పరిశోధనా పత్రాలు పుణెలోని అంతర్జాతీయ సెంటర్ ఫర్ సోషల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ జర్నల్‌ను సోమవారం ఉపకులపతి ఆచార్య కె.ఆర్.రజని వర్సిటీలో ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీలోని ఆచార్యులు, అధ్యాపకులు పరిశోధనా రంగంపై దృష్టి సారించాలన్నారు. రెక్టార్ బిడ్డికి అడ్డయ్య, సెమినార్ కన్వీనర్ డా.యు.కావ్యజ్యోత్స్న, విజయవాడకు చెందిన వాసవ్య మహిళా మండలి డైరెక్టర్ రష్మి తదితరులు పాల్గొన్నారు.

3.34 కిలోల గంజాయి పట్టివేత

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మీదుగా ఒడిశాలోని పూరీ ప్రాంతానికి గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పాతపట్నం సీఐ వి.రామారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాలోని పూరీ జిల్లా గడామృగశిర గ్రామానికి చెందిన రఘునాథ జెన్నా పూరీ ఆలయంలో గైడ్‌గా ఉంటూ భక్తులకు ఆలయాన్ని చూపించేవారు. మునిగుడ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి పరిచయం కావడంతో అక్కడ నుంచి పూరీకి గంజాయి తరలించేందుకు రఘునాథ సిద్ధమయ్యారు. 3.34 కేజీల సరకుతో పాతపట్నం వరకు పలు ఆటోలు మారుకుంటా వచ్చారు. పాతపట్నం తనిఖీ కేంద్రం వద్ద ఎస్ఐ బి.లావణ్యతో పాటు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడినట్లు సీఐ పేర్కొన్నారు. సరకు, చరవాణి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు.

తరలింపు కేసులో నిందితులకు జైలు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు సోమవారం తీర్పు వెలువరించారు. విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస పోలీసు స్టేషను పరిధిలో బూరాడ కూడలి వద్ద 2023 ఆగస్టు 7న ద్విచక్రవాహనంపై వెళ్తున్న రాంబాబును తనిఖీ చేయగా అతని వద్ద 1.8 కిలోల గంజాయి దొరికింది. పోలీసుల విచారణలో ముద్దాయి ఇచ్చిన సమాచారం మేరకు వెంకటేశ్, జీనా బందూస్‌లను గుర్తించి వారి దగ్గర ఉన్న 4.8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. విచారణ సమయంలో నేరం రుజువు కావడంతో ముగ్గురికి నాలుగేళ్ల కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు.

(c) eenadu

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బలరాంపురంలో సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ అశోక్

ఇచ్ఛాపురం గ్రామీణం, కంచిలి, పలాస గ్రామీణం, ఇచ్ఛాపురం, మందస, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు అన్నారు. ఇచ్ఛాపురం మండలం బలరాంపురంలో 'సుపరి పాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీ ఢిల్లీరావు, కామేష్ రెడ్డి, సహదేవురెడ్డి, ప్రసాద్, పద్మనాభం పాల్గొన్నారు. ❖ కంచిలి మండలం కుత్తుమలో కూటమి నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ❖ పలాస మండలం బ్రాహ్మణతర్లా, చినంచలలో పలాస నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు చౌదరి బాబ్జీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. విఠల్, లక్ష్మణ్, సంతోష్, శ్రీహర్ష, పాపారావు పాల్గొన్నారు. ❖ ఇచ్ఛాపురం పుర పరిధి మూడో వార్డులో పట్టణ తెదేపా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్రి తవిటయ్య, నందిగాం కోటేశ్వరరావు కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరించారు. ధర్మారావు, ఢిల్లీరావు, లీలా రాణి, శంకర్‌రెడ్డి, జైదేవ్ పాల్గొన్నారు. ❖ మందస మండలం తాళ్లగురంటి, సిద్ధిగాం, అంబుగాంలో తెదేపా శ్రేణులు ప్రచారం చేపట్టారు. తెదేపా కళింగ కార్పొరేషన్ డైరెక్టరు దుర్యోధనరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో కరపత్రం అందిస్తున్న తెదేపా పట్టణ అధ్యక్షుడు తవిటయ్య, నాయకులు

తెలంగాణ ఐసెట్‌లో జింకిభద్ర బాలిక ప్రతిభ

సోంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఐసెట్ ఫలితాల్లో జింకిభద్రకు చెందిన బోడ ప్రశాంతి 203 ర్యాంకు సాధించి ప్రతిభ చాటింది. విద్యార్థిని తండ్రి బోడ లింగరాజు హైదరాబాద్‌లో జిరాక్సు షాపు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రశాంతి ఆంధ్ర ఐసెట్‌లో 132 ర్యాంకు సాధించగా.. సోమవారం ప్రకటించిన తెలంగాణ ఐసెట్‌లోనూ ప్రతిభ చూపింది. ఎంబీఏ చదివి మంచి ఉద్యోగం సాధించాలని ఉందని ప్రశాంతి తెలిపింది.

బలరామస్వామిగా జగన్నాథుడు

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట జగన్నాథస్వామి ఆలయంలో దివ్య అవతారాల అలంకరణలతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం జగన్నాథుడిని బలరామస్వామిగా అలంకరించి పూజలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
ఇచ్ఛాపురం : 9440437129
పలాస : 8008574279
కవిటి గ్రామీణం : 8309638875
పలాస గ్రామీణం: 7386408926
కంచిలి గ్రామీణం: 9704568738

?: నిర్మాణ లోపం వల్ల ఇచ్ఛాపురం పట్టణం పురాబువీధి రహదారిపై రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. – డి.సత్యం, ఇచ్ఛాపురం

❖ పురాబువీధి రహదారిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.- పి.కామేశ్, ఎంఈఈ, ఇచ్ఛాపురం – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

?: ఇద్దివానిపాలెం వంతెన సమీపంలో సీసీ రోడ్డు పలు చోట్ల మరమ్మతులకు గురై ఇబ్బందులు తప్పడం లేదు. – స్థానికులు ❖ మరమ్మతులు చేపట్టి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. – ధనుంజయ, పంచాయతీరాజ్ శాఖ ఏఈ – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ఉపాధి శిక్షణ.. మహిళల భవిష్యత్తుకు రక్షణ

న్యూస్‌టుడే, పలాస

మహిళలు తమ కాళ్లపై నిలబడి ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలని కూటమి ప్రభుత్వం ఉపాధి చూపిస్తోంది. పలాస నియోజకవర్గంలో పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని మహిళలకు కుట్టు శిక్షణపై మెలకువలు నేర్పుతూ ఉపాధికి మార్గదర్శకత్వం చేపడుతోంది.

75 శాతం హాజరు తప్పనిసరి

పలాస నియోజకవర్గంలో మహిళలకు కుట్టు శిక్షణపై మూడు నెలపాటు తర్ఫీదునిస్తారు. మొదటి కటింగ్‌పై అవగాహన కల్పిస్తూనే పేపర్‌పై కటింగ్ విధానంతోపాటు హ్యాండ్ వర్క్ పనులపై మెలకువలు నేర్పిస్తూ కుట్టు యంత్రాలపై శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు యంత్రంతో పాటు ధ్రువపత్రం అందజేస్తారు. ప్రతి మహిళా ముఖ హాజరు ద్వారా 75 శాతం హాజరు ఉంటేనే శిక్షణకు అర్హురాలిగా ప్రకటిస్తారు.

నియోజకవర్గంలో వివరాలిలా...

మండలం	మహిళలు
పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం	60
పలాస	88
మందస	82
వజ్రపుకొత్తూరు	50
మొత్తం	280

ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు

మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు కుట్టు శిక్షణ ఉపయోగపడుతోంది. ఆదాయం పొందేందుకు అవకాశం కలుగుతోంది. – కె మణి మహాలక్ష్మి, మహిళ, కాశీబుగ్గ

ఆదాయం పెంచుకునేలా..

మహిళలు తమ కాళ్లపై నిలబడుతూ ఆదాయం పెంచుకునేలా ఉపయోగపడుతుంది. ఇంట్లో ఖాళీగా కూర్చొనే బదులుగా శిక్షణలో పాల్గొనడం ద్వారా అదనపు ఆదాయం పొందేందుకు అవకాశం ఉంది. ఇప్పటివరకు సుమారుగా 1,500 మందికి శిక్షణ ఇచ్చాం. – ఆర్.భారతి, శిక్షకురాలు, కాశీబుగ్గ

అమర్చారు.. సరిచేశారు..

స్పందనకు వందనం

పురుషోత్తపురంలో వెలగని దీపాలు మార్చారు. ఈ సమస్యపై ఐదేళ్ల 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షిక 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి కమిషనర్ రమేష్ స్పందించారు. పుర ఏఈ పి.కామేశ్వరరావు పర్యవేక్షణలో సమస్యను పరిష్కరించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

❖ దాసన్నపేట కూడలిలో కిందకే వేలాడుతున్న దీప స్తంభ విద్యుత్తు మీటరు, ఇతర ఉపకరణాలు, తీగలను సరిచేశారు. ఈ సమస్య గురువారం 'మీటరు అమర్చారు.. రక్షణ మరిచారు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి కమిషనర్ స్పందించారు. ఈ మేరకు సిబ్బంది ఆయా విద్యుత్తు ఉపకరణాలను సరిచేయడంతోపాటు దీపాలు వెలిగేలా చేశారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కాలువ శుభ్రం

శౌసనం చిన్న వీధిలోని కాలువ శుభ్రం చేశారు. దీనిపై శుక్రవారం 'దుర్వాసన భరించలేకున్నాం' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి సద్గుణ స్పందించారు. సిబ్బందితో కాలువలోని పూడికను తీయించారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

జారుకుంటూ వెళ్లాలి..!

ఇచ్ఛాపురం పుర పరిధి 3వ వార్డులో ఏఎస్ పేట రహదారి ఇది. ఈ దారిలో ముందుకు సాగాలంటే సాహసించాల్సిందే. వర్షం పడితే ఎర్ర మట్టితో కూడిన కంకర రోడ్డు బురదమయంగా మారి, రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా అడుగులు వేస్తే, పడటం ఖాయమని, సిమెంటు రోడ్డుగా మార్చాలని మహిళలు కోరుతున్నారు. పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు చేస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

చెంతనే గుంత.. ఆదమరిస్తే చింత..

ఇచ్ఛాపురం మండలం బెనుగానిపేట సమీప ప్రధాన రహదారి పక్కనే 4 అడుగుల గుంత దర్శనమిస్తోంది. బెనుగానిపేట, కేదారిపురం, ముచ్చింద్ర గ్రామాలకు సంబంధించి నీటిని సరఫరా చేసే వాల్వ్ పై కప్పు వేయలేదు. ఆ ప్రాంతంలో ఎలాంటి హెచ్చరిక బోర్డు లేకపోవడంతో తరచూ ప్రమాదాల చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామీణ నీటిసరఫరా విభాగం జేఈ విష్ణుమూర్తిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

అల్లుకున్న నిర్లక్ష్యం

కవిటి నుంచి సోంపేట వెళ్లే రోడ్డులో పలు చోట్ల తీగజాతి మొక్కలు విద్యుత్తు స్తంభాలకు అల్లుకుంటున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తీగజాతి మొక్కలు తొలగించాలని కోరుతున్నారు. విద్యుత్తుశాఖ ఏఈ యు.శ్రీనివాసరావును వివరణ కోరగా ఇప్పటికే పలు చోట్ల స్తంభాలకు అల్లుకున్న తీగలను తొలగించామని, మిగతా వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

రాళ్లు తేలి.. అధ్వానంగా మారి..

కంచిలి మండలం చిన్నకొజ్జిరియా నుంచి జాతీయ రహదారి కలిసే రహదారి నిర్మాణ పనులు సగంలో నిలిచిపోవడంతో రాళ్లు తేలి అధ్వానంగా మారింది. ఈ రహదారి ప్రయాణానికి అనుకూలంగా లేకపోవడంతో వేరే గ్రామాల మీదుగా ప్రయాణిస్తున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పంచాయతీరాజ్ ఏఈ ధనంజయ వద్ద ప్రస్తావించగా సగంలో నిలిచిన రహదారి పనులను త్వరలో పూర్తిచేస్తామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

అక్కడ వంట.. ఇక్కడ భోజనం..

పలాస మండలం దానగోరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(గిరిజన సంక్షేమ)లో వంట గది లేదు. వంటమనిషి ఇంట్లో మధ్యాహ్న భోజనం వండి పాఠశాలకు తీసుకొస్తున్నారు. పాఠశాలలోనే వంట గదిని నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో-2 సత్యం దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

అలంకారప్రాయంగా బారువ బస్టాండ్

మూలన పడిన మరుగుదొడ్లు

– న్యూస్‌టుడే, సోంపేట

మేజర్ పంచాయతీ బారువతోపాటు తీర ప్రాంత ప్రజలకు ఉపయోగపడే బారువ ఆర్టీసీ బస్టాండు అధ్వానంగా తయారైంది. ప్రణాళిక లేకుండా రెండు దశాబ్దాల కిందట నిర్మించిన దీనిని వినియోగించే పరిస్థితి లేకుండా పోయింది. బస్సులు లోపలకు వెళ్లి బయటకు వచ్చేందుకు వీలులేకుండా ఉంది. ప్లాట్‌ఫాంలతోపాటు ఇతర నిర్మాణాలు చేపట్టకపోవడంతో వర్షం పడితే ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. ప్రసిద్ధ ఆలయాలతోపాటు బీచ్ ఇతర అంశాల పరంగా ప్రాధాన్యత ఉన్నప్పటికీ బస్టాండు గురించి పట్టించుకోకపోవడంతో స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

నిలువ నీడ కరవు...

బారువ బస్టాండులో ప్రయాణికులు ఉండేందుకు కనీస వసతులు లేవు. షెడ్డు మరమ్మతులకు గురైంది. సూర్య కిరణాలు నేరుగా తాకే ప్రాంతంలో షెడ్డు నిర్మించడంతో అవస్థలు తప్పడం లేదు. వర్షం పడితే ప్రాంగణంలో అడుగు పెట్టే పరిస్థితి లేదు. కంకర రోడ్డు గోతులమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ నీటి నిర్వహణ, ట్యాంకు ఇతర సమస్యల మూలంగా అవి వినియోగించకుండానే మూలన పడ్డాయి. కొత్త బస్టాండు నిర్మించి వసతులు కల్పించాలని, ఆర్టీసీ సర్వీసులను బస్టాండ్ లోపలకు వచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. 'బారువ బస్టాండు సమస్యలను పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. రహదారులతోపాటు మరుగుదొడ్లు మరమ్మతులు ఇతర అంశాల గురించి ఉన్నతాధికారులతో మాట్లాడి ఇబ్బందులు తీర్చేందుకు ప్రయత్నిస్తామ'ని పలాస ఆర్టీసీ డిపో అసిస్టెంటు మేనేజర్ కరుణశ్రీ అన్నారు.

సచివాలయ ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు

పలాస: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో సచివాలయ ఉద్యోగులకు పుర కమిషనర్ ఎన్. రామారావు సోమవారం బదిలీ ఉత్తర్వులు అందజేశారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం నుంచి ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, రాజాం పురపాలక సంఘాలకు 9 మంది బదిలీ అయ్యారు. ప్లానింగ్ కార్యదర్శి సోమనాథ్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెస్ కార్యదర్శి సంతోషలక్ష్మి, శానిటేషన్ కార్యదర్శి కోటేశ్వరరావు, అడ్మిన్ కార్యదర్శి హేమశంకర్, అడ్మిన్ కార్యదర్శి జనార్దన్ శ్రీకాకుళం, ప్లానింగ్ కార్యదర్శి నారాయణరావు రాజాం, ప్లానింగ్ సెక్రటరీ రవళి, ప్లానింగ్ కార్యదర్శి ఎం. జయంత్ ఇచ్ఛాపురం, ఎడ్యుకేషన్ కార్యదర్శి నాగమణి పాలకొండ పురపాలికలకు బదిలీ అయ్యారు.

ప్రజాసమస్యలు పెండింగ్‌లో పెట్టకండి

పలాస, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో ప్రజాసమస్యలు పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కారం చూపాలని పలాస-కాశీబుగ్గ పుర కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. సోమవారం పుర కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జనన ధ్రువపత్రాలు 3, మరణ ధ్రువపత్రాలు 4, పింఛన్లు 3, ఆస్తిపన్ను పేరు మార్పిడికి 3 దరఖాస్తులు అందాయని రామారావు తెలిపారు.

కమిషనర్ రామారావుకు వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

మహిళలతోనే మరింత అభివృద్ధి

పలాస మండల పరిషత్తు కార్యాలయంలో మందస, వజ్రపుకొత్తూరు, టెక్కలి మండలాలకు చెందిన మహిళా సర్పంచులకు సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శిక్షకులు కామరాజు, జ్యోతి శ్రీనివాస్, మన్మథరావు మహిళా సర్పంచులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పాలనలో మెలకువల గురించి వివరించారు.

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

మాజీ మంత్రి పరామర్శ

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల బెండిగేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొండపూరుకు చెందిన కొరికాన చైతన్య కుటుంబాన్ని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. నాయకులు అప్పన్న, విశ్వనాథం, విఘ్నేశ్ పాల్గొన్నారు.

చైతన్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

యూత్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస యూత్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక కాశీబుగ్గలో సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బి.సునీల్‌వర్మ, ప్రధాన కార్యదర్శిగా డి.దిలీప్‌కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా జయరాజ్, సహాయ కార్యదర్శిగా రాజాం సురేష్‌లతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రైల్వే పనులు ప్రారంభం కానున్నాయి

రైల్వే సీఏవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు శ్రీనివాస రౌలో

ఇచ్ఛాపురం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం రైలునిలయ ఉత్తరకేబిన్ వద్ద ఉన్న రైల్వేగేటు సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని, నెల రోజుల్లో పనులు ప్రారంభమయ్యే దశకు చేరుకుంటుందని జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు శ్రీనివాస రౌలో తెలిపారు. సోమవారం భువనేశ్వర్ డీఆర్‌ఎం కార్యాలయంలో ఉన్న రోడ్ సేఫ్టీ ప్రాజెక్ట్స్ ముఖ్య పరిపాలనాధికారి (నిర్మాణాలు) (సీఏవో) జీహెచ్ విక్టర్ జోసెఫ్‌కు ఇక్కడి పరిస్థితిని వివరించి వినతి పత్రం అందజేశామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు సదానంద రౌలో పాల్గొన్నారు. ❖ కవిటి మండలం గొర్లపాడు రైల్వే దిగువ వంతెన మరమ్మతు పనులకు రూ. 6 లక్షలు నిధులు మంజూరైనట్లు రైల్వే జెడ్‌ఆర్‌యూయూసీ సభ్యుడు శ్రీనివాస రౌళో తెలిపారు. దీనికి కొన్నేళ్లుగా మరమ్మతులు లేక వర్షం నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

సోంపేటలో సీఐటీయూ ర్యాలీ

సోంపేట, కంచిలి, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులు కాలరాస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా పోరాటాలు సాగించాల్సిన అవసరముందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సీఐటీయూ, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోంపేట, కంచిలి మండలాల పరిధిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు కె.గోపీనాథ్ పాల్గొన్నారు.

మాతృభాష గొప్పది

పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మాతృభాషపై ప్రతి ఒక్కరూ మమకారం పెంచుకోవాలని హెచ్‌ఎస్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మాదుగుల రామారావు అన్నారు. గోవిందపురం ఉన్నత పాఠశాలలో 2024-25 సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన 9మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించి జ్ఞాపికలతో సత్కరించారు.

హామీలు అమలు చేయకుంటే సమ్మె

ఇచ్ఛాపురం బస్టాండులో మానవహారం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పురపాలక సంఘాల్లో వివిధ విభాగాల్లో సేవలందించే కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేకుంటే 12వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మె చేస్తామని ఇచ్ఛాపురం పుర కార్మికులు పేర్కొన్నారు. సోమవారం ఇచ్ఛాపురం పారిశుద్ధ్య కార్యాలయం వద్ద ఏపీ పుర ఉద్యోగులు, కార్మికుల సంక్షేమ సంఘ జిల్లా కన్వీనర్ ఎ.రమేష్ పట్నాయక్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించి, పలు అంశాలు చర్చించారు. మంగళవారం అర్ధనగ్న, పరికరాలతో ప్రదర్శనలు జరుగుతాయన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ

ఉపాధ్యాయులకు సన్మానం

కంచిలి మండలం ఎక్కల ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉమారావు, కామేష్‌లను సోమవారం గ్రామస్థులు సన్మానించారు. ఎంఈవో శివరాంప్రసాద్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

తల్లిదండ్రుల పాత్ర కీలకం

కవిటి గ్రామీణం, కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రధానోపాధ్యాయులు వీరభద్రరావు అన్నారు. ఈనెల 10న మెగా తల్లిదండ్రుల సమావేశం సందర్భంగా బి.గొనపపుట్టుగ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్రపై వ్యాసరచన, చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. ❖ మెగా తల్లిదండ్రుల సమావేశం 2.0పై కంచిలి ప్రత్యేకాధికారి అప్పలస్వామి మండల విద్యాశాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఎంపీడీవో తిరుమలరావు, తహసీల్దార్ రమేష్, ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం

సోంపేట, న్యూస్‌టుడే: వాతావరణ మార్పులు ఎదుర్కోవడానికి మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకత ఉందని ట్రీ ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త సోమేశ్వరరావు పేర్కొన్నారు. కర్తలిపాలెం స్కూలు ఆవరణలో సోమవారం విద్యార్థులతో మొక్కలు నాటించారు.

చెరువుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి

వజ్రపుకొత్తూరు గ్రామీణం: చెరువుల ఆక్రమణలపై దృష్టి సారించి రెవెన్యూ అధికారుల సహకారంతో తొలగింపులకు చర్యలు తీసుకుంటామని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దుర్గారావు అన్నారు. పూండి బస్టాండ్‌లోని గోపాల చెరువును సోమవారం పరిశీలించారు.

యాజమాన్య పద్ధతులతో మేలు

సోంపేట, న్యూస్‌టుడే: నారుమడి, వెద జల్లిన పంట పొలాల్లో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించడంతోపాటు పెట్టుబడిని తగ్గించుకోవచ్చని ఏవో బి.నర్సింహమూర్తి సూచనలిచ్చారు. సోమవారం సోంపేట మండలంలోని పలు గ్రామాల్లో పొలాలు పరిశీలించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టారు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: గరుడభద్రలో సోమవారం సర్పంచి గిరిజ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. పరిసరాలు, చెరువుల చుట్టుపక్కలా పేరుకుపోయిన పనికిరాని మొక్కలు, చెత్తను తొలగించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటిలో దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వర ఆలయానికి గ్రామానికి చెందిన మార్కెట్ అధినేత పిరియా రవి ప్రసాద్ విరాళం అందించారు. సోమవారం ఆయన భార్య ప్రశాంతితో కలిసి రూ. 50 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

సౌండ్ సిస్టమ్ వితరణ

ఇచ్ఛాపురం గ్రామీణం, కంచిలి: దాతల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.యశోద అన్నారు. బలరాంపురం మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలకు విద్యార్థి తల్లిదండ్రులు గురునాథం, జయలక్ష్మి దంపతులు రూ. 16,400 విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను సోమవారం అందించారు. ❖ పురుషోత్తపురానికి చెందిన స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ చాణక్య స్థానిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయుడు రవి పాల్గొన్నారు.

సమస్యలు తీరవు.. అవస్థలు తప్పవు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ముచ్చింద్ర పంచాయతీ పరిధిలో ముచ్చింద్ర, బెనుగానిపేట గ్రామాలున్నాయి. ఇవి అనేక సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. ముచ్చింద్ర పెద్ద వీధిలో రహదారిలో మురుగు రెండు నెలలుగా తాండవిస్తోంది. కంపు భరించలేకపోవతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు పూర్తిగా కాలువ వ్యవస్థ లేకపోవడంతో వాడుక, వర్షం నీరు రోడ్డుపై నిల్వ ఉంటోంది. దీంతో అడుగుతీసి బయటకు వేయలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులకు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

జగనన్న కాలనీలో నీటి నిల్వలు

గ్రామంలోని విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరి పగుళ్లు ఏర్పడి పెచ్చులూడుతోంది. ప్రయాణికులు అక్కడకు వచ్చేందుకు సాహసించడం లేదు. వర్షాకాలం మరింత ఇబ్బందిగా ఉందని ఆందోళన చెందుతున్నారు. బెనుగానిపేట సమీప ప్రధాన రహదారికి ఆనుకొని 4 అడుగుల లోతులో నీటి వాల్వ్‌పై కప్పు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నివారణ చర్యల చేపట్టి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామ సమీపంలోని జగనన్న కాలనీలు లోతట్టు ప్రాంతాల్లో ఉండటంతో వర్షాకాలంలో నివాసాల మధ్య వర్షపు నీరు నిల్వ ఉంటోంది. ❖ పంచాయతీలో పలు సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే చర్యలు తీసుకొని సమస్య పరిష్కరిస్తామని పంచాయతీ సర్పంచి సాడి నూకమ్మ తెలిపారు.

పంచాయతీ : ముచ్చింద్ర, గ్రామాలు: 2, ఇళ్లు: 394, జనాభా: 1620

(c) eenadu

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గంలో సమస్యలా..?

నేడు ఎమ్మెల్యే మామిడి గోవిందరావుతో 'ఈనాడు ఫోన్ ఇన్'

పాతపట్నం నియోజకవర్గంలో అర్హులైనా సంక్షేమ పథకాలు అందడం లేదా? అభివృద్ధి పనులు జరగడం లేదా? సమస్యలపై అధికారులు స్పందించడం లేదా? ఇలా ఎటువంటి ఇబ్బందులైనా నేరుగా నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తుంది.. మీరు చేయాల్సిందల్లా ఒక్కటే. కింద పేర్కొన్న నంబర్లకు ఫోన్ చేసి చెప్పడమే. అలాగే ఆయా సమస్యల చిత్రాలు వాట్సాప్ కూడా చేయవచ్చు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి సంబంధించిన వివిధ శాఖల అధికారులు పాల్గొంటారు. – న్యూస్‌టుడే, పాతపట్నం

ఈనాడు మీతోడు

తేదీ: 08.07.2025 (మంగళవారం), సమయం: ఉదయం 9 గంటల నుంచి 10 వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్లు : 80085 52706, 99851 07090

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, సారవకోట, జలుమూరు, మెళియాపుట్టి, కొత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అర్హులందరికీ పథకాలు అందిస్తుందని ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పేర్కొన్నారు. సోమవారం టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. వైకాపా హయాంలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని ఎమ్మెల్యే రమణమూర్తి అన్నారు. నరసన్నపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రూ.53 లక్షలతో తాగునీటి పథకం పనులు ప్రారంభించారు. సారవకోటలో తెదేపా నాయకులు సురవరపు తిరుపతిరావు, కత్తిరి వెంకటరమణ, కోన వెంకటేష్, పట్ట ఉమామహేశ్వరరావు, కొత్తూరులో వి.వెంకటరమణ, జి.కమలాకర్, ఎ.దశరథరావు పాల్గొన్నారు. మెళియాపుట్టి మండలం ముక్తాపురం గ్రామంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఇంటింటా కరపత్రాలు అందించారు. కరకవలసలో వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రకాశ్‌నగర్ కాలనీలో..

జలుమూరు మండలం కరకవలసలో...

ముక్తాపురంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో..

రేపు విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక

టెక్కలి, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదిక సదస్సును బుధవారం నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.శంకరరావు సోమవారం తెలిపారు. ఈ నెల 8న జరగాల్సిన కార్యక్రమాన్ని 9వ తేదీకి వాయిదా వేసినట్లు ఆయన చెప్పారు. భగవాన్‌పురం రహదారిలోని ఎస్ కన్వెన్షన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు సదస్సు జరుగుతుందన్నారు.

అంజనాపురం లేఅవుట్ పరిశీలన

టెక్కలి సమీపంలోని అంజనాపురం వద్ద జగనన్న లేఅవుట్‌ను ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సోమవారం పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. రహదారులు, మంచినీటి సౌకర్యాల గురించి చర్చించారు. అవసరమైన చర్యలు తీసుకుని లబ్ధిదారులకు అసౌకర్యం కలగకుండా చూడాలని తహసీల్దార్ సత్యంను ఆదేశించారు. – న్యూస్‌టుడే, టెక్కలి

ఆటలకు టాటా..!

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం, నరసన్నపేట, పోలాకి, సారవకోట, జలుమూరు

విద్యారంగానికి పెద్దపీట వేసి, నాడు- నేడుతో పాఠశాలల రూపురేఖలు మారుస్తామని ఊదరగొట్టిన గత ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనలో కనీస శ్రద్ధ చూపలేదు. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. కొన్ని చోట్ల ఆటస్థలాలు లేకపోవడం, మరికొన్ని చోట్ల ఉన్నా.. చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతుండటంతో పిల్లలు క్రీడలకు దూరమవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటస్థలం లేని లింగాలవలస విద్యాలయం

తరగతులకే పరిమితం

● నరసన్నపేట మండలంలోని బాడాం, కంబకాయ, మడపాం, తామరాపల్లి, దేశవానిపేట, సత్యవరం ఉన్నత పాఠశాలలకు చిన్నపాటి మైదానాలున్నాయి. లుకులాం, ఉర్లాం విద్యాలయాల్లో విశాలమైన ప్రాంగణాలున్నప్పటికీ నిర్వహణ లోపంతో అధ్వానంగా మారాయి. సమస్యను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకెళ్తామని ఎంఈవో ఉప్పాడ శాంతారావు అన్నారు.

● పోలాకి మండలంలోని అంపలాం, గొల్లలవలస ఉన్నత పాఠశాలతో పాటు 40 ప్రాథమిక పాఠశాలల్లో ఆట స్థలాలు లేక విద్యార్థులు తరగతులకే పరిమితమవుతున్నారు. ఉన్నతాధికారులకు సమస్య తెలియజేశామని ఎంఈవో ఎం.లింగరాజు తెలిపారు.

నరసన్నపేట నియోజకవర్గంలో పాఠశాలలు

మండలం	ఉన్నత	ప్రాథమికోన్నత	ప్రాథమిక	మొత్తం
నరసన్నపేట	14	06	61	81
పోలాకి	12	01	73	86
జలుమూరు	16	02	59	77
సారవకోట	07	03	69	79

● సారవకోట, చిన్నకిట్టాలపాడు, బుడితి ఉన్నత, సవరబొంతు, తర్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలకు మైదానాలున్నాయి. తర్లి ఆశ్రమ పాఠశాల కొండ అంచున నిర్మించడంతో కొండపై నుంచి వర్షంతో పాటు బురద చేరి విద్యార్థులు ఆడుకునేందుకు వీలు లేకుండా పోతోంది. చర్యలు తీసుకుంటామని ఎంఈవో వెంకటరమణ చెప్పారు.

● జలుమూరు మండలంలోని పెద్దదూగాం, చల్లవానిపేట, దరివాడ, దరివాడ, బసివాడ, తమ్మయ్యపేట, జొణంకి విద్యాలయాలకు పూర్తిగా ఆటస్థలాలు లేవు. సమస్యను పరిష్కరిస్తామని మండల విద్యాశాఖాధికారి మాధవరావు పేర్కొన్నారు.

పనికిరాని మొక్కలతో అధ్వానంగా ఉర్లాం ఉన్నత పాఠశాల మైదానం

తప్పని వ్యయప్రయాసలు

పాఠశాలకు విశాలమైన క్రీడా మైదానం ఉన్నా గోతులు, పనికిరాని మొక్కలతో దయనీయంగా మారింది. పోటీల సమయంలో వ్యయప్రయాసలు తప్పడం లేదు. విద్యార్థులను నరసన్నపేట తీసుకెళ్లి సాధన చేయిస్తున్నాం.

- ఎం.జగదీశ్వరరావు, పీడీ, ఉర్లాం ఉన్నత పాఠశాల

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం కర్లపూడి గ్రామంలోని రక్షిత మంచి నీటి పథకం మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీటికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలి.

- గంటం విజయకుమార్, స్థానికుడు

★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. మోటారు బాగు చేయించి తాగునీటి ఇబ్బందులు తీరుస్తాం.

- కురేష్ బెహరా, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ నందిగాం

– న్యూస్‌టుడే, నందిగాం

రెయిలింగ్ ధ్వంసం

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరు నాలుగు రహదారుల కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి ఆనుకుని నిర్మించిన ఇనుప రెయిలింగ్ ధ్వంసమైంది. ఈ విషయాన్ని సోమవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ చింతాడ ప్రసాదరావు, ఎస్ఐ అమీర్ ఆలీ సీసీ కెమెరాల ఆధారంగా ఘటన ఎలా జరిగిందో పరిశీలించారు. ఓ ఇసుక లారీని వెనక్కి తిప్పుతుండగా రెయిలింగ్‌ను ఢీకొన్నట్లు గుర్తించారు.

తూకం వేయరు.. తరుగు ఆగదు

పౌర సరఫరా గోదాం నుంచి చౌకధరల దుకాణాలకు నిత్యావసర సరకులు తూకం వేయడానికి జలుమూరులో గతేడాది వేబ్రిడ్జి నిర్మించారు. ఇంతవరకు దాన్ని ప్రారంభించలేదు. తూకం వేయక పోవడంతో తరుగు వస్తుందని, ఆ ప్రభావం లబ్ధిదారులపై పడుతుందని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై గోదాం ఇన్‌ఛార్జి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. – న్యూస్‌టుడే, జలుమూరు

ఆదాయం ఘనం.. సౌకర్యాలు కనం

కొత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వర్షం నీరు నిలిచి పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు సుమారు 150 సర్వీసులు తిరుగుతుంటాయి. ఆదాయం బాగున్నా.. సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ కంట్రోలర్ వెంకట్రావు వద్ద ప్రస్తావించగా.. సమస్యను డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

అధ్వానం.. ఎందుకీ నిర్లక్ష్యం..?

నరసన్నపేటలోని విశ్వేశ్వరయ్య మార్కెట్ అధ్వానంగా మారింది. వ్యర్థాలు పేరుకుపోవడంతో అక్కడకు వెళ్లేందుకు స్థానికులు వెనకడుగు వేస్తున్నారు. దుర్వాసనతో ముక్కు మూసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల వ్యర్థాలు తినేందుకు ఆ ప్రాంతంలో పశువులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చర్యలు తీసుకుంటామని ఈవో దాక్షాయణి చెప్పారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట

పందుల నివారణకు చర్యలు

నరసన్నపేట, న్యూస్‌టుడే: నరసన్నపేటలో పందుల సంఖ్య నివారణకు గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈనాడులో ఈనెల 5న 'ఆలయం ఎదుట అధ్వానం' శీర్షికతో ప్రచురితమైన వార్తకు పంచాయతీ ఈవో దాక్షాయణి స్పందించారు. వీధుల్లో సంచరిస్తున్న పందులను పట్టుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. నెల రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆమె తెలిపారు.

ఎట్టకేలకు మారిన దారి

స్పందనకు వందనం

పోలాకి, న్యూస్‌టుడే: మండలంలోని పిన్నింటిపేట గ్రామం మీదుగా వెళ్లే డీపీఎన్ రోడ్డు పనులు ఎట్టకేలకు పూర్తి చేశారు. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఈ మార్గం నిర్మాణం మధ్యలో నిలిపేశారు. దీంతో వివిధ గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. దీనిపై ఈ నెల 3న 'అసంపూర్తి నిర్మాణం.. అవస్థల ప్రయాణం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో ర.భ.శాఖ అధికారులు స్పందించి, త్వరితగతిన పనులు పూర్తి చేయించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన టెర్రిటరీ మేనేజర్ (రిటెయిల్ వైజాగ్) భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, విశాఖపట్నం వారి భోగట్టాపై ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (BPCL) వారు సర్వే నెం. 110-2 & 110-3 జలుమూరు గ్రామం, జలుమూరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ ... ఖాళీ స్థలం విస్తీర్ణం 960 Sq.Mtrs (32x30) పొడవు, వెడల్పు కలిగిన ఖాళీ స్థలంలో రిటైల్ అవుట్‌లెట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. హద్దులు: తూర్పు: కోన తారకేశ్వరరావు గారి ఖాళీ భూమి, పడమర: కోన తారకేశ్వరరావు గారి ఖాళీ భూమి, ఉత్తరం: కోన తారకేశ్వరరావు గారి ఖాళీ భూమి, దక్షిణం: జె.పి. రోడ్డు (S.H-106 Road). ఈ పై ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, శ్రీకాకుళం జిల్లా, జలుమూరు మండలం, జలుమూరు గ్రామం కాపురస్తులు కోన అప్పలదాసు లేటు గారి కుమారుడు కోన తారకేశ్వరరావు (65 సం॥) గారి వద్ద నుండి లీజుకు తీసుకోవడమైనది. ఈ పై సర్వే నెంబర్లలో మరియు హద్దులు మధ్యస్తమైన స్థిరాస్తిపై ఎవరైనా వ్యక్తికి గాని, ఏదైనా సంస్థకు గాని (వ్యవస్థీకృత లేదా అసంఘటిత) ఎటువంటి హక్కులు కలిగియున్న యెడల ఈ తేదీ లగాయతు 7 రోజులలోపు వారి హక్కులకు సంబంధించి పూర్తి వివరములు కలిగిన పత్రములతో పాటు దిగువ పేర్కొన్న చిరునామాలో దిగువ సంతకం చేసిన వారికి తెలియజేయవలసినదిగా ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

సంప్రదింపుల కొరకు చిరునామా:
Territory Manager (Regional Vizag), Bharat Petroleum Corporation Ltd., Vizag, Instalation Near Dhana Reddy, Visakhapatnam, Andhra Pradesh.
Mob: 9437080856. Email: ankitmahapatra@bharatpetroleum.in

పూజారి వాసుదేవరావు
అడ్వకేట్, కోటబొమ్మాళి. సెల్: 9440317016

సంక్షిప్త సమాచారం

అన్నదాతల శ్రమదానం

నందిగాం, న్యూస్‌టుడే: సవరబాణాపురం రైతులు శ్రమదానంతో చెరువు బాగు చేసుకున్నారు. గ్రామంలో ఉన్న కాముడు కాసారం ద్వారా సుమారు 70 ఎకరాలకు సాగునీరందుతుంది. గుర్రపు డెక్క పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీంతో సోమవారం పూడిక తొలగించారు.

పశుగ్రాసంతో మేలు

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: రేగులపాడు రైతుసేవా కేంద్రంలో సోమవారం పశుగ్రాస వారోత్సవాలను డీడీ నరసింహులు ప్రారంభించారు. పశుగ్రాసంతో పాడి రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు సింహాచలం పాల్గొన్నారు.

పింఛన్ల సొమ్ము స్వాహా

పోలాకి, న్యూస్‌టుడే: పోలాకి, ఉరజాం గ్రామాలకు చెందిన పింఛనదారుల సొమ్మును సిబ్బంది స్వాహా చేసినట్లు రెండు ఊర్లలో చర్చనీయాంశంగా మారింది. బాధితులు ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎంపీడీవో రవికుమార్ అన్నారు.

నాణ్యత ప్రకారం బిల్లులు

ఎల్ఎన్‌పేట: నాణ్యత ప్రకారం బిల్లులు మంజూరు చేస్తామని వంశధార డీఈఈ ఏ.రామకృష్ణ పేర్కొన్నారు. 5ఎల్ కాలువపై కోవిలాం గ్రామం వద్ద జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఏఈ శ్రీనివాసరావు, సర్పంచి నారాయణరావు పాల్గొన్నారు.

వంశధార పనుల పరిశీలన

నరసన్నపేట: వంశధార కాలువ పనులను జమ్ము కూడలి వద్ద క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఈఈ అప్పలనాయుడు సిబ్బందికి సూచించారు. అధికారులు రామలక్ష్మి, హరీష్, శ్యామ్ ఉన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నంలోని నవజీవన్ వసతి గృహం పదో వార్షికోత్సవాన్ని సిబ్బంది నిర్వహించారు. నవజీవన్ ట్రస్టు అధ్యక్షుడు శ్రీధర్‌ఆచార్య పుట్టిన రోజు సందర్భంగా 40 మంది వితంతువులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మహేంద్ర కళాశాల డైరెక్టర్ ఎస్.మధుబాబు పాల్గొన్నారు.

అన్నదాతా సుఖీభవ వర్తింపజేయాలి

టెక్కలి, న్యూస్‌టుడే: గిరిజనులకు అన్నదాతా సుఖీభవ పథకం వర్తింప జేయాలని భాజపా గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు జెన్ని పరమేశ్వరరావు కోరారు. సోమవారం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతి పత్రం అందించారు. పార్టీ మండలాధ్యక్షుడు రాంజీ, బూరె నరేంద్ర చక్రవర్తి ఉన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

ఎ.ఎస్.కవిటిలో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాతపట్నం : క్షయ వ్యాధిపై అవగాహనతో ఉండాలని పాతపట్నం టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.చిరంజీవి అన్నారు. సోమవారం బైదలాపురం పీహెచ్‌సీ పరిధిలోని ఎ.ఎస్.కవిటి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధిని గుర్తించడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎస్.టి.ఎల్.ఎస్. ఝాన్సీరాణి, ఎం.ఎల్.హెచ్.పి. లావణ్య, ఏఎన్ఎం కల్యాణి, ఆరోగ్య సహాయకులు చలపతిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి దారి చూపండి.. మెళియాపుట్టి, న్యూస్‌టుడే: మెళియాపుట్టిలోని మల్లికార్జున స్వామి ఆలయానికి ఉత్తర వైపు ఉన్న రహదారి మూసివేయడపై స్థానికులు జిల్లా కేంద్రంలో కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు. రేఖాన వాసు, పోలాకి జయమునిరావు, దుక్క గాంధీరెడ్డి, దున్న శ్రీనివాసరావు, బి.రమణమూర్తి పాల్గొన్నారు.

వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు.. కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: గుంజిలోవ వైభవ వెంకటేశ్వరునికి భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనల్లో పరిసర గ్రామాల భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేతనాలందక ఇబ్బందులు

టెక్కలి, న్యూస్‌టుడే: టెక్కలి కింజరాపు ఎర్రన్నాయుడు తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు అందించడం లేదని, వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు నంబూరు షణ్ముఖరావు కోరారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు, సంబంధిత గుత్తేదారు వేతనాలపై స్పందించడం లేదని ఆరోపించారు. దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, రామారావు, రమేష్, పాపారావు, సంతోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు

పాతపట్నం, న్యూస్‌టుడే: హరిద్వారం వద్ద రైలు ఢీకొని ఆదివారం 17 ఆవులు మృతి చెందిన విషయం తెలిసిందే. తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు. సోమవారం తహసీల్దార్ ఎన్.ప్రసాదరావుకు తెదేపా నాయకుడు నరేష్‌తో కలిసి సమస్యను వివరించారు. జీవనాధారం కోల్పోవడంతో తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిని స్వీకరించిన తహసీల్దార్ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.

మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

సారవకోటలో మానవహారంగా ఏర్పడిన ఎమ్మార్పీఎస్ నాయకులు, మహిళలు

హిరమండలం, సారవకోట, న్యూస్‌టుడే: హిరమండలంలో సోమవారం మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ యువజన సంఘం అధ్యక్షుడు కంటి త్రినాథరావు కేకు కోశారు. మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు. ★ మందకృష్ణ మాదిగ అలుపెరగని నాయకుడని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. సారవకోటలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

సొంత నిధులతో మరమ్మతులు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: జంబాడ వద్ద కడగండి రిజర్వాయర్ కాలువల తలుపులు శిథిలమయ్యాయి. దీంతో నీరు వృథాగా పోతోంది. బొర్రంపేట గ్రామానికి చెందిన కోట అన్నాజీరావు రైతుల ఇబ్బందులు తీర్చేందుకు ముందుకొచ్చారు. సుమారు రూ.3 లక్షల సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తున్నారు. సోమవారం తలుపులు అమర్చే పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయుకులు కొవిలాపు కృష్ణమాచార్యులు, నారాయణరావు, అన్నంనాయుడు, రైతులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం, పాకివలస గ్రామం కాపురస్తురాలు అయిన సబ్బి లావణ్య W/o. అప్పన్న మరియు ఆమె కుమార్తెలు, కుమారుడు అనే నా క్లయింట్లు మహారాజశ్రీ కోటబొమ్మాళి జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో O.S. No: 49/25 I.A. No:404/2025 అనే పార్టీషన్ దావా వేసియున్నారు. సదరు నా క్లయింటు సబ్బి లావణ్య భర్త అయిన సబ్బి అప్పన్న సదరు లావణ్యను, పిల్లలను నిర్లక్ష్యం చేసి సబ్బి అప్పన్న మరియు అతని తండ్రి అయిన సింహాచలం భూములను ఈ దరిమిలా అమ్ముటకు ప్రయత్నం చేస్తున్నట్లుగా తెలియవచ్చినది. మహారాజశ్రీ కోటబొమ్మాళి కోర్టులో ఈ క్రింది సర్వే నెంబర్‌లలో గల భూములపై దావా పెండింగ్‌లో ఉన్నందున, సదరు భూములపై ఎవరైనా ఎటువంటి క్రయ విక్రయాలు జరిపినను చట్టపరంగా చెల్లనేరవు. సదరు భూమిని సబ్బి అప్పన్న మరియు అతని తండ్రి సింహాచలం పరిసర ప్రాంతములలో ఉన్నవారికి విక్రయించుటకు ప్రయత్నం చేస్తున్నట్లుగా తెలిసినది. సదరు భూములపై నా క్లయింటుకు ఆమె పిల్లలకు మాత్రమే హక్కు అనుభవం కలదని ఈ పత్రికా ప్రకటనా మూలకముగా జనయావన్మందికి తెలియజేయడమైనది. ఎవరైనా అన్యాక్రాంతముగా సదరు భూమిని కొనుగోలు చేసినచో వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకోబడునని ఈ బహిరంగ ప్రకటన మూలకముగా జన యావన్మందికి తెలియజేయడమైనది. ఈ క్రింది సర్వే నెంబర్‌లలో సదరు ఆస్తులు కలవు.

సర్వే నెం.లు మరియు విస్తీర్ణం: 296/13, 0-21 సెంట్లు, 296/9C 0-15, 296/14 0.17, 423/3 0.14, 279/18 0.20, 428/9B 0.25, 414/1 0.56, 295/8 0.21, 428/9A 0.13, 423/3 0.21 సెంట్లు.

లఖనేని శ్రీనివాసులు B.A.,B.L,
అడ్వకేట్, కోటబొమ్మాళి, సెల్: 9676549303

భాజపా బలోపేతానికి కృషి

కొత్తూరు, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో భాజపా బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరావు అన్నారు. జిల్లా కార్యాలయంలో కొత్తూరు మండలానికి చెందిన కె.ఇల్లంనాయుడు, గణపతిరావు, సూర్యనారాయణ తదితరులు సోమవారం భాజపా తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆయన కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. మండలాధ్యక్షుడు భాస్కరరావు, జాన్ కటారి పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో భాజపా జిల్లా అధ్యక్షుడు తేజేశ్వరరావు

ఫలించిన కృషి

– న్యూస్‌టుడే, సారవకోట

సారవకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల కృషికి ఫలితం దక్కింది. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఏప్రిల్ నెల నుంచే గ్రామాల్లో తిరిగి పిల్లల్ని చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. వేసవి సెలవుల్లోనూ నెల రోజుల పాటు సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తున్నప్పటికీ ఇక్కడ మాత్రం ఈ విద్యాసంవత్సరంలో 92 మంది కొత్తగా చేరారు.

ఆటోల ఏర్పాటు.. చిన్నగుజ్జువాడ, కిడిమి ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థుల రాకపోకలకు ఆటోలు ఏర్పాటు చేయిస్తామని తల్లిదండ్రులకు చెప్పడంతో ఆయా గ్రామాల నుంచి 20 మంది విద్యార్థులు చేరారు. ప్రైవేటు పాఠశాలల నుంచి మరో 15 మంది ప్రవేశాలు పొందారు. గతేడాది 235 మంది పిల్లలుండగా ప్రస్తుతం 272 మంది ఉన్నారు. మరో 10 మంది వరకు చేరే అవకాశముందని హెచ్ఎం ఆర్.రామకృష్ణారావు తెలిపారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పిల్లలను చేర్పించడానికి తమ వంతు కష్టపడుతున్నారు. సారవకోట ఉన్నత పాఠశాలలో ఎక్కువ మంది చేరడం ఆనందంగా ఉందని ఎంఈవో ఎం.వెంకటరమణ చెప్పారు.

ప్రైవేటు విద్యాలయాల నుంచి సారవకోట ఉన్నత పాఠశాలలో చేరిన విద్యార్థులు

సచివాలయ సిబ్బందితో సమీక్ష

పోలాకి, న్యూస్‌టుడే: పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు రాజగోపాలరావు అన్నారు. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో జి.వి.రవికుమార్, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంఈవో ఎం.లింగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ జేడీ కె.రాజగోపాలరావు

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత

పాతపట్నం, న్యూస్‌టుడే: మహిళల భద్రతకు శక్తి యాప్ ఎంతగానో దోహదపడుతుందని శక్తి టీం టెక్కలి డివిజన్ ఇన్‌ఛార్జి ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. సోమవారం పాతపట్నంలోని కిరణ్మయి డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాల బాలికలకు యాప్ వినియోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

(c) eenadu

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి

ఆమదాలవలస కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సోమవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘ మహిళలు అమ్మవారిని 108 రకాల కూరగాయలు, పండ్లతో అలంకరించారు. అనంతరం లలితా సహస్రనామ, కన్యకాపరమేశ్వరి పారాయణం చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

తెరపై ఈనాడు

● కిన్నెర: 3బీహెచ్‌కే ● కీర్తన: సోలో బోయ్, లోపలికి రా.... చెప్తా !, జురాసిక్ వరల్డ్ రీబర్త్ ● కీర్తి : షో టైం ● మారుతి : శివ ● ఎస్వీసీ (రామలక్ష్మణ): కుబేరా ● సన్‌మార్క్స్: తమ్ముడు ● సూర్యమహల్: కన్నప్ప ● సరస్వతి: జురాసిక్ వరల్డ్ రీబర్త్,మార్గన్

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

జగన్నాథా పాహిమాం..!

శ్రీకాకుళం నగరంలో గుజరాతీపేటలో జగన్నాథస్వామి ఆలయంలో పదకొండు రోజుల పాటు నిర్వహించిన రథయాత్ర ఉత్సవాలు సోమవారం మారురథయాత్రతో ముగిశాయి. ఇందులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గుజరాతీపేట నుంచి పాతపట్నం రహదారిలో అరగంటపాటు వాహనాలు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

కూటమితోనే అన్ని రంగాలకు ఊతం

నెలివాడలో మహిళకు కరపత్రం ఇస్తున్న ఎంపీ కలిశెట్టి, నాయకులు

రణస్థలం, ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సోమవారం సాయంత్రం రణస్థలం మండలం నెలివాడలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. తెదేపా మండలాధ్యక్షుడు లంకశ్యామ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ● చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకుంటుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలం అక్కులపేటలో సుపరిపాలన ముందడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేటలో సర్పంచి బొడ్డేపల్లి గోవిందరావు కలిసి రూ.1.03 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు, కాలువలను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే నియోజకవర్గంలో అన్ని పంచాయతీల అభివృద్ధికి రూ.138 కోట్లు మంజూరు చేసిందన్నారు. తెదేపా మండలాధ్యక్షుడు నూక రాజా, ఎంపీటీసీ సభ్యురాలు బొడ్డేపల్లి సుగుణ, తెదేపా మహిళా జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాసాచార్యులపేటలో సీసీ రోడ్డు, కాలువలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

పారిశుద్ధ్యం పడకేసింది..!

❖ జ్వరాల బారిన పడుతున్న ప్రజలు

– న్యూస్‌టుడే, జి.సిగడాం, లావేరు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా మారింది. గ్రామాల్లో తూతూ మంత్రంగా పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే తాండవిస్తోంది. నెలలు తరబడి కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. ప్రస్తుతం కాలానుగుణ వ్యాధుల బారినపడి గ్రామీణులు అవస్థలు పడుతున్నారు.

● ఇటీవల జి.సిగడాం మండలం టంకాల దుగ్గివలస గ్రామంలో ఇటీవల 50 మంది, ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట 100 మంది వరకు జ్వరాల బారిన పడ్డారు. ప్రస్తుతం కొంతమంది జ్వరాలతో బాధపడుతున్నారు.

లావేరు మండలం తాళ్లవలస కాలువ దుస్థితి ఇది..

అధికారుల పర్యవేక్షణ ఏదీ..?

ఎచ్చెర్ల నియోజకవర్గంలో 123 పంచాయతీలు, 100 సచివాలయాల పరిధిలో సుమారు 2.50 లక్షల జనాభా ఉంది. ఆయా సచివాలయాల పరిధిలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయకపోవడంతోపాటు కాలువల్లో, చెత్తకుప్పల వద్ద ఫాగింగ్ వంటి పనులు చేపట్టకపోవడంతో అపరిశుభ్రత నెలకొంది.

మండలం	పంచాయతీలు	సచివాలయాలు
జి.సిగడాం	31	21
లావేరు	33	23
రణస్థలం	34	27
ఎచ్చెర్ల	26	26

ఇదీ పరిస్థితి..

● జి.సిగడాం మండలంలో టీడీవలస, సీతంపేట, ఆనందపురం, అధ్వానంపేట, నిద్దాం, సేతుభీమవరం, సంతవురిటి తదితర గ్రామాల్లో ఎటుచూసినా అపారిశుద్ధ్యమే దర్శనమిస్తుంది. లావేరు మండలంలో లావేరు, బట్టుపాలేం, అదపాక, బుడుమూరు, బెజ్జిపురం, లోపెంట తదితర గ్రామాల్లో రహదారులపై మురుగునీరు ప్రవహిస్తోంది.

● రణస్థలం మండలంలో రణస్థలం, జేఆర్‌పురం, కొవ్వాడ, జీరుపాలేం, నారువ, మెంటాడ, సంచాం, అల్లివలస తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎచ్చెర్ల మండలంలో చిలకపాలెం, డి.మత్స్యలేశం, కొయ్యాం, బడివానిపేట, అల్లినగరం, ఎచ్చెర్ల తదితర గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది.

సూచనలు అందించాం

గ్రామాల్లో పక్కాగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మండల అధికారులకు సూచించాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – గోపీబాల, డివిజనల్ పంచాయతీ అధికారి, శ్రీకాకుళం

మెగా సమావేశానికి తప్పక హాజరుకావాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం): విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 10న నిర్వహిస్తున్న మెగా విద్యార్థుల, తల్లిదండ్రుల సమావేశానికి అంతా హాజరుకావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. విద్యార్థి పురోగతికి సంబంధించి తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో మాట్లాడి తెలుసుకోవాలన్నారు. *ఇండియన్ రెడ్ క్రాస్ సేవలను ప్రశంసిస్తూ అవార్డు అందజేసిన కలెక్టర్. . ఐఐటీలో ఆలిండియాలో 21వ ర్యాంకు సాధించిన పల్లి భరత్ చంద్ర, 256వ ర్యాంకును సాధించిన బి.రోహిత్ దత్‌లతో పాటు వారి తల్లిదండ్రులను సత్కరించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

రహదారిపైనే తిష్ఠ

శ్రీకాకుళం నగరంలో పశువులను వాటి పెంపకందారులు బహిరంగ ప్రదేశాల్లో వదిలేస్తున్నారు. అవి రాత్రి పగలు తేడా లేకుండా కాలినడకతో పాటు ప్రధాన రహదారుల్లో సంచరిస్తుండటంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు వివరణ కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

వర్షపు నీరు నిలిచి ఇక్కట్లు

గార మండలంలో చాలా గ్రామాల్లోని వీధులు చాలా దారుణంగా ఉంటున్నాయి. చినుకు పడితే చాలు లోతట్టుగా ఉన్న దారుల్లో మోకాలి లోతున నీరు నిలిచి అవస్థలకు నెలవుతోంది. రహదారులు అభివృద్ధి మాట పక్కన పెడితే వర్షాలకు నిలిచిన నీటిని బయటకు పంపించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కె.ఈశ్వరమ్మ వద్ద ప్రస్తావించగా ఉపాధి నిధులతో రహదారులు మంజూరయ్యాయన్నారు. – న్యూస్‌టుడే, గార

కల్వర్టు శిథిలం.. కూలితే ప్రమాదం

బూర్జ మండలం గుత్తావల్లి-నారాయణపురం మధ్య భారీ ఇసుక వాహనాలు నిత్యం రాకపోకలు చేయడంతో కల్వర్టులు దారి పొడవునా శిథిలమయ్యాయి. దీంతో ఏ క్షణమైనా ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. మరో వైపు కల్వర్టుల పక్కనే పంట పొలాలకు సమయానికి సాగునీరు అందని దుస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్ అండ్ బీ జేఈ అంజనేయ నాయక్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, బూర్జ

అర్ధరాత్రి విద్యుత్తు కోతలతో అవస్థలు..

ఎచ్చెర్ల మండలంలో నిత్యం అర్ధరాత్రి వేళల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో 12 నుంచి 3 గంటల మధ్య షేర్‌మహ్మద్‌పురం, రాజీవ్‌స్వగృహ కాలనీ, ఫరీదుపేట, కొయిరాళ్లు, ఎచ్చెర్ల తదితర ప్రాంతాలకు సరఫరా ఉండట్లేదని ఆయా గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు. కేశవరావుపేటలో రెండు రోజుల నుంచి లోఓల్టేజీతో టీవీ, ఫ్రిజ్, కూలర్లు కాలిపోయాయని స్థానికులు వాపోతున్నారు. ఏఈ హరికృష్ణ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

గురుకులాన్ని సందర్శించిన జేసీ

బూర్జ, న్యూస్‌టుడే: మండలంలోని కొల్లివలస గురుకులాన్ని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందించాలని అధికారులకు సూచించారు. వంట గదిని పరిశీలించి శుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని జేసీ చెప్పారు.

సప్తమ వర్ధంతి

08-07-2025

స్వర్గీయ అప్పు నువ్వు వెళ్లిపోయి ఏడేళ్లయినా నువ్వు మాపై చూపిన ప్రేమ, అప్యాయత, ఎన్నటికీ మరువలేము. నీ జ్ఞాపకాలు మా గుండెల్లో ఎన్నటికీ పదిలం

ఇట్లు

నీ కుటుంబ సభ్యులు, అమ్మ, నాన్న, తమ్ముడు: సిజ్జు

స్వర్గీయ అప్పు

గోవిందనగర్, శ్రీకాకుళం

(2013-2018)

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ఎచ్చెర్లలో కేకు కోస్తున్న తెదేపా నాయకులు

జి.సిగడాం, రణస్థలం, ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు జన్మదిన వేడుకలను ఎచ్చెర్ల నియోజకవర్గం వ్యాప్తంగా పలు చోట్ల సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎచ్చెర్లలో తెదేపా జిల్లా పూర్వ అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ చౌదరి అవినాష్, పార్టీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బెండు మల్లేసు, వావిలిపల్లి రామకృష్ణ పాల్గొని కేకు కోశారు. రణస్థలంలోని తెదేపా కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు లంక శ్యామ్, కార్యదర్శి కనకారావు, జి.సిగడాం మండలం మెట్టవలసలో భాజపా మండలాధ్యక్షుడు పైల విష్ణుమూర్తి, సంతవురిటిలో భాజపా నాయకులు రామకృష్ణ, అప్పారావు, పాల్గొన్నారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మండల పరిషత్తు కార్యాలయంలో తెదేపా మండలాధ్యక్షుడు కుమరాపు రవికుమార్ ఆధ్వర్యంలో కేక్ కోశారు.

సమ్మె విజయవంతం చేయండి

ఎచ్చెర్ల, కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తోన్న అఖిలభారత సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎన్.వి.రమణ పిలుపునిచ్చారు. చిలకపాలెం, శ్రీకాకుళంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు.

చిలకపాలెంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, కార్మికసంఘు నాయకులు

ఆక్రమణపై ఫిర్యాదు

జి.సిగడాం: జి.సిగడాం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని కొంతమంది ఆక్రమించారని ప్రిన్సిపల్ మైలపల్లి శ్రీనివాసరావు, తెదేపా మండలాధ్యక్షుడు కుమరాపు రవికుమార్, గ్రామస్థులు తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందించారు. కళాశాల మైదానాన్ని పరిరక్షించాలని కోరారు.

అరాచకాలపై ప్రజా పోరాటం

ఆమదాలవలస పట్టణం: నియోజకవర్గంలోని ఎమ్మెల్యే కూన రవికుమార్ అరాచకాలు మితిమీరిపోతున్నాయని, ఇప్పటికైనా వాటిని ఆపకపోతే ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని ఎమ్మెల్యేగా పోటీచేసిన స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకే అభాండాలు

పొందూరు: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకే పలువురు నాయకులు ఎమ్మెల్యే రవికుమార్‌పై అభాండాలు వేస్తున్నారని తెదేపా మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొందూరు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు.

14 ఆటోలు సీజ్

శ్రీకాకుళం నేరవార్త విభాగం: పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న 14 ఆటోలను నగర ట్రాఫిక్ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. నగరంలోని రామలక్ష్మణ కూడలిలో ట్రాఫిక్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు.

అవీ.. ఇవీ.. అన్నీ

సామాజిక తనిఖీలపై గ్రామసభ

లావేరు: సామాజిక తనిఖీల్లో భాగంగా 2024-2025 మధ్యలో చేపట్టిన పనులకు సంబంధించి మూడు రోజుల పాటు నిర్వహించిన తనిఖీపై సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఎస్ఆర్‌పీ సీహెచ్.రామచంద్రరావు మాట్లాడుతూ వివిధ పనులకు రూ.43.63 లక్షల నిధులను ఖర్చుచేశామన్నారు

రైతులకు అండగా కృషి విజ్ఞాన కేంద్రాలు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: రైతులకు అండగా కృషివిజ్ఞాన కేంద్రాలు నిలవాలని ఐసీఏఆర్ అటారి జోన్ సభ్యుడు ఎన్.మీన అన్నారు. కృషివిజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి, సేల్ కౌంటర్‌ను ప్రారంభించారు. కేవీకే సమన్వయ కర్త భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గాయపడిన చిన్నారికి ఆర్థికసాయం

పాతబస్టాండ్: నరసన్నపేట ఇందిరా నగర్ కాలనీకు చెందిన కె.శ్యామ్ చరణ్ ప్రమాదంలో గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న జిల్లా పునీత్ రాజ్‌కుమార్ అసోసియేషన్ రూ.10 వేల నగదును చికిత్స నిమిత్తం అందజేసింది.

జిల్లా విద్యుత్తు శాఖలో బదిలీలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా విద్యుత్తు శాఖలో ఇద్దరు ఇంజినీరింగ్ అధికారులకు స్థాన చలనం జరిగింది. విశాఖపట్నం తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థలో డీఈగా ఉన్న ఈ.నరసింహకుమార్‌ను ఉద్యోగోన్నతి కల్పించి టెక్కలి డివిజన్ ఈఈగా నియమిస్తూ సీఎండీ పృథ్వీతేజ్ ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ ఈఈగా విధుల్లో ఉన్న జి.శంకరరావును శ్రీకాకుళం ఎస్ఈ కార్యాలయంలో డీపీఈ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా బదిలీ చేశారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

శ్రీకాకుళం నగరం: నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ, అనుబంధ సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ధర్నా చేశారు. మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, అధ్యక్ష, కార్యదర్శులు కె.వేణుగోపాల్, కల్యాణి, అప్పలరాజులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండండి

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సత్యనారాయణ అన్నారు. పొందూరు పట్టణంలో నంబరు-2 ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరుగుతున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి మహిళలతో మాట్లాడారు.

రోటరీ క్లబ్ సేవలు ఆదర్శనీయం

ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే కూన రవి, పర్లాఖిముండి శాసనసభ్యుడు రూపేష్ పాణిగ్రాహి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ సేవలు ఆదర్శనీయమని ఒడిశాలోని పర్లాఖిముండి శాసనసభ్యుడు రూపేష్ పాణిగ్రాహి అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో కలిసి ఆమదాలవలసలోని ఓ కల్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు ఇరువురు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. హైటెక్ గ్రూప్ సంస్థల ఛైర్మన్ తిరుపతి పాణిగ్రహి, రోటరీ గవర్నర్ కల్యాణ చక్రవర్తి, రోటరీ పూర్వ అధ్యక్షులు జె.కె.వెంకుబాబు, ప్రస్తుత అధ్యక్షుడు వి.టి.చౌదరి పాల్గొన్నారు.

అలరించిన హరికథా గానం

బాపూజీ కళామందిరంలో విశ్వనాథం భాగవతార్‌కు సత్కారం

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: డా.పులఖండం శ్రీనివాసరావు సంస్మరణార్థం సుమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో బాపూజీకళామందిరంలో తొమ్మిదిరోజుల పాటు నిర్వహించనున్న హరికథా ఉత్సవాల్లో భాగంగా సోమవారం నెల్లూరుకు చెందిన కొండపల్లి విశ్వనాథం భాగవతార్ తులసీ జలంధర హరికథా గానం జరిగింది. సుమిత్ర కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ, ఉపనిషన్మందిరం సంస్థ అధ్యక్షుడు గుమ్మా నగేష్‌లు అతిథులుగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

చికిత్స పొందుతూ మృతి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల సాయుధ పోలీసు క్వార్టర్స్‌కు సమీపంలో పాత జాతీయరహదారిపై ఈ నెల 1న రోడ్డు ప్రమాదంలో గాయపడిన లింగాలపేటకు చెందిన వంక శ్రీనివాసరావు (42) చికిత్సపొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన రోజు రాత్రి 8 గంటల సమయంలో శ్రీనివాసరావు పోలీసు క్వార్టర్స్‌లో జరిగిన ఓ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను తొలుత శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కామర్స్‌పేట వాసి అదృశ్యం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని అల్లినగరం పంచాయతీ కామర్స్‌పేటకు చెందిన కోల మల్లేశ్వరరావు ఈ నెల 2వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య పార్వతి ఎచ్చెర్ల పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆ రోజు కూలి పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడని, తాను ఉపాధిహామీ పనుల కోసం వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంట్లో సెల్‌ఫోన్‌ను విడిచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె ఫిర్యాదు పేర్కొంది. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వాకబు చేసిన ఆచూకీ లభ్యం కాలేదని వాపోయారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పశువుల వాహనం పట్టివేత..

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండలంలో జాతీయ రహదారి బుడుమూరు కూడలి నుంచి అక్రమంగా విశాఖపట్నం తరలిస్తున్న పశువుల వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం సంతలో కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్న 7 పశువులు, ఒక వ్యానును స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.లక్ష్మణరావు తెలిపారు.

అడుగేయలేం..వాహనాలు నడపలేం

● అధ్వానంగా గ్రామీణ రహదారులు ● రాకపోకలకు అవస్థలు పడుతున్న ప్రజలు

న్యూస్‌టుడే, బూర్జ

ఆమదాలవలస నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు గుంతలతో అధ్వానంగా మారి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లె రోడ్లు దయనీయంగా తయారయ్యాయి. గుంతల్లో వర్షపునీరు చేరి ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి. నాయకులు, సంబంధిత అధికారులు స్పందించి రహదారులు బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

చీడివలస సమీపంలో గుత్తావల్లి రహదారి దుస్థితి ఇది

దారుణంగా మారాయి..

బూర్జ మండలంలో నామాల లక్ష్మీపురం, కొల్లివలస-గుత్తావల్లి రహదారులు సుమారు రెండు కి.మీ పొడవునా అడుగేయలేనంత దారుణంగా ఉన్నాయి. చీడివలస, నారాయణపురం సమీపంలో గుంతలు ఏర్పడ్డాయి. తోటవాడ, అన్నంపేట మార్గం అధ్వానంగా ఉంది. పణుకుపర్త నుంచి అల్లెన, ఉప్పినివలస కూడలి, ఏబీసీపేట, గిరిజన గ్రామాలైన కొత్తవలస, హరిపురం రోడ్లు చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారుతున్నాయి. ఆమదాలవలస మండలంలో ఇసుకలపేట, సిరిశింపేట, దివంజిపేట, ఆనందపురం, పొన్నానపేట, రామచంద్రాపురం రహదారులు దుర్భరంగా ఉన్నాయి.

రాళ్ల పిక్కలు తేలి..

పొందూరు మండలంలో లక్ష్మీపేట నుంచి తండ్యాం, బాణాం నుంచి లావేరు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారాయి. సరుబుజ్జిలి కూడలిలో, అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో పలు చోట్ల రాళ్ల పిక్కలు తేలి దర్శనమిస్తున్నాయి. ఆదివాసీ గ్రామాలకు నడిచి వెళ్లాలన్నా ఇబ్బందిగా మారింది.

తక్షణ చర్యలు తీసుకుంటాం..

జిల్లాలో రహదారుల కోసం ప్రభుత్వం, ఉన్నత అధికారులకు రూ.50 కోట్ల నిధులు అవసరమని నివేదించాం. గుంతలు ఏర్పడిన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని ఇటీవల కలెక్టరు సూచించారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. కొన్నిచోట్ల ఇప్పటికే నిధులు మంజూరై ఉన్నాయి. టెండర్లు పూర్తయితే పనులు ప్రారంభిస్తాం. - గణపతిరావు, ఆర్అండ్‌బీ డీఈఈ

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన ఏ.పీ.గ్రామీణ బ్యాంక్ రాగోలు బ్రాంచ్ మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టాపై ఈ బహిరంగ ప్రకటన.

నా క్లయింటు అయిన రాగోలు ఏపీ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ గారు శ్రీ గండేపల్లి శరణ్ తండ్రి లేటు ఆదినారాయణ, తురాయిచెట్టు వీధి శ్రీకాకుళం పట్టణం వారు గృహ ఋణమునకై వారు ఆనెం చంద్రమౌళి వద్ద గారి నుండి తేదీ 22.03.2025న అగ్రిమెంటు పొందియున్నారు. పై ఆనెం చంద్రమౌళి గారు వారికి దఖలుపడిన ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్స్ బ్యాంకుకి ఇచ్చి ఉన్నారు. సదరు షెడ్యూల్ దాఖల ఆస్తిపై ఎట్టి ఆక్షేపణలు గాని, అభ్యంతరములు గాని లేవని నిర్ధారించుకొనుటకు ఈ ప్రకటన చేయడమైనది. అయినను ఎవరికైనా ఈ క్రింది షెడ్యూల్ దాఖల ఆస్తిపై ఎట్టి అభ్యంతరములు గాని, ఎట్టి హక్కులు గాని, ఎట్టి ఆర్థిక లావాదేవీలు గాని ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురించిన వారం దినములలో రాగోలు ఏ.పి.గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ గారికి గాని ఈ క్రింది ఉదహరించిన న్యాయవాది గారికి గాని తెలియజేయవలెను. పై వారము దినములలో ఎట్టి అభ్యంతరములు రాని ఎడల సదరు షెడ్యూల్ దాఖల ఆస్తి నిర్వివాదమైన ఆస్తిగా పరిగణించి ఋణమునకై తదుపరి చర్యలు చేయడం అగునని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్ ఆస్తి: శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్ డివిజన్, శ్రీకాకుళం మండలం, చాపారం గ్రామపంచాయతీ ప్రస్తుతం శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్న బలగ గ్రామం ఉత్తర దిశలో ఉన్న లే-అవుట్ ఖాళీ స్థలము ప్లాట్ నెంబర్ 8 లే-అవుట్ పి.ఆర్.నెంబర్ తేది: 15.07.2025, పాత సర్వేనెంబర్: 505 పార్ట్, కొత్త సర్వే నెంబర్ 5/5లో 195.55 చ.గజాలు, లేదా 163.47 చ.మీ. తూర్పు-పడమరలకు 32 అడుగులు అనగా 9.753.మీ. మరియు ఉత్తర-దక్షిణలకు 55 అడుగులు అనగా 16.764 మీ. కలిగిన ఈ దిగువ హద్దులు మధ్యస్థంలో గల ఖాళీ స్థలం: తూర్పు :ప్లాట్ నెంబర్ 9 ఖాళీ స్థలం, దక్షిణం : లే-అవుట్ రోడ్డు, పడమర :ప్లాట్ నెంబర్ 7 ఖాళీ స్థలం, ఉత్తరం : గరికయ్య మాస్టరు గారి లే -అవుట్.

పి.వి.యస్. సీతారామయ్య, బి.యస్సీ, బి.యల్., న్యాయవాది, డో.నెం.7-3-1, న్యూ కోలనీ, శ్రీకాకుళం. సెల్ : 9848407726

బహిరంగ ప్రకటన

మా క్లయింట్స్ అయిన బెహరా చిన్న వెంకటరావు కుమార్తెలయిన డబ్బీరు మురళి భార్య పుష్ప, డబ్బీరు సత్యనారాయణ భార్య అయిన జగదాంబ, కల్లెపల్లి నాగభూషణరావు భార్య విజయలక్ష్మి మాకు ఇచ్చిన భోగట్టాపై ఈ బహిరంగ ప్రకటన ద్వారా యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్థి బెహరా లక్ష్మీనారాయణ కుమారుడు చిన్న వెంకటరావు తేది. 14-02-1997 లో రిజిస్ట్రీ క్రియచీటి ద్వారా కొంటిరి. సదరు చిన్న వెంకటరావు తేది. 07-02-2011న వీలునామా వ్రాసితిరి. సదరు వీలునామా ప్రకారము తన రెండవ భార్య వరలక్ష్మి తన జీవిత కాలములో అనుభవించుటకు మాత్రమే హక్కు కల్పిస్తూ, తన తదనంతరం మా ముగ్గురు క్లయింట్స్‌కు సర్వ హక్కులతో దఖలు పడేటట్లు వ్రాసితిరి. సదరు చిన్న వెంకటరావు తేది. 25-10-2011న మరణించితిరి. సదరు వీలునామా ప్రకారం తన రెండవ భార్య వరలక్ష్మి అనుభవించుకోవలెను. ఆమె తదనంతరం మా క్లయింట్స్‌కు సర్వహక్కులు దఖలుపడును.

బెహరా వరలక్ష్మి తన దుర్బుద్ధితో లేని హక్కులు కల్పించుకొంటూ అమ్మివేయుటకు ప్రయత్నించగా మా క్లయింట్స్ శ్రీకాకుళంలో గల ఫ్యామిలీ కోర్టులో O.S. No: 39/2015 దావా వేయగా సదరు దావాని తేది. 29-02-2024న డిస్మిస్ చేసితిరి. దానిపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో A.S. No: 201/2024 అప్పీలు పెండింగ్‌లో ఉన్నది. దావా విచారణలో ఉండగా బెహరా వరలక్ష్మి చనిపోయినది. ఆమెకు ఎటువంటి సంతానము లేదు. వరలక్ష్మి వారసులమని రత్నాదేవి, పద్మ, శర్మ షెడ్యూలు ఆస్తులు అమ్మివేయుటకు ప్రయత్నిస్తున్నట్లుగా తెలియవచ్చినది. అప్పీలు పెండింగ్‌లో ఉన్నందున మా క్లయింట్స్ తప్పించి వేరెవరికి హక్కులు లేనందున వారు జరిపిన ఎటువంటి పురోణీలు కాని, అగ్రిమెంట్లు గాని, క్రయములు గాని చెల్లనేరవు. అవి మా క్లయింట్స్‌కు బంధించవు.

షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం మండలం, కిల్లిపాలెం గ్రామ పంచాయతీలో గల బ్యాంకర్స్ కాలనీ, ప్లాటు నెం: 184, సర్వే నెంబరు 22-7, 22-8, డో. నెం: 34-84 ఇంటికి హద్దులు: తూర్పు: ప్లాటు నెం. 185 ఖాళీ స్థలం, దక్షిణం: గైనేటి అయోధ్య రామ, ఉత్తరం: లేఅవుట్ రోడ్డు, పడమర: ప్లాట్ నెం: 183.

TANGI SIVA PRASAD RAO

ADVOCATE, Srikakulam. Cell: 8074221503

(c) eenadu

తిరుచ్చెందూర్ మురుగన్ ఆలయంలో కనులపండువగా కుంభాభిషేకం

■ భారీగా తరలివచ్చిన భక్తజనం

ప్యారిస్, న్యూస్‌టుడే: తిరుచ్చెందూర్ మురుగన్ ఆలయ కుంభాభిషేకం కనులపండువగా జరిగింది. మురుగన్ పుణ్యక్షేత్రాల్లో(అరుపడై వీడుగల్) రెండోది, సముద్రతీరంలో ఉన్న ఆలయాల్లో అత్యంత ప్రాముఖ్యత పొందిన క్షేత్రంగా తిరుచ్చెందూర్ ఆలయం భాసిల్లుతోంది. ఇక్కడ 2009లో కుంభాభిషేకం జరిగింది. ఆ తర్వాత వివిధ కారణాలతో నిర్వహించలేదు. 2022లో రూ.300 కోట్లతో ఆలయంలో వివిధ పనులు ప్రారంభించారు. ఇవి పూర్తయిన నేపథ్యంలో 15 ఏళ్ల తర్వాత సోమవారం వేడుక జరిగింది. సుమారు 8వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ యాగశాల ఏర్పాటు చేసి జులై 1 నుంచి యాగశాల పూజలు కొనసాగిస్తున్నారు. స్వామి షణ్ముగర్‌కు 49, జయంతినాథర్ 5, నటరాజర్ 5, పెరుమాళ్ 5, పరివార మూర్తులకు 12 యాగగుండాలను ఏర్పాటు చేసి ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహిస్తున్నారు. మహా కుంభాభిషేకంలో భాగంగా సోమవారం తెల్లవారుజామున 12వ కాల యాగశాల పూజలు జరిగాయి. అనంతరం దీపారాధన, పూర్ణాహుతి నిర్వహించారు. రాజగోపురానికి పవిత్రజలాలను తీసుకెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన తొమ్మిది కలశాలకు పూజలు చేసిన అనంతరం భక్తుల హరోంహర నినాదాల నడుమ అభిషేకించారు. అనంతరం కలశాలకు దీపారాధన చేశారు. మూలవిరాట్టు షణ్ముగర్, వళ్లి, దేవసేన, పెరుమాళ్, నటరాజర్ తదితర పరివారమూర్తుల సన్నిధిలో ఉన్న కలశాలకు పుణ్య జలాలను పోసి కుంభాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో తమిళంలో మంత్రాలను వినిపించారు. కుంభాభిషేకంలో మంత్రులు శేఖర్ బాబు, అనితారాధాకృష్ణన్, కేంద్ర మాజీ మంత్రి పొన్ రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. కుంభాభిషేకం ముగిసిన తర్వాత సముద్రతీరంలో 20 డ్రోన్ల ద్వారా భక్తులపై పుణ్య జలాలను పోసే కార్యక్రమం జరిగింది. వేడుకలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. అదనపు డీజీపీ దేవిడ్సన్ దేవాశీర్వాదం నేతృత్వంలో 6 వేల మంది పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.

వేడుకలో పాల్గొన్న భక్తులు

రాజగోపురంలోని కలశాలను పవిత్రజలాలతో అభిషేకిస్తున్న అర్చకులు

డ్రోన్‌తో భక్తులపై పుణ్యజలాలు పోస్తున్న దృశ్యం

విద్యుత్తుదీపాల అలంకరణలో ఆలయం

ఇంజినీరింగ్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు 3.2లక్షల మంది విద్యార్థులు నమోదు చేసుకున్న నేపథ్యంలో 2.41 లక్షల మందికి ర్యాంకులు ఇచ్చారు. విద్యార్థుల ప్రవేశాలకు ఆన్‌లైన్ కౌన్సిలింగ్ సోమవారం నుంచి ప్రారంభమైంది. మొదటి విడతగా 7.5శాతం రిజర్వేషన్ కింద ప్రత్యేక విభాగానికి సోమవారం కౌన్సిలింగ్ ప్రారంభమైంది. దివ్యాంగుల విద్యార్థులు, మాజీ సైనికుల విభాగం, క్రీడా విభాగంలో విద్యార్థులకు కౌన్సిలింగ్ జరిగింది.. ఇంకా జనరల్ కేటగిరిలోని ప్రత్యేక విభాగానికి కౌన్సిలింగ్ జూలై 9వ నుంచి 11వ తేది వరకు జరగనుంది. 7.5శాతం రిజర్వేషన్ కింద 47,372మంది విద్యార్థులు, క్రీడా విభాగం కింద 2,446మంది విద్యార్థులు, సైనికుల విభాగంలో 437 మంది కౌన్సిలింగ్‌లో పాల్గొన్నారు.

టీవీకే ఆందోళనకు పోలీసుల అనుమతి

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆలయ కాపలాదారుడు అజిత్‌కుమార్ మృతి వ్యవహారమై టీవీకే ఆందోళనకు పోలీసులు అనుమతిచ్చారు. అజిత్‌కుమార్ మృతి కేసులో న్యాయం అందించాలని, హైకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని కోరుతూ టీవీకే తరఫున చెన్నై ఎగ్మూర్ రాజారత్నం మైదానంలో జులై 3న ఆందోళన చేయనున్నట్లు ప్రకటించారు. పోలీసులు అంగీకరించకపోవడంతో 6న ఆందోళనకు అనుమతివ్వాలని టీవీకే తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. అనుమతి లభించడంలో ఆలస్యం కావడంతో మళ్లీ ఆందోళన వాయిదా పడింది. హైకోర్టు ఆదేశం మేరకు పోలీసులు అనుమతి ఇచ్చారు. ఎగ్మూర్ రాజారత్నం మైదానం కాకుండా శివానందసాలైలో ఆందోళన చేయొచ్చని తెలిపారు.

రాష్ట్రంలో రికార్డుస్థాయి సౌర విద్యుదుత్పత్తి

వడపళని, న్యూస్‌టుడే: రాష్ట్రంలో శనివారం రికార్డుస్థాయిలో సౌర విద్యుదుత్పత్తి జరిగింది. ఫిబ్రవరి 16న 6,529 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికాగా శనివారం 6,617 మెగావాట్లుగా నమోదైనట్లు తమిళనాడు స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్(టీఎన్ఎస్ఎల్‌డీసీ) డేటా విడుదల చేసింది. రోజువారీ సౌర విద్యుత్తు 48.5 మిలియన్ యూనిట్లు(ఎంయూ), ఫిబ్రవరి 11న ఉన్న 48.3 ఎంయూ కన్నా ఇది కాస్త ఎక్కువేనని అన్నారు. ఆకాశం కాంతివంతంగా ఉండటం, సూర్యరశ్మితో కూడిన వాతావరణం, ఇటీవల కురిసిన జల్లులే కారణమని తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎన్‌జీఈసీఎల్) సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. రూఫ్‌టాప్ సౌర ఉత్పత్తి 1,000 మెగావాట్లతో రాష్ట్రంలో మొత్తం సౌర విద్యుత్తు 10,159 మెగావాట్లుగా ఉందన్నారు. శనివారం 100 మిలియన్ యూనిట్ల సామర్థ్యంతో పవన విద్యుత్తు కూడా ఈ ఏడాదిలో మొదటిసారి ఉత్పత్తిని అధిగమించింది. టీఎన్‌పీడీసీఎల్ 104.1 మిలియన్ యూనిట్ల పవన శక్తిని సాధించి, గరిష్ఠంగా 5,574 మెగావాట్ల ఉత్పత్తి, రాష్ట్రంలో 11,361.85 మెగావాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న గవర్నర్

గవర్నర్ ఆర్‌ఎన్ రవి, కుటుంబ సభ్యులకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ రవి సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే ఛైర్మన్ తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, డిప్యూటీ ఈవో ఆర్1 భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకులు బాగుపడాలని..

వ్యవసాయ కార్మికులు
2012 - 43 శాతం
2024 - 22 శాతం
తగ్గుదల - 21 శాతం

● వ్యవసాయం నుంచి ఇతర రంగాలకు వెళుతున్న ప్రజలు
● పట్టణం, నగరాలకు తరలుతున్న వైనం
● మారుతున్న రాష్ట్ర గ్రామీణ ముఖచిత్రం

రాష్ట్ర గ్రామీణ ప్రజల్లో భారీమార్పులు చోటు చేసుకుంటున్నాయి. పూర్తిస్థాయిలో వ్యవసాయం పైనే ఆధారపడే పరిస్థితి సన్నగిల్లుతోంది. జీవన ప్రమాణాల్ని పెంచుకోడానికి, ఆర్థికవృద్ధి సాధించేందుకు చాలా కుటుంబాలు పరితపిస్తున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రణాళిక సంఘం విడుదలచేసిన నివేదిక ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది.
ఈనాడు-చెన్నై

తమిళనాడులో 2012 నాటికి వ్యవసాయరంగంలో పనిచేసే కార్మికులతో పోల్చితే ప్రస్తుతం 21 శాతం తగ్గినట్లు స్పష్టత వచ్చింది. వ్యవసాయేతర రంగాలపైనే ఆ కుటుంబాల దృష్టి మరలింది. ప్రస్తుత అంచనాల ప్రకారం గ్రామీణుల్లో మగవారు 75 శాతం, మహిళలు 50 శాతం వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. వారంతా దగ్గర్లోని పట్టణాలు, నగరాలకు వెళ్లి డబ్బులు సంపాదిస్తున్నట్లు వెల్లడైంది. గ్రామీణ ముఖచిత్రంలో చోటుచేసుకుంటున్న మార్పుకు ఇదొక నిదర్శనం.

విరుదునగర్‌లో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న మహిళలు

యువత సంగతేంటి?

పల్లె, మండల ప్రాంతాల్లోని యువత చదువుకు ప్రాధాన్యం ఎటువంటి కోణంలోనా ప్రణాళిక సంఘం గణాంకాలు సేకరించింది. 20-29 ఏళ్ల మధ్య యువత తమ చదువులు పూర్తిచేసుకున్న వెంటనే వ్యవసాయేతర రంగాల్లో స్థిరపడ్డారు. వారిలో యువకులు 94 శాతం, గ్రామీణ యువతులు 87 శాతం ఉన్నారు. ప్రధానంగా యువకులు అధికంగా నిర్మాణరంగాన్ని ఎంచుకున్నారు. 15-34 ఏళ్లలోపు యువత తాము పనిచేస్తున్నచోట అధిక వేతనాలు పొందుతున్నారు. వ్యవసాయంతో పోల్చితే నిర్మాణరంగంలో మంచి వేతనం, భద్రత ఉందని నివేదికలో చెప్పారు.

ఆ నాలుగు జిల్లాల్లో ఇలా..

విరుదునగర్, తిరునెల్వేలి జిల్లాల్లో మగవారు ఎక్కువగా నిర్మాణరంగాన్ని, ఆడవారు ఉత్పత్తి తయారీరంగాన్ని ఎంపిక చేసుకున్నట్లు తేలింది. తద్వారా తమ కుటుంబాలకు అధికమొత్తాన్ని సంపాదిస్తున్నారు. మరోవైపు తంజావూరు, పుదుక్కోట్టై జిల్లాలో మాత్రం వ్యవసాయాన్ని ఎక్కువమంది వదల్లేదు. ప్రత్యామ్నాయ ఆలోచనలు చేసిన కొన్ని కుటుంబాల్లో ఆడవారు, మగవారు ఎక్కువగా నిర్మాణ రంగంలోనే ఉపాధి చూసుకున్నారు. విరుదునగర్ జిల్లాల్లో గ్రామంలోనే పనికి వెళుతున్నవారు 24.7 శాతం మంది కాగా తిరునెల్వేలిలో అది 38.2 శాతంగా ఉంది. గ్రామం నుంచి 5 కి.మీ. దూరంలో విరుదునగర్ జిల్లాలో 10 శాతం, తిరునెల్వేలిలో 8 శాతం మంది పని కోసం వెళుతున్నారు. 20 కి.మీ మించి వెళుతున్నవారు విరుదునగర్‌లో 13.1 శాతం, తిరునెల్వేలిలో 12.9 శాతం మంది ఉన్నారు.

నైపుణ్యం, సమతుల్యత అవసరం

గ్రామీణుల్లో ఆర్థిక వనరులు పెరగడం గొప్ప విషయంగానే భావిస్తున్న ప్రభుత్వం, ఇతర రంగాలతో పాటు వ్యవసాయరంగాన్ని కూడా కాపాడేందుకు ప్రయత్నించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ప్రతిపాదించింది. ప్రత్యేకించి వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు తీసుకురావాలని, యాంత్రికరణ జరగాలని చెప్పింది. ఇతర రంగాలపై చేసిన ప్రతిపాదనలు చూస్తే..
● వివిధ రంగాల్లో స్థిరపడేందుకు యువతకు నైపుణ్యాలతో కూడిన శిక్షణ ఇవ్వాలి.
● గ్రామీణ నేపథ్యంగానే సూక్ష్మ వాణిజ్య పద్ధతుల్ని ప్రవేశపెట్టాలి. అదే తరహాలో స్టార్టప్‌లు పెట్టే స్థాయికి యువతను తయారు చేయాలి.
● ఊళ్లలోని ఎంఎస్ఎంఈలను బలోపేతం చేయడంతోపాటు జాబ్ క్లస్టర్లుగా వాటిని మార్చి ఉపాధి అందించాలి.
● వాటిని అమలుచేస్తే గ్రామీణ ప్రాంతాలు ఆర్థికంగా ఎదగడంతో పాటు సమతుల్యత సాధించినట్లవుతుంది.

పాలనలోకి రాగానే అత్తికడవు- అవినాశీ ప్రాజెక్ట్ విస్తరణ

● కోవై నుంచి ప్రచారం ప్రారంభించిన ఈపీఎస్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే పాలనలోకి రాగానే అత్తికడవు- అవినాశీ ప్రాజెక్టు విస్తరణ అమలు చేస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ప్రకటించారు. మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం (ప్రజలను కాపాడుదాం.. తమిళనాడును రక్షిద్దాం)పేరిట ప్రచారాన్ని కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళ్యంలో సోమవారం ఆయన ప్రారంభించారు. తొలుత ఆయన మేట్టుపాళ్యం వనభక్తి కాళియమ్మన్ ఆలయాన్ని దర్శించారు. అనంతరం తెక్కంబట్టి ప్రాంతంలో రైతులు, చేనేతలు, ఇటుక తయారీదారులతో సమావేశం నిర్వహించారు. ఎడప్పాడి పళనిసామి మాట్లాడుతూ.. రూ.వెయ్యికోట్ల అంచనాతో సిద్ధం చేసిన 'అత్తికడవు- అవినాశీ' ప్రాజెక్టును డీఎంకే ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. అన్నాడీఎంకే పాలనలోకి రాగానే ఆ పథకాన్ని అమలు చేస్తామన్నారు. అన్నాడీఎంకే హయాంలో రైతుల కోసం చెరువుల్లో పూడికతీయించామని గుర్తుచేశారు. ఈ పాలనలో ఆ పనిని పక్కన పెట్టేశారన్నారు. పశుసంవర్ధకశాఖ కోసం ఏర్పాటు చేసిన పరిశోధన కేంద్రానికి తాళాలు వేశారన్నారు. రైతులకు తాము త్రీఫేజ్ విద్యుత్తు సక్రమంగా అందించామన్నారు. డీఎంకే పాలనలో నాలుగుసార్లు విద్యుత్తు ఛార్జీల పెంపుతో చేనేతలు నష్టపోయారని తెలిపారు.

ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిసామి, చిత్రంలో నయినార్ నాగేంద్రన్, ఎల్.మురుగన్ తదితరులు

ప్రచార ప్రయాణంలో చేరండి..

ఆర్కేనగర్: ప్రచార ప్రయాణంలో ప్రతి పార్టీ సభ్యుడు చేరాలని ఈపీఎస్ ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన లేఖ రాశారు. అందులో..అన్నాడీఎంకేను పాలనలోకి తీసుకురావాలన్నది అందరి కోరిక అని తనకు తెలుసన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు వెళ్లాలని పార్టీ విజయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

సమావేశంలో దొంగల చేతివాటం..

కోయంత్తూర్: తెక్కుంబట్టిలో కార్యక్రమానికి విచ్చేసిన మాజీ పంచాయతీ ఉపాధ్యక్షుడు తంగరాజ్ జేబులోని రూ.లక్ష నగదును దుండగులు బ్లేడుతో కోసి చోరీ చేశారు. మరో పార్టీ నిర్వాహకుడు నెల్లితురైకు చెందిన ఆనంద్ వద్ద రూ.లక్ష, అబు అనేవ్యక్తి వద్ద రూ.2,500 నగదు చోరీ జరిగింది. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్ షోలో జనాన్ని చూసి స్టాలిన్‌కు జ్వరం రావచ్చు..

ఆర్కేనగర్: మేట్టుపాళ్యంలో జనం రద్దీ చూసి సీఎం స్టాలిన్‌కు జ్వరం రావచ్చని ఎడప్పాడి పళనిసామి తెలిపారు. మేట్టుపాళ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో రోడ్‌షో నిర్వహించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, కేంద్ర సహాయమంత్రి ఎల్.మురుగన్, మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి తదితరులు పాల్గొన్నారు. ఈపీఎస్ మాట్లాడుతూ కేంద్రం నుంచి పథకాలు పొంది ప్రజలకు మంచి చేయడానికే భాజపాతో కూటమి పెట్టుకున్నామని తెలిపారు. అన్నాడీఎంకే కూటమిలో మరిన్ని పార్టీలు చేరుతాయన్నారు. అమ్మా మినీ క్లినిక్ తదితర అన్నాడీఎంకే పాలనలో తీసుకొచ్చిన పథకాలను ఆపేయడమే డీఎంకే విజయమన్నారు.

కార్యకర్తలను కాపాడుకునేందుకే ఈపీఎస్ పర్యటన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే కార్యకర్తలను భాజపా నుంచి కాపాడుకునేందుకే ఎడప్పాడి పళనిసామి పర్యటన ప్రారంభించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ ఆరోపించారు. ఆయన తిరుచ్చిలో విలేకరులతో మాట్లాడారు. సీపీఐ 26వ మహానాడు ఆగస్టు 15 నుంచి 18 వరకు సేలంలో జరగనుందన్నారు. రెండోరోజు కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మిత్రపక్షాల నేతలు పాల్గొనున్నారని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ అన్ని కార్మిక సంఘాలు 9న దేశవ్యాప్తంగా సమ్మెలో పాల్గొననున్నాయన్నారు. తమిళనాడును రక్షిద్దామని 2021లో సీపీఐ పిలునిచ్చిందన్నారు. ఇప్పుడు ఎవరి నుంచి ఎడప్పాడి పళనిసామి తమిళనాడును రక్షించబోతున్నారని ఆయన ప్రశ్నించారు. భాజపాతో అన్నాడీఎంకే కూటమిని వారి కార్యకర్తలకే నచ్చలేదన్నారు. డీఎంకే కూటమిలో ఎన్ని సీట్లలో పోటీ అనేది చర్చల్లో నిర్ణయిస్తామన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ముత్తరసన్

అజిత్‌కుమార్ మృతిలో నిజం దాచే యత్నం

మదురై ధర్మాసనంలో పిటిషన్

ప్యారిస్, న్యూస్‌టుడే: కాపలాదారుడు అజిత్‌కుమార్ మృతికి సంబంధించిన నిజాన్ని దాచేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలైంది. మదురైకి చెందిన మహారాజన్ దాఖలు చేసిన పిటిషన్‌లో.. శివగంగై జిల్లా మడపురం కాళియమ్మన్ ఆలయంలో దర్శనం చేసుకోవడానికి వచ్చిన నిఖిత అనే మహిళ.. ఆలయ కాపలాదారుడు అజిత్‌కుమార్‌పై నగల చోరీ ఫిర్యాదు చేసిందన్నారు. అనంతరం అజిత్‌కుమార్‌ను దర్యాప్తునకు తీసుకెళ్లిన పోలీసులు రెండు రోజులు చట్టవిరుద్ధంగా కస్టడీలో ఉంచుకొని తీవ్రంగా దాడి చేశారన్నారు. గాయపడిన అతను మృతిచెందాడని, ఈ ఘటన ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఆలయంలో రికార్డయిన కెమెరా దృశ్యాలను పోలీసులతో కలసి కొందరు రహస్యంగా తీసుకెళ్లారన్నారు. అజిత్‌కుమార్ మరణంలో ఉన్న నిజాన్ని దాచేందుకు యత్నిస్తున్నవారిపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ పిటిషన్‌ను సోమవారం విచారించిన న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌ఎం సుబ్రహ్మణ్యం, జస్టిస్ మరియా గ్లాడ్ ధర్మాసనం.. అజిత్‌కుమార్ మరణానికి సంబంధించిన అన్ని కేసులను మంగళవారం(8వ తేదీ) విచారణకు వస్తాయని, అప్పుడు కలిపి విచారిస్తారని తెలిపి వాయిదా వేశారు.

ద్రావిడ రాజకీయాల్లో అగ్రగామి రెట్టమలై శ్రీనివాసన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో డీఎంకే కూటమి దృఢంగా ఉందని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ పేర్కొన్నారు. రెట్టమలై శ్రీనివాసన్ జయంతి సందర్భంగా చెన్నై ఓటేరిలోని స్మారక మందిరంలో సోమవారం నివాళులర్పించారు. అనంతరం తిరుమావళవన్ మాట్లాడుతూ రెట్టమలై శ్రీనివాసన్ ద్రావిడ రాజకీయాల్లో అగ్రగామి, జస్టిస్ పార్టీ నాయకుల్లో ఒకరు, అంబేడ్కర్‌కు ఆద్యుడు, పీడిత ప్రజల స్వరమని కొనియాడారు. ఓట్టేరి రోడ్డుకు రెట్టమలై శ్రీనివాసన్ పేరు పెట్టినందుకు చెన్నై కార్పొరేషన్, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అన్నాడీఎంకేతో విజయ్ పార్టీ చేతులు కలిపితే బలపడతుందా అనే ప్రశ్నలకు తాను సమాధానం చెప్పలేనన్నారు. డీఎంకే కూటమిలోనే ఉండి ఎన్నికలు ఎదుర్కొంటామని త్వరలో కొత్త జిల్లా కార్యదర్శులు నియమిస్తామని తెలిపారు. డీఎంకే హామీల్లోని పాత పింఛను పథకాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు.

ఏఐతో పిల్లలు ఎక్కువ నేర్చుకుంటున్నారు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల కంటే పిల్లలు ఏఐ ద్వారా చాలా ఎక్కువ నేర్చుకుంటున్నారని మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. చెన్నై కోట్టూర్‌పురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీలో ప్రైవేట్ స్వయం- ఫైనాన్సింగ్, ఇతర బోర్డు పాఠశాలలో పనిచేస్తున్న తమిళ ఉపాధ్యాయులకు పునశ్చరణ శిక్షణ మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు ఏఐ నుంచి చాలా ఎక్కువ నేర్చుకుంటున్నారని, అది పాఠశాలలో బోధించే ఉపాధ్యాయుడిలా కాదన్నారు. మనకు తమిళం లేకపోతే, మనల్ని మనం మరచిపోతామన్నారు. మన సంస్కృతి, వారసత్వం అన్నీ భాషపై ఆధారపడి ఉన్నాయన్నారు. అందుకు కీళడి తవ్వకాలే సాక్ష్యాలన్నారు. 5,300 ఏళ్ల కిందటే తమిళులు ఇనుమును ఉపయోగించిన గొప్పతనం మనం చూశామన్నారు. తమిళం మన గుర్తింపు అని, ఆంగ్లం మన అవకాశమన్నారు. అవకాశం ఉంటే ఏ భాషనైనా నేర్చుకోవచ్చన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అన్బిల్ మహేష్

చెన్నై విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై మీనంబాక్కం విమానాశ్రయానికి మళ్లీ బాంబు బెదిరింపు వచ్చింది. విమానాశ్రయంలో బాంబులు ఉన్నట్లు, అవి పేలుతాయని ఆదివారం డైరక్టరు కార్యాలయానికి ఈ-మెయిల్ వచ్చింది. వెంటనే బాంబు స్క్వాడ్ విమానాశ్రయం అంతటా తనిఖీ చేసినా కనిపించలేదు. విమానాశ్రయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నకిలీ ఈ-మెయిల్ ద్వారా విదేశాల నుంచి బెదిరింపులు వచ్చినట్లు తెలిసింది.

పీఎంకే లెటర్‌ప్యాడ్‌లో అన్బుమణి పేరు తొలగింపు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: పీఎంకే కార్యనిర్వాహక నియామక లేఖ నుంచి అన్బుమణి పేరును తొలగిస్తూ పార్టీ వ్యవస్థాపకుడు రామదాసు చర్యలు తీసుకున్నారు. గత 7 నెలలుగా రామదాసు, అన్బుమణి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. దిండివనం సమీప తైలాపురంలో రామదాసు నేతృత్వంలో ఆదివారం పార్టీ కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారు. సోమవారం రామదాసు కార్యనిర్వాహక నియామక లేఖను విడుదల చేశారు. అందులో అన్బుమణి పేరును తొలగించడంతో పార్టీ సభ్యుల మధ్య మళ్లీ కలకలం రేగింది.

భాజపా-అన్నాడీఎంకే కూటమితో డీఎంకేలో ఆందోళన

వేళచ్చేరి, న్యూస్‌టుడే: భాజపా-అన్నాడీఎంకే కూటమితో డీఎంకేలో ఆందోళన నెలకొందని రాష్ట్ర భాజపా అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. ఇరాన్‌లో చిక్కుకున్న తిరునెల్వేలి జిల్లా ఉవరికి చెందిన 15 మంది మత్స్యకారులను భారత విదేశాంగ మంత్రిత్వశాఖ రక్షించింది. ఓడ ద్వారా దుబాయ్ చేరుకున్న జాలర్లు విమానంలో దిల్లీకి ఆదివారం అర్ధరాత్రి రాగా అనంతరం చెన్నై వచ్చారు. వారికి విమానాశ్రయంలో నయినార్ నాగేంద్రన్ స్వాగతం పలికి పార్టీ తరఫున ఏర్పాటు చేసిన వాహనాల్లో సొంతూళ్లకు పంపారు. నయినార్ నాగేంద్రన్ మాట్లాడుతూ తిరునెల్వేలి జిల్లాకు చెందిన మరో 15 మంది మత్స్యకారులు ఇరాన్‌లోని మరో ద్వీపంలో ఉన్నారని వారిని కూడా రక్షించే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మరో రెండురోజుల్లో తిరిగొచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. రాష్ట్రంలో డీఎంకే ఉండకూడదన్నదే తమ విధానమని పేర్కొన్నారు. విజయ్ లక్ష్యం కూడా అదేనన్నారు. డీఎంకేకు భాజపా అంటే భయమని అన్నాడీఎంకే పొత్తు కుదుర్చుకున్నప్పటి నుంచి వారిలో ఉత్కంఠ కొనసాగుతోందని చెప్పారు.

ఇరాన్ నుంచి వచ్చిన మత్స్యకారులతో నయినార్ నాగేంద్రన్

ఆహారం దొరక్క అవస్థలు..

మత్స్యకారులు విలేకరులతో మాట్లాడుతూ తాము ఫిబ్రవరిలో చేపల వేటకు ఇరాన్ వెళ్లామని, అనంతరం అక్కడ యుద్ధం జరిగిందన్నారు. ఈ కారణంగా సముద్రంలోకి చేపల వేటకు వెళ్లలేకపోయామని, ఆహారం కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. జూన్‌లో యుద్ధం తీవ్రమవడంతో భయానక వాతావరణం చోటుచేసుకుందన్నారు. తాము ప్రత్యక్షంగా ప్రభావితం కాలేదని చెప్పారు. జీపీఎస్ పరికరాలు పని చేయలేదని తెలిపారు. తిరిగి భారత్‌కు రావాలని నిర్ణయించుకోగా తమ కుటుంబీకులు నయినార్ నాగేంద్రన్ ద్వారా ప్రయత్నాలు చేశారన్నారు. అలా సొంతూరికి వచ్చామని వివరించారు.

పునరావాస శిబిరాల్లో నివాసాలు ప్రారంభం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ తరఫున ధర్మపురి జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో రూ.36.62 కోట్లతో అదనపు భవనం, రూ.17.52 కోట్లతో నాలుగు తాలూకా కార్యాలయ భవనాలు, రూ.65.76 లక్షలతో రెండు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంతో కూడిన నివాస భవనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం సచివాలయం నుంచి వీసీ ద్వారా ప్రారంభించారు. ప్రజా, పునరావాసశాఖ తరఫున విలుపురం జిల్లా కీళత్తుపట్టు, తిరుప్పూర్ జిల్లా తిరుమూర్తినగర్, సేలం జిల్లా తమ్మంబట్టి, ధర్మపురి జిల్లా నాగావతి ఆనకట్ట, కేసర్కులి ఆనకట్ట, విరుదునగర్ జిల్లా కండియపురం తదితర ప్రాంతాల్లోని శ్రీలంక తమిళుల పునరావాస శిబిరాల్లో రూ.38.76 కోట్ల ఖర్చుతో నిర్మించిన 729 నివాసాలను ప్రారంభించారు.

భవనాలను వీసీ ద్వారా ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

వివిధ శాఖలపై సమీక్ష

సమీక్షలో సీఎం స్టాలిన్ తదితరులు

ఆర్కేనగర్: ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయంలో సోమవారం యువజన సంక్షేమం- క్రీడల అభివృద్ధిశాఖ, ప్రణాళిక-అభివృద్ధి, సహజ వనరులు, రవాణా, ఉన్నతవిద్య, సమాచార సాంకేతిక, డిజిటల్ సేవలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీల సంక్షేమం, పాఠశాల విద్య తదితర శాఖల కార్యకలాపాలపై సుమారు 4 గంటలపాటు సమీక్ష సమావేశం నిర్వహించారు. వినియోగ సమాచార వ్యవస్థ, రవాణా సంస్థల కార్యాచరణ సామర్థ్యం, 6 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు ప్రాథమిక కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేధ నైపుణ్యాభివృద్ధి ప్రాజెక్ట్ తదితర అంశాలపై చర్చించారు. ఉపముఖ్యమంత్రి ఉదయనిధిస్టాలిన్, సంబంధిత శాఖల మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

(c) eenadu

పారిశుద్ధ్య కార్మికులకు ఉపకరణాలు పంపిణీ

సామగ్రి అందిస్తున్న అధ్యక్షురాలు వడివేలు

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా నెమిలి పంచాయతీ యూనియన్ కార్యాలయ ఆవరణలో సోమవారం యూనియన్ అధ్యక్షురాలు వడివేలు నేతృత్వంలో ఏర్పాటైన కార్యక్రమంలో యూనియన్‌లోని 47 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో బీడీవోలు, శివకుమార్, మనోన్మణి, గ్రామ పంచాయతీ యూనియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జలవనరుల డిజిటల్ మ్యాపులు సిద్ధం

ఆక్రమణల గుర్తింపు సులభతరం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: జలవనరుల ఆక్రమణలు సులభంగా గుర్తించడానికి భూ సర్వేశాఖ డిజిటల్ మ్యాపులను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలో ప్రస్తుత జలవనరులు, రెవెన్యూశాఖ పత్రాల ఆధారంగా 41,948 చెరువులు ఉన్నాయి. పలు ప్రాంతాల్లో ఇవి ఆక్రమణలకు గురవడంతో ఎక్కడున్నాయో వెదకాల్సి వస్తోంది. కొన్నేళ్ల క్రితం మద్రాసు హైకోర్టు చెరువుల ఉపగ్రహ చిత్రాల వివరాలను జిల్లాలు, తాలూకాల వారీగా ప్రచురించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ప్రకారం రెవెన్యూ శాఖ చెరువుల ఉపగ్రహ చిత్రాల వివరాలను వెల్లడించింది. ఎక్కువమంది వాటిని ఉపయోగించుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న జలవనరులను డిజిటల్‌గా మార్చడానికి సర్వే శాఖ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జలవనరుల డిజిటల్ మ్యాపులను సిద్ధం చేశారు. భూ సర్వే శాఖ సీనియర్ అధికారి ఒకరు మాట్లాడుతూ... 2021 మేలో ప్రారంభించగా ఇప్పటి వరకు 14,116 చెరువులకు సంబంధించిన సర్వే పనులు పూర్తయినట్లు తెలిపారు. ఇందులో 11,372 జలవనరుల డిజిటల్ చిత్రాల మ్యాపులు తయారీ ముగిసినట్లు వివరించారు. ఈ వివరాలు https://tngis.tn.gov.in/?water-bodies వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు. జిల్లా, తాలూకా, గ్రామం పేరు ఎంపిక చేసుకొని అక్కడి జలవనరుల మ్యాపులు చూడొచ్చన్నారు.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

వృద్ధురాలికి పరీక్ష నిర్వహిస్తున్న సిబ్బంది

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీప చిన్నకావణంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి బలరామన్ ప్రారంభించారు. 16 మందితో కూడిన వైద్యుల బృందం 305 మందికి పరీక్షలు నిర్వహించింది. 16 మందికి కంటి పొర తొలగించి 32 మందికి శస్త్ర చికిత్సకు సూచించారు. సీనియర్ నేతలు ఉబయతుల్లా, శంకర్, విజయకుమార్, సత్యమూర్తి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేఎన్ నెహ్రూ సోదరుడిపై కేసు కొట్టివేత

ప్యారిస్, న్యూస్‌టుడే: మంత్రి కేఎన్ నెహ్రూ సోదరుడు రవిచంద్రన్ రూ.30 లక్షలు జరిమానా చెల్లించాలన్న నిబంధనతో ఆయనపై నమోదైన సీబీఐ కేసును మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. 2013లో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి తీసుకున్న రూ.30 కోట్ల రుణాన్ని సోదర సంస్థలకు మళ్లించి రూ.22.48 కోట్ల నష్టం ఏర్పరిచినట్లు రవిచంద్రన్ డైరక్టరుగా ఉన్న సంస్థపై ఫిర్యాదులు అందాయి. ప్రాథమిక దర్యాప్తు తరువాత 2021లో సీబీఐ కేసు నమోదు చేసింది. అనంతరం మంత్రి కేఎన్ నెహ్రూ తదితరులకు చెందిన ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) సోదాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఎగ్మూర్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు రద్దు చేయాలని కోరి రవిచంద్రన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణ సమయంలో ఈడీ తరఫున సీబీఐ కేసు ప్రాతిపదికన కేసు నమోదు చేసినట్లు, సీబీఐ కేసు రద్దు చేయాలన్న కేసులో తమని చేర్చుకోవాలని కోరారు. ఇందుకు రవిచంద్రన్ తరఫున తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ కేసులో జస్టిస్ చక్రవర్తి సోమవారం తీర్పు ఇచ్చారు. రవిచంద్రన్‌కు రూ.30 లక్షలు జరిమానా విధించారు. అందులో రూ.15 లక్షలను ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుకి, మరో రూ.15 లక్షలను తమిళనాడు మధ్యవర్తిత్వ కేంద్రానికి చెల్లించాలని తెలిపి సీబీఐ కేసుని కొట్టివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో ఎలాంటి మోసం జరగలేదని, ప్రభుత్వ అధికారులకు సంబంధం లేదని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

చెన్నై రేవుకు జపాన్ తీరగస్తీ నౌక రాక

నవోకి మిజోగుచికి జ్ఞాపిక అందిస్తున్న దత్వీందర్‌సింగ్ సైని

వడపళని, న్యూస్‌టుడే: 'ఓషన్ వాయేజ్' శిక్షణలో భాగంగా జపాన్ తీర గస్తీ నౌక 'ఇట్సుకుషిమా' సోమవారం చెన్నై రేవుకు చేరుకుంది. జపాన్ నౌకాదళం ఇండియన్ కోస్ట్ గార్డ్(ఐసీజీ), జపాన్ కోస్ట్ గార్డ్(జేసీజీ)ల మధ్య మైత్రి బలపడుతుంది. రెండు సముద్ర దళాల మధ్య పరస్పర సామర్థ్యాన్ని పెంపొందించి [illegible] విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. జపాన్ కెప్టెన్ నవోకి మిజోగుచి నేతృత్వంలో రేవుకు చేరుకున్న నౌకకు దేశీయ సంప్రదాయ పద్ధతిలో కోస్ట్ గార్డ్ రీజియన్(ఈస్ట్) ఇన్‌స్పెక్టర్ జనరల్ దత్వీందర్ సింగ్ సైని స్వాగతం పలికారు. జేసీజీ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించేందుకు జపాన్ కోస్ట్ గార్డ్ వైస్ కమాండెంట్స్ ఆప్స్, వైస్ అడ్మిరల్ హిరోకి కనోసు జపాన్ నుంచి చెన్నై వచ్చారు. నౌక చెన్నైలో ఉండే రోజుల్లో అధికారిక సమావేశాలు, నౌకలపై పరస్పర సందర్శన, సాంస్కృతిక, వృత్తిపరమైన పరస్పర చర్యలు సహా అనేక కార్యక్రమాల్లో పాల్గొననుంది. ఈ నెల 12తో ముగియనున్న కార్యక్రమాల్లో భాగంగా యోగా సెషన్ కూడా ఉంటుంది.

14న ఉత్తర చెన్నైలో అన్నాడీఎంకే మానవహారం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చెన్నై కార్పొరేషన్ ఉత్తర చెన్నై ప్రాంతంలో పరిశుభ్రత పనులు ప్రైవేటుకు అప్పగించడాన్ని ఖండిస్తూ ఈనెల 14వ తేదీన 4వ జోన్ నుంచి టోల్‌గేట్ వరకు సాయంత్రం 4 గంటలకు మానవహార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిసామి తెలిపారు. ఈమేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో చెన్నై కార్పొరేషన్ ఉత్తర చెన్నై ప్రాంతంలో జాతీయ పట్టణ జీవనాధార పథకం కింద పని చేసే 2 వేల మంది తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికుల జీవనాధారాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం, చెన్నై కార్పొరేషన్ ప్రైవేట్ సంస్థతో ఒప్పందం చేసుకొందని తెలిపారు. ఈ కారణంగా 2007లో డీఎంకే ప్రభుత్వంలో నియమించిన కార్మికుల జీవనాధారం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అప్పటి ప్రతిపక్ష నేత డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ తాత్కాలిక కార్మికులను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత చెన్నై కార్పొరేషన్‌లో పరిశుభ్రత పనులను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. దీనిని నిరసిస్తూ 14వ తేది సోమవారం చెన్నై ఉత్తర (తూర్పు) జిల్లా తరపున 4వ జోన్ ప్రారంభం నుంచి టోల్‌గేట్ వరకు మానవహార నిర్వహించనున్నామని ఈ కార్యక్రమంలో అన్నాడీఎంకే శ్రేణులు పాల్గొనాలని కోరారు.

రూ.31 కోట్లతో ఘనవ్యర్థాల తరలింపు కేంద్రాలు

ఘనవ్యర్థాలు తరలిస్తున్న దృశ్యం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్ మిషన్(అర్బన్) 2.0 కింద తాంబరంలో ఐదు కొత్త పరిశుభ్రత స్టేషన్ల నిర్మాణానికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరేట్ పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. రోజుకు 500 టన్నుల సామర్థ్యంతో ప్రతిపాదిత స్టేషన్లు అభివృద్ధి చెందుతున్న మున్సిపల్ కార్పొరేషన్‌లో వ్యర్థాల నియంత్రణను క్రమబద్ధీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. సేకరించిన వ్యర్థాలను ప్రాసెసింగ్ సైట్లు లేదా డంప్ యార్డులకు రవాణా చేయడానికి ముందు తాత్కాలికంగా డంప్ చేయడానికి నిర్ణయించిన ప్రదేశాలను ట్రాన్స్‌ఫర్ స్టేషన్లుగా పిలుస్తుంటారు. ఇవి జనావాసాల్లో వ్యర్థాలను డంపింగ్ చేయడాన్ని తగ్గించగలవని, సేకరణ స్థలాల నుంచి యార్డులకు మొత్తం ట్రిప్పుల సంఖ్య తగ్గించడం ద్వారా రవాణా ఖర్చులు ఆదా చేయొచ్చని భావిస్తున్నారు. టీవీకేనగర్, మాదంబాక్కం, మంగళగిరి, కన్నడపాలయం, మరో రెండు జోన్‌లలో ఒక్కొక్కటి చొప్పున రానున్నాయి. వాటి మొత్తం వ్యయ అంచనా రూ.31 కోట్లకుపైగా ఉంటుంది.

ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ

సైకిళ్లు అందిస్తున్న చిత్రం

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలోని వలార్పురం ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఎస్టీ ఇరులర్ వర్గానికి చెందిన మణికంఠన్, లావణ్య అనే ఇద్దరు విద్యార్థులు 9వ తరగతి చదువుతున్నారు. నిర్ణీత సమయానికి పాఠశాలకు రాలేకపోతుండడంతో ఉపాధ్యాయులు పట్టణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకురాలు సుగంధి వినోదిని ద్వారా విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా సోమవారం అందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్ కుమార్, ఉపాధ్యాయులు సతీష్‌కుమార్, వాసుదేవన్, జీవమణి పాల్గొన్నారు.

11న అళగుముత్తు కోన్ గురుపూజోత్సవం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాట యోధుడు అళగుముత్తుకోన్ 268వ వార్షిక గురుపూజోత్సవాన్ని 11న అన్నాడీఎంకే తరపున నిర్వహించనున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తెలిపారు. ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆ రోజు ఉదయం 10 గంటలకు చెన్నై నగరంలో ఎగ్మూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఆయన విగ్రహానికి పార్టీ తరపున నివాళులర్పించే కార్యక్రమాన్ని తన నేతృత్వంలో నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లా కార్యదర్శులు, అన్నాడీఎంకే ఎంపీలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, నాయకులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్యశాఖమంత్రి మా సుబ్రమణియన్ సోమవారం కృష్ణగిరి జిల్లా తేన్‌గనిక్కోట్టై డివిజన్‌లోని ఆలహళ్ళి, మాట్టుపట్టి కుట్టికొండ గ్రామాలకు 14 కి.మీ నడిచి వెళ్లారు. 'మక్కలైత్తేడి మరుత్తువం' పథకం కింద అక్కడి గిరిజనులకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. హోసూరు వన్యప్రాణుల సంరక్షకుడు బగాన్ జగదీష్, జిల్లా ఆరోగ్యాధికారి డాక్టర్ రమేష్ కుమార్, ప్రాంతీయ వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్, నర్సులు, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు. -విల్లివాక్కం, న్యూస్‌టుడే

చెన్నైలో సెయిలింగ్ అకాడమీ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జల క్రీడలకు పెద్దపీట వేస్తూ తమిళనాడు ఒలింపిక్ వాటర్‌స్పోర్ట్స్ అకాడమీ రెండు అత్యాధునిక కేంద్రాలను నిర్మిస్తోంది. ఒకటి చెన్నైలో, మరొకటి రామనాథపురంలో. వచ్చే ఏడాది అందుబాటులోకి రానున్నాయని భావిస్తున్నారు. చెన్నై కేంద్రం ప్రధానంగా సెయిలింగ్, రామనాథపురంలో సెయిలింగ్, కనోయింగ్, మారథాన్ స్విమ్మింగ్‌లాంటివి అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు తీర నియంత్రణ మండలి(సీఆర్‌జడ్) అనుమతులను పొందాయి. శిక్షణకు జాతీయ, అంతర్జాతీయ కోచ్‌లను నియమించనున్నారు.

అంతర్జాతీయస్థాయి సదుపాయాలు..

తాను వర్ధమాన అథ్లెట్‌గా ఉన్న సమయంలో చెన్నైలో పోటీకి చాలా ఇష్టపడేవాడినని ఒలింపియన్, ఆసియా క్రీడల పతక విజేత విష్ణు శరవణన్ పేర్కొన్నారు. అప్పట్లో సౌకర్యాలు పరిమితంగా ఉండేవని, ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో సదుపాయాలు మెరుగయ్యాయన్నారు. రామనాథపురంలోని సహజ పరిస్థితులు దేశంలోనే అత్యుత్తమంగా ఉండటంతో అంతర్జాతీయ టోర్నీల నిర్వహణకు అనువైన ప్రదేశంగా మారిందన్నారు. రామనాథపురంలో పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. చెన్నైలో మెరీనా ఈతకొలను సమీపంలో త్వరలో మొదలవనున్నాయి. ఒలింపియన్ నేత్రా కుమనన్ మాట్లాడుతూ.. తాను చెన్నై పోర్టులో శిక్షణ పొందినట్లు తెలిపారు. ప్రపంచస్థాయి సౌకర్యాలు పొందడం సుదూర కలలా అనిపించిందన్నారు. ఇప్పుడు పరిస్థితులు మారాయని తెలిపారు.

ముమ్మరంగా వినాయక విగ్రహాల తయారీ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: వినాయక చతుర్థిని పురస్కరించుకొని ధర్మపురిలో గడ్డపిండి, కాగితపు గుజ్జుతో విగ్రహాల తయారీ పనులు ముమ్మరంగా సాగుతున్నారు. ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా ప్రతిమలను ప్రతిష్ఠించి తర్వాత నిమజ్జనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆదియమాన్‌కోట్టై ప్రాంతంలో వినాయక విగ్రహాల తయారీ పనులు జోరుగా సాగుతున్నాయి.

రూపుదిద్దుకుంటున్న విగ్రహాలు

జాతీయస్థాయి గుర్రపుస్వారీ పోటీలు

పోటీలో దృశ్యం

ట్రిప్లి కేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరు జిల్లా మోళప్పాళైయంలో జాతీయ స్థాయి ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్స్ లీగ్ గుర్రపు స్వారీ పోటీలు జరిగాయి. చివరి రౌండ్ ఆదివారం నిర్వహించారు. ఫెడరేషన్ ఆఫ్ ఈక్విన్ స్పోర్ట్స్ ఇండియా, ఇండిజీనస్ హార్స్ సొసైటీ(తమిళనాడు) సంయుక్తంగా నిర్వహించిన పోటీలో చెన్నై బుల్స్(తమిళనాడు), పెగాసస్ స్పోర్ట్స్(కేరళ), బెంగళూరు నైట్స్(కర్ణాటక), గోల్కొండ ఛార్జర్స్(తెలంగాణ), క్వాంటం రీన్స్(గోవా), ఎలైట్ ఈక్వెస్ట్రియన్స్(పశ్చిమ బెంగాల్) జట్లు పాల్గొన్నాయి. షో జంపింగ్ పోటీ 110 సెం.మీ, 120 సెం.మీ. రెండు విభాగాల్లో జరిగింది. ఇందులో చెన్నై బుల్స్ మొదటి స్థానం సాధించి రూ.15 లక్షలు, కేరళ పెగాసస్ స్పోర్ట్స్ రెండో స్థానంతో రూ.10 లక్షలు, తెలంగాణ గోల్కొండ ఛార్జర్స్ మూడో స్థానంతో రూ.5 లక్షల ప్రైజ్ మనీ గెలుచుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌కు చారు గ్రూప్స్ ఛైర్మన్ సామియప్పన్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

డీఎంకే బూత్ కమిటీ సమావేశం

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి, గుమ్మిడిపూండి శాసనసభ నియోజకవర్గాల బూత్ కమిటీ, యూనియన్ కార్యదర్శుల సమావేశం పంజట్టిలో సోమవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రమేష్‌రాజ్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి నాజర్, డీఎంకే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎంపీ రాజా ముఖ్య అతిథులుగా హాజరై వచ్చే ఏడాది జరగనున్న శాసనసభ ఎన్నికల్లో విజయంపై దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే గోవిందరాజన్, యూనియన్ కార్యదర్శులు ఆనందన్, మణిబాలన్, చంద్రశేఖర్, సత్యవేలు పాల్గొన్నారు.

వేదికపై మంత్రి నాజర్, ఎంపీ రాజా, హాజరైన కార్యకర్తలు

మెట్టూరు నుంచి నీటి విడుదల

టీనగర్, న్యూస్‌టుడే: మెట్టూరు డ్యామ్ పూర్తి స్థాయిలో నిండిన నేపథ్యంలో అదనపు జలాలు విడుదల చేశారు. కర్ణాటకలో భారీ వర్షం కారణంగా అక్కడి డ్యామ్‌ల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. అవి రాష్ట్రంలోని మెట్టూరుకు చేరుతున్నాయి. గతనెల 29న డ్యామ్ పూర్తి స్థాయిలో నిండగా ఈనెల 5న సెకనుకు 29,423 ఘనపుటడుగుల నీరు చేరుకుంటుండగా ఆ సంఖ్య 6వ తేదీకి 53,027 ఘనపుటడుగులకు చేరింది. నీరు భారీగా రావడంతో నీటి విడుదలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. డ్యామ్ నుంచి సెకనుకు 58,500 ఘనపుటడుగుల నీటిని విడుదల చేస్తున్నారు. కావేరి నదీ తీరప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు హెచ్చరించారు.

రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, పైవంతెనలకు రూ.7,500 కోట్లు

✦ కేటాయించిన ప్రభుత్వం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, పైవంతెనలు నిర్మించేందుకు రూ.7,500 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వు విడుదలైంది. మొత్తం 3,268 కి.మీ మేర రహదారులు నిర్మించనున్నారు. రాష్ట్రంలో 14 బైపాస్ రోడ్ల నిర్మాణానికి రూ.1,713 కోట్ల కేటాయించారు. ఆత్రుపాలెం రోడ్డు విస్తరణ, వర్షపునీటి పారుదల పనులకు రూ.250కోట్లు, ఆత్తూర్, హోసూరులలో బైపాస్ రోడ్ల నిర్మాణానికి రూ.500 కోట్లు, నదులపై ఎలివేటెడ్ రోడ్లకు రూ.295 కోట్లు కేటాయించారు. విరుదాచలం- తొలముత్తూర్, కోడై- వత్తలంగుండు, శివకాశి- విరుదునగర్ రోడ్లను నాలుగు వరుసలుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు.

ధోనీకి స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు

చెన్నై, న్యూస్‌టుడే: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎం.ఎస్.ధోనీ జన్మదినం సందర్భంగా ఆయనకు ముఖ్యమంత్రి స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం తన 'ఎక్స్' పేజీలో... ఒత్తిడితో కూడిన పరిస్థితులనూ తన ప్రతి కదలిక ద్వారా కవితాత్మకంగా మార్చిన అరుదైన క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ అని తెలిపారు. గొప్పదనం పుట్టుకతోనే రాదని, తీసుకునే ప్రతి నిర్ణయం, ప్రతి రన్, నింపాదిగా సాధించే ప్రతి విజయంతోను నిర్మితమవుతుందని, దానిని ఎం.ఎస్.ధోనీ నిర్మించారని ప్రశంసించారు.

నిఫా వైరస్ వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలి: ఓపీఎస్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కేరళలో నిఫా వైరస్ ప్రబలుతున్నందున తమిళనాడులో వ్యాపించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నాడీఎంకే బహిష్కృత నేత ఓ పన్నీర్‌సెల్వం విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో సిబ్బంది, మందుల కొరత ఉన్నట్లు ఆరోపణలున్నాయన్నారు. కేరళ రాష్ట్ర సరిహద్దుల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి వైరస్ నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నటి నయనతార డాక్యుమెంటరీలో చంద్రముఖి సన్నివేశాలు

✦ హైకోర్టులో పిటిషన్

ప్యారిస్, న్యూస్‌టుడే: నటి నయనతార డాక్యుమెంటరీలో స్థానం పొందిన 'చంద్రముఖి' సన్నివేశాలు తొలగించాలని దాఖలైన పిటిషన్‌పై డాక్యుమెంటరీ నిర్మాణ సంస్థ, నెట్‌ఫ్లిక్స్ జవాబు ఇవ్వాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. నటి నయనతార, డైరక్టర్ విఘ్నేశ్ శివన్ వివాహ వేడుకలు, వారికి సంబంధించిన వీడియో రికార్డులను డాక్యుమెంటరీగా నిర్మించిన డార్క్ స్టూడియో 2024లో నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ఫ్లాట్‌ఫామ్‌లో విడుదల చేసింది. ఇందులో నటుడు ధనుష్‌కు చెందిన వండర్‌బార్ ఫిలిమ్స్ నిర్మించిన నానుం రౌడీదాన్ షూటింగ్‌లో తీసిన సన్నివేశాలు చోటుచేసుకున్నాయని, తన అనుమతి లేకుండా నానుం రౌడీదాన్ షూటింగ్ సన్నివేశాలు ఉపయోగించినట్లు నటుడు ధనుష్ మద్రాసు హైకోర్టులో కేసు వేశారు. ఈ కేసు విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో ఈ డాక్యుమెంటరీలో చంద్రముఖి సినిమాలో స్థానం పొందిన కొన్ని సన్నివేశాలను అనుమతి లేకుండా ఉపయోగించారని, రూ.5 కోట్లు పరిహారం చెల్లించాలని చంద్రముఖి సినిమా కాపీరైట్ పొందిన ఏబీ ఇంటర్నేషనల్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేసింది. దీనిని సోమవారం విచారించిన మద్రాసు హైకోర్టు డాక్యుమెంటరీ నిర్మాణ సంస్థ డార్క్ స్టూడియో, నెట్‌ఫ్లిక్స్ రెండు వారాల్లో జవాబివ్వాలని ఉత్తర్వులు ఇచ్చింది.

మహానగర చెన్నై కార్పొరేషన్ 6 డివిజన్‌లో జరగనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' పథక శిబిరాలకు దరఖాస్తు ఫారాలు, సమాచార గైడ్‌ను వాలంటీర్ల సాయంతో ఇంటింటికీ అందించే పనులను జీసీసీ అధికారులు, సిబ్బంది సోమవారం ప్రారంభిస్తున్న దృశ్యం

నటులు శ్రీకాంత్, కృష్ణ బెయిల్ పిటిషన్లపై తీర్పు నేడు

ప్యారిస్, న్యూస్‌టుడే: నటులు శ్రీకాంత్, కృష్ణల బెయిల్ పిటిషన్లపై మంగళవారం తీర్పు ఇవ్వనున్నట్లు మద్రాసు హైకోర్టు తెలిపింది. మత్తుపదార్థాలు ఉపయోగించిన కేసులో గత నెల అరెస్టయిన శ్రీకాంత్, కృష్ణలు బెయిల్ కోసం మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇది న్యాయమూర్తి జస్టిస్ నిర్మల్‌కుమార్ ఎదుట సోమవారం విచారణకు వచ్చింది. శ్రీకాంత్ తరపున.. ప్రధాన నిందితుడు ప్రవీణ్ కుమార్ ఇచ్చిన వాఙ్మూలం ఆధారంగా శ్రీకాంత్‌ను అరెస్టు చేశారని, ఆయన్నుంచి మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకోలేదని వాదించారు. కృష్ణ తరపున.. పోలీసులు జారీ చేసిన సమన్లు మేరకు దర్యాప్తునకు హాజరైన నేపథ్యంలో కృష్ణను అరెస్టు చేశారన్నారు. అరెస్టుకి సంబంధించిన కారణాలు తెలపలేదని, వైద్య పరీక్షలో మత్తుపదార్థాలు ఉపయోగించినట్లు నిర్ధారణ కాలేదని వాదించారు. ప్రభుత్వం తరపున జవాబిస్తూ.. హత్యాయత్నం కేసులో అరెస్టయిన అన్నాడీఎంకే మాజీ ప్రముఖుడు ప్రసాద్ వద్ద జరిపిన దర్యాప్తులో మత్తుపదార్థాలు వినియోగం గురించి తెలిసిందని, ఆయన వాఙ్మూలం ఆధారంగా ప్రధాన నిందితుడు ప్రవీణ్‌కుమార్, అతని వాఙ్మూలం ఆధారంగా నటులు శ్రీకాంత్‌ను జూన్ 23న, కృష్ణను జూన్ 26న అరెస్టు చేసినట్లు తెలిపారు. అన్ని తరపు వాదనలు పూర్తయిన నేపథ్యంలో బెయిల్ పిటిషన్‌పై మంగళవారం తీర్పు ఇవ్వనున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

తాగునీటి చెరువుల్లో 56 శాతం నిల్వ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చెన్నైకి తాగునీరు సరఫరా చేస్తున్న చెరువుల్లో 56 శాతం మాత్రమే నీటి నిల్వ ఉంది. మహానగరవాసుల దాహార్తి తీర్చుతున్న ముఖ్యమైన చెరువులు పుళల్, పూండి, చెంబరంబాక్కం, చోళవరం, కన్నన్‌కోట్టై తేర్వాయ్‌కండిగై. ఐదు చెరువుల మొత్తం సామర్థ్యం 11,757 మిలియన్ ఘనపుటడుగులు. వేసవి ప్రారంభమైన తర్వాత చెరువులకు నీటిరాక తగ్గింది. ప్రస్తుతం నీటి నిల్వ 56 శాతంగా ఉంది. మీంజూర్, నెమ్మేలిలో ఉన్న నిర్లవణీకరణ కేంద్రాల ద్వారా నిత్యం సరఫరా చేస్తున్నందున ఈ ఏడాది చెన్నైలో తాగునీటి ఎద్దడి ఉండదని జలమండలి అధికారులు చెబుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల మూత అవాస్తవం

✦ మంత్రి గీతాజీవన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 501 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం మూసివేసినట్లు ఒక పత్రికలో ఈనెల 5న వచ్చిన వార్త అవాస్తవమని సాంఘిక సంక్షేమం, మహిళ హక్కుల శాఖ మంత్రి గీతాజీవన్ ఖండించారు. ఆమె సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని రోజు ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచురిస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని తెలిపారు. ఆ మేరకు భాజపా అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, రాష్ట్రంలో 500 అంగన్‌వాడీ కేంద్రాలను మూసి వేసినట్లు తెలుపుతూ ప్రకటనలు విడుదల చేశారన్నారు. ఆ ప్రకటనల్లో నిజం లేదన్నారు. 2021లో డీఎంకే ప్రభుత్వం ఏర్పడినప్పుడు 54,439 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండేవని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నాలుగేళ్లలో అదనంగా 44 కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 54,483 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు.

మామిడి ధర పెంచాలి

వేలూరు, న్యూస్‌టుడే: మామిడి ధరలు పెంచాలని డిమాండ్ చేస్తూ భాజపా తరఫున సోమవారం వేలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన జరిగింది. జిల్లా అధ్యక్షుడు దశరథన్ నేతృత్వంలో జరిగిన ఆందోళనలో రాష్ట్ర కార్యదర్శి కార్తియాయిని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేంద్రన్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. వేలూరులో మామిడి గుజ్జు తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని మామిడి పండ్లు చేతపట్టుకుని నినాదాలు చేశారు.

ఆందోళన చేస్తున్న భాజపా నిర్వాహకులు

వివాహ వేడుకలో ఉప ముఖ్యమంత్రి

మహాబలిపురం, న్యూస్‌టుడే: తిరుప్పోరూర్ పట్టణ పంచాయతీ డీఎంకే కార్యదర్శి, మాజీ అధ్యక్షుడు ఎం. దేవరాజ్- సెల్వి దంపతుల కుమారుడు టి. వెంకటేశన్, మాజీ ఎమ్మెల్యే మదివాణన్-గీతా దంపతుల కుమార్తె ఎం.ప్రీతికకు సోమవారం తిరుప్పోరూర్‌లో వివాహం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ వధూవరులను ఆశీర్వదించారు. మంత్రి టీఎం అన్బసన్, కాంచీపురం ఎంపీ జీ.సెల్వం, ఎమ్మెల్యేలు కరుణానిధి, వరలక్ష్మి మధుసూధనన్, ఎస్ఆర్ భారతి, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వధూవరులతో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

8, 10 తేదీల్లో పలు సబర్బన్ సర్వీసులు రద్దు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షన్‌లోని గుమ్మిడిపూండి, పొన్నేరి స్టేషన్ల మధ్య జరుగుతున్న లైన్ బ్లాక్ ఇతర సాంకేతిక పనుల కారణంగా 8, 10 తేదీల్లో పలు సబర్బన్ సర్వీసులు రద్దయినట్లు దక్షిణ రైల్వే సోమవారం ప్రకటన విడుదల చేసింది.

- ఎంఎంసీ-సూళ్లూరుపేట మెము 05.40, 08.35, 10.15, 12.10, సూళ్లూరుపేట-నెల్లూరు మెము 07.50, ఎంఎంసీ-గుమ్మిడిపూండి 08.05, 09.00, 09.30, 10.30, 11.35, చెన్నై బీచ్-గుమ్మిడిపూండి 09.40, 12.40, గుమ్మిడిపూండి-ఎంఎంసీ 09.10, 09.55, 11.25, 12.00, 13.00, 14.30, సూళ్లూరుపేట-ఎంఎంసీ 10.00, 11.45, 13.15, 12.35, నెల్లూరు-సూళ్లూరుపేట 21.00 సర్వీసులు 8, 10 తేదీలు రద్దు చేశారు.

పాక్షికంగా రద్దయిన రైలు

వడపళని: తిరువనంతపురం డివిజనలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనుల కారణంగా కొన్ని రైళ్ల టెర్మినల్‌లో మార్పు చేసినట్టు దక్షిణ రైల్వే ప్రకటన విడుదల చేసింది. ● 20691 తాంబరం-నాగర్‌కోయిల్ అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ 8, 9 తేదీలు 22.40కి బయలుదేరే రైలు తిరునెల్వేలి వరకు వెళ్తుంది. ● 20692 నాగర్‌కోయిల్-తాంబరం 9వ తేదీ 15.50 రైలు తిరునెల్వేలిలో 17.10కి బయలుదేరుతుంది. ● చెంగల్పట్టు-గుమ్మిడిపూండి 09.55, గుమ్మిడిపూండి- తాంబరం 15.00 సర్వీసులు 8, 10 తేదీల్లో చెన్నై బీచ్ నుంచి నడుస్తాయి.

ప్రత్యేకం..

- ఎంఎంసీ-పొన్నేరి 08.05, 09.00, 09.30, ఎంఎంసీ-ఎన్నూరు 10.30, 11.35, చెన్నై బీచ్-మీంజూరు 12.40, పొన్నేరి-ఎంఎంసీ 09.40, 09.58, పొన్నేరి-చెన్నై బీచ్ 10.28, మీంజూరు-ఎంఎంసీ 10.34, ఎన్నూరు-ఎంఎంసీ 11.03 గంటలకు ప్రత్యేక సర్వీసులు 8, 10 తేదీల్లో నడుస్తాయి.

(c) eenadu

బల్టీలో చేరిన సాయి అభ్యంకర్

సాయి అభ్యంకర్

చెన్నై, న్యూస్‌టుడే: 'కచ్చి సేరా', 'ఆశ కూడా', 'చిత్తిర పుత్తిరి' తదితర హిట్ ఆల్బమ్ సాంగ్‌ల ద్వారా సంగీతం రంగంలో తనకంటూ ప్రత్యేకతను ఏర్పరచుకున్న సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్. ప్రస్తుతం ఆయన మలయాళ నటుడు షేన్ నిగామ్ 25వ చిత్రం 'బల్టీ'కి సంగీతం అందించనున్నారు. ఈ సినిమాతో ఆయన మాలీవుడ్‌లోనూ అడుగు పెడుతున్నారు. ఇందుకు సంబంధించిన ఓ ప్రత్యేక ప్రోమో వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. ఇందులో 'బల్టీ ఓనం' అనే శుభాకాంక్షలు, సాయి అభ్యంకర్ పేరు పొందుపరిచిన బల్టీ జర్సీతో మోహన్‌లాల్ శుభాకాంక్షలు ఉన్నాయి. ఉన్ని శివలింగం దర్శకత్వం వహిస్తున్నారు. సంగీతం, యాక్షన్‌కు ప్రాధాన్యం ఉన్న ఈ చిత్రం ఓనం పండుగకు విడుదల కానుంది. సాయి అభ్యంకర్ ప్రముఖ నేపథ్య గాయకులు టిప్పు, హరిణి దంపతుల కుమారుడు. ఆయన ప్రస్తుతం 'సూర్య 46', 'ఎస్‌టీఆర్ 49', 'డ్యూడ్', 'బెంజ్' తదితర చిత్రాలకు స్వరాలు సమకూర్చుతున్నారు.

కేజేఆర్ కథానాయకుడిగా రెండో చిత్రం

పూజా కార్యక్రమంలో ప్రభుదేవా, నయినార్ నాగేంద్రన్ తదితరులు

చెన్నై, న్యూస్‌టుడే: 'అంగీకారం' ద్వారా తమిళ చిత్రసీమకు కథానాయకుడిగా పరిచయమైన నటుడు కేజేఆర్ ప్రస్తుతం తన రెండో సినిమాలో నటిస్తున్నారు. 'విలంగు' వెబ్ సిరీస్ దర్శకుడు ప్రశాంత్ పాండియన్ వద్ద సహ దర్శకుడిగా పనిచేసిన రీగన్ స్టానిస్లాస్ దర్శకుడిగా పరిచయమవు తున్నారు. 'మార్క్ ఆంటని' చిత్ర నిర్మాణ సంస్థ మినీ స్టూడియో 'ప్రొడక్షన్ నంబర్ 15'గా నిర్మిస్తోంది. చిత్రీకరణ పనులు పూజా కార్యక్రమంతో నగరంలో ప్రారంభమయ్యాయి. ప్రత్యేక అతిథులుగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, ప్రముఖ కొరియోగ్రాఫర్, నట దర్శకుడు ప్రభుదేవా తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రంలో అర్జున్ అశోకన్, శ్రీదేవి, సింగం పులి, జయప్రకాశ్, హరీశ్‌కుమార్, పృథ్వీరాజ్, ఇందుమతి, అశ్విన్ కె.కుమార్, అభిషేక్ జోసెఫ్ జార్జ్, అజు వర్గీస్, శ్రీకాంత్ మురళీ తదితరులు నటిస్తున్నారు. చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు.

అందరినీ నవ్విస్తుంది

ప్రసంగిస్తున్న విష్ణు విశాల్

చెన్నై, న్యూస్‌టుడే: కృష్ణకుమార్ రాంకుమార్ దర్శకత్వంలో విష్ణువిశాల్ తమ్ముడు రుద్ర కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'ఓహో ఎన్‌దన్ బేబీ'. 11న చిత్రం విడుదల కానున్న సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నగరంలో నిర్వహించారు. నటి మిథిలా పాల్కర్ మాట్లాడుతూ... ఇదొక రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చిత్రమన్నారు. నటి అంజు కురియన్ మాట్లాడుతూ... ఈ చిత్రం కోసం అందరూ కఠినంగా కృషి చేశామని తెలిపారు. నటుడు రుద్ర మాట్లాడుతూ.. కొవిడ్ తర్వాత అందరిలోనూ ఒక విధమైన మానసిక ఒత్తిడి నెలకొందని, దానిని ఈ చిత్రం పోగొట్టి సరదాగా నవ్వుకునేలా చేస్తుందని పేర్కొన్నారు. నటుడు, నిర్మాత విష్ణు విశాల్ మాట్లాడుతూ... కొత్త దర్శకులతో తాను ఎక్కువ చిత్రాలను చేశానన్నారు. వారివద్దే మ్యాజిక్ ఉంటుందని, ఆ మ్యాజిక్‌ను ఈ చిత్రంలోనూ చూడొచ్చని తెలిపారు. కొత్తలో తనకు సినిమా అవకాశాలు సులభంగా లభించలేదని, నేడు పలువురికి అవకాశాలు అందించే స్థాయికి అభివృద్ధి చెందానని పేర్కొన్నారు. వచ్చే ఏడాది తన నిర్మాణంలో 'కట్టాకుస్తీ 2', 'రాట్చసన్ 2' చిత్రాలు వస్తాయని తెలిపారు. ఈ చిత్రాన్ని చూసి బాలివుడ్ నటుడు అమిర్‌ఖాన్ కంటతడి పెట్టారని పేర్కొన్నారు.

తప్పుడు సందేశాలను నమ్మొద్దు

సైబర్ క్రైం పోలీసులు

ప్యారిస్, న్యూస్‌టుడే: ట్రాఫిక్ జరిమానాలు రద్దయినట్లు వచ్చే సంక్షిప్త సందేశాలను నమ్మొద్దని సైబర్‌క్రైం పోలీసులు తెలిపారు. హెల్మెట్ ధరించకపోవడం, కారులో సీటు బెల్టు పెట్టకపోవడం వంటి ట్రాఫిక్ నిబంధనలకు రూ.500 నుంచి రూ.15 వేల వరకు ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధిస్తున్నారు. ఈ జరిమానా పలువురు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో రూ.7 వేలు కన్నా తక్కువగా ఉన్న జరిమానాను రాష్ట్ర ప్రభుత్వం కొట్టివేసిందని, అందుకు సూచించిన లింక్‌ను డౌన్‌లోడ్ చేయాలని, అందులో వాహన వివరాలను నమోదు చేయాలని సందేశాలు వస్తున్నాయి. ఈ విధంగా వచ్చే లింక్‌లను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతా వివరాలను చోరీ చేసి నగదు దోచుకుంటారని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

9, 10 తేదీల్లో సీఎం తిరువారూర్ పర్యటన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ ఈనెల 9, 10 తేదీల్లో తిరువారూర్ జిల్లాలో పర్యటించి ప్రజలకు సంక్షేమ సహాయాలు అందించనున్నారు. చెన్నై నుంచి విమానంలో తిరుచ్చి చేరుకుని అక్కడి నుంచి తిరువారూర్‌కు రోడ్డు మార్గంలో వెళ్లనున్నారు. తిరువారూర్ రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కలైఙ్ఞర్ విగ్రహాన్ని ఆవిష్కరించి రోడ్‌షోలో పాల్గొని ప్రజలతో మాట్లాడనున్నారు. 10న ఉదయం తిరువారూర్ కొత్త బస్టాండ్ వద్ద ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు అందించి కొత్త పథకాలకు శంకుస్థాపన, పూర్తైనవాటిని ప్రారంభించనున్నారు.

జైలు కష్టాలు తెలిపే ఫ్రీడమ్

వేదికపై చిత్రబృందం

చెన్నై, న్యూస్‌టుడే: సత్యశివ దర్శకత్వంలో శశికుమార్, లిజోమోల్ జోస్ జంటగా నటించిన చిత్రం 'ఫ్రీడమ్'. విజయ గణపతి పిక్చర్స్ పతాకంపై పాండియన్ పరశురామన్ నిర్మించారు. 10న థియేటర్లలోకి రానుంది. నగరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నటుడు శశికుమార్ మాట్లాడుతూ... లిజో మోల్ జోస్ రాకతో చిత్రం స్వరూపం మారిపోయిందన్నారు. 'టూరిస్ట్ ఫ్యామిలీ' తరహాలో కామెడీగా ఉండదని, జైలులో పడే కష్టాన్ని తెలియజేస్తుందన్నారు. 1991లో జరిగిన యథార్థ గాథ, మనకు తెలియని కథ అని చెప్పారు. అందరికీ నచ్చుతుందన్నారు. నటి లిజోమోల్ జోస్ మాట్లాడుతూ.. ఇందులో తాను శ్రీలంక యువతిగా నటించానన్నారు. తమిళం మాట్లాడటమే కష్టంకాగా ఈ చిత్రంలో శ్రీలంక తమిళంలో మాట్లాడానని చెప్పారు. ప్రతి సన్నివేశానికి దర్శకుడు దిద్దుబాట్లు చేస్తూనే వచ్చారన్నారు. చిత్రీకరణ సమయంలో తనకు చికెన్ ఫాక్స్ వచ్చిందని గుర్తు చేసుకున్నారు. నిర్మాతలు పాండియన్ పరశురామన్, అమ్మ శివ, ఛాయాగ్రాహకుడు ఉదయకుమార్, నటులు మణికంఠన్, ఆంటోని, సినీ గేయ రచయితలు అరుణ్ భారతి, మోహన్ రాజన్, సంగీత దర్శకుడు జిబ్రాన్, దర్శకులు ఆర్కే సెల్వమణి, సత్యశివ తదితరులు పాల్గొన్నారు.

కిల్లర్‌కు రెహమాన్ స్వరాలు

ఎస్జే సూర్యతో ఏఆర్ రెహమాన్

చెన్నై, న్యూస్‌టుడే: దర్శకత్వం నుంచి నటనవైపు మళ్లిన ఎస్జే సూర్య ప్రస్తుతం మళ్లీ మెగాఫోన్ పట్టిన విషయం తెలిసిందే. 'కిల్లర్' చిత్రానికి ఆయన దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ స్వరాలు అందించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇప్పటికే ఎస్జే సూర్య నటించిన 'న్యూ', 'అన్బే ఆరుయిరే' చిత్రాలకు ఏ.ఆర్.రెహమాన్ సంగీతం సమకూర్చడం గమనార్హం. శ్రీగోకులం మూవీస్ పతాకంపై రూపొందుతున్న చిత్రంలో ప్రీతి అస్రాని నాయిక. ఇతర నటీనటుల వివరాలను ఇంకా వెల్లడించలేదు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

చెన్నై, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణమాదిక 60వ జన్మదిన వేడుకలను తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి పట్టణంలో సోమవారం నిర్వహించారు. అరుంధతినగర్‌లో పార్టీ తిరువళ్లూర్ జిల్లా సీనియర్ నాయకులు ఎస్.కుప్పన్ అధ్యక్షతన ఈ వేడుకలు జరిగాయి. ఇందులో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎం.కొండయ్య పాల్గొని ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం మంద కృష్ణమాదిక చేపట్టిన చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కె.భాస్కర్, తిరువళ్లూర్ నాయకులు వంశీ, న్యాయవాది భాస్కర్, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేకం.. పరవశించిన భక్తజనం

పవిత్ర జలాలను అభిషేకిస్తున్న పురోహితులు

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీప మీంజూరులోని ప్రసిద్ధ ము పునాతమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరింది. భక్తుల విరాళాలతో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులు పూర్తవడంతో సోమవారం కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాలలు ఏర్పాటు చేసి పవిత్ర జలాలకు విశేష పూజలు చేసి 20 అడుగుల ముప్పాత్తమ్మవారి భారీ విగ్రహంపై అభిషేకించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

యోగాంజనేయస్వామి ఆలయంలో..

శోళింగర్: రాణిపేట జిల్లా శోళింగర్ కొండపై యోగాంజనేయస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో మహాకుంభాభిషేకం సోమవారం ఉదయం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. చివరగా పవిత్ర జలం ఉన్న కలశాలను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ కలశాలపై పోసి మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కలశాలు, ప్రతిమలు తీసుకొస్తున్న దృశ్యం

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్ సమీప నెర్కుండ్రం గ్రామంలోని పురాతన జ్ఞానప్రసన్నాంబిక సమేత కాళహస్తీశ్వర ఆలయాన్ని 13 ఏళ్ల తర్వాత పునరుద్ధరించి సోమవారం కుంభాభిషేకం నిర్వహించారు. శివాచార్యులు నాలుగు రకాల యాగపూజలు చేశారు. వాస్తుశాంతి, గణపతి హోమం, నవగ్రహ హోమం జరిపారు. వివిధ పుణ్య క్షేత్రాల నుంచి తరలించిన పవిత్ర జలాలను విమాన కలశాలపై అభిషేకించారు.

9 ఏళ్ల తర్వాత..

తిరువెన్క్కాడు శ్వేతారణ్యేశ్వర ఆలయంలో..

వేళచ్చేరి, న్యూస్‌టుడే: మైలాడుదురై జిల్లా సీర్గాళి తాలూకా తిరువెన్క్కాడులో బ్రహ్మ విద్యాంబిక సమేత శ్వేతారణ్యేశ్వర ఆలయం ఉంది. నవ గ్రహాల్లో బుధుడి పరిహార స్థలంగా ఈ ఆలయం పేరొంది. ఇక్కడ చివరగా 2016లో మహాకుంభాభిషేకం నిర్వహించారు. 9 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అందించిన రూ.2.05 కోట్లతో పాటు దాతల విరాళాలు కలిపి రూ.25 కోట్లతో పునరుద్ధరణ పనులు చేపట్టారు. పనులు ముగియడంతో సోమవారం ఉదయం 9.05 గంటలకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. వేడుకలో ముఖ్యమంత్రి సతీమణి దుర్గా స్టాలిన్, మైలాడుదురై ఎంపీ సుధా, ఎమ్మెల్యేలు మైలాడుదురై రాజకుమార్, పూంపుహార్ నివేదా ఎం.మురుగేశన్, సీర్గాళి పన్నీర్‌సెల్వం సహా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.


కరింబేడులో ..

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు తాలూకా కరింబేడు గ్రామంలో 15 వందల ఏళ్ల క్రితం పల్లవరాజులు నిర్మించిన నాదాధీశ్వరర్ ఆలయం ఉంది. ఈ ఆలయ మహా కుంభాభిషేకం సోమవారం వైభవంగా జరిగింది. యాగశాలలో పూజలు, పూర్ణాహుతి, దీపారాధనలు జరిగాయి. సోమవారం ఉదయం పవిత్ర జలం ఉన్న కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ కలశాలపై పోసి మహాకుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా మారియమ్మన్ రథోత్సవం

టీనగర్, న్యూస్‌టుడే: సేలం జిల్లాలోని కోట్టై మారియమ్మన్ ఆలయ రథోత్సవం సోమవారం వేడుకగా జరిగింది. సేలం నగరంలో ప్రసిద్ధి చెందిన కోట్టై మారియమ్మన్ ఉత్సవాలు ఏటా వైభవంగా జరుగుతాయి. స్థానిక భక్తుల కోరిక మేరకు ప్రభుత్వం ఆలయానికి కొత్త రథాన్ని తయారు చేయించింది. 30 అడుగుల ఎత్తు, 16 అడుగుల వెడల్పు, వంద టన్నుల బరువుతో ఉన్న రథం పనులు పూర్తయిన నేపథ్యంలో రథంపై స్వామివారి ఊరేగింపు కార్యక్రమం తొలిసారి నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్ జెండా ఊపి ఊరేగింపు ప్రారంభించారు. వేలాది మంది భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఊరేగింపులో భక్తులు పలువురు నృత్యం చేస్తూ భక్తిని చాటుకున్నారు. ఆలయ పరిసరాల్లోని అగ్రహారం, పట్టయ్ కోవిల్, పెరియకడైవీధి, బజారు వీధి మీదుగా ఊరేగింపు సాగింది. ఆలయ పరిసరాల్లో పోలీసులు ట్రాఫిక్ మార్పులు చేపట్టి సహరించారు.

అదనంగా రుసుము వసూలు చేసిన కండక్టరుకు జరిమానా

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి-నాంగునేరి ప్రాంతాల మధ్య నడిచిన ప్రభుత్వ బస్సులో ప్రయాణికుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే రూ.4 అదనంగా ఛార్జి వసూలు చేసిన ప్రభుత్వ బస్సు కండక్టరుకు జరిమానా విధిస్తూ తిరునెల్వేలి వినియోగదారుల కోర్టు ఇటీవల తీర్పు చెప్పింది. దీనికి సంబంధించిన వార్త సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. జిల్లాలోని నాంగునేరి సన్నిధివీధికి చెందిన కన్నన్, కైలాసం గత ఏడాది తిరునెల్వేలి కొత్త బస్టాండు నుంచి నాంగునేరికి ప్రభుత్వ బస్సులో ప్రయాణించారు. తిరునెల్వేలి నుంచి నాంగునేరికి రూ.23 మొత్తాన్ని వసూలు చేయాల్సి ఉండగా ఒక్కొక్కరి నుంచి రూ.25 వంతున వసూలు చేశాడని ఆరోపిస్తూ కండక్టరుపై వారు తిరునెల్వేలి జిల్లా వినియోగదారుల కోర్టులో కేసు పెట్టారు. విచారణ పూర్తయిన నేపథ్యంలో కోర్టు ఇటీవల తీర్పు చెప్పింది. ఆ మేరకు సంబంధిత ప్రయాణికులను తీవ్ర మనస్తాపానికి గురిచేసిన కండక్టరుకు రూ.ఏడు వేలు జరిమానా విధించింది. బాధితులకు కేసు ఖర్చు కింద రూ.5 వేలు మొత్తం రూ.12 వేల మొత్తాన్ని అందజేయాలని కండక్టరును ఆదేశిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.

ఫిర్యాదుపత్రాలతో హిందూ మున్నని నిర్వాహకులు

మురుగన్‌పై రీల్ వైరల్

- హిందూ మున్నని ఫిర్యాదు

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు ఎస్పీ కార్యాలయంలో హిందూ మున్నని డివిజన్ అధ్యక్షుడు మహేష్ నేతృత్వంలో సోమవారం ఫిర్యాదు ఇచ్చారు. అందులో వేలూరు పుదువసూర్ తీర్థగిరిలో 92 అడుగుల ఎత్తైన తమిళ దేవుడు మురుగన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి కుంభాభిషేకం జరిగింది. రోజూ పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఇన్‌స్టాగ్రాంలో ఒక రీల్ వైరల్ అయింది. ఓ యువకుడు మామ, మచ్చా, యో అని ఏకవచనంతో రెండు పెళ్లిళ్లు చేసుకుని ఎలా సంతోషంగా ఉన్నావంటూ ఎగతాళి చేశాడు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. మురుగన్‌ను కించపరిచే చర్యకు పాల్పడిన యువకుడిపై హిందూ మున్నని తరఫున అన్ని పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశామని తెలిపారు. యువకుడిపై కేసు నమోదు చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బావిలో పడి యువకుడి మృతి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా శూలగిరి సమీపంలోని కామన్‌తొట్టి గ్రామానికి చెందిన శ్రీనివాస్ కుమారుడు అభిషేక్‌కుమార్(21) ఆదివారం స్నేహితులతో కలిసి సమీపంలోని బావి వద్దకు వెళ్లాడు. కాలుజారి బావిలో పడ్డాడు. ఈత తెలియకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. హోసూరు అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని బయటికి తీశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ...

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మొరప్పూర్ వంతెన సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో భర్తతో బైక్‌పై వెళ్తున్న మహిళ ప్రాణాలు కోల్పోయారు. ధర్మపురి జిల్లా పాపిరెడ్డిపట్టికి చెందిన ముల్లైవేందన్ ప్రైవేట్ పాల సంస్థలో పనిచేస్తున్నారు. ఈయన తన భార్య శశికళతో(28) కలిసి ఆదివారం సాయంత్రం బైక్‌పై చెమ్మనూర్ వెళ్లడానికి కారిమంగళం వైపు బయలుదేరారు. మొరప్పూర్ వంతెన సమీపంలో వెనుక నుంచి వచ్చిన సరకు లారీ బైక్‌ను ఢీకొంది. లారీ చక్రం శశికళ తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ముల్లైవేందన్‌కు గాయాలయ్యాయి. కారిమంగళం పోలీసులు శశికళ మృతదేహాన్ని శవపరీక్షకు ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు దిగుతుండగా సీఐఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్...

వడపళని, న్యూస్‌టుడే: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)కు చెందిన హెడ్ కానిస్టేబుల్ చెన్నై బీచ్ రైల్వే స్టేషను వద్ద ఆదివారం సాయంత్రం కదులుతున్న రైలు నుంచి పడి మృతి చెందారు. అరక్కోణం రైల్వే స్టేషనులో సీఐఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన కె.పద్దల పోలయ్య ఆదివారం తిరుక్కురళ్ ఎక్స్‌ప్రెస్‌లో ఎగ్మూర్‌కు బయలుదేరారు. బీచ్ స్టేషనుకు రాగానే అరక్కోణానికి వెళ్లే సబర్బన్ రైలు ఎక్కాలని కిందకు దిగే ప్రయత్నం చేశారు. అదుపుతప్పి కింద పడగా రెండు కాళ్లకు దెబ్బలు తగిలాయి. రైల్వే సిబ్బంది చికిత్స నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స ఫలించక మృతి చెందాడు. ఎగ్మూర్ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు కొరియర్ బాయ్ బలవన్మరణం

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా తొరప్పాడికి చెందిన సుధాకర్(38) కోణవట్టంలోని ఓ ప్రైవేటు కొరియర్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఇతని భార్య పవిత్ర ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వచ్చిన సుధాకర్ తన గదిలోకెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొన్నాడు. ఇంటికొచ్చిన పవిత్ర భర్త ఉరేసుకుని ఉండడం చూసి దిగ్భ్రాంతికి గురై భర్తను ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పాగాయం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు కోణవట్టానికి చెందిన 24 ఏళ్ల నూరుల్లా అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో కొద్దిరోజుల క్రితం షోకేస్‌కు అద్దం అమర్చాడు. ఆ సమయంలో ఆ వ్యక్తి నూరుల్లాకి కూలీ ఇవ్వలేదు. నూరుల్లా ఆ వ్యక్తి ఇంటికెళ్లి తరచూ డబ్బులు అడిగేవాడు. ఆ వ్యక్తి తన బంధువు మదీనానగర్‌కు చెందిన ఉమర్‌కు విషయం చెప్పాడు. ఉమర్ తన స్నేహితులు ఇస్మాయిల్, మరో ఇద్దరితో ఆదివారం రాత్రి నూరుల్లా వద్ద కెళ్లి ప్రశ్నించారు. అప్పుడు మద్యం మత్తులో ఉన్న నూరుల్లా కత్తితో ఉమర్, ఇస్మాయిల్‌ను పొడిచి పారిపోయాడు. వెంటనే ఇద్దరినీ వేలూరులో ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. ఉమర్ ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. వేలూరు ఉత్తర పోలీసులు కేసు నమోదు చేసుకుని పరారీలో ఉన్న నూరుల్లా కోసం గాలిస్తున్నారు.

నగదు మోసం కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

గంగాధరన్

ప్యారిస్, న్యూస్‌టుడే: విరుదునగర్ జిల్లా రాజపాళెయానికి చెందిన గంగాధరన్ రాజపాళెయం-శంకరన్‌కోవిల్ రోడ్డు కొత్త బస్టాండు వద్ద టూల్ డోర్ అనే సంస్థ ఆధ్వర్యంలో బిర్యానీ దుకాణం నడుపుతున్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా బ్రాంచ్‌లు ప్రారంభించనున్నట్లు రెండేళ్ల ముందు ప్రకటించాడు. ఇది చూసిన తమిళనాడు మాత్రమే కాకుండా పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన 239 మంది బిర్యానీ దుకాణాన్ని ప్రారంభించేందుకు సంప్రదించారు. వారి నుంచి గంగాధరన్ వస్తువులు, దుకాణం అద్దె తదితర వాటి కోసం రూ.25 కోట్లు తీసుకున్నాడు. ప్రారంభంలో 21 దుకాణాలను ప్రారంభించాడని అవి కొంతకాలానికే మూతపడ్డాయని, మిగిలినవి ఇంకా ప్రారంభించలేదని తెలిపి బాధితులు చెన్నై అశోక్‌నగర్ ఆర్థిక నేర విభాగం పోలీసులకు, డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు జూన్ 6న ఏసీ ప్రవీణ్‌రావ్, సతీష్‌కుమార్, షణ్ముగసుందరాన్ని అరెస్టు చేశారు. కేసులో ప్రధాన నిందితుడైన గంగాధరన్‌ను విరుదునగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.

గోదాములో భారీ అగ్నిప్రమాదం


చెలరేగుతున్న మంటలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా మాధవరం రౌండ్ ఠాణా వద్ద ప్రైవేటు సంస్థకు చెందిన గోదాము ఉంది. కారు విడిభాగాలు భద్రపరచి చెన్నై తదితర ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఆదివారం సాయంత్రం గోదాము నుంచి మంటలు వ్యాపించాయి. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సుమారు 4 గంటల పాటు శ్రమించి మంటలు అదుపు చేశారు. రూ.లక్షల్లో నష్టం వాటిల్లినట్లు గోదాము మేనేజర్ మాధవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొబ్బరినార మిల్లులో మంటలు

మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లా భవాని సమీపంలోని పెరియవడమలైపాలయంకు చెందిన గణపతి(45) కరుక్కుపాళయంలో కొబ్బరి నార మిల్లు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఇనుప తీగలు రాసుకుని నిప్పు రవ్వలు కొబ్బరి నారపై పడి నిప్పంటుకుంది. అగ్నిమాపక సిబ్బంది రెండు గంటల సేపు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే కొబ్బరి నార ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ

8 మందిపై కేసు నమోదు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప విడైయూరుకు చెందిన దేవరాజన్ ఆదివారం సాయంత్రం తన ఇంటి వద్ద నిలిచి ఉండగా అదే గ్రామానికి చెందిన ఇళయరాజా ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్లాడు. దేవరాజన్ మందలించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఇళయరాజా బంధువులు నిత్యానందం, మారి, బాబు అక్కడకు చేరుకుని దేవరాజన్‌పై దాడి చేశారు. ప్రతిగా దేవరాజన్ తన బంధువులు సారథి, వెంకటేశన్, చిన్నరాజుతో కలిసి దాడి చేశారు. గాయపడిన ఇరువర్గాలకు చెందిన 8 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం తిరువళ్లూరు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు 8 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తుపాకులు, తూటాలు స్వాధీనం

ఆజీరా

ఆసిఫ్

వేలూరు, న్యూస్‌టుడే: తిరుప్పత్తూరు జిల్లా ఆంబూరుకు చెందిన ముహ్మద్ మీరాన్ కుమారుడు ఆసిఫ్ స్థానిక ప్రైవేటు చెప్పుల కర్మాగారంలో పనిచేస్తున్నాడు. ఇతని ఇంట్లో రహస్యంగా చేతి తుపాకీలు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ పోలీసులు, ఆంబూరు నగర పోలీసులకు సమాచారం అందింది. ఆసిఫ్‌ను పోలీసులు అరెస్టు చేసి, అతని ఇంటి నుంచి ఏడు కత్తులు, పది తూటాలు స్వాధీనం చేసుకున్నారు. వేలూరు ముళ్లిపాళెయంకి చెందిన ఆసిఫ్ సహోదరి ఆజీరా ఇంట్లో నాలుగు చేతి తుపాకీలు ఉన్నట్లు తెలుసుకుని అక్కడికెళ్లి పది తూటాలు కూడా స్వాధీనం చేసుకుని ఆమెను కూడా అరెస్టు చేశారు.

విదేశీ మద్యం..

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా మాధవరం పోలీసులు పుళల్ గాంధీనగర్, భువనేశ్వరినగర్‌లో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వేగంగా వెళ్లిన ఆటోను సుమారు కిలోమీటరు వెంబడించి అడ్డుకుని సోదా చేసి 350 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మిల్క్ డిపోకు చెందిన ఆటో డ్రైవర్ స్టాలిన్‌ను అరెస్టు చేశారు.

చేపల మధ్య పడుకుని ఫొటో తీసుకున్న భూపతి

పెద్ద పెద్ద చేపలు.. చిక్కడం అరుదు

- వలలో 260 కిలోలు చిక్కడంతో ఉబ్బితబ్బిబైన జాలరి

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: మత్స్యకారుడి వలకు 260 కిలోల చేపలు చిక్కడంతో ఆనందంతో వాటి మధ్య పడుకుని ఫొటో తీసుకున్నారు. ఈ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. కోయంబత్తూరు జిల్లా మెట్టుపాళెయం సమీపం సిరుముగై వద్ద ఉన్న భవానిసాగర్ డ్యామ్ దగ్గరలో ఉన్న జేజే నగర్‌కి చెందిన యువకుడు భూపతి కొన్నిరోజుల క్రితం ఎప్పటిలాగే రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు వల వేశాడు. అప్పుడు ఊహించని విధంగా పెద్ద సంఖ్యలో చేపలు చిక్కాయి. సుమారు 24, 27, 32 కిలోల బరువున్న మొత్తం 260 కిలోల 14 పెద్ద చేపలు వలలో పడ్డాయి. ఎప్పుడూ లేనివిధంగా 260కిలోల క్యాట్ ఫిష్‌లు దొరకడంతో భూపతి ఆనందానికి హద్దులు లేవు. వెంటనే చేపలను గుండ్రంగా అమర్చి వాటి మధ్య పడుకుని ఫొటోలు తీసుకుని సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

వారధి.. దందాల్లో ఆరితేరి..!

- అడ్డదారులు తొక్కుతున్న కొందరు ఎమ్మెల్యేల సహాయకులు
- నష్ట నివారణ చర్యలు చేపట్టకుంటే ప్రతికూల పరిస్థితులు

ఈనాడు- చిత్తూరు, తిరుపతి: శాసనసభ్యుల వ్యక్తిగత సహాయకులు (పీఏ) నిర్దేశించిన పనులకే పరిమితం కావాలి. వారి రోజువారీ కార్యక్రమాల పర్యవేక్షణ, ప్రజలు అర్జీలు ఇస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత వారిదే. ఒకరకంగా జనాలు, అధికారులు.. ఎమ్మెల్యే మధ్య వారధిగా వ్యవహరించాలి. అటు ప్రభుత్వానికి ఇటు శాసనసభ్యుడికి మంచి పేరు తీసుకురావాలి. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొందరు ఎమ్మెల్యేల పీఏల వైఖరి ఇందుకు భిన్నంగా ఉంది. ప్రైవేటు పీఏలూ, అనుచరులు కొందరు ఇదే బాటలో పయనిస్తున్నారు. ప్రతి అంశంలోనూ తలదూర్చుతున్నారు. ఇప్పటికైనా వీరి విషయంలో నష్ట నివారణ చర్యలు చేపట్టకుంటే శాసనసభ్యుల పుట్టి మునగడం ఖాయం.

● **నలుగురిని దూరం పెట్టిన నేత..** నెల్లూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాలో చేరిన ఓ నియోజకవర్గ శాసనసభ్యుడి అనుచరులు నలుగురు ఏడాదిగా పెత్తనం చెలాయించారు. ప్రైవేటు వెంచర్లు, ప్రభుత్వ భూముల ఆక్రమణల్లో వీరి వ్యవహారం శ్రుతి మించిందని గ్రహించిన నేత నలుగురినీ పక్కనపెట్టారు.

అంతకుమించి.. తిరుపతికి ఆనుకుని ఉన్న ఓ నియోజకవర్గంలో స్థానిక ప్రజాప్రతినిధి అనధికారిక పీఏ ప్రతి వ్యవహారంలోనూ వేలు పెడుతున్నారు. వైకాపా హయాంలో ఓ కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ఇటుకలు తోలిన ఈయన ఇప్పుడూ చక్రం తిప్పుతున్నారు. ఇటీవల ఓ మండలంలో గ్రావెల్ ట్రాక్టరును అధికారులు పట్టుకుంటే.. విడిచిపెట్టాలని హుకుం జారీ చేశారు. సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అంశాల్లో పని చేయాలంటే మరో అనుచరుడు ఆమోదముద్ర వేయాల్సిందే. మద్యం దుకాణాల్లో మామూళ్ల వసూలు చేసే బాధ్యతను మరొకరు భుజాన వేసుకున్నారు.

● **వైకాపాలోనూ హవా చూపి..** చిత్తూరు జిల్లాలోని ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే పీఏగా ఉన్న వ్యక్తి వైకాపాలోనూ ఓ వెలుగు వెలిగారు. కూటమి హయాంలోనూ ఇతను తన హవా చూపుతున్నారు. శాసనసభ్యుడు పెద్దగా నియోజకవర్గంలో ఉండకపోవడాన్ని అలుసుగా తీసుకున్నారు. విద్యుత్తు కాంట్రాక్టులు దక్కించుకున్న గుత్తేదారులను బెదిరించి అభాసుపాలైనా అతని తీరు మారలేదు. ఇసుక, మట్టి అక్రమ రవాణాదారులకు సహకరిస్తున్నాడనే ఆరోపణలున్నాయి.

ప్లాట్లు వేస్తే చుక్కలు చూపిస్తూ..

చిత్తూరు జిల్లాలోని కీలక నియోజకవర్గంలో ఇద్దరు అనధికారిక పీఏల ఆగడాలకు హద్దే లేదు. ఒకరు మున్సిపల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారు. టెండర్లు సైతం తమకు కావాల్సిన వ్యక్తులకే కట్టబెట్టాలని చెప్పారు. మరో ప్రైవేటు పీఏ ఎక్కడ ప్లాట్లు వేస్తే అక్కడ వాలిపోయి రియల్టర్లకు చుక్కలు చూపిస్తున్నారు.

మాట తీరుతో అప్రతిష్ఠ

చిత్తూరు జిల్లాలోని పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న సీనియర్ ఎమ్మెల్యే అనధికారిక పీఏ మాట తీరుతో అప్రతిష్ఠ మూటగట్టుకుంటున్నారు. అవినీతికి దూరంగా ఉన్నా ప్రజలు ఎవరైనా వస్తే కటువుగా మాట్లాడుతున్నారు. అర్జీదారులకు సరైన సమాధానం చెప్పకుండా తిప్పుకొంటున్నారు.

జీతాలందక.. అలమటిస్తున్న ఆయాలు

ఇస్కాన్ పరిధిలోని 395 పాఠశాలల్లో సమస్య

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: సకాలంలో వేతనాలందక ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించే ఆయాలు, రాత్రి కాపలాదారులు నాలుగు నెలలుగా అలమటిస్తున్నారు. జిల్లాలో 2,229 మంది ఆయాలు, 249 మంది కాపలాదారులు విధులు నిర్వహిస్తున్నారు. రెండురోజుల కిందట అధికారులపై జిల్లాలోని ఆయాలు తీవ్ర ఒత్తిడి తేవడంతో మార్చి, ఏప్రిల్, మే వేతనాలు చెల్లించగా జూన్ మాసానికి సంబంధించి పెండింగ్‌లో ఉంది. ఇస్కాన్ పరిధిలోని 395 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విధులు నిర్వహిస్తున్న ఆయాలకు ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు జీతాలు అందనట్లు సమాచారం. నిధుల రాకలో ఆలస్యంతో సమస్య నెలకొందని, ఇస్కాన్ పరిధిలో పనిచేసేవారికి త్వరలో చెల్లించేలా చూస్తామని మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షకుడు వెంకట్ తెలిపారు.

ప్రకృతి చెక్కిన.. శిల్పం

శ్రీవారు కొలువైన ఏడు కొండలు ప్రకృతి రమణీయతకు, అందమైన ఆకృతులకు నిలయం. మొదటి ఘాట్ రోడ్డులోని శ్రీవినాయక స్వామి ఆలయంపైన ఉన్న ఓ కొండ ఉపరితల భాగం మనిషి తలను పోలి ఉంది. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఈ ఆకారం భక్తులకు వింత అనుభూతిని కలిగిస్తోంది.

- న్యూస్‌టుడే, తిరుమల



దస్త్రాలు మార్చి.. తీరంలో భూఆక్రమణలు

వాకాడు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో ప్రభుత్వ భూములు రోజురోజుకు ఆక్రమణలకు గురవుతున్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఎవరు, ఎంత ఆక్రమించారు?.. ఏ ప్రాంతం వారు.. సర్వే నంబర్లతో వీఆర్‌ఏ, వీఆర్వోలకు తెలిసినా పట్టించుకోవడం లేదు. - న్యూస్‌టుడే, వాకాడు

● **వీఆర్‌ఏ కుటుంబీకుల పేరిట స్వాహా**

వాకాడు మండలం మొనపాలెం వద్ద ప్రభుత్వ భూమిలో నిర్మించిన భవనం

మండలంలోని దుగరాజపట్నం, కొండూరు, రావిగుంటపాలెం, పంబలి, రెడ్డిపాలెం బిట్-1, బిట్-2, పూడిరాయదొరువు రెవెన్యూ గ్రామాల్లో వైకాపా పాలన నుంచి ప్రభుత్వ భూములు ఆక్రమణల్లో చిక్కుకుంటున్నాయి. మండలంలోని పూడిరాయదొరువు రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 30లో 15.62 ఎకరాల భూమి ఉండగా.. ఇప్పటికే పదికరాల భూమి ఆక్రమించారు. ఆ భూముల్లో భవనంతో పాటు కొందరు దస్త్రాలను సాగు చేస్తున్నారు. కొంత భూమిలో చిన్న తోటకు చెందిన ఓ రైతు ఏకంగా ఓ భవనాన్ని రెండు నెలల కిందట నిర్మించారు. ఇదంతా రెవెన్యూ అధికారులకు తెలిసినా వారి వద్ద మామూళ్లు తీసుకుని పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. పంబలిలో రెండేళ్ల కిందట అక్కడి వీఆర్‌ఏ ప్రభుత్వ అసైన్‌మెంట్ భూములను ఆయన కుటుంబీకుల పేరుతో దస్త్రాలను తారుమారు చేసినా ఆ కేసులు అలానే కొనసాగుతున్నాయి. తూపిలిపాలెం వద్ద కొందరు ప్రభుత్వ భూముల్లో రొయ్యల సాగు చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదు.

● **అధికారుల హవా..** మండలంలోని సముద్ర తీర గ్రామాల్లో పనిచేస్తున్న కొందరు గ్రామ రెవెన్యూ అధికారులు, వారితో పాటుగా కొందరు వీఆర్‌ఏలు ప్రభుత్వ భూముల ఆక్రమణల్లో హవా చూపిస్తున్నారు. కొందరు ఏకంగా దస్త్రాలను వారి వద్ద ఉంచుకుని వారి ఇష్టానుసారంగా మార్పులు చేస్తున్నట్లు సమాచారం. కొందరు వీఆర్‌ఏలకు మండల అధికారులు తీరంలో విలువైన భూముల దస్త్రాలను అప్పగించడంతో వారు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రామయ్యను వివరణ కోరగా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని, విలువైన భూముల దస్త్రాలపై నిఘా ఉంచుతామన్నారు.

టికెట్ల మాయాజాలం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో టికెట్ల మాయాజాలంతో భక్తులను మోసగించి బ్యాంకు సిబ్బంది అడ్డంగా దొరికిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకకు చెందిన ప్రభుత్వ అధికారి కుటుంబ సభ్యులతో కలసి సోమవారం కౌంటర్ వద్ద అంతరాలయ దర్శనం కోసం 9 టికెట్లకు రూ. 4500 చెల్లించారు. అక్కడ విధి నిర్వహణలోని బ్యాంకు సిబ్బంది పైన, కింద రూ.500 టికెట్లు పెట్టి.. మధ్యలో రూ.200 టికెట్లు ఇచ్చారు. నగదుకు సరిపడా టికెట్లు ఇవ్వకపోవడంపై అనుమానం వచ్చిన ఆయన ఈవో బాపిరెడ్డికి ఫిర్యాదు చేశారు. టికెట్లను స్కానర్ పాయింట్, మహద్వారం, దక్షిణామూర్తి సన్నిధి, స్వామి, అమ్మవార్ల సన్నిధిలో పరిశీలిస్తారు. ఇంత ధైర్యంగా సిబ్బంది భక్తులను మోసగించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంత కాలంగా అక్రమాలు జరుగుతున్నాయన్న విషయమై ఈవో విచారణకు ఆదేశించారు.

105 గదిపై ఉత్కంఠ: ఆలయ ఒప్పంద ఉద్యోగి ఒకరు భక్తకన్నప్ప సదన్ 105 గదిలోకి వెళ్లి తలుపు వేసుకోవడం, ఎంతసేపు పిలిచినా తెరవకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. చివరికి తలుపు తెరవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బడిబాటలో.. ఆధార్ కష్టాలు

- నమోదులో తప్పని ఇబ్బందులు
- మరిన్ని కేంద్రాల ఏర్పాటుతో మేలు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: చిన్నారుల ఆధార్ నమోదులో సమస్యలు వీడటం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆధార్ నమోదు కోసం తల్లిదండ్రులు నానాఅవస్థలు పడుతున్నారు. సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆధార్ లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. జిల్లాలోని 34 మండలాల్లో 3,219 మంది విద్యార్థులకు ఆధార్ లేకపోవడంతో పాఠశాలల్లో చేరికలు, ఇతర అవసరాల కోసం తంటాలు పడుతున్నారు.

తిరుపతి జిల్లాలో ఇలా..

ఆధార్ నమోదుకాని విద్యార్థులు:	3,219
సవరణలు చేయాల్సినవారు:	4,427
ప్రత్యేకంగా జిల్లాలో నమోదు కేంద్రాలు:	7
ఒకటో తరగతిలో ఆధార్ లేనివారు	
ప్రభుత్వ 1,610, ప్రైవేటు:	1,417

జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన 1,610 మంది విద్యార్థులకు ఆధార్ లేదు. ప్రైవేట్ పాఠశాలల్లో మరో 1,417 మంది విద్యార్థులకు లేనట్టు తేలింది. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న మరో 4,427 మంది విద్యార్థులకు సంబంధించి ఆధార్ సవరణలు చేయాల్సి ఉంది. తల్లిదండ్రుల వివరాలు ఇతరత్రా పొరపాట్లను సరిచేయాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో ఏడు కేంద్రాల్లో నమోదు

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ నమోదు కోసం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని పలు పాఠశాలల్లోనే ప్రత్యేకంగా విద్యాశాఖ అధికారులు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇవి ఏమాత్రం సరిపోనట్లు స్పష్టమవుతోంది. ఇంతకాలం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నమోదు కేంద్రాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సచివాలయం సిబ్బంది ఉన్నా అవగాహన కల్పించడంలో విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

తగిన ధ్రువపత్రాల కొరతతో..

ఆధారు నమోదు కోసం అవసరమైన పత్రాలు, ముఖ్యంగా జనన ధ్రువపత్రం, తల్లిదండ్రుల ఆధారు కార్డులు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. పత్రాలు ఎలా పొందాలో సరైన పరిజ్ఞానం లేకపోవడంతో నమోదు ప్రక్రియ పూర్తి కావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రత్యేక కేంద్రాల్లో నమోదు అనంతరం త్వరితగతిన నూతన ఆధారు కార్డులు ఇస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. ఇందుకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

కార్‌వాష్‌లో.. పుస్తక పరిచయం

తిరుపతి పరిధిలోని కొత్తపల్లి వినాయకసాగర్ వద్ద మాస్టర్ ప్లాన్ రహదారిలో కార్ వాష్ యజమాని ఏర్పాట్లు ఆకట్టుకుంటున్నాయి. వాహనదారుల సమయాన్ని వృథా చేయకుండా.. చరవాణికి అంకితం కాకుండా నిరీక్షణ గదిలో ప్రత్యేకంగా పుస్తకాలు ఏర్పాటు చేశారు. వాటిలో ఎక్కువగా ఆరోగ్యానికి సంబంధించి ఆయుర్వేదం, కథలు, వర్తమాన అంశాలకు సంబంధించి పిల్లల నుంచి పెద్దల వరకు చదివేలా చర్యలు తీసుకున్నారు. కార్ వాష్‌కు సమయంలో పడుతుండటంతో వచ్చిన వారు సైతం పుస్తకాలు తిరగేస్తూ కనిపిస్తున్నారు. - **ఈనాడు, తిరుపతి**

అనుమతులతో మాకేం పని?

- మామిడి రైతులతో మాట్లాడేందుకు 500 మందే రావాలని ఎస్పీ ప్రకటన
- జగన్ పర్యటనకు భారీగా జన సమీకరణ చేస్తోన్న వైకాపా నేతలు

ఈనాడు- చిత్తూరు: తన పర్యటనల్లో సొంత పార్టీ కార్యకర్తలు ప్రాణాలు పోతున్నా, సామాన్యులు, పోలీసులకు గాయాలవుతున్నా మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు పట్టడం లేదు. పరామర్శలకు కూడా వైకాపా నేతలు జన సమీకరణ ఆపడం లేదు. ఈ నెల 9న మాజీ సీఎం జగన్.. బంగారుపాళ్యం యార్డుకు వచ్చి మామిడి రైతులతో మాట్లాడతారని వైకాపా నేతలు సమాచారం ఇవ్వడంతో 500 మంది తరలిరావాలని ఎస్పీ మణికంఠ స్పష్టం చేశారు. ఆ స్థలంలో ఎక్కువ మంది ఉండేందుకు సాధ్యం కాదని చెప్పారు. ఇందుకు తగిన విధంగానే జనసమీకరణ చేసుకోవాలని సూచించినా ఫ్యాను పార్టీ నేతలు ఇందుకు విరుద్ధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బంగారుపాళ్యం మార్కెట్ ఉన్న పూతలపట్టు నియోజకవర్గం నుంచే 2 వేలు- 3వేల మందికి తగ్గకుండా జనాలు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. పుంగనూరు నియోజకవర్గంలో ప్రతి పంచాయతీ నుంచి ఒక కారు పెట్టాలని నిర్ణయించుకున్నారు. పలమనేరు, చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాలను కలుపుకొంటే కనీసం 10 వేల మందిని తరలించాలని భావిస్తున్నారు.

జిల్లాలో 67,988 టన్నుల తోతాపురి కొనుగోళ్లు : కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలోని మామిడి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఈనెల 5వ తేదీ నాటికి జిల్లాలో సుమారు 67,988 టన్నులు సేకరించి, 10,046 మంది రైతులకు ప్రయోజనం చేకూర్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 76,700 మంది రైతులు దాదాపు 80 వేల హెక్టార్లలో తోతాపురి పండిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అనేకసార్లు గుజ్జు పరిశ్రమల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించామని, జిల్లా యంత్రాంగం మామిడి సేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వర్ణాంధ్రలో.. మొదటి స్థానమే లక్ష్యం

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా జిల్లాను అన్నివిధాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఎమ్మెల్యేలు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా.. ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని, త్వరలో రైతులకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ఆగస్టు 15 నాటికి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీ అమలు చేస్తామని ఉద్ఘాటించారు. పీ-4 ద్వారా బంగారు కుటుంబాలను గుర్తించి వారందరినీ వచ్చేనెల 15లోగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. వారికి మెరుగైన జీవన ప్రమాణాలు అందించే వరకు చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనల పేరుతో ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటున్నారని విమర్శించారు. అంతకుముందు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, సునీల్‌కుమార్, రామకృష్ణ, ఆదిమూలం, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, నగరపాలక కమిషనర్ నారపురెడ్డి మౌర్య, జేసీ శుభం భన్సల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్రంలో కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు రామకృష్ణ, సుధీర్ రెడ్డి, నాని, సునీల్ కుమార్, విజయశ్రీ

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల: నేరుగా వచ్చే భక్తులకు 10 గంటల్లో, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. ఆదివారం శ్రీవారిని 88,938 మంది దర్శించుకోగా రూ.4.39 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

22న తితిదే ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల: తితిదే ధర్మకర్తల మండలి సమావేశం ఈ నెల 22న నిర్వహించనున్నట్లు సమాచారం. ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన స్థానిక అన్నమయ్య భవనంలో సభ్యులు సమావేశమై పలు తీర్మానాలు చేయనున్నారు. గతంలో ఆమోదించిన తీర్మానాల అమలు, ప్రగతిని సమీక్షించడంతోపాటు భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానంగా చర్చిస్తారు.

రైతేరాజు 6లో

మావారే.. పక్కన పెడితే ఊరుకోం

తిరుపతి (ఎస్వీయూ): ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్ల కొనసాగింపు అంశం వర్సిటీ పాలకులకు తలనొప్పిగా తయారైనట్లు తెలుస్తోంది. ఈనెల ఒకటి నుంచి 5వ తేదీ వరకు వారి పనితీరు, సామర్థ్య మదింపు అంశాలకు సంబంధించిన పరిశీలన ప్రక్రియ పూర్తయింది. 241 మంది బోధనా సామర్థ్యాలను ప్రత్యేక నిపుణుల సమక్షంలో పరిశీలించగా ప్రస్తుతం వారిలో ఎవరెవరిని కొనసాగించాలనే అంశంపై దృష్టి సారించి జాబితా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో నియమించినవారినే కొనసాగించాలని పలువురు తీవ్ర ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం. ఓ అడుగు ముందుకేసి తమవారిని కొనసాగించని పక్షంలో అందరి జాతకాలు బయటపెడతామంటూ బెదిరింపులకు సైతం దిగుతున్నట్లు తెలుస్తోంది. పలు విద్యార్థి సంఘాలు సోమవారం వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లను కలిసి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారినే కొనసాగించాలంటూ విన్నవించారు. ఇదే విషయమై రాష్ట్ర మంత్రి నుంచి గల్లీ స్థాయి నాయకుడి వరకు వర్సిటీ పెద్దలపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలుస్తోంది. వీరితోపాటు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుంటుండటంతో రెండుమూడు రోజుల్లో అకడమిక్ కన్సల్టెంట్ల భవితవ్యం తేలనుంది.

గణేశా.. తిప్పలు తప్పేనా..?

▸ అంతరాలయ దర్శనంపై కఠినంగా ఉండాలని భక్తుల సూచన

కాణిపాకం: దేశ, విదేశాల నుంచి నిత్యం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దర్శనార్థం తరలివస్తారు. వీరిలో కొందరిని సిఫార్సులపై ఆలయ ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక గేటు ద్వారా స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. వీరిలో సింహభాగం భక్తులు స్వామివారిని అత్యంత దగ్గరగా చూసేందుకు అంతరాలయ దర్శనానికి ప్రాధాన్యం ఇస్తారు. అధిక సమయం అంతరాలయంలో గడపడం వల్ల సాధారణ భక్తులకు స్వామివారి దర్శనం ఆలస్యమవుతోంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకుని సాధారణ భక్తులకు స్వామివారి దర్శనం త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వీఐపీ గేటు వద్ద సిఫార్సు భక్తులు

అభ్యంతరాలివీ...

వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆదివారం జరిగిన ఉభయదారుల సమావేశంలో ప్రత్యేకంగా అంతరాలయ దర్శనంపై చర్చ జరిగింది. ఉభయదారులు, ప్రొటోకాల్ మినహా వచ్చిన ప్రతి ఒక్కరూ అంతరాలయ దర్శనం చేసుకోవడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు కఠినంగా వ్యవహరించి, సాధారణ భక్తుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అంతరాలయ ప్రవేశానికి విధిగా సంప్రదాయ దుస్తులు (పంచె, చీర, పైజామా) ఉంటేనే అనుమతిస్తారు. సిఫార్సులపై వచ్చే వారిలో ఎక్కువ మంది ప్యాంట్లపై పంచె ధరించి వెళ్తున్నారు.

కవచ.. ప్రతిష్ఠ

తిరుపతి (తితిదే) : గోవిందరాజ స్వామివారి ఆలయంలో జరుగుతున్న జ్యేష్ఠాభిషేకంలో భాగంగా రెండోరోజు సోమవారం కవచప్రతిష్ఠ వైభవంగా జరిగింది. స్నపన తిరుమంజనం, సమర్పణ తదితర కార్యక్రమాల అనంతరం కవచ ప్రతిష్ఠ చేశారు. సాయంత్రం తిరుచ్చిపై మాఢ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు.

చిరుత తిరుగుతోంది.. అప్రమత్తంగా ఉండండి

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: చిరుత సంచారంతో అప్రమత్తంగా ఉండాలని కోరుతూ అటవీశాఖ అధికారి బి.సుదర్శన్‌రెడ్డి ఆయా వర్సిటీల రిజిస్ట్రార్లకు ముందస్తు హెచ్చరికలు చేశారు. మూడురోజులుగా ఎస్వీయూ, వేదిక్, వ్యవసాయ, వెటర్నరీ విశ్వవిద్యాలయాల పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరిస్తోందని, సిబ్బందిని అప్రమత్తం చేసి విద్యార్థులు, ఉద్యోగుల రక్షణకుగాను సూచిక బోర్డులు, జాగ్రత్తలు తీసుకోవాలని, తమ సిబ్బంది ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేసి చిరుత కదలికలపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.

B.Tech., and Ag.B.Sc., SPOT ADMISSION
కేవలం 6,7,8,9,10 లక్షల ఖర్చుతో నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ / అగ్రికల్చర్ బీఎస్సీ (కాలేజ్ ఫీజు + హాస్టల్ ఫీజుతో కలిపి) ఎటువంటి షూరిటీ లేకుండా విద్యార్థికి 70 నుంచి 80% లోన్ సౌకర్యం కల్పించబడును. వివరాలకు సంప్రదించండి :
9502555500, 9160220527

స్కిట్‌పై ఆశల ఊసులు..!

☛ 12వతేదీ లోగా ఆమోదిస్తేనే ప్రవేశాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: 'శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్) ఇంజినీరింగ్ కళాశాల పునః ప్రారంభంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల ప్రవేశాలకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఇప్పటి వరకు స్కిట్ కళాశాలలో ప్రవేశాలకు అనుమతి లభించకపోవడంపై ఉత్కంఠ నెలకొంది.



విలీనంపై సడలని పట్టు

కళాశాలను జేఎన్‌టీయూ పరిధిలోకి తేవాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని సాకారం చేసేలా మంత్రి నారా లోకేశ్ సూచనలతో ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. తాజాగా నెల్లూరు పర్యటనకు వచ్చిన మంత్రి లోకేశ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఇదే విషయమై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సంక్షిప్త నివేదికను అందజేశారు.

● **ఫలించేనా..:** కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కావాలంటే ఎంసెట్ ప్రవేశాలకు అవకాశం లభించాలి. ప్రస్తుతం ప్రవేశాలకు అన్నీ కళాశాలలు దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టాయి. ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ఈ నెల 13న ప్రారంభం కానుంది. ఆ లెక్కన 12వ తేదీ రాత్రి వరకు అవకాశం ఉంది. ఆలోగా కళాశాల పునః ప్రారంభంపై ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటే వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉంటుంది. లేకుంటే ఇక ఈ ఆర్థిక సంవత్సరం కళాశాల ప్రారంభం కష్టసాధ్యమే. అమరావతిలో సోమవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అనుకూల ఫలితాలు వస్తాయని కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం భావిస్తోంది.

104FM Tirupati
104 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9000180635

విద్యాశాఖ తీరుపై ఆరా

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల హాజరు తగ్గడం.. ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండటం.. పిల్లలు లేక పాఠశాలలు మూతపడడం వంటి వాటిపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ ఈ విషయమై ఆరా తీయాలంటూ కమిషనరేట్ నుంచి కొంత మంది అధికారుల బృందాన్ని సోమవారం పంపారు. బృందం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యాశాఖ కార్యాలయంలో వివరాలు సేకరించారు. గ్రామాల్లో పర్యటించి పిల్లలు ఎందుకు చేరడం లేదనే అంశమై నేరుగా ప్రజలను విచారిస్తే బాగుండేదని పలువురు అంటున్నారు. పిల్లలు చేరకపోవడంపై స్థానిక ఎంఈవో నశీం ఆలీతో కడప ఆర్జేడీ శామ్యూల్ ఫోన్‌లో మాట్లాడారు. కమిషనర్ కార్యాలయంలోని అధికారి రమేష్ ఆధ్వర్యంలో అధికారులు బృందం పాల్గొన్నారు.

వాకాడు విద్యాశాఖ కార్యాలయంలో పిల్లల హాజరు తగ్గడంపై పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం అధికారులు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

(c) eenadu

డ్రోన్ వినియోగం.. సేద్యం సులభతరం

రాయితీ అందిస్తున్న ప్రభుత్వం

పుంగనూరు, న్యూస్‌టుడే: అధునాతన పద్ధతులతో వ్యవసాయాన్ని సులభతరం చేసేలా డ్రోన్ల వినియోగం పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై వీటిని కొన్ని విధివిధానాలతో అందిస్తోంది. అవేంటంటే.. రైతులు ఐదుగురు సభ్యులుగా ఉండాలి. అందులో చురుగ్గా ఉన్న వ్యక్తిని పైలట్‌గా ఎంపిక చేస్తారు. ఇతనికి 50 ఏళ్ల లోపు వయసుండాలి. కనీసం ఇంటర్ విద్యార్హత అవసరం. పైలట్‌గా ఎంపికయ్యే రైతుకు గుంటూరులో శిక్షణ ఇస్తారు. చిత్తూరు జిల్లాకు 31 డ్రోన్లు మంజూరయ్యాయి. ఒక్కో డ్రోన్ విలువ రూ.9.80 లక్షలు కాగా ప్రభుత్వం 80 శాతం రాయితీ కింద రూ.7.84 లక్షలు రైతు సంఘం ఖాతాకు జమ చేస్తోంది. ఇందులో రైతు వాటా 1.96 లక్షలే. ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడి రూ.5 లక్షలు బ్యాంక్‌లో ధరావత్తు చెల్లించాలి. దీనికి జతగా బ్యాంకు మిగిలిన సొమ్ము రూ.4.80 లక్షలు రుణంగా అందిస్తోంది. ఈ మొత్తంతో డ్రోన్ పరికరం కొనుగోలు చేసిన తరువాత అది రైతు సంఘానికి చేరుతుంది. 15 రోజుల్లో ప్రభుత్వం అందించే రాయితీ సొమ్మును రైతు సంఘం ఖాతాకు జమ చేస్తారు. దీన్ని విత్‌డ్రా చేసుకునే అవకాశం లేదు. రుణం కంతులు సక్రమంగా చెల్లిస్తూ గడువు తీరాకే రాయితీ సొమ్ము పొందేందుకు వీలుంటుంది.

ఉపయోగాలు: పురుగు మందు ప్రభావం మనుషుల ఆరోగ్యంపై పడకుండా ఉంటుంది. కూలీల ఖర్చు తగ్గింపు, సమయం, నీరు, ఎరువులు, క్రిమిసంహారక మందు ఆదా అవుతుంది. పిచికారీ చేసే మందులు మొక్కలకు సమానంగా అందుతాయి. మిరప, వంకాయ, కాలీఫ్లవర్, చిక్కుడు, టమాటా, బీర, గుమ్మడి, కాకర వంటి కూరగాయల తోటలతో పాటు మునగ, బొప్పాయి, మామిడి, అరటి, రోజా, బంతి, చామంతి, కనకాంబరం తోటలకు, వరి పైరుకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేయొచ్చు.

సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు

మహిళా రైతు ఆదర్శం

తవణంపల్లె, న్యూస్‌టుడే: సేంద్రియ ఎరువులతో అన్నదాతకు దీర్ఘకాలిక ప్రయోజనాలున్నాయి. ఆవు పేడ ఎరువు, వానపాముల ఎరువులతో భూసారం పెరగడానికి ఆస్కారముంది. దిగుబడులు సైతం ఆశించిన స్థాయిలో వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పశువుల నుంచి పొందే పేడను ఎరువుగా పొలాల్లో చల్లుకోవడం వల్ల పెట్టుబడి సైతం తగ్గుతుంది. ఈ కోవలోనే ఓ మహిళా రైతు పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

తవణంపల్లె మండలం జెట్టిపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు పల్లవి సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేశారు. వంగ 20 సెంట్లు, గోరుచిక్కుడు 30 సెంట్లు, రాగి 30 సెంట్ల స్థలంలో సాగు చేశారు. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులు వినియోగించారు. వీటి వాడకం వల్ల మంచి దిగుబడులు వచ్చాయని చెబుతున్నారు. వంగలో ఇప్పటి వరకు రెండు కోతలయ్యాయి. రెండు కోతల్లో 500 కిలోలు వచ్చాయని కిలో రూ.70కు, గోరుచిక్కుడు ఇప్పటి వరకు 200 కిలోలు రాగా కిలో రూ.40కు విక్రయించినట్లు తెలిపారు. రాగి పంటను కోసి ఎండబెట్టామని 300 కిలోల రాగులు వచ్చే అవకాశముందని వెల్లడించారు.

'పొలం పిలుస్తోంది'లో ప్రదర్శన

వ్యవసాయశాఖ అధికారులు జెట్టిపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పల్లవి సాగు చేసిన పంటలను రైతులందరికీ చూపించారు. ఆమె ఎలా సాగు చేశారు? సేంద్రియ ఎరువులను ఎలా వాడారు? తదితర యాజమాన్య పద్ధతులు వివరించి రైతులందరికీ అవగాహన కల్పించారు.

రైతేరాజు

రేణిగుంట, న్యూస్‌టుడే:

ప్రశ్న: యూరియా అతిగా వాడితే వరి పంటకు కలిగే నష్టాలేమిటి? **- మధు, రైతు, గాజులమండ్యం, రేణిగుంట మండలం**

జవాబు: ఎకరా పంటకి రెండు బస్తాల యూరియాని మూడు దఫాలుగా సమపాళ్లలో వేసుకోవాలి. మొదటి దఫా నాటు సమయంలో, రెండో దఫా పిలకలు వేసే సమయంలో, మూడో దఫా చిరు పొట్ట దశలో వేసుకోవాలి. నత్రజని ఎరువు వేసినప్పుడు పొలంలో పూర్తిగా నీరు తీసేసి బురద పదును పైన వేసి 48 గంటల తర్వాత నీరు పెట్టాలి. ఎక్కువగా యూరియా వేయడంతో నేల నిస్సారంగా మారుతుంది. సూక్ష్మ పోషక లోపాలు అధికమవుతాయి. చీడపీడల ఉద్ధృతి పెరుగుతుంది. భూగర్భ జలాలు కలుషితమవుతాయి.

- సునీల్‌కుమార్, వ్యవసాయాధికారి

ప్రశ్న జవాబు

వరిలో కాండం తొలుచు పురుగు

నాయుడుపేట, న్యూస్‌టుడే: వరి పైర్లను కాండం తొలుచు పురుగు(మొవ్వ పిప్పి) అధికంగా ఆశిస్తోందని, వేసవిలో సాగు చేసిన రైతులు జాగ్రత్తలు పాటించాలని నాయుడుపేట మండల వ్యవసాయాధికారి జె.గణేష్ సూచించారు. 'కాండం తొలుచు పురుగు నారుమడి నుంచి ఈనిక దశ వరకు ఆశించే అవకాశం ఉంది. నారుమడిలో ఆశిస్తే మొక్కలు, పైరు పిలక దశలో ఆశిస్తే మొవ్వ చనిపోతుంది. ఈనిక దశలో కంకి పాలుపోసుకోకుండా తెల్లకంకి ఏర్పడుతుంది. ఆకు చివరి భాగాన గుడ్లుపెట్టి గోధుమ రంగు వెంట్రుకలతో కప్పుతుంది. గుడ్డు నుంచి విడుదల చేసిన లార్వా కాండం కింది వైపు నుంచి లోపలికి ప్రవేశించి మొవ్వను తినేస్తుంది. ఆలస్యంగా నాట్లు వేసినప్పుడు, ముదిరిన నారు నాటినప్పుడు రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువగా, పగలు తక్కువగా ఉన్నప్పుడు నత్రజని ఎరువులు అధికంగా వినియోగిస్తే ఈ పురుగు ఆశించే అవకాశం ఉంటుంది' అని ఆయన వివరించారు.

నివారణ చర్యలు.. నారుమడిలో చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా గుడ్ల సముదాయం, పిలక దశలో ఐదు శాతం చనిపోయిన మొవ్వల పైర్లు కనిపించినప్పుడు రైతులు గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నారు పీకడానికి వారం ముందు ఐదు సెంట్ల నారుమడికి 20 గ్రాములు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు చొప్పున ఎకరానికి లేదా అంకురం లేదా చిరు పొట్టదశలో పురుగులు ఆశిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 10 కిలోలు లేదా క్లోరాంత్రానిలి ప్రోల్ 4 శాతం నాలుగు కిలోలు వేయాలి. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ రెండు గ్రాములు లేదా క్లోరాంత్రినిలిప్రోల్ 0.4 మిల్లీలీటర్ల నీటికి కలిపి పిచికారీ చేస్తే నివారించవచ్చు.

రేషన్ దుకాణం వద్దే చౌకబియ్యం పక్కదారి

వినియోగదారుల నుంచి రూ.10కు కొనుగోలు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం తెల్లరేషన్ కార్డున్న పేదలకు ఉచితంగా బియ్యం సరఫరా చేస్తోంది. ఆ బియ్యం ప్రస్తుతం కొందరు డీలర్ల ద్వారా నల్లబజారుకు చేరుతోంది. కొందరు చౌకధరాణాల డీలర్లు అక్కడే ఉచిత బియ్యాన్ని కిలో రూ.10 చొప్పున కొనుగోలు చేస్తూ అక్రమ వ్యాపారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం డీలర్ల చేతికి నిత్యావసర సరకుల పంపిణీ అప్పగించి రెండు నెలలు కూడా పూర్తి కాక ముందే ఈ అక్రమ వ్యాపారం చౌకధరాణాల వద్దనే కొనసాగుతుండడం విడ్డూరం. డీలర్లు కొనుగోలు చేసిన బియ్యాన్ని అక్రమ వ్యాపారులు మిల్లుకు తరలించి అక్కడ రీసైక్లింగ్ చేసి అధిక ధరలకు నాణ్యమైన బియ్యం పేరుతో అమ్ముతున్నారు. కొద్ది రోజులుగా ఈ తంతు గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో సాగుతోంది. ప్రధానంగా వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో సాగుతున్నట్లు సమాచారం. కొందరు వినియోగదారులు అయితే చౌక దుకాణంలో ఉచిత బియ్యం తీసుకుని అక్రమ వ్యాపారులకు కిలో రూ.16 చొప్పున ఇళ్ల వద్దనే అమ్ముకుంటూ చేస్తున్నారు. ఈ విషయమై వాకాడు సీఎస్ డీటీ హజ్బుల్లా ఖాన్‌ను వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజలకు పంపిణీ చేయాల్సిన చౌక బియ్యం బస్తాలు

ధర్మ పరిరక్షణకే పాదయాత్ర

బాసర (ముథోల్), న్యూస్‌టుడే: ధర్మ పరిరక్షణకే పాదయాత్ర చేపడుతున్నట్లు భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి స్వామి అన్నారు. బాసర సరస్వతీ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కుంకుమార్చన, మహాహారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయాలను కాపాడుకునేందుకు ఈనెల 12 నుంచి తలకోనలోని మహాశివాలయం నుంచి యాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

గవర్నర్ ఆర్‌ఎన్ రవి, కుటుంబ సభ్యులకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు

శ్రీవారి సేవలో తమిళనాడు గవర్నర్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ్ రవి సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయక మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే ఛైర్మన్ తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, డిప్యూటీ ఈవో ఆర్‌టి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం హాజరుతో అరుదైన ఘనత

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ సోమవారం అరుదైన ఘనతను సాధించింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు నూటికి నూరుశాతం హాజరు నమోదు కావడంతో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇందుకు సహకరించిన విద్యాధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్.కుమార్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.గౌరీశంకర్‌రావు, పేరెంట్ అటెండెన్స్ నోడల్ అధికారి జి.సురేష్ అభినందనలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని జిల్లా విద్యాశాఖాధికారి విన్నవించారు.

వంద శాతం నమోదు ప్రతులతో డీఈవో కేవీఎన్ కుమార్, సురేష్, గౌరీశంకర్ రావు

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు సోమవారం దర్శించుకున్నారు. తెల్లవారుజామున సుప్రభాత సేవలో పరమవీర చక్ర గ్రహీత యోగేంద్ర సింగ్ యాదవ్, ఉదయం వీఐపీ బ్రేక్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్ దర్శించుకున్నారు.

ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో పరమవీరచక్ర యోగేందర్ సింగ్ యాదవ్

ప్రభుత్వ సలహాదారు ఆర్‌పీ ఠాకూర్

ఆగస్టు 7న జాతీయ ఓబీసీ మహాసభ

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడానికి అఖిలభారత జాతీయ ఓబీసీ మహాసభను నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, కేశన శంకరరావు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడారు. ఈనెల 21 నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుపై చర్చించి చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ మాట్లాడుతూ ఆగస్టు 7న తేదీన గోవాలో నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభకు ఉత్తర, దక్షిణ రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులను ఆహ్వానించనున్నామన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖరరావు పాల్గొన్నారు.

తాళ్లపాకను.. అభివృద్ధి పరచాలి

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరుతూ సోమవారం తితిదే ఈవో శ్యామలరావుకు తితిదే పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. తాళ్లపాక ముఖద్వారం నుంచి తాళ్లపాక వరకు రోడ్డును వెడల్పు చేసి పేరెన్నికగల కవుల విగ్రహాలు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సంగీత నృత్య కళాశాల, శ్రీవారి ఆలయ నిర్మాణంతోపాటు అన్నమయ్య నివసించిన ఇంటి స్థలాన్ని అభివృద్ధి పరచాలని కోరారు. సిద్ధేశ్వర చెన్నకేశవ స్వామి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో కల్యాణ టికెట్లను పెంచాలని విన్నవించారు. ఈవో సానుకూలంగా స్పందించి బోర్డు సమావేశంలో పొందుపరిచి అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుకుంట రమేష్ నాయుడు, ఉద్దండం సుబ్రహ్మణ్యం, రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, న్యాయవాది వై.సురేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో వాస్తవికతను గుర్తించండి

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఫిర్యాదుదారుల మాటల్లోని వాస్తవికతను గుర్తించి సమస్య పరిష్కరించడంలో వేగం పెంచాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచించారు. సోమవారం డీపీవోలో 97 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుని వివరాలు ఆరాతీశారు. సంబంధిత స్టేషన్ అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, నాగభూషణం, సీఐలు హరి ప్రసాద్, రామయ్య, వెంకటరమణ, తిమ్మయ్య, శ్రీరాములు, ఇమ్రాన్ బాషా, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (మహిళా వర్సిటీ): శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో జూన్‌లో నిర్వహించిన బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని అధికారులు తెలిపారు.

నేడు ఈత ఎంపిక పోటీలు

తిరుపతి (క్రీడలు): తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా జిల్లాస్థాయి ఈత ఎంపిక పోటీలను మంగళవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఈటీ గోపినాథ్ తెలిపారు. మొదటి విభాగంలో 2008, 2009, 2010, రెండో విభాగంలో 2011, 2012, మూడో విభాగంలో 2013, 2014 సంవత్సరాల్లో జన్మించిన క్రీడాకారులు అర్హులని, వివరాలకు శిక్షకుడు చక్రవర్తిని 81217 77077లో సంప్రదించాలన్నారు.

విద్యాశాఖలో మార్పులు తీసుకురండి

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: జిల్లాతోపాటు కడప ఆర్జేడీ పరిధిలో ఎప్పటికప్పుడు పనితీరు మార్చుకొని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు పేర్కొన్నారు. సోమవారం అమరావతి నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్జేడీ శామ్యూల్, డీఈవో కేవీఎన్ కుమార్ పాల్గొన్నారు. ఈనెల 10వ తేదీన జరిగే మెగా పీటీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

చంద్రగిరి: చంద్రగిరిలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయంఉపాధి శిక్షణ సంస్థలో మహిళలకు టైలరింగ్‌పై 31 రోజులపాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సంస్థ డైరెక్టర్ పి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పదోతరగతి చదివిన 19-45 సంవత్సరాలలోపు మహిళలు అర్హులన్నారు. వివరాలకు 79896 80587, 94949 51289, 83091 64644లో సంప్రదించాలని ఆయన సూచించారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో)	
బ్రాయిలర్ (రైతు ధర)	105
రిటైల్	127
లేయర్	112
బ్రాయిలర్	184
బ్రాయిలర్ స్కిన్ లెస్	210
లేయర్ మాంసం	190

MARGADARSI CHIT FUND PVT. LTD.
Chit Groups are available at our *TIRUPATI* BRANCH

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
LT T	50	10,000	5,00,000
FT VZ	40	1,25,000	50,00,000
FT D	40	50,000	20,00,000
FT Z	40	25,000	10,00,000
FT U	40	7,500	3,00,000
TT V	30	1,00,000	30,00,000

Please Contact Branch Manager **Mr. C.KESAVULU NAIDU,** for further details. **Mobile No's. 80080-01815, 91549-87874 Landline: 0877-2224700.**

NAIDUPETA MUNICIPALITY

3rd Call Tender Notice NIT NO 005/15TH FC/ 2020-21/AE-PT-NMC, Dated: 07-07-2025.

Commissioner, Naidupeta Municipality has invited tenders for 1-(One Work Vide Tender Notice **01/NPT-NMC/15TH FC/2025-26, Dated: 07-07-2025**

Bid Document Downloading Start Date	08-07-2025 From 10.00 AM
Bid Document Downloading End Date	22-07-2025 Upto 04.00 PM
Last Date & Time for Receipt of Bids	22-07-2025 Upto 05.00 PM
Technical bid opening date and time	22-07-2025 After 05.31 PM

Further details can be seen at `e` Procurement Market place and Office Notice Board @ http:// tender. eprocurement. gov.in Phone No. 08623-248005

Sd/ Shaik Fazululla
Municipal Commissioner, Naidupeta Municipality.

విన్నపాలకు.. అడ్డగోలు ముగింపు

అర్జీదారుల ఆవేదన

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: సమస్యలతో దూరప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు తరలివచ్చి వినతులు ఇస్తున్నాం. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారుగానీ.. క్షేత్రస్థాయిలోని అధికారులు పరిష్కరించకుండానే తప్పుడు వివరాలు నమోదు చేస్తున్నారు. కనీసం తమను సంప్రదించకుండానే క్లోజ్ చేస్తున్నారంటూ పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పెద్దసంఖ్యలో అర్జీదారులు తరలివచ్చారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్, డీఆర్వో నరసింహులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 284 రాగా అందులో అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించి 149 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్రంలో కలెక్టర్ వెంకటేశ్వర్

ఇంటి స్థలాన్ని లాక్కుంటున్నారు.. సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ రోడ్డులో తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన నా ఇంటి స్థలాన్ని దక్కించుకునేందుకు సోదరి కుటుంబ సభ్యులు యత్నిస్తున్నారు. తరచూ దాడులకు దిగుతున్నారు. భర్త చనిపోవడంతో దివ్యాంగురాలైన నేను ఒంటరిగా జీవిస్తున్నా. ఉన్న ఇంటి స్థలాన్ని లాక్కుంటే జీవనాధారం కోల్పోతా. ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలి.

- దర్శిజాయిసీ, సూళ్లూరుపేట

దగ్గరలో ప్రవేశం కల్పించాలి.. మాపాప యామిని ఇటీవల ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రవేశపరీక్ష రాయడంతో శ్రీసత్యసాయి జిల్లా అమరాపురంలో సీటు వచ్చింది. మాది నిరుపేద కుటుంబం. పాపను 380 కి.మీ. పంపించి చదివించడం కష్టమవుతుంది. ఉన్నతాధికారులు స్పందించి దగ్గరగా ఉన్న డక్కిలి, సూళ్లూరుపేట, పోదూరులో సీటు ఇప్పించాలి.

- కె.మల్లికార్జున్, మిట్టాత్మకూరు, గూడూరు

భర్త పింఛన్ మంజూరు చేయాలి.. నా భర్త మూడు సంవత్సరాల కిందట అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు ప్రభుత్వం నుంచి వృద్ధాప్య పింఛన్ ఇచ్చేవారు. ఆయన మరణానంతరం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా. అనారోగ్య సమస్యలతో మందులు కొనుగోలు చేసేందుకు డబ్బు కూడా లేదు. ఉన్నతాధికారులు స్పందించి భర్త పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి.

- కృష్ణమ్మ, ఎన్టీఆర్ కాలనీ, తిరుపతి

రేషన్‌కార్డు కోసం వేధిస్తున్నారు.. కుటుంబ సభ్యులు పది సంవత్సరాలు నన్ను వదిలేసి వెళ్లిపోయారు. ఒంటరిగా ఉంటున్న నన్ను కొన్ని రోజులుగా వారందరూ వేధిస్తున్నారు. రేషన్‌కార్డు రద్దు చేసుకోవాలంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇప్పటికే అనేకసార్లు దాడులు చేయడంతో భయంతో జీవిస్తున్నా. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- రాజేంద్రన్, ఎస్సీ కాలనీ, నారాయణవనం

9న జగన్ పర్యటన ఇలా..

ఐరాల, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్ బంగారుపాళ్యం పర్యటనకు సంబంధించి సోమవారం రాత్రి షెడ్యూల్ విడుదలైంది. 9న ఉదయం 10 గంటలకు బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.50కు బంగారుపాళ్యం మండలం కొత్తపల్లెలోని హెలిప్యాడ్‌కు వస్తారు. 11.20కి బంగారుపాళ్యం మామిడి మార్కెట్ యార్డుకు చేరుకుంటారు. 12.20 వరకు మామిడి రైతులతో మాట్లాడతారు. 12.20కు మళ్లీ హెలిప్యాడ్‌కు వెళ్లి 12.45కు హెలికాప్టర్‌లో బెంగళూరు బయలుదేరతారు. ఈ మేరకు సోమవారం రాత్రి షెడ్యూల్ విడుదలైంది.

'శాంతిభద్రతల పేరుతో అడ్డుకోవాలనుకోవడం అప్రజాస్వామికం'

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: మామిడి రైతులను పరామర్శించేందుకు బంగారుపాళ్యం వస్తున్న వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను శాంతిభద్రతల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని, ఆయనపై దాడి చేసేందుకు కూటమి నేతలు కుట్రపన్నుతున్నారని వైకాపా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యేలు జగన్ పర్యటనపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, అడ్డుకుంటామని చెబుతున్నారని, ఇది పూర్తి అప్రజాస్వామికమన్నారు. పోలీసులు కూటమి నేతల కుట్రలను భగ్నం చేసి జగన్ పర్యటన శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పూడిలో 10 కిలోల గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్టు

వడమాలపేట, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర ఆదేశాలతో.. సోమవారం ఎస్సై ధర్మారెడ్డి పోలీసులతో పూడి రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా రెండు బ్యాగులతో అటూఇటూ తిరుగుతుండగా అతడిని నిలువరించి తనిఖీ చేశారు అందులో 10 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించారు. నిందితుడిని విచారించగా తమిళనాడు రాష్ట్రం మదురై జిల్లా మీనాంబల్పురం గ్రామానికి చెందిన ఆర్ముగంగా గుర్తించామని, అతడిని అరెస్టు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

మద్యం మత్తులో ఇరువర్గాల ఘర్షణ

❖ వైద్యశాలలో చేరిన వారిపై మూకుమ్మడి దాడి ❖ ఐదుగురికి తీవ్ర గాయాలు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదం చినికిచినికి గాలివానలా మారి ఘర్షణకు దారి తీసింది. వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓ వర్గంపై మరో వర్గానికి చెందిన వారు దాడికి తెగబడ్డారు. రాడ్లు, కర్రలు, రాళ్లతో పరస్పరం దాడి చేసుకోవడంతో వైద్య సిబ్బంది భయంతో పరుగులు తీసి గదుల్లోకి వెళ్లి తాళం వేసుకున్నారు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సోమవారం ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పోలీసుల కథనం మేరకు..

సీసీ కెమెరాలో నమోదైన దాడి దృశ్యాలు

ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి అగ్నిగుండ ప్రవేశం సందర్భంగా పట్టణంలోని మంచినీళ్లగుంటకు రోహిత్, ధనుష్‌కు, వీఎంపల్లికి చెందిన భాను, కిరణ్, చరణ్‌ల మధ్య ఆదివారం రాత్రి వాగ్వాదం జరిగింది. అర్ధరాత్రి సమయంలో తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇందులో రోహిత్, ధనుష్ గాయపడ్డారు. వారిని బంధువులైన సుధాకర్, మునిరత్నం, మునిరాజా ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. ఈ సమయంలో భాను, కిరణ్, చరణ్.. గ్రామానికి చెందిన మరి కొందరితో వైద్యశాల అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న యువకులు, వారి బంధువులపై కర్రలు, రాడ్లు, రాళ్లతో వారిపై దాడికి పాల్పడ్డారు. దాడిలో ముగ్గురు సైతం గాయపడగా వారు తిరిగి రాళ్లు రువ్వడంతో అక్కడి నుంచి పారిపోయారు. ఘటన సమయంలో అక్కడ ఏం జరుగుతుందో తెలియక.. సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. వీఎంపల్లికి చెందిన యువకుల ద్విచక్రవాహనం పట్టుబడటంతో ధ్వంసం చేసి పెట్రోలు పోసి తగలబెట్టే యత్నంలో చేయగా ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది వారించారు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో చేరుకొని విచారణ ప్రారంభించారు. ఓ ఆటోను స్వాధీనం చేసుకుని ఘటనపై విచారిస్తున్నామని డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దాడిలో ఒకరి మృతి

ఇద్దరికి గాయాలు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని వ్యక్తి తిరుపతిలో వీరంగం సృష్టించాడు. కర్రలతో చితకబాదడంతో ఓ భిక్షగాడు మృతిచెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. అలిపిరి పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. తమిళ భాష మాట్లాడే సుమారు 45 ఏళ్ల వ్యక్తి కొంతకాలంగా భూదేవి కాంప్లెక్స్ వద్ద భిక్షాటన చేసుకుంటూ పరిసరాల్లో నిద్రిస్తుంటాడు. సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక కపిలతీర్థం ఆలయ కూడలి వద్దకు చేరుకుని అక్కడే భిక్షాటన చేస్తున్న శేఖర్ (55) అనే వ్యక్తిపై కేకలు వేస్తూ పైపైకి వెళ్లారు. అతను ప్రతిఘటించడంతో చేతిలోని కర్రతో తలపై బలంగా బాదడంతో అతడికి తీవ్ర రక్తస్రావమైంది. పక్కనే భిక్షాటన చేసే కల్పన నిలువరించి శేఖర్‌ను కాపాడే యత్నం చేయగా ఆమెపైనా కర్రతో దాడి చేశారు. సమీపంలో వాహన పార్కింగ్ ఫీజు వసూలు చేసే తారకరామ నగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం నిలువరించే ప్రయత్నం చేయగా అతనిపైనా దాడికి దిగాడు. అంతలో ప్రజలు గుమికూడటంతో నిందితుడు కేకలు వేస్తూ అన్నారావు కూడలి వైపు వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను రుయాకు తరలించగా చికిత్స పొందుతూ శేఖర్ మృతి చెందాడు. నాలుగు గంటల తర్వాత స్థానిక ప్రకాశం పార్కు వద్ద స్థానికుల సహకారంతో నిందితుడిని వల వేసి పట్టుకున్నారు. రెండు కత్తులు ఇతర సామగ్రి స్వాధీనం చేసుకొని హత్య కేసు నమోదుచేశారు. నిందితుడు రెండువారాల కిందట ఆటో డ్రైవర్‌పై దాడి చేసినట్లు సమాచారం. ఘటనతో నగర ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

దాడి అనంతరం రోడ్లపై తిరుగుతున్న మతి స్థిమితం లేని వ్యక్తి

స్వాధీనం చేసుకున్న కత్తులు

EENADU e Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

తిరుపతి లో కరకంబాడి రోడ్డు లోని గెస్ట్ లైన్ డేస్ హోటల్ వెనుక, రాదేశ్యామ్ అపార్ట్ మెంట్ నందు ఫ్లాట్ నెం: 101, 2500 Sft, ఫుల్ ఫర్నిష్డ్, అమ్మకమునకు కలదు. Cont: 9845458960, 9440310989.

PLOT FOR SALE

GENERAL

అతి తక్కువ ధరల్లో, 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/ డిటిసిపి అమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు : ✆ 91145 61456.

నేషనల్ హైవేకి ఆనుకొని తిరుపతి IIT దగ్గర ఫైనల్ అప్రూవ్డ్ కలిగిన ప్లాట్లు అతి తక్కువ ధరకే ✆ 95027 74175/ 79959 92114.

JOBS

WANTED GRADUATE Trained Teachers for primary Mathematics and EVS, Computer & PET Faculty also Sudhaha Little Citizen's High School, R.C. Road, Tirupati. ✆ 93925 13633.

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

తిరుపతి, MRపల్లి, ధనలక్ష్మీనగర్‌లో D.No: 23-1-102/16 నెంబర్‌లోని బాలాజీ హాస్పిటల్ నందు పనిచేయుటకు ఆయాలు కావలెను. జీతం: 16,000/-. ✆ 89776 07644.

FREE JOBS: తిరుపతిలోని మా సంస్థ కొరకు, కంప్యూటర్ ఆపరేటర్లు, HR Recruiters, Counsellors, Tele Callers, BDMలు కావలెను. జీ: 15-35 వేలు. # ✆ 99906 78818.

USAలో 1 సం॥ బాబును చూసుకోవడానికి వీసా కల్గిన Nancy (కేర్ టేకర్) కావలెను. జీతం + భోజనం + ఉచిత వసతి. L.రామచంద్ర నాయుడు, తిరుపతి. ✆ 92469 99571, 92469 98571.

తిరుపతిలోని ప్రముఖ హోండా కార్ల షోరూమ్ వారికి డ్రైవర్స్ కావలెను. అనుభవం గలవారికి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి. ✆ 99085 42222.

THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తితిదే ఉద్యోగుల విక్రయశాల వద్ద పరిశీలిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుమలలో తితిదే ఈవో విస్తృత తనిఖీలు

తిరుమల: తిరుమలలో సోమవారం సాయంత్రం తితిదే ఈవో జె.శ్యామలరావు విస్తృత తనిఖీలు నిర్వహించారు. శ్రీవారి పుష్కరిణి, బంగారు డాలర్ల విక్రయ కేంద్రం, అగరబత్తి, కొబ్బరికాయల విక్రయ కౌంటర్, పబ్లికేషన్ స్టాళ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని ప్రాంతాల్లో డిజిటల్ పేమెంట్ సజావుగా సాగుతున్నప్పటికీ కొబ్బరికాయల కౌంటర్ వద్ద సిగ్నల్స్ సరిగ్గా లేకపోవడం కారణంగా డిజిటల్ పేమెంట్ చేసేందుకు భక్తులు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. సమస్యను పరిష్కరించాలని అధికారులను ఈవో ఆదేశించారు. డిప్యూటీ ఈవో లోకనాథం, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: సి.మల్లవరం పంచాయతీ తెదేపా బాధ్యుడు మనోహర్‌చౌదరి ప్రాథమిక పాఠశాలలోని పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందించారు. గాంధీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పలకలు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు, పెన్సిళ్లు, ఆటవస్తువులు సోమవారం అందించారు. నాయకులు ప్రభు, రవినాయుడు, నవీన్‌కుమార్, పావని పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేస్తున్న సి.మల్లవరం తెదేపా బాధ్యుడు మనోహర్‌చౌదరి

10న గురు పూర్ణిమ మహోత్సవం

చంద్రగిరి, న్యూస్‌టుడే: పాతపేట బజారువీధిలోని శ్రీశిరిడీ సాయిబాబా దేవాలయంలో ఈనెల 10న గురువారం గురుపూర్ణిమ మహోత్సవం నిర్వహించనున్నారు. 9న బుధవారం సాయంత్రం గణపతిపూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన.. 10న గురువారం గురుపౌర్ణమిని నిర్వహించడంతో పాటు మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం ధూప్ హారతి, రాత్రికి గ్రామోత్సవంతో స్వామివారి దర్శనభాగ్యం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు వీరంగారి రమేష్‌రెడ్డి, సభ్యులు తెలిపారు.

ఘనంగా ధనుమకొండ గంగమ్మ జాతర

పాకాల: దామలచెరువు పంచాయతీ పరిధిలోని మొరవపల్లిలో వెలసిన శ్రీధనుమకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం గంగమ్మ జాతర నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ఆడి కృత్తిక ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష: ఉత్సవాలకు సమీపంలోని ఆనందగిరిపై వెలసిన శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆడి కృత్తిక బ్రహ్మోత్సవాల నాటికి పూర్తిచేయాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు, ఆలయ పాలక మండలి ప్రతినిధులతో ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం సమీక్షించారు. ఆలయం వరకు ఆర్టీసీ బస్సులు నడిపేలా ప్రస్తుతం విస్తరిస్తున్న రోడ్డు పనులు పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. భక్తులకు వసతుల కల్పనలో లోపం లేకుండా ప్రణాళికలతో ఉండాలని సూచించారు.

కపిలేశ్వరాలయంలో వైభవంగా పవిత్రోత్సవాలు

తిరుమంజనం అనంతరం ఉత్సవర్లకు హారతులిస్తున్న అర్చకులు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: కపిలేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు వైభవంగా సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం పంచమూర్తులు ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం, అలంకారం, సాయంత్రం కలశ స్థాపన తదితర కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం గ్రంధి పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలపూజ, హోమం చేపడతారు. 9వ తేదీన ఉదయం మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణ.. సాయంత్రం పురవీధుల్లో విహరించి పంచమూర్తులు దర్శనం ఇవ్వనున్నారు.

నారా లోకేశ్‌కు ఘన వీడ్కోలు

రేణిగుంట, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ రేణిగుంట విమానాశ్రయంలో ఘన వీడ్కోలు లభించింది. నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం ఆదివారం రాత్రి ఇక్కడికి వచ్చిన లోకేశ్ సోమవారం రాత్రి ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో ఆయనకు ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, పులివర్తి నాని, ఎమ్మెల్సీ రాంప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీధర్ వర్మ తదితరులు వీడ్కోలు పలికారు.

ఉన్నా లేనట్లే.. నగరానికి చీకట్లే..!

పనిచేయని ఎల్ఈడీ దీపాలు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: నగరంలో చీకట్లు కమ్ముకుంటున్నాయి. 2017లో అప్పటి ప్రభుత్వం అమర్చిన ఎల్ఈడీ దీపాలు వెలుగులు పంచలేక మిణుమిణుకుమంటున్నాయి. అప్పట్లో గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఉన్న సోడియం వేపర్, మెర్క్యురీ, ట్యూబ్‌లైట్లు, సీఎఫ్ఎల్ బల్బుల స్థానంలో 20 నుంచి 200 వాట్ల సామర్థ్యంగల ఎల్ఈడీ దీపాలు బిగించారు. నిర్వహణ బాధ్యతల్ని ఈఈఎస్ఎల్ సంస్థకు అప్పగించారు. 2023 ఫిబ్రవరి నాటికి ఒప్పంద గడువు ముగియడంతో ప్రస్తుతం నగరపాలక సంస్థ ఆ బాధ్యతల్ని చేపట్టింది. అయితే నగరంలో అప్పట్లో అమర్చిన 11 వేల దీపాలు ఇప్పుడు నామమాత్రంగా వెలుగుతూ పూర్తిస్థాయిలో వెలుగులు పంచలేకపోతున్నాయి.

అరకొర మరమ్మతులతో సరి

నగరంలో ప్రస్తుతం 13,500 ఎల్ఈడీ వీధి దీపాలు ఉన్నాయి. ప్రైవేటు సంస్థ తప్పుకున్నాక నగరపాలిక నిర్వహణలో వీధిదీపాల నిర్వహణ పూర్తిగా అటకెక్కింది. ప్రస్తుతం నెలకు రూ.40 లక్షలకు పైగా వచ్చే బిల్లుల చెల్లింపులు తప్ప కనీసం మరమ్మతులు చేయలేని పరిస్థితి నెలకొంది. ఐదేళ్లుగా మాస్టర్‌స్టాష్ రోడ్డు, శివారు ప్రాంతాల్లో రూ.కోట్లు వెచ్చించి కొత్త దీపాలు వేయడం మినహా పాతవాటి జోలికెళ్లె పాపాన పోలేదు. నగరంలో ఇలా దాదాపు 11 వేల దీపాలు అలంకారప్రాయంగా మారినప్పటికీ వాటిని మార్చేందుకు ఎలాంటి కసరత్తు చేయడం లేదు.

పద్మావతినగర్‌లో నామమాత్రంగా వెలుగుతున్న వీధిదీపం

ఫిర్యాదు అందితేనే కదలిక

నగరపాలిక పరిధిలో వైకాపా పాలించిన ఐదేళ్లూ వీధి దీపాల గురించి ఆలోచించాల్సిన అవసరమే లేకుండా తెదేపా ప్రభుత్వం వెనుకబాటుకు కల్పించింది. వీధిదీపాల నిర్వహిస్తున్న ప్రైవేటు సంస్థకు 2022 ఆఖర్లో బిల్లుల చెల్లింపులు నిలిపివేయడంతో వారు తూతూమంత్రంగా మరమ్మతులు కొనసాగిస్తూ వచ్చారు. 2023లో ఫిబ్రవరిలో ఒప్పందకాలం ముగియగానే తప్పుకున్నారు. అప్పటి నుంచి వీధిదీపాల సమస్యపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప మరమ్మతులు చేయడం లేదు. కొత్త దీపాల జోలికెళ్లకుండా కొన్ని పరికరాలు మార్చి కొద్దిపాటి వెలుగులు వచ్చేలా మమ్మతులు చేసి ఫిర్యాదుదారులను సంతృప్తిపరుస్తున్నారు. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో పలుచోట్ల నెలల తరబడి మరమ్మతుల కోసం ఎదురుచూసే దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం స్పందించి వీధి దీపాల వ్యవస్థ ప్రక్షాళనకు నడుంబిగించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పథకాల కరపత్రాలు అందిస్తున్న తెదేపా నాయకులు

సంక్షేమ పథకాల అమలు తెదేపాకే సాధ్యం

రామచంద్రాపురం: రాష్ట్రంలో బడ్జెట్ లోటు ఉన్నా సంక్షేమ పథకాలు అందించడం తెదేపాకే సాధ్యమని తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోరా హరిప్రసాద్ నాయుడు అన్నారు. సోమవారం కొత్తకండ్రిగ పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. దినేష్ నాయుడు, మునిరత్నంనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు చూపాలి

రామచంద్రాపురం: ప్రతి రైతు ఆయిల్ పామ్ సాగుపై మొగ్గు చూపాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా జోనల్ మేనేజర్ వెంకటమురళీ అన్నారు. రావిళ్ల వారిపల్లిలో సాగు చేస్తున్న తోటను సోమవారం పరిశీలించారు. క్లస్టర్ అధికారులు రెడ్డప్పనాయుడు, దేవరాజులు నాయుడు పాల్గొన్నారు.

11న ఉద్యోగ మేళా

తొట్టంబేడు, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం సంయుక్తంగా ఈనెల 11వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుగంగ కాలనీలోని ఓ కళాశాల ఆవరణలో జరిగే ఉద్యోగ మేళాలో 11 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయని అందులో పేర్కొన్నారు.

భరతనాట్యం రికార్డు సాధనలో విద్యార్థినులు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తమిళనాడులోని సేలం వద్ద గల కైలాస మానసరోవరం పాఠశాలలో ఇంటర్నేషనల్ టైమ్స్, వరల్డ్ రికార్డు ఆధ్వర్యంలో ఈ నెల 5న భరత నాట్యం కార్యక్రమం నిర్వహించారు. పలు రాష్ట్రాల నుంచి నుంచి సుమారు రెండు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. తిరుపతి రూరల్ మండలం స్టాఫ్ క్వార్టర్స్‌కు చెందిన శ్రీకల్యాణి నాట్య కళా క్షేత్రం ఆధ్వర్యంలో కె.శ్రీ వద్ద నాట్యం అభ్యసించిన విద్యార్థినులు సింహల లేక్షణ సాయి, కందుల హసిష్, బి.ప్రశ్నత్రీ, సి.కేతనలు నటరాజ స్వామి ఆకారంలో 27 నిమిషాల 32 సెకండ్ల పాటు నృత్యం చేసి ప్రపంచ రికార్డు సాధించారు. వీరికి ఇంటర్నేషనల్ టైమ్స్ వరల్డ్ రికార్డు నుంచి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించి సత్కరించారు.

ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో తిరుపతి విద్యార్థినులు

చౌక దుకాణంపై విజి'లెన్స్'

తిరుపతి(నేరభాగం), న్యూస్‌టుడే: నగరంలోని 16వ నెంబరు చౌక దుకాణంలో విజిలెన్స్, పౌరసరఫరాల అధికారులు సోదాలు చేశారు. అధికంగా ఉన్న 490 కిలోల బియ్యం, 106 కిలోల చక్కెర సీజ్ చేశారు. ప్రజల ఫిర్యాదుతో తిరుపతి ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు ఎస్సై వెంకటరమణ, సీఎస్‌డీటీ గంగయ్య తమ సిబ్బందితో సోమవారం చౌక దుకాణాన్ని తనిఖీ చేశారు. గుణసుందరి పేరుతో ఉన్న చౌక దుకాణాన్ని వినోద్‌కుమార్ నడుపుతున్నట్లు గుర్తించారు. అధికంగా ఉన్న సరకును సీజ్‌చేసి వీఆర్‌ఓకు అప్పగించారు.

దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) తిరుపతి : 80080 20003 చంద్రగిరి : 80085 74561 పాకాల : 80085 74563

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: సమస్య: న్యూబాలాజీకాలనీలో ప్రధాన రహదారి మొత్తం పాఠశాల వాహనాలు నిలిపివేయడంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. ఆక్రమణల్ని తొలగించి వాహనాలు రోడ్డుకు ఇరువైపులా క్రమపద్ధతిలో పార్కింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోండి. - బ్రహ్మానందరెడ్డి, న్యూబాలాజీకాలనీ

సమాధానం: న్యూబాలాజీ కాలనీలో పరిస్థితుల్ని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. - ఖాన్, డీసీపీ, నగరపాలిక

సమస్య: కేశవాయనగుంటలో మురుగునీటి కాలువను సక్రమంగా శుభ్రం చేయడం లేదు. వ్యర్థాలు పేరుకుపోయి.. కాలువల్లోని మురుగునీరు పొంగుతోంది. దుర్వాసన, దోమల సమస్య తోడు మురుగులో రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉంది. - సుధాకర్‌శర్మ, కేశవాయనగుంట

సమాధానం: పరిశీలించి కాలువల్ని శుభ్రం చేయిస్తాం. - డా.యువ అన్వేష్, నగరపాలిక ఆరోగ్యాధికారి

పాలకుల బొమ్మపై రంగుపడింది

చంద్రగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఏడాది పూర్తయినా మండలంలోని పాత శానంబట్ల సచివాలయ ఆవరణలో గత పాలకుల ఫొటోలతోపాటు నామఫలకాలు తొలగింపులో అధికారులు మీనమేషాలు లెక్కించారు. ఈదే విషయాన్ని ఈనాడు దినపత్రికలో 'పాలకులు మారినా..అధికారుల తీరుమారలేదు' శీర్షికన కథనం వెలువడింది. ఎట్టకేలకు స్పందించిన అధికారులు సచివాలయ ప్రాంగణంలోని గత పాలకుల బొమ్మ, నామఫలకాలపై రంగులువేశారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

రేణిగుంట: మహిళలు ఆర్థికంగా ఎదగాలని జన శిక్షణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్ తెలిపారు. సోమవారం ఎల్లమండ్యంలో రాస్, జన శిక్షణ సంస్థాన్, బాలాజీ బాలవికాస్ చైల్డ్ ఫండ్ సంయుక్తంగా మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ శిక్షణ పొందుతున్న 20 మంది మహిళలకు కిట్లు అందించి మాట్లాడారు. ఎన్జీరాజైనా 20 మంది మహిళలు ఓ గ్రూపుగా ఏర్పడితే కోర్సులను అక్కడే శిక్షణ అందిస్తామని తెలిపారు.

న్యాయ కళాశాలలపై చర్యలకు వినతి

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: వర్సిటీ పరిధిలోని న్యాయ కళాశాలల్లో ప్రవేశాలు, పరీక్షలు, రుసుముల చెల్లింపుల్లో అక్రమాలు జరుగుతున్నాయని, అలాంటి కళాశాలలను గుర్తించి అనుమతులు రద్దు చేయాలని కోరుతూ పలు విద్యార్థి సంఘం నేతలు కోరారు. సోమవారం వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడులను కలిసి వారి యాజమాన్యాల తీరును వివరించి చర్యలకు విన్నవించారు.

వంతెనకు బీటలు.. అలాగే పరుగులు

దామలచెరువు - రేండ్రగుంట రోడ్డు దారిపై పెద్ద వంకకు అడ్డంగా నిర్మించిన ప్రధాన వంతెన శిథిలావస్థకు చేరింది. ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం ఇదే మార్గంలో ప్రయాణిస్తుంటారు. పుంగనూరు, పూతలపట్టు, చంద్రగిరి నియోజకవర్గాల పరిధిలోని ఏడు మండలాల ప్రజలు తిరుపతికి వెళ్లాలంటే ఇదే ప్రధాన మార్గం. వంతెన పైభాగం బాగానే కనిపిస్తున్నా అడుగు భాగాన సిమెంటు పెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే మరమ్మతులు చేయిస్తామని ర.భ.శాఖ ఏఈ అజిత్ కుమార్ తెలిపారు. - న్యూస్‌టుడే, పాకాల

వన్యప్రాణులు ఉన్నాయ్.. జాగ్రత్త

రంగంపేట, భాకరాపేట కనుమ అడవి జంతువులు మృత్యువాత పడకుండా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో స్పందించిన అటవీ అధికారులు రహదారిలో అక్కడక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వాహన చోదకులు అప్రమత్తంగా వెళ్లాలని, అడవి జంతువులకు ఎలాంటి హాని చేయకుండా వాహనాలు నడపాలంటూ పలు సూచనలు, వన్యప్రాణి చట్టాల తీవ్రతను తెలియజేస్తూ కల్యాణి జలాశయం ముందువద్ద నుంచి భాకరాపేట వరకు ఏనిమిది బోర్డులు పెట్టారు. - న్యూస్‌టుడే, చంద్రగిరి గ్రామీణ

పుణ్యం ఉంటది సారూ.. పింఛను ఇప్పించండి

కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా పింఛను ఇప్పించాలంటూ కుమారుడు, భార్యతో కలిసి వచ్చిన ఈయన పేరు డి.అయ్యర్. ఏడాదిగా పక్షవాతంతో మంచానికి పరిమితమయ్యాడు. పేదరికంతో ఉంటున్నారు. కూలి పనిచేస్తేగానీ జీవనం సాగని కుటుంబం తమదని, పిల్లలకు ఫీజులు కట్టడానికి కూడా డబ్బులు లేవని చెమ్మగిల్లిన కళ్లతో అధికారులకు ఇల్లాలు పరిమార విన్నవించారు. భర్తకు పింఛను ఇప్పించి ఆదుకోవాలని కోరారు. సదరం ధ్రువపత్రం సమర్పిస్తే మంజూరుకు కృషిచేస్తామని అధికారులు తెలిపారు. -ఈనాడు, తిరుపతి

కత్తిరింపు సరే.. తరలింపో..!

నగరంలో విద్యుత్‌శాఖ, నగరపాలక సంస్థ మధ్య సమన్వయ లోపానికి ఇది ఓ చక్కని నిదర్శనం ఈ చిత్రం. పద్మావతినగర్‌లో ఐదురోజుల కిందట ఏపీ ఎస్పీడీసీఎల్ సిబ్బంది విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మల్ని కత్తిరించారు. అవి రోడ్డుపై అడ్డుగా అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. వాటిని తరలించాల్సిన నగరపాలిక సిబ్బంది సైతం వాటి జోలికెళ్లలేదు. అసలే ఇరుకుగా ఉన్న పద్మావతినగర్ మొదటి క్రాస్ వీధి నిండా ఎండిన చెట్ల కొమ్మలు సగభాగం ఆక్రమించాయి. ఈ తరహా సమస్య నగరవ్యాప్తంగా ఉన్న నేపథ్యంలో రెండు శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే పరిష్కారం లభిస్తుంది. - న్యూస్‌టుడే, తిరుపతి (నగరపాలిక)

మెరుగైన వసతులు కల్పించాలి

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూలో చెట్ల కింద చదువుతున్న విద్యార్థులకు వర్సిటీ పాలకులు మెరుగైన వసతులు, భోజన సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం వర్సిటీలోని ఉద్యానవనంలో చెట్లకింద చదువుతూ, నిద్రిస్తూ భోజనాలు చేస్తున్న విద్యార్థులతో కలిసి మాట్లాడారు. విద్యార్థులు ఆర్థికంగా చాలా పేదవారిగా ఉన్నారని, వీరికి కొందరు దాతలు రెండు సంవత్సరాలుగా భోజనాలు అందించడం అభినందనీయమన్నారు. వర్సిటీ పాలకులు, తితిదే ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని, నిరుద్యోగ విద్యార్థులకు భోజనాలు, వసతి సౌకర్యాలు కల్పించాలని నారాయణ డిమాండ్ చేశారు. నగరంలో పరిశుభ్రత లోపించిందని, బస్టాండు, రైల్వే స్టేషన్ వద్ద వీధి విక్రయదారులు నుంచి కొందరు గుండాగిరి ప్రదర్శిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లీలామహల్ సమీపంలో చేపల వ్యాపారం చేస్తున్న వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

గోల్.. పడాల్సిందే

ఫుట్‌బాల్‌లో జాతీయ జూనియర్ పోటీలకు ఎంపిక

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు క్రీడాకారులు.. వారి అద్భుత ప్రదర్శనతో జాతీయ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల(2025- 26)కు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం (ఏపీఎఫ్ఏ) ఆదివారం విడుదల చేసిన తుది జాబితాలో స్టాండ్‌బైతో కలిపి మొత్తం 24 మంది ఉండగా వారిలో హేమకేష్, జైఆదిత్య, హేమకేష్‌రెడ్డి ఎంపిక కావడం విశేషం. వీరిద్దరూ త్వరలో పంజాబ్ వేదికగా జరుగనున్న జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. అప్పటి కని విశాఖపట్నంలో జరిగే శిబిరంలో శిక్షణ పొందనున్నారు.

మొదటి ప్రయత్నం చేజారినా..



తిరుపతిలోని శ్రీకృష్ణనగర్‌కు చెందిన పి.శివప్రసాద్ రెడ్డి, కృష్ణవేణి దంపతుల కుమారుడు హేమకేష్ రెడ్డి. ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి ఫుట్‌బాల్ ఆడటం ఎంతో ఇష్టం. పదేళ్ల వయసులోనే శిక్షణ మొదలుపెట్టాడు. ప్రస్తుతం శాప్ శిక్షకుడు వినోద్ పర్యవేక్షణలో రాటుదేలుతూ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో జిల్లా జట్టులో కీలకపాత్ర పోషిస్తూ జట్టు విజయానికి దోహదం చేస్తున్నాడు. జాతీయ శిక్షణ శిబిరానికి ఎంపికైనప్పటికీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మొదటి ప్రయత్నం చేజారింది. ఈ ఏడాది తన ప్రతిభతో జాతీయ జూనియర్ పోటీలకు రాష్ట్ర జట్టులో స్థానం సాధించాడు. భారత జట్టులో ఆడటమే తన లక్ష్యం అంటున్నాడు.. హేమకేష్.

అనారోగ్యాన్ని జయించి..



తిరుపతిలోని ఉపాధ్యాయనగర్‌కు చెందిన గోపీచంద్, సరయూ దంపతుల కుమారుడు మన్నవ జైఆదిత్య. ఎడిపై పాఠశాలలో పదో తరగతి అభ్యసిస్తున్నాడు. చిన్నతనం నుంచే జైఆదిత్యకు ఫుట్‌బాల్ అంటే విపరీతమైన ఇష్టం. మైదానంలో ఆడలేని స్థితిలో ఉన్నప్పటికీ యూట్యూబ్‌లో ఆటను చూసి మెలకువలు నేర్చుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత బెంగళూరులోని పుర్వవీడర్ అకాడమీలో చదువుతూనే శిక్షణ పొందాడు. 2019లో మూత్రపిండాల వ్యాధిని జయించి ఆరోగ్యవంతుడిగా మారాడు. క్రీడల ద్వారానే అనారోగ్యాన్ని జయించవచ్చనేమరింత ఉత్సాహంతో టోర్నీల్లో పాల్గొనడం మొదలుపెట్టాడు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీల్లో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. శిక్షకుడు రమేష్ పర్యవేక్షణలో ఫుట్‌బాల్‌లోనూ రాణిస్తూ నాలుగేళ్లుగా రాష్ట్ర స్థాయిలో ఉండే జిల్లా జట్టును సగర్వంగా స్థానానికి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించి జాతీయ జూనియర్ పోటీలకు ఎంపికయ్యాడు.

ఉపాధ్యాయులకు సన్మానం

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలోని సొరకాయలపాళెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందిన, బదిలీపై వెళ్లిన ఇన్‌ఛార్జి హెచ్ఎం డాక్టర్ జయసుధ, ఉపాధ్యాయులు రమేష్, దామోదరం, రామాంజనేయులు, బాలాజీ కుమార్‌లకు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చినబాబు ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు.

'పెరుమాళ్లపల్లిని ప్రత్యేక రెవెన్యూగా విభజించండి'

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ మండలం పెరుమాళ్ల పల్లి పంచాయతీని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా విభజించాలని తెదేపా మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. తిరుపతికి విచ్చేసిన మంత్రిని సోమవారం కలిశారు. ఈ సమయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విషయాన్ని వివరించారు.

మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సమస్యలను తెదేపా మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్

త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తాం

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ డిపోల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి జగదీష్ పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య ఆధ్వర్యంలో నాయకులు కలిసి సమస్యలను విన్నవించారు. రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు బి.ఎన్.రెడ్డి, ఉపాధ్యక్షుడు జి.వి.మణి, అధ్యక్షుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డీపీటీవో జగదీష్‌ను సత్కరించిన వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు

తితిదే ఉద్యోగి మృతిపై కేసు

తిరుపతి (నేర విభాగం), న్యూస్‌టుడే: తితిదే ఉద్యోగి మృతిపై కేసు నమోదు చేసినట్లు తూర్పు ఎస్సై హేమాద్రి తెలిపారు. అసిస్టెంట్ షరాఫ్ హేమ్‌కుమార్ (39) తన భార్య, కుమారుడితో స్థానిక కొర్లగుంటలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్నారు. ఆదివారం చేసిన భోజనం పడకపోవడంతో ఆసుపత్రికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. సోమవారం ఉదయం నిద్ర లేవకపోవడంతో భార్య గుమాసింది స్విమ్స్‌కు తరలించగా వైద్యులు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

వాటర్ ప్లాంట్ సామగ్రి ధ్వంసం

పాకాల, న్యూస్‌టుడే: శివశక్తి నగర్‌లో తాను నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌పై సోమవారం ఉదయం కొందరు స్థానికులు ఉద్దేశపూర్వకంగా దాడిచేసి సామగ్రిని ధ్వంసం చేశారని యజమాని యోగిత తెలియజేశారు. వాటర్ ప్లాంట్ నీరు తమ ఇళ్ల ముందు వెళ్తున్నాయని స్థానికులు గొడవకు దిగారని, వాటర్ ప్లాంట్ సామగ్రిని ధ్వంసం చేశారని సైతం పగలగొట్టారని ఆమె ఆరోపించారు.

ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని మినీ లారీ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. యల్లమంద పంచాయతీ చెరువుముందరపల్లి చెందిన కిరణ్ (30), రెడ్డప్ప నాయక్ (70) సొంత పనుల నిమిత్తం యల్లమందకి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా మధ్యలో వాహనాన్ని మినీ లారీ ఢీకొట్టడంతో రెడ్డప్పనాయక్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కిరణ్ తీవ్రంగా గాయపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

తెదేపా కార్యకర్త మృతికి సంతాపం

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: నెత్తకుప్పానికి చెందిన తెదేపా కార్యకర్త కృష్ణయ్య మృతి బాధాకరమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సోమవారం గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. తెదేపా నాయకులు జేడీ జగన్, తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లల అప్పగింత

రేణిగుంట, న్యూస్‌టుడే: ఆంగ్లం చదవడం ఇష్టం లేదని ఓ పిల్లల గృహం నుంచి పారిపోయిన ముగ్గురు చిన్నారులను పట్టణ పోలీసులు తిరిగి ఆ హోమ్ నిర్వాహకులకు అప్పగించారు. తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడలోని మాతృశ్రీ చైల్డ్ హోమ్‌లో ఉంటున్న లంకేష్, సహదేవ, ముకేష్ తిరుపతిలోని సోక్రటీస్ పాఠశాలలో చదువుతున్నారు. ఆంగ్లం చదవడం ఇబ్బందిగా మారడంతో వీరు అక్కడ్నుంచి పారిపోయి రేణిగుంట మండలం కరకంబాడి వద్ద తిరుగుతుండగా పట్టణ పోలీసులు గుర్తించి వారిని విచారించి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. అనంతరం ఆ పిల్లలు ముగ్గురికి కౌన్సెలింగ్ ఇచ్చి మాతృశ్రీ చైల్డ్ హోమ్ వారికి పిలిపించి అప్పగించారు.


పిల్లలను అప్పగిస్తున్న రేణిగుంట పోలీసులు

25వ వర్ధంతి



మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన కీ॥శే॥ బి.నల్లారెడ్డి గారు మా నుండి దూరమై నేటికి 25 సంవత్సరాలైనను గడిచినను వారి మధురస్మృతులు మాతోనే ఎప్పటికీ పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ బి.నల్లారెడ్డి గారు
తిరుపతి మొదటి బిజెపి టౌన్ ప్రెసిడెంట్

వసంతవిహార్ లాడ్జి
తేరు వీధి, తిరుపతి. సెల్: 94409 01373

(c) eenadu

శ్రీకాళహస్తి
•శ్రీకాళహస్తి • సత్యవేడు

మృత్యుంజయ శివలింగానికి అభిషేకాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శ్రీమృత్యుంజయ శివలింగానికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సోమవారం గోక్షీరం, వివిధ పూజా ద్రవ్యాలతో శివలింగానికి, ఉమాదేవి సమేత చంద్రశేఖరస్వామి, వినాయక స్వామి ప్రతిమలకు అభిషేకాలు జరిపారు. ధూప, దీప, నివేదనలు సమర్పించారు.

11న ఉద్యోగ మేళా

తొట్టంబేడు, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం సంయుక్తంగా ఈనెల 11వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుగంగ కాలనీలోని కళాశాల ఆవరణలో జరిగే ఉద్యోగ మేళాలో 11 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయని అందులో పేర్కొన్నారు. ఈ మేళాలో 400 పైగా ఉద్యోగాలకు ముఖాముఖి నిర్వహిస్తామన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులు అర్హులన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలతో నేరుగా హాజరు కావాలని తెలిపారు.

ప్రజలు మెచ్చిన పాలన

కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నేతలు

శ్రీకాళహస్తి(గ్రామీణ(ఏర్పేడు), న్యూస్‌టుడే: ప్రజలు మెచ్చిన సుపరిపాలన కొనసాగుతుందని తెదేపా నేతలు అభిప్రాయపడ్డారు. శ్రీకాళహస్తి మండలం తెదేపా అధ్యక్షులు కృష్ణయాదవ్, ఏర్పేడు మండల అధ్యక్షులు నాగరాజునాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఓబులాయపల్లి, రెడ్డిపల్లి, మోదుగులపాళెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. గురవారెడ్డి, కామేష్‌యాదవ్, జగన్నాథంనాయుడు పాల్గొన్నారు.

వసతిగృహాల్లోనే భోజనం చేయాలి

సంక్షేమాధికారులతో సమావేశమైన ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణ అధికారులు, సిబ్బంది విధిగా ఆయా సంక్షేమ వసతి గృహాల్లోనే భోజనం చేయాలని ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి సూచించారు. పురపాలక కార్యాలయంలో సోమవారం డివిజన్ పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల అధికారులు, డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల శ్రీకాళహస్తిలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో వచ్చిన విద్యార్థులపై చర్చించారు. వాటిలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే పరిష్కరించే వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని, మిగిలినవి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆహార నాణ్యతలో ఎలాంటి రాజీ వద్దన్నారు. అధికారులు మునీంద్ర, ఉదయ్‌కిరణ్, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

సద్గురు ఏమిటీ దుర్గతి

✦ ఆశ్రమంలో అడుగడుగునా నిర్లక్ష్యపు ఆనవాళ్లు ✦ కనుమరుగవుతున్న పురాతన కట్టడాలు

శిథిలావస్థలో బ్రహ్మవిద్య పాఠశాల భవనం

ఏర్పేడు, న్యూస్‌టుడే: సాధులు, పేదల సంక్షేమమే లక్ష్యంగా శ్రీ సద్గురు మలయాళస్వామి ఏర్పేడులో స్థాపించిన శ్రీ వ్యాసాశ్రమం దుస్థితికి చేరింది. ఆశ్రమంలో సాధువులకు బదులుగా బయట వ్యక్తుల పాలన సాగుతుంది. ఫలితంగా వారికే చోటు కరవైంది. నిత్య అన్నదాన పథకంతో పేదలను ఆదుకోవాలని స్వామివారు తీర్మానించిన పుటికి పెత్తనందారుల నిర్ణయాలతో ఆశ్రమం వైపు కన్నెత్తి చూసేవారే లేరు. ఎటుచూసిన శిథిలాలు, మూతపడుతున్న కేంద్రాలు చూసిన భక్తులు, పూర్వ విద్యార్థులు కన్నీరు పెడుతున్నారు. ఓ సద్గురు లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన ఆశ్రమాన్ని మీరే కాపాడుకోవాలి స్వామి అంటూ ప్రార్థనలు చేయడం చూపరులను సైతం కలచివేస్తోంది.



స్తూపం చుట్టూ అటవీని తలపిస్తున్న పిచ్చిమొక్కలు

మూతపడిన కేంద్రాలు..

1926లో శ్రీ సద్గురు మలయాళస్వామి సుమారు 26 ఎకరాల్లో ఆశ్రమాన్ని స్థాపించారు. ఈ క్రమంలోనే కుల, మత, లింగ బేధాలు లేకుండా వేదవిద్య నభ్యసించాలనే లక్ష్యంతో బ్రహ్మవిద్య పాఠశాల, సాధువులకు అండగా సాధుపోషణకేంద్రం, ఉచిత వైద్యం కోసం కంటి వైద్యశాల, సాధారణ ఆసుపత్రి, అనాథ శరణాలయం ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఇవి పూర్తిస్థాయిలో కనుమరుగు కావడంతో భవనాలు సైతం శిథిలాలుగా మారుతున్నాయి.

వసతులపై అధికారుల అసంతృప్తి

శ్రీవ్యాసాశ్రమంలో ప్రస్తుతం జరుగుతున్న పాఠశాల, వసతిగృహాల్లో సరైన వసతులు లేవనే ఆరోపణలున్నాయి. గతంలో ఆశ్రమాన్ని పరిశీలించి కలెక్టర్ వసతిగృహాల్లో అపరిశుభ్రత, నిర్వహణలేమిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. తరచూ అధికారులు పరిశీలిస్తారని తీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే తర్వాత కాలంలో మండల అధికారులు అటువైపు వెళ్లకపోవడంతో గతం మాదిరిగానే విద్యార్థులు అవస్థలు పడుతున్నారని సమాచారం. శ్రీవ్యాసాశ్రమ పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఉదమానికి సిద్ధమయ్యారు.

నిర్లక్ష్యంతో నిధులు వృథా

తెరచుకోని మ్యూజియం

వజ్రోత్సవాలకు చిహ్నంగా 2001లో శ్రీవ్యాసాశ్రమంలో 13 అంతస్తుల ఎత్తైన స్తూపాన్ని నిర్మించారు. స్తూపంలోపల ఏర్పాటు చేసిన దేవతామూర్తులను దర్శించుకుంటూ పైకి చేరుకుని సమీపంలోని అటవీప్రాంతం, ఆశ్రమ ప్రాంగణాన్ని వీక్షించి ఆహ్లాదం పొందేలా ఏర్పాట్లు చేశారు. అయితే గత కొన్నేళ్లుగా ఆశ్రమంలోకి భక్తులకు అనుమతించకపోవడంతో స్తూపం చుట్టూ అటవీని తలపించేలా దట్టమైన పిచ్చిమొక్కలు పెరిగాయి. అదేవిధంగా స్వామి వారి చరిత్ర, ఆశ్రమానికి సంబంధించిన పురాణాలు తెలియజేస్తూ ఏర్పాటు చేసి మ్యూజియం భవనంపై పిచ్చిమొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరడంతో రూ.కోట్ల నిధులు వృథాగా మారాయి.

❖ ఈ విషయం మా దృష్టికి వచ్చింది. పలుమార్లు ఆశ్రమానికి వెళ్లి పరిశీలించాం. సమస్యలు పరిష్కరించాలని సూచించాం. అయినా ఆశ్రమం నిర్వాహకులు సహకరించడం లేదు. దీని గురించి ఉన్నతాధికారులకు సైతం నివేదించాం. వారి ఆదేశాలు మేరకు నడుచుకుంటామని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ దేవాదాయశాఖ ఉన్నతాధికారి చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ సత్యసాయి వీధిలో మురుగు నిలిచింది. దీంతో దుర్గంధంతో పాటు ఇబ్బందులు తప్పడం లేదు. **- స్థానికులు**

పరిష్కారం: సమస్యను మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా తెలుసుకున్న పారిశుద్ధ్య విభాగం అధికారులు బాలకృష్ణ, మోతీలాల్ ఇద్దరూ సిబ్బంది అక్కడికి పంపి వెంటనే వ్యర్థాలు తొలగించి దుర్గంధాన్ని తప్పించారు. అధికారుల తీరుకు వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: సమస్య: మండలకేంద్రంలో శ్రీకాళహస్తి-తడ రహదారి మార్గంలోని ట్రంకు రోడ్డు పొడవునా కేబుల్ నెట్‌వర్క్ నిర్వాహకులు తీగలు అమర్చేందుకు పలుచోట్ల గోతులు తీశారు. గొయ్యిలా తవ్విన వీటిని వెంటనే పూడ్చివేయాల్సి ఉండగా, రోజుల తరబడి పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ట్రాఫిక్ రద్దీ కారణంగా వాహనాల రాకపోకలకు అవస్థలు కల్గిస్తోంది. **-మూగాల పోలయ్య, చెన్నవారిపాళెం**

సమాధానం: వాటిని వెంటనే పూడ్చేయాలని నిర్వాహకులను ఆదేశించాం. రేపటిలోగా పని జరిగేలా చర్యలు తీసుకుంటాం. **-బసిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

పైపులైనుకు మరమ్మతులు

స్పందనకు వందనం

నారాయణవనం, న్యూస్‌టుడే: మండలంలోని ఎరికంబట్టులో తాగునీటి పైపులైన్ లీకేజీతో నీరు వృథా అవుతుంది. అలాగే కాలువలోని మురుగు పైపుల్లో చేరి కలుషితమవుతుంది. సమస్యపై స్థానికుల ఫిర్యాదుతో 'మేమున్నాం.. మీకుతోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైనును బాగు చేయించారు. ❖ మండలంలోని బ్రాహ్మణ తాంగేల్‌లో కాలువల్లో వ్యర్థాలపై ప్రచురితమైన సమస్యపై అధికారులు స్పందించారు. ఎంపీడీఓ అరుణ ఆదేశాలతో స్థానిక పారిశుద్ధ్య సిబ్బంది పూడిక తొలగించారు.

ముక్కంటి సేవలో ఎచ్చర్ల ఎమ్మెల్యే

ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో ఏబీవీపీ నేత యాచంద్ర

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం ముక్కంటి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనానంతరం ఆలయం తరఫున తీర్థ ప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం ఆయన స్థానిక ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు సూళ్లూరు యాచంద్ర ఇంటికి వెళ్లారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వార్షిక ఉత్సవాల్లో భాగంగా ధ్వజావరోహణ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయ ఆవరణలో ఆలయ ప్రధాన అర్చకులు పురుషోత్తం, రవి నేతృత్వంలో పూజలు నిర్వహించారు. ఆగమోక్తంగా ధ్వజావరోహణ ఘట్టాన్ని పూర్తి చేశారు. సాయంత్రం కురుక్షేత్ర సంగ్రామంలో మృతిచెందిన కౌరవులందరికీ పాండవుల తరఫున అర్చకులు పిండప్రదానం చేశారు. ఆలయ ఈఓ హేమమాలిని, సూపరింటెండెంట్ రవి, తనిఖీ అధికారులు లక్ష్మయ్య, దుర్గాప్రసాద్, మునిరెడ్డి, దాము పాల్గొన్నారు.

కౌరవులకు పాండవుల తరఫున పిండప్రదానం చేస్తున్న అర్చకులు
✦ ధ్వజావరోహణ గావిస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

వేడుకగా మహాకుంభాభిషేకం

ఆలయ ఆవరణలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నాగలాపురం, న్యూస్‌టుడే: గ్రామదేవత చెల్లేతమ్మ ఆలయ మహాకుంభాభిషేకం సోమవారం వేడుకగా జరిగింది. ఆలయ ఆవరణలో గణపతి హోమాన్ని నిర్వహించిన అర్చకులు మంత్రయుక్త కలశ జలాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయ గోపురాలపై కలశ జలాలతో మహాకుంభాభిషేకాన్ని నిర్వహించారు. మునీశ్వరస్వామి, సప్త కన్యలు, పెరియాండార్ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. ఏర్పాట్లు గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

పుర కమిషనర్ సంజయ్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న యూనియన్ సభ్యులు

కార్మిక సంఘాలతో సార్వత్రిక సమ్మె

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కార్మిక చట్టాల అమలు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు పురపాలక సంఘ పారిశుద్ధ్య విభాగ కార్మికులు పాల్గొంటారని యూనియన్ నేతలు తెలిపారు. సీఐటీయూ నేతలతో కలసి సోమవారం పుర కమిషనర్ సంజయ్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ నెల 9వ తేదీన చేపట్టబోయే ఈ సమ్మెకు కార్మిక సంఘాలన్నీ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. మల్లికార్జున్, చారుశీల, హరి, జాను, మురళి, జనార్దన్ పాల్గొన్నారు.

8 గంటల పని విధానం అమలు చేయాలి

సత్యవేడు: కార్మికులకు 8గంటల పని విధానాన్ని అమలు చేయాలని సీఐటీయూ నాయకులు రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఆయన కరపత్రాలు ఆవిష్కరించి పంపిణీ చేశారు. క్రిష్టయ్య, సుందరం తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు వేసిన పునాదులు ధ్వంసం

మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్రంలో నరసింహయాదవ్, శ్రీపతిబాబు తదితరులు

సత్యవేడు, న్యూస్‌టుడే: రాష్ట్ర విభజన తర్వాత తెదేపా పాలనలో రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు వేసిన పునాదులను వైకాపా పాలనలో జగన్ మోహన్ రెడ్డి ధ్వంసం చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. సోమవారం సత్యవేడులో ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో జరిగిన పరిచయ వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగన్ విధ్వంసం చేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే చంద్రబాబు నేతృత్వంలో పునర్నిర్మించామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని చోట్ల 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం జరుగుతుందన్నారు. తెదేపాకు కంచుకోట సత్యవేడు చాలా ఇబ్బంది పడుతుందన్నారు. ఇన్‌ఛార్జి మంత్రి అయిన తర్వాత సత్యవేడు నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. నియోజకవర్గాన్ని చక్కబెడతామన్నారు. మాజీ సీఎం జగన్ ఐదేళ్లు ఎదుటి వారు నాశనమైనా పర్వాలేదు తన కుటుంబానికి డబ్బులు కావాలని మద్యం, ఇసుక, పేదల భూముల్లో స్కాంలకు పాల్పడ్డారని విమర్శించారు. వైకాపా ఇచ్చిన హామీలు తుంగలో తొక్కింది. తెదేపా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి గర్వంగా చెప్పే రోజు వచ్చిందన్నారు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోయిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, సూపర్‌సిక్స్‌లో భాగంగా ఇంటిలో ఎంతమంది పిల్లలున్నా అంతమందికి తల్లికివందనం ఇచ్చామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆటో డ్రైవర్లకు రూ.15వేలు పంపిణీ కార్యక్రమం త్వరలో ఉంటుందన్నారు.

త్వరితగతిన మౌలిక వసతులు కల్పించాలి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా బీసీ సంక్షేమ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి

ఏర్పేడు, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఉపయోగకరంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఏర్పేడు బీసీ వసతిగృహాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. రూ.17లక్షలతో చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం చదువుల్లో విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. రాత్రిభోజనం వడ్డించి వారితో కలిసి తిన్నారు. బీసీ సంక్షేమశాఖ సహాయ అధికారిణి జోత్స్న, వార్డెన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్లకు దరఖాస్తుల ఆహ్వానం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ఆర్టీసీలో ఆన్ కాల్ పద్ధతిలో డ్రైవర్లుగా పని చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాళహస్తి డిపో మేనేజర్ మునిచంద్రయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెవీ వెయిట్ డ్రైవింగ్ లైసెన్సు పొంది 18 నెలలు పూర్తయి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తుతో ఆధార్ కార్డును జతపరిచి ఈనెల 14వ తేదీ లోపు శ్రీకాళహస్తి డిపో మేనేజర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

వాహనాలపై స్టిక్కర్ల తొలగింపు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలపై ప్రెస్‌తో పాటు పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించి వేసుకున్న స్టిక్కర్లను పట్టణ పోలీసులు తొలగించారు. డీఎస్పీ నరసింహమూర్తి ఆదేశాల మేరకు పట్టణ సీఐ గోపి నేతృత్వంలో పోలీసులు ద్విచక్ర వాహనాలపై ఉన్న స్టిక్కర్లను వాళ్ల చేతనే తొలగించారు. మళ్లీ వేసుకుంటే చర్యలు తప్పవంటూ హెచ్చరించి పంపారు.

సంక్షేమమే తెదేపా లక్ష్యం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని తెదేపా బీసీ విభాగం నేతలు రవి, ఉమేష్‌లు అన్నారు. పట్టణంలోని 52వ పోలింగ్ కేంద్రం పరిధిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

నారా లోకేశ్‌కు ఘన వీడ్కోలు

రేణిగుంట, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన వీడ్కోలు లభించింది. నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం ఆదివారం రాత్రి ఇక్కడికి వచ్చిన లోకేశ్ సోమవారం రాత్రి ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో ఆయనకు ఎమ్మెల్యేలు బొజ్జల సుదీర్ రెడ్డి, గాలి భానుప్రకాష్, పులివర్తి నాని, ఎమ్మెల్సీ రాంప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీధర్ వర్మ తదితరులు వీడ్కోలు పలికారు.

విలీనంతో విద్య దూరం

కలెక్టర్ కార్యాలయం ఎదుట చెన్నంపల్లి మహిళల నిరసన

ఏర్పేడు, న్యూస్‌టుడే: ప్రాథమిక పాఠశాల తరగతులను పాపానాయుడుపేటలో విలీనం చేయడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. సోమవారం స్థానిక పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. అనంతరం మహిళలు కలెక్టర్ కార్యాలయానికి చేరకుని గ్రీవెన్స్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. వర్షాకాలంలో నక్కలవాగు, స్వర్ణముఖినది దాటలేని పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల అనుసరిస్తున్న తీరుకు నిరసనగా చేపట్టదల్చిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సివిల్ సప్లయిస్ కూలీల సంఘం నేతలు కోరారు. ఈ సందర్భంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్యతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలంటూ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

మహిళలకు కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

రేణిగుంట: మహిళలు ఆర్థికంగా ఎదగాలని జన శిక్షణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్ తెలిపారు. సోమవారం ఎల్లమందంలో రాస్, జన శిక్షణ సంస్థాన్, బాలాజీ బాలవికాస్ చైల్డ్ ఫండ్ సంయుక్తంగా మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ శిక్షణ పొందుతున్న 20 మంది మహిళలకు కిట్లు అందించి మాట్లాడారు. ఎక్కడైనా 20 మంది మహిళలు ఓ గ్రూపుగా ఏర్పడితే కోర్సులను అక్కడే శిక్షణ అందిస్తామని తెలిపారు. రాస్ ప్రాజెక్టు అధికారి రమేష్‌రెడ్డి, సంస్థ సమన్వయకర్త సుధాకర్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కూడలి శుభ్రం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని వైకాపా నేతలు పట్టణంలోని బాబుఅగ్రహారం పుష్కరిణి సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహ పరిసరాలు శుభ్రం చేశారు. సోమవారం ఆలయ మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు నేతృత్వంలో పలువురు వైకాపా నేతలు ఇక్కడి పరిసరాలతో పాటు వైఎస్ఆర్ విగ్రహాన్ని శుభ్రం చేశారు. మంగళవారం ఇక్కడ వైఎస్ఆర్ జయంతి వేడుకలు జరపనున్నారు. మున్నా, జయశ్యాం, శ్రీనివాసులు, ఉదయ్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లల అప్పగింత

పిల్లలను అప్పగిస్తున్న పోలీసులు

రేణిగుంట, న్యూస్‌టుడే: ఆంగ్లం చదవడం ఇబ్బందిగా ఉందని ఓ పిల్లల గృహం నుంచి పారిపోయిన ముగ్గురు చిన్నారులను పట్టణ పోలీసులు తిరిగి ఆ హోమ్ నిర్వాహకులకు అప్పగించారు. తిరుపతి నగరంలోని బైరాగపట్టెడలోని మాతృశ్రీ చైల్డ్ హోమ్‌లో ఉంటున్న లంకేష్, సహదేవ, ముఖేష్ తిరుపతిలోని సోక్రటీస్ పాఠశాలలో చదువుతున్నారు. ఆంగ్లం చదవడం ఇబ్బందిగా మారడంతో వీరు అక్కడ్నించి పారిపోయి రేణిగుంట మండలం కరకంబాడి వద్ద తిరుగుతుండగా పట్టణ పోలీసులు గుర్తించి వారిని విచారించి పట్టణ పోలీసుస్టేషన్‌కు తీసుకుని వచ్చారు. అనంతరం ఆ పిల్లలు ముగ్గురికి కౌన్సెలింగ్ ఇచ్చి మాతృశ్రీ చైల్డ్ హోమ్ వారిని పిలిపించి అప్పగించారు.

విషం తాగి యువకుడి ఆత్మహత్య.. ఏర్పేడు: ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో యువకుడు విషం తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని గోవిందవరంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. కోనసీమ జిల్లాకు చెందిన బాలయేసు(25) గోవిందవరంలో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెందిన బాలయేసు విషం తాగి మృతి చెందాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాదచారుడికి తీవ్రగాయాలు.. నాగలాపురం: రోడ్డు ప్రమాదంలో ఓ పాదచారుడు తీవ్రగాయాలపాలైన ఘటన మండలంలోని మలిమేలుకండ్రిగలో సోమవారం జరిగినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. చెన్నైలోని ట్రిప్లికేన్‌కు చెందిన ఓ కుటుంబం తిరుమల శ్రీవారి దర్శన అనంతరం తిరుగుప్రయాణంలో కారులో వెళుతుండగా.. మార్గమధ్యలోని మలిమేలుకండ్రిగ వద్ద రహదారిపై నడిచివెళుతున్న ఇందిరానగర్‌కు చెందిన కన్నయ్య(52)ను ఢీకొంది. ప్రమాదంలో కన్నయ్య రెండు కాళ్ల దెబ్బతిన్నాయి.

గుంతలు.. కళ్లకు గంతలు

రహదారి పక్కనే ప్రమాదకరంగా గుంత

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ప్రజల ప్రాణాలంటే అధికారులకు అలుసుగా మారింది. రహదారి పక్కనే కాలువలా తీసిన గుంతలు పూడ్చకపోవడంతో ప్రమాదాలకు దారి తీస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలకేంద్రంలో గోవర్ధనపురం మారేడుకాలువ పక్కనే ఇటీవల భూగర్భంలో గ్యాస్ పైపులు అమర్చేందుకు గుంతలు తవ్వారు. పనులు పూర్తైన తర్వాత వాటిని సక్రమంగా పూడ్చకపోవడంతో సమస్య ఏర్పడింది. ఈ పనులు పూర్తై నెల గడుస్తున్నా ఇంతవరకు దీనిపై పట్టించుకునే నాథుడు కరవయ్యారు. గోవర్ధనపురంలోని మారేడుకాలువ వంతెన మీదుగా రాకపోకలు సాగించే క్రమంలో ఇరుకు కారణంగా ఇక్కడ తరచూ ఉదయం, సాయంత్రం వేళ్లలో వాహనాల రద్దీ తీవ్రంగా ఉంటుంది. అదుపు తప్పితే ఈ గుంతలో పడితే మళ్లీ లేవలేని, లేపలేని పరిస్థితి నెలకొంది. కాలువలో నీరు నిలిచి మురికికూపంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

బండరాయి.. గుండెజారి

రహదారి పక్కన ఉన్న బండరాయితో వాహనదారులకు నిత్యం ప్రమాదకరంగా మారింది. శ్రీకాళహస్తి -తడ ప్రధాన రహదారిలో బీడీ కాలనీ సమీపంలో రోడ్డు అనుకుని పెద్ద బండరాళ్లు వాహనాలకు ముప్పు తెచ్చిపెడుతుంది. రాళ్లను తప్పించే క్రమంలో పలు వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రాళ్లు తొలగించాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, తొట్టంబేడు

వ్యర్థాలతో ఇక్కట్లు

పట్టణంలోని నక్కహరిజనవాడలో మురుగునీటి కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో అక్కడి గృహస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యర్థాలు తొలగించి మురుగునీటి కాల్వ అవస్థలు తప్పించాలంటూ అక్కడి ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 21 నుంచి రూ. 30 వరకు

రెండో రకం: కిలో రూ. 15 నుంచి రూ. 20 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	125
లేయర్	112
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	250
లేయర్ మాంసం	190

నేటి నుంచి గురుపూర్ణిమ ఉత్సవాలు .. నాయుడుపేట పట్టణం: నాయుడుపేట బ్రాహ్మణ వీధిలోని శిరిడీ సాయిబాబా మందిరంలో మంగళవారం నుంచి గురుపూర్ణిమ మహోత్సవాలు ప్రారంభంకానున్నాయని ఆలయ ధర్మకర్త కోటూరు సాయిరాం ప్రసాద్ తెలిపారు.

రేపు శిక్షణ తరగతులు.. బాలాయపల్లి, న్యూస్‌టుడే: 'పంచాయతీ పురోగతి సూచిక 2.0' నిర్వహణపై ఈ నెల 9న స్థానిక కార్యాలయంలో శిక్షణ తరగతులు ఉంటాయని ఎంపీడీవో వినీల్‌కుమార్ తెలిపారు. మండల స్థాయి అధికారులతో పాటు గ్రామ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ సహాయకులు, ఏఎన్‌ఎంలు హాజరు కావాలన్నారు.

నేడు మెమూ రైళ్ల రద్దు .. నాయుడుపేట పట్టణం: సూళ్లూరుపేట నుంచి నెల్లూరు వెళ్లే లోకల్ రైలు 66035, నెల్లూరు నుంచి సూళ్లూరుపేట వచ్చే మెమూ రైళ్లు మంగళవారం పూర్తిగా రద్దు చేశారని స్టేషన్ మాస్టరు చిరంజీవి సోమవారం పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం.. చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాలిచర్లవారిపాలెం ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు వై.చంద్ర, వీవీ కుమార్, మంజుశ్రీ, ఆదిలక్ష్మి, సురేంద్ర సోమవారం సన్మానం పొందారు. హెచ్‌ఎం అనసూయ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు

వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు పట్టణం: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. డివిజన్‌లోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మహిళకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

మిట్టాత్మకూరు(గూడూరు పట్టణం), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు మండలం మిట్టాత్మకూరు, పగడాలపల్లి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, కొండూరు వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధం.. అధికారుల చోద్యం

- శిథిలావస్థలో వాటర్ ట్యాంకులు
- పుర ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు

వాలయానందపురంలో శిథిలావస్థలో ట్యాంకు

పిల్లర్ల దుస్థితి

దెబ్బతిన్న ట్యాంకు పైభాగం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గ్రేడ్-1 పురపాలక సంఘమైన గూడూరులో అభివృద్ధి అంతంతమాత్రంగా ఉంది. కనీస అవసరాలైన తాగునీటి సమస్యను కూడా తీర్చలేక పాలకులు, అధికారులు నిర్లక్ష్య ధోరణితో ఉన్నారు. పుష్కలంగా రెండుసార్లు నీటి పంపిణీ చేసే అధికారులు, ప్రస్తుతం ఒకపూట ఇచ్చేందుకే దిక్కు లేకుండా పోయింది. కండలేరు జలాశయం నుంచి వచ్చే నీటి సరఫరాకున్న నాసిరకం పైపులైన్లతో నిత్యం అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. వేసవి వస్తే తాగునీటి కోసం పట్టణ ప్రజలు ఎదురుచూపులే తప్ప ప్రయోజనం శూన్యం. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని వాటర్ ట్యాంకు దుస్థితి చూస్తే నీటి ఎద్దడి తప్పే విధంగా లేదు. అధికారులు సక్రమంగా పట్టించుకోకపోవడంతో పట్టణంలోని పలు వాటర్ ట్యాంకులు శిథిలావస్థలో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇవి కూలిపోతే నీటి ఎద్దడి తప్పదని భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం శిథిలావస్థలోని వాటర్ ట్యాంకుల ఏర్పాటుపై దృష్టి సారించాలని పుర ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడెక్కడంటే..

పట్టణంలోని మాయబజారు, పీఎస్‌ఆర్ పార్కు, వాలయానందపురం, విఘ్నేశ్వరపురం, జనార్దన్‌రెడ్డికాలనీ, జానకీరామ్‌పేట, ఇందిరానగర్ ప్రాంతాల్లో మొత్తం తొమ్మిది వాటర్ ట్యాంకులున్నాయి. ఇవి 34 వార్డులకు సరఫరా చేసేందుకు వీలుగా కండలేరు నుంచి వచ్చే నీటిని పంపింగ్ చేస్తున్నారు. పురపాలక సంఘంలో ఉదయం, సాయంత్రం రెండు పూట్ల నీటి సరఫరా చేయాల్సి ఉండగా ఉదయం ఒక్కసారి మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకొంటూ పుర అధికారులు చోద్యం చూస్తున్నారు.

సగానికిపైగా దెబ్బతిని..

పురపాలక సంఘంలో తొమ్మిది ట్యాంకుల్లో 57లక్షల లీటర్లు నిల్వ చేసి పట్టణంలోని లక్షపైగా ఉన్న జనాభాకు నీటిని సరఫరా చేస్తున్నారు. వీటిలో మూడు ట్యాంకులు పూర్తి శిథిలావస్థలో చేరగా, మరో రెండు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ట్యాంకు నేలమట్టమైతే నీటి కోసం ఇక్కట్లు తప్పవని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

త్వరలో నిర్మిస్తాం

వాటర్ ట్యాంకుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. అమృత్ పథకంలో నిధులు కూడా మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్లు పిలిచి, నూతన నిర్మాణాలు చేపడతాం.

\- వెంకటేశ్వర్లు, కమిషనర్, గూడూరు పురపాలక సంఘం

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046		సమయం
నాయుడుపేట: 80085 73970		10 AM
సూళ్లూరుపేట: 96188 78782		TO
వెంకటగిరి : 80085 73966		1 PM

తడ, న్యూస్‌టుడే: సమస్య: చేనిగుంటలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. **- మునికృష్ణయ్య**

సమాధానం: ఏబీ స్విచ్ కాలిపోవడం వల్ల వెలగడం లేదు. బాగుచేస్తాం. **- నాగేంద్ర, అండగుండాల కార్యదర్శి**

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: గూడూరు రెండో పట్టణంలోని కోర్టు సెంటర్ ప్రాంతంలో రోడ్డుపై చెత్తాచెదారాలు అధ్వానంగా ఉండడంతో దుర్వాసన భరింతగా ఉన్నాయి. **- సుందర్**

సమాధానం: చెత్తాచెదారాలను సిబ్బందితో తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు, కమిషనర్**

వెంకటగిరి, న్యూస్‌టుడే: సమస్య: తూర్పు వీధిలోని మహాత్మాగాంధీ గ్రంథాలయం వద్ద చేతి పంపు మరమ్మతులకు గురై రెండు నెలలవుతోంది. **- రంగినేని శంకరయ్య**

సమాధానం: చేతిపంపును మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొస్తాం. **- వెంకట్రామిరెడ్డి, కమిషనర్**

చెత్తాచెదారాల తొలగింపు

స్పందనకు వందనం

బాలాయపల్లి, న్యూస్‌టుడే : అక్కసముద్రం బస్ షెల్టర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సోమవారం తొలగించారు. 'ఈనాడు'లో సమస్యను ప్రచురితం చేయడంతో వెంటనే గ్రామ కార్యదర్శి దయాకర్ స్పందించి గ్రీన్ అంబాడిసర్‌తో పనులు చేయించారు.

పరిశ్రమల ఏర్పాటుకు సహకరించండి

మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వినతిపత్రం అందించారు. తిరుపతిలో సోమవారం జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని నాయుడుపేటలోని మేనకూరు సెజ్‌లో అనేక పరిశ్రమలున్నాయని, అదేవిధంగా ఏర్పేడులో ఏర్పడనున్న పరిశ్రమలకు అనుగుణంగా వెంకటగిరి పరిసర ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు సహకరించాలని కోరారు. అవసరమైన నైపుణ్యం కలిగించేలా పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రం మంత్రికి అందజేశారు.

'పేదలను చదువుకు దూరం చేయొద్దు'

ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పలు గ్రామాల ప్రజలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పేద విద్యార్థులను చదువుకు దూరం చేయొద్దంటూ వివిధ మండలాలకు చెందిన ప్రజలు, విద్యార్థి సంఘాలు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. వీరికి సీఐటీయూ సంఘీభావం తెలిపింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలల్లో భాగంగా 3, 4, 5 తరగతులను వేరొకచోట విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. పలు గ్రామాల నుంచి తల్లిదండ్రులు, విద్యా కమిటీలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని 'మా ఊరి బడి కాపాడి.. మా పిల్లల భవిష్యత్తును కాపాడాలి' అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ డీఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. నేతలు లక్ష్మయ్య, భగత్ రవి, సుమన్ నాగరాజు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి రమణయ్య తెలిపారు. నెల్లటూరులో సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 9న దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. నాయకులు రాగయ్య, రమేష్, మస్తాన్, సుబ్బయ్య, శ్రీనివాసులు, మురళి పాల్గొన్నారు.

బల్లవోలులో పూడికతీత.. చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని బల్లవోలులో డ్రైనేజీ పూడికతీత పనులను వేళ్లపాలెం సర్పంచి రావుల వెంకటేశ్వర్లు, బల్లవోలు ఉపసర్పంచి వినయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జలవనరులశాఖ అధికారులు సోమవారం ప్రారంభించారు. పనులు పూర్తయితే ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు నిల్వ లేకుండా సాఫీగా కాలువ ద్వారా సముద్రానికి చేరుకునే అవకాశం ఉంది. తెదేపా నేతలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మునిశేఖర్, చెరుకూరు పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన.. గూడూరు పట్టణం : పట్టణంలోని పశు వైద్యశాలలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా సోమవారం పాడి రైతులకు గూడూరు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాసాల అవశ్యకత, సాగు, పోషక విలువలను వివరించారు. ఈ నెల 14న గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పశు సంవర్ధక సహాయకులు పాడి రైతలకు అవగాహన కల్పిస్తారన్నారు. కాంచన, షాకీరా, గాయత్రి, కృప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యాపారులతో కమిషనర్ సమావేశం.. నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక పుర కార్యాలయంలో సోమవారం ఇనుప సామగ్రి వ్యాపారులతో కమిషనర్ ఎస్‌కే ఫజులుల్లా సమావేశమయ్యారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు పొందాలని, పాత సామగ్రి రోడ్లపై ఎక్కడబడితే వేయకూడదని, దుకాణాల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. పురి కార్తిక్, కలపాటి మహర్షి, పి.చైతన్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులు

ఈనాడు కథనానికి స్పందన

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట అగ్రహారపేట ప్రధాన వీధి మలుపులో పాఠశాలలు, కళాశాలలు ఉండే చోట విద్యుత్తు నియంత్రిక వద్ద సోమవారం అధికారులు పనులు చేపట్టారు. విద్యుత్తు నియంత్రిక వద్ద కింద నీరు గుంత ఏర్పడటంతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి గుంతను పూడ్చి నీరు నిల్వ లేకుండా చేశారు.

ఆందోళన చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

ఉపాధి హామీ కూలీల ఆందోళన

కోట, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం చంద్రశేఖరపురానికి చెందిన ఉపాధిహామీ కూలీలకు నిబంధనలకు వ్యతిరేకంగా దూరంగా పనులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన చేపట్టారు. తమ గ్రామ పరిధిలోనే పనులు చూపి న్యాయం చేయాలని ఎంపీడీవో దిలీప్‌కుమార్‌కు వినతులు చేశారు. కూలీలు మాట్లాడుతూ తమకు ఆరు కిలోమీటర్ల దూరంలో పనులు పెట్టారన్నారు. నడిచివెళ్లి వచ్చేటప్పటికే ఎక్కువ సమయం పడుతుందని వాపోయారు. ఎంపీడీవో మాట్లాడుతూ పరిశీలించి కూలీలకు న్యాయం చేస్తామని తెలిపారు.

రోడ్డెక్కాలా... మడుగు దాటాలా?

జాతీయ రహదారి నుంచి అక్కంపేట తూర్పు ఎస్సీ కాలనీలోకి వెళ్లే వీధిలో పెద్ద మడుగు ఏర్పడింది. కాలనీ వాసులు రోడ్డెక్కాలంటే ఈ మడుగు దాటాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనదారులు, పిల్లలు బిక్కుబిక్కుమంటూ మడుగు దాటి వెళ్తున్నారు. చినుకు పడితే కాలినడకన వెళ్లేవారు సైతం ఇబ్బంది పడుతున్నారు. వర్షపునీరు వెళ్లే మార్గం లేకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. అటు జాతీయ రహదారి నిర్వహణ సంస్థ గానీ ఇటు పంచాయతీ అధికారులు గానీ దృష్టి పెట్టకపోవడంతో ప్రజలు రాకపోకలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. **- న్యూస్‌టుడే, తడ**

వ్యర్థాలతో ఇక్కట్లు

నాయుడుపేట మండలం మేనకూరు పారిశ్రామికవాడలోని రహదారుల పొడవునా ఎక్కడబడితే అక్కడ వ్యర్థాలను పడేస్తున్నారు. ఇక్కడి సెజ్‌లో పలు కంపెనీలు వెలిశాయి. అయితే అక్కడ వాడే కొన్ని వస్తువులు, వ్యర్థాలను బయట పడేస్తున్నారు. దీంతో రహదారుల పొడవునా టీ కప్పులు, కంపెనీల్లో వాడిన వస్తువులు పడేస్తున్నారు. అపరిశుభ్రతగా మారుతోంది. పర్యావరణం దెబ్బతింటోంది. **- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం**

బస్టాండ్‌లో పార్కింగ్ కరవు

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి 45 బస్సులు వరకు తిరుపతి, కడప, చెన్నై, విజయవాడ, నెల్లూరు, సూళ్లూరుపేట, గూడూరు, నాయుడుపేట, కోట, వాకాడు చిట్టమూరు మండలాల మీదుగా సుమారు 300 ప్రాంతాలకు పైగా రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు వారి వాహనాలను ఇక్కడే పార్క్ చేసి వెళ్తుంటారు. కానీ వాటికి రక్షణ కరవై చోరీకి గురవుతున్నాయి. దీంతో పార్కింగ్ చేయాలంటే భయపడుతున్నారు. దీనిపై ఆర్టీసీ డీఎం చినపెంచలయ్యను అడగ్గా త్వరలోనే టెండర్లు వేసి బైక్ స్టాండ్ ఏర్పాటు చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కోట**

నాయుడుపేట పట్టణం: అగ్రహారపేటలో జరిగిన కార్యక్రమంలో నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కేకు కోసి అందరికీ పంచిపెట్టారు. అన్నదానం చేశారు. నాయకులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే బృందం**

కాలుష్య కోరల్లో కాళంగి

కాళంగి నది కాలుష్య కోరల్లో చిక్కుకుంది. అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కళాహీనంగా మారుతోంది. నది ఒడ్డున కొంత స్థలాన్ని పురపాలక సంఘం డంపింగ్‌యార్డుగా వినియోగిస్తూ.. వ్యర్థాలను, చెత్తను నదిలోకి నెట్టేస్తున్నారు. దరిమిలా ఇప్పటికే ఆ ప్రాంతంలో నది కాస్తా కుంచించుకుపోయింది. ఇవి తరచూ తగలపడుతూ జాతీయ రహదారిపై రాకపోకలకు పట్టణవాసులకు ఇబ్బందిగా మారింది. తాజాగా పలువురు వ్యర్థాలను తీసుకెళ్లి, ఆర్టీసీ డిపో సమీపన కాళంగి నదిలో పడేస్తున్నారు. వాటికి సోమవారం నిప్పు అంటించారు. ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. దాంతో ప్రమాదం తప్పింది. **- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట**

కూటమి ప్రభుత్వంలోనే సుపరిపాలన

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో సుపరిపాలన నెలకొందని మండల తెదేపా ప్రధాన కార్యదర్శి పల్లంపర్తి మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెదురుపట్టులో సుపరిపాలనలో తొలిఅడుగు కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. నాయకులు నారాయణరెడ్డి, విజయ్‌భాస్కర్, ప్రసాద్, చంద్రబాబు పాల్గొన్నారు.

మత్తుపదార్థాల జోలికి వెళ్లొద్దు

నాయుడుపేట పట్టణం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువులో రాణించి ఉన్నత స్థితికి చేరుకోవాలని సీనియర్ న్యాయవాది ఎం.సోమశేఖర్ పేర్కొన్నారు. స్థానిక బాలుర గురుకులంలో సోమవారం లీగల్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.

పంచాయతీ భవనం ప్రారంభంపై వివాదం

సూళ్లూరుపేట: నాలుగు రోజుల కిందట పిండిపాళెంలో ఎమ్మెల్యే విజయశ్రీ ప్రారంభించిన సచివాలయ భవనం వివాదానికి దారి తీసింది. నాదెండ్లవారికండ్రిగలో అప్పటి తెదేపా ప్రభుత్వంలో స్థానిక నేతల చొరవతో ఉపాధి హామీ పథకం కింద పంచాయతీ భవనం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. అవి సరిపడక 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.9 లక్షలతో భవనాన్ని పూర్తి చేశారు. భవన శనివారం ప్రారంభానికి ఎమ్మెల్యేతోపాటు తెదేపా మండలాధ్యక్షుడు శంకరయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుజ్జయ్య, వైకాపాకు చెందిన ఎంపీపీ అనిల్‌రెడ్డి, సర్పంచి వెల్తూరి ప్రియదర్శిని, ఎంపీటీసీ సభ్యులు(అధికార హోదా) సుకుమార్‌తోపాటు మరికొందరు ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు. అయితే స్థానిక తెదేపా నేతలు హాజరు కాలేదు. ఈ విషయమై తెదేపాలోని ఓ వర్గం తమకు, స్థానిక నేతలకు తెలియకుండా ఎమ్మెల్యే భవనాన్ని ప్రారంభించారని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. స్పందించిన అధిష్ఠానం దీనిపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. వారి విచారణలో క్షేత్రస్థాయిలో జరిగిందే వాస్తమేనని తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వైకాపా నాయకులతో కలిసి ఎలా హాజరువుతారని నియోజకవర్గ నేతలు ప్రశ్నించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ వివాదం చర్చకు దారి తీసింది.

కార్మికులకు జీతాలు పెంచాలి

వెంకటగిరి: మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలంటూ కార్మికులు నిరసన, మానవహారం చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఏపీ మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ తిరుపతి కమిటీ సభ్యుడు చెంగయ్య మాట్లాడుతూ జీవో నంబర్ 36 ప్రకారంగా జీతాలు పెంచాలన్నారు. కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులు పెంచలయ్య, ప్రసాద్, సుబ్బయ్య, సుబ్రమణ్యం, రమణయ్య పాల్గొన్నారు.

చదువుల తల్లికి అపచారం

కాలిపోయిన అమ్మవారి చీర

నాయుడుపేట, న్యూస్‌టుడే: మండలంలో మేనకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని సరస్వతీదేవి విగ్రహానికున్న చీరకు ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుని కాలిపోయిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పాఠశాల ముందు భాగంలోని అమ్మవారి విగ్రహానికున్న చీర కాలిపోతుండడంతో పక్కనే వసతి గృహం విద్యార్థులు గుర్తించి మంటలు అదుపు చేశారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎంకు చెప్పడంతో వారు మండల విద్యాశాఖ అధికారి బి.మునిరత్నం దృష్టికి తీసుకెళ్లారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు తెలిపారు. మేనకూరులో మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయినా కొందరు నాయకులు ఎక్కడికి అక్కడ అనధికార మద్యం దుకాణాలు ఏర్పాటు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. పరిశ్రమల్లో పనిచేసే వ్యక్తులు రాత్రిళ్లు పాఠశాల ఆవరణలో, బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగి ఆగడాలు సృష్టిస్తున్నారు. అలా సిగిరెట్ తాగి నిప్పు అమ్మవారి చీరకు అంటించడంతో తగలబడి ఉంటుందనే సందేహాలు స్థానికులు నుంచి వ్యక్తమవుతున్నాయి.

మలుపులు.. ప్రమాద పిలుపులు

నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు ఎదురుగా మలుపులో ఎదురొచ్చే వాహనాలు కనిపించకుండా బోర్డు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేటలో పలు చోట్ల మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న మలుపులో ఇరువైపులా ప్రధాన డ్రైనేజీ కాలువ ఉంది. రోడ్డు దిగితే కాలువలో పడిపోయేలా ఉంది. ఆర్టీసీ బస్టాండు నుంచి బస్సులు నిత్యం విజయవాడ, తిరుపతి, చెన్నై నెల్లూరు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇరువైపులా ప్రచార బోర్డులు ఇంకా ప్రమాదకరంగా మారాయి. ఆర్టీసీ బస్టాండులో నుంచి తిరుపతి వెళ్లే వాహనాలు కనిపించకుండా మలుపులో రెండు ప్రచార బోర్డులు పెట్టారు. దీంతో ఎదురుగా వచ్చే కానరక ప్రమాదాలు జరుగుతున్నాయి. బోర్డులు ఇనుప కడ్డీలతో చేసినవి కావడంతో పొరపాటున తగిలితే అంతే సంగతులు.

ఇదీ జాతీయ రహదారుల పరిస్థితి

సూచికల్లేక అవస్థ ..

కార్లు, మోటారుసైకిళ్లు, ఆటోలు ఇతర వాహనాలు మలుపులో ఎటుపడితే అటు దూరేయడంతో సమస్యగా ఉంది. రోడ్డు సరిగా లేకపోవడంతో వాహనాలు ముందుకు సాగడం కష్టంగా ఉంది. ఎన్నో నెలలుగా ఈ రోడ్డు మరమ్మతులు చేయలేదు. ఆర్టీసీ బస్టాండు నుంచి మల్లాం జాతీయ రహదారి మలుపు వరకూ రోడ్డుపై తారు ఉబ్బిపోయి గాడులుగా మారడంతో చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మల్లాం జాతీయ రహదారి, గోమతి వద్ద మలుపుల్లో సూచిక బోర్డు లేక మేనకూరు సెజ్‌లోకి వెళ్లే వాహనాలు ఇబ్బంది పడుతున్నాయి. నాయుడుపేట చుట్టూ ఉండే జాతీయ రాష్ట్ర రహదారుల మలుపుల్లో బోర్డులు సరిగా లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై ర.భ. డీఈ పరమేశ్వరిని వివరణ కోరగా మలుపుల్లో ప్రమాదకరంగా ఉండే బోర్డులు తొలగిస్తామని, రోడ్డు పనులు చేస్తామన్నారు.

ఎగుడుదిగుడుగా రోడ్డు

ముగిసిన మొహర్రం

వెంకటగిరి: పట్టణంలో వారం రోజులుగా నిర్వహించిన మొహర్రం ముగిసింది. ఆదివారం రాత్రి హుల్లేసాహెబ్, బుడ్డేపీర్లు, బగిడీఖాసీంతో సహా పలు ప్రాంతాల్లో పుర వీధుల్లో ఊరేగించారు. ఏకలవ్వనగర్ ప్రాంతంలోనీ పీర్లను పట్టణ వీధుల్లో ఊరేగించారు. రాజాల నివాసం వద్ద పలువురు కళాకారులు ఖవాలీ కార్యక్రమం నిర్వహించారు. బంగారుపీరు నగరోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముస్లిం యువత చిందులు మధ్య ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సోమవారం వేకువజాము వరకు జరిపారు.

రాజాల నివాసం వద్ద ఖవాలీ నిర్వహిస్తున్న కళాకారులు

పీజీఆర్ఎస్‌కు ఒకే ఒక్కరు!

బాలాయపల్లిలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారు విజయలక్ష్మి

బాలాయపల్లి, న్యూస్‌టుడే: వారంలో ఒక రోజు నాలుగు గంటలు అందుబాటులో ఉండి మండల పరిధిలోని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం చర్యలు చేపట్టాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక హుళ్లక్కుగా మారింది. అధికారులు పత్తాలేక సమస్యలను చెప్పేందుకు వచ్చే జనమూ అంతంత మాత్రమే అయ్యారు. బాలాయపల్లిలో సోమవారం కేవలం తహసీల్దారు విజయలక్ష్మి ఒక్కరే దిక్కయ్యారు. గృహనిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్, బాలికల వసతి గృహం వార్డెన్ వచ్చి సంతకాలు చేసి వెళ్లారు. 12 గంటలకు వ్యవసాయ అధికారిణి చేరుకుని హాజరు పుస్తకంలో సంతకం పెట్టి వెంటనే పలాయనం సాగించారు. మిగతా శాఖల వారంతా రాలేదంటే ఏ స్థాయిలో నిర్లక్ష్యం చోటు చేసుకుందనేది అవగతం చేసుకోవచ్చు. ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, జలవనరుల శాఖ ఏఈలు, విద్య, వైద్య, పశువైద్య, ఉద్యాన, అటవీ, డిస్కం, ఐసీడీఎస్ తదితర కీలక శాఖలు హాజరు కాలేదు.

దిక్కూమొక్కూ లేదు

జలవనరుల శాఖలో డీఈ స్థాయి అధికారితో పాటు ముగ్గురు ఏఈలు ఉన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు ఏఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడికే ఈ రెండు ఏఈ పోస్టులను కట్టబెట్టిన పరిస్థితి. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఎక్కువ మంది మండల స్థాయి ఉద్యోగులు రోజూ విధులకు అంతంతమాత్రమే వస్తున్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో విధులకు వెళ్లినట్లు సమాధానాలు వినిపిస్తాయి.

(c) eenadu

ఆర్టీసీ డీఎంతో నేడు 'ఈనాడు- ఫోన్‌ఇన్'

ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్, విజయవాడ, అమరావతి, రాజమహేంద్రవరం, కాకినాడ,తిరుపతి తదితర సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారి సమస్యల్ని, బస్సుల కండిషన్, బస్సు డ్రైవర్లు, కండక్టర్ల పనితీరుపై విశాఖపట్నం డిపో మేనేజర్ కె.గంగాధరరావు దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఇందుకు 'ఈనాడు' అవకాశం కల్పిస్తోంది. మీరు ఫోన్ చేసి సమస్య వివరిస్తే.. డీఎం సమాధానం ఇస్తారు. –న్యూస్‌టుడే, మద్దిలపాలెం

సమయం : ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
తేదీ : 08-07-2025, మంగళవారం
ఫోన్ నెంబర్లు : 99592 25594, 99121 20229

ఈఎన్‌సీ చీఫ్‌తో కమిషనర్ భేటీ

ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్‌పెంధార్కర్‌తో సమావేశమైన జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

సింధియా, న్యూస్‌టుడే : ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్‌పెంధార్కర్‌తో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ సమావేశమైనట్లు సోమవారం నేవీ వర్గాలు తెలిపాయి. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టాక ఈఎన్‌సీ చీఫ్ ఆహ్వానం మేరకు జరిగిన సమావేశం ప్రత్యేకతను సంతరించుకుంది. నగర పౌరులు, సైన్యం మధ్య పరస్పర సహకారం పెంపొందే పలు అంశాలు వీరి మధ్య ప్రస్తావనకు వచ్చాయన్నారు. వచ్చే ఏడాది భారత నౌకాదళం జరపనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ-2026, బహుళ పక్ష సముద్ర విన్యాసాలను విజయవంతం చేయడంలో జీవీఎంసీ పోషించే పాత్రపై చర్చించారన్నారు.

తీరంలో విధ్వంసంపై కేసు!

ఈనాడు–విశాఖపట్నం: మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి వైకాపా హయాంలో భీమిలి తీరంలో సాగించిన పర్యావరణ ఉల్లంఘనలపై కేసు నమోదైంది. పర్యావరణ పరిరక్షణ చట్టం కింద కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) భీమిలి కోర్టులో ఈ కేసు వేసింది. నెల రోజుల క్రితమే ఇందుకు సంబంధించిన దస్త్రాలు సిద్ధం చేయగా, కొన్ని మార్పులతో పూర్తిస్థాయిలో తాజాగా సమర్పించారు. ఇక్కడ జరిగిన విధ్వంసం నేపథ్యంలో పర్యావరణానికి జరిగిన నష్టం అంచనా వేయటానికి హైకోర్టు ఆదేశాలతో ఇప్పటికే కేంద్ర మంత్రిత్వశాఖ ఓ కమిటీ వేయగా... ఆ ప్రతినిధులు వచ్చి అక్రమ కట్టడాలతో పర్యావరణానికి జరిగిన నష్టం ఎంతనేది తేల్చాల్సి ఉంది. ఆ మొత్తం నేహారెడ్డికి చెందిన అవ్యాన్ సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే జీవీఎంసీ ఆధ్వర్యంలో 588 మీటర్ల పొడవున్న గోడ, పునాదులు వెలికి తీయడానికి రూ.80 లక్షలకు పైగా ఖర్చు చేసినట్లు సమాచారం. ఇది సైతం నేహారెడ్డి నుంచే వసూలు చేయాలని ఇప్పటికే హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోర్టు నిర్దేశించి చాలా రోజులవుతున్నా స్థానిక అధికారులు ఎలాంటి ఎలాంటి ఫిర్యాదు చేయలేదని సమాచారం.

అధికారులు నటిస్తే.. భక్తులు కష్టంగా నడిస్తే!!

★ అది ఇంజినీరింగ్ విభాగ వైఫల్యమే
★ 9న 'సింహాచలం అప్పన్న గిరి ప్రదక్షిణ'
★ ఏర్పాట్లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణే కీలకం

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, సింహాచలం : పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొననున్న 'సింహాచలం అప్పన్న గిరి ప్రదక్షిణ' ఏర్పాట్లలో ఏ చిన్న పొరపాటు జరిగినా అది తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. రెండు నెలల క్రితం చందనోత్సవం రోజున అధికారుల పర్యవేక్షణ లోపంతో భక్తులు ప్రాణాలు కోల్పోయారు. అందుకే ఈ నెల 9న మొదలయ్యే గిరిప్రదక్షిణ ఏర్పాట్లపై యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టిసారించాల్సి ఉంది. ఏదో చేశాం అన్నట్లు అధికారులు అలసత్వం వహిస్తే భక్తుల ఆగ్రహానికి గురికాక తప్పదనే చర్చ సాగుతోంది.

వారిదే బాధ్యత: దేవస్థానంలో ఏ ఉత్సవాల నిర్వహణలోనైనా ఇంజినీరింగ్ విభాగానిదే ముఖ్యభూమిక. టెండర్లు పిలవడం మొదలు ఏర్పాట్లు పూర్తిచేయడం వరకు వారిదే బాధ్యత. గిరిప్రదక్షిణ పనుల పర్యవేక్షణకు సింహాచలం దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో పాటు అదనంగా మరో 15 మందిని డిప్యుటేషన్‌పై నియమించారు. అయినప్పటికీ కొన్ని చోట్ల పనుల పర్యవేక్షణ తూతూమంత్రంగా సాగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వీరంతా రెండు, మూడు వారాల నుంచి క్షేత్రస్థాయిలో ఉన్నా పలు ప్రాంతాల్లో లోపాలు బయటపడుతున్నాయి.

» వాస్తవానికి ఏటా చేసే ఏర్పాట్లే కదా అన్న భావనతో యంత్రాంగం ఉదాసీనత ప్రదర్శిస్తోంది. ఏప్రిల్‌లో జరిగిన చందనోత్సవం ఏర్పాట్లలో అదే తీరు ఏడుగురి ప్రాణాలు తీసింది. నిశితంగా తనిఖీ చేయాల్సిన వారు కూడా పట్టించుకోలేదు.

ఆలయం వద్ద ప్రదక్షిణకు ఏర్పాటు చేస్తున్న ర్యాంపు

గిరిప్రదక్షిణలో చాలా మంది భక్తులు మెట్ల మార్గాన్ని ఉపయోగిస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు చూడాల్సి ఉన్నా కనీసం పట్టించుకోవడం లేదు. చిన్నపాటి పనులు చేసి వదిలేశారు. మెట్లు ప్రమాదకరంగా ఉన్న చోట్ల కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. ఇటీవల కురిసిన వర్షానికి నాచుపట్టి జారేలా ఉన్నాయి.

» తాజాగా తొలిపావంచా వద్ద నిర్మించిన భారీ షెడ్డు కూలిన ఘటన భక్తులను కలవరపాటుకు గురి చేస్తోంది. ఆ సమయంలో అదృష్టవశాత్తు అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇటువంటి చోటే ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ అవసరం.

» కొండ చుట్టూ స్టాల్స్, తొలిపావంచా వద్ద క్యూలైన్లు, కొబ్బరికాయలు కొట్టడానికి ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేస్తారు. కొండ మీద అదనపు క్యూలైన్ల నిర్మాణం, ఆలయ ప్రదక్షిణ ఏర్పాట్లు, ర్యాంపుల నిర్మాణం వంటివి చేపడుతున్నారు. వీటిపైనా పర్యవేక్షణ కీలకమే.

» మెట్ల మార్గంలో ఆంజనేయస్వామి గుడి నుంచి కిందికి కొంత ప్రమాదకరంగా ఉంది. భారీ వర్షం కురిస్తే అటు నుంచే వరద వస్తుంది. భద్రత కోసం ఇక్కడ అదనపు సిబ్బందిని నియమించాలి.

అతిథి అధ్యాపకులు ఉద్యోగులు కాదు: వీసీ

నేటి నుంచి నిరసనలకు సన్నాహాలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: అతిథి అధ్యాపకులు ఉద్యోగులు కాదని ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఏయూ సెనేట్ సమావేశ మందిరంలో వీసీతో అతిథి అధ్యాపకులు సమావేశమయ్యారు. తాము 15 నుంచి 20ఏళ్లుగా ఏయూలో పనిచేస్తున్నామని చెప్పారు. ఆర్ట్సు కళాశాల పరిధిలో పనిచేసే అతిథి అధ్యాపకులకు ఆరు నెలలకు కేవలం రూ.45వేలు చెల్లిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఉపకులపతి ఆచార్య ప్రసాదరెడ్డి తమను తొలగించారన్నారు. పోరాటాల కారణంగా విధుల్లోకి తీసుకుంటామని 'కూటమి' నేతలు హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు గతేడాది ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య శశిభూషణరావు తమకు ఇంటర్వ్యూలు నిర్వహించి విధుల్లోకి తీసుకున్నారని చెప్పారు. ఇప్పుడు మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష ఎదుర్కోమనడం భావ్యం కాదని, నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరారు. వీసీ స్పందిస్తూ అతిథి అధ్యాపకులు ఉద్యోగులు కాదని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ రద్దు చేసే అవకాశం లేదని తేల్చి చెప్పారు. దీంతో అతిథి అధ్యాపకులు మంగళవారం నుంచి నిరసనలు చేయడానికి సిద్ధపడుతున్నారు.

సమావేశంలో పాల్గొన్న అతిథి అధ్యాపకులు

నిబంధనల బూచి.. నిర్భయంగా దోచి!!

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ అధికారుల తీరుతో... ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి గాడి తప్పుతోంది. దొడ్డిదారిలో అధికారుల చేతికి కాసులు వచ్చే వాటికి, ప్రజాప్రతినిధులు సూచిస్తున్న ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూరే వాటికే ప్రాధాన్యం ఇస్తుండడం గమనార్హం. మున్సిపల్‌శాఖకు లబ్ధి చేకూర్చే అంశాల కంటే ప్రభుత్వం నుంచి ప్రైవేటు వ్యక్తులు లాభపడేలా ప్రణాళికలు సిద్ధం చేసి, అమలు చేస్తున్నారు. వైకాపా హయాంలో నగరంలో విడుదల చేసిన టీడీఆర్‌లపై ఓవైపు విచారణ జరుగుతుండగా, అదే తీరుగా టీడీఆర్‌లు ఇవ్వడానికే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అభివృద్ధి ప్రణాళికల ముసుగులో అక్రమాలు

వంద అడుగులకు విస్తరించనున్న రహదారి ఇదే

ఖాళీ స్థలం అప్పగింత: 88వ వార్డు పరిధిలో దశాబ్దాల కిందట ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి ఏర్పాటు చేసిన లేఅవుట్ ఖాళీ స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు భూబదలాయింపు కింద అందించేలా ఇటీవల మున్సిపల్‌శాఖ మెమో జారీ చేసింది. ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు చెందిన ఎనిమిది ఎకరాల స్థలానికి అనువుగా రహదారి నిర్మించేందుకు ఖాళీ స్థలాన్ని వినియోగించేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఆ స్థలాన్ని అప్పగించడం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు భారీగా లబ్ధి చేకూరుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో స్థానికంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధి పాత్ర కీలకమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎవరి కోసం రహదారి విస్తరణ

జన సంచారం తక్కువగా ఉండే ప్రాంతంలో రహదారి విస్తరణ పేరుతో ప్రైవేటు వ్యక్తులు టీడీఆర్‌లు దక్కించుకునేందుకు వీలుగా సిద్ధం చేసిన దస్త్రాన్ని జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు చకచకా నడిపిస్తున్నారు. మాస్టర్‌ప్లాన్-2041లో భాగంగా నాయుడుతోట కూడలి నుంచి ఆంధ్ర సిమెంట్స్ కంపెనీ, పొర్లుపాలెం కూడలి వరకు 2.6 కిలోమీటర్ల రహదారిని 100 అడుగుల మేర విస్తరించేందుకు ఆర్‌డీపీ (రహదారి అభివృద్ధి ప్రణాళిక) తయారు చేశారు.

» వేపగుంట వద్ద సర్వే నెంబర్లు 75, 76, 77, వెంకటాపురం వద్ద సర్వే నెంబర్లు 76, 82లో రహదారి అభివృద్ధి చేయనున్నారు. ఈ మార్గంలో ఓవైపు కొండ, మరోవైపు గెడ్డ, ప్రభుత్వ స్థలాలే ఉన్నాయి. అయితే ఆస్తి హక్కులు లేని వారికి అక్రమంగా టీడీఆర్‌లు జారీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

» ప్రస్తుతం 60 అడుగుల వెడల్పైన సీసీ రహదారి ఉంది. నివాసాలు తక్కువగా ఉండడంతో పాటు, మూతపడిన ఓ కంపెనీ, పక్కన రైల్వే ట్రాక్, ఆ తరువాత మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ ఉన్నాయి. దీంతో భవిష్యత్తులోనూ ఈ ప్రాంతం అభివృద్ధికి అవకాశాలు తక్కువే. ఇలాంటి పరిస్థితుల్లో టీడీఆర్‌లు దోపిడీ చేయడానికే రహదారి విస్తరణ చేపడుతున్నట్లు పలువురు అనుమానిస్తున్నారు.

వెలుగుల కొండ 'సింహాద్రి'

నేడు వ్యవస్థాపక దినోత్సవం

పరవాడ, న్యూస్‌టుడే: వివిధ రాష్ట్రాలకు వెలుగులు ప్రసాదిస్తున్న పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ నాణ్యమైన విద్యుదుత్పత్తి చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ ప్రగతి పథంలో పయనిస్తోంది. 1997 జులై 8న దీనిని ఆరంభించారు. 500 మందికిపైగా ఉద్యోగులు, 2500 మంది ఒప్పంద కార్మికులు పని చేస్తున్నారు.
● తొలి, మలి దశలలో కలిపి మొత్తం రూ.8,148 కోట్లతో 2వేల మెగావాట్ల (500 మెగావాట్ల సామర్థ్యం గల 4యూనిట్లు) సామర్థ్యంతో దీన్ని నిర్మించారు. ● ఇక్కడి రిజర్వాయర్‌పై 25 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుదుత్పత్తి కూడా జరుగుతోంది. దీన్ని రూ.110 కోట్లతో 2021లో ఏర్పాటు చేశారు. మరో 18 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ● కాలుష్య నివారణకు రూ.871 కోట్లతో నిర్మిస్తున్న ఫ్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) ప్లాంట్ల పనులు దాదాపు పూర్తయ్యాయి. థర్మల్ విద్యుదుత్పత్తిలో భాగంగా బొగ్గు మండించే క్రమంలో

సింహాద్రి ఎన్టీపీసీ విద్యుత్తు కేంద్రం

విడుదలయ్యే సల్ఫర్ డయాక్సైడ్ తదితర కాలుష్య కారక వాయువుల తీవ్రత తగ్గించేందుకు ఇక్కడి 4యూనిట్లకు 4 ఎఫ్‌జీడీ ప్లాంట్లు నిర్మిస్తున్నారు. 1, 2, 4 యూనిట్లకు చెందిన పనులు పూర్తి కావడంతో వినియోగంలోకి తెచ్చారు. 3వ యూనిట్ పనులు చివరి దశలో ఉన్నాయి. ● ఎన్టీపీసీలో 165 మీటర్ల ఎత్తున నిర్మించిన కూలింగ్ టవర్లు ఆసియాలోనే అతి ఎత్తైనవి. ● ఒక రోజుకు అవసరమయ్యే 30వేల మెట్రిక్ టన్నుల బొగ్గును వేర్వేరు ప్రాంతాల నుంచి రైలుమార్గం ద్వారా దిగుమతి చేసుకుంటున్నారు. ● విద్యుదుత్పత్తి సమయంలో ఒక రోజుకు వచ్చే సుమారు 3500 టన్నుల బూడిదను జాతీయ రహదారుల నిర్మాణానికి, సిమెంట్ కంపెనీలకు, బ్రిక్స్ తయారీ యూనిట్లకు తరలిస్తున్నారు. ● సముద్ర నీటి అవసరాల నిమిత్తం తిక్కవానిపాలెం తీరంలో జెట్టీ (పంపుహౌస్) నిర్మించారు.

● సీఎస్ఆర్ పథకం కింద ఈ సంస్థ సమీప గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతోంది. వాటితోపాటు వేసవిలో బాలికా సాధికారత శిక్షణ, మండల స్థాయిలో క్రీడల నిర్వహణ కొనసాగిస్తోంది. నిర్వాసిత గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు విజయవాడలోని సీపీఈటీ సంస్థలో 'మెషిన్ ఆపరేటర్ ఇంజక్షన్ మౌల్డింగ్ అండ్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్'లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. మహిళలకు కుట్టు శిక్షణ, ప్రతిభ గల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి ప్రోత్సహిస్తోంది.

10వేల మంది విద్యార్థులకు ఏఐలో శిక్షణ

మాట్లాడుతున్న వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏయూ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తూ 100మంది ఫ్యాకల్టీ, 10వేల మంది విద్యార్థులకు ఏఐ, డీప్ లెర్నింగ్‌లలో నైపుణ్య శిక్షణ ఇస్తామని ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ తెలిపారు. సాగర తీరంలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం ఏయూ అనుబంధ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లతో జరిగిన సమావేశంతో వీసీ మాట్లాడారు. విద్యలో నాణ్యత పెంచడానికి అనుబంధ కళాశాలలు విశ్వవిద్యాలయంతో కలిసి ముందుకు సాగాలన్నారు. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పరీక్షా కేంద్రంతోపాటు కళాశాల గుర్తింపును రద్దు చేస్తామని స్పష్టం చేశారు. బీఈడీ, న్యాయ కళాశాలల పనితీరు మరింత మెరుగు పడాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఏయూ అనుబంధ కళాశాలలను భాగస్వామ్యం చేస్తూ రూరల్ ఔట్రీచ్ కార్యక్రమాలు చేపడతామని, దీనికి సంబంధించిన విధి విధానాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. అనుబంధ కళాశాలలో పనిచేసే ఫ్యాకల్టీకి వృత్తిపరమైన సూచనలు అందించడానికి ఫ్యాకల్టీ మెంటార్ విధానం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ కళాశాలల గుర్తింపు, ఫీజులు, కోర్సుల నిర్వహణ తదితర అంశాలపై చర్చించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అనుబంధ కళాశాలల సమస్యలను అసోసియేషన్ కార్యదర్శి రమణాజీ వివరించారు. అసోసియేషన్ అధ్యక్షులు పైడా కృష్ణప్రసాద్, గౌరవ అధ్యక్షులు బలరామకృష్ణ, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు తదితరులు ప్రైవేటు కళాశాలల తరఫున ప్రసంగించారు.

ప్రయాణికుల రద్దీకి ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: పలు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ★ సంత్రాగచ్చి- యశ్వంత్‌పూర్ (02863) రైలు ఈ నెల 10 నుంచి ఆగస్టు 28 వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు ఉదయం 2.43 గంటలకు దువ్వాడ వస్తుంది. ★ యశ్వంత్‌పూర్- సంత్రాగచ్చి (02864) రైలు ఈ నెల 12 నుంచి ఆగస్టు 30 వరకు ప్రతి శనివారం తెల్లవారుజామున 4.30గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి రాత్రి 11.05గంటలకు దువ్వాడ వస్తుంది. ★ కొరాపుట్- కిరండూల్ లైన్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో విశాఖ- కిరండూల్- విశాఖ (58501- 58502) రైళ్లను ఈనెల 8న జైపూర్- కిరండూల్- జైపూర్ మధ్య నడపనున్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

★ మామూళ్లు అడిగిన సర్వేయర్‌పై విచారణ
★ దురుసుగా ప్రవర్తించిన మరో ఏడుగురు సిబ్బందికి కలెక్టర్ నోటీసులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే వారిపై దురుసుగా ప్రవర్తించినా, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించినా చర్యలు తప్పవని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులు, ఉద్యోగులను హెచ్చరించారు. కలెక్టరేట్‌లో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ తదితరులతో కలిసి సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలు, కాల్ సెంటర్ ఫీడ్‌బ్యాక్‌పై విశ్లేషించారు. జిల్లా అధికారులు అర్జీదారులతో ఫోన్‌లో మాట్లాడి సంతృప్తికరమైన పరిష్కారం చూపాలన్నారు. పోలీసు శాఖలో అనుసరిస్తున్న ఎండార్స్‌మెంట్ విధానాన్ని మార్చాలన్నారు. ఆనందపురం మండలం వెల్లంకి గ్రామంలో నిర్వహించిన సర్వేలో క్షేత్రస్థాయి అధికారి నిర్లక్ష్యం వహించారని నగదు అడిగినట్లు ఫిర్యాదు వచ్చిందని, దీనిపై విచారణ చేసి నివేదిక అందించాలని సర్వేశాఖ ఏడీను కలెక్టర్ ఆదేశించారు. వాస్తవాలు నిరూపితమైతే సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలన్నారు. అదేవిధంగా వివిధ శాఖలకు చెందిన ఏడుగురు సిబ్బంది ప్రజలపై దురుసుగా ప్రవర్తించినట్లు ఫీడ్‌బ్యాక్ సర్వేలో వెల్లడైందని, వారందరికీ నోటీసులు జారీ చేయాలని పీజీఆర్ఎస్ నోడల్ అధికారిని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో 347 వినతులు అందాయి.

పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, తదితరులు

కోస్టుగార్డు సిబ్బందికి శిక్షణ

సింధియా, న్యూస్‌టుడే : ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లో భారతీయ తీరగస్తీ దళ సిబ్బందికి నెల రోజులపాటు కొనసాగిన ప్రత్యేక శిక్షణ ముగిసినట్లు సోమవారం నేవీ వర్గాలు తెలిపాయి. కమాండ్‌లోని నేవల్ వాటర్‌మెన్‌షిప్ శిక్షణ కేంద్రం(విశాఖ)లో విశాఖపట్నం కోస్టుగార్డుకు చెందిన 13 మందికి ఈ శిక్షణ కొనసాగించారు. ఈ ఏడాది అక్టోబరు-నవంబరులో జరగబోయే భారతీయ తీరగస్తీ దళం స్వర్ణోత్సవాల సంసిద్ధతకు తగినట్లు ఈ శిక్షణ అందించామన్నారు.

అప్పన్న స్వామి హుండీ ఆదాయం రూ.1.54 కోట్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం సోమవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో జరిగింది. ఈవో వేండ్ర త్రినాథరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది హుండీలను తెరిచి ఆదాయం లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు రూ.1,54,80,798 సమకూరినట్లు తెలిపారు. దీంతో పాటు 132.100 గ్రాముల బంగారం, 9.835 కిలోల వెండి లభ్యమైనట్లు వివరించారు. ఇది 21 రోజులకు సంబంధించినదిగా పేర్కొన్నారు.

హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అలల సవ్వడి... సందర్శకుల తాకిడి

తొట్లకొండ వద్ద శిలాతోరణం ప్రాంతానికి సందర్శకుల తాకిడి ఎక్కువయింది. సాగర తీరాన అందమైన ఈ ప్రాంతానికి సాధారణ సందర్శకులతో పాటు ఎక్కువ మంది ఫొటోషూట్స్, రీల్స్ చేయటానికి వస్తున్నారు. దీంతో ఇక్కడ కోలాహల వాతావరణం నెలకొంటోంది. మరో వైపు...సమూహంగా వచ్చే కొందరి కార్యకలాపాలు పూర్తయ్యే వరకూ మిగిలిన వారికి నిరీక్షణ తప్పడం లేదనే ఆవేదన వ్యక్తం అవుతోంది. –ఈనాడు,విశాఖపట్నం

నడిరోడ్డుపై కత్తులతో దాడి

ఫ్యాక్షన్‌ను తలపించేలా ఘటన
నలుగురికి తీవ్ర గాయాలు

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : చేతుల్లో కత్తులు పట్టుకొని రోడ్లపై తిరుగుతూ.. అడ్డువచ్చిన వారిపై దాడులుచేస్తూ ఫ్యాక్షన్ సినిమాకు ఏమాత్రం తీసిపోని విధంగా కొందరు రౌడీమూకలు చేసిన బీభత్సం నగరంలో శాంతి భద్రతలకు సవాలుగా మారింది. గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి. 89వ వార్డు కొత్తపాలేనికి చెందిన చందక సూర్యకుమార్.. అదే ప్రాంతానికి చెందిన సాయి ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న సాయి స్నేహితుడు సరపాక రాజేశ్ జోక్యం చేసుకుని ఇద్దరిని మందలించారు. ఈ విషయం తెలుసుకున్న సూర్యకుమార్ సోదరుడు సురేంద్ర, తన స్నేహితులు శిలపరిశెట్టి అక్షయ్, బరిగట్ల సతీశ్, దాడి లిఖిత్, రేసు ఆనంద్‌లతో కలిసి వచ్చి నా సోదరుడిని మందలిస్తావా అంటూ రాజేశ్‌పై కత్తితో దాడిచేశాడు. ఆ సమయంలో సురేంద్ర గంజాయి మత్తులో ఉన్నాడు. గతంలో జరిగిన ఓ టెంట్ హౌస్ తగాదాను కూడా మనసులో ఉంచుకొని ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడి సమయంలో అక్కడే ఉన్న సూదికొండ మణికంఠ, లంకా రమణ, అమరపిన్ని కనకరాజు ఇరువర్గాలకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా.. వీళ్లపై కూడా సురేంద్ర, అతని స్నేహితులు కత్తితో దాడిచేసి గాయపరిచారు. ప్రధాన రహదారిపై అర్ధరాత్రి వేళ కత్తులతో రోడ్ల మీద పరుగులు తీయడం చూసి స్థానికులు భయపడిపోయి ఇళ్లలోకి వెళ్లిపోయి తాళాలు వేసుకున్నారు. రాజేశ్‌కు ఆరుచోట్ల కత్తిగాయాలు కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. మిగతా వారికి కూడా గాయాలయ్యాయి. వీరు కూడా చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే నిందితులు పరారయ్యారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం సీఐ ఎన్.వి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎస్సైలు అప్పలనాయుడు, రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే..నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ప్రధాన నిందితుడు చందక సురేంద్ర

గాయపడిన రాజేశ్

(c) eenadu

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
వినాయక నగర్ బ్రాంచ్, డి.నెం. 24-66-10,
ఎమ్ఐజి-1-163, ఉడా కాలనీ, వినాయక నగర్, గాజువాక, విశాఖపట్నం-530044, ☎ 9137923611

బహిరంగ వేలం ద్వారా వాహనము వేలం/అమ్మకం

నెం	రిజిస్ట్రేషన్ నెంబరు	కంపెనీ	మోడల్	రిజర్వు ధర	ధరావత్తు
1.	AP40Q 2950	MAHINDRA XUV 300 W8 PM BS6 MT	2023	6,30,000/-	63,000/-

ఋణగ్రహీత: శ్రీ కడులూరి సంతోషి, చెల్లించవలసిన బకాయి: రూ. 12,89,659.75 + వడ్డీ, ఇతర ఛార్జీలు
1) వాహనం తనిఖీ కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 9137923611.
2) ధరావత్తు సొమ్మును NEFT ద్వారా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వినాయకనగర్ బ్రాంచ్ అకౌంట్ నెం. 236111980050000, IFSC Code: UBIN0823619 కు చెల్లించవలెను.
3) వేలం జరుగు ప్రదేశం: వినాయకనగర్ బ్రాంచ్, వేలం తేది: 22.07.2025, మధ్యాహ్నం 12.00 గం॥లకు
4) బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-
5) "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే" అను పద్ధతిలో విక్రయించబడును.
6) వేలం రద్దు చేయుటకు / వాయిదా వేయుటకు బ్యాంకు వారికి సర్వహక్కులు కలవు.
తేది: 07-07-2025 సం/- అధీకృత అధికారి

Karur Vysya Bank Smart way to bank
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్
డివిజనల్ ఆఫీస్, డి.నెం.47-10-15, ఎ.జి.ఎవెన్యూ, ఫస్ట్ ఫ్లోర్, పొల్లాక్స్ స్కూల్ ఎదురుగా, 2వ లైన్, ద్వారకానగర్, విశాఖపట్నం - 530 016. ఫోన్: 0891-2511706

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) నందలి నిబంధనలతో చదవుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా **1. శ్రీమతి నాగవల్లి దోనెపూడి,** భర్త : డి. వెంకట పవన్ కుమార్ డి, డి.నెం.50-53-11/2, ఎస్ఇ లే అవుట్, సీతమ్మధార, విశాఖపట్నం - 530013. **2. శ్రీ వెంకట పవన్ కుమార్ దోనెపూడి,** తండ్రి : వెంకటేశ్వరరావు, డి.నెం.50-53-11/2, ఎస్ఇ లే అవుట్, సీతమ్మధార, విశాఖపట్నం - 530013 వారి నుండి సెక్యూర్డ్ క్రెడిటార్ అనగా కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్ వారికి రావల్సిన బకాయి **రూ.28,69,720.80 పై.** (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల అరవై తొమ్మిది వేల ఏడు వందల ఇరవై రూపాయల ఎనభై పైసలు మాత్రమే) **(అకౌంట్ నెం.4842753000000084) + తేది.02.07.2025** నుండి తదుపరి వడ్డీ మరియు వ్యయాలు మొదలగునవి రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ది **కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, సీతమ్మధార బ్రాంచ్,** విశాఖపట్నం యొక్క అధీకృత అధికారియైన సెక్యూర్డ్ క్రెడిటార్‌చే స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులను **29-07-2025** న "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అలానే ప్రాతిపదికన" విక్రయించబడును.

స్థిరాస్తి వివరములు:

విశాఖపట్నం, లంకెలపాలెం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ యొక్క రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, సానివాడ గ్రామ సర్వే.నెం.లు 86/1ఎ/1బి1బి, 86/1ఎ/1బి1సి, 86/1ఎ/1బి2ఎ లోని మొత్తం విస్తీర్ణం 9127.80 చ॥గ॥లు లేదా 7861.74 చ॥మీ॥ల లోని, 5750.51 చ॥గ॥ల మొత్తంలో 59.00 చ॥గ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా విస్తీర్ణంతో "సాయి నరసింహాస్ ఎరీనా" యొక్క "నరసింహ టవర్" ఎ-బ్లాక్ 6వ ఫ్లోర్ నందు 1930 చ॥అ॥లు (కామన్ ఏరియాలు, బాల్కానీలతో సహా) ప్లింత్ ఏరియా మరియు సెల్లార్ ఫ్లోర్ నందు 80 చ॥అ॥ల కార్ పార్కింగ్, డోర్ నెం.4-13/6తో గల నివాస ఫ్లాట్ నెం.608 ఆస్తి డాక్యుమెంట్ నెం.3370/2014, తేది.05.12.2014 ప్రకారం శ్రీమతి దోనెపూడి నాగవల్లి, భర్త : వెంకట పవన్ కుమార్ దోనెపూడి గారి పేరున కలదు. మొత్తం స్థలమునకు హద్దులు : **ఉత్తరం** : పాత ఎన్‌హెచ్- 5 రోడ్డు, **తూర్పు** : కోమాకుల మంజుల వాణి, భర్త : కె. వేణుగోపాల్ కృష్ణ తిలక్ మొ॥ వారికి చెందిన జిరాయితీ భూమి, **పడమర** : రావెళ్ళ కృష్ణ కుమారి గారి భూమి విస్తీర్ణం ఎ.0.25 సెంట్లు, **దక్షిణం** : ఎన్‌హెచ్-5 రోడ్డు. **5వ అంతస్తునందు గల ఫ్లాట్ నెం.608 హద్దులు: ఉత్తరం** : ఓపెన్ టు స్కై, **తూర్పు** : కామన్ కారిడార్ మరియు ఫ్లాట్ నెం.609, **పడమర** : ఓపెన్ టు స్కై, **దక్షిణం** : ఓపెన్ డక్ట్ మరియు ఫ్లాట్ నెం.607.

రిజర్వు ధర	ధరావత్తు (రిజర్వు ధరలో 10%)	బిడ్ పెంపుదల మొత్తం
రూ.28,00,000/-	రూ.2,80,000/-	రూ.50,000/-

అమ్మకం యొక్క ఇతర వివరములు మరియు నియమ నిబంధనల కొరకు https://www.bankauctions.in ని చూడండి (ఇ-వేలం యొక్క ప్రొవైడర్ వెబ్ చిరునామా) లేదా అధీకృత అధికారి, ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, సీతమ్మధార బ్రాంచి, విశాఖపట్నం, మొబైల్ నెం.9963477686.

SARFAESI చట్టం, 2002 యొక్క రూల్ 9(1) క్రింద 15 రోజుల చట్టబద్ధ ప్రకటన

చెల్లింపు తేదీ వరకు వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో పాటు పైన తెలిపిన బకాయిలను వేలం తేదీలోపు చెల్లించవలెనని, లేనిచో, షెడ్యూల్ ఆస్తి వేలం వేయబడుతుందని/విక్రయించబడుతుందని మరియు మిగిలిన బకాయిలు ఏవైన ఉన్నట్లయితే, వడ్డీ మరియు ఖర్చులతో పాటు వసూలు చేయబడతాయని రుణగ్రహీత/లు మరియు గ్యారంటర్/లకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

అధీకృత అధికారి
తేది: 07-07-2025 ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్,
స్థలం: విశాఖపట్నం సీతమ్మధార బ్రాంచ్, విశాఖపట్నం

'ప్రైవేటు వ్యక్తుల గుప్పిట్లో జీవీఎంసీ పార్కులు

మాట్లాడుతున్న జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో కొందరు కూటమి నాయకులు పార్కులనూ వదలడం లేదని 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ విమర్శించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తెదేపా ఫ్లోర్ లీడర్ ఛాంబరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంబంధిత నేతలు జీవీఎంసీకి చెందిన పార్కులను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడం, టీడీఆర్‌లు జారీ చేయించడం చేస్తున్నారన్నారు. నగరంలో జీవీఎంసీకి 1326 పార్కులు, ఖాళీ స్థలాలున్నాయన్నారు. వాటిలో 34 న్యాయ వివాదాల్లో చిక్కుకోగా జీవీఎంసీ అధికారులు సకాలంలో కౌంటరు దాఖలు చేయకపోవడంతో కొన్ని స్థలాలు ప్రయివేటు వ్యక్తుల పాలవుతున్నాయన్నారు. మధురవాడ బొట్టవానిపాలెం ప్రాంతంలో ఎకరా స్థలాన్ని ప్రయివేటు స్థలంగా మార్చడానికి కొందరు నాయకులు ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. జీవీఎంసీ పార్కు స్థలాల ఆక్రమణలపై హైకోర్టును ఆశ్రయిస్తామని ఈ మేరకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, తెదేపా నాయకుడు గొలగాని పోలారావు పాల్గొన్నారు.

పగలు భేటీ.. రాత్రి లూటీ!

★ కూటమి పాలనలోనూ వైకాపా నేతల బరితెగింపు
★ కొండవాలు ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి, సబ్బవరం, న్యూస్‌టుడే

వారంతా ఒక ముఠా! రెండు బృందాలుగా ఏర్పడతారు. పగలు కొందరు బేరాలు ఒప్పుకొని సొమ్ము వసూలు చేస్తుంటే.. రాత్రయితే మరికొందరు పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో మూకుమ్మడిగా బయలుదేరి దగ్గరలోని కొండలను, చెరువులను కొల్లగొడుతున్నారు. ఇదీ సబ్బవరం మండలంలో సాగుతున్న గ్రావెల్ దందా! కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా.. సబ్బవరం మండలంలో వైకాపాలోని కొందరి ఆగడాలకు అడ్డుకట్ట పడలేదు. కొండలు, చెరువులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సబ్బవరం, పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంది. లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటితోపాటు ఇళ్ల నిర్మాణాలు సైతం జోరుగా సాగుతున్నాయి. దీంతో మట్టి, గ్రావెల్‌కు డిమాండ్ బాగా ఎక్కువైంది. దీన్ని అవకాశంగా చేసుకుని.. వైకాపా నాయకులు ఓ ముఠాగా ఏర్పడి సమీపంలోని ఎలాంటి అనుమతులు లేకుండా కొండలను తవ్వేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిందిపోయి వైకాపా నాయకులతో కుమ్మక్కయి వారికి అండదండలు అందిస్తున్నారు. తనిఖీలు చేసి అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులేమో కార్యాలయాలకే పరిమితం అవుతుండటంతో అక్రమార్కుల దందా మూడు లారీలు.. ఆరు ట్రాక్టర్లుగా కొనసాగుతోంది.

అసకపల్లి శివారు ఎర్రవానిపాలెం దగ్గర కొండవాలులో తవ్వకాలు జరిగిన ప్రాంతం

కన్నుపడితే చాలు: అసకపల్లి, గంగవరం, బాటజంగాలపాలెం, ఒమ్మివానిపాలెం, గాలిభీమవరం, అంతకాపల్లి, రాయపురఅగ్రహారం, గొల్లలపాలెం తదితర గ్రామాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాల రవాణా పెద్ద వ్యాపారంగా మారింది. ఆయా ప్రాంతాలకు సమీపంలోని ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలు, పేదల ఇళ్ల కాలనీలకు సమీపంలో రాత్రి వేళల్లో భారీ యంత్రాలతో తవ్వకాలు సాగిస్తున్నారు. దూరాన్ని బట్టి లారీకి రూ. 3,500 నుంచి రూ. 7 వేల వరకు వసూలు చేస్తున్నారు. ★ అసకపల్లి సర్వే నం. 1లోని వజ్రాలకొండ చుట్టూ రోజూ తవ్వకాలు చేస్తున్నారు. న్యాయ విశ్వవిద్యాలయం దగ్గర పేదల ఇళ్లకు అనుకుని ఉన్న కొండవాలు మొత్తం అగాధంలా మార్చేశారు. ★ ప్రస్తుతం ఒమ్మివానిపాలెం సమీపంలోని నల్లకొండపై అక్రమార్కుల కన్నుపడింది. దీంతో ఇక్కడ కొద్దిరోజులుగా తవ్వకాలు ఊపందుకున్నాయి.

చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం: ప్రభుత్వ స్థలాలు, కొండ వాలుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. ఫిర్యాదులు వస్తే.. రెవెన్యూ సిబ్బందిని పంపించి తనిఖీలు చేయిస్తున్నాం. రాత్రివేళల్లో కూడా నిఘా పెడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలు చేస్తే.. వాహనాలను సీజ్ చేస్తాం. అపరాధరుసుం విధిస్తాం. అప్పటికీ ఆపకపోతే.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, ఏడీ, మైనింగ్, అనకాపల్లి

భక్తజనం వెంట రాగా... కదలనున్న పుష్పరథం

సింహాచలంలో రేపు గిరి ప్రదక్షిణ మహోత్సవం

సింహాచలం, న్యూస్‌టుడే: ఎంతో ప్రతిష్ఠాత్మకమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవానికి సమయం ఆసన్నమైంది. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా చతుర్దశి నాడు లక్షలాది మంది భక్తులు సింహగిరి ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. బుధవారం సింహాచలం తొలిపావంచా వద్ద నుంచి భక్తులు బయలుదేరనున్న నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు.

★ **మధ్యాహ్నం 2 గంటలకు:** ఈ నెల 9న సింహాచలం కొండ దిగువన తొలిపావంచా వద్ద నుంచి అప్పన్న స్వామి నమూనా విగ్రహంతో పుష్పరథం ప్రారంభమవుతుంది. రథాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు జెండా ఊపి ప్రారంభిస్తారు. రథం వెంట లక్షలాది మంది భక్తజనం గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుడతారు. తొలిపావంచా నుంచి మొదలయ్యే ప్రదక్షిణ పాత అడివివరం మీదుగా పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, ఇసుకతోట, హెచ్‌బీ కాలనీ, సీతమ్మధార, అల్లూరి విగ్రహం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం, కంచరపాలెం, మాధవధార, మురళీనగర్, ఎన్ఏడీ కూడలి, గోపాలపట్నం బంకు, ప్రహ్లాదపురం, పాత గోశాల కూడలి మీదుగా తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకోవడంతో 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ పూర్తవుతుంది.

సింహాచలం ఆలయం

★ **10న చందన సమర్పణ, ఆలయ ప్రదక్షిణ:** ఆషాఢ పౌర్ణమి సందర్భంగా 10న సింహాద్రినాథుడికి చివరి విడత చందన సమర్పణ జరుగుతుంది. ఈ సందర్భంగా ఆరోజు వేకువజామున 2 గంటలకే సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు నిర్వహిస్తారు. అనంతరం సుగంధ ద్రవ్యాలు మిళితం చేసి సిద్ధం చేసిన మూడు మణుగుల (సుమారు 125కిలోలు) శ్రీగంధాన్ని స్వామికి సమర్పణ చేస్తారు. 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేయలేని భక్తుల కోసం ఆలయ ప్రదక్షిణకు అవకాశం కల్పిస్తారు. వేకువజామున 3 గంటల నుంచి ఆలయ వెలుపల నుంచి భక్తులు ఆలయ ప్రదక్షిణకు అనుమతిస్తారు. ఉత్తర గోపురం, దక్షిణ గోపురం వద్ద ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు.

★ **సాయంత్రం విజయోత్సవం:** ఆషాఢ పౌర్ణమి నాడు భగవద్రామానుజాచార్యులు ఢిల్లీ పాదుషాను పాండిత్యంలో మెప్పించిన ఘట్టాన్ని పురస్కరించుకుని సింహాచలం ఆలయంలో ఢిల్లీ విజయం ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా 10న సాయంత్రం 4 గంటల నుంచి భక్తులకు దర్శనాలు నిలిపివేస్తారు. తిరిగి 5 గంటల తర్వాత దర్శనాలు కల్పిస్తారు. 10న తెల్లవారుజామున 5.30 గంటల నుంచి భక్తులకు సర్వ దర్శనాలు కల్పిస్తారు. ఉత్సవాల సందర్భంగా 9, 10 తేదీల్లో ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ఈవో త్రినాథరావు తెలిపారు.

★ **ఉచిత బస్సు సదుపాయం:** 10న ఆలయ ప్రదక్షిణ పూర్తి చేసుకుని సింహగిరికి వచ్చిన భక్తులను కొండ దిగువకు చేర్చేందుకు ఉచిత రవాణా సదుపాయం కల్పించినట్లు ఈవో తెలిపారు. ఇందుకు 50 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. మెట్లమార్గంలో, సింహగిరిపైన వివిధ ప్రాంతాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ చేసినట్లు వెల్లడించారు. ★ గిరి ప్రదక్షిణ మార్గంలోని 29 ప్రాంతాల్లోని ప్రత్యేక స్టాళ్లలో విశ్రాంతి తీసుకోవడానికి కుర్చీలు, కార్పెట్లు ఏర్పాటు చేస్తామని ఈవో తెలిపారు.

10 వేల మంది మార్గదర్శకులను గుర్తించాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పీ4 అమల్లో భాగంగా పారిశ్రామిక, సేవా, ఇతర రంగాల్లో ఆర్థికంగా, సమర్థత కలిగిన 10 వేల మంది మార్గదర్శకులను గుర్తించాలని, ఒక్కో మార్గదర్శి కనీసం 10 కుటుంబాలను దత్తత తీసుకొనే విధంగా ప్రోత్సహించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో పీ4 అమలుపై సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పీ4 సర్వేలో అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. ప్రతి సచివాలయం పరిధిలో రోజుకు 50 బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించాలన్నారు. ఏపీఐఐసీ, పారిశ్రామిక సంస్థలు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులు, వివిధ వ్యాపార కంపెనీలు, అసోసియేషన్లు పీ4లో భాగస్వామ్యం కావాలన్నారు. అధికారులు సైతం ఒక కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

Karur Vysya Bank Smart way to bank
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్
డివిజనల్ ఆఫీస్, డి.నెం.47-10-15, ఎ.జి.ఎవెన్యూ, ఫస్ట్ ఫ్లోర్, పొల్లాక్స్ స్కూల్ ఎదురుగా, 2వ లైన్, ద్వారకానగర్, విశాఖపట్నం - 530 016. ఫోన్: 0891-2511706

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) నందలి నిబంధనలతో చదవుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా **1. శ్రీ ఇమ్మడిశెట్టి లీలా వెంకట రాఘవ పవన్ కుమార్,** తండ్రి: శ్రీ ఇ. హరి ప్రసాదరావు, డి.నెం.4-56-1/9/2, లాసన్స్ బే కాలనీ, విశాఖపట్నం - 530017. వేరొక చిరునామా: శ్రీ ఇమ్మడిశెట్టి లీలా వెంకట రాఘవ పవన్ కుమార్, తండ్రి: శ్రీ ఇ. హరి ప్రసాదరావు, సెల్యూలైట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, 7వ ఫ్లోర్, నవరత్న ట్రేడ్ సెంటర్, రామ్ నగర్, విశాఖపట్నం - 530002. **2. శ్రీ ఇమ్మడిశెట్టి వెంకట సుధీర్ కుమార్,** తండ్రి: శ్రీ ఇ. హరి ప్రసాదరావు, కేరాఫ్: మెస్సర్స్ మెడికవర్ హాస్పిటల్స్, డి.నెం.1-1-83, సర్వే వెంకోజీపాలెం, ఎమ్‌వీపీ కాలనీ, సెక్టార్-6, ఎన్‌హెచ్-16, ప్రైవేట్ బస్ డిపో, విశాఖపట్నం - 530017. వేరొక చిరునామా: శ్రీ ఇమ్మడిశెట్టి వెంకట సుధీర్ కుమార్, తండ్రి: శ్రీ ఇ. హరి ప్రసాదరావు, డి.నెం.4-56-1/9/2, లాసన్స్ బే కాలనీ, విశాఖపట్నం - 530017 వారి నుండి రావల్సిన బకాయి **రూ.79,28,636.87 పై.** (అక్షరాల [illegible] మాత్రమే) **(అకౌంట్ నెం. 4878777000000072) + తేది.06.07.2025** నుండి తదుపరి వడ్డీ మరియు వ్యయాలు మొదలగునవి రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, అక్కయ్యపాలెం బ్రాంచ్,** విశాఖపట్నం యొక్క అధీకృత అధికారియైన సెక్యూర్డ్ క్రెడిటార్‌చే స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులను **29-07-2025** న "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అలానే ప్రాతిపదికన" విక్రయించబడును.

స్థిరాస్తి వివరములు:

విశాఖపట్నం, ఆనందపురం మండలం, వెల్లంకి పంచాయితీ, వెల్లంకి గ్రామం, ఎస్.నెం.263/4/2/2 వద్ద 625.62 చ॥గ॥లు విస్తీర్ణం గల నివాస ఖాళీ భూమి శ్రీ ఇమ్మడిశెట్టి లీలా వెంకట రాఘవ పవన్ కుమార్, తండ్రి: శ్రీ ఇ. హరిప్రసాదరావు గారి పేరున కలదు. (రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం.3328/2019, తేది: 14-06-2019 మరియు రెక్టిఫికేషన్ డీడ్ నెం.4606/2019, తేది.10.07.2019, సెటిల్మెంట్ డీడ్ నెం.4951/2019, తేది.22.08.2019 ప్రకారం) హద్దులు: ఉత్తరం : పెట్ల మాధవరావు గారికి చెందిన మిగిలిన భూమి, తూర్పు : రోడ్డు, పడమర : [illegible], దక్షిణం : [illegible].

రిజర్వు ధర	ధరావత్తు (రిజర్వు ధరలో 10%)	బిడ్ పెంపుదల మొత్తం
రూ.70,00,000/-	రూ.7,00,000/-	రూ.50,000/-

అమ్మకం యొక్క ఇతర వివరములు మరియు నియమ నిబంధనల కొరకు https://www.bankauctions.in ని చూడండి (ఇ-వేలం యొక్క ప్రొవైడర్ వెబ్ చిరునామా) లేదా అధీకృత అధికారి, ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, అక్కయ్యపాలెం బ్రాంచి, విశాఖపట్నం, మొబైల్ నెం.9100446834.

SARFAESI చట్టం, 2002 యొక్క రూల్ 9(1) క్రింద 15 రోజుల చట్టబద్ధ ప్రకటన

చెల్లింపు తేదీ వరకు వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో పాటు పైన తెలిపిన బకాయిలను వేలం తేదీలోపు చెల్లించవలెనని, లేనిచో, షెడ్యూల్ ఆస్తి వేలం వేయబడుతుందని/విక్రయించబడుతుందని మరియు మిగిలిన బకాయిలు ఏవైన ఉన్నట్లయితే, వడ్డీ మరియు ఖర్చులతో పాటు వసూలు చేయబడతాయని రుణగ్రహీత/లు మరియు గ్యారంటర్/లకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

అధీకృత అధికారి
తేది: 07-07-2025 ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్,
స్థలం: విశాఖపట్నం అక్కయ్యపాలెం బ్రాంచ్, విశాఖపట్నం

నిల్వ ఉంచిన ఆహార పదార్థాల గుర్తింపు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఓ హోటల్‌లో భారీగా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను గుర్తించామని ఆహారభద్రత అధికారి జి.వి.అప్పారావు తెలిపారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా సోమవారం ఆయన సిబ్బందితో కలిసి నగరంలోని ముంతాజ్ హోటల్‌ను పరిశీలించారు. మిగిలిపోయిన చికెన్, మటన్ వంటకాలు, శాకాహార కూరలు ఫ్రిజ్‌లో నిల్వ చేసి ఉండడం గుర్తించామన్నారు. వాటిని తిరిగి రోజు వేడిచేసి వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. సుమారు రూ.40 వేల విలువైన ఆహార పదార్థాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇలాంటి ఆహారం తింటే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని చెప్పారు. హోటల్‌పై కేసు నమోదు చేసి జాయింట్ కలెక్టర్‌కు నివేదించినట్లు వివరించారు.

హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఆహార భద్రత అధికారి అప్పారావు

టోల్‌ఫ్రీ నంబరుతో సేవలు పొందండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు సేవలు పొందేందుకు టోల్‌ఫ్రీ 1800-4250-0009, హెల్ప్‌లైన్ 0891-2507225 నంబర్లు అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ కేతన్‌గార్గ్ ఓ ప్రకటనలో తెలిపారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులు వీటి సాయంతో తమకు ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకోవచ్చునని; తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు తదితర వాటి సమాచారం తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. భక్తులకు ఏ ఇబ్బంది ఎదురైనా వెంటనే తెలియజేయాలని వివరించారు.

1800 మంది బీఎల్‌వోలకు శిక్షణ

శిక్షణలో పాల్గొన్న బీఎల్‌వోలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: సంక్షిప్త ఓటరు జాబితా సవరణ-2026 ప్రక్రియ వచ్చే నెల నుంచి ఆరంభం కానున్నందున పోలింగ్ కేంద్ర అధికారులు(బీఎల్‌వో)లకు సోమవారం శిక్షణ ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు వివిధ అంశాలపై వీరికి అవగాహన కల్పించనున్నారు. జిల్లాలోని విశాఖ దక్షిణం, ఉత్తరం, తూర్పు, పశ్చిమం, భీమిలి, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల పరిధిలోని 1800 మంది బీఎల్‌వోలకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. ఓటర్ల నమోదు, తప్పిదాలు సరిదిద్దడం, ఇంటింటి సర్వే తదితర అంశాలపై ఈసీ మార్గదర్శకాలను వీరికి వివరించనున్నారు. ఓటరు నమోదు అధికారి(ఈఆర్‌వో) సహాయ ఓటరు నమోదు అధికారి(ఏఈఆర్‌వో)ల పర్యవేక్షణలో కార్యక్రమం జరగనుంది. విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఏఈఆర్‌ఓ లచ్చాపాత్రుడు, మధుసూదనరావు, డీటీ జిలాని పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు పార్కుల నిర్వహణ బాధ్యత

అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో ఉద్యానవనాల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఓ వ్యక్తి ఓ పార్కు నిర్వహణపై ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ ఉద్యానవన విభాగం ఉప సంచాలకుడు దామోదర్, యూసీడీ పీఎం సత్యవేణిలతో మాట్లాడి ప్రస్తుతం ఉన్న ఉద్యానవనాల్లో గుత్తేదారులు, జీవీఎంసీ ఎన్ని పార్కులు నిర్వహిస్తున్నాయో నివేదిక ఇవ్వాలన్నారు. ఇక మీదట ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా సంఘాల ద్వారా పార్కుల నిర్వహణ చేపట్టాలన్నారు. అంతకు ముందు మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి అర్జీలు స్వీకరించారు. జోన్-1కు 3, జోన్-2కు 26, జోన్-3కు 23, జోన్-4కు 9, జోన్-5కు 15, జోన్-6కు 14, జోన్-7కు 1, జోన్-8కు 12, ప్రధాన కార్యాలయానికి 35 వినతులు వచ్చాయి. వాటిలో పరిపాలనకు 8, రెవెన్యూకు 16, ప్రజారోగ్య విభాగానికి 13, ప్రణాళికకు 64, ఇంజినీరింగ్‌కు 24, ఉద్యానవన విభాగానికి 4, యూసీడీకి 9 వినతులు అందాయి.

'ఉక్కు పరిరక్షణకు సమష్టి పోరాటం'

సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

అగనంపూడి, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకొచ్చి సమష్టిగా పోరాటం సాగించాలని మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. అగనంపూడి పరిధి పెదమడక కాలనీలో ఉక్కు నిర్వాసితుల ఐక్య సంఘం, ఉక్కు నిర్వాసిత కాంట్రాక్టు లేబర్ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు కానున్న ప్రయివేటు స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వం అధిక శ్రద్ధచూపుతూ విశాఖ ఉక్కుపై సవతి ప్రేమను కనబరుస్తుందన్నారు. ఇంతవరకూ ఉక్కుకు సొంతగనుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయకపోవడమే దీనికి నిదర్శనమన్నారు. ఉపాధి కల్పించని ఉక్కు నిర్వాసితులకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని, మిగులు భూములను తిరిగి అప్పగించాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారుడు మహదేవ్, మానవ హక్కుల వేదిక ప్రతినిధి వి.ఎస్.కృష్ణ, నిర్వాసిత సంఘాల ప్రతినిధులు జి.పూర్ణానందశర్మ, విందుల చిరురాజు, గల్లా రామకృష్ణ, బి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి కింద పడి యువకుడి దుర్మరణం

నాగమహాలక్ష్మినాయుడు (పాతచిత్రం)

పరవాడ, న్యూస్‌టుడే: ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో విద్యుత్తు అలంకరణ పనులు చేస్తూ భవనం పైనుంచి కింద పడి ఓ యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. మునగపాక మండలం టి.సిరసపల్లి గ్రామానికి చెందిన మద్దాల నాగమహాలక్ష్మినాయుడు (28) దీపాంజలి నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌కు విద్యుత్తు అలంకరణ సామగ్రి అమర్చేందుకు లైటింగ్ సంస్థకు చెందిన యజమాని భాస్కరరావుతో అక్కడికి వెళ్లాడు. ఈనెల 8వ తేదీన పరవాడ ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం జరగనున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఈ పనులు చేపట్టారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు భవనం మొదటి అంతస్తు నుంచి నాగమహాలక్ష్మినాయుడు కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని తొలుత ఎన్టీపీసీ ఆసుపత్రికి, తర్వాత కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. అవివాహితుడైన ఇతడికి తల్లిదండ్రులతోపాటు వివాహమైన ఇద్దరు అక్కలు ఉన్నారు. చేతికి అందొచ్చిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. కేజీహెచ్ మార్చురీలో సోమవారం పోస్టుమార్టం జరిగాక మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై త్రినాథరావు పేర్కొన్నారు.

ఉక్కునగరంలో రెచ్చిపోయిన దొంగలు

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరంలో ఆదివారం రాత్రి దొంగలు రెచ్చిపోయి పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. బంగారం, వెండి, ద్విచక్ర వాహనాలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సెక్టార్-6లోని 335-డి క్వార్టర్స్‌లో ఉంటున్న ఉక్కు ఉద్యోగి సీహెచ్.మనోహర్ శనివారం నగరంలోని బంధువుల ఇంటికి కుటుంబ సమేతంగా వెళ్లారు. అయితే సోమవారం ఉదయం ఆయన ఇంటికి సమీపంలో ఉండే సత్యనారాయణ ఫోన్‌చేసి.. మీ ఇంటి తలుపు తెరిచి ఉందని సమాచారం ఇవ్వగా.. ఆయన వచ్చి పరిశీలించారు. సుమారు రెండున్నర తులాల బంగారు వస్తువులు, సుమారు 50 తులాల వెండి సామగ్రి కనిపించలేదు. అలాగే 327-డిలో నివశించే రామారావు ఆదివారం రాత్రి తన ద్విచక్రవాహనం ఇంటి బయట పార్కింగ్ చేయగా అది కూడా కనిపించలేదు. జగన్నాథస్వామి ఆలయం వద్ద కూడా ద్విచక్ర వాహనం కనిపించలేదు. వీరిలో ఇద్దరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

ఒకరి మృతి

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన 16వ జాతీయ రహదారి ఆనందపురంలోని వేములవలస సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా జీఎంవలస మండలం బీజేపురం అగ్రహారం గ్రామానికి చెందిన కరకవలస రమణమూర్తి (57) 30 ఏళ్లుగా ఓ బీమా సంస్థలో ఏజెంట్‌గా పని చేస్తున్నారు. దేవి సంతోష్, గాయత్రిదేవి సంతానం. హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కుమారుడు దేవి సంతోష్ ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో విశాఖపట్నం మద్దిలపాలెంలో నివాసముంటున్న కుమార్తె గాయత్రిదేవి వద్దకు వెళ్లేందుకు ఇద్దరూ కారులో బయలుదేరారు. ఆనందపురం మండలం వేములవలస వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంతో రమణమూర్తి అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే స్థానికులు కారులో ఇరుక్కుపోయిన సంతోష్ (31)ను బయటకు తీసి ట్రాఫిక్ పోలీసులకు సమాచారమిచ్చారు. అనంతరం క్షతగాత్రుడిని తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. పోలీసులు కారును పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆనందపురం సీఐ వాసునాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడి భార్య రమణి ఎనిమిదేళ్ల కిందట మృతి చెందారు.

ప్రమాద దృశ్యం

రమణమూర్తి (పాతచిత్రం)

బాలల సదనంలో ఉచిత వసతికి దరఖాస్తుల ఆహ్వానం

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: పాతడెయిరీఫారం కూడలి ఆనందమార్గ ఆశ్రమంలోని బాలల సదనంలో ఉచిత వసతికి అనాథ, నిరుపేద బాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆశ్రమ నిర్వాహకులు స్వామి సౌమ్యానంద అవదూత తెలిపారు. ఆరు నుంచి పదేళ్ల బాలలు అర్హులన్నారు. వివరాలకు 80742 67791, 95507 75518 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	86	78
లైవ్	108	98
డ్రెస్డ్	157	166
స్కిన్‌లెస్	178	176

EENADU eClassifieds

AGRI BUSINESS
Tomato Trading. Earn 1000 daily profit on investment. Cntct: 6309090490. Svfpl.

BUSINESS SERVICES
లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఉన్న బంగారాన్ని విడిపించి అధికరేటుకు కొనుగోలు చేయబడును. ✆ 9648488068, 7799223300.
శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఉన్న బంగారాన్ని విడిపించి అధికరేటుకు కొనుగోలు చేయబడును. ✆ 9908545224.

FINANCIAL SERVICES
అర్జెంట్ పెన్షనర్స్, ప్రభుత్వ ఉద్యోగులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలవరకు లోన్స్. [illegible] ✆ 96665 47338.

REAL ESTATE

LAND FOR SALE
BHOGAPURAM
Land for Sale: 1.5 Acres (NH-16) Highway Adjacent along Vizag- Srikakulam Rd. @ Nathavalasa Jn., Nr. Bhogapuram. Ph: 9959964304.

FLAT FOR SALE
KOMMADI
North East Facing 2BHK 1200 Sft, Pooja, Dressing Room, Car Parking at Kommadi. Rent 7 to 8,000/- PM. Spot Reg. Bank Loan available. Ph: 8121100599.

HOUSE FOR SALE
ATCHYUTAPURAM
North- East Corner Building for Sale. Ready to Move. 121 Sq.Yds. (Cellar G+1) 60 Ft. Double Rd. Facing. Prime Location at Atchutapuram. ✆ 9885824528.

SECOND SALE
మెదిన ఏజెన్సీ కొనుగోలు పాత A/Cలు, సెంట్రల్ A/Cలు, ఇన్వర్టర్ బ్యాటరీలు, ఫ్రిజ్, వాషింగ్ మిషన్స్, UPS లు కొనబడును. Cont : 6309746364.

JOBS
Receptionist and Waiters Required Age: below 35 yrs. with Computer & Hindi & English speaking skills Hotel Winsar Park, Opp. KGH, Vizag. 9849581868.

Wanted Marketing Managers to work in Ministry of Divinity, Vizag. Salary Rs. 27,500/-. ✆: 86393 67991.

డ్రైవర్స్- హెవీ వెహికల్/ బ్యాడ్జ్ కలవారు మారికవలసలో కోళ్ల ఫారం నుండి కోళ్ళు వ్యానులో (407) రాత్రి [illegible] ✆ 9440611329, 9951853379.

ఉద్యోగ అవకాశం: [illegible] 1. Administrative Officers: M/F, 2. Co-ordinators: M/F, 3. Client Supporting Managers: (F) [illegible] Cont: 9177296835, 9290063887.

USA [illegible] ✆ 92469 99571, 92469 96571.

Oyo హోటల్ రూమ్స్ (Lodge) నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్ cum రూమ్ బాయ్స్ కావలెను (Age below 28). భోజనం & వసతి కలదు. MVP కాలనీ, వైజాగ్. ✆ 7036488899.

జనరేషన్‌యువ చిల్డ్రన్ హోమ్‌లో ఉండి పనిచేయుటకు M/F 1) వార్డెన్ -3, వయస్సు 25-40 [illegible] ✆ 7286846624.

ACCOUNTING
Hotel @ Gajuwaka, Autonagar needs Hotel Industry Exp. Sr. Accounts/ Asst. Accounts/ Clerks. Send resume WhatsApp: 9392900617

గమనిక [illegible]

పెందుర్తి

తెరపై ఈనాడు

పెందుర్తి, న్యూస్‌టుడే

లక్ష్మీకాంత్ స్క్రీన్-1- **జురాసిక్ వరల్డ్** (మార్నింగ్, ఫస్ట్ షో), **కన్నప్ప** (మ్యాట్నీ, సెకెండ్ షో) స్క్రీన్-2 - **తమ్ముడు**

కృష్ణమయ్య సంకీర్తనల జయంతి

సింహాచలం, న్యూస్‌టుడే: తొలి తెలుగు వచన సంకీర్తనా పితామహుడు శ్రీకాంత కృష్ణమాచార్యులు సింహాద్రినాథుడిపై రాసిన చాతుర్లక్ష సంకీర్తనల జయంతి సోమవారం అప్పన్న ఆలయంలో ఘనంగా జరిగింది. ఆలయ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు నేతృత్వంలో అర్చకులు ఆలయ బేడామండపంలోని కృష్ణమయ్య విగ్రహం వద్ద విశేష పూజలు, ఆరాధనలు నిర్వహించారు. కృష్ణమయ్య వచన సంకీర్తనలను గానం చేశారు.

పెందుర్తి ఎమ్మెల్యేతో 'ఈనాడు-ఫోన్‌ఇన్' రేపు

ఈనాడు మీతోడు

తేదీ: 09-07-2025 (బుధవారం)

సమయం: ఉదయం 9.00 నుంచి 10.00 గంటల వరకు

ఫోన్ నెంబర్: 93472 79909

పెందుర్తి నియోజకవర్గంలో వివిధ ప్రజా సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలు, అర్హులకు అందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు... తదితర అంశాలను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఇందుకు 'ఈనాడు' అవకాశం కల్పిస్తోంది. మీరు ఫోన్ చేసి వివరిస్తే ఎమ్మెల్యే తగు సమాధానం ఇస్తారు. -న్యూస్‌టుడే, వేపగుంట

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: శ్రీసాయిమాధవనగర్ సెక్టార్-1లో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. -త్రినాథరావు, శ్రీసాయిమాధవనగర్. ✓: వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. -హరిబహదూర్, వీధిదీపాల నిర్వహణాధికారి

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం పెదనాయుడుపాలెం కొత్తరోడ్డు సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. -స్థానికులు, పెదనాయుడుపాలెం. ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -చైతన్య, ఈవోపీఆర్డీ, సబ్బవరం.

?: సబ్బవరం జోడుగుళ్ల వినాయక మందిరం దగ్గరలో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద అధికంగా ఉంది. -కె.తాతబాబు, సబ్బవరం. ✓: పరిశీలించి వ్యర్థాల తరలింపునకు చర్యలు తీసుకుంటాం. - వై. రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

వ్యవసాయ ల్యాబ్ సేవలు అందేదెప్పుడో..!

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరంలో నిర్మించిన జిల్లా వ్యవసాయ ల్యాబ్ సేవలు ఈ ఏడాదైనా రైతులకు అందుబాటులోకి వచ్చేనా అని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఏడాది కిందట సుమారు రూ.3కోట్లతో దీన్ని నిర్మించారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు అందుబాటులోకి వస్తుందని గతంలో వ్యవసాయాధికారులు ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదు.

★ ఇది అందుబాటులోకి వస్తే రైతులు వినియోగించే ఎరువుల నాణ్యతను ఇక్కడ పరిశీలిస్తారు. దీనివల్ల నకిలీ ఎరువులు వినియోగించి రైతులు నష్టపోయే ప్రమాదం ఉండదు. ముందుగా విత్తన పరీక్ష చేయించడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుంది. మార్కెట్‌లోకి వచ్చే వివిధ రకాల విత్తనాల ప్రకటనలు చూసి మోసపోరు. క్రిమిసంహారక మందుల విషయంలోనూ రైతులకు మేలు జరుగుతుంది.

సబ్బవరంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవనం

★ సాధారణంగా ఏ జిల్లాకు చెందిన విత్తనాలను ఆ జిల్లా వ్యవసాయ ల్యాబ్‌లో పరీక్షలు చేయడం వల్ల కొన్ని విత్తన సంస్థలు స్థానిక అధికారులను ప్రలోభాలకు గురిచేసి అనుకూల ధ్రువపత్రం పొందే అవకాశం ఉంది. దీనివల్ల రైతులు వినియోగించే విత్తనాల వల్ల నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. ఇలాంటివి జరగకుండా ఉండేందుకు ఒక వ్యవసాయ కేంద్రం నుంచి వేరొక కేంద్రానికి నమూనాలు పంపి పరీక్షలు చేయిస్తుంటారు. ముందుగా ఒక సంస్థ విత్తనం రిలీజ్ చేసినపుడు వాటిని సంబంధిత డిపోల నుంచి వ్యవసాయాధికారులు సేకరించి స్థానిక వ్యవసాయ ల్యాబ్‌కు పంపిస్తారు. అక్కడ ఒక్కో నమూనాకు ఒక్కో కోడ్ నంబరు ఇచ్చి ఇతర జిల్లాలకు వాటిని తరలిస్తారు. అక్కడ వాటికి డీ-కోడింగ్ చేసి నాణ్యత పరీక్షలు చేపడతారు. దీని వల్ల ఆ నమూనాలు ఏ కంపెనీవో తెలిసే అవకాశం లేనందున ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగి నాణ్యంగా లేని వాటిని తిరస్కరిస్తారు. దీనివల్ల రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా దీన్ని ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. సోమవారం పెందుర్తి సీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఛైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి, జీవీఎంసీ జోనల్ కమిషనర్, ఎంపీడీవోలతో కలిపి ఏడుగురు సభ్యులు ఉంటారు. ఇందులో భాగంగా పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ దొర.. సభ్యులు నియమితులైన రాపర్తి శంకర్ ఆనంద్, బండారు వరాదినిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులంతా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. వైద్యులు అవంతి, అరుణ, హెడ్ నర్సు లిల్లీగ్రేస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేష్‌బాబు తదితరులు

యుక్త వయసు.. లక్ష్యాలకు పునాది

మాట్లాడుతున్న సీఐ సతీశ్‌కుమార్

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవితంలో యుక్త వయసు ఎంతో కీలకమైనదని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యుక్త వయసులో మంచి అలవాట్లు, క్రమశిక్షణతో జీవితంలో సాధించబోయే లక్ష్యాలకు పునాది వేసుకోవాలని సూచించారు. ఈవ్‌టీజింగ్ తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లలితకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● నేడు ఎమ్మెల్యే పర్యటన

సబ్బవరం, న్యూస్‌టుడే: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మంగళవారం ఉదయం 10 గంటలకు సబ్బవరం మండలంలోని ఆరిపాక శివారు చినయాతపాలెం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరవుతారని ఎంపీడీవో పి.పద్మజ, మండల జనసేన అధ్యక్షుడు కర్రి కనకరాజు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ కార్యక్రమానికి అంతా హాజరు కావాలని కోరారు.

● మందుబాబులకు జరిమానా

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి న్యాయస్థానం జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం ఏడుగురిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అందరికీ కలిపి రూ.70 వేలు జరిమానా విధించినట్లు వివరించారు.

● భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించరూ..

సబ్బవరం, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఈ నెల 9వ తేదీన జరగనున్న అఖిల భారత కార్మిక సంఘాల సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులంతా పాల్గొంటారని తెలియజేస్తూ సబ్బవరం ఎంఈవో రవీంద్రబాబుకు సోమవారం పలువురు ఆ సంఘ నాయకులు విన్నవించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

ఓటరు జాబితాల నిర్వహణపై శిక్షణ

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవెల్ అధికారులకు ఓటరు జాబితాల నిర్వహణపై సోమవారం నుంచి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. నియోజకవర్గ పరిధిలోని 299 మంది బీఎల్వోలకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్నికల విభాగం డీటీ అర్జునరావు తెలిపారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన ఈ శిబిరంలో తొలిరోజు 50 మంది బీఎల్వోలకు యాప్ వినియోగం, మార్పులు, చేర్పులు, తొలగింపుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారు.

బీఎల్వోలకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్

● వినతుల స్వీకరణ

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సోమవారం జరిగింది. జడ్సీ హేమవతి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెందుర్తి వీఎంఆర్డీఏ లేఅవుట్‌లో భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, ఎన్టీఆర్ భరోసా పింఛను ఇప్పించాలని, సింహాచలం ప్రాంతంలో టీడీఆర్‌లు ఇవ్వాలని, లక్ష్మీపురం ప్రాంతంలో వీధిదీపాల సమస్య పరిష్కరించాలని, అడివివరం, దొగ్గవానిపాలెం ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

● దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

పరవాడ, న్యూస్‌టుడే: లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9వ తేదీన కార్మికులు చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం లంకెలపాలెం తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

● నకిలీ మద్యంపై విచారణ చేపట్టాలంటూ వినతి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ కేంద్రంగా కలకలం రేపిన నకిలీ మద్యం తయారీ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పరవాడకు చెందిన పలువురు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పరవాడలోని కొందరు ముఠాగా ఏర్పడి నకిలీ మద్యం తయారు చేసి బెల్టు షాపులకు సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసును సీఐడీ విభాగాధికారులతో పక్కాగా దర్యాప్తు చేయించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్రి చంద్రశేఖర్, రాజులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు మెరైన్ పోలీసులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సింహాచలం నృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే గిరి ప్రదక్షిణకు రుషికొండలోని మెరైన్ పోలీసుస్టేషన్‌కు చెందిన 20 మంది పోలీసులు, స్థానిక బీచ్ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న గజ ఈతగాళ్లు 17 మంది జీవీఎంసీ లైఫ్‌గార్డుల్ని జిల్లా ప్రభుత్వ యంత్రాంగం నియమించింది. సంబంధిత సముద్ర తీరంలో వీరు ఈ నెల 9, 10 తేదీల్లో గిరి ప్రదక్షిణ భక్తులకు సేవలందిస్తారు.

జీవీఎంసీ కమిషనర్‌కు వినతి

సింధియా: పారిశ్రామిక ప్రాంతం గుల్లలపాలెం ఎఫ్ఆర్‌యూని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకుండా నిరోధించి తక్షణం జీవీఎంసీ ఆధీనంలోనే నడిచేలా చర్యలు తీసుకోవాలని సోమవారం గ్రీవెన్స్‌లో కమిషనర్ కేతన్‌గార్గ్‌కు 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆధీనంలో పేదలకు సక్రమంగా వైద్య సేవలు, ఉచితంగానే మందులు పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. రెండేళ్ల కిందటే ప్రభుత్వం ఎఫ్ఆర్‌యూకి రూ.70 లక్షలతో అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు. ప్రైవేటుకు అప్పగిస్తే నిరాహార దీక్షకు కూర్చుంటానన్నారు.

ఘనంగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే : నరవ ఎల్‌జీనగర్‌లో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. అంబేడ్కర్ విగ్రహానికి ఎంఆర్‌పీఎస్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎల్‌జీనగర్ నివాసుల సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ముప్పిడి వినయ్‌కుమార్, కార్యదర్శి శ్యామ్ సుందరమ్, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం సాయినగర్ కాలనీలోనూ మండల ఎమ్మార్పీఎస్ కన్వీనర్ బొర్రా జయరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు దండోరా జెండాను ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దండోరా ఉద్యమంలో విశేష సేవలు అందించిన నాయకులు సన్యాసి, అప్పారావు, శాంతమ్మలను ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ సభ్యులు, కూటమి నాయకులు

సింహాద్రి ఎన్టీపీసీ సీవాటర్ పైపులైన్‌కు లీకులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం తిక్కవానిపాలెం తీరం నుంచి సింహాద్రి ఎన్టీపీసీకి వేసిన సీవాటర్ పైపులైన్‌కు లీకులు ఏర్పడ్డాయి. ప్లాంటులోని విద్యుదుత్పత్తి తయారీలో భాగంగా కూలింగ్ టవర్లకు సముద్ర నీటి అవసరాల నిమిత్తం ప్లాంటు ప్రారంభ సమయంలో తిక్కవానిపాలెం తీరం నుంచి ఎన్టీపీసీ ప్లాంటు లోపలికి భారీ సీవాటర్ పైపులైన్ నిర్మించారు. దేవాడ ఉప్పుగల్లీల సమీపంలో ఈ పైపులైన్ దెబ్బతిని సముద్రపు నీరు వృథాగా కొంతమేర ఉప్పుటేరులోకి ప్రవహిస్తుండగా మరికొంత రోడ్డుపైకి వస్తుండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి మరో 50 మీటర్ల దూరంలో పైపులైన్ వాల్వ్ నుంచి కూడా పెద్దఎత్తున లీకవుతోంది. సంబంధిత అధికారులు వెంటనే తగిన మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దేవాడ ఉప్పుగల్లీల సమీపంలో ఇలా..

గిరి ప్రదక్షిణ భక్తులకు సౌకర్యాలు కల్పించండి

బీఆర్‌టీఎస్ రహదారిని పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు

అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సింహగిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. వీరిద్దరూ సోమవారం రాత్రి వేర్వేరుగా గిరి ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తాగునీరు, మరుగుదొడ్లు ఎక్కువ ప్రాంతంలో అందుబాటులో ఉంచాలన్నారు. నడవడానికి అనుకూలంగా రహదారులను తీర్చిదిద్దాలన్నారు. బీచ్‌లో స్నానం చేసే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు అనుకూలంగా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. విద్యుత్తు దీపాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేసి, భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, పి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

రూ.3.53 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక 75వ వార్డులో రూ.3.53 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఉక్కు నిర్వాసిత కాలనీల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తామన్నారు. వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అధ్యక్షత వహించి వార్డులో సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, తెదేపా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు శ్రీముసిరి శ్రీను, సోమునాయుడు, అప్పారావు, పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎంవీపీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవాల్తేరు గాంధీ సెంటర్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున అనధికారికంగా మద్యం సీసాలను తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎంవీపీ ఎస్.ఐ. శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు, సిబ్బంది దాడులు చేశారు. ఓ వ్యక్తి వద్ద రెండు సంచుల్లో ఉన్న 33 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పెదవాల్తేరు చేపలబజారు ప్రాంతానికి చెందిన బోర సతీష్‌రెడ్డి (26)ని అరెస్టు చేశారు. మద్యం సీసాలను కొనుగోలు చేసి అనధికారికంగా అధిక ధరలకు విక్రయిస్తున్నాడని సీఐ తెలిపారు.

సీనియర్ జల నాణ్యత విశ్లేషకుడి బదిలీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలలోని సీనియర్ జల నాణ్యత విశ్లేషకులు వై.ఎస్.శివరామకృష్ణ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో విజయవాడకు బదిలీ అయ్యారు. గత ఐదు సంవత్సరాలుగా ఆయన ఇక్కడ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన్ను కార్యాలయ సిబ్బంది సత్కరించారు. మాధవరావు, గౌరీశ్వరరావు, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రభుత్వ హైస్కూలు విద్యార్థులకు సోమవారం రోడ్డు భద్రతపై సబ్బవరం సీఐ ఆర్.రామచంద్రరావు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే శిక్షార్హులవుతారన్నారు. సబ్బవరం జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

త్వరలో టీడీఆర్, పంచగ్రామాల సమస్యకు పరిష్కారం

అడివివరం, న్యూస్‌టుడే: ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం అధ్యక్షతన సోమవారం అడివివరంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. త్వరలోనే టీడీఆర్‌ల సమస్య, పంచగ్రామాల భూసమస్య పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. టీడీఆర్‌ల జారీపై ప్రభుత్వం వేసిన అయిదుగురు సభ్యుల కమిటీ నివేదిక రాగానే టీడీఆర్‌లు జారీ అవుతాయన్నారు. పంచగ్రామాల సమస్య పరిష్కారంలో భాగంగా తొలుత నిర్మాణాల క్రమబద్ధీకరణ జరుగుతుందన్నారు. దశలవారీగా ఖాళీ స్థలాలు, రైతుల భూములు, గ్రామ కంఠం స్థలాల సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. తొలుత ఆయన కాపుదిబ్బ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో 98వ వార్డు తెదేపా అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నాయకులు గుసిడి శంకర్రావు, లండ శ్రీను, రౌతు రాంబాబు, బున్ని, అవినాశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

కాపుదిబ్బలో ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

జంగాలపాలెంలో ఇంటింటికీ తెదేపా

జంగాలపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం పెందుర్తి మండలం జంగాలపాలెంలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం జరిగింది. సర్పంచి గొరపల్లి నరసింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో సాధించిన లక్ష్యాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు రెడ్డి నారాయణరావు, గొరపల్లి వెంకటరమణ, నగేశ్, అజయ్, అధిక సంఖ్యలో కార్యకర్తలు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న నాయకులు

కూటమితోనే సుపరిపాలన

పిట్టవానిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వవార్డు పరిధి పిట్టవానిపాలెంలో సోమవారం వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు ఈర్ల సోమునాయుడు, నూకరెడ్డి, పైడిరెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం పెదనాయుడుపాలెంలోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు. పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలన కరపత్రాలను అందించారు. అంతకు ముందు గ్రామంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో సాయినాథరావు, గండి దేముడు, రెడ్డి దేముడు, పోతల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబ్జీ విలేకరులతో మాట్లాడుతూ వైకాపా చేస్తున్న దుష్ప్రచారాన్ని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని, వాస్తవాలు ప్రజలకు వివరించాలని సూచించారు.

సింధియా, న్యూస్‌టుడే: నిరుద్యోగిత తగ్గించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళాలు నిర్వహించడానికి ప్రత్యేక కార్యాచరణకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. సోమవారం సాయంత్రం 59వ వార్డులో జరిగిన 'సుపరిపాలనలో-తొలిఅడుగు' పేరిట పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓపిక పడితే హామీలన్నీ సకాలంలో పూర్తి కాగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షులు నక్క లక్ష్మణరావు, వార్డు అధ్యక్షులు ఉరుకూటి హరి, ప్రధాన కార్యదర్శి మితిరెడ్డి శంకర్, క్లస్టర్ ప్రతినిధి డొంకాన రాంబాబు, కూటమి నాయకులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

పెదనాయుడుపాలెంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న గండి బాబ్జీ, నాయకులు, కార్యకర్తలు

అనధికార వసూళ్లపై ఫిర్యాదుల వెల్లువ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రేషను డిపోల డీలర్ల నుంచి పౌర సరఫరాల శాఖ సిబ్బంది అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారంటూ సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ సరకుల పంపిణీలో మార్పులు చేసింది. గతంలో ఉన్న ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి గత నెల నుంచి డిపోల వద్దే సరకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 610 రేషను డిపోల ద్వారా నిత్యావసరాలు అందజేస్తున్నారు. ప్రస్తుతం జులై నెలకు సంబంధించి పంపిణీ చురుగ్గా సాగుతోంది. ఈ నేపథ్యంలో పంపిణీని పర్యవేక్షించాల్సిన ఉద్యోగులు డీలర్ల నుంచి అనధికారికంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నారు. ఒక్కో రేషను కార్డుకు రూ.3ల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక్కో దుకాణం పరిధిలో సుమారు 800 నుంచి 1500 వరకు కార్డులుంటాయి. దీనిప్రకారం నెలకు రూ.2400 నుంచి రూ.4500 వరకు ఇవ్వాలని లేకుంటే తనిఖీల పేరుతో కేసులు రాస్తామని డీలర్లను హెచ్చరిస్తున్నట్లు సమాచారం. పాతనగరంలోని డిపోలతో పాటు కంచరపాలెం, గాజువాక, మధురవాడ, గోపాలపట్నం, రైల్వే న్యూకాలనీ తదితర ప్రాంతాల్లో ఈ బెదిరింపులు అధికంగా ఉన్నాయని చెబుతున్నారు. కారుణ్య నియామకాల కింద వచ్చిన కొంతమంది డీలర్ల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వయం సహాయక బృందాల పేరుతో పలు డిపోలను బినామీగా నడుపుతున్న ఒక ఉద్యోగి వసూళ్ల వెనుక చక్రం తిప్పుతున్నారని, అనధికారికంగా వసూలు చేసిన ఈ మొత్తాన్ని సహాయ సరఫరా అధికారులకు ఇస్తున్నారని చెబుతున్నారు. పూర్తిస్థాయిలో ఆయా అంశాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీలర్లు అధికారులను కోరుతున్నారు.

ఎఫ్ఆర్‌యూని ప్రభుత్వమే నడపాలి

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం 60వ వార్డు గుల్లలపాలెంలో ఎఫ్ఆర్‌యూ (ఫస్ట్ రిఫరల్ యూనిట్)ని ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు డిమాండు చేశారు. సోమవారం ఆసుపత్రి వద్ద సీపీఎం, సిటూలు చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏడు వార్డుల్లో కొండవాలు ప్రాంత రోగులందరికీ ఏకైక ప్రభుత్వ ఆసుపత్రిగా ఉందని స్పష్టం చేశారు. కోరమాండల్ లాంటి సంస్థకు ఇచ్చే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, సీపీఎం, సిటూ నాయకులు, ఐద్వా మహిళలు పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం, సిటూ నాయకులు, కార్యకర్తలు

యువతకు ఉచిత శిక్షణ

సింధియా, న్యూస్‌టుడే: విశాఖపట్నం పోర్టు అథారిటీ సహకారంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సోమవారం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్‌బిల్డింగ్ (సెమ్స్) సీవోవో కమాండర్ (రిటైర్డ్) గోపీకృష్ణ శివ్వం తెలిపారు. ఇరవై ఏడేళ్ల వయసులోపు పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైన అభ్యర్థులంతా ఈ ఉచిత కోర్సు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. రెండు నెలలపాటు ఉచిత వసతితో శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తిగల యువతీ యువకులు ఈనెల 11లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 86884 11100, 77948 40934, 0891-2704010 నంబర్లలో లేదా సింధియా సమీప సెమ్స్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జలవనరుల ఏఈఈల సంఘం ఎన్నిక

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ (ఏఈఈ) అధికారుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సంబంధిత కార్యాలయంలో సోమవారం జరిగింది. జిల్లా శాఖ నూతన అధ్యక్షునిగా బాడాన విజయ్‌కుమార్ (విశాఖ), ప్రధాన కార్యదర్శిగా రఘుపతుల విజయ్‌కుమార్ (భీమిలి), అసోసియేట్ అధ్యక్షునిగా కోరాడ పైడినాయుడు (క్యూసీ), ఉపాధ్యక్షులుగా ఆకుల ప్రకాశ్ (చోడవరం), మలయాల శ్రీరామ కపిల్ (ఎస్ఎంఐ), కోశాధికారిగా నివగాని రావు (విశాఖ), సహాయ కార్యదర్శులుగా ముడికి రాంజీ, ఎ.రాజేశ్, అక్కిరి భాను అమీనా, వీవీకే సాయిలక్ష్మి ఎన్నికయ్యారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారులంతా ఈ ఎన్నికలకు హాజరయ్యారు. కార్యక్రమంలో జలవనరులశాఖ విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలు పోలవరం ప్రాజెక్టు అసిస్టెంట్ కార్యనిర్వాహక ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అధ్యక్షుడు విజయ్ కుమార్

ప్రధానకార్యదర్శి ఆర్.విజయ్ కుమార్

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పరవాడ, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ ఉదయ నాగశ్రీ, ప్రిన్సిపల్ సీతాలక్ష్మి అన్నారు. పాఠశాలలో అధునాతన ప్రమాణాలతో తీర్చిదిద్దిన పికెల్‌బాల్ క్రీడకు చెందిన నాలుగు కోర్టులను సోమవారం వీరు ప్రారంభించారు. విద్యార్థులంతా పికెల్‌బాల్ కోర్టులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో నిశాంత్, కోచ్‌లు పాల్గొన్నారు.

పికెల్‌బాల్ కోర్టులను ప్రారంభిస్తున్న పాఠశాల డైరెక్టర్ ఉదయ నాగశ్రీ

పండగ వాతావరణంలో మెగా పీటీఎం

మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి సరోజిని

పరవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో ఈనెల 10వ తేదీన ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న మెగా పీటీఎం-2 (పేరెంట్స్ టీచర్స్ మీటింగ్)ని పండగ వాతావరణంలో నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారిణి సరోజిని పేర్కొన్నారు. పరవాడ మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో పీటీఎం-2పై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాలల్లో పక్కాగా నిర్వహించాలన్నారు. ఎంపీడీవో రమేశ్‌నాయుడు, ఎంఈవోలు దివాకర్‌రావు, సాయిశైలజ, ఈవోపీఆర్డీ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ప్రేమ వ్యవహారంలో యువతి హత్య!

మృతదేహం పక్కనే కత్తి గాయాలతో ప్రియుడు

రమ్య

జిన్నారం(రామచంద్రాపురం), న్యూస్‌టుడే: ప్రేమ వ్యవహారంలో యువతి హత్య కలకలం రేపింది. ఆమె మృతదేహం పక్కనే ప్రియుడు కూడా గొంతుపై కత్తిగాట్లతో పడి ఉండడం అనుమానాలు రేకెత్తిస్తోంది. ప్రియుడే ఈ పని చేశాడా... ఇంకెవరి హస్తమైనా ఉందా...? అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. హైదరాబాద్ శివారులోని రామచంద్రాపురం ఠాణా పరిధిలోని బండ్లగూడలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా బాడంగి మండలం గజరాయునివలస గ్రామానికి చెందిన బొత్స శ్రీనివాస్, ఈశ్వరమ్మ దంపతులు 25 ఏళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. రామచంద్రాపురం పరిధిలోని బండ్లగూడ బాలాజీనగర్‌లో నివాసముంటున్నారు. వీరి కుమార్తె రమ్య (23)కు మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మాణెపల్లికి చెందిన ప్రవీణ్‌కుమార్ (25)తో మూడేళ్ల నుంచి పరిచయముంది. బీటెక్ పూర్తి చేసిన ప్రవీణ్ ప్రస్తుతం ఆల్విన్‌కాలనీలో ఉంటూ ట్యూషన్లు చెబుతున్నాడు. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. ఆరు నెలల క్రితం తమ ప్రేమ గురించి యువకుడు... రమ్య తల్లిదండ్రులకు చెప్పగా.. వారు అంగీకరించలేదు. ఆమెకు పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. సోమవారం మధ్యాహ్నం యువతి తల్లి ఈశ్వరమ్మ ఇంటికి వచ్చేసరికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. కిటికీ లోంచి పరిశీలించగా... రమ్య గొంతుపై తీవ్ర గాయంతో రక్తపు మడుగులో ఉంది. ఆ పక్కనే మెడ మీద గాయంతో ప్రవీణ్ పడి ఉన్నాడు. ప్రవీణ్ కొన ఊపిరితో ఉండడంతో ఆసుపత్రికి తరలించారు.

అలాంటి వాటికే మీ సమయాన్ని వెచ్చించండి

అవసరం లేని విషయాల గురించి ఆలోచిస్తూ ఉంటే మీ సమయం వృథా కావడమే కాదు, దానివల్ల ముఖ్యమైన పనులపై మీరు దృష్టి పెట్టలేరు. ఓ విషయం వల్ల మీకు

1. వ్యక్తిగత ప్రయోజనమైనా ఉండాలి.
2. మనశ్శాంతైనా లభించాలి.
3. మీ కుటుంబానికి, సమాజానికి పనికొచ్చే అర్థవంతమైన విషయమైనా అయ్యుండాలి.

అలాంటి వాటి కోసమే మీ సమయాన్ని, శక్తిని వెచ్చిస్తూ పూర్తి ఏకాగ్రతను నిలపండి.

– మోర్గాన్ రిచర్డ్ ఒలివియర్, రచయిత్రి

జగన్ కారులో వచ్చి వెళ్లా.. నాకేం తెలియదు

పోలీసుల విచారణలో మాజీ మంత్రి పేర్ని నాని

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 18న సత్తెనపల్లి పట్టణంలో ర్యాలీ చేయడంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తిన విషయం మీకు తెలుసా? రప్పా రప్పా అనే ప్లకార్డులు మీరు చూశారా? వాటిని ఎక్కడ ముద్రించారు? జనసమీకరణలో మీ పాత్ర ఉందా? పట్టణంలో ఎటువంటి అనుమతుల్లేకుండా ర్యాలీ చేయడమే కాకుండా డీజేతో నృత్యాలు చేయడం, వాహనాలు శబ్దం చేస్తూ నడపడం, బహిరంగంగా మద్యం తాగడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడం వంటి విషయాలు మీకు తెలియవా? అంటూ మాజీ మంత్రి పేర్ని నానిని సత్తెనపల్లి పోలీసులు ప్రశ్నించారు. జగన్ కారు ఎక్కమంటే ఎక్కాను.. తాడేపల్లి నుంచి కారులో వచ్చా.. కారులోనే తిరిగి వెళ్లా.. అనుమతుల గురించి నాకేం తెలియదని ఆయన సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడంపై పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో పేర్ని నానిని సోమవారం విచారించారు. పట్టణంలో జరిగిన ర్యాలీలో మీరు పాల్గొన్నారా అని పోలీసులు ప్రశ్నించగా కారులో ఉన్నానని చెప్పారు. జగన్ పర్యటనకు 3 వాహనాలు, 100 మందికి అనుమతి ఇచ్చారు కదా అని నాని పోలీసుల్ని అడిగారు. పట్టణంలో ర్యాలీకి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, రెంటపాళ్లకు పెద్దసంఖ్యలో వాహనాలు, జనం వస్తే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని ఉన్నతాధికారులు ముందుగానే చెప్పారని పోలీసులు సమాధానమిచ్చారు. విచారణకు మరోసారి పిలిస్తే రావాలని సీఐ నాగమల్లేశ్వరరావు మాజీ మంత్రికి చెప్పారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు పోలీస్‌స్టేషన్‌లోకి గుంపుగా వచ్చేసి.. విచారణ పూర్తయ్యే వరకు సీఐ గది ముందే హడావుడి చేశారు.

సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన పేర్ని నాని ★ సీఐ గది వద్ద గుమికూడిన వైకాపా నాయకులు

రెంటపాళ్ల ఎక్కడో తెలియదు

తనకు రెంటపాళ్లే కాదు సత్తెనపల్లి ఎక్కడో కూడా తెలియదని.. ఇక్కడికి రావడం ఇదే తొలిసారి అని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. పోలీసుల విచారణ తర్వాత వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుధీర్ భార్గవరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 11 సెక్షన్లతో తనపై కేసు పెట్టారని, మచిలీపట్నంలోని కార్యాలయంలో ఆదివారం పోలీసులు నోటీసు అంటించి వెళ్లడంతో విచారణకు వచ్చానని చెప్పారు. పోలీసుల ఆంక్షలు అతిక్రమించారని, ప్రజల్ని ఇబ్బందులకు గురి చేశారని, స్టంట్లు వేశారని రుజువు కావడంతో మిమ్మల్ని విచారణకు పిలుస్తున్నామంటూ నోటీసులో పేర్కొన్నారన్నారు. సత్తెనపల్లిలో వైకాపా ఇన్‌ఛార్జి, ఛైర్‌పర్సన్ ఎవరో కూడా ఇక్కడికి వచ్చేవరకు తనకు తెలియదని, తాను ఎవరితోనూ మాట్లాడలేదని అన్నారు. పాలకుల ఒత్తిడితో వారి కుర్చీలను కాపాడుకునేందుకు పోలీసు అధికారులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని, సత్తెనపల్లి పోలీసులు అమాయకులని వ్యాఖ్యానించారు. తనపై కేసులు పెట్టినా జగన్ జెండాను వదిలేది లేదన్నారు.

గ్రూప్-1 కేసులో మధుసూదన్‌కు బెయిల్

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 (2018) ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు, నిధుల దుర్వినియోగం కేసులో రెండో నిందితుడు, క్యామ్‌సైన్ మీడియా సంస్థ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్‌కు హైకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. విజయవాడ కోర్టులో రూ.25 వేల విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. అభియోగపత్రం దాఖలు చేసే వరకు ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరుకావాలని మధుసూదన్‌కు స్పష్టంచేశారు. మూల్యాంకనంలో అక్రమాలపై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం మధుసూదన్ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇటీవల వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి.. సోమవారం నిర్ణయాన్ని ప్రకటించారు. ఏపీపీఎస్సీతో చేసుకున్న ఒప్పందంలోని నిబంధనలకు అనుగుణంగానే మధుసూదన్ పనులు నిర్వహించారన్నారు. వైద్య నివేదికలు, కేసులోని వివరాలను పరిగణనలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు
- హైకోర్టులో నేడు విచారణ

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి(ఏ39) ఉపసంహరించుకున్నారు. సోమవారం జరిగిన విచారణలో వ్యాజ్యం ఉపసంహరణకు మోహిత్‌రెడ్డి తరఫు న్యాయవాది అభ్యర్థించారు. అందుకు అనుమతిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులిచ్చారు. సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని, కేసులో తనను నిందితుడిగా పేర్కొంటూ 'సాక్షి'గా విచారణకు రావాలని దర్యాప్తు అధికారి నోటీసు ఇవ్వడం చెల్లదంటూ హైకోర్టులో మోహిత్‌రెడ్డి క్వాష్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇటీవల జరిగిన విచారణలో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని అతని తరఫు సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు అభ్యర్థించగా, ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి నిరాకరించారు. అరెస్టుపై ఆందోళన ఉంటే ముందస్తు బెయిలు పిటిషన్ వేసుకోవాలన్నారు.

వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రానుంది. 'మద్యం ముడుపులను తరలించడానికి నేను తుడా ఛైర్మన్‌గా ఉన్న సమయంలో వాహనాలను వినియోగించినట్లు నాపై ఆరోపణ చేస్తున్నారు. వాస్తవానికి అప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తుడా వాహనాలను వినియోగించడం, రూ.కోట్లు తరలించడం సాధ్యం కాదు. నేను నేరానికి పాల్పడలేదు. నా ప్రతిష్ఠను దిగజార్చేందుకు రాజకీయ నేతలు చెప్పిన మాటలు విని పోలీసులు నన్ను ఈ కేసులో ఇరికించార'ని వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఇప్పటికే బెయిలు కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను విజయవాడ కోర్టు కొట్టివేసిందని వెల్లడించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరారు.

బూనేటి చాణక్య బెయిల్ పిటిషన్ కొట్టివేత

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన రాజ్ కెసిరెడ్డి ప్రధాన అనుచరుడు బూనేటి చాణక్య (ఏ-8) బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం కొట్టేసింది. అతనికి బెయిల్ నిరాకరిస్తూ ఏసీబీ న్యాయస్థానం న్యాయాధికారి భాస్కర్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- ఇంటి నుంచి ఆహారం తీసుకొచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మద్యం కుంభకోణం కేసు నిందితుడు రాజ్ కెసిరెడ్డి (ఏ-1) దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా విజయవాడ ఏసీబీ న్యాయస్థానం కొట్టేసింది.
- మద్యం కుంభకోణం కేసులో నిందితులైన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్‌నాయుడు బెయిల్ పిటిషన్లపై తదుపరి విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. వీరిద్దరికీ బెయిల్ ఇవ్వొద్దంటూ సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు.

కరోనా కట్టుకథల కరోడ్'పతి'

- బెంగళూరు మహిళను వంచించి కోట్ల ఆస్తి కాజేసిన చిత్తూరువాసి

శివప్రసాద్

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: భార్యాపిల్లలు కరోనా సోకి మృతి చెందారని మాయమాటలతో ఓ మహిళను నమ్మించి పెళ్లి చేసుకుని వంచించి రూ.28 కోట్ల సొత్తు కాజేసి పరారయ్యాడొక మోసగాడు. బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజ్‌పేట్‌కు చెందిన నాగమణి (50)కి చాన్నాళ్ల క్రితం బెంగళూరుకు చెందిన వెంకటప్పరెడ్డితో పెళ్లయింది. కొద్దికాలం క్రితం వారి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ బెంగతో భర్త వెంకటప్పరెడ్డి అనారోగ్యంతో మరణించారు. కొన్నాళ్లకు ఆమె మరో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని మధ్యవర్తి మహిళను ఆశ్రయించారు. ఆ మహిళ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం శేషాపురానికి చెందిన శివప్రసాద్‌కు ఈ విషయాన్ని చెప్పింది. అప్పటికే అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. అయినా.. నాగమణి ఆస్తిపరురాలని తెలుసుకున్న శివప్రసాద్ పథకం పన్నాడు. తన భార్య, కుమార్తె కొవిడ్‌తో మరణించారంటూ నకిలీ మరణ ధ్రువపత్రాలు తయారు చేసి నాగమణికి చూపాడు. నాగమణి వాటిని నమ్మడంతో 2022లో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు.

డబ్బొస్తుందని ఆశజూపి..: ఆమె ఆస్తిపై కన్నేసిన శివప్రసాద్ ఆర్‌బీఐ నుంచి కోట్లలో సొమ్ము రానుందని చెబుతూ కొన్ని నకిలీ పత్రాలు సృష్టించి, ఆ నగదు దక్కాలంటే కొంతసొమ్ము ఆర్‌బీఐకి చెల్లించాలని నమ్మించాడు. భర్తే కదా అని ఆమె నమ్మడంతో తన తండ్రి, సోదరుడు, వదినల ఖాతాల్లోకి ఆమె నుంచి సొమ్ము బదలాయించుకున్నాడు. అప్పటికే నాగమణి సంతకాలు ఫోర్జరీ చేసిన శివప్రసాద్ బెంగళూరులో మొదటి భర్త నుంచి ఆమెకు సంక్రమించిన రూ.15 కోట్ల విలువైన భూమిని, రూ.10 కోట్ల విలువైన భవనాన్ని అమ్మేశాడు. ఆమె ఆభరణాలను కూడా బ్యాంకుల్లో తనఖా పెట్టాడు. బంధువుల పెళ్లికి వెళ్లాల్సి ఉందని, ఆభరణాలు కావాలని నాగమణి కోరగా అప్పటి నుంచి అతడు పరారయ్యాడు. భర్తను వెతుక్కుంటూ ఆమె బంగారుపాళ్యానికి రాగా.. అప్పటికే అతనికి భార్య, కూతురు ఉన్న తెలిసింది. దీంతో బాధితురాలు ఎస్పీ మణికంఠను ఆశ్రయించి న్యాయం చేయాలని విన్నవించారు.

మాలిలో కిడ్నాపర్ల చెర నుంచి మా బిడ్డను కాపాడండి

అమరలింగేశ్వరరావు తల్లిదండ్రుల వేడుకోలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: 'అమ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది? మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ చేశారు కదా.. ఇప్పుడు బాగానే నడవగలుగుతున్నావా?' అని చివరిసారిగా తన కుమారుడు అమరలింగేశ్వరరావు అన్న మాటలను గుర్తు చేసుకుని ఆ తల్లి కుమిలిపోతున్నారు. ఉపాధి కోసం ఆఫ్రికాలోని మాలి దేశం వెళ్లిన పల్నాడు జిల్లా మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన అమరలింగేశ్వరరావును వారం రోజుల క్రితం ఉగ్రవాదులు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. రోజులు గడుస్తున్నా ఆచూకీ లేకపోవడంతో అతని తల్లిదండ్రులు వెంకటరమణ, రాజ్యలక్ష్మి, భార్య, ముగ్గురు పిల్లలు ఆందోళన చెందుతున్నారు. ఆయన తల్లిదండ్రులను పలకరించగా.. 'అమరలింగేశ్వరరావు గ్రామంలో పదో తరగతి చదివాక మాచర్లలో ఐటీఐ పూర్తి చేశాడు. తర్వాత నల్గొండలో సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగం వచ్చింది. పెళ్లై ముగ్గురు పిల్లలు పుట్టాక కుటుంబ పోషణ కష్టమైంది. మరోవైపు ఫ్యాక్టరీలో పనిచేసే స్నేహితుడి ద్వారా మాలిలో ఉద్యోగం ఉందంటే దరఖాస్తు చేసి వెళ్లాడు. ఇప్పటికి 11 ఏళ్లు అయ్యింది. ఏటా ఒకసారి వచ్చి వెళ్తాడు. ఈసారి రెండు నెలల్లో వస్తానని మాతో అన్నాడు' అని తల్లి రాజ్యలక్ష్మి తెలిపింది. చివరిసారి జులై 1న ఫోన్‌లో తాము మాట్లాడామని, తర్వాత కిడ్నాప్ విషయం తెలిసిందని తల్లిదండ్రులు చెప్పారు. ఉగ్రవాదుల చెర నుంచి తమ కుమారుడిని విడిపించి క్షేమంగా ఇక్కడికి వచ్చేలా చూడాలని వారు వేడుకుంటున్నారు.

త్వరలోనే ధాన్యం రైతుల బకాయిలు చెల్లింపు

ఏపీమార్క్‌ఫెడ్ ఎండీ ఢిల్లీరావు

ఈనాడు, అమరావతి: ధాన్యం రైతుల బకాయిలను (ఖరీఫ్ 2024-25 పంట కాలానికి) త్వరలో చెల్లించనున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ ఢిల్లీరావు తెలిపారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి రూ.1,000 కోట్ల రుణం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4న అనుమతించిదన్నారు. మూడు రోజుల్లో ఆ మొత్తం మార్క్‌ఫెడ్‌కు బదిలీ అవనుందన్నారు. రుణం బదిలీ అయిన వెంటనే రైతుల బకాయిలు చెల్లిస్తామని తెలిపారు.

మద్యం సిండికేట్ పెత్తనం

ఈనాడు–విశాఖపట్నం: నగరంలో మద్యం దుకాణాలు ఏర్పాటైనప్పటి నుంచి ఓ సిండికేట్ పెత్తనం చేస్తోంది. ఓ ప్రజాప్రతినిధి అండతో పోలీసులను గుప్పిట్లో పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఓ మద్యం దుకాణ స్థల మార్పిడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుసుం చెల్లించినా అడ్డంకులు సృష్టించారు. దీంతో వ్యాపారులు పోలీసులను ఆశ్రయించగా.. అక్కడా సిండికేట్ మాటే నడుస్తున్నట్లు చెబుతున్నారు. ★ టెండర్లలో ఒకరికి ప్రభుత్వ మద్యం దుకాణం దక్కగా కొన్ని నెలలుగా సత్యం జంక్షన్‌లో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగస్వాములైన వ్యాపారులు రూ.85 వేలు రుసుములు చెల్లించి దుకాణం వేరే చోటుకు మార్పు చేయాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎక్సైజ్ శాఖ ఒప్పుకోవడంతో పది రోజుల క్రితం వన్‌టౌన్ లక్ష్మీటాకీస్ సమీప వీధిలో పెట్టేందుకు స్థలం చూసుకున్నారు. అక్కడ దుకాణం ప్రారంభించగానే సిండికేట్ రంగంలోకి దిగింది. పెద్ద సంఖ్యలో మూకను అక్కడికి పంపగా..వారంతా దుకాణానికి తాళాలు వేసి హడావుడి చేశారు. దీంతో దుకాణం అక్కడి నుంచి వేరేచోటుకు మార్చేందుకు ఎక్సైజ్ శాఖకు మరోసారి నగదు చెల్లించి కురుపాం మార్కెట్ ప్రధాన రహదారిలో ఈ నెల 3న ప్రారంభించారు. అప్పటి నుంచి అక్కడ ఉదయం దుకాణం తెరిసినా...సాయంత్రం కాగానే సిండికేట్ అనుకూల వ్యక్తులు వచ్చి తాళాలు వేయడం జరుగుతోంది. సిండికేట్‌కు సంబంధించిన దుకాణాల దగ్గర వేరే దుకాణం రాకుండా చక్రం తిప్పుతున్నారు. దీనిపై వ్యాపారులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా...వారు వచ్చి పరిశీలించి వెళ్లిపోయారు. కేవలం ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు.

సీఏ ఇంటర్ ఫలితాల్లో సత్తా

శరత్‌చంద్ర

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: సింహాచలం ప్రాంతానికి విద్యార్థి జె.శరత్‌చంద్ర సీఏ ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటాడు. మొత్తం 461 మార్కులు సాధించి ఆలిండియాలో 29వ ర్యాంకు సాధించాడు. తండ్రి రాజశేఖర్ ఓ ప్రైవేటు సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. తల్లి సుధారాణి గృహిణి. 'సీఏలో కీలకమైన ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపాలని నిర్ణయించుకున్నా. ప్రారంభం నుంచి చదువే లోకంగా సాగా. కళాశాల సమయాల్లో కాకుండా ప్రతిరోజు తెల్లవారుజామున 4 గంటలకు నిద్రలేచి ఉదయం 7గంటల వరకు చదివేవాడ్ని. మళ్లీ రాత్రి 8 నుంచి 11 గంటల వరకు సాధన చేసేవాడ్ని. సీఏ కావడమే లక్ష్యమ'ని శరత్‌చంద్ర తెలిపాడు.

జాతీయ యువజనోత్సవాల్లో ప్రతిభ

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నిర్వహించిన జాతీయ యువజన సాంస్కృతిక కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. రాష్ట్రం తరఫున కళాశాల విద్యార్థినులు జి.కుశాంక, భావనందిత పాల్గొన్నారని ప్రిన్సిపల్ సిస్టర్ షైజీ తెలిపారు. రాజస్థాన్‌లోని నాగౌర్‌లో జూన్ 23 నుంచి జులై 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతిపై కళాశాల విద్యార్థినులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారన్నారు. నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారని చెప్పారు. అధ్యాపకురాలు కె.మాణిక్యకుమారి పాల్గొన్నారు.

విద్యార్థినితో కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైజీ

వైభవంగా జగన్నాథుడి తిరుగు రథయాత్ర

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరం టర్నర్‌చౌల్ట్రీలోని జగన్నాథస్వామి తిరుగు రథయాత్రను సోమవారం వైభవంగా నిర్వహించారు. గత నెల 27 నుంచి జగన్నాథుడు రోజుకో అవతారంలో పదిరోజుల పాటు భక్తులకు దర్శనమిచ్చారు. దశావతారాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయంలోని రథాన్ని పూలతో అలంకరించి ఉదయం 9.30 గంటలకు సుభద్ర, బలభద్ర, జగన్నాథుడిని రథంపై ఆశీనులు చేశారు. సాయంత్రం వరకు స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం 5 గంటల సమయంలో భక్తుల కోలాహలం మధ్య ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి రథయాత్రను ప్రారంభించారు. సూపర్‌బజార్, పూర్ణామార్కెట్ మీదుగా టౌన్ కొత్తరోడ్డు వద్దనున్న ఆలయానికి సాయంత్రం 6.30 గంటల సమయంలో చేరుకుంది. ప్రధాన అర్చకులు జగన్నాథాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను ఆలయంలోని యథాస్థానంలో ఆశీనులు చేశారు. దేవాదాయ శాఖ ఏసీ అన్నపూర్ణ, ఆలయ ఈఓ టి.రాజగోపాల్‌రెడ్డి, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు రథయాత్రలో పాల్గొన్నారు. పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. పాతనగరంలో ఉన్నయంబర్ మన్నార్, సీతారామస్వామి ఆలయాలకు చెందిన రథాలు జగన్నాథుడి రథాన్ని అనుసరించాయి.

తిరుగు రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు

ఆలయం వద్దకు చేరుకున్న స్వామివారి రథం

కలెక్టరేట్‌లో నిరసనల హోరు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కలెక్టరేట్ వద్ద వివిధ సంఘాల ప్రతినిధులు సోమవారం నిరసనలు తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ఘటనకు సంబంధించి 200 మంది బాధితులకు ఇంతవరకు పరిహారం అందలేదని, గత అయిదేళ్లుగా ఎన్నిసార్లు వినతులు అందజేసినా ఫలితం కనిపించలేదని బాధితులు వాపోయారు. వీరంతా కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. న్యాయం చేయాలని లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

సీఆర్‌పీల సమస్యలు పరిష్కరించాలని: ఏళ్ల తరబడి విద్యాశాఖలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు(సీఆర్‌పీ) పని చేస్తున్నామని, తమ సమస్యలను మాత్రం ప్రభుత్వం పరిష్కరించడం లేదని సీఆర్‌పీ ఫెడరేషన్ జిల్లా ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని, సీఆర్‌పీల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, మెగా డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలని కోరారు. ★ ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవలు, అద్దె బస్సుల కాల్ ఆన్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎస్ఆర్టీసీ ఒప్పంద కార్మికుల యూనియన్ కోరింది. కార్మిక శాఖ జారీ చేసే సర్క్యులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, మద్దిలపాలెం డిపోలో తొలగించిన కంప్యూటర్ ఆపరేటర్లకు 9 నెలలుగా బకాయి పడ్డ వేతనాలు ఇవ్వలేదని, ఆరు నెలలకు ఒకసారి జనరల్ బస్సు పాసు ఇవ్వాలని తదితర 13 డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను కలెక్టర్‌కు అందజేసినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్ తెలిపారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎల్జీ పాలిమర్స్ బాధితులు

గంజాయి కేసులో జైలు, జరిమానా

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు పదేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2లక్షలు చొప్పున జరిమానా చెల్లించాలని మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో నిందితులు అదనంగా మరో ఆరునెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని ఆదేశించారు. దీనికి సంబంధించి నాతవరం పోలీసులు అందించిన కేసు వివరాలిలా.. మధురవాడ ప్రాంతానికి చెందిన షేక్ మస్తాన్‌వలి, గులిమి మల్లేశ్వరరావు స్నేహితులు. 2016వ సంవత్సరం మే 13వ తేదీన నాతవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెదురుపల్లి కూడలి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వీరిద్దరూ తమ ఆటోలో అక్రమంగా రవాణా చేస్తున్న 60కిలోల గంజాయి బస్తాలను స్వాధీనపర్చుకున్నారు. తర్వాత వారిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి.. నేరం రుజువు కావడంతో నిందితులకు పైవిధంగా శిక్ష విధించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాఫిక్ వ్యవస్థలో సమూల మార్పులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ట్రాఫిక్ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. బీచ్‌రోడ్డు కాళీమాత ఆలయం వద్ద సోమవారం ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లు, ద్విచక్ర వాహనాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులకు సౌకర్యాలు కల్పిస్తే మరింత సమర్థమంతంగా పనిచేస్తారన్నారు. ఇటీవల ఏఐ ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థపై ఎంపీ శ్రీభరత్ అధ్యక్షతన కలెక్టరేట్లో జరిగిన సదస్సులో ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సంస్థ ప్రతినిధులు ప్రజెంటేషన్ ఇచ్చారన్నారు. ఎండలో పనిచేసే ట్రాఫిక్ పోలీసుల కోసం విశాఖ పోర్టు, సౌత్ ఏసియా ఎల్.పి.జి. కంపెనీలు 200 ఏసీ హెల్మెట్లు వితరణగా ఇచ్చాయన్నారు. వీటి విలువ రూ.46 లక్షలని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ సందర్భంగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం 64 ద్విచక్ర వాహనాలను మంజూరు చేసిందన్నారు. విశాఖ పోర్టు రూ.17లక్షల విలువైన అధునాతన డ్రోన్లను పోలీసు శాఖకు అందజేసిందన్నారు. హెచ్.పి.సి.ఎల్. యాజమాన్యం సీఎస్ఆర్ కింద రూ.15.60లక్షల విలువైన రెండు కంపాక్టర్లు విశాఖ సిటీ పోలీసులకు అందజేసిందన్నారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పించే దిశగా ముందుకెళ్తామన్నారు. నైట్ విజన్ డ్రోన్లు ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డుప్రమాదాల నివారణకు ఉపయోగిస్తామని చెప్పారు.

ద్విచక్ర వాహనాలకు పచ్చజెండా ఊపుతున్న మంత్రి అనిత... చిత్రంలో సీపీ శంఖబ్రత బాగ్చీ

రాష్ట్ర ప్రగతికి కట్టుబడి పనిచేస్తున్నాం: మంత్రి

మాడుగుల, న్యూస్‌టుడే : ప్రపంచంలోనే ప్రత్యేకమైన రాజధానిగా అమరావతిని నిర్మించడమే లక్ష్యం కాగా, 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి నీటిని విడుదల చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం మాడుగుల వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రగతికి కట్టుబడి పని చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజల్లో చెడ్డ చేయడానికి జగన్ ఎత్తుగడలు వేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 6లక్షల ఇళ్లను నిర్మించాలన్నది లక్ష్యం కాగా, రూ. 3,300 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రహదారుల కష్టాలు లేకుండా కొత్తగా రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థ సారథి.. చిత్రంలో బండారు సత్యనారాయణ, కోన తాతారావు

గిరి ప్రదక్షిణను విజయవంతం చేయాలి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగే గిరి ప్రదక్షిణను విజయవంతం చేయాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. సోమవారం నగరపోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, దేవస్థానం ఈఓ త్రినాథరావు తదితర అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉత్తరాంధ్రతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్ఠ భద్రత చేపట్టాలన్నారు. కొండపైన, దిగువన బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇరుకైన రోడ్లలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీసీపీలు అజితవేరి, ప్రశాంతి, ఏడీసీపీలు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

యాంటీ డ్రోన్ సాంకేతికత అమలుకు ఒప్పందం

సింధియా, న్యూస్‌టుడే: తీరప్రాంత భద్రతలో భాగంగా యుద్ధనౌకలకు అవసరమయ్యే యాంటీ డ్రోన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ విధానాన్ని అమలుకు హిందుస్థాన్ షిప్‌యార్డు యాజమాన్యం పెంటగాన్ రగ్గడ్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్‌తో ఎంవోయూ కుదుర్చుకుందని సోమవారం సంస్థ వర్గాలు తెలిపాయి. యుద్ధనౌకల నిర్మాణంలో డ్రోన్‌లను వేగంగా పసిగట్టే సాంకేతికత అమలుకు ఈ ఒప్పందం దోహదం చేయనుందన్నారు. ఈ ఎంవోయూ పత్రాలను షిప్‌యార్డు సీఎండీ కమొడోర్ హేమంత్ ఖత్రీ, పెంటగాన్ సిస్టమ్స్ సంస్థ ఎండీ డాక్టర్ స్వామినాథన్‌లు పరస్పరం ఇచ్చిపుచ్చుకున్నట్లు వివరించాయి.


ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న షిప్‌యార్డు, పీఆర్ఎస్ అధికారులు హేమంత్‌ఖత్రీ, డాక్టర్ స్వామినాథన్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఆర్పీలపై ఉందని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్‌గార్గ్, పీడీ పీఎం సత్యవేణిలతో కలిసి ఆయన ఆర్పీ (రిసోర్స్ పర్సన్)లకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే ఆర్పీలను తొలగిస్తారని వైకాపా నాయకులు అప్పట్లో ప్రచారం చేశారని, కూటమి ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి చర్యలకు పాల్పడబోదని పేర్కొన్నారు. కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ జీవీఎంసీలో 1048 మంది ఆర్పీలు పనిచేస్తున్నారని, వారందరికీ పంపిణీ చేసేందుకు మెప్మా, జీవీఎంసీ సంయుక్తంగా రూ.3.93 కోట్ల వ్యయంతో ట్యాబ్‌లు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో ప్రభుత్వ పథకాలు సకాలంలో అర్హులందరికీ అందేలా చూడాలని ఆయన కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్: జురాసిక్ వరల్డ్- రీబర్త్
రాములమ్మ: మార్గాన్
డ్రాగన్, తాతా : కుబేర
సప్తగిరి : తమ్ముడు

నేడు ఉచిత వైద్య శిబిరం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలికి చెందిన కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఫౌండేషన్ కార్యాలయంలో నియో విజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా కంటి, చర్మ సంబంధిత పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8.30 నుంచి ఒంటిగంట వరకు జరిగే శిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు.

బీఎల్‌వోలకు శిక్షణ

శిక్షణాంశాలు వివరిస్తున్న ఆర్డీవో సంగీత్‌మాధుర్

పద్మనాభం, న్యూస్‌టుడే: ఓటరు జాబితా, పోలింగ్ బూత్‌ల స్వచ్ఛీకరణ ధ్యేయంగా బీఎల్‌వోలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. భీమునిపట్నం ఆర్డీవో సంగీత్‌మాధుర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యంగా ఫారం-6, ఫారం-7, ఫారం-8, ఫారం-8ఎల గురించి వివరించారు. తహసీల్దార్ కె.ఆనందరావు, ఆర్.ఐ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: శ్రీరామ్‌ప్రాపర్టీస్ నుంచి మధురవాడ వెళ్తున్న దారిలో విద్యుద్దీపాలు వెలగడం లేదు. – దాస్, మధురవాడ

✓: విద్యుద్దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – గాయత్రీ, విద్యుత్ ఏఈ

?: తులసీనగర్ (మధురవాడ) అశోక్‌నగర్ కొండవాలు ప్రాంతాల్లో వారం రోజులుగా విద్యుద్దీపాలు వెలగడం లేదు. – తులసీనగర్ వాసులు, ✓: విద్యుద్దీపాలకు మరమ్మతులు చేపడతాం. – గాయత్రీ, విద్యుత్ ఏఈ

?: మారికవలస రాజీవ్ స్వగృహ సముదాయాల్లో బ్లాక్ నంబరు 91, 92, 93లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. – మారికవలస వాసులు, ✓: శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: పీఎంపాలెం క్రికెట్ మైదానం ఎదురుగా ఎస్‌బీఐ రోడ్డులో భూగర్భ విద్యుత్ తీగల కోసం గోతులు తవ్వి వదిలేశారు. – కాలనీ వాసులు, ✓: క్షేత్రస్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. – హేమ, విద్యుత్ ఏఈ

?: రాజీవ్‌నగర్ (ఎండాడ) కొండవాలు ప్రాంతాల కాలువల్లో పూడిక పేరుకుపోయింది. – కాలనీవాసులు, ✓: కాలువల్లో పూడికలు తొలగిస్తాం. – రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: రుషికొండ నుంచి ఎండాడ జాతీయ రహదారిలో రాత్రివేళ వీధి కుక్కల సంచారం తీవ్రంగా ఉంది. – రుషికొండ వాసులు ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. – కిశోర్, ఆరోగ్య అధికారి

స్పందనకు వందనం

తీగలను సరి చేశారు

ఎండాడ, న్యూస్‌టుడే: తగరపువలస కూడలిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతూ ఉన్నాయని 'ఈనాడు' 'మేమున్నాం...మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ ఏఈ రవి తమ సిబ్బందితో వేలాడుతున్న తీగలను సరిచేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుంతను పూడ్చారు

కొమ్మాది, న్యూస్‌టుడే: మారికవలస కూడలిలో 'సేవారోడ్డులో' ప్రమాదకరంగా గుంత ఉండటంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని ఆదివారం 'ఈనాడు'లో 'రోడ్డు చెంత.. ప్రమాదపు గుంత' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో జీవీఎంసీ అధికారులు స్పందించారు. జెడ్సీ కె.కనకమహాలక్ష్మి ఆదేశాల మేరకు ఏఈ శ్రీనివాస్ సోమవారం గుంతను జేసీబీతో పూడ్చి వేయించారు.

వసతిలో చేరదాం.. విద్యలో ముందుకెళ్దాం!

భీమునిపట్నం, న్యూస్‌టుడే

భీమిలి నియోజకవర్గంలో ఉన్న తొమ్మిది బీసీ బాలబాలికల వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇందులో 4 నుంచి 10వ తరగతుల ప్రవేశాలకు ఏడు ప్రీమెట్రిక్ హాస్టళ్లు.. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఇంజినీరింగ్ వంటి కోర్సుల విద్యార్థినీ విద్యార్థులకు రెండు పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్తు, ఎయిడెడ్ పాఠశాలల్లో సీట్లు పొందిన బీసీ విద్యార్థులు ఇక్కడి ప్రీమెట్రిక్ హాస్టళ్లలో ఆశ్రయం పొందుతూ తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు అన్నివిధాలుగా ప్రోత్సహిస్తారు.

భీమిలి బీసీ బాలికల పోస్ట్‌మెట్రిక్ కళాశాల హాస్టల్

■ వసతి పేరు.. భర్తీ చేయాల్సిన ఖాళీలు: భీమునిపట్నం మండలంలో బాలికల సమీకృత హాస్టల్ (బీచ్‌రోడ్డు)-150, బాలికల హాస్టల్-2 (కృష్ణాకాలనీ)-43, బాలుర వసతి (భీమిలి)-20, బాలుర హాస్టల్ (చేపలుప్పాడ)-30, బాలుర కళాశాల హాస్టల్-17, బాలికల కళాశాల వసతి-17... ఆనందపురం మండలంలో బాలుర హాస్టల్ (ఆనందపురం)-లేవు, పద్మనాభం మండలంలో బాలికల వసతి (అనంతవరం)-30, బాలుర వసతి (పద్మనాభం)-50

■ రిజర్వేషన్ ఇలా..: మొత్తం సీట్లలో బీసీలకు 76 శాతం ■ ఎస్సీలకు 10 శాతం ■ ఈబీసీలకు 6 శాతం ■ ఎస్టీలకు 5 శాతం ■ మైనార్టీలకు 3 శాతం కేటాయిస్తారు. ■ కల్పిస్తున్న వసతులు: 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ■ దుప్పట్లు, మంచాలు, ఫ్యాన్లతో సదుపాయం ■ పాఠశాలల్లో ఏకరూప దుస్తులు, పుస్తకాలు ఇస్తారు. ■ బాలబాలికలకు నెలవారీ కాస్మోటిక్స్ ఛార్జీలు ■ దూరపు తల్లిదండ్రులను కలిసేందుకు నెలకోసారి అనుమతి

■ ఈనెల 31లోగా దరఖాస్తు చేయాలి: బీసీ హాస్టళ్లలో ప్రవేశం పొంది ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు అన్నింటా రాణించేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో గతేడాది నియోజకవర్గ బీసీ హాస్టళ్లలో పదో తరగతిలో 92 శాతం ఉత్తీర్ణత లభించింది. సీట్లు కావాల్సిన వారు ఈనెల 31లోగా హాస్టల్ సంక్షేమాధికారులకు దరఖాస్తులు చేసుకోవాలి.
– కె.కృష్ణారావు, సహాయ బీసీ సంక్షేమాధికారి, భీమునిపట్నం డివిజన్

క్షయ రహిత సమాజమే లక్ష్యం

మధురవాడ, న్యూస్‌టుడే: క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించడంతో పాటు సకాలంలో మెరుగైన చికిత్స అందించి నివారణకు కృషి చేస్తున్నామని జిల్లా క్షయ, కుష్ఠు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ పేర్కొన్నారు. జాతీయ క్షయ వ్యాధి నివారణలో భాగంగా 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' పేరుతో మధురవాడ, కొమ్మాది ప్రాంతాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో ఆయన పాల్గొన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. సుమారు 50 మంది నుంచి కఫం శాంపిల్స్‌ను సేకరించారు. కార్యక్రమంలో భాగంగా మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి వైద్యులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారిణి దీపికాదేవి, ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం, సురేష్, అనూష, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: క్షయ రహిత సమాజమే లక్ష్యంగా పీఎం టీబీ ముక్త భారత్ అభియాన్ లక్ష్యమని తగరపువలస పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కొప్పల సుస్మిత అన్నారు. తగరపువలస రాజవీధి గాంధీబొమ్మ కూడలిలో ఉచిత క్షయ నివారణ వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 260 మందికి పరీక్షలు చేశారు. క్షయ నివారణ విభాగం సూపర్‌వైజర్ చక్రవర్తి, హెల్త్ విజిటర్లు పద్మజారాణి, వై.హరి, తెదేపా వార్డు అధ్యక్షుడు తమ్మిన సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రేష్ఠకు ఉమెన్ అచీవర్ అవార్డు

మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడకు చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి కొప్పాక శ్రీశ్రేష్ఠ ప్రతిష్ఠాత్మక 'సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు-2025' (ఎస్ఐడబ్ల్యూఏఏ)ను అందుకున్నారు. రెండు రోజుల క్రితం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఏటా నిర్వహించే జాతీయ స్థాయి వేడుకలో రాష్ట్రాల నుంచి వివిధ రంగాల్లో రాణించే వారిని ఎంపిక చేసి ఈ అవార్డులు అందజేస్తారు. ఏపీ నుంచి నలుగురు ఎంపిక కాగా కూచిపూడి నృత్య ప్రదర్శనకు శ్రీశ్రేష్ఠకు అవార్డు దక్కింది. ఆమె ఇప్పటి వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో పలు వేదికలపై సుమారు 400కు పైగా ప్రదర్శనలిచ్చారు. గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌తో పాటు ప్రైడ్ భరత్, సత్యభామ బాల పురస్కార్, లాస్య మయూరి, నర్తనబాల-24, నాట్య కళా నంది తదితర అవార్డులు సొంతం చేసుకున్నారు.

అవార్డు అందుకుంటున్న శ్రీశ్రేష్ఠ

సమ్మెను జయప్రదం చేయండి

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: జాతీయ పారిశ్రామిక సమ్మె సందర్భంగా ఈనెల 9న తగరపువలస, చిట్టివలస, భీమిలి ప్రాంతాల్లో నిర్వహించే బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి కాసారపు రాంబాబు, చిట్టివలస ప్రాంత పింఛనుదారుల సంఘం ప్రధాన కార్యదర్శి దాకా రవి బాబ్జి పిలుపునిచ్చారు. తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లోని ఏఐటీయూసీ, పింఛనుదారుల సంఘం కార్యాలయాల్లో సోమవారం వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో వీరు మాట్లాడారు. నాయకులు కొండపు ఈశ్వరరావు, పంపాన సూర్యనారాయణ, మోర అప్పలరాజు, చిల్ల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశమైన నాయకులు

జలవనరుల ఏఈఈల సంఘం ఎన్నిక

అధ్యక్షులు బి.విజయ్‌కుమార్

ప్రధానకార్యదర్శి ఆర్.విజయ్‌కుమార్

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ (ఏఈఈ) అధికారుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సంబంధిత కార్యాలయంలో సోమవారం జరిగింది. జిల్లా శాఖ నూతన అధ్యక్షులుగా బాదాన విజయ్‌కుమార్ (విశాఖ), ప్రధాన కార్యదర్శి రఘుపతుల విజయ్ కుమార్ (భీమిలి), అసోసియేట్ అధ్యక్షునిగా కోరాడ షైనీనాయుడు, ఉపాధ్యక్షులుగా ఆకుల ప్రకాష్ (చోడవరం), మలయాల శ్రీరామ కపిల్ (ఎస్ఎల్), కోశాధికారిగా నివగాని రావు (విశాఖ), సహాయ కార్యదర్శులుగా ముడికి రాంజీ, ఎ.రాజేశ్, అక్షర భాను అమీనా, వీవీకే సాయిలక్ష్మి ఎన్నికయ్యారు. మూడు జిల్లాలు, పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారులంతా ఈ ఎన్నికలకు హాజరయ్యారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలు పోలవరం ప్రాజెక్టు అసిస్టెంట్ కార్యనిర్వాహక ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, నాయకులు అల్లాడ అప్పారావు 26వ వర్ధంతి సందర్భంగా సోమవారం నగరంపాలెం రోడ్డులో 200 మంది మహిళలకు చీరలు, వృద్ధులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. పలు వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి సైతం పండ్లు, రొట్టెలు అందించారు. కార్యక్రమంలో అల్లాడ ఉమామహేశ్వరరావు, ఎ.వెంకట్రావు, సూర్యారావు, అల్లాడ లింగేశ్వరరావు, జనసేన నాయకులు నక్కా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు అందజేస్తున్న అప్పారావు కుటుంబ సభ్యులు

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 పరిధిలో 5, 6, 7, 8 వార్డుల్లో మంగళవారం తాగు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జెడ్సీ కె.కనకమహాలక్ష్మి తెలిపారు. గోస్తని హెడ్ వాటర్‌వర్క్స్ నుంచి తాగునీరు పంపింగ్ చేయు ప్రధాన పైపులైన్‌కు మారికవలస గ్రామం వద్ద మరమ్మతులు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో 5వ వార్డులో బోయపాలెం హౌసింగ్ కాలనీ, పరదేశిపాలెం, బోరవాని పాలెం, సాయిరాంకాలనీ, మారికవలస రాజీవ్‌గృహకల్ప, వైఎస్ఆర్‌నగర్, శారదానగర్, శివశక్తినగర్.. 6వ వార్డులో కొమ్మాది గ్రామం, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, రిక్షాకాలనీ, వైభవ్‌నగర్, పీఎంపాలెం, కే-1, కే-2, కే-3, ఎం-1 హౌసింగ్‌కాలనీ.. 7వ వార్డులో వాంబేకాలనీ, చంద్రంపాలెం, కళానగర్, కృష్ణనగర్, ఎన్‌జీవోఎస్‌కాలనీ, స్వతంత్రనగర్, గణేష్‌నగర్, మిధిలాపురి వుడాకాలనీ, పాతమధురవాడ, పిలకవానిపాలెం.. 8వ వార్డులో రెవెన్యూ లే-అవుట్, షిప్‌యార్డ్‌కాలనీ, బింద్రానగర్ తదితర కాలనీలకు తాగునీరు రాదన్నారు. ప్రత్యామ్నాయంగా మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని జెడ్సీ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

ఐబీడీపీ ఫలితాల్లో ఓక్రిడ్జ్ విద్యార్థి ప్రతిభ

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస ప్రాంతంలోని సింగనబంద ఓక్రిడ్జ్ పాఠశాల విద్యార్థి రుత్విక్ సోమవారం వెలువడిన ఐబీడీపీ ఫలితాల్లో ప్రతిభ చూపారు. మొత్తం 45కి 41 మార్కులను సాధించారు. పాఠశాల ప్రిన్సిపల్ శైలా, తదితరులు రుత్విక్‌ను అభినందించారు.

పీజీఆర్ఎస్‌లో వినతుల స్వీకరణ

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జెడ్సీ కె.కనకమహాలక్ష్మి 26 వినతులను స్వీకరించారు. కొమ్మాది పీఎం హౌసింగ్ బోర్డుకాలనీ ఏర్పడి దశాబ్దాలు అవుతున్నా నేటికీ రహదారులు, కాలువలు అభివృద్ధి చేయలేదని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని పౌరసంక్షేమ సంఘం అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాష్ బృందం కోరింది. రేవళ్లపాలెంలో ఎస్‌సీ టవర్స్ సమీపంలో అనధికారికంగా వాటర్‌ప్లాంట్లు నిర్వహిస్తున్నారని, భూగర్భజలాలు పడిపోతున్నాయని స్థానికులు తెలిపారు. వాంబేకాలనీ సమీపంలో మొగదారమ్మ కాలనీలో వెలసిన వీధిదీపాలు, గాయత్రీనగర్‌లో పగిలిన మంచినీటి ట్యాంకుల స్థానే కొత్తవి ఏర్పాటు చేయాలని మహిళలు కోరారు. పీఎంపాలెం హెచ్‌బీ కాలనీలో రామాలయం వెనుక ఉన్న గృహాల్లో మ్యాన్‌హోల్స్ తొలగించాలని విన్నవించారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి జోనల్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆరు వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి మూడు, యూసీడీ విభాగానికి రెండు, పట్టణ ప్రణాళిక విభాగానికి ఒకటి చొప్పున అందాయి. వీటిని పరిష్కరించేందుకు నిమిత్తం ఆయా విభాగాలకు బదలాయించామని జెడ్సీ వి.అయ్యప్పనాయుడు పేర్కొన్నారు.

జెడ్సీకి వినతిపత్రం అందిస్తున్న పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం, న్యూస్‌టుడే: రేవిడి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కోరాడ 11కేవీ ఫీడర్‌లో మంగళవారం విద్యుత్ సరఫరా అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జగన్మోహన రావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కోరాడ, బొత్సపేట, లింగన్నపేట, బొత్సపేట, అయినాడ, సుంకరపేట, భీమిలి మండలం మజ్జిపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయునున్నట్లు పేర్కొన్నారు.

పగిలిన పైపులు.. వృథాగా పోతున్న నీరు

ఆనందపురం, న్యూస్‌టుడే: బోని గోస్తనీ నది నుంచి విశాఖ నగరానికి మంచినీటి సరఫరా చేస్తున్న ఆనందపురం పరిధి లొడగలవానిపాలెం కాలనీ వద్ద జీవీఎంసీ వేసిన గొట్టాలకు లీకేజీ ఏర్పడింది. దీంతో నిరంతరం నీరు వృథాగా పోతోంది. మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఫలితంగా కింద కాలనీలోకి నీరు చేరడంతో అక్కడి మట్టి రోడ్డు బురదమయంగా మారింది. ఇప్పటికైనా నీటి వృథాను అరికట్టాలని ప్రాంతీయులు కోరుతున్నారు.

లొడగలవానిపాలెం కాలనీ వద్ద బురదమయంగా మారిన రోడ్డు

రాష్ట్రంలో జనరంజక పాలన

వాంబే కాలనీలో...

పీఎంపాలెం, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోందని పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ అన్నారు. ఆరోవార్డు గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో సోమవారం నాయకులు, కార్యకర్తలు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు అందించారు. బీసీసెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, పెంటకోట బబ్బేలు, పోతిన రఘు, ఎన్.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: సుపరిపాలన- తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా భీమిలి తోటవీధిలో తెదేపా నాయకులు పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న జనరంజకపాలన గురించి వివరించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు చురకల రమణ, వియ్యపు పోతురాజు, వాసుపల్లి వంశీ, మారోజు సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

మధురవాడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సంక్షేమ పథకాల విప్లవం మొదలైందని తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం నిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకట్రావు అన్నారు. మధురవాడ వాంబే కాలనీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి దుర్గారావు, నాయకులు కె.అచ్యుతరావు, నాగోతి సూర్యప్రకాష్, పిళ్లా రాము, పిళ్లా మోహన్‌శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పీఎంపాలెం గాయత్రీనగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

భీమిలి తోటవీధిలో...

ఔషధ రంగంలో అపార అవకాశాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఫార్మసీ విద్యను అభ్యసిస్తున్న వారికి క్లినికల్ రీసెర్చ్‌లోని ఉపాధి అవకాశాలపై గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా క్లీనోవీ రీసెర్చి ప్రైవేటు లిమిటెడ్ (పుణె) డైరెక్టర్ డాక్టర్ ఐ.రాధిక మాట్లాడారు. ఔషధ రంగంలో క్లినికల్ రీసెర్చ్‌కు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా ఫార్మసీ విద్యార్థులు నిరంతర అభ్యాసకులుగా కొత్త విషయాలను నేర్చుకోవాలన్నారు. భావప్రకటన సామర్థ్యం, పరిశోధనల పట్ల ఆసక్తి, ఎంపిక చేసుకున్న అంశాలపై లోతైన అవగాహన ద్వారా అంచెలంచెలుగా రాణించాలన్నారు. ఫార్మసీ పట్టభద్రులకు క్లినికల్ రీసెర్చ్ అసోసియేట్స్, కో-ఆర్డినేటర్, ఫార్మ కో-విజిలెన్స్ అసోసియేట్స్ వంటి విభాగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని గీతం సంబంధిత విభాగం ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ రాధికకు జ్ఞాపిక అందజేస్తున్న ఆచార్య శ్రీనివాస్

త్వరలో టీడీఆర్, పంచగ్రామాల సమస్యకు పరిష్కారం

అడివివరం, న్యూస్‌టుడే: ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం అధ్యక్షతన సోమవారం అడివివరంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. త్వరలోనే టీడీఆర్‌ల సమస్య, పంచగ్రామాల భూసమస్య పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. టీడీఆర్‌ల జారీపై ప్రభుత్వం వేసిన అయిదుగురు సభ్యుల కమిటీ నివేదిక రాగానే టీడీఆర్‌లు జారీ అవుతాయన్నారు. పంచగ్రామాల సమస్య పరిష్కారంలో భాగంగా తొలుత నిర్మాణాల క్రమబద్ధీకరణ జరుగుతుందన్నారు. దశల వారీగా ఖాళీ స్థలాలు, రైతుల భూములు, గ్రామకంఠం స్థలాల సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. తొలుత ఆయన కాపుదిబ్బ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో 98వ వార్డు తెదేపా అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నాయకులు గుసిడి శంకర్రావు, లండ శ్రీను, రౌతు రాంబాబు, బున్ని, అవినాశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

కాపుదిబ్బలో ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

కృష్ణమయ్య సంకీర్తనల జయంతి

సింహాచలం, న్యూస్‌టుడే: తొలి తెలుగు వచన సంకీర్తనా పితామహుడు శ్రీకాంత కృష్ణమాచార్యులు సింహాద్రినాథుడిపై రాసిన చాతుర్లక్ష సంకీర్తనల జయంతి సోమవారం అప్పన్న ఆలయంలో ఘనంగా జరిగింది. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు నేతృత్వంలో అర్చకులు ఆలయ బేడామండపంలోని కృష్ణమయ్య విగ్రహం వద్ద విశేష పూజలు, ఆరాధనలు నిర్వహించారు. కృష్ణమయ్య వచన సంకీర్తనలను గానం చేశారు. ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కృష్ణమయ్య విగ్రహం వద్ద ఆరాధనలు చేస్తున్న అర్చకులు

వ్యక్తిత్వ వికాస దీప్తి ఎన్‌సీసీ

కొమ్మాది, న్యూస్‌టుడే: ఎన్‌సీసీలో చేరిన విద్యార్థికి దేశం, సమాజం పట్ల తన బాధ్యతలు తెలుస్తాయని చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరావు పేర్కొన్నారు. పాఠశాలలో సోమవారం ఎన్‌సీసీలో చేరేందుకు ఎంపిక ప్రక్రియను చేపట్టారు. వివిధ అంశాల్లో పరీక్షలు నిర్వహించగా అందులో ప్రతిభ చూపిన 62 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు ఉన్నత చదువులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మానవ విలువలతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను ఆయనతో పాటు ఏఎన్‌వో బోని అప్పలనాయుడు, ఆర్మీ అధికారి శ్యామలరావు, హవల్దార్ మహేందర్, తదితరులు అభినందించారు.



ఎంపిక ప్రక్రియ చేపడుతున్న ఎన్‌సీసీ అధికారులు

విద్యార్థినికి అభినందన

భీమునిపట్నం , న్యూస్‌టుడే: భీమిలికి చెందిన విద్యార్థిని పల్లా నవోజ్ఞ పెన్సిల్ స్కెచ్‌తో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ చిత్రపటాన్ని గీసి అబ్బురపరిచింది. ఆ చిత్రాన్ని భాజపా నాయకులతో కలసి బాలిక సోమవారం విశాఖలో మాధవ్‌కు అందించింది. అనంతరం ఆమెను అభినందించారు. భాజపా జిల్లా వైద్య విభాగం కన్వీనరు రూపాకుల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ భక్తులకు సౌకర్యాలు కల్పించండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సింహగిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. వీరిద్దరూ సోమవారం రాత్రి వేర్వేరుగా గిరి ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తాగునీరు, మరుగుదొడ్లు ఎక్కువ ప్రాంతంలో అందుబాటులో ఉంచాలన్నారు. నడవడానికి అనుకూలంగా రహదారులను తీర్చిదిద్దాలన్నారు.

గిరి ప్రదక్షిణకు మెరైన్ పోలీసులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సింహాచలం నృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే గిరి ప్రదక్షిణకు రుషికొండలోని మెరైన్ పోలీసుస్టేషన్‌కు చెందిన 20 మంది పోలీసులు, స్థానిక బీచ్ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న గజ ఈతగాళ్లు 17 మంది జీవీఎంసీ లైఫ్‌గార్డుల్ని జిల్లా ప్రభుత్వ యంత్రాంగం నియమించింది.. సంబంధిత సముద్ర తీరంలో వీరు ఈ నెల 9, 10 తేదీల్లో సేవలందిస్తారు.

జాతీయ రహదారి మార్గం.. ప్రమాదభరితం

ఆనందపురం, న్యూస్‌టుడే: 16వ నంబరు జాతీయ రహదారి ఆనందపురం వద్ద అనుసంధాన రోడ్డు ప్రమాదకరంగా మారింది. వాహనాలు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఆనందపురం కూడలికి వెళ్లేందుకు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. మలుపు తిరిగే క్రమంలో అక్కడ ప్రమాదకర గుంతలు దర్శనమిస్తున్నాయి. ఏ మాత్రం ఆదమరిచి వెళ్లినా ప్రమాదం బారిన పడటం ఖాయమని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అదే ప్రాంతం నుంచి జాతీయ రహదారిలోకి ప్రవేశమార్గం కావడం, ఆనందపురం నుంచి తగరపువలస వెళ్లే సర్వీస్ రోడ్డు అక్కడే ప్రారంభమవుతుంది. దీంతో రోజూ అధిక సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఇటీవల వర్షాలకు మరింతగా రోడ్డు దెబ్బతినడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జాతీయ రహదారి నుంచి ఆనందపురం కూడలి వైపు వెళ్లే మార్గంలో గుంత

ఆక్రమణల తొలగింపు అడ్డగింత

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి జోన్ మామిడిపాలెంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవటానికి వచ్చిన రెవిన్యూ సిబ్బందిని ఆక్రమణదారులు అడ్డుకున్నారు. మామిడిపాలెంలో ఖాళీగా ఉన్న బంజరు భూమిలోని అయిదు సెంట్ల స్థలాన్ని కొంతమంది ఆక్రమించి షెడ్లు వేశారు. ఈ మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టరు శ్రీదేవి సోమవారం సిబ్బందితో అక్కడకు వెళ్లి పరిశీలించారు. అక్కడున్న ఆక్రమిత షెడ్లను జేసీబీతో తొలగించేందుకు ప్రయత్నించగా ఆక్రమణదారులు అడ్డుకోవడంతో రెవెన్యూ సిబ్బంది వెనుదిరిగారు. త్వరలోనే పోలీసు బందోబస్తుతో వచ్చి పూర్తిస్థాయిలో స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు.

రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న దృశ్యం

(c) eenadu

విశాఖ తూర్పు

అక్రమంగా తలిస్తున్న మద్యం స్వాధీనం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎంవీపీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవాల్తేరు గాంధీ సెంటర్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున అనధికారికంగా మద్యం సీసాలను తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎంవీపీ ఎస్.ఐ. శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు, సిబ్బంది దాడులు చేశారు. ఓ వ్యక్తి వద్ద రెండు సంచుల్లో ఉన్న 33 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పెదవాల్తేరు చేపలబజారు ప్రాంతానికి చెందిన బోర సతీష్‌రెడ్డి (26)ని అరెస్టు చేశారు. మద్యం సీసాలను కొనుగోలు చేసి అనధికారికంగా అధిక ధరలకు విక్రయిస్తున్నాడని సీఐ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎంవీపీ కాలనీ: 8008574768

మద్దిలపాలెం: 9912120229

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 16వ వార్డు మద్దిలపాలెం శివాలయం ప్రాంతంలోని కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. దుర్వాసనతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. – సురేష్, మద్దిలపాలెం ✓: తక్షణమే సిబ్బందిని పంపించి కాలువల్లో పూడిక తొలగిస్తాం. – సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 13వ వార్డు రామకృష్ణాపురంలో కల్వర్టుపై చెత్త వేస్తున్నారు. రోజుల తరబడి దాన్ని తొలగించకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. – వి.బాబూరావు, రామకృష్ణాపురం. ✓: సిబ్బందితో మాట్లాడి కల్వర్టుపై చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – ఆర్.రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: పదోవార్డు నేతాజీనగర్ ప్రాథమిక పాఠశాల వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. కొండచివరి భాగం కావటంతో రాత్రుళ్లు బయటకు రావాలంటే హడలిపోతున్నాం. – జగన్నాథం, నేతాజీనగర్. ✓: పరిశీలించి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. – గాయత్రి, ఏఈ.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: విశాలాక్షినగర్ కైలాసగిరి కూడలి నుంచి హనుమంతువాక కూడలి వరకు ప్రధాన రహదారిలో యూజీడీ పైపులైను మార్గంలో గోతులు పడ్డాయి. – నల్ల రవికుమార్, సంజీవ్‌నగర్ కాలనీ. ✓: రహదారిని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. – శ్రీనివాస్, ఏఈ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: మానసిక ఆసుపత్రి నుంచి బీచ్‌రోడ్డుకు వెళ్లే రహదారిలో చెత్త పేరుకుపోతోంది. –కృష్ణారావు, స్థానికుడు ✓: సిబ్బందితో మాట్లాడి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – ప్రకాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అదిగదిగో కలల రహదారి

- పునర్నిర్మాణం దిశగా ఆదర్శనగర్ రోడ్డు
- వ్యయ అంచనాలు పెంచి ప్రతిపాదన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : పదో వార్డు రవీంద్రనగర్ నుంచి ఆదర్శనగర్, ఇందిరానగర్‌ల మీదుగా విశాఖవ్యాలీ పాఠశాల కూడలికి అనుసంధాన రహదారికి త్వరలో మోక్షం కలగనుంది. రహదారి దుస్థితిపై ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. వీటికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్పందించారు. ఆయనే స్వయంగా చొరవ తీసుకుని అధికారులతో మాట్లాడారు. ఫలితంగా దశాబ్ద కాలంగా నిలిచిపోయిన ఈ రహదారి పునర్నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.

రవీంద్రనగర్ కొండ చివరి భాగంలో రహదారి దుస్థితి

ప్రస్తుతం ఏదశలో ఉందంటే...: పదేళ్ల కిందట 2015లో రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. తొలిదశలో జీవీఎంసీ రూ.25 లక్షల నిధులు విడుదల చేసింది. ఆ మొత్తంతో రహదారిని చదును చేసి కంకర వేశారు. అయితే అటవీశాఖ అధికారులు అది కంబాల కొండ అభయారణ్యానికి చెందిన స్థలమని అభ్యంతరం తెలిపి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం దీని గురించి పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన తయారైంది. నాడు వేసిన కంకర అంతా కొట్టుకుపోయింది. మళ్లీ మొదటి నుంచి పనులు ప్రారంభించాల్సిన పరిస్థితి వచ్చింది.

- రహదారి విస్తీర్ణం : సుమారు 3 కి.మీ.
- నిర్మాణ వ్యయం : సుమారు రూ.3.5 కోట్లు
- ప్రారంభించిన సంవత్సరం : 2015
- నాడు చేసిన వ్యయం : రూ.25 లక్షలు
- ప్రయోజనం: సుమారు 50వేల మందికి..

రాష్ట్రస్థాయికి చేరిన దస్త్రం: రహదారిపై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అధికారులతో చర్చించారు. నిర్మాణం వ్యయం పెరిగిపోయిందని రూ.3.5కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు తెలిపారు. అటవీశాఖ అధికారులు అభ్యంతరం గురించి ప్రస్తావించగా వారితో తాను మాట్లాడతానని, ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు దస్త్రం కదిలేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం అమరావతి ఉన్నతాధికారుల వద్దకు దస్త్రం చేరుకుంది.

ట్రాఫిక్ రద్దీతో నిత్యం అవస్థలు: పాతడెయిరీఫారం కూడలి నుంచి రవీంద్రనగర్ వరకు సుమారు 50వేల మంది జనాభా నివాసం ఉంటున్నారు. 40ఏళ్ల క్రితం వేసిన రోడ్డే ఇప్పటికీ ఉంది. ఉదయం సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. రహదారి పూర్తయితే ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది.
– గుత్తుల తులసీపార్వతీ, రవీంద్రనగర్

అటవీశాఖకు ప్రత్యామ్నాయ స్థలం ఇస్తాం..: రహదారి విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లా. వారు సానుకూలంగా స్పందించారు. అటవీశాఖకు ప్రత్యామ్నాయ స్థలం జీవీఎంసీ పరిధిలో కేటాయించేలా చర్యలు తీసుకున్నాం. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు వస్తాయి.
– వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే

కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు

22వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

శివాజీపాలెం(మద్దిపాలెం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు జరుగుతోందని తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బొడ్డ వెంకటరమణ అన్నారు. సోమవారం 22వ వార్డులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఒమ్మి అప్పారావు, కె.ఆనంద్, బర్కాలు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ దుర్గానగర్, కనకదుర్గానగర్, నెహ్రూనగర్ కాలనీల్లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తెదేపా విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, తెదేపా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను తెదేపా యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. కాలనీల్లోని సమస్యలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు.

ఆరిలోవ దుర్గానగర్ కాలనీలో...

గిరిజన ఐక్యవేదిక నూతన కార్యవర్గం ఎన్నిక

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జిల్లా గిరిజన ఐక్యవేదిక నూతన కార్యవర్గాన్ని ఎంవీపీకాలనీలోని గిరిజన భవన్‌లో ఆదివారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లకే చిట్టిబాబు, గౌరవాధ్యక్షుడిగా కిముడు రామారావు, ముఖ్య సలహాదారుడిగా సిహెచ్.రామనాయుడు, న్యాయ సలహాదారుడిగా కె.సిద్ధేశ్వరరావు, సత్యారావు, ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా గొల్ల వరహాలు దొర, సలహాదారులుగా శెట్టి దామోదర్, సమారెడ్డి సింహాద్రి, వంతల బొంజుబాబు, దొండ సత్యనారాయణ, పెనుమాలి మత్స్యలింగం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గిరిజన ఐక్యవేదిక వ్యవస్థాపకులు వివేక్‌వినాయక్, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పడాల భూదేవి పాల్గొన్నారు.

ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

స్పందనకు వందనం

రహదారిపై వ్యర్థాల తొలగింపు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం తాండ్ర పాపారాయ కల్యాణ మండపం సమీపంలో రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది వ్యర్థాలు తొలగించి శుభ్రం చేశారు.

శివాజీపాలెంలో వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

వీధి కుక్కల పట్టివేత

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విశాలాక్షినగర్ పరిధి కనకమహాలక్ష్మి నగర్ గీతాంజలి ఫంక్షన్ హాల్ వీధిలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని సోమవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి జీవీఎంసీ పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎన్.కిషోర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది కుక్కలను పట్టుకుని తరలించారు.

వీధి కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

జోన్-3 కార్యాలయానికి 23 వినతులు

వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ కె.శివప్రసాద్

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-3 జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 23 వినతులు వచ్చాయి. జెడ్సీ కె.శివప్రసాద్ వాటిని స్వీకరించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ విభాగానికి 1, ప్రజారోగ్య విభాగానికి 1, పట్టణ ప్రణాళికకు 15, ఇంజినీరింగ్‌కు 4, ఉద్యాన విభాగం, యూసీడీలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు వచ్చాయని తెలిపారు. జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులపై దృష్టి సారించామన్నారు. తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని పట్టణ ప్రణాళిక విభాగ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సింహగిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. వీరిద్దరూ సోమవారం రాత్రి వేర్వేరుగా గిరి ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తాగునీరు, మరుగుదొడ్లు ఎక్కువ ప్రాంతంలో అందుబాటులో ఉంచాలన్నారు. నడవడానికి అనుకూలంగా రహదారులను తీర్చిదిద్దాలన్నారు. బీచ్‌లో స్నానం చేసే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు అనుకూలంగా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. విద్యుత్తు దీపాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేసి, భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, పి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు చురుగ్గా ఏర్పాట్లు

- జోన్-3 పరిధిలో భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు
- ఒక్కో షిఫ్ట్‌నకు 150మంది కార్మికుల నియామకం

తాత్కాలిక మరుగుదొడ్లను పరిశీలిస్తున్న జీవీఎంసీ అధికారులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 'సింహాచలం అప్పన్నస్వామి గిరి ప్రదక్షిణకు జోన్-3 పరిధిలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అప్పుఘర్ నుంచి ఎంవీపీకాలనీ, వెంకోజీపాలెం, హెచ్‌బీకాలనీ, సీతమ్మధార, అక్కయ్యపాలెం నరసింహనగర్ రైతు బజార్ వరకు భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా యంత్రాంగం పటిష్ఠ చర్యలు తీసుకుంటోంద'ని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. బుధవారం జరగనున్న గిరిప్రదక్షిణకు చేసిన ఏర్పాట్లను ఆయన 'న్యూస్‌టుడే'కు వివరించారు. 'ఈ ఏడాది భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. వారు ఎక్కువ సమయం సేద తీరే అప్పుఘర్, లుంబినీపార్కు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాం. జోన్-3 పరిధిలో సుమారు ఆరు కిలోమీటర్లు నడుస్తారు. ఆ మార్గంలో 20చోట్ల తాగునీరు, ఏడు ప్రాంతాల్లో 96 బయో మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. ఒక్కో ప్రాంతంలో అదనంగా నీటి ట్యాంకర్‌ను అందుబాటులో ఉంచుతాం. బీచ్‌లో నాలుగు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. తాత్కాలికంగా 60 విద్యుత్తు దీపాలు, మూడుచోట్ల టవర్లు ఏర్పాటు చేసి వాటికి 48 దీపాలు అమరుస్తున్నాం. ఒక్కో షిఫ్ట్‌నకు 150మంది చొప్పున పారిశుద్ధ్య కార్మికులు పనులు చేస్తారు. వీరు రహదారులను శుభ్రం చేయడంతోపాటు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలిస్తారు.

★ లుంబినీ పార్కు తీరంలో బారికేడ్లు, భక్తులు దుస్తులు మార్చుకోవడానికి తాత్కాలిక గదులు ఏర్పాటు చేస్తున్నాం. అప్పుఘర్ నుంచి ఎంవీపీకాలనీ వరకు రహదారులపై గోతులను పూడ్చాం. రాత్రిపూట భక్తులు ఇబ్బందులు పడకుండా పనిచేయని వీధి దీపాలకు మరమ్మతులు చేయించామ'ని జెడ్సీ తెలిపారు.

కారాగారం సమీపంలో డివైడర్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

బీఆర్టీఎస్‌లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు : ఆరిలోవ, న్యూస్‌టుడే: ముడసర్లోవ ప్రాంతంలోని బీఆర్టీఎస్ రోడ్డును 40మంది పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నారు. విభాగినుల్లో వ్యర్థాలను తొలగించి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులు నడవడానికి ఇబ్బందులు పడకుండా రోడ్లను శుభ్రం చేస్తున్నామని పారిశుద్ధ్య విభాగ ఇన్‌స్పెక్టర్ రామారావు తెలిపారు. సింహాచలం నుంచి హనుమంతువాక వరకు అన్ని దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్తు విభాగ ఏఈ గాయత్రి శరణ్య తెలిపారు.

కనకదుర్గ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట జాతీయ రహదారిపై వెలసిన కనకదుర్గ అమ్మవారి జాతరలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో సుందరంగా అలంకరించారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సీనియర్ జల నాణ్యత విశ్లేషకుడి బదిలీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు ప్రాంతీయ ప్రజాఆరోగ్య ప్రయోగశాలలోని సీనియర్ జల నాణ్యత విశ్లేషకులు వై.ఎస్.శివరామకృష్ణ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో విజయవాడకు బదిలీ అయ్యారు. గత ఐదు సంవత్సరాలుగా ఆయన ఇక్కడ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన్ను కార్యాలయ సిబ్బంది సత్కరించారు. మాధవరావు, గౌరీశ్వరరావు, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలని పిలుపు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈనెల 9న నిర్వహించనున్న జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నేతలు పిలుపు నిచ్చారు. ఈ మేరకు పాతడెయిరీఫారం కూడలిలో సోమవారం ఆటోజాత నిర్వహించారు. అసంఘటిత రంగ కార్మికులందరూ సమ్మెలో పాల్గొని శ్రామికుల శక్తిని చాటాలని కోరారు. కార్యక్రమంలో జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, నరేంద్రకుమార్, వి.తులసీరామ్, నాగరాజు, భూలోకరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోజాతలో పాల్గొన్న సీఐటీయూ ప్రతినిధులు

జలవనరుల ఏఈఈల సంఘం ఎన్నిక

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ (ఏఈఈ) అధికారుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సంబంధిత కార్యాలయంలో సోమవారం జరిగింది. జిల్లా శాఖ నూతన అధ్యక్షునిగా బాడాన విజయ్‌కుమార్ (విశాఖ), ప్రధాన కార్యదర్శి రఘుపతుల విజయ్‌కుమార్ (భీమిలి), అసోసియేట్ అధ్యక్షునిగా కోరాడ పైడినాయుడు (క్యూసీ), ఉపాధ్యక్షులుగా ఆకుల ప్రకాశ్ (చోడవరం), మలయాల శ్రీరామ కపిల్ (ఎస్ఎంఐ), కోశాధికారిగా నివగానిరావు (విశాఖ), సహాయ కార్యదర్శులుగా ముడికి రాంజీ, ఎ.రాజేశ్, అక్తరి భాను అమీనా, వీవీకే సాయిలక్ష్మి ఎన్నికయ్యారు. మూడు జిల్లాలు, పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారులంతా ఈ ఎన్నికలకు హాజరయ్యారు. కార్యక్రమంలో జలవనరులశాఖ విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలు పోలవరం ప్రాజెక్టు అసిస్టెంట్ కార్యనిర్వాహక ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అనలిటికల్ కెమిస్ట్రీ కోర్సుతో ఉద్యోగానికి భరోసా..!

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన విభాగాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో అనలిటికల్ కెమిస్ట్రీ విభాగం ఒకటి. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విభాగంలో దీన్ని 1932లో ప్రారంభించారు. అప్పట్లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు కలిసే ఉండేవి. వీటికి మామిడి వెంకట రంగయ్య ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. అనంతర కాలంలో సైన్స్ విభాగం వేరుపడింది. అప్పటి నుంచి ఈకోర్సు చేసిన ఎంతో మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో ప్రతిభ కనబరిచారు.

★ **కొత్త సొబగులు...:** అనలిటికల్ కెమిస్ట్రీ లేబొరేటరీ ఏర్పాటు చేసి 90ఏళ్లు దాటడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీన్ని ఆధునికీకరించేందుకు దివీస్ ల్యాబ్ అధిపతులు డాక్టర్ దివీ మురళి, సురేష్‌బాబు ముందుకు వచ్చారు. గత ఏడాది సుమారు రూ.84లక్షలు వెచ్చించి ల్యాబ్‌కు సొబగులు అద్దారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఇప్పుడీ ల్యాబ్ విద్యార్థులు, పరిశోధకులకు అందుబాటులోకి వచ్చింది. ఒకేసారి వంద మంది విద్యార్థులు, పరిశోధకులు ఇక్కడ పరిశోధనలు చేసే వీలుంది.

ఆధునికీకరించిన అనలిటికల్ కెమిస్ట్రీ లేబొరేటరీ

★ **వంద శాతం ఉద్యోగాలు...:** ఎమ్మెస్సీ కెమిస్ట్రీ అనలిటికల్ కోర్సు చేసే విద్యార్థులు ఏటా వంద శాతం ఉద్యోగాలు పొందుతున్నారు. వీరిలో 95 శాతం ఫార్మా రంగంలో స్థిరపడగా, మిగిలిన వారు అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్నారు. ఈ కోర్సులో చేరాలంటే ఏపీ పీజీసెట్‌లో అత్యుత్తమ ర్యాంకు రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇందులో కేవలం 45 సీట్లు ఉన్నాయి. ఇక్కడ 20 మంది పరిశోధకులు ఉన్నారు.

★ **త్వరలో రెండో ల్యాబ్ ప్రారంభం...:** దివీస్ ఫార్మా సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్)లో భాగంగా లేబొరేటరీని ఆధునికీకరించింది. అందులో ఒక ల్యాబ్‌ను గత ఏడాది అప్పటి ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు ప్రారంభించారు. రెండో ల్యాబ్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ప్రపంచస్థాయి హంగులతో కూడిన ల్యాబ్‌లు అందుబాటులోకి రావడం ఏయూకి వరమని చెప్పవచ్చు. – ఆచార్య ఎ.బసవయ్య, ల్యాబ్ ఇన్‌ఛార్జి

ఏయూ సమాచారం

దూరవిద్యా తరగతులకు లాగిన్ కావాలి..

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ దూరవిద్యా కేంద్రం పీజీ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పర్సనల్ కాంటాక్ట్ ప్రోగ్రాం(పీసీపీ), ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రాం(పీటీపీ) విద్యార్థులు తరగతుల కోసం ఏయూ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలని దూర విద్యా కేంద్రం సంచాలకులు ఆచార్య డి.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 2024 విద్యా సంవత్సరం 2వ సెమిస్టర్, 3వ సెమిస్టర్ విద్యార్థులు పైన పేర్కొన్న తరగతులకు హాజరుకావాలన్నారు.

ఐసీఏఆర్-సీఐఎఫ్‌టీ సైంటిస్టు ఇన్‌ఛార్జిగా డాక్టర్ బి.మధుసూదనరావు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: భారత వ్యవసాయ పరిశోధన మండలి-కేంద్ర మత్స్య సాంకేతిక సంస్థ (ఐసీఏఆర్-సీఐఎఫ్‌టీ) విశాఖపట్నం రీసెర్చ్ సెంటర్ సైంటిస్ట్ ఇన్‌ఛార్జిగా డాక్టర్ బి.మధుసూదనరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ యు.శ్రీధర్ పనిచేశారు. మధుసూదనరావు నగరంలోని సెయింట్ అలోసియస్ ఆంగ్లో-ఇండియన్ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్య పూర్తి చేశారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ఇంటర్ చదివారు. తిరుపతి వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ వెటర్నరీ కళాశాలలో బీవీఎస్సీ, ఎమ్వీఎస్సీ చదివి బంగారు పతకాలు అందుకున్నారు. అనంతరం కోచి విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఇండియన్ వెటర్నరీ అసోసియేషన్ నుంచి 2001లో బెస్ట్ పేపర్ అవార్డు అందుకున్నారు. సొసైటీ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ నుంచి 2004లో బెస్ట్ అవార్డు అందుకున్నారు. పరిశోధనల్లో 27 ఏళ్ల అనుభవం ఉంది. వివిధ జర్నల్స్‌లో 130కి పైగా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. వందకు పైగా జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొన్నారు. ఇటీవల సింగపూర్‌కు చెందిన స్ప్రింగర్స్ నేచర్ సంస్థ ఆయన రాసిన 'యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) పుస్తకాన్ని ప్రచురించింది.

చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి చెందాడు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రానికి చెందిన జగేశ్వర్ హంటల్(45) గత ఏడాది నవంబరులో గంజాయి తరలిస్తుండగా అల్లూరి జిల్లా హుకుంపేట వద్ద పోలీసులకు చిక్కాడు. అప్పటి నుంచి విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉంటున్నాడు. ఆదివారం గుండె నొప్పి రావడంతో జగేశ్వర్ హండల్‌ను జైలు సిబ్బంది పైఅధికారుల ఆదేశాలతో కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందాడు.

అక్రమ అంతస్తుల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న కట్టడాలపై జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు ఎట్టకేలకు చర్యలకు ఉపక్రమించారు. 'ముడుపులు ఇచ్చుకో.. ఇష్టమొచ్చినట్టు కట్టుకో..!' శీర్షికతో ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం జోన్-3 ఏసీపీ మధుసూదనరావు నేతృత్వంలో సిబ్బంది శివాజీపాలెం, మద్దిలపాలెం ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన అంతస్తులను కూల్చివేశారు. అనుమతులు తీసుకోకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

శివాజీపాలెంలో అక్రమ అంతస్తును తొలగిస్తున్న సిబ్బంది

మెగా వేడుకకు ఆహ్వానపత్రాల అందజేత

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఈనెల 10న జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పక హాజరుకావాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి మజ్జి ఆదినారాయణ కోరారు. సోమవారం ఆయన కృష్ణా జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశమయ్యారు. కార్యక్రమం విజయవంతానికి అధ్యాపకులకు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం విద్యార్థులకు ఆహ్వానపత్రాలు అందజేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అధ్యాపకులు రామవేదవ్యాస్, బి.సన్యాసిరావు, ఆర్వీనాయుడు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆహ్వానపత్రాలు అందజేస్తున్న మజ్జి ఆదినారాయణ

రోడ్డుపైన ఇసుక.. రాకపోకలెలా..?

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీ సెక్టార్-6 భద్రం పార్కు వీధిలో ఓ భవన నిర్మాణదారుడు రహదారిపైనే ఇసుక, పిక్క వేసేశాడు. రెండోవైపు ఓ మొక్క అడ్డుగా ఉంది. దీంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఆటోలు, కార్లు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు భవన నిర్మాణదారుడికి అవగాహన కల్పించి సామగ్రి తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నివాసితులు కోరుతున్నారు.

ఎంవీపీ భద్రంపార్కు వీధిలో..

గుంతలు పూడ్చండి మహాప్రభో...

దర్పణం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: హనుమంతువాక నుంచి పెదగదిలి వరకు బీఆర్‌టీఎస్ రహదారిలో పలుచోట్ల గుంతలు పడ్డాయి. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం భూగర్భ విద్యుత్ తీగల ఏర్పాటు పనులు జరుగుతుండటంతో వీధి దీపాలు వెలగక ఆ దారి అంధకారంగా మారింది. 9న గిరిప్రదక్షిణ జరగనున్న నేపథ్యంలో అధికారులు తక్షణం స్పందించి గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఎల్వీప్రసాద్ ఆసుపత్రి ఎదురుగా గుంతలు

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి చెందాడు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రానికి చెందిన జగేశ్వర్ హంటల్(45) గత ఏడాది నవంబరులో గంజాయి తరలిస్తుండగా అల్లూరి జిల్లా హుకుంపేట వద్ద పోలీసులకు చిక్కాడు. అప్పటి నుంచి విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉంటున్నాడు. ఆదివారం గుండె నొప్పి రావడంతో జగేశ్వర్ హండల్‌ను జైలు సిబ్బంది పైఅధికారుల ఆదేశాలతో కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందాడు. జైలు సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలవనరుల ఏఈఈల సంఘం ఎన్నిక

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ (ఏఈఈ) అధికారుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సంబంధిత కార్యాలయంలో సోమవారం జరిగింది. జిల్లా శాఖ నూతన అధ్యక్షునిగా బాదన విజయకుమార్ (విశాఖ), ప్రధాన కార్యదర్శి రఘుపతుల విజయకుమార్ (భీమిలి), అసోసియేట్ అధ్యక్షునిగా కొరడ పైడినాయుడు (క్యూసీ), ఉపాధ్యక్షులుగా ఆకుల ప్రకాష్ (పోడవరం), మలయాల శ్రీరామ కుమార్ (ఎస్ఎంఐ), కోశాధికారిగా నిడిగిని రావు (విశాఖ), సహాయ కార్యదర్శులుగా ముడికి రాంజీ, ఎ.రాజేశ్, అక్కరి భాను అమీనా, వీవీకే సాయిలక్ష్మి ఎన్నికయ్యారు. మూడు జిల్లాలు, పోలవరం ప్రాజెక్టు సంబంధించిన ప్రభుత్వ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారులంతా ఈ ఎన్నికలకు హాజరయ్యారు. కార్యక్రమంలో జలవనరులశాఖ విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలు పోలవరం ప్రాజెక్టు అసిస్టెంట్ కార్యనిర్వాహక ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796
విశాఖ దక్షిణం: 8008574977

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్, అంబేడ్కర్ కాలనీ ప్రధాన రహదారిలో గత మూడు రోజులుగా వ్యర్థాలను తరలించడం లేదు. తీవ్ర దుర్వాసన, ఈగలు, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. – పి.రాము, స్థానికుడు ✓: తక్షణమే సిబ్బందిని పంపించి వ్యర్థాలను శుభ్రం చేయిస్తాం. – హేమసుందర్, శానిటేషన్ కార్యదర్శి

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: టీపీటీకాలనీ బృందావన్ పార్కు సమీపంలో రహదారి గోతులమయంగా మారింది. నడవడానికి కూడా వీలుకాని పరిస్థితి. – రమేశ్, స్థానికుడు ✓: గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాస్, ఏఈ

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: గురుద్వారా ఐడీబీఐ బ్యాంకు రహదారిలో వాహనాలు ఇష్టానుసారంగా నిలిపివేస్తున్నారు. మలుపు తిరిగేటప్పుడు ఇబ్బంది పడుతున్నాం. – శాస్త్రి, వాహన చోదకుడు ✓: వాహనాలు నిలపకుండా హెచ్చరిక బోర్డులు పెడతాం. – ద్వారకా ట్రాఫిక్ పోలీసులు

స్పందనకు వందన

దిమ్మెలు సరి చేశారు

గురుద్వారా, న్యూస్‌టుడే: టీపీటీకాలనీ లడ్డూగోపాల్ మిఠాయి దుకాణం పక్క మార్గంలో కాలువపై వేసిన సిమెంటు దిమ్మె ప్రమాదకరంగా మారడంపై 'చోదకులూ జాగ్రత్త' శీర్షికతో ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. కార్మికులతో దిమ్మెను సరిచేసి రాకపోకలుగా వీలుగా చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తీగ తొలగించారు

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార పాత ఏఎంజీ ఆసుపత్రి సమీపంలో విద్యుత్ స్తంభానికి ప్రమాదకరంగా వేలాడుతున్న తీగను ఎట్టకేలకు తొలగించారు. తీగ ప్రమాదాన్ని తలపిస్తోందని 'తాకితే ప్రమాదమే' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. తీగను తొలగించి ముందస్తు ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు.

తుప్పలు తొలగించి.. వసతులు కల్పించి..

గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తి

మాధవధార, న్యూస్‌టుడే: సింహాచలం సింహాద్రి అప్పన్న స్వామి గిరి ప్రదక్షిణ ఈ నెల 9న నిర్వహించనున్నారు. ఉత్తర నియోజకవర్గం పరిధిలో సీతమ్మధార నుంచి ఆర్అండ్‌బీ వరకు 12 కిలోమీటర్ల మేర ఈ యాత్ర సాగనుంది. ఈ మార్గంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానం, జీవీఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల నడక యాత్రను సాఫీగా సాగించేందుకు వీలుగా మాధవధార వుడాకాలనీ పరిసర ప్రాంతాల్లో రహదారిని విస్తరించడమే కాకుండా, పలుచోట్ల రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చారు. అస్తవ్యస్తంగా ఉన్న యూజీడీ మ్యాన్‌హోల్స్‌ను సరి చేశారు. అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు, భక్తులకు అవసరమైన తాగునీరు, ఎక్కడికక్కడ వైద్య శిబిరాలు, సేద తీరేందుకు వీలుగా విశ్రాంతి శిబిరాలను, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. భక్తులు స్నానమాచరించేందుకు మాధవస్వామి ఆలయం జలధార వద్ద, నడక మార్గంలో మరో రెండు చోట్ల షైపులు ఏర్పాటు చేశారు. రహదారికి ఇరువైపులా ఉన్న వ్యర్థాలను, తుప్పలను తొలగించి క్రషర్ పొడి వేస్తున్నారు.

నడిచేందుకు వీలుగా రహదారి పక్కన పిచ్చి మొక్కలను తొలగించి క్రషర్ పొడి వేస్తున్న దృశ్యం

మాధవస్వామి దర్శనం తప్పనిసరి: గిరి ప్రదక్షిణ వచ్చే భక్తులు సింహాచలం కొండ కింద ఉన్న మాధవస్వామిని తప్పనిసరిగా దర్శించుకొని అక్కడ నుంచి కొండ పక్కనున్న గిరి ప్రదక్షిణ రహదారి గుండా సింహాచలం వెళ్లడం ఆనవాయితీ. భక్తులు అలా కాకుండా నేరుగా సీతమ్మధార నుంచి ఆర్అండ్‌బీ మీదగా సింహాచలం వెళ్తున్నారు. ఇది ఏ మాత్రం సరైంది కాదని దీనికి సంబంధించి దేవస్థానం, పోలీసు అధికారులు భక్తులకు ప్రచారం చేసి, బ్యానర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. భక్తులకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ మాధవధారకు వెళ్లేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనధికార వసూళ్లపై ఫిర్యాదుల వెల్లువ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రేషను డిపోల డీలర్ల నుంచి పౌర సరఫరాల శాఖ సిబ్బంది అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారంటూ సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ సరుకుల పంపిణీలో మార్పులు చేసింది. గతంలో ఉన్న ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి గత నెల నుంచి డిపోల వద్దే సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 610 రేషను డిపోల ద్వారా నిత్యావసరాలు అందజేస్తున్నారు. ప్రస్తుతం జులై నెలకు సంబంధించిన పంపిణీ చురుగ్గా సాగుతోంది. ఈ నేపథ్యంలో పంపిణీని పర్యవేక్షించాల్సిన ఉద్యోగులు డీలర్ల నుంచి అనధికారికంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో రేషను కార్డుకు రూ.3ల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక్కో దుకాణం పరిధిలో సుమారు 800 నుంచి 1500 వరకు కార్డులుంటాయి. దీని ప్రకారం నెలకు రూ.2400 నుంచి రూ.4500 వరకు ఇవ్వాలని లేకుంటే తనిఖీల పేరుతో కేసులు రాస్తామని డీలర్లను హెచ్చరిస్తున్నట్లు సమాచారం. పాతనగరంలోని డిపోలతో పాటు కంచరపాలెం, గాజువాక, మధురవాడ, గోపాలపట్నం, రైల్వేన్యూకాలనీ తదితర ప్రాంతాల్లో ఈ బెదిరింపులు అధికంగా ఉన్నాయని చెబుతున్నారు. కారుణ్య నియామకం కింద వచ్చిన కొంతమంది డీలర్ల నుంచి భారీగా మామూళ్లు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వయం సహాయక బృందాల పేరుతో పలు డిపోలను బినామీగా నడుపుతున్న ఒక ఉద్యోగి వసూళ్ల వెనుక చక్రం తిప్పుతున్నారని, అనధికారికంగా వసూలు చేసిన ఈ మొత్తాన్ని సహాయ సరఫరా అధికారులకు ఇస్తున్నారని చెబుతున్నారు. పూర్తిస్థాయిలో ఆయా అంశాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీలర్లు అధికారులను కోరుతున్నారు.

గిరి ప్రదక్షిణ భక్తులకు సౌకర్యాలు కల్పించండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సింహగిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. వీరిద్దరూ సోమవారం రాత్రి వేర్వేరుగా గిరి ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తాగునీరు, మరుగుదొడ్లు ఎక్కువ ప్రాంతంలో అందుబాటులో ఉంచాలన్నారు. నడవడానికి అనుకూలంగా రహదారులను తీర్చిదిద్దాలన్నారు. బీచ్‌లో స్నానం చేసే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు అనుకూలంగా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. విద్యుత్తు దీపాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేసి, భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, పి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రహదారిని పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు

వంట సామగ్రి అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ దక్షిణం నియోజకవర్గ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తన నివాసంలో గ్యాస్‌స్టౌవ్‌లు, వంటపాత్రలు, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలకు మళ్లీ పూర్వ వైభవం వచ్చిందన్నారు. ప్రభుత్వం అందించే వస్తువులను సద్వినియోగం చేసుకొని పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీడీఓ నీలిమ, ఏపీడీపీఓ శ్రీలత, పర్యవేక్షకులు కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వంటపాత్రలు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వృద్ధురాలికి ఆశ్రయం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: రహదారి పక్కన పుట్‌పాత్‌పై నివాసముంటూ చుట్టుపక్కల వారు ఏదైనా ఇస్తే తింటూ రాత్రి సమయంలో ఓ దుకాణం మెట్లపై నిద్రిస్తున్న వృద్ధురాలిని మురళీనగర్‌లోని వానప్రస్థ వృద్ధాశ్రమం నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్ ఆశ్రయం కల్పించాడు. కాళ్ల గోవిందమ్మ(72) కుటుంబ సభ్యులతో కలిసి మద్దిలపాలెంలో నివాసముండేది. ఆరు నెలలు కిందట కొడుకు ఆరిలోవకు నివాసం మార్చాడు. ఆ క్రమంలో తన తల్లిని వదిలిపెట్టి వెళ్లి పోయాడు. దీంతో అప్పటి నుంచి రోడ్డు పక్కన ఉంటూ రాత్రుళ్లు దుకాణం వద్ద తలదాచుకుంటోంది. స్థానికుల సమాచారం మేరకు రొబ్బి శ్రీనివాస్ సోమవారం అక్కడకు చేరుకుని ఆమెను ఆశ్రమానికి తరలించి యోగక్షేమాలు చూస్తున్నాడు.

వృద్ధురాలిని తీసుకెళ్తున్న రొబ్బి శ్రీనివాస్

వైభవంగా తొలేళ్ల ఉత్సవం

మాధవధార, న్యూస్‌టుడే: మాధవధార గ్రామ ప్రజల ఇలవేల్పు కుంచుమాంబ అమ్మవారి తొలేళ్ల పండుగను సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సదరం పట్టు వద్ద ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం నిర్వహించనున్న అమ్మవారి ప్రధాన పండుగకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి పూల ఘటాలను ఇంటింటికీ ఊరేగింపుగా తీసుకెళ్తామన్నారు.

ప్రత్యేక అలంకరణలో కుంచుమాంబ

అమ్మవారి ఘటాల ఊరేగింపు

సంక్షేమ పథకాల తీరుతెన్నులపై ఆరా..!

గురుద్వారా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో కూటమి పార్టీల నాయకుల ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తెదేపా ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్ ముఖ్యఅతిథిగా హాజరై ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఏడాది పాలనపై స్పందన అడిగి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షురాలు బర్ల పద్మలత, ప్రధాన కార్యదర్శి దేముడుబాబు, కె.వెంకటరెడ్డి, ఎస్.శంకర్రావ్, రమణారెడ్డి, వరలక్ష్మి, బొట్టా పైడిరాజ, సన్యాసిరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న నజీర్, పద్మలత, తదితరులు

దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నిరసనలో ఆటో డ్రైవర్లు, చిల్లర వర్తకుల సంఘాల ప్రతినిధులు రావి కృష్ణ, జి.నీలకంఠం, పి.సాయికుమార్, జి.ఆదినారాయణ, జి.అప్పారావు, బి.బుజ్జి, కె.వెంకట్, టి.కృష్ణ, ఎం.చిన్న తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి, తదితరులు

మట్టికుప్పలు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 42వ వార్డు రైల్వేన్యూకాలనీ ప్రాంతంలో రహదారులపై ఉన్న మట్టికుప్పలను జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు తొలగించారు. రైల్వేన్యూకాలనీ ప్రధాన రహదారిలో ఇటీవల పాత కాలువను ధ్వంసం చేసి కొత్తది నిర్మిస్తున్నారు. పాత డ్రైనేజీ వ్యర్థాలను రోడ్డు మీదే వదిలేశారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో 'నత్తనడక పనులతో ఇక్కట్లు' శీర్షికతో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించి మట్టిని తరలించారు.

పెన్సిల్‌తో వేసిన చిత్రపటం బహూకరణ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: చిత్రకారులను ప్రోత్సహిస్తామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. నగరానికి చెందిన చిత్రకారిణి పల్లా నవోజ్ఞ పెన్సిల్‌తో వేసిన పి.వి.ఎన్.మాధవ్ చిత్రపటాన్ని సోమవారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా యువతిని మాధవ్ అభినందించారు. భాజపా వైద్యవిభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్, భరత్‌కుమార్, వాయునందరావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్నాళ్లు అడ్డుగా.. ఇక ఆ బాధ లేదుగా

సీతంపేట, న్యూస్‌టుడే: శ్రీనగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయానికి ప్రతిరోజూ వందల సంఖ్యలో విద్యార్థులు, వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు వస్తుంటారు. వీరంతా చదువుకునేందుకు సెల్లార్‌లో కూడా ఏర్పాట్లు చేయడంతో తమ బ్యాగులను మెట్లపై ఉంచుతున్నారు. దీంతో పైకి వెళ్లేందుకు పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించిన గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ మెట్లు వద్ద గోడకు మేకులు కొట్టి వాటికి బ్యాగులు తగిలించుకునే ఏర్పాటు చేశారు. వాటిని చూసిన వారంతా బ్యాగులా గబ్బిలాలా అంటున్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

మురళీనగర్, న్యూస్‌టుడే: పట్టాభిరెడ్డితోట 11 కేవీ ఫీడర్ పరిధి మురళీనగర్ సెక్షన్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్నందున మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బి.కె.నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఎన్జీజీఓస్‌కాలనీ, పట్టాభిరెడ్డితోట, అల్లూరి సీతారామరాజునగర్ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

వ్యక్తి మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కొబ్బరితోట ప్రాంతానికి చెందిన కనకరాజు మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, మృతి చెందిన తీరు, గాయపడ్డ విధానం చూస్తే తమకు కొన్ని అనుమానాలున్నాయని మృతుడి బంధువులు పేర్కొన్నారు. కనకరాజు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. సోమవారం కేజీహెచ్ శవాగారంలో శవపంచనామా నిర్వహించారు. అతని బంధువులు పెద్ద సంఖ్యలో అక్కడకు వచ్చి నిరసన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపడతామని పోలీసులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ మీదుగా హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేసేందుకు యత్నించిన వ్యక్తిని విశాఖలో రైల్వే పోలీసులు అరెస్టు చేసినట్లు జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. తెలంగాణకు చెందిన దుగ్యాలరాజ్ రెండు కిలోల గంజాయితో స్టేషన్‌లో ఉండగా తనిఖీల్లో ఉన్న విశాఖలో రైల్వే పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణ అనంతరం గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడ్ని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. కొబ్బరితోట ప్రాంతానికి చెందిన కనకరాజు(30) ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదంలో గాయపడగా కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కులో సోమవారం సాయంత్రం మహిళలకు నడక పోటీలు నిర్వహించారు. క్లబ్ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా జరిపిన ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 60 మంది పోటీల్లో పాల్గొన్నారని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రభావతి, ఎం.జయ తెలిపారు. ఈనెల 15న నిర్వహించనున్న వార్షికోత్సవ వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఓటర్ల జాబితా రూపకల్పనపై శిక్షణ

శిక్షణ ఇస్తున్న ఈఆర్వో జ్ఞానవేణి నాగమణి

గురుద్వారా, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల విధులు, ఎన్నికల సంఘం నిబంధనలపై ఉత్తరం నియోజకవర్గంలోని బీఎల్‌వోలకు సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈఆర్వో జ్ఞానవేణి నాగమణి ముఖ్యఅతిథిగా హాజరై పలు విషయాలను వివరించారు. రోజుకు 50 మందికి చొప్పున వారం రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ ముగిసిన తర్వాత పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. ఉప తహసీల్దార్ త్రినాథ్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ప్రయాణం ప్రమాదం సుమా..!

కంచరపాలెం బస్టాప్ వద్ద ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న ద్విచక్రవాహన చోదకులు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: కొంతమంది వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ, రోడ్లు దాటుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. జాతీయ రహదారిలో కప్పరాడ నుంచి ఊర్వశి కూడలి వరకు ఎక్కడా యూటర్న్ లేకపోవడంతో కంచరపాలెం బస్టాప్ డివైడర్ వద్ద ద్విచక్ర వాహనదారులు ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్నారు. ఏ మాత్రం అప్రమత్తంగా లేకపోయినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

దళితులపై దాడులు అరికట్టాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని విశాఖ దళిత సంఘాల (విదసం) సమన్వయకర్త బూసి వెంకటరావు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం విదసం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ భూములను స్వాధీనం చేసుకుని దళితులకు అప్పగించాలని, అమలాపురంలో నడిరోడ్డుపై దళిత యువకులపై దాడి చేసిన పోలీసులపై కేసులు నమోదు చేయాలని, విశాఖ భూ కుంభకోణంపై వేసిన సిట్ దర్యాప్తు నివేదిక బయటపెట్టి దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విదసం నాయకులు బి.కల్యాణరావు, కె.చిన్నారావు, కె.వెంకటరమణ, అప్పారావు, గోపాల్, సీహెచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ ఎరీనా బకాయిలు వసూలు చేయండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ఎంవీపీకాలనీలో నిర్మించిన స్పోర్ట్స్ ఎరీనా బకాయిలు గుత్తేదారు నుంచి వసూలు చేయాలని మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌లకు 78వ వార్డు సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు విన్నవించారు. ఈ సందర్భంగా సోమవారం ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ రూ.2కోట్ల వరకు గుత్తేదారు బకాయిపడినా జీవీఎంసీ అధికారులు ఎందుకు ఉపేక్షిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. తక్షణమే అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పలు రైళ్ల రద్దు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: తూ.కో. రైల్వే వాల్తేర్ డివిజన్ కోటబొమ్మాళిలో భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 11న విశాఖ-గుణుపూర్-విశాఖ (58506-58505), విశాఖ-బ్రహ్మపుర-విశాఖ (58532-58531), భువనేశ్వర్- విశాఖ- భువనేశ్వర్(22819-22820), విశాఖ-పలాస-విశాఖ(67289-67290) రైళ్లను రద్దు చేసినట్లు ప్రకటించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మాధవధార, న్యూస్‌టుడే: జాతీయ రహదారి జ్యోతినగర్ వద్ద కారును లారీ ఢీకొట్టింది. కారు ముందు భాగం ధ్వంసమైంది. కారు నడుపుతున్న డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారి బిర్లా కూడలి నుంచి పంజాబు హోటల్ వైపు వెళ్తున్న కారు జ్యోతినగర్ వద్దకు వచ్చేసరికి ముందు ట్రాఫిక్ ఉండటంతో ఒక్కసారిగా కారు వేగాన్ని తగ్గించాడు. ఈలోగా వెనుక నుంచి వస్తున్న ఒక లారీ డ్రైవర్ దీన్ని గమనించకుండా వేగంగా రావడంతో ఒక్కసారిగా డివైడర్‌పై ఎక్కి కారును ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకుపోవడంతో కారు వ్యతిరేక మార్గంలో తిరిగి ఆగింది. ట్రాఫిక్ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను నమోదు చేసి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పేదరికంలేని సమాజమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

అల్లిపురం, న్యూస్‌టుడే: పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047, పి4 జీరో పావర్టీపై సూర్యబాగ్‌లోని జోన్-4 కార్యాలయంలో యూసీడీ విభాగాధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బంగారు కుటుంబాలను ఎంపిక చేయడానికి దత్తత ప్రక్రియపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సీఎం చంద్రబాబు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఏపీడీ పద్మావతి, ఏసీపీ ఝాన్సీ, ఈఈ నరసింగరావు, డీఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జోన్-4 కార్యాలయానికి నాలుగు అర్జీలు

అల్లిపురం, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-4 కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు నాలుగు అర్జీలు వచ్చాయి. జెడ్సీ మల్లయ్యనాయుడు వాటిని స్వీకరించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ విభాగానికి 2, టౌన్‌ప్లానింగ్‌కు 1, యూసీడీ విభాగానికి 1 చొప్పున అర్జీలు వచ్చినట్లు చెప్పారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణంరాజు, ఈఈ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణమాదిగ జన్మదిన వేడుకలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ జన్మదిన వేడుకలు సోమవారం ఏవీఎన్ కళాశాల వద్ద గల దిగువ రోడ్డులో నిర్వహించారు. మాదిగ మహిళా సమైక్య సభ్యురాలు కడితి రవణమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో తెదేపా దక్షిణ నియోజకవర్గ బాధ్యులు సీతంరాజు సుధాకర్ పాల్గొని కేక్ కోశారు.

(c) eenadu

యువతకు ఉచిత శిక్షణ

సింధియా, న్యూస్‌టుడే: విశాఖపట్నం పోర్టు అథారిటీ సహకారంతో అల్లూరి సీతారామరాజు జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సోమవారం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్‌బిల్డింగ్ (సెమ్స్) సీవోవో కమాండర్ (రిటైర్డ్) గోపీకృష్ణ శివ్వం తెలిపారు. ఇరవై ఏడు ఏళ్ల వయసులోపు పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైన అభ్యర్థులంతా ఈ ఉచిత కోర్సు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. రెండు నెలల పాటు ఉచిత వసతితో శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తిగల యువతీ యువకులు జులై 11లోగా తమ పేర్లు వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8688411100, 7794840934, 0891-2704010లో గాని సింధియా దరి సెమ్స్ కార్యాలయంలోగాని సంప్రదించాలన్నారు.

గాజువాక
• గాజువాక • విశాఖ పశ్చిమం

శాకంబరిగా సత్తెమ్మతల్లి

గాజువాక, న్యూస్‌టుడే : ఆషాడ మాసోత్సవాల్లో భాగంగా గాజువాక రాజీవ్‌మార్గ్‌లో కొలువైన సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయంలో శాకంబరి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పురోహితులు, ఆలయ కమిటీ సభ్యులు సహాయ సహకారాలు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ?: పంచవటికి వెళ్లే మట్టిదారి అధ్వానంగా ఉంది. అటుగా నడవలేక పోతున్నాం. కణితిరోడ్డు గొంతెనవానిపాలెంరోడ్డు గోతులతో నిండి ఉంది. –వి.లక్ష్మి పంచవటి, సన్యాసిరావు, కణితిరోడ్డు. ✔: ఇంజినీరింగ్ సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటాం. –శేషాద్రి, జెడ్సీ

?: చట్టివానిపాలెం నూకాంబిక గుడి వద్ద పైపులైను లీకు వల్ల తాగునీరు నేలపాలవుతోంది. –సంకల్ప్, 70వ వార్డు
✔: మెకానిక్‌లను పంపి మరమ్మతులు చేస్తాం. –కేదార్‌నాథ్, ఏఈ

రోడ్లకు నిధులివ్వండి.. సౌకర్యాలకు చోటివ్వండి..!

గాజువాక, న్యూస్‌టుడే

'రోడ్లకు నిధులివ్వండి.. సంక్షేమ పథకాలు వివిధ కారణాల వల్ల అందుకోలేకపోతున్నాం. తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, వికలాంగులు, విధి వంచితులైన అర్హులకు తగిన న్యాయం చేయాలి'. . ఇలా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి పలువురు సమస్యలను తీసుకువచ్చారు. 'ఈనాడు మీతోడు'గా ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు ఎమ్మెల్యే ఓపికగా సమాధానం ఇచ్చారు. ప్రశ్నలు.. సమాధానాలు చూద్దాం..!

ప్రశ్న : ఇండోర్ స్టేడియంలో సీనియర్ సిటిజన్లు వాకింగ్ చేయాలంటే నెలకు రూ.60 ఇమ్మంటున్నారు.–సత్యనారాయణ, బీసీ రోడ్డు

ఎమ్మెల్యే : సీనియర్ సిటిజన్ల నుంచి ఎలాంటి రుసుం వసూలు చేయరాదని అధికారులకు చెబుతాను.

ప్ర : గాజువాకలో బస్టాపుల్లేక ప్రయాణికులు ఎండల్లో నిరీక్షించాల్సి వస్తోంది. –విశ్వనాథ్, 76వ వార్డు

ఎమ్మెల్యే: స్థల సమస్య వల్ల ఈ తరహా ఇబ్బందులు ఉన్నాయి. ఆర్టీసీ, రెవెన్యూ వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా.

ప్ర : వడ్లపూడిలో రైతుబజారును అందుబాటులోకి తేవాలి. –శ్రీనివాసరావు, 87వవార్డు

ఎమ్మెల్యే : మార్కెటింగ్ శాఖ అధికారులతో మాట్లాడుతాను.

ఈనాడు మీతోడు

గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో 'ఫోన్ ఇన్'కు విశేష స్పందన

సంక్షేమ పథకాలు అందలేదు..

ప్ర : 66వ వార్డు, శ్రీనగర్‌లో కుటుంబంతో ఉంటున్నాం. పింఛన్లు ఇప్పించండి. 85వ వార్డులో ఉంటున్నాం. పక్షవాతం ఉంది. ఎలాంటి పింఛను రాలేదు. రేషన్ కార్డుల్లో స్ప్లిట్ ఆప్షన్ వల్ల వల్ల పథకం పొందలేకపోతున్నాం. ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి. –పిన్నపోతుల లక్ష్మి, 66వ వార్డు, –శ్రీనివాస్, 85వ వార్డు, –బాధితురాలు, శ్రీనగర్, –కౌశల్య, కూర్మన్నపాలెం

ఎమ్మెల్యే: సాంకేతిక ఇబ్బందుల కారణంగా కొందరికి పథకాలు అందడం లేదని గుర్తించాం. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తాం. స్వయంగా తనను సంప్రదించి లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందజేయవచ్చు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తా.

రోడ్లు బాగుచేయండి...

ప్ర : గాజువాక ఎల్‌వీ.నగర్ రోడ్డు నెంబర్ 7లో గోతులతో ఇబ్బందులు పడుతున్నాం. అగనంపూడి డొంకాడలో శివాలయం రోడ్డు కాలువ పాడైంది. పెదనడుపూరులో నీటి సమస్య తీర్చాలి. కొత్తగాజువాక విజేత బుక్‌డిపో పక్కరోడ్డు బాగుచేయాలి. 73వ వార్డు వుడాకాలనీలో గెడ్డకు రిటైనింగ్‌వాల్ లేదు. కూర్మన్నపాలెంలో ఫేజ్-7లో డ్రైనేజీ లేదు. అక్కిరెడ్డిపాలెంలో తగిన వీధి రోడ్లు, కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వుడాకాలనీలో పారిశుద్ధ్య సమస్యను మెరుగు పర్చాలి. శ్రామికనగర్‌లో గౌరీ సంఘం రోడ్డు అధ్వానంగా ఉంది. మాతృశ్రీనగర్‌లో వీధి దీపాలులేవు. గొంతెనవానిపాలెంలో రహదారులు పాడయ్యాయి. కూర్మన్నపాలెం శివారు సాయిబాలాజీనగర్‌లో తాగునీటి ఇబ్బందులు పడుతున్నాం. భరత్‌నగర్‌లో రోడ్లు, డ్రైన్లు బాగు చేయాలి.

–సత్తిరాజు, లక్ష్మణరావు, ఎల్.నగర్, –నూకరత్నం, డొంకాడ, –సుబ్రహ్మణ్యేశ్వరరావు, పెదనడుపూరు, –శ్రీనివాసరావు, గాజువాక, –ఎస్‌వీఆర్. నాయుడు, వుడాకాలనీ, –గణేశ్, కూర్మన్నపాలెం, –గాయత్రీ, తోకాడ, –లక్ష్మి, అక్కిరెడ్డిపాలెం

ఎమ్మెల్యే: పెండింగ్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో తక్షణం మాట్లాడి న్యాయం చేస్తాం. ప్రత్యేక నిధులతో సౌకర్యాలు కల్పిస్తాం.

ప్ర : నేను 76వ వార్డు హౌసింగ్‌బోర్డుకాలనీలో ఉంటున్నాను. క్యాన్సర్ వల్ల మందులు కొనుక్కోలేకపోతున్నాం. తగిన న్యాయం చేయాలి. మేము 74వ వార్డు కోనవానిపాలెంలో కుటుంబంతో ఉన్నాం. ఆరోగ్యశ్రీ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నాం. గుడివాడ అప్పన్నకాలనీలో ఉంటున్నాం. ఆరోగ్యశ్రీ బిల్లులు ఇప్పించండి. –మీనా, హౌసింగ్‌బోర్డు కాలనీ, –సూర్యారావు, కోనవానిపాలెం, –లక్ష్మి, అర్జునరావు, గాజువాక

ఎమ్మెల్యే : ఆయా బిల్లులతో గాజువాక కార్యాలయానికి వచ్చి సంప్రదించండి

జోన్ మార్పు ప్రతిపాదన విరమించుకోవాలి

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ గాజువాక జోన్-6లో కొనసాగుతున్న 79వ వార్డు పరిధి కాలనీలను పెందుర్తి జోన్‌కు మార్పు చేసే ప్రతిపాదనను విరమించుకోవాలని వార్డు జనసేన అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్ కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలోని కార్యాలయంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

● పేద కుటుంబానికి సాయం

అగనంపూడి: అగనంపూడిలో ఇంటి యజమాని చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబానికి సాయం చేయడానికి పెదమడక సర్వహిత ఛారిటబుల్ ట్రస్టు ముందుకొచ్చింది. సోమవారం సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బి.భాస్కరరాజు చేతుల మీదుగా నెలకు సరిపడా నిత్యావసర సరకులను అందించారు.

'దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం'

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే: ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని భెల్ సిటూ కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ కోరారు. భెల్ గేటు వద్ద సోమవారం 9న జరిగే సమ్మెకు మద్దతుగా నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు వి.ఆనందరావు, ఎస్.జగన్నాథరావు, సీహెచ్ మురళీశ్వరరావు, అచ్చెంనాయుడు, హనుమాన్, అప్పారావు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

భెల్ గేటు వద్ద కార్మికుల నిరసన

● ప్రైవేటుకు అప్పగించవద్దు

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం గుల్లలపాలెం ఎఫ్ఆర్‌యూని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకుండా నిరోధించి తక్షణం జీవీఎంసీ ఆధీనంలోనే నడిచేలా చర్యలు తీసుకోవాలని సోమవారం గ్రీవెన్స్‌లో కమిషనర్ కేతన్‌గార్గ్‌కు 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆధీనంలో పేదలకు సక్రమంగా వైద్య సేవలు, ఉచితంగానే మందులు పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. రెండేళ్ల కిందటే ప్రభుత్వం ఎఫ్ఆర్‌యూకి రూ.70 లక్షలతో అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు. ప్రైవేటుకు అప్పగిస్తే నిరాహార దీక్షకు కూర్చుంటానన్నారు.

● సమాజంలో గురువుల పాత్ర కీలకం

గాజువాక, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ గంట్యాడనగర్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వికాస్‌నగర్ బాలగౌరి కల్యాణ మండపంలో ఆర్ఎస్ఎస్ గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. సమాజంలో గురువుల పాత్ర, హిందూ సంస్కృతి వికాసంపై వక్తలు మాట్లాడారు. సంస్థ ముఖ్య ప్రతినిధి వీర్రాజు, సభ్యులు వినోద్‌కుమార్, రమణయ్య, గొందేశి ఎరుకునాయుడు, గొందేశి గురప్పరెడ్డి, సూర్య ప్రకాశ్, పెంటకోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటకు చెందిన సీహెచ్.రామలక్ష్మి(20) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ విశాఖ జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ కాళీమాత ఆలయం సమీపంలో నివాసముంటున్నారు. సోమవారం రాత్రి అల్పాహారం తెచ్చుకునేందుకు ఆమె గోపాలపట్నం బీఆర్టీఎస్‌రోడ్డు దాటుతుండగా.. బాజీకూడలి నుంచి పెందుర్తి వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో యువతి తలపై బలమైన గాయమైంది. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం వచ్చి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇంకా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని బాధితురాలి బంధువులు పేర్కొన్నారు.

● నంద ప్రసాదరావు జీవితం ఆదర్శనీయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: జాతీయస్థాయిలో ధ్యాన ప్రచారం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న ధ్యానరత్న నంద ప్రసాదరావు జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం నెల్లిముక్కు అహింస పిరమిడ్ కేంద్రంలో నంద స్మృతి సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్రం నిర్వాహకుడు మీసాల శివగణేశ్వరరావు నంద జీవిత విశేషాలను తెలిపారు. పిరమిడ్ మాస్టార్లు అప్పారావు, బాలాజీ, మూర్తి, వనతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రనగర్‌లో అగ్నిప్రమాదం

కాలిపోయిన సామగ్రిని బయటకి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గోపాలపట్నం (కొత్తపాలెం), న్యూస్‌టుడే: విద్యుదాఘాతం కారణంగా ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బి.రఘు, కల్యాణి ప్రైవేట్ పనులు చేసుకుంటూ.. జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో నివాసముంటున్నారు. సోమవారం మధ్యాహ్నం వీరిద్దరూ విధులకు వెళ్లిపోగా.. రఘు తల్లి పరమేశ్వరి ఇంట్లోనే ఉన్నారు. విద్యుత్తు మీటర్ నుంచి మంటలు ఇల్లంతా వ్యాపించి సామగ్రి అంతా కాలిపోయింది. సమాచారం అందుకున్న మర్రిపాలెం అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకునేలోపే అంతా దగ్ధమైంది. సుమారు రూ.6లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు.

ఎఫ్ఆర్‌యూని ప్రభుత్వమే నడపాలి

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం 60వ వార్డు గుల్లలపాలెంలో ఎఫ్ఆర్‌యూని ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు డిమాండు చేశారు. సోమవారం ఆసుపత్రి వద్ద సీపీఎం, సిటూలు చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏడు వార్డుల్లో కొండవాలు ప్రాంత రోగులందరికి ఏకైక ప్రభుత్వ ఆసుపత్రిగా ఉందని స్పష్టం చేశారు. కోరమాండల్ లాంటి సంస్థకు ఇచ్చే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, సీపీఎం, సిటూ నాయకులు కె.పెంటారావు, లక్ష్మణమూర్తి సత్యారావు, ఐద్వా మహిళలు పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం, సిటూ కార్యకర్తలు

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలకు వినతి

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. పశ్చిమ తల్లిదండ్రుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. పశ్చిమ అధ్యక్షుడు పొలమరశెట్టి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ద్విచక్ర వాహన ర్యాలీ

మల్కాపురం, న్యూస్‌టుడే: ఈనెల 9వ తేదీన జరగనున్న కార్మిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని అఖిలపక్ష యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 40వ వార్డు పైపులైన్ కూడలి నుంచి సోమవారం సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఏఐటీయూసీ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ, ఏఐటీయూసీ నాయకులు కసిరెడ్డి సత్యానారాయణ, గుడాల రాంబాబు, సిటూ నాయకులు లక్ష్మణమూర్తి, పైడిరాజు, పెంటారావు, విశాఖ స్టీల్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు మంత్రి రాజశేఖర్, వైకాపా ట్రేడ్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

సాహిత్యానికి ఆదిగురువు శంకరాచార్యులు

సమావేశంలో మాట్లాడుతున్న రచయిత్రి విశాలాక్షి

ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే: సాహిత్యానికి సంబంధించిన శతకాలు, పద్యాలు, గేయాలు బోధిస్తూ ఆదిగురువుగా శంకరాచార్యులు సుప్రసిద్ధమైన సాహిత్యం అందించారని రచయిత్రి డి.విశాలాక్షి అన్నారు. [illegible] గోపాలపట్నం శాఖాగ్రంథాలయంలో జరిగింది. ఆదిశంకరులు విశిష్టతపై ఆమె చేసిన ప్రసంగాన్ని ఆదిత్య కళాశాల తెలుగు అధ్యాపకులు ఎం.సోమేశ్వరరావు విశ్లేషించారు. గరిక సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు కేవీఎస్ నరసింహం, గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం, చినసూర్యనారాయణ, రామదాసు, అప్పారావు, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలకోసారి ఉపాధి మేళా

సింధియా, న్యూస్‌టుడే: నిరుద్యోగిత తగ్గించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళాలు నిర్వహించడానికి ప్రత్యేక కార్యాచరణకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. సోమవారం సాయంత్రం 59వ వార్డులో జరిగిన 'సుపరిపాలనలో-తొలిఅడుగు' పేరిట పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓపిక పడితే హామీలు కూడా సకాలంలో పూర్తి కాగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, [illegible] రాంబాబు, కూటమి నాయకులు రామ్మోహన్, దేవర ఈశ్వరరావు, మజ్జి మాలినాయుడు, భాస్కర్, రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశాఖ ఎంపీ శ్రీభరత్, చిత్రంలో గణబాబు

కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా

కూటమి పాలనలో ప్రజలు సంతృప్తి

సీతానగరం(పెదగంట్యాడ), న్యూస్‌టుడే: [illegible] సుపరిపాలన- తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నగర ఉపాధ్యక్షుడు పులి రమణారెడ్డి, వార్డు అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య, అప్పారావు, సింహాచలం మాట్లాడారు.

నిర్వాసిత కాలనీల్లో సౌకర్యాలు కల్పిస్తాం : పల్లా

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక 75వ వార్డులో రూ.3.53 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఉక్కు నిర్వాసిత కాలనీలో సౌకర్యాలను [illegible] శ్రీను, సోమునాయుడు, అప్పారావు, పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా, చిత్రంలో కార్పొరేటర్ లక్ష్మీబాయి, డిప్యూటీ మేయర్ గోవిందరాజు

మద్యం సీసాలు స్వాధీనం

గాజువాక, న్యూస్‌టుడే: దొడ్డిదారిన డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గాజువాక ప్రోహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 41 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మల్కాపురం ప్రకాశ్‌నగర్లో ఐతంశెట్టి ఉదయ్‌కిరణ్ అనే వ్యక్తి డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు అధికారులకు సమాచారం అందడంతో నిఘా ఉంచారు. నిందితుడికి నేవీ ఉద్యోగులతో ఉన్న పరిచయాలతో మద్యం సేకరించి అధిక ధరలకు అమ్ముతున్నట్లు గుర్తించి దాడిచేసి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గాజువాక ఎక్సైజ్ సిబ్బంది కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ సమష్టి విజయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు ఎంతో లబ్ధి చేకూరిందని, ఇది సమష్టి విజయానికి సంకేతమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఎలేషియా అన్నారు. సోమవారం పెదగంట్యాడ ఎస్సీకాంప్లెక్సు ఆవరణలో 31 ఆవిర్భావం పురస్కరించుకుని మాదిగ దండోరా పతాకావిష్కణ నిర్వహించారు. విశిష్ట అతిథిగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ గోవిందరాజు, అఖిలపక్ష నాయకులు మంత్రి రాజశేఖర్, తిప్పల దేవన్‌రెడ్డి, మార్దుపూడి పరదేశి, గంట్యాడ గోవింద్ పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

వేడుకల్లో డప్పువాయిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

61వ వార్డులో..: సింధియా(జవహర్‌నగర్), న్యూస్‌టుడే: రాష్ట్ర ఎమ్మార్పీఎస్ 31వ వ్యవస్థాపక వేడుకలను సోమవారం 61వ వార్డు రామ్‌రాంజీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మల్కాపురంలో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దుర్గాప్రశాంతి, రామ్మోహన్, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు పి.హరికృష్ణ, ఎంవీ గిరీ, భూలోక, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో ఎమ్మార్పీఎస్ పతాకావిష్కరణలో ప్రతినిధులు

★ ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3)న్యూస్‌టుడే : ఉక్కునగరం సెక్టారు-2లో జరిగిన ఎమ్మార్పీఎస్ వేడుకల్లో సీనియర్ నాయకులు దేవులపల్లి సంపూర్ణం, సిక్కా ఉదయభాస్కరరావు, ఎం.రాజశేఖర్, వై.వరలక్ష్మి, లెనిన్‌బాబు, సోమన్న, కె.సత్యనారాయణరావు, బి.అప్పారావు, వై.టి.దాసు పాల్గొన్నారు.

విమల విద్యాలయం ప్రారంభించాలంటూ వినతి

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయం ప్రారంభించాలని కోరుతూ 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 25 రోజులు గడుస్తున్నా స్టీల్‌ప్లాంటు ఆధీనంలో నడుస్తున్న విమల విద్యాలయాన్ని ప్రారంభించకుండా ఉక్కు యాజమాన్యం తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గంగారావు

నేలకొరిగిన విద్యుత్తు టవర్

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ఇనుపతుక్కు దొంగల వికృతచేష్టకు విద్యుత్తు టవర్ నేలకొరిగింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమి జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గాజువాక 76వవార్డు హౌసింగ్‌బోర్డుకాలనీలో పోర్టురోడ్డుకు వెళ్లే ఎంఐజీ బ్లాకుల్లో 33కేవీ విద్యుత్తు టవర్లు ఉన్నాయి. అయితే హౌసింగ్‌బోర్డుకాలనీలో స్క్రాప్ దొంగలు రాత్రివేళ టవర్ సపోర్టు యాంగులర్స్, బోల్టులు, ఇనుప ముక్కల కోసం టవర్ కింద జాయింట్లను విప్పేశారు. తగిన సపోర్టు లేకపోవడంతో విద్యుత్తు టవర్ ఓ ఇంటిని ఆనుకుని పడిపోయింది. తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీఎల్వోలపై గురుతర బాధ్యత

చినగంట్యాడ(గాజువాక), న్యూస్‌టుడే: ఓటర్ల నమోదు ప్రక్రియ, పోలింగ్ బూత్‌ల నిర్వహణలో బీఎల్వోలు గురుతర బాధ్యత పోషించాలని వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారి, ఈఆర్వో బి.దయానిధి సూచించారు. సోమవారం గాజువాక తహసీల్దార్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో బీఎల్వోల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గాజువాకలో 309 పీఎస్‌ల బీఎల్వోలకు ఈనెల 7 వరకూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల డీటీ సూర్యకళ, తహసీల్దార్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు విశ్వేశ్వరరావు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఈఆర్వో దయానిధి

★ ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లోని సామాజిక భవనంలో సోమవారం పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని బీఎల్వోకి శిక్షణ తరగతులు నిర్వహించారు.

కాలనీ సమస్యలపై వినతి

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వరకాలనీ అభివృద్ధి సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. కాలనీలోని ప్రధాన సమస్యలపై ఆయనతో చర్చించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వీర్రాజు, మోహన్‌రావు, విశ్వేశ్వరరావు, సన్యాసినాయుడు, కోటేశ్వరరావు, రాజారావు పాల్గొన్నారు.

గోతుల పని పట్టారు

స్పందనకు వందనం

స్టేట్‌బ్యాంక్ ఎదురుగా...

ఆర్.ఆర్.వి.పురం కూడలిలో..

గోపాలపట్నం, న్యూస్‌టుడే : బాజీకూడలి, గోపాలపట్నం, ఆర్.ఆర్.వి.పురం కూడలిలోని బీఆర్టీఎస్‌రోడ్డులో అక్కడక్కడ గోతులు వాహనదారులకు పరీక్ష పెట్టేవి. బుధవారం గిరి ప్రదక్షిణ కూడా ఉండటంతో సోమవారం 'ఈనాడు'లో 'ప్రదక్షిణకు ముందే పట్టించుకోండి' శీర్షికతో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి బీఆర్టీఎస్‌రోడ్డులో ఏర్పడిన గోతులకు మరమ్మతులు చేపట్టారు.

శిక్షణకు పదండి.. కొలువుకు మార్గమండి

- ఐటీఐ విద్యార్థులకు రైల్వేలో అప్రెంటీస్‌షిప్
- తొలిసారిగా ఉమ్మడి జిల్లా వారికి అవకాశం

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

ఐటీఐ విద్యార్థులకు రైల్వే కొలువులు వరించనున్నాయి. ఉమ్మడి జిల్లా వారికి కొత్తగా ఈ విభాగంలో అప్రెంటీస్ అవకాశాలు కల్పించనున్నారు. ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్‌లో భాగంగా ఈనెల 14న విజయనగరంలోని కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక మేళా జరగనుంది. సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు సులువుగా దక్కనున్నాయి.

ఐటీఐలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ట్రేడులివే..

ఫిట్టర్, వెల్డర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానికల్, రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ మెకానిక్, వైర్‌మెన్, కార్పెంటర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ప్లంబర్, మేషన్.

కొలువుల్లో వెయిటేజీ..

శిక్షణ తీసుకున్న వారికి రైల్వే ఉద్యోగాల్లో వెయిటేజీ కల్పిస్తారు. దీంతో అభ్యర్థులు సులువుగా ఉద్యోగాలు పొందేందుకు వీలుంటుంది. ఇటీవల కాలంలో రైల్వేలో ఐటీఐ విద్యార్థులకు అవకాశాలు పెరుగుతున్నాయి. సహాయ లోకోపైలెట్, టెక్నీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితర విభాగాల్లో పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో అప్రెంటీస్‌కు ఎక్కువ సంఖ్యలో ముందుకొస్తారని అధికారులు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆరు ప్రభుత్వ ఐటీఐలు, 30 ప్రైవేటు ఐటీఐలున్నాయి. వీటిలో 10 వేల మంది వరకు చదువుతున్నారు. తుది సంవత్సరం విద్యార్థులు 5 వేల మంది ఉన్నారు. ఇప్పటికే ఉత్తీర్ణత సాధించినవారు వీరికి అదనం.

500 మందికి అవకాశం..

మేళా ద్వారా 500 మందిని ఎంపిక చేయనున్నారు. 13 ట్రేడుల్లో ఐటీఐ పూర్తి చేసినవారు, ప్రస్తుతం తుది సంవత్సరం చదువుతున్న వారు అర్హులు. ఎంపికైన వారికి 12 నెలల పాటు అప్రెంటీస్‌షిప్ ఉంటుంది. నెలకు రూ.7 వేల నుంచి రూ.12 వేల వరకు భృతి చెల్లిస్తారు.

ఇతర జిల్లాల వారూ అర్హులే..

విజయనగరం ప్రభుత్వ ఐటీఐను నోడల్ కేంద్రంగా ఎంపిక చేశారు. ఇక్కడే మేళా జరగనుంది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా సమీప ప్రాంతాల వారు కూడా హాజరుకావచ్చు. ముందుగా అభ్యర్థులు అప్రెంటీస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నిర్దేశించిన తేదీన ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలి. ఇతర వివరాలకు 94415 18355, 98499 44654 నంబర్లను సంప్రదించాలి. - టి.వి.గిరి, కన్వీనర్, ఐటీఐ విద్య

కొండగూడెంలో కూలిన వంతెన

సంతకవిటి, న్యూస్‌టుడే: మండలంలోని కొండగూడెం సమీపంలో సాయన్నగెడ్డపై ఉన్న ప్రధాన వంతెన సోమవారం ఉదయం కుప్పకూలింది. 1987లో దీనిని నిర్మించారు. మండలంలోని కొండగూడెం, మాధవరాయపురం, జావాం, కేఆర్‌పురం, రేగిడి మండలంలోని ఖండ్యాం గ్రామాల ప్రజల రాకపోకలకు ఇదే ప్రధానాధారం. నాగావళి నదీ తీరంలోని 20 ప్రాంతాల వారు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు వెళ్లాలంటే ఇటుగా రాకపోకలు సాగించాల్సిందే. ఏళ్ల నాటిది కావడం, మరమ్మతులు లేకపోవడంతో కొంతభాగం కూలిపోయింది. వారధి మీదుగా భారీ ఇసుక లారీలు వెళ్తుండడమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాకపోకలను నిలిపివేశారు. ఆర్అండ్‌బీ ఏఈ సతీష్‌కుమార్, డీఈఈ ప్రభాకరరావు, గ్రామ సర్పంచి కె.శారద పరిశీలించారు. తాత్కాలికంగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తామని ఏఈ చెప్పారు.

సాయన్నగెడ్డపై కూలిన వంతెన వద్ద స్థానికులు

దౌర్జన్యంగా పంటలను తొలగిస్తున్నారు

అర్జీ చూపుతున్న భూ నిర్వాసితులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిందాల్ కంపెనీ ప్రతినిధులు తమ భూముల్లో జేసీబీల సాయంతో పంటలను దౌర్జన్యంగా తొలగిస్తున్నారని ఎస్.కోట మండలం ముషిడిపల్లి, పెదఖండేపల్లి, బొడ్డవర, కిల్తంపాలెం గ్రామాలకు చెందిన రైతులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు విన్నవించుకున్నారు. 2008-09లో 164 ఎకరాల భూమిని కంపెనీకి ఇచ్చామని, పరిశ్రమలు ఏర్పాటు కానందున తాము సాగు చేసుకుంటున్నామని చెప్పారు. ... అని పలుమార్లు వేడుకున్నా, న్యాయం చేయలేదని వాపోయారు.

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు: ఆర్అండ్‌బీ స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని గంట్యాడ మండలం పెదమజ్జిపాలెం గ్రామానికి చెందిన కొండల అప్పలరాజు ఫిర్యాదు చేశారు. తన ఇంటి ముందు భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ★ జామి మండలంలోని అలమండ సంతకు లైసెన్సులు లేకుండా ఆశీలు వసూలు చేస్తున్నారని గంట్యాడ మండలం పెదవేమలి సర్పంచి వర్రి పాపునాయుడు అర్జీ ఇచ్చారు.

194 వినతులు.. కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు 194 వినతులు అందాయి. భూసమస్యలకు సంబంధించి అత్యధికంగా రెవెన్యూశాఖకు 97 అర్జీలు వచ్చాయి. పంచాయతీశాఖ-07, డీఆర్‌డీఏ-31, పురపాలక-05, విద్య- 13, వైద్యం-05, మిగిలిన శాఖలకు కొన్ని అందాయి. కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేథు మాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఉప కలెక్టర్లు మురళీ, ప్రమీలా గాంధీ పాల్గొన్నారు.

తహసీల్దారు తిప్పుతున్నారు.. తహసీల్దారు తనకు పట్టా ఇవ్వకుండా తిప్పుతున్నారని కొత్తవలస మండలం ఉత్తరావల్లికి చెందిన సింగంపల్లి శ్రీరామ్మూర్తి అర్జీ అందజేశారు. సర్వే నంబరు 105/50లో హరిత రహదారి నిమిత్తం 0.33 ఎకరాల భూమి తీసుకున్నారని, మిగిలిన 0.26 సెంట్ల విస్తీర్ణానికి వన్‌బీ ఇవ్వా

శుద్ధికి సెగ.. ఆరోగ్యానికి పొగ!

'పుర'ాలను వెంటాడుతున్న చెత్త సమస్య

ఈనాడు-విజయనగరం

పట్టణాలను పరిశుభ్రంగా మారుస్తాం.. చెత్త సమస్య నివారిస్తాం.. ఇళ్ల నుంచి సేకరించి డంపింగ్ యార్డుల్లో నిల్వ చేసిన చెత్తను జీరో లెవెల్‌కి తీసుకొస్తాం.. స్వర్ణాంధ్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలంటూ సుద్దులు చెప్పిన గత ప్రభుత్వ పాలకులు ఆచరణలో శుద్ధి మరిచారు. ఇందుకు ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లోని డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన వేల టన్నుల చెత్త కుప్పలే నిదర్శనం. సీసీ కెమెరాలు పెట్టి తూతూమంత్రంగా యార్డుల్లో చర్యలు చేపట్టారు. నదులు, చెరువుల్లో నీటిలో మురుగు కలవకుండా శుద్ధికి రసాయన ట్యాంకులు ఏర్పాటు చేసి నామమాత్ర చర్యలే చేపట్టారు.

తలకు మించిన భారం

◆ విజయనగరంలో రోజుకు 123 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దాసన్నపేట సమీపంలో నిల్వ చేస్తున్నారు. అక్కడ నుంచి మూడు లారీల్లో 115 టన్నుల వరకు విశాఖలో విద్యుత్తు ఉత్పత్తి కేంద్రానికి తరలిస్తున్నారు. మిగిలినది ఎరువు తయారీకి వినియోగిస్తున్నారు. సిబ్బంది, వాహనాల కొరతతో రోజూ పూర్తిస్థాయిలో చెత్త తొలగించడం లేదు. దీంతో నగరాభివృద్ధి సంస్థ తలకు మించిన భారమైంది. ◆ రాజాం పురపాలికలో రోజుకు 18.5 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దీన్ని జీవీఎల్ వద్ద డంపింగ్ యార్డులో నిల్వ చేస్తారు. అక్కడి నుంచి విశాఖ తరలిస్తారు. వాహనాలు సమకూర్చాలని పుర అధికారులు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ను కోరినా స్పందించకపోవడంతో 5 టన్నులు నిల్వ పేరుకుపోయింది. ◆ బొబ్బిలి మున్సిపాలిటీలో రోజుకు 14 టన్నుల ఉత్పత్తి అవుతోంది. రోజుకు అయిదారు టన్నుల తడి చెత్తను ఎరువు తయారీకి వినియోగిస్తున్నారు. విశాఖకు పొడి చెత్త తరలింపు సక్రమంగా జరగడం లేదు. విద్యుత్తు ఉత్పత్తి కేంద్రానికి టిప్పర్‌లో తరలించాలంటే ఒక ట్రిప్పునకు రూ.15 వేలు ఖర్చవుతుంది. దీంతో మున్సిపాలిటీ చేతులెత్తేసింది. ◆ నెల్లిమర్లలో రోజుకు 10 టన్నుల ఉత్పత్తి అవుతోంది. వారంలో రెండు సార్లు విశాఖకు తరలిస్తున్నారు.

విజయనగరంలోని డంపింగ్‌యార్డులో చెత్త శుద్ధి కోసం రసాయనం పిచికారీ చేస్తున్న తరుణి సంస్థ ఉద్యోగి

తప్పులు కప్పేందుకు తిప్పలు

పట్టణాల్లో ఉత్పత్తి అయిన చెత్త విశాఖకు తరలించి, డంపింగ్ యార్డులను జీరో లెవెల్‌కి తెచ్చేందుకు రాష్ట్రంలో తరుణి అసోసియేట్ సంస్థతో గత వైకాపా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ మేరకు పనులు చేపట్టిన సంస్థ సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే నిలిపివేసింది. ఇప్పుడు ఆ ఒప్పందం గడువు ముగిసింది. పొరుగు రాష్ట్రంలో మరికొన్ని శుద్ధి పనులు సకాలంలో చేపట్టలేదంటూ గతంలో గ్రీన్ ట్రైబ్యునల్ ఆ ప్రభుత్వానికి భారీగా జరిమానా విధించింది. మళ్లీ వైకాపా ప్రభుత్వం అలాంటి పరిస్థితి ఎదురుకాకుండా యార్డుల్లో, శుద్ధి కేంద్రాల్లో పనులు జరుగుతున్నట్లు చూపేందుకు ఫొటోలు, వీడియోలు తీసి కాలుష్య నియంత్రణ మండలికి చూపించింది. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కొన్నాళ్లకే వెనక్కి తీసుకుపోయారు.

అక్టోబరు నాటికి పూర్తి చేస్తాం: ఉత్తరాంధ్రలోని పట్టణాల్లో చెత్త ఉత్పత్తి, తరలింపు, ఎరువు తయారీ ప్రక్రియపై సంబంధిత అధికారులతో చర్చించాం. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రైవేటు సంస్థలతోనూ మాట్లాడా. పట్టణాల్లోని డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తను జీరో లెవల్‌కు తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది. వచ్చే అక్టోబరు నాటికి నిర్దేశించుకున్న లక్ష్యం పూర్తి చేసేలా ముందుకెళ్తున్నాం.
- కామేశ్వరరావు, ఎస్ఈ, ప్రజారోగ్యశాఖ, విశాఖపట్నం

మెగా సమావేశాల్లో భాగస్వామ్యం కావాలి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని విద్యాలయాల్లో ఈనెల 10న జరగనున్న మెగా సమావేశాల్లో ప్రైవేటు విద్యాసంస్థలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థలన్నీ రిజిస్టర్ కావాలని చెప్పారు. ఇప్పటివరకు 65 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, 100 శాతం జరగాలని స్పష్టం చేశారు. తల్లి పేరుతో మొక్కను నాటేందుకు 20 లక్షల మొక్కలు అందుబాటులో ఉంచామన్నారు. ఎక్కడా రాజకీయ నాయకుల ఫొటోలు, బ్యానర్లు లేకుండా చూడాలన్నారు. డీఈవో యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్షా ఏపీసీ ఎ.రామారావు, డీఆర్వో ఎస్.తవిటినాయుడు, ప్రైవేటు విద్యాసంస్థల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

పేదల అవసరాలను గుర్తించండి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: పీ-4 కార్యక్రమం అమల్లో భాగంగా మార్గదర్శులను గుర్తించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. సోమవారం ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంఈవోలతో ఆన్‌లైన్‌లో మాట్లాడారు. కుటుంబాలు పేదరికం నుంచి బయటపడేందుకు వారి అవసరాలు గుర్తించి, చైతన్య పర్చాలని చెప్పారు. ★ ఉపాధి హామీ పథకం కింద 500 ఎకరాల్లో మంగళవారం మొక్కలు నాటనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 477 మంది రైతులకు చెందిన భూములు, చెరువు గట్లపై వేసేందుకు 23 రకాల పండ్ల మొక్కలను సిద్ధం చేశామని, ఎంపీడీవోలు, ఏపీవోలు పర్యవేక్షించాలన్నారు.

మడ్డువలస జలాశయం నీరు విడుదల

జలాశయం గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

వంగర, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా ఉంటోందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. సోమవారం మడ్డువలస జలాశయం కుడి కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఖరీఫ్ సీజన్‌కు సాగు నీరు విడుదల చేశారు. వంగర, రేగిడి, సంతకవిటి మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, పొందూరు, లావేరు మండలాల పరిధిలోని 30,077 ఎకరాలకు నీరందనుందని చెప్పారు. తొలిరోజు 100 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశామని, క్రమేణా 600 క్యూసెక్కుల వరకు పొలాలకు అందించనున్నట్లు జలవనరులశాఖ ఈఈ సుధాకర్, జలాశయం డీఈఈ అర్జున్ చెప్పారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు బి.వాసుదేవరావునాయుడు, తెదేపా మండలాధ్యక్షుడు పి.మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మీట నొక్కుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

చేతులు మారిన భూములు ప్రభుత్వ పరం

న్యూస్‌టుడే- శృంగవరపుకోట

74.15 ఎకరాల అసైన్డు భూములు వెనక్కి

రూ.3.50 కోట్ల చెల్లింపులు నిలిపివేత

జిందాల్ భూసేకరణ వ్యవహారంలో చేతులు మారిన 74.15 ఎకరాల అసైన్డు భూములను తాజాగా రెవెన్యూ అధికారులు ప్రభుత్వ పరం చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇటీవల కలెక్టరేట్‌లో కలెక్టరు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 18 మంది అసైన్డు దారులకు చెందిన 74.15 ఎకరాలను పీవోటీ యాక్టు కింద వెనక్కి తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఎకరానికి పరిహారం రూ.2,05,000.. షేర్లు మొత్తం రూ.2,05,000.. అసైన్డుదారులకు ఉద్యోగం వద్దంటే రూ.3 లక్షలు అన్నీ కలిపి సుమారుగా రూ.3.50 కోట్లకు పైగా భూములు కోల్పోయిన 18 మందికి అందాల్సిఉంది. కానీ చేతులు మారిన భూములు అనే కారణంతో పరిహారానికి నిరాకరించినట్లు తెలుస్తోంది.

అప్పుడలా.. ఇప్పుడిలా...

జేఎస్‌డబ్ల్యూ సంస్థ 2007- 08లో బొడ్డవర ప్రాంతంలో అల్యూమినా పరిశ్రమ ఏర్పాటుకు భూములు సేకరించిన సమయంలో భూములివ్వమంటూ పెద్దఎత్తున ఉద్యమాలు సాగాయి. రైతులను ఒప్పించడానికి దొడ్డిదారిన ప్రయత్నాలు చేశారు. సంస్థ సేకరించాల్సిన సుమారు 834 ఎకరాల అసైన్డు భూముల్లో చాలావరకు చేతులు మారినవే. దీన్ని అడ్డుగా పెట్టుకొని పరిహారం ఇవ్వమంటూ భూములు కొనుగోలు చేసిన, అమ్మిన రైతులను భయపెట్టి సెటిల్‌మెంట్లకు తెరలేపారు. వచ్చిన పరిహారాన్ని ఇద్దరూ పంచుకునేలా సెటిల్‌మెంట్ చేసి మూడో వాటాను దళారులు కొట్టేశారు. పీవోటీ యాక్టు కింద ఇచ్చిన నోటీసులపై కొందరు కోర్టుకు వెళ్లారు. ఇరువర్గాలను సర్దుబాటు చేసి మరీ చెల్లింపులు చేశారు. ఇప్పుడు మాత్రం 74.15 ఎకరాలు ప్రభుత్వ పరం చేయడం ఎంత వరకు సమంజసమని సదరు రైతులు ప్రశ్నిస్తున్నారు. పాత పద్ధతిలో చెల్లింపులు చేయాలని డిమాండు చేస్తున్నారు.

గతంలోనే నోటీసులు ఇచ్చాం..: గతంలో 2008లో భూసేకరణ జరిగిన సమయంలోనే ఈ 18 మందికి అప్పటి తహసీల్దారు ఫారం-1, 2, రెస్యూమ్ నోటీసులు అందించారు. కొత్తగా చేసిందేమీ లేదు. ఈ వివరాలతో కూడిన నివేదికను కలెక్టరుకు పంపుతాం. గతంలో చేతులు మారిన భూములకు పరిహారం చెల్లింపు విషయం నాకు తెలియదు.
- డి.శ్రీనివాసరావు, తహసీల్దార్, శృంగవరపుకోట

నిర్వాసితులకు అండగా రైతు సంఘాలు

మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనరు శోభనాద్రీశ్వరరావు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిందాల్ భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకు రైతు సంఘాలన్నీ అండగా ఉంటాయని ఆ సంఘాల సమన్వయ కమిటీ కన్వీనరు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. సోమవారం బొడ్డవరలోని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నివాసంలో నిర్వాసితుల సమావేశంలో మాట్లాడారు. తాటిపూడి రిజర్వాయరు నిర్వాసితులైన రైతులను జిందాల్ కోసం మరోసారి నిర్వాసితులను చేశారని, చట్టం ప్రకారం ఇలా చేయకూడదన్నారు. పరిశ్రమ 5 ఏళ్ల లోపు ఏర్పాటు చేయకపోతే భూములు తిరిగి రైతులకే చెందుతాయన్నారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల బీడు భూములుండగా ప్రభుత్వాలు పచ్చటి పొలాలను పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతున్నాయని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులపై మావోయిస్టు ముద్రవేసి అడవి నుంచి వెళ్లగొడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో రూ.39 లక్షల కోట్ల విలువైన భూములను కార్పొరేట్లకు పందేరం చేసిందని కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు వైవీఎస్ మహదేవ్ అన్నారు. రైతుల కోసం పోరాడతానని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు.

రాజాంలో భూచోళ్లు

న్యూస్‌టుడే- రాజాం గ్రామీణం

రాజాం పట్టణం విద్య, వాణిజ్య, వ్యాపార రంగాల్లో రోజు రోజుకూ అభివృద్ధి చెందుతోంది. దీంతో పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. చెరువు, గెడ్డ, కొండ, గుట్ట, శ్మశానం, ప్రభుత్వ స్థలం అనే తేడా లేకుండా ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో కబ్జాలకు పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఓ వైపు ఎంతో అవసరమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి సుమారు 11 ఏళ్లుగా స్థలం లేకపోయినా ఎవరూ పట్టించుకోవడంలేని, ఆక్రమణలను మాత్రం ఆపడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చదును చేస్తుండడంతో రూపు కోల్పోతున్న చెరువు గర్భం

రూ.2 కోట్ల పైమాటే..

రాజాం పట్టణానికి కూతవేటు దూరంలోని మొగిలివలస గ్రామ పరిధిలో ఉన్న ఎరుకవాని చెరువు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం ఆక్రమణలకు గురై చెరువు ఆకారమే కనిపించడంలేదు. సుమారు ఎకరాకు పైగా ఆక్రమణలకు గురైనట్లు సమాచారం. ప్రస్తుతం ఆ ప్రాంతం చుట్టూ భవనాలతో అభివృద్ధి చెందుతోంది. దీంతో ఇక్కడ సెంటు భూమి ధర రూ.లక్ష నుంచి రూ.3 లక్షల మధ్య పలుకుతోంది. ఆ లెక్కన ఎకరా ఆక్రమణకు గురైందనుకున్నా దాని విలువ సుమారు రూ.2 కోట్ల పైమాటే.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. మొగిలివలస గ్రామంలోని ఎరుకవాని చెరువు ఆక్రమణలను పరిశీలిస్తాం. వీఆర్వో, ఆర్ఐ, సర్వేయర్‌తో కొలతలు వేయించి ఎంత ఆక్రమణకు గురైందో గుర్తిస్తాం. తదుపరి చర్యలు తీసుకుంటాం.
- రాజశేఖరం, తహసీల్దార్, రాజాం

తహసీల్దారు కార్యాలయం పక్కనే..

రాజాం తహసీల్దార్ కార్యాలయానికి అతి సమీపంలో ఉన్న ఎరుకవాని చెరువును ఆక్రమించి భారీ యంత్రాలతో చదును చేస్తున్నా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. అధికారుల అండతోనే ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారనే వాదనా ఉంది. చెరువు గర్భం ఆక్రమణకు గురికావడంతో సుమారు 100 ఎకరాల ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఖరీఫ్‌లో సాగునీరు అందకపోతే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధులు ప్రబలితే బాధ్యులు మీరే..!

పారిశుద్ధ్య, రక్షిత పథకాల నిర్వహణపై దృష్టి

పంచాయతీ కార్యదర్శులు, ఉప ఎంపీడీవోలకు ఆదేశాలు

న్యూస్‌టుడే, కొత్తవలస

ఏటా వర్షాకాలంలో డయేరియా, మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. ఈ పరిస్థితిని నివారించడానికి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలితే సంబంధిత పంచాయతీ కార్యదర్శి, ఉప ఎంపీడీవోలను బాధ్యుల్ని చేస్తామంటూ ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) మల్లికార్జునరావు జిల్లాలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలోని 777 పంచాయతీల్లో పారిశుద్ధ్య, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. ఇందులో భాగంగా జిల్లాస్థాయి అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. కొన్ని మార్గదర్శకాలూ చేశారు.

కొత్తవలసలో పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలిస్తున్న డీపీవో మల్లికార్జునరావు (పాత చిత్రం)

గ్రామాల్లో పర్యవేక్షించాలి

ఉప ఎంపీడీవోలు మండల పరిధిలో, డీఎల్‌పీవోలు డివిజన్ పరిధిలోని అన్ని పంచాయతీలు సందర్శించి పర్యవేక్షించాలి. ఎక్కడైనా వ్యాధులు ప్రబలితే ఉప ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యులవుతారు. సూచనలు పాటించని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీపీవో తమ ఆదేశాల్లో వెల్లడించారు.

ఫాగింగ్ చేపట్టాలి..

నివారణకు పంచాయతీలకు అందించిన యంత్రాలతో తేమలేని సమయంలో ఫాగింగ్ చేయించాలి. కాలువల్లో దోమల లార్వా పెరగకుండా వేస్ట్ ఆయిల్ చల్లించాలి. ఇళ్ల నుంచి తడి పొడి చెత్త, వీధుల్లోని వ్యర్థాలను రోజూ సేకరించి సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలి. వ్యాధుల వల్ల వచ్చే నష్టాలపై దండోరా, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలి. వైద్యారోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్‌ఎస్ సిబ్బంది సమన్వయంతో కార్యదర్శులు ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించాలి.

నిబంధనలు పాటించాలి..

◆ గ్రామాల్లోని కాలువల్లో పూడిక తీయించాలి. ◆పారిశుద్ధ్య సామగ్రి బ్లీచింగ్, ఫినాయిల్, సున్నం తగినంత అందుబాటులో ఉంచుకోవాలి. ◆ రక్షిత మంచినీటి పథకాల (ఓహెచ్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్) ట్యాంకుల్లో నీరు నింపేటప్పుడు సమపాళ్లలో క్లోరినేషన్ ప్రతిరోజూ చేయించాలి. ◆ ట్యాంకులు ప్రతి 15 రోజులకు శుభ్రం చేయించాలి. ◆ ప్రతిరోజూ శుభ్రం చేసినట్లు ఉన్న చిత్రాలు 'పీఆర్-ఒన్ యాప్'లో అప్లోడ్ చేయాలి. ◆ గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యశాఖ అధికారులతో పంచాయతీ కార్యదర్శులు సమన్వయం చేసుకుని రక్షిత మంచినీటి పథకాలకు సరఫరా చేసే సోర్స్ కలుషితం కాకుండా వ్యర్థాలు ఉంటే తొలగించాలి. ◆ ట్యాంకుల నుంచి కుళాయిలకు నీరు సరఫరా చేసే పైపులైన్లు మురుగు కాలువల్లో ఉన్నా, లీకేజీలున్నా వెంటనే సరిచేయాలి.

9 నుంచి మినిస్టీరియల్ ఉద్యోగ సంఘ ఎన్నికలు

కొత్తవలస, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఈనెల 9 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని సమితి యూనిట్ల కాలపరిమితి పూర్తవడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు, పరిశీలకులను జిల్లా సంఘ అధ్యక్షుడు చింతాడ మురళీ నియమించారు. 9న కురుపాం, 12న చీపురుపల్లి, నెల్లిమర్ల, 13న పార్వతీపురం, సాలూరు, 15న గజపతినగరం, 16న భోగాపురం, 17న జడ్పీ యూనిట్, 18న గంట్యాడ, 20న బొబ్బిలి, బాడంగి, 27న శృంగవరపుకోట, కొత్తవలస తాలూకా యూనిట్ల సంఘ ఎన్నికలు జరగనున్నాయి. కొత్తవలసకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి జె.వి.ప్రసాద్ సోమవారం విడుదల చేశారు. దీనిని ఎంపీడీవో ఎస్.రమణయ్య సమక్షంలో మండల పరిషత్తు కార్యాలయం నోటీసు బోర్డులో పెట్టారు.

స్పందించారు.. నిధులు తెచ్చారు

బేబినాయన, ఎమ్మెల్యే

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలో కీలకమైన రాజా కళాశాల రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్సు- దాడితల్లి బైపాస్ గుడి రహదారులు గోతులతో నిండి ప్రమాదాలకు కారణం కావడంపై 'ఈనాడు'లో వరుస కథనాలు వెలువడ్డాయి. గతనెల 19న 'గోతుల్లో రక్కసి.. అడుగేస్తే రక్కేసి', ఈనెల 7న 'సాహసం చేయాల్సిందే ప్రయాణికా' శీర్షికలతో వచ్చిన కథనాలకు ఎమ్మెల్యే బేబినాయన స్పందించారు. గత నెల 20న రోడ్ల దుస్థితిని చూసి వర్షాకాలం నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతులు చేపడతామని చెప్పారు. సోమవారం పురోగతిని వివరించారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్న దున రాజా కళాశాల మార్గంలో ఉన్న గుంతలను పూడ్చేందుకు తన సొంత నిధులు రూ.7 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. బొబ్బిలి-రామభద్రపురం, బొబ్బిలి- పాతబొబ్బిలి మధ్య సీఆర్ఆర్ రహదారి బాగుకు కలెక్టర్ అంబేడ్కర్ రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో రహదారుల పరిస్థితిని ప్రస్తావించడంతో మంత్రులు స్పందించి నిధులు విడుదల చేశారని, త్వరలోనే శాశ్వత నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ప్రస్తుత ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తాత్కాలిక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈనాడు కథనానికి స్పందన

రైతులకు యూరియా పంపిణీ

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఖరీఫ్ ఆదిలోనే రైతులకు యూరియా కష్టాలపై సోమవారం 'ఈనాడు'లో 'లెక్కల్లోనే యూరియా.. ఇక్కడ లేదయా!' శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేశారు. బొబ్బిలి మండలం ఎం.బూర్జివలసకు ఆరు మెట్రిక్ టన్నులు, అలజంగికి 12, పక్కి గ్రామానికి 8 మెట్రిక్ టన్నుల యూరియాను పంపించి, అన్నదాతలకు పంపిణీ చేశారు. యూరియా, డీఏపీ అన్ని ఆర్ఎస్‌కేల్లో నిల్వ చేశామని ఏడీఏ శ్యామ్‌సుందర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

బొబ్బిలిలో ఎరువులు తీసుకుంటున్న అన్నదాతలు

వాహన చలానా పేరుతో సైబర్ మోసం

ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం నేర వార్తా విభాగం, న్యూస్‌టుడే: తన వాహనం పేరిట జరిమానాలు ఉన్నాయని, వెంటనే కట్టాలని చరవాణికి సంక్షిప్త సమాచారం రాగా.. దానిని తెరవగానే రూ.12 వేలు మాయమయ్యాయని నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి ప్రసాద్ వాపోయారు. ఈమేరకు ఏఎస్పీ సౌమ్యలతకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటికే సైబర్ సెల్‌తో పాటు ఒకటో పట్టణ స్టేషన్‌ను ఆశ్రయించినా పట్టించుకోలేదని చెప్పారు. సోమవారం నగరంలోని పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆయనతో పాటు మరో 39 మంది ఆశ్రయించారు. భూ తగాదాలపై 13, కుటుంబ కలహాలపై 4, మోసాలపై 5, ఇతర అంశాలపై 18 వినతిపత్రాలు వచ్చాయని, వాటిని పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ ఆదేశించారు. మధ్యాహ్నం ఎస్పీ వకుల్ జిందాల్ చేరుకుని అర్జీలను తనిఖీ చేశారు. ఎస్బీ సీఐలు ఏవీ.లీలారావు, ఆర్‌వీఆర్‌కే.చౌదరి, డీసీఆర్‌బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, విజయనగరం జిల్లా

షార్ట్ టెండర్ ప్రకటన

టెండర్ నోటీసు నం.339/2025-26/A1 తేది.08/07/2025.

మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ విజయనగరం జిల్లా పరిధిలో గల 11 ICDS ప్రాజెక్టులుకు మరియు Institutionsకు స్టేషనరీ, ఎక్విప్‌మెంట్ మరియు ఇతర సామానులు సరఫరా చేయుటకు సీల్డు టెండర్లు తే 14-07-2025 ది లోపు ఆఫీసు పనిదినములలో కోరబడుచున్నవి. సీల్డు టెండర్లు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి, విజయనగరం వారి కార్యాలయమునకు సమర్పించవలెను.

టెండర్లు స్వీకరణ మొదలయ్యే తేది : 09-07-2025, ఉదయం 11.00 గంటలు.
టెండర్లు స్వీకరణకు చివరి తేది : 14-07-2025, సాయంత్రం 5.00 గంటలు.
టెండర్లు ఓపెనింగ్ తేది : 15-07-2025, ఉదయం 11.00 గంటలకు

సం/- జిల్లా సంయుక్త కలెక్టర్ మరియు ఛైర్మన్,
జిల్లా కొనుగోలు కమిటి (DPC), విజయనగరం

కర్లాంలో పౌల్ట్రీ కార్మికుల ఆందోళన

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం కర్లాంలో ఉన్న వెంకట్రామ పౌల్ట్రీ వద్ద ఉద్రిక్తత నెలకొంది. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని గతంలో పనిచేసిన కార్మికులు డిమాండు చేశారు. ఈమేరకు సోమవారం పత్తికాయవలస, కరకాం, సంకుపాలెం, పీకే.పాలవలస, గచ్చలవలస గ్రామాలకు చెందిన కార్మికులు పరిశ్రమ గేటు ముందు నిరసన తెలిపారు. పలువురు నాయకులు వీరికి మద్దతు తెలిపారు. వైకాపా పాలనలో ఆ పార్టీ నాయకుల బెదిరింపులకు తలొగ్గిన యాజమాన్యం తెదేపా మద్దతుదారులను తొలగించిందని ఆరోపించారు. రెండు నెలలుగా చర్చిస్తున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను కాదని ఇతర రాష్ట్రాల వారిని చేర్చుకోవడం సమంజసం కాదన్నారు. సమస్యను సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈనెల 11న ఎమ్మెల్యే కళా వెంకటరావు సమక్షంలో చర్చించనున్నట్లు చెప్పారు. చీపురుపల్లి ఆర్ఈసీఎస్ మాజీ అధ్యక్షుడు దన్నాన రామచంద్రుడు, అలజంగి ఎంపీటీసీ సభ్యుడు ఎస్.శ్రీనివాసరావు, పీకే.పాలవలస ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొర్లె లక్ష్మణరావు, నిమ్మలవలస మాజీ సర్పంచి వర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ గేట్లు నెట్టివేత.. నిరసన వ్యక్తం చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడంతో పలువురు పరిశ్రమ గేట్లను బలవంతంగా నెట్టుకుంటూ లోపలికి వెళ్లేందుకు యత్నించారు. సీఐ శంకరరావు, ఎస్సైలు ఎల్.దామోదరరావు, లోకేశ్, ఇతర సిబ్బంది వారిని అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం సంస్థ ప్రబంధకురాలిని బయటకు రప్పించి నాయకులు, కార్మికులతో ఎస్సై దామోదరరావు మాట్లాడించారు.

పరిశ్రమ గేటును తోసి లోపలికి వెళ్లేందుకు యత్నిస్తున్న కార్మికులు

జాజి పంట.. కేరళ టు పాచిపెంట!

వక్కలో అంతరపంటగా సాగుతో లాభం

న్యూస్‌టుడే, పాచిపెంట

సుగంధ ద్రవ్యాల సాగు అంటే మన ప్రాంతం అనుకూలం కాదని ఇప్పటి వరకు రైతులు ఆ ఆలోచనే చేయలేదు. దీనికి భిన్నంగా వక్కలో అంతర పంటగా జాజి సాగు చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలిచారు పాచిపెంట మండలం గోగాడవలస గ్రామానికి చెందిన చలసాని లీలా ప్రసాద్. గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలో వక్క, కొబ్బరి, ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఏడేళ్ల కిందట కేరళకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలతో అంతర పంటగా జాజి సాగు చేయాలని ఈయన నిర్ణయించారు. కేరళలో కొనుగోలు చేసి తెచ్చిన జాజి మొక్కలను ఎకరాలో 40 చొప్పున 20 ఎకరాల్లో నాటారు. ప్రస్తుతం పంట దిగుబడి వస్తోంది. దీర్ఘ కాలిక ఫలసాయాన్ని ఇచ్చే ఈ పంట వందేళ్ల వరకు కాపునిస్తుంది.

సస్యరక్షణ ఇలా..

- ఈ పంట సాగుకు నీడ, చల్లని వాతావరణం అనుకూలం.
- వక్క, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటగా వేస్తే మొక్కల ఎదుగుదల, దిగుబడి బాగుంటుంది.
- వక్కలో అంతర పంటలు వేయడం వల్ల ప్రత్యేకంగా వీటికి నీటి తడులు ఇవ్వాల్సిన అవసరం లేదు.
- డ్రిప్‌తో నిరంతరం నీరు పంటకు అందుతుంది.
- సేంద్రియ ఎరువైన పశువుల గెత్తం వాడడం వల్ల పంట తెగుళ్ల బారిన పడకుండా ఉంటుంది.
- వారంలో ఒకటి, రెండు రోజులు పంట పరిశీలించాలి.

దిగుబడి.. అమ్మకం

మొక్కలు నాటిన ఏడేళ్ల నుంచి దిగుబడి ప్రారంభం అవుతుంది. వందేళ్ల వరకు మొక్క అయిదు కిలోలకు తక్కువ కాకుండా కాయలు కాస్తుంది. మార్కెట్‌లో కిలో రూ.600 నుంచి రూ.700 వరకు ధర పలుకుతోంది. సగటున రెండు క్వింటాళ్ల దిగుబడికి పెట్టుబడి ఖర్చులు, మొక్కలు నాటడం, ఎరువులు, నిర్వహణకు ఖర్చులు ఏడాదికి సుమారు రూ. 40 వేల వరకు అవుతుంది. ఆ లెక్కన రూ.1.20 లక్షల ఆదాయం వస్తుంది. ఖర్చులు పోనూ రూ.80 వేల లాభం వస్తుందని రైతు చెబుతున్నారు. ప్రస్తుతం కేరళ, తమిళనాడులో ఒక్కో మొక్క నాణ్యతను బట్టి రూ.200 నుంచి రూ.1000 వరకు పలుకుతోంది. అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటే వ్యయప్రయాసలు తప్పవని, మరో పది ఎకరాలకు సరిపడే మొక్కల కోసం విత్తనాలు తెప్పించి నర్సరీని పెంచుతున్నట్లు ఆయన తెలిపారు.

రైతేరాజు

సకాలంలో చూడి కడితేనే సత్ఫలితం



కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పశు పోషణలో వ్యయం పెరిగి ఆదాయం తగ్గడంతో రైతులు నష్టపోతున్నారు. సకాలంలో చూడికట్టడం, సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక పాల దిగుబడి, పోషకులకు లాభం ఉంటుందని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారిణి శైలజ తెలిపారు. ఎద లక్షణాలు గుర్తించి సకాలంలో కృత్రిమ గర్భోత్పత్తి చేయించాలి. ఆవుల్లో ఆ లక్షణాలు ప్రస్ఫుటంగా ఉంటాయి. గేదెల్లో 40 శాతమే గుర్తించగలం. కృత్రిమ గర్భోత్పత్తి జరిపినపుడు కచ్చితంగా చూడి నిలబడాలని లేదు. ఈతల మధ్య వ్యవధి తక్కువగా ఉండాలి. గేదెలు 14 నుంచి 16, ఆవులు 12 నుంచి 14 నెలల్లో ఈనేలా చర్యలు ఉండాలి. గర్భధారణ జరిగిన మూడు నెలల్లోపు ఎదకు రాకుంటే పరీక్ష చేయించాలి. ఈనిన నాలుగు నెలల్లోపు చూడి కట్టేలా, పాల దిగుబడి తగ్గకుండా అదనపు మేపు అందించాలని సూచించారు.

కోతలు అనంతరం సస్యరక్షణ అవసరం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: జీడి, మామిడి కోతల అనంతరం సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కేవీకే ఉద్యాన విభాగ శాస్త్రవేత్త శ్రీనివాసరాజు సూచించారు. రైతుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

ప్రశ్న: మామిడి కోతల తర్వాత ఎలాంటి ఎరువులు వేయాలి? **- చిన్నారావు, బొండపల్లి**

సమాధానం: ఎరువులను జులై-ఆగస్టు మాసాల్లో చెట్టు మొదట్లో చల్లి నేలలో కలిసేలా తిరగబెట్టాలి. తక్కువ వర్షపాతం గల ప్రదేశాల్లో ఎరువులను, పోషక పదార్థాలను వర్షాకాలం మొదట్లో, రెండో దఫా చివరిలో వేయాలి. వర్షపాతం ఎక్కువున్న ప్రదేశాల్లో చివర్లో అందించాలి. తేలికపాటి భూముల్లో తగినంత చెరువు మట్టిని లేదా కంపోస్టు వేయాలి. ఒక్కో మొక్కకు మొదటి ఏడాది 100 గ్రాముల నత్రజని, 100గ్రా. భాస్వరం, 100 గ్రా. పొటాష్ అందేలా ఎరువులు వేయాలి.

?: మామిడి, జీడి మామిడి మొక్కలను ఎంత దూరంలో నాటుకోవాలి.?

- అంటు మొక్కలను మట్టిగడ్డతో సహా తీసి వేర్లు కదలకుండా గుంత మధ్యలో నాటాలి. మామిడి మొక్కలను 7.5×7.5 మీటర్ల దూరంలో హెక్టారుకు 178 మొక్కలు నాటాలి. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు 5×5 మీటర్ల దూరంలో 400 మొక్కలు నాటుకోవచ్చు. జీడిమామిడి 6×6 మీటర్లు దూరం చొప్పున 278 మొక్కలు నాటుకోవాలి.

వెద సాగు.. ఆదాయం బాగు

గుమ్మలక్ష్మీపురం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: ఖరీఫ్ సాగులో వరి ప్రధానం. పెరుగుతున్న ఖర్చులు, కూలీల కొరత లాంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని వెద సాగు పద్ధతి అవలంబిస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.తేజశ్వరరావు సూచించారు.

ఖర్చులు మిగులు.. నాట్లు వేస్తే ఎకరాకు 25 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. ట్రాక్టర్ కిరాయి, కూలీలు, ఎరువులు, పురుగు మందులకు ఎకరాకు రూ.30 వేలు అవుతుంది. దిగుబడి ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్లలోపే. వెద సాగులో ఎకరాకు 15 కిలోల విత్తనం సరిపోతుంది. నాటేందుకు కూలీల ఖర్చు ఉండదు. ముందస్తు చర్యలతో కలుపుతీత అవసరం లేదు. ఇదంతా కలిసి రూ.10 వేల వరకు ఆదా చేసుకోవచ్చు. దిగుబడి ఎకరాకు 25 నుంచి 32 క్వింటాళ్ల వరకు వస్తుంది.

ఎరువుల యాజమాన్యం

పొలం తయారీ సమయంలో ఎకరానికి 8-10 టన్నుల పశువుల గెత్తం వేయాలి. తొలకరి వర్షాలకు పెసర వంటి అపరాల పంటలు వేసి కలియదున్నాలి. ఎకరానికి 500 మి.లీ. అజోస్పైరిల్లం, 500 మి.లీ పాస్ఫో బాక్టీరియాను 100 కిలోల పశువుల గెత్తంతో కలిపి విత్తిన తర్వాత తేమ ఉన్నప్పుడు వేసుకోవాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

ఖరీఫ్‌లో సాగవుతున్న వరి, మొక్కజొన్న, చెరకు తదితర పంటల్లో ఎరువుల యాజమాన్యం, విత్తనశుద్ధి, నేలలకు అనుకూలమైన ఎలాంటి పంటలు వేసుకోవాలి వంటి సలహాలకు 89781 14299 నంబరును సంప్రదించాలని కేవీకే ప్రోగ్రాం సమన్వయకర్త ధ్రువ తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	98	166	176

సచివాలయాల్లో 3,875 మందికి బదిలీ!!

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల్లో భారీగా బదిలీలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో 3,875 మంది సొంత మండలం దాటి వెళ్లనున్నారు. వీరిలో 3,571 మంది అయిదేళ్ల సర్వీసు పూర్తి చేయడంతో తప్పనిసరిగా స్థానాలు మారనున్నారు. మిగిలిన 304 మందిని రిక్వెస్ట్ కింద ఇతర ప్రాంతాలకు పంపనున్నారు. శాఖల వారీగా ఇప్పటికే ప్రక్రియ పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. సంబంధిత జాబితాపై ప్రస్తుతం పరిశీలన జరుగుతోంది. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సిబ్బంది మరో రెండు రోజుల్లో కేటాయించిన స్థానాలకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

హేతుబద్ధీకరణతో ఖాళీలు.. గ్రేడ్- 5 కార్యదర్శులు, పట్టు పరిశ్రమ, విద్యుత్తుశాఖ మినహా 12 విభాగాల్లో బదిలీలు నిర్వహించారు. ఇందులో పురపాలక/అర్బన్ డెవలప్‌మెంట్, 11 ఇతర ప్రభుత్వ శాఖలున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 778 సచివాలయాలకు 6,178 పోస్టులు మంజూరయ్యాయి. 5,452 మంది మాత్రమే పనిచేస్తున్నారు. హేతుబద్ధీకరణ తర్వాత అన్ని శాఖల్లో కలిపి 5,894 ఉద్యోగులే అవసరముంటుందని ప్రాథమికంగా గుర్తించారు. కొన్నిచోట్ల తక్కువ మందినే వినియోగిస్తుండడంతో మిగిలిన వారిని జిల్లా, డివిజన్ కార్యాలయాల్లో సర్దనున్నారు. విద్యుత్తుశాఖలో ఎనర్జీ సహాయకుల నియామకాలను శాఖపరంగా నిర్వహించినందున, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారికి స్థానచలనం కల్పిస్తారు. పట్టుపరిశ్రమల శాఖలో ఉన్న ఇద్దరు ఉద్యోగులు పదోన్నతిపై వెళ్లడంతో బదిలీలు జరగలేదని సచివాలయాల జిల్లా అధికారిణి ఎస్.రోజారాణి తెలిపారు.

శాఖల వారీగా స్థానచలనాలిలా..

శాఖ	తప్పనిసరి	రిక్వెస్ట్
రెవెన్యూ	57	-
ఉద్యాన	106	05
సాంఘికసంక్షేమ	333	01
పంచాయతీరాజ్	361	27
వైద్య శాఖ	530	10
మహిళా పోలీసు	554	04
పంచాయతీ(డీఏ)	255	23
పశుసంవర్ధక	213	72
మత్స్యశాఖ	34	-
వ్యవసాయ	340	149
సర్వే, భూములశాఖ	342	10
పురపాలక, అర్బన్	446	03

బ్యాంకు ఖాతాలు తప్పనిసరి

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: తల్లికి వందనం పథకం వర్తించేందుకు ఎస్సీ వర్గానికి చెందిన ఒకటో తరగతి విద్యార్థులు తల్లి పేరుతో, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నవారు వ్యక్తిగతంగా బ్యాంకు లేదా తపాలా శాఖల్లో ఖాతాలను తెరుచుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు యు.అన్నపూర్ణమ్మ తెలిపారు. వాటికి ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని చెప్పారు. వివరాలకు 96868 02519ను సంప్రదించాలన్నారు.

స్టాఫ్‌నర్సులకు స్థానచలనం

విజయనగరం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని మహారాజా ప్రభుత్వాసుపత్రిలో సేవలందిస్తున్న 20 మంది స్టాఫ్‌నర్సులను విశాఖలోని కేజీహెచ్‌కు బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరి స్థానంలో అక్కడి నుంచి 20 మంది వస్తున్నారని సూపరింటెండెంటు ఎస్.అప్పలనాయుడు తెలిపారు. ★ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా పర్యవేక్షకుడు ఎస్.గోపాలరావు మచిలీపట్నం బదిలీ అయ్యారు. విశాఖపట్నంలో ఈ విభాగం బాధ్యతలు చూస్తున్న బద్రి ఇక్కడకు రానున్నారు.

విశ్రాంత వైద్యుడి పింఛనులో 6 శాతం కోత

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: గతంలో సివిల్ సర్జన్‌గా, ఘోషాసుపత్రి సూపరింటెండెంటుగా సేవలందించి 2022లో ఉద్యోగ విరమణ పొందిన డా.రవిచంద్రకు వచ్చే పింఛనులో 6 శాతం కోత విధిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2012లో గాజులరేగ ప్రాంతానికి చెందిన గర్భిణి టి.రూప ఆసుపత్రిలో చేరగా, ప్రసవ సమయంలో ఆమెతో పాటు బిడ్డ కూడా చనిపోయింది. అప్పట్లో ఆమె కుటుంబ సభ్యులు, స్థానికులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. దీనిపై అప్పటి ప్రభుత్వం కమిటీ వేసి విచారణకు ఆదేశించింది. అందులో భాగంగా ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న మహిళా వైద్యురాలు అనురాధ, మత్తు వైద్యుడు సుబ్బారావుపై చర్యలు తీసుకున్నారు. సూపరింటెండెంటు హోదాలో ఉన్న రవిచంద్ర వారికి సరైన సూచనలు చేయలేకపోయారని భారీ జరిమానా వేయాలని భావించారు. కానీ సరైన నిర్ణయం తీసుకోలేదు. ఈలోపు ఆయన విరమణ పొందారు. గతంలో అందించిన సేవలు, వృద్ధాప్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, తాజాగా పింఛనులో కోత విధించాలని ఆదేశాలొచ్చాయి.

అసభ్యకరంగా చిత్రీకరణ యువకుడి అరెస్టు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ఓ వివాహిత స్నానం చేస్తుండగా వీడియో తీసి, ప్రశ్నించిన ఆమె భర్తపై దాడి చేసిన నిందితుడ్ని ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించారు. ఈ కేసు వివరాలను సీఐ శ్రీనివాస్ సోమవారం వెల్లడించారు. బాధితురాలు ఈనెల 4వ తేదీన స్నానం చేస్తున్న సమయంలో పి.శంకర్ అనే వ్యక్తి వీడియో తీశాడు. గమనించిన ఆమె కేకలు వేయగా.. పరారయ్యాడు. భర్తకు విషయం తెలియడంతో అతను వెళ్లి శంకర్‌ను నిలదీసి, చరవాణి తీసుకున్నాడు. ఈక్రమంలో అతడిపై దాడికి పాల్పడి, చరవాణితో శంకర్ పారిపోయాడు. సాంకేతికత ఆధారంగా అతడిని అరెస్టు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు

మన్యం వాసి మృత్యువాత

ఘటనా స్థలంలో దెబ్బతిన్న కారు

రమణమూర్తి (పాతచిత్రం)

ఆనందపురం, పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆగిఉన్న లారీని కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన 16వ జాతీయ రహదారి ఆనందపురంలోని వేములవలస సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ట్రాఫిక్ ఎస్సై పాపారావు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం బీజేపురం అగ్రహారం గ్రామానికి చెందిన కె.రమణమూర్తి(57) 30 ఏళ్లుగా ఓ బీమా సంస్థలో ఏజెంట్‌గా పని చేస్తున్నారు. దేవి సంతోష్, గాయత్రిదేవి సంతానం. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కుమారుడు దేవిసంతోష్ ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో మద్దిలపాలెంలో నివాసముంటున్న కుమార్తె గాయత్రిదేవి వద్దకు వెళ్లేందుకు ఇద్దరూ కారులో బయలుదేరారు. వేములవలస వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి ఆగిఉన్న లారీని ఢీకొంది. దీంతో రమణమూర్తి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు చేరుకుని కారులో ఇరుక్కుపోయిన సంతోష్(31)ను బయటకు తీసి ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం క్షతగాత్రుడిని తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కారును పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆనందపురం సీఐ వాసునాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు. రమణమూర్తి భార్య రమణి ఎనిమిదేళ్ల కిందట మృతి చెందారు.

నగరంలో పీర్ల పండగ

ఊరేగింపులో పాల్గొన్న ముస్లిం సోదరులు, నగరవాసులు

మొహర్రంను పురస్కరించుకొని విజయనగరంలో పీర్ల పండగను సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురవీధుల్లో పీర్లను ఊరేగించారు. అంబటిసత్రం నుంచి మూడులాంతర్లు, కోట తదితర ప్రాంతాల మీదుగా తిరిగారు. ముస్లిం సోదరులతో పాటు పట్టణవాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పీర్ల ముందు కర్రసాము చేస్తున్న దృశ్యం

70 మంది బాలికలకు సైకిళ్ల పంపిణీ

బాడంగి, న్యూస్‌టుడే: వీకే ట్రస్టు మరోసారి దాతృత్వం చాటుకుంది. బాడంగి మండలంలో తల్లిదండ్రులను కోల్పోయిన 70 మంది విద్యార్థినులకు రూ.5 లక్షలు విలువజేసే సైకిళ్లను అందించింది. బాడంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి ఎస్.సత్యకుమార్ చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. క్రేజీబీ ఫైనాన్స్ సర్వీసు సహకారం అందించినట్లు చెప్పారు. ఎంఈవో రాజేశ్వరి, హెచ్‌ఎం సత్యనారాయణ, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గతంలోనూ పెద్దఎత్తున సైకిళ్లను అందించింది.

విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

EENADU Classifieds

AGRI BUSINESS
Tomato Trading. Earn 1000 daily profit on investment. Cntct: 6309090490. Svfpl.

BUSINESS SERVICES

BATH CLEANING

TO LET
2BHK with Car Parking in between Sun School and Fort City School for rent. Mobile: 9441637846 or 7013056499.

HEALTH & CARE

JOBS

NEURO

REAL ESTATE

FLAT FOR SALE

LAND FOR SALE
Land for Sale: 1.5 Acres (NH-16) Highway Adjacent along Vizag-Srikakulam Rd. & Nathavalasa Jn., Nr. Bhogapuram. Ph: 9959964304.

PLOT FOR SALE
116 Sq. Yards Plot No.24, Sarvani Nagar. Contact: 8374612225.

WANTED
A Leading Woman & Child Hospital in Vizianagaram required working team
1) Anaesthetist
2) Obstetrician and Gynecology
3) O.T. Technician
4) X-ray Technician
5) Pharmacist
6) Receptionist Female (Age:35)
VENKATAPADMA HOSPITAL
3 Lamps Jn., Vizianagaram
Cell: 9985153355, 08922-227131,225777

FACULTY/ TEACHERS

Wanted Marketing Managers to work in Ministry of Divinity, Vizag. Salary Rs. 27,500/-. ✆: 86393 67991.

గమనిక

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

4,500 మొక్కలు అందజేత

అధికారులతో సమీక్షిస్తున్న బేబినాయన

బొబ్బిలి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని రైతులకు రాయితీపై 4,500 జీడి, మామిడి మొక్కలను అందజేయనున్నట్లు ఎమ్మెల్యే బేబి నాయనకు ఏడీహెచ్ తెలిపారు. ఆయన కోటలో ఆయా అధికారులతో సమీక్షించారు. వర్షాలు కురుస్తున్నందున రైతులకు అవసరమైన మొక్కలు ఇవ్వాలన్నారు. ఉద్యాన క్షేత్రంలో అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం నిర్వహించిన 'ప్రజా దర్బార్‌'లో ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

గజపతినగరం సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కిరణ్‌కుమార్

గజపతినగరం, న్యూస్‌టుడే: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎల్‌పీవో కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం గజపతినగరం పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రస్తుతం డివిజన్ పరిధిలోని 150 సచివాలయాల్లో 50 చోట్ల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్యం అమలు తీరును ప్రభుత్వం ఐవీఆర్ఎస్ విధానంలో నేరుగా ప్రజల నుంచి తెలుసుకుని, ఆయా చోట్ల వెంటనే కార్యక్రమాలు జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య శాఖతో కలిసి దోమల నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆదివారం గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుగుణాకరరావు, కార్యదర్శి జనార్దనరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో రైతుల అవస్థలు

రామభద్రపురం మార్కెట్లో రైతులు గొడుగుల కింద కూరగాయలు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మార్కెట్ రహదారులు బురదతో నిండిపోయాయి. పక్కా షెడ్లు లేకపోవడంతో చిరు వ్యాపారులు, రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పక్కా షెడ్లు, రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని సర్పంచి ఈశ్వరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, రామభద్రపురం

రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఎరువుల దుకాణంపై కేసు నమోదు

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం యూనిట్ విజిలెన్స్, మండల వ్యవసాయాధికారులు మెట్టపల్లిలోని ఓ ఎరువుల దుకాణాన్ని సోమవారం తనిఖీ చేశారు. బస్తాల బరువుల్లో తేడా ఉండటంతో డీలరుపై కేసు నమోదు చేసి, రూ.1,49,200 విలువైన 5.7 టన్నుల ఎరువును స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్, ఎస్సై రామారావు తెలిపారు. కార్యక్రమంలో ఏవో సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

నేడు హోం మంత్రి రాక

బొబ్బిలి, న్యూస్‌టుడే: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం బొబ్బిలి పట్టణం 17వ వార్డులో జరగనున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి హాజరు కానున్నారు. వార్డులో ఎమ్మెల్యే బేబినాయనతో పాటు కలిసి పర్యటించనున్నారు. ఈ మేరకు తెదేపా నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	80085 74367
గజపతినగరం	80085 74332
రాజాం	80085 74308
గరివిడి	80085 74348

?: కెల్ల మధుర బెల్లానపేట వద్ద నిర్మించిన గోదాం నిరుపయోగంగా మారింది. వినియోగంలోకి తీసుకురావాలి. - **స్థానికులు** ❖ సమస్యని జిల్లా అధికారులకు నివేదించాం. - **శ్రీను, సీఈవో, కెల్ల సొసైటీ** – న్యూస్‌టుడే, గుర్ల

?: చంద్రంపేట హౌసింగ్ కాలనీలో మురుగు నిల్వ ఉండటంతో అవస్థలు పడుతున్నాం. - **స్థానికులు** ❖ తొలగింపు చర్యలు చేపడతాం. - **వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

?: మిర్తివలస గ్రామ బీసీ కాలనీలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. - **స్థానికులు** ❖ నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తాం. - **రమేష్, ఏఈ** – న్యూస్‌టుడే, రామభద్రపురం

?: బోనంగి ఉన్నత పాఠశాలలో తాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. - **విద్యార్థులు** ❖ మరమ్మతులు చేపట్టి తాగునీరు అందిస్తాం. - **వెంకటరావు, ఎంఈవో-2** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

?: విశాఖ నుంచి వంగర మండలం బంగారువలసకు వచ్చే బస్సు సర్వీసు పునరుద్ధరించాలి. - **వంగర మండల ప్రజలు** ❖ చీపురుపల్లి వద్ద వంతెన నిర్మాణం పూర్తయిన వెంటనే బంగారువలసకు వచ్చే బస్సు సర్వీసు పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతాం. - **పి.వెంకటేశ్వరరావు, డిపో మేనేజరు, పాలకొండ** –న్యూస్‌టుడే, వంగర

?: రాజాం పట్టణంలోని పాలకొండ రహదారి గుంతలమయంగా మారింది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - **స్థానికులు** ❖ పరిశీలించి, మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. - **నాగభూషణరావు, ఆర్‌అండ్‌బీ జేఈ** – న్యూస్‌టుడే, రాజాం

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

బాడంగి, న్యూస్‌టుడే: గదబవలస గిరిజన గ్రామ శ్మశానవాటికకు స్థలం కేటాయించి రహదారి నిర్మించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దారు సుధాకర్‌కు సోమవారం గ్రామస్థులు వినతిపత్రం అందించారు. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల రాజ్యం.. వివాదాలకు ఆజ్యం

జాతీయ రహదారి సలాలు కనుమరుగు

గజపతినగరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. వాటిని నిలిపేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఆక్రమణల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. చివరకు ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారుల మధ్య వివాదాలు చెలరేగుతున్నాయి. వీరికి రాజకీయ పార్టీలు కొమ్ముకాస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

తొలగించాక సంఖ్య రెట్టింపు!

రెండేళ్ల కిందట గజపతినగరం జాతీయ రహదారి విస్తరణ జరిగింది. ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించారు. వాటిని ఆనుకుని కొంత ప్రభుత్వ స్థలం ఉంది. దాన్ని ఆక్రమించి శాశ్వత షెడ్లు వేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. అప్పట్లో రోడ్డు విస్తరణ సమయంలో గజపతినగరం, పురిటిపెంట, మధుపాడ ప్రాంతాల్లో రెండు కి.మీ దూరంలో ఇరువైపులా 178 ఆక్రమణలు గుర్తించి తొలగించారు. పనులు జరిగిన అనంతరం ఏడాది కాలంలో ఆ సంఖ్య 310కి చేరింది. అధికారులు కిమ్మనకపోవడం, ఒకరి ఆక్రమణల్లో మరొకరు చేరడంతో వివాదాలు చెలరేగుతున్నాయి. చేస్తోంది ఆక్రమమైనా అధికారుల్నే ప్రశ్నించే స్థాయికి చేరారు.

అద్దెలకు ఇచ్చి డబ్బు వసూలు

గజపతినగరం పంచాయతీ స్థలాల్లో ఇప్పటికే 130 వరకు ఆక్రమణలు ఉన్నాయి. వాటిని తొలగించేందుకు ఎలాంటి చర్యలు లేవు. చివరికి గణేష్ ఆలయం వద్ద ఆక్రమణల మూలంగా వివాదం రోడ్డున పడింది. గజపతినగరం పంచాయతీ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న స్థలంలో ఆక్రమణదారులున్నారు. వారంతా ఆ స్థలాలను చిల్లర వర్తకులకు అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. 15 ఏళ్లుగా అద్దె చెల్లిస్తున్నామని, ఇప్పుడు శాశ్వత దుకాణాలు నిర్మిస్తుంటే వెంటనే ఖాళీ చేయాలని అంటున్నారని గజపతినగరంలోని వర్తకులు శుక్రవారం జరిగిన గ్రామ సభలో అధికారుల ముందే గొడవకు దిగారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

పురిటిపెంట ప్రభుత్వ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసిన కబ్జాదారులు అద్దెలకు ఇచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంపై వివాదం జరుగుతోంది

మధుపాడ పంచాయతీ పరిధి పెట్రోలు బంకు, విద్యుత్తు ఉపకేంద్రం వద్ద ఆక్రమణలు వివాదాలకు గురవుతున్నాయి. పురిటిపెంట పంచాయతీ పరిధిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆనుకుని ఉన్న జాగాలో ఇటీవల మరిన్ని కొత్త ఆక్రమణలు పుట్టుకొచ్చాయి. వీటిపై అధికారుల్లో చలనం లేదు. చర్యలు తీసుకోవాలని స్థానికులు అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

జాతీయ రహదారి పక్కన ప్రస్తుతం కొన్ని పనులు జరుగుతున్నాయి. పూర్తికాగానే ఆక్రమణలు గుర్తించి చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందిస్తాం. గతంలో ఉన్న ఆక్రమణల జాబితాలోకి కొత్తవి చేరాయి.

– సత్యశేఖర్, డీఈ, ఎన్‌హెచ్

ఆర్‌అండ్‌బీ అధికారులు కోరితే..

రోడ్లు భవనాల అధికారులు కోరితే ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మాకు వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తున్నాం.

– రత్నకుమార్, తహసీల్దారు, గజపతినగరం

పంచాయతీలకు తెలిసే..

ఆక్రమించిన వ్యక్తులు షెడ్లు వేసుకుంటున్నారు. వారికి విద్యుత్తు మీటర్లు ఇచ్చినప్పుడు పంచాయతీ అధికారుల తీర్మానాలు తప్పనిసరి. ఆ సమయంలో సంబంధిత స్థలం పత్రాలను పంచాయతీ అధికారులు అడిగి, ప్రైవేటు స్థలంగా ఉంటేనే తీర్మానం ఇవ్వాలి. అలా కాకుండా రాజకీయ వ్యవహారమో, కాసులకో లోబడి పంచాయతీలు విద్యుత్తు మీటర్లు అందించేందుకు సిఫార్సులు చేస్తున్నాయి. ఇది ఆక్రమణదారులకు బలం ఇస్తోంది. వారి సొంత ఆస్తిలా అనుభవిస్తూ వివాదాలకు దిగుతున్నారు.

నిర్మాణం పూర్తికి ఇంకెన్నాళ్లు

గుర్ల మండలంలోని గోషాడ, జమ్ముల గ్రామాల్లో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు దశాబ్దం దాటినా ఒక్క అడుగు ముందుకు పడడం లేదు. గతంలో నిధులు మంజూరు కాకపోవడంతో ఆగిపోయాయి. తర్వాత ధరలు పెరగడంతో వచ్చిన నిధులు సరిపోవని పక్కన పెట్టేశారు. దీంతో మొండిగోడలే దర్శనమిస్తున్నాయి. చేపట్టిన నిర్మాణాలు పాడవుతున్నాయని, వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయమై సీడీపీవో ఆరుద్ర మాట్లాడుతూ.. ప్రభుత్వానికి నివేదించామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, గుర్ల

గండ్లు పూడ్చేదెప్పుడో?

మద్దువలస ఎడమ ప్రధాన కాలువ నుంచి కొనసాగే మగ్గూరు బ్రాంచి కెనాల్ సుమారు 350 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఓని అగ్రహారం, మగ్గూరు, సంగాం గ్రామాల సాగు భూములకు నీరందాలి. ఎడమ ప్రధాన కాలువలో గత నెలలో పూడిక తొలగించినా.. మగ్గూరు ఉప కాలువను పట్టించుకోలేదు. దీని పరిధిలో రెండు చోట్ల గండ్లు ఉండడంతో ఈనెల 7న విడిచిపెట్టే సాగునీరు పొలాలకు చేరదని రైతులు ఆదివారం శ్రమదానం చేసి తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేశారు. మగ్గూరు బ్రాంచి కాలువ ఏఈఈ ఎం.క్రాంతికుమార్ వద్ద ప్రస్తావించగా.. ఇప్పటికే పనులు చేపట్టడానికి రూ.7 లక్షలతో ప్రతిపాదనలు పంపించామని, ఆమోదం వచ్చిన వెంటనే చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, వంగర

ఇలాగైతే వ్యాధులు రావా..

చీపురుపల్లి చేపల మార్కెట్‌లో తాగునీటి వాల్వు పాడవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాల్వు నుంచి తాగునీరు లీకవుతోంది. పైకప్పు పగిలిపోయింది. దీంతో వర్షపునీరు, మురుగు, వాడుక నీరు వాల్వులోకి చేరి తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐ.రామకృష్ణ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా.. సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు సురక్షిత జలం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, చీపురుపల్లి

ఆ దారిలో వెళ్లలేం

సంతకవిటి మండలం కొండగూడెంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో మురుగు నీరు చేరుతోంది. అక్కడి సీసీ రోడ్డు గుంతలమయం కావడంతో నీటి నిల్వ కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ ప్రాంతం మరింత అధ్వానంగా మారింది. అక్కడ కాలువలు కూడా లేవని స్థానికులు చెబుతున్నారు. పరిశీలించి, నీరు నిలవకుండా చూస్తామని పంచాయతీ కార్యదర్శి నరేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

సారూ.. శుభ్రం చేయండి

రేగిడి మండలంలోని సంకిలి వద్ద నాగావళి నదిపై నిర్మించిన వంతెన ఇది. పొడవునా ఇరువైపులా మట్టి, పనికి రాని మొక్కలు పెరిగిపోయాయి. దీంతో వర్షం నీరు పోయేందుకు ఏర్పాటు చేసిన ఖాళీలు మూసుకుపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీరు నిలిచి వంతెన, రెయిలింగ్ పాడవుతుందని, ఇరువైపులా మట్టి, గడ్డిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ కిరణ్‌ను అడగ్గా ప్రతిపాదించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రేగిడి

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

గుర్ల, న్యూస్‌టుడే: అచ్యుతాపురం ఫీడర్ పరిధిలోని తెట్టంగి, తాతావారికిత్తలి, పోలాయవలస గ్రామాల్లో కొత్తలైను ఏర్పాటు చేయనున్నందున మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ త్రినాథరావు తెలిపారు.

గ్రంథాలయానికి వితరణ

తెర్లాం: తెర్లాం గ్రంథాలయంలో పుస్తకాలు భద్రపరిచేందుకు దత్తి లక్ష్మణరావు తన సొంత నిధులు రూ.10 వేలతో ఇనుప ర్యాక్ అందించారు. ❖ **విద్యార్థులకు సామగ్రి:** గజపతినగరం: ఎం.గుమడాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అల్లు లక్ష్మీనారాయణమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నీటి సీసాలు, పుస్తకాలు తదితర సామగ్రి అందించారు.

గ్రామసభ నిర్వహణ

చీపురుపల్లి గ్రామీణం: రామలింగాపురం పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామసభ జరిగింది. అవసరాల గుర్తింపు, తాగునీటి సరఫరా, పరిశుభ్రత, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు.

గంజాయి కేసులో నాలుగేళ్ల జైలు

న్యాయవార్తా విభాగం: రేగిడి మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు నాలుగేళ్ల చొప్పున జైలు శిక్ష పడింది. 2023లో పోలీసుల తనిఖీల్లో వి.రాంబాబు, పి.వెంకటేష్, పి.జినబంధుష్ 6.6 కిలోల గంజాయితో పట్టుబడ్డారు. నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు. న్యాయస్థానంలో కేసు రుజువు కావడంతో శిక్ష విధించినట్లు పోలీసులు వెల్లడించారు.

అధ్వానం.. నరకప్రాయం

పోలీస్ స్టేషన్ రహదారి దుస్థితి

చీపురుపల్లి రోడ్లన్నీ గోతులమయమే

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి పట్టణంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే గాంధీ సెంటర్ కూడలి నుంచి పోలీస్ స్టేషన్, రైల్వే స్టేషన్, పాఠశాల, పలు వీధులకు వెళ్లే రహదారి గోతులమయమైంది. మెట్టకాలనీలో సిమెంటు రోడ్ల నిర్మాణం జరగక వర్షాలు కురిస్తే మట్టి మార్గం జారుడు బల్లల్లా తయారవుతున్నాయి. కాలనీలో 400 వరకు కుటుంబాలు నివాసముంటున్నాయి. రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా, గ్యాస్ సిలిండర్, సరకులను ఇంటికి తేవాలన్నా యాతన తప్పడం లేదు. ఆంజనేయపురంలో పాత కిరోసిన్ బంకు నుంచి రాధామాధవ ఫంక్షన్ హాలు వరకు రహదారి, అక్కడున్న కూడలి ప్రాంతం పూర్తిగా పాడయ్యాయి. కొత్తఅగ్రహారం రహదారి అధ్వానంగా తయారైంది. జి.అగ్రహారంలో విజయనగరం- పాలకొండ రహదారి నుంచి రావిచెట్టు మీదుగా పాఠశాల వరకు రోడ్డు పాడైంది. పట్టణంలో రహదారులు, కాలువలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మండల ఇంజినీరింగ్ అధికారి డి.రమేష్ మాట్లాడుతూ.. అవసరమైన చోట్ల రహదారులు, కాలువల నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు.

మత్తుకు దూరంగా ఉండండి

మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వల్ల నష్టాలపై విద్యార్థులు మరింత అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ భవ్యారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని అభ్యుదయ టెక్నో పాఠశాలలో ప్రిన్సిపల్ డా.చింతా శారద అధ్యక్షతన జరిగిన సదస్సులో మాట్లాడారు. మాదక ద్రవ్యాల వాడకంతో యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటోందన్నారు. 'సంకల్పం'లో భాగంగా ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం పాఠశాల కరస్పాండెంటు కూర్మినాయుడు(నాని), విజయనగరం టాస్కుఫోర్సు సీఐ బంగారుపాప ప్రసంగించారు. విద్యార్థులకు తెరపై చిత్రాలు, వీడియోలు చూపించి అవగాహన కల్పించారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

చెక్కులు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయానికి కొత్తగవిడి వీధికి చెందిన జి.వెంకటరామ్మోహనరావు, రమణి దంపతులు రూ.50,116 విరాళాన్ని ప్రకటించారు. వారి తల్లిదండ్రులు జి.వెంకటరామారావు, తేజోవతి జ్ఞాపకార్థం సోమవారం ట్రస్టు సభ్యులు ఆదిబాబు, విష్ణుమూర్తి, దాసరి రవికి చెక్కులు అందజేశారు.

కూటమి పాలనతోనే అభివృద్ధి

మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నీలావతి గ్రామంలో చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని రంగాలకు ప్రత్యేక నిధులు కేటాయించిందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు తదితరాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తెదేపా మండలాధ్యక్షుడు కొండపల్లి భాస్కరరావు, రంధి అర్జున మహేశ్వరరావు, అల్లు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ❖ **వంగర:** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మద్దువలస, మగ్గూరు, ఓనిఅగ్రహారం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పి.మోహనరావు, బొత్స వాసుదేవరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మగ్గూరులో కరపత్రాలు చూపుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పంటల బీమా.. రైతన్నకు ధీమా

ప్రీమియం చెల్లిస్తే మేలు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా పథకాలు రైతన్నకు దన్నుగా నిలుస్తున్నాయి. ప్రకృతి విపత్తుల కారణంగా పంటలు పోవడం, దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అలాంటి వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి ఫసల్, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల సౌకర్యాలు కల్పించారు. ఆసక్తి కలిగిన రైతులు నిర్దేశించిన గడువులోగా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అర్హులైన రైతులు వినియోగించుకోవాలని ఏడీఏ శ్యాంసుందర్ కోరారు.

పొలంలో దమ్ము పడుతున్న రైతు

ఈ మూడు పంటలకు ప్రత్యేకం

ప్రధాన మంత్రి పంటల బీమా పథకం వరి, మొక్కజొన్న, నువ్వుకు వర్తిస్తుంది. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ సంస్థ ఆధ్వర్యంలో బీమా సౌకర్యం కల్పించారు. వరి పంట ఎకరానికి రైతు వాటాగా ప్రీమియం రూ.200, మొక్కజొన్న-రూ.165, నువ్వుకు రూ.65 చొప్పున చెల్లించాలి. మీసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పంట కోత ప్రయోగాల ఆధారంగా ఏడు సంవత్సరాల సరాసరి దిగుబడి ఆధారంగా వరికి రూ.40 వేలు, నువ్వుకు రూ.12 వేలు, మొక్కజొన్నకు రూ.35 వేలు చొప్పున నష్ట పరిహారం వస్తుందని ఏడీఏ వివరించారు. వరి పంటకు ఆగస్టు 15, మొక్కజొన్న, నువ్వు పంటలకు జులై 31లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంకుల ద్వారా రుణం తీసుకున్న రైతులు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు.

వాతావరణ ఆధారిత బీమా

ప్రతికూల వాతావరణం వల్ల నష్టపోయిన పంటలకు వర్తించేదే వాతావరణ ఆధారిత బీమా పథకం. కేవలం పత్తికి మాత్రమే వర్తిస్తుంది. జులై 15వ తేదీలోగా ఎకరానికి రూ.1,923 ప్రీమియం చెల్లించాలి. నష్టం వస్తే ఎకరానికి రూ.38 వేలు బీమా సంస్థ చెల్లిస్తుంది. వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి వేగం ఆధారంగా నష్టాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. రైతులు మీసేవా కేంద్రాల్లో 1బీ, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, వ్యవసాయశాఖ అధికారుల నుంచి పంట ధ్రువీకరణ పత్రం జతచేసి ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించాలి.

డివిజన్‌లో సాగు ఇలా..

బొబ్బిలి డివిజన్ పరిధిలోని రామభద్రపురం, బాడంగి, తెర్లాం, బొబ్బిలి మండలాల పరిధిలోని రైతులు ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమయ్యారు. వరి-15,345, మొక్కజొన్న-3,625, నువ్వు-2,150, పత్తి-1,680 హెక్టార్లు చొప్పున సాగు చేపట్టారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: వర్షాకాలం నేపథ్యంలో చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సర్పంచి మంగళగిరి సుధారాణి అధికారులకు సూచించారు. తాగునీటి ట్యాంకులు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పాడైన వీధి దీపాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. సంగోడి మెట్ట కాలనీలో పనికిరాని మొక్కలను తొలగించాలని పేర్కొన్నారు. ఈవో వై.యూస్నీరాణి, నాయకులు రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు, ఇప్పిలి అనంతం తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న మేజర్ పంచాయతీ సర్పంచి మంగళగిరి సుధారాణి

'సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదు'

మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

గజపతినగరం, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ప్రకటించిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదని జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి కుటుంబానికి ఏడాదిలో జరిగిన నష్టాలను వివరించాలని నేతలు, నాయకులకు వివరించారు. వైకాపా బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఈ సందర్భంగా అన్నారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు, అయిదు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండలాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్‌ఎస్ అధికారి చొరవతో బస్సు సౌకర్యం

రేగిడి, న్యూస్‌టుడే: మండలంలోని ఖండ్యాం గ్రామానికి ఎట్టకేలకు ఆర్టీసీ బస్సు వచ్చింది. గ్రామస్థులతో కలిసి ఆర్టీసీ అధికారులు పూజలు చేసి సోమవారం సర్వీసును ప్రారంభించారు. తమ ప్రాంతం మీదుగా బస్సు నడపాలని గ్రామానికి చెందిన ఐఆర్‌ఎస్ అధికారి బవిరి సంతోష్‌కుమార్ జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టరు స్పందించి, పాలకొండ డిపో మేనేజరు వెంకటేశ్వరరావుతో మాట్లాడారు. డిపో చీఫ్ ఇన్‌స్పెక్టరు రమేష్ గ్రామానికి బస్సుతో సహా వెళ్లి తొలి సర్వీసును ప్రారంభించారు.

వాహనం వద్ద గ్రామస్థులు

క్షమా గుణంతోనే వ్యక్తి ఉన్నతి

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కారుణ్య ఫౌండేషన్ ప్రతినిధులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: క్షమా గుణమే వ్యక్తి ఉన్నతికి దోహదపడుతుందని కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు జేసీ రాజు అన్నారు. సోమవారం ప్రపంచ క్షమాపణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ కార్యాలయంలో యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎందరో ఆర్తనాదాలకు కారణమవుతున్న కామ, క్రోధ వంటి హీనగుణాలను జయించే శక్తి క్షమా గుణానికి ఉందన్నారు. యువత క్షమా గుణంతో ముందుకెళ్తే ఉన్నత స్థానం చేరుకుంటారని చెప్పారు. అనంతరం వాటికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. సభ్యులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, యుగంధర్, శివకాంత్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

బాధిత మహిళలకు అండగా నిలవాలి

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: సఖి (వన్ స్టాప్ కేంద్రం) ద్వారా బాధిత మహిళలకు అండగా నిలవాలని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. సోమవారం తన ఛాంబర్లో సఖి గోడప్రతులను ఆవిష్కరించారు. దాడికి గురైన బాలికలు, మహిళలకు పోలీసు, న్యాయ, వైద్య సహాయంతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. వారి రక్షణ కోసం తాత్కాలిక వసతిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ విమలారాణి, నోడల్ అధికారి నాయుడు, వన్‌స్టాప్ కేంద్రం పరిపాలనాధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

విజయనగరం రైతుబజార్లలో సోమవారం ధరలు (కిలో రూ.లలో) ★ వంకాయలు: తెల్లవి- 50, రవి వంగ- 40, నల్లవి- 32 ★ టమాటా: 32 ★ బెండ: 45 ★ కాకర: 35 ★ బీర: 40 ★ క్యాబేజీ: 30 ★ పొడవుచిక్కుడు: 45 ★ బరబాటీ: 50 ★ క్యారెట్: 48 ★ దొండ: 50 ★ బీట్ రూట్: 40 ★ ఉల్లి: 23 ★ బంగాళదుంపలు: 20 ★ గోరుచిక్కుడు: 35 ★ క్యాప్సికమ్: 90 ★ పొటల్స్: 50 ★ బీన్స్: 90 ★ ఆగాకర: హైబ్రిడ్- 90, దేశవాళీ- 210 ★ పందిరిచిక్కుడు: 60 ★ పచ్చిబఠాణి: 75. – వ్యవసాయ విభాగం

తెరపై ఈనాడు

★ ఎన్సీఎస్: **కన్నప్ప** ★ శ్రీకృష్ణ: **జురాసిక్ వరల్డ్ రీబర్త్(తెలుగు డబ్బింగ్)** ★ లీలామహల్: **కుబేర** ★ రంజనీ స్క్రీన్-1: **తమ్ముడు** ★ శివరంజనీ స్క్రీన్-2: **కుబేర** ★ హిమగిరి: **తమ్ముడు** ★ సప్తగిరి: **మార్గన్** – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

మేమున్నాం.. మీకు తోడుగా

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	8008574326
భోగాపురం	70959 54646

(10 AM TO 1 PM)

? నగరంలోని సాయినాథ్ కాలనీలో తాగునీరు వృథాగా పోతోంది. **- రాజు, స్థానికుడు**

★ పరిశీలించి, పైపులైన్ బాగుచేస్తాం. వృథా అరికడతాం. **- రవి, ఏఈ, నగరపాలక సంస్థ**

? కామాక్షినగర్ దారి, కస్పా పాఠశాల, గురజాడ రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. **- ప్రకాశరావు, దొరకుమార్, కుమార్**

★ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- స్రవంతి, ఏఈ – విజయనగరం పట్టణం**

? నారాయణపురంలో వీధి దీపాలు వెలగడం లేదు. ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

★ చర్యలు తీసుకుంటాం. **- సీహెచ్ కన్నబాబు, ఈవోపీఆర్డీ – అయ్యన్నపేట**

వెలుగులొచ్చాయ్.. (స్పందనకు వందనం)

విజయనగరం పట్టణం: నగరంలోని లక్ష్మీగణపతి కాలనీ-3లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. ఏఈ స్రవంతి దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకున్నారు.

తాగునీటి ట్యాంకుల శుభ్రత

లక్కవరపుకోట: రక్షిత నీటి ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ వివరాలు సక్రమంగా లేవని, ఎప్పుడు క్లోరినేషన్ చేశారో కూడా తెలియడం లేదని సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి డిప్యూటీ ఎంపీడీవో కుమార్ స్పందించారు. ఆయన సూచనలతో కార్యదర్శులు, ఇంజినీరింగు సహాయకులు క్లోరినేషన్ చేపట్టి, వివరాలు నమోదు చేశారు.

శిథిల కల్వర్టు దారి పరిశీలన

డెంకాడ: ఆర్.ముంగినాపల్లి వద్ద కల్వర్టు శిథిలమై ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సోమవారం ప్రచురితమైన వార్తకు ఎంపీపీ వాసుదేవరావు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ జేఈలు రవికుమార్, సూర్యకుమార్ స్పందించారు. కల్వర్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

రూ.కోట్ల స్థలం.. ఆక్రమణల పర్వం

న్యూస్‌టుడే– శృంగవరపుకోట

కుచించుకుపోయిన రైతు బజారు రహదారి

ఎస్.కోట పట్టణంలో 516బీ జాతీయ రహదారి పక్కన రూ.కోట్ల విలువైన స్థలం ఆక్రమణలకు గురవుతున్నా.. పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్సును ఆనుకొని, రైతు బజారు ముందు ఉన్న స్థలాన్ని పంచాయతీ పెద్దలే ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇరుకుగా మారుతున్న దారి..

ముందువైపు ఉన్న స్థలం పంచాయతీకి ఉంచాలని రైతు బజారుకు స్థలం ఇచ్చిన సమయంలో పెద్దలు కోరడంతో స్థలం వదిలేశారు. రైతు బజారు పక్క నుంచి పశువుల ఆసుపత్రికి వెళ్లే రోడ్డును పక్కా రహదారిగా మార్చడానికి పలుమార్లు నిధులు కేటాయించారు. కానీ ఏళ్ల తరబడి రోడ్డుకు అడ్డుగా స్థలాన్ని ఆక్రమించి దుకాణం నిర్వహిస్తుండడంతో అడ్డంకిగా మారింది. పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. తాజాగా మరోసారి రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. దీంతో పంచాయతీ సర్పంచి, ఈవో వెళ్లి దుకాణం తొలగించి పక్కన షెడ్డు వేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం షెడ్డును పక్కన ఏర్పాటు చేస్తుండడంతో రైతు బజారుకు వెళ్లే దారి ఇరుకుగా మారుతోంది. రోడ్డుకు రెండో వైపు కూడా దుకాణాలు పెరిగిపోయాయి. ఆక్రమణలతో వాహనాలు తప్పించుకోవడానికి ఇబ్బంది ఎదురవుతోందని చోదకులు వాపోతున్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తాం..

ఈ ప్రాంతంలో గజం రూ.లక్షకు పైగా ధర పలుకుతోంది. ఇటువంటి చోట దుకాణాలు నిర్మించి అద్దెకు ఇస్తే పంచాయతీకి ఆదాయం వచ్చే అవకాశముందని పలువురు అంటున్నారు. విషయం పంచాయతీ ఈవో అనురాధ వద్ద ప్రస్తావించగా.. 30 ఏళ్లుగా దుకాణం అక్కడే ఉందని, తాత్కాలికంగా పక్కన షెడ్డు వేసుకోమని చెప్పామన్నారు. దుకాణాలు నిర్మిస్తే తొలగిస్తామని ఆక్రమణదారు నుంచి లిఖిత పూర్వకంగా తీసుకున్నామన్నారు. రైతుబజారుకు వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు.

వంతెన నిర్మించక.. వెతలు తీరక

న్యూస్‌టుడే– జామి

వంతెన నిర్మించాల్సిన ప్రాంతం

జామి మండలం శాసనాపల్లి, గంట్యాడ మండలం పెదవేమలి గ్రామాల మధ్యలో ఉన్న గెడ్డపై వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోయింది. గంట్యాడ, విజయనగరం, గజపతినగరం మండలాల ప్రజలు జామి, కొత్తవలస, విశాఖపట్నం వెళ్లడానికి దగ్గర మార్గం. ప్రతి సోమవారం అలమండ పశువుల సంతకూ ఈ గెడ్డలోంచే వెళ్లాల్సిన పరిస్థితి. సుమారు 30 మంది విద్యార్థులు పెదవేమలి పాఠశాలకు వెళ్తుంటారు. ఇంత ప్రాధాన్యత ఉన్న దారిలో గెడ్డపై వంతెన నిర్మించాలని ప్రజలు ప్రజాప్రతినిధులను కోరడమే తప్ప పనులు జరగడంలేదు. వైకాపా హయాంలో నిధులు మంజూరయ్యాయని చెప్పారు. కానీ ఎటువంటి చర్యలు లేవు.

గెడ్డ పొంగితే ఇక్కట్లే..

ఏటా వర్షాకాలంలో గెడ్డ పొంగితే శాసనాపల్లి గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేక ఇళ్లకే పరిమితమవుతారు. గత ఏడాది గెడ్డ ప్రవాహం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి ఆ గ్రామానికి చెందిన యువకుడు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించారు. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించమన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా గెడ్డను పరిశీలించి, వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. కానీ నేటికీ దాని ప్రస్తావనే లేదు.

బిక్కుబిక్కుమంటూ ఉంటాం.. వంతెన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం వచ్చిందంటే బిక్కుబిక్కుమంటూ గడుపుతాం. గెడ్డ పొంగితే చుట్టు పక్కల గ్రామాలతో సంబంధాలు తెగిపోతాయి. అత్యవసర సమయాల్లోనూ ఇబ్బందే. ఎన్ని ప్రభుత్వాలు మారినా పరిస్థితి మాత్రం మారడంలేదు. **- ఎ.వెంకటరావు, గ్రామస్థుడు**

అంచనాలు తయారు చేస్తున్నాం..

వంతెన నిర్మాణానికి రూ.4 కోట్ల ఉపాధి హామీ నిధులతో అంచనాలు తయారు చేస్తున్నాం. మంత్రి కొండపల్లి సహకారంతో నిధుల మంజూరుకు కృషి చేస్తాం. ఇబ్బందులు తీరేలా చర్యలు తీసుకుంటాం. **– స్వామినాయుడు, డీఈ, పంచాయతీరాజ్, ఎస్.కోట**

ఎస్టీ సెల్ ఏర్పాటు చేయండి

ఉడాకాలనీ, న్యూస్‌టుడే: నగరంలోని మహారాజా ఆసుపత్రిలో ఎస్టీ సెల్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్‌ను రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు సోమవారం కోరారు. వైద్య సహాయం కోసం అండగా నిలవాలన్నారు. ఈ మేరకు కలెక్టర్ డీఎంహెచ్‌వో జీవనరాణితో మాట్లాడగా.. వారం రోజుల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

ఉపాధి పనులు కల్పించండి

ఉడాకాలనీ, న్యూస్‌టుడే: అటవీ ప్రాంతంలో వన సంరక్షణ సమితి సభ్యులుగా తమకు పని కల్పించాలని పూసపాటిరేగ మండలం కనిమెట్ట గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్ అంబేడ్కర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. గతంలో వీఎస్ఎస్ సభ్యులుగా పనిచేశామని గుర్తు చేశారు. మళ్లీ అవకాశం కల్పించాలన్నారు.

శిథిల ట్యాంకు కూల్చివేత.. లక్కవరపుకోట: గొల్జాంలో 42 ఏళ్ల క్రితం నిర్మించిన మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో సోమవారం ఇంజినీరింగు అధికారుల పర్యవేక్షణలో కూల్చివేశారు. నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. 60 వేల లీటర్ల సామర్థ్యంతో కొత్త ట్యాంకుకు ప్రతిపాదనలు పంపామన్నారు.

సదుపాయాలు కల్పించాలి

కమిషనరుతో మాట్లాడుతున్న గుంకలాం వాసులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం పట్టణంలోని పేదలకు గ్రామీణ మండలంలోని గుంకాలంలో కేటాయించిన ఇళ్ల స్థలాల వద్ద సౌకర్యాలు కల్పించాలని ఆ ప్రాంత వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం కమిషనరు పి.నల్లనయ్యకు వినతిపత్రం అందజేశారు. ★ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఉపేక్షించబోమని కమిషనరు అన్నారు. ఆయన ఆదేశాలతో డబుల్ కాలనీలో ప్రహరీని తొలగించారు. ★ నగరవ్యాప్తంగా జ్వరాల సర్వే చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు.

రహదారే డంపింగ్ యార్డు..!

ఎస్.కోట మండలం బొడ్డవర పంచాయతీలో సేకరించిన చెత్తను జాతీయ రహదారి పక్కన పోగులుగా వేస్తున్నారు. దీంతో అధ్వానంగా మారుతోంది. విశాఖ- అరకు పర్యాటక మార్గం కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దుర్వాసన భరించలేకున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీకి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం ఉన్నా.. వ్యర్థాలను రోడ్డు పక్కన వేస్తున్నారు. వెంటనే చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రామునాయుడు అన్నారు. – న్యూస్‌టుడే, ఎస్.కోట

10న తల్లిదండ్రుల సమావేశం

ప్రసంగిస్తున్న ఎంఈవో కూర్మారావు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ప్రభుత్వ సూచనలతో ఈ నెల 10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశాలు పండగ వాతావరణంలో నిర్వహించాలని ఎంఈవోలు కూర్మారావు, శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపయోగపడాలన్నారు. తల్లిదండ్రుల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. నాలుగు క్లస్టర్ల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీల సమస్యలపై ప్రత్యేక దృష్టి

కొత్తవలస, న్యూస్‌టుడే: ప్రభుత్వం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం పరుపులు, తలగడలు ఇటీవల సరఫరా చేసింది. కొత్తవలస కేజీబీవీకి 280 పరుపులు, పిల్లోలు వచ్చాయని ప్రత్యేక అధికారిణి విజయకుమారి తెలిపారు. కొత్తవలస కేజీబీవీలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో 280 పరుపులు కాలిపోవడంతో రోటరీక్లబ్ ప్రతినిధులు మళ్లీ సాయం అందించనున్నట్లు తెలిపారన్నారు. 71 మంది విద్యార్థుల ట్రంక్ పెట్టెలు, దుస్తులు, పుస్తకాలు దగ్ధమవడంతో వీటిని సమకూర్చడానికి సమగ్ర శిక్షా ఏపీసీ ఎ.రామారావు సుమారు రూ.1.90 లక్షలతో ప్రతిపాదనలు పంపారని ఎస్‌వో తెలియజేశారు.

దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం మద్దతు

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కార్మికులు

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఎల్బీజీ భవనంలో గోడప్రతులను ఆవిష్కరించారు. ● రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కో-కన్వీనర్ ఎ.జగన్‌మోహన్‌రావు డిమాండు చేశారు. ఈ నెల 9న జరిగే సమ్మెకు సంబంధించిన కరపత్రాలను సోమవారం నగరంలో వివిధ ప్రాంతాల్లో ఆవిష్కరించారు.

జీతాలు పెంచాలని డిమాండు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: పురపాలక సంఘాల్లో ఇంజినీరింగ్ విభాగం పరిధిలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు పెంచాలని మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు ఎ.జగన్‌మోహనరావు, ఎస్.రాజు, ఆదినారాయణ డిమాండు చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా రూ.21 వేల వేతనం ఇవ్వాలన్నారు. 8న అర్ధనగ్న ప్రదర్శన చేపడతామని, 9న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని, 10న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

సైకిళ్లతో విద్యార్థినులు, దాతలు

విజయనగరం పట్టణం: నగరపాలక సంస్థ పరిధిలోని బీపీఎం ఉన్నత పాఠశాలలో 10 మంది విద్యార్థులకు థెరెసా క్లబ్ సోమవారం సైకిళ్లను పంపిణీ చేసింది. డిప్యూటీ మేయరు కోలగట్ల శ్రావణి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

రెడ్డికంచేరులో పథకాల కరపత్రాలు ఇస్తున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, తెదేపా మండలాధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ అన్నారు. సోమవారం రెడ్డి కంచేరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు కర్రోతు రాజు, నర్సింహులు పాల్గొన్నారు. ● కొత్తవలస: కూటమి ప్రభుత్వ హయాంలో కొత్తవలస మండలం పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటుకానుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. చిన రావుపల్లిలో పతంజలి ప్రాజెక్టు వస్తుందని, బలిఘట్టం వద్ద ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మున్ముందు మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నాయన్నారు. మంగళపాలెం, మునిసిరాంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. సంబంధిత కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు గొరపల్లి రాము, టీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ పాల్గొన్నారు. ● నెల్లిమర్ల: తెదేపా విశాఖ జిల్లా ఇన్‌ఛార్జ్ నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, జిల్లా తెదేపా అధికార ప్రతినిధి గేదెల రాజారావు కొండగుంపాం, పూతికపేట గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యకర్తలకు గౌరవం ఇవ్వాలి

కలెక్టరేట్‌కు నిరసనగా వస్తున్న కార్యకర్త ఆనందరావు

ఈనాడు, విజయనగరం: 'గత ఎన్నికల్లో మేమంతా చాలా కష్టపడి పనిచేశాం. విజయనగరం ఎమ్మెల్యేగా అదితి విజయలక్ష్మిని గెలిపించుకున్నాం. సీనియర్ నాయకులు, కార్యకర్తలకు విలువ లేదు. నాలుగు దశాబ్దాలుగా ఉత్తమ సేవలు అందించిన అశోక్ గజపతిరాజుకు మంచి స్థానం కల్పించాలి. ఇప్పటి వరకు జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూడాలి. కార్యకర్తలకు తగిన గౌరవం కల్పించాలని విజయనగరం 28వ డివిజన్ తెదేపా కార్యకర్త బీగల ఆనందరావు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నిరసన వద్ద తన ఆవేదన వ్యక్తం చేశారు. ఓ కార్యకర్త ఫ్లెక్సీతో నిరసన తెలపడం చర్చనీయాంశమైంది.

వసతి గృహానికి రాని సంక్షేమ అధికారి?

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ఎల్.కోటలోని ఎస్సీ వసతి గృహ నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ వసతి గృహంలో సంక్షేమ అధికారిగా పని చేసిన కె.గౌరునాయుడు విజయనగరం బదిలీ అయ్యారు. వియ్యంపేట వసతి గృహం నుంచి పద్మావతికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె జూన్ 26న బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఒక్కసారి కూడా రాలేదు. బదిలీపై వెళ్లిన గౌరునాయుడు వచ్చి నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారని సిబ్బంది తెలిపారు. అదనపు బాధ్యతలు తీసుకున్న అధికారిణి సంతకాలు కూడా హాజరు పట్టీలో ఆయనే చేస్తున్నాడంటున్నారు. విద్యార్థులకు భోజనాలు అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కమాటీ అప్పారావు, కుక్ శివమ్మ చెప్పారు. విషయం సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు అన్నపూర్ణమ్మ వద్ద ప్రస్తావించగా.. సదరు అధికారికి ఇప్పటికే హెచ్చరికలు జారీచేశామన్నారు.

ఎల్.కోట మండలంలో రీసర్వేపై ఆడిట్

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ప్రస్తుత ప్రభుత్వం, గత ప్రభుత్వ హయాంలో చేసిన రీసర్వేపై ఆడిట్ నిర్వహిస్తున్నట్లు సర్వే శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వీవీఎస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని గ్రామ సర్వేయర్లతో ఎల్.కోట సచివాలయంలో సమావేశమయ్యారు. ఎవరూ హాజరుకాకపోవడం, దస్త్రాలు తీసుకురాకపోవడం తదితర విషయాలపై మండిపడ్డారు. ముందుగా చెప్పినప్పటికీ ఇలా చేయడం పనితీరుకు అద్దంపడుతోందన్నారు. రీసర్వే తరువాత ఎదుర్కొంటున్న సమస్యలు గురించి ఆరా తీస్తున్నట్లు వివరించారు. కొత్తగా మండలానికి రెండు గ్రామాల చొప్పున రీసర్వేకు ఎంపిక చేశారన్నారు. ఎల్.కోటలో 21 వినతులు, కొత్తవలసలో 600 వినతులు రైతుల నుంచి వచ్చాయన్నారు.

869 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

జామి, న్యూస్‌టుడే: జామి మండలం భీమసింగి సెంటర్ వద్ద సోమవారం అక్రమంగా తరలిస్తున్న 869 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, సీఎస్‌డీటీ ఎ.వి.వి.ఎస్.మూర్తి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు భీమసింగి కూడలి వద్ద తెల్లవారుజాము నుంచి నిఘా పెట్టి పట్టుకున్నామన్నారు. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న భీమసింగికి చెందిన వి.నరేష్, ఆటో డ్రైవర్‌పై 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

ఆటో, బైక్ ఢీ : ఇద్దరికి గాయాలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని పుణ్యగిరి రోడ్డులో గిరిజన బాలికల కళాశాల వసతి గృహం ఎదురుగా ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. సీఐ వి.నారాయణమూర్తి వివరాల ప్రకారం.. అరకు వ్యాలీకి చెందిన ఎస్.అభిషేక్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతూ.. గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో ఉంటున్నాడు. స్నేహితుడు లాలూప్రసాద్‌తో కలిసి సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వసతి గృహానికి వస్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఆటో కిందకు బైక్ వెళ్లిపోయింది. అభిషేక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో చోదకుడు చందక నాయుడు తలకు గాయమైంది. ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అభిషేక్‌ను విజయనగరం ఆసుపత్రికి రిఫర్ చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పరిహారం ఇవ్వలేదు.. విజయనగరం అర్బన్: తనకు చెందిన భూమికి సంబంధించి జిందాల్ కంపెనీ వేరొకరికిచ్చిన నష్టపరిహారాన్ని ఆపాలని కిల్తంపాలెం వాసి సిరగం గంగమ్మ కోరారు. అడ్డతీగల గ్రామంలో భూహక్కుదారులకు సదరు కంపెనీ ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని సిరగం అంగురయ్య ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఉన్నతాధికారితో వాగ్వాదం!

నేరవార్తావిభాగం: కిల్తంపాలెంలో నివాసం ఉండే ఓ మహిళకు సంబంధించిన డీ-పట్టా భూమి విషయంలో ఆమెకు న్యాయం చేయాలని కార్మిక సంఘానికి చెందిన నాయకుడు బి.శంకరరావు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆశ్రయించారు. ఈ క్రమంలో ఉన్నతాధికారికి, ఆయనకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో సదరు అధికారి వెంటనే పోలీసులను పిలిపించి శంకరరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. దీనిపై ఒకటో పట్టణ సీఐ ఎస్.శ్రీనివాస్‌ను వివరణ కోరగా, న్యాయ నిపుణుల అభిప్రాయం తీసుకొని ముందుకెళ్తామన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

భోగాపురం: తనపై అంగన్‌వాడీ కార్యకర్త దాడికి దిగారని మండలంలోని జగ్గయ్యపేటకు చెందిన ఆదిలక్ష్మి కలెక్టర్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులో చేశారు. చిన్నారుల సరకుల కోసం కేంద్రానికి వెళ్లగా.. రెండు గంటల పాటు వేచి ఉండాలని కార్యకర్త మంగ చెప్పారని, అనంతరం సర్వర్ పనిచేయలేదన్నారన్నారు. ఆరు నెలలుగా ఇలానే చెప్పి సరకులు ఇవ్వకుండా పంపిస్తున్నారనడంతో అంగన్‌వాడీ కార్యకర్త తనపై దాడికి దిగారని బాధితురాలు పేర్కొన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో లావణ్యకు, కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశానన్నారు.

రూ.1.12 లక్షల ఎరువుల సీజ్

కొత్తవలస: కొత్తవలసలోని ఓ ఆగ్రో ఏజెన్సీలో సోమవారం విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, మండల వ్యవసాయాధికారి కె.రాంప్రసాద్ తనిఖీ చేశారు. 67 బస్తాల ఎరువులు తక్కువగా ఉండటంతో డీలరుపై 6ఏ కేసు నమోదు చేశారు. రూ.1,12,096 విలువచేసే ఎరువులు సీజ్ చేశామని సీఐ వెల్లడించారు. పురుగు మందుల రికార్డులు అప్‌డేట్ చేయకపోవడంతో రూ.1,24,510 విలువైన మందుల విక్రయాన్ని నిలిపేస్తూ ఆదేశాలు జారీ చేశామన్నారు.

పేదలకు అండగా నిలవాలి

కంటోన్మెంట్, ఉడాకాలనీ: పేదలకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పేర్కొన్నారు. సోమవారం కణపాకలోని నవజీవన్ పూర్ చిల్డ్రన్ హాస్టల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 35 మంది మహిళలకు రూ.35 వేల విలువైన వస్త్రాలు, నిత్యావసరాలను అందజేశారు.

యూరియా కోసం రైతుల పాట్లు

జామి: మండలంలో యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. భీమసింగిలోని ఓ దుకాణానికి ఎరువులు రావడంతో జామి తదితర ప్రాంతాల రైతులు వెళ్లారు. తమ వద్ద పురుగు మందు, విత్తనాలు కొన్న వారికే యూరియా ఇస్తామంటున్నారని జామికి చెందిన రైతు వి.చంద్రరావు తదితరులు వాపోయారు. కొంతమంది రైతులు ఉదయం నుంచి వేచివున్నా.. ఇవ్వడానికి ముప్పతిప్పలు పెట్టారన్నారు. విషయం మండల వ్యవసాయాధికారి పూర్ణిమ వద్ద ప్రస్తావించగా.. చర్యలు తీసుకుంటామన్నారు.

ముగ్గురి అరెస్టు

కొత్తవలస: కొత్తవలసకు చెందిన కె.రఘు, నాని, వి.హేమంత్ సాయిలను సోమవారం అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించామని ఎస్సై హేమంత్‌కుమార్ తెలిపారు. వీరు ముగ్గురూ ఈ నెల 5న తుమ్మికాపల్లిగేటుకు సమీపంలోని ఓ రెస్టారెంట్ దగ్గర కారులో వచ్చిన విశాఖపట్నానికి చెందిన భీశెట్టి సాయిచంద్, మరో ఇద్దరిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రికార్డుల పరిశీలన

అయ్యన్నపేట: విజయనగరం మండల పరిషత్ పరిధిలో 2024- 25 ఆర్థిక ఏడాదిలో జరిగిన లావాదేవీలపై జిల్లా ఆడిట్ అధికారులు ఎస్.వేణుగోపాల్, గిరిధర్, శ్రీనివాసరావు సోమవారం రికార్డులను పరిశీలించారు.



బడి బస్సు ప్రారంభం

జాకేరులో బస్సును ప్రారంభిస్తున్న డీపీటీవో వరలక్ష్మి

వేపాడ, న్యూస్‌టుడే: మండలంలోని సోంపురం- జాకేరు మీదుగా బక్కునాయుడుపేటకు ఆర్టీసీ డీపీటీవో జి.వరలక్ష్మి సోమవారం బడి బస్సును ప్రారంభించారు. శృంగవరపుకోట డిపో నుంచి ఈ మార్గంలో బస్సు నడపడంతో జాకేరు, కరకవలస, చామలాపల్లి, మారిక, పోతుబందిపాలెం, వెంకయ్యపాలెం, దబ్బిరాజుపేట గ్రామాలకు చెందిన సుమారు 56 మంది విద్యార్థుల ఇక్కట్లు తీరనున్నాయి. బస్సు రావడం కోసం కృషి చేసిన సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావును జాకేరు గ్రామస్థులు సత్కరించారు. డిపో మేనేజరు కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కొత్తవలస, న్యూస్‌టుడే: వర్షాకాలంలో వచ్చే కాలానుగుణ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముసిరాం గ్రామంలో ప్రజలకు వియ్యంపేట పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం అవగాహన కల్పించారు. వైద్యాధికారి గోపాలకృష్ణ, సిబ్బంది ఈశ్వరరావు, సత్యారావు పంచాయతీ కార్యదర్శి శాంతికుమారితో కలిసి గ్రామంలో పర్యటించారు. నీరు నిల్వఉన్న ప్రదేశాల్లో పూడికతీత, రక్షిత మంచినీటిని సరఫరాచేసే ఓవర్‌హెడ్ ట్యాంకు ఆవరణను క్లోరినేషన్ చేయించారు. ఎంఎల్‌హెచ్‌పీ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్దలకూ ఓనమాలు!

- ఆగస్టులో అక్షరాంధ్ర కార్యక్రమాలు
- 1.60 లక్షల మందికి చదువు నేర్పడమే లక్ష్యం

☛ గణపవరం మండలం మొయ్యేరుకు చెందిన లక్ష్మి చదువుకోలేక పోయినా సంతకం చేయగలరు. కానీ డ్వాక్రా సంఘంలో చేసిన తీర్మానం చదవలేరు. చేతిలో చరవాణి ఉన్నా డిజిటల్ లావాదేవీలు నిర్వహించలేకపోతున్నారు. ఇలాంటి మహిళలతో పాటు పురుషులను సైతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం అక్షరాంధ్ర కార్యక్రమాన్ని ఆగస్టులో నిర్వహించనుంది. దీని కోసం ఉభయ జిల్లాల్లో నిరక్షరాస్యుల వివరాలు సేకరిస్తున్నారు.

పాలకొల్లు, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఫిబ్రవరిలో 'ఉల్లాస్' పేరిట గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పట్లో పశ్చిమలో 3,895 మంది, ఏలూరు జిల్లాలో 6 వేల మందికి తొలివిడతలో శిక్షణ పూర్తి చేసి మార్చిలో పరీక్ష నిర్వహించారు. ఇప్పుడు వారంతా అక్షరాస్యులుగా మారారు. ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాల ద్వారా డిజిటల్, ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకున్నారు. ప్రతి మండలానికి 20 మంది వీవోఏలను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆలయాల ప్రాంగణాల్లో స్థానికుల సమయానుకూలతను బట్టి ఉల్లాస్ తరగతులు నిర్వహించారు. ఇప్పుడు రెండో విడతో ఉభయ జిల్లాల్లో ఏడు పురపాల సంఘాలు, ఒక నగరపాలక సంస్థ, రెండు నగర పంచాయతీలు, 48 మండలాల్లోనూ అక్షరాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అభ్యసనలో మహిళలు (పాత చిత్రం)

జిల్లా	జనాభా	నిరక్షరాస్యులు	ఈ ఏడాది లక్ష్యం
పశ్చిమ	14లక్షలు	2.05లక్షలు	69 వేలు
ఏలూరు	25 "	3.52 "	91 "

100 గంటల చొప్పున.. ఇరు జిల్లాల్లో సుమారు 5.50 లక్షల మంది నిరక్ష్యరాస్యులు ఉన్నట్లు అంచనా. వీరందరినీ 2028-29 నాటికి అక్షరాస్యులుగా మార్చాలనేది ప్రభుత్వ లక్ష్యం. వీరిలో 1.60 లక్షల మందికి వచ్చే మార్చినాటికి విద్య నేర్పాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మండలాల్లో వెలుగు, పట్టణాల్లో మెప్మా ఆధ్వర్యంలో లక్ష్యాలను నిర్దేశించుకుని మొత్తం 100 గంటల పాటు తరగతులు నిర్వహించనున్నారు. తరగతుల నిర్వహణకు వీవోఏలతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో విద్యావంతులను ఎంపిక చేయనున్నారు. టీసీఎస్ సంస్థ డిజిటల్ శిక్షణకు సహకరించనుంది. ఈ అంశంపై వయోజన విద్య ఉప సంచాలకుడు ప్రభాకర్‌ను సంప్రదించగా లక్ష్యాలను నిర్దేశించుకుని అక్షరాంధ్రను విజయవంతం చేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

అందరి సహకారంతో మొదటిస్థానం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా పీ4 విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని కలెక్టర్ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పీ4 అమలులో భాగంగా మార్గదర్శుల గుర్తింపుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గానికి సుమారు 7 వేలు చొప్పున బంగారు కుటుంబాలను గుర్తించాలని, ఆగస్టు 15 నాటికి జిల్లా వ్యాప్తంగా 15 వేల మంది మార్గదర్శులను గుర్తించే లక్ష్యంగా పని చేయాలన్నారు. మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవోలు పర్యవేక్షకులుగా ఉంటారన్నారు. పీ4 అమలులో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేందుకు అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు.

అర్హులా.. కాదా తెలుసుకోండి..

- అందుబాటులోకి అన్నదాత సుఖీభవ వెబ్‌సైట్
- ఆధార్ సంఖ్యతో వివరాలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించామా లేదా అనే సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రభుత్వం వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. అర్హుల జాబితాలో పేరు ఉందా లేక అనర్హుల జాబితాలో చేర్చారా..ఏలా తెలుసుకోవాలి.. ఎవరికీ ఫిర్యాదు చేయాలి అనే సందేహాల నడుమ అన్నదాతలు సతమతమైతున్నారు. ఈ నేపథ్యంలో అన్నదాత సుఖీభవ వెబ్‌సైట్‌లో ఆధార్ సంఖ్యతో రైతుల వివరాలు తెలుసుకునేందుకు 'నవ్ యువర్ స్టేటస్ అప్షన్'ను తీసుకొచ్చింది. ఆధార్ సంఖ్యతో రైతు పేరు, జిల్లా, మండలం, గ్రామం, అర్హుల, అనర్హుల, ఈకేవైసీ వంటి వివరాలు కనిపిస్తాయి. అర్హులై ఉండి రిమార్కులో అనర్హులుగా చూపితే సంబంధిత ధ్రువ పత్రాలతో సమీప రైతు సేవా కేంద్రంలో ఈ నెల 10 లోపు వ్యవసాయ సహాయకులకు ఫిర్యాదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు సూచించారు.

వెబ్‌సైట్ అడ్రస్: annadathasukhibhava.ap.gov.in

జిల్లాలో అర్హుల సంఖ్య : 1,02,500

ఆక్వా వర్సిటీకి నిధుల గండం

పునాది దశలోనే నిలిచిన నిర్మాణాలు

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పరిధి సరిపల్లి వద్ద ఆక్వా యూనివర్సిటీ భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిధుల విడుదల, బిల్లుల మంజూరులో జాప్యంతో మూడేళ్లుగా పునాదులకే పరిమితమయ్యాయి. భవనాలు లేకపోవడంతో లక్ష్మణేశ్వరంలోని తుపాను షెల్టర్‌లో తరగతులు నిర్వహించాల్సి వస్తోంది.

అద్దె భవనంలోకి.. ప్రస్తుత నిర్వహిస్తున్న ఒక కోర్సులో బ్యాచ్‌కు 60 మంది చొప్పున రెండేళ్లకు 120 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది కొత్తగా వచ్చే మరో బ్యాచ్‌కు అవసరమైన తరగతి గదులు తుపాను షెల్టరులో లేవు. దీంతో తరగతులను సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోకి మార్చనున్నారు. దీనికి నెలకు రూ.1.20 లక్షలు అద్దె చెల్లించనున్నారు.

ఒక కోర్సుకే పరిమితం.. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆక్వా యూనివర్సిటీ మంజూరు చేసింది. 2022 నవంబరులో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసి ఏడాది తర్వాత భవనాలు ప్రారంభిస్తామంటూ బీరాలు పలికారు. 2023లో మొదలైన పనులు 2024 మే నాటికి పూర్తి కావాల్సి ఉండగా పునాది దశ దాటలేదు. పేరుకు యూనివర్సిటీ అయినా భవనాలు లేకపోవడంతో ఒక్క బీఎఫ్ఎస్సీ కోర్సుకే పరిమితం చేశారు. పూర్తి స్థాయిలో తరగతులు నిర్వహిస్తే ఉన్నతీకరణలో భాగంగా ఫిషరీస్ డిప్లొమో, ఎంఎఫ్ఎస్సీ, ఇతర అనుబంధ కోర్సులు అందుబాటులోకి వస్తాయి.

విద్యార్థులకు ఇబ్బందులు.. ప్రయోగశాలల నిర్మాణానికి వేములదీవిలో 350 ఎకరాల భూమిని గుర్తించారు. భూసేకరణ పూర్తికాకపోవడంతో వర్సిటీకి అప్పగించలేదు. దీంతో విద్యార్థులు ప్రయోగాలు, క్షేత్ర పరిశీలన నిమిత్తం సుమారు 30 కిలోమీటర్ల దూరాన ఉన్న ఉండిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి వెళ్తున్నారు.

బకాయిలు రూ.25 కోట్లు.. వర్సిటీ నిర్మాణానికి నరసాపురం పరిధి సరిపల్లి, లిఖితపూడి గ్రామాల మధ్య 40 ఎకరాల భూమిని సేకరించారు. రూ.332 కోట్లతో డీపీఆర్ ఆమోదించి తొలి విడతగా రూ.100 కోట్లు మంజూరు చేశారు. మొదటి దశలో పరిపాలన భవనం, విద్యార్థులకు వసతిగృహాలు, వీసీ బంగ్లా, రైతు శిక్షణ కేంద్రాల నిర్మాణాలు పూర్తిచేయాలని నిర్ణయించారు. 2023 బడ్జెట్లో రూ.40 కోట్లు కేటాయించినట్లు ప్రచారం చేసినా తాత్కాలిక రహదారులు, మట్టి పనులు తప్ప ఇంకేం చేయలేదు. నాటి సర్కారు రూ.16 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక పెండింగ్ బిల్లులు రూ.7 కోట్లు విడుదల చేసింది. మరో రూ.25 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

మాట్లాడుతున్న నాగరాణి

పండగ వాతావరణంలో తల్లిదండ్రుల సమావేశాలు : కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జులై 10న జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించే మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్‌ను పండగ వాతావరణంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వర్చువల్‌గా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాజ్యసభ, శాసనసభ, శాసనమండలి సభ్యులంతా హాజరు కానున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు. గ్రీన్ పాస్‌పోర్ట్ పేరిట ప్రతి విద్యార్థికి ఒక మొక్క అందజేసి వారి తల్లి పేరున వాటిని పెంచేలా ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించాలన్నారు.

రైతేరాజు
- వక్క.. లాభాలు పక్కా..
- వరి నాట్లు వేస్తున్నారా..!
6లో

విద్యుత్తు శాఖలో బదిలీలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో పలువురిని బదిలీలు చేస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడేపల్లిగూడెం డివిజన్ కార్యాలయ జూనియర్ అకౌంట్స్ అధికారి టి.వెంకాయమ్మకు ఉద్యోగోన్నతి కల్పించి, ఏలూరు నగర విద్యుత్తు రెవెన్యూ కార్యాలయం అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా నియమించారు. కోనసీమ జిల్లాలో ఏడీఈగా పని చేస్తున్న రఘురాజును పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేశారు.

అందుబాటులో ఎరువుల నిల్వలు: జేసీ

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎరువుల కొరత లేదని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ పంటకు 58,905 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా.. 44,792 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

తట్ట మట్టి పోయక.. గట్టు మేలు తలపెట్టక!

ఈ కింది చిత్రం యండగండి లాకు దిగువన కాలువ గట్టు. ఇది అయిదారేళ్ల కిందట కోతకు గురై నేడు పూర్తిగా దెబ్బతింది. అధిక నీరొచ్చినప్పుడు గట్టుపై నుంచి పారి.. ఆయకట్టు పొలాలు నీటమునుగుతున్నాయి. అయినా గట్టుని పటిష్ఠ పరిచే పనులు గత ప్రభుత్వం చేయలేదు. దీంతో ఇప్పటికీ ఇలానే ఉంది.

ఉండి, న్యూస్‌టుడే: పంట కాలువ గట్లు బలహీనంగా దర్శనమిస్తున్నాయి. అధిక వర్షాలు, వరదలు వస్తే.. గట్లు పొంగి ఆయకట్టు పంట నీటమునిగే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. చాలా వరకు పూడికతీత పనులు చేపట్టినా.. గట్లను కూడా పటిష్ఠ పరిస్తే బాగుండేదని అభిప్రాయ పడుతున్నారు. గత ఐదేళ్లుగా అధిక వర్షాలు, వరదలతో ఏటా వేలాది ఎకరాల్లో ఖరీఫ్ పంట ముంపుతో దెబ్బతింది. ఈ ఏడాదీ నష్టపోయే పరిస్థితి ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధిక నీరొస్తే సర్‌ప్లస్ వియర్లు తెరవాల్సిందే!.. జలవనరుల శాఖ ఉండి సబ్ డివిజన్ పరిధిలో వెంకయ్య వయ్యేరు, పాతవయ్యేరు, ఉండి ప్రధాన పంట కాలువల ద్వారా 1.49 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి, చేపలు, రొయ్యలు, ఇతర పంటలు సాగవుతున్నాయి. చిలకంపాడు నుంచి మహదేవపట్నం శివారు ప్రాంతం వరకు ఉండి పంట కాలువపై డెల్టా ఆధునికీకరణ పనులు జరిగాయి. పరిమెళ్ల నుంచి వెంకయ్య వయ్యేరుపై ఇదే సమయంలో మట్టి పూడికతీత పనులు చేశారు. అప్పట్లో సరైన ప్రమాణాలు పాటించకపోవడమే గట్లు బలహీనమవ్వడానికి ప్రధాన కారణమనే ఆరోపణలున్నాయి.

ఇది ఎన్నార్పీఅగ్రహారం ఉన్నత పాఠశాల ప్రాంతంలో బలహీన పడిన గట్టు. రెండేళ్ల కిందట కాలువకు పూర్తిస్థాయిలో నీరొదిలిన దశలో నీరు పక్కనున్న పొలాల్లోకి వెళ్లింది. అయినా ఇప్పటికీ దానిని పటిష్ఠ పరచలేదు.

ఇక్కడ బలహీనంగా.. పిప్పర, కేశవరం, ఉణుదుర్రు, యండగండి, గరగపర్రు, మహదేవపట్నం, ఎన్నార్పీ అగ్రహారం, ఉండి అక్విడెక్టు వరకు ఉండి కాలువ గట్లు వివిధ చోట్ల బలహీనంగా తయారయ్యాయి. భారీ వర్షాలు కురిసినా.. అధిక నీరొదిలినా పంట కాలువల్లో యుద్ధ ప్రాతిపదికన నీటి మట్టాలు తగ్గించేందుకు సర్‌ప్లస్ వియర్లను ఎక్కడికక్కడ తెరవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఈ విషయమై జలవనరులశాఖ ఉండి డీఈఈ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ. ఇప్పటికే కొన్ని పనులు చేశామని, మిగిలిన చోట్ల అవసరమైన మేర చర్యలు తీసుకుంటామన్నారు.

అన్నార్తుల ఆకలి తీరేలా..!

- ✴ ఉభయ జిల్లాల్లో మరో 7 అన్న క్యాంటీన్లు
- ✴ జనవరిలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: అన్నార్తుల ఆకలి తీర్చేలా.. అన్న క్యాంటీన్ల విస్తరణకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఉభయ జిల్లాల్లో ఇప్పటికే పలుచోట్ల అన్న క్యాంటీన్లు కొనసాగుతుండగా.. కొత్తగా ఏలూరు జిల్లాలో 4, పశ్చిమ గోదావరిలో 3 ఏర్పాటు చేయనున్నారు.

నియోజకవర్గానికొకటి చొప్పున.. ప్రతి నియోజకవర్గానికో అన్న క్యాంటీన్ ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 6, పశ్చిమలో 9 చొప్పున కొనసాగుతున్నాయి. ఇవన్నీ పట్టణ ప్రాంతాల్లోనే కొనసాగుతున్నాయి. మిగతా నియోజకవర్గాల్లోని పట్టణాల్లోనూ వచ్చే జనవరిలో కొత్తగా క్యాంటీన్లు ప్రారంభించనున్నారు. తదనుగుణంగా భవన నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఏలూరులో కొత్త క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు సేకరించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనరు భానుప్రతాప్ తెలిపారు.

పూటకు 350 మందికి.. ఉభయ జిల్లాల్లోని అన్న క్యాంటీన్లలో ప్రతి పూటకు 350 మందికి చొప్పున రూ.5కే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రివేళ భోజనం అందిస్తున్నారు. మూడు పూటలా కలిపి ఒక్కొక్కరికీ రాయితీ కింద రూ.75 కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. నెలకు సుమారు రూ.2.79 కోట్లు భరిస్తోంది.

గ్రామీణ ప్రాంతాల్లోనూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, తొలుత పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు నెలకొల్పింది. వీటిని దశలవారీగా అన్ని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తోంది. ప్రస్తుతం ఏలూరు నగరంలో 4, జంగారెడ్డిగూడెం, నూజివీడులో ఒక్కో అన్న క్యాంటీను నడుస్తోంది. కొత్తగా ఏలూరులో ఒకటి, మిగతా మూడింటిని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుతం భీమవరం, తాడేపల్లిగూడెంలో మూడేసి, పాలకొల్లు, నరసాపురం, తణుకులో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. జనవరిలో మరో మూడు కొత్తగా ప్రారంభించనున్నారు.

మరుగుదొడ్లు ఉన్నాయా.. వినియోగిస్తున్నారా..

ఇంటింటికీ వెళ్లి ఆరా తీసిన కేంద్ర బృందం

వీరవాసరం, ఉండి, న్యూస్‌టుడే: ఉండి మండలం ఆరేడు, వీరవాసరం గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. ఎంపిక చేసుకున్న ఇళ్లకు వెళ్లిన బృంద సభ్యులు మీ ఇంట్లో మరుగుదొడ్డి ఉందా.. వినియోగిస్తున్నారా.. ఇంటింటి చెత్త సేకరణ, మురుగు కాలువలు శుభ్రం చేస్తున్నారా.. వంటి ప్రశ్నలు వేసి వారి సమాధానాలను యాప్‌లో నమోదు చేసుకున్నారు. ఇంటింటా సర్వేతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు, దేవాలయాలను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని తెలుసుకుని ఫొటోలు తీసుకున్నారు. వీరవాసరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ జిల్లా సమన్వయకర్తలు ఎం.మధుమతి, పి.సత్తిబాబు, జిల్లా కన్సల్‌టెంట్ ఎం.సంతోష్‌కుమార్, ఆరేడులో కేంద్ర సర్వే నోడల్ అధికారి డి.సునిల్, కన్సల్‌టెన్సీ ప్రతినిధులు దినేష్, రామకృష్ణ తదితరులు పర్యటించారు.

'మీ కోసం'లో 15 ఫిర్యాదులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో 15 అర్జీలు వచ్చాయని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త, అత్తింటి వేధింపులు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ప్రేమ పేరుతో మోసం తదితర విషయాలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తెలియజేశారు.

ఇదండీ ఇంటి లెక్క

ఎంపిక చేసిన ఇళ్లలో పన్ను మదింపు బృందాల సర్వే

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: నగర పాలక, పురపాలక సంఘాల్లో పలువురు నిర్మాణ విస్తీర్ణాన్ని తక్కువ చూపి ఆస్తిపన్ను తక్కువగా చెల్లిస్తున్నారు. పలుచోట్ల ఇళ్లు, భవనాలు అసలు పన్ను పరిధిలోకి రావడంలేదు. వీటన్నింటిని గుర్తించిన కూటమి ప్రభుత్వం ఆస్తి పన్ను మదింపును పక్కాగా అమలు చేయాలని నిర్ణయించింది. ప్రతి ఇంటిని పరిశీలించి విస్తీర్ణం మేరకు కొలతలు వేసి అదనపు అంతస్తులు ఉంటే పరిగణనలోకి తీసుకుంటారు. ఆస్తి పన్ను మదింపు చేస్తారు.

భీమవరంలో సర్వే చేస్తున్న అధికారులు

మార్గదర్శకాలు ఇవీ.. ఇళ్లు, భవనాలు ఉన్నవారు ఆస్తి పన్ను చెల్లిస్తున్నారా లేదా, నిర్మాణ విస్తీర్ణం మేరకు సిబ్బంది పన్ను విధించారా అనే విషయాలపై సర్వే చేస్తున్నారు. లోటుపాట్లను సవరించి ఆదాయం పెంచుకునేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. దీంతో వేర్వేరు పురపాలక సంఘాల్లోని అధికారులను వేరొక పట్టణాల్లో ఎంపిక చేసిన భవనాలను పరిశీలించాలని నిర్ణయించారు. ఉదాహరణకు భీమవరం అధికారులను తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు అధికారులను భీమవరం, నరసాపురం తదితర పట్టణాలకు నియమించారు. 2021 నుంచి ఈ ఏడాది జూన్ వరకు పన్ను మదింపుపై ఆయా భవనాలను బృందాలు పరిశీలిస్తాయి.

పట్టణాల వారీగా సర్వే చేయాల్సిన భవనాలు	
తాడేపల్లిగూడెం	116
తణుకు	105
నరసాపురం	6
పాలకొల్లు	13
భీమవరం	74
ఆకివీడు	58

ఎత్తుకు పైఎత్తు వేస్తూ..
ఉత్కంఠగా 'ఈనాడు' ఛాంపియన్ పోటీలు
6లో
పోక్సో కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు

బూప్పికట్టిన బదిలీలు!

- ఇష్టానుసారంగా ప్రక్రియ
- రోడ్డెక్కిన సచివాలయ సిబ్బంది

న్యూస్‌టుడే- ఏలూరు వన్‌టౌన్, టూటౌన్: సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి గందరగోళంగా సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో 1,100 పైగా గ్రామ/ వార్డు సచివాలయాలు న్నాయి. మొత్తం 8,500 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకేచోట అయిదేళ్ల సర్వీసు పూర్తయిన వారందరికీ తప్పనిసరిగా స్థానచలనం కల్పించాలని, అభ్యర్థన బదిలీలకూ అవకాశమివ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ ప్రక్రియ ప్రారంభం నుంచి వివాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు ఏక పక్షంగా స్థానచలనం కల్పించారంటూ వ్యవసాయ గ్రామ సహాయకులు రోడ్డెక్కారు. పైరవీలకు ప్రాధాన్యమిస్తూ.. బదిలీలు చేశారంటూ ఇంజినీరింగ్ సహాయకులు ఆందోళనకు దిగారు.

ఖాళీ లేని స్థానాలకూ.. తాజాగా సచివాలయ సంక్షేమ కార్యదర్శుల బదిలీలు అభ్యర్థులను గందరగోళంలో పడేశాయి. ఒకే స్థానానికి ఇద్దరికి స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులివ్వడంపై సిబ్బంది కంగుతిన్నారు. మొత్తం 640 మంది సిబ్బందికి కౌన్సెలింగ్ ముగిసినానంతరం 606 మందిని బదిలీలు చేశారు. వారికిచ్చిన ఉత్తర్వులు లోపభూయిష్టంగా ఉండటంతో.. న్యాయం చేయాలంటూ అభ్యర్థులు సోమవారం ఏలూరు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రీ కౌన్సెలింగ్ చేపట్టాలని పట్టుబట్టారు. విషయాన్ని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. చిన్నచిన్న పొరపాట్లు జరిగాయని, వెంటనే సరి చేస్తామని హామీ ఇచ్చారు.

సంక్షేమ, విద్యా సహాయకులతో చర్చిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని

నిబంధనలకు తిలోదకాలు.. మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలు సైతం తలనొప్పిగా మారాయి. నిబంధనల ప్రకారం అయిదేళ్ల సర్వీసు పూర్తయిన వారిని మెరిట్ ప్రకారం బదిలీ చేయాలి. ఇక్కడే నాటకాలు మొదలయ్యాయి. అర్హత ప్రకారం 1, 2, 3 మెరిట్ జాబితా ప్రకారం నియామకమైన సిబ్బందిని ర్యాంకుల వారీగా పిలిచి కౌన్సెలింగ్ చేపట్టాలి. ఇందుకు భిన్నంగా ప్రక్రియ జరగడంపై సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలంటూ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావుకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. సంక్షేమ, విద్యా సహాయకులు సైతం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టడంతో.. వారితో కలెక్టర్ వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

హమ్మయ్య.. దొరికింది!

208 చరవాణుల స్వాధీనం.. పోగొట్టుకున్న వారికి అప్పగింత

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: అపహరణకు గురైన, జారవిడుచుకున్న 208 చరవాణులను సెల్ ఫోన్ ట్రాకింగ్ విధానంలో గుర్తించామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వి.భీమారావు, సీఐలు వి.పుల్లారావు, డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇట్టే పట్టేస్తాం.. చరవాణి ఎవరికైనా దొరికితే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించాలని ఎస్పీ సూచించారు. ఎటువంటి బిల్లులు ఇవ్వకుండా విక్రయించిన వాటిని కొనుగోలు చేసి ఇబ్బందులకు గురి కావొద్దన్నారు. జిల్లాతో పాటు పలు ప్రాంతాల్లో చరవాణి పోగొట్టుకున్నవారి నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు, పోలీసులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించారన్నారు.

బాధితురాలికి చరవాణి అందజేస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

1612 ఫోన్లు స్వాధీనం.. పదో విడతగా రూ.31.20 లక్షలు విలువైన 208 చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.2.40 కోట్లు విలువైన 1612 చరవాణులను గుర్తించి బాధితులకు అందజేశారు. దీంతో సెల్‌ఫోన్ ట్రాకింగ్ బృందాన్ని ఎస్పీ అభినందించారు.

వాట్సాప్ నంబరుకు హాయ్ చెప్పి.. అపహరణకు గురైనా, జారవిడుచుకున్న చరవాణులను గుర్తించేందుకు 91549 66503 చరవాణి వాట్సాప్ నంబరును అందుబాటులో ఉంచారు. చరవాణి అపహరణకు గురైతే చరవాణి వివరాలు, ఐ.ఎం.ఈ.ఐ నంబరు, చరవాణి ఎక్కడ, ఏ సమయంలో పోయిందో తదితర వివరాలను వాట్సాప్ నంబరులో ఉంచాలి. వాట్సాప్ నంబరుకు హాయ్, హెల్ప్ అని సందేశం పంపాలి. వచ్చిన లింకు ద్వారా ఆన్‌లైన్‌లో మొబైల్ ఫోన్‌కు సంబంధించిన వివరాలు నమోదు చేయాలి. ఇలాంటి ఫిర్యాదులను పరిష్కరించేలా ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. కొన్ని చరవాణులు వెనువెంటనే దొరికాయి. మరికొన్ని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లిన తర్వాత వేరొక సిమ్ వేసి ఉపయోగిస్తున్నారు. ఇలాంటివి కొన్నింటిని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరంలలో ఉన్నట్లు గుర్తించారు. చరవాణి స్వాధీనం చేసుకున్న తర్వాత బాధితులను పిలిచి పూర్తి వివరాలు సరి చూసుకుని చరవాణులను అందజేశారు.

తీరంలో వరద గుబులు

లంక గ్రామాల్లో అప్రమత్తత

ఆచంట, న్యూస్‌టుడే: గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఈ నెల 14వ తేదీ నాటికి ప్రవాహం 9 లక్షల నుంచి 10 లక్షల క్యూసెక్కులకు చేరవచ్చని వరద పర్యవేక్షణ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో జిల్లా అధికారులు లంక గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ముందు జాగ్రత్త చర్యలకు సన్నద్ధమయ్యారు.

పెదమల్లం వద్ద గోదావరి ప్రవాహం

జిల్లాలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజవర్గాలు వశిష్ఠ గోదావరి నదికి శివారున ఉన్నాయి. ఆచంట నియోజకవర్గ పరిధిలో గోదావరి మధ్య ఉన్న లంక గ్రామాల్లో 6 వేలకు పైగా నివాసితులు ఉన్నారు. లంక భూముల్లో పెద్ద సంఖ్యలో పశువులు ఉన్నాయి. వరద పెరిగితే పెనుగొండ, ఆచంట, యలమంచిలి మండలాల పరిధిలో ఉన్న లంక భూములపై పడుతుంది. ఈ నేపథ్యంలో లంకభూముల్లో పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులు స్థానికులకు సూచించారు. ఆచంట, యలమంచిలి మండలాల్లో గర్భిణులు, బాలింతలు, వృద్ధుల వివరాలు సేకరిస్తున్నారు. అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు. అన్ని శాఖల అధికారులతో ఆయా మండలాల్లో మంగళ, బుధవారాల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినందున మరో రెండు మూడు రోజుల్లో వరద నీరు దిగువకు వచ్చే అవకాశం ఉందని ఆచంట తహసీల్దారు కనకరాజు పేర్కొన్నారు. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టేలా ఆచంట మండలంలో క్షేత్ర స్థాయి సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
ఈనాడు క్లాసిఫైడ్స్
లీగల్ ప్రకటనలు
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జీఎస్టీ 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

కాలువల ప్రక్షాళనకు అడుగులు

'ఈనాడు' ఫోన్ ఇన్‌లో ఈఈ

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: అధ్వానంగా ఉన్న కాలువలను బాగు చేయిస్తాం. తూడు తొలగింపు పనులు వేగంగా పూర్తి చేయించి, పొలాలకు నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని జల వనరుల శాఖ ఈఈ సుబ్రహ్మణ్యేశ్వర రావు తెలిపారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో జరిగిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో జిల్లాలో వివిధ ప్రాంతాల రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నీటి సంఘాలతో పనులు త్వరగా చేయించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. ఏఈలు వెంకటేశ్వరరావు, ప్రసాదరాజు, వినయ్, డ్రెయినేజీ శాఖ డీఈ నర్సింహ అప్పన్న పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న ఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, పాల్గొన్న డీఈ, ఏఈలు

సమస్య: చినమామిడిపల్లి మురుగు కాలువను ఆక్రమించారు. నరసాపురం పట్టణంలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను దానిలో వేస్తున్నారు. బి.కొండేపాడు ఛానల్ ఆక్రమణలతో పూడిపోయింది. - వెంకటేశ్వరరావు -చినమామిడిపల్లి, జి.వీరాస్వామి-బి.కొండేపాడు

అధికారి: పరిశీలించి ఆక్రమణల తొలగింపునకు తగిన చర్యలు తీసుకుంటాం.

? చిన అమిరంలో డ్రెయిన్ అధ్వానంగా ఉండటం వల్ల పొలాల్లో నీరు బయటకు వెళ్లడం లేదు.- **మంతెన విజయరామరాజు, జి.బాలకోటయ్య, చినఅమిరం**

>> చినఅమిరంతో పాటు కోపల్లె, బొండాడ డ్రెయిన్లు బాగు చేస్తే మీ సమస్య తీరుతుంది. పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

? వీరవాసరం పంట కాలువలో చెత్త ఇష్టమొచ్చినట్లు వేస్తున్నారు. ఒక నీటి శుద్ధి కేంద్రం, కొన్ని ఇళ్లలో వ్యర్థపు నీటిని కాలువలోకి నేరుగా గొట్టాలు ఏర్పాటు చేసి వదిలేస్తున్నారు.- **బొంతు రమేష్, వీరవాసరం**

>> పరిష్కారానికి చర్యలు చేపడతాం.

? గునుపూడి సౌత్ డ్రెయిన్‌లో తూడు పేరుకుపోయింది. దిగువన ఆక్వా చెరువుల వారి ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. మా పొలాల్లో నీరు బయటకు వెళ్లడం లేదు.
- **నల్లం సాయిబాబు, గునుపూడి భీమవరం**

>> కొత్తాడ వరకు కిక్కిస తొలగించారు. పూడిక పనులు అక్కడ జరిగాయి. తూడు తొలగించి ఆక్రమణలపై దృష్టి సారిస్తాం.

? ఆక్వా చెరువుల్లో బురదమట్టిని తోడి రాములకోడులోకి వదలడంతో నిండిపోయింది.. 300 ఎకరాల్లో నీరు దాని ద్వారా దిగువకు వెళ్లే మార్గం లేక పొలాలు, హరిజనపేట ఆవాస ప్రాంతం ముంపునకు గురవుతున్నాయి. - **రంగయ్యనాయుడు, తోలేరు**

>> కాలువ ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటాం.

? పూడుకుపోయిన గేదెలకోడును తవ్వించాలి. బాలేపల్లి డ్రెయిన్ అధ్వానంగా ఉంది.
- **సూర్యచంద్రరావు, ఎం.చల్లారావు, వీరవాసరం**

>> ప్రతిపాదనలు తయారు చేయిస్తాం. రైతు సంఘాలతో పనులు చేపట్టేలా చూస్తాం.

? మత్స్యపురి పంట కాలువలో చెత్త తీస్తున్నారు. పూడిక మాత్రం తీయించడం లేదు. సరిపడా నీరు మా పొలాలకు అందక ఇబ్బందులు పడుతున్నాం.
- **మేడిసెట్టి వెంకటరత్నం, కౌలు రైతు, మత్స్యపురి**

>> సమస్య పరిష్కరిస్తాం

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు: కలెక్టర్

అర్జీదారులతో మాట్లాడుతున్న నాగరాణి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్ (మీ కోసం)లో అందే ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే అర్జీలకు నిర్ణీత సమయంలోగా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. మొత్తం 165 అర్జీలు, ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ● రొయ్యల పట్టుబడి తూకాల్లో జరుగుతున్న మోసాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రొయ్య రైతుల సంక్షేమ సంఘం సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ●బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచానికే పరిమితమైన తనకు ప్రభుత్వం ఆరోగ్య పింఛను రూ.15 వేలు మంజూరు చేయాలని నందమూరుగరువుకు చెందిన చింత వెంకన్న అర్జీ ఇచ్చారు. ● ఒంటరి మహిళ పింఛను అందజేయాలని యలమంచిలి మండలం అడవిపాలెం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు రూతమ్మ వినతి అందించారు.

అప్రమత్తంగా ఉండాలి..

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అధిక వర్షాలు, తుపానులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. బలహీనంగా ఉన్న కాలువ, నదీ పరీవాహక ప్రాంతాల గట్లను రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. రానున్న మూడు రోజుల్లో భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్తు ప్రమాదాలు, అంతరాయాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎత్తుకు పైఎత్తు వేస్తూ

ఉత్కంఠగా 'ఈనాడు' ఛాంపియన్ పోటీలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: నిత్యం విధుల్లో తలమునకలై ఉండే పలు శాఖల ఉద్యోగులకు 'ఈనాడు' 'ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చదరంగం పోటీలకు విశేష ఆదరణ లభించింది. గత నెల 13 నుంచి 30వ తేదీ వరకు విద్యుత్తు, వ్యవసాయం, విద్య శాఖ, జలవనరులు, నగరపాలక సంస్థ, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖల్లోని ఉద్యోగులకు చదరంగం పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఉద్యోగులకు సోమవారం ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో చదరంగం ఫైనల్ పోటీలను నిర్వహించారు. 6 జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్స్‌లో నగరపాలక సంస్థకు చెందిన వార్డు వెల్ఫేర్ అడ్మిన్ కార్యదర్శి నంబూరి జీవన్ ఛాంపియన్‌గా నిలిచారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అకౌంటెంట్ టి. మహేష్ ద్వితీయ స్థానం పొందారు. వీరికి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ బి.సుజాత రాణి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు చదరంగం పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి స్వరాజ్యలక్ష్మి, సూపరింటెండెంట్ రవికుమార్, ఈవో అపరంజి, డీసీపీవో సూర్యచక్రవేణి, చెస్ ఆర్బిటర్ జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

పోటీలో తలపడుతున్న ఉద్యోగులు

జీవన్ (ప్రథమ), మహేశ్ (ద్వితీయ)లకు ట్రోఫీ అందజేస్తున్న ఆర్జేడీ


పాల్గొన్న విద్యార్థులతో పాలకవర్గం, అధ్యాపకులు

న్యాయ విద్యార్థులకు పట్టాల ప్రదానం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం డీఎన్నార్ న్యాయ కళాశాలలో అయిదేళ్ల న్యాయ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు పట్టా ప్రదానోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాలకవర్గ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ.. న్యాయ విద్యతో భవిష్యత్తుకు మార్గాలను సుగమం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ రఘురాం, వైస్ ప్రిన్సిపల్ అశోక్‌కుమార్, సీహెచ్ రంగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు అండగా ఎమ్మార్పీఎస్

తణుకులో ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

జెండా ఆవిష్కరించిన లాజర్, నాయకులు

తణుకు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఆవిర్భవించిన మాదిగ దండోరా సమాజంలో అన్ని వర్గాలకు అండగా నిలిచిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు అబ్బదాసరి లాజర్ పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘ పట్టణ అధ్యక్షుడు కల్యాణ్ అధ్యక్షతన స్థానిక ఎన్టీఆర్ పార్కు వద్ద వేడుకలు నిర్వహించారు. ముందుగా ఎమ్మార్పీఎస్ జెండాను లాజర్ ఆవిష్కరించి మాట్లాడారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ చేపట్టిన చిన్నపిల్లల గుండె ఆపరేషన్ల ఉద్యమమే ఆరోగ్యశ్రీకి శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. సమాజంలో దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళల పింఛన్ల పెంపు కోసం ఎమ్మార్పీఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. కృష్ణ మాదిగకు జాతి రుణపడి ఉంటుందన్నారు. భవిష్యత్తులో కృష్ణ మాదిగ నేతృత్వంలో సామాజిక ఉద్యమాలకు, రాజ్యాధికారం దిశగా పయనించేందుకు మాదిగలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోలేమాన్ మాదిగ, దిద్దే మధుబాబు, నేకూరి కృష్ణ, ఉండ్రాజవరపు శ్రీను, చదలవాడ తిమోతి, గంగోలు శివ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో విగిరి విస్మయ, కందికట్ల ఆన్యాబెన్, ముదునూరి హర్షిత్ శ్రీవర్మ, ఇందుకూరి అహాన్ వర్మ పతకాలు సాధించారు. వీళ్లంతా ఆగస్టు 1 నుంచి 4 వరకు థాయిలాండ్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.వి కృష్ణమోహన్ తెలిపారు.

కాగిత మాయాజాలం!

★ చింతలపూడిలో బయటకొచ్చిన ఇండెక్స్ వాల్యూము
★ అయిదుగురు ఉద్యోగులకు డిప్యుటేషన్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: రిజిస్ట్రేషన్ శాఖ అవినీతికి చిరునామాగా మారింది. ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో.. వారందరినీ వేర్వేరు ప్రాంతాలకు డిప్యుటేషన్‌పై పంపారు. వివరాల్లోకి వెళితే.. చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొన్నెళ్ల క్రితం ఓ దస్తావేజు ఇండెక్స్ వాల్యూములోని కాగితాన్ని ఒకరు రిజిస్ట్రేషన్ శాఖ ఐజీకి పంపారు. భద్రంగా ఉంచాల్సిన ఈ వాల్యూముల కాగితాలను గుర్తుతెలియని వ్యక్తి ఐజీకి పంపడంపై ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఇప్పటికే చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అనేక అవినీతి ఆరోపణలున్నాయి. పైగా వాల్యూముల కాగితం బయటకు రావడంతో.. సంబంధిత ఉద్యోగులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డీఐజీ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ ఎస్‌కేఎం బేగంను విజయవాడ, ఇద్దరు జూనియర్, ఒక సీనియర్ సహాయకులను ఏలూరు, షరాబ్ కామవరపుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై పంపారు. జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు రావడంతో.. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అయిదుగురు ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు పంపామన్నారు. వాల్యూము కాగితం బయటకు వెళ్లిన విషయంపై అక్కడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ వ్యవహారంపై విచారణ కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఉపాధ్యాయుడి అరెస్టు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని ఓ ఉన్నత పాఠశాలలో బాలికలపై ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు బాలికలు ఇచ్చిన ఫిర్యాదుపై సదరు ఉపాధ్యాయుడిని సోమవారం అరెస్టు చేశామని ఎస్సై ఎస్.వి.వి.ఎస్ కృష్ణాజీ తెలిపారు. ఉపాధ్యాయుడిని న్యాయస్థానంలో హాజరు పరిచామన్నారు.

కొబ్బరిలో తెగుళ్లు.. అశ్రద్ధ వద్దు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: కొబ్బరి చెట్లను పలు రకాల తెగుళ్లు ఆశిస్తాయని.. వాటి విషయంలో అశ్రద్ధ చేస్తే నష్టం తీవ్రంగా ఉంటుందని ఉద్యానశాఖాధికారిణి ప్రియదర్శిని తెలిపారు. వివిధ రకాల తెగుళ్ల లక్షణాలు, నివారణ చర్యలను ఆమె వివరించారు. ● ఆకు ఎండు, ఆకుమచ్చ తెగులు దిగువ భాగంలోని ఆకులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. గాలి ద్వారా ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు వ్యాపిస్తాయి. ఆకులపై చిన్న గోధుమ రంగు మచ్చలు మొదలై క్రమేపీ విస్తరిస్తాయి. కాయలపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి శిలీంధ్రం వ్యాపించి కుళ్లిపోతాయి. మట్టల నుంచి మొవ్వను ఆశించి చివరకు చెట్టు చనిపోతుంది. తెగులును గుర్తించిన తోటల్లో 200 గ్రాముల సూడోమోనాస్ పొడి, 50 కిలోల పశువుల ఎరువు, 5 కిలోల వేపపిండి కలిపి ఏడాదికి ఒకసారి నేలలో వేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్న ముదురు తోటల్లో 2 మి.లీ హెక్సాకొనజోల్‌ను 100 మి.లీ నీటిలో కలిపి ఏడాదికి 4 సార్లు వేర్ల ద్వారా ఎక్కించాలి.

వక్క.. లాభాలు పక్కా..

మిశ్రమ సాగుతో సత్ఫలితాలు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మిశ్రమ సేద్యం లాభసాటిగా ఉంటుందని జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన రైతు ఎలికే వరప్రసాదరావు నమ్మారు. వ్యవసాయం ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ఏకకాలంలో పలు పంటలు వేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. స్వతహాగా వ్యవసాయ కుటుంబం కావడంతో చిన్ననాటి నుంచి తండ్రి చేస్తున్న సాగు పనులు నిశితంగా పరిశీలించేవారు. చదువు పూర్తయిన తర్వాత తనకున్న ఎకరాల్లో మిర్చి, పొగాకు పండించేవారు. అప్పట్లో ఈ ప్రాంతంలో మిర్చి సాగు ఎక్కువగా ఉండటంతో మార్కెట్ ఒడుదొడుకులు ఉండేవి. దీనిని అధిగమించేందుకు దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్‌పామ్ వేయాలని నిర్ణయించుకున్నారు. మూడున్నర ఎకరాల్లో ప్రయోగాత్మకంగా మొక్కలు తెచ్చి నాటారు. మరో మూడున్నర ఎకరాల్లో కొబ్బరి నాటి అంతర పంటగా కోకో వేశారు.

ఆది నుంచి వినూత్నంగా.. ప్రసాదరావుకు ఆది నుంచి సాగులో వినూత్నంగా పంటలు పండించి అధిక దిగుబడి సాధించాలని కోరిక. ఐదు దశాబ్దాల కిందటే ఈ ప్రాంత వాసులకు ఆయిల్‌పామ్, కోకో పంటలను పరిచయం చేశారు. ప్రస్తుతం వక్క తోటలపై లాభాలు బాగున్నాయని తెలుసుకుని వేమనాడ నర్సరీ నుంచి వక్క మొక్కలు రూ.90 చొప్పున మూడేళ్ల కిందట తెచ్చి కోకోలో అంతర పంటగా నాటారు. ప్రయోగాత్మకంగా ఓ ఎకరంలో ప్రత్యేకంగా వక్కతోటను పెంచుతున్నారు. వక్క మొక్కలకు ఎండ తీవ్రత తగలకుండా అరటి పెంచుతున్నారు. ప్రస్తుతం వక్క తోట ఏపుగా పెరిగి గెలలతో అలరారుతోంది. వక్క కాయలు గుత్తులుగా కాస్తున్నాయి.

సేంద్రియ పద్ధతుల్లో.. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నారు. పదేళ్ల కిందటే వర్మీ కంపోస్టు యూనిట్లను తన పొలంలో నెలకొల్పారు. ఏడాది పొడవునా పంటలకు ఎరువుగా వేయడంతోపాటు చీడపీడల నివారణకు పెంటలను వినియోగిస్తున్నారు. దరదేరకుండా జీవామృతాన్ని పిచికారీ చేస్తున్నారు. ఆకులను సైతం చెట్ల మొదళ్లో వేస్తున్నారు.

తక్కువ ఖర్చుతోనే.. 'తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చేలా రైతులు వ్యవసాయం చేయాలి. కొద్ది భూమిలో పలు రకాల పంటలు వేసి ఆదాయం గడించవచ్చు. వక్క పండు కిలో రూ.60 చొప్పున లేదా చెట్టు రూ.500 దాకా కొనుగోలు చేస్తున్నారు. మొత్తం మీద ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మిగతా కోకో, కొబ్బరిపై ఖర్చులు పోనూ రూ. లక్ష ఆదాయం సమకూరుతుంది..' అని రైతు ఎలికే వరప్రసాదరావు వివరించారు.

ప్రశ్న: వరిలో మాగాణి జీలో నేల సారాన్ని పెంచడం ఎలా?
- జన్నారెడ్డి, తాడేపల్లిగూడెం

సమాధానం: రసాయనిక ఎరువుల వినియోగానికి ముందు ఎకరానికి పచ్చిరొట్ట విత్తనాలు (జీలుగ, జనుము, పిల్లి పెసర) 15 కిలోలు చల్లి 50 శాతం పూత దశకు వచ్చిన తర్వాత కలియదున్నాలి. ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువును నాట్లకు ముందు నేలలో వేయాలి. జీవన ఎరువులు (అజోస్పైరిల్లమ్, పీఎస్‌బీ, కేఆర్‌బీ) 2 కిలోలు 100 కిలోల పశువుల ఎరువుకు పట్టించి నేలలో కలియబెట్టాలి.

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

డా. పి.విజయలక్ష్మి
ప్రధాన శాస్త్రవేత్త
కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు
✆ చరవాణి
73826 33692

రైతేరాజు

వరి నాట్లు వేస్తున్నారా..!

మార్టేరు, న్యూస్‌టుడే: వరి నాట్లు వేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే దిగుబడిపై ప్రభావం పడుతుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు టి.శ్రీనివాస్ తెలిపారు. రైతులకు ఆయన చేసిన సూచనలు ఇవీ.. ● భూములను మెత్తగా దమ్ము చేసి రెండు నుంచి పది రోజుల లోపు నాటుకోవాలి. పైపైన నాట్లు వేస్తే ఎక్కువ పిలకలు తొడిగి 20 శాతం వరకు దిగుబడి పెరిగినట్లు పరిశోధనల్లో తేలింది. ● నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారును నాటితే దిగుబడి తగ్గుతుంది. ● భూసారాన్ని అనుసరించి చదరపు మీటరుకు 33 మూనలు ఉండేలా చూసుకోవాలి. భూసారం తక్కువగా ఉన్న భూముల్లో, నాట్లు ఆలస్యమై ముదురు నారు వినియోగించాల్సి వస్తే మూనల సంఖ్య పెంచాలి.

యాజమాన్య పద్ధతులతో నష్ట నివారణ

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: చెరువుల్లో సాగు చేస్తున్న పండుగప్ప చేపలు ఇటీవల తెగుళ్లు సోకి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సాగునీటి కాలువల నుంచి కొత్త నీటిని చెరువుల్లోకి తోడటం, వర్షాల ప్రభావంతో చేపలు రెడ్ డిసీజ్, తాటాకు, మొప్పల్లో జలగల వంటి తెగుళ్లకు గురవుతున్నాయి. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా దీనిని నివారించవచ్చని భీమవరానికి చెందిన ఆక్వారంగ నిపుణుడు డాక్టర్ అడబాల గోపాలరావు పేర్కొన్నారు. రైతులకు ఆయన ఇచ్చిన సూచనలు ఇవీ..

తెగులు సోకిన చేపలు

★ చెరువుల్లోకి కొత్త నీరు తోడిన వెంటనే బ్యాక్టీరియా కిల్లింగ్ ఏజెంట్ అయిన శానిటైజర్‌ను చల్లాలి. తగిన ఔషధాలను నిపుణుల సలహా మేరకు వినియోగించాలి. ★ పండుగప్పలు బతికి ఉన్న, మృతి చెందిన ఇతర చేపలను ఆహారంగా తీసుకుంటాయి. వాటి అవశేషాలు చెరువు అడుగు భాగంలో చేరి కుళ్లడంతో అమోనియా, నైట్రైట్ వంటి విషవాయువులు పెరుగుతుంటాయి. ప్రతి పదిరోజులకు ఒకసారి జియోలైట్, గ్యాసోక్యూర్, రోడోబ్యాక్టిల్, రోడోకోకస్, నైట్రోజమోనాస్ వంటి ప్రొబయోటిక్స్‌ను తగిన మోతాదులో వినియోగించి చెరువు అడుగు భాగాన్ని శుభ్రం చేసుకోవాలి. క్యూర్ వంటి శానిటైజర్‌ను వారానికోసారి చెరువుల్లో చల్లి బ్యాక్టీరియా రహితంగా చూసుకోవాలి.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

Wanted teachers of Physical Science, Maths for Classes 6th to 10th. Contact or Send resume through Whatsapp: 98853 47949. Vijaya E.M. School, Penumantra, W.G.Dt.

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

ఎవిఆర్ బజాజ్ త్రీ వీలర్ ఆటో షోరూం, భీమవరం, ఆకివీడు, చేబ్రోలు, నిడమర్రు, గణపవరం, కాళ్ళ, పాలకొల్లు, మార్టేరు, నలజెర్ల, తాడేపల్లి గూడెం, నిడదవోలు, అత్తిలి, నరసాపురం, మొగల్తూరు నందు పనిచేయుటకు ఇంటర్ చదివిన సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను, టూ వీలర్ తప్పనిసరి, త్రీ వీలర్ రంగంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. Cont: 88866 31234, 97014 95202

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

మిడిల్ స్కూల్ ఇంగ్లీష్ (3rd to 7th క్లాస్), PET లు, బ్లాక్ ఇంచార్జ్‌లు, టీచర్లు కావలెను. శ్రీశ్రీ స్కూల్, శ్రీరామ్ నగర్ 10 వ రోడ్, ఏలూరు. సెల్: 94412 34626, 08812-244084.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి / వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52843.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.35 పైll
తణుకు ఆఫీసు: 08819-224254

అక్కడే వదిలేయండి.. ఎలా పోతే నాకేంటి?

☛ రైలు నుంచి జారిపడి చికిత్స పొందుతున్న తండ్రి
☛ తనకు సంబంధం లేదన్న కొడుకు

తణుకు, న్యూస్‌టుడే: కని పెంచి పెద్ద చేసిన తండ్రి కుటుంబంలో మనస్పర్థల కారణంగా ఏడేళ్ల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి సోమవారం తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యక్షమయ్యారు. ఆస్పత్రి సిబ్బంది కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినప్పటికీ తనకు సంబంధం లేదని కొడుకు తేల్చి చెప్పడంపై పలువురు మండిపడుతున్నారు. పైగా తనకు సంబంధం లేదని రాసిస్తానని చెప్పడం చూస్తుంటే మానవత్వం మంటగలిసిందని వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన గలగల సుబ్బారావుకు భార్యతో పాటు కొడుకు సుధీర్, కుమార్తె ఉన్నారు. దాదాపు ఏడేళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సుబ్బారావు అప్పటి నుంచి తిరిగి రాలేదు. ఆదివారం సాయంత్రం కాల్దరి రైల్వేస్టేషన్లో రైలు నుంచి జారి పడి గాయాలపాలయ్యాడు. తణుకు రైల్వే పోలీసులు బాధితుణ్ని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అతడి నుంచి వివరాలు సేకరించిన రైల్వే కానిస్టేబుల్ బాల బాధితుడి కుమారుడు సుధీర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. సుబ్బారావు పరిస్థితి విషమంగా ఉందని.. ఏలూరు తీసుకెళ్లాలని చెప్పడంతో 'నాకు ఆయనతో సంబంధం లేదు. అక్కడే వదిలేయండి, ఆయన ఎలాపోతే నాకేంటి అని' సమాధానం ఇవ్వడంతో అవాక్కయిన కానిస్టేబుల్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

ఎప్పుడో చనిపోయాడన్న భార్య.. సుబ్బారావు భార్యతో మాట్లాడేందుకు సోమవారం ప్రకాశరావుపాలెం గ్రామానికి వెళ్లిన పోలీసులకు అతని కుటుంబ సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తన తండ్రి చనిపోయినట్లు మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్నామని, నా తల్లి వితంతు పింఛను సైతం తీసుకుంటోందని చెప్పడంతో పోలీసులు అవాక్కయ్యారు.

అవసరమైతే రాసిస్తా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బారావు వద్దకు కుమారుడు సుధీర్‌ను తీసుకొచ్చిన రైల్వే పోలీసులకు, తణుకు జిల్లా ఆసుపత్రి వైద్యులకు సైతం అదే సమాధానం ఇవ్వడం గమనార్హం. మరో వైపు తనకు, తన కుటుంబానికి తండ్రితో ఎలాంటి సంబంధం లేదని లిఖితపూర్వకంగా ఇస్తానని చెప్పడంతో ఆసుపత్రి ఆర్ఎంవో ఏవీఆర్ తాతారావు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎంత నచ్చజెప్పినప్పటికీ తండ్రిని తీసుకెళ్లేందుకు కొడుకు సుధీర్ నిరాకరించడంతో ఆర్ఎంవో తణుకు సీఐ కొండయ్యకు సమాచారం అందించారు. తండ్రి పట్ల నిర్లక్ష్యం వహిస్తే కేసు నమోదు చేస్తానని సీఐ సైతం హెచ్చరించినప్పటికీ మొండికేయడంతో బాధితుడు సుబ్బారావుకు అదే ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

పోక్సో కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు

తణుకు, న్యూస్‌టుడే: ఇరగవరం పోలీస్‌స్టేషన్లో 2021లో నమోదైన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ.1.10 లక్షల జరిమానా విధిస్తూ సోమవారం భీమవరం పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ తీర్పు చెప్పారు. ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన నీలాపు గోపికృష్ణ అదే గ్రామానికి చెందిన బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఇరగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై జానా సతీష్ పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేశారు. కోర్టు విచారణలో గోపికృష్ణపై నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలు, జరిమానా విధిస్తూ భీమవరం పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు ఎస్సై జానా సతీష్ తెలిపారు. ఈ కేసులో బాలిక తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బ్రహ్మయ్య వాదనలు వినిపించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

డబ్బు ఇవ్వలేదని తండ్రిపై దాడి

పెనుమంట్ర, న్యూస్‌టుడే: అడిగిన డబ్బు ఇవ్వలేదనే కోపంతో తండ్రిపై తనయుడు దాడి చేసిన ఘటన పెనుమంట్ర మండలం మల్లిపూడిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మల్లిపూడి బ్యాంకు వీధికి చెందిన గుడిమెట్ల కృష్ణారెడ్డితో అతడి కుమారుడు వెంకటరెడ్డికి ఆస్తి వివాదాలు ఉన్నాయి. వెంకటరెడ్డి తండ్రిని డబ్బు అడగ్గా ఆయన నిరాకరించారు. దీంతో తండ్రిపై ఇనుపరాడ్డుతో దాడికి తెగబడ్డాడు. బాధితుడి తల, శరీర భాగాలపై గాయాలు కావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహన సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని తణుకు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు. పెనుగొండ సీఐ విజయకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

నరసాపురం, న్యూస్‌టుడే: మనస్తాపంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు నరసాపురం పట్టణ ఎస్సై ఎస్ఎన్ ముత్యాలరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన రజియా సుల్తానా(38)కు గతంలో ఆకివీడుకు చెందిన యువకుడితో వివాహమైంది. మనస్పర్థలతో వారు విడిపోయారు. తరువాత పట్టణానికి చెందిన సునీల్‌కుమార్, రజియా సుల్తానాలు ఒకరికొకరు ఇష్టపడి మూడేళ్ల కిందట వివాహం చేసుకున్నారు. సునీల్‌కుమార్ ఖాళీగా తిరుగుతుండగా ఆమె రుస్తుంబాదలో మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇస్తూ కుటుంబాన్ని నెట్టుకువస్తున్నారు. ఆమె సోమవారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తన చావుకు ఎవరూ కారణం కాదని.. మనస్పర్థలతో మొదటి భర్తతో విడిపోవడం, రెండో భర్త ఏ పనీ లేకుండా తిరుగుతుండటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఆమె గదిలో లేఖ లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. దీనిపై మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఒంటరి మహిళను వేధించిన వ్యక్తికి..

పాలకోడేరు, న్యూస్‌టుడే: ఒంటరిగా ఉన్న మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు కోరిక తీర్చాలని వేధింపులకు గురిచేసిన నిందితుడికి భీమవరం రెండో అదనపు జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి ఏడాది జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. పాలకోడేరు ఎస్సై ఎం.రవివర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకోడేరు మండలం కొండేపూడికి చెందిన ఓ మహిళ భర్త చనిపోవడంతో పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన చింతపల్లి గోవిందరావు అనే వ్యక్తి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు వేధింపులకు గురిచేశాడు. సంఘ పెద్దలు పలుమార్లు మందలించినా.. అతనిలో మార్పు రాకపోగా.. 2020 మార్చి 10న ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఆమెను వేండ్ర అగ్రహారం వద్ద ఆపి కోరిక తీర్చాలని వేధించాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఎన్.జ్యోతి ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై వివరించారు.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉll 5 - ఉll 7
ఈ-మార్నింగ్స్	ఉll 7 - ఉll 11
నువ్వా నేనా	ఉll 11 - మll 2
సత్యభామ	మll 2 - సాll 5
లైట్ తీస్కో	సాll 5 - రాll 9
సరదాగా కాసేపు	రాll 9 - రాll 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రాll 12 - తెll 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 6304901226

భీమవరం

●భీమవరం ●ఉండి

నేడు మండల సమావేశం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో మార్కండేశ్వరరావు తెలిపారు. మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ కఠారి జయలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

మత్తు జోలికి వెళ్లొద్దు: ఎస్సై

కాళ్ల(భీమవరం పట్టణం), న్యూస్‌టుడే: మత్తు పదార్థాల సరఫరా, వినియోగం చట్ట విరుద్ధమని కాళ్ల ఎస్సై ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్లకూరు గ్రామంలో ఈగల్ బృందం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వినియోగంపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు.

మొక్కలు నాటిన చిన్నారులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జమాతే ఇస్లామి హింద్ అనుబంధ సంస్థ చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం భీమవరంలో మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని ఇక్రా మదరసాలో ప్రారంభించారు. జమాతే ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ అస్కరి, మౌలానా అబుల్‌కలాం, ప్రధానోపాధ్యాయుడు షేక్ బాబాజీ సాహెబ్ తదితరుల పర్యవేక్షణలో పాఠశాలల ఆవరణలో చిన్నారులతో మొక్కలు నాటించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? గొల్లలకోడేరు పంచాయతీ పరిధి యనమదుర్రు కాలువకి కేటాయించిన స్థలాలు ఆక్రమించి పలువురు నిర్మాణాలు చేపడుతున్నారు. **- పి.సుబ్బారావు, గొల్లలకోడేరు**

✔ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే నోటీసులు జారీ చేయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. నిర్మాణాలను తొలగిస్తాం. **- కె.సుజాత, కార్యదర్శి**

రహదారి అంచులు బలోపేతం

ఉణుదుర్రు (ఉండి), న్యూస్‌టుడే: పిప్పర- భీమవరం రాష్ట్రీయ రహదారిలో అంచులను పటిష్ఠ పరిచే పనులు ఆ శాఖ అధికారులు చేపట్టారు. సాగపాడు- యండగండి మధ్య దెబ్బ తిన్న రహదారి అంచుల్లో తాత్కాలిక రక్షణ చర్యల్లో భాగంగా పనులు జరుగుతున్నాయి. జూన్ 20న 'రహదారి మధ్యలో ముప్పు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. సాగపాడు బస్టాండ్ సమీపంలో ఉండి పంట కాలువ పూర్తిగా కోతకు గురైన అంచులు రక్షణ చర్యలు చేపట్టారు. మిగిలిన ప్రాంతాల్లోనూ మరమ్మతు పనులు చేపట్టనున్నామని ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీహరిరాజు తెలిపారు.

ఈనాడు కథనాలకు స్పందన

స్తంభాన్ని నిలబెట్టారు.. **పాలకోడేరు, న్యూస్‌టుడే:** గొల్లలకోడేరు బ్రాహ్మణ చెరువు గట్టుపై రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని సరి చేశారు. గత నెల 11న వీచిన ఈదురు గాలులకు స్తంభం కూలి పోయే విధంగా మారిన వైనంపై 'కూలితే ముప్పే' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు ఏఈ మాధవరావు స్పందించారు. సోమవారం మరమ్మతులు చేయించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇట్టే కొట్టేస్తున్నారు..!

రెప్పపాటులో నగదు, నగలు మాయం చేస్తున్న ముఠాలు

● గతేడాది జనవరిలో భీమవరం ఒకటో పట్టణంలోని పోలీసు బొమ్మ కూడలిలో ఓ హోటల్ ఎదుట ద్విచక్ర వాహనాన్ని వ్యక్తి నిలిపాడు. అందులో రూ.4 లక్షలు ఉన్నాయి. భోజనం చేసి బయటకు వచ్చేసరికి బండి డిక్కీ తెరిచి ఉంది. అందులో ఉంచిన నగదు మాయమైంది.

● గతేడాది రెండో పట్టణంలోని ఓ బ్యాంకు దగ్గర ఉంచిన ద్విచక్ర వాహనంలోని రూ. 10 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు.

● గతేడాది డిసెంబర్‌లో రెండో పట్టణంలోని చినఅమిరం పరిధిలో ఓ బ్యాంకు సమీపంలో రూ.8.50 లక్షల విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లారు.

● రెండు రోజుల కిందట ఒకటో పట్టణంలోని ఓ ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనం డిక్కీలోని రూ.3 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఎం.రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: నగదు, బంగారు ఆభరణాలను రెప్పపాటులో అపహరిస్తున్న ముఠాలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహన డిక్కీల్లో ఉంచిన నగదు అయితే ఇట్టే కొట్టేస్తున్నారు. వాటిని ఛేదించడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారుతోంది.

ఇతర ప్రాంతాల నుంచి వచ్చి

గత రెండేళ్ల కిందట డిక్కీలోని నగదు అపహరించిన కేసుకు సంబంధించి సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించారు. ఇద్దరు అనుమానితులు చెన్నై ప్రాంతానికి చెందినవారుగా గుర్తించారు. మరికొన్ని కేసుల్లోని దొంగలు చిత్తూరు ప్రాంతానికి చెందిన వారుగా తెలిసింది. ద్విచక్ర వాహనాలపై వెళ్తూ ఎక్కడైతే నగదు లావాదేవీలు ఉంటాయో, బ్యాంకులు, ఏటీఎంలు నుంచి డబ్బులు తీసుకెళ్తారో వాళ్లని అనుసరించి నగదు కొట్టేసి తప్పించుకుంటారు.

అప్రమత్తంగా ఉండాలి

నగదు లావాదేవీలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను దొంగలు ఎంచుకుంటారు. బ్యాంకులు, బంగారు ఆభరణాల దుకాణాల దగ్గర తిరుగుతుంటారు. ప్రజలకు మాయమాటలు చెప్పి నగదు అపహరించుకెళ్తున్నారు. నగదు, బంగారు ఆభరణాలు తీసుకెళ్లే సమయంలో సంచి చేతిలోనే ఉంచుకోవాలని డీఎస్పీ ఆర్.జి జయసూర్య సూచించారు. ద్విచక్ర వాహన డిక్కీలో నగదు ఉండగా బండిని ఏదొక దుకాణం దగ్గర నిలుపుదల చేసి లోపలికి వెళ్లి వచ్చేలోపు జరుగుతున్న దొంగతనాలు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. బాధితులు ఏమరుపాటుగా ఉన్న సమయంలో నగదు, బంగారు వస్తువులతో పారిపోతున్నట్లు పలు కేసులు ఛేదనలో వెల్లడవుతుందన్నారు. బ్యాంకులు ఉన్న చోట్ల, వాహన రద్దీ, ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వెండి కిరీటం సమర్పణ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మెంటేవారితోటలోని విజయగణపతి ఆలయానికి పట్టణానికి చెందిన భూపతి తాతారావు జ్ఞాపకార్థం కుమారులు కిలో వెండి కిరీటం సోమవారం సమర్పించారు. తాతారావు కుమారులు శ్రీను, రామకృష్ణ దంపతులు, కుటుంబ సభ్యులు కిరీటం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అర్చకుడు సంప్రోక్షణ చేసి స్వామివారికి అలంకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అమ్మవారికి.. **భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** మెంటేవారితోటలోని బాలాత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారి వెండి పీఠానికి పట్టణానికి చెందిన నైనాలశెట్టి లీలా దంపతులు 100 గ్రాముల వెండిని సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు చేశారు. దాతకు చిత్రపటం, ప్రసాదం అందించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

ఏఎస్ఆర్ హాలు పునర్ నిర్మించాలని వినతి

కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సాధన కమిటీ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పాత బస్టాండు వద్ద గతంలో తొలగించిన అల్లూరి సీతారామరాజు భవనాన్ని వెంటనే పునర్ నిర్మించాలని అల్లూరి సీతారామరాజు భవన నిర్మాణ సాధన కమిటీ కోరింది. ఈ మేరకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోసేనురాజు, రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, పీఏసీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులుకు సోమవారం వినతిపత్రాలను అందజేశారు. ప్రజానీకానికి అనేక విధాలుగా ఉపయోగపడిన భవనం తొలగించాక దాని స్థానే కొత్తది వెంటనే నిర్మించాలని కోరారు. సాధన కమిటీ గౌరవాధ్యక్షుడు కనుమూరి సత్యనారాయణరాజు, సభ్యులు బి.బలరాం, జె.ఎన్.వి గోపాలన్, కె.వెంకట్రాజు, సీతారాం ప్రసాద్, రంగసాయి, డి.శ్రీనివాసరాజు, గాతల జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

తీరిన రోడ్డు కష్టాలు

పనులు పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

కలిసిపూడి (ఉండి), న్యూస్‌టుడే: కొత్త కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి కష్టాలు మూడేళ్ల తరువాత తీరాయి. గ్రామ పంచాయతీకి కూతవేటు దూరంలోని పేద ప్రజలకు గూడు కల్పించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. రహదారులు, విద్యుత్తు, మంచి నీరు వంటి వసతులు కల్పిస్తామని జిల్లా అధికారులు సైతం హామీనిచ్చారు. దీంతో 24 మంది లబ్ధిదారుల్లో 23 మంది పక్కా గృహాలు నిర్మించుకున్నారు. రహదారుల నిర్మాణం ప్రతిపాదన దశలోనే ఉండిపోయింది. వర్షాకాలం వస్తే ఛిద్రంగా రహదారి దర్శనమిస్తోందని స్థానికులు వాపోయారు. ఈ మేరకు గ్రామ సర్పంచి కేశబోయిన జానకి శ్రీనివాస్ కంకర రహదారి నిర్మాణానికి రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టారు. రెండ్రోజుల నుంచి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సోమవారం సర్పంచి జానకి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి అప్పారావు పనులు పరిశీలించారు.

వేణుగోపాలస్వామికి విశేష పూజలు

ఆకివీడు, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామికి సోమవారం అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు కృషి: డీపీవో

మాట్లాడుతున్న రామనాథ్‌రెడ్డి

ఉండి, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు బూత్ స్థాయి అధికారులందరూ కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, నియోజకవర్గ ఎన్నికల అధికారి రామనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గంలో బీఎల్‌వోలు, ఎన్నికల సిబ్బందికి తొలి విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. అందులో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి అర్హుల పేర్లు మాత్రమే ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలన్నారు. ఉండి, పాలకోడేరు మండలాల సహాయ ఎన్నికల అధికారులు కె.నాగార్జున, ఎన్‌బీ విజయలక్ష్మి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రత్నకుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. శిక్షణ పొందిన బీఎల్‌వోలకు ధ్రువపత్రాలు అందజేశారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం

ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం, కామాక్షి ఆలయ నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం రాత్రి ఏకగ్రీవంగా జరిగాయి. బుధవారం మార్కెట్ సమీపాన ఉన్న కామాక్షి ఆలయ ప్రాంగణంలోని విశ్వబ్రాహ్మణ సంఘ భవనంలో నిర్వహించిన ఎన్నికలో సంఘ అధ్యక్షుడిగా శ్రీశైలపు నాగవరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కనితి భద్రం, కోశాధికారిగా సుధాకర్, పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా పుట్ట ఫణికుమార్, ప్రధాన కార్యదర్శిగా మందరపు సంపత్, కోశాధికారిగా ఆవుపాటి జగన్ పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కార్యదర్శి తెలిపారు.

తక్కువ తూకంతో మోసాలు

సమావేశంలో సంఘం ప్రతినిధులు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: దళారులు తక్కువ తూకం చూపుతూ ఆక్వా రైతులను మోసం చేస్తున్నారని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం కార్యదర్శి బోణం చిన్నబాబు ఆరోపించారు. పాలకొల్లు మండలం పూలపల్లిలో ఆ సంఘం కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొయ్యల గ్రేడుల పేరిట దళారుల చేతుల్లో రైతులు దోపిడీకి గురవుతున్నారన్నారు. రొయ్యల తూకంలో కిలోకు 80 గ్రాముల వరకు తేడా ఉన్నట్లు ఓ రైతు గుర్తించి సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు సంఘం తరపున రైతులకు అండగా నిలుస్తామని తెలిపారు. సంబంధిత కంపెనీలు, ప్రభుత్వం కూడా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షులు పి.వెంకటసత్య నారాయణ రాజు, కె.నరసింహస్వామి పాల్గొన్నారు.

'మీ కోసం'లో మూడు అర్జీలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)లో మొత్తం మూడు అర్జీలు అందాయని తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

క్షీరారామలింగేశ్వరునికి అభిషేకాలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష అభిషేకాలు జరిపించారు. స్వామిని నాగాభరణం, పుష్పాలు, రుద్రాక్షలతో అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ సప్త సోమవారాల ప్రదక్షిణలు చేశారు. స్వామిని పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. గోశాలలో భక్తులకు అన్నసమారాధన చేశారు. రాత్రి స్వామికి పంచహారతులు ఇచ్చారు.

అనధికార వంతెన నిర్మాణంపై అభ్యంతరం

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల, దొడ్డనపూడి, కోలనపల్లి గ్రామాలకు సాగు, తాగునీరు అందించే కె.లంక పంట కాలువపై అనధికారికంగా వంతెన నిర్మించడంపై రైతులు సోమవారం అభ్యంతరం తెలిపారు. నీటి సంఘం ప్రతినిధులతో కలిసి రైతులు వంతెన నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. పంట కాలువపై ఉన్న పాత ఇనుప వంతెన తొలగించి కొత్తగా మరొక వంతెన నిర్మాణానికి కాలువను పూడ్చి వేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కాలువ శివారు గ్రామాలకు వచ్చే నీటి ప్రవాహానికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ విషయమై జలవనరుల శాఖ ఏఈ ఫణిశంకర్ మాట్లాడుతూ.. కాలువ పూడ్చి వేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అక్కడ వంతెన నిర్మాణానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

పాలకోడేరు, న్యూస్‌టుడే: మోగల్లు సంత మార్కెట్‌లో ఆదివారం మామిడికాయలు కొనుగోలు చేసే సందర్భంలో చోటుచేసుకున్న గొడవపై గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై ఎం.రవివర్మ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బేతాళ ఏసు మామిడికాయలు కొనేందుకు దుకాణం వద్దకు వెళ్లగా.. అక్కడే ఉన్న మరో వ్యక్తి వాగ్వాదానికి దిగారు. అనంతరం ఇంటికి వచ్చేసిన ఏసుపై గొడవకు దిగిన వెంకటరత్నం, ఏసోబు, సంసాని, లడ్డు కర్రలతో దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఏసును స్థానికులు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గొల్లలకోడేరులో అగ్నిప్రమాదం

పాలకోడేరు, న్యూస్‌టుడే: గొల్లలకోడేరులోని ఉండి పంట కాలువ గట్టు సమీపంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు, పశువుల పాకతో పాటు గడ్డివాము దగ్ధమైంది. వృద్ధురాలు సూరమ్మకు చెందిన తాటాకిల్లు కాలిపోగా, సోడవరపు దాలియ్యకు చెందిన రెండు పాడి గేదెలకు నిప్పు అంటుకుని తీవ్ర గాయాలయ్యాయి. భీమవరం నుంచి అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను అదుపు చేశారు.

నిర్వహణ లోపం.. ప్రజలకు శాపం

● గ్రామాల్లో నిరుపయోగంగా తాగునీటి పథకాలు ● అధ్వానంగా చెరువులు

బొబ్బనపల్లి (వీరవాసరం), న్యూస్‌టుడే: తాగునీటి పథకాల నిర్వహణ లోపం ప్రజలకు శాపంగా మారింది. గ్రామాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేసి అందుబాటులోకి తీసుకు వచ్చిన పథకాలు పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో ప్రజలు ప్రైవేటు నీటి శుద్ధి కేంద్రాల నుంచి రక్షిత తాగునీరు కొనుగోలు చేసి వినియోగించుకోవాల్సి వస్తోంది.

వర్షాకాలంలోనూ అవే ఇబ్బందులు

పంట కాలువలకు నీటిని విడుదల చేసి వారం రోజులు కావస్తున్నా.. మత్స్యపురి, వీరవాసరం తదితర గ్రామాల్లో చెరువులను ఇంత వరకూ నీటితో నింపలేదు. అదేమని అడిగితే చెరువులో చేపలు పట్టుకునేందుకు వన్‌డే సెల్ నిర్వహించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు వర్షాకాలం వచ్చినా ఆ ఇబ్బందులు తప్పడం లేదంటూ వాపోతున్నారు. ఇక బొబ్బనపల్లి, మత్స్యపురిపాలెం, బాలేపల్లి తదితర గ్రామాల్లో చెరువులను శుభ్రం చేయకుండా వాటిని నీటితో నింపడంతో కలుషితంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్నది బొబ్బనపల్లిలోని తాగు నీటి చెరువు. ఇటీవల ఎండలకు చెరువులో నీరు పసర్లెక్కి అడుగంటింది. కాలువలకు నీటిని విడుదల చేసిన తరువాత అధికారులు చెరువులో పసర్లెక్కిన నీటిని బయటకు మళ్లించకుండా నీటితో నింపడంతో చెరువు నీరంతా రంగు మారింది.

ఇది బొబ్బనపల్లిలో తాగునీటి సంపు. నెలలుగా దీనిని వినియోగించక పోవడంతో ఇలా దర్శనమిస్తోంది.

మురుగు నీటితో..

పలు గ్రామాల్లో తాగునీటి చెరువులకు సంబంధించిన కాలువలు ఆక్రమణలకు గురికావడం అందులో స్థానికులు మురుగునీటిని విడిచిపెడుతున్నారు. ఇక గ్రామ పంచాయతీల్లో ప్రజలకు సరఫరా చేసే తాగునీరు ఎలా ఉందో పరీక్షించడానికి ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో సరఫరా చేసిన నీటి పరీక్షా కిట్లు పంచాయతీల్లో నిరుపయోగంగా ఉన్నాయి. 'పంచాయతీల్లో నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకాలను వినియోగంలోకి తీసుకొస్తాం. బొబ్బనపల్లి నీటి పథకాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటా.' అని ఆర్‌డబ్ల్యూఎస్ వీరవాసరం జేఈ ఎం.కనకారావు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

పుస్తకాలు, నగదు అందుకున్న విద్యార్థులతో దాతలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, కెరీర్ గైడెన్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నలుగురు విద్యార్థులకు నగదు, పుస్తకాలు సోమవారం అందించారు. శ్రీరామపురం కూడలి సమీపాన ఉన్న గాంధీ కస్తూర్బా భవనంలో ఐఐటీ విద్యార్థిని బి.ఎస్.అనూషకు ఫీజు నిమిత్తం రూ.60 వేలు, ఇంటర్ విద్యార్థులు ఎన్.హనీష్‌వర్మ, వై.అవినాష్, కె.ఎస్ఎస్‌వీ కుమారిలకు సుమారు రూ.29 వేల విలువైన పాఠ్యపుస్తకాలు మొత్తం రూ.89 వేలు డాక్టర్ దీప్తిరాజు, బి.నీలాద్రిరాజు ఆర్థిక సహకారం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సంస్థల ప్రతినిధులు సీహెచ్.రామకృష్ణంరాజు, వి.వెంకటేశ్వరరావు, బి.వెంకటపతిరాజు, పి.రామ్మోహన్‌వర్మ, ఈ.ప్రసాదరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు వితరణ.. **భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** గంటా పాల్ రోనాల్డ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాయలంలోని లూథరన్ చర్చిలో 350 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు, పాఠశాలకు పంకాలు సోమవారం అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ ఏడాది 4 జిల్లాల్లో 1.50 లక్షల రాత పుస్తకాలు అందజేశామన్నారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిపల్లి మంగరాజు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనా జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు టవర్ ఎక్కి మళ్లీ హల్‌చల్

కుటుంబ సభ్యులతో మైక్‌లో మాట్లాడిస్తున్న పోలీసులు

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: మద్యం మత్తులో మెంటేవారితోటకు చెందిన కె.శ్యామ్ భీమవరం బీవీ రాజు కూడలిలోని విద్యుత్తు టవర్‌పైకి ఎక్కి సోమవారం మధ్యాహ్నం హల్‌చల్ చేశాడు. సమాచారం తెలుసుకున్న విద్యుత్తు ఏఈ కె.రవివర్మ సరఫరా నిలిపివేయడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. టవర్‌పై ఉన్న వ్యక్తితో అతని కుటుంబ సభ్యులతో పోలీసులు మాట్లాడించగా.. కిందకు దిగి వచ్చాడు. అయితే ఇదే వ్యక్తి ఈ నెల 5న కూడా టవర్ ఎక్కి హల్‌చల్ చేసినట్లు అధికారులు గుర్తించారు. రెండో పట్టణ పోలీసులు ఆ వ్యక్తిని ప్రభుత్వాసుపత్రికి తరలించి పరీక్షలు చేయించారు. అతని మానసిక పరిస్థితి బాగోలేదని వైద్యులు నిర్ధారించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు. అతను టవర్‌పై నుంచి కిందకు దిగడానికి సుమారు రెండు గంటల పాటు సమయం పట్టడంతో ఒకటో, రెండో పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేశారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

నోటీసు అందిస్తున్న నాయకులు

ఆకివీడు, న్యూస్‌టుడే: దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం విద్యుత్తు, రవాణా, బ్యాంకులు, బీమా, ఉక్కు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటీకరిస్తోందని సీఐటీయూ మండలాధ్యక్షుడు పెంకి అప్పారావు విమర్శించారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో ఉద్యోగ, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక పోస్టు మాస్టర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మద్దతు.. **భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు జులై 9న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టి.ప్రసాద్ తెలిపారు.

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లులోని దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ తరగతుల బోధనకు ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్స్ చేసిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ శోభారాణి తెలిపారు. సంబంధిత కోర్సుల్లో 55 శాతానికి మించి మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 10న ఉదయం 10 గంటలకు ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. ★ యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్లం బోధనకు అర్హులు ఈ నెల 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కనకదుర్గా ప్రసాద్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు అలుపెరగని పోరాటం

కేకు కోస్తున్న నాయకులు

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్లలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు సోమవారం కేకు కోసి సందడి చేశారు. సిర్రా వరదరాజు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన జెండా స్తూపాన్ని జిల్లా ప్రతినిధులు ప్రారంభించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మంద కృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేశారని జిల్లా ప్రతినిధులు గొల్లపల్లి శ్రీను, యార్లగడ్డ రత్నరాజు అన్నారు. సర్పంచి బందా విజయ, తెదేపా మండలాధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆకివీడు, న్యూస్‌టుడే: సీఐటీయూ కార్యాలయంలో ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల గీత కార్మికులతో సమావేశం నిర్వహించారు. కల్లు గీత కార్మిక సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి బొక్క చంటి, జిల్లా ఉపాధ్యక్షుడు కడలి పాండు పాల్గొని మాట్లాడారు. మద్యం దుకాణాలతో పాటు బెల్ట్ షాపుల్లో కూడా విక్రయాలు కొనసాగించడంతో ప్రకృతి సిద్ధమైన కల్లు అమ్మకాలను దెబ్బ తీస్తున్నాయన్నారు. ఈ మేరకు ఈ నెల 14న కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి వినతి పత్రం అందజేసే కార్యక్రమంలో గీత కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎం.సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దాడి ఘటనలో 10 మందిపై కేసు

కైకలూరు, న్యూస్‌టుడే: దాడి ఘటనలో పది మంది వ్యక్తులపై కైకలూరు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కైకలూరు మండలం వదర్లపాడు గ్రామానికి చెందిన ఘంటసాల సురేశ్ ఆదివారం కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం సమీపంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో సర్కారు కాలువ వంతెనపై కారు ఆపి ఫోన్‌లో ఫొటోలు దిగుతున్నారు. ఇంతలో వెనక కార్లలో వస్తున్న భీమవరానికి చెందిన యువకులు కారు పక్కకు తీయాలని హారన్లు మోగించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి వెళ్తున్న సురేశ్ కారును ఆలపాడు పెట్రోల్ బంకు సమీపంలో భీమవరం యువకులు కారుతో అడ్డగించి వాగ్వాదానికి దిగారు. తర్వాత సురేశ్, అతని సోదరుడు సుబ్రహ్మణ్యం, మరో వ్యక్తి అర్జున్‌పై కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురూ గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు సురేశ్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై వి.రాంబాబు దాడి చేసిన పది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	తమ్ముడు
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	కుబేర
కిషోర్ స్క్రీన్ 1	తమ్ముడు
కిషోర్ స్క్రీన్ 2	మార్గన్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	తమ్ముడు
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	3 బీహెచ్‌కే, కన్నప్ప
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	జురాసిక్ వరల్డ్ 3డీ (తెలుగు)
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	ఎఫ్1 ది మూవీ (తెలుగు), కుబేర
విజయలక్ష్మి స్క్రీన్	మార్గన్

బురద దారి.. అడుగు పడదు మరి!



కోడిగట్టు పేదల కాలనీకి వెళ్లే రహదారి గోతులు, బురదమయంగా మారింది. పొలాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం కావడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో గ్రావెల్ వేసి వదిలేయడంతో వాహనాల రద్దీతో అధ్వానంగా తయారైందని, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీరాజ్ ఏఈ విజయకుమార్‌రాజును 'న్యూస్‌టుడే' సంప్రదించగా రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, పాలకోడేరు**

పూర్తిగా పాడై.. ఇబ్బంది పెట్టి!

బొబ్బనపల్లి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారి దయనీయంగా ఉంది. రెండు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ రోడ్డు కుంగిపోవడంతో స్థానికులు, విద్యార్థులు కనీసం నడిచి వెళ్లేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే రహదారిపై నీరు నిలుస్తోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆ ప్రాంతంలో కచ్చా డ్రెయిన్ తవ్విస్తామన్నారు. రహదారి పునఃనిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, (వీరవాసరం)బొబ్బనపల్లి**

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

నిలిచిన విద్యుత్తు సరఫరా

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఈదురుగాలులు, వర్షానికి లైన్లు మరమ్మతులకు గురికావడంతో మొగల్తూరు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. గంటల తరబడి విద్యుత్తు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

రేషన్ డిపోలో తనిఖీలపై గోప్యం

మొగల్తూరు, న్యూస్‌టుడే: కొత్తోటలోని రేషన్ డిపోలో రెవెన్యూ అధికారులు ఈ నెల 5న తనిఖీలు నిర్వహించారు. కానీ ఈ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచారు. ఆ దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌లో వివరాలకు, బియ్యం, పంచదార నిల్వలకు భారీ వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ అంశంపై 'న్యూస్‌టుడే' డీటీ సంధ్య, తహసీల్దారు రాజకిశోర్‌లను సమాచారం కోరగా పరిశీలించి చెబుతామంటూ దాటవేశారు.

కిక్కిస తొలగింపునకు చర్యలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: గోస్తని కాలువ ప్రాంత రైతుల ఇబ్బందులు తొలగించే దిశగా కిక్కిస తొలగింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెదేపా యువ నాయకుడు పితాని వెంకట్ తెలిపారు. వెల్లూరు నుంచి సోమరాజు ఇల్లిందలపర్రు వరకు గోస్తని కాలువలో కిక్కిస తొలగింపు పనులను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే మాముడూరు వరకు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

ఉప ఎంపీడీవోగా సూరన్న

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండల ఉప ఎంపీడీవోగా కొండ బుల్లి సూరన్న సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఆచంట పంచాయతీ కార్యదర్శిగా నాగేశ్వరావు ఇక్కడ ఈ బాధ్యతలు నిర్వర్తించారు.

ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

క్షీరారామలింగేశ్వరునికి అభిషేకాలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష అభిషేకాలు జరిపించారు. స్వామిని నాగాభరణం, పుష్పాలు, రుద్రాక్షలతో అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ సప్త సోమవారాల ప్రదక్షిణలు చేశారు. స్వామిని పల్లకిలో కొలువదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. గోశాలలో భక్తులకు అన్నసమారాధన చేశారు. రాత్రి స్వామికి పంచాహారతులు ఇచ్చారు.

అలంకరణలో స్వామివారు

ఘనంగా పీర్ల ఊరేగింపు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా పాలకొల్లు అచ్చుగట్లపాలెం పీర్ల పంజా వద్ద సోమవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం పట్టణ వీధుల్లో పీర్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లులోని దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ తరగతుల బోధనకు ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్స్ చేసిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ శోభారాణి తెలిపారు. సంబంధిత కోర్సుల్లో 55 శాతానికి మించి మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 10న ఉదయం 10 గంటలకు ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. ★ యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్లం బోధనకు అర్హులు ఈ నెల 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కనకదుర్గా ప్రసాద్ తెలిపారు.

మా పిల్లలూ సర్కారు బడిలోనే..!

ఆదర్శంగా ఆచంట ఉపాధ్యాయులు

ఆచంట, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులు కూడా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఆచంట మండలంలో పదో తరగతి విద్యార్థులు 583 పైగా మార్కులు సాధించడమే కాకుండా ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారు. ఈ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు కూడా తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించి ఆదర్శంగా నిలిచారు.

★ వల్లూరు మోడల్ పాఠశాలలో పని చేస్తున్న అనిశెట్టి జ్యోతి తన కుమారులు జాస్విన్ మణికంఠ, గహన్ శివకంఠను సర్కారు బడిలో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

★ ఆచంటకు చెందిన ఎన్. వెంకట్రావు, శ్రీకనకదుర్గాదేవి ఉపాధ్యాయులు. ఒకరు కొడమంచిలి బీపీ చెరువు, మరొకరు ఆచంట పాఠశాలలో పని చేస్తున్నారు. వారి పెద్ద కుమారుడు బస్వంత్‌ను ఆచంట ఎంవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మరో కుమారుడు తనుష్‌ను ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివిస్తున్నారు.

తండ్రి వెంకట్రావుతో తనుష్

★ ఆచంట మండలంలో పనిచేస్తున్న ఎస్ఎస్ సత్యకుమారి తన కుమారుడు వేదశ్‌ను ఆచంట ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతిలో, మరో ఉపాధ్యాయుడు బి. శ్రీనివాస్ తన కుమారుడు సత్యవివేక్‌ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు.

★ కొడమంచిలి ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తున్న సరిపల్లి శ్రీదేవి తమ ఇద్దరు పిల్లలు మోనిత్, మోక్షిత్‌ను ప్రభుత్వ పాఠశాలలో 4, 2 తరగతుల్లో చేర్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం:80085 74504
పాలకొల్లు :80085 74510
ఆచంట :91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని గాంధీ బొమ్మ కూడలి వద్ద విద్యుత్తు తీగలకు పాదులు అల్లుకున్నాయి. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. - ఎం. నాగేశ్వరరావు

✔ పరిశీలించి చర్యలు చేపడతాం. - కె.ప్రభాకర్, విద్యుత్తు ఏఈ

? మాధవాయిపాలెంలో డ్రైనుల్లో పూడికను సక్రమంగా తొలగించడం లేదు. - బి. రాజు, నరసాపురం

✔ పూడికతీత పనులు చేయిస్తాం. - ఎం.అంజయ్య, పురపాలక కమిషనర్

? పట్టణంలో ప్రధాన రహదారులపై పశువులు సంచరిస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రివేళ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. - స్థానికులు

✔ పశువుల యజమానులకు నోటీసులు ఇస్తాం. - ఎం. అంజయ్య, పురపాలక కమిషనర్

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ? పాలకొల్లు జింకల వారి వీధిలో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. - రాజు, స్థానికుడు

✔ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. - రాజ్‌కుమార్, పురపాలక డీఈ

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? పాలకొల్లు మండలం తిల్లపూడిపాలెం గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ వాహనం కొద్ది రోజులుగా రావడంలేదు. - కె.గంగాధర్‌రావు, స్థానికుడు

✔ వాహనం మరమ్మతులకు గురైంది. నేటి నుంచి యథావిధిగా చెత్త సేకరణ చేయిస్తాం. - సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి

తక్కువ తూకంతో మోసాలు

సమావేశంలో సంఘం ప్రతినిధులు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: దళారులు తక్కువ తూకం చూపుతూ ఆక్వా రైతులను మోసం చేస్తున్నారని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం కార్యదర్శి బోణం చిన్నబాబు ఆరోపించారు. పాలకొల్లు మండలం పూలపల్లిలో ఆ సంఘం కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొయ్యల గ్రేడుల పేరిట దళారుల చేతుల్లో రైతులు దోపిడీకి గురవుతున్నారన్నారు. రొయ్యల తూకంలో కిలోకు 80 గ్రాముల వరకు తేడా ఉన్నట్లు ఓ రైతు గుర్తించి సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు సంఘం తరఫున రైతులకు అండగా నిలుస్తామని తెలిపారు. సంబంధిత కంపెనీలు, ప్రభుత్వం కూడా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షులు పి. వెంకటసత్య నారాయణ రాజు, కె. నరసింహస్వామి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

వివరాలు తెలుసుకుంటున్న కిశోర్‌బాబు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ములపర్రు సర్పంచి భర్త మద్రే వరప్రసాద్ పంచాయతీ నిధులు మళ్లించి మోసగించినట్లు భీమవరం కలెక్టరేట్‌లోని 'మీ కోసం' కార్యక్రమంలో గత నెల 23న గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ వై. కిశోర్‌బాబు సోమవారం ములపర్రు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పంచాయతీలో సిబ్బంది లేకపోయినా సర్పంచి భర్త జీతాల పేరిట రూ. 7,75,844 నిధులు డ్రా చేసినట్లు ఆరోపించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలు నిరసన తెలిపారు. మళ్లించిన సొమ్మును రాబట్టాలని, సర్పంచి భర్త, నాటి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ తెలిపారు.

అన్ని రంగాల అభివృద్ధే లక్ష్యం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో గాడి తప్పిన రాష్ట్రం.. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని రంగాల్లోనూ ప్రగతి పథంలో సాగుతోందని తెదేపా నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. కొప్పర్రులో సోమవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. కూటమి పాలనలో అమలు చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరాలతో ఉన్న కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పంపిణీ చేశారు. రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, నాయకులు వాతాడి ఉమామహేశ్వరరావు, అందే రామకృష్ణ, పోతుమూడి ముసలయ్య, ముక్కు బాబూరావు, నేదునూరి సావిత్రి, నాగిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొండాలమ్మ ఆలయం, వైఎన్నీ ప్రాంతంలో తెదేపా నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, నాయకులు పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు నాగిడి రాంబాబు, సంకు భాస్కరనాయుడు, పెంద్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం: సంక్షేమ పథకాలను వివరిస్తున్న రామరాజు తదితరులు

పోడూరు: కరపత్రాలు అందిస్తున్న పితాని వెంకట్

పోడూరు, న్యూస్‌టుడే: పోడూరులో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా యువ నాయకుడు పితాని వెంకట్ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. జడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, ఉప సర్పంచ్ సీహెచ్ జయరామకృష్ణ, తెదేపా నాయకులు రుద్రరాజు రమేశ్‌రాజు, రవిరాజు, బొంతు కాశి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పెనుగొండ, న్యూస్‌టుడే: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పెనుగొండలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి తానేటి చిన బుల్లయ్య ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు.

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మల్లిపూడిలో కాపా ఇస్సాకు మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో తెదేపా యువ నాయకుడు పితాని వెంకట్ పాల్గొని మాట్లాడారు.

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ నాయకులు ద్విచక్ర వాహనాలపై ప్రదర్శనగా మొగల్తూరులో గాంధీబొమ్మ కూడలికి చేరుకుని కేకు కోసి ప్రజలకు పంపిణీ చేశారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

నరసాపురం, న్యూస్‌టుడే: అసంఘటిత రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 9న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్ల కార్మికులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించి సమ్మెకు మద్దతు కోరారు.

కనీస వసతులు లేక ఇక్కట్లు

తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న కాలనీవాసులు

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ శివారు నగరేశ్వర కాలనీలో మౌలిక సదుపాయాలు లేక నివాసితులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. కాలనీవాసులు, సీపీఎం నాయకులు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దారు జి. అనితాకుమారి, ఎంపీడీవో టి. సూర్యనారాయణ మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఎం. శ్రీనివాస్‌లకు వినతిపత్రాలు అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ ఈ కాలనీలో తాగునీరు, డ్రెయిన్, రహదారి సౌకర్యాలు లేక నివాసితులు అవస్థలు పడుతున్నారన్నారు. అంతకు ముందుకు కాలనీవాసులు బజారు రహదారి నుంచి గాంధీ బొమ్మల కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు.

దళిత కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

పెనుమంట్ర, న్యూస్‌టుడే: దళిత కాలనీల్లో సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ కోరారు. ఆలమూరులో ఆ సంఘం మండల అధ్యక్షుడు కుసుమే వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా దళిత కాలనీల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. డ్రెయినేజీ, రహదారులు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందరకుమార్, నాయకులు పాల్గొన్నారు.

చింత చెట్టుపై నుంచి పడి దుర్మరణం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: చిగురు కోసం చింత చెట్టు ఎక్కిన వ్యక్తి జారిపడి దుర్మరణం పాలైన ఘటన రుస్తుంబాదలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్సై టీవీ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం. . రుస్తుంబాద అంబేడ్కర్ నగర్‌కు చెందిన మురాల పెద్దిరాజు (50) చింత చిగురు కోసి విక్రయించి జీవనం సాగించేవారు. సోమవారం ఉదయం ఇంటి సమీపంలో చెట్టు ఎక్కి చిగురు కోస్తుండగా కాలుజారి పడిపోయారు. స్థానికులు అతడిని అంబులెన్సులో ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

లారీ ఢీకొని తాపీమేస్త్రి మృతి

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి మండలం చించినాడ వద్ద గోదావరి వంతెనపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామరాజులంకకు చెందిన మేడిచర్ల భాస్కరరావు(60) తాపీ మేస్త్రిగా పని చేస్తున్నారు. పని అనంతరం సహచరుడు మద్దూరి శివతో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో శివకు గాయాలు కాగా భాస్కరరావు అక్కడికక్కడే మృతి చెందారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఇద్దరిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. పట్టణ పరిధి పొన్నపల్లి వాసి తిరుమాని వెంకన్నపై అదే ప్రాంతానికి చెందిన తిరుమని ఏసు, రాంబాబు ఈ నెల 5న దాడిచేసి కొట్టారు. దీనిపై బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఆస్తి వివాదంతో కొట్లాట

పోడూరు, న్యూస్‌టుడే: ఆస్తి వివాదాల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. తనపై దాడి చేశారంటూ పెనుమదం గ్రామానికి చెందిన పొన్నపల్లి మాలతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త నాగవెంకట రామలింగేశ్వరస్వామితో పాటు మరికొందరిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకరరెడ్డి తెలిపారు. మరోపక్క మాలతి, ఆమె కుటుంబ సభ్యులు తనపై దాడి చేసినట్లు పొన్నపల్లి కనకమాణిక్యం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ఆలమూరులో బోల్తా కొట్టిన కారు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన కారు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. పోలమూరు అంబేడ్కర్ విగ్రహం కూడలి సమీపాన సోమవారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. వీరవాసరం మండలం రాయకుదురుకు చెందిన కొందరు ఈ కారులో శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. కారు ముందు పూర్తిగా ధ్వంసమైంది. దానిలో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సోమవారం మధ్యాహ్నం ఆలమూరు రైసుమిల్లు వద్ద కారు బోల్తా పడిన ఘటన దానిలో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయుడు, ఆయన భార్యకు గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కార్లలో ఎయిర్ బెలూన్లు తెరచుకోవడంతో ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

రుణం తిరిగి చెల్లించాలంటూ ఫోన్లు

నరసాపురం, గ్రామీణ, న్యూస్‌టుడే: మీ గ్రామానికి చెందిన వ్యక్తి బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించాలంటూ లిఖితపూడికి చెందిన పలువురి చరవాణులకు గత రెండ్రోజులుగా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఈ గ్రామానికి చెందిన శ్రీకాంత్ హైదరాబాద్‌లోని ప్రయివేటు సంస్థలో ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నారు. ఆయన రుణం తీసుకొని సక్రమంగా చెల్లించడం లేదని.. హామీ సంతకం చేసిన మీరంతా ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఫోన్ చేసిన వ్యక్తులు బెదిరిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. దీనిపై గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గతంలో తాను తీసుకున్న రుణ వాయిదాలను సక్రమంగా చెల్లిస్తున్నానని.. మరో మూడు వాయిదాలు చెల్లిస్తే బకాయి తీరిపోతుందని శ్రీకాంత్ చరవాణిలో చెప్పినట్లు నరసాపురం గ్రామీణ ఎస్సై 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వసతులు లేక.. సేవలు అందక!

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండల పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన వసతుల లేక రోగులతో పాటు సిబ్బంది సతమతమవుతున్నారు. దీనికి తోడు వైద్యుల బదిలీలతో సేవలకు అంతరాయం ఏర్పడింది. ఆచంటలో సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు వేమవరం, వల్లూరులలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పేదలకు వైద్య సేవలు అందుతున్నాయి. వేమవరం పీహెచ్‌సీలో గతంలో ఇద్దరు వైద్యులు పనిచేసేవారు. వారిలో ఒకరిని గతంలోనే సిద్ధాంతం పీహెచ్‌సీకి బదిలీ చేశారు. తాజాగా మరో వైద్యాధికారి ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో గుమ్ములూరు ఆసుపత్రి వైద్యుడిని ఇన్‌ఛార్జిగా నియమించారు. వల్లూరు పీహెచ్‌సీలో పనిచేసిన వైద్యుడు మరో జిల్లాకు వెళ్లిపోయారు. ఆచంట సీహెచ్‌సీలోనూ వైద్యుల కొరత ఉంది. ఈ ఆసుపత్రి నెలకొల్పిన తరువాత ఇప్పటి వరకు జనరల్ మెడిసిన్ వైద్యుడిని నియమించలేదు. మరో రెండు వైద్యుల పోస్టులతో పాటు, బదిలీ అయిన స్టాఫ్‌నర్సుల కొలువులు ఖాళీగా ఉన్నాయి.

ఆచంట వేమవరం పీహెచ్‌సీ భవనం వెనుక పెరిగిన పొదలు

★ వేమవరంలో పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరి శ్లాబు లీకవుతోంది. వెనుక భాగంలో పొదలు పెరిగి చిట్టడవిలా మారింది. వల్లూరు పీహెచ్‌సీ ప్రహరీ కూలిపోయింది. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాద్ తెలిపారు.

పొగతో ఉక్కిరిబిక్కిరి!

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు- నిడదవోలు ప్రధాన రహదారిలో ఉల్లంపర్రు పంచాయతీ పరిధిలో ప్రధాన కాలువ గట్టుపై చెత్త వేసి తగులబెడుతున్నారు. దీంతో దట్టమైన పొగ రహదారిని కమ్మేసి వాహనదారులు, ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు గురవుతున్నామని పలువురు వాపోతున్నారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ చెత్త వేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి ఎల్. సత్యనారాయణ తెలిపారు.

అప్రమత్తతతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: అప్రమత్తతతో మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని హైదరాబాదుకు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త శ్రావ్యశృతి అన్నారు. నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. యువతులు, కిశోర బాలికలు, మహిళలకు అంగన్‌వాడీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఇబ్బంది ఎదురైతే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఉపాధ్యాయిని తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఓ ఉపాధ్యాయిని తరగతి గదిలో రాజకీయ అంశాలను ప్రస్తావిస్తూ.. వైకాపా అనుకూల వ్యాఖ్యలు చేసినట్లు విద్యార్థులు ఆరోపించడంతో తల్లిదండ్రులు, నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. నరసాపురం మండలం సీతారాంపురం సౌత్ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని పి. సుజాతరాణి తరచూ కూటమి పాలనపై వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని తొమ్మిదో తరగతి విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కూటమి నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని దాదాపు రెండు గంటల పాటు నిరసన తెలిపారు. దీంతో పాఠశాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. మొగల్తూరు ఎస్సై వై. నాగలక్ష్మి అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయిని సుజాత రాణి, విద్యార్థులతో హెచ్‌ఎం వేర్వేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సాంఘిక శాస్త్ర పాఠ్యాంశంలో భాగంగా రాష్ట్రంలో రాజకీయ పరిణామాలను విశ్లేషించగా.. విద్యార్థులు తప్పుగా అర్థం చేసుకున్నారని సుజాత రాణి వివరణ ఇచ్చారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో రాజు

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి అందే అర్జీలు, వినతులను ఎలాంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు సూచించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 51 మంది అర్జీలు అందించారని కార్యాలయ జూనియర్ అసిస్టెంటు బి. సురేఖ తెలిపారు. భూములకు సాగునీటి సౌకర్యం కల్పించాలని రామన్నపాలేనికి అయితం చిట్టితల్లి వినతిపత్రం అందించారు. గతంలో రుస్తుంబాదలో ఇచ్చిన ఇంటి స్థలానికి బదులు ఇతర ప్రాంతంలో మంజూరు చేయించాలని పీచుపాలేనికి చెందిన తిరుమాని కనకదుర్గ అర్జీ అందించారు. తమకు యాజమాన్యం నుంచి జీతం ఇప్పించాలని ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయులు వినతిపత్రం అందించారు. వలకట్ల సమస్య పరిష్కరించాలని పేరుపాలెంనార్తుకు చెందిన అంద్రాజు సత్యనారాయణ వినతిపత్రం అందించారు. జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ముత్యాలపల్లికి చెందిన నాగిడి రాంబాబు వినతిపత్రం అందించారు. ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సంబంధిత శాఖల అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ★ మొగల్తూరు మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భూ సర్వే సమస్యలపై ఇద్దరు అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దారు రాజకిశోర్ తెలిపారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థ(మీ కోసం) కార్యక్రమంలో ప్రజల నుంచి నాలుగు వినతులు అందినట్లు తహసీల్దారు జి. అనితాకుమారి తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇక్కడైనా.. న్యాయం చేస్తారని..

రుస్తుంబాద, (నరసాపురం), న్యూస్‌టుడే: నరసాపురం రెవెన్యూ డివిజన్ ప్రజలు పలు సమస్యలపై 'మీ కోసం' కార్యక్రమంలో వినతులు ఇస్తున్నారు. గతంలో స్థానిక కార్యాలయాల్లో అర్జీలు ఇచ్చినా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజలు డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహించే కార్యక్రమాలకు వస్తున్నారు. సోమవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి వచ్చిన పలువురు 'న్యూస్‌టుడే'తో తమ సమస్యలను వివరించారు.

ఏడాది నుంచి తిరుగుతున్నా..

నాకు మా గ్రామంలో 16.5 సెంట్ల మెరక భూమి ఉంది. ఆక్రమణల నేపథ్యంలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని ఏడాది నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా. అయినా పరిష్కారం చూపలేదు. - పిప్పళ్ల ఏసేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగి, రామన్నపాలెం

భూమి ఆక్రమణ

మాకు యలమంచిలి మండలం కొంతేరులో ఎకరం భూమి ఉంది. దానిలో 93 సెంట్లు విక్రయించాం. మిగిలిన భూమి మా స్వాధీనంలో ఉంది. దానికి అనుకుని లేఅవుట్ వేసి వ్యక్తి మా స్థలాన్ని కూడా విక్రయించేశాడు. మా భూమి పత్రాలు చూపినా వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది న్యాయం చేయడంలేదు. నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా అధికారులు సమస్యను పరిష్కరించడం లేదు. - వెంకట సత్యఆంజనేయులు, నరసాపురం

కొలతల్లో వ్యత్యాసం

మాకు పాలకమ్మ చెరువులో 1.93 ఎకరాల భూమి ఉంది. మా తమ్ముడు 0.97 సెంట్లు, నేను 0.96 సెంట్లు పంచుకున్నాం. ఇటీవల నా భూమి కొలతల్లో వ్యత్యాసం వచ్చింది. పదిసెంట్ల విస్తీర్ణం తగ్గింది. దీనిపై సర్వే నిర్వహించి న్యాయం చేయాలని ఏడాది నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. అధికారులు సమస్య పరిష్కరించ లేదు. - పోతురాజు రత్నంరాజు, మొగల్తూరు

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆకివీడు, న్యూస్‌టుడే: సీఐటీయూ కార్యాలయంలో గీత కార్మికులతో సమావేశం నిర్వహించారు. కల్లు గీత కార్మిక సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి చంటి, జిల్లా ఉపాధ్యక్షుడు కడలి పాండు పాల్గొని మాట్లాడారు. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎన్నాళ్లో కష్టాలు

వెంప - కొత్తపాలెం మార్గం ఇలా..

ఇటీవల వర్షాలకు పలు ప్రాంతాలలో రహదారులు అధ్వానంగా మారాయి. పెదగరువు నుంచి వెంప వెళ్లే రహదారి గోతులమయమైంది. వెంప నుంచి కొత్తపాలెం వెళ్లే రోడ్డు చెరువును తలపిస్తోంది. మొగల్తూరులోని పోలీస్‌స్టేషన్ రోడ్డు మడుగులా మారింది. అధికారులు పరిశీలించి రహదారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - ఈనాడు, మొగల్తూరు

మడుగులా మొగల్తూరు పోలీస్‌స్టేషన్ రోడ్డు

SAPTHA NIDHI MACTCS LIMITED (Quasi-Banking)
Regd. No: AMC/WG(BVRM)DCO/2023/07
H.O: #22-13-06, First Floor, Venkayya Naidu Street, Opp. SBI Main Branch, Bhimavaram-534201, W.G.Dt., A.P.

బంగారు నగల వేలం ప్రకటన

క్రింది ఖాతాదారుడు మా సంస్థలో బంగారు నగలపై అప్పు తీసుకుని సకాలంలో చెల్లించని కారణంగా సంస్థ నిబంధనల ప్రకారం ది. 17-07-2025 ఉదయం 11.00 గంటలకు సంస్థ (భీమవరం హెడ్ ఆఫీస్) ఆవరణలో వేలం వేసి మా బాకీలను చెల్లు చేసుకుందుమని ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

క్ర. సం.	ఖాతాదారుని పేరు & చిరునామా	ఋణ ఖాతా నెంబరు	బంగారం బరువు గ్రా॥లలో
1	ఈశ్వరరావు పరిసి S/o జార్జ్‌బాబు డోర్ నెం: 2-80/1, మెయిన్ రోడ్, గోరింటాడ, పాలకొల్లు (మం)	JL-85000018	37.620

షరతులు-నిబంధనలు: 1. వేలంలో పాల్గొనదలచినవారు రూ. 10,000/- ధరావతు కట్టి వేలంలో పాల్గొనవలెను. 2. హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదే రోజు చెల్లించి వస్తువులు పొందవలెను. 3. నగల బరువునకు, నాణ్యతకు సంస్థ వారి పూచీ ఏమాత్రం లేదు. 4. ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుకొనుటకు గాని, వేలం ఆపుటకు కాని, రద్దు చేయుటకు గాని సంస్థ వారికి పూర్తి అధికారము కలదు. 5. అడ్రస్ నిర్ధారించు ఆధార్ కార్డు కాపీని గాని, పాన్ కార్డు కాపీని జతచేయవలెను. 6. ఈ ఖాతాదారుడు మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచునట్లుగా భావించవలెను. 7. అప్పు వసూలు నోటీసులు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటనను తుది నోటీసుగా భావించి వేలము తేదీలోగా సొమ్ము చెల్లించవచ్చును.
సం/- బ్రాంచి మేనేజర్, పాలకొల్లు

భూమి కౌలు హక్కునకు టెండర్-కమ్- బహిరంగ వేలం ప్రకటన

డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం, అంతర్వేది గ్రామంలో గల ఈక్రింది ఉదహరించిన సత్రంనకు పశ్చిమగోదావరి జిల్లా, పోడూరు మండలం పెనుమదం గ్రామంలో గల పల్లం భూమికి నగదు రూపంలో శిస్తు చెల్లించు పద్ధతిపై 2025-26 సంవత్సరం నుండి 2027-2028 సంవత్సరం వరకు అనగా 3 సంవత్సరముల కాలమునకు సేద్యం చేసుకొను హక్కు కొరకు దేవదాయ ధర్మదాయ శాఖ వారి జి.ఓ.ఎం.ఎస్.నెం. 379 తేది 11.03.2003 ప్రకారం జారీ చేయబడిన నిబంధనలను అనుసరించి దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించబడును.

వ. నెం	సత్రం పేరు	భూమిగల గ్రామము, మండలం, జిల్లా	సర్వే నెంబరు	పాట పెట్టవలసిన భూమి వివరము	ధరావత్తు రూ.లలో	బహిరంగ వేలం పాట జరుగు ప్రదేశము, తేదీ, సమయము
1	శ్రీరామినీడివారి సత్రం, అంతర్వేది (గ్రా), సఖినేటిపల్లి (మం)	పెనుమదం (గ్రామం) పోడూరు (మం) పశ్చిమగోదావరి జిల్లా	190/1 194/2	య.1.33సెంట్లు య.1.24సెంట్లు య.2-57 సెంట్లు (ఒక ప్రతి)	రూ. 2000/-	శ్రీ ఉమా అగస్త్యేశ్వర స్వామి వారి దేవస్థానం పెనుమదం వద్ద ది.21.07.2025 సోమవారం ఉదయం గం.10.00లకు

వేలంలో పాల్గొను ప్రతి ఒక్కరు ధరావత్తు చెల్లించవలెను, సాల్వేన్సీ సర్టిఫికేట్ ఒరిజినల్ మరియు ఆధార్ కార్డు నకలు తప్పనిసరిగా సమర్పించవలెను. మిగిలిన పాట షరతులు విషయమై ఆఫీసు నందు సంప్రదించగలరు.
అంతర్వేది, 06.07.2025 T.నాగవిష్ణు, కార్యనిర్వహణాధికారి, 9949114915

తాడేపల్లిగూడెం

•తాడేపల్లిగూడెం •తణుకు

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: బడి వయసు గల ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఎంఈవో జ్యోతి పేర్కొన్నారు. స్థానిక 28వ వార్డులో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చిన్నారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, రౌతు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాటలో ఎంఈవో జ్యోతి, జనసేన నాయకులు

పీజీఆర్ఎస్‌కు 14 ఫిర్యాదులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్‌కు 14 ఫిర్యాదులు వచ్చాయని పురపాలక కమిషనర్ ఏసుబాబు పేర్కొన్నారు. పట్టణంలోని పురపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇంజినీర్ వై.వి.రమణ, సహాయ కమిషనర్ డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ఏసుబాబు

వర్షం తెచ్చిన తంటా.. పనులు మొదటికొచ్చేనంట

ఎస్ఎస్ ట్యాంకు పురోగతిలో ఆటంకాలు

న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం అర్బన్

పట్టణ ప్రజల తాగునీటి ఇబ్బందుల పరిష్కారానికి రెండో ఎస్ఎస్ ట్యాంకు(వేసవి జలాశయం) నిర్మించాలని రెండు దశాబ్దాలుగా కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే ఎన్నో అవాంతరాలను అధిగమించింది. కూటమి ప్రభుత్వం రాకతో ఎట్టకేలకు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఎనిమిది నెలలుగా వడివడిగా కొనసాగుతున్న పనులకు ఇటీవల కురిసిన వర్షాలు అడ్డంకిగా మారాయి. దీంతో పనులకు ఆటంకాలు ఏర్పడి కథ మళ్లీ మొదటికొచ్చింది.

మోటారు సహాయంతో నీళ్లు తోడుతున్న వైనం

తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామంలోని కడియపు చెరువులో ఎస్ఎస్ ట్యాంకు-2 నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు రూ.73.43 కోట్ల అమృత్ నిధులు కేటాయించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా చెరువులోని నీరు, పూడికను గతంలో తొలగించారు. గట్టు జారిపోకుండా కాంక్రీటు రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. భారీ గుంతలు తవ్వి కాంక్రీటు పనులు ప్రారంభించే సమయానికి వర్షాలు మొదలయ్యాయి. వరద నీరు చెరువులోకి చేరి ఇప్పటి వరకు జరిగిన పనులు నామరూపాల్లేకుండా చేసింది. గత్యంతరం లేక వర్షపు నీటిని మోటార్ల సహాయంతో తోడేస్తున్నారు. శరవేగంగా పనులు పూర్తి చేసి వచ్చే ఏడాదికి అందుబాటులోకి తీసుకురావాలనే అధికారుల ఆలోచనలపై వర్షం నీళ్లు చల్లింది.

పైపులైన్ల పనులు దాదాపు పూర్తి.. కడియపు చెరువులోకి ఏలూరు కాలువ నుంచి నీళ్లను చేరవేసేందుకు అవసరమైన పైపులైన్ల పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. చెరువు నుంచి పాతూరులోని ఫిల్టరేషన్ ప్లాంట్ వరకు నిర్మిస్తున్న మరో పైపులైన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. జలవనరుల శాఖ కారణంగా కొంతమేర మందగించాయి. దీనిపై కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ నిర్ణీత సమయంలో ఎస్ఎస్ ట్యాంకు-2 పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

మెగా వేడుక.. ప్రగతి వీచిక

10న విద్యాలయాల్లో తల్లిదండ్రుల సమావేశం

న్యూస్‌టుడే, తణుకు

విద్యార్థులు విద్యా బుద్ధులు నేర్చుకోవడంతోపాటు క్రమశిక్షణగా మెలిగేందుకు.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం నెలకొల్పడానికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం (పీటీఎం) 2.0 నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 10న ప్రాథమిక పాఠశాలల నుంచి జూనియర్ కళాశాలల వరకు పండగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించేలా రూపకల్పన చేశారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మూడు మండలాలకు సంబంధించి 162 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 11,500 మంది, మూడు జూనియర్ కళాశాలల్లో సుమారు 1000 మంది విద్యార్థులున్నారు.

సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు (పాత చిత్రం)

ప్రైవేటు బడుల్లోనూ.. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోనూ ఈ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల వారీగా నిధులు సైతం విడుదల చేసింది. ఆ డబ్బులతో తాగునీరు, మధ్యాహ్న భోజనం, కుర్చీలు, తదితర ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.

అమ్మ పేరుతో ఓ మొక్క.. విద్యాసంస్థ ప్రాంగణంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు బృంద చిత్రాలు తీసుకునేలా ఫొటోస్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రీన్ వాల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులతో వారి లక్ష్యాలను రాయిస్తారు. అమ్మ పేరుతో మొక్కలు నాటిస్తారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి విజయాలు, పాఠశాల సాధించిన ప్రగతిని వేదికపై వెల్లడిస్తారు. తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహిస్తారు.

గిన్నిస్ రికార్డు సాధించేలా.. ఈ సారి నిర్వహించే సమావేశం గిన్నిస్ రికార్డుల్లో ఎక్కేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సమావేశానికి ఒక వ్యక్తి సాక్ష్యంగా ఉండేలా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయాలి. ఆ వ్యక్తి ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చిత్రాలు తీసి యాప్‌లో నమోదు చేయాలి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కాకుండా బయట వ్యక్తుల ఎవరైనా ఈ చిత్రాలను అప్‌లోడ్ చేయొచ్చు.

నిర్వహణ ఇలా.. ● విద్యార్థి ఎలా చదువుతున్నారు? ప్రమాణాలతో కూడిన విద్య నందించేందుకు ఎలాంటి మార్పులు చేయాలనే అంశాలపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయాలు పంచుకుంటారు. ● పిల్లల్లో సాధిస్తున్న మార్కులు, ఆరోగ్య సమాచారంతో కూడిన సమగ్ర ప్రగతి పత్రం తల్లిదండ్రులకు అందిస్తారు. ● పిల్లలు పాఠశాలల్లో ఉంటున్న తీరు, తోటి వారితో ఏ విధంగా ప్రవర్తిస్తున్నారనే విషయాలను వివరిస్తారు. ● ఆ రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సమావేశం నిర్వహిస్తారు. బాలల ప్రవర్తన, అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రగతిపై చర్చిస్తారు. దీని ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని డీవైఈవో మురళీ సత్యనారాయణ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	79950 67078
పెంటపాడు	79939 36123
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402

పెంటపాడు, న్యూస్‌టుడే: ? పెంటపాడులోని ప్రభుత్వ పోస్టుమెట్రిక్ ఉన్నత పాఠశాల గోడ ఆనుకుని చెత్త పడేస్తున్నారు. దుర్వాసనతో విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - రమేష్

✔ చెత్త తొలగించి శుభ్రం చేయిస్తాం. - బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి

? మురుగునీరు పీహెచ్‌సీకి సమీపంలోని వీధుల్లో మురుగు డ్రెయిన్లు వ్యర్థాలతో పూడుకుపోయాయి. - లక్ష్మణరావు

✔ పూడిక తొలగిస్తాం. - భావన ధాన్యలక్ష్మి, సర్పంచి

దాతల సహకారం అభినందనీయం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని కడకట్లలో తటాకం నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి చెందిన విజ్జు దుర్గాప్రసాద్ స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టిని కలిసి రూ.1 లక్ష విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కూచిపూడి అనిల్, పాలూరి వెంకటేశ్వరరావు, పుల్లా బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు విరాళం అందజేస్తున్న దాతలు

అన్నదాతల అభ్యున్నతికి కట్టుబడిన కూటమి సర్కారు

తణుకు, గ్రామీణం, న్యూస్‌టుడే: గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ హయాంలో కాలువలలో కనీసం గుర్రపు డెక్క తొలగించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం వేల్పూరు నుంచి పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లింద్రపర్రు వరకు గోస్తని కాలువలో పేరుకుపోయిన కిక్కిస తొలగింపు పనులను రాధాకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్లలో చేయలేని పనులను ఏడాదిలోనే పూర్తి చేసేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆచంట నియోజకవర్గ యువ నాయకుడు పితాని వెంకట్, పీసీ ఛైర్మన్ మురళీ కృష్ణంరాజు, నీటి సంఘం అధ్యక్షుడు దొమ్మేటి బాస్కరరావు, జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

అంతరాయం లేని విద్యుత్తు అందించేందుకు కృషి.. తణుకు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్తు సమస్యలు పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందించినట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. తేతలి ఎస్సీ కాలనీలో సింగిల్ ఫేజ్ నుంచి త్రీ ఫేజ్‌కు మార్చడంతో పాటు రెండు 100 కేవీ విద్యుత్తు నియంత్రికలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యుత్తు స్తంభాలు, లైన్లు, నియంత్రికలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి విద్యుత్తు శాఖను నిర్వీర్యం చేశారని విమర్శించారు. గ్రామంలో లోవోల్టేజ్, ట్రిప్పింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాధాకృష్ణ వెల్లడించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు బజార్ ఏర్పాటు చేయాలని వినతి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానోను కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్మికులు, పేద ప్రజల సౌకర్యార్థం రైతు బజారు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు కళింగ లక్ష్మణరావు, బండారు శ్రీనివాసరావు, కొణతాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

9న సమ్మె విజయవంతానికి పిలుపు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న నిర్వహించబోయే సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక వార్డు రోడ్డులో సోమవారం నిర్వహించిన రైల్వే గూడ్స్ షెడ్ కార్మికుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం సాగించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. నాయకులు ఎస్.రామిరెడ్డి, చిట్టిపుల్లారెడ్డి, కరి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన ప్రదర్శనలో సీఐటీయూ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు తాడేపల్లిగూడెంలో సోమవారం ద్విచక్ర వాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ నెల 9న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు సిరపు రంగారావు, కె.రామకృష్ణ, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

తణుకు, న్యూస్‌టుడే: సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్లు గేటు వద్ద సోమవారం జరిగిన స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడారు. సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముసలయ్య, వెంకటేశ్వరు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు, న్యూస్‌టుడే: కార్మికులకు హాని కలిగిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ తలపెట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని సోమవారం పట్టణంలో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ మాట్లాడారు. నాయకులు బొద్దాని నాగరాజు, అజయకుమారి, చిక్కాల దుర్గా ప్రసాద్, పణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల్లో భాగంగా పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు భాగ్యలక్ష్మి పేట, బ్రహ్మానందరెడ్డి మార్కెట్, తాళ్లముదునూరుపాడు తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉమాసిద్ధేశ్వరుడికి విశేష అభిషేకాలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి ఉమా సిద్ధేశ్వరుడికి సోమవారం తెల్లవారు జాము నుంచే అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పండ్ల రసాలతో అభిషేకించారు. అనంతరం శోభాయమానంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సమస్యలతో సతమతం

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని 22వ వార్డు పరిధి శివారు ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు పెరిగి విస్తరిస్తున్నా తగిన వసతులు లేకపోవడంతో స్థానికులు వివిధ సమస్యలతో సతమతమవుతున్నారు. వార్డుల్లో చాలావరకు మట్టి రహదారులే ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బోదిగట్టు ప్రాంతంలో డ్రెయిన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, జంతు కళేబరాల వల్ల దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డులో దోమల మందు పిచికారీ చేసి చాలా రోజులవుతోందంటున్నారు. వారంలో కనీసం రెండు రోజులైన పిచికారీ చేయాలని కోరుతున్నారు. దీనికితోడు పురపాలక సంఘంవారు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు శివారు వీధుల వరకు అందకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

వార్డు వాచ్

వార్డులో అధ్వానంగా రహదారి

ప్రాధాన్య క్రమంలో పనులు చేస్తున్నాం

వార్డుల్లో ప్రాధాన్య క్రమంలో పనులు చేస్తున్నాం. ఇటీవల కాలువల్లో పూడిక తీయించాం. మరోసారి పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. దోమల మందు పిచికారీ చేయిస్తాం.

- ఏసుబాబు, మున్సిపల్ కమిషనర్

వార్డు : 22, జనాభా : 2728, ప్రాంతం : బోదిగట్టు

అక్కడ తాగుతూ.. ఇక్కడ తూలుతూ

తాగుబోతుల ప్రవర్తనతో ప్రయాణికులు తంటాలు పడుతున్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని తణుకు వైపు వెళ్లే బస్‌షెల్టర్‌లో వారి ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. నిత్యం ప్రయాణికుల రద్దీతో సందడిగా ఉన్న బస్‌షెల్టర్ ప్రాంగణంలో వారి ప్రవర్తనతో ప్రయాణికులు, విద్యార్థినులు అసౌకర్యానికి గురవుతున్నారు. మద్యం దకాణాల వద్ద తప్పతాగి..బస్‌షెల్టర్‌ను విశ్రాంతి కేంద్రంగా మార్చుకుంటున్నారు. ప్రయాణికులు కూర్చునే బల్లలపైనే ఉంటూ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఆరుబయటే బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్‌షెల్టర్ ప్రాంగణాన్ని శుభ్రం చేసి ప్రయాణికులు కూర్చునే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఆర్టీసీ డిపో మేనేజర్ ఏలూరి వీరాస్వామి మాట్లాడుతూ ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు.

- న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం టూటౌన్

బస్‌షెల్టర్‌లో తాగుబోతులు

సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో తణుకు

E.P.No. : 27/2020 in O.S.No. : 231/2009

Between :
శ్రీమతి కఠారి పద్మావతి ...DHR
and
The Das & పార్టనర్స్, Rep. by its మేనేజింగ్ పార్టనర్ : జి.సూర్యనారాయణ రాజు & another ...JDR's

JDR's తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని DHR పై నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం E.P. దాఖలు చేసియున్నారు. సదరు కోర్టు వారు E.P. షెడ్యూలు ఆస్తిని దివి.31-07-2025 తేదీన ఉదయం 10.30 ని నుండి కోర్టు వారు ఎదుట వేలం వేయబడును. వేలంలో పాల్గొనదలసినవారు షరతులకు లోబడి వేలంలో పాల్గొన వచ్చునని ఇందుమూలముగా కోర్టు వారి ఆర్డరుపై తెలియపర్చడమైనది.

షెడ్యూలు : తూర్పు గోదావరి జిల్లా, ఉండ్రాజవరం మండలం, పడ్మూరు గ్రామ పంచాయితీ డోర్ నెం.2-257, పాత పెంకుటిల్లు, **తూర్పు :** పంచాయితీ రోడ్, **పడమర :** గాదిరాజు సూరమ్మ, **దక్షిణం :** పబ్లిక్ లేన్, **ఉత్తరం :** పంచాయితీ రోడ్.

ఈ హద్దుల మధ్య 400 చ.గ.లు స్థలము ఇందలి పాత పెంకుటిల్లు తలుపులు, ద్వారబంధములు, కరెంటు సర్వీస్ వగైరాలు.

DHR విలువ : రూ.4,00,000/-
JDR : తెలుపలేదు :
SRO : రూ.9,20,000/-

కర్రి జనార్థన రెడ్డి
డిహెచ్‌ఆర్ అడ్వకేటు,
సెల్ : 93971 12777

ప్రకటన

In the Court of the Principal Civil Judge (Junior Division), Tadepalligudem
O.S.No. 450/2024

Between:
M/s Bank of India, Pentapadu ..Plaintiff
and
Sri Alugubelli Lakshmi Naidu .. Defendant

To Defendant
Sri Alugubelli Lakshmi Naidu, S/o Rama Naidu, Miriyala vari Street, Rama Rao pet, Tadepalligudem, West Godavari District, AP - 534101

పై నెంబరు దావాలో ప్రతివాదికి (Defendant)కి ఎన్నిసార్లు సమనులు పంపించినప్పటికి దావా సమనులు అమలు జరిగి వుండలేదు. కావున పై నెంబరు దావా వాయిదా రోజున అనగా ది. 16-07-2025వ తేదీన ఉదయం గం॥లు 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షములో దావా తీర్మానం చేయబడును అని ఇందుమూలముగా తెలియజేయడం అయినది.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

Sd/- **Thota Rambabu,** Advocate
Vijaya Towers, Tadepalligudem
Tadepalligudem W.G.Dist,
24-6-2025 Cell: 98483 77437

కలెక్టర్‌కు చెప్పుకుందాం విజయవంతం చేయండి

తణుకు, న్యూస్‌టుడే: 'కలెక్టర్‌కు చెప్పుకుందాం రండి' కార్యక్రమంలో గీత కార్మికులు వారి కుటుంబాలు పాల్గొనాలని గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి కోరారు. ఈ మేరకు సోమవారం తేతలిలో కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామాల్లో విచ్చలవిడిగా గొలుసు దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల కల్లు గీత కార్మికులు నష్టపోతున్నారన్నారు. గీత కార్మికులు ఏడాదిలో నాలుగు నెలలు మాత్రమే వృత్తిని నిర్వహించుకుంటారన్నారని.. మిగిలిన 8 నెలలు పస్తులతో కాలం గడపాల్సి వస్తోందన్నారు. ఈ నెల 14న కలెక్టరేట్ వద్ద నిర్వహించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున గీత కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. శ్రీనివాసు, శ్రీరామ్మూర్తి, సీతరామయ్య, పోతురాజు, రాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటం సమర్పణ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మెంటే వారితోటలోని విజయగణపతి ఆలయానికి పట్టణానికి చెందిన భూపతి తాతారావు జ్ఞాపకార్థం కుమారులు కిలో వెండి కిరీటం సోమవారం సమర్పించారు. తాతారావు కుమారులు శ్రీను, రామకృష్ణ దంపతులు, కుటుంబ సభ్యులు కిరీటం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

పల్లెల అభివృద్ధికి పెద్ద పీట

తణుకు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమలో భాగంగా సోమవారం ఇరగవరం, తణుకు మండలాల్లోని తూర్పువిప్పర్రు, కె.ఇల్లింద్రపర్రు, కొమరవరం, తేతలి గ్రామాల్లో ఆయన పర్యటించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే 15 ఏళ్లపాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాధాకృష్ణ చెప్పారు.

కస్పాపెంటపాడులో కరపత్రాలు పంచుతున్న బాబ్జీ

పెంటపాడు, తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే : ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి సంక్షేమ ప్రభుత్వంగా చాటిచెబుతామని భవన నిర్మాణ, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్, నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ అన్నారు. పెంటపాడు మండలం కస్పాపెంటపాడులో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ✦ తాడేపల్లిగూడెం పట్టణం ఒకటో వార్డులో కల్యాణం రామచంద్రరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా భవన నిర్మాణ, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ పాల్గొని ఏడాది పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, రావాడ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ తూకంతో మోసాలు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: దళారులు తక్కువ తూకం చూపుతూ ఆక్వా రైతులను మోసం చేస్తున్నారని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం కార్యదర్శి బోణం చిన్నబాబు ఆరోపించారు. పూలపల్లిలో ఆ సంఘం కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. రొయ్యల గ్రేడుల పేరిట దళారుల చేతుల్లో రైతులు దోపిడీకి గురవుతున్నారన్నారు. రొయ్యల తూకంలో కిలోకు 80 గ్రాముల వరకు తేడా ఉన్నట్లు ఓ రైతు గుర్తించి సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు దృష్టికి తీసుకువచ్చారన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: నిడమర్రుకు చెందిన పసుపులేటి శ్రీనివాస్ కుమార్తె జ్యోతికి 2017లో తణుకు మండలం పైడిపర్రుకు చెందిన పంగం అయ్యప్పతో వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.10 లక్షలు, 10 కాసుల బంగారం, రూ.2 లక్షలతో ఇతర లాంఛనాలు కట్నంగా ఇచ్చారు. ఇంకా కట్నం తీసుకురావాలని భర్త, అత్తమామలు సుబ్బలక్ష్మి, హనుమంతు వేధింపులకు గురిచేస్తున్నారు. విసిగిపోయాన వివాహిత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

దోమల మందు పిచికారీ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు ఉన్నా, చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి జి.భాస్కర్ నోటీసులు అందించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ అత్తిలిలో భాగంగా అత్తిలి గ్రామ పరిధిలోని బొంతువారి పాలెం, పెద్దహరిజనపేట కాలనీల్లో సోమవారం మలాథియాన్ దోమల మందు పిచికారీ చేయించారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ ఒప్పంద కార్మికులకు జీతాలు పెంచడంతోపాటుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ స్థానిక పురపాలక కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శాశ్వత కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలన్నారు. మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ఓవీ రాజు, ఎం.హరీష్, కళింగ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు

తణుకు, న్యూస్‌టుడే: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని డిప్యూటీ ఎంపీడీవో పీవీఎస్ రాంప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం వేల్పూరులో పంచాయతీ, పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో దోమల మంచి పిచికారీ చేపట్టారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఆయన కోరారు. సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి, ఉప సర్పంచి రాజారావు, తణుకు ఏఎంసీ వైస్‌ఛైర్మన్ వల్లూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు కృషి: డీపీవో

ఉండి, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు బూత్ స్థాయి అధికారులందరూ కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, నియోజకవర్గ ఎన్నికల అధికారి రామనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గంలో బీఎల్‌వోలు, ఎన్నికల సిబ్బందికి తొలి విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. అందులో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి అర్హుల పేర్లు మాత్రమే ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలన్నారు. ఉండి, పాలకోడేరు మండలాల సహాయ ఎన్నికల అధికారులు కె.నాగార్జున, ఎన్‌బీ విజయలక్ష్మి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రత్నకుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. శిక్షణ పొందిన బీఎల్‌వోలకు ధ్రువపత్రాలు అందజేశారు.

సమావేశంలో సంఘం ప్రతినిధులు

ప్రకటన

In the Court of the Principal Civil Judge (Junior Division), Tadepalligudem
O.S.No. 403/2024

Between:
State Bank of India, Tadepalligudem ..Plaintiff
and
Sri Sabarimala Agencies,
Prop. Saladi Murthy Raju .. Defendant

To Defendant
Sri Sabarimala Agencies, Prop Saladi Murthy Raju, D.No. 11-5-1, Pabolu vari Street, Bhagya Lakshmi Peta, Tadepalligudem, West Godavari District.

పై నెంబరు దావాలో ప్రతివాదికి (Defendant)కి ఎన్నిసార్లు సమనులు పంపించినప్పటికి దావా సమనులు అమలు జరిగి వుండలేదు. కావున పై నెంబరు దావా వాయిదా అనగా ది. 17-07-2025వ తేదీన ఉదయం గం॥లు 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షములో దావా తీర్మానం చేయబడును అని ఇందుమూలముగా తెలియజేయడం అయినది.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

Sd/- **Thota Rambabu,** Advocate
Vijaya Towers, Tadepalligudem
Tadepalligudem W.G.Dist,
26-6-2025 Cell: 98483 77437

పుంతదారులు.. అన్నదాతల అగచాట్లు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో పుంత దారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ హయాంలో వీటి గురించి పట్టించుకున్న పాపానపోలేదు. తణుకు నియోజకవర్గంలో సుమారు 50 కి.మీ. పొడవునా పుంతదారులున్నాయి. ఒక్కటికూడా అభివృద్ధికి నోచుకోకపోవడంతో మరింత అధ్వానంగా మారాయి. వాటి అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. నియోజకవర్గంలో సుమారు 35 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి, మరో 10 వేల ఎకరాల్లో ఆక్వా, కాయగూరలు, ఇతర ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. రైతులు నిత్యం వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లాలన్నా, ఎరువులు, పురుగు మందులు తీసుకెళ్లాలన్నా, పంట ఉత్పత్తులను బయటకు తీసుకురావాలన్నా ఈ దారులు చాలా ముఖ్యం. ఇంత ప్రాధాన్యత ఉన్న ఈ మార్గాలు అధ్వానంగా ఉండడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు.

అవస్థలు పడుతున్నాం.. ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లాలన్నా.. పంట ఉత్పత్తులు ఇళ్లకు చేర్చాలన్నా అవస్థలు పడుతున్నాం. ఐదేళ్లుగా ఈ దారులను అధికారులు పట్టించుకోలేదు. - జుత్తిగ నాగేశ్వరరావు, కంచుమర్రు, అత్తిలి మండలం

చినుకు పడితే చిత్తడే.. చినుకు పడితే పుంత దారిలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కనీసం ఎడ్లబండిపై పంట దిగుబడులు తీసుకురావడానికీ నానా యాతన అనుభవిస్తున్నాం. - రామారావు, ఐనపర్రు, ఇరగవరం మండలం

కంచుమర్రులో గుంతలమయంగా..

ప్రక్షాళనకు చర్యలు.. మండలంలోని పుంతదారులను పరిశీలించి ప్రక్షాళనకు చర్యలు చేపట్టాం. వాటి అభివృద్ధి కోసం అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. - పి.సూర్యనారాయణ, ఏఈ పీఆర్

(c) eenadu

ఆర్టీసీ జోన్ డీసీటీఎంగా ప్రశాంతి

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : కడప ఆర్టీసీ జోన్ డిప్యూటీ సీటీఎం (ఆపరేషన్-కార్గో)గా ఎంఎస్ ప్రశాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీహరిని జోనల్ వర్క్‌షాపునకు బదిలీ చేశారు. పుత్తూరులో డీఎంగా పనిచేస్తున్న ప్రశాంతికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ కడప జోన్ డిప్యూటీ సీటీఎంగా బదిలీ చేశారు. కడప జోన్ పరిధిలోని 52 డిపోల్లోని కార్గో వ్యవహారాలను ఆమె పర్యవేక్షిస్తారు.

ప్చ్.. టైం బాగోలేదు!

ఒకటో గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మరమ్మతులకు నోచుకోని క్లాక్ టవర్

క్లాక్ టవర్... నగరంలో చారిత్రక ప్రాంతం... గడియారం నుంచే ఆ ప్రాంతానికి ఆ పేరొచ్చింది... టిక్ టిక్ టిక్ అంటూ నాలుగు వైపులా సమయాన్ని చూపించే ఈ చారిత్రక పరికరం నేడు ఆగిపోయింది. పెద్ద ముల్లు, చిన్న ముల్లు ఊసులాడుకోక కొన్ని నెలలవుతోంది. రెండింటికి చిన్న ముల్లు, పెద్ద ముల్లు కూడా లేవు. నగరవాసికి ఎంతో సుపరిచితమైన క్లాక్ టవర్ ఆగడం వారి మనసు చివుక్కుమనేలా చేస్తోంది. కడప నగర నడిబొడ్డున ఒకటో గాంధీ విగ్రహం వద్ద విజయ హోటల్ ఆంగ్లేయుల కాలం నాటి కట్టడం. నగరపాలక కార్యాలయం వద్ద ఉన్న మరో అతి పెద్ద గడియారం మూన్నాళ్ల ముచ్చటగా పనిచేసింది. జిల్లా ఉన్నతాధికారులంతా తిరిగే ప్రధాన రహదారులపైనే ఉత్సవ విగ్రహాల్లా మారిన వీటిని మరమ్మతు చేయించాలని నగరవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు

నగరపాలక కార్యాలయం వద్ద పనిచేయని గడియారం

తిలా పాపం.. తలా పిడికెడు

- పులివెందుల వైకాపా నేతలకు పరిహారమా?
- గండికోట పునరావాసం కింద కాజేసే యత్నం
- రూ.5 కోట్ల చెల్లింపుపై ఎమ్మెల్యే ఆది నిలదీత

- ఈనాడు, కడప

గండికోట ప్రాజెక్టు పునరావాసం పేరిట అక్రమంగా పరిహారం పొందేందుకు పులివెందుల వైకాపా నేతల ప్రయత్నాలపై జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి.. జేసీ అదితిసింగ్‌ను నిలదీశారు. ఏమాత్రం భూములు లేనప్పటికీ పరిహారం కోసం అక్రమంగా పేర్లు నమోదు చేసుకుని కాజేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఇదెలా సాధ్యమని గట్టిగా ప్రశ్నించారు. ఈ అక్రమంపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై శుక్రవారం తానే స్వయంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటానని జేసీ హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యేతో పాటు కొండాపురం మండలవాసులు శాంతించారు.

జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ఇంతకీ ఈ వ్యవహారమేమిటంటే?

గండికోట ప్రాజెక్టు నిర్వాసితులు ముసుగులో ఊరూ పేరూ లేని వ్యక్తులు వైకాపా హయాంలో ప్రత్యక్షమయ్యారు. అందులోనూ ప్రభుత్వ భూమికే పరిహారం పొందడానికి ఎత్తుగడ వేశారు. వైకాపా కీలక నేతల ఒత్తిడి.. అధికార యంత్రాంగం వత్తాసు.. పరిహారం చెల్లింపునకు నోటిఫికేషన్ వరకు వ్యవహారం వైకాపా హయాంలో సాగింది. ప్రభుత్వ భూమిగా ఉన్న కొండ ప్రాంతం. దీని పేరిట యజమానులు పుట్టుకొచ్చారు. స్థానికేతరులు.. ప్రత్యేకించి పులివెందుల వాసులు కొందరు తెరపైకి వచ్చారు. రూ.7.50 కోట్ల ప్రజాధనాన్ని పరిహారం రూపంలో చెల్లించడానికి ప్రక్రియ కొలిక్కివచ్చింది. మొదటి దశలో రూ.5 కోట్లు చెల్లింపులకు రంగం సిద్ధమైంది.

ఎందెందు వెతికినా అక్రమాలే

గండికోట ప్రాజెక్టుకు కొత్తగా పరిహారం చెల్లింపులకు అవకాశం లేదు. అదనపు పరిహారం నిర్వాసితులకు చెల్లింపు వ్యవహారమే పెండింగ్‌లో ఉంది. గతంలో చెల్లించిన దాని కంటే అదనంగా చెల్లిస్తామని వైకాపా హయాంలో సీఎం హోదాలో జగన్ హామీ ఇచ్చి వారి నోట్లో మట్టికొట్టారు. ఇంతలో 27 మంది రైతులకు 133 ఎకరాలకు రూ.7.50 కోట్లు చెల్లింపు వ్యవహారం అకస్మాత్తుగా తెరపైకి వచ్చింది. దీనికి సంబంధించి నోటిఫికేషన్ వైకాపా హయాంలో జారీ అయింది. 27 మంది రైతుల్లో 17 మంది రైతులు స్థానికంగా ఉన్నవారు కాదు. కొండాపురం మండలం కె.బొమ్మేపల్లి పరిధిలో నిర్వాసితులుగా పేర్కొన్న వ్యక్తుల సామాజిక వర్గం గ్రామంలోనే లేదు. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు కనీసం కొండాపురం మండలంలో సైతం లేరు. కొందరిని మండలంలోని ముచ్చుమర్రి, బుక్కపట్నం గ్రామాలుగా సూచించారు. మరికొందరు పులివెందుల నియోజకవర్గం లింగాల మండలానికి చెందిన వారుగా ఉన్నారు. నిర్వాసితుల పేర్లు స్థానికంగా ఓటర్ల జాబితాలో లేవు. సామాజిక సర్వే జాబితాలోనూ లేని వ్యక్తులకు పరిహారం కింద ఎంపిక చేశారు. పరిహారం కాజేయడానికి డీకేటీ పట్టాలను సృష్టించినట్లు ఆరోపణలున్నాయి. నిబంధనల మేరకు డీకేటీ పట్టాలు కింద ఒక్కో లబ్ధిదారుకు గతంలో 1.50 ఎకరా మాత్రమే ఇస్తారు. ఇక్కడ మాత్రం ఒక్కొక్కరికి 4 నుంచి 5 ఎకరాలు సైతం పరిహారం కోసమే నమోదు చేశారు. అక్రమ మార్గంలో తప్పుడు పత్రాలు సృష్టించినట్లు వెలుగులోకి వచ్చాయి. పరిహారం కోసమే.. ప్రభుత్వ భూమిని చూపించి ప్రజాధనాన్ని కాజేసే కుట్రలు.. కుతంత్రాలు సాగాయి. వ్యవహారం బయటికి రావడంతో నోటిఫికేషన్ ఇచ్చిన అధికారులు మాత్రం.. ఇదంతా రెవెన్యూ ప్రతిపాదన మేరకు జారీ చేశామని తప్పుకొంటున్నారు. తమ పరిధిలో ఏమీ లేదని జారుకుంటుండగా.. రెవెన్యూ అధికారులు గుంభనంగా ఉంటున్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఆర్డీవో సైతం పట్టించుకోకుండా పరిహారం చెల్లింపునకు ఏర్పాట్లు చేశారు.

సింహ వాహనం.. మలయప్ప అవతారం!

నందలూరు, న్యూస్‌టుడే: నందలూరులో సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సింహ వాహనంపై మలయప్ప అవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి వారు మాడ వీధుల్లో విహరించారు. జిల్లా నలుమూలలు నుంచి భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం పాల్గొన్నారు. ● బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం పల్లకీసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి హనుమంత వాహనంపై స్వామి వారు విహరిస్తారని అధికారులు తెలిపారు.

పులివెందులలో జగన్: ఈనాడు, కడప : వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమంలో పాల్గొనడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ పులివెందులకు, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఇడుపులపాయకు వేర్వేరుగా సోమవారం చేరుకున్నారు. వైఎస్ ఘాట్‌లో మంగళవారం జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు.

B.Tech., and Ag.B.Sc., SPOT ADMISSION
కేవలం 6,7,8,9,10 లక్షల ఖర్చుతో నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ / అగ్రికల్చర్ బీఎస్సీ (కాలేజ్ ఫీజు + హాస్టల్ ఫీజుతో కలిపి) ఎటువంటి షూరిటీ లేకుండా విద్యార్థికి 70 నుంచి 80% లోన్ సౌకర్యం కల్పించబడును. వివరాలకు సంప్రదించండి :
9502555500, 9160220527

ఎవరి కోసం జగన్ దండుయాత్ర

మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: వైకాపాను రాష్ట్ర ప్రజలు ఛీకొట్టినా ఆ పార్టీ బుద్ధి కుక్కతోక వంకరలా మారిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విమర్శించారు. రాయచోటిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. కారుతో కార్యకర్తను తొక్కించి అతని మరణానికి కారణమైన మాజీ సీఎం జగన్ మళ్లీ రైతుల పేరుతో రోడ్డెక్కడం దారుణమని విమర్శించారు. రైతుల పేరుతో జగన్ పరామర్శలకు వెళ్లిన చోటల్లా ఏం జరిగిందో ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. గుంటూరు మిర్చి యార్డులో పరామర్శకు వెళ్తే వైకాపా అల్లరిమూకలు మిరప కాయల బస్తాలు ఎత్తుకెళ్లారన్నారు. పొదిలిలో పొగాకు రైతుల పరామర్శకు వెళ్లి పొగాకు బేళ్లు తొక్కి నాశనం చేసి రైతులను నష్టపరిచారని, ఇప్పుడు మళ్లీ మామిడి రైతులను ఏం చేద్దామని పరామర్శకు వెళ్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. జగన్ రాద్ధాంతం చేసేందుకే బలప్రదర్శన తరహాలో బంగారుపాళెం వెళ్తున్నారన్నారు. తోతాపురి మామిడితో సంబంధం లేని వైఎస్సార్ కడప జిల్లా నుంచి కార్యకర్తలను ఎందుకు తరలిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

ప్రగతి గడప... స్వర్ణ కడప

- సమీక్షలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత
- ఏటా 15 శాతం వృద్ధిరేటుతో ప్రణాళిక

మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, చిత్రంలో సీపీవో హజరత్తయ్య, జేసీ అదితిసింగ్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యేలు మాధవి, ఆదినారాయణరెడ్డి

ఈనాడు, కడప: గడప.. గడపకు సంక్షేమాలను విస్తరించి స్వర్ణ కడపగా మార్చే బాధ్యత అందరిపైనా ఉందని, ఇందుకోసం ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, సామాజికవేత్తలు కలిసిరావాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. కడపలోని కలెక్టర్ కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్' అమలు, జిల్లా కార్యాచరణ ప్రణాళిక ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. 'రాష్ట్ర ప్రగతిని ఆకాంక్షించే ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా విజన్ రూపొందించారు. గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా యూనిట్‌గా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. పేదలను అన్ని రంగాల్లో ఉన్నతస్థాయికి తీసుకొచ్చేలా ధనికుల సాయం తీసుకుంటాం. పేదలను బంగారు కుటుంబాలుగా, ధనికులను మార్గదర్శకులుగా గుర్తిస్తాం. కడపలో 70 వేల బంగారు కుటుంబాలుగా గుర్తించాం. వారిని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటున్నాం' అని వివరించారు.
● స్వర్ణాంధ్ర-2047 సాధనలో భాగంగా 2029 నాటికి కార్యాచరణ ప్రణాళికను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆవిష్కరించారు. ప్రతి 15 శాతం వృద్ధి రేటును సాధిస్తూ స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని వందశాతం సునాయాసంగా చేరుకోవచ్చన్నారు. పీ-4 విధానాన్ని జిల్లాలో పటిష్టంగా అమలుకు సహకరించాలని అన్ని వర్గాలకు ఎమ్మెల్యే మాధవి పిలుపునిచ్చారు. జిల్లాను ఫ్యాక్షన్ నుంచి ఫ్యాషన్ రంగం వైపు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆకాంక్షించారు. అక్షరాస్యతలో వందశాతం ప్రగతి సాధించడానికి చర్యలు చేపట్టాలని, కమలాపురం నియోజకవర్గం అక్షరాస్యతలో వెనుకబడటాన్ని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి ప్రస్తావించారు. నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు తమ అజెండాను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పలు ప్రశ్నలు వేస్తూ అధికారుల నుంచి సమాధానాలు రాబట్టారు. తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు చంద్రమోహన్, సాయిశ్రీ, జార్విన్, నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

సెలవుపై జడ్పీ సీఈవో, డీపీవో

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : జిల్లాలో కీలక అధికారులు సెలవుపై వెళ్లారు. జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా పంచాయతీ అధికారిణి (డీపీవో) రాజ్యలక్ష్మి సెలవుపై వెళ్లారు. జడ్పీ సీఈవో ఓబులమ్మ వారం నుంచి సెలవులో ఉండగా.. మరో వారం రోజుల పాటు తన సెలవును కలెక్టరు అనుమతితో పొడిగించుకున్నారు. డీపీవో రాజ్యలక్ష్మి ఈ నెల 7 నుంచి 28వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. జడ్పీ సీఈవో బాధ్యతలను, డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం తాత్కాలికంగా నిర్వహించనున్నారు.

సాగుకు ఆపద... బాగు చేస్తే ఆగదా!

శ్రీశైలం జలాశయం నుంచి నీటి విడుదల చేసేనాటికి పంట కాలువలు బాగుపడాలి. ప్రవాహం సాగాలంటే పూడిక, కంప చెట్లు తొలగించి, కాలువలకు షట్టర్లు పనిచేసేలా చేయాలి. ఇలాంటి పనులేవీ చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి విడుదల నాటికి అధికారులు ఈ పనులు చేస్తేనే పొలాలకు నీరందుతుంది. రాజోలి గ్రామం వద్ద ప్రారంభమయ్యే చాపాడు కాలువ 40.5 కి.మీ దూరం పొడవునా 18,650 ఎకరాలకు నీటి వసతి అందించాలి. గత ప్రభుత్వం జపాన్ నిధులు రూ.10 కోట్లతో చేపట్టిన లైనింగ్ పనుల్లో నాణ్యత లోపించడంతో ప్రస్తుతం ఈ దుస్థితి నెలకొంది. - న్యూస్‌టుడే, రాజుపాళెం

రాజుపాళెం మండలం కొర్రపాడులో చాపాడు రెండో కాలువలో శిథిలమైన లైనింగ్

చెత్తాపట్టాల్

- పన్ను రద్దు చేసినా ప్రజలపై తప్పని భారం
- యూజర్ ఛార్జీల పేరిట అక్రమ వసూళ్లు
- కడప నగరపాలక సంస్థలో అధికారుల దందా

2021 అక్టోబరు 2 : జగనన్న స్వచ్ఛతా సంకల్పం మాటున క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో జనం నుంచి చెత్తపన్ను వసూళ్లు మొదలుపెట్టిన దినం! రాష్ట్ర ప్రజలు ఛీదరించుకున్నా వెరవకుండా జగన్ సర్కార్ ప్రభుత్వంలో ఉన్నంత కాలం ప్రజల నుంచి చెత్త పన్ను వసూలు చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2024 జూన్ 9న చెత్తపన్ను వసూళ్లను నిలిపేయాలని ఆదేశించారు. ఈ ఆదేశాల ప్రకారం కడప నగరపాలక సంస్థ చెత్తపన్ను వసూళ్లను నిలిపేసింది. కానీ పారిశుద్ధ్య విభాగానికి చెందిన కొందరు అధికారులు ప్రభుత్వ ఆదేశాలను పక్కనబెట్టారు. చెత్తపన్ను వసూళ్లలో సొంత అజెండాను అమలు చేస్తూ నగరవాసుల నుంచి నెలనెలా రూ.లక్షలు అక్రమంగా వసూలు చేస్తున్నారు. చెత్త పన్ను చెల్లింపులపై నోరు మెదిపితే ఏ కేసులు పెడతారో.. ఎంత పెనాల్టీలు వేస్తారో అన్న భయంతో అక్రమార్కులు అడిగినంత చెల్లించేస్తున్నారు. అక్రమ చెత్తపన్ను వసూళ్లకు నగరపాలక సంస్థ పేరుతో రశీదులు కూడా ఇవ్వడం చర్చనీయాంశమయింది. - న్యూస్‌టుడే, కడప నగరపాలక

చెత్తపన్ను వసూలు చేసి ఇచ్చిన రశీదులు

వాణిజ్య సంస్థలపై కన్నేశారు

రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేసిన తర్వాత చెత్తాసురుల కన్ను నగరంలోని వాణిజ్య, వ్యాపార సంస్థలపై పడింది. ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేసినా వారి నుంచి నిర్భయంగా పన్ను వసూళ్లకు పాల్పడుతూ వస్తున్నారు. రోడ్డుపక్కన ఉండే టీ స్టాల్ మొదలుకుని పెద్ద రెస్టారెంట్ల వరకు దేన్నీ వదలకుండా వసూళ్లు చేపట్టారు. పన్ను చెల్లింపునకు రశీదు ఇవ్వాలని కోరితే వారు ప్రింటు చేయించుకున్న రశీదులనిస్తున్నారు. చెత్తపన్ను ఎందుకు కట్టాలని ప్రశ్నిస్తే ఆ పరిసరాల్లో టీ గ్లాసులు పడేశారని, రోడ్డు పక్కన వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, పాలిథిన్ సంచులు వాడుతున్నారని రకరకాల కారణాలతో బెదిరిస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వర్గాల నుంచి యథాతథంగా నెలకు రూ.200 మొదలుకుని రూ.2 వేల వరకు అనధికారికంగా వసూలు చేస్తున్నారు. నెలకు సగటున రూ.30 లక్షల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే రూ.కోట్ల చెత్త కుంభకోణం బయటపడే అవకాశం ఉంది.

● జగన్ జమానాలో వసూళ్ల పర్వం

జగన్ జమానాలో నగరంలోని ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.90 చెత్త పన్ను వసూలు చేశారు. టీ హోటళ్లు, అల్పాహారశాలలు, హోటళ్లు, రెస్టారెంట్లు, చికెన్ పకోడీ బండ్లు, మద్యం షాపులు, బార్లు, క్లినిక్కులు, వైద్యశాలలు, లాడ్జిలు, సినిమా థియేటర్లు, ఫంక్షన్ హాళ్లు, వస్త్ర దుకాణాలు, కిరాణా దుకాణాలు, మాంసం అంగళ్లు, కూరగాయల దుకాణాల నుంచి కేటగిరీల వారీగా రూ.200 మొదలుకుని రూ.2 వేల వరకు వసూలు చేసేవారు. తర్వాత వారికి ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులకు సంబంధించిన సమాచారాన్ని పంపించాలి, తగిన రశీదులు కూడా ఇవ్వాలి. కానీ చెత్తపన్ను విధానంలోని పలు లోపాలను ఆసరాగా తీసుకుని అప్పటి నుంచే సొంత రశీదు పుస్తకాలను కొందరు అధికారులు సిద్ధం చేసుకున్నారు. చెత్త పన్ను చెల్లింపుదారులకు వారు సిద్ధం చేసుకున్న రశీదు పుస్తకాల నుంచే రశీదులిచ్చేవారు. ప్రజల నుంచి, సొంత పార్టీ నాయకుల నుంచే చెత్తపన్ను వసూళ్లపై విమర్శలు రావడంతో దీనిపై అప్పటి అధికారులు కూడా పూర్తిగా దృష్టి పెట్టలేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న అధికారులు ప్రజల నుంచి 75-90 శాతం మేర చెత్త పన్ను వసూలు చేసి నగరపాలక సంస్థ ఖజానాకు 30 శాతం మేర మాత్రమే జమ చేసే వారు. రాష్ట్ర ప్రభుత్వం చెత్తపన్ను వసూళ్లను పూర్తిగా రద్దు చేయడంతో నివాస గృహాల వద్ద చెత్త పన్ను వసూళ్లను నిలిపేశారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం :

రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్ను వసూళ్లను రద్దు చేసింది. కానీ కడప కార్పొరేషన్లో వ్యాపారులు, వాణిజ్య సంస్థల నుంచి చెత్త పన్ను వసూళ్లు చేయడంపై వెంటనే విచారణ చేపట్టాలని ఆదేశించాం. చెత్త పన్ను వసూలు చేస్తున్నదెవరు? ఎప్పటి నుంచి వసూలు చేస్తున్నారు? ఆ సొమ్మును నగరపాలక సంస్థ ఖజానాలో జమ చేశారా? లేక పక్కదారి పట్టించారా? అన్న అంశాలపై దృష్టి పెట్టి అక్రమాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. - మనోజ్‌రెడ్డి, కమిషనర్

రైతేరాజు 6లో

భద్రతకు ప్రాధాన్యం

కొండాపురం, న్యూస్‌టుడే: ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా అన్నారు. సోమవారం సాధారణ సేఫ్టీ తనిఖీల్లో భాగంగా కొండాపురం సమీపంలోని చిత్రావతినదిపై ఉన్న రైల్వే వంతెన (బ్రిడ్జి నంబరు 687)ను పరిశీలించారు. అలాగే ముద్దనూరు వద్దనున్న లెవల్ క్రాస్ గేట్ (ఎల్‌సీ నంబరు 145)ను, రైల్వే నిలయం పరిసరాలను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న సిబ్బందితో భద్రతకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. మంగపట్నం వద్ద పాయింట్స్, క్రాసింగ్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైల్వే ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే డీవోఎం జనరల్ పూర్ణచంద్రరావ్, సంబంధిత రైల్వే అధికారులు, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండు మిర్చిని బస్తాల్లో నింపుతున్న కార్మికులు

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు

కల్లంలో చేర్చి.. కళ్లు చెమిర్చి

- ధరల పతనంతో రైతు కుదేలు
- మూడేళ్లుగా శీతల గోదాముల్లోనే సరకు

ఓ వైపు పెరిగిన పెట్టుబడులు, మరో వైపు పడిపోయిన ధరలు ఎండు మిర్చి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. సరైన ధర లేక మూడేళ్లుగా సరకు గోదాముల్లోనే మగ్గుతోంది. అక్కడ నిల్వ చేసినందుకు క్వింటాకు రూ.300 వరకు చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.
●ఎక్కడెక్కడ సాగు చేస్తారంటే... : జిల్లాలో మిరప పంట 2095.31 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఎక్కువగా మైలవరం మండలంలో 1,144.69 ఎకరాల్లో సాగు చేయగా, పోరుమామిళ్లలో 434, పెద్దముడియంలో 387.85, జమ్మలమడుగులో 89.78, రాజుపాలెంలో 21.21, ప్రొద్దుటూరులో 17.78 ఎకరాల్లో పండించారు.
● మైలవరం మండలంలో మైలవరం, ముక్కబావిపల్లె, దొడియం, తొర్రివేముల, నార్జంపల్లె, పొన్నంపల్లె, చిన్నకొమ్మెర్ల, పెద్దకొమ్మెర్ల తదితర గ్రామాల్లో ఎండు మిర్చి సాగు ఎక్కువ. రైతులు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. పంట బాగా పండితే ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. తెగుళ్లు, వరుస తుపానుల కారణంగా 10 నుంచి 12 క్వింటాళ్లలోపే ఉందని రైతులు చెబుతున్నారు. ● గతంలో క్వింటా రూ.21 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.9 వేలకు పడిపోయిందని రైతులు చెబుతున్నారు. జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో శీతల గోదాములుండగా అందులో సుమారు 5 వేల క్వింటాళ్ల సరకు నిల్వ ఉండొచ్చని అంచనా. ● ఈ ప్రాంతంలో మిర్చి పంట ఎక్కడ సాగు చేసినా గుంటూరు మార్కెట్‌కు తరలిస్తారు. అక్కడ్నుంచి చైనా, బంగ్లాదేశ్‌కు ఎగుమతులు జరిగేవి. కరోనా తర్వాత అంతర్జాతీయ మార్కెట్ కుదేలు కావడంతో ధరలు పతనమైనట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్వింటా రూ.9 వేలకు విక్రయం : నేను ఆరెకరాల్లో మిర్చి సాగు చేశాను. నారు, ఎరువుల ధరలు పెరిగిపోవడం, కూలీల ఖర్చులు అధికం కావడంతో ఒక్కో ఎకరాకు సుమారు రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. దిగుబడి కూడా ఆశించనంత లేదు. అప్పులు పెరిగి పోవడంతో ఇటీవల గుంటూరు మార్కెట్‌లో క్వింటా రూ.9 వేలకు అమ్ముకున్నాను. - నాగరాజు, మిర్చి రైతు, గంగుల నారాయణపల్లె, మైలవరం మండలం

(c) eenadu

రైతేరాజు

పశువుల కొట్టంలో ప్రథమ చికిత్స పెట్టె

పాడి రైతులు డెయిరీ ఫామ్స్ లేదా పశువుల కొట్టంలో ప్రథమ చికిత్స పెట్టె (ఫస్ట్ ఎయిడ్ బాక్సు) ఏర్పాటు చేసుకోవాలి. అందులో కాటన్, బ్యాండేజ్ క్లాత్, కత్తెర, ప్లాస్టర్, టించర్ అయోడిన్, టించర్ బెజాయిన్, ఆయిల్ ఆఫ్ టర్పంటైన్, డిస్పోజబుల్ 5 ఎంఎల్, 10, 20 ఎంఎల్ సిరంజిలు, ఐవీ సెట్, మల్లెముల్లు(ఫోర్‌సెప్స్), డ్రెంచింగ్ కప్ లేదా బాటిల్ వంటి వస్తువులు ఉంచుకోవాలి. ఈ పరికరాలు అందుబాటులో ఉంటే అనారోగ్యంతో ఉన్న పశువులకు ఈ కిట్టు ద్వారా ప్రథమ చికిత్స చేసి ఉపశమనం కలిగించవచ్చు. తదుపరి దశలలో మెరుగైన చికిత్స కోసం సమీపంలోని పశువైద్యులను సంప్రదించవచ్చని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టరు గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. పశువైద్యులు అందుబాటులో లేని సమయం, పశువుల వలస వెళ్లినప్పుడు ఈ ప్రథమ చికిత్స ఎక్కువగా తోడ్పడుతుంది. పొరుగు రాష్ట్రాలలో మొర్రాజాతి పశువుల కొనుగోలు చేసి రవాణా చేసే సమయంలో ఈ కిట్లు అందుబాటులో ఉంచుకొంటే ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, రాయచోటి

చిట్కా

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న: సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వంగను వెర్రి తెగులు, కొమ్మ, కాయతొలుచు పురుగులు ఆశించాయి. పురుగు ఉద్ధృతి అధికంగా ఉంది. నివారణ తెలపండి?

- నిత్యానందరెడ్డి, నిమ్మనపల్లె

సమాధానం: వంగలో వెర్రితెగులు ఆశించినప్పుడు ఆకులు చిన్నవిగా మారి పూత, కాయ రాదు. నివారణకు తెగులు సోకిన మొక్కలను పీకి దూరంగా వేసి కాల్చివేయాలి. వేప నూనె, బ్రహ్మాస్త్రం పిచికారీ చేయడం ద్వారా నివారణ చేయవచ్చు.

- పీరూసాహెబ్, సస్యరక్షణ శాస్త్రవేత్త, కలికిరి కేవీకే

- న్యూస్‌టుడే, కలికిరి గ్రామీణ

పాడికి దన్నుగా.. గతం కంటే మిన్నగా

- న్యూస్‌టుడే, చిన్నమండెం

ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా కరవులో సైతం ఎక్కువ మంది పాడి పెంపకంతోనే జీవనం సాగిస్తున్నారు. ఏటికేడు ప్రధాన పంటలు సాగు చేసినా అతివృష్టి, అనావృష్టి, తెగుళ్లు, గిట్టుబాటు కాని ధరలతో రైతులు నష్టాలపాలవుతున్నారు. ఇలాంటి సమయంలో జీవనం భారమైన రైతులు పాడి పెంపకంపై దృష్టి సారిస్తున్నారు. పాల ఉత్పత్తితోనే తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పశుగ్రాసాభివృద్ధికి తమ వంతు ప్రోత్సహిస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ పరంగా అమలు చేసే పథకాలను అన్నమయ్య జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ గుణశేఖరపిళ్లై వివరించారు. వర్షాకాలంలో పశుగ్రాసాన్ని అధికంగా సాగు చేసుకుని వేసవికి కూడా ఉపయోగించుకోవచ్చని సూచిస్తున్నారు. ప్రభుత్వం ద్వారా అందే రాయితీలను ఆయన వివరించారు.

పశుగ్రాసాభివృద్ధికి పంచ సూత్రాలు

పడమటికోన సాగులో ఉన్న గడ్డి

రాయితీపై విత్తనాల పంపిణీ

ప్రభుత్వం 75 శాతం రాయితీతో నీటి ఎద్దడిని తట్టుకుని దిగుబడినిచ్చే గడ్డి విత్తనాల పశు వైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నారు. సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు కూడా ఉన్న పొలంలో తమకున్న పశువులను బట్టి గ్రాసాన్ని పెంచుకోవాలని సూచిస్తున్నారు.

బహువార్షిక పశుగ్రాస పెంపకం

ఈ సాగులోని ప్రధాన రకాలు కో 1,2,3,4, ఏపీబీఎన్ నేపియర్, సూపర్ నేపియర్, హైబ్రీడ్ నేపియర్‌లు. ఒకసారి సాగు చేసుకుంటే అయిదేళ్ల వరకు దిగుబడులు వస్తాయి. ఎకరాకు రెండు కనుపులున్న పుల్లలను 10 వేలు నాటుకోవాలి. ఒక కోతకు 25 టన్నుల వరకు గడ్డి దిగుబడి రావడంతో పాటు ఏటా ఐదు నుంచి ఆరు కోతలు వస్తాయిని జేడీ తెలిపారు.

గడ్డి సాగుకు ఉపాధి ప్రోత్సాహం : గడ్డి పెంపకానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోంది. పది సెంట్లు నుంచి అర ఎకరా వరకు గడ్డి పెంచుకునే రైతులకు ఆర్థికంగా చేయూతనిస్తోంది.

కరవులో పశుగ్రాసానికి ఉపయోగపడే చెట్ల పెంపకం : వ్యవసాయానికి అనువుగా లేని భూముల్లో అవిసె, సుబాబుల్, గ్లెరిసిడియా చెట్లను పెంచుకోవచ్చు. ఇందులో సుబాబుల్ విత్తనాలను చల్లుకుంటే వర్షాలకు మొలకెత్తుతాయి. వీటి ఆకులను పశుగ్రాసంగా ఉపయోగించుకోవచ్చు.

వ్యవసాయ ఉప ఉత్పత్తులు

ఖరీఫ్, రబీ సీజన్లలో పండిన వరి, వేరుసెనగ, జొన్న, సజ్జ, రాగి పంటలు అయిపోయిన తర్వాత వాటి శాఖీయ భాగాలను పశుగ్రాసంగా ఉపయోగించుకోవచ్చు. వీటిని ఎండబెట్టుకొని వేసవిలో గ్రాసంగా కూడా వాడుకోవచ్చు. పచ్చిమేతతో పాటు వరిగడ్డి, వేరుసెనగ కట్టె పశువులకు మేతగా వేయడంతో పాలలో వెన్న శాతం పెరుగుతుంది. తద్వారా పాలకు గిట్టుబాటు ధర పలికి రైతులకు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుందని వివరించారు.

బీన్సు సాగు... లాభాలు బాగు

రామసముద్రం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం ముళబాగల్ తాలుకా అరిపినేపల్లెకు చెందిన శ్రీనివాసులు 1.5 ఎకరాల విస్తీర్ణంలో బీన్సు సాగు చేపట్టారు. టమాట దిగుబడి పూర్తయిన వెంటనే ఆ మొక్కలకు ఊతంగా ఏర్పాటు చేసిన కర్రల వద్దే తీగ బీన్సు విత్తనాలను విత్తారు. మొలకెత్తిన 15 రోజుల వ్యవధిలోనే తీగలు బాగా పాకాయి. ఊతాలుగా ఉన్న కర్రలకు పాకించి వారానికోసారి బిందు సేద్యంతో మొక్కలకు పోషక ఎరువులను అందించారు. క్రిమి కీటకాలు ఆశించకుండా 15 రోజుల కాల వ్యవధిలో పంటసాగుకు మందులు పిచికారీ చేశారు. సూర్యరశ్మి మొక్కలపై నేరుగా పడకుండా షేడ్‌నెట్లను అమర్చారు. రెండున్నర నెలలకే దిగుబడి ప్రారంభం కాగా 1.5 ఎకరాల విస్తీర్ణంలో 60 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. షేడ్‌నెట్ ఏర్పాటుతో దిగుబడి రెట్టింపు అయింది. మూడు నెలల వ్యవధిలోనే పంట కాలం పూర్తి కావాల్సి ఉంటే మరో నెల రోజుల పాటు అదనంగా దిగుబడి వచ్చింది. రైతుకు సాగు వ్యయం రూ.70 వేల వరకు ఖర్చు కాగా రాబడి రూ.3 లక్షలకు పైగానే వచ్చింది. ఖర్చులు పోనూ రైతుకు రూ.2.30 లక్షల వరకు లాభం సమకూరినట్లు తెలిపారు.

షేడ్‌నెట్లలో సాగవుతోన్న బీన్సు పంట

అభివృద్ధే మా ధ్యేయం

లింగాల, పులివెందుల, న్యూస్‌టుడే : అభివృద్ధే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తోందని, నూతన పరిశ్రమలు తీసుకొచ్చామని, ఉపాధి, సంక్షేమ పథకాలు అందించడంతోపాటు సంపద సృష్టించగల నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా బాధ్య మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం పులివెందుల నియోజకవర్గంలో ఆమె పర్యటించారు. లింగాలలో తెదేపా నియోజకవర్గ బాధ్యుడు బిటెక్ రవి మంత్రితో కలిసి 'సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం పాల్గొన్నారు. ఈ సందర్భగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్లలో మంత్రులు, ఎమ్మెల్యేలు సంవత్సరంలోపు గ్రామాల్లోకి రాలేదని ఈ రోజు మేం ధైర్యంగా వచ్చామంటే అభివృద్ధి చేశాం కాబట్టి వచ్చామన్నారు. నియోజకవర్గ బాధ్యుడు బిటెక్ రవి మాట్లాడుతూ ల్యాండ్ టైటిల్ రద్దు చేశామన్నారు. జగన్ హయాంలో లిక్కర్ పాలసీతో నాసిరకం మద్యం విక్రయించి ఎంతో మంది చావుకు కారణమయ్యారని విమర్శించారు. మండల తెదేపా కన్వీనర్ విశ్వనాథ రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, ధనుంజయనాయుడు, అమర్, కూటమి నాయకులు పాల్గొన్నారు. పులివెందులలోని రహదారులు భవనాల అతిథి గృహంలో పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ కలిసి పులివెందులలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై చర్చించారు. పులివెందులలో శాంతి భద్రతలు ఏవిధంగా ఉన్నాయి.. తదితర విషయాలను మంత్రి డీఎస్పీని ఆరా తీశారు. నియోజకవర్గ తెదేపా బాధ్యుడు బీటెక్ రవి, తుంగభద్ర హైలెవెల్ కెనాల్ ప్రాజెక్టు డైరెక్టర్ జోగిరెడ్డి, వేంపల్లె మండల తెదేపా బాధ్యుడు రఘునాథరెడ్డిలతో కలిసి నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. లింగాల మండల తెదేపా నాయకులు ధనుంజయ, సంజీవరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి సవిత

జమ్మలమడుగులో మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, పక్కన తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

వైకాపా సింగిల్ డిజిట్‌కే పరిమితం

జమ్మలమడుగు, మైదుకూరు: వైకాపాకు 2019 ఎన్నికల్లో ప్రజలు నమ్మి 151 స్థానాలు కట్టబెడితే చేతకాని పరిపాలనతో 11 స్థానాలకే పరిమితమయ్యారని, రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ సింగిల్ డిజిట్‌తో సరిపెట్టుకోనుందని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం జమ్మలమడుగులోని తెదేపా కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో విధ్వంస పరిపాలనతో దేశంలో ఏ పార్టీకి ఉండని వ్యతిరేకతను వైకాపా మూటకట్టుకుందని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష హోదా దక్కని ఆ పార్టీ ఏమని రీకాల్‌కు వెళ్తారని నిలదీశారు. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా దక్కని ఆ పార్టీని ప్రజలు ఎప్పుడో రీకాల్ చేసేశారని, త్వరలో కాలగర్భంలో కలిసిపోతుందని ఘాటుగా మాట్లాడారు. ప్రతి పక్ష హోదా దక్కనందుకా, గెలిచిన 11 మంది వైకాపా ఎమ్మెల్యేలు జీతాలు తీసుకుంటూ అసెంబ్లీలో అడుగు పెట్టనందుకా, ఉనికి కోసం గ్రామాల్లో అలజడులు సృష్టిస్తూ వ్యతిరేక శక్తులను తయారు చేస్తున్నందుకా అని మంత్రి నిలదీశారు.

రప్పా రప్పా అంటే ప్రజలు చిత్తుగా ఓడిస్తారు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : వైకాపా నాయకులు రప్పా రప్పా అంటూ ప్రజలను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇదే పద్ధతిలో ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు 2029 ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రావని తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత అయిదేళ్లలో వైకాపా నాయకులు చేసిన అరాచకాలకు విసిగిపోయి ప్రజలకు వారికి కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు రప్పా రప్పా అంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో పెట్టుబడిదారులు ధైర్యంగా వస్తుంటే వారిని బెదరగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళుతోందన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ పనులు మొదలయ్యాయని, పర్యాటకం అభివృద్ధి చెందుతోందని, వ్యవసాయ రంగానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. రప్పా రప్పా అనే సంస్కృతి తీసుకొస్తే వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని, పులివెందులలో కూడా ఓటమి పాలవుతారన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో భయానక వాతావరణం సృష్టించి ఏకగ్రీవం చేసుకున్నారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అభివృద్ధి చూసి ప్రజలు మాకు ఓట్లేస్తారన్నారు. మీ తరపున పోటీ చేసేందుకు కూడా ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి లేదన్నారు. జగన్ కారు కింద వ్యక్తి పడితే ఈడ్చుకెళ్లారని, ఇదంతా ప్రజలు గమనించారన్నారు. వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం విద్యార్థుల జీవితాలను నాశనం చేసి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు.

మాట్లాడుతున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్‌రవి

పకడ్బందీగా సమావేశాల నిర్వహణ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : పేరెంట్, టీచర్ కమిటీ సమావేశాలను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కడప కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో ఈ నెల 10న మెగా పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో అందరికీ ఆహ్వానపత్రికలు అందించాలన్నారు. హోలిస్టిక్ రిపోర్టు కార్డులు పాఠశాలలు, కళాశాలలకు అందాయో లేదో ముందుగానే గుర్తించాలన్నారు. పాఠశాలలు మారిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు సమావేశాన్ని పండగ వాతావరణంలో నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి 8, 9 తేదీల్లో ట్రైలర్‌రన్ నిర్వహించాలని, ఇందులో నిర్లక్ష్యానికి తావివ్వద్దన్నారు. సమావేశంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, డీఈవో షంషుద్దీన్, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, కమిషనర్ మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో జేసీ అదితిసింగ్

గోదాము ఎదుట పొగాకు రైతుల ఆందోళన

ముద్దనూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లె సమీపంలో యశ్వంత్ గోడౌన్ వద్ద సోమవారం పొగాకు రైతులు ఆందోళన చేపట్టారు. తమ పంటను వాహనాల్లో తీసుకుని వచ్చి నినాదాలు చేశారు. జీపీఐ కంపెనీ వారే పొగాకు నారు ఇచ్చి నాటించారు, వారే కొంటామన్నారు. ఇప్పుడు కొనలేమనడం న్యాయమా అని నిలదీశారు. 90 రోజులకు పంట వస్తుందని, తమకు క్వింటాకు రూ.18,500 లెక్కన కొనుగోలు చేస్తామని పంట చేతికొచ్చి నాలుగు నెలలైనా పట్టించుకోకపోవడం తగదన్నారు. ఇప్పటికే కొంత మంది రైతుల పంట వర్షాల్లో తడిచి తీవ్రంగా నష్టపోయారన్నారు. తమకు ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చు అయిందన్నారు. దాదాపు 10 ట్రాక్టర్లతో 400 క్వింటాల వరకు పంటను తీసుకొని వచ్చామన్నారు. ఉదయం 8 గంటల నుంచి గేటు వద్దనే పడిగాపులు కాస్తున్నా సిబ్బంది పట్టించుకోకపోవడంతో తాళాలు పగులగొట్టామన్నారు. పోలీసులు చేరుకుని రైతులు, కంపెనీ వారితో మాట్లాడారు. నాలుగు రోజుల్లో కొనుగోలు చేస్తామనడంతో ఆందోళన విరమించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ సంజీవరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి

పులివెందుల, న్యూస్‌టుడే : పులివెందుల మండలం ఉలిమెల్ల గ్రామంలో సోమవారం విద్యుత్తు లైన్ మరమ్మతులు చేస్తూ లైన్‌మెన్ గంగారపు శివారెడ్డి (46) తీగలపైనే మృతి చెందాడు. ఉలిమెల్ల గ్రామానికి చెందిన సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో విద్యుత్తు లైన్ మరమ్మతులకు గురికావడంతో దాన్ని బాగుచేసేందుకు లైన్‌మెన్ గంగారపు శివారెడ్డి సబ్‌స్టేసన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న సాయికి ఫోన్ చేసి ఎల్‌సీ కావాలని అడిగాడు. ఎల్‌సీ తీసుకుని స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా తీగలకు విద్యుత్తు సరఫరా కావడంతో శివారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు చూసి పోలీసులకు, విద్యుత్తు సిబ్బందికి తెలియజేశారు. విద్యుత్తు శాఖ సిబ్బంది హుటాహుటిన ఘటనా ప్రదేశానికి చేరుకుని శివారెడ్డి మృతదేహాన్ని కిందికి దించారు. అతని సోదరుడు గంగారపు నాగరాజరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పులివెందుల పోలీసులు తెలిపారు. ఈ విషయమై విద్యుత్తు శాఖ డీఈ ప్రసాద్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా శివారెడ్డి ఒక్కడే విధులకు వెళ్లి ఎల్‌సీ తీసుకున్నట్లు సమాచారం రికార్డు అయ్యిందన్నారు. కడప నుంచి వచ్చిన అధికారుల బృందం సబ్‌స్టేషన్‌ను పరిశీలించి.. విద్యుదాఘాతానికి గల కారణాలను వెల్లడిస్తారని తెలిపారు. నిర్లక్ష్యం వల్లే ఒక నిండు ప్రాణం పోయిందని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గంగారపు శివారెడ్డి (పాత చిత్రం)

అక్రమాలపై విచారణ జరపండి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వంలో నాడు-నేడు కార్యక్రమాల్లో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి చేసిన అవినీతిపై ప్రభుత్వం విచారణ జరపాలని విజయవాడకు చెందిన గుత్తేదారు కంచి రాజేష్ కోరారు. సోమవారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 2020 సంవత్సరంలో నాడు-నేడు పనుల కోసం గ్రీన్ చాక్ బోర్డు మెటీరియల్ సరఫరా చేసేందుకు సుదర్శన్‌రెడ్డితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. దీని నిమిత్తం పలు దఫాలుగా రూ.1.50 కోట్లు చెల్లించానని తెలిపారు. కానీ మెటీరియల్ సరఫరా చేయలేదని, తాను ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వలేదని వాపోయారు. వైకాపాను వీడిన సుదర్శనరెడ్డి.. ప్రస్తుతం తెదేపాలో ఉన్నారని, డబ్బుల గురించి అడిగితే బెదిరిస్తున్నారని రాజేష్ ఆరోపించారు. దీనిపై ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఈ ఏడాది జనవరిలో ఫిర్యాదు చేశానని చెప్పారు. ఇది సివిల్ ఫిర్యాదు అని చెప్పి.. కేసు నమోదు చేయలేదన్నారు. తనకు న్యాయం చేయాలని రాజేష్ విజ్ఞప్తి చేశారు.

క్రీడా పాఠశాల జిల్లా స్థాయి ఎంపికలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల ప్రవేశానికి సంబంధించి జిల్లా స్థాయి ఎంపికలను ఈ నెల 9, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ నెల 9న 4వ తరగతి ప్రవేశానికి, 10న 5వ తరగతి ప్రవేశానికి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నామన్నారు. ఎంపికలకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్, 2 పాస్‌పోర్టు ఫొటోలతో హాజరు కావాలన్నారు. ప్రాథమిక వైద్య పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే జిల్లా స్థాయి ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు.

ఉత్సాహంగా అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ అంతర్ జిల్లా మూడు రోజుల క్రికెట్ పోటీల్లో చిత్తూరు బ్యాటరు అభిషేక్‌రెడ్డి (227) అసాధారణ బ్యాటింగ్‌తో అందరిని ఆకట్టుకున్నాడు. సోమవారం అనంత క్రికెట్ మైదానంలో ఉదయం 316/3 ఓవర్‌నైట్ స్కోరుతో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన చిత్తూరు జట్టు 115.2 ఓవర్లలో 455 పరుగులకు ఆలౌటైంది. ★ మరో పోటీలో నెల్లూరు జట్టు కడప జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 44 పరుగుల ఆధిక్యత సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 47/1తో మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన కడప జట్టు 244 పరుగులకే కుప్పకూలింది. ఆరిఫ్‌బాషా (62), టి.వంశీకృష్ణ (54) బ్యాటింగ్‌లో రాణించినా జట్టుకు ఆధిక్యత సాధించలేకపోయారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లకు 179 పరుగులు చేసింది. రేవంత్ రెడ్డి(76) చక్కటి బ్యాటింగ్‌తో అలరించాడు. మూడో రౌండు మ్యాచ్‌లు రెండు డ్రా దిశగానే పయనిస్తున్నాయి.

14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ముగ్గురు నిందితుల అరెస్టు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం శివారు కమ్మపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఆదివారం వేకువన సిద్దవటం అటవీ అధికారులు దాడులు చేసి ముగ్గురు నిందితులతో పాటు ఎర్రచందనం దుంగలు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిద్దవటంలోని అటవీక్షేత్రాధికారి కార్యాలయంలో సోమవారం అటవీ అధికారిణి కళావతి మాట్లాడుతూ.. పక్కా సమాచారం మేరకు కమ్మపాలెం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ముగ్గురు వ్యక్తులు, ఒక కారు అనుమానాస్పదంగా కన్పించడంతో అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. ఆలయం సమీపంలోని 14 ఎర్రచందనం దుంగలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన దుంగలు 193 కిలోలు ఉండగా వాటి విలువ రూ.56 వేలు ఉంటుందని వివరించారు. నిందితులను కడపలోని రామాంజనేయపురానికి చెందిన సన్నపూరి వెంకటరమణ, కొప్పర్తికి చెందిన సుబ్బారెడ్డి, సిద్దవటం మండలం కమ్మపాలెం గ్రామానికి చెందిన శిఖామణిగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి తిరుపతిలోని న్యాయస్థానానికి తరలించారు. మరో నిందితుడు పరారవ్వగా అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఉప అటవీ అధికారి ఓబులేసు, బీటు, సహాయ బీటు అధికారులు పెంచలరెడ్డి, మధు, హైమావతి, స్ట్రైకింగ్ ఫోర్స్ సాహెబ్‌బావి బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన దుంగలు, నిందితులతో అటవీ అధికారులు

గంజాయి విక్రయిస్తున్న దంపతుల అరెస్టు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప రిమ్స్ ఠాణా పరిధిలో గంజాయి విక్రయిస్తున్న దంపతులను పోలీసులు అరెస్టు చేసి 2.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. నిందితులను సోమవారం రిమ్స్ ఠాణా ఆవరణలో మీడియా ఎదుట హాజరుపరిచారు. కడప శాస్త్రినగర్‌కు చెందిన చెన్నుబోయిన రాము, వాసుపల్లి భారతి దంపతులు. సోమవారం పోలీసులు నగర శివారులోని నగరవనం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వెళుతున్న రాము, భారతిని ఆపి తనిఖీ చేయడగా 2.8 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించేందుకు వీరిద్దరూ మహేష్ అనే వ్యక్తి నుంచి గంజాయి తెప్పించుకుని నగరంలో విక్రయిస్తుండేవారని పేర్కొన్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి గంజాయితో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉద్రిక్తతకు దారితీసిన అదృశ్యం

- పోలీసు ఠాణా ఎదుట బంధువుల బైఠాయింపు
- స్టేషన్‌పై దాడి.. కుర్చీలు ధ్వంసం
- 4 గంటల తర్వాత ఆచూకీ లభ్యం

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లెలో బాలిక (17) అదృశ్యం సోమవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. బాలిక ఆచూకీ తెలపాలంటూ తల్లిదండ్రులు, బంధువులు, వారి మద్దతుదారులు వేంపల్లె పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. అదృశ్యం కారణమైన యువకులను తమకు అప్పగించాలని డిమాండు చేస్తూ స్టేషన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అడ్డుకున్న పోలీసులపైకి ఇటుక పెళ్లలు, వాటర్ ప్యాకెట్లు విసిరారు. స్టేషన్ కిటికీల అద్దాలు.. బయట ఉన్న కుర్చీలు విరగ్గొట్టారు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని వారితో మాట్లాడి శాంతింపజేసేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. చివరికి బాలిక ఆచూకీ లభ్యం కావడంతో ఆందోళనకారులు శాంతించారు. మండలానికి చెందిన బాలిక తమ గ్రామ సమీపాన గొర్రెలు మేపేందుకు వెళ్లింది. ఓ రైతు బాలిక తండ్రికి ఫోన్ చేసి తన పొలంలో గొర్రెలు పడ్డాయని, నీ కుమార్తె కనిపించడం లేదని, గొర్రెల వద్ద కొందరు యువకులు కనిపించారని తెలిపారు. వెంటనే బాలిక తండ్రి అక్కడికి చేరుకుని.. ఓ యువకుడిని నిలదీశాడు. తనతోపాటు ఐదుగురు వచ్చారని చెప్పడంతో.. అతన్ని తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. విచారణ చేపట్టిన సీఐ నరసింహులు మరో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో ఓ వీడియో బహిర్గతమై వైరల్ అయింది. ఈ విషయం తెలియడంతో బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. తెదేపా, భాజపా, వైకాపా శ్రేణులు పెద్ద ఎత్తున స్టేషన్‌కు చేరుకుని బాలిక కుటుంబ సభ్యులకు మద్దతుగా నిలిచారు. ఆ యువకులను తమకు అప్పగించాలని డిమాండు చేశారు. పోలీసు బలగాలు వేంపల్లెకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో కొండల్లో నుంచి బాలిక సమీప పొలాల్లోని గొర్రెల కాపరి వద్దకు వచ్చింది. దీంతో వారు చరవాణిలో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, సీఐ నరసింహులు బాలికను తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో సమస్య సర్దుమణిగింది.

పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

వేర్వేరు కారణాలతో ముగ్గురి బలవన్మరణం

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అప్పుల బాధతో ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లెవాసి మూలింటి నాగార్జున (35) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. నాగార్జున, గురులక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. భార్త హెయిర్ కటింగ్ దుకాణం నిర్వహిస్తుండగా భార్య కూలీ పనులు చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి అప్పులు చేశారు. వాటిని తీర్చకపోవడంతో రుణదాతల నుంచి ఒత్తిడి పెరిగింది. సోమవారం కుమార్తెలు పాఠశాలకు వెళ్లగా, భార్య పనికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న నాగార్జున ఉరి వేసుకున్నారు. ఇంటికి చేరుకున్న భార్య తలుపు తెరుచుకోకపోవడంతో కిటికీలో నుంచి చూడగా భర్త ఉరి వేసుకుని కనిపించారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో కన్నీటిపర్యంతమయ్యారు.

ప్రొద్దుటూరులో వృద్ధురాలు...

ప్రొద్దుటూరు నేరవార్తలు : విషద్రావణం తాగి ప్రొద్దుటూరు పట్టణం ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన జీవరత్నమ్మ (72) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. పుల్లయ్య, జీవరత్నమ్మ దంపతులు మేకలు మేపుతూ ఉండేవారు. వాటిని అమ్మగా అందులో వచ్చిన డబ్బులు ఖర్చుపెట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భర్త పుల్లయ్య నిత్యం మద్యం తాగేవారు. భార్య వద్దని చెప్పినా మానుకోలేదు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగేది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కూడా గొడవ జరగ్గా జీవరత్నమ్మ విషద్రావణం తాగారు. ఇది గమనించిన ఆమె కుమారులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆపై మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు.

విష ద్రావణం తాగి యువకుడు...

నందలూరు : వెంకటాద్రిపురం ఎస్టీ కాలనీకి చెందిన నారాయణ (25) అనే యువకుడు కుటుంబ కలహాలతో ఆదివారం విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన మునెమ్మతో వివాహమైంది. కడప సమీపంలోని ఇటుకల బట్టీలో కూలి పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మద్యం తాగి ఇంటికి వెళ్లడంతో భార్య గొడవ పడింది. దీంతో మనస్తాపానికి గురై విష ద్రావణం తాగారు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

వేధింపులు తాళలేక ఉపాధ్యాయిని ఆత్మహత్యాయత్నం

మైదుకూరు, న్యూస్‌టుడే : వనిపెంటలోని మహాత్మా జ్యోతిబా పులే బాలికల పాఠశాల ప్రిన్సిపల్ వేధింపులు భరించలేక బయాలజీ ఉపాధ్యాయురాలు జ్యోతి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సోమవారం విధులకు హాజరైన ఆమె నిద్రమాత్రలు మింగారు. గుర్తించిన తోటి సిబ్బంది అప్రమత్తమై చికిత్స కోసం కడపలోని రిమ్స్‌కు తరలించారు. జూన్ నెల నుంచి ప్రిన్సిపల్ వేధింపులకు గురి చేస్తున్నారని జ్యోతి రాసిన లేఖ వెలుగులోకి వచ్చింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. తనకు మూడు నెలల బిడ్డ ఉండటంతో అన్ని తరగతులకు వెళ్లలేకపోతున్నాని.. దీంతో పాఠాలు సరిగా చెప్పట్లేదని తనను వేధింపులకు గురి చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. పాఠశాల విషయాలను బయటకు చెబుతున్నానని ఎలాంటి ఆధారాలు లేకుండా ఉపాధ్యాయుల ముందు అవమానించారని అందులో ప్రస్తావించారు. చాలా అవమానాలకు గురై ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నట్లు తెలిపారు. తన మరణం తర్వాత తన పిల్లల పూర్తి బాధ్యత ప్రిన్సిపాల్‌దే అంటూ లేఖలో పేర్కొన్నారు. ప్రిన్సిపల్ నిర్మలను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆమె తనకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించలేదని తెలిపారు. సంతకాలు పెట్టాలని టీచింగ్ డైరీ, లెసన్ ప్లాన్ తన వద్దకు తీసుకురాగా పరిశీలించినట్లు పేర్కొన్నారు. సెలవురోజు, తరగతికి రానిరోజు తరగతికి వెళ్లినట్లు రాసుకు రావడంతో ప్రశ్నించి వివరణ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. సీఐ రమణారెడ్డిని ప్రశ్నించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

JOBS

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్/ ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బులతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం Cell: 7382114647.

Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph No. 91333 99257, 97033 33378.

FREE JOBS: తిరుపతిలోని మా సంస్థ కొరకు, కంప్యూటర్ ఆపరేటర్లు, HR Recruiters, Counsellors, Tele Callers, BDMలు కావలెను. జీ: 15-35 వేలు. # ✆ 99906 78818.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Shaik Jafarvali (Old Name), S/o, S.Babasab, R/o D.No: 4-6-235, New Colony, Yerraguntla-516309, Kadapa, Andhra Pradesh. I Changed my name to Shaik Jafarvalli. Henceforth, I will be known as Shaik Jafarvalli.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు నరుకుల అమ్మకం లేదా అందించను సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజలు నుండి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే

Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

ఆదమరిస్తే... ఆసుపత్రికే

జమ్మలమడుగు - తాడిపత్రి ప్రధాన రహదారిలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న సందులో కాలువపై సిమెంటుదారి పగిలిపోవడంతో గొయ్యి ప్రమాదకరంగా మారింది. రాత్రివేళ అదుపు తప్పి అటుగా రాకపోకలు సాగిస్తే ప్రమాదం తప్పదు. కొన్ని నెలల నుంచి సమస్య ఇలాగే ఉందని, ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. నిత్యం పాదచారులు, రోగులు, ప్రజలు సంచరించే చోట ప్రమాదకరంగా ఉన్న గొయ్యిను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

ప్రొద్దుటూరు

•ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

మానవత్వం చాటుకున్న పోలీసులు

జమ్మలమడుగు: ముద్దనూరు రోడ్డులోని నాసుబాల పంక్షన్ హాలు వద్ద బాబయ్య అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడగా డీఎస్పీ వెంకటేశ్వరరావు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం గండికోట నుంచి తిరిగి వస్తున్న డీఎస్పీ గమనించి ఆయన వాహనంలోనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె గ్రామం నుంచి జమ్మలమడుగుకు వస్తుండగా బాబయ్యను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయిందని డీఎస్పీ తెలుసుకున్నారు. ఆ గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చెప్పారు.

ఆసుపత్రికి చేర్చి సమీక్షిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
ప్రొద్దుటూరు: 9966534931
జమ్మలమడుగు: 9494294241
మైదుకూరు: 8008573447
బద్వేలు గ్రామీణ: 8008573493

?: పోరుమామిళ్ల ప్రధాన రహదారిలో రోడ్డు పక్కనే చెత్త చెదారం, వ్యర్థాలు వేయడంతో అపరిశుభ్రత చోటు చేసుకుంది. - మహబూబ్‌బాషా, కలసపాడు

✓: చెత్త చెదారం తొలగించి, శుభ్రం చేయిస్తాం. - లక్ష్మీస్వజన, పంచాయతీ కార్యదర్శి, - న్యూస్‌టుడే, కలసపాడు

?: అల్లాడుపల్లె పంచాయతీ విజయనగరం కాలనీలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ తీగలు అమర్చకపోవడంతో నివాస గృహాలకు కరెంటు షాక్ కొడుతోంది. సమస్యను విద్యుత్తు శాఖ సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదు. - జెర్మియా, స్థానికుడు

✓: నియంత్రిక వద్ద ఎర్త్ తీగలు అమర్చేలా సిబ్బందికి ఆదేశిస్తాం. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. - శ్రీకాంత్, డీఈఈ విద్యుత్తు శాఖ, - న్యూస్‌టుడే, చాపాడు

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం... రహదారులు అధ్వానం

❖ దెబ్బతిన్న కాలువలతో అవస్థలు ❖ ఇరుకుగా మారిన పట్టణ వీధులు

సచివాలయం కార్యాలయం వీధిలో మురుగు కాలువ దుస్థితి

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

బంగారం, వస్త్ర వ్యాపారాలకు నిలయం ప్రొద్దుటూరు పట్టణం. రాష్ట్ర నలుమూలల నుంచి ఇక్కడికి కొనుగోలుదారులు వస్తుంటారు. నగరపాలక సంస్థ స్థాయికి పరుగులు తీస్తున్న ఈ పురపాలక సంఘ పరిధిలోని వీధులు అసౌకర్యాలకు నిలయంగా మారుతోంది. ప్రధానంగా 12వ సచివాలయ పరిధిలో దెబ్బతిన్న మురుగుకాలువలు, రోడ్డు విస్తరణ ప్రధాన సమస్యగా స్థానికులను వేధిస్తోంది. శ్రీరాములపేట, సచివాలయం వీధి, శివాజీవీధి, సార్వకట్టవీధి, గిడ్డంగివీధి, స్వయంసేవక్‌రోడ్డులతో మరో మూడు వీధులు ఉన్నాయి. 3 కిమీల రోడ్డు ఉండగా 928 ఇళ్లు, 2,900 మంది జనాభా ఉంది. సచివాలయం వీధిలో కాలువలు రోడ్డుకు సమాంతరంగా ఉండి అస్తవ్యస్తంగా మారాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగంతా రహదారులపై పారుతోంది. ఈ దుర్గంధ భరించలేక ప్రజలు ముక్కులు మూసుకుని రాకపోకలు చేస్తున్నారు. ఇక అందులోనే నడవాలంటే ఎంత నరకమో తలచుకుంటేనే ఎవరికైనా ఒళ్లు గగుర్పాటుకు గురవుతుంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.13 లక్షలతో డ్రైనేజీల నిర్మాణానికి నిధులు కేటాయించగా ఆ పనులను గుత్తేదారు చేయలేదు. దీంతో సచివాలయ ఇంజినీర్ నోటీసులను జారీ చేసినా ప్రయోజనం కనిపించలేదు. శ్రీరాములపేట వీధిలో ఏటీఎం కేంద్రం నుంచి గాంధీరోడ్డు వైపునకు వెళ్లే దారంతా ఆక్రమణకు గురై ఇరుకువీధిగా మారడంతో వాహనాల రద్దీగా ఉంటోంది.

ఎత్తుగా మారిన రోడ్డు

స్వయంసేవక్‌రోడ్డులోని గృహాల ముందు పొరుగు ఇళ్ల నుంచి నీరు రాకుండా ఉండేందుకు సిమెంటు ప్లాస్టరింగ్ చేయడం వలన రోడ్డు ఎత్తుగా మారింది. దీని వలన వృద్ధులు రాత్రి వేళ ప్రమాదాలకు గురవుతున్నారు. గిడ్డంగివీధిలోని రోడ్డు కూడా కుదించుకుపోయింది. వార్డు సచివాలయ ప్రణాళిక కార్యదర్శులు ఆక్రమణలను ముందుగానే అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చెరలో వరద కాలువ

స్వయంసేవక్‌రోడ్డులో ఇళ్ల మధ్యన ప్రొద్దుటూరు వరదకాలువ ఆక్రమణకు గురైంది. 50 అడుగులకు పైగా ఉన్న కాలువ ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద మురుగుకాలువగా మారింది. ఈ కాలువ ఆక్రమణకు గురవడంతో చిన్నపాటి వర్షానికే మురుగంతా ఇళ్ల ముందుకు చేరుతోంది.

ఆక్రమణకు గురైన ప్రొద్దుటూరు వరద కాలువ

ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని పూజలు

ప్రొద్దుటూరు గ్రామీణ: తాళ్లమాపురంలోని ప్రసన్న రామచంద్ర ఆలయంలో ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి ఆరోగ్యపరంగా త్వరగా కొలుకోవాలని జనసేన, తెదేపా నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు మంచి శివకుమార్, శివప్రసాదు యాదవ్, పాలకొండారెడ్డి, రామచంద్రారెడ్డి, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో వినతుల స్వీకరణ

ప్రొద్దుటూరు గ్రామీణ: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన వినతులను డీటీ అజయ్‌బాబు స్వీకరించారు. కరెంటు బిల్లులపై మోపుతున్న అదనపు ఛార్జీలను కూటమి ప్రభుత్వం భరించాలని స్వర్ణ భారత్ ప్రజాపార్టీ అధ్యక్షుడు దశరథ రామయ్య డిమాండు చేశారు. అమృతానగర్‌లో ఖాళీగా ఉన్న స్థలాలకు దరఖాస్తుపెట్టుకున్న అర్హులైన లబ్ధిదారులకు 15 రోజుల్లోగా మంజూరు చేయాలని ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి కోరారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం

బద్వేలు గ్రామీణ: స్థానిక ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణంలో బద్వేలు ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. సోమవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు బోలా నారాయణ, అధ్యక్షుడు రాజారెడ్డి కలిసి యూనియన్ తరపున ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయం రూ.15 వేలు, తృతీయ రూ.10 వేలు అందజేశారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత

కల్లూరులోని పెన్నాలో గుంతలు తవ్వి అడ్డుపెట్టిన రాతిదూలం

ప్రొద్దుటూరు గ్రామీణ: కల్లూరులోని పెన్నా పరీవాహకంలో ఎట్ట కేలకు వాహనాలు వెళ్లకుండా ప్రధాన మార్గంలో గుంతలు తవ్వడంతో పాటు రాతి దూలాలను అడ్డుపెట్టారు. దీని కోసం ఇద్దరు వీఆర్‌ఏలతో నిఘా ఏర్పాటు చేశారు. రేగులపల్లెలో ఉదయం నుంచి సాయంత్రం తర్వాత పెన్నాలోకి ఇసుక ట్రాక్టర్లకు అనుమతి లేకుండా గ్రామస్థులు ఇనుప గేటు ఏర్పాటుతో కట్టడి చేస్తున్నారు.

విద్యుత్తుశాఖకు జమ కాని రూ.18 లక్షలు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక మైదుకూరు రోడ్డులోని ఆర్టీసీ బస్టాండు నుంచి హనుమాన్ కూడలి వరకు రహదారి విస్తరణలో భాగంగా రూ.1.20 కోట్లతో కాంక్రీటు కాలువల నిర్మాణాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు చేపట్టారు. దీంతో అడ్డుగా ఉన్న కరెంటు స్తంభాలు, నియంత్రికలను తొలగించి పక్కనే ఏర్పాటుకు రూ.18 లక్షల నిధులను విద్యుత్తుశాఖకు రోడ్లు, భవనాల అధికారులు జమ చేయలేదు. దీంతో 790 మీటర్ల కాలువ నిర్మాణం చేయగా మధ్యలో 4 చోట్ల నియంత్రికలు తొలగించని కారణంగా మిగిలిన 80 మీటర్ల వరకు వాటి పనులను నిలిపేశారు. ఫలితంగా నాలుగైదు నెలలుగా అనుసంధానం కాని కాలువలో మురుగుపారుదల లేక ప్రధాన రహదారి పక్కనే పాచిపట్టిన మడుగులను తలపిస్తున్నాయి. దీనిపై దక్షిణ విభాగం ఎస్పీడీసీఎల్ ఏఈ లక్ష్మీనారాయణబాబు వివరణ కోరగా రూ.18 లక్షలు ర. భ అధికారులు జమ చేస్తే స్తంభాలు, నియంత్రికలు తొలగించి పక్కన ఏర్పాటు చేస్తామన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం

మైదుకూరు పట్టణం ఆకులవీధిలో మహిళలతో చర్చిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే : వైకాపాలాగా రాక్షసపాలన కాకుండా ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని కాంక్షిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ డబ్బుతో జీతాలు తీసుకుంటూ అసెంబ్లీ సమావేశాలకు రాకుండా పారిపోయిన వైకాపా ఎమ్మెల్యేలు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని తప్పుపట్టారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం మైదుకూరు పట్టణంలోని ఆకుల వీధిలో నిర్వహించిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష హోదా దక్కని జగన్ మోహన్‌రెడ్డికి మాట్లాడే అర్హత లేదన్నారు. తిరస్కరించి పంపినా పాదయాత్ర చేస్తాననడంపై ప్రజలు ఏవగించుకుంటున్నారని పేర్కొన్నారు. గంజాయి విక్రయించిన వారిని రౌడీలను పరామర్శించడానికి వెళ్లి మత విద్వేషాలను రెచ్చగొడుతూ పరిపాలనకు అడ్డంకులు కల్పిస్తూ దౌర్జన్యాలకు దిగాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల వరకే రాజకీయాలని అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చేస్తామని వివరించారు. అంతకుముందు ఆకులవీధిలో కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేసీ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ డి.గురివిరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ రవీంద్ర, వార్డు కౌన్సిలర్ రాయచోటి సులోచన, పార్టీ నాయకులు ఆకుల కృష్ణ, దాసరిబాబు, ఆర్.శ్రీనివాసులు, ధనపాల జగన్, తదితరులు పాల్గొన్నారు. జమ్మలమడుగులోని కన్నెలూరులో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డితో కలిసి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను పలకరించి కరపత్రాలను అందజేసి వాటి గురించి వివరించారు. ఏమ్మా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, తల్లికి వందనం డబ్బులు జమ అయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, జంబాపురం రమణారెడ్డి, నాగేశ్వరరెడ్డి, గండికోట సర్పంచ్ ఈశ్వర్, కన్నెలూరు కౌన్సిలరు శివరామలింగారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రొద్దుటూరు పురపాలక 39వ వార్డులో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి సోమవారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి పాలనపై చర్చించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అందరికి కరపత్రాలు పంచిపెట్టారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు పట్టణం, బద్వేలు గ్రామీణ: పురపాలక కార్మికుల పెండింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక పురపాలక కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ కార్మికులకు ట్రేడ్ల వారీగా వేతనాలు చెల్లింపు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పురపాలక ఒప్పంద పారిశుద్ధ్య ఇంజినీరింగ్ విభాగ కార్మికులకు సంక్షేమ పథకాలు యథావిధిగా అమలు చేయాలని కోతలను రద్దు చేయాలన్నారు.

గోడపత్రికల ఆవిష్కరణ

మైదుకూరు, న్యూస్‌టుడే : స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ద్వితీయ వార్షికోత్సవ రక్తదాన వారోత్సవాల గోడపత్రికలను సోమవారం రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆవిష్కరించారు. సంస్థల ప్రతినిధులు ములపాకు నాగేశ్వర్ రెడ్డి, ప్రసన్న, ఇమ్మిడిశెట్టి సతీష్‌బాబు, నియాజ్, భూమిరెడ్డి రవికల్యాణ్, జూటూరు విజయ్‌కుమార్, చంద్ర, వాగ్దానం శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసాలతో అధిక పాడి ఉత్పత్తి

ఖాజీపేట, న్యూస్‌టుడే: పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా స్థానిక మండలం కొత్తపేట గ్రామంలో అవగాహన కల్పించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శారదమ్మ మాట్లాడుతూ పాడి రైతులు మేలైన పశుగ్రాసాలను వాడితే అధిక పాల దిగుబడి సాధ్యమవుతుందన్నారు. మండల ఏడీ మురళి, పాడి రైతులు, పశు వైద్య సిబ్బంది.పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

దువ్వూరు, న్యూస్‌టుడే : కడప-కర్నూలు జాతీయ రహదారి పక్కన దువ్వూరు మండలం ఇడమడక గ్రామం వద్ద ఓ వ్యక్తి అక్రమంగా ప్రభుత్వ స్థలంలో నిర్వహిస్తున్న దాబాను సోమవారం రెవెన్యూ, పోలీసు అధికారులు తొలగించారు. జాతీయ రహదారి పక్కనే దాబా ఉండటంతో వాహనాలు నిలబడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

పరిహారానికి పట్టుబట్టిన నిర్వాసితులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: బెంగళూరు - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను సోమవారం భూ నిర్వాసితులు అడ్డుకున్నారు. తిప్పలూరు వద్ద 13 మంది తమ స్థలాన్ని కోల్పోతున్నారు. వారికి తమ ఖాతాలో డబ్బులు జమ కాకపోవడంతో పనులను అడ్డుకున్నారు. దీంతో రెవెన్యూ, పోలీసులు అధికారులు అక్కడి వెళ్లి నెల రోజుల వ్యవధిలో డబ్బులు జమ కావడం జరుగుతుందని తెలపడంతో భూనిర్వాసితులు అక్కడి నుంచి వెళ్లి పోవడం జరిగింది.

బోగస్ పత్రాలతో పింఛన్లు

ఎర్రగుంట్ల: హనుమనగుత్తి పంచాయతీ పరిధిలో దివ్యాంగురాలిగా బోగస్ పత్రాలు సృష్టించి పింఛనులు పొందుతుండటం చర్చనీయాంశంగా మారింది. దివ్యాంగురాలు పింఛను తీసుకుంటూ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీ పనులు చేస్తున్నట్లు డబ్బులు తీసుకోవడం గమనార్హం. అదే విధంగా మరో మహిళ పక్షపాతం ఉన్నట్లు నకిలీ పత్రాలతో పింఛను పొందుతూ ఉపాధి హామీ పథకంలో కూలి డబ్బులు తీసుకోవడం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై ఎంపీడీవో వెంకటరమణయ్యను వివరణ కోరగా వైద్యుల నుంచి పత్రాల ఆధారంగా పింఛను పొందుతున్నట్లు వివరించారు.

CHANGE OF NAME
I, BELLEKALLU DIVYA TEJA (Old Name), S/o BELLEKALLU VENUGOPAL, R/at flat No. 301, Mirai Homes, Sankalp, Mayuri Nagar, Miyapur, Ranga Reddy Dist, Telangana. I have changed my Name to BELLEKALLU RANGANATHA DIVYA TEJA (New Name). Henceforth, I will be known as BELLEKALLU RANGANATHA DIVYA TEJA for all Purposes.

కానరాని వానజాడ.. రైతుల్లో దడ

● నిరాశ నింపుతున్న నైరుతి

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే కేరళను తాకడంతో భారీ వర్షాలు కురుస్తాయని రైతులు ఆనందపడ్డారు. అనుకున్న విధంగా అడపాదడపా కొన్ని చోట్ల వానలు కురిశాయి. ఆ వానలకు కొన్ని మండలాల్లో మినుము, పత్తి పంటలు వేయగా మరికొన్ని చోట్ల కంది వేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. సరైన వానలు లేక ఖరీఫ్ సాగుపై రైతన్నకు ఆశలు సన్నగిల్లుతున్నాయి. జమ్మలమడుగు మండలం పొన్నతోట, ఎస్.ఉప్పలపాడులో పత్తి సాగు చేయగా కంది వేసేందుకు సిద్ధమవుతున్నారు. గండికోట కొట్టాలపల్లెలో గతేడాది సుమారు 600 ఎకరాల్లో కంది వేయగా ఈ సారి కూడా అదే పంట వేసేందుకు సమాయత్తమవుతున్నారు.

దొడియం గ్రామంలో ఎండుముఖం పట్టిన మినుము

అడుగంటుతున్న భూగర్భ జలాలు

గండికోటలో భూగర్భ జలాలు అడుగంటడంతో నిమ్మ తోటలున్న రైతులు ఆందోళన పడుతున్నారు. మైలవరం మండలంలో నెలన్నర రోజుల నుంచి మినుము పంటను విస్తారంగా సాగుచేశారు. దొడియం, రామచంద్రాయపల్లె, నక్కోనిపల్లె, మద్దిరెడ్డిపల్లె, తొర్రివేముల, నార్జంపల్లె తదితర గ్రామాల్లో సాగు చేయగా వానలేక కొన్నిచోట్ల ఎండుముఖం పట్టిందని రైతులు వాపోతున్నారు. తొర్రివేముల, దొడియం, నక్కోనిపల్లె, మైలవరం, బెస్తవేముల, చిన్నవెంతుర్ల తదితర గ్రామాల్లో చీనీ తోటలు ఉండగా భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి తడులు ఇవ్వలేక పోతున్నామని చెబుతున్నారు. పెద్దముడియం మండలంలోని జంగాలపల్లె, సుద్దపల్లె, కొట్టాలపల్లె తదితర గ్రామాల్లో మొక్కజొన్న, బెండ, మినుము పంటలు సాగులో ఉన్నాయి. వర్షాల ఆలస్యం కారణంగా సాగు విస్తీర్ణం తగ్గే సూచనలు ఉన్నాయని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాను రెండు ఎకరాల్లో మినుము పంట వేశానని, రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు. భూగర్భ జలాలు అడుగంటడంతో అర ఎకరం నీరు పారాలంటే కనీసం పది రోజుల సమయం పడుతోందని మైలవరం మండలం దొడియం గ్రామానికి చెందిన రైతు భాస్కర్‌రెడ్డి చెబుతున్నారు.

ఎస్.ఉప్పలపాడు శివారులో పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతన్న

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

చాపాడు మండలం కేతవరంలో పీర్ల ఊరేగింపు

చాపాడు, న్యూస్‌టుడే : మొహర్రం ప్రార్థనల్లో భాగంగా చాపాడు మండలం కేతవరంలో కుల మతాలకతీతంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. సోమవారం సాయంత్రం గ్రామంలో భక్తులు గుండం దాటుతూ రంగులు చల్లుకుంటూ పీర్లను జలధి కోసం కుందూ నదికి తీసుకెళ్లారు.

కొండాపురం: కొండాపురంలో కొలువుదీరిన పీర్లు సోమవారం జలధికి తరలివెళ్లాయి. పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్ల స్వాములను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని చదివింపులు, ప్రార్థనలు చేశారు. తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం జనసందోహం నడుమ సంప్రదాయబద్ధంగా డప్పు, వాయిద్యాల నడుమ పీర్లను జలధికి తరలించారు.

కొండాపురంలో జలధికి తరలుతున్న పీర్లు

భక్తులకు అన్నదానం

చాపాడు, న్యూస్‌టుడే : అల్లాడుపల్లె భద్రకాళిమాత సమేత వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. సంజీవరెడ్డిపల్లెకు చెందిన జె.వీరారెడ్డి అన్నప్రసాద వితరణకు రూ.10 వేలు ఇచ్చినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ వీరనారాయణ, ఈఓ శ్రీనివాసులు తెలిపారు. తెదేపా బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేకల బాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెదేపా నాయకుడి మృతికి నివాళి

కలసపాడు, న్యూస్‌టుడే : మండలంలోని చెన్నారెడ్డిపల్లెకు చెందిన తెదేపా నాయకుడు ముత్తుముల నారాయణరెడ్డి (55) సోమవారం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని చెన్నారెడ్డిపల్లెకు తరలించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ రంతూ, తెదేపా మండల అధ్యక్షుడు జి.వెంకటరామిరెడ్డి, పలువురు నాయకులు నారాయణరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

వేడుకలు జరుపుకొంటున్న నాయకులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంతోపాటు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను జమ్మలమడుగు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు లక్ష్మయ్య సతీమణి సుబ్బలక్ష్మి హాజరై స్థానిక పాత బస్టాండ్‌లో దండోరా జెండాను ఎగురవేశారు. కేకు కోసి చేసి మిఠాయిలను పంచిపెట్టారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విజయసారధి మందకృష్ణ సుదీర్ఘ పోరాట ఫలితంతో తమ కల సాకారమైందన్నారు. నాయకులు శింగరయ్య, నరసింహులు, నల్లప్ప, ఓబులేసు, వెంకటసుబ్బయ్య, బాల ఓబయ్య, కొండయ్య పాల్గొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో మేకల ఆంజనేయులు ఆధ్వర్యంలో వేడుకలను జరుపుకొన్నారు.

విద్యార్థుల వసతి పట్టదా!

వసతిగృహం వద్ద ఏబీవీపీ నాయకులు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: స్థానిక పొట్టిపాడు రోడ్డులో మూడేళ్ల కిందట మూసివేసిన కళాశాలల బాలుర ప్రభుత్వ వసతిగృహాన్ని త్వరగా బాగు చేయాలని ఏబీవీపీ నాయకుడు శరణ్‌కుమార్, శవనారాయణ, శ్రావణ్, మహేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం వసతిగృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతిగృహం అధ్వానంగా ఉండటంతో అధికారులు మూడేళ్ల కిందట మూసివేశారన్నారు. దీంతో ఆ హాస్టల్ విద్యార్థులకు పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థుల వసతిగృహంలో వసతి కల్పించారని, అందరూ ఒకేచోట ఉండటంతో అక్కడ ఇబ్బందులు ఎదురౌతున్నాయని తెలిపారు. ఏళ్లు గడుస్తున్నా వసతిగృహాన్ని ఇప్పటికీ బాగు చేయలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, సుదర్శన్, తరుణ్, చరణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని తెదేపా యువనాయకుడు రమణ అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ పతాకాన్ని ఎగురవేశారు. ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ అభిలాష్,నాయకులు రమణ, కార్తీక్, హర్ష, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు ఢీకొని కానిస్టేబుల్‌కు గాయాలు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు-దువ్వూరు మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దువ్వూరు కానిస్టేబుల్ ఓబులేసు గాయపడ్డారు. కానిస్టేబుల్ ఓబులేసు ప్రొద్దుటూరు పట్టణంలో నివాసం ఉంటున్నారు. విధులు ముగించుకుని కారులో ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యలో వాహనం ఆగిపోయింది. దీంతో కారు దిగి నిల్చొని ఉండగా అటువైపు నుంచి వచ్చిన మరోకారు ఢీ కొట్టడంతో గాయాలు అయ్యాయి. చికిత్స కోసం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు.

ముగ్గురి అరెస్టు

కలసపాడు: మండలంలోని ఎగువరామాపురంలో సోమవారం ఎస్ఐ తిమోతి, పోలీసులు మూడు మద్యం గొలుసు దుకాణాలపై దాడులు నిర్వహించారు. 43 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని బి.సుబ్బరాయుడు, బి.వెంకటరత్నంతోపాటు మరో మహిళను అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. మండలంలో ఎవరైనా మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు.

జూదరులు... : కలసపాడు, న్యూస్‌టుడే: రెడ్డిపల్లె సమీపంలో మేకలకుంట కంప చెట్లలో జూదం ఆడుతున్న చెన్నారెడ్డి, పుష్పరాజ్, వెంకటసుబ్బయ్యలను అరెస్టు చేశామని ఎస్సై తిమోతి తెలిపారు. జూదరుల వద్ద నుంచి రూ.59 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

పల్లె ప్రగతికి మహిళా సర్పంచులు మమేకం కావాలి

బద్వేలు: గ్రామీణ పేదల అభ్యున్నతిలో మహిళా సర్పంచులు మమేకం కావాలని బద్వేలు డివిజనల్ అభివృద్ధి అధికారి వెంకటశేషయ్య సూచించారు. బద్వేలు మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం జరిగిన మహిళా సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన పేదలకు చేరేలా చూడాలని అన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఆదినారాయణ పాల్గొన్నారు.

హామీలను గాలికొదిలేసిన ప్రభుత్వం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని వైకాపా జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. సోమవారం జమ్మలమడుగులో జరిగిన వైకాపా నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ పింఛన్లు ఇస్తామని చెప్పి కొంతమందివి తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళితే వారు నిలదీస్తారని తెదేపా కార్యకర్తల ఇళ్లకు వెళ్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

కడప
• కడప • పులివెందుల • కమలాపురం

పరీక్షల నిర్వహణపై ఆగ్రహం

నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎఫ్ నాయకులు

మారుతీనగర్, న్యూస్‌టుడే : యోగివేమన విశ్వవిద్యాలయం అధికారులు బీఎడ్, ఎంఈడీ కళాశాలలో తరగతులు నిర్వహించకుండా పరీక్షలు నిర్వహించి కళాశాలలపై ఎందుకు అతి ప్రేమ చూపుతున్నారని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు డిమాండు చేశారు. స్థానిక వైవీయూ పరిపాలనా భవనం వద్ద సోమవారం ఆర్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఏళ్ల తరబడి తరగతులు నిర్వహించకున్నా వారికి మద్దతుగా ఉంటూ ప్రస్తుతం ఆందోళనలు చేస్తుంటే కమిటీల పేరుతో అధికారులు కొత్త నాటకానికి తెర తీస్తున్నారని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుడు సాయిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ప్రకాష్, నాయకులు పౌల్, జగన్‌నాయక్, హుస్సేన్ పాల్గొన్నారు.

సిబ్బందిని వేధిస్తున్న వైద్యాధికారులపై చర్యలకు వినతి

అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

కడప వైద్యం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా అవుకు మండలం ఆరుమళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కిందిస్థాయి సిబ్బందిని వేధిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాల జయవర్ధన్, ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ శంకర్ సోమవారం కడప నగరంలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో కార్యాలయ పర్యవేక్షక అధికారికి వినతిపత్రం అందించారు. సీహెచ్‌ఓ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలను మానసికంగా వేధిస్తున్నారని పేర్కొన్నారు. కింది స్థాయి ఉద్యోగులను బెదిరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పీహెచ్‌సీ మందులను బయటి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారని ఆరోపించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల: 8008573466, 8008573474
కమలాపురం : 8008573475

?: మండలంలోని ఆజాద్‌నగర్‌లో రోడ్డుపై చెత్త పేరుకుంది. వారాల తరబడి వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. - పుల్లయ్య, ఆజాద్‌నగర్
✓: వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - కుళాయి బాబు, ఎంపీడీఓ. - న్యూస్‌టుడే, చింతకొమ్మదిన్నె
?: కడప నగరంలోని కో-ఆపరేటివ్‌కాలనీలో సాయిబాబా ఆలయం వద్ద దీపాలు వెలగడంలేదు - ప్రశాంతి, స్థానికురాలు
✓: పరిశీలించి వీధి దీపాలు మరమ్మతులు చేయిస్తాం. - ధనలక్ష్మి, ఎంఈ, నగరపాలకసంస్థ - కడప, కలెక్టరేట్
?: మండల కేంద్రంలోని ఏవో కార్యాలయం సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. - సుబ్బారెడ్డి, స్థానికుడు
✓: చెత్తాచెదారం తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - రాజేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, పెండ్లిమర్రి

దూరం నుంచి వచ్చాం.. దయ చూపండి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : ఎన్నో ఆశలతో సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని జేసీ అదితిసింగ్ సూచించారు. సోమవారం కడప కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని, ఇందుకు ప్రాధాన్యంగా విచారణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్డీసీ వెంకటపతి, సహకారశాఖాధికారి వెంకటసుబ్బయ్య, డీఎస్ ఏవో రంగస్వామి, మెప్మా పీడీ కిరణ్‌కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కుటుంబ పోషణ భారంగా మారింది

నా భర్త రెండేళ్ల కిందట మృతి చెందారు. పలు దఫాలు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ మంజూరు కావడం లేదు. వితంతు, ఒంటరి మహిళ పింఛను కూడా రావడం లేదు. కుటుంబ పోషణ కష్టంగా మారింది. పింఛన్ మంజూరు చేయిస్తే ఆసరాగా ఉంటుంది.
-బుజ్జమ్మ, మైదుకూరు

పింఛను ఇప్పించండి సారూ..!

ఏడాది కిందట ఓ కాలు పూర్తిగా తొలగించారు. పింఛను కోసం స్థానిక అధికారులను కలిసి పట్టించుకోవడం లేదు. కనీసం ప్రయత్నాలు కూడా తీసుకోవడంలేదు. గతంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందిస్తే కచ్చితంగా పింఛను వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చాను. అధికారులు స్పందించిన పింఛను మంజూరు చేయించాలి.
- వెంకట సుబ్బారెడ్డి, కొప్పోలు, వల్లూరు

భూ ఆక్రమణకు యత్నిస్తున్నారు

నా పేరున 40 సెంట్ల భూమిని కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పొలంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ఇది మా భూమి అంటున్నారు. ఎప్పటి నుంచో మా ఆధీనంలో ఉన్న భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. సమస్య పరిష్కరించాలని అధికారుల వద్దకు వెళితే పట్టించుకోవడం లేదు.
-మార్తమ్మ, సున్నపురాళ్లపల్లె, జమ్మలమడుగు

ఆధార్ అనుసంధానం కాలేదు

ప్రభుత్వం నాకు డీకేటీ పట్టా భూమి ఇచ్చింది. దాన్ని ఆధార్ అనుసంధానం చేసేందుకు అధికారులను కలిస్తే మీ సేవకు వెళ్లాలని చెప్పారు. అక్కడికి వెళ్తే అనుసంధానం కావడం లేదు. దీంతో ప్రభుత్వ పథకాలకు అర్హత లేకుండా పోయింది. ఏడాదిగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదు.
- రాముసుబ్బన్న, ప్రొద్దుటూరు

పూర్వ విద్యార్థి దాతృత్వం

లింగాల, న్యూస్‌టుడే : మండలంలోని పెద్దకుడాల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, పారిశ్రామిక వేత్త రాజగోపాల్‌రెడ్డి పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష నగదును ఎంఈఓ రామకృష్ణయ్యకు సోమవారం అందజేశారు. ఇటీవల నిర్వహించిన పూర విద్యార్థుల సమ్మేళనంలో ఆర్థిక సాయం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. నగదును ఫర్నీచరు కోసం వినియోగిస్తామని ఎంఈఓ వెల్లడించారు. ఉపాధ్యాయ బృందం ఆయనను సన్మానించింది.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : పెండ్లిమర్రి, వెల్లటూరు గ్రామాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో మొహర్రాన్ని కుల మతాలకు అతీతంగా ప్రజలు జరుపుకొంటున్నారు. పీర్ల స్వాములను ఊరేగించారు. భక్తులు చెక్కర చదివింపులు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు.

పెండ్లిమర్రిలో పీర్ల ఊరేగింపు

మృత్యుంజయకుంట శివాలయం అభివృద్ధికి కృషి

మారుతీనగర్, న్యూస్‌టుడే : మృత్యుంజయకుంట శివాలయం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని ఎమ్మెల్యే మాధవి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మృత్యుంజయకుంట శివాలయంలోని పలు అభివృద్ధి పనులను దేవదాయశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సోమవారం వారు పరిశీలించారు. భక్తులకు అత్యాధునిక వసతులు, సౌకర్యాలను ఆలయంలో ఏర్పాటు చేస్తామన్నారు.

10 నుంచి రక్తదాన శిబిరాలు

కమలాపురం, న్యూస్‌టుడే : జిల్లా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న రక్తదాన వారోత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దారు శివరామిరెడ్డి కోరారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మదర్‌థెరిస్సా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్‌తో కలిసి తహసీల్దారు గోడపత్రాలు విడుదల చేశారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని మూలవంక విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. రాత్రి 8 నుంచి 12 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. ఊటుకూరు పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

నేటి నుంచి మల్టీడే క్రికెట్ పోటీలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : ఏసీఏ సౌత్‌జోన్ అండర్-19 పురుషుల మల్టీ డే క్రికెట్ పోటీల్లో భాగంగా వైఎస్సార్-ఏసీఏ స్టేడియంలో కడప-అనంతపురం క్రికెట్ జట్లు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు పోటీపడనున్నాయి. ఇప్పటికే అనంతపురం జట్టు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలుపొంది 20 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. కడప జట్టు ఆడిన మూడు మ్యాచ్‌లో ఒక విజయం, రెండు డ్రాలతో 12 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. నెల్లూరు 7, కర్నూలు 2, చిత్తూరు ఒక పాయింట్ మాత్రమే సాధించాయి. చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు కేఎస్ఆర్ఎం మైదానంలో ఏసీఏ అండర్-19 పురుషుల మల్టీ డే క్రికెట్ పోటీ జరగనుంది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

స్థానికులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత, చిత్రంలో ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని జిల్లా బాధ్య మంత్రి సవిత పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం కడప నగరంలోని నిరంజన్‌నగర్, ఫరీదానగర్‌లో ఎమ్మెల్యే మాధవి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో కలిసి మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. . సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పక్కా ప్రణాళికలతో కడప నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాకేశ్, తెదేపా నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, జిలానీబాషా, జయకుమార్, మలిరెడ్డిచంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండ్లిమర్రి: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మమ్ముసిద్ధుపల్లె, ఎం.కొత్తపల్లె గ్రామాల్లో సుపరి పరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. కొందరు స్థానికులు తమ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ప్రజల నుంచి వచ్చే వినతులు, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. తెదేపా మండల సమన్వయకర్త ఎస్వీ గంగిరెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ విజయసారథిరెడ్డి, మాజీ కార్పొరేటర్ విశ్వనాథరెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి

రామయ్య సేవలో విజిలెన్స్ ఏఎస్పీ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని కడప విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ జి.శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు. రాములోరి సన్నిధికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణ మూర్తులను దర్శించారు. అనంతరం ఆలయ చారిత్రక వైభవం, ప్రాశస్త్యాన్ని అర్చకులు వారికి తెలియజేశారు. శాలువా కప్పి సత్కరించి వేదాశీర్వాదం చేశారు. రంగ మండపం, తూర్పు గోపురంలో శిల్పసంపద అద్భుతంగా ఉందని ఆయన కొనియాడారు.

బకాయిలు చెల్లించాలని డిమాండ్

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మహేష్‌బాబు డిమాండ్ చేశారు. ఒంటిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ బాబు మాట్లాడుతూ.. పీఆర్సీని అమలు చేయాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పాలన వచ్చి ఏడాది దాటినా ఇంతవరకు తమకు న్యాయం చేయలేదన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై ఉద్యమం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపీనాథ్, సురేష్‌కుమార్, కోశాధికారి సుబ్బరాయుడు, సహాధ్యక్షుడు బ్రహ్మయ్య, నాయకులు మస్తానయ్య, రవూఫ్‌బాషా, శివరామకృష్ణంరాజు, బాబు, విశ్వనాథ్, ఖదీర్‌బాషా, ఆగస్టీన్‌బాబు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

లింగాల, న్యూస్‌టుడే : మండల పరిషత్తు పరిధిలోని 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం కావడంతో సోమవారం డీఎల్‌డీఓ విజయలక్ష్మి విచారణ నిర్వహించారు. ఆర్థిక సంఘం నిధులు పలుమార్లు బ్యాంకు నుంచి సిబ్బంది డ్రా చేశారని జడ్పీ సీఈఓ ఓబుళమ్మ విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో డీఎల్‌డీఓ కార్యదర్శులతో సమావేశమై ఆర్థిక సంఘం నిధులు ఎంతమేర ఖర్చు పెట్టారు ఆరా తీశారు. గత నెల 27న కడప జడ్పీలో సీఈఓ ఓబుళమ్మ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై సమావేశం నిర్వహించగా కార్యాలయ సిబ్బంది నిధుల జమ ఖర్చులపై పొంతన లేని సమాధానాలు చెప్పడంతో విచారణకు ఆదేశించారు. డీఎల్‌డీఓ విలేకరులతో మాట్లాడుతూ నిధులు దుర్వినియోగం జరిగినట్లు రుజువైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటి ఎంపీడీఓలు సురేంద్ర, తేజ్యోత్స్న, ప్రస్తుత ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షణాధికారి లోకేశ్, జూనియర్ అసిస్టెంటు శ్రీకాంత్‌కు ఈ నెల 11న విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశామన్నారు.

తులసిరెడ్డి సతీమణికి షర్మిల పరామర్శ

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మను సోమవారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పరామర్శించారు. జిల్లా పర్యటన కోసం వచ్చిన ఆమె కడప నుంచి నేరుగా వేంపల్లెలోని పాతపేటలో ఉన్న తులసిరెడ్డి ఇంటికి వెళ్లారు. అలివేలమ్మ ఆరోగ్యం గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా షర్మిలను తులసిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం తులసిరెడ్డి ఇడుపులపాయకు బయలుదేరి వెళ్లారు.

తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మను పరామర్శిస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

మాట్లాడుతున్న శాస్త్రవేత్త సాయిమహేశ్వరి

వల్లూరు, న్యూస్‌టుడే : ప్రకృతి వ్యవసాయం ద్వారా వాతావరణ సమతౌల్యం ఏర్పడుతుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సాయిమహేశ్వరి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెద్దలేబాక సచివాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు రెండు రోజుల పాటు ఇచ్చే శిక్షణను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయానికి అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్నదాతలకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయం పాటించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సురేశ్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

లేఅవుట్లకు అనుమతులు తప్పనిసరి

వేంపల్లె, న్యూస్‌టుడే : గ్రామపంచాయతీల్లో కొత్తగా వేసే లేఅవుట్లకు అనుమతులు తప్పనిసరని కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ కృష్ణసింగ్ పేర్కొన్నారు. సోమవారం వేంపల్లె గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఈవో మాధవరెడ్డి, కార్యదర్శులు కొండయ్య, ప్రసాద్, తదితరులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 300 చదరపు మీటర్ల స్థలంలో ఇళ్లు నిర్మించుకొనే వారు తప్పనిసరిగా పంచాయతీ కార్యదర్శి అనుమతులు తీసుకోవాలన్నారు. జేపీవో ఇందు, టెక్నికల్ ఇంజినీరు రామకృష్ణరాయల్, తదితరులు పాల్గొన్నారు.

13న నూర్‌బాషా సంఘం సమావేశం

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : ఒంటిమిట్టలోని హరిత హోటల్‌లో ఈ నెల 13న ఏపీ నూర్‌బాషా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరాజా పేర్కొన్నారు. సోమవారం కడపలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. నూర్‌బాషా వర్గీయుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారిందన్నారు. దూదేకుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దూదేకులకు అవకాశం కల్పించాలన్నారు. సంఘం నాయకులు హుస్సేన్, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పులివెందుల, న్యూస్‌టుడే : దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పులివెందులలోని నగరిగుట్ట పీహెచ్‌సీ అధికారి డాక్టర్ స్నేహ ప్రత్యూష అన్నారు. జాతీయ డెంగీ మాసోత్సవాలలో సోమవారం పట్టణంలోని నగరిగుట్టలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో, వర్షపునీరు, సీసాలు, టైర్లు, కొబ్బరి బొండాలు తదితర వాటిల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెందే ఆవాసాలు అని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు సంస్థను కాపాడుకోవాలి

కడప గ్రామీణ, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ విధానాల నుంచి విద్యుత్తు సంస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని విద్యుత్తు ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. సోమవారం విద్యుత్తుభవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. వాటిని నిలువరించి సంస్థను, కార్మికులను కాపాడుకోవాలన్నారు. ఈ నెల 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిస్కం అధ్యక్షుడు శివశంకర్, కోశాధికారి సురేంద్ర, నాగమల్లయ్య, రాజా పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మూసేసిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలని, గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న రూ.4,200 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు మార్కుల జాబితాలు ఇవ్వడం లేదని పీడీయస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు సోమవారం వైవీయూ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేశారు. నాయకులు మహేష్, శ్రీకాంత్, ప్రశాంత్, జ్యోతిబస్, విక్కీ పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : ఫీజులు, పుస్తకాలు, ఏకరూప దుస్తుల పేరుతో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు పేదల నుంచి రూ. వేలల్లో దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డిబాబు ఆరోపించారు. సోమవారం కడప కలెక్టరేట్ ఎదుట విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న విద్యాసంస్థల తీరును నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించి ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆనంద్, మణికుమార్, చిన్న, నాగేంద్ర, సుందర్‌రాజు, రామ లక్ష్మమ్మ, వెంకటయ్య, ఓబయ్య పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లెలో తాగునీటి ఎద్దడి నివారణకు పాపఘ్ని నదిలో కొత్తగా ఫిల్టర్లు వేస్తున్నామని సర్పంచి శీను తెలిపారు. సోమవారం స్థానిక పాపఘ్ని నదిలో కూలీలతో చేపట్టిన కొత్త ఫిల్టర్ల పనులను ప్రారంభించారు. వర్షాభావ పరిస్థితులతో పాపఘ్ని నదిలో భూగర్భ జలాలు అడుగంటి నదిలోని తాగునీటి ఫిల్టర్లు ఎండిపోతున్నాయన్నారు. పట్టణవాసులకు తాగునీటి సమస్య రాకుండా నదిలో ఐదు కొత్త ఫిల్టర్లు తవ్విస్తున్నామన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప విద్య, న్యూస్‌టుడే : దేశవ్యాప్తంగా ఈ నెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు యూటీఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పేర్కొన్నారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం సమ్మె జయప్రదం కోసం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన నల్లచట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. 12 గంటల పనివిధానాన్ని తక్షణమే కేంద్రప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, కృష్ణారెడ్డి, నరసింహారావు, రమణ, అజాజ్‌అహ్మద్, శివశంకర్, బాబునాయక్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

లింగాల, న్యూస్‌టుడే : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవ, పద్మశ్రీ పురస్కార గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను సోమవారం లింగాలలో ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించి కేకు కోసి పంచిపెట్టారు. రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు కొళ్లభాస్కర్, రామకృష్ణ, నియోజకవర్గ బాధ్యుడు అగ్రహారం రవి ప్రసంగించారు. ఐక్యతతో అన్ని సాధించుకోవచ్చన్నారు.

పగలు దుర్వాసన... రాత్రిళ్లు దోమలతో యాతన

పులివెందుల, న్యూస్‌టుడే : పులివెందులలోని గ్రామీణ ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్యం పడకేయడంతో దోమలు, దుర్వాసనతో రోగాల బారినపడుతున్నారు. కాలువలు లేకపోవడంతో మురుగంతా రోడ్డుపై ప్రవహిస్తూ అపరిశుభ్రత నెలకొంది. మండలంలోని అచ్చవెల్లి, కనంపల్లె, యర్రబల్లె, ఇ.కొత్తపల్లె, నల్లపురెడ్డిపల్లె, కె.వెలమవారిపల్లె, చంద్రగిరి, మల్లికార్జునపురం, నల్లగొండువారిపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. అధికారులు మురుగు తొలగింపునకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోగాల బారినపడి ఆసుపత్రుల చుట్టూ తిరిగుతూ రూ.వేలల్లో ఖర్చు చేస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని కాపాడేందుకు కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని వాపోతున్నారు.

చంద్రగిరిలో రోడ్డుపై పారుతున్న మురుగు

కాలువలు ఏర్పాటు చేయాలి

కనంపల్లెలో కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్డుపై నిలుస్తోంది. దీంతో దోమలు, దుర్వాసతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి కాలువలు ఏర్పాటు చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లి దోమల వ్యాప్తిని అరికట్టాలి. - రాజా, కనంపల్లె

జ్వరాల బారినపడుతున్నాం

పెద్దరంగాపురంలో మురుగు కారణంగా దుర్వాసన వస్తోంది. ఈ ప్రాంతంలో ఉండాలంటే చాలా ఇబ్బందిగా మారింది. దోమల కారణంగా జ్వరాల బారినపడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.
- సుజాత, ఇ.కొత్తపల్లె

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. త్వరలో కాలువలు ఏర్పాటు చేసి మురుగు సమస్యలు తొలగిస్తాం.
- క్రిష్ణమూర్తి, ఎంపీడీవో, పులివెందుల

తెదేపా నూతన కార్యవర్గం ఏర్పాటుపై ఏకాభిప్రాయం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : మండలంలోని కొండమాచుపల్లెలో తెదేపా గ్రామ నూతన కార్యవర్గంపై నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. మండల పరిశీలకుడు ఈశ్వరప్ప ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించి పార్టీలోని అన్ని వర్గాల నాయకులతో చర్చించారు. కొత్త కమిటీ కూర్పుపై అందరూ ఏకతాటిపై వచ్చారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సాదు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా అవ్వారు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా సోమా వెంకటరమణ, కోశాధికారిగా మామిళ్ల పత్తయ్యగారి కృష్ణమూర్తిని నియమించాలని కోరారు. కార్యనిర్వాహకులుగా మామిళ్ల వెంకటేశ్వర్లు, బీమిశెట్టి వెంకటసుబ్బయ్య, మునగపాటి వెంకటరమణ, కార్యదర్శులుగా చందా కేశవులు, ఎం.పి.చినరాజ, అవ్వారు మహేంద్ర పేర్లను సిఫార్సు చేశారు. కమిటీ వివరాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానని పరిశీలకుడు ఈశ్వరప్ప తెలిపారు.



(c) eenadu